ఈనాడు
అల్లూరి సీతారామరాజు
శుక్రవారం 2 జనవరి 2026

కొర్రుబయలే లంబసింగి

లంబసింగిలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

ఆంధ్రాకశ్మీర్‌గా పేరొందిన లంబసింగికి మరో పేరుంది. అదే కొర్రుబయలు. ఈ ప్రాంతంలో స్థానికులంతా లంబసింగిని కొర్రుబయలుగానే పిలుస్తుంటారు. ఆర్టీసీ బస్సుల్లో కండక్టర్లు సైతం లంబసింగి రాగానే కొర్రుబయలు వచ్చిందని చెబుతుంటారు. లంబసింగి ఊరి పేరు వెనుకా ఒక కథ ఉంది. లంబ అంటే గిరిజనుల భాషలో పెద్దది అని అర్థం. సింగి అంటే కొండ. ఇలా ఈ రెండింటినీ కలిపి లంబసింగిగా పిలవడం మొదలైంది. సముద్రమట్టానికి సుమారు నాలుగువేల అడుగుల ఎత్తులో ఉన్న లంబసింగిలో నిత్యం చల్లని వాతావరణం ఉండటం తెలిసిందే. ఇక్కడ ఉన్న భౌగోళిక పరిస్థితుల ప్రభావంతో ఏటా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. చాలా ఏళ్ల క్రితం ఒక గుర్తుతెలియని బాటసారి లంబసింగి కూడలిలో చలికి తాళలేక కొర్రులా బిగుసుకుపోయి మరణించారట. అప్పటినుంచీ దీన్ని కొర్రుబయలుగా పిలవడం మొదలు పెట్టారు.

– న్యూస్‌టుడే, చింతపల్లి

సంతలో జపనీయుల సందడి

ఒనకఢిల్లీ వారపు సంతలో విదేశీయులు

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని ఒనకఢిల్లీ వారపు సంతలో గురువారం జపాన్ దేశానికి చెందిన పర్యాటకులు సందడి చేశారు. ఇక్కడి బోండా, గదబ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను అధ్యయనం చేయడానికి పెద్ద సంఖ్యలో విదేశీయులు ఇక్కడికి వస్తుంటారు. గురువారం నూతన సంవత్సరం సందర్భంగా జపాన్ దేశానికి చెందిన 15 మంది పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఇటలీ, అమెరికా తదితర దేశాల నుంచి పర్యాటకులు ఇక్కడకు వచ్చారు.

విలువ జోడింపు.. లాభం రెట్టింపు..

చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ

చింతపల్లి, న్యూస్‌టుడే

అల్లూరి జిల్లా పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. గిరిజనులు తిండి గింజల కోసం వరి, రాగులు పండిస్తారు. వాణిజ్యపరంగా కాఫీ, మిరియాలు, రాజ్‌మా, మొక్కజొన్న, పసుపు వంటి ఉద్యాన, సుగంధ ద్రవ్య పంటలను సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు పంటల సాగుకే పరిమితం కాగా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటుతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై దృష్టి సారిస్తున్నారు.

గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కొన్ని విదేశీ సంస్థలు స్థానికంగా పనిచేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలకు నిధులు ఇచ్చేవి. వీటిపై కేంద్ర ప్రభుత్వం కొన్ని నిబంధనలు విధించింది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓ) ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ పేరిట రిజిస్టరు అయిన సంఘాలకు ప్రోత్సాహం అందిస్తోంది. ఈ సంఘాల్లో ఎక్కడికక్కడ ఆయా ప్రాంతాల్లో పంటలు పండించే స్థానిక గిరిజన రైతులే సభ్యులుగా ఉంటున్నారు. రైతులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ ఆశయం. ఇందుకోసం కలెక్టర్ నేతృత్వంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ఉద్యాన వ్యవసాయ అధికారులతో తరచూ సమావేశాలను ఏర్పాటు చేసి ప్రోత్సాహం అందిస్తున్నారు.

■ చింతపల్లి మండలం రాజుపాకలు వద్ద లంబసింగి ట్రైబల్ ప్రోడక్ట్స్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ (ఎఫ్‌పీఓ)లో కొందరు గిరిజన రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరు చాలాకాలంగా చిరుధాన్యాలు, ఉద్యాన, వ్యవసాయ పంటలను పండించడంతోపాటు వాటితో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి ఎగుమతి చేస్తున్నారు. వచ్చిన లాభాలను పంచుకుంటున్నారు.

■ హైదరాబాద్ కేంద్రంగా భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్) దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో చిరుధాన్యాల సాగు విస్తరణకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తోంది. ఏపీతోపాటు తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పలు ప్రాజెక్టులను అమలు చేస్తోంది. ఈ రాష్ట్రాల్లో చిరుధాన్యాల సాగుతోపాటు వాటి ద్వారా ఎగుమతులకు అనువైన విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని చేపడుతున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఆర్థికపరమైన తోడ్పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తోంది. వీటిని అందిపుచ్చుకుంటున్న ఎఫ్‌పీఓలకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలని ఐఐఎంఆర్ నిర్ణయించింది. ఇందులో భాగంగా రాజుపాకలు కేంద్రంగా చిరుధాన్యాల సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై పనిచేస్తున్న లంబసింగి ట్రైబల్ ప్రోడక్ట్స్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ (ఎఫ్‌పీఓ) సభ్యులకు శిక్షణ ఇవ్వడంతోపాటు సాంకేతిక, ఆర్థిక సహకాకం అందిస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాటైన ఎఫ్‌పీఓలన్నింటికీ రాజుపాకలు కేంద్రంగా శిక్షణ ఇచ్చేలా ఇక్కడి కేంద్రాన్ని సాంకేతిక శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దే ఆలోచన చేస్తున్నట్లు ఐఐఎంఆర్ శాస్త్రవేత్త డాక్టర్ రఫీ పేర్కొన్నారు.

ఖర్చు దండిగా.. ఫలితం దండగ!

అరకులోయలో నిరుపయోగంగా డ్రైవ్ ఇన్ రెస్టారెంట్

అరకులోయ, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో రూ. 2 కోట్ల ప్రజాధనం వృథా అయ్యే పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. అరకులోయలోని హరిత హిల్‌రిసార్ట్స్ ప్రాంగణంలో 2019లో రూ. 2 కోట్లతో డ్రైవ్ ఇన్ రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. పర్యాటకులు వారి వాహనాల్లోనే కూర్చొని ఎదురుగా తెరపై కనిపించే దృశ్యాలను చూస్తూ.. సంగీత ధ్వనులను ఆస్వాదిస్తూ వారికి నచ్చిన ఆహారాన్ని తినేందుకు వీలుగా దీన్ని ఏర్పాటు చేశారు. లోపల కూడా కూర్చొని ఆహారాన్ని తినేందుకు భవనాలు నిర్మించారు. అప్పటి పర్యాటకశాఖ మంత్రిగా ఉన్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు దీనిని ప్రారంభించారు.

ప్రారంభోత్సవం జరిగి సుమారు ఆరేళ్లు పూర్తవుతున్నా నేటికీ ఈ రెస్టారెంట్‌లో కార్యకలాపాలు ప్రారంభం కాలేదు. రూ. కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన నిర్మాణం నిరుపయోగంగా మారింది. హరిత హిల్ రిసార్ట్స్‌లో రెస్టారెంట్ మరమ్మతులకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్న అధికారులు.. ఈ రెస్టారెంట్‌ని పూర్తిస్థాయిలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. పర్యాటకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా.. కేవలం నిధుల ఖర్చు పైనే ఆనాటి అధికారులు దృష్టి సారించడంతో ఈ పరిస్థితి నెలకొంది.

శిథిలమవుతున్న అంతర్గత రహదారి

శిథిలావస్థకు చేరుతూ.. : కోట్లు ఖర్చు చేసి నిర్మించిన డ్రైవ్ ఇన్ రెస్టారెంట్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతోంది. ఇప్పటికే అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయి. భవనాల నిర్వహణ లేకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. కేవలం పర్యాటకశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే డ్రైవ్ ఇన్ రెస్టారెంట్‌కు ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు విమర్శిస్తున్నారు. ఈ పర్యాటక సీజన్‌లో అయినా దీన్ని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'మిరాకిల్' మొక్క!

సాధారణంగా ఏ మొక్కకైనా ఆకులు, పూలు విడివిడిగా ఉంటాయి. ఈ చిత్రంలోని మొక్కను చూశారా. ఆకులు, పూలు కలిసి ఉన్నాయి. గొట్టం ఆకారంలో ఉన్న ఆకు భూమిపైపడి కిందికి వంగి ఉంటాయి. దీని రూపానికి తగ్గట్టే దీన్ని మిరాకిల్ ప్లాంట్ అని పిలుస్తారని చింతపల్లి ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త చెట్టి బిందు తెలిపారు. ఇది మడగాస్కర్‌కు చెందిన అలంకరణ మొక్క. 1.8 మీటర్ల ఎత్తువరకూ పెరుగుతుంది. ఆకులు, పూలు కలిసి గంట ఆకారంలో ఉంటాయి. వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఇది మన్యంలోనూ పెరుగుతుందని బిందు తెలిపారు. ఇది విషపూరితమైనది, కొన్ని రకాల మందుల తయారీలో దీన్ని వినియోగిస్తారని పేర్కొన్నారు. – చింతపల్లి, న్యూస్‌టుడే

తారాబులో హాయ్‌హాయ్!

పెదబయలు మండలంలోని తారాబు జలపాతం అందాలు పర్యాటకులను మైమరిపిస్తున్నాయి. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో గురువారం ఇక్కడకు భారీగా తరలి వచ్చారు. ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి పర్యాటకులు ఇక్కడకు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఇక్కడ ఫొటోలు దిగుతూ, కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. ఇక్కడ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. గుంటసీమ మార్గంలో గెడ్డపై వంతెన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో అవస్థలు తప్పడం లేదు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని, జలపాతాన్ని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు. – పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే

రూ. 2.16 కోట్ల మద్యం తాగేశారు!

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భారీగా మద్యం అమ్ముడుపోయింది. డిసెంబరు 31న మద్యం దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. ఒక్కరోజులోనే రూ.2.16 కోట్ల విలువైన మద్యం తాగారని అధికారులు అంచనా వేశారు. జిల్లాలోని 39 దుకాణాలు బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు తెరించేందుకు ఎక్సైజ్ అధికారులు అనుమతి ఇచ్చారు. అమ్మకాలు అధికంగా ఉంటాయని దుకాణ యజమానులు డిపో నుంచి భారీగా నిల్వలు తెచ్చి పెట్టుకున్నారు. డిసెంబరు 30, 31వ తేదీల్లో మద్యం కేసులు 10 వేల పైబడి బుక్‌చేశారు. బీర్ కేసులు సుమారు ఐదు వేల వరకు బుక్ చేసి నిల్వ పెట్టుకున్నారు. ఎక్కువగా మన్యంలోని మారుమూల గ్రామాల్లో బెల్టు షాపులకు మద్యం తరలిపోయింది. సాధారణ రోజుల కంటే రెట్టింపు అమ్మకాలు జరిగినట్లు పాడేరు అబ్కారీ సీఐ ఆచారి తెలిపారు.

మొక్కవోని విశ్వాసం.. విజయ సోపానం!

ఉన్నతాధికారి నుంచి నియామకపత్రం అందుకుంటున్న సీదరి శ్రీనివాస్

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: లక్ష్య సాధనలో ఒడిదొడుకులు ఎదురైనా.. అసలు వెనుకడుగు వేయకుండా మనోధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఫలితం దానంతట అదే వరిస్తుందని ఓ గిరిజన యువకుడు నిరూపించాడు. పాడేరు మండలం దేవాపల్లి గ్రామానికి చెందిన సీదరి శ్రీనివాస్ ఎస్సై కొలువుకు ఎంపికై ఆదర్శంగా నిలిచాడు. తొలి పోస్టింగ్‌లో కొయ్యూరు మండలం మంప పోలీసు స్టేషన్‌కు ఎస్సైగా నియమితులయ్యారు. శ్రీనివాస్ ప్రాథమిక విద్య పాడేరులో సాగింది. ట్రిపుల్ ఐటీలో బీటెక్, ఎంటెక్ పూర్తి చేశారు. ఆ సమయంలో పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పనిచేసిన రోణంకి గోపాలకృష్ణ గ్రూప్-1 శిక్షణ శిబిరం నిర్వహించడం ఇతడికి కలిసొచ్చింది. ఈ శిబిరానికి ఎంపికై వేపగుంటలో శిక్షణ పొందారు. ఈ క్రమంలో ఎస్సై పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. గ్రూప్స్‌కు తీసుకున్న శిక్షణ.. ఎస్సై పోస్టుల రాత పరీక్షకు ఎంతగానో ఉపయోగపడింది. రాత పరీక్షలో మంచి మార్కులు రావడంతో ఎస్సైగా ఎంపికయ్యారు. ఈయనతో పాటు పాడేరు డివిజన్ నుంచి ముగ్గురు గిరిజన యువకులు ఎస్సైలుగా ఎంపికయ్యారు. వీరిలో ఒకరు జి.మాడుగుల ఎస్సైగా ఇప్పటికే బాధ్యతలు స్వీకరించారు. మరొకరు మైదాన ప్రాంతంలో పోస్టింగ్ దక్కించుకున్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..: ప్రభుత్వ కొలువు సాధించాలనే నా చిరకాల కోరిక నెరవేరింది. ప్రజాసేవ, శాంతిభద్రతలు పర్యవేక్షించే పోలీసు విభాగంలో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. నా విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతగానో దోహదం చేసింది. లక్ష్య సాధనలో ఒడిదొడుకులు ఎదురైనా వాటిని దాటుకుంటూ ముందుకు సాగితే ఫలితం దక్కుతుంది. – సీదరి శ్రీనివాస్

ప్రథమ వర్ధంతి
నీతిమంతుని జ్ఞాపకము చేసికొనుట ఆశీర్వాదమగును. సామెతలు: 10:7
జననం 27-05-1975
మరణం 02-01-2025

కీ.శే. వేమగిరి రాజబాబు గారు
B.Ed., M.C.A., M.Sc.
Ward Education Secretary,
GVMC, Visakhapatnam
అమ్మ : వి. సుగుణ అత్తగారు : పి. జ్యోయ్
భార్య: డా॥ వి. సూర్యసునీత, M.Sc., M.Phil, Ph.D, (Govt. Lecturer)
కుమారుడు: వి. ఆకర్ష్ చక్రవర్తి, B.Tech (Mech)
కుమార్తె : అమృతహంస మరియు కుటుంబ సభ్యులు

రాజముద్రతో పాసుపుస్తకాలు



పాడేరు, న్యూస్‌టుడే: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీకి ముహూర్తం కుదిరింది. రైతుల కష్టాలను తీర్చేలా రాజముద్రతో కూడిన నూతన పాసు పుస్తకాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి అల్లూరి జిల్లాలోని 169 గ్రామాల్లో 7847 మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయనున్నారు.

★ పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 5,645, రంపచోడవరం డివిజన్‌లో 2,202 మంది రైతులకు పాసు పుస్తకాలు వచ్చాయి. వీటి ముద్రణ పూర్తయినా పంపిణీ కార్యక్రమం 8 నెలలుగా వాయిదా పడుతూ వస్తోంది. ఈ జాప్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ముద్రణ పూర్తయిన పుస్తకాలు సత్వరమే రైతులకు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామసభల ద్వారా జనవరి 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రైతులకు పుస్తకాల పంపిణీకి కార్యాచరణ రూపొందించారు.

★ గతంలో వారికి పంపిణీ చేసిన భూహక్కు పత్రాలు వెనక్కి తీసుకుని కొత్తవి ఇవ్వనున్నారు. రైతుకు అందినట్లుగా నిర్ధారించేందుకు బయోమెట్రిక్ నమోదు చేయనున్నారు. వెబ్ ల్యాండ్‌లో వివరాల ప్రకారం సరిపోల్చి, ఎలాంటి తప్పులు లేని పాసు పుస్తకాన్ని అందజేయనున్నారు.

★ పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులుంటే తక్షణమే తహసీల్దార్లు సవరణకు చర్యలు ప్రారంభిస్తారు.

★ ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు గ్రామసభల సమాచారం అందజేస్తారు.

మారని రాత.. తప్పని మోత!

లంబసింగి పంచాయతీ గోగులబంద గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు విన్నవిస్తున్నారు. ఏళ్ల తరబడిగా ఈ గ్రామానికి రహదారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, గర్భిణులు, జ్వరబాధితులను డోలీమోతతో ఆసుపత్రికి తరలిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన జర్భింగి లక్ష్మణరావు రెండురోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారు. గురువారం గోగులబంద నుంచి బచ్చింత వరకు సుమారు 5 కిలోమీటర్ల దూరం డోలీమోతతో తీసుకొచ్చారు. అక్కడి నుంచి నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా స్పందించడం లేదని, ఇప్పటికైనా గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు మన్మథరావు, మచ్చిరాజు, కృష్ణారావు కోరారు. – చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

కుటుంబ సభ్యుల ధ్రువపత్రం పొందడం ఇలా..

ముకోసం

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతంలో కుటుంబ సభ్యుల ధ్రువపత్రం ఎలా పొందాలో తెలియక చాలామంది ఇబ్బంది పడుతున్నారు. ఇదే అదునుగా దళారులు వేలాది రూపాయలు కాజేస్తున్నారు. గిరిజన ప్రాంతంలో కుటుంబ పెద్ద పేరు మీదనే భూములు, ఆస్తులు ఉంచుకుంటారు. హఠాత్తుగా మరణిస్తే కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడాల్సిందే. విధిగా కుటుంబ సభ్యుల ధ్రువపత్రం అవసరం. జీవిత బీమా పరిహారం పొందడానికి, భవిష్యత్తులో ఇతరత్రా ఆస్తుల లావాదేవీలకు కూడా కావాల్సి ఉంటుంది. ఈ పత్రాన్ని ఎలా పొందాలంటే..

● తొలుత వ్యక్తి మరణ ధ్రువపత్రం తీసుకోవాలి.

● మరణించిన వ్యక్తి భర్త అయితే భార్యతోపాటు పిల్లల ఆధార్ నకళ్లు దరఖాస్తుకు జత చేయాలి

● కుటుంబ సభ్యుల పేర్లు ఆధార్ నంబర్లు పొందుపరుస్తూ అఫిడవిట్ చేయించాలి.

● పూర్తిచేసిన దరఖాస్తును మీ-సేవ, సచివాలయంలో దాఖలు చేయాలి. అనంతరం సంబంధిత ఏరియా ఆర్‌ఐ దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి విచారణ చేస్తారు. దరఖాస్తులో ఉన్న వివరాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, పరిసరాల వారితో సాక్షి సంతకాలు తీసుకుని వివరాలు తహసీల్దార్‌కు సమర్పిస్తారు. తహసీల్దార్ ఆ దరఖాస్తు పరిశీలించి ఎలాంటి అభ్యంతరాలు లేకుంటే ఆమోదిస్తారు.

● దరఖాస్తుదారులు అర్జీ సమర్పించిన పది రోజుల్లోగా ఆన్‌లైన్‌లో కుటుంబ సభ్యుల ధ్రువపత్రం పొందవచ్చని అనంతగిరి తహసీల్దార్ వీరభద్రాచారి తెలియజేశారు. దళారులను నమ్మవద్దని స్పష్టం చేశారు.

శ్రద్ధాంజలి

వైద్యరంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, ఎందరో వైద్య విద్యార్థినీ, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతూ మీరు చేసిన సేవలు అనిర్వచనీయమైనవి. మీ సేవలు ఎప్పటికీ మరువలేనివి. మీరు భౌతికంగా మా నుండి దూరమైననూ మీ తీపి జ్ఞాపకాలు ఎల్లప్పుడూ మా వెంటే ఉంటాయి. దైవ సన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో... అంజలి ఘటిస్తూ....
డాక్టర్ Y. శేషగిరిరావు గారు
M.D. (Gen. Med.) DCH.
Area Hospital, Tuni
Retd. Professor,
Civil Surgeon Specialist
జననం: 28-01-1956
స్వర్గప్రాప్తి: 22-12-2025
మీ... భార్య: శ్రీమతి Y. పద్మావతి
కుమారుడు: Dr. Y. వెంకటేష్, MD
కుమార్తె-అల్లుడు:
శ్రీమతి S. ప్రియాంక - S. శ్రీనివాస్
అన్నయ్యలు - వదినలు:
Y. రంగారావు - Y. శశికళ (Late)
Y. జగన్నాధరావు - Y. ఉషారాణి
చెల్లెలు - బావగారు:
R. సుగుణ - R. కన్నారావు
మనుమరాలు: S. శ్రీహిత
బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు
పెద్దకర్మ
తేది: 03-01-2026 శనివారం ద్వారకానగర్, ఫార్చ్యూన్ శ్రీకన్య హోటల్ నందు జరుగును.

చిత్తశుద్ధితో విధులకు పునరంకితం

పాడేరు, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలతో గురువారం ప్రభుత్వ కార్యాలయాల్లో సందడి నెలకొంది. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ దినేష్‌కుమార్, ఇన్‌ఛార్జి జేసీ శ్రీపూజను పలువురు అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో విధులకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే దిశగా పనిచేయాలని కోరారు. కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటుతో రంపచోడవరం ప్రాంతంలో పరిపాలనా సౌలభ్యం పెరుగుతుందన్నారు. చింతూరు డివిజన్‌లో పోలవరం ముంపు బాధితులకు పునరావాసం, పరిహారం వెంటనే అందించే అవకాశం ఉంటుందన్నారు. కొత్త కలెక్టరేట్ కోసం రూ.ఐదు కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. రంపచోడరంలో ఐటీడీఏ, పీఎంఆర్‌సీ భవనాలు వినియోగించుకుంటామని చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎస్పీ అమిత్ బర్దార్, ఇన్‌ఛార్జి జేసీ తిరుమణి శ్రీపూజ, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఇన్‌ఛార్జి డీఆర్‌ఓ అంబేడ్కర్, ఇన్‌ఛార్జి ఆర్డీఓ లోకేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ మురళీ, పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్‌బాబు, ఐటీడీఏ ఏపీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

★ ఎస్పీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ అమిత్ బర్దార్ కేక్ కోశారు. పోలీస్ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో కేక్ కోస్తున్న ఎస్పీ అమిత్‌బర్దార్.. చిత్రంలో జిల్లా పోలీస్ అధికారులు

ప్రచార పత్రాలు ఆవిష్కరించిన కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా రవాణాశాఖ అధికారి కె.వి.ప్రకాశ్‌రావు తదితరులు

అందరి సహకారంతో ప్రమాదాల నివారణ

పాడేరు, న్యూస్‌టుడే: ఈనెల ఒకటి నుంచి 31 వరకు జరిగే జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయాలని, వాహనదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించి ప్రమాదాలను నివారించేందుకు సహకరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మసోత్సవాల ప్రచారపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. నెల రోజులపాటు పలు రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. పాత వాహనాలు కొనుగోలు చేసినవారు తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులకు వాహనాలు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి కె.వి.ప్రకాశ్‌రావు, సహాయ మోటార్ వాహన ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సాయిరమేష్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా 'ఏకలవ్య' పనులు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: పాడేరు ఏకలవ్య పాఠశాల భవన సముదాయాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. పాడేరు ఐటీడీఏ పరిధిలో ప్రతి మండల కేంద్రానికి ఏకలవ్య పాఠశాల కొత్త భవనాల నిర్మాణం జరుగుతోంది. సుమారు రూ. 25 కోట్ల నిధులు వీటికి మంజూరు చేశారు. ప్రస్తుతం కొన్నిచోట్ల భవనాలు అందుబాటులో లేకపోవడంతో సమీపంలోని యువ శిక్షణ కేంద్రాలు, గురుకుల పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పెదబయలు పాఠశాలకు పక్కా భవనం అందుబాటులోకి వచ్చింది. పాడేరుకు సంబంధించిన ఏకలవ్య పాఠశాల డోకులూరు గ్రామంలో నిర్మిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు దీనిని అందుబాటులోకి తీసుకురానున్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

క్రికెట్ పోరు.. తుది దశకు చేరే...!

ఉత్కంఠగా 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025'

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : ఆంధ్ర మెడికల్ కళాశాల మైదానంలో 'ఈనాడు- ఈతరం క్లబ్' ఆధ్వర్యంలో జరుగుతున్న 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్' ప్రజెంట్స్ 'ఈనాడు- స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025' టోర్నీ చివరి దశకు చేరుతుంది. గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో విజయం సాధించిన గీతం డీమ్డ్ యూనివర్సిటీ (సీనియర్స్), కైట్స్ జూనియర్ కళాశాల (జూనియర్స్) జట్లు ఫైనల్ బెర్త్‌లు ఖరారు చేసుకున్నాయి. కైట్స్ జూనియర్ కళాశాల జట్టు క్రీడాకారుడు ఆర్.రోహన్ 'ధనిక్ భారత్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే'గా ఎంపికయ్యాడు.

★ శుక్రవారం సీనియర్స్ విభాగంలో జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో బుల్లయ్య డిగ్రీ కళాశాల- శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల, అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ - ఆంధ్ర మెడికల్ కళాశాల జట్లు, జూనియర్స్ విభాగంలో జరిగే సెమీ ఫైనల్స్‌లో విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (పాలిటెక్నిక్)- సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాల జట్లు పోటీ పడనున్నాయి.

✔ **గీతం డీమ్డ్ యూనివర్సిటీ 'వర్సెస్' గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాల (సీనియర్స్) :** తొలుత గీతం డీమ్డ్ యూనివర్సిటీ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసింది. జట్టులో వి.ప్రద్యుష్‌సాయి 36, పి.శ్యామ్ 20, సాయివర్ధన్ 14 పరుగులు చేశారు. గాయత్రి జట్టు బౌలర్లు అనంత్ 2 వికెట్లు, సాల్మన్, నరేంద్ర చెరో వికెట్ తీశారు. తర్వాత గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 63 పరుగులు చేసింది. జట్టులో చిన్నా 43, సాల్మన్ 11 పరుగులు చేశారు. గీతం జట్టు బౌలర్లు దేవాశిష్, మోహన్, సాయివర్ధన్ తలో వికెటు తీశారు.

విజయం సాధించిన గీతం డీమ్డ్ యూనివర్సిటీ జట్టు (సీనియర్స్)

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

ఆర్.రోహన్ (23 పరుగులు, ఓ వికెట్)

గెలుపొందిన కైట్స్ జూనియర్ కళాశాల జట్టు (జూనియర్స్)

✔ **కైట్స్ జూనియర్ కళాశాల 'వర్సెస్' గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల (జూనియర్స్):** తొలుత కైట్స్ జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 74 పరుగులు చేసింది. **జట్టులో రోహన్ 23,** ధార్మిక్ 15, మౌర్య 14 పరుగులు చేశారు. గవర్నమెంట్ కెమికల్ పాలిటెక్నిక్ జట్టు బౌలర్లు దినేష్, లక్ష్మణ్ చెరో రెండు వికెట్లు తీయగా, రాము ఓ వికెట్ తీశాడు. తర్వాత గవర్నమెంట్ కెమికల్ పాలిటెక్నిక్ జట్టు 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 71 పరుగులు చేసింది. జట్టులో దినేష్ 20, చరణ్ 18 పరుగులు చేశారు. కైట్స్ జట్టు బౌలర్లు తేజేశ్వర్, భరత్ చెరో రెండు వికెట్లు, రోహన్ ఓ వికెట్ తీశారు.

✔ **ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల 'వర్సెస్' సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాల (జూనియర్స్) :** మొదట సాంకేతిక జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 67 పరుగులు చేసింది. జట్టులో కె.లవకుమార్ 15 పరుగులు చేశాడు. ఏపీటీడబ్ల్యూఆర్ జట్టు బౌలర్లు బి.చరణ్, ఎస్.యశ్వంత్, ఎల్.మహేంద్ర తలో 3 వికెట్లు తీశారు. అనంతరం ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 58 పరుగులు చేసింది. జట్టులో బి.మూర్తి 9 పరుగులు చేయగా, చరణ్, యశ్వంత్ చెరో 8 పరుగులు చేశారు. సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాల జట్టు బౌలర్లు జి.అనిల్ 3 వికెట్లు తీయగా, భరత్, శ్రీనివాస్ చెరో వికెట్ తీశారు.

విజయానందంలో సాంకేతిక పాలిటెక్నిక్ జట్టు (జూనియర్స్)

Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు
IIT-JEE | NEET
Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ
NECC
(Non-Govt. Public Charitable Trust)
"Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner
CMR SHOPPING MALL
The joy of life
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Regional Sponsor
GGU
GODAVARI GLOBAL UNIVERSITY
RAJAMAHENDRAVARAM, A.P.
Call: 994 999 3483 | www.ggu.edu.in
TV Partner
ETV
Digital Partner
ఈనాడు.నెట్
ETV BHARAT
Dolphin Diagnostic Services
District Sponsor
TIRUMALA విద్యాసంస్థలు
Organised by
ఈనాడు ఈతరం క్లబ్

నేటి మ్యాచ్‌లు (02-01-2026)

★ **ఉదయం 8 గంటలకు :** డాక్టర్ లంకపల్లి బుల్లయ్య డిగ్రీ కళాశాల × శ్రీ కశ్యప్ డిగ్రీ కళాశాల(సీనియర్స్) ★ **10 గంటలకు :** విశాఖ పాలిటెక్నిక్ కళాశాల × సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాల (జూనియర్స్)★ **మధ్యాహ్నం 12 గంటలకు :** అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ × ఆంధ్ర మెడికల్ కళాశాల (సీనియర్స్).

రేపటి మ్యాచ్ (03-01-2026)

★ సీనియర్స్ విభాగంలో శుక్రవారం జరిగే రెండు మ్యాచ్‌ల్లో విజేతలైన జట్లు శనివారం సెమీ ఫైనల్‌లో తలపడతాయి.

ఐజీగా బాధ్యతల స్వీకరణ

గోపీనాథ్‌జెట్టి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ రేంజ్ డీఐజీగా విధులు నిర్వహిస్తున్న గోపీనాథ్‌జెట్టి పదోన్నతి పొందడంతో గురువారం ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఐజీ)గా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు విశాఖ రేంజ్ కార్యాలయంలో సంతకాలు చేశారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రణకు పెద్ద పీట వేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను రేంజ్‌పరిధిలోని వివిధ జిల్లాల ఎస్పీలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, శ్రీకాకుళం ఎస్పీ మహేశ్వరరెడ్డి, పార్వతీపురం ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి, విజయనగరం ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఉన్నతాధికారులు ఉన్నారు. అనంతరం అధికారులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు.

సంక్రాంతికి 1500 అదనపు సర్వీసులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే : సంక్రాంతి రద్దీ దృష్ట్యా 1500 అదనపు సర్వీసులు నడపడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఆర్టీసీ ఆర్ఎం బి.అప్పలనాయుడు తెలిపారు. రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలని డిపో మేనేజర్లను ఆదేశించినట్లు గురువారం చెప్పారు. స్త్రీ శక్తి పథకం అమలులో ఉండటంతో, మహిళలతో పాటు, ఇతర ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. భోగి ముందు రోజు నుంచి ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి వస్తాయని, కనుమ తర్వాత ఐదు రోజుల పాటు ఆయా సర్వీసులు ఉంటాయన్నారు. హైదరాబాద్, విజయవాడ, రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, శ్రీకాకుళం, విజయనగరం, పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి, పార్వతీపురం, పాలకొండ, సాలూరు, బొబ్బిలి ప్రాంతాలతో పాటు, గ్రామీణ ప్రాంతాలకు బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.

రామావతారంలో సింహాచలేశుడి దర్శనం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై రాపత్తు ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం సింహాచలేశుడు శ్రీరామచంద్రమూర్తి అవతారంలో భక్తులను అనుగ్రహించారు. మాడవీధుల్లో స్వామివారి తిరువీధి వేడుక వైభవోపేతంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతుడైన గోవిందరాజ స్వామిని ధనుర్మాసాలతో రామావతారంలో అలంకరించారు. స్వామి, అమ్మవార్లు, ఆళ్వారాచార్యులను వేర్వేరు పల్లకీలో అధిష్ఠింపజేశారు. తిరువీధిలో విహరించిన దేవదేవుడిని దర్శించుకున్న భక్తజనం గోవింద నామస్మరణ చేశారు.

సింహగిరి మాడవీధుల్లో దేవతామూర్తుల తిరువీధి వేడుక

'ఉపాధి హామీ చట్టం మార్పు జాతీయ నేరం'

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కేంద్రంలోని భాజపా కూటమి ప్రభుత్వం దేశంలోని ఉపాధి హామీ చట్టాన్ని మార్పు చేసి వీబీ-జీరాంజీ పథకం తెచ్చి పేదల జీవితాలతో ఆడుకుంటోందని సీటూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఆరోపించారు. లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల హక్కులపై దాడి చేస్తోందని పేర్కొన్నారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్లో సీఐటీయూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. విశాఖలో జరుగుతున్న అఖిల భారత మహాసభల్లో భవిష్యత్ కార్మిక, కర్షక పోరాటాలపై వివిధ రాష్ట్రాల ప్రతినిధులు చర్చిస్తున్నారన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం మార్చడంతో ఉపాధికి గ్యారంటీ లేకుండా పోయిందన్నారు. మహాసభల రెండో రోజున ఉపాధి హామీ చట్టం నిర్వీర్యంపై ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మెకు సిద్ధమయ్యేలా చేసిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. గత ఐదేళ్లుగా కార్మికులు చేస్తున్న పోరాటాల వల్లే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్ పరం కాలేదన్నారు. యాజమాన్యం లేకుండా చేయడమే కేంద్రం లక్ష్యమని దీనిపై కార్మికులు పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు.

★ సినీ దర్శకుడు సత్యారెడ్డి సీటూ జాతీయ మహాసభలో పాల్గొని మాట్లాడారు. సామాజిక న్యాయం సాధనకై ఉద్యమించాలని, సామాజిక న్యాయం అంశాన్ని పార్లమెంటు ఎజెండాలో చేర్చాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలను అడ్డుకొని తీరాలని పిలుపునిచ్చారు.

విలేకరులతో మాట్లాడుతున్న తపన్‌సేన్, చిత్రంలో సీహెచ్ నర్సింగరావు

వెట'రన్'.. మెరిసెన్..

అథ్లెటిక్స్‌లో పతకాలు సాధిస్తున్న సుధాకర్

విశాఖపట్నం, న్యూస్‌టుడే : పాతికేళ్లు నిండేసరికే ఒళ్లు, కీళ్లు పట్టేస్తున్నాయంటూ ఆపసోపాలు పడే నేటి యువతలో చాలా మంది... 77 ఏళ్ల వయసులో వివిధ పోటీల్లో పతకాలను ఎగరేసుకొస్తున్న పాత గాజువాకకు చెందిన గోగినేని సుధాకర్‌ను ఆదర్శంగా తీసుకోవాల్సిందే. ఇటీవల గుంటూరు జిల్లా పెదనందిపాడులో నిర్వహించిన 45వ ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఒకేసారి 5 పతకాలను కైవసం చేసుకున్నారు.

★ వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖ (వావ్) ఆధ్వర్యంలో జరిగిన అన్ని పోటీల్లోనూ మూడు బంగారు పతకాలతోపాటు, ఒక రజత, ఒక కాంస్య పతకం పొందారు. వయో వృద్ధులతో వాకింగ్, రన్నింగ్, షాట్‌పుట్, జాగింగ్, అథ్లెటిక్స్‌లో పోటీపడి తనదైన ముద్ర వేసుకున్నారు. ఈ సందర్భంగా 'వావ్' చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ [illegible], మాస్టర్ [illegible] ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సత్యదేవ్, వావ్ ట్రస్టీలు సుధాకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయ పోటీలకు అర్హత

గుంటూరు జిల్లాలో జరిగిన పోటీల్లో వరుసగా 5 పతకాలు సాధించిన సుధాకర్ త్వరలో జబల్‌పూర్‌లో నిర్వహించనున్న జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సంపాదించారు. ఈయన బీహెచ్‌పీవీలో సాధారణ ఉద్యోగిగా పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. జాతీయ కబడ్డీ పోటీల్లో పలు పతకాలను నమోదు చేసుకున్నారు. ఆరుసార్లు రాష్ట్రస్థాయి పోటీలకు కెప్టెన్‌గా వ్యవహరించారు. రోజూ తెల్లవారుజామున భెల్ మైదానంలో 2 గంటలపాటు సాధన చేస్తుంటానని, ఏమాత్రం అలసట, అనారోగ్యం తన దరి చేరదని పేర్కొన్నారు.

వావ్ ఆధ్వర్యంలో జరిగిన అథ్లెటిక్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన గోగినేని సుధాకర్

వాగైనా కప్పేస్తాం.. ఏదైనా చేసేస్తాం!!

అడ్డదారి కోసం ఇష్టారాజ్యం

అయినా కన్నెత్తి చూడని యంత్రాంగం

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, ఆనందపురం: కొనుగోలు చేసిన భూములకు దగ్గర మార్గాన్ని ఎంచుకునే క్రమంలో జలవనరుని కప్పేశారు. రాత్రికి రాత్రే రోడ్డు నిర్మించేశారు. జాతీయ రహదారి నుంచి ఆ భూములకు వేగంగా చేరుకునేందుకే ఆ దారుణమంతా. ఆనందపురం మండలం గిడిజాలలో ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. విశాఖ నగర సమీప భూములకు ఇటీవల భాగా విలువ పెరుగుతుండటంతో ఎక్కడికక్కడ ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

రాత్రికి రాత్రే: విజయనగరం జిల్లా కొత్తవలస ప్రాంత కొండలు, ఆనందపురంలోని బృహదాచల కొండల నుంచి ప్రవహించే వాగును గిడిజాల రెవెన్యూ పరిధిలో కొందరు దర్జాగా పూడ్చేశారు. వీరి భూములకు నీళ్ల కుండీల నుంచి దిబ్బడపాలెం గ్రామం మీదుగా వెళ్తే రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అలా కాకుండా నీళ్లకుండీలను ఆనుకొని ఓ ప్రైవేట్ లేఅవుట్ మీదుగా గెడ్డను దాటుకొని వెళ్తే జాతీయ రహదారికి 300 మీటర్ల దూరంలోనే ఉంటుంది. అందుకే ఎటువంటి అనుమతులు లేకుండా ఏకంగా నీటి ప్రవాహ వాగుపై 25 అడుగుల మేర రోడ్డు నిర్మించేశారు. రాత్రికి రాత్రి లారీలతో గ్రావెల్ తెచ్చి, గొట్టాలు ఏర్పాటు చేసి కప్పేశారు. గతంలో ఆ ప్రాంతం చెట్లు, పొదలతో ఉండేది. ఇప్పుడు వాటన్నింటినీ తొలగించారు. దీంతో ఆ ప్రాంతమంతా ఖాళీగా కనిపిస్తోంది.

వాగు ప్రవాహానికి అడ్డంగా నిర్మించిన మార్గం

ఎంతో కీలకమైన వనరు: ఈ వాగు ఆనందపురం మండలంలోని గుడిలోవ ఛానల్‌కు ఆధారం. సుమారు 50 చెరువులు నిండాలంటే ఇది ప్రవహించాలి. మరో వైపు గంభీరం జలాశయానికి ప్రధాన వరద గెడ్డ కూడా ఇదే. సుమారు 25 కిలోమీటర్ల మేర వివిధ గ్రామాల మీదుగా ప్రవహిస్తుంది. అంతటి ప్రాధాన్యమున్న వాగును భూముల విలువ పెంచుకునేందుకు మూసేయడంపై విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి జలవనరులపై రోడ్డు నిర్మించాలంటే రెవెన్యూ, జలవనరులశాఖల నుంచి అనుమతి తీసుకోవాలి. ఇక్కడ అవేమీ లేకుండానే ఇష్టానుసారంగా చేపట్టారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి కాత్యాయినీ కూచిపూడి నృత్య అకాడమీ విద్యార్థులు ప్రముఖ పుణ్య క్షేత్రం భద్రాచలంలో నృత్య ప్రదర్శన ఇచ్చారు. దేవస్థానం వీరి ప్రతిభను గుర్తించి ప్రశంసా పత్రాలను అందజేసింది. కోర్టుపేటకు చెందిన అకాడమీ విద్యార్థులు నృత్యప్రదర్శన ఇచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. గురువు ఎస్.లక్ష్మిని ఘనంగా సన్మానించారు. వీరిని స్థానిక మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు అభినందించారు.

భద్రాచలంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చిన ఎలమంచిలి విద్యార్థినులు

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: కొణతాల

అనకాపల్లి, న్యూస్‌టుడే: వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. స్థానిక సుబ్రహ్మణ్యం ఘాట్ వద్ద గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర సుజలస్రవంతికి బడ్జెట్‌లో రూ. 1,000 కోట్లు కేటాయించారని, భూసేకరణ జరుగుతోందన్నారు. వంశధార, నాగావళి, జంఝావతి వంటి ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ.రెండు వేల కోట్లు కేటాయించారన్నారు. పోలవరం ఎడమ కాలువ నిర్మాణం పూర్తయితే ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. పోలవరం ద్వారా వచ్చే నీటితో పాయకరావుపేటలోని గోపాలపురం, ఎలమంచిలి పెంజెరువు, అచ్యుతాపురం కొండకర్ల ఆవలో నీటి నిల్వలు ఉంచుతామన్నారు.

మాట్లాడుతున్న కొణతాల

400 పడకలకు ఎన్టీఆర్ ఆసుపత్రి

ఎన్టీఆర్ ఆసుపత్రిని జిల్లాస్థాయికి తీసుకువచ్చి అన్ని విధాలగా అభివృద్ధి చేస్తున్నామని కొణతాల తెలిపారు. ఆసుపత్రిలో గతంలో 17 మంది వైద్యులు ఉండేవారని, ప్రస్తుతం 42 మంది ఉన్నారని పేర్కొన్నారు. రూ.1.80 కోట్లతో సీటీ స్కాన్ ఏర్పాటు చేశామన్నారు. దాదాపు 134 పరీక్షలు నిర్వహించే నూతన ల్యాబ్‌ను రూ. 1.2 కోట్లతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోగులు నిరీక్షణకు హాలు, మార్చురీ ఆధునీకరణ పనులను రూ.1.40 కోట్లుతో చేస్తున్నామని తెలిపారు. శస్త్రచికిత్స గదులను రూ. 1.2 కోట్లతో ఆధునికీకరిస్తున్నామన్నారు. ఆసుపత్రిని మరో రెండు ఎకరాల్లో విస్తరించి 400 పడకలకు పెంచుతామన్నారు. పట్టణంలోని రహదారులు ఇతర మౌలిక సదుపాయాలకు రూ. 41 కోట్లు మంజూరు చేశామన్నారు. పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జీవీఎంసీ కార్యాలయంలో ఉన్న కంపోస్టు యార్డును తరలించి తీరుతామని స్పష్టం చేశారు. లక్ష్మీదేవిపేట పైవంతెన పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో మురుగు కాలువలు నిర్మించి, అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. దీనిపై సర్వే చేయిస్తున్నామని ఇందుకోసం రూ. 40 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినట్లు కొణతాల వివరించారు.

కశింకోట: నర్సింగబిల్లికి చెందిన వైకాపా యువజన కార్యదర్శి తిర్రి శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు జనసేనలో చేరారు. ఎమ్మెల్యే రామకృష్ణ వారిని సాదరంగా ఆహ్వానించారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఉపాధ్యాయులకు సూచించారు. ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య జిల్లా కార్యవర్గ సభ్యులు గురువారం కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ ఏడాది జిల్లాలో పది పరీక్ష ఫలితాల్లో మంచి ఫలితాలను సాధించడానికి ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. యూటీఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గొంది చినబబ్బాయి, రొంగలి అక్కునాయుడు, కోశాధికారి జోగా రమేష్, బాబురావు, దేవుడినాయుడు పాల్గొన్నారు.

✦ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడును మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంఘానికి సంబంధించి క్యాలెండర్, డైరీని డీఈఓ సభ్యులతో కలసి ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు టి.వి.రమణ, కార్యదర్శి శ్రీనుబాబు, సభ్యులు పాల్గొన్నారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ముద్రించిన నూతన ఏడాది క్యాలెండర్లు, డైరీలను నక్కపల్లిలో సంఘం నాయకులు గురువారం విడుదల చేశారు. తెదేపా నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ తదితరులు కలిసి వీటిని పలువురికి అందజేశారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు తోడపు వెంకటరమణ, ప్రగడ శివాజీ, సీహెచ్ ప్రసాద్, బీవీ రమణ, ఎస్వీ రమణ, శ్రీనివాసరావు, లచ్చబాబు, నీలకంఠకుమార్, రమేష్, గోపి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో క్యాలెండర్లు, డైరీలు విడుదల చేస్తున్న నాయకులు

డీవీఎంసీ కమిటీలో ఇద్దరికి చోటు

దేవరాపల్లి, న్యూస్‌టుడే : అనకాపల్లి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు, మోనిటరింగు కమిటీ(డీవీఎంసీ)లో దేవరాపల్లి మండలానికి చెందిన ఇద్దరికి చోటు దక్కింది. కమిటీకి జిల్లా కలెక్టరు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. 8 మంది సభ్యులుండే ఈ కమిటీలో మండలంలోని తామరబ్బ శివారు బొడ్డపాడుకి చెందిన మొసలి పైడిరాజుకి చోటు దక్కింది. ఇదే మండలంలోని వేచలంకికి చెందిన గంగాధర మరియమ్మకి ఈ కమిటీలో రెండోసారి కొనసాగడానికి అవకాశమిచ్చారు.

ఆదిశేషును అభినందిస్తున్న సభాపతి అయ్యన్నపాత్రుడు

శరీర సౌష్ఠవ పోటీల్లో స్వర్ణం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: విశాఖ జోనల్ శరీర సౌష్ఠవ పోటీల్లో మాకవరపాలెం సమీపంలోని అవంతి కళాశాల విద్యార్థి ఆదిశేష స్వర్ణ పతకం అందుకున్నాడు. సింహాచలంలోని ఎస్ఎన్ఆర్ హాలులో గత నెల 28వ తేదీ రాత్రి ఈ పోటీలు జరిగాయి. 55 కేజీల విభాగంలో ఫైనల్స్‌కు చేరిన ఆరుగురితో పోటీ పడి విజేతగా నిలిచాడని కోచ్ పురుషోత్తం చెప్పారు. ఆదిశేషును సభాపతి అయ్యన్నపాత్రుడు గురువారం అభినందించారు.

పాల్తేరులో ఫ్లెక్సీ ఏర్పాటుపై వివాదం

ఇరువర్గాల దాడిలో పలువురికి గాయాలు

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పాల్తేరు శివారు అంకంపేటలో ఫ్లెక్సీలో అనుచరుల ఫొటోల విషయమై అధికార పార్టీలో రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. దీంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ అప్పన్న తెలిపిన వివరాల ప్రకారం.. నూతన సంవత్సరం పురస్కరించుకుని కొందరు నాయకుల అనుచరులు గ్రామకూడలిలో ఏర్పాటుకు ఫ్లెక్సీలు సిద్ధం చేశారు. వీరిలో కొందరి ఫొటోలు తొలగించాలని ఒక వర్గం నేతలు సూచించారు. ఆ చిత్రాలు తొలగించకపోవడంతో బుధవారం అర్ధరాత్రి ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో దాడులకు దిగారు. శ్రీరాములు, శివ, దండు, తాసు తదితరులకు గాయాలయ్యాయని పోలీసులు పేర్కొన్నారు. వీరిలో ఇద్దరు తునిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే బాధ్యులపై రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు.

కుంపటి అంటుకుని వృద్ధురాలు సజీవ దహనం

కోటవురట్ల, న్యూస్‌టుడే: చలి నుంచి ఉపశమనం కోసం మంచం కింద పెట్టుకున్న కుంపటే ఓ వృద్ధురాలి మరణానికి కారణమైంది. ఈ ఘటన కోటవురట్ల మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. కైలాసపట్నంకు చెందిన వృద్ధురాలు వంకల మాణిక్యం (73) కమ్మలతో నిర్మించిన పూరింట్లో నివసిస్తోంది. మంచం కింద కుంపటిలో అగ్గి వేసుకుని పడుకుంది. నిద్రపోతున్న సమయంలో కప్పుకొన్న దుప్పటి కుంపటిలో పడటంతో మంట చలరేగింది. రక్షించండని వృద్ధురాలు వేసిన కేకలకు చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకొని కాలిపోతున్న వృద్ధురాలిని బయటకు తీసుకురాగా అప్పటికే మృతి చెందింది. నూతన సంవత్సరం రోజే చీకటిని మిగిల్చావా అంటూ కుటుంబసభ్యులు విలపించారు.

హాస్యం మనిషికి దివ్య ఔషధం

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: యాంత్రిక జీవనంలో హాస్యం మనిషికి ఓ దివ్య ఔషధంలా పనిచేస్తుందని రోటరీక్లబ్ అధ్యక్షుడు బుద్ధ శ్రీనివాసరావు పేర్కొన్నారు. రోటరీక్లబ్ ఆధ్వర్యాన పట్టణంలోని న్యూ కాలనీ పాలూరి చిదంబరం రోటరీ మెమోరియల్ హాల్‌లో గురువారం రాత్రి జరిగిన 'నవ్వుల సందడి' కార్యక్రమం అందరినీ అలరించింది. విశాఖ లాఫింగ్ క్లబ్ సభ్యులు ప్రదర్శించిన హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను నవ్వించాయి. గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు గ్రహీత కోరుకొండ రంగారావు, నటుడు త్రినాథ్, సినీ నటి రమ ప్రదర్శించిన స్కిట్లు ఆకట్టుకున్నాయి. క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ రోటరీ ద్వారా సేవా కార్యక్రమాలతోపాటు వినోద కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. క్లబ్ కార్యదర్శి ప్రకాశరావు, కోశాధికారి సూర్యారావు, ప్రోగ్రాం ఛైర్మన్ సత్యనారాయణ, పి.జె.నాయుడు పాల్గొన్నారు.

కార్యక్రమంలో ఓ సన్నివేశం

వ్యవసాయ విద్యుత్తు సరఫరా వేళల మార్పు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: వ్యవసాయ విద్యుత్తు సరఫరా వేళలను శుక్రవారం మార్చినట్లు ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. పెద్దాపురం, పాయకరావుపేటకు చెందిన 132 కె.వి.లైనును ఏపీ ట్రాన్స్‌కో మరమ్మతులు చేపడుతోందన్నారు. దీనివల్ల పాయకరావుపేట, నక్కపల్లి, సత్యవరం సెక్షన్ పరిధిలో ఉదయం 4 నుంచి 8, సాయంత్రం 5 నుంచి రాత్రి 10 వరకు వ్యవసాయానికి విద్యుత్ అందిస్తామని చెప్పారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	133	130
లైవ్	160	150
డ్రెస్డ్	232	270
స్కిన్‌లెస్	264	280

(c) eenadu

7 వరకు అభ్యంతరాల స్వీకరణ

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా సమగ్ర శిక్షలో సైట్ ఇంజినీర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి గతంలో స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించి అర్హులు, అనర్హుల జాబితాలను నోటీసు బోర్డులో ఉంచినట్లు పథక సంచాలకులు స్వామినాయుడు గురువారం తెలిపారు. గతంలో తాత్కాలిక ప్రాతిపదికన (ఎన్ఎంఆర్) ఆరు సైట్ ఇంజినీర్, రెండు డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరించామన్నారు. జాబితాలపై అభ్యంతరాలుంటూ ఈ నెల 7వ తేదీలోగా కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా మోదకొండమ్మ అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

ఆలయం ఎదుట భక్తులు

తోంకోట అమ్మవారు

తోంకోట అమ్మవారి జాతర 4న

హుకుంపేట, న్యూస్‌టుడే: హుకుంపేట, అనంతగిరి మండలాల సరిహద్దుల్లోని తోంకోట అమ్మవారి జాతర ఈనెల 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అటవీ ప్రాంతంలో జాతర జరుగుతుంది. భక్తులు కాలినడకన, ప్రైవేట్ వాహనాల్లో ఆ ప్రాంతానికి వెళ్లారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. రోడ్డు, బారికేడ్లు, నీటి సదుపాయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

శతశాతం ఉత్తీర్ణతకు 'సంకల్పం'

ముంచంగిపుట్టు జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

పెదబయలు, న్యూస్‌టుడే: విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ కీలకం. ఈ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఇంటర్ బోర్డు ఈ ఏడాది సంకల్పం పేరుతో 50 రోజుల ప్రణాళికను అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, గిరిజన గురుకులాలు, కేజీబీవీ, హైస్కూల్ ప్లస్‌లలో అమలు చేస్తోంది. అర్ధ సంవత్సర పరీక్షల్లో మార్కుల ఆధారంగా విద్యార్థులను గ్రేడ్‌లుగా విభజించి ప్రత్యేక తర్ఫీదు అందిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ప్రత్యేక బోధన, మధ్యాహ్నం పరీక్షలు నిర్వహిస్తున్నారు.

విద్యార్థుల దత్తత

విద్యార్థులు అర్ధ సంవత్సర పరీక్షల్లో ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి ఆయా సబ్జెక్టు అధ్యాపకుడు వారిని దత్తత తీసుకొని ఫిబ్రవరి 20 వరకు ప్రత్యేకంగా బోధిస్తారు. ప్రతి ఒక్క అధ్యాపకుడు కొంతమంది విద్యార్థులను దత్తత తీసుకొని వారు కచ్చితంగా మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వడమే ఈ 'సంకల్పం' లక్ష్యం. ప్రభుత్వ కళాశాలల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించి.. భవిష్యత్తులో మరిన్ని ప్రవేశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

జిల్లాలో వివరాలిలా..

కేటగిరీ	కళాశాలలు	విద్యార్థులు
ప్రభుత్వ జూనియర్	20	7203
గిరిజన గురుకుల	16	4236
కేజీబీవీ	19	1354
హైస్కూల్ ప్లస్	05	292
ప్రైవేటు జూనియర్	14	1911
మొత్తం	74	14996

★ గతేడాది నుంచి మార్చిలో పరీక్షలు ముగిశాక.. ద్వితీయ సంవత్సరంలో చేరే విద్యార్థులకు ఏప్రిల్ నుంచే విద్యా సంవత్సరం ఆరంభమయ్యే విధంగా బోధన సాగిస్తున్నారు. పది ఫలితాలు వచ్చిన వెంటనే ప్రథమ సంవత్సరం ప్రవేశాలు కల్పించి జూన్ నెల నుంచే వారికి బోధన అందేలా చర్యలు చేపడుతున్నారు. దీని కారణంగా ఇప్పటికే ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెరిగాయి. ముంచంగిపుట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 90 నుంచి 95 శాతం ఉత్తీర్ణత సాధించి అల్లూరి జిల్లాలోనే ప్రథమ స్థానం సంపాదించారు. ఈ ఏడాది అదే స్ఫూర్తితో శతశాతం లక్ష్యంగా ఇప్పటినుంచే విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదునిస్తున్నారు.

నేటి నుంచి పాసు పుస్తకాల పంపిణీ

సీలేరు(గూడెం కొత్తవీధి), న్యూస్‌టుడే: గతంలో రీసర్వే జరిగిన ఆరు గ్రామాల్లో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ నేటి నుంచి ప్రారంభంకానుందని తహసీల్దారు అన్నాజీరావు చెప్పారు. ఈ నెల 9 వరకు షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులతో కలిసి అందజేస్తామన్నారు.

మూడు రాష్ట్రాలు.. నాలుగు జిల్లాలు

చింతూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల కోసం ప్రత్యేకంగా రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు చేసిన పోలవరం జిల్లాకు ఓ ప్రత్యేకత ఉందండోయ్. కొత్తగా ఏర్పాటైన ఈ జిల్లాకు మూడు రాష్ట్రాలు, నాలుగు జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి. వేరే ఏ జిల్లాకు ఇలాంటి ప్రత్యేకత లేదు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దున కుంట, ఒడిశా సరిహద్దున మోటు, తెలంగాణలోని భద్రాచలం గ్రామాలు ఓవైపు సరిహద్దుగా ఉన్నాయి. మరోవైపు కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలు కలిసి ఉన్నాయి.

కార్యాలయాల ఏర్పాటుకు కసరత్తు

వారంలో కొలిక్కి వచ్చే అవకాశం

ఈనాడు, పోలవరం, న్యూస్‌టుడే, రంపచోడవరం: కొత్తగా ఏర్పాటైన పోలవరం జిల్లా కేంద్రమైన రంపచోడవరంలో అన్ని ప్రభుత్వ శాఖల ప్రధాన కార్యాలయాలు అందుబాటులోకి తెచ్చేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. వారంలోగా ప్రతి శాఖ కార్యాలయాన్ని స్థానికంగా అందుబాటులోకి తేవడంతోపాటు, డివిజన్ స్థాయి అధికారులకు తాత్కాలికంగా జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించి పాలనాపరమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు. పూర్తిస్థాయిలో అధికారుల నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకు స్థానిక సబ్ కలెక్టర్/ ఐటీడీఏ పీవోకు పర్యవేక్షణ బాధ్యత అప్పగించనున్నారు.

త్వరలోనే కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు సిరిగిందపాడు యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ)లో కలెక్టరేట్, సంయుక్త కలెక్టర్ కార్యాలయాలను, పోలీసు స్టేషన్ ఆవరణలోని సమావేశ మందిరంలో ఎస్పీ కార్యాలయాలను అప్పటికప్పుడు ఏర్పాటు చేశారు. కొన్ని మరమ్మతులు, నిర్మాణాల తర్వాత పీఎంఆర్‌సీ సముదాయంలో కలెక్టరేట్, ఇతర కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. వైటీసీలో ఎస్పీ, ఓఎస్‌డీ కార్యాలయాలు ఏర్పాటు చేసేలా ప్రణాళిక చేశారు. ఇక్కడ పనులన్నీ పది రోజుల్లో పూర్తి చేసి కార్యాలయాలు అందుబాటులోకి తెచ్చేలా ఇప్పటికే కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

పీజీఆర్ఎస్‌కు హాజరవ్వనున్న కలెక్టర్

కొత్త జిల్లాలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదిక (పీజీఆర్ఎస్)కు ఇన్‌ఛార్జి కలెక్టర్ దినేశ్‌కుమార్ హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. కొన్ని శాఖల్లో సీనియర్ అధికారులకు తాత్కాలికంగా ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వనున్నారు. గత రాత్రి నిర్వహించిన జూమ్ సమావేశంలో స్పష్టత ఇచ్చారు. దీనికి సంబంధించి అన్ని శాఖల్లోనూ ఆయా విభాగాధితుల నుంచి సీనియర్ అధికారుల జాబితాను సేకరించిన కలెక్టర్.. వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారానికి ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉంది.

కలెక్టర్ సారూ.. కరుణించరూ..

ముంచంగిపుట్టులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు భవనాల నిర్మాణాన్ని 12 ఏళ్ల క్రితం ప్రారంభించారు. ఈ పనులు పునాదుల స్థాయిలోనే ఆగిపోయాయి. పలుమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదు. ఈ పనులు పూర్తి చేయాలని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ప్రిన్సిపల్ విన్నవించారు. ప్రస్తుతం ఈ కళాశాలలో విద్యార్థులు సుమారు 600 మంది ఉన్నారు. కేవలం ఆరు గదులే ఉన్నాయి. వాటిలోనే ప్రయోగశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ స్పందించి నిధులు మంజూరు చేసి, కష్టాలు తీర్చాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది కోరుతున్నారు. – పెదబయలు, న్యూస్‌టుడే

అసంపూర్తిగా అదనపు భవనాలు

పొంచి ఉన్న ప్రమాదం

పాడేరు నుంచి ముంచంగిపుట్టు, డుడుమ, జోలాపుట్టు వెళ్లే ప్రధాన రహదారిలో చోటాముఖిపుట్టు సమీపంలో కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. రక్షణగోడ లేని కల్వర్టు రోజురోజుకు కుంగిపోతోంది. లోపలి భాగంలో స్లాబు కుంగి, గోడలు బీటలువారి పెచ్చులూడి రాళ్లు నేల పడుతున్నాయి. కల్వర్టు కూలితే పెదబయలు, పాడేరు ప్రాంతాలకు రవాణా సేవలు స్తంభించిపోయే ప్రమాదం ఉంది. భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు ప్రతిరోజూ ఈ మార్గంలో తిరుగుతుంటాయి. కల్వర్టు కూలిపోయే దశలో దర్శనమిస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు వద్ద వంతెన నిర్మించాలని, ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

చోటాముఖిపుట్టు సమీపంలో బీటలువారిన కల్వర్టు

దశాబ్దాల కల.. నెరవేరిన వేళ!

ముంచంగిపుట్టు మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ గడ్డిబంద గ్రామానికి దశాబ్దాలుగా రహదారి సదుపాయం లేక గిరిజనులు నానా అవస్థలు ఎదుర్కొన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా రోడ్డు సదుపాయం సమకూరలేదు. ఇక్కడి గిరిజనుల కలను కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. పీఎం జన్‌మన్ పథకం కింద రూ.2 కోట్ల నిధులతో గడ్డిబంద గ్రామానికి తారురోడ్డు నిర్మించింది. రెండు కి.మీ.ల పొడవునా రోడ్డు లేక కొండలు, గుట్టలు దాటుకుని రాకపోకలు సాగించిన గిరిజనులకు కష్టాలు తొలగిపోయాయి. గడ్డిబంద గ్రామానికి తారురోడ్డు నిర్మాణంతో కించాయిపుట్టు పంచాయతీలోని ప్రతి గ్రామానికి రోడ్డు సదుపాయం సమకూరిందని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

గడ్డిబంద గ్రామానికి నిర్మించిన తారురోడ్డు

అ వీ ఇ వీ

చట్టాల అమలుతో న్యాయం

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: మన్యంలో 1/70 చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు చెండా లోహిదాసుడు పేర్కొన్నారు. వడ్డెకోడపుట్టులో ఆదివాసీలతో గురువారం మాట్లాడారు. అట్రాసిటీ, పెసా చట్టాల అమలుతో గిరిజనులకు న్యాయం జరుగుతుందన్నారు. ఆదివాసీ నాయకులు గెమ్మిలి లక్ష్మణరావు, కె.నాగేశ్వరరావు, వి.మత్స్యన్న, జి.రాజేశ్వరరావు, జి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై ఖాతాదారులకు అవగాహన

పెదబయలు, న్యూస్‌టుడే: పెదబయలులో బ్యాంకు సేవలపై ఖాతాదారులకు స్థానిక గ్రామీణ బ్యాంకు ఆవరణలో గురువారం అవగాహన కలిగించారు. మేనేజర్ సతీష్ మాట్లాడుతూ బ్యాంకు సేవల కోసం ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించవద్దని, బ్యాంకు మిత్రల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్యాషియర్ హరీష్, సిబ్బంది రామారావు, బ్యాంకు మిత్రలు కొండబాబు, బాలకుమారి, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

మాదిగల సమస్యలు పరిష్కరించాలి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మన్యంలో నివసిస్తున్న మాదిగల సమస్యలను పరిష్కరించాలని పాడేరు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కుందూరు వెంకటరావు కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగను గురువారం విజయవాడలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారులకు వితరణ

సీలేరు, న్యూస్‌టుడే: రింతాడలో పేద కుటుంబాలకు చెందిన చిన్నారులకు మన్యపుత్ర యువజన సంఘం తరపున దుస్తులు, నిత్యావసర సరకులు అందజేశారు. సంఘ అధ్యక్షుడు సోమేశ్‌కుమార్, సీపీఐ మండల కార్యదర్శి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాలడబ్బాల అందజేత

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: గుంటగన్నెల పంచాయతీ కూనపుట్టు గ్రామంలో బాలింత కాంతమ్మ అనారోగ్యం బారిన పడింది. తల్లిపాలకు చంటి బిడ్డ దూరమైనట్లు ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర యూనిటీ పర్ చారిటీ ట్రస్టు దృష్టికి తీసుకెళ్లారు. ట్రస్టు ప్రతినిధులు నీలి నారాయణ, మేరి జోస్పిన్ బాధిత కుటుంబానికి పాలడబ్బాలు వితరణ చేశారు. ప్రతినెలా అందిస్తామని తెలిపారు. ఆ సంఘ నాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సరకులు అందజేస్తున్న మన్యపుత్ర యువజన సంఘ ప్రతినిధులు

కొత్త ఏడాదికి కోటి ఆశలతో స్వాగతం

సీలేరు, జి.మాడుగుల, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలు గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. గూడెంకొత్తవీధి మండలం సీలేరు, దుప్పిలవాడ, ధారకొండ వీధులన్నీ రంగుల ముగ్గులతో కళకళలాడాయి. ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు జరిగాయి. అర్ధరాత్రి 12 గంటల సమయంలో పలు చోట్ల కేక్‌లు కట్‌చేసి కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. జి.మాడుగుల మండలంలో ప్రజలు ఆనందోత్సాహాలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. చర్చిలు, దేవాలయాల్లో ప్రార్థనలు, పూజలు జరిగాయి.

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: పాడేరులో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా విద్యాశాఖాధికారి రామకృష్ణారావు, మండల విద్యాశాఖాధికారులు జాన్, సరస్వతిదేవిలను ఉపాధ్యాయులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు కొట్టగుళ్లి సుబ్బారావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేకు కోశారు.

కొయ్యూరు, చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కొయ్యూరులోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చింతపల్లి ప్రధాన రహదారి, రామాలయం, నెయ్యిలవీధి తదితర చోట్ల మహిళలు, యువకులు అర్ధరాత్రి వరకు ఉత్సాహంగా డ్యాన్స్ చేశారు.

చింతపల్లిలో కేక్ కోస్తున్న మహిళలు, చిన్నారులు

డుంబ్రిగుడ, హుకుంపేట, న్యూస్‌టుడే: డుంబ్రిగుడలో అల్లూరి యూత్ సభ్యులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో అధికారులను సచివాలయ సిబ్బంది సత్కరించారు. హుకుంపేట బెతేస్థ చర్చిలో బుధవారం రాత్రంతా క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. పాస్టర్ సాల్మన్‌రాజు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ దానగుణం, జాలి, ప్రేమ కలిగి ఉండాలన్నారు. ఎస్తేరురాణి, ఇస్సాకు, రాజారావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అరకులోయ, న్యూస్‌టుడే: పద్మాపురం ఉద్యానంలోని హాట్ ఎయిర్ బెలూన్‌పై నూతన సంవత్సరానికి స్వాగతం పలికేలా పోస్టర్‌ని ఎగురవేస్తూ ఉత్సాహంగా వేడుకలను జరుపుకొన్నారు.

సీలేరు యూసీఐఎం చర్చిలో చిన్నారుల నృత్యాలు

పాడేరు వేడుకల్లో ఉపాధ్యాయులు..

హుకుంపేటలో అన్నదానం

డిపో భవనం.. శిథిలమయం!

గుమ్మకోట డీఆర్ డిపో భవనం మరమ్మతులకు గురైంది. భవనం నిర్మాణం చేపట్టి ఇప్పటికే సుమారు 40 సంవత్సరాలు కావడంతో పూర్తిగా శిథిలమైంది. పలుమార్లు చిన్న చిన్న మరమ్మతులు చేపట్టినా ప్రయోజనం లేకపోయింది. ఇందులో బియ్యం, పంచదార వంటి నిత్యావసర సరకులను నిల్వ చేయడం నిర్వాహకులకు తలకుమించిన భారంలా మారింది. వర్షాలు పడినప్పుడు సరకులు తడిచిపోతున్నాయని చెబుతున్నారు. అధికారులు స్పందించి నూతన భవనం నిర్మించాలని, అప్పటివరకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. – అనంతగిరి, న్యూస్‌టుడే

మరమ్మతులకు గురైన గుమ్మకోట డిపో

క్యాలెండర్ల ఆవిష్కరణ

కొయ్యూరు, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈవో రాంబాబు, ఆ సంఘ నేతలు గురువారం ఆవిష్కరించారు. సంఘ మండల అధ్యక్షుడు వి.తలుపులు, ప్రధాన కార్యదర్శి పంతులుబాబు, కె.మురళీ, ఎల్.సురేష్, ఎస్.సుభద్రమ్మ, కె.వాసంతి తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో రాంబాబు, పీఆర్‌టీయూ నేతలు

గూడెంకొత్తవీధిలో..

సీలేరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీటీఎఫ్) క్యాలెండర్, డైరీలను మండల విద్యాశాఖాధికారులు గోవింద్ పడాల్, రామన్నపడాల్ ఆవిష్కరించారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో కేరింతలు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: కొత్తపల్లి జలపాతంలో పర్యాటకులు గురువారం కేరింతలు కొట్టారు. నూతన సంవత్సరం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో జలపాతం కిక్కిరిసింది. ఇక్కడి అందాలు వీక్షించి మంత్రముగ్ధులయ్యారు.

కొత్తపల్లి జలపాతంలో పర్యాటకులు

గిరిజన మ్యూజియం బయట అంతంతమాత్రంగా సందర్శకులు..

అరకులోయ, న్యూస్‌టుడే: ఆంధ్రా ఊటీ అరకులోయలో పర్యాటకుల సంఖ్య అంతంతమాత్రంగానే ఉంది. గత వారం రోజుల నుంచి సందర్శకులతో పోటెత్తిన ఇక్కడి సందర్శిత ప్రాంతాలు గురువారం వెలవెలబోయాయి. నూతన సంవత్సరం అయినప్పటికీ పర్యాటకులు అంతగా అరకు రాలేదు. గిరిజన మ్యూజియం, కాఫీ తోటలు, వ్యూపాయింట్, పద్మాపురం ఉద్యానం తదితరాలు కళ తప్పాయి.

విద్యాభివృద్ధికి కృషి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: గిరిజన విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు పాటుపడాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణారావు అన్నారు. గురువారం డుంబ్రిగుడ వచ్చిన ఆయనకు పీఆర్‌టీయూ నాయకులు, మండల విద్యాశాఖ అధికారి-2 గెన్ను పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు. పిల్లలంతా బడిలో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శి చిన్నిబాబు, పోలన్న, నాయకులు రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణారావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అందాలు ఘనం.. పరిశుభ్రత కనం!

చింతపల్లి, న్యూస్‌టుడే: మన్యంలో ఏటా చలికాలంలో ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చి వెళుతున్నారు. ఇక్కడ సహజసిద్ధ అందాలకు పరవశించిపోతున్నారు. వారాంతాలు, పండగలు, వరుస సెలవుల నేపథ్యంలో చలికాలంలో మన్యంలో పర్యాటక ప్రాంతాలకు వచ్చి వెళుతున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. చింతపల్లి మండలం లంబసింగి, తాజంగి, చెరువులవెనం కొత్తపల్లి, పాడేరులోని వంజంగి మేఘాల కొండ, కొత్తపల్లి, ఎర్నాపల్లి జలపాతాలకు ఇటీవల బాగా ఆదరణ పెరిగింది. పర్యాటకుల రాక వల్ల మన్యానికి ఆదరణ పెరుగుతున్నా.. వారు చేసే పనుల వల్ల ఈ ప్రాంతంలో పరిశుభ్రత దెబ్బతింటోంది. దూరప్రాంతాల నుంచి కార్లు, ఇతర వ్యక్తిగత వాహనాల్లో వచ్చేవారంతా తమ వెంట తినుబండారాలు, వివిధ రకాల ఆహార పొట్లాలు, మంచినీళ్ల సీసాలు, మద్యం బాటిళ్లు తీసుకొస్తున్నారు. వాటిని వినియోగించిన తరువాత ఎక్కడికక్కడే వదిలేసి వెళ్లిపోతున్నారు. వీటి వల్ల అక్కడ పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతోపాటు తోటి వారికి ఇబ్బందిగా మారుతోంది. మద్యం సీసాలు తాగి పడేసి వెళ్లిపోవడంతో అవి పగిలి ఇతరులు గాయపడుతున్న సందర్భాలు ఉంటున్నాయి.

★ పాలిథిన్ సంచుల వినియోగంతో పర్యావరణం పూర్తిగా కలుషితమవుతోంది. పర్యాటక ప్రాంతాల్లో పాలిథిన్ సంచుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించామని అధికారులు చెబుతున్నా ఇది ఆచరణలో నోచుకోవడంలేదు. పైగా పేరుకుపోతున్న పాలిథిన్ వ్యర్థాల తొలగింపు పంచాయతీలకు పెద్ద సమస్యగా మారుతోంది. దీంతో స్థానికంగా ఉన్న గిరిజన యువతే చొరవ తీసుకుని తమ గ్రామాల్లో పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగిస్తున్నారు. చెరువులవెనంలో అక్కడ గిరిజన యువత తరచూ పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. తాజంగిలో పర్యాటక వికాస్ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. బయోమరుగుదొడ్లు లేకపోవడంతో చాలామంది బహిరంగ ప్రదేశాలనే వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటున్నారు. దీంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని పర్యాటక ప్రాంతాల్లో మరుగుదొడ్ల ఏర్పాటుతోపాటు పాలిథిన్ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. పర్యాటక ప్రాంతాల్లో ఏపీ పర్యాటక శాఖ కొన్ని రకాల సదుపాయాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

పేరుకుపోయిన పాలిథిన్ వ్యర్థాలు

అమరులకు నివాళి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: భీమా కోరేగావ్ విజయ్ దివస్‌ను అరకులోయలో భీమ్‌సెఫ్, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కోరేగావ్ యుద్ధం.. అంబేడ్కర్, పులే వంటి మహనీయులు అణగారిన వర్గాల ఉన్నతికి చేసిన పోరాటాలకు స్ఫూర్తిని ఇచ్చిందని భీమ్‌సెఫ్ ప్రతినిధులు లైకోన్, జలంధర్ అన్నారు. యుద్ధంలో అమరులకు నివాళులు అర్పించారు. బాలకృష్ణ, స్వామి, వికాష్, పెద్దన్న, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి

రంపచోడవరం, న్యూస్‌టుడే: నూతనంగా ఏర్పడిన జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. గురువారం నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ గత పాలకులు ఈ నియోజకవర్గాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లాలో విలీనం చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకొని సీఎం చంద్రబాబు ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేశారన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లిలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏఈఈ వనుము ప్రభాకరరావు తెలిపారు. చింతపల్లిలో గురువారం నూతన విద్యుత్తు తీగలు అమర్చారు. మండల కేంద్రంలో గతంతో పోల్చుకుంటే విద్యుత్తు వినియోగం బాగా పెరిగిందని, సరఫరా చేస్తున్నప్పుడు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. చాలా వీధుల్లో లోవోల్టేజీ సమస్య ఉందని, ఈ సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. పలు వీధుల్లో పాత విద్యుత్తు తీగలు తొలగించి నూతన వైర్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విద్యుత్తు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు తీగలు అమర్చుతున్న సిబ్బంది

తుమ్మనవలసలో రెండు కార్లు ఢీ

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తూరు పంచాయతీ తుమ్మనవలస వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. అరకులోయ నుంచి వస్తున్న కారు, ఎస్.కోట నుంచి అరకులోయ వైపు వెళ్తున్న కారు ఎదురుగా ఢీకొన్నాయి. కార్ల ముందు భాగం దెబ్బతిన్నాయి. కారులో వారు ఎవరికీ ఏం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

ఘటనాస్థలంలో కార్లు

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు	అరకులోయ: 63034 86346
89853 66570	రంపచోడవరం: 94908 77172

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: కరిముఖిపుట్టు పంచాయతీ గొర్రెలమెట్ట గ్రామానికి వెళ్లే రహదారి దయనీయంగా మారింది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.– సంజయ్‌కుమార్, స్థానికుడు, ✓: తారురోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని ప్రతిపాదించాం. నిధులు విడుదలైతే పనులు చేపడతాం. – రాముడు, ఏఈ, గి.సం.శాఖ, ముంచంగిపుట్టు

పెదబయలు, న్యూస్‌టుడే: లక్ష్మీపేట పంచాయతీ అల్లంపుట్టులో పాఠశాల భవనం అసంపూర్తిగా ఉంది. తక్షణమే పూర్తిచేసి ఇబ్బందులు తొలగించాలి – సురేష్, అల్లంపుట్టు, ✓: ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే పూర్తిచేస్తాం – కృష్ణమూర్తి, ఎంఈవో, పెదబయలు

(c) eenadu

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తారు

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను గురువారం నూతన సంవత్సరం రోజు దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ భక్తులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించి పర్యవేక్షించారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు అంతా సిద్ధం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గుంటూరు ఏటుకూరు బైపాస్ రోడ్డులోని శ్రీసత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ ప్రాంగణంలో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో జరగనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు అంతా సిద్ధమైంది. దాదాపు ఆరు వేల మంది కూర్చుని కార్యక్రమాలను చూసేందుకు వీలుగా ప్రధాన వేదికను రూపొందించారు. దీంతో పాటు మరో నాలుగు వేదికలు సిద్ధమయ్యాయి. సభలకు వచ్చే వారి కోసం భోజన వసతి, వివిధ అంగళ్లు, ప్రదర్శనశాలల నిర్మాణాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. సాహిత్య, సాంస్కృతిక, కళాంశాల ఆస్వాదనకు ప్రేక్షకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగినన్ని ఏర్పాట్లు, నిర్వహణలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఇది తెలుగు చేవ అని ప్రపంచానికి తెలియజెప్పేలా కార్యక్రమాలను రూపకల్పన చేశామని పేర్కొన్నారు.

ప్రధాన వేదికను పరిశీలిస్తున్న గజల్ శ్రీనివాస్, ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, పీఆర్ రాజు తదితరులు

రాజముద్రతో పాస్‌పుస్తకం

- నేటి నుంచి 9 వరకు పంపిణీకి చర్యలు
- జిల్లాలో 35,690 పుస్తకాలు సిద్ధం



కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జారీ చేసే పట్టాదారు పాస్‌పుస్తకంపై రాజకీయాలకు సంబంధించిన ఎటువంటి ముద్రలుండవు.. చిత్రాలు ఉండవు.. రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర మాత్రమే ఉంటుంది. ఇది కూటమి ప్రభుత్వం 2026 నూతన సంవత్సరంలో వ్యవసాయ భూమి ఉన్న రైతులకు అందించే పట్టాదారు పాస్‌పుస్తకం. గుంటూరు జిల్లాకు సంబంధించి ఇప్పటికే 35,690 ముద్రితమై వచ్చాయి. నెలల కిందటే జిల్లాకు పట్టాదారు పాస్‌పుస్తకాలు వచ్చినా ఇంకా పంపిణీ చేయలేదు. దీనిపై యంత్రాంగం పెద్ద కసరత్తే చేసింది. రైతుల పేరుతో ప్రభుత్వ రాజముద్రతో ముద్రితమై జిల్లాకు వచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకాలను మండలాల వారీగా ఆయా మండలం, గ్రామంలోని వీఆర్వోలు ఏమైనా తప్పులున్నాయా.. లేదా అనే అంశాలను సుమారు నెన్నర రోజుల పాటు పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల వీఆర్వోలు.. వారి పరిధిలోని పాస్ పుస్తకాల్లో తప్పులు లేకుండా పరిశీలించారు. కొన్నింటిలో తప్పులు దొర్లినా.. వాటిని సవరణకు పంపి కచ్చితమైన వివరాలతో తెప్పించారు. రైతు చేతికి వెళ్లాక ఎటువంటి తప్పులు ఉండకుండా ఉండేలా ముందస్తుగానే ప్రభుత్వ సూచన మేరకు యంత్రాంగం ఈ చర్యలు చేపట్టింది.

గతంలో పరిస్థితి ఇదీ..

వైకాపా ప్రభుత్వ హయాంలో జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం పేరుతో భూములను రీసర్వే చేసింది. రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని రైతుల భూములకు సంబంధించి భూహక్కు పత్రం పేరుతో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాన్ని పట్టాదారు పాస్‌పుస్తకంపై ముద్రించారు. రీసర్వేలో అనేక లోపాలున్నా.. వాటిని సరిచేయకుండా వదిలేశారు. రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి సర్కారు ఎన్నికల సమయంలో భూయజమాని చిత్రంతో, రాజముద్రతో అందిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ జనవరి 2వ తేదీ నుంచి మండలాల వారీగా సభల్లో పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసింది.

ఏపీఎన్జీవోల సంఘం జిల్లా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీఓల సంఘం జిల్లా ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి కిలారు జగదీశ్వరరావు గురువారం విడుదల చేశారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో సహా 17 పోస్టులకు ఈ ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 4న నామినేషన్ల స్వీకరణ, 19న ఓటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు చెప్పారు. గుంటూరుతో పాటు, ప్రత్తిపాడు, దుగ్గిరాల, అమరావతి, మంగళగిరి, తెనాలి, పొన్నూరు తాలూకా యూనిట్లకు చెందిన 256 మంది ఓటర్లు.. ఓటు హక్కును వినియోగించుకుని జిల్లా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు.

పుస్తక.. పండగొచ్చేసిందోచ్!

- ఇందిరాగాంధీ మైదానంలో 36వ ప్రదర్శన
- 309 స్టాళ్లు.. జనవరి 12 వరకు నిర్వహణ

ఈనాడు, అమరావతి

విజయవాడ పుస్తక మహోత్సవానికి.. వేదిక సిద్ధమైంది. నేటి నుంచి 36వ పుస్తక పండగ.. విజయవాడలో సందడి చేయబోతోంది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జనవరి 02 నుంచి 12 వరకు.. వేడుక జరగబోతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి స్టాళ్ల సంఖ్య బాగా పెరిగింది. దేశంలో ప్రముఖ ప్రచురణ సంస్థలన్నీ తరలివచ్చాయి. ఈసారి తెలుగుతో పాటు ఆంగ్ల పుస్తకాల ప్రచురణ సంస్థలు భారీగా వచ్చాయని.. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ (వీబీఎఫ్ఎస్) అధ్యక్షుడు టి.మనోహర్‌నాయుడు తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 09 వరకూ ప్రదర్శన కొనసాగుతుంది.

భారీ స్పందనకు వీలు...

హైదరాబాద్‌లో పుస్తక మహోత్సవానికి ఈసారి విపరీత రద్దీ నెలకొంది. కొనుగోళ్లు భారీగా పెరిగాయి. అందుకే.. విజయవాడ పుస్తక మహోత్సవానికి సైతం స్పందన భారీగా ఉండబోతోందని నిర్వాహకులు అంచనా వేసి ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా యువత, పిల్లలు ఎక్కువగా రానున్నారు. పాఠశాలల్లో పుస్తక పఠనం పెంచడానికి చేస్తున్న ప్రయత్నాలే దీనికి కారణం.

ఇందిరాగాంధీ స్టేడియంలో పుస్తక ప్రదర్శనకు జరుగుతున్న ఏర్పాట్లు..

స్టాల్స్‌లో పుస్తకాలు సర్దుకుంటూ..

స్టాళ్లు.. పెరిగాయ్..

262 స్టాళ్లు.. దేశంలోని ప్రముఖ ప్రచురణ సంస్థలవి కాగా.. 47 స్టాళ్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలవి. నిరుడు 240 స్టాళ్లే ఏర్పాటయ్యాయి. గతసారి వేదిక వెతుకులాటతోనే ఆఖరు నిమిషం వరకూ ఉత్కంఠ నెలకొనగా.. చివరిలో ఇందిరాగాంధీ మైదానం కుదిరింది. ఈసారి ముందే వేదికపై స్పష్టతరాగా.. స్టాళ్ల సంఖ్య గణనీయంగా పెరిగింది.

మహోత్సవం విశేషాలు..

- కృష్ణా, గుంటూరుల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తరలివచ్చేలా సహకరించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను వీబీఎఫ్ఎస్ తరఫున విజ్ఞప్తి చేశారు. దీంతో ఈసారి విద్యార్థుల రద్దీ విపరీతంగా ఉండబోతోంది.
- కోల్‌కతా పుస్తక ప్రదర్శన స్ఫూర్తితో ఏటా 'పుస్తక ప్రియుల పాదయాత్ర' బెజవాడలోనూ నిర్వహిస్తున్నారు. జనవరి 6న సాయంత్రం 4 గంటలకు మొగల్రాజపురం సిద్ధార్థ కళాశాల నుంచి పుస్తక మహోత్సవ ప్రాంగణం వరకూ పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈసారి ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్నారు.
- 1989 అక్టోబరులో నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొదటి పుస్తక మహోత్సవం విజయవాడలో నిర్వహించారు. తర్వాత ఏటా పుస్తక మహోత్సవం నిర్వహించాలని ప్రచురణకర్తలు నిర్ణయించారు. విజయవాడలో ప్రచురణకర్తలు, సాహితీవేత్తలు, కవులు, రచయితలు అంతా కలిసి విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం(వీబీఎఫ్ఎస్)గా ఏర్పడ్డారు.
- తొలి ఏడాది 1989లో 84 స్టాళ్లతో నిర్వహించగా, 1991లో 90కు పెరిగాయి. 2015లో అత్యధికంగా 389 స్టాళ్లతో రికార్డు సృష్టించారు. క్రమంగా స్టాళ్లు తగ్గుతూ.. ఈసారి 309కి చేరాయి.

గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామిని నూతన సంవత్సరం రోజు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు వేలాదిగా దర్శించుకున్నారు. - పట్టాభిపురం

సాగర్ నీటిమట్టం 562 అడుగులు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం సాయంత్రం 7 గంటలకు 562.90 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 15,748 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 6774 క్యూసెక్కులు, సాగర్ కుడి కాలువకు 9500, ఎడమ కాలువకు 8022, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 1812, లోలెవల్ కెనాల్‌కు 300.. మొత్తం 26,637 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఇంటిని మరిపిస్తుంది.. సౌకర్యం కల్పిస్తుంది..

వీవీఐపీల కోసం వంట గది, బెడ్‌రూం, బాల్కనీతో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాప్సూల్

జనవరి 3 నుంచి గుంటూరు సత్యసాయి స్పిరిచ్యువల్ సెంటర్‌లో జరగనున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనే వీవీఐపీల కోసం ప్రత్యేకంగా సభావేదికల వద్ద క్యాప్సూల్ హోమ్స్ ముస్తాబు అవుతున్నాయి. ఒక్కొక్కటి రూ.23లక్షల ఖరీదైన మూడింటిని ఇక్కడ అందుబాటులో ఉంచారు. వీటిలో ఇంటిని తలపించేలా వంటగది, అధునాతన మరుగుదొడ్లు, షవర్లు, 16 పడకలు, బాల్కనీ వంటి వసతులు ఉంటాయి. సీఎం, సుప్రీంకోర్టు న్యాయమూర్తి వంటి ప్రధాన అతిథుల కోసం వీటిని ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

- ఈనాడు, అమరావతి

లోపల అత్యాధునిక వాష్‌రూం

దివ్యాంగులకు తోడుగా.. ఆత్మీయత మెండుగా..

అంధుల పాఠశాల విద్యార్థులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి తదితరులు

బ్రాడీపేటలోని అంధుల పాఠశాలలో కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. అంధ విద్యార్థులను ఆప్యాయంగా పలకరించారు. కేకు కోసి వారికి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. లక్ష్యాన్ని సాధించే దిశగా కష్టపడాలని కలెక్టర్ సూచించారు. - కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే

వైకాపా శ్రేణుల రాతలపై ఫిర్యాదు

పెదనందిపాడు, న్యూస్‌టుడే : పెదనందిపాడు మండలం జరుగులవారిపాలెం వద్ద చిలకలూరిపేట రహదారిపై గుర్తు తెలియని వైకాపా శ్రేణులు పిచ్చిరాతలు రాసి అనాగరికంగా వ్యవహరించారని, ఈ వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బ తీశాయని, కారకులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని తెదేపా నేతలు వీరయ్య, రామనాథ్ బాబు, అంకమ్మ చౌదరి, ఎన్.శ్రీనివాసరావు, ఆర్.శ్రీనివాసరావు పోలీసు అధికారులను కోరారు. గతంలో కూడా ఇక్కడ తెదేపా ఫ్లెక్సీ చించివేశారని వారు పేర్కొన్నారు. ఎస్సై సత్యనారాయణ ఘటనా ప్రదేశాన్ని గురువారం రాత్రి పరిశీలించారు. విచారణ చేస్తున్నారు.

'న్యూ గుంటూరు'కు కొత్త శోభ

రూ.4.68 కోట్లతో అభివృద్ధి పనులు

ఈనాడు, అమరావతి

న్యూ గుంటూరు రైల్వేస్టేషన్ కొత్తరూపు సంతరించుకోనుంది. ఏళ్ల తరబడి పీడించిన అసౌకర్యాల బాధ తప్పించేందుకు రూ.4.68 కోట్లతో పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ప్లాట్‌ఫామ్స్ విస్తరణతోపాటు మౌలిక సౌకర్యాలు కల్పించనున్నారు.

రైల్వేపరంగా గుంటూరు కీలక ప్రాంతం. 22 ఏళ్ల క్రితం డివిజన్‌గా మారింది. ప్రధాన రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం 90కు పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. 10వేలమందికిపైగా ప్రయాణిస్తుంటారు. ఎగుమతులు, దిగుమతులూ పెరిగాయి. రద్దీని తట్టుకునేందుకు దశాబ్దాల క్రితం గుంటూరు న్యూ రైల్వేస్టేషన్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ఎరువులు, సిమెంటు అవసరాల కోసం గోదాములు ఏర్పాటు చేశారు. క్రమేణా ప్రయాణికుల రాకపోకలకు అవకాశం కల్పించారు.

ఇదీ పరిస్థితి..

- నగరానికి 3 కిలోమీటర్ల దూరంలో నెహ్రూనగర్‌లో ఈ స్టేషన్ ఉంది.
- గతంలో ఇక్కడికెళ్లి రైలెక్కాలంటే ప్రయాణికులు భయపడేవారు.
- క్రమేణా నగరం విస్తరించడం, ఈ ప్రాంతానికి రాకపోకలు పెరగడంతో మార్పు వచ్చింది.
- 2022-23లో వార్షిక ప్రయాణికుల సంఖ్య ఆధారంగా ఎన్ఎస్‌జీ 5 స్టేషన్ జాబితాలోకి చేరింది. 12 రైళ్లు ఈ మార్గంలో వెళ్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. పండగ సమయాల్లో ప్రత్యేక రైళ్ల రద్దీ ఉంటోంది.
- దేశంలో రద్దీగా ఉండే 1,195వ స్టేషన్‌గా రైల్వేశాఖ గుర్తించింది.
- విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్, జనశతాబ్ది, అండమాన్ ఎక్స్‌ప్రెస్, సర్కార్, లఖ్‌నవూ ఎక్స్‌ప్రెస్.. ఈ స్టేషన్ మీదుగా వెళ్తున్నాయి.

న్యూ గుంటూరు రైల్వేస్టేషన్

ఇబ్బందులివీ..

రద్దీకి తగ్గట్టుగా సౌకర్యాల్లేవు. ఒకటే ప్లాట్‌ఫామ్, ఒకే విద్యుత్తు లైన్ ట్రాక్ ఉన్నాయి. ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్లు, లిఫ్టులు లేవు. 2019 ఏప్రిల్‌లో రూ.30 లక్షలతో కొంతమేర అప్‌గ్రేడ్ చేయడానికి అవకాశం ఏర్పడింది. గత ఆగస్టులో ఆధునికీకరణకు రూ.4.68 కోట్లు మంజూరయ్యాయి. ఈ నెల 16న పనులకు పచ్చజెండా ఊపుతూ రైల్వేశాఖ ఉత్తర్వులిచ్చింది.

ఏమేం చేస్తారంటే..

- ఇంజినీరింగ్ విభాగానికి రూ.3.88 కోట్లు...
- రూ.44 లక్షలు ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్‌కు, రూ.36 లక్షలు టెలికాం అనుబంధ అంశాలకు కేటాయించారు.
- ప్లాట్‌ఫామ్, అప్రోచ్ రోడ్డు విస్తరిస్తారు.
- దివ్యాంగులకు ర్యాంపులు సహా ఇతర సదుపాయాలు కల్పిస్తారు.
- చుట్టుపక్కల వీధిదీపాలు, క్లాక్‌రూములు, పార్కింగ్ ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు.

అమరావతిలో భూగర్భ విధానంలో విద్యుత్తు పనులు

సీడ్‌యాక్సెస్ రహదారి పక్కన భూగర్భ విధానంలో అమర్చుతున్న హెచ్‌టీ విద్యుత్తు లైన్లు

తుళ్లూరు, న్యూస్‌టుడే : అమరావతిలో ట్రంక్ రోడ్లు, రైతుల రిటర్నబుల్ ప్లాట్ల లేఔట్ల నిర్మాణాల్లో రహదారుల వెంట భూగర్భ విధానంలో విద్యుత్తు, ఇంటర్‌నెట్ సౌకర్యాల కోసం మౌలిక సదుపాయాల నిర్మాణ పనులు వేగంగా చేస్తున్నారు. రహదారుల వెంట వివిధ సైజుల్లో ఉన్న పైపులు, కేబుళ్లు భూగర్భంలో అమర్చే పనులు చేపట్టారు. మరో వైపు రాజధానిలో భూగర్భ విధానంలో హైటెన్షన్ విద్యుత్తు లైన్ల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. దొండపాడు సమీపంలో సీడ్ యాక్సెస్ రహదారితో పాటు ఎన్- 16 తదితర ప్రాంతాల్లో ఈ పనులు చేస్తున్నారు. వీటిని రాజధాని గ్రామం తాళ్లాయపాలెం వద్ద నిర్మించిన 4000 కేవీ ప్రధాన ఉప కేంద్రానికి అనుసంధానం చేయనున్నారు. పనులు పూర్తయ్యాక భూమిపై వెళుతున్న హెచ్‌టీ లైన్లు పూర్తిగా తొలగించనున్నారు.

పత్తి కంటే.. గింజకే ధర

కొరత పేరుతో పెరిగిన డిమాండ్

ఈనాడు, అమరావతి

పత్తికి బహిరంగ మార్కెట్లో ఆశించిన ధర దక్కకపోయినా గింజలకు మాత్రం గరిష్ఠ స్థాయిలో పలుకుతోంది. ప్రస్తుతం క్వింటాలు రూ.3,300-రూ.3,400 మధ్య అమ్ముడవుతున్నాయి. సాధారణంగా పత్తి చేతికొచ్చినప్పుడు గింజల లభ్యత పెరిగి ధర తగ్గుతుంది. డిసెంబరులో క్వింటాలుకు రూ.2 వేలకు ఉండేది. ఈసారి అంచనాలు మించి రూ.3వేలు దాటేసింది. ఇదింకా పెరిగే అవకాశం ఉందని మార్కెట్‌వర్గాల అంచనా. భవిష్యత్తులో కొరత ఏర్పడుతుందన్న భావనతో ధరలు పెరుగుతున్నాయని విశ్లేషిస్తున్నారు.

సాగు, దిగుబడులు తగ్గడమే కారణం...

- దేశవ్యాప్తంగా పత్తి సాగు తగ్గిపోవడం, దిగుబడులు పడిపోతుండడంతో పత్తి గింజలకు కొరత ఏర్పడొచ్చని అంచనా. మొత్తం పత్తి పంటలో గింజల ఉత్పత్తి మూడో వంతు వరకు ఉంటుంది.
- రెండు తెలుగు రాష్ట్రాల్లో జనవరి తరువాత కూడా పంట కొనసాగితే కొంతమేర గింజలు వచ్చేవి. ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది.
- ప్రైవేటు వ్యాపారుల వద్ద పత్తి, గింజల లభ్యత తగ్గిపోయింది.
- సీసీఐ దగ్గర మాత్రమే గింజలు ఉన్నాయి. ఇది ఆన్‌లైన్‌లో వేలం విధానంలో విక్రయిస్తోంది.
- ఏటాకంటే ఈసారి లభ్యత 20 నుంచి 30 శాతం తగ్గొచ్చన్న అంచనాల నేపథ్యంలో పోటీ పెరిగింది.
- ఎప్పుడూ లేనివిధంగా ఈసారి గింజలను శీతల గోదాముల్లో నిల్వ చేస్తున్నారు.
- నాణ్యమైన గింజలను మహారాష్ట్ర, గుజరాత్ వ్యాపారులు ఎక్కువగా సేకరిస్తున్నారు.
- తెలంగాణ నుంచి మనరాష్ట్రంలోని ఆయిల్ మిల్లులకు ఏటా మాదిరిగా పత్తి గింజలు రావడం లేదని యజమానులు చెబుతున్నారు.

మిల్లులకు ముడిసరకు కొరత

రాష్ట్రంలో పత్తి నూనె మిల్లులకు ప్రధాన ముడిసరకు గింజలు. నవంబరు నుంచి ఏప్రిల్ వరకే లభ్యమవుతాయి. మిగిలిన పంటల మాదిరిగా శీతల గోదాముల్లో నిల్వ చేసి తరువాత వాడుకునేందుకు వీలు లేదు. అందువల్లనే నవంబరు-ఏప్రిల్ వరకే గింజల సీజన్‌గా పరిగణిస్తారు. ఈసారి వాతావరణ పరిస్థితుల వల్ల దిగుబడులు క్షీణించాయి. ధరల సమస్య వల్ల ఎక్కువమంది రైతులు పత్తిని డిసెంబరులోనే తొలగించి మొక్కజొన్న, శనగ తదితర పంటలు సాగు చేశారు. ఇది పత్తి నూనె మిల్లులకు సంకటంగా మారింది.

యంత్ర పరికరాలు వచ్చేశాయ్

- విద్యుత్తు పనులు మొదలు
- ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న ఎంసీహెచ్ బ్లాక్

ఈనాడు - అమరావతి

గుంటూరు సమగ్ర ప్రభుత్వాసుపత్రిలోని కానూరి-జింకానా మాతా శిశు సంరక్షణ భవనం (ఎంసీహెచ్ బ్లాక్) ప్రారంభోత్సవానికి నెలరోజులే సమయం ఉండడంతో అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నిర్మాణం కొలిక్కి వచ్చింది. విద్యుత్తు సౌకర్యాల కల్పనకు ఆ శాఖవర్గాలు పచ్చజెండా ఊపడంతో పనులు మొదలవుతున్నాయి. ఇందుకయ్యే రూ.15 లక్షలు చెల్లించేందుకు ఆసుపత్రి వర్గాలు సిద్ధమైనట్టు సమాచారం. ప్రత్యేక లైను, ట్రాన్స్‌ఫార్మర్ తదితరాల ఏర్పాటుకు విద్యుత్తుశాఖ పచ్చజెండా ఊపినట్టు సమాచారం.

ఎంసీహెచ్ బ్లాక్‌కు చేరిన యంత్ర, పరికరాల పెట్టెలు..

అంచనా వ్యయం : సుమారు రూ.100 కోట్లు
సెల్లార్ సహా అంతస్తులు : జీ+5
మొత్తం పడకలు : 597

రూ.27 కోట్ల యంత్ర పరికరాలు.. జీజీహెచ్‌లోనే అతి పెద్ద భవనంగా ఎంసీహెచ్ రూపొందుతోంది. ఇక్కడ రూ.27 కోట్ల విలువైన యంత్ర, పరికరాలను సమకూర్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఇటీవల కొన్ని పరికరాలు జీజీహెచ్ స్టోర్స్‌కు చేరాయి. నియోనటల్ పల్స్ ఆక్సీమీటర్లు, నియోనాటల్ వెంటిలేటర్లు, సీటీజీ మిషన్, ఫెటల్ డాప్లర్, సిరంజ్ పంప్స్, బ్లడ్ అండ్ ఫ్లూయిడ్ వార్మర్లు, డబుల్ సర్ఫేస్ ఫొటోథెరపీ, అనస్తీషియా వర్క్‌స్టేషన్ విత్ వాపొరైజర్.. ఇలా మొత్తం 27 రకాల యంత్ర, పరికరాలు, ఫర్నిచర్ సమకూర్చాలని ప్రభుత్వాన్ని కోరగా.. ఇందులో 50 శాతం సామగ్రి చేరింది.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు.. ఎంసీహెచ్ బ్లాక్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అదేరోజు గుంటూరు వైద్య కళాశాలలో రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది.

అమృతమూర్తికి అశ్రుతాంజలి

జననం : 01-07-1937
మరణం : 24-12-2025

కీ॥శే॥ శ్రీమతి డా॥ వీరగంధం సువర్ణ పద్మావతి గారు
పద్మావతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కొత్తపేట, గుంటూరు.
నీ జ్ఞాపకాల మధుర స్మృతులే మాకు నిత్య స్మరణీయం.. బాధాతప్త హృదయాలతో...
భర్త : డా॥ వీరగంధం వెంకట సుబ్బారావు
కుమారుడు - కోడలు : డా॥ VSV. రమేష్ - డా॥ PV. సుమన్
మనుమరాండ్రు, మనుమడు : V.శృతి, V.ప్రీతి, V.కృష్ణ
కుమార్తె - అల్లుడు : డా॥ YS.లక్ష్మి - డా॥ Y.శ్రీనివాస్
మనుమడు : డా॥ Y.విజయ్-డా॥ Y.విద్య
మనుమరాలు : డా॥ స్వాతి - మాధ్యూ
ముని మనుమలు, ముని మనుమరాలు : Y.ఐషికృష్ణ, Y.మీరాపార్వతి, జోసఫ్ రవి, క్రిష్టఫర్ నిఖిల్
సంస్మరణ సభ : ది.03-01-2026 శనివారం మధ్యాహ్నం 12 గంటలకు 'V' కన్వెన్షన్, గుజ్జనగుండ్ల, పలకలూరు రోడ్, గుంటూరు నందు జరుగును. కావున తెలియపరచడమైనది. సెల్ : 9963192709

కురగల్లు సొసైటీ నగదు మోసం కేసులో మరో నిందితుడి అరెస్టు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే : మంగళగిరి మండలం కురగల్లు గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నిధుల దుర్వినియోగం కేసులో మరో నిందితుడిని అరెస్టు చేసినట్లు గుంటూరు సీసీఎస్ డీఎస్పీ బీవీ మాధవరావు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. పీఏసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాయల రమేష్‌బాబు మరి కొంత మంది ఉద్యోగులతో కలిసి మోసం చేశారని కురగల్లు ప్రజలు ఫిర్యాదు చేశారు. సొసైటీ డిపాజిటర్ల నుంచి వీరు అధిక మొత్తంలో డిపాజిట్లు సేకరించారు. వారికి అసలు బాండ్లకు బదులు నకిలీవి జారీ చేశారు. డిపాజిటర్లకు తామే నేరుగా వడ్డీని చెల్లిస్తామని నమ్మబలికారు. నగదును బ్యాంకులో నమోదు చేయకుండా దారి మళ్లించారు. 72 మంది డిపాజిటర్ల నుంచి రూ.8,50,93,474 తీసుకొని పరారయ్యారు. 112 నకిలీ డిపాజిట్లను సృష్టించి.. రైతులను మోసం చేశారని గత నెలలో పీఏసీఎస్ ఛైర్మన్ శీలం గోపయ్య మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుంటూరు సీసీఎస్ డీఎస్పీ బీవీ మధుసూదనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కేసులో ఇప్పటికే రావెల రమేష్ బాబును అరెస్టు చేయగా.. బెయిల్‌పై విడుదలయ్యాడు. బుధవారం అర్ధరాత్రి మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్ వద్ద కేసులో రెండో నిందితుడైన తాడిబోయిన శ్రీకాంత్‌ని అరెస్టు చేసి.. గురువారం కోర్టులో ప్రవేశపెట్టగా మంగళగిరి జడ్జి జి.ప్రసన్నలక్ష్మి రిమాండ్ విధించారు.

(c) eenadu

ఒక్క క్లిక్.. వందల పుస్తకాలు..

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

వందల సంవత్సరాల కిందట అచ్చయిన పుస్తకాలు, వేల రూపాయల ధర ఉన్నవి, అరుదైనవి కావాలంటే.. ఈ రోజుల్లో పుస్తకప్రియులు కాస్తంత ఇబ్బంది పడుతున్న మాట నిజమే. ఈ కష్టాన్ని పోగొట్టడానికి మూడో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా గుంటూరు సాహితీ సమాఖ్య ఓ వినూత్న, విశిష్ట కార్యక్రమాన్ని చేపట్టింది. నిఘంటు రచయితగా పేరున్న పెద్ది సాంబశివరావు సహకారంతో అందుబాటులో ఉన్న అధునాతన సాంకేతిక సహకారంతో తెలుగు భాష, సంస్కృతుల ప్రచారానికి ఉపకరించేవి, పాఠకుల ఆదరణ పొందిన వందల పుస్తకాలు సేకరించారు. వీటన్నింటినీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఒక 'క్యూఆర్ కోడ్'కు అనుసంధానించారు. ఆ కోడ్‌ను స్కాన్ చేస్తే సంబంధిత వెబ్‌సైట్ తెరుచుకుంటుంది. అందులో పీడీఎఫ్ పద్ధతిలో వివిధ పుస్తకాలు ఉంటాయి. వాటిలో ఏది కావాలో ఎంచుకుని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వాటి అచ్చు కాపీలు కావాలంటే ప్రపంచ తెలుగు మహాసభల్లో ఏర్పాటు చేస్తున్న అంగడిలో ధర చెల్లించి తీసుకోవచ్చు.

పాఠకుల సౌకర్యం కోసమే..

తెలుగు సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఏ స్థాయికి చేరుకుంటుందో తెలియజెప్పేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నాం. ప్రస్తుత కాలంలో అంతర్జాలంతో కూడిన చరవాణి అందరి వద్ద ఉంటోంది. చరవాణిలో కోడ్‌ను స్కాన్ చేసి మా దగ్గరున్న పుస్తకాల్లో కావాల్సినవి ఉచితంగా డౌన్‌లోడ్ చేసి చదువుకోవచ్చు. ప్రస్తుతం 50 వరకు నిఘంటువులు, గణితం, భాషా సాహిత్యాలకు సంబంధించినవి, పురాణం, వైజ్ఞానికం తదితరాలకు చెందిన 200 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వీటి సంఖ్య మరింత పెంచుతాం. **- ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ (సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి), పెద్ది సాంబశివరావు (నిఘంటు రచయిత)**

తెలుగు సభలు .. జానపద ఝురులు

మాట్లాడుతున్న డాక్టర్ చిట్టినేని శివకోటేశ్వరరావు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో తెలుగు జానపద కళావైభవ ప్రదర్శనకు కొంత సమయం కేటాయించారు. కొన్ని కళల ప్రదర్శనలతో పాటు ఆ కళల ఆవిర్భావ వికాసాల విశ్లేషణ కోసం ప్రత్యేక చర్చలు, కార్యశాలలు నిర్వహిస్తున్నారు. సమన్వయకర్త డాక్టర్ చిట్టినేని శివకోటేశ్వరరావు మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రాచీన కాలం నుంచి నేటి వరకు కళలను ప్రస్తుత తరానికి పరిచయం చేయాలన్న లక్ష్యంతో ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు, సభల నిర్వాహకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ పర్యవేక్షణలో జానపద కళారూపాలు ఎంపిక చేశారన్నారు. కనుమరుగవుతున్న వీధి భాగోతం, తూర్పు భాగోతం లాంటి వాటికి ప్రాధాన్యం ఇచ్చామన్నారు. కోలాటం, జడకోలాటం, చెక్క భజన తదితర కళారూపాల్లో పలు కళాశాలల విద్యార్థులకు శిక్షణ ఇచ్చి.. వారితో కళారూపాలను ప్రదర్శింపజేస్తున్నామన్నారు. ఈ విద్యార్థి కళా బృందాలు ముఖ్యమంత్రి తదితర వీవీఐపీలు వచ్చేటప్పుడు స్వాగతం పలుకుతారని తెలిపారు. తూర్పు భాగోతం లాంటి కళాప్రక్రియల్లో వంశపారంపర్యంగా వస్తున్న చివరి తరం వారిని పిలిచి పురస్కారాలిచ్చి సత్కరిస్తారన్నారు.

భక్తి భావనల వెలుగులు

ప్రపంచ తెలుగు మహాసభల్లో పూజలందుకోనున్న ఉభయదేవేరులతో శ్రీనివాసుడు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రపంచ తెలుగు మహాసభల్లో భక్తి భావనలకు పెద్దపీట వేస్తున్నారు. తెలుగు నాట భక్తి అనగానే గుర్తొచ్చే శ్రీవెంకటేశ్వర స్వామికి పూజలు, కల్యాణాలు, కీర్తనలతో ప్రారంభమై.. శివ, సుబ్రహ్మణ్యేశ్వర పూజలు, కల్యాణాలతో కళకళలాడేలా అచ్చంగా ఓ వేదిక నిర్మితమైంది. ప్రముఖ సీఏ గబ్బిట శివరామ కృష్ణప్రసాద్ బృందం వేదిక నిర్వహణ కయ్యే వ్యయాన్ని భరిస్తున్నారు. వేదిక సమన్వయకర్త అన్నాప్రగడ రవిశ్రీనివాస్ కార్యక్రమాల వివరాలు వెల్లడించారు.

మదురై నుంచి స్వామి విగ్రహం: తొలి రోజున లక్ష్మీగణపతి హోమంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం పద్మావతీ శ్రీనివాసుల కల్యాణోత్సవం జరుగుతుంది. ఇక్కడే మదురై నుంచి తీసుకొస్తున్న వెంకటేశ్వర స్వామి పంచలోహ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. తిరుమలలో శ్రీవారికి నిత్యం ఎలా అలంకరించి కల్యాణం నిర్వహిస్తారో.. అదేవిధంగా ఇక్కడి విగ్రహానికి నిర్వహిస్తారు. శివపార్వతులకు, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుల కల్యాణాలు జరుగుతాయి. హనుమాన్ చాలీసా, విష్ణు సహస్రనామ పారాయణలు, అన్నమయ్య సంకీర్తన గానాలు.. ఇలా ఎన్నో వైవిధ్యభరిత కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టి పడేలా ప్రాంగణాన్ని రూపొందిస్తున్నారు. తెలుగు ప్రజల సుఖశాంతులు, అభివృద్ధి, లోక సంక్షేమం సంకల్పాలతో హోమాలు నిర్వహించనున్నారు.

సమాజ చైతన్యానికి లఘుచిత్రం రూపకల్పన

ప్రచార ప్రతులను ఆవిష్కరిస్తున్న ఏపీ ఎంఎస్ఐడీసీ ఛైర్మన్ శ్రీనివాసరావు, నిర్మాత రాజేష్ తదితరులు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు నష్టపోతున్నాయి. దీనికి ప్రధాన కారణం వాహనం నడిపేవారు నిబంధనలు పాటించక పోవడమేనని ఏపీ ఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళగిరి నియోజకవర్గ జనసేన కార్యాలయంలో నిర్మాత, జనసేన నాయకుడు జొన్నా రాజేష్ నిర్మించిన తొమ్మిది నిమిషాలు నిడివి కలిగిన 'రాంగ్ డెసిషన్' అనే లఘుచిత్ర ప్రచార ప్రతులను ఆయన నటీనటులతో పాటు నిర్మాతతో కలసి గురువారం ఆవిష్కరించారు. కారు నడిపేవారు సీటుబెల్టు, ద్విచక్ర వాహనం నడిపేవారు శిరస్త్రాణం ధరించక పోవడం వల్ల కలిగే అనర్థాలను ఇందులో చూపారని తెలిపారు. ఒక కుటుంబంలోని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో చనిపోతే ఆ కుటుంబాన్ని నడిపేవారు లేక పడే అవస్థలు తెలియజేస్తూ సమాజాన్ని చైతన్యం చేసే రీతిలో రూపొందించిన లఘుచిత్రం ద్వారా చైతన్యం రావాలని కోరారు. సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలన్న అధినేత పవన్ కల్యాణ్ సూచనల మేరకు దీన్ని రూపొందించినట్లు నిర్మాత జొన్నా రాజేష్ తెలిపారు. దర్శకత్వం, కథానాయకులు పవన్ లావూరి, దినేష్, నటీనటులు మౌనిక, శశిరాజు, కోటేశ్వరి, పండు, దీక్షా మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

మాజీ ఉప రాష్ట్రపతి రాక 5న

పుల్లడిగుంట (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే : మండలంలోని పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జనవరి 5న నిర్వహించే ముందస్తు సంక్రాంతి సంబరాలకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు హాజరవుతారని కళాశాల ఛైర్మన్ మలినేని పెరుమాళ్లు తెలిపారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీనారాయణ, విద్యా మంత్రిత్వ శాఖ ఏఐసీటీఈ సీఈవో బుద్ధ చంద్రశేఖర్ పాల్గొంటున్నట్లు చెప్పారు. వీరు కళాశాలలో నిర్మించిన వసతి గృహం భవన సముదాయం ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

సహ్యాద్రి సిందూర.. దిగుబడి భళిరా!

రైతేరాజు

✪ హెక్టారుకు 55 క్వింటాళ్ల ఉత్పత్తి ✪ మధుమేహులకు ఎక్కువ ప్రయోజనం

పాలు పోసుకున్న వరి గింజలు

సహ్యాద్రి సిందూర బియ్యం

రైతన్నలకు ఓ కొత్త వరివంగడం లాభాల రుచి చూపించబోతోంది. కర్ణాటకలోని శివమొగ్గలోని శివప్ప నాయక వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయంలో 'సహ్యాద్రి సిందూర' రకం వంగడాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. సన్నగా, తెలుపెక్కి ఎరుపు వర్ణంలో ఉండే ఈ బియ్యంలో వండే అన్నం మధుమేహ సమస్యలు ఎదుర్కొనే వారికి ప్రయోజనకరం. హెక్టారుకు 55 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుంది. ప్రయోగాత్మకంగా సహ్యాద్రి సిందూరను ఎక్కువ మంది రైతులకు చేర్చే లక్ష్యంతో ఎక్కువ వంగడాలను సిద్ధం చేస్తున్నామని కర్ణాటక వ్యవసాయ శాఖ మంత్రి చెలువ రాయస్వామి తెలిపారు. సహ్యాద్రి సిందూర ఎర్రగా ఉన్న పుటికి సోనా మసూరి తరహాలో సన్నగా ఉంటుంది. ఐదేళ్లలో విడుదల చేసిన జ్యోతి, బిళియ రకం వంగడాల జన్యువులు ఉపయోగించి, పలు ప్రయోగాల అనంతరం దీన్ని రూపొందించామని విశ్వవిద్యాలయంలో వరి పరిశోధన విభాగం డైరెక్టర్ డాక్టర్ దుశ్యంత్ కుమార్ తెలిపారు. ప్రతికూల పరిస్థితులు లేకపోతే 120 రోజుల్లోనే 55 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని వివరించారు. ప్రొటీన్, ఐరన్, జింక్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ✪ సాధారణ వరి సాగుకు అనువైన అన్ని నేలల్లోనూ సహ్యాద్రి రకం వరి పండించవచ్చని నిపుణులు చెబుతున్నారు. శివమొగ్గలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతానికి విత్తన వరి అందుబాటులో ఉందని.. భవిష్యత్తులో వాణిజ్య అవసరాలకూ సాగును ప్రోత్సహిస్తున్నారు. - శివమొగ్గ, న్యూస్‌టుడే

పశుగ్రాసం పెంపకానికి ప్రభుత్వ రాయితీ

పశు పోషకులకు పశుగ్రాసం పెంపకానికి ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. 0.25 సెంట్ల భూమిలో సూపర్ నేపియర్, పెరిలినమ్(వంగడం) రకం సాగు చేసిన పశుపోషకులకు ప్రభుత్వం రూ.16,500 రాయితీ ఇస్తోంది. ఇది ఐదు ఎకరాల లోపు రైతులకు వర్తిస్తుంది. కనీసం రెండు పశువులు ఉండాలి. ఇందుకు సంబంధించిన దరఖాస్తును స్థానిక మండల పశువైద్యాధికారికి అందజేయాలి. సూపర్‌నేపియర్ గడ్డిజాతిలో ప్రొటీన్ అధికం. సంవత్సరం పొడవునా గడ్డి ఎదుగుదల ఉంటుంది. ఎకరానికి 180 నుంచి 200 టన్నుల గడ్డి దిగుబడి వస్తుంది. ఇతర గడ్డి జాతులతో పోల్చితే ఇది మాదిరింత అదనపు దిగుబడినిస్తుంది. పశుగ్రాసం రుచిగా ఉండడంతో పశువులు ఇష్టపడతాయి. సంవత్సరంలో ఎనిమిది నుంచి 10 పర్యాయాలు కోతకు వస్తుంది. ఎకరాకు ఎనిమిది నుంచి 10 పశువులకు ఆహారంగా సరిపోతుంది. మార్కెట్‌లో వంగడాలు అందుబాటులో ఉంటాయి. ఎండు గడ్డి అదనపు ఆహారంగా వినియోగిస్తే 15 గేదెల పోషణకు అవకాశం ఉంది. ప్రభుత్వం అందించిన రాయితీతో 25 సెంట్ల భూమిలో గడ్డి పెంపకం చేపట్టానని దావులూరిపాలేనికి చెందిన రమాదేవి తెలిపారు. పాల దిగుబడి బాగుందని ఆమె వెల్లడించారు. **– కొల్లిపర, న్యూస్‌టుడే**

రబీ సీజన్‌లో నువ్వు పంట సాగులో మెలకువలు తెలపండి. -కోటేశ్వరరావు, ఐడేపురం, కొడికొండ మండలం

శాస్త్రవేత్త సమాధానం: నువ్వు పంట సాగుకు చాలా తేలికపాటి నేలలు అనుకూలం. ఆమ్ల, క్షార, చౌడు నేలలు నువ్వు పంటకు పనికిరావు. నీరు నిలబడని నేలలు చాలా అనుకూలమైనవి. పంట వేసే ముందు దుక్కి బాగా మెత్తగా చేసుకోవాలి. దుక్కి ఎంత మెత్తగా ఉంటే మొక్కలు అంత బాగా వస్తాయి. దుక్కిలో భాస్వరం, సల్ఫర్ కలిగిన ఎరువులను నత్రజని, పొటాష్ ఎరువులతో పాటు తప్పనిసరిగా వేసుకోవాలి. నేలను 2- 4 సార్లు మెత్తగా దున్ని, రెండు సార్లు గుంటక తోలి చదును చేయాలి.

వంగడాల రకాలు: ఎలమంచిలి-11, 17, 66 రకాలు అనుకూలం. వైఎల్ఎం-146 కొత్త రకం. ఇది ఎక్కువ కొమ్మలు, దిగుబడి ఇస్తుంది. ఈ వంగడం కోసం 9440887450 లేదా 8639858330 నంబర్లలో సంప్రదించవచ్చు.

★ **విత్తే పద్ధతి:** ఎకరానికి 2 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తనానికి సమపాళ్లలో ఇసుక లేదా నూకలు కలిపి గొర్రుతో వరుసల్లో విత్తుకోవాలి. కిలో విత్తనానికి 3 గ్రా. కార్బండిజమ్ లేదా మాంకోజెబ్‌తో శుద్ధి చేసి విత్తడం వలన నేల నుంచి సంక్రమించే తెగుళ్లను 21 రోజుల వరకు నివారించవచ్చు.

ఎరువులు: ఆఖరి దుక్కిలో ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువు, 16 కిలోల నత్రజని, 8 కిలోల పొటాష్, 8 కిలోల భాస్వరాన్ని ఇచ్చే ఎరువులు వేసుకోవాలి. నత్రజని సగ భాగం, మొత్తం భాస్వరం, పొటాష్‌ను ఇచ్చే ఎరువులను ఆఖరి దుక్కిలో వేసి బాగా కలియదున్నాలి.

-డాక్టర్ ఎం.నగేష్, ఆంగ్రూ ఏరువాక కేంద్రం సమన్వయకర్త

– జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే

శనగలో యాజమాన్య పద్ధతులు

శనగలో ప్రస్తుతం ఎండుతెగులు, వేరుకుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉంది. రైతులు ఎక్కువగా జేజీ 11, కేఏకే2 రకాలు సాగుచేస్తున్నారు. ప్రస్తుతం పంట ఎదుగుదల దశ నుంచి పూత దశకు చేరుకోవడంతో పంటపై రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏడీఏ రామకోటేశ్వరి తెలిపారు.

ఎండు తెగులు ఆశించకుండా చర్యలు

నేలలో ట్రైకోడెర్మావిరిడి అభివృద్ధి చేసే విధానం ద్వారా తెగులును నివారించవచ్చు. బాగా మాగిన పశువుల ఎరువు 90 కిలోలు, ట్రైకోడెర్మావిరిడి 2కిలోలు, వేపపిండి 10కిలోలు చొప్పున కలుపుకొని మిశ్రమాన్ని ఆరు అంగుళాల మందం ఉండేలా ఒక బెడ్‌లా వేసుకుని, ప్రతి రోజూ నీరు చల్లాలి. 15రోజుల తర్వాత ట్రైకోడెర్మావిరిడి అభివృద్ధిచెంది ఎరువుగా మారుతుంది. ఎక్కడైతే ఎండుతెగులు, వేరుకుళ్లు తెగులు ఆశించి మొక్కలు చనిపోతాయో అక్కడ విత్తబోయే ముందుగా పొలంలో ఈ ఎరువును చల్లుకోవడం ద్వారా మట్టిద్వారా సంక్రమించే తెగులు శిలీంద్రాన్ని అరికట్టవచ్చు. దుక్కులు లోతుగా దున్నుకోవడంతో పాటు పంటమార్పిడి, విత్తనశుద్ధికి రైతులు అధికప్రాధాన్యం ఇవ్వాలి. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాములు లేదా కార్బండిజమ్ ఒక గ్రాము లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లల్లో పోయాలి.

తుప్పు తెగులు నివారణ ఇలా..: శనగ పైరు పక్వానికి వచ్చిన దశలో తుప్పుతెగులు ఆశించే అవకాశం ఉంది. ఆకులపై గుండ్రని చిన్న గోధుమ రంగు పొక్కులు ఏర్పడితే వెంటనే గుర్తించాలి. లేని పక్షంలో మొక్కలు పక్వానికి రాకముందే ఎండిపోతాయి. చల్లని వాతావరణం ఈ తెగులు వ్యాప్తికి దోహదపడుతుంది. నివారణకు హెక్సాకొనజోల్ 2ఎం.ఎల్ లేక ప్రాపికొనజోల్ 1ఎం.ఎల్ లేక ట్రైఫ్లోక్సిస్ట్రోబిన్ టెబుకొనజోల్ 0.8గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. **– పొన్నూరు, న్యూస్‌టుడే**

రాష్ట్రంలో తెలుగు వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు సీఎంకు లేఖ

అకాడమీ ఛైర్మన్ విల్సన్

మాట్లాడుతున్న తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ విల్సన్

తాడేపల్లి, న్యూస్‌టుడే : రాష్ట్రంలో తెలుగు, సంస్కృత భాషా పరిరక్షణలో భాగంగా తెలుగు వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాసినట్లు తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్డీ విల్సన్ తెలిపారు. తాడేపల్లిలోని అకాడమీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. తమిళ భాష పరిరక్షణకు ఏర్పాటు చేసిన తమిళ వర్చువల్ అకాడమీని చెన్నై పర్యటనలో పరిశీలించినట్లు చెప్పారు. రాష్ట్రంలో తెలుగు వర్చువల్ అకాడమీ ఏర్పాటు చేయాలని, ఇందుకు రూ.వంద కోట్లు కేటాయించాలని సీఎంను కోరినట్లు తెలిపారు. తెలుగు భాషను నేర్పించేందుకు ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులను, భాషా నిపుణులను గంటకు రూ.500 గౌరవ వేతనంతో నియమించుకోవాలని అకాడమీ పాలకవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. వర్చువల్ అకాడమీ శాశ్వత భవన నిర్మాణానికి రాజధాని ప్రాంతంలో రెండెకరాలు కేటాయించాలని సీఎంతో పాటు మంత్రి నారా లోకేశ్‌కి లేఖలు రాసినట్లు తెలిపారు. అకాడమీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ఏపీపీఎస్‌ఈ ద్వారా నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 2 నుంచి నిర్వహించే పుస్తక మహోత్సవంలో తెలుగు అకాడమీ పుస్తకాల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అకాడమీ ఛైర్మన్ విల్సన్ తెలిపారు.

రూ.వందకోట్లు నిధులు, ఆస్తులు ఇవ్వాలి

రాష్ట్ర విభజనలో తెలుగు అకాడమీకి రావాల్సిన రూ.వంద కోట్లు నిధులు ఇతర ఆస్తులను అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్, ఇంటర్ విద్యాసంస్థలు తప్పనిసరిగా తెలుగు అకాడమీ పుస్తకాలను మాత్రమే వినియోగించాలని సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

ఎన్టీఏ నూతన ఏడాది కాలమానిని ఆవిష్కరణ

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్టీఏ) రూపొందించిన నూతన ఏడాది- 2026 కాలమానిని, దైనందినిని గురువారం కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బి.హైమారావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సాయివిశ్వనాథ్, ఎన్.భాస్కరరావు, సహాధ్యక్షులు పి.లలిత బాబు, జి.సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

INDUSTRY

GENERATORS

జనరేటర్స్ కావలెను. 82.5KV కెపాసిటీగల Kirloskar, Cummins, Ashok Leyand కంపెనీ మాత్రమే కావలెను. వెంటనే సంప్రదించగలరు. మొబైల్ నెంబర్: 92487 11160, 92487 33306.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

గుంటూరు సిటీ లిమిట్స్ నుండి కేవలం 5Kms దూరంలో, రాజధాని అమరావతి రహదారికి దగ్గరలో లామ్ అగ్రికల్చర్ యూనివర్సిటీ దగ్గర 25 ఎకరాలలో గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ లోటస్ ఇన్‌ఫ్రా వారి Luxurio. 105 ప్రీమియం 4BHK విల్లాలు, 4 వైవిధ్య భరితమైన పార్కులు, క్లబ్‌హౌస్, గ్రాండ్ ఎంట్రన్స్ ఆర్చ్ 40 అ|| CC రోడ్స్ కాంపౌండ్ వాల్ సోలార్ ఫెన్సింగ్‌తో, CC TV, CRDA & Rera అప్రూవ్డ్ వెంచర్. బ్యాంక్‌లోన్ కలదు. 9866833383, 8142223456.

PLOT FOR SALE

VINUKONDA

వినుకొండ దొనకొండ 133 గజాలు (2.75 సెంట్లు) ఇంటి స్థలం కేవలం 99999/- మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 93986 21767.

GENERAL

గుంటూరు, సిటీ పరిధిలో 1250, 1360,3000 చ||గజాల తూర్పు ఫేస్ ప్లాట్స్ సేల్, గోరంట్ల, ఆదిత్రి యెల్లోరా ప్రక్కన రేట్ గజం 14000: 87908 94569.

JOBS

WANTED exp MBA - Marketing graduates to work in a well reputed real estate company. Age below 35yrs. 2wheeler is must & willing to travel extensively with in Guntur limits. Attractive salary&Inc. mail: h4hanumanth@gmail.com. ✆ 95531 55743.

Exp Principals, IIT, NEET, Civils Faculty & 6th - 10th all subjects Teachers (B.Ed/ M.Ed) Required. Interview: 4-1-26, 10Am-4Pm. Jonathan E.M. School, Pedaravuru, (Tenali). ✆ 91778 62662, 96038 65658.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/- 5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/- ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

గుంటూరు బార్‌లో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్, వెయిటర్లు, సప్లయర్లు కావలెను. రూం + భోజన వసతి కలదు. ✆ 81431 98968, 70753 38338.

ప్రముఖ ఐస్ క్రీమ్ కంపెనీ నందు పనిచేయుటకు ట్యాలీ వచ్చిన లేడీ ఆపరేటర్ కావలెను. జీతం: 15కె నల్లపాడు గుంటూరు. ✆ 70323 51666.

R అగ్రహారం & శ్రీనగర్ కాలనీ నందు రిటైల్ షాపులో పని చేయుటకు పార్ట్ టైం సేల్స్ పర్సన్స్ కావలెను. టైం: 4:00Pm-10:30 Pm. ✆ 77990 65046.

MARKETING/ SALES

జీతం 25వేలు. రియల్ ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. M/F రిటైర్డ్ Govt. ఎంప్లాయిస్, LIC ఏజెంట్స్. ✆ 9493585365.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

రహదారి నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందే

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, రవాణా శాఖ అధికారులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రయాణ సమయంలో చోదకులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ గురువారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాహనాలు జాగ్రత్తగా నడపటం వల్ల ప్రమాదాలను అరికట్టవచ్చని, ప్రమాదాల్లో ఎక్కువ శాతం నిబంధనలు పాటించకపోవడం వల్లే జరుగుతున్నాయన్నారు. వాహనదారులు.. కుటుంబాలను, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బండి నడపాలని సూచించారు. ఈ నెలాఖరు వరకు నిర్వహించే రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో రహదారి భద్రతా నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ వర్గాల ప్రజలకు, వాహన చోదకులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రవాణా శాఖ ఉప కమిషనర్ సీతారామిరెడ్డి, ఆర్టీఏ శ్రీహరి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీలు

ప్రచార ప్రతులను విడుదల చేస్తున్న వీసీ వర్మ, ప్రొవీసీ ప్రసాద్, వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి మండలం వడ్డేశ్వరం వద్ద ఉన్న కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఈనెల 3 నుంచి 5 వరకు సౌత్‌జోన్ ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉప కులపతి డాక్టర్ పార్థసారథివర్మ తెలిపారు. గురువారం ప్రొవీసీలు ఏవీఎస్ ప్రసాద్, ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు, క్రీడల డైరెక్టర్ హరికిషోర్, రామకృష్ణతో కలసి క్రీడల ప్రచార ప్రతులను విశ్వవిద్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 128 విశ్వవిద్యాలయాల నుంచి 900 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు వసతి, భోజన, వైద్య సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)

వచ్చిన బస్తాలు:	31,392
అమ్మకాలు:	34,992
నిల్వలు:	11,276

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ.ల్లో)

334	10,000-17,000
నంబర్ 5	12,000-15,500
273	11,000-17,200
341	11,000-17,600
సూపర్ 10	12,000-16,500

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-16,500
బాడిగ	11,000-17,000
దేవనూరు డీలక్స్	11,000-17,800
ఆర్మూర్	10,000-13,000

ఏసీ కామన్ వెరైటీ

334	10,500-16,600
నంబర్ 5	11,000-15,000
341	11,000-16,500
4884	12,000-14,300
సూపర్10	12,000-14,300

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-14,800
బాడిగ	10,000-16,500
దేవనూరు డీలక్స్	12,000-17,000
తాలు	5,200-7,500

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

ఐజీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి కేక్ కట్ చేశారు. ఐజీకి ఎస్పీ వకుల్‌జిందాల్ పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏఎస్పీలు రమణమూర్తి, రవికుమార్, హనుమంతు, ఎస్బీ డీఎస్పీ గొట్టిముక్కల శ్రీనివాసులు, సీఐ అళహరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ఆక్టోపస్ కీలకపాత్ర

కేకు కోస్తున్న ఆక్టోపస్ ఐజీపీ సెంథిల్ కుమార్, ఆపరేషన్ ఐజీపీ శ్రీకాంత్

తాడేపల్లి, న్యూస్‌టుడే : రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో ఆక్టోపస్ కీలకపాత్ర పోషిస్తుందని ఐజీపీ ఎస్.సెంథిల్‌కుమార్, ఆపరేషన్ ఐజీపీ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. ఇందుకు ఆక్టోపస్ జవాన్లు చేస్తున్న కృషిని ప్రశంసించారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని ఆక్టోపస్ బెటాలియన్‌లో సిబ్బందితో కలిసి వారు గురువారం నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేకు కోశారు. క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన సిబ్బందికి, అధికారులకు పతకాలు అందజేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, రిటైల్ ధర - 179, చికెన్ విత్‌స్కిన్ - 260, చికెన్ స్కిన్‌లెస్ - 295.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -147 రిటైల్ ధర 174 చికెన్ విత్ స్కిన్ - 252, చికెన్ స్కిన్‌లెస్ - 287.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 162, 171, 183 చికెన్ విత్ స్కిన్ - 314 చికెన్ స్కిన్‌లెస్ - 324.

పొగాకు బోర్డు వ్యవస్థాపక దినోత్సవం నేడు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్‌లో భారత పొగాకు బోర్డు వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి రైతులు, వ్యాపారులు, తయారీదారులు 500 మందిని బోర్డు అధికారులు ఆహ్వానించారు. పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్ కుమార్, సభ్యులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారు.

అమరావతి ఆలయానికి రావాలని గవర్నర్‌కు ఆహ్వానం

జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పట్టాభిపురం: గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ రాజ్‌భవన్‌లో గురువారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా అమరావతి దేవాలయ విశేషాలను గవర్నర్‌కు వివరించారు. దేవాలయానికి రావాలని ఎమ్మెల్యే ప్రవీణ్ ఆహ్వానించారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 14589

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

ఇక.. ఎయిమ్స్‌కు వెళ్లడం సులభం

జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్‌కు ప్రత్యామ్నాయ రోడ్డు

తాడేపల్లి, న్యూస్‌టుడే : గుంటూరు, విజయవాడ 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి మంగళగిరి ఎయిమ్స్‌కు వచ్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గుంటూరు వైపు నుంచి ఎయిమ్స్‌కు రావాలంటే వాహనదారులకు మార్గం తెలియక తికమక పడుతున్నారు. ఈ నేపథ్యంలో డీజీపీ కార్యాలయం దాటాక జాతీయ రహదారి నుంచి సర్వీసు మార్గంలోకి ఓ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు వేగంగా చేస్తున్నారు. జాతీయ రహదారి నుంచి ఏర్పాటు చేస్తున్న ఈ మార్గం వల్ల గుంటూరు ఉమ్మడి జిల్లాతో పాటు ఒంగోలు, నెల్లూరు, తిరుపతి ప్రాంతాల నుంచి ఎయిమ్స్‌కు వచ్చేవారికి మార్గం తేలిగ్గా ఉంటుంది. జాతీయ రహదారి నుంచి దీన్ని ఎయిమ్స్ తూర్పు రోడ్డుకు అనుసంధానం చేసేందుకు పనులు చేస్తున్నారు.

లోపల అనుకూలంగా ఉండేలా..

మంగళగిరి ఎయిమ్స్‌లో ఉన్న ప్రధాన రహదారి ప్రత్యామ్నాయంగా మరో రోడ్డు నిర్మాణం చేపట్టారు. తూర్పు ద్వారం నుంచి పడమర ద్వారం వరకు ఉన్న ప్రధాన మార్గంలో అన్ని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రధానంగా భారీ వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు మరో మార్గాన్ని ఎంపిక చేశారు. వైద్యశాలకు అవసరమైన యంత్ర పరికరాలు, నిర్మాణాలకు సంబంధించిన సామగ్రి తరలించే లారీలు, శవాగారం నుంచి మృతదేహాలను బయటకు తీసుకు వెళ్లేందుకు వినియోగించేందుకు నూతన రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఎయిమ్స్ ప్రహరీ లోపల వైపు దీని నిర్మాణం చేపట్టారు. తూర్పు గేటు నుంచి పడమర గేటు వరకు దాదాపుగా 2.5 కిలోమీటర్ల ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా నిర్వహిస్తున్నారు. ఇది పూర్తయితే మృతదేహాలతో పాటు ఇతర భారీ వాహనాలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటున్నారు.

108 కలశాలతో అయ్యప్పస్వామి ఆలయంలో పూజ

కలశ పూజలో గురుస్వాములు

తాడేపల్లి, న్యూస్‌టుడే : తాడేపల్లి రైల్వేగేట్ సెంటర్‌లోని గణపతి, అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం 108 కలశాలతో అయ్యప్ప మాలధారులతో పాటు గురుస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ ఏడాది పాడిపంటలతో రాష్ట్రం కళకళలాడాలని, ఆటంకాలు లేకుండా సాఫీగా ప్రజా జీవనం సాగిపోవాలని కోరుతూ స్వాములు పూజలు నిర్వహించారు. చిరంజీవి గురుస్వామి, మద్ది నంబూద్రి నేతృత్వంలో నిర్వహించిన పూజల్లో గణపతిహోమం, అష్టాభిషేకం, అనంతరం అత్యంత వేడుకగా పడి పూజోత్సవాన్ని చేశారు. అయ్యప్ప భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వైభవం.. రుక్మిణి కల్యాణం

కల్యాణంలో భక్తులు

నాగులపాడు (పెదనందిపాడు), న్యూస్‌టుడే : మండలంలోని నాగులపాడు శృంగేరి శారద పీఠపాలిత కోదండ రామాంజనేయ స్వామి ఆలయంలో గురువారం తృతీయ సప్తాహ మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యశర్మ భజన మండలి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ రుక్మిణి కల్యాణాన్ని వేదపండితులు 12 మంది దంపతులతో నిర్వహించారు. ఆలయ పాలకమండలి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి : ఎస్పీ

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే : 2026 సంవత్సరంలోకి అడుగు పెడుతున్న గుంటూరు జిల్లా ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలను అందించాలని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా గురువారం ఆయన కేకు కోశారు. శాంతిభద్రతల పరిరక్షణ, పరిపాలన దక్షత, సేవాభావాన్ని, సరికొత్త ఆలోచనలతో, చట్టబద్ధంగా పోలీసులు సేవలు అందించాలని కోరారు. నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, మంగళగిరి రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం, పట్టణ సీఐ వీరాస్వామి, ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ పాల్గొన్నారు.

అనంతవరం శ్రీవారి ఆలయానికి మహర్దశ

❑ రూ.పది కోట్లు మంజూరు చేసిన తితిదే ❑ త్వరలో ప్రహరీ, ఇతర మండపాల నిర్మాణం

తుళ్లూరు, న్యూస్‌టుడే

రాజధాని గ్రామం అనంతవరం కొండపై శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వయంభూగా వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ పట్టింది. ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధి పనులకు గ్రహణం పట్టింది. పలువురు దాతలు ఆలయం వద్ద భోజనశాల, కల్యాణ మండపం, ఆలయం మెట్లు ఎదుట రేకులతో షెడ్లు, కల్యాణకట్ట నిర్మించారు.

◆ కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ రాజధాని గ్రామం దొండపాడుకు చెందిన తితిదే బోర్డు సభ్యుడు సదాశివరావు ఆలయ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విన్నవించారు. ఆయన సూచనలతో తితిదే బోర్డు ఛైర్మన్ బి.ఆర్.నాయుడు పాలకమండలిలో చర్చించి అనంతవరం ఆలయ అభివృద్ధి పనులకు రూ.పది కోట్లు మంజూరు చేశారు. టెండర్ ప్రక్రియ పూర్తి కావటంతో త్వరలో ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఆలయం వద్ద తితిదే కల్యాణ మండపానికి మరమ్మతులు, మెట్ల మార్గం, దానిపై నీడ కోసం రేకుల నిర్మాణం, కొండపైన ఆలయం వద్ద రేకులతో మండపాన్ని తితిదే నిర్మించింది.

◆ యాత్రికుల వసతి గృహాలు, ప్రహరీలు, శిల్ప కళాకృతులతో రంగులు, ప్రధాన ఆలయం ఎదుట పంచతల రాజగోపుర నిర్మాణం, కొండ కింద మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి ప్రహరీ, దానికి రంగులు, భక్తులు పొంగళ్లు వండేందుకు షెడ్లు, ముఖమండపం, కొండపైన ఘాట్ రోడ్డుపై నుంచి ప్రధాన ఆలయం వరకు లిఫ్ట్ సౌకర్యం తదితర అభివృద్ధి పనులకు రూ.10 కోట్ల నిధులను తితిదే మంజూరు చేసింది.

మరమ్మతులు చేసి సిద్ధం చేసిన తితిదే కల్యాణ మండపం

దశలవారీగా అభివృద్ధి చేస్తాం

ఆలయాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తాం. తితిదే స్థానిక దేవాలయాల పేరు మీద బ్యాంకు ఖాతాలు ప్రారంభిస్తాం. భక్తులు ఇచ్చే విరాళాలను ఆ ఖాతాల్లో వేసి రశీదులు ఇస్తాం. తితిదే ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తాం.

- నన్నపనేని సదాశివరావు, తితిదే బోర్డు సభ్యుడు

వేడుక నిర్వాహకుల ఆందోళన

పెదనందిపాడు, న్యూస్‌టుడే : పెదనందిపాడు ఎస్సీ కాలనీలో నూతన సంవత్సర వేడుక నిర్వహిస్తుండగా కాలనీకి చెందినవారు ఇబ్బంది దగా ఉందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి నిబంధనల ప్రకారం వేడుకలు చేసుకోవాలని, సమయపాలన పాటించాలని వారికి చెప్పగా ఆపేశారు. తర్వాత కొంతసేపటికి మళ్లీ తిరిగి వేడుకలు చేస్తుండటంతో పోలీసులు వెళ్లి అభ్యంతరం తెలిపారు. దీంతో మళ్లీ ఆపివేశారు. అయితే పోలీసుల్లో ఒకరు దురుసుగా వ్యవహరించారని వేడుకల నిర్వాహకులు ఆరోపించారు. అనంతరం ఎస్సై సత్యనారాయణ వెళ్లి నిర్వాహకుల ల్యాప్‌టాప్ తీసుకుని జీపులో వస్తుండగా కొందరు అడ్డుకున్నారు. ల్యాప్‌టాప్ ఇవ్వాలని పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి గురువారం ఉదయం నాలుగు గంటల వరకు ఆందోళనకు దిగారు. పోలీసులు వారి పెద్దలతో మాట్లాడటంతో సమస్య సద్దుమణిగింది.

శ్రీవారికి మొక్కు చెల్లింపు

తుళ్లూరు, న్యూస్‌టుడే : బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, రాజోలు మండలం, లక్కవరం గ్రామానికి చెందిన జోళ్ల సూర్య వీరభద్రస్వామి అనుగ్రహంతో వృద్ధిలోకి వచ్చానని గురువారం అనంతవరం కొండపై స్వామికి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయంలోని ఆళ్వారులకు 12 జతల వెండి నేత్రాలు, రంగులు, నామాలు విరాళంగా అందించారు.

కేంద్రం నిర్ణయాలతో వ్యవసాయ రంగం నిర్వీర్యం

మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

మంగళగిరి, న్యూస్‌టుడే : కేంద్రం అనుసరిస్తున్న విధానాలు, నిర్ణయాలతో వ్యవసాయ రంగం నిర్వీర్యమవుతుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. మంగళగిరిలోని వేమూరి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణకి ఇచ్చిన హామీలు అమలు చేయక వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. అన్ని రంగాల్లో మోదీ ప్రభుత్వం విఫలమైందని, దేశ రాజకీయాలను విభజించి అధికారాన్ని వస్తున్నారని తెలిపారు. నిరుద్యోగ సమస్య తీవ్రమైందని, వచ్చే ఎన్నికల్లో కేంద్రంలోని బాజాపాకు ప్రజలు గుణపాఠం చెబుతారని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, వెంకటేశ్వరరావు, కాశయ్య, ప్రభాకర్, జానీబాషా, కరీముల్లా, నాగేశ్వరరావు, ఈశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

విలువలను గుర్తించేలా బోధన సాగాలి

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే : విద్యతో పాటు విద్యార్థుల్లో విలువలను గుర్తించేలా విద్యా బోధన సాగాలని సి.కె. ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంజి చిరంజీవి అధ్యాపకులకు సూచించారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది ఆయన నివాసంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పొంగిన ఉత్సాహం

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

న్యూస్‌టుడే, బృందం : జిల్లాలో ప్రజలు 2026 నూతన సంవత్సరానికి గురువారం ఘన స్వాగతం పలికారు. అన్ని గ్రామాల్లో యువత కేకులు కోస్తూ సందడి చేశారు. వీధుల్లోకి వచ్చి పరస్పరం శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం నుంచి రాజకీయ నాయకులు గుంటూరు నగరంలోని తమ నాయకులను కలిసి శుభాకాంక్షలు చెప్పారు. మిఠాయిలు పంచారు.

తాడికొండ : మొక్క నాటుతున్న వైద్య అంజనేయులు, అధ్యాపకులు

వేడుకలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు దంపతులు, నాయకులు

మేడికొండూరు : ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌ను కలిసిన డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు, ఎస్సైలు

పుల్లడిగుంటలో గ్రామస్థులు..

దుగ్గిరాలలో అన్న క్యాంటీన్ వద్ద..

మంగళగిరి గ్రామీణం : పోతినేని శ్రీనివాసరావుకు సత్కారం

తుళ్లూరు : ఏపీ ఎస్ఆర్ఎంలో కేకు కోస్తున్న విజయ్, సతీష్‌కుమార్ తదితరులు

దుగ్గిరాల : కేకు కోస్తున్న ఎంపీపీ జబీన్, ఎంపీడీవో, వెనిగళ్ల తదితరులు

ఆలయ అభివృద్ధికి విరాళాలు

పెదనందిపాడు, న్యూస్‌టుడే : స్థానిక శిర్డీ సాయిమందిర్ అన్నపూర్ణాలయ అభివృద్ధి నిమిత్తం పెదనందిపాడుకు చెందిన పావులూరి శ్రీనివాసరావు, సునీత దంపతులు, గుంటూరుకు చెందిన సాదు సుబ్బారావు పేరిట వెంకట పుల్లారావు, సుశీలదేవి దంపతులు రూ.25,116 వంతున మందిర్ కమిటీ వారికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మందిర్ కమిటీ కార్యదర్శి రామసుబ్బారావు, సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? ముట్లూరు నల్లకుంట వద్ద వ్యర్థాలు దహనం చేస్తున్నారు. దీంతో దారిన వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. -వెంకట్రావు ✔ అక్కడ చెత్త వేయకుండా చూస్తాం. చెత్త వేసే వారిపై చర్యలు తీసుకుంటాం.- **రమేష్‌బాబు, ఎండీవో, వట్టిచెరుకూరు** – వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే

స్పందనకు వందనం: ✦ నూతక్కి కొత్తపాలెం రోడ్డులో మురుగు కాలువల్లో నుంచి మురుగు కదలడం లేదని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. దీనికి స్పందించి పారిశుద్ధ్య విభాగం అధికారి కరుణ్ కార్మికులతో కాలువల్లో పూడిక తీయించి.. బ్లీచింగ్ చల్లించారు. –మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే ✦ పెదపరిమిలో మురుగు కాలువల్లో మురుగు నిలుస్తోందని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పారిశుద్ధ్య కార్మికులతో కాలువల్లో పూడిక తీయించారు. ✦ దొండపాడులో తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని స్థానికులు కోరారు. దీనికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి కుమార్ పారిశుద్ధ్య కార్మికులను పంపి.. ట్యాంకు శుభ్రం చేయించారు. –తుళ్లూరు, న్యూస్‌టుడే

ఏఎంసీ ఛైర్‌పర్సన్‌కు పతీ వియోగం

40 రోజుల్లో ఆ ఇంట ముగ్గురు మృతి

ఉన్నం వెంకయ్య

దుగ్గిరాల, న్యూస్‌టుడే : దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ ఉన్నం ఝాన్సీరాణి భర్త ఉన్నం వెంకయ్య (58) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. బుధవారం రాత్రి కొంతసేపు నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఆయన నిద్రలోనే మృతి చెందారు. ఎంపీపీ షేక్ జబీన్, తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, యార్డు కార్యదర్శి సుబ్బారావు, ప్రవాస భారతీయుడు జంపాల సుబ్బారావు, గద్దె వాసు, హర్ష, నక్కా చిరంజీవి, చంటి, శంకర్ నాయక్ తదితరులు ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

✦ నవంబర్ 19న వెంకయ్య తమ్ముడు నగేష్ (56) మృతి చెందారు. సరిగ్గా నెలకు గత డిసెంబర్ 20న వెంకయ్య తల్లి, విశ్రాంత ఉపాధ్యాయిని రాజేశ్వరి (83) మృతి చెందారు. ఈ రెండు సంఘటనలతో ఆ కుటుంబం ఆవేదనలో ఉంది. ఈలోపే తల్లి మరణించిన పది రోజులకే వెంకయ్య కూడా మృతి చెందడం కలచి వేసింది.

కోడి పందెం స్థావరంపై దాడి

మేడికొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని సిరిపురం శివారు పొలాల్లో గురువారం కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై ఖాజీబాబు, సిబ్బందితో స్థావరం వద్దకు వెళ్లారు. పోలీసుల రాకను గమనించిన పందెంరాయుళ్లు కొంత మంది పరారు కాగా నలుగుర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆటో, ఒక కోడిని స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై విచారించాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

తాడేపల్లి, న్యూస్‌టుడే : తాడేపల్లి వారధి వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి ప్రమాదం త్రుటిలో తప్పింది. విజయవాడ వైపు నుంచి తాడేపల్లి వైపు వస్తున్న కారు వారధి దాటాక టైర్ పంచర్ కావడంతో అదుపు తప్పి అక్కడే ఉన్న ఎస్కార్ట్ వాహనాన్ని ఢీకొట్టింది. అనంతరం పక్కనే డివైడర్ వద్దకు వచ్చి నిలిచింది. ఆ సమయంలో రహదారిలో ఎవరూ లేక ప్రమాదం తప్పింది. కారులో ఉన్న వారికి కూడా గాయాలు కాలేదు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

దారి అధ్వానం.. ప్రయాణం నరకప్రాయం

మండలంలోని మందపాడు నుంచి బండారుపల్లి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. దారిలో అక్కడక్కడ కంకర రాళ్లు బయటకు వచ్చాయి. దీంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతున్నాయి. చోదకులు కింద పడి గాయపడుతున్నారు. అధికారులు రోడ్డు అభివృద్ధి చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. –మేడికొండూరు, న్యూస్‌టుడే

భక్తిశ్రద్ధలతో చర్చి వార్షికోత్సవం

వాక్యోపదేశం చేస్తున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య

మేడికొండూరు, న్యూస్‌టుడే : లోక రక్షణకు ప్రభువు జన్మించారని, ఆయన మార్గం అనుసరణీయమని, ఆయన్ను భక్తితో ప్రార్థిస్తే అంతా మంచి జరుగుతుందని గుంటూరు మేత్రాసన పీఠాధిపతి చిన్నా బత్తిని భాగ్యయ్య తెలిపారు. మండలంలోని సిరిపురంలో గల యేసు నామకరణ దేవాలయం (చర్చి) వార్షికోత్సవం నిర్వహించారు. ఆలయ విచారణ గురువు యస్.వి.తోమస్ ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. భాగ్యయ్య దివ్య బలిపూజ నిర్వహించి.. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విశ్వాసులు కొవ్వొత్తులు సమర్పించారు. కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. రాత్రికి బాణసంచా కాల్చుతూ తేరు ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఫిరంగిపురం బాలయేసు నామకరణ దేవాలయం విచారణ గురువు ఫాతిమా మర్రెడ్డి, యూనివర్శల్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బాలస్వామి, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



కార్యాలయ ప్రారంభోత్సవంలో నాగేశ్వరరావు తదితరులు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే : ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించడంతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు జనసేన కృషి చేస్తుందని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు అన్నారు. నగరంలోని శ్రీనివాసరావు పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని చెప్పారు. కేకు కోసి.. నాయకులకు, కార్యకర్తలకు పంచారు. పార్టీ కార్పొరేటర్లు పద్మావతి, లక్ష్మీదుర్గ, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు డైరెక్టర్ చింత రేణుక రాజు, పార్టీ నాయకులు డేగల లక్ష్మణ్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

తెనాలి టౌన్ : కొలనుకొండ వద్ద గురువారం రైలు కింద పడి గుర్తు తెలియని సుమారు 45 సంవత్సరాల వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారని తెనాలి రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు మంగళగిరివాసిగా ప్రాథమిక సమాచారం అందిందని, మృతదేహాన్ని మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

పాముకాటుతో వృద్ధుడి మృతి

తుళ్లూరు, న్యూస్‌టుడే : పాము కాటుతో బుధవారం బోరుపాలెంలో వృద్ధుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన మల్లెల దాసు (80) గత నెల 31న రాత్రి ఇంటి వరండాలో మంచంపై కూర్చుని ఉండగా తాచుపాము ఎడమ చేతి చూపుడువేలుపై కాటు వేసింది. స్థానికులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు.

13, 14న సంక్రాంతి సంబరాలు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సుబ్బారావు, గాంధీ తదితరులు

దుగ్గిరాల: గ్రామాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ దుగ్గిరాల వన్ సేవా ట్రస్ట్ (దోస్త్) సంక్రాంతి సంబరాలు నిర్వహించడం గర్వకారణమని సర్పంచి బాణావత్ కుషీబాయి, గ్యాస్ ఏజెన్సీస్ అధినేత గద్దె అను సూర్యావతి అన్నారు. సంక్రాంతి సంబరాలు నిర్వహణకు సంబంధించిన కరపత్రాలను ట్రస్ట్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ, ప్రవాస భారతీయుడు సుబ్బారావు, నన్నపనేని నాగేశ్వరరావు, పఠాన్ జున్నుఖాన్, ఉన్నం బాబూరావు, కొండపనేని ఛటర్జీ, కొండపనేని జోగేంద్ర ప్రసాద్, వల్లూరు నరసింహారావు పాటు పలువురు గురువారం దుగ్గిరాలలో ఆవిష్కరించారు. ఈనెల 13, 14 తేదీల్లో సంబరాలు ఉంటాయని దోస్త్ సమన్వయకర్త గద్దె వాసు ప్రకటించారు.

✦ ఈనెల 11న జంపాల వారి కల్యాణ మండపంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, గుండె, ప్రొస్టేట్ స్పెసిఫిక్ యాంటిజన్‌కు సంబంధించిన ఎంతో విలువైన అన్ని వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. పరీక్షలు చేయించుకోవాలనుకునే వారు 98484 42142 (రవీంద్ర)నంబరుకు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు.

✦ ఈనెల 13న మండలంలోని అన్ని గ్రామాల్లో 6-10 తరగతుల బాల, బాలికలకు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వ పోటీలు ఉంటాయని చెప్పారు. 14న భోగిమంటలు, కోలాటాలు, 2 కి.మీ నడక, సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళలకు వంటలు, చుక్కల ముగ్గుల పోటీలు ఉంటాయని, పాల్గొనేవారు 9949493981 (సరళాదేవి) సంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

మాజీ మంత్రిని కలసిన ఎమ్మెల్యే

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే : ప్రత్తిపాడు నియోజకవర్గ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి మాకినేని పెద్ద రత్తయ్యను గురువారం ఆయన నివాసంలో ఎమ్మెల్యే రామాంజనేయులు, పార్టీ నేతలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పలు అంశాలపై చర్చించారు.

గ్రేడ్- 2 ఉద్యోగులకు జూనియర్ లైన్‌మ్యాన్‌గా నియామకాలు

ఉద్యోగికి నియామక పత్రాన్ని అందజేస్తున్న ఈఈ సంజీవరావు

తాడేపల్లి, న్యూస్‌టుడే : తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల మండలాల్లోని సచివాలయాల్లో గ్రేడ్-2 ఉద్యోగులను విద్యుత్తు శాఖలో జూనియర్ లైన్‌మ్యాన్లుగా నియమిస్తూ నియామక పత్రాలను మంగళగిరి విద్యుత్తు శాఖ ఈఈ సంజీవరావు గురువారం అందజేశారు. దాదాపుగా 60 మందికి మంగళగిరి కొప్పురావుకాలనీలోని ఈఈ కార్యాలయంలో నియామక పత్రాలను అందజేసి విద్యుత్తు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

కొత్త ఏడాదిలో ఆలయాల్లో పూజలు

పెదనందిపాడు శిర్డీ సాయి మందిరంలో పూజలు

అనంతవరంలో శ్రీవారి దర్శనానికి క్యూలో భక్తులు

పెదనందిపాడు, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా గురువారం మండలంలోని ఆలయాలకు ప్రజలు తరలి వచ్చి పూజలు చేశారు. విశ్వాసులు చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఈ ఏడాది సజావుగా ఇబ్బందులు లేకుండా గడిచిపోవాలని వారు కోరుతున్నారు. చర్చిల్లో విచారణ గురువుల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.

తుళ్లూరు, న్యూస్‌టుడే : 2026 ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా అనంతవరం కొండపై స్వయంభూగా వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని వేలాదిగా భక్తులు సందర్శించారు. భక్తుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ చేశారు.

వేలం ప్రకటన

IN THE COURT OF THE IV ADDL. DIST. JUDGE : GUNTUR

E.P. 426/2024 in O.S. 556/2015

Between:

Sri Giri Cotton Traders, Rep. by its Prop. Kopuri Venkata Ravi Kumar ....D.Hr

And

Sri Venkateswara Cotton Company Rep. by its Prop. Nelakuditi Anuradha ...J.Dr'

పై నెంబరు దావాలో జప్తుకాబడిన ఇ.పి.లో యిస్తిహారు జారీకాబడి జప్తు ఖాయమైన జె.డి.ఆర్. తాలుకు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలం వేయుటకు శ్రీ కోర్టు వారు ది.04-02-2026కి వాయిదా వేసినారు. కావున వేలంలో పాల్గొనదలచిన వారు వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట హాజరై వేలంలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

Schedule: Palnadu Dt. & Narasaraopet Registration Dt., Phirangipuram Sub Dt., Velavarthipadu Gram panchayathi Area, Velavarthipadu(V) & D.No. 98/A in an extent of Ac.3.00cents of land and site bounded by: **East :** Land belongs to Shaik Dinesh etc., **South:** Land belongs to Nelakuditi Mullamuraiah, **West:** Land belongs to Nelakuditi China Rathaiah **North :** Land belongs to Shaik Saidamma etc., Within these boundaries an extent of Ac.3.00 cents of land or 1.20 Hectors of land.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

డి.హెచ్.ఆర్.విలువ: 50,00,000/-

అమీనా విలువ: 1,00,00,000/-

వేలం తేది: 04-02-2026,

నోట్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మేడికొండూరు బ్రాంచ్ వారికి రూ.2,79,145.61 మార్టుగేజ్‌కి లోబడి వేలం జరుగును.

యార్లగడ్డ రవి, డి.హెచ్.ఆర్ తరపు అడ్వకేట్, రాజేంద్రనగర్, 3వ లైను, గుంటూరు. సెల్: 7702402777

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

పిబిబి బృందావన్ గార్డెన్స్-04104, యూకో బ్యాంక్ ఎదురు, గుంటూరు-522006., ఫోన్: 0863-2212114

బంగారు నగల వేలము ప్రకటన

ఈ దిగువ పేర్కొనబడిన వ్యక్తులు మా బ్యాంకు శాఖ నందు బంగారు నగలు తాకట్టు పెట్టి ఋణములు తీసుకొని ఉన్నారు. ఎన్ని నోటీసులు పంపినసూ ఋణం చెల్లించని కారణమున, ఈ ప్రకటన ఆఖరు ప్రకటనగా భావించి ది.03-01-2026 తేదీ లోపు చెల్లించి తమ ఆభరణములను విడిపించుకోగలరు. లేని యెడల ది.06-01-2026 మంగళవారం సాయంత్రం 4.00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు ఆవరణయందు బహిరంగ వేలం వేసి వారి పేరున ఉన్న బకాయిలకు జమకట్టుకొనబడును. షరతులు : 1) వేలంలో పాల్గొనదలచినవారు రూ.11,000/- ధరావత్తు చెల్లించి ది.06-01-2026 సాయంత్రం 3 గం॥లోపు పేరు నమోదు చేయించుకోవలెను. 2) ఎట్టి కారణము చూపకనే వేలం ఆఫర్ తిరస్కరించుటకు గాని, వేలం ఆపివేయుటకుగాని, వాయిదా వేయుటకుగాని బ్యాంకు వారికి పూర్తి అధికారములు కలవు. 3) వేలం వేసినా బకాయిలు రద్దుకాని యెడల వారిపై చట్టరీత్యా తగుచర్యలు తీసుకొని మిగిలిన బకాయిలను వసూలు చేయబడును. 4) ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారుల్లో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం నోటీసు వర్తించును. ఈ వేలం ప్రకటన తదితర ఖర్చులు ఈ క్రింది ఖాతాదారులే భరించవలెను.

క్రమ సంఖ్య	ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	తూకం మొత్తం గ్రాములలో	నికర తూకం గ్రాములలో
1	43771300279	శ్రీ జంపని సాయి కృష్ణ, తండ్రి: రంగారావు, 20/3, గాంధీబొమ్మ సెంటర్, పేరేచర్ల, గుంటూరు-522005.	38.00	34.00

తేది: 01-01-2026, ప్రదేశం : గుంటూరు సం/- బ్రాంచి మేనేజర్, భారతీయ స్టేట్ బ్యాంక్, బృందావన్ గార్డెన్స్ బ్రాంచి, గుంటూరు.

తెనాలి

●తెనాలి ●పొన్నూరు

మేముస్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పొన్నూరు పరిధిలోని 28వ వార్డులో సీసీ రహదారి నిర్మించలేదు. మట్టి రోడ్డులో రాకపోకలు నిర్వహించాలంటే ఇబ్బందిగా ఉంది.- **షేక్ రియాజ్, 28వ వార్డు.** ✔ నిధులు రాగానే సిమెంటు రహదారి నిర్మించే విధంగా చూస్తాం. - **షేక్ హసీనా, పురపాలక సంఘం సహాయ ఇంజినీరు.** ? పాత పొన్నూరు శివారులో చెత్తను తొలగించ లేదు.- **కె.అనిల్ బాబు, పాత పొన్నూరు** ✔ చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రజలు ఇబ్బంది లేకుండా చేస్తాం. - **పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి**

స్పందనకు వందనం

❖'మేముస్నాం...మీకు తోడుగా' శీర్షిక 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పొన్నూరు పట్టణ పరిధి డీబీసీ కాలనీలోని మురుగు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను కార్మికులతో తీయించారు. ❖ 19వ వార్డులో పాడైపోయిన వీధి దీపాన్ని బాగు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. - **న్యూస్‌టుడే, పొన్నూరు**

మెరుగైన సేవలు అందించండి : ఎస్పీ

మంగళగిరి గ్రామీణం: 2026 సంవత్సరంలోకి అడుగు పెడుతున్న గుంటూరు జిల్లా ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలను అందించాలని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా గురువారం ఆయన కేకు కోశారు. శాంతిభద్రతల పరిరక్షణ, పరిపాలన దక్షత, సేవాభావాన్ని, సమర్థ అంశాలతో, పట్టబద్ధంగా పోలీసులు సేవలు అందించాలని కోరారు. నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, మంగళగిరి రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం, పట్టణ సీఐ వీరాస్వామి, ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నియోజకవర్గం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: నూతన ఆంగ్ల సంవత్సరంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు ఆకాంక్షించారు. ఈయన గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. కేకు కోసి కార్యకర్తలకు పంచారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ. (క్వింటా)

అత్యధికం: 1600

అత్యల్పం: 1000

సగటు: 1400

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

పడకేసిన పారిశుద్ధ్యం.. అధికారుల చోద్యం

జిల్లా ఆసుపత్రిలో పరిస్థితి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే

రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకంతో తెనాలి జిల్లా ఆసుపత్రిలో పారిశుద్ధ్యం పడకేసింది. పారిశుద్ధ్య ఒప్పందం గడువు ముగిసినా కొత్త గుత్తేదారును నియమించి అప్పగించకపోవడమే దీనికి కారణం. పాత గుత్తేదారు కొత్త శుభ్రత పరికరాలు కొనివ్వక ఉన్నవి మూలనపడ్డాయి. రసాయనాలు తగినన్ని ఇవ్వక మరుగుదొడ్ల దుర్గంధం వెదజల్లుతున్నాయి. వైద్యులు, రోగులు ముక్కుమూసుకుని తిరుగుతున్నారు. వీటిలోనే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వైద్యఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, జిల్లా, తెనాలి రెవెన్యూ డివిజన్ పాలనాధికారులు వచ్చినప్పుడు దుర్గంధం రాకుండా అధికారులు జాగ్రత్త పడుతున్నారు. అధ్వాన పారిశుద్ధ్యానికి చికిత్స చేసే వారు లేక జబ్బు నయం కావడానికి ఎక్కువ రోజులు పడుతుందని రోగులు ఆందోళన చెందుతున్నారు.

నిర్వహణ సరిగా లేని మరుగుదొడ్లు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడొంతుల మంది రోగులకు తెనాలి జిల్లా ఆసుపత్రే దిక్కు. ఇక్కడ అవుట్ పేషెంట్లు 3 లక్షలు, ఇన్ పేషెంట్లు 50 వేల మంది ఏటా వైద్య సేవలు పొందుతున్నారు. శుభ్రతకు వాడే వెట్ అండ్ డ్రై వాక్యూమ్ క్లీనర్, స్క్రబ్బింగ్ మిషన్, త్రీ బకెట్ సిస్టమ్ ట్రాలీ, హై ప్రెజర్ వాటర్ జెట్‌మిషన్, గ్లాసులు క్లీనింగ్ సెట్లు, గ్రాసు కటింగ్ మిషన్ వంటి ఆధునిక పారిశుద్ధ్య పరికరాలు మూలన పడ్డాయి. కలరా ఉండలు, ఫినాయిల్, సోపు ఆయిల్, బ్లీచింగ్ పౌడర్, వెట్ అండ్ డ్రై సెట్లు, స్క్రబ్బింగ్ ప్యాడ్లు, చీపుర్లు ఇచ్చినవి చాలట్లేదని జాగ్రత్తగా వాడుతున్నారు. బయోమెడికల్, సాధారణ వ్యర్థాల కవర్ల కొరతతో వాడినవే వాడుతున్నారు.

ఒప్పంద కార్మికుల కొరత..:

ఆసుపత్రి అధికారులు ఒప్పందం ప్రకారం 60 మంది కార్మికులకు బదులు 55 మందితో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారు. ఐదు ఖాళీల్లో అధికారుల అనుకూలురును ఆసుపత్రి విధుల్లో నియమించి వాడుకుంటున్నారు. వీరిని పారిశుద్ధ్య కార్మికులుగా చూపి బిల్లులు చెల్లించడం పరిపాటి అయ్యింది. ఈ ప్రభావం పారిశుద్ధ్యంపై పడి పనులు కుంటుపడుతున్నాయి. చినిగిన యూనిఫారంతోనే కార్మికులు పనిచేస్తున్నారు. సకాలంలో ఒప్పందం పునరుద్ధరించక ఏడాది నుంచి నెలకు రూ.2 నుంచి రూ.3 వేలు కోల్పోయారు. దీనిపై జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ రంగారావును సంప్రదించగా.. ఆసుపత్రి తనిఖీల సందర్భంగా పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, బాగాలేకుంటే దస్త్రాల్లో రాయాలని తరచూ అధికారులకు చెబుతుంటానని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా శ్రీ కృష్ణ దేవ రాయ కళావేదిక ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని విశ్వ సాహితీ కళావేదిక వద్ద నిర్వహించిన ఆత్మీయ కవి సమ్మేళనం ఆలోచింపజేసింది. నిర్వాహకులు సంగీతం మాస్టారు బొల్లిముంత కృష్ణను సన్మానించారు.

తాపీ కార్మికుల ఇబ్బందులు పరిష్కరించరూ..

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: భవన నిర్మాణ పనులు కొనసాగక కార్మికులు ఇబ్బందులు పడుతున్నట్లు తెనాలి తాలూకా తాపీ కార్మికుల సంఘ నాయకులు నాగరాజు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సంఘ కార్యాలయం వద్ద నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని కార్మికుల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించి, కేకు కోశారు.

రేపటి నుంచి ఆర్ద్రా మహోత్సవాలు ప్రారంభం

తక్కెళ్లపాడు (పెదకాకాని), న్యూస్‌టుడే: తక్కెళ్లపాడు గంగా భ్రమరాంబ సమేత చంద్రశేఖర స్వామి వార్ల 83వ ఆర్ద్రా మహోత్సవాలు 3వ తేదీన ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలు ఐదు రోజుల పాటు జరుగనున్నాయి. తొలి రోజు నూతన నాదస్వరం, ప్రభాత సేవ, మహన్యాస పూర్వక ఆర్ద్రాభిషేకం, ఉత్తర ద్వార దర్శనం, పంచహారతి, అఖండ యజ్ఞం, వినాయకుని అభిషేకాలు, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, సంగీత విభావరి, కూచిపూడి నృత్యం, రెండో రోజు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, భద్రకాళి సమేత వీరభద్ర స్వామికి పూజ, హాస్య ప్రవచనాలు, కూచిపూడి నృత్య రూపకం, మూడో రోజు 108 మంది దంపతులతో కల్యాణాలు, హరికథ, స్వామి వారి గ్రామోత్సవం, కూచిపూడి, భరత నాట్యం, జానపద నృత్యాలు, గజవీర పద్య నాటకం, నాలుగో రోజు లక్ష బిల్వార్చన, బుర్రకథ, డాన్స్ బేబీ డాన్స్, ఐదో రోజు అభయాంజనేయ స్వామికి ఆకుపూజ, గంగా భ్రమరాంబ సమేత చంద్రశేఖర స్వామి వార్ల తెప్పోత్సవం కార్యక్రమాలు ఉన్నాయని నిర్వాహకులు చెప్పారు.

ప్రధాన మార్గంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు

ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయ స్వామి

నూతన సంవత్సరం సందర్భంగా పొన్నూరు పట్టణ పరిధిలోని సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో శ్రీవీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. - **న్యూస్‌టుడే, పొన్నూరు**

శివ ముక్కోటికి సర్వం సిద్ధం

పెదకాకాని, న్యూస్‌టుడే : పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 3న శివ ముక్కోటి పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో గోగినేని లీలాకుమార్ తెలిపారు. తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనానికి సంబంధించి క్యూలైన్లు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. పాడి పంటలు వృద్ధి కలిగి, దేశమంతా సస్యశ్యామలంగా విరాజిల్లాలని నిర్వహించే కార్యక్రమమే శివ ముక్కోటి అని దేవస్థాన స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకుడు ప్రసాద్ వెల్లడించారు.

మల్లేశ్వర స్వామి

4న హిందూ సమ్మేళనం

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: హిందూ సమ్మేళనాన్ని ఈ నెల 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. కొత్తపేటలోని కార్యాలయంలో కార్యక్రమ గోడ పత్రికలు ఆవిష్కరించారు. శ్రీనివాస్, మూర్తి, శ్యాము, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యోగా చేస్తే మేలు

తెనాలి (కొత్తపేట): ప్రతి ఒక్కరూ యోగా ఆచరించాలని వాసవీ పెనుగొండ పీఠాధిపతి ప్రజానంద సరస్వతి పేర్కొన్నారు. ఆయన గురువారం గంగానమ్మపేటలోని విద్యాపీఠంలో మాట్లాడారు. యోగా ప్రయోజనాలను ఆయన వివరించారు. ఎం.రమణయ్య, సుబ్బారావు, రామకృష్ణ తదితరులతో కలిసి ఆయన నూతన కాలమానిని ఆవిష్కరించారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి ప్రజానంద సరస్వతి

సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కాలమానిని మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు ఆవిష్కరించారు. గురువారం కమిషనర్ చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనతోపాటు మున్సిపల్ ఎంఈ శ్రీకాంత్, ఏసీపీ మొవ్వా ఏసుబాబు, డీఈలు, ఏఈలు, సచివాలయాల ఉద్యోగులు, సంఘం కమిటీ నాయకులు పాల్గొన్నారు.

పొన్నూరు, న్యూస్‌టుడే : పొన్నూరు ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర కాలమానిని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు, నాయకులు గురువారం ఆవిష్కరించారు.

అధ్వాన రహదారితో అవస్థలు

తెనాలి నుంచి బుర్రిపాలెం వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు అధిక లోడు వాహనాలతో గుంతలు పడి అధ్వానంగా మారింది. ఇవి ప్రమాదకరంగా ఉండడంతో వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. గుంటూరులోని అనేక కళాశాలలు, తెనాలిలోని పాఠశాలల బస్సులు ఈ మార్గంలో తిరుగుతూ ఉంటాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించినా, భారీ వాహనాల ధాటికి దెబ్బతిని పది నెలలకే మరమ్మతులకు గురయ్యాయి. భారీ వాహనాలను నియంత్రించకుంటే రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్లు దెబ్బతినే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. - **న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)**

అసంపూర్తి భవనం.. ఆకతాయిలకు నిలయం

గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఐతానగర్ పొట్టి శ్రీరాములు పార్కులో ఎస్సీ/ఎస్టీ నిధులు రూ.50 లక్షలతో చేపట్టిన అంబేడ్కర్ భవనం తుది పనుల దశలో నిలిచిపోయింది. అప్పటినుంచి వినియోగంలోకి రాకపోవడంతో ఆకతాయిలు దాని కిటికీలు, అద్దాలు, తలుపులు ధ్వంసం చేశారు. ఇంత జరిగినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పశువుల కొష్టం, మందు బాబులకు వేదికగా మారింది. అమరజీవి పొట్టి శ్రీరాములు పేరున నడుస్తున్న పార్కులో అంబేద్కర్ పేరు పెట్టిన భవనమని మరువక వెంటనే అన్న విషయాన్ని అధికారులు మరవడం గమనార్హం.. - **న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)**

ఎనిమిది ద్విచక్ర వాహనాలు స్వాధీనం

పొన్నూరు: కట్టెంపూడి- దండమూడి మధ్యలో కోడి పందెం స్థావరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులు, రెండు కోళ్లు, ఎనిమిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీహరి గురువారం తెలిపారు.



భళా.. చిత్రకళ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: చిత్రకళపై ఆసక్తితో నిత్య సాధన చేస్తూ చక్కటి ఆవిష్కరణలు చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే డ్రాయింగ్ పరీక్షల్లోనూ సత్తాచాటారు తెనాలికి చెందిన కరుణ ప్రసన్నకుమారి, విశ్వనాథపల్లి రేణు. ఇటీవల విడుదలైన డ్రాయింగ్ లోయర్ పరీక్షల ఫలితాల్లో ప్రథమ శ్రేణితో ధ్రువపత్రాలు అందుకున్నారు. ఈ ఏడాది జరుగనున్న హయ్యర్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు.

సాధన చేస్తున్న కరుణ ప్రసన్నకుమారి

డ్రాయింగ్ టీచర్ కావాలని..

సాల్మన్ రాజు, మేరి దంపతుల కుమార్తె కరుణ ప్రసన్నకుమారి బీఎస్సీ, డీఈడీ చేసి ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థినిగా ఉన్న సమయంలో చిత్రకళపై ఆసక్తి ఉన్నా సాధన చేసే అవకాశం రాలేదు. దానితో డిగ్రీల తర్వాత చిత్రకళోపాధ్యాయుడు పణిదెపు వెంకటకృష్ణ వద్ద రెండేళ్లు సాధన చేశారు. రోజూ కొంత సమయం, వారాంతాలను ఇందుకు కేటాయించుకుని చక్కటి ఆవిష్కరణలతో అందరి అభినందనలు అందుకుంటున్నారు. ఇటీవల లోయర్ పరీక్షల్లో ప్రథమ శ్రేణి సాధించారు. రంగుల కాగితాలు, వ్యర్థాలకు చక్కటి అర్థాలనిచ్చే వస్తువులుగా మార్చగలరు. చిత్ర కళలోని అన్ని విభాగాల గురించి అధ్యయనం చేస్తున్నానని, డ్రాయింగ్ టీచర్ కావాలన్నది లక్ష్యమని వివరించారు.

రంగు పెన్సిల్స్‌తో వేసిన బొమ్మ

రెండో తరగతి నుంచే ఆసక్తి

శివశంకర్, ఆదిలక్ష్మి దంపతుల కుమార్తె 'విశ్వనాథపల్లి రేణు' తెనాలి సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాల్లో 9వ తరగతి చదువుతోంది. రెండో తరగతి నుంచే చిత్రకళోపాధ్యాయుడు పణిదెపు వెంకటకృష్ణ వద్ద సాధన చేస్తోంది. రంగులు, పెన్సిల్ డ్రాయింగ్‌లో నైపుణ్యం సాధించి అభినందనలు అందుకుంటోంది. లోయర్ ఫలితాల్లో ప్రథమ శ్రేణితో ధ్రువపత్రం అందుకుంది. డ్రాయింగ్ హయ్యర్ పూర్తి చేయడం, పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం ప్రస్తుత లక్ష్యాలని వివరించింది.

బొమ్మలు గీస్తున్న విశ్వనాథపల్లి రేణు

పంచముఖ ఆంజనేయ స్వామి

అంతా మా ఇష్టం..

పట్టించుకోని అధికార యంత్రాంగం

తక్కెళ్లపాడు(పెదకాకాని), న్యూస్‌టుడే : కాలువలు, వాగులు, చెరువు గట్లను ఎవరైనా ఆక్రమించినా, అనుమతులు లేకుండా పనులు చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలున్నా క్షేత్ర స్థాయిలో అధికారులు పట్టించుకోవడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. తక్కెళ్లపాడులోని గుంటూరు ఛానల్(కాలువ) గట్టుపై ఓ రియల్ ఎస్టేటు వ్యాపారి రోడ్డు పనులు చేపట్టడం గ్రామంలో చర్చనీయాంశమైంది. గ్రామస్థులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోక పోవడం గమనార్హం. ఈ కాలువ సమీపంలో ఓ వ్యాపారి వ్యవసాయ భూములు కొనుగోలు చేసి వెంచర్ వేస్తున్నారు. దానికి వెళ్లేందుకు మూడు వైపులా రోడ్లు లేవు. కేవలం గుంటూరు ఛానల్ గట్టు మాత్రమే ఉంది. ఇంకేముంది దానిపై రహదారి నిర్మించి ప్లాట్లను అమ్ముకోవాలని వ్యాపారి చూస్తున్నాడు. కొన్ని నెలల్లో గుంటూరు ఛానల్‌ని అభివృద్ధి చేయనున్నారు. ఈ రోడ్డు కారణంగా భారం పడే అవకాశం ఉంది. దీనిపై 'న్యూస్‌టుడే' గుంటూరు ఛానల్ డీఈ హరికృష్ణను వివరణ కోరగా పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పని చేశారు.. మరమ్మతులు మరిచారు!

పొన్నూరు పట్టణ పరిధి నిడుబ్రోలు 12వ వార్డు నుంచి టిడ్కో గృహాలకు వెళ్లే దారిలో సుమారు రెండు నెలలు కిందట తాగునీటి ప్రధాన పైపులైన్‌కు లీకు ఏర్పడింది. ఈ నేపథ్యంలో మరమ్మతులు కోసం రహదారిని పగలగొట్టి పని పూర్తి చేశారు. కానీ రోడ్డును బాగు చేయకుండా వదిలేశారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిర్వహించే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, పొన్నూరు**

పేదలకు చీరల పంపిణీ

పెదకాకాని, న్యూస్‌టుడే : స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సరస్వతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా స్థానిక శివాలయం మాజీ ఛైర్మన్లు ఆలపాటి సత్యనారాయణ, దర్శి భాస్కరరావు పాల్గొని మాట్లాడారు. కొన్నేళ్లుగా ఫౌండేషన్ ద్వారా పేదలకు మౌలిక అవసరాలు కల్పించి అండగా నిలవడం అభినందనీయమన్నారు. క్రిస్టియన్ ఫోరం సభ్యుడు సాల్మన్‌రాజు, మైనార్టీ నేత ఆరిఫ్, ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కూరపాటి సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో సత్యనారాయణ, సాల్మన్‌రాజు తదితరులు

స్థిరాస్తి కొనుగోలు విషయమై ప్రకటన

మా క్లయింటు తెనాలి పట్టణం, రామలింగేశ్వర పేట, మామిడిబత్తుల వారి వీధి, ఇంటి నెం.21-19-1రు కాపురస్తురాలు, మామిడిబత్తుల వెంకటకృష్ణసుధాకరరావు గారి భార్య మామిడిబత్తుల పద్మజ గారి తరపున యావన్మందికి తెలియజేయునది ఏమనగా:-

గవిని రఘునాథబాబు గారు వారి స్వార్జితముగా ది.09-09-1987 తేదీన రేటూరి వసుంధరాదేవి గారి వలన విక్రయం పొంది తెనాలి సబ్ రిజిష్టారు వారి ఆఫీసులో దస్తావేజు నెం.3349/1987రుగా రిజిష్టరు కాబడిన రీత్యా తెనాలి మున్సిపల్ 8 వార్డు, 10 బ్లాకు, టి.ఎస్.నెం.529/3రు మింజుమలె 212 చ.గ. స్థలం గవిని రఘునాథబాబు గారికి సర్వ హక్కులతో సంక్రమించబడినదియు, దరిమిలా వారు ది.27-03-2018 తేదీన ఇంటెస్టేట్గా స్వర్గస్తులైనందున, వారి మరణానంతరం హిందూ వారసత్వ చట్టం రీత్యా ముఖ్య వారసులు అయిన వారి భార్య, కుమార్తెలు అయిన వరుసగా 1. చాపలమడుగు లక్ష్మీనరసమ్మ, 2.గవిని వాసంతి, 3.గవిని ప్రశాంతి గార్లకు పైన తెల్పిన స్థిరాస్తి సర్వ హక్కులతో సంక్రమించబడి, వార్ల ముగ్గురు స్వాధీనములో ఉండినదనియు, పైన తెల్పిన స్థలమును అనగా ఇంటి నెం. 1-38-18రుకు సమీపములోని స్థలమును కొల్త వేయించగా తేలిన విస్తీర్ణం 203.63 చ.గ. స్థలము కలదనియు, వార్ల ముగ్గురు తెలియజేసిన పిమ్మట సదరు స్థలమును పైన తెల్పిన ముగ్గురు వలన మా క్లయింటు కొనుగోలు చేయుటకు నిర్ణయించుకున్నారనియు, యిందుపై ఎవరికైనను తాకట్టు, కోర్టు జప్తులు మరియు ఏవిధమైన అభ్యంతరములు ఉన్న యెడల యీ ప్రకటన తేదీ నుండి ఐదు (5) రోజుల లోగా యీ క్రింది చిరునామాకు లిఖిత పూర్వకముగా అభ్యంతరములు తెలియజేయగలరు. గడువు లోగా ఎటువంటి ఆక్షేపణలు రాని యెడల సదరు ఆస్తిని నిష్పేచిత మరియు నిరభ్యంతరమైన ఆస్తిగా భావించి మా క్లయింటు సక్రమమైన విక్రయ దస్తావేజును పై ముగ్గురు వలన పొందగలరు. గడువు అనంతరం వచ్చు ఆక్షేపణలు పై ఆస్తిని గాని, మా క్లయింటు హక్కులను గాని నిర్బంధించజాలవు.

HARIDASU GOWRISANKAR, అడ్వకేట్, ఎన్.జి.ఓ బిల్డింగ్ పైన ఆఫీసు కొత్తపేట, తెనాలి. ✆ :93464 60085

అంబరాన్నంటిన నూతన సంవత్సర సంబరాలు

తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో గురువారం నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. ప్రజాప్రతినిధులు, అధికారులను నాయకులు, ప్రజలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పలుచోట్ల కేకులు కోశారు. కొన్నిచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. **- న్యూస్‌టుడే బృందం**

పొన్నూరు : కేకు కోస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో..

పొన్నూరు: కమిషనర్ రమేష్ బాబుకు పుష్పగుచ్ఛం అందిస్తూ..

విజ్ఞాన్ లారాలో విద్యార్థుల ఆనందం

తెనాలి: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డీఎస్పీ, సీఐలు

తెనాలి టైమ్స్ కాలమానిని ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ సంజనా సింహ

తెనాలి: కేకు కోస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి తదితరులు

తెనాలి: ఇమ్మానుయేలు ప్రార్థనా గోపురంలో..

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కొలనుకొండ వద్ద గురువారం రైలు కింద పడి గుర్తు తెలియని సుమారు 45 సంవత్సరాల వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారని తెనాలి రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు మంగళగిరివాసిగా ప్రాథమిక సమాచారం అందిందని, మృతదేహాన్ని మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

చికిత్స పొందుతూ భవన నిర్మాణ కార్మికుడి మృతి

పొన్నూరు, న్యూస్‌టుడే : మండల పరిధిలోని చింతలపూడి గ్రామానికి చెందిన నల్లూరి శ్రీనివాసరావు(30) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిస కాగా తాగవద్దని కుటుంబ సభ్యులు హెచ్చరించిన మార్పు రాకపోవడంతో మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన అతను గతేడాది డిసెంబరు 6న పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు గ్రామీణ ఎస్సై శ్రీహరి తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

సచివాలయ ఉద్యోగి దాడి చేశాడని ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గతంలో తమ గ్రామ సచివాలయంలో పని చేసిన మధుసూదనరావు అనే వ్యక్తి తనపై దాడి చేశాడని తెనాలి మండలం ఖాజీపేట గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య అనే వృద్ధుడు గ్రామీణ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం కొల్లిపర మండలంలో విధులు నిర్వహిస్తున్న ఆ ఉద్యోగి ఒక పని నిమిత్తం తన వద్ద రూ.20 వేలు తీసుకుని పనిచేయలేదని, ప్రశ్నిస్తే దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(పూర్వపు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. జోనల్ కార్యాలయం: శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైను, ఇన్నర్ రింగ్ రోడ్, గోరంట్ల, గుంటూరు-522034, బ్రాంచ్ కార్యాలయం: తెనాలి - వెబ్‌సైట్: www.shriramfinance.in

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో **'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్'** గా పిలువబడేది. ఎన్‌సిఎల్‌టీ బెంచ్-II చెన్నై, తేది.09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా** తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు **తెనాలి నందు బ్రాంచి ఆఫీస్ కలిగి** నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టర్డై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ/ఋణదాతగా సూచిస్తారు)

ఋణగ్రహీతలు/ సహ-ఋణగ్రహీత(లు)/ హామీదార్లు/దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు/ హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3 తో చదుపబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్టువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలకు/ హామీదారులకు/ తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

వారి యొక్క చివరగా తెలిసిన చిరునామాలకు పంపిన నోటీసులు అందకుండా తిరిగి వచ్చినవి. కాబట్టి ఈ పబ్లిక్ నోటీసు ద్వారా వారికి ఈ విషయం తెలియజేయబడుతుంది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

ఋణగ్రహీత(లు)/ సహ- ఋణగ్రహీత(లు)/ హామీదార్ల యొక్క పేర్లు :
1) షేక్ దరియాబీ, భర్త: షేక్ పచ్చా, ముస్లీం, వయస్సు 70 సం॥లు, నివాసము: డి.నెం.6-15-4, వీరరాఘవులు వీధి, సాల్ట్ బజార్, తెనాలి, గుంటూరు జిల్లా, జెసిజెసి తెనాలి.
2) షేక్ బాజి, తండ్రి: షేక్ పచ్చా, ముస్లీం, వయస్సు 50 సం॥లు, నివాసము: డి.నెం.6-15-4, వీరరాఘవులు వీధి, సాల్ట్ బజార్, తెనాలి, గుంటూరు జిల్లా, జెసిజెసి తెనాలి.
3) షేక్ కాలేషా, తండ్రి: షేక్ పచ్చా, ముస్లీం, వయస్సు 48 సం॥లు, నివాసము: డి.నెం.6-15-4, వీరరాఘవులు వీధి, సాల్ట్ బజార్, తెనాలి, గుంటూరు జిల్లా, జెసిజెసి తెనాలి.
4) బూర్లె కన్యక, భర్త: నాగ వెంకట కిషోర్, హిందూ, వయస్సు 60 సం॥లు, నివాసము: డి.నెం.22-5-07, సరోజిని నాయుడు వీధి,కొత్తపేట, తెనాలి, (లేటు బి.నాగ వెంకట కిషోర్ యొక్క ఎల్ఆర్).
(పైన నెం.1 నుండి 3 వరకు మరణించిన షేక్ పచ్చా యొక్క చట్టబద్ధమైన వారసులు & నెం.4 హామీదారు)
లోను అగ్రిమెంట్ నెం. TENALTF1511250003

NPA తేది	28-02-2017
డిమాండ్ నోటీసు తేది	10-12-2025
బకాయి మొత్తం	రూ.34,71,887/- (అక్షరాల ముప్పైనాలుగు లక్షల డెబ్బైఒక్క వేల ఎనిమిది వందల ఎనభైఏడు రూపాయలు మాత్రమే)
లోను ఋణం మొత్తం	రూ.15,000,00/-

లేటు షేక్ పచ్చాకు చెందిన స్థిరాస్థి షెడ్యూల్ : గుంటూరు జిల్లా, తెనాలి రిజిస్ట్రేషన్ జిల్లా, తెనాలి మునిసిపల్ ఏరియా, తెనాలి టౌన్, సాలిపేట, 4వ వార్డు, 1వ బ్లాక్, టి.ఎస్ నెం.23 నందలి ఎ.0.01 సెంట్లు, టి.ఎస్ నెం.24 నందలి ఎ.0.01 సెంట్లు, టి.ఎస్ నెం.25 నందలి ఎ.0.01 సెంట్లు మొత్తం ఎ.0.03 సెంట్లలోని వీరరాఘవులు వీధి దక్షిణంవైపు 84.5 1/4 చ॥గ॥లు లేదా 70.74 చ॥మీ॥ల విస్తీర్ణం గల ఇంటి స్థలం అందులో అసెస్‌మెంట్ నెం. 1028013852, డోర్ నెం.16-15-4తో గల ఆర్‌సిసి రూఫ్ భవనమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** ఉమ్మడి గల్లీ బజార్-22.00అ॥లు, **దక్షిణం:** చిలుకోటి పున్నయ్య యొక్క ఉమ్మడి గోడ-35.00అ॥లు, **పడమర:** ఉమ్మడి గల్లీ బజార్-21.06అ॥లు, **ఉత్తరం:** పాలిశెట్టి అనసూయ యొక్క గోడ-35.00 అ॥లు. **ఈ హద్దుల మధ్య 84.51/4 చ॥గ॥లు లేదా 70.74 చ॥మీ॥ల విస్తీర్ణం గల ఇంటి స్థలం మరియు అందులో డోర్ నెం.16-15-4, అసెస్‌మెంట్ నెం.1028013852తో గల ఆర్‌సిసి రూఫ్ భవనము కలదు.**

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.

తేది: 10-12-2025, ప్రదేశం: తెనాలి సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(c) eenadu

గుంటూరు తూర్పు

కార్డుదారులకు గోధుమపిండి పంపిణీ

కలెక్టరేట్ (గుంటూరు): గుంటూరు నగరంలోని కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెలకు సంబంధించి గోధుమపిండి సరఫరాకు నిర్ణయించింది. ఈ మేరకు గురువారం కంకరగుంట సమీపంలోని రేషన్ దుకాణంలో జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ.. కార్డుదారులకు గోధుమపిండి అందించారు ఈ సందర్భంగా జేసీ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ప్రభుత్వం రూ.20కే కిలో నాణ్యమైన గోధుమపిండిని సరఫరా చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో కోమలి పద్మ, సీఎస్‌డీటీలు ఖాదర్‌బేగ్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ మేయర్ షేక్ సజీల -పట్నంబజారు, న్యూస్‌టుడే

పోలీసు అధికారులతో కలిసి కేక్ కోస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే : అరుంధతినగర్ ప్రధాన రోడ్డు కాల్వల్లో పూడికలు పేరుకుపోయి మురుగునీరు పారుదలకాక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు మోహన్ 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్‌కు తెలియజేయడంతో కాల్వల్లో పూడికలు తీయించారు. ★ చేనేతకాలనీ రెండోలైన్ మలుపు వద్ద చెత్త కుప్పలు తీయకపోవడంతో వీధి అపరిశుభ్రంగా మారుతోందని స్థానికులు బ్రహ్మం 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్య ప్రజారోగ్య అధికారులకు తెలియజేయడంతో చెత్తకుప్పలు తీయించి తరలించారు.

రహదారులకు మోక్షం
ఐదేళ్లు గాలికొదిలేసిన వైకాపా ప్రభుత్వం

న్యూస్‌టుడే, నెహ్రూనగర్

తారుతో మెరుస్తున్న నెహ్రూనగర్ రహదారి..

నెహ్రూనగర్ నుంచి సంజీవనగర్‌కు వెళ్లే రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. సుమారు ఏడేళ్ల తర్వాత నూతన రహదారి నిర్మాణానికి నోచుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెహ్రూనగర్ ప్రధాన రహదారి నుంచి న్యూగుంటూరు, చేనేతకాలనీ, సంజీవనగర్ రైల్వేగేటు రహదారి పొడవునా గుంతలమయంగా మారడంతో ఆయా ప్రాంతాల వాసులు సంవత్సరాలుగా ఇబ్బందులు పడ్డారు. నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి లక్ష్మీపురం హెచ్‌ఎల్‌ఆర్ వరకు భారీ పైపులైను ఏర్పాటు పనుల కోసం ఏడేళ్ల కిందట తవ్వకాలు చేపట్టారు. ఆ గుంతలకు తాత్కాలికంగా మరమ్మతులు చేసేవారు. అదేమంటే పైపులైను పనులు ముగిసిన తర్వాత మాత్రమే నూతన రోడ్డు నిర్మాణం చేయాలంటూ అధికారులు సమాధానమిచ్చేవాళ్లు. ఇటుగా ఇన్నర్‌రింగ్‌రోడ్డు, రెడ్డిపాలెం, శారదాకాలనీ, సంజీవనగర్, కొత్తపేట, నెహ్రూనగర్ వాసులు నిత్యం వేలాదిగా ప్రయాణించేవారు. నగరం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి న్యూగుంటూరు రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులకు ఈ రహదారి ప్రధాన మార్గం కావడంతో గతుకుల రోడ్డుతో అల్లాడిపోయారు. చిన్నపాటి వర్షానికి గుంతల్లో మురుగు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. స్థానికులు అనేకసార్లు ఆందోళనలు చేయడంతో చిప్స్, డస్టు పోయించి మిన్నకుండిపోయారు. ఆ డస్టు నుంచి దుమ్ము, ధూళి రేగడంతో స్థానిక నివాసాలు, దుకాణదారులు ఉబ్బసం, ఎలర్జీ తదితర అనారోగ్యాలతో నరకయాతన అనుభవించారు. స్థానికుల ఇబ్బందులపై 'ఈనాడు' వరుసగా కథనాలు ప్రచురితం చేసింది. ప్రజలు అంత ఇబ్బందులు పడుతున్నా వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు తాగునీటి పైపులైను పనులు పూర్తి చేయకుండా, రోడ్డు నిర్మాణాన్ని గాలికి వదిలేశారు. కూటమి ప్రభుత్వం రావడంతో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకొని తాగునీటి పైపులైను పనులను వేగవంతం చేయించారు. దీంతో రహదారి నిర్మాణానికి మార్గం సుగమం అయ్యింది. ఇటీవల ఆ మార్గంలో నూతనంగా తారురోడ్డు (బీటీ రోడ్డు) నిర్మాణం చేపట్టారు. అప్పుడు రోడ్డు సగం వేసి ఆపేయడంతో స్థానికులు నిరసన వ్యక్తం చేసిన క్రమంలో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన జీఎంసీ డీఈ కల్యాణరావు సిబ్బందితో వెంటనే రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. ఒకప్పుడు గుంతలు, మురుగునీటితో ఉన్న రోడ్డు ఇప్పుడు నూతనంగా తారు రోడ్డుతో మెరిసిపోతుంది. కూటమి ప్రభుత్వం నూతన సంవత్సర కానుకగా రహదారి నిర్మాణం చేసి అందివ్వడంతో స్థానికులతో పాటు ఇటుగా ప్రయాణించే వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

3వ ఇన్నర్ రింగురోడ్డు మూడో దశ పనుల శంకుస్థాపన

నగరపాలకసంస్థ: ఇన్నర్ రింగురోడ్డు మూడో దశ పనులకు శనివారం రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

★ నల్లపాడురోడ్డులో ఈనెల 6 నుంచి 18వ తేదీ వరకు సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ(సారస్) ప్రదర్శన జరగనుంది. ఈ నేపథ్యంలో 150కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేయనున్నందున ప్రదర్శనకు వచ్చే వారికి తాగునీరు అందించడంతో పాటు, పరిసరాల్లో పారిశుద్ధ్యం పక్కాగా ఉండేలా నిర్వహణ చూసుకోవాలని జీఎంసీ అధికారులకు బాధ్యతలు అప్పగించారు.

అభివృద్ధి పరుగులు పెట్టిస్తాం

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో రెట్టింపు ఉత్సాహంతో అభివృద్ధి పరుగులు పెట్టిస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. క్యాంప్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కోశారు. అనంతరం నసీర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రజారంజక పాలన సాగుతుందన్నారు. ఈ ఏడాది నందివెలుగు ఆర్వోబీ నిర్మాణం, అన్ని ప్రాంతాలకు సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మొండిగేటు నిర్మాణం వంటి పనుల్ని పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నామని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, డ్రగ్స్ నియంత్రణ వంటి అంశాలపై దృష్టి సారించాలని పోలీసులకు ఎమ్మెల్యే నసీర్ సూచించారు.

సేవాభావం అభినందనీయం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా గురువారం నల్లపాడులో గృహలక్ష్మి మహిళా మండలి అధ్యక్షురాలు మల్లేశ్వరి ఆధ్వర్యంలో అతిథిగా హాజరైన ఏపీ మున్సిపల్ కార్మికుల సంఘం నగర కార్యదర్శి మాల్యాద్రి చేతులమీదుగా పేదలకు చీరలు పంపిణీ చేశారు.

కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలి

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: విద్యార్థులు నూతన సంవత్సరంలో కొత్త ఆలోచనలతో విజ్ఞానాన్ని మెరుగుపరచుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని జైన్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.డి.మున్ను అన్నారు. సంగడిగుంటలోని జైన్ హైస్కూల్‌లో గురువారం నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.కనకదుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఫ్లెక్సీల తొలగింపుపై మహిళల ఆగ్రహం

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: నూతన సంవత్సరం శుభాకాంక్షలు చెబుతూ స్థానిక ఎమ్మెల్యే గళ్లా మాధవి, సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని తదితర నాయకుల ఫొటోలతో నగరపాలెంకు చెందిన మహిళలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. టీబీ బంగ్లా నుంచి కంకరగుంట బ్రిడ్జి వరకు వీటిని ఏర్పాటు చేయగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా జీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది ఫ్లెక్సీలను తొలగించారని స్థానిక మహిళలు మూడు బొమ్మల కూడలి వద్ద నిరసన తెలిపారు. కమిషనర్ ఇతరపార్టీల ఇలాగే ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టినా పట్టించుకోని అధికారులు కలెక్టర్ రహదారిలో ఏర్పాటు చేసిన వాటిని ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. తాము లక్షలు పెట్టి అభిమాన నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే తొలగించడం సరికాదని విమర్శించారు.

క్లెసా 2026 దైనందిని ఆవిష్కరణ

నగరపాలకసంస్థ: ఏపీ లైసెన్స్‌డ్ ఇంజినీర్లు, సర్వేయర్లు, ఆర్కిటెక్ట్‌ల సమాఖ్య(ఏపీ క్లెసా) నూతన ఏడాది 2026 దైనందినిని గురువారం కమిషనర్ పులి శ్రీనివాసులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లెసా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ మహమ్మద్ రఫీ, రేజేటి సతీష్‌కుమార్, కోశాధికారి సూర్య పాల్గొన్నారు.

తూర్పు సబ్ డివిజన్ డీఎస్పీ అజీజ్, సీఐలు, ఎస్సైలు

డీపీవోలో నూతన సంవత్సర వేడుకలు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : జిల్లా పోలీసు కార్యాలయం (డీపీవో)లో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందల్ కేక్ కట్ చేశారు. ప్రతి సబ్ డివిజన్‌కు చెందిన డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏఎస్పీలు సుప్రజ, రమణమూర్తి, రవికుమార్, హనుమంతు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

జడ్పీ కార్యాలయంలో.. జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాపరిషత్తు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా క్యాంప్ కార్యాలయంలో భర్త సురేష్‌కుమార్‌తో కలిసి కేకు కోశారు. సీఈవో వి.జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ, ఏవో పి.శామ్యూల్‌పాల్, అధికారులు, ఉద్యోగులు, జడ్పీటీసీ సభ్యులు క్రిస్టినాకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నగరాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి

మేయర్ రవీంద్రకు పూలకుండీ అందజేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు, పక్కన కార్పొరేటర్లు

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: నగరాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో కమిషనర్ పులి శ్రీనివాసులు, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఇతర అధికారులు, తెదేపా కార్పొరేటర్లు, నాయకులు ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ కోవెలమూడి మాట్లాడుతూ నగరంలో సుమారు రూ.550 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి.. టమాట 45, వంగ 20, బెండ 34, పచ్చిమిర్చి 36, కాకర 45, క్యారెట్ 32, క్యాబేజీ 24, బీర 30, దొండ 42, బంగాళదుంప 25, ఉల్లిపాయలు 30, గోరుచిక్కుళ్లు 48, దోస 36, పొట్ల 34, చామదుంప 24, గోంగూర 10, తోటకూర 10, చుక్కకూర 10, మెంతికూర రూ.5, కొత్తిమీర 20, బీట్‌రూట్ 28, కీర 35, క్యాప్సికం 55, అల్లం 75, ఫ్రెంచి బీన్స్ 80, సొర 15, అరటి 8. - న్యూస్‌టుడే, పట్నంబజార్

ప్రగతి, సంక్షేమ కార్యక్రమాలపై కార్యాచరణ

కమిషనర్ శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో రానున్న కాలంలో అభివృద్ధి పనులతో పాటు పెద్దఎత్తున సుందరీకరణ, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం నూతన సంవత్సరం 2026 ఆరంభం సందర్భంగా కమిషనర్‌ను నగర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, విభాగాల అధికారులు కలిసి పూలమొక్కలు అందజేసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని పర్యావరణ హితంగా తీర్చిదిద్దేందుకు అందరి భాగస్వామ్యంతో ముందుకెళ్తున్నామన్నారు. గతేడాది ప్రతి ఒక్కరి సహకారంతో చేపట్టిన పలు సంస్కరణల ఫలితంగా జాతీయ స్థాయిలో గుంటూరు మెరుగైన స్థానం సాధించిందని తెలిపారు. రానున్న కాలంలో మరింతగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నెలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటేలా, ప్రస్తుత తరానికి నాటి పండగల ప్రాముఖ్యత తెలిసేలా నిర్వహించనున్నామని తెలిపారు.

గాంధీపార్కులో ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో..

నగరపాలకసంస్థ: స్థానిక గాంధీ పార్కులో గురువారం ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, పారిశుద్ధ్య కార్మికుల ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ఎస్ఈ సుందరరామిరెడ్డి, డీసీ వెంకటకృష్ణయ్య హాజరై కేక్ కట్ చేశారు. యూనియన్ నాయకులు చందు, కోటి, చిన్నారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

నెహ్రూనగర్ 7వ వీదిలో రహదారిపై వ్యర్థాలు చెల్లాచెదురుగా పడేయడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఇళ్ల ముందు అందంగా ముగ్గులు వేసుకొని వేడుకలు చేసుకుంటుంటే తమ వీధుల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
-నెహ్రూనగర్, న్యూస్‌టుడే

నిలిపితే ఇలా.. నడిచేదెలా..

బస్టాండు సెంటర్‌లోని పుట్‌పాత్‌లపై కొందరు ద్విచక్ర వాహనాల్ని నిలిపేస్తున్నారు. బస్టాండులోకి వచ్చే ప్రయాణికులు రోడ్లపై నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆక్రమణల్ని తొలగించాలని పలుమార్లు కార్పొరేషన్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి ప్రయోజనం లేదని సాక్షాత్తూ ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. - పట్నంబజారు, న్యూస్‌టుడే

వేగ నిరోధకం.. ఆపేను ప్రమాదం

పాతగుంటూరులోని నందివెలుగు రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇటీవల ఇక్కడి రోడ్డును అధికారులు 80 అడుగులకు విస్తరించారు. జెండాచెట్టు సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు రోడ్డంతా విశాలంగా ఉండడంతో వాహనదారులు వేగంగా వాహనాల్ని నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల ఓ ద్విచక్ర వాహనదారు ఎదురుగా వేగంగా వస్తున్న వాహనం ఢీ కొని కుడి చెయ్యి విరిగింది. ఇక్కడ వేగనిరోధకాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. - పట్నంబజారు, న్యూస్‌టుడే

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కుగ్లర్ ఆసుపత్రి ఆవరణలో..

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని అంబేడ్కర్‌నగర్, ఆదిత్యానగర్, మంగళదాస్‌నగర్, సంజీవనగర్, వెంకటాద్రిపేట, నెహ్రూనగర్, కొత్తపేట, వసంతరాయపురం, బొంగరాలబీడు, శారదాకాలనీ తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో గురువారం నూతన సంవత్సర ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేశారు. కుగ్లర్ ఆసుపత్రి ఆవరణలో రెవ డానియేల్, దేవాశీర్వాదం, రమేష్ ప్రార్థనలు చేశారు. నిర్వాహకులు బత్తుల లెనిన్, గ్రేస్‌సుదర్శన్, భీమ్‌రాజు పాల్గొన్నారు. వెంకటాద్రిపేటలోని ఇమ్మానియేల్ చర్చిలో పాస్టర్ యాకోబు ప్రార్థన చేయగా సంఘ పెద్దలు రమేష్, వెంకటరావు, మెస్సయ్య పాల్గొన్నారు. ట్రినిటి గురుమండలంలో కొవ్వొత్తులతో ప్రార్థనలు చేశారు.

భక్తులతో కిక్కిరిసిన దేవాలయాలు

పాత గుంటూరు: శ్రీవినాయక దేవస్థానంలో..

కొత్తపేట శివాలయంలో..

బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారు

లాలాపేట వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో..

వేణుగోపాలస్వామి దేవస్థానంలో..

నెహ్రూనగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో..

సంగడిగుంట మంత్రివారివీధిలోని దాసాంజనేయస్వామి దేవస్థానంలో

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సందర్భంగా గురువారం నగరంలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. స్వామివార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవాదాయశాఖకు చెందిన కొత్తపేటలోని శివాలయం, జగన్నాథస్వామి ఆలయం, లాలాపేటలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం, నాజ్ సెంటర్, రైలుపేటలోని ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు నెహ్రూనగర్, బుచ్చయ్యతోట, కొత్తపేట, గుంటూరువారితోట, ఆర్టీసీకాలనీ, సీతానగర్, వసంతరాయపురం, కాకుమానువారితోట, శ్రీనగర్, అరుంధతినగర్, పరమయ్యకుంట తదితర ప్రాంతాల్లోని ఆలయాలకు భక్తులు ఉదయం నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

పట్నంబజారు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా గురువారం నగరంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పాతగుంటూరులోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం, కొర్లపాటి అంకమ్మ తల్లి దేవస్థానం, ఆంజనేయస్వామి దేవస్థానం, లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యస్వామివార్ల దేవస్థానాలకు గురువారం తెల్లవారుజాము నుంచే భక్తులు విచ్చేసి పూజలు నిర్వహించారు. ఏటుకూరురోడ్డులోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, గంటలమ్మచెట్టు వీధిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాల్లో భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి కుంకుమ పూజలు జరిపారు. సంగడిగుంట మంత్రివారి వీధిలోని దాసాంజనేయస్వామి దేవస్థానంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు.

పట్నంబజారు: పాతగుంటూరు మెయిన్ రోడ్డులోని శ్రీ వినాయక దేవస్థానంలో గురువారం నూతన సంవత్సరం సందర్భంగా ఆలయ నిర్వాహకులు రావూరు సుబ్రహ్మణ్యశర్మ ప్రత్యేక పూజలు చేశారు.

టీఎన్‌యూఎస్ కాలమానిని ఆవిష్కరణ

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతులమీదుగా విడుదల చేస్తూ..

గుంటూరు విద్య: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం(టీఎన్‌యూఎస్) జిల్లా నాయకులు గురువారం కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయం వద్ద కలిసి నూతన ఏడాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వీ.జగదీష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు పి.బాలస్వామి, ప్రధాన కార్యదర్శి పి.జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో.. గుంటూరు విద్య: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా నాయకులు గురువారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును కలిసి నూతన ఏడాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను ఎంపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షులు డి.పెదబాబు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ బాజీ, యామర్తి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ కాలమానిని ఆవిష్కరిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

తారకరామానగర్‌లో స్థానిక సమస్యల తిష్ఠ

న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ (గుంటూరు)

అనుసంధానం చేయకుండా వదిలేసిన సైడు కాల్వలు

జీఎంసీ పరిధిలోని శివారు కాలనీల్లో స్థానిక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రం హడావుడి చేసి వదిలేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. స్థానిక విజయవాడరోడ్డు తారకరామానగర్‌లో నెలకొన్న సమస్యలతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. ఇక్కడ కొన్నేళ్ల కిందట వేసిన ప్రధాన రోడ్డు గోతులమయంగా మారి రాత్రిళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి మలుపుల్లో ఇలాంటి పరిస్థితి ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అంతర్గత రహదారుల్లో నిర్మించిన సైడుకాల్వలు సక్రమంగా లేవు. కొత్తగా నిర్మిస్తున్న కాల్వలు అనుసంధానం చేయకుండా వదిలేయడంతో మురుగునీటి పారుదలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. కాల్వల నిర్మాణాలు కొన్నిచోట్ల జరిగినా ఉపయోగం లేకుండా పోతోంది. ఇళ్ల ముందుకు మురుగునీరు చేరి దోమల వ్యాప్తి అధికంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఎప్పుడు.. పక్కనే ఉన్న శ్రీనివాసకాలనీలో అభివృద్ధి పనుల్లో భాగంగా రహదారులు, డ్రెయిన్ల నిర్మాణాలు జరుగుతున్నందున తారకరామానగర్‌లోనూ సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. శ్రీనివాసనగర్ నుంచి ఇటువైపు వచ్చే డ్రెయిన్లకు అనుసంధానంగా ప్రధాన డ్రెయిన్ల నిర్మాణం చేపడితేనే మురుగు నీటి సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు చెబుతున్నారు. వెంటనే ఇంజినీరింగ్ అధికారులు పాడైన రహదారుల మరమ్మతులు పూర్తి చేయడంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిచేలా దృష్టి సారించాలని కోరుకుంటున్నారు.

విద్యా సంస్థల్లో ఉత్సాహంగా సంబరాలు

దాసరి రాజామాస్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ..

ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ పాఠశాలలో డైరెక్టర్ మేకల రవీంద్రబాబు, ఉపాధ్యాయులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: ఆర్టీసీకాలనీ, నెహ్రూనగర్, కొత్తపేట, రాజీవ్‌గాంధీనగర్, రైలుపేట, నవభారత్‌నగర్, సాంబశివపేట తదితర ప్రాంతాల్లోని విద్యా సంస్థల్లో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కోసి పంచిపెట్టారు. నెహ్రూనగర్‌లోని శ్రీవికాస్ విద్యా సంస్థల్లో జరిగిన వేడుకల్లో రాష్ట్ర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐఎస్‌డీసీ) డైరెక్టర్ దాసరి రాజామాస్టర్, ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ పాఠశాలలో డైరెక్టర్ మేకల రవీంద్రబాబు అతిథులుగా పాల్గొన్నారు.

ఉద్యోగుల ఉన్నతికి కృషి

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వాణిజ్య పన్నుల శాఖ నోడల్ జాయింట్ కమిషనర్ గీతా మాధురి

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఉద్యోగుల ఉన్నతికి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని వాణిజ్య పన్నులశాఖ నోడల్ జాయింట్ కమిషనర్ గీతామాధురి అన్నారు. జిన్నాటవర్ సెంటర్‌లోని ఆ శాఖ కార్యాలయంలో ది కమర్షియల్ ట్యాక్సెస్ ఎన్జీవోస్ అసోసియేషన్ వారు ప్రచురించిన 2026 టేబుల్ క్యాలెండర్‌ను నోడల్ జాయింట్ కమిషనర్ గీతామాధురితో పాటు, గుంటూరు-2 డివిజన్ జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్‌సన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ జానీబాషా, డి.వి.కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు చాముండేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, పి.మల్లికార్జునరావు, వి.శ్రావణి పాల్గొన్నారు.



గుంటూరు పశ్చిమ

కలిసికట్టుగా సాగితే ఏదైనా సాధించొచ్చు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: స్నేహితులందరూ కలిసికట్టుగా సాగితే ఏదైనా సాధించవచ్చని శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు బోడెపూడి వెంకట సుబ్బారావు, రెరా సభ్యుడు దామచర్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. డీఏ స్సార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గొట్టిపాటి కల్యాణ మండపంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. స్నేహితులందరూ కుటుంబ సభ్యులతో కలిసివచ్చి ఉల్లాసంగా గడిపారు. కేకు కోసి వేడుకలు నిర్వహించారు. వెంకట సుబ్బారావు మాట్లాడుతూ స్నేహితులందరూ ఒక సంఘంగా ఏర్పడి సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ.. కష్టాల్లో ఒకరికొకరు అండగా ఉంటూ ముందుకు సాగడం అభినందనీయమన్నారు. సంఘ వ్యవస్థాపక కార్యదర్శి దామచర్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు కొత్తపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అందరి సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నెల్లూరి కాశయ్య, గుర్రం బుల్లెయ్య, పాదర్తి మురళీకృష్ణ, వీరయ్య తదితరులు పాల్గొన్నారు. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

వెంకట సుబ్బారావును సత్కరించిన శ్రీనివాసరావు, నాగేశ్వరరావు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80086 22566, 97042 53525, 80085 74897

? కృష్ణబాబుకాలనీలో రహదారి పక్కనున్న డ్రెయిన్‌లో మురుగు ముందుకు కదలడంలేదు. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. దోమల బెడద ఎక్కువైంది. - స్థానికులు ✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి డ్రెయిన్లలో పూడిక తీసేలా చర్యలు తీసుకుంటాం. - అంగడి రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్

స్పందన: బ్రాడీపేట 1వ లైన్ నుంచి 14వ లైన్ వరకు రహదారిపై చెత్త పేరుకుపోవడంతో దోమలు, దుర్గంధం వెదజల్లుతోంది. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ ఎన్.వి.ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన వెంటనే స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో చెత్త తరలించి బ్లీచింగ్ పిచికారి చేయించారు.

- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

ఉత్సాహంగా క్విజ్ పోటీలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: స్తంభాలగరువులోని నారాయణ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా గురువారం క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సహీత్(తొమ్మిదో తరగతి) ప్రథమ, కార్తిక్ నాయుడు (ఎనిమిదో తరగతి) ద్వితీయ, భవ్య సహారి (ఏడో తరగతి) తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు ప్రిన్సిపల్ ప్రమీలకుమారి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ ప్రమీల కుమారి

దీక్షాపరులకు అన్నప్రసాద వితరణ

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ పాలకమండలి సంయుక్త ఆధ్వర్యంలో గత నెల 27వ తేదీ నుంచి ప్రారంభమైన 14వ సిద్ధ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా గురువారం చండీహోమం, పూర్ణాహుతి జరిగింది. అనంతరం అయ్యప్ప దీక్ష తీసుకున్న వారికి ఇతర మాలధారణ చేసిన వారికి, భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. బొల్లేపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ శనివారం ఉదయం పుష్య పౌర్ణమి సందర్భంగా విష్ణుసహస్రనామ పారాయణ, దత్తాత్రేయ హోమం, 6న హనుమాన్ చాలీసా పారాయణ, 12న కలశపూజ, మహాచండీ యాగ పూర్ణాహుతి ఉంటాయన్నారు. 14న గోదా రంగనాథుల తిరుకల్యాణ మహోత్సవం, 15న అన్నమయ్య కళావేదికపై అయ్యప్పస్వామికి విశేష అభిషేకాలు, మకరజ్యోతి దర్శనంతో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమాల్లో ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 45, వంగ 23, బెండ 29, పచ్చిమిర్చి 39, కాకర 45, బీర 49, క్యాలిఫ్లవర్ 25, క్యాబేజి 24, క్యారెట్ 35, దొండ 37, బంగాళదుంప 25, ఉల్లిపాయలు 30, గోరుచిక్కుళ్లు 42, దోస 32, సొర 20, పొట్ల 35, అరటికాయ 10, పెద్ద చిక్కుళ్లు 35, చామదుంప 22, బీట్‌రూట్ 25, కీరదోసకాయ 30, బీన్స్ 63, క్యాప్సికమ్ 50, కొత్తిమీర 20, ఆకుకూరలు 10, నిమ్మకాయలు 25, అల్లం 75, వెల్లుల్లి 155. - న్యూస్‌టుడే, పట్టాభిపురం

రూ.లక్షల వ్యయం.. కళావిహీనం

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వే స్టేషన్ పశ్చిమ వైపు నూతన భవనాల నిర్మాణం, పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు, ప్లాట్‌ఫాంల ఆధునికీకరణ తదితర పనులు రూ.కోట్ల నిధులతో చేశారు. రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పేరుతో నిధులు ఖర్చు చేయడం వరకే మా పని అన్నట్లు అధికారులు వ్యవహరిస్తూ నిర్వహణను గాలికివదిలేశారు. రైల్వే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏడాదిన్నర క్రితం వేసిన మొక్కలు, పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన లాన్ మోడువారి కనిపిస్తున్నాయి. పచ్చిక, మొక్కలు ఎండిపోయినా.. పట్టించుకున్నవారే లేరు. లాన్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. నూతన భవనాల ఎదుట ప్రారంభోత్సవ సమయంలో వేసిన పూల మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి.

పచ్చికలో పెరిగిన పిచ్చి మొక్కలు

పచ్చికలో వేసిన వ్యర్థాలు

నిర్వహణ ఊసేదీ.. మొక్కలు, పచ్చిక పేరుతో గుత్తేదారులు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అమృత్ భారత్ పథకంలో గుంటూరు రైల్వే స్టేషన్‌ను రూ.కోట్ల నిధులతో ఆధునికీకరించారు. అత్యాధునిక సౌకర్యాలు, స్థానిక సంస్కృతి ప్రతిబింబించే డిజైన్‌లు, విశాలమైన ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేశారు. అరకొరగా మొక్కలు నాటి చేతులు దులిపేసుకున్నారు. నాటిన మొక్కల సంరక్షణపై దృష్టి సారించకపోవడంతో సగానికి పైగా ఎండిపోయాయి. పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన లాన్ మోడువారిపోయింది. పచ్చిక స్థానంలో పిచ్చి మొక్కలు మొలిచాయి. ఏడాదిన్నర క్రితం ఎంతో అందంగా కనిపించిన పశ్చిమ వైపు రైల్వేస్టేషన్ నేడు కళాహీనంగా మారింది.

ఫ్లెక్సీల తొలగింపుపై మహిళల ఆగ్రహం

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: నూతన సంవత్సరం శుభాకాంక్షలు చెబుతూ స్థానిక ఎమ్మెల్యే గళ్లా మాధవి, సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని తదితర నాయకుల ఫొటోలతో నగరంపాలెంకు చెందిన మహిళలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. టీబీ బంగ్లా నుంచి కంకరగుంట బ్రిడ్జి వరకు వీటిని ఏర్పాటు చేయగా ముందస్తు సమాచారం ఇవ్వకుండా జీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది ఫ్లెక్సీలను తొలగించారని స్థానిక మహిళలు మూడు బొమ్మల కూడలి వద్దకు వచ్చి నిరసన తెలిపారు. నగరంలో ఇతరచోట్లా ఇలాగే ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టినా పట్టించుకోని అధికారులు కల్టెరేట్ రహదారిలో ఏర్పాటు చేసిన వాటిని ఎందుకు తొలగించారో చెప్పాలన్నారు. తాము రూ.లక్షలు పెట్టి అభిమాన నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే తొలగించడం సరికాదని విమర్శించారు.

3న ఇన్నర్ రింగురోడ్డు మూడో దశ పనుల శంకుస్థాపన

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: : ఇన్నర్ రింగురోడ్డు మూడో దశ పనులకు శనివారం రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

● నల్లపాడురోడ్డులో ఈనెల 6 నుంచి 18వ తేదీ వరకు సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ(సారస్) ప్రదర్శన జరగనుంది. ఈ నేపథ్యంలో 150కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేయనున్నందున ప్రదర్శనకు వచ్చే వారికి తాగునీరు అందించడంతో పాటు, పరిసరాల్లో పారిశుద్ధ్యం పక్కాగా ఉండేలా నిర్వహణ చూసుకోవాలని జీఎంసీ అధికారులకు బాధ్యతలు అప్పగించారు.

ఉద్యోగుల ఉన్నతికి కృషి

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఉద్యోగుల ఉన్నతికి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని వాణిజ్య పన్నులశాఖ నోడల్ జాయింట్ కమిషనర్ గీతామాధురి అన్నారు. జిన్నాటవర్ సెంటర్‌లోని ఆ శాఖ కార్యాలయంలో ది కమర్షియల్ ట్యాక్సెస్ ఎన్జీవోస్ అసోసియేషన్ వారు ప్రచురించిన 2026 టేబుల్ క్యాలెండర్‌ను నోడల్ జాయింట్ కమిషనర్ గీతామాధురితో పాటు, గుంటూరు-2 డివిజన్ జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్‌సన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ జానీబాషా, డి.వి.కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు చాముండేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, పి.మల్లికార్జునరావు, వి.శ్రావణి పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వాణిజ్య పన్నుల శాఖ నోడల్ జాయింట్ కమిషనర్ గీతా మాధురి

బారులు తీరిన భక్తజనకోటి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవారిని విశేషంగా అలంకరించి వేద పండితులు విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ పాలక కమిటీ సభ్యులు ప్రత్యేక వరుసలు ఏర్పాటు చేశారు. భాష్యం విద్యాసంస్థలు భక్తులకు ప్రసాద వితరణ చేసింది. అన్నమయ్య కళావేదికపై తిరుప్పావై ప్రవచనం జరిగింది. భక్తి సంగీత విభావరి భక్తుల్ని అలరించింది. కృష్ణనగర్‌లోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో స్వామి, అమ్మవార్లను చూడముచ్చటగా అలంకరించారు.

కృష్ణనగర్‌లో లక్ష్మీనారాయణ స్వామికి పూజలు

క్యాలెండర్ ఆవిష్కరణ

ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంస్థ ఛైర్‌పర్సన్ వందనాదేవి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు కంపా శ్రీనివాసరావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, కలెక్టరేట్(గుంటూరు)

కార్డుదారులకు గోధుమపిండి పంపిణీ

కలెక్టరేట్(గుంటూరు): గుంటూరు నగరంలోని కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెలకు సంబంధించి గోధుమపిండి సరఫరాకు నిర్ణయించింది. ఈ మేరకు గురువారం కంకరగుంట సమీపంలోని రేషన్ దుకాణంలో జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ.. కార్డుదారులకు గోధుమపిండి అందించారు ఈ సందర్భంగా జేసీ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ప్రభుత్వం రూ.20కే కిలో నాణ్యమైన గోధుమపిండిని సరఫరా చేస్తుందన్నారు. నగరంలోని కార్డుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్‌వో కోమలి పద్మ, సీఎస్‌డీటీలు ఖాదర్‌బేగ్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో : గోధుమప్రభుత్వం కార్డుదారులకు అందిస్తున్న గోధుమపిండిని ఎమ్మెల్యే గళ్లా మాధవి గురువారం పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాయుడుపేటలోని 43, 44 రేషన్ దుకాణాల్లోని కార్డుదారులకు ఎమ్మెల్యే గోధుమ పిండి, బియ్యం అందించారు.

- కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే

తారకరామానగర్‌లో స్థానిక సమస్యల తిష్ఠ

న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ (గుంటూరు)

జీఎంసీ పరిధిలోని శివారు కాలనీల్లో స్థానిక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రం హడావుడి చేసి వదిలేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. స్థానిక విజయవాడరోడ్డు తారకరామానగర్‌లో నెలకొన్న సమస్యలతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. ఇక్కడ కొన్నేళ్ల కిందట వేసిన ప్రధాన రోడ్డు గోతులమయంగా మారి రాత్రిళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి మలుపుల్లో ఇలాంటి పరిస్థితి ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అంతర్గత రహదారుల్లో నిర్మించిన సైడుకాల్వలు సక్రమంగా లేవు. కొత్తగా నిర్మిస్తున్న కాల్వలు అనుసంధానం చేయకుండా వదిలేయడంతో మురుగునీటి పారుదలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. కాల్వల నిర్మాణాలు కొన్నిచోట్ల జరిగినా ఉపయోగం లేకుండా పోతోంది. ఇళ్ల ముందుకు మురుగునీరు చేరి దోమల వ్యాప్తి అధికంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

అనుసంధానం చేయకుండా వదిలేసిన సైడుకాల్వలు

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఎప్పుడు.. పక్కనే ఉన్న శ్రీనివాసకాలనీలో అభివృద్ధి పనుల్లో భాగంగా రహదారులు, డ్రెయిన్ల నిర్మాణాలు జరుగుతున్నందున తారకరామానగర్‌లోనూ సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. శ్రీనివాసనగర్ నుంచి ఇటువైపు వచ్చే డ్రెయిన్లకు అనుసంధానంగా ప్రధాన డ్రెయిన్ల నిర్మాణం చేపడితేనే మురుగు నీటి సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు చెబుతున్నారు. వెంటనే ఇంజినీరింగ్ అధికారులు పాడైన రహదారుల మరమ్మతులు పూర్తి చేయడంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిచేలా దృష్టి సారించాలని కోరుకుంటున్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: అరండల్‌పేటలోని తులసీ గ్రూపు సంస్థ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. తులసీ గ్రూప్ సంస్థ ఛైర్మన్ తులసీ రామచంద్రప్రభుకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ☛ చౌకధరల దుకాణాల సంఘం నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డీఎస్‌ఓ పి.కోమలి పద్మకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ☛ అఖిల భారత పంచాయతీ పరిషత్తు జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను సచివాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ☛ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావును గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్తమ్మ, సంస్థ అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ☛ ఏపీ ఎన్జీఓల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవలను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి ఎ.శ్యాంసుందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగుర్ షరీఫ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డీఎస్‌ఓ కోమలి పద్మకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న రేషన్ డీలర్లు

జిల్లా పోలీసు కార్యాలయంలో..

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందల్ కేక్ కట్ చేశారు. ప్రతి సబ్ డివిజన్‌కు చెందిన డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏఎస్పీలు సుప్రజ, రమణమూర్తి, రవికుమార్, హనుమంతు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పశ్చిమ సబ్ డివిజన్ డీఎస్పీ అరవింద్, సీఐలు, ఎస్సైలు

జిల్లా పరిషత్తులో..

జిల్లాపరిషత్తు(గుంటూరు): జిల్లాపరిషత్తు కార్యాలయంలో నూతన సంవత్సరం వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా క్యాంప్ కార్యాలయంలో భర్త సురేష్‌కుమార్‌తో కలిసి కేకు కోశారు. సీఈవో వి.జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ, ఏవో పి.శామ్యూల్‌పాల్, అధికారులు, ఉద్యోగులు, జడ్పీటీసీ సభ్యులు క్రిస్టినాకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కేకు కోస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

టీఎన్‌యూఎస్ కాలమానిని ఆవిష్కరణ

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతులమీదుగా విడుదల చేస్తూ..

గుంటూరు విద్య: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం(టీఎన్‌యూఎస్) జిల్లా నాయకులు గురువారం కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయం వద్ద కలిసి నూతన ఏడాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వీ.జగదీష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు పి.బాలస్వామి, ప్రధాన కార్యదర్శి పి.జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో.. గుంటూరు విద్య: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా నాయకులు గురువారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును కలిసి నూతన ఏడాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను ఎంపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షులు డి.పెదబాబు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ బాజీ, యామర్తి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ కాలమానిని ఆవిష్కరిస్తున్న నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

క్లెసా నూతన ఏడాది దైనందిని ఆవిష్కరణ

నగరపాలకసంస్థ: ఏపీ లైసెన్స్‌డ్ ఇంజినీర్లు, సర్వేయర్లు, ఆర్కిటెక్ట్‌ల సమాఖ్య(ఏపీ క్లెసా) నూతన ఏడాది 2026 దైనందినిని గురువారం కమిషనర్ పులి శ్రీనివాసులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లెసా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ మహమ్మద్ రఫీ, రేజేటి సతీష్‌కుమార్, కోశాధికారి సూర్య పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కార్యాచరణ

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో రానున్న కాలంలో అభివృద్ధి పనులతో పాటు పెద్దఎత్తున సుందరీకరణ, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం నూతన సంవత్సరం 2026 ఆరంభం సందర్భంగా కమిషనర్‌ను నగర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, విభాగాల అధికారులు కలిసి పూలమొక్కలు అందజేసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని పర్యావరణ హితంగా తీర్చిదిద్దేందుకు అందరి భాగస్వామ్యంతో ముందుకెళ్తున్నామన్నారు. గతేడాది ప్రతి ఒక్కరి సహకారంతో చేపట్టిన పలు సంస్కరణల ఫలితంగా జాతీయ స్థాయిలో గుంటూరు మెరుగైన స్థానం సాధించిందని తెలిపారు. రానున్న కాలంలో మరింతగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నెలలోనే సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటేలా, ప్రస్తుత తరానికి నాటి పండగల ప్రాముఖ్యత తెలిసేలా నిర్వహించనున్నామని తెలిపారు.

గాంధీపార్కులో నూతన సంవత్సర వేడుక..

నగరపాలకసంస్థ: స్థానిక గాంధీ పార్కులో గురువారం ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, పారిశుద్ధ్య కార్మికుల ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ఎస్ఈ సుందరరామిరెడ్డి, డీసీ వెంకటకృష్ణయ్య హాజరై కేక్ కట్ చేశారు. యూనియన్ నాయకులు చందు, కోటి, చిన్నారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి కృషి

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: కొత్త సంవత్సరంలో పైవంతెనలు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. బస్టాండ్ సమీపంలోని మణిపురం బ్రిడ్జి, కంకరగేటు బ్రిడ్జిలకు రంగులు వేసి ఆకట్టుకునే బొమ్మలతో తీర్చిదిద్దారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా రహదారులు, విభాగినులు, కూడళ్లతో పాటు పైవంతెనలను సుందరంగా మార్చుతున్నారు. వంతెన పిల్లర్లకు కోటలను తలపించేలా రంగులు వేశారు. కంకరగుంట ఓవర్ బ్రిడ్జి గోడలకు వేసిన చిత్రాలు అటుగా వెళ్లేవారిని ఎంతో ఆకట్టుకుంటున్నాయి. వివాహ వేడుకల సమయంలో ఉండే హడావుడి బ్రిడ్జి గోడలపై కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తుంది. పల్లకిలో పెళ్లికూతురు, అశ్వంపై పెళ్లి కుమారుడు, మేళతాళాలు, భజంత్రీలు, అశ్వాలు, ఏనుగులు తదితర బొమ్మలను ఆకట్టుకునే విధంగా చిత్రకారులు ఎంతో అందంగా తీర్చిదిద్దారు.

జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

కొత్త ఏడాదిలో ప్రగతి పరుగులు

పెమ్మసాని చంద్రశేఖర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న వేములకొండ శ్రీనివాస్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో అభివృద్ధి పరుగులు పెట్టిస్తామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరులోని క్యాంప్ కార్యాలయంలో పలువురు ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా బీసీ విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మాదల చినకొండలరావు, కార్యదర్శి గొడుగు శంకర్ తదితరులు ఆయన్ను సత్కరించారు. పెమ్మసాని మాట్లాడుతూ ఈ ఏడాది రాజధాని అమరావతి పనులతో పాటు నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్యే గళ్లా మాధవి తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి కేకు కోశారు. పలువురు సీఐలు ఎమ్మెల్యే మాధవికి శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, మిర్చి యార్డు ఛైర్మన్ కుర్రా అప్పారావు కేకు కోశారు. మాణిక్యరావు మాట్లాడుతూ అభివృద్ధి పరంగా జిల్లా దూసుకుపోవాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబుకు తెదేపా రాష్ట్ర నాయకులు కొర్రపాటి సురేష్, ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టరేట్: కలెక్టర్ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టరేట్‌లోని రెవెన్యూ అధికారులు, ఉద్యోగులతో కలిసి కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా కేకు కోశారు. ఈ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పుష్పగుచ్ఛాలు పూలమొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవకు కూడా జిల్లా రెవెన్యూ అధికారులు, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, గుంటూరు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.



ఆనందబాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కొర్రపాటి సురేష్

జిల్లా పార్టీ కార్యాలయంలో ...

కేకు కోస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

తాగునీరు వృథా పట్టించుకోరా..!

బ్రాడీపేట 1/21వ లైన్ కంకరగుంట అంబేడ్కర్ బొమ్మ దగ్గర పైపులైన్ల లీకులతో మంచినీరు వృథాగా పోతోంది. దీంతో రోడ్డు సైతం అధ్వానంగా మారుతోంది. వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. అధికారుల స్పందించి పైపులైను లీకేజీకి మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం



(c) eenadu

ఈనాడు
అమరావతి
కృష్ణా
శుక్రవారం జనవరి 2, 2026 5

కనుల నిండుగ... కనకదుర్గమ్మ...

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను నూతన సంవత్సరం మొదటి రోజు గురువారం దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ భక్తులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించి పర్యవేక్షించారు.

- ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

ఈపీఎఫ్ కార్యాలయం చిరునామా మార్పు

ఈనాడు, అమరావతి: విజయవాడలోని ఉద్యోగుల భవిష్య నిధి(ఈపీఎఫ్‌వో) జిల్లా కార్యాలయం చిరునామా మారింది. ప్రస్తుతం విజయవాడ దుర్గ అగ్రహారంలోని అన్నదాన సమాజం రోడ్డులో ఈపీఎఫ్‌వో కార్యాలయం ఉంది. దీనిని అక్కడి నుంచి విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్(పీఎన్‌బీఎస్)లోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లోని.. మూడో అంతస్తులో ఉన్న ఆర్టీసీ హౌస్‌లోకి మార్చారు. ఇకనుంచి కొత్త కార్యాలయానికే.. ఈపీఎఫ్‌వో సభ్యులు, పింఛనుదారులు, సాధారణ ప్రజలు రావాలని.. విజయవాడ రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-02 అబ్దుల్ ఖాదర్ తెలిపారు.

రోగాలు సరఫరా.. ఇటుపైపు చూడరా!

పురపాలికల్లో మురుగు కాలువల్లోనే తాగునీటి పైపులు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

జిల్లాలోని నగర, పురపాలికల్లో తాగునీటి పైపులైన్లు ఏళ్ల తరబడి డ్రెయిన్లలో మగ్గుతున్నాయి. తాగునీరు, డ్రెయిన్ల నిర్వహణకు పురపాలికల్లో రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా.. అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో ఇబ్బందులు తప్పట్లేదు. వర్షాలు, వరదలు, డ్రెయిన్లు పొంగినప్పుడు తాగునీరు కలుషితమై పురవాసులు రోగాల బారిన పడుతున్నారు. అసలే జిల్లాలో మురుగు వ్యవస్థ అధ్వానం.. చిన్నపాటి వర్షాలు వచ్చినా రోడ్లు ఏరులవుతున్నాయి. కాలువల్లో పూడికలు సరిగా తీయకపోవడం.. తీసినా రోజులు తరబడి వ్యర్థాలు అక్కడే వదిలేయడం.. ప్రజలు సైతం కాలువల్లోనే వ్యర్థాలు పడేస్తుండడంతో మురుగు కదలక డ్రెయిన్లు పొంగుతున్నాయి. ఇలాంటి కాలువల్లోనే తాగునీటి పైపులు ఉండడంతో చిన్నపాటి లీకు పడినా.. ఆ నీరు తాగితే అతిసారం, విషజ్వరాలు, ఇతర వ్యాధులు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అధికారులు అప్రమత్తమై సమస్య పరిష్కరించాలని పురవాసులు కోరుతున్నారు.

✪ మచిలీపట్నంలోని ఇంగ్లిషుపాలెంలో డ్రెయిన్‌లోనే తాగునీటి పైపు వేయడంతో.. ఇంట్లో నుంచి వచ్చే వ్యర్థ నీరు.. మురుగు చేరి ఇలా ప్రమాదకరంగా మారింది.

✪ మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో రోజూ 22 మిలియన్ లీటర్ల నీరు సరఫరా చేస్తున్నారు. 33395 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. నీటి నిర్వహణకు ఏటా రూ.3 కోట్లకు పైగానే ఖర్చు చేస్తున్నారు. 285 కి.మీ.ల మేర డ్రెయిన్లు ఉండగా పూడికతీత ఇతర నిర్వహణకు ఏటా రూ.80 లక్షలు అవుతోంది. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో రూ.కోట్లు ఖర్చు చేసినా ఫలితం ఉండట్లేదు.

✪ గుడివాడ మున్సిపల్ కార్యాలయానికి సమీపంలోని ప్రధాన మురుగు కాలువలోనే తాగునీటి లైన్లు ఏళ్లుగా ఇలా దర్శనమిస్తున్నాయి. పురపాలికలో 150 కి.మీ. తాగునీటి పైపులైన్లు ఉండగా.. నిర్వహణకు నెలకు రూ.25 లక్షలు ఖర్చు చేస్తున్నారు. 12 ట్యాంకుల నుంచి 12,600 కనెక్షన్లకు రోజూ 12 మిలియన్ లీటర్ల నీరు సరఫరా అవుతోంది. చాలావరకు పైపులైన్లు మురుగుకాలువల్లోనే ఉన్నాయి. ✪ ఉయ్యూరు, తాడిగడప, పెడన పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి.

అమృత్ 2.0 నిధులతో బాగు చేస్తున్నాం

'మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో డ్రెయిన్లలోని తాగునీటి పైపులైన్లను గుర్తిస్తున్నాం. అమృత్ 2.0లో నగరానికి రూ.71 కోట్లు మంజూరవగా.. రూ.15కోట్ల మేర పైపులైన్ల మార్పిడి ఇతర పనులకు కేటాయిస్తాం. గుడివాడలో ఇప్పటికే లైన్ల మార్పిడి పనులు చేపట్టాం. సమస్య లేకుండా చూస్తాం' అని మచిలీపట్నం, గుడివాడ మున్సిపల్ కమిషనర్లు బాపిరాజు, సింహాద్రిమనోహర్ తెలిపారు.

పుస్తక.. పండగొచ్చేసిందోచ్!

ఇందిరాగాంధీ స్టేడియంలో 36వ ప్రదర్శన

309 స్టాళ్లు.. జనవరి 12 వరకు నిర్వహణ

ఈనాడు, అమరావతి

విజయవాడ పుస్తక మహోత్సవానికి.. వేదిక సిద్ధమైంది. నేటి నుంచి 36వ పుస్తక పండగ.. విజయవాడలో సందడి చేయబోతోంది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జనవరి 02 నుంచి 12 వరకు.. వేడుక జరగబోతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి స్టాళ్ల సంఖ్య బాగా పెరిగింది. దేశంలో ప్రముఖ ప్రచురణ సంస్థలన్నీ తరలివచ్చాయి. ఈసారి తెలుగుతోపాటు ఆంగ్ల పుస్తకాల ప్రచురణ సంస్థలు భారీగా వచ్చాయని.. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ (వీబీఎఫ్ఎస్) అధ్యక్షుడు టి.మనోహర్ నాయుడు తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 09 వరకూ ప్రదర్శన కొనసాగుతుంది.

ఇందిరాగాంధీ స్టేడియంలో పుస్తక ప్రదర్శనకు జరుగుతున్న ఏర్పాట్లు.. స్టాల్స్‌లో పుస్తకాలు సర్దుకుంటూ..

భారీ స్పందనకు వీలు...

హైదరాబాద్‌లో పుస్తక మహోత్సవానికి ఈసారి విపరీత రద్దీ నెలకొంది. కొనుగోళ్లు భారీగా పెరిగాయి. అందుకే.. విజయవాడ పుస్తక మహోత్సవానికి సైతం స్పందన భారీగా ఉండబోతోందని నిర్వాహకులు అంచనా వేసి ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా యువత, పిల్లలు ఎక్కువగా రానున్నారు. పాఠశాలల్లో పుస్తక పఠనం పెంచడానికి చేస్తున్న ప్రయత్నాలే దీనికి కారణం.

స్టాళ్లు.. పెరిగాయ్..

262 స్టాళ్లు.. దేశంలోని ప్రముఖ ప్రచురణ సంస్థలవి కాగా.. 47 స్టాళ్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలవి. నిరుడు 240 స్టాళ్లే ఏర్పాటయ్యాయి. గతసారి వేదిక వెతుకులాటతోనే ఆఖరు నిమిషం వరకూ ఉత్కంఠ నెలకొనగా.. చివరిలో ఇందిరాగాంధీ మైదానం కుదిరింది. ఈసారి ముందే వేదికపై స్పష్టతరాగా.. స్టాళ్ల సంఖ్య గణనీయంగా పెరిగింది.

✪ కృష్ణా, గుంటూరుల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తరలివచ్చేలా సహకరించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను వీబీఎఫ్ఎస్ తరఫున విజ్ఞప్తి చేశారు. దీంతో ఈసారి విద్యార్థుల రద్దీ విపరీతంగా ఉండబోతోంది.

మహోత్సవం విశేషాలు..

✪ కోల్‌కతా పుస్తక ప్రదర్శన స్ఫూర్తితో ఏటా 'పుస్తక ప్రియుల పాదయాత్ర' బెజవాడలోనూ నిర్వహిస్తున్నారు. జనవరి 6న సాయంత్రం 4 గంటలకు మొగల్రాజపురం సిద్ధార్థ కళాశాల నుంచి పుస్తక మహోత్సవ ప్రాంగణం వరకూ పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈసారి ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్నారు.

✪ 1989 అక్టోబరులో నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొదటి పుస్తక మహోత్సవం విజయవాడలో నిర్వహించారు. తర్వాత ఏటా పుస్తక మహోత్సవం నిర్వహించాలని ప్రచురణకర్తలు నిర్ణయించారు. విజయవాడలో ప్రచురణకర్తలు, సాహితీవేత్తలు, కవులు, రచయితలు అంతా కలిసి విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం(వీబీఎఫ్ఎస్)గా ఏర్పడ్డారు.

✪ తొలి ఏడాది 1989లో 84 స్టాళ్లతో నిర్వహించగా, 1991లో 90కు పెరిగాయి. 2015లో అత్యధికంగా 389 స్టాళ్లతో రికార్డు సృష్టించారు. క్రమంగా స్టాళ్లు తగ్గుతూ.. ఈసారి 309కి పెరిగాయి.

రంగుల వేడుక.. రమణీయ వేదిక

5వ తేదీ నుంచి ప్రారంభం

పెనుగంచిప్రోలు తిరుపతమ్మ రంగుల మహోత్సవానికి ప్రత్యేకత ఉంది. గ్రామ దేవత ఉత్సవాలను వందల ఏళ్ల నుంచి నిర్వహిస్తున్నారు. ఈ వేడుక రెండేళ్లకోసారి జరుపుకొంటారు. ఈ ఉత్సవం జనవరి 5న నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎద్దుల బండ్లపై జగ్గయ్యపేటకు.. అమ్మవారి ఆలయం వద్ద నుంచి 11 విగ్రహాలను రజకులు శిరస్సులపై ఉంచుకుని ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారి మండపం వద్ద ఉంచుతారు. లాటరీ పద్ధతిలో ఎంపిక చేసిన రైతులు తమ ఎద్దుల బండ్లపై విగ్రహాలను ఉంచి జగ్గయ్యపేటకు తీసుకెళ్తారు. రాత్రికి పెనుగంచిప్రోలు మండపం వద్ద నుంచి మక్కపేట, చిల్లకల్లు మీదుగా జగ్గయ్యపేటలోని రంగుల బజారు వద్ద తీసుకెళ్లి రంగులు వేసే నిపుణులకు అప్పగిస్తారు. రంగులు వేశాక 28న తిరిగి పల్లకీల్లో బయలుదేరతారు. అక్కడ నుంచి జగ్గయ్యపేట, చిల్లకల్లు, భీమవరం, లింగగూడెం, పెనుగంచిప్రోలు గ్రామాలకు పల్లకీల్లో తీసుకొస్తారు. విగ్రహాలను పెనుగంచిప్రోలులో విడిది మండపం వద్ద ఉంచుతారు. ప్రత్యేక పూజలయ్యాక ఇనుప రథంపైకి చేర్చి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తెచ్చి విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. మరుసటి రోజు పెద్ద తిరునాళ్లు, దీక్షా స్వాములు తిరుముడి సమర్పిస్తారు.

గ్రీష్మ కోసం గాలింపు

★ ఎండీఎంఏ కేసులో తెరపైకి ఇంజినీరింగ్ విద్యార్థిని

★ బెంగళూరులో పలువురు విద్యార్థులకు సరఫరా..

ఈనాడు, అమరావతి: ఎండీఎంఏ కేసులో కొత్తగా తెరపైకి మరో ఇంజినీరింగ్ విద్యార్థిని గ్రీష్మ పేరు బయటకు వచ్చింది. ఈమె నుంచి డ్రగ్స్ తీసుకుంటున్నట్లు ఈ కేసులో తాజాగా అరెస్టు అయిన మహేష్ వెల్లడించాడు. దీంతో పోలీసులు గ్రీష్మ కోసం బెంగళూరులో ప్రత్యేక బృందంతో గాలిస్తున్నారు. మహేష్ అరెస్టు తర్వాత ఆమె అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది. యువతిని అదుపులోకి తీసుకుని విచారిస్తే.. మత్తు మందు సరఫరా మూలాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

గ్రీష్మ నుంచి కొనుగోళ్లు... రాజమహేంద్రవరం నగరానికి చెందిన మహేష్.. బెంగళూరులోని అలయన్స్ విశ్వవిద్యాలయంలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. అదే కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్న గ్రీష్మ పరిచయమైంది. మత్తుకు అలవాటుపడిన మహేష్.. ఆమె నుంచి ఎండీఎంఏ కొనుగోలు చేసేవాడు. వాట్సప్‌లో యూపీఐ స్కానర్ పంపితే.. దానిని స్కాన్ చేసి డబ్బులు పంపేవాడు. సొంతంగా వినియోగించుకున్న తర్వాత మిగిలింది, ఇతరులకు ఎక్కువ ధరకు అమ్మేవాడు.

★ ఈ కేసులో ఇప్పటికే అరెస్టు అయి.. రిమాండ్‌లో ఉన్న జగదీష్‌కు విజయవాడలో మహేష్ పరిచయమయ్యాడు. బెంగళూరు వచ్చినప్పుడు తనను కలవమని.. ఆ సందర్భంగా చెప్పాడు. దీంతో జగదీష్ కుమార్, అఖిలేష్ విజయవాడ నుంచి తరచూ బెంగళూరు వెళ్లి ఎండీఎంఏ కొనుగోలు చేసి తెచ్చుకునేవారు. గత నెల 19న వీరిద్దరూ కారులో బెంగళూరు వెళ్లారు. అక్కడ దిగిన తర్వాత మహేష్‌కు వాట్సప్‌లో కాల్ చేసి డ్రగ్ కావాలని అడిగారు. వారిని ఆరోజు మార్తనహళ్లిలోని పీజీ హాస్టల్‌లో మహేష్‌ను ఉంచాడు. గ్రీష్మ నుంచి 19 గ్రాముల డ్రగ్ తీసుకుని.. హాస్టల్‌కు వెళ్లి జగదీష్ కుమార్, అఖిలేష్‌కు ఇచ్చాడు. వారి నుంచి రూ.38 వేలు తీసుకున్నాడు. ఇదే కేసులో పరారైన మరో నిందితుడు రాజేష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అడుగులు

జిల్లా జడ్జి గోపీకి మొక్క అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా జడ్జి జి.గోపిని కలెక్టర్ డీకే బాలాజీ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా జడ్జి బంగ్లాలో గురువారం ఆయనను కలిసిన కలెక్టర్ పూలమొక్కను అందచేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిగా జడ్జి కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం జిల్లా మరింత సర్వతోముఖాభివృద్ధి సాధించాలని వారు ఆకాంక్షించారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు అంతా సిద్ధం

వేదికను పరిశీలిస్తున్న గజల్ శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, పీఆర్ రాజు తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గుంటూరు ఏటుకూరు బైపాస్ రోడ్డులోని శ్రీసత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ ప్రాంగణంలో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో జరగనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు అంతా సిద్ధమైంది. దాదాపు ఆరు వేల మంది కూర్చుని కార్యక్రమాలను చూసేందుకు వీలుగా ప్రధాన వేదికను రూపొందించారు. దీంతో పాటు మరో నాలుగు వేదికలు సిద్ధమయ్యాయి. సభలకు వచ్చేవారి కోసం భోజన వసతి, వివిధ అంగళ్లు, ప్రదర్శనశాలల నిర్మాణాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. సాహిత్య, సాంస్కృతిక, కళాంశాల ఆస్వాదనకు ప్రేక్షకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగినన్ని ఏర్పాట్లు, నిర్వహణలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఇది తెలుగు చేవ అని ప్రపంచానికి తెలియజెప్పేలా కార్యక్రమాలను రూపకల్పన చేశామని పేర్కొన్నారు.

సుక్కేసి.. సిందేసి..!

☛ ఒక్కరోజే... రూ.37.18 కోట్ల మద్యం తాగారు

☛ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఏరులై పారిన మందు

ఈనాడు, అమరావతి

నూతన సంవత్సర వేడుకల్లో మద్యం ఏరులై పారింది. ఊరూవాడా అన్ని వర్గాలు హుషారుగా కొత్త సంవత్సరాదికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు చోట్ల పార్టీల్లో మద్యం బాబులు సందడి చేశారు. నూతన సంవత్సర సంబరాలు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మిన్నంటాయి. కాలనీలు, అపార్ట్‌మెంట్లలోనూ హంగామా చేశారు. విజయవాడ నగరంలో జోష్ ఎక్కువగా కనిపించింది. అర్ధరాత్రి వరకు చిందులేశారు. డిసెంబరు 31న మద్యం అమ్మకాలు ఎగబాకాయి. మామూలు రోజులతో పోలిస్తే దాదాపు రెట్టింపు తాగారు. మద్యం దుకాణాలు, బార్లలో భారీగా మద్యం విక్రయాలు సాగాయి. ఒక్క రోజే రెండు జిల్లాల వాసులు మద్యం కోసం రూ.37 కోట్లు ఖర్చు పెట్టారు.

☛ నూతన సంవత్సరం సందర్భంగా రెండు జిల్లాలో పలు చోట్ల వేడుకలు నిర్వహించారు. పలు సంస్థల ఆధ్వర్యంలో ఇవి జరిగాయి. వీటికి పోలీసుల నుంచి అనుమతి ఇచ్చారు. మద్యం వినియోగించే ఉత్సవాలకు ఎక్సైజ్ అధికారులు నుంచి కూడా అనుమతి తీసుకున్నారు. అర్ధరాత్రి వరకు మద్యం ఏరులై పారింది. ఉత్సవాలలోనే కాకుండా మిగిలినచోట్ల కూడా మందు బాబుల సందడి కనిపించింది.

➠ ఎన్టీఆర్ జిల్లాలో 86 బార్లు, 124 మద్యం దుకాణాలు ఉన్నాయి. కృష్ణాలో 32 బార్లు, 135 దుకాణాలు ఉన్నాయి. ఇవి అర్ధరాత్రి 12 గంటల వరకు తెరిచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో అమ్మకాలు భారీగా నమోదయ్యాయి. రోజు వారీ అమ్మకాల కంటే సుమారు రెట్టింపు స్థాయిలో జరిగాయి. రెండు జిల్లాల్లో కలిపి బీర్లు 15,825 కేసులు, ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎల్) 38,434 కేసులు అమ్ముడయ్యాయి. వీటి విలువ రూ.37.18 కోట్లు. సాయంత్రం నుంచే దుకాణాల వద్ద పెద్ద క్యూలు కనిపించాయి. పోలీసులు వివిధ ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. విజయవాడ నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పలువురిని అదుపులోకి తీసుకుని వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

నేటి నుంచి నాలుగో విడత రీసర్వే ప్రారంభం

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 66 గ్రామాల్లో ఈ నెల 2 నుంచి నాలుగో విడత రీసర్వే ప్రారంభించనున్నట్టు సర్వే, భూమి రికార్డుల విభాగం ఓ ప్రకటనలో తెలిపింది. మచిలీపట్నం డివిజన్ పరిధిలోని 37, ఉయ్యూరు 17, గుడివాడ 12 గ్రామాల్లో సర్వే ప్రారంభం కానుంది. సంబంధిత గ్రామాల రైతులు తమ డాక్యుమెంట్లతో హాజరై భూములను సర్వే చేయించుకోవాలని సూచించారు.

నేటి నుంచే కొత్త పాసుపుస్తకాల పంపిణీ

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం- న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

భూ సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో రీసర్వే నిర్వహించింది. వివాదాల పరిష్కారం అనంతరం నిర్దేశించిన రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయడానికి రంగం సిద్ధమైంది. శుక్రవారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వైకాపా రంగులు.. జగన్ చిత్రాలతో పట్టదారు పాసుపుస్తకాన్ని గత సర్కారు భ్రష్టు పట్టించింది. ఇందుకు భిన్నంగా రాజకీయ పార్టీల రంగులు.. నాయకుల చిత్రాలు లేకుండా రాజముద్రతో 'రైతుల, రైతుకూలీల క్షేమం- ప్రభుత్వ ధ్యేయం' నినాదంతో పుస్తకాలను కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

176 గ్రామాలకు సరఫరా

జిల్లాలోని 19 మండలాల్లో 176 గ్రామాలకు సంబంధించి 82,210 పాసుపుస్తకాలు పంపిణీ చేయడానికి రెవెన్యూ యంత్రాంగం సిద్ధమైంది. గ్రామ సభలు నిర్వహించి జనవరి 2 నుంచి 9 వరకు విడతల వారీగా రైతులకు అందజేయనున్నారు. సుమారు పది నెలలుగా పాసుపుస్తకాలు లేక రుణాలు, క్రయవిక్రయాల విషయంలో ఇబ్బంది పడుతున్న రైతులకు ఊరట లభించనుంది.

రెవెన్యూ డివిజన్	గ్రామాలు	పుస్తకాలు
మచిలీపట్నం	25	10,676
ఉయ్యూరు	34	15,463
గుడివాడ	117	56,071



కొత్త పట్టాదారు పాసుపుస్తకం

ఏర్పాట్లు చేశాం: జేసీ నవీన్

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జనవరి 2 నుంచి గ్రామసభలు నిర్వహించి కొత్త పాసుపుస్తకాలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. వీటి విషయంలో రైతులకు ఎలాంటి సమస్యలున్నా గ్రామసభల్లో అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ఎనలేని స్వేచ్ఛ

రహదారి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మోదుమూడి(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం చేసిన విధ్వంసకర పాలనకు నిలువెత్తు సాక్షీభూతంగా మోదుమూడి ప్రధాన రహదారి నిలుస్తోందని, నడకే నరక ప్రాయంగా ఉందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పల్లె పండగ 2.0 కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ నిధులు రూ.91 లక్షలతో రహదారి అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రజలు స్వేచ్ఛ కోల్పోయారన్నారు. ప్రజా ప్రతినిధులకు సైతం సమస్యలు చెప్పే స్వేచ్ఛ కూడా లేకపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్వేచ్ఛగా ప్రజలు ఉన్నారని, ధైర్యంగా ప్రజాప్రతినిధులను సమస్యలపై అడుగుతున్నారని, ప్రజాప్రతినిధిగా వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత తనపై ఉందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో పల్లెల అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని, అందుకు పంచాయతీ గ్రామీణాభివృద్ధి మంత్రిగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉండటమేనని చెప్పారు. సర్పంచి బచ్చు బేబీ, ఎంపీపీ తుంగల సుమతి, వసంతకుమార్, బచ్చు రఘునాథ్, గుడివాక శేషుబాబు, వెంకటనాథ్, అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై 3న సహజ రైతు సదస్సు

విజయవాడ(భవానీపురం): సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు ఈనెల 3న 'సహజ రైతు సదస్సు'ను విజయవాడలోని వెన్యూ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి పేర్కొన్నారు. గురువారం విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు అధికంగా ఎరువులు, పురుగు మందులపై ఆధారపడడం వల్ల ఖర్చులు పెరగడంతో పాటు నేల సారం తగ్గి ఆరోగ్య సమస్యలు పెరిగాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనేక పథకాల ద్వారా రైతులను రసాయన రహిత సాగు వైపు ప్రోత్సహిస్తుందని తెలిపారు. రైతులకు శిక్షణ, సర్టిఫికేషన్, మార్కెట్‌కు అనుసంధానం చేయడం, ఉత్పత్తులకు మంచి ధర వచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

(c) eenadu

కళల వెలుగు.. కలల గెలుపు

కళాపీఠంలో తొలి ఏడాదే 125 మంది ప్రవేశం

కూచిపూడి, న్యూస్‌టుడే

రాజమహేంద్రవరంలోని తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కూచిపూడి కళాపీఠంలో ప్రారంభమైన నాట్య శిక్షణకు విశేష స్పందన వచ్చింది. మొదటి ఏడాదే 125 మంది వివిధ కోర్సులు నేర్చుకునేందుకు చేరారు. కళాపీఠం ప్రధానాచార్యులు డాక్టర్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపల్‌గా డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఏలేశ్వరపు శ్రీనివాసులు పనిచేస్తున్నారు.

కూచిపూడి నాట్యంలో శిక్షణ ఇస్తున్న కళాపీఠం వైస్ ప్రిన్సిపల్ బిస్మిల్లాఖాన్ యువపురస్కార గ్రహీత డాక్టర్ చింతా రవిబాలకృష్ణ

ప్రారంభించిన కోర్సులు
- నాలుగేళ్ల సర్టిఫికెట్
- రెండేళ్ల డిప్లొమా
- యక్షగానంలో ఏడాది
- సాత్వికాభినయంలో ఏడాది
- రెండేళ్ల మాస్టర్ ఇన్ పెర్ఫార్మెన్స్ ఆర్ట్స్

సాత్వికాభినయంలో మెరుగుదల కోసం..

నాకు 58 సంవత్సరాలు. కూచిపూడిలో యక్షగానం, సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులు చేశాను. హైదరాబాదు విశ్వవిద్యాలయంలో ఎంపీఏ కూచిపూడి చేశా. ఇప్పటికి దాదాపు మూడు వేల నాట్య ప్రదర్శనల్లో పాల్గొన్నా. 18 సంవత్సరాలుగా గద్వాల్‌లో కూచిపూడి నాట్యంలో ఎందరికో శిక్షణ ఇచ్చా. కూచిపూడిలో సాత్వికాభినయం చేయాలని వచ్చి శిక్షణ పొందుతున్నా. – డాక్టర్ ఏలేశ్వరపు వెంకటేశ్వర్లు(గద్వాల్)

కూచిపూడిలో రాణించాలని..

కూచిపూడిలో సర్టిఫికెట్, డిప్లొమాలో శిక్షణ పూర్తి చేసుకున్నా. బీఏ వరకు చదువుకున్న నేను గత 11 సంవత్సరాలుగా తణుకులో నృత్యపాఠశాలను ఏర్పాటు చేసుకుని శిక్షణ ఇస్తున్నా. ఆంధ్రప్రదేశ్‌గా విడిపోయిన తరువాత ఏర్పాటైన తెలుగు విశ్వవిద్యాలయం తొలి బ్యాచ్‌లో ఎంపీఏ కూచిపూడి విద్యార్థిగా చేరడం సంతోషంగా ఉంది. – జి.బ్రాహ్మిణి(తణుకు)

పీహెచ్‌డీ చేస్తా

బీఎస్సీ కంప్యూటర్ వరకూ చదువుకున్నా. గుంటూరులో కూచిపూడి సర్టిఫికెట్ కోర్సు చేశా. నాట్యం పుట్టిన ప్రదేశంలో నేర్చుకోవాలని తెలుసుకుని వచ్చి ఎంపీఏ కోర్సు చేస్తున్నా. కూచిపూడిలో సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని రానున్న తరాలకు పరిచయం చేయాలన్నది నా సంకల్పం. కూచిపూడి నాట్యంలో పీహెచ్‌డీ చేస్తా. – బి.హర్షిత(చీరాల)

ఇక్కడే శిక్షణ పొందాలని..

అమ్మా, నాన్న పొలం పనులు చేసుకుని జీవిస్తుంటారు. ఇంటర్ పూర్తవగానే కూచిపూడిలో శిక్షణ పొందాలని అనుకున్నా. అమ్మా, నాన్నలు కూడా సహకరించారు. దీంతో హైదరాబాద్‌లో సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ పొందా. నాట్యం పుట్టిన కూచిపూడిలోనే శిక్షణ పొందాలని వచ్చి ఎంపీఏ చేస్తున్నా. పీహెచ్‌డీ కూడా చేయాలని ఉంది. – ఎం.భార్గవి(హైదరాబాద్)

సాగు విభిన్నం.. దీర్ఘకాలిక ఆదాయం!

కూచిపూడి, న్యూస్‌టుడే

కొబ్బరి, వక్క, పనసలో అంతర పంటగా మినుము సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు.. మొవ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామానికి చెందిన



చలసాని శరత్ అనే రైతు. సినీ నిర్మాతైన ఆయన.. వ్యవసాయంపై ఉన్న మక్కువతో పమిడిముక్కల మండలం ఐనంపూడిలో తనకు ఉన్న మెరక మాగాణి 9.5 ఎకరాల్లో గతంలో వరి, చెరకు, కరివేపాకు సాగు చేసేవారు. దీర్ఘకాలిక ఆదాయం వచ్చే పంటలు వేయాలన్న ఆలోచనతో తమిళనాడు నుంచి రామ్‌గంగ రకం కొబ్బరి మొక్కలు తెచ్చి ఎకరాకు 60 చొప్పున నాటారు. అలాగే జే33 రకం పనస మొక్కలు 60 చొప్పున 27 అడుగులకు ఒకటి నాటారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల

కొబ్బరి, వక్క పంటలో అంతర పంటగా మినుము

నుంచి వక్క మొక్కలు తెచ్చి.. ఎకరాకు 35 చొప్పున 5.5 ఎకరాల్లో నాటారు. మరో 4 ఎకరాల్లో చిరంజీవి కొబ్బరి రకం, వియత్నా సూపర్ ఎర్లీ పనస, వక్క మొక్కలు నాటారు. అంతర పంటగా వేసిన మినుము ద్వారా గత రెండేళ్లలో మంచి దిగుబడి సాధించారు. ఎకరానికి 7 నుంచి 8 బస్తాలు వచ్చాయి. ఏడాదికి రూ.5 లక్షలపైనే ఆదాయం పొందారు. ఈ ఏడాది కొత్తగా వంబన్ 11 మినుము రకం వేశారు. 'బిందు సేద్యం ద్వారా రోజూ 2 గంటల పాటు తోటను తడుపుతా. మొక్కలు నాటి జనవరికి మూడేళ్లవుతుంది. ఇప్పుడిప్పుడే ప్రధాన పంటల దిగుబడి వస్తోంది. పనస కాయలు కిలో రూ.70 చొప్పున, కొబ్బరి బొండాలు ఒకటి రూ.20 చొప్పున తొలిగా అమ్మా. కనీసం 60 ఏళ్ల వరకు కొబ్బరి, పనస, వక్క పంటల్లో ఎకరానికి ఏడాదికి రూ.2 లక్షలకు పైగా ఆదాయం లభిస్తుందనుకుంటున్నా. ఎకరాకు ఇప్పటికి రూ.1.50 లక్షలు పెట్టుబడి అయ్యింది'అని రైతు చలసాని శరత్ తెలిపారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మెట్ట ప్రాంతంలో రబీ పంటగా రైతులు మొక్కజొన్న సాగుచేస్తున్నారు. ప్రస్తుతం ఈ పంటకు కత్తెర పురుగు ఆశించింది. నివారణకు గరికపాడు కేవీకే శాస్త్రవేత్త వెంకటరెడ్డి పలు సూచనలు చేశారు. కత్తెర పురుగు ముఖంపై వై ఆకారంలో చార ఉంటుంది. ఇవి మొదటి దశలో గొంగళి పురుగులు ఆకులపై పత్ర హరితాన్ని గోకి తింటాయి. పురుగు పెరిగే కొద్దీ ఆకులను సైతం తింటుంది. అనంతరం ఆకుల సుడులు, కాండాన్ని తొలిచి రంధ్రాలు చేసి పంటను నష్టపరుస్తుంది. **నివారణ ఇలా..** ఈ పురుగు గుడ్లను గమనించిన వెంటనే ఎకరానికి లీటరు వేపనూనె, 5శాతం వేపగింజల కషాయం పిచికారీ చేయాలి. తొలి దశలో పురుగుల నివారణకు ఎకరానికి 500 మి.లీ. క్లోరిఫైరిఫాస్ పిచికారీ చేయాలి. గొంగలి పురుగుల ఉధృతి అధికంగా ఉంటే ఎమామెక్టిన్ బెంజోయేట్ 5ఎస్‌జీ 80 గ్రా మందును సుడులు, మొవ్వ లోపలి ఆకులు తడిచేలా పిచికారీ చేయాలి. ఎదిగిన గొంగళి పురుగుల నివారణకు పది కిలోల తవుడు, రెండు కిలోల బెల్లం, రెండు లీటర్ల నీటిలో కలిపి 24 గంటల పాటు పులియబెట్టి ఆ మిశ్రమానికి 100 గ్రాముల థయోడికార్బ్ మందును కలిపి సాయంత్రం వేళల్లో సుడులు, మొవ్వలో వేయాలి. పురుగు ఉధృతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఎకరానికి అయిదు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. పురుగుల గుడ్లను ఏరించి నాశనం చేయాలి.

రైతేరాజు



ప్రశ్న: టమాటాలో పచ్చదోమ నివారణ, స్పాటెట్ విల్ట్ వైరస్ గురించి వివరించండి? -కె.రామారావు, కొడాలి, -కె.శ్రీరాములు, చినకళ్లేపల్లి.

సమాధానం: పచ్చదోమ సోకిన తోటలో టామాటా ఆకుల అడుగుభాగం నుంచి రసం పీల్చడం ద్వారా చివర్లు పసుపు పచ్చగా మారి క్రమేపీ ఎర్రబడి చివరగా ఆకులు ముడుచుకు పోయి.. దోనె లాగా కనిపిస్తాయి. నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ 2 మి.లీ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ☛ టమాటా పంటలో చిగురాకుల పైభాగంలో ఈనెలు గోధుమ వర్ణంలోకి మారి, ఆకులు మీద పసుపు రంగు మచ్చలు ఏర్పడి, మాడిపోతాయి. మొక్కలు గిడసబారి, పూత పిందె పట్టక ఎండిపోతాయి. మొక్కలు గిడసబారి. పూత పిందె పట్టక ఎండిపోతాయి. దీని నివారణకు తెగులు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి. స్పాటెట్ విల్ట్ వైరస్‌ను వ్యాప్తి చెందించే తామర పురుగుల నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్-డెమటాన్ 2మి.లీ.లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నారుమడిలో 250 గ్రాములు, నాటిన 10వరోజున ఎకరానికి 10 కిలోల కార్బొఫ్యూరాన్ 3జీ గుళికలు వేయాలి. - వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషివిజ్ఞానకేంద్రం, ఘంటసాల.

- న్యూస్‌టుడే, ఘంటసాల

ప్రజాచైతన్యంతో రహదారి ప్రమాదాల నివారణ

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రజలకు రహదారి భద్రత గురించి పరిపూర్ణ అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను సూచించారు. 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు భద్రతా మాసోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. రహదారి భద్రత పట్ల వాహన చోదకుల్లో చైతన్యం కల్పిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ఆ దిశగా వివిధ రూపాల్లో ప్రజలను చైతన్యపరిచేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వాహన డీలర్లు, లారీ యజమానుల సంఘం, డ్రైవర్ శిక్షణ కేంద్ర నిర్వాహకులను భాగస్వాములను చేసి విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా రవాణా అధికారి శ్రీనివాసరావు, డీటీవో వెంకటేశ్వర్లు, ఎంవీఐలు సిద్దిక్, నాని, నారాయణస్వామి, సంగీతరావు, ఏఎంవీఐ సౌందర్య పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బాలాజీ, రవాణాశాఖ అధికారులు

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడే ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు ఆవిష్కరించారు. ఎస్టీయూ రాష్ట్ర కమిటీ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను డీఈవో కార్యాలయంలో గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పది ఫలితాల్లో జిల్లాను టాప్ ఫైవ్‌లో ఉంచేలా కృషి చేయాలని కోరారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ఇమ్మానియేల్, యువీ కృష్ణమూర్తి మాట్లాడుతూ గత ఏడాది ఎస్టీయూ తొలి ప్రయత్నంగా విడుదల చేసిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఉపయోగపడడంతోపాటు పరీక్షల్లో ఘన విజయానికి దోహదపడిందన్నారు. ఆ స్ఫూర్తితో ఈ ఏడాది రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కోరారు. ఎస్టీయూ నాయకులు చంద్రశేఖర్, ప్రసాద్, మాధవరావు, కిరణ్‌బాబు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో, సంఘ నాయకులు

పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: విద్యార్థులు చదువే ప్రధానంగా భావించి క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ డీకే బాలాజీ ఆకాంక్షించారు. నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కృష్ణ సంకల్పం పేరుతో వినూత్నంగా సంక్షేమ వసతిగృహ విద్యార్థులకు బల్లలు, బాలికలకు శానిటరీ నాప్కిన్‌లు, ముస్తాబు కిట్లు, ఉద్యోగులకు పదోన్నతులతో పాటు కారుణ్య నియామకపత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సంవత్సరం బొకేలు, దండలు, పండ్లు, మిఠాయిలు వంటివి కాకుండా విదార్థులకు ఉపయోగపడే పుస్తకాలు తదితరాలు అందచేయడం అభినందనీయమన్నారు. ప్రయోజనం లేని చర్యలకన్నా నలుగురికి ఉపయోగపడేలా కృష్ణ సంకల్పం పేరుతో చేపట్టిన కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం నుంచి వచ్చిన స్పందన ప్రశంసనీయమన్నారు. విద్యార్థులు చరవాణి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. తన ఐఏఎస్ బ్యాచ్‌మేట్లు బాలగురు, వీరపాండ్యన్‌లు ఎన్ని బాధలు ఎదుర్కొని ఉన్నత స్థాయి చేరుకున్నారో తెలుపుతూ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.30 లక్షల విలువ చేసే గల్ఫర్ యంత్ర వాహనాల మంజూరు పత్రాలను ముగ్గురు లబ్ధిదారులకు అందచేశారు. రెవెన్యూ, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖలు, వ్యవసాయ, వైద్యారోగ్య శాఖల్లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులకు సర్వీస్ క్రమబద్ధీకరణ, వార్షిక ఇంక్రిమెంట్లు, ఇంక్రిమెంట్ బకాయిలు, వేతన నిర్ధారణకు సంబంధించిన మంజూరు పత్రాలను ప్రదానం చేశారు. పది మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు ఇచ్చారు. సహాయ కలెక్టర్ ఫర్హీన్‌జాహిద్, డీఆర్వో చంద్రశేఖరరావు, ఎస్సీ సంక్షేమశాఖాధికారి షాహిద్‌బాబు, బీసీ సంక్షేమాధికారి రమేష్ తదితరులతో పాటు వసతిగృహ సంక్షేమాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య వర్సిటీలో సౌర విద్యుత్తు యూనిట్‌కు సాయం

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: సామాజిక బాధ్యతగా బ్యాంకు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్‌రావు అన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సోలార్ పవర్ యూనిట్ ఏర్పాటుకు కెనరా బ్యాంకు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.40 లక్షలు సాయం అందించింది. గురువారం కెనరా బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.రత్నాకరరావు చెక్కును వీసీ చంద్రశేఖర్‌రావుకు అందజేశారు. వీసీ మాట్లాడుతూ సోలార్ పవర్ యూనిట్‌ను ఏర్పాటు చేయడంతో 100 కిలోవాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. కొవిడ్ కష్టకాలంలో ఎన్నో కార్పొరేట్ సంస్థలు ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, మందులు, మాస్కులు, శానిటైజర్లు ప్రభుత్వానికి అందజేసే సామాజిక బాధ్యతను చాటుకున్నాయన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి మాట్లాడుతూ కొత్త ఏడాదిలో ప్రతి ఒక్కరూ కొత్త మార్పును కోరుకుంటున్నారని, ఆరోగ్యంగా ఉండేదుకు జాగ్రత్తలు తీసుకోవాలని, మంచి అలవాట్లపై దృష్టి పెట్టాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ శ్రీహరి, సైకియాట్రిస్ట్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ సూర్యప్రభ, పబ్లికేషన్స్ డైరెక్టర్ డాక్టర్ సుధ పాల్గొన్నారు.

వీసీకి చెక్కు అందజేస్తున్న కెనరా బ్యాంకు డీజీఎం రత్నాకరరావు తదితరులు

బడుగుల సంక్షేమ నామ సంవత్సరం మొదలైంది

మాట్లాడుతున్న బాలకోటయ్య

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సూపర్-6 పథకాల అమలుతో పాటు బడుగుల ఉపాధి, అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలకు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారని.. బడుగుల సంక్షేమ నామ సంవత్సర మొదలైందని ఆంధ్రప్రదేశ్ సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని 4,400 మంది ఎస్సీ లబ్ధిదారులకు రూ.63.2 కోట్లు విడుదల చేశారన్నారు. గురువారం విజయవాడ ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని దాదాపు 56 ఎస్సీ ఉపకులాల జీవనోపాధికి ఒక్కొక్కరికి రూ.50 వేల సబ్సిడీతో రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. బేకరీ దుకాణాలు, మొబైల్ షాపులు, టిఫిన్ సెంటర్లు, ఫుడ్ స్టాల్స్, ఆర్గానిక్ ఉత్పత్తులు, బిస్కెట్ తయారీ, జీడిపప్పు వ్యాపారం, డెయిరీ, ఇటుక బట్టీలు వంటి 56 యూనిట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీటితో పాటు గత ప్రభుత్వాల కాలంలో రుణాలు తీసుకుని వడ్డీభారం మోయలేక ఇబ్బందులు పడుతున్న 11,478 మంది ఎస్సీ లబ్ధిదారులకు వడ్డీ రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వంలో జీవో విడుదల చేశారని తెలిపారు. గతంలో రాష్ట్రంలో సంక్షేమం అనే పదం వినిపించేది కాదని, ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేయడం ద్వారా బడుగులపై ప్రభుత్వం తన బాధ్యత చాటుకుందని బాలకోటయ్య పేర్కొన్నారు. సమావేశంలో పేరం భుజంగరావు, మామిడి సత్యం తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిగా శ్రీకాంత్

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నూతన పరీక్షల నియంత్రణాధికారిగా తిరుపతి స్విమ్స్ అనాటమీ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఐదేళ్లుగా పరీక్షల నియంత్రణాధికారి పనిచేసిన డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు డిసెంబరు 31వ తేదీతో గడువు ముగిసిన విషయం విదితమే. ఆయన సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫిజియాలజీ ప్రొఫెసర్‌గా చేరారు.

డ్రెయిన్‌పై గోదామును పరిశీలించిన అధికారులు

పెడన, న్యూస్‌టుడే: 'డ్రెయిన్ ఆక్రమించి.. గోదాము నిర్మించి' శీర్షికన గత నెల 29న ఈనాడులో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. [illegible] డీఈఈ నారాయణరావు, పెడన సెక్షన్ ఏఈఈ [illegible] బుధవారం [illegible] రోడ్డులో గోదాము నిర్మించిన ప్రాంతాన్ని సందర్శించి [illegible] వివరాలు తీసుకున్నారు. గోదాము నిర్మించిన స్థలం [illegible] నిర్ధారణకు మండల సర్వేయర్‌తో సర్వే చేయించాలని తహసీల్దార్‌కు సూచించామని ఏఈఈ చెప్పారు. నివేదిక అందాక తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బైక్ పైనుంచి పడి వృద్ధురాలి మృతి

పెడన, న్యూస్‌టుడే: బైక్ పైనుంచి జారి పడి వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం [illegible] మండలం [illegible]కు చెందిన [illegible](65) బుధవారం తమ పెద్ద కుమారుడు [illegible]తో కలిసి బైక్‌పై పెడన వచ్చారు. తిరుగు ప్రయాణంలో [illegible] వంతెనపై కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి వృద్ధురాలు కింద పడి స్పృహ కోల్పోయారు. ఆమెను మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహానికి పెడన పోలీసులు గురువారం పంచనామా నిర్వహించిన అనంతరం పోస్ట్‌మార్టానికి తరలించారు. కేసును ఏఎస్సై లక్ష్మణరావు దర్యాప్తు చేస్తున్నారు.

జూద శిబిరంపై దాడి.. రూ.2.20 లక్షలు స్వాధీనం

కోడూరు, న్యూస్‌టుడే: కోడూరు శివారు యర్రారెడ్డిపాలెంలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై గురువారం తెల్లవారుజామున విశ్వసనీయ సమాచారం మేరకు కోడూరు ఎస్సై కె.చాణక్య తన సిబ్బందితో దాడిచేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,20,780 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుడివాడ ప్రాంతంలో 26 మంది అరెస్టు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ, మండలంలోని బిళ్లపాడు, మల్లాయపాలెం గ్రామాలలో బహిరంగ ప్రదేశాలలో జూదం ఆడుతున్న 26 మందిని పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.55,570 స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాగాయలంక, న్యూస్‌టుడే: మండలంలోని పర్రచివర శివారు దీనదయాళపురం గ్రామంలో గురువారం కోడి పందాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై కె.రాజేష్ ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని రూ.4,970 నగదు, ఒక కోడి పుంజు స్వాధీనం చేసుకున్నారు.

అరటిలో సస్యరక్షణ చర్యలు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే

అరటి తోటలు సాగుచేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని ఉద్యానశాఖాధికారిణి మానస తెలిపారు.

నులి పురుగులు(నిమటోడాలు): ఇవి ఆశిస్తే వేర్లు, దుంప బలహీనపడి.. నీరు, పోషకాలను మొక్క సరిగా తీసుకోలేదు. [illegible] ఆకులు అంచులు నల్లగా మారి క్రమేపీ ఎండిపోతాయి. నివారణకు పిలకల దుంపపై చర్మం పలుచగా చెక్కిన తర్వాత ద్రావణం([illegible] లీటరు నీటిలో కలిపి)లో 15 నిమిషాలు ముంచి ఉంచాలి. అనంతరం నాటుకోవాలి. పిలకలు నాటే గుంతలోని మట్టిలో అరకిలో వేపపిండి కలపాలి. నులి పురుగులు ఆశించిన మొక్కలకు 40 గ్రా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు మొదలు వద్ద లోతుగా వేసి మట్టితో కప్పి నీరుపెట్టాలి.

దుంప పుచ్చు: ఈ పురుగు దుంపను తొలిచి నష్టం కలిగిస్తుంది. [illegible] నివారణకు పిలకలను [illegible] 25 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు మొదలు వద్ద లోతుగా వేసి మట్టితో కప్పి నీరు పెట్టాలి.

తెగులు సోకిన మొక్క

దుంప తెగులు

పనామా తెగులు: ఈ తెగులు విత్తన పిలకలు, మట్టి ద్వారా వ్యాపిస్తుంది. అమృతపాణి రకం ఈ తెగులును ఏ మాత్రం తట్టుకోలేదు. సోకిన మొక్కల ఆకులు కింద నుంచి పైకి పసుపు వర్ణంలోకి మారి ఎండిపోతాయి. [illegible] ఈ తెగులును రసాయన మందుల ద్వారా నివారించడం సాధ్యపడదు. కనుక ఈ తెగులును తట్టుకునే రకాలను మాత్రమే రైతులు సాగు చేయాలి.

దేశం సమగ్రాభివృద్ధి చెందాలి

పటమట పటమట దత్తపీఠంలో గురువారం మైసూర్ దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ సమక్షంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామీజీ ఆశీస్సులు అందుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. 2026 సంవత్సరం అందరికీ మంచి ఫలితాలు ఇవ్వాలని, దేశం సమగ్రాభివృద్ధి చెందాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గురువారం నుంచి ఈ నెల 10 వరకు ప్రతి రోజూ శ్రీచక్ర పూజ, భాగవత సప్తాహం ప్రవచనాలు నిర్వహిస్తారని కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

అభయుడికి పూజలు

పెదముత్తేవి శ్రీ అభయ వీరాంజనేయ స్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా ధనుర్మాస మహావ్రతంలో భాగంగా స్వామి వారికి 108 వడమాలలు, పుష్పమాలలు, హనుమాన్ చాలీసా పారాయణ అత్యంత వైభవోపేతంగా చేశారు. మహాపీఠాధిపతి గౌరకృష్ణ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. - పెదముత్తేవి (కూచిపూడి), న్యూస్‌టుడే

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ మండల విద్యాశాఖ అధికారులు సీహెచ్.రజిని, బి.బాలాజీలు యూటీఎఫ్ డైరీని గురువారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు నీలం ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు మీరా హుస్సేన్, ప్రధాన కార్యదర్శి కె.సతీష్ కుమార్, సహాధ్యక్షుడు ఎండీ.హుస్సేన్ పాషా, నాయకులు వి.మురళీకృష్ణ, కె.లోలాక్షి, అమ్మన్న, కె.పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణలో రజినీ, బాలాజీ

ట్రాఫిక్ ఉల్లంఘనలు 4.68 లక్షలు

ఏడాది నివేదిక విడుదల

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

ట్రా'ఫికర్' అంటేనే బెజవాడ అంటారు. పండుగలు, వేడుకలు వచ్చాయంటే సాయంత్రం వేళ రహదారులన్నీ కిక్కిరిసిపోతాయి. అడుగుతీసి ముందుకు వేయాలంటే పాదచారి అష్టకష్టాలు పడాల్సిందే. ఇక ట్రాఫిక్‌ను దాటి వాహనం ముందుకు కదలాలంటే.. వ్యవప్రయాసలు తప్పవు. నిబంధనల ఉల్లంఘనలు సైతం అధికంగానే ఉంటున్నాయి. ఒకప్పుడు నిబంధన ఉల్లంఘిస్తే పట్టుకుని కేసు రాసేవారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో వచ్చిన తర్వాత ఫొటోలు తీసి 'ఈ-చలాన్' విధిస్తున్నారు. వీటికి సంబంధించిన 2025 ఏడాది నివేదికను అధికారులు వెల్లడించారు.

ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో 2025 సంవత్సరంలో 54 రకాల ఉల్లంఘనలపై కేసులు నమోదు చేశారు. ద్విచక్రవాహనాలు, కార్లు, హెవీ వెహికల్స్ (బస్సులు, లారీలు)పై వేర్వేరుగా ఈ ఉల్లంఘనలు గుర్తించి వాటిపై ఈ-చలాన్‌లు విధించారు.

శిరస్త్రాణం లేని కేసులే ఎక్కువ

నమోదు చేసిన మొత్తం కేసుల్లో శిరస్త్రాణం లేకుండా ద్విచక్రవాహనం నడిపిన కేసులే ఎక్కువగా ఉన్నాయి. ఆ తర్వాతి స్థానం నో డ్రైవింగ్ లైసెన్సు. మూడో స్థానంలో నంబరు ప్లేటు సక్రమంగా లేని కేసులే.

- ☛ ఈ-చలాన్‌ల సంఖ్య : 4,68,456
- ☛ చోదకులు కట్టినవి : 3,16,422
- ☛ జరిమానా : రూ.13,62,74,400
- ☛ వసూలైనవి : రూ.7,42,35,250

వివరం	చలానాలు	జరిమానా రూ.
శిరస్త్రాణం	1,25,285	7,78,15,400
డీఎల్, ఆర్సీ	49,183	75,46,050
నంబరు ప్లేటు లేనివి	23,487	34,42,550
ప్రమాదకర డ్రైవింగ్	9,242	92,42,000
బీమా లేకుండా	2,969	33,34,000
శబ్ద, వాయు కాలుష్యం	2,851	30,52,000
మైనర్ డ్రైవింగ్	1,660	20,22,500
నో ఎంట్రీ, నో పార్కింగ్	1,654	1,66,200
సీటు బెల్టు లేకపోవడం	132	1,32,000

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -147 రిటైల్ ధర 174 చికెన్ విత్ స్కిన్ - 252, చికెన్ స్కిన్‌లెస్ - 287.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 167, 176, 187 చికెన్ విత్ స్కిన్ - 324 చికెన్ స్కిన్‌లెస్ - 334.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం కొనబడును.బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును స్పాట్‌క్యాష్. ✆ 81422 92071

REAL ESTATE

HOUSE FOR SALE

బందరురోడ్డులో తుర్లపాటి కుటుంబరావు వీధిలో సెమీ కమర్షియల్ 209గ. స్థలంలో 3 ఫ్లోర్లు గల బిల్డింగ్ ఈస్ట్ ఫేసింగ్ అమ్మకానికి కలదు. నో బ్రోకర్స్. సంప్ర. ✆ 98481 93191

PLOT FOR SALE

ఠి.జి. శ్రీ కంచికచర్ల దగ్గర- చెవిటికల్లు రోడ్డులో- HYD హైవేకి 500మీ|| పరిటాల రైల్వేహాట్‌కి, ఐకాన్ బ్రిడ్జికి దగ్గరలో CRDA ప్లాట్లు. లోన్ కలదు. ✆78427 58859

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

JOBS

Wanted Telecallers for Gates Institute of Management & Sciences, VJA. Qual: Inter / Degree. Contact: ✆ 86449 93322

Wanted Female Telecallers / Data Entry/ Freshers / Experience / Any Graduate. Salary: 10K to18K Timing: 9.30 to 6.30 ✆ 99080 98305.

Wanted Telecallers for University Office in Vijayawada. Eligibility Degree/ B.Tech, Age: 18- 25 Years (Only). ✆ 77027 54944

ఫ్యాక్టరీ మార్కెటింగ్ ఆఫీస్ నందు అసిస్టెంట్‌గా పనిచేయుటకు ఇంటర్/ డిగ్రీ/ డిప్లొమా ఉన్నవారు క్రింది వాట్సాప్ నెంబరుకు మీ బయోడేటా పంపగలను. ఉద్యోగం అత్యవసరం ఉన్నవారు వ్యక్తిగతంగా హాజరు కాగలరు. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. లోకేష్ ఇండస్ట్రీస్, VJA . ✆ 94935 79226

విజయవాడ సిటీ, ఆటోనగర్, కానూరు ఏరియాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ అర్జెంటుగా కావలెను. మంచి జీతం. 85004 05004, 89854 22255.

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డులు & హెల్పర్లు కావలెను. విజయవాడ MG రోడ్‌లో ప్రముఖ షోరూమ్‌లో పనిచేయుటకు. జీతము గార్డ్స్‌కు 15,000/- & హెల్పర్లుకు 12,000/-. ఇతర సదుపాయాలు కలవు. ✆ 80994 44758 / 96401 48367.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

(c) eenadu

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

ముగ్గుల పోటీలు

బంటుమిల్లి : బంటుమిల్లిలోని కొమ్మారెడ్డి హైస్కూల్‌లో విద్యార్థులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు రంగులతో ముగ్గులను తీర్చిదిద్దారు. విద్యార్థులు కె.గీతికగణశ్రీజ, లక్ష్మీ చరిత, లక్ష్మీ ప్రసన్నలు గెలుపొందారు. పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, శోభ తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు

టమాట 46, వంగ 20, బెండ 36, పచ్చిమిర్చి 36, కాకర 50, క్యాబేజీ 22, క్యారెట్ 36, దొండ 37, బంగాళాదుంప 24, ఉల్లిపాయలు 28, గోరుచిక్కుడు 40, దోస 40, సొర 20,25, అరటికాయ 7,8, చిక్కుళ్లు 28, బీర 36, చామదుంప 26, మునగ 15/14, కంద 44, బీట్‌రూట్ 30, కీరదోస 32, బీన్స్ 65, క్యాప్సికం 58, అలసందలు 34, చిలకడదుంప 36, కొత్తిమీర 12/06, పుదీనా 15/05 శుక్రవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి. ఫిర్యాదులుంటే ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తిని ఫోన్ 9182361295లో సంప్రదించవచ్చు.

సినిమాలు

రేవతి: ఈషా
మినీ రేవతి: శంబాల
సిరికృష్ణ: అఖండ-2
సిరివెంకట్: ఛాంపియన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

❖ నగరంలోని వలందపాలెం వసతిగృహ సమీపంలో రహదారి పక్కన చెత్త పేరుకుపోయింది. తరచుగా అక్కడ చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో విద్యార్థులతోపాటు రాకపోకలు చేసే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈసమస్యను ఆ ప్రాంతవాసులు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించడంతో సిబ్బందిని పంపి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించి, చెత్త వేయకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ❖ నగరంలోని ఇంగ్లిషుపాలెం నుంచి రామానాయుడుపేటకు వెళ్లే రహదారి పక్కన డ్రెయిన్‌లో పూడిక తొలగించకపోవడంతో మురుగు పారుదలకు ఆటంకంగా మారింది. స్థానికులు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకు రాగా అధికారులకు వివరించడంతో వారు స్పందించి పూడిక తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

– న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

కాలమానిని ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

పెట్టుబడి తగ్గించేలా...ప్రకృతి సాగు పెంచేలా..

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే

సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులతోపాటు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను అన్నదాతలకు చేరువ చేయడం, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ కార్యక్రమంలో ప్రకృతి సాగుపై కూడా అవగాహన కల్పించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో ఆ దిశగా కార్యాచరణ చేపట్టారు.

సదస్సులు.. చైతన్య కార్యక్రమాలు

బందరు, పెడన నియోజకవర్గాల్లో రబీలో రైతులు అపరాలసాగు చేపట్టారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలతో వారానికి రెండు రోజులు మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల చొప్పున పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులతోపాటు శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారులు నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం పలు గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో పొలాలను సందర్శించి తెగుళ్లు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతోపాటు యాంత్రీకరణ, సాగులో వస్తున్న మార్పులు, అంతర పంటల ఆవశ్యకత తదితరాలపై అవగాహన కల్పిస్తున్నారు.

గూడూరులో నిర్వహించిన కార్యక్రమంలో రైతులతో ఏవో శివరామకృష్ణ

బందరు, పెడన నియోజకవర్గాల్లో అపరాల సాగు వివరాలు (హెక్టార్లలో)

మండలం	మినుము	పెసర
మచిలీపట్నం సౌత్	510	–
మచిలీపట్నం నార్త్	355	–
పెడన	1810	11
గూడూరు	4,065	–
బంటుమిల్లి	3,407	1
కృత్తివెన్ను	450	–

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలతో రైతులను ప్రకృతిసాగు వైపు మళ్లించేలా ప్రత్యేక దృష్టి సారించారు. బందరు, పెడన నియోజకవర్గాల్లో గతంతో పోల్చుకుంటే క్రమంగా ప్రకృతి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ తరహా సాగు చేసే రైతులు కూడా పెరుగుతున్నారు. గూడూరు మండలంలోని పినగూడూరులంక, కోకనారాయణపాలెం, తరకటూరు, కంచాకోడూరు, మద్దిపట్ల, పెడన మండలంలోని నడుపూరు, జింజేరు తదితర గ్రామాలతోపాటు బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో కూడా చేస్తున్నారు. ప్రకృతి సాగులో జీవామృతం, బీజామృతం లాంటి కషాయాలను మాత్రమే వినియోగిస్తారు. అయితే చాలామందికి వీటి తయారీపై అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వీటిపై రైతులకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించడంతోపాటు విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ డీకె బాలాజీ ఈసాగుపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎక్కువమంది రైతులు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ప్రకృతి క్షేత్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

విద్యార్థులకు ముస్తాబు కిట్ల పంపిణీ

కార్యక్రమంలో విద్యార్థులతో మంత్రి రవీంద్ర

మచిలీపట్నం(కోనేరు సెంటరు), న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లోని విద్యార్థులకు ముస్తాబు కిట్లను పంపిణీ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ నవన్, డీఆర్వో చంద్రశేఖరరావుల సమక్షంలో 100 మంది విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ షాహిద్‌బాబు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే విద్యార్థులకు పరిశుభ్రత, క్రమశిక్షణ, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, నేర్చుకునే సామర్థ్యం, చురుకుదనం పెంపొందించుకునేలా చేయడమే ముస్తాబు కార్యక్రమ ఉద్దేశమని మంత్రికి వివరించారు. సాంఘిక సంక్షేమశాఖ నిధులతో అద్దం, దువ్వెన, సబ్బు, నెయిల్‌కట్టర్, పౌడర్, కొబ్బరినూనె తదితరాలతో కూడిన కిట్లను విద్యార్థులకు ఇస్తున్నట్టు తెలిపారు.

గోడపత్రిక ఆవిష్కరణ

కార్యక్రమంలో ఎంటీ కృష్ణబాబు, అధికారులు

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలకు సంబంధించిన గోడపత్రికను రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఆవిష్కరించారు. నగరానికి గురువారం వచ్చిన ఆయనకు జిల్లా రవాణా శాఖాధికారి శ్రీనివాసరావు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందచేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

యాదవుల ప్రగతికి కలిసి సాగుదాం

పెడన, న్యూస్‌టుడే: యాదవ సామాజిక వర్గం అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రొండి కృష్ణయాదవ్ పిలుపునిచ్చారు. పెడన నియోజకవర్గ యాదవ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో గురువారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. యాదవులు రాజకీయ, సామాజిక, విద్యా రంగాల్లో మరింత ప్రగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఈసందర్భంగా వివిధ అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో డా.జె.శంకర్, పుట్టి కృష్ణప్రసాద్, పల్లపోతు అంకరాజు, కొలుసు చందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకూరు ఏపీఆర్‌జేసీకి వంట సామగ్రి అందజేత

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: నిమ్మకూరు గురుకుల వృత్తివిద్యా జూనియర్ కళాశాలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో వంట సామగ్రి సమకూరిందని కళాశాల ప్రిన్సిపల్ ఎస్.లక్ష్మీకుమారి తెలిపారు. ముంబై కేంద్ర కార్యాలయం డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజయ్ సహాయ, చీఫ్ మేనేజర్ మిత్రజిత్, మచిలీపట్నం ప్రాంతీయ కార్యాలయం అధిపతి కె.వెంకట్రావు, హెచ్.పి.దాస్, ప్రహ్లాద్, సుబ్బారావు, మానిష్‌పవన్ పాల్గొన్నారు.

దివాకర్‌ను సత్కరిస్తున్న ఆలయచైర్మన్ తదితరులు

వెంకటేశ్వరస్వామి మహిమపై ప్రవచనం

మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే: మహిమగల దేవుడు ఏడుకొండల వాడు అని ప్రవచనకర్త సింగరాజు దివాకర్ అన్నారు. నగరంలోని గొడుగుపేట వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆయన గురువారం శ్రీవెంకటేశ్వర స్వామి మహిమలు, కంచి పరమాచార్య వైభవంపై ప్రవచనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు కొండలస్వామి భక్తుల అనుభవాలలో అద్భుతమైన మహిమలు చూపించారన్నారు. అనంతరం దివాకర్‌ను ఆలయ ఛైర్మన్ వడ్లమూడి నరసింహారావు, సభ్యులు జొన్నలగడ్డ మాధవి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్, బ్రాహ్మణ సంఘం నాయకులు సత్కరించారు.

మల్కాపట్నం ఎల్ఈఎఫ్ చర్చిలో గీతాలు ఆలపిస్తున్న యువతులు

బెల్ కంపెనీ ఉద్యోగులు నిర్వహించిన వేడుకల్లో నృత్యప్రదర్శన

ఉత్సవం.. ఉత్సాహం

న్యూస్‌టుడే బృందం: నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. గురువారం ఉదయం నుంచే ఎవరికి వారు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతోపాటు ప్రజా ప్రతినిధులు, అధికారులను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో ఎక్కడ చూసినా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ కనిపించారు. ఇళ్ల ముందు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ తీర్చిదిద్దిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. బెల్ కంపెనీ ఉద్యోగులు నిర్వహించిన వేడుకల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

స్థలం పరిశీలన

గండిగుంట(ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే : కృష్ణాజిల్లా ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు నిర్మించడానికి గండిగుంట గ్రామానికి చెందిన వెలివెల లక్ష్మయ్య రమాదేవి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు నాగ శివాజీ ఎకరం పొలం విరాళంగా ఇచ్చారు. దానికి సంబంధించిన సమ్మతి పత్రాన్ని సజ్జా వెంకటేశ్వరరావు ఇటీవల కోర్టుకు సమర్పించారు. ఈ నేపథ్యంలో గండిగుంట శివారు కాకాని నగర్ సమీపంలో ఉన్న స్థలాన్ని జడ్జి కె.శ్రీహరి గురువారం పరిశీలించారు. తహసీల్దార్ సురేశ్‌కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపిచంద్, అశోక్‌కుమార్, చంటిబాబు, ప్రసాద్, శ్రీకృష్ణ పాల్గొన్నారు.

జాతీయ 'ఫెన్సింగ్' పోటీలకు ఎంపిక

ఈడుపుగల్లు (కంకిపాడు), కంకిపాడు గ్రామీణం : మండలంలోని ఈడుపుగల్లుకు చెందిన కోట వర్షంత్ నాయుడు జాతీయ స్థాయి 'ఫెన్సింగ్' పోటీలకు ఎంపికయ్యారు. గతేడాది డిసెంబరు 29వ తేదీన తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టోర్నీలో కాంస్య పతకం సాధించినట్లు రాష్ట్ర ఫెన్సింగ్ సంఘం అధ్యక్షుడు సుగుణరెడ్డి తెలిపారు. జనవరి 5 నుంచి కటక్‌లో నిర్వహించే జాతీయ పోటీలకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. ★ వర్షంత్‌ను మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచి పి.ఇందిర, తెదేపా గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్.షకార్, కె.సుధాకర్ కలిసి అభినందించారు.

వర్షంత్‌నాయుడిని అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

మంత్రి కొల్లు రవీంద్రను సత్కరిస్తున్న కూటమి నాయకులు, అభిమానులు

వేదవ్యాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసిన నాయకులు

ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు సోదరులను సన్మానిస్తూ..

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

న్యూస్‌టుడే బృందం: ప్రతి ఒక్కరూ ఆత్మీయ అనుబంధాలు పెంపొందించుకుంటూ ఐక్యంగా ఉండాలని పలువురు పిలుపునిచ్చారు. గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. బందరు, పెడన నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు, నాయకులను వారి అభిమానులు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తెదేపా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుమూర్తి, గోపు సత్యనారాయణలకు సన్మానం

కలెక్టర్ బాలాజీకి మొక్క అందజేస్తున్న కేయూ వీసీ ఆచార్య రాంజీ, రిజిస్ట్రార్ ఉష

జిల్లా ఉన్నతాధికారులకు శుభాకాంక్షల వెల్లువ

కలెక్టరేట్(మచిలీపట్నం): జిల్లా ఉన్నతాధికారులైన కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ నవీన్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తదితరులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు గురువారం ఉదయం నుంచే శుభాకాంక్షలు తెలిపేందుకు క్యూ కట్టారు. వివిధ సంఘాల డైరీలు, క్యాలెండర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ గతంలో చేసిన సూచన మేరకు నూతన సంవత్సరం సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడే చిన్న బల్లలను అధికారులు పెద్ద మొత్తంలో అందజేశారు.

సీతనపల్లి ఎస్సీవాడ సీఎస్ఐ చర్చిలో కేకు కోస్తున్న సంఘకాపరి, విశ్వాసులు

జిల్లా జడ్జిని కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న న్యాయవాదుల సంఘ నాయకులు



డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణతో నాయకులు

బంటుమిల్లి : ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

పూజలు అందుకున్న నిజాంపేట విజయవనవలమ్మ

బందరుకోట లక్ష్మీనరసింహస్వామి..

బుట్టాయిపేట చిట్టిపిల్లారయ్య స్వామి

ప్రత్యేక పూజలు

మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే: నగరంలోని పలుదేవాలయాల్లో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం విశేషపూజలు నిర్వహించారు. నగరంలోని రంగనాయక స్వామి ఆలయంతోపాటు బందరుకోట లక్ష్మీనరసింహస్వామి, నిజాంపేట విజయవనవలమ్మ తదితర ఆలయాల్లో పూజా క్రతువులు జరిపించారు. నూతనసంవత్సరం సందర్భంగా ఆయా ఆలయాల్లో అధికసంఖ్యలో భక్తులు దైవదర్శనం చేసుకున్నారు. చెమ్మనగిరిపేట అయ్యప్ప ఆలయంలో అన్నసమారాధన నిర్వహించారు.

వైభవంగా గ్రామోత్సవం

పెడన, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మూడ్రోజులుగా స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు గురువారం ముగిశాయి. ఈసందర్భంగా గురువారం సాయంత్రం దీపాలంకరణ కనుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం పురవీధుల్లో వైభవంగా జరిగింది. వేణుగోపాల స్మరణతో సాగిన ఈ ఊరేగింపులో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. గుడివాడ రోడ్డులోని ఆలయం నుంచి బస్టాండు సెంటరు వరకు మేళతాళాలు, విద్యుత్తు దీప కాంతులతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ బళ్ల ప్రసాద్, చందన నారాయణరావు, కొత్త నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామోత్సవంలో భక్తులు

యూటీఎఫ్ కాలమానిని ఆవిష్కరణ

కృత్తివెన్ను, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం యూటీఎఫ్ కాలమానిని ఎంఈవో-2 ఎస్‌కే డీవీ ప్రసాదరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బొర్రా వీరాస్వామి, సైకం ఆదినారాయణ, సానా రామకృష్ణ, ఉండి పురుషోత్తం, రంగనాయకులు, సానా ఏడుకొండలు, పి.రామరాజు, పట్టాభిరామయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ సంక్షేమ సంఘం ఏర్పాటు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: చేవేంద్ర గ్రామంలో శ్రీమద్విరాట్ విశ్వకర్మ సంక్షేమ సంఘాన్ని గురువారం ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా చలపాక శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా పులికొండ బ్రహ్మానందచారి, కార్యదర్శిగా పులికొండ శివయ్య, ఉపకార్యదర్శిగా చిత్రాల దక్షిణామూర్తి, కోశాధికారిగా చలపాక నాగకోటేశ్వరరావుతో పాటు ఏడుగురు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. గ్రామ సర్పంచి ఉచ్చుల భాస్కరరావు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాల పనులకు టెండర్ల ఖరారు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో నాలుగు ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణాలకు టెండర్లు ఖరారైనట్లు పీఆర్ ఏఈ వై.ధర్మయ్య తెలిపారు. కమాలాపురం ఉపకేంద్ర నిర్మాణాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మిగిలిన కొంకేపూడి, ఉరివి, చెన్నూరు గ్రామాల్లో త్వరలో నిర్మాణాలను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఒక్కొక్క ఉపకేంద్రం నిర్మాణానికి రూ.36 లక్షల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. కూడూరు, కృష్ణాపురం, కొంకేపూడి గురివిందగుంట, చోడవరం గ్రామాల్లో సామాజిక భవనాల నిర్మాణాలు పునాది స్థాయికి వచ్చాయని తెలిపారు. కొంకేపూడి నుంచి ఈదుమూడి వరకు, బల్లిపర్రు నుంచి కాకర్లమూడి వరకు బీటీ రహదారుల పనులకు త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. ఒక్కొక్క రహదారికి రూ.రెండు కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు.

మండలి వెంకటకృష్ణారావుకు ఘన నివాళి

కోడూరు, న్యూస్‌టుడే: దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం కోడూరులోని ప్రధాన కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి మందపాకల శివారు చింతకోళ్ల గ్రామస్థులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దివిసీమ ఉప్పెన సమయంలో సేవలను కొనియాడారు.

మరియ మాతృత్వ మహోత్సవం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆధ్యాత్మికంగా క్రీస్తు బాటలో నడిచే ప్రతిఒక్కరికీ జనని మరియమ్మ ఎంతో ఆదర్శమని కథోలిక గురువులు పేర్కొన్నారు. గన్నవరం, ఉంగుటూరు మండలాల్లోని ప్రసిద్ధ పెద్దఅవుటపల్లి బ్రదర్ జోసఫ్‌తంబి పుణ్యక్షేత్రం, గన్నవరం, కేసరపల్లి, అజ్జంపూడి, ముస్తాబాద, కొండపావులూరు, తేలప్రోలు క్షేత్రాల్లో గురువారం మరియ మాతృత్వ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ప్రత్యేక దివ్యపూజాబలి, జపమాల, ఆరాధన, తొలుత నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఫాదర్లు పాలడుగు జోసఫ్, పసల థామస్, జోసఫ్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి బలోపేతానికి కృషి చేయాలి

రామవరప్పాడు, న్యూస్‌టుడే: గన్నవరం నియోజకవర్గంలో కూటమి పార్టీల బలోపేతానికి కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను అన్నారు. భవానీపురంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం రామవరప్పాడుకు చెందిన ఘంటా రామ్మోహన్‌రావుకు ఉదయభాను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీ కార్యదర్శులు సంఘం ఉపాధ్యక్షుడిగా ఘంటా రామ్మోహన్ సంఘ బలోపేతానికి కృషి చేశారన్నారు. రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శిగా ఏడేళ్లు పనిచేసి పంచాయతీ అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. పదవీ విరమణ అనంతరం కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు ఆకర్షితుడై జనసేన పార్టీలో చేరారని తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రామవరప్పాడు జనసేన నాయకులు రత్నం నాగేశ్వరరావు, కోనపురెడ్డి నాని, అడ్డగిరి రామకృష్ణ, కాట్రగడ్డ రాంబాబు, కొండూరి హరి, గంధం గోవర్ధన్‌రావు, మల్ల సాంబయ్య, పి.కృష్ణలు పాల్గొన్నారు.

రామ్మోహన్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సామినేని ఉదయభాను

జాతీయ ఓపెన్ కరాటేలో సత్తా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: న్యూదిల్లీలో గత నెల 29, 30వ తేదీల్లో జరిగిన జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన జి.నీనా(7) సత్తాచాటి కాంస్య పతకం కైవసం చేసుకుందని వాంకన్ కరాటే డొ సమాఖ్య రాష్ట్ర చీఫ్ ఎస్.దుర్గారావు తెలిపారు. ఈ పోటీల్లో దేశంలోని 15 రాష్ట్రాల నుంచి రెండు వేల మంది క్రీడాకారులు తలపడ్డారని పేర్కొన్నారు. నీనా 5 నుంచి 14 ఏళ్లలోపు కేటగిరీలో కటాలో తలపడి తృతీయ స్థానంలో నిలిచిందని వివరించారు.

వాహనం అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

చల్లపల్లి, న్యూస్‌టుడే: మద్యం మత్తులో అతివేగంగా మోటారు వాహనం నడిపి చల్లపల్లి మండలం పురిటిగడ్డకు చెందిన గంజి నాని, కనపర్తి కల్యాణ్ గాయాల పాలయ్యారు. చల్లపల్లి-నడకుదురు రోడ్డులో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. నాని వాహనాన్ని వంకర్లు తిప్పుతూ నడపడంతో అదుపుతప్పి తీవ్ర గాయాల పాలయ్యారు. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్చారు. గురువారం సాయంత్రం వారు మార్గం మధ్యలో ఐదారుగురిని ఢీకొనేవారని, అదృష్టవశాత్తూ బయటపడ్డామని పలువురు చెబుతున్నారు.

బ్రాహ్మణుల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి.ఫణికుమార్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన బ్రాహ్మణ ప్రముఖులు గురువారం ఫణికుమార్‌ను మచిలీపట్నంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ జిల్లాలో బ్రాహ్మణులు అపరకర్మలు చేసుకునేందుకు భవనాల ఏర్పాటు గురించి బోర్డు మీటింగ్ దృష్టికి తీసుకువెళతానన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు పి.ఎస్.ఎస్.ఆర్.శర్మ, ఎం.సుబ్రహ్మణ్యం, జమ్మలమడక సేతురామయ్య, వడ్లమన్నాటి మారుతీ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

వైభవంగా గ్రామోత్సవం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకుని హనుమాన్‌జంక్షన్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి గ్రామోత్సవం గురువారం రాత్రి నిర్వహించారు. తిరువీధి ఉత్సవం పేరుతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన గరుత్మంతుడి వాహనంపై గ్రామ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈవో కిశోర్, ధర్మకర్తలు కాకాని వెంకటేశ్వరరావు, తవ్వా పూర్ణచంద్రరావు, తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు

కాలమానిని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సొసైటీ సభ్యులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: సమాజంలో అట్టడుగు వర్గాలకు మరింత విస్తృతంగా సేవలందించేలా జైభీమ్ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ కృషి చేయాలని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం జైభీమ్ సంస్థ కాలమానిని ఆయనతో ఆవిష్కరింపజేశారు. విద్య, వైద్యం కోసం జైభీమ్ హెల్పింగ్ హ్యాండ్స్ ఎంతో మందికి చేయూతనిచ్చిందని, భవిష్యత్తులో మరింత ఎక్కువ మందికి సాయం చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని నిర్వాహకులు కలతోటి నాగేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సాగర్‌బాబు, లంకపల్లి వెంకటేశ్వరరావు, పి.సుబ్బారావు, బడుగు కిశోర్ పాల్గొన్నారు.

స్థలం పరిశీలన

తహసీల్దార్‌తో చర్చిస్తున్న జడ్జి శ్రీహరి

గండిగుంట(ఉయ్యూరు(గ్రామీణం), న్యూస్‌టుడే : కృష్ణాజిల్లా ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు నిర్మించడానికి పెనమలూరు గ్రామానికి చెందిన వెలివెల లక్ష్మయ్య రమాదేవి దంపతులు జ్ఞాపకార్థం వారి కుమారుడు నాగశివాజీ ఎకరం పొలం విరాళంగా ఇచ్చారు. దానికి సంబంధించిన సమ్మతి పత్రాన్ని సబ్ జడ్జి వెంకటేశ్వరరావు జడ్జి కోర్టు సమర్పించారు. ఈ నేపథ్యంలో గండిగుంట శివారు కాకాని నగర్ సమీపంలో ఉన్న స్థలాన్ని జడ్జి కె.శ్రీహరి గురువారం పరిశీలించారు. తహసీల్దార్ సురేశ్‌కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపీచంద్, అశోక్‌కుమార్, వంటిబాబు, ప్రసాద్, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ 'ఫెన్సింగ్' పోటీలకు ఎంపిక

వర్షంత్‌నాయుడిని అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఈడుపుగల్లు (కంకిపాడు), కంకిపాడు (గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని ఈడుపుగల్లుకు చెందిన కోట వర్షంత్ నాయుడు జాతీయ స్థాయి 'ఫెన్సింగ్' పోటీలకు ఎంపికయ్యారు. గతేడాది డిసెంబరు 29న తేదీన తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించినట్లు రాష్ట్ర 'ఫెన్సింగ్' సంఘం అధ్యక్షుడు సూనరెడ్డి తెలిపారు. జనవరి 5 నుంచి కటక్‌లో నిర్వహించే జాతీయ పోటీలకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. ★ వర్షంత్‌ను మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచి పి.ఇందిర, తెదేపా గ్రామ పార్టీ అధ్యక్షుడు పేట ఏకార్, కె.సుధాకర్ కలిసి అభినందించారు.

డీజీపీకి శుభాకాంక్షలు

హరీశ్‌కుమార్ గుప్తాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు గురువారం రాష్ట్ర డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీతో పాటు ఎన్టీఆర్ జిల్లా డీసీపీలు కృష్ణకాంత్ పటేల్, తిరుమలేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, కె.జి.వి.సరిత, కె.కృష్ణప్రసన్న, షిరీన్‌బేగం తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మండలి వెంకటకృష్ణారావుకు ఘన నివాళి

కోడూరు: దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం కోడూరులోని ప్రధాన కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి మందపాకల శివారు చింతకోళ్ల గ్రామస్థులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దివిసీమ ఉప్పెన సమయంలో సేవలను కొనియాడారు.

కలెక్టర్‌కు చిత్రాన్ని బహూకరించిన డీటీ

గన్నవరం మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న సద్దుల భవానీరెడ్డికి చిత్రలేఖనంపై ఆసక్తి. చిన్ననాటి నుంచి వ్యాపకంగా మార్చుకున్న ఆమె నేటికీ వివిధ చిత్రాలు గీస్తూ తనదైన ప్రతిభ కనబరుస్తున్నారు. తాజాగా కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చిత్రాన్ని గీసిన భవానీ రెడ్డి.. నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ డీకే.బాలాజీకి తాను గీసిన చిత్రాన్ని బహూకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రత్యేకంగా ఆకట్టుకున్న డీటీ భవానీరెడ్డి ప్రతిభను పలువురు ప్రశంసించారు.

-గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

విద్యాలయాల్లో ఆకతాయిల ఆగడాలు

కంకిపాడు, న్యూస్‌టుడే

సెలవు రోజుల్లో పాఠశాలల ప్రాంగణాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి. ప్రహరీలున్నా ఆకతాయిలు గేట్లు దాటుకుని ఆవరణల్లో ప్రవేశిస్తున్నారు. పగటి పూట క్రికెట్ వంటి క్రీడలు ఆడుకునే పిల్లలతో పాటు ఇతరులు కూడా వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో సిగరెట్లు తాగడం, పాన్ పరాగ్‌లు, గుట్కాలు నమిలి పాఠశాల గోడలపై ప్రాంగణాల్లో ఉమ్మి వేస్తూ అధ్వానంగా తయారు చేస్తున్నారు. చీకటి పడితే మందుబాబులు మద్యం సీసాలను పగలగొట్టడం తినుబండారాల వ్యర్థాలను విసిరేయడం చేస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు.

◆ దసరా, సంక్రాంతి పండగ సందర్భాల్లో వరుస సెలవుల్లో ఉంటాయి. ఆ సమయంలో వీరి చేష్టలకు హద్దు లేకుండా పోతుందని పలు గ్రామాల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెలవుల అనంతరం పాఠశాలలు తెరచిన రోజు శుభ్రం చేయడానికే సరిపోతోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

◆ ఈడుపుగల్లు, పునాదిపాడు, కంకిపాడు, మంతెన, తెన్నేరు, ప్రొద్దుటూరు, కోలవెన్ను జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఈ సమస్య తరచూ ఎదురవుతోందని పలువురు గ్రామస్థులు చెబుతున్నారు.

ఈడుపుగల్లు జడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట ఏర్పాటు చేసిన బోర్డ్

కాపలాదారుల నియామకం ఎన్నడు?

గతంలో ప్రతి జడ్పీ ఉన్నత పాఠశాలకు రాత్రి కాపలాదారులు ఉండేవారు. వీరి పదవీ విరమణ తర్వాత పోస్టులను భర్తీ చేయలేదు. ఈ సమస్య పరిష్కారానికి పాఠశాల నిర్వహణకు ఇచ్చే గ్రాంట్, దాతల సహకారంతో తాత్కాలిక ప్రాతిపదికన కాపలాదారులను నియమించుకోవాలని జిల్లా విద్యాశాఖ ఆరేళ్ల కిందటే చెప్పింది. అయితే గ్రాంట్ చాలా తక్కువగా ఉండడంతోపాటు ప్రతి నెలా కాపలాదారుకు వేతనం చెల్లించేందుకు దాతలు ముందుకు రాలేదు. కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సిబ్బందికే 'కాపలా' బాధ్యత అప్పగించారు. కానీ ఆకతాయిలు వీరిపై దౌర్జన్యం చేయడం వంటి ఘటనలతో వెనుకడుగు వేశారు.

నెలకు రూ.10 వేల గ్రాంట్ ఇవ్వాలి - ఎస్ఎంసీ ఛైర్మన్లు

ఇటీవల జరిగిన 'మెగా పేరెంట్స్ డే' సందర్భంగా పలువురు పాఠశాల నిర్వహణ కమిటీ ఛైర్మన్లు ఈ సమస్యను ప్రస్తావించారు. నెలకు రూ.10 వేల గ్రాంట్ మంజూరుతో కాపలాదారును నియమించుకుంటామని కోరుతున్నారు. అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

గండిగుంట(ఉయ్యూరు(గ్రామీణం), న్యూస్‌టుడే : విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. దీంతో రాళ్లు పైకి తేలి ఆ దారిలో ప్రయాణిస్తున్న పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

దివ్యబలిపూజ సమర్పిస్తున్న ఫాదర్లు చలివేంద్రశౌరి, దేవదానం, రత్నరాజు

అధికారులు, ఉద్యోగులతో ఎమ్మెల్యే బోడే ప్రసాద్

కంకిపాడు (గ్రామీణం: కేకు ఇస్తూ..

హనుమాన్‌జంక్షన్‌లో విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, సిబ్బంది, పాల సంఘాల అధ్యక్షులు

నూతన సంవత్సర వేడుకలు

పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా చేసుకున్నారు. ★ ఎన్జీవో ఉపాధ్యాయ సంఘ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఎమ్మెల్యే బోడేప్రసాద్ గురువారం ఆవిష్కరించిన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ★ గన్నవరం బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో నాయకులతో కలిసి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కేకు కోసి పంపిణీ చేశారు. అనంతరం తెదేపాలో ఉత్తమ సేవలందించిన కార్యకర్తలను సత్కరించారు. ఎమ్మెల్యేకు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు అంగ సంఖ్యలో శుభాకాంక్షలు తెలిపారు. ★ కానూరులోని దుర్గగుడి పాలకవర్గ సభ్యుడు వెలగపూడి శంకర బాబు నేతృత్వంలో ★ కంకిపాడు ఎంపీపీ పాఠశాలలో 'భవిత' ఆధ్వర్యంలో ★ తాడిగడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని వివిధ రకాల పండ్లతో అలంకరించారు. ★ ఎమ్మెల్యే బోడేప్రసాద్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో కేకులు కోశారు. యువత నృత్యాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. ★ పాతగన్నవరం శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు

అలంకారంలో హనుమాన్ జంక్షన్ అభయాంజనేయస్వామి

పండ్ల అలంకరణలో..

పోరంకిలో కేకు కోస్తున్న నాయకులు

ఉయ్యూరులో మాజీ ఎమ్మెల్యే వైవీబీ

ఉత్తమ సేవలందించిన కార్యకర్తలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

నిర్వహించారు. ★ చిన్నఅవుటపల్లి పుణ్య చారిటీస్ వృద్ధాశ్రమంలో వయోవృద్ధుల ఛారిటీస్ కార్యదర్శి జస్టిస్ విజయభూషణ్‌కుమార్ పండ్లు పంపిణీ చేశారు. - **న్యూస్‌టుడే బృందం**

● నూతన సంవత్సరం పురస్కరించుకొని స్థానిక కార్మెల్ చర్చిలో ఫాదర్ చలివేంద్రశౌరి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్లు దేవదానం, రత్నరాజు పాల్గొన్నారు. ★ నూతన సంవత్సర వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ఆలయాలు, చర్చిలు, ప్రార్థనా మందిరాలను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయస్వామి, లక్ష్మీ వేంకటేశ్వరస్వామిని విశేషంగా అలంకరించారు. హనుమాన్‌జంక్షన్ కాకాని కల్యాణ మండపంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల దండ వేసి నివాళులర్పించిన విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, పాల సంఘాల అధ్యక్షులు, సిబ్బందితో కలిసి కేకు కోశారు.

వెల్లివిరిసిన సృజన

గ్రీటింగ్స్ తయారీలో ప్రత్యేక అవసరాల పిల్లలు

ఎమ్మెల్యే రామ్మోహనరావుకు మానసిక దివ్యాంగులు తయారు చేసిన కార్డు అందిస్తున్న కేంద్రం పర్యవేక్షకులు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: వారంతా మానసిక దివ్యాంగులు..అయితేనేం వారిలోనూ మంచి సృజన.. అభిరుచులు దాగున్నాయి. వాటిని గుర్తించి ప్రోత్సహిస్తే వారు ఏదైనా చేయగలరని నిరూపిస్తున్నారు. ఉయ్యూరు, కామయ్యతోపులోని శిరీషా మానసిక వికలాంగ కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలు పర్యవేక్షకుల ప్రోత్సాహం, శిక్షణతో క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండగలకు అందమైన గ్రీటింగ్ తయారు చేస్తున్నారు.

● ఈ కేంద్రాల్లోని అనేక మంది పిల్లలు గ్రీటింగ్ కార్డులను అందంగా తయారు చేస్తున్నారు. రంగు రంగుల కాగితాలు, రిబ్బన్లు, కార్డ్‌బోర్డులతో వాటిని రూపొందిస్తున్నారు. వారికి ఆయా కేంద్రాల్లోని పర్యవేక్షకులు తగిన శిక్షణ ఇస్తున్నారు. వారి ఆలోచనలను జత చేసి వాటిని తయారు చేయిస్తున్నారు. వస్త్రాలు, కాగితాలను కత్తిరించి కార్డులపై వివిధ ఆకృతులలో అతికించి వాటికి చెమ్కీలు, పూసలు అద్ది అందమైన గ్రీటింగ్ కార్డులు తయారు చేస్తున్నారు.

● పండగలకు ప్రత్యేకం.. ప్రతి ఏడాది క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండగల్లో ప్రత్యేకంగా గ్రీటింగ్ కార్డులను కొన్ని రోజులు ముందుగా తయారు చేస్తారు. వాటిని ఆయా కేంద్రాలకు సహాయం అందించే దాతలు, కేంద్రాలను సందర్శించే అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులకు వాటిని అందిస్తూ శుభాకాంక్షలు తెలియజేసి ఆనందపడుతుంటారు. మానసిక దివ్యాంగుల్లోని నైపుణ్యం, నూతన ఆలోచనలను వెలికి తీసేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కేంద్రం బాధ్యులు ఎం.సోమేశ్వరరావు తెలిపారు.

కార్డులు తయారు చేస్తూ..

బ్రాహ్మణుల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే: బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి.ఫణికుమార్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన బ్రాహ్మణ ప్రముఖులు గురువారం ఫణికుమార్‌ను మచిలీపట్నంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ జిల్లాలో బ్రాహ్మణులు అపర కర్మలు చేసుకునేందుకు భవనాల ఏర్పాటు గురించి బోర్డు మీటింగ్ దృష్టికి తీసుకువెళతానన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు పి.ఎస్.ఎస్.ఆర్.శర్మ, ఎం.సుబ్రహ్మణ్యం, జమ్మలమడక సేతురామయ్య, వడ్లమన్నాటి మారుతీ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలోనే సంతృప్తి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజ సేవలోనే సంతృప్తి దాగి ఉందని, గాడి తప్పుతున్న యువతకు సరైన మార్గం చూపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఉంగుటూరు మండలం తేలప్రోలు ఉషా రామా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీహరిబాబు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విజయవాడ నగరం, దావాజీగూడెం, నూజివీడు, ఉయ్యూరు పరిసర ప్రాంతాల్లో బస్టాండ్, రైల్వేస్టేషన్, రోడ్ల పక్కన జీవనం సాగిస్తున్న ఒంటరి పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. సుమారు 500 దుప్పట్లు పంపిణీ చేసినట్లు విద్యార్థులు తెలిపారు.

ఉప్పులూరు (కంకిపాడు):, న్యూస్‌టుడే: విజయవాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ నుంచి జనవరి 1వ తేదీ వరకు మండలంలో 100 మందికి దుప్పట్లు, నిత్యావసరాలు అందజేశామని సంఘ కార్యదర్శి రావి సురేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ అన్నే ధనయ్య, నీటి సంఘం అధ్యక్షుడు కనగాల సుబ్బారావు, పీఏసీఎస్ ఛైర్మన్ పడవల మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

ఉప్పులూరు : నిత్యావసరాలు అందజేస్తున్న ప్రతినిధులు

కూటమి పార్టీల బలోపేతానికి కృషి చేయాలి

రామ్మోహన్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉదయభాను

రామవరప్పాడు, న్యూస్‌టుడే: గన్నవరం నియోజకవర్గంలో కూటమి పార్టీల బలోపేతానికి కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను అన్నారు. భవానీపురంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం రామవరప్పాడుకు చెందిన ఘంటా రామ్మోహన్‌రావుకు ఉదయభాను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీ కార్యదర్శులు సంఘం ఉపాధ్యక్షుడిగా ఘంటా రామ్మోహన్ సంఘ బలోపేతానికి కృషి చేశారన్నారు. రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శిగా ఏడేళ్లు పనిచేసి పంచాయతీ అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రామవరప్పాడు జనసేన నాయకులు రత్నం నాగేశ్వరరావు, కోనపు రెడ్డి నాని, అడ్డగిరి రామకృష్ణ, కాట్రగడ్డ రాంబాబు, కొండూరి హరి, గంధం గోవర్ధన్‌రావు, మల్ల సాంబయ్య, పి.కృష్ణలు పాల్గొన్నారు.

11న హిందూ సమ్మేళనం

పామర్రు: ఈనెల 11న ఆదివారం బందరు రోడ్డులోని బైసాని నాగేశ్వరరావు స్థలంలో నిర్వహించే పామర్రు మండల హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని హైందవ బంధువులు కోరారు. గురువారం స్థానిక విష్ణాలయంలో ఏర్పాట్లపై చర్చించారు. దేశభక్తి, హిందూ సమాజం పట్ల గౌరవభావం, అంకితభావం, సేవా గుణం, వంటి వాటిని వికసింపజేసేందుకు సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

కోటి కాంతుల వెలుగులు

గాడిన పడిన అభివృద్ధి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

గన్నవరం నియోజకవర్గంలో వైకాపా అయిదేళ్ల పాలనలో అభివృద్ధి జాడ లేకుండాపోయింది. ఎంతో ప్రాధాన్యం ఉన్న ప్రాంతంలో నామమాత్రంగా కూడా పురోగతి లేదు. 2024 ద్వితీయార్థంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గన్నవరం ప్రగతికి ప్రణాళిక రూపొందించింది. 2025లో గణనీయంగా పురోగతి సాకారమవ్వగా, 2026లో మరింత మెరుగ్గా అభివృద్ధి జరిగేలా కీలక పనులకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. పూర్వ వైభవం తెచ్చేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నారు.

పారిశ్రామికవాడకు కళ

మల్లవల్లిలోని ఏపీఐఐసీకు చెందిన పారిశ్రామిక వాడ పురోగతి 2025లో మొదలైంది. అయిదేళ్ల కిందటే సిద్ధమై, మూసివేతకు గురైన అశోక్ లేల్యాండ్ యూనిట్ తిరిగి మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభమైంది. 200 బస్సుల వరకు ఇక్కడ ఉత్పత్తి జరిగింది. వందల సంఖ్యలో నిరుద్యోగులకు ఉపాధి లభించింది.

రహదారులకు మోక్షం

వైకాపా హయాంలో కీలక రహదారులు, గ్రామాల అనుసంధాన, అంతర్గత రహదారుల పరిస్థితి దయనీయంగా తయారైంది. వీటికి కనీస మరమ్మతులు కూడా చేయకపోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వం 2025లో కీలక రోడ్లను అభివృద్ధి చేయగా, కొత్త సంవత్సరంలో రూ.200 కోట్లతో పనులు చేపట్టేలా సన్నాహాలు చేస్తున్నారు.

సుందరీకరణ

విమానాశ్రయం నుంచి విజయవాడ నగర శివారు వరకు ఉన్న వీఐపీ కారిడార్ కళావిహీనంగా తయారైంది. పచ్చదనం దాదాపుగా కనుమరుగైంది. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో ఈ మార్గం సుందరీకరణ పనులకు కార్యాచరణ చేపట్టారు. దీంతో పాటు బొమ్ములూరు నుంచి గన్నవరం వరకు కూడా ఈ సుందరీకరణ పనులు విస్తరింప జేస్తూ ఇప్పటికే పలు చోట్ల పనులు పూర్తి చేశారు.

బైపాస్ అందుబాటులోకి వచ్చేలా..

విజయవాడ పశ్చిమ బైపాస్ నిర్మాణ పనుల్లోనూ కూటమి ప్రభుత్వం రాకతో కదలిక వచ్చింది. ప్రధానంగా రహదారి నిర్మాణానికి అవరోధంగా మారిన హైటెన్షన్ విద్యుత్తు టవర్ల మార్పు వివాదానికి తెర పడింది. ప్రస్తుతం రాకపోకలు జరుగుతున్నా, నెల రోజుల్లోపుగానే పూర్తి స్థాయిలో ఈ మార్గం అందుబాటులోకి వచ్చేలా కార్యాచరణ చేపట్టారు.

విస్తరణ తర్వాత గన్నవరం గాంధీ బొమ్మ కూడలి

వీటిపై దృష్టి పెట్టాలి

బ్రహ్మయ్యలింగం చెరువును రిజర్వాయర్‌గా మార్చి, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడం, పోలవరం కుడి కాలువ నుంచి ఏలూరు కాలువ నీటి మళ్లింపు, ఉంగుటూరు మండలంలో బుడమేరుపైనా, గన్నవరం, విజయవాడ గ్రామీణ మండలాల్లో ఏలూరు, రైవస్ కాలువలపై వంతెనల నిర్మాణం, రైతుబజార్ల ఏర్పాటు వంటి కీలక పనులు కొత్త ఏడాదిలో సాకారమవ్వాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

మరియ మాతృత్వ మహోత్సవం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆధ్యాత్మికంగా క్రీస్తు బాటలో నడిచే ప్రతిఒక్కరికీ జనని మరియమ్మ ఎంతో ఆదర్శమని కథోలిక గురువులు పేర్కొన్నారు. గన్నవరం, ఉంగుటూరు మండలాల్లోని ప్రసిద్ధ పెద్దఅవుటపల్లి బ్రదర్ జోసఫ్‌తంబి పుణ్యక్షేత్రం, గన్నవరం, కేసరపల్లి, అజ్జంపూడి, ముస్తాబాద, కొండపావులూరు, తేలప్రోలు క్షేత్రాల్లో గురువారం మరియ మాతృత్వ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ప్రత్యేక దివ్యపూజాబలి, జపమాల, ఆరాధన, తొలుత నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఫాదర్లు పాలడుగు జోసఫ్, పసల థామస్, జోసఫ్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

నూజివీడు మెయిన్ బ్రాంచి (00889), యస్ వాణి టవర్స్, హనుమాన్ జంక్షన్ రోడ్, నూజివీడు, ఏలూరు జిల్లా-521201.

APPENDIX-IV-A
{see provision to rule 8(6)R/w9(1)}

స్థిరాస్తి ఈ-వేలం అమ్మకం బహిరంగ ప్రకటన తేది.04-02-2026

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ మరియు దానిక్రింద చేయబడిన రూల్స్ మేరకు భారతీయ స్టేట్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారిచే చూపట్టబడిన దిగువ తెలిపిన వివరముల ప్రకారం సెక్షన్ 13(4) నిబంధనల ప్రకారం ఆస్థి యొక్క స్వాధీనతకు కొనసాగింపుగా దిగువ షెడ్యూల్‌లో తెలిపిన ఆస్థిని దిగువ నిర్దేశించబడిన 13(2) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నియమ నిబంధనలకు లోబడి "ఎక్కడ ఎలా ఉన్నది, అక్కడ అది అలానే" ప్రాతి పదికన దిగువ తెలిపిన వివరముల ప్రకారం ఇ-వేలం వెబ్ పోర్టల్ https://www.baanknet.com ద్వారా విక్రయించబడును.

ఋణగ్రహీత(ల) పేరు: 1) శ్రీ పోలన నాగేంద్ర శివరామకృష్ణ తండ్రి: పి పెద్ది కాశేశ్వరరావు, 2) శ్రీమతి పోలన పద్మావతి భర్త: పి నాగేంద్ర శివరామకృష్ణ, ఫ్లాట్ నెం.204, యస్‌యస్ రెసిడెన్సి, షిరిడి సాయిబాబా నగర్, తాడిగడప డొంకరోడ్డు, యనమలకుదురు, విజయవాడ-520007.

హెచ్‌యల్ నెంబర్లు: 41357531429, 41362032537

బకాయి మొత్తం: ది.18-08-2025 నాటికి రూ.66,83,620/-

స్థిరాస్తి యజమాని పేరు: శ్రీ పోలన నాగేంద్ర శివరామకృష్ణ తండ్రి: పి పెద్ది కాశేశ్వరరావు

స్థిరాస్తి వివరము: కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, వైయస్‌ఆర్ తాడిగడప మునిసిపాలిటి, తాడిగడప, ఆర్‌యస్ నెం.97/13, సమీప డోర్ నెం.1-10, 100 చ॥గ॥ల విస్తీర్ణములోని ఆర్‌సిసి భవనము శ్రీ పోలన నాగేంద్ర శివరామకృష్ణ, తండ్రి: పి. పెద్ది కాశేశ్వరరావు గారికి చెందిన రిజిస్టర్డ్ సేల్‌డీడ్ నెం.14052/2022, తేది:26-10-2022 పటమట జెయస్‌ఆర్‌ఒ, విజయవాడ, యన్‌టీఆర్ జిల్లా. భవనము హద్దులు: తూర్పు: 30 అడుగుల వెడల్పుగల రోడ్డు, దక్షిణం: షేక్ బడేమియా గారు గౌరిశెట్టి శ్రీనివాసరావు గారికి అమ్మిన ఆస్థి, పడమర: మేడసాని రేఖ గారి ఆస్థి, ఉత్తరం: వీర్ల నాగేశ్వరమ్మ గారి ఆస్థి.

రిజర్వు ధర: రూ.53,61,000/- ధరావత్తు: రూ. 5,36,100/- బిడ్ పెంపుదల: రూ.10,000/-

ఇ-వేలం తేదీ & సమయం: 04-02-2026 ఉ॥ గం॥ 11.00 ల నుండి సా॥ గం॥4.00 ల వరకు

NEFT/RTGS సొమ్మును సమర్పించుటకు https://www.baanknet.com వెబ్‌పోర్టల్ (యూజర్ ఐడి & పాస్‌వర్డ్ ఉచితంగా https://www.baanknet.com లో రిజిష్టర్ చేసుకొన్న పేరు మీద లభించును) ద్వారా పాస్‌వర్డ్ & లాగిన్ ఐడి కలిగిఉండవలెను. తమ బిడ్లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలములో పాల్గొనుటకు ముందుగా మెస్సర్స్ పియస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్, టోల్ ఫ్రీ నెం: +91 8291220220 వారి వెబ్ పోర్టల్ https://www.baanknet.com మరియు పై లభించు ఇ-వేలపు నియమ నిబంధనల పూర్తి వివరములు పరిశీలించవలసినదిగా బిడ్డర్లను కోరుచున్నాము. ఆసక్తిగల బిడ్డర్లు ఆస్థుల తనిఖీ కొరకు చీఫ్ మేనేజర్, మొబైల్ నెం.9533988999, ఇ-మెయిల్ ఐడి: sbi.00889@sbi.co.in మరియు రికవరీ ఏజెన్సి: DRS Associates, మొబైల్ నెం:9014758586 వారిని బ్యాంకు పనిదినములలో సంప్రదించవచ్చును.

ప్రదేశం: నూజివీడు
తేది :31-12-2025

సం/- అధీకృత అధికారి
భారతీయ స్టేట్ బ్యాంక్

సీపీఐ శతాబ్ది ఉత్సవాల జయప్రదానికి పిలుపు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించి వారికి అండగా నిలిచిన భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజా పిలుపునిచ్చారు. పార్టీ ముగింపు ఉత్సవాల్లో భాగంగా గురువారం ఏడో డివిజన్ పార్టీ ఆధ్వర్యంలో బోయపాటి మాధవరావు గ్రంథాలయం వద్ద వృద్ధులు, బాలలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన ఖమ్మంలో 5 లక్షల మందితో ముగింపు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం పార్టీ చేసిన కృషిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కోరారు. కమ్యూనిస్టు పాలనలో నగరంలోని కొండ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. నగర కార్యదర్శివర్గ సభ్యుడు అప్పురబోతు రాము అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సంగుల పేరయ్య, మాజీ కార్పొరేటర్ ఇజ్జాడ లక్ష్మీ, డివిజన్ కార్యదర్శి పూసర్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

గుడివాడ
•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

ఎమ్మెల్యేకు సన్మానం

కోడూరు, న్యూస్‌టుడే: ఎమ్మెల్యేను కోడూరులోని శ్రీఅయ్యప్ప స్వామి దేవస్థాన కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. శ్రీఅయ్యప్పస్వామి దేవస్థానానికి వెళ్లే మార్గాన్ని సీసీ రహదారిగా అభివృద్ధి పరిచేందుకు రూ.20లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించినందుకు సన్మానించారు. ధర్మకర్త బడే భావన్నారాయణ, ప్రధాన కార్యదర్శి ఇంకొల్లు అశోక్‌మహారాజ్, శ్రీనివాసశర్మ, శ్రీనివాసరావు, ప్రసాద్, కుటుంబరావు, గోవర్ధనరావు పాల్గొన్నారు.

చర్చి అభివృద్ధికి సాయం

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి పంచాయతీ పరిధిలోని గంజివానిపాలెం ఆర్‌సీఎం చర్చి అభివృద్ధి పనులకు మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు రూ.25వేల నగదుసాయాన్ని గురువారం పాస్టరు చిరంజీవికి అందించారు. దాతను ఘనంగా సత్కరించారు.

గోదా అమ్మవారికి సారె సమర్పణ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ధనుర్మాసోత్సవాలలో భాగంగా స్థానిక గీతా మందిరంలో గోదాదేవి అమ్మవారికి గురువారం భక్తులు సారెగా పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమలు, గాజులు, పండ్లు, మిఠాయిలు సమర్పించారు. అనంతరం లక్ష్మీ సహస్రనామ స్తోత్రం, లలితా సహస్రనామ స్తోత్రం పారాయణం చేశారు.

మువ్వ టీమ్ ప్రతిభ

కూచిపూడి, న్యూస్‌టుడే: గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ పోటీలలో మువ్వ టీమ్ ప్రతిభ కనబరచింది. కెప్టెన్ హర్షకు మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ షీల్డ్‌ను కూచిపూడి ఎస్‌ఐ పి.శిరీష అందించారు. ఫౌండేషన్ ఛైర్మన్, సినీ నిర్మాత సాయి, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

? గుడివాడ పట్టణం సత్యనారాయణపురం రామాలయం వీధిలో మురుగు కాలువలో పూడిక పేరుకుపోవడంతో దుర్వాసనతో పాటు దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. **- సాగిరి రజని, సత్యనారాయణపురం.**
✔ సిబ్బందిని పంపించి కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగిస్తాం. **- మున్సిపల్ సహాయ కమిషనర్ పి.శ్రీనివాసరావు**
– గుడివాడ (సత్యనారాయణపురం), న్యూస్‌టుడే

మూసేస్తారా?

జిల్లాలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లకు రాని నమూనాలు

అవనిగడ్డ, న్యూస్‌టుడే

అవనిగడ్డ రెవెన్యూ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌కు గత ఏడాది ఏప్రిల్ నుంచి పరీక్షలు చేసేందుకు మట్టి నమూనాలు రాకపోవడంతో దాన్ని మూసేస్తారేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాబార్డు నిధులు రూ.82 లక్షలు, ఆర్‌కేవీవై నిధులు రూ.15.30 లక్షలతో దీన్ని ఏర్పాటు చేశారు. దీనిలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత పరీక్షలు చేస్తారు. వీటికి రాష్ట్ర స్థాయిలో తాడేపల్లిగూడెం, తిరుపతి, విశాఖపట్నం, అమరావతి రీజినల్ కోడింగ్ కేంద్రాలుగా వ్యవహరిస్తాయి. వీటికి మండల వ్యవసాయాధికారులు సేకరించిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను పంపిస్తారు. ఈసెంటర్ నియోజకవర్గ కేంద్రాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లకు ఇస్తుంది. వాటిని పరిశోధన చేసిన తరువాత ఎక్కడి నుంచి వచ్చిందో వారికే ఆన్‌లైన్‌లో రిపోర్టులు ఇస్తారు. కేంద్రం కేవలం కంకిపాడు, గుడివాడ ల్యాబ్‌లకు నమూనాలు ఇచ్చి మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ, పామర్రు వాటికి ఇవ్వకపోవటం వల్ల నిరుపయోగానికి గురయ్యాయి. వాటిని మూసేస్తారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెటీరియల్స్, పరికరాలు ఉన్నప్పటికీ నమూనాలు ఇవ్వకపోవటంపై అనుమానాలకి తావిస్తోంది. అవనిగడ్డలో వాటర్ డిస్టిలేషన్ యూనిట్ మరమ్మతుకు గురైనప్పటికీ నెలలు గడిచినా సరిచేయటం లేదు. గతంలో నెలకు 40 నుంచి 50 నమూనాలు వచ్చేవి. ప్రస్తుతం గన్నవరంలో పెద్ద ల్యాబ్ నిర్మాణంలో ఉందని, అది పూర్తయితే జిల్లాలో నియోజకవర్గ స్థాయిలో ఉన్న ల్యాబ్‌లన్నీ మూసేస్తారని అనుకుంటున్నారు. దీనిపై స్థానిక వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు జయప్రదను వివరణ కోరగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నమూనాలు పంపడం లేదని, మూసేస్తున్నట్లు తమకు సమాచారం రాలేదన్నారు.

పరీక్షలు చేసే విభాగం

మరమ్మతుకు గురైన వాటర్ డిస్టిలేషన్ యూనిట్

కోడూరులో వెంకట కృష్ణారావుకు ఘన నివాళి

కోడూరు, న్యూస్‌టుడే: దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం కోడూరులోని ప్రధాన కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి మందపాకల శివారు చింతకోళ్ల గ్రామస్థులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దివిసీమ ఉప్పెన సమయంలో సేవలను కొనియాడారు.

వెంకట కృష్ణారావు విగ్రహం వద్ద చింతకోళ్ల గ్రామస్థులు

ఉత్తమ సేవలకు ఘన సన్మానం

పామర్రుగ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని జమీదగ్గుమిల్లి జెడ్పీ పాఠశాలలో పామర్రు సీఐ సుభాకర్‌కి గురువారం ఘన సన్మానం జరిగింది. ఎన్టీఆర్ కళాపీఠం ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు గాను కళాపీఠం కాటూరి మురళీకృష్ణ, సర్పంచి కేసీఆర్, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ సన్మానించారు.

సీఐ సుభాకర్‌ని సన్మానిస్తున్న ఎన్టీఆర్ కళాపీఠం సభ్యులు

ధ్రువీకరణ పత్రాల పంపిణీ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక లక్ష్మీనారాయణస్వామి వారి ఆలయ అర్చకులకు వంశపారంపర్య ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పంపిణీ చేశారు. ఈవో వాసు పాల్గొన్నారు. ❖ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 13 మందికి మంజూరైన రూ.25,00,426 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

అవనిగడ్డ, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మోపిదేవి మండల మాజీ ఎంపీపీ మోర్ల జయలక్ష్మి, చిదంబరరావు దంపతులు ఎమ్మెల్యేకు శిరిడి సాయిబాబా పాలరాతి పూజా మందిరాన్ని బహూకరించారు.

అవనిగడ్డ రూరల్, న్యూస్‌టుడే: మోదుమూడిలో రూ.2.30లక్షలతో నిర్మించిన గోకుల షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు.

కలసికట్టుగా మండలాన్ని అభివృద్ధి చేయాలి

పెదపారుపూడి: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో 2026వ సంవత్సరంలో మండలం ప్రగతి సాధించేలా కృషి చేయాలని ఎంపీడీవో విమాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం కేక్ కోసి శుభాకాంక్షలు తెలియజేశారు. డిప్యూటీ ఎంపీడీవోలు వంగా శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కోస్తున్న ఎంపీడీవో విమాదేవి

ఫౌండేషన్ సేవలు అభినందనీయం

పెదపారుపూడి, న్యూస్‌టుడే: అమరావతి సేవా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో 50 మంది సిబ్బందికి యూనిఫాం అందజేశారు. సూరపనేని వెంకట సత్యనారాయణ, మసిముక్కు రాంబాబు, చిలకా ఆంజనేయులు, చెరుకూరి రమేష్, ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి, నాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి యూనిఫాం అందజేస్తున్న అమరావతి సేవా ఫౌండేషన్ సభ్యులు

నిమ్మకూరు ఏపీఆర్‌జేసీకి వంట సామగ్రి అందజేత

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: నిమ్మకూరు గురుకుల వృత్తి విద్యా జూనియర్ కళాశాలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో వంట సామగ్రి సమకూరిందని కళాశాల ప్రిన్సిపల్ ఎస్.లక్ష్మీకుమారి తెలిపారు. ముంబై కేంద్ర కార్యాలయం డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజయ్ సహాయ, చీఫ్ మేనేజర్ మిత్రజిత్, మచిలీపట్నం ప్రాంతీయ కార్యాలయం అధిపతి కె.వెంకట్రావు, హెచ్.పి.దాస్, ప్రహ్లాద్, సుబ్బారావు, మానిష్‌పవన్, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ప్రిన్సిపల్‌కి వంట సామగ్రి అందిస్తున్న బ్యాంకు సిబ్బంది

నూతన జీవితాన్ని ప్రారంభించాలి

గుడివాడ, న్యూస్‌టుడే: ప్రతీ వ్యక్తి గత ఏడాది దేవుడు చేసిన మేలు గుర్తుంచుకుని నూతన జీవితాన్ని ప్రారంభించాలని సాటి వారికి సాయం చేయాలని హైదరాబాద్‌లోని ఆంధ్ర క్రైస్తవ దివ్య జ్ఞాన కళాశాల రిజిస్ట్రార్ పాస్టర్ వై.జాయ్ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. చారిత్రక సీఎస్ఐ క్రైస్ట్ చర్చిలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు జరిగిన ఆరాధనలో ప్రసంగించారు. పాస్టర్లు జాషువా, ఉదయ్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు. ❖ గుడివాడ ఏలూరు రోడ్డులోని మౌంట్ కార్మేలు ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్లు మైఖేల్, ప్రతాప్ మాట్లాడారు. ❖ గుడివాడ పట్టణంలోని కోతిబొమ్మ సెంటర్‌లోని అవిలాపురి చిన తెరేజమ్మ దేవాలయం, రక్షణ సైన్యం, గాస్పెల్ ప్రేయర్, బాప్టిస్ట్ , హోసన్నా మినిస్ట్రీస్, ఫుల్ గాస్పెల్ ఆఫ్ ఇండియా చర్చిలల్లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

ప్రసంగిస్తున్న జాయ్ రాజేంద్రప్రసాద్

గుడివాడ మౌంట్ కార్మేలు ఆర్‌సీఎం చర్చిలో..

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాల మండలంలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఘంటసాలపాలెం ఆర్సీఎం చర్చిలో పాస్టర్ తోట భక్తినాధం కేకు కోశారు.

ఎన్నాళ్లీ వెతలు...

వేకనూరు రహదారిపై ఉన్న చెత్తాచెదారంతో దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో ఇటుగా ప్రయాణించే వాహన చోదకులు, సమీపంలో నివసించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జంతు కళేబరాల కోసం వీధికుక్కలు గుంపులుగా చేరి ద్విచక్ర వాహనాలకు అడ్డుపడతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు త్వరితగతిన స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, అవనిగడ్డ గ్రామీణం

అవనిగడ్డ - నాగాయలంక ప్రధాన రహదారిలో ఉన్న చెత్త

కాల్వ పూడిపోయింది

రావివారిపాలెం(మోపిదేవి), న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీ మోపిదేవి శివారు రావివారిపాలెం నవీన్ నగర్ కాలనీవాసులు పంచాయతీ అధికారుల ఉదాసీనతపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో మురుగు కాల్వ పూడుకుపోయి 15రోజులైనా పట్టించుకోని తీరుపై మండిపడుతున్నారు. మురుగు నీరు పోయేందుకు దారులు తీయాలని, దుర్వాసన వస్తోందని, దోమల వ్యాప్తితో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పంచాయతీ కార్యాలయంలో తెలిపారు. అయినా ఏ మాత్రం చర్యలు చేపట్టలేదు.

మురుగు కాల్వను చూపుతున్న గ్రామస్థులు

మురుగునీరు పోయేదెలా?

మోపిదేవి న్యూస్‌టుడే: మోపిదేవి పంచాయతీ 216 జాతీయ రహదారి పక్కనున్న మురుగుకాల్వలో నీరు పారేందుకు అవరోధాలను ఎదుర్కొంటోంది. కాల్వలో పచ్చగడ్డి మొలిచింది. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవటం లేదు. ఎగువ నుంచి వస్తున్న మురుగునీరు పెరిగిన గడ్డి వల్ల దిగువకు ప్రవహించటం లేదు. దుర్వాసన వస్తోంది. కాల్వలకు రెండువైపులా దేవాలయాలు ఉన్నాయి. భక్తులు ముక్కులు మూసుకుని నడవాల్సి వస్తోంది. గడ్డిని తొలగించాలని భక్తులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

మోపిదేవి సెంటరులో మురుగు కాల్వలో పెరిగిన పచ్చగడ్డి

భూహక్కుపై గ్రామసభలు

పెదపారుపూడి: మండలంలో గ్రామసభల ద్వారా శుక్రవారం నుంచి 7082 భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దారు శ్రీనునాయక్ చెప్పారు. రీసర్వేలో భాగంగా గతంలో ఇచ్చిన భూహక్కు పత్రాల స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన వాటిని ఇస్తారన్నారు. 2వ తేదీన భూషణగుళ్ల, గుర్విందగుంట, మహేశ్వరపురం గ్రామసభలు ఉంటాయన్నారు.

వృద్ధులు, వితంతువులకు వస్త్రదానం

పామర్రు: కొరముక్కువానిపురం, ఇందిరానగర్, భగత్‌సింగ్ క్రీస్తు వర్షిప్ టెంపుల్‌చర్చిలో గురువారం పాస్టర్ జేబీ రాణి, దేవబాలుడు ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. ఇమ్మానుయేలు ఛారిటబుల్ ట్రస్టు అనూష, ప్రదీప్ దంపతులు, కోటినాగులు, శుభాషిని దంపతుల వితరణతో ఈ చీరెలు అందించారు.

తాడంకి (పమిడిముక్కల) న్యూస్‌టుడే: తన తండ్రి యేనుగ నాగేశ్వరరావు శతజయంతి, నూతన సంవత్సరాది సందర్భంగా తాడంకి చెందిన యేనుగ సీతారామప్రసాద్, మస్తాన్‌రావు వారి సోదరులు గురువారం బీదలకు నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

ఘనంగా మరియమాత పండగ

చల్లపల్లి, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని, మరియమాత మాతృత్వ పండుగను చల్లపల్లి సాలిపేట ఆర్‌సీఎం చర్చిలో గురువారం ఘనంగా నిర్వహించారు. చర్చి ఫాదర్ బిరుదుగడ్డ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కోసి పంచారు.

ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

అవనిగడ్డ మండల పరిషత్తు కార్యాలయంలో కేకు కోస్తున్న ఎంపీపీ తుంగల సుమతి, ఎంపీడీవో మరియాదేవి తదితరులు

మోపిదేవి ఎస్సీ బాలుర వసతిగృహ విద్యార్థుల మధ్య నూతన సంవత్సర వేడుకల్లో తహసీల్దార్ హరనాథ్, ఇతర రెవెన్యూ అధికారులు

చల్లపల్లి గీతా మందిరంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక అలంకరణ - న్యూస్‌టుడే, చల్లపల్లి

మహిళలకు చీరల అందజేత

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ మండలం బొమ్ములూరు గ్రామంలో వి.కోటేశ్వరమ్మ జ్ఞాపకార్థం బొడ్డు రాణీ, సునీతలు రూపాంతర మినిస్ట్రీస్ చర్చిలో మహిళలకు చీరలను తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు గుత్తా శివరామకృష్ణ(చంటి) చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం మహిళ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ దారం నాగమణి, పాస్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు సకాలంలో చెల్లించండి

కృష్ణాపురం (పమిడిముక్కల): జిల్లా, మండల పరిషత్తు పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, వంట ఏజెన్సీలకు నెలల తరపడి జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. వారికి సకాలంలో జీతాలు చెల్లించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి విజయకుమార్, యూనియన్ మండల అధ్యక్షుడు డి.కోటయ్య కోరారు.

అవనిగడ్డలో నూతన సంవత్సర సందడి

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు శుభాకాంక్షలు చెబుతున్న అవనిగడ్డ సర్కిల్ పోలీసు అధికారులు, సిబ్బంది

అవనిగడ్డ: స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా గురువారం సందడి నెలకొంది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపడానికి వచ్చిన వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలతో నూతన శోభ వెల్లివిరిసింది. అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యాశ్రీ, అవనిగడ్డ సర్కిల్ పోలీసు అధికారులు, ఇతర మండలాల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి, తెదేపా నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు స్థానిక ప్రధాన రహదారిపై కేక్ కోసి పంపిణీ చేశారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావుకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

పామర్రుగ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ఐ, ఆర్‌సీఎం, పెంతెకోస్తు, తదితర క్రైస్తవ సంఘాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి ప్రార్థనల్లో పాలుపంచుకున్నారు.

కూటమి నేతలతో కలసి సంబరాలు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ తెదేపా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, సుఖద దంపతులతో కలిసి పలువురు కూటమి నేతలు కేక్ కోశారు. అభిమానులు రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండరును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. దివ్యాంగ చిన్నారులకు బహుమతులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గ ప్రజలకు ఆ దేవుడు ఆయురారోగ్యాలను ప్రసాదించాలన్నారు. గుడివాడ ఆర్డీవో జి.బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు, పురపాలక కమిషనర్ సింహాద్రి మనోహర్ శుభాకాంక్షలు తెలిపారు. సీఐలు సోమేశ్వరరావు, హనీష్, శ్రీనివాస్, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నేతలు బూరగడ్డ శ్రీకాంత్, సందు పవన్, లింగం ప్రసాద్, పంద్రాజు సాంబయ్య, రవికుమార్, పొట్లూరి రవి, దింట్యాల రాంబాబు, వాసే మురళీ తదితరులు పాల్గొన్నారు.

తెదేపా నూతన సంవత్సర క్యాలెండరును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాము

ఎమ్మెల్యే రామును కలిసిన డివిజన్ పోలీసు సిబ్బంది

ఆనందంగా జీవించాలి

కూచిపూడి, న్యూస్‌టుడే: కొత్త ఆశలు, ఆనందాలతో నూతన సంవత్సరంలోకి అడుగు పెడుతున్నామంటూ ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పెదపూడి బేతేల్ చర్చిలో వేడుకలు పాస్టర్ ఇమానియేల్ ఆధ్వర్యంలో జరిగాయి. వీరేంద్ర, ప్రభాకరరావు, రాజా తదితరులు పాల్గొన్నారు. నిడుమోలు బేతేల్ ప్రార్థనా మందిరంలో ఎమ్మెల్యే, సతీమణి విశ్రమ పాల్గొని కేకును కోశారు.

నిడుమోలులో కేకు కోస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా దంపతులు

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

పామర్రు: నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. గురువారం స్థానిక తెదేపా కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని కేక్ కోసి పంచారు. నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేయాలి: కనపర్తి

మోపిదేవి, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి శత శాతం విజయం సాధించి ప్రతిపక్షానికి అవకాశం లేకుండా చేయాలని నియోజకవర్గ తెదేపా పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మోపిదేవి తెదేపా కార్యాలయంలో న్యూఇయర్ కేక్ కోసి తినిపించారు. నడకుదిటి జనార్ధనరావు, రావి నాగేశ్వరరావు, రత్నగిరి, జొన్నలగడ్డ రాము, రత్నగిరి, రంగారావు, శివరామకృష్ణ, సీతారామాంజనేయులు, బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పార్టీ కార్యాలయంలో కేక్ కోస్తున్న కనపర్తి

❖ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావుకు తెదేపా నాయకులు కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. కొల్లి మురళి, విస్సంశెట్టి రాజా, కోనేరు సుందర్‌సింగ్, గొరిపర్తి శ్రీనివాసరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా కార్యాలయంలో వేడుకలు

పామర్రు: వైకాపా కార్యాలయంలో గురువారం మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ నేతృత్వంలో నూతన సంవత్సర వేడుకలను పార్టీ నాయకులతో నిర్వహించారు. కేక్ కోసి తినిపించుకున్నారు.

వాహనం అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

చల్లపల్లి, న్యూస్‌టుడే: మద్యం మత్తులో అతివేగంగా మోటారు వాహనం నడిపి చల్లపల్లి మండలం పురిటిగడ్డకు చెందిన గంజి నాని, కనపర్తి కల్యాణ్ గాయాల పాలయ్యారు. చల్లపల్లి-నడకుదురు రోడ్డులో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. నాని వాహనాన్ని వంకర్లు తిప్పుతూ నడపడంతో అదుపుతప్పి తీవ్ర గాయాల పాలయ్యారు. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్చారు. గురువారం సాయంత్రం వారు మార్గం మధ్యలో ఐదారుగురిని ఢీకొనేవారని, అదృష్టవత్తూ బయటపడ్డామని పలువురు చెబుతున్నారు.

ప్రమాదానికి గురైన యువకులు

తోట్లవల్లూరులో మండల పరిషత్తు కార్యాలయంలో..

ఘనంగా వేడుకలు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి కేక్ కోసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పలు గ్రామాల ఎంపీటీసీలు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని తోట్లవల్లూరు గ్రామంలోని పలు చర్చిల్లో గురువారం తెదేపా నాయకుడు తటుకూరి రమణ కేక్‌లు, స్వీట్లు పంపిణీ చేశారు.

11న హిందూ సమ్మేళనం

పామర్రు, న్యూస్‌టుడే: ఈనెల 11న ఆదివారం బందరు రోడ్డులోని బైసాని నాగేశ్వరరావు స్థలంలో నిర్వహించే పామర్రు మండల హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని హైందవ బంధువులు కోరారు. గురువారం స్థానిక విష్ణాలయంలో ఏర్పాట్లపై చర్చించారు. దేశభక్తి, హిందూ సమాజం పట్ల గౌరవభావం, అంకితభావం, సేవా గుణం, వంటి వాటిని వికసింపజేసేందుకు సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆహ్వాన పత్రికలను విడుదలచేస్తున్న హిందూ బంధువులు

(c) eenadu

కనుల నిండుగ... కనకదుర్గమ్మ...

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను నూతన సంవత్సరం మొదటి రోజు గురువారం దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ భక్తులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించి పర్యవేక్షించారు.

- ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

ఈపీఎఫ్ కార్యాలయం చిరునామా మార్పు

ఈనాడు, అమరావతి: విజయవాడలోని ఉద్యోగుల భవిష్య నిధి(ఈపీఎఫ్‌వో) జిల్లా కార్యాలయం చిరునామా మారింది. ప్రస్తుతం విజయవాడ దుర్గ అగ్రహారంలోని అన్నదాన సమాజం రోడ్డులో ఈపీఎఫ్‌వో కార్యాలయం ఉంది. దీనిని అక్కడి నుంచి విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్(పీఎన్‌బీఎస్)లోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లోని.. మూడో అంతస్తులో ఉన్న ఆర్టీసీ హౌస్‌లోకి మార్చారు. ఇకనుంచి కొత్త కార్యాలయానికే.. ఈపీఎఫ్‌వో సభ్యులు, పింఛనుదారులు, సాధారణ ప్రజలు రావాలని.. విజయవాడ రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-02 అబ్దుల్ ఖాదర్ తెలిపారు.

ఆహార భద్రతకు అదనపు భరోసా

కార్డుదారుకు గోధుమపిండి ప్యాకెట్ అందిస్తున్న పౌరసరఫరాల సంస్థ ఎండీ డిల్లీరావు తదితరులు

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా ఆహార భద్రతను మరింత పటిష్ఠం చేయాలనే ఉద్దేశంతో రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం రూ.20 లకే కిలో గోధుమపిండి అందిస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వీసీ, ఎండీ ఎస్.డిల్లీరావు తెలిపారు. గురువారం విజయవాడ పటమట ఏపీఐఐసీ కాలనీలోని చౌకధరల దుకాణంలో కార్డుదారులకు గోధుమ పిండి పంపిణీ కార్యక్రమాన్ని పౌర సరఫరాల డైరెక్టర్ గోవిందరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియలతో కలిసి ఆయన ప్రారంభించారు. డిల్లీరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక సమావేశంలో చేసిన సూచనలు మేరకు కొత్త సంవత్సరం ప్రారంభం రోజున సంక్రాంతికి ముందు ఓ మంచి కార్యక్రమం ప్రారంభించినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతి నెలా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన 1850 మెట్రిక్ టన్నుల గోధుమలను తీసుకుని ప్రస్తుతం పిండి సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లా ప్రధాన కేంద్రాల్లో సరఫరా చేస్తున్నామని దశల వారీగా విస్తృతం చేయనున్నట్లు వెల్లడించారు. పంపిణీలో ఏమైనా సమస్యలు ఎదురైతే లబ్ధిదారులు సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన పోషక సహిత గోధుమపిండి అందించడం జరుగుతోందన్నారు. మిల్లింగ్, ప్యాకింగ్, రవాణా ఇలా ప్రతి దశలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, ఏఎస్‌వో శ్రీనివాసులు నాయుడు, జిల్లా డీలర్ల అసోసియేషన్ కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్ శివప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక.. పండగొచ్చేసిందోచ్!

ఇందిరాగాంధీ మైదానంలో 36వ ప్రదర్శన

309 స్టాళ్లు.. జనవరి 12 వరకు నిర్వహణ

ఈనాడు, అమరావతి

విజయవాడ పుస్తక మహోత్సవానికి.. వేదిక సిద్ధమైంది. నేటి నుంచి 36వ పుస్తక పండగ.. విజయవాడలో సందడి చేయబోతోంది. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జనవరి 02 నుంచి 12 వరకు.. వేడుక జరగబోతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి స్టాళ్ల సంఖ్య బాగా పెరిగింది. దేశంలోని ప్రముఖ ప్రచురణ సంస్థలన్నీ తరలివచ్చాయి. ఈసారి తెలుగుతోపాటు ఆంగ్ల పుస్తకాల ప్రచురణ సంస్థలు భారీగా వచ్చాయి.. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ (బీఎఫ్ఎస్) అధ్యక్షుడు టి.మనోహర్ నాయుడు తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 09 వరకు ప్రదర్శన కొనసాగుతుంది.

ఇందిరాగాంధీ స్టేడియంలో పుస్తక ప్రదర్శనకు జరుగుతున్న ఏర్పాట్లు.. స్టాల్స్‌లో పుస్తకాలు సర్దుకుంటూ..

భారీ స్పందనకు వీలు..

హైదరాబాద్‌లో పుస్తక మహోత్సవానికి ఈసారి విపరీత రద్దీ నెలకొంది. కొనుగోళ్లూ భారీగా పెరిగాయి. అందుకే.. విజయవాడ పుస్తక మహోత్సవానికి సైతం స్పందన భారీగా ఉండబోతోందని నిర్వాహకులు అంచనా వేసి ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా యువత, పిల్లలు ఎక్కువగా రానున్నారు. పాఠశాలల్లో పుస్తక పఠనం పెంచడానికి చేస్తున్న ప్రయత్నాలే దీనికి కారణం.

స్టాళ్లు.. పెరిగాయి..

262 స్టాళ్లు.. దేశంలోని ప్రముఖ ప్రచురణ సంస్థలవి కాగా.. 47 స్టాళ్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలవి. నిరుడు 240 స్టాళ్లే ఏర్పాటయ్యాయి. గతసారి వేదిక వెతుకులాటతోనే ఆఖరు నిమిషం వరకూ ఉత్కంఠ నెలకొనగా.. చివరిలో ఇందిరాగాంధీ మైదానం కుదిరింది. ఈసారి ముందే వేదికపై స్పష్టతరాగా.. స్టాళ్ల సంఖ్య గణనీయంగా పెరిగింది.

మహోత్సవం విశేషాలు..

* కృష్ణా, గుంటూరుల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను తరలించేలా సహకరించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను బీఎఫ్‌ఎస్ తరఫున విజ్ఞప్తి చేశారు. దీంతో ఈసారి విద్యార్థుల రద్దీ విపరీతంగా ఉండబోతోంది.
* కోల్‌కతా పుస్తక ప్రదర్శన స్ఫూర్తితో ఏటా 'పుస్తక ప్రియుల పాదయాత్ర' విజయవాడలోనూ నిర్వహిస్తున్నారు. జనవరి 6న సాయంత్రం 4 గంటలకు మొగల్రాజపురం సిద్ధార్థ కళాశాల నుంచి పుస్తక మహోత్సవ ప్రాంగణం వరకూ పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈసారి ముఖ్యఅతిథిగా చంద్రబోస్ రానున్నారు.
* 1989 అక్టోబరులో నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొదటి పుస్తక మహోత్సవం విజయవాడలో నిర్వహించారు. తర్వాత ఏటా పుస్తక మహోత్సవం నిర్వహించాలని ప్రచురణకర్తలు నిర్ణయించారు. విజయవాడలో ప్రచురణకర్తలు, సాహితీవేత్తలు, కవులు, రచయితలు అంతా కలిసి విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం(వీబీఎఫ్‌ఎస్)గా ఏర్పడ్డారు.
* తొలి ఏడాది 1989లో 84 స్టాళ్లతో నిర్వహించగా, 1991లో 90కు పెరిగాయి. 2015లో అత్యధికంగా 389 స్టాళ్లతో రికార్డు సృష్టించారు. క్రమంగా స్టాళ్లు తగ్గుతూ.. ఈసారి 309కి పెరిగాయి.

ప్రపంచ తెలుగు మహాసభలకు అంతా సిద్ధం

వేదికను పరిశీలిస్తున్న గజల్ శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, పీటర్ రాజు తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గుంటూరు ఏటుకూరు బైపాస్ రోడ్డులోని శ్రీసత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ ప్రాంగణంలో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో జరగనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు అంతా సిద్ధమైంది. దాదాపు ఆరు వేల మంది ప్రతినిధులు కార్యక్రమాలు చూసేందుకు వీలుగా ప్రధాన వేదికను రూపొందించారు. దీంతో పాటు మరో నాలుగు వేదికలు సిద్ధమయ్యాయి. సభలకు వచ్చే వారి కోసం భోజన వసతి, వివిధ అంగళ్లు, ప్రదర్శనశాలల నిర్మాణాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. సాహిత్య, సాంస్కృతిక, కళాంశాల ఆస్వాదనకు ప్రేక్షకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన అన్ని ఏర్పాట్లు, నిర్వహణలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఇది తెలుగు చేవ అని ప్రపంచానికి తెలియజెప్పేలా కార్యక్రమాలను రూపకల్పన చేశామని పేర్కొన్నారు.

గ్రీష్మ కోసం గాలింపు

★ ఎండీఎంఏ కేసులో తెరపైకి ఇంజినీరింగ్ విద్యార్థిని

★ బెంగళూరులో పలువురు విద్యార్థులకు సరఫరా..

ఈనాడు, అమరావతి: ఎండీఎంఏ కేసులో కొత్తగా తెరపైకి మరో ఇంజినీరింగ్ విద్యార్థిని గ్రీష్మ పేరు బయటకు వచ్చింది. ఈమె నుంచి డ్రగ్స్ తీసుకుంటున్నట్లు ఈ కేసులో తాజాగా అరెస్టు అయిన మహేష్ వెల్లడించాడు. దీంతో పోలీసులు గ్రీష్మ కోసం బెంగళూరులో ప్రత్యేక బృందంతో గాలిస్తున్నారు. మహేష్ అరెస్టు తర్వాత ఆమె అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది. యువతిని అదుపులోకి తీసుకుని విచారిస్తే.. మత్తు మందు సరఫరా మూలాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

గ్రీష్మ నుంచి కొనుగోళ్లు... రాజమహేంద్రవరం నగరానికి చెందిన మహేష్.. బెంగళూరులోని అలయన్స్ విశ్వవిద్యాలయంలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. అదే కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్న గ్రీష్మ పరిచయమైంది. మత్తుకు అలవాటుపడిన మహేష్.. ఆమె నుంచి ఎండీఎంఏ కొనుగోలు చేసేవాడు. వాట్సప్‌లో యూపీఐ స్కానర్ పంపితే.. దానిని స్కాన్ చేసి డబ్బులు పంపేవాడు. సొంతంగా వినియోగించుకున్న తర్వాత మిగిలింది, ఇతరులకు ఎక్కువ ధరకు అమ్మేవాడు.

★ ఈ కేసులో ఇప్పటికే అరెస్టు అయి.. రిమాండ్‌లో ఉన్న జగదీష్‌కు విజయవాడలో మహేష్ పరిచయమయ్యాడు. బెంగళూరు వచ్చినప్పుడు తనను కలవమని.. ఆ సందర్భంగా చెప్పాడు. దీంతో జగదీష్ కుమార్, అఖిలేష్ విజయవాడ నుంచి తరచూ బెంగళూరు వెళ్లి ఎండీఎంఏ కొనుగోలు చేసి తెచ్చుకునేవారు. గత నెల 19న వీరిద్దరూ కారులో బెంగళూరు వెళ్లారు. అక్కడ దిగిన తర్వాత మహేష్‌కు వాట్సప్‌లో కాల్ చేసి డ్రగ్ కావాలని అడిగారు. వారిని ఆరోజు మార్తనహళ్లిలోని పీజీ హాస్టల్‌లో మహేష్‌ను ఉంచాడు. గ్రీష్మ నుంచి 19 గ్రాముల డ్రగ్ తీసుకుని.. హాస్టల్‌కు వెళ్లి జగదీష్ కుమార్, అఖిలేష్‌కు ఇచ్చాడు. వారి నుంచి రూ.38 వేలు తీసుకున్నాడు. ఇదే కేసులో పరారైన మరో నిందితుడు రాజేష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సమన్వయంతో జిల్లా ప్రగతికి కృషి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టర్ విడిది కార్యాలయంలో నూతన సంవత్సరం పురస్కరించుకుని గురువారం సాయంత్రం 'ఎట్ హోమ్' కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ జి. లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, జేసీ ఎస్.ఇలక్కియా, డీసీపీ కె.జి.వి.సరిత, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు. కేకు కోసి, ఒకరినొకరు తినిపించుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా అధికారులు సమన్వయంతో పని చేసి, రాష్ట్రంలో ఎన్టీఆర్ జిల్లాను అన్ని విధాలా ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కేకు తినిపించుకుంటున్న సీపీ రాజశేఖరబాబు, కలెక్టర్ లక్ష్మీశ. పక్కన డీసీపీ సరిత, జేసీ ఇలక్కియా

రంగుల వేడుక.. రమణీయ వేదిక

5వ తేదీ నుంచి ప్రారంభం

తెలుగు రాష్ట్రాల్లో పెనుగంచిప్రోలు తిరుపతమ్మ రంగుల మహోత్సవానికి ప్రత్యేకత ఉంది. గ్రామ దేవత ఉత్సవాలను వందల ఏళ్ల నుంచి సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుక రెండేళ్లకోసారి పెద్ద పండగలా జరుపుకొంటారు. ఈ ఉత్సవం జనవరి 5వ తేదీన నిర్వహించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎద్దుల బండ్లపై జగ్గయ్యపేటకు.. అమ్మవారి ఆలయం వద్ద నుంచి 11 విగ్రహాలను రజకులు తమ శిరస్సులపై ఉంచుకుని గ్రామంలో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారి మండపం వద్ద ఉంచుతారు. అనంతరం లాటరీ పద్ధతిలో ఎంపిక చేసిన రైతులు తమ ఎద్దుల బండ్లపై విగ్రహాలను ఉంచి అనంతరం జగ్గయ్యపేటకు భారీ బందోబస్తు మధ్య తీసుకెళ్తారు. రాత్రికి పెనుగంచిప్రోలు మండపం వద్ద నుంచి మక్కపేట, చిల్లకల్లు మీదుగా జగ్గయ్యపేటలోని రంగుల బజారు వద్ద తీసుకెళ్లి రంగులు వేసే నిపుణులకు అప్పగిస్తారు. పెద్ద తిరుపతమ్మ, పెద్ద గోపయ్యస్వామి, ఉన్న ఊరు అంకమ్మ, చంద్రమ్మ, మల్లయ్యస్వామి, మద్దిరావమ్మ, వినుకొండ అంకమ్మ, తిరుపతమ్మ, గోపయ్య స్వాముల ఉత్సవ మూర్తులు, పెద్దమ్మ అమ్మవార్లు, గుర్రపు వాహనం కలిపి సహదేవతల విగ్రహాలతో పాటు రంగులను సైతం తీసుకెళ్తారు.

పల్లకీల్లో తిరుగు పయనం..

జగ్గయ్యపేటలో అమ్మవారి విగ్రహాలకు రంగులు వేశాక జనవరి 28వ తేదీన తిరిగి పల్లకీల్లో బయలుదేరతారు. అక్కడ నుంచి జగ్గయ్యపేట, చిల్లకల్లు, భీమవరం, లింగగూడెం, పెనుగంచిప్రోలు గ్రామాలకు పల్లకీల్లో తీసుకొస్తారు. విగ్రహాలను పెనుగంచిప్రోలులో విడిది మండపం వద్ద ఉంచుతారు. ప్రత్యేక పూజల అనంతరం విగ్రహాలను ఇనుప రథంపైకి చేర్చుతారు. అనంతరం ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వరకు తీసుకొచ్చి విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. మరుసటి రోజు పెద్ద తిరునాళ్లు, దీక్షా స్వాములు తిరుముడి సమర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. –పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

సేంద్రియ వ్యవసాయంపై 3న సహజ రైతు సదస్సు

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు ఈనెల 3న 'సహజ రైతు సదస్సు'ను విజయవాడలోని వెన్యూ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి పేర్కొన్నారు. గురువారం విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు అధికంగా ఎరువులు, పురుగు మందులపై ఆధార పడడం వల్ల ఖర్చులు పెరగడంతో పాటు నేల సారం తగ్గి ఆరోగ్య సమస్యలు పెరిగాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనేక పథకాల ద్వారా రైతులను రసాయన రహిత సాగు వైపు ప్రోత్సహిస్తుందని తెలిపారు. రైతులకు శిక్షణ, సర్టిఫికేషన్, మార్కెట్‌కు అనుసంధానం చేయడం, ఉత్పత్తులకు మంచి ధర వచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

సిబ్బంది లేరు.. రోవర్లు రావు!

నాలుగో విడత రీసర్వేకు బాలారిష్టాలు ★ 21 గ్రామాల్లో వాయిదా...

ఈనాడు, అమరావతి

"**నా**లుగో విడత రీసర్వేకు బాలారిష్టాలు వీడలేదు. సర్వేకు కీలకమైన రోవర్లు, సిబ్బంది కొరత వేధించడంతో సర్వే గ్రామాలను తగ్గించి శుక్రవారం నుంచి రీసర్వే మొదలు పెట్టనున్నారు. సర్వే మొదలు పెట్టే సమయానికి రోవర్లు, సిబ్బందిని సర్దుబాటు చేస్తామని అధికారులు చెప్పినా చివరికి చేతులెత్తేశారు. దీంతో మరో రెండు విడతల్లో పూర్తి కావాల్సిన రీసర్వే మూడు విడతలకు పెరిగింది."

వాయిదా ఇక్కడే..

రెడ్డిగూడెం, మద్దులపర్వ, రోలుపూడి, విస్సన్నపేట, లింగాల, కోడూరు, కీసర, సిరిఅమరవరం, చందర్లపాడు, కొడవటికల్లు, గుడిమెట్ల, ముక్తేశ్వరపురం, వేదాద్రి, మక్కపేట, పొలంపల్లి, అనిగండ్లపాడు, తెల్లదేవరపాడు, సున్నంపాడు, పొందుగులలో రీసర్వే వాయిదా వేశారు. ఈ 20 గ్రామాల్లో 69,854 ఎకరాల్లో చేయాల్సిన రీసర్వే నిలిచింది. సర్వే ఏడీ మోహన్‌రావు మాట్లాడుతూ... ప్రస్తుత సిబ్బంది, రోవర్లతో సర్వే చేపట్టేందుకు ఏర్పాటు చేశాం.. త్వరలో మిగిలిన ప్రాంతాల్లో చేపడతామని వివరించారు.

40 గ్రామాలకే పరిమితం...

★ జిల్లాలో గత మూడు విడతల్లో సర్వే చేసినవి కాక... ఇంకా 123 గ్రామాల్లో రీసర్వే చేయాలి. ★ నాలుగో విడతలో ఇందులో 61 గ్రామాల్లో 1.83 లక్షల ఎకరాల్లో 93 బృందాలతో జనవరి 2 నుంచి సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ★ కొన్ని మండలాల్లో సిబ్బంది రోవర్లు లేవని అన్ని గ్రామాల్లో సర్వే సాధ్యం కాదని స్థానిక సిబ్బంది ఉన్నతాధికారులకు తెలిపారు. ★ జిల్లాలో 60 రోవర్లు ఉండగా.. స్వామిత్వ సర్వేకు 7, మీకోసం ఫిర్యాదులు, సాధారణ సర్వేలకు 13 కేటాయించగా.. 40 రోవర్లు మాత్రమే ఉన్నాయి. ★ వీఆర్వో, సర్వేయర్లు కూడా పూర్తిగా లేరు. ★ ఉన్నతాధికారులు సైతం కాడి వదిలేయడంతో 21 గ్రామాల్లో సర్వే వాయిదా వేశారు. ★ దీంతో ప్రస్తుతం 1.15 లక్షల ఎకరాల్లో 52 బృందాలు మాత్రమే సర్వే చేయనున్నాయి. ఈ విడత 61 గ్రామాల్లో చేస్తే అయిదో విడతలో మిగిలినవి పూర్తి చేస్తే రీసర్వే ముగిసేది. ★ తాజా మార్పుతో 83 గ్రామాల్లో ఒక్క విడతలో చేయడం సాధ్యం కాదు.

ట్రాఫిక్ ఉల్లంఘనలు 4.68 లక్షలు

ఏడాది నివేదిక విడుదల

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

ట్రా'ఫికర్' అంటేనే బెజవాడ అంటారు. పండుగలు, వేడుకలు వచ్చాయంటే సాయంత్రం వేళ రహదారులన్నీ కిక్కిరిసిపోతాయి. అడుగు తీసి ముందుకు వేయాలంటే పాదచారి అష్టకష్టాలు పడాల్సిందే. ఇక ట్రాఫిక్‌ను దాటి వాహనం ముందుకు కదలాలంటే.. వ్యవప్రయాసలు తప్పవు. నిబంధనల ఉల్లంఘనలు సైతం అధికంగానే ఉంటున్నాయి. ఒకప్పుడు నిబంధన ఉల్లంఘిస్తే పట్టుకుని కేసు రాసేవారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో వచ్చిన తర్వాత ఫొటోలు తీసి 'ఈ-చలాన్' విధిస్తున్నారు. వీటికి సంబంధించిన 2025 ఏడాది నివేదికను అధికారులు వెల్లడించారు.

వివరం	చలానాలు	జరిమానా రూ.
శిరస్త్రాణం	1,25,285	7,78,15,400
డీఎల్, ఆర్‌సీ	49,183	75,46,050
నంబరు ప్లేటు లేనివి	23,487	34,42,550
ప్రమాదకర డ్రైవింగ్	9,242	92,42,000
బీమా లేకుండా	2,969	33,34,000
శబ్ద, వాయు కాలుష్యం	2,851	30,52,000
మైనర్ డ్రైవింగ్	1,660	20,22,500
నో ఎంట్రీ, నో పార్కింగ్	1,654	1,66,200
సీటు బెల్టు లేకపోవడం	132	1,32,000

ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో 2025 సంవత్సరంలో 54 రకాల ఉల్లంఘనలపై కేసులు నమోదు చేశారు. ద్విచక్రవాహనాలు, కార్లు, హెవీ వెహికల్స్ (బస్సులు, లారీలు)పై వేర్వేరుగా ఈ ఉల్లంఘనలు గుర్తించి వాటిపై ఈ-చలాన్‌లు విధించారు.

శిరస్త్రాణం లేని కేసులే ఎక్కువ

నమోదు చేసిన మొత్తం కేసుల్లో శిరస్త్రాణం లేకుండా ద్విచక్రవాహనం నడిపిన కేసులే ఎక్కువగా ఉన్నాయి. ఆ తర్వాతి స్థానం నో డ్రైవింగ్ లైసెన్సు. మూడో స్థానంలో నంబరు ప్లేటు సక్రమంగా లేని కేసులే.

- ఈ-చలాన్‌ల సంఖ్య : 4,68,456
- చోదకులు కట్టినవి : 3,16,422
- జరిమానా : రూ.13,62,74,400
- వసూలైనవి : రూ.7,42,35,250

రహదారి భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో 37వ రహదారి భద్రతా మాసోత్సవాలను గురువారం ప్రారంభించారు. ఇవి ఈనెల 31వ తేదీ వరకు కొనసాగుతాయి. ప్రచార పోస్టర్లను నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి. లక్ష్మీశ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. శిక్షణతో భద్రత, సాంకేతికత ద్వారా పరివర్తన ఇతివృత్తంతో రవాణా శాఖ ఆధ్వర్యంలో మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమన్వయ శాఖల అధికారుల భాగస్వామ్యంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. వివిధ రకాల పోటీలు, ర్యాలీలు, సమావేశాలను నిర్వహిస్తామన్నారు. పోలీసు, రవాణా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుక్కేసి.. సిందేసి..!

- ఒక్కరోజే... రూ.37.18 కోట్ల మద్యం తాగారు
- కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఏరులై పారిన మందు

ఈనాడు, అమరావతి

నూతన సంవత్సర వేడుకల్లో మద్యం ఏరులై పారింది. ఊరూవాడా అన్ని వర్గాలు హుషారుగా కొత్త సంవత్సరాదికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు చోట్ల పార్టీల్లో మద్యం బాబులు సందడి చేశారు. నూతన సంవత్సర సంబరాలు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మిన్నంటాయి. కాలనీలు, అపార్ట్‌మెంట్లలోనూ హంగామా చేశారు. విజయవాడ నగరంలో జోష్ ఎక్కువగా కనిపించింది. అర్ధరాత్రి వరకు చిందులేశారు. డిసెంబరు 31న మద్యం అమ్మకాలు ఎగబాకాయి. మామూలు రోజులతో పోలిస్తే దాదాపు రెట్టింపు తాగారు. మద్యం దుకాణాలు, బార్లలో భారీగా మద్యం విక్రయాలు సాగాయి. ఒక్క రోజే రెండు జిల్లాల వాసులు మద్యం కోసం రూ.37 కోట్లు ఖర్చు పెట్టారు.

- నూతన సంవత్సరం సందర్భంగా రెండు జిల్లాలో పలు చోట్ల వేడుకలు నిర్వహించారు. పలు సంస్థల ఆధ్వర్యంలో ఇవి జరిగాయి. వీటికి పోలీసుల నుంచి అనుమతి ఇచ్చారు. మద్యం వినియోగించే ఉత్సవాలకు ఎక్సైజ్ అధికారులు నుంచి కూడా అనుమతి తీసుకున్నారు. అర్ధరాత్రి వరకు మద్యం ఏరులై పారింది. ఉత్సవాలలోనే కాకుండా మిగిలినచోట్ల కూడా మందు బాబుల సందడి కనిపించింది.

- ఎన్టీఆర్ జిల్లాలో 86 బార్లు, 124 మద్యం దుకాణాలు ఉన్నాయి. కృష్ణాలో 32 బార్లు, 135 దుకాణాలు ఉన్నాయి. ఇవి అర్ధరాత్రి 12 గంటల వరకు తెరిచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో అమ్మకాలు భారీగా నమోదయ్యాయి. రోజు వారీ అమ్మకాల కంటే సుమారు రెట్టింపు స్థాయిలో జరిగాయి. రెండు జిల్లాల్లో కలిపి బీర్లు 15,825 కేసులు, ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎల్) 38,434 కేసులు అమ్ముడయ్యాయి. వీటి విలువ రూ.37.18 కోట్లు. సాయంత్రం నుంచే దుకాణాల వద్ద పెద్ద క్యూలు కనిపించాయి. పోలీసులు వివిధ ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. విజయవాడ నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పలువురిని అదుపులోకి తీసుకుని వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

(c) eenadu

ఆశకు పోతే... అసలుకే ఎసరు!

- సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాల్సిందే
- 'ఈనాడు-ఫోన్ ఇన్'లో సైబర్ క్రైం డీసీపీ కృష్ణప్రసన్న

ఈనాడు మీతోడు

ప్రజల సమస్యలకు సమాధానాలు ఇస్తున్న డీసీపీ కృష్ణప్రసన్న

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

డిజిటల్ అరెస్టు పేరుతో భయపెట్టి కష్టార్జితాన్ని గుంజేస్తున్నారు. తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభాలు అంటూ రూ.లక్షల్లో టోకరా వేస్తున్నారు. ఈ-చలాన్ల పేరుతో ఏపీకే ఫైల్స్ పంపి ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. మనకు తెలియకుండానే ఖాతాలో డబ్బులు బదలాయించేస్తున్నారు. కొత్త కొత్త మోసాలు వెలుగుచూస్తున్నాయి. వాటిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సైబర్ క్రైం డీసీపీ కె.కృష్ణప్రసన్నతో 'ఈనాడు' ఫోన్ ఇన్ కార్యక్రమం చేపట్టింది. దీనికి పలువురు ఫోన్లు చేసి.. తాము మోసపోయిన తీరు వివరించారు. వారి ప్రశ్నలకు డీసీపీ సమాధానాలు ఇచ్చి, పరిష్కార మార్గాలు చూపారు.

? ధనీ లోన్ యాప్ ద్వారా రుణాలు ఇస్తామని నమ్మించారు. విడతల వారీగా మొత్తం రూ.20,050 కట్టాం. గంపలగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. **- రాంబాబు, గంపలగూడెం మండలం**

✔ ధనీ లోన్ యాప్ అనేది పూర్తిగా మోసం. అలాంటి వారి మాటలు నమ్మకండి. మీరు కట్టిన డబ్బులు ఏ ఖాతాకు వెళ్లాయో పరిశీలించి, న్యాయం జరిగేలా చూస్తాం.

? ఓఎల్ఎక్స్‌లో ఏసీ కొనేందుకు 7 నెలల క్రితం రూ.13,500 కట్టాం. ఎస్‌కే ట్రేడర్స్ అనే పేరుతో ఉన్న సంస్థకు ఫోన్ పే చేశాం. ఏసీ పంపలేదు. డబ్బులు తిరిగి ఇవ్వలేదు. **- కిషోర్, విజయవాడ**

✔ ఓఎల్ఎక్స్‌లో తరచూ ఇలాంటి మోసాలు జరుగుతున్నాయి. మీరు చేసిన ఫోన్ పే ఖాతా వివరాలు ట్రేస్ చేస్తాం. అందులో డబ్బులు ఉంటే స్తంభింపచేసి, డబ్బులు వెనక్కి తెప్పిస్తాం.

? మా అమ్మాయి ఇంజినీరింగ్ చదువుతోంది. గుర్తు తెలియని వారు ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యంగా ప్రచారం చేస్తున్నారు. చర్యలు తీసుకోగలరు. **- ఓ తండ్రి, ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్**

✔ వివరాలతో ఇన్‌స్టాగ్రామ్‌కు లేఖలు రాస్తాం. సదరు ప్రచారాన్ని తొలగించేలా చేస్తాం.

? స్నేహితుడి చరవాణి నుంచి మేసేజ్ వచ్చింది. అది ఏపీకే ఫైల్ అని తెలిసింది. నా బ్యాంకు ఖాతాలో రూ.7 లక్షలు ఉన్నాయి. బ్యాంకుకు వెళ్లి ఖాతాను స్తంభింపచేయమని అడిగితే లిఖిత పూర్వకంగా ఇమ్మంటున్నారు. అర్ధరాత్రి పూట జరిగితే బ్యాంకులకు వెళ్లి ఫిర్యాదు చేయలేం కదా. టోల్ ఫ్రీ నంబరు ఉంటే చెప్పగలరు. **- తోక మల్లికార్జున్, సూర్యారావుపేట**

✔ ప్రతి బ్యాంకుకు 24 గంటలూ పని చేసే టోల్‌ఫ్రీ నంబర్లు ఉంటాయి. అర్ధరాత్రి అయినా.. ఫోన్ చేసి ఏటీఎం కార్డు, ఖాతా నంబర్లు చెబితే బ్లాక్ చేస్తారు. డబ్బులు పోతే వెంటనే 1930 నంబరుకు కాల్ చేస్తే. కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు.

? నా పేరుతో డబ్బులు పంపమని సైబర్ నేరగాళ్లు.. నా స్నేహితులందరికీ మేసేజ్ చేశారు. మా బావమరిది చెబితే తెలిసింది. నా ఫోన్ హ్యాక్ అయిందని ఫ్యాక్టరీ రీసెట్ చేశాను. సిమ్ కార్డు మార్చమని చెబుతున్నారు. మార్చుకోవాలా? **- రమణబాబు, శ్రీనగర్‌కాలనీ**

✔ మీ సిమ్ కార్డు ఎస్.ఎం.ఎస్. ఫార్వార్డ్ అనే ఆప్షన్‌లోకి వెళ్లి ఉంటుంది. మీ సర్వీస్ ప్రొవైడర్ వద్దకు వెళ్లి చెక్ చేయించుకోండి. కొత్త సిమ్ కార్డు తీసుకోవాలో లేదో వారే చెబుతారు. సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌కు వచ్చినా తనిఖీ చేసి చెబుతారు.

? సత్యనారాయణపురంలో నా పర్సు జారిపోయింది. అందులో ఫోన్, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకుల ఏటీఎంలు ఉన్నాయి. ఒక ఏటీఎంను బ్లాక్ చేయించాను. ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ.5వేలు, ఆరు విడతలుగుఆ మరో రూ.5వేలు చొప్పున డ్రా చేశారు. 1930 నంబరుకు ఫిర్యాదు చేశాను. **- జ్యోత్స్న, గవర్నర్‌పేట**

✔ ఏటీఎం పిన్ తెలుసుకుని అలా చేసి ఉండొచ్చు. చరవాణిపై నిఘా ఉంచి, ఆన్ చేయగానే పట్టుకుంటాం.

? ఫ్లిప్‌కార్ట్‌లో కొనుగోళ్లు చేసినందుకు లక్కీడ్రాలో ఎంపికయ్యారు. కారు బహుమతిగా వచ్చింది. ప్రాసెసింగ్ ఫీజు, బీమా రుసుములు కడితే కారు పంపిస్తామన్నారు. రూ.19,500 పంపించాను. ఇంకా పంపించమంటుంటే ఆపేశాను. **- జి.శైలజ, పెనమకూరు, తోట్లవల్లూరు మండలం**

✔ ఇలాంటి వాటిని ఫిషింగ్ నేరాలు అంటారు. అమాయకులకు గేలం వేసి మోసం చేస్తుంటారు. ఆన్‌లైన్‌లో లక్కీడ్రా వచ్చిందంటే అసలు నమ్మవద్దు. జాగ్రత్తగా ఉండాలి. మీరు డబ్బులు పంపిన ఖాతాను పరిశీలించి.. అందులో డబ్బులు ఉంటే వెనక్కి తీసుకువస్తాం.

? ఐ ఫోన్ 13 పోయింది. సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. **- గూడవల్లి అభినయ్, మొగల్రాజపురం**

? రైలులో ఊరు వెళుతుంటే చరవాణిని దొంగిలించారు. **- కొమ్మినేని మోహన్‌రావు, మధురానగర్**

? సాంబమూర్తిరోడ్డులో రైతుబజారుకు వెళితే చరవాణిని దొంగలు కొట్టేశారు. **- బత్తుల ప్రసాద్, దుర్గాపురం**

✔ ఆయా ఫోన్‌లను ఆన్ చేయగానే వెంటనే మాకు ఎలర్ట్ సమాచారం వస్తుంది. వాటిని ట్రేస్ చేసి, స్వాధీనం చేసుకుని మీకు అప్పగిస్తాం.

? నేను బడ్డీ కొట్టు నిర్వహిస్తుంటాను. తెలిసిన వారికి రూ.50వేలు ఇచ్చాను. వాళ్లు తిరిగి ఫోన్ పే ద్వారా చెల్లించారు. సైబర్ నేరం జరిగిందని బ్యాంకు వాళ్లు నా ఖాతాను స్తంభింపచేశారు. **- చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు**

✔ ఎక్కడో జరిగిన సైబర్ నేరంలో మీకు తెలియకుండానే మీరు భాగస్వామి అయి ఉంటారు. నేరగాళ్లు మీకు తెలిసిన వ్యక్తికి డబ్బులు పంపించారు. ఆ డబ్బులు మీకు పంపించారు. ఈ అంచెలో మీరిద్దరూ సైబర్ నేరంలో భాగస్వామి అయ్యారని భావించి మీ ఖాతాను స్తంభింపచేశారు.

ఇదీ జరిగింది : దిల్లీలోని స్పెషల్ సెల్ పోలీసులు ఖాతాను స్తంభింపచేశారు. 5వ అంచెలో వెంకటేశ్వరరావుకు డబ్బులు పడ్డాయని ఖాతాను నిలువరించారు. వారితో మాట్లాడి మీకు న్యాయం చేస్తాం.

? నందిగామ ఎస్‌బీఐలోని నా ఖాతాలో రూ.29వేలు స్తంభింపచేశారు. ఎందుకు చేశారని అడిగితే సైబర్ క్రైం వాళ్లు స్తంభింప చేశారని చెబుతున్నారు. **- వెంకటేశ్వర్లు, నందిగామ**

✔ ఒక వ్యక్తిని మోసం చేసిన నేరగాడు.. తన ఖాతాలో డబ్బులు వేయించుకుని. వాటిని మరి కొన్ని ఖాతాలకు బదలాయిస్తాడు. వాటి నుంచి మరికొన్ని ఖాతాలకు మళ్లిస్తారు. ఈ క్రమంలో మీ ఖాతాలో డబ్బులు జమ చేసి ఉండొచ్చు.

ఇదీ జరిగింది : కర్ణాటక రాష్ట్రం బెంగళూరు సిటీలోని కడుడి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఒక సైబర్ నేరంలో 6వ అంచెలో వెంకటేశ్వర్లు ఖాతాలో డబ్బులు పడ్డాయి. అధికారుల ఆదేశాల మేరకు ఆయన ఖాతాను స్తంభింపచేశారు. అక్కడి పోలీసులతో మాట్లాడి న్యాయం చేస్తాం.

కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీల భర్తీ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలోని ఎ.కొండూరు, రెడ్డిగూడెం, గంపలగూడెం మండలాల్లోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం.రజనీకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, ఎ.ఎన్.ఎం., ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్, పార్ట్ టైమ్ టీచర్ ఉద్యోగాలకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వారు ఈ నెల 3వ తేదీ నుంచి 11 వరకు విజయవాడ ఎంజీ (బందరు) రోడ్డులోని ఆకాశవాణి ఎదురుగా గల మాంటిస్సోరి మహిళా కళాశాల ఆవరణలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆమె సూచించారు.

వంకాయలు-20/24, టమాటా-45, బెండ-36, పచ్చిమిర్చి-36, కాకర-50, బీర-36/42, క్యాలీ ఫ్లవర్-30/25, క్యాబేజీ-22, క్యారెట్-34, దొండ-36, బంగాళదుంప-23, ఉల్లిపాయలు-28, గోరుచిక్కుళ్లు-40, దోస-30/40, సొర-25/20, పొట్ల-35, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-76, మునగ-14/15, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-44, బీట్ రూట్-30, కీరదోస-32, బీన్స్-65, క్యాప్సికమ్-58, చింతకాయలు-60, నిమ్మ (డజను)-24/18, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

జస్టిస్ సుభేందు సామంతకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో వెంకటరెడ్డి

జస్టిస్ టి.సి.డి శేఖర్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్

ముఖ్యమంత్రి కార్యదర్శి రాజమౌళి, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, హరిజవహర్‌లాల్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్

జగన్మాత సేవలో ప్రముఖులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం నేపథ్యంలో గురువారం ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకుని పూజలు చేశారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి.సి.డి శేఖర్, జస్టిస్ సుభేందు సామంత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ముఖ్యమంత్రి కార్యదర్శి రాజమౌళి, దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి హరిజవహర్ లాల్ తదితరులు వేర్వేరుగా దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన వారికి ఆలయ మర్యాదలతో పండితులు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, ఏఈవో వెంకటరెడ్డి, దేవస్థానం సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు ప్రసాదాలు అందజేశారు. సీపీ రాజశేఖరబాబు డీసీపీ షిరీన్ బేగం, ఏడీసీపీ రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిగా శ్రీకాంత్

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నూతన పరీక్షల నియంత్రణాధికారిగా తిరుపతి స్విమ్స్ అనాటమీ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఐదేళ్లుగా పరీక్షల నియంత్రణాధికారి పనిచేసిన డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు డిసెంబరు 31వ తేదీతో గడువు ముగిసిన విషయం విదితమే. ఆయన సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫిజియాలజీ ప్రొఫెసర్‌గా చేరారు.

అర్ధరాత్రి వేళ... విస్తృత తనిఖీలు

సూర్యారావుపేట: నూతన సంవత్సరం సందర్భంగా ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా ట్రాఫిక్, శాంతిభద్రతల విభాగం పోలీసులు విస్తృతమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి 10 గంటల నుంచి గురువారం తెల్లవారుజామున 3 గంటల వరకు రహదారులపైనే పహారా కాశారు. ఫలితంగా ఒకటి, రెండు చిన్న సంఘటనలు మినహా ఎలాంటి ప్రమాదాలు జరగలేదు.

బారికేడ్లతో కట్టడి.. నగరంలోని రహదారుల్లో వాహనాల వేగాన్ని కట్టడి చేసేందుకు ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టారు. పోలీసు సిబ్బంది, ట్రాఫిక్ వాలంటీర్లు రేడియం జాకెట్లు ధరించి 'నూతన సంవత్సరం ఆనంద సంవత్సరం కావాలి' అంటూ ప్లకార్డులు చేతపట్టి రహదారులపై నిలబడ్డారు. చోదకులకు అవగాహన కలిగించారు. మహాత్మా గాంధీ రోడ్డు, కారల్‌మార్క్స్ రోడ్డు, బి.ఆర్.టి.ఎస్. రోడ్డు, వన్‌టౌన్, భవానీపురం, అజిత్‌సింగ్‌నగర్ రోడ్లలో విస్తృతమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పైవంతెనలపై రాకపోకలను నియంత్రించారు. ☛ రోడ్డు ప్రమాదాలకు అత్యధిక కారణం మద్యం మత్తే అని అధికారులు గుర్తించారు. తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. బారికేడ్లతో నిలువరించి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేశారు. తాగిన వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ముఖ్యమైన ప్రాంతాల్లో పర్యటించి.. సిబ్బంది బందోబస్తును పర్యవేక్షించారు. ఫలితంగా ప్రమాద రహిత నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

చోదకుడిని పరీక్షిస్తున్న పోలీసు సిబ్బంది

సీపీ కార్యాలయంలో వేడుకలు

కేకు కోస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు బుధవారం అర్ధరాత్రి మహాత్మాగాంధీరోడ్డులోని కేవస్ వ్యాస్ కాంప్లెక్సు వద్ద కేకు కోశారు. పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కాగా గురువారం ఉదయం పోలీస్ కమిషనర్ కార్యాలయం పోలీసు అధికారులు, సిబ్బందితో కిటకిటలాడిపోయింది. శాంతిభద్రతలు, ట్రాఫిక్, సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్, పరిపాలనా విభాగం అధికారులు విచ్చేసి సీపీకి శుభాకాంక్షలు తెలిపారు. కేకులు కోశారు. డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దేశం సమగ్రాభివృద్ధి చెందాలి

పటమట, న్యూస్‌టుడే: పటమట దత్తపీఠంలో గురువారం మైసూర్ దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ సమక్షంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామీజీ ఆశీస్సులు అందుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. 2026 సంవత్సరం అందరికీ మంచి ఫలితాలు ఇవ్వాలని, దేశం సమగ్రాభివృద్ధి చెందాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గురువారం నుంచి ఈ నెల 10 వరకు ప్రతి రోజూ శ్రీచక్ర పూజ, భాగవత సప్తాహం ప్రవచనాలు నిర్వహిస్తారని కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామిజీ

సాగు విభిన్నం.. దీర్ఘకాలిక ఆదాయం!

కూచిపూడి, న్యూస్‌టుడే

కొబ్బరి, వక్క, పనసలో అంతర పంటగా మినుము సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు.. మొవ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామానికి చెందిన **చలసాని శరత్** అనే రైతు. సినీ నిర్మాతైన ఆయన.. వ్యవసాయంపై ఉన్న మక్కువతో పమిడిముక్కల మండలం ఐనంపూడిలో తనకు ఉన్న మెరక మాగాణి 9.5 ఎకరాల్లో గతంలో వరి, చెరకు, కరివేపాకు సాగు చేసేవారు. దీర్ఘకాలిక ఆదాయం వచ్చే పంటలు వేయాలన్న ఆలోచనతో తమిళనాడు నుంచి రామ్‌గంగ రకం కొబ్బరి మొక్కలు తెచ్చి ఎకరాకు 60 చొప్పున నాటారు. అలాగే జే33 రకం పనస మొక్కలు 60 చొప్పున 27 అడుగులకు ఒకటి నాటారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల నుంచి వక్క మొక్కలు తెచ్చి.. ఎకరాకు 35 చొప్పున 5.5 ఎకరాల్లో నాటారు. మరో 4 ఎకరాల్లో చిరంజీవి కొబ్బరి రకం, వియత్నా సూపర్ ఎర్లీ పనస, వక్క మొక్కలు నాటారు. అంతర పంటగా వేసిన మినుము ద్వారా గత రెండేళ్లలో మంచి దిగుబడి సాధించారు. ఎకరానికి 7 నుంచి 8 బస్తాలు వచ్చాయి. ఏడాదికి రూ.5 లక్షలపైనే ఆదాయం పొందారు. ఈ ఏడాది కొత్తగా వంబన్ 11 మినుము రకం వేశారు. 'బిందు సేద్యం ద్వారా రోజూ 2 గంటల పాటు తోటను తడుపుతా. మొక్కలు నాటి జనవరికి మూడేళ్లవుతుంది. ఇప్పుడిప్పుడే ప్రధాన పంటల దిగుబడి వస్తోంది. పనస కాయలు కిలో రూ.70 చొప్పున, కొబ్బరి బొండాలు ఒకటి రూ.20 చొప్పున తొలిగా అమ్మా. కనీసం 60 ఏళ్ల వరకు కొబ్బరి, పనస, వక్క పంటల్లో ఎకరానికి ఏడాదికి రూ.2 లక్షలకు పైగా ఆదాయం లభిస్తుందనుకుంటున్నా. ఎకరాకు ఇప్పటికి రూ.1.50 లక్షలు పెట్టుబడి అయ్యింది'అని రైతు చలసాని శరత్ తెలిపారు.



కొబ్బరి, వక్క పంటలో అంతర పంటగా మినుము

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ



నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మెట్ట ప్రాంతంలో రబీ పంటగా రైతులు మొక్కజొన్న సాగుచేస్తున్నారు. ప్రస్తుతం ఈ పంటకు కత్తెర పురుగు ఆశించింది. నివారణకు గరికపాడు కేవీకే శాస్త్రవేత్త వెంకటరెడ్డి పలు సూచనలు చేశారు. కత్తెర పురుగు ముఖంపై వై ఆకారంలో చార ఉంటుంది. ఇవి మొదటి దశలో గొంగళి పురుగులు ఆకులపై పత్ర హరితాన్ని గోకి తింటాయి. పురుగు పెరిగే కొద్దీ ఆకులను సైతం తింటుంది. అనంతరం ఆకుల సుడులు, కాండాన్ని తొలిచి రంధ్రాలు చేసి పంటను నష్టపరుస్తుంది. **నివారణ ఇలా..** ఈ పురుగు గుడ్లను గమనించిన వెంటనే ఎకరానికి లీటరు వేపనూనె, 5శాతం వేపగింజల కషాయం పిచికారీ చేయాలి. తొలి దశలో పురుగుల నివారణకు ఎకరానికి 500 మి.లీ. క్లోరిఫైరిఫాస్ పిచికారీ చేయాలి. గొంగలి పురుగుల ఉధృతి అధికంగా ఉంటే ఎమామెక్టిన్ బెంజోయేట్ 5ఎస్‌డీ 80 గ్రా మందును సుడులు, మొవ్వ లోపలి ఆకులు తడిచేలా పిచికారీ చేయాలి. ఎదిగిన గొంగళి పురుగుల నివారణకు పది కిలోల తవుడు, రెండు కిలోల బెల్లం, రెండు లీటర్ల నీటిలో కలిపి 24 గంటల పాటు పులియబెట్టి ఆ మిశ్రమానికి 100 గ్రాముల థయోడికార్బ్ మందును కలిపి సాయంత్రం వేళల్లో సుడులు, మొవ్వులో వేయాలి. పురుగు ఉధృతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఎకరానికి అయిదు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. పురుగుల గుడ్లను ఏరించి నాశనం చేయాలి.

ప్రశ్న: టమాటాలో పచ్చదోమ నివారణ, స్పాటెట్ విల్ట్ వైరస్ గురించి వివరించండి? **-కె.రామారావు, కొడాలి, -కె.శ్రీరాములు, చినకళ్లేపల్లి.**

సమాధానం: పచ్చదోమ సోకిన తోటలో టామాటా ఆకుల అడుగుభాగం నుంచి రసం పీల్చడం ద్వారా చివర్లు పసుపు పచ్చగా మారి క్రమేపీ ఎర్రబడి చివరగా ఆకులు ముడుచుకు పోయి.. దోనె లాగా కనిపిస్తాయి. నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ 2 మి.లీ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ☛ టమాటా పంటలో చిగురాకుల పైభాగంలో ఈనెలు గోధుమ వర్ణంలోకి మారి, ఆకులు మీద పసుపు రంగు మచ్చలు ఏర్పడి, మాడిపోతాయి. మొక్కలు గిడసబారి, పూత పిందె పట్టక ఎండిపోతాయి. మొక్కలు గిడసబారి. పూత పిందె పట్టక ఎండిపోతాయి. దీని నివారణకు తెగులు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి. స్పాటెట్ విల్ట్ వైరస్‌ను వ్యాప్తి చెందించే తామర పురుగుల నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్-డైమటాన్ 2మి.లీ.లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నారుమడిలో 250 గ్రాములు, నాటిన 10వరోజున ఎకరానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేయాలి. **- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషివిజ్ఞానకేంద్రం, ఘంటసాల.**

- న్యూస్‌టుడే, ఘంటసాల

అరటిలో సస్యరక్షణ చర్యలు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే

అరటి తోటలు సాగుచేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని ఉద్యానశాఖాధికారిణి మానస తెలిపారు.

నులి పురుగులు(నిమటోడాలు): ఇవి ఆశిస్తే వేర్లు, దుంప బలహీనపడి.. నీరు, పోషకాలను మొక్క సరిగా తీసుకోలేదు. కందువాలు వదిలినట్లు కనిపిస్తాయి. ఆకుల అంచులు నల్లగా మారి క్రమేపీ ఎండిపోతాయి. నివారణకు పిలకల దుంపపై చర్మం పలుచగా చెక్కిన తర్వాత ద్రావణం(కాపర్ ఆక్సీక్లోరైడు 5 గ్రా, మోనోక్రోటోపాస్ 2.5 మీ.లీలను లీటరు నీటిలో కలిపి)లో 15 నిమిషాలు ముంచి ఉంచాలి. అనంతరం నాటుకోవాలి. పిలకలు నాటే గుంతలోని మట్టిలో అరకిలో వేపపిండి కలపాలి. నులి పురుగులు ఆశించిన మొక్కలకు 40 గ్రా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు మొదలు వద్ద లోతుగా వేసి మట్టితో కప్పి నీరుపెట్టాలి.

దుంప పుచ్చు: ఈ పురుగు దుంపను తొలిచి నష్టం కలిగిస్తుంది. అరటి చెట్టు నీరు పీల్చలేదు. వదిలేసినట్లు కనిపిస్తుంది. ఆకులన్నీ నీటి ఎద్దడిని సూచిస్తాయి. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే ఒక్కో మొక్కకు 25 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు మొదలు వద్ద లోతుగా వేసి మట్టితో కప్పి నీరు పెట్టాలి.

పనామా తెగులు: ఈ తెగులు విత్తన పిలకలు, మట్టి ద్వారా వ్యాపిస్తుంది. అమృతపాణి రకం ఈ తెగులును ఏ మాత్రం తట్టుకోలేదు. సోకిన మొక్కల ఆకులు కింద నుంచి పైకి పసుపు వర్ణంలోకి మారి ఎండిపోతాయి. చెట్టు కందం వెంట వేలాడుతుంటాయి. నేల పైభాగంలో కందంపై పగుళ్లు ఏర్పడతాయి. ఇటువంటి మొక్కలు, దుంపలను కోసి గమనిస్తే లోపల గోధుమ రంగు మచ్చలు కనిపిస్తాయి. ఈ తెగులు రసాయన మందులు ద్వారా నివారించడం సాధ్యపడదు. కనుక ఈ తెగులును తట్టుకునే రకాలను మాత్రమే రైతులు సాగు చేయాలి.

తెగులు సోకిన మొక్క

దుంప తెగులు

ఆరోగ్య వర్సిటీలో సౌర విద్యుత్తు యూనిట్‌కు సాయం

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: సామాజిక బాధ్యతగా బ్యాంకు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్‌రావు అన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సోలార్ పవర్ యూనిట్ ఏర్పాటుకు కెనరా బ్యాంకు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.40 లక్షలు సాయం అందించింది. గురువారం కెనరా బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.రత్నాకరరావు చెక్కును వీసీ చంద్రశేఖర్‌రావుకు అందజేశారు. వీసీ మాట్లాడుతూ సోలార్ పవర్ యూనిట్‌ను ఏర్పాటు చేయడంతో 100 కిలోవాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. కొవిడ్ కష్టకాలంలో ఎన్నో కార్పొరేట్ సంస్థలు ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, మందులు, మాస్కులు, శానిటైజర్లు ప్రభుత్వానికి అందజేసే సామాజిక బాధ్యతను చాటుకున్నాయన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి మాట్లాడుతూ కొత్త ఏడాదిలో ప్రతి ఒక్కరూ కొత్త మార్పును కోరుకుంటున్నారని, ఆరోగ్యంగా ఉండేదుకు జాగ్రత్తలు తీసుకోవాలని, మంచి అలవాట్లపై దృష్టి పెట్టాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ శ్రీహరి, సైకియాట్రిస్ట్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ సూర్యప్రభ, పబ్లికేషన్స్ డైరెక్టర్ డాక్టర్ సుధ పాల్గొన్నారు.

వీసీకి చెక్కు అందజేస్తున్న కెనరా బ్యాంకు డీజీఎం రత్నాకరరావు తదితరులు

బడుగుల సంక్షేమ నామ సంవత్సరం మొదలైంది

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సూపర్-6 పథకాల అమలుతో పాటు బడుగుల ఉపాధి, అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలకు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారని.. బడుగుల సంక్షేమ నామ సంవత్సర మొదలైందని ఆంధ్రప్రదేశ్ సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని 4,400 మంది ఎస్సీ లబ్ధిదారులకు రూ.63.2 కోట్లు విడుదల చేశారన్నారు. గురువారం విజయవాడ ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని దాదాపు 56 ఎస్సీ ఉపకులాల జీవనోపాధికి ఒక్కొక్కరికి రూ.50 వేల సబ్సిడీతో రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. బేకరీ దుకాణాలు, మొబైల్ షాపులు, టిఫిన్ సెంటర్లు, ఫుడ్ స్టాల్స్, ఆర్గానిక్ ఉత్పత్తులు, బిస్కెట్ తయారీ, జీడిపప్పు వ్యాపారం, డెయిరీ, ఇటుక బట్టీలు వంటి 56 యూనిట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీటితో పాటు గత ప్రభుత్వాల కాలంలో రుణాలు తీసుకుని వడ్డీభారం మోయలేక ఇబ్బందులు పడుతున్న 11,478 మంది ఎస్సీ లబ్ధిదారులకు వడ్డీ రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వంలో జీవో విడుదల చేశారని తెలిపారు. గతంలో రాష్ట్రంలో సంక్షేమం అనే పదం వినిపించేది కాదని, ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేయడం ద్వారా బడుగులపై ప్రభుత్వం తన బాధ్యత చాటుకుందని బాలకోటయ్య పేర్కొన్నారు. సమావేశంలో పేరం భుజంగరావు, మామిడి సత్యం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాలకోటయ్య

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -147 రిటైల్ ధర 174 చికెన్ విత్ స్కిన్ - 252, చికెన్ స్కిన్‌లెస్ - 287.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 167, 176, 187 చికెన్ విత్ స్కిన్ - 324 చికెన్ స్కిన్‌లెస్ - 334.

వైద్య ఉద్యోగుల సేవలు అభినందనీయం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య ఉద్యోగులు ప్రజారోగ్య రక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నారని, వారి సేవల ప్రశంసనీయమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర కాలమానిని గురువారం కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి, జిల్లా కార్యదర్శి పి.నాగరాజు, విజయవాడ సిటీ శాఖ అధ్యక్షురాలు సౌభాగ్యం, కోశాధికారి జి.పుణ్యకుమారి, ఇతర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

91.9 FM Vijayawada
ఈఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం కొనబడును.బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును స్పాట్‌క్యాష్. ✆ 81422 92071

REAL ESTATE

HOUSE FOR SALE

బందరురోడ్డులో తుర్లపాటి కుటుంబరావు వీధిలో సెమీ కమర్షియల్ 209గ. స్థలంలో 3 ఫ్లోర్లు గల బిల్డింగ్ ఈస్ట్ ఫేసింగ్ అమ్మకానికి కలదు. నో బ్రోకర్స్. సంప్ర. ✆ 98481 93191

PLOT FOR SALE

రి.జి. శ్రీ కంచికచర్ల దగ్గర- చెవిటికల్లు రోడ్డులో- HYD హైవేకి 500మీ|| పరిటాల రైల్వేహబ్‌కి, ఐకాన్ బ్రిడ్జికి దగ్గరలో CRDA ప్లాట్లు. లోన్ కలదు. ✆78427 58859

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

JOBS

Wanted Telecallers for Gates Institute of Management & Sciences, VJA. Qual: Inter / Degree. Contact: ✆ 86449 93322

Wanted Female Telecallers / Data Entry/ Freshers / Experience / Any Graduate. Salary: 10K to18K Timing: 9.30 to 6.30 ✆ 99080 98305.

Wanted Telecallers for University Office in Vijayawada. Eligibility Degree/ B.Tech, Age: 18- 25 Years (Only). ✆ 77027 54944

ఫ్యాక్టరీ మార్కెటింగ్ ఆఫీస్ నందు అసిస్టెంట్‌గా పనిచేయుటకు ఇంటర్/ డిగ్రీ/ డిప్లొమా ఉన్నవారు క్రింది వాట్సప్ నెంబరుకు మీ బయోడేటా పంపగలను. ఉద్యోగం అత్యవసరం ఉన్నవారు వ్యక్తిగతంగా హాజరు కాగలరు. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. లోకేష్ ఇండస్ట్రీస్, VJA . ✆ 94935 79226

విజయవాడ సిటీ, ఆటోనగర్, కానూరు ఏరియాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ అర్జెంటుగా కావలెను. మంచి జీతం. 85004 05004, 89854 22255.

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డులు & హెల్పర్లు కావలెను. విజయవాడ MG రోడ్‌లో ప్రముఖ షోరూమ్‌లో పనిచేయుటకు. జీతము గార్డ్స్‌కు 15,000/- & హెల్పర్లకు 12,000/-. ఇతర సదుపాయాలు కలవు. ✆ 80994 44758 / 96401 48367.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

తిరువూరు

• తిరువూరు • మైలవరం

పింఛనుదారులు జీవన ధ్రువపత్రాలు సమర్పించండి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : పింఛన్ పొందుతున్న విశ్రాంతి ఉద్యోగులు, కుటుంబ పింఛన్లు పొందుతున్న వారు తమ జీవన ధ్రువపత్రాలను జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 లోపల సమర్పించాలని మైలవరం ఉప ఖజానాధికారి నాగ సత్యనారాయణ తెలిపారు. నియోజకవర్గ పరిధిలో మైలవరం ఉప ఖజానా ద్వారా 845 మంది విశ్రాంతి ఉద్యోగులు పింఛన్లు పొందుతున్నారు. మైలవరంలోని తన కార్యాలయానికి వ్యక్తిగతంగా వచ్చి లైఫ్ సర్టిఫికేట్ ఇవ్వచ్చని, లేకున్నా డిజిటల్ విధానంలో జీవన ప్రమాణ పోర్టల్ ద్వారా కూడా సమర్పించాల్సి ఉంటుందని ఆయన చెప్పారు.

ఊటుకూరు రామాలయంలో..

ధనుర్మాసం.. భక్తుల నీరాజనం

గంపలగూడెం, న్యూస్‌టుడే : ధనుర్మాసం సందర్భంగా గురువారం మండలంలోని నెమలి, పెనుగొలను, గంపలగూడెం, ఊటుకూరు, గోసవీడు, వినగడప గ్రామాల్లోని వేణుగోపాల స్వామి, రంగనాయక స్వామి, సీతారామచంద్ర స్వామి, శ్రీనివాస స్వామి ఆలయాల్లో దేవతామూర్తులకు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు గోదాదేవి తిరుప్పావైపాశురాలు ఆలపించారు. ప్రసాదాలు స్వీకరించారు.

గోసవీడులో శ్రీకృష్ణపరమాత్మ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? నరసాపురం ప్రధాన రహదారికి ఇరువైపులా నరికిన చెట్ల కొమ్మలు, చెత్త వేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- వాహనదారులు** ✔ పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయిస్తాం. **- జి.స్వాతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, నరసాపురం - న్యూస్‌టుడే, విస్సన్నపేట**

• తిరువూరు 4వ వార్డులోని డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు ప్రకాశరావు సమస్యను 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

మూడు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన నేడు

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం సరఫరా చేసిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీకి రెవెన్యూ అధికారులు శుక్రవారం నిర్వహించే గ్రామ సభల్లో తిరువూరు శాసన సభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొంటారని ఆయన కార్యాలయ వర్గాలు గురువారం తెలిపారు. ఎ.కొండూరు మండలం మారేపల్లి, గంపలగూడెం మండలం కనుమూరు, అనుముల్లంకలో జరిగే రెవెన్యూ గ్రామ సభలో ఆయన పాల్గొని, రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తారన్నారు.

ధర ఎక్కువ.. దిగుబడులు తక్కువ

నష్టపోతున్న అన్నదాతలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

మిర్చి ధర పెరుగుతున్నా దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మైలవరం నియోజకవర్గంలో 20 రోజులుగా సాగుతున్న మిర్చి కోతలు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. అయితే తెగుళ్లతో దిగుబడులు తగ్గిపోవడంతో సాగుదారులు వాపోతున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఆశించిన ధర దక్కక సరైన దిగుబడులు లేక మిర్చి రైతులు నష్టాల పాలయ్యారు. దీంతో ఈ ఏడాది సాగు భూమి గణనీయంగా తగ్గింది. దీనికి తోడు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో తెగుళ్లు ఆశించి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి.

కవులూరులో కల్లంలో ఆరబోసిన మిర్చి

శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసినా..

గతేడాది ఎకరానికి రూ.1.50 లక్షలు పెట్టుబడితో మిర్చిని సాగు చేస్తే సగటున 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ధర క్వింటా రూ.10 వేల నుంచి రూ.13 వేలు మాత్రమే ఉండటంతో పెట్టుబడిలో సగం కూడా చేతికి రాకపోవడంతో రైతులు భారీగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో ధర పెరిగిన తర్వాత విక్రయించుకోవచ్చన్న ఆశతో శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసినా ధరలు పెరగక పోవడంతో నిలువునా అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం కొత్త మిర్చికి మార్కెట్‌లో క్వింటా రూ.16 వేలు వరకు పలుకుతోంది. అయితే ఈ సంవత్సరం పంటకు నల్ల దోమ, ఎండు తెగులు వంటి చీడపీడలతో దిగుబడులు ఎకరానికి 9 క్వింటాళ్లు కూడా రాలేదని జి.కొండూరు మండలం కవులూరుకు చెందిన రైతు వెంకటేశ్వరరావు తెలిపారు. పెరిగిన ధరకు మంచి దిగుబడులు వస్తే ఈ ఏడాదైనా నష్టాలను అధిగమించే అవకాశం ఉండేదని ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండకు చెందిన రైతు కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి ధరల్లో నిలకడ లేకపోవడం సాగుదారులకు శాపంగా మారుతోంది. పంట చేతికొచ్చే సమయంలో ఊరిస్తున్న ధరలు కోతలు పూర్తి చేసి మార్కెటుకు తీసుకు వస్తే ఉండటం లేదని మిర్చి సాగుదారులు వాపోతున్నారు.

ప్రదర్శన నిర్వహిస్తున్న టోల్ ప్లాజా సిబ్బంది

రహదారి భద్రతపై అవగాహన

కీసర(కంచికచర్ల), న్యూస్‌టుడే: రహదారి భద్రతపై వాహనదారులకు స్వర్ణ టోల్ ప్లాజా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం ప్రదర్శన నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని సూచించారు. కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ రాజారావు, టోల్ మేనేజర్ జయప్రకాష్, సెఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రంలోనే మధ్యాహ్న భోజనం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : భవిత కేంద్రాల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అదే పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందించే ఏర్పాటు చేయనున్నట్లు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం సంచాలకురాలు గంగాభవాని తెలిపారు. ఆమె గురువారం అధికారులతో కలిసి ఇబ్రహీంపట్నం పెర్రీలోని భవిత కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని సహిత ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకున్నారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త నారాయణ మాట్లాడుతూ జిల్లాలో 20 భవిత కేంద్రాల్లో 2,300 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు 39 మంది ప్రత్యేక ఉపాధ్యాయులు వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఆరు నుంచి పదో తరగతి వరకు చదువు తున్న వారికి సమీప బడుల నుంచి మధ్యాహ్న భోజనం అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రావతి, ఉష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో గంగాభవాని, ఉపాధ్యాయులు

ఆరోగ్యం సైతం లెక్క చేయకుండా విధులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య పనులు చేసే వారి సేవలు మరువలేనివని పురపాలక ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. పురపాలికలో ఉద్యోగ విరమణ చేసిన 9 మంది పారిశుద్ధ్య కార్మికులను ఇబ్రహీంపట్నంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు అంటే ఎంతో నిబద్ధత, ఓర్పు కలిగి ఉండాలన్నారు. ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు ఉంటాయని చెప్పారు. కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికులందరూ అలుపెరుగక సేవలందించారని గుర్తు చేసుకున్నారు. అనంతరం కృష్ణ, దుర్గ, వెంకటేశ్వరరావు, రామారావు, [illegible] ఛైర్మన్ చిట్టిబాబు, ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్మికులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన వారితో పురపాలిక అధికారులు, ప్రజాప్రతినిధులు

క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

వాసవీ క్లబ్ సేవలు విస్తృతం చేస్తాం

తిరువూరు టౌన్: తిరువూరు పట్టణ వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక గురువారం జరిగింది. ఇందులో క్లబ్ సభ్యులు ఏకగ్రీవ సమ్మతితో నూతన అధ్యక్షుడిగా దేవిశెట్టి బాలకృష్ణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామన్నారు. అనంతరం [illegible] పాల్గొన్నారు.

డీవీఆర్ బ్రాంచి కెనాల్‌కు వారబందీ

పెనుగంచిప్రోలు: డీవీఆర్ బ్రాంచి కెనాల్‌లో సాగునీటి సరఫరాకు ఈ నెల 8 నుంచి వారబందీ విధానం అమలు చేస్తున్నారని డీసీ కమిటీ అధ్యక్షులు గోపాలరావు, చంద్రశేఖర్ తెలిపారు. కెనాల్‌కు ఎగువనున్న తెలంగాణ ప్రాంతానికి వారం రోజులు, ఆ తర్వాత దిగువకు ఇవ్వాలని ఎన్ఎస్పీ అధికారులు నిర్ణయించినట్లు తెలిపారు.

మైలవరం: తెదేపా కార్యాలయంలో..



తిరువూరు: కూటమి నాయకుల ఆధ్వర్యంలో..

గంపలగూడెంలో..

నూతన ఏడాది.. ఆశల వారధి

తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు చేరుకుని తమ ఇష్టదైవాలకు ప్రత్యేక పూజలు చేశారు. క్రైస్తవాలయాల్లో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత కేకులు కోసి బాణసంచా కాల్చి సందడి చేశారు. **- న్యూస్‌టుడే, బృందం**

మెట్టగుట్ట శ్రీనివాస ఆలయంలో భక్తుల రద్దీ

తాతకుంట్లలో..

ఆత్కూరులో చీరల పంపిణీ

గొల్లపూడి: దేవినేని ఉమా కార్యాలయంలో..

కొత్తరెడ్డిగూడెంలో..

పోలిశెట్టిపాడులో..

ట్రాఫిక్ కష్టాలు.. ఇంకా ఎన్నాళ్లు?

మైలవరంలో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. అసలే ఇరుకు రోడ్లు, ఆపై ఆక్రమణలతో పాటు వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో ప్రజలు, ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. వారం రోజులుగా వస్త్ర, వాణిజ్య దుకాణాల్లో కొనుగోళ్లు పెరగడంతో ప్రధాన రహదారిపై రద్దీ ఎక్కువైంది. ఇప్పటికే దుకాణాలు రోడ్లపైకి చొచ్చుకురాగా, వాటి ముందు మరిన్ని తోపుడు బండ్లను పెట్టుకోవడానికి అనధికారికంగా అద్దెలకు ఇస్తున్నారు. దాంతో ఆటోలు, బస్సులు సైతం ప్రధాన రహదారిపై నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటుండటంతో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతోంది. **- న్యూస్‌టుడే, మైలవరం**

పొదలు.. ప్రమాదాలకు కారకాలు

ఎ.ఎం.కే రహదారి నుంచి శ్రీరంపురం వెళ్లే తారు రోడ్డు అంచుల్లో ఇరువైపులా పెరిగిన పిచ్చిపొదలతో వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో వాడ వైపు వెళ్లే ఈ మార్గంలో పెద్ద వాహనాలు వచ్చినప్పుడు ద్విచక్ర వాహనదారులు తప్పుకోవాలంటే ఇవి అడ్డంకిగా మారాయని స్థానికులు చెబుతున్నారు. దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు వల్ల ప్రమాదాల బారిన పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ రహదారికి ఇరు వైపున ఉన్న వాటిని తొలగించి రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

దారులు అధ్వానం.. ఒళ్లు హూనం!

విస్సన్నపేట, న్యూస్‌టుడే

విస్సన్నపేట మండల పరిధి గ్రామాల్లోని డొంక రోడ్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా విస్సన్నపేట రాణి ఫంక్షన్ హాల్ ఎదురుగా 2 కి.మీ రహదారి గోతులమయమై వర్షాలకు నీరు చేరి బురదమయంగా తయారవ్వడంతో పొలాలకు రాకపోకలు సాగించడానికి 100 ఎకరాల మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు చివరన డంపింగ్ యార్డు ఉండటంతో నిత్యం చెత్త తరలించే ట్రాక్టర్లు మార్గం మధ్యలో దిగబడిపోతున్నాయి. మండల కేంద్రంలోని వ్యర్థాలను సింహాభాగం బస్టాండు దగ్గర, ఎ.కొండూరు, నూజివీడు రోడ్డులో డంప్ చేస్తుండడంతో కాలుష్యం బారిన పడాల్సి వస్తోందని ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు.

బురదమయంగా విస్సన్నపేట డొంక రోడ్డు

పట్టించుకోక పోవడంతోనే..

నరసాపురం, తాతకుంట్ల నుంచి చాట్రాయి వెళ్లే డొంక రోడ్డు పలు చోట్ల గోతులు పడ్డాయి. దీనికి తోడు ధ్వంసం కావడంతో పంట పొలాలకు వెళ్లేందుకు అవస్థలు పడాల్సి వస్తోందని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేమిరెడ్డిపల్లి నుంచి పంట పొలాలకు పోయే దారి పరిస్థితి ఇలానే ఉంది. పుట్రేల నుంచి నూతిపాడు వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని, దీన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి గ్రామీణ డొంక రహదారులను బాగుజేయించి రాకపోకలు సాగించేందుకు వీలుగా చేయాలని ప్రజలు, అన్నదాతలు కోరుతున్నారు.

ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలి

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆర్డీవో కె.మాధురి తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. జన విజ్ఞాన వేదిక శాస్త్ర విజ్ఞానాన్ని ప్రజలందరికీ చేరువ చేసే కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి యల్.గంగాధర్, ఉపాధ్యక్షుడు ఎం.హరికృష్ణ, తిరువూరు కమిటీ సభ్యులు పి.శీనయ్య, ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జి.కొండూరులో..

బూరుగగూడెంలో..



తిరువూరు : జన విజ్ఞాన వేదిక క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీవో మాధురి

ఆలోచన చేయడం హర్షణీయం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : మండల విద్యా వనరుల కేంద్రం వద్ద యూటీఎఫ్ కాలమానిని ఎంఈవో పుష్పలత గురువారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు విధి నిర్వహణతో పాటు క్రీడల్లో పాల్గొనడం, విద్యార్థులకు అవసరమైన అంశాలపై ఆలోచన చేయడం హర్షణీయమన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రెడ్‌స్టార్, కార్యవర్గ సభ్యులు హరిప్రసాద్, సూర్యనారాయణ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో పీవీ నరసింహరావు చేతుల మీదుగా డెమోక్రటిక్ పీఆర్టీయూ సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మండల శాఖ అధ్యక్షుడు డేవిడ్‌రాజు, ఉపాధ్యాయులు వాసు, కిరణ్, రామారావు, నాగరాజు, వెంకట్రావు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : యూటీఎఫ్ మండల శాఖ నూతన క్యాలెండరు, డైరీని ఎంపీపీ ఆర్.దేవిప్రవణ్య, తెదేపా నాయకులు కె.విజయబాబు, ఎంఎన్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి గురువారం ఆవిష్కరణ చేసినట్లు ఆ శాఖ నాయకులు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు పి.భవాని, మండల అధ్యక్షురాలు బి.వి.ఎస్.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాడు వెతలు.. నేడు పరుగులు

నాలుగేళ్లుగా గజానికో గోతితో ముప్పతిప్పలు పెట్టిన రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. సంక్రాంతికి గోతులుండకూడదన్న ప్రభుత్వ ఆదేశాలతో ఏళ్లనాటి ఇబ్బందులు తొలగి వాహనాలు దూసుకుపోతున్నాయి. మైలవరం నుంచి ఏలూరు జిల్లా నూజివీడు వరకు 25 కి.మీ. దూరం ఉండగా, 13 కి.మీ. మైలవరం పరిధిలో ఉంది. మైలవరం నుంచి వెల్వడం వరకు ప్రస్తుతం రూ.6 కోట్ల అంచనాలతో పనులు చివరి దశలో ఉండగా, వెల్వడం హైస్కూల్ నుంచి చంద్రాల దాటే వరకు మరో రూ.8.85 కోట్ల పనులకు కార్యాచరణ సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రకటించారు. ప్రస్తుతం పూర్తైన రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులు, స్థానికులు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

వెల్వడంలో అభివృద్ధి చేసిన రహదారి

నెరవేరని ఏళ్ల నాటి కల

విస్సన్నపేట మండలం కొండపర్వ నుంచి ముసునూరు మండలం, రమణక్కపేట మీదుగా ఏలూరుకు వెళ్లే దారి ఇది. స్వాతంత్ర్యానికి పూర్వం డొంక దారిగా ఉండేది. ఎన్ని ప్రభుత్వాలు, ఎంతమంది ప్రజా ప్రతినిధులు మారినా ఇది తారు రోడ్డుగా మారే ఘడియ ఇప్పటివరకు రాలేదు. 2014 - 2019 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం హయాంలో తారు రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధమై, గుత్తేదారు కంకర కూడా తోలించారు. మరి కొద్ది రోజుల్లో తారు రోడ్డుగా మారుతుందనుకున్న క్రమంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తిరిగి ఇది మట్టి రోడ్డుగానే మిగిలిపోయింది. కొండపర్వ, చిత్తపూరు, జనార్దనవరం, తుమ్మగూడెం, తదితర గ్రామాల ప్రజలు ఏలూరు వెళ్లడానికి ఈ రహదారి ఎంతో అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా దీన్ని తారు రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

దాతల సహకారంతో వంటశాల నిర్మాణం

చందర్లపాడు, న్యూస్‌టుడే: కోనాయపాలెంలోని షిర్డి సాయి మందిరంలో దాతల సహకారంతో వంటశాలను నిర్మించారు. శ్రీపతి ఆంజనేయులు, సుగుణమ్మ దంపతుల కుమారులు మధు, హరిబాబు, శ్రీనివాసరావు అందించిన రూ.లక్ష నిధులతో నిర్మించిన దీన్ని సహకార సంఘ అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలను గ్రామస్థులు బుగ్గినేని సురేష్, కొత్త కామేశ్వరరావు, జాన్‌కోటయ్య, రవి తదితరులు అభినందించారు.

రబీ వరి సాగు ప్రారంభించిన అన్నదాతలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే

ఖరీఫ్ వరి నూర్పిడులు పూర్తయిన భూముల్లో దుక్కి దున్ని దమ్ములు చేసి రబీ వరిసాగును అన్నదాతలు రెడ్డిగూడెం మండలంలో గ్రామాల్లో ప్రారంభించారు. దాళ్వా వరి సాగు చేయడానికి కొందరు రైతులు ముందుగా బోర్ల కింద వరి నారుమడులు పెంచిన రైతులు నాట్లు వేసే పనులు ప్రారంభించారు. కొందరు మాగాణి పొలాల్లో చెరువుల్లో ఉన్న నీరు పెట్టి దమ్ము చేసి వెదజల్లే పద్ధతిలో విత్తనాలు చల్లుతున్నారు. గత కొన్ని రోజులుగా మద్దులపర్వలో కర్షకులు రబీ వరి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ గ్రామంలో ఖరీఫ్ నూర్పిడులు ముందుగా పూర్తి చేయడంతో రబీ వరినాట్లు వేస్తున్నారు. ★ మండలంలో రెడ్డిగూడెం, రంగాపురం, కూనపరాజుపర్వ, కుదప, రుద్రవరంలోని పెద్ద చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో రైతులు వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఆరుతడి పంటలు సాగు చేయాలని రెవెన్యూ, వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రైతులు దాళ్వా సాగుకే మొగ్గు చూపుతున్నారు. కొందరు క్రాసింగ్ వరి నాట్లు వేస్తున్నారు. ఈ రైతులు విత్తన సంస్థలతో ముందుగా ఒప్పందం చేసుకొని సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

రహదారిపై మంచు దుప్పటి..

శీతాకాలం వేళ మంచు గజగజలాడిస్తోంది. ఈ నేపథ్యంలో తెల్లవారుజాము నుంచే మంచు మొదలవుతుండగా ఉదయం 8 గంటలు దాటాక కూడా వదలడం లేదు. దీంతో రహదారులు, చెట్లూ చేమలు కనిపించని విధంగా మంచుతో పరుచుకుంటోంది. పలువురు వాహనాలను లైట్లు వేసి నిదానంగా నడుపుతున్నారు. **న్యూస్‌టుడే, మైలవరం**

అగ్ని ప్రమాదంలో తాటాకు ఇల్లు దగ్ధం

పోలిశెట్టిపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని పోలిశెట్టిపాడులో వాసం నాగేశ్వరరావుకు చెందిన తాటాకు ఇల్లు గురువారం జరిగిన విద్యుత్తు ప్రమాదంలో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. రెవెన్యూ అధికారులు అతనికి బియ్యం, కందిపప్పు, పంచదార అందజేశారు. తెదేపా నాయకులు మునియ్య, చిట్టిబాబు తదితరులు నాగేశ్వరరావును పరామర్శించారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

ఊటుకూరు, కొత్తపల్లి(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని ఊటుకూరు, కొత్తపల్లి గ్రామాల పరిధిలో కోడి పందేల నిర్వాహకులపై దాడి చేసి నిర్వాహకులను పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ గురువారం తెలిపారు. 14 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7,200, రెండు కోళ్లు, కోడికత్తి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

చర్చిలో మైకు శబ్దం తగ్గించమన్నందుకు ఘర్షణ

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల పరిధి తోటమూలలోని ఒక చర్చిలో ఏర్పాటు చేసిన మైక్ శబ్దం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. వివరాల్లోకి వెళ్తే.. తమ సమీపంలోని చర్చిలో ఏర్పాటు చేసిన మైక్ శబ్దం అసౌకర్యంగా ఉందని బిర్యాని విక్రయ దుకాణదారులైన బజ్జూరి హరికృష్ణ, కె.రాజశేఖర్ చర్చి నిర్వాహకులకు తెలిపారు. అయినా ఎక్కువ శబ్దంతో మైక్ పెట్టడంతో బుధవారం రాత్రి హరికృష్ణ కూడా మరో సౌండ్ సిస్టంతో పాటలు పెట్టగా ఇరువర్గాల మధ్య వివాదం మొదలైంది. అర్ధరాత్రి వేళ చర్చి నుంచి వచ్చిన రజని, నాగరాజు తదితర 30 మంది వరకు తనను నిద్ర లేపి దాడి చేశారని, ఇంట్లో వంట సామగ్రితో తనను కొట్టారని హరికృష్ణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫిర్యాదుదారునికి తల పగలడంతో తిరువూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో దాడిని నిరసిస్తూ తోటమూలలో భాజపా, హిందూ సంఘాల నాయకులు ఎ.క్రాంతికుమార్, వి.సుజాత, ఎన్.యుగంధర్, వి.రామకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై గురువారం ఉదయం ఆందోళనకు దిగారు. పోలీసులు చేరుకుని విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విరమించారు.

తోటమూలలో భాజపా నాయకుల ఆందోళన

(c) eenadu

విజయవాడ తూర్పు

ప్రమాదకర కేబుళ్లు తొలగించకుంటే చర్యలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని అనేక ప్రాంతాల్లో ప్రమాదకర స్థితిలో వేలాడుతున్న కేబుళ్లను ఆయా సంస్థలు వెంటనే తొలగించుకోవాలని నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వివిధ కేబుల్, నెట్ సంస్థలకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినా ఆయా సంస్థల ప్రతినిధులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించినా ఆయా సంస్థల ప్రతినిధులు మాత్రం సక్రమంగా స్పందించడం లేదని అన్నారు. జక్కంపూడి, మొగల్రాజపురం, బందరు రోడ్డు, పటమట ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న పలు కేబుళ్లను తొలగించాలని ఆయన వెల్లడించారు. ఇప్పటికైనా ఆయా సంస్థలు వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో రహదారుల వెంట వేలాడుతున్న కేబుళ్లను పూర్తిగా తొలగిస్తామని హెచ్చరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

★ క్రీస్తురాజపురం విజయనగర్ కాలనీలో తాగునీటి పైపు లీకేజీ అవుతోందని స్థానిక నివాసి రమణారావు మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మరమ్మతులు చేయించారు.

★ 3వ డివిజన్ నాగార్జుననగర్, బాయన బాబూజీ రహదారి వెంబడి పంట కాలువ డ్రెయిన్‌లో దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక నివాసి భగవాన్ మలేరియా అధికారి హెచ్.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల పొగ, మందులు చల్లించారు.

★ 8వ డివిజన్ విజయలక్ష్మి కాలనీ 3-10/9 విద్యుత్ స్తంభానికున్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి కృష్ణారావు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు.

? నాలుగో డివిజన్ శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీ వీరికాని రహదారి ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.- కిషోర్ కృష్ణ

✔ కాలనీలో అన్ని రోడ్లు సీసీ రహదారులుగా అభివృద్ధి చేశాం. ప్రధాన రహదారికి మాత్రం బీటీ వేస్తాం. - సామ్రాజ్యం, ఈఈ – న్యూస్‌టుడే, కరెన్సీనగర్

చెత్త తొలగింపు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: మూడో డివిజన్ గుణదల ఈఎస్ఐ శ్మశాన వాటిక వెనక రోడ్డులో చెత్త డంపింగ్ చేస్తున్న వైనంపై 'వ్యర్థాల తిష్ఠ.. దుర్గంధంతో అవస్థ' శీర్షికన బుధవారం 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. డివిజన్ శానిటరీ అధికారి ఆంథోనీ పర్యవేక్షణలో సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి ప్రత్యేక వాహనంలో చెత్త తరలించారు.

ఉత్సాహంగా ఫెట్ 2026

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే వస్తువుల క్రయ, విక్రయాలపై అవగాహనతో పాటు వ్యాపార దృక్పథం అలవడుతోందని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు బి.రాజశేఖర్ అన్నారు. సిద్ధమనేని పాలిక్లినిక్ రోడ్డులోని నలంద విద్యా నికేతన్‌లో నూతన సంవత్సర సందర్భంగా 'ఫెట్ 2026' గురువారం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నలంద విద్యా సంస్థల ఛైర్మన్ ఎ.విజయబాబు, పాఠశాల ప్రిన్సిపల్ మాదల పద్మజ తదితరులు పాల్గొన్నారు. స్టాల్స్‌లో విద్యార్థులు.. దేశీయ, విదేశీ వంటకాలు ప్రదర్శించారు. గేమ్‌షోలు, గిఫ్ట్ ఆర్టికల్స్ ఏర్పాటు చేశారు.

ప్రదర్శన వద్ద రాజశేఖర్, పద్మజ, విజయబాబు

నాడు వదిలేశారు... నేడు పూర్తి చేశారు

వైకాపా ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేసి వదిలేసిన రహదారిని కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఎనిమిదో డివిజన్‌లోని ఎస్బీఐ కాలనీలో ఎఎస్ రామారావు రోడ్డు నుంచి అస్మిపూర్వ అపార్ట్‌మెంట్ వరకు అభివృద్ధి పనులకు నిధులు రూ.51 లక్షలతో అభివృద్ధి చేస్తామని 2020, ఫిబ్రవరిలో వైకాపా ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. వారి పాలనలో పూర్తి చేయకుండా వదిలేశారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, రహదారి సమస్య పరిష్కరించాలంటూ 'ఈనాడు' పలుమార్లు కథనాలు ప్రచురించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. రూ.38 లక్షలు మంజూరు చేశారు. రహదారి అభివృద్ధి చేశారు. రెండువైపులా పేవర్ బ్రిక్స్ ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో శిలాఫలకానికే పరిమితమైన రహదారిని అభివృద్ధి చేయడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

కలగర నాగబాబు వీధిలో అభివృద్ధి చేసిన రహదారి

ఆర్థిక సాయం.. ఆశయ సాకారం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే

అంధ విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆర్థిక చేయూతనిస్తున్నాయి చెన్నైలోని హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్, ఆంధ్రా లయోలా కళాశాల హెల్ప్‌లైన్ విభాగం. తోటి విద్యార్థుల్లానే చదువుకొని ఉద్యోగాలు చేయాలనే దృఢ సంకల్పం వారిది. కానీ తోడ్పాటు అందించే వారు కరువయ్యారు. పాఠశాల విద్య పూర్తయిన తరువాత స్నేహితుల సహకారంతో ఇంటర్, డిగ్రీ, పీజీ చదివే స్థాయికి చేరుకున్నారు. వారికి ఆర్థిక చేయూతనిచ్చి ఉన్నత స్థాయికి చేరేలా ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి.

★ విజయవాడ ఆంధ్రా లయోలా కళాశాలలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులు దాదాపు 18 మంది చదువుతున్నారు. వారికి హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్ ఏటా ఉపకార వేతనాలు అందిస్తోంది. దేశ వ్యాప్తంగా 3 వేల మందికి 25 ఏళ్లుగా ఇస్తోంది. ఈ ఏడాది కొత్తగా ఇంటర్ చదివే వారికి కూడా వేతనాలు ఇస్తోంది. డే స్కాలర్లకు రూ.12 వేలు, హాస్టల్ విద్యార్థులకు రూ.30 వేలు అందించింది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి విజయవాడ, గుంటూరులోని వివిధ కళాశాలల నుంచి 38 మందికి రూ.6.89 లక్షలు పంపిణీ చేసినట్లు హెల్ప్‌లైన్ సమన్వయకర్త జి.సహాయ భాస్కరన్ తెలిపారు.

ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ముఖ్యఅతిథి, రెక్టర్, ప్రిన్సిపల్ తదితరులు

పోటీ పరీక్షలకు వినియోగిస్తా

మాది గుంటూరు జిల్లా గోరంట్ల. బీఏ ఏపీ ప్లస్ కళాశాలలో చదువుతున్నా. ఏటా రూ.12 వేలు ఉపకార వేతనం తీసుకుంటున్నా. స్నేహితులు నాకు అందిస్తున్న సహకారం మరువలేనిది. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నా. ప్రభుత్వ ఉద్యోగం చేయాలని ఉంది. - బొడపాటి వెన్నెల

తల్లిదండ్రులకు అండగా

మాది గుంటూరు. పాఠశాల విద్య సుజాత హైస్కూల్‌లో పూర్తి చేశా. గుంటూరు హిందూ కళాశాలలో డిగ్రీ చదువుతున్నా. ఎంబీఏ చేసి బ్యాంకింగ్ రంగంలోకి వెళ్లాలని ఉంది. స్నేహితుల సహకారంతో ఇక్కడి వరకు రాగలిగా. ఉపకార వేతనాన్ని తల్లిదండ్రులకు ఇస్తున్నా. - కమతం వెంకట్రావు

కంప్యూటర్ రంగంలో స్థానం

మాది సింగ్‌నగర్. పాఠశాల విద్య గుణదల విజయమేరీ అంధుల పాఠశాలలో పూర్తి చేశా. ఇంటర్, డిగ్రీ మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాలలో చదువుతున్నా. సంగీతమంటే ఇష్టం. మ్యూజిక్ వినడం నా అభిరుచి. కంప్యూటర్ ఆపరేటర్‌గా స్థిర పడాలనుకుంటున్నా. - దాసరి డేనియల్

అభివృద్ధి.. సంక్షేమ పథకాలకు పెద్దపీట

బిస్కెట్ల దండతో ఎమ్మెల్యే రామ్మోహన్‌ను సన్మానిస్తున్న ప్రజలు

పటమట, న్యూస్‌టుడే: గత ఏడాది కంటే ఎక్కువగా కొత్త సంవత్సరంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. గురువారం ఆటోనగర్‌లోని పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మధ్య కేక్ కోశారు. అనంతరం పార్టీ నాయకుడు దూళిపాళ్ల రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూరగాయల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ నాయకులు ఇచ్చిన బొకేలను ఆయన స్వీకరించారు. ఎమ్మెల్యే సొంత గ్రామం బుద్ధవరానికి చెందిన అభిమానులు సైదులు, వెంకటేశ్వరరావు తదితరులు 2026 బిస్కెట్లతో తయారు చేసిన దండను ఆయనకు వేసి సత్కరించారు. డివిజన్ పార్టీ నాయకులు, కూటమి నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, ప్రభుత్వ శాఖ అధికారులు తదితరులు హాజరై ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీశైలంలో వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: శ్రీశైలంలో శాశ్వత పద్ధతిలో వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ శ్రీశైలం ట్రస్ట్ బోర్డు పాలక మండలి సభ్యులకు హామీ ఇచ్చారు. అమరావతిలోని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యులు ఏవీ రమణ, బోడేపూడి వెంకట సుబ్బారావు, శంకరశెట్టి పిచ్చయ్యలు పట్టాభిరామ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. దేవస్థాన చిత్రపటం, ప్రసాదం అందజేశారు. శ్రీశైలంలో వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు.



పట్టాభిరామ్‌కు దేవస్థానం చిత్రపటం, ప్రసాదం అందజేస్తున్న శ్రీశైలం బోర్డు సభ్యులు

మురుగు సమస్యకు మోక్షం

ఏడో డివిజన్‌లోని మధుచౌక్ పక్క రహదారిపై చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతోంది. తరచూ కాలువలు పొంగి రహదారి పైకి రావడం వల్ల ఆ ప్రాంతంలో మురుగు సమస్యతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి అధికారులు, పాలకులు చర్యలు తీసుకున్నారు. రూ.18 లక్షలతో భూగర్భ డ్రెయినేజీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పైపులు ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల్లో పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. త్వరలోనే మురుగు సమస్యకు మోక్షం కలుగుతుంది.

– మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే

నగరాన్ని ఉన్నత స్థితిలో నిలిపేందుకు కృషి

విజయవాడ నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరానికి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఈ ఏడాది కూడా స్వచ్ఛ అవార్డు దక్కేందుకు అధికారులు, ఉద్యోగులు ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో కోరారు. దేశంలో ప్రతిష్ఠాత్మకమైన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు కిందటి ఏడాది నగరపాలక సంస్థ సూపర్ స్వచ్ఛ అవార్డు దక్కించుకుందని అన్నారు. అదేవిధంగా ఈ ఏడాది లోనూ అవార్డు దక్కించుకునేందుకు ప్రతి ఒక్కరూ మరింతగా కృషి చేయాలని సూచించారు. మరోవైపు నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు హరితాంధ్ర ప్రదేశ్‌వైపు అడుగులు వేయాలని అన్నారు. ఇందుకు వీలుగా నగరపాలక సంస్థలోని ప్రతి ఇంటి నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను రెడ్యూస్, రీ-యూజ్, రీసైకిల్(ఆర్ఆర్ఆర్) పద్ధతుల ద్వారా సద్వినియోగం అయ్యేలా చూడాలని కోరారు. ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను తడి పొడిగా విభజించి మాత్రమే తమ సిబ్బందికి అందించాలని కమిషనర్ సూచించారు. పర్యావరణ హితమైన వస్తువులను మాత్రమే వాడడం ద్వారా ఘన వ్యర్థాల సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించకుండా పూర్తిగా నియంత్రించాలని ఆయన కోరారు. విజయవాడ నగరాన్ని ఉన్నత స్థానంలో నిలిపేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

రక్షిత నీటి సరఫరాపై దృష్టి

విజయవాడ నగరపాలక సంస్థ: నగర ప్రజలకు నిత్యం రక్షిత నీటిని అందించేందుకు బాధ్యులైన అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. బాధ్యులైన అధికారులతో గురువారం టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ నిత్యం నీటి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పాత పైప్‌లైన్లలో లీకేజీలు ఉన్నట్లు గుర్తించిన పక్షంలో వెంటనే వాటిని మార్చివేసి కొత్త వాటిని అమర్చాలని, పైపులకు ఎక్కడా లీకేజీలు లేకుండా చూడాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంజినీరింగ్ అధికారులు నిత్యం నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ పర్యవేక్షించడం ద్వారా స్థానికంగా తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు ఉత్పన్నం అవుతున్నా వెంటనే గుర్తించి సరిచేయాలని తెలిపారు. నిత్యం నీటి పరీక్షలు చేసి ప్రతి ఇంటికి రక్షితనీరు అందుతుందో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. కొండ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా రోజూ అసిస్టెంట్ ఇంజినీర్లు, ఎమినిటీ కార్యదర్శులు ఆ ప్రాంతాల్లో పర్యటించాలని, ఇంటింటి వివరాలు సేకరించాలని తెలిపారు.

యోగా.. ఆరోగ్య ప్రదాత

చిట్టినగర్: యోగా.. ఆరోగ్య ప్రదాత అని అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.శివకుమార్ పట్నాయక్ పేర్కొన్నారు. కేఎల్‌రావు పార్కులో అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ సహకారంతో శ్రీనివాసరెడ్డి యోగా సేవా సంస్థ నిర్వహిస్తున్న యోగా శిక్షణలో ప్రతిభ చూపిన వారిని గురువారం సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి పిలుపు మేరకు చేపట్టిన యోగాంధ్ర స్ఫూర్తితో యోగా శిక్షణ కొనసాగుతుందన్నారు. కేఏం కుమారి, శివపార్వతిలకు ఉత్తమ యోగా అవార్డుతో సత్కరించి జ్ఞాపికలను అందించినట్లు తెలిపారు. సంఘ గౌరవాధ్యక్షుడు విజయ్‌కుమార్, హ్యాపీ వాకర్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అల్ఫ్రెడ్, వెంకటేశ్వర్లు, యోగా గురువు సుబ్బారావు, పాల్గొన్నారు.

డీజీపీకి శుభాకాంక్షలు

హరీష్‌కుమార్ గుప్తాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు గురువారం రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీతో పాటు ఎన్టీఆర్ జిల్లా డీసీపీలు కృష్ణకాంత్ పటేల్, తిరుమలేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, కె.జి.వి.సరిత, కె.కృష్ణప్రసన్న, షిరీన్‌బేగం తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సేవలకు గుర్తింపు

అవార్డులతో ఎండీ వేణుగోపాలరెడ్డి, మారుతీరావు, హేమంత్‌కుమార్

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: పేద, మధ్య తరగతి ప్రజలకు రుణాలు మంజూరు చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నట్లు కోస్టల్ బ్యాంకును గుర్తించి ఛాంబర్ ఆఫ్ ఇండియన్ మైక్రో స్మాల్, మీడియం సంస్థ ఉత్తమ అవార్డు అందజేసిందని బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ బి.వేణుగోపాలరెడ్డి తెలిపారు. గాయత్రినగర్‌లోని బ్యాంకులో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ అవార్డును ఇటీవల దిల్లీలో కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ అందజేశారని వెల్లడించారు. బ్యాంక్ చీఫ్ క్రెడిట్ ఆఫీసర్ మారుతీరావు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ పి.హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓపెన్ కరాటేలో సత్తా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: న్యూదిల్లీలో గత నెల 29, 30వ తేదీల్లో జరిగిన జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన జి.నీనా(7) సత్తాచాటి కాంస్య పతకం కైవసం చేసుకుందని వాంకన్ కరాటే డొ సమాఖ్య రాష్ట్ర చీఫ్ ఎస్.దుర్గారావు తెలిపారు. ఈ పోటీల్లో దేశంలోని 15 రాష్ట్రాల నుంచి రెండు వేల మంది క్రీడాకారులు తలపడ్డారని పేర్కొన్నారు. నీనా 5 నుంచి 14 ఏళ్లలోపు కేటగిరీలో కటాలో తలపడి తృతీయ స్థానంలో నిలిచిందని వివరించారు. పలువురు పతకం సాధించిన నీనాను అభినందించారు.

పతకం సాధించిన నీనాతో దుర్గారావు

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

పున్నమ్మతోట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండప ప్రాంగణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం రాత్రి నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీకృష్ణకేళి కోలాట బృందం వివిధ పాటలకు కోలాటాలు వేసి అలరించారు. ఈ కార్యక్రమాన్ని తనిఖీ అధికారి లలిత రమాదేవి పర్యవేక్షించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కృష్ణలంక, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కృష్ణలంక పరిధిలోని ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. పీఎన్‌బీఎస్ సమీపంలోని త్రిశక్తిపీఠం కాళీమాత ఆలయంలో ఉదయం నుంచి భక్తుల రద్దీ నెలకొంది. కృష్ణలంక పాత పోలీస్ స్టేషన్ వీధిలోని కోదండరామాలయం, శంకరమఠం, నల్లగేటు సమీపంలోని వినాయకుడి మందిరానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పూజలు చేపట్టారు.

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అలంకరణలో త్రిశక్తిపీఠం కాళీమాత

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: విజయవాడ తూర్పు మండలం ఏపీఐఐసీ కాలనీలోని ప్రత్యేక అవసరాల భవిత కేంద్రంలో నూతన సంవత్సరం వేడుకలకు జరిగాయి. రాష్ట్ర సమగ్ర శిక్షా కార్యాలయ అధికారులు వచ్చి కేకు కోసి పిల్లలకు పంచి పెట్టారు. పిల్లలు పాటలు, నృత్యాలతో అలరించారు.

పిల్లలతో సమగ్ర శిక్షా అధికారులు

కోర్ సబ్జెక్టులతోనే దేశ ప్రగతి

దైనందిని ఆవిష్కరణలో వీసీ వెంకటేశ్వరరావు, రామారావు తదితరులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ది రిటైర్డ్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర వేడుకలు, 2026 దైనందిని ఆవిష్కరణ గురువారం కానూరు లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో జరిగాయి. జి.పట్టాభి రామారావు అధ్యక్షతన జరిగిన వేడుకలకు సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు విచ్చేసి దైనందిని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ కోర్సులకు ప్రాధాన్యం ఇస్తున్నారని, కోర్ సబ్జెక్టులు మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ గ్రూపులు మాత్రమే 2047 దేశ ప్రగతి లక్ష్యాలను చేరుకోగలమన్నారు. గుండెనొప్పి లక్షణాలు, నివారణను క్యాపిటల్ హాస్పిటల్స్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వీఎన్ భూపాల్ వివరించారు. ఎన్.వెంకటేశ్వర్లు, వై.కుమార్‌స్వామి, కార్యదర్శి అన్నే సాంబశివరావు, ఎస్ఎస్ఆర్ ఆంజనేయులు, ట్రస్టు ఛైర్మన్ వీవీ రామారావు, డి.భానుప్రసాద్ పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు చేపట్టరూ..

కృష్ణలంక, న్యూస్‌టుడే: కృష్ణలంక జాతీయ రహదారి పీఎన్‌బీఎస్ ఇన్‌గేటు వద్ద రహదారి గుంతలతో అధ్వానస్థితిలో ఉంది. రోజూ వందలాది బస్సులు ఇదే మార్గంగా బస్ స్టేషన్‌లోకి వెళుతుంటాయి. తక్షణం మరమ్మతులు చేపట్టాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

రాణిగారితోట ప్రాంతానికి త్వరలో కృష్ణా జలాలు

చెంతనే నివాసం ఉంటున్నప్పటికీ కృష్ణా నది జలాలు అందడం లేదనే అసంతృప్తి రాణిగారితోట ప్రాంత ప్రజల్లో ఉంది. ఆ ప్రాంత వాసులకు త్వరలో కృష్ణా జలాలు సరఫరా కానున్నాయి. ఆ ప్రక్రియ వేగవంతమైంది. నగర పాలక సంస్థ అమృత్ పథకం కింద రామలింగేశ్వరనగర్‌లో ఏర్పాటు చేయనున్న 5 ఎమ్మెల్డీ హెడ్ వాటర్ వర్క్స్ ఫిల్టరేషన్ ప్లాంట్ ఏర్పాటుతో సర్కిల్-3 పరిధిలోని రాణిగారితోట ప్రాంత ప్రజలకు కృష్ణా జలాలు అందుతాయి. ఫిల్టరేషన్ ప్లాంట్‌లో శుద్ధి చేసిన నీరు రాణిగారితోటలో నూతనంగా నిర్మించనున్న రిజర్వాయర్ ద్వారా ఇళ్లకు చేరనుంది.

★ రాణిగారితోట సిమెంటు గోదాము ప్రాంగణంలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో 1000 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ ద్వారా 16, 17 డివిజన్లతో పాటు కరకట్ట ప్రాంతాలైన భూపేష్‌గుప్తానగర్, తారకరామానగర్ ప్రాంతాలకు నీటి సరఫరా చేస్తారు. ఇప్పటికే హెడ్ వాటర్ వర్క్స్ ఫిల్టరేషన్ ప్లాంట్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. అక్కడ శుద్ధి చేసిన కృష్ణా జలాలను ప్రజలకు అందించేందుకు వీఎంసీ రాణిగారితోటలో రిజర్వాయర్ నిర్మాణం తలపెట్టింది. ఆరు నెలల వ్యవధిలో పనులు పూర్తి చేసి శుద్ధి చేసిన నీటిని కుళాయిల ద్వారా ఇళ్లకు చేరవేస్తామని అధికారులు చెబుతున్నారు.

- కృష్ణలంక, న్యూస్‌టుడే

సీపీఐ శతాబ్ది ఉత్సవాల జయప్రదానికి పిలుపు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించి వారికి అండగా నిలిచిన భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజా పిలుపునిచ్చారు. పార్టీ ముగింపు ఉత్సవాల్లో భాగంగా గురువారం ఏడో డివిజన్ పార్టీ ఆధ్వర్యంలో బోయపాటి మాధవరావు గ్రంథాలయం వద్ద వృద్ధులు, బాలలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన ఖమ్మంలో 5 లక్షల మందితో ముగింపు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం పార్టీ చేసిన కృషిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కోరారు. కమ్యూనిస్టు పాలనలో నగరంలోని కొండ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. నగర కార్యదర్శివర్గ సభ్యుడు అప్పురబోతు రాము అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సంగుల పేరయ్య, మాజీ కార్పొరేటర్ ఇజ్జాడ లక్ష్మీ, డివిజన్ కార్యదర్శి పూసర్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న అక్కినేని వనజా, జల్లి విల్సన్

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పాతబస్తీ రథం సెంటరులో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం తెలిపారు. గురువారం వన్‌ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు, సీఐ ఉమామహేశ్వరరావులతో కలిసి రథం సెంటరులో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పర్వదినాలు, శుక్ర, శని, ఆదివారాల్లో దుర్గమ్మ గుడికి వచ్చే భక్తుల వాహనాలతో మహా మండపం, కనకదుర్గానగర్, రథం సెంటరు సమస్యాత్మకంగా మారుతుందన్నారు. దీన్ని పరిగణనలోకి తీసుకొని కనకదుర్గానగర్ నుంచి కెనాల్ రోడ్డు వరకు ట్రాఫిక్ కోన్స్, బారికేడ్లతో నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రకాశం బ్యారేజీ వైపు నుంచి ఘాట్ రోడ్డు వైపు వచ్చే వాహనాలను సాధారణ ట్రాఫిక్‌ను సులభతరంగా వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆటో డ్రైవర్లు, వాహన చోదకులు ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన చర్యలకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్రీధర్, ఓంకార్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు సూచినలిస్తున్న డీసీపీ షిరీన్ బేగం

పింఛనర్ల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

భవానీపురం, న్యూస్‌టుడే: ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు భవానీపురం హెచ్‌బీ కాలనీలోని సంఘం కార్యాలయంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యెమినేని వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఉపాధ్యక్షుడిగా పి.పట్టాభిరామారావు, ఎం.రత్నాకర్, కార్యదర్శిగా యెనిగళ్ల సుబ్బారావు, జాయింట్ కార్యదర్శులుగా ఫారూఖ్ అలీ బేగ్, శశాంక బాబు, సహాయ కార్యదర్శులుగా ప్రతాప్ శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు, కోశాధికారిగా వేణు గోపాల కృష్ణమూర్తి తదితరులు ఎన్నికయ్యారు.

సినిమాలు

సైక్ సిద్ధార్థ, 45, మార్క్: ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). **మదం:** అప్సర(గవర్నరుపేట), తారా స్క్రీన్స్(పాయకాపురం), రామ్ సినిమాల్(గుణదల). **సఃకుటుంబానం:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట). **వినరా ఓవేమ, ఘంటసాల:** నవరంగ్(గవర్నరుపేట). **వినరా ఓవేమ**, **నిలకంఠ:** పీవీఆర్ మాల్(బందరురోడ్డు). **నిలకంఠ:** ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట). **సైక్ సిద్ధార్థ:** అలంకార్. **శంబాల, వనవీర, ఛాంపియన్, ఈషా:** జీ-3(రాజ్, యువరాజ్).

తొలగిన ఇక్కట్లు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : మొగల్రాజపురంలోని శివగిరి కొండపై వంద కుటుంబాలకుపైగా నివాసం ఉంటారు. వారంతా నగరంలో వివిధ పనులు, చేతివృత్తులు, చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారు నివసించే ప్రాంతాల్లో మెట్లు శిథిలావస్థకు చేరాయి. రాకపోకలకు అసౌకర్యంగా మారాయి. రాత్రి పడిపోయి గాయాలపాలవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యలను వైకాపా ప్రభుత్వం హయాంలో పాలకులకు చెప్పినా.. పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే అట్లూరి పరమాత్మ వీధి నుంచి శివగిరికి వెళ్లే మెట్లను రూ.15 లక్షలతో అభివృద్ధి చేశారు. కొన్ని సంవత్సరాల నుంచి నెలకొన్న సమస్యను పరిష్కరించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జీఎల్ఎస్ఆర్ వీధిలో కూడా రూ.7 లక్షలతో మెట్లు అభివృద్ధి చేశారు.

కోర్టు ప్రకటన

In the Court of the Motaor Accident Claims Tribunal Cum XII th Addl District judge at Vijayawada
M.V.O.P No: 65/2025
Between:-
Shaik Khadar Vali ....Petitioner,
And
Kode SadasivaRao & others ...Respondents
To,
R2, Tummapudi Manga Devi, S/o T.Sankara Rao, Aged 45 years Owner of Car bearing No: AP 40 D 1689, R/o D. No: 41-2/3-4, Harijana Seva Sangam street, Krishna Lanka Vijayawada, NTR District - 520013

పై నెంబరు పిటీషను లో పిటీషనర్ కు జరిగిన రోడ్డు ప్రమాదం వలన గాయపడినందుకు దానికి నష్టపరిహారం కోరుతూ పై పిటీషన్ దాఖలు చేయగా, సదరు 2వ రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారి ఎదుట ది.28-01-2026 ఉదయం గం॥10.30ని॥ వాయిదా అయి ఉన్నది. కావున మీరు ప్రత్యక్షంగా గాని, లాయరు గారి ద్వారా హాజరై మీ ఆక్షేపణల తెలుపుకొనవలెను. లేని యెడల పరోక్షంగా తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది 28-01-2026
ఇట్లు:- మాదల వెంకట్‌రావు, న్యాయవాది, విజయవాడ,
ఫోన్: 92462 23338

(c) eenadu

నందిగామ
• నందిగామ • జగ్గయ్యపేట

డీవీఆర్ బ్రాంచి కెనాల్‌కు వారబందీ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: డీవీఆర్ బ్రాంచి కెనాల్‌లో సాగునీటి సరఫరాకు ఈ నెల 8 నుంచి వారబందీ విధానం అమలు చేస్తున్నారని డీసీ కమిటీ అధ్యక్షులు గోపాలరావు, చంద్రశేఖర్ తెలిపారు. కెనాల్‌కు ఎగువనున్న తెలంగాణ ప్రాంతానికి వారం రోజుల తర్వాత దిగువకు ఇవ్వాలని ఎన్నెస్పీ అధికారులు నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 15 నుంచి తిరిగి సరఫరా చేస్తారన్నారు.

జీవన ధ్రువపత్రాల సమర్పణ

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక సబ్‌ట్రెజరీ కార్యాలయంలో గురువారం పింఛన్‌దారులు తమ జీవన ధ్రువపత్రాలను ఎస్టీవో కాకాని నాగేశ్వరరావుకు అందజేశారు. ఈనెల ఒకటి నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు వీటిని సమర్పించేందుకు గడువు ఉండగా తొలిరోజే కొందరు పత్రాలు అందించారు.

ప్రసంగ పీఠం బహూకరణ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మాగల్లు సీఎస్ఐ చర్చికి గురువారం గ్రామ తెదేపా నాయకులు రూ.60 వేలు విలువైన పీఠాన్ని బహూకరించారు. దివంగత సర్పంచి చెరుకుమల్లి వెంకటయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు శివవరాంప్రసాద్, శంకరరావు, రామకోటేశ్వరరావు అందజేశారు. దాతలను పాస్టర్ ఏసుపాదం, సౌజన్య అభినందించారు. కొణతమాత్మకూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రీడింగ్ రూం ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. దాతల సౌజన్యంతో వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. రీడింగ్ రూంకు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి ప్రకాశరావు రూ.20 వేల విలువైన పుస్తకాలు వితరణగా ఇచ్చారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనలు: కంచికచర్ల రైతు బజారు వెనక వీధిలో రోజుల తరబడి చెత్త నిల్వ ఉండి దుర్వాసన వస్తోందని స్థానికులు చేసిన ఫిర్యాదుకు పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం స్పందించారు. సిబ్బందితో చెత్తను తీయించారు. ★ కంచికచర్ల ప్రణీత కాలనీలో వీధి దీపాలు లేక రాత్రి వేళ ఇబ్బందిగా ఉంటుందని కాలనీకి చెందిన జమలయ్య చేసిన ఫిర్యాదుకు విద్యుత్తు శాఖ ఏఈ దిబ్బయ్య స్పందించారు. వీధి దీపాలను మార్పించారు. ★ చెవిటికల్లు సచివాలయం సమీపంలో కాలువలు వ్యర్థాలతో నిండి దుర్వాసన వస్తోందని గ్రామానికి చెందిన రమణారావు చేసిన ఫిర్యాదుకు పంచాయతీ కార్యదర్శి నాని బాబు స్పందించారు. సిబ్బందితో వ్యర్థాలను తీయించారు. ★ పేరకలపాడు వద్ద పైపు లైన్లు పాడై తాగు నీరు వృథాగా పోతోందని గ్రామానికి చెందిన కోటేశ్వరరావు చేసిన ఫిర్యాదుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరసింహారావు స్పందించారు. పైపు లైన్లకు మరమ్మతులు చేయించారు. - **న్యూస్‌టుడే, వీరులపాడు**

బరుల ఏర్పాటుకు సన్నాహాలు

కంచికచర్ల, న్యూస్‌టుడే

గండేపల్లి వద్ద మామిడి తోటలో బరి ఏర్పాటు చేస్తున్నది ఇక్కడే..

సంబరాల సంక్రాంతి వేళ.. నందిగామ నియోజకవర్గంలో కోడి పందేల బరులకు రంగం సిద్ధమవుతోంది. స్థానిక నాయకుల హామీతో నిర్వాహకులు పలుచోట్ల భారీ బరులు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మరోపక్క కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నా నిర్వాహకులు మాత్రం పట్టించుకున్న పరిస్థితులు కన్పించడం లేదు. ★ కంచికచర్ల మండలం గండేపల్లి వద్ద గత కొన్నేళ్లుగా భారీ బరి ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా ఇదే ప్రాంతంలో కోడి పందేల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ★ వేములపల్లి, నక్కలంపేట వంటి మరికొన్ని గ్రామాల్లో సైతం బరుల ఏర్పాటుకు కొంత మంది ప్రయత్నాలు ప్రారంభించారు. ★ నందిగామ మండలం మాగల్లు, ఐతవరం, అనాసాగరం తదితర ప్రాంతాల్లో బరుల ఏర్పాటుకు నిర్వాహకులు ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ★ చందర్లపాడు మండలంలో గతంలో నిర్వహించిన బరులతో పాటు ఈసారి మరికొన్ని ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులు సిద్ధమవుతున్నారు.

★ స్థాయిని బట్టి ఒక్కో బరి ఏర్పాటుకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు కొంతమంది అధికారులు డిమాండ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇది కాకుండా కేసుల నిమిత్తం కొన్ని కోడి పుంజులు, కొంత మంది వ్యక్తులను సైతం తమకు ముందుగానే అప్పజెప్పాలనే నిబంధనలు విధిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

★ బరుల వద్ద మద్యం, జూదం, మరికొన్ని ఇతర నిషేధిత ఆటలు ఆడించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తారు. దీంతో ఘర్షణలు చెలరేగి శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది గండేపల్లి బరి వద్ద చెలరేగిన ఘర్షణలో పలువురు గాయాలపాలైన సంగతిని గుర్తు చేస్తున్నారు.

శుభాకాంక్షల వెల్లువ

మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు చెబుతున్న తెదేపా నాయకులు

ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌తో మైలవరం పోలీసు అధికారులు

కేకు కోస్తున్న రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

ఐతవరం(నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని ఐతవరం గ్రామంలో గురువారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌ను నియోజవర్గానికి చెందిన తెదేపా నాయకులు, అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు అధికారుల సమక్షంలో కేకుకోసి పంపిణీ చేశారు. నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరించారు. విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం, కొండపల్లి, జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం మండలాల కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావుకు గ్రామ సొసైటీ అధ్యక్షుడు మద్దుకూరు రామారావు, వైస్ ఎంపీపీ అన్నం పిచ్చయ్య, యరమాస అంకురావు, చెన్నారావు తదితరులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాగల్లు సొసైటీ కార్యాలయం వద్ద సొసైటీ అధ్యక్షుడు సూరంపల్లి అప్పారావు ఆధ్వర్యంలో కేకు కోసి పంపిణీ చేశారు.

జగ్గయ్యపేట గ్రామీణం: పట్టణంలోని కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం నివాసంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ముఖ్య అతిథిగా పాల్గొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరం ప్రతి ఇంటా ఆరోగ్యం, ఆనందం, శాంతి, సుఖసంతోషాలు, ప్రతి రైతుకు సమృద్ధి ఆదాయం, యువతకు అవకాశాలు, మహిళలకు భద్రత తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అమ్మవారి నిత్యాన్నదానానికి విరాళం

విరాళమిస్తున్న శివప్రసాద్, పావని దంపతులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో నిత్య అన్నదానానికి నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం నెల్లూరు పాలెం గ్రామానికి చెందిన చెరుకూరి శివప్రసాద్, పావని దంపతులు రూ.50,116 విరాళం అందజేశారు. గురువారం దంపతులు అమ్మవార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, వేద పండితులు వారికి వేద ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుమలగిరి ఆలయంలో దాతలు..

జగ్గయ్యపేట గ్రామీణం: తిరుమలగిరి గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి గురువారం కోదాడకు చెందిన జనపనేని భార్గవ చారి-మాధవి దంపతులు రూ.25వేలు, విరాళం అందించారు. నందిగామకు చెందిన కొప్పు రామారావు సుశీల రూ.10వేలు అందజేశారు. ఆలయ అర్చకులు దాతలకు తీర్థప్రసాదాలు అందించారు. కాగా ప్రతి నెలా పౌర్ణమి రోజు నిర్వహించే గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలియజేశారు.

కరపత్రాల ఆవిష్కరణ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: షేర్‌మహమ్మద్‌పేటలో ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఈ నెల 5 నుంచి 15వరకు 'సంక్రాంతి ఆటలు- యువజన మైత్రికి బాటలు' అనే నినాదంతో గ్రామ స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. అనంతరం నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కేక్ కోసి మిఠాయిలు పంచారు.

నందిగామ గీతామందిరంలో శ్రీకృష్ణుని మూలమూర్తి

నందిగామలో పుష్పాలంకరణలో వాసవీ మాత

పుష్పాలంకరణలో చెన్న కేశవస్వామి ఉత్సవమూర్తులు

దేవాలయాలకు పోటెత్తిన భక్తులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం దేవాలయాల్లో స్వాములను అలంకరించారు. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నందిగామ సాయిబాబా దేవాలయం, గీతామందిరం, శివాలయాలను భక్తులు దర్శించుకున్నారు. పట్టణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం, భవానీశంకరుని వాయులింగం, అభయ వీరాంజనేయస్వామి దేవాలయాల్లో భక్తులు పూజలు చేశారు. నందిగామ వాసవీమాత మందిరంలో మహిళలు తిరుప్పావై, భగవద్గీత పారాయణం చేశారు. అమ్మవారి మూల మూర్తిని వెండిచీర, పుష్పాలతో అలంకరణ చేశారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. స్థానిక ముక్కోటి మండపంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా సాయిచరణ్ శుక్ల యజుర్వేద పారాయణం చేశారు. వారాల రామకృష్ణ శేషసాయి(తిరుపతి) సుందరకాండ పురాణ ప్రవచనం, పాతూరి కొండలరెడ్డి (సిద్దిపేట) గజేంద్రమోక్షం పద్యప్రవచనం, మురపాక బాలసుందరం (తాడేపల్లిగూడెం) హరికథాగానం ఆకట్టుకున్నాయి. అతిథులను ఉత్సవ కమిటీ కన్వీనర్ దీవి వెంకటరత్నమాచార్యులు సత్కరించారు.

వాసవీ మందిరంలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న మహిళలు

రహదారి భద్రతపై అవగాహన

ప్రదర్శన నిర్వహిస్తున్న టోల్ ప్లాజా సిబ్బంది

కీసర(కంచికచర్ల), న్యూస్‌టుడే: రహదారి భద్రతపై వాహనదారులకు స్వర్ణ టోల్ ప్లాజా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం ప్రదర్శన నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని సూచించారు. కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేషన్ మేనేజర్ రాజారావు, టోల్ మేనేజర్ జయప్రకాశ్, సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారంతో వంటశాల నిర్మాణం

వంటశాలను ప్రారంభిస్తున్న సహకార సంఘ అధ్యక్షుడు వాసిరెడ్డి

చందర్లపాడు, న్యూస్‌టుడే: కోనాయపాలెంలోని షిర్డీ సాయి మందిరంలో దాతల సహకారంతో వంటశాలను నిర్మించారు. శ్రీపతి ఆంజనేయులు, సుగుణమ్మ దంపతుల కుమారులు మధు, హరిబాబు, శ్రీనివాసరావు అందించిన రూ.లక్ష నిధులతో నిర్మించిన దీన్ని సహకార సంఘ అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్ గురువారం ప్రారంభించారు. దాతలను గ్రామస్థులు బుగ్గినేని సురేష్, కొత్త కామేశ్వరరావు, జాన్‌కోటయ్య, రవి తదితరులు అభినందించారు.

మాగల్లులో హిందూ సమ్మేళనం రేపు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మాగల్లు 108 అడుగుల లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఆవరణలో శనివారం సాయంత్రం 4 గంటలకు హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు గురువారం తెలిపారు. అభయ హిందూసేన వ్యవస్థాపకుడు రాధామనోహర్ దాస్ స్వామీజీ, ఆర్ఎస్ఎస్ ఏపీ బౌద్ధిక్‌టోలీ సభ్యుడు శ్యామ్ ప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని చెప్పారు.

కోతులు, కుక్కలతో బెంబేలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే

చిల్లకల్లులో సంచరిస్తున్న వానరాలు

జగ్గయ్యపేట పట్టణం, మండలంలో వానరుల సంచారంతో ప్రజలు బెంబేలెత్తున్నారు. ఇళ్లల్లోకి దూరి ఇంట్లో ఉన్న వస్తువులను చిందరవందర చేసి ఆహార పదార్థాలు తీసుకెళ్తున్నాయి. గ్రామాల్లో పిల్లలు దుకాణాలు వెళ్లి ఆహార పదార్థాలు తీసుకొస్తున్న సమయంలో వారిపై దాడి చేసి వాటిని తీసుకెళ్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారిపై దాడి చేస్తున్నాయి. పొలాల్లో పంటలను నాశనం చేస్తున్నాయి. పొలాల చుట్టూ వలలు, చీరలు, ఇనుప కంచెలు ఏర్పాటు చేసి పంటలను రక్షించుకుంటున్నారు. ఇటీవల ముక్త్యాలలో కోతులు అనేక మందిపై దాడిచేసి గాయ పరిచాయి. మరోవైపు కుక్కలు స్వైర విహారం చేస్తూ స్థానికులపై దాడి చేస్తున్నాయి. పట్టణంలో రాత్రి సమయంలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ఇళ్ల వద్ద కట్టేసిన గేదెలు, ఆవులపై దాడి చేస్తున్నాయి. కోతులు, కుక్కల స్వైర విహారాలపై పంచాయతీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు, మున్సిపల్ అధికారులకు తెలిపినా వాటి నివారణ చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గత నెలలో కుక్కల దాడిలో 170, కోతుల దాడిలో 45 మంది గాయపడి చికిత్సలకు వచ్చారని ఆసుపత్రి సూపర్‌వైజర్ హరికృష్ణ తెలియజేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కోతుల, కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భాజపా నేత వెంకటేశ్వరరావు మృతి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అడవిరావులపాడు గ్రామానికి చెందిన భాజపా సీనియర్ నాయకుడు ఆకుల వెంకటేశ్వరరావు (72) అలియాస్ బీజేపీ వెంకటేశ్వరరావు గురువారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. కె.కంభ్రిక దాసాంజనేయస్వామి దేవాలయంవద్ద గుండెపోటుకు గురికావడంతో ఆయనను నందిగామలోని ఓ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆర్ఎస్ఎస్ నాయకుడిగా, భాజపా కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శిగా పార్టీలో సుదీర్ఘ కాలం క్రియాశీలకంగా పనిచేశారు. అడవిరావులపాడులో ఆయన మృతదేహానికి నందిగామ ఏఎంసీ ఛైర్‌పర్సన్ పిట్టల శ్రీదేవి, భాజపా జిల్లా అధికార ప్రతినిధి బండారు కేదార్‌నాథ్‌శర్మ, జిల్లా కార్యదర్శి పోరుగంటి నరసింహారావు, నాయకులు సుందరరావు, శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, రమేష్, సత్యనారాయణ, పలువురు ఆర్ఎస్ఎస్ నాయకులు, వైస్ ఎంపీపీ హనుమంతరావు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

వాసవీ వృద్ధాప్య పింఛన్ల పంపిణీ

నందిగామ: మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం పది మంది నిరుపేద ఆర్యవైశ్య వృద్ధులకు వాసవీ వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేశారు. దాతల సహకారంతో సంఘ నేత పి.సాయిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనార్దనరావు, ఈశ్వరయ్య, వెంకట నాగ గాంధీ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణం

నెరవేరని గృహ కల

రెండున్నర దశాబ్దాల నిర్లక్ష్యం

అన్యాక్రాంతమవుతున్న పేదల ఇళ్ల స్థలాలు

న్యూస్‌టుడే, కంచికచర్ల

కంచికచర్లలోని ఎన్టీఆర్ కాలనీలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి రెండున్నర దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ వారి సొంతింటి కల నెరవేరలేదు. కాలనీలో అవసరమైన మౌలిక వసతులు కల్పించకపోవడం, అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్మాణం మొదలు పెట్టిన లబ్ధిదారులు సగంలోనే పనులు ఆపేశారు. నాటి నుంచి ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ గృహ కల నెరవేరలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శివసాయి క్షేత్రం సమీపంలో 18 ఎకరాల సేకరణ

1999లో అప్పటి తెదేపా ప్రభుత్వం 'కోటి వరాలు' పథకంలో భాగంగా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు స్థానిక శివసాయి క్షేత్రం సమీపంలో 18 ఎకరాలు సేకరించింది. అందులో 700 మందికి పైగా లబ్ధిదారులకు నివేశన స్థలాలు కేటాయించింది. కాలనీకి అవసరమైన విద్యుత్తు సౌకర్యం కల్పించింది. స్థలాలు ఊరికి దూరంగా ఉండడం, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు 'ఇందిరమ్మ ఇళ్ల పథకం'లో ఇదే స్థలంలో తిరిగి పేదలకు నివేశన స్థలాలు కేటాయించారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందడంతో లబ్ధిదారులు మళ్లీ గృహ నిర్మాణ పనులు మొదలు పెట్టినా.. మౌలిక వసతుల కల్పించకపోవడంతో వెనక్కి తగ్గారు. దీంతో వీటి కథ మళ్లీ మొదటికొచ్చింది. ఆతర్వాత మారిన పరిస్థితుల నేపథ్యంలో ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ బూమ్‌తో భూములకు ధరలు పెరగడం, కాలనీకి సమీపంలోనే బైపాస్ రహదారి ఏర్పడడంతో దళారుల సాయంతో కొంతమంది లబ్ధిదారులు తమ స్థలాలను విక్రయించుకున్నారు. ఇప్పుడు ఆ స్థలాల్లో కొంత మంది వెంచర్లు వేయడం గమనార్హం. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ కాలనీకి అవసరమైన మౌలిక వసతులు కల్పించి ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

విధులు ముగించుకొచ్చి.. శాశ్వత నిద్రలోకి..

సుధీర్ కుమార్ (పాత చిత్రం)

నందిగామ, న్యూస్‌టుడే: విధులు ముగించుకొని ఇంటికి వచ్చి పడుకున్న హెడ్‌కానిస్టేబుల్ మాతంగి సుధీర్‌కుమార్(58)కు అదే శాశ్వత నిద్ర అయింది. వివరాల్లోకి వెళితే.. విజయవాడ సీసీఎస్‌లో పని చేస్తున్న సుధీర్‌కుమార్ గురువారం విధులు మగిశాక నందిగామలోని ఇంటికి వచ్చారు. అనంతరం గ్యాస్‌తో ఇబ్బందిగా ఉందని మంచంపై పడుకున్నారు. కొద్దిసేపటికి భార్య భోజనానికి లేపగా స్పృహ లేకపోవటంతో వెంటనే ఆర్ఎంపీని పిలిచి చూపించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గతంలో నందిగామ పోలీస్‌స్టేషన్‌లో పని చేసిన ఆయన విజయవాడలోని సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. ఇటీవల కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయినా రిలీవ్ కాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూర్యవంశీ తెలిపారు.

జుజ్జూరులో జూదరుల అరెస్టు

జుజ్జూరు (వీరులపాడు): జుజ్జూరు శివారులో గురువారం జూద శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.6090 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని శుక్రవారం కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఎస్సై అభిమన్యు తెలిపారు.

కష్టాలు తీర్చే దారులు చూపరూ!

న్యూస్‌టుడే, కంచికచర్ల

రూపం కోల్పోయిన కంచికచర్ల - మున్నలూరు రోడ్డు

మోగులూరు - మున్నలూరు మధ్య కంకర తేలి అధ్వానంగా ..

గత ఐదేళ్ల వైకాపా పాలనలో గ్రామాల మధ్య రహదారులు రూపురేఖలు కోల్పోయి అధ్వానంగా మారాయి. కనీస మరమ్మతులు సైతం నిర్వహించకపోవడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నిత్యం నరకం కనిపిస్తోంది. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో పలు గ్రామాల మధ్య రహదారులు భారీ గుంతలతో కంకర తేలాయి.

కంచికచర్ల నుంచి మున్నలూరు రహదారిపై ఇసుక అక్రమార్కులు నిత్యం భారీ లారీలతో ఇసుక రవాణా సాగించడంతో రహదారి పూర్తి అధ్వానంగా మారింది. భారీ గుంతలతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా తయారైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో అంతంత మాత్రంగా ఉన్న రహదారి ఆనవాలు సైతం కోల్పోయింది. గత ఐదేళ్ల వైకాపా పాలకులు పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వమైనా తమ రహదారుల ఇబ్బందులకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఏఏ రహదారులంటే..

★ మోగులూరు- మున్నలూరు దారి గుంతలతో కంకర తేలింది. ★ చెవిటికల్లు, కునికినపాడు, బత్తినపాడు రహదారులు ధ్వంసమయ్యాయి. ★ వీరులపాడు మండలం వెల్లంకి నుంచి కొణతాలపల్లి, పల్లంపల్లి వరకు ఉన్న దారి పూర్తి అధ్వానంగా మారింది. ★ దొడ్డదేవరపాడు నుంచి వి.అన్నవరం, నందలూరు - తాటిగుమ్మి రహదారులు గుంతలతో నిండి వాహనదారులకు ఇబ్బందికరంగా మారాయి.

విప్ సౌమ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్డీవో బాలకృష్ణ, తహసీల్దారు సురేష్

ఏపీటీఎఫ్ క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తున్న ఎంఈవో-I నాగలక్ష్మి, యూనియన్ నాయకులు

అంబారుపేటలో చీరలు పంపిణీ చేస్తున్న పాస్టర్ సర్వేశ్వరరావు

నందిగామలో జనసేన ఇన్‌ఛార్జి రమాదేవి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన నాయకులు

ఊరూరా నూతన సంవత్సర సంబరాలు

నందిగామ, నందిగామ గ్రామీణ, న్యూస్‌టుడే: నియోజకవర్గం అంతటా నూతన సంవత్సర సంబరాలు అంబరాన్ని అంటాయి. నందిగామలో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆమె కార్యాలయం వద్ద కేకు కోసి పంపిణీ చేశారు. స్థానిక ఆర్డీవో కె.బాలకృష్ణ, ఏసీపీ తిలక్, మున్సిపల్ కమిషనర్ లోవరాజు, సీఐలు లచ్చునాయుడు, చవాన్, సీడీపీవో లక్ష్మీభార్గవి, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్టీయూ, ఏపీటీఎఫ్, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరించారు. అంబారుపేట గ్లోరియస్ గాస్పెల్ చర్చిలో పాస్టర్ సర్వేశ్వరరావు, సుజాత దంపతులు మహిళలకు చీరలు బహూకరించారు. రామిరెడ్డిపల్లి ఆర్సీఎం చర్చిలో క్రైస్తవ విశ్వాసులు, మహిళలు ప్రార్థనలు చేశారు. స్థానిక వైకాపా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు కేకు కోసి పంపిణీ చేశారు. స్థానిక జనసేన కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి తంబళ్లపల్లి రమాదేవి కుటుంబసభ్యులతో కలిసి కేకు కోసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోగంటి బాబు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వాకర్స్ క్లబ్ సభ్యులు కేకు కోసి పంచారు.

వైకాపా కార్యాలయంలో ..

కంచికచర్ల వాకర్స్ క్లబ్ సభ్యులు

(c) eenadu

విజయవాడ పశ్చిమ

ప్రమాదకర కేబుళ్లు తొలగించకుంటే చర్యలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని అనేక ప్రాంతాల్లో ప్రమాదకర స్థితిలో వేలాడుతున్న కేబుళ్లను ఆయా సంస్థలు వెంటనే తొలగించుకోవాలని నగరపాలక సంస్థ చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వివిధ కేబుల్, నెట్ సంస్థలకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినా ఆయా సంస్థల ప్రతినిధులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించినా ఆయా సంస్థల ప్రతినిధులు మాత్రం సక్రమంగా స్పందించడం లేదని అన్నారు. ఇటీవల మొగల్రాజపురం, బందరు రోడ్డు, పటమట ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న పలు కేబుళ్లను తొలగించామని ఆయన వెల్లడించారు. ఇప్పటికైనా ఆయా సంస్థలు వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో రహదారుల వెంట వేలాడుతున్న కేబుళ్లను పూర్తిగా తొలగిస్తామని హెచ్చరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందనకు వందనం.. ✦ వాగుసెంటర్ వద్రుపేట రోడ్డుపై చెత్త ఉందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో చెత్త తరలించారు.

? గొల్లపాలెం గట్టు ఆర్‌సీఎం స్కూల్ వద్ద మురుగు కాలువలో పూడిక పేరుకుంది. **- శ్రీనివాసరావు, స్థానికుడు.**
✔ పూడిక తీయిస్తాం. **- కృష్ణ, స్థానిక శానిటరీ అధికారి**
?ఎర్రకట్ట పైవంతెన మార్గంలోని సీఎస్ఐ చర్చి పక్క వీధిలో కుక్కలు దాడులు చేస్తున్నాయి. **- రేష్మా, స్థానికురాలు.**
✔ చర్యలు తీసుకుంటాం. **- సోమశేఖర్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్.** – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

ఎల్‌వోసీ అందజేత

భవానీ పురం: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఎమ్మెల్యే సుజనా చౌదరి సహకారంతో ఎల్‌వోసీ మంజూరైంది. చిట్టినగర్ 48వ డివిజన్‌కు చెందిన షేక్ మాలిన్ గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. ఆమెకు బైపాస్ సర్జరీ నిమిత్తం మంజూరైన రూ.4,72,300 ఎల్‌వోసీ పత్రాన్ని భవానీపురంలోని కార్యాలయంలో నాయకులు ఖాదర్, కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ తదితరులు అందజేశారు.

మలుపు.. ప్రాణాలకు ముప్పు..

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే

పాతబస్తీలోని పలు కూడళ్లలో, కొత్తపేట పోలీసుస్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలు ప్రమాదాలకు నిలయాలుగా నిలుస్తున్నాయి. ఎర్రకట్టపై వంతెన నుంచి నైజాంగేటు, వించిపేట చౌరస్తాకు దిగే మార్గంలో ద్విచక్ర వాహనదారులు జారి పడి గాయాలబారిన పడుతున్నారు. రహదారి మలుపు ఆకారంలో ఉండడం, ఎటువంటి ప్రమాద సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు, వాహన చోదకులు వాపోతున్నారు.

☛ కేదారేశ్వరపేట కూడలి నుంచి చిట్టినగర్ కూడలి వరకు ఉన్న రహదారి ఇరువైపులా కుచించుకుపోయింది. దీనికి తోడు ఈ మార్గంలో కేవలం రెండు వేగ నిరోధకాలు మాత్రం ఉన్నాయి. దీంతో అనేక ప్రమాదాలకు చేసుకుంటున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

☛ ఎర్రకట్టపై వంతెన నుంచి పాతరాజరాజేశ్వరీపేటకు రాకపోకలు సాగించే ర్యాంపు మార్గంలో ఎటువంటి సూచిక బోర్డులు, వేగనిరోధకాలు లేవు. దీంతో వాహనాల వేగానికి అడ్డు అదుపు లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.

ప్రమాదాలకు నిలయంగా.. కొత్తపేటలోని నెహ్రూబొమ్మ కూడలి, గణపతిరావు రోడ్డు నుంచి పంజాసెంటర్‌కు తిరిగే మలుపు, బీఆర్పీ రోడ్డు నుంచి గణపతిరావు రోడ్డుకు తిరిగే మలుపు, ఎర్రకట్టపై వంతెన, వించిపేట, వైఎస్ఆర్ కాలనీ, జక్కంపూడి కాలనీ సర్కిల్, పైపుల్‌రోడ్డు, రాయల్‌హోటల్ సెంటర్ తదితర ప్రాంతాలు.

రెండేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాలు	85
ప్రాణాలు కోల్పోయిన వారు	39
క్షతగాత్రులు	178
స్టేషన్లు	వన్‌టౌన్, కొత్తపేట, భవానీపురం, అజిత్‌సింగ్‌నగర్
రాకపోకలు సాగించేవారు	రోజూ 20 వేల మంది
వేగనిరోధకాలు	సుమారు 12 కిలోమీటర్ల మేర అవసరం

ఎర్రకట్టపై వంతెన నుంచి పాతరాజరాజేశ్వరిపేట వెళ్లే వైపు ప్రమాదకర మలుపు మార్గం

పట్టించుకోని అధికారులు.. పాతబస్తీలోని ప్రమాదక మలుపులో వేగనిరోధకాలు.. సూచిక బోర్డులు కూడా అధికారులు ఏర్పాటు చేయలేదు. ఆయా మార్గాల్లో విద్యుత్తు దీపాలు లేవు. దీంతో ఆ ప్రాంతాలన్ని అంధకారంతో ఉంటున్నాయి.

రక్షిత నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర ప్రజలకు నిత్యం రక్షిత నీటిని అందించేందుకు బాధ్యులైన అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. బాధ్యులైన అధికారులతో గురువారం టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ నిత్యం నీటి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పాత పైపులైన్లలో లీకేజీలు ఉన్నట్లు గుర్తించిన పక్షంలో వెంటనే వాటిని మార్చివేసి కొత్త వాటిని అమర్చాలని, పైపులకు ఎక్కడా లీకేజీలు లేకుండా చూడాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంజినీరింగ్ అధికారులు నిత్యం నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ పర్యవేక్షించడం ద్వారా స్థానికంగా తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు ఉత్పన్నం అవుతున్నా వెంటనే గుర్తించి సరిచేయాలని తెలిపారు. నిత్యం నీటి పరీక్షలు చేసి ప్రతి ఇంటికి రక్షితనీరు అందుతుందో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. కొండ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా రోజూ అసిస్టెంట్ ఇంజినీర్లు, ఎమినిటీ కార్యదర్శులు ఆ ప్రాంతాల్లో పర్యటించాలని, ఇంటింటి వివరాలు సేకరించాలని తెలిపారు. తాగునీటి సరఫరాలో ఏమాత్రం లోపాలు ఉన్నట్లు గుర్తించిన పక్షంలో వెంటనే సరిచేయాలని, లేని పక్షంలో బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

పున్నమ్మతోట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండప ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం రాత్రి నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీకృష్ణ కేళి కోలాట బృందం వివిధ పాటలకు కోలాటాలు వేసి అలరించారు. ఈ కార్యక్రమాన్ని తనిఖీ అధికారి లలిత రమాదేవి పర్యవేక్షించారు.

రజత తులసి మాల బహూకరణ

విద్యాధరపురం, న్యూస్‌టుడే: వన్‌టౌన్ అంగడాల వారి వీధిలోని రామాలయంలో స్వామి వారి అలంకరణ నిమిత్తం రజత తులసి మాలను పాతబస్తీ అభివృద్ధి పోరాట సమితి కన్వీనర్ కొణిజేటి రమేష్, సురేష్ సోదరులు గురువారం బహూకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అర్చకులు రజత తులసి మాలను భక్తుల సమక్షంలో స్వామి వారికి అలంకరించారు.

స్వామి వారి అలంకరణకు మాల అందజేస్తున్న దాత రమేష్, సురేష్ కుటుంబ సభ్యులు

దుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రాభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే వెంకన్నను సత్కరిస్తున్న శ్వేతశైలాలయ కమిటీ ఛైర్మన్ రామారావు, నాయకులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: దుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మాజీ ఎమ్మెల్యే బుద్ధ వెంకన్న తెలిపారు. మల్లికార్జునపేటలోని తెదేపా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బుద్ధ వెంకన్నను నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శ్వేతశైలాలయ కమిటీ ఛైర్మన్ గాజా రామారావు, సీనియర్ తెదేపా నాయకులు సాదరబోయిన ఏడుకొండలు, దేవరాజు, నాగోతి రామారావు, బడుగు గణేష్, నందం భవాని ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే చేపట్టిన అభివృద్ధి పనులు క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు.

సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలు జయప్రదం చేయాలి

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించి వారికి అండగా నిలిచిన భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. పార్టీ ముగింపు ఉత్సవాల్లో భాగంగా గురువారం ఏడో డివిజన్ పార్టీ ఆధ్వర్యంలో బోయపాటి మాధవరావు గ్రంథాలయం వద్ద వృద్ధులు, బాలలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన ఖమ్మంలో 5 లక్షల మందితో ముగింపు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం పార్టీ చేసిన కృషిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కోరారు. కమ్యూనిస్టుల పాలనలో నగరంలోని కొండ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. నగర కార్యదర్శివర్గ సభ్యుడు అప్పురబోతు రాము అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సంగుల పేరయ్య, మాజీ కార్పొరేటర్ ఇజ్జాడ లక్ష్మీ, డివిజన్ కార్యదర్శి పూసర్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఏపీపీటీడీ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరి రావు నేతృత్వంలో నాయకులు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును గురువారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానంద రెడ్డి, విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రాజు, సూరిబాబు, వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు శేషగిరిరావు, రాజు, వెంకటేశ్వరరావు, సూరిబాబు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు సంఘ్ కార్యాలయంలో నిర్వహించారు. విజయవాడ డివిజనల్ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రవి చారి, ఆముదాల వెంకటేశ్వరరావు కేక్ కట్ చేశారు. క్యాలెండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యశ్వ నాగేంద్రబాబు, రమేష్, దేశం శ్రీనివాస్, కొయ్య రమణారెడ్డి, ఎం.ఎస్.రావు, అన్ని బ్రాంచీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ✦ 34వ డివిజన్ జనసేన అధ్యక్షుడు ఆకుల రవిశంకర్ ఆధ్వర్యంలో నాయకులు పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసును ఆయన కార్యాలయంలో కలిశారు. కార్యక్రమంలో బాలు, భాను, బి. విజయ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏడీఆర్ఎంకు మొక్క అందిస్తున్న ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పాతబస్తీ రథం సెంటరులో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం తెలిపారు. గురువారం వన్‌ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు, సీఐ ఉమామహేశ్వరరావుతో కలిసి రథం సెంటరులో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పర్వదినాలు, శుక్ర, శని, ఆదివారాల్లో దుర్గమ్మ గుడికి వచ్చే భక్తుల వాహనాలతో మహా మండపం, కనకదుర్గానగర్, రథం సెంటరు సమస్యాత్మకంగా మారుతుందన్నారు. దీన్ని పరిగణనలోకి తీసుకొని కనకదుర్గానగర్ నుంచి కెనాల్ రోడ్డు వరకు ట్రాఫిక్ కోన్స్, బారికేడ్లతో నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రకాశం బ్యారేజీ వైపు నుంచి మాల్ రోడ్డు వైపు వచ్చే వాహనాలను సాధారణ ట్రాఫిక్‌ను సులభతరంగా వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆటో డ్రైవర్లు, వాహన చోదకులు ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన చర్యలకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్రీధర్, ఓంకార్ సిబ్బంది పాల్గొన్నారు.

రథం సెంటరులో ట్రాఫిక్ నియంత్రణపై అధికారులకు సూచనలిస్తున్న డీసీపీ షిరీన్ బేగం

పించనర్ల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

భవానీపురం, న్యూస్‌టుడే: ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు భవానీపురం హెచ్‌బీ కాలనీలోని సంఘం కార్యాలయంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యెమినేని వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఉపాధ్యక్షుడిగా పి.పట్టాభిరామారావు, ఎం.రత్నాకర్, కార్యదర్శిగా యెనిగళ్ల సుబ్బారావు, జాయింట్ కార్యదర్శులుగా ఫారూఖ్ అలీ బేగ్, శశాంక బాబు, సహాయ కార్యదర్శులుగా ప్రతాప్ శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు, కోశాధికారిగా వేణు గోపాల కృష్ణమూర్తి తదితరులు ఎన్నికయ్యారు.

పారిశుద్ధ్య నిర్వహణ.. అధ్వానం..

కాలనీలోని నివాసాలు	8 వేలు
నివాసితుల సంఖ్య	సుమారు 30 వేలు
కాలనీలు	40

భవానీపురం, న్యూస్‌టుడే

జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలో పారిశుద్ధ్య పనులు దిగజారుతున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ పనులను విజయవాడ నగరపాలక సంస్థ వారే పడుతున్నారు. కాలనీలో ఉన్న కార్మికులకు వేతనాలను ఇచ్చే బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీ వారికి నగరపాలక సంస్థ అధికారులు అప్పగించారు. ప్రైవేటు ఏజెన్సీ వారు జీతాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో కార్మికులు చెత్త సేకరణ సరిగా చేయడం లేదు. దీంతో వీధుల్లో, డంపర్ బిన్ల వద్ద చెత్త భారీ ఎత్తున పేరుకుపోయి ఉంది. చెత్తను తొలగించకపోవడంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. కాలువల్లోను వ్యర్థాలు భారీ ఎత్తున పేరుకుపోయి ఉంటుంది. నగరపాలక సంస్థ అధికారులు పారిశుధ్య నిర్వహణపై సక్రమంగా దృష్టి సారించడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కాలనీలోని డంపర్ బిన్ వద్ద పేరుకున్న వ్యర్థాలు

ఆట పరికరాలు మాయం

జక్కంపూడి వైఎస్ ఆర్‌కాలనీలో ఆట పరికరాలు లేకపోవడంతో విద్యార్థులు ఆడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఊయలలు మాయం అయ్యాయి. ఊయల కోసం ఏర్పాటు చేసిన ఇనుప రాడ్లపైకి ఎక్కి కూర్చుంటున్నారు. ఊయలలు ఏర్పాటు చేస్తే విద్యార్థులు ఆడుకోవడానికి వీలుగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, భవానీపురం**

చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం

భవానీపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు అండగా ఉంటుందని మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య పేర్కొన్నారు. భావన ఋషి చేనేత హస్త కళ, కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో భవానీపురం కొండ వీడు అకాడమీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన హస్త కళా ప్రదర్శనను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ.. నేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్తును ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. తెదేపా నాయకులు సురేష్, మల్లికార్జున, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీరలు పరిశీలిస్తున్న నాయకులు

మద్యం దుకాణం నిర్వాహకులపై దాడి.. కేసు

భవానీపురం: గొల్లపూడిలోని ఓ మద్యం దుకాణం నిర్వాహకులపై కొందరు వ్యక్తులు దాడి చేసినట్లు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి... గొల్లపూడి పెట్రోల్ బంక్ సెంటర్ వద్ద ఆవాల అరుణ్ సాయి అనే వ్యక్తి మద్యం దుకాణం నిర్వహిస్తున్నారు. వారం రోజుల కిందట మద్యం దుకాణంలో ఇద్దరు వ్యక్తులు మద్యం తాగుతున్నారు. వేరొక చోట కొనుగోలు చేసిన మద్యం తీసుకు వచ్చి తాగుతున్నట్లు దుకాణంలో పని చేసే విజయ్ గుర్తించి ప్రశ్నించి వారిని అక్కడ నుంచి బయటకు పంపించాడు. దీంతో కోపం పెంచుకొని గురువారం మరో ఇద్దరితో కలిసి సదరు వ్యక్తులు దుకాణం వద్దకు వచ్చి అరుణ్ సాయి, విజయ్, దుకాణంలో ఉన్న సుంకర రాజాబాబు, నాగేంద్ర, శివలను కొట్టారు. ఈమేరకు బాధితులు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడి చేసిన ప్రకాష్, అఖిల్, సందీప్, శ్రీకాంత్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భవానీపురం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. కడప జిల్లా ముద్దనూరి మండలం కొలవల్లి గ్రామంలో బొలిశెట్టి రవి శంకర్ నివాసం ఉంటున్నారు. 2025 డిసెంబరు 27న గొల్లపూడిలోని మేనత్త వంకా జ్యోతి నివాసానికి వచ్చాడు. అదే రోజు ఉదయం ఆమెను ద్విచక్ర వాహనం ఎక్కించుకుని గొల్లపూడి పాత పోస్ట్ ఆఫీసు రోడ్డులో వెళ్తున్నారు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన కారు వారిని ఢీకొట్టింది. దీంతో గాయపడిన వారిద్దరిని సమీపంలోని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎగ్జిబిషన్ అనుమతుల రద్దుకు డిమాండ్

విజయవాడ వన్‌టౌన్: గతేడాది కబేళా క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న సమయంలో మరోసారి అనుమతులు ఇవ్వమని చెప్పిన వీఎంసీ అధికారులు ఇప్పుడు ఎందుకు అనుమతులు ఇచ్చారని వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్‌కుమార్ ప్రశ్నించారు. గురువారం పాతబస్తీలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్‌కు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జనావాసాల మధ్య ఎగ్జిబిషన్‌కు అనుమతి ఇవ్వడంపై ఆయన ప్రశ్నించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

కార్యక్రమంలో రంగారావు, నాయకులు తదితరులు

కాలమానిని.. డైరీ ఆవిష్కరణ

చిట్టినగర్, న్యూస్‌టుడే: సమాజానికి మేలు చేసే విధంగా ఆరోగ్య సేవలను అందించడం హర్షణీయమని బెజవాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనిశెట్టి రంగారావు తెలిపారు. చిట్టినగర్‌లోని నగరాల సీతారామ స్వామి మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నగరాల హెల్త్ అండ్ వెల్ఫేర్ సొసైటీ, ప్రజా వైద్యశాల నిర్వాహకులు శ్రావణ కుమార్ ఆధ్వర్యంలో గురువారం 2026 కాలమానిని, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సొసైటీ ద్వారా ఆరోగ్య సేవలతో పాటు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జాతీయ కార్యదర్శి రాంపిళ్ల జయప్రకాష్, నాయకులు మహేష్, నగరాల సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు ఎన్.సూర్యారావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

యోగా.. ఆరోగ్య ప్రదాత

చిట్టినగర్, న్యూస్‌టుడే: యోగా.. ఆరోగ్య ప్రదాత అని అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.శివకుమార్ పట్నాయక్ పేర్కొన్నారు. కేఎల్‌రావు పార్కులో అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ సహకారంతో శ్రీవీరాంజనేయ యోగా సేవా సంస్థ నిర్వహిస్తున్న యోగా శిక్షణలో ప్రతిభ చూపిన వారిని గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి పిలుపు మేరకు చేపట్టిన యోగాంధ్ర స్ఫూర్తితో యోగా శిక్షణ కొనసాగుతుందన్నారు. కె.ఏ.ఎం.కుమారి, ఎం.శివపార్వతిలకు ఉత్తమ యోగా అవార్డుతో సత్కరించి జ్ఞాపికలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జి.విజయ్‌కుమార్, హ్యాపీ వాకర్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అల్ఫ్రెడ్, బెల్లం వెంకటేశ్వర్లు, యోగా గురువు జన్ను సుబ్బారావు, కస్తూరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న సాధకులు

అర్హులకు సంక్షేమ పథకాలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ అభివృద్ధి ఫలాలను అర్హులకు చేర్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తెలిపారు. గురువారం ఆయన పాతబస్తీలో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అదే ప్రాంతానికి చెందిన కె.శ్రీనివాస్ శ్రీరామ్ సమక్షంలో భాజపాలో చేరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల గోవిందు, కార్యదర్శి డాక్టర్ దుర్గాశ్రీలక్ష్మి, పల్నాడు జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పల్లపు శివయ్య, ఎన్టీఆర్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు, వాణిజ్య విభాగపు అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

పార్టీలో చేరిన శ్రీనివాస్‌కు కండువా కప్పి ఆహ్వానిస్తున్న భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ తదితరులు

చురుగ్గా రహదారుల నిర్మాణం

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురం హెచ్‌బీకాలనీ ప్రాంతంలో రహదారి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత కొన్నేళ్లుగా రహదారులు అధ్వానంగా ఉండడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా రహదారులు ముంపునకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో హెచ్‌బీకాలనీ కల్యాణ మండపం ప్రాంతంలో రూ.25 లక్షలతో రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే సుజనాచౌదరి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో గుత్తేదారు పనులను ప్రారంభించారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే స్థానికులు పడుతున్న ఇబ్బందులు తొలుగుతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


హెచ్‌బీకాలనీలో నిర్మాణ పనులు

కోర్ సబ్జెక్టులతోనే దేశ ప్రగతి

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ది రిటైర్డ్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర వేడుకలు, 2026 దైనందిని ఆవిష్కరణ గురువారం కానూరు లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో జరిగాయి. జి.పట్టాభి రామారావు అధ్యక్షతన జరిగిన వేడుకలకు సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు విచ్చేసి దైనందిని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ కోర్సులకు ప్రాధాన్యం ఇస్తున్నారని, కోర్ సబ్జెక్టులు మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ గ్రూపులు మాత్రమే 2047 దేశ ప్రగతి లక్ష్యాలను చేరుకోగలమన్నారు. గుండెనొప్పి లక్షణాలు, నివారణను క్యాపిటల్ హాస్పిటల్స్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వీఎన్ భూపాల్ వివరించారు.

నగరాన్ని ఉన్నత స్థితిలో నిలిపేందుకు కృషి

విజయవాడ నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరానికి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఈ ఏడాది కూడా స్వచ్ఛ అవార్డు దక్కేందుకు అధికారులు, ఉద్యోగులు ఇప్పటి నుంచే ప్రత్యేక కృషి చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో కోరారు. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు కింద గత ఏడాది నగరపాలక సంస్థ సూపర్ స్వచ్ఛ అవార్డు దక్కించుకుందని అన్నారు. అదేరీతిన ఈ ఏడాదిలోనూ అవార్డు దక్కేందుకు ప్రతి ఒక్కరూ మరింతగా కృషి చేయాలని సూచించారు. మరోవైపు నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు హరితాంధ్ర ప్రదేశ్‌వైపు అడుగులు వేయాలని అన్నారు. అందుకు వీలుగా నగరంలోని ప్రతి ఇంటి నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను రెడ్యూస్.. రీ-యూజ్.. రీసైకిల్(ఆర్ఆర్ఆర్) పద్ధతుల ద్వారా సద్వినియోగం అయ్యేలా చూడాలని కోరారు. ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను తడి పొడిగా విభజించి మాత్రమే తమ సిబ్బందికి అందించాలని కమిషనర్ సూచించారు. పర్యావరణ హితమైన వస్తువులను మాత్రమే వాడడం ద్వారా ఇతరత్రా సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించకుండా పూర్తిగా నియంత్రించాలని ఆయన కోరారు. విజయవాడ నగరాన్ని ఉన్నత స్థానంలో నిలిపేందుకు అధికారులు, సిబ్బంది సంయుక్తంగా పనిచేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

సినిమాలు

సైక్ సిద్ధార్థ, 45, మార్క్: ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). **మదం:** అప్సర(గవర్నరుపేట), తారా స్క్రీన్స్(పాయకాపురం), రామ్ సినిమాల్(గుణదల). **సఃకుటుంబానం:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట). **వినరా ఓవేమ, ఘంటసాల:** నవరంగ్(గవర్నరుపేట). **వినరా ఓవేమ, నిలకంఠ:** పీవీఆర్ మాల్(బందరురోడ్డు). **నిలకంఠ:** ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట). **సైక్ సిద్ధార్థ:** అలంకార్. **శంబాల, వనవీర, ఛాంపియన్,ఈషా:**జీ-3(రాజ్, యువరాజ్). **శంబాల, ఈషా, దండోర, ఛాంపియన్:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). **– న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

క్రయ.. విక్రయాలపై అవగాహన

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే వస్తువులు క్రయ, విక్రయాలపై అవగాహనతో పాటు వ్యాపార దృక్పథం అలవడుతోందని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు బి.రాజశేఖర్ అన్నారు. పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని నలంద విద్యానికేతన్‌లో నూతన సంవత్సరం సందర్భంగా 'ఫెట్ 2026' గురువారం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నలంద విద్యా సంస్థల ఛైర్మన్ ఎ.విజయబాబు, పాఠశాల ప్రిన్సిపల్ మాదల పద్మజ తదితరులు పాల్గొన్నారు. స్టాల్స్‌లో విద్యార్థులు. దేశీయ, విదేశీ వంటకాలు ప్రదర్శించారు. గేమ్‌షోలు, గిఫ్ట్ ఆర్టికల్స్ ఏర్పాటు చేశారు.

(c) eenadu

విజయవాడ మధ్య

ప్రమాదకర కేబుళ్లు తొలగించకుంటే చర్యలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని అనేక ప్రాంతాల్లో ప్రమాదకర స్థితిలో వేలాడుతున్న కేబుళ్లను ఆయా సంస్థలు వెంటనే తొలగించుకోవాలని నగరపాలక సంస్థ చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వివిధ కేబుల్, నెట్ సంస్థలకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినా ఆయా సంస్థల ప్రతినిధులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించినా ఆయా సంస్థల ప్రతినిధులు మాత్రం సక్రమంగా స్పందించడం లేదని అన్నారు. ఇటీవల మొగల్రాజపురం, బందరు రోడ్డు, పటమట ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న పలు కేబుళ్లలను తొలగించాలని ఆయన వెల్లడించారు. ఇప్పటికైనా ఆయా సంస్థలు వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో రహదారుల వెంట వేలాడుతున్న కేబుళ్లను పూర్తిగా తొలగిస్తామని హెచ్చరించారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

పున్నమ్మతోట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండప ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం రాత్రి నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీకృష్ణ శేష కోలాట బృందం వివిధ పాటలకు కోలాటాలు వేసి అలరించారు. ఈ కార్యక్రమాన్ని తనిఖీ అధికారి లలిత రమాదేవి పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సీతారాంపురం–63036 11232, పాయకాపురం– 90631 44761

పాయకాపురం, న్యూస్‌టుడే : కొత్త రాజరాజేశ్వరీపేట ప్రభుత్వ గృహాల వద్ద రాత్రివేళ ఆకతాయిలు గంజాయి తాగుతున్నారని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనిపై బుధవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు.. ఆ ప్రాంతంలో రాత్రివేళల్లో గస్తీని ఏర్పాటు చేశారు.

❖ ఇంద్రా నాయక్‌నగర్ రెండోవీధిలో చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు.. కార్మికులతో చెత్త సేకరింపజేశారు.

? పాయకాపురం శారదా విద్యాపీఠ్ మార్గంలో పక్క కాలువలో పూడిక పేరుకుంది. – నటరాజ్, స్థానికుడు

✔ పూడిక తీసేందుకు చర్యలు తీసుకుంటాం. – శివరామకృష్ణ, శానిటరీ అధికారి

? కొత్తరాజరాజేశ్వరీపేట రైలుకట్ట రోడ్డులో రాత్రివేళ పలువురు యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. – షర్మిల, స్థానికురాలు ✔ నిఘా ఉంచి తగిన చర్యలు తీసుకుంటాం. – వెంకటేశ్వరరావు, సీఐ, అజిత్‌సింగ్‌నగర్ - న్యూస్‌టుడే, పాయకాపురం

లక్ష్యంపై గురి.. సాధనతో భళీ..

నూతన సంవత్సరంలో యువత ప్రణాళికలు

మాచవరం, న్యూస్‌టుడే

నేటి యువత కచ్చితమైన.. స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఉన్నతాశయ సాధనకు డిగ్రీ మొదటి ఏడాది నుంచే శ్రమిస్తున్నారు. చక్కని ప్రణాళికతో.. వివిధ సబ్జెక్టులపై పట్టు సాధిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు పెంపొందించుకుంటున్నారు. గత ఏడాదిలో పెట్టుకున్న లక్ష్యాన్ని సాధించి.. కొత్త ఏడాది 2026లో మరొక అంశంపై దృష్టిసారించారు మాచవరంలోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు. ఆయా వివరాలు వారి మాటల్లోనే..

యాప్ డెవలపర్ అవుతా..



నా పేరు ఎ.మానస. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. తండ్రి బార్బర్, తల్లి గృహిణి. భవిష్యత్తులో మంచి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా, మొబైల్ యాప్ డెవలపర్‌గా అవ్వాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నాను. సాధనలో భాగంగా మొదటి సంవత్సరంలో బేసిక్ ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాను. మొబైల్ ఫ్రేమ్ వర్క్, యూజర్ ఇంటర్‌ఫైస్ (యూఐ) డిజైన్, యూజర్ అనుభవం(యూఎక్స్) వంటి అంశాలపై దృష్టిపెడతాను. పరీక్షల కోసం కాకుండా.. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నదే ఆశయం.

సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధిస్తా



నా పేరు సారిక యజ్ఞేష్. ప్రస్తుతం బీఎస్సీ కంప్యూటర్ సైన్స్(ఆనర్స్) తృతీయ సంవత్సరం చదువుతున్నాను. గత సంవత్సరం లాజికల్ స్కిల్స్‌ను మెరుగుపరచుకోవడంపై దృష్టి పెట్టాను. నూతన సాంకేతికతను ప్రయోగాత్మకంగా ఎలా ఉపయోగించాలో నేర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. ఇందులో భాగంగానే పలు హ్యాకథాన్‌ల్లో పాల్గొనడం, సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేయడం ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నాను. కొత్త ఏడాదిలోనూ సాంకేతిక పరిజ్ఞానంపై మరింత పట్టు సాధించేందుకు కష్టపడతాను. డిగ్రీ ఒక్కటే లక్ష్యంగా పెట్టుకోకుండా.. నైపుణ్యాల అభివృద్ధిని జీవిత లక్ష్యంగా మార్చుకోవాలి. కష్టపడే మనస్తత్వం, నేర్చుకునే తపన ఉంటే విజయం తప్పకుండా వరిస్తుంది.

ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు పెంచుకుంటా

నా పేరు ఎన్.చిన్ని, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. మా నాన్న సెక్యూరిటీ గార్డు, తల్లి రోజువారీ కూలీగా పనిచేస్తున్నారు. వారు కష్టపడుతున్న కష్టమే నాకు ప్రేరణగా నిలిచింది. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా వెనక్కి తగ్గకుండా ముందుకు సాగాలనే ధైర్యం వాళ్ల నుంచే వచ్చింది. గత సంవత్సరం-2025లో హిందీ మాట్లాడే నైపుణ్యాన్ని, వక్తృత్వాన్ని మెరుగుపరచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. సాధన చేశాను. సఫలీకృతురాలినయ్యాను. భాష అనేది వ్యక్తిత్వాన్ని వెలుగులోకి తీసుకువచ్చే సాధనం అని అర్థమైంది. కొత్త సంవత్సరంలో మరో లక్ష్యాన్ని ఏర్పరచుకున్నాను. ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను మెరుగుపరచుకుంటాను. కంప్యూటర్ సైన్స్ విద్యార్థిగా.. కేవలం డిగ్రీ కోసం కాకుండా జ్ఞానం కోసం నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాను. పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతాను.

లోకో పైలట్ సాధించేందుకు కృషి

నా పేరు డి.రోహిత్‌కుమార్. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ తృతీయ సంవత్సరం చదువుతున్నాను. విద్యతో పాటు జీవితాన్ని అర్థం చేసుకునే అనుభవాలు ఎంతో ముఖ్యమని నమ్ముతాను. గత సంవత్సరం నాకు అలాంటి అనుభవాలను అందించింది. అసోం, కోల్‌కతా, ఛత్తీస్‌గఢ్ వంటి పలు రాష్ట్రాల్లో పర్యటించాను. కొత్త ప్రదేశాల సందర్శనతో ఆలోచనా విధానం మారింది. ప్రతి ప్రాంతంలోనూ ఒక ప్రత్యేకమైన సంస్కృతి, భాష, జీవనశైలి ఉంటుంది. వాటిని దగ్గర నుంచి చూడడం వల్ల.. సహనం, అవగాహన, అనుకూలత పెరిగింది. భారతీయ రైల్వేలో లోకో పైలట్ (ఆర్ఆర్‌బీ) ఉద్యోగం నా జీవిత లక్ష్యం. దీన్ని సాధించేందుకు అప్టిట్యూడ్, రీజనింగ్ నైపుణ్యాలను పెంచుకునేందుకు కృషి చేస్తాను. దీనికోసం నిరంతర సాధన చేస్తాను. లక్ష్యం స్పష్టంగా ఉంటే.. దాన్ని చేరుకునే దారి క్రమంగా స్పష్టమవుతుందని నా నమ్మకం.

రక్షిత నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర ప్రజలకు నిత్యం రక్షిత నీటిని అందించడానికి బాధ్యులైన అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. బాధ్యులైన అధికారులతో గురువారం టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ నిత్యం నీటి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పాత పైపులైన్లలో లీకేజీలు ఉన్నట్టు గుర్తించిన పక్షంలో వెంటనే వాటిని మార్చివేసి కొత్త వాటిని అమర్చాలని, పైపులకు ఎక్కడా లీకేజీలు లేకుండా చూడాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంజినీరింగ్ అధికారులు నిత్యం నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ పర్యవేక్షించడం ద్వారా స్థానికంగా తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉత్పన్నం అవుతున్నా వెంటనే గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. నిత్యం నీటి పరీక్షలు చేసి ప్రతి ఇంటికి రక్షితనీరు అందుతుందో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. కొండ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా రోజూ అసిస్టెంట్ ఇంజినీర్లు, ఎమినిటీ కార్యదర్శులు ఆ ప్రాంతాల్లో పర్యటించాలని, ఇంటింటి వివరాలు సేకరించాలని తెలిపారు. తాగునీటి సమస్యలో ఏమాత్రం లోపాలు ఉన్నట్టు గుర్తించిన పక్షంలో వెంటనే సరిచేయాలని, లేనిపక్షంలో బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పాటలు పాడుతున్న ఝాన్సీరాణి, భవానీ తదితరులు

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీశ్రీనివాస నాట్యమండలి ఆధ్వర్యంలో గురువారం గాంధీనగర్‌లోని కొత్త పూర్ణానంద కళావేదికపై నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు వి.సురేష్, ఝాన్సీరాణి, ఎస్.అంజలి, వి.భవాని, వి.దత్తుబాబు తదితరులు అన్నమయ్య భక్తి గీతాలు ఆలపించారు.

విజయవాడ సాంస్కృతికం : హేమబిందు సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కంచి మల్లేశ్వరి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఆశిష్ క్రియేషన్స్‌లో గురువారం సినీ సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చింతకాయల చిట్టిబాబు, పరుచూరి విజయలక్ష్మి, ప్రసూనా రామన్‌లు హాజరయ్యారు. నూతన సంవత్సర రామన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గాయకులు కె.డేవిడ్‌రాజు, ఎం.శ్యామ్‌ప్రసాద్, దండు చంద్రశేఖర్, కుమార్ గుప్తా, శర్మ తదితరులు సినీ గేయాలు ఆలపించి ప్రేక్షకులను అలరించారు.

మర్యాదపూర్వక కలయిక

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు గురువారం రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీతో పాటు ఎన్టీఆర్ జిల్లా డీసీపీలు కృష్ణకాంత్ పటేల్, తిరుమలేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, కె.జి.వి.సరిత, కె.కృష్ణప్రసన్న, షిరీన్‌బేగం తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీపీ రాజశేఖరబాబు

కలెక్టర్‌కు శుభాకాంక్షలు

కలెక్టర్ జి.లక్ష్మీశకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు కె.వి.రమణ, కె.రవి, వేమూరి ప్రసాద్ - న్యూస్‌టుడే, ఎన్టీఆర్ కలెక్టరేట్

కిటకిటలాడిన దేవాలయాలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సందర్భంగా నగరంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడిపోయాయి. గురువారం ఉదయం నుంచి పెద్ద ఎత్తున విచ్చేసి పూజలు చేశారు. సాయిబాబా మందిరాలకు భక్తులు పోటెత్తారు. గవర్నర్‌పేటలోని శ్రీకాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తన కుమారులు సిద్ధార్థ, రవితేజ, తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి పూజలు పాల్గొన్నారు. వీరికి ఈవో యడ్లపల్లి సీతారామయ్య సాదర స్వాగతం పలికారు.

శిర్డీ నాగసాయిబాబా మందిరంలో... లెనిన్ కూడలిలోని శిర్డీ నాగసాయిబాబా నాగమానసాదేవి మందిరంలో అర్ధరాత్రి ప్రత్యేక పూజలు జరిగాయి. సుధాస్వామి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. భక్తులకు శిర్డీ సంస్థాన్ నూతన సంవత్సర క్యాలెండర్, దైనందినులు అందజేశారు.

పీఆర్‌టీయూ కాలమానిని ఆవిష్కరణ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లా పీఆర్‌టీయూ రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్‌ను నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశ గురువారం ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు షేక్ నవాబ్ జానీ, ప్రధాన కార్యదర్శి సోల రాఘవరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరి రాజశేఖర్, రాష్ట్ర సంఘ సహాధ్యక్షుడు కొత్త హరిచరణ్, రాష్ట్ర కార్యదర్శులు కొనకళ్ల రమేష్‌బాబు, గంటా సత్యం, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఇర్ఫాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

సమతుల్య పాలనతో రాష్ట్రాభివృద్ధి

మొగల్రాజపురం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధిపై స్పష్టమైన విధానంతో పాలన చేస్తోందని చెప్పారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసం వద్ద గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గత 18 నెలల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు రూ.60వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు చెప్పారు. తల్లికి వందనం, రైతు సంక్షేమ పథకాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి కార్యక్రమాలకు లక్ష కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి సుమారు రూ.80వేల కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. రూ.22లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, మరింతగా వస్తాయని చెప్పారు. యువతకు విస్తృత ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయ వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖకు తీసుకురావడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ అభివృద్ధితో భవిష్యత్తుతరాలకు సాంకేతిక అవకాశాలు విస్తరిస్తాయన్నారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రజలందరికీ మంచి జరగడం ఖాయమన్నారు. ఎమ్మెల్యేతోపాటు తెదేపా యువ నాయకులు బొండా సిద్ధార్థ, రవితేజలను శ్రేణులు ఘనంగా సన్మానించాయి. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరరావు, రవితేజ, సిద్ధార్థలను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ప్రమాదమని తెలిసినా.. తప్పని ప్రయాణం

న్యూరాజరాజేశ్వరిపేటలోని సుబ్బరాజు నగర్‌వాసులు.. సర్కస్ ఫీట్లు చేస్తూ... ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రాణాలకు తెగించే సాహసం చేస్తున్నారు. రోజువారీ కూలీలు పనుల కోసం.. డాబా కొట్లు సెంటర్ లేదా పాత రాజరాజేశ్వరి పేట మీదుగా చుట్టూ తిరిగి నగరంలోకి వెళ్లాల్సి ఉంది. కాలినడకన వెళ్లేవారు.. సమీపంలోని రైల్వే గోడను దాటుతున్నారు. రైల్వే గోడ దిగి, మురుగు కాల్వపై విద్యుత్తు స్తంభం సహాయంతో.. పాట్లు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు సైతం ఇలాగే చేస్తున్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రత్యామ్నాయం లేక ఇదే దారి ఎంచుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుబ్బరాజు నగర్ నుంచి రైల్వే మార్గంపై ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్

వ్యర్థాలకు నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు

న్యూరాజరాజేశ్వరిపేట అమరావతి కాలనీలోని అంతర్గత రోడ్లను శుభ్రం చేశాక వెలువడిన వ్యర్థాలను వీఎంసీ సిబ్బంది తరలించకుండా బుడమేరు కాల్వలో పోస్తున్నారు. రోజుల తరబడి తొలగించకపోవడంతో.. వాటికి కొంతమంది నిప్పు పెడుతున్నారు. పొగ వ్యాపించి వాహనదారులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతోందని స్థానికులు వాపోతున్నారు. ఎప్పటికప్పుడు చెత్త తొలగించి, నిప్పు పెట్టకుండా అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్

ఇళ్ల పక్కనే తుప్పలు

నందమూరి నగర్‌లోని పలు చోట్ల ఖాళీ స్థలాల్లో గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. విష సర్పాలు, దోమలకు ఆవాసాలుగా మారాయి. వర్షం నీరు రోజుల తరబడి నిల్వ ఉండి.. దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి సంబంధిత యజమానులకు నోటీసులు ఇవ్వాలని, పిచ్చి మొక్కలు తొలగించి, నీటిని తోడించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్

క్యాలెండర్ల ఉచిత పంపిణీ

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : ముత్యాలంపాడులోని సాయిబాబా ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విష్ణుసహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యంలో పారాయణం జరిగింది. మందిర గౌరవాధ్యక్షుడు పూనూరు గౌతమ్ రెడ్డి.. భక్తులకు ఉచితంగా క్యాలెండర్లు, ప్రసాదాలు పంపిణీ చేశారు. సభ్యులు ఎం.సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు కాలమానినులు అందజేస్తూ..

☛ కేదారేశ్వరపేట లోటస్ ల్యాండ్ మార్క్‌లో విజయకృష్ణ సూపర్‌బజార్ ఛైర్మన్ వెలగా సురేష్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు

లోటస్‌ల్యాండ్ మార్క్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని మాట్లాడారు. కాలనీవాసులంతా కలిసికట్టుగా కుల, మతాలకతీతంగా వేడుకలు నిర్వహించడం సంతోషకరమన్నారు. బొండా సిద్ధార్థ, నవనీతం సాంబశివరావు, గాయత్రి, మనోహర్, రాజేష్‌రెడ్డి, పరుచూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సందర్శన

విద్యార్థులతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు, మస్తానయ్య

పాయకాపురం, న్యూస్‌టుడే : పాయకాపురం శ్రీఅయితా రాములు పాఠశాలలోని భవిత కేంద్రాన్ని రాష్ట్ర సమగ్ర శిక్షా అదనపు డైరెక్టర్ కె.నాగేశ్వరరావు గురువారం సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకం, ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయ సహకారాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో విద్యార్థులతో కలిసి ఆయన కేకు కోశారు. కార్యక్రమంలో సమగ్రశిక్షా అభియాన్ సిబ్బంది మస్తానయ్య, అమ్మినాయుడు, పి.విజయ, కె.పాప తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సేవలు గుర్తించాలి

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : నిత్యం నగరాన్ని, మన ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని కళ్లే లలిత ట్రస్టు డైరెక్టర్ హరీష్ కోరారు. గురువారం అజిత్‌సింగ్‌నగర్‌లో 59వ డివిజన్‌లోని పారిశుద్ధ్య కార్యాలయం వద్ద కార్మికులకు అల్పాహారం అందజేశారు. వారికి సేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు. వారికి వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వందనం బాబు, జి.ధ్రువన్, స్థానికులు పాల్గొన్నారు.

మహిళలకు అల్పాహారం అందిస్తున్న హరీష్ తదితరులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

వాడవాడలా వేడుకలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : నూతన సంవత్సర వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్రరత్నభవన్‌లో గురువారం నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు నేతృత్వంలో వి.గురునాథం, మీసాల రాజేశ్వరరావు, అన్సారీ కేకు కోశారు. గవర్నర్‌పేటలోని వృద్ధుల సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మేయర్ జంధ్యాల శంకర్ పాల్గొన్నారు. వృద్ధులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వెంకటప్పయ్య, వేమూరు బాబూరావు, మోతుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

★ ఐ.ఎం.ఎ. హాలులో ఐ.ఎం.ఎ. నగర అధ్యక్షుడు డాక్టర్ నాగవరప్రసాద్ కేకు కోసి, వైద్యులకు అందించారు. వైద్యులు అనురూప్, ఉప్పులేటి తారకప్రసాద్, బోడేపూడి చౌదరి, వంశీ, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

★ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుకు తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బొండా నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో చిరు సత్కారం చేశారు.

బొండా ఉమాను సత్కరిస్తున్న ఫ్లోర్‌లీడర్ బాలస్వామి

ఆంధ్రరత్నభవన్‌లో కేకు కోస్తున్న నరసింహారావు, గురునాథం తదితరులు

నగరాన్ని ఉన్నత స్థితిలో నిలిపేందుకు కృషి

విజయవాడ నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరానికి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఈ ఏడాది కూడా స్వచ్ఛ అవార్డు దక్కేందుకు అధికారులు, ఉద్యోగులు ఇప్పటి నుంచే ప్రత్యేక కృషి చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో కోరారు. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు కింద గత ఏడాది నగరపాలక సంస్థ సూపర్ స్వచ్ఛ అవార్డు దక్కించుకుందని అన్నారు. అదేరీతిన ఈ ఏడాదిలోనూ అవార్డు దక్కేందుకు ప్రతి ఒక్కరూ మరింతగా కృషి చేయాలని సూచించారు. మరోవైపు నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు హరితాంధ్ర ప్రదేశ్‌వైపు అడుగులు వేయాలని అన్నారు. అందుకు వీలుగా నగరంలోని ప్రతి ఇంటి నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను రెడ్యూస్.. రీ-యూజ్.. రీసైకిల్(ఆర్ఆర్ఆర్) పద్ధతుల ద్వారా సద్వినియోగం అయ్యేలా చూడాలని కోరారు. ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను తడి పొడిగా విభజించి మాత్రమే తమ సిబ్బందికి అందించాలని కమిషనర్ సూచించారు. పర్యావరణ హితమైన వస్తువులను మాత్రమే వాడడం ద్వారా ఇతరత్రా సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించకుండా పూర్తిగా నియంత్రించాలని ఆయన కోరారు. విజయవాడ నగరాన్ని ఉన్నత స్థానంలో నిలిపేందుకు అధికారులు, సిబ్బంది సంయుక్తంగా పనిచేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

యాదవ సంఘీయుల కలయిక

కాలమానిని ఆవిష్కరిస్తున్న వెంగళరావు యాదవ్ తదితరులు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం పురస్కరించుకుని స్థానిక రామ్‌నగర్ కాలనీలో శ్రీమాధవ కృష్ణ యాదవ రాజుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యాదవ కమ్యూనిటీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం శ్రీకృష్ణ మందిర నిర్మాణ ప్రతిపాదిత స్థలంలో కేకు కోశారు. సంఘం ప్రచురించిన కాలమానిని నాయకులు ఆవిష్కరించారు. అఖిల భారతీయ రాష్ట్రీయ యాదవ సంఘం అధ్యక్షుడు ఎల్.వెంగళరావు యాదవ్, ప్రధాన కార్యదర్శి పెద్దిబోయిన శ్రీనివాసరావు యాదవ్, సహకార బ్యాంకు ఛైర్మన్ సాదం త్రినాథ్ తదితరులు.. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మరక శ్రీనివాస్, కార్యదర్శి సి.హెచ్.కోటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు దాసరి కనకారావు, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాల జయప్రదానికి పిలుపు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించి వారికి అండగా నిలిచిన భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజా పిలుపునిచ్చారు. పార్టీ ముగింపు ఉత్సవాల్లో భాగంగా గురువారం ఏడో డివిజన్ పార్టీ ఆధ్వర్యంలో బోయపాటి మాధవరావు గ్రంథాలయం వద్ద వృద్ధులు, బాలలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన ఖమ్మంలో 5 లక్షల మందితో ముగింపు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం పార్టీ చేసిన కృషిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కోరారు. కమ్యూనిస్టు పాలనలో నగరంలోని కొండ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. నగర కార్యదర్శివర్గ సభ్యుడు అప్పురబోతు రాము అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సంగుల పేరయ్య, మాజీ కార్పొరేటర్ ఇజ్జాడ లక్ష్మీ, డివిజన్ కార్యదర్శి పూసర్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: శ్రీశైలంలో శాశ్వత పద్ధతిలో వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ శ్రీశైలం ట్రస్ట్ పాలక మండలి సభ్యులకు హామీ ఇచ్చారు. అమరావతిలోని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యులు ఏవీ రమణ, బోడేపూడి వెంకట సుబ్బారావు, శంకరశెట్టి పిచ్చయ్యలు పట్టాభిరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. దేవస్థానం చిత్రపటం, ప్రసాదం అందజేశారు. శ్రీశైలంలో వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు.

కారు ఢీకొని స్నేహితులకు గాయాలు

పాయకాపురం, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో స్నేహితులు గాయపడిన ఘటన గురువారం రాత్రి నున్న పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన సాయికుమార్, జానీ, దుర్గాప్రసాద్‌లు స్నేహితులు. నూతన సంవత్సరం వేడుకలు నిమిత్తం పుష్పా హోటల్ సెంటర్‌కి వెళ్లి తిరిగి వస్తున్నారు. కండ్రికలోని భవానీ బార్ వద్ద.. ఓ కారు అతి వేగంగా వచ్చి వారిని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. స్థానికులు క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు నగల అపహరణ

పాయకాపురం, న్యూస్‌టుడే : అధిక సంఖ్యలో బంగారు, వెండి ఆభరణాలను దొంగలు అపహరించారు. నున్న పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుర్రం అరుణ విజయవాడ నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తున్నారు. వాంబేకాలనీలో భర్తతో కలిసి ఉంటున్నారు. బుధవారం స్థానిక చర్చిలో వంట పని ఉందంటే.. ఇంటికి తాళం వేసి అక్కడికి వెళ్లారు. రాత్రి 11గంటల సమయంలో పెద్ద కుమారుడు పవన్.. విధులు ముగించుకుని ఇంటికి వచ్చారు. వెనకవైపు తలుపు పగలకొట్టి బీరువా తెరిచి ఉండడాన్ని గమనించారు. వెంటనే తల్లికి ఫోన్ చేశారు. ఆమె వచ్చి చూడగా.. 20 కాసుల బంగారు ఆభరణాలు, మూడు తులాల వెండి మొలతాడు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేశారు. కాగా పోలీసులు దొంగలను పట్టుకుని సమాచారం సేకరిస్తున్నట్టు తెలిసింది.

(c) eenadu

గర్భిణులు కేజీహెచ్‌కు వెళ్లక్కర్లేదిక!

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

ఆసుపత్రిలో చికిత్సకు వచ్చిన గర్భిణులు

అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో ఆధునిక స్కాన్‌ను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టారు. జిల్లా ఆసుపత్రికి తగ్గట్టుగా సౌకర్యాలు మెరుగుపరిచేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీంట్లో భాగంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వసతులు కల్పించేలా చొరవ చూపుతున్నారు. ఈ ఆసుపత్రిలో నెలకు 300కి పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. రోజుకు 200కి పైగా గర్భిణులు చికిత్సకు వస్తుంటారు. టిఫా స్కాన్ అందుబాటులోకి లేక ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి ఎమ్మెల్యే కొణతాల తీసుకు రాగా వెంటనే ఆయన స్పందించి మంజూరుచేశారు.

- గర్భంలో బిడ్డ ఎదుగుదలతో ఏమైనా లోపాలుంటే వాటిని ఈ స్కాన్ ద్వారా గుర్తించడానికి వీలుంటుంది. ఇది ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటుగా తీయించుకోవాల్సి వస్తోంది. దీనికి రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు ప్రైవేటు క్లినిక్‌లలో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ సేవలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నారు.
- ఆసుపత్రిలో ప్రస్తుతం ఒక రేడియాలజిస్టుతో సేవలు అందిస్తున్నారు. గర్భిణుల్లో అవసరమైన వారికి ఈ స్కాన్‌ను తీస్తారు. ఇది చేయడానికి ఒక్కొక్కరికీ గంట వరకు సమయం పడుతుంది. ఆసుపత్రిలో ఈ సేవలను మరింత మెరుగుపరిచేలా పీజీ రేడియాలజిస్టులతో సేవలు అందించేలా చర్యలు చేపట్టేలా వైద్యాధికారులు చర్యలు చేపడుతున్నారు.

మెరుగైన సేవలందేలా చర్యలు

అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలందించేలా చర్యలు చేపడుతున్నాం. ఆసుపత్రిలో గైనిక్ సేవలు బాగున్నాయి. సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్నాయి. టిఫా స్కాన్‌ను అందుబాటులోకి తెస్తున్నాం. సీటీ స్కాన్, డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. త్వరలోనే క్రిటికల్ కేర్ యూనిట్ అందుబాటులోకి వస్తుంది. సీఎస్ఆర్ నిధులతో ఆధునిక శస్త్రచికిత్స గదులు, రోగుల బంధువుల నిరీక్షణ భవనం నిర్మించాం. కేజీహెచ్‌కు పంపకుండా ఇక్కడే పేదరోగులకు వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంటాం.

– కొణతాల రామకృష్ణ, అనకాపల్లి ఎమ్మెల్యే

ఐజీగా గోపీనాథ్‌జెట్టి బాధ్యతల స్వీకరణ

విశాఖపట్నం: విశాఖ రేంజ్ డీఐజీగా విధులు నిర్వహిస్తున్న గోపీనాథ్ జెట్టి పదోన్నతి పొందడంతో గురువారం ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఐజీ)గా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు విశాఖ రేంజ్ కార్యాలయంలో సంతకాలు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రణకు పెద్దపీట వేస్తామన్నారు. ఆయన్ను వివిధ జిల్లాల ఎస్పీలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త సంవత్సరానికి స్వాగతం.. లోక రక్షకునికి వందనం

నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ అన్ని ప్రాంతాల్లో ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలు నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కశింకోట చర్చిలో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేయడంతోపాటు క్రైస్తవ భక్తిగీతాలను ఆలపించారు. – కశింకోట, న్యూస్‌టుడే

నైపుణ్య శిక్షణ.. భవితకు నిచ్చెన

నెలరోజుల కోర్సులివీ

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే

అనకాపల్లిలో ఎస్‌బీఐ అనుబంధ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ యువత లక్ష్య సాధనకు మార్గదర్శిగా నిలుస్తోంది. ఎంపిక చేసిన స్వల్పకాలిక కోర్సులతో త్వరగా జీవనోపాధి పొందేలా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. 2009లో ప్రారంభించిన ఈ సంస్థ వివిధ రంగాల్లో నిపుణులతో శిక్షణతోపాటు వసతి, ఆహారం, అవసరమైన దుస్తులు, సామగ్రి సమకూరుస్తుండటం విశేషం. యోగా, ధ్యానం, నైతిక విలువలు, జీవన నైపుణ్యాలు, ఆర్థిక వ్యవహారాలు, చట్టాలు, నిబంధనలు, ప్యాకింగ్, మార్కెటింగ్ తదితర అంశాలపైనా అవగాహన కల్పిస్తున్నారు. ఈ కేంద్రానికి కలెక్టర్ ఛైర్మన్‌గా, భారతీయ స్టేట్‌బ్యాంక్ ఏజీఎం కో ఛైర్మన్‌గా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, నాబార్డు, జిల్లా లీడ్ బ్యాంక్, పరిశ్రమల శాఖల ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటూ పర్యవేక్షిస్తుంటారు. ఒక్కో కేంద్రానికి ఏడాదికి రూ. రెండు కోట్ల వరకూ వివిధ రూపాల్లో ఖర్చు చేస్తున్నారు. కేంద్రం అందజేస్తున్న శిక్షణతోపాటు సమీపంలోని పారిశ్రామిక వేత్తలు, నిరుద్యోగులు కోరిన కోర్సుల్లో కూడా శిక్షణ అందజేస్తున్నారు. పరిశ్రమలు, వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారిని ప్రోత్సహిస్తున్నారు.

అర్హతలు: అభ్యర్థులు పదో తరగతి చదివి ఉండి, 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు. ఆధార్, తెలుపు రేషన్ కార్డు కలిగిన గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారై ఉండాలి.

★ శిక్షణతో పాటు కోర్సు మెటీరియల్, యూనిఫాం, టూల్ కిట్, భోజన, వసతి సదుపాయాలు ఉచితం

★ నిపుణులు సూచనల మేరకు కోర్సులకు అనుగుణంగా 10 నుంచి 35 రోజుల పాటు శిక్షణ ఇస్తారు.

- పూర్తయిన శిక్షణ కార్యక్రమాలు: 389
- శిక్షణ పొందినవారు: 10,516 మంది
- ఉపాధి పొందినది: 8,696 మంది
- బ్యాంకు రుణాలు లభించింది: 3,814

బ్యుటీషియన్ కోర్సులో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

కోర్సులు.. శిక్షణ ఇచ్చే రోజులు	
బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్	: 35
ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ	: 31
కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్ (టాలీ)	: 28
జ్యూట్ బ్యాగుల తయారీ	: 14
సీసీటీవీ ఇన్‌స్టలేషన్	: 13
పుట్టగొడుగుల పెంపకం	: 10
కూరగాయల సాగు, నర్సరీ నిర్వహణ	: 12
చేపల పెంపకం	: 10

సెల్‌ఫోన్ మరమ్మతులు, బైక్ మెకానిక్ విద్యుత్తు వైరింగ్, ఎల్ఎంవీ డ్రైవింగ్ ఏసీ, ఫ్రిజ్‌ల సర్వీసింగ్, కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ **స్వల్పకాల శిక్షణ :** అగర్‌బత్తి, కొవ్వొత్తులు, అప్పడాలు, పచ్చళ్లు, మసాల పొడుల తయారీ

జీవనోపాధి పొందా!

పదో తరగతి చదివి మానేశా. అనకాపల్లి శిక్షణ కేంద్రంలో బైక్ మెకానిక్‌గా శిక్షణ పొందాను. మా గ్రామానికి సమీపంలోనే రహదారిపై దుకాణం పెట్టుకొని నెలకు రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకూ సంపాదిస్తున్నాను. శిక్షణ పొందడం వల్ల నాకు మేలు జరిగింది.

– టి.మత్యరాజు, డి.చింతలవీధి, హుకుంపేట మండలం

జాతీయస్థాయిలో గుర్తింపు

అనకాపల్లిలో ఈ శిక్షణ సంస్థ సుమారు 16 ఏళ్లుగా విజయవంతంగా నడుస్తోంది. జాతీయ స్థాయిలో పలు అవార్డులు, బహుమతులను అందుకుంది. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించి వారికి ఉన్నత జీవనోపాధిని కల్పించడానికి కృషి చేస్తున్నాం. శిక్షణ సమయంలో అన్ని వసతులు, సదుపాయాలు కల్పిస్తున్నాం.

– చల్లా రాజేశ్వరరావు, సంచాలకుడు, శిక్షణ కేంద్రం

ఒక్క క్లిక్ చాలు..

ఇంటి నుంచే విద్యుత్తు సేవలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే

విద్యుత్తు సేవలు పొందడంలో వినియోగదారులకు ఊరట లభిస్తోంది. ఒక్క క్లిక్‌తోనే ఉన్న చోట నుంచి అన్ని పనులు పూర్తవుతున్నాయి. ఈపీడీసీఎల్ 'ఈస్టర్న్ పవర్' యాప్‌తో విద్యుత్తు సంబంధ సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన శ్రమ తప్పుతోంది. ఈ యాప్‌కు మరింత ఆదరణ పెరిగింది. 50 శాతంపైగా కరెంటు బిల్లులను ఇందులోనే చెల్లిస్తున్నారు. ఇతర సేవలను ఇప్పటివరకు 35 శాతం మంది వినియోగించుకున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

★ విద్యుత్తు సమస్యల పరిష్కారానికి గతంలో జనం నానాయాతన పడాల్సి వచ్చేది. బిల్లులు చెల్లింపునకు ఎక్కడో ఉన్న కార్యాలయాలకు వెళ్లి క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి. ఇప్పుడీ యాప్‌తో అందరికీ ఉపశమనం లభిస్తోందని నర్సీపట్నం ఈఈ అప్పారావు పేర్కొన్నారు. యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

★ ప్లేస్టోర్ నుంచి ఈస్టర్న్ పవర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. బిల్లుల చెల్లింపుతో పాటు సేవల్లో లోపాలు, సరఫరాలో అంతరాయాలపై ఫిర్యాదు చేయవచ్చు. రోజువారీ విద్యుత్తు వినియోగమూ చూసుకోవచ్చు.

ఆటలాడించాల్సిందే!

నక్కపల్లి, న్యూస్‌టుడే

కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

తెల్లారి లేచింది మొదలు ఉరుకులు పరుగులు..పుస్తకాలతో కుస్తీలు..ఆపై సెల్‌ఫోన్‌లో ఆటలు, చదువులు.. చాలా ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల ప్రస్తుత పరిస్థితి ఇది. శారీరక శ్రమ లేక అనారోగ్యం బారిన పడుతున్న బాలల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేలా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ప్రైవేటు పాఠశాలల్లోనూ కచ్చితంగా వ్యాయామ విద్య అమలు చేయాలంటూ ఆదేశాలిచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే వ్యాయామ విద్య అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా రోజూ ఓ గంట సేపు ఆటలాడేందుకు సమయం కేటాయిస్తారు. ఉదయం, మధ్యాహ్నం అమలు చేసే విరామ సమయాల్లోనూ పిల్లలకు చాలామంది ఆటలాడుతుంటారు. ప్రైవేటు బడుల్లో పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంటుంది. కేవలం కొద్దిపాటి పాఠశాలల్లో మాత్రమే వ్యాయామ విద్య అమలు చేస్తుండగా, మిగిలినచోట్ల వీటికి చోటు లేదు. ఈ దుస్థితి నుంచి బయటపడేలా ఒకటి నుంచి పదో తరగతి వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటలు ఆడించాల్సిందేనంటూ విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది.

జిల్లాలో 638 ప్రైవేటు పాఠశాలలుండగా, వీటి పరిధిలో దాదాపు 1.25 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో అనకాపల్లి, నర్సీపట్నం పాయకరావుపేట, ఎలమంచిలి, చోడవరం, అడ్డురోడ్డు, అచ్యుతాపురం ప్రాంతాల్లో ప్రైవేటు బడులు అధికంగా ఉన్నాయి. ఇకపై కచ్చితంగా అన్ని పాఠశాలల్లోనూ ప్రతి విద్యార్థితో ఓ గంటపాటు వివిధ రూపాల్లో శారీరక శ్రమ చేయించాల్సిందే.

- ప్రతి విద్యార్థికి వారానికి ఆరు పీరియడ్ల చొప్పున ఆటలాడించాలి.
- ఉదయం అసెంబ్లీ సమయంలో పది నిమిషాల ధ్యానం చేయించాలి.
- ప్రతిరోజూ కచ్చితంగా ఆటలు ఉండాలి. వారంలో ఒక పీరియడ్ ఆరోగ్య విద్యకు కేటాయించాలి. ఇందులో ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

చాలా మంచి నిర్ణయం

ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరిగానే ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడలను నిత్యకృత్యం చేయడం చాలా అవసరం. ఇక్కడ చాలా మంది చదువు ఒత్తిడితో మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు బడుల్లో ఆటలాడించడం మంచి నిర్ణయం. దీని ద్వారా పిల్లల్లో మానసిక దృఢత్వం, ఆరోగ్యం పెరుగుతుంది. – కుందూరు రాజు, పీడీ

కన్నీటి వెతలకు ఊరట

అందుబాటులోకి మరో ఆసరా కేంద్రం

నర్సీపట్నం, న్యూస్‌టుడే

రోజులు మారాయి. అతివలకు వేధింపులు అధికమయ్యాయి. కన్నీటి వెతల నుంచి సాంత్వన చేకూర్చేందుకు జెండర్ రిసోర్స్ కేంద్రాలు (జీఆర్‌సీ) ఆసరాగా నిలుస్తున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు ఉన్న వాటిలో పలువురు మగువలు తాము ఎదుర్కొంటున్న సమస్యల నుంచి ఉపశమనం పొందగలిగారు. బాధిత మహిళలకు భరోసా కల్పిస్తున్న ఈ కేంద్రాన్ని నర్సీపట్నంలో శుక్రవారం ప్రారంభించనున్నారు. మరి కొన్నింటి ఏర్పాటుకు సైతం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇక్కడ అతివల గోడు వినిపించుకుని వారికి అవసరమైన సహాయం అందిస్తారు.

నర్సీపట్నంలో సేవలకు సిద్ధం చేసిన జీఆర్‌సీ కేంద్రం

- సమాజంలో మార్పులు, సామాజిక మాధ్యమాల ప్రభావంతో స్త్రీలు నిత్యం ఎక్కడో ఒకచోట ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. వీరిలో చాలామంది ప్రతిఘటించలేక, ఎవరికీ చెప్పుకోలేక తమలో తాము కుమిలి పోతున్నారు. పోలీసు స్టేషన్లకు వెళ్లలేక బాధను తమలో తామే దిగమింగుతున్నారు. ఇలాంటి వారందరికీ జీఆర్ఎస్ కేంద్రాలు ఊరట కలిగించడంతోపాటు సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నాయి.
- రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిలాల్లో తొలుత రావికమతం, కె.కోటపాడు, నక్కపల్లిలో ఏర్పాటయ్యాయి. తాజాగా నర్సీపట్నంలో అందుబాటులోకి రానుంది. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళా ప్రతినిధులు ప్రత్యేక కమిటీలుగా ఏర్పడి ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి కొద్ది రోజులు కేంద్రంలోనే వసతి కల్పించనున్నారు. ఇక్కడి కార్యకలాపాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.
- కేంద్రాల్లో బాధితులకు ముందుగా కౌన్సెలింగ్ ఇస్తారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. అవసరమైతే కోర్టు ద్వారా న్యాయం చేకూర్చేలా సాయం అందిస్తారు. జిల్లాలోని మూడు కేంద్రాల్లో ఇప్పటివరకు 30కి పైగా మహిళా సమస్యలను పరిష్కరించారని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డీపీఎం రత్నప్రభ చెప్పారు. నర్సీపట్నం వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని మున్సిపల్ కౌన్సిలర్ పద్మావతి ప్రారంభిస్తారన్నారు. మరో వారంలో అనకాపల్లి, మాడుగులలోనూ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు.

కోళ్లకు చలిగండం

ఎలమంచిలిలో చలి నియంత్రణకు కట్టిన పరదాలు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: జిల్లాలో చలిబాగా పెరగడంతో బాయిలర్, లేయర్ కోళ్లు పెద్ద సంఖ్యలో చనిపోతున్నాయి. రెండురోజుల్లో 30 వేలకు పైగా పిల్లకోళ్లు, 20 వేలకు పైగా పెద్ద కోళ్లు చనిపోయాయి. కోళ్ల మరణాలను నిలువరించడానికి రైతులు షెడ్ల చుట్టూ పరదాలు కడుతున్నారు. తాగడానికి వేడి నీళ్లు, బొగ్గు కుంపట్లు పెట్టి వెచ్చదనాన్ని కలిగిస్తున్నారు. ఇన్ని చేసినా మరణాలు తగ్గకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పిల్ల దశలో ఉన్న కోళ్లకు కుంపట్లు పెట్టడానికి భారీ ఖర్చు అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా వీస్తున్న చలిగాలులు కోళ్లకు ఇబ్బందిగా మారాయి. ఈ గండం నుంచి కోళ్లను కాపాడుకోవడానికి రైతులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. వేడిని ఇచ్చే అత్యధిక ఓల్టేజి గల విద్యుత్ బల్బులను వాడుతున్నారు. గుడ్డుకు, మాంసానికి ధర బాగున్న సమయంలో వాతావరణం ప్రతికూలంగా మారడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

వేల సంఖ్యలో చనిపోతున్నాయి

జిల్లాలో చలిపెరగడంతో ఒక్క మా ఫారంలోనే పిల్లకోళ్లు 3 వేలు, పెద్దకోళ్లు రెండు వేలు చనిపోయాయి. పిల్లకోళ్లకు కుంపట్లు పెట్టి తాగడానికి వేడినీళ్లు ఉంచుతున్నాం. పెద్ద కోళ్లకు ఉదయాన్నే బోరు నుంచి వచ్చే నీరు మారుస్తున్నాం. అయినా మరణాలు ఆగడం లేదు. – పాపారెడ్డి, ఎలమంచిలి

ఉమ్మడి విశాఖ జిల్లాలో	
గుడ్లు పెట్టే కోళ్ల సంఖ్య	: 21 లక్షలు
బాయిలర్ కోళ్ల సంఖ్య	: 50 లక్షలు
పెరుగుతున్న పిల్ల కోళ్లు	: 20 లక్షలు

కరిగిపోతున్న కొండవాలు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

అంతకాపల్లిలో గ్రావెల్ తవ్వకాలు

సబ్బవరం పరిసర ప్రాంతాల్లో గ్రావెల్ దందా విచ్చలవిడిగా సాగుతోంది. గత ప్రభుత్వం హయాంలో వైకాపా నేతలు మొదలెట్టిన ఈ వ్యాపారం ఇప్పటికీ యథేచ్ఛగా సాగుతోంది. వీరి అక్రమాలను ఎండగట్టాల్సిన కూటమి నేతలు తెరవెనుక ఉండి మద్దతు ఇస్తుండటంతో తవ్వకాలు మూడు లారీలు.. ఆరు ట్రాక్టర్లు అన్నట్టుగా సాగుతోంది. విశాఖ నగరంలోని దువ్వాడ, కూర్మన్నపాలెం, గాజువాక ప్రాంతాల్లో భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. లేఅవుట్లు చదును చేసేందుకు, నిర్మాణాలకు గ్రావెల్ అవసరం కావడంతో డిమాండ్ ఏర్పడింది. సబ్బవరం నుంచి ట్రాక్టర్ లోడు వెళ్తే రూ. 6 వేల నుంచి రూ. 8 వేల వరకు వస్తోంది. దీంతో అసకపల్లి, వెదుళ్లనెరవ, అంతకాపల్లి, గాలిభీమవరం, గొల్లలపాలెం, తంగిరాలపాలెం, గంగవరం, ఒమ్మివానిపాలెం, బాటజంగాలపాలెం గ్రామాల సమీపంలోని చెరువులు, కొండవాలు ప్రాంతాల్లో రాత్రివేళ భారీ యంత్రాలతో యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. సెలవు దినాలు, అధికారులు లేని సమయంలో మరింతగా రెచ్చిపోతున్నారు. సూదికొండ నుంచి వంగలి వెళ్లే రహదారిలో కేజీబీవీ-పెదగరువు మధ్య కొండలను కొల్లగొడుతున్నారు. ఆరిపాక నుంచి నల్లరేగులపాలెం వెళ్లే రహదారిలో నల్లరేగులపాలెం అటవీ భూమిలో భారీ యంత్రాలతో దందా సాగిస్తున్నారు.

ప్రభుత్వ స్థలంలో తవ్వితే చర్యలు

కొండవాలు, ప్రభుత్వ స్థలాల్లో మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. కొన్ని ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలను గుర్తించాం. రెవెన్యూ సిబ్బందిని పంపించి తరచూ తనిఖీలు చేయిస్తున్నాం. ప్రభుత్వ స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేస్తే.. వాహనాలు సీజ్ చేస్తాం. అపరాధ రుసుంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, ఏడీ, మైనింగ్, అనకాపల్లి

రూ.1.03 కోట్ల మద్యం విక్రయాలు

నర్సీపట్నం అర్బన్: నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ బుధవారం రాత్రి జరిగిన వేడుకల్లో నర్సీపట్నం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 24 మద్యం దుకాణాల్లో రూ. 1,03,27,232 విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. యూపీఐ ద్వారా రూ. 32,82,836, నగదు రూపేణా రూ. 70,44,396 చెల్లింపులు చేశారు. నర్సీపట్నంలో ఆరు పోలీసు బృందాలు అర్ధరాత్రి దాటే వరకు తనిఖీలు నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 8 మందిపై కేసు నమోదు చేశారు.

రూ. 99 కోట్ల పింఛన్ల పంపిణీ

కలెక్టరేట్: జిల్లాలో 2,55,680 మంది ఎన్టీఆర్ భరోసా పింఛను లబ్ధిదారులకుగాను తొలి రోజు బుధవారం 2,36,385 మందికి రూ. 99 కోట్ల నగదు పంపిణీ చేపట్టారు. 19295 మంది మిగిలిపోయారు. వీరికి శుక్రవారం సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛను నగదు అందిస్తారని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ శచీదేవి పేర్కొన్నారు. ఎవరూ పింఛను కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

పారిశ్రామిక శోభ!

కొత్త పరిశ్రమలు.. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు

ఈనాడు, విశాఖపట్నం: ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న విశాఖ.. ఉత్తరాంధ్రతోపాటు పొరుగు రాష్ట్రాల ప్రజలకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పరిశ్రమలు తరలివస్తున్నాయి. గతేడాది వివిధ పరిశ్రమలు ప్రారంభం కాగా.. వేలాది మందికి కొత్తగా ఉద్యోగావకాశాలు లభించాయి. గత నవంబరులో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన భాగస్వామ్య సదస్సు పారిశ్రామిక, వాణిజ్య పరంగా విశాఖకు కలిసొచ్చింది. నగర పరిసరాల్లో వివిధ రంగాల్లో పరిశ్రమల ఏర్పాటుకు 105 ఒప్పందాలు జరిగాయి. అవన్నీ పట్టాలెక్కి.. త్వరలో కార్యకలాపాలు ప్రారంభించేలా జిల్లా అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ఉపాధి కల్పనకు చర్యలు: జిల్లాలో యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అన్ని నియోజకవర్గాల్లో దశలవారీగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కులు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ)లను అభివృద్ధి చేయనున్నారు. భూములు అందుబాటులో ఉన్న చోట పారిశ్రామిక పార్కుగా, తక్కువ భూమి ఉంటే ఎఫ్ఎఫ్‌సీగా నిర్మిస్తున్నారు. పెదగంట్యాడలో నిర్మించిన ఎఫ్ఎఫ్‌సీని ఇప్పటికే ప్రారంభించారు. 29 దుకాణాలు అందుబాటులో ఉన్నట్లు ఏపీఐఐసీ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. విశాఖ పశ్చిమం, పెందుర్తి నియోజకవర్గాల్లో ఎఫ్ఎఫ్‌సీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.

పారిశ్రామిక సదస్సులో ఒప్పందాలు..			
పర్యాటకం	42	ఫుడ్ ప్రాసెసింగ్	02
ఐటీ రంగం	41	వైద్యారోగ్య	01
ఐ అండ్ సీ	18	టెక్స్‌టైల్	01



గోదారి పాయ కాదు.. వరహా మాయ

చుట్టూ ఎత్తయిన కొండలు.. ఆ పక్కనే తోటలు.. మధ్యలో నదీ ప్రవాహం.. అందులోనే అందమైన గడ్డి దుబ్బులు.. ఇదంతా గోదావరిలో పాపికొండల సౌందర్యం అనుకుంటే పొరబడినట్లే. కోటవురట్ల-ఎస్.రాయవరం మండలాల నడుమ ఇందేశమ్మవాక ప్రాంతం రహదారి మలుపులో ప్రవహించే వరహానది సుందర దృశ్యమిది. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వారిని ఈ అందాలు కట్టిపడేస్తుంటాయి. – నక్కపల్లి, న్యూస్‌టుడే

సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యం

విశాఖపట్నం: ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఆర్ఎం బి.అప్పలనాయుడు తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా గురువారం ఆయన ఆర్టీసీ అధికారులతో సమావేశమయ్యారు. బస్సుల్ని డ్రైవర్లు అతివేగంగా నడపకూడదన్నారు.

(c) eenadu

వెట'రన్'.. మెరిసెన్..

అథ్లెటిక్స్‌లో వరుసగా 5 పతకాలు

వావ్ ఆధ్వర్యంలో జరిగిన అథ్లెటిక్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన సుధాకర్

విశాఖపట్నం, న్యూస్‌టుడే : పాతికేళ్లు నిండే సరికే ఒళ్లు, కీళ్లు పట్టేస్తున్నాయంటూ ఆపసోపాలు పడే నేటి యువతో చాలా మంది... 77 ఏళ్లు మీదపడ్డా వివిధ పోటీల్లో పతకాలను ఎగరేసుకుపోతున్న పాత గాజువాకకు చెందిన గోగినేని సుధాకర్‌ను ఆదర్శంగా తీసుకోవాల్సిందే. ఇటీవల గుంటూరు జిల్లా పెదనందిపాడులో నిర్వహించిన 45వ ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఒకేసారి 5 పతకాలను కైవసం చేసుకున్నారు.

★ వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖ (వావ్) ఆధ్వర్యంలో జరిగిన అన్ని పోటీల్లోనూ మూడు బంగారు పతకాలతోపాటు, ఒక సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్ పొందారు. వయో వృద్ధులతో వాకింగ్, రన్నింగ్, షాట్‌పుట్, జాగింగ్, అథ్లెటిక్స్‌లో పోటీపడి తనదైన ముద్ర వేసుకున్నారు. ఈ సందర్భంగా 'వావ్' చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ కమల్‌బైద్, మాస్టర్ ఈకే జనకులం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సత్యదేవ్, వావ్ ట్రస్టీలు సుధాకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయ పోటీలకు అర్హత: గుంటూరు పోటీల్లో వరుసగా 5 పతకాలు సాధించిన సుధాకర్ త్వరలో జబల్‌పూర్‌లో నిర్వహించనున్న జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించారు. ఈయన బీహెచ్‌పీవీలో సాధారణ ఉద్యోగిగా పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. జాతీయ కబడ్డీ పోటీల్లో పలు పతకాలను నమోదు చేసుకున్నారు. ఆరుసార్లు రాష్ట్రస్థాయి పోటీలకు కెప్టెన్‌గా వ్యవహరించారు. రోజూ తెల్లవారుజామున బెల్ మైదానంలో 2 గంటలపాటు సాధన చేస్తుంటానని, ఏమాత్రం అలసట, అనారోగ్యం తన దరి చేరదని పేర్కొన్నారు.

క్రికెట్ పోరు.. తుది దశకు చేరే...!

ఉత్కంఠగా 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025'

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : ఆంధ్ర మెడికల్ కళాశాల మైదానంలో 'ఈనాడు- ఈతరం క్లబ్' ఆధ్వర్యంలో జరుగుతున్న 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్' ప్రజెంట్స్ 'ఈనాడు- స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025' టోర్నీ చివరి దశకు చేరుతుంది. గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో విజయం సాధించిన గీతం డీమ్డ్ యూనివర్సిటీ (సీనియర్స్), కైట్స్ జూనియర్ కళాశాల (జూనియర్స్) జట్లు ఫైనల్ బెర్తులు ఖరారు చేసుకున్నాయి. కైట్స్ జూనియర్ కళాశాల జట్టు క్రీడాకారుడు ఆర్.రోహన్ 'ధనిక్ భారత్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే'గా ఎంపికయ్యాడు.

★ శుక్రవారం సీనియర్స్ విభాగంలో జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో బుల్లయ్య డిగ్రీ కళాశాల- శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల, అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ - ఆంధ్ర మెడికల్ కళాశాల జట్లు, జూనియర్స్ విభాగంలో జరిగే సెమీ ఫైనల్స్‌లో విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (పాలిటెక్నిక్)- సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాల జట్లు పోటీ పడనున్నాయి.

✔ **గీతం డీమ్డ్ యూనివర్సిటీ 'వర్సెస్' గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాల (సీనియర్స్) :** తొలుత గీతం డీమ్డ్ యూనివర్సిటీ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసింది. జట్టులో వి.ప్రద్యుష్‌సాయి 36, పి.శ్యామ్ 20, సాయివర్ధన్ 14 పరుగులు చేశారు. గాయత్రి జట్టు బౌలర్లు అనంత్ 2 వికెట్లు, సాల్మన్, నరేంద్ర చెరో వికెట్ తీశారు. తర్వాత గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 63 పరుగులు చేసింది. జట్టులో చిన్నా 43, సాల్మన్ 11 పరుగులు చేశారు. గీతం జట్టు బౌలర్లు దేవాశిష్, మోహన్, సాయివర్ధన్ తలో వికెట్ తీశారు.

విజయం సాధించిన గీతం డీమ్డ్ యూనివర్సిటీ జట్టు (సీనియర్స్)

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

ఆర్.రోహన్ (23 పరుగులు, ఓ వికెట్)

గెలుపొందిన కైట్స్ జూనియర్ కళాశాల జట్టు (జూనియర్స్)

✔ **కైట్స్ జూనియర్ కళాశాల 'వర్సెస్' గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల (జూనియర్స్) :** తొలుత కైట్స్ జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 74 పరుగులు చేసింది. **జట్టులో రోహన్ 23,** ధార్మిక్ 15, మౌర్య 14 పరుగులు చేశారు. గవర్నమెంట్ కెమికల్ పాలిటెక్నిక్ జట్టు బౌలర్లు దినేష్, లక్ష్మణ్ చెరో రెండు వికెట్లు తీయగా, రాము ఓ వికెట్ తీశాడు. తర్వాత గవర్నమెంట్ కెమికల్ పాలిటెక్నిక్ జట్టు 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 71 పరుగులు చేసింది. జట్టులో దినేష్ 20, చరణ్ 18 పరుగులు చేశారు. కైట్స్ జట్టు బౌలర్లు తేజేశ్వర్, భరత్ చెరో రెండు వికెట్లు, రోహన్ ఓ వికెట్ తీశారు.

✔ **ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల 'వర్సెస్' సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాల (జూనియర్స్) :** మొదట సాంకేతిక జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 67 పరుగులు చేసింది. జట్టులో కె.లవకుమార్ 15 పరుగులు చేశాడు. ఏపీటీడబ్ల్యూఆర్ జట్టు బౌలర్లు బి.చరణ్, ఎస్.యశ్వంత్, ఎల్.మహేంద్ర తలో 3 వికెట్లు తీశారు. అనంతరం ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 58 పరుగులు చేసింది. జట్టులో బి.మూర్తి 9 పరుగులు చేయగా, చరణ్, యశ్వంత్ చెరో 8 పరుగులు చేశారు. సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాల జట్టు బౌలర్లు జి.అనిల్ 3 వికెట్లు తీయగా, భరత్, శ్రీనివాస్ చెరో వికెట్ తీశారు.

విజయానందంలో సాంకేతిక పాలిటెక్నిక్ జట్టు (జూనియర్స్)

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT
Dolphin Diagnostic Services
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
Organised by ఈనాడు ఈతరం క్లబ్

నేటి మ్యాచ్‌లు (02-01-2026)

★ **ఉదయం 8 గంటలకు :** డాక్టర్ లంకపల్లి బుల్లయ్య డిగ్రీ కళాశాల × శ్రీ కశ్యప్ డిగ్రీ కళాశాల(సీనియర్స్) ★ **10 గంటలకు :** విశాఖ పాలిటెక్నిక్ కళాశాల × సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాల (జూనియర్స్) ★ **మధ్యాహ్నం 12 గంటలకు :** అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ × ఆంధ్ర మెడికల్ కళాశాల (సీనియర్స్).

రేపటి మ్యాచ్ (03-01-2026)

★ సీనియర్స్ విభాగంలో శుక్రవారం జరిగే రెండు మ్యాచ్‌ల్లో విజేతలైన జట్లు శనివారం సెమీ ఫైనల్‌లో తలపడతాయి.

సంక్రాంతికి 1500 అదనపు సర్వీసులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే : సంక్రాంతి రద్దీ దృష్ట్యా 1500 అదనపు సర్వీసులు నడపడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు తెలిపారు. రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలని డిపో మేనేజర్లను ఆదేశించినట్లు గురువారం చెప్పారు. స్త్రీ శక్తి పథకం అమలులో ఉండటంతో మహిళలతోపాటు ఇతర ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. భోగి ముందు రోజు నుంచి ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి వస్తాయని, కనుమ తర్వాత ఐదు రోజుల పాటు ఆయా సర్వీసులు ఉంటాయన్నారు. హైదరాబాద్, విజయవాడ, రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, శ్రీకాకుళం, విజయనగరం, పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి, పార్వతీపురం, పాలకొండ, సాలూరు, బొబ్బిలి ప్రాంతాలతో పాటు, గ్రామీణ ప్రాంతాలకు బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.

రాజముద్రతో కొత్తగా..

పట్టాదారు పుస్తకాల పంపిణీ నేటి నుంచే

నక్కపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో రైతాంగానికి రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు అందించే కార్యక్రమానికి రంగం సిద్ధమైంది. గత పాలనలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ బొమ్మతో అనాలోచితంగా ముద్రించిన వాటిని రద్దు చేసి వాటి స్థానే సిద్ధం చేసిన నూతన డిజిటల్ పట్టాదారు పుస్తకాలను నేటినుంచి పంపిణీ చేయనున్నారు. ఈనెల తొమ్మిదో తేదీ వరకు గ్రామసభలను నిర్వహించి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందించనున్నారు. ✦ వైకాపా పాలనలో తప్పుల తడకలుగా చేపట్టిన రీసర్వేతో రైతులు నానా అవస్థలు పడ్డారు. ముఖ్యంగా పుస్తకాల నిండా సీఎం బొమ్మలనే ముద్రించారు. దీంతో రైతులనుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీ మేరకు ఆ పుస్తకాల స్థానే రాజముద్రతో పాస్ పుస్తకాలను తయారు చేయించారు. ఇలా జిల్లా వ్యాప్తంగా రెండు లక్షలకుపైగా చేరుకోగా, వాటిని మండలాలకు పంపించారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం జరిగే పంపిణీలో భాగంగా ఇక్కడా మొదలు పెట్టనున్నారు. జిల్లాలో 24 మండలాల పరిధిలో 373 గ్రామాల్లో 2,01,841 పుస్తకాలను అందించనున్నారు. ఇందులో అనకాపల్లి డివిజన్ పరిధిలో 199 గ్రామాల్లో 1.26 లక్షల పుస్తకాలు ఇవ్వనున్నారు. చోడవరం మండలంలో అత్యధికంగా 15051 పుస్తకాలు ఇస్తుండగా, అత్యల్పంగా నాతవరంలో 1454 ఇవ్వనున్నారు.



సద్వినియోగం చేసుకోవాలి

గ్రామాల వారీగా వచ్చిన పుస్తకాలను కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామసభలు వీఆర్వోల ద్వారా పంపిణీ చేయిస్తాం. వచ్చిన ప్రతి రైతుకు ఈకేవైసీ చేసి అప్పగించాల్సి ఉంటుంది. దీని ద్వారా ఎన్ని పుస్తకాలు పంపిణీ చేశామనే విషయం ఎప్పటికప్పుడు తెలుస్తుంది. ఎవరైనా అందుబాటులో లేక పుస్తకాలు తీసుకోలేకపోతే వీఆర్వోను సంప్రదిస్తే సరిపోతుంది. దీనిపై సదరు యజమానికి ముందుగానే సమాచారం అందిస్తారు. రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి. - వీవీ రమణ, ఆర్డీఓ నర్సీపట్నం

వృద్ధురాలు సజీవ దహనం

కోటవురట్ల, న్యూస్‌టుడే: చలి వేస్తోందని వేడి కోసం మంచం కింద పెట్టుకున్న కుంపటే ఓ వృద్ధురాలు మరణానికి కారణమైంది. ఈ ఘటన కోటవురట్ల మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. కైలాసపట్నం గ్రామానికి చెందిన వృద్ధురాలు **వంకల మాణిక్యం** (73) కమ్మలతో నిర్మించిన పూరింట్లో నివసిస్తోంది. చలి కాలం కావడంతో వేడిగా ఉంటుందని..మంచం కింద, కుంపటిలో అగ్గి వేసుకుని పడుకుంది. నిద్రపోతున్న సమయంలో కప్పుకొన్న దుప్పటి కుంపటిలో పడటంతో మంట చలరేగింది. రక్షించండని వృద్ధురాలు వేసిన కేకలకు చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకొని కాలిపోతున్న వృద్ధురాలిని బయటకు తీసుకొచ్చి చూడగా అప్పటికే మృతి చెందింది. నూతన సంవత్సరం రోజే చీకటిని మిగిల్చావా అంటూ కుటుంబసభ్యులు విలపించారు.

పార్టీ బలోపేతానికి తోడ్పడాలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: భాజపా ఎస్సీ మోర్చా జిల్లా పదాధికారుల ప్రమాణ స్వీకారం గురువారం అనకాపల్లిలో జరిగింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేలా పదాధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు సామ్రాట్ కుమార్, నాగేశ్వరరావు, రత్నభరత్, రామానాయుడు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client **M/s. SHRIRAM FINANCE LIMITED, DWARAKA NAGAR Branch, Visakhapatnam,** I issue the following notice to general public. My client intends to grant loan **Mr. PATNANA VENKATA RAMANA** S/o P. Ramu Naidu by keeping the below mentioned schedule property of **Mr. BALIREDDY APPARAO** S/o N.Appanna as security by way of Registered Mortgage. As such if any one has any claims, charges, mortgages, Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices, otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Visakhapatnam District, Anakapalli Registration district, Lankelapalem Sub-District, Pedamushidiwada Gram panchayat and village accounts dry land covered by S. Nos. 368, 369 & 377 part an extent of Ac.6.18.5 cents divided into house plots and got the approval of VUDA vide LP No.33/2009 in which **Plot No.34** an extent of 266.7 Sq. yards or 222.92 Sq. meters of vacant site is measured and bounded by: **East:** Plot No.39 site - 40 feet or 12.18 meters; **South:** Plot No.33 site - 60 feet or 18.28 meters; **West:** 40 feet wide road - 40 feet or 12.18 meters; **North:** Plot No. 35 site - 60 feet or 18.28 meters.

KODURI SREENIVASA RAO
Smt. SIVA KUMARI JALADI
Advocates
S-2, Bharat Apartments, Behind Rythu Bazar, Seethammadhara, Visakhapatnam-13.
Visakhapatnam Dt.01.01.2026 | Mobile No. **9885166648** Mail: sreenivaskoduri@gmail.com

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణ

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చెప్పారు. స్థానిక సుబ్రహ్మణ్యం ఘాట్ వద్ద గురువారం ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి బడ్జెట్‌లో రూ.1,000 కోట్లు కేటాయించారని, భూసేకరణ జరుగుతోందన్నారు. వంశధార, నాగావళి, జంఝావతి వంటి ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ.రెండు వేల కోట్లు కేటాయించారన్నారు. పోలవరం ఎడమ కాలువ నిర్మాణం పూర్తయితే ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. పోలవరం ద్వారా వచ్చే నీటితో పాయకరావుపేటలోని గోపాలపురం, ఎలమంచిలి పెంజెరువు, అచ్యుతాపురం కొండకర్ల ఆవలో నీటి నిల్వలు ఉంచుతామన్నారు.

400 పడకలకు ఎన్టీఆర్ ఆసుపత్రి

ఎన్టీఆర్ ఆసుపత్రిలో గతంలో 17 మంది వైద్యులు ఉండేవారని, ప్రస్తుతం 42 మంది ఉన్నారని ఎమ్మెల్యే రామకృష్ణ చెప్పారు. రూ.1.8 కోట్లతో సీటీ స్కాన్ ఏర్పాటు చేశామన్నారు. 134 పరీక్షలు నిర్వహించే నూతన ల్యాబ్‌ను రూ. 1.2 కోట్లతో, రూ.1.4 కోట్లతో రోగుల నిరీక్షణ ఐహాలు, మార్చురీని ఆధునికీకరించనున్నట్లు చెప్పారు. శస్త్రచికిత్స గదులను రూ. 1.2 కోట్లతో ఆధునికీకరిస్తున్నామన్నారు. ఆసుపత్రిని మరో రెండు ఎకరాల్లో విస్తరించి 400 పడకలకు పెంచుతామన్నారు. పట్టణంలోని రహదారులు, మౌలిక సదుపాయాలకు రూ. 41 కోట్లు మంజూరు చేశామన్నారు. పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జీవీఎంసీ కార్యాలయంలో ఉన్న కంపోస్టు యార్డును తరలించి తీరుతామని స్పష్టం చేశారు. లక్ష్మీదేవిపేట పైవంతెన పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. అన్ని ప్రాంతాల్లో మురుగుకాలువలు నిర్మించి, అవుట్‌లెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు రూ. 40 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు.

కశింకోట, న్యూస్‌టుడే: నర్సింగబిల్లికి చెందిన వైకాపా యువజన కార్యదర్శి తిర్రి శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు గురువారం జనసేనలో చేరారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వీరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి కాత్యాయినీ కూచిపూడి నృత్య అకాడమీ విద్యార్థులు ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలంలో నృత్య ప్రదర్శన ఇచ్చారు. దేవస్థానం వీరి ప్రతిభను గుర్తించి ప్రశంసా పత్రాలను అందజేసింది. కోర్టుపేటకు చెందిన అకాడమీ విద్యార్థులు నృత్య ప్రదర్శన ఇచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. కూచిపూడి గురువు ఎస్.లక్ష్మిని ఘనంగా సన్మానించారు. వీరిని స్థానిక మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు అభినందించారు.

భద్రాచలంలో నృత్యప్రదర్శన ఇచ్చిన ఎలమంచిలి విద్యార్థినులు

కలెక్టరేట్‌లో నూతన సంవత్సర సందడి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టరేట్‌లో గురువారం సందడి నెలకొంది. వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ, ప్రత్యేక ఉప కలెక్టర్ సుబ్బలక్ష్మి, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో కలిసి కలెక్టర్ రెవెన్యూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గవరపాలెం సంతబయలులో కొణతాల సుబ్రహ్మణ్యం ఘాట్ వద్ద ఎమ్మెల్యే రామకృష్ణకు కూటమి నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ సీఎం రమేష్, కార్పొరేషన్ల ఛైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, మళ్ల సురేంద్ర తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. నూకాంబిక దేవస్థానం కార్యనిర్వహణాధికారి, అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

✦ రహదారిపై రాకపోకలు సాగించే వారంతా విధిగా నిబంధనలు పాటించాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను కలెక్టరేట్‌లో ప్రారంభించి గోడప్రతులను ఆవిష్కరించారు. ఆర్టీఓ మనోహర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

అనకాపల్లి పట్టణం: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ తుహిన్‌సిన్హా కేకు కోశారు. ఏఎస్పీలు దేవప్రసాద్, మోహన్‌రావు డీఎస్పీలు మోహన్, శ్రావణి, శ్రీనివాసరావు ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణలో కలెక్టర్ విజయకృష్ణన్, డీఆర్వో సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి

నక్కపల్లిలో క్యాలెండర్లు, డైరీలు విడుదల చేస్తున్న నాయకులు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఉపాధ్యాయులకు సూచించారు. ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య జిల్లా కార్యవర్గ సభ్యులు గురువారం కలెక్టర్‌ను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ ఏడాది జిల్లాలో పది పరీక్ష ఫలితాల్లో మంచి ఫలితాలను సాధించడానికి ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. యూటీఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వత్స వాయి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గొంది చిన బాబ్బయి, రొంగలి అక్కునాయుడు, కోశాధికారి జోగా రమేష్, బాబురావు, దేవుడినాయుడు పాల్గొన్నారు.

✦ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడును మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంఘానికి సంబంధించి క్యాలెండర్, డైరీని డీఈఓ సభ్యులతో కలసి ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు టి.వి.రమణ, కార్యదర్శి శ్రీనుబాబు, సభ్యులు పాల్గొన్నారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ముద్రించిన నూతన ఏడాది క్యాలెండర్లు, డైరీలను నక్కపల్లిలో సంఘం నాయకులు గురువారం విడుదల చేశారు. తెదేపా నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ తదితరులు కలిసి వీటిని పలువురికి అందజేశారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు తోడపు వెంకటరమణ, ప్రగడ శివాజీ, సీహెచ్ ప్రసాద్, బీవీ రమణ, ఎస్‌వీ రమణ, శ్రీనివాసరావు, లచ్చబాబు, నీలకంఠకుమార్, రమేష్, గోపి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

BUSINESS OFFER

న్యూఇయర్‌లో ఎలాంటి పెట్టుబడి లేకుండా నచ్చిన టైమ్‌లో బిజినెస్ చేసుకొని అధిక ఆదాయం పొందండి. అనుభవం, అర్హతలేదు. 9705877799, 8096225555

REAL ESTATE

FLAT FOR SALE

MADHURAWADA

Madhuawada Chandram palem E/F 1180 Sft. Furnished 2BHK 10Yrs. Old Flat Near NH-16 For Sale. Cont: 8125920193.

MVP COLONY

3B/R 2025 Sft. Delux Flats, Each Floor one Flat at MVP Sector-VI, Ready to Occupy. Contact: A.S.Rao. ✆ 8885556575.

SEETHAMMADHARA

Rs.6999/Sft 3bhk Smart Flat 2450 sft Google Automation, Touch Swiches, Glass Lift, Generator, 2 parking. Ph: 7893126804

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగ మం గోవిందపురంరోడ్డు, హైవేకి ½km తార్రోడ్డుఫేసింగ్ 9ఎకరాలు కొబ్బరితోట & 4 ఎకరాలు కొబ్బరితోట అమ్మకం. 9440255187.

PLOT FOR SALE

KURMANNAPALEM

PLOT FOR SALE HIG -III KURMANNAPALEM Phase-6 VMRDA Layout 60x40 S/W 261.12 Yards Rate: 62,000/ yard ✆ 9848198291 9866651382

GENERAL

విజయనగరంనుండి వైజాగ్ వెళ్ళు NH-26కు ప్రక్కన రాయపూర్ హైవేకు దగ్గర్లో ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళు 80Ft రోడ్‌కు ఆనుకొని VMRDA & RERA అనుమతులు కల్గిన లేఅవుట్‌లో 24గం॥ సెక్యూరిటీతో అన్నిసౌకర్యాలు కలిగిన ఇండ్ల స్థలములు డైరెక్ట్ కంపెనీధరకు అమ్మబడును. ఈ ఆఫర్ సేల్స్ సంక్రాంతి వరకు మాత్రమే. 8919807419.

TO LET

KURMANNAPALEM

TO-LET A) 4 - BHK, Green City Heights @ VPL Green City, VADLAPUDI B) 3 - BHK, Fully Furnished with A/C, Green City Heights @ VPL Green City, VADLAPUDI ✆ 98487 71300

JOBS

RECRUITMENT Are you RETIRED but not "TIRED" A Leading MNC Looking for New Operations In Vizag A Great Opportunity for Retired Government / (State & Central) / Private Employees. Age Limit: 55 yrs to 70 yrs (Male/Female). Offering An exciting Opportunity to attend "FREE" ONE DAY WORKSHOP for exploring the New Trending Opportunities in VIZAG exclusive for Retired Government (State & Central) / Private Employees. NOTE: This Workshop Timings is from 9am to 3pm. (Breakfast, Lunch & Evening Snacks will be provided during training). Call between 10AM to 7PM HR Ph: 83096 55089. Kalyani, Aishwarya Towers, R&B Jn., Nr. NAD Kotha Road, Vizag.

అమెజాన్ సంస్థలో డెలివరీ చేయుటకు డెలివరీ అసోసియేట్స్ కావలెను. జీ॥ 25,000/- నుండి 30,000/- వరకు ఇవ్వబడును. 8885216128, 8919110170

Hydలో 24 గం. బెడ్ పేషంట్ & సపోర్టింగ్‌కి చేయుటకు అనుభవంగల ఆయాలు, కేర్‌టేకర్ స్త్రీ/పు, జీ:18-20వేలు+రూం+భో. బ్రా.& వైశ్య, బ్రాహ్మణులు వంటకి. 8331078939

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పాల్తేరులో ఫ్లెక్సీ ఏర్పాటుపై వివాదం

ఇరువర్గాల దాడిలో పలువురికి గాయాలు

తీవ్రంగా గాయపడిన వ్యక్తి

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పాల్తేరు శివారు అంకంపేటలో ఫ్లెక్సీలో అనుచరుల ఫొటోల విషయమై అధికార పార్టీలో రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. దీంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ అప్పన్న తెలిపిన వివరాల ప్రకారం.. నూతన సంవత్సరం పురస్కరించుకుని కొందరు నాయకుల అనుచరులు గ్రామకూడలిలో ఏర్పాటుకు ఫ్లెక్సీలు సిద్ధం చేశారు. వీరిలో కొందరు వ్యక్తుల ఫొటోలు తొలగించాలని ఒక వర్గం నేతలు సూచించారు. ఆ చిత్రాలు తొలగించకపోవడంతో బుధవారం అర్ధరాత్రి ఇరువర్గాలకు చెందిన వారు కర్రలు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇరు వర్గాలకు చెందిన శ్రీరాములు, పిట్ల శివ, దండు, తాసు తదితరులు గాయాలపాలైనట్లు పోలీసులు పేర్కొన్నారు. వీరిలో ఇద్దరికి తలకు తీవ్ర గాయాలు కావడంతో తునిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో అల్లర్లు జరగకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే బాధ్యులపై రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు.

హాస్యం మనిషికి దివ్య ఔషధం

కార్యక్రమంలో ఓ సన్నివేశం

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: యాంత్రిక జీవనంలో హాస్యం మనిషికి ఓ దివ్య ఔషధంలా పనిచేస్తుందని రోటరీక్లబ్ అధ్యక్షుడు బుద్ద శ్రీనివాసరావు పేర్కొన్నారు. రోటరీక్లబ్ ఆధ్వర్యాన పట్టణంలోని న్యూ కాలనీ పాలూరి చిదంబరం రోటరీ మెమోరియల్ హాల్‌లో గురువారం రాత్రి జరిగిన 'నవ్వుల సందడి' కార్యక్రమం అందరినీ అలరించింది. విశాఖ లాఫింగ్ క్లబ్ సభ్యులు ప్రదర్శించిన హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను నవ్వించాయి. గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు గ్రహీత కోరుకొండ రంగారావు, నటుడు త్రినాథ్, సినీ నటి రమ ప్రదర్శించిన స్కిట్లు ఆకట్టుకున్నాయి. క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ రోటరీ ద్వారా సేవా కార్యక్రమాలతోపాటు వినోద కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. క్లబ్ కార్యదర్శి ప్రకాశరావు, కోశాధికారి సూర్యారావు, ప్రోగ్రాం ఛైర్మన్ సత్యనారాయణ, పి.జె.నాయుడు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్తు సరఫరా వేళల మార్పు

పాయకరావుపేట: వ్యవసాయ విద్యుత్తు సరఫరా వేళలను శుక్రవారం మార్చినట్లు ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. పెద్దాపురం, పాయకరావుపేటకు చెందిన 132 కె.వి.లైనును ఏపీ ట్రాన్స్‌కో మరమ్మతులు చేపడుతోందన్నారు. దీనివల్ల పాయకరావుపేట, నక్కపల్లి, సత్యవరం సెక్షన్ పరిధిలో ఉదయం 4 నుంచి 8, సాయంత్రం 5 నుంచి రాత్రి 10 వరకు వ్యవసాయానికి విద్యుత్ అందిస్తామని చెప్పారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	133	130
లైవ్	160	150
డ్రెస్డ్	232	270
స్కిన్‌లెస్	264	280

(c) eenadu

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **ఈషా** రామచంద్ర: **సకుటుంబానాం** ఉదయం, మొదటి ఆట, **దండోరా** మేట్నీ రెండో ఆట, వెంకటేశ్వర: **శంబాల,** పర్తిసాయి: **సైక్ సిద్ధార్థ,** సత్యనారాయణ స్క్రీన్1: **ఛాంపియన్** స్క్రీన్2: **45,** షిర్డిసాయి: **మార్క్** **అచ్యుతాపురం:** శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **ఛాంపియన్,** స్క్రీన్-2: **వృషభ**

ఆర్డీఓను కలిసిన నేతలు

ఎస్.రాయవరం: అడ్డురోడ్డులో ఆర్డీవో రమణకు తెదేపా నేతలు అబద్ధం, కొరుప్రోలు రామకృష్ణ, జనసేన నాయకులు శానపతి బాబూరావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ వెంకటలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవికి అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మండల సమావేశం నేడు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మీనా కుమారి తెలిపారు. ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వస్తామన్నారు.

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

సంక్రాంతి సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ విజయ భాస్కర్

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరు ప్రాథమిక పాఠశాలలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సంక్రాంతి సంబరాల గోడపత్రికను ఆర్డీఓ విజయభాస్కర్ గురువారం ఆవిష్కరించారు. పీఆర్టీయూ విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షుడు మద్దు శ్రీను, గోపినాథ్ సమక్షంలో వీటిని ఆవిష్కరించారు. విద్యార్థులకు గ్రాండ్ టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నామని, విజేతలకు రూ.పది వేల బహుమతి అందిస్తామని పీఆర్టీయూ సభ్యులు తెలిపారు. విద్యార్థులు టాలెంట్ టెస్టులో పాల్గొని, సామర్థ్యాలు మెరుగుపర్చుకోవాలని సూచించారు.

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి

పుణ్యకోటి వాహనంపై ఉత్సవమూర్తులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్న ఆలయం గురువారం భక్తుల తాకిడితో రద్దీగా మారింది. నూతన ఏడాది కావడం, ప్రస్తుతం ధనుర్మాస వేడుకలు జరుగుతుండటంతో తెల్లవారుసుంచే ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో ఉమ్మడి విశాఖలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చారు. కొండపై నిజరూపంతోపాటు, దిగువన వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు తదితరులు స్వామి వారిని పుణ్యకోటి వాహనం, గోదాదేవిని పల్లకీలో ఉంచి అందంగా అలంకరించారు. భక్తుల గోవిందనామస్మరణతో తిరువీధుల్లో ఊరేగించారు.

చలపతిరావు జన్మదిన వేడుకలు

రాంబిల్లి: దిమిలిలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు జన్మదిన వేడుకలు జరిగాయి. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాయకులు, పీఏసీఎస్ అధ్యక్షుడు చిట్టిబాబు, తాతబాబు, అజయ్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. భాజపా జిల్లా కార్యదర్శి వర్మ రాజు, తెదేపా నాయకులు భూపతిరాజు రవి రాజు, పిన్నమరాజు రవిరాజు పాల్గొన్నారు.

జూదం ఆడుతున్న 13 మంది అరెస్టు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి మండలం పురుషోత్తపురంలో గురువారం సాయంత్రం జూదం ఆడుతున్న 13 మంది వ్యక్తులను అరెస్ట్ చేశామని గ్రామీణ ఎస్సై ఉపేంద్ర చెప్పారు. వీరి వద్ద నుంచి రూ. 3,550 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని వివరించారు.

రూ.1.17 కోట్లతో మరమ్మతులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే

సాగునీటి రంగానికి కొత్తఊపు వస్తోంది. వైకాపా పాలనలో నీటి వనరుల మరమ్మతుకు ఒక్క రూపాయి మంజూరు చేయలేదు. దీంతో అన్నదాతలకు సాగునీటి కష్టాలు తప్పలేదు. అయిదేళ్లపాటు అష్టకష్టాలు పడ్డారు. కూటమి ప్రభుత్వం సాగునీటి రంగానికి పెద్దపీట వేయడంతో క్రమేపీ రూపుమారుతోంది. తాజాగా పాయకరావుపేట నియోజకవర్గంలో మూడు పనులు చేపట్టేందుకు రూ. 1.17 కోట్లు మంజూరు చేశారు. సాగునీటి సమస్యలను హోంమంత్రి వంగలపూడి అనిత ప్రత్యేకంగా దృష్టి సారించి కలెక్టర్ విజయకృష్ణన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో జిల్లా మినరల్ ఫండ్ నుంచి ఈ నిధులు కేటాయించారు.

మరమ్మతుకు సిద్ధం...: ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు గ్రోయిన్ మరమ్మతు చేపట్టాల్సి ఉంది. తరచూ ఈ ప్రాంతంలో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని రూ. 99 లక్షలు వెచ్చించి కొత్తరూపు తీసుకురానున్నారు. పాయకరావుపేటలో తాండవ నదిలో ముఠా, భూమి ఆనకట్టల ద్వారా నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లోని సుమారు 30 వేల ఎకరాలకు నీరందుతోంది. అయితే ఆనకట్టలకు తలుపులతో ఇక్కట్లు తప్పడం లేదు. నీటిని సకాలంలో పంట కాలువల్లోకి పంపించేందుకు వీలుండటం లేదు. తలుపులు ఎత్తేందుకు, దించేందుకు వీలుండటం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రెండు ఆనకట్టల తలుపులు మరమ్మతు చేసేందుకు రూ. 18 లక్షలు విడుదల చేశారు. ప్రస్తుతం టెండరు ఖరారు దశలో ఉంది.

ముఠా ఆనకట్ట గేట్లు

రూ.3 కోట్లతో ప్రతిపాదనలు: మరో రూ.3 కోట్లతో ఎంపీల్యాడ్స్ నిధులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే మూడు మండలాల పరిధిలో కాలువలు, స్లూయిస్‌లకు మరమ్మతు చేపడతాం. ఖరీఫ్‌లో సాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నాం.– ఎం.వి.సురేష్‌కుమార్, డీఈ, జలవనరులశాఖ

నాణ్యత తీసికట్టు

ఎలమంచిలి గాజువాక స్టీల్ ప్లాంట్‌ను కలిపే బైపాస్ రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించింది. నిర్మించిన ఏడాదికే వేసిన రోడ్డంతా పోయి పాత రహదారి పైకి కనిపిస్తోంది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గం ఇలా తయారైంది. రూ. 2 కోట్లు వెచ్చించి నిర్మించిన రహదారి ఇలా తయారైనా రోడ్లు, భవనాల శాఖ అధికారులు పట్టించుకోలేదు. కనీసం ప్యాచ్ వర్కు అయినా చేయించలేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, ఎలమంచిలి

ఫోకస్

నిర్మించిన ఏడాదికే కొట్టుకుపోయిన ఎలమంచిలి - గాజువాక బైపాస్ రోడ్డు

భారీగా గోతులు

ట్యాంకు శుభ్రం చేయాలంటే అవస్థే

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అరట్లకోట గ్రామంలో తాగునీటి ట్యాంకు మెట్లు సక్రమంగా లేవు. రెయిలింగ్ లేకపోవడంతో ట్యాంకు పైకి ఎక్కాలంటే అవస్థలు ఎదుర్కొంటున్నామని సిబ్బంది చెబుతున్నారు. ట్యాంకు శుభ్రం చేయాలంటే సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మెట్లు మార్గం బాగా లేకపోవడంతో ఎక్కే సమయంలో భయాందోళనలు చెందుతున్నారు. కొన్నేళ్లుగా పథకానికి మరమ్మతు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు ట్యాంకుకు పూర్తిస్థాయిలో మరమ్మతు చేయించి మెట్లు ఆధునీకీకరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అరట్లకోటలో విరిగిపోయిన తాగునీటి పథకం మెట్లు

జాతీయ రహదారి చెంతనే వ్యర్థాలు..

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పీఎల్‌పురం వద్ద జాతీయ రహదారి మార్జిన్లు చెత్త, వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయి. సమీప మార్కెట్‌యార్డులో సేకరించిన పశువుల వ్యర్థాలను కొంత మంది వీటిని పారబోస్తున్నారు. చెత్త కుళ్లిపోవడంతో ఈ ప్రాంతమంతా తీవ్రమైన దుర్వాసన వస్తోందని వాహన చోదకులు వాపోతున్నారు. ఈ కారణంగా ఒక్కోసారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జాతీయ రహదారి భద్రత సిబ్బంది చెత్త వేయకుండా నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు, చోదకులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే జరిమానాలే

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహన చోదకుల ఆగడాలకు చెక్ పడినట్లే. పట్టణంలోని వై జంక్షన్ జాతీయ రహదారిపై ఉన్న సిగ్నల్ పాయింట్ వద్ద (ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ డిటెక్షన్ (ఏఎన్‌పీడీ) కెమెరాలు అమర్చారు. దీంతో ఇకపై జరిమానాల నుంచి తప్పించుకోవడానికి వీలుండదు. ఇప్పటివరకు ఎర్ర సిగ్నల్ పడిన సమయంలో ఇష్టారాజ్యంగా వాహనచోదకులు ఇక్కడ రోడ్డు దాటుతున్నారు. ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ఇకపై సిగ్నల్ జంప్ చేసినా, శిరస్త్రాణం ధరించకపోయినా కెమెరాల్లో నమోదవుతుంది. ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించినా, ఆటోల్లో ఓవర్ లోడు, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా బాదుడు తప్పదు. సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసు ప్రమేయం లేకుండానే జరిమానాలు పడతాయని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు తూ.చ. తప్పకుండా పాటించాలని సూచించారు.

ఏర్పాటు చేసిన కెమెరాలు

నాటు పుంజులకు భలే గిరాకీ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సంక్రాంతి సమీపిస్తుండటంతో నాటు కోళ్లకు ఎక్కడలేని డిమాండ్ వచ్చిపడింది. దసరా రోజుల్లో ఉండే డిమాండ్ ఇప్పుడు సంక్రాంతి సమయంలోనూ కనిపిస్తోంది. అచ్యుతాపురం మండలంలో వెదురువాడ, మోసయ్యపేట, దొప్పెర్ల, దోసూరు, భీమలాపల్లి, పూడిమడక, మడుతూరు, రామన్నపాలెం, జంగులూరు, భోగాపురం, దుప్పితూరు, మార్టూరు గ్రామాల్లో మహిళలు ఇళ్లవద్ద కోళ్లు పెంచుతారు. ప్రతి శుక్రవారం అచ్యుతాపురం వారపు సంతలో వీటిని విక్రయిస్తూ ఆదాయం పొందుతారు.

సందడిగా నూతన సంవత్సర వేడుకలు

అనకాపల్లిలో కేకు కోస్తున్న ఎంపీ రమేశ్

అనకాపల్లి, అనకాపల్లి పట్టణం, కొత్తూరు, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గురువారం సందడి నెలకొంది. ఎంపీ సీఎం రమేశ్ తన కార్యాలయంలో కేకు కోశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావును ఎంపీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, తెదేపా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ, వర్తక సంఘ అధ్యక్షుడు కొణతాల పెదబాబు వేడుకలు నిర్వహించారు. బ్రహ్మకుమారీల ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బాధ్యురాలు విద్య ఆధ్వర్యంలో పలు చోట్ల ఆధ్యాత్మిక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కొణతా, ఆర్డీఓ ఆయిషా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అచ్యుతాపురం: ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌కు కూటమి నాయకులు, కార్యకర్తలు నూతన శుభాకాంక్షలు తెలిపారు.

అనకాపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పీలా, తదితరులు

అచ్యుతాపురంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు పుస్తకాలు అందిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అనకాపల్లి ఆర్డీఓ ఆయిషాతో బ్రహ్మకుమారీలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా పలు ఆలయాలు గురువారం న భక్తులతో రద్దీగా మారాయి. సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో మూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలు చేపట్టారు. ఆంజనేయస్వామికి సిందూరార్చన చేపట్టారు. పట్టణంలోని గవరపాలెం అరుంధతి నగర్‌లోని నూకాంబిక ఆలయంలో నూతన సంవత్సర పూజలు చేపట్టారు. ఆలయ నిర్వాహకుడు పెట్ల నాగేశ్వరరావు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: గాంధీనగరం అంజయ్య కాలనీలోని వేంకటేశ్వరాలయంలో మూల విగ్రహాన్ని గురువారం జగన్మోహినిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ప్రధాన అర్చకులు చక్రవర్తి, శ్రీరామ్, శ్రీకాంత్ భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

కశింకోట: వేంకటేశ్వర ధ్యాన మందిరంలో జగన్మోహినీ అవతారంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు రేజేటి శ్రీరామచరణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక సేవలు నిర్వహించారు. రాత్రికి ప్రత్యేక నవనీతహారతిని సమర్పించారు. సుందరయ్యపేట శివారు చిన్నయ్యపాలెంలో భూలోక అమ్మవారి పండగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని భక్తులు, మహిళలు దర్శించుకున్నారు.

కశింకోట వేంకటేశ్వర ధ్యాన మందిరంలో మహిళల కోలాటం

చర్చిలలో ప్రార్థనలు

కోటవురట్ల, నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి, పెదతీనార్ల, దొండవాక, కాగిత, వేంపాడు, గొడిచెర్ల, నెల్లిపూడి చర్చిల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పాస్టర్లు ప్రార్థనలు నిర్వహించారు. పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేసి విందు ఏర్పాటు చేశారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, పాస్టర్లు అబ్రహం, నాగేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు. కోటవురట్ల మండలం గొల్లపేట యోహాన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా అచ్యుతాపురం ఫిలిడెల్ఫియా ప్రార్థనా మందిరంలో పాస్టర్ ఏజేఎస్. శ్యామ్‌కుమార్ ప్రార్థన చేసి మహిళలకు చీరలు అందించారు. ఆటలు, బైబిల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రైస్తవ చిన్నారులకు సుజాతమ్మ బహుమతులు అందించారు. కొండకర్ల ఏబీ చర్చిలో బుధవారం రాత్రి అంతా ప్రార్థనలు జరిగాయి.

అచ్యుతాపురంలో ..

పాడి రైతుల సంక్షేమానికి కృషి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా విశాఖ డెయిరీ సేవలందిస్తోందని కొత్త ఏడాదిలో మరింత కృషి చేస్తామని డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. ఎలమంచిలి పట్టణంలో గురువారం కేకు కోసి వేడుకలను ప్రారంభించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, డెయిరీ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారిని కలిశారు. ఆనంద్ మిత్రమండలి ప్రతినిధులు వెంకట్, రమేష్, వెంకటేష్, చిరంజీవి, నాయకులు పరమేశ్వరరావు, శ్రీను, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేకు తినిపిస్తున్న ఆనంద్‌కుమార్, చిత్రంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

నక్కపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని అమలాపురం పంచాయతీ పరిధిలోని మూలపర్ర వద్ద ఓ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. దీనికి సంబంధించి సర్పంచి పెదపూడి శంకరరావు, తెదేపా నాయకులు ఎరిపల్లి అప్పలరాజు, ఎరిపల్లి సత్తిబాబు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామ సమీపంలో వ్యవసాయ విద్యుత్తుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం అర్ధరాత్రి దొంగలు అపహరించారు. సమీపంలో దీన్ని పగలగొట్టి ఇందులో రాగి వైరు, ఇతర విలువైన సామగ్రి ఎత్తుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్ చోరితో స్తంభం పరిధిలోని పలు వ్యవసాయ బోర్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఉదయం దీన్ని గుర్తించిన రైతుల సమాచారంతో దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు నాయకులు వెల్లడించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ముక్కలు

కొరమేను చిక్కితే పంట పండినట్లే

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కొండకర్ల ఆవ రుచినందించే కొరమేనుకు ప్రసిద్ధి చెందింది. ఉభయగోదావరి జిల్లాలకు చెందిన ప్రజలతోపాటు స్థానికులు సైతం అధికంగా ఇష్టపడే కొరమేనుకు వేట ఆసక్తిగా ఉంటుంది. వెదురు ముక్కలతో తయారుచేసిన మావును నీటిలో ఉంచి కొండకర్ల, వాడ్రాపల్లికి చెందిన మత్స్యకారులు ఆవలో వీటిని వేటసాగిస్తారు. మిగిలిన అన్ని చేపలను ఆహారంగా తీసుకునే కొర్రమేనుకు రుచి ఎక్కువ. ఇది చిక్కిందంటే మత్స్యకారులకు పంట పండినట్లే. దీనిని కొనుగోలు చేయడానికి ఎక్కువమంది ఇష్టపడతారు. దీని ధర సైతం ఎక్కువగా ఉంటుంది.

వెదురుతో తయారుచేసిన మావు

మహార్యాలీ జయప్రదం చేయండి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఈ నెల 4న విశాఖలో జరిగే సీఐటీయూ మహార్యాలీకి వేలాదిమంది తరలి రావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము కోరారు. మండలంలో దోసూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం వేడుకలు జరిగాయి. కేకును కట్ చేసి తినిపించుకున్నారు. అనంతరం సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని దోసూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మహాసభలకు భవన నిర్మాణ కార్మికులు రూ.10 వేల విరాళం అందించారు. నాయకులు సోమునాయుడు, కన్నూరు రమేష్, సబ్బవరపు రాజు, రమణ, పలపాల రాజు, మణికంఠ, రాజాన అప్పలనాయుడు, రాజునాయుడు, పైడిరాజు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, భవన నిర్మాణకార్మికులు

4న పూర్వ విద్యార్థుల సమావేశం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాల (ఎంజీహెచ్) పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల 4న జరగనుంది. పాఠశాల ఆవరణలో గురువారం సంఘ గౌరవాధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు వివరాలు వెల్లడించారు. పాఠశాల అభివృద్ధితోపాటు సమాజాభివృద్ధి తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. అధ్యక్షుడు నాగభూషణం, కోశాధికారి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులంతా హాజరు కావాలని కోరారు.

కానిస్టేబుల్‌కు డీఎస్పీ పరామర్శ

నక్కపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్‌ను నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. పాయకరావుపేట స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మల్లపురెడ్డి కిరణ్ బుధవారం అర్ధరాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా.. వేగంగా వస్తున్న మరో బైక్ వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రథమ చికిత్స అనంతరం నక్కపల్లిలోని ఇంటికి రాగా.. డీఎస్పీ శ్రీనివాసరావు ఆయన్ను పరామర్శించారు. తెదేపా నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, ఎస్సై సన్నిబాబు పరామర్శించిన వారిలో ఉన్నారు.

కిరణ్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని బెల్లం వర్తకులు కర్రి సన్యాసినాయుడు కోరారు. స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు లక్ష్మీగణపతి ఆలయంలో గురువారం గ్రీన్‌క్లబ్-2026 క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ జరిగింది. క్లబ్ సభ్యులతో కలిసి సన్యాసినాయుడు క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. బీరా వినోద్‌కుమార్, కాండ్రేగుల సత్యనారాయణ, క్లబ్ గౌరవాధ్యక్షులు పెంటకోట ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు యల్లపు సూరి అప్పారావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

క్లబ్ డైరీ, జూట్ సంచులతో క్లబ్ సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722	పాయకరావుపేట-
ఎలమంచిలి- 80085 74726	80085 74750

అనకాపల్లి, న్యూస్‌టుడే: ?: గవరపాలెం కర్రివారివీధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. – **బొడ్డేడ మురళి, అనకాపల్లి** ✓: కుక్కలు పట్టుకుని కు.ని శస్త్రచికిత్సలు చేయిస్తాం. – **రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్, అనకాపల్లి**

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: జాతీయ రహదారి కొప్పాక వద్ద రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. నీరు ఏలేరు కాలువలో కలుస్తోంది. సమస్యను పరిష్కరించగలరు. – **అప్పలనాయుడు, కొప్పాక** ✓: కాలువ నిర్మాణ పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. – **గోపాలకృష్ణ, జీవీఎంసీ ఈఈ, అనకాపల్లి.**

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని గుంటపల్లి కాలనీలో రోడ్డుపై మురుగు చేరింది. ఇళ్లలో వాడిన నీరు రోడ్డుపైకి చేరుతోంది. – **మహేష్, పాయకరావుపేట** ✓: మురుగు తీయిస్తాం. శుభ్రపరుస్తాం. – **కె.డేవిడ్, ఈవో**

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని పాత వీధిలో కుళాయికి హెడ్‌లు లేక తాగునీరు వృథాగా పోతోంది. – పి.రత్నం ఎలమంచిలి ✓: కుళాయిలకు హెడ్‌లు ఏర్పాటు చేయిస్తాం. – ప్రసాదరాజు కమిషనర్ ఎలమంచిలి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ?: కొత్తపాలెం మార్గంలో రోడ్డు పక్కన తాటి చెట్టు నరికి పడేశారు. వాహనాలు రోడ్డు దిగడానికి వీలు పడటంలేదు. – **ఎం.రాము, ఎలమంచిలి** ✓: చెట్టు తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. – **ప్రసాదరాజు, కమిషనర్**

పాయకరావుపేట: ? భూమి కాలువ చిట్టడవిలా మారింది. నీటి ప్రవాహానికి ఇక్కట్లు తప్పడం లేదు. – **దుర్గారావు, పాయకరావుపేట** ✓: పిచ్చి మొక్కలు తొలగించి ఆధునికీకరణ పనుల చేపడతాం. –**ఎం.సురేష్ కుమార్, డీఈ, జల వనరుల శాఖ**

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: మండలంలోని మంగవరంలోని ప్రధాన రహదారిపై మురుగు చేరుతోంది. దీనివల్ల రోడ్డు బురదగా మారుతోంది. దుర్వాసన వస్తోంది. – **స్థానికుడు, మంగవరం** ✓: రోడ్డుపై మురుగు చేరకుండా చర్యలు చేపడతాం.– **కె.డేవిడ్, డిప్యూటీ ఎంపీడీఓ**

అనకాపల్లి, న్యూస్‌టుడే: ?: జాతీయ రహదారి సమీపంలోని గవరపాలెం నూకాలమ్మ ఆర్చి వద్ద మురుగునీరు రోడ్డుపై నిలుస్తోంది. రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నాం. – **బీవీ రామారావు, అనకాపల్లి** ✓: మురుగు కాలువల నిర్మాణం చేపడతాం. – **కె.చక్రవర్తి, జోనల్ కమిషనర్**

సమస్యల సుడిలో జగనన్న కాలనీలు

తాంబూలాలిచ్చేశాం.. అన్న చందాన మారింది జగనన్న కాలనీల దుస్థితి. సదుపాయాల్లేకుండా కొన్ని కాలనీల్లో సమస్యల నడుమ ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ముఖ్యంగా చందనాడ కాలనీ పరిస్థితి మరీ దారుణం. ఓ కొండ ప్రాంతంలో సుమారు 147 ఇళ్ల స్థలాలను చందనాడ, బుచ్చిరాజుపేట పంచాయతీ వాసులకు కేటాయించగా, ఇంతవరకు 47 కుటుంబాల వారు ఇందులో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. ఇక్కడ విద్యుత్తు సదుపాయంతో ఓ మోటారు బోరు వేసి వదిలేశారు. వీధి కుళాయిలు, రోడ్లు సమకూర్చలేదు. ఫలితంగా నిత్యం నరకం చూస్తున్నారు. కాలనీ ఎగువ ప్రాంతంలో ఉండటంతో వర్షాలకు మట్టి రోడ్డుపై వరదనీరు పరుగులతో కోతకు గురవుతోంది. దీనికితోడు భారీగా రాళ్లుతేలి ఉన్నాయి. చీకటి పడితే విష పురుగుల సంచారం ఉంటోంది. ఒకట్రెండు వీధుల్లో మాత్రమే నీరు వస్తుండగా, ఎత్తు కారణంగా మిగిలినచోట్లకు వెళ్లడం లేదు. దీంతో ఆయా కుటుంబాల వారు నీటికోసం నడిచి వెళ్లి తెచ్చుకుంటున్నారు. ఇళ్లు కట్టుకోవాలని అధికారులు, నాయకులు బలవంతం పెట్టి ఇక్కడకు పంపించి, తర్వాత తమను గాలి కొదిలేశారని కాలనీ వాసులు కె.మంగ, ఎన్.లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల మధ్య తుప్పలు పెరిగిపోయి పాములు తిరుగుతున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోని ఆందోళన చెందుతున్నామన్నారు. – న్యూస్‌టుడే, నక్కపల్లి

ప్రధాన రహదారి దుస్థితి

తాగునీటి ట్యాంకు ప్రారంభం

నక్కపల్లి, న్యూస్‌టుడే: జానకయ్యపేట సమీప కాలనీలో గురువారం నూతన తాగునీటి ట్యాంకును జనసేన నాయకులు ప్రారంభించారు. కాలనీవాసులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన జనసేన నాయకులు పరిష్కారానికి ముందుకు వచ్చారు. జిల్లా సంయుక్త కార్యదర్శి కురందాసు అప్పలరాజు, పంపన బోయిన తులసీరావు, చందక నానాజీ, మామిడి అప్పలరాజు, గింజాల తాతరాజు తదితరులు దాదాపు రూ. లక్ష వెచ్చించి పథకాన్ని పూర్తి చేయించారు. దీన్ని గురువారం ప్రారంభించగా, మహిళలు నీటిని పట్టుకుని హర్షం వ్యక్తం చేశారు.

నూతన ట్యాంకు వద్ద జనసేన నాయకులు, మహిళలు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
सेंट्रल बैंक ऑफ इंडिया
Central Bank of India
1911 से आपके लिए "सेंट्रल" "CENTRAL" TO YOU SINCE 1911

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయం: #47-10-14, సారిపల్లి ఎలైట్, 3వ అంతస్తు, పాలక్స్ స్కూల్ ఎదురుగా, డైమండ్ పార్కు దగ్గర, 2వ లైను ద్వారకానగర్, విశాఖపట్నం-530016.

బిడ్లు కొరకు ఆహ్వానం / లీజు ప్రాంగణం కొరకు ఆహ్వానం

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ప్రాంగణం కొరకు 120.77 చ॥మీ॥లు (1300 చ॥అ॥లు) విస్తీర్ణం గల కార్పెట్ ఏరియా, అనకాపల్లి బ్రాంచ్ కొరకు 3 నెలల లోపు అద్దె కొరకు సిద్ధంగా ఉండగలిగిన మరియు బ్రాంచ్ యొక్క కస్టమర్ & స్టాఫ్ కొరకు తగిన పార్కింగ్ స్థలంతో పాటు గ్రౌండ్ ఫ్లోర్‌కు ప్రాధాన్యత ఉండవలెను. దయచేసి బ్రోకర్లు లేదా మధ్యవర్తుల ప్రమేయమునకు అవకాశం లేదు అని గమనించగలరు. ప్రభుత్వం / సెమీ ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. దయచేసి https://www.centralbank.bank.in నుండి ఫార్మాట్‌లు / నిబంధనలు మరియు షరతులను డౌన్‌లోడ్ చేసుకోండి లేదా కార్యాలయ పనిదినములలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అనకాపల్లి బ్రాంచ్ / రీజనల్ ఆఫీస్ విశాఖపట్నం నుండి సేకరించవచ్చును మరియు ఆఫర్లను చివరి తేది.23.01.2026 సాయంత్రం 4.00 గం॥ల లోపు సమర్పించవలెను.

సం/- సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయం, విశాఖపట్నం

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

సభాపతి ఇంట సందడి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చిన వారితో నర్సీపట్నంలో సభాపతి అయ్యన్నపాత్రుడు ఇల్లు, క్యాంపు కార్యాలయం గురువారం సందడిగా మారింది. ఎంపీ సీఎం రమేశ్, జడ్పీ సీఈవో నారాయణమూర్తి, ఆర్డీవో వి.వి.రమణ, డీఎస్పీ శ్రీనివాసరావు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

★ శాసన సభాపతి అయ్యన్నను రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవిందు, రవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు తదితరులు కలిశారు.

పుష్పగుచ్ఛాలకు బదులు పుస్తకాలు ఇచ్చి..

దేవరాపల్లి: శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే వారంతా పూలదండలకు బదులు పుస్తకాలతో రావాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేసిన సూచనను పలువురు నాయకులు పాటించారు. మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన కూటమి నాయకుల్లో చాలా మంది పుస్తకాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మరికొందరు పండ్లు అందజేశారు.

అయ్యన్నకు శుభాకాంక్షలు చెబుతున్న కూటమి నాయకులు

ఎమ్మెల్యే బండారుకు పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

ఉత్సాహంగా కొత్త సంవత్సర వేడుకలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: బుచ్చెయ్యపేట మండలంతో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. వడ్డాదిలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, జిల్లా తెదేపా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబును పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, మండల పరిషత్తు అధ్యక్షురాలు దాకవరపు నాగేశ్వరిదేవి, మండల ఉపాధ్యక్షురాలు దొండా లలితను పార్టీ నాయకులు, పలుశాఖల ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వడ్డాది వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

వడ్డాదిలో తాతయ్యబాబుతో పార్టీ నాయకులు, కార్యకర్తలు

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య **ఆడి 1:** ఈషా, దండోరా, వృషభా, అఖండ-2, **ఆడి 2:** ఛాంపియన్, అనకొండ, **ఆడి3:** శంబాల, బ్యాడ్ గాళ్స్, **ఆడి 4:** అవతార్, అఖండ-2, **రాజు:** అఖండ-2, **బంగార్రాజు:** ఈషా, శంబాల **చోడవరం: సాయిలక్ష్మి:** శంబాల, **శ్రీ సాయిలక్ష్మి:** ఛాంపియన్, **లక్ష్మి:** ఛాంపియన్, **పూర్ణా:** అఖండ2

ఈ కేంద్రం... కౌమారులకు ప్రత్యేకం!

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలో పది నుంచి 18 ఏళ్లలోపు వయసు కలిగిన బాల బాలికల కోసం ప్రత్యేకంగా కౌన్సెలింగ్ కేంద్రం ఉంది. పెద్దగా ప్రచారం లేని ఈ విభాగానికి వచ్చే వారికి వారానికి నాలుగు రోజులు సేవలు అందించాలి. పోషకాహారం తీసుకోవడంతో కలిగే లాభాలు, లైంగిక, పునరుత్పత్తి సమస్యల పరిష్కారం, మానసిక ఆరోగ్యం పరిశీలన, గాయాలు, హింస, మాదకద్రవ్యాల వినియోగంతో ఎదురయ్యే నష్టాలపై అవగాహన కల్పిస్తారు. అవసరమైన వారికి వైద్యసాయం అందేలా సహకరిస్తారు. ప్రతినెలా 343 మంది ఆరోగ్యాన్ని ఆరా తీయడం లక్ష్యంగా ఉంది. నర్సీపట్నం నియోజకవర్గంతో పాటు చోడవరం నియోజకవర్గం రోలుగుంట, రావికమతం, పాయకరావుపేట నియోజకవర్గం కోటవురట్ల మండలాలు ఈ కేంద్రం పరిధిలో ఉన్నాయి.

బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కలిగిస్తున్న కౌన్సిలర్

★ ఈ కేంద్రంలోని కౌన్సిలర్ ప్రతి గురువారం ఒక పాఠశాలకు వెళ్లి కౌమార బాల బాలికలను కలిసి వారి ఆరోగ్యాన్ని పరిశీలించాలి. ఐరన్, ఫోలిక్‌యాసిడ్ మాత్రలను పిల్లలకు అందజేస్తారు.

> ప్రతి శనివారం ఓ పీహెచ్‌సీలో కౌన్సిలర్ అందుబాటులో ఉంటారు. పీహెచ్‌సీకి వచ్చే కౌమార బాల బాలికలను గమనించి అవసరమైన వారికి సహకారం అందజేస్తుంటారు.

★ హాస్టళ్లలో ఉండే పిల్లలు ఎక్కువగా గజ్జి, దురద తదితర చర్మవ్యాధులకు గురవుతున్నట్టు తమ దృష్టికి వస్తోందని కౌన్సెలర్ పి.రాము తెలిపారు. ఉతికి, ఆరిన తరువాత దుస్తులు ధరించడం మంచిదని పిల్లలకు సూచించారు. గోళ్లు కత్తిరించుకోవడం, తినేముందు, మరుగుదొడ్డికి వెళ్లొచ్చిన తరువాత చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా సూక్ష్మజీవులు పొట్టలో చేరకుండా చూసుకోవచ్చన్నారు. రుతుచక్రంపై పిల్లలకు అవగాహన కలిగిస్తామని తెలిపారు. 18 ఏళ్లు దాటిన తరువాతనే బాలికలు వివాహం చేసుకునేలా చైతన్యం చేస్తున్నామని ఆయన తెలిపారు. సమస్యలు ఉన్నవారు ప్రాంతీయ ఆసుపత్రిలో ఈ కేంద్రాన్ని సంప్రదించవచ్చని సూచించారు. అనారోగ్యానికి గురికాకుండా అందరూ వ్యక్తిగత పరిశుభ్రత విధిగా పాటించాలన్నారు.

చెరకు లారీ బోల్తా..

చోడవరం, న్యూస్‌టుడే : చీకటితోట చెరకు తూనిక కేంద్రం నుంచి సంకిలి చక్కెర కర్మాగారానికి చెరకు తరలిస్తున్న లారీ బీ-ఎన్ రోడ్డుపై అంభేరుపురం గ్రామం వద్ద గురువారం సాయంత్రం బోల్తాపడింది. అధికమొత్తంలో చెరకు రోడ్డుపై అడ్డంగా ఉండిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలీసులు చొరవ తీసుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

రోడ్డుపై అడ్డంగా పడిపోయిన చెరకు

జీవన ధ్రువపత్రం దాఖలుకు కౌంటర్

చోడవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పింఛనుదారులు జీవన ధ్రువపత్రం(లైఫ్ సర్టిఫికెట్) అందించేందుకు కార్యాలయంలో కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు స్థానిక ఉపఖజానాధికారిణి ఎల్.మీనా తెలిపారు. గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్ ద్వారా పింఛనుదారులకు ఫేసియల్‌ను నిక్షిప్తం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి నెలాఖరులోగా ధ్రువపత్రం సమర్పించాలని చెప్పారు. ప్రభుత్వ పింఛనుదారుల సంఘ అధ్యక్షుడు వి.చిన బాబు, ప్రధాన కార్యదర్శి బి.దక్షిణమూర్తి, చిరికి దేవానంద్, టి.వి.రమణ, గొర్లె అప్పల నర్సింహమూర్తి పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత రేపు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: మాకవరపాలెం మండలంలోని పలు గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ అప్పారావు గురువారం చెప్పారు. గిడుతూరు, బూరుగుపాలెం, జి.కోడూరు, లచ్చన్నపాలెం, శెట్టిపాలెం ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

అ వీ ఇ వీ

నేటి నుంచి మూడు గ్రామాల్లో రీసర్వే

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: మండలంలోని మరో మూడు గ్రామాల్లో శుక్రవారం నుంచి భూముల రీసర్వే నిర్వహించనున్నారు. లోపూడి, వడ్డాది, గున్నెంపూడి గ్రామాల్లో రీసర్వే చేయనున్నట్లు తహసీల్దారు లక్ష్మి చెప్పారు. ఇప్పటికే గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులందరూ దగ్గరుండి సర్వే చేయించుకోవాలని సూచించారు.

డీవీఎంసీ కమిటీలో ఇద్దరికి చోటు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు, మానిటరింగ్ కమిటీ(డీవీఎంసీ)లో దేవరాపల్లి మండలానికి చెందిన ఇద్దరికి చోటు దక్కింది. కమిటీకి కలెక్టరు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. 8 మంది సభ్యులుండే ఈ కమిటీలో మండలంలోని తామరబ్బ శివారు బొడ్డపాడుకి చెందిన మొసలి పైడిరాజుకి చోటు దక్కింది. ఇదే మండలంలోని వేచలంకి చెందిన గంగాధర మరియమ్మకి ఈ కమిటీలో రెండోసారి కొనసాగడానికి అవకాశమిచ్చారు.

మొసలి పైడిరాజు గంగాధర మరియమ్మ

పార్కుగా దివాన్‌సాగర్ చెరువు

కె.కోటపాడు, న్యూస్‌టుడే : చౌడువాడ గ్రామం సచివాలయం ఎదురుగా ఉన్న దివాన్ సాగర్ చెరువును పార్కుగా అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే చెరువు గట్టును చదునుచేసి మొక్కలు నాటారు. అందాలను సంతరించుకోవడానికి పలు నిర్మాణాలు జరుపుతున్నారు. అన్ని విధాలుగా అభివృద్ధి చేసి అందమైన పార్కుగా మలుస్తామని సర్పంచి దాడి ఎరుకు నాయుడు తెలిపారు.

భాజపా సీనియర్‌నేత మృతి

కె.కోటపాడు, న్యూస్‌టుడే : భాజపా సీనియర్‌నేత గొండుపాలెం మాజీ సర్పంచి బండారు రామస్వామిపాత్రుడు అనారోగ్యంతో మృతి చెందారు. గొండుపాలెం గ్రామ అభివృద్ధికి చెప్పుకోదగిన రీతిలో కృషిచేసిన ఈయన రెండు పర్యాయాలు సర్పంచిగానూ, ఎంపీటీసీ సభ్యుడిగా పని చేశారు. రామస్వామిపాత్రుడు మృతికి పలువురు నియోజకవర్గ నేతలు సంతాపం తెలిపారు.

పర్యావరణం పరిరక్షణకు కృషి

చోడవరం, న్యూస్‌టుడే: పర్యావరణం సమతుల్యతను పాటిద్దామంటూ సద్భావన బృందం ప్రజలకు వివరిస్తూ గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ చర్యల్లో భాగంగా ప్లాస్టిక్ సంచులు బదులు వస్త్రంతో చేసిన చేతి సంచులను వాడాలంటూ చెప్పడమే కాకుండా వెయ్యి సంచులను ప్రజలకు అందజేసింది. సద్భావన బృందం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా 34వ కార్యక్రమంగా సంచుల పంపిణీ చేపట్టారు. సద్భావన బృందం వ్యవస్థాపకుడు కొప్పాక రాజేష్, సబ్‌రిజిస్ట్రార్ బి.గీతాలక్ష్మి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ పి.అప్పలరాజు, ఎంపీపీ గాడి కాసులు ప్రారంభించారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

నక్కపల్లి: మండలంలోని అమలాపురం పంచాయతీ పరిధిలోని మూలపర్ర వద్ద ఓ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. దీనికి సంబంధించి సర్పంచి పెదపూడి శంకరరావు, తెదేపా నాయకులు ఎరిపల్లి అప్పలరాజు, ఎరిపల్లి సత్తిబాబు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామ సమీపంలో వ్యవసాయ విద్యుత్తుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం అర్ధరాత్రి దొంగలు అపహరించారు. సమీపంలో దీన్ని పగలగొట్టి ఇందులో రాగి వైరు, ఇతర విలువైన సామగ్రి ఎత్తుకెళ్లారు.

కూటమి నేతల కోలాహలం

చోడవరం, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలతో చోడవరం సందడిగా మారింది. చోడవరంలో ఉన్న ఎమ్మెల్యే రాజు క్యాంపు కార్యాలయం పార్టీ కార్యకర్తలతో నిండిపోయింది. నాలుగు మండలాల నుంచి వచ్చిన వారితో పట్టణంలో కొత్తూరు కూడలిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

★ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యే రాజుకు శుభాకాంక్షలు తెలిపేందుకు కార్యకర్తలు బారులుతీరారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలు ఎమ్మెల్యే రాజును గజమాలతో సత్కరించారు. గేదెల సత్యనారాయణ, సకురు కోటేశ్వరరావు, బొడ్డేడ గంగాధర్, ఎలమంచిలి రమేష్, దేవరాపల్లి వెంకట అప్పారావు, పప్పు శ్రీను, కార్తిక్, ఎలా మల్లిబాబు, చంద్రమౌళి, గోకివాడ కోటేశ్వరరావు, తమరాన దాసు, రాజాన కొండనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి సంక్షేమ పథకాలు నియోజకవర్గంలో అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

★ తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీలు పెదబాబు, కొండతల్లికి శుభాకాంక్షలు చెప్పేందుకు పట్టణంలోని వారి స్వగృహానికి పార్టీ నాయకులు అధిక సంఖ్యలో వచ్చారు.

★ జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పీవీఎస్ఎన్.రాజును మార్కెట్ కమిటీ ఛైర్మన్ అల్లం మాధవి అప్పారావు, పార్టీ క్యాడర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే రాజును గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు

ధ్రువపత్రం అందిస్తున్న డిప్యూటీ ఈవో రాధ

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహస్వామి నిత్య అన్నప్రసాద పథకానికి అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం తూటిపాల గ్రామానికి చెందిన బొడకుర్తి నాగ వెంకట లక్ష్మీకుమార్ దంపతులు గురువారం రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో దేవస్థానం డిప్యూటీ ఈవో సింగం రాధకు అందజేశారు. అధికారులు దాత కుటుంబానికి స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

శిథిల భవనంలోనే సేవలు

దేవరాపల్లి, న్యూస్‌టుడే : శతాబ్దకాలం చరిత్ర కలిగిన ఎం.అలమండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) భవనం దారావు శిథిలావస్థకు చేరింది. 1923లో స్థాపించిన ఈ పరపతి సంఘం అన్నదాతలకు సేవలందిస్తోంది. ప్రారంభంలో ప్రైవేటు భవనంలో నడిచే దీనికి 1947లో శాశ్వత భవనాన్ని నిర్మించారు. అప్పటి నుంచి అదే భవనంలో కొనసాగుతోంది. పెంకుటిల్లు మరమ్మతులు చేసినా ఈ భవనం పాతబడటంతో దీని స్థానంలో కొత్తదాన్ని నిర్మించాల్సి ఉంది.

శిథిలావస్థకు చేరుకున్న ఎం.అలమండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం భవనం

సంఘంలో రూ. 7 కోట్ల లావాదేవీలు : ఎం.అలమండతో పాటు ఎ.కొత్తపల్లి, ముషిడిపల్లి, కొత్తూరు - ముత్యాలమ్మపాలెం, తారువ, యండపల్లిపాలెం తదితర గ్రామాలకు విస్తరించింది. ప్రస్తుతం రూ.7 కోట్ల వ్యాపార లావాదేవీలతో నడుస్తోంది. 1860 మంది రైతులు ఇందులో సభ్యత్వం ఉంది. రైతులకు దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక రుణాలు అందజేయడంతోపాటు యూరియా విక్రయిస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేస్తూ రైతుకు రావలసిన డబ్బుని సకాలంలో వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు.

★ రూ. 60 లక్షల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ భవనం పరిస్థితిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ద్వారా డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు దృష్టికి నాతో పాటు రైవాడ జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు తీసుకెళ్లాం. నూతన భవన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపించాం. రెండంతస్తుల భవన నిర్మాణానికి రూ. 60 లక్షల వరకు ఖర్చవుతుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కొత్త భవనం నిర్మిస్తే బంగారు ఆభరణాలపై రుణాలు పొందే సౌకర్యాన్ని కల్పిస్తాం. యూరియా వ్యాపారం, ధాన్యం కొనుగోలును యథావిధిగా కొనసాగించి సంఘానికి ఆదాయవనరులు మార్చుకుంటాం. గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు గోదాములు నిర్మిస్తాం. పైఅంతస్తులో కార్యాలయంతో పాటు రైతులు రుణాలు తీసుకునే సమయంలో రైతులు కుదువపెట్టే బంగారు ఆభరణాలు భద్రపరచడానికి అనువైన స్ట్రాంగ్‌రూమ్ నిర్మిస్తాం. – గొర్లె గోవింద, ఏపీసీఎస్ అధ్యక్షుడు, ఎం.అలమండ

శరీర సౌష్ఠవ పోటీల్లో స్వర్ణం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: విశాఖ జోనల్ శరీర సౌష్ఠవ పోటీల్లో మాకవరపాలెం సమీపంలోని అవంతి కళాశాల విద్యార్థి ఆదిశేషు స్వర్ణ పతకం అందుకున్నాడు. సింహాచలంలోని ఎస్ఎన్ఆర్ హాలులో గత నెల 28వ తేదీ రాత్రి ఈ పోటీలు జరిగాయి. 55 కేజీల విభాగంలో ఫైనల్స్‌కు చేరిన ఆరుగురితో పోటీ పడి విజేతగా నిలిచాడని కోచ్ పురుషోత్తం చెప్పారు. ఆదిశేషును సభాపతి అయ్యన్నపాత్రుడు గురువారం అభినందించారు.

ఆదిశేషును అభినందిస్తున్న సభాపతి అయ్యన్నపాత్రుడు

తాండవ వంతెనలు బాగుపడేనా?

నాతవరం, న్యూస్‌టుడే: తాండవ జలాశయం ప్రధాన కాలువలపై 50 ఏళ్ల కిందట నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరాయి. వీటి మీదుగా రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. స్లాబు దెబ్బతినడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. నాతవరం ప్రధాన రోడ్డులోని వంతెనను పునర్నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది. వల్సంపేటలో వంతెనకు ఇరువైపులా గోడలు దెబ్బతిన్నాయి. ఇనప చువ్వలు ఊడి పోయాయి. సంబంధిత అధికారులు సంబంధించి మరమ్మతుకు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

వల్సంపేటలో శిథిలావస్థలో వంతెన

ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్సు

చోడవరం పట్టణంలో గురువారం మధ్యాహ్నం కొత్తూరు నాలుగు రహదారుల కూడలిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయమేర్పడింది. ఎమ్మెల్యేతోపాటు నాయకుల్ని కలిసేందుకు వచ్చే వారితో పాటు ఆలయాలకు వచ్చే వారి వాహనాలు అధికంగా రావడంతో అంతరాయానికి కారణమైంది. ఈదశలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి అంబులెన్సు కొత్తూరు కూడలికి చేరుకుంది. అప్పటికే వాహనాలు బారులు తీరడంతో అంబులెన్సు సైరన్ వేసినా ఫలితం లేకపోయింది. కొద్దిసేపటికి తప్పించుకుంటూ ముందుకు సాగింది.

– న్యూస్‌టుడే, చోడవరం

కొత్తూరు కూడలిలో అంబులెన్సు

కొత్త సంవత్సరంలో రేషన్ కార్డుదారులకు శుభవార్త

చీడికాడ, న్యూస్‌టుడే: పౌరసరఫరాల శాఖ నూతన సంవత్సరం సందర్భంగా మరో పథకానికి శ్రీకారం చుట్టింది. రేషన్ డిపోలు ద్వారా కార్డుదారులకు తక్కువ ధరకే నాణ్యమైన గోధుమ పిండిని అందించనుంది. దీనికి ఈ ఏడాది జనవరి రెండో తేదీ నుంచి అమల్లోకి తీసుకురానున్నారు.

★ రేషన్ దుకాణాల సేవలను కూటమి ప్రభుత్వం కార్డుదారులకు మరింత దగ్గర చేసుంది. పేదలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు మరో ముందడుగు వేశారు. ఇప్పటికే కొన్ని నిత్యావసర సరకులను తక్కువ ధరకే అందిస్తోంది. బియ్యం ఉచితంగా సరఫరా చేస్తుంది. ఇకనుంచి కార్డుదారులకు తక్కువ ధరకే గోధుమ పిండిని అందించనుంది. దీనికి ఈ నెల రెండో తేదీ నుంచి మొదలు పెట్టనున్నారు. తొలుత జిల్లా కేంద్రంలోని రేషన్ కార్డుదారులకు సరఫరాకు శ్రీకారం చుడుతున్నారు. దశల వారీగా ఎలమంచిలి, నర్సీపట్నం, మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామాల్లోని దుకాణాల్లో అందించనున్నారు. కేజీ గోధుమ పిండిని రూ. 20లకే ప్రభుత్వం అందించనుంది. దీనికి అవసరమైన ఏర్పాట్లను పౌరసరఫరాల శాఖ చేపట్టింది.

రేషన్ డిపోలో సరకులు తీసుకుంటున్న లబ్ధిదారులు

జిల్లా కేంద్రంలో 24 వేల కార్డుదారులకు

అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఉన్న 24 వేల రేషన్ కార్డుదారులకు తొలుత కేజీ గోధుమ పిండి ప్యాకెటు రూ. 20కు అందించనున్నాం. ఈనెల రెండో తేదీన ప్రభుత్వం అమల్లోకి తెస్తుంది. 75 శాతం కార్డు దారలుకు సిద్ధం చేశాం. దశల వారీగా మున్సిపాలిటీలు, మండలాల్లోని అన్ని రేషన్ దుకాణాల్లో అమల్లోకి తీసుకురానున్నాం. జిల్లా కేంద్రంలోని రేషన్ దుకాణాల్లో పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం.

– కె.వి.ఎల్.ఎ.నరసింహమూర్తి, జిల్లా పౌర సరఫరాల అధికారి

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

కె.కోటపాడు, న్యూస్‌టుడే : గొండుపాలెం వరహ లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద గురువారం 10వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాతసేవ, స్వామివారి కల్యాణం, సాయంత్రం చౌడువాడ వారితో తోడపెద్ద గరిడీసేవలు, రాత్రి అన్నసమారాధనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన అప్పన్న మాలధారులు పాల్గొన్నారు. ఈ గ్రామగౌరీ సేవాసంఘం అధ్యక్షుడు మద్దాల దేముడు, సెక్రటరీ మద్దాల అప్పారావు, కోశాధికారి మద్దాల రాము, ఉపాధ్యక్షుడు మద్దాల రాజేంద్రప్రసాదు తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

గొండుపాలెంలో తోడపెద్దు గరిడీసేవలో పాల్గొన్న అప్పన్న భక్తులు

ఆలయాల్లో పూజలు

చీడికాడ, న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా చీడికాడ మండలంలోని పలు ఆలయాల్లో గురువారం భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయాలకు కొత్త సంవత్సరం శోభ సంతరించుకుంది.

పొగ మంచు... కమ్మేసింది

దేవరాపల్లి, న్యూస్‌టుడే : దేవరాపల్లి మండలాన్ని పొగ మంచు గురువారం దట్టంగా కమ్మేసింది. ఉదయం 11 గంటలు దాటినా గిరిజన ప్రాంతాన్ని తలపించేలా పరిసరాలన్నీ మారిపోయాయి. వాహనదారులు సైతం పట్టపగలు లైట్లు వేసి ప్రయాణించాల్సి వచ్చింది. ముఖ్యంగా రైవాడ, నాగయ్యపేట, దేవరాపల్లి, కాశీపురం తదితర ప్రాంతాల్లో మంచు ప్రభావం బాగా కనిపించింది. దీని ప్రభావంతో చలి కాస్త తగ్గింది.

ఉదయం ll గంటలు దాటినా తొలగని మంచు

జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభం నేడు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక వెలుగు కార్యాలయంలో జెండర్ రిసోర్స్ కేంద్రం శుక్రవారం ప్రారంభంకానుంది. ప్రతి గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పని చేస్తుందని వెలుగు ఏపీఎం రమణకుమారి చెప్పారు.

రాజముద్రతో పాసుపుస్తకాలు..

ప్రభుత్వ రాజముద్రతో కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో నిర్వహించనున్న రెవెన్యూ గ్రామసభలో సభాపతి అయ్యన్నపాత్రుడు భూయజమానులకు పుస్తకాలు అందజేయనున్నారు. నర్సీపట్నం మండలంలోని ఏడు గ్రామాల్లో 4,439 మంది, మాకవరపాలెం మండలంలోని 13 గ్రామాల్లో 5,848 మంది, గొలుగొండ మండలంలోని 18 గ్రామాల్లో 4,518 మంది, నాతవరం మండలంలోని 12 గ్రామాల్లో 1,404 మందికి పంపిణీ చేసేందుకు పాసు పుస్తకాలను సిద్ధం చేశారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ఆర్క్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు పాల్గొని కేక్ కోశారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్కారభారతి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వరరావు, టి.వి.రమణ, ఎన్.దేముడు, కొండలరావు, సత్యనారాయణ, వేచలపు రాము, బి.శ్రీనివాసరావు, ప్రసాద్‌రాజు, పుల్లేటి గణేష్, ఆదివాసి మిత్రులు, మాతోట సభ్యులు పాల్గొన్నారు.

రోలుగుంట, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల 2026నూతన సంవత్సర క్యాలెండర్‌ను శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు గురువారం ఆవిష్కరించారు. డెమోక్రటిక్ అసోసియేషన్ 69/21కి సంబంధించి తాజాగా రూపొందించిన క్యాలెండర్‌ను సభాపతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు సాయికృష్ణ, జిల్లా ప్రతినిధులు రామకృష్ణ, హారిక, చిరంజీవి, మూర్తి, చక్రి తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ యూనియన్‌కు చెందిన 2026 సంవత్సరం క్యాలెండర్, డెయిరీలను గురువారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ బాధ్యతలు పోతల నాయుడుబాబు, రావాడ త్రినాథ్, గాలి సతీష్, రాళ్లపల్లి దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ఆర్క్ ప్రసాద్, తదితరులు

అఖిలపక్ష సమావేశం నేడు

చోడవరం: చోడవరం సహకార చక్కెర కర్మాగారం(గోవాడ) భవితవ్యంపై చర్చించేందుకు శుక్రవారం ఉదయం 10 గంటలకు చోడవరంలో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. మాధవ ఫంక్షన్ హాల్లో జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీలతో శ్రామిక సంఘాలు, రైతు సంఘ ప్రతినిధులు, చెరకు రైతులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: రేవళ్ల గ్రామంలో రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయింది. దుర్వాసనతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. – నాగేశ్వరరావు, నివాసితుడు, ✓: క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తొలగించివేస్తాం. – శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి

అమర్‌ను కలిసిన వైకాపా నాయకులు

చోడవరం, న్యూస్‌టుడే: మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను చోడవరం నియోజకవర్గ వైకాపా నాయకులు గురువారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వీరంతా మిందివెళ్లి మాజీమంత్రిని కలిసారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి ఏడువాక వెంకట సత్యారావు, చోడవరం ఉపసర్పంచి పుల్లేటి వెంకటరావు, అంకుపాలెం సర్పంచి పరమేశ్వరి రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు శరగడం శిమ్మినాయుడు, ఓరుగంటి నెహ్రూబాబు, సత్య, పందిరి శ్రీను, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బైన ఈశ్వరకుమారీ, గౌరీపట్నం సర్పంచి కోన లక్ష్మీచంద్రరావు, ఉప్పల బాబు, పుట్రేవు శ్యామ్ ఉన్నారు.

అమర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లిలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏఈఈ వనుము ప్రభాకరరావు తెలిపారు. చింతపల్లిలో గురువారం నూతన విద్యుత్తు తీగలు అమర్చారు. మండల కేంద్రంలో గతంతో పోల్చుకుంటే విద్యుత్తు వినియోగం బాగా పెరిగిందని, సరఫరా చేస్తున్నప్పుడు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. చాలా వీధుల్లో లోవోల్టేజీ సమస్య ఉందని, ఈ సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. పలు వీధుల్లో పాత విద్యుత్తు తీగలు తొలగించి నూతన వైర్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విద్యుత్తు సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యపు గింజలపై సూక్ష్మరూపం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎం.కోడూరు గ్రామానికి చెందిన ఎన్.గోపాల్ సూక్ష్మ రూపాలు తయారు చేయడంలో ప్రత్యేక ప్రతిభ కనబరుస్తున్నాడు. సంవత్సరంలో వచ్చే వివిధ ముఖ్యమైన రోజులకు పెన్సిల్, బియ్యపు, సబ్బుల తదితర వస్తువులపై సూక్ష్మ రూపాలు రూపొందిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆంగ్ల సంవత్సరం సందర్భంగా బియ్యపు గింజలపై 2026 సూక్ష్మరూపాన్ని చెక్కాడు, దీన్ని తయారు చేయడానికి రెండు గంటల వ్యవధి పట్టిందని తెలిపారు.

(c) eenadu

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1: **శంబాలా** (మార్నింగ్, ఫస్ట్ షో), **ఈషా** (మ్యాట్నీ, సెకండ్ షో)

స్క్రీన్-2: **45**

నేడు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం రావాడ, పరవాడ, కన్నూరు, పెద ముషిడివాడ పంచాయతీల్లో శుక్రవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పర్యటించనున్నారని స్థానిక కూటమి నాయకులు పేర్కొన్నారు. అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామాల్లో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకుంటారని, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని అన్నారు. కూటమి నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు హాజరు కావాలని కోరారు.

పెందుర్తి

జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలు అంటేనే ఉత్సాహంగా జరుపుకొంటున్నా ఉక్కు ఉద్యోగుల్లో ఆ ఆనందం కనిపించడం లేదని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ పేర్కొన్నారు. తక్షణమే ఉద్యోగులకు పూర్తి జీతంతో పాటు పాత బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉత్పత్తితో ముడిపెట్టి జీతాలు చెల్లించడం అప్రజాస్వామికం అన్నారు. తక్షణమే ఆ ఉత్తర్వులు రద్దు చేయాలని ఇంటక్ నాయకులు ఎం.రాజశేఖర్, పి.వి. రమణమూర్తి యాజమాన్యాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: సమస్య: కృష్ణరాయపురం సమీప విద్యానగర్‌లో ప్రధాన కాలువలు శుభ్రతకు నోచుకోవడం లేదు. –**అప్పారావు** ✓: పరిష్కారం: వెంటనే శుభ్రత చర్యలు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. –**అప్పలనాయుడు, ఏఎంహెచ్‌వో**

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: అసకపల్లి ఎస్సీ కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. –**కె.ఆర్. ప్రసాద్, ఎస్సీకాలనీ, అసకపల్లి.** ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. –**కె. నర్సింగరావు, అసకపల్లి సర్పంచి**

?: సబ్బవరం కోమటి వీధిలో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద వెంటాడుతోంది. –**పి.వెంకటేశ్, సబ్బవరం.** ✓: వెంటనే పరిశీలించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. –**డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం**

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ సబ్‌స్టేషన్ కూడలిలోని హైమాస్టు దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. –**నాగేశ్వరరావు, పరవాడ** ✓: క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరిస్తాం. –**మల్లికార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో, పరవాడ.**

ప్రతిభ చాటి.. పతకాలు సాధించి..

వివిధ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పి.భోనంగి సంస్కృతి గ్లోబల్‌స్కూల్ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, క్విజ్ తదితర పోటీల్లో సత్తా చాటుతున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఇటీవల జరిగిన సౌత్‌జోన్, జిల్లా, రాష్ట్ర స్థాయి క్విజ్, క్రీడా పోటీల్లో ప్రతిభ చాటి త్వరలో హైదరాబాద్, దిల్లీలలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు విజేతల మనోగతం వారి మాటల్లోనే..

మేము పదో తరగతి చదువుతున్నాం. చదువుతో పాటు మిగతా రంగాల్లో రాణించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో క్రీడా పోటీల్లో పాల్గొంటున్నాం. నవంబరులో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన సీబీఎస్ఈ సౌత్‌జోన్ స్థాయి రీడింగ్ డెకథ్లాన్ క్విజ్ పోటీల్లో 30 పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పోటీ పడ్డాం. ప్రథమస్థానం సాధించి జ్ఞాపికతో పాటు పతకం సొంతం చేసుకుని ఈనెల 17న హైదరాబాద్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాం. జాతీయ స్థాయిలోనూ సత్తా చాటేందుకు సన్నద్ధమవుతున్నాం. **–అభినవ్ ధనావత్, ప్రతి వెంకట శ్రేయస్**

మాది జాజులవానిపాలెం. నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. తండ్రి ఆడడం చూసి ఆసక్తి పెంచుకున్నా. రెండేళ్లుగా క్రమం తప్పకుండా కోచ్ వద్ద తర్ఫీదు పొందుతున్నా. కోహ్లి అంటే చాలా ఇష్టం. మూడో తరగతి చదువుతున్నా. తండ్రి సన్యాసిరావు రైతు. తల్లి ధనలక్ష్మి గృహిణి. రోజూ ఆడడం వల్ల ఆరోగ్యంగా ఉంటున్నా. ఇటీవల విశాఖలో అండర్-10 విభాగంలో సింగపూర్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో విశాఖ జట్టు తరఫున ఆడి నాలుగు వికెట్లు తీశా. ప్రస్తుతం విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్ క్యాంప్‌లో శిక్షణ పొందుతున్నా. మున్ముందు అంతర్జాతీ స్థాయి క్రికెటర్ అవుతా. **–ఎన్. రోష్మిత్**

చదువుతో పాటు సాఫ్ట్‌బాల్ క్రీడకు ప్రాధాన్యమిచ్చి మూడేళ్లుగా సాధన చేస్తున్నా. కోచ్ వద్ద తర్ఫీదు పొందుతూ ఆటలో రాటు దేలుతున్నా. తండ్రి మణిమధు, తల్లి తనూజకుమారి రైల్వే ఉద్యోగులు. క్రీడల వల్ల ఏకాగ్రత పెరిగి చదువులోనూ రాణిస్తున్నా. ఆరో తరగతి చదువుతున్నా. ఇటీవల మాకవరపాలెంలో జిల్లా స్థాయి పోటీల్లో, కడపలో రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి బెస్టుప్లేయర్ అవార్డు సొంతం చేసుకున్నా. త్వరలో దిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యా. గతంలోనూ జిల్లా స్థాయిలో పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. **–ప్రతిక్‌కుమార్**

ప్రజల దగ్గరకు పాలన కూటమి ప్రభుత్వ లక్ష్యం

పెందుర్తి జోన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేపగుంట, న్యూస్‌టుడే: ప్రజలకు దగ్గరగా పరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన జోనల్ వ్యవస్థలో భాగంగా వేపగుంటలో పెందుర్తి జోన్ కార్యాలయాన్ని మేయర్, ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా జోనల్ కార్యాలయాలు ఉంటే ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందుతాయనే ఉద్దేశంలో ప్రభుత్వం ఈ మార్పు చేసిందన్నారు. జోనల్ కమిషనర్ హెచ్.శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు, ఏసీపీ రామలింగారెడ్డి, ఈఈ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ★ ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాల తీరుపై మేయర్ పీలా శ్రీనివాసరావు అసహనం వ్యక్తం చేశారు. జోన్ పరిధిలో ఉన్న కార్పొరేటర్ల పేర్లు లేకపోవడం తగదని, వారి పేర్లు కూడా శిలాఫలకంపై ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శిలాఫలకాలు ప్రజలందరికీ కనిపించే చోట ఏర్పాటు చేయాలని సూచించారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

గురుకులంలో కేక్ కోస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

సబ్బవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం సబ్బవరం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల మధ్య నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. ముందుగా ఆమె కేక్ కోసి విద్యార్థులకు తినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇదే రోజున పుట్టిన రోజు జరుపుకొంటున్న విద్యార్థులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులంతా బాగా చదువుకుని తల్లిదండ్రులకు, విద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన శుద్ధ జల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా ప్రజలకు ఆమె నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీవో జి.గ్రేస్, డీడీవో బి.రామానంద్, సబ్బవరం తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పి.పద్మజ, ప్రిన్సిపల్ సీహెచ్ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి మృతి

శ్రీనివాసనగర్ (వేపగుంట), న్యూస్‌టుడే: ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. శ్రీనివాసనగర్‌కు చెందిన కరోతి షణ్ముఖరావు (32) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో పిన్ని, చిన్నాన్నల వద్దే ఉంటూ గోపాలపట్నంలోని ఓ వెల్డింగ్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఇటీవల స్నేహితులు జానీ, గోపాల్‌తో కలసి బయటకు వెళ్లాడు. అక్కడ వారి మధ్య తలెత్తిన వివాదంలో జానీని షణ్ముఖరావు బలంగా కొట్టడంతో ఆసుపత్రిలో చేరాడు. కోలుకున్న తర్వాత అతడు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ విషయం తెలుసుకున్న షణ్ముఖరావు కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ బుధవారం రాత్రి ఇంటికొచ్చాడు. మళ్లీ కొద్ది సేపటికే బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో నూతన సంవత్సర వేడుకల్లో స్నేహితులతో ఉండి ఉంటాడని కుటుంబీకులు భావించారు. కాగా.. గురువారం మామిడితోటలో చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించడంతో స్థానికులు గోపాలపట్నం పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ మరణంపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరుతున్నారు.

పర్యావరణ ప్రేమికుడి ఔదార్యం

ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్న దుర్గాప్రసాద్

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం గొర్లెవానిపాలెం బీసీకాలనీకి చెందిన రేగల దుర్గాప్రసాద్ పర్యావరణంపై ఉన్న మక్కువను మరోమారు చాటుకున్నారు. ఈయన అచ్యుతాపురం మండలం నునపర్తి సచివాలయ పరిధిలో అసిస్టెంట్ లైన్‌మెన్. నూతన సంవత్సరం సందర్భంగా తన సొంత నిధులు రూ.50 వేలు వెచ్చించి కడియం నుంచి వివిధ రకాలకు చెందిన 1200 మొక్కలు తెప్పించి గురువారం విశాఖ ఆర్కే బీచ్ వద్ద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. రోజురోజుకు కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం ఈ ప్రక్రియ చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. గడచిన రెండేళ్లుగా ఆయన తన కుమారుడు విరాజ్ మొదటి, ద్వితీయ పుట్టిన రోజు వేడుకలు చేయకుండా ఆ సొమ్ముతో కడియం నుంచి వెయ్యికి పైగా మొక్కలు తెప్పించి పరిసర గ్రామాల్లో పంపిణీ చేశారు. దుర్గాప్రసాద్ తన వివాహానికి శుభలేఖలకు బదులు అప్పట్లో బంధువులకు, స్నేహితులకు, అధికారులకు మొక్కలు అందజేసి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో 'వైజాగ్ వాలంటీర్స్' పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయాల ప్రారంభం

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, అగనంపూడి, గాజువాక, న్యూస్‌టుడే : అగనంపూడిలో కొత్తగా ఏర్పాటుచేసిన జోనల్ కార్యాలయాన్ని, పునర్ వ్యవస్థీకరించిన గాజువాక జోనల్ కార్యాలయాలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరానికి దీటుగా గాజువాక ప్రాంతాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రజల సౌలభ్యం కోసం జోనల్ కార్యాలయాలను ఏర్పాటు చేశామన్నారు. జోనల్ కార్యాలయాల ప్రారంభోత్సవంలో డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, అగనంపూడి జెడ్సీ మనీషా త్రిపాఠి, జెడ్సీ శేషాద్రి, ఎస్ఈ గోవిందరావు, ఇ.ఇ. రాయల్‌బాబు, కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, ఇల్లపు వరలక్ష్మి, మొల్లి ముత్యాలనాయుడు, ఎ.జె.స్టాలిన్, భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కర్రి దశేంద్ర, గొల్లవిల్లి కనకభవాని, గవర సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవలు ప్రశంసనీయం

మొక్కలు నాటుతున్న మెడ్‌టెక్ వ్యవస్థాపక సీఈవో డాక్టర్ జితేంద్ర శర్మ

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : సమాజంలో పేదలు, వెనుకబడిన వర్గాలకు నిరంతరం సేవలు అందిస్తున్న సత్యసాయి సేవా సంస్థల నిస్వార్థ సేవా సిద్ధాంతం ప్రశంసనీయమని మెడ్‌టెక్ జోన్ మేనేజింగ్ డైరెక్టర్, వ్యవస్థాపక సీఈవో డాక్టర్ జితేంద్ర శర్మ అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మెడ్‌టెక్ జోన్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఎంటీజెడ్ వాలంటీర్లు, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు ఆర్.ఎ.నాయుడు, సోమేశ్వరి, ఎస్.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు

సత్కారం పొందిన ఉద్యోగులతో నాయకులు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం అంతకాపల్లి సచివాలయం నుంచి బదిలీపై వెళ్లిన అధికారులు సీహెచ్ రవి, మూర్తి, మహాలక్ష్మి, ఎన్.శ్రావణి, సీహెచ్ దేవకిలను గురువారం సర్పంచి నారాయణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు చొక్కాకుల గోవింద, తదితరులు సత్కరించి జ్ఞాపికలు అందించారు. జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రామకాసు తదితరులు అతిథులుగా విచ్చేసి వారి సేవలను కొనియాడారు. స్థానిక నాయకులు ముత్యాలునాయుడు, దేముడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు

వేంకటాద్రిపై పూజలందుకున్న మలయప్ప స్వామి

నవనీత అలంకరణలో శ్రీనివాసుడు

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై కొలువుదీరిన శ్రీనివాసుడు గురువారం నవనీత అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చక బృందం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా వేకువజామున తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. 27 కిలోల వెన్నతో స్వామిని అలంకరించి ధూపదీప సేవలు జరిపి తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా స్వామివారి ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామిని శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు సామూహిక పాశుర పారాయణం చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, అమెరికాలోని అట్లాంటాలో హనుమాన్ మందిర ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ చీమలపాటి మూర్తి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అర్చకులు ప్రముఖులను వేదమంత్రాలతో ఆశీర్వదించి శేషవస్త్రాలతో సత్కరించారు.

తిరుప్పావై సేవాకాలంలో పాల్గొన్న భక్తజనం

కృష్ణావతారంలో..

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: సుజాతనగర్ హరిహర క్షేత్రంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామి గురువారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఫార్మాసిటీ పునరావాస కాలనీలో..

విరాళం అందజేస్తున్న దాత గంగరాజు దంపతులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.భోనంగి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొండపై కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం నూతన సంవత్సరం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరికృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు, గోత్రనామాలతో అర్చనలు చేశారు. ఈ సందర్భంగా తిరుప్పావై 17వ పాశురాన్ని విన్నపం చేశారు. భక్తులు పెద్దఎత్తున స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పెదముషిడివాడకు చెందిన డి.గంగరాజు దంపతులు ఆలయ అభివృద్ధి కోసం రూ.10,116 మొత్తాన్ని విరాళంగా సమకూర్చారు. ఆలయ కమిటీ ఛైర్మన్ బుగిడి రామగోవిందరావు, పాల్గొన్నారు.

వేపగుంట, న్యూస్‌టుడే : నాయుడుతోట రవినగర్ శేషాద్రి శిఖరంపై గల కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ముత్యమాంబకాలనీలో బైబిల్‌మిషన్ సమృద్ధిగృహం చర్చిలో పాస్టర్ సుందరరావు ఆధ్వర్యంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అర్చకులు వేకువజామున తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నపం చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు.

గణనాథుడుకి జేజేలు

ప్రత్యేక అలంకరణలో వినాయకుడు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరి ఘాట్ రోడ్డు టోల్‌గేటు దరి సింహాచలం దేవస్థానం ఉప దేవాలయం వినాయకుడి ఆలయంలో గురువారం నూతన సంవత్సరం పురస్కరించుకుని విశేష పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో గణనాథుడిని శ్రీగంధం, పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు.

నేటి నుంచి గ్రామసభలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలోని భూయజమానులకు రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసేందుకు ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ అరుణ్ కుమార్ తెలిపారు. ఈనెల 2న ఈ.భోనంగి, గొర్లెవానిపాలెం, 3న వెన్నెలపాలెం, 5న కలపాక, పి.భోనంగి, 6న భరణికం, తానాం, 7న పెదముషిడివాడ, కన్నూరు, 8న ఈ.మర్రిపాలెంలో గ్రామసభలు ఉంటాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఈ సభలు జరుగుతాయని పేర్కొన్నారు. పరవాడ గ్రామానికి చెందిన కొత్తపట్టాదారు పాసుపుస్తకాలు ఇంకా రాలేదని, వచ్చిన వెంటనే గ్రామసభ నిర్వహించి పుస్తకాలు అందిస్తామన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలానికి చెందిన షెడ్యూల్‌ను తహసీల్దార్ బి.చిన్నికృష్ణ విడుదల చేశారు. ఈనెల 2న విప్పాక అగ్రహారం, ఆరిపాక; 3న ఎరుకునాయుడుపాలెం, గాలిభీమవరంలలో, 5న లగిశెట్టిపాలెం, రాయపుర అగ్రహారం, టెక్కలిపాలెం, 6న బంగారమ్మపాలెం, సిరసపల్లి, 7న అయ్యన్నపాలెం, ఎల్లుప్పి, బోదువలస 8న సీహెచ్ అగ్రహారం, 8న మొగలిపురం, ఇరువాడ, 9న పైడివాడ అగ్రహారంలలో ఈ కార్యక్రమం జరుగుతుందని రైతులంతా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు పుస్తకాలు అందిస్తున్న పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్, ఎస్ఐలు, సిబ్బంది

మేయర్ పీలా శ్రీనివాసరావుకు మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందిస్తున్న జీవీఎంసీ అధికారులు

పెందుర్తి, న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పెందుర్తి మండలంలో గురువారం ఘనంగా వేడుకలు జరిగాయి. సుజాతనగర్ సమీప రత్నగిరినగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత అభిమానుల నడుమ రమేశ్‌బాబు కేక్ కోసి వేడుకల్లో పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు ఆయనకు పుస్తకాలు, రాత సామగ్రి, శాలువాలు, రగ్గులు అందజేశారు. వాటిని అవసరమైన వారికి పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన ఏడాదిలో కూటమి ప్రభుత్వం మరపురాని పాలన అందించిందని కొనియాడారు. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ★ పెందుర్తిలో జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు నివాసంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు అధికారులు, కార్పొరేటర్లు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ★ పెందుర్తి మండల పరిషత్ కార్యాలయం వద్ద పరిపాలనాధికారి కొల్లి వెంకటరావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది జెడ్పీ సీఈవో నారాయణమూర్తిని కలిసి శాలువాతో సత్కరించారు.

★ పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ నేతృత్వంలో ఎస్ఐలు, సిబ్బంది స్థానిక శక్తి సదన్, లయోలా వృద్ధాశ్రమాల్లో వృద్ధులు, పునరావాసం పొందుతున్న మహిళల మధ్య ఈ వేడుకలు నిర్వహించారు. ఎస్ఐలు షేక్ జిలానీ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ దీపాంజలినగర్‌లో..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్ క్రీడామైదానంలో బుధవారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈడీ సమీర్‌శర్మ సంస్థ అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కుటుంబసభ్యులు ఆటపాటలతో సందడి చేశారు. సినీనేపథ్య గాయకుడు శ్రీకృష్ణ హుషారైన పాటలు పాడి ఉర్రూతలూగించారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి. బాణసంచా వెలుగులు కనువిందు చేశాయి. దీపికాలేడీస్ క్లబ్ అధ్యక్షురాలు నీతూశర్మ, ఎన్టీపీసీ జీఎంలు, సంస్థ అధికారులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ, తదితరులు

సినీ నేపథ్య గాయకుడు శ్రీకృష్ణ గీతాలాపన

ఎమ్మెల్యే పంచకర్లకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట జోనల్ కార్యాలయంలో జెడ్సీ శంకరరావుకు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేశారు. పెందుర్తి జోన్ కార్యాలయం ప్రారంభోత్సవానికి వచ్చిన మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబులకు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావుల కార్యాలయాలకు పలుకాలనీ సంఘాల ప్రతినిధులు, అభిమానులు వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు.

మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీకి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలో ఈ వేడుకలు సందడిగా జరిగాయి. పలుచోట్ల బాణసంచా కాల్చారు. వెన్నెలపాలెంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కేక్ కట్ చేశారు. నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పరవాడలో ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మిని ఎంపీడీవో రమేశ్‌నాయుడు, ఇతర అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ★ పరవాడ మండలం వెన్నెలపాలెం గ్రామంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని గురువారం రాత్రి అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

బండారుకు శుభాకాంక్షలు చెబుతున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

సబ్బవరం, న్యూస్‌టుడే: పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ మొగలిపురంలోని తన నివాసంలో తెదేపా కూటమి నేతలు, కార్యకర్తల మధ్య ఈ వేడుకలు నిర్వహించారు. శాప్ డైరెక్టర్ రాజు, స్థానిక నాయకులు బర్నికాన సాయినాథరావు, గండి ముత్యాలునాయుడు తదితరులు పాల్గొన్నారు. ★ సబ్బవరం మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లోనూ ఈ వేడుకలు జరిగాయి. ఎంపీపీ బోకం సూర్యకుమారికి మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు బొకేలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

'సిటూ పోరాటాలతోనే ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ'

మాట్లాడుతున్న జె.అయోధ్యరామ్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: సీఐటీయూ పోరాటాలతోనే ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ సాధ్యమవుతుందని విశాఖ ఉక్కు కర్మాగారం ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అఖిల భారత స్టీల్ కార్మికుల సమాఖ్య ఉపాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. ఏయూ ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న సిటూ 18వ అఖిల భారత మహాసభల్లో ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ అంశంపై ఆయన మాట్లాడారు. నూతన ఆర్థిక విధానాల ప్రారంభం నుంచే ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ప్రయత్నం ప్రారంభమైందన్నారు. దీనికి వ్యతిరేకంగా సీఐటీయూ చేస్తున్న పోరాటాల వల్ల ప్రభుత్వాలు ముందుకు వెళ్లలేకపోతున్నాయన్నారు. విశాఖ ఉక్కుకు ముడిసరకు, వర్కింగ్ క్యాపిటల్ కేటాయించకపోవడం వల్లే ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మూడో వంతుకు తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వం రూ.5 వేల కోట్ల పెట్టుబడి పెడితే రూ.58 వేల కోట్ల మేరకు పన్నుల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమకూర్చడంతో పాటు లక్షల మందికి ఉపాధి కల్పించడం సాధ్యమైందన్నారు. ఇటువంటి పరిశ్రమలను ప్రైవేటీకరణ చేసేందుకు చేస్తున్న అన్ని ప్రయత్నాలను సీఐటీయూ అడుగడుగునా అడ్డుకుంటుందన్నారు.

ఘనంగా భీమా కొరేగావ్ విజయోత్సవం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కుల వివక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి చిరస్మరణీయ ప్రతీకగా నిలిచిన భీమా కోరేగావ్ విజయోత్సవాన్ని(శౌర్యదిన్) గురువారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. మూవ్‌మెంట్ 21 ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా క్యాలెండర్ ఆవిష్కరించారు. డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య జి.సుధాకర్, ఆచార్య పి.ప్రేమానందం, డాక్టర్ కృష్ణ, డాక్టర్ బి.మోహన్‌బాబు, డాక్టర్ తెనాలి సాంబశివరావు, డాక్టర్ చప్పిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతల స్వీకరణ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ఏవీఎన్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా ఉన్న పి.కృష్ణకుమారిని ప్రిన్సిపల్‌గా నియమిస్తూ కరస్పాండెంట్ ఏవీ అదీప్‌భానోజీరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. అధ్యాపకులను సమన్వయం చేసుకుంటూ, విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తామని ప్రకటించారు. అనంతరం ఆమెను అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

(c) eenadu

ఉద్యాన పంటలకు మార్కెట్ కల్పిస్తాం

● రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
● 'ఈనాడు' ముఖాముఖిలో కలెక్టర్ ఆనంద్

గతేడాది సరైన ధరలు లభించక తీవ్రంగా నష్టపోయిన ఉద్యాన రైతుల్ని ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తామని జిల్లా కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. అరటి, దానిమ్మ వంటి ఉత్పత్తులను ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేసి మార్కెట్ సదుపాయా కల్పిస్తామన్నారు. విలువ జోడింపు ఉత్పత్తులను తయారుచేసేందుకు ముందుకొచ్చే ఔత్సాహికులను ప్రోత్సహిస్తామన్నారు. కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో 'ఈనాడు' నిర్వహించిన ముఖాముఖిలో పలు అంశాలను వెల్లడించారు. వాటిలో కొన్ని ఇలా..

- ఈనాడు, అనంతపురం

లక్షల టన్నుల కాగా 10 లక్షల టన్నులు మాత్రమే ఎగుమతి అవుతోంది. మిగిలిన 10 లక్షల టన్నుల్ని ఎగుమతి చేసేలా లక్ష్యం నిర్దేశించుకున్నాం.

అరటి రైతుల్ని ఆదుకునేలా..

దిగుబడి అనంతర నష్టాలను తగ్గించేలా అరటి రైతులకు ఫలసంరక్షణపై శిక్షణ ఇస్తున్నాం. ఈ ఏడాది 200 గ్రామాల్లో ఫ్రూట్ కేర్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎగుమతులను మరింత సులభతరం చేసేందుకు ఛార్జీలు తగ్గించమని రైల్వేశాఖను కోరాం. కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతాం. ప్రస్తుతం జిల్లాలో ఉద్యాన ఉత్పత్తులు 20

దస్త్రాల డిజిటలైజేషన్

రెవెన్యూ దస్త్రాలను వంద శాతం డిజిటలైజేషన్ చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. వచ్చే మూడు, నాలుగు నెలల్లో తహసీల్దార్, వీఆర్వోల వద్ద ఉన్న రికార్డులన్నింటినీ డిజిటల్ రూపంలోకి తీసుకొస్తాం. రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

4వేల ఎకరాలకుపైగా భూసేకరణ

జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఎన్‌టీపీసీ, ఏపీ జెన్‌కో, రెన్యూ సంస్థలు ముందుకొచ్చాయి. ఇప్పటికే కొన్ని కంపెనీలు పనులు మొదలుపెట్టాయి. ఈఏడాది నుంచి అసైన్డ్ భూములను పరిశ్రమల ఏర్పాటుకు ఇవ్వనున్నాం. ఇప్పటికే 4750 ఎకరాల భూమి సేకరించాం. ఈఏడాది పరిశ్రమల గ్రౌండింగ్‌కు పకడ్బందీ చర్యలు తీసుకుంటాం.

బిందుసేద్యంపై దృష్టి

జిల్లాను ఉద్యానహబ్‌గా మార్చడంలో బిందుసేద్యానిది కీలకపాత్ర. గతేడాది 21వేల హెక్టార్లను బిందుసేద్యంలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 2026-27లో 25,000 హెక్టార్లకు డ్రిప్ ఇరిగేషన్ అందిస్తాం. రైతులకు వీలైనంత త్వరగా సామగ్రి అందించేలా చర్యలు తీసుకుంటాం.

తాగునీటి పథకాలను బాగుచేస్తాం

జిల్లాకు ఎంతో కీలకమైన శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి పథకాల నిర్వహణ కొన్నేళ్లుగా ఇబ్బందికరంగా మారింది. ప్రధానంగా నిధుల సమస్య వేధిస్తోంది. శ్రీసత్యసాయి శత జయంతి వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో పథకాన్ని కొంతమేర బాగు చేశాం. ఈ ఏడాది రెండు పథకాలను గాడిలో పెట్టేలా తగిన చర్యలు తీసుకుంటాం.

845 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు

తొలి స్నాతకోత్సవానికి సెంట్రల్ యూనివర్సిటీ

సమాయత్తం: అనంత నగరానికి సమీపాన జంతులూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవానికి సిద్ధమవుతోంది. త్వరలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము చేతుల మీదుగా 845 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయి.

నేపథ్యం: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం హామీల్లో భాగంగా 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో అనంత జేఎన్‌టీయూ తాత్కాలిక భవనాల్లో 200 మంది విద్యార్థులతో వర్సిటీ ప్రారంభమైంది. జంతులూరు వద్ద 291 ఎకరాల విస్తీర్ణంలో కేంద్రం తొలివిడత రూ.350 కోట్లతో రెండు అకడమిక్ భవనాలు, పరిపాలనా భవనం, మూడు వసతిగృహాలతోపాటు ఇతర మౌలిక వసతులు కల్పించారు.

వర్సిటీలోని అకడమిక్ బ్లాక్

కోర్సులు ఇతరత్రా: 2024, ఆగస్టు నుంచి నూతనంగా నిర్మించిన భవనాల్లో 1200 మంది విద్యార్థులతో వర్సిటీ ప్రారంభించారు. ప్రస్తుతం 17 పీజీ కోర్సులు, 9 యూజీ, 5 పీహెచ్‌డీ, 16 డిప్లొమా కోర్సుల్లో 1,457 మంది విద్యార్థులు చదువుతున్నారు. గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌లు, తరగతి గదుల్లో ఆధునిక పరిజ్ఞానంతో డిజిటల్ తరగతుల నిర్వహణలో ఆదర్శంగా నిలుస్తోంది.

నిరంతర నిఘా: విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. 24 గంటలు 25 మంది సెక్యూరిటీ గార్డులతో పహారా, 500 సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంది. 491 ఎకరాల్లో ప్రహరీ నిర్మాణం, తాగునీరు, రోడ్ల నిర్మాణం చేసి వర్సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. జనవరి 26 తర్వాత రాష్ట్రపతి పర్యటన ఖరారయ్యే అవకాశం ఉందని ఉపకులపతి కోరి చెబుతున్నారు. ఇప్పటికే ఆయన గత నెలలో రాష్ట్రపతిని కలిసి స్నాతకోత్సవానికి ఆహ్వానించారు.

- న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం

స్తంభాల తీరు.. సరిదిద్దేదెవరు?

తాడిపత్రి నుంచి యల్లనూరు మార్గంలో చప్పిడి వెంగన్నపల్లె వద్ద విద్యుత్తు స్తంభాలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ఎప్పుడు కూలిపోతాయోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. శనగ పంట తొలగించే సమయంలో ప్రాణాలకే ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి స్తంభాలను సరిదిద్దాలని కోరుతున్నారు.

-ఈనాడు, అనంతపురం

తుప్పు వదల్చరు.. తర్ఫీదు ఇవ్వరు!

కణేకల్లు వెలుగు కార్యాలయంలో కుట్టు శిక్షణకు తీసుకొచ్చిన 25 యంత్రాలు నాలుగేళ్లుగా మూలన చేరి తుప్పు పడుతున్నాయి. గతంలో ఇక్కడ రెండు విడతలుగా మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చి, వదిలేశారు. ఆ తర్వాత తర్ఫీదు కొనసాగించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీనివల్ల ప్రజాధనం వృథాగా మారడంతోపాటు మహిళలు శిక్షణ పొందలేక పోతున్నారు. అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కణేకల్లు

అభివృద్ధికి జేసీ దీక్ష

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి ప్రజల శ్రేయస్సు కోసం మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒకరోజు దీక్ష చేపట్టారు. పట్టణ పోలీస్‌స్టేషన్ కూడలిలో పురపాలిక బడ్జెట్‌ను తెలియపరుస్తున్న దీక్ష బూనారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ.. అభివృద్ధి కోసం తాను ఎంతకైనా సిద్ధమన్నారు. పారిశుద్ధ్యం విషయంలో ప్రజలు సహకరించాలన్నారు. దీక్షలో కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల డీలర్ల నయా దందా..

అధిక ధరకు యూరియా విక్రయం

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో రసాయన ఎరువులకు కొరత లేదు. అదనపు ధర చెల్లించాల్సిన పనిలేదు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలు వసూలు చేస్తే ఫిర్యాదు చేయండి. తగిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తూనే ఉన్నారు. క్షేత్ర స్థాయిలో మాత్రం భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి.

రూ.266.50 : బస్తా యూరియా అమ్మాల్సిన ధర
రూ.350-400 : ప్రస్తుతం విక్రయిస్తున్నది
రూ.100-150 : ఒక్కో బస్తాపై అదనంగా వసూలు

● కొందరు డీలర్లు చెప్పిన సొమ్ము అంతా ఫోన్‌పే చేస్తేనే.. ఎమ్మార్పీకి బిల్లు రాసిస్తారు. ఇతర బయోమందులు కొంటేనే యూరియా ఇస్తామంటున్నారు. రైతుల నుంచి ఎక్కువ మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. అనంతపురంలోని తాడిపత్రి బస్టాండ్‌లో ఓ దుకాణాదారుడు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తేలింది.

● కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా యూరియా కేటాయింపులు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మార్క్‌ఫెడ్ ద్వారా రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎల్, ప్రాథమిక సహకార సంఘాలకు కాకుండా ఎక్కువగా ప్రైవేటు డీలర్లకు ఇచ్చారన్న విమర్శలు వస్తున్నాయి.

రబీకి కేటాయింపులు

సాగు లక్ష్యం : 1,07,261 హెక్టార్లు
ఇప్పటివరకు అయింది : 67,898 హెక్టార్లు
అక్టోబరు నుంచి డిసెంబరు వరకు: 27,232 టన్నులు యూరియా నెలవారీగా జిల్లాకు కేటాయింపు

విధిగా రశీదు పొందాలి

- రవి, జిల్లా వ్యవసాయాధికారి

ప్రతి డీలరు ఈ-పాస్ యంత్రంతోనే యూరియా విక్రయించాలి. బస్తా రూ. 266.50 విక్రయిస్తున్నట్లు నోటీసు బోర్డులో రాసి ఉంచాలి. బస్తాపై ముద్రించిన ధరకు కొనుగోలు చేయాలి. అందుకు డీలరు నుంచి విధిగా రశీదు తీసుకోవాలి.

ఆకారం శివుడిది.. ఆలయం వెంకన్నది!



ఒకదాని అంచున ఒకటి పెద్ద పెద్ద బండ రాళ్లు.. వాటిపై స్వర్ణ కాంతితో చిన్నపాటి గోపురం.. బండరాతి కింద ఒక మనిషి దూరేంత గవి.. అందులో విగ్రహం. చూడగానే అక్కడున్న శివలింగం అని అనుకున్న వారంతా మరింత దగ్గరికెళ్లి పరిశీలించి వేంకటేశ్వరుడి రూపాన్ని చూసి ఆశ్చర్యచకితులవుతారు. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఉరవకొండ-గుంతకల్లు ప్రధాన రహదారి అంచున పెద్ద రాతిబండ కింద ఉన్న రూపాన్ని గవి వెంకటేశ్వరునిగా పూజిస్తారు. కొన్నేళ్ల క్రితం ఓ భక్తుడు స్వామి మూలవిగ్రహానికి నాగాభరణాన్ని బహూకరించాడు. అర్చకులు వెంకన్న విగ్రహానికి నాగభరణాన్ని అలంకరించి, పూజలు మొదలుపెట్టారు. కొత్తగా విగ్రహాన్ని చూసే పర్యాటకులు, భక్తులు నాగపడగ ఆభరణాన్ని చూసి తొలుత శివలింగం అనుకుంటారు. వెంకన్న ఆలయాల్లో ఉగాది, వైకుంఠ ఏకాదశి సందర్భాల్లో ఉత్సవాలు ఉంటాయి. కానీ ఇక్కడ మహాశివరాత్రి పెద్ద జాతరను నిర్వహిస్తారు.

- ఈనాడు, అనంతపురం-న్యూస్‌టుడే, ఉరవకొండ

సుగంధ ద్రవ్యాల గుబాళింపు

కరవు నేలలో

మడకశిర, అమరాపురం, న్యూస్‌టుడే: కరవు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో రైతులు సుగంధ ద్రవ్యాల సాగు వైపు అడుగులు వేస్తున్నారు. కర్ణాటకలో వర్షపాతం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పండించే నల్ల మిరియాలు, జాజికాయ, చెక్క వంటివి ప్రయోగాత్మకంగా సాగు చేసి విజయం సాధించారు. రాష్ట్రంలోనే మారుమూలన ఉన్న ఈ ప్రాంతంలో అత్యధికంగా వక్క పంట సాగవుతోంది. దానిలో అంతర పంటల సాగుకు దక్కిన అవకాశాన్ని ఇక్కడి రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. సాధారణంగా వక్క పంటలో తీగ జాతి మొక్క తమలపాకు సాగు చేసేవారు. సదరు పంటకు తెగుళ్ల బెడద ఎక్కువ కావడంతో తీవ్రంగా నష్టపోయారు. దీంతో సుగంధ ద్రవ్యాలపై ఆసక్తి పెంచుకుని అడుగులు వేస్తున్నారు. ప్రధానంగా అమరాపురం మండల రైతులు కొత్త పంటలను ఈ ప్రాంతానికి పరిచయం చేస్తూ మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

నెలాఖరులో కోతకు సిద్ధంగా..

ప్రస్తుతం అంతర పంటలుగా నల్లమిరియాలు 50 ఎకరాలు, జాజికాయ 5 ఎకరాలు, చెక్క 2 ఎకరాల్లో సాగవుతోంది. జనవరి చివర్లో నల్లమిరియాల పంట కోత ప్రారంభమౌతుంది. ఎకరాకు క్వింటాలు వరకు దిగుబడి వస్తోంది. మార్కెట్‌లో కిలో మిరియాల ధర రూ. 600 నుంచి రూ. 800 వరకు పలుకుతోంది. ఈలెక్కన రూ. 10 వేల వరకు పెట్టుబడి పోయినా రూ. 60 వేల నుంచి రూ. 70 వేల దాకా ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. వీటితో పాటు చెక్క, జాజికాయ పంట ప్రారంభమైతే మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. పంట ఉత్పత్తులను కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నా పంటలు బాగా పండుతుండటంతో ఇతర రైతులు కొత్త పంటల సాగుకు మొగ్గుచూపుతున్నారు.

ఏపుగా పెరిగిన నల్లమిరియాల చెట్టు తీగలు

ప్రయోగాత్మక సాగు విజయవంతం

అదనపు ఆదాయం..

- మూర్కణ్ణప్ప, గౌడనకుంట, అమరాపురం మండలం



కొన్నేళ్ల నుంచి 5 ఎకరాల్లో వక్క సాగు చేస్తున్నా. తమలపాకు సాగు చేసి నష్టపోవడంతో పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రం హాసన్ జిల్లాలో రైతులు పండిస్తున్న సుగంధ ద్రవ్యాల సాగు చేయాలని నిర్ణయించుకున్నా. అక్కడికే వెళ్లి ప్రత్యక్షంగా సాగు విధానం తెలుసుకుని వక్కలో అంతర పంటగా మిరియాలు వేశాను. నీడలో పెరిగే జాతి మొక్క కావడంతో వక్క చెట్లు అనుకూలంగా ఉంటాయి. మొక్కలకు మాత్రమే డబ్బులు పెట్టాం. పెద్దగా ఖర్చులు ఉండవు. రెండేళ్ల నుంచి ఎకరాకు క్వింటాలు వరకు నల్లమిరియాలు దిగుబడి వస్తోంది.

16 మందికి ఉప తహసీల్దార్లుగా పదోన్నతి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలో ఎంతో కాలంగా నిరీక్షిస్తున్న పదోన్నతుల ప్రక్రియ మొదలైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన 16 మంది సీనియర్ సహాయకులు/ఆర్‌ఐలకు ఉప తహశీల్దార్లుగా (డీటీ) తాత్కాలిక పదోన్నతి కల్పించారు. వీరిలో చాలా మంది రీసర్వే డీటీలే (తాత్కాలికం) ఉన్నారు. గురువారం కలెక్టర్ ఆనంద్ పదోన్నతి ఉత్తర్వులను జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో కొందరు కలెక్టర్, సహాయ కలెక్టర్ సచిన్, డీఆర్‌ఓ మాలోల, ఏఓ అలెగ్జాండర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పదోన్నతి పొందిన వారిలో.. శ్రీసత్యసాయి కలెక్టరేట్ సీనియర్ సహాయకుడు (ఎస్‌ఏ) కె.మహబూబ్‌బాషా, అనంత కలెక్టరేట్ భూ సంస్కరణలో పని చేస్తున్న యు.రమాదేవి, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ భూ సేకరణలో ఉన్న కె.సుశీల, ధర్మవరం ఎంఆర్‌ఐ జి.రమాదేవిలతోపాటు..రీసర్వే డీటీలుగా పని చేస్తున్న వారిలో కుందుర్పి ఎస్.గణేశ్‌బాబు, కళ్యాణదుర్గం పీసీ కుళ్లాయప్ప, శ్రీసత్యసాయి జిల్లా కె.ఆర్.చంద్రశేఖర్, శెట్టూరు బి.షెక్షావలి, వజ్రకరూరు జె.కేశవరెడ్డి, పామిడి జి.బేబి సురేఖ, బొమ్మనహాళ్ పి.లక్ష్మీకాంత్ నాయక్, గుత్తి ఎంఎల్‌ఎస్ పాయింట్ యు.ఆదినారాయణ, గుమ్మఘట్ట ఎస్.రఘు, ఆత్మకూరు కె.నాగమణి, అనంత అర్బన్ జి.చాంద్‌బాషా, ఆత్మకూరు ఎంఎల్‌ఎస్ పాయింట్ ఎ.ఎస్.ముక్తీయార్ అహమ్మద్ ఉన్నారు. త్వరలోనే వీరికి డీటీలుగా స్థానాల కేటాయింపు జరగనుంది.

సాయి సన్నిధిలో నూతన సంవత్సర సందడి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో నూతన సంవత్సర వేడుకలు వైభవంగా నిర్వహించారు. గురువారం సాయికుల్వంత్ మందిరంలో సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ పూర్వ విద్యార్థులు వేద పఠనంతో వేడుకలను ప్రారంభించారు. సాయి పూర్వ విద్యార్థులు వేదాలు పఠిస్తూ, భక్తి గీతాలను ఆలపిస్తూ జాతీయ పతకాలతో ఊరేగింపుగా మందిరానికి చేరుకున్నారు. సత్యసాయి మహాసమాధిని వివిధ రంగుల పుష్పాలతో అలంకరించి, వేదంతో వేడుకలను ప్రారంభించారు. 'ప్రేమబంధం' పేరుతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సత్యసాయితో ఉన్న అనుబంధాన్ని నృత్యనాటిక ద్వారా కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. బ్రాస్‌బ్యాండు వాయిస్తూ బాబాను కీర్తించారు. వందలాది మంది భక్తులు సాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

సాయి పూర్వవిద్యార్థుల మార్చ్‌ఫాస్ట్

విద్యుత్తు ఛార్జింగ్ స్టేషన్లు

వచ్చేస్తున్నాయ్!

ఎస్పీడీసీఎల్ స్థలాల్లో ఏర్పాటుకు సన్నాహాలు

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్తుతో నడిచే వాహనాలను కొనుగోలు చేసేందుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో తగినన్ని ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులోలేని పరిస్థితి. వాయు కాలుష్య నియంత్రణతోపాటు తక్కువ ధరకు విద్యుత్తు యూనిట్లను అందించి.. వాహనాల వాడకాన్ని పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. ఇందులో భాగంగా పీఎం డ్రైవ్ పథకం కింద అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో ఎస్పీడీసీఎల్ సంస్థకు సంబంధించిన స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఒక స్టేషన్‌కు వ్యయం చేసే నిధుల్లో 70 శాతం మేరకు కేంద్రం రాయితీ ఇస్తుంది. వాహనాల సామర్థ్యాన్ని బట్టి ఛార్జింగ్ సమయం ఉంటుంది. స్టేషన్ ఆవరణలోనే తినుబండారాల స్టాల్స్‌తో పాటు, పిల్లల ఆటస్థలం తదితరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. వాటి ద్వారా సంస్థకు ఆదాయం వచ్చే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి.

అనంత జిల్లాలో ఎక్కడెక్కడ?

జాతీయ రహదారుల పక్కన విద్యుత్తు ఉపకేంద్రాలు ఉన్న హంపాపురం, ఇటుకలపల్లి, రాయలచెరువు, మిడుతూరు, కూడేరు... అనంత నగరంలోని బళ్లారిరోడ్డు, కళ్యాణదుర్గం, గుత్తి, ఉరవకొండ, తాడిపత్రి విద్యుత్తు కార్యాలయాల ఎదురుగా ఉన్న సంస్థ ఖాళీ స్థలాల్లో స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. ఇందుకు గాను రూ.7 కోట్లు వ్యయం చేయనున్నారు.

శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో..

పెనుకొండ, కదిరి, బత్తలపల్లి విద్యుత్తు కార్యాలయం, ధర్మవరం మార్కెట్ యార్డు, డి.చెర్లోపల్లి, ఎన్‌ఎస్‌గేట్, కనముక్కల, కొత్తచెరువు, గోరంట్ల, బుక్కపట్నం, గూణిపల్లి, రామగిరి, ఓబుళదేవరచెరువు, గాజులవారిపల్లి, ఎన్పీ కుంట, ముదిగుబ్బ, కొడికొండ, కోడూరు, కళ్లుమర్రి, మడకశిర, రాళ్లఅనంతపురం, లేపాక్షి, రొద్దం, తురకలపట్నం, పరిగి ఉపకేంద్రాల వద్ద స్టేషన్లను అందుబాటులోకి తేనున్నారు. వాటి ఏర్పాటుకు రూ.17.14 కోట్లు వెచ్చించనున్నారు.

మార్చిలోపు అందుబాటులోకి..

- శేషాద్రి శేఖర్, సంపత్‌కుమార్, ఎస్ఈలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు

ఇరు జిల్లాల్లో అనువైన ప్రాంతాలను గుర్తించి ఉన్నతాధికారులకు పంపాం. మార్చి ఆఖరులోపు గుర్తించిన ప్రాంతాల్లో విద్యుత్తు ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు వచ్చాయి.

అంకితభావంతో పనిచేద్దాం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: పాత సంవత్సర అనుభవాలు, గుణపాఠాలను నెమరు వేసుకుంటూనే.. కొత్త సంవత్సరంలో ప్రజల ప్రయోజనాలు, సంక్షేమం కోసం రెట్టింపు ఉత్సాహం, అంకితభావంతో పని చేద్దామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో 2026 నూతన సంవత్సర వేడుకలను జరిపారు. కలెక్టర్‌తోపాటు సహాయ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ మాలోల.. తదితరులు కలిసి కొత్త సంవత్సర వేడుకలను నిర్వహించారు. గతానికి భిన్నంగా పుష్పగుచ్ఛాలు, దండలు, కేకులు, స్వీట్లు..వంటి వాటికి దూరంగా ఉన్నారు. పేద విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండే పెన్సిల్, పెన్నులు, నోటు పుస్తకాలు.. వంటి విద్యా సామగ్రిని కలెక్టర్‌కు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలోనే కాకుండా.. ఇతర ప్రాంతాల నుంచి అధికారులు, అనధికారులు తరలి వచ్చి నూతన సంవత్సర శుభకాంక్షలు తెలిపారు. రెవెన్యూ, సాంఘిక సంక్షేమ వార్డెన్లు, ఉపాధ్యాయ సంఘాల కాలమానిని, దైనందినిలను ఆవిష్కరించారు. ఆ తర్వాత కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్దామన్నారు.

దిగ్విజయంగా రహదారుల భద్రతా మాసోత్సవం..

నెల రోజులపాటు జరిగే జాతీయ రహదారుల భద్రతా మాసోత్సవాన్ని దిగ్విజయంగా జరపాలని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ఈ మాసోత్సవాన్ని పురస్కరించుకుని రవాణా శాఖ సారథ్యంలో ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. వాహనదారులకు శిక్షణ, భద్రత సాంకేతికతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. ఆలోచన విధానాన్నే బట్టే జీవిత విధానం ఉంటుందన్నారు. ప్రమాద బ్లాక్‌స్పాట్లను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రూ.3.5కోట్ల బంగారు నగలు స్వాధీనం

● పురం బ్యాంకు దోపిడీ కేసులో పురోగతి
● రెండో నిందితుడి అరెస్ట్: ఎస్పీ

వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్, పోలీసు అధికారులు, చిత్రంలో స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం గ్రామీణ మండలం తూముకుంట పారిశ్రామికవాడలో ఎస్‌బీఐలో జరిగిన భారీ దోపిడీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. 2025, జులై 27న జరిగిన దోపిడీ రాష్ట్రంలో సంచలనం కలిగించింది. కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు నగలతో పాటు రెండో నిందితుడిని పట్టుకున్నారు. ఎట్టకేలకు సుమారు 50 శాతం బంగారం రికవరీ చేయగలిగారు. గురువారం జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. కేసులో రెండో నిందితుడు రాజస్థాన్‌లోని కరౌలి జిల్లా సలంపూర్‌కు చెందిన మహ్మద్ ఇష్రార్‌ఖాన్‌ను పీటీ వారెంట్‌పై కస్టడీలోకి తీసుకొని... రూ.3.5 కోట్లు విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనకు మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ప్రధాన నిందితుడు హరియాణాలోని సాన్వర్ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ పన్వార్‌ను గత ఆగస్టులో అరెస్ట్ చేసి... 2 కిలోల బంగారు ఆభరణాలు, కారు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

నెలల కొద్దీ రెక్కీ...

నిందితులు చెడువ్యసనాలకు అలవాటుపడ్డారు. దోపిడీ చేయడానికి ముందు నెలల కొద్ది అక్కడే ఉంటూ పలు దఫాలు రెక్కీ నిర్వహిస్తారు. తర్వాత పక్కా ప్రణాళికతో తమ పని కానిచ్చేస్తారని ఎస్పీ వివరించారు. 2018లో అనంతపురంలోని జేఎన్‌టీయూ ఎస్‌బీఐ దోపిడీలో అనిల్‌కుమార్ పన్వార్ నిందితుడని, అతనిపై పలు రాష్ట్రాల్లో 14 కేసులు ఉన్నాయన్నారు. తమిళనాడులోని కోయంబత్తూరులో ఐదేళ్లు జైలుశిక్ష అనుభవించి విడుదలైన తర్వాత మహ్మద్ ఇష్రార్‌ఖాన్‌తో ఇతను కలిసి హిందూపురంలో బ్యాంకు దోపిడీకి పాల్పడ్డారని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా నగలు, నిందితులను పట్టకోవడంలో కీలకంగా వ్యవహరించిన డీఎస్పీ మహేశ్, సీఐలు ఆంజినేయులు, మహ్మద్‌కరీం, జనార్దన్, ఎస్‌ఐలు మునీర్‌అహ్మద్, మునిప్రతాప్, జీఎం కరీం, శ్రీధర్, ముక్బూల్‌ను ఎస్పీ అభినందించారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

పూర్తి వివరములకు: 8008709784

(c) eenadu

'మైనారిటీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: ముస్లిం, మైనారిటీల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆలీమేవ సంఘం ముద్రించిన 2026 క్యాలెండర్‌ను ఎంపీతో పాటు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వేర్వేరుగా విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానంగా మైనారిటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటుందన్నారు. ఉర్దూ భాషను అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నప్పటికి నూర్‌బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.100 కోట్లు కేటాయించారని, ఇమామ్, మౌజంలకు గౌరవ వేతనం కూడా ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మైనారిటీల అభివృద్ధి కోసం రూ.5433 కోట్ల కేటాయించి, కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకున్నారన్నారు. హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలకు ఆర్థిక సాయం అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు. ఆలీమేవ అధ్యక్షుడు షేక్షావలి, కార్యదర్శి ఫరూక్ అహమ్మద్, నాయకులు షఫ్రీన్, జిలాన్, అన్వర్, జాకీర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు అశోక్‌కుమార్

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని మహాత్మా జ్యోతి బాపులే గురుకుల పాఠశాల విద్యార్థి అశోక్‌కుమార్ స్కూల్ గేమ్స్ అండర్-19 విభాగంలో జాతీయస్థాయి ఆర్టిస్టిక్ యోగా పోటీలకు ఎంపికయ్యాడు. కిందటి నెల 23, 24, 25 తేదీల్లో బాపట్ల జిల్లా చందలూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్టిస్టిక్ యోగా పోటీల్లో అశోక్‌కుమార్ ఉత్తమ ప్రతిభ చూపి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. జనవరి 25, 26 తేదీల్లో వెస్ట్‌బెంగాల్‌లో నిర్వహించే జాతీయస్థాయి ఆర్టిస్టిక్ యోగా పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపల్ యూసఫ్‌ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయుడు శర్మ తెలిపారు.

మూడు రోజుల్లో రూ.13.52 కోట్ల మద్యం అమ్మకాలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మూడు రోజుల్లో అనంతపురం జిల్లాలో రూ.13.52 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. 30వ తేదీ 6,900 పెట్టెల ఐఎంఎల్, 3381 పెట్టెల బీరు అమ్ముడుపోగా రూ.5.87 కోట్లు ఆదాయం సమకూరింది. అలాగే 31న 8,661 పెట్టెల ఐఎంఎల్, 3442 పెట్టెల బీర్ల వ్యాపారం కాగా రూ.6.06కోట్లు ఆదాయం వచ్చింది. అలాగే 1న రూ.1.59 కోట్ల వ్యాపారం జరిగింది.

అపుస్మా కాలమానిని ఆవిష్కరణ

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిబంధనలు ప్రైవేటు పాఠశాలలు పాటించాలని డీఈవో ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. జిల్లా ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల సంఘం (అపుస్మా) ఆధ్వర్యంలో రూపొందించిన 2026 సంవత్సరపు క్యాలండర్‌ను డీఈవో గురువారం విడుదల చేశారు. ఉప విద్యాశాఖాధికారి మల్లారెడ్డి, అపుస్మా పుల్లారెడ్డి, సుబ్బారెడ్డి, రవిశంకర్‌ప్రసాద్, నాగరాజు, సూర్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులు అస్తవ్యస్తం!

పునర్విభజన సరే.. పోస్టులేవీ?

రెడ్డిపల్లి శిక్షణ కేంద్రంలోని పాత భవనంలో శింగనమల వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్వహణ

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మార్కెట్ యార్డుల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారాయి. సిబ్బంది కొరత, పర్యవేక్షణ లోపంతో సతమతమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 17 వ్యవసాయ మార్కెట్ యార్డులున్నాయి. తొమ్మిది చోట్ల కార్యదర్శులే లేకపోవడం గమనార్హం. ఒక్కొక్కరికి రెండేసి యార్డుల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. 2021లో అప్పటి వైకాపా ప్రభుత్వం యార్డులను పునర్విభజించింది. వాటికి ఏటా ప్రతిపాదనలు పంపుతున్నారే కాని ఒక్క పోస్టు మంజూరు కాలేదు. దీంతో ఉన్న సిబ్బందినే సర్దుబాటు చేయడంతో పనిభారం పెరిగింది.

● మార్కెట్ యార్డులన్నీ ప్రభుత్వానికి ఆదాయ వనరులే. కింది స్థాయి సిబ్బందికి పాలనా పగ్గాలు ఇవ్వడంతో ఆదాయానికి గండి కొడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో కొన్నేళ్లుగా పలు యార్డులకు ఇన్‌ఛార్జి కార్యదర్శులుగా సూపర్‌వైజర్లు కొనసాగుతున్నారు.

● అనంతపురం, గుత్తి, కళ్యాణదుర్గం, రాప్తాడు, శింగనమల, తాడిపత్రి, గోరంట్ల, మడకశిర, పుట్టపర్తి, తనకల్లు యార్డులకు కార్యదర్శులు లేరు. అనంతపురం యార్డుకు ఎంపికశ్రేణి కార్యదర్శి గోవింద ఆదోని యార్డుకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. దీంతో అనంతపురం, శింగనమల యార్డులకు అనంతపురం మార్కెటింగ్‌శాఖ ఏడీ రామచంద్రకుమార్ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు.

● శ్రీసత్యసాయి జిల్లాకు ఏడీఎం పోస్టు ఖాళీగా ఉంది. హిందూపురం కార్యదర్శి నరసింహమూర్తికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

● గతేడాది నవంబరు వరకు ఉమ్మడి జిల్లాలో రూ.19.49 కోట్ల రుసుం లక్ష్యం విధించగా రూ.7.27 కోట్ల మాత్రమే వసూలైంది.

స్థలాల సమస్య

కొత్తగా వ్యవసాయ మార్కెట్ యార్డులకు భవనాలు లేవు. రాప్తాడులో 50 ఎకరాలు కేటాయించగా సదరు భూమిని రెవెన్యూ అధికారులు ఏపీఐఐసీకి ఇచ్చేశారు. శింగనమల మార్కెట్ యార్డు ప్రాంతీయ పశువైద్య శిక్షణా కేంద్రంలో కొనసాగుతుండగా, పుట్టపర్తి యార్డు పరిధిలో కొత్తచెరువు సబ్‌యార్డు ఉందని నల్లమాడలో భవనాలు నిర్మించారు. అనుకూలం లేదని ఇంతవరకు కొత్త భవనంలోకి చేరలేదు.

ప్రతిపాదనలు పంపుతున్నాం

ఉమ్మడి జిల్లాలో సిబ్బంది కొరత వాస్తవమే. పాతయార్డుల నుంచి సర్దుబాటు చేశాం. ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి నివేదికను ప్రభుత్వానికి పంపుతున్నాం.

రామచంద్రకుమార్, నరసింహమూర్తి, ఏడీఎంలు (అనంతపురం, శ్రీసత్యసాయి)

వేధిస్తున్న సిబ్బంది కొరత

అనంతపురం, హిందూపురం యార్డుల్లో సంతలు నిర్వహిస్తారు. వివిధ కేడర్లలో మొత్తం మంజూరు పోస్టులు 181 కాగా అందులో 53 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన 128 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో 24 చెక్‌పోస్టులు ఉన్నాయి. ఆయా మార్కెట్ యార్డులోని పనిచేసే సిబ్బంది అక్కడ విధులు నిర్వహిస్తున్నారు.

● గోరంట్ల, కొత్తచెరువు మండలాల్లో పశువుల సంతలు, కదిరి యార్డులో గొర్రెల సంతను ప్రతి వారం నిర్వహిస్తారు. సిబ్బంది కొరత కారణంగా వాటి నిర్వహణ కష్టంగా మారింది.

● మార్కెట్ యార్డుల పునర్విభజనలో భాగంగా రాప్తాడు, పుట్టపర్తిలో కొత్తగా మార్కెట్ యార్డులు... గోరంట్ల, శింగనమల సబ్‌యార్డులను మార్కెట్ యార్డులుగా మార్చారు. ఒక్కోదానికి కార్యదర్శితో పాటు నలుగురు సిబ్బంది ఉండాలి. నాలుచోట్ల ఒక్క పోస్టు మంజూరు చేయలేదు.

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా నేడు (శుక్రవారం) వేకువజామునే పూజలు మొదలవుతాయి. ఉదయం ఏడున్నర గంటలకు అమ్మవార్లకు అభిషేక పూజలు చేస్తారు. ఖాద్రీశునికి ఉదయం 5 నుంచి 7 గంటల వరకు, 8 గంటల నుంచి 10 గంటల వరకు రెండు పర్యాయాలు అభిషేకాలు. తర్వాత పది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

అధికారినంటూ ఖాతాలో రూ.60 వేలు స్వాహా

ఇద్దరు మహిళలను మోసం చేసిన సైబర్ నేరగాడు

యాడికి, న్యూస్‌టుడే: వెలుగు కార్యాలయం నుంచి మాట్లాడుతున్నానంటూ ఇద్దరు మహిళల ఖాతాలో నుంచి నగదు తస్కరించాడు ఓ సైబర్ నేరగాడు. యాడికిలోని ప్రధాన రహదారిలో ఉంటున్న ఓ మహిళకు వెలుగు కార్యాలయ అధికారిని అంటూ.. ఫోన్ చేశాడు. మీ లావాదేవీలు సరిగ్గా లేవని.. బ్యాంకు ఖాతా నంబరు సరి చూడాలని చెప్పుకొచ్చాడు. ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పమన్నాడు. దీన్ని నమ్మిన బాధిత మహిళ ఓటీపీ చెప్పింది. ఈక్రమంలో ఆమె ఖాతాలోని రూ.29 వేలు స్వాహా చేశాడు. తిరిగి డబ్బు జమ చేస్తానంటూ... మరో ఖాతా నంబరు చెప్పాలని కోరాడు. దీంతో బాధిత మహిళ పొదుపు సంఘంలోని మరో సభ్యురాలి వద్దకు వెళ్లింది. ఆమెను కూడా సైబర్ నేరగాడు మాయమాటలతో నమ్మించాడు. ఇద్దరు మహిళలు మరో ఖాతా నంబరు ఇవ్వగా అందులో రూ.28వేలు జమ చేశాడు. మళ్లీ వారికి ఫోన్ చేసి ఓటీపీ చెప్పమన్నాడు. వచ్చిన ఓటీపీని తెలపడంతో ఒకేసారి రూ.60 వేలు ఖాళీ చేశాడు. మోసపోయామని గుర్తించిన బాధితులు సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేశారు.

వినీత.. వినూత్న బోధన

బోధిస్తున్న వినీత

న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం: కళ్యాణదుర్గం మండలంలోని మానిరేవు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయిని వినీత వినూత్నంగా బోధన చేస్తున్నారు. ఆమె మొదటగా కంబదూరు మండలం కురాకులపల్లి ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరారు. స్థానికంగా పిల్లల సంఖ్య తక్కువగా ఉండటంతో చదువు పట్ల ఆకర్షితులయ్యేలా చేయాలని ఆటపాటలు, నోకాస్టు -లోకాస్టు పరికరాలు, ఇతర వస్తువులతో బోధన ప్రారంభించారు. దీంతో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే వారు సైతం ప్రభుత్వ పాఠశాలలో చేరడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఆత్మకూరు పడమటి యాలేరు, బెళుగుప్ప మండలం పి.గొల్లలదొడ్డి ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ ఇదే స్థాయిలో బోధన చేశారు. ఆరు నెలలుగా కళ్యాణదుర్గం మండలం మానిరేవులో ఆమె పనిచేస్తున్నారు.

● ఆంగ్లంపై భయం పోగొట్టి సంభాషించుకునేలా చేయడం, అందంగా అక్షరాలు రాయడంపై ఆసక్తి పెంచేలా కృషి చేస్తున్నారు. విద్యార్థులు ఆయా సబ్జెక్టుల అంశాల్లో పాల్గొని నేర్చుకొనేలా చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులు సైతం సులువుగా చదివేలా చేస్తున్నారు. ఇలాంటి బోధనలకు సంబంధించి వీడియోలు చేసి యూట్యూబ్‌లోనూ ఉంచారు.

పిల్లలకు ఆసక్తి పెరిగింది

ప్రతి విద్యార్థికి ఆసక్తి పెంచుకునేలా కృషి చేస్తున్నా. వినూత్న బోధనల కారణంగా పాఠశాలకు క్రమం తప్పకుండా వస్తున్నారు. ఆంగ్లమంటే భయాన్ని వీడి చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు దక్కింది. - **వినీత**

అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం: మంత్రి పయ్యావుల

ఉరవకొండ, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలో పనిచేద్దామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఉరవకొండ తెదేపా కార్యాలయంలోనూ, లత్తవరం, కౌకుంట్లలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో తనయులు విక్రమసింహ, విజయసింహతో కలిసి పాల్గొన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి కేకు కోశారు. పార్టీ నాయకులు, అధికారులు ఆయనకు పుస్తక సామగ్రి, మొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, ఏపీఐడీసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రేగటి నాగరాజు, తెదేపా మండల కన్వీనరు విజయభాస్కర్ పాల్గొన్నారు.

కూడేరులో శ్రేణులతో కలిసి కేకును కోస్తున్న కేశవ్

బాల్య వివాహరహిత జిల్లాగా మారుద్దాం

అనంతపురాన్ని బాల్య వివాహ రహిత జిల్లాగా మారుద్దామని, తల్లిదండ్రులు సహకరించాలని మంత్రి పయ్యావుల సూచించారు. 'బాల్య వివాహ ముక్త భారత్'లో భాగంగా శిశుసంక్షేమ శాఖ చేపట్టిన వంద రోజుల కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. సీడీపీవో శ్రీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, అరుణ, రబియా, పుష్ప, విజయ, పద్మ, ధనశేఖర్ పాల్గొన్నారు.

కమీషన్ ఇవ్వాలని బొగ్గుల వ్యాపారులతో గొడవ

బత్తలపల్లి, న్యూస్‌టుడే: కమీషన్ల కోసం బొగ్గుల వ్యాపారులతో గొడవకు దిగిన వారిని బత్తలపల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. మండలంలోని వేల్పుమడుగు గ్రామ సమీపంలో మహారాష్ట్రకు చెందిన కొందరు వ్యక్తులు రైతులతో మాట్లాడుకొని కంపచెట్లు కాల్చి బొగ్గుల వ్యాపారం చేసుకుంటున్నారు. బుధవారం రాత్రి బొగ్గులను లారీలోకి లోడ్ చేశారు. విషయం తెలుసుకున్న తెదేపా నాయకుడు జగ్గు తన అనుచరులతో కలిసి సదరు వ్యాపారుల వద్దకు వెళ్లి.. అక్రమంగా బొగ్గులు కాలుస్తున్నారు, మీకు పర్మిట్ ఉందా అని గొడవకు దిగారు. లారీ టైర్ల గాలి తీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని జగ్గు, నాగార్జునరెడ్డి, సాంబాతోపాటు మరి కొందరిని అదుపులోకి తీసుకున్నారు. రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

జేఎన్‌టీయూ ర్యాంకింగ్‌కు కృషి

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: ర్యాంకింగ్, గ్రేడింగ్ రావడానికి ఉద్యోగులంతా కృషి చేయాలని జేఎన్‌టీయూ వీసీ ఆచార్య సుదర్శనరావు పేర్కొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఆచార్యులు

జేఎన్‌టీయూ రూపొందించిన నూతన సంవత్సరపు క్యాలెండర్లు, టేబుల్ ప్రణాళికలను గురువారం ఆవిష్కరించారు. వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్యతో కలసి వాటిని ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ 2025 సంవత్సరంలో పలువురు ఆచార్యులకు పదోన్నతులు కల్పించామన్నారు. 2026 సంవత్సరంలో నాక్ మంచి గ్రేడ్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ సాధించడానికి అందరూ కృషి చేయాలన్నారు. వర్సిటీ అభివృద్ధికి బోధన, బోధనేతర ఉద్యోగులు సహకారం అందించాలన్నారు. ఓఎస్‌డీ దేవన్న, డీఏపీ డైరెక్టర్ ఎస్.వి.సత్యనారాయణ, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

కేకు తిని పది మందికి అస్వస్థత

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మణపల్లి రహదారిలోని నైపుణ్య శిక్షణ కేంద్రంలో గురువారం నూతన సంవత్సరం పురస్కరించుకుని కేకు కోశారు. ఆ కేకును తిని పది మంది అస్వస్థతకు గురయ్యారు. కేకును కొత్తచెరువులోని ఓ బేకరి నుంచి తీసుకొచ్చినట్లు తెలిసింది. కేకు తిన్న వెంటనే మొదట ముగ్గురికి, తర్వాత మరో ఏడుగురికి వాంతులు అయ్యాయి. వారిని వెంటనే సత్యసాయి జనరల్ ఆసుపత్రికి తరలించారు. వీరితో పాటు కేకు తిన్న 40 మందిని ఆసుపత్రికి తరలించి, వైద్యసేవలందించారు. అస్వస్థతకు గురైన పది మంది ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆర్డీవో సువర్ణ, డీఎస్పీ విజయ్‌కుమార్ ఆసుపత్రికి వెళ్లి పరిశీలించారు. చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితులపై ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ప్రదర్శిస్తున్న ఎస్పీ జగదీశ్, సంఘం ప్రతినిధులు

అనంత నేరవార్తలు: అనంతపురం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా, సిటీ, శింగనమల తాలూకా క్యాలెండర్‌ను ఎస్పీ జగదీశ్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ, కార్యదర్శి రామునాయక్‌లు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగులందరూ నూతన ఉత్సాహంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వం ప్రజల మధ్య వారధిగా ఉంటూ జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఉద్యోగుల సంఘం కార్యకలాపాలు విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. సంఘం అధ్యక్షుడు గోపీకృష్ణ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని వివరించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. సంఘం ప్రతినిధులు హనుమంతు, రవీ, వేణుగోపాల్, నాగరాజు, మౌలాసాహెబ్, సుధాకర్, ఈశ్వరయ్య, తిమ్మరాజు పాల్గొన్నారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

REAL ESTATE

FLAT FOR SALE

నూతన సంవత్సర స్పెషల్ ఆఫర్ 3 BHK, 2 BHK ఫ్లాట్స్ ఆధునిక సౌకర్యాలతో అనంతపురం నడిబొడ్డున గల మీనాక్షి అపార్ట్‌మెంట్ నందు కొన్ని ఫ్లాట్స్ మాత్రమే కలవు. సెల్: 7416560179, 9515651111.

JOBS

Required Civil Site Supervisors/Engg/Diploma with or without Experience. Location Karnataka. Contact: 9347083151

ATP ప్లైవుడ్ షాపు నందు అకౌంటెంట్‌గా Tally Input, Output మరియు GST Returns వేయడంలో అనుభవం గల జెంట్స్ మాత్రమే కావలెను. ✆ 8096006606

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU Classifieds 5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

డీసీఎంఎస్ మేనేజరు బాధ్యతల స్వీకరణ

సత్యనారాయణరెడ్డి

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ నూతన మేనేజరుగా సత్యనారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సొసైటీలో 1992లో జూనియర్ సహాయకుడిగా ఉద్యోగంలో చేరిన ఆయన సీనియర్ సహాయకుడిగా, గణాంక అధికారిగా, సహాయ మేనేజరుగా పనిచేశారు. ఇప్పటివరకు మేనేజరుగా పనిచేసిన విజయ భాస్కర్ ఉద్యోగ విరమణ చేశారు. తాడిపత్రి మండలం చుక్కలూరు గ్రామానికి ఆయన అనేక హోదాల్లో పనిచేసి మేనేజరుగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీసీఎంఎస్ అధ్యక్షుడు నెట్టెం వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎరువులు, పురుగు మందులు సరసమైన ధరలకు అందించి సొసైటీని లాభాల దిశగా నడిపిస్తానని వెల్లడించారు. పాలకవర్గం సహకారంతో సొసైటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత సహాయ మేనేజరు సుధాకర్ రెడ్డి, ఇతర సిబ్బంది ఆయనను సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

పక్కా ప్రణాళికతో పనిచేద్దాం: జేడీఏ

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లా రైతాంగానికి సకాలంలో సేవలు అందాలంటే.. మనమంతా కలిసికట్టుగా ప్రణాళికబద్ధంగా పనిచేయాలని నూతన జేడీఏ రవి సూచించారు. గురువారం జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని రైతు సేవా కేంద్రాల సిబ్బంది, మండల, డివిజన్, జిల్లాలోని వివిధ విభాగాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులంతా తరలివచ్చారు. ముందుగా జేడీఏ రవి, అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రాముడు, వెంకట్‌కుమార్ ఉద్యోగులు, సిబ్బంది కేక్ కోశారు. అనంతరం జేడీఏకు శాలువాలు, పూలు, పండ్లతో ఘనంగా సత్కరించారు. అనంతరం అందరికీ జేడీఏ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2026లో వ్యవసాయశాఖలోని అందరం ఒక జట్టులాగా పనిచేయాలన్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ ఆనంద సూచనలతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పక్కా ప్రణాళికలతో ముందుకెళ్లాలన్నారు. డీడీఏ ఓబుళపతి, వ్యవసాయాధికారుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసుప్రకాశ్, అధ్యక్షుడు వెంకట్రాముడు, ప్రధాన కార్యదర్శి వెంకట్‌కుమార్, ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు, పాల్గొన్నారు.

జేడీఏ రవిని సత్కరిస్తున్న కార్యాలయ పరిపాలనాధికారి మునీర్ అహమ్మద్, ఇతర ఉద్యోగులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

వంశీకృష్ణ

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లు, తాడిపత్రి, బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన ముగ్గురు మృతిచెందారు. నూతన సంవత్సరవేళ యువత మృత్యువాత పడడం ఆ కుటుంబాల్లో విషాదం నింపింది. విడపనకల్లులో సుబ్బలక్ష్మీ కాలనీకి చెందిన రామాంజనేయులు, రాజేశ్వరి దంపతుల కుమారుడు వంశీకృష్ణ(28) గురువారం గుత్తి మండలంలోని తురకపల్లి గ్రామానికి వెళ్లాడు. తిరిగి ద్విచక్రవాహనంపై వస్తుండగా గుంతకల్లు సమీపంలో పంప్ హౌస్ వద్ద వాహనం అదుపు తప్పి కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఏడు నెలల కిందటే వివాహం జరిగిందని, భార్య జాహ్నవి గర్భిణి అని బంధువులు వివరించారు. కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధుమిత్రులు కన్నీటి పర్యంతమయ్యారు.



జీవన

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా స్నేహితురాలితో కలిసి బెంగళూరులో గుడికి వెళ్తున్న సమయంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి కదిరికి చెందిన జీవన (20) మృతిచెందింది. బంధువుల వివరాల మేరకు. . భాస్కరాచారి, కుమారి దంపతుల రెండో కుమార్తె జీవన బీబీఏ పూర్తిచేసి బెంగళూరులో ఎంబీఏ కోసం శిక్షణ పొందుతుంది. గురువారం జరిగిన ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. వాహనం నడుపుతున్న ఆమె స్నేహితురాలు చికిత్స పొందుతుంది. జీవన మృతి విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు బెంగళూరుకు తరలివెళ్లారు.

తాడిపత్రి, న్యూస్‌టుడే: మండలంలోని చుక్కలూరు గ్రామానికి చెందిన రత్నకుమార్ (20) పని నిమిత్తం వరదాయపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న రాయికి ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని స్థానికులు 108 అంబులెన్స్‌లో స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఆతర్వాత బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గాయపడిన కార్యకర్తలను పరామర్శించిన ఎంపీ

వైద్య సిబ్బందితో వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్యంలో హింసకు స్థానంలేదని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం యల్లనూరులో వైకాపా నాయకుల దాడిలో గాయపడిన తెదేపా కార్యకర్తలను అనంతపురం ప్రభుత్వ వైద్యశాలలో పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పినా వైకాపా నాయకుల్లో మార్పు రావడం లేదన్నారు. దాడులు, దౌర్జన్యాలతో భయభ్రాంతులకు గురిచేసేందుకు యత్నిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి దాడులను ఉపేక్షించదు, తప్పక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

అప్పుల బాధతో వెల్డర్ బలవన్మరణం

షుకూర్ ఖాన్

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం మాళాపురంలో వెల్డింగ్ షాప్ నిర్వాహకుడు షుకూర్ ఖాన్(29) అప్పుల బాధతో బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన అతడి భార్య, కుటుంబ సభ్యులు వెంటనే బళ్లారిలోని ఓపీడీ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సుకూర్ ఖాన్ స్వగ్రామం పాల్తూరు కాగా.. మాళాపురానికి వలసొచ్చి వెల్డింగ్ షాప్ నిర్వహిస్తున్నాడు. కుటుంబ అవసరాల కోసం అయిన రూ.5 లక్షల అప్పులు తీరే మార్గం లేకపోవడంతో మనోవేదనతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఖాజాహుసేన్ పేర్కొన్నారు.

మిద్దెపై నుంచి పడి యువకుడి మృత్యువాత

తరుణ్‌కుమార్‌రెడ్డి

పుట్టపర్తి పట్టణం: నూతన సంవత్సర వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. మిద్దెపై సంబరాలు జరుపుకొంటున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన పుట్టపర్తి మండల పరిధిలోని చెర్లోపల్లిలో చోటుచేసుకుంది. బుధవారం రాత్రి తరుణ్‌కుమార్ (18) మిత్రులతో కలిసి ఇంటిపైన సంబరాలు జరుపుకొన్నాడు. కేకు కోసిన తర్వాత సెల్‌ఫోన్ చూసుకుంటూ పొరపాటున జారిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. తల్లిదండ్రులు అతన్ని పుట్టపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి రాజారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో యువకుల ఘర్షణ

ఒకరి పరిస్థితి విషమం, మరికొందరికి గాయాలు

చెర్లోపల్లిలో గ్రామస్థులను విచారిస్తున్న సీఐ శ్రీధర్, ఎస్ఐ ప్రదీప్‌రాజ్

రామగిరి, న్యూస్‌టుడే: డిసెంబరు 31 అర్ధరాత్రి మద్యం మత్తులో ఉన్న చెర్లోపల్లి, వెంకటాపురం గ్రామాలకు చెందిన యువకుల మధ్య ఘర్షణ తలెత్తి పలువురు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. రామగిరి సీఐ శ్రీధర్, ఎస్ఐ ప్రదీప్‌రాజ్, చెర్లోపల్లి గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. డిసెంబరు 31న అర్ధరాత్రి రామగిరి, ఎన్ఎస్ గేటు రహదారి పక్కన చెర్లోపల్లి వద్ద ఆ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు చరణ్, నరేంద్ర, బాలు చలిమంట కాచుకుంటున్నారు. అటుగా వెంకటాపురం వైపు వెళుతున్న ఆ గ్రామ వాస్తవ్యులు నాని, మంజునాథ మరో యువకుడు ఆగి చలి మంట వద్దకు వచ్చారు. ఇరు గ్రామాల యువకులు మద్యం మత్తులో ఉండటంతో మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. ఒకరినొకరు తోసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. వెంకటాపురానికి చెందిన నాని కొంతమంది యువకులతో వచ్చి చెర్లోపల్లి యువకుల ఇళ్ల వద్దకు వెళ్లి ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో ఒకరిపై నొకరు దాడి చేసుకున్నారు. ఘర్షణలో నానికి తీవ్రగాయాలు కావడంతో అనంతపురం ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఇరు గ్రామాలకు చెందిన మంజునాథ, చరణ్, నరేంద్రలకు గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

(c) eenadu

రాయదుర్గం

• రాయదుర్గం • కళ్యాణదుర్గం • ఉరవకొండ

పైపులు పగిలి నీరు వృథా

ఒంటిమిద్ది వద్ద పైపుల నుంచి ఉబికి వస్తున్న నీరు

టి.వీరాపురం ప్రధాన దారిలో వరదలా..

రాయదుర్గం గ్రామీణం, కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: కణేకల్లు హెచ్చెల్సీ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి రాయదుర్గం పట్టణానికి తాగు నీరు అందించే పైపులు పగిలిపోవడంతో పలు ప్రాంతాల్లో తాగునీరు వృథా అవుతుంది. కణేకల్లు క్రాస్, టి.వీరాపురంలో నీరు ప్రధాన దారిలో వరదగా ప్రవహిస్తోంది. అధికారులు పైపులకు మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్సార్పీ పైపులైన్ లీక్: అనంతపురం రోడ్డులోని ఒంటిమిద్ది వద్ద భైరవానితిప్ప ప్రాజెక్టు కాలువ పనులు జరుగుతున్న సమీపంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పైపులైన్ పైపులీకైంది. నీళ్లు పెద్ద ఎత్తున ఉబికి వచ్చాయి. తరచుగా ఏదో ఒకచోట లీకులు ఏర్పడుతూనే ఉన్నాయి. దీని కారణంగా వందలాది గ్రామాలకు ఒకటి, రెండు రోజులు నీటి సరఫరా జరగడం లేదు. లీకేజీ విషయాన్ని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం డీఈ శిరీష దృష్టికి తీసుకెళ్లగా వెంటనే మరమ్మతులు చేస్తామన్నారు.

నేడు పాసుపుస్తకాల పంపిణీ

రాయదుర్గం గ్రామీణం, బెళుగుప్ప, న్యూస్‌టుడే: ప్రభుత్వం మండలంలో రీసర్వే పూర్తయిన రైతుల భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు రాయదుర్గం మండల తెదేపా కన్వీనర్ హనుమంతు తెలిపారు. రీ సర్వే పూర్తయిన గుంతపల్లి కల్యాణమండపంలో శుక్రవారం ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ ఆనంద్ రైతులకు రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తారని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు!

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: ఇంటి ఎదుట నిలిపి ఉన్న లలిత్‌కు చెందిన ద్విచక్ర వాహనానికి ఆకతాయిలు నిప్పంటించిన ఘటన పట్టణంలోని శాంతినగర్‌లో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. జనవరి ఒకటిన మద్యం మత్తులో ఆకతాయిలు ఈ పనికి పాల్పడి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మహిళల ఆరోగ్యానికి సురక్ష

● నేడు, రేపు వైద్య శిబిరాలు

న్యూస్‌టుడే, రాయదుర్గం: పట్టణంలోని పేద మహిళలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు జాతీయ అర్బన్ ఆరోగ్య మిషన్ (ఎన్‌యూహెచ్‌ఎం) 'సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని స్టేడియంలో 2, 3 తేదీల్లో మెప్మా ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఇబ్బందులు పడకూడదనే...

మహిళలు పేదరికం, పని ఒత్తిడి ఇతరత్రా కారణాలతో ఆరోగ్యంపై దృష్టి పెట్టలేకపోతున్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యానికి భయపడి కనీసం ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకోవడం లేదు. స్వయం సహాయక సంఘాల మహిళలకు శారీరక, మానసిక, పోషకాహార ఆరోగ్యాన్ని కాపాడి వారి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచడానికి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. పురపాలక సంఘంలో మొత్తం సుమారు 14 వేలకు పైగా మహిళా సంఘాల వారితోపాటు పట్టణంలో ఇతరులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

చేయనున్న పరీక్షలు ఇవే

మహిళలకు రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, కొలెస్ట్రాల్, గుండెజబ్బులు, రక్తహీనత, విటమిన్, ప్రొటీన్ లోపం, రొమ్ము, గర్భాశయం, నోటి క్యాన్సర్లను ముందుగా గుర్తించటం, డిప్రెషన్, ఆందోళన, ఒత్తిడి నివారణకు కౌన్సెలింగ్ తదితరాలు ఇవ్వనున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: మండల పరిధిలోని ఒంటారెడ్డిపల్లి వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమల ఉద్ధృతి పెరిగింది. వెంటనే శుభ్రం చేయించండి. **- స్థానికుడు రాజు**

సమస్య: జెల్లిపల్లిలో అపరిశుభ్రత, తాగు నీటి సమస్య ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలి. **- గ్రామస్థుడు గంగప్ప**

సమాధానం: పై గ్రామాల్లో సమస్యలు పరిశీలించి వెంటనే పరిష్కార మార్గాలు చూపిస్తాం. **- మహేశ్, ఇన్‌ఛార్జి కార్యదర్శి, కంబదూరు.**

సమస్య: రుద్రంపల్లిలోని ఈశ్వరస్వామి ఆలయం వెనుక అపరిశుభ్రత నెలకొంది. **- గ్రామ యువకులు**

సమాధానం: వెంటనే పారిశుద్ధ్య కార్మికులతో ఆలయ పరిసరాలు శుభ్రం చేయిస్తాం. **-రామాంజినేయులు, ఇన్‌ఛార్జి, ఈఓఆర్డీ**

సమస్య: కొల్లారట్టి గ్రామంలో అర్ధాంతరంగా ఆగిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణం వెంటనే పూర్తి చేయించండి. **- ఈరన్న, గ్రామస్థుడు**

సమాధానం: ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. నిధులు రాగానే పూర్తవుతుంది. **-సుశీల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్**

సమస్య: నాగేపల్లిలో తాగునీటి సమస్య తీర్చండి. **- కెంచరాయ, గ్రామస్థుడు**

సమాధానం: ప్రత్యేక పైపులైను ఏర్పాటు చేయించి తాగునీటి ఎద్దడి నివారిస్తాం. **-రామాంజినేయులు, కార్యదర్శి**

– న్యూస్‌టుడే, కుందుర్పి

ఉపాధ్యాయ సంఘాల కాలమానిని ఆవిష్కరణ

కాలమానినిలను ఆవిష్కరిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, ఉపాధ్యాయులు

ఉరవకొండ, గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: ఉరవకొండ మండలం కౌకుంట్లలో యూటీఎఫ్, టీఎన్‌యూఎస్ ఉపాధ్యాయ సంఘాలకు చెందిన కాలమానిని, డైరీలను మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం వేర్వేరుగా ఆవిష్కరించారు. విద్యాభివృద్ధిలో సంఘాలు కీలకంగా వ్యవహరించాలని ఆయన కోరారు. టీఎన్‌యూఎస్ నాయకులు మృత్యుంజయ, దావూద్, గోపాల్, రవీంద్రనాథ్, గిరీశం, సురేశ్‌కుమార్, యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షుడు రామప్ప చౌదరి, జిల్లా కార్యదర్శులు సంజీవ, శేఖర్, నాయకులు నాగరాజు, సంజీవ, ఉమాపతి, లక్ష్మీనారాయణ, రాజశేఖర్, బండయ్య పాల్గొన్నారు. ఉరవకొండలో స్వామి వివేకనంద విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సహకరించాలని మంత్రిని లయన్స్‌క్లబ్ ప్రాంతీయ ఛైర్మన్ గణేశ్ బాబు, ఆయుర్ సంస్థ ప్రతినిధులు వెంకట్, యోగా గురువులు చంద్రశేఖర్, సునీత కోరగా... ఆయన సానుకూలంగా స్పందించారు.

నెట్టికంటయ్య దర్శనం: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని మంత్రి గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవో విజయరాజు, వేదపండితులు స్వాగతం పలికారు. మంత్రికి స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈవో పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రవాణా సౌకర్యానికి రోడ్ల విస్తరణ చేయాలని కోరారు. పనులు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుగణమ్మ, తెదేపా నాయకులు, మాజీ ఎంపీపీ ప్రతాప్‌నాయుడు, రామన్నచౌదరి, దేవేంద్ర, బళ్లారి శీనా పాల్గొన్నారు.

ఎస్‌బీఐ అధికారుల వినూత్న కార్యక్రమం

ఉరవకొండ, న్యూస్‌టుడే: సాధారణంగా అధికారుల వద్దకు వచ్చి శుభాకాంక్షలు చెప్పడం చూస్తుంటాం. ఉరవకొండ ఎస్‌బీఐ ప్రధాన శాఖ చీఫ్ మేనేజర్ సుధాకర్, క్షేత్రాధికారి రాజేంద్రబాబుతోపాటు ఇతరులు గురువారం బ్యాంకు ఖాతాదారుల వద్దకే వెళ్లి శుభాకాంక్షలు చెప్పారు. ఖాతాదారుల ప్రయోజనమే ముఖ్య లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ గృహ రుణాల కౌన్సిలర్ టెక్కే నజీర్ పాల్గొన్నారు.

మురడి అంజన్నకు పూజలు

డి.హీరేహాళ్, రాయదుర్గం, వజ్రకరూరు, కళ్యాణదుర్గం, కణేకల్లు, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రం మురడిలో వెలసిన శ్రీఅంజనేయస్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో నరసింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తలారి గంగాధర్, ఆలయ మాజీ ధర్మకర్త వెంకటరెడ్డి, ఆలయ అర్చకులు పవన్‌స్వామి వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామీణ సీఐ వెంకటరమణ, ఎస్సైలు గురుప్రసాద్‌రెడ్డి, నబిరసూల్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో సాయిబాబా ఆలయం...

సాయి ఆలయంలో.. ఆంగ్ల నూతన సంవత్సరం గురువారం రావటంతో పట్టణంలోని శ్రీ షిర్డీసాయిబాబా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పట్టణ ప్రజలతోపాటు గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు.

రాఘవేంద్రస్వామి మఠంలో...

పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి, జంబుకేశ్వర స్వామి ఆలయాల్లోనూ భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. ● వజ్రకరూరు మండలం వజ్రకరూరులోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ● దొడగట్ట రోడ్డులో నూతనంగా నిర్మించి రాఘవేంద్రస్వామి మఠంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మఠంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ● కణేకల్లు మండలం కొత్తపల్లి క్రాస్ సమీపంలోని సాయి మందిరంలో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. చిక్కణ్ణేశ్వర స్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు కొనసాగాయి.

పట్టుతప్పితే ప్రమాదమే

ఉరవకొండ పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ ప్రధాన వీధిలో గతంలో పంచాయతీ అధికారులు మురుగు కాలువను నిర్మించి దానిపై పలుచోట్ల కల్వర్టులను నిర్మించలేదు. అలాంటి ప్రదేశాల్లో బండలు వేసి, చేతులు దులుపుకున్నారు. ఇవి ఎగుడుదిగుడుగా మారడంతో వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వారు ఏ మాత్రం పట్టుతప్పినా అక్కడ ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. చాలాకాలంగా ఆయా వీధుల్లోని ప్రజలు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. బండలను తొలగించి కల్వర్టులను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ దిశగా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

కంకర తేలి.. ప్రయాణ కష్టాలు

వజ్రకరూరు మండలం చాబాల నుంచి వజ్రకరూరు వెళ్లే ప్రధాన రహదారి అక్కడక్కడ కంకర తేలడంతోపాటు పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ దారిలో వెళ్లే ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో ద్విచక్ర వాహనదారులు కంకర తేలినచోట గుంతలు తప్పించే క్రమంలో కిందపడటంతో గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై గుంతలకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వజ్రకరూరు**

నీటితొట్టె.. ఏళ్లుగా నిరుపయోగం

కుందుర్పిలోని జమ్మిచెట్టు సమీపంలో పశువులు, మూగ జీవాల తాగునీటి కోసం ఎనిమిది సంవత్సరాల కిందట నిర్మించిన పశువుల తాగునీటి తొట్టె వృథాగా మారింది. దీని నీటిపైపులు ధ్వంసం అవడంతో నేటికీ మరమ్మతులు చేసిన దాఖలాల్లేవు. ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి నిరుపయోగంగా మారింది. పైపునకు మరమ్మతులు చేయించి నీటితొట్టెను వినియోగంలోకి తీసుకొస్తామని గ్రామ కార్యదర్శి యల్లక్క తెలిపారు. **- న్యూస్‌టుడే, కుందుర్పి**

దారికి మరమ్మతులు చేయరూ

రాయదుర్గం పట్టణంలోని 11వ వార్డు జాన్ మెమోరియల్ బాపిస్టు చర్చి సమీపంలో సిమెంట్ రోడ్డు అధ్వానంగా మారింది. దీనికి మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జనావాసాల మధ్య దెబ్బతిన్న రోడ్డుపై రాత్రుళ్లు వెళ్లే పాదచారులు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా రోడ్డుకు మరమ్మతులకు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఏఈ నరసింహులు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ త్వరలో మరమ్మతులు చేస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం

శివకోటి శ్రీపీఠంలో నేడు వ్రతం

అనంత సాంస్కృతికం: నగరంలోని బెంగళూరు రోడ్డు శివకోటి శ్రీపీఠం ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు సామూహిక సత్య నారాయణ స్వామి వ్రతం జరుగుతుందని శ్రీపీఠం నిర్వాహకులు తెలిపారు. పుష్య శుద్ధపౌర్ణమి చాలా ప్రాశస్తమైనదని వారు తెలపుతూ.. పౌర్ణమి ఘడియలున్న రోజు పరిగణనలోకి తీసుకుంటారని, కావున 2న వ్రతం జరుగుతుందన్నారు. పూజలో పాల్గొనదలచిన వారు 85008 50016, 70366 46646 చరవాణిలో సంప్రదించాలని సూచించారు.

ఏడీసీసీ బ్యాంకు కాలమానిని ఆవిష్కరణ

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన కాలమానిని గురువారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. బ్యాంకు ఛైర్మన్ ఎం.కేశవరెడ్డి, సీఈఓ సురేఖరాణి చేతుల మీదుగా ఆవిష్కరించారు. డీజీఎంలు సుఖదేవబాబు, విజయచంద్రారెడ్డి, ఏజీఎంలు, సీనియర్ మేనేజర్లు, మేనేజర్లు, సొసైటీల ఛైర్మన్లు పామురాయి రఘు, చియ్యేడు లక్ష్మీనారాయణ, సీఈఓలు శ్రీనివాసులు, హనుమంతరెడ్డి, నారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలమానినితోపాటు జనపనార సంచులు కూడా ఆవిష్కరించారు.

రాయదుర్గం ఎమ్మెల్యే కాలవకు శుభాకాంక్షలు తెలుపుతున్న డీఎస్పీ రవిబాబు, సీఐ వెంకటరమణ, ఎస్సైలు

మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్పకు మొక్క అందిస్తున్న కమిషనర్ దివాకర్‌రెడ్డి, అధికారులు

రాయదుర్గం మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతరెడ్డికి...

ఊరూరా నూతన సంవత్సర శుభాకాంక్షలు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ప్రజలు నూతన సంవత్సర వేడుకలు గురువారం ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పూలమాలలు, బొకేలు, శాలువాలు వేసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేశారు. బెళుగుప్ప మండలంలోని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల స్వగ్రామం కౌకుంట్లలో పలువురు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. **- న్యూస్‌టుడే బృందం**

కళ్యాణదుర్గం మార్కెట్‌యార్డు ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవికి...

కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో రొట్టెలు పంపిణీ...

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వజ్రకరూరు, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందిన ఘటన వజ్రకరూరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వెంకటేస్‌నాయక్(55) ఏడాది కిందట ట్రాక్టర్ కొనుగోలు చేసి సొంత భూమితో పాటు కొంత కౌలుకు తీసుకొని కంది పంట వేశాడు. దిగుబడి సక్రమంగా రాకపోవడంతో మనస్తాపానికి గురై రెండు రోజుల కిందట విష గుళికలు మింగాడు. స్థానికులు అతడిని గుంతకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

జెండా పైపు ధ్వంసంపై నిరసన

కుందుర్పి, న్యూస్‌టుడే: కుందుర్పిలో ఆకతాయిలు తెదేపా జెండా కట్ట పైపును ధ్వంసం చేయడంపై స్థానిక తెదేపా నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. నాయకులు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఈ నిరసనలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, మాజీ సర్పంచి పెద్దనరసింహప్ప, సాగునీటి సంఘం అధ్యక్షుడు రాంమూర్తి పాల్గొన్నారు.

తెదేపా కార్యకర్తపై వైకాపా మూకల దాడి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం ఇప్పించకపోవడంతో వైకాపా మూకలు తెదేపా కార్యకర్తపై దాడిచేసిన ఘటన గురువారం మండలంలోని చాపిరిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు.. తెదేపా కార్యకర్త ఆంజనేయులు ఇంటి వద్ద ఉండగా వైకాపాకు చెందిన గణేష్, హర్ష అక్కడికి చేరుకుని మద్యం ఇప్పించాలని కోరగా ఆయన నిరాకరించారు. దీంతో ఆగ్రహానికి గురైన వైకాపా మూకలు ఒక్కసారిగా ఆంజనేయులుపై దాడి చేశారు. తదుపరి వారే ఆటోలో క్షతగాత్రుడిని తీసుకెళ్లి కళ్యాణదుర్గం ఆస్పత్రిలో చేర్చారు. గ్రామపెద్దలు పోలీసుస్టేషన్‌కు చేరుకుని జరిగిన సంఘటనపై చర్చిస్తున్నారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ● నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఎస్సీ కాలనీలో ఇద్దరు స్నేహితుల మధ్య మాటా మాటా పెరిగింది. ఒకరికొకరు దాడి చేసుకున్నారు. పట్టణ సీఐ హరినాథ్ సిబ్బందితో గుంపులుగా చేరిన వారిని చెదరగొట్టి గురువారం ఉదయం వరకు పోలీసు పహారా ఏర్పాటు చేయించారు.

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

బొమ్మనహాళ్ ఉప సర్పంచి మృతి

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: బొమ్మనహాళ్ ఉప సర్పంచి, సీనియర్ తెదేపా నాయకుడు పయ్యావుల హనుమంతప్ప(76) అనారోగ్యంతో గురువారం మృతిచెందడంతో పలువురు నివాళి అర్పించారు. తెదేపా నాయకులు పయ్యావుల అనిల్, మాజీ మండల ఉపాధ్యక్షులు పయ్యావుల మోహన్‌బాబు, సర్పంచి వన్నమ్మ, వార్డు సభ్యులు సంతాపం తెలియజేశారు.

కళ్యాణదుర్గం గ్రామీణం: కళ్యాణదుర్గం డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు కర్నూలులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. పలువురు గురువారం నివాళి ప్రకటించారు. యూనియన్ల నాయకులు ముత్యాలప్ప, నారాయణ, రాంప్రసాద్, రామాంజనేయులు, కదిరప్ప, సంతోష్‌కుమార్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి తీవ్ర గాయాలు

చికిత్స పొందుతున్న సమీనా

ఉరవకొండ, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు సత్యనారాయణపేటకు చెందిన సమీనా అనే పదో తరగతి విద్యార్థిని జారి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. నూతన సంవత్సరం సందర్భంగా మిత్రులంతా కలిసి కొండ ఎక్కారు. ఈ క్రమంలో జారి పడడంతో సమీనా కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి, తదుపరి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు.

ఎలుగుబంటి దాడిలో ఒకరికి...

నాగరాజు

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: మామడూరుకు చెందిన బోయ నాగరాజు మొక్కజొన్న పంటకు నీటి తడులు పెట్టేందుకు గురువారం తెల్లవారుజామున వెళ్లగా ఎలుగుబంటి దాడి చేసింది. తల, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆయనను కళ్యాణదుర్గం ఆసుపత్రికి, తదుపరి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ. 93/2025

మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, రాయదుర్గం బ్రాంచ్ ...డిస్‌పూటెంట్

వర్సెస్

వడ్డే గంగప్ప మరియు ఇతరులు ...అపోనెంట్స్

అపోనెంట్ 3కి నోటీసు

3. బి.తిప్పేస్వామి తండ్రి: బి.మల్లేశప్ప, వయస్సు: 42 సంIIలు, ఉద్యోగి: పబ్లిక్ హెల్త్ వర్కర్, రాయదుర్గం మునిసిపల్ ఆఫీస్, రాయదుర్గం, నివాసం: డోర్ నెం. 7-1-56, అంబేద్కర్‌నగర్, రాయదుర్గం, అనంతపురం జిల్లా.

డిస్‌పూటెంట్, డిస్‌పూట్ బాకీమొత్తం **రూ. 4,97,578/-**లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌పూట్‌లో 3కి అపోనెంట్ అయిన మీరు **21-01-2026** తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, O/o ది. జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌పూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By Order of the Deputy Registrar of Chits
O/of the District Registrar,
Registration and Stamps Dept.
D.No. 6-3-134, 1st Floor,
Ram Nagar, Ananthapuramu.

బ్యాలెట్ పెట్టెల నిర్వహణపై నిర్లక్ష్యం!

ఎన్నికల ప్రక్రియలో బ్యాలెట్ పెట్టెలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. వాటిని భద్రంగా దాచడానికి ఎన్నికల సంఘం అంతే చొరవ చూపుతోంది. అయితే ఉరవకొండలో మాత్రం అంతటి ప్రాముఖ్యం కలిగిన వాటిని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పాడుబడిన ఓ పైకప్పు లేని గదిలో నిల్వచేశారు. మూడేళ్ల కిందటి నుంచి వాటిని అక్కడే ఉంచడంతో ఎండకు ఎండి.. వానకు తడిచి తుప్పు పట్టి పనికిరాకుండా మారాయి. వాటి భద్రత, నిర్వహణ గురించి నిరంతర పరిశీలన చేయాల్సిన ఎన్నికల అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఈ దుస్థితి నెలకొంది. ఇవి వినియోగంలో లేకపోయినా సరైన ప్రదేశంలో భద్రపరుచాల్సినప్పటికీ పట్టించుకోలేదు. దీనిపై తహసీల్దార్ మహబూబ్‌బాషా 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ వినియోగంలోని లేని వాటిని అక్కడ ఉంచారని, పరిశీలించి భద్రపరిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

పాడుబడిన గదిలో బ్యాలెట్ పెట్టెలు

వీధిలో మురుగు... తప్పని తిప్పలు

ఉరవకొండ ఎస్ఎల్ఎన్ కాలనీ ఆంజనేయస్వామి వీధిలో మురుగు పేరుకుపోయింది. స్థానికంగా కాలువ లేకపోవడంతో ఇళ్లలోని నిరుపయోగమైన నీరు సిమెంటు దారి మీదకు చేరుతోంది. దీంతో ఈ ప్రాంతం అపరిశుభ్రంగా మారింది. ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావాలంటే ఈ మురుగులో కాలు పెట్టాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు సైడ్ కాలువలు నిర్మించి మురుగు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

డోనేకల్లులో తాగునీటి కటకట

న్యూస్‌టుడే, విడపనకల్లు: విడపనకల్లు మండలం డోనేకల్లులోని పలు వీధుల్లో సుమారు 20 రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నాళ్ల కిందట పంపింగ్ మోటారు కాలిపోవడంతో ఈ సమస్య నెలకొంది. గ్రామంలోని అంజనేయస్వామి క్యాంపు కాలనీలో నల్లానీరు రాకపోవడంతో ప్రజలంతా దూరంలోని 67వ జాతీయ రహదారి పక్కన ఉన్న చేతిపంపు వద్దకు వెళ్లి తోపుడు బండ్లు, ద్విచక్రవాహనాలు, బిందెల ద్వారా నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. రహదారిపై భారీ వాహనాలు ఎక్కువ సంఖ్యలో వెళ్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులు చేయించి డోనేకల్లులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో రాధాకృష్ణ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ వెంటనే పరిశీలించి సమస్య తీరుస్తామని పేర్కొన్నారు.

జాతీయ రహదారి పక్కన చేతిపంపు నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న ప్రజలు

అంగన్వాడీ భవన నిర్మాణం నాసిరకం

నార్పల మండలపరిధిలోని మంగపట్నంలో నిర్మిస్తున్న అంగన్వాడీ భవనం నాసిరకంగా నిర్మిస్తున్నారు. దీనికి దాదాపు రూ.13.5లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టగా ఇప్పటికే 50శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. అయితే భవనం పూర్తికాకుండానే పునాదికి పగుళ్లు ఏర్పడ్డాయి. గుత్తేదారు నాసిరకంగా నిర్మాణం చేపట్టడంతో భవిష్యత్తులో కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, నార్పల

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి నియోజకవర్గంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి హెచ్చరించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన క్రైం రివ్యూ సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే తాడిపత్రిలో జూదం, మట్కా వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్మూలనపై ఉక్కుపాదం మోపామని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో అక్రమంగా దాదాపు 300టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాటిని తరలించిన వాహనాలు జప్తు చేసినట్లు వివరించారు. 2026 నూతన సంవత్సరంలో శాంతి భద్రతలే ప్రధాన లక్ష్యంగా చేసుకుని పోలీసు సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నట్లు ఏఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: గుంతకల్లులోని పాత గుత్తిరోడ్డులో కథలగేరికి వెళ్లే దారి దగ్గర కాలువ నిండి మురుగు ప్రధాన రహదారిపై ప్రవాహిస్తోంది. నడిచి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- బాబు, స్థానికుడు**

సమస్య: కసాపురం రోడ్డు నుంచి కూరగాయల మార్కెట్‌లోకి వెళ్లే క్రాస్‌లో చెత్త పేరుకుపోయింది. **- రాజు, స్థానికుడు**

సమాధానాలు: మురుగు నీటిని తొలగించి శుభ్రం చేయిస్తాం. మార్కెట్ క్రాస్‌కి కార్మికులను పంపించి శుభ్రం చేయిస్తాం. **- వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, గుంతకల్లు పురపాలక సంఘం** – న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

పలు సమస్యలు.. ప్రజల ఇక్కట్లు

అల్లీపీరా కాలనీలో అధ్వానంగా మురుగు

పురపాలిక :	గుంతకల్లు
కాలనీలు :	అల్లీపీరా కాలనీ, ఆలూరు రోడ్డు కాలనీ
నివాస గృహాలు :	1400
జనాభా :	5000

గుంతకల్లు, న్యూస్‌టుడే: సరైన సీసీ రోడ్లు, మురుగు కాలువలు లేక అల్లీపీరా కాలనీ, ఆలూరురోడ్డు కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. సమస్యల గురించి పలు మార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదు. అల్లీపీరా కాలనీలో మైనార్టీ బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు పూర్తిగా రాళ్లతో నిండింది. దీనిపై నడిచి వెళ్లలేని పరిస్థితి. దీంతో రాకపోకలకు కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. మురుగు కాలువలు నిర్మించకపోవడంతో రోడ్డు పక్కనే ఇళ్లు ఉన్నవారు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. సీసీ రోడ్డు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. కొన్ని చోట్ల రోడ్డు నిర్మించినా మురుగు కాలువలు ఏర్పాటు చేయలేదు. కళాశాల భవనాలను నిర్మించి ఆరు సంవత్సరాలు అవుతున్నా ప్రారంభించలేదు. ఫలితంగా నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. ఓవర్‌హెడ్ ట్యాంకు ఆవరణలో జిమ్ పరికరాలను వృథాగా పడేశారు. ఇవి తుప్పుపట్టి పాడవుతున్నాయి.

● ఆలూరురోడ్డు పక్కనున్న కాలనీలో విద్యుత్తు మీటర్ల మరమ్మతుల కేంద్రం ఏడాదిన్నర నుంచి మూతపడింది. అందులో ఉన్న కంప్యూటర్లు కూడా పనిచేయడంలేదు. కొత్త కంప్యూటర్లు కొనుగోలు చేయడంలో అధికారులు జాప్యం వహిస్తున్నారు. దీంతో విద్యుత్తు వినియోగదారులు మీటర్ల మరమ్మతుల కోసం అనంతపురానికి వెళ్లివస్తున్నారు. అధికారులు కాలనీలో ఒక పార్కు కూడా ఏర్పాటు చేయలేదు. చిన్న తాగునీటి పథకం కూడా లేదు. దీంతో కాలనీవాసులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

కాలనీల్లో సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన చర్యలు చేపడతాం. రోడ్డు మరమ్మతులు చేయడానికి ప్రత్యేక ప్రణాళికలో చేర్చాం. నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తాం. వృథాగా ఉన్న జిమ్ పరికరాలను పార్కులో ఏర్పాటు చేయిస్తాం. మిగిలిన సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తాం. **- హరికృష్ణ, మున్సిపల్ ఏఈ**

పెద్దవడుగూరులోని బస్టాండ్ ఆవరణలో కేక్ కోసి సంబరాలు చేస్తున్న ఎస్సై ఆంజనేయులు, యువకులు

గుంతకల్లు: తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్‌కు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

గత ఏడాదికి స్వస్తి చెబుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు, నాయకులు, యువకులు, అధికారులు పలుచోట్ల ఆనందోత్సాహంతో సంబరాలు చేసుకున్నారు. అర్ధరాత్రి 12గంటల సమయంలో కేక్ కోసి బాణాసంచా పేల్చుతూ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ సందడి చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించడంతో వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. **-న్యూస్‌టుడే బృందం**

గుత్తిఆర్.ఎస్.లో తెదేపా కార్యకర్తల సంబరాలు

సిద్ధరాంపురంలో ఎంపీ లక్ష్మీనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న తెదేపా నాయకులు

ఆలయాల్లో భక్తుల సందడి

కసాపురం ఆలయంలో స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా గురువారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని టెంకాయలు సమర్పించి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు అన్నదానం, వసతి కల్పించారు. అలాగే గుంతకల్లు పట్టణంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పెద్దపప్పూరు: మండలంలో ప్రసిద్ధి చెందిన అశ్వర్థ ఆలయంలో నూతన సంవత్సరం పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశ్వర్థ నారాయణస్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వామి వారికి అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో చక్రభీమలింగేశ్వరస్వామి

ఇళ్లముందు మురుగుతో అవస్థలు

తాడిపత్రిలోని గన్నెవారిపల్లి కాలనీలో చివరి వీధిలో ఇళ్ల ముందు భారీగా మురుగు చేరింది. అక్కడ ఉన్న ఖాళీ స్థలంలో మురుగు నిల్వ ఉండటంతో దుర్వాసనతో పాటు దోమలు అధికంగా వస్తున్నాయి. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలుమార్లు విన్నవించిన ఫలితం లేదని స్థానికులు వివరించారు. దీనిపై 'న్యూస్‌టుడే' మున్సిపల్ ఏఈ రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సమస్యను పరిశీలించి మురుగు నిల్వ లేకుండా చూస్తామని తెలిపారు. **-న్యూస్‌టుడే, తాడిపత్రి**

మహిళలకు చీరల పంపిణీ

చీర అందజేస్తున్న రామలింగారెడ్డి, కేశవరెడ్డి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గురువారం సిద్ధరాంపురం గ్రామంలో 1000 మంది మహిళలకు చీరల పంపిణీ చేశారు. రామలింగారెడ్డి, ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌కు గ్రామస్థులు స్వాగతం పలికారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. రామలింగారెడ్డి మాట్లాడుతూ తనను ఇంతలా ఆదరిస్తున్న గ్రామస్థులకు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు లక్ష్మీనారాయణ, అశోక్, నారాయణస్వామి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని గురువారం రాత్రి శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాత్రి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమాలు అడుగడుగునా అలరించాయి. ఆర్య ఆది డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జానపద నృత్యాలు, సినిమా పాటలకు లయబద్ధంగా చేసిన బృంద నృత్యాలు మైమరిపించాయి. నూతన సంవత్సరం కావడంతో సందర్శకులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఒక్క రోజే 5వేల మందికి పైగా శిల్పారామాన్ని సందర్శించి కార్యక్రమాలను వీక్షించారు. ఈ కార్యక్రమాలను శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించి తగిన ఏర్పాట్లు చేశారు. ప్రతి శనివారం సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు చేతివృత్తుల తయారీపై ప్రదర్శనలు నిర్వహిస్తామని ఆయన వివరించారు.

నెట్టికంటయ్యను దర్శించుకున్న మంత్రి పయ్యావుల కేశవ్

పూజలు నిర్వహిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, కుటుంబసభ్యులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవో విజయరాజు, వేదపండితులు స్వాగతం పలికారు. స్వామివారికి పూజ సామగ్రిని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రికి స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి మంత్రి ఈవోతో చర్చించారు. ఈవో పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగిందని, వారి కోసం తాగునీరు, వసతి గదులు తదితర మౌలిక సదుపాయాలు అవసరమన్నారు. రవాణ సౌకర్యాల కోసం రోడ్ల విస్తరణ చేయాలని కోరారు. పనులు చేయుటకు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుగణమ్మ, తెదేపా నాయకులు, మాజీ ఎంపీపీ ప్రతాప్‌నాయుడు, రామన్నచౌదరి, దేవేంద్ర, బళ్లారి శీనా తదితరులు పాల్గొన్నారు.

తెదేపా కార్యకర్తలపై దాడిని ఖండించిన ఎమ్మెల్యే

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: యల్లనూరులో తెదేపా కార్యకర్తలపై, వైకాపా శ్రేణులు ఇళ్లలోకి చొరబడి కర్రలతో మూక దాడులకు పాల్పడటం దారుణమని ఎమ్మెల్యే బండారు శ్రావణి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆమె న్యూస్‌టుడేతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులకు తావు లేదన్నారు. యల్లనూరులో దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరామని తెలిపారు. ప్రజలు శాంతియుతంగా జీవించడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారని వివరించారు.

ఏడీసీసీ బ్యాంకు కాలమానిని ఆవిష్కరణ

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన కాలమానిని గురువారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. బ్యాంకు ఛైర్మన్ ఎం.కేశవరెడ్డి, సీఈఓ సురేఖరాణి చేతుల మీదుగా ఆవిష్కరించారు. డీజీఎంలు సుఖదేవబాబు, విజయచంద్రారెడ్డి, ఏజీఎంలు, సీనియర్ మేనేజర్లు, మేనేజర్లు, సొసైటీల ఛైర్మన్లు పాముదాయి రఘు, చియ్యేడు లక్ష్మీనారాయణ, సీఈఓలు శ్రీనివాసులు, హనుమంతరెడ్డి, నారాయణ పాల్గొన్నారు. కాలమానినితో పాటు జనపనార సంచులు ఆవిష్కరించారు.

గుంతలు.. చోదకులకు తిప్పలు

గుంతకల్లులోని కొనకొండ్ల గేటు రహదారి గుంతలు పడటంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆర్డీటీ కాలనీ నుంచి ఒక కిలో మీటరు పైగా మట్టిరోడ్డు ఉంది. ప్రమాదాలు జరుగుతున్నాయని, రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు సీసీరోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం**

ఉద్యానం.. అధ్వానం

చాగల్లు జలాశయం సమీపంలో ఉద్యానం అధ్వానంగా మారింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఐదేళ్ల నుంచి సరైన నిర్వహణ లేదు. ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట వస్తువులు, సేద తీరేందుకు ఏర్పాటు చేసిన బల్లలు ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం జలాశయం నిండింది. పర్యాటకులు పెద్దఎత్తున వస్తున్నారు. సంబంధిత అధికారులు ఉద్యానాన్ని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెద్దపప్పూరు**

తీగలు ఏర్పాటు చేయడం మరిచారు

గుత్తి నుంచి నాగసముద్రం మీదుగా వజ్రకరూరు వరకు రోడ్డుపక్కన విద్యుత్తు అధికారులు స్తంభాలు నాటి తీగలను ఏర్పాటు చేయలేదు. పాత స్తంభాలు పలు చోట్ల ఒరిగాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం స్తంభాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్తుశాఖ అధికారులు తీగలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గుత్తి**

శుభ్రతకు మోక్షం ఎన్నడో..?

శింగనమల మండలంలోని గోవిందరాయునిపేట గ్రామంలో తాగునీటి అవసరాలకు తీర్చడానికి ఏర్పాటు చేసిన ట్యాంక్ పాచి పట్టి అధ్వానంగా మారింది. కొన్ని నెలలుగా పంచాయతీ అధికారులు శుభ్రం చేయకపోవడంతో ఇలా మారింది. తాగునీరు కలుషితం అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా పంచాయతీ అధికారులు శుభ్రం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, శింగనమల**

రైల్వే నిబంధనల పుస్తకావిష్కరణ

గుంతకల్లు, న్యూస్‌టుడే: రైళ్లను నడిపే లోకోపైలట్, సహాయ లోకోపైలట్ పాటించాల్సిన నిబంధలను, సికింద్రాబాద్ జోనల్ అధికారులు ముద్రించిన వర్కింగ్ టైమ్ టేబుల్ పుస్తకాలను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్త, ఏడీఆర్ఎం సుధాకర్ గురువారం ఆవిష్కరించారు. డీఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ శాఖల అధికారులతో వారు మట్లాడారు. రైళ్ల వేగం, సమయం, ఇలా అన్ని విషయాలు పుస్తకాల్లో పొందుపరిచామన్నారు. వంతెనలు, లెవల్ క్రాసింగుల వివరాలు కూడా ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్, కోఆర్డినేషన్ శ్రీనివాస్, సీనియర్ డీసీఎం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వర్కింగ్ టైమ్‌టేబుల్ పుస్తకాలను శాఖాధికారులతో కలిసి ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్త, ఏడీఆర్ఎం సుధాకర్

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన

గుంతకల్లు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చోదకులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని గుంతకల్లు మోటారు వాహనాల తనిఖీ అధికారి వెంకటరాజాబాబు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం సందర్భంగా ఆయన గురువారం గుంతకల్లులో అవగాహనా సదస్సును నిర్వహించారు. రోడ్డు నిబంధలను పాటిస్తే ప్రమాదాలు జరగవని తెలియజేశారు. మద్యాన్ని తాగి, మత్తుపదార్థాలను తీసుకుని వాహనాలు నడపడం చాలా ప్రమాదమని వెల్లడించారు. రోడ్లపై వాహనాలను నిర్లక్ష్యంగా ఉంచడం మంచిదికాదన్నారు. లైసెన్స్ లేని వారు, చిన్న పిల్లలు వాహనాలను నడపకూడదన్నారు.

చోదకులకు అవగాహన కల్పిస్తున్న మోటారు వాహనాల తనిఖీ అధికారి వెంకటరాజాబాబు

దుకాణానికి నిప్పు పెట్టిన దుండగులు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండలపరిధిలోని జంతులూరు గ్రామంలో ఓ దుకాణానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దగ్ధం అయింది. వివరాల్లోకి వెళితే జంతులూరు గ్రామ శివారులో సెంట్రల్ యూనివర్సిటీ ఎదురుగా నాగేశ్వరమ్మ అనే మహిళ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తోంది. గురువారం నూతన సంవత్సర వేడుకలు కావడంతో దుకాణానికి తాళాలు వేసి ఇంటికి వెళ్లింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో దుండగులు దుకాణానికి నిప్పు పెట్టి పారిపోయారు. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే దుకాణం మొత్తం కాలిపోయింది. దీంతో రూ.50 వేలు నష్టం వాటిల్లిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపింది.

కాలిపోయిన దుకాణం వద్ద బాధితులు

వాహనం బోల్తాపడి ఒకరికి గాయాలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పెద్దవడుగూరు సమీపంలోని లక్షుంపల్లి రోడ్డులో ద్విచక్రవాహనం బోల్తాపడి గుర్తుతెలియని వ్యక్తి గాయపడినట్లు 108వాహన సిబ్బంది తెలిపారు. గాయపడిన వ్యక్తి లక్షుంపల్లి సమీపంలో హైపవర్ విద్యుత్తు మరమ్మతుల్లో భాగంగా పనులు చేస్తున్నారు. దీంతో బుధవారం అర్ధరాత్రి పెద్దవడుగూరు నుంచి లక్షుంపల్లి వైపు వెళ్తుండగా వాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. గురువారం ఉదయం చికిత్స కోసం 108వాహనంలో పెద్దవడుగూరు ఆసుపత్రికి తరలించారు.

ఉత్తమ సేవకురాలికి సత్కారం

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పెద్దవడుగూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటెన్జంటీ వర్కర్‌గా పనిచేస్తున్న ప్రమీల పదవీవిరమణ సందర్భంగా గురువారం ఆసుపత్రి సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆసుపత్రి వైద్యురాలు పుష్పలత, సునీత, సీహెచ్‌వో వెంకటలక్ష్మీదేవి తదితరులు పాల్గొని వర్కర్‌గా ప్రమీల రోగులకు అందించిన సేవలపై కొనియాడారు.

రైల్వే గేటును ఢీకొన్న ఆటో.. ప్రయాణికులకు అవస్థలు

గుంతకల్లు, న్యూస్‌టుడే: రైల్వేగేటును ఆటో ఢీకొనడంతో గేటు పనిచేయక జాతీయ రహదారిలో దాదాపు మూడు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ఘటన గురువారం ఉదయం గుంతకల్లు - కల్లూరు రైలు మార్గంలో పట్టణ శివారులోని బళ్లారి లిఫ్టింగ్ రైల్వేగేటులో చోటుచేసుకుంది. రైలు వచ్చే ముందు గేట్‌మెన్ రెక్కల గేటును మూసే సమయంలో ఆటో డ్రైవరు గేటు దాటుకుని వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆటో గేటు రెక్కను ఢీకొనడంతో దెబ్బతినింది. గేటును తెరవడానికి, మూయడానికి అవకాశం లేకపోవడంతో గేటును మూసే ఉంచారు. దీంతో జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహన చోదకులు పట్టణంలో వెళ్లే అన్ని రోడ్లను వినియోగించుకోగా భారీ వాహనాలను మాత్రం రోడ్డులో నిలిపివేశారు. తరువాత సిబ్బంది మరమ్మతులు చేశారు.

దెబ్బతిన్న లిఫ్టింగ్ గేటుకు రెక్కను పరిశీలిస్తున్న సిబ్బంది

బ్యాలెట్ పెట్టెల నిర్వహణపై నిర్లక్ష్యం!

ఎన్నికల ప్రక్రియలో బ్యాలెట్ పెట్టెలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. వాటిని భద్రంగా దాచడానికి ఎన్నికల సంఘం అంతే చొరవ చూపుతోంది. అయితే ఉరవకొండలో మాత్రం అంతటి ప్రాముఖ్యం కలిగిన వాటిని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పాడుబడిన ఓ పైకప్పు లేని గదిలో నిల్వచేశారు. మూడేళ్ల కిందటి నుంచి వాటిని అక్కడే ఉంచడంతో ఎండకు ఎండి.. వానకు తడిచి తుప్పు పట్టి పనికిరాకుండా మారాయి. వాటి భద్రత, నిర్వహణ గురించి నిరంతర పరిశీలన చేయాల్సిన ఎన్నికల అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఈ దుస్థితి నెలకొంది. ఇవి వినియోగంలో లేకపోయినా సరైన ప్రదేశంలో భద్రపరుచాల్సినప్పటికీ పట్టించుకోలేదు. దీనిపై తహసీల్దార్ మహబూబ్‌బాషా 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ వినియోగంలోని లేని వాటిని అక్కడ ఉంచారని, పరిశీలించి భద్రపరిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**



పాడుబడిన గదిలో బ్యాలెట్ పెట్టెలు

నిరుపయోగంగా వసతిగృహం

శింగనమల మండలకేంద్రంలో ఉన్న బాలికల పాత వసతి గృహానికి సంబంధించిన భవనం నిరుపయోగంగా ఉండి, చుట్టూ ముళ్లపొదలు అలుముకున్నాయి. అలాగే శిథిలావస్థకు చేరుకుంది. 16ఏళ్ల కిందట రూ.30లక్షల భవనాన్ని నిర్మించారు. అయితే బాలికలు తక్కువగా ఉండటంతో ఆ వసతులని అనంతపురానికి మార్చారు. అప్పటి నుంచి నిరుపయోగంగా మారి పశువులు, పందులకు ఆవాసంగా మారింది. దీంతో భవనానికి మరమ్మతులు చేసి ప్రభుత్వ కార్యకలాపాలకు ఉపయోగించుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, శింగనమల**

ఆరేళ్లుగా ఇలానే!

గుత్తి పట్టణంలో మెగా వాటర్‌ప్లాంటు కింద నిర్మించబోతున్న మూడు ఉపరితల ట్యాంకులు నిలిచిపోయాయి. సుమారు రూ. 175 కోట్లతో నిర్మించాల్సిన వాటర్ ప్లాంటు దాదాపు ఆరేళ్లుగా పనులు ఆగిపోయాయి. అలాగే నిర్మాణ ముడిసరకు చోరీకి గురయ్యాయి. ఆదర్శ పాఠశాల పక్కన గుట్టపైన, ఆర్ఎస్ గుట్టపైన ఉన్న మూడు ట్యాంకుల నిర్మాణాలు నిలిచిపోయాయి. వీటిని పూర్తి చేసి తాగునీటి సమస్యకు అడ్డుకట్ట వేయాలని, కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గుత్తి గ్రామీణం**

In the Court of the Junior Civil Judge, Tadipatri
E.P. No: 45/2024 in OS No: 452/2022

Between:-
Kaveti Venu Gopal - **D.Hr**
vs
Arigela Jaya Ram - **J.Dr**

వేలం ప్రకటన

పై నంబర్ E.P. లో వాది బాకీ రాబట్టుకొను నిమిత్తం ప్రతివాది స్వాధీనానుభవము మరియు హక్కుగల షెడ్యూలు దాఖలా స్థిరాస్థులను పై కోర్టు వారిచే తేది 06-01-2026 ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రము 5.00 గం॥ లోపు వేలం వేయబడును. సదరు ఆస్తులను కొనదలచిన సవాలుదార్లు వేలంలో పాల్గొనవచ్చు.

Schedule

The Landed Property Situated Within the R.D. of Anantapuramu and S.R.D. of Tadipatri Municipal area, Nandalapadu Village fields.

S.No.	Sy.No.	Extent
1	135-B	0.03 Cents.

Boundaries:-
East :- 12 feet road in the same Sy.No. ingress and egress.
West:- land of Gurramma.
North:- Land of Y.Rasool in the same Sy.No.
South:- Land of K.Pulla Reddy in the same Sy.No.
D.Hr Value:- Rs-10,00,000/- **Amin Value** :- Rs-12,00,000/-
(By order of the court)

దగ్గు శివయ్య, B.Com, L.L.B.,
గూడూరు శ్రీధర్ కుమార్, M.A., L.L.B.,
చెన్నా రంగగోపాల్, B.Com, L.L.B.,
D.Hr తరపున న్యాయవాదులు, తాడిపత్రి

(c) eenadu

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

2026లో నగరం మరింత అభివృద్ధి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: కొత్త సంవత్సరంలో అనంతపురం నగరం మరిన్ని మంచి కార్యక్రమాలతో ముందుకు తీసుకెళ్తామని మేయర్ వసీం, నగరపాలక సంస్థ కమిషనరు బాలస్వామిలు పేర్కొన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మేయర్, కమిషనరు కార్యాలయాల్లో సందడి నెలకొంది. మేయర్‌కు కమిషనరు పూలమొక్క ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయా సెక్షన్ల అధికారులు ఘనంగా సత్కరించారు. ఉద్యోగులు అంకిత భావంతో పని చేసి నగరంలోని ప్రజలకు మరింత సేవలు చేయాలని కోరారు. ఎస్ఈ రాజశేఖర్, డిప్యూటీ కమిషనరు అంజయ్య, ఈఈలు షాకీర్ హుస్సేన్, చంద్రశేఖర్, ఆర్ఓలు లక్ష్మీదేవి, దేవశంకర్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో శ్రీనగర్‌కాలనీకి మహర్దశ

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రాకతో శ్రీనగర్ కాలనీకి మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో కోటి రూపాయలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. నూతన సంవత్సరం రోజే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో సంవత్సరం అంతా మరింత ఉత్సాహంతో అభివృద్ధి పనులు చేయడానికి అవకాశం ఏర్పడుతుందనడానికి సంకేతం అన్నారు. ఈ ప్రాంతాన్ని వైకాపా హయాంలో పట్టించుకోకుండా వదిలేశారన్నారు. ఇప్పటికే 80 అడుగుల రోడ్డుతో పాటు మరికొన్ని పనులను రూ.4 కోట్లుతో పూర్తి చేశామన్నారు. కమిషనరు బాలస్వామి, ఈఈలు షాకీర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: గౌరి: అఖండ-2, గాయత్రి: ఈషా, సైకో సిద్ధార్థ, మార్క్, గౌతమి: పతంగ్, నీలిమ, తేజస్విని: అవతార్ ఫైర్ అండ్ యాష్, త్రివేణి: 45, శంబాల, తరంగిణి: వవేరి, మదం, ఎస్వీ సినిమా: ధురంధర్, శాంతి: ఛాంపియన్, సుధ: దండోరా.

కాయగూరల ధరలు

అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: (అనంతపురం పాతూరు మార్కెట్లో ధరలు కిలో రూ.లలో) టమాటాలు 40, రెండోరకం 25, ఉల్లిగడ్డలు 35, రెండోరకం 25, బంగాళాదుంపలు 35, మిరపకాయలు 40, బెండకాయలు 25, వంకాయలు 10, ముల్లంగి 20, బీట్‌రూట్ 40, బీరకాయలు 40, కాకరకాయలు 35, చౌళేకాయలు 30, క్యాప్సికమ్ 35, చిక్కుడుకాయలు 35, క్యారెట్ 40, బీన్స్ 40, క్యాబేజీ 40, మునగకాయలు 60, నిమ్మకాయలు (వంద)250, అల్లం 75.

ప్రమాదం.. అనేక రూపాల్లో!

అనంతపురం (అశోక్‌నగర్) న్యూస్‌టుడే: ప్రమాదం ఏ రూపంలో అయినా జరగొచ్చు. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రమాదాలు పొంచి ఉన్నా నగరపాలక యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఏమాత్రం అప్రమత్తంగా లేకుండా వెళితే ఏదో ఒక రూపంలో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికార యంత్రాంగం చిన్న సమస్య అని పట్టించుకోకుండా ఉండటంతో ప్రాణం మీదకు వచ్చే అవకాశం ఉంది.

రద్దీ రోడ్డుపై విరిగిన విభాగిని

నగరంలోని సుభాష్‌రోడ్డు రద్దీగా ఉంటుంది. గడియార స్తంభం సమీపంలోని పెద్ద షాపింగ్ మాల్స్ వద్ద ఇనుప విభాగిని విరిగిపోయింది. కొందరు అదే ప్రాంతంలోనే రోడ్డు దాటుతున్నారు. వాహనాల్లో వెళ్లే వారికి ఇనుప చువ్వలు గుచ్చుకొనే ప్రమాదం ఉన్నా వాటిని సరి చేయకుండా అలాగే వదిలేశారు. కలెక్టరేట్ దాటిన అనంతరం పలు ప్రాంతాల్లో విభాగినులు ఊడిపోయి రోడ్డుకు అడ్డంగా ఉన్నాయి. వాటిని సరి చేయకుండా వదిలేశారు.

స్తంభం చూడకుంటే ప్రమాదం

యువజన కాలనీలో రోడ్డు నిర్మించే సమయంలో స్తంభాన్ని రోడ్డు చివరకు మార్చకుండా అలాగే వదిలేశారు. యువజన కాలనీ నుంచి చివరకు, మలుపు తిరిగే ప్రాంతంలో రోడ్డుకు మధ్యలో స్తంభం ఉంది. రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సైకిళ్ల మీద వెళ్లే పిల్లలు పలువురు కింద పడ్డారు. ద్విచక్రవాహనాల్లో వెళ్లే వారు త్రుటిలో ప్రమాదం తప్పింది. కార్లు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంది. రోడ్డు చివరకు మార్చే అవకాశం ఉన్నా పట్టించుకోకుండా అలాగే వదిలేయడంతో నెలలు గడుస్తున్నా సమస్య మాత్రం తీరడం లేదు.

రోడ్డుకు సమాంతరంగా వ్యర్థాలు!

మురుగు కాలువ, రోడ్డు రెండు సమానం కావడంతో కాలువ ఆనవాళ్లు కన్పించడం లేదు. సోమనాథ నగర్ నడిమివంక దాటిన అనంతరం సోమనాథ నగర్, యువజన కాలనీ, తిరుమల నగర్ నుంచి వచ్చే మురుగు నీరంతా మరో మురుగు కాలువ ద్వారా వెళ్తాయి. తపోవనం కూడలికి సమీపాన రోడ్డుకు సమాంతరంగా వ్యర్థాలతో నిండిపోయింది. నిత్యం రద్దీగా ఉండే దారి కావడంతో రోడ్డు ఉందని ఏమాత్రం అజాగ్రత్తగా వచ్చినా మురుగు కాలువలో పడే ప్రమాదం పొంచి ఉంది. కల్వర్టు వద్ద అడ్డుగా ఉన్న వ్యర్థాలను తొలగిస్తే కనీసం కాలువ ఉన్నట్లు వాహనదారులకు తెలిసే అవకాశం ఉంది.

శిల్పారామంలో సాంస్కృతిక సందడి

నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని గురువారం రాత్రి శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాత్రి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమాలు అడుగడుగునా అలరించాయి. ఆర్య ఆది డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జానపద నృత్యాలు, సినిమా పాటలకు లయబద్ధంగా చేసిన బృంద నృత్యాలు మైమరిపించాయి. నూతన సంవత్సరం కావడంతో సందర్శకులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఒక్క రోజే 5వేల మందికి పైగా శిల్పారామాన్ని సందర్శించి కార్యక్రమాలను వీక్షించారు. ఈ కార్యక్రమాలను శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించి తగిన ఏర్పాట్లు చేశారు. ప్రతి శనివారం సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు చేతివృత్తుల తయారీపై ప్రదర్శనలు నిర్వహిస్తామని ఆయన వివరించారు. **- న్యూస్‌టుడే, తపోవనం (అనంత గ్రామీణం)**

అలంకరణలో హరి హరేశ్వరుడు

ప్రత్యేక పూజలందుకున్న కోర్టు రోడ్డు ఆంజనేయుడు

హౌసింగ్ బోర్డు శ్రీనివాసుడు

వెండి కవచధారుడైన సుబ్రహ్మణ్యేశ్వరుడు

విశేష పూజలతో కొత్త ఏడాది శుభారంభం

అలంకరణలో ఆర్ఎఫ్ రోడ్డు వేంకటేశ్వరుడు

అనంత సాంస్కృతికం: నూతన సంవత్సరం ప్రారంభ సందర్భంగా గురువారం నగరంలో ఆలయాలు కిటకిటలాడాయి. తెల్లవారుజాము నాలుగు గంటలకు పట్టణంలోని ప్రతి దేవాలయంలో అభిషేక పూజలు జరిగాయి. ధనుర్మాసం పూజలు జరుగుతుండటం, నూతన సంవత్సరాది శుభారంభం కావడంతో ప్రతి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. అన్ని ఆలయాల్లో స్వామి వార్లకు అభిషేకాలు, అర్చనలు, విష్ణు సహస్ర నామం, లక్ష్మీ స్తోత్రం పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు నూతన సంవత్సరాది శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

రామచంద్ర నగర్ కార్మెల్ మాత చర్చి అలంకరణ

ఎస్ఐయూ చర్చిలో

చర్చిలు కిటకిట..

సప్తగిరి కూడలి చర్చిలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ సంపత్ విజయకుమార్

అనంత సాంస్కృతికం: నగరంలోని పలు చర్చిల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో క్రైస్తవులు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. బుధవారం అర్ధరాత్రితోపాటు, గురువారం ఉదయం కూడా ప్రతి చర్చిలో కేక్ కట్ చేసి కొత్త ఏడాదికి నాంది పలికారు. ప్రతి చోట ఆశీర్వచనం, హామీ కార్డులను పంపిణీ చేశారు. అన్ని చర్చిల్లో పాస్టర్లు సందేశం ఇచ్చి ప్రార్థనలు చేయించారు. అనంతరం పలువురు యువతులు సంగీతార్చన చేశారు.

ఏడీసీసీ బ్యాంకు కాలమానిని ఆవిష్కరణ

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన కాలమానిని గురువారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. బ్యాంకు ఛైర్మన్ ఎం.కేశవరెడ్డి, సీఈఓ సురేఖరాణి చేతుల మీదుగా ఆవిష్కరించారు. డీజీఎంలు సుఖదేవబాబు, విజయ చంద్రారెడ్డి, ఏజీఎంలు, సీనియర్ మేనేజర్లు, మేనేజర్లు, సొసైటీల ఛైర్మన్లు పాముురాయి రఘు, చియ్యేడు లక్ష్మీనారాయణ, సీఈఓలు శ్రీనివాసులు, హనుమంతరెడ్డి, నారాయణ పాల్గొన్నారు. కాలమానినితో పాటు జనపనార సంచులు ఆవిష్కరించారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న కేశవరెడ్డి తదితరులు

పల్లె రఘునాథరెడ్డి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలుపుతున్న పీవీకేకే ఐటీ, బాలాజీ కళాశాలల ఉద్యోగులు

పల్లె నివాసంలో సందడి

రుద్రంపేట, న్యూస్‌టుడే: మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పీవీకేకే ఐటీ కళాశాల ఛైర్మన్ పల్లె కృష్ణకిశోర్‌లకు గురువారం నూతన సంవత్సరం దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పల్లె నివాసంలో పీవీకేకే ఐటీ, బాలాజీ విద్య సంస్థల ఉద్యోగులు పూలకుండీలతో శుభాకంక్షలు తెలిపారు. పుట్టపర్తి నియోజవర్గం ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు గజమాలతో పల్లె కుటుంబ సభ్యులను సత్కరించారు. అనంతరం పల్లె ఉమ సమాధికి పల్లె కుటుంబ సభ్యులు ఘనంగా నివాళి అర్పించారు.

మాంచోఫెర్రర్ దంపతులకు శుభాకాంక్షలు

తపోవనం : ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్, ఆయన సతీమణి విశాలఫెర్రర్‌కు పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎ.యుగంధర్‌రెడ్డి, సభ్యులు శ్రీవాస్‌రెడ్డి, టీవీ చంద్రమోహన్‌రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

డీఈవో ప్రసాద్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యాశాఖ ఉద్యోగులు

కాలమానిని ఆవిష్కరణ

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యాశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కాలమానిని డీఈవో ప్రసాద్‌బాబు ఆవిష్కరించారు. ఉప విద్యాశాఖాధికారి మల్లారెడ్డి, సహాయ సంచాలకులు శ్రీనివాసులు, మునీర్ ఖాన్, పర్యవేక్షకులు, ఐటీసెల్ సిబ్బంది పాల్గొన్నారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు వేరువేరుగా డీఈవోకి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యాశాఖ అధికారులకు సన్మానం

అనంతపురం విద్య: జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో డీఈవో ప్రసాద్‌బాబు, డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావులను గురువారం సన్మానించారు. నూతన సంవత్సరం పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహించారు. ఆ సంఘం గౌరవాధ్యక్షులు గంగాధర్ యాదవ్, అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, సీఆర్ఓ రవిచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం.. ఏపీఎంకు గాయాలు

అనంత నేరవార్తలు: అనంతపురం నగర శివారులో గురువారం ఉదయం రోడ్డు ప్రమాదంలో ఓ ప్రభుత్వ ఉద్యోగి గాయపడ్డాడు. శ్రీసత్యసాయి జిల్లా పెనుగొండలో విధులు నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ ఏపీఎం రవిచంద్రరాజు ప్రజాప్రతినిధులు, అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి, కుమారుడు అనిల్ కుమార్ రాజుతో కలిసి ద్విచక్ర వాహనంపై బస్టాండుకు బయలుదేరారు. రజాక్ ఫంక్షన్ హాలు సమీపంలో స్పీడ్‌బ్రేకరు వద్ద వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో రవిచంద్రరాజు తలకు గాయాలయ్యాయి. కుమారుడు స్వల్పంగా గాయపడ్డాడు. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

జిల్లా తెదేపా కార్యాలయంలో కేకు కట్‌చేస్తోన్న అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి

రాంనగర్‌లో ప్రభాకర్‌చౌదరిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న అభిమానులు

సంబరం మిన్నంటె..

రాంనగర్ (అనంతపురం) : జిల్లా తెదేపా కార్యాలయం, ప్రజాప్రతినిధుల క్యాంపు కార్యాలయాల్లో కొత్త ఏడాది వేడుకల సంబరాలు అంబారాన్నంటాయి. పూలు, పండ్లు, బొకేలు, శాలువాలు, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. పార్టీ కార్యాలయంతో పాటు క్యాంపు కార్యాలయాలు కిక్కిరిశాయి. కేకులు కోసి సంబరాలు చేసుకున్నారు. ప్రజాప్రతినిధులకు శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా తెదేపా కార్యాలయంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూలనాగరాజు, శ్రీధర్‌చౌదరి నాయకులు, కార్యకర్తల మధ్య కేకులు కోశారు. మిఠాయిలు పంచిపెట్టారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, ఉద్యోగులు తరలివచ్చారు. ఎంపీ కేకు కోసిన నాయకులకు తినిపించారు. శ్రీనగర్‌కాలనీలోని అనంతపురం అర్బన్ తెదేపా నూతన కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్, శ్రీలక్ష్మీ దంపతులు మహిళల మధ్య కేకు కోశారు. రాంనగర్‌లోని నివాసంలో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌చౌదరి నివాసానికి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. గజమాలలతో ప్రభాకర్‌చౌదరిని సత్కరించారు. భారీ కేకు కోసి అందరికీ పంచిపెట్టారు.

శ్రీనగర్ క్యాంపు కార్యాలయంలో మహిళలతో కలిసి కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్, శ్రీలక్ష్మీ దంపతులు

అనాథ చిన్నారులతో వేడుక

కమలానగర్, న్యూస్‌టుడే : నగరంలోని శ్రీనివాస్‌నగర్‌లో సీనియర్ న్యాయవాది పుట్టపర్తి ప్రభాకర్‌రెడ్డి 80 మంది అనాథ చిన్నారులతో కలిసి నూతన సంవత్సర వేడుకలను జరిపారు. గురువారం తమ ఇంటి ఆవరణలో కుటుంబ సభ్యులతో పాటు కేక్ కోసి, విద్యార్థులకు పాఠశాల బ్యాగులను అందించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 9 ఏళ్లుగా పేద, అనాథ చిన్నారులే తమకు అతిథులుగా భావించి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. తమ ఇంట్లో ఏ శుభకార్యం చేసిన, పండగలకు ఆనాథ చిన్నారులనే అతిథులుగా పిలుస్తామన్నారు. మానవత రక్తదాత సంస్థ ఛైర్మన్ తరిమెల అమర్నాథ్‌రెడ్డి, ఇతర సామాజిక కార్యకర్తలు పాల్గొని ప్రభాకర్‌రెడ్డి దంపతులను సన్మానించారు.

In The Court of the Prl. Senior Civil Judge, Ananthapuramu
E.P. No.137/2004 in O.S. No. 42/2002

Between:
N.Ramananda Reddy Resident at Maruthi Nagar, Ananthapuramu. ... Petitioner/ D.Hr
V/s
N.Harinath S/o N.Munirathnam, R/at D.No. 15-53/A, Kamala Nagar, Ananthapuramu. Presently R/at Flat No. 406, Gayatri Towers, Gooty Road, Kurnool ...Respondent/J.Dr

వేలం ప్రకటన

అర్జీదారుడు E.P. మొత్తమును రాబట్టుటకు J.Dr కు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నారు. వేలములో పాల్గొనదలచినవారు 22-01-2026వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

SCHEDULE

N.M.R. Shed Situate at Raju Road within the SRD and RD of Ananthapuramu and within the Municipal limits of Ananthapuramu, D.No. 15/707, A.C. 0.13 cents, within the following boundaries: **East:** N.M.R. Complex, **South:** Road, **West:** Gupta (Auditor)'s house, **North:** Dr. Sai Prasad's House.
Amin value: Rs.1,00,00,000/-
Market value: Rs. 65,92,160/-
D.Hr value: Rs. 5,00,000/-
(By Order of the Court)

K.Lakshmanachar, K.Chandra Sekhar Rao
Advocates, Ananthapuramu.
Cell: 9848504780

రోడ్డుపై మురుగు పరుగు

నిర్లక్ష్యంగా అధికార యంత్రాంగం

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : అనంత నగరంలో నిత్యం జనసంచారం ఉన్న కాలనీల్లో అధికారులు కనీసం మురుగు కాలువలు శుభ్రం చేయించటం లేదు. మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు ముందుకు సాగటం లేదు. దీంతో రోడ్డుపైనే ప్రవహిస్తోంది. వీధుల్లో వెళ్లాలంటే ముక్కుమూసుకొని వెళ్లే పరిస్థితి నెలకొంది. ఇది ఎక్కడో కాదో టవర్‌క్లాక్ సమీప కాలనీలో అధ్వానంగా ఉంది. మురుగు వ్యాప్తితో దోమల ఉద్ధృతి పెరిగి రోగాల బారిన పడుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోర్టు రోడ్డు నుంచి గుల్జార్‌పేట కాలనీకి వెళ్లే దారిలో ఓ హోటల్ వద్ద ఇలా కాలువ పేరుకుపోయి రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. 50 మీటర్ల మేర మురుగులోనే పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. తీవ్ర దుర్వాసనతో వెదజల్లుతోంది.

గుల్జార్‌పేటకాలనీలోని శ్రీ చైతన్య పాఠశాల నుంచి మూడో వీధిలో ఇలా మురుగు రోడ్డుపైకి వస్తోంది. దీంతో పందులు విచ్చల విడిగా సంచరిస్తున్నాయి. వారం రోజులుగా కాలువలు శుభ్రం చేయకపోవడంతో తీవ్ర దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తితో రోగాలు వస్తున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

వీరుల విజయం మరువలేనిది

కమలానగర్, న్యూస్‌టుడే : అగ్రకుల దురంకారులపై వీరోచితంగా పోరాడి విజయం సాధించిన కోరేగావ్ వీరుల త్యాగాలు మరువలేనివని ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. గురువారం కోరేగావ్ యుద్ధ వీరులను స్మరించుకుంటూ నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ నాయకులు నివార్పించారు. సాకే హరి మాట్లాడుతూ 28 వేల మందిని, కేవలం 500 మంది ఓడించారని, ఆ వీరుల త్యాగాలను స్మరించుకుంటూ స్వేచ్ఛ, సమానత్వ హక్కుల కోసం పోరాడాలన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యార్థికి సాయం

కమలానగర్, న్యూస్‌టుడే: నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ నిర్మలమురళి విద్యార్థి విష్ణువర్ధన్ చదువు కోసం రూ.10 వేల సాయం అందించారు. నగర శివారుకు చెందిన విష్ణువర్ధన్ ఎంఎస్సీ చదువుతున్నాడు. ఇటీవల ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదం గాయపడ్డాడు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న విష్ణువర్ధన్ పరిస్థితి పరిశీలించి రూ.5 వేల నగదు, పోటీ పరీక్షలకు పుస్తకాలు, ఇతర వస్తువులు అందించారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE, ANANTHAPURAMU.
E.P.No. 25/2020 in O.S.No:457/2015

Between:
R.Adinarayana Reddy S/o Venkata Reddy, R/of Bommeparthi village and post, Rapthadu Mandal. ...Petitioner/D.Hr
And
Y.Siva Reddy S/o Y.Gangi Reddy, R/o D.No: 12/5/381, Sivaji Nagar, APHB Colony, Anantapuram City ...Respondent/ J.Dr

వేలం ప్రకటన

ఇందుమూలముగా తెలియచేయడం ఏమనగా డిక్రీ హోల్డర్ జడ్జిమెంట్ డెటార్ నుండి ఇ.పి. మొత్తమును రాబట్టుకొనుటకు గాను షెడ్యూలులో కనబరిచిన జడ్జిమెంట్ డెటార్ యొక్క స్థిరాస్తిని వేలం వేయుటకు ఉత్తర్వులు పొందిఉన్నారు. ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని పై తెలిపిన కోర్టులో 21-01-2026వ తేది ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 5.00 గంటలలోపు బహిరంగ వేలమును కోర్టువారిచే నిర్వహించబడును. కొనదలచిన వారు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

SCHEDULE

Property situated in R.D. of Ananthapuramu and S.R.D. of Ananthapuramu Rural within Kakkalapalli village lands, within Ananthapuramu Mandal, within the following description. Govt. Dry S.No.10 measuring Ac.0.75 cents out of it Ac.3.74 cents. **Boundaries: East:** Remaining land in same S.No., **West:** Land in same S.No. of B.Vengamuni, **South:** Land in S.No.11, **North:** Land in same S.No. of A.Subramanyam and others. Measurements: East to west on northern side=128 links. East to west on southern side=161 links, North to south on eastern side=556 links, North to south on western side=630 links Total extent of the property is Ac.0.75 cents out of the above 1/5 th joint share of the defendant only.
E.P.Amount: Rs. 3,95,274/-
D.Hr Value Rs. 3,00,000/-
Market Value Rs. 60,28,400/-
Ameen Value Rs:45,00,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

A.V.SIVA REDDY, D.Hr Advocate, Ananthapuramu. Cell: 9440982484.

ఆవిరవుతున్న ఆహ్లాదం..

దెబ్బతిన్న జారుడుబండ

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: హౌసింగ్ బోర్డులోని అభయాంజనేయస్వామి ఉద్యానవనంపై నిర్లక్ష్యం నెలకొంది. పార్కులోని జారుడు బండ, ఊయలలు, ఆట వస్తువులు విరిగిపోయాయి. పచ్చిక కనుమరుగైంది. నడకబాటలు మాయమయ్యాయి. ప్రస్తుతం ప్రహరీ మాత్రమే ఉంది. పాలకులు, అధికారుల ఆలనాపాలనా లేకపోవడంతో ఉద్యానవనం ఆనవాళ్లు కోల్పోతోంది. ఉద్యానవనం అభివృద్ధి చేయాలని స్థానికులు జిల్లా కలెక్టర్‌కి పలుమార్లు వినతులు అందజేశారు. అభివృద్ధికి రూ.20 లక్షలతో అంచనాలు రూపొందించారు. కానీ టెండరు దశలోనే ఆగిపోయింది. పిల్లలు ఆడుకోడానికి ఆటవస్తువులు లేకపోవడం, పార్కుల మధ్యలో హైమాస్ట్‌లైట్లు మాత్రమే ఉన్నాయి. ఇటీవల వారం రోజులపాటు లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. వాటిని ఆర్పేవారు లేరు. ఉద్యానవనాలపై నిర్లక్ష్యం చేస్తే నగర వాసులకు ఆహ్లాదం దూరం అవ్వడంతో పాటు స్థలం అన్యాక్రాంతమవుతుంది.

పక్కన పడేసిన పిల్లల ఆట వస్తువులు

ఎస్కేయూ వీసీకి శుభాకాంక్షలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ చదువుతున్న విద్యార్థిని ఇటీవల మరణించింది. దీంతో ఎస్కేయూలో నూతన సంవత్సర వేడుకలు నిరాడంబరంగా నిర్వహించారు. బోధన, బోధనేతర ఉద్యోగులు ఇన్‌ఛార్జి వీసీ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబులకు వేరువేరుగా శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు, పూలమాలలు, కేక్ కటింగ్ లేకుండా కేవలం శుభాకాంక్షలు మాత్రమే తెలిపారు.

ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ అనితకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

శివకోటి శ్రీపీఠంలో నేడు వ్రతం

అనంత సాంస్కృతికం: నగరంలోని బెంగళూరు రోడ్డు శివకోటి శ్రీపీఠం ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు సామూహిక సత్య నారాయణ స్వామి వ్రతం జరుగుతుందని శ్రీపీఠం నిర్వాహకులు తెలిపారు. పుష్య శుద్ధపౌర్ణమి చాలా ప్రాశస్త్యమైనదని వారు తెలుపుతూ.. పౌర్ణమి ఘడియలున్న రోజు పరిగణనలోకి తీసుకుంటారని, కావున 2న వ్రతం జరుగుతుందన్నారు. పూజలో పాల్గొనదలచిన వారు 85008 50016, 70366 46646 చరవాణిలో సంప్రదించాలని సూచించారు.

తపాల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

అరవిందనగర్: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారాలకు కృషి చేస్తానని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అఖిల భారత తపాలా ఉద్యోగులు..ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ అనంతపురం డివిజన్ కాలమానిని ఆయన ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్రిష్ణయ్య యాదవ్, నాగేశ్వర్, మంజునాథ్ పాల్గొన్నారు.

(c) eenadu

సందడే సందడి

బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌కు కొత్త సంవత్సరం సందర్భంగా సందర్శకులు తరలి వచ్చారు. జిల్లావ్యాప్తంగానే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి వచ్చిన వారు అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత కేకులు కోసి సంబరాలు చేసుకున్నారు. అటవీ ప్రాంగణంలోని మినీ జంతు ప్రదర్శన శాల, మొసళ్ల పార్కును సందర్శించారు. మానస సరోవరంలో బోటింగ్ చేశారు. కొండపైకి పర్యాటకులను తీసుకెళ్లేందుకు మదనపల్లె, బి.కొత్తకోట, అంగళ్లు, కాండ్లమడుగు క్రాస్‌ల నుంచి ఆర్టీసీ 24 బస్సు సర్వీసులు నడిపింది.

- న్యూస్‌టుడే, బి.కొత్తకోట

అందరూ కదిలొచ్చిన వేళ

కార్యాలయంలో పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్ దంపతులు, చిత్రంలో జేసీ డీఆర్వో, సబ్ కలెక్టర్

■ మదనపల్లె నుంచి పాలన ప్రారంభం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా పరిపాలన మదనపల్లె కేంద్రంగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గురువారం కలెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రారంభించారు. వేద పండితులు పూజలు నిర్వహించి విధులు ప్రారంభించారు. వీరితో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌లకు కేటాయించిన గదుల్లో వారు బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ కార్యాలయంలో సెక్షన్‌ల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా జిల్లాలోని వివిధ శాఖల అధికారులు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

నిషాచరులు

■ ఒక్క రోజే రూ.5.54 కోట్లు తాగేశారు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో మొదటి రోజే మందుబాబులు రికార్డు సృష్టించారు. డిసెంబరు 31న ఒక్క రోజే రూ.5.54 కోట్ల విలువైన మద్యం తాగేశారు. కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా బుధవారం భారీగా విక్రయాలు జరిగాయి. జిల్లాలో 124 మద్యం దుకాణాలు, 11 బార్లు ఉన్నాయి. వీటిలో 7,463 బాక్సుల మద్యం, 3,475 బాక్సుల బీర్లు అమ్ముడయ్యాయి. దీని ద్వారా ప్రభుత్వానికి రూ.5.54 కోట్లు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. మదనపల్లె డివిజన్‌లో రూ.1.70 కోట్ల విలువైన మద్యం విక్రయించినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు.

మూతి వంకర.. పక్షవాతం అనుకోరా!

■ జిల్లాలో బెల్స్ పాల్సీ ముప్పు



సునీతకు 28 ఏళ్లు.. ఉదయం చన్నీటి స్నానం చేయడం, ధనుర్మాసం సందర్భంగా తెల్లవారుజామునే ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల ఉన్నట్టుండి ఆమె మూతి వంకర పోవడం గుర్తించిన భర్త అద్దంలో చూపించగా పక్షవాతం వచ్చిందేమోనని హడలిపోయింది. వెంటనే వైద్యుడిని సంప్రదించగా అది పక్షవాతం కాదని బెల్స్‌పాల్సీగా నిర్ధారించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే ఇలాంటి వారి సంఖ్య జిల్లాలో వందల నుంచి వేలకు చేరుతోంది. ఇంతకీ ఏమిటీ బెల్స్‌పాల్సీ?

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : ప్రస్తుతం మంచు ఎక్కువగా కురుస్తోంది. దీనికి తోడు విపరీతమైన చలి ఉంటోంది. నునువెచ్చని సూర్యకిరణాలు తాకుతున్న సమయంలో ఉదయపు నడక (వాకింగ్) చేస్తే ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. చలికాలంలో యువత వాకింగ్ చేసినా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అయితే వృద్ధులు, నడివయస్కులు బెల్స్ పాల్సీ బారిన పడే అవకాశం ఎక్కువ. మూతి వంకరతో వచ్చే వారు బెల్స్‌పాల్సీగా వైద్యులు గుర్తిస్తున్నారు.

లక్షణాలు ఇవీ ..

చలిగాలులు ఎక్కువగా చెవుల్లో నుంచి లోపలకు వెళ్లడం వల్ల నాడిపై ప్రభావం పడి ముఖం ఒక పక్కకు లాగేసినట్లు ఏర్పడుతుంది. దీంతో మూతి వంకర తిరిగినట్లు ఉంటుంది. దీన్నే బెల్స్ పాల్సీ అంటారు.

● చన్నీటి స్నానం చేసినా, చలిలో తిరిగినా 30 ఏళ్లు పైబడిన వారికి ఈ ముప్పు ఎక్కువగా ఉంటుంది.

అందమైన జిల్లా.. ప్రత్యేకతల ఖిల్లా!

మదనపల్లె పట్టణం, పుంగనూరు, న్యూస్‌టుడే: మదనపల్లె... సీమ జిల్లాల్లో శీతల ప్రాంతం.. అనేక ప్రత్యేకతల సమాహారం.. రోడ్డు, రైలు మార్గాలతో ఎక్కడి నుంచైనా చేరుకునే అవకాశం.. అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఆవిర్భవించడంతో భవిష్యత్తులో కలల నగరంగా విస్తరించే అవకాశాలు మెరుగయ్యాయి. దశాబ్దాల కాలం నాటి ఆకాంక్ష నెరవేరిన నేపథ్యంలో ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పటి పురాతన పట్టణం నేడు అంచెలంచెలుగా ఎదుగుతూ జిల్లా కేంద్రంగా ఆవిర్భవించింది. వివిధ ప్రత్యేకతల నిలయంగా మారింది.

చేనేత గ్రామం నీరుగట్టువారిపల్లె

మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె చేనేత పట్టు చీరలు తయారీకి ప్రసిద్ధి చెందింది. జిల్లాలో అది పెద్ద చేనేత గ్రామంగా మారనుంది. ఇక్కడ తయారయ్యే ఆధునిక డిజైన్ల పట్టుచీరలు దేశ, విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు.

ఆంధ్రా ఊటీ మన చెంతే

ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ పర్యాటకంగా జిల్లాకు మణిహారంగా మారింది. మదనపల్లె జిల్లా కేంద్రం కావడం వల్ల సమీపంలోనే ఈ వేసవి విడిదికి వీఐపీల తాకిడి పెరిగే అవకాశం ఉంది. ఉన్నతాధికారుల రాకతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు.

మహాలక్ష్మి.. పుంగనూరు ఆవు

జిల్లాకు పుంగనూరు జాతి ఆవులు తలమానికమైన ప్రత్యేకతగా చెప్పవచ్చు. పశువు 70 నుంచి 90 సెంటీమీటర్ల ఎత్తు మాత్రమే ఉంటోంది. ఈ ఆవు పాలలో 8 శాతం కొవ్వు ఉండి ఔషధ గుణాలు కలిగి ఉంటాయి. ఆవులు 115 నుంచి 200 కిలోల బరువుంటూ రోజుకి 5 కిలోల గడ్డిని తింటాయి. రెండు నుంచి 3 లీటర్ల పాలు ఇస్తాయి. నేలను తాకే తోక, పొట్టి పొట్టిగా, ముద్దుగా కనిపిస్తాయి.

భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి

■ రాయచోటిలో వెలసిన భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి అర్చా మూర్తిగా పూజలందుకుంటున్నారు.. కన్నడిగులు రాచోటి వీరన్నగా ఆయనను పూజిస్తుంటారు. వీరశైవుల ఆరాధ్యదైవం కావడంతో రాచోటి పేరు మీదుగానే ఈ పట్టణం రాయచోటిగా మారింది. మదనపల్లె సమీప రైలు నిలయం కావడంతో భవిష్యత్తులో ఇక్కడి నుంచి రవాణా సదుపాయాలు మరింత మెరుగుపడే అవకాశాలున్నాయి.

టమాట అడ్డా

ఉద్యాన పంటల సాగులో మదనపల్లెకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రధానంగా టమాటను ఈ ప్రాంత రైతులు లక్షల ఎకరాల్లో పండిస్తుంటారు. ఆసియా ఖండంలోనే అతి పెద్ద మార్కెట్‌గా గుర్తింపు తెచ్చుకుంది. దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు అండమాన్ నికోబార్ దీవులకు కూడా మదనపల్లె టమాటను ఎగుమతి చేస్తున్నారు. గుర్రంకొండ కోట, సోంపాళ్యం చెన్నకేశవాలయం చూడతగ్గ ప్రాంతాలు.

స్మార్ట్ పోలీసింగే లక్ష్యం

■ 'ఈనాడు'తో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి
■ సాంకేతికతతో నేరగాళ్లను వెంటాడుతాం

"ప్రజల మన్ననలు పొందేలా 'స్మార్ట్' పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేస్తాం. ప్రజల రక్షణ, భద్రత విషయంలో ఎలాంటి రాజీపడబోం. మదనపల్లె కేంద్రం నుంచి అన్నమయ్య జిల్లా కార్యకలాపాలు మరింతగా విస్తరిస్తాం. సరిహద్దు నేరాల నియంత్రణ, అక్రమ రవాణాను అరికట్టడం లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాం. సైబర్ నేరాలను అరికట్టి ప్రజలకు ఆర్థిక రక్షణగా ఉంటాం. సాంకేతికతను వినియోగించి నేరగాళ్లను వెంటాడుతాం.' 'ఈనాడు'తో జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి - **ఈనాడు, కడప**"

ఆయన చెప్పిన విషయాలివి..

☛ 'సామాన్య బాధితులకు సైతం న్యాయం చేసే దిశగా 'స్మార్ట్' పోలీసింగ్ పేరిట వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం. ఫిర్యాదుదారుల పట్ల ఆదరాభిమానాలతో వ్యవహరిస్తూ భరోసా ఇచ్చే దిశగా మనసును చూరగొనేలా వ్యవస్థ ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పోలీస్ స్టేషన్ అంటే భయపడేలా కాకుండా న్యాయం జరుగుతుందనే భరోసా ఇచ్చేలా మార్పులుంటాయి'

☛ 'సైబర్ నేరాల నుంచి రక్షణకు ప్రజలకు అవగాహన, నేరస్థులపై కఠిన చర్యలు దిశగా వ్యవహరిస్తాం. చట్టం ద్వారా కఠిన చర్యలు తీసుకుని మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. సైబర్ నేరాల శాతం పెరిగింది. తగ్గింపునకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తాం. ఇందులో భాగంగా అవగాహన ప్రధాన భూమికగా ఉంటుంది'

☛ 'డిజిటల్ అరెస్టులు అంటూ ఉండవు. జనం వీటిని నమ్మి మోసపోవద్దు. ఈ విషయంలో భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. పోలీసు వ్యవస్థలో డిజిటల్ అరెస్టు అంశమే లేదని అందరూ గ్రహించాలి. జిల్లాలో భారీ ఎత్తున సీసీ కెమెరాలు, డ్రోన్ బీట్ల ద్వారా నిరంతరం నిఘా పెట్టాం. ఎక్కడ ఏ ఘటన జరిగినా సమాచారం వేగంగా తెలుస్తుంది'

☛ 'రోడ్డు ప్రమాదాల కట్టడికి ప్రత్యేక దృష్టి పెట్టాం. రాష్ట్రంలోనే ఎక్కువ మరణాలున్న జిల్లాగా నమోదైంది. ఘటనలు, ప్రమాదాల శాతాన్ని తగ్గించడానికి కార్యాచరణ ప్రణాళిక తయారు చేశాం. రహదారులపై తనిఖీలు, యువతకు కళాశాలల వేదికగా అవగాహన చర్యలు చేపట్టి ప్రమాదాలను నివారిస్తాం'

రాజంపేట పోయింది.. పుంగనూరు వచ్చింది

■ జిల్లాలో మారిన ఆర్టీసీ స్వరూపం

పుంగనూరు ఆర్టీసీ బస్టాండు

పీలేరు: మదనపల్లె కొత్త జిల్లా కేంద్రంగా ఏర్పడినందున ప్రజా రవాణా శాఖ స్వరూపం కూడా మారింది. రాయచోటి జిల్లా కేంద్రంగా ఉన్నప్పుడు జిల్లాలో రాయచోటి, రాజంపేట, మదనపల్లె-1, మదనపల్లె-2, పీలేరు డిపోల్లో మొత్తం 472 బస్సులుండేవి. కొత్త జిల్లా ఆవిర్భావంతో రాజంపేట డిపో కడప జిల్లా పరిధిలోకి మారగా మదనపల్లె జిల్లా కేంద్రమైన అన్నమయ్య జిల్లాలోకి పుంగనూరు డిపో చేరింది. బస్సుల సంఖ్య ఒకటి తగ్గి 471 అయింది.

జిల్లాలో డిపోల వారీగా ఉన్న బస్సులు

డిపో	బస్సులు
మదనపల్లె-1	118
మదనపల్లె-2	74
పీలేరు	100
రాయచోటి	101
పుంగనూరు	78
మొత్తం	471

రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు

నేటి నుంచి గ్రామసభల నిర్వహణ



ఈనాడు, అన్నమయ్య: కొత్త పట్టాదారు పాసు పుస్తకాల జారీని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రారంభిస్తోంది. గత ప్రభుత్వంలోని తప్పులను సరిదిద్ది, రాజముద్రతో ఈ కొత్త పాసు పుస్తకాలను ఉచితంగా అందజేయనుంది. గతంలో జగన్ బొమ్మలున్న పాసు పుస్తకాల స్థానంలో ఇప్పుడు రాజముద్రతో కొత్తవి ఇవ్వనుంది. రీ-సర్వేలో తప్పులను సరిదిద్దిన తర్వాత వాటిని జారీ చేస్తున్నారు. వైకాపా హయాంలో జారీ చేసిన పట్టాదారు పాసు పుస్తకాల స్థానంలో మరొకటి ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ పార్టీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఫొటోతో పాసు పుస్తకాల జారీపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. తమ భూములకు నాటి సీఎం ఫొటో ఏమిటంటూ విమర్శలు వెల్లువెత్తాయి. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగన్ జారీ చేసిన పట్టాదారు పాసు పుస్తకాలను రద్దు చేసి రాజముద్రతో జారీ చేస్తామని అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి ఈ నెల 9 వరకు జరిగే గ్రామసభల్లో పంపిణీ చేయనున్నారు.

జోగి సోదరులకు పోలీసు కస్టడీ

ఈనాడు, అన్నమయ్య: ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులైన మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాములను పోలీసు కస్టడీకి తంబళ్లపల్లె కోర్టు అనుమతిచ్చింది. విజయవాడ జైల్లో ఉన్న వీరిని శుక్రవారం నుంచి ఈ నెల 4 వరకు కస్టడీకి ఇవ్వాలని ఆదేశించింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలీసు కస్టడీ కొనసాగుతుందని కోర్టు స్పష్టం చేసింది. ప్రతి రోజు ఉదయం నిందితులను ఎక్సైజ్ పోలీసులకు అప్పగించి సాయంత్రం తిరిగి జైలుకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని జైలు అధికారులను ఆదేశించింది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ సైతం నిందితులను విచారించే అవకాశం ఉంది.

(c) eenadu

నేడు ఈనాడు క్రికెట్ పోటీలు

కేఎస్‌ఆర్‌ఎం గ్రౌండ్ (సీనియర్ మెన్స్): ◆ ఉదయం 8.00 గంటలకు: ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల (ప్రొద్దుటూరు) - అన్నమాచార్య (కడప) ◆ ఉదయం 10.00 గంటలకు: శ్రీనివాస డిగ్రీ కళాశాల (మదనపల్లె) - కేఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల (కడప) ◆ మధ్యాహ్నం 1 గంటకు: గవర్నమెంట్ మెడికల్ కళాశాల (రిమ్స్), కడప - ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల (మదనపల్లె)

కేఓఆర్‌ఎం గ్రౌండ్ (సీనియర్ మెన్స్): ◆ ఉదయం 8.00 గంటలకు: శ్రీసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (రాయచోటి)-శ్రీ వైష్ణవి డిగ్రీ కళాశాల (రాజంపేట) ◆ ఉదయం 10.00 గంటలకు: ఎస్‌ఏబీఎస్ డిగ్రీ కళాశాల (బద్వేలు) - పి.రామిరెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (కడప)

రాయచోటి అభివృద్ధికి ముఖ్యమంత్రి భరోసా

సంబేపల్లె: కేకు కోస్తున్న రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ నాగేశ్వర నాయుడు

సంబేపల్లె, న్యూస్‌టుడే: రాయచోటి అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడే భరోసా అని రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కందూరి నాగేశ్వర నాయుడు అన్నారు. గురువారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సంబేపల్లెలో ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి పూల మాలలు వేసి అంజలి ఘటించారు. కేక్ కోసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. [illegible] రాయచోటి అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు [illegible] ఇచ్చారన్నారు. [illegible] కోట్లతో [illegible] రూ.70 కోట్లతో సిమెంటు రహదారుల నిర్మాణం [illegible] రూ.300 కోట్లతో [illegible] జరుగుతున్నాయన్నారు. [illegible] పాల్గొన్నారు.

'మన మిత్ర'లో ద్రవిడ పరీక్ష ఫలితాల విడుదల

కుప్పం (గ్రామీణ), న్యూస్‌టుడే: కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలో గురువారం ఉదయం 9.30కు మన మిత్ర(వాట్సప్ గవర్నెన్స్) ద్వారా యూజీ, పీజీ పరీక్ష ఫలితాలను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, వర్సిటీ వీసీ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ చేతులమీదుగా విడుదల చేశారు. యూజీలో ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు సంబంధించి 3, 5వ సెమిస్టర్లు, పీజీలో ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను 'మనమిత్ర' యాప్‌లో అందుబాటులో ఉంచారు. వాట్సప్‌లో పరీక్షా ఫలితాలు విడుదల కావడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మామిడి ఆశలపై మంచుతెరలు

ఆలస్యమవుతున్న పూత, దిగుబడిపై తీవ్ర ప్రభావం

పుత్తూరు, బంగారుపాళ్యం, న్యూస్‌టుడే : మామిడి రైతులను మంచు ముంచేస్తోంది.. ఏడాది కష్టం నేలపాలయ్యే పరిస్థితి ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.. ఏటా ఏదోఒక కారణంతో నష్టాలపాలవుతున్నారు.. గతేడాది ఆశించిన దిగుబడి వచ్చినా తోతాపురి రైతుకు నష్టం తప్పలేదు.. గతేడాది నవంబరులో మొంథా, డిసెంబరులో దిత్వా తుపానుతో వర్షాలు కురిశాయి.. మామిడిలో డిసెంబరు 15 నాటికే మొగ్గ దశ ఉండాలి.. అధిక వర్షాల వల్ల పూత ఆలస్యమవుతోంది.. దీనికితోడు ఈ ఏడాది మంచు అధికంగా పడటం, ఉష్ణోగ్రతల్లో భారీ తేడాలతో వచ్చిన పూత మగ్గిపోయి బంక పడుతోంది.. ఫలితంగా దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అక్కడక్కడ కనిపిస్తున్న మామిడి పూత

ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి సాగు విస్తీర్ణంలో ప్రథమ స్థానంలో ఉంది. జిల్లాలో 1.05 లక్షల హెక్టార్లలో మామిడి సాగవుతోంది. ఈ విస్తీర్ణం ఏటికేడు పెరుగుతోంది. ఇక్కడ గుజ్జు కంపెనీలు సైతం ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏటా రైతులు దున్నకం, నీటి తడులు అందించడం, సస్యరక్షణ చర్యలకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా ఏదోఒక విపత్తుతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారు. దిగుబడి ఎక్కువ వస్తే పల్ప్ ఫ్యాక్టరీల యజమానులు సిండికేట్‌గా మారి రైతుల నుంచి తక్కువకు కొనుగోలు చేస్తారు. దీంతో రైతులకు పెట్టుబడి సైతం దక్కడం లేదు. గతేడాది నవంబరు, డిసెంబరులో అధిక వర్షాల వల్ల పూత ఆలస్యమై దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. గతేడాది సీజన్ మొదటి నుంచి తోతాపురి కొనుగోలులో ఫ్యాక్టరీల యజమానులు సిండికేట్‌గా మారి ధర పెరగకుండా చేయడంతో ప్రభుత్వమే నేరుగా రంగంలోకి దిగి గుజ్జు పరిశ్రమల యజమానులు టన్నుకు రూ.8 వేలు చెల్లించాలని ఆదేశించింది. ప్రోత్సాహక ధర రూ.4 వేలు ఇస్తామని ప్రకటించి రైతుల ఖాతాల్లో జమ చేసింది ప్రస్తుత ప్రభుత్వం.

పట్టించుకోని యాజమాన్యాలు..

గుజ్జు పరిశ్రమల యజమానులు టన్నుకు రూ.3,500 నుంచి రూ.6 వేల వరకు తమకు తోచినట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇంకా చాలామందికి నేటికీ డబ్బు అందక, ఆశించిన ధర ఇప్పిస్తామని ఆర్భాటంగా హామీ ఇచ్చిన జిల్లా యంత్రాంగం సైతం మొక్కుబడి సమావేశాలు నిర్వహించి కంపెనీలను తరచూ బతిమలాడుతుండటంతో చేసేదేమీ లేక రైతులు నగదు కోసం ఆయా పరిశ్రమల చుట్టూ తిరుగుతున్నారు. గతేడాది ఎలాగూ నష్టపోయామని, ఈ ఏడాదైనా ఆశించిన మేర దిగుబడి వస్తుందని ఊహించిన వారు ప్రస్తుతం మంచుతో దిగాలు చెందుతున్నారు. పూత నల్లగా మారి బంక కారే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి..

ఉష్ణోగ్రత అనుకూలిస్తే ఆశించిన దిగుబడులు వస్తాయి. లేదంటే దిగుబడి తగ్గొచ్చు. పూత ఆలస్యమవుతోంది. తేనెమంచు పురుగు నివారణకు ఇమిడాక్లోపిడ్ లీటరు నీటికి 0.33 మి.లీ, కార్బొడైజిన్ ఒక గ్రాము.. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కాదర్ లాంటి రకాల్లో డైజర్ కోనోజిల్. . లీటరు నీటికి 0.5 మి.లీటర్లు కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. గూడు పురుగు నివారణకు అసిఫేట్ ఒక లీటరు నీటికి 125 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. తద్వారా కొంతమేర వాటి నుంచి కాపాడుకోవచ్చు.

-వెంకట సాజన్య, ఉద్యానశాఖ అధికారిణి, పుత్తూరు

వినాయకుడి ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తజనం

కాణిపాకంలో ఆంగ్ల సంవత్సరాది వేడుకలు

దర్శనానికి ఐదు గంటలు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయంలో ఆంగ్ల సంవత్సరాది వేడుకలను ఘనంగా గురువారం నిర్వహించారు. వేకువజామున ఉభయదారులచే స్వామివారి మూలమూర్తికి పంచామృతాభిషేకం చేశారు. చందనం, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి, నివేదన సమర్పించారు. నాలుగు గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాక తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనార్థం తరలి వచ్చారు. ఆలయ క్యూలైన్లు నిండి వెలుపలకు వరుసలు కొనసాగాయి. దర్శనానికి ఐదు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో ఉన్న భక్తులకు బిస్కెట్లు, పాలు అందజేశారు. ఉచిత ప్రసాదంతో పాటు, అన్నదానం చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిశోర్ పర్యవేక్షించారు. స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో చిన్నారులు తప్పిపోకుండా ట్యాగులు కట్టారు.

కాలమానిని ఆవిష్కరించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక, సంఘం ప్రతినిధులు

నూతన సంవత్సరంలో మంచి జరగాలి

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సరం-2026 కాలమానిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక ఆవిష్కరించారు. స్థానిక జిల్లా జడ్జి బంగ్లాలో గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తిని.. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరించి న్యాయమూర్తులు, అధికారులు, ఉద్యోగులందరికీ నూతన సంవత్సరంలో మంచి జరగాలని ఆకాంక్షించారు. జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు లక్ష్మీపతి, కె.రవీంద్రారెడ్డి, వి.రాజేష్, ఎస్.బాలసుందర్, డి.జి.దామోదరం, పవనకుమారి, కె.ఆర్.హరికృష్ణ, ఎ.రెడ్డెప్ప, దిలీప్, హేమ, గణేష్, ఎస్.సంతోష్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నీళ్లు లేక మూత్రశాలలకు తాళాలు



నూతన సంవత్సరం సందర్భంగా అత్యధికంగా భక్తులు వస్తారని తెలుసు. అయినా ప్రణాళిక లోపం కారణంగా యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీస అవసరాల దృష్ట్యా శివయ్య గోపురం ఆవరణలో మూత్రశాలలు ఏర్పాటు చేశారు. నీళ్లు నిల్వ చేయని కారణంగా గురువారం మధ్యాహ్నం వాటికి తాళాలు వేశారు. దర్శనార్థం వచ్చిన భక్తుల ఇక్కడకు రావడం, తాళాలు వేసి ఉండటంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. దాదాపు ఐదారు గంటల వరకు ఇదే పరిస్థితి. భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

స్కేటింగ్‌లో సత్తా

నిర్వాహకులతో విజేత వేదస్వరూప్

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: దిల్లీలో జరిగిన ఐస్ స్కేటింగ్ పోటీల్లో బి.కొత్తకోట విద్యార్థి మేడా వేదస్వరూప్ సత్తా చాటాడు. స్థానిక చైతన్య చిల్డ్రన్స్ అకాడమీలో ఏడో తరగతి చదువుతున్నాడు. దిల్లీలో ఓ ప్రైవేటు సంస్థ నిర్వహించిన అండర్-15 పోటీల్లో రజతం గెలిచినట్లు తండ్రి చంద్రమోహన్ తెలిపారు.

సమన్వయంతో నేరాల నియంత్రణకు కృషి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలోని పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేసి నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సూచించారు. గురువారం మదనపల్లె డీఎస్పీ కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా కేకు కోశారు. వివిధ ఠాణాల సీఐలు, ఎస్‌ఐలతో ఆయన మాట్లాడారు. డీఎస్పీ కార్యాలయం పూర్తిగా పాడైన నేపథ్యంలో వేరే ప్రాంతంలో కొత్త భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మదనపల్లె సబ్‌డివిజన్‌లో ఇన్నాళ్లు 11 స్టేషన్లు ఉండేవని, కొత్తగా పుంగనూరు, చౌడేపల్లె, సదుం, సోమల కలవడంతో 15కు చేరాయన్నారు. డీఎస్పీ మహేంద్ర, సీఐలు, ఎస్‌ఐలు, డీఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ ధీరజ్‌ను సత్కరించిన డీఎస్పీ మహేంద్ర, సీఐలు, ఎస్‌ఐలు

జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: అందరికీ అందుబాటులో ఉంటూ జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేస్తామని డీఈవో సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం మదనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డీఈవో కార్యాలయాన్ని ప్రారంభించారు. డీఈవోను డీవైఈవో లోకేశ్వర్‌రెడ్డి, ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఎస్టీయూ, యూటీఎఫ్, వివిధ సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ● మదనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త కార్యాలయాన్ని గురువారం ఏపీసీ డాక్టర్ అనురాధ ప్రారంభించారు. ఈఈ సుధాకర్, సీఎంవో కరుణాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఈవో సుబ్రహ్మణ్యంకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంఈవోలు, హెచ్‌ఎంలు

అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

తిరుచానూరు: శ్రీపద్మావతీ అమ్మవారిని గురువారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జ్యోతిర్మయి, జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబ సభ్యులతో వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద న్యాయమూర్తులకు సూపరింటెండెంట్లు సురేష్ బాబు, రమేష్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

జూ ఆదాయం రూ.7 లక్షలు

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలను గురువారం పెద్ద సంఖ్యలో సందర్శించారు. జూను సందర్శించిన వారిలో 6500 మంది పెద్దలు, 1100 మంది పిల్లలు ఉన్నారని జూ అధికారులు తెలిపారు. వీరి ద్వారా జూకు సుమారు రూ.7 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు.

డీడీవో కార్యాలయమే సబ్ కలెక్టరేట్

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లాను మదనపల్లె కేంద్రంగా చేయడంతో జిల్లా స్థాయి అధికారులు తమ కార్యాలయాల ఏర్పాటుకు తర్జనభర్జనలో పడ్డారు. పుంగనూరు రోడ్డులోని డీడీవో కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. గురువారం సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి కార్యాలయంలో విధులు ప్రారంభించారు. దీంతో ఇక్కడున్న డివిజన్ స్థాయి అధికారులకు భవనం కేటాయించాల్సి ఉంది. ఎస్పీ కార్యాలయాన్ని రేస్ కళాశాలను కేటాయించగా మరి కొన్ని శాఖల కార్యాలయాల ఏర్పాటుపై భవనాల అన్వేషణ చేపట్టారు.

❖ జిల్లా కేంద్రానికి సంబంధించి దాదాపు 73 శాఖలుండగా వీటిలో 45 శాఖలకుపైగా భవనాలు అవసరమని అధికారుల అంచనా వేశారు. తాత్కాలిక భవనాలను కేటాయించేందుకు జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ పరిశీలిస్తున్నారు. కొన్ని శాఖలకు సంబంధించి డివిజన్ కార్యాలయాల్లోనే జిల్లా కార్యాలయాలుగా మార్పుచేశారు. గృహ నిర్మాణశాఖ ఈఈ కార్యాలయాన్ని జిల్లా అధికారి కార్యాలయం ఏర్పాటు చేశారు. బీటీ కళాశాల పీజీ బ్లాక్‌లో డ్వామా, డీఆర్‌డీఏ, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయాలకు కేటాయించారు. అదే విధంగా బెంగళూరు రహదారిలోని పట్టుగూళ్ల ఉత్పత్తి కేంద్ర భవనంలో పశువైద్యశాల ఆవరణంలోని భవనాల్లో జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయాన్ని, వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ, మత్స్యశాఖ, సూక్ష్మనీటి సేద్యం, పట్టుగూళ్ల పరిశ్రమ జిల్లా అధికారులకు బెంగళూరు రహదారిలోని పట్టుగూళ్ల ఉత్పత్తి కేంద్రంలోని భవనాలను, బెంగళూరు రహదారిలోని మడికయ్యల శివాలయం రోడ్డులోని బీటీ కళాశాల పీజీ బాయ్స్ వసతి గృహంలో జిల్లా ల్యాండ్, సర్వే అధికారి కార్యాలయం, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి, జిల్లా ప్లానింగ్ అధికారి కార్యాలయాలకు కేటాయించారు. మరిన్ని శాఖలకు భవనాలు కేటాయించాల్సి ఉంది. దీనిపై అధికారులు సర్దుబాటు చర్యలు చేపట్టారు. కొన్నిశాఖలకు సంబంధించి భవనాలు కేటాయించాల్సి ఉంది. మరో రెండు రోజుల్లో కార్యాలయాల ఏర్పాటుపై స్పష్టత రానుంది.

డ్వామా కార్యాలయం ప్రారంభించి సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న పీడీ వెంకటరత్నం

బీటీ కళాశాలలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో పీడీ నాగేశ్వరరావు, డీపీఎం సత్యనారాయణ తదితరులు

తెప్పలపై శ్రీకామాక్షి అమ్మవారి కటాక్షం

తిరుపతి(తితిదే): శ్రీకపిలేశ్వరస్వామి తెప్పోత్సవాల్లో భాగంగా శ్రీ కామాక్షి అమ్మవారు కపిలతీర్థం పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన తెప్పపై ఆసీనులైన శ్రీకామాక్షి, లక్ష్మీ, సరస్వతి అమ్మవారు కపిలతీర్థం పుష్కరిణిలో 9 చుట్లు తిరిగారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు అందించారు. తితిదే అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు భక్తి సంకీర్తనలు ఆలపించారు.

శివయ్యకు వేడినీళ్ల అభిషేకం రేపు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఆరుద్రను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో విశేష వేడుకలు జరుపనున్నారు. ఎక్కడా లేని విధంగా ఇక్కడి ఆలయంలో శనివారం శ్రీజ్ఞానప్రసూనాంబిక, శ్రీకాళహస్తీశ్వరుని ధ్రువమూర్తులకు వేడినీళ్లతో అభిషేకాలు జరపనున్నారు. ఉదయం 6 గంటలకు శ్రీశివకామసుందరి సమేత నటరాజస్వామికి అభిషేకాలు జరిపి ఊరేగింపు చేస్తారు. పదిగంటలకు వేడినీళ్ల అభిషేకం సందర్భంగా దర్శనాలు నిలిపేస్తారు. ఉత్సవమూర్తులను ఉంచి దర్శనాలకు అనుమతించనున్నారు. ఇక రాత్రి ఆలయంలోని మహానంది ప్రతిమ వద్ద అరికట్ల ఉత్సవం నిర్వహించాక ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించనున్నారు.



ముక్కంటి ఆలయంలోని వాయులింగేశ్వరుని సన్నిధి

ముక్కంటి సేవలో ఎల్‌జీ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: జమ్ము, కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హా వాయులింగేశ్వరుని దర్శనార్థం వచ్చారు. ఈయనకు ఆలయ ఈవో బాపిరెడ్డి దక్షిణ గోపురం వద్ద గురువారం ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో రాహు, కేతు పూజలతో పాటు అభిషేక సేవల్లో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనం పూర్తయ్యాక వేదాశీర్వాదం, జ్ఞాపికతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ప్రొటోకాల్ ఏఈవో మోహన్ పాల్గొన్నారు.

మనోజ్‌సిన్హాకు పూలమాల వేసి స్వాగతిస్తున్న ఈవో బాపిరెడ్డి

స్వామీ.. నిన్ను దర్శించాలని

తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి మొదటి మూడు రోజులు ఈ-డిప్ టోకెన్లున్న భక్తులను మాత్రమే అనుమతించారు. జనవరి 2 నుంచి టోకెన్లు లేని భక్తులను కూడా అనుమతిస్తున్న నేపథ్యంలో గురువారం ఉదయం నుంచే భక్తులు తిరుమలకు పెద్దఎత్తున తరలి వస్తున్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో గరుడ కూడలి నుంచి నంది కూడలి వైపు ట్రాఫిక్ స్తంభించడంతో శ్రీవారి భక్తులు ఇబ్బందులు పడ్డారు. తిరుమలకు వెళ్లే బస్సులు తగినన్ని లేకపోవడంతో బాలాజీ లింకు బస్టాండ్‌లో వచ్చిన ప్రతి బస్సు వద్దకూ భక్తులు పరుగులు తీశారు. సీటు కోసం పోటీ పడ్డారు. ఇదే పరిస్థితి ఆర్టీసీ సెంట్రల్ బస్టాండ్‌లో కనిపించింది. - ఈనాడు, తిరుపతి

వెంటాడి.. భయపెట్టి.. దోపిడీ

సినీ ఫక్కీలో రూ.2.18 లక్షల నగదు స్వాహా

నూలివీడు (గాలివీడు), న్యూస్‌టుడే: బంగారు నగలు బ్యాంకులో తాకట్టుపెట్టి నగదు తీసుకెళ్తున్న కుటుంబాన్ని వెంటాడిన దుండగులు అదను చూసి బెదిరించి దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటన నూలివీడులో బుధవారం రాత్రి 7 గంటల చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు గాలివీడు మండలం నూలివీడుకు చెందిన ఈశ్వరమ్మ, ఆమె భర్త ఇరగయ్య, మనవడితో కలిసి బుధవారం సాయంత్రం స్టేట్ బ్యాంకుకు వెళ్లింది. సొంత అవసరాల కోసం బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రూ.2.18 లక్షలు తీసుకున్నారు. ఆపై ఆటోలో నూలివీడు బస్టాండుకు చేరుకున్నారు. గాలివీడు నుంచి వీరిని బైకులో ఇద్దరు వెంటాడుతున్న విషయాన్ని గుర్తించలేదు. ఈ నేపథ్యంలో ఇరగయ్య పక్కకు వెళ్లగా.. స్థానిక పాఠశాలలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఈశ్వరమ్మ పాఠశాలలో వస్తువులు సరిచేయడానికి బడిలోకి వెళ్లింది. ఈ క్రమంలో వెంబడించిన ఇద్దరు ఇద్దరు దుండగులు మాస్కులతో గదిలోకి వెళ్లారు. అధికారులమని నమ్మించి ఆమె వద్ద ఉన్న నగదు సంచిని లాక్కున్నారు. గది తలుపులు వేసి అక్కడి నుంచి బైక్‌లో లక్కిరెడ్డిపల్లె మార్గం వైపు వెళ్లారు. ఈశ్వరమ్మ అరుపులు విన్న స్థానికులు గది తలుపులు తెరవగా దోపిడీ జరిగినట్లు బాధితురాలు వాపోయారు. దుండగుల కోసం గాలించినా ప్రయోజనం లేకపోయింది. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. నూలివీడు బస్టాండులో ఓ దుకాణం వద్ద ఉన్న సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై ఇరగయ్య, ఈశ్వరమ్మలను అనుసరించినట్లు కనిపించారని పోలీసులు తెలిపారు.

ఆరా తీస్తున్న మాస్క్ ధరించిన వ్యక్తులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

చౌడేపల్లె, కల్లూరు, న్యూస్‌టుడే: వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి. చౌడేపల్లె మండలంలోని ఎ.కొత్తకోటకు చెందిన వెంకటరమణ (65) వ్యవసాయ కూలీ. ద్విచక్రవాహనం పొలానికి వెళ్తుండగా గ్రామం ముఖ ద్వారం వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. రోడ్డుపై పడిన ఆయన తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. వెంకటరమణ కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.

వెంకటరమణ (పాతచిత్రం)

❖ కల్లూరు మండలంలోని జల్లావారిపల్లెకు చెందిన పి.రాజు (25) మిత్రులు ప్రవీణ్, ప్రసాద్ తిరుపతి నుంచి భాకరాపేట వస్తున్నట్లు చరవాణిలో చెప్పారు. వారిని కలిసేందుకు నడిచి వెళ్తుండగా మంగళంపేట- పాపిరెడ్డిగారిపల్లె మార్గంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రగాయాలైన రాజును కేకేపేట పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు చెప్పారు.



రాజు (పాతచిత్రం)

అస్వస్థతతో బాలింత మృత్యువాత

ఆసుపత్రి ముందు కుటుంబ సభ్యుల ఆందోళన

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రభుత్వాసుపత్రిలో కాన్పు అయిన బాలింత అస్వస్థతకు గురికావడంతో వైద్యులు తిరుపతికి రిఫర్ చేశారు. ప్రైవేటు అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందిన ఘటన మదనపల్లె జిల్లాలో చోటు చేసుకుంది. చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం మిట్టపల్లెకు చెందిన గగనశ్రీ (23) తొలి కాన్పు కోసం మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో డిసెంబరు 24న చేరారు. తర్వాత రోజు వైద్యులు శస్త్రచికిత్స చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. గురువారం గగనశ్రీని డిశ్చార్జి చేసేందుకు కుట్లు విప్పారు. ఈ సమయంలో ఆమె తీవ్ర అస్వస్థతకు గురవడంతో తిరుపతి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. బాలింతను అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయింది. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు మదనపల్లె తీసుకువచ్చి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే ప్రాణాలు కోల్పోయినట్లు మాలమహానాడు రాష్ట్ర నాయకుడు సుదర్శనం, కుటుంబ సభ్యులు ఆరోపించారు. వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకొని సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. కుట్లు విప్పిన సమయంలో మూర్ఛ రావడంతో గగనశ్రీ తీవ్ర అస్వస్థతకు గురైందని, ఎలాంటి నిర్లక్ష్యం చేయలేదని ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

గగనశ్రీ (పాతచిత్రం)

EENADU e Classifieds

PERSONAL CLASSIFIEDS

TO LET

BIRTHDAY GREETINGS

COMMERCIAL

సిద్ధవటం కోర్టు సమీపమున మెయిన్ రోడ్డులో ఉషా గార్డెన్, ఫంక్షన్ హాలు, రూములు బాడుగకు గానీ లీజుకు ఇవ్వబడును. Cell : 9949741939.

JOBS

Kadapa, Proddatur Ather Showroom need Sales Executives, Service Technicians, Service Advisors Cont: 7093909123 (Sales), 9381331440 (Service)

కడపలో డా॥ పరమేశ్వర రావు ENT (చెవి, ముక్కు, గొంతు) హాస్పిటల్ నందు పని చేయుటకు ఇద్దరు నర్సులు, కాంపౌండర్స్ & ఇంట్లో పని చేయుటకు ఇద్దరు ఆడవారు కావలెను. కడప వారికి ప్రాధాన్యత. ✆ 9492410402

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏటి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నేటి నుంచి పట్టాదారు పుస్తకాల పంపిణీ

పెద్దతిప్పసముద్రం, సదుం, న్యూస్‌టుడే: పెద్దతిప్పసముద్రం మండలంలో అయిదు గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని తహసీల్దారు శ్రీరాములునాయక్ తెలిపారు. 2న అనంతాపురం, చిన్నపొంగుపల్లి, 6న పీటీఎం, 7న మదుమూరు, 8న జగదూరివారిపల్లెలో పాసు పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. ● సదుం మండలంలో గ్రామ సభలు నిర్వహిస్తామని తహసీల్దార్ ప్రమీల చెప్పారు. 2న అమ్మగారిపల్లె, 79వ చింతమాకులపల్లె, 3న నడిగడ్డ, ఊటుపల్లె, 5న సదుం, చెరుకువారిపల్లె, 6న బూరగమంద, కంభంవారిపల్లె, 7న ఎర్రాతివారిపల్లె, తాటిగుంటపాళెం, 8న తిమ్మనాయనిపల్లెలో పాసు పుస్తకాలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

మదనపల్లె

• మదనపల్లె • తంబళ్లపల్లె • పుంగనూరు

సేవతో ఆత్మ సంతృప్తి

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: సేవతో ఆత్మ సంతృప్తి లభిస్తుందని చిత్తూరు లయన్స్ క్లబ్ డైరెక్టర్ పార్థసారథి నాయుడు అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా చిత్తూరు, జీడీనెల్లూరు మండలం వేల్కూరుల్లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మదనపల్లె పట్టణం: 80085 74611
పీలేరు గ్రామీణం: 80085 74958
పుంగనూరు: 80085 74622

? ఐటుకునెల్లూరు గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. శుభ్రత చర్యలు చేపట్టాలి. - శ్రీనివాసులు * వీధులు, కాలువల్లో వ్యర్థాలు తొలగించాలి. - సురేంద్రరెడ్డి, కార్యదర్శి – న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణం

డైరీలు, క్యాలెండర్ల ఆవిష్కరణ

ఏపీఎన్‌జీవో సంఘం క్యాలెండర్ ఆవిష్కరణలో కలెక్టర్ నిశాంత్‌కుమార్, నాయకులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మదనపల్లెలోని గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ శాఖ డైరీని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆవిష్కరించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. డీఈ ఈఈ సతీష్‌కుమార్, ఈఈ రషీద్‌ఖాన్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు. ● మదనపల్లె ఏపీఎన్‌జీవో టేబుల్ క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సంఘాధ్యక్షుడు రెడ్డి శేఖర్, కార్యదర్శి శివప్రసాద్, గౌరవాధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రెసిడెంట్ భాస్కర్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ సూచించారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న 37వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. ప్రమాదాల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను సూచించారు. కార్యక్రమంలో రవాణాశాఖ అధికారి ప్రసాద్, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమండ్యం.. ఆక్రమణల పర్వం

దేవుడు భూముల కబ్జా చేసి బండపై నిర్మాణాలు చేపట్టగా.. అభ్యంతరాలు రావడంతో ఆగిన పనులు

ములకలచెరువు, పెద్దమండ్యం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో విలువైన భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. వైకాపా నాయకుల ప్రోత్సాహంతో పెద్దమండ్యం మండలంలో కొందరు భూకబ్జాలకు పాల్పడుతున్నారు. కుంటలు, ఆలయాలకు సంబంధించిన భూములను వదలకుండా ఆక్రమిస్తున్నారు. మదనపల్లె జిల్లా కేంద్రంగా మారడంతో కురబలకోట మండలంలోని అంగుళ్లలో ఆక్రమణలకు పాల్పడేందుకు సిద్ధం అవుతున్నారు.

ఆక్రమించి.. అమ్మేసి..

పెద్దమండ్యం రాజా, సబ్‌స్టేషన్ సమీపంలో గాలివీడు- మదనపల్లె రోడ్డుకు ఆనుకొని రియల్టర్లు కొత్త పట్టా భూమి కొనుగోలు చేశారు. నాయకులు కొందరు అధికారులకు తాయిలాలతో మభ్యపెట్టి తమ్మిరెవాని కుంటలో భూమి ఆక్రమించి ప్లాట్లు వేశారు. ఒక్కో ప్లాటును రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు విక్రయిస్తున్నారు. ● ఇదే ప్రాంతంలోని సర్వే నంబరు 481లో 10 ఎకరాల భూమి ఉండగా సుమారు 3 ఎకరాలను ఆక్రమించారని ఆరోపణలున్నాయి.

పంట పొలాలుగా మార్చి..

పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో మాదిగకుంటలో 9 ఎకరాల్లో 4 ఎకరాలకు ఆక్రమణకు గురైనట్లు పలువురు అధికారులకు ఫిర్యాదులు చేశారు. కురవపల్లి సమీపంలో జీలకరేణికుంటలో 11 ఎకరాల్లో చెరువు ఉండగా 5 ఎకరాలు ఆక్రమించినట్లు ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో బోరు తవ్వించి వరి పండిస్తున్నట్లు ఫిర్యాదులు చేశారు. దేవుని రాతి విగ్రహాలు తొలగించి ప్లాట్లుగా మార్చారు. గ్రామస్థులు అడ్డుకోవడంతో పనులు ఆపేశారు.

500 ఎకరాల వరకు..

ఇరిగేషన్ అధికారుల అంచనా ప్రకారం పెద్దమండ్యం మండలంలో సుమారు 500 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు లెక్కలు చెబుతున్నాయి. చెరువులు, పోరంబోకు కుంటలను ఆక్రమణదారులు కబ్జా చేసినట్లు తేల్చారు. విషయం తహసీల్దారు తేజస్విని వద్ద ప్రస్తావించగా.. మండలంలో రూ.కోట్ల విలువైన భూముల కబ్జాలపై విచారణ చేపడతామన్నారు. అన్ని రకాల ఆక్రమణలు గుర్తించి స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

ప్రైవేటు దుకాణంలో ప్రభుత్వ మందులు

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే: ప్రైవేటు దుకాణంలో ప్రభుత్వ మందులు ఉండటంతో ఔషధ నియంత్రణ అధికారి దాదా కలంధర్ గురువారం తనిఖీలు చేపట్టారు. మదనపల్లె ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు మందుల దుకాణంలో ప్రభుత్వం సరఫరా చేసే మెట్రోజల్ ఉన్నట్లు వైద్యులు గుర్తించి యజమానిని నిలదీశారు. విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వాసుపత్రిలోని డ్రగ్‌స్టోర్, ప్రైవేటు దుకాణాన్ని పరిశీలించారు. మందుపై ఉన్న సంఖ్య ఆధారంగా ఏ ఆసుపత్రికి సరఫరా చేసినవో అని విచారణ చేపతామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

విద్యుత్తు సమస్యల పరిష్కారంపై దృష్టి

పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఈఈ, ఏడీఈలు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్తు సమస్యలను పరిష్కరించాలని ఆ శాఖ ఎస్‌ఈ కె.సోమశేఖర్‌రెడ్డి ఆదేశించారు. ఈఈ, ఏడీఈ, ఏడీఈలు, సిబ్బంది గురువారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పర్యవేక్షక కార్యాలయం నుంచి ఇకపై పాలన కార్యకలాపాలు సాగుతాయన్నారు. అవసరమైన భవనాల కోసం నివేదిస్తామని చెప్పారు. కరెంటోళ్ల జనబాట కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు వెళ్లి ప్రజల నుంచి సమస్యలు తెలుసుకొని పరిష్కారాలు చూపాలన్నారు. ఈఈలు గంగాధరం, ఈశ్వర్‌రెడ్డి, ఏడీఈలు హరికుమార్, సురేంద్రనాయక్, గోవిందురెడ్డి, ఏఈలు, యూనియన్ల నేతలు, విద్యుత్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

రామసముద్రం, న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మండలంలోని మూగవాడి పంచాయతీలో తెదేపా నాయకులతో గురువారం సమావేశమయ్యారు. తెదేపాలో చేరిన పంచాయతీకి చెందిన వైకాపా నాయకులకు కండువాలు వేసి ఆహ్వానించారు. తెదేపా బలోపేతానికి కృషి చేస్తున్న శివారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, ఆనందరెడ్డి, ఆనందగౌడ్‌ను అభినందించారు. నాయకులు లింగారెడ్డి, ఇమామ్‌సాబ్, అమరప్ప, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, చౌడప్ప, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా..?

రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా కొందరిలో ఎలాంటి మార్పు రావడం లేదు. పుంగనూరులో ఓ ట్రాక్టరుపై గురువారం పశుగ్రాసం తీసుకు వెళ్తున్నారు. మహిళలు మాత్రం ప్రమాదకరంగా దానిపై కూర్చొని ప్రయాణం చేస్తున్నారు. వాహనం అదుపుతప్పినా, నియంత్రికల వద్ద ఇబ్బందులు ఎదురైనా వారు కిందపడి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.

– న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణం

తిరుపతి వెళ్లాలంటే కష్టమే

పుంగనూరు- తిరుపతి రోడ్డు అధ్వానంగా మారింది. రోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. పాడైన రోడ్డును బాగు చేయకపోవడంతో ఇటీవల వర్షాలకు మరింత దెబ్బతింది. ఈ మార్గంలో వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బాగు చేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పుంగనూరు

ప్రహరీ లేక ఇబ్బందులు

పుంగనూరు మండలంలోని మంగళం పంచాయతీ కృష్ణంరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేదు. దీంతో పశువులు ఆవరణలోకి వచ్చి పరిసరాలు పాడు చేస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. తరగతులు జరుగుతున్న సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. త్వరలో నిర్మాణాలు చేపడతామని ఎంఈవో-2 రెడ్డెన్నశెట్టి చెప్పారు.

– న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణం

సదుం దారి అధ్వానం

సోమల మండలంలోని నంజంపేట- సదుం మార్గంలో గురికానివారిపల్లె చెరువు వద్దనున్న కల్వర్టు అధ్వానంగా మారింది. ఇక్కడ గొయ్యి ఏర్పడటంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో కనీసం గోతులు కనిపించడం లేదని వాహన చోదకులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కల్వర్టు బాగు చేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, సోమల

జిల్లా పేరు మదనపల్లెగా మార్చాలి

మదనపల్లె గ్రామీణం, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా పేరు మదనపల్లెగా మార్చాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణప్ప, నాయకులు సాంబశివ, మురళీ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు అర్జీ సమర్పించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. ఎంతో చరిత్ర కలిగిన మదనపల్లె పేరు కాకుండా, గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన అన్నమయ్య జిల్లాను కొనసాగించడం తగదన్నారు. దీంతో భవిష్యత్తులో జిల్లా కేంద్రం ఉంటుందో, లేదో అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. సీపీఐ నాయకులు ఆంజనేయులు, వెంకటరమణ, గజపతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

బురకాయలకోట మండలం ఏర్పాటుకు డిమాండ్

ములకలచెరువు, న్యూస్‌టుడే: ములకలచెరువు మండలంలోని బురకాయలకోటను మండల కేంద్రంగా ప్రకటించాలని స్థానికులు పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డిని కోరారు. గురువారం కలికిరిలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. బ్రిటిష్ పాలనలో పోలీసు ఠాణా సహా పలు కార్యాలయాలు ఉండేవని చెప్పారు. బురకాయలకోటను మండల కేంద్రం చేస్తే సమీప మండలాల్లోని తుమ్మణంగుట్ట, బండారువాండ్లపల్లి, గొల్లపల్లి, కోటటూరు, ముద్దలదొడ్డి, దేవుళచెరువు, పర్తికోట, వేపూరికోట, మద్దినాయునిపల్లి, సెంట్రల్‌స్కూల్ పంచాయతీలకు అనుకూలంగా ఉంటుందన్నారు. చంద్రశేఖర్, మూర్తిస్వామి, కృష్ణమూర్తి, సీవీ. రెడ్డి, సి.శివరాం రెడ్డి, జి.ఈశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ముంచుతోన్న.. పొగమంచు

పుంగనూరు- మదనపల్లె జాతీయ రహదారిలో కురుస్తున్న పొగ మంచు

పుంగనూరు, న్యూస్‌టుడే: జిల్లాలో కొన్ని రోజులుగా మంచు విపరీతంగా కురుస్తోంది. ప్రజలు చలికి వణుకుతుండగా ఉదయం 9 గంటలు అవుతున్నా పొగ మంచు వీడటం లేదు. రాత్రి వేళల్లో మరింత సమస్యగా మారుతోంది. దీంతో చిన్నారులు, వృద్ధులు ఎక్కువగా అనారోగ్యం బారిన పడుతున్నారు. జిల్లాలోని మదనపల్లె, పుంగనూరు, పీలేరు, రాయచోటి పట్టణాల్లోని ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరుగుతోంది.

రోజుకు 400లకు పైగా ఓపీ..

పుంగనూరు ప్రాంతీయ ఆసుపత్రికి నెల రోజుల క్రితం 300 వరకు ఓపీ ఉండేది. ప్రస్తుతం ఆ సంఖ్య 400 నుంచి 430 మధ్యకు చేరింది. వచ్చే వారిలో ఎక్కువగా గొంతు నొప్పి, శ్వాసకోశ, ఫ్లూ, కఫంతో కూడిన దగ్గు బాధితులు ఉంటున్నారని వైద్యులు చెబుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిపై ఎక్కువ ప్రభావం చూపుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో సైతం 1000 నుంచి 1500 వరకు ఓపీ నమోదు అవుతోంది. దగ్గు, జలుబు, జ్వరం, చర్మం పొడిబారడం, దురద, దద్దుర్లు, అలర్జీ వంటి బాధితుల సంఖ్య ఆసుపత్రుల్లో అధికంగా కనిపిస్తుంది.

జాగ్రత్తలు తప్పనిసరి..

మరో రెండు నెలల పాటు చలి తీవ్రత అధికంగా ఉండే ప్రమాదం ఉంది. పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోకపోతే న్యుమోనియాకు గురవుతారు. శీతల పదార్థాలకు దూరంగా ఉండాలి. వేడి ఆహారం, నీరు తీసుకోవాలి. మంచులో తిరగాల్సి వస్తే మాస్కులు, స్వెట్టర్లు, ఉన్ని దుస్తులు ధరించాలి. అనారోగ్యానికి గురైతే వైద్యులను సంప్రదించాలి.

- డా.మధుసూదనచారి, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, ప్రాంతీయాసుపత్రి, పుంగనూరు.

కొత్త ఏడాదిలో.. ఆలయాల్లో రద్దీ

ములకలచెరువు, న్యూస్‌టుడే: కొత్త సంవత్సరం సందర్భంగా తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రం మల్లయ్యకొండకు భక్తులు పోటెత్తారు. మల్లికార్జున స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ❖ మదనపల్లె అర్బన్: దేవళంవీధిలోని ప్రసన్న వేంకటరమణస్వామిని ఎస్పీ ధీరజ్ దంపతులు దర్శించుకున్నారు. ❖ కల్లూరు, సదుం: పులిచెర్ల మండలంలోని దేవళంపేట లక్ష్మీనరసింహ స్వామి, కాశీవిశ్వేశర స్వామి ఆలయాల్లో రాజంపేట ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి, పుంగనూరు, తంబళ్లపల్లె ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పి.ద్వారకనాథరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్ప పూజలు చేశారు. ❖ రామసముద్రం, పుంగనూరు, నిమ్మనపల్లె: రామసముద్రంలో లక్ష్మీజనార్దనస్వామి, దుర్గాదేవి, వాసవీదేవి, కోదండరామ స్వామి ఆలయాల్లో విశేష పూజలు చేశారు. ❖ పుంగనూరులోని కల్యాణ వెంకటరమణ, కాశీవిశ్వేశ్వరుడు, భోగనంజుండేశ్వరుడు, విరూపాక్షి మారెమ్మ, నిమ్మనపల్లె అభయాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ❖ వాల్మీకిపురం: వీరభద్రగిరి సమీపంలో షిర్డీ సాయినాథుడి ఆలయంలో ప్రత్యేక హారతులిచ్చారు. ❖ సోమల: మండలంలో ఆవులపల్లె, కమ్మపల్లె, నంజంపేట, సోమల, దుర్గంకొండలో, మల్లేశ్వరపురం నెల్లిమంద, కందూరు గ్రామాల్లో వేంకటేశ్వర, శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

లక్ష్మీజనార్దన స్వామికి పూజలు

ప్రత్యేకాలంకరణలో విరూపాక్షి మారెమ్మ

అధికారులకు శుభాకాంక్షలు

మదనపల్లె పట్టణం, ములకలచెరువు, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు మెప్మా ఆర్పీలు గురువారం కలిశారు. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ● కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను జనసేన రాయలసీమ కోకన్వీనర్ దారం అనిత, నాయకులు కలిసి శుభాకాంక్షలు చెప్పారు. కలెక్టర్‌ను టీఎస్‌ఎన్వీ మాజీ ఉపాధ్యక్షుడు కట్టా దొరస్వామినాయుడు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, నాయకులు ఉన్నారు. ● కలెక్టర్ నిశాంత్‌కుమార్, జేసీ ఆదర్శ రాజేంద్రన్‌ను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కలిసి శుభాకాంక్షలు చెప్పారు. కలెక్టర్‌ను తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు కలిశారు. ● మార్కెట్‌యార్డు ఛైర్మన్ జంగాలశివరామ్‌కు కార్యాలయం కార్యదర్శి జగదీశ్, సహాయ కార్యదర్శి అభిలాష్ పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సత్కరిస్తున్న ఆర్పీలు

ఎక్స్ హ్యాక్‌థాన్‌లో ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, అధ్యాపకులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: కురబలకోట మండలంలోని మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎక్స్ హ్యాక్‌థాన్ 2025లో ప్రతిభ చూపి పురస్కారాలు అందుకున్నారని ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్ తెలిపారు. చెన్నైకు చెందిన జెనోవెక్స్ టెక్నాలజీస్ నిర్వహించిన కార్యక్రమంలో సీఎస్‌ఈ (ఏఐ, మిషన్ లెర్నింగ్) విద్యార్థులు మోహన్‌కృష్ణ, వర్ధన్‌కుమార్, షణ్ముఖసాయి, మోహిత్ బృందం రూ.10 వేల నగదు బహుమతి గెలిచినట్లు చెప్పారు. వారిని యూనివర్శిటీ ఫౌండర్, ఛాన్సలర్ విజయభాస్కర్‌చౌదరి, ప్రో ఛాన్సలర్ ద్వారకనాథ్, ఈడీ కీర్తి నాదేళ్ల, విభాగాధిపతి డాక్టర్ ఎస్.పద్మ, అధ్యాపకులు అభినందించారు.

హిందూ సమ్మేళనానికి ఏర్పాట్లు

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రంలో ఈనెల 4న ఉదయం 9 గంటలకు హిందూ సమ్మేళనం సభ నిర్వహించనున్నారు. ఆ ప్రాంగణాన్ని కమిటీ సభ్యులు గురువారం సుందరంగా తయారు చేశారు. హిందువులందరూ సభకు తరలి రావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

మహర్ వీరుల త్యాగం చిరస్మరణీయం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: గోరెగావ్ మహర్ వీరుల త్యాగం చిరస్మరణీయమని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమల సుదర్శన్ అన్నారు. గురువారం అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. 250 మంది మహర్ (మాల) వీరులు 28 వేల మంది పిష్వ సైన్యాన్ని తుదముట్టించినట్లు చెప్పారు. వారి జ్ఞాపకార్థం బ్రిటిష్ వారు మహర్‌మార్కు స్థూపం ఏర్పాటు చేశారన్నారు. నాయకులు మనోహర్, చంద్రయ్య, ఎం.మోహన తదితరులు పాల్గొన్నారు.

మామిడి, వరి పంటలకు నష్టం

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని దేవళంపేట పంచాయతీ దిగువమూర్తివారిపల్లె, చిన్ననగరి గ్రామాల్లో పంట పొలాలపై బుధవారం రాత్రి ఒంటరి ఏనుగు దాడులు చేసింది. రాత్రి 12 గంటల ప్రాంతంలో దిగువమూర్తివారిపల్లెకు చెందిన వెంకటరమణ, శివయ్య పొలాల్లోని 20 మామిడి చెట్ల కొమ్మలు విరిచేసింది. శివయ్య వరి పైరును పూర్తిగా తినేసింది. చిన్ననగరికి చెందిన ఎం.రమణ పొలంలో మామిడి చెట్ల కొమ్మలు విరిచేసినట్లు అటవీ అధికారి మధుసూదన్ తెలిపారు.

పాస్‌పోర్టు దారిపోయినది

షేక్ రఫీ S/o షేక్ అజీజ్ సాహెబ్, D.No:3-169-104, రామారావ్ కాలనీ, మదనపల్లె టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా, A.P. నాకు సంబంధించిన Passport No: U1737125 29-12-2025 తేదీన రామారావ్ కాలనీ నుండి SBI Colony లోకి ఇల్లు మారుస్తున్న సమయంలో దారిపోయినది. ఎవ్వరికైనా దొరికినచో ఈ క్రింది నెంబర్‌కు తెలియజేయగలరు.

Cell: 63039 33941

IN THE COURT OF THE 2ND ADDL. DISTRICT JUDGE, MADANAPALLE

O.E.P. NO: 22/2014
O.S. NO: 90/2012

డిక్రీ హోల్డరు: ఎల్.క్రిష్ణారెడ్డి
జె.డి.ఆర్: పి.వెంకటేశ్వరరావు

NOTICE UNDER ORDER 21 RULE 64, 66 C.P.C.

To,
P.Venkateswara Rao,
S/o P.V.Seshadri Rao,
D.No: 17-465-C-6-1,
Vivekananda Nagar,
Madanapalle Town.

పై కనిన E.P. నందు మీరు హాజరగుటకుగాను 22.1.2026వ తేదీన వాయిదా వున్నది. మీకేమైననూ ఆక్షేపణలు ఉన్న యెడల పై కనిన కోర్టు నందు 22.1.2026వ తేదీన ఉదయము 10.30 గంటలకు మీరు స్వయముగా కాని, మీ తరపు వకీలు ద్వారా కానీ హాజరయి తెలుపుకొనవచ్చును. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

// By order of the court //
శ్రీ ఎం.చైతన్యకుమార్, B.A., B.L.,
శ్రీ పి.వి.ప్రసాద్, B.Com, B.L.,
అడ్వొకేట్స్, మదనపల్లె.

గెలుపొందిన మహిళలకు బహుమతులు ఇస్తున్న డెయిరీ ప్రతినిధులు

పోటీలతో రైతుల్లో ఉత్సాహం

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: పాడి రైతుల్లో ఉత్సాహం నింపేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు శ్రీజ డెయిరీ ప్రాంతీయ మేనేజరు వీరనారాయణరెడ్డి పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం నిమ్మనపల్లె పెద్దదళితవాడలో మహిళలకు ముగ్గుల పోటీలు, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాడి రైతులకు పశు వ్యాధుల నివారణ చర్యల గురించి అవగాహన కల్పించారు. పీఐబీ ఎగ్జిక్యూటివ్ మనోజ్, సూపర్‌వైజర్ హరీష్, సిబ్బంది ఉన్నారు.

కృష్ణమనాయుడు పుట్టినరోజు వేడుకలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: టీకేఎన్ డెవలపర్స్ అధినేత టి.కృష్ణమనాయుడు జన్మదిన వేడుకలు గురువారం జరిగాయి. మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్, సతీమణి సరళ, యశస్విరాజ్ కృష్ణమనాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. జి.కె.నేచర్‌వ్యాలీ బిజినెస్ హెడ్ టి.ఈశ్వర్, కె.హరి, రాజేశ్‌కుమార్, ఉదయ్‌కుమార్, సేతు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, జనసేన నాయకులు రాందాస్‌చౌదరి, సీడ్స్ మల్లికార్జుననాయుడు, భాజపా నాయకులు ఆనంద్, ఏఎంసీ అధ్యక్షుడు శివరామ్ తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

కృష్ణమనాయుడుకు శుభాకాంక్షలు చెబుతున్న మాజీ ఎమ్మెల్యే రమేశ్ దంపతులు

రక్తదానం చేస్తున్న వెల్ విషర్స్ రక్తదాతల సంఘం నాయకులు

అందరూ రక్తదానం చేయాలి

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే: రక్తదానం చేసి ప్రాణాలు నిలపొచ్చని మదనపల్లె ప్రభుత్వాసుపత్రి రక్తనిధి కేంద్రం వైద్యుడు నవీన్ పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా వెల్‌విషర్స్ రక్తదాతల సంఘం నిర్వాహకుడు గిరీష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 65 మంది రక్తదానం చేశారు. వెల్‌విషర్స్ రక్తదాతల సంఘం సభ్యులు విజయభాస్కర్, హేమంత్, భానుప్రకాష్, రామకృష్ణ, హరిబాబు, వంశీ, రెడ్డిశేషు, భాను, లక్ష్మీపతి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పేద రైతులకు సాయం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌కుమార్ కోరారు. గురువారం మదనపల్లెలో నాయకులతో సమావేశమయ్యారు. 'మట్టిని నమ్ముకున్న రైతుకు మన చేయూత' కార్యక్రమం గోడప్రతులు ఆవిష్కరించారు. పేద రైతులకు బహుజన యువసేన ఆర్థికసాయం, ఉచితంగా విత్తనాలు, వ్యవసాయ పరికరాలు ఇస్తుందన్నారు. 96524 23237ను సంప్రదించాలని సూచించారు. జిలానీ, శేఖర్‌రెడ్డి, శశికుమార్, సాయికుమార్, ప్రవీణ్, రాజు, ద్వారక, వెంకటేశ్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న నాయకులు

జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి గుణశేఖర్‌పిళ్లైతో డీడీ రసూల్‌సాహెబ్, ఏడీలు, వైద్యాధికారులు

పశువులకు సకాలంలో వైద్యం

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: పశువులకు అన్ని మండలాల్లో సకాలంలో వైద్యం అందించేలా కృషి చేస్తామని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. మదనపల్లెలో ఏర్పాటైన కొత్త జిల్లా కార్యాలయంలో డీడీ డాక్టర్ రసూల్‌సాహెబ్, ఏడీలు, వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పశువుల ఆరోగ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. ఏడీలు రోహిణి, కల్యాణ్, వెంకటముని, శంకర్‌రెడ్డి, వైద్యులు లారెన్స్, చంద్రలేఖ పాల్గొన్నారు.

(c) eenadu

రాయచోటి

• రాయచోటి • పీలేరు

పేర్లున్నాయ్.. ఊళ్లే లేవ్!

రోడ్డు పక్కన కలిబండ బోర్డు

మీకు తెలుసా?

చిన్నమండెం, న్యూస్‌టుడే: ఆ గ్రామాలకు పేర్లు మాత్రమే ఉన్నాయి.. కాకుంటే ఆ పేరుతో ఊళ్లే లేవు.. ఆయా ప్రాంత ప్రజలను పలకరిస్తే పంచాయతీలోని అన్ని పల్లెలను కలిపి గ్రామంగా పిలుస్తారని చెబుతారు.. ఇవెక్కడో కాదండి.. చిన్నమండెం మండలం కలిబండ, వండాడి గ్రామ పంచాయతీలండి. ఈ రెండు పంచాయతీలు రెవెన్యూ గ్రామాలే. . అయినా ఆ పేర్లతో ఆ పరిధిలో పల్లెలే లేవు. కలిబండ గ్రామ పంచాయతీలో ఏడు పల్లెలు న్నాయి. ప్రధాన రోడ్డు పక్కన కలిబండ అనే బోర్డు ఉంటుంది. కానీ ఆ బోర్డు చూపిన దారిన వెళ్తే వచ్చేది మాత్రం పోలిమేరపల్లె. దీన్నే కలిబండ అని గ్రామస్థులు అంటారు.

✦ వండాడి గ్రామ పంచాయతీలో 16 పల్లెలున్నాయి. అందులో వండాడి మాత్రం లేదు. పంచాయతీ, సచివాలయ కార్యాలయాలు మాత్రం రాయచోటి-మదనపల్లె ప్రధాన రోడ్డులోని కదిరివాండ్లపల్లె బస్టాపు వద్ద ఉన్నాయి. ఈ రెండు గ్రామ పంచాయతీ కేంద్రాలు రెవెన్యూ, ఇతర రికార్డుల్లో మాత్రం కలిబండ, వండాడి పేర్లతోనే ఉంటాయి.

సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తాం

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: కొత్త ఏడాది ప్రారంభం నుంచి సమాజంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేద్దామని తాలూకా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సిద్ధారెడ్డి అన్నారు. గురువారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశ భవనంలో నిర్వహించిన విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనానికి స్థలసేకరణ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. త్వరలోనే కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. స్థలం కేటాయించగానే సంఘానికి సొంత భవనం సమకూరేలా చర్యలు చేపడతామన్నారు. ముందుగా స్థానిక ఎస్టీవో నరేష్‌కు జీవన ప్రమాణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శంకరయ్య, బీవీ రమణ, మస్తాన్‌వలి, నారాయణ, సారథి, శ్రీరాములు, నాగరాజు, రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఎస్టీవోకు వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘ సభ్యులు

రెండు కార్యాలయాలకు ఒకే భవనం

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ఏటా అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు సర్కారు చెబుతున్నా ఇంకా కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు శిథిల భవనాల్లో కొనసాగుతున్నాయి. లక్కిరెడ్డిపల్లె మండల వ్యవసాయ కార్యాలయం శిథిలమవడంతో సిబ్బంది వ్యవసాయ శాఖ సంచాలకుల కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. అధికారులు బయటకు వెళ్లినప్పుడు వారి కోసం వేచి ఉండాలంటే ప్రజలు గంటల తరబడి ఆవరణలో నిల్చోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఎండవానలకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వ పథకాలు, పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలంటే ఎంపీడీవో, వెలుగు కార్యాలయ సభా భవనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదించామని ఏడీఏ జయరాణి తెలిపారు.

నేటి నుంచి గ్రామసభలు

సంబేపల్లె, న్యూస్‌టుడే: రీసర్వే జరిగిన గ్రామాల్లో శుక్రవారం నుంచి 8వ తేదీ వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుబ్రహ్మణ్యరెడ్డి తెలిపారు. ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. గ్రామాల వారీగా సభలు ఇలా.. 2న రౌతుకుంట, 3న సంబేపల్లె, 5న గుట్టపల్లె, 6న నారాయణరెడ్డిపల్లె, 7న గున్నికుంట్ల, 8న గురిగింజకుంట గ్రామ సచివాలయాల్లో ఉ.10.30 నుంచి ఒంటి గంట, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు.

పశువులకు సకాలంలో వైద్యం

మదనపల్లె అర్బన్: పశువులకు అన్ని మండలాల్లో సకాలంలో వైద్యం అందించేలా కృషి చేస్తామని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. మదనపల్లెలో ఏర్పాటైన కొత్త జిల్లా కార్యాలయంలో డీడీ డాక్టర్ రసూల్‌సాహెబ్, ఏడీలు, వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

మామిడి, వరి పంటలకు నష్టం

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని దేవళంపేట పంచాయతీ దిగువమూర్తివారిపల్లె, చిన్ననగరి గ్రామాల్లో పంట పొలాలపై బుధవారం రాత్రి ఒంటరి ఏనుగు దాడులు చేసింది. రాత్రి 12 గంటల ప్రాంతంలో దిగువమూర్తివారిపల్లెకు చెందిన వెంకటరమణ, శివయ్య పొలాల్లోని 20 మామిడి చెట్ల కొమ్మలు విరిచేసింది. శివయ్య వరిపైరును పూర్తిగా తినేసింది. చిన్ననగరికి చెందిన ఎం.రమణ పొలంలో మామిడి చెట్ల కొమ్మలు విరిచేసినట్లు అటవీ అధికారి మధుసూదన్ తెలిపారు.

హిందూ సమ్మేళనానికి ఏర్పాట్లు

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రంలో ఈనెల 4న ఉదయం 9 గంటలకు హిందూ సమ్మేళనం సభ నిర్వహించనున్నారు. ఆ ప్రాంగణాన్ని కమిటీ సభ్యులు గురువారం సుందరంగా తయారు చేశారు. హిందువులందరూ సభకు తరలి రావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

ఇసుకంతా బెంగళూరు, చెన్నైకు

✦ నిర్విరామంగా తరలిస్తున్న మాఫియా

పీలేరు గ్రామీణ, ములకలచెరువు, మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజానీకాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త ఇసుక విధానాన్ని తెచ్చింది. ఇసుక పూర్తిగా ఉచితం చేస్తూ జీవో జారీ చేసింది. అనధికార రీచ్‌ల నుంచి పొక్లెయిన్లు, హిటాచీలతో ఇసుకను మాఫియా తవ్వేస్తోంది. ఆపై టిప్పర్లలో చెన్నై, బెంగళూరుకు రవాణా చేస్తున్నారు. పది యూనిట్ల టిప్పర్ ఇసుకకు రూ.27 వేలు వసూలు చేస్తున్నారు. చెన్నై, బెంగళూరుకు తరలిస్తూ రూ.లక్షల్లో గడిస్తున్నారు.

చక్రం తిప్పుతున్న వైకాపా నేతలు

❖ తంబళ్లపల్లె నియోజకవర్గం సీటీఎం, పీటీఎం మండలం టి.సదుం నుంచి ట్రాక్టర్లు, టిప్పర్లలో చింతామణి, బెంగళూరు నగరాలకు ఇసుక పంపిస్తున్నారు. ఈ దందాలో నియోజకవర్గ పరిధిలోని వైకాపా నాయకులు చక్రం తిప్పుతున్నారు. ❖ మదనపల్లె చిప్పిలి రిజర్వాయర్, ములకలదిన్నె వంక తదితర ప్రాంతాల నుంచి ఇసుక తరలిస్తున్నారు. వాల్మీకిపురం మండలం ఎగువ మంచూరు, ఇగువ మంచూరు, బోగంపల్లె రిజర్వాయర్ నుంచి నిత్యం అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ❖ కలికిరి మండల పరిధిలో ప్రవహించే బహుదానది నుంచి మేడికుర్తి, అద్దవారిపల్లె, గుండ్లూరు, పల్లవోలు, మహల్ గ్రామాల సమీపం నుంచి నిర్విరామంగా ఇసుక తవ్వేస్తున్నారు. ❖ గుర్రంకొండ మండలం మర్రిపాడు, హరిహరరాయ చెరువు, శెట్టివారిపల్లె, హిమాంబేగ్ చెరువు, పసలవాండ్లపల్లె కొండవంక నుంచి నిత్యం ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ❖ కలకడ మండలం బహుదా నది మాండవ్య నది పరివాహక ప్రాంతాల నుంచి నిత్యం ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు.

ఎక్కడెక్కడంటే..

❖ పీలేరు నియోజకవర్గ పరిధిలోని మహల్ ఇసుక రేవు నుంచి టిప్పర్లలో తరలించి డంప్ చేసి.. అమ్ముతున్నారు.

❖ సుండుపల్లె మండలం ఎర్రమనేనిపాళెం, అడిపల్లె, పాళెంగడ్డ ప్రాంతాల నుంచి పీలేరు మీదుగా టిప్పర్లలో నిర్విరామంగా బెంగళూరు, చెన్నైకి ఇసుక తరలిస్తున్నారు.

పీటీఎం మండలంలో తవ్వకాలు

పీలేరు మీదుగా చెన్నై తరలుతున్న టిప్పర్

తలెత్తే సమస్యలివే..

నదీ పరివాహక ప్రాంతాల్లో యంత్రాలతో ఇసుక తోడేయడంతో భూగర్భ జలాల్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫలితంగా వ్యవసాయ బోరుబావులు ఒట్టిపోతున్నాయి. పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల పరిధిలోని నదీ పరివాహక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని పీలేరు తహసీల్దార్ శివకుమార్ వివరణ ఇచ్చారు.

ఎక్స్ హ్యాకథాన్‌లో ప్రతిభ

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: కురబలకోట మండలంలోని మిట్స్ డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎక్స్ హ్యాకథాన్ 2025లో ప్రతిభ చూపి పురస్కారాలు అందుకున్నారని ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్ తెలిపారు. చెన్నైకు చెందిన జెనోవెక్స్ టెక్నాలజీస్ నిర్వహించిన కార్యక్రమంలో సీఎస్ఈ (ఏఐ, మెషిన్ లెర్నింగ్) విద్యార్థులు మోహన్‌కృష్ణ, వర్ధన్‌కుమార్, షణ్ముఖసాయి, మోహిత్ బృందం రూ.10 వేల నగదు బహుమతి గెలిపొందినట్లు చెప్పారు. వారిని యూనివర్సిటీ ఫౌండర్, ఛాన్స్‌లర్ విజయభాస్కర్‌చౌదరి, ప్రో ఛాన్స్‌లర్ ద్వారకనాథ్, ఉపకీర్తి నాదెళ్ల, విభాగాధిపతి డాక్టర్ ఎస్.పద్మ, అధ్యాపకులు అభినందించారు.

మహార్ వీరుల త్యాగం చిరస్మరణీయం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: గోరెగావ్ మహార్ వీరుల త్యాగం చిరస్మరణీయమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలసుదర్శన్ అన్నారు. గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. 250 మంది మహార్ (మాల) వీరులు 28 వేల మంది పీష్వ సైన్యాన్ని తుదముట్టించినట్లు చెప్పారు. వారి జ్ఞాపకార్థం బ్రిటిష్ వారు మహార్ స్థూపం ఏర్పాటు చేశారన్నారు. నాయకులు మనోహర్, చంద్రయ్య, ఎం.మోహన తదితరులు పాల్గొన్నారు.

పదిలో సంపూర్ణ ఉత్తీర్ణతే లక్ష్యం

✦ వంద రోజుల ప్రణాళిక అమలు

చిన్నమండెం ఆదర్శ పాఠశాలలో స్టడీ అవర్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు, ప్రిన్సిపల్

చిన్నమండెం, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. దీంతో పాటు కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రవేశపెట్టిన 'మై స్కూల్.. మై ప్రైడ్' కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలకు ఒక గెజిటెడ్ అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించారు. వీరు ఆయా పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ప్రగతితో పాటు తొమ్మిదో తరగతి విద్యార్థులను పదో తరగతికి సన్నద్ధం చేసేందుకు కృషి చేస్తున్నారు. వంద రోజుల ప్రణాళిక డిసెంబరు ఆరున ప్రారంభం కాగా మార్చి నెల 15న ముగుస్తుంది. విద్యార్థులు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు స్టడీ అవర్ నిర్వహిస్తున్నారు. సెలవు రోజుల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. **గ్రేడ్ల విభజన:** ఇప్పటికే విద్యార్థులను వారి స్థాయిని బట్టి నాలుగు గ్రేడ్లుగా విభజించారు. ఏ, బీ గ్రేడ్లలో ఉన్న విద్యార్థులను షైనింగ్ స్టార్‌గా; సీ, డీ గ్రేడ్లలో ఉండే వారిని రైజింగ్ స్టార్‌గా గుర్తించి వారికి సరిపడా ప్రశ్నపత్రాలతో రోజువారీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వెంటనే పరీక్ష పత్రాలను మూల్యాంకనం చేసి మరుసటి రోజు లీప్‌యాప్‌లో నమోదు చేస్తున్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధనకు తమ వంతు కృషి చేస్తున్నట్లు ఎంఈవో2 ఆంజనేయులు నాయుడు తెలిపారు.

గుర్రంకొండ: చెర్లోపల్లె శ్రీరెడ్డెమ్మ ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

శబ్బాల దినకర్‌కు కేకు తినిపిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

అంబరాన్ని అంటిన సంబరాలు

న్యూస్‌టుడే బృందం: కొత్త ఆశలు, కొంగొత్త ఊసులతో నూతన సంవత్సరంలోకి అడుగు పెట్టిన ప్రజలు అంబరాన్ని అంటేలా సంబరాలు చేసుకున్నారు. యువత కేకులు కోసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ ఏడాది అంతా మంచి జరగాలని ఆలయాల్లో పూజలు చేశారు. ఈ నేపథ్యంలో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పీలేరు నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు జనార్దన్‌గౌడ్ సోదరుడు కామినేని రెడ్డిశేఖర్, గుర్రంకొండ మండల తెదేపా అధ్యక్షుడు నాయిని జగదీష్‌కుమార్‌లు తెచ్చిన కేకులను ఎమ్మెల్యే కోసి అందరికీ పంచారు.

పీలేరులో విశేషాలంకరణలో శ్రీచెన్నకేశవస్వామి

రాయచోటి.. రాకపోకలకు ఏదీ చోటు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణంలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో రహదారులు విస్తరించకపోవడం, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు సాగిస్తుండటం, వాహనాలను ఎక్కడంటే అక్కడ పార్కింగ్ చేస్తుండటం, ట్రాఫిక్ సిగ్నళ్లు పనిచేయకపోవడం వంటివి ఇందుకు ప్రధాన కారణాలు. ఈ క్రమంలో ట్రాఫిక్‌ను నియంత్రించడం పోలీసులకు తలకు మించిన భారమవుతోంది.

నెల రోజులుగా ఇలాగే..

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: పాతరాయచోటిలో శివాలయం వద్ద రహదారి మధ్యలో కాలువపై ఏర్పాటు చేసిన ఇనుప నిర్మాణం దెబ్బతిని పెద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. నెల రోజులుగా ఈ పరిస్థితి నెలకొన్నా ఎవరికీ పట్టడం లేదు. రాత్రి సమయాల్లో ఈ గుంత కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేసున్నారు.

మురుగు సమస్య తీరేదెలా?

గుర్రంకొండ, న్యూస్‌టుడే: గుర్రంకొండ మండలంలోని ఖండ్రిగ పంచాయతీ మగ్బీరాలో మురుగు కాలువలకు మోక్షమెప్పుడోనని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చెత్త పేరుకుపోయి కాలువలు నిండిపోయాయి. పిచ్చిమొక్కలు పెరిగి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. ఈ పంచాయతీ జాతీయ రహదారికి ఇరువైపులా ఉంది. కొంత గుర్రంకొండ పంచాయతీలో ఉన్నా మిగిలిన మూడు వీధులు ఖండ్రిగలో ఉన్నాయి. మురుగు కంపుతో దోమలు, ఈగల ఉద్ధృతి అధికమైంది. ఈ సమస్యను ఎంపీడీవో శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా కార్యదర్శులతో మాట్లాడి కాలువలు శుభ్రం చేయిస్తామని పేర్కొన్నారు.

ఇంకా అదే పేరు.. మారని తీరు

పల్లవోలు (కలికిరి), న్యూస్‌టుడే: ప్రభుత్వం మారి రెండేళ్లు కావస్తున్నా కలికిరి మండలం పల్లవోలులో నిర్మించిన భవన సముదాయంపై వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం అనే కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు సేవ కేంద్రంగా మార్చారు. అయితే పాత పేరునే కొనసాగించడంపై స్థానికుల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి

బండలే విద్యార్థులకు అండ

కలికిరి, న్యూస్‌టుడే: కలికిరి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో దూరప్రాంతాల నుంచి వచ్చి చదువుకునే విద్యార్థులు బస్సుల కోసం వేచి ఉండాలంటే బండలే దిక్కయ్యాయి. సరైన బస్‌షెల్టర్ లేక, నిల్చోవడానికి వసతి లేక జాతీయ మార్గం ఇరువైపుల ఉన్న బండలపై కూర్చొని బస్సుల రాక కోసం ఎదురుచూస్తున్నారు. అధికారులు స్పందించి బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పంట రక్షణకు మూడో కన్ను

చిన్నమండెం, న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. తెగుళ్ల బెడద అటుంచితే అడవి జంతువులు, దొంగల బారి నుంచి రక్షించుకోవడం మరింత కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో పడమటికోన గ్రామం నాగూరివాండ్లపల్లెకు చెందిన రైతు కె.రాజారెడ్డి టమాటా తోటలో రూ.పది వేలు వెచ్చించి సౌర ఫలకంతో పనిచేసే సీసీ కెమెరా ఏర్పాటు చేసి తన చరవాణికి అనుసంధానించుకున్నారు. తోటలో కాయలతో పాటు మోటారు వద్ద కేబుల్, ఇతర తీగలు ఇటీవల చోరీకి గురికావడంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నట్లు సదరు రైతు వివరించారు.

టమాటా తోటలో రైతు రాజారెడ్డి ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

రాయచోటిలో కనిపించని వేడుకలు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలో గురువారం నూతన సంవత్సర వేడుకలు అంతగా కనిపించలేదు. కేకులు, పూల బుకే అంగళ్లలో కొనుగోళ్లు గతంతో పోల్చుకుంటే తగ్గిపోయాయని నిర్వాహకులు తెలిపారు. మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి క్యాంపు కార్యాలయం, రాజంపేట పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడి కార్యాలయం, వైకాపా, కాంగ్రెస్ పార్టీల కార్యాలయాలు ప్రజలు లేక బోసిపోయాయి. నేతలు కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ప్రభుత్వ ఉద్యోగులు కార్యాలయాల తరలింపు పనుల్లో బిజీగా ఉండిపోయారు.

గుడి హుండీల ధ్వంసానికి పడని అడ్డుకట్ట

గాలివీడు, న్యూస్‌టుడే: మండలంలోని గుడులకు దొంగల బెడద అధికమైంది. దేవుడి గుడుల్లో భక్తులు కానుకలు వేసే హుండీలను కొందరు వ్యసనపరులు ధ్వంసం చేసి కానుకలు దోచుకుంటున్నారు. ప్యారంపల్లె పంచాయతీ పెడకంటి కొత్తపల్లిలో వేంకటేశ్వరస్వామి గుడిలో బుధవారం రాత్రి హుండీ చోరీకి గురైంది. దుండగులు దాన్ని ధ్వంసం చేసి సమీపంలో పడేశారు. ఇటీవల నూలివీడు పంచాయతీ బోడసానివాండ్లపల్లి రామాలయంలో హుండీ చోరీకి గురైంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేటు దుకాణంలో ప్రభుత్వ మందులు

మదనపల్లె వైద్యం: ప్రైవేటు దుకాణంలో ప్రభుత్వ మందులు ఉండటంతో ఔషధ నియంత్రణ అధికారి దాదా కలంధర్ గురువారం తనిఖీలు చేపట్టారు. మదనపల్లె ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు మందుల దుకాణంలో మెట్రోజల్ ఉన్నట్లు వైద్యులు గుర్తించి యజమానిని నిలదీశారు. దీంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వాసుపత్రిలోని డ్రగ్‌స్టోర్, ఫార్మసీని పరిశీలించారు. మందుపై ఉన్న సంఖ్య ఆధారంగా విచారణ చేపడతామన్నారు.

విద్యుత్తు సమస్యల పరిష్కారంపై దృష్టి

మదనపల్లె అర్బన్: జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్తు సమస్యలను పరిష్కరించాలని విద్యుత్తుశాఖ ఎస్ఈ కె.సోమశేఖర్‌రెడ్డి ఆదేశించారు. ఈఈ, ఏడీఈ, ఏడీఈలు, సిబ్బంది గురువారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పర్యవేక్షక కార్యాలయ నుంచి ఇకపై పాలన కార్యకలాపాలు సాగుతాయన్నారు. అవసరమైన భవనాల కోసం నివేదిస్తామన్నారు. కరెంటోళ్ల జనబాట కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు వెళ్లి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈఈలు గంగాధరం, ఈశ్వర్‌రెడ్డి, ఏడీఈలు హరికుమార్, సురేంద్రనాయక్, గోవిందురెడ్డి, ఏఈలు, యూనియన్ల నేతలు, సిబ్బంది పాల్గొన్నారు.

బురకాయలకోట మండలానికి డిమాండ్

ములకలచెరువు : ములకలచెరువు మండలంలోని బురకాయలకోటను మండల కేంద్రంగా ప్రకటించాలని స్థానికులు పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డిని కోరారు. గురువారం కలికిరిలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. బ్రిటీష్ పాలనలో పోలీసు ఠాణా సహా పలు కార్యాలయాలు ఉండేవని చెప్పారు. బురకాయలకోటను మండల కేంద్రం చేస్తే సమీప మండలాల్లోని తుమ్మణంగుట్ట, బండారువాండ్లపల్లి, గొళ్లపల్లి, కోటటూరు, ముద్దలదొడ్డి, దేవుళచెరువు, పర్తికోట, వేపూరికోట, మద్దినాయునిపల్లి, సెంట్రల్‌స్కూల్ పంచాయతీలకు అనుకూలంగా ఉంటుందన్నారు. చంద్రశేఖర్, మూర్తిస్వామి, కృష్ణమూర్తి, సీవీ.రెడ్డి, సి.శివరాంరెడ్డి, జి.ఈశ్వర్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ సూచించారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి 31వ తేది వరకు నిర్వహించనున్న 37వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలకు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు. ప్రమాదాల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను సూచించారు. కార్యక్రమంలో రవాణాశాఖ అధికారి ప్రసాద్, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వెలిగల్లు ఉద్యానంలో సందడే సందడి

గాలివీడు సమీపంలోని వెలిగల్లు జలాశయ ప్రకృతి అందాల నడుమ పర్యాటకులు సందడి చేశారు. నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా గురువారం జలాశయం, ఉద్యాన వనాలను కుటుంబ సమేతంగా సందర్శించారు. స్పిల్‌వే గేట్లు, జలకళతో పాటు గేట్ల దిగువన పాపాఘ్ని నది ఒడ్డున వెలిసిన గండిమడుగు క్షేత్రంలో సందర్శకులు కలియ తిరిగారు. పిల్లలు, మహిళలు ఉద్యానంలోని పచ్చని చెట్ల నీడన ఉత్సాహంగా గడిపారు. బంధువులు, స్నేహితులతో విందు భోజనాలు చేశారు. పార్కుల్లో పిల్లలు కేరింతలు కొట్టారు. **- న్యూస్‌టుడే, గాలివీడు**

ఆటోలోనే యంత్రం.. పసుపు సిద్ధం

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: పసుపు.. నిత్యం వంట కూరలతో పాటు పూజల్లో వాడతాం. దుకాణాల్లో కొనే పసుపులో నాణ్యత ఉంటుందో లేదో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం నల్గొండకు చెందిన రైతు గణేష్‌కు వినూత్న ఆలోచన వచ్చింది. ప్రజల ఇంటి వద్దే పసుపు చేసి ఇస్తే పది కాసులు వెనకేసుకోవచ్చని ఆలోచించారు. దాన్ని ఆచరణలో పెట్టాడు. ఒక ఆటో కొనుగోలు చేసి అందులో పిండిమర ఏర్పాటు చేసుకున్నారు. తాను పండించిన పసుపు కొమ్ములతో పాటు మరి కొంత కొని ఆటోలో వేసుకుని ఇంటింటికీ తిరుగుతున్నారు. ప్రజలకు ఆటోలోని పిండి యంత్రంతో కొమ్ములను పుసుపుగా మార్చి అమ్ముతున్నారు. కళ్లముందే పసుపు చేసి ఇస్తుండటంతో ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. గురువారం వాల్మీకిపురంలో రాగా ప్రజలు కొనుగోలుకు ఎగబడ్డారు. పంటను సాగుచేసి బల్క్‌గా అమ్మే కంటే ఇలా పసుపు చేసి ఇస్తుండటంతో ఖర్చులు పోను రోజుకు రూ.2 వేల వరకు ఆదాయం లభిస్తోందని గణేష్ తెలిపారు.

ఆటోలో ఏర్పాటు చేసిన పిండి మిషన్‌తో పసుపు చేస్తూ..

రైతు గణేష్

కార్మికుల కొరత.. కదలని చెత్త

✦ మూడు రోజులకోసారి సేకరణ
✦ రాయచోటి పురపాలికలో అధ్వానంగా పారిశుద్ధ్యం

వార్డులు: 34	నివాసాలు: 31 వేలు
రోజూ ఉత్పత్తయ్యే చెత్త: 57 టన్నులు	
ప్రస్తుతం సేకరిస్తున్న చెత్త: 27 టన్నులు	
వినియోగిస్తున్న వాహనాలు: 19	
పని చేస్తున్న కార్మికులు: 224	
అదనంగా అవసరం: 40 మంది	

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయచోటి పురపాలిక పరిధిలో చెత్త నిర్వహణ అస్తవ్యస్తంగా సాగుతోంది. పేరుకు గ్రేడ్-1 మున్సిపాలిటీ అయినా శాశ్వత, పొరుగు సేవల కార్మికులు; చెత్త సేకరణ వాహనాల కొరత వేధిస్తోంది. వైకాపా హయాంలో క్లాప్ పేరిట పట్టణంలో చెత్త తరలింపునకు 24 నాలుగు చక్రాల ఆటోలను ఓ ప్రైవేటు ఏజెన్సీ నుంచి అద్దె ప్రాతిపదికన పురపాలికకు తెచ్చారు. ప్రతి వాహనానికి నెలకు రూ.52 వేలు అద్దె చెల్లించే వారు. వాహనాల నిర్వహణ కూడా ఆ ఏజెన్సీనే చూసుకునేది. వైకాపా హయాం నుంచే సరిగా అద్దెలు చెల్లించకపోవడంతో ఇటీవల వాటిని ఏజెన్సీ వారు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పురపాలికలో చెత్త సేకరణకు వాహనాల కొరత ఏర్పడింది.

భరించలేని కంపు

వాహనాల కొరత నేపథ్యంలో 27 టన్నుల చెత్త తరలించడం కూడా కష్టమవుతోంది. ఈ క్రమంలో వీధుల్లో మూడు రోజులకోసారి చెత్త సేకరిస్తున్నారు. దీంతో ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోయి వీధులు అపరిశుభ్రంగా మారడంతో పాటు దుర్వాసన వస్తున్నాయి.

సుండుపల్లె రోడ్డులో ఉదయాన్నే చెత్త ఊడ్చుతున్న కార్మికురాలు

ఈ ప్రాంతాల్లో మరీ దారుణం

చెత్త సేకరణకు ప్రతి కార్మికుడికి 400 ఇళ్లను కేటాయించారు. కార్మికులు, వాహనాల కొరత కారణంగా చెత్త తరలింపు సమయానికి జరగడం లేదు. ప్రధానంగా కొత్తపల్లె, ఎన్జీవో కాలనీ, బోసినగర్, మాసాపేట, రవి హాల్ వెనుక వీధులు, కొత్తపేట, శివారు కాలనీల్లో మరీ దారుణంగా ఉంది. నెలల తరబడి కాలువల్లో మురుగు శుభ్రం చేయడం లేదు.

పరికరాలూ లేక..

ఉన్న కార్మికులతో పని చేయించాలన్నా పరికరాల కొరత వేధిస్తోంది. వారికి అవసరమైన పరికరాలను అధికారులు ఇవ్వడం లేదు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

పురపాలికలో పారిశుద్ధ్యం మెరుగుపరిచి, పట్టణం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. సమయానికి చెత్త సేకరణ జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వాహనాలు, సిబ్బంది కొరత లేకుండా చూస్తాం. **- రవి, కమిషనర్**

(c) eenadu

నిధులొస్తేనే.. నిశ్చింత!

- కొమ్మమూరు కాలువకు గండ్లు
- ప్రతిపాదనల్లోనే పటిష్ఠ పనులు

బాపట్ల, న్యూస్‌టుడే

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు వరద ముంచెత్తి కొమ్మమూరు కాలువ కట్టలు కొట్టుకుపోయి వందకు పైగా గండ్లు పడ్డాయి. అనుబంధ కాలువల కట్టలు ధ్వంసమయ్యాయి. వరి పంట తుడిచిపెట్టుకుపోయి అన్నదాతలు నష్టపోయారు. ఇసుక బస్తాలు వేసి తాత్కాలికంగా గండ్లు పూడ్చారు. శాశ్వతంగా పూడ్చేందుకు పటిష్ఠం చేయడానికి రూ.12 కోట్లు అవసరమవుతాయని జలవనరుల శాఖాధికారులు అంచనాలు రూపొందించారు. ఆ ప్రతిపాదనలు ఈఎన్‌సీ వద్దే ఉండిపోయాయి. మార్చిలోగా టెండర్లు పిలిచి ఏప్రిల్ నుంచి పనులు చేపడితేనే వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తయ్యే అవకాశం ఉంటుంది.

కొమ్మమూరు కాలువ గరిష్ఠ నీటి ప్రవాహ సామర్థ్యం 3500 క్యూసెక్కులు. దీని పరిధిలో గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో 2.68 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కాలువ కట్టలు బలహీనంగా ఉండటంతో బాపట్ల, చీరాల సబ్‌డివిజన్‌లోని చివరి ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 2023 డిసెంబర్లో వచ్చిన మిగ్‌జాం తుపాను ప్రభావానికి కాలువ కట్టలు ధ్వంసమయ్యాయి. అప్పటి వైకాపా ప్రభుత్వం మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గండ్లను తాత్కాలికంగా పూడ్చారు.

❖ ఈఎన్‌సీ వద్ద ఉన్న ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించి నిధులు, అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేస్తే ఫిబ్రవరి, మార్చిలో టెండర్లు పిలిచి గుత్తేదారులను ఖరారు చేస్తేనే సకాలంలో పనులు చేయగలుగుతారు. కొమ్మమూరు కాలువకు గరిష్ఠ స్థాయిలో నీరు విడుదల చేయాలంటే వివిధ అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యేలు, కలెక్టర్ పనుల ప్రాధాన్యాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై జలవనరుల శాఖ ఎస్‌ఈ వెంకటరత్నంను సంప్రదించగా కాలువ గండ్లు శాశ్వతంగా పూడ్చే పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపామన్నారు. నిధులు విడుదల కాగానే పనులు చేపట్టడానికి టెండర్లు పిలుస్తామన్నారు.

కట్టలు గండి పడిన ప్రాంతంలో తాత్కాలికంగా వేసిన ఇసుక బస్తాలు

❖ ఏటా భారీవర్షాలు కురిసినప్పుడు కాలువ కట్టలు తెగిపోతున్నాయి. వాటిని పూర్తి స్థాయిలో పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉంది. మార్చి నెలాఖరు వరకు కాలువలో నీరు ఉంటుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలలు పనులు చేయడానికి అవకాశం ఉంటుంది.

పోటా పోటీ

శ్రీకృష్ణ యాదవ యూత్ ఆధ్వర్యంలో చీరాల మండలం బోయినవారిపాలెంలో గురువారం రాష్ట్ర స్థాయి పోలురాధా ఎడ్ల పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ఎడ్ల జతలు పోటీల్లో తలపడగా.. గ్రామస్థులు ఆసక్తిగా తిలకించారు. - న్యూస్‌టుడే, చీరాల

ఉగాదికి.. లాహిరి.. లాహిరిలో..

హౌస్ బోటింగ్‌కు మౌలిక వసతుల కల్పన

బాపట్ల, న్యూస్‌టుడే

పర్యాటక రంగం ఇక కొత్త పుంతలు తొక్కనుంది. పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచే హౌస్ బోటింగ్ ప్రాజెక్టు త్వరలో కార్యరూపం దాల్చనుంది. విజయవాడ సమీపంలోని జి.కొండూరులో పర్యాటక పడవను తయారు చేస్తున్నారు. బాపట్ల మండలం ఆదర్శనగర్ వద్ద పేరలి కాలువ నుంచి నల్లమడ వాగు, ఉప్పుటేరు మీదుగా తూర్పు తుంగభద్ర కాలువలో నిజాంపట్నం హార్బర్ సమీపం వరకు పడవలు తిరిగే మార్గాన్ని ఖరారు చేశారు. హౌస్ బోట్లు నిలపటానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.9 కోట్ల నిధులు కేటాయించింది.

❖ సూర్యలంకకు పర్యాటకులను మరింతగా ఆకర్షించడానికి మూడు హౌస్‌బోట్లు తిప్పేలా ప్రైవేటు ఆపరేటర్లతో పర్యాటక శాఖ ఒప్పందం చేసుకుంది. రాబోయే కొద్ది నెలల్లో ఓ పడవ నిర్మాణం పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. రెండు, మూడు హౌస్ బోట్ల నిర్మాణానికి తూర్పు బాపట్ల, పిన్నిబోయినవారిపాలెం సమీప నల్లమడ వాగు ఒడ్డున స్థలాల్ని కలెక్టర్ వినోద్‌కుమార్ కేటాయించారు. త్వరలో వీటి నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. ఉగాది నాటికి మొదటి హౌస్‌బోటు అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు.

పేరలి కాలువ

రూ.97.52 కోట్లతో అభివృద్ధి పనులు

పేరలి కాలువ, నల్లమడ వాగు కట్టలపై పొగురు వరకు నాలుగు కి.మీ. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, ఆదర్శ నగర్, పొగురు, తుమ్మలపల్లి, నిజాంపట్నం హార్బర్ సమీపంలో నాలుగు ల్యాండింగ్ పాయింట్లలో పడవలు నిలపడానికి జెట్టీల నిర్మాణం, విద్యుత్తు సౌకర్యం కల్పించే పనులు ప్రారంభించనున్నారు. ఇప్పటికే టెండర్ ఖరారు చేశారు. సూర్యలంకలో రూ.97.52 కోట్లతో చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనుల్లో భాగంగా దీనిని చేపడుతున్నారు. బీచ్ ఒడ్డున నిర్మాణాలు ఇటీవలే మొదలుపెట్టి వేగంగా చేస్తున్నారు. దీనికి అనుబంధంగా ప్రముఖ హోటళ్లు, ఆతిథ్య సంస్థలు, పెట్టుబడిదారులు రూ.వందల కోట్లు వెచ్చించి కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.

❖ కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ తీర ప్రాంతం జిల్లాకు గొప్ప వరమన్నారు. సూర్యలంక, పాండురంగాపురం, వాడరేవు, రామాపురం బీచ్‌లు ప్రముఖ పర్యాటక స్థలాలుగా అభివృద్ధి చెందుతాయన్నారు. పర్యాటక జోన్లుగా విభజించి మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. హౌస్‌బోట్ల ప్రాజెక్టు అలెప్పీ తరహాలో పర్యాటకులకు విశేషంగా ఆకట్టుకుంటుందని వివరించారు.

రాజముద్రతో పాస్‌పుస్తకాలు

నేటి నుంచి రైతులకు పంపిణీ

పర్చూరు, మార్టూరు, కారంచేడు, న్యూస్‌టుడే : రైతుల కష్టాలు తీర్చేలా కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. కష్టకాలంలో బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు అన్నదాతలకు ఎంతో కీలకమైన పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించనుంది. వైకాపా ప్రభుత్వ హయాంలో పాస్ పుస్తకాలపై రంగులు ముద్రించడంతో కొందరు రైతులు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యపై దృష్టి సారించింది. రాజకీయాలకు అతీతంగా రైతుల సంక్షేమం ధ్యేయంగా రాజముద్రతో ఈ నెల 2 నుంచి పాస్‌పుస్తకాలు అందించేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధమైంది.

డివిజన్	పుస్తకాలు
చీరాల	31746
బాపట్ల	17516
రేపల్లె	1854
మొత్తం	51116

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో..

భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో ఈ నెల 2 నుంచి 9వ తేదీ వరకు పాస్ పుస్తకాలు పంపిణీ చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతుల భూముల వివరాల్ని ఈ పుస్తకాల్లో నిక్షిప్తం చేసి, భవిష్యత్తులో ఎటువంటి తప్పులు దొర్లకుండా చర్యలు చేపట్టారు. గతంలో మంజూరుచేసిన పాస్‌పుస్తకాల్ని వెనక్కి తీసుకుని గ్రామసభల వేదికగా రైతులకు వీటిని అందించనున్నారు. గ్రామాల్లో సభలు నిర్వహించి అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో అందజేయడంతోపాటు గ్రామ రెవెన్యూ అధికారి పుస్తకాలు పొందిన రైతుల వద్ద నుంచి బయోమెట్రిక్ నమోదు చేసి, రికార్డుల్లో పొందుపరుస్తారు.

బాపట్ల, రేపల్లె, చీరాల డివిజన్ల పరిధిలోని మండల కేంద్రాలకు 51,116 పాస్ పుస్తకాలను ఇప్పటికే పంపించారు. కొన్నినెలలుగా తమ భూములకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేక ఇబ్బందులుపడ్డ రైతులకు వీటి పంపిణీతో మేలు చేకూరే అవకాశముంది. ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం పాస్ పుస్తకాలు అందించనుందని చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. గ్రామసభల ద్వారా వీటిని అందజేస్తామన్నారు.

యంత్ర పరికరాలు వచ్చేశాయ్

ప్రారంభోత్సవానికి సిద్ధం అవుతున్న ఎంసీహెచ్ బ్లాక్

ఈనాడు - అమరావతి

అంచనా వ్యయం: సుమారు రూ.100 కోట్లు

సెల్లార్ సహా అంతస్తులు: జీ+5

మొత్తం పడకలు: 597

గుంటూరు సమగ్ర ప్రభుత్వాసుపత్రిలోని కానూరి-జింకానా మాతా శిశు సంరక్షణ భవనం (ఎంసీహెచ్ బ్లాక్) ప్రారంభోత్సవానికి నెలరోజులే సమయం ఉండడంతో అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నిర్మాణం కొలిక్కి వచ్చింది. విద్యుత్తు సౌకర్యాల కల్పనకు ఆ శాఖవర్గాలు పచ్చజెండా ఊపడంతో పనులు మొదలవుతున్నాయి. ఇందుకయ్యే రూ.15 లక్షలు చెల్లించేందుకు ఆసుపత్రివర్గాలు సిద్ధమైనట్టు సమాచారం. ప్రత్యేక లైను, ట్రాన్స్‌ఫార్మర్ తదితరాల ఏర్పాటుకు విద్యుత్తుశాఖ పచ్చజెండా ఊపినట్టు సమాచారం.

జీజీహెచ్‌లోనే అతి పెద్ద భవనంగా ఎంసీహెచ్ రూపొందుతోంది. ఇక్కడ రూ.27 కోట్ల విలువైన యంత్ర, పరికరాలను సమకూర్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. నియోనటల్ పల్స్ ఆక్సీమీటర్లు, నియోనటల్ వెంటిలేటర్లు, సీటీజీ మిషన్, ఫెటల్ డాప్లర్, సిరంజ్ పంప్స్, బ్లడ్ అండ్ ఫ్లుయిడ్ వార్మర్లు, డబుల్ సర్ఫేస్ ఫొటోథెరపీ, అనస్తీషియా వర్క్‌స్టేషన్ విత్ వాపొరైజర్.. ఇలా మొత్తం 27 రకాల యంత్ర, పరికరాలు, ఫర్నిచర్ సమకూర్చాలని ప్రభుత్వాన్ని కోరగా.. ఇందులో 50 శాతం సామగ్రి చేరింది.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు

ఎంసీహెచ్ బ్లాక్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అదే రోజు గుంటూరు వైద్య కళాశాలలో రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది.

నరసరావుపేటకు చెందిన తిరుమలశెట్టి రఘురామ్ ఆరుపదుల వయసులో అలుపెరగకుండా దేశంలోని వివిధ నగరాలు తిరుగుతూ పురాతన నాణేలు, ఖరీదైన కరెన్సీ నోట్లను సేకరిస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 360కి పైగా దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు, అరుదైన నాణేలు సేకరించి భద్రపరిచారు. ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడి చరిత్ర, సంస్కృతి తెలుసుకుంటున్నారు. ఆయన కొంతకాలం ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేసి, సొంతంగా స్కూలు కూడా నిర్వహించారు. చిన్నప్పట్నుంచే నాణేలను సేకరించడం హాబీగా పెట్టుకున్నారు. బంధువులు, స్నేహితుల వద్ద విదేశీ నాణేలు ఉన్నాయని తెలిస్తే.. అడిగి తీసుకుని భద్రపరిచేవారు. ఒకటి నుంచి 50 పైసల నాణేలు, 2, 5, రూపాయల నోట్లున్నాయి. సీసం, బంగారం, వెండి, రాగి, ఇనుము, కంచు తదితర లోహాలతో తయారు చేసిన నాణేలు కూడా భద్రపరిచారు. ఒకటో శతాబ్దం నుంచి వివిధ రాజ్యాల్లోని పాలకులు వినియోగంలోకి తెచ్చినవి ఉన్నాయి. నేటితరానికి మన చరిత్రను తెలియజేయాలనే లక్ష్యంతో నాణేలను ప్రదర్శిస్తున్నట్లు ఆయన చెబుతున్నారు.

- ఈనాడు డిజిటల్, నరసరావుపేట

రైతేరాజు: నాగులవరం రైతులు.. చెరకులో సిరులు / శనగలో యాజమాన్య పద్ధతులు 6లో

సాగర్ నీటిమట్టం 562 అడుగులు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం సాయంత్రం 7 గంటలకు 562.90 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 15,748 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 6774 క్యూసెక్కులు, సాగర్ కుడి కాలువకు 9500, ఎడమ కాలువకు 8022, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 1812, లోలెవల్ కెనాల్‌కు 300.. మొత్తం 26,637 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

అందరికీ మంచి జరగాలి: కలెక్టర్

బాపట్ల, న్యూస్‌టుడే: కొత్త ఏడాదిలో అందరికీ మంచి జరిగి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టర్ బంగ్లాలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ దంపతులు కేకు కోశారు. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ సంఘాల కాలమానిని, దైనందినిని కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్‌ను జిల్లా అధికారులు కలిసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేయడానికి పుస్తకాలు, పెన్నులు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జేసీ భావన, డీఆర్వో గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేకు కోస్తున్న వినోద్‌కుమార్ దంపతులు

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి: ఎస్పీ

బాపట్ల, న్యూస్‌టుడే: కొత్త ఏడాదిలో రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నియంత్రణ, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారించి పని చేస్తామని ఎస్పీ ఉమామహేశ్వర్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన కేకు కోశారు. గతేడాది జిల్లా పోలీసులు మంచి సేవలందించి సీఎం, డీజీపీ నుంచి ప్రశంసలు అందుకున్నారన్నారు. ఎస్పీని పోలీసు అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీలు రామాంజనేయులు, శ్రీనివాసరావు, మొయిన్, జగదీష్ నాయక్, విజయసారథి పాల్గొన్నారు.

చిన్నారికి కేకు తినిపిస్తున్న ఉమామహేశ్వర్

ఎన్జీవోల సంఘం జిల్లా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

గుంటూరు : ఏపీ ఎన్జీఓల సంఘం జిల్లా ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి కిలారు జగదీశ్వరరావు గురువారం విడుదల చేశారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సహా 17 పోస్టులకు ఈ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 4న నామినేషన్ల స్వీకరణ, 19న ఓటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు వివరించారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు అంతా సిద్ధం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గుంటూరు ఏటుకూరు బైపాస్ రోడ్డులోని శ్రీసత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ ప్రాంగణంలో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో జరగనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు అంతా సిద్ధమైంది. దాదాపు ఆరు వేల మంది కూర్చుని కార్యక్రమాలను చూసేందుకు వీలుగా ప్రధాన వేదికను రూపొందించారు. దీంతో పాటు మరో నాలుగు వేదికలు సిద్ధమయ్యాయి. సభలకు వచ్చే వారి కోసం భోజన వసతి, వివిధ అంగళ్లు, ప్రదర్శనశాలల నిర్మాణాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. సాహిత్య, సాంస్కృతిక, కళాంశాల ఆస్వాదనకు ప్రేక్షకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగినన్ని ఏర్పాట్లు, నిర్వహణలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఇది తెలుగు చేవ అని ప్రపంచానికి తెలియజెప్పేలా కార్యక్రమాలను రూపకల్పన చేశామని పేర్కొన్నారు.

ప్రధాన వేదికను పరిశీలిస్తున్న గజల్ శ్రీనివాస్, ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, పీఆర్ రాజు తదితరులు

ఒక్క క్లిక్.. వందల పుస్తకాల పెట్టు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: వందల సంవత్సరాల కిందట అచ్చయిన పుస్తకాలు, వేల రూపాయల ధర ఉన్నవి, అరుదైనవి కావాలంటే.. ఈ రోజుల్లో పుస్తకప్రియులు కాస్తంత ఇబ్బంది పడుతున్న మాట నిజమే. ఈ కష్టాన్ని పోగొట్టడానికి మూడో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా గుంటూరు సాహితీ సమాఖ్య ఓ వినూత్న, విశిష్ట కార్యక్రమాన్ని చేపట్టింది. నిఘంటు రచయితగా పేరున్న పెద్ది సాంబశివరావు సహకారంతో అందుబాటులో ఉన్న అధునాతన సాంకేతిక సహకారంతో తెలుగు భాష, సంస్కృతుల ప్రచారానికి ఉపకరించేవి, పాఠకుల ఆదరణ పొందిన వందల పుస్తకాలు సేకరించారు. వీటన్నింటినీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఒక 'క్యూఆర్ కోడ్'కు అనుసంధానించారు. ఆ కోడ్‌ను స్కాన్ చేస్తే సంబంధిత వెబ్‌సైట్ తెరుచుకుంటుంది. అందులో పీడీఎఫ్ పద్ధతిలో వివిధ పుస్తకాలు ఉంటాయి. వాటిలో ఏది కావాలో ఎంచుకుని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

క్యూఆర్ కోడ్

'తెలుగు సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఏ స్థాయికి చేరుకుంటుందో తెలియజెప్పేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నాం. ప్రస్తుతం 50 వరకు నిఘంటువులు, గణితం, భాషా సాహిత్యాలకు సంబంధించినవి, పురాణం, వైజ్ఞానికం తదితరాలకు చెందిన 200 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వీటి సంఖ్య మరింత పెంచుతాం' అని ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ (సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి), పెద్ది సాంబశివరావు (నిఘంటు రచయిత) తెలిపారు.

జానపద ఝురులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో తెలుగు జానపద కళావైభవ ప్రదర్శనకు కొంత సమయం కేటాయించారు. కొన్ని కళల ప్రదర్శనలతో పాటు ఆ కళల ఆవిర్భావ వికాసాల విశ్లేషణ కోసం ప్రత్యేక చర్చలు, కార్యశాలలు నిర్వహిస్తున్నారు. సమన్వయకర్త డాక్టర్ చిట్టినేని శివకోటేశ్వరరావు మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రాచీన కాలం నుంచి నేటి వరకు కళలను ప్రస్తుత తరానికి పరిచయం చేయాలన్న లక్ష్యంతో ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు, సభల నిర్వాహకుడు గజల్ శ్రీనివాస్ పర్యవేక్షణలో జానపద కళారూపాలు ఎంపిక చేశారన్నారు. కనుమరుగవుతున్న వీధి భాగోతం, తూర్పు భాగోతం లాంటి వాటికి ప్రాధాన్యం ఇచ్చామన్నారు.

వెనకెళ్తే రంగు పడుద్ది

గ్రానైట్ డస్ట్‌తో నిండి.. దట్టమైన దుమ్ము, ధూళిని ఎగజిమ్ముతూ.. ముందెళ్తున్న, ఎదురొస్తున్న వాహనాలు కనిపించకుండా మారిన దుస్థితిని చూసి పొలాలకు వెళ్లే డొంకరోడ్డను కుంటే పొరపడినట్లే. ఇది రెండు వరుసలుగా అభివృద్ధి చేసిన బీటీ రహదారి. కిలోమీటరు మేరకు వేలాది ఆవాసాలకు నిలయమైన మార్టూరు- బల్లికురవ ప్రధాన రహదారిలోని వివిధ కాలనీలకు చేరుకునే మార్గం. ఓ గ్రానైట్ పరిశ్రమ నుంచి డస్ట్‌ను తరలిస్తున్న ట్రాక్టర్ల ట్రక్కులకు వెనుక తలుపులు లేకపోవడంతో పెద్దఎత్తున దుమ్ము రోడ్డుపై పడిపోతోంది. ముందు వాహనం వెళ్తుంటే వెనుక ప్రయాణించే వారి కళ్లలో దుమ్ము పడుతోంది. ప్రధానంగా మార్టూరు పట్టణంలోని సంపత్ నగర్, సీతాదేవి నగర్, కాకతీయ నగర్ ప్రాంతాల ప్రజలు ఇళ్లలోకి చేరుతున్న గ్రానైట్ దుమ్ముతో అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

4,398 మంది ఉద్యోగులు.. 5,72,154 కుటుంబాలు

బాపట్ల, న్యూస్‌టుడే: భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రామాణికమైన ఏకీకృత కుటుంబ సర్వే (యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే) జిల్లాలో వేగం అందుకుంది. జిల్లాలోని 477 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 4,398 మంది ఉద్యోగులు పాల్గొంటున్నారు. 5,72,154 కుటుంబాల వివరాలు సేకరించాల్సి ఉండగా ఇప్పటివరకు 7,860 కుటుంబాల సర్వే పూర్తి చేశారు.

కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్న ఉద్యోగి

ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో మరణించిన, శాశ్వత వలస వెళ్లిన వారి పేర్లను తొలగిస్తున్నారు. యూఎఫ్ఎస్ సర్వే యాప్‌లో వ్యక్తిగత, కుటుంబ స్థాయి వివరాలు నమోదు చేస్తున్నారు. వ్యక్తిగత ఆధార్ వివరాలు, జనన తేదీ, చరవాణి నంబరు, ఉమ్మడి కుటుంబ స్థాయిలో వివాహ స్థితి, తండ్రి, భర్త పేరు, వారి ఆధార్ నంబర్లు, కులం, మతం, విద్యార్హత, కుటుంబ ఉపాధి, ఆదాయం, ఇంటి పరిస్థితి, తాగు నీరు, మరుగుదొడ్డి, అంతర్జాలం, ఎల్పీజీ కనెక్షన్, వాహనాలు, ఆస్తులు ఇతర వివరాలు నమోదు చేస్తున్నారు. సాంకేతిక సమస్యలతో మొదట్లో సర్వే కాస్తంత నెమ్మదించింది. త్వరితగతిన సర్వే పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

కిరణం ప్రసరించదు సంగీతం వినిపించదు

నిరుపయోగంగా రూ.4 కోట్లతో నిర్మించిన లేజర్ షో

ధరణికోట, అమరావతి, న్యూస్‌టుడే: పర్యాటకులకు కనువిందు, ఆహ్లాదం పంచేందుకు అమరేశ్వర ఘాట్‌లో ఏర్పాటుచేసిన లేజర్ షో మూణ్నాళ్ల ముచ్చటే అయ్యింది. 2018లో సుమారు రూ.4 కోట్లతో ఏర్పాటుచేసిన ఫౌంటేన్ ద్వారా పైకి లేచిన నీటిపై తెరలాగా ఏర్పడి ఛాయాచిత్రాలు ప్రదర్శితమవుతాయి. ఆ షోలో అమరావతి విశేషాలు, బుద్ధుని జీవిత చరిత్ర, అమరేశ్వరాలయ ప్రాముఖ్యత తెలిపేలా రూపొందించారు. ఆహ్లాదకర వాతావరణంలో శ్రావ్యంగా ఉండే సంగీతంతో ఈ లేజర్ షో పర్యాటకులను రెండు నెలలపాటు అలరించింది. తర్వాత కృష్ణానది వరదలతో కొంత మేర సామగ్రి కొట్టుకుపోయింది. పకడ్బందీగా నిర్మాణం చేపట్టాల్సిన గుత్తేదారు మొక్కుబడిగా చేసి చేతులు దులుపుకొన్నారన్న విమర్శలొచ్చాయి. వరద వచ్చినప్పుడల్లా షోకు అంతరాయం ఏర్పడటంతో పూర్తిగా నిలిపేశారు. ఆ సామగ్రిని థీమ్ పార్కులో ఏర్పాటు చేశారు. అక్కడ నిర్మాణం చేపట్టి నాలుగేళ్లు పూర్తయినా ఒక్క షో కూడా వేయలేదు. రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన లేజర్ షో ఉపయోగం లేకుండా పోయిందని, ప్రజాధనం అంటే పాలకులకు లెక్కలేక పోవడం వల్లనే ఈ దుస్థితి వచ్చిందని పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

వృథాగా పరికరాలు

అమృతమూర్తికి అశ్రుతాంజలి

జననం : 01-07-1937

మరణం : 24-12-2025

కీ॥శే॥ శ్రీమతి డా॥ వీరగంధం సువర్ణ పద్మావతి గారు

పద్మావతి సూపర్ స్పెషాలిటి హాస్పిటల్, కొత్తపేట, గుంటూరు.

నీ జ్ఞాపకాల మధుర స్మృతులే మాకు నిత్య స్మరణీయం.. బాధాతప్త హృదయాలతో...

భర్త : డా॥ వీరగంధం వెంకట సుబ్బారావు

కుమారుడు - కోడలు : డా॥ VSV. రమేష్ - డా॥ PV. సుమన్

మనుమరాండ్రు, మనుమడు : V.శృతి, V.ప్రీతి, V.కృష్ణ

కుమార్తె - అల్లుడు : డా॥ YS.లక్ష్మి - డా॥ Y.శ్రీనివాస్

మనుమడు : డా॥ Y.విజయ్-డా॥ Y.విద్య

మనుమరాలు : డా॥ స్వాతి - మాధ్యూ

ముని మనుమలు, ముని మనుమరాలు : Y.లక్షికృష్ణ, Y.మీరాపార్వతి, జోసఫ్ రవి, క్రిష్టఫర్ నిఖిల్

సంస్మరణ సభ : ది.03-01-2026 శనివారం మధ్యాహ్నం 12 గంటలకు 'V' కన్వెన్షన్, గుజ్జనగుండ్ల, పలకలూరు రోడ్, గుంటూరు నందు జరుగును. కావున తెలియపరచడమైనది. సెల్ : 9963192709

(c) eenadu

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

కేకు కోస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ దంపతులు

బాపట్ల, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో కొత్త ఏడాది వేడుకల్లో కృష్ణప్రసాద్ దంపతులు కేకు కోశారు. ఎంపీని అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందజేశారు.

నూరు శాతం చెత్త సేకరించండి

జెండా ఊపి ఈ-ఆటోలు ప్రారంభిస్తున్న కలెక్టర్

బాపట్ల, న్యూస్‌టుడే: గ్రామాలు, పట్టణాల్లో ప్రతి ఇంటి నుంచి నూరు శాతం చెత్త సేకరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా జిల్లాకు తొలి విడతగా కేటాయించిన ఎనిమిది ఈ-ఆటోలను కలెక్టరేట్లో గురువారం ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సేకరించిన చెత్తను డంపింగ్ కేంద్రాలకు తరలించేందుకు చీరాల, బాపట్ల, పర్చూరు, చెరుకుపల్లి, నగరం, కర్లపాలెం, కొరిశపాడు, అద్దంకి మండలాలకు ఈ-ఆటోలను కేటాయించినట్లు పేర్కొన్నారు. డీపీవో ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఐజీని కలిసిన ఎస్పీ

బాపట్ల: గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ఆయన కార్యాలయంలో ఎస్పీ ఉమామహేశ్వర్ గురువారం మర్యాదపూర్వకంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను ఐజీకి వివరించారు. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాను ఎస్పీ ఉమామహేశ్వర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అమరావతిలో ఇంటెలిజెన్స్ అదనపు డీజీ మహేష్ చంద్ర లడ్డాను ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అంబరాన్ని అంటిన సంబరాలు

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా నిర్వహించారు. కళాశాలలో విద్యార్థులకు కేకులు కోసి నృత్యాలు చేశారు. సూర్యలంక, కొత్త వాడరేవు బీచ్‌లలో హోటళ్లు, రిసార్టులలో సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భారీగా బాణాసంచా కాల్చారు. కేరింతలు కొడుతూ కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. జిల్లా ప్రజలకు ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో జిల్లాను ప్రగతి పథంలో నడిపి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు అన్నం సతీష్ ప్రభాకర్ గృహంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల కాలమాని, దైనందినిని ఆవిష్కరించారు. బీఈఎస్ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు, జనసేన సమన్వయకర్త శివనారాయణ, భాజపా జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు పార్టీ నేతలతో కలిసి కేకులు కోసి సందడి చేశారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్

ఖేలో ఇండియా బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపిక

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం బీకే స్పోర్ట్స్ క్లబ్‌కు చెందిన కబడ్డీ క్రీడాకారులు జి. లక్ష్మణ్, కె. వెంకటేశ్‌లు కబడ్డీ జాతీయ పురుషుల జట్టుకు ఎంపికయ్యారని ఆ క్లబ్ అధ్యక్షుడు, అంతర్జాతీయ బీచ్ కబడ్డీ క్రీడాకారుడు ఎం. గిరిబాబు తెలిపారు. క్రీడాకారులిద్దరూ ఈ నెల 5 నుంచి జరిగే జాతీయ స్థాయి ఖేలో ఇండియా బీచ్ గేమ్స్ (2వ ఎడిషన్) కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ పోటీలకు శాప్ ఆధ్వర్యంలో డిసెంబరు 19న రాష్ట్ర స్థాయిలో ఓపెన్ సెలక్షన్ ట్రయల్స్ విజయవాడలో నిర్వహించారు. దీనిలో జి. లక్ష్మణ్, కె. వెంకటేశ్‌లు చూపిన క్రీడా ప్రతిభ ఆధారంగా రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. విశాఖపట్నంలో గత డిసెంబరు 24 నుంచి జనవరి ఒకటి వరకు నిర్వహించిన శిక్షణలో క్రీడాకారులు లక్ష్మణ్, వెంకటేశ్ పాల్గొన్నారని గిరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా గిరిబాబు, క్లబ్ ప్రతినిధులు గురువారం వీరిని అభినందించారు.

లక్ష్మణ్

వెంకటేశ్

8న గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సిన్ ఉచిత శిబిరం

సమావేశంలో ఎంసీఏ, ఐఎంఏ ప్రతినిధులు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె మెడికల్ కల్చరల్ అసోసియేషన్ (ఎంసీఏ) హాల్లో ఈ నెల 8 ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గర్భాశయ క్యాన్సర్ వాక్సిన్ ఉచిత శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ఎంసీఏ హాల్లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 9 నుంచి 16 ఏళ్ల బాలికలకు రూ.4 వేల ఖరీదైన వాక్సిన్ ఉచితంగా వ్యాక్సిన్ అందజేస్తారన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ కృషితో ఇంటర్నేషనల్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గుంటూరు రోటరీ క్లబ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పర్యవేక్షణలో వెయ్యి మందికి మొదటి డోసు వేస్తారని, ఆరు నెలల తరువాత రెండో డోసు అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేపల్లె ఐఎంఏ, ఎంసీఏ ప్రతినిధులు వసంతం వీరరాఘవయ్య, ఎన్‌బీ రాజేంద్రప్రసాద్, పర్చూరు శ్రీనివాసరావు, రత్నాకర్, రమేష్, సుబ్బారావు, రామకృష్ణ తదితరులున్నారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

రోడ్డు ప్రమాదాలతో వీధిన పడుతున్న కుటుంబాలు

బాపట్ల: రోడ్డు ప్రమాదాల్లో సంభవిస్తున్న మరణాలతో ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల కరపత్రాలు, ఫ్లెక్సీలను ఆయన గురువారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నెల రోజుల పాటు రోడ్డు భద్రతపై విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలను పూర్తిగా నివారించడమే లక్ష్యంగా పోలీసు, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్, వైద్య ఆరోగ్య, ఆర్టీసీ, పంచాయతీరాజ్, రవాణా శాఖ అధికారులు కలిసి సమన్వయంతో పని చేయాలని సూచించారు. డీటీవో పరంధామరెడ్డి, డీఎంహెచ్‌వో విజయమ్మ, డీఎస్పీ జగదీష్ నాయక్, ఆర్అండ్‌బీ ఈఈ నళిని, పంచాయతీరాజ్ ఎస్ఈ రాజన్‌బాబు, డీఎం గురవారెడ్డి, ఎన్‌హెచ్ అధికారులు పాల్గొన్నారు.

నాగులవరం రైతులు.. చెరకులో సిరులు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: చెరకు పంట కర్షకుడికి కాసులు కురిపిస్తోందని నిరూపిస్తున్నారు వినుకొండ మండలం నాగులవరం రైతులు. గ్రామానికి చెందిన చిలకల సుబ్బారెడ్డి 22 ఏళ్లుగా సాగుచేస్తూ దిగుబడులు సాధిస్తున్నారు. గ్రామంలో మరో 20 మంది వరకు సుమారు 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఒకటిన్నర ఎకరాలో సాగు చేసినట్లు సుబ్బారెడ్డి తెలిపారు. మొదటి సంవత్సరం కాస్త పెట్టుబడి ఎక్కువగా ఉంటుందని, మూడేళ్ల పాటు తక్కువ పెట్టుబడితో పంట వస్తుందన్నారు. పంట వేసేందుకు, దుక్కి దున్నేందుకు, బోదెలు చేయడం, విత్తనం నాటేందుకు, ఎరువులు, నీటి తడులు, కలుపు నివారణ చర్యలు, ఆకు విరవడం, చెరకు కొట్టడం, రవాణా ఇతర ఖర్చులు.. అన్నీ కలిపి కూలీలు, ఎరువుల ధరల ఆధారంగా ఎకరాకు సుమారు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి అవుతుందన్నారు. అన్నీ అనుకూలిస్తే ఎకరాకు రూ.3 లక్షల వరకు పంట వస్తుందని, ఖర్చులు పోను రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల మధ్య మిగులుతుందని చెప్పారు. వరికి ప్రత్యామ్నాయంగా లాభదాయకమన్నారు. కూలీల కొరతను అధిగమించవచ్చని, యాంత్రీకరణ ఉపయోగించవచ్చన్నారు. సొంత పొలంతో పాటు మరి కొంత కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నానని సుబ్బారెడ్డి తెలిపారు. చెరకు కోతకు రాగానే వ్యాపారులకు అమ్మితే ఒకేసారి డబ్బులు వస్తాయి.. కానీ లాభం తగ్గుతుంది. 10 చెరకులు చొప్పున కట్టలుగా కట్టి జనవరి నుంచి గ్రామాల్లో జరిగే తిరునాళ్లు, జాతరల్లో అమ్మితే ఎక్కువ ధరకు అమ్ముకోవడంతో అధికంగా మిగులుతాయి. కర్ర సైజు పెరిగి లావు ఊరితే పెట్టుబడులు పోను ఎకరాకు రూ.2 లక్షల వరకు మిగులుతాయని వివరించారు.

చెరకు తోట వద్ద సుబ్బారెడ్డి

ఆరేళ్లుగా.. శనగ.. ఎర్రజొన్న సాగుతో లాభాలు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం మండలం గొనసపూడి గ్రామానికి చెందిన మానం సుబ్బారావు వయసు 65 ఏళ్లు. 45 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. ప్రకృతి పరంగా, ఇతర కారణాల వల్ల వచ్చే ఒడుదొడుకులను ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారు.. మండలంలో పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం 15 ఎకరాల శనగ, 12 ఎకరాల్లో ఎర్రజొన్న సాగు చేస్తున్నారు. తనకున్న పొలంతో పాటు మరో 12 ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. శనగ, ఎర్రజొన్న నెల రోజుల పైర్లుగా ఉన్నాయి. ఎకరం భూమిని రూ.17 వేలకు కౌలుకు తీసుకున్నారు. ఎర్రజొన్న మూడు నెలల 15 రోజులు పంట కాలం కాగా శనగ 80 రోజుల పంట కాలం. ఎకరం శనగ పొలానికి కౌలు ఇతర ఖర్చులు కలిపి రూ.35 వేలు కాగా దిగుబడి ఎనిమిది క్వింటాళ్లు వచ్చి రూ.55 వేల ఆదాయం వస్తుందని సుబ్బారావు తెలిపారు. అన్ని ఖర్చులు పోగా ఎకరానికి రూ.20 వేలు వస్తుందన్నారు. ఎకరం ఎర్రజొన్నకు కౌలు తదితర ఖర్చులు కలిపి రూ.30వేలు వ్యయం కాగా రూ.55 వేల నుంచి రూ.60 వేలు వస్తుందని తెలిపారు. అన్ని ఖర్చులు పోగా రూ.30 వేలు మిగులుతుందని చెప్పారు. గతంలో వరి, సోయాబీన్, కంది, మినుము, పెసర పంటలు సాగు చేసినట్లు వివరించారు. ప్రస్తుత కాల పరిస్థితులు దృష్ట్యా లాభసాటిగా ఉందని శనగ, ఎర్రజొన్నను ఆరేడు సంవత్సరాల నుంచి సాగు చేస్తూ లాభాలు పొందుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ వారు 2018లో సుబ్బారావును ఆదర్శ రైతుగా ఎంపిక చేసి, సత్కరించారు.

శనగ పైరు వద్ద రైతు సుబ్బారావు

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ రాయితీ

మార్టూరు, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోంది. జాతీయ నూనె గింజలు, పామాయిల్ (ఎన్ఎంఈవో) పథకం కింద రైతులకు పామాయిల్ మొక్కలు ఉచితంగా అందించడంతో పాటు ఒక హెక్టారుకు రూ.5,250, అంతర పంటల కింద రూ.5,250 చొప్పున నాలుగేళ్లకు రూ.42వేల రాయితీ అందిస్తోంది. ఈ పథకం కింద పేర్లు నమోదు చేసుకున్నవారికి సాగుపై ఎప్పటికప్పుడు అధికారులు సూచనలు చేస్తున్నారు. దీంతో మార్టూరు మండలం జంగమహేశ్వరపురం, జొన్నతాళి, ఇసుకదర్శి ద్రోణాదుల, నాగరాజుపల్లి గ్రామాల్లో 60 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. రైతులను వాణిజ్యపరంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం మార్టూరులో ఆయిల్‌పామ్ సాగుకు శ్రీకారం చుట్టిందని ఉద్యాన శాఖాధికారి బి. హనుమంత్‌నాయక్ తెలిపారు.

నల్ల తామర పురుగును నియంత్రిద్దాం

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: లాభదాయకమైన పంటల్లో మిరప ఒకటి ఈ తోటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభాలు ఖాయమని చెబుతున్నారు పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు. మిరప సాగులో నల్లతామర పురుగు ఆశిస్తే దిగుబడి భారీగా తగ్గించే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఎకరానికి 40 చొప్పున జిగురు అట్టలు ఏర్పాటు చేయాలి. వేప కషాయం 5 శాతం ఎకరాకు లీటరు చొప్పున పిచికారీ చేయాలి. వారం రోజుల తరువాత స్పైనోసాడ్ 0.3మి.లీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి చల్లాలి. అక్కడక్కడ బంతి మొక్కలు తోట చుట్టూ మొక్కజొన్న రెండు వరుసల్లో పెంచితే సత్ఫలితం ఉంటుందని చెప్పారు.

శనగలో యాజమాన్య పద్ధతులు

పర్చూరు, కారంచేడు, న్యూస్‌టుడే: శనగలో ప్రస్తుతం ఎండుతెగులు, వేరుకుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉంది. రైతులు ఎక్కువగా జేజీ 11, కేఏకే2 రకాలు సాగుచేస్తున్నారు. ప్రస్తుతం పంట ఎదుగుదల దశ నుంచి పూత దశకు చేరుకోవడంతో పంటపై రైతులు జాగ్రత్తలు పాటించాలి. ఎండుతెగులు, వేరుకుళ్లు తెగులు, తుప్పు తెగులు నివారణకు రైతులు తప్పనిసరిగా వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని పర్చూరు ఏడీఏ జీబీపీ ప్రవీణ తెలిపారు.

ఎండు తెగులు ఆశించకుండా చర్యలు

నేలలో ట్రైకోడెర్మావిరిడి అభివృద్ధి చేసే విధానం ద్వారా తెగులును నివారించవచ్చు. బాగా మాగిన పశువుల ఎరువు 90 కిలోలు, ట్రైకోడెర్మావిరిడి 2కిలోలు, వేపపిండి 10కిలోలు చొప్పున కలుపుకొని మిశ్రమాన్ని ఆరు అంగుళాల మందం ఉండేలా ఒక బెడ్‌లా వేసుకుని, ప్రతి రోజూ నీరు చల్లాలి. 15రోజుల తర్వాత ట్రైకోడెర్మావిరిడి అభివృద్ధిచెంది ఎరువుగా మారుతుంది. ఎక్కడైతే ఎండుతెగులు, వేరుకుళ్లు తెగులు ఆశించి మొక్కలు చనిపోతాయో అక్కడ విత్తబోయే ముందుగా పొలంలో ఈ ఎరువును చల్లుకోవడం ద్వారా మట్టి ద్వారా సంక్రమించే తెగులు శిలీంద్రాన్ని అరికట్టవచ్చు. దుక్కులు లోతుగా దున్నుకోవడంతో పాటు పంటమార్పిడి, విత్తనశుద్ధికి రైతులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాములు లేదా కార్బండిజమ్ ఒక గ్రాము లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లల్లో పోయాలి.

తుప్పు తెగులు నివారణ ఇలా..

శనగ పైరు పక్వాని దశలో తుప్పుతెగులు ఆశించే అవకాశం ఉంది. ఆకులపై గుండ్రని చిన్న గోదుమ రంగు పొక్కులు ఏర్పడితే వెంటనే గుర్తించాలి. లేని పక్షంలో మొక్కలు పక్వానికి రాకముందే ఎండిపోతాయి. చల్లని వాతావరణం ఈ తెగులు వ్యాప్తికి దోహదపడుతుంది. నివారణకు హెక్సాకొనజోల్ 2ఎం.ఎల్ లేక ప్రొపికొనజోల్ 1ఎం.ఎల్ లేక ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ టెబుకొనజోల్ 0.8గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.

గ్రామీణ క్రీడలు సంప్రదాయాలకు ప్రతీకలు

బోయినవారిపాలెం (చీరాల), న్యూస్‌టుడే: గ్రామీణ క్రీడలు సంప్రదాయాలకు ప్రతీకలని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటితరంపై ఉందని ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య అన్నారు. స్థానికంగా శ్రీకృష్ణ యాదవ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోలురాధా ఎడ్ల పోటీలను గురువారం నిర్వహించారు. వీటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన అభివృద్ధిలో భాగమైన ఎడ్ల పౌరుషానికి, సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచే ఈ పోటీలు మన గ్రామీణ వాతావరణంలో ఒక భాగమన్నారు. ఆధునిక కాలంలోనూ ఈ సంప్రదాయం మరవకుండా కొన్నేళ్లుగా పోలురాధా ఎడ్ల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పోటీలు జరగ్గా తిలకించేందుకు పెద్దసంఖ్యలో గ్రామస్థులు హాజరయ్యారు. ఏఎంసీ ఛైర్మన్ కె.జనార్దన్, పీఏసీఎస్ ఛైర్మన్ కోటి మోహన్, బోయిన కేశవులు, బాలాజీ, సుబ్బారావు, శ్రీను, పవన్, నాగేంద్రబాబు, అనిల్, సారథి, దిలీప్ పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

పేదలకు ఆహార భద్రత

మహిళకు గోధుమ పిండి అందజేస్తున్న జేసీ భావన

బాపట్ల, న్యూస్‌టుడే: పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు ప్రభుత్వం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తోందని జేసీ భావన అన్నారు. పట్టణంలో తెల్ల రేషన్ కార్డుదారులకు గోధుమ పిండి పంపిణీని ఆమె గురువారం ప్రారంభించారు. రైలుపేటలోని రేషన్ దుకాణంలో మహిళలకు గోధుమ పిండి ప్యాకెట్లు అందజేశారు. జేసీ రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కిలో గోధుమ పిండిని రూ.20లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్‌వో జమీర్‌బాషా, డీఎం శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

అప్పు చెల్లించాలని కోరిన వృద్ధురాలిపై దౌర్జన్యం

కొల్లూరు, న్యూస్‌టుడే: అప్పుగా ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వమని అడిగిన వృద్ధురాలిపై దౌర్జన్యానికి పాల్పడుతున్న ఘటనపై గురువారం కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. కొల్లూరుకు చెందిన సూరపనేని రాజేశ్వరి రెండు సంవత్సరాల క్రితం భర్త చనిపోవడంతో వయో వృద్ధురాలైన బాధితురాలు తన నివాసంలో ఒంటరిగా ఉంటోంది. వేరొక చోట నివాసం ఉంటున్న ఆమె కుమారుడు, కుమార్తెలు పోషణ, వైద్యఖర్చుల నిమిత్తం దఫదఫాలుగా ఇచ్చిన సొమ్ములో రూ.17 లక్షలు ఆమె వద్ద ఉన్నాయి. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన గూడూరు శ్రీనివాసరావుకు వ్యాపారం నిమిత్తం ఆమె వద్ద ఉన్న రూ. 17 లక్షలు మధ్యవర్తుల సమక్షంలో అప్పుగా తీసుకున్నారు. కొన్ని నెలల కిందట మొత్తం అప్పులో రూ. 6 లక్షలు తిరిగి చెల్లించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆమె వైద్యఖర్చుల నిమిత్తం మిగిలిన రూ. 11 లక్షలు తిరిగి ఇవ్వాలని కోరింది. తొలుత అప్పుడు ఇస్తాం, ఇప్పుడు ఇస్తాం అని వాయిదాలు వేస్తూ కాలం గడుపుతూ వచ్చాడు. ఫోర్జరీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు ఇచ్చి తనను నిందితులు మోసగించారని కొద్ది రోజుల క్రితం గుర్తించిన ఆమె తన బాకీ సొమ్ము తక్షణమే చెల్లించాలని పట్టు పట్టింది. దీంతో కుటుంబ సభ్యులు బాకీ చెల్లించేది లేదంటూ దుర్భాషలాడుతూ పలుమార్లు ఆమెపై దౌర్జన్యానికి దిగారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు శ్రీనివాసరావు, భార్య శ్రీవిద్య, కుమారులు తరుణ్ సాయి, నితీష్‌లపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, రిటైల్ ధర - 179, చికెన్ విత్‌స్కిన్ - 260, చికెన్ స్కిన్‌లెస్ - 295.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -147 రిటైల్ ధర 174 చికెన్ విత్ స్కిన్ - 252, చికెన్ స్కిన్‌లెస్ - 287.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 162, 171, 183 చికెన్ విత్ స్కిన్ - 314 చికెన్ స్కిన్‌లెస్ - 324.

జవాన్ భావనారాయణరెడ్డికి కన్నీటి వీడ్కోలు

చినగంజాం, న్యూస్‌టుడే: మండలంలోని మూలగానివారిపాలెం గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ మున్నం భావనారాయణరెడ్డి అంత్యక్రియలు గురువారం జరిగాయి. 63వ బెటాలియన్‌కు చెందిన భావనారాయణరెడ్డి బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో భారత్- బంగ్లాదేశ్ సరిహద్దు వద్ద విధుల్లో ఉండగా ఈ నెల 30న మృతిచెందారు. భావనారాయణరెడ్డి భౌతికకాయాన్ని బీఎస్ఎఫ్ జీడీ రామచంద్రప్ప, సిబ్బంది బుధవారం అర్ధరాత్రి చినగంజాంకు ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చారు. గురువారం ఉదయం బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, యువకుల ఆధ్వర్యంలో చినగంజాం పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి గ్రామంలో ఊరేగింపుగా భౌతికకాయానికి అంతిమ యాత్ర నిర్వహించారు. అనంతరం మూలగానివారిపాలెం శ్మశానంలో బీఎస్ఎఫ్ సిబ్బంది గాడ్‌ఆఫ్‌ఆనర్‌తో దహన సంస్కారాలు చేశారు. భౌతికకాయం వద్ద చినగంజాం తహసీల్దార్ జె. ప్రభాకరరావు నివాళులర్పించారు. యువకులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జవాన్ భావనారాయణరెడ్డి భౌతికకాయం వద్ద గాడ్ ఆఫ్ ఆనర్ నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లు

శతాధిక వృద్ధురాలి జన్మదినోత్సవం

బామ్మకు వందనం

కారంచేడు, న్యూస్‌టుడే: శతాధిక వృద్ధురాలు నక్కల సుబ్బమ్మ జన్మ దినోత్సవాన్ని గురువారం కుటుంబ సభ్యులు నిర్వహించారు. కారంచేడు మాస్కో బజారుకు చెందిన సుబ్బమ్మకు ప్రస్తుతం వందేళ్లకు పైగా ఉంటాయని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఆమె జన్మించిన తేదీ తెలియకపోవడంతో ఆధార్‌లో నమోదైన రోజునే వేడుక చేశారు. ఈమె భర్త వెంకటస్వామి గతంలోనే మృతి చెందారు. వీరికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె వయసు 80 ఏళ్లు. మనవళ్లు, ముదిమనవళ్లతో కలిసి ఆమె కేకు కోశారు. నూతన సంవత్సరం, సుబ్బమ్మ జన్మ దినోత్సవం ఒకేరోజు కావడంతో సందడి వాతావరణం నెలకొంది.

ముదిమనవళ్లతో కలిసి వేడుక చేసుకుంటున్న సుబ్బమ్మ

జాతీయ వాలీబాల్ పోటీల రిఫరీగా రాజేష్

వినుకొండ, న్యూస్‌టుడే: వినుకొండకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు కాకుమాను రాజేష్ జాతీయ వాలీబాల్ పోటీలకు రిఫరీ (టెక్నికల్ అఫీషియల్)గా నియమితులయ్యారు. ఈ నెల 5 నుంచి 9 వరకు కడప జిల్లా దేవగుడిలో అండర్-14 బాలికల జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లా నుంచి రాజేష్ ఒక్కరికే ఈ అవకాశం లభించింది. ప్రస్తుతం ఆయన యడ్లపాడు మండలం ఉన్నవ జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి దుర్మరణం

వేమూరు, న్యూస్‌టుడే: రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన జంపని- వేమూరు మధ్య బుధవారం రాత్రి చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం తెనాలి నుంచి రేపల్లె వెళ్తున్న పాసింజర్ రైలు 10బై22-24 కిలోమీటరు వద్ద గుర్తు తెలియని సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని శరీరంపై పసుపురంగు గీతల చొక్కా, లోపల గులాబి రంగు టీషర్టు ఉంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఇద్దరి మృతి, ఒకరికి తీవ్రగాయాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా నుంచి పల్నాడు జిల్లాలోని మాచర్లకు పండ్లు, డ్రైఫ్రూట్స్ తెచ్చి అమ్ముకుని తిరిగి వెళుతూ ఇద్దరు దుర్మరణం చెందగా, మరొకరు గాయపడిన ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. మార్కాపురానికి చెందిన షేక్ కరీముల్లా (50) రెండు రోజులకోసారి పండ్లు, డ్రైఫ్రూట్స్ తెచ్చి మాచర్లకు చెందిన సమీప బంధువు నూర్జహాన్‌తో పాటు వ్యాపారం చేస్తుంటాడు. గురువారం వ్యాపారం ముగించుకుని నూర్జహాన్(45)తో కలిసి ద్విచక్రవాహనంపై వెళుతున్నాడు. శిరిగిరిపాడు శివారులో మాచర్ల వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహేష్ ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో కరీముల్లా తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన నూర్జహాన్‌ను ఆసుపత్రికి తీసుకెళ్తుండగా చనిపోయారు. మహేష్‌ను మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి, తర్వాత మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు. మృతుడు కరీముల్లాకు భార్య, కూమారుడు, నూర్జహాన్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

INDUSTRY

GENERATORS

జనరేటర్స్ కావలెను. 82.5KV కెపాసిటీగల Kirloskar, Cummins, Ashok Leyand కంపెనీ మాత్రమే కావలెను. వెంటనే సంప్రదించగలరు. మొబైల్ నెంబర్: 92487 11160, 92487 33306.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

గుంటూరు సిటీ లిమిట్స్ నుండి కేవలం 5Kms దూరంలో, రాజధాని అమరావతి రహదారికి దగ్గరలో లామ్ అగ్రికల్చర్ యూనివర్సిటీ దగ్గర 25 ఎకరాలలో గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ లోటస్ ఇన్‌ఫ్రా వారి Luxurio. 105 ప్రీమియం 4BHK విల్లాలు, 4 వైవిధ్య భరితమైన పార్కులు, క్లబ్‌హౌస్, గ్రాండ్ ఎంట్రన్స్ ఆర్చ్ 40 అ॥ CC రోడ్స్ కాంపౌండ్ వాల్ సోలార్ ఫెన్సింగ్‌తో, CC TV, CRDA & Rera అప్రూవ్ వెంచర్. బ్యాంక్‌లోన్ కలదు. 9866833383, 8142223456.

PLOT FOR SALE

VINUKONDA

వినుకొండ దొనకొండ 133 గజాలు (2.75 సెంట్లు) ఇంటి స్థలం కేవలం 99999/- మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 93986 21767.

GENERAL

గుంటూరు, సిటీ పరిధిలో 1250, 1360,3000 చ॥గజాల తూర్పు ఫేస్ ప్లాట్స్ సేల్, గోరంట్ల, ఆదిత్రి యెల్లోరా ప్రక్కన రేట్ గజం 14000: 87908 94569.

JOBS

WANTED exp MBA - Marketing graduates to work in a well reputed real estate company. Age below 35yrs. 2wheeler is must & willing to travel extensively with in Guntur limits. Attractive salary&Inc. mail: h4hanumanth@gmail.com. ✆ 95531 55743.

Exp Principals, IIT, NEET, Civils Faculty & 6th - 10th all subjects Teachers (B.Ed/ M.Ed) Required. Interview: 4-1-26, 10Am-4Pm. Jonathan E.M. School, Pedaravuru, (Tenali). ✆ 91778 62662, 96038 65658.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

గుంటూరు బార్‌లో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్, వెయిటర్లు, సప్లయర్లు కావలెను. రూం + భోజన వసతి కలదు. ✆ 81431 98968, 70753 38338.

ప్రముఖ ఐస్ క్రీమ్ కంపెనీ నందు పనిచేయుటకు ట్యాలీ వచ్చిన లేడీ ఆపరేటర్ కావలెను. జీతం: 15కె నల్లపాడు గుంటూరు. ✆ 70323 51666.

R **అగ్రహారం** & శ్రీనగర్ కాలనీ నందు రిటైల్ షాప్‌లో పని చేయుటకు పార్ట్ టైం సేల్స్ పర్సన్స్ కావలెను. టైం: 4:00Pm-10:30 Pm. ✆ 77990 65046.

MARKETING/ SALES

జీతం 25వేలు. రియల్ ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. M/F రిటైర్డ్ Govt. ఎంప్లాయిస్, LIC ఏజెంట్స్. ✆ 9493585365.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

కేసన శంకరరావుకు సత్కారం

శంకరరావు దంపతులను సన్మానిస్తున్న గ్రామస్థులు

నిజాంపట్నం (బాపట్ల టౌన్) న్యూస్‌టుడే: కేసన శంకరరావు బీసీల న్యాయమైన హక్కుల కోసం నిరంతరాయంగా పోరాటం చేస్తున్నట్లు సర్పంచి కె.నాగముత్యాలమ్మ అన్నారు. ఆయన స్వగ్రామమైన నిజాంపట్నం మండలం బొర్రావారి పాలెంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావును గురువారం ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ సభ్యులు బి.బుడరంకయ్య, రామకృష్ణసుబ్బారావు, మురళీరాజు, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

తెదేపాతోనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యం

బాపట్ల, న్యూస్‌టుడే: తెదేపా ద్వారానే బీసీలకు రాజకీయ ప్రాధాన్యం పెరిగిందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పట్టణంలోని ఉప్పరపాలేనికి చెందిన బీసీ నేతలు ఉప్పాల వీరాస్వామి, ఉసిరికాయల శ్రీనివాసరావు, సూరగాని బుజ్జి తమ అనుచరులతో కలిసి ఎమ్మెల్యే సమక్షంలో గురువారం తెదేపాలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పేద విద్యార్థులకు పంపిణీ చేయటానికి ఎమ్మెల్యేకు నేతలు పుస్తకాలు అందజేశారు.

రామకృష్ణకు సన్మానం

బలుసులపాలెం(చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: తెదేపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన తెదేపా సీనియర్ నేత మల్లాది రామకృష్ణను పార్టీ శ్రేణులు నూతన సంవత్సరం సందర్భంగా సత్కరించారు. గురువారం మండలంలోని బలుసుల పాలెం గ్రామంలో సర్పంచి కొనకళ్ల నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల: 80085 73141, రేపల్లె: 80085 73136, వేమూరు: 91107 83738

? జంపనిలోని 11వ వార్డు కొత్త కాలనీలోకి వెళ్లే రోడ్డు పక్కన చెత్త వేస్తున్నారు. - స్థానికుడు, జంపని ✔ వెంటనే పంచాయతీ కార్మికులతో మాట్లాడి, సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాం. - రవికుమార్, ఎంపీడీవో -న్యూస్‌టుడే, వేమూరు ? మండలంలోని భవనంవారి పాలెం పంచాయతీ పరిధిలోని కొత్తరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల పక్క రహదారిపైకి ముళ్లపొదలు రావటంతో విద్యార్థులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. - చలపతి రావు, భవనంవారిపాలెం ✔ పరిశీలించి వెంటనే తొలగిస్తాం. - శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి, భవనంవారిపాలెం - న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం ? పట్టణంలోని విజయ్ మూరితోటలో వానరాలు గృహాల్లోకి వచ్చి విధ్వంసం సృష్టిస్తున్నాయి. దాడి చేస్తాయేమోనని భయపడుతున్నాం. - బాలాజీ, 26వ వార్డు ✔ కోతులను పట్టించి దూరంగా అడవిలో విడిచిపెట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - రఘునాథరెడ్డి, పురపాలక కమిషనర్ - బాపట్ల, న్యూస్‌టుడే ? రేపల్లె మండలం గంగడిపాలెం పంచాయతీ అడవిపాలెంలో పలుచోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. - రాంబాబు, స్థానికుడు ✔ వెంటనే వెలగని దీపాలు పరిశీలించి ఏర్పాటు చేయిస్తాం. - బొర్రా ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్ ? చందోలు ప్రధాన రహదారి పక్కన బండ్లమ్మ దేవస్థానం ఎదురుగా ఉన్న రహదారిపై చెత్త చెదారం, వ్యర్థాలు పేరుకుపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. - కరీముల్లా, చందోలు ✔ పారిశుద్ధ్య కార్మికులను పంపి వెంటనే తొలగిస్తాం. - సుజాత, పంచాయతీ కార్యదర్శి, చందోలు – న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం ? భట్టిప్రోలు బస్టాండు సెంటరులో పెద్ద లైటు వెలగడం లేదు. దాని స్థానంలో చిన్న లైటును ఏర్పాటుచేశారు. రాత్రి సమయంలో చీకటిగా ఉంటోంది. - దుర్గారావు, భట్టిప్రోలు ✔ పంచాయతీ సిబ్బందితో మాట్లాడి త్వరలో పెద్ద లైటు అమరుస్తాం. - నాయక్, పంచాయతీ కార్యదర్శి, భట్టిప్రోలు – న్యూస్‌టుడే, భట్టిప్రోలు

43 వీధి దీపాలు ఏర్పాటు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె మండలం గంగడిపాలెంలో పలుచోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. సమస్యను గత నెల 31న మేమున్నాం..మీకు తోడుగా శీర్షికన ఈనాడు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి బొర్రా ప్రసాద్ బుధవారం కార్మికులను పంపి 36 విద్యుత్తు స్తంభాలకు వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.
◆ రేపల్లె మండలం బేతపూడి పంచాయతీ ఉయ్యూరువారిపాలెంలో పలుచోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన సమస్యను గత నెల 31న ఈనాడు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు బుధవారం కార్మికులను పంపి ఏడు చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు.

ఆసుపత్రికి వచ్చే మీరు.. సీసాల్లో తెచ్చుకోవాలి నీరు

రేపల్లె అర్బన్, నిజాంపట్నం, న్యూస్‌టుడే: రేపల్లె ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో తాగునీటి సదుపాయం లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం 250 నుంచి 300 వరకు అనారోగ్య సమస్యల నిమిత్తం ఇక్కడికి వస్తుంటారు. వీరితోపాటు మహిళలు, పురుషులు, ప్రసూతి వార్డుల్లో సుమారు 50 మంది ఉండి వైద్యం సేవలు పొందుతారు. రేపల్లె, నగరం, చెరుకుపల్లి, నిజాంపట్నం, భట్టిప్రోలు మండలాల్లో రాత్రివేళ రోడ్డు ప్రమాదాలు, కొట్లాటలు జరిగినా క్షతగాత్రులను 108 వాహన సిబ్బంది ఇక్కడికే తీసుకొస్తారు. ఇటు స్థానికంగా ఉండి వైద్యం పొందుతున్న రోగులతో పాటు ప్రమాదాలకు గురైన వారు తాగేందుకు గుక్కెడు నీరు అందక పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

అలంకారప్రాయంగా శుద్ధజల పరికరాలు

అధికారుల చర్యలు శూన్యం

ఏళ్ల నుంచి పెద్దాసుపత్రిగా పేరున్న రేపల్లెలో గతంలో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకు నుంచి వచ్చే నీరు తాగేందుకు పనికిరావు. వాటిని మరుగుదొడ్లకు ఆరోగ్య కేంద్రాన్ని శుభ్రం చేసేందుకు మాత్రమే వినియోగిస్తున్నారు. గతంలో పలువురు దాతలు ఏర్పాటు చేసిన శుద్ధ జల ప్లాంట్లు పాడై నిరుపయోగంగా మారాయి. రోగులు బయట నుంచి సీసాల్లో నీరు తెచ్చుకుని దాహార్తి తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తనిఖీలు నిర్వహిస్తున్న ఉన్నతాధికారులు సైతం ఇక్కడ కనీస తాగునీటి సౌకర్యం ఉందో లేదో పరిశీలించడంలేదని ప్రజా సంఘాల ప్రతినిధులు విమర్శిస్తున్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ ఉన్నా రోగులకు మెరుగైన సదుపాయాలున్నాయా అని ఇటువైపు తొంగిచూడడం లేదు. ఇక్కడ వైద్యం పొందే రోగులు, సేవ చేసే సిబ్బందికి ప్రైవేటు వ్యాపారులు విక్రయించే నీటి డబ్బాలు ఏర్పాటు చేస్తున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు, దాతలు స్పందించి మెరుగైన తాగునీటి సదుపాయం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

దాతలు ముందుకొచ్చారు..

ఆసుపత్రిలో నిత్యం 10 వరకు మినరల్ వాటర్ డబ్బాలు ఏర్పాటు చేయిస్తున్నాం. ట్యాంకు నుంచి సరఫరా అవుతున్న నీటిని తాగేందుకు ఆసక్తి చూపడంలేదు. ఇప్పటికే ఓ దాత వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారు. రోగులకు మెరుగైన వైద్య సేవలతోపాటు సదుపాయాలు కల్పిస్తున్నాం.

-పృథ్వీ గణేష్, సూపరింటెండెంట్, రేపల్లె

క్విజ్‌లో పాల్గొని.. బహుమతులు సాధించి..

బాపట్ల, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ క్విజ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అక్షర విద్యాభవన్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపి విద్యార్థులు విష్ణు తేజ ప్రథమ, పావనీశ్రీ ద్వితీయ, గ్రీష్మ ఆశ్రిత తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ రత్నమాల, ఉపాధ్యాయిని బేబీరాణి బహుమతులు అందజేశారు. వివేకా పాస్టర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో రాణించి విద్యార్థులు లక్ష్మణ్, సాహిత్య, తారక్ సాకేత్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ మోహన్, ఉపాధ్యాయులు సురేష్, అబ్దుల్ రహీమ్, అభినయ్ బహుమతులు ప్రదానం చేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న అక్షర విద్యాభవన్ పాఠశాల ప్రిన్సిపల్ రత్నమాల

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న వివేకా పాస్టర్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ మోహన్

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషి

బాపట్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అంకితభావంతో కృషి చేస్తోందని తెదేపా బాపట్ల పార్లమెంటు అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీకి ఏడాదిన్నరలో రూ. 13.5 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చి కొత్త పరిశ్రమల ఏర్పాటు ద్వారా లక్షల ఉద్యోగాలు సృష్టిస్తున్నట్లు పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌లో 90 శాతం హామీలు నెరవేర్చామన్నారు. పార్టీ ఉపాధ్యక్షులు అల్లం గోపీకృష్ణ, మద్దాల మసలయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ఫరీద్ మస్తాన్, జిట్టా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధ్యక్షుడు రాజశేఖరబాబు, ప్రధాన కార్యదర్శి రాఘవ

ఒంటరి మహిళలకు చేయూత

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే : ఒంటరి మహిళలకు కుట్టుమిషన్లు, గ్రైండర్లు ఆర్థిక తోడ్పాటును అందిస్తాయని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో కాపు సేవాసంఘం ఆర్థిక సహకారంతో గురువారం అన్నం సతీష్ ప్రభాకర్ చేతుల మీదుగా కాపు ఒంటరి మహిళలకు 9 కుట్టు మిషన్లు, 12 గ్రైండర్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదగాలన్నారు. కాపు సేవాసంఘం పెద్దలు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు, గ్రైండర్లు అందజేస్తున్న సతీష్ ప్రభాకర్

నూతన సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

న్యూస్‌టుడే, బృందం: ప్రజలు సుఖసంతోషాలతో, రైతులు పాడిపంటలతో తులతూగాలని ప్రజాప్రతినిధులు, అధికారులు, పేర్కొన్నారు. గురువారం నూతన సంవత్సర వేడుకలను గురువారం బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. బాపట్ల తెదేపా కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో అధికారులు, నేతలతో కలిసి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కేకులు కోశారు. ఎమ్మెల్యేను అధికారులు, తెదేపా, భాజపా, జనసేన నాయకులు కలిసి పూల మాలలతో సత్కరించారు. నియోజకవర్గ ప్రజల జీవితాల్లో సుఖశాంతులు నింపాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. రేపల్లె మున్సిపల్ కార్యాలయంలో అనగాని శివప్రసాద్ కేకు కోసి నాయకులకు అందజేశారు. ఆయా గ్రామాల్లోని క్రైస్తవులు చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. వృద్ధులకు దుస్తులు, పండ్లు మిఠాయిలు పంపిణీ చేశారు. అధినేత పవన్ కల్యాణ్ ఆశయాల సాధనకు జనసైనికులు అంకితభావంతో కృషి చేయాలని జనసేన నేత విన్నకోట సురేష్ అన్నారు. జనసేన కార్యాలయంలో గురువారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన కేకు కోశారు.

ఎమ్మెల్యే ఆనందబాబుకు కేకు తినిపిస్తున్న పాస్టర్

డీఎస్పీ రామాంజనేయులు, సీఐలతో కలిసి కేకు కోస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

మున్సిపల్ కార్యాలయంలో కేకు కోస్తున్న శివప్రసాద్, కమిషనర్ సాంబశివరావు

అసంపూర్తిగా ఇండోర్ స్టేడియం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో చేపట్టిన ఇండోర్ స్టేడియం అందుబాటులోకి వస్తే వందల మంది క్రీడాకారులకు ఉపయోగంగా ఉంటుంది. ఎంపీ నిధులు రూ.కోటి వ్యయం అంచనాతో 2022లో గత వైకాపా నేతలు పనులకు శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరులో జాప్యంతో 2023లో గుత్తేదారుడు పనులు ప్రారంభించి వదిలేశాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అలంకారప్రాయంగా మిగిలింది. స్టేడియం అందుబాటులోకి తెస్తే ఇండోర్ గేమ్స్‌లో విద్యార్థులు, యువత పోటీల్లో రాణించే నైపుణ్యం సాధిస్తారు. నియోజకవర్గం నుంచి మరింత మంది క్రీడాకారులు వెలుగులోకి వచ్చి ఉన్నతంగా ఎదుగుతామని ఆశగా ఎదురు చూస్తున్నారు. కూటమి నేతలు చొరవ చూపి ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేయించాలని కోరుతున్నారు.

చిరకాల కల నెరవేరుతోందిలా

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె పట్టణ ప్రజలు, రైతుల చిరకాల కోరిక రైతు బజార్ ఈనెలలో అందుబాటులోకి రానుంది. రూ.2 కోట్ల వ్యవసాయ మార్కెటింగ్ నిధులతో 2022లో గత ప్రభుత్వ పాలకులు రైతు బజార్ నిర్మాణానికి శంకుస్థాన చేశారు. 2023లో గుత్తేదారుడు పనులు చేపట్టినా సకాంలో బిల్లులు మంజూరు కాక అసంపూర్తిగా వదిలేశాడు. మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో మున్సిపల్ అధికారులు పనులు పూర్తయ్యేలా దృష్టి సారించారు. 15 షెట్టర్లు, 22 ఓసెన్ గదులతో రైతు బజార్‌కు తుదిమెరుగులు దిద్దుతున్నారు. సంక్రాంతి పండగరోజు ప్రారంభించేలా సన్నాహాలు చేస్తున్నారు. అందుబాటులోకి వస్తే పురవాసులకు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తక్కువ ధరలకు లభ్యమవుతాయి. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, భట్టిప్రోలు మండలాల రైతులు పండించిన ఉత్పత్తులు నేరుగా విక్రయించుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు తాము పడిన ఇబ్బందులు తొలగనున్నాయి.

రేపల్లెలో అందుబాటులోకి రానున్న రైతు బజార్

మంచు దుప్పట్లో భావపురి


రథం బజారులో కమ్మేసిన పొగమంచు

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం ఆరంభంలో భావపురిని మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం పది గంటల వరకు మంచు వీడలేదు. చీలు రోడ్డు, పాత బస్టాండ్, రథం బజారు కూడళ్లు, ఎన్‌హెచ్ 216ఏ, జీబీసీ రహదారిపై దట్టమైన పొగమంచు వ్యాపించింది. వాహనదారులు లైట్లు వేసుకుని వాహనాలు నడిపారు.

పచ్చదనమేదీ?

బాపట్ల, న్యూస్‌టుడే: కలెక్టరేట్ మార్గంలో ప్రధానమంత్రి స్వచ్ఛభారత్ స్ఫూర్తితో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 2014లో మొక్కలు నాటి ఉద్యానాన్ని పెంచారు. 2017లో పురపాలక సంఘం నిధులు మంజూరు చేసి పార్కును అభివృద్ధి చేసింది. గత పాలకులు పార్కు నిర్వహణను పట్టించుకోలేదు. 80 శాతం మొక్కలు ఎండి పచ్చదనం కనుమరుగైంది. సమస్యపై పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటి పెంచి సంరక్షణకు చర్యలు చేపడతామన్నారు.

పోషకాహార సామగ్రి పంపిణీ

మోపర్రు, (అమృతలూరు), న్యూస్‌టుడే: మోపర్రులోని ఏఆర్‌సీ వసతి గృహం విద్యార్థులకు దాత పోషకాహారం పంపిణీ చేశారు. యలవర్రుకు చెందిన ఓలేటి సాంబయ్య, సామ్రాజ్యం జ్ఞాపకార్థం వారి కుమారుడు శివాజీ ఆర్థిక సహాయంతో జరిగిన కార్యక్రమంలో మైనేని రత్నప్రసాద్, ఓలేటి వెంకటేశ్వరావు, రాజేష్, రాంబాబు, గోపి తదితరులు పాల్గొన్నారు.

శివముక్కోటికి ఏర్పాట్లు చేయండి

గుళ్లపల్లి(చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: ఆరుద్రోత్సవం సందర్భంగా ఈనెల 3వ తేదీన శివాలయాల్లో నిర్వహించే శివముక్కోటికి జిల్లాలోని శైవక్షేత్రాలతో పాటు సమరసత సేవా ఫౌండేషన్, తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్తంగా మత్స్యకార, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నిర్మించిన ఆలయాల్లోనూ ఏర్పాట్లు చేయాలని ఫౌండేషన్ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ తెలిపారు. గురువారం మండలంలోని గుళ్లపల్లి శివాలయం వద్ద ఫౌండేషన్ నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ సూచనలు చేశారు.

మౌలానా హస్రత్ మొహానీ జయంతి

రైలుపేట (బాపట్ల టౌన్), న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరంలో ఇంక్విలాబ్ జిందాబాద్ (విప్లవం వర్ధిల్లాలి)అనే నినాదం సమరయోధుల్లో ఉత్సాహాన్ని నింపిందని సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. బాపట్ల జమేదారు పేటలోని సాహితీ భారతి కార్యాలయంలో గురువారం మౌలానా హస్రత్ మొహానీ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంక్విలాబ్ జిందాబాద్ నినాద రూపకర్త మొహానీ అని గుర్తు చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : మండలంలోని పలు ఆలయాల్లో గురువారం నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖాజీపాలెం గ్రామదేవత శ్రీయెన్నాడమ్మ, పిట్టలవాని పాలెం, చందోలు, జి.ఎన్.పాలెంలోని బండ్లమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్త కోటికి కొత్త సంవత్సరం సకల శుభాలను అనుగ్రహించే అభయప్రదాయినిగా చందోలు బండ్లమ్మ దర్శనమిచ్చారు.

బాపట్ల, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆలయాలు, చర్చిలలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు గురువారం నిర్వహించారు. భావనారాయణ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఎస్పీ ఉమామహేశ్వర్ పూజలు జరిపారు. పండితులు వేదాశ్వీరచనం చేశారు. ● భావనారాయణ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. వారణాసి సత్ సేవా సంఘం ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య రూపకం ఆకట్టుకుంది.

ఐలవరం(భట్టిప్రోలు), న్యూస్‌టుడే : ధనుర్మాస పూజల్లో భాగంగా నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని మండలంలోని ఐలవరం వేణుగోపాల స్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చందోలు బండ్లమ్మ

యెన్నాడమ్మ అమ్మవారు

వేణుగోపాలస్వామి

నేత్రదానం

ఇంకొల్లు: రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో నేత్రదానం జరిగింది. తాటిపర్తివారిపాలేనికి చెందిన గాదె అనంతలక్ష్మి(52) గురువారం మృతిచెందారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు రోటరీ అవయవ నేత్రదాన సలహా కేంద్రం ప్రతినిధులు జెట్టి స్వామి, ఎస్. రామమోహనరావు పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి సిబ్బందిని పిలిపించి, మృతురాలి కార్నియాలను సేకరించారు.

సంకల్పించి.. సంరక్షించి

కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏటా మొక్కలు నాటే కార్యక్రమం

కావూరు (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: కొత్త ఏడాది ప్రారంభం బాగుంటే ఏడాదంతా బాగుంటుదని ప్రజల నమ్మకం. దీన్ని నిజం చేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏటా పర్యావరణ పరిరక్షణకు నాంది పలుకుతున్నారు. చెరుకుపల్లి మండలంలోని కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఏడాది చివరి రోజున మొక్కలు నాటి, ఏడాది మొదటి రోజున ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం వంటి పనులతో పాత ఏడాదికి ఘన వీడ్కోలు పలుకుతూనే కొత్త ఏడాదికి అదే రీతిలో స్వాగతం పలుకుతున్నారు. పుష్కర కాలంగా ఈ పని చేస్తున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు మొక్కలు నాటడంతో పాటు వారితో ఎవరి మొక్కను వారే సంరక్షిస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తారు. బాలికలు మొక్కలు నాటడం, బాలురు ఇంకుడు గుంతలు తీయడం చేస్తున్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న హెచ్‌ఎం వనజాక్షి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

బడిలో మొత్తం మొక్కల సంఖ్య - 250	నూతన ఏడాదిలో నాటబోయేవి - 200	విద్యార్థుల సంఖ్య - 300	బడిలో ఏర్పాటు చేసిన ఇంకుడుగుంతలు - 15

పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత తెలియాలని..

మా పాఠశాలలో ఉపాధ్యాయులందరం కలసి మొక్కలు నాటి సంరక్షిస్తున్నాం. ఇందుకు తలోకొంత వేసుకుని ఆ సొమ్ముతో మొక్కలు తెస్తున్నాం. కొన్ని దాతలు అందిస్తున్నారు. ఏటా డిసెంబరు నెలాఖరులో కొన్ని మొక్కలను ప్రత్యేకంగా నాటుతాం. వాటి వద్ద విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తాం. దీని వల్ల పిల్లలకు పర్యావరణ పరిరక్షణ ఎంత ముఖ్యమో తెలుస్తుంది. దీన్ని వారు తమ జీవితంలో ఆచరించడం చేస్తారు. మా లక్ష్యం ఇదే. అది నెరవేరుతోంది. -సీహెచ్ వనజాక్షి, హెచ్‌ఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కావూరు.

వరి కుప్ప దగ్ధం

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: అద్దేపల్లి బాడవ పొలాల్లో కసుకుర్తి దుర్గారావుకు చెందిన రెండు ఎకరాల వరి కుప్పను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి నిప్పు అంటించారు. గురువారం ఉదయం సమీప రైతులు చూసి మంటలను ఆర్పివేశారు. వరి కుప్ప పూర్తిగా కాలింది. సుమారు రూ.60 వేలు వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నాడు. పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

మచ్చల పురుగును తొలిదశలోనే నివారించుకోవాలి

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: మినుము సాగులో ఎదురయ్యే మారుకా మచ్చల పురుగు తొలిదశలోనే నివారించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫారుక్ తెలిపారు. ఈ పురుగు పూత, పిందె దశలో ఆశించి ఎక్కువ నష్టం కలుగజేస్తుందన్నారు. పూత దశలో పూలను గూడుగా చేసి లోపలి పదార్థాలను తింటుందని, ముందు జాగ్రత్తగా పూత దశలో పైరుపై 5 శాతం వేప గింజల కషాయం కానీ లేదా వేపనూనెను కానీ పిచికారి చేయాలని సూచించారు.

ఆదర్శమూర్తికి అశ్రుతాంజలి

సేవా కార్యక్రమాలలో ముందుంటూ, కుటుంబాన్ని ఉన్నత స్థాయికి చేర్చి, మమ్మల్ని శోక సంద్రంలో ముంచి, నిబద్ధతగల ఉపాధ్యాయునిగా ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన 'కేసన వెంకట నాగమల్లేశ్వరరావు' గారి అకాల మరణానికి చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తూ...

బాధాతప్త హృదయాలతో...

భార్య: కేసన విజయలక్ష్మి

కుమార్తెలు-అల్లుళ్ళు
మరీదు గౌతమి - కోటేశ్వరరావు
పేరం రాణి - విజయ సుభాష్‌రాయ్ (బోస్)
మనుమలు, మనుమరాండ్రు:
మరీదు కుశల్‌సాయి, మరీదు గణేష్‌సాయి, పేరం కోవిదసాయి

కీ॥శే॥ కేసన వెంకట నాగమల్లేశ్వరరావు గారు
Rtd. టీచర్, B.Sc., B.Ed.
జననం: 15-12-1945 మరణం: 20-12-2025
రేపల్లె రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు

సోదరులు: K.V. కృష్ణారావు (లేటు), K.V. పురుషోత్తం, K.V. సుబ్బారావు
కుటుంబ సభ్యులు & బంధు మిత్రులు

పెద్దకర్మ ది. 03-01-2026 (శనివారం)న రేపల్లె 14వ వార్డులోని మా స్వగృహము నందు జరుగును. సెల్: 83319 50919

(c) eenadu

చీరాల

• చీరాల • పర్చూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల: 9154841713 వేటపాలెం: 8008574099
చీరాల గ్రామీణ: 8919838695 పర్చూరు: 9063144743
మార్టూరు: 8008574106 ఇంకొల్లు: 8008574102
చినగంజాం: 8008574103

? జాండ్రపేట నుంచి కుందేరు, గ్రామ ప్రధాన రహదారులు గుంతలు పడి ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంది. అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలి. - **స్థానికులు**

✔ ఈ రహదారులు ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్నాయి. ఈ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటాం. - **ఎం.శ్రీనివాస్, కార్యదర్శి - న్యూస్‌టుడే, చీరాల గ్రామీణం**

3న గొనసపూడిలో భూ హక్కు పత్రాల పంపిణీ

చినగంజాం: చినగంజాం మండలంలో గతంలో జరిగిన రీసర్వేకు సంబంధించి భూ హక్కు పత్రాలను ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకు పంపిణీ చేస్తామని తహసీల్దార్ జె.ప్రభాకరరావు తెలిపారు. జనవరి 3న గొనసపూడి పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తారని చెప్పారు. 4న చింతగుంపల, 11న కడవకుదురు పంచాయతీ కార్యాలయాల వద్ద పంపిణీలో చేస్తారని తహసీల్దార్ వివరించారు.

మంచు దుప్పటి

చీరాల అర్బన్: చీరాల నియోజకవర్గంలోని రెండు మండలాల్లో గురువారం మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం పది గంటలు దాటినా మంచు వదల్లేదు. ఫలితంగా చీరాల-వేటపాలెం బైపాస్ రోడ్డులో వాహనాలు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గడచిన రెండు రోజులుగా ఇలా ఉదయం పూట మంచు కురుస్తూ దీర్ఘకాలిక వ్యాధులున్న వారు, చిన్నారులు బయటకు వచ్చేందుకు వెనుకంజవేయాల్సి వచ్చింది.

గ్రంథపాలకుడిని నియమించరూ

ఇంకొల్లు శాఖా గ్రంథాలయం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు శాఖా గ్రంథాలయానికి పాలకుడు లేక నిరుపయోగంగా ఉంటోంది. 1982 వరకు నాగండ్లలోని గ్రంథాలయం నిర్వహణ సక్రమంగా లేనికారణంగా ఇంకొల్లుకు తరలివచ్చింది. కొన్నాళ్లు అద్దె గృహంలో కొనసాగింది. తదుపరి యువజన సంఘం ఆధ్వర్యంలో బెల్లమ్మ సత్రంలో నిర్వహించారు. 2001లో గంగవరం రోడ్డులో నారప రాజు వంశీయులకు చెందిన ఖాళీ స్థలంలో సొంత భవనం నిర్మించారు. కొన్నాళ్లు సజావుగా సాగగా గ్రంథపాలకుడు లేక వారంలో మూడురోజుల మాత్రమే తెరుస్తున్నారు. ఇడుపులపాడు, ఇంకొల్లుకు ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. గ్రంథాలయం నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. విలువైన గ్రంథాలు చెదలు పట్టి పోతున్నాయి. పూర్తికాలం పని చేసే గ్రంథపాలకుడిని నియమించాలని ఈప్రాంత విద్యార్థులు, పాఠకులు కోరుతున్నారు.

పల్లె రోడ్లు.. కొంగొత్త హంగులు

మార్టూరు, యద్దనపూడి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం భారీ ఎత్తున నిధులు విడుదల చేసింది. తద్వారా పల్లె రోడ్లు కొంగొత్త హంగులు సంతరించుకుంటున్నాయి. కొన్ని మార్గాలు ఇప్పటికే పూర్తవగా మరికొన్ని నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి.

ఇంకొల్లు మండలం పావులూరు- నాగండ్ల మధ్య బీటీ రోడ్డు

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ర.భ, పీఆర్ రహదారుల నిర్మాణాలకు కోట్లాది రూపాయలు విడుదల చేసింది. అందులో ఇంకొల్లు- పర్చూరు పాత మద్రాసు రోడ్డుకు రూ.23.88 కోట్లు, వలపర్ల-కొంకిటి రూ.4.20 కోట్లు, విజయనపాలెం-తిమ్మరాజుపాలెంకు రూ.10.50 కోట్లు, రాజుబంగారుపాలెం-పెదరంటాలకు రూ.2 కోట్లు, పెదగంజాం-ఆవులదొడ్డి గొల్లపాలెంనకు రూ.1.15 కోట్లు, హైవే- అనంతవరం రూ.2.20 కోట్లు, హైవే- రాజుగారిపాలెంనకు రూ.1.76 కోట్లు, స్వర్ణపాలెం-స్వర్ణ రూ.1.97 కోట్లు, ఇంకొల్లు-కడవకుదురుకు రూ.2.26 కోట్లు, చెరుకూరు-ఏదుబాడు రూ.26 లక్షలు, బొబ్బేపల్లి-రాజుగారిపాలెం రూ.77 లక్షలు, కడవకుదురు- చినగంజాంనకు రూ.82 లక్షల నిధులను మంజూరు చేసింది. అలాగే పూనూరు- గన్నవరం నకు రూ.3 కోట్లు, మార్టూరు- గన్నవరంనకు రూ.3కోట్ల నిధులు సిద్ధమయ్యాయి.

కూటమి ప్రభుత్వం రాకతో

పర్చూరు నియోజకవర్గంలో ఇటీవల నిర్మాణం పూర్తిచేసుకుని కొన్ని రహదారులు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తున్నాయి. రూ.1.80 కోట్లతో చింతగుంపల, రూ.3 కోట్లతో పావులూరు- నాగండ్ల, రూ.3.53 కోట్లతో ద్రోణాదుల- ఇడుపులపాడు రహదారులు బీటీ పరుపుకుని అందుబాటులోకి వచ్చాయి. రూ.10 కోట్ల వ్యయంతో విజయనపాడు- పోలూరు- తిమ్మరాజుపాలెం మార్గం పనులు సాగుతున్నాయి. కొన్ని మార్గాల్లో ఇప్పటికే ప్రయాణ సౌలభ్యం కలగడంతో ఆయా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైకాపా పాలనలో అభివృద్ధి ఊసే లేక రహదారులపై ప్రయాణించాలంటేనే హడలెత్తిన ప్రయాణికులు అష్టకష్టాలు ప్రత్యామ్నాయ దారులను వెతుక్కోవల్సిన దుస్థితి నెలకొంది. ఈపరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామీణ మార్గాలకు భారీగా నిధులు కేటాయించడంతో ఆయా గ్రామాల ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

మరమ్మతులకు నోచని విభాజకం

చీరాల ప్రసాద్ థియేటర్ కూడలి వద్ద ఇలా..

చీరాల ప్రసాద్ థియేటర్ కూడలిలో రహదారి విభాజకం దెబ్బతిని రూపుమారుతోంది. క్రమంగా సిమెంట్ రాళ్లు ఊడిపోతున్నాయి. పురపాలక నిధులతో ఎనిమిదేళ్ల క్రితం దీన్ని ఏర్పాటు చేశారు. మధ్యలో మొక్కలు పెంచడానికి డ్రిప్ సైతం అమర్చారు. వాహనాలు ఢీకొనడంతో విభాజకం దెబ్బతిని డ్రిప్ పని చేయని స్థితికి చేరింది. నెలల తరబడి ఈ పరిస్థితి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా.. మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

- చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే

అందరి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి

ఎమ్మెల్యే కొండయ్యకు శుభాకాంక్షలు చెబుతున్న పోలీసు అధికారులు

చీరాల, న్యూస్‌టుడే: అధికారులు, నాయకుల సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నామని ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగాయి. నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వ్యాపారులు, ప్రజలు తరలివచ్చి కొండయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో దాదాపు రూ.160 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. గతంలో ఎన్నడు లేని విధంగా ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.6.58 కోట్ల చెక్కులు అందజేశామన్నారు. రైతులు, చేనేత, మత్స్యకారుల అభివృద్ధికి కార్యక్రమాలు చేపట్టామన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ త్వరలో పూర్తవుతుందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు చేసే ఆరోపణలు తాను పట్టించుకోనన్నారు. చీరాలను అభివృద్ధిలో ముందంజలో ఉంచడమే తన లక్ష్యమని చెప్పారు. నేతలు ఎం.సాంబశివరావు, కె.జనార్దన్, సజ్జా హేమలత, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలు సొంత కాళ్లపై నిలబడాలి

మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: బాలికలు ప్రణాళికాబద్ధంగా చదివి తమ సొంత కాళ్లపై నిలబడిన అనంతరమే వివాహ ఆలోచనలు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. బుర్లవారిపాలెం పరిధిలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఆయన నూతన సంవత్సరం సందర్భంగా గురువారం సతీమణి భూమిక చంద్రతో కలిసి సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ. . ప్రతి బాలిక తప్పకుండా డిగ్రీ వరకు చదివి ఉద్యోగం సాధించిన తర్వాతే పెళ్లి చేసుకోవాలన్నారు. ముందుగా వీరిని పలు ప్రశ్నలు అడిగి, స్పందన తెలుసుకున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను అడిగి, వాటి సాధనకు సలహాలు ఇచ్చారు. ఇటీవల క్రికెట్‌లో భారత్‌కు ప్రపంచ కప్ అందించిన మహిళలను ఆదర్శంగా తీసుకుని, ఆటల్లో రాణించాలన్నారు. అనంతరం బాలికలకు రాత పుస్తకాలు, పెన్నులు అందించారు. డీఈవో శ్రీనివాసరావు, ఇతర అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సాగుతూ..

యద్దనపూడి మండల డ్వాక్రా మహిళలకు రుణాల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

ఇసుకదర్శి(మార్టూరు), న్యూస్‌టుడే: నియోజకవర్గ సమగ్రాభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని ఇసుకదర్శి క్యాంపు కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు మంజూరైన సంక్షేమ ఫలాలను పంపిణీ చేశారు. ఆరు మండలాలకు చెందిన డ్వాక్రా మహిళలకు రూ.50 కోట్ల విలువైన రుణాలు, 160 మందికి వినికిడి యంత్రాలు అందజేశారు. పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్ఎఫ్ పత్రాలు ఇచ్చారు. సర్కారు సాగు, సంక్షేమం, ఉపాధి, మౌలిక వసతుల కల్పనకు వెనకడుగు వేయకుండా నిధులు వెచ్చిస్తోందన్నారు. ఈసందర్భంగా తెదేపా అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తలను సభలో అభినందించి, ప్రశంసాపత్రాలు అందించారు.

మారనున్న దేవాలయాల రూపురేఖలు

పర్చూరు, న్యూస్‌టుడే: పర్చూరు నియోజకవర్గంలో జీర్ణోద్ధరణకు దూరంగా ఉన్న దేవాలయాల రూపురేఖలు మార్చేలా కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. కోట్లాది రూపాయలను సర్వశ్రేయోనిధి(సీజీఎఫ్) ద్వారా మంజూరు చేయించి, పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దేవాయాల ప్రాముఖ్యతను, భక్తుల మనోభావాలను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డికి వివరించడంతో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఏడు దేవాలయాలకు రూ.8.40కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పర్చూరులోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి రూ.1.75 కోట్లు, శ్రీ భీమేశ్వరస్వామి దేవాలయానికి రూ.1.50 కోట్లు, దేవరపల్లిలోని శ్రీ వేణుగోపాలస్వామివారికి రూ. కోటి, గర్నేపూడిలోని శ్రీ విఘ్నేశ్వర, శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయాలకు రూ.రూ.కోటి, అనంతవరంలోని శ్రీ వేణుగోపాలస్వామి గుడికి రూ.1.05 కోట్లు, సూరవరపుపల్లిలోని శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయానికి రూ. 1.05 కోట్లు, సంతరావూరులోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి రూ.1.05 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులకు 33 శాతం మ్యాచింగ్ గ్రాంట్స్‌తో ఆలయాల పునర్నిర్మాణాలు జరగనున్నాయి.

రాష్ట్ర ప్రగతికి అంకితభావంతో కృషి

బాపట్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అంకితభావంతో కృషి చేస్తోందని తెదేపా బాపట్ల పార్లమెంటు అధ్యక్షుడు సలగల రాజశేఖర బాబు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీకి ఏడాదిన్నరలో రూ. 13.5 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చి కొత్త పరిశ్రమల ఏర్పాటు ద్వారా లక్షల ఉద్యోగాలు సృష్టిస్తున్నట్లు పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌లో 90 శాతం హామీలు నెరవేర్చామన్నారు. పార్టీ ఉపాధ్యక్షులు అల్లం గోపీకృష్ణ.మద్దాల ముసలయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ఫరీద్ మస్తాన్, జిట్టా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస పూజలు



కోలలపూడిలో విశేష అలంకరణలో కోదండ రాముడు

మార్టూరు: పూలంగి సేవకు వెళ్తున్న మహిళా భక్తులు

మార్టూరు, యద్దనపూడి, న్యూస్‌టుడే: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని వైష్ణవ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం మార్టూరు మండలం శ్రీరంగక్షేత్రంలో స్వామివార్లు, అమ్మవార్లకు పూలంగి సేవ చేశారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కోలలపూడి, యద్దనపూడి, పూనూరు, వలపర్ల, ద్రోణాదుల తదితర గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో ప్రత్యేక అర్చనలు, విశేష పూజలు ఆచరించారు.

ఆనందోత్సాహాల నడుమ వేడుకలు

ఎమ్మెల్యే సాంబశివరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీస్ అధికారులు, గ్రానైట్ యజమానులు

సోపిరాల కూడలి రంగా విగ్రహం వద్ద కేకు కోస్తున్న గ్రామ పెద్దలు

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే: చీరాల, పర్చూరు నియోజకవర్గ ప్రజలు నూతన సంవత్సర వేడుకలను గురువారం అత్యంత వేడుకగా జరుపుకొన్నారు. బుధవారం అర్ధరాత్రి పన్నెండు గంటలు దాటిన తరువాత యువకులు హ్యాపీ న్యూ ఇయర్ అంటూ పెద్ద ఎత్తున కేకలు వేసుకుంటూ వీధుల్లో తిరిగారు. కొందరు కేకులు కోసి, మిఠాయిలు పంచారు. బాణసంచా కాల్చారు. వేకువజామునే తమకు ఇష్టమైన ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చర్చిల్లో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులను నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, అధికారులను ఉద్యోగులు, ఉపాధ్యాయులను విద్యార్థులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

చినగంజాం పరిధి సోపిరాల కూడలిలో వంగవీటి రంగా కాంస్య విగ్రహం వద్ద గురువారం రాత్రి కేకును గ్రామ పెద్దలు కోటయ్య, రంగారావు, రామసుబ్బారావు కోశారు. బాణసంచా కాల్చారు. ఇంకొల్లు సీఐ రమణయ్య, ఎస్సై రమేష్ బుధవారం రాత్రి గ్రామాల్లో పర్యటించారు.

ఏలూరికి ఇంకొల్లు నేతల శుభాకాంక్షలు

ఇంకొల్లు: శాసన సభ్యుడు ఏలూరి సాంబశివరావుకు ఇంకొల్లు మండల తెదేపా నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గురువారం నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి శుభాభినందనలు చెప్పారు. హనుమంతరావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, వెంకట్రావు, వీరాంజనేయులు, సంధ్య, అనూరాధ, సాంబయ్య, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, కారంచేడు, చినగంజాం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం పాడిపంటలతో, సుఖసంతోషాలు, కొత్త ఆశలు, ఆశయాలతో జీవనం సాగించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆకాంక్షించారు. గురువారం ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని ఇసుకదర్శి క్యాంపు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన తెదేపా నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత, మహిళలు వేలాది మంది ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి ఏలూరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వివిధ ప్రాంతాల పలు శాఖల అధికారులు, గ్రానైట్ యజమానులు, సిబ్బంది శుభాకాంక్షలు చెప్పారు. ఈసందర్భంగా ఏలూరి పూలమాలలు, బొకేలు కాకుండా పూలమొక్కలు, రాత పుస్తకాలు, పెన్నులు స్వీకరించారు. క్యాంపు కార్యాలయ ఆవరణలో భారీగా అల్పాహారం, అన్నదానం చేపట్టారు. పర్చూరు, కారంచేడు తహసీల్దార్లు పి.బ్రహ్మయ్య, జి.నాగరాజులను కార్యాలయ సిబ్బంది సన్మానించి, కేకులు కోసి శుభాకాంక్షలు తెలిపారు.

కీలక మలుపులో గుంతలమయం

పర్చూరు-ఇంకొల్లు రహదారిలో యద్దనపూడి మార్గం వద్ద రోడ్డుపై పడిన భారీ గుంత

పర్చూరు-ఇంకొల్లు రహదారిలో యద్దనపూడి వైపు వెళ్లే మార్గం వద్దకు చేరితే వాహనదారులకు హడలే అన్నట్లుగా మారింది. పర్చూరు నుంచి పలు పనుల నిమిత్తం ఇంకొల్లు, యద్దనపూడి వెళ్లేందుకు వాహనదారులు ఇటుగానే రాకపోకలు సాగిస్తుంటారు. వ్యవసాయ మార్కెట్ యార్డుకు కూతవేటు దూరంలో ఉన్న ఈ రహదారికి అనుసంధానంగా యద్దనపూడి మార్గం కలిసి ఉండగా కీలక మలుపు వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. రాత్రి సమయంలో ఈ ప్రాంతంలో సరైన విద్యుత్తు దీపాలు లేకపోవడంతో ఒక్కసారిగా వచ్చే వాహనాలు అదుపుతప్పి, ఈ గుంతల్లో పడి పలువురు గాయాలపాలైన సందర్భాలు లేకపోలేదని స్థానికులు తెలుపుతున్నారు. వర్షాల సమయంలో ఈ గుంతల్లో నీరు నిలిచి రోడ్డు సరిగా కనపడటం లేదని వాపోతున్నారు. అధికారులు వీటిని పూడ్చించాలని ప్రజలతో పాటు వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీకాంత్‌ను వివరణ కోరగా రెండ్రోజుల్లో గుంతలు పడిన ప్రాంతాల్లో మరమ్మతులు చేయించి, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. **- న్యూస్‌టుడే, పర్చూరు**

ముమ్మరంగా వసతి గదుల నిర్మాణం

పర్చూరులోని ఏపీ గిరిజన గురుకుల పాఠశాల(బాలుర) శిథిలావస్థకు చేరడంతో గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (పీటీసీ శ్రీశైలం), ధర్తి ఆబాజంజాటియా గ్రామ్‌ఉత్కర్ష్ అభియాన్ (డీఏ.జేజీయూఏ) పథకం కింద రూ.5.30 కోట్ల నిధులు విడుదలయ్యాయి. దీంతో ఈ భవన నిర్మాణాలకు అక్టోబర్ 25న కలెక్టర్ వి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు భూమి పూజ, శంకుస్థాపన చేశారు. దీంతో పనులు ఊపందుకుని ప్రాథమిక బేస్‌మెంట్ స్థాయికి చేరాయి. ఈ పనులను గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. 2026 విద్యా సంవత్సరానికి పనులు పూర్తి అయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు ఆ శాఖ ఏఈ ఎల్.రవికుమార్ తెలిపారు.

- న్యూస్‌టుడే, పర్చూరు

ట్రావెల్స్ బస్సుల తీరుతో ప్రజల అవస్థలు

పేరాల, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల నిర్వాహకుల తీరుతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజు రాత్రి తొమ్మిది గంటల నుంచి పదిగంటల వరకు చీరాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ట్రావెల్స్ బస్సులన్నీ స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ప్రధాన రహదారిపై నిలుపుకొని, ఇక్కడి నుంచే ప్రయాణికులను ఎక్కించుకొని వెళుతుంటాయి. ఈ క్రమంలో రోడ్డుపై బస్సులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో పాటు ఇదే మార్గంలో ఇరువైపులా అనేక వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపి ఉండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీంతో అటుగా వెళ్లాల్సిన వాహనచోదకులు, పాదచారులు నరకయాతన అనుభవిస్తున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన ట్రాఫిక్ పోలీసులు కనీసం అటువైపుగా కన్నెత్తి చూడటంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ట్రావెల్స్ బస్సులు నిలిపే సమయంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీస్ సిబ్బందిని నియమించి, సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

తుమ్మచెట్ల కొమ్మలు తొలగించరూ

చినగంజాం, ఇంకొల్లు, న్యూస్‌టుడే: కడవకుదురు-ఇంకొల్లు గ్రామాల మధ్య సుమారు 12 కిలోమీటర్ల పరిధిలో ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. దీనిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డు వెంబడి కడవకుదురు, గొనసపూడి, చింతగుంపల, భీమవరం, తిమ్మసముద్రం తదితర గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల వరి, తదితర పంటల సాగు ఉంది. రైతులు ద్విచక్ర వాహనాలపై వ్యవసాయపరమైన విత్తనాలు, ఎరువులు వంటి వాటిని తీసుకెళుతుంటారు. రోడ్డు పక్కన ఉన్న పెద్ద తుమ్మచెట్ల కొమ్మలు రహదారిపైకి రావడంతో ఇబ్బంది పడుతున్నామని వాహనచోదకులు సుబ్బారావు, వెంకటేశ్వరరావు తెలిపారు. గతంలో వీటి కారణంగా పలువురు గాయపడ్డారు. వాటిని తొలగించాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

దగ్గుబాడు-చీరాల రహదారిపై రయ్ రయ్

పాతచెన్నై- చీరాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణం పూర్తయింది. దగ్గుబాడు నుంచి పోతినవారిపాలెం స్వర్ణ-దండుబాట మీదుగా చీరాల వరకు రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో జరిగింది. గతంలో చీరాల నుంచి 12 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించారు. ఇటీవల స్వర్ణ వెలుపల నుంచి దగ్గుబాడు వరకు రూ.1.90 కోట్లతో 5 కిలోమీటర్ల మేర నిర్మించారు. పాతచెన్నై రహదారి నుంచి చీరాల వరకు 17 కిలోమీటర్ల మార్గాన్ని ఎక్కడా ఒక్క గుంత కనిపించకుండా మరమ్మతులు చేశారు. ఇంకొల్లు నుంచి ద్విచక్ర వాహనంపై 35 నిమిషాల్లో చీరాల చేరుతున్నారు. గత 20 ఏళ్లలో ఈవిధంగా రహదారి నిర్మాణం జరగలేదని దగ్గుబాడు, పోతినవారిపాలెం, స్వర్ణ గ్రామాల ప్రజలు కూటమి ప్రభుత్వం పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. **- ఇంకొల్లు, కారంచేడు, న్యూస్‌టుడే**

ఉన్నత పాఠశాలకు పంకాల వితరణ

జాండ్రపేట(చీరాల గ్రామీణం), న్యూస్‌టుడే: కడప అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి హజ్రత్ కేఎస్ఎస్ హరిఫుల్లా హుస్సేని జన్మదినం సందర్భంగా చీరాల మండలం జాండ్రపేట దర్గా భక్తులు గురువారం స్థానిక బీవీ, బీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎనిమిది ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు అందజేశారు. అనంతరం చీరాల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంచారు.

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు అందజేత

వేటపాలెం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు గురువారం నూతన వస్త్రాలను పరణం అంజన్ కుమార్ అందజేశారు. వీటిని తన తల్లిదండ్రులైన బాలాజీ రావు, సావిత్రి దేవి జ్ఞాపకార్థం పంపిణీ చేశారు. రామిశెట్టి నరసింహారావు, రాంబాబు, సీతారామయ్య పాల్గొన్నారు.

తాటిపర్తివారిపాలెంలో నేత్రదానం

గాదె అనంతలక్ష్మి

తాటిపర్తివారిపాలెం (ఇంకొల్లు), న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో నేత్రదానం జరిగింది. తాటిపర్తివారిపాలేనికి చెందిన గాదె అనంతలక్ష్మి(52) గురువారం మృతిచెందారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు రోటరీ అవయవ నేత్రదాన సలహా కేంద్రం ప్రతినిధులు జెట్టి స్వామి, ఎస్.రామమోహనరావు పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి సిబ్బందిని పిలిపించి, మృతురాలి కార్నియాలను సేకరించారు. దాత కుటుంబ సభ్యులను రోటరీ ప్రతినిధులు కోటేశ్వరరావు, రాఘవరెడ్డి, నాగేశ్వరరావు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనం

ఇసుకదర్శి (మార్టూరు), న్యూస్‌టుడే: చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఇసుకదర్శి సమీపంలో గురువారం ఇది జరిగింది. గుంటూరు నుంచి ఒంగోలు వైపు ప్రయాణికులతో వెళుతున్న బస్సు ఇసుకదర్శిలో ప్రయాణికులను దింపి, ఎక్కించుకునేందుకు హైవే సర్వీసు రోడ్డులోకి మళ్లుతుండగా వినుకొండ సమీపంలోని పిట్టంబండ గ్రామానికి చెందిన జయపాల్(42) బైక్‌పై వెళుతూ ఎదురెదురు ఢీకొన్నారు. ఈ సంఘటనలో అతడి తలకు బలమైన గాయమైందని స్థానికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తమ వాహనంలో క్షతగాత్రుడ్ని వైద్యసేవలకు మార్టూరు తరలించారు. జొన్నతాళిలోని బంధువుల ఇంటికి జయపాల్ వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. మెరుగైన వైద్యం కోసం మార్టూరు వైద్యులు గుంటూరుకు సూచించడంతో అక్కడికి తరలించారు.

(c) eenadu

నూతన ఆంగ్ల సంవత్సరాది వేడుకలను తిరుపతి నగరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో కళాకారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. జబర్దస్త్ కమెడియన్ రాజమౌళి ప్రదర్శన సందర్శకులకు నవ్వులు పూయించింది. నగరవాసులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో శిల్పారామం సందడిగా మారింది.

- న్యూస్‌టుడే, తిరుపతి

తొలి జీతం.. బడి పిల్లలకు

కొత్తపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక ఉపాధ్యాయులు సమదుస్తులు వితరణగా అందజేశారు. ఇటీవల డీఎస్సీ ద్వారా ఎంపికైన రాంబాబు, ప్రభాకర్, సుబ్బమ్మ కొత్తపేట పాఠశాలలో ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించారు. వారి మొదటి నెల జీతంలో రూ.21 వేలు వెచ్చించి.. 35 మందికి దుస్తులు అందించడంతో వారిలో ఆనందం కనిపించింది. **- న్యూస్‌టుడే, శాంతిపురం**

191 గ్రామాలు.. 3.88 లక్షల ఎకరాలు

నేటి నుంచి నాలుగో విడత రీసర్వే

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో నాలుగో విడత రీసర్వేకు రంగం సిద్ధమైంది. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా వివాదాలకు తావులేకుండా కచ్చితమైన సమాచారం నమోదుకు వీలుగా సర్వే చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ శుక్రవారం మొదలు కానుంది. జిల్లాలోని 191 రెవెన్యూ గ్రామాల్లోని 3,88,850 ఎకరాలు రీసర్వే చేయనున్నారు. ఈ ఏడాది ప్రథమార్థానికి ఈ ప్రక్రియ పూర్తిచేసేలా ప్రణాళిక అమలు చేస్తున్నారు. సర్వే నిమిత్తం గ్రామ/మండల సర్వేయరు, వీఆర్‌వో, వీఆర్‌ఏలను బృందాలుగా నియమించారు. ఆర్‌ఐ, డిప్యూటీ తహసీల్దార్, ఆర్డీవోలకు క్షేత్రస్థాయి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఒక్కో బృందం రోజుకు 25 ఎకరాలకు తగ్గకుండా సర్వే చేయాలని ఆదేశించారు. ముందుగా ప్రభుత్వ, అసైన్డ్.. తర్వాత ప్రైవేటు భూములు లెక్కించనున్నారు.

సర్వే చేస్తున్న సిబ్బంది (పాతచిత్రం)

రెండు విడతల్లో ఇలా..

మొదటి విడతలో 31 రెవెన్యూ గ్రామాల్లోని 30,774 ఎకరాలు, రెండో విడతలో 38 గ్రామాల్లోని 40,359 ఎకరాలు, మూడో విడతలో 12 గ్రామాల్లో మూడు వేలకుపైగా ఎకరాల్లో రీసర్వే చేశారు. తాజాగా నాలుగో విడత రీసర్వే మొదలుకానుండగా ఇప్పటికే 58 వేల ఎకరాల సర్వే పూర్తిచేశారు. మిగిలిన విస్తీర్ణాన్ని లెక్కించడం పూర్తిచేసి ఈ ఏడాది జులై నాటికి రైతులకు భూహక్కు చట్టం ప్రకారం రికార్డులు (ఆర్‌వోఆర్) రూపొందించేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు.

పాసు పుస్తకాల పంపిణీ రెవెన్యూ గ్రామసభలు

రీసర్వే పూర్తయిన 319 గ్రామాల్లో ఈ నెల రెండో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి ఆర్డీవో కార్యాలయాలకు షెడ్యూల్ వెళ్లింది. ప్రభుత్వ రాజముద్రతో కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను గ్రామసభల్లో పంపిణీ చేయనుంది. గ్రామాల్లో వీఆర్వోలు అందుబాటులో ఉండి.. రైతులకు పాసు పుస్తకాలు అందజేయనున్నారు. ఈ సమయంలో నిర్ధారణ కోసం రైతుల నుంచి బయోమెట్రిక్ తీసుకుంటారు. జిల్లాకు వచ్చిన 70 వేలకు పైగా పాసు పుస్తకాలు ఆర్డీవో కార్యాలయాల నుంచి తహసీల్దార్ కార్యాలయాలకు పంపారు. ఇక తప్పుల్లేని వాటిని రైతులకు అందజేయనున్నారు. పొరపాట్లు నమోదైన వాటిని వెనక్కి తీసుకుని సవరించాక పంపిణీ చేస్తారని, తహసీల్దార్లు ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటించి పంపిణీ పర్యవేక్షించాలని డీఆర్వో మోహన్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు.

జిల్లాకు చేరిన
825 టన్నుల యూరియా

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: రబీ పంటల సాగు అవసరాల నిమిత్తం జిల్లాకు 825 టన్నుల యూరియా చేరింది. ప్రత్యేక వ్యాగన్‌లో గురువారం స్థానిక రైల్వేస్టేషన్‌కు చేరింది. ప్రస్తుతం జిల్లాలో అవసరాలకు అనుగుణంగా 2,020 టన్నులు నిల్వ ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి గురువారం తెలిపారు. అధిక ధరకు విక్రయం, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

చిత్తూరు రైల్వే స్టేషన్‌కు చేరిన వ్యాగన్

అందరూ వీఐపీలే..

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తజన సంద్రంగా మారింది. గురువారం ఇసుకేస్తే రాలనంతగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి ఆలయం మూత వేసే సమయానికి దాదాపు 35 వేలమందికి పైగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వచ్చిన వాళ్లలో సిఫార్సు దర్శనాలే ఎక్కువ. మరోవైపు అంతరాలయ దర్శన టికెట్లు 719 మాత్రమే విక్రయించారు. దళారులు తమదైన రీతిలో భక్తుల బృందాలను దర్శనాలకు యథేచ్ఛగా తీసుకెళ్లారు. ప్రధానంగా రూ.500, వీఐపీ దర్శనాల కారణంగా సామాన్య భక్తులు అవస్థలు పడ్డారు. వీఐపీ బ్రేక్ సమయాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో ఉచిత సిఫార్సులు కట్టడి చేయాల్సి ఉంది.

రేవు దోచేయ్.. చెన్నై తరలించేయ్

పుత్తూరు, న్యూస్‌టుడే: ఇసుక ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.. రూ.4 వేలు చెల్లిస్తేగానీ ఇసుక దొరకని పరిస్థితి.. పుత్తూరు, నగరి అవసరాలకు నాగలాపురం, గాజులమండ్యం రీచ్‌ల నుంచే సరఫరా అవుతుంది. ఇది వ్యయప్రయాసలతో కూడిన పనికావడంతో అక్రమ వ్యాపారం చేసేవారి పంట పండుతోంది.

పాపానాయుడుపేట నుంచి పుత్తూరుకు వెళ్తున్న ట్రాక్టర్

నిత్యం భారీగా తరలింపు

ఏర్పేడు మండలం పాపానాయుడుపేట నుంచి ఇసుక రాజమార్గాన తరలివస్తోంది. ఒకే పర్మిట్‌తో రోజుకు నాలుగైదు ట్రిప్పులు తరలిస్తున్నారు. ఇలా రోజూ వంద ట్రిప్పుల మేర పుత్తూరుకే డంప్ అవుతోంది. అనంతరం రాత్రివేళ చెన్నైకు టిప్పర్లలో తరలిస్తున్నారు. అక్రమాలు తిరుపతి-చెన్నై హైవేపై నిరాటంకంగా సాగుతున్నా పట్టించుకునే దిక్కులేదు.

పర్మిట్లు విధిగా ఉండాల్సిందే..

ఏర్పేడు నుంచి పుత్తూరుకు వస్తున్న ఇసుక ట్రాక్టర్లకు విధిగా పర్మిట్లు ఉండాలి. అలా ఉంటేనే ఆయా వాహనాలు పట్టణంలోకి అనుమతించాలి. ఈ మేరకు చర్యలు తీసుకుంటాం. స్థానిక పోలీసులు నిఘా పెంచి అక్రమంగా వస్తున్న ట్రాక్టర్లు సీజ్ చేసేలా చర్యలు తీసుకుంటాం. ఈ అక్రమాల్లో ఎవరున్నా ఉపేక్షించబోం.

- వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు

నాడు వెలవెల.. నేడు కళకళ

☛ శరవేగంగా పరిశ్రమల నిర్మాణం

గంగాధరనెల్లూరు: గత వైకాపా ప్రభుత్వ హయాంలో దాడులు, దౌర్జన్యాలు, ఆక్రమణలతో ఏపీఐఐసీలో పలు పరిశ్రమలు మూతబడ్డాయి. కొత్త పరిశ్రమలు నెలకొల్పడానికి ఔత్సాహికులైన యువ పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం ఏపీఐఐసీ అధికారులతో పాటు ఎమ్మెల్యే చొరవతో మూతపడిన పరిశ్రమలు తెరచుకోవడంతోపాటు కొత్తవాటి స్థాపన చురుగ్గా సాగుతోంది.

పునఃప్రారంభమైన గ్రానైట్ పరిశ్రమ

గంగాధరనెల్లూరులో (2014-19) 12 ఎకరాలను రైతులకు పరిహారంగా ఇచ్చి వారి సమ్మతితో ఏపీఐఐసీకి కేటాయించారు. ఇందులో తారురోడ్డు, విద్యుత్తు, నీరు వసతులు కల్పించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆకర్షించి పరిశ్రమలు ప్రారంభించింది. ఆపై వైకాపా ప్రభుత్వ హయాంలో దాడులు, దౌర్జన్యాలు, ఆక్రమణలతో ఆయా పరిశ్రమలు మూతబడటంతో పాటు కొత్తవి నెలకొల్పలేదు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు రూ.14.3 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో నిర్వహణ కష్టమై మూసేశారు. ఏపీఐఐసీ సముదాయంలో కల్పించాల్సిన తాగునీరు, బస్‌షెల్టరు, వీధి దీపాలు, మరుగుదొడ్లు లేక కార్మికులు అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బకాయిలు దశల వారీగా విడుదలవడంతో గతంలో పక్కనే మెగా లెదర్ కర్మాగారానికి కేటాయించిన 432 ఎకరాల్లో 36 ఎకరాలు ఏపీఐఐసీకి కొత్తగా కేటాయించనున్నారు. ఫలితంగా యువతకు ఉపాధి లభించనుంది.

పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటాం

పరిశ్రమల స్థాపనకు, కార్మికులకు వసతులు కల్పించడం, ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల విడుదలకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఉన్న 12 ఎకరాలతో పాటు అదనంగా 36 ఎకరాల భూములు సేకరించి ఇచ్చి మరిన్ని పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి, ఉద్యోగాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

-థామస్, ఎమ్మెల్యే, గంగాధరనెల్లూరు

మూతి వంకర.. పక్షవాతం అనుకోరా!

■ ఉమ్మడి జిల్లాలో బెల్స్ పాల్సీ ముప్పు

సునీతకు 28 ఏళ్లు.. ఉదయం చన్నీటి స్నానం చేయడం, ధనుర్మాసం సందర్భంగా తెల్లవారుజామునే ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల ఉన్నట్టుండి ఆమె మూతి వంకర పోవడం గుర్తించిన భర్త అద్దంలో చూపించగా పక్షవాతం వచ్చిందేమోనని హడలిపోయింది. వెంటనే వైద్యుడిని సంప్రదించగా అది పక్షవాతం కాదని బెల్స్‌పాల్సీగా నిర్ధారించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే ఇలాంటి వారి సంఖ్య జిల్లాలో వందల నుంచి వేలకు చేరుతోంది. ఇంతకీ ఏమిటీ బెల్స్ పాల్సీ?

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : ప్రస్తుతం మంచు ఎక్కువగా కురుస్తోంది. దీనికి తోడు విపరీతమైన చలి ఉంటోంది. నునువెచ్చని సూర్యకిరణాలు తాకుతున్న సమయంలో ఉదయపు నడక (వాకింగ్) చేస్తే ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. చలికాలంలో యువత వాకింగ్ చేసినా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అయితే వృద్ధులు, నడి వయస్కులు బెల్స్ పాల్సీ బారిన పడే అవకాశం ఎక్కువ. మూతి వంకరతో వచ్చే వారు బెల్స్‌పాల్సీగా వైద్యులు గుర్తిస్తున్నారు.

లక్షణాలు ఇవీ ..

చలిగాలులు ఎక్కువగా చెవుల్లో నుంచి లోపలకు వెళ్లడం వల్ల నాడిపై ప్రభావం పడి ముఖం ఒక పక్కకు లాగేసినట్లు ఏర్పడుతుంది. దీంతో మూతి వంకర తిరిగినట్లు ఉంటుంది. దీన్నే బెల్స్ పాల్సీ అంటారు.

- చన్నీటి స్నానం చేసినా, చలిలో తిరిగినా 30 ఏళ్లు పైబడిన వారికి ఈ ముప్పు ఎక్కువగా ఉంటుంది.

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

(c) eenadu

ఈఎస్ఎల్ హోరు.. యువత హుషారు

ఆసక్తికరంగా 'ఈనాడు' క్రికెట్ మ్యాచ్‌లు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్' (ఈఎస్ఎల్)-2025 క్రికెట్ పోరులో యువ బ్యాటర్లు, బౌలర్లు సత్తాచాటుతున్నారు. అదరగొట్టే బ్యాటింగ్‌తో బంతిని బౌండరీలు దాటిస్తూ.. చాకచక్యమైన బౌలింగ్‌తో వికెట్లు పడగొడుతూ అద్భుత ప్రతిభ ప్రదర్శిస్తున్నారు. తిరుపతిలోని ఎస్వీ హై స్కూల్ క్రికెట్ మైదానం, ఎస్వీయూ స్టేడియం వేదికగా సీనియర్స్, జూనియర్స్ విభాగంలో జరుగుతున్న మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగుతున్నాయి. బుధవారం జరిగిన 'ఈనాడు' క్రికెట్ మ్యాచ్‌ల వివరాలు ఇలా ఉన్నాయి.

గ్రౌండ్-1 ఎస్వీ హై స్కూల్ మైదానం

పది వికెట్ల తేడాతో సీకాం గెలుపు

విజయం సాధించిన సీకాం జూనియర్ కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జయంత్

తొలి మ్యాచ్‌లో బీఎస్ఆర్ జూనియర్ కళాశాల తిరుపతి, సీకాం జూనియర్ కళాశాల తిరుపతి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సీకాం బౌలింగ్‌ను ఎంచుకోగా, బ్యాటింగ్ చేసిన బీఎస్ఆర్ 7.2 ఓవర్లలో ఆలౌటై 31 పరుగులు చేసింది. 32 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన సీకాం కేవలం 3.3 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. జట్టులో జయంత్ (15 బంతుల్లో 4×3) 20 పరుగులు, 2 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

అదే జోరులో ఎమరాల్డ్స్

గెలుపొందిన ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా హవీష్ రెడ్డి

ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల తిరుపతి, అక్షర జూనియర్ కళాశాల నాగలాపురం జట్ల మధ్య రెండో మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన అక్షర బ్యాటింగ్‌లో నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 66 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన ఎమరాల్డ్స్ 8.5 ఓవర్లలో 67 పరుగులు చేసి 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జట్టులో హవీష్ రెడ్డి (29 బంతుల్లో 4×1) 26 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

వరదయ్యపాళెం కళాశాల లక్ష్య ఛేదన

వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల విజయకేతనం

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ప్రణీత్

మూడో మ్యాచ్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల నాగలాపురం, ప్రభుత్వ జూనియర్ కళాశాల వరదయ్యపాళెం జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన నాగలాపురం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 70 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన వరదయ్యపాళెం జట్టు 8.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 71 పరుగులతో గెలుపును సొంతం చేసుకుంది. జట్టులో ప్రణీత్ (16 బంతుల్లో 4×1) 12 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి ఉత్తమ ఆల్‌రౌండర్‌గా ఎంపికయ్యాడు.

గ్రౌండ్-2 ఎస్వీయూ స్టేడియం

హోరాహోరీ పోరులో ఎస్వీ విజయం

విజయం సాధించిన ఎస్వీ పాలిటెక్నిక్ జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా సాయితేజ

ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తిరుపతి, గీతం జూనియర్ కళాశాల భవానీనగర్ జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్ హోరాహోరీగా సాగింది. టాస్ గెలిచిన ఎస్వీ పాలిటెక్నిక్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన గీతం నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 101 పరుగులు చేసింది. 102 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన ఎస్వీ పాలిటెక్నిక్ 8.2 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జట్టులో సాయితేజ (29 బంతుల్లో 10×4) 54 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

ఆర్కే విద్యాలయ సత్తా

సత్తాచాటిన ఆర్కే విద్యాలయ జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నితీష్

రెండవ మ్యాచ్‌లో వేము పాలిటెక్నిక్ కళాశాల పి.కొత్తకోట, ఆర్కే విద్యాలయ జూనియర్ కళాశాల చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఆర్కే విద్యాలయ బౌలింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్ చేసిన వేము పాలిటెక్నిక్ నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 71 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆర్కే విద్యాలయ 8.3 ఓవర్లలో కేవలం వికెట్ నష్టానికి 72 పరుగులు చేసి సత్తాచాటింది. జట్టులో నితీష్ (11 బంతుల్లో 3×4) 19 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

కృష్ణతేజ విజయకేతనం

గెలుపొందిన కృష్ణతేజ ఫార్మసీ జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎన్.దినేష్

మూడో మ్యాచ్‌లో కృష్ణతేజ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ తిరుపతి, వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పి.కొత్తకోట జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన వేము బ్యాటింగ్‌తో నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 73 పరుగులు చేసింది. 74 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌తో బరిలో దిగిన కృష్ణతేజ 7.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించి విజయకేతనం ఎగురవేసింది. జట్టులో ఎన్.దినేష్ (21 బంతుల్లో 4×6) 34 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్ FM Partner TV Partner
Organised by ఈనాడు

నేడు 02.01.2026

గ్రౌండ్-1: ఎస్వీ హై స్కూల్ మైదానం (సీనియర్స్, జూనియర్స్)

- **ఉదయం 8:00:** సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎస్ఐఈటీకే), పుత్తూరు × పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చిత్తూరు (సీనియర్స్)
- **ఉదయం 10:30:** శ్రీవివేకానంద జూనియర్ కళాశాల, పలమనేరు × సీకాం జూనియర్ కళాశాల, తిరుపతి (జూనియర్స్)
- **మధ్యాహ్నం 2:00:** శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి × ఎస్‌డీహెచ్ఆర్ డిగ్రీ కళాశాల, తిరుపతి (సీనియర్స్)

గ్రౌండ్-2: ఎస్వీయూ స్టేడియం (సీనియర్స్, జూనియర్స్)

- **ఉదయం 8:00:** ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కాలేజ్, విద్యానగర్ × ఎస్వీయూ కళాశాలలు, తిరుపతి (సీనియర్స్)
- **ఉదయం 10:30:** గీతం జూనియర్ కళాశాల, రామాపురం × ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల, తిరుపతి (జూనియర్స్)
- **మధ్యాహ్నం 2:00:** ప్రభుత్వ జూనియర్ కళాశాల, వరదయ్యపాళెం × ఆర్కే విద్యాలయ జూనియర్ కళాశాల, చిత్తూరు (జూనియర్స్)

రేపు 03.01.2026

గ్రౌండ్-1: ఎస్వీ హై స్కూల్ మైదానం (సీనియర్స్, జూనియర్స్)

- **ఉదయం 8:00:** ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తిరుపతి × ఎస్వీ జూనియర్ కళాశాల, తిరుపతి (జూనియర్స్)
- **ఉదయం 10:30:** అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, తిరుపతి × బీఎస్ఆర్ డిగ్రీ కళాశాల, తిరుపతి (సీనియర్స్)
- **మధ్యాహ్నం 2:00:** శ్రీవిద్యానికేతన్ ఇంజినీరింగ్ కాలేజ్, రంగంపేట × సీకాం డిగ్రీ కళాశాల, తిరుపతి (సీనియర్స్)

గ్రౌండ్-2: ఎస్వీయూ స్టేడియం (సీనియర్స్, జూనియర్స్)

- **ఉదయం 8:00:** గ్రౌండ్-2లో నేటి మ్యాచ్-2 విజేత × గ్రౌండ్-1లో నేటి మ్యాచ్-2 విజేత (జూనియర్స్)
- **ఉదయం 10:30:** సిద్ధార్థ ఎడ్యుకేషనల్ అకాడమీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, సి.గొల్లపల్లి × గ్రౌండ్-2లో నేటి మ్యాచ్-1 విజేత
- **మధ్యాహ్నం 2:00:** ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి × చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి

ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని పెంచాలి: ఎస్పీ

తపోవనంలో పిల్లలకు కేకు అందజేస్తున్న ఎస్పీ తుషార్ డూడి

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: ప్రజల్లో పోలీసులపై మరింత నమ్మకాన్ని పెంపొందించాలని ఎస్పీ తుషార్‌డూడి పేర్కొన్నారు. జిల్లా పోలీసు క్యాంపు కార్యాలయంలో గురువారం నూతన సంవత్సరం వేడుకల్లో అధికారులతో కలిసి పాల్గొని కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కొత్త ఏడాదిలో మరింత ఉత్సాహంతో సమష్టిగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రజల్లో శిక్షణ ఎస్పీ తరుణ్ పహ్వా, ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఎస్పీని సత్కరించారు. తపోవనంలో అనాథ పిల్లలు, వృద్ధులతో కలిసి కేకు కోసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో ఆప్యాయంగా మాట్లాడారు. ఏదైనా సమస్య ఉన్నా, సాయం అవసరమైనా తమను సంప్రదించాలని, పోలీసుశాఖ నుంచి సాయం చేయడానికి సిద్ధంగా ఉంటామని చెప్పారు. ప్రశాంత్‌నగర్ కాలనీలోని పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న సిబ్బంది మధ్య ఎస్పీ వేడుకలు నిర్వహించారు.

అప్పలాయగుంటలో భక్తుల తాకిడి

వడమాలపేట, న్యూస్‌టుడే: అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా గురువారం భక్తుల తాకిడి పెరిగింది. స్వామివారికి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. నిజాలయంలో కొలువైన ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, పుష్ప మాలికలతో అలంకరించారు. ఆలయాధికారి వేణుగోపాల్‌రాజు, అర్చకులు పాల్గొన్నారు.

EENADU Classifieds
HEALTH & CARE
PAEDIATRIC
శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.
REAL ESTATE
LAND FOR SALE
GENERAL
గూడూరుకు 5 కి.మీ. పరిధిలో 1 3/4 ఎకరము పొలము అమ్మబడును. వివరములకు సెల్: ✆ 96522 14810.
JOBS
ప్రభుత్వ ఆఫీసులలో అవుట్ సోర్సింగ్ కింద పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్స్, ITI మెకానిక్స్ కావలెను. ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగాలకు. 9849848817.
తిరుపతి ఏరియాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ అర్జెంటుగా కావలెను. మంచి జీతం. 85004 05004, 89854 22255.
THE EENADU WAY CLASSIFIEDS B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు... 80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు పూల మొక్క అందజేస్తున్న జేసీ విద్యాధరి

ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా కేకు కోస్తున్న కలెక్టర్

ఎంపీ ప్రసాదరావుకు బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

కాలమానిని ఆవిష్కరించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక, సంఘం నాయకులు

కొత్త సందడి

చిత్తూరు (కలెక్టరేట్, పంచాయతీ), న్యూస్‌టుడే: జిల్లా ప్రజలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ సుఖ శాంతులతో అలరారాలని ఆయన ఆకాంక్షించారు. గురువారం నూతన సంవత్సరాది సందర్భంగా జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్‌తోపాటు వివిధ జిల్లా శాఖల అధికారులు, రెవెన్యూ ఉద్యోగులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్ పాల్గొన్నారు. లక్ష్మీనగర్ కాలనీలోని ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే కార్యాలయాల్లో వారిని శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే పిలుపుమేరకు బొకేలు, శాలువలకు బదులు పేద విద్యార్థులకు అందించేందుకు పెన్నులు, నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేశారు. ప్రజలకు 2026 కాలమానిని, స్వీట్లు పంపిణీ చేశారు.

నూతన సంవత్సరంలో మంచి జరగాలి

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సరం-2026 కాలమానిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక ఆవిష్కరించారు. స్థానిక జిల్లా జడ్జి బంగ్లాలో గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తిని.. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరించి న్యాయమూర్తులు, అధికారులు, ఉద్యోగులందరికీ నూతన సంవత్సరంలో మంచి జరగాలని ఆకాంక్షించారు. జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు లక్ష్మీపతి, కె.రవీంద్రారెడ్డి, వి.రాజేష్, ఎస్.బాలసుందర్, డి.జి.దామోదరం, పవనకుమారి, కె.ఆర్.హరికృష్ణ, ఎ.రెడ్డెప్ప, దిలీప్, హేమ, గణేష్, ఎస్.సంతోష్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

విరుల సోయగం..!

వైకుంఠ ఏకాదశి, నూతన ఆంగ్ల సంవత్సరాది పూజలు.. వేడుకల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కుప్పం ప్రాంత రైతులు పూల సాగును విస్తారంగా చేపట్టారు. శాంతిపురం, కుప్పం, రామకుప్పం, గుడుపల్లె మండలాల్లో చామంతి తోటలను అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. ప్రస్తుతం గిట్టుబాటు ధరలు లభించడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, కుప్పం**

విద్యా వ్యవస్థను బలోపేతం చేద్దాం

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: జిల్లాలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయుల సహకారం అవసరమని డీఈవో రాజేంద్రప్రసాద్ కోరారు. ఆయన తన కార్యాలయంలో గురువారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రూపొందించిన దైనందిని, కాలమానిని ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయప్రకాష్ నాయుడు, రామయ్య, ప్రతినిధులు సుబ్రహ్మణ్యం నాయుడు, జార్జి పాల్గొన్నారు.

కాణిపాకంలో ఆంగ్ల సంవత్సరాది వేడుకలు

దర్శనానికి ఐదు గంటలు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయంలో ఆంగ్ల సంవత్సరాది వేడుకలు ఘనంగా గురువారం నిర్వహించారు. వేకువజామున ఉభయదారులచే స్వామివారి మూలమూర్తికి పంచామృతాభిషేకం చేశారు. చందనం, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి, నివేదన సమర్పించారు. నాలుగు గంటల నుంచి భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాక తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనార్థం తరలి వచ్చారు. ఆలయ క్యూలైన్లు నిండి వెలుపలికి వరుసలు కొనసాగాయి. దర్శనానికి ఐదు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో ఉన్న భక్తులకు బిస్కెట్లు, బాదంపాలు అందజేశారు. ఉచిత ప్రసాదంతో పాటు, అన్నదానం చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిశోర్ పర్యవేక్షించారు. స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో చిన్నారులు తప్పిపోకుండా ట్యాగ్‌లు కట్టారు.

వినాయకుడి ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తజనం

ప్రసన్న వెంకన్న సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

వడమాలపేట, న్యూస్‌టుడే: అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఏవో వేణుగోపాల్‌రాజు, అర్చకులు.. వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. ఆలయ విశిష్టతను ఆయనకు.. అర్చకులు వివరించారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ దంపతులను వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

← ఆలయ ఆవరణలో జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్ దంపతులు

'మన మిత్ర'లో ద్రవిడ పరీక్ష ఫలితాల విడుదల

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలో గురువారం ఉదయం 9.30కు మన మిత్ర(వాట్సప్ గవర్నెన్స్) ద్వారా యూజీ, పీజీ పరీక్ష ఫలితాలను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, వర్సిటీ వీసీ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ చేతులమీదుగా విడుదల చేశారు. యూజీలో ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు సంబంధించి 3, 5వ సెమిస్టర్లు, పీజీలో ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను 'మనమిత్ర' యాప్‌లో అందుబాటులో ఉంచారు. వాట్సప్‌లో పరీక్షా ఫలితాలు విడుదల కావడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యాప్ వినియోగంపై కరపత్రం విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, అధికారులు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి గాయాలు

గుడికొత్తూరు(గుడుపల్లె), న్యూస్‌టుడే: మండలంలోని గుడికొత్తూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరు గాయపడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. శాంతిపురం మండలం వెంకటాపురానికి చెందిన చిన్నవెంకటేశు తన కుమారుడు సోమశేఖర్(21)ను బెంగళూరుకు పంపేందుకు కుప్పానికి ద్విచక్ర వాహనంపై గ్రామం నుంచి బయలుదేరారు. కుప్పం-గెసికపల్లె మార్గం గుడికొత్తూరు వద్ద ద్విచక్ర వాహనాన్ని టెంపో ఢీకొంది. ప్రమాదంలో సోమశేఖర్ మృతి చెందగా చిన్నవెంకటేశు తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎస్సై నరేష్ తెలిపారు.

మామిడి ఆశలపై మంచుతెరలు

ఆలస్యమవుతున్న పూత, దిగుబడిపై తీవ్ర ప్రభావం

పుత్తూరు, బంగారుపాళ్యం, న్యూస్‌టుడే : మామిడి రైతులను మంచు ముంచేస్తోంది.. ఏడాది కష్టం నేలపాలయ్యే పరిస్థితి ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.. ఏటా ఏదోఒక కారణంతో నష్టాలపాలవుతున్నారు.. గతేడాది ఆశించిన దిగుబడి వచ్చినా తోతాపురి రైతుకు నష్టం తప్పలేదు.. గతేడాది నవంబరులో మొంథా, డిసెంబరులో దిత్వా తుపానుతో వర్షాలు కురిశాయి.. మామిడిలో డిసెంబరు 15 నాటికే మొగ్గ దశ ఉండాలి.. అధిక వర్షాల వల్ల పూత ఆలస్యమవుతోంది.. దీనికితోడు ఈ ఏడాది మంచు అధికంగా పడటం, ఉష్ణోగ్రతల్లో భారీ తేడాలతో వచ్చిన పూత మగ్గిపోయి బంక పడుతోంది.. ఫలితంగా దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి సాగు విస్తీర్ణంలో ప్రథమ స్థానంలో ఉంది. జిల్లాలో 1.05 లక్షల హెక్టార్లలో మామిడి సాగవుతోంది. ఈ విస్తీర్ణం ఏటికేడు పెరుగుతోంది. ఇక్కడ గుజ్జు కంపెనీలు సైతం ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏటా రైతులు దున్నకం, నీటి తడులు అందించడం, సస్యరక్షణ చర్యలకు రూ. లక్షలు ఖర్చు చేస్తున్నా ఏదోఒక విపత్తుతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారు. దిగుబడి ఎక్కువ వస్తే పల్ప్ ఫ్యాక్టరీల యజమానులు సిండికేట్‌గా మారి రైతుల నుంచి తక్కువకు కొనుగోలు చేస్తారు. దీంతో రైతులకు పెట్టుబడి సైతం దక్కడం లేదు. గతేడాది నవంబరు, డిసెంబరులో అధిక వర్షాల వల్ల పూత ఆలస్యమై దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

అక్కడక్కడ కనిపిస్తున్న మామిడి పూత

పట్టించుకోని యాజమాన్యాలు..

గుజ్జు పరిశ్రమల యజమానులు టన్నుకు రూ.3,500 నుంచి రూ.6 వేల వరకు తమకు తోచినట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇంకా చాలామందికి నేటికీ డబ్బు అందక, ఆశించిన ధర ఇప్పిస్తామని ఆర్భాటంగా హామీ ఇచ్చిన జిల్లా యంత్రాంగం సైతం మొక్కుబడి సమావేశాలు నిర్వహించి కంపెనీలను తరచూ బతిమలాడుతుండటంతో చేసేదేమీ లేక రైతులు నగదు కోసం ఆయా పరిశ్రమల చుట్టూ తిరుగుతున్నారు. పూత నల్లగా మారి బంక కారే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి..

ఉష్ణోగ్రత అనుకూలిస్తే ఆశించిన దిగుబడులు వస్తాయి. లేదంటే దిగుబడి తగ్గొచ్చు. పూత ఆలస్యమవుతోంది. తేనెమంచు పురుగు నివారణకు ఇమిడాక్లోపిడ్ లీటరు నీటికి 0.33 మి.లీ, కార్బొడైజిన్ ఒక గ్రాము.. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కాదర్ లాంటి రకాల్లో డైజర్ కోనోజిల్.. లీటరు నీటికి 0.5 మి.లీటర్లు కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. గూడు పురుగు నివారణకు అసిఫేట్ ఒక లీటరు నీటికి 125 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. తద్వారా కొంతమేర వాటి నుంచి కాపాడుకోవచ్చు.

-వెంకట సౌజన్య, ఉద్యానశాఖ అధికారిణి, పుత్తూరు

(c) eenadu

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

నేటి నుంచి రైతులకు పాసుపుస్తకాల పంపిణీ

నిండ్ర, న్యూస్‌టుడే: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఈశ్వర్ తెలిపారు. ఈ నెల 9 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 2న కావనూరు, 3న శ్రీరామాపురం, 6న చవరంబాకం, 7న పాదిరి, 8న అగరం, 9న ఆరూరులో గ్రామసభలకు సంబంధించి అధికారుల టీమ్‌ను సిద్ధం చేశామని చెప్పారు.

నేటి నుంచి భూముల రీసర్వే

నగరి, న్యూస్‌టుడే: రెవెన్యూ డివిజన్ పరిధిలోని నగరి, నిండ్ర, విజయపురం, కార్వేటినగరం, పాలసముద్రం మండలాల్లో భూముల రీసర్వే నిర్వహించనున్నామని ఆర్డీవో అనుపమ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల రైతులు సర్వేయర్లకు సహకరించాలని డీడీఐ ప్రసాద్ కోరారు.

8న మండల సమావేశం

పూతలపట్టు, న్యూస్‌టుడే: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 8న ఉదయం 11గంటలకు నిర్వహించనున్నామని ఎంపీడీవో నాగరాజు గురువారం తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరుగుతుందని, చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) చిత్తూరు నగరం: 80085 74598, నగరి: 9866112017, గంగాధరనెల్లూరు: 80085 74605, పూతలపట్టు: 9505557466

? సంతపేటలోని రోడ్డు అధ్వానంగా ఉన్నాయి. సీసీ రోడ్డు నిర్మించాలి. – స్థానికులు ● కొత్త రోడ్డ నిర్మాణానికి ప్రతిపాదిస్తాం. – సుకుమార్‌రెడ్డి, కార్యదర్శి – తవణంపల్లె

? చిత్తూరు యూనిట్రెక్స్ వీధిలోని మురుగు కాలువలో పూడికతీత చేపట్టాలి. – రాజు ● పూడికతీత పనులు చేపడతాం. – లోకేశ్, ఆరోగ్యాధికారి – చిత్తూరు నగరం

? గంగమాంబాపురం పంచాయతీ వీధుల్లో కుళాయి నీరు వృథాగా పోతున్నాయి. పైపు విరిగిపోవడంతో సమస్య ఏర్పడింది. – శివయ్య ● పైపు బాగు చేయించి నీటి వృథాను అరికడతాం. –సత్యనారాయణ, కార్యదర్శి – పాలసముద్రం

? చిత్తూరు- పుత్తూరు ప్రధాన రహదారిలోని సుందరరాజపురం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ముళ్ల కంపలు పెరిగిపోయాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. – నాగమ్మ ● పనికిరాని ముళ్లపొదలు తొలగిస్తాం. – శివయ్య, డిప్యూటీ ఎంపీడీవో – న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు

? వెంగంపల్లెలో వీధి దీపాలు కొన్ని వెలగడం లేదు. రాత్రివేళ ఇబ్బందులు పడుతున్నాం. –గ్రామస్థులు ● పంచాయతీ అధికారులతో మాట్లాడి వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. – ప్రభుకిరణ్, డిప్యూటీ ఎంపీడీవో – న్యూస్‌టుడే, తవణంపల్లె

? పుత్తూరు మండలం వేపగుంట నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు పశ్చిమం వైపునున్న 1.6 కిలోమీటర్ల పొడవైన రోడ్డు అధ్వానంగా మారింది. – సుబ్రహ్మణ్యమూర్తి ● ఇటీవల కొంత భాగం బాగు చేశాం. ఆ ప్రాంతంలో పనికిరాని ముళ్లను తొలగిస్తాం. – శ్రీదేవి, ఎంపీడీవో – పుత్తూరు

? ఎలంగుంరెడ్డిపల్లె- పులికల్లుకు మార్గంలో విద్యుత్తు స్తంభానికి లతలు అల్లుకున్నాయి. – ప్రయాణికులు ● లతలు తొలగిస్తాం.–తులసీప్రసాద్, ఏఈ–పెనుమూరు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: సమస్య: ఎంపీడీవో కార్యాలయంలో సమాచార హక్కు బోర్డులో అధికారుల పేర్లు సరిచేయాలి. – రాఘవేంద్ర, తగ్గువారిపల్లె **సమాధానం:** వెంటనే పరిశీలించి మార్పు చేస్తాం. – మహేష్, ఎంపీడీవో, బంగారుపాళ్యం

తవణంపల్లె: సమస్య: ఎగువమారేడుపల్లిలో రహదారి పక్కనే వ్యర్థాలు వేస్తున్నారు. – స్థానికులు ● **సమాధానం:** రహదారి పక్కన ఉన్న వ్యర్థాలు తొలగింపజేస్తాం. –సుధాకర్, పంచాయతీ కార్యదర్శి

గణనాథుడి సేవలో ప్రముఖులు

కాణిపాకం, న్యూస్‌టుడే: వరసిద్ధి వినాయకస్వామి వారిని ఎమ్మెల్సీలు డాక్టర్ కలిశెట్టి మురళీమోహన్, గురజాల జగన్మోహన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ గురువారం వేర్వేరుగా దర్శించుకున్నారు. పాలకమండలి ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిశోర్, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ప్రముఖులకు స్వామి వారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఏఈవోలు రవీంద్రబాబు, ధనపాల్, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, రవి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మురళీమోహన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఛైర్మన్ మణినాయుడు, ఈవో కిశోర్

తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రొటోకాల్ ఏఈవో ధనపాల్

రోడ్డు భద్రతా మాసోత్సవాలు

నగరి, న్యూస్‌టుడే: జనవరి ఒకటో తేదీ నుంచి 31 వరకు అఖిల భారత స్థాయి రోడ్డు భద్రతా మాసోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిందని స్థానిక ఎంవీఐ వాసుదేవరెడ్డి తెలిపారు. నెల రోజులు పాటు పాఠశాలల బస్సుల డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, బస్సులు, ఆటోలు నడిపే డ్రైవర్లకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అనుబంధ అంశాలు వివరించి పాటించాల్సిన జాగ్రత్తలు సూచించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

● యాదమరి మండలం చిత్తూరు-గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిలో కన్నికాపురం, జోడిచింతల మధ్య ప్రతి రోజూ రాత్రయితే గ్రానైట్ వాహనాలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. వాటికి అనుమతులే లేవు.

● గుడిపాల మండలంలోని క్వారీల నుంచి నిత్యం అక్రమంగా పాలిషింగ్ యూనిట్లకు గ్రానైట్ దిమ్మెలు తరలిస్తున్నారు.

● జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గాల్లోనూ ఇదే దందా.

గ్రానైట్ రవాణా

❖ సక్రమం కొంత.. అక్రమమే అంతా
❖ ప్రభుత్వ ఆదాయానికి గండి
❖ చోద్యం చూస్తున్న అధికారులు

యాదమరి మండలంలో రాత్రి వేళ అక్రమంగా తరలిపోతున్న గ్రానైట్ రాళ్లు

న్యూస్‌టుడే, చిత్తూరు (జిల్లా పంచాయతీ)

జిల్లా సరిహద్దులో గ్రానైటు రవాణా దర్జాగా సాగుతోంది.. రాత్రయితే క్వారీల నుంచి వాహనాల్లో ముడిరాయిని పాలిషింగ్ యూనిట్లకు తరలించడం నిత్యకృత్యమైంది.. ప్రభుత్వ ఆదాయార్జనలో కీలకమైన గనుల శాఖపై సీఎం చంద్రబాబు తరచూ సమీక్షిస్తున్నా అధికారులకు చీమకుట్టినట్లయినా లేదు.. ఉల్లంఘనకు పాల్పడిన సంస్థల నుంచి జరిమానా, సీనరేజీ వసూలు చేయాలని ఆదేశించినా అక్రమాలు ఆగడం లేదు.. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో గండి పడుతోంది.

ప్రైవేటు సంస్థకు అప్పగించేలోగా..

గతంలో పర్మిట్ల మంజూరు, రాయల్టీ వసూలు బాధ్యతను ఓ ప్రైవేటు సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. నిర్ణీత మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించి ఆ సంస్థ రాయల్టీ వసూలు చేసుకునేది. ప్రతి మార్గంలో సిబ్బందిని నియమించి అక్రమ రవాణా అడ్డుకునేది. దాని కాంట్రాక్టు ముగియడంతో పర్మిట్ల మంజూరు, రాయల్టీ వసూలును గనులశాఖే చూస్తోంది. త్వరలో మళ్లీ ప్రైవేటు సంస్థకు కాంట్రాక్టు అప్పగించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఈలోగా అవకాశం ఉన్న మేర చక్కబెట్టేయాలని అక్రమంగా తరలించేయడం గమనార్హం.

అక్రమ రవాణా అరికడతాం..

పర్మిట్లు లేకుండా గ్రానైట్ అక్రమ రవాణా చేసేవారిపై నిఘా ఉంచుతాం. రాత్రివేళ ముమ్మర తనిఖీలు నిర్వహిస్తాం. గ్రానైట్ అక్రమార్కులపై చర్యలు చేపడతాం.

-సత్యనారాయణ, డీడీ, మైన్స్

కొలతలు సరిచూశాకే పర్మిట్లు..

క్వారీలో రాయి వెలికితీశాక దారి పరిమాణాన్ని బట్టి ఆన్‌లైన్‌లో పర్మిట్ల కోసం నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవాలి. ఆపై గనుల శాఖ అధికారులు ఆ క్వారీకి వెళ్లి కొలతలు సరిచూసి సక్రమంగా ఉంటే పర్మిట్ ఇస్తారు. ఆపై రాయల్టీ చెల్లించాలి. ఇవేమీ లేకుండా రాళ్లు తరలించి దండుకుంటున్నారు.

క్వారీలలో ఇలా..

చిత్తూరు, జీడీనెల్లూరు, పూతలపట్టు, నగరి నియోజకవర్గాల్లో 420 క్వారీలు ఉన్నాయి. వీటిలో 290 చోట్ల ప్రస్తుతం తవ్వకాలు జరుగుతున్నాయి. అనుమతులు ఉన్నవాటిలో 30 చోట్ల పరిధికి మించి తవ్వుతున్నారని అధికారులు గుర్తించారు. వీటిలో నగరిలో 13, వెదురుకుప్పంలో 5, తవణంపల్లెలో మూడు, ఐరాల, పూతలపట్టు, ఎస్‌ఆర్‌పురంలో రెండేసి, మిగతాచోట్ల ఒకటి చొప్పున క్వారీల్లో ఉల్లంఘన జరుగుతోంది.

ప్రభుత్వానికి నష్టం..

క్వారీల నుంచి తరలించే రాళ్లకు గతంలో క్యూబిక్ మీటరు లెక్కన రాయల్టీ వసూలు చేసేవారు. ఇప్పుడు మెట్రిక్ టన్నుల లెక్కన చేస్తున్నారు. నల్ల గ్రానైట్ టన్నుకు రూ.3,800 నుంచి రూ.5 వేలు, రంగుల రాళ్లకు రూ.2,500 నుంరి రూ.4 వేలు రాయల్టీ చెల్లించాలి. పూతలపట్టు, చిత్తూరు, జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గాల పరిధిలోని క్వారీల నుంచి ఏటా రూ.150 కోట్లు రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా అక్రమంగా తరలిపోయేది అంతకు రెట్టింపు ఉంది. దీన్ని అరికడితే ప్రభుత్వానికి రెండింతల ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

గొల్లమడుగు వెళ్లాలంటే.. ఘొల్లుమనాల్సిందే..!

బొమ్మసముద్రం నుంచి గొల్లమడుగు గ్రామానికి వెళ్లే రోడ్డులో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది దగ్గరి మార్గం కావడంతో ప్రధానంగా ప్రైవేటు పాఠశాలల బస్సులు ఇటుగా ఎక్కువగా తిరుగుతుంటాయి. గుంతలు ఎగుడు, దిగుడుగా ఉండటం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. స్థానికంగా ఓ కళాశాల ఉండటంతో ఆ విద్యార్థులు సైతం నిత్యం ద్విచక్ర వాహనాల్లో వెళ్తుంటారు. ఇప్పటికైనా అధికారులు ఈ రోడ్డును గురించి పట్టించుకోక పోతే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. **-న్యూస్‌టుడే, గుడిపాల**

సేవతో ఆత్మ సంతృప్తి

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: సేవతో ఆత్మ సంతృప్తి లభిస్తుందని చిత్తూరు లయన్స్ క్లబ్ డైరెక్టర్ పార్థసారథి నాయుడు అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా చిత్తూరు, జీడీనెల్లూరు మండలం వేల్కూరులో చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అక్కడి మహిళలకు ఆయన దుస్తులు పంపిణీ చేశారు.

మహిళకు దుస్తులు అందజేస్తున్న పార్థసారథి నాయుడు

మమ అనిపించారు..

ఉత్తరపు కండ్రిగలో రైతు భరోసా కేంద్రం నిర్మాణం చేపట్టాలని తలచినాడు అనుకున్నదే తడవుగా పునాదులు వేసి గోడలు నిర్మించి శ్లాబ్ వేశారు. అంతే.. ఇక అక్కడి నుంచి పనులు ముందుకు సాగక అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం అర్ధాంతరంగా నిలిచిపోయింది. అదే మన సొంత నగదైతే ఇలా వదిలేస్తారా..? అది ప్రభుత్వ ధనం కాబట్టి అసంపూర్తిగా నిలిపేశారని గ్రామస్థులు చెబుతున్నారు. పనులు త్వరగా పూర్తిచేసి ఈ భవనాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పుత్తూరు**

చెరువు కాలువ ఆక్రమణ

శ్రీరంగరాజపురం, న్యూస్‌టుడే: మండల పరిధి పద్మాపురం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుకు పక్కనే ఉన్న చెరువు కాలువ ఆక్రమణకు గురైంది. ఆరిమాకులకోన చెరువు నుంచి వచ్చే కుడికాలువను కొందరు చదును చేశారు. అడవినుంచి వచ్చే వర్షపునీరు పూర్తిగా రోడ్డుపై చేరి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల సర్వసభ్య సమావేశంలో సమస్యను లేవనెత్తినా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

కొండ కాలువను రోడ్డుపైకి మళ్లించిన దృశ్యం

చిత్తూరు(జిల్లా పంచాయతీ): తెదేపా కార్యాలయంలో కేకు కోస్తున్న నాయకులు ● పోలీసు శిక్షణ కేంద్రంలో సిబ్బందికి కేకు అందజేస్తున్న ఎస్పీ తుషార్‌డూడి ● విశేషాలంకరణలో కార్వేటినగరం వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

అన్నదాతకు అంతా మంచే జరగాలి

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: జిల్లాలోని అన్నదాతలకు కొత్త ఏడాదిలో అంతా మంచి జరగాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి ఆకాంక్షించారు. గురువారం జిల్లా కార్యాలయంలో నూతన సంవత్సర కేకు కోసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆధునిక సాగు సేవలు విస్తరించి కర్షకులకు అండగా ఉందామన్నారు. ఏడీ సావిత్రి, ఏవో అంజయ్య, ఏవోలు, ఉద్యోగులు పాల్గొన్నారు. **చిత్తూరు (జిల్లా పంచాయతీ):** తెదేపా జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్, సీనియర్ నాయకులు చంద్రప్రకాష్, జయచంద్రనాయుడు ఆధ్వర్యంలో కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. జీడీనెల్లూరు, పెనుమూరు, కార్వేటినగరం, నగరి, పుత్తూరు, బంగారుపాళ్యం, పూతలపట్టు, చిత్తూరు గ్రామీణ ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు. బంగారుపాళ్యం మొగిలీశ్వరాలయం, ముత్యాలమ్మ ఆలయం, వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయం, చిత్తూరులోని కోదండరామస్వామి దేవస్థానంలో పూజలు చేశారు. చిత్తూరు చామంతిపురంలోని ఫ్యూర్ గాస్పల్ చర్చిలో కేకు కోసి సంబరాలు చేశారు. పేద మహిళలకు చీరలు వితరణ చేశారు.

పుత్తూరు.. అంకాళ పరమేశ్వరి ఆలయంలో పూజలు ● నగరి.. సాయి దివ్యధామంలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా ● పుత్తూరు.. వినాయకుడికి విశేష అలంకరణ ● బంగారుపాళ్యంలో.. ప్రత్యేక అలంకారణలో ముత్యాలమ్మ

గుంతల దారిలో అవస్థలు

గుడిపాల మండలంలోని బొమ్మసముద్రం నుంచి గొల్లమడుగు వెళ్లు రోడ్డు గుంతలుగా మారింది. దీంతో ఈ మార్గంలో ఎక్కువగా కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు అదుపుతప్పి పడిపోతున్న ఘటనలు నెలకొన్నాయి. ఈ రోడ్డును అధికారులు బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గుడిపాల

పక్కకు వెళ్తే ప్రమాదమే

ఐరాల మండలంలోని అగరంపల్లె- కాణిపాకం ప్రధాన మార్గంలో శ్రీశైల నిత్యాన్నదాన సత్రం వద్ద విద్యుత్తు నియంత్రిక తక్కువ ఎత్తులో ఉంది. వరసిద్ధి వినాయక ఆలయానికి ఈ మార్గంలో భక్తులు నిత్యం వస్తుంటారు. ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, నియంత్రికను ఎత్తులో అమర్చాలని పలువురు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఐరాల

అర్ధగిరిలో దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు

ఆలయాల్లో భక్తుల తాకిడి

తవణంపల్లె, న్యూస్‌టుడే: అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, తవణంపల్లెలోని శ్రీకాళభైరేశ్వర స్వామి ఆలయంలో గురువారం భక్తుల తాకిడి అధికమైంది. నూతన సంవత్సరం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ వివాదంపై కేసు.. బంగారుపాళ్యం: ఎగువ రాగిమానుపెంటకు చెందిన వేణుగోపాల్‌కు మునిరత్నం నాయుడికి మధ్య భూ వివాదం ఉంది. ఈ నేపథ్యంలో వారు.. మునిరత్నంనాయుడిపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు.. చిత్తూరు(సంతపేట): అనాథ వృద్ధురాలు సత్యవతమ్మ(86) మృతదేహానికి అమ్మఒడి సేవా సంస్థ సభ్యులు హిందూ సంప్రదాయం ప్రకారం స్థానిక శ్మశానవాటికలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు పద్మనాభనాయుడు, కార్పొరేటర్ మధుబాబు, మల్లిఆచారి, ధనమ్మ పాల్గొన్నారు.

టెక్నీషియన్లు కావలెను
JOB LOCATION THUTHUKUDI-T/N
POWER PLANT EXPERIENCE IN 3 to 5 Yrs

Fitters Wanted	జీతం
Mill Wright Fitters	Rs.38,000
Equipment Fitters	Rs.24,000
Rigger Fitters	Rs.22,000

పనివేళలు: 8 గం॥లు
EPF & ESIC, Group Insurance, Room Free
Eligibility: ITI Pass, Age: 22-35 Yrs
Sri Sai Krishna Security Services Pvt.Ltd, Nagari
Cell: 9160604900, 8096890893.
Resume పై ఫోన్ నంబర్లకు Whatsapp పంపగలరు.

లెక్క పక్కాగా..

● 66 గ్రామాలు.. 1.17 లక్షల ఎకరాలు
● నేటి నుంచి నాలుగో విడత రీసర్వే

న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు)

జాయింట్ ఎల్పీ నంబరు, విస్తీర్ణంలో వ్యత్యాసాలు.. నిషేధిత జాబితాలోకి వెళ్లిపోవడం.. ఇలా వైకాపా పాలనలో జరిగిన సర్వేలో లోపాలు రైతుల పాలిట శాపాలుగా మారాయి.. కూటమి ప్రభుత్వం గ్రామసభలు పెట్టినా పరిష్కారం కాలేదంటే ఆ స్థాయిలో లోపాలు జరిగాయి.. కూటమి వచ్చాక రెండు విడతల రీసర్వే పూర్తికాగా శుక్రవారం నుంచి నాలుగో విడత సర్వే ప్రారంభించనున్నారు.

మొదటి విడత సర్వేలో చాలాచోట్ల తమకు ఉండాల్సిన భూమి కన్నా తగ్గిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తావనకు వచ్చిన సమస్యలను ఆర్డీవో శ్రీనివాసులు ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తూ ముందుకెళ్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది అవగాహన లోపం, నిర్లక్ష్యం కారణంగా భూముల యజమానులు కార్యాలయాల చుట్టూ నేటికీ తిరుగుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యల పరిష్కారం దిశగా ముందుకెళ్లాలని రైతులు కోరుతున్నారు.

పాఠాలు నేర్చుకోవాలి..

గతంలో రైతులకు సమాచారం ఇవ్వకుండా వారు స్థానికంగా లేకున్నా రీసర్వే చేపట్టడం సమస్యలకు ప్రధాన కారణం. దీంతో జాయింట్ ఎల్పీ నంబర్ల సమస్య వచ్చింది. నిబంధనల ప్రకారం రైతులకు రెండు రోజుల ముందే సమాచారం నోటీసుల రూపంలో అందజేయాలి.

చిత్తూరు గ్రామీణ మండలంలో రీసర్వేపై ప్రచారం నిర్వహిస్తున్న తహసీల్దార్ కల్యాణి

విధిగా గ్రామసభలు..

గ్రామసభలు మొక్కుబడిగా కాక ముందస్తుగా సమాచారం ఇవ్వాలి. రైతులు అందరూ గ్రామసభల్లో తప్పక పాల్గొనేలా ప్రచారం నిర్వహించాలి. సర్వేలో గ్రామ సర్వేయర్, వీఆర్వో తప్పక ఉంటే తప్పులు దొర్లే అవకాశం ఉండదు. రైతులు సైతం అధికారులు చెప్పిన సమయానికి అందుబాటులో ఉంటే సమస్యలు ఉత్పన్నం కావు. 12 మండలాల్లో 66 గ్రామాల్లో 1.17లక్షల ఎకరాల్లో సర్వే చేయడానికి 83 బృందాలను నియమించారు. దీని కోసం 36 రోవర్లు వినియోగించనున్నారు. వాస్తవంగా వీటి సంఖ్య పెంచితే సర్వే వేగవంతానికి అవకాశం ఉంటుందని సిబ్బంది చెబుతున్నారు.

సర్వే చేయనున్న గ్రామాలు, భూముల వివరాలిలా..

మండలం	గ్రామాలు	ఎకరాలు
పెనుమూరు	4	10,961
పూతలపట్టు	6	11,038
తవణంపల్లె	6	10,352
గుడిపాల	8	7,921
చిత్తూరు	4	5,482
జీడీనెల్లూరు	4	8,391
ఐరాల	4	12,387
వెదురుకుప్పం	12	9,133
యాదమరి	2	4,800
ఎస్‌ఆర్‌పురం	8	8,959
పులిచెర్ల	5	13,979
రొంపిచెర్ల	3	14,154

సమస్యలు పునరావృతం కానీయం..

సమస్యలు పునరావృతం కాకుండా ప్రణాళికాబద్ధంగా సర్వే చేపట్టనున్నాం. సర్వే సమయంలో రైతులు ప్రస్తావించే సమస్యలు, సందేహాలు నివృత్తి చేసే దిశగా అధికారులకు ఆదేశాలిచ్చాం. సర్వేలో తప్పిదాలకు పాల్పడితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవు. **-శ్రీనివాసులు, ఆర్డీవో, చిత్తూరు**

ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న షణ్ముగరెడ్డి

ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

పుత్తూరు, న్యూస్‌టుడే: నూతన ఏడాది ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. తిరుపతిలోని నివాసంలో పలు శాఖల అధికారులు ఆయన్ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. తెదేపా చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు షణ్ముగరెడ్డి, వడమాలపేట జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఏలుమలై సత్కరించారు. పుత్తూరులో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్యను తెదేపా నాయకులు ఘనంగా సత్కరించారు.

జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్‌కు సత్కారం

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గీర్వాణి, చంద్రప్రకాష్ దంపతులను గురువారం తెదేపా చిత్తూరు మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కేకు కోసి నూతన సంవత్సరాది శుభకాంక్షలు తెలియజేశారు. నాయకులు రఘు, శశికర్‌బాబు, చల్లా, మోహన్‌రాష్ సత్కరించి తిరుమల ప్రసాదాలు అందజేశారు.

గీర్వాణి, చంద్రప్రకాష్ దంపతుల్ని సత్కరిస్తున్న తెదేపా నాయకులు

శ్రీ కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి - శ్రీమతి శోభారెడ్డి(USA) గార్లు
శంకర నేత్రాలయ కంటి వైద్యశాల - చెన్నై
శ్రీ ఆరువేల బాలసుబ్రమణ్యం ట్రస్టు - నిండ్ర
సంయుక్తంగా నిర్వహించు
ఉచిత కంటి శుక్ల శస్త్ర చికిత్స శిబిరం
స్థలం: శ్రీ వీ కాంప్లెక్స్ (శ్రీ వీ సినిమాస్ వెనుక) నిండ్ర, చిత్తూరు జిల్లా
శిబిరం నిర్వహించే తేది: జనవరి 3వ తేది నుంచి 11వ తేది వరకు

కంటి ఆపరేషన్ వాహనము
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
98463 24139 / 96766 05144 / 70130 85790
TYROMER INDIA PRIVATE LIMITED
NINDRA

(c) eenadu

ఆలయాల్లో భక్తుల తాకిడి

అర్ధగిరిలో దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు

తవణంపల్లె, న్యూస్‌టుడే: అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, తవణంపల్లెలోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో గురువారం భక్తుల తాకిడి అధికమైంది. నూతన సంవత్సరం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు

•పలమనేరు • కుప్పం

పెన్షనర్ల సమస్యలపై దృష్టి

పలమనేరు, న్యూస్‌టుడే: విశ్రాంత ఉద్యోగుల లైఫ్ సర్టిఫికెట్ల సమస్యను పరిష్కరిస్తామని పలమనేరు సబ్ ట్రెజరీ అధికారి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని విశ్రాంత ఉద్యోగులు గురువారం ఆయన్ను కలిసి సత్కరించారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారిస్తానని కిరణ్‌కుమార్ తెలిపారు. నాయకులు గురురాజారావు, గౌస్, గౌడు, కృష్ణమూర్తి, మోహన్, గురుస్వామినాయుడు పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

తెగుళ్లకు విరుగుడిక..!

✦ రాయితీతో మందుల పంపిణీ

పలమనేరు, న్యూస్‌టుడే: పొగ మంచు పెరుగుతుండటంతో మల్బరీ పంటకు తెగుళ్లు సోకుతున్నాయి. ధరలు ఆశాజనకంగా ఉన్న సమయంలో దిగుబడులు వస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమయంలో కూటమి ప్రభుత్వం రైతులకు రాయితీతో డిస్ ఇన్ఫెక్షన్ కిట్లను సరఫరా చేస్తోంది. వీటి ద్వారా మల్బరీ పంటను కాపాడుకోవచ్చు.

కిట్లు తీసుకెళ్తున్న రైతులు

కిట్టు విలువ రూ.5 వేలు

పట్టు పురుగు పెరిగే దశలో మస్కార్డిన్ అనే వ్యాధి సోకుతోంది. ప్రస్తుతం కొన్ని చోట్ల రైతులు దీని కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇది అక్టోబరు, నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో ఎక్కువగా వస్తుంది. గాలిలో తేమ ఎక్కువగా ఉంటే మల్బరీ ఆకుకు ప్లాచరీ, గ్రాసరీ తెగుళ్లు కూడా వ్యాపిస్తాయి. వ్యాధుల నివారణ కోసం ప్రభుత్వం రూ.5 వేలు విలువ చేసే మందుల కిట్లను అందిస్తోంది.

సబ్సిడీ ఇలా..

ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం
మిగిలిన వారికి 75 శాతం
కిట్ ధర రూ.5 వేలు
రైతులు రూ.1,250 చెల్లిస్తే ప్రభుత్వం రూ.3,750 చెల్లిస్తుంది

మందులు ఇవే..

సున్నం: వంద కిలోలు
విజేత: 20 కిలోలు
విజేత సప్లిమెంటరీ: 30 కిలోలు
అస్త్ర: 2 ప్యాకెట్లు
సెరిఫిట్: 2 ప్యాకెట్లు
శానిటెక్ ఆయిల్: 5 లీటర్లు
బ్లీచింగ్: 25 కిలోలు

చాలా ఉపయోగం

పలమనేరు పట్టు పరిశ్రమ శాఖ పరిధిలోని పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి, పుంగనూరు, చౌడేపల్లె, సదుం, సోమల మండలాల్లోని రెండు వేల మంది రైతులకు వీటిని పంపిణీ చేస్తాం. ఈ కిట్టు రైతులకు చాలా ఉపయోగం. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
– సరోజ, పట్టుపరిశ్రమ అధికారిణి, పలమనేరు

ఉబ్బకుంట.. ఊటతో తంటా!

✦ కనీస వసతులు కరవు ✦ అవస్థలు పడుతున్న ప్రజలు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: అసలే చెరువు సమీపంలో కాలనీ.. ఆపై చెరువు రూపం కోల్పోయేలా అక్రమ మట్టి తవ్వకాలు.. ఇంకేముంది చెరువులోని నీరంతా కాలనీలోకి రావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ కనీస రోడ్డు వసతి లేకపోవడంతో కొందరు ఇళ్లు నిర్మించుకుని.. మరికొందరు నిర్మాణం చేపట్టకనే పునాదులకే పరిమితం చేశారు. ఇదంతా కుప్పం పురపాలిక పరిధిలోని గెర్సిబాయిలోని జగనన్న కాలనీ పరిస్థితి.

ఇదీ పరిస్థితి..

వైకాపా హయాంలో మున్సిపాలిటీ పరిధిలోని ఉబ్బకుంట చెరువు పక్కన జగనన్న కాలనీ పేరుతో పేదలకు స్థలాలు కేటాయించారు. కృత్రిమ ఇసుక కోసం చెరువులో ఇష్టానుసారం మట్టి తవ్వకాలు చేపట్టడంతో చెరువు రూపుకోల్పోయింది. దీంతో చెరువుకు నీరు చేరినప్పుడు ఆ నీరు సమీప కాలనీలోకి వస్తోంది.

అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణాలు

1,334 ఇళ్లు మంజూరు..

కాలనీలో ఆరు లే-అవుట్లు వేయగా.. 1,334 ఇళ్లను లబ్ధిదారులకు మంజూరు చేశారు. వీటిలో దాదాపు 515 పూర్తయ్యాయి. మొదట్లో ఉబ్బకుంట చెరువు సమీపంలోని లే-అవుట్ నిర్మాణం శరవేగంగా జరిగింది. ఆ సమయంలో వర్షాలు మొదలై కురవడంతో చెరువులో కొంత నీరు చేరింది. ఊట ద్వారా నీరు కాలనీలోకి రావడంతో లబ్ధిదారులు నిర్మాణ పనులను ఆలస్యం చేశారు. మరోవైపు కనీస మౌలిక వసతులు లేకపోవడంతో మరి కొందరు నిర్మాణాలు చేపట్టేందుకు ఆసక్తి చూపలేదు.

వసతులు కల్పిస్తాం

కాలనీలో పర్యటించి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటాం.
- కమిషనర్, శ్రీనివాసరావు

శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయంలో భక్తులు

మల్లప్పకొండపై భక్తుల సందడి

గుడుపల్లె, కుప్పం పట్టణం: మల్లప్ప కొండపై నూతన సంవత్సరం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. మల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ✦ కుప్పంలోని శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మను భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. పెద్దపంజాణి: మండలంలోని కొత్తవీరప్పల్లె సమీపంలోని యోగనందీశ్వరాలయం వద్ద భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

మల్లేశ్వరస్వామి

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: సమస్య: శెట్టిపల్లెలో నూతనంగా బోరు వేశారు. అయితే మోటారు ఏర్పాటు చేయలేదు. మోటారు, పైపులైను ఏర్పాటు చేస్తే ప్రజలకు నీటి సమస్య తీరుతుంది. – స్థానికులు

సమాధానం: సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మోటారు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.
– ప్రభుదాస్, కార్యదర్శి, లక్కనపల్లె

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని నెహ్రూనగర్ ప్రాంతంలో పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. కాలువల్లో మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది.
– సుమిత్ర, పలమనేరు

సమాధానం: సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం. – ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్

ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో పోలీసులు ❖ కడా పీడీ వికాస్ మర్మత్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

కొత్త సంవత్సర వేడుకలు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని తెదేపా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం ప్రభుత్వ అధికారులు, వివిధ విభాగాల ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, ఆర్డీవో భవానితో పాటు ఉద్యోగులు, పోలీసులు పాల్గొన్నారు. ✦ ఆంగ్ల నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికీ ఆనందం, సంపూర్ణ ఆరోగ్యం, సుఖ సంతోషాలతో ఉండాలని కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ అన్నారు. స్థానిక కడా కార్యాలయంలో ఆయనను అన్ని శాఖల అధికారులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

మురుగు తొలగింపు

స్పందనకు వందనం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధిలో మురుగు పేరుకుపోవడంతో సమస్యపై 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు గురువారం శుభ్రత పనులు చేపట్టారు.

నవ వసంతం.. భక్తి పరవశం

బైరెడ్డిపల్లె: నూతన సంవత్సర సందర్భంగా గురువారం ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. స్థానిక శ్రీశేషాద్రిస్వామి ఆలయంలో మాజీ ఎంపీపీ కృష్ణవేణి కుటుంబీకుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ✦ పట్నపల్లె శ్రీకల్యాణ వెంకటరమణస్వామి, కడపనత్తం శ్రీనలగుంద్రాయస్వామి, తీర్థం శ్రీరామచంద్రస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయాల వద్ద జానపద కళాకారులు కోలాటాలు ఆకట్టుకున్నాయి.

బైరెడ్డిపల్లె: చప్పిడిపల్లెలో కోలాటం ప్రదర్శన

గుడుపల్లె: వేంటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భక్తులు

వైభవంగా స్వామివారి కల్యాణోత్సవం

గుడుపల్లె, న్యూస్‌టుడే: స్థానిక శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గురువారం స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శాంతిపురం, నడింపల్లెలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

సుఖసంతోషాలతో జీవనం సాగించాలి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో జీవనం సాగించాలని తెదేపా మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు ఆకాంక్షించారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు కిశోర్‌గౌడు, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు రాధమ్మను సత్కరించి నూతన శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈవో మహబూబ్‌బాషా, తెదేపా వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి రఘుచంద్రగుప్తా పాల్గొన్నారు.

తమిళశాఖాధిపతిగా గణేశ్‌మూర్తి

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలోని తమిళశాఖాధిపతిగా సహాయ ఆచార్యులు గణేశ్ మూర్తిని నియమిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో తమిళశాఖాధిపతిగా కొనసాగుతున్న ఆచార్య విష్ణుకుమరన్‌కు మూడేళ్ల పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో ఆయన స్థానంలో గణేశ్‌మూర్తిని నియమించారు.

కాలమానిని ఆవిష్కరణ

రామకుప్పం, న్యూస్‌టుడే: తెలుగునాడు ఉపాధ్యాయుల సంఘం నూతన కాలమానిని గురువారం తెదేపా మండల మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి ఆవిష్కరించారు. నాయకులు శ్రీనివాసులు రెడ్డి, నందారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగభూషణం, తెలుగునాడు ఉపాధ్యాయుల సంఘం సభ్యులు నాగేశ్వర్, బాలకృష్ణ, బాలచంద్రనాయక్ పాల్గొన్నారు.

క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పట్టు తప్పితే ప్రమాదమే

కుప్పం నుంచి వేపనపల్లె వెళ్తున్న ఆర్టీసీ బస్సులో విద్యార్థులు ప్రమాదకరంగా ఫుట్‌బోర్డుపై నిల్చొని ప్రయాణిస్తున్నారు. నిత్యం ఇలానే ప్రయాణిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి బస్సుల సంఖ్య పెంచడమో. . లేదా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

ఎంత ప్రమాదమో కదా..?

పట్టణంలోని రెక్కమాను సర్కిల్ వద్ద విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. పైగా ఆటోలు ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే నిలుపుతున్నారు. చేతికి అందేంత ఎత్తులో ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నియంత్రిక ఎత్తు పెంచాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, పలమనేరు

కాస్త.. ఈ గుంత పూడ్చరూ..?

చూడటానికి ఈ గుంత చిన్నగా ఉన్నా.. ద్విచక్ర వాహనదారులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలమనేరులోని లింగాయతి వీధిలో జీవిత బీమా సంస్థ ఎదురుగా ఈ గుంత ఉంది. ఇక్కడ ద్విచక్ర వాహనాల్లో వచ్చేవారు ఎదురుగా మరో వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పుతున్నారు. అధికారులు స్పందించి ఈ గుంతను పూడ్చాలని పురవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పలమనేరు

కంకర తేలి.. ఇబ్బందిగా మారి

శాంతిపురం మండలం చిన్నారిదొడ్డి-శివకురుబూరు బీటీ రహదారి అధ్వాన స్థితికి చేరుకొంది. శాంతిపురం-రాళ్లబూదుగూరు మార్గం నుంచి కొత్తపేట, చింతగనపల్లె శివకురుబూరు తదితర గ్రామాల మీదుగా శాంతిపురం-కేజీఎఫ్ అంతరాష్ట్ర రహదారి వరకు దాదాపు ఆరు కి.మీ. పరిధి రోడ్డు కంకర తేలి గుంతలమయమైంది. తీవ్ర అసౌకర్యం ఎదురవుతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరుతున్నారు. - న్యూస్‌టుడే, శాంతిపురం

డాక్టరేట్ ప్రదానం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: బెంగళూరు ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి తెదేపా సీనియర్ నాయకుడు గోపినాథ్ డాక్టరేట్ అందుకున్నారు. 36 ఏళ్లుగా రాజకీయ పార్టీలో ఉంటూ ప్రజాసేవ చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. కుప్పం సుజ్ఞానానంద ఆశ్రమంలో గురువారం బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు.

బాలిక నిజాయితీ

❖ పోలీసులకు చరవాణి అప్పగింత

బాధితుడికి చరవాణిని అందిస్తున్న బాలిక భావన

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: స్థానిక ఆర్టీసీ బస్టాండులో చరవాణి పోగొట్టుకున్న బాధితుడికి బాలిక తిరిగి అప్పగించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. మండలంలోని భద్రాచలం గ్రామానికి చెందిన రెడ్డెప్ప తన కుమార్తె భావనతో పెద్దపంజాణిలోని వారపు సంతకు వచ్చారు. బాలికకు బస్టాండులో చరవాణి కనిపించడంతో తండ్రికి చెప్పింది. చరవాణి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు విచారించి బాధితుడికి సమాచారం అందించారు. పలమనేరుకు చెందిన శ్రీరాములు గురువారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాలిక చేతులమీదుగా పోలీసుల సమక్షంలో చరవాణి అందుకున్నారు. బాలిక నిజాయితీని పోలీసులు, బాధితుడు అభినందించారు.

తిరుమలకు కాలినడక బయల్దేరిన భక్తులు

తిరుమలకు భక్తుల పాదయాత్ర

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని శెట్టిపల్లె, పెద్దాపురం గ్రామాల నుంచి భక్తులు తిరుమలకు గురువారం పాదయాత్రగా బయల్దేరారు. స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. రెండు గ్రామాల నుంచి సుమారు వంద మందికి పైగా భక్తులు కాలినడన తిరుమలకు వెళ్లారు. భక్తులకు అన్నప్ప ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

పెద్దపంజాణి: బిక్షాటన చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన వృద్ధుడి మృతదేహానికి స్థానికులు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. రాయలపేట పంచాయతీ చిలకపుత్తూరు సమీపంలోని నల్లగంగమ్మ గుడి ఆవరణలో శివరామయ్య(65) కొంతకాలంగా బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. అతని వద్ద ఎలాంటి ఆచూకీ లేకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కార్యదర్శి రెడ్డిశేఖర్ ద్వారా గురువారం మృతదేహాన్ని ఖననం చేశారు.

భూ వివాదంపై కేసు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: ఎగువ రాగిమానుపెంటకు చెందిన వేణుగోపాల్‌కు మునిరత్నం నాయుడికి మధ్య భూ వివాదం ఉంది. ఈ నేపథ్యంలో వారు.. మునిరత్నంనాయుడిపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఇలా అయితే గమ్యం చేరుకోగలమా..?

ద్విచక్ర వాహనంపై ఒకరిద్దరు ప్రయాణిస్తే సాఫీగా గమ్యం చేరుకోవచ్చు. ద్విచక్ర వాహనంపై ఐదుగురు వెళ్లడం ఎంతో ప్రమాదకరం. మండల కేంద్రమైన బైరెడ్డిపల్లెలో గురువారం ద్విచక్ర వాహన చోదకుడు ఐదుగురిని కూర్చొబెట్టి ఇబ్బందికరంగా ప్రయాణం సాగించారు. ఏ మాత్రం వాహనం అదుపు తప్పినా ప్రమాదం జరిగే అవకాశముంది. – న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె

శాంతిపురం మండల పరిషత్తుకు ఐఎస్‌వో పత్రం

శాంతిపురం, న్యూస్‌టుడే: శాంతిపురం మండల ప్రజా పరిషత్తుకు ఐఎస్‌వో(ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్) అభినందన పత్రం అందినట్లు ఎంపీడీవో ప్రేమరాజ్‌కుమార్ తెలిపారు. చిత్తూరులో కలెక్టర్ సుమిత్‌కుమార్, జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు ద్వారా గురువారం అభినందన పత్రాన్ని అందుకున్నట్లు పేర్కొన్నారు. సుపరిపాలన, ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడం, అధికారులు, సిబ్బంది మెరుగైన పనితీరును గుర్తించి ఈ పురస్కారాన్ని అందించినట్లు తెలిపారు. కార్యదర్శి రవినాయక్, సిబ్బంది వాసు, మహేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

కలెక్టర్ నుంచి ఐఎస్‌వో పత్రాన్ని అందుకుంటున్న ఎంపీడీవో ప్రేమరాజ్‌కుమార్, సిబ్బంది

నేటి నుంచి పాసు పుస్తకాల పంపిణీ

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: కుప్పం మండలంలో శుక్రవారం నుంచి రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెదేపా మండల అధ్యక్షుడు రాజగోపాల్ గురువారం తెలిపారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే మురళీమోహన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఛైర్మన్ మణినాయుడు, ఈవో కిశోర్

గణనాథుడి సేవలో ప్రముఖులు

కాణిపాకం, న్యూస్‌టుడే: వరసిద్ధి వినాయకస్వామి వారిని ఎమ్మెల్యేలు డాక్టర్ కలికిరి మురళీమోహన్, గురజాల జగన్మోహన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ గురువారం వేర్వేరుగా దర్శించుకున్నారు. పాలకమండలి ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిశోర్, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ప్రముఖులకు స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఏఈవోలు రవీంద్రబాబు, ధనపాల్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు బాలాజీ నాయుడు, రవి పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రొటోకాల్ ఏఈవో ధనపాల్

ర్యాలీ కాదు సుమా..!

పలమనేరు, న్యూస్‌టుడే: ఇదేదో మోటారు సైకిలు ర్యాలీ అనుకుంటే పొరపడినట్లే. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం గంగవరం మండలం కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. బొమ్మనపల్లె వద్ద ఎదురెదురుగా వాహనాలు రావడంతో రాకపోకలు స్తంభించాయి. పోలీసులు స్పందించి ఆలయానికి ఒక దారిలో వచ్చి, తిరిగి వెళ్లడానికి మరో దారి ఏర్పాటు చేశారు. దాంతో రాకపోకలకు అంతరాయం తగ్గింది.

శిథిలావస్థ.. లేదంటే దురావస్థ

రామకుప్పం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాలకు పూర్తిస్థాయిలో భవనాలు లేకపోవడంతో.. శిథిల, అద్దె భవనాలు, చాలీచాలని అద్దె గదుల్లో కొనసాగించాల్సిన పరిస్థితి వస్తోంది. మరికొన్ని చోట్ల కార్యాలయాలు నిర్మించినా ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. ఫలితంగా ప్రజలకు సకాలంలో సరైన సేవలు అందడం లేదు. మరోవైపు పాత భవనాల్లో మరుగుదొడ్లు, నీటి సదుపాయం లేకపోవడంతో ఉద్యోగులు నానా అవస్థలు పడుతున్నారు.

రామకుప్పం మండల పరిధిలో 23 సచివాలయాల్లో 18 భవనాలకు అనుమతులు రావడంతో దాదాపు 70శాతం పనులు పూర్తి చేశారు. మరోవైపు 10 విలేజ్ క్లినిక్‌లు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. వైకాపా హయాంలో చేపట్టిన పలు రైతు సేవా కేంద్రాలు గ్రామానికి దూరంగా ఉన్నాయి. అవి నిరుపయోగంగా ఉండటంతో కిటికీలు పగిలిపోయి, తలుపులు విరిగిపోయి ఆకతాయిలకు అడ్డాగా మారాయి. పలు భవనాలు పూర్తిగా నిర్మించిన పలు కారణాల చేత కొబ్బరికాయ కొట్టలేదు. బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు భవనాల తాళాలు ఇవ్వని పరిస్థితి.

బాలఓబనపల్లెలో ప్రారంభానికి నోచుకోని రైతు సేవా కేంద్రం

భవనాలను వినియోగించాలి

ప్రభుత్వ భవనాలకు రూ.లక్షలు వెచ్చించారు. వాడుకలోకి రాక నిరుపయోగంగా ఉన్నాయి. విలేజ్ క్లినిక్‌లు, రైతు సేవా కేంద్రాలు, సచివాలయాలు పక్కా భవనంలో సేవలందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. - చంద్రబాబునాయక్, పీయంకే తండా

అనుమతులు రావాల్సి ఉంది

సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు. ఆదేశాల మేరకు పనులు పూర్తి చేస్తాం.
- వెంకటసుబ్బయ్య, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ

(c) eenadu



వాడపల్లిలో ఆధ్యాత్మిక శోభ

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: నూతన ఆంగ్ల సంవత్సరం ప్రారంభం సందర్భంగా గురువారం కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం అశేష భక్తజనంతో శోభిల్లింది. ఈ సందర్భంగా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. తొలుత గోపూజ, ఐశ్వర్య లక్ష్మీ హోమం, తిరుప్పావై సేవ, 17వ పాశుర విన్నపం, శ్రీగోష్ఠి తదితర కార్యక్రమాలను అర్చకులు రమణీయంగా జరిపించారు. అనంతరం అష్టోత్తర శతనామావళి పూజలు, కల్యాణం నిర్వహించారు. ఈవో(డీసీ) నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అష్టోత్తర పూజ చేస్తున్న అర్చకస్వామి, పాల్గొన్న భక్తజనం

శుభాకాంక్షల వెల్లువ

కలెక్టర్ మహేష్‌కుమార్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టర్ మహేష్‌కుమార్‌కు పలు శాఖల జిల్లా స్థాయి అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ రాహుల్ మీనా, జేసీ నిశాంతి కలెక్టర్ మహేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జేసీకి పలువురు అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వేడుకల కిక్.. రూ.10 కోట్లు

బీర్లు పొంగాయి.. మద్యం పారింది

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

నూతన సంవత్సరానికి స్వాగతం పలికే వేడుకల్లో మద్యం తెగతాగేశారు. 2025కు వీడ్కోలు చెబుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికిన 31వ తేదీ రాత్రి ఈ విక్రయాలు రికార్డు సృష్టించాయి. జిల్లాలోని మద్యం డిపోల నుంచి డిసెంబరు 30న అమలాపురం డిపో నుంచి రూ.15 కోట్ల విలువైన మద్యం దుకాణాలకు తరలించారు. నచ్చిన బ్రాండ్లు అందుబాటులో ఉండటంతో అమ్మకాలు పెరిగాయి. 31వ తేదీ మధ్యాహ్నం నుంచే దుకాణాల వద్ద రద్దీ నెలకొంది.

మూడు రెట్లు అధికం

అమలాపురం డిపో పరిధిలో సగటున రోజుకు రూ.1.50 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు మద్యం అమ్మకాలు జరుగుతాయి. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా డిసెంబరు 30న రూ.4.17 కోట్లు, 31న రూ.5.93 కోట్లు విలువైన మద్యం విక్రయించారు.

అమలాపురం డిపోలో విక్రయాలు ఇలా..

తేదీ	మద్యం కేసులు	విలువ
30	7,440	4.17
31	10,779	5.93

బిర్యానీ అమ్మకాలు

జిల్లా వ్యాప్తంగా బిర్యానీ కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. పలుచోట్ల అమ్మకందారులు పలు ఆఫర్లు ప్రకటించారు. కూల్ డ్రింక్ ఫ్రీ, కాంబో.. అంటూ అమ్మకాలు సాగించారు. జిల్లాలో సాధారణ రోజుల్లో ఉన్న హోటళ్లతో పాటు అప్పటికప్పుడు వెలిసిన దుకాణాలు మరో 1500 వరకు ఉన్నట్లు అంచనా.

- అమలాపురంలోని ఓ హోటల్‌లో సాధారణ రోజుల్లో 100 నుంచి 150 వరకు పార్శిళ్లు విక్రయించగా 31వ తేదీ రాత్రి సుమారు వెయ్యి వరకు ప్యాకెట్లు అమ్మినట్లు నిర్వాహకులు తెలిపారు.
- చిన్నచిన్న గ్రామాల్లో సైతం రహదారుల వెంట షామియానా వేసి అమ్మకాల సాగించారు. జిల్లా వ్యాప్తంగా 31వ తేదీ రాత్రి సుమార రూ.50 లక్షల వరకు బిర్యానీ అమ్మకాలు జరిగినట్లు వ్యాపారుల అంచనా.

సముద్ర కోత కట్టడి

రూ.109 కోట్లు విడుదల చేసిన ఓఎన్జీసీ

న్యూస్‌టుడే, అల్లవరం

కోనసీమ ప్రాంతంలో సముద్రం రోజురోజుకూ ముందుకు చొచ్చుకు వస్తోంది. దీంతో ఉప్పునీటి తీరం కోతకు గురవుతూ గ్రామాల వైపు ముంచుకొస్తోంది. అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరిపట్నం గ్రామాల ప్రజలు దీనిపై ఆందోళనతో ఉన్నారు. కోత నుంచి రక్షణ కల్పించాలని ప్రజా ప్రతినిధులు, ఇక్కడి కార్యకలాపాలు నిర్వహిస్తున్న చమురు సంస్థల ఉన్నతాధికారులను ఎప్పటి నుంచో వేడుకుంటున్నారు. ఎట్టకేలకు వారి ఆవేదన విన్న అధికారులు రక్షణ చర్యలు ప్రారంభించారు.

ఓడలరేవు సముద్ర తీరంలో నిర్మిస్తున్న గ్రోయిన్లు

వందల ఎకరాలు కనుమరుగు

సముద్రం- గోదావరి మొగ(అన్నాచెల్లెల గట్టు) నుంచి ఓఎన్జీసీ సంస్థకు చెందిన ప్లాంట్ వరకు తీరం విపరీతంగా కోతకు గురైంది. అలల తాకిడి తీరం వెంబడి ఉన్న అనేక చెట్లు సముద్ర గర్భంలో కలిసి పోయింది. అటవీ శాఖకు చెందిన 200 ఎకరాలు, జిరాయితీ భూములు మరో 250 ఎకరాలు కోతకు గురై సముద్రంలో కలిసిపోయాయి.

300 మీటర్లకు ఒక గ్రోయిన్

ఓడలరేవు పరిధిలో సముద్రం- గోదావరి కలిసే చోట నుంచి కొమరగిరిపట్నం వైపుగా తీరం వెంబడి 6.5 కిలో మీటర్ల పరిధిలో 21 గ్రోయిన్స్ నిర్మిస్తున్నారు. వీటిని సముద్రపు లోతు ఆధారంగా తీరం నుంచి 50, 100, 150 మీటర్ల చొప్పున నిర్మించనున్నారు. మొదట రాళ్లతో నిర్మించి పైన కాంక్రీట్‌తో తయారు చేసిన దిమ్మె(టెట్రా పాడ్స్)లను అమర్చుతారు.

ఇదీ ఉపయోగం

ప్రతి 300 మీటర్లకు గ్రోయిన్లు నిర్మించడం వల్ల సముద్రపు అలలు నేరుగా తీరాన్ని తాకలేవు. ఈ గ్రోయిన్ల మధ్య ప్రదేశంలో భారీగా ఇసుక చేరి పూర్తిగా మెరకగా మారుతుంది. దీంతో తీరం కోతకు గురికాదు. తమిళనాడుకు చెందిన ఐఐటీ సంస్థ నిపుణుల బృందం గతంలో ఇక్కడ పలు మార్లు పరిశీలించి కోత నివారణ సంబంధించి ఇచ్చిన నమూనా ప్రకారం ఈ రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ఓఎన్జీసీ అధికారులు తెలిపారు.

ఈ ఏడాది మార్చినాటికి..

ఈ పనులకు ఇక్కడి కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్జీసీ) రూ.109 కోట్లు విడుదల చేసింది. ఆ సంస్థ ఆధ్వర్యంలోనే రక్షణ గోడ పనులు చేపడుతున్నారు. ఈ పనులు 2026 మార్చి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సత్యసాయి స్మారక నాణెం

అమలాపురం పట్టణం: భగవాన్ సత్యసాయి బాబా శత జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం రూ.100 విలువతో స్మారక నాణెం విడుదల చేసింది. దీనిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన కృష్ణ కామేశ్వర్ ప్రత్యేక ఆర్డర్‌పై గురువారం తెప్పించారు. హైదరాబాద్ టంకశాల విడుదల చేసిన ఈ నాణెం బరువు 35 గ్రాములు కాగా.. 50శాతం వెండి, 40శాతం రాగి, నికెల్, జింక్ చెరో అయిదుశాతం మిశ్రమంతో తయారు చేశారు. దీనిని రూ.6,330కు కొనుగోలు చేసినట్లు కామేశ్వర్ చెప్పారు.

ఖాళీలు 34.. దరఖాస్తులు 457

పారామెడికల్ పోస్టులకు పోటాపోటీ

ఈనాడు, కాకినాడ: కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల పరిధిలో పారామెడికల్ పోస్టుల భర్తీకి ఎక్కువ మంది పోటీపడుతున్నారు. జనరల్ డ్యూటీ అటెండెంట్, ఆపరేషన్ థియేటర్, ఈసీజీ, డయాలసిస్, రేడియోథెరపీ, సీటీ, సీ-ఆర్మ్ విభాగాల టెక్నీషియన్లతో సహా 34 పోస్టుల భర్తీకి గతనెలలో ప్రకటన జారీచేశారు. వీటి కోసం 457 దరఖాస్తులు వచ్చాయి. జనరల్ డ్యూటీ అటెండెంట్ పోస్టులు 14 ఖాళీలకు గాను 326 మంది పోటీ పడుతున్నారు. మిగతా పోస్టులకు మూడు నుంచి 33 మంది వరకు దరఖాస్తులు చేశారు. రేడియోథెరపీ పోస్టులు మూడు ఖాళీలుంటే ఒక్క దరఖాస్తే వచ్చింది. సీటీ, ఓటీ టెక్నీషియన్ పోస్టులకు పోటీపడే అభ్యర్థులు ఎక్కువ మంది ఉన్నారు.

అటకలపై పోతలు.. అన్నదాతల ఆశలు

న్యూస్‌టుడే, అంబాజీపేట

కోనసీమ మార్కెట్‌లో కొబ్బరి కాయల ధరలు తగ్గుముఖం పట్టాయి. గత అక్టోబర్, సెప్టెంబర్ మాసాల్లో వెయ్యి పచ్చికాయలు రూ.23 వేల నుంచి రూ.26 వేల వరకు ధర పలికింది. అనంతరం నవంబర్, డిసెంబర్ నెలల్లో ధరలు బాగా పడిపోయాయి. ఇప్పుడు రూ.15 నుంచి రూ.16 వేలు వరకు ఉంది. తమిళనాడులో ఉత్పత్తులు పెరగడం, ఇక్కడ మూఢం కొనసాగుతుండటం, ఇతర ప్రాంతాల నుంచి దిగుబడులు రావడంతో డిమాండ్ తగ్గింది. ఈ నేపథ్యంలో స్థానిక రైతులు పచ్చికాయలను అటకలపై వేసి నిల్వ చేసుకుంటున్నారు.

కురిడీలుగా మార్చి..

పచ్చి కొబ్బరికాయలను అటకపై వేసి నిల్వ చేసుకుంటే ఆరు నెలల్లో నీరు ఇంకిపోయి కురిడీలుగా మారతాయి. దీంతో వీటికి మంచి డిమాండ్ ఏర్పడుతుంది. నిల్వ చేసుకోవడంతో ప్రస్తుత ధర ఉందని, లేకపోతే మరింత పతనమయ్యేదని చెబుతున్నారు. శివరాత్రి నుంచి ధరలు పెరుగుతాయని ఆశిస్తున్నారు.

13 నుంచి కోనసీమ సంక్రాంతి ఉత్సవ్

సత్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ

లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

పామర్రు, న్యూస్‌టుడే: 'సంతోషాలకు స్వర్గసీమ.. ఆనందాలకు చిరునామా మన కోనసీమ' అనే నినాదంతో కోనసీమ సంక్రాంతి ఉత్సవ్-2026కు సంబంధించిన లోగోను మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. వాసంశెట్టి సత్యం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఉత్సవాలు కోటిపల్లి- ముక్తేశ్వరం రేవు వద్ద ఈ నెల 13, 14, 15 తేదీల్లో ఏర్పాటుచేశామన్నారు. దానికి సంబంధించిన లోగోను ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, రేవు నిర్వాహకుడు పప్పుల మసేను వెంకన్న (శ్రీనుబాబు)లతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. పండగకు పెట్టింది పేరు కోనసీమ.. తెలుగువారికి పెద్ద పండుగ సంక్రాంతి. ఈ పండుగకు పెట్టింది పేరు కోనసీమ. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా, అన్ని వర్గాల ప్రజలూ ఆదరించేలా పలు సాంస్కృతిక, జానపద, పురాణ కార్యక్రమాలు, అలనాటి పాత మధురాలు ఉత్సవాల్లో ఉంటాయన్నారు. వీటితో పాటు జబర్దస్త్ టీం షోలు కూడా ఉంటాయన్నారు. కూటమి నాయకులు పి.శ్రీనుబాబు, కర్రి చిట్టిబాబు, సలాది నాయుడు, చందమామ వాసు, పెమ్మాడి బేబీ సత్తిబాబు, అవసరాల వెంకటరమణ, ఎస్.విశ్వనాథ బాలాజీ, కంచుమర్తి బాబూరావు, చిర్రా రాజకుమార్ పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువగా..

3.12 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు

న్యూస్‌టుడే, పి.గన్నవరం

జిల్లాలో ఖరీఫ్ ధాన్యాన్ని లక్ష్యానికి చేరువగా కొనుగోలు చేశారు. మొత్తం 3.50 లక్షల మెట్రిక్‌టన్నులు లక్ష్యం కాగా ఇంతవరకు 3.12 లక్షల మెట్రిక్‌టన్నుల కొనుగోలు చేశారు. ఇందుకోసం 62,126 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.734.85 కోట్లు జమచేశారు. ఇంకా రూ.61 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం కూడా 24 గంటల్లో జమ అవుతాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. 204 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించారు. గత ప్రభుత్వంలో డబ్బులు నిర్ణీత గడువులోగా ఖాతాల్లో పడకపోవడంతో నెలల తరబడి నిరీక్షించేవారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి సమస్యలకు తెరదించింది.

పలు సాంకేతిక సమస్యలు

కొంతమంది రైతుల బ్యాంకు ఖాతాలు వారి ఆధార్, ఈకేవైసీతో అనుసంధానం కాకపోవటతో జిల్లావ్యాప్తంగా రూ.1.64 కోట్లు తిరిగి పౌరసరఫరాల సంస్థ బ్యాంకు ఖాతాకు వచ్చాయి. ఈ సమస్యలను పరిష్కరిస్తున్నాం. బ్యాంకు ఖాతాలు సరిచేసుకున్నవారికి వెంటనే చెల్లింపులు చేస్తున్నాం. - పి.శ్రీనివాసరావు, మేనేజర్, జిల్లా పౌరసరఫరాల సంస్థ

మరో అడుగు ముందుకు..

కనకాయలంక వంతెన నిర్మాణానికి టెండరు ఖరారు

న్యూస్‌టుడే, పి.గన్నవరం

ఇక్కడి కాజ్‌వే స్థానంలోనే వంతెన నిర్మించనున్నారు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని కనకాయలంక గ్రామం పి.గన్నవరం మండలం చాకలిపాలెం సమీపంలో ఉంది. ఏటా వరదల సమయంలో ఇక్కడి కాజ్‌వే ముంపుబారిన పడి గ్రామస్థులు పడుతున్న ఇబ్బందుల నుంచి గట్టెక్కించేందుకు పాలకొల్లు ఎమ్మెల్యే, భారీ నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చొరవ తీసుకున్నారు. ఇక్కడ వంతెన నిర్మించేందుకు రూ.24 కోట్లు మంజూరు చేయించారు. గత జూన్‌లో నిధులు మంజూరయ్యాయి. తదుపరి ప్రక్రియ కోసం సీఓటీ(కమిషనరేట్ ఆఫ్ టెండర్)కు పంపారు. అక్కడ ఆమోదం అనంతరం గుత్తేదారుడితో వంతెన నిర్మాణానికి సంబంధించి ఒప్పందం, ఇతర అంశాలు పూర్తి చేస్తారు. ఇక్కడ వంతెన నిర్మాణ ఆవశ్యకతపై 'ఈనాడు'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి.

ఈనాడు మీ తోడు

నిర్మాణం ఇలా..

ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 6 లక్షల క్యూసెక్కుల వరదనీరు దిగువకు విడిచిపెడితే కనకాయలంక కాజ్‌వే ముంపుబారిన పడుతుంది. దీనిని పరిగణనలోకి తీసుకుని 1986 ఆగస్టు వంటి భారీ వరదలు వచ్చినా వంతెన మునిగిపోకుండా రూపకల్పన చేశారు. 4.25 మీటర్ల వెడల్పుతో 310 మీటర్ల మేర ప్రధాన కట్టడం(సూపర్‌స్ట్రక్చర్) నిర్మించి దీనికి చాకలిపాలెం, కనకాయలంక వైపున అప్రోచ్‌లు ఏర్పాటు చేస్తారు.

ఒప్పందం పూర్తికాగానే..

టెండరు ఖరారై సీఓటీకి వెళ్లింది. అక్కడ ఆమోదం పొందిన వెంటనే గుత్తేదారుడితో అగ్రిమెంట్ పూర్తి చేసి పనులు మొదలు పెడతాం. - గంగుమళ్ల శ్రీనివాసరావు, ఈఈ, గోదావరి హెడ్‌వర్క్స్, ధవళేశ్వరం

పాఠశాలకో ప్రత్యేక అధికారి

పదో తరగతి విద్యార్థులపై మరింత పర్యవేక్షణ

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేలా ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించింది.

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో నాగేశ్వరరావు

మెరుగైన ఫలితాలు సాధించేలా

పదో తరగతిలో జిల్లా వ్యాప్తంగా మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం నూతన విధానం తీసుకు వచ్చింది. ప్రతి పాఠశాలకు ఒక అధికారిని నియమించింది. వారి పరిధిలోని పాఠశాలలను సమన్వయం చేసుకుని విద్యార్థులకు అందుతున్న బోధన తీరును పరిశీలిస్తారు. ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా ప్రతి అధికారితో కలిసి చర్యలు తీసుకుంటున్నాం. -నాగేశ్వరరావు, డీఈవో

వివరాలు

మండలాలు:	22
ఉన్నత పాఠశాలలు:	240
పదోతరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు:	19,168
ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు:	240 మంది

నిత్యం తనిఖీలు..

తహసీల్దారు, ఎంపీడీవో, ఎంఈవో, ఇతర శాఖలకు సంబంధించిన అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించారు.

- వీరు హెచ్‌ఎం, ఎంఈవో, డిప్యూటీ డీఈవో, డీఈవో సమగ్ర శిక్ష అధికారులను సమన్వయం చేసుకుంటూ వంద రోజుల ప్రణాళిక మెరుగ్గా నిర్వహించేలా చర్యలు తీసుకుంటారు.
- సబ్జెక్టు వారీగా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడం, ఇతర అంశాలు పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షిస్తారు.
- రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు, ఇతర అంశాలను పరిశీలిస్తారు. విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు చర్చిస్తారు.
- ఎక్కువ రోజులు గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చేస్తారు.

కృత్రిమ మేధతో అవకాశాలు: ఎంపీ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: రాబోయే దశాబ్దంలో కృత్రిమ మేధ(ఏఐ)తో దేశ జీడీపీ పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్ అన్నారు. విద్యార్థులు సాంకేతిక జ్ఞానం, నైపుణ్యాలను సమాజ సేవకు వినియోగించి సవాళ్లకు పరిష్కరించాలన్నారు. స్కిల్లింగ్ ఫర్ ఏఐ రెడీనెస్(ఎస్‌వోఏఆర్) కార్యక్రమంలో భాగంగా దిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఎంపీ ఎస్‌వోఏఆర్ లెర్నింగ్ మాడ్యుల్స్ ప్రామాణిక పత్రం అందుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

శ్రద్ధాంజలి

వైద్యరంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, ఎందరో వైద్య విద్యార్థినీ, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతూ మీరు చేసిన సేవలు అనిర్వచనీయమైనవి. మీ సేవలు ఎప్పటికీ మరువలేనివి. మీరు భౌతికంగా మా నుండి దూరమైననూ మీ తీపి జ్ఞాపకాలు ఎల్లప్పుడూ మా వెంటే ఉంటాయి. దైవ సన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో... అంజలి ఘటిస్తూ....

డాక్టర్ Y. శేషగిరిరావు గారు
M.D. (Gen. Med.) DCH.
Area Hospital, Tuni
Retd. Professor,
Civil Surgeon Specialist
జననం: 28-01-1956
స్వర్గప్రాప్తి: 22-12-2025

మీ... భార్య: శ్రీమతి Y. పద్మావతి
కుమారుడు: Dr. Y. వెంకటేష్, MD
కుమార్తె-అల్లుడు: శ్రీమతి S. ప్రియాంక - S. శ్రీనివాస్
అన్నయ్యలు - వదినలు: Y. రంగారావు - Y. శశికళ (Late), Y. జగన్నాధరావు - Y. ఉషారాణి
చెల్లెలు - బావగారు: R. సుగుణ - R. కన్నారావు
మనుమరాలు: S. శ్రీహిత
బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు

పెద్దకర్మ: తేది: 03-01-2026 శనివారం ద్వారకానగర్, ఫార్చ్యూన్ శ్రీకన్య హోటల్ నందు జరుగును.

రాజులపాలెంలో నాట్లు వేస్తున్న కూలీలు

34వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తి

పి.గన్నవరం, న్యూస్‌టుడే: జిల్లాలో రబీ వరినాట్లు జోరందుకున్నాయి. వాస్తవానికి డిసెంబరు 31 నాటికి పూర్తిచేస్తే మార్చి 31 నాటికి కోతలు పూర్తవుతాయి. ఈ సీజన్‌ను ఆలస్యంగా మొదలు పెట్టడంతో జనవరి 20 నాటికిగాని నూరుశాతం పూర్తికావడం లేదు. జిల్లాలో వరి ఆయకట్టు 1.72 లక్షల ఎకరాలు. బుధవారం నాటికి 34,013 ఎకరాల విస్తీర్ణంలో నాట్లు పూర్తయినట్టు జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తెలిపారు. 2,903 ఎకరాల విస్తీర్ణంలో నారుమడి సిద్ధంగా ఉంది. 70 వేల ఎకరాల్లో నాట్లు వేసేందుకు సరిపోతుంది. గత ఏడాది 1.69 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగుచేశారు. ఈసారి మరో 3 వేల ఎకరాల్లో పెరగనుంది. ఏప్రిల్ 25 నాటికిగాని నూరుశాతం మాసూళ్లు పూర్తికావు. ఏప్రిల్ 15 వరకు సాగునీరు సరఫరా చేస్తారు.

అన్నవరం.. ప్రగతి మార్గం

భక్తులకు మెరుగైన సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టి

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వ పథకం 'ప్రసాద్', దేవస్థానం నిధులతో పలు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో ఇవన్నీ అందుబాటులోకి వస్తాయి. రానున్న గోదావరి పుష్కరాలకు మరింత ప్రగతి కనిపించేలా కార్యచరణ జరుగుతుంది.

రూ.18.98 కోట్లతో 'ప్రసాద్' పనులు

కేంద్ర ప్రభుత్వ పథకం 'ప్రసాద్' ద్వారా పలు పనులను కూటమి ప్రభుత్వం పట్టాలెక్కించింది. రూ.18.98 కోట్లతో ఇవి జరుగుతున్నాయి. రత్నగిరిపై అన్నదాన భవన నిర్మాణం జరుగుతోంది. జీ ప్లస్1లో నాలుగు హాళ్లు నిర్మిస్తున్నారు. ఒకేసారి 1,400 మంది భక్తులు భోజనాలు చేయవచ్చు. 1,500 మంది భక్తులు వేచి ఉండేలా రెండు హాళ్లలో క్యూ కాంప్లెక్సు నిర్మిస్తున్నారు. మరుగుదొడ్లు, రక్షణ గోడ, మురుగునీటి శుద్ధిప్లాంటు పనులు జరుగుతున్నాయి. రూ.7.07 కోట్ల దేవస్థానం నిధులతో 105 గదులతో సీతారామసత్రం నిర్మాణానికి చర్యలు చేపట్టారు. 105 గదులతో మరో బ్లాక్ నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తారు. ఎగువ ఘాట్ రోడ్డుకు ఆనుకుని (టోల్‌గేటు వద్ద నుంచి) కొండపైకి సెంటినరీ కాటేజీ వరకు 250 మీటర్ల మేర 350 మెట్లతో మరో మార్గాన్ని నిర్మిస్తున్నారు. భక్తులు ఈ మార్గంలో కేవలం 15-20 నిమిషాల్లోనే కొండపైకి చేరుకోవచ్చు. సుమారు రూ.1.25 కోట్లతో ఈ పనులు జరుగుతున్నాయి.

క్యూకాంప్లెక్స్ నిర్మాణ పనులు

బృహత్తర ప్రణాళికలో మార్పులు

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా దేవస్థానం బృహత్తర ప్రణాళికలో కొన్ని మార్పులు, చేర్పులతో పునః ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. కొండ దిగువన దేవస్థానం స్థలంలో కల్యాణ మండపాలు, దుకాణ సముదాయం, ఇతర నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

సుబ్రహ్మణ్యం హత్య కేసులో జాప్యమేల!

ఎమ్మెల్సీ అనంతబాబుకు కొందరి సహకారం

ఈనాడు, కాకినాడ: కాకినాడకు చెందిన దళిత యువకుడు, డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్యకేసు విచారణలో ఇప్పుడూ అదే నిర్లక్ష్యం కనిపిస్తోంది. 2022 మేలో ఆయన హత్యకు గురయ్యారు. గత ప్రభుతంలో నీరుగారిపోయిన ఈ కేసును కొలిక్కితెచ్చి నిందితులకు శిక్ష పడేలా చేస్తారని బాధిత కుటుంబం ఆశించినా ఆ స్థాయిలో విచారణ లేదనే విమర్శలున్నాయి. నిందితుడు వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుకు ఈ ప్రభుత్వంలోను కొంతమంది సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

సాక్ష్యాల విశ్లేషణ కీలకం..

పోలీసులు సీసీటీవీ ఫుటేజి, ఫోరెన్సిక్ ల్యాబ్ ఫలితాలపైనే ఆధారపడ్డారు తప్ప ఇతర సాక్ష్యాల సేకరణ, విశ్లేషణపై పెద్దగా దృష్టి పెట్టలేదు. హత్య సమయంలో ఎమ్మెల్సీ అనంతబాబు ఐ ఫోన్‌లో సమాచారం సేకరించేలా తగినవిధంగా ప్రయత్నించలేదు. అప్పట్లో కేసు విచారణ చేసిన పోలీసులు కొన్ని ఆధారాలను తప్పించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో అనంతబాబు లక్ష్మీదుర్గ కుల ధ్రువీకరణ కోసం అడ్డతీగల తహసీల్దార్ కార్యాలయానికి సిట్ అధికారి లేఖ రాశారు. సమాచారం పోలీసులకు రాకముందే ఆ లేఖ అనంతబాబుకు చేతికి చేరింది. దీని ఆధారంగానే నిందితుని భార్య ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలుచేశారు. లేఖ సమాచారం లీకు చేసిందెవరో ఇప్పుడు తేలాల్సి ఉంది.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97607

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80082 34669



శ్రద్ధాంజలి

మా అందరికీ ప్రేమ, ఆప్యాయత, అనురాగాన్ని పంచిన కీ॥శే॥ పోలిశెట్టి వెంకటరత్నం గారు (నాయున) ది.22-12-2025 న స్వర్గస్థులైనారని తెలియజేయుటకు చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుకుంటూ...

కీ॥శే॥ పోలిశెట్టి వెంకటరత్నం (నాయున) గారు
కాకినాడ
జననం : 21-09-1950 మరణం : 22-12-2025

భార్య : వెంకట రమణమ్మ (రమావతి)
కుమారుడు : మహావీర్ అనిల్ కుమార్ కోడలు : జాహ్నవి
కుమార్తెలు : గుర్రం సంతోషి మానస, రెడ్నం సౌమ్య వందన అల్లుళ్లు : హరీష్ ప్రశాంత్, నవీన్ కుమార్
మనుమలు : శ్రీయన్, శ్రీతన్, హయాన్
మనుమరాలు : ఏరా
అక్క : రెడ్నం రమణి కుమారి (లేటు)
బావ : సూర్యనారాయణ రావు (లేటు)
చెల్లెలు : నూకల సూర్యకుమారి
బావ : డా॥ రాయల అప్పాజీ రావు నాయుడు
బావ మరుదులు : రెడ్నం అచ్యుత కుమార్ - చక్రధర వరలక్ష్మి, రెడ్నం వెంకట రమణమూర్తి - భాగ్యలక్ష్మి
మరదలు : నల్లం లక్ష్మి తులసి తోడల్లుడు : నాగేశ్వరరావు
మేనల్లుళ్లు : రెడ్నం ఫణీంద్ర కుమార్ - రాధ, రెడ్నం అమరేంద్ర కుమార్ - కరుణ
మేనకోడళ్లు : కొమ్మిరెడ్డి సౌజన్య మాలిని - సామ్రాట్, నల్లం ఆశ్రిత - వెంకట సురేష్, కోడెబోయిన శుశ్రిత - శ్రీ కృష్ణ చైతన్య
పోలిశెట్టి బ్రదర్స్ & సిస్టర్స్

పెద్దకార్యము : ది. 03-01-2026 శనివారం, శాంతినగర్, కాకినాడలో మా స్వగృహమునందు జరుగును.

(c) eenadu

పరుగులతో మెరిసి.. విజయంతో మురిసి..!

▲ ఉత్కంఠభరితంగా సాగుతున్న ఈఎస్ఎల్ క్రికెట్ పోటీలు

శ్యామలా సెంటర్, రాజానగరం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. క్రీడాకారులు ఫోర్లు, సిక్సర్లతో అదరగొడుతున్నారు. ఐడియల్, చైతన్య కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఏకంగా ఓవర్‌కు 15కు పైగా రన్‌రేట్ స్కోరుతో భారీ లక్ష్యాలు చేస్తున్నారు. మరో వైపు గైట్, కైట్ ఇంజినీరింగ్ జట్ల జరిగిన మ్యాచ్ ఆఖరి బంతి వరకు ఉత్కంఠ రేకెత్తించాయి. క్రీడాకారులు క్రికెట్ ఆస్వాదిస్తూ.. పరుగుల వరద సృష్టించగా విజయంతో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకున్నారు. రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) క్రీడా మైదానంలో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్ టోర్నీ గురువారం ఉత్సాహంగా సాగాయి.

బీవీసీ మెరుపులు..

హోరాహోరీపోరులో విజయం సాధించిన బీవీసీ కళాశాల జట్టు

బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల, భట్లపాలెం - ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, సూరంపాలెం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బీవీసీ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచిన బీవీసీ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆదిత్య కళాశాల జట్టు మూడు వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. ఈ జట్టులో లోహిత్ 27 బంతుల్లో 41 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన బీవీసీ కళాశాల జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 103 పరుగులు సాధించింది. బీవీసీ జట్టులో తేజ 21 బంతుల్లో 38 పరుగులు సాధించి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. ఆ జట్టు 9 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.

హ్యాట్రిక్‌తో రాజు మాయ

విజయం సాధించిన ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల(కాకినాడ), బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల(వాడలరేవు) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి ఐడియల్ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన బీవీసీ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసింది. ప్రత్యర్థి జట్టులో కె. రాజు వరుసగా మూడు వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్ సాధించటం విశేషం. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఐడియల్ కళాశాల జట్టు ఒక వికెట్ నష్టపోయి 73 పరుగులు సాధించి తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. బ్యాటింగ్‌లోనూ కె. రాజు సత్తాచాటి 37 బంతుల్లో 46 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.

మూడు వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్ సాధించిన రాజు

ఒక్క పరుగు తేడాతో కైట్ విజయం

విజయం సాధించిన కైట్ ఇంజినీరింగ్ జట్టు

మైదానం-2లో ఉదయం కైట్ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ), గైట్ ఇంజినీరింగ్ కళాశాల (రాజమహేంద్రవరం) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కైట్ ఇంజినీరింగ్ కళాశాల ఒకే ఒక్క పరుగు తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కైట్ కళాశాల జట్టు నిర్ణీత 10ఓవర్లకు 4వికెట్ల నష్టానికి 87 పరుగులు చేశారు. ఈ జట్టులో జేఎల్ దీపక్ 20 బంతుల్లో 28పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గైట్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు తక్కువ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సింగిల్స్, డబుల్స్ తీస్తూ స్కోరుబోర్డును పరుగుపెట్టించారు. అయితే ఒకానొక సమయంలో వరుసగా వికెట్లు కోల్పోవటంతో ఆఖరి ఓవర్‌కు 14 పరుగులు చేయాల్సి ఉండగా ఒక ఫోర్, రెండు వైడ్, బైస్ రూపంలో 12 పరుగులు వచ్చాయి. ఆఖరి బంతికి రెండు పరుగులు చేయాల్సి ఉండగా బ్యాటర్ బంతిని తాకలేకపోయాడు. కీపర్ చేతికి బంతి వెళ్లగా ఒక్క పరుగు కోసం పరుగెత్తే క్రమంలో రనౌట్ అయ్యాడు. దీంతో గైట్ జట్టు ఒక్క పరుగుతో ఓటమిపాలైంది.

భారీ ఆధిక్యంతో ఘన విజయం సాధించిన ఐడియల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు

100 పరుగుల తేడాతో ఐడియల్ డిగ్రీ కళాశాల జట్టు విజయం

ఐడియల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కాకినాడ, చైతన్య ఇంజినీరింగ్ కళాశాల, కాకినాడ మధ్య జరిగిన పోటీలో ఐడియల్ ఆర్ట్స్ అండ్ కళాశాల జట్టు 100 పరుగుల భారీ ఆధిక్యంతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన ఐడియల్ కళాశాల జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ జట్టులో శివకుమార్ వీరోచిత బ్యాటింగ్‌తో కేవలం 29 బంతుల్లో 60 పరుగులు చేశాడు. వినయ్ ఆఖరి 6 బంతుల్లో 5భారీ సిక్స్‌లు, ఒకఫోర్ కొట్టి 34 పరుగులు సాధించటంతో ఐడియల్ జట్టు ఐదు వికెట్ల నష్టానికి 152 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చైతన్య ఇంజినీరింగ్ జట్టు భారీ లక్ష్యఛేదనలో ఆది నుంచి తడబడుతూ త్వరత్వరగా వికెట్లు కోల్పోయింది. ఐడియల్ కళాశాల జట్టులోని వెంకటేష్ 2 ఓవర్లకు కేవలం 8పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టి చైతన్య జట్టును దెబ్బతీశాడు. చైతన్య కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 52 పరుగులు మాత్రమే చేయగలిగింది. 100 పరుగుల భారీ ఆధిక్యంతో ఐడియల్ కళాశాల జట్టు ఘనవిజయం సాధించింది. ఇప్పటివరకు ఈ టోర్నీలో ఐడియల్ కళాశాల జట్టు చేసిన 152 పరుగులు అత్యధికం కావటం విశేషం..

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే శివకుమార్ (60 పరుగులు)

నేటి మ్యాచ్‌లు 02.01.2026

గ్రౌండ్-1

- ఉదయం 8 గంటలకు: ఆదికవి నన్నయ యూనివర్సిటీ(యూజీ) X ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (రాజమహేంద్రవరం). ● ఉదయం 11 గంటలకు: పైడా కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ X గైట్ డిగ్రీ కాలేజీ. ● మధ్యాహ్నం 2 గంటలకు: గైట్ ఇంజినీరింగ్ కాలేజీ X ఏబీఎన్, పీఆర్ఆర్ కళాశాల.

గ్రౌండ్-2

- ఉదయం 8 గంటలకు: మెగా జూనియర్ కాలేజీ (రాజమహేంద్రవరం) X శ్రీరాజరాజేశ్వరి (కాకినాడ). ● ఉదయం 11 గంటలకు: శ్రీ సంహిత జూనియర్ కాలేజీ (రావులపాలెం) X శ్రీరాజరాజేశ్వరి కళాశాల (పెద్దాపురం).

రేపటి మ్యాచ్‌లు 03.01.2026

గ్రౌండ్ - 1

- ఉదయం 8 గంటలకు: కైట్ - 2(కాకినాడ) X బీవీసీ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల(భట్లపాలెం). ● ఉదయం 11 గంటలకు: ఐడియల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (కాకినాడ) X కైట్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల(కాకినాడ). ● మధ్యాహ్నం 2 గంటలకు: చైతన్య ఇంజనీరింగ్ కళాశాల, కాకినాడ X ఎస్‌కేజీఆర్ అండ్ ఎస్ఎస్ కుమారి జూనియర్ కళాశాల (తాళ్ళపూడి)

గ్రౌండ్ - 2

- ఉదయం 8 గంటలకు : కైట్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (కాకినాడ) X మంగెన గైరయ్య కళాశాల(లక్కవరం). ● ఉదయం 11 గంటలకు : గొలుగూరి బాపిరాజు జూనియర్ కళాశాల(అనపర్తి) X దివ్య జూనియర్ కళాశాల (రాజానగరం).

విజయం సాధించిన వీఎస్ఎం జట్టు

వీఎస్ఎం విజయబావుటా

వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల (రామచంద్రాపురం), ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వీఎస్ఎం జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన వీఎస్ఎం జట్టు 102 పరుగులు చేసి ఆలౌటైంది. ఈ జట్టులో అర్జున్ 26 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌కేవీటీ జట్టు 7వికెట్లు కోల్పోయి 90 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది.

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక
Gift Partner: KL UNIVERSITY (DEEMED TO BE UNIVERSITY)
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT
Medical Partner
FM Partner: ఈ FM Mee FM
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
GSL
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
Organised by ఈనాడు

పరమశివుడి సన్నిధిలో రాజకీయాలు వద్దు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: పరమశివుడి సన్నిధిలో రాజకీయాలు వద్దని మంత్రి వాసంశెట్టి సుభాష్ హితవు పలికారు. రెండు రోజుల క్రితం ద్రాక్షారామ భీమేశ్వరుడి సన్నిధిలో కపాలేశ్వరస్వామి లింగాన్ని ధ్వంసం చేసిన తరువాత గురువారం ఆయన ఆలయాన్ని సందర్శించి కపాలేశ్వర లింగానికి అభిషేకం చేశారు. తూతూమంత్రంగా లింగాన్ని ప్రతిష్ఠించారని వైకాపా నాయకులు ఆరోపిస్తున్నారని వారికి ఆగమ శాస్త్రం గురించి ఏమి తెలుసని ప్రశ్నించారు. ఘటన జరిగిన రోజే నిందితుడిని గుర్తించి అరెస్టు చేశామని వైకాపా హయాంలో అంతర్వేది రథం తగలబెడితే ఎన్నాళ్లకో ఒక ఉన్మాదిని నిందితుడిగా చూపించారని గుర్తు చేశారు. ఆలయ ఈవో, సహాయ కమిషనరు ఏవీ దుర్గాభవాని, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

కపాలేశ్వరస్వామి లింగానికి అభిషేకం చేస్తున్న మంత్రి సుభాష్

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం: శ్రీటవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్‌ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
కార్యాలయ చిరునామా: డి.నెం.20-1-10/8, 2వ అంతస్తు, సూపర్‌బజార్ కాంప్లెక్స్, మెయిన్ రోడ్డు, కాకినాడ-533001.
(రూల్ 8(1) ప్రకారం) భౌతిక స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
SARFAESI చట్టం యొక్క 13(4) సెక్షన్ క్రింద స్థిరాస్తి భౌతిక స్వాధీనం కొరకు ... లోన్ అకౌంట్ నెం. AMLPMTF1711270001:
[illegible]
అస్తి యొక్క షెడ్యూలు
[illegible]
ప్రదేశం: కాకినాడ సం/- అధీకృత అధికారి
తేదీ: 29-12-2025 శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రథ శకలాల నిమజ్జనానికి ఏర్పాట్లు

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామికి చెందిన దగ్ధమైన పాత రథ శకలాలను ఈ నెల 3న నిమజ్జనం చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి వార్షిక వాహన సేవకులతో శకలాలను చిన్నచిన్న ముక్కలుగా చేసి సాగర సంగమం వద్దకు తీసుకెళతారు. అక్కడ ఇసుకలో పెద్దగొయ్యి తీసి చుట్టూ రేకులు అమర్చి అందులో శకలాలను వేసి కర్పూరంతో మండిస్తారు. భస్మాన్ని బోట్లపై సంగమం మధ్యలో నిమజ్జనం చేస్తారని ఆలయ ఏసీ నాగవరప్రసాద్ తెలిపారు.

చప్పిడిచేపల కూర.. గోదారోళ్ల నోరూర..

న్యూస్‌టుడే, పి.గన్నవరం

చప్పిడిచేపలు తయారు చేస్తున్న మత్స్యకారులు (అంతర చిత్రం) చప్పిడిచేపలు, కోడిగుడ్లు, చిక్కుడు కాయలతో కూర

మన ఊరి వంట

నోరూరించే చేపల కూరలు తయారు చేయడంలో గోదారోళ్లు సిద్ధహస్తులు. సీజన్ల వారీగా దొరికే పులస, దొందు, చీరమీను తదితరాలను కొనుగోలు చేసి బంధుమిత్రులకు పంపుతుంటారు. ప్రధానంగా మహా రుచికరమైన చప్పిడి చేపలను గోదావరి తీర ప్రాంతంలో ఉండే మత్స్యకార కుటుంబాలు తయారు చేసి విక్రయిస్తుంటాయి. కొయ్యింగ, కట్టెపరిగి, కడిస, ఇసుకదొందులు వంటి పచ్చిచేపలతో చప్పిడి చేపలు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. వీటిని ఎంతోమంది ఇష్టంగా తింటారు.

తయారీ విధానం

కోనసీమలో జొన్నల్లంక, నాగుల్లంక, వాకలగరువు, బోడసకుర్రు తదితర ప్రాంతాల్లో చప్పిడిచేపలు తయారు చేస్తుంటారు. పచ్చిచేపలను పొలుసు తీయకుండా లోపల పేగులు వంటివాటిని తొలగించి ఎండలో ఆరబెడతారు. డొక్కలపీచును పరుపు మాదిరిగా పరిచి మధ్య నిప్పులు వేస్తారు. దానిపై చెరకుపిప్పు పెట్టి పైన ఆరిన పచ్చిచేపలను చక్కగా పేర్చి పొగతో ఆరుస్తారు. వీటిని చప్పిడిచేపలు లేదా ఆర్చినచేపలు అంటారు. మంట రాకుండా పొగతో ఆర్చడంతో ఎనలేని రుచి వస్తుంది.

అందుబాటు ధరలో..

ఆర్చిన చప్పిడిచేపల ధర వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది. కొయ్యింగలైతే ఒకటి రూ.200-300, కట్టెపరిగ, కడిస, దొందులు వంటివైతే రూ.100 నుంచి ఆపైన ఉంటుంది.

ఈ కాంబినేషన్‌లో..

చప్పిడి చేపలపైన ఉండే చర్మంలాంటి పొరను తొలగించి వండుతారు. చిక్కుడుకాయ, కోడిగుడ్డు, టమాటా, వంకాయ, చింతకాయ, మునగకాడలు.. ఇలా వివిధ కాంబినేషన్లతో ఇగురు తయారు చేసి ఆరగిస్తుంటారు.

ఇతర ప్రాంతాలకు

ఈ చేపలు మార్కెట్ నుంచి తెచ్చుకున్న ఒకటి, రెండు రోజుల్లో వండుకోవాలి. ఫ్రిజ్‌లో పెట్టుకుంటే ఎక్కువ రోజులు ఉంటాయి. సంక్రాంతికి వచ్చే వారికి ఈ చేపలతో కూరలు తయారు చేసి ఇక్కడివారు ప్రత్యేకంగా వడ్డిస్తారు.

భీమేశ్వరుడి సన్నిధిలో సినిమా బృందం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి వారిని గురువారం ఉదయం 'వచ్చిన వాడు గౌతమ్' సినిమా బృందం సభ్యులు దర్శించుకున్నారు. చిత్ర హీరో అశ్విన్, నిర్మాత టి.గణపతిరెడ్డి, దర్శకుడు మామిడాల ఎం.ఆర్.కృష్ణ స్వామి, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ సినిమా ఘనవిజయం సాధించాలని స్వామి వారిని కోరుకున్నట్టు తెలిపారు. 2026 వేసవిలో ప్రేక్షకుల ముందుకు ఈ సినిమా వస్తుందని తెలిపారు.

తపాలా సూపరింటెండెంట్‌గా శ్రీకర్‌బాబు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: తపాలా శాఖ అందించే సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అమలాపురం తపాలా సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర్‌బాబు కోరారు. ఇక్కడి కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. ఆయన ఏలూరు డివిజన్ నుంచి బదిలీపై వచ్చారు. తపాలా శాఖ ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలోని వెదిరేశ్వరం రోడ్డులో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ఏర్పాటు విషయంలో తలెత్తిన వివాదంలో మాజీ ఎమ్మెల్యే, వైకాపా జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వెదిరేశ్వరం రోడ్డు మధ్యలో ఓ సామాజికవర్గం వారు విగ్రహ ఏర్పాటుకు నిర్మించిన దిమ్మ కారణంగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసు, రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, మరి కొంతమంది అక్కడికి వచ్చి దిమ్మపై ఉంచిన శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటాన్ని దూరంగా విసిరేస్తున్న సమయంలో పోలీసులు అడ్డుకున్నారు. దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కలిగించిన నేపథ్యంలో చిర్ల జగ్గిరెడ్డి, గొల్లపల్లి డేవిడ్, ఏనుగపల్లి నాగార్జున, ఇసుకపట్ల సునీల్, కొల్లాటి డాక్టర్‌బాబు, ముసునూరి వెంకటేశ్వరరావు, గొల్లపల్లి రాజశేఖర్, పడాల నాగమహేశ్వరరెడ్డి, నెల్లి రాజులపై కేసు నమోదు చేసినట్లు రావులపాలెం ఎస్సై చంటి గురువారం తెలిపారు.

యువతి ఆత్మహత్య కేసులో ఇద్దరి అరెస్ట్

రాజోలు: రాజోలులో గత నెల 29న ఆత్మహత్యకు పాల్పడిన యువతి అప్పన నాగప్రియ కేసులో గురువారం ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని రాజోలు సీఐ టి.వి.నరేష్‌కుమార్ తెలిపారు. తన మృతికి దారితీసిన కారణాలను వివరిస్తూ ఆమె లేఖ రాసిన విషయం తెలిసిందే. దీని ఆధారంగా దర్యాప్తు చేసి రాజోలుకు చెందిన డి.బాపూజీ, కె.శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ పేర్కొన్నారు.

అలంకరణలో స్వామివారు, దర్శనానికి వచ్చిన భక్తులు

అయినవిల్లికి పోటెత్తిన భక్తజనం

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయం గురువారం భక్తజన సంద్రంగా మారింది. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున తరలిరావడంతో పరిసరాలు కిటకిటలాడాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు పూజలు చేశారు. వివిధ రుసుముల ద్వారా రూ.5,01,248 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

బాలబాలాజీ సేవలో...

స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయానికి వివిధ జిల్లాల నుంచి గురువారం అత్యధికంగా భక్తులు విచ్చేశారు. ప్రధాన ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలతో మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు స్వామివారికి విశేషార్చనలు, అభిషేకాలను నిర్వహించారు. ధనుర్మాసోత్సవంలో భాగంగా ధర్మగిరి నుంచి వచ్చిన పండితులు, అర్చకులు వైనతేయ నది నుంచి కలశాలతో తెచ్చిన జలాలతో గోదాదేవికి అభిషేకం చేసి తిరుప్పావై పాశురాలను పఠించారు. ఏసీ ఎం. సత్యనారాయణరాజు, వంశ పారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	17,000
పాతకాయ: గండేరా	27,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,000-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	147-00
రిటైల్ లైవ్	174-00
డ్రెస్డ్	252-00
స్కిన్‌లెస్	287-00

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU e Classifieds

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

BUSINESS OFFER
న్యూఇయర్‌లో ఎలాంటి పెట్టుబడి లేకుండా నచ్చిన టైమ్‌లో బిజినెస్ చేసుకొని అధికఆదాయం పొందండి. అనుభవం, అర్హత లేదు. 9705877799, 8096225555

SECOND SALE
New Jewellery shop Furniture, cash counter, 2 display counters etc for sale ✆ Cont: 9885076741.

JOBS
రాజమండ్రి, కోరుకొండ రోడ్డులో మా ఇంటిపట్ల 2 సంవత్సరాల పిల్లల ఆలన పాలన చూసుకొనుటకు ★ కేర్‌టేకర్స్ కావలెను. Cont. Cell: 77999 88168.
వాచ్‌మెన్ ఫ్యామిలీ, వార్డెన్స్ (మగ), వంట మనుషులు (ఆడ) కావలెను. వసతి సదుపాయం. జయశ్రీ గార్డెన్స్, ఎ.వి.ఎ.రోడ్, రాజమండ్రి. 7095223216, 9494158858.
రాజమండ్రిలో ప్రముఖ రెడీమేడ్ గార్మెంట్స్ షాపులో పనిచేయుటకు సేల్స్‌స్టాఫ్, డైలీవేజెస్ (పు)-500/-, స్త్రీ-300-400/- కావలెను. Contact: 90523 81026.

ఇంటిపని వంటపనిలో అనుభవం కలిగిన 35 సం॥లోపు ఏ బాదరబందీలేని మహిళలు హైదరాబాద్‌లో ఇంటిలో పనిచేయుటకు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. నమ్మకంతో పనిచేయుటకు ఇష్టంగలవారు సంప్ర॥. ✆ 98481 93191, 98493 49999.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-25 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

పనుల నాణ్యతలో రాజీ పడొద్దు: ఎస్ఈ

అంతర్వేది, న్యూస్‌టుడే: సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం గ్రామాల్లో సుమారు రూ.2 కోట్లతో జరుగుతున్న ఆరు సీసీ, బీటీరోడ్ల వెడల్పు, నాణ్యతలను పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఎస్ఈ కృష్ణారెడ్డి గురువారం తనిఖీ చేశారు. పనుల నాణ్యతలో ఎటువంటి రాజీ పడొద్దని నిర్మాణ గుత్తేదారునికి తెలిపారు. అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి, పర్యాటక ప్రదేశంగా ఉన్న సాగర సంగమం, తదితర ప్రాంతాలు చూడ్డానికి వచ్చే భక్తులు, సందర్శకులు, పర్యాటకుల సౌకర్యార్థం వీటిని నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఈ కృష్ణంరాజు, సఖినేటిపల్లి, రాజోలు జేఈలు గంగాధర్, సంపన్న పాల్గొన్నారు. ఈ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో స్థానిక గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

3న అంతర్వేదిలో ఆరుద్రోత్సవం

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది క్షేత్రపాలకుడు పార్వతీ నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 3న శివముక్కోటి సందర్భంగా ఆరుద్రోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఏసీ నాగవరప్రసాద్ తెలిపారు. ఉదయం 4.30 గంటల నుంచి స్వామివారికి అభిషేకం, అనంతరం రుద్రహోమం చేస్తున్నట్లు తెలిపారు.

రావులపాలెంలో ఉచిత వైద్యశిబిరం

రావులపాలెం పట్టణం: రావులపాలెం సత్యసాయి సేవా మందిరంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. హోమియో వైద్యులు నాగులపల్లి శ్రీనివాసరావు, భవాని ఆసుపత్రి వైద్యుడు భీమారెడ్డి, శ్రీరామా ఆసుపత్రి వైద్యుడు విశ్వనాథగాంధీ పాల్గొని సేవలు అందించారు. 220 మంది ఈ శిబిరానికి హాజరైనట్లు సంస్థ కన్వీనర్ మన్యం పర్వతవర్ధనరావు అన్నారు.

అంబరం.. నూతన సంబరం

విశ్వేశ్వరాయపురంలో కేకు కోస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్, కూటమి నాయకులు

అంబాజీపేట, రాజోలు, అయినవిల్లి, మలికిపురం, మామిడికుదురు, పి.గన్నవరం, ఆత్రేయపురం, కొత్తపేట, రావులపాలెం గ్రామీణం, రావులపాలెం పట్టణం, అంతర్వేది, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని తాకాయి. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చిన్నాపెద్దా కలిసి సందడి చేశారు. కేకులు కోశారు. మిఠాయిలు పంచి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల ఉద్యోగులు, సిబ్బంది ఉన్నతాధికారులకు పుష్పగుచ్ఛాలు అందించారు. ఎమ్మెల్యేలు దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ, బండారు సత్యానంద రావును పూలమాలలతో సత్కరించారు. నూతన ఏడాదిలో మరింత అభివృద్ధి చేస్తామని వారు పేర్కొన్నారు. దీంతో రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ✦ పొదలాడలో రాజోలు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్యను, పొన్నమండలో గోదావరి డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్‌ను నాయకులు, కార్యకర్తలు, నీటిసంఘాల అధ్యక్షులు కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ✦ అయినవిల్లి తహసీల్దార్ విద్యాపతి వీఆర్ఏలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ✦ మగటపల్లిలో జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. సొసైటీ ఛైర్మన్లు ఈలి శ్రీనివాస్, బొలిశెట్టి జగదీశ్, కామిశెట్టి బాబ్జీ, సాగి బాబ్జీరాజు, సూదా బాబ్జీ, బొలిశెట్టి ఏసుబాబు, దొడ్డా జయరామ్, కొమ్ముల నందుబాబు తదితరులు పాల్గొన్నారు. ✦ రావులపాలెంలో జరిగిన వేడుకల్లో డీసీఎమ్మెస్ మాజీ అధ్యక్షుడు కె.వి.సత్యనారాయణరెడ్డి, యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, జడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాడపాలెంలో కేకు కోస్తున్న ఎమ్మెల్యే బండారు, తదితరులు

వాడపాలెంలో జనసేన ఇంఛార్జి శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందిస్తూ..

ఎమ్మెల్యే సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న మండల పరిషత్ ఉద్యోగులు

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
ఉ. 10 - మ. 1 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

చెత్తాచెదారం శుభ్రం

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: ఊబలంక రోడ్డు చెంత నిలిచిన చెత్తాచెదారం పేరుకుపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి శరబరాజు దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

పైపులైన్‌కు మరమ్మతులు

మామిడికుదురు: పాశర్లపూడి నుంచి లూటుకుర్రు వరకు పైపులైను దెబ్బతినడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సిబ్బంది చెప్పిన సమస్యను సంబంధిత ఏఈఈ జయశ్రీ వద్ద ప్రస్తావించగా వెంటనే స్పందించారు. మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరా పునరుద్ధరించారు.

నిధులు స్వాహా.. బీడీవో అరెస్టు

యానాం: పుదుచ్చేరి గ్రామీణాభివృద్ధిశాఖలో బీడీవోగా పనిచేసిన వివేకానందన్ ప్రభుత్వ సొమ్ము స్వాహా చేయడంతో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. 2022లో అరియాంకుప్పం పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణం నిమిత్తం కేంద్ర, పుదుచ్చేరి ప్రభుత్వాలు ఇచ్చిన నగదులో రూ.59 లక్షలు ఆయన స్వాహా చేశారు. అక్రమాలు గుర్తించిన అధికారులు ఆతడిని నెట్టపాక్కం పంచాయతీకి బదిలీ చేయగా అక్కడ మరో రూ.28 లక్షలు దుర్వినియోగం చేశారు. దీంతో ఆతడిని విధుల నుంచి డిస్మిస్ చేశారు. అనంతరం అరియాంకుప్పం అభివృద్ధి అధికారిగా నియమితులైన కార్తికేయన్ నగదు దుర్వినియోగం గురించి ఏసీబీకి గత ఏడాది జులైలో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ కేసులో నిందితుడికి సహకరించి కంప్యూటర్ ఆపరేటర్ రాజశేఖర్‌ను గురువారం అదుపులోకి తీసుకున్నారు. మరో ఎనిమిది మందికి దీనిలో భాగస్వామ్యం ఉందని పోలీసులు గుర్తించారు.

కాలువలు మాయమవుతున్నాయ్!

– న్యూస్‌టుడే, మామిడికుదురు

వైనతేయ నదీ తీరంలోని లంక గ్రామాల్లో పాటునీటి కాలువల పరిస్థితి దుర్భరంగా మారింది. ఆక్రమణలకు గురైన వీటిని ఎవరూ పట్టించుకోకపోవడంతో పూర్తిగా మాయమయ్యే పరిస్థితి ఎదురవుతోంది. పి.గన్నవరం మండలం నాగుల్లంక నుంచి మామిడికుదురు మండలం గోగన్నమఠం వరకు 18 కిలోమీటర్ల మేర ఇవి ఏటిగట్టుకు ఆనుకుని దిగువలో ఉన్న లంక గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలు, వరదల సమయంలో ముంపునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో స్తంభించిపోవడంతో పాటు నిత్యం మురుగునీటి కూపాలుగా మారుతున్నాయి.

▼ బి.దొడ్డవరంలో రెండుచోట్ల నాలుగు కిలోమీటర్ల మేర గట్టు బలహీనంగా మారి, చెత్తడప్పలతో నిండిపోయి పారుదల నిలిచిపోవడంతో దుర్గంధభరితంగా ఉన్నాయి. అప్పనపల్లి, పెదపట్నంలంకలోనూ ఇదే దుస్థితి.

▼ పెదపట్నం నుంచి ఉచ్చులవారిపేట మీదుగా పాశర్లపూడి వరకు పాటుకాలువ పలుచోట్ల పూడిక పెరిగిపోయి, ఆక్రమణల బారిన పడి అధ్వానంగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడి ఇటుక బట్టీలకు మట్టిని తరలించడం వల్ల కూడా పాటు నీటి కాలువల్లో పూడిక మరింత పెరిగిపోతోంది. గతంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా అప్పనపల్లి, పెదపట్నంలో కొన్నిచోట్ల మట్టిపని పనులు చేశారు. దీనివల్ల కొంతమేర జరిగిన పూర్తిస్థాయిలో సాగారు కాకపోవడం, ఆక్రమణలు పట్టకపోవడంతో ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదని లంక గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

పూడికతీతతోనే ప్రయోజనం..

ఏటిగట్టు దిగువలో అప్పనపల్లి, పెదపట్నం, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాల్లో 18,900 మంది జనాభా ఉన్నారు. ఆయా గ్రామాల్లోని మురుగు, ముంపునీరు పాటునీటి కాలువల ద్వారానే పాశర్లపూడిలోని నదిలోకి చేరాల్సి ఉంది. పలుచోట్ల చాలావరకు ఆక్రమణల బారిన పడ్డాయి.

▼ అప్పనపల్లి కాజ్‌వేకు ఇరువైపులా 5 కిలోమీటర్ల మేర ఇటుకబట్టీలు, ఆక్వా చెరువులు, కొబ్బరి తోటలు ఉన్నాయి. ఇందులో క్రమేణా పూడిక పెరిగిపోవడంతో నీరు వెళ్లేందుకు మార్గం కుంచించుకుపోయింది.

పాశర్లపూడిలో ఇదీ పరిస్థితి..

ఆక్రమణలు తొలగిస్తాం

లంక గ్రామాల్లో ఆక్రమణల కారణంగా ముంపునీటి పారుదలకు ఏర్పడిన అడ్డంకులు పరిశీలించి తొలగించే దిశగా చర్యలు చేపడతాం. ఆక్రమణల్లో ఉన్న ఇటుక బట్టీలను గుర్తించి నోటీసులు ఇస్తాం. లంక గ్రామాలకు మట్టిని అక్రమంగా తరలించే వారిపై నిఘా పెడతాం.
– పి.సునీల్‌కుమార్, తహసీల్దార్, మామిడికుదురు

భీమా కోరేగావ్ విజయోత్సవం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: అణగారిన వర్గాల హక్కుల సాధనకు, స్వాభిమాన పోరాటాలకు భీమా కోరేగావ్ పోరాటం స్ఫూర్తిగా నిలుస్తుందని ఆర్పీఐ నాయకులు అన్నారు. ముమ్మిడివరం గ్రామంలోని పోలమ్మచెరువుగట్టు జైబుద్ధ పార్కు వద్ద ఆర్పీఐ జిల్లా కన్వీనర్ చీకురమిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన భీమా కోరేగావ్ 208వ విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పెనుమాల సుధీర్, దోనిపాటి ఆంజనేయులు, పెద్ది నాగేశ్వరరావు, కాశి వెంకటేశ్వరావు, సింహాద్రిరావు, మట్టా శ్రీనివాసరావు, పండిరి శ్రీనివాస్, బుడితి శరత్, జనిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈ-గవర్నెన్స్‌పై నేడు శిక్షణ కార్యక్రమం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: డివిజనల్ స్థాయి 2025-26 ఈ-గవర్నెన్స్ అప్లికేషన్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం రామచంద్రపురం మండల పరిషత్ సమావేశపు హాలులో నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో తెలిపారు. ఈ శిక్షణ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. దీనికి రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాలకు చెందిన డిప్యూటీ ఎంపీడీవో(పంచాయతీరాజ్), డిప్యూటీ ఎంపీడీవో (గ్రామవార్డు సచివాలయం), పంచాయతీ కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు ఈ శిక్షణకు హాజరు కావాలని సూచించారు.

అమలాపురం వయా రత్నాలపేట

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి రేవు నుంచి అమలాపురం వరకు వయా రత్నాలపేట, లూథరన్ ఉన్నత పాఠశాల మీదుగా మలికిపురం, రాజోలు, అమలాపురం నూతన బస్సు సర్వీస్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. గతంలో ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులేక ప్రయాణికులు, విద్యార్థులు నానా ఇబ్బందులు పడేవారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, డిపో మేనేజర్ జేమ్స్‌కుమార్, మహాలక్ష్మీప్రసాద్, మోహన్‌కుమార్, గుబ్బల ఫణికుమార్ పాల్గొన్నారు.

బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

ఖాళీ జాగా కనిపిస్తే ఆక్రమించేస్తారు..

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఖాళీ జాగా కనిపిస్తే చాలు ఆక్రమించేస్తున్నారు. ఇప్పటివరకు కాలువగట్లు ఆక్రమించిన స్వార్థపరులు చెరువులను సైతం వదలడం లేదు. తాజాగా ఆత్రేయపురం, లొల్ల ర.భ.శాఖ రోడ్డు చెంతన పంచాయతీకి చెందిన రామరాజు చెరువును ఒక వ్యక్తి ఆక్రమించి గడ్డి పెంపకం చేస్తున్నారు. గతంలో దీన్ని మత్స్యకారులకు కౌలుకు ఇచ్చారు. ప్రస్తుతం ఖాళీగా ఉండటంతో దానిపై కన్నేశారు. దీంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ కార్యదర్శి శివప్రసాద్ మాట్లాడుతూ చెరువును ఆక్రమించి సాగు చేసిన వ్యక్తికి నోటీసులు అందజేయున్నట్లు చెప్పారు.

చెరువు ప్రాంతంలో సాగవుతున్న పశుగ్రాసం

రోడ్డుపైనే దుకాణాలు

నిత్యం వేలాది మంది ప్రయాణించే రావులపాలెం రైతుబజారు రోడ్డుపై కొందరు వ్యాపారులు ఏకంగా దుకాణాలు పెట్టేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతుబజారుకు వచ్చేవారు వాహనాలు నిలిపే ప్రాంతంలో కూరగాయల దుకాణాలు పెట్టేయడంతో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని రైతుబజారు అధికారి దృష్టికి తీసుకుని వెళ్లగా రోడ్డుపై దుకాణాలు పెట్టకుండా చూస్తామన్నారు.– న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం

తుప్పు పట్టి.. మూలకు చేరి

పెద పట్నం గ్రామ పంచాయతీ పరిధిలో చెత్తను తరలించేందుకు ఉపయోగించే రిక్షాలు కొన్ని మూలకు చేరడంతో తుప్పుపట్టి నిరుపయోగంగా మారాయి. వీటిని స్థానిక ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రం వద్ద ఉంచేయడంతో చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. పరిసరాలు కూడా అస్తవ్యస్తంగా మారాయి. వీటికి కొద్దిపాటి మరమ్మతులు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఈ విషయాన్ని సర్పంచి గుబ్బల దుర్గ దృష్టికి తీసుకువెళ్లగా అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

నియంత్రికకు మరమ్మతులేవి?

కట్టుంగ గ్రామ చెరువు సమీపంలో విద్యుత్తు నియంత్రిక మరమ్మతుకు గురై వారం రోజులవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో స్థానికులు పడరాని పాట్లు పడుతున్నారు. సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తుండటంతో గృహోపకరణాలు పాడవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్తు ఏఈ అశోక్ వద్ద ప్రస్తావించగా మరమ్మతులు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

రాకపోకలకు జనం అవస్థలు

విశ్వేశ్వరాయపురం-కత్తిమండ రోడ్డు అధ్వానంగా మారింది. గతంలో పంచాయతీ కార్యాలయం నుంచి కత్తిమండలో మల్లిపూడివారి ఇంటివద్ద 450 మీటర్ల మేర సీసీగా అభివృద్ధి చేశారు. అక్కడి నుంచి విశ్వేశ్వరాయపురం ప్రధాన రహదారి వరకు 550 మీటర్ల మేర శిథిలమై రాళ్లు తేలి, గుంతలు పడి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. కత్తిమండ, విశ్వేశ్వరాయపురం గ్రామాల ప్రజలకు ఇది ఉపయోగపడుతుంది. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు చెప్పారు. – న్యూస్‌టుడే, మలికిపురం

శిథిల భవనంతో భయం

అమలాపురం మండలం ఈదరపల్లి పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనమిది. శిథిలావస్థకు చేరి చాలా కాలంగా ఇలాగే ఉంది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. – న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

బాధిత కుటుంబానికి భరోసా

కొత్తపేట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన పి-4 పథకం స్ఫూర్తితో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబానికి తనవంతు సాయంగా ఆర్థిక భరోసా కల్పిస్తానని జిల్లా రవాణా శాఖాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. కొద్ది నెలల క్రితం గోపాలపురం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యడ్ల సుభాష్ తల్లిని గురువారం కొత్తపేట మండలం గంటి గ్రామం చినపేటలో పరామర్శించి నూతన వస్త్రాలు అందించారు. భవిష్యత్తులో ఏ అవసరమున్నా తనకు తెలియపరచాలని, సాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

తెదేపా నేత మృతికి సంతాపం

వద్దిపర్రు(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వద్దిపర్రు గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి వాకలపూడి సూరిబాబు(69) గురువారం తెల్లవారు జామున మృతిచెందారు. సౌమ్యుడిగా ఉంటూ గతంలో గ్రామపార్టీ, సహకార సంఘ అధ్యక్షులుగా పనిచేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, గ్రామ సర్పంచి జుజ్జవరపు శ్యామల, కూటమి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి మహారాష్ట్రలోని నవీముంబై ప్రాంతానికి చెందిన వాడపల్లి రామ్ ప్రసాద్, సుజాత దంపతులు రూ.1,20,116 విరాళం గురువారం సమర్పించారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేసి వేదపండితులు అభినందించారు.

● కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సినీనటుడు సంతోష్ శోభన్ దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

డ్రెయినేజీ నీటితో దుర్వాసన

మలికిపురం, న్యూస్‌టుడే: విశ్వేశ్వరాయపురంలోని పెట్రోలు బంకు సమీపంలో డ్రెయినేజీ నీరు రోడ్డుపైకి చేరుతోంది. దీనివల్ల దుర్వాసన వెలువడుతోందని సమీప కుటుంబాల వారు వాపోతున్నారు. దీన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి డి.సీతారాముడిని వివరణ కోరగా రోడ్డు పక్కన ఉన్న ఓ ఇంటికి సంబంధించిన డ్రెయినేజీ నీరు మ్యాన్‌హోల్ నుంచి లీకవుతోందన్నారు. వారికి నోటీసు ఇచ్చి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వెంకన్నకు లక్షతులసి అర్చన

ఆలమూరు, న్యూస్‌టుడే: చింతలూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి గురువారం భక్తులు లక్ష తులసి అర్చన వైభవంగా నిర్వహించారు. ఉదయం మూలమూర్తికి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని వరాహమూర్తి రూపంలో అలంకరించారు. అనంతరం శాంతికల్యాణం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అర్చన చేస్తున్న అర్చకులు

శివకేశవుల గ్రామోత్సవం

అంబాజీపేట, న్యూస్‌టుడే: ధనుర్మాసం సందర్భంగా గంగలకుర్రుఅగ్రహారంలోని ఉమా పార్వతీ సమేత వీరేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి వార్లకు గురువారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన యువకుల ఆధ్వర్యంలో విగ్రహాలను పురవీధుల్లో ఆధ్యాత్మిక వాతావరణంలో ఊరేగించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

తీర్థ మహోత్సవాలు ప్రారంభం

కుంతలేశ్వరి

రాజోలు, న్యూస్‌టుడే: శివకోటిలోని పుంతలో ముసలమ్మ(కుంతలేశ్వరి) వారి తీర్థ మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 5 నుంచి 11 వరకు వివిధ సేవలు, 13న జాగారం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలు 20 వరకు జరుగుతాయన్నారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.

సంక్రాంతి పోటీలకు ముస్తాబు

నేడు ట్రయల్ రన్

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాలకు ఆత్రేయపురం ముస్తాబవుతోంది. ఈ నెల 11 నుంచి మూడు రోజుల పాటు జరిగే సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ పోటీలకు సంబంధించి ఏర్పాట్లలో అధికారులు తలమునకలై ఉన్నారు. లొల్లలాకులు, ఆత్రేయపురం ప్రాంతాల్లో ఈ మేరకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం కలెక్టర్ పర్యవేక్షణలో కనోయింగ్ పడవ ట్రయల్ రన్ నిర్వహించేందుకు సిద్ధం చేశారు. లొల్లలాకుల నుంచి పులిదిండి వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. త్వరలో జరగనున్న పోటీల్లో కేరళ, ఉభయ గోదావరితో పాటు అనంతపురం, విశాఖ, కృష్ణా తదితర జిల్లాలకు చెందిన జట్లు పాల్గొననున్నాయి. వీటితో పాటే మహిళలకు రంగవల్లులు, చిన్నారులకు, యువతకు గాలిపటాలు(పతంగులు) పోటీలు నిర్వహించనున్నారు. సుమారు 20 వేల మంది వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యాటకంగా పేరుగాంచిన లొల్లలాకుల ప్రాంతంలో పడవ పోటీలు నిర్వహించనున్నారు. ఆత్రేయపురం కాలువ రేవు నుంచి ఉచ్చిలి మధ్య ప్రధాన పంట కాలువలో సుమారు వెయ్యి మీటర్ల పరిధిలో జరుగుతాయి.

కొత్తగా మరికొన్ని..

ఈ ఏడాది కొత్తగా కోనసీమ ఫుడ్ ఫెస్టివల్ పేరిట ఆత్రేయపురం పూతరేకులు, కండ్రిగ పాలకోవ, రాజోలు ప్రాంతానికి చెందిన పిచ్చుకగూళ్లు, నార్కెడుమిల్లి పచ్చళ్లు తదితర రకాలు ప్రదర్శించనున్నారు. ఈ దఫా సినీ ఆర్కెస్ట్రా, బ్యాండ్ సెహరీ ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. పోటీలు విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఇప్పటికే కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీవో పి.శ్రీకర్ అధికారులతో సమీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు.

అటువైపే లంక గ్రామాలు

ప్రజల ఆశలు ఆవిరి

– న్యూస్‌టుడే, పి.గన్నవరం

కూటమి ప్రభుత్వం పాలనా సౌలభ్యం కోసం కొన్ని కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడంతో పాటు కొన్ని మండలాలను సమీపంలోని జిల్లాల్లోకి మారుస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ విధంగా తమను కూడా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోకి తీసుకొస్తారని పి.గన్నవరం మండలాన్ని చేర్చి ఉన్న సరిహద్దు లంక గ్రామాల ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంలో ఈ ప్రస్తావన లేకపోవడంతో వారి ఆశలు ఆవిరయ్యాయి.

ఇటీవల వరదలకు మరపడవలో లంకలగన్నవరం వైపు అయోధ్యలంక గ్రామస్థుల రాక..

నిత్యం రాకపోకలు..

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని పెదలంక, కనకాయలంక, ఆచంట నియోజకవర్గం పరిధిలోని అయోధ్యలంక, రావిలంక, మర్రిమూల, ఆనగార్లంక, పెదమల్లంక గ్రామాలు పి.గన్నవరం మండలాన్ని చేర్చి ఉన్నాయి. పెదలంక గ్రామమైతే రాజోలు మండలాన్ని చేర్చి ఉంది. ఇక్కడి ప్రజలు నిత్యం పి.గన్నవరం, రాజోలు మండలాల వైపు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు, ప్రజాప్రతినిధులను కలుసుకునేందుకు వెళ్లాలంటే నరసాపురం, పాలకొల్లు, ఆచంట వెళ్లాల్సి వస్తుంది. వీరంతా తమను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చేర్చాలని అనేక సంవత్సరాలుగా కోరుతున్నారు. జిల్లాల పునర్విభజనతో కోనసీమ ఏర్పాటైంది. దీంట్లో చేర్చితే అన్నివిధాలా బాగుంటుందని భావించారు. అక్కడి రైతులు వ్యవసాయోత్పత్తులు పి.గన్నవరం మండలం వైపు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. విద్యార్థులు ఇటువైపు వచ్చి పాఠశాలలు, కళాశాలలకు వెళుతుంటారు. ప్రయివేటు, ప్రభుత్వ ఆసుపత్రుల సేవల కోసం ఇటువైపు ఉన్నవాటి మీదే ఆధారపడతారు. ప్రస్తుతం ప్రభుత్వం వీటిని పరిగణనలోకి తీసుకోకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

మాట్లాడుతున్న దేశంశెట్టి లక్ష్మీనారాయణ

ఉప్పలగుప్తం: రైతుల నుంచి ప్రతి గింజా కొనుగోలు చేసి మద్దతు ధర కల్పిస్తామని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ అన్నారు. గొల్లవిల్లిలో గురువారం జిల్లా అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. మండపేట తూర్పుగోదావరి జిల్లాలో విలీనం కావడంతో జిల్లా రైస్‌మిల్లర్లకు ధాన్యం సేకరణకు మరిన్ని అవకాశాలు పెరగాయన్నారు. జిల్లాలో రైతులు పండించిన ధాన్యం స్థానిక మిల్లులకు పంపించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రతి క్లస్టరు నుంచి సంఘంలో ఒక వర్కింగ్ సభ్యుడు ఉండేలా అయిదుగురిని నియమిస్తే అసోసియేషన్ నిర్వహణ సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి పిప్పళ్ల రాము, ఉపాధ్యక్షులు చంద్రు శ్రీనివాస్, దివ్వి శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • రామచంద్రపురం

పందిరి రాట కార్యక్రమంలో కమిటీ సభ్యులు

సత్తెమ్మతల్లి జాతరకు అంకురార్పణ

ముమ్మిడివరం: సీహెచ్ గున్నేపల్లిలో ప్రసిద్ధి చెందిన సత్తెమ్మతల్లి అమ్మవారి జాతర ఉత్సవాలకు గురువారం అంకురార్పణ చేశారు. ఫిబ్రవరి నాలుగో తేదీ నుంచి 8 వరకు నిర్వహించే అమ్మవారి జాతర మహోత్సవాలకు ముహూర్తం ప్రకారం గురువారం పందిరి రాట వేశారు. మేకల బుజ్జి, గొలకోటి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు సుంకర శ్రీనివాస్, భోగిశెట్టి చిన్నా పాల్గొన్నారు.

రైతుబజార్‌లో గురువారం నాటి ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: టమాటా - 44, వంకాయలు నలుపు - 30, వంకాయలు తెలుపు - 26, బెండకాయలు - 45, పచ్చిమిర్చి - 40, కాకరకాయ - 46, బీరకాయలు - 46, కాలీఫ్లవర్ - 26, క్యాబేజీ - 32, క్యారెట్ - 34, దొండకాయలు - 38, బంగాళదుంపలు - 18, ఉల్లిపాయలు - 20, 30, గోరుచిక్కుళ్లు - 45, దోసకాయలు - 26, చిక్కుడుకాయలు - 24, చేమదుంపలు - 43, కంద - 45, బీట్‌రూట్ - 32, కీరదోసకాయలు - 35, అల్లం - 75, క్యాప్సికం - 65, చిలకడదుంపలు - 40, గుమ్మడి - 30, ముల్లంగి -45, ఉసిరి -80, నిమ్మకాయలు -30, అనబకాయ -28, పొట్లకాయ -25, అరటికాయ -6, మునగకాయ -20, ఆకుకూరలు కట్ట -10, 15, కొత్తిమీర కట్ట - 15, కొబ్బరికాయ - 25.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718, ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

సమస్య: బోడసకుర్రు టిడ్కో ఇళ్ల వద్ద చెత్త నిలిచి పోయింది. దీనిని తొలగించేలా చర్యలు తీసుకోవాలి.
-వరలక్ష్మి, స్థానికురాలు

సమస్య: కొంకాపల్లి కుమ్మర్లవీధిలో మురుగుకాలువపై పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో మురుగు ముందుకు వెళ్లడం లేదు.
-చిన్నా, స్థానికుడు

సమస్య: నారాయణపేట శివారు మురుగుకాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసనతో పాటు దోమలతో ఇబ్బంది పడుతున్నాం.
-వెంకాయమ్మ, స్థానికురాలు

సమస్య: పద్మినీపేటలో రహదారి దుమ్ము, ధూళి నిండిపోవడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.
- విజయలక్ష్మి, స్థానికురాలు

పరిష్కారం: పట్టణంలో బోడసకుర్రు టిడ్కో ఇళ్లు, నారాయణపేట, పద్మినీపేట సమస్యలు తెలుపగా ఆయా సచివాలయ కార్యదర్శులు స్పందించారు. సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. కుమ్మర్లవీధిలో మురుగుకాలువపై పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. -న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

ప్రమాద ఘంటికలు

పెరుగుతున్న డయాలసిస్ బాధితులు

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో డయాలసిస్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం 135 మందికి అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రిలో రక్త శుద్ధి(డయాలసిస్) చేస్తున్నారు. ఈ కేంద్రం నిరుపేదలకు భరోసా కల్పిస్తోంది. అమలాపురం వాసులతో పాటు చుట్టుపక్కల నియోజకవర్గాల్లోని బాధితులకు ఈ కేంద్రం సేవలు అందిస్తోంది.

ఏడేళ్ల నుంచి సేవలు

జిల్లాలో నెలకొన్న విభిన్న పరిస్థితులు, అలవాట్ల కారణంగా మూత్రపిండ సంబంధిత వ్యాధులు విస్తరిస్తున్నాయి. భూగర్భ జలాలు కలుషితం కావడం సైతం ఓ కారణమని వైద్యులు చెబుతున్నారు. అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రిలో 2018లో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. నాలుగేళ్లలో అయిదు వందల మందికి పైగా ఈ కేంద్రంలో చికిత్స పొందారు.

ఇవిగో కారణాలు

- రసాయన అవశేషాలున్న ఆహార పదార్థాలు తినడం
- పొగాకు, ధూమపానం, గుట్కా వినియోగం
- ప్రొస్టేట్ గ్రంధి ఉబ్బడం.
- కలుషిత నీటిని తాగడంతో మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడి సమస్యగా మారుతుంది.

అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రి డయాలసిస్ కేంద్రంలో రోగులు

ఇలా గుర్తించవచ్చు..

- మూత్రంలో నురగ రావడం
- విసర్జన సమయంలో మంట ఉండటం
- కాళ్లు, చేతులు, ముఖంపై వాపు రావటం
- బొట్లుబొట్లుగా మూత్ర విసర్జన కావడం
- నడుము నొప్పి తగ్గకపోవటం

అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రిలో సేవలు పొందినవారు

ఏడాది	బాధితులు
2022-23	156
2023-24	135
2024-25	138
2025-26	135

ఏడేళ్లుగా సేవలు

ప్రాంతీయ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం ద్వారా బాధితులకు రక్త శుద్ధి ప్రక్రియ జరుగుతోంది. ప్రస్తుతం 135 మంది చికిత్స పొందుతున్నారు. ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ఎంతో మంది బాధితులకు బాసటగా నిలుస్తోంది. ఈ కేంద్రాన్ని రోగులు వినియోగించుకోవాలి. -శంకర్రావు, సూపరింటెండెంట్, అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రి

4న పశువులు, కోళ్లు, లేగదూడల ప్రదర్శన

యానాం: యానాం పశువైద్యశాల ప్రాంగణంలో ఆదివారం పశువులు, కోళ్లు, లేగదూడలు, శునకాలు, ఇతర పెంపుడు జంతువుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ కొమరిన్ తెలిపారు. ప్రదర్శనకు పశువులు, మేలుజాతి ఆవులు, గేదెలు, పెయ్యలతోపాటు పోషకులు పునరుత్పత్తి పుస్తకాల్ని తీసుకురావాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి పేర్లు నమోదు చేస్తామన్నారు. పెంపుడు శునకాల యజమానులు ర్యాబిస్ వేక్సినేషన్ కార్డుల్ని తమ వెంట తీసుకురావాలని కొమరిన్ తెలిపారు.

గణతంత్ర వేడుకలకు పుదుచ్చేరి శకటం

యానాం, న్యూస్‌టుడే: దిల్లీలో నిర్వహించనున్న భారత గణతంత్ర వేడుకలకు పుదుచ్చేరి శకటం ఎంపికైనట్లు సమాచారశాఖ డైరెక్టర్ మాథ్యూ ఫ్రాన్సిస్ గురువారం తెలిపారు. పుదుచ్చేరి సంస్కృతిని తెలియజేసే మట్టి, రాతి పనిముట్లు, అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రం ఆరోవిల్‌ను ఈ శకటం ద్వారా దేశానికి పరిచయం చేస్తామని ఫ్రాన్సిస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జగదీష్ చంద్రబోస్ వీధి ప్రారంభం

వీధిని ప్రారంభిస్తున్న స్వామినాయుడు, తాతాజీ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: గొలకోటి ధర్మారావు వీధి, బ్రహ్మానందం వీధులను కలుపుతూ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ జగదీష్ చంద్ర బోస్ వీధిని ఏర్పాటు చేసినట్లు అముడా ఛైర్మన్ అల్లాడ స్వామి నాయుడు తెలిపారు. అమలాపురం మొబర్లీపేటలో కౌన్సిలర్ యేడిద శ్రీను ఆధ్వర్యంలో జగదీష్ చంద్రబోస్ వీధిని స్వామినాయుడు, జనసేన నాయకుడు కల్వకొలను తాతాజీలు గురువారం ప్రారంభించారు.

శుభాకాంక్షల సందడి

నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, నాయకుల ఇళ్లు సందడిగా మారాయి. కార్యకర్తలు పండ్లు, పూలబొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నతాధికారులుకు ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు చెప్పారు.

అమలాపురం పట్టణం: తెదేపా కార్యాలయాలలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడస్వామినాయుడు, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు శుభాకాంక్షలు తెలిపారు.

● ఆర్డీవో మాధవికి కార్యాలయ సిబ్బంది, అధికారులు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైకాపా కౌన్సిలర్లు, జనసేన పార్టీ నాయకుడు నల్లా శ్రీధర్, కౌన్సిలర్లు ఏడిద శ్రీను తదితరులకు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజుకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

రామచంద్రపురం, ద్రాక్షారామ: రామచంద్రపురం పట్టణంలోని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇంటి వద్ద లలితా నగర్ గ్రౌండ్‌లో వేడుకలు అంబరాన్నంటాయి. నాయకులు, కార్యకర్తలు, అధికారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆర్డీలో డి.అఖిల, డీఎస్పీ రఘువీర్ సిబ్బందితో కలిసి వచ్చి మంత్రికి అభినందనలు తెలిపారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్లు సత్యనారాయణ, దుర్గాభవాని, జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్ పాల్గొన్నారు.

కాట్రేనికోన: నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అమలాపురం పట్టణం: ఎస్పీ బంగ్లాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ రాహుల్‌మీనా కేకు కోశారు.

ఐ.పోలవరం: మురమళ్లలోని క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును పోలీసు అధికారులు బుచ్చి బాబును గజమాలతో సత్కరించారు.

అల్లవరం: ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎంపీపీ ఇళ్ల శేషారావు, మాజీ ఎంపీ చింతా అనురాధకు వారి స్వగృహాల్లో నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

పామర్రు: మండల ఉపాధ్యాయ సంఘాలన్నీ ఎంఈవోలు చోడిశెట్టి ఆంజనేయులు, అలజంగి నాగరాజు, ఎంపీపీ పంపన నాగమణి, జడ్పీటీసీ సభ్యురాలు ఓలిబినేని వరలక్ష్మి, ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావును కలుసుకున్నారు. పోలీసు స్టేషన్లో సిబ్బంది ఎస్సై గుబ్బల సోమేంద్ర, పీహెచ్‌సీ, పశువుల ఆసుపత్రిలో ప్రధానవైద్యులను అభినందించారు.

అమలాపురం గ్రామీణం: భట్నవిల్లిలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ పినిపే శ్రీకాంత్‌కు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావుతోపాటు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు వివిధ సంఘాల పెద్దలు, అధికారులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను అధికారులు, ఉద్యోగులు, అభిమానులు కలిసి సత్కరించారు. పరిపాలనాధికారి అంకితామిశ్రమార్ పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ముమ్మిడివరం: జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఏఎంసీ ఛైర్ పర్సన్ ఓగూరి భాగ్యశ్రీ కేకు కోసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచారు. గుత్తి జమ్మి, ఇబ్రి రామ సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

మంత్రితో కేక్ కోయిస్తున్న డీఎస్పీ, సీఐలు

ఎమ్మెల్యే బుచ్చిబాబు సన్మానం

ఎమ్మెల్యే ఆనందరావుకు శుభాకాంక్షలు చెబుతున్న పల్లంరాజు

మల్లాడిని సత్కరిస్తున్న అభిమానులు

గొల్లపల్లికి ఉద్యోగుల శుభాకాంక్షలు

ఎస్పీ రాహుల్‌మీనాకు పోలీసు అధికారులు..

దండోరా జెండా ఆవిష్కరణ

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం ఎంఆర్‌పీఎస్ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు గురువారం పోలమ్మచెరువుగట్టు వద్ద వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నలమాటి లంకరాజు దండోరా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ నెల 25న అమలాపురంలో నిర్వహించనున్న హలో మాదిగ.. చలో అమలాపురం విజయోత్సవ సభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఏలియా, లంక వరప్రసాద్, చేట్ల దుర్గారావు, సత్తాల సంపదరావు, చుట్టుగుళ్ల అన్నవరం, అయినవిల్లి వీరభద్రం, దొండపాటి వినోద్, సవరపు కన్నబాబు, అయినవిల్లి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

గాడిలంకలో గుత్తుల సాయి ఇంటి వద్ద సందడి

నూతన సంవత్సర వేడుకలు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి ఇంటి వద్ద జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, అభిమానులు తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ ఇంటి వద్ద పార్టీ నాయకులు, అభిమానులు తరలివచ్చి కేకును కోశారు. నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవాని ఇంటికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కాట్రేనికోన: మండలంలోని చర్చిల్లో గురువారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాట్రేనికోనలో వివిధ అంశాల్లో ప్రతిభచూపిన వారికి బహుమతులు అందించారు. నూతన సంవత్సర కేకు కోశారు.

తాపీ కార్మికులకు పరికరాల పంపిణీ

యానాం, న్యూస్‌టుడే: వ్యాపారవేత్త తోట రాజు 200 మంది తాపీమేస్త్రీలు, కార్మికులకు పనిముట్లు పంపిణీ చేశారు. స్థానిక నల్లచెరువు దుర్గగుడి వద్ద శ్రీ సాయి మేసన్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో వీటిని గురువారం అందజేశారు. ఆయనను యూనియన్ అధ్యక్షుడు కర్రా చిన్నీ, కార్యదర్శి పోలిశెట్టి చంటి, ఉపాధ్యక్షుడు కర్రి సత్తిబాబు తదితరులు సత్కరించారు.

పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీకి శ్రీకారం

తాళ్లరేవు: మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తున్నట్లు తహసీల్దారు పితాని త్రినాథరావు గురువారం తెలిపారు. ఈ నెల 3న ఉదయం 10 గంటలకు చొల్లంగి, మధ్యాహ్నం 12 గంటలకు చొల్లంగిపేట, 6న జి.వేమవరం, నీలపల్లి, 7న ఉప్పంగల, లచ్చిపాలెం, ఇంజరం పంచాయతీ కార్యాలయాల్లో పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు.

మాట్లాడుతున్న దేశంశెట్టి లక్ష్మీనారాయణ

ప్రతిగింజా కొనుగోలు చేస్తాం

ఉప్పలగుప్తం: రైతుల నుంచి ప్రతి గింజా కొనుగోలు చేసి మద్దతు ధర కల్పిస్తామని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ అన్నారు. గొల్లవిల్లిలో గురువారం జిల్లా అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. మండపేట తూర్పుగోదావరి జిల్లాలో విలీనం కావడంతో జిల్లా రైస్ మిల్లర్స్‌కు ధాన్యం సేకరణకు మరిన్ని అవకాశాలు పెరగాయన్నారు. జిల్లాలో రైతులు పండించిన ధాన్యం స్థానిక మిల్లులకు పంపించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రతి క్లస్టరు నుంచి సంఘంలో ఒక వర్కింగ్ సభ్యుడు ఉండేలా అయిదుగురిని నియమిస్తే అసోసియేషన్ నిర్వహణ సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి పిప్పళ్ల రాము, ఉపాధ్యక్షులు చంద్రు శ్రీనివాస్, దివ్వి శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రహదారిపై పొగతో ఇక్కట్లు

కందికుప్పలో ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్తకు నిప్పుపెట్టడంతో పొగ వ్యాపించి ఇటుగా వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ రోడ్డు పక్కన వేసిన చెత్తను సంబంధిత సిబ్బంది తొలగించకుండా రోజుల తరబడి ఉంచడంతో ఇప్పటికే దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పుడు పొగతో మరింత ఇక్కట్లు ఎదుర్కొంటున్నామంటున్నారు. -న్యూస్‌టుడే, కాట్రేనికోన

శిథిల భవనంతో భయం

అమలాపురం మండలం ఈదరపల్లి పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనమిది. శిథిలావస్థకు చేరి చాలా కాలంగా ఇలాగే ఉంది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. - న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

పచ్చదనం పోటీకి సై

న్యూస్‌టుడే, యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించనున్న 24వ ఫల, పుష్ప ప్రదర్శనలో మొక్కలు పెంపకం పోటీల కోసం స్థానికులు సిద్ధమవుతున్నారు. 23 ఏళ్లుగా ఫల, పుష్ప ప్రదర్శనలు జరుగుతుండటంతో రకరకాల మొక్కల్ని పెంచి పోటీలో బహుమతులు గెలుచుకోవడం ప్రతిష్ఠగా మారింది. పలువురు గృహిణిలు ఖర్చుకు వెనుకాడకుండా తమ ఇళ్ల వద్ద మొక్కల్ని పెంచుతూ పోటీలకు సమాయత్తమౌతున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం పట్ల చైతన్యపరిచేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన ఎంతో సత్ఫలితాలిస్తోంది. ఫల, పుష్ప ప్రదర్శన పోటీల స్ఫూర్తితో యానాంలో సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్(సీటీజీ) పేరిట 45 మంది సభ్యులతో ఒక బృందం ఏర్పాటైంది. వీరు నిత్యం ఫల, పుష్పాలకు సంబంధించిన సమాచారం పరస్పరం పంచుకుంటున్నారు.

వివిధ విభాగాలలో పోటీలు

■ పెరటి తోటలు ■ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సాధారణ, రూఫ్ గార్డెన్ విభాగాలు ■ వివిధ రకాల పూల మొక్కలు, పుష్పాలంకరణ, పాట్ కల్చర్, కట్ ఫ్లవర్స్, కూరగాయల ప్రదర్శన ■ అరటి గెలలు, కొబ్బరి గెలలు, కొబ్బరి బొండాలు, గుమ్మడి, ఆనబ, బూడిద గుమ్మడి, భారీ సైజులో పెంచిన అన్ని రకాలు కూరగాయలు, పండ్ల రకాల పోటీలను వ్యవసాయ శాఖ నిర్వహిస్తోంది.

మొక్కలను బాగు చేస్తున్న నాగమణి దంపతులు

తోట పనిచేస్తున్న షేక్ గౌసియా బేగం

15 విభాగాలలో పోటీ పడుతున్నాం

గత ఏడాది నిర్వహించిన ఫల, పుష్ప ప్రదర్శనలో మా కుటుంబం 13 బహుమతులు గెలుచుకుంది. ఈ ఏడాది 15 విభాగాల్లో పోటీ కోసం సిద్ధమవుతున్నాం. దీని కోసం వివిధ రకాల గెలలు, గుమ్మడి, బూడిద గుమ్మడి వంటి కూరగాయలు, పూల రకాలు ఇంటివద్ద పెంచుతున్నాం.
-సమ్మె వీరవెంకట సత్యనారాయణ, నాగమణి దంపతులు, మెట్టకూరు

సంక్రాంతి పోటీలకు ముస్తాబు

ఆత్రేయపురం,: సంక్రాంతి సంబరాలకు ఆత్రేయపురం ముస్తాబవుతోంది. ఈ నెల 11 నుంచి మూడు రోజుల పాటు జరిగే సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ పోటీలకు సంబంధించి ఏర్పాట్లలో అధికారులు తలమునకలై ఉన్నారు. లొల్లలాకులు, ఆత్రేయపురం ప్రాంతాల్లో ఈ మేరకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం కలెక్టర్ పర్యవేక్షణలో కనోయింగ్ పడవ ట్రయల్ రన్ నిర్వహించేందుకు సిద్ధం చేశారు. లొల్లలాకుల నుంచి పులిదిండి వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. త్వరలో జరగనున్న పోటీల్లో కేరళ, ఉభయ గోదావరితో పాటు అనంతపురం, విశాఖ, కృష్ణా తదితర జిల్లాలకు చెందిన జట్లు పాల్గొననున్నాయి. వీటితో పాటే మహిళలకు రంగవల్లులు, చిన్నారులకు, యువతకు గాలిపటాలు(పతంగులు) పోటీలు నిర్వహించనున్నారు. లొల్లలాకుల ప్రాంతంలో పడవ పోటీలు నిర్వహించనున్నారు. ఆత్రేయపురం పంటకాలువలో జరుగుతాయి.

స్వాగతం.. పర్యావరణ హితం

నూతన సంవత్సర వేడుకల్లో మొక్కలు అందజేసి శుభాకాంక్షలు

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

ఒకప్పుడు నూతన సంవత్సరం వేడుకలు వచ్చాయంటే చాలు.. పూల దండలు, బొకేలు అందించే వారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. మార్కెట్‌లో లభ్యమయ్యే అందమైన మొక్కలను కానుకగా అందిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా నాయకులతోపాటు ఉన్నతాధికారులకు పర్యావరణ హిత బహుమతులు అందిస్తూ శుభాకాంక్షలు చెప్పారు. ఇది గతంలో పెద్ద పట్టణాలకు పరిమితమైతే ఇప్పుడు పల్లెల్లోనూ కనిపిస్తోంది. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అమలాపురం పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో అందమైన మొక్కలు భారీగా విక్రయించారు. వీటితో పాటు అందమైన రకరకాల కుండీలు పలుచోట్ల విక్రయించారు.

ధరలు అందుబాటులోనే..

పర్యావరణహితంగా నూతన సంవత్సర వేడుకలను నిర్వహించాలనుకునే వారి కోసం జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో అయిదు వరకు ఈ తరహా నర్సరీలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో రూ.200 నుంచి మొదలుకుని రూ.1000, రూ.2000 వరకు విభిన్న తరహాలో మొక్కలు విక్రయించారు.

అమలాపురంలోని ఓ నర్సరీలో సిద్ధం చేసిన మొక్కలు

స్థానికంగా అందుబాటులో..

విభిన్న రకాల మొక్కలు కావాలంటే కడియపులంక వెళ్లాల్సి వచ్చేది. బెంగళూరు, హైదరాబాద్‌లలో లభ్యమయ్యే ఆకట్టుకునే మొక్కలు సైతం ఇప్పుడు స్థానికంగా దొరుకుతున్నాయి. జిల్లాలోని జాతీయ రహదారి వెంబడి ఉండే నర్సరీలతోపాటు అమలాపురం, రావులపాలెం, కొత్తపేట, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలులో ఇవి లభ్యమవుతున్నాయి.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

కాట్రేనికోన, న్యూస్‌టుడే: కాట్రేనికోన ఎంపీడీవోగా తొండంగి మండలం నుంచి బదిలీపై వచ్చిన బి.రాజేశ్వరరావు గురువారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన వెంకటాచలం స్వచ్ఛంద ఉద్యోగవిరమణ చేశారు. పలువురు ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు.

బీమా కోరేగావ్ విజయోత్సవం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: అణగారిన వర్గాల హక్కుల సాధనకు, స్వాభిమాన పోరాటాలకు బీమా కోరేగావ్ పోరాటం స్ఫూర్తిగా నిలుస్తుందని ఆర్‌పీఐ నాయకులు అన్నారు. ముమ్మిడివరంలోని పోలమ్మచెరువు గట్టు జైబుద్ధా పార్కు వద్ద ఆర్‌పీఐ జిల్లా కన్వీనర్ చీకురుమిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన బీమా కోరేగావ్ 208వ విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పెనుమాల సుధీర్, దోనిపాటి ఆంజనేయులు, వడ్డి నాగేశ్వరరావు, కాశి వెంకటాచార్య, సింహాద్రివర్మ, మట్టా శ్రీనివాసరావుచ, పందిరి శ్రీనివాస్, బుడితి శరత్, జనిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈ-గవర్నెన్స్ అప్లికేషన్‌పై నేడు శిక్షణ

ద్రాక్షారామ: డివిజనల్ స్థాయి 2025-26 ఈ-గవర్నెన్స్ అప్లికేషన్‌పై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం రామచంద్రపురం మండల పరిషత్ సమావేశపు హాలులో నిర్వహిస్తున్నట్టు ఇన్‌ఛార్జి ఎంపీడీవో శివప్రసాద్ తెలిపారు. శిక్షణ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాలకు చెందిన డిప్యూటీ ఎంపీడీవో(పంచాయతీరాజ్), డిప్యూటీ ఎంపీడీవో (గ్రామవార్డు సచివాలయం), పంచాయతీ కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు ఈ శిక్షణకు హాజరు కావాలని సూచించారు.

రూ.87లక్షలు స్వాహా.. బీడీవో అరెస్టు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి గ్రామీణాభివృద్ధిశాఖలో బీడీవోగా పనిచేసిన వివేకానందన్ ప్రభుత్వ సొమ్ము స్వాహా చేయడంతో చెన్నై ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. 2022లో అరియన్‌కుప్పం పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణం నిమిత్తం కేంద్ర, పుదుచ్చేరి ప్రభుత్వాలు ఇచ్చిన నగదులో రూ.59 లక్షలు ఆయన స్వాహా చేశాడు. అక్రమాల్ని గుర్తించిన అధికారులు అతడిని విలియనూర్ పంచాయతీకి బదిలీ చేయగా అక్కడ మరో రూ.28 లక్షలు దుర్వినియోగం చేశాడు. దీంతో అతడిని విధుల నుంచి డిస్మిస్ చేశారు. అనంతరం అరియన్‌కుప్పం అభివృద్ధి అధికారిగా నియమితులైన కార్తికేయన్ నగదు దుర్వినియోగం గురించి ఏసీబీకి గత ఏడాది జులైలో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ కేసులో నిందితుడికి సహకరించి కంప్యూటర్ ఆపరేటర్ రాజశేఖర్‌ను గురువారం అదుపులోకి తీసుకున్నారు. మరో ఎనిమిది మందికి దీనిలో భాగస్వామ్యం ఉందని పోలీసులు గుర్తించారు.

INDIRA GANDHI MEDICAL COLLEGE & RESEARCH INSTITUTE
(Government of Puducherry Institution),
Kathirkamam, Puducherry-605 009.

No.6794/IGMC&RI/Estt./A1/2025 Date: 31-12-2025

NOTIFICATION

Applicants for **Direct Recruitment** to the post of **Nursing Officer** in **IGMC&RI, Puducherry** are informed that the **tentative marks** and **proposed eligibility category** have been finalized by the Staff Selection Committee based on scrutiny of applications and documents, in accordance with the Recruitment Rules and Notification dated 07-10-2025.

Candidates may view their **application status, tentative marks** and **eligibility category** by logging into the online portal at Website: **https://igmcri.edu.in.**

Objections/claims, if any, regarding marks, eligibility category, or document consideration may be submitted **online only** from **02-01-2026 at 11.00 AM** to **10-01-2026 at 06.00 PM**. Non-submission within the stipulated period shall be treated as deemed acceptance.

Sd/- DIRECTOR

(c) eenadu

వాడపల్లి.. ఆధ్యాత్మికత శోభిల్లి

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: నూతన ఆంగ్ల సంవత్సరం ప్రారంభం సందర్భంగా గురువారం కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం అశేష భక్త జనంతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. తొలుత గోపూజ, విశ్వరూప లక్ష్మీ హోమం, తిరుప్పావై సేవ, 17వ పాశుర విన్నపం, తీర్థగోష్ఠి తదితర కార్యక్రమాలను అర్చకులు రమణీయంగా జరిపించారు. అనంతరం అష్టోత్తర శతనామావళి పూజలు, కల్యాణం నిర్వహించారు. ఈవో(డీసీ) నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉద్యోగుల సమస్యలపై త్వరలో సమావేశం

కలెక్టరేట్(రాజమహేంద్రవరం): ఉద్యోగుల సమస్యలపై జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్(ఏపీ ఎన్జీవో) సంఘ నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతినెలా మూడో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగులకు సమస్యలు ఏమైనా ఉంటే ఆ రోజు గ్రీవెన్స్‌కు వచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షుడు మాధవరావు, కార్యదర్శి విజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం హత్య కేసులో జాప్యమేల!

ఎమ్మెల్సీ అనంతబాబుకు కొందరి సహకారం

ఈనాడు, కాకినాడ: కాకినాడ నగరానికి చెందిన దళిత యువకుడు, డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్యకేసు విచారణలో ఇప్పుడూ అదే నిర్లక్ష్యం కనిపిస్తోంది. 2022 మేలో ఆయన హత్యకు గురయ్యారు. గత ప్రభుత్వంలో నీరుగారిపోయిన ఈ కేసును కొలిక్కితెచ్చి నిందితునికి శిక్షపడేలా చేస్తారని బాధిత కుటుంబం ఆశించింది. ఆ స్థాయిలో విచారణ లేదనే విమర్శలున్నాయి. నిందితుడు వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుకు ఈ ప్రభుత్వంలోనూ కొందరి సహకారం అందుతోందనే ఆరోపణలున్నాయి.

సాక్ష్యాల విశ్లేషణ కీలకం..

పోలీసులు సీసీటీవీ ఫుటేజీ, ఫోరెన్సిక్ ల్యాబ్ ఫలితాలపైనే ఆధారపడ్డారు తప్ప ఇతర సాక్ష్యాల సేకరణ, విశ్లేషణపై పెద్దగా దృష్టిపెట్టలేదు. హత్య సమయంలో ఎమ్మెల్సీ అనంతబాబు ఐ ఫోన్‌లో సమాచారం సేకరించేలా దర్యాప్తు ప్రయత్నించలేదు. ఇప్పుడు కేసు విచారణ చేసిన పోలీసులు కొన్ని ఆధారాలు తప్పించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో అనంతబాబు లక్ష్మీపుర కుల ధ్రువీకరణ కోసం అడ్డతీగల తహసీల్దార్ కార్యాలయానికి సిట్ అధికారి లేఖ రాశారు. సమాచారం పోలీసులకు రాక ముందే ఆ లేఖ అనంతబాబు చేతికి చేరింది. దీని ఆధారంగానే నిందితుని భార్య ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలుచేశారు. లేఖ సమాచారం లీకు చేసిందెవరో ఇప్పుడు తేలాల్సి ఉంది.

19 గ్రామాలు.. 61,226 ఎకరాలు..

నేటి నుంచి జిల్లాలో నాలుగో విడత భూరీసర్వే

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

జిల్లాలో నాలుగో విడత భూముల రీసర్వే ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. 19 రెవెన్యూ గ్రామాల్లో భూ రీసర్వే చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్‌లో మూడు మండలాల పరిధిలోని ఎనిమిది గ్రామాల్లో, కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లో ఏడు మండలాల పరిధిలోని 11 గ్రామాల్లో రీసర్వే చేపట్టి మార్చి నెలాఖరుకు భూముల కొలతలు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. నాలుగో విడతగా రీసర్వే చేపట్టే ఈ 19 గ్రామాల్లో కలిపి భూవిస్తీర్ణం దాదాపు 70,840 ఎకరాలు. దీనిలో 9,613 ఎకరాలు ప్రభుత్వ, మిగతా 61,226 ఎకరాలు పట్టా భూములు. ఇప్పటికే ప్రభుత్వ భూముల సర్వే పూర్తి కావడంతో ఇప్పుడు రైతులవారీ భూములకు రీసర్వే చేపట్టనున్నట్లు జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు.

సర్వే చేస్తున్న సిబ్బంది

రెవెన్యూ డివిజన్	రీ సర్వే చేసే గ్రామాలు	ప్రభుత్వ భూముల విస్తీర్ణం (ఎకరాల్లో)	పట్టా భూముల విస్తీర్ణం
రాజమహేంద్రవరం	8	5,462	30,790
కొవ్వూరు	11	4,151	30,436

- గతేడాది జనవరిలో తొలివిడత 16 గ్రామాల్లోని 34,692, జూన్‌లో (రెండో విడత) 15 గ్రామాల్లోని 36,267 అక్టోబరులో (మూడో విడత) అయిదు గ్రామాల్లో 2,380 ఎకరాల చొప్పున రీసర్వే పూర్తి చేశారు. ఇప్పుడు 19 గ్రామాల్లో 61,226 ఎకరాల్లో భూరీసర్వే చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా సర్వే అధికారి తెలిపారు.

ఏయే గ్రామాలంటే..

రంగంపేట మండలం వడిశలేరు, సీతానగరం మండలం మునికూడలి, చిన్నకొండేపూడి, రఘుదేవపురం, కాటవరం, గోకవరం మండలం కొత్తపల్లి, గోకవరం, తిరుమలాయపాలెం, తాళ్లపూడి మండలం మలకపల్లి, పద్దేవం, గోపాలపురం మండలం సగ్గొండ, వెల్లంచిగూడెం, దేవరపల్లి మండలం బందపురం, చాగల్లు మండలం చాగల్లు, ఉండ్రాజవరం మండలం తాడిపర్రు, పెరవలి మండలం కాకరపర్రు, తీపర్రు, నల్లజర్ల మండలం పోతవరం, అనంతపల్లి

వ్యాపార విస్తరణకు ఉద్యమ్

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

మీ కోసం

దేశంలోని ప్రతి వ్యక్తికి ఆధార్ కార్డు ఉన్నట్లే.. ప్రతి వ్యాపారికి ఉద్యమ్ ఆధార్ అవసరం కానుంది. ప్రభుత్వమే వీటిని పంపిణీ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. గతంలోనే ఈ విధానం ఉన్నా పెద్దగా పట్టించుకోలేదు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రత్యేక రిజిస్ట్రేషన్ చేయించనుంది. ప్రతి వ్యాపారి ఈ కార్డును పొందేలా శ్రద్ధ చూపుతోంది. పరిశ్రమల శాఖ, డీఆర్డీఏ సంయుక్తంగా ఉద్యమ్ ఆధార్ ప్రయోజనాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నాయి. ◆ సాధారణ ఆధార్ మాదిరిగానే ఈ కార్డులోనూ 12 అంకెలు ఉంటాయి. ◆ తూర్పు గోదావరి జిల్లాలో డీఆర్డీఏ పర్యవేక్షణలో ఈ మధ్య కాలంలో 249 మంది వ్యాపారులకు ఉద్యమ్ ఆధార్ పత్రాలను అందించారు.

నమోదు చేయాలంటే..

ఆధార్, పాన్ లింకైన చరవాణితో వెలుగు కార్యాలయానికి వెళితే సిబ్బంది వెంటనే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. తగిన రుసుము చెల్లిస్తే మీసేవా కేంద్రాలు, స్థానిక సచివాలయాల్లోనూ ఈ సేవలను పొందే వీలుంది.

రుణం పొందేందుకు తోడ్పాటు..

ఉద్యమ్ ఆధార్ పత్రం వ్యాపారులకు ఎంతో మేలు చేకూరుస్తుంది. వ్యాపారాల విస్తరణకు, బ్యాంకుల నుంచి రుణం పొందేందుకు తోడ్పడుతుంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం.

-ఎన్‌వీవీఎస్ మూర్తి, డీఆర్డీఏ, పీడీ

13 నుంచి కోనసీమ సంక్రాంతి ఉత్సవ్

సామర్రు, న్యూస్‌టుడే: 'సంతోషాలకు స్వర్గసీమ.. ఆనందాలకు చిరునామా మన కోనసీమ' అనే నినాదంతో కోనసీమ సంక్రాంతి ఉత్సవ్-2026కు సంబంధించిన లోగోను మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. వాసంశెట్టి సత్యం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఉత్సవాలు కోటిపల్లి-ముక్తేశ్వరం రేవు వద్ద ఈ నెల 13, 14, 15 తేదీల్లో ఏర్పాటుచేశామన్నారు. దానికి సంబంధించిన లోగోను ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, రేవు నిర్వాహకుడు పప్పుల మసేను వెంకన్న (శ్రీనుబాబు)లతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు.

పండగకు పెట్టింది పేరు

తెలుగువారికి పెద్ద పండుగ సంక్రాంతి. ఈ పండుగకు పెట్టింది పేరు కోనసీమ. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా, అన్ని వర్గాల ప్రజలూ ఆదరించేలా పలు సాంస్కృతిక, జానపద, పురాణ కార్యక్రమాలు, అలనాటి పాత మధురాలు ఉత్సవాల్లో ఉంటాయన్నారు. వీటితో పాటు జబర్దస్త్ టీం షోలు కూడా ఉంటాయన్నారు. కూటమి నాయకులు పి.శ్రీనుబాబు, కర్రి చిట్టిబాబు, సలాది నాయుడు, చందమామ వాసు, పెమ్మాడి బేబీ సత్తిబాబు, అవసరాల వెంకటరమణ, ఎస్.విశ్వనాథ బాలాజీ, కంచుమర్తి బాబూరావు, చిర్రా రాజకుమార్ పాల్గొన్నారు.

లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

కలెక్టర్ కీర్తి చేకూరికి మొక్క అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న జేసీ మేఘాస్వరూప్

నూతనోత్సాహంతో ముందుకెళ్దాం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో నూతనోత్సాహంతో ముందుకెళ్దామని జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ కీర్తి చేకూరి పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో జేసీ మేఘాస్వరూప్, డీఆర్వో సీతారామమూర్తి, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరేలా చూడాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకతతోపాటు వేగం కూడా కీలకమన్నారు.

అటకలపై పోతలు.. అన్నదాతల ఆశలు

అంబాజీపేట: కోనసీమ మార్కెట్‌లో కొబ్బరి కాయల ధరలు తగ్గుముఖం పట్టాయి. గత అక్టోబర్, సెప్టెంబర్ మాసాల్లో వెయ్యి పచ్చికాయలు రూ.23 వేల నుంచి రూ.26 వేల వరకు ధర పలికింది. అనంతరం నవంబర్, డిసెంబర్ నెలల్లో ధరలు బాగా పడిపోయాయి. ఇప్పుడు రూ.15 నుంచి రూ.16 వేలు వరకు ఉంది. తమిళనాడులో ఉత్పత్తులు పెరగడం, ఇక్కడ మూఢం కొనసాగుతుండటం, ఇతర ప్రాంతాల నుంచి దిగుబడులు రావడంతో డిమాండ్ తగ్గింది. ఈ నేపథ్యంలో స్థానిక రైతులు పచ్చికాయలను అటకలపై వేసి నిల్వ చేసుకుంటున్నారు.

కురిడీలుగా మార్చి..

పచ్చి కొబ్బరికాయలను అటకపై వేసి నిల్వ చేసుకుంటే ఆరు నెలల్లో నీరు ఇంకిపోయి కురిడీలుగా మారతాయి. దీంతో వీటికి మంచి డిమాండ్ ఏర్పడుతుంది. నిల్వ చేసుకోవడంతో ప్రస్తుత ధర ఉందని, లేకపోతే మరింత పతనమయ్యేదని చెబుతున్నారు. శివరాత్రి నుంచి ధరలు పెరుగుతాయని ఆశిస్తున్నారు.

అన్నవరం.. ప్రగతి మార్గం

క్యూకాంప్లెక్స్ నిర్మాణ పనులు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానం అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. కేంద్ర ప్రభుత్వ పథకం 'ప్రసాద్', దేవస్థానం నిధులతో పలు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

రూ.18.98 కోట్లతో 'ప్రసాద్' పనులు

ఏళ్లుగా దస్త్రాలకే పరిమితమైన కేంద్ర ప్రభుత్వ పథకం 'ప్రసాద్' ద్వారా పలు పనులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టాలెక్కాయి. రూ.18.98 కోట్లతో పనులు జరుగుతున్నాయి. రత్నగిరిపై అన్నదాన భవన నిర్మాణం జరుగుతుంది. జీ ప్లస్1లో నాలుగు హాళ్ల నిర్మాణం చేస్తున్నారు. ఒకేసారి 1,400 మంది భక్తులు భోజనాలు చేయవచ్చు. 1,500 మంది భక్తులు వేచి ఉండేలా రెండు హాళ్లలో క్యూ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నారు. రూ.7.07 కోట్ల దేవస్థానం నిధులతో 105 గదులతో సీతారామ సత్రం వసతి సముదాయం నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఎగువ ఘాట్ రోడ్డుకు ఆనుకుని కొండపైకి 350 మెట్లతో మరోమార్గాన్ని నిర్మిస్తున్నారు.

బృహత్తర ప్రణాళికలో మార్పులు

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా దేవస్థానం బృహత్తర ప్రణాళికలో కొన్ని మార్పులు చేస్తున్నారు. సత్యగిరిపై వివాహాలు చేసుకునే వారికి వసతి సౌకర్యాలు, యోగా ఆసుపత్రి నిర్మాణానికి పరిశీలిస్తున్నారు.

19 నుంచి డీఈడీ పరీక్షలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: డీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 19 నుంచి 24వరకు నిర్వహించనున్నట్లు డీఎస్ఈవో కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

రారు.. తీసుకోరు..!

డీలర్ల వద్దే 26,442 స్మార్ట్‌కార్డులు

ధవళేశ్వరం: ప్రభుత్వం ఇటీవల పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్తగా స్మార్ట్ కార్డులు పంపిణీ చేసింది. సమయం ముగిసినా కొంత మంది వీటిని తీసుకోలేదు. దీంతో అవి డీలర్ల వద్దే ఉండిపోయాయి. పంపిణీ చేయని వాటిలో బోగస్ కార్డులు, ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఎప్పుడు తీసుకుంటారో...?

కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు నుంచి పాత రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రారంభించింది. డీలర్లు, వీఆర్వోల లాగిన్‌లలో లబ్ధిదారుల బయోమెట్రిక్ నమోదు చేసి కార్డులు అందజేశారు. జిల్లాలోని 19 మండలాల్లో 5,59,348కుగాను ఇప్పటి వరకు 5,32,906 కార్డులు పంపిణీ చేశారు. ఇంకా 26,442 కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది.

పాసు పుస్తకాలపై రాజముద్ర

వి.ఎల్.పురం: జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేయనున్నారు. తొలివిడతగా 102 గ్రామాల్లోని రైతులు, భూయజమానులకు అందించేందుకు 90 వేల పట్టాదారు పాసుపుస్తకాలు సిద్ధం చేశారు. నేటి నుంచి 9 వరకు గ్రామసభల ద్వారా ప్రజాప్రతినిధుల సమక్షంలో సంబంధిత రైతులు, భూయజమానులకు అందించనున్నారు.

గత ప్రభుత్వంలో విమర్శలు..

గత వైకాపా ప్రభుత్వం జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం కింద జిల్లాలో 272 రెవెన్యూ గ్రామాలకు 190 గ్రామాల్లోని 3,31,635.907 ఎకరాల్లో రీసర్వే చేపట్టింది. పూర్తయిన గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల ముందు వరకు 86,799 జగనన్న భూహక్కు పత్రాలు జారీ చేసింది. ఇందులో తప్పులు ఉండటం, భూయజమాని ఫొటో కంటే అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం పెద్దగా ఉండటంపై ఆందోళనలు వ్యక్తమైనప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పుడు రైతులు నిరసనలు వ్యక్తం చేశారు.



ఈసారి పక్కాగా..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భూహక్కుపత్రాల్లో జగన్ ఫొటోను తొలగించి గతంలో మాదిరిగానే ప్రభుత్వ రాజముద్రతో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలని నిర్ణయించింది. మ్యుటేషన్ పూర్తయిన వారికి ఇవ్వనున్నారు. ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాసుపుస్తకాలు జిల్లాకు ఇప్పటివరకు 1.50 లక్షలు వచ్చాయి. తప్పులు లేకుండా ఆ వివరాలను వెబ్‌ల్యాండ్‌లో సరిపోల్చుతున్నారు. తొలుత 90 వేల పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు డీఆర్వో సీతారామమూర్తి తెలిపారు.

గ్రామసభల్లో అందజేత..

గ్రామసభల్లో పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వనున్నారు. ■ ఈకేవైసీ ద్వారా ధ్రువీకరించి, ఇచ్చినట్లు భూయజమాని నుంచి సంతకాలు తీసుకుంటారు. ■ కొత్తవి తీసుకున్న వారి దగ్గర నుంచి పాత పత్రాలు(బీహెచ్‌పీ) వెనక్కి తీసుకుంటారు. గ్రామసభ జరిగే తేదీ, ప్రదేశం, సమయాలు ప్రజాప్రతినిధులు, రైతులు, భూయజమానులకు ముందుగానే తెలియజేస్తారు.

లక్ష్యానికి చేరువగా ధాన్యం సేకరణ: జేసీ

వి.ఎల్.పురం: జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియ లక్ష్యానికి చేరువగా కొనసాగుతుందని జేసీ మేఘాస్వరూప్ తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ ధాన్యం దిగుబడి 4 లక్షల టన్నులుగా అంచనా వేయగా గురువారం నాటికి 3,67,852 టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 47,426 మంది రైతుల ధాన్యం విక్రయాలకు ముందుకొచ్చారని, రైతుల నుంచి సేకరించిన ధాన్యం విలువ రూ.871.44 కోట్లకు చేరిందని వివరించారు. ఇప్పటికే రూ.822.08 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేయగా ఇంకా రూ.49.36 కోట్ల మేర చెల్లింపులు చేయాల్సి ఉందన్నారు.

రహదారి భద్రతపై అవగాహన కల్పించండి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు 2026 పురస్కరించుకుని ఈ నెల 31 వరకు రహదారి భద్రతపై వాహన చోదకుల్లో విస్తృత అవగాహన కల్పించేలా సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో 'సడక్ సురక్ష అభియాన్' గోడపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణతో భద్రత, సాంకేతికత ద్వారా పరివర్తన అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జిల్లా రవాణా అధికారి సురేష్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సంపత్‌కుమార్, రవికుమార్, సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సాయికుమార్, ప్రణీత్, ఉమామహేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక!

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రానున్న పుష్కరాల నేపథ్యంలో రాజమహేంద్రవరంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు **కమిషనర్ రాహుల్ మీనా** తెలిపారు. కొత్త ఏడాదిలో నగర విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. తాగు నీరు, పారిశుద్ధ్యం మెరుగుపర్చడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే వినతులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్త ఏడాదిలో చేపట్టే పనులు, ప్రతిపాదనలు, ప్రణాళికలపై న్యూస్‌టుడేతో మాట్లాడారు.

జీపీఎస్ విధానంలో పర్యవేక్షణ

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణకు జీపీఎస్ విధానం అమలు చేస్తున్నాం. ఇంటింటా చెత్త సేకరణ పూర్తి స్థాయిలో అమలు చేసేలా చర్యలు చేపడుతున్నాం. అనధికార భవనాలు గుర్తించి నోటీసులు జారీ చేశాం. త్వరలో చట్ట ప్రకారం చర్యలు చేపడుతున్నాం. పుష్కరాల నేపథ్యంలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నాం. అర్బన్ పరిధిలో గోదావరి నదీ ఘాట్‌లకు అనుసంధానంగా ఉన్న 24 రోడ్లను గుర్తించి విస్తరిస్తున్నాం. ముంపు నివారణ పనులు వేగవంతం చేస్తున్నాం.

మెరుగైన సేవలు

ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాం. ఇప్పటికే టోల్ ఫ్రీ నంబరు ద్వారా సమస్యలను తెలుసుకొంటున్నాం. దీనికి సంబంధించి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి కుక్కలు తదితర వాటిపై 9494060060 నంబరు ద్వారా వివరాలు సేకరిస్తున్నాం. కొత్త ఏడాదిలో సమస్యల పరిష్కారానికి పర్యవేక్షక బృందాలు ఏర్పాటు చేస్తాం.

ఉద్యాన వనాలపై దృష్టి

రానున్న పుష్కరాలకు సంబంధించి నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళిక సిద్ధం చేశాం. కేవలం పుష్కరాలే కాకుండా శాశ్వత ప్రాతిపదికన భవిష్యత్తులో ఉపయోగపడే విధంగా అంచనాలు రూపొందించాం. గోదావరి గట్టును పర్యాటకంగా తీర్చిదిద్దుతాం. గోదావరి రివర్ ఫ్రంటుకు నిధులు కేటాయించాం. పుష్కరాల నాటికి పనులు పూర్తి చేస్తాం. అర్బన్ పరిధిలో 32 పార్కులను గుర్తించి గ్రీనరీ పనులు చేపడుతున్నాం.

అమృత్ నిధులతో మంచినీరు..

కేంద్రం అమృత్ 2.0 ద్వారా నగరపాలక సంస్థకు రూ 88.12 కోట్ల నిధులు విడుదల చేశారు. వీటిని శివారు ప్రాంతాల్లో నీటి సమస్య పరిష్కారానికి వినియోగిస్తున్నాం. అదనంగా రెండు తాగునీటి రిజర్వాయర్లు సిద్ధం చేస్తున్నాం. నగరంలో రెండు పూటల తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాం.

భారీ ప్రాజెక్టులు

కొత్త ఏడాదిలో భారీ ప్రాజెక్టులు నగరంలో అందుబాటులోకి రానున్నాయి. ముందుగా గోదావరి కాలుష్య నివారణలో భాగంగా ఆవ ప్రాంతంలో సుమారు రూ 84 కోట్లతో నిర్మాణంలో ఉన్న 50 ఎంఎల్‌డీ ప్లాంట్ (మురుగునీటి శుద్ధి కేంద్రం) పూర్తికానుంది. దీనివల్ల నదీ కాలుష్యం తగ్గుతుంది.

పారామెడికల్ పోస్టులకు పోటాపోటీ

ఈనాడు, కాకినాడ: కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల పరిధిలో పారామెడికల్ పోస్టుల భర్తీకి పోటీ ఎక్కువగా ఉంది. 34 పోస్టుల భర్తీకి గతనెలలో ప్రకటన జారీచేశారు. 457 దరఖాస్తులు వచ్చాయి. జనరల్ డ్యూటీ అటెండెంట్ పోస్టులు 14 ఖాళీలకు 326 మంది పోటీ పడుతున్నారు. మిగతా పోస్టులకు మూడు నుంచి 33 మంది వరకు దరఖాస్తులు చేశారు. రేడియో థెరపీ పోస్టులు మూడు ఖాళీలుంటే ఒక్క దరఖాస్తే వచ్చింది.

మద్యం పరవళ్లు..!

నెలలో రూ.326.78 కోట్లు తాగేశారు

గత డిసెంబరుతో పోల్చితే.. (రూ.కోట్లలో)		
సంవత్సరం	2024	2025
తూర్పుగోదావరి	103.51	118.34

ఈనాడు, రాజమహేంద్రవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో గతేడాదితో పోల్చితే డిసెంబరులో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల పరిధిలో గత డిసెంబరులో రూ.295.5 కోట్ల మేర ఐఎంఎల్, బీర్ల అమ్మకాలు జరగ్గా.. ఈ డిసెంబరులో రూ.326 కోట్ల మేర విక్రయించారు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో చివరి మూడు రోజుల్లో దాదాపు రూ.60 కోట్ల అమ్మకాలు జరిగాయని అంచనా. డిసెంబరు 28, 29, 30 తేదీల్లో రాజమహేంద్రవరం, చాగల్లు, అమలాపురం, సామర్లకోటలోని మద్యం డిపోల నుంచి పెద్ద ఎత్తున లిక్కర్, బీర్ల కేసులు మద్యం దుకాణాలకు చేరింది. ★ రాజమహేంద్రవరం డిపో పరిధిలో డిసెంబరు 28, 29, 30 తేదీల్లో సుమారు రూ.25 కోట్ల మేర లిక్కరు, బీరు అమ్మకాలు చేశారు. 30న రూ.10 కోట్ల విలువైన సరకు దుకాణాలకు సరఫరా అయింది. ★ చాగల్లు డిపో నుంచి మూడు రోజుల్లో 19.26 కోట్ల విలువైన మద్యం విక్రయించారు. ఇక్కడి నుంచి 25381 లిక్కర్ కేసులు, 9470 బీరు కేసులు మద్యం దుకాణాలకు తరలించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

శ్రద్ధాంజలి

వైద్యరంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, ఎందరో వైద్య విద్యార్థినీ, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతూ మీరు చేసిన సేవలు అనిర్వచనీయం. మీరు భౌతికంగా మా నుండి దూరమైనను మీ తీపి జ్ఞాపకాలు ఎల్లప్పుడూ మా వెంటే ఉంటాయి. మీ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... అశ్రునయనాలతో...
డాక్టర్ Y. శేషగిరిరావు గారు
M.D. (Gen. Med.) DCH.
Area Hospital, Tuni
Retd. Professor,
Civil Surgeon Specialist
జననం: 28-01-1956
స్వర్గస్తులు: 22-12-2025
భార్య: శ్రీమతి Y. పద్మావతి
కుమారుడు: Dr. Y. వెంకటేష్, MD
కుమార్తె-అల్లుడు: శ్రీమతి S. ప్రియాంక - S. శ్రీనివాస్
అన్నయ్యలు - వదినలు: Y. రంగారావు - Y. శశికళ (Late), Y. జగన్నాథరావు - Y. ఉషారాణి
చెల్లెలు - బావగారు: R. సుగుణ - R. కన్నారావు
మనుమరాలు: S. శ్రీహిత
బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు
పెద్దకర్మ తేదీ: 03-01-2026 శనివారం ద్వారకానగర్, ఫార్చ్యూన్ శ్రీకన్య హోటల్ నందు జరుగును.

శ్రద్ధాంజలి
మా అందరిని ప్రేమ, ఆప్యాయత, అనురాగాన్ని పంచిన కీ.శే. పోలిశెట్టి వెంకటరత్నం గారు (నాయన)
ది. 22-12-2025 న స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.



కీ.శే. పోలిశెట్టి వెంకటరత్నం (నాయన) గారు
కాకినాడ
జననం: 21-09-1950 మరణం: 22-12-2025
భార్య: వెంకట రమణమ్మ (రమావతి)
కుమారుడు - కోడలు: మహేశ్వర్ అనిల్ కుమార్ - బాబ్జావ్రి
కుమార్తెలు - అల్లుళ్లు: గుర్రం సంతోషి మానస - హరీష్ ప్రశాంత్, రెడ్డం సౌమ్య వందన - నవీన్ కుమార్
మనుమలు: శ్రేయస్, శ్రీతన్, హియాన్
మనుమరాలు: విరా
అక్క: రెడ్డం రమణ కుమారి (లేటు) - బావ: సూర్యనారాయణ రావు (లేటు)
చెల్లెలు: మాకిం సూర్యకుమారి - బావ: డా॥ రాయల అప్పలరాజు నాయుడు
బావ మరుదులు: రెడ్డం అచ్యుత కుమార్ - చక్రధర వరలక్ష్మి, రెడ్డం వెంకట రమణమూర్తి - భాగ్యలక్ష్మి
మేనల్లుళ్లు: రెడ్డం ఫణీంద్ర కుమార్ - రాధ, రెడ్డం అమరేంద్ర కుమార్ - కరుణ
మేనకోడళ్లు: కొమ్మిరెడ్డి సాహిత్య మాలిని - సామ్రాట్, నల్లం అశ్రిత - వెంకట సురేష్, కోడిబోయిన సుశ్రిత - శ్రీ కృష్ణ చైతన్య
పోలిశెట్టి బ్రదర్స్ & సిస్టర్స్
పెద్దకర్మ: ది. 03-01-2026 శనివారం, శాంతినగర్, కాకినాడలోని మా స్వగృహమునందు జరుగును.

(c) eenadu

పరుగులతో మెరిసి.. విజయంతో మురిసి..!

▲ ఉత్కంఠభరితంగా సాగుతున్న ఈఎస్ఎల్ క్రికెట్ పోటీలు

శ్యామలాసెంటర్, రాజానగరం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. క్రీడాకారులు ఫోర్లు, సిక్సర్లతో అదరగొడుతున్నారు. ఐడియల్, చైతన్య కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఏకంగా ఓవర్‌కు 15కు పైగా రన్‌రేట్ స్కోరుతో భారీ లక్ష్యాలు చేస్తున్నారు. మరో వైపు గైట్, కైట్ ఇంజినీరింగ్ జట్ల జరిగిన మ్యాచ్ ఆఖరి బంతి వరకు ఉత్కంఠ రేకెత్తించాయి. క్రీడాకారులు క్రికెట్ ఆస్వాదిస్తూ.. పరుగుల వరద సృష్టించగా విజయంతో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకున్నారు. రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) క్రీడా మైదానంలో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రజెంట్) ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్ టోర్నీ గురువారం ఉత్సాహంగా సాగాయి.

బీవీసీ మెరుపులు..

హోరాహోరీపోరులో విజయం సాధించిన బీవీసీ కళాశాల జట్టు

బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల, భట్లపాలెం - ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, సూరంపాలెం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బీవీసీ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచిన బీవీసీ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆదిత్య కళాశాల జట్టు మూడు వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. ఈ జట్టులో లోహిత్ 27 బంతుల్లో 41 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన బీవీసీ కళాశాల జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 103 పరుగులు సాధించింది. బీవీసీ జట్టులో తేజ 21 బంతుల్లో 38 పరుగులు సాధించి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. ఆ జట్టు 9 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.

భారీ ఆధిక్యంతో ఘన విజయం సాధించిన ఐడియల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు

100 పరుగుల తేడాతో ఐడియల్ డిగ్రీ కళాశాల జట్టు విజయం

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే శివకుమార్ (60 పరుగులు)

ఐడియల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కాకినాడ, చైతన్య ఇంజినీరింగ్ కళాశాల, కాకినాడ మధ్య జరిగిన పోటీలో ఐడియల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు 100 పరుగుల భారీ ఆధిక్యంతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన ఐడియల్ కళాశాల జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ జట్టులో శివకుమార్ వీరోచిత బ్యాటింగ్‌తో కేవలం 29 బంతుల్లో 60 పరుగులు చేశాడు. వినయ్ ఆఖరి 6 బంతుల్లో సిక్సర్లు, ఒకఫోర్ కొట్టి 34 పరుగులు సాధించటంతో ఐడియల్ జట్టు ఐదు వికెట్ల నష్టానికి 152 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చైతన్య ఇంజినీరింగ్ జట్టు భారీ లక్ష్యఛేదనలో ఆది నుంచి తడబడుతూ త్వరత్వరగా వికెట్లు కోల్పోయింది. ఐడియల్ కళాశాల జట్టులోని వెంకటేష్ 2 ఓవర్లకు కేవలం 8పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టి చైతన్య జట్టును దెబ్బతీశాడు. చైతన్య కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 52 పరుగులు మాత్రమే చేయగలిగింది. 100 పరుగుల భారీ ఆధిక్యంతో ఐడియల్ కళాశాల జట్టు ఘనవిజయం సాధించింది. ఇప్పటివరకు ఈ టోర్నీలో ఐడియల్ కళాశాల జట్టు చేసిన 152 పరుగులు అత్యధికం కావటం విశేషం..

హ్యాట్రిక్‌తో రాజు మాయ

ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల(కాకినాడ), బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల(వాడలరేవు) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి ఐడియల్ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన బీవీసీ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసింది. ప్రత్యర్థి జట్టులో కె. రాజు వరుసగా మూడు వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్ సాధించటం విశేషం. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఐడియల్ కళాశాల జట్టు ఒక వికెట్ నష్టానికి 73 పరుగులు సాధించి తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. బ్యాటింగ్‌లోనూ కె.రాజు సత్తాచాటి 37 బంతుల్లో 46 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.

విజయం సాధించిన ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

మూడు వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్ సాధించిన రాజు

ఒక్క పరుగు తేడాతో కైట్ విజయం

విజయం సాధించిన కైట్ ఇంజినీరింగ్ జట్టు

మైదానం-2లో ఉదయం కైట్ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ), గైట్ ఇంజినీరింగ్ కళాశాల (రాజమహేంద్రవరం) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కైట్ ఇంజినీరింగ్ కళాశాల ఒకే ఒక్క పరుగు తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కైట్ కళాశాల జట్టు నిర్ణీత 10ఓవర్లకు 4వికెట్ల నష్టానికి 87 పరుగులు చేశారు. ఈ జట్టులో జేఎల్ దీపక్ 20 బంతుల్లో 28పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గైట్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు తక్కువ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సింగిల్స్, డబుల్స్ తీస్తూ స్కోరుబోర్డును పరుగు పెట్టించారు. అయితే ఒకానొక సమయంలో వరుసగా వికెట్లు కోల్పోవటంతో ఆఖరి ఓవర్‌కు 14 పరుగులు చేయాల్సి ఉండగా ఒక ఫోర్, రెండు వైడ్, బైస్ రూపంలో 12 పరుగులు వచ్చాయి. ఆఖరి బంతికి రెండు పరుగులు చేయాల్సి ఉండగా బ్యాటర్ బంతిని తాకలేకపోయాడు. కీపర్ చేతికి బంతి వెళ్లగా ఒక్క పరుగు కోసం పరుగెత్తే క్రమంలో రనౌట్ అయ్యాడు. దీంతో గైట్ జట్టు ఒక్క పరుగుతో ఓటమిపాలైంది.

విజయం సాధించిన వీఎస్ఎం జట్టు

వీఎస్ఎం విజయబావుటా

వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల (రామచంద్రాపురం), ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వీఎస్ఎం జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన వీఎస్ఎం జట్టు 102 పరుగులు చేసి ఆలౌటైంది. ఈ జట్టులో అర్జున్ 26 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌కేవీటీ జట్టు 7వికెట్లు కోల్పోయి 90 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది.

Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు
IIT-JEE | NEET
Protein Partner
NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner
CMR SHOPPING MALL The joy of life
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Regional Sponsor
GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P.
Call: 994 999 3483 | www.ggu.edu.in
Digital Partner
ఈనాడు.నెట్ ETV BHARAT
Medical Partner
GSL
District Sponsor
TIRUMALA విద్యాసంస్థలు
FM Partner
ఈ FM Mee FM
TV Partner
ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

నేటి మ్యాచ్‌లు 02.01.2026

గ్రౌండ్-1

- **ఉదయం 8 గంటలకు:** ఆదికవి నన్నయ యూనివర్సిటీ(యూజీ) X ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (రాజమహేంద్రవరం).
- **ఉదయం 11 గంటలకు:** పైడా కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ X గైట్ డిగ్రీ కాలేజీ.
- **మధ్యాహ్నం 2 గంటలకు:** గైట్ ఇంజినీరింగ్ కాలేజీ X ఏబీఎన్, పీఆర్ఆర్ కళాశాల.

గ్రౌండ్-2

- **ఉదయం 8 గంటలకు:** మెగా జూనియర్ కాలేజీ (రాజమహేంద్రవరం) X శ్రీరాజరాజేశ్వరి (కాకినాడ).
- **ఉదయం 11 గంటలకు:** శ్రీ సంహిత జూనియర్ కాలేజీ (రావులపాలెం) X శ్రీరాజరాజేశ్వరి కళాశాల (పెద్దాపురం).

రేపటి మ్యాచ్‌లు 03.01.2026

గ్రౌండ్ - 1

- **ఉదయం 8 గంటలకు:** కైట్ - 2(కాకినాడ) X బీవీసీ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల(భట్లపాలెం).
- **ఉదయం 11 గంటలకు:** ఐడియల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (కాకినాడ) X కైట్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల(కాకినాడ).
- **మధ్యాహ్నం 2 గంటలకు:** చైతన్య ఇంజనీరింగ్ కళాశాల, కాకినాడ X ఎస్‌కేజీఆర్ అండ్ ఎస్ఎస్ కుమారి జూనియర్ కళాశాల (తాళ్ళపూడి)

గ్రౌండ్ - 2

- **ఉదయం 8 గంటలకు :** కైట్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (కాకినాడ) X మంగెన గైరయ్య కళాశాల(లక్కవరం).
- **ఉదయం 11 గంటలకు :** గొలుగూరి బాపిరాజు జూనియర్ కళాశాల(అనపర్తి) X దివ్య జూనియర్ కళాశాల (రాజానగరం).

గ్రామసభల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు

కలెక్టరేట్: కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీకి జిల్లాలో గ్రామసభల నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది. శుక్రవారం నుంచి ఈ నెల 9 వరకు ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామసభల ద్వారా కొత్త పాసుపుస్తకాలు రైతులకు జారీ చేయనున్నట్లు డీఆర్వో సీతా రామమూర్తి తెలిపారు. శుక్రవారం అనపర్తి మండలం మహేంద్రవాడ, బిక్కవోలు మండలం రంగాపురం, ఇల్లపల్లి, తుమ్మలపల్లి, రళ్లకండ్రిగ, కోరుకొండ మండలం గాడాల, రాజమహేంద్రవరం గ్రామీణ మండలం రాజవోలు, రంగంపేట మండలం సుభద్రమ్మపేట, కడియం మండలం దామిరెడ్డి పల్లి, ఉండ్రాజవరం మండలం వెలగదుర్రు, తాళ్లపూడి మండలం తాళ్లపూడి, పెరవలి మండలం నడుపల్లి, నిడదవోలు మండలం సురపురం, ఉనకరమిల్లి, నల్లజర్ల మండలం మరెల్లమూడి, కొవ్వూరు మండలం పెనకనమెట్ట, గోపాలపురం మండలం దొండపూడి, చాగల్లుమండలం నెలటూరులలో సభలు జరుగుతాయని డీఆర్వో తెలిపారు.

రథ శకలాల నిమజ్జనానికి ఏర్పాట్లు

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామికి చెందిన దగ్ధమైన పాత రథ శకలాలను ఈ నెల 3న నిమజ్జనం చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి వార్షిక వాహన సేవకులతో శకలాలను చిన్నచిన్న ముక్కలుగా చేసి సాగర సంగమం వద్దకు తీసుకెళతారు. అక్కడ ఇసుకలో పెద్దగొయ్యి తీసి చుట్టూ రేకులు అమర్చి అందులో శకలాలను వేసి కర్పూరంతో మండిస్తారు. భస్మాన్ని బోట్లపై సంగమం మధ్యలో నిమజ్జనం చేస్తారని ఆలయ ఏసీ నాగవరప్రసాద్ తెలిపారు.

పరమశివుడి సన్నిధిలో రాజకీయాలు వద్దు: సుభాష్

కపాలేశ్వరస్వామి లింగానికి అభిషేకం చేస్తున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: పరమశివుడి సన్నిధిలో రాజకీయాలు వద్దని మంత్రి వాసంశెట్టి సుభాష్ హితవు పలికారు. రెండు రోజుల క్రితం ద్రాక్షారామ భీమేశ్వరుడి సన్నిధిలో కపాలేశ్వరస్వామి లింగాన్ని ధ్వంసం చేసిన తరువాత గురువారం ఆయన ఆలయాన్ని సందర్శించి కపాలేశ్వర లింగానికి అభిషేకం చేశారు. తూతూమంత్రంగా లింగాన్ని ప్రతిష్ఠించారని వైకాపా నాయకులు ఆరోపిస్తున్నారని వారికి ఆగమ శాస్త్రం గురించి ఏమి తెలుసని ప్రశ్నించారు. ఘటన జరిగిన రోజే నిందితుడిని గుర్తించి అరెస్టు చేశామని వైకాపా హయాంలో అంతర్వేది రథం తగలబెడితే ఎన్నాళ్లకో ఒక ఉన్మాదిని నిందితుడిగా చూపించారని గుర్తు చేశారు. ఆలయ ఈవో, సహాయ కమిషనరు ఏవీ దుర్గాభవాని, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

చప్పిడిచేపల కూర.. గోదారోళ్ల నోరూర..

న్యూస్‌టుడే, పి.గన్నవరం

చప్పిడిచేపలు తయారు చేస్తున్న మత్స్యకారులు (అంతర చిత్రం) చప్పిడిచేపలు, కోడిగుడ్లు, చిక్కుడు కాయలతో కూర

మన ఊరి వంట

నోరూరించే చేపల కూరలు తయారు చేయడంలో గోదారోళ్లు సిద్ధహస్తులు. సీజన్ల వారీగా దొరికే పులస, దొందు, చీరమీను తదితరాలను కొనుగోలు చేసి బంధుమిత్రులకు పంపుతుంటారు. ప్రధానంగా మహా రుచికరమైన చప్పిడి చేపలను గోదావరి తీర ప్రాంతంలో ఉండే మత్స్యకార కుటుంబాలు తయారు చేసి విక్రయిస్తుంటాయి. కొయ్యింగ, కట్టెపరిగి, కడిస, ఇసుకదొందులు వంటి పచ్చిచేపలతో చప్పిడి చేపలు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. వీటిని ఎంతోమంది ఇష్టంగా తింటారు.

తయారీ విధానం

కోనసీమలో జొన్నల్లంక, నాగుల్లంక, వాకలగరువు, బోడసకుర్రు తదితర ప్రాంతాల్లో చప్పిడిచేపలు తయారు చేస్తుంటారు. పచ్చిచేపలను పొలుసు తీయకుండా లోపల పేగులు వంటివాటిని తొలగించి ఎండలో ఆరబెడతారు. డొక్కలపీచును పరుపు మాదిరిగా పరిచి మధ్య నిప్పులు వేస్తారు. దానిపై చెరకుపిప్పు పెట్టి పైన ఆరిన పచ్చిచేపలను చక్కగా పేర్చి పొగతో ఆరుస్తారు. వీటిని చప్పిడిచేపలు లేదా ఆర్చినచేపలు అంటారు. మంట రాకుండా పొగతో ఆర్చడంతో ఎనలేని రుచి వస్తుంది.

అందుబాటు ధరలో..

ఆర్చిన చప్పిడిచేపల ధర వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది. కొయ్యింగలైతే ఒకటి రూ.200-300, కట్టెపరిగ, కడిస, దొందులు వంటివైతే రూ.100 నుంచి ఆపైన ఉంటుంది.

ఈ కాంబినేషన్‌లో..

చప్పిడి చేపలపైన ఉండే చర్మంలాంటి పొరను తొలగించి వండుతారు. చిక్కుడుకాయ, కోడిగుడ్డు, టమాటా, వంకాయ, చింతకాయ, మునగకాడలు.. ఇలా వివిధ కాంబినేషన్లతో ఇగురు తయారు చేసి ఆరగిస్తుంటారు.

ఇతర ప్రాంతాలకు

ఈ చేపలు మార్కెట్ నుంచి తెచ్చుకున్న ఒకటి, రెండు రోజుల్లో వండుకోవాలి. ఫ్రిజ్‌లో పెట్టుకుంటే ఎక్కువ రోజులు ఉంటాయి. సంక్రాంతికి వచ్చే వారికి ఈ చేపలతో కూరలు తయారు చేసి ఇక్కడివారు ప్రత్యేకంగా వడ్డిస్తారు.

వెన్నతో కన్నయ్య

ధనుర్మాస మహావ్రతంలో భాగంగా కొవ్వూరు పాత ఊరు వరద గోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, తిరుప్పావై పాశుర పఠనం గావించారు. అనంతరం నవనీతం (వెన్న)తో స్వామివారిని అలంకరించారు. క్షేత్రంలోని సుందరేశ్వర స్వామి, గోష్పదేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతామూర్తులకు విశేషాలంకరణలు చేశారు.

– న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

మంత్రి దుర్గేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్డీవో రాణి సుస్మిత, రెవెన్యూ సిబ్బంది

రాష్ట్రాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం: దుర్గేష్

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలులోని జనసేన కార్యాలయంలో మంత్రి కందుల దుర్గేష్‌కు వివిధ శాఖల జిల్లా అధికారులతో పాటు, కూటమి నాయకులు భారీగా తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో రాష్ట్రాభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. గడిచిన ఏడాది కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి రూ.400 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవకుమార్, పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, పట్టణ తెదేపా అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు తదితరులు మంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

ఇంటిపని వంటపనిలో అనుభవం కలిగిన 35 సం||లోపు ఏ బాదరబందీలేని మహిళలు హైదరాబాద్‌లో ఇంటిలో పనిచేయుటకు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. నమ్మకంతో పనిచేయుటకు ఇష్టం గలవారు సంప్ర||. ✆ 98481 93191, 98493 49999.

BUSINESS OFFER

న్యూఇయర్‌లో ఎలాంటి పెట్టుబడి లేకుండా నచ్చిన టైమ్‌లో బిజినెస్ చేసుకొని అధికఆదాయం పొందండి. అనుభవం, అర్హత లేదు. 9705877799, 8096225555

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-25 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

SECOND SALE

New Jewellery shop Furniture, cash counter, 2 display counters etc for sale ✆ Cont: 9885076741.

EENADU for Advertisement Contact: 8008597607

JOBS

రాజమండ్రి, కోరుకొండ రోడ్డులో మా ఇంటివద్ద 2 సంవత్సరాల పిల్లల ఆలన పాలన చూసుకొనుటకు ★ కేర్‌టేకర్స్ కావలెను. Cont. Cell: 77999 88168.

వాచ్‌మెన్ ఫ్యామిలీ, వార్డెన్స్ (మగ), వంట మనుషులు (ఆడ) కావలెను. వసతి సదుపాయం. జయశ్రీ గార్డెన్స్, ఎ.వి.ఎ.రోడ్, రాజమండ్రి. 7095223216, 9494158858.

రాజమండ్రిలో ప్రముఖ రెడీమేడ్ గార్మెంటు షాపులో పనిచేయుటకు సేల్స్‌స్టాఫ్, డైలీవేజస్ (పు)-500/-, స్త్రీ-300-400/- కావలెను. Contact: 90523 81026.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	17,000
పాతకాయ: గండేరా	27,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,000-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	147-00
రిటైల్ లైవ్	174-00
డ్రెస్డ్	252-00
స్కిన్‌లెస్	287-00

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

మృత్యుశకటం

దంపతులను ఢీకొన్న లారీ
భార్య మృతి.. భర్తకు తీవ్ర గాయాలు

తణుకు గ్రామీణం: నూతన సంవత్సరం ఆ కుటుంబానికి తీవ్ర విషాదం మిగిల్చింది. దైవ దర్శనానికి వెళ్తొస్తున్న దంపతుల్లో భార్య దుర్మరణంపాలై భర్తకు తీవ్ర గాయాలైన ఘటనతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. తణుకు మండలం తేతలి జాతీయ రహదారిపై గురువారం తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన అందే లోకేశ్వరరావు ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో ఔషధ దుకాణం నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య వెంకటలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, కుమార్తె భీమవరంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో బీఫార్మసీ చదువుతోంది. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం తెల్లవారుజామున లోకేశ్వరరావు దంపతులు ద్విచక్ర వాహనంపై ద్వారకా తిరుమల, మద్ది ఆంజనేయస్వామి ఆలయాలకు వెళ్లి తిరిగొస్తుండగా తణుకు మండలం తేతలి సమీపంలో జాతీయ రహదారిపై లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో వెంకటలక్ష్మి (43) అక్కడికక్కడే మృతి చెందగా భర్తకు తీవ్ర గాయాలు కావడంతో 108 సిబ్బంది తణుకు జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో లోకేశ్వరరావును మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తణుకు గ్రామీణ ఎస్సై తెలిపారు.

బావపై బావమరిది కత్తితో దాడి

నిడదవోలు, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో బావపై బావమరిది కత్తితో దాడి చేసిన ఘటన గురువారం నిడదవోలు మండలం శెట్టిపేటలో చోటుచేసుకుంది. నిడదవోలు ఎస్సై జగన్మోహనరావు వివరాల ప్రకారం.. యర్రంశెట్టి పాండురంగారావు భార్య నిడదవోలు మండలం శెట్టిపేటలో ఉంటున్నారు. గురువారం పాండురంగారావు నిడదవోలు నుంచి శెట్టిపేట వెళ్లి పిల్లలను తనతో పాటు నిడదవోలు పంపించాలని భార్యను కోరగా అందుకు ఆమె నిరాకరించింది. దీంతో అతను మామయ్యతో వాదులాటకు దిగగా పొలంలో పనిచేసుకుంటున్న అతని కుమారుడు బయ్యే వినిల్‌కు మార్‌కు చెప్పడంతో అతను వచ్చి కత్తితో అతని బావ అయిన పాండురంగారావును మెడపై నరికినట్లు తెలిపారు. గాయపడిన పాండురంగారావును వైద్యసేవల నిమిత్తం నిడదవోలు సామాజికాసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్య సేవల నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలోని వెదిరేశ్వరం రోడ్డులో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ఏర్పాటు విషయంలో తలెత్తిన వివాదంలో మాజీ ఎమ్మెల్యే, వైకాపా జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వెదిరేశ్వరం రోడ్డు మధ్యలో ఓ సామాజికవర్గం వారు విగ్రహ ఏర్పాటుకు నిర్మించిన దిమ్మ కారణంగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసు, రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, మరి కొంతమంది అక్కడికి వచ్చి దిమ్మపై ఉంచిన శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటాన్ని దూరంగా విసిరేస్తున్న సమయంలో పోలీసులు అడ్డుకున్నారు. దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కలిగించిన నేపథ్యంలో చిర్ల జగ్గిరెడ్డి, గొల్లపల్లి డేవిడ్, ఏనుగపల్లి నాగార్జున, ఇసుకపట్ల సునీల్, కొల్లాటి డాక్టర్‌బాబు, ముసునూరి వెంకటేశ్వరరావు, గొల్లపల్లి రాజశేఖర్, పడాల నాగమహేశ్వరరెడ్డి, నెల్లి రాజులపై కేసు నమోదు చేసినట్లు రావులపాలెం ఎస్సై చంటి గురువారం తెలిపారు.

రాబర్ట్‌పాల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వ్యవసాయాధికారులు, సిబ్బంది

ఇన్‌ఛార్జి డీఏవోగా రాబర్ట్‌పాల్ బాధ్యతలు

కలెక్టరేట్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఇన్‌ఛార్జి జిల్లా వ్యవసాయ అధికారి (ఇన్‌ఛార్జి డీఏవో)గా గురువారం కె.రాబర్ట్‌పాల్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ డీఏవోగా బాధ్యతలు నిర్వహించిన ఎస్.మాధవరావు ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఉమ్మడి జిల్లా ఆత్మ ప్రాజెక్టు మేనేజర్‌గా వ్యవహరిస్తున్న రాబర్ట్‌పాల్‌ను ఇన్‌ఛార్జి డీఏవోగా నియమించారు. కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను రాజమహేంద్రవరం ఏడీఏ సూర్యరమేష్, ఏఈవో సంఘ అధ్యక్షుడు వేణుమాధవ్, రాజమహేంద్రవరం గ్రామీణం, కడియం, రాజానగరం మండలాల వ్యవసాయ అధికారులు భీమరాజు, కల్యాణ్, శ్రీనివాస్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

(c) eenadu

రాజమహేంద్రవరం

దుప్పట్ల పంపిణీ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపకశాఖ సంక్షేమ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని మానవీయ ఐక్య సేవా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో జోన్-2 ప్రాంతీయ అగ్నిమాపకశాఖ అధికారి స్వామి, అగ్నిమాపకశాఖ అధికారి మార్టిన్ లూథర్‌కింగ్ చేతుల మీదుగా 45 మంది వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. అగ్నిమాపకశాఖ జిల్లా సహాయ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు సామాజిక సేవ, మానవీయ విలువలు, బాధ్యతాయుతమైన ఆలోచనలతో ముందుకు సాగాలని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోని గౌతమి జీవకారుణ్య అనాథాశ్రమంలో చిన్నారులకు రాత పుస్తకాలు, రగ్గులు, దుప్పట్లు సమకూర్చారు.

విజేతలతో ప్రిన్సిపల్ తిరుపణ్యం తదితరులు

విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నెహ్రూ యువ కేంద్రం, మై భారత్‌లో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు రాణించారని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.వి.తిరుపణ్యం తెలిపారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ఉమెన్స్ టీం రన్నర్‌గా, పురుషుల వాలీబాల్‌లో రన్నర్స్‌గా, రన్నింగ్ 100 మీటర్లలో ఉమెన్స్ మొదటి స్థానం, అబ్బాయిల విభాగంలో మొదటి స్థానంలో గెలిచి కళాశాలకు గర్వకారణంగా నిలిచారని ప్రశంసించారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. పీడీ కిశోర్‌బాబు, సీరా గంగాధర్, పి.వి.బి.సంజీవరావు, జి.శరత్‌బాబు, మేకల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చదరంగంలో..

పతకం అందుకుంటున్న అనన్య

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: అస్సాంలో గత నెల 27నుంచి 31 వరకు జరిగిన 14వ జాతీయ స్కూలుగేమ్స్ ఓపెన్ కేటగిరిలో నగరానికి చెందిన అనన్య టాప్-9లో నిలిచినట్లు ఎంకె చెస్ అకాడమీ కోచ్ జి.హేమచంద్రమౌళి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 9 రౌండ్లు నిర్వహించగా 6.5పాయింట్లతో టాప్-10లో చోటు దక్కించుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అనన్యను జిల్లా చదరంగం సంఘ కార్యదర్శి జీవీ కుమార్, ఉపాధ్యక్షులు వై.కల్యాణ్‌కుమార్, కోచ్ హేమచంద్ర, కార్తీక్‌గోపాల్ అభినందించారు.

నాట్య కళ.. ఉపాధి భళా

అమెరికాలో ప్రదర్శనలు..

కూచిపూడి నాట్యం పురుడు పోసుకున్న కూచిపూడి మా సొంతూరు. నాన్న పసుమర్తి శ్రీనివాసశర్మ నాట్య గురువు. ఓ వైపు చదువుకుంటూనే విజయ శంకర పాఠశాలలో నృత్యం, కర్ణాటక సంగీతంలో సర్టిఫికెట్, డిప్లొమో కోర్సులు చేసి సెంట్రల్ యూనివర్సిటీలో పరిశోధన చేశాను. దేశవ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చాను. అమెరికాలో మూడుసార్లు నృత్య ప్రదర్శనలు ఇచ్చాను. ప్రస్తుతం బెంగళూరులోని అలయన్స్ విశ్వవిద్యాలయంలో నృత్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నా.

- పసుమర్తి కుమారదత్త, నాట్యాచార్యుడు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: కళలు భగవంతుడి ప్రసాదం. ఎంతో ఇష్టంతో సాధన చేస్తేనే సొంతమవుతుంది. అది కొందరికి ఉపాధి మార్గం చూపితే.. మరికొందరిని ఎంతో గొప్ప కళాకారులుగా తీర్చిదిద్దుతుంది. రాజమహేంద్రవరంలోని విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల 50 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా జనవరి 2, 3, 4 తేదీల్లో స్వర్ణోత్సవం నిర్వహించనున్నారు. ఇక్కడి విద్యార్థులు చాలామంది గొప్ప స్థానాల్లో స్థిరపడ్డారు.

16 ఏళ్లుగా శిక్షణ..

విజయ శంకర పాఠశాలలో సర్టిఫికెట్, డిప్లొమో కోర్సులు చేశాను. కూచిపూడి నృత్యంలో పీహెచ్‌డీ చేశాను. దేశవిదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చాను. వివాహం తర్వాత హైదరాబాద్‌లో సొంతంగా శిక్షణాలయం స్థాపించి 16 ఏళ్లుగా వేలమందికి శిక్షణ ఇస్తున్నా. నాట్య ప్రచారంలో భాగంగా మా శిష్యబృందంతో తిరుపతి, శ్రీశైలం, విజయవాడ, ద్వారకా తిరుమల, భద్రాచలం, వారణాసి తదితర పుణ్యక్షేత్రాల్లో ప్రదర్శనలు ఇచ్చాను.

- కె.విజయలక్ష్మి, నాట్యగురువు

శిక్షణ ఇస్తున్న కదలి శ్రీరాజరాజేశ్వరి

నృత్యం అంటే ప్రాణం..

బీఎస్సీ బీఈడీ చేశా. మరో వైపు కూచిపూడి సర్టిఫికెట్ కోర్సు చేసి, నృత్యంలో పీహెచ్‌డీ చేశా. బొమ్మూరులో శ్రీకర్ నృత్యనికేతన్ పేరుతో సొంతంగా నాట్యాలయం నిర్వహిస్తున్నా. ఇంత వరకు 25 కార్యశాలలు, 40 సెమినార్లలో పాల్గొని ప్రసంగించాను. సుమారుగా 500 వరకు నృత్య కార్యక్రమాల్లో పాల్గొన్నా. నృత్య పోటీలకు న్యాయనిర్ణేతగాను వ్యవహరిస్తున్నా. నన్నయ విశ్వవిద్యాలయంలో నృత్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాను. దూరదర్శన్ బి-గ్రేడ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు లభించింది.

- కదలి శ్రీరాజరాజేశ్వరీదేవి, కూచిపూడి నాట్యగురువు

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

కమిషనర్‌ను కలిసిన ఉద్యోగులు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : అధికార యంత్రాంగం విధుల్లో అంకిత భావంతో పని చేయాల్సి ఉందని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. గురువారం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఉద్యోగులు ఆయనకు పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ఫలాలు చివరి గడప వరకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ రహితంగా నగరాన్ని తీర్చిదిద్దాల్సి ఉందన్నారు. అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ రమణ, ఈఈలు మాధవి, ఆలీ, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి..

టీనగర్: అన్ని వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు నూతన సంవత్సరం సందర్భంగా గురువారం ఎమ్మెల్యే నివాసం వద్ద సందడి నెలకొంది. కార్యకర్తల మధ్య కేకు కోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త ఆశలతో వృద్ధి సాధించే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

ఇది పేదల ప్రభుత్వం

టీ.నగర్: పేదల సంక్షేమం అందించే లక్ష్యంగా ప్రభుత్వ పాలన చేస్తోందని గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. గురువారం ఆయన నివాసం వద్ద నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పార్టీ అభిమానులు, కార్యకర్తలు ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టీ.నగర్, న్యూస్‌టుడే: దేశంలో బాబు పాలనను మెచ్చి పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని ఎమ్మెల్సీ సోమువీర్రాజు అన్నారు. గురువారం అన్నపూర్ణయ్య పేట వద్ద, పార్టీ పాలెమొంటు కన్వీనర్ పడాల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలో ఆయన మాట్లాడారు. ముందుగా కేకు కోసి పంపిణీ చేశారు. ● జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి నివాసంలో వేడుకలు నిర్వహించారు. ● తెదేపా ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ నివాసంలో నూతన సంవత్సరం వేడుకలు జరిగాయి.

ఆదిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మహిళా కార్యకర్తలు

కేకు కోస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

నేటి నుంచి సంగీత, నృత్య పాఠశాల స్వర్ణోత్సవం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : రాజమహేంద్రవరం విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 2, 3, 4 తేదీల్లో స్వర్ణోత్సవం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ పసుమర్తి శ్రీనివాసశర్మ తెలిపారు. రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో జరిగే వేడుకలో శుక్రవారం ఉదయం 7.30 గంటలకు నగర సంకీర్తన, 8.30గంటలకు నాదస్వరం, వేదస్వస్తి ఉంటుంది. ప్రార్థనా గీతాలు, స్వాగత నృత్యంతో 10 గంటలకు సభ ప్రారంభం, పురస్కార ప్రదానం, మధ్యాహ్నం 3 గంటలకు వీణా కచేరీ, పూర్వవిద్యార్థుల గాత్రకచేరీ, సాయంత్రం కూచిపూడి నృత్య రూపకం ఉంటాయి. 3న ఉదయం 9 గంటల నుంచి గాత్ర కచేరీ, నృత్య ప్రదర్శన, 11 గంటలకు కవితా సదస్సు, మధ్యాహ్నం 3 గంటల నుంచి గాత్ర కచేరీ, వీణా కచేరీ, కూచిపూడి నృత్య రూపకం ఉంటాయి. 4న ఉదయం 9 గంటల నుంచి పంచరత్న సేవ, నృత్య ప్రదర్శన, వీణా కచేరీ, అధ్యాపకుల వాద్య కచేరీ, భక్తి సంగీతం, రాత్రి 7 గంటల నుంచి స్మారక పురస్కారాల ప్రదానంతో వేడుక ముగుస్తుందని పేర్కొన్నారు.

ఈ దారిలో వెళ్లేదెలా?

సంతోష్‌నగర్‌లో అధ్వానస్థితిలో ప్రధానరహదారి

దివాన్‌చెరువులోని సంతోష్‌నగర్‌లోని ప్రధాన రహదారి పై మురుగునీటి కాలువ లేకపోవడంతో నీరంతా రోడ్డుపైనే చేరుతోంది. మట్టి రోడ్డు కావడంతో నడిచేందుకు, వాహనాల రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలో రూ. కోటికి పైగా నిధులు ఉన్నప్పటికీ రహదారులు, సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టడం లేదు. పేరుకుపోయిన చెత్తను తొలగించక దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రాజానగరం

అర్హులందరికీ రేషన్ కార్డులు : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

టి.నగర్, న్యూస్‌టుడే: పేదల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. గురువారం సాయంత్రం 11వ డివిజన్ వీఎల్‌పురం వద్ద రేషన్ దుకాణంలో కిలో 20కే గోధుమ పిండి అందించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. త్వరలో అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ద్వాదశ జ్యోతిర్లింగ రుద్రయాగం

తాళ్లపూడి: తాళ్లపూడి శివాలయంలో శుక్రవారం నుంచి 5 వరకు ద్వాదశ జ్యోతిర్లింగ రుద్రయాగం జరుగుతుందని జంధ్యాల గంగాధరశర్మ తెలిపారు. ఆలయప్రాంగణం, ప్రధాన వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. పురాణ ప్రవచనం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష్మీగణపతి, రుద్ర, నక్షత్ర నవగ్రహ హోమాలు, లక్షపత్రిపూజ, లక్ష రుద్రాక్షల పూజ, లక్షపుష్పార్చన జరుగుతాయన్నారు.

నిడదవోలులో జన్మభూమికి హాల్ట్ ఇవ్వాలి

నిడదవోలు: జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు అనపర్తితో పాటు నిడదవోలులో కూడా హాల్ట్ ఇవ్వాలని పట్టణ ప్రజల సంక్షేమ సంఘ అధ్యక్షుడు జువ్వల రాంబాబు అన్నారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు నిడదవోలు రైల్వేజంక్షన్‌లో హాల్ట్ ఇవ్వాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో గురువారం దర్నా నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు పొన్నా కృష్ణబాబు, యర్రా శ్రీను, శ్రీరామ్, రసూల్, లక్ష్మణరావు, రాఘవ, కోట సాయి, సత్యనారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

ముందుకెళ్లని నీరు

స్వరాజ్యనగర్ ప్రాంతంలో ప్రధాన రహదారి వెంబడి నీరు నిలిచి నాచు పట్టడంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర జిల్లాల నుంచి నగరానికి చేరుకునే ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు, పాదచారులకు ఇక్కట్లు తప్పడం లేదు. రోడ్డుపై నీరు నిలిచి ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

పడితే అంతే

నగరంలోని చాలా ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలకు సరైన నిర్వాహణ, రక్షణ చర్యలు లేకుండా ప్రమాదకరంగా మారాయి. కొన్ని చోట్ల స్తంభాలు ఒరిగిపోయాయి. పాత ఇనుప స్తంభాలకు అడుగు భాగంలో చాలా వరకు తుప్పుపట్టి పూర్తిగా పాడై ప్రమాదకరంగా ఉన్నాయి. ఎటువంటి ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి పరిస్థితి చక్కదిద్దాలని నగర ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

ఇలాగేనా తరలించడం

నగరంలోని కొంత మంది వాహన చోదకులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండానే ఇనుప ఊచలను తరలిస్తున్నారు. దీంతో వీటి వెనుక వచ్చే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. మహాకాళేశ్వర ఆలయం వద్ద గురువారం ఉదయం రద్దీ మార్గంలో మినీ వ్యాన్ వెనుక పెద్ద ఇనుప నిచ్చెనని ఎటువంటి వస్త్రాలు కట్టకుండా తీసుకెళ్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, తగుచర్యలు తీసుకుని ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

రహదారిపై ఇసుకతో వెతలు

నగరంలో నిత్యం రద్దీగా ఉండే మార్గాలైన మల్లయ్యపేట, ధవళేశ్వరం, ఐ.ఎల్.టి.డి వంతెనకు వెళ్లే మార్గాలపై ప్రయాణించాలంటే ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఆయా ప్రాంతాల్లో రహదారికి సగానికి పైగా ఇసుక పరిచినట్లు ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. భారీ వాహనాలు సైతం అదుపు తప్పుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి, ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

జవహర్ వాకర్స్ క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : జవహర్ వాకర్స్ క్లబ్ రాజమండ్రి సభ్యుల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం వెంకటేశ్వర నగర్ పార్కులో గురువారం ఉదయం జరిగింది. క్లబ్ అధ్యక్షుడిగా గొడతి సూర్యనారాయణమూర్తి, సెక్రటరీగా సలాది ప్రసాద్, కోశాధికారిగా పాలూరి నాగేశ్వరరావు, జాలీ వాకర్‌గా భానుప్రసాద్ తదితర పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వాకర్స్ జిల్లా గవర్నర్ తోలేటి సూర్యనారాయణ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

గంగిరెడ్డికి సత్కారం

ఎస్.పి.గంగిరెడ్డిని సత్కరించిన ఆదిత్య ప్రిన్సిపల్ తదితరులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే :విద్యార్థులకు ఉత్తమవిద్య, క్రమశిక్షణ నేర్పిస్తూ వారి భవితకు చక్కటి బాటలు వేసిన ఆదిత్య డైరెక్టర్ ఎస్.పి.గంగిరెడ్డికి నూతన ఏడాది సందర్భంగా చిరుసత్కారం చేశారు. గురువారం తాడితోటలోని కళాశాలలో ఎన్ఎస్ఎస్ అధికారులు జి.వి.ఎస్.నాగేశ్వరరావు, రమాదేవి నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఫణికుమార్ గంగిరెడ్డిని శాలువా, పూలదండతో సత్కరించి ఆశీస్సులు అందుకున్నారు. కళాశాల అభివృద్ధిలో ఆయన అందించిన సేవలను కొనియాడారు.

శ్రీవారి ఆలయాల్లో ధనుర్మాస పూజలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: ధనుర్మాసం, నూతన ఏడాది సందర్భంగా రాజమహేంద్రవరం నగరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతంపేట రామాలయంలో గురువారం తెల్లవారుజామున స్వామివారి మూలవిరాట్‌కు చామంతి, గులాబీ, బంతి, తులసి దళాలతో అలంకరించి హారతి సమర్పించారు. స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తిరుప్పావై, విష్ణు సహస్ర నామార్చన పఠించారు. నల్లమందుసందు వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు, నూతన ఏడాదిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. శ్రీవారి మూలవిరాట్‌కు పట్టువస్త్రాలు, నక్షత్ర హారతులు అందించారు. గౌతమఘాట్‌లోని శ్రీరంగధామంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజాము నుంచి దేవేరీ సమేత స్వామికి విశేష అలంకారం, పూజలు జరిగాయి. తిరుప్పావై పఠించారు. నూతన ఏడాదిలో శ్రీవారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

సీతంపేట రామాలయంలో వేంకటేశ్వరస్వామి..

నల్లమందుసందు ఆలయంలో శ్రీవారు..

గౌతమఘాట్ శ్రీరంగధామంలో..

శ్రీవారి ఉత్సవమూర్తికి అలంకారం, పూజలు

గుంతలతో చింత

మోరంపూడి, న్యూస్‌టుడే: శాటిలైట్ సిటీ బీ బ్లాక్ ప్రధాన రహదారి గుంతలు పడి దెబ్బతింది. రాత్రి సమయంలో వీధి దీపాలు లేక గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వాహనాలతో పాటు, నడుం నొప్పులు వస్తున్నాయని, సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కోటికేశవరంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

కోరుకొండ: కోటికేశవరంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది.. గోకవరం, సూదికొండ ప్రాంతాలకు చెందిన కొందరు యువకులు కోటికేశవరం శివారున తోటల్లో నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించుకున్నారు. గురువారం తెల్లవారుజామున 3 గంటలకు తిరిగి వారి స్వస్థలాలకు కోటికేశవరం- బొల్లెద్దుపాలెం రహదారిలో బయలుదేరారు. ముందుగా సామగ్రితో ఉన్న ఒక వాహనం వెళుతుండగా అక్కడే ఉన్న ఓ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు యువకులు వేగంగా నడుపుతున్నావేంటి అంటూ వాహనంలోని వ్యక్తిపై దాడి చేశారు. వెనకాల కారులో ఉన్న యువకులు కిందికి దిగి కేకలు వేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరిపై మరొకరు ఇటుకలను విసురుకున్నారు. పారిపోయిన వారి ఆచూకీ తెలుసుకుని వారి ఇంటికి వెళ్లడంతో తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరు వర్గాల్లో నలుగురికి గాయాలయ్యాయి. వీరిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి ఒక సామాజిక వర్గానికి చెందినవారు పోలీసుస్టేషనుకు వచ్చి కేసు నమోదు చేసి, వారిపై చర్యలు తీసుకోవాలని ఆందోళనకు దిగారు. కేసు నమోదు చేశామని ఎస్.ఐ శ్రీనివాస్ చెప్పడంతో ఆందోళన విరమించారు. ఎస్సైను వివరణ కోరగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు, ఇరువర్గాలపైనా దాడి జరిగినట్లు కేసులు నమోదు చేశామని, పూర్తి వివరాలు రాలేదన్నారు. డీఎస్పీ దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

ప్రకటన

మా క్లయింట్లు బెంగుళూరు కాపురస్తులు నోరి వెంకటేశ్వర్లు గారి కుమారుడు నోరి శ్రీనివాస్ గారు మాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునదేమనగా,

మా క్లయింటు వారికి రావలసిన సొమ్ము రూ. 29,49,560/- మరియు ఇతర నష్టపరిహారము మరియు మా క్లయింట్ యొక్క భవనము నుండి ఊర్వశి లాడ్జి వ్యాపారమును తొలగించవలెను. వగైరా పరిహారములు కోరుతూ రాజమహేంద్రవరం కాపురస్తులు **(1) రత్నా స్టీల్స్ అండ్ కంపెనీ, పార్టనర్‌షిప్ ఫర్మ్ రిప్రజెంటెడ్ బై పార్టనర్స్ లేటు ఇయ్యపు కూర్మారావు గారి కుమారులు ఇయ్యపు మురళీధర్ (2) ఇయ్యపు మాధవరావు మరియు ఇయ్యపు కేశవరావులపై** ఓ.యస్.నెం. 78/2005గా రాజమహేంద్రవరం 9వ అదనపు జిల్లా కోర్టు నందు దావా దాఖలు చేసినారు. వారు మా క్లయింటుకు ఇయ్యవలసిన బకాయిలు ఎగ్గొట్టే దుర్మార్గపు ఉద్దేశ్యంతో వారికి చెందిన దిగువ షెడ్యూల్ ఆస్తిని విక్రయించుటకు ప్రయత్నము చేయుచున్నారు అని తెలిసినది. కనుక మా క్లయింటు హక్కుల పరిరక్షణ కొరకు ఈ ఆస్తులను తొడజప్తు నిమిత్తం I.A.No.1593/2025 దాఖలు చేసి జప్తు ఉత్తర్వులు పొంది యున్నారు. అట్టి ఉత్తర్వుల ప్రకారం ఈ దిగువ షెడ్యూల్ ఆస్తులు జప్తు చేయబడినవని యావన్మంది గుర్తించి మెలగవలెను.

షెడ్యూల్

ఐటెం నెం.1: తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం సబ్ రిజిస్ట్రార్, రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్, వార్డు నెం. 29, ఎ.వి.అప్పారావు రోడ్ డో.నెం. 80-30-19, 80-30-19/1, 80-30-20, 80-30-20/1, అసెస్‌మెంట్ నెం. 10640 31452, 10640 31592, 10640 31581, 10640 31451 విస్తీర్ణం 2559.26 చ॥గ॥ బిల్డప్ స్థలం 23013 Sq. Ft. కు హద్దులు. **తూర్పు:** ఇండోర్ రూఫ్స్; **పడమర:** స్వామి కోకోనట్; **ఉత్తరం:** డో.నెం. 80-28-5 లారెల్ కిడ్స్ ప్రీ-స్కూల్; **దక్షిణం:** సాయి శ్రీ కమర్షియల్ కాంప్లెక్స్.

ఐటెం నెం.2: తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం టౌన్ హాల్ రోడ్, కూరగాయల మార్కెట్, డో.నెం. 80-33-1-23, మొత్తం విస్తీర్ణం 936.70 చ॥గ॥ విత్ బిల్డప్ స్థలం 21072 Sq. Ft. కు హద్దులు. **తూర్పు:** లేన్; **పడమర:** రౌతు సూర్యప్రకాశరావు ఇల్లు; **ఉత్తరం:** డో.నెం. 32-8-29 ఇల్లు; **దక్షిణం:** రోడ్.

చింతపెంట ప్రభాకరరావు అండ్ అసోసియేట్స్
అడ్వకేట్స్
రాజమహేంద్రవరం,
దానవాయిపేట, రాజమహేంద్రవరం
ది.01-01-2026.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కేదారేశ్వరరావును అభినందిస్తున్న జీజీహెచ్ కార్యాలయం సిబ్బంది

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు, జీజీహెచ్ మేనేజర్ కోసూరి కేదారేశ్వరరావు పేర్కొన్నారు. ఇటీవల ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జీజీహెచ్ ఏడీ శ్యామ్ సుందర్, యోహాన్, అజీజ్, ఒప్పంద, పొరుగుసేవల సంక్షేమ సంఘం కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డూడూ బసవన్న.. ఫోన్‌పే కొట్టన్నా..

సంక్రాంతి నెల ప్రారంభమైందంటే హరిదాసుల కీర్తనలు, డూడూ బసవన్నల ప్రదర్శనలు, ఇళ్ల ముందు రంగుల ముగ్గులు కనిపిస్తుంటాయి. ప్రస్తుతం ఇంటింటికీ నడిచి వచ్చే హరిదాసు ప్రస్తుతం ద్విచక్రవాహనంపై చక్కర్లు కొడుతున్నారు. డిజిటల్ ప్రపంచంలో ఆన్‌లైన్ లావాదేవీల కారణంగా ఇళ్లకు డూడూ బసవన్నలను తీసుకొచ్చి ప్రదర్శనలు చేసే కళాకారులకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఒకప్పుడు బియ్యం, తోచిన కాడికి నగదు వారికి ఇచ్చేవారు. దీనికి వారూ వినూత్నంగా ఆలోచించి ఫోన్‌పే క్యూఆర్ కోడ్‌ను బసవన్న తలకు కట్టి ఇలా తీసుకొస్తుండడంతో తోచినంత డబ్బు స్కాన్ చేసి ఎవరికి వారు ఇస్తున్నారు. రాజమహేంద్రవరంలోని వై జంక్షన్ వద్ద ఓ వీధిలో గురువారం సాయంత్రం ఇలాంటి దృశ్యాన్ని న్యూస్‌టుడే క్లిక్ మనిపించింది.

-న్యూస్‌టుడే, కంబాలచెరువు(రాజమహేంద్రవరం)

వైజంక్షన్ ఎస్‌కేవీటీ కళాశాల సమీపంలో డూడూ బసవన్న వద్ద ఫోన్‌పే చేస్తూ..

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం
• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం

ప్రత్యేక పూజలు

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరు వెంకటేశ్వర నగర్‌లో శ్రీభూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆంగ్ల సంవత్సరం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. స్థానిక గ్రామదేవత దోసాలమ్మ గుడిలో ఉదయం నుంచి వివిధ పూజలు నిర్వహించారు. భక్తులు చీరలు, గాజులు సమర్పించారు. హుకుంపేట మూడుగుళ్లలో దేవతా మూర్తులకు అర్చకులు వివిధ కైంకర్యాలు నిర్వహించారు.

టీఎన్‌టీయూసీ నేతకు సత్కారం

శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

రాజానగరం, న్యూస్‌టుడే: మండలంలో వివిధ కార్మిక, సామాజిక, సాంస్కృతిక సంఘాల ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం జరిగాయి. నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్‌ను రాష్ట్ర బీసీ సాధికార కమిటీ డైరెక్టర్ వంక మల్లిబాబు, చిలకసాని రాంబాబు, వి.సత్తిబాబు, గాంధి తదితరులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు.

విరుల సిరులు ఆహ్వానం పలికే..

కడియపులంక పుల్లా నాగేశ్వరరావు నర్సరీ వద్ద ఏర్పాటు చేసిన విరుల కూర్పు

కడియం, న్యూస్‌టుడే: నూతన సంవత్సర ప్రత్యేక కూర్పులు ఏర్పాటుతో కడియం నర్సరీలు సందర్శకుల తాకిడితో రద్దీగా మారాయి. జాతీయ రహదారి సమీపంలో నర్సరీ వద్ద ఏర్పాటు చేసిన భారీ విరుల కూర్పు ఆకట్టుకుంటోంది.

జిల్లాకు మంచి పేరు తెచ్చేందుకు కృషి

మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీని అభినందిస్తున్న సిబ్బంది

బొమ్మూరు, న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా బొమ్మూరులోని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ టి.శ్రీదేవికి యూనియన్ నాయకులు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. పీడీ మాట్లాడుతూ ఉత్సాహంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో పీడీ మూర్తిని సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్టీయూ డైరీలతో ఎంఈవో కార్యాలయ సిబ్బంది, నాయకులు, అధికారులు

అధికారులను కలిసిన ఎస్టీయూ నాయకులు

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం మండల విద్యాశాఖాధికారులు రామన్నదొర, జ్యోతిప్రసాదలను రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు గురువారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ మందారపు సీతారత్నం, జీజీయూ ఛాన్సలర్ కె.వి.వి.సత్యనారాయణ రాజును వారంతా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎంఈవో కార్యాలయ సిబ్బందికి ఎస్టీయూ డైరీలను ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్.వి.వి.శ్రీనాథ్‌బాబు, బండి దుర్గారావు, సుబ్రహ్మణ్యం, రత్నరాజు, పవన్‌కుమార్, బి.హెచ్.కామేశ్వరరావు, సానా శ్రీను, పి.వి.వి.బీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి చిరు సత్కారం

రంగంపేట, న్యూస్‌టుడే: రంగంపేటలోని శ్రీజ్ఞానలహరి విద్యార్థి సాల నిహాల్ గౌతమ్ ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన భగవద్గీత పఠన పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచాడు. గురువారం గౌతమ్‌ను కరస్పాండెంట్ నాగులపాటి శ్రీనివాస్, ప్రిన్సిపల్ మల్లేశ్వరి, ఉపాధ్యాయులు సత్కరించారు. మూడో తరగతి చదువుతూ ప్రతిభ చూపుతున్న విద్యార్థిని అభినందించారు.

కళల అభ్యాసం.. భవితకు సోపానం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: కళలు భగవంతుడి ప్రసాదం. అందరికీ దొరికేది కాదు. ఎంతో ఇష్టంతో సాధన చేస్తేనే సొంతమవుతుంది. అది కొందరికి ఉపాధి మార్గం చూపితే.. మరికొందరిని ఎంతో గొప్ప కళాకారులుగా తీర్చిదిద్దుతుంది. రాజమహేంద్రవరంలోని విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల 50 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా జనవరి 2, 3, 4 తేదీల్లో స్వర్ణోత్సవ వేడుక జరగనుంది. ఇక్కడి విద్యార్థులు చాలామంది గొప్ప స్థానాల్లో స్థిరపడ్డారు. ఈ సందర్భంగా తమ అభిప్రాయాలు పంచుకున్నారిలా.

విద్యార్థులకు నాట్యశిక్షణ అందిస్తున్న కదలి శ్రీరాజరాజేశ్వరి

రుక్మిణీ కల్యాణం నృత్యరూపకంలో శిశుపాలుడిగా కుమారదత్త

నృత్యం అంటే ప్రాణం..

బీఎస్సీ బీఈడీ చేశాను. మరో పక్క కూచిపూడి సర్టిఫికెట్ కోర్సు చేసి, నృత్యంలో పీహెచ్‌డీ చేశాను. బొమ్మూరులో శ్రీకర్ నృత్యనికేతన్ పేరుతో సొంతంగా నాట్యాలయం నిర్వహిస్తున్నా. ఇంతవరకు 25 కార్యశాలలు, 40 సెమినార్లలో పాల్గొని ప్రసంగించాను. సుమారుగా 500 వరకు నృత్య కార్యక్రమాల్లో పాల్గొన్నా. నృత్య పోటీలకు న్యాయనిర్ణేతగాను వ్యవహరిస్తున్నా. నన్నయ విశ్వవిద్యాలయంలో నృత్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాను. దూరదర్శన్ బి-గ్రేడ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు లభించింది. - కదలి శ్రీరాజరాజేశ్వరీదేవి, కూచిపూడి నాట్యగురువు

16 ఏళ్లుగా శిక్షణ..

విజయ శంకర పాఠశాలలో సర్టిఫికెట్, డిప్లొమో కోర్సులు చేశాను. కూచిపూడి నృత్యంలో పీహెచ్‌డీ చేశాను. దేశవిదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చాను. వివాహం తర్వాత హైదరాబాద్‌లో సొంతంగా శిక్షణాలయం స్థాపించి 16 ఏళ్లుగా వేలమందికి శిక్షణ ఇస్తున్నా. నాట్య ప్రచారంలో భాగంగా మా శిష్యబృందంతో తిరుపతి, శ్రీశైలం, విజయవాడ, ద్వారకా తిరుమల, భద్రాచలం, వారణాసి తదితర పుణ్య క్షేత్రాల్లో ప్రదర్శనలు ఇచ్చాను. - కె.విజయలక్ష్మి, నాట్యగురువు

అమెరికాలో ప్రదర్శనలు..

కూచిపూడి నాట్యం పురుడు పోసుకున్న కూచిపూడి మా సొంతూరు. నాన్న పసుమర్తి శ్రీనివాసశర్మ నాట్య గురువు. ఓ వైపు చదువుకుంటూనే విజయ శంకర పాఠశాలలో నృత్యం, కర్ణాటక సంగీతంలో సర్టిఫికెట్, డిప్లొమో కోర్సులు చేసి సెంట్రల్ యూనివర్సిటీలో పరిశోధన చేశాను. దేశవ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చాను. అమెరికాలో మూడు సార్లు నృత్య ప్రదర్శనలు ఇచ్చాను. ప్రస్తుతం బెంగళూరులోని అలయన్స్ విశ్వవిద్యాలయంలో నృత్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నా. - పసుమర్తి కుమారదత్త, నాట్యాచార్యుడు

సరికొత్త లక్ష్యాల సాధనకు కృషి

సమావేశంలో మాట్లాడుతున్న జీజీయూ ఛాన్సలర్

రాజానగరం, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేళ సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కంకణబద్ధులు కావాలని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ) ఛాన్సలర్ కె.వి.వి.సత్యనారాయణరాజు అన్నారు. జీజీయూలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఉద్యోగులందరూ దృఢ సంకల్పంతో, బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. అనంతరం అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జీజీయూ ప్రొ వైస్‌ఛాన్సలర్ డా.కె.వి.బి.రాజు, డైరెక్టర్లు డా.ఎం.శ్రీనివాసరావు, కె.వి.రామరాజు, రిజిస్ట్రార్ డా.పి.ఎం.ఎం.ఎస్.శర్మ, డీన్ డా.బి.ప్రభాకరరావు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం, కోరుకొండ మండలాల్లో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను నేడు భూ యజమానులకు అందజేయనున్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సీతారాంపురంలో ఉదయం 10, నరేంద్రపురంలో 10:30, గాడాల్లో 11 గంటలకు గ్రామసచివాలయాల వద్ద సభలు ఏర్పాటు చేసిన సంబంధిత భూ యజమానులకు అందజేస్తారు.

సందడిగా నూతన సంవత్సర వేడుకలు

కోరుకొండ, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం ప్రారంభం వేళ నేతల కార్యాలయాలు, గృహాల్లో సందడిగా నెలకొంది. రాజమహేంద్రవరంలోని తన స్వగృహంలో గురువారం జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులను నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు చెందిన కూటమి శ్రేణులు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు ఆయనను కలిశారు. ● నియోజకవర్గ భాజపా ఇన్‌ఛార్జి నీరుకొండ వీరన్న చౌదరిని గురువారం కూటమి నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఎంఈవో టి.కుశలవదొరను ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన ఉపాధ్యాయులు, కరస్పాండెంట్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యాలయాల్లోనూ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

కోరుకొండ: మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నివాసంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని వైకాపా శ్రేణులు, అభిమానులు, అధికారులు పెద్ద సంఖ్యలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే బత్తుల నివాసంలో నాయకుల సందడి

రాజానగరం: రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నివాసంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ సీనియర్ నాయకుడు అడపా శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలతో ఊరేగింపుగా వెళ్లి ఎమ్మెల్యే బత్తులను గజమాలతో సత్కరించారు. నియోజకవర్గంలోని పలు శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున వచ్చి ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ నూతన సంవత్సరంలో నియోజకవర్గ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని, ఇందుకు కూటమి పార్టీ నాయకులు సహకరించాలని కోరారు. పథకాలను అర్హులకు ఎంపిక చేయడంలో వారు కృషి చేయాలన్నారు. శుభాకాంక్షలు తెలిపేందుకు శాలువాలు, పుష్పగుచ్ఛాలు, పూలదండలు, బహుమతులు తీసుకురావద్దని ముందుగానే ఆయన సూచించారు. దాంతో వారంతా నోట్ పుస్తకాలు తీసుకువచ్చి ఆయనకు తులాభారం వేశారు. అనంతరం ఆయన కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి.నరసింహకిశోర్, రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్ రాహుల్‌మీనా తదితరులను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను సత్కరిస్తున్న నాయకులు

నేటి నుంచి సంగీత, నృత్య పాఠశాల స్వర్ణోత్సవం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 2, 3, 4 తేదీల్లో స్వర్ణోత్సవం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ పసుమర్తి శ్రీనివాసశర్మ తెలిపారు. రాజమహేంద్రవరం ఆనంరోటరీ హాల్‌లో జరిగే వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7.30 గంటలకు నగర సంకీర్తన, 8.30గంటలకు నాదస్వరం, వేదస్వస్తి ఉంటుంది. ప్రార్థనా గీతాలు, స్వాగత నృత్యంతో 10 గంటలకు సభ ప్రారంభం, పూర్వవిద్యార్థుల ప్రదర్శన, మధ్యాహ్నం 3 గంటలకు వీణా కచేరీ, పూర్వవిద్యార్థుల గాత్రకచేరీ, సాయంత్రం కూచిపూడి నృత్య రూపకం ఉంటాయి. 3న ఉదయం 9 గంటల నుంచి గాత్రకచేరీ, నృత్య ప్రదర్శన, 11 గంటలకు కవితా సదస్సు, మధ్యాహ్నం 3 గంటల నుంచి గాత్రకచేరీ, వీణా కచేరీ, కూచిపూడి నృత్య రూపకం ఉంటాయి. 4న ఉదయం 9 గంటల నుంచి పంచరత్న సేవ, నృత్య ప్రదర్శన, వీణా కచేరీ, అధ్యాపకుల వాద్య కచేరీ, భక్తి సంగీతం, రాత్రి 7 గంటల నుంచి పురస్కారాల ప్రదానంతో వేడుక ముగుస్తుందని పేర్కొన్నారు.

గుంతలతో చింత

శాటిలైట్ సిటీ బీ బ్లాక్ ప్రధాన రహదారి గుంతలు పడి దెబ్బ తింది. రాత్రి సమయంలో వీధి దీపాలు లేక గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వాహనాలతో పాటు, నడుం నొప్పులు వస్తున్నాయని, సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మోరంపూడి

రక్షణ కల్పించరూ...!

కోరుకొండ మండలం రాఘవపురం వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న వంతెనకు ఇరువైపులా గతంలో రక్షణగా సిమెంటు స్తంభాలు ఏర్పాటు చేశారు. తరువాత కాలం గడిచేకొద్దీ కొన్ని స్తంభాలు శిథిలమయ్యాయి. వంతెనకు కింద నుంచి కాలువ ప్రవహిస్తుంది. వాహనచోదకులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం తప్పదు. ఇక్కడ వంతెనకు ఒకవైపు రక్షణగా 10 స్తంభాలు ఉండగా, మరోవైపు కేవలం నాలుగే ఉన్నాయి. మిగిలినవి పూర్తిగా శిథిలమవడంతో ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోరుకొండ

ఇళ్ల ముందే మురుగు

పిడింగొయ్యి పంచాయతీ వేంకటేశ్వర నగర్ వీధిలో ఇళ్ల మధ్య మురుగు నీరు పేరుకుపోయింది. గతంలో ప్రధాన కాలువ శిథిలమై మురుగు మొత్తం ఇళ్ల ముందే చేరుతుందని కాలనీ వాసులు వాపోతున్నారు. మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, సమస్యను సంబంధిత అధికారులు స్పందించి పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మోరంపూడి

ఈ వాహనం ఎవరిది..?

బొమ్మూరు వైటీసీలో ఓ ప్రభుత్వ వాహనం పూర్తిగా తుప్పపట్టి నిరుపయోగంగా ఉంది. ఏళ్ల తరబడి ఉండటంతో టైర్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. రూ.లక్షల విలువైన వాహనం ఎండ, వానకు తడుస్తు రూపురేఖలు మారిపోతున్నాయని పలువురు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, బొమ్మూరు

మేమున్నాం.. మీకు తోడుగా

© ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
ధవళేశ్వరం: 91212 29057,
కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

సమస్య: రాజవోలు అరుంధతిపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద తాగు నీరు రెండు రోజుల నుంచి రావడం లేదు. వీధి కొళాయి పైపు పగిలిపోయింది.
- వెంకటరావు, స్థానికుడు

సమాధానం: మరమ్మతులు చేయించి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం.
- శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి, రాజవోలు
- న్యూస్‌టుడే, బొమ్మూరు

విశ్వవిద్యాలయ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ

కొత్త ఆలోచనలతో అభివృద్ధి

రాజానగరం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో కొత్త ఆలోచనలతో నన్నయ విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి చేద్దామని వీసీ ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా వీసీ ప్రసన్నశ్రీ 2026 విశ్వవిద్యాలయ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ 2025లో మూడు నూతన భవనాలు ప్రారంభించమని, జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, నారీఫెస్ట్, ఫుడ్ ఫెస్ట్, భాషా సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేశామన్నారు. రిజిస్ట్రార్ కేవీ స్వామి విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రాణాలో నూతన భవనం ప్రారంభం

రాజానగరం: రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన భవనాన్ని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.బి.ఎం.మురళీకృష్ణ గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా చోరీల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పండగ సెలవులకు వెళ్ళే ఇంటి యజమానులు లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ఉపయోగించుకునే విధంగా అప్రమత్తం చేయాలని సూచించారు. ఉత్తమ మండల డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ ఎస్.ప్రసన్నవీరయ్యగౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అదనపు భవనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

ఇలా ఆటోలు.. ఎలా రాకపోకలు?

ఆటోలు అడ్డుగా ఉంటే తాము ఎలా వచ్చి వెళతామని ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోరుకొండ ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని ఒక వైపు ఆటోలు ఎక్కువగా అడ్డు పెడుతున్నారు. ఇటు నాగంపల్లి, బొల్లెద్దుపాలెం ప్రాంతాల నుంచి కోరుకొండ మీదుగా రాజమహేంద్రవరం వైపు ఆర్టీసీ బస్సులు ప్రయాణిస్తుంటాయి. ఈ నేపథ్యంలో బస్సులు ఆటోలు నిలిపే స్థలానికి వచ్చి కొంత సమయం ఆగి ప్రయాణికులను ఎక్కించుకుని వెళతాయి. ఆటోలు అడ్డుగా ఉండడం వల్ల బస్సులు కొన్నిసార్లు రహదారిపైనే ఆగి వెళ్లడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆటో డ్రైవర్లు సహకరించి తమ ఆటోలను వేరే చోట పెట్టుకోవాలని వారు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోరుకొండ

ఈ దారిలో వెళ్లేదెలా?

సంతోష్‌నగర్‌లో అధ్వానస్థితిలో ప్రధానరహదారి

దివాన్‌చెరువులోని సంతోష్‌నగర్‌లో ప్రధాన రహదారిపై మురుగునీటి కాలువ లేకపోవడంతో నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. మట్టిరోడ్డు కావడంతో నడిచేందుకు, వాహనాల రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలో రూ.కోటికి పైగా నిధులు ఉన్నప్పటికీ రహదారులు, సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టడం లేదు. పేరుకుపోయిన చెత్తను తొలగించక దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రాజానగరం

ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పోలీసు అధికారులు

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల ఆకాంక్షలు, అభీష్టాలను తెలుసుకుని అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రధాని మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టును పట్టాలెక్కించడంతో పాటు రోడ్ల అభివృద్ధి, సాగునీటి వ్యవస్థ మెరుగు, ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించడంలో మెరుగైన చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రామవరంలోని తన నివాసానికి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అధికారులతో ఆయన మాట్లాడారు. పీపీపీ విధానంలో కెనాల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. అప్పటివరకు రూ.7.1 కోట్లతో అనపర్తి నుంచి బిక్కవోలు మండలంలోని ఇళ్లపల్లి జోడునాదాల తూము వరకు రహదారిని అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. సంక్రాంతి పండుగ నాటికి పనులు పూర్తవుతాయన్నారు. నియోజకవర్గంతో పాటు జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి పుష్పగుచ్ఛాలు, శాలువాలు, జ్ఞాపికలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సాయిబాబా దర్శనానికి పోటెత్తిన భక్తులు

బిక్కవోలు, న్యూస్‌టుడే: బిక్కవోలు మండలం బలభద్రపురం ఆంధ్రా శిర్డీగా పేరొందిన సాయిబాబా మందిరానికి గురువారం భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరం కావడంతో బాబా దర్శనానికి భక్తులు అధికసంఖ్యలో విచ్చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.వి.వి.కె.పురుషోత్తమరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులకు దర్శన ఏర్పాట్లు, అన్నప్రసాద వితరణ చేశారు.

తెదేపాలో చేరిన వైకాపా నేతలు

అనపర్తి గ్రామీణం: అనపర్తి మండలం రామవరం మహేంద్రవాడకు చెందిన వైకాపా నేత సత్తి శ్రీనివాసరెడ్డి గురువారం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. తన అనుచరులతో వచ్చిన ఆయనకు తెదేపా యువనేత నల్లమిల్లి మనోజ్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కోటపాడు ఆర్యవైశ్య సంఘం ఎన్నిక

రంగంపేట, న్యూస్‌టుడే: రంగంపేట మండలం కోటపాడు గ్రామ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నడిపల్లి శ్రీనివాస మూర్తి ఎంపికయ్యారు. ఉపాధ్యక్షునిగా సాయికృష్ణ, కార్యదర్శిగా రామ్‌కుమార్, గ్రామ మహిళా అధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి, కార్యదర్శిగా సంధ్యారాణి ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు బత్తుల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు మండవిల్లి రాజా సమక్షంలో గురువారం ఎన్నిక నిర్వహించారు.

రహదారి నిర్మాణంలో నాణ్యతకు పాతర

కడియం-జేగురుపాడు బీటీ రహదారిపై కుంగిపోతున్న గ్రావెల్

కడియం, న్యూస్‌టుడే: కడియం నుంచి జేగురుపాడు శివారు వరకూ కాలువ రహదారి నిర్మాణ పనులకు నాబార్డు నిధులు రూ.2.60 కోట్లు కేటాయించారు. ఇటీవల ఈ పనులు ప్రారంభించారు. పాత తారు రోడ్డును ధ్వంసం చేశారు. ఆ వ్యర్థాలను తొలగించాల్సి ఉండగా వాటినే యథాస్థితిలో ఉంచి రోలర్‌తో తొక్కించి వాటిపై పనులు ప్రారంభించారు. రహదారి ఇరువైపులా గ్రావెల్ వేశారు. ఇది కాస్తా సమీపంలో ఉన్న నదిలోకి కుంగిపోతోంది. ● ఇదే తరహాలో దోశాలమ్మకాలనీ నుంచి దామిరెడ్డిపల్లి వరకూ దున్నపోతుల పుంత రహదారి నిర్మాణం గతంలో చేపట్టారని, ఏడాది గడవకుండానే గుంతలతో దర్శనమిచ్చిందని పలువురు వాహనదారులు వాపోయారు. ప్రస్తుత రహదారిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నాసిరకంగా ఉంటున్నాయని విమర్శిస్తున్నారు. దీనిపై సంబంధిత ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైన చోట రహదారి కుంగిపోకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసేందుకు టెండర్ షెడ్యూల్‌లో పొందుపరిచామన్నారు.

(c) eenadu

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ రహిత సమాజంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం కానుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో గాంధీజీ విగ్రహానికి గురువారం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుందరబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర పేరుతో నిర్వహిస్తున్న కార్యాచరణలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘ గౌరవాధ్యక్షుడు మైగాపుల నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొరయ్య, యూనియన్ నాయకులు మానికిరెడ్డి హరిబాబు, బీరా రవి తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో జన్మభూమికి హాల్ట్ ఇవ్వాలి

రైల్వేస్టేషన్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

నిడదవోలు: జన్మభూమి ఎక్స్‌ప్రెస్ అనకాపల్లితో పాటు నిడదవోలులో కూడా హాల్ట్ ఇవ్వాలని పట్టణ ప్రజల సంక్షేమ సంఘ అధ్యక్షుడు జువ్వల రాంబాబు అన్నారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నిడదవోలు రైల్వేజంక్షన్‌లో హాల్ట్ ఇవ్వాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు పొన్నా కృష్ణబాబు, యర్రా శ్రీను, శ్రీరామ్, రఫెల్, లక్ష్మణరావు, రామయ్య, కోట సాయి, సత్యనారాయణ, అంజనేయులు పాల్గొన్నారు.

మంత్రి దుర్గేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నిడదవోలు పురపాలక ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, సంఘ సిబ్బంది, పట్టణ తెదేపా అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు

2026లో అందరికీ సత్ఫలితాలు రావాలి: మంత్రి

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు పట్టణంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మంత్రి కందుల దుర్గేష్ జనసేన కార్యాలయం వద్ద అందుబాటులో ఉన్నారు. దుర్గేష్ మాట్లాడుతూ.. త్వరలోనే రాష్ట్రంలో మరిన్ని అభివృద్ధి సంక్షేమ ఫలాలు ప్రజలు చూస్తారన్నారు. పర్యాటక రంగంలో నిడదవోలుకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే తన లక్ష్యమన్నారు. 2026 అందరికీ సత్ఫలితాలు ఇచ్చే సంవత్సరం కావాలని ఆకాంక్షించారు. పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, పట్టణ తెదేపా అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు తదితర కూటమి నాయకులు మంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైకాపా కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడుకు వైకాపా నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నాయకులు, అభిమానుల మధ్య కేకు కోస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరును అభివృద్ధి పథాన నిలుపుతాం: ముప్పిడి

కొవ్వూరు పట్టణం: పుష్కరాల కార్యాచరణతో కొవ్వూరు అభివృద్ధి పథాన నిలుస్తుందని.. నూతన వసంతంలో నియోజకవర్గ సమగ్రాభివృద్ధి సాకారం కానుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులోని నియోజకవర్గ తెదేపా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుక నిర్వహించారు. అభిమానులు, పార్టీ శ్రేణుల సమక్షంలో కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం నుంచి ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, ప్రముఖులు ఎమ్మెల్యేకు పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీహెచ్‌సీ కూడా ఏరియా ఆసుపత్రిగా మారనుందన్నారు. రూ.70 కోట్లతో గోదావరి శుద్ధ జలాన్ని ప్రజలకు పంపిణీ చేసే పనులకు టెండర్లు పూర్తయ్యాయన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, ఏఎంసీ ఛైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, సూరపనేని చిన్ని, మద్దిపట్ల శివరామకృష్ణ, భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, తెదేపా కొవ్వూరు పట్టణ, మండల అధ్యక్షులు అర్జెల్లి రామకృష్ణ, నారాయణ హాజరయ్యారు.

13 గ్రామాలు.. 45 వేల ఎకరాలు

నాలుగో విడత భూముల రీసర్వేకు సన్నద్ధం

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

ఏళ్ల నాటి భూ సమస్యలను పరిష్కరిస్తామని గత ప్రభుత్వం ఊదరగొట్టింది. ఆ మాటెలా ఉన్నా సరిహద్దు వ్యత్యాసాలు, సంయుక్త ఎల్పీఎంలతో కొత్త వెతలు తెర మీదకొచ్చాయి. ఆర్భాటంగా ఆరంభించిన భూముల రీసర్వేలో లోపాలు రైతుల పాలిట శాపాలుగా మారాయి. దీంతో వారు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇప్పటి వరకు మూడు విడతలుగా సర్వేలో పూర్తి చేశారు. తాజాగా నాలుగో దశగా రీసర్వే, గ్రామసభల నిర్వహణకు రంగం సిద్ధం చేశారు. ఈ సభలలో భారత చిహ్నంతో కూడిన పాసు పుస్తకాలను అందించనున్నారు. సర్వే మొత్తాన్ని వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలన్నది ప్రభుత్వ సంకల్పంగా ఉంది.

కొవ్వూరు డివిజన్‌లో ఇలా..

మండలాలు:	9
మొత్తం గ్రామాలు:	149
మూడు విడతల్లో రీసర్వే చేసిన గ్రామాలు:	119
పట్టణాలు:	కొవ్వూరు, నిడదవోలు
రీసర్వే చేసిన భూ విస్తీర్ణం:	2,00,198.087 ఎకరాలు

తాజాగా 72 మందితో..

ప్రభుత్వ తాజా నిర్ణయంతో డివిజన్‌లో 13 గ్రామాలను ఎంపిక చేశారు. మొత్తంగా 45,085 ఎకరాలను రీసర్వే చేసేందుకు 24 రోవర్లను వాడనున్నారు. సర్వేయర్లు, వీఆర్వోలు, ఇతర సిబ్బంది 72 మంది సర్వే చేపట్టనున్నారు.

రైతుల ఆవేదన ఇదీ..

● డివిజన్‌లో ఎల్పీఎంలు 1,03,661 ఉండగా సుమారు 1500 వరకు పెండింగ్‌లో ఉన్నాయని తెలుస్తోంది. అలాగే ఉండాల్సిన భూమి విస్తీర్ణం కన్నా తగ్గిందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ● అధికారులైతే వినతులను పరిష్కరిస్తామని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఈ సమస్యపై అధికారుల చుట్టూ భూ యజమానులు తిరుగుతున్నారు. ● ఈసారి జరిగే గ్రామసభల ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని రైతులు ఎదురు చూస్తున్నారు.

గ్రామసభల్లో పాసు పుస్తకాల పంపిణీ..

జనవరి రెండో తేదీ నుంచి నాలుగో విడత రీసర్వే ప్రారంభం కానుంది. ఈ మేరకు డివిజన్లోని 13 గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు వచ్చిన అభ్యంతరాల పరిష్కారానికి యంత్రాంగం శ్రద్ధ చూపుతోంది. గ్రామసభల్లో పట్టాదారు పాసు పుస్తకాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- రాణి సుస్మిత, ఆర్డీవో, కొవ్వూరు

పుష్య పూర్ణిమ మహానీరాజనం

నేడు

కొవ్వూరు పట్టణం: సంస్కృతికి మూలమైన గోదావరికి నీరాజనం సమర్పించడం సనాతన సంప్రదాయమని నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు గురువారం అన్నారు. మార్గశిర పూర్ణిమ సందర్భంగా ఈనెల 2న (శుక్రవారం) 244వ మాసోత్సవ మహానీరాజనాన్ని సమర్పించనున్నామన్నారు. గోదావరిమాత అష్టోత్తర నామావళి, కుంకుమార్చన చేసి మహానీరాజన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

నేటి నుంచి ద్వాదశ జ్యోతిర్లింగ రుద్రయాగం

తాళ్లపూడి: తాళ్లపూడి శివాలయంలో శుక్రవారం నుంచి 5వ తేదీ వరకు ద్వాదశ జ్యోతిర్లింగ రుద్రయాగం జరుగుతుందని జంధ్యాల గంగాధరశర్మ తెలిపారు. దీనిని పురస్కరించుకొని ఆలయప్రాంగణం, ప్రధాన వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. రోజూ పురాణ ప్రవచనం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష్మీగణపతి, రుద్ర, నక్షత్ర నవగ్రహ హోమాలు, లక్షపత్రిపూజ, లక్ష రుద్రాక్షల పూజ, లక్షపుష్పార్చన జరుగుతాయన్నారు. చివరి రోజున ద్వాదశ జ్యోతిర్లింగాల ఊరేగింపు, నిమజ్జనం, జ్యోతిర్లింగ దీపోత్సవం, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి పాసు పుస్తకాల పంపిణీ

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు మండలంలో గ్రామసభలు నిర్వహించి పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు ఎం.దుర్గాప్రసాద్ గురువారం తెలిపారు. ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే గ్రామసభల్లో 3607 పట్టాదారు పాసు పుస్తకాలను అందించనున్నామన్నారు. శుక్రవారం పెనకనమెట్ట సచివాలయం వద్ద గ్రామసభ ప్రారంభం కానుందన్నారు. 3న ధర్మవరం, 5న ఐ.పంగిడి, 6న మద్దూరు, మద్దూరులంక, 7న పశివేదల, 8న తోగుమ్మి, 9న చిడిపి గ్రామ సచివాలయాల వద్ద సభలు జరగనున్నాయన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని తెలిపారు.

జూద స్థావరాలపై పోలీసుల దాడి

గోపాలపురం: గోపాలపురం మండలం హుకుంపేటలో కోడి పందేల స్థావరాలపై ఎస్సై పి.మనోహర్, శిక్షణ ఎస్సై పి.శివ సిబ్బందితో గురువారం రాత్రి దాడి చేశారు. హుకుంపేట, ఎల్.ఎన్.డి పేటకు చెందిన ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.4500 నగదు, రెండు కోడి పుంజులు, 2 కోడి కత్తులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

దళితుల సంక్షేమానికి కృషి - ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: రాజ్యాంగ పరంగా దళితుల హక్కులను రక్షించి వారి సంక్షేమానికి ఎస్సీ కమిషన్ చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఛైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. కొవ్వూరులోని కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకను గురువారం నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, సబ్ డివిజినల్ పోలీసు యంత్రాంగం జవహర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. కేకు కోసి పంచారు. పలు శాఖల అధికారులు, సిబ్బంది, నాయకులు జవహర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

జవహర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు

కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తోంది

నల్లజర్ల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తోందని హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరాసాహెబ్ తెలిపారు. గురువారం ఆవపాడు తెదేపా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అన్నింటిని చెప్పినట్టుగా అమలు చేసిందన్నారు. గ్రామశాఖ అధ్యక్షుడు అచ్యుత వెంకటేశ్వరరావు, జోగినీడి వెంకట్రావు, అచ్యుత మధసూదనరావు, దొండపాటి శరత్, సింగం రాజేష్, తూముల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మీరాసాహెబ్

సత్తా చాటి.. బహుమతి సాధించి

● ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కొవ్వూరు పట్టణ పరిధిలోని అభ్యాస పాఠశాలలో గురువారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'జనరల్ నాలెడ్జి, కరెంట్ అఫైర్స్' అంశాలపై విద్యార్థులకు క్విజ్ పోటీలు ఆహ్లాదకర వాతావరణంలో జరిగాయి. 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని సమాధానాలను రాసి ప్రతిభ చాటుకున్నారు. తొమ్మిదో తరగతి విదార్థులు జి.సూర్య గణేష్, బి.రేఖ, పి.ప్రణతి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ పి.వెంకటరమణ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, విజేతలతో అభ్యాస పాఠశాల కరస్పాండెంట్ పి.వెంకటరమణ

క్విజ్ పోటీల్లో విద్యార్థులు, విజేతలతో అభ్యాస కళాశాల కరస్పాండెంట్ పి.వెంకటరమణ

అభ్యాస కళాశాలలో..

కొవ్వూరు పట్టణ పరిధిలోని అభ్యాస జూనియర్ కళాశాలలో గురువారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలు జరిగాయి. 'జనరల్ నాలెడ్జి, కరెంట్ అఫైర్స్' అంశాలపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. జి.లక్ష్మీప్రియ, కె.దీక్షసాయి (ప్రథమ ఎంపీసీ), కె.లేఖన (ద్వితీయ ఎంపీసీ) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ పి.వెంకటరమణ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

అల్లుకున్న ప్రమాదం

దేవరపల్లి మండలం యర్నగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని విద్యుత్తు నియంత్రిక చుట్టూ పిచ్చి మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఇదే ప్రాంతంలో సచివాలయం ఉండడంతో నిత్యం ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ సురేష్‌కుమార్‌తో మాట్లాడగా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, దేవరపల్లి

సూచికలు లేక.. ప్రమాదాలు ఆగక

నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం నుంచి ఆవపాడు, సింగరాజు పాలెం వెళ్లే రోడ్డులో మలుపుల వద్ద సూచికలు లేకపోవడం, ఇరువైపులా తుప్పలు పెరగడంతో ఎదురొచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం వాహనాల రాకపోకలకు రద్దీగా ఉండే రోడ్డులో మలుపుల వద్ద కనీసం ప్రమాద సూచికలైనా ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు, వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ర.భ.శాఖ డీఈ వెంకటరమణ వద్ద ప్రస్తావించగా పరిశీలించి సూచకల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, నల్లజర్ల

పఠనాలయానికి పగుళ్లు

ఉండ్రాజవరంలోని శాఖా గ్రంథాలయంలో ఫ్లోరింగ్ దెబ్బతింది. టైల్స్ పగిలి పాఠకుల రాకపోకలకు ఆటంకంగా ఉంది. అదుపుతప్పి జారిపడటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని 15 గ్రామాలకు ఇది ఒక్కటే శాఖా గ్రంథాలయం కావటంతో ఎక్కువ మంది విద్యార్థులు, పాఠకులు సద్వినియోగం చేసుకుంటున్నారు. మరమ్మతు పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. చర్యలు తీసుకుంటామని గ్రంథపాలకుడు గుత్తికొండ కృష్ణారావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

కల్వర్టు నిర్మించరూ..

ఉండ్రాజవరం మండలంలోని చివటం నుంచి వడ్లూరు, రెడ్డిచెరువు మీదుగా సూర్యారావుపాలెం వెళ్లే రహదారిలో కల్వర్టు దెబ్బతింది. ఈ రోడ్డు మీదుగా నిత్యం వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. పాఠశాలల బస్సులు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. కల్వర్టు నిర్మించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి అభివృద్ధి పనులు చేపడతామని ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసు తెలిపారు. – న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

జనసేన క్యాలెండర్‌లు ఆవిష్కరణ

క్యాలెండర్ ప్రదర్శిస్తున్న మంత్రి దుర్గేష్, రామకృష్ణ

ఉండ్రాజవరం: మండల కేంద్రమైన ఉండ్రాజవరానికి చెందిన చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు కటకం రామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన క్యాలెండర్‌లను మంత్రి కందుల దుర్గేష్ చిత్రాలు, పార్టీకి సంబంధించిన చిత్రాలతో ముద్రించారు. వీటిని మంత్రి కందుల దుర్గేష్, పార్టీ నేతల సమక్షంలో రాజమహేంద్రవరంలో గురువారం ఆవిష్కరించారు. వీటిని రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘ ఆధ్వర్యంలో..

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రెజరీ అధికారి ఫణీంద్ర

నిడదవోలు: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ క్యాలెండర్‌ను నిడదవోలు సబ్ ట్రెజరీ అధికారి ఫణీంద్ర చేతుల మీదుగా ఆవిష్కరించారు. ముందుగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కుందుల ప్రభాకరం, అసోసియేట్ అధ్యక్షుడు షేక్ షమివుల్లా, నాయకులు గుండేపల్లి సుభోష్, లక్కు తులసమ్మ, మల్లిపూడి బీకే వాసు, ఎస్.శ్రీరామచంద్రరావు, షేక్ సత్తార్‌సాహెబ్, ఏవీ రమణ, వై.ఉమామహేశ్వరరావు, పువ్వల మురళీకృష్ణ పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి విగతజీవిగా తేలి..


గెల్లా గోవింద ప్రసాద్ (పాత చిత్రం)

కొవ్వూరు పట్టణం: అదృశ్యమైన వ్యక్తి మృతదేహం గోదావరిలో లభ్యమైంది. వివరాల ప్రకారం వేములూరుకు చెందిన గెల్లా గోవింద ప్రసాద్ (38) స్థానికంగా వెల్డింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈనెల 30న అర్ధరాత్రి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. రోడ్‌కం రైలు వంతెనపై 144వ స్తంభం వద్ద అతని ద్విచక్ర వాహనం, పాదరక్షలు కనిపించడంతో 31వ తేదీ రాత్రి ఆ వివరాలతో పట్టణ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గురువారం మధ్యాహ్నం స్థానిక ఔరంగాబాదు ఇసుక ర్యాంపు సమీపంలో గోవింద ప్రసాద్ మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. చనిపోవడానికి కారణం ఏమిటనేది స్పష్టంగా తెలియరాలేదు. సోదరుడు గోవిందరాజు ఇచ్చిన ఫిర్యాదుపై హెడ్ కానిస్టేబుల్ కేవీవీ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

దేవరపల్లిలో కేకు కోస్తున్న జనసేన ఇన్‌ఛార్జి సువర్ణరాజు

ఉండ్రాజవరం ఎంపీడీవో కార్యాలయంలో..

చాగల్లు: పంటల చిత్రాలతో రంగవల్లిక

నవ వసంతానికి స్వాగతం..

కొవ్వూరు పట్టణం, తాళ్లపూడి, దేవరపల్లి, ఉండ్రాజవరం: కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. కోటి ఆశలతో ప్రజలు నవ వసంతంలోకి అడుగుపెట్టారు.. గత ఏడాది చేదు అనుభూతులను మరిచి అందరికీ మేలు కలగాలని కోరుతూ 2026 ఏడాదిని ఘనంగా స్వాగతించారు. కొవ్వూరు సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో జరిగిన ప్రార్థనలు, వేడుకల్లో ఛైర్‌పర్సన్ భావన రత్నకుమారి పాల్గొన్నారు. ● తాళ్లపూడి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, పుష్పాలతో అలంకరించారు. ● దేవరపల్లి మండలంలో మాజీ హోంమంత్రి తానేటి వనిత, జనసేన ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు తంగెళ్ల మునేశ్వరరావు తదితరులకు కార్యకర్తలు, పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. ● నూతన సంవత్సరం పురస్కరించుకుని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు, మండలంలోని ఆయా గ్రామాల్లో కూటమి నాయకులు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీవో మడిపల్లి శ్రీనివాసరావు, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాదు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపూడి వేంకటేశ్వరస్వామికి పూజలు

శ్లోకాలు పఠిస్తూ.. సంస్కృతిని పాటిస్తూ..

– న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

నేటి ఆధునిక యుగంలో ఆంగ్లం, పాశ్చాత్య సంస్కృతి ఎంతో ప్రభావం చూపుతోంది. అయినా కొంతమంది చిన్నారులు భారతీయ సంప్రదాయాల వైపు దృష్టి సారిస్తున్నారు. చదువుతో పాటు ఇతర రంగాల్లో శిక్షణ పొంది ప్రతిభతో ప్రావీణ్యం సంపాదిస్తున్నారు. పిల్లల ఆసక్తికి అనుగుణంగా తల్లితండ్రులు ప్రోత్సహిస్తున్నారు. శ్లోక పఠనం, సంగీతం, నృత్యం, సూర్యనమస్కారాలు, దేవతాష్టకాలను నిత్య జీవన విధానంగా మారుస్తున్నారు.

వీరిదే ప్రధాన భూమిక..

కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠం, సంస్కృత భారతి, పవిత్ర జీవన్ సంస్థాన్ ఆధ్వర్యంలో గీతా పారాయణ, శ్లోక కంఠస్థీకరణ, ఆధ్యాత్మిక ప్రతిభ పోటీలు నిర్వహిస్తున్నారు. పుష్కరాలు, పర్వదినాలు, విశేష కార్యక్రమాల నేపథ్యంలో ఆధ్యాత్మిక వేదికలపై చిన్నారులతో సామూహిక సహస్ర గళార్చన చేయిస్తున్నారు. అన్ని కార్యక్రమాల్లోనూ చిన్నారులే ప్రధాన భూమిక పోషిస్తున్నారు.

విదేశంలో ఉన్నా శ్లోకాల్లో దిట్ట..

కొవ్వూరుకు చెందిన పాలకోడేటి సత్యనారాయణమూర్తి మనుమడు కార్తీక్ అమెరికాలోని హ్యూస్టన్‌లోనే పుట్టి అక్కడే 8వ తరగతి చదువుతున్నాడు. భగవద్గీతలోని భక్తి, పురుషోత్తమ ప్రాప్తియోగంలోని సుమారు 40 శ్లోకాలను అనర్గళంగా చదువుతున్నాడు. రోజూ తెల్లవారుజామున లేచి సంధ్యావందనం, పూజ, సూర్యనమస్కారాలు చేస్తున్నాడు. అక్కడి చిన్మయ మిషన్‌లో విద్యార్థిగా ఉంటూ ప్రతి వారం తరగతులకు హాజరై అనేక బహుమతులు, ప్రశంసలు పొందుతున్నాడు.

చిన్నారి బహుముఖ ప్రజ్ఞ..

కొవ్వూరుకు చెందిన చెరువు శ్రీలక్ష్మీవేదప్రియ నృత్యం, సంగీతం, భగవద్గీత శ్లోక పఠనం, ఆట పాటల్లో రాణిస్తోంది. 4వ తరగతి చదువుతున్న ఆ చిన్నారి భగవద్గీతలో సుమారు 50 శ్లోకాలు, రామాయణం, భాగవతంలో శ్లోకాలను తాత్పర్యంతో సహా చెబుతుంది. కొవ్వూరు, రాజమహేంద్రవరం, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో వివిధ పోటీల్లో పాల్గొని పండితులు, ప్రముఖుల ప్రశంసలు పొందింది. గ్రంథాలయం, ఆలయాల వద్ద కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభతో అందరినీ ఆకట్టుకుంటోంది.

నోటీసు

నా క్లయింటును ప్రస్తుతం హైదరాబాద్‌లోని పోచారం ఏరియాలోని Galaxy Towers, G-201లో నివశించే కారుమంచి శ్రీహరి గారి కుమారుడు దుర్గాప్రసాద్ సంజాయిషీ ప్రకారం ఇచ్చినది.

నా క్లయింటు ఉద్యోగ బాధ్యతల రీత్యా ఉమ్మడి ఆస్తికి సంబంధించి అవసరమైన లావాదేవీల నిమిత్తం అవసరమైన సమయం కేటాయించలేని పరిస్థితిలో తన తండ్రి గారైన శ్రీ కారుమంచి శ్రీహరి గారికి ది.16-08-2010వ తేదీన బుక్ నెం.412/2010గా తన సోదరుడు, ఇద్దరు సోదరీమణులతో కలిపి "General Power of Attorney" ఇవ్వడం జరిగింది. ఇప్పుడు నా క్లయింటు చేస్తున్న ఉద్యోగానికి పదవీవిరమణ పొందినందున తన ఉమ్మడి ఆస్తికి సంబంధించి అవసరమైన లావాదేవీలకు కావాల్సిన సమయాన్ని కేటాయించగలిగిన స్థితిలో ఉన్నందున మరియు తన తండ్రి గారి వయస్సు పైబడినందున వారి బాధ్యతలను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నందున పైన ఉదహరించిన "General Power of Attorney"ని రద్దు పరుచుకొనుచు General Power of Attorney Dt: 16-08-2010తో ఏవిధమైన లావాదేవీలు జరిపిన చెల్లనేరవని తెలియజేయడమైనది.

కొవ్వూరు, **వల్లభశెట్టి సురేష్,** అడ్వకేట్
Date: 31-12-2025. కొవ్వూరు, తూ॥గో॥ జిల్లా, సెల్: 92999 08580

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | SME తాడేపల్లిగూడెం బ్రాంచి

గాంధి రెడ్డి కాంప్లెక్స్, భీమవరం రోడ్డు, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా-534102

ఈ-వేలం ద్వారా వాహనములు అమ్మకం

ఈ దిగువ ఉదహరించిన ఖాతాదారులు మా బ్యాంక్ నుండి వాహనములు కొనుగోలు నిమిత్తం లోను సౌకర్యములను పొంది వున్నారు. బ్యాంకునకు చెల్లించవలసిన వాయిదాలను సక్రమముగా చెల్లించనందున బ్యాంకు వారు వాహనములను స్వాధీనము చేసుకొని "యధాతథ స్థితిలో" ఈ వేలం ద్వారా తేది.16.01.2026న అమ్ముటకు నిర్ణయించినారు. వాహనముల లోను తాలూకా అసలు బకాయి సొమ్ము మరియు ఇతర ఖర్చులు రాబట్టుకొనుటకై ఈ క్రింది తెలిపిన వాహనములను ఇ-వేలమునకు బిడ్స్ ఆహ్వానించడమైనది.

వ. నెం.	ఖాతా నెం. & ఋణగ్రహీత పేరు	వాహనములు & మోడల్ కె.ఎం.	వాహనముల నెం., కలర్, ఆస్తి ఐడి & అక్షన్ ఐడి	రిజర్వు ధర & ధరావత్తు
1	ఖాతా నెం.41251565797 కొల్లాటి తరుణ్ తేజ	Super Luxry Bus's EICHER 6016 NCWC Km-.: Model : 2022	AP 39 UK 2001 Colour : White & Orange SBIN200067581208228165	రూ.9,00,000/- రూ.90,000/-
2	ఖాతా నెం.41251565797 కొల్లాటి తరుణ్ తేజ	Super Luxry Bus's EICHER 6016 CWC Km-.: 26297	AP 39 UK 1997 Colour : White & Orange SBIN200067581162228166	రూ.16,20,000/- రూ.1,62,000/-

ఇ-వేలం తేది మరియు సమయం: ది.16-01-2026. ఉ॥ గం॥ 11.00 నుండి మధ్యాహ్నం 2.00 గం॥ల వరకు (అపరిమిత పొడిగింపు)
బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేది మరియు సమయం ది.16-01-2026న ఉ॥ 11.00 గం॥లలోపు.
కనీస బిడ్ పెంపుదల మొత్తం : రూ.5,000/-.

నియమ నిబంధనలు: (1) రిజర్వు ధర కన్నా తక్కువ ధరకు వాహనములు అమ్మబడవు. (2) విజయవంతమైన పాటదారుడు అంగీకరించిన బిడ్ మొత్తంలో కనీసం 25% (10+15%) తక్షణమే చెల్లించవలెను. మిగిలిన సొమ్ము 7 రోజులలోపు చెల్లించని యెడల ఎటువంటి నోటీసులు లేకుండా అప్పటి వరకు చెల్లించిన సొమ్మును కోల్పోవుదురు. (3) వేలం వాయిదా వేయుటకు లేదా రద్దు చేయుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. (4) వాహనములను బ్యాంక్ పనిదినములలో తనిఖీ చేసుకొనుటకు సంప్రదించవలసిన వారు. రికవరీ ఏజెంట్, మెస్సర్స్ సూర్యాంశ్ అసోసియేట్స్, మొబైల్ నెం.80966 96191. (5) వాహనములు రిజిస్ట్రేషన్ (FRC) బాధ్యత విజయవంతమైన బిడ్డర్‌దే మాత్రమే ... తరువాత మాత్రమే వాహనములు ఇవ్వబడును. (6) మరిన్ని వివరాలకొరకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SME తాడేపల్లిగూడెం బ్రాంచ్, తాడేపల్లిగూడెం, మొబైల్ నెం.9000 94888, 76610 35133 వారిని సంప్రదించగలరు. (7) ఈ-వేలం కొరకు వెబ్ పోర్టల్ https://baanknet.com అమ్మకం వివరముల కొరకు https://baanknet.com లో పరిశీలించగలరు. (8) అవసరమైతే, వేలం సమయాన్ని అపరిమితంగా 10 నిమిషాల పొడిగించవచ్చు. గమనిక: ... ఇతర ఖర్చులను విజయవంతమైన బిడ్డరు చెల్లించవలెను.

తేది : 01.01.2026
ప్రదేశం : తాడేపల్లిగూడెం

సం/- అసిస్టెంట్ జనరల్ మేనేజర్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SME తాడేపల్లిగూడెం బ్రాంచ్

మండపేట

•మండపేట •అనపర్తి

నేడు మండపేటలో జిల్లా కలెక్టర్ పర్యటన

మండపేట, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లాలో మండపేట నియోజకవర్గం విలీనమైన సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం నియోజకవర్గంలో పర్యటిస్తారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కపిలేశ్వరపురం మండలం నేలటూరు గ్రామంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. అనంతరం 11.30 గంటలకు మండపేట మండలం మారేడుబాక గ్రామం, మధ్యాహ్నం 2.30 గంటలకు రాయవరం మండలం నదురుబాదలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీలో కలెక్టర్ పాల్గొంటారని వివరించారు.

4న ఎమ్మెల్యే వేగుళ్ల సత్కార సభ

రాయవరం, న్యూస్‌టుడే: మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయడంలో కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును ఐకాస ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన సత్కరించే పౌర సన్మానానికి తరలిరావాలని తెదేపా మండల అధ్యక్షుడు నల్లమిల్లి సతీష్‌రెడ్డి, రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ వుండవిల్లి రాంబాబు పిలుపునిచ్చారు. గురువారం వారు మాట్లాడుతూ ఆరోజు మధ్యాహ్నం రెండు గంటలకు మండపేటలో నిర్వహించే సన్మానసభకు పార్టీలకతీతంగా విచ్చేయాలని కోరారు. సభా ఏర్పాట్లపై ప్రజా సంఘాలు, వివిధ పార్టీల ప్రతినిధులతో చర్చించేందుకు నియోజకవర్గం ఐకాస ఛైర్మన్ కామన ప్రభాకరరావు రాయవరంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారని పేర్కొన్నారు.

బుద్ధావతారంలో గోవిందుడు

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో దశావతార మహోత్సవాల్లో భాగంగా గురువారం గోవిందుడిని బుద్ధావతారంలో అలంకరించారు. ఆలయ అర్చకులు అంగర రామకృష్ణ శోభనాచార్యులు ఆధ్వర్యంలో వైఖానస ఆగమనం ప్రకారం శ్రీవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పుష్పాలంకరణ అనంతరం బుద్ధావతారంలో వేంకటేశ్వరస్వామి దర్శనమిచ్చారు. ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు

పెదపూడి, న్యూస్‌టుడే: పెదపూడి మండలం పుట్టకొండ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గోదాదేవికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమ పూజలు జరిపించారు. నూతన సంవత్సర సందర్భంగా దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

సాయిబాబా దర్శనానికి పోటెత్తిన భక్తులు

బిక్కవోలు, న్యూస్‌టుడే: బిక్కవోలు మండలం బలభద్రపురం ఆంధ్రా షిర్డీగా పేరొందిన సాయిబాబా మందిరానికి గురువారం భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరం కావడంతో బాబా దర్శనానికి భక్తులు అధికసంఖ్యలో విచ్చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.వి.వి.కె.పురుషోత్తమరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులకు దర్శన ఏర్పాట్లు, అన్నప్రసాద వితరణ చేశారు.

శ్రీవారి ఆలయంలో..

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరు వెంకటేశ్వరనగర్‌లో శ్రీభూ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆంగ్ల సంవత్సర సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. స్థానిక గ్రామదేవత దోసాలమ్మ గుడిలో ఉదయం నుంచి వివిధ పూజలు నిర్వహించారు. భక్తులు చీరలు, గాజులు సమర్పించారు. హుకుంపేట ముడుగుల్లో దేవతా మూర్తులకు అర్చకులు వివిధ కైంకర్యాలు నిర్వహించారు.

రేపు అగస్త్యేశ్వరాలయంలో అన్నాభిషేకం

మండపేట, న్యూస్‌టుడే: ధనుర్మాసం ఆర్ద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీబాలత్రిపురసుందరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం 74వ వార్షిక అన్నాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం ప్రారంభమవుతాయని వివరించారు.

కొత్త జిల్లాలో కొంగొత్త ఆశలు

అభివృద్ధి, స్వావలంబన దిశగా ప్రణాళికలు: ఎమ్మెల్యే వేగుళ్ల

ముఖాముఖి

మండపేట, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విభజన సమయంలో మండపేట నియోజకవర్గాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో విలీనం చేసినప్పటి నుంచి నియోజకవర్గం ప్రజలు అసంతృప్తితోనే ఉన్నారు. వారు ఈ మార్పు కోరుకోలేదు. అప్పటి నుంచి నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా తూర్పుగోదావరి జిల్లాలోనే కొనసాగించాలని పలు సందర్భాల్లో ప్రజలు నిరసన వ్యక్తంచేయడం.. అన్ని పార్టీలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఐక్య కార్యాచరణ సమితి ఏర్పాటుచేసి ఉద్యమబాట పట్టారు. ఎన్నికల్లో ఇదే ప్రధాన అంశంగా మారడంతో తెదేపాకు అత్యధిక మెజార్టీతో పట్టం కట్టారు. చిరకాల వాంఛ నెరవేరడంతో కొత్త జిల్లాలో, కొత్త సంవత్సరంలో ప్రజలకు భవిష్యత్‌పై ఎన్నో ఆశలు.. ఆకాంక్షలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కొత్త జిల్లాలో యువత, విద్యార్థులు, మహిళలు, పారిశ్రామికవేత్తల ఆకాంక్షల మేరకు పలు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. వాటి వివరాలు ఆయన మాటల్లోనే..

యువత కోసం: క్రీడలు, సాధనకు సంబంధించి మున్సిపాలిటీ పరిధిలో రెండు స్టేడియాలు నిర్మించాలని ప్రతిపాదించాం. ఏడిద రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఔట్‌డోర్ స్టేడియం, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఖాళీ స్థలంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపడతాం. క్రీడాకారుల్లో నైపుణ్యం పెంచేలా చర్యలు తీసుకుని వారిని జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రోత్సహిస్తాం. యువతకు ఉద్యోగావకాశాలు మెరుగుపరిచేలా ప్రత్యేక ప్రణాళికతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ఉద్యోగ మేళాలు నిర్వహించి ఎక్కువ మందికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తాం.

మహిళలు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల అభ్యున్నతికి పలు పథకాలు ప్రవేశపెట్టాయి. వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటాం. మహిళలకు అమలుచేసే పథకాలు, మంజూరుచేసే రుణాలకు సంబంధించిన వివరాలు జిల్లా కేంద్రంలో లభ్యమవుతాయి. శుక్రవారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మండపేటలో పర్యటించనున్నారు. ఆమెతో ఆయా విషయాలపై మాట్లాడి ప్రణాళిక సిద్ధం చేస్తాం. నియోజకవర్గంలోని మహిళల సమస్యలు వివరించి.. పథకాలు సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తాం.

విద్యార్థులు.. తల్లికి వందనం పథకంలో నగదు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల తల్లుల ఖాతాలో సక్రమంగా జమవలేదని ఎక్కువగా ఫిర్యాదులొస్తున్నాయి. వారి డేటా తీసుకుంటాం. రాజమహేంద్రవరంలోని కళాశాలల యాజమాన్యంతో మాట్లాడి ఎక్కువ సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటాం.

పారిశ్రామికవేత్తలు.. మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) కోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు స్థలాలు కేటాయించనున్నాం. కేశవరం, వేములపల్లిలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చేవారికి అనువైన 80 ఎకరాల ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంది. పారిశ్రామికవాడగా మండపేటను అభివృద్ధిచేసి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాయితీలు కల్పిస్తాం. ఇంకా ఇతర వర్గాల అభ్యున్నతికి ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి సంక్షేమ పథకాలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం.

నూతన సంవత్సరం.. ఉప్పొంగిన ఉత్సాహం

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మెప్మా మహిళలు

మండపేట, న్యూస్‌టుడే: మండపేటలో నూతన సంవత్సర వేడుకలను గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. నూతన జిల్లా ఆవిష్కృతమైన నేపథ్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో పాటు ఐకాస నాయకులకు శుభాకాంక్షలు తెలిపేందుకు జనం పోటెత్తారు. ఎమ్మెల్యే వేగుళ్ల నివాసానికి నియోజకవర్గ పరిధిలోని కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పూల బొకేలతో చేరుకున్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు, పార్టీ అభిమానులు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

బహుమతులు అందిస్తున్న సత్యనారాయణరెడ్డి తదితరులు

రంగంపేట: నూతన సంవత్సర సంబరాలతో రంగంపేట మండలంలో గురువారం సందడి నెలకొంది. ఆలయాలు, క్రైస్తవ మందిరాలు భక్తులతో కళకళలాడాయి. వడిశలేరులో తెదేపా మాజీ ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, జి.దొంతమూరులో ఆత్మ కమిటీ ఛైర్మన్ సత్తిబాబు, మండల తెదేపా అధ్యక్షుడు ఉద్దండ్రావు శ్రీనివాసరావులను కలిసి మండలంలోని కూటమి నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారీగా నాయకులు, అభిమానులు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు చెప్పారు.

రాయవరం: క్రైస్తవ ఆరాధనాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పసలపూడిలోని ఏసు కరుణాలయంలో పాస్టర్ దీవెనకుమార్ ఆధ్వర్యంలో చిన్నారులు, యువత వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, వృద్ధులకు వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం సాగునీటి సంఘం ఛైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, పాల్గొన్నారు.

మండపేటకు తరలిన నాయకులు..

తూర్పుగోదావరి జిల్లాలో మండపేట నియోజకవర్గాన్ని విలీనం చేయడంలో కీలకపాత్ర వహించిన ఎమ్మెల్యే వేగుళ్లకు కృతజ్ఞతలు తెలిపేందుకు, వల్లూరులో రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణను కలిసేందుకు అధిక సంఖ్యలో తెదేపా, భాజపా, జనసేన నాయకులు తరలివెళ్లారు.

అంగర: కపిలేశ్వరపురం మండలం అంగర, టేకి, కాలేరు, వల్లూరు, నేలటూరు, మాచర, కోరుమిల్లి తదితర గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు స్నేహితుల ఇళ్లకు వెళ్లి గ్రీటింగ్‌ కార్డులు, చాక్లెట్లు అందించి సందడి చేశారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మహిళలు ఇళ్ల ముందు రంగులతో ముగ్గులు వేశారు. యువత బాణసంచా కాల్చుతూ కేకులు కోసి సంబరాలు చేసుకున్నారు. ★ వల్లూరులో రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్, జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ వేగుళ్ల లీలాకృష్ణను పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను సత్కరించి, పుస్తకాలు, పెన్నులు, పుష్పగుచ్ఛాలు అందించారు.

నేటి నుంచి నూతన పాస్‌పుస్తకాల పంపిణీ

రాయవరం, న్యూస్‌టుడే: రాజముద్రతో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన నూతన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీకి శుక్రవారం నుంచి శ్రీకారం చుడుతున్నామని తహసీల్దారు బి.వెంకట భాస్కర్ గురువారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నదురుబాద, 4 గంటలకు వి.సావరం గ్రామాల్లో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా రైతులకు పాస్‌పుస్తకాలు అందిస్తామని పేర్కొన్నారు.

చిన్నారికి చిరు సత్కారం

రంగంపేట, న్యూస్‌టుడే: రంగంపేటలోని శ్రీజ్ఞానహరి విద్యార్థి సాల నిహాల్ గౌతమ్ ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన భగవద్గీత పఠన పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచాడు. గురువారం గౌతమ్‌ను కరస్పాండెంట్ నాగంపాటి శ్రీనివాస్, ప్రిన్సిపల్ మల్లేశ్వరి, ఉపాధ్యాయులు సత్కరించారు. మూడో తరగతి చదువుతూ ప్రతిభ చూపుతున్న విద్యార్థిని అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ: 10 - మ: 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు | మండపేట: 80085 74183 | అనపర్తి: 95333 66637

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

సమస్య: మండపేట వేగుళ్ల వీర్రాజు కూరగాయల మార్కెట్ వద్ద వాహనాలను ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు. దీనివల్ల తరచుగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. – సుబ్బారావు, మండపేట

పరిష్కారం: ఈ అంశాన్ని పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. వాహనాలు మార్జిన్ దాటి రాకుండా చర్యలు తీసుకుంటాం.

– టి.వి.రంగారావు, మున్సిపల్ కమిషనర్, – న్యూస్‌టుడే, మండపేట

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పోలీసు అధికారులు

అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల ఆకాంక్షలు, అభీష్టాలను తెలుసుకుని అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రధాని మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టును పట్టాలెక్కించడంతో పాటు రోడ్ల అభివృద్ధి, సాగునీటి వ్యవస్థ మెరుగు, ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించడంలో మెరుగైన చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రామవరంలోని తన నివాసానికి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అధికారులతో ఆయన మాట్లాడారు. పీపీపీ విధానంలో కెనాల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. అప్పటివరకు రూ.7.1 కోట్లతో అనపర్తి నుంచి బిక్కవోలు మండలంలోని ఇళ్లపల్లి జోడునాదాల తూము వరకు రహదారిని అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. సంక్రాంతి పండుగ నాటికి పనులు పూర్తవుతాయన్నారు. నియోజకవర్గంతో పాటు జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి పుష్పగుచ్ఛాలు, శాలువాలు, జ్ఞాపికలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కళల అభ్యాసం.. భవితకు సోపానం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: కళలు భగవంతుడి ప్రసాదం. అందరికీ దొరికేది కాదు. ఎంతో ఇష్టంతో సాధన చేస్తేనే సొంతమవుతుంది. అది కొందరికి ఉపాధి మార్గం చూపితే.. మరికొందరిని ఎంతో గొప్ప కళాకారులుగా తీర్చిదిద్దుతుంది. రాజమహేంద్రవరంలోని విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల 50 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా జనవరి 2, 3, 4 తేదీల్లో స్వర్ణోత్సవ వేడుక జరగనుంది. ఇక్కడి విద్యార్థులు చాలామంది గొప్ప స్థానాల్లో స్థిరపడ్డారు. ఈ సందర్భంగా తమ అభిప్రాయాలు పంచుకున్నారిలా.

విద్యార్థులకు నాట్యశిక్షణ అందిస్తున్న కదలి శ్రీరాజరాజేశ్వరి

రుక్మిణీ కల్యాణం నృత్యరూపకంలో శిశుపాలుడిగా కుమారదత్త

నృత్యం అంటే ప్రాణం..

బీఎస్సీ బీఈడీ చేశాను. మరో పక్క కూచిపూడి సర్టిఫికెట్ కోర్సు చేసి, నృత్యంలో పీహెచ్‌డీ చేశాను. బొమ్మూరులో శ్రీకర్ నృత్యనికేతన్ పేరుతో సొంతంగా నాట్యాలయం నిర్వహిస్తున్నా. ఇంతవరకు 25 కార్యశాలలు, 40 సెమినార్లలో పాల్గొని ప్రసంగించాను. సుమారుగా 500 వరకు నృత్య కార్యక్రమాల్లో పాల్గొన్నా. నృత్య పోటీలకు న్యాయనిర్ణేతగాను వ్యవహరిస్తున్నా. నన్నయ విశ్వవిద్యాలయంలో నృత్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాను. దూరదర్శన్ బి-గ్రేడ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు లభించింది. - కదలి శ్రీరాజరాజేశ్వరీదేవి, కూచిపూడి నాట్యగురువు

16 ఏళ్లుగా శిక్షణ..

విజయ శంకర పాఠశాలలో సర్టిఫికెట్, డిప్లొమో కోర్సులు చేశాను. కూచిపూడి నృత్యంలో పీహెచ్‌డీ చేశాను. దేశవిదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చాను. వివాహం తర్వాత హైదరాబాద్‌లో సొంతంగా శిక్షణాలయం స్థాపించి 16 ఏళ్లుగా వేలమందికి శిక్షణ ఇస్తున్నా. నాట్య ప్రచారంలో భాగంగా మా శిష్యబృందంతో తిరుపతి, శ్రీశైలం, విజయవాడ, ద్వారకా తిరుమల, భద్రాచలం, వారణాసి తదితర పుణ్య క్షేత్రాల్లో ప్రదర్శనలు ఇచ్చాను. - కె.విజయలక్ష్మి, నాట్యగురువు

అమెరికాలో ప్రదర్శనలు..

కూచిపూడి నాట్యం పురుడు పోసుకున్న కూచిపూడి మా సొంతూరు. నాన్న పసుమర్తి శ్రీనివాసశర్మ నాట్య గురువు. ఓ వైపు చదువుకుంటూనే విజయ శంకర పాఠశాలలో నృత్యం, కర్ణాటక సంగీతంలో సర్టిఫికెట్, డిప్లొమో కోర్సులు చేసి సెంట్రల్ యూనివర్సిటీలో పరిశోధన చేశాను. దేశవ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చాను. అమెరికాలో మూడుసార్లు నృత్య ప్రదర్శనలు ఇచ్చాను. ప్రస్తుతం బెంగళూర్‌లోని అలయన్స్ విశ్వవిద్యాలయంలో నృత్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నా. - పసుమర్తి కుమారదత్త, నాట్యాచార్యుడు

ఇలా ఆటోలు.. ఎలా రాకపోకలు?

ఆటోలు అడ్డుగా ఉంటే తాము ఎలా వచ్చి వెళతామని ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోరుకొండ ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని ఒక వైపు ఆటోలు ఎక్కువగా అడ్డుపెడుతున్నారు. ఇటు నాగంపల్లి, బొల్లెద్దుపాలెం ప్రాంతాల నుంచి కోరుకొండ మీదుగా రాజమహేంద్రవరం వైపు ఆర్టీసీ బస్సులు ప్రయాణిస్తుంటాయి. ఈ నేపథ్యంలో బస్సులు ఆటోలు నిలిపే స్థలానికి వచ్చి కొంత సమయం ఆగి ప్రయాణికులను ఎక్కించుకుని వెళతాయి. ఆటోలు అడ్డుగా ఉండడం వల్ల బస్సులు కొన్నిసార్లు రహదారిపైనే ఆగి వెళ్లడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆటో డ్రైవర్లు సహకరించి తమ ఆటోలను వేరే చోట పెట్టుకోవాలని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోరుకొండ

తెదేపాలో చేరిన వైకాపా నేతలు

శ్రీనివాసరెడ్డికి కండువా కప్పుతున్న మనోజ్‌రెడ్డి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి మండలం రామవరం మహేంద్రవాడకు చెందిన వైకాపా నేత సత్తి శ్రీనివాసరెడ్డి గురువారం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. తన అనుచులతో వచ్చిన ఆయనకు తెదేపా యువనేత నల్లమిల్లి మనోజ్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కోటపాడు ఆర్యవైశ్య సంఘం ఎన్నిక

రంగంపేట: రంగంపేట మండలం కోటపాడు గ్రామ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నడిపల్లి శ్రీనివాసమూర్తి ఎంపికయ్యారు. ఉపాధ్యక్షునిగా సాయికృష్ణ, కార్యదర్శిగా రామ్‌కుమార్, గ్రామ మహిళా అధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి, కార్యదర్శిగా సంధ్యారాణి ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు బత్తుల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు మండవిల్లి రాజా సమక్షంలో గురువారం ఎన్నిక నిర్వహించారు.

క్రీడల్లో సత్తా చాటండి

విజేతలకు బహుమతులు అందించిన ముఖ్యఅతిథులు

మండపేట, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సత్తా చాటాలని, నైపుణ్యం సాధించి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకోవాలని రాష్ట్ర భాజపా నేత, ఛైల్డ్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ వేటుకూరి సూర్యనారాయణరాజు అన్నారు. కేంద్ర ప్రభుత్వ యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మరో అతిథి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, ప్రిన్సిపల్ టీకేవీ శ్రీనివాస్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వాలీబాల్, కబడ్డీ, పరుగు పందెం, షాట్‌పుట్ తదితర క్రీడాంశాల్లో మండపేట, రావులపాలెం, కొత్తపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు ప్రతిభచాటారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. వైస్ ప్రిన్సిపల్ ఎ.ఆనందరావు, వ్యాయామ అధ్యాపకులు అరుణకిషోర్, కనకరాజు, యువరాజులను సత్కరించారు.

విజేతలు వీరే..

వాలీబాల్ మహిళల విభాగంలో రావులపాలెం ప్రథమస్థానం, మండపేట ద్వితీయ స్థానం సాధించాయి. కబడ్డీలో మండపేట ప్రథమ, కొత్తపేట ద్వితీయస్థానం, పరుగు పందెంలో పి.వీణ (కొత్తపేట) ప్రథమ బహుమతి, జి.పవిత్రరాణి (మండపేట) ద్వితీయ బహుమతి, కె.శ్రీలక్ష్మి తృతీయ బహుమతి సాధించారు. పురుషుల విభాగం పరుగు పందెంలో కె.ప్రసాద్ (రావులపాలెం) మొదటి బహుమతి, ఎస్.జైపాల్ (కొత్తపేట) రెండో బహుమతి, ఎం.సాయి తృతీయ బహుమతి అందుకున్నారు. షాట్‌పుట్ మహిళల విభాగంలో మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన జి.అనూష ప్రథమ బహుమతి, కె.నవ్య, జి.పద్మ ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. పురుషుల విభాగంలో కొత్తపేట కళాశాలకు చెందిన ఎస్.జయపాల్ ప్రథమ, సీహెచ్.పృథ్వీరాజ్ ద్వితీయ బహుమతులు అందుకున్నారు. మండపేటకు చెందిన పి.రవి తృతీయ బహుమతి సాధించారు.

అంధుల పాఠశాలలో వేడుక నిర్వహిస్తున్న న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్

దివ్యాంగుల్లో మనోధైర్యం నింపాలి

మండపేట, న్యూస్‌టుడే: దివ్యాంగులను ప్రోత్సహించి వారిలో మనోధైర్యం నింపడం ద్వారా సమాజంలో వారి గౌరవాన్ని పెంచాలని ఆలమూరు సివిల్ జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. నూతన సంవత్సర వేడుకలను గురువారం అంధుల పాఠశాలలో ఆయన కుటుంబ సమేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కోసి మిఠాయిలు పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి అంధుల పాఠశాలలో వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని పేర్కొన్నారు.

దుప్పట్ల పంపిణీ

కంబాలచెరువు: అగ్నిమాపకశాఖ సంక్షేమ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని మానవీయ ఐక్య సేవా అసోసియేషన్ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో జోన్-2 ప్రాంతీయ అగ్నిమాపకశాఖ అధికారి స్వామి, అగ్నిమాపకశాఖ అధికారి మార్టిన్ లూథర్‌కింగ్ చేతుల మీదుగా 45 మంది వృద్ధులకు దుప్పట్లు అందజేశారు.

రహదారి నిర్మాణంలో నాణ్యతకు పాతర

కడియం-జేగురుపాడు బీటీ రహదారిపై కుంగిపోతున్న గ్రావెల్

కడియం, న్యూస్‌టుడే: కడియం నుంచి జేగురుపాడు శివారు వరకూ కాలువ రహదారి నిర్మాణ పనులకు నాబార్డు నిధులు రూ.2.60 కోట్లు కేటాయించారు. ఇటీవల ఈ పనులు ప్రారంభించారు. పాత తారు రోడ్డును ధ్వంసం చేశారు. ఆ వ్యర్థాలను తొలగించాల్సి ఉండగా వాటినే యథాస్థితిలో ఉంచి రోలర్‌తో తొక్కించి వాటిపై పనులు ప్రారంభించారు. రహదారి ఇరువైపులా గ్రావెల్ వేశారు. ఇది కాస్తా సమీపంలో ఉన్న నదిలోకి కుంగిపోతోంది. ● ఇదే తరహాలో దోశాలమ్మకాలనీ నుంచి దామిరెడ్డిపల్లి వరకూ దున్నపోతుల పుంత రహదారి నిర్మాణం గతంలో చేపట్టారని, ఏడాది గడవకుండానే గుంతలతో దర్శనమిచ్చిందని పలువురు వాహనదారులు వాపోయారు. ప్రస్తుత రహదారిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నాసిరకంగా ఉంటున్నాయని విమర్శిస్తున్నారు. దీనిపై సంబంధిత ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైన చోట రహదారి కుంగిపోకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసేందుకు టెండర్ షెడ్యూల్‌లో పొందుపరిచామన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కంబాలచెరువు: వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు, జీజీహెచ్ మేనేజర్ కోసూరి కేదారేశ్వరరావు పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులు గురువారం కలిశారు. ఏపీఎన్జీవో ద్వారా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జీజీహెచ్ ఏడీ శ్యామ్‌సుందర్, సీనియర్ అసిస్టెంట్లు యోహాన్, అజీజ్, ఒప్పంద, పొరుగుసేవల సంక్షేమ సంఘం కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి సంగీత, నృత్య పాఠశాల స్వర్ణోత్సవం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 2, 3, 4 తేదీల్లో స్వర్ణోత్సవం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ పసుమర్తి శ్రీనివాసశర్మ తెలిపారు. రాజమహేంద్రవరం ఆనంకళాకేంద్రంలో జరిగే వేడుకలో భాగంగా శుక్రవారం ఉదయం 7.30 గంటలకు నగర సంకీర్తన, 8.30గంటలకు నాదస్వరం, వేదస్వస్తి ఉంటుంది. ప్రార్థనా గీతాలు, స్వాగత నృత్యంతో 10 గంటలకు సభ ప్రారంభం, పురస్కార ప్రదానం, మధ్యాహ్న 3 గంటలకు వీణాకచేరీ, పూర్వవిద్యార్థుల గాత్రకచేరీ, సాయంత్రం కూచిపూడి నృత్య రూపకం ఉంటాయి. 3న ఉదయం 9 గంటల నుంచి గాత్రకచేరీ, నృత్య ప్రదర్శన, 11 గంటలకు కవితా సదస్సు, మధ్యాహ్నం 3 గంటల నుంచి గాత్రకచేరీ, వీణా కచేరీ, కూచిపూడి నృత్య రూపకం ఉంటాయి. 4న ఉదయం 9 గంటల నుంచి పంచరత్న సేవ, నృత్య ప్రదర్శన, వీణా కచేరీ, అధ్యాపకుల వాద్య కచేరీ, భక్తి సంగీతం, రాత్రి 7 గంటల నుంచి పురస్కారాల ప్రదానంతో వేడుక ముగుస్తుందని పేర్కొన్నారు.

(c) eenadu

ఈనాడు కర్ణాటక

శుక్రవారం జనవరి 2, 2026 5

నాన్న ఇక రాడని..

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : చిన్నచిన్న మనస్పర్థలతో అమ్మా-నాన్న నిత్యం అలా గొడవ పడుతుంటే లేఖనా కన్నీళ్లు ఆగేవి కావు. ఒకరికొకరు సర్దిపోరు. మాటకు మాట.. దెబ్బకు దెబ్బ అన్నట్లు రగడల్లో మునిగిన వారిని చూసి ఏమీ చేయలేకపోయింది. ఎవరూ రాజీపడటం లేదు. పెద్దల మాటలూ వారి చెవికెక్కలేదు. ఉన్న ఒక్క గానొక్క బిడ్డ లేఖనా బాగోగులు వారికి పట్టినట్లు లేదు. ఆ గొడవలే ఇద్దరి మధ్య దూరం పెంచి.. చివరికి విడిపోయారు. అమ్మతోటే లేఖనా ఉండాలనుకుంది. నాన్న ఒంటరివాడైపోయారు. విడిపోతే ఎవరైనా ఒంటరిగా మారాల్సిందే. ఇక్కడ అమ్మ- నాన్న వేరు గదుల్లో సిద్ధం చేసుకుంటే మానసికంగా లేఖనా(17) ఒంటరిగా మారిపోయింది. అమ్మతోటే ఉంటున్న మాటేగానీ తండ్రిలేని లోటు భరించలేకపోయింది. 'ఆమె బాధ మానసికమైంది. నాన్నకు ఇక ఎప్పటికీ చేరువ కాలేనే మానసిక వేదనతో ఆమె బుధవారం అర్ధరాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది' అని బెంగళూరు చెన్నమ్మనకెరె అచ్చుకట్టు రాణా పోలీసులు వెల్లడించారు. కేసు దర్యాప్తులో మరిన్ని వివరాలు తెలుస్తాయని వివరించారు.

వద్దంటే.. ప్రేమసందేశాలు

యువతిని సతాయించి కడతేరిన యువకుడు

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : తరికేరి తాలూకా ఉడేవా గ్రామానికి మంజునాథ్ (21) అనే యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. తనకు పరిచయం ఉన్న యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో నిరంతరం సందేశాలు పంపిస్తూ ఇబ్బంది పెట్టాడు. తనకు వివాహం నిశ్చయమైందని, సందేశాలు పంపించవద్దని పలుసార్లు కోరినా మంజునాథ్ తన తీరును మార్చుకోలేదని సమాచారం. తాను వివాహం చేసుకుంటున్న వేళలో ఆ యువతి ఈ విషయాన్ని చెప్పింది. నీతో మాట్లాడాలని రమ్మని ఆ యువతితో మంజునాథ్‌ను బుధవారం సాయంత్రం కబురు పెట్టారని పోలీసులు వివరించారు. అక్తిగనాళు గ్రామం వద్దకు వచ్చిన మంజునాథ్‌పై వేణు, అతని స్నేహితులు కిరణ్, ఆనంద్ తదితరులు కత్తులతో దాడి చేసి పరారయ్యారని వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ, బుధవారం అర్ధరాత్రి మరణించాడు. తరికేరి రాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వేడుక కొండంత.. జనం పులకింత

బెంగళూరులో బుధవారం అర్ధరాత్రి.. ఏ వీధి చూసినా జనసంద్రమే

రాచనగరిలో నూతన సంవత్సర వేడుకల వేళ.. నృత్యాలతో అలరించిన యువత

బెంగళూరు (గ్రామీణ), న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. కొత్త ఏడాదిలోకి అడుగు పెట్టినవేళ వేడుకలు జోరందుకున్నాయి. పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భద్రతను పర్యవేక్షించడంతో ఇది సాధ్యమైందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రశంసించారు. బెంగళూరు ఒపేరా రోడ్డులో తాగిన మత్తులో తన స్నేహితురాలిపై ఒక యువతి దాడి చేసింది. ఆమెను పోలీసులే నియంత్రించారు. కోరమంగలలోని ఒక పబ్‌లో ఇద్దరు స్నేహితులు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. బీరు సీసాతో కొట్టడంతో ఒక యువకుడి తలకు గాయమైంది. నగరంలోని అన్ని బార్లు, పబ్బులు రాత్రి ఒంటి గంటకు పోలీసుల దగ్గర ఉండి మూయించారు. మంగళూరులో మాదక ద్రవ్యాలను తీసుకున్నారన్న అనుమానంపై వెయ్యి మంది యువతకు వైద్యులతో పరీక్షలు చేయించగా 52 మంది డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది. వారందరిని కౌన్సెలింగ్‌కు తరలించామని రేవుగరిని పోలీసులు తెలిపారు. మైసూరు, మంగళూరు, ఉడుపి, కార్వార, బెంగళూరు పరిధిలోని స్టార్ హోటళ్లు, రిసార్టుల్లో అనుమతి తీసుకున్న వారికి పార్టీలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. రాత్రి ఒంటి గంట అనంతరం అన్ని చోట్లా వేడుకలను పోలీసులు నిలిపివేయించారు. కొత్త ఏడాదిని స్వాగతించే సమయంలో బాణసంచా కాల్చులతో నిషేధం ఉన్నప్పటికీ, నగర శివార ప్రాంతాల్లో వాటి ప్రభావం కనిపించింది. మద్యం తాగిన అనంతరం వాహనాలు నడపకుండా ఎక్కువ మంది ట్యాక్సీ సేవలను వినియోగించుకున్నారు. మెట్రో రైలు సేవలు, నగరంలోని అన్ని ప్రాంతాలకు బీఎంటీసీ బస్సులు రాత్రి 1.30 వరకు ఉండడంతో వాటి సేవలను కూడా వినియోగించుకున్నారు. వేడుకల వేళ.. హుబ్బళ్లిలో అంజుమ్ (33) అనే గృహిణిని ఆమె భర్త మెబబూబ్ గొంతు నులిమి హత్య చేశాడని గురువారం ఉదయం గుర్తించారు. చిన్నవిషయానికి వారిద్దరూ బుధవారం అర్ధరాత్రి నుంచి గొడవ పడినట్లు ఇరుగు పొరుగుల ద్వారా గుర్తించామని కొత్వాలు ఎన్ శశికుమార్ తెలిపారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

బెంగళూరు (రాజాజీనగర): ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నగరంలోని ఆలయాలు, ప్రార్థన మందిరాలకు భక్తులు పోటెత్తారు. బసవనగుడి ఆలయంలో దేవాదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి పూజలు చేసుకున్నారు. ఇస్కాన్, మహాలక్ష్మి ఆలయం, కోటి వెంకటరమణ స్వామి, వయ్యాలికావల్ తిరుపతి, గవి గంగాధరేశ్వర, దొడ్డబసవ, దొడ్డగణపతి, కాడు మల్లేశ్వర, రామోహళ్లి ముక్తినాగ ఆలయం, దక్షిణ ముఖ నందీశ్వర, విద్యారణ్యపుర దుర్గా పరమేశ్వరి, గాలి ఆంజనేయ స్వామి, కోటి బండె, రాగిగుడ్డ ఆంజనేయ స్వామి, మురుగేశ్‌పాళ్య శివ మందిరం, తదితర ఆలయాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. శివాజీనగరలోని సెయింట్ మేరీ బెసిలికాలోనూ భక్తులు క్రొవ్వొత్తులు వెలిగించుకుని ప్రార్థనలు చేసుకున్నారు. ఉద్యానాలతో పాటు తమకు ఎదురైన వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ వెళ్లారు. కొత్త కాలమానిని, దినచర్య, కేకుల కొనుగోళ్లు జోరుగా సాగాయి.

మైసూరు చాముండేశ్వరీ ఆలయం.. గురువారం ఉదయం భక్తసంద్రం

హింసాత్మక దాడి

బెంగళూరు (యశ్వంతపుర): నూతన సంవత్సరం.. రుదాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. బెంగళూరు కార్పొరేషన్ గేట్ రాణాకు సమీపంలోని రహదారి పక్కగా ఆపిన డ్రైవర్‌తో అటుగా వెళ్తే పది మంది గొడవ పెట్టుకున్నారు. ఆ రగడ పెద్దగా.. గురువారం తెల్లవారు జామున హింసాత్మక దాడికి దారితీసింది. హెంసూరు సమీపంలో 3.15 గంటల సమయంలో ఏకంగా పది మంది కలిసి నడివీధిలో ఆ డ్రైవర్‌పై మూకుమ్మడి దాడికి తెగించారు. బూటుకాళ్లతో తన్నుతూ, చేతికందిన వాటితో బీభత్సం సృష్టించారు. బాధితుడ్ని స్థానికులు ఓ ఆసుపత్రిలో చేర్చారు. సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించే పని ప్రారంభించామని పోలీసులు తెలిపారు.

శివుడికి సింహాసనం సాధ్యమేనా?

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : శాసనసభలో ప్రతి ఏడాది పద్దు (బడ్జెట్)ను ప్రవేశ పెట్టేందుకు డిసెంబరు నుంచే అన్ని శాఖల అధికారులు, మంత్రులతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమీక్షలు నిర్వహించడం ఆనవాయితీ. కొత్త ఏడాది ప్రారంభమైనా, సమీక్ష సమావేశాల విషయమై ఇప్పటి వరకు అధికారులు, మంత్రులకు ఆయన ఎటువంటి సూచనలూ చేయలేదు. ముఖ్యమంత్రి మార్పు, మంత్రివర్గంలో మార్పులు చేర్పులకు సంబంధించి ఉత్కంఠ కొనసాగుతున్న నేపథ్యంలోనే ఈ నెల రెండో వారం వరకు వేచి చూసి, ఆ తర్వాత సమీక్ష సమావేశాలను ప్రారంభించాలని సిద్ధరామయ్య కోరుకుంటున్నారని అధికారులు తెలిపారు. ఈ నెల ఆరున నెలమంగలలో 'అహింద' నేతల శక్తి ప్రదర్శన సమావేశం అనంతరం పదో తేదీలోగా హస్తినకు వెళ్లి మంత్రివర్గ విస్తరణ, పద్దుకు కసరత్తుకు సంబంధించి పార్టీ అధిష్ఠానం నుంచి ఆమోదం పొందాలని సిద్ధు యోచిస్తున్నారు. మార్పు ఉండదని ఆయన కుమారుడు యతీంద్ర, మంత్రులు సతీశ్ జార్కిహొళి, ప్రియాంక్ ఖర్గే, జమీర్ అహ్మద్ ఖాన్, డాక్టర్ మహదేవప్ప, మాజీ మంత్రి రాజణ్ణ ధీమాతో ఉండగా.. దళిత ముఖ్యమంత్రికి అవకాశం ఇవ్వాలని పరమేశ్వర్ పరోక్ష వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ముందుగా అనుకున్న రీతిలో తనకు అవకాశం ఇవ్వాలని కోరేందుకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హస్తినకు వెళ్లివచ్చినా కీలక నేతలు రాహుల్, సోనియా, కేసీ వేణుగోపాల్ తదితరులతో భేటీ కావడం సాధ్యం కాలేదు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు హస్తినకు వెళ్లిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వారితో ప్రత్యేకంగా చర్చించేందుకు సమయం ఇవ్వకపోవడంతో బెంగళూరుకు తిరిగి వచ్చారు. తదుపరి బడ్జెట్ సమావేశాల వరకు తన పదవికి ముప్పు లేదని సిద్ధరామయ్య భావిస్తున్నారు. జనవరి 9 అనంతరం ఏ క్షణంలో అయినా శివకుమార్‌కు పగ్గాలు అప్పగిస్తారన్న నమ్మకంతో ఆయన వర్గానికి చెందిన నేతలు ఉన్నారు. పార్టీ అధ్యక్షుడు ఖర్గేను డీకే గురువారం కలిసి ప్రత్యేకంగా మాట్లాడారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకే తాను ఇక్కడకు వచ్చానని ఆయన పేర్కొనడం గమనార్హం.

ఖర్గేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న శివకుమార్

ముఖ్యమంత్రి పీఠం.. నా లక్ష్యం!

పోలీసు అధికారులతో కలిసి 'పోలీసు వార్తాపత్రిక' విడుదల చేసి ప్రదర్శిస్తున్న పరమేశ్వర్

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : 'ముఖ్యమంత్రి కావాలన్న ఆశ నాకూ ఉంది' అని హోం మంత్రి డాక్టర్ జి పరమేశ్వర్ పేర్కొన్నారు. 'నేను ఆశావాదిని. ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నా. నుదుటి రాతకు అనుగుణంగా అన్నీ జరుగుతాయి. ఆకాంక్షలు లేకపోతే మనిషే కాదు. అందరిలాగే నాకూ ఆశ ఉంది. కాంగ్రెస్ అధిష్ఠానమే అన్ని నిర్ణయాలను తీసుకుంటుంది' అని వివరించారు. నూతన ఏడాదిని పురస్కరించుకుని పోలీసు డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఏ సలీం, నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్, ఇతర పోలీసు అధికారులతో కలిసి 'పోలీసు వార్తా పత్రికను గురువారం విడుదల చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, ఈ ఏడాది తనకు పదోన్నతి దక్కుతుందన్న ఆశ ఉందన్నారు.

● ముఖ్యమంత్రి పీఠాన్ని వీడేందుకు సిద్ధరామయ్య సిద్ధంగా లేకపోయినా, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆ పీఠాన్ని దక్కించుకునేందుకు తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ సమయంలోనే దళిత వ్యక్తికి ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలని కొందరు మఠాధిపతులు కొత్త వాదనను తెరపైకి తీసుకువచ్చారు. ఈ సమయంలోనే పరమేశ్వర్ కూడా తనకు ముఖ్యమంత్రి పదవిపై ఆశ ఉందని ప్రకటించి, చందనసీమ రాజకీయాలను మరింత వేడెక్కించారు. ముఖ్యమంత్రి మార్పు ఉంటుందా లేదా అనేది జాగ్రత్తగా గమనిస్తే ఎవరికైనా అర్థం అవుతుందని, ఆ విషయాన్ని తాను విడమర్చి చెప్పలేనని మంత్రి పేర్కొన్నారు.

అంతా.. ప్రశాంతం

కొత్త ఏడాదిని స్వాగతించేందుకు బ్రిగేడ్ రోడ్డు, కోరమంగల, తదితర ప్రాంతాలకు ఎనిమిది లక్షల మంది వచ్చి వెళ్లారని అంచనా వేశామని పరమేశ్వర్ తెలిపారు. ఎక్కడా హింసాత్మక ఘటనలకు తావివ్వకుండా పోలీసులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయని చెప్పారు. బుధవారం రాత్రి తాను కమాండ్ సెంటర్‌కు వెళ్లి పరిస్థితులను సమీక్షించానని చెప్పారు. భద్రత కోసం 20 వేల మంది సిబ్బందిని నియమించామని గుర్తు చేశారు. ఉత్తమ సేవలు అందిస్తున్న 30 మంది ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు ఇచ్చామని, కేంద్రం నుంచి పోలీసు శాఖ ఆధునికీకరణకు రూ. 335 కోట్ల నిధులు విడుదల కావడం శుభ పరిణామమని పేర్కొన్నారు.

చారిత్రక నిర్మాణాలకు శ్రీకారం

హ్యారిస్, భైరతి సురేశ్, ఇతర నేతలతో కలిసి వంతెనపై నడుస్తూ వెళుతున్న శివకుమార్

బెంగళూరు (సదాశివనగర), (యలహంక), న్యూస్‌టుడే : విమానాశ్రయ మార్గంలో కీలకమైన హెబ్బాళ ఉపరితల వంతెనకు అనుబంధంగా తుమకూరు, బెంగళూరు ఉత్తర విభాగాల నుంచి మెఖ్రీ కూడలికి చేరుకునేందుకు వీలుగా నిర్మించిన ఉపరితల వంతెనను ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ గురువారం ప్రారంభించారు. సకాలంలో నిర్మాణాన్ని పూర్తి చేసిన బీడీఏ అధ్యక్షుడు ఎన్ఏ హ్యారిస్‌ను ఆయన అభినందించారు. మంత్రి భైరతి సురేశ్, కమిషనర్ మణివణ్ణన్, ఉప ముఖ్యమంత్రికి కార్యదర్శి రాజేంద్ర చోళన్ తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

● తమ ప్రభుత్వం నిర్మిస్తున్న ఉపరితల వంతెనలు, సొరంగ మార్గాలు, టౌన్‌షిప్ ప్రాజెక్టులు చరిత్రలో చోటు దక్కించుకుంటాయని శివకుమార్ పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పరిష్కారణకు నోచుకోని ప్రాజెక్టులను తాము దశల వారీగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. బెంగళూరుకు తలమానికంగా ఉండే స్కైడెస్కు నిర్మాణానికి త్వరలో శ్రీకారం చుడతామన్నారు. భారతీయ ఎయిర్ ఫోర్స్ అథారిటీ నుంచి అనుమతులు లభించిన అనంతరం ఈ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. బెంగళూరు బిజినెస్ కారిడార్‌గా వ్యవహరించే 120 కి.మీ. పెరిఫెరల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి నోటిఫికేషన్ విడుదల చేశామని చెప్పారు. బెంగళూరు పరిధిలో చిన్న వాణిజ్య పట్టణాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. ఈ ఏడాదితో బీడీఏ ఏర్పడి 50 ఏళ్లవుతుందని, విజయోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నవ నగర నిర్మాణంలో సంస్థ పాత్ర కీలకమన్నారు.

ప్రముఖులకు శుభాకాంక్షల వెల్లువ

గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పోలీసు అధికారుల బృందం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : కొత్త ఏడాదిని పురస్కరించుకుని పోలీసు డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఏ సలీం, నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్, సీనియరు ఐపీఎస్ అధికారులు సంయుక్తంగా గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ తదితరులతో వేర్వేరుగా సమావేశమై శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదికి ఎటువంటి హింసాత్మక ఘటనలను తావివ్వకుండా విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందిని శివకుమార్ అభినందించారు. దేశంలోని అత్యుత్తమ సేవలు అందించే వారిలో కర్ణాటక పోలీసులు ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. పోలీసులకు కావలసిన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పరమేశ్వర్ తెలిపారు.

వాహనం చక్రం పేలి.. ముగ్గురు దుర్మరణం

హాసన, న్యూస్‌టుడే : అరిసికెరె తాలూకా చిక్కారహళ్లి సమీపాన గురువారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించారు. శబ్బీర్ (55), తిమ్మణ్ణ (53), సంజయ్ (45) అనే వ్యక్తులను మృతులుగా గుర్తించారు. హాసనకు చెందిన నౌషద్ ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. జాతీయ రహదారి 69లో వేగంగా వెళుతున్న బొలెరో వాహనం టైరు పేలిపోవడంతో అది బోల్తా కొట్టింది. వాహనంలో ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మరణించగా, నౌషద్‌ను చికిత్స కోసం హిమ్స్‌కు తరలించారు. బాణావర రాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మిత్రుడి చేతిలోనే కడతేరిపోయాడు..

హావేరి, న్యూస్‌టుడే : హావేరి తాలూకా హొంబరడి గ్రామంలో తండ్రి అంత్యక్రియలు ముగించుకుని ఇంటికి వెళుతున్న మంజునాథ్ ముద్దినవర (40) అనే వ్యక్తి తన స్నేహితుని చేతిలో దారుణహత్యకు గురయ్యాడు. గత డిసెంబరు 30న సాయంత్రం ఇంటికి తిరిగి వెళుతున్న అతన్ని స్నేహితుడు శివకుమార్ తనతో పిలుచుకుని వెళ్లాడు. ఆ రోజు రాత్రి ఇద్దరూ మద్యం తాగారు. మద్యం మత్తులో మంజునాథ్‌పై రాళ్లతో దాడి చేసి శివకుమార్ పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించాడు. పరారీలో ఉన్న నిందితునిపై హావేరి గ్రామీణ రాణా పోలీసులు కేసు నమోదు చేసుకుని, గాలింపు చేపట్టారు.

గనినాడులో పేలిన రాజకీయ తూటా

బ్యానర్ల తొలగింపుపై గాలి, నారా వర్గీయుల ఘర్షణ

'గాలి' ఇంటికి చేరువలో గుమికూడిన ఇరువర్గాలు

బళ్లారి, న్యూస్‌టుడే: బ్యానర్ల తొలగింపు విషయంలో గోటితో పోవలసిన విషయం గొడ్డలి దాకా తెచ్చుకున్నారు. రెండు వర్గాలు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకున్నారు. కాల్పుల్లో రాజశేఖర్ అనే యువకుడు మరణించాడు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. మాజీ మంత్రి బి. శ్రీరాములు, మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి రంగ ప్రవేశం చేయడంతో ఘర్షణ మరింత ఉద్ధృతంగా మారింది. ఘర్షణకు దారి తీసిన వివరాలు.. బళ్లారి నగర వాల్మీకి కూడలి విస్తరణతో పాటు మహర్షి వాల్మీకి విగ్రహం ప్రతిష్ఠాపన కార్యక్రమం ఈ నెల 3న చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి. కె. శివకుమార్, ఇతర వాల్మీకి వర్గం మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కానున్న నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు నగరంలో బ్యానర్లు వేశారు. స్థానిక సిరుగుప్ప రహదారిలోని హవంబావిలో మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి నివాసం రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో బ్యానర్లు కట్టారు. భాజపా కార్యకర్తలు, తొలగించారా? వేరే వ్యక్తులు తొలగించారా? అనే విషయం తెలియదు. కట్టిన బ్యానర్లు కిందకు పడిపోయాయి. ఈ విషయంపై కాంగ్రెస్ కార్యకర్తలు, నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అభిమానులు, అక్కడికి చేరుకుని బ్యానర్లను ఎలా తొలగిస్తారంటూ గాలి జనార్దన్‌రెడ్డి అనుచరులతో వాగ్వాదానికి దిగారు. అక్కడికి చేరుకున్న భాజపా కార్యకర్తలు బ్యానర్లు తొలగించడం తప్పు.. పడిపోయిన ప్రదేశంలో తాము బ్యానర్లు కడతామని చెప్పే ప్రయత్నం చేశారు. ఈలోపు విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆప్తులు సతీష్‌రెడ్డి, చానాళ్ శేఖర్ తదితరులు అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. తొలగించిన (గాలి జనార్దన్‌రెడ్డి నివాసం ముందే) వేయి బ్యానర్లు కడతాం... ఎవరు ఏమి చేస్తారో చూద్దామని అక్కడే రోడ్డుపై కుర్చీ వేసుకుని కూర్చున్నారు. రెండు వర్గాల కార్యకర్తలు అభిమానులు చేరుకోవడంతో మొదట ఎమ్మెల్యే అభిమానులు రాళ్లు విసిరారు. కోపోద్రిక్తులైన గాలి అనుచరులు కూడా రాళ్లు విసరడంతో పోలీసులకు వారిని నియంత్రణ సాధ్యం కాలేదు. చివరికి ఎమ్మెల్యే ఆప్తుడు సతీష్‌రెడ్డిని భాజపా కార్యకర్తలు చుట్టుముట్టడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. దీంతో రక్షణ కోసం ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బంది ఒకరు గాల్లోకి కాల్పులు జరిపారు. ఇరువర్గాలకు చెందిన వారికి రాళ్లు తగలగడంతో స్వల్పంగా గాయపడ్డారు. అనంతరం మాజీ మంత్రి బి. శ్రీరాములు ఘర్షణను నివారించేందుకు అక్కడికి చేరుకున్నారు. రెచ్చిపోయిన కాంగ్రెస్ కార్యకర్తలు ఆయనపై దాడికి యత్నించారు. ఈనేపథ్యంలో శ్రీరాములు, కార్యకర్తల నడుమ తోపులాట జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి రెండు వర్గాలను చెదరగొట్టారు. అనంతరం ఎస్పీ పవన్ నెజ్జూర్, ఏఎస్పీ రవికుమార్, నవీన్‌కుమార్, డీఎస్పీ చంద్రకాంత్ నందారెడ్డి, డీఆర్ఏ డీఎస్పీ తిప్పేస్వామి తదితర పోలీస్ అధికారులు ఆగమేఘాలపై రంగంలోకి దిగారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, భాజపా రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్. దివాకర్, గోనాల్ రాజశేఖర్‌గౌడ, దమ్మూరు శేఖర్, పాలన్న, వీరశేఖర్‌రెడ్డి, మోత్కార్ శ్రీనివాసులతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు.

భద్రతకు రంగంలోకి దిగిన కొత్త ఎస్పీ పవన్ నెజ్జూర్

ఉద్యోగుల సహకారమే బలం

సిద్ధరామయ్యకు శుభాకాంక్షలు చెప్పడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ ఆధ్వర్యంలో విచ్చేసిన ఉన్నతాధికారులు

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే : రాష్ట్రం అభివృద్ధి పథంలో కొనసాగేందుకు అధికారుల సహకారం అత్యవసరమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. సచివాలయం ఉద్యోగుల సంఘం కాలమానిని విడుదల చేసి, అధికారులు, సంఘం ప్రతినిధులతో గురువారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారందరి నుంచి నూతన సంవత్సర వేళ పూల గుచ్ఛాలు స్వీకరించి.. కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన పథకాలు, సేవలు జాప్యం లేకుండా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో ఉద్యోగులు, అధికారుల పాత్ర కీలకమని గుర్తు చేశారు. ఈ ఏడాది ప్రజలు, పేదలు, రైతులు, మహిళల మోములో సంతోషం చూడాలని ప్రతి ఒక్కరూ లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. గత ఏడాది చక్కని వర్షపాతం ఉండడంతో ఖరీఫ్, రబీ సాగు ఉత్తమంగా సాగిందని, జలాశయాలు నిండడంతో తాగు, సాగు నీటికి కొరత రాలేదన్నారు. విపక్షాలు రాజకీయాన్ని దృష్టిలో ఉంచుకుని విమర్శలు చేస్తుంటారని, వాటిని పట్టించుకోకుండా నవ, సమ సమాజాన్ని నెలకొల్పే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. ప్రతి ఒక్కరికీ ఆర్థిక స్వాతంత్ర్యం లభించేందుకే తాము పంచ గ్యారంటీ పథకాలు ఉపకరిస్తున్నాయని పునరుద్ఘాటించారు. రాజకీయ నాయకులు వచ్చి వెళుతుంటారని, అధికారులు కనీసం 35 ఏళ్లు ప్రజా సేవలో ఉంటారని పేర్కొన్నారు. విధులను చక్కగా నిర్వహిస్తే ప్రజల వద్ద గుర్తింపుతో పాటు, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుదన్నారు. ముఖ్యమంత్రికి రాజకీయ సలహాదారు నసీర్ అహ్మద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, ఉద్యోగుల సంఘం ప్రతినిధులతో సిద్ధరామయ్య సమావేశమయ్యారు.

స్మారకం వద్ద నివాళి అర్పిస్తున్న సీతేపల్లి శ్రీనివాస్

వాయుసేన శిక్షకుడిగా శ్రీనివాస్

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : భారతీయ వాయుదళం శిక్షణ కేంద్రంలో కమాండింగ్ ఇన్ చీఫ్‌గా సీనియరు అధికారి సీతేపల్లి శ్రీనివాస్ గురువారం బెంగళూరులోని సంబంధిత కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన ఆయన 1987 జూన్ 19న భారతీయ వాయుదళం విభాగంలో చేరారు. మిగ్-21, ఇస్క్రా, కిరణ్, పీసీ-7, ఎంకే 2 తదితర యుద్ధ విమానాలను 4200 గంటలు నడిపిన అనుభవం ఉంది. చేతక్, చీతా హెలికాప్టర్లు, పెచూరా క్షిపణి వ్యవస్థలో కార్యాచరణ అధికారిగానూ సేవలు అందించారు. రాష్ట్రపతి నుంచి 2017లో విశిష్ట సేవా పతకం, 2024లో అతి విశిష్ట సేవా పతకాన్ని అందుకున్నారు. కార్గిల్ యుద్ధవీరుల స్మారకం వద్ద నివాళి అర్పించి, సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని అందుకుని బాధ్యతలు చేపట్టారు.

కిక్కిరిసిన మెట్రో

మెజెస్టిక్: బోగీలో ప్రయాణికుల రద్దీ

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఒకే రోజు 8.93 లక్షల మంది మెట్రో రైళ్లలో ప్రయాణించారని బీఎంఆర్‌సీఎల్ అధికారులు తెలిపారు. గురువారం తెల్లవారు జామున మూడు గంటల వరకు నేరుడు, ఆకుపచ్చ, పసుపు మార్గాల్లో మెట్రో పరుగులు జోరుగా సాగాయి. బుధవారం తెల్లవారు జామున ఐదుగంటల నుంచి గురువారం తెల్లవారు జాము 3.10 గంటల వరకు 8,93,903 మంది ప్రయాణించడంతో రూ. 3.08 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి:

Cell: 9121167527

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి:

Cell: 8008551132

(c) eenadu

క్షణ.. క్షణం.. భయం.. భయం

కాల్పులు దృశ్యాలను చరవాణిలో చూపిస్తున్న గాలి జనార్దన్‌రెడ్డి

బళ్లారి, న్యూస్‌టుడే: బ్యానర్ల తొలగింపు విషయంపై బళ్లారి నగరంలో గురువారం రాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ చేయి దాటి పోవడంతో భద్రతా సిబ్బంది గాల్లోకి కాల్పులు జరపడం, రాజశేఖర్ అనే యువకుడి మృతితో ప్రశాంతంగా ఉన్న నగరంలో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇరువర్గాల కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జి, కాల్పులు, చివరికి ఒకరు మృతి చెందే వరకు దారితీయడంపై సర్వత్రా ఆందోళన నెలకొంది. ఈ పరిణామంతో సామాన్య ప్రజలు వణికిపోయారు. ఘర్షణలో కాంగ్రెస్ కార్యకర్తలు గాయపడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి రాత్రి 9.30 గంటలకు ఘటనా స్థలానికి చేరుకోవడంతో అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మరోసారి రెండు వర్గాల మధ్య ఘర్షణ తారస్థాయికి చేరుకుంది. రాళ్లు, బీరు సీసాలు కూడా విసురుకున్నారు. పోలీసులు సైతం రాళ్ల దాడిని తప్పించుకోవడానికి పరుగులు తీయాల్సి వచ్చింది. చివరికి ఎస్పీ ఆదేశాలతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. బళ్లారిలో జరిగిన ఈ సంఘటనతో ఎన్నడూ లేనంతగా పరిస్థితి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.

కాల్పులతో వణికిన బళ్లారి

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ఐజీపీ వర్తికా కటియార్

భాజపా కార్యకర్తలు, అభిమానులతో వచ్చిన గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా తదితరులు

'ఇంటిపైకి గుండాలను పంపారు'

బళ్లారి: మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణరెడ్డి, ఆయన కుమారుడు ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డిలకు నేర చరిత్ర ఉంది. 25 ఏళ్ల నుంచి రౌడీయిజం చేస్తున్నా వాటిని తొక్కుకుంటూ భాజపాను అధికారంలోకి తెచ్చాం. వారి చుట్టూ హత్యలు చేసిన గుండాలను పెట్టుకున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం రాత్రి తన నివాసం ముందు కలిసిన విలేకరులతో మాట్లాడారు. గురువారం ఉదయం ఇంటి ఆవరణలో బ్యానర్లు కట్టారని తమ సెక్యూరిటీ గార్డ్ మా దృష్టికి తీసుకొచ్చాడు. అనంతరం బ్యానర్ పడిపోయింది. దీనిపై క్షమాపణ చెప్పి బ్యానర్ కడుతామని చెప్పాం. అనంతరం మా ఇంటి ముందు రహదారిపై ఎమ్మెల్యే అప్పుడు సతీష్‌రెడ్డి, చానాళ్ శేఖర్ కుర్చీ వేసుకుని కూర్చున్నారు. వారితో పాటు కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఘర్షణలో ఇంటిపై రాళ్లు విసిరారు. సరిగ్గా నేను గంగావతి నుంచి వచ్చే సమయంలో సతీష్‌రెడ్డి భద్రతా సిబ్బంది కాల్పులు జరిపారు. తమ ప్రభుత్వంలో రూ.8 కోట్లతో వాల్మీకి భవనం నిర్మించాం. ఇప్పటికే వాల్మీకి విగ్రహం ప్రతిష్ఠించినా మళ్లీ ఎందుకని ప్రశ్నించారు. రాజకీయ భవిష్యత్తు లేదని, అభివృద్ధి చేయలేక ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని గాలి ఆరోపించారు.

తోపులాటలో మాజీ మంత్రి శ్రీరాములు

వాల్మీకి అజ్జ చూసుకుంటారు

బళ్లారి నగరంలో వాల్మీకి విగ్రహం ప్రతిష్ఠను శాంతియుతంగా నిర్వహిస్తున్నాం. వారికి భవిష్యత్తు ఉండదు. ఈ కార్యక్రమం జరగకుండా చూడాలని ఘర్షణకు పాల్పడుతున్నారని నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఆరోపించారు. బ్యానర్ విషయంలో అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వాల్మీకి అజ్జ వారి పాపాలను చూసుకుంటారని తెలిపారు. వారికి వయస్సు 60 నుంచి 65 ఏళ్ల ఉండవచ్చు. నాకు 35 ఏళ్ల ఉంటాయి. యువకులే శాంతియుతంగా ముందుకు వెళ్తుంటే వయస్సు మీదపడినా వారే రెచ్చగొట్టేలా చేయడం సరికాదన్నారు. ఈఘటనపై చట్టపరంగా ముందుకు వెళ్తామని ఆయన పేర్కొన్నారు.

ఘర్షణలో బ్యానర్లను చింపివేస్తున్న కార్యకర్తలు

రాళ్లు, బీరు సీసాలను విసిరేందుకు ఓ కార్యకర్త యత్నం

కాంగ్రెస్ కార్యకర్తలను నియంత్రణ చేస్తున్న పోలీసులు

హంపీలో లడ్డూ ప్రసాదం కౌంటరు ప్రారంభం

హొసపేటె, న్యూస్‌టుడే: హంపీలో విరూపాక్షేశ్వర స్వామి లడ్డూ ప్రసాద కౌంటరు గురువారం ప్రారంభమైంది. ఇక్కడ కౌంటరును ప్రారంభించాలని చాలా కాలం నుంచి భక్తులు కోరుతుండేవారు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్రల నుంచి వచ్చే భక్తులకు స్వామివారి ప్రసాదం అందక నిరాశకు గురయ్యేవారు. ఈ నేపథ్యంలో అధికారులు కొత్త సంవత్సరం 1వ తేదీ నుంచి ఆలయం ఆవరణలో లడ్డూ ప్రసాద కౌంటరును తెరిచారు. ప్రసాద రూపంగా లడ్డూ, తీర్థం, కలకండ కలిపి రూ.వంద ధర నిర్ణయించారు. కేవలం లడ్డూ మాత్రమే కావాలనుకుంటే రూ.25 ధర ఖరారు చేశారు. గురువారం కౌంటరును ఆలయ ఈవో హనుమంతప్ప ప్రారంభించారు. అర్చకులు, గైడ్లు, స్థానికులు పాల్గొన్నారు.

హంపీ విరూపాక్ష ఆలయం ఆవరణలో లడ్డూ ప్రసాద కౌంటరును ప్రారంభిస్తున్న అధికారి హనుమంతప్ప

సింధనూరు వచ్చిన నూతన ఎస్పీ అరుణాంగ్షు గిరి

సింధనూరులో స్థానిక ప్రముఖుల అభినందనలు అందుకుంటున్న రాయచూరు నూతన ఎస్పీ

సింధనూరు, న్యూస్‌టుడే: పుట్టమాదయ్య స్థానంలో రాయచూరు జిల్లా ఎస్పీగా బెంగళూరు నుంచి వచ్చిన నూతన ఎస్పీ అరుణాంగ్షు గిరి గురువారం సింధనూరు వచ్చారు. ఆయనకు స్థానిక పోలీసు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. వివిధ రాజకీయ, ఇతర వర్గాల ప్రముఖులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఎస్పీ సింధనూరు ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ, మస్కి క్షేత్రం ఎమ్మెల్యే ఆర్.బసనగౌడ తదితరులను కలసి మాట్లాడారు.

పుస్తక పఠనంతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యం

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు, సభ్యులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రాథమిక పాఠశాల దశ నుంచి పుస్తకాలు చదివితే పోటీ పరీక్షల్లో విజయం సాధించడం తేలికవుతుందని విద్యాశాఖాధికారి గుర్రప్ప పేర్కొన్నారు. తెక్కెలకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం నరేంద్రసింహ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు నరేంద్రసింహ మాట్లాడుతూ 11 పాఠశాలల్లో చదివే 250 మందికి ఒక్కొక్కరికి రూ.300 విలువైన పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను పంపిణీ చేస్తున్నామన్నారు. సభ్యులు, పాఠశాల ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు బావికట్టి రాజ, ఉపాధ్యాయులు దొడ్డబసప్ప, శివకుమార్ పాల్గొన్నారు.

లక్కీడ్రా పేరిట కుచ్చుటోపీ

హొసపేటె: రూ.వెయ్యి చెల్లిస్తే కొత్త సంవత్సరం రోజు లక్కీడ్రా తీసి ద్విచక్ర వాహనం, ఇతర వస్తువులు ఇస్తామని నమ్మబలికిన నలుగురు సభ్యులు గల ఓ బృందం ప్రజలు కట్టిన డబ్బుతో పరారైన ఘటన గురువారం కూడ్లిగిలో వెలుగు చూసింది. నేడు లక్కీడ్రా ఉందని డబ్బు కట్టించుకున్న వ్యక్తి కార్యాలయానికి బాధితులు రాగా, అది కూడా తాళంవేసి ఉన్నట్లు గుర్తించారు. డబ్బు కట్టించుకున్న వ్యక్తి చరవాణి కూడా స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయామని బాధితులు లబోదిబోమన్నారు. కూడ్లిగి, మొరబ, కాళింగేరి, తుప్పకనహళ్లి గ్రామాల్లో సుమారు 2,700 మంది రూ.1100 చొప్పున కట్టినట్లు బాధితులు వాపోయారు. జరిగిన వంచనపై బాధితులెవరూ ఫిర్యాదు ఇవ్వకపోవడంతో కేసు నమోదు చేయలేదని కూడ్లిగి ఎస్సై 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

బళ్లారి నూతన ఎస్పీగా పవన్ నెజ్జూర్

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా నూతన పోలీస్ అధికారి (ఎస్పీ)గా పవన్ నెజ్జూర్ గురువారం బదిలీ అయిన ఎస్పీ డా.వి.జె.శోభారాణి నుంచి బాధ్యతలు స్వీకరించారు. శిర్శికి చెందిన ఉదయ్ శంకర్ నెజ్జూరు, భారతీ నెజ్జూర్‌ల కుమారుడు పవన్ నెజ్జూర్. 30 ఏళ్ల కిందట ఉదయశంకర్ నెజ్జూర్ జిల్లా హెచ్.క్యూ. (అదనపు జిల్లా పాలనాధికారి)గా విధులు నిర్వహించే సమయంలో బళ్లారి సెయింట్ ఫిలోమినా పాఠశాలలో 4వ తరగతి వరకు విద్యాభ్యాసం చేశాడు. అనంతరం తండ్రి తుమకూరు, ధారవాడ, తదితర ప్రాంతాలకు బదిలీ కావడంతో 10వ తరగతి ముగిసేసరికి 13 పాఠశాలలను మార్చారు. పీయూసీ బెంగళూరు, బి.ఎ.బెంగళూరు సెయింట్ జాన్ కళాశాలలో పూర్తి చేశారు. అనంతరం కేపీఎస్ పరీక్షలు ఉత్తీర్ణత సాధించడంతో కలబురగిలో మొదటిసారిగా డీఎస్పీగా విధులు ప్రారంభించారు. బెళగావిలో డీఎస్పీగా పనిచేసిన అనుభవం ఉంది. 2016లో కేపీఎస్ నుంచి ఐపీఎస్ పదోన్నతి పొందారు. మంగళూరు, బెంగళూరు ఏసీపీగా విధులు నిర్వహించారు. తుమకూరు, హాసన, బెంగళూరు లోకాయుక్త ఎస్పీగా విధులు నిర్వహించారు. ఎస్పీగా మొదటి సారిగా బళ్లారిలో బాధ్యతలు స్వీకరించారు.

పూర్వ ఎస్పీ శోభారాణి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన ఎస్పీ పవన్ నెజ్జూర్

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

ఎస్పీ పవన్ నెజ్జూరు బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన ఉదయం 10 గంటలకు బళ్లారికి చేరుకున్నారు. మొదట పోలీస్ జిమ్‌ఖానాలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని నేరుగా దుర్గమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఎస్పీ కార్యాలయానికి చేరుకుని బదిలీ అయిన ఎస్పీ డా.వి.జె. శోభారాణి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్పీలు రవికుమార్, నవీన్‌కుమార్, డీఎస్పీలు చంద్రకాంత్ నందారెడ్డి, ప్రసాద్ గోఖులె, మహంతేష్, తిప్పేస్వామి, సీఐలు, పీఎస్ఐలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

బాలల్లో పఠనాసక్తిని పెంచాలి

రామతీర్థామృత పుస్తకాన్ని ఆవిష్కరించిన బ్రహ్మనిష్ఠానందస్వామి

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: తల్లిదండ్రులు పిల్లలకు చరవాణులను ఇచ్చి కాలహరణం చేయడానికి బదులుగా ఉత్తమ పుస్తకాలను ఇచ్చి వారిలో పఠనాసక్తిని పెంచాలని, రామకృష్ణ మఠం ఆధ్యాత్మిక గురువు బ్రహ్మనిష్ఠానందస్వామి పేర్కొన్నారు. గురువారం శ్రీ రామతీర్థాశ్రమంలో సంగేనహళహళ్లి అశోక్‌కుమార్ రచించిన రామతీర్థామృత పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పిల్లలను నిర్లక్ష్యం చేయకుండా వారికి ఉత్తమ సంస్కారాన్ని నేర్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఆధ్యాత్మిక గురువు శాంతరామతీర్థ, రచయిత అశోక్‌కుమార్, ప్రముఖులు ఎన్‌జె దేవరాజరెడ్డి, యాదవరెడ్డి, జి.ఎన్. మల్లికార్జునప్ప, శివలింగప్ప పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులకు ఉచిత బస్సు

కొత్త సంవత్సరం ఆరంభం రోజున ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంచుతున్న ఎమ్మెల్యే బాదర్లి

సింధనూరు, న్యూస్‌టుడే: గ్రామీణ విద్యార్థులకు ఉచితంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయడం రాష్ట్రంలో తొలిసారి సింధనూరులోనే ప్రయోగాత్మకంగా ఆరంభిస్తున్నట్లు సింధనూరు శాసనసభ్యుడు బాదర్లి హంపనగౌడ వెల్లడించారు. అవి శనివారం సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆయన కొత్త సంవత్సరం సందర్భంగా గురువారం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవా కార్యాలు తలపెట్టారు. ప్రసూతి ఆసుపత్రిలో రోగులకు పళ్లు పంచగా.. ప్రధాన ఆసుపత్రిలో విద్యుత్తు స్తంభాలను ప్రారంభోత్సవం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణంలోని ప్రభుత్వ బడులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల కోసం.. వాళ్ల సమయాల ప్రకారం అన్ని మార్గాల్లో సంచరించేలా ఉచిత విద్యార్థుల కోసం 15 బస్సులు సింధనూరు వచ్చి చేరుకున్నాయి. దీనికి ఎమ్మెల్యేకు కృతజ్ఞత తెలిపేందుకు స్థానిక టౌన్‌హాల్లో విద్యార్థులు ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంతో బాదర్లి ఉబ్బితబ్బిబయ్యారు. బస్సులు అందించి మాకు మేలు చేశారంటూ 75 మంది విద్యార్థులు బృందంగా.. గేయాలు పాడి ఆకట్టుకున్నారు. కొత్త సంవత్సరం తొలి రోజునే ఎమ్మెల్యే బాదర్లి జన్మదినం కూడా కావడంతో వివిధ వర్గాల ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ పోలీసు ఉన్నతాధికారి శంకర్ బిదరి, మాజీ మంత్రి అమరేగౌడ బయ్యాపూరు, ఎమ్మెల్యే ఆర్.బసనగౌడ, మాజీ ఎంపీ కేవీ, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌గౌడ తదితరులు ఆయనకు బాదర్లి అభినందనలు తెలిపారు.

సీఎం ప్రారంభించనున్న గ్రామీణ విద్యార్థుల ఉచిత బస్సు

పేదలకు దుస్తుల పంపిణీ

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు తాలూకా సత్యనారాయణ క్యాంపులోని శాంతికిరణ్ ప్రార్థనా మందిరం ట్రస్టు కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని సేవాకార్యంలో భాగంగా గురువారం 50 మంది పేద ప్రజలకు దుస్తులు పంపిణీ చేసింది. ప్రతి మనిషికి తిండి, దుస్తులు కనీస అవసరాలు.. మనకు ఉన్నదాంట్లో ఇతరులకూ అందించాలనే భావనతో ట్రస్టును స్థాపించి ఇలాంటి కార్యాలు చేపడుతున్నట్లు క్యాంపు పెద్దలు పెద్దిరాజు, శామ్యూల్ వెల్లడించారు.

పేదలకు దుస్తులు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

శ్రీమంతుల సన్యాస దీక్ష

సన్యాస దీక్ష తీసుకునేందుకు వస్తున్న యువత

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : కొత్త ఏడాది శుభసమయంలో సన్యాస దీక్ష తీసుకునేందుకు 15 మంది యువతీ యువకులు సిద్ధమయ్యారు. రాజధాని నగర వీవీపురం వాసవి ఆలయం సమీపంలోని శ్రీ సిమంధర్ శాంతి సూరి జైన సంఘం ఆవరణలో 20 నుంచి 40 ఏళ్ల వయసున్న తొమ్మిది మంది సాధ్వీలు, ఆరుగురు సాధువులు సన్యాస దీక్షకు ముందుకు వచ్చారు. ఇంజినీరింగ్, వైద్యం, విద్యావేత్తలు, ఎంబీఏ పూర్తి చేసిన వీరంతా శ్రీమంతులేనని సంఘం ప్రతినిధులు తెలిపారు. అఖిల భారతీయ జైన శ్వేతాంబరధర మూర్తి పూజక మహాసంఘానికి చెందిన మునులు వీరికి సన్యాస దీక్ష ఇస్తున్నారని సంఘం ప్రతినిధులు తెలిపారు. మరో వారం పాటు వీరికి దీక్ష ఇచ్చే ప్రక్రియ కొనసాగనుంది.

మునులకు స్వాగతం పలుకుతున్న జైన సముదాయం ప్రతినిధులు

జైన మునులతో సన్యాస దీక్ష తీసుకునేందుకు వచ్చిన యువత

సామూహిక అత్యాచారంపై అడ్డగోలు 'వైద్య' నివేదిక

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : కొప్పళ జిల్లా యలబుర్గ తాలూకా మద్లూర గ్రామ సమీపాన గత ఏడాది నవంబరు 17న ఒక గృహిణి (39) సామూహిక అత్యాచారానికి గురైన కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. హొసపేట నుంచి కుష్టగిలో తనకు పరిచయం ఉన్న వారి వద్ద నగదు కోసం వచ్చిన ఆమెకు.. మాయమాటలు చెప్పి తీసుకువెళ్లిన నలుగురు మత్తు మందు కలిపిన పానీయాన్ని తాగించి, సామూహిక అత్యాచారానికి పాల్పడి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు ఆమెను యలబుర్గ తాలూకా ఆసుపత్రిలో చేర్పించి, వైద్య పరీక్షలు చేయించారు. పరీక్షలకు నేతృత్వం వహించిన డాక్టర్ శివకుమార్ 16 సాక్ష్యాలను నాశనం చేయడంతో పాటు, నివేదికను కూడా అనుమానాస్పదంగా రూపొందించారనేది తాజా అభియోగం. దీనిపై యలబుర్గ ఇన్‌స్పెక్టర్ మాలిపాటిల్ కొత్తగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డుప్రమాదంలో గృహిణి దుర్మరణం

రామనగర, న్యూస్‌టుడే : కుదూరు సమీపంలోని లక్కేనహళ్లి వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో అశ్విని (29) అనే గృహిణి మరణించింది. ఆమె భర్త రమేశ్ (32), కుమారుడు యువన్ (1) తీవ్రంగా గాయపడగా, కుమార్తె సాన్వి (7) చిన్నపాటి గాయాలతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. కుణిగల్ నుంచి నెలమంగలకు వస్తున్న కారు అదుపు తప్పి మూడు పల్టీలు కొడుతూ, ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టింది. ప్రమాదంలో బైకుపై భర్త, పిల్లలతో కలిసి వస్తున్న అశ్విని తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మరణించింది. డ్రైవరు మద్యం తాగి కారు నడిపి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. గాయపడిన వారిని నెలమంగలలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. కుదూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆభరణాల దోపిడీ కేసులో నిందితుల వేట

మైసూరు, న్యూస్‌టుడే : కేవలం ఐదే నిమిషాల్లో రూ.11 కోట్ల విలువైన ఆభరణాలను దోచుకుని పరారైన నిందితుల కోసం హుణసూరు ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు. కేరళలోని వయనాడుకు చెందిన పీపీ జంషిద్ ఈ దుకాణం యజమాని. గత డిసెంబరు 28న మధ్యాహ్నం ద్విచక్ర వాహనాపై వచ్చిన ఐదుగురు దుండగులు, తుపాకులు చూపించి, దోపిడీకి పాల్పడి పరారయ్యారు. నిందితుల కోసం 100 మంది పోలీసులు ఐదు బృందాలుగా విడిపోయి గాలింపు తీవ్రం చేశారని ఎస్పీ విష్ణువర్ధన్ తెలిపారు.

అమరశిల్పి జక్కణాచారికి ఘననివాళి

కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సంఘం అధ్యక్షుడు చంద్రకాంత్ సోనార్, తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: అమరశిల్పి జక్కణాచారి రాష్ట్రానికి గొప్ప వారసత్వం, ఆయన కృషి గొప్పదని ప్రభుత్వ గ్యారంటీల అథారిటీ జిల్లా ఛైర్మన్ కె.ఇ.చిదానందప్ప పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ, బళ్లారి నగర పాలికె సంయుక్తంగా గురువారం స్థానిక కాళమ్మ వీధిలోని కాళమ్మ కామేశ్వర ఆలయం సభాభవనంలో విశ్వకర్మ అమరశిల్పి జక్కణాచారి జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అథారిటీ ఛైర్మన్ చిదానందప్ప, కన్నడ సాంస్కృతిక శాఖాధికారి నాగరాజు, సంఘం అధ్యక్షుడు చంద్రకాంత్ సోనార్, రాజస్థానీ విశ్వకర్మ అధ్యక్షుడు మేఘరాజ్, బళ్లారి నగర పాలికె కార్పొరేటర్ ఈరమ్మ బాలల సంక్షేమ కమిటీ అధ్యక్షురాలు త్రివేణి పత్తార్ పాల్గొని అమరశిల్పి జక్కణాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తుమకూరు జిల్లా కైదాల గ్రామంలో అమరశిల్పి జక్కణాచారి జన్మించారన్నారు. బేలూరు చెన్నకేశవ, హళేబీడు ఆలయాల నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఆధునిక యుగంలో శిల్పకళ నశించిపోతోంది. అమరశిల్పి జక్కణాచారి పరంపర వృత్తిని కాపాడాలన్నారు. బళ్లారి ఉప విభాగం ఏసీ హెచ్.డి.రాజేష్ మాట్లాడుతూ బేలూరు, హళేబీడు దేవాలయాల నిర్మాణం చాలా చరిత్రాత్మకమైనవన్నారు. సోమనాథపుర దేవాలయాల శిల్ప కళలకు జీవం పోశారని తెలిపారు. ఇది రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఉపన్యాసకులు వెంకటేశ్ బాడిగర్ ప్రత్యేక ఉపన్యాసం చేశారు. జిల్లా విశ్వకర్మ సభ్యులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కంప్లి: కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జక్కణాచార్య సంస్మరణ దినోత్సవం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పూజలు జరిపారు. విశ్వకర్మ సముదాయ కార్యదర్శి డి.మౌనేశ్ మాట్లాడుతూ సంస్మరణ దినోత్సవాన్ని కేవలం చిత్రపటానికి పూజకే పరిమితం చేయకుండా ఆయా ప్రాంతాల శిల్ప కళాకారులను సత్కరిస్తే కార్యక్రమం అర్థవంతమవుతుందన్నారు. విశ్వకర్మ మహాసభ జిల్లా అధ్యక్షుడు మంజునాథ, తహసీల్దార్ మంజునాయక్ మాట్లాడారు. బుక్కసాగర శిల్ప కళాకారుడు విశ్వనాథను సత్కరించారు. సముదాయ అధ్యక్షుడు రుద్రప్ప ఆచార్, కాళాచార్, చంద్రశేఖర ఆచార్, ఎ.రాఘవేంద్ర పాల్గొన్నారు. కాళికా కమరేశ్వరి ఆలయం, జక్కణాచార్య కూడలిలోనూ కార్యక్రమం నిర్వహించారు.

రాజ్యాంగంపై ప్రతిజ్ఞ చేస్తున్న హాజరైన ప్రజలు

గంగావతి : అమరశిల్పి జక్కణాచారి జయంతిని పురస్కరించుకుని ఆయనకు కొప్పళలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. అదనపు జిల్లాధికారి ఆయన చిత్రపటానికి పుష్పార్చన చేశారు. విశ్వకర్మ సామాజికవర్గం ప్రతినిధులు ఈశప్ప బడిగేర్, దేవేంద్రప్ప, రుద్రప్ప, కాళమ్మ, కల్లప్ప పాల్గొన్నారు.

చెళ్లకెర: అమరశిల్పిగా గుర్తింపు పొందిన జక్కణాచారి శిల్పకళలో ఆరితేరారని, ఆయన నేతృత్వంలో నిర్మించిన బేలూరు, హళేబీడు తదితర దేవాలయాలు నేటికీ శిల్పకళకు పుట్టినిల్లుగా విరాజిల్లుతున్నాయని ఎమ్మెల్యే టి.రఘుమూర్తి పేర్కొన్నారు. గురువారం ఇక్కడ తహసీల్దార్ కార్యాలయంలో జక్కణాచారి సంస్మరణ దినోత్సవంలో ఆయన చిత్రపటానికి పుష్పార్చన చేసి నివాళులు అర్పించారు. తహసీల్దార్ రెహాన్ పాషా, నగరసభ కమిషనర్ జగ్గరెడ్డి, ప్రసన్న, గద్దిగే తిప్పేస్వామి పాల్గొన్నారు.

కురుగోడు(బళ్లారి): తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అమరశిల్పి జక్కణాచారి జయంతిని నిర్వహించారు. తహసీల్దార్ నరసప్ప, ఉప తహసీల్దార్ మల్లేశప్ప, రాజశేఖర్, సురేశ్, భద్రయ్య, స్వాతి, శ్వేతా, లత, చంద్రమ్మ, సరస్వతి, విశ్వకర్మ, డా.తిప్పేస్వామి రమేష్‌చారి తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కంప్లి: జయంతిలో పాల్గొన్న తహసీల్దార్ విశ్వకర్మ సముదాయ నాయకులు

మాన్వి: అమరశిల్పి జక్కన్న జయంత్యుత్సవాన్ని గురువారం మాన్వి, సిరివార, లింగసుగూరు తాలూకాల్లో ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ శిలలకు జీవం పోసిన మహాశిల్పి జక్కణాచార్యులన్నారు. దేశంలో పేరుగాంచిన దేవస్థానాల్లో ఆయన అద్భుత కళను కళ్లారా చూడొచ్చన్నారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సముదాయ ప్రముఖులను ఘనంగా సత్కరించారు. తహసీల్దార్లు భీమరాయ రామసంద్ర, అశోక్ పవార్, అబ్దుల్ వాహిద్ గ్రేడ్2, వై.భూపనగౌడ, లక్ష్మీ, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సంఘ సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.



కొప్పళలో అమరశిల్పి జక్కణాచారికి నివాళులర్పిస్తున్న అధికారులు

జక్కన్న చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

చెళ్లకెరలో అమరశిల్పి జక్కణాచారికి నివాళులు సమర్పించిన ఎమ్మెల్యే రఘుమూర్తి

అమరశిల్పి జక్కణాచారి జయంతిలో తహసీల్దార్ నరసప్ప, తదితరులు

(c) eenadu

బళ్లారి
● బళ్లారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

భక్తసందోహం మధ్య చెన్నబసవతాత రథోత్సవం

గంగావతి చెన్నబసవతాత రథోత్సవం

గంగావతి: గంగావతి ఆరాధ్యదైవం చెన్నబసవతాత రథోత్సవం గురువారం సాయంత్రం భక్తసందోహం మధ్య ఘనంగా జరిగింది. వేలాది మంది భక్తులు ఉత్సవాన్ని తిలకించి తేరుకు ఎండు ఖర్జూరాలు సమర్పించుకున్నారు. దీనికి పూర్వం ఆలయంలో తాత జీవసమాధిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సమితి భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేసింది.

గ్రామాల స్వచ్ఛత ముఖ్యం

బళ్లారి, న్యూస్‌టుడే: గ్రామాల్లో పరిశుభ్రతను కాపాడుకోవడంలో వాహన డ్రైవర్లు, మన వ్యర్థాల నిర్వహణ యూనిట్‌లోని సహాయ మహిళా సభ్యుల పాత్ర చాలా ముఖ్యమైంది. పరిశుభ్రత పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా పంచాయతీ ఉప కార్యదర్శి శశికాంత్ శివపురే పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలోని వాహన డ్రైవర్లు, మన వ్యర్థాల నిర్వహణ యూనిట్‌లోని సహాయ మహిళా సభ్యులకు గురువారం జిల్లా వనరుల శిక్షణ కేంద్రంలో కార్యశాల నిర్వహించారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ ఉప కార్యదర్శి శశికాంత్ శివపురే, తదితరులు

నిందితులను కఠినంగా శిక్షించండి

కంప్లి, న్యూస్‌టుడే: హుబ్బళ్లి ఇనాం పుర గ్రామంలో జరిగిన గర్భిణి మాన్య హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలని కంప్లి సమాజ మనస్సుల ప్రగతిపర సంఘాల సమాఖ్య నాయకులు డిమాండు చేశారు. ఈ విషయమై కంప్లి అంబేడ్కర్ కూడలిలో గురువారం కొంతసేపు ధర్నా జరిపి తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం సమర్పించారు. మాదిగ రక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కరియప్ప గుడిమని మాట్లాడుతూ తక్కువ కులం వాడ్ని పెళ్లి చేసుకుందని తండ్రి కుమార్తెను దారుణంగా హత్య చేయడం విచారకరం. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. నాయకులు వసంతరాజ కహళె, నీలప్ప, ఎ.ఎస్.యల్లప్ప, లక్ష్మణ, ధనుంజయ, మంజునాథ పాల్గొన్నారు.

కంప్లిలో అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న సమాఖ్య నాయకులు

కంది రైతుకు వెన్నుదన్ను

● ప్రభుత్వ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు ● వారంలో 544 మంది పేర్లు నమోదు

16.80 లక్షల హెక్టార్లలో పంట సాగు

బళ్లారి, న్యూస్‌టుడే: తక్కువ పెట్టుబడి, వర్షపాతంతో పండించే కందులు ఈసారి గిరాకీ పెరిగింది. ప్రభుత్వాలు రైతులకు మద్దతుగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో కంది రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కోతలు ప్రారంభమైన పొలాల్లో నిల్వ చేసుకున్న కందులను కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు.

ఉత్తర కర్ణాటకలో వర్షాధారం కింద రైతులు ఎక్కువ విస్తీర్ణంలో కంది పంటను సాగు చేస్తున్నారు. ప్రధానంగా కలబురగి, యాదగిరి, బీదర్, రాయచూరు, విజయపుర, కొప్పళ, బెళగావి, బళ్లారి, విజయనగర, బాగలకోటెలతో పాటు దక్షిణ కర్ణాటకలోని కోలార్, చిక్కబళ్లాపుర, చిత్రదుర్గం జిల్లాల్లో ఈ ఏడాది మొత్తం 16.80 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. రైతులను దృష్టిలో ఉంచుకుని మొత్తం 12.69 లక్షల మెట్రిక్ టన్నుల సరకు కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధమైంది.

ఎకరాకు 4 క్వింటాళ్లు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం నుంచి 2025 డిసెంబరు 19న ఆదేశాలు వచ్చాయి. రైతులు డిసెంబరు 22 నుంచి పేర్లు నమోదు చేసుకుంటున్నారు. పొలం జీపీఎస్ చేసుకున్న పహణి, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలను కొనుగోలు కేంద్రాల్లో సమర్పించి పేర్లు నమోదు చేసుకోవాలి. ఆదేశాలు విడుదల చేసిన రోజు నుంచి 80 రోజుల్లో పేర్లు నమోదు చేసుకోవాలి. 90 రోజుల వరకు విక్రయించుకోవడానికి అవకాశం కల్పించారు. ఎకరాకు 4 క్వింటాళ్ల చొప్పున ఎన్ని ఎకరాల్లో పండించిన సరకైనా విక్రయించుకోవడానికి అవకాశం కల్పించారు. ప్రస్తుతం బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రాల్లో 153 మంది రైతులు 3,100 క్వింటాళ్లను విక్రయించుకోవడానికి పేర్లు నమోదు చేసుకున్నారు. వాల్మీకి కూడలి సమీపంలోని కర్షక సహకార కోపరేటివ్ సొసైటీలో 391 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. క్వింటాల్ రూ.8,000 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. రైతులు పండించిన కందుల్లో తేమశాతం 12 శాతం అంత కంటే తక్కువగా ఉండాలి. వీల్ పప్పులు 3 శాతం శుభ్రంగా ఉండాలని నిబంధనతోనే సరకును విక్రయించడానికి అవకాశం ఉంటుందని సహకార సంఘ బాధ్యుడు మస్తాన్ తెలిపారు.

ఏపీఎంసీ కొనుగోలు కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుంటున్న రైతులు

మార్కెట్‌కు తరలించిన కందులు

ఎంతో ఉపయోగకరం

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరంగా మారింది. నేను 18 ఎకరాల్లో కంది పంటను సాగు చేశాను. ఎకరాకు రూ.8 వేల వరకు పెట్టుబడి వచ్చింది. దిగుబడి ఎకరాకు 5క్వింటాల్ వచ్చింది. ప్రభుత్వం నాలుగు క్వింటాళ్ల కొనుగోలు చేసినా...ఎకరాకు రూ.32వేలు వస్తుంది. పెట్టుబడి పోను రూ.24వేల నుంచి రూ.25వేల వరకు మిగులుతుంది. **- బసవనగౌడ, రైతు, కారేకల్లు వీరాపురం**

ఐదు క్వింటాళ్లకు పరిమితి పెంచితే మేలు

ప్రభుత్వం ఎకరాకు నాలుగు క్వింటాళ్లకు పరిమితి చేయడం కొంత ఇబ్బందే. ఈ ఏడాది తక్కువ పెట్టుబడి, వర్షాధారం కింద సాగుచేసిన కంది పంట ఎకరాకు 5 నుంచి 7 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఎకరాకు కనీసం ఐదు క్వింటాళ్ల పరిమితి విధించి ఉంటే రైతుకు మేలు కలుగుతుంది. **-బసవరాజు, రైతు, సింధిగేరి**

తక్షణమే సొమ్ము ఖాతాకు జమ చేయాలి

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల నుంచి కందులు తీసుకుంటోంది. ఆలస్యం చేయకుండా 15 నుంచి 20 రోజుల్లోపు రైతుల బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ చేస్తే పెట్టుబడి కోసం తీసుకున్న వాటిని అప్పులు చెల్లించడానికి వీలవుతుంది. గతంలో జొన్నల డబ్బులు ఆలస్యంగా రావడంతో ఇబ్బందులు పడ్డాం. **-సుంకయ్య, రైతు, సింధిగేరి**

భక్తిశ్రద్ధలతో ఉరుసు

ఊరేగింపుగా దర్గా వద్దకు గంధం తీసుకెళుతున్న ధర్మ గురువు సయ్యద్‌షా అబుల్ హసన్ ఖాద్రి

కంప్లి, న్యూస్‌టుడే: స్థానిక గంగావతి మార్గంలోని బడే సాబ్ ఖాద్రి దర్గాలో గురువారం ఉరుసు భక్తిశ్రద్ధలతో జరిగింది. ధర్మగురువు సయ్యద్‌షా అబుల్ హసన్ ఖాద్రి ఉదయం ఊరేగింపుగా దర్గా వద్దకు గంధం తెచ్చారు. సామూహిక ప్రార్థనలు జరిగాయి. అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. శుక్రవారం జియారత్ జరగనుంది. స్థానికులతో పాటు హొసపేటె, బళ్లారి, గంగావతి, కనకగిరి తదితర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

మాదిగ రక్షణ వేదిక అధ్యక్షుడిగా ధనుంజయ్

ఇ.ధనుంజయ్

కంప్లి, న్యూస్‌టుడే: కర్ణాటక మాదిగ రక్షణ వేదిక కంప్లి తాలూకా అధ్యక్షుడిగా ఇ.ధనుంజయ నియమితులయ్యారు. వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కరియప్ప గుడిమని గురువారం నూతన కార్యవర్గాన్ని నియమించారు. గౌరవ అధ్యక్షులుగా జయణ్ణ, నానాపాటే, ఉపాధ్యక్షుడిగా ఓబులేశ్, ప్రధాన కార్యదర్శిగా నీలప్ప పేంటర్, కోశాధికారిగా సుంకప్ప తదితర కార్యవర్గసభ్యులు నియమితులయ్యారు. సముదాయ, ప్రజల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేయిలని కరియప్ప సూచించారు.

గ్రామసభల్లో కార్యాచరణ ప్రణాళికలు రూపకల్పన

కొప్పళ జిల్లా హాలవర్తిలో మాట్లాడుతున్న డీఆర్ పాటిల్

గంగావతి,న్యూస్‌టుడే: పంచాయతీల గ్రామసభల్లో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర వికేంద్రీకరణ పథకాలు, అభివృద్ధి సమితి అధ్యక్షుడు డీఆర్ పాటిల్ పేర్కొన్నారు. ఆయన గురువారం కొప్పళ జిల్లా హాలవర్తిలో గ్రామ పంచాయతీ వార్షిక సభలో పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి పథకాల కార్యాచరణలో ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇందులో తమ పాత్ర సైతం ఉందన్న నమ్మకం ప్రజల్లో కలిగించాలన్నారు. అప్పుడే వికేంద్రీకరణ సాధ్యమవుతుందన్నారు. గాంధీజీ గ్రామ స్వరాజ్యం ఆశయం సాకారమవుతుందన్నారు. స్థానిక ప్రభుత్వాలుగా పని చేసే అధికారం పంచాయతీలకు ఉందన్నారు. స్వచ్ఛత, ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేయాలన్నారు. కొప్పళ శాసనసభ్యుడు రాఘవేంద్ర హిట్నాళ, జడ్పీ సీఈవో వర్ణిత్ నేగి, మాజీ ఎమ్మెల్యే బసవరాజ్ హిట్నాళ, పంచాయతీ అధ్యక్షురాలు జయప్రదా గౌరవర్ పాల్గొన్నారు.

గోడ గడియారాల పంపిణీ

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా గులాబీలు, మిఠాయిలు పంచి సంతోషాన్ని పంచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం చెళ్లకెరలో నగరసభ మాజీ సభ్యుడు రాఘవేంద్ర తనను గతంలో ఎన్నుకొన్న వార్డులో ఇంటింటికీ గోడ గడియారాలు, మిఠాయి పొట్లాలను పంచి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గడియారాలపై స్థానిక ఎమ్మెల్యే రఘుమూర్తి, రాఘవేంద్రల చిత్రాలను ముద్రించారు.

4 నుంచి నిర్భయానంద సరస్వతి ఉపన్యాసం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సమితి సంచాలకుడు రాజశేఖర్, తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: విద్యార్థులు, యువతీ, యువకుల్లో దేశప్రేమ, భక్తి, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస జీవిత చరిత్రలు, ఆదర్శాలపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం ఈ నెల 4 నుంచి 13 వరకు జరగనుంది. కార్యక్రమం బళ్లారి రాఘవ కళామందిరంలో సాయంత్రం 5.15గంటల నుంచి రాత్రి 8గంటల వరకు స్వామి నిర్భయానంద సరస్వతి నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు వివేకా లీలామృత స్వాగత సమితి సంచాలకుడు రాజశేఖర్, వివేకతోరణ కార్యదర్శి ప్రభుదేవ కప్పగల్లు వెల్లడించారు. గురువారం బళ్లారిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 4న సాయంత్రం కార్యక్రమాన్ని మేయర్ పూజారి గాదెప్ప, ప్రముఖ వైద్యులు డా.నరేంద్రగౌడ పాల్గొని ప్రారంభిస్తారన్నారు. మొదట సమేధానందజీ మహారాజతో సంగీత కార్యక్రమం అనంతరం ఉపన్యాసం ఉంటుందన్నారు. ప్రతినిధులు సిద్ధరామేశ్వరగౌడ, చంద్రశేఖరగౌడ, అడవిస్వామి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా..అయ్యప్పస్వామి పడిపూజలు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: రాఘవేంద్రకాలనీలో వెలసిన శబరి అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్పస్వామి పడిపూజలు వైభవంగా జరిపారు. గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం, తదితర పూజలు జరిపారు. అయ్యప్ప మాలధారులు, భక్తులు భక్తి కీర్తనలను సుమారు మూడుగంటలపాటు ఆలపించారు. అనంతరం 18 మెట్లకు పడిపూజలు నిర్వహించారు. అయ్యప్ప పవళింపు సేవతో పూజలు ముగిశాయి. ఆలయ ఛైర్మన్ జయప్రకాశ్ గుప్త మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని అయ్యప్పస్వామికి విశేష పూజలు చేపట్టామన్నారు. గుప్త కుటుంబం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో మెట్లకు పడిపూజలు చేస్తున్న అర్చకులు

తృణధాన్యాల వంటల పోటీలో బరుగు హల్వాకు ప్రథమ బహుమతి

జిల్లా స్థాయి తృణధాన్యాల వంటల పోటీలను ప్రారంభించిన జడ్పీ సీఈవో ఆకాశ్

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: జిల్లా స్థాయి తృణధాన్యాల వంటల పోటీల్లో హొసదుర్గం తాలూకా అత్రికట్టే గ్రామానికి చెందిన గృహిణి మంజుళ తయారు చేసిన బరుగు హల్వాకు ప్రథమ బహుమతి లభించినట్లు జడ్పీ సీఈఓ డాక్టర్ ఆకాశ్ పేర్కొన్నారు. రాగి హల్వా తయారు చేసిన హొళల్కెర తాలూకా హనుమణకట్టే గ్రామానికి చెందిన సౌభాగ్యకు రెండో బహుమతి, తృణధాన్యాలతో నిప్పట్టు తయారు చేసిన చెళ్లకెర తాలూకా పరశురాంపురం నివాసితురాలు విద్యకు మూడో బహుమతి లభించిందన్నారు. ఇక్కడ వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించిన తృణధాన్యాల వంటల పోటీలో మొత్తం 41 మంది పాల్గొన్నారన్నారు. హొసదుర్గం తాలూకాలో రైతులు రాష్ట్రంలోనే అత్యధికంగా తృణ ధాన్యాలను పండిస్తున్నారన్నారు. కొర్రలు, సామలు ఇక్కడ రైతులు సాగుచేసి ఆదాయాన్ని గడిస్తున్నారన్నారు. వ్యవసాయ శాఖ జె.డి. మంజునాథ్, డి.డి. శివకుమార్, ఎ.డి. ప్రవీణ్ చౌధురి, జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ రాఘవేంద్ర, న్యాయనిర్ణేతగా, ఆహార నిపుణులు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

గవిమఠం తిరణాలకు శ్రీకారం

గంగావతి,న్యూస్‌టుడే: బసవపటం ఆరోహణం, పంచ కలశాల ప్రతిష్ఠాపనతో కొప్పళ గవిమఠం గవిసిద్ధేశ్వర తిరణాలకు గురువారం శ్రీకారం చుట్టారు. నంది, ఈశ్వర, సూర్య, చంద్ర, వరుణ, ప్రణవ మంత్రం కలిగిన పటానికి పూజలు చేసి గవిసిద్ధేశ్వరుని జీవసమాధి చుట్టూ ప్రదక్షిణ చేసి మండపంలో దీన్ని స్థాపించారు. పంచకలశాలను ప్రతిష్ఠించారు. వారం రోజుల కిందట భక్తులు వీటిని కిందకు దించి శుభ్రం చేసి అలంకరించి ఊరేగింపుగా తరలించి మళ్లీ ప్రతిష్ఠించడం ఇక్కడ ఆనవాయితీ.

గవిమఠంలో బసవపటం ఆరోహణం

కలశాలను ఊరేగింపుగా తరలిస్తున్న భక్తులు

కనులపండువగా..శ్రీవారి ఉయ్యాలోత్సవం

బాలాజీక్యాంపులో ఉయ్యాలసేవలో స్వామి అమ్మవార్లు

నృత్యం చేస్తున్న చిన్నారి

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: బాలాజీ క్యాంపులో వెలసిన లక్ష్మీ బాలాజీ పద్మావతి ఆలయంలో గురువారం స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకించారు. పుష్పాలతో అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాలలో కూర్చోబెట్టి పవళింపు సేవ ఆచరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివార్ల పూజలను తిలకించారు. అనంతరం శాస్త్రీయ నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వేములపల్లి రాధాప్రసాదు దంపతులు, సింధుఫణీంద్ర, శేషమ్మ చన్నప్ప, రవికుమార్, అనిల్‌బాబు, క్యాంపువాసులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS (O/o DISTRICT REGISTRAR) ANANTAPURAMU.
Dispute No. DRA/CFS/92/2025

Between:
M/s. Sri Raghuvaran Chits (P) Ltd., Rayadurgam Branch. ... **Disputant**
AND
V.S.Rajakumar and others ... **Opponents**

NOTICE TO OPPONENT No. 2
2. N.Gangadharappa S/o Nagappa, A/a 46 Years, Asst. Master, Ashoka Grameena High School, Ashoka Siddapura (V), Molakalmuru (T), Chitradurg Dist. R/of Ashoka Siddapura (V), Molakalmuru (T), Chitradurg (Dist.), Karnataka State.
Whereas the Disputant Chit Fund Company in the above Dispute has instituted the above Dispute for recovery of money for **Rs. 7,83,831/-** and the same is posted for your appearance in the said Court on the **21-01-2026** by 11.00 a.m. If you failed to attend the said court on the said date, the matter will be heard and decided as exparte.
By Order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept. D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS (O/o DISTRICT REGISTRAR) ANANTAPURAMU.
Dispute No. DRA/CFS/94/2025

Between:
M/s. Sri Raghuvaran Chits (P) Ltd. Rayadurgam Branch ... **Disputant**
AND
Kampam Venkatesh and others .. **Opponents**

NOTICE TO OPPONENT No. 1, 2 and 3
1. Kampam Venkatesh S/o K.Mallikarjuna, A/a 32 years R/of D/No : 6-1-18-1, Venkateswara Colony, Rayadurgam, Anantapuram Dist.
2. Valmiki Harish S/o V.Prakash, A/a 35 years, Asst. Engineer, KIUWMIP-KIUWMIP Tr-2, PIU, Kundapura, Udipi (Dist), Karnataka State R/of D/No : 8A Devinagar Road, opp : Kumar Swami Temple, Sanjay Gandhi Nagar, Bellary, Karnataka State.
3. T.Nagendra S/o Vaddara Thimmaiah, A/a 41 years, KB Scale Runner, Beviam, Mardihally (V), Hirayur Division, Chitradurga Dist, Karnataka State R/of Mathrukrupa Nilaya, Gajendra Layout, Valmiki Nagar, Challekere, Chitraduga. (Dist).
Whereas the Disputant Chit Fund Company in the above Dispute has instituted the above Dispute for recovery of money for **Rs. 4,85,049/-** and the same is posted for your appearance in the said Court on the **21-01-2026** by 11.00 a.m. If you failed to attend the said court on the said date, the matter will be heard and decied as exparte.
By Order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept. D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu.

వైభవంగా భీమా కోరెగాంవ్ విజయోత్సవ ర్యాలీ

భీమా కోరెగాంవ్ విజయోత్సవం ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

సిరుగుప్ప, న్యూస్‌టుడే: భీమా కోరెగాంవ్ విజయోత్సవాన్ని సిరుగుప్ప పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వివిధ దళిత సంఘాల ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం తాలూకా క్రీడా మైదానంలో వాల్మీకి విద్యాభివృద్ధి ట్రస్ట్ అధ్యక్షుడు బి.ఎం.సతీష్ జెండా ఊపి ఉత్సవాన్ని ప్రారంభించారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొడ్లె మల్లికార్జున మాట్లాడుతూ నాడు మానవీయ విలువలకు తిలోదకాలిచ్చిన జాతి పద్ధతి, అంటరానితనం వంటి వాటికి వ్యతిరేకంగా మహర్ సైనికులు పోరాడారన్నారు. 30 వేల మంది సైనికులను కేవలం 500 మంది మహర్ సైనికులు ధైర్యంతో ఎదుర్కొని యుద్ధంలో విజయం సాధించారన్నారు. అనేక మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని వారి స్మరణార్థం ఏటా విజయోత్సవం ఆచరిస్తున్నామని పేర్కొన్నారు. సంఘాల ప్రతినిధులు హెచ్.గణేశ్, దరగప్ప, చిక్క బళ్లారి నాగప్ప, విరేశ్ పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

01-01-2026 (ఉ. 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1609.58	1626.32
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	290
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	8,764	9,073
నీటి నిల్వ (టి.ఎం.సి)	36.756	80.891

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

కమనీయంగా సత్యనారాయణ పూజలు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: సత్యనారాయణ పేట రాఘవేంద్రస్వామి మఠంలో గురువారం ఆంగ్ల నూతన సంవత్సరం పురస్కరించుకుని లోకకల్యాణార్థం సామూహిక సత్యనారాయణ పూజలు వైభవంగా జరిపారు. రాఘవేంద్రుడికి పుష్పాలు, రజతకవచంతో అలంకరించారు. మఠం వ్యవస్థాపకులు ప్రసన్నాచార్ ఫలమంత్రాక్షితలు అందజేసి ఆశీర్వదించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. రాయల్‌కాలనీ సంజీవరాయ, వెంకటేశ్వర మఠంలో రాఘవేంద్ర ఆచార్ నేతృత్వంలో నూతన ఏడాది వేడుకలు ఘనంగా ఆచరించారు. కార్యక్రమంలో మఠం సిబ్బంది, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ పేట రాఘవేంద్ర స్వామి బృందావనానికి పుష్పాలంకరణ

రాయల్‌కాలనీ సంజీవరాయ, వేంకటేశ్వరస్వామికి పుష్పాలంకరణ

ఘనంగా నూతన ఆంగ్లసంవత్సర వేడుకలు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: హలకుంది ప్రభుత్వ పాఠశాలలో నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా ఆచరించారు. పాఠశాల ఆవరణలో కేకు కోసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి మాట్లాడుతూ నూతన ఏడాదిలో విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

నూతన సంవత్సర వేడుకలు జరుపుకొంటున్న ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, తదితరులు

కొప్పళ జాతరకు దేవసముద్ర నుంచి 25 వేల రొట్టెలు

కంప్లి, న్యూస్‌టుడే: ఈనెల 5న జరగనున్న కొప్పళ గవి సిద్ధేశ్వర జాతర అన్న సంతర్పణకు కంప్లి తాలూకా దేవసముద్ర గ్రామస్థులు 25 వేల రొట్టెలు పంపిస్తున్నారు. ఇందుకోసం గ్రామంలోని లక్ష్మీనారాయణ ఆలయ ఆవరణలో మహిళలు అయిదు రోజులుగా రొట్టెలు సిద్ధం చేస్తున్నారు. తురుముంది బసవేశ్వర యువక మండలి సభ్యులు మాట్లాడుతూ తొలుత యువక మండలి నుంచి 5 వేల రొట్టెలు పంపాలనుకున్నాం. విషయం తెలిసి తమ వంతు సహకారం అందిస్తామని గ్రామస్థులు ముందుకు రావడంతో 25 వేల రొట్టెలు పంపిస్తున్నాం. సర్వ ధర్మాల మహిళలు ఆలయ ఆవరణలో రొట్టెలు సిద్ధం చేస్తున్నారు. రొట్టెలతో పాటు 5 క్వింటాళ్ల బియ్యాన్ని శుక్ర వారం గ్రామం నంచి పాదయాత్రగా కొప్పళ వెళ్లి ఇస్తామన్నారు. రెండు రోజులు అక్కడే ఉండి సేవ చేస్తామని తెలిపారు.

ఆలయ ఆవరణలో రొట్టెలు తయారుచేస్తున్న మహిళలు

రొట్టెలు, బియ్యం తదితరాలను వాహనంలో కొప్పళకు తరలిస్తున్న సింగనాళ గ్రామస్థులు

● **రొట్టెలు, బియ్యం తరలింపు:** శ్రీరామనగర్ సమీప సింగనాళ గ్రామస్థులు కొప్పళ జాతరకు గురువారం వాహనంలో రొట్టెలు, బియ్యం తరలించారు. గ్రామంలో భక్తుల నుంచి సేకంచిన బియ్యం, రొట్టెలు తదితర ధాన్యం గింజలను అన్న సంతర్పణకు కొప్పళ పంపిస్తున్నామని గ్రామస్థులు తెలిపారు. గ్రామ వీధుల్లో మంగళ వాయిద్యాలతో వాహనాన్ని ఊరేగించి కొప్పళ పంపారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మనశ్శాంతి

కార్యక్రమంలో పాల్గొన్న మఠాధీశులు, తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: మందిరాల్లో దీపాలు వెలిగిస్తే ఆధ్యాత్మికంగా మనశ్శాంతి లభిస్తుందని, పాప కర్మలు తొలగిపోతాయని నిరంజన ప్రభు మహాస్వామి తెలిపారు. కురుగోడు కొట్టూరు స్వామి సంస్థాన శాఖ విరక్తి మఠంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్తికోత్సవాన్ని స్వామీజీ ప్రారంభించి మాట్లాడారు. చేసిన తప్పులు, కర్మలు తొలగిపోవడానికి ప్రతి ఒక్కరూ దీపాలను వెలిగించి మోక్షం పొందాలన్నారు. సోసముద్ర గ్రామంలోని కొట్టూరు స్వామి సంస్థాన మఠం సిద్ధలింగ మహాస్వామి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. సీఐ విశ్వనాథ హిరేగౌడర్, ఎస్.ఐ. సుప్రిత్, సంఘం సభ్యులు అరివి శరణప్ప, చానాళు ఆనంద, శశిగౌడ, మల్లేశప్ప, ఉమాపతిగౌడ, సదాశివయ్యస్వామి పాల్గొన్నారు.

(c) eenadu

కొత్తకొత్తగా.. వేడుక సాగగా!

ఒకరిద్దరు కాదు.. ఏకంగా 20 వేల మంది పోలీసులతో వీధులకు రక్షణ! మహిళలను కంటికి రెప్పలా కాపడటానికి ప్రత్యేక దళాల గస్తీ. వెరసి.. బెంగళూరు నగరంలో నూతన సంవత్సర వేడుకలు ఒకింత ప్రశాంతంగా సాగాయి.

● కిక్కిరిసిన బెంగళూరు వీధులు
● పోలీసుల ప్రణాళిక విజయవంతం

బ్రిగేడ్ మార్గం: కిక్కిరిసిన జనం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : అంతర్జాతీయ పోకడలకు నెలవుగా మారిన బెంగళూరు నగరంలో 2026 సంవత్సర ప్రారంభ వేడుకలు శాంతియుతంగా సాగడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అక్కడక్కడ చిన్న సంఘటనలు మినహా అంతా ప్రశాంతమేనని నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ వెల్లడించారు. మునుపెన్నడూ లేని విధంగా ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చివీధి కన్నా కోరమంగలలో ఊహించలేని విధంగా ప్రజలు గుమికూడటం ఈసారి ప్రత్యేకం. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బుధవారం రాత్రి పది గంటల నుంచి ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చివీ

కోరమంగల : వీధుల్లో యువత కిటకిట

దుల్లోకి ప్రజల రాక ప్రారంభమైంది. రాత్రి 11.30 గంటలకు ఆ మార్గాలు కిక్కిరిసిపోయాయి.

● పోలీసులు ఎంజీ రోడ్డు ప్రధాన ద్వారం వద్ద ప్రజలను తనిఖీ చేసి లోపలకు పంపించారు. ఆ ఠికాగా విస్తరించిన పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లు, హోటళ్లన్నీ నిండిపోయాయి. వాటిలో మద్యం తాగిన యువతీ, యువకులు బయటకు వచ్చి నృత్యం చేశారు. చర్చివీధిలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా కానిస్టేబుల్ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిని సీసీబీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బ్రిగేడ్ రోడ్డులో సంచరిస్తున్న యువతులను తాకేందుకు ప్రయత్నించిన యువకులను మహిళా పోలీసులు వారించారు. బ్రిగేడ్ రోడ్డుకు వచ్చిన ప్రజలతో పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్ మాట్లాడారు. మద్యం తాగి కిందపడిన ఇద్దరు యువకులను అంబులెన్స్‌లో బౌరింగ్ ఆసుపత్రికి పోలీసులే తరలించారు. పబ్‌లు ప్రజలతో నిండిపోవడంతో కొందరు బయట నిలబడే మద్యం తాగుతూ కనిపించారు. మద్యం సీసాలను వీధుల్లో పడవేసేవారిని పోలీసులు అడ్డుకున్నారు. సరిగ్గా అర్ధ రాత్రి సమయానికి యువతీ యువకులు కేకలు వేస్తూ బాణసంచా కాల్చుతూ, వాయిద్యాలను మోగిస్తూ 2026 సంవత్సరానికి స్వాగతం పలికారు. పరస్పరం శుభాకాంక్షలు ప్రకటించారు. 12.30 గంటల నుంచి ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చివీధిని ఖాళీ చేసి వెళ్లి పోవాలని పోలీసులు హెచ్చరించారు. ఈ క్రమంలోనే బ్రిగేడ్ రోడ్డులో రద్దీ ఏర్పడటంతో లాఠీలకు పని చెప్పారు.

● ఇళ్లకు వెళ్లాలనుకునే వారికి ఎంజీ రోడ్డు నుంచి వివిధ ప్రాంతాలకు బీఎంటీసీ బస్సులు నడిపింది. రాత్రి పది గంటలకే మూతపడిన ఎంజీ రోడ్డు మెట్రోస్టేషన్ అర్ధరాత్రి 12.30గంటల తరువాత ప్రయాణికులకు సేవలందించింది. కోరమంగలలో పబ్‌లు, బార్లు 85కిపైగా ఉన్నాయి. అక్కడే ఎక్కువ మంది గుమికూడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ తలెత్తకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. ఎలక్ట్రానిక్ సిటీ నీలాద్రి లేఔట్‌లో వేడుకల సందర్భంగా కానిస్టేబుల్‌పై ఓ మహిళ చేయిచేసుకోవడం కలకలం రేపింది. అధికారులు రంగంలోకి దిగి సమస్య పెద్దది కాకుండా నిలువరించారు. మత్తులో వాహనాలు నడిపిన వారిని గుర్తించి జరిమానా వసూలు చేశారు. అర్ధరాత్రి సమయంలో ఇలాంటి కేసులు 181 నమోదు చేసినట్లు సంచార పోలీసులు వెల్లడించారు.

ఏరులై పారిన మద్యం

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : నూతన సంవత్సరాన్ని స్వాగతించేందుకు ఎక్కువ మంది మద్యం కొనుగోళ్లు చేయడంతో ఎక్సైజ్ శాఖకు రూ.745.84 కోట్ల ఆదాయం సమకూరింది. గత డిసెంబరు 29 నుంచి 31 అర్ధరాత్రి వరకు 9.84 లక్షల బాక్సుల మద్యం, 6.64 లక్షల బాక్సుల బీరు అమ్ముడయ్యాయి. పూర్వపు సంవత్సర డిసెంబరు 30-31వ తేదీల్లో మాత్రమే రూ.420.77 కోట్ల విలువైన మద్యం విక్రయించగా.. ఈసారి అదే సమయంలో రూ.465.19 కోట్ల విలువైన మద్యం విక్రయమైందని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

ఎంజీ రోడ్డు : యువకులతో మాట్లాడుతున్న కొత్వాల్ సీమంత్‌కుమార్‌సింగ్

భార్య కనిపించలేదని..

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : నూతన సంవత్సర వేడుకలకు బుధవారం రాత్రి భార్యతో వచ్చిన సమయంలో తన భార్య (28) తప్పిపోవడంతో ఆమె భర్త (32) మూర్ఛ పోయాడు. బాధితుడ్ని పోలీసులు తక్షణమే బౌరింగ్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం బాధితుడు కోలుకున్నాడు. బాధితుని ఫిర్యాదుతో కనిపించకుండా పోయిన గృహిణి కోసం అశోకనగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

శుభాకాంక్షల పర్వం: బెంగళూరు సదాశివనగరలో ఉంటున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను అటవీశాఖ మంత్రి ఈశ్వర్ బి.ఖండ్రే గురువారం ఉదయం కలిసి.. పుష్పగుచ్ఛం అందించి.. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది సాధారణ సమావేశమేనని, రాజకీయాలేవీ లేవని ఖండ్రే స్పష్టం చేశారు. - న్యూస్‌టుడే, యశ్వంతపుర

బ్రిగేడ్ రోడ్డులో లాఠీలకు పని చెబుతున్న పోలీసులు

ఎంజీ రోడ్డు నుంచి వివిధ ప్రాంతాలకు బీఎంటీసీ బస్సుల సేవ

మద్యం తాగి వాహనాలు నడపకుండా ముందస్తు 'పరీక్ష'

గర్భగుడి ముంగిట దుర్గా దీప ప్రజ్వలన ఘట్టం

వివిధ పుష్పాలు, గాజుల అలంకరణలో బనశంకరి అమ్మవారు

బనశంకరి మాతకు దీపహారతి

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : రాజధాని నగరంలోని బనశంకరి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న జాతర మహోత్సవాలు, కొత్త ఏడాది మొదటి రోజును పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయంలో బుధవారం రాత్రి దుర్గా దీపాన్ని వెలిగించగా, గురువారం ఉదయం శతరుద్రాభిషేకం, రుద్ర హోమాలను నిర్వహించారు. సాయంత్రం పర్వత మల్లికార్జున స్వామికి బిల్వార్చన చేశారు. వేకువ జామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలను చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశామని ఆలయం కార్యనిర్వాహక అధికారి ఎస్.కృష్ణప్ప తెలిపారు.

విద్యార్థి సంఘాలకు ఎన్నికలు!

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : యువతలో నాయకత్వ ప్రతిభను పెంచేందుకు, వారిలోని రాజకీయ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు విద్యార్థి సంఘాలకు ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలతో కూడిన 11 మంది సభ్యుల సమితిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వైద్య విద్య మంత్రి శరణు ప్రకాశ్ పాటిల్, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, ఎమ్మెల్యేలు రిజ్వాన్ అర్షద్, బి శివణ్ణ, ఎమ్మెల్సీలు సలీం అహ్మద్, బసనగౌడ బాదర్లి, పుట్టణ్ణ, యువ కాంగ్రెస్ అధ్యక్షుడు హెచ్‌ఎస్ మంజునాథ్, ఎన్‌ఎస్‌యుఐ అధ్యక్షుడు కీర్తి గణేశ్ సభ్యులుగా ఉంటారు. పదిహేను రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది. చివరిసారిగా కర్ణాటకలో 37 ఏళ్ల కిందట విద్యార్థి సంఘాలకు ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల నిర్వహణతో ఏమైనా సమస్యలు ఎదురవుతాయా? విద్యార్థి సంఘాలతో కలిగే ప్రయోజనాలను తెలుసుకునేందుకు ఈ సమితి అధ్యయనం చేసి, నివేదికను ఇవ్వనుంది.

సామూహిక అత్యాచారంపై అడ్డగోలు 'వైద్య' నివేదిక

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : కొప్పళ జిల్లా యలబుర్గ తాలూకా మద్లూర గ్రామ సమీపాన గత ఏడాది నవంబరు 17న ఒక గృహిణి (39) సామూహిక అత్యాచారానికి గురైన కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. హొసపేట నుంచి కుష్టగిలో తనకు పరిచయం ఉన్న వారి వద్ద నగదు కోసం వచ్చిన ఆమెకు.. మాయమాటలు చెప్పి తీసుకువెళ్లిన నలుగురు మత్తు మందు కలిపిన పానీయాన్ని తాగించి, సామూహిక అత్యాచారానికి పాల్పడి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు ఆమెను యలబుర్గ తాలూకా ఆసుపత్రిలో చేర్పించి, వైద్య పరీక్షలు చేయించారు. పరీక్షలకు నేతృత్వం వహించిన డాక్టర్ శివకుమార్ 16 సాక్ష్యాలను నాశనం చేయడంతో పాటు, నివేదికను కూడా అనుమానాస్పదంగా రూపొందించారనేది తాజా అభియోగం. దీనిపై యలబుర్గ ఇన్‌స్పెక్టర్ మాలిపాటిల్ కొత్తగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డుప్రమాదంలో గృహిణి దుర్మరణం

రామనగర, న్యూస్‌టుడే : కుదూరు సమీపంలోని లక్కేనహళ్లి వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో అశ్విని (29) అనే గృహిణి మరణించింది. ఆమె భర్త రమేశ్ (32), కుమారుడు యువన్ (1) తీవ్రంగా గాయపడగా, కుమార్తె సాన్వి (7) చిన్నపాటి గాయాలతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. కుణిగల్ నుంచి నెలమంగలకు వస్తున్న కారు అదుపు తప్పి మూడు పల్టీలు కొడుతూ, ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టింది. ప్రమాదంలో బైకుపై భర్త, పిల్లలతో కలిసి వస్తున్న అశ్విని తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మరణించింది. డ్రైవరు మద్యం తాగి కారు నడిపి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. గాయపడిన వారిని నెలమంగలలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. కుదూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

కలబురగి, న్యూస్‌టుడే : అప్పుల బాధ తాళలేక నింగణ్ణ మల్లేశప్ప దేశాయి (37) అనే రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. జీవర్గి తాలూకా కెల్లూర తాలూకాలో 2.21 ఎకరాల భూమి ఉన్న ఆయన స్థానికంగా మరికొందరి నుంచి పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. వివిధ బ్యాంకులు, స్థానికుల నుంచి రూ.10.5 లక్షల రుణం తీసుకున్నారు. వడ్డీ, అసలు చెల్లించలేక, పొలంలో పురుగు మందు తాగి గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. అతని భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో జీవర్గి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మఠాధిపతి దుందుడుకు చర్య

విజయపుర, న్యూస్‌టుడే : ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ మంత్రి ఎంబీ పాటిల్ నివాసం వద్ద ధర్నా చేస్తున్న వారిని పంపించేందుకు వచ్చిన పోలీసులను ఆందోళనకారులు అడ్డుకున్నారు. ఈ సమయంలో బసవన బాగేవాడి తాలూకా పీబీ హుణశ్యాల గ్రామంలోని ఆధ్యాత్మిక పీఠం మఠాధిపతి సంగనబసవేశ్వర స్వామి తీరు విమర్శలకు దారితీసింది. విధినిర్వహణలో ఉన్న ఎస్సై సీతారామ లమాణి చెంప చెళ్లుమనిపించారు. దీంతో ఆయనను ఇతర పోలీసులు అదుపులోనికి తీసుకుని వెళ్లారు. విజయపుర నగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్సైను మఠాధిపతి కొడుతున్న వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

శ్రీమంతుల సన్యాస దీక్ష

సన్యాస దీక్ష తీసుకునేందుకు వస్తున్న యువత

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : కొత్త ఏడాది శుభసమయంలో సన్యాస దీక్ష తీసుకునేందుకు 15 మంది యువతీ యువకులు సిద్ధమయ్యారు. రాజధాని నగర వీవీ పురం వాసవి ఆలయం సమీపంలోని శ్రీ సిమంధర్ శాంతి సూరి జైన సంఘం ఆవరణలో 20 నుంచి 40 ఏళ్ల వయసున్న తొమ్మిది మంది సాధ్వీలు, ఆరుగురు సాధువులు సన్యాస దీక్షకు ముందుకు వచ్చారు. ఇంజినీరింగ్, వైద్యం, విద్యావేత్తలు, ఎంబీఏ పూర్తి చేసిన వీరంతా శ్రీమంతులేనని సంఘం ప్రతినిధులు తెలిపారు. అఖిల భారతీయ జైన శ్వేతాంబరధర మూర్తి పూజక మహాసంఘానికి చెందిన మునులు వీరికి సన్యాస దీక్ష ఇస్తున్నారని సంఘం ప్రతినిధులు తెలిపారు. మరో వారం పాటు వీరికి దీక్ష ఇచ్చే ప్రక్రియ కొనసాగనుంది.

మునులకు స్వాగతం పలుకుతున్న జైన సముదాయం ప్రతినిధులు

జైన మునులతో సన్యాస దీక్ష తీసుకునేందుకు వచ్చిన యువత

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	60
క్యారెట్-	65
బీరకాయలు-	55
క్యాబేజి-	50
క్యాలీఫ్లవర్(ఒక్కొటి)-	30
సొరకాయ-	55
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	70
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	70
టమాటా(సాధారణ)-	55
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	45
ఉల్లి(మేలురకం)-	40
ఉల్లి(సాధారణ)-	35
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	55
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	120
పండ్లు, ఫలాలు ధరలు	
వాషింగ్టన్ ఆపిల్-	385
సిమ్లా ఆపిల్-	265
గ్రీన్ ఆపిల్-	325
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	35
ఆరంజి-	95
బత్తాయి-	65

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

రాజాజీనగర్.. సైకిల్ రాజా!

యువతరానికే మార్గదర్శి ఆ ఎమ్మెల్యే

మార్గమధ్యంలో సైక్లిస్టులతో సురేశ్‌కుమార్ మాటామంతీ

బెంగళూరు (గ్రామీణ), చిత్రదర్గం, న్యూస్‌టుడే : రాజాజీనగర ఎమ్మెల్యే, న్యాయశాఖ మాజీ మంత్రి ఎస్.సురేశ్‌కుమార్ (70) నిత్యం సైకిల్‌పై పది కిలోమీటర్లకుపైగా తిరిగి రావడం అలవాటు. వారాంతం. . శనివారమైతే వంద కిలోమీటర్లకు తగ్గేదేలేదు. 'రాజాజీనగర పెడల్ పవర్' పేరిట ఆయన బృందంలో 50 మమంది సభ్యులు ఉన్నారు. క్రిస్మస్ సమయంలో బెంగళూరు నుంచి కన్యాకుమారికి 702 కి.మీ. ప్రయాణించి ఆయన ఆదివారం గమ్యాన్ని చేరుకున్నారు. ఆయన సాధన వివరాలు తెలుసుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం అభినందిస్తూ ట్వీట్‌చేశారు. వివేకానంద స్మారకం వద్దకు సైకిల్‌పై చేరుకుని చిరకాల స్వప్నం నెరవేర్చుకున్నానని సురేశ్ సంతోషం వ్యక్తం చేశారు. స్మారకాన్ని నిర్మిస్తున్న సమయంలో 51 ఏళ్ల కిందట (1954)లోనూ తన స్నేహితుడు, హిరియూరుకు చెందిన వెంకటేశ్ తన్యాసి గౌండర్, రాజాజీనగర నివాసి సోమనాథ్‌లతో సైకిల్‌పై నాలుగు రోజులు ప్రయాణించి వివేకా రాక్ వద్దకు వెళ్లి వచ్చారు. గత నవంబరు 11న ఆయన 70వ ఏడాదిలోకి అడుగు పెట్టారు. తన పుట్టిన రోజును మరపురానిదిగా చేసుకునేందుకు మరోసారి కన్యాకుమారి యాత్రకు వెళ్లానని ఆయన చెప్పారు. వివేకా రాక్ నుంచి సూర్యోదయం, సూర్యాస్తమయం చూడడం చక్కని అనుభూతి అని ఆయన పేర్కొన్నారు. రెండు నెలల కిందటే బెంగళూరు నుంచి 350 కిలోమీటర్ల దూరంలోని ధర్మస్థలకు వెళ్లి వచ్చారు. గతంలో తిరుపతి, పాండిచేరికీ ఆయన సైకిల్‌పై వెళ్లి వచ్చారు. రాజాజీనగర నుంచి 2004లో మినహా ఆరుసార్లు (1994, 1999, 2008, 2013, 2018, 2023) ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రివర్గంలో విద్యాశాఖ, న్యాయశాఖ మంత్రిగా విధులు నిర్వహించారు. అర కి.మీ. వెళ్లాలన్నా, ద్విచక్ర వాహనంపై ప్రయాణించే నేటి తరం యువతకు 70 ఏళ్లలోనూ రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటూ, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, సైకిల్‌పై దూర ప్రాంతాలకు ప్రయాణించడం అభినందించదగిన విషయమే.

మార్గదర్శనం: సురేశ్‌కుమార్‌తో యాత్రకు వెళ్లిన ఔత్సాహికులు

సంక్రాంతి వేడుకలకు సన్నాహాలు

రాధాకృష్ణ రాజు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఉద్యాననగరి పరిధి వయ్యాలి కావల్‌లోని తెలుగు విజ్ఞాన సమితి శ్రీకృష్ణదేవరాయ కళా మందిరంలో ఈ నెల 11న సంక్రాంతి వేడుకలను నిర్వహిస్తామని సమితి అధ్యక్షుడు ఎ.రాధాకృష్ణరాజు ప్రకటించారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు గోపూజతో కార్యక్రమాలు ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం బాలికలు, మహిళలకు ముగ్గుల పోటీ, చిన్నారులకు విచిత్ర వేషధారణ పోటీలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి మత్తికెరెకు చెందిన పద్మావతి కళానికేతన్ విద్యార్థులతో కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ ఏడాది కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి డాక్టర్ జయమాల, ప్రముఖ నాటక రంగ కళాకారిణి మాలతి సుధీర్, ప్రముఖ సాహితీవేత్త రోహిణి సత్యలు విచ్చేస్తారని ఓ ప్రకటనలో ఆయన వివరించారు.

మాస్టారుకు 'డిజిటల్' కుచ్చుటోపీ

కార్వార, న్యూస్‌టుడే : ముండగోడ టిబెటియన్ కాలనీలో ఉంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు పల్దెన్ లోబ్బాంగ్ చోడాక్ అనూహ్యంగా సైబర్ నేరగాళ్ల బారిన పడ్డారు. డిజిటల్ అరెస్టు పేరిట ఆయన ఖాతాల్లో ఉన్న రూ.1.61 కోట్లను నిందితులు తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. కేంద్రీయ పాఠశాలలో సేవలు అందించి, కొన్నేళ్ల కిందటే ఆయన పదవీ విరమణ చేశారు. తాము ముంబయి పోలీసులమని, మీ ఖాతా నుంచి అనుమానాస్పద లావాదేవీలు జరుగుతున్నాయని బెదిరించారు. డిజిటల్ అరెస్టు పేరిట నగదు బదిలీ చేయించుకున్నారు. తాను వంచనకు గురయ్యానని ఆలస్యంగా గుర్తించిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ముండగోడ సైబర్ క్రైమ్ ఠాణా పోలీసులు గురువారం దర్యాప్తు ప్రారంభించారు.

ఆభరణాల దోపిడీ కేసులో నిందితుల వేట

మైసూరు, న్యూస్‌టుడే : కేవలం ఐదే నిమిషాల్లో రూ.11 కోట్ల విలువైన ఆభరణాలను దోచుకుని పరారైన నిందితుల కోసం హుణసూరు ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు. కేరళలోని వయనాడుకు చెందిన పీఏ జంషిద్ ఈ దుకాణం యజమాని. గత డిసెంబరు 28న మధ్యాహ్నం ద్విచక్ర వాహనాలపై వచ్చిన ఐదుగురు దుండగులు, తుపాకులు చూపించి, దోపిడీకి పాల్పడి పరారయ్యారు. నిందితుల కోసం 100 మంది పోలీసులు ఐదు బృందాలుగా విడిపోయి గాలింపు తీవ్రం చేశారని ఎస్పీ విష్ణువర్ధన్ తెలిపారు.

'హిండలగ'లోకి మాదక ద్రవ్యాలు

బెళగావి : హిండలగ కేంద్ర కారాగారం ఆవరణలోకి గుర్తు తెలియని వ్యక్తులు గురువారం వేకువ జామున మాదక ద్రవ్యాలు, చరవాణులను విసిరి పరారయ్యారు. ముఖాలకు మాస్కులు కట్టుకుని వచ్చిన వ్యక్తులు వీటిని విసిరారని సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. కారాగారం అధికారుల ఫిర్యాదుతో బెళగావి గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'కోగిలు' లోగిలిలో గందరగోళం

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : రాజధాని నగర శివారు కోగిలు సమీపంలో ఫకీర్ లేఅవుట్, వసీం లేఅవుట్లలో జీబీఏ అధికారులు 167 ఇళ్లను కూల్చి వేశారు. నిర్వాసితులకు ఇళ్లను శుక్రవారం కేటాయిస్తున్నామని గృహ నిర్మాణ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ ప్రకటించారు. నిర్వాసితులైన కన్నడిగులకే ఫ్లాట్లు కేటాయిస్తామని, బయటి వారికి నివేశనాలు, ఫ్లాట్లు కేటాయించబోమని స్పష్టం చేశారు. ఆధార్, బీపీఎల్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, ఇతర దాఖలాలు ఉన్న వారినే పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. అర్హుల జాబితా ఇప్పటికీ అందలేదని రాజీవ్‌గాంధీ వసతి మండలి మేనేజింగ్ డైరెక్టర్ పరశురామ్ శిన్నాళ్కర్ తెలిపారు. బైయప్పనహళ్లి సమీపంలో రాజీవ్‌వసతి యోజన కార్యక్రమంలో భాగంగా నిర్మించిన నివాస సముదాయంలో ఫ్లాట్లు ఇస్తుండగా, 250 మంది దరఖాస్తులు చేసుకున్నారని గుర్తించారు. ఈ లేఅవుట్లలో ఒకే చిరునామాలో ఇద్దరు, ముగ్గురు ఉంటున్నట్లు దరఖాస్తులు వేసుకున్నారు. వీరిలో కొందరు అక్కడి లేఅవుట్లలో లేకపోయినా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు.

కూల్చివేతల సమయంలో వినియోగించిన యంత్రాలు

తాము ఆ రెండు లేఅవుట్లలో 30 ఏళ్ల నుంచి ఉంటున్నామని మూడు వేల మంది నివాసుల తరపున జైబా తబ్సుమ్, మరికొందరు ఉన్నత న్యాయస్థానంలో ప్రజాహిత వ్యాజ్యాలను దాఖలు చేశారు. కర్ణాటకలో ముస్లింల జనాభా పెరగాలన్న ఉద్దేశంతోనే ఈ రెండు లేవుట్లలో నిర్వాసితులుగా మారిన వారికి ఫ్లాట్లు కేటాయిస్తున్నారని ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ ఆరోపించారు.

విశ్వవిద్యాలయంలో ఆందోళన

ధారవాడ : ధారవాడ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమానికి 'నమో' బ్రిగేడ్ వ్యవస్థాపకుడు చక్రవర్తి సూలిబెలెను ఆహ్వానించడాన్ని దళిత సంఘాలు, విశ్వవిద్యాలయ బోర్డు సభ్యులు ఖండించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడే చక్రవర్తిని ఆహ్వానించకూడదని ప్రవేశద్వారం వద్ద ఆందోళనకారులు ధర్నాకు దిగారు. ఆందోళన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తమ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని విద్యార్థుల సంఘం ప్రకటించింది.

ఉపాధ్యాయుడికి తాఖీదులు

కార్వార : హళియాళ తాలూకా బీకేహళ్లిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కారు కడిగించిన ఉపాధ్యాయుడు ఉదయ్‌కు బీఈఓ ప్రమోద్ మహలె నోటీసులు జారీ చేశారు. పాఠశాలకు నిత్యం కారులో వచ్చే ఉదయ్.. విద్యార్థులతోనే దాన్ని శుభ్రం చేయించేవాడు. స్థానికులు చరవాణిలో దీన్ని రికార్డు చేసి, బీఈఓకు ఫిర్యాదు చేయడంతో సంఘటన వెలుగులోకి వచ్చింది.

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

రాఘవేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

బృందావనానికి హారతి ఇస్తున్న పురోహితులు

బెంగళూరు (కెంగేరి) : నూతన ఏడాది సందర్భంగా గురువారం జయనగరలోని నంజనగూడు రాఘవేంద్రస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఆలయ వ్యవస్థాపకుడు ఆర్.కె.వాదీంద్రాచార్యుల నేతృత్వంలో రామవేంద్రస్వామి మూల బృందావనానికి నవరత్నాల కవచం, పుష్పాలంకరణలు చేశారు. రాఘవుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసారు. స్వర్ణసింహాసనం, బంగారు ఉయ్యాలతో విగ్రహాలను ఉంచి ప్రత్యేక పూజలు చేసినట్లు పురోహితులు నందకిశోర్‌ఆచార్యులు తెలిపారు.

చిరుధాన్యాల మేళా ప్రారంభం

తయారు చేసిన పిండివంటలతో మహిళలు

తుమకూరు, న్యూస్‌టుడే : పోషకాలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణ్ సూచించారు. చిరుధాన్య వాణిజ్య మేళా, పిండి వంటల పోటీల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 7, 8వ తేదీల్లో నగరంలోని గ్లాస్‌హౌస్, 16, 17, 18 తేదీల్లో బెంగళూరులో చిరుధాన్య మేళా నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ హులిరాజ్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆశాజ్యోతి, ఎడిటర్ ఎస్.నాగన్న, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా వేరుసెనగ జాతర

జాతరలో నిర్వాహకులు మాదేశ్వరన్, కృష్ణమూర్తి తదితరులు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కార్పొరేషన్ పరిధి తేరుపేట కొండమీద వెలిసిన ఆంజనేయస్వామి ఆలయం వద్ద కార్పొరేటరు ఎన్.ఎస్.మాదేశ్వరన్, జ్యువెలరీ కృష్ణమూర్తి బృందం నేతృత్వంలో వైభవంగా వేరుసెనగ జాతర నిర్వహించారు. హోసూరు, డెంకణీకోట తాలూకాల్లో అధికంగా వేరుసెనగ పంట సాగుచేస్తారు. వర్షాలు పడాలని, పంట దిగుబడి రావాలని, ప్రజలు ఆనందంగా జీవించాలని ఆంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పరిశుభ్రతపై దృష్టి సారించిన ప్రాధికార

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : గ్రేటర్ బెంగళూరు ప్రాధికార సిబ్బంది నగరంలోని వివిధ ప్రాంతాల్లో శుభ్రత పనులు చేపట్టారు. చిక్కపేట, జయనగర, బసవనగుడి, వీవీపురం తదితర ప్రాంతాల్లో చెత్తతో కూడిన మట్టి కుప్పలను తొలగించారు. పాదచారిమార్గాల్లో ఉన్న మట్టి కుప్పలు తొలగించి వాహనాలకు ఎత్తి డంపింగ్ యార్డులకు తరలించారు. విద్యుత్తు నియంత్రికల వద్ద ఉన్న రాళ్లతో కూడిన మట్టితో పాటు పాదచారిమార్గాల్లో ఉన్న చెత్తను తొలగించారు. వర్షకాలంలో మట్టి తొలగింపు సాధ్యం కాకపోవడంతో ఇపుడు పరిశుభ్రత పనులు చేపట్టాల్సి వచ్చిందన్నారు. పాదచారి మార్గంలో ఉన్న చెట్ల పాదులను శుభ్రం చేశారు. పాదుల్లో ఉన్న చెత్త రాళ్లను తొలగించారు. నీరు నిలబడే విధంగా పాదులు చేశారు.

చెట్టుకు పాదులు చేస్తున్న సిబ్బంది

వృక్షాల సంరక్షణకు అధ్యయనం

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సందర్భంగా వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు, విద్యార్థులు గ్రేటర్ బెంగళూరు ప్రాధికార అధికారులు సంయుక్తంగా గురువారం ఉదయం ఇక్కడ ఆర్‌వీ రోడ్డు మెట్రోస్టేషన్ నుంచి 26 కిలోమీటర్ల వరకు పాదచారిమార్గాల్లో నడిచారు. చెట్ల సంరక్షణ కోసం నడక-26 కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో పాదచారిమార్గాల్లో నడుస్తూ ఆమార్గాలను పరిశీలించారు. అక్కడ ఉన్న వృక్షాల సంరక్షణపై అధ్యయనం చేశారు. వారిలో కలిసి చీఫ్ కమిషనర్ మహేశ్వరరావు కూడా నడిచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదచారిమార్గాల ఆక్రమణలను తొలగించడానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, పాడైన మార్గాలను బాగు చేస్తున్నట్లు తెలిపారు. వారంలో ఒక రోజు మార్గాల ఆక్రమణలు తొలగిస్తామన్నారు. వృక్షాల కాండం చుట్టూ సిమెంట్ లేకుండా వాననీరు ఇంకే విధంగా చేస్తామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా నడిచే విధంగా పాదచారిమార్గాలను అభివృద్ధి చేస్తామన్నారు.

పాదచారిమార్గాల సంరక్షణ కోసం నడుం కట్టిన యువత

నిన్న అపరిశుభ్రత-నేడు శుభ్రత

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నూతన సంవత్సర వేడుకలు జరిగిన ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చివీధి, కోరమంగల తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం గ్రేటర్ బెంగళూరు ప్రాధికార పారిశుద్ధ్య కార్మికులు శుభ్రత పనులు చేపట్టారు. వేడుకలు జరిగిన ప్రాంతాల్లో ప్లాస్టిక్ సంచులు, కాగితాలు, పువ్వులు, మద్యం బాటిళ్లను పోగు చేశారు. ఎంజీ రోడ్డు బ్రిగేడ్ రోడ్డు, చర్చివీధి నుంచి లారీ చెత్తను తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఎక్కువగా మద్యం బాటిళ్లను వాహనాల్లో తరలించామన్నారు. గ్రానైట్ రాళ్లతో నిర్మించిన చర్చివీధి ప్రదేశాన్ని పారిశుద్ధ్య కార్మికులు నీళ్లతో శుభ్రం చేశారు. మలమూత్రాలు, మద్యం, ఆహార పదార్థాలు, పానీయాలు పడి ఉన్న దారిని రసాయనిక మందులతో పిచికారి చేసి శుభ్రం చేశారు. ఎక్కువ సంఖ్యలో చెప్పులు దొరికినట్లు తెలిపారు. కోరమంగల రహదారిలో లారీ చెత్తను పోగు చేసి డంపింగ్ యార్డుకు తరలించారు. ఆ రహదారిని నీటితో శుభ్రం చేశారు.

చర్చి వీధిని శుభ్రం చేస్తున్న కార్మికుడు

కమ్మ సంఘం కాలమానిని విడుదల

ఆవిష్కరణలో సంఘం ప్రతినిధులు

హోసూరు, న్యూస్‌టుడే : రాయకోట రోడ్డులోని కమ్మ భవనంలో కమ్మ సంక్షేమ సంఘం రూపొందించిన కాలమానిని గురువారం సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. ఎన్టీఆర్ చిత్రాలతో కూడా కేలండర్ ఆకర్షణీయంగా ఉన్నట్లు సంఘం అధ్యక్షుడు ఎల్.గోపాల్ తెలిపారు. తాలూకాలోని 108 గ్రామాల్లో వీటిని పంపిణీ చేస్తామన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలహారాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వి.లోకేష్, బి.శ్రీరాములు, జి.ఆనందకుమార్, పేరండపల్లి రాజన్న, వెంకటరాజ్, ఎం.నాగరాజు, ఎ.వి.గోవర్ధన్, ఎం.స్వర్ణమూర్తి, కోదండరామన్, నారాయణప్ప, కృష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.

కొత్తకొత్తగా నూతన సంవత్సర వేడుకలు

కెలమంగలం (డెంకణీకోట) న్యూస్‌టుడే : తాలూకాలోని డెంకణీకోట, అంచెట్టి, తళి, రాయకోట ప్రాంతాల్లో కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కెలమంగలం శివారు ఒసపురంలో రామాలయ ఆలయఆవరణలో ఉన్న 32 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. బాగలూరుకు చెందిన హరిదాసులు త్యాగరాజ భాగవతార్ బృందంచే భక్తప్రహ్లాద హరికథా కాలక్షేపం జరిగింది.

హనుమంతునికి పూజలు చేస్తున్న భక్తులు

'అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి'

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగరంలో నాడప్రభు కెంపేగౌడ లేఅవుట్ వద్ద చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అధికారులకు సూచించారు. గురువారం ఇక్కడ ఆయన బీడీఏ అధికారులతో కలిసి చల్లఘట్ట-భీమనకుప్ప వద్ద ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన కింద వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. లేఅవుట్‌కు మైసూరు రహదారికి అనుసంధానం కల్పించే విధంగా కింద వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. పనులు త్వరగా పూర్తి చేస్తే ప్రజల రాకపోకలకు సులభమవుతుందన్నారు. కెంపేగౌడ లేఅవుట్‌ను బీడీఏ అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే. బీడీఏ అధ్యక్షుడు ఎన్.ఎ.హ్యారిస్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో కలిసి పనులను పరిశీలిస్తున్న డీకే శివకుమార్

టెకీల పాదయాత్రలో శాలిని రజనీశ్

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : బెంగళూరులో పర్యావరణ పరిరక్షణ, సామరస్యం తదితరాలను కోరుకుంటూ టెకీలు నిర్వహించిన పాదయాత్రలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ పాల్గొన్నారు. పాదయాత్రగా వచ్చిన వారంతా లాల్‌బాగ్‌కు చేరుకున్నారు. టెకీలతో మాట్లాడుతూ, వారి సమస్యలను ఆమె ఆలకించారు. చివరిగా వారితో ఆమె బృంద చిత్రాన్ని తీసుకున్నారు.

సంఘం ప్రతినిధులతో శాలిని రజనీశ్

పీడితుల పోరాట చిహ్నం భీమ్ కోరేగాం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : పీడితులకు పోరాట చిహ్నంగా నేటికీ భీమ్ కోరేగాం నిర్మించినట్లు హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ తెలిపారు. భీమ్ కోరేగాం దినోత్సవం సందర్భంగా గురువారం ఇక్కడ సదాశివనగరలోని నాగసేనా మైదానంలో వివిధ సంఘాలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కోరేగాం స్తూపానికి, అంబేడ్కర్ చిత్ర పటానికి పువ్వులు వేసి నివాళులర్పించారు. పేశ్వాలకు వ్యతిరేకంగా మహర్‌లో యుద్ధం చేసి విజయం సాధించిన ప్రదేశ్ కోరేగాం అని, అది పీడితులు అగ్రవర్ణాలపై సాధించిన విజయమన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు వెంకటస్వామి, బాలకృష్ణ, జీఏబావా తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పరమేశ్వర్ తదితరులు

దేవాలయాల్లో నూతన ఏడాది పూజలు

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే : అబ్బిగిరిలోని వెంకటేశ్వరస్వామి, రామాంజనేయస్వామి ఆలయాల్లో ధర్మకర్తలు నాగభూషణ్, విశ్వనాథ్ నేతృత్వంలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన దేవాలయం వద్దకు కలశాలను తీసుకెళ్లి పూజించారు. ప్రజలందరూ ఆరోగ్యంగా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. భక్తులకు అన్నదానం, ప్రసాదం పంపిణీ చేశారు.

వేంకటేశ్వరస్వామి పూజల్లో నాగభూషణ్, విశ్వనాథ్ తదితరులు

ఘనంగా అయ్యప్పస్వామి రథోత్సవం

డెంకణీకోట, న్యూస్‌టుడే : డెంకణీకోట అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం మండల పూజ వైభవంగా నిర్వహించారు. అలంకరించిన స్వామిని తేరుపై ఉంచి మేళతాళాలతో పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజనల నడుమ సాగింది. చిన్నారులు, మహిళలు, యువత ఉత్సాహంగా పూజల్లో పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న ఊరేగింపు

నూతన ఎస్పీగా సుశ్రీవల్

కోలారు జిల్లా నూతన ఎస్పీగా సుశ్రీవల్‌ను నియమించారు. ఈమె కలబురగిలో ఎస్పీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఒకటిన్నర సంవత్సరం పనిచేసిన నిఖిల్‌ను బీఎంటీఎఫ్ ఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. **- న్యూస్‌టుడే, ముళబాగిలు**

హైదర్‌వలి ఉరుసు షురూ

నగరంలోని కేజీఎఫ్ రోడ్డులోని ప్రసిద్ధ బాబా హైదర్ వలి ఉరుసు ప్రారంభమైంది. తొలిరోజు దర్గా షరీఫ్‌లో అభిషేకం చేశారు. బాబా దర్గా నుంచి గంధోత్సవం పురవీధుల్లో సంచరించింది. శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకూ రెజ్లింగ్ టోర్నమెంట్ నిర్వహిస్తారు. విజేతలకు ఉరుసు కమిటీ నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేస్తారు. రాత్రి ఖవ్వాలీ, జోగినాశిన్ ఉంటుందని తెలిపారు.

- న్యూస్‌టుడే, ముళబాగిలు

తెలుగు ప్రజలు సఖసంతోషాలతో జీవించాలి

తెలుగు కాలమానిని ఆవిష్కరిస్తున్న బెంజమన్, సభ్యులు

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : కొత్త సంవత్సరంలో తెలుగు ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖ సంతోషాలతో జీవించాలని తెలుగు ప్రార్థనాలయం వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.బెంజిమన్ ఆకాంక్షించారు. గురువారం ఇక్కడ మోహన్‌కుమార్ నగర్ అక్కయ్యప్ప గార్డెన్‌లోని ప్రార్థనాలయంలో 2026 నూతన ఏడాది తెలుగు కాలమానిని ఆయన సభ్యులతో కల్సి విడుదల చేశారు. నూతన ఏడాదిలో ప్రతి ఒక్కరు దైవజ్ఞానం, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు అశోక్, కుమార్, సభ్యులు జాన్‌వెస్లీ, జి.బాబు, శ్రీమంత్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శి, కోచ్‌తో ఛాంపియన్స్ జట్టు

మెట్రో షీల్డ్ క్రికెట్ విజేత స్పార్టన్స్ జట్టు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : కర్ణాటక క్రికెట్ సంఘం నిర్వహించిన మెట్రో షీల్డ్ క్రికెట్ పోటీల్లో స్పార్టన్స్ స్పోర్ట్స్ జట్టు విజేతగా నిలిచింది. చిన్నస్వామి క్రీడాప్రాంగణంలో జరిగిన ఫైనల్ పోటీలో స్పార్టన్స్ జట్టు ఆరు వికెట్లతో ప్రత్యర్థి సఫైర్ జట్టుపై విజయం సాధించింది. ముగింపు కార్యక్రమంలో విజేత జట్టు కార్యదర్శి అలీఖాన్, కోచ్ మహమ్మద్ తాహా విజేతలను అభినందించారు. కెప్టెన్ వీరేంద్రసింగ్ సారథ్యంలో చిన్న, రైయాన్‌తోమర్, ఆదిత్యసింగ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు జట్టు విజయానికి కృషి చేశారు.

డోయెన్ కన్నుమూత

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : బెంగళూరు విశ్వవిద్యాలయం భౌగోళిక విభాగం హెచ్ఓడీగా పదవీ విరమణ చేసిన డోయెన్ (96) గురువారం జయనగరలోని తన నివాసంలో కన్నుమూశారు. ఈయనకు ఇద్దరు కుమారులు, మనవళ్లు ఉన్నారు. దేశంలో మొదటిసారిగా హైడ్రోజియాలజీ అధ్యాయనాన్ని ఎం.టెక్ డిగ్రీగా ప్రవేశపెట్టారు. మేరీ దీవులో ప్రత్యేక శిలల గురించి భౌగోళిక శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించిన తొలి వ్యక్తి. 20 ఏళ్ల పాటు భారత ఖనిజ సంఘం అధ్యక్షుడిగా, 24 ఏళ్ల బెంగళూరు విశ్వవిద్యాలయం హెచ్ఓడీగా వ్యవహరించారు. భారత భూగర్భశాస్త్రంలో భీష్ముడిగా గుర్తింపు పొందారు.

డోయెన్

ధర్మస్థల తరఫున వకాలత్తు

మంగళూరు, న్యూస్‌టుడే: ధర్మస్థలలో వందలాది మృతదేహాలను ఖననం చేశామని కొందరు నిందితులు ఆరోపణలు చేసిన కేసులో ఆలయం తరపున సీనియరు న్యాయవాది సీవీ నాగేశ్, పుత్తూరుకు చెందిన మహేశ్ కజె వకాలత్తును బెళ్తంగడి న్యాయస్థానంలో దాఖలు చేశారు. ఈ కేసులో సిట్ అధికారులు ఇప్పటికే ఒక అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. సిట్ దాఖలు చేసిన అభియోగపత్రంపై బెళ్తంగడి న్యాయస్థానం శనివారం నుంచి వాదనలను ఆలకించనుంది. ఈ నేపథ్యంలో ఆలయం తరపున న్యాయవాదులు తమ వాదన వినిపించేందుకు వకాలత్తు దాఖలు చేశారు.

వేడుకల్లో అపశృతి-యువకుడి మృతి

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : నూతన సంవత్సరం వేడుకలు ముగించుకుని స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంలో వస్తుండగా కన్నింగ్ హ్యామ్ రహదారిలో వాహనం అదుపు తప్పి గోడకు ఢీకొనటంతో వయాలికావల్ నివాసి శరత్‌కుమార్ (29) అనేవ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన శరత్ కుమార్‌ను చికిత్స కోసం బౌరింగ్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయులను వినియోగించవద్దు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఓటరు జాబితా సిద్ధం చేసే పనులకు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు అప్పగించవద్దని జేడీఎస్ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ హెచ్.ఎం.రమేష్‌గౌడ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రాథమిక విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి రశ్మి మహేశ్, కమిషనర్ వికాస్ కిశోర్ సురల్కర్‌లను వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎస్ఎల్సీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, ఆబాధ్యతల నుంచి తప్పించి ఓటరు జాబితా సిద్ధం చేయడం తగదన్నారు. తన విన్నపాన్ని అధికారులు సూత్రప్రాయంగా అంగీకరించారని తెలిపారు.

విద్యాశాఖ ప్రధాన కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న రమేష్‌గౌడ

బాలల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : బాలల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను రూపొందించాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత ఐజీపీ బి.ఎన్.ఎస్.రెడ్డి తెలిపారు. గురువారం ఆచార్య రాకూంజీ పాఠశాలలో బి.ఎన్.ఎస్.రెడ్డికి అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాఠశాల సంస్థాపకుడు ఆచార్య స్వామి రాకుంజీని సత్కరించారు. ఈ సందర్భంగా రెడ్డి మాట్లాడుతూ ప్రజలు, పోలీసు మధ్య స్నేహభావమైన సంబంధాలు ఉండాలని, బాలలకు సురక్షత గురించి తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో కవితారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినందన సభలో కవితారెడ్డి, రెడ్డి, రాకుంజీ

హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: మాచనహళ్లి గ్రామం సమీపంలో ఎనిమిది ఎకరాల భూమిని కబ్జా చేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్న హెడ్ కానిస్టేబుల్ గిరిజేశ్‌ను సస్పెండ్ చేశామని బెంగళూరు గ్రామీణ ఠాణా ఎస్పీ సీకే బాబా తెలిపారు. గిరిజేశ్‌తో కలిపి ఆరుగురు నిందితులపై డాబస్‌పేట ఠాణాలో కేసు నమోదైంది. గత 20 రోజులుగా నిందితులు పరారీలో ఉన్నారని గుర్తించారు. కాగా, కేసు నమోదైన అనంతరం నెలమంగల సబ్ రిజిస్ట్రార్ డీపీ సతీశ్ కుమార్ కూడా అజ్ఞాతంలోకి వెళ్లడం పలు అనుమానాలకు కారణమైంది.

వ్యక్తి దారుణ హత్య

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగరంలోని కేపీ అగ్రహార పోలీసుఠాణా పరిధిలో బుధవారం రాత్రి రేవణ్ణ (35) అనే వ్యక్తి హత్యకు గురయ్యారు. రాత్రి 11.30గంటలకు నిందితులు ఆవ్యక్తిపై కత్తులతో దాడి చేసి హత్య చేసి పరారయ్యారు. హత్యకు కారణాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

కారాగారంలో జూదం

కలబురగి, న్యూస్‌టుడే: కలబురగి జిల్లా కారాగారంలో ఖైదీలు బ్రాండెడ్ మద్యం తాగుతూ, సిగరెట్టు పొగను గుప్పున ఊదుతూ, పేక ముక్కలతో జూదం ఆడుతున్న వీడియోలు వైరల్‌గా మారాయి. కట్టుదిట్టమైన భద్రత ఉన్న కారాగారంలోకి మద్యం, సిగరెట్లు, పేక ముక్కలు వెళుతున్నా, సిబ్బంది మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఆరోపణలు వచ్చాయి.

హిందూ సంస్కృతిని చాటి చెప్పిన అమరశిల్పి

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : శతాబ్దాలు గడచినా చెక్కుచెదురని రీతిలో అమరశిల్పి జక్కణాచారి తన శిల్పకళ చాతుర్యంతో భవిష్యత్తు తరాలకు వారసత్వ సంపదగా సమకూర్చారని, హిందూ సంస్కృతిలో భాగమైన శిల్పకళ నైపుణ్యాన్ని ఆయన ప్రపంచానికి అందించారని కన్నడ సంస్కృతి శాఖ సహాయ డైరెక్టర్ గుర్నాథ్ పేర్కొన్నారు. అమరశిల్పి స్మరణోత్సవం సందర్భంగా గురువారం జిల్లా పాలనాధికారి కార్యాలయంలో అతని చిత్రపటానికి పుష్పార్చన చేసి నివాళులర్పించారు. జక్కణాచారి మన మనిషి కావడం కన్నడిగులకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోవింద రాజులు, పట్టణాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు తాజ్ పీర్, జిల్లా విశ్వకర్మ సమాజం అధ్యక్షుడు సురేశాచార్ తదితరులు పాల్గొన్నారు.

జక్కన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గుర్నాథ్, తదితరులు

ఘనంగా రామయ్య విద్యా సంస్థ స్నాతకోత్సవం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : రామయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. 2023 నుంచి 2025 వరకు చదివిన 280 మంది విద్యార్థులకు పట్టాలు అందజేశారు. మిట్టే కెఫే సీఈవో అలీనాఆలం, గోకుల్ ఫౌండేషన్ డైరెక్టర్ ఆనందరామ్, ముఖ్య కార్యనిర్వాహకుడు పార్శ్వనాథ్, ఆర్థిక విభాగం ముఖ్యుడు జి.రామచంద్ర, ఆర్ఐఎం అరుణ్‌కుమార్, రిజిస్ట్రార్ సవితరాణి రామచంద్రన్ పాల్గొన్నారు. ప్రముఖులు సీతారం, పట్టాభిరామ్ విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఉత్తమ సాధన చేసిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను ప్రదానం చేశారు. పూజా సాసనూర్ బంగారు పతకాన్ని అందుకొంది.

విద్యార్థులతో అలీనా ఆలం, ఆనందరామ్ తదితరులు

సీనియరు విలేకరులకు సత్కారం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : బెంగళూరు ప్రెస్‌క్లబ్ వార్షిక పురస్కారాలను బుధవారం రాత్రి విధానపరిషత్తు అధ్యక్షుడు బసవరాజ హొరట్టి, ముఖ్యమంత్రికి మాధ్యమ సలహాదారుడు కేవీ ప్రభాకర్ ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో ఎంఎన్ గురుమూర్తి, నంజుండప్ప, బీఆర్ విశ్వనాథ్, ప్రభుదేవ శాస్త్రిమఠ్, బీఆర్ విశ్వనాథ్, నవీన్ అమ్మెంబళ, ఛాయాచిత్రగ్రాహకుడు నాగరాజ్ గడేకల్ తదితరులు ఉన్నారు.

సత్కార గ్రహీతలతో హొరట్టి, ప్రభాకర్ తదితరులు

'మలేగళల్లి మదుమగళు' పుస్తకంపై ఉపన్యాసం

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : బెంగళూరు నగర విశ్వవిద్యాలయంలో 'మలేగళల్లి మదుమగళు' పుస్తకంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కన్నడ పుస్తక ప్రాధికార అధ్యక్షురాలు మానస ప్రారంభించారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి బి.రమేశ్ మాట్లాడుతూ కువెంపు సాహిత్యం ముందు తరాలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు గాయత్రి, కిరణ్‌సింగ్, బసవలింగయ్య, తాండవగౌడ, సి.ఎన్.మంజు, ఐ.ఎస్.తేజేశ్వర తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రమేశ్ తదితరులు

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

సహకార సంఘం కాలమానిని ఆవిష్కరణ

జడి సోమేశ్వర సౌహార్ద సహకార సంఘం 2026 నూతన కాలమానిని గురువారం సోమవారపేట హిరేమఠంలో స్వామీజీ రాయచోటి వీరశివాచార్య విడుదల చేశారు. అందరికీ ఉపయోగపడేలా రూపొందించిన కాలమానిని సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ సూచించారు. సహకారి సంఘం అధ్యక్షుడు ఎస్.ఎస్.బిరాదార్, ఉపాధ్యక్షుడు యంకనగౌడ, సీఈవో వెంకటేశ్‌జడాల, పాలక మండలి నిర్దేశకులు చంద్రశేఖర్, అమరేగౌడ, నవీన్‌కుమార్ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, రాయచూరు

పేదలకు దుస్తుల వితరణ

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు తాలూకా సత్యనారాయణ క్యాంపులోని శాంతికిరణ ప్రార్థనా మందిరం ట్రస్ట్ కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని సేవాకార్యంలో భాగంగా గురువారం 50 మంది పేద ప్రజలకు దుస్తులు పంపిణీ చేసింది. ప్రతి మనిషికి తిండి, దుస్తులు కనీస అవసరాలు..మనకు ఉన్నదాంట్లో ఇతరులకూ అందించాలనే భావనతో ట్రస్టును స్థాపించి ఇలాంటి కార్యాలు చేపడుతున్నట్లు క్యాంపు పెద్దలు పెద్దిరాజు, సమూయేలు వెల్లడించారు.

పేదలకు దుస్తులు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

నెలాఖారులో రాయచూరు ఉత్సవం

ఉత్సవం ఏర్పాట్లను సమీక్షిస్తున్న జిల్లా పాలనాధికారి

తీరనున్న ప్రజల ఆకాంక్ష

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు జిల్లా ఉత్సవాన్ని తిలకించాలన్న ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరబోతోంది. జనవరి 29 నుంచి 31 వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం శరవేగంతో ఏర్పాట్లను చేయిస్తోంది. జిల్లా పాలనాధికారి నితీశ్ గత నెలలో సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేసి అధికారులను సిద్ధం చేశారు. ఉత్సవాలకు మూడు వారాలు మాత్రమే మిగిలి ఉన్నందున గురువారం రెండోసారి సమీక్షించారు. విజయవంతం చేయటానికి నియమించిన 22 సమితులు సకాలంలో అప్పగించిన పనులను ముగించాలని సూచించారు. కుస్తీ, వాలీబాల్, క్రికెట్ పోటీలు పెట్టాలన్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో తాత్కాలిక స్వాగత బోర్డులు నెలకొల్పాలని కోరారు. నగర రహదారులను బాగు చేయించాలని, జనవరి 26 నుంచి నెలాఖరు వరకు ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్తు దీపాలతో అలంకరించాలన్నారు. రాయచూరు ఎమ్మెల్యేగా పాపారెడ్డి ఉన్నప్పుడు 2006లో మహాత్మగాంధీ మైదానంలో జిల్లా ఉత్సవం జరిగింది. ప్రభుత్వం నుంచి ఆశించిన నిధులు విడుదల కాలేదు. పాపారెడ్డి సవాల్‌గా తీసుకోవడంతో అంచనాలకు మించి జయప్రదమైంది. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో తరచూ ఏదో ఉత్సవం జరుగుతూనే ఉంటుంది. రాయచూరు మున్నూరు కాపు సమాజం ఏటా రైతుల కోసం ఖరీఫ్ సాంస్కృతిక పండగను జరుపుతోంది. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం తీసుకోకనే పాతికేళ్లగా మూడు రోజులు అత్యంత ఘనంగా నిర్వహిస్తోంది. జిల్లాలో నిర్వహించే పెద్ద పండగ ఇది ఒక్కటే.

రెండు దశాబ్దాలుగా ఉత్సవానికి దూరం

జిల్లాలో 20 ఏళ్లుగా ఏ ఉత్సవం జరగలేదు. జిల్లా బాధ్య మంత్రులుగా పనిచేసిన వారు ఇచ్చిన హామీలతో రెండు దశాబ్దాలు గడిచిపోయాయి. కరవు కాటకాలు, ప్రకృతి విపత్తుల సాకు చూపి వాయిదా వేస్తూ వచ్చారు. దీంతో జిల్లా వాసులు మనోరంజన, సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించేందుకు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు. కల్యాణ కర్ణాటక హంపీ, ఆనెగుంది, బీదర్, కలబురగి జిల్లాల్లో జరిగే ఉత్సవాలకు సర్కారు నిధులు సమకూర్చింది. జిల్లా బాధ్య మంత్రులుగా ఇతర ప్రాంతాల వారు ఉంటున్నందునే ఉత్సవ నిర్వహణకు ఆసక్తి చూపలేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం కలబురగి జిల్లాకు చెందిన మంత్రి శరణ ప్రకాష్ బాధ్యుడిగా ఉన్నారు. అయితే రాయచూరు జిల్లా వాసి, కొడగు జిల్లా బాధ్య మంత్రి బోసురాజు చొరవ తీసుకున్నందునే ఆచరణకు ప్రభుత్వం మొగ్గు చూపింది. ఉత్సవ జరిపే స్థలాన్ని ఇంకా నిర్ణయించలేదు.

హాజరైన అధికారులు

హంపీ ఉత్సవాల తరహాలో నిర్వహించాలి

హంపీ ఉత్సవం వలే రాయచూరు ఉత్సవాన్ని జరపాలి. అధికంగా నిధులను విడుదల చేయాలి. ప్రదర్శనల్లో స్థానిక కళాకారులకు చోటు కల్పించాలి. వారికి సంభావన చెల్లించాలి. వసతి, భోజన వ్యవస్థ సమకూర్చాలి. పేరుగాంచిన మ్యూజిక్ డైరెక్టర్‌ను పిలిపించాలన్న సన్నాహాలను మానుకోవాలి. ఇతడికి లక్షల్లో చెల్లించాలి. కళలను నమ్ముకుని, ఉపాధి లేని వారికి అవకాశం ఇవ్వడం సబబు. పేరున్న ఇతర ప్రాంతాల కళాకారులకు పెద్ద పీట వేస్తే అది జిల్లా ఉత్సవం కాదు. - పాపారెడ్డి (మాజీ ఎమ్మెల్యే)

కొత్తకొత్తగా.. వేడుక సాగగా!

ఒకరిద్దరు కాదు.. ఏకంగా 20 వేల మంది పోలీసులతో వీధులకు రక్షణ! మహిళలను కంటికి రెప్పలా కాపడటానికి ప్రత్యేక దళాల గస్తీ. వెరసి.. బెంగళూరు నగరంలో నూతన సంవత్సర వేడుకలు ఒకింత ప్రశాంతంగా సాగాయి.

● కిక్కిరిసిన బెంగళూరు వీధులు
● పోలీసుల ప్రణాళిక విజయవంతం

ఎంజీ రోడ్డు : యువకులతో మాట్లాడుతున్న కొత్వాల్ సీమంత్‌కుమార్‌సింగ్

బ్రిగేడ్ మార్గం: కిక్కిరిసిన జనం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : అంతర్జాతీయ పోకడలకు నెలవుగా మారిన బెంగళూరు నగరంలో 2026 సంవత్సర ప్రారంభ వేడుకలు శాంతియుతంగా సాగడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అక్కడక్కడ చిన్న సంఘటనలు మినహా అంతా ప్రశాంతమేనని నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ వెల్లడించారు. మునుపెన్నడూ లేని విధంగా ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చివీధి కన్నా కోరమంగలలో ఊహించలేని విధంగా ప్రజలు గుమికూడటం ఈసారి ప్రత్యేకం. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బుధవారం రాత్రి పది గంటల నుంచి ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చి వీధుల్లోకి ప్రజల రాక ప్రారంభమైంది. రాత్రి 11.30 గంటలకు ఆ మార్గాలు కిక్కిరిసిపోయాయి.

● పోలీసులు ఎంజీ రోడ్డు ప్రధాన ద్వారం వద్ద ప్రజలను తనిఖీ చేసి లోపలకు పంపించారు. ఆ దిశగా విస్తరించిన పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లు, హోటళ్లన్నీ నిండిపోయాయి. వాటిలో మద్యం తాగిన యువతీ, యువకులు బయటకు వచ్చి నృత్యం చేశారు. చర్చివీధిలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా కానిస్టేబుల్ పట్టుకునేందుకు ప్రయత్నించిన యువకుడిని సీసీబీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బ్రిగేడ్ రోడ్డులో సంచరిస్తున్న యువతులను తాకేందుకు ప్రయత్నించిన యువకులను మహిళా పోలీసులు వారించారు. బ్రిగేడ్ రోడ్డుకు వచ్చిన ప్రజలతో పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్ మాట్లాడారు. మద్యం తాగి కిందపడిన ఇద్దరు యువకులను అంబులెన్స్‌లో బౌరింగ్ ఆసుపత్రికి పోలీసులే తరలించారు. పబ్‌లు ప్రజలతో నిండిపోవడంతో కొందరు బయట నిలబడే మద్యం తాగుతూ కనిపించారు. మద్యం సీసాలను వీధుల్లో పడవేసేవారిని పోలీసులు అడ్డుకున్నారు. సరిగ్గా అర్ధరాత్రి సమయానికి యువతీ యువకులు కేకలు వేస్తూ బాణసంచా కాల్చుతూ, వాయిద్యాలను మోగిస్తూ 2026 సంవత్సరానికి స్వాగతం పలికారు. పరస్పరం శుభాకాంక్షలు ప్రకటించారు. 12.30 గంటల నుంచి ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చి వీధిని ఖాళీ చేసి వెళ్లి పోవాలని పోలీసులు హెచ్చరించారు. ఈ క్రమంలోనే బ్రిగేడ్ రోడ్డులో రద్దీ ఏర్పడటంతో లాఠీలకు పని చెప్పారు.

● ఇళ్లకు వెళ్లాలనుకునే వారికి ఎంజీ రోడ్డు నుంచి వివిధ ప్రాంతాలకు బీఎంటీసీ బస్సులు నడిపింది. రాత్రి పది గంటలకే మూతపడిన ఎంజీ రోడ్డు మెట్రోస్టేషన్ అర్ధరాత్రి 12.30గంటల తరువాత ప్రయాణికులకు సేవలందించింది. కోరమంగలలో పబ్‌లు, బార్లు 85కి పైగా ఉన్నాయి. అక్కడే ఎక్కువ మంది గుమికూడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ తలెత్తకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. ఎలక్ట్రానిక్ సిటీ నీలాద్రి లేఔట్‌లో వేడుకల సందర్భంగా కానిస్టేబుల్‌పై ఓ మహిళ చేయిచేసుకోవడం కలకలం రేపింది. అధికారులు రంగంలోకి దిగి సమస్య పెద్దది కాకుండా నిలువరించారు. మత్తులో వాహనాలు నడిపిన వారిని గుర్తించి జరిమానా వసూలు చేశారు. అర్ధరాత్రి సమయంలో ఇలాంటి కేసులు 181 నమోదు చేసినట్లు సంచార పోలీసులు వెల్లడించారు.

కోరమంగల : వీధుల్లో యువత కిటకిట

నేటి నుంచి ఉచిత దంత వైద్య శిబిరం

రాయచూరు, న్యూస్‌టుడే : నగరంలోని ఏఎంఈ దంత కళాశాల, ఆసుపత్రిలో ఈ నెల 2 నుంచి 31వ తేదీ వరకు ఉచిత దంతవైద్య శిబిరాన్ని నిర్వహిస్తారు. ప్రభుత్వ సెలవు రోజులు మినహా పనిదినాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4 గంటలకు వరకు దంత పరీక్షలు చేస్తారు. అవసరమైన ఇతర చికిత్సలు చేయించుకునేందుకు రాయితీ ఇస్తారు. రాయచూరు నగరం, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాలక మండలి ప్రతినిధులు తెలిపారు.

3న జక్కణాచారి సంస్మరణ దినోత్సవం

రాయచూరు : అమరశిల్పి జక్కణాచారి సంస్మరణ దినోత్సవాన్ని ఈ నెల 3న స్థానిక రంగమందిరంలో నిర్వహిస్తామని కన్నడ, సంస్కృతి శాఖ సహాయ నిర్దేశకురాలు ఉత్తరాదేవి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, విశ్వకర్మ మదానెగుంది సరస్వతి సంస్థానం (దేవదుర్గ) స్వామీజీ మౌనేశ్వర సాన్నిధ్యం వహిస్తారన్నారు. నగరంలోని ఎస్ఆర్‌కే కళాశాల సహాయ అధ్యాపకురాలు డాక్టర్ సవితా పంపాపతి బడిగేరా వక్తగా పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, అధికారులను ఆహ్వానించినట్లు వివరించారు.

మేళాలో 1500 మందికి ఉద్యోగాలు

రాయచూరు, న్యూస్‌టుడే : నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఈ నెలలో రాయచూరు వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న ఉద్యోగ మేళా గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని జడ్పీ ముఖ్య ప్రణాళిక నిర్దేశకుడు శరణ బసవరాజ్ అధికారులకు సూచించారు. ప్రచారానికి సామాజిక మాధ్యమాలను వినియోగించుకోవాలన్నారు. మేళా ఏర్పాట్లపై చర్చించేందుకు జలనిర్మల సభాభవనంలో జరిగిన సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మేళాకు 75 కంపెనీలను ఆహ్వానించామని, కనీసం 1500 మందికి ఉద్యోగాలు చూపాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు కంపెనీల ప్రతినిధులు మేళాలోనే నియామక పత్రాలు అందజేస్తారన్నారు. పది, పీయూసీ, డిప్లొమో, డిగ్రీ, ఐటీఐ, ఇంజినీరింగ్, వివిధ వృత్తిళ్లు చేసిన వారు మేళాలో పాల్గొనేందుకు అవకాశముందని వెల్లడించారు. సమావేశంలో ఉపాధి కల్పనాకేంద్రం అధికారి నవీన్‌కుమార్, జడ్పీ అకౌంటెంట్ విజయశంకర్, సిడాక్ సంయుక్త నిర్దేశకుడు హుడేదా, పీయూసీ విద్యాశాఖ ఉప నిర్దేశకుడు సోమశేఖరప్ప, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఉప నిర్దేశకుడు రాజశేఖర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బసవరాజ్, అధికారులు

శ్రీమంతుల సన్యాస దీక్ష

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : కొత్త ఏడాది శుభసమయంలో సన్యాస దీక్ష తీసుకునేందుకు 15 మంది యువతీ యువకులు సిద్ధమయ్యారు. రాజధాని నగర వీవీ పురం వాసవి ఆలయం సమీపంలోని శ్రీ సిమంధర్ శాంతి సూరి జైన సంఘం ఆవరణలో 20 నుంచి 40 ఏళ్ల వయసున్న తొమ్మిది మంది సాధ్వీలు, ఆరు గురు సాధువులు సన్యాస దీక్షకు ముందుకు వచ్చారు. ఇంజినీరింగ్, వైద్యం, విద్యావేత్తలు, ఎంబీఏ పూర్తి చేసిన వీరంతా శ్రీమంతులేనని సంఘం ప్రతినిధులు తెలిపారు. అఖిల భారతీయ జైన శ్వేతాంబరధర మూర్తి పూజక మహాసంఘానికి చెందిన మునులు వీరికి సన్యాస దీక్ష ఇస్తున్నారని సంఘం ప్రతినిధులు తెలిపారు. మరో వారం పాటు వీరికి దీక్ష ఇచ్చే ప్రక్రియ కొనసాగనుంది.

మునులకు స్వాగతం పలుకుతున్న జైన సముదాయం ప్రతినిధులు

వ్యవసాయంలో సమగ్ర పద్ధతులు

రాయచూరు, న్యూస్‌టుడే : ఉత్తమ సమగ్ర వ్యవసాయ పద్ధతులపై అన్నదాతలు మొగ్గు చూపాలే ప్రేరణ కల్గించాలని రాయచూరు వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఎం.హనుమంతప్ప శాస్త్రవేత్తలకు సూచించారు. వ్యవసాయ, పశువర్ధక, వ్యవసాయంతో ముడిపడిన పరిశ్రమలకు సంబంధించి నిర్వహించిన మూడు రోజుల సమ్మేళనం ముగింపు కార్యక్రమంలో ఉపకులపతి అధ్యక్షత వహించి ఉపన్యసించారు. ఒక సమీక్ష ప్రకారం పరిశోధనలకు ఒక రూపాయి ఖర్చు చేస్తే రూ.13.50 లాభం, విస్తరణ పనులకు రూ.7, వ్యవసాయ విద్యలో రూ.2.05 లాభం వస్తుందని తేలిందన్నారు. వ్యవసాయ వద్యను విద్యను బలోపేతం చేయాలన్నారు. వ్యవసాయ రంగం లాభసాటిగా మారేందుకు కృత్రిమ మేధస్సు, యంత్రాల వాడకం, డ్రోన్‌ల వినియోగంపై కర్షకులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. విద్యా నిర్దేశకుడు డాక్టర్ గురురాజ సుంకద మాట్లాడుతూ భారత్‌లో 48 శాతం మంది ప్రత్యక్షంగా వ్యవసాయంపై ఆధారపడ్డారని, ఇది దేశ జీడీపీలో 17 శాతం ఉందని వెల్లడించారు. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు, ఇతర కారణాల వల్ల సేద్యరంగంపై రైతులకు ఆసక్తి సన్నగిల్లకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులు వ్యవసాయ విద్యను పరిపూర్ణంగా అభ్యసిస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలుసుకోవాలని కోరారు. సమ్మేళనం సంయోజకుడు డాక్టర్ ఆర్.ఎ.శాహ, సంఘటనకారులు డాక్టర్ జాగృతి, వ్యవసాయ అర్థశాస్త్రం విభాగం ముఖ్యుడు డాక్టర్ లోకేశ్, సహ అధ్యాపకుడు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న ఉపకులపతి హనుమంతప్ప, ప్రతినిధులు

ఘనంగా అమరశిల్పి జక్కన్న జయంత్యుత్సవం

మాన్వి, న్యూస్‌టుడే : అమరశిల్పి జక్కన్న జయంత్యుత్సవాన్ని గురువారం మాన్వి, సిరివార, లింగసుగూరు తాలూకాల్లో ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ శిలలకు జీవం పోసిన మహాశిల్పి జక్కణాచార్యులన్నారు. దేశంలో పేరుగాంచిన దేవస్థానాల్లో ఆయన అద్భుత కళను కళ్లారా చూడొచ్చన్నారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సముదాయ ప్రముఖులను ఘనంగా సత్కరించారు. తహసీల్దార్లు భీమరాయ రామసంద్ర, అశోక్ పవార్, అబ్దుల్ వాహిద్ గ్రేడ్2, వై.భూపనగౌడ, లక్ష్మీ, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సంఘ సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

జక్కన్న చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సామూహిక అత్యాచారం.. అడ్డగోలు ‘వైద్య’ నివేదిక

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : కొప్పళ జిల్లా యలబుర్గ తాలూకా మద్లూర గ్రామ సమీపాన గత ఏడాది నవంబరు 17న ఒక గృహిణి (39) సామూహిక అత్యాచారానికి గురైన కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. హొసపేట నుంచి కుష్టగిలో తనకు పరిచయం ఉన్న వారి వద్ద నగదు కోసం వచ్చిన ఆమెకు.. మాయమాటలు చెప్పి తీసుకువెళ్లిన నలుగురు మత్తు మందు కలిపిన పానీయాన్ని తాగించి, సామూహిక అత్యాచారానికి పాల్పడి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు ఆమెను యలబుర్గ తాలూకా ఆసుపత్రిలో చేర్పించి, వైద్య పరీక్షలు చేయించారు. పరీక్షలకు నేతృత్వం వహించిన డాక్టర్ శివకుమార్ 16 సాక్ష్యాలను నాశనం చేయడంతో పాటు, నివేదికను కూడా అనుమానస్పదంగా రూపొందించారనేది తాజా అభియోగం. దీనిపై యలబుర్గ ఇన్‌స్పెక్టర్ మాలిపాటిల్ కొత్తగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS (O/o DISTRICT REGISTRAR) ANANTAPURAMU.
Dispute No. DRA/CFS/92/2025

Between:
M/s. Sri Raghuvaran Chits (P) Ltd., Rayadurgam Branch. ... Disputant
AND
V.S.Rajakumar and others ... Opponents

NOTICE TO OPPONENT No. 2
2. N.Gangadharappa S/o Nagappa, A/a 46 Years, Asst. Master, Ashoka Grameena High School, Ashoka Siddapura (V), Molakalmuru (T), Chitradurg Dist. R/of Ashoka Siddapura (V), Molakalmuru (T), Chitradurg (Dist.), Karnataka State.
Whereas the Disputant Chit Fund Company in the above Dispute has instituted the above Dispute for recovery of money for **Rs. 7,83,831/-** and the same is posted for your appearance in the said Court on the **21-01-2026** by 11.00 a.m. If you failed to attend the said court on the said date, the matter will be heard and decided as exparte.

By Order of Deputy Registrar of Chits
O/of the District Registrar, Registration and Stamps Dept.
D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu.

వాయుసేన శిక్షకుడిగా శ్రీనివాస్

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : భారతీయ వాయు దళం శిక్షణ కేంద్రంలో కమాండింగ్ ఇన్ చీఫ్‌గా సీనియరు అధికారి సీతేపల్లి శ్రీనివాస్ గురువారం బెంగళూరులోని సంబంధిత కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన ఆయన 1987 జూన్ 19న భారతీయ వాయు దళం విభాగంలో చేరారు. మిగ్-21, ఇస్క్రా, కిరణ్, పీసీ-7, ఎంకే 2 తదితర యుద్ధ విమానాలను 4200 గంటలు నడిపిన అనుభవం ఉంది. చేతక్, చీతా హెలికాప్టర్లు, పెచూరా క్షిపణి వ్యవస్థలో కార్యాచరణ అధికారిగానూ సేవలు అందించారు. రాష్ట్రపతి నుంచి 2017లో విశిష్ట సేవా పతకం, 2024లో అతి విశిష్ట సేవా పతకాన్ని అందుకున్నారు. కార్గిల్ యుద్ధవీరుల స్మారకం వద్ద నివాళి అర్పించి, సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని అందుకుని బాధ్యతలు చేపట్టారు.

స్మారకం వద్ద నివాళి అర్పిస్తున్న సీతేపల్లి శ్రీనివాస్

మఠాధిపతి దుందుడుకు చర్య

విజయపుర: ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ మంత్రి ఎంబీ పాటిల్ నివాసం వద్ద ధర్నా చేస్తున్న వారిని పంపించేందుకు వచ్చిన పోలీసులను ఆందోళనకారులు అడ్డుకున్నారు. ఈ సమయంలో బసవన బాగేవాడి తాలూకా పీబీ హుణశ్యాల గ్రామంలోని ఆధ్యాత్మిక పీఠం మఠాధిపతి సంగన బసవేశ్వర స్వామి తీరు విమర్శలకు దారితీసింది. విధినిర్వహణలో ఉన్న ఎస్సై సీతారామ లమాణి చెంప చెళ్లుమనిపించారు. ఎస్సైను మఠాధిపతి కొడుతున్న వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

జలవనరులను సంరక్షిద్దాం

మాన్వి, న్యూస్‌టుడే : జలవనరులను సంరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే హంపయ్యానాయక్ పేర్కొన్నారు. జలజాగృతి, జనజాగృతి పాదయాత్రను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. తుంగభద్ర నదిని కాలుష్యం బారిన పడకుండా కాపాడుకోవాలని, ప్రజలు, ప్రభుత్వాలు సమష్టిగా వ్యవహరించాలన్నారు. సమితి జాతీయ అధ్యక్షుడు బసవరాజ్‌పాటిల్ మాట్లాడుతూ శృంగేరి నుంచి మంత్రాలయం వరకు పాదయాత్ర చేస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు మహిమాపాటిల్, మాధవన్, గాయత్రి, శ్రీపతి, కుమారస్వామి, మహంతలింగ స్వామీజీ, విరూపాక్ష పండితారాధ్యస్వామీజీ, గంగాధర్‌నాయక్, రాజా వెంకటప్పనాయక్, బసనగౌడ, ఎన్.ఉదయ్‌కుమార్, అనితా నవకల్, జగదీశ్, సుధాకర్, శ్రీధర్‌స్వామి, శరణప్పగౌడ, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకారం.. కొండంత బలం

ముఖ్యమంత్రి శుభాకాంక్షలు చెప్పడానికి విచ్చేసిన శాలిని రజనీశ్, నసీర్ అహ్మద్ తదితరులు

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే : రాష్ట్రం అభివృద్ధి పథంలో కొనసాగేందుకు అధికారుల సహకారం అత్యవసరమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. సచివాలయం ఉద్యోగుల సంఘం కాలమానిని విడుదల చేసి, అధికారులు, సంఘం ప్రతినిధులతో గురువారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారందరి నుంచి నూతన సంవత్సర వేళ పూలగుచ్ఛాలు స్వీకరించి. . కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన పథకాలు, సేవలు జాప్యం లేకుండా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో ఉద్యోగులు, అధికారుల పాత్ర కీలకమని గుర్తు చేశారు. ఈ ఏడాది ప్రజలు, పేదలు, రైతులు, మహిళల మొహంలో సంతోషం చూడాలని ప్రతి ఒక్కరూ లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. గత ఏడాది చక్కని వర్షపాతం ఉండడంతో ఖరీఫ్, రబీ సాగు ఉత్తమంగా సాగిందని, జలాశయాలు నిండడంతో తాగు, సాగు నీటికి కొరత రాలేదన్నారు. విపక్షాలు రాజకీయాన్ని దృష్టిలో ఉంచుకుని విమర్శలు చేస్తుంటారని, వాటిని పట్టించుకోకుండా నవ, సమ సమాజాన్ని నెలకొల్పే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. ప్రతి ఒక్కరికీ ఆర్థిక స్వాతంత్ర్యం లభించేందుకే తాము పంచ గ్యారంటీ పథకాలు ఉపకరిస్తున్నాయని పునరుద్ఘాటించారు. రాజకీయ నాయకులు వచ్చి వెళుతుంటారని, అధికారులు కనీసం 35 ఏళ్ల ప్రజా సేవలో ఉంటారని పేర్కొన్నారు. విధులను చక్కగా నిర్వహిస్తే ప్రజల వద్ద గుర్తింపుతో పాటు, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుదన్నారు. ముఖ్యమంత్రికి రాజకీయ సలహాదారు నసీర్ అహ్మద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, ఉద్యోగుల సంఘం ప్రతినిధులతో సిద్ధరామయ్య సమావేశమయ్యారు.

పాత ఏడాదికి వీడ్కోలు.. కొత్త సంవత్సరంలో సంబరాలు

రాయచూరు, న్యూస్‌టుడే : కాలగర్భంలో కలసిపోయిన పాత ఏడాదికి ఘనంగా సాగనంపి, నూతన సంవత్సరాన్ని జిల్లా ప్రజలు సాదరంగా ఆహ్వానించారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటలు దాటాగానే చప్పట్లు కొడుతూ, కేరింతలు పెడుతూ ఉత్సాహంతో 2026 ఏడాదికి స్వాగతం పలికారు. గృహాలు, అపార్టుమెంట్లు, వసతి నిలయాల్లో కేకులు కోసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. యువతీ యువకులు సంతోషంతో బైకుల్లో సంచరించారు. రెస్టారెంట్లు, బార్లు కిటకిటలాడాయి. మాంసాహార హోటళ్లు, డాబాలు, స్వీట్లు, బేకరీ దుకాణాలు రద్దీగా మారాయి. జొన్న రొట్టెల విక్రయాల దుకాణాలు కిక్కిరిసిపోయాయి. నగరంలోని ఉద్యానవనాలకు కుటుంబ సమేతంగా వెళ్లి సరదగా గడిపారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసింది. ఆయా పార్టీల కార్యకర్తలు, నాయకులు ప్రజా ప్రతినిధులకు, సిబ్బంది, అధికారులు ఉన్నతాధికారులను కలసి కొత్త ఏడాది శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలను సన్మానించారు. గురువారం ఉదయం, సాయంత్రం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జిల్లా వ్యాప్తంగా ప్రముఖ దేవాయాలను దర్శించుకున్నారు.

ఎమ్మెల్యే బసనగౌడను సత్కరిస్తున్న నాయకులు

వాహనం చక్రం పేలి.. ముగ్గురు దుర్మరణం

హాసన, న్యూస్‌టుడే : అరిసికెరె తాలూకా చిక్కారహళ్లి సమీపాన గురువారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించారు. శబ్బీర్ (55), తిమ్మణ్ణ (53), సంజయ్ (45) అనే వ్యక్తులను మృతులుగా గుర్తించారు. హాసనకు చెందిన నౌషద్ ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. జాతీయ రహదారి 69లో వేగంగా వెళుతున్న బొలెరో వాహనం టైరు పేలిపోవడంతో అది బోల్తా కొట్టింది. వాహనంలో ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మరణించగా, నౌషద్‌ను చికిత్స కోసం హిమ్స్‌కు తరలించారు. బాణావర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

కలబురగి, న్యూస్‌టుడే : అప్పుల బాధ తాళలేక నింగణ్ణ మల్లేశప్ప దేశాయి (37) అనే రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. జీవర్గి తాలూకా కెల్లూర తాలూకాలో 2.21 ఎకరాల భూమి ఉన్న ఆయన స్థానికంగా మరికొందరి నుంచి పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. వివిధ బ్యాంకులు, స్థానికుల నుంచి రూ.10.5 లక్షల రుణం తీసుకున్నారు. వడ్డీ, అసలు చెల్లించలేక, పొలంలో పురుగుల మందు తాగి గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. అతని భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో జీవర్గి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS (O/o DISTRICT REGISTRAR) ANANTAPURAMU.
Dispute No. DRA/CFS/94/2025

Between:
M/s. Sri Raghuvaran Chits (P) Ltd. Rayadurgam Branch ... Disputant
AND
Kampam Venkatesh and others .. Opponents

NOTICE TO OPPONENT No. 1, 2 and 3
1. Kampam Venkatesh S/o K.Mallikarjuna, A/a 32 years R/of D/No : 6-1-18-1, Venkateswara Colony, Rayadurgam, Anantapuram Dist.
2. Valmiki Harish S/o V.Prakash, A/a 35 years, Asst. Engineer, KIUWMIP-KIUWMIP Tr-2, PIU, Kundapura, Udipi (Dist), Karnataka State R/of D/No : 8A Devinagar Road, opp : Kumar Swami Temple, Sanjay Gandhi Nagar, Bellary, Karnataka State.
3. T.Nagendra S/o Vaddara Thimmaiah, A/a 41 years, KB Scale Runner, Beviam, Mardihally (V), Hirayur Division, Chitradurga Dist, Karnataka State R/of Mathrukrupa Nilaya, Gajendra Layout, Valmiki Nagar, Challekere, Chitraduga. (Dist).
Whereas the Disputant Chit Fund Company in the above Dispute has instituted the above Dispute for recovery of money for **Rs. 4,85,049/-** and the same is posted for your appearance in the said Court on the **21-01-2026** by 11.00 a.m. If you failed to attend the said court on the said date, the matter will be heard and decied as exparte.

By Order of Deputy Registrar of Chits
O/of the District Registrar, Registration and Stamps Dept.
D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu.

(c) eenadu

నూతన సంవత్సర శుభాకాంక్షలు

పూరీ గోల్డెన్ బీచ్‌లో గురువారం ఉదయం ప్రముఖ శిల్పి సుదర్శన పట్నాయక్ సైకత శిల్పం తీర్చిదిద్ది సందర్శకులకు 2026 ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. - న్యూస్‌టుడే గోపాలపూర్

10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఇంతవరకు 2.28 లక్షల రైతుల నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగింది. అన్నదాతల బ్యాంకు ఖాతాలకు రూ.179 కోట్లు జమ చేసినట్లు ఆహార, పౌరసరఫరాలశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్‌కుమార్ సింగ్ తెలిపారు. గురువారం భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్‌లో ఆహార, పౌరసరఫరాల శాఖల మంత్రి కృష్ణచంద్ర పాత్ర్ అధ్యక్షతన ఖరీఫ్ పంట సేకరణపై సమీక్షా సమావేశం జరిగింది. మండీల్లో సక్రమంగా ధాన్యం సేకరణ జరుగుతోందని, ఇబ్బందులు తొలగాయని సింగ్ వివరించారు. ఇన్‌పుట్ సబ్సిడీగా రైతులకు పంట మద్దతుగా రూ.552 కోట్లు చెల్లింపులు జరిగాయన్నారు. సమావేశానంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో గోదాముల కొరత ఉన్నందున మూడు రకాలుగా 10, 6, 4 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంగల గిడ్డంగులు నిర్మాణాలకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి పాత్ర్

ఈ-కేవైసీ పొడిగింపు

రాష్ట్రంలో రేషన్ కార్డుల కోసం 96 శాతం మంది ఈ-కేవైసీ చేయించుకోగా మరో 13 లక్షల మంది చేయించుకోలేదన్నారు. ఈ-కేవైసీ వ్యవధి డిసెంబరు 31తో ముగిసినందున మరో రెండు నెలలు పొడిగించామన్నారు. ఇదే చివరి అవకాశమని, దీనిని వినియోగించుకోవాలని మంత్రి కోరారు.

రఘురాయలతో సింగ్‌దేవ్ చర్చలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ హైదరాబాద్‌కు చెందిన ఆర్‌వీఆర్ ప్రాజెక్ట్స్ ఎండీ రఘురాయలతో బుధవారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో చర్చించారు. ఆర్‌వీఆర్ సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరిచిన నేపథ్యంలో త్వరలో ఒప్పందం కుదరనుందని అధికార వర్గాలు తెలిపాయి. పవర్ ప్రాజెక్టు, ఫార్మాస్యూటికల్ కేంద్రాల నిర్మాణాలపై ఆర్‌వీఆర్ కంపెనీ ఆసక్తి కనబరిచినట్లు తెలిసింది.

హైదరాబాద్ ప్రతినిధుల బృందంతో సింగ్‌దేవ్ చర్చలు

మహిళలు అవకాశాలు వినియోగించుకోవాలి: గవర్నర్

జగన్నాథుని విగ్రహం వద్ద దీపం వెలిగిస్తున్న గవర్నరు హరిబాబు, పక్కన ఎంపీ సంబిత్ తదితరులు

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆర్థికాభివృద్ధి ధ్యేయంగా పథకాలు అమలు చేస్తున్నాయని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని గవర్నర్ కంభంపాటి హరిబాబు కోరారు. సంవత్సర ప్రారంభం రోజున గురువారం పూరీ జిల్లా సదర్ సమితిలోని కృష్ణాంజనపూర్‌లో జరిగిన మహిళల సదస్సులో గవర్నరు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాల గురించి విపులంగా వివరించారు. వాణిజ్య బ్యాంకులు రాయితీలతో కూడిన రుణాలు కేటాయిస్తున్నాయని, గ్రామీణ ప్రజలు వీటిగురించి తెలుసుకుని ప్రయోజనాలు పొందాలన్నారు. గవర్నరు పర్యటనలో భాగంగా గ్రామస్థులు ఆయనకు మనస్వాగతం పలికారు. కార్యక్రమంలో పూరీ ఎంపీ సంబిత్‌పాత్ర్, బ్రహ్మగిరి ఎమ్మెల్యే ఉపాసన మహాపాత్ర్, పూరీ కోణార్క్ దీవీలాబ్ మెరిట్ అథారిటీ కార్యదర్శి, మహిళలు పాల్గొన్నారు. అనంతరం లోక్‌భవన్‌లో గవర్నరు హరిబాబు పార్లమెంటు సభ్యుడు సంబిత్‌తో కొంతసేపు వివిధ అంశాలపై ముచ్చటించారు.

పాల్గొన్న మహిళలు

సీఎస్‌ను అభినందించిన సీఎం

ముఖ్యమంత్రి మోహన్‌తో అనూగార్గ్, మనోజ్ అహుజా

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన అనూగార్గ్ బుధవారం రాత్రి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో కలిశారు. ఆమె వెంట మాజీ సీఎస్ మనోజ్ అహుజా కూడా ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం మోహన్ అనూగార్గ్‌ను అభినందించారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం ధ్యేయంగా విధులు నిర్వహించాలని సూచించారు.

అందాలకు నిలయం.. రోల జలపాతం

స్వాగత తోరణం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: పచ్చని ప్రకృతి.. చుట్టూ దట్టమైన అడవి.. కొండల పైనుంచి కిందకు గలగల పారుతున్న జలపాతం అందాలు సందర్శకులకు మధురానుభూతులు మిగులుస్తాయి. గంజాం జిల్లా సురడా సమితిలో బడగడకు నాలుగు కి.మీ. దూరంలోని 'రోల' జలపాతం ఇప్పుడు జిల్లా వాసుల వన భోజనాలు, విహార యాత్రలకు నిలయంగా మారుతోంది. ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లో సందర్శకులతో ఈ ప్రాంతం కిటకిటలాడుతోంది.

సందర్శకుల విశ్రాంతికి ఏర్పాట్లు

బ్రహ్మపుర నుంచి..

బ్రహ్మపుర నుంచి సుమారు 70 కి.మీ. దూరంలోని రోల జలపాతం అందాల్ని సందర్శకులు ఆస్వాదించేందుకు సుమారు ఏడాది కిందట ప్రభుత్వం దీన్ని అభివృద్ధి చేసింది. ఇక్కడ సందర్శకులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేయడంతోపాటు వన భోజనాలకు వచ్చే వారి కోసం తాగునీరు, వంటలు చేసుకునేందుకు, భోజనాలకు భారీ వృక్షాల కింద సిమెంట్‌తో నిర్మాణాలు చేపట్టింది. బడగడ-మోహన ప్రధాన రహదారి నుంచి సుమారు రెండు కి.మీ. లోపలకు వెళ్తే జలపాతం స్వాగతం పలుకుతుంది.

ప్రచారం చేయాలి

రోల జలపాతానికి ఇప్పుడిప్పుడే సందర్శకుల తాకిడి ఉంటోందని, పర్యాటక శాఖ ముమ్మర ప్రచారం జరిపితే ఇదో మంచి పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందుతోందని బడగడ నివాసి, సౌత్ ఒడిశా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహా నీల మాధవ్ బుధవారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. జలపాతం వరకూ కారులు, ద్విచక్ర వాహనాలు తదితరాలు వెళ్లేందుకు కచ్చా రోడ్డు ఉందని, దీన్ని పక్కా రోడ్డుగా మార్చాలని కోరారు. ఈ పర్యాటక కేంద్రంలో సందర్శకుల భద్రతపైనా జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలని నీల మాధవ్ సూచించారు.

జాలువారుతున్న జలం

2026 ప్రధాన పార్టీలకు కీలకం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈ ఏడాది (2026) ప్రధాన రాజకీయ పార్టీలకు కీలకం కానుంది. అధికార, విపక్షాల్లో లుకలుకలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎవరికి కలిసొస్తుందన్నదిప్పుడు చర్చనీయాంశమైంది. 2027 సంవత్సరారంభంలో స్థానిక సంస్థల (పంచాయతీ, మున్సిపల్) ఎన్నికలు జరుగుతాయి. ఇందుకోసం ప్రధాన పార్టీలు భాజపా, బిజద, కాంగ్రెస్ పార్టీలు గట్టి కసరత్తు చేయాల్సి ఉంటుందని పరిశీలకులంటున్నారు.

కాంగ్రెస్‌లో ఇంటిపోరు

గతేడాది పీసీసీ అధ్యక్ష పదవి చేపట్టిన **భక్త చరణ్‌దాస్** కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెస్తానని చెప్పుకున్నా అది నెరవేరలేదు. నువాపడ ఉప ఎన్నికల్లో ఆ పార్టీ తృతీయ స్థానానికే పరిమితమైంది. ఇంటిపోరు యథాతథంగా ఉంది. నేతల్లో అభిప్రాయభేదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో కాంగ్రెస్ చేపట్టిన ఆందోళనల్లో నాయకులంతా పాల్గొనలేదు. వాస్తవాలు ఎండగట్టిన సీనియర్ నేత మహమ్మద్ ముఖింను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించారు. దీన్ని ఎంతోమంది నిరసించారు. ముఖిం ప్రాంతీయ పార్టీ పెట్టేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. బిజద, కాంగ్రెస్ అసంతృప్తి నాయకుల్ని తనవైపు రప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమదే పైచేయి అంటున్న భక్తచరణ్ ముందు ఎన్నో సవాళ్లున్నాయి. ఇవి అధిగమించి కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెస్తానన్న ఆయన ఆశయం నెరవేరుతుందా అన్న చర్చ పార్టీలో కొనసాగుతోంది.

నవీన్‌కు అగ్ని పరీక్ష

ప్రధాన విపక్షం బిజదలో అసంతృప్తి తీవ్రంగా ఉంది. ఆ పార్టీ అధికారం కోల్పోయిన తరువాత అధినేత **నవీన్ పట్నాయక్** పట్టు సడలింది. ఇదివరకు ఆయనకు వ్యతిరేకంగా పెదవి విప్పని వారంతా ప్రసార సాధనాల ముందు నాయకత్వాన్ని ధిక్కరించి వ్యాఖ్యలు చేస్తున్నారు. కొంతమంది గ్రూపులు కట్టారు. లక్ష్మణరేఖ దాటినవారిపై నాయకత్వం చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తోంది. నువాపడ సీటు చేజారిన తరువాత బిజద ప్రతిష్ఠ మరింత మసకబారింది. శాసనసభలో ప్రధాన విపక్షంగా సక్రమంగా బాధ్యతలు నిర్వర్తించడం లేదన్న అపవాదు ఉంది. ఇటీవల జరిగిన పార్టీ ఆవిర్భావ వేడుకల్లో మరో వందేళ్లు బిజద మనుగడ సాగిస్తుందని నవీన్ చెప్పినా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయలేదు. వయోభారం, అస్వస్థత వల్ల ఓపిక, ఉత్సాహం తగ్గిన ఆయన తన తదనంతరం పార్టీ సారథ్యం ఎవరు చేపడతారన్నదానిపై పెదవి విప్పలేదు. మరోవైపు వి.కార్తికేయపాండ్యన్, సుజాత కార్తికేయన్ దంపతుల అలజడి బిజదలో కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో 2026లో ఈ సవాళ్లు అధిగమించి నేతలందర్నీ ఒకేతాటిపైకి తేవడం నవీన్‌కు అగ్నిపరీక్ష అని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఆశావహుల ఎదురుచూపులు

గతేడాది భాజపాకు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. శాంతి భద్రతల విషయానికొస్తే మహిళలు, బాలికలపై జరిగిన అత్యాచారాలు, ఆత్మాహుతి ఘటనలు **మోహన్‌చరణ్ మాఝి** సర్కారు ప్రతిష్ఠను మసకబార్చాయి. మరోవైపు పదవుల కోసం వేచిచూస్తున్న వారిలో అసహనం వ్యక్తమవుతోంది. ఇదిగిదిగో అంటూ కాలయాపన చేసిన పాలకులు కీలక నేతలకు పునరావాసం కల్పించలేదు. పదవులు ఆశిస్తున్నవారి సంఖ్య ఎక్కువ కావడమే ఇందుకు కారణం. గతేడాది నువాపడ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన భాజపా త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఆధిక్యత సాధించాలన్న ధ్యేయంతో ఉంది. పంచాయతీ, బూత్‌స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి నాయకత్వం కసరత్తు చేస్తోంది. ఇది నెరవేరాలంటే ఆశావహులకు పునరావాసం కల్పించాల్సి ఉంది.

ప్రగతి ఫలాలు ప్రజల వద్దకు చేరాలి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన అనూగార్గ్ గురువారం భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్‌లో తన కార్యాలయానికి వెళ్లారు. అన్నిశాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులతో సమావేశమై కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సమృద్ధ ఒడిశా ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు.

వీటిపై దృష్టి సారించండి

మరోవైపు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సీఎస్‌కు 15 టాస్క్‌లిచ్చారు. వాటి అమలుకు శ్రీకారం చుట్టాలని సూచించారు. పారిశ్రామిక ఒప్పందాలు పట్టాలెక్కించాలని, విజన్ డాక్యుమెంట్-2036 చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి అభివృద్ధి చెందిన అయిదు రాష్ట్రాల జాబితాలో ఒడిశా చేరేలా కార్యాక్రమాలు అమలు చేయాలన్నారు. కార్యాలయాలకు పరిమితం కాకుండా, అధికారులు క్షేత్రస్థాయిలో తరచూ పర్యటించి పరిస్థితి అధ్యయనం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయాశాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులతో తరచూ సమావేశాలు చేపట్టి బడ్జెట్ కేటాయింపులు ఖర్చయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రగతి ఫలాలు ప్రజల ముంగిళ్లకు చేరేలా దృష్టి సారించాలని ఆదేశించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గదతో కంస పాత్రధారి

బరగఢ్, న్యూస్‌టుడే: బరగఢ్‌లో జరుగుతున్న ప్రపంచ ప్రసిద్ధ ధనుయాత్ర బుధవారం రాత్రి అత్యంత ఆకర్షణగా, మధురానగరి భక్తిశ్రద్ధలతో సాగింది. గోపపూర్‌లో కృష్ణ బలరాముల సన్నివేశాలు, కృష్ణ లీలలతో పాటు కంసుడు అహంకారాన్ని ప్రతిబింబించే కీలక సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. రాజదర్బార్‌లో కంసుడు నిర్వహించిన రాజ్యసభ ఘనంగా సాగింది. ఈ ప్రదర్శనకు వేలాది మంది ప్రజలు హాజరయ్యారు.

రాజస్థాన్ కళాకారుల నృత్యం

'బీఈఎంసీ'లో 14 పంచాయతీల విలీనం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ)లో పరిసరాల్లోని 14 పంచాయతీల పరిధిలో గల 34 రెవెన్యూ గ్రామాల విలీనం ప్రక్రియకు శ్రీకారం జరిగింది. ఈ మేరకు రాష్ట్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ముప్పై రోజుల్లోగా విలీనంపై ఆయా గ్రామాల ప్రజల నుంచి అభ్యంతరాలుంటే గంజాం పాలనాధికారి ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరింది. ఈ ప్రకటనతో బ్రహ్మపుర, దాని పరిసర గ్రామాల ప్రజల దీర్ఘకాల డిమాండు నెరవేరనుంది. 'గ్రేటర్ బ్రహ్మపుర'కు మార్గం సుగమం కానుంది. ప్రభుత్వ నోటిఫికేషన్‌తో ఈ డిమాండుపై ముమ్మరంగా ఉద్యమిస్తున్న సౌహరి తౌళ అంచలా మిళిత క్రియానుష్ఠాన్ కమిటీ అధ్యక్షుడు సంజీబ్ పట్నాయక్ ఆనందం వ్యక్తం చేశారు. తమ దీర్ఘకాల కల సాకారం కానుందని పేర్కొన్నారు.

చిలికాలో చిక్కుకున్న పడవ: ఒకరి మృతి

- నూతన సంవత్సరారంభంలో విషాదం

గోపాలపూర్, న్యూస్‌టుడే: మంచు ముప్పుగా పరిణమించింది, ఒక వ్యక్తిని పొట్టన పెట్టుకొంది. చిలికా సరస్సులో గురువారం ఉదయం ఈ ఘటన జరిగింది. పూరీ జిల్లా కృష్ణప్రసాద్ సమితి పరిధిలోని సతపడ నుంచి జొహ్నికుడ వైపునకు 50 మంది ప్రయాణికులతో చిలికా సరస్సు నుంచి బయలుదేరిన పడవలో ఒక బస్సు, రెండు కార్లున్నాయి. పడవ బయలుదేరిన కొద్దిసేపటికే మంచు కమ్మేసింది. మార్గం కనిపించలేదు. దీంతో సరంగు మహిషాకుద వద్ద పడవను నిలిపేశారు. గంటవరకు అక్కడే ఉండిపోయారు. భయంతో ప్రయాణికులు కేకలు వేశారు. ఈ వైనం తెలిసిన కృష్ణప్రసాద్ సమితి యంత్రాంగం ఘటనా స్థలానికి రెండు లాంచీలను తరలించింది. పడవలో ఉన్న ప్రయాణికులందర్నీ లాంచీల్లోకి తెచ్చి ఒడ్డుకు చేర్చింది. పడవ దిగినవారిలో ఒక వ్యక్తి లేరని కుటుంబీకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన బ్రహ్మపురకు చెందిన ఉమాశంకర్ సబత్‌గా తేలింది. అగ్నిమాపక జవానులు చిలికాలో గాలించగా మధ్యాహ్నానికి ఆయన మృతదేహం దొరికింది. నూతన సంవత్సరం వేడుకలు జరుపుకోవాలని కుటుంబ సమేతంగా బుధవారం వెళ్లిన బసత్ గురువారం బ్రహ్మపురకు తిరిగి బయలుదేరి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు.

చిలికా సరస్సులో నిలిచిపోయిన పడవ

గజపతి కలెక్టర్‌గా అక్షయ్

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లాకు నూతన కలెక్టరుగా **అక్షయ్ సునీల్ అగర్వాల్**ను నియమిస్తున్నట్లు ప్రభుత్వం గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గతంలో నయాగఢ్ కలెక్టరుగా విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

రహదారుల అనుసంధానం.. ప్రయాణం మరింత సులభం

- రూ.1,526 కోట్లతో ఉన్నతీకరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- రాయగడ, కొరాపుట్, గజపతి జిల్లాలకు లబ్ధి

రహదారి నమూనా చిత్రం

– న్యూస్‌టుడే, రాయగడ పట్టణం

విజయవాడ - రాంచీ కారిడార్‌లో భాగమైన ఎన్‌హెచ్ 326కు మహర్దశ పట్టనుంది. రూ.1,526 కోట్లతో దీని ఉన్నతీకరణకు కేంద్ర క్యాబినెట్ బుధవారం సాయంత్రం ఆమోదం తెలిపింది. ఈ వివరాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ఇప్పటికే రెండు వరుసలుగా ఉన్న ఈ రహదారిని మరో రెండు వరుసలకు విస్తరించనున్నారు. దీంతో దక్షిణాది జిల్లాలు ముఖ్యంగా రాయగడ, కొరాపుట్, గజపతి జిల్లాలకు మరింత లబ్ధి చేకూరనుంది. ఎన్‌హెచ్-326లోని 68.600 కి.మీ నుంచి 311.700 కి.మీ వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నారు. దీంతో రాష్ట్రంలో వివిధ జిల్లాల మధ్య, అంతర్రాష్ట్ర ప్రయాణం మరింత సులభతరం కానుంది. ఇంజినీరింగ్ స్థలసేకరణ, నిర్మాణం విధానం ద్వారా విస్తరించనున్న దీనికోసం రూ.1,526.21 కోట్ల అంచనా వ్యయాన్ని నిర్ణయించారు. సివిల్ నిర్మాణం కోసం మొత్తం నిధుల్లో రూ.966.79 కోట్లు వెచ్చించనున్నారు.

తగ్గనున్న ప్రయాణ సమయం

రాయగడ, కొరాపుట్, గజపతి జిల్లాల మీదుగా కొనసాగుతున్న ఈ రహదారి విస్తరణలో వివిధ ముఖ్య రహదారులకు అనుసంధానం జరగనుంది. ఎన్‌హెచ్ 59, 26, 16, రాయపూర్ -విశాఖ కారిడార్‌కు అనుసంధానంతో చాలా ప్రాంతాలకు ప్రయాణ సమయం మరింత తగ్గనుంది. ఈ కారిడార్ జె.కె.కాగితపు పరిశ్రమ, మెగాఫుడ్ పార్క్, నాల్కో, ఇంఫా, వేదాంత ఉత్కళ అల్యూమినా, హాల్ వంటి పరిశ్రమలకు అనుసంధానం మరింత సులభతరం కానుంది. విస్తరణ పనులు పూర్తిచేయడానికి రెండేళ్ల గడువు విధించగా, మరో ఐదేళ్ల పాటు నిర్వహణతో కలిపి మొత్తం ఏడేళ్లు కోసం ఒప్పందం కుదుర్చుకున్నట్లు క్యాబినెట్ స్పష్టం చేసింది. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ఆమోదం లభించిన ఈ రహదారి విస్తరణ పూర్తయితే పైమూడు జిల్లాల్లో పారిశ్రామిక, పర్యాటక, ఆర్థిక రంగాలు మరింత పురోగతి సాధించనున్నాయి.


వివరాలు వెల్లడిస్తున్న మంత్రి అశ్వినీ వైష్ణవ్

అంబరాన్నంటిన అర్ధరాత్రి సంబరాలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలో నూతన ఆంగ్ల సంవత్సరాన్ని స్వాగతిస్తూ వివిధ సంస్థలు, బహుళ అంతస్థులు, వివిధ వీధుల్లో బుధవారం రాత్రి నిర్వహించిన 'అర్ధరాత్రి సంబరాలు-2026' అంబరాన్నంటాయి. అర్ధరాత్రి 12 గంటలు దాటగానే నగరంలో వివిధ చోట్ల బాణసంచా కాల్చి ఒకరికొకరు శుభాకాంక్షలు చెబుతూ సందడి చేశారు. స్థానిక యూనియన్ క్లబ్, గాంధీనగర్‌లోని ఓ హోటల్, గంజాం కళా పరిషత్‌లలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న నగరవాసులు వేడుకల్ని ఆస్వాదిస్తూ కళాకారులతో కలిసి నృత్యాలు చేశారు. అర్ధరాత్రి సంబరాల నేపథ్యంలో బ్రహ్మపుర పోలీసు జిల్లా యంత్రాంగం నగరంలోని వివిధ కూడళ్లలో పోలీసుల్ని నియమించి, రహదారుల్లో వాహనాలతో ముమ్మర గస్తీ నిర్వహించింది. పలు తెలుగు ప్రాంతాల్లో ప్రజలు ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్ది, కొత్త సంవత్సరానికి స్వాగతించారు.

సందర్శకుల సందడి

(c) eenadu

ఆనందమానందమాయె!



సింహద్వారం వద్ద పతిత పావనునికి హారతి

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ పుణ్యధామం ఆనంద సాగరాన్ని తలపించింది, శ్రీక్షేత్రం ఆవరణ భక్త జనం ప్రార్థనలతో పిక్కటిల్లింది. పురుషోత్తమా! ప్రణమామ్యహం అంటూ జగన్నాథుడ్ని కొలిచారు. ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం నల్లనయ్య సన్నిధి కళకళలాడింది. బుధవారం రాత్రి ఒంటిగంటకు ఆలయ తలుపులు తెరిచిన సేవాయత్‌లు గర్భగుడిలో జగన్నాథ, బలభద్ర, సుభద్రల సన్నిధిలో మంగళహారతి మైలం, అబకాశ, తిలకధారణ, ఇతర సేవలు పూర్తిచేశారు. రాత్రి 2 గంటల నుంచే భక్తుల దర్శనాలు మొదలయ్యాయి. రాత్రంతా భక్తులు బారికేడ్ లైన్లలో జాగరణ చేసి ఆరాధ్య దైవాన్ని దర్శించుకున్నారు. గురువారం రోజంతా భక్తుల సందడి కొనసాగింది. ఆలయం లోపల, వెలుపల పోలీసు యంత్రాంగం గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది. పూరీ పాలనాధికారి దివ్యజ్యోతి పరిడ, ఎస్పీ ప్రతీక్ సింగ్ దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉదయం 11 గంటల కల్లా స్వామికి ఒబడా నైవేద్యం అర్పించి భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. ఎలాంటి అపశ్రుతులు జరగలేదని క్షేత్ర పాలనాధికారి పరిడ చెప్పారు.

'జల క్రీడల కాంప్లెక్స్' నిర్మాణానికి భూమిపూజ

భూమిపూజలో పాల్గొన్న చికిటి ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన్ సామంత్రాయ్, గంజాం పాలనాధికారి కీర్తివాసన్ తదితరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా చికిటి సమితిలోని సున్నాపురంలో సాగర తీరం సమీపాన కొత్తగా 'జల క్రీడల కాంప్లెక్స్' నిర్మాణానికి బుధవారం సాయంత్రం భూమి పూజ జరిగింది. బ్రహ్మపుర అభివృద్ధి సంస్థ (బీఈడీఏ) ఆధ్వర్యంలో రూ.2.40 కోట్ల వ్యయ అంచనాతో ఇది నిర్మాణం కానుంది. ఈ సందర్భంగా జరిగిన భూమిపూజల్లో చికిటి ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన్ సామంత్రాయ్ అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గంజాం పాలనాధికారి వి.కీర్తివాసన్, బీఈడీఏ ఉపాధ్యక్షుడిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) కమిషనర్ ప్రథమేష్ అరవింద్ రాజేషిర్కె, బ్రహ్మపుర సబ్‌కలెక్టరు అవినాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

5 వరకు రాష్ట్రానికి మంచు ముప్పు: తగ్గిన చలి

పూరీజిల్లా కోణార్క్ ఆవరణలో గురువారం ఇలా..

గోపాలపూర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో చలి తీవ్రత తగ్గిందని, మంచు పెరిగిందని గురువారం దక్షిణ ఉత్తరకోస్తా, తీర జిల్లాల్లో విపరీతంగా మంచు కురిసినట్లు గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్ర అధికారి కె.ఎస్.మూర్తి 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ఈ పరిస్థితి 5 వరకు కొనసాగుతుందన్నారు. శుక్రవారం (2న) జగత్సింగ్‌పూర్, పూరీ, కేంద్రపడ, అనుగుల్, ఢెంకనాల్, సోన్‌పూర్, బౌద్ధ్, నయాగడ్, జాజ్‌పూర్, కటక్, ఖుర్దా జిల్లాల్లో మంచు తీవ్రత అధికంగా ఉంటుందన్న అంచనాతో ఆరెంజ్ హెచ్చరికలు జారీచేశామన్నారు. కొంధమాల్, గజపతి, గంజాం, సంబల్‌పూర్, కేంఝర్, బాలేశ్వర్, భద్రక్, మయూర్‌భంజ్, సుందర్‌గఢ్ జిల్లాల్లోనూ మంచు కురిసే అవకాశం ఉన్నందున ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు.

తీవ్ర ఇబ్బందులు

గురువారం ఉదయం భువనేశ్వర్, కటక్ ఖుర్దా, బాలేశ్వర్, భద్రక్, కేంద్రపడ, జగత్సింగ్‌పూర్, నయాగడ్ ప్రాంతాల్లో విపరీతంగా మంచు కురిసినందున వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. భువనేశ్వర్ విమానాశ్రయం నుంచి 10 గంటల వరకు విమాన సేవలు నిలిచిపోయాయి. పూరీలోనూ పాక్షికంగా మంచు కురిసింది.

'ఎఫ్‌డబ్ల్యూసీ' సేవ

పేదవానికి కంబలు కప్పుతున్న ప్రతినిధి. చిత్రంలో ఎఫ్‌డబ్ల్యూసీ ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని 'ఫ్రెండ్స్ వెల్ఫేర్ క్లబ్' (ఎఫ్‌డబ్ల్యూసీ) ఆధ్వర్యంలో బుధ, గురువారాలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి పార్కువీధిలోని క్లబ్ కార్యాలయం వద్ద కేక్ కోసి కొత్త సంవత్సర వేడుకలు జరుపుకొన్న సంస్థ ప్రతినిధులు అనంతరం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పేదలకు కంబళ్లతో పాటు బిస్కెట్లు, రస్కులు, పండ్లు పంచిపెట్టారు. ఆయా కార్యక్రమాల్లో ఎఫ్‌డబ్ల్యూసీ ప్రతినిధులు బి.వెంకటరావు, ఎ.లక్ష్మీనారాయణ (బాబు), కె.శ్రీనివాసరావు, ఎస్.సురేష్, బి.ఆదినారాయణ, కె.మాధవ రావు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ మిస్ సౌత్ ఇండియాగా మేఘాల్

రాయగడ రైల్వే స్టేషన్ వద్ద తల్లిదండ్రులతో మేఘాల్

రాయగడ, న్యూస్‌టుడే: జిల్లాలోని జేకేపూర్‌కు చెందిన 4వ తరగతి చదువుతున్న మేఘాల్ యాదవ్ జూనియర్ మిస్ సౌత్ ఇండియాగా ఎంపికయ్యింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఈ పోటీల్లో 360 మంది పోటీపడగా జూనియర్ రన్నర్‌గా నిలిచి బహుమతి, టైటిల్ కైవసం చేసుకొని గురువారం రాయగడ చేరుకుంది. మొదట విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో 700మంది పాల్గొనగా వారిలో ఫైనల్ పోటీలకు ఎంపికైందని ఆమె తండ్రి చంద్రశేఖర్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

శశిభూషణ్ రథ్‌కు నివాళులు

పాతబస్టాండులోని శశి భూషణ్ రథ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బ్రహ్మపుర ఎమ్మెల్యే అనిల్ కుమార్, ఇతరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్వతంత్ర ఒడిశా ఏర్పాటు ఉద్యమంలో చురుగ్గా పాల్గొని, మాతృభాష పరిరక్షణకు శశి భూషణ్ రథ్ విశేష సేవలందించారని వక్తలు అన్నారు. రథ్ 142వ జయంత్యుత్సవం సందర్భంగా గురువారం స్థానిక సంస్థలు, ఇతర సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. స్థానిక పాతబస్టాండు, ఎస్బీఐ మహిళా కళాశాల ఆవరణల్లోని ఆయన విగ్రహాలకు ఆయా సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్ కుమార్, త్రినాథ మహరణా, ప్రమోద్ కుమార్ పండా, డాక్టర్ సాగర్ రంజన్ త్రిపాఠి, రఘునాథ్ సామంత్రాయ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయకుంటే రాస్తారోకో

మండీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగ్‌పూర్ జిల్లాలో గత నెల 11న మండీలు ప్రారంభం కాగా ఉమ్మరకోట్‌లో 17న ప్రారంభించారు. కాని మండీల వద్ద ధాన్యం బస్తాలు కుప్పలుగా పడి ఉన్నా మిల్లర్లు, అధికారులు కొనుగోలు చేయడం లేదని రైతులు ఆగ్రహిస్తున్నారు. మరో రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు చేయకుంటే రాస్తారోకో చేస్తామని అన్నదాతలు గురువారం హెచ్చరించారు. ఇప్పటికే ధాన్యం బస్తాలు ఎండలోనూ రాత్రివేళల్లో చలిలోనే ఉండిపోయి నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. మండీ డైరెక్టర్ అజిత్‌రాయ్ మాట్లాడుతూ.. ఇప్పటికే 400 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని, నాణ్యత పరీక్షల అనంతరం కొనుగోలు చేస్తామని తెలిపారు.

హరిబాబును కలిసిన అనూగార్గ్

సీఎస్ అనూగార్గ్‌ను సత్కరిస్తున్న గవర్నర్ హరిబాబు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా బాధ్యతలు చేపట్టిన అనూగార్గ్ గురువారం సాయంత్రం భువనేశ్వర్‌లోని లోక్‌భవన్‌లో గవర్నర్ కంభంపాటి హరిబాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలు, అమలవుతున్న పథకాలు సంబంధించి సీఎస్ గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆమెను హరిబాబు సత్కరించారు.

క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

సూరజ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కదం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యమని పొట్టంగి ఎమ్మెల్యే రామ్ చంద్ర కదం అన్నారు. రాష్ట్ర అండర్-17 కబడ్డీ జట్టుకు సిమిలిగుడ నందపూర్ సమితికి చెందిన విద్యార్థి సూరజ్ పాండే ఎంపికైన విషయం తెలిసిందే. భువనేశ్వర్‌లో ఎమ్మెల్యే కదం అధికార నివాస గృహంలో సూరజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

గుప్తేశ్వరంలో భక్తుల సందోహం

జయపురం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా కొరాపుట్‌లోని ప్రసిద్ధ శైవ క్షేత్రమైన గుప్తేశ్వరుని వేల సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఒడిశాతో పాటు ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు హాజరయ్యారు. భక్తులతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది.

భాజపాలో భారీగా చేరికలు

కండువా కప్పి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే మనోరంజన్

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా చికిటి నియోజకవర్గంలోని ఓ పంచాయతీ వాసులు పెద్ద సంఖ్యలో భాజపాలో చేరారు. ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన్ సామంత్రాయ్ ఆధ్వర్యంలో బుధవారం పాత్రపురంలోని కార్యాలయ ఆవరణలో వేడుకలు నిర్వహించారు. ఆయన సమక్షంలో పాత్రపుర సమితిలోని పొడదిని పంచాయతీలోని 80 కుటుంబాల వారు భాజపాలో చేరారు. వారికి ఎమ్మెల్యే మనోరంజన్ పార్టీ టోపీలు పెట్టి, కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భార్య, మహిళా మోర్చా నాయకులు మినా ధ్యాన్ సామంత్రాయ్ కూడా పాల్గొన్నారు.

ముగ్గురు ఐఏఎస్‌లకు ఉద్యోగోన్నతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ఉద్యోగోన్నతి కల్పించింది. బుధవారం రాత్రి సాధారణ పాలనాభివిభాగం (జీఏ) అధికార వర్గాలు దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీచేశాయి. ప్రమోషన్ పొందిన వారిలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆర్.ఎస్.గోపాలన్, శాలిని పండిత్, డి.వెంకటస్వామిలు ఉన్నారు. ఈ ముగ్గురికి సహాయ ప్రధాన కార్యదర్శి హోదా కల్పించారు.

మాలిపుంగర్‌లో నాటిక ప్రదర్శన

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ సమితి కుందిలి పంచాయతీకి చెందిన మాలిపుంగర్‌లో బుధవారం రాత్రి దేశీ నాటిక ప్రదర్శన ఏర్పాటైంది. గ్రామానికి చెందిన యువకుల కొత్తగా నేర్చుకుని తొలిసారిగా గ్రామంలో నాటికను ప్రదర్శించారు. సర్పంచి అర్జున్ నాయక్ పాల్గొని నాటిక ప్రారంభించారు.

సర్వేజనా!.. సుఖినోభవంతు

గోపాలపూర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా బాధ్యతలు స్వీకరించిన అనూగార్గ్ బుధవారం రాత్రి పూరీ శ్రీక్షేత్రాన్ని సందర్శించారు. జగన్నాథుని సన్నిధిలో ఆలయ పాలనాధికారి అరవింద్ పాధీ, పూరీ జిల్లా పాలనాధికారి దివ్యజ్యోతి పరిడ, ఇతర అధికారులతో కలిసి పూజలు చేశారు. సేవాయత్‌లు స్వామి భోగ ప్రసాదాలు అందజేశారు. అనంతరం సీఎస్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ పురుషోత్తముడ్ని ప్రార్థించినట్లు చెప్పారు.

ఆగని మండేయ్ వివాదం

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా కోసగుముడ సమితి తారాగావ్ పంచాయతీలో ఈ నెల 6 నుంచి వీర్ చౌరియా ఆలయం ఉత్సవాలు జరుగనున్నాయి. దీనికి సంబంధించి బుధవారం తారాగావ్, కాటగావ్ గ్రామస్థుల సమావేశమయ్యారు. ఆలయం స్థలానికి సంబంధించి వివాదం ఏర్పడింది. దీంతో రెండు గ్రామాల ప్రజలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం కాటగావ్ బంద్ ప్రకటించి, దుకాణాలు, మార్కెట్ మూసివేసి నిరసన చేశారు. వివాదం కొనసాగితే మండేయ్ నిలిపివేస్తామని ఠాణాధికారి జగల్ కిశోర్ తెలిపారు.

కార్పొరేషన్‌గా పూరీ: గ్రేటర్‌గా బ్రహ్మపుర

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పూరీ తూర్పుతీర పుణ్యధామం నగరపాలక సంస్థగా అవతరించింది. బ్రహ్మపుర కార్పొరేషన్ గ్రేటర్ హోదా పొందింది. పట్టణాభివృద్ధిశాఖ దీనికి సంబంధించి బుధవారం జీఓ జారీచేసింది. ఇటీవల ముఖ్యమంత్రి మోహన్ చరణ్‌మాఝి పూరీ మున్సిపాలిటీకి నగరపాలక సంస్థగా బ్రహ్మపురకు గ్రేటర్‌గా ప్రకటించిన సంగతి తెలిసిందే. జీఓ జారీతో గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. బ్రహ్మపుర కార్పొరేషన్ పరిధిలో రొంగాయిలొండ, కుకుడాఖండ సమితుల్లోని 14 పంచాయతీలు విలీనం చేశారు. పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కృష్ణచంద్ర మహాపాత్ర్ గురువారం భువనేశ్వర్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ నగరాలు పట్టణాలకు మరిన్ని సౌకర్యాలకు కల్పించాలని విజన్-2036 డాక్యుమెంట్‌లో ప్రకటించామని, దీనికి అనుగుణంగా సన్నాహాలు చేస్తున్నామన్నారు.

పురపాలిక కార్యాలయం వద్ద ఆందోళన

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పురపాలిక వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన టెండర్ గెలుచుకున్న ఎస్.హెచ్.జీ బృందాల పేర్లను ఇటీవల ప్రకటించింది. టెండర్ బాధ్యతలు అప్పగించడంలో రిగ్గింగ్ జరిగిందని ఆరోపిస్తూ కొన్ని ఎస్.హెచ్.జీ బృందాల సభ్యులు పురపాలిక కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేశాయి. సబ్ కలెక్టర్ సస్మిత్ సోమవారం టెండర్ ప్రక్రియను సంబంధించి దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన తరువాత ఆందోళనకారులు శాంతించారు. దీనిపై చర్యలు తీసుకుంటే కోర్టును ఆశ్రయిస్తామని సభ్యులు హెచ్చరించారు.

వేతనాలు పెంచండి

ధర్నాలో ఆశా కార్మికులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: వేతనాలు పెంచమని డిమాండ్ చేస్తూ ఏఐయూటీయూసీ యూనియన్ ఆశా కార్మికులు బుధవారం ఎస్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఇందులో నాయకులు పుష్ప దాస్, మౌనిత కుండు, బుల్బీదత్, బైసాకి పండా, దేవయానిదాస్, యూనియన్ రాష్ట్రశాఖ కార్యదర్శి సురంజన్ పాత్ర తదితరులు ఎస్డీఓకు డిమాండ్ల వినతి పత్రం అందజేశారు.

ఉద్యోగ విరమణ పొందిన వారికి సత్కారం

విరమణ పొందిన ఉద్యోగిని సత్కరిస్తున్న డీఆర్ఎం అమితాబ్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక రైల్వే శ్రామిక సంఘం కార్యాలయం ఆవరణలో బుధవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యఅతిధిగా డీఆర్ఎం అమితాబ్ సింఘాల్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన రైల్వే ఉద్యోగులను సత్కరించారు. సంఘం డివిజనల్ ఉప సంచాలకుడు అశోక్‌కుమార్ పాఢి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాయగడ శాఖ కార్యదర్శి బి.మురళీకుమార్ రెడ్డి, స్టేషన్ మేనేజర్ పరమానంద్ పిడికా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్‌లో జిల్లాకు 26 పతకాలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఇటీవల రాష్ట్ర క్రీడా సంఘం తరపున కటక్‌లో జరిగిన 71వ రాష్ట్ర అథ్లెటిక్స్ మీట్‌లో నవరంగపూర్ జిల్లాకు 26 పతకాలు వరించాయి. జిల్లాకు చెందిన 64 మంది క్రీడాకారులకు వివిధ పోటీల్లో తలపడగా 6 స్వర్ణ, 8 రజత, 12 కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడా సంఘం ఉపాధ్యక్షుడు బాలకృష్ణ రావు, ఎడిటర్ ప్రహ్లాద త్రిపాఠి తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

పతకాలు చూపిస్తున్న క్రీడాకారులు

'కాలమానిని'ల ఆవిష్కరణ

బ్రహ్మపుర నగరం: స్థానిక 'తెలుగు బ్రాహ్మణ సేవా సంఘం' ఆధ్వర్యంలో కొత్త సంవత్సరం సందర్భంగా గురువారం 'కాలమానిని' ఆవిష్కరించారు. స్థానిక నీలకంఠనగర్ హౌసింగు బోర్డులోని గాయత్రీ మందిరం ఆవరణలోని వేద భవనంలో జరిగింది. వైద్యులు టి.ప్రకాశరావు, జె.భరతుడు, టీబీఎస్ఎస్ అధ్యక్షుడు పూడిపెద్ది సత్యనారాయణ (బాబు), గాయత్రీ మందిరం పూజా కమిటీ ఛైర్మన్ శ్రీపాద రామ్‌కుమార్ తదితరులు పాల్గొని గాయత్రీమాత చిత్రమున్న రంగుల కాలమానినితోపాటు ఒడియా, తెలుగు భాషల్లో తిథి, వారాలతో ఉన్న కాలమానినులు ఆవిష్కరించారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ

బీఎంసీ అధికారులతో వీధి రహదారిని పరిశీలిస్తున్న ఉషాపాఢి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శి ఉషాపాఢి రాజధాని నగరంలో పారిశుద్ధ్య పనులను బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చంచల్‌రాణా, పారిశుద్ధ్య విభాగం డిప్యూటీ కమిషనర్ ఎన్.గణేష్‌బాబుతో కలిసి ఆమె రాజధాని వీధుల్లో పర్యటించారు. చాలావరకు వీధులు పరిశుభ్రంగా ఉండడంతో బీఎంసీ అధికారులను ఆమె ప్రశంసించారు.

గులాబీలతో విజ్ఞప్తి

వాహన చోదకులకు గులాబీలు ఇస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, రవాణాశాఖ సిబ్బంది

రాయగడ, న్యూస్‌టుడే: గులాబీలు ఇచ్చి చెప్తున్నాం ..రహదారి భద్రతా నియమాలు పాటించాలని ప్రాంతీయ రవాణాశాఖ వారు వినూత్న చైతన్య కార్యక్రమం చేపట్టారు. గురువారం కపిలాస్ కూడలి వద్ద సిబ్బంది, అటానమస్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు వాహన చోదకులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించాలని, అతివేగం వద్దని తదితర అంశాలను సూచించారు.

లోక్‌సేవాభవన్‌లో 'పదే ఆకాశో' చిత్రప్రదర్శన

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సాధించాలన్న తపన, ఆత్మస్థైర్యం ఉంటే వైకల్యం అడ్డుకాదని, ఆకాశాన్ని అందుకోగలం అన్న సందేశంతో తరంగ్ సినీ ప్రొడక్షన్ 'పదే ఆకాశో' (అడుగేస్తే ఆకాశం) ఒడియా చిత్ర నిర్మాణం చేసింది. ప్రముఖ దర్శకుడు సుశాంత మణి తీర్చిదిద్దిన ఈ చలనచిత్రం దివ్యాంగులు అన్నిరంగాల్లో సమర్థులు, సాధనతో వారు దేనైన్నా సాధించగలరన్న ఇతివృత్తంతో సాగుతుంది. దివ్యాంగురాలైన డాక్టర్ శ్రుతి మహాపాత్ర్ అడ్డంకులను అధిగమించి స్వాభిమాన సేవా సంస్థ ఏర్పాటుచేసి 'నారీశక్తి' జాతీయ పురస్కారం అందుకున్న సంగతి తెలిసిందే. ఆమె జీవిత చరిత్ర 'పదే ఆకాశో' చిత్రం దీన్ని బుధవారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో ప్రదర్శించారు. అధికారులంతా తిలకించారు.

తెలుగు మహాసభల్లో రాతెసకు సముచిత స్థానం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఆంధ్ర సారస్వత పరిషత్ జనవరి 3 నుంచి మూడు రోజులు గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభలు జరగనున్నాయి. ఈ వేదికపై ప్రసంగించే అవకాశం కల్పించడం రాష్ట్రేతర తెలుగు సమాఖ్యకు సముచిత స్థానం ఇవ్వడమే అని సంస్థ అధ్యక్షుడు రాళ్లపల్లి సుందరరావు అభిప్రాయపడ్డారు. ప్రముఖ నాట్యగురువు భారతీయ మోహన్, ఆమె శిష్యురాలు శ్రీనిధి ఈ కార్యక్రమంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేసేందుకు వెళ్తున్నారు. ప్రతినిధులుగా ఐఐటీ కే వేణుగోపాల్‌రావు, ఏ శ్రీనివాసరావు, కోల్‌కతా నుంచి కె.నాగేశ్వరరావు, శివలింగం మాస్టారు, ఇ.వి.రాజు కె.మెహర్ వెళ్తున్నారని రాళ్లపల్లి సుందర్‌రావు తెలిపారు.

ఉద్యోగాల పేరిట మోసం: ముగ్గురి అరెస్టు

అరెస్టయిన నిందితులు. చిత్రంలో మహిళా పోలీసు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఉద్యోగాల పేరిట రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసాలకు పాల్పడిన ఇద్దరు మహిళలుసహా ముగ్గురు నిందితుల్ని స్థానిక బి.ఎన్.పూర్ ఠాణా పోలీసులు అరెస్టు చేసి బుధవారం న్యాయస్థానానికి తరలించారు. అరెస్టయిన నిందితులు భద్రక్ జిల్లా నాయక్‌నిధి ఠాణా ప్రాంతానికి చెందిన స్మృతిప్రభా మహంకుడ్ (33), గంజాం జిల్లా గొళంత్రా ఠాణా ప్రాంతానికి చెందిన నిరుపమ మహంతి (43), ఖుర్దా జిల్లా ఎయిర్‌పోర్టు ఠాణా ప్రాంతానికి చెందిన ప్రశాంత కుమార్ బెహర (43)లు. వీరి నుంచి నకిలీ నియామక ధ్రువపత్రాలు, నగదు రశీదులు, ఇతర పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన నిందితురాలైన స్మృతిప్రభ మహంకుడ్ శ్రీ జగన్నాథ హ్యూమన్ ఎంపవర్‌మెంట్ ట్రస్ట్ పేరిట ఓ సంస్థ ఏర్పాటు చేసి, భువనేశ్వర్‌లోని బారముండ ప్రాంతంలో ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేసింది. దీంతో పాటు గంజాం జిల్లాలోని బ్రహ్మపురతోపాటు వివిధ జిల్లాల్లో వాటి శాఖలు ప్రారంభించారు. వివిధ సమితుల్లో డేటా అసిస్టెంట్, ఆరోగ్య మిత్ర, జూనియర్ అసిస్టెంట్, మల్టీ టాస్కింగ్ తదితర ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులు ఒక్కొక్కరి నుంచి రూ.12,500ల నుంచి రూ.20 వేలు చొప్పున వసూళ్లు చేసి, వారికి నకిలీ నియామక పత్రాలు అందజేసి మోసాలకు పాల్పడ్డారు. ఒక్క గంజాం జిల్లాలోనే వీరు 800 మంది నుంచి రూ.12,500ల చొప్పున, 200ల మంది నుంచి రూ.20 వేల చొప్పున (మొత్తం రూ.1.15 కోట్లు) వసూలు చేసి, మోసగించారని ఎస్పీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

హత్య కేసులో మూడో నిందితుడి అరెస్టు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: సంచలనం రేపిన సివిక్ పోలీసు తులసీరావు హత్య కేసులో మూడో నిందితుడు సోనూసాంకర్‌ను అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం సోను ఆంధ్రాకి వెళ్లడానికి పట్టణ బస్టాండ్ వద్దకు వచ్చాడని తెలుసుకున్న పోలీసులు ఆయనను చుట్టుముట్టి అరెస్ట్ చేశారు. బుధవారం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

హోటళ్లపై ఆకస్మిక దాడులు

రాయగడ, న్యూస్‌టుడే, గుణుపురం: పద్మాపూర్‌లో పలుహోటళ్లపై పౌరసరఫరా విభాగం అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. బుధవారం గుణుపురం పౌర సరఫరా విభాగం అధికారి లలిత్ మోహన్ పట్నాయక్, సిబ్బంది నిర్వహించిన ఈ దాడుల్లో గృహోపయోగ సిలెండర్లు వినియోగిస్తున్న రెండు హోటళ్ల నుంచి 9 సిలిండర్లు స్వాధీన పరుచుకున్నారు.

లారీ బోల్తా.. ఇద్దరికి గాయాలు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కాశీపూర్ సమితి టికిరి ప్రధాన రహదారి కలియపొడ ఘాట్ రోడ్డులో బుధవారం రాత్రి లారీ బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఐఐసీ బిశ్వనందిని తెలిపిన వివరాల ప్రకారం.. దొరగూడలో ఉత్కళ అల్యూమిన కంపెనీకి సరకుల లోడు తీసుకొస్తున్న లారీ ఘాట్ రోడ్డు ఎక్కుతుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనానికి దారి ఇస్తూ.. అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. స్వల్ప గాయాలైన చోదకుడు, సహాయకుడిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. గురువారం క్రేన్ సహాయంతో లారీని పక్కకు తొలగించారు.

పెరుగుతున్న ఎలుగు దాడులు

గాయపడిన నటమాలి

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ సమితి బిసింగ్‌పూర్ ప్రాంతంలో ఇటీవల ఎలుగు దాడులు విస్తృతంగా పెరిగిపోయి స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గురువారం ఉదయం పొడపొదర గ్రామానికి చెందిన నటమాలిపై మూడు ఎలుగులు దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. బొరిగుమ్మలో ప్రాథమిక చికిత్స అనంతరం జయపురంలో జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. తరచూ దాడులు జరుగుతున్నా అటవీ శాఖ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

నాటు సారా ధ్వంసం

నవరంగపూర్, న్యూస్‌టుడే: కొసగుముడా సమితి కోడింగ గ్రామంలో గురువారం ఎస్‌హెచ్‌జీ బృందం సభ్యులు 62 లీటర్ల నాటుసారా ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు గ్రామానికి చేరుకొని 25 సారా సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సారా విక్రయించొద్దని వ్యాపారులను అధికారులు హెచ్చరించారు.

ఉత్సాహంగా కొత్త సంవత్సర వేడుకలు

భువనేశ్వర్: బిజద అధినేత నవీన్ పట్నాయక్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సులోచనా దాస్



పర్లాఖెముండి: రాష్ట్ర ఉపాధ్యక్షులు కోడూరు నారాయణరావుకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. రాత్రి 12 గంటలు అయ్యేసరికి యువత కేరింతలు వేసి బాణసంచాలను కాల్చి కొత్తసంవత్సరానికి స్వాగతం పలికారు. అన్ని ప్రాంతాల్లో సందడి వాతావరణం కనిపించింది. – న్యూస్‌టుడే బృందం

పర్లాఖెముండి: కేకు కోస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి

రాయగడ: భాస్కరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తూ..

దేవతామూర్తులకు విశేష అలంకరణలు



బ్రహ్మపురలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో..

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కొత్త ఆంగ్ల సంవత్సరం సందర్భంగా బ్రహ్మపురలోని వివిధ దేవస్థానాల్లో గురువారం విశేష అలంకరణలు, కార్యక్రమాలు జరిగాయి. నగరంలోని పురాతన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామిగా శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనమిచ్చారు. ఈ అలంకరణ కోసం 25 కిలోల వెన్న, ఐదు కిలోల ద్రాక్ష, ఎండు ద్రాక్ష, జీడిపప్పు, బాదం, స్ట్రాబెర్రీ తదితరాలు ఉపయోగించారు. నీలకంఠనగర్ హౌసింగు బోర్డులోని వేదమాత గాయత్రీ మాత, గొల్లపల్లిలోని రఘునాథ స్వామి, ఖస్పావీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ, బ్రహ్మపుర పెద్దమ్మవారు, చిన్నమ్మవారు (కాళిక), పురాతన శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానాల్లో దేవతామూర్తుల్ని రకరకాల పూలతో దివ్యంగా అలంకరించారు.

పథకాలపై అవగాహన రథం ప్రారంభం

రథానికి పచ్చజెండా ఊపుతున్న అధికారులు, ఎమ్మెల్యే

నవరంగపూర్, న్యూస్‌టుడే: జిల్లాలోని గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖల తరపున 'సహాజోగ్ మొబైల్ అసిస్టెన్స్ సెంటర్ రథాన్ని గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే గౌరీశంకర్ మాఝి పురాధ్యక్షుడు కున్నునాయక్, పాలనాధికారి మహేశ్వర స్వైయి, సీడీఓ వివరించి నారాయణ్ తదితరులు పచ్చజెండా ఊపి రథాన్ని ప్రారంభించారు. శాఖకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో 13 పథకాల గురించి అవగాహన కల్పిస్తుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ దివంగత నేత వైభవ్ శ్రద్ధ దివస్

జయపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ భవన్‌లో గురువారం దివంగత మాజీ ఎమ్మెల్యే వైభవ్‌నాయక్ శ్రద్ధ దివస్ కార్యక్రమం జరిగింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రూపక్ తురుక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్‌నేతలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రూపక్ తరుక్

కరాటే పోటీల్లో శ్రద్ధ మంజారికి కాంస్యం

శ్రద్ధ మంజారి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ కరాటే పోటీల్లో శ్రద్ధ మంజారి కాంస్య పతకం సాధించారు. ఉత్కల్ కరాటే స్కూల్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జాతీయ పోటీల్లో సునాబెడకు చెందిన కంబాట్ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన శ్రద్ధ మంజారి బరిక్ సత్తా చాటి కాంస్య పతకం గెలుచుకున్నాడు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

(c) eenadu

పాదం కదిలెనే.. ప్రాయం ఎగిరెనే!!

– న్యూస్‌టుడే, సీతంపేట

గన్‌షూట్ క్రీడలో యువతి

అడుగు పెట్టగానే అందాల వనం అబ్బుర పరుస్తుంది. తొమ్మిది 'విహార్'లు అల్లరి చేయమని తొందర పెడతాయి. తెడ్డు పట్టమని బోట్లు రారమ్మంటాయి. గురిపెట్టమని గన్‌లు ఆహ్వానిస్తాయి. హై సైకిల్ హైహై నాయకా అంటే.. లోసైకిల్ లోలోపలే మురిసిపోతుంది. సీతాకోక చిలుక బొమ్మ, వెదురు కర్రలతో చేసిన ఆర్చీలు ఆకట్టుకుంటాయి. ఇలా ఒక్కటేమిటి.. అదో అద్భుత లోకం.. సాహస మార్గం.. చిన్నారుల నుంచి పెద్దలవరకు ఇష్టపడి పచ్చని ఉద్యానం సీతంపేటలోని అడ్వెంచర్ పార్క్.

పార్కులోని 5డీ థియేటర్

రాష్ట్రానికే తలమానికంగా నిలిచిన సీతంపేట ఎన్టీఆర్ సాహస ఉద్యానవనం పర్యాటకులను, ప్రకృతి ప్రేమికులను రా..రమ్మంటోంది. చిన్నారుల నుంచి పెద్దలు, మహిళలు అంతా సరదాగా గడిపేయొచ్చు. ఇక్కడ ఏర్పాటు చేసిన అనేక క్రీడల్లో ఎవరి ఆసక్తి మేరకు వారు పాల్గొని సందడి చేయవచ్చు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఈ పార్కులో ప్రత్యేకంగా తొమ్మిది విహార్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రవేశ రుసుం కింద రూ.30 చెల్లించాలి. అయిదేళ్లలోపు వారికి ఉచితం. లోపల బ్రిటీష్ వారి పాలనలో ఏర్పాటు చేసిన పెద్ద ఇండిగో చిమ్నీ(నీలి మందు తయారీ పొగ గొట్టం) ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

బంజీ ట్రాంపోలిన్

విహార్‌లు ఇలా..

- ★ **జల:** ఫ్యామిలీ బోట్, సెల్ఫ్ బోట్, కయాకింగ్
- ★ **సార్య:** విలువిద్య, గన్‌షూట్, డార్ట్‌గేమ్
- ★ **వినూతన:** హై సైకిల్, లో సైకిల్
- ★ **వినోద విహార్:** చిల్డ్రన్ ట్రైన్, బుల్ రైడ్, బంగీ రన్నింగ్, గైరో, మెకానికల్ ట్రాంపోలిన్, ఇన్‌ఫ్లేటెడ్ బాల్‌పూల్, స్లైడింగ్ బౌన్స్, కిడ్స్ బోటింగ్
- ★ **సాహస విహార్:** బంగీ ట్రాంపోలిన్, క్లైంబింగ్ వాల్, కమాండ్ నెట్
- ★ **అద్భుత:** 5డీ థియేటర్, 3డీ వరల్డ్
- ★ **వైవిధ్య:** ఆల్ టెర్రైన్ వాహనాలు(ఏటీవీ)
- ★ **ఉయ్యాల:** జెయింట్ స్వింగ్
- ★ **విస్మయ:** ఊగె వంతెన

బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

దగ్గర్లోనే మరికొన్ని..

ఈ ఉద్యానానికి సమీపంలోనే మెట్టుగూడ జలపాతం ఉంది. దోనుబాయి దరి సున్నపుగెడ్డ, మల్లి, బెనరాయి, ఈతమానుగూడ తదితర జలపాతాలు, ఆడలి, జగతిపల్లి వ్యూ పాయింట్లు ఆకట్టుకుంటాయి. మెట్టుగూడ తప్ప.. ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సొంత వాహనాలు కానీ, అద్దె వాహనాలు కానీ ఉండాలి. సీతంపేటలోకి అడుగు పెట్టకముందే తితిదే ఆధ్వర్యంలో నడుస్తున్న వెంకన్న స్వామి దేవాలయాన్ని దర్శించుకోవచ్చు.

అందొచ్చాయి.. అవస్థలు తీర్చాయి

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ పట్టణ ప్రజలను ఏళ్లుగా వేధిస్తున్న సమస్యలు ఈ ఏడాది పరిష్కారమయ్యాయి. పాలకుల కృషితో అభివృద్ధి ఫలాలు కొన్ని అందుబాటులోకి రాగా, మరి కొన్ని కొనసాగుతున్నాయి.

ఆరోగ్య మందిరం

రూ.70 లక్షలతో కేంద్రం..

వైకాపా హయాంలో రూ.70 లక్షలతో నాలుగేళ్ల కిందట ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని ప్రారంభించారు. సకాలంలో బిల్లు మంజూరు కాక ఏళ్లు గడిచినా పూర్తికాలేదు. ఇరుకుగదుల్లో విధులు నిర్వర్తించారు. కూటమి ప్రభుత్వం రాకతో ఎమ్మెల్యే జయకృష్ణ చొరవతో మరో రూ.21 లక్షలు మంజూరయ్యాయి. పూర్తి చేసి ఇటీవలే ప్రారంభించారు. దీంతో 40 వేల మందికి ఆరోగ్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

కల నెరవేరింది..

పాలకొండ పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం నూతన భవనం ఎట్టకేలకు ప్రారంభమైంది. నాలుగు దశాబ్దాల కిందట నిర్మించిన భవనం పూర్తిగా శిథిలమైనా బాగు చేయలేదు. అందులోనే సేవలందించారు. పాలకొండతోపాటు వీరఘట్టం, సీతంపేట, విజయనగరం జిల్లా రేగిడి, వంగర, శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలాల్లో అగ్నిప్రమాదాలు జరిగితే ఇక్కడి సిబ్బందే వెళ్లేవారు. దీనిపై స్పందించిన పాలకులు రూ.1.25 కోట్లు నిధులు మంజూరు చేయడంతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. కొత్త ఏడాదిలో భవనం అందుబాటులోకి రానుంది.

25 వీధులకు రాకపోకలు

పట్టణంలోని శెగిడివీధి కూడలిలో మినీ వంతెన శిథిలావస్థకు చేరడంతో గత ప్రభుత్వంలో రూ.40 లక్షలతో మినీ వంతెన నిర్మాణం ప్రారంభించారు. బిల్లులు చెల్లించక అసంపూర్తిగానే మిగిలిపోయింది. కూటమి వచ్చిన తర్వాత పాలకులు దృష్టిసారించారు. పనులు వేగవంతం చేయడంతో పూర్తయింది. దీంతో 25 వీధులకు చెందిన ప్రజలకు స్వర్గధామం, పంట పొలాలకు వెళ్లేందుకు వీలు కలిగింది.

ఆ పల్లె ఓ ప్రశాంత నిలయం

ఆదర్శంగా కొవ్వాడపేట

గిరిజనులకు నిత్యావసరాలు ఇస్తున్న యువత

న్యూస్‌టుడే, బొండపల్లి, గంట్యాడ

ఆ గ్రామస్థులు సాయిబాబా బోధనలను ఆచరిస్తారు. ఒకరినొకరు సాయిరాం అని పిలుచుకుంటారు. రోజూ ఉదయం 5 గంటలకు నగర సంకీర్తనలతో వారి దినచర్య ప్రారంభమవుతుంది. స్థానికంగా ఉన్న సుమారు వంద మంది యువతలో 70 మంది వరకు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. మిగిలినవారు బాలవికాసం పేరిట పాఠశాల, కళాశాలల విద్యార్థులకు అన్ని రంగాలపై అవగాహన కల్పిస్తున్నారు. 1995 తరువాత పుట్టిన వారికి పేరు ముందుగానీ, వెనుక గానీ సాయి అని ఉంటుంది. బొండపల్లి మండలం వెదురువాడ పంచాయతీ కొవ్వాడపేటలో ఇవన్నీ కనిపిస్తాయి. ఈ పల్లె ఓ ప్రశాంత నిలయంగా విరాజిల్లుతోంది.

ప్రేమామృతం

గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. కాబోయే తల్లులు ప్రశాంతంగా ఉండాలని అందరూ కలిపి వేడుకగా సీమంతాలు నిర్వహిస్తారు. పెదమజ్జిపాలెం, గంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రతి నెల 9న ప్రధానమంత్రి మాతృత్వ యోజన కింద వైద్య పరీక్షలు జరుగుతాయి. అక్కడికి వచ్చేవారికి ప్రేమామృతం పేరిట అయిదేళ్లుగా భోజనాలు అందిస్తున్నారు.

అదే పెద్దపండగ

శ్రీరామనవమి, సత్యసాయి జయంతే ఇక్కడ పెద్ద పండగలు. ఊరంతా తోరణాలతో అలంకరిస్తారు. చుట్టుపక్కలున్న పది గ్రామాల వారిని పిలిచి అన్నసమారాధన చేపడతారు. ధాన్యం నూర్పులు అయిన వెంటనే పంటను స్వచ్ఛందంగా ఈ కార్యక్రమానికి ఇస్తారు. రూ.2 లక్షల వరకు విరాళాలు సేకరించి, సేవా కార్యక్రమాలు చేపడతారు.

పుట్టపర్తి సేవలో..

ఇక్కడున్న వారిలో మూడొంతుల మంది పుట్టపర్తి వెళ్లి వచ్చిన వారే. గొడవలు, వ్యసనాలకు దూరంగా ఉంటారు. బాబా చూపిన మార్గాన్ని అనుసరిస్తున్నామని, సాటివారి పట్ల ప్రేమతో ఉండేందుకు, ఉన్న దాంట్లో కొంత నలుగురికీ పంచేందుకు యువత కృషి చేస్తోందని భక్త మండలి కన్వీనర్ గోపి తెలిపారు. బాలవికాసం వల్ల పిల్లల్లో నైతిక విలువలు అలవడుతున్నాయని చెప్పారు.

గ్రామస్థుల్లో ప్రతిఒక్కరూ తమ సంపాదనలో కొంత మొత్తాన్ని సేవలకు కేటాయిస్తున్నారు. గతంలో స్థానికంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. తాగునీటిపై మడ్డిలా తేలేది. దీంతో యువకులు రక్షిత మంచి నీటి ప్లాంటు ఏర్పాటు చేసింది. అంగన్‌వాడీ, బడు

నీటి సమస్యకు పరిష్కారం

లకు ఉచితంగా జలాలు సరఫరా చేస్తున్నారు. మిగిలిన వారికి టిన్ రూ.6కే అందిస్తున్నారు. పదేళ్లుగా ఈ ప్రక్రియ సాగుతోంది. చలికాలంలో ఏటా గిరిజనులు, నిరాశ్రయులు, అనాథలకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేస్తున్నారు. వృద్ధులు, నిరుపేదలకు అమృత కలశం పేరిట నిత్యావసరాలు అందిస్తున్నారు.

విరాళాలతో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రం

వేణుగోపాలుడికి పుష్పార్చన సేవ: జామి, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామికి పుష్పార్చన సేవ వైభవంగా జరిగింది. 108 గంపలతో వివిధ రకాల పూలతో పూజలు నిర్వహించారు. అర్చకులు రవి స్వామి, విజయనగరం సరస్వతీ ఆలయ అర్చకులు తాతారావు ఆధ్వర్యంలో ఈ క్రతువు సాగింది. అంతకుముందు పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

నాడు అధ్వానం.. నేడు ఆహ్లాదం

పట్టణంలోని బోనం వీధి కూడలిలో పచ్చదనం ఆహ్లాదం పంచుతోంది. గతంలో ఈ ప్రాంతం వ్యర్థాలతో అధ్వానంగా దర్శనమిచ్చేది. దీంతో సమీపంలో ఉన్న చేతి పంపును సైతం వినియోగించలేని పరిస్థితి ఉండేది. దీన్ని గుర్తించిన స్థానిక వ్యాపారి రెడ్డి మొక్కలు నాటించి, సరంక్షణా చర్యలు చేపట్టారు. దీంతో సమస్య దూరమైంది. స్థానిక ఆంజనేయనగర్ కూడలిలోనూ ఇదే సమస్య ఉండేంది. ఇటీవల నగర పంచాయతీ సిబ్బంది వ్యర్థాలను తొలగించారు. ఈ కూడలిలో వీధికి చెందిన చిరు వ్యాపారి రవి పలు రకాల మొక్కలు నాటారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

తోటపల్లి జలాశయం.. పర్యాటకుల పరవశం

గరుగుబిల్లి మండలంలోని సుంకి వద్ద ఉన్న తోటపల్లి జలాశయానికి సరికొత్త కళ వచ్చింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో బోటు షికారు, ఐటీడీఏ ఉద్యాన క్షేత్రం మరుగున పడ్డాయి. కూటమి ప్రభుత్వం రాకతో అభివృద్ధి పనులు చేపట్టి, పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దారు.

వడివడిగా సొబగులు

చుట్టూ పచ్చని కొండలు, ఆహ్లాదమైన వాతావరణంలోని తోటపల్లి జలాశయం ఆదరణ కోల్పోవడంపై 'ఈనాడు'లో వరుస కథనాలు వెలువడ్డాయి. దీనిపై పార్వతీపురం మన్యం జిల్లా అధికారులు స్పందించారు. రిజర్వాయర్‌లో పాడైన ఆరుచుతున్న మరబోట్లు, విలువైన పడవలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చారు. చిన్నారులను ఆకట్టుకునేలా వివిధ రకాల ఆట వస్తువులు, వ్యాయామ పరికరాలు, క్రీడా సామగ్రి అందుబాటులోకి తెచ్చారు. బోసిపోయిన గిరిజన సంప్రదాయ బొమ్మలకు రంగులు, గోడలపై ప్రత్యేక చిత్రాలు వేసి, స్టాళ్లు నిర్మించారు. ఉద్యాన క్షేత్రంలో పర్యాటకులు సేద తీరేందుకు రిజర్వాయర్ గట్టు, ఉద్యాన క్షేత్రంలో వెదురు కర్రలతో వివిధ ఆకృతుల కుర్చీలు, బల్లలు, సెల్ఫీ స్టాండ్లు ఏర్పాటు చేశారు. పార్కు ముఖద్వారం బాగుచేయించి రంగులు వేసి సుందరంగా తయారు చేశారు. దీంతో పర్యాటకుల తాకిడి పెరిగింది. నెలకు రూ.60 వేల వరకు ఆదాయం వస్తోందని ఐటీడీఏ ఏఈ తిరుపతిరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. పీవో, కలెక్టర్ చొరవతో మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

బోటు షికారుకు సిద్ధమవుతున్న పర్యాటకులు

చట్టాలపై అవగాహన అవసరం

పప్పుదినుసులను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

విజయనగరం అయ్యన్నపేట, న్యాయవార్త విభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని సబ్ జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి, ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. నేర ప్రవృత్తిని వీడనాడి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలని హితవు పలికారు. జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వంటగది, భోజన శాల, స్టోర్ రూమ్, సరకులు, పప్పు దినుసులను పరిశీలించారు. న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, సబ్ జైలు సూపరింటెండెంట్ కేపీఎస్ఎన్.మూర్తి పాల్గొన్నారు.

దివ్య లింగం.. బలరాముని చరితం

బలరాముడు ప్రతిష్ఠించిన దివ్య లింగమిది.. ద్వాపర కాలంనాటి క్షేత్రాన్ని దర్శించుకుంటే కాశీ వెళ్లినంత పుణ్యమని అంటుంటారు. అలాంటి మహిమ ఉన్న ఆలయమే.. పార్వతీపురం నుంచి పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొమరాడ మండలంలో ఉంది. జంఝావతి, నాగావళి నదుల మధ్య ఉన్న గుంప సోమేశ్వరాలయంలోని లింగానికి ఆధ్యాత్మిక చరిత్ర ఉంది. రెండు నదులు కలిసే ఈ ప్రాంతంలో శివరాత్రి, కార్తిక మాసంలో భక్తుల తాకిడి అధికం. ఉత్తరాంధ్ర, ఒడిశా నుంచి అధిక సంఖ్యలో వస్తుంటారు. స్వామిని ఒడిశాలోని పాయకపాడులో పాతాళేశ్వరుడిగా, గుంపలో సోమేశ్వరుడు, విజయనగరం జిల్లా సంగాంలో సంగమేశ్వరుడు, శ్రీకాకుళంలో రుద్రకోటీశ్వరుడు,

కళ్లేపల్లిలో మణినాగేశ్వరుడిగా సంబోధిస్తుంటారు. గుంప ఆలయానికి చేరుకునేందుకు కోటిపాం కాలనీ మీదుగా సౌకర్యం ఉంది. పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేపడితే నేరుగా వాహనాలు, భక్తులు చేరుకుని ఈశ్వరుడిని దర్శించుకోవచ్చు. – న్యూస్‌టుడే, కొమరాడ

ఛాంపియన్‌గా తమాండో క్రికెట్ జట్టు

ముగిసిన అటల్ బిహారీ వాజ్‌పేయీ క్రికెట్ టోర్నీ

ట్రోఫీతో తమాండో జట్టు క్రీడాకారులు, ఎమ్మెల్యే అనిల్ తదితరులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో వారం రోజులు జరిగిన అటల్ బిహారీ వాజ్‌పేయీ టీ-20 క్రికెట్ టోర్నీ బుధవారం రాత్రి ముగిసింది. డే అండ్ నైట్‌లో జరిగిన తుదిపోరులో రైజింగ్ స్టూడెంట్ (కటక్), తమాండో క్రికెట్ (భువనేశ్వర్) జట్లు తలపడ్డాయి. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన తమాండో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 156 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రైజింగ్ స్టూడెంట్స్ జట్టు అన్ని వికెట్లు కోల్పోయి 133 పరుగులు మాత్రమే చేసింది. దీంతో తమాండో జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. గంజాం పాలనాధికారి వి.కీర్తివాసన్, బీఈఎంసీ కమిషనర్ ప్రథమేష్ అరవింద్ రాజెషిర్కె, బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం అతిథులుగా హాజరై కాసేపు ఫైనల్ మ్యాచును వీక్షించారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్ కుమార్ విన్నర్, రన్నర్ జట్లకు బహుమతులు, నగదు పురస్కారాలు అందజేశారు. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచు అవార్డును ఆశిష్ కె ప్రధాన్ (తొమాండో జట్టు) అందుకోగా, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ అవార్డును జయంత్ కయాబడ్, ఉత్తమ బౌలర్‌గా నమన్ ధరుబ్‌లు ప్రత్యేక బహుమతుందుకున్నారు.

పదెకరాలున్నా.. ఒక బస్తా యూరియానేనా?

ఏవోను నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యుడు

బలిజిపేట, న్యూస్‌టుడే: పదెకరాల భూములున్న రైతులకు సైతం ఒక బస్తా యూరియా సరఫరా చేస్తే ఎలా వ్యవసాయం చేస్తారని నారాయణపురం ఎంపీటీసీ సభ్యుడు రాజమోహన్ ఏవో శివగణేష్‌ను నిలదీశారు. ఎంపీపీ నాగమణి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ అంశంపై ఏవో మాట్లాడుతూ.. ప్రతి సేవా కేంద్రంలో రైతులకు కావాల్సినంత యూరియాను సిద్ధంగా ఉంచామని, విస్తీర్ణం బట్టి దశలవారీగా సరఫరా చేస్తామన్నారు. నీటి తీరువా బకాయిలున్న రైతులకు ఆరు శాతం రాయితీ ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని, సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. బలిజిపేట మండలంలో 660 గోకులాలు మంజూరు కాగా, ఎవరికి ఇచ్చారో తెలియడం లేదని జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్ ఏపీవో కేశవరావును ప్రశ్నించారు. అంపావల్లి పైలెట్ ప్రాజెక్టు ద్వారా 11 గ్రామాలకు కలుషిత నీరు సరఫరా అవుతోందని, అధికారులు స్పందించాలని ఎంపీపీ నాగమణి కోరారు. ఎంపీడీవో వాణిశ్రీ, వెలిది సాయిరాం, నగేష్, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఏళ్లనాటి ఇబ్బందులకు మోక్షం

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట మండలం సరాయివలస గ్రామస్థులు రాయిమాను కొండవాగుపైన వంతెన లేక నానా అవస్థలు పడేవారు. ఏటా వర్షా కాలంలో కొండవాగు ప్రవాహంతో శివలింగపురం, సరాయివలస గ్రామస్థులు, సరాయివలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయులకు రాకపోకలకు ఇబ్బందులు తప్పేవి కావు. కొండవాగు ఉద్ధృతికి గతేడాది ఆగస్టు 16న ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయిని ఆర్తీ, వార్డెన్ మహేష్ ద్విచక్ర వాహనంతో వాగు దాటే సమయంలో కొట్టుకుపోయి మృత్యువాతపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయించారు. దీంతో నిర్మాణం ప్రారంభించిన ఏడాదిలోపే పూర్తి చేశారు. గిరిజనుల కష్టాలు తీరాయి.

– న్యూస్‌టుడే, పాచిపెంట

కొత్తఊరికి రోడ్డొచ్చిందోచ్!

పాలకొండ మండలంలోని ఓని పంచాయతీ పరిధిలో ఉన్న కొత్తఊరికి ఎట్టకేలకు రోడ్డు సౌకర్యం ఏర్పడుతోంది. సుమారు 50 ఏళ్లుగా ఈ గ్రామానికి మట్టి మార్గమే గతి. గ్రామస్థులు అనేక సార్లు అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.1.20 కోట్లు మంజూరు చేయగా.. గుత్తేదారు పనులు చేపట్టారు. నిర్మాణం పూర్తయితే ఈ ఊరితోపాటు దొరవలస గ్రామానికి రహదారి సౌకర్యం కలుగుతుంది. పనులు వేగంగా చేయిస్తున్నామని పంచాయతీరాజ్ ఈఈ రవి తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

విద్యార్థులందరికీ రక్త పరీక్షలు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించాలని పీవో పవర్ స్వప్నిల్ జగన్నాథ్ సూచించారు. బుధవారం గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, సంక్షేమాధికారులతో సమావేశం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, మెనూ పక్కాగా అమలు చేయాలని, ఆర్వో ప్లాంట్లు సక్రమంగా పని చేసేలా చూసుకోవాలని చెప్పారు. డీడీ ఎం.అన్నాదొర, డిప్యూటీ డీఈవో జి.రామ్మోహనరావు, ఏటీడబ్ల్యూవోలు మల్లికార్జునరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేగావతి తీరం.. ఆధ్యాత్మిక నిలయం

సాలూరు పట్టణంలోని వేగావతి నదీ తీరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నదికి ఇరువైపులా చాలా దేవాలయాలు ఏర్పాటయ్యాయి. వేగావతి వంతెనకు ఒకవైపు మూడున్నర శతాబ్దాల చరిత్ర కలిగిన పంచముఖేశ్వరస్వామి ఆలయం, సంపత్ వినాయక, సంతోషిమాత, ఆది పరాశక్తి, వీరబ్రహ్మేంద్రస్వామి, జ్ఞాన సరస్వతి, షిర్డీసాయి, దత్తాత్రేయ, అయ్యప్పస్వామి, బాలసుబ్రహ్మణ్యస్వామి, బాల త్రిపుర సుందరి అమ్మవారి ఆలయాలున్నాయి. మరోవైపు ముత్యాలమ్మ, పరదేశమ్మ, దేశమ్మ, నూకాలమ్మ, కల్యాణ వేంకటేశ్వర స్వామి, మహాగణపతి, ఏకామ్రనాథ సమేత కామాక్షి అమ్మవారి దేవాలయాలు ఉన్నాయి. దీంతో ఏడాది పొడవునా నిత్య పూజలు, భక్తి పారవశ్యంతో ఈ ప్రాంతం విరాజిల్లుతోంది.

– న్యూస్‌టుడే, సాలూరు

చిన్న తిరుపతి వైభోగం

ప్రధాన ఆలయ సముదాయం

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రలో తోటపల్లి వేంకటేశ్వర కోదండ రామాలయం చిన్న తిరుపతిగా పేరుగాంచింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకునేవారు. కానీ కొంతకాలంగా నిర్వహణ లోపం వల్ల శిథిలావస్థకు చేరింది. తర్వాత నూతన అభివృద్ధి కమిటీ ఏర్పాటుతో పూర్వ వైభవం వచ్చింది.

ఇదీ చరిత్ర: 1969లో ఓ ప్రైవేటు బస్సు తోటపల్లి ప్రధాన కాలువలో అదుపు తప్పి దాదాపు 100 అడుగుల లోతులో పడిపోయింది. ఆ ప్రమాదంలో ప్రాణనష్టం జరగలేదు. బస్సును బయటికి తీసే క్రమంలో 5 అడుగుల విష్ణుమూర్తి విగ్రహం బయట పడింది. రహదారి పక్కన పందిరి వేసి స్వామివారిని నెలకొల్పారు. భక్తుల తాకిడి ఎక్కువ కావడంతోపాటు ఆదాయం కూడా పెరిగింది.

దాతల విరాళాలతో..

తోటపల్లి గ్రామానికి చెందిన దాతలు ఆలయ నిర్మాణానికి స్థలం ఇచ్చారు. వీరఘట్టానికి చెందిన నల్లాన సాంబశివరావు, తోటపల్లి గ్రామ పెద్దలు కమిటీగా ఏర్పడి విరాళాలు సేకరించి ఆలయ నిర్మాణం చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థాన శిల్పశాల నుంచి నల్లరాతి విగ్రహాన్ని తెప్పించి 1972లో ప్రతిష్ఠ చేశారు. కాలక్రమేణా నిర్మాణాలు శిథిలమై భక్తుల సంఖ్య తగ్గిపోయింది. ఏడాది క్రితం నూతన ఆలయం అభివృద్ధి కమిటీ ఏర్పడి మళ్లీ విగ్రహాన్ని తెప్పించి పునఃప్రతిష్ఠించారు. గాలిగోపురం నిర్మాణానికి కమిటీ సభ్యులు దాతల నుంచి విరాళాలు ఆశిస్తున్నారు.

తోటపల్లి దేవస్థానంలో కొలువైన వేంకటేశ్వరస్వామి

(c) eenadu

ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని చెన్నై మెరినా బీచ్‌లో వేడుకలు జరుపుకొంటున్న నగరవాసులు, టీనగర్ తితిదే ఆలయంలో శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

చెన్నై జీఎన్ చెట్టి రోడ్డులోని ఆలయంలో పద్మావతి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

విద్యుద్దీపకాంతుల్లో వేళాంకణ్ణి చర్చి

సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువ

ముఖ్యమంత్రి స్టాలిన్‌తో దురైమురుగన్, టి.ఆర్.బాలు, వేలు

చెన్నై, న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మంత్రులు, పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు కలిశారు. క్యాంపు కార్యాలయంలో గురువారం మంత్రులు దురైమురుగన్, వేలు, ఎమ్మెల్యే పన్నీర్ సెల్వం, తంగం తెన్నరసు, పెరియకరుప్పన్, అన్బరసన్, సామినాథన్, ఎంపీలు టి.ఆర్.బాలు, ఎ.రాజా తదితరులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆది తమిళర్ పేరవై వ్యవస్థాపక అధ్యక్షుడు అదియమాన్, మక్కళ్ విడుదలై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మురుగవేల్ రాజన్, ది హిందూ పబ్లిషింగ్ గ్రూపు సంచాలకులు ఎన్.రామ్, రాష్ట్ర మైనారిటీల కమిషన్ మాజీ ఛైర్మన్ పీటర్ అల్ఫోన్స్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై, ఆ పార్టీ ఎమ్మెల్యేలు రూబి మనోహరన్, అమిర్తరాజ్, వ్యవస్థాపక కార్యదర్శి రామ్మోహన్, రాష్ట్ర ప్రభుత్వ దివ్యాంగుల సంక్షేమ కమిటీ సభ్యుడు, డిసెంబరు-3 మూవ్‌మెంట్ అధ్యక్షుడు దీపక్ నాథన్, కవి మనుష్యపుత్రన్ తదితరులు కూడా స్టాలిన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు చెన్నైలో ఉప రాష్ట్రపతికి సన్మానం

చెన్నై, న్యూస్‌టుడే: ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ శుక్రవారం చెన్నై రానున్నారు. ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయనకు నగరంలో సన్మాన కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాట్లు చేయగా అనివార్య కారణాలతో రెండుసార్లు వాయిదా పడింది. ఈ నేపథ్యంలో శుక్రవారం చెన్నైకు విచ్చేయనున్న ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు భాజపా రాష్ట్ర నిర్వాహకులు, చెన్నై నివాసుల సంక్షేమ సంఘం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఎంజీఆర్ ఫౌండేషన్ తరఫున మాజీ మంత్రి హండే అధ్యక్షతన కలైవానర్ అరంగంలో సాయంత్రం 5 గంటలకు సన్మాన కార్యక్రమం జరగనుంది. ఎంజీఆర్ విశ్వవిద్యాలయంలో మంత్రి ఏ.సి.షణ్ముగం సమక్షంలో జరిగే కార్యక్రమంలో కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా తదితరులు ప్రసంగించనున్నారు. ఉదయం ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయంలో జరిగే స్నాతకోత్సవంలో పాల్గొని విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయనున్నారు.

విపత్తులు పసిగట్టేలా.. ముప్పు తప్పించేలా..

- దక్షిణాది జిల్లాల్లో కొత్తగా 5 డాప్లర్ కేంద్రాలు
- కచ్చిత వాతావరణ సమాచారానికి అవకాశం

ఈనాడు-చెన్నై: తుపాను, భారీ వర్షాలంటి విపత్తులంటేనే దక్షిణ తమిళనాడు వాసులు వణికిపోతున్నారు. ఈ పరిస్థితులు వారికి పుడు ఆకస్మికంగా వచ్చిపడుతుండటం, భారీ నష్టాల్ని చవిచూస్తుండటం కోలుకోకుండా చేస్తున్నాయి. గత రెండేళ్లలో.. తూత్తుకుడి, తిరునెల్వేలి, తెన్‌కాశి, కన్యాకుమారి తదితర జిల్లాలు విపరీత నష్టాల్ని చూశాయి. అందుకు ప్రధాన కారణం సరైన వాతావరణ అంచనాలు లేకపోవడమే. ఈ లోపం తీరాలంటే వీలైనన్ని డాప్లర్ వెదర్ రాడార్ కేంద్రాలు ఆ ప్రాంతాల పరిధిలోకి రావాలి. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాతావరణ అంచనాల్ని మరింత కచ్చితత్వంతో అందుకునేలా 'డాప్లర్ వెదర్ రాడార్' కేంద్రాల్ని అదనంగా ఏర్పాటుచేసేలా నిర్ణయం తీసుకున్నాయి. తాజా ప్రతిపాదనల ప్రకారం వాటిని కన్యాకుమారి, తిరుచ్చి, కోయంబత్తూర్, ఏర్కాడ్, రామనాథపురం తదితర ప్రాంతాల్లో పెట్టనున్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇందులో 3 కేంద్రాల్ని కేంద్ర ప్రభుత్వం 'మిషన్ మౌసమ్' కార్యక్రమంలో భాగంగా తెస్తుండగా, మరో రెండు తమిళనాడు విపత్తు ప్రమాద నివారణ సంస్థ ఆధ్వర్యంలో తీసుకొస్తున్నారు. వాటిని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటుచేసేందుకు అనువైన ప్రదేశాల్ని ఎంపికచేసే పనిలో అధికారులున్నారు.

రుతుపవనాల సమయంలో..

రాష్ట్ర విస్తీర్ణం విశాలంగా ఉండటంతో దక్షిణ జిల్లాలకు సంబంధించిన సమగ్ర వాతావరణ అంచనాల్ని తీసుకునేందుకు ఇప్పటికీ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రత్యేకించి దక్షిణ జిల్లాల పరంగా కచ్చిత సమాచారం అవసరమవుతోంది. గత కొన్ని విపత్తులపరంగా చూస్తే.. భీకర వరదలు రావడం, వాటి తీవ్రతను ముందే ఊహించకపోవడం పెద్దలోపంగా భావిస్తున్నారు. నైరుతి, ఈశాన్య రుతుపవనాల్లోనూ ఈ ప్రాంతాలు ప్రభావానికి గురవుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడే పలు తుపాన్ల కారణంగా దక్షిణ జిల్లాలైన కన్యాకుమారి, తిరుచ్చి, తిరునెల్వేలి, తూత్తుకుడి, రామనాథపురంలాంటివి దెబ్బతింటున్నాయి. కొత్తగా వచ్చే డాప్లర్ రాడార్‌ల ద్వారా రాష్ట్ర రాడార్ విస్తరణ మరింతగా పెరగనుండటంతో సమస్య పరిష్కారమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

8 రాడార్ల పర్యవేక్షణ

ప్రస్తుతం రాష్ట్ర పరిధికి సంబంధించి వాతావరణ అంచనాల్ని తెలుసుకునేందుకు వాతావరణశాఖ అధికారులు 8 డాప్లర్ వెదర్ రాడార్ కేంద్రాల్ని వినియోగిస్తున్నారు. ఇందులో రెండు చెన్నైలోని చెన్నై పోర్టు, ఎన్‌ఐఓటీ ప్రాంతాల్లో ఉన్నాయి. వాటితో పాటు కల్పాక్కం, కారైకాల్, సూలూర్‌లతో పాటు సరిహద్దు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట, కేరళలోని తిరువనంతపురం, కొచ్చి డాప్లర్‌ల ద్వారా డేటా తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ వివిధ వెదర్ రాడార్‌ల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా విపత్తు అంచనాలు, వర్షాలు, తుపాను స్థితిగతుల్ని ముందుగా సూచిస్తున్నారు.

ఉపయోగాలు చాలానే..

కొత్త డాప్లర్ వెదర్ రాడార్ కేంద్రాలతో చాలా లాభాలే ఉండనున్నాయి. గాలి వేగం, తుపాను గమనం, మేఘాల తీవ్రత, వర్షపాతం తదితర అంశాలపై ఈ కేంద్రాలు ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుని వాతావరణ శాస్త్రవేత్తలకు అందిస్తుంటాయి. ఈ సూచనల్ని విశ్లేషించిన తర్వాత వాతావరణశాఖ ప్రజలకు హెచ్చరికలు చేసేలా బులెటిన్లను విడుదల చేస్తుంటుంది. తుపాను తీవ్రత, వర్షాల రాకపై ప్రజలకు, రైతులకు, విమానయాన, రవాణా వ్యవస్థలకు వారు ప్రత్యేక బులెటిన్లు ఇస్తుంటారు. వాటి ఆధారంగా రాష్ట్ర, జిల్లా యంత్రాంగాలు అప్రమత్తమై విపత్తు నివారణ చర్యలకు ఉపక్రమిస్తుంటాయి. కొత్త కేంద్రాలు అమల్లోకి వస్తే దక్షిణాది ప్రాంతవాసులకు ఊరట కలగనుంది.

రాష్ట్రంలో 90,421 మంది క్షయ బాధితులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఈ ఏడాది 90,421 మందికి క్షయ నిర్ధారణ అయినట్లు ఆరోగ్యశాఖ తెలిపింది. దేశంలో లక్ష మందిలో 179 మంది క్షయ బాధితులున్నారు. రాష్ట్రంలో ఆ సంఖ్య లక్షలో 125గా ఉంది. క్షయను పూర్తిగా నిర్మూలించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్రంలో వ్యాధి నివారణ రేటు గణనీయంగా పెరుగుతోందని నివేదికలు సూచిస్తున్నాయి. వ్యాధి బారినపడిన రోగుల్లో 84 శాతం మంది మొదటి చికిత్సలోనే నయమవుతారని, మిగిలినవారు తదుపరి వైద్యంతో పూర్తిగా బయటపడుతారని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. క్షయ బారినపడిన వారి పోషకాహారాన్ని మెరుగుపరచడానికి ప్రతినెలా బ్యాంకు ఖాతాలకు రూ.వెయ్యి బదిలీ చేస్తున్నారు. ఇలా గత సంవత్సరం రూ.31.1 కోట్లు అందించారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్షయ నిర్ధారించడానికి పరీక్షల కిట్లు అందుబాటులో ఉన్నాయి.

సైబర్ నేరాలకు పాల్పడిన 1,193 మంది అరెస్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: సైబర్ నేరాలకు పాల్పడిన 1,193 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసినట్లు రాష్ట్ర సైబర్ క్రైం డీజీపీ సందీప్ మిట్టల్ తెలిపారు. సైబర్ మోసాల్లో చిక్కుకోకుండా 1,212 మంది కాపాడినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. నగదు మోసం కోసం ప్రారంభించిన 1,507 ఖాతాలను బ్లాక్ చేసి, రాష్ట్ర వ్యాప్తంగా 212 మందిని అరెస్టు చేశారన్నారు. ఆపరేషన్ హైడ్రా పేరుతో ఉత్తరాఖండ్, అస్సాం, దిల్లీకి చెందిన ఏడుగురు అరెస్టయ్యారన్నారు. గతేడాది సైబర్ నేరాలకు పాల్పడిన మొత్తం 1,193 మందిని అరెస్టు చేసినట్లు, వారిలో 50 మందిపై గూండాచట్టం కింద చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర ఆర్థికస్థితిని ఉత్తరప్రదేశ్‌తో పోల్చడం సరికాదు: పి.చిదంబరం

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు ఆర్థిక పరిస్థితిని ఉత్తరప్రదేశ్‌తో పోల్చడం సరికాదని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం తెలిపారు. ఆయన గురువారం తన 'ఎక్స్'లో.. ఓ రాష్ట్ర మొత్తం రుణం ఆధారంగా ఆ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని లెక్కించడం సరికాదన్నారు. అమెరికా మొదలుకొని ఇంగ్లండ్, జపాన్, ఫ్రాన్స్, కెనడా తదితర అభివృద్ధి చెందిన దేశాల మొత్తం రుణం ఏటా పెరుగుతోందని తెలిపారు. భారతదేశ మొత్తం రుణం, అన్ని రాష్ట్రాల రుణం కూడా ఏటా పెరుగుతోందని పేర్కొన్నారు. ఇది సహజమన్నారు. ఆర్థిక లోటు ఏటా తగ్గి 2025-26 నాటికి నీతి ఆయోగ్ వెల్లడించిన పరిమితి 3శాతం స్థాయిని తమిళనాడు చేరుకుంటుందని ఈ ఏడాది అంచనాలు వెల్లడిస్తున్నాయని, ఇది అభినందనీయమని తెలిపారు. తమిళనాడు ఆర్థిక స్థితిని ఉత్తరప్రదేశ్‌తో పోలుస్తూ కాంగ్రెస్ ప్రముఖుడు ప్రవీణ్ చక్రవర్తి ఇటీవల వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

పండుగ తర్వాత కూటమి ఖరారు

మాట్లాడుతున్న నయినార్ నాగేంద్రన్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: పొంగల్ తర్వాత కూటమి ఖరారవుతుందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తెలిపారు. తిరునెల్వేలి సమీపంలోని గంగైకొండాన్ వడకరై ప్రాంతంలో పేచ్చి కాలువకు అడ్డంగా రూ.6 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించే వంతెనకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యం హత్యలు, దోపిడీలు చోటుచేసుకుంటున్నాయన్నారు. మత్తుపదార్థాల వినియోగం అన్ని ప్రాంతాల్లో అన్ని ప్రాంతాల్లో అధికమవుతోందని ఆరోపించారు. పుస్తకాలతో పాఠశాలకు వెళ్లాల్సిన వయసులో వేటకొడవళ్లు పట్టుకొని తిరగడం బాధాకరమన్నారు. రాబోయే ఎన్నికల్లో అధికారం మారుతుందని తెలిపారు.

పొంగల్ బోనస్ ప్రకటించిన ముఖ్యమంత్రి

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వరంగాల్లో పనిచేసే 'సి', 'డి' కేటగిరి ఉద్యోగులు, పింఛనుదారులు తదితరులకు పొంగల్ బోనస్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో.. తమిళుల పర్వదినం పొంగల్ సంబరాలను సంతోషంగా చేసుకోవడానికి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులు, కుటుంబ పింఛనుదారులకు 2024-25వ ఏడాది పింఛన్, పొంగల్ కానుకను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.183.86 కోట్లను కేటాయించినట్లు తెలిపింది. దీని ద్వారా 9.90 లక్షల మంది లబ్ధి పొందనున్నారని వెల్లడించింది. 'సి', 'డి' కేటగిరి ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రూ.3వేలు చొప్పున బోనస్ అందించనున్నారని పేర్కొంది. కన్సాలిడేటెడ్ పొందేవారికి, 2024-25వ ఆర్థిక సంవత్సరంలో కనిష్ఠంగా 240 రోజులు పనిచేసిన నిర్ణీత వేతనం పొందే ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులకు, 'సి', 'డి' గ్రూపు పింఛనుదారులు, కుటుంబ పింఛనుదారులు, గ్రామ సహాయకులు, అన్ని రకాల ప్రత్యేక పింఛనుదారులకు రూ.వెయ్యి చొప్పున పొంగల్ కానుక అందించనున్నట్లు తెలిపింది.

టీనగర్‌లో తీవ్రమవుతున్న పార్కింగ్ సమస్య

మెరుగైన నిర్వహణపై జీసీసీ దృష్టి

– న్యూస్‌టుడే, వడపళని

చెన్నై నగరంలోని పలు ప్రాంతాల నుంచి టీనగర్‌కు షాపింగ్ చేయడానికి వచ్చేవారు వాహనాల పార్కింగుకు అవస్థలు పడుతుంటారు. సమస్య పరిష్కారానికి చెన్నై మహానగర పాలక సంస్థ (జీసీసీ) ఐదేళ్లపాటు నిర్వహణకు కాంట్రాక్టరు నియామకానికి ఇటీవల టెండర్లు ఆహ్వానించింది. జనవరిలోనే కొత్త కాంట్రాక్టరు అందుబాటులోకి రానున్నారని జీసీసీ పేర్కొంది. టీనగర్‌లోని ఉస్మాన్ రోడ్డు, త్యాగరాయ రోడ్డు (పాండీ బజార్), వెంకట నారాయణ రోడ్డు, బర్కిత్ రోడ్డు, హబీబుల్లా రోడ్డు, జీఎన్ చెట్టి రోడ్డులో అక్రమ పార్కింగులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉస్మాన్ రోడ్డు పైవంతెనకి ఆనుకుని ఉన్న పార్కింగు స్థలంలో కూడా నిర్వహణ సరిగా లేదు.

నిర్వహణ ఇలా.. టెండరు మేరకు కాంట్రాక్టు పొందినవారు టోయింగ్ వాహనం, సీసీ కెమెరాలు కలిగి ఉండాలి. వాహనాలకు జరిమానా విధించేందుకు, 50 కార్లను గమనించేందుకు మార్షల్ కూడా ఉండాలి. ఆ మార్షల్ అక్రమంగా పార్కు చేసిన వాహనాలను ఫొటోలతో రికార్డు చేసుకుంటూ, పోలీసులకు సహకరిస్తూ ఉండాలి. 1,488 చదరపు మీటర్ల విస్తీర్ణంలో

టీనగర్ పాండీ బజార్‌లోని జీసీసీ బహుళ అంతస్తుల పార్కింగు భవంతి

మల్టీలెవల్ పార్కింగ్ (ఎంఎల్‌పీ)లో 222 కార్లు, 513 ద్విచక్ర వాహనాలు, త్యాగరాయ రోడ్డు, జీఎన్ చెట్టి రోడ్డు, వెంకటనారాయణ రోడ్డులో 139 కార్లు, 111 ద్విచక్ర వాహనాలు పార్కు చేసే వీలుంటుంది. కాంట్రాక్టర్ ఛార్జీలు వసూలు చేస్తారు.

గతంలోలా కాకుండా... టీనగర్‌లో కార్లు, ద్విచక్ర వాహనాలు 1,000 కంటే ఎక్కువగా పార్కింగు చేసుకునే సదుపాయం ఉన్నా గతంలో ఉన్న కాంట్రాక్టర్ 'టూర్కీ మీడియా సర్వీసెస్' రోడ్డు నిబంధనలు సరిగా అమలు చేయలేదని జీసీసీ అధికారి ఒకరన్నారు. ఫలితంగా నష్టం వాటిల్లిందని, ఆ సంస్థ కాంట్రాక్టు రద్దు చేసి తమిళనాడు మాజీ సైనికుల సంక్షేమ సంస్థకు అప్పగించినా పరిస్థితిలో మార్పులేదని తెలిపారు. ఈసారి పార్కింగ్ నిర్వహణలో విఫలమైతే జరిమానా విధిస్తామని, వీధి పార్కింగులను నివారించాలని, నో పార్కింగు బోర్డులను ఏర్పాటు చేయాలని, వాహనాలను తొలగించడానికి ట్రాఫిక్ పోలీసులతో సమన్వయంతో వ్యవహరించాలని కాంట్రాక్టర్‌కు చెప్పామని పేర్కొన్నారు.

జరిమానాలు అధికంగా ఉండాలి.. భాజపా కౌన్సిలర్ ఉమా ఆనందన్ మాట్లాడుతూ.. వీధి పార్కింగులకు కార్పొరేషన్ అధికంగా జరిమానా వసూలు చేయాలని, ఇలా చేస్తే వాహనదారులు బహుళ అంతస్తుల పార్కింగుకు వెళ్లడమో లేదా ప్రజా రవాణాను ఉపయోగించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. భవన నిబంధనల మేరకు ప్రయివేటు పార్కింగు తప్పనిసరని, జీసీసీ దానిని అమలు చేయాలని, పార్కింగు స్థలాలు లేని వాణిజ్య సంస్థలను ముందుగానే గుర్తించాలని సూచించారు. టీనగర్‌లోని పలు దుకాణాలు ప్రయివేటు స్థలాల్లో పార్కింగు స్థలాన్ని కేటాయించినా ఎవరూ ఉచితంగా ఇవ్వరని, ఆయా స్థలాలకు చెందిన దుకాణాల్లో కొనుగోలు చేసి, బిల్లును చూపిస్తేనే ఉచితంగా పార్కుకు అనుమతిస్తారని టీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి బి.కణ్ణన్ చెప్పారు. ఈ కారణంగానే కొందరు వాహనాలను అంతర్గత రోడ్లలో పార్కు చేస్తున్నట్లు తెలిపారు.

టీవీకే కొత్త నిర్వాహకుల ప్రకటన

చెన్నై, న్యూస్‌టుడే: టీవీకే ప్రసార, సమాచార సంబంధాల విభాగానికి కొత్త నిర్వాహకులను పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రకటించారు. పార్టీ ప్రసార, సమాచార సంబంధాల విభాగం ఉప ప్రధాన కార్యదర్శిగా రాజ్‌మోహన్, కన్వీనర్లుగా ఎస్.రమేశ్, కేథరిన్ పాండియన్, జాతీయ సమాచార విభాగం ప్రతినిధులుగా పెలిక్స్ జెరాల్డ్, సత్యకుమార్, తేన్‌మొళి ప్రసన్న, రాష్ట్ర సమాచార విభాగం ప్రతినిధులుగా ముఖిల్ వీరప్పన్ అలియాస్ శివకుమార్, అమలన్ శ్యామ్‌రాజ్ మగియ, జ్ఞానసెల్విన్ ఇన్బరాజ్, ముహమదు ఇబ్రహీం, రిక్కినాథన్ పండిట్ వెట్రివేల్ నియమితులయ్యారు.

కూటమి ధర్మం పాటిస్తాం: వైగో

విల్లివాక్కం, న్యూస్‌టుడే: లక్ష్మణ రేఖ దాటే అలవాటు తమకు లేదని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో తెలిపారు. ఆంగ్ల నూతన ఏడాదిని పురస్కరించుకొని వైగో గురువారం విలేకరులతో మాట్లాడారు. వైగో, వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ తమ ఎంపీలకు మార్గనిర్దేశం చేయాలన్న కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కూటమి ధర్మాన్ని పాటించడంలో, నాయకత్వాన్ని గౌరవించడంలో తాము పరిమితులు దాటలేదని తెలిపారు. కూటమిలోని పార్టీలను విమర్శించే లేదా బాధపెట్టే వ్యాఖ్యలు చేయమని స్పష్టం చేశారు.

రాష్ట్రపతి చేతుల మీదుగా నైటింగేల్ పురస్కారం అందుకుంటూ..

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఆమె చిన్న గ్రామంలో, పరిమితుల మధ్య పెరిగినా అపారమైన కృషి, దృఢసంకల్పం, ఆత్మవిశ్వాసంతో ఉన్నతస్థానానికి చేరుకున్నారు. సైన్యంలో నర్సుగా విధులు ప్రారంభించి మేజర్ జనరల్‌గా పదోన్నతి పొందారు. ఆమే ఇగ్నేషియస్ డెలోస్ ఫ్లోరా. ఇటీవల పదవీ విరమణ పొందిన ఆమె తాను దాటి వచ్చిన ఆటంకాల గురించి మాట్లాడుతూ..

అడ్డంకులు ఛేదించి.. అత్యున్నత స్థానం చేరా

విశ్రాంత మేజర్ జనరల్ ఇగ్నేషియస్ డెలోస్ ఫ్లోరా

సోదరుడి సహకారంతో..

సొంతూరు కన్నియాకుమరి జిల్లా రాజాపూర్. వ్యవసాయ కుటుంబం. ముగ్గురు సోదరులు, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. పెద్ద అన్న భారత వైమానికదళంలో పనిచేశారు. రెండో అన్న సరిహద్దుల్లో భద్రతాదళంలో విధులు నిర్వర్తించారు. ప్లస్‌టూ ముగియగానే ఉన్నత విద్య చదవాలని ఆశపడ్డాను. నాన్న ఒప్పుకోలేదు. పెద్ద అన్న ఒప్పించాడు. ఇండియన్ మిలిటరీ పాఠశాలలో 'జనరల్ నర్సింగ్' అనే కోర్సు ఉండేది. ప్రవేశపరీక్ష రాసి సీటు పొందాను. పలు పోరాటాల తర్వాత అన్న సహకారంతో దిల్లీ వెళ్లి చదివాను. భాష, ఆహారం వంటి ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. జనరల్ నర్సింగ్ కోర్సులో జాతీయ స్థాయిలో ఏడోస్థానం పొందాను. 1985లో ఆర్మీ నర్సుగా విధుల్లో చేరాను.

పెళ్లయిన వారానికే విధుల్లోకి..

విధుల్లో చేరినప్పుడు తెలియని నగరం, అపరిచిత వ్యక్తులు, యుద్ధ ఉద్రిక్తత భయపెట్టాయి. దేశం కోసం పనిచేస్తున్నవారికి చికిత్స అందిస్తున్నానని అనుకున్నప్పుడు గర్వంగా అనిపించేది. ఉద్యోగం చేస్తూనే నర్సింగ్‌లో బ్యాచిలర్, మాస్టర్స్ డిగ్రీలు పూర్తిచేశాను. 1994లో వివాహమైంది. పెళ్లయిన వారానికే మళ్లీ విధులకు వెళ్లాను. భర్త తిరునెల్వేలిలో కళాశాల అధ్యాపకుడు. ఏడాదిలో 15రోజులు మాత్రమే ఇద్దరం కలిసి ఉంటాం. ఉద్యోగంపై నాకున్న అభిమానాన్ని అర్థం చేసుకొని అండగా నిలిచారు. కోల్‌కతా, సికింద్రాబాద్, జబల్‌పూర్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, చెన్నై తదితర సైనిక ప్రధాన కార్యాలయాల్లో పనిచేశాను. జంతువులు, కీటకాలు, కఠినమైన వాతావరణ పరిస్థితులను తట్టుకొని విధులు నిర్వహించాను.

ఉద్రిక్త పరిస్థితుల్లో..

మాకు ఇద్దరు పిల్లలు. ప్రసవమైన 13రోజులకే బిడ్డను తీసుకొని విధులకు వెళ్లాను. ఒకానొక సమయంలో పెద్దబిడ్డను నేను, చిన్నబిడ్డను భర్త పెంచాం. నా జీవితంలో చాలా భావోద్వేగ క్షణాలను కోల్పోయాను. తల్లి, సోదరుడు మరణించినప్పుడు కుటుంబంతో ఉండలేని పరిస్థితులు ఎదుర్కొన్నాను. 39 ఏళ్లు పరిగెత్తాను. ఇటీవల పదవీ విరమణ పొందాక రోజూ నా కుటుంబం కోసం జీవిస్తున్నాను. కార్గిల్ యుద్ధం సహా దేశం ఎదుర్కొన్న ముఖ్యమైన ఉద్రిక్త సమయాల్లో సైనికులతో కలిసి నిలబడ్డాను. వృత్తి అనుభవం కారణంగా ఆర్మీ నర్సింగ్ స్కూల్‌లో శిక్షకురాలిగా నియమించారు. కెప్టెన్, లెఫ్టినెంట్ కర్నల్‌గా పదోన్నతి పొందాను. 2023లో మేజర్ జనరల్‌గా పదోన్నతి లభించడం విజయంగా భావిస్తున్నాను. 2024లో ఫ్లోరెన్స్ నైటింగేల్ పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నాను. మనం గెలిస్తే ప్రపంచం మొత్తం మనతోనే ఉంటుంది. కానీ మనం ఒంటరిగా పోరాడాలని అంటున్నారు. మహిళా ప్రపంచం పరిమితులతో నిండి ఉంటుంది. ఆ ఆంక్షలను ఉల్లంఘించాలా లేక కలిసి జీవించాలా అనేది సంబంధిత మహిళ నిర్ణయించుకోవాలి. నేను పరిమితులను ఉల్లంఘించానని వివరించారు.

రాష్ట్రంలో రాజకీయ మార్పు తథ్యం

విజయకాంత్ సమాధికి నివాళులర్పిస్తున్న ప్రేమలత

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రాజకీయ మార్పు తథ్యమని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత తెలిపారు. ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలోని విజయకాంత్ విగ్రహానికి గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. విజయకాంత్ సమాధికి పుష్పాంజలి ఘటించారు. పేదలకు అన్నదానం చేశారు. అనంతరం మీడియా ప్రతినిధులతో ఆమె మాట్లాడుతూ... తమిళనాడు అనే పేరుతో ప్రభుత్వ బస్సులు నడపాలన్నారు. మత్తుపదార్థాల సంస్కృతి నిర్మూలనకు ముమ్మరంగా చర్యలు చేపట్టాలని, సెకెండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు, శుభ్రతా కార్మికులు, నర్సుల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. డీఎంకే ప్రభుత్వ ఐదేళ్ల పాలన ముగుస్తున్నా ఎన్నికల హామీలను పూర్తిగా నెరవేర్చలేదనే ఆగ్రహంతో ప్రజలు ఉన్నారన్నారు. ప్రజలకు మంచి జరిగితే దానిని తమ పార్టీ స్వాగతిస్తుందని తెలిపారు. కూటమి వ్యవహారంలో మంచి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. డీఎండీకే ఉన్న కూటమి అధికారాన్ని ఏర్పాటు చేస్తుందని జోస్యం చెప్పారు.

పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశం 5న

చెన్నై: డీఎండీకే జిల్లా కార్యదర్శుల సమావేశం 5న కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరగనుందని ప్రేమలత తెలిపారు. రాజకీయ మార్పులు, పార్టీ బలోపేతంపై చర్చించనున్నట్లు సమాచారం.

(c) eenadu

ముదుమలై శిబిరానికి గున్న ఏనుగు అప్పగింత

గున్న ఏనుగుతో అటవీశాఖ సిబ్బంది

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లా తేన్‌గనిక్కోట్టై సమీపం ఉళిపండా అటవీ ప్రాంతంలోని గుంతలో గత నెల 4వ తేదీ నీరు తాగడానికి ఏనుగుల గుంపు వెళ్లింది. అందులో 6 నెలల వయసున్న గున్న ఏనుగు జారి గుంతలో పడింది. దాన్ని బయటికి తీయడానికి ప్రయత్నించిన ఏనుగులు కుదరకపోడంతో వెళ్లిపోయాయి. ఈ నేపథ్యంలో గస్తీకి వెళ్లిన జవళగిరి అటవీశాఖ సిబ్బంది ప్రొక్లెయినర్ సాయంతో బయటకు తీసి తల్లి చెంతకు చేర్చాలని ప్రయత్నించారు. ఫలించని కారణంగా అంజెట్టి శిబిరంలో ఉంచి సంరక్షించారు. తల్లి మీద బెంగతో గున్న చిక్కిపోయింది. దీంతో బుధవారం వ్యానులో తీసుకెళ్లి ముదుమలై తెప్పకాడులోని ఏనుగుల శిబిరంలో వదిలేశారు.

పెరియార్ కలలుగన్న తమిళనాడును తీర్చిదిద్దుతాం: కె.వీరమణి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: పెరియార్ కలలుగన్న మత విద్వేషాల్లేని సమత్వ ప్రపంచంగా తమిళనాడును తీర్చిదిద్దుతామని ద్రావిడ కళగం ప్రధాన కార్యదర్శి కె.వీరమణి గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కరూర్ జిల్లా తొగైహిల్స్ సమీపంలోని చిన్నరెడ్డియపట్టి పంచాయతీ యూనియన్ మిడిల్‌స్కూల్‌లో వంటమనిషిగా పని చేస్తున్న 35 ఏళ్ల మహిళ అణగారిన వర్గానికి చెందిన వారనే కారణంతో ఉద్యోగం నుంచి తొలగించారని తెలిసిందన్నారు. ఈ విషయమై నిరసన వ్యక్తం చేశామన్నారు. తండ్రై పెరియార్, అంబేడ్కర్ పేరిట వివిధ కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వం కరూర్‌లో జరిగిన ఘటనపై చర్యలు తీసుకోవాలన్నారు. మదురై జిల్లా నల్లమణి ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల సమీపంలో ఆర్‌ఎస్‌ఎస్ శాఖను ప్రారంభించినప్పుడు వ్యతిరేకత వచ్చిందని దానిపై ద్రావిడకళగంతో పాటు వివిధ సంస్థల తరఫున కలెక్టరుకు ఫిర్యాదు చేశామన్నారు.

పొంగల్ కానుకలో నగదు ఊసేది?

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈ ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్నందున పొంగల్ కానుక కిట్‌తో పాటు రూ.3వేల నగదు ఇస్తారని ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూశారు. అయితే వారికి నిరాశే ఎదురైంది. 2.22 కోట్ల రేషన్ కార్డులకు కానుక అందజేయాలని ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, నగదు ఊసే ఎత్తలేదు. దీని గురించి సహకార, ఆహార శాఖాధికారి ఒకరు మాట్లాడుతూ.. వస్తువుల కిట్‌తో పాటు రూ.3 వేల నగదు ఇవ్వాలని మొదట నిర్ణయించారని, ఆఖరి నిమిషంలో రూ.5వేలు ఇవ్వాలన్న వ్యవహారంగా సమాలోచన జరుపుతున్నట్టు తెలిపారు. అందుకయ్యే ఖర్చు ఎలా సర్దుబాటు చేయాలని ఆర్థికశాఖ ఆలోచిస్తోందని పేర్కొన్నారు. కానుక పంపిణీ ఈ నెల 8వ తేదీ ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని చెప్పారు. నగదు నిర్ణయించి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు వివరించారు.

వన్యప్రాణులను బలి తీసుకుంటున్న విద్యుత్తు కంచెలు

- న్యూస్‌టుడే, విల్లివాక్కం

కొండ ప్రాంతాలలోని గ్రామాలలో వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరించడానికి వీలులేకుండా అనధికార విద్యుత్తు కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా వన్యప్రాణుల మరణాలు పెరుగుతున్నాయి. పశ్చిమ కనుమలు వివిధ రకాల వన్యప్రాణులకు నిలయంగా ఉన్నాయి. కొబ్బరి, అరటి, చౌవ్‌చౌవ్, కాఫీ, నిమ్మ, మిరియాలు తదితర పంటలు పర్వతాల దిగువ గ్రామాలలో విస్తృతంగా సాగు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా గ్రామాలలో వన్యప్రాణుల సంచారం గణనీయంగా పెరిగింది. ఏనుగులు, అడవి పందులు తరచూ పంట పొలాలపై దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. కందకాలు, విద్యుత్తు కంచెలు తదితర నియంత్రణ చర్యలు చేపట్టడంలో అటవీశాఖ నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందన్న ఆరోపణలున్నాయి.

అనధికారికంగా విచ్చలవిడిగా ఏర్పాటు

విద్యుత్తు కంచెలో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయిన ఏనుగులు (పాతచిత్రం)

కఠిన చర్యలు అవసరం

అవసరానికి అనుగుణంగా అడవుల్లో ఆహారం, తాగునీరు అందుబాటులో ఉండేలా అటవీశాఖ ఏర్పాటు చేయాలని పలువురు సమాజ సేవకులు కోరుతున్నారు. అడవిలో అక్రమంగా కలప తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నామమాత్రపు చర్యలు మానుకొని అనధికారంగా విద్యుత్తు కంచెలను ఏర్పాటు చేస్తున్న వారిపై విద్యున్మండలి, అటవీశాఖ సంయుక్తంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా సమస్య పరిష్కారమవుతుందని పేర్కొంటున్నారు.

అటవీశాఖ నిర్లక్ష్య వైఖరి

ఏనుగులు పంటలు, గృహాలను ధ్వంసం చేయడం, దాడిలో రైతులు మరణించడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. కొన్నేళ్లుగా కన్నివాడి అటవీ సర్కిల్‌లో అటవీశాఖ సిబ్బంది సహా పలువురు మృతి చెందుతున్నారు. ఏనుగుల శాశ్వత మార్గాలను పర్యవేక్షించి దట్టమైన అడవిలోకి తరిమికొట్టే ప్రణాళిక గురించి అటవీశాఖ పట్టించుకోవట్లేదు. బాణసంచా పేల్చడం, పొగ సృష్టించడం వంటి పనులు డాక్యుమెంటరీల కోసమే చేస్తున్నారు. కొన్ని వారాలుగా పర్వత ప్రాంతాలలో ఏనుగులు, పందుల సంచారం పెరిగింది. దీంతో పలువురు రైతులు విద్యుత్తు కంచెలను ఏర్పాటు చేసుకోవడం ప్రారంభించారు. ఫలితంగా వన్యప్రాణులే కాకుండా మనుషులు కూడా ప్రాణాలు కోల్పోతున్నారు.

శిరస్త్రాణాలు ధరించిన బైకర్లకు వెండి నాణేల బహుమతి

వాహనచోదకులకు నాణేలు అందజేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాది సందర్భంగా శిరస్త్రాణం ధరించి ద్విచక్ర వాహనాలు నడిపినవారికి తంజావూర్ పోలీసులు నాలుగు గ్రాముల వెండి నాణెం బహుమతిగా అందజేశారు. తంజావూర్ జిల్లాలో ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించడం 100శాతం చేయాలన్న లక్ష్యంతో ట్రాఫిక్ పోలీసులు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం తంజావూర్ ఆట్రుపాళ్యం సమీపంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్రన్ నేతృత్వంలో సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా శిరస్త్రాణం ధరించి వచ్చిన 50మందికి ఇన్‌స్పెక్టర్ రవిచంద్రన్ అభినందనలు తెలియజేసి తలా నాలుగు గ్రాముల వెండి నాణేలను బహుమతిగా అందజేశారు.

మాదకద్రవ్యాల గుర్తింపునకు స్నిఫర్ జాగిలం నియామకం

నియామకపత్రం అందజేస్తున్న ఎస్పీ శరవణన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుప్పురం జిల్లా పోలీస్ విభాగంలో తొలిసారిగా మాదకద్రవ్యాల గుర్తింపునకు బస్టర్ అనే స్నిఫర్ జాగిలాన్ని నియమించినట్లు జిల్లా ఎస్పీ శరవణన్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. జాగిలానికి ఏడాది పాటు శిక్షణ ఇచ్చామని, అంతేకాకుండా జిల్లాలో నేరాల నియంత్రణకు, నేరస్థులను గుర్తించడానికి, రహదార్లను పర్యవేక్షించడానికి ఇందిరా నగర్ నుంచి వెస్ట్ పోలీస్ స్టేషన్ ఫోర్‌వే జంక్షన్ వరకు, విళుప్పురం మంజంబట్టు రోడ్డు, పాత బస్టాండు, రైల్వే స్టేషన్, పానంబట్టు జంక్షన్ నుంచి కోలియనూర్-కుంభకోణం ఫోర్‌వే జంక్షన్ వరకు, విళుప్పురం అన్నామలై హోటల్ బైపాస్ నుంచి కొత్త బస్టాండ్ వరకు సుమారు 18 కి.మీ దూరం మేర సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, వీటి కంట్రోల్ రూంను డీఐజీ ఉమ గురువారం ప్రారంభించారని పేర్కొన్నారు.

నేడు తిరుచ్చిలో వైగో 'సమత్తువ నడై పయనం'

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారకుండా, తమిళనాడులో కుల, మత ఘర్షణలు జరగకుండా అవగాహన కల్పించడానికి ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో శుక్రవారం తిరుచ్చిలో 'సమత్తువ నడైపయనం' చేపట్టనున్నారు. ఈ పయనం మదురైలో 12వ తేదీ ముగియనుంది. 190 కి.మీ దూరం జరిగే పయనంలో పాల్గొనేందుకు వెయ్యి మందిని ఎంపిక చేశారు. వాలంటీర్లు అలసిపోకుండా ఉత్సాహపరిచేందుకు పాత సినిమాల పాటలు, 12 సినిమాలను రాత్రిపూట షెల్టర్లలో ప్రదర్శించడానికి ఎంపిక చేశారు. ఈ పయనాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. ఇందుకుగాను ఆయన శుక్రవారం ఉదయం చెన్నై నుంచి విమానంలో తిరుచ్చికి చేరుకుంటారు. అనంతరం తపాలా కార్యాలయం వద్ద అన్నానగర్‌లో రోడ్‌షో నిర్వహిస్తారు. ఈ క్రమంలో శుక్రవారం తిరుచ్చి నగరంలో డ్రోన్లు ఎగురవేసేందుకు పోలీసులు నిషేధం విధించారు.

సౌరశక్తితో నడిచే బోటు సేవలు ప్రారంభం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో తొలిసారిగా సౌరశక్తితో నడిచే పడవ సేవలను కడలూర్ జిల్లా కిల్లయ్ పట్టణ పంచాయతీలోని పిచ్చావరం బోట్‌హౌస్‌లో ఏర్పాటు చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ ఎస్పీ ఆదిత్య సెంథిల్ కుమార్ ప్రారంభించి అధికారులతో కలిసి అందులో విహరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో 11 ప్రాంతాలను పర్యావరణ మార్పుల వల్ల ప్రభావితమయ్యే ప్రాంతాలుగా గుర్తించామని తెలిపారు. కిల్లయ్ ప్రాంతాన్ని గ్రీన్ కాంప్లెక్స్‌గా అభివృద్ధి చేయడానికి అటవీ, మత్స్య, జలవనరులశాఖల ద్వారా వివిధ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆ మేరకు వాయు, నీటి కాలుష్యాన్ని తగ్గించడానికి పిచ్చావరం బోట్‌హౌస్‌లో పర్యాటకుల కోసం 100శాతం సౌరశక్తితో నడిచే పడవ సేవలను ప్రారంభించామని, ఇందులో ఒకేసారి 14మంది ప్రయాణించవచ్చని పేర్కొన్నారు.

మదురై ఎయిమ్స్‌కి వైగై నది నీరు సరఫరా

విల్లివాక్కం, న్యూస్‌టుడే: మదురై ఎయిమ్స్ వినియోగానికి వైగై నది నీటిని సరఫరా చేయనున్నారు. ఇందుకుగాను రూ.8.40 కోట్లతో ప్రాజెక్టుకు టెండరు విడుదల చేశారు. 9 నెలల్లో పనులు పూర్తిచేయాలని లక్ష్యం నిర్ణయించారు. తిరుప్పరంకుండ్రం సమీపంలోని తోప్పూర్‌లో సుమారు 220 ఎకరాల విస్తీర్ణంలో రూ.2,021 కోట్ల వ్యయ అంచనాతో ఎయిమ్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

తాళం వేసిన ఇంట్లో 20రోజులుగా 50 శునకాల ఆర్తనాదాలు

ఆకలితో అలమటించి రెండు మృతి

శునకాలను ఉంచిన ఇల్లు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో సుమారు 20రోజులపాటు ఆహారం, నీళ్లు లేక నాలుగు పెంపుడు శునకాలు మృతి చెందిన సంఘటన నెల్లైలో చోటుచేసుకుంది. తిరునెల్వేలి జిల్లా రామాయపట్టి ప్రాంతానికి చెందిన అళగేశన్ తన ఇంట్లో 50కుపైగా శునకాలను పెంచుతున్నారు. ఈయనను 20 రోజుల క్రితం భూ వివాదానికి సంబంధించిన కేసులో దచ్చనల్లూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న శునకాలకు ఇరుగుపొరుగువారు రెండు రోజులు శునకాలకు ఆహారం పెట్టారు. తర్వాత మానేశారు. 20రోజులుగా ఆహారం, నీరు లేకపోవడంతో నాలుగు శునకాలు మృతి చెందాయి. ఆకలికి తాళలేక మిగిలిన కుక్కలు వాటి కళేబరాలను తిన్నాయి. దుర్వాసన రావడంతో స్థానికులు జంతు సంరక్షణ కార్యకర్తలకు సమాచారం ఇచ్చారు. వారు పోలీసులతో అక్కడకు చేరుకుని ఇంట్లో ఆకలితో అలమటిస్తున్న శునకాలకు ఆహారం, నీరు అందించారు. అనంతరం ఊటీలోని శునకాల హోంకు తరలించారు.

'ఎంటీసీ' అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

వడపళని, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 'ఐటీఐ' కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థుల నుంచి అప్రెంటిస్‌షిప్ కోసం మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్(ఎంటీసీ) దరఖాస్తులను ఆహ్వానించింది. ఐటీఐలో మోటార్ వెహికల్ మెకానిక్, డీజిల్ మెకానిక్, ఆటో ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, పెయింటర్, టర్నర్ లాంటి కోర్సులు చదివిన అభ్యర్థులు అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 3వ తేదీ ఉదయం 10 గంటలకు క్రోంపేటలోని ఎంటీసీ ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ స్కూల్‌లో నియామక శిబిరం జరగనుంది. ఎంపికైన వారికి నెలకు రూ.14వేల గౌరవభృతి అందుతుంది.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు

భరతనాట్యం, కథక్ నృత్య భంగిమలు

వడపళని, న్యూస్‌టుడే: ఇండియన్ ఫైనార్ట్స్ సొసైటీ ఆళ్వార్‌పేటలోని యతిరాజ కల్యాణ నిలయంలో 93వ వార్షిక సంగీతోత్సవాలను వైభవంగా నిర్వహిస్తోంది. చివరి రోజైన బుధవారం రాత్రి కథక్ నృత్య కళాకారులు నిరుపమ, రాజేంద్రల శిష్యులు రోహిణి, మేధావినిలు ఒకరు కర్ణాటక సంగీతానికి తగినట్టు భరతనాట్యం, మరొకరు హిందుస్తానీ సంగీతానికి తగ్గట్టు కథక్ నృత్య ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా మెరినా తీరంలోని దివంగత ముఖ్యమంత్రి అన్నాదురై, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సమాధులకు ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం రాత్రి నివాళులర్పించారు. అక్కడ ఉన్న సందర్శకులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ముఖ్యమంత్రితో కరచాలనం చేయడానికి పోటీపడ్డారు.

- న్యూస్‌టుడే, చెన్నై

త్వరలో పుదుచ్చేరిలో ప్రధాని పర్యటన

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: భారత ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో పుదుచ్చేరికి రానున్నారని రాష్ట్ర హోంశాఖ మంత్రి నమశ్శివాయం తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. త్వరలో పుదుచ్చేరికి రానున్న ప్రధాని పలు అభివృద్ధి పథకాలను ప్రకటిస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్రానికి విచ్చేసిన ఉపరాష్ట్రపతి అమలవుతున్న పథకాలపై చర్చించారని పేర్కొన్నారు.

అన్నాడీఎంకే తరఫున పోటీకి దరఖాస్తుల వెల్లువ

దరఖాస్తు అందుకుంటున్న మాజీ మంత్రి వళర్మతి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే తరఫున తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడానికి 10,175 ఆశావహులు దరఖాస్తులు అందజేసినట్లు పార్టీ అధిష్ఠానం గురువారం ప్రకటనలో తెలిపింది. తమ నియోజకవర్గంలో ఎడప్పాడి పళనిసామి పోటీ చేయాలని ఏకంగా 2,187 దరఖాస్తులు అందాయి. చెన్నై రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తుల అందజేత, స్వీకరణ చేపట్టారు.

కల్పాక్కం అణు పరిశోధనా కేంద్రం డైరెక్టర్‌గా శ్రీకుమార్ పిళ్లై

బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీకుమార్ పిళ్లై

మామల్లపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా కల్పాక్కంలోని ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్(ఐజీసీఏఆర్) డైరెక్టర్ సి.జి కర్హత్కర్ బుధవారం పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో నియమితులైన శ్రీకుమార్ పిళ్లై గురువారం బాధ్యతలు స్వీకరించారు. అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు ఆయనకు తెలిపారు.

మద్రాస్ వర్సిటీలో 'ఇంటర్ డిసిప్లినరీ' పీజీ కోర్సు

త్వరలో ప్రారంభం

- న్యూస్‌టుడే, వడపళని

మద్రాస్ వర్సిటీ

మద్రాస్ విశ్వవిద్యాలయం మొదటిసారిగా సైన్స్, టెక్నాలజీ, జాతీయ భద్రతలో 'ఇంటర్ డిసిప్లినరీ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ (ఎంఎస్)'ను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించాలనుకుంటోంది. రక్షణ, వ్యూహాత్మక అధ్యయనాలు, సైద్ధాంతిక భౌతికశాస్త్ర విభాగం ఈ కోర్సును అందించడానికి సహకరించనున్నాయి. కోర్సు గురించి వర్సిటీ రిజిస్ట్రార్ రీటా జాన్ మాట్లాడుతూ... కోర్సుతో విద్యార్థులు క్వాంటం కంప్యూటింగ్, డిజైన్ థింకింగ్ వంటి రంగాలపై అవగాహన పెంచుకుంటారని తెలిపారు. అంతేకాకుండా రక్షణ, వ్యూహాత్మక అధ్యయనాల విభాగం నాలుగు సంవత్సరాల సేవ తర్వాత సైన్యం నుంచి బయటికొచ్చే 'అగ్నివీర్' జవాన్లకు వ్యూహాత్మక అధ్యయనాలతో డిప్లొమా కోర్సును కూడా అందించాలనే ఆలోచన కూడా ఉందని పేర్కొన్నారు.

మెల్బోర్న్ వర్సిటీ సహకారం

మద్రాస్ వర్సిటీ 2026 శీతాకాల కార్యక్రమానికి మెల్బోర్న్ వర్సిటీ నుంచి ఆహ్వానాన్ని అందుకుంది. మెల్బోర్న్ వర్సిటీ నుంచి అందే ఆర్థిక సాయంతో వివిధ విభాగాల నుంచి ఐదుగురు విద్యార్థులు మెల్బోర్న్‌కు వెళ్లనున్నట్టు రీటా జాన్ చెప్పారు. మద్రాస్ వర్సిటీ వచ్చే ఏడాది వివిధ విభాగాలలో సేవలందించేందుకు విదేశీ వర్సిటీల నుంచి 15మంది ఆచార్యులకు అవకాశాలు కల్పించనుంది.

ఏడు ఆన్‌లైన్ డిగ్రీలు

వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీకాం, బీబీఏ, ఫ్రెంచ్‌లో బీఏ, ఎంకాం, ఎంఏ (ఇంగ్లిష్), ఎంఏ (జర్నలిజం), ఎంఏ ఆంత్రపాలజీ లాంటి ఏడు కోర్సులను ఆన్‌లైన్‌లో అందించేందుకు ఆలోచనలు జరుగుతున్నాయి. ఈ కోర్సులను అందించేందుకు యూజీసీ నుంచి కూడా ఆమోదం లభించింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (ఐడీఈ) కూడా వచ్చే సంవత్సరంలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించాలనుకుంటోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడల్ట్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ (వయోజన, నిరంతర విద్యా విభాగం) వృద్ధాప్య సంరక్షణ లాంటి రంగాల్లో కొత్తగా డిప్లొమా కోర్సులను కూడా అందించనుంది.

రామదాస్ కన్నీళ్లు పెట్టుకోవడం బాధాకరం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్ కన్నీళ్లు పెట్టుకోవడం తనను బాధించిందని తమిళగ మక్కల్ మున్నేట్ర కళగం వ్యవస్థాపకుడు జాన్‌పాండియన్ తెలిపారు. ఆయన గురువారం తిరునెల్వేలిలో విలేకరులతో మాట్లాడుతూ... పీఎంకే ప్రారంభించిన కొత్తలో తాను ఆ పార్టీ యువజన విభాగ అధ్యక్షుడిగా పనిచేశానని, తాజాగా ఆ పార్టీలో నెలకొన్న విభేదాలతో రామదాస్ కన్నీళ్లు పెట్టుకోవడం తనను చాలా బాధించిందని తెలిపారు. రామదాస్, అన్బుమణి కలిసి పార్టీని నడిపించాలని కోరారు. నేరాలకు పాల్పడుతున్న బాలురను అరెస్ట్ చేయాలన్నారు. అప్పుడే వారిలో మార్పు వస్తుందన్నారు. విజయ్ కూటమిలో చేరితే ఆహ్వానిస్తామన్నారు.

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎంఎండీఏ కాలనీ, అరుంబాక్కం, అళగిరి నగర్, చూలైమేడు, కోడంబాక్కం ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్తు శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

కామాక్షి అమ్మవారికి స్వర్ణ వడ్డాణం సమర్పణ

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం కామాక్షి అమ్మవారికి తిరువైయ్యారుకు చెందిన భక్తుడు శంకర నారాయణన్ బంగారు వడ్డాణాన్ని కానుకగా అందజేశారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతికి బుధవారం సమర్పించారు. పీఠాధిపతులైన శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి, శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి కలిసి బుధవారం సాయంత్రం అమ్మవారికి అలంకరించారు.

తిరుప్పావై పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ

బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే మునిరత్నం

శోళింగర్, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా శోళింగర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా మెట్ల ఉత్సవం, తిరుప్పావై పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే ఎ.ఎం.మునిరత్నం ప్రత్యేక అతిథిగా పాల్గొని విజేతలుగా నిలిచిన 109 మంది విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు నిత్యానంద, స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ తమిళ్‌సెల్వి, కౌన్సిలర్లు గోపాల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

2026కి ఘన స్వాగతం

మెరినా బీచ్‌లో కేక్ కోస్తున్న పోలీసులు

ప్యారిస్, న్యూస్‌టుడే: ప్రజలు 2026 నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. చెన్నై మెరినా బీచ్ క్లాక్ టవర్‌నురంగురంగుల విద్యుత్తు దీపాలతో అలంకరించారు. కామరాజర్ సాలై, ఈస్ట్‌కోస్ట్ రోడ్డులలో బుధవారం సాయంత్రం నుంచే ప్రజలు పెద్దసంఖ్యలో గుమికూడారు. పాటలు పాడి, నృత్యం చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. భద్రత దృష్ట్యా ఒక్క మెరినా బీచ్ వద్దే 2 వేల మంది పోలీసులు విధులు నిర్వర్తించారు. న్యూ ఇయర్ వేడుకలకు అర్ధరాత్రి ఒంటి గంట వరకు మాత్రమే అనుమతిచ్చిన నేపథ్యంలో ఆ తర్వాత కూడా సంబరాలు చేసుకుంటున్నవారిని పోలీసులు అక్కడి నుంచి పంపించేశారు. చెన్నైలో సుమారు 425 చోట్ల పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. శాంథోమ్‌చర్చి, బెసంట్‌నగర్ అన్నా వేళాంకణ్ణి చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. మెరినా బీచ్‌లో వేడుకలను నగర పోలీసు కమిషనర్ అరుణ్ పరిశీలించారు. పోలీసు అధికారులతో కలిసి కేక్ కోశారు. పోలీసులు చేపట్టిన ప్రత్యేక చర్యలతో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోలేదు.

టీనగర్‌లోని తితిదే ఆలయంలో వరుసలో నిల్చున్న భక్తులు

వాహనాల తనిఖీ చేపట్టి భద్రతా విధుల్లో ఉన్న పోలీసులు

చెన్నై: ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా త్యాగరాయనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామిని పలువురు దర్శించుకున్నారు. ఆలయాన్ని రంగురంగుల పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. గర్భాలయంలోని శ్రీవారు విశేష ఆభరణాల అలంకరణతో దర్శనమిచ్చారు. తెల్లవారుజామున తిరుప్పావై పఠనం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను అనుమతించారు. బుధవారం అర్ధరాత్రి నుంచి భక్తుల రాక మొదలైంది. రద్దీ దృష్ట్యా తెల్లవారుజామున 1.45 నుంచే దర్శనాలకు అనుమతి కల్పించారు. చెన్నైలోని శ్రీలంక డిప్యూటీ హైకమిషనర్ గణేశనాథన్ గీతీశ్వరన్, తితిదే చెన్నై స్థానిక సలహా మండలి మాజీ అధ్యక్షులు శ్రీకృష్ణ, తెదేపా చెన్నై ప్రముఖులు చంద్రశేఖర్ సహా పలువురు శ్రీవారిని దర్శించుకున్నారు. పలు సంస్థలు కాలమానినులు, శ్రీవారి ఫొటోలు పంచిపెట్టాయి. గతేడాది కన్నా భక్తుల రద్దీ తగ్గినట్లు పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. జీఎన్ చెట్టి రోడ్డులోని పద్మావతి అమ్మవారి ఆలయం కూడా భక్తుల రద్దీతో కిటకిటలాడింది.

వేళాంకణ్ణిలో ప్రత్యేక ప్రార్థనలు

ఆర్కేనగర్: ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకొని నాగపట్టినం జిల్లా వేళాంకణ్ణి చర్చిలో బుధవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. చర్చి విద్యుత్‌కాంతులతో వెలుగులీనింది.



చెన్నై వడపళనిలోని మురుగన్ ఆలయంలో హారతి ఇస్తున్న పూజారులు ● దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

శ్రీవారిని దర్శించుకున్న మంత్రి ఆర్.గాంధీ

ఆలయం ఎదుట మంత్రి గాంధీ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారిని వైకుంఠ త్రయోదశి నాడు రాష్ట్ర మంత్రి ఆర్.గాంధీ దర్శించుకున్నారు. ఆయనకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

తితిదేకు రూ.78 లక్షల ఔషధాల విరాళం

తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడికి విరాళం డీడీ అందిస్తున్న దాత పొన్నయ నాగేశ్వరన్ కుటుంబం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానములకు హైదరాబాద్‌కు చెందిన త్రిశూల్ ఎంటర్ ప్రైజర్స్ సంస్థ అధినేతలు చక్రధర్, శివరంజనిలు రూ.78 లక్షల విలువైన ఔషధాలను విరాళంగా అందించారు. దాతల తరఫున తితిదే బోర్డు సభ్యుడు సదాశివరావు గురువారం స్థానిక తితిదే ఛైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్ బీఆర్ నాయుడికి ఔషధాలు అందజేశారు. కార్యక్రమంలో స్విమ్స్ సంచాలకుడు ఆర్.వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షలు

తితిదే ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు చెన్నైకు చెందిన పొన్నయ నాగేశ్వరన్ రూ.50 లక్షలు విరాళంగా అందించారు. ఛైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్ బీఆర్ నాయుడికి కుటుంబసభ్యులతో కలిసి విరాళం డీడీని అందజేశారు.

(c) eenadu

తారల నూతన సంవత్సర శుభాకాంక్షలు

అభిమానులకు అభివాదం చేస్తున్న రజనీకాంత్ ● అజిత్‌కుమార్

చెన్నై, న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, అభిమానులకు పలువురు సినీ తారలు శుభాకాంక్షలు తెలిపారు. చెన్నై పోయెస్ గార్డెన్‌లోని నివాసం ఎదుట గుమిగూడిన అభిమానులకు నటుడు రజనీకాంత్ కనిపించి శుభాకాంక్షలు తెలిపారు. 'ముత్తు' చిత్రంలోని ఓ సన్నివేశాన్ని తన 'ఎక్స్'లో పోస్టు చేసి అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. తిరుప్పూర్ జిల్లా వెళ్లకోయిల్ సమీపంలోని కొంగునాడు రైఫిల్ క్లబ్‌లో ప్రాక్టీసులో పాల్గొన్న నటుడు అజిత్‌కుమార్ అక్కడి నుంచే నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇతర నటులు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. సూర్య ప్రధానపాత్రలో నటించిన 'కరుప్పు', అధర్వ మురళి నటించిన 'ఇదయం మురళి' చిత్రబృందాలు ప్రత్యేక పోస్టర్లు విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపాయి. విశాల్ నటించిన 'మగుడం' చిత్రబృందం ప్రత్యేక పోస్టరును విడుదల చేసింది.

అర్జునన్ పేర్ పత్తు ఫస్ట్‌లుక్ విడుదల

చెన్నై: నటుడు యోగిబాబు 300వ చిత్రానికి రాజ్‌మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో యోగిబాబు ముఖ్యపాత్రను పోషిస్తుండగా కాళి వెంకట్, 'మైనా' నందిని, అరుళ్‌దాస్ తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి 'అర్జునన్ పేర్ పత్తు' టైటిల్‌ను ఖరారు చేశారు. ఫస్ట్‌లుక్ పోస్టరును నటుడు విజయ్ సేతుపతి తన సామాజిక మాధ్యమ పేజీలో విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆళి ఫస్ట్‌లుక్...

చెన్నై: మాదవ్ దాసన్ దర్శకత్వంలో శరత్‌కుమార్ నటించిన చిత్రం 'ఆళి'. 888 ప్రొడక్షన్స్ పతాకంపై పొన్ను కణ్ణన్ నిర్మించారు. చిత్రీకరణ పనులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ఫస్ట్‌లుక్ పోస్టరును చిత్రబృందం విడుదల చేసింది. పోస్టరు ద్వారా సముద్రంతో ముడిపడిన కథతో చిత్రం రూపొందినట్లు తెలుస్తోంది.

రూట్ ఫస్ట్‌లుక్ పోస్టరు...

ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తున్న రజనీకాంత్

చెన్నై: వర్ధమాన దర్శకుడు సూర్య ప్రతాప్ దర్శకత్వంలో గౌతమ్ రామ్ కార్తిక్, భవ్య త్రిఖ జంటగా నటించిన చిత్రం 'రూట్ - రన్నింగ్ ఔట్ ఆఫ్ టైమ్'. ఇందులో వై.జి.మహేంద్రన్, పావనిరెడ్డి, లింగ, ఆర్.జె.ఆనంది తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటించారు. సైన్స్ ఫిక్షన్‌గా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణను చెన్నై, ఇతర ప్రాంతాల్లో చేపట్టారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్న నేపథ్యంలో ఫస్ట్‌లుక్ పోస్టరును రజనీకాంత్ ఆవిష్కరించారు.

డిమాంటి కాలనీ-3 ఫస్ట్‌లుక్...

చెన్నై: అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో హారర్ థ్రిల్లర్ జానర్‌లో 2015లో విడుదలైన 'డిమాంటి కాలనీ'కి ప్రస్తుతం మూడో భాగం తెరకెక్కనుంది. పేషన్ స్టూడియోస్, గోల్డ్ మైన్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనులు ముగిసిన నేపథ్యంలో జులైలో చిత్రీకరణ పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం గురువారం విడుదల చేసింది. చిత్రంలో అరుళ్‌నిధి ప్రధానపాత్రలో నటిస్తున్నారు.

విత్ లవ్ ఫిబ్రవరి 6న...

చిత్రంలోని ఓ సన్నివేశ దృశ్యం

చెన్నై: 'టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడు అభిషన్ జీవింత్, అనస్వర రాజన్ జంటగా నటించిన చిత్రం 'విత్ లవ్'. బసిలియాన్ నజరేత్, మహేశ్ రాజ్ బసిలియాన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'టూరిస్ట్ ఫ్యామిలీ' సహాయ దర్శకుడు మదన్ దర్శకత్వం వహించారు. ఆధునిక యువత జీవన విధానాన్ని ఆధారంగా చేసుకుని ప్రేమకథగా రూపొందిన ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 6న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. చిత్రానికి షాన్ రోల్డన్ సంగీతం అందించారు. త్వరలో ట్రైలర్, ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ద్రౌపతి-2 చిత్రానికి యు/ఏ ధ్రువపత్రం



చెన్నై: మోహన్.జి దర్శకత్వంలో చారిత్రక చిత్రంగా రూపొందిన చిత్రం 'ద్రౌపతి-2'. రిచ్చర్డ్ రిషి కథానాయకుడిగా నటించిన ఈ చిత్రంలో వై.జి.మహేంద్రన్, 'నాడోడిగళ్' భరణి, శరవణ సుబ్బయ్య, వేల రామమూర్తి, సిరాజ్ జాని, దినేశ్ లంబా తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు యు/ఏ ధ్రువపత్రం అందించింది. త్వరలో విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది.

అలంకరణలో శ్రీ వళ్లీ దేవసేన సమేత మురుగన్ ● లక్ష్మి, సరస్వతి సమేత కామాక్షి అమ్మవారు ● ఆదిపరాశక్తికి దీపారాధన చేస్తున్న లక్ష్మీ బంగారు అడిగళార్ ● పళ్లిపట్టు: వేంకటేశ్వరస్వామి అలంకరణలో శ్రీకృష్ణుడు

ఆలయాల్లో నూతన సంవత్సర శోభ

కాంచీపురం, న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా గురువారం తెల్లవారు జామున కాంచీపురం వరదరాజ పెరుమాళ్, ఏకాంబరనాథర్, కామాక్షి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర ప్రజలు తెల్లవారు జాము నుంచే ఆలయాలకు తరలివెళ్లారు. శంకర మఠంలోని శ్రీ చంద్రమౌళీశ్వరుడికి కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి, శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి పూజలు నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు. శ్రీపెరుంబుదూర్ సమీపం వల్లకోట మురుగన్ ఆలయంలో తెల్లవారు జామున మూలవిరాట్టు, ఉత్సవరులకు అభిషేకాలు, ఆరాధనలు నిర్వహించారు. కాంచీపురం సమీపం ఉక్కల్ గ్రామంలోని 27 నక్షత్ర వృక్ష వినాయకుడు, మడావలం ప్రాంతంలోని కామాక్షి అమ్మవారి ఆలయంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు జరిపారు.

అరుణాచలేశ్వరాలయంలో...

తిరువణ్ణామలై: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో గురువారం మూలవర్లకు సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉన్నాములై సమేత చంద్రశేఖరస్వామి, పరాశక్తి అమ్మవారికి వెండి కవచం తొడిగారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ● **పళ్లిపట్టు:** తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట యూనియన్ వంగనూరు గ్రామంలో ద్రౌపదమ్మ ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా గురువారం శ్రీకృష్ణుడిని వేంకటేశ్వరస్వామిగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శనం చేసుకున్నారు.

ఆదిపరాశక్తి సిద్ధర్ పీఠంలో...

మామల్లపురం: చెంగల్పట్టు జిల్లా మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి సిద్ధర్ పీఠంలో కర్ణాటక రాష్ట్ర ఓం శక్తి భక్తుల తరఫున ఆంగ్ల నూతన సంవత్సరాది వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక ఉద్యమ ఛైర్‌పర్సన్ లక్ష్మీ బంగారు అడిగళార్‌కు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారు, బంగారు అడిగళార్ విగ్రహానికి అభిషేకాలు, ఆరాధనలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. బుధవారం సాయంత్రం కలశ, యాగ పూజలను ఆధ్యాత్మిక ఉద్యమ వైస్ ఛైర్‌పర్సన్ శ్రీదేవి రమేష్ ప్రారంభించారు.

తిరువణ్ణామలై: వెండి కవచ అలంకరణలో ఉన్నాములై సమేత చంద్రశేఖరస్వామి, పరాశక్తి అమ్మవారు

కిశోర్ రాజ్‌కుమార్ సినిమా చిత్రీకరణ పూర్తి

చెన్నై: 'నాయ్ శేఖర్' దర్శకుడు కిశోర్ రాజ్‌కుమార్ కథ రాసి దర్శకత్వం వహించి కథానాయకుడిగా ఓ చిత్రంలో నటించారు. నాయిస్ అండ్ గ్రెయిన్స్ మీడియా నిర్మించిన ఈ చిత్రంలో మలయాళ నటి అన్నా బెన్ నాయిక. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ పనులు ప్రస్తుతం పూర్తయ్యాయి. నిర్మాణానంతర పనులను త్వరగా పూర్తి చేసి చిత్రాన్ని అతి త్వరలో విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. చిత్రం ఆద్యంతం హాస్యభరితంగా ఉంటుందని చిత్రబృందం వెల్లడించింది.

సంబరాల్లో చిత్రబృందం

జమా దర్శకుడి చిత్రానికి పూజ

పూజ కార్యక్రమంలో చిత్రబృందం

చెన్నై, న్యూస్‌టుడే: మిలియన్ డాలర్ స్టూడియోస్, నియో క్యాస్టిల్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రానికి పూజా కార్యక్రమం జరిగింది. 'జమా' చిత్రం ద్వారా అభిమానులను ఆకట్టుకున్న పారి ఇళవళగన్ ఈ చిత్రానికి కథ రాసి కథానాయకుడిగా నటిస్తున్నారు. 'నిలవుక్కు ఎన్‌మేల్ ఎన్నడి కోబం' చిత్రంలో ముఖ్యపాత్రను పోషించిన రమ్య రంగనాథన్ కథానాయిక. చెన్నైలోని పెరంబూర్ ప్రాంతాన్ని నేపథ్యంగా తీసుకుని తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో సీనియర్ నటి రోజా, చేతన్, యూట్యూబర్ 'పరితాపంగళ్' గోపి, ఇస్మత్ బాను, సుదర్శన్ గాంధీ తదితరులు ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. భరత్ శంకర్ సంగీతం అందించనున్నారు. సినీ గేయరచయితలు మోహన్‌రాజన్, భాగ్యం శంకర్ తదితరులు పాటలు రాస్తున్నారు.

పైవంతెన నిర్మాణానికి భూమిపూజ

పునాది రాళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేంద్రన్, కలెక్టరు ప్రతాప్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా కడంబత్తూరు సమీపం తండలంలో సుమారు 5వేల మందికి పైగా నివసిస్తున్నారు. వీరు ప్రతి అవసరానికి కూవం నది దాటి కడంబత్తూరు వెళ్లాలి. వర్షాకాలంలో నది ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో నదిపై పైవంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.17.20 కోట్లను కేటాయించింది. ఈ నేపథ్యంలో నిర్మాణానికి భూమిపూజ గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజేంద్రన్, జిల్లా కలెక్టర్ ప్రతాప్ పనులు ప్రారంభించారు.

నటరాజస్వామి క్షేత్రంలో 3న ఆరుద్ర దర్శనం

అలంకరణలో నటరాజస్వామి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా చిదంబరంలోని ప్రసిద్ధ నటరాజస్వామి ఆలయంలో ధనుర్మాసంలో ఆరుద్ర దర్శన వేడుక నిర్వహించడం ఆనవాయితీ. ఆ మేరకు ఈనెల 3వ తేదీ నిర్వహించనున్నారు. ఆ రోజు స్వామివారికి ఉదయం నుంచి రాత్రి వరకు ఆరు రకాల అభిషేకాలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా చిదంబరం పట్టణంలో శుక్ర, శనివారాల్లో ట్రాఫిక్‌లో మార్పులు చేసినట్లు పోలీసులు తెలిపారు. చెన్నై, పుదుచ్చేరి, కడలూర్, భువనగిరి మార్గం గుండా వచ్చే బస్సులు బైసల్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండులో నిలపాలి. నాగపట్నం, కాట్టుమన్నార్ కోవిల్, తిరుచ్చి మార్గాల గుండా వచ్చే బస్సులు మన్నార్‌గుడి రోడ్డులో పోలీస్ క్వార్టర్స్ వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండు నుంచి రాకపోకలు సాగించాలి. కార్లు ఇతర వాహనాలు కడలూర్ బైపాస్ రోడ్డులోని ఆక్స్‌ఫర్డ్ సీబీఎస్ఈ పాఠశాల ప్రాంగణంలోని తాత్కాలిక పార్కింగ్ ప్రాంతంలో నిలపాలి.

వైభవంగా ప్రదోషోత్సవం

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో గురువారం ప్రదోషోత్సవం ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సరాది సందర్భంగా ఆలయాన్ని వేకువజామున తెరిచారు. ఉదయం మూలవర్లకు, సాయంత్రం మహానంది సహా అన్ని నంది విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు చేశారు. ఉత్సవమూర్తులైన ఉన్నాములై సమేత చంద్రశేఖరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి బంగారు వృషభ వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

* **పళ్లిపట్టు:** తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు పట్టణంలోని పార్వతి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో ప్రదోషోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మూలవర్లు, నంది విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు చేశారు. ఉత్సవమూర్తులను మాడ వీధుల్లో ఊరేగించారు.

వృషభ వాహనంపై ఉన్నాములై సమేత చంద్రశేఖరస్వామి
● మహానందికి చందనాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

పోలీసుల అదుపులో ఉన్న శుభ్రతా కార్మికులకు అస్వస్థత

చెన్నై, న్యూస్‌టుడే: విధులు శాశ్వతం చేయాలని, వేతనాలు పెంచాలని తదితర పలు డిమాండ్లతో కొన్ని నెలలుగా శుభ్రతా కార్మికులు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి వంద మందికిపైగా కార్మికులు చెన్నై రిప్పన్ బిల్డింగ్ ఎదుట ఆందోళనకు పాల్పడటంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని సాయంత్రం విడిచిపెట్టారు. మళ్లీ ఆందోళన కొనసాగించడంతో బుధవారం రాత్రి మళ్లీ అదుపులోకి తీసుకుని కణ్ణప్పర్ తిడల్ కమ్యూనిటీ హాలుకు తరలించారు. అక్కడి నుంచి కోయంబేడు బస్ టెర్మినస్‌కు తరలిస్తుండగా నిరసనకారుల్లో సరస్వతి, నిర్మల, మహేశ్వరి, ధనలక్ష్మి అనే కార్మికులు అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే వారిని వడపళనిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్సల కోసం కీళ్‌పాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారికి అండగా మిగతా కార్మికులూ ఆస్పత్రిలోనే ఉన్నారు.

పథకాలతో 22వేల మంది విద్యార్థులకు లబ్ధి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: పాఠశాలల్లో 6 నుంచి ప్లస్‌టూ వరకు చదివి ఉన్నత విద్యలో చేరిన విద్యార్థులకు తమిళ్‌పుదల్వన్, పుదుమైప్పెన్ పథకాల కింద రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.వెయ్యి సాయం అందజేస్తోంది. ఈ పథకాల కింద 2025లో 22,465 మంది విద్యార్థులు లబ్ధి పొందారని జిల్లా కలెక్టర్ ప్రతాప్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

దక్షిణామూర్తికి ప్రత్యేకాభిషేకాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయంలో కొలువుదీరిన శ్రీమేధా దక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో స్వామివారి సన్నిధి వద్ద గురువారం సంకల్పపూజలను ఆలయ ప్రధాన అర్చకులు కరుణాగురుకుల్ నేతృత్వంలో జరిపారు. గోక్షీరంతో పాటు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ధూప, దీప, నివేదనలు పూర్తయ్యాక బంగారు ఉడుపులతో ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ఈ విశేషోత్సవంలో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

తమిళనాడు రావడానికి జంకుతున్న వలస కార్మికులు

సినీనటి కస్తూరి

ప్యారిస్, న్యూస్‌టుడే: ఇతర రాష్ట్రాల ప్రజలు ప్రస్తుతం తమిళనాడు రావడానికి భయపడే పరిస్థితి నెలకొందని సినీనటి కస్తూరి ఆరోపించారు. మదురై తిరుప్పరంకుండ్రంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఏ రంగంలో చూసినా పోరాటాలే జరుగుతున్నాయని, నర్సులు, ఉపాధ్యాయులు, రైతులు తదితర అన్ని వర్గాలవారు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. నేడు రాష్ట్రంలో కులం, మతం, మానవత్వం వంటి వాటిని మించి మత్తు ఉందన్నారు. ఎక్కడ చూసినా మద్యం, మత్తుపదార్థాలు సులభంగా లభిస్తున్నాయన్నారు. పదేళ్లుగా స్టూడియో నడుపుతున్న ఓ సంగీత దర్శకుడు ఇటీవల స్టూడియోకి వెళ్లేందుకు కుదరలేదని, భయంగా ఉందని అంటున్నారని, ఆ స్థాయికి పరిస్థితులు మారాయని పేర్కొన్నారు. ద్రావిడ ఉద్యమం ప్రారంభమైనప్పుడు నిర్దిష్ట సామాజిక వర్గాన్ని చూసి వలస వచ్చినవారని, మనవాళ్లు కాదని చెప్పారన్నారు. ఆ తర్వాత హిందీ వాళ్లని చూసి ఆ విధంగా చెబుతున్నారని తెలిపారు. ఇప్పుడు మంత్రులు కూడా ఉత్తరాది వారిని కించపరిచేలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బతుకుదెరువు కోసం వచ్చినవారిని బతికించే తమిళనాడు అనే పరిస్థితి మారి అసలు ఇక్కడికి రావడానికే ఇతర రాష్ట్రాల ప్రజలు జంకుతున్నారని విమర్శించారు.

లారీ ఢీకొని దివ్యాంగుడి మృతి

గుమ్మిడిపూండి: తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి సమీపం ఆరంబాక్కం బాట్టైకుప్పానికి చెందిన సెల్వం (46) దివ్యాంగుడు. ఈయన గురువారం చెన్నై-కోల్‌కతా రహదారిని దాటుతుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరంబాక్కం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్పృహకోల్పోయి ఖైదీ...

రెడ్‌హిల్స్: పెరంబూరు జిల్లా వీరపిళ్లైక్కాడుకు చెందిన ఉదయకుమార్(46) చెన్నై తండయార్‌పేటలో 2019లో జరిగిన హత్య కేసులో అరెస్టయ్యి తిరువళ్లూర్ జిల్లా పుళల్ కేంద్ర కారాగారంలో ఉంచారు. ఇతను బుధవారం సాయంత్రం స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే జైలు సిబ్బంది చెన్నై స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. పుళల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి మృతదేహం స్వాధీనం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: బావిలో నుంచి బాలుడి మృతదేహాన్ని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. నామక్కల్ జిల్లా రాశిపురం-సేలం రోడ్డులోని సామువేల్ గార్డెన్‌లో గాబ్రియల్ రమేష్, ఆయన సతీమణి షీలా క్రీస్తు దేవాలయాన్ని నిర్వహిస్తున్నారు. వారి కుమారుడు ఎలేజా బిళసన్(12) ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. సెలవుకావడంతో ఇంట్లోనే ఉన్నాడు. చర్చిలో నూతన సంవత్సర వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో ఎలేజా బిళసన్ కనిపించలేదు. ఫిర్యాదు మేరకు రాశిపురం పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. సమీపంలోని 60 అడుగుల బావిలో బాలుడి మృతదేహం కనిపించడంతో అగ్నిమాపక సిబ్బంది సాయంతో బయటికి తీసి రాశిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హత్య కేసులో హోంగార్డు సహా ఇద్దరి అరెస్టు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాకు చెందిన సూరజ్(23) కోవై కరుంబుకడై ప్రాంతంలోని ఓ చైనీస్ రెస్టారెంట్‌లో వంట మాస్టర్‌గా పనిచేశాడు. ఇతను గత నెల 30వ తేదీ పుల్లుకడై ప్రాంతంలో నడిచి వెళుతుండగా కరుంబుకడై ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ బాసిత్, అతని స్నేహితుడు హోంగార్డు ప్రకాష్ కలిసి సూరజ్‌ని అడ్డుకొని ఉత్తరాది రాష్ట్రానికి చెందినవాడివా? అని అడిగి అసభ్య పదజాలంతో దూషించి కిందకు తోశారు. తలకు తీవ్రగాయం కావడంతో సూరజ్ స్పృహకోల్పోయాడు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి బాసిత్, ప్రకాష్‌లను అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

మహిళను లైంగికంగా వేధించిన ప్రభుత్వ ఉద్యోగి...

ప్యారిస్: చెన్నై మైలాపూర్‌కి చెందిన ఆస్టిన్ ప్రభుత్వ ఉద్యోగి. ఇతను గత నెల 28వ తేదీ చెన్నై శాంథోం ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రోడ్డుపై ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళను లైంగికంగా వేధించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి ఆస్టిన్‌ని అరెస్టు చేశారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడు...

ప్యారిస్: చెన్నై వడపళనికి చెందిన పాఠశాల విద్యార్థిని బుధవారం రాత్రి కుటుంబంతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంది. అనంతరం ఇంటి బయట కూర్చొని ఉండగా ఓ యువకుడు ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేయడంతో స్థానికులు యువకుడిని పట్టుకుని పోలీసులకి అప్పగించారు. దర్యాప్తులో అతను చూళైమేడుకి చెందిన గౌతమ్ అని, మద్యం మత్తులో అలా ప్రవర్తించాడని తెలిసింది.

నగదు మోసానికి పాల్పడిన వ్యక్తి...

గుమ్మిడిపూండి: తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి సమీపం పెద్దికుప్పంలో ఆన్‌లైన్ వర్తక సంస్థ ఉంది. ఇందులో ఈగువారుపాళ్యానికి చెందిన పార్తిబన్ పని చేశాడు. ఇతను రూ.4.94 లక్షల నగదు మోసానికి పాల్పడినట్లు సంస్థ మేనేజర్ నిర్మల్‌కుమార్ సిప్కాట్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని గురువారం అరెస్టు చేశారు.

చోరీ నిందితులు ముగ్గురు...

అరెస్టైన నిందితులు

ప్యారిస్: ఇంటి తాళం పగలగొట్టి చోరీకి పాల్పడిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై మాధవరానికి చెందిన ఐకోట్టుతురై గతనెల 25న ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి పళని మురుగన్ ఆలయానికి వెళ్లాడు. ఆయన ఇంటి తాళం పగులగొట్టి ఉన్నట్లు 28న చుట్టుపక్కలవారు ఫోన్‌లో తెలియజేశారు. సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించగా నగదు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు తెలిసింది. కేసు నమోదు చేసి చోరీకి పాల్పడిన రిషికేష్, జయంతినాథన్, విఘ్నేష్‌లను అరెస్టు చేశారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హత్య చేయించిన భార్య అరెస్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హత్య చేయించిన భార్యను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మదురైకి చెందిన దేవా అలియాస్ రితీష్(27) కార్మికుడు. భార్య ఇంద్రాణి, మూడేళ్ల కుమారుడితో కలిసి కోయంబత్తూరులో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో గతనెల 26న దేవా అకస్మాత్తుగా అదృశ్యమవడంతో ఆయన తల్లి సుశీల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంద్రాణి తన భర్తను బంధువులతో కలిసి హత్య చేయించినట్లు బుధవారం పోలీసుల ఎదుట లొంగిపోయింది. ఇంద్రాణికి తన చిన్నాన్న వినోద్‌కుమార్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడినట్లు, విషయం తెలిసిన దేవా వారిని మందలించడంతో హత్య చేయడానికి వారు కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. 28వ తేదీ రాత్రి దేవాను వినోద్‌కుమార్, మరికొంత మంది కలిసి హత్య చేసి, ప్రైవేటు అంబులెన్స్‌ను రప్పించి రైలు పట్టాలపై పడేసి ఆత్మహత్యలా చిత్రీకరించినట్లు తెలిసింది. వినోద్‌కుమార్ తదితరుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వ్యాను బోల్తా.. 20 వేల కోడిగుడ్లు నేలపాలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: వ్యాను బోల్తాపడటంతో వేలాది కోడిగుడ్లు నేలపాలయ్యాయి. విళుప్పురం సమీప కెడారి ప్రాంతానికి చెందిన గుణశేఖరన్(40) నామక్కల్‌లో కోడిగుడ్లు కొనుగోలు చేసి విళుప్పురం తీసుకొచ్చి హోల్‌సేల్‌గా విక్రయిస్తుంటాడు. బుధవారం గుడ్లను తీసుకుని సొంతవ్యానులో బయల్దేరాడు. విళుప్పురం కీళ్ పెరుంబాక్కానికి చెందిన రమేష్ వాహనం నడిపాడు. గురువారం ఉదయం విళుప్పురం సమీప అయినంపాళ్యం వద్ద వెళుతుండగా ప్రభుత్వ బస్సును ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నించే క్రమంలో అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. రమేష్, గుణశేఖన్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వ్యానులో లక్షకు పైగా కోడిగుడ్లు ఉండగా వాటిలో సుమారు 20 వేల వరకు పగిలిపోయాయి. రోడ్డుపై పడిన గుడ్లను స్థానికులు పట్టుకెళ్లారు. విళుప్పురం-సెంజి మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

అన్నాడీఎంకే నేతలపై కేసు నమోదు

ప్యారిస్, న్యూస్‌టుడే: శాలువా వేయడంలో గొడవలు జరిగిన నేపథ్యంలో అన్నాడీఎంకే నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. చెన్నై కొళత్తూర్ రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన ఆరుముగం అన్నాడీఎంకే నాయకుడు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి తిరుత్తణి, తిరువళ్లూర్‌లో ప్రచారం ముగించుకుని వెళ్తుండగా కొళత్తూర్‌లో పార్టీ కార్యకర్తలు స్వాగతం పలికారు. ఆరుముగం ఎడప్పాడి పళనిసామికి శాలువా కప్పారు. అనంతరం ఎడప్పాడి పళనిసామి అక్కడి నుంచి వెళ్లిపోయారు. శాలువా వేసిన వ్యవహారమై ఆరుముగంతో అక్కడి స్థానిక నాయకుడు మురుగదాస్ గొడవపడి, తన మద్దతుదారులతో కలిసి అతనిపై దాడిచేశారు. గాయపడిన ఆరుముగం ఫిర్యాదు మేరకు మురుగదాస్, ఆయన మద్దతుదారులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హరిపురం(మందస), న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా మందస మండలం కొర్రాయిగేటు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వాహనం ఢీకొని తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన మింటుకుమార్‌సాహు(25) మృతి చెందినట్లు మందస ఎస్సై కె.కృష్ణప్రసాద్ తెలిపారు. చెన్నై నుంచి సాహు, అతని స్నేహితుడు సోనోకుమార్ మండల్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై ఝార్ఖండ్ వెళ్తుండగా మార్గమధ్యంలో ప్రమాదం చోటు చేసుకుంది. ఇందులో సాహు మరణించగా.. గాయాలపాలైన మండల్ హరిపురం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

వైద్యానికి చికిత్స అవసరం

ఆసుపత్రుల్లో సేవలు పెరగాలి
ఐవీఆర్ఎస్ సర్వేలో అభిప్రాయం

ఈనాడు-ఏలూరు: ప్రభుత్వ ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్యసేవలు ఎలా అందుతున్నాయి? వైద్యులు, మందులు, పారిశుద్ధ్యం, సేవలు అందించడానికి సిబ్బంది ఎవరైనా డబ్బులు ఆశిస్తున్నారా అని కూటమి ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే చేయించింది. ప్రజలకు ఫోన్ చేసి వారి అభిప్రాయాలు తెలుసుకుంది. ఈ సర్వే 2024 డిసెంబరు నుంచి 2025 డిసెంబరు 19 వరకు నిర్వహించారు.

రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో మూడు నుంచి ఐదారు నియోజకవర్గాల్లో సర్వే చేశారు. అక్కడ ఆరోగ్య కేంద్రాల్లో నెల వారీ సర్వేతో పాటు ఆరు మాసాలు, ఏడాదిలో అందుతున్న సేవలపై సంతృప్తిగా ఉన్నారా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని నాలుగు ప్రశ్నలు సంధించి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. ఈ సర్వే వివరాలను గత నెలలో జరిగిన కలెక్టర్ల సమీక్షలో ప్రభుత్వం వెల్లడించింది. ఆసుపత్రుల్లో సేవలపై ఇంకా సంతృప్తి స్థాయి పెరగాలని.. అందుకు వైద్యశాలలను బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి దిశా, నిర్దేశం చేశారు.

రెండు జిల్లాల్లో ఫలితాలు (%) ఇలా..

నియోజకవర్గం	పాజిటివ్	నెగిటివ్
ఏలూరు	68.68	31.32
చింతలపూడి	65.85	34.15
నూజివీడు	63.73	36.27
పోలవరం	64.35	35.65
ఉంగుటూరు	64.94	35.06
తణుకు	65.93	34.07
ఉండి	65.39	34.61
తాడేపల్లిగూడెం	64.34	35.66

బాగుంటే మంచి ర్యాంకు వచ్చేది.. సర్వేలో అన్ని విభాగాల్లో ప్రగతి బాగుంది. వైద్యసేవల్లో మాత్రం ర్యాంకు బాగా పడిపోయింది. దీనిలో పురోగతి బాగుంటే జిల్లాలకు మంచి ర్యాంకు వచ్చేది. దీన్ని అధిగమించాలని కలెక్టర్ల సదస్సు ముగిసిన వెంటనే జరిగిన పీజీఆర్ఎస్ సమావేశంలో ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథాన నడిపిద్దాం: కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు సాధించడం ద్వారా జిల్లాను అభివృద్ధి పథాన నడిపిద్దామని కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో ఆమెను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వెట్రిసెల్వి మాట్లాడుతూ.. అందరం కలిసికట్టుగా పని చేసి జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేద్దామన్నారు. ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా బాధ్యతాయుతంగా ముందుకెళ్దామని పేర్కొన్నారు. జేసీ అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న, డీఆర్వో విశ్వేశ్వరరావు, జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తూచ్... మనది కాదంతే!

- మొన్నటి వరకూ మనదే.. ఇప్పుడు వాళ్లదట..
- కిన్నెరసాని నదిలో ఇసుక రవాణా వ్యవహారం

ఇసుక తవ్వకాల కోసం ఏర్పాటు చేసిన దారి

కుక్కునూరు, న్యూస్‌టుడే: కిన్నెరసాని నది నుంచి తెలంగాణ వ్యక్తులు యథేచ్ఛగా ఇసుక తరలించుకుపోతున్నారు. రెండు నెలల కిందటి వరకూ మన అధికారులు, ఆ ఇసుక తవ్వకాలు జరుపుతున్న ప్రాంతం ఆంధ్రా పరిధిలోని కుక్కునూరు మండలంలో ఉందంటూ, ఆ రవాణాను ఆపేందుకు ప్రయత్నించారు. తెలంగాణ అధికారులు సహకరించడం లేదంటూ నిందలు వేశారు. బూర్గంపాడు వెళ్లి పత్రికా సమావేశం కూడా ఏర్పాటు చేశారు. తమ భూభాగంలోని ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, చట్టరీత్యా నేరమని, ఇకనైనా మానుకోకపోతే కేసులు నమోదు చేస్తామంటూ హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఆ దందా ఆగలేదు.

అప్పట్లో రెవెన్యూ, పోలీసు సిబ్బందితో గస్తీ కూడా ఏర్పాటు చేశారు. రాత్రి పూట గస్తీ అన్నా, 7-8 గంటల వరకూ ఉండి సిబ్బంది వచ్చేసేవారు. దీంతో రవాణాకు ఎటువంటి ఆటంకం లేకుండా పోయింది. ఇక చేసేది లేక ఆంధ్రా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం మానేశారు.

ప్రధాన దారిపై స్థావరాలు.. కొద్దో గొప్పో అడ్డుపెట్టే ఆంధ్రా అధికారులు అటువైపు చూడకపోవటంతో, రవాణాదారులు రాత్రిపూట ట్రాక్టర్లలో తోలి, కుక్కునూరు - భద్రాచలం ప్రధాన రహదారి (తెలంగాణ ప్రాంతం)లో ఇసుక నిల్వ స్థావరాలు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి పగటిపూట లారీలతో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు.

కుక్కునూరు-భద్రాచలం ప్రధాన రహదారి పక్కన నిల్వ

అది తెలంగాణ భూభాగమే.. రవాణా పెరగటం, అధికారులు పట్టించుకోకపోవటంపై ఇప్పుడు తవ్వకాలు జరుగుతున్న ప్రదేశం తెలంగాణలో ఉందంటున్నారు అధికారులు. మరి మొదట్లో హడావుడి చేసి, ఇప్పుడు ఆ ప్రాంతం మనదే కాదనడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఇదే విషయమై కుక్కునూరు తహసీల్దార్ రమేశ్‌బాబు మాట్లాడుతూ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం తెలంగాణదేనన్నారు. తొలుత ఆంధ్రా అనుకొని, నిలిపే ప్రయత్నాలు చేశామన్నారు. సర్వేయర్లు ఆ ప్రాంతం తెలంగాణలో ఉందని తెలపటంతో వదిలేశామని చెప్పారు.

పక్కకెళ్తే.. ప్రమాదం అంచుల వరకు వెళ్లినట్లే..

ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం నిత్యం ఎంతో మంది వాహనదారులకు ప్రాణ సంకటంగా మారుతోంది. జాతీయ రహదారి 165 విస్తరణలో భాగంగా మండవల్లి మండలం పెరికెగూడెంలో రోడ్డును నిర్మించారు. దానికి ఇరువైపులా అంచులు నిర్మించలేదు. దీంతో ఒకవైపు శ్యాంప్ డ్రెయిన్, మరో వైపు పంట కాలువ ఉండటంతో వాహనాలు వాటిలోకి జారిపోతున్నాయి. పెరికెగూడెం ప్రాంతంలో మార్జిన్లు అయినా నిర్మించాలి. లేదా సూచిక బోర్డులు అయినా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎన్‌హెచ్ డీఈ సత్యనారాయణను వివరణ కోరగా.. వెంటనే సమస్యను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, మండవల్లి

అక్షరమే ఆభరణం

మహిళల ఉన్నతికి మహాయజ్ఞం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మహిళలు చదువుకుంటే కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుంది. అక్షర కుసుమాలు పూస్తాయి. అందుకే కూటమి ప్రభుత్వం 'అక్షరాంధ్ర' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. జిల్లాలో ఈ మహత్తర యజ్ఞాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి పర్యవేక్షిస్తున్నారు.

పాఠాలు చదువుకుంటున్న మహిళలు

అక్షరాలు రాయడం, చదవడం, అంకెలపై పట్టు, డిజిటల్ నగదు లావాదేవీలపై అవగాహన ఉంటే మహిళలు మోసాలకు గురికారని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం 'ఉల్లాస్'. దీన్ని గ్రామీణ ప్రాంతాల నుంచి అన్ని చోట్లా విజయవంతం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం 'అక్షరాంధ్ర' కొనసాగిస్తోంది. అంతర్జాతీయ అక్షరాస్యత రోజైన సెప్టెంబరు 8న ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ఏలూరు జిల్లాలో ఎంపికైన వారు
డీఆర్‌డీఏ - 54,000
డ్వామా - 27,000
మెప్మా - 16,000
బోధించే వాలంటీర్లు 9,700

డ్వామా, డ్వాక్రా, మెప్మా తదితర విభాగాల్లో అక్షరాలు నేర్చుకోవాల్సిన మహిళలను గుర్తించారు. వారిలో కొందరికి తొలివిడతగా పాఠాలు బోధిస్తున్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం అమలు తీరును ఎన్‌సీఈఆర్టీ బృందం ఇటీవల పరిశీలించింది. కోర్సులు పూర్తి చేశాక ఫిబ్రవరిలో పరీక్షలు నిర్వహిస్తారు. ఉత్తీర్ణులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు.

రోజూ ఓ గంట.. బోధన, పుస్తక పఠనానికి ఆయా సంఘాల్లో చదువుకున్న వారినే వాలంటీర్లుగా ఎంపిక చేశారు. వీరు అక్షరాలు రాయడం, పదాలు పలకడం వంటివి నేర్పుతారు. రోజూ ఓ గంట పాటు ఆయా ప్రాంతాల్లో అనువైన చోట చెబుతారు. మొత్తం మీద 100 గంటల కార్యక్రమం ఇది. అన్ని ప్రాంతాలకు పుస్తకాలు పంపించామని వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి కె.వి.వి సత్యనారాయణ తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు: ఐజీ

కేకు కోస్తున్న అశోక్ కుమార్, చిత్రంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: కొత్త సంవత్సరంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఐజీ అశోక్‌కుమార్ సూచించారు. స్థానిక రేంజ్ ఐజీ కార్యాలయంలో గురువారం కొత్త ఏడాది వేడుకలు నిర్వహించారు. తొలుత ఎస్పీ ప్రతాప్ శివకిశోర్‌తో కలిసి ఆయన కేక్ కోసి మాట్లాడారు. గతేడాది ఎన్నో క్లిష్టమైన కేసులు ఛేదించారని, అదే స్ఫూర్తిని కొత్త సంవత్సరంలోనూ కొనసాగించాలన్నారు. జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుస్మిత, శిక్షణ ఐపీఎస్ అధికారి జయశర్మ, డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని రక్తధార.. ఆరని కన్నీటి చార!
వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురి మృతి
6లో

తెగ తాగేశారు

గణనీయంగా వచ్చిన ఆదాయం

ఈనాడు - ఏలూరు, భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో నూతన సంవత్సర వేడుకల వేళ మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో జరిగాయి. గడిచిన రెండు రోజుల్లో ఏలూరు జిల్లాలో రూ. 15 కోట్లు, పశ్చిమలో రూ. 22 కోట్లు వచ్చింది. వారం రోజుల్లో అమ్మాల్సిన సరుకు కేవలం సోమవారం నుంచి బుధవారం వరకు రికార్డు స్థాయిలో విక్రయించారు. సంవత్సర ముగింపు సేల్ అంటూ అధికారులు పక్షం రోజుల నుంచే వ్యాపారులను అప్రమత్తం చేసి ఇండెంట్ మేరకు సరుకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఇన్నేళ్ల అమ్మకాలు పెరగటానికి దోహదమయ్యాయి. ఒకానొక సమయంలో జిల్లాకు అవసరమైన సరుకు సర్దుబాటు చేయడానికి పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి తీసుకొచ్చారు.

ఏలూరు జిల్లాలో 150 మద్యం దుకాణాలు ఉన్నాయి. 2024లో జిల్లా వ్యాప్తంగా రూ. 886 కోట్ల వ్యాపారం జరిగితే 2025లో రూ. 945 కోట్లు అయింది. గతేడాదితో పోలిస్తే రూ. 59 కోట్లు అదనంగా అమ్మారు. 2024 డిసెంబరులో రూ. 110.75 కోట్లు అమ్మగా 2025లో అదే నెలలో రూ. 119.04 కోట్లకు పెరిగింది. 7.5 శాతం వృద్ధి అయ్యాయి.

అప్పుడు దారినే.. ఇప్పుడు దారుణాన్ని..

వేలేరుపాడు, న్యూస్‌టుడే: వేలేరుపాడు మండలం ఊటగుంపు-రామవరం మధ్య పంచాయతీరాజ్ రహదారి దుస్థితి ఇదీ. 2022 జులైలో కురిసిన భారీ వర్షాలు, పెదవాగు ప్రాజెక్టు కట్ట తెగిపోవడంతో రెండు గ్రామాల మధ్యనున్న కల్వర్టు, 20 ఏళ్ల కిందట నిర్మించిన ఈ మార్గం ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయాయి. దీంతో ఊటగుంపు గిరిజనులు బాహ్యప్రపంచానికి రావాలంటే పడరాని పాట్లు పడుతున్నారు. దీనిపై ఎంపీడీవో ఎం.శ్రీహరి మాట్లాడుతూ వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరలో బాగు చేయిస్తామని చెప్పారు.

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ జిల్లాలో నత్తనడకన సాగుతోంది. రాష్ట్ర స్థాయిలో జిల్లా కింది వరసలో ఉంది. మొత్తం 16,41,426 మంది ఓటర్లు ఉండగా.. ఇప్పటి వరకు 5,81,697 మంది ఓటర్లను మాత్రమే మ్యాపింగ్ చేశారు. నమోదు కేవలం 35.48 శాతమే. దీనిపై కలెక్టర్ వెట్రిసెల్వి సైతం అసహనం వ్యక్తం చేశారు. మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 44.48 శాతంతో ఉంగుటూరు ప్రథమ, 26.53 శాతంతో ఏలూరు చివరి స్థానాల్లో ఉన్నాయి.

ఎక్కడున్నారు.. ఎందరున్నారు!

● నత్తనడకన ఓటర్ల మ్యాపింగ్ ● 35.48 శాతం మాత్రమే పూర్తి

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం చివరిగా 2002లో చేశారు. 23 ఏళ్లలో ఓటర్ల జాబితాలో గణనీయ మార్పులు చోటుచేసుకున్నాయి. విద్య, జీవనోపాధి, వ్యాపారాల నిమిత్తం ఏటా ఎందరో ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. కొత్తగా వెళ్లిన చోటే నివాసం ఉంటూ ఓటు నమోదు చేసుకుంటున్నారు. ఫలితంగా జాబితాల్లో పేర్లు పునరావృతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓటరుగా నమోదు చేసుకునే వ్యక్తి వివరాలు పూర్తిగా ధ్రువీకరించుకునేలా ఎస్ఐఆర్ అవసరమని కేంద్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఓటర్ల మ్యాపింగ్ (పరిశీలన) చేపట్టింది.

రెండింటిని సరిపోల్చుతూ.. 2002 ఓటర్ల జాబితా ప్రామాణికంగా మ్యాపింగ్ చేపడుతున్నారు. ఈ జాబితాను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. జిల్లాలోని 1,744 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2002, 2025 ఓటరు జాబితాలను బీఎల్వోలు సరిపోల్చుతున్నారు. 2002 జాబితాలోని ఓటర్లలో ఎందరు 2025 ఉన్నారో లేదా గుర్తిస్తున్నారు. బతికే ఉంటే ఆ ఓటరు కుటుంబ సభ్యులు (భార్య, పిల్లలు తదితరులు) ఎక్కడ ఓటర్లుగా ఉన్నారో పరిశీలించి మ్యాపింగ్ చేస్తున్నారు. అలాగే ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, మరణించిన వారి వివరాలు సేకరిస్తున్నారు.

డిసెంబరు 30 వరకు వివరాలిలా..

నియోజకవర్గం	ఓటర్లు	మ్యాపింగ్ పూర్తి
ఉంగుటూరు	2,06,902	92,032
కైకలూరు	2,06,281	91,054
దెందులూరు	2,25,109	85,392
చింతలపూడి	2,73,624	1,00,405
నూజివీడు	2,39,823	75,051
పోలవరం	2,54,822	76,184
ఏలూరు	2,34,865	62,312

అడగరు.. కొండల్లో కదా చూడరు

నిధులున్నా ప్రారంభం కాని రోడ్ల పనులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యంలో రహదారుల దుస్థితి దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారాయి. మంజూరైన పనులు కూడా సకాలంలో చేపట్టేందుకు నోచుకోవడం లేదు. దీంతో రాకపోకలకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, టి.నరసాపురం మండలాల్లో 25 పనులకు ఉపాధి హామీ పథకం కింద ఉన్నతాధికారులు రూ.12.36 కోట్లు మంజూరు చేశారు. వీటిలో ప్రధానంగా వేపులపాడు నుంచి రామచంద్రాపురం వరకు 1.5 కిలోమీటర్లకు రూ.86 లక్షలు, పందిరిమామిడిగూడెం నుంచి గుబ్బలమంగమ్మ గుడి వరకు 6 కిలోమీటర్లకు రూ.3 కోట్లు, దొరమామిడి నుంచి అలివేరుకు 8 కిలోమీటర్లకు రూ.4 కోట్లు మంజూరు చేశారు. రెండు నెలలు కావస్తున్నా పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. మారుమూల అనేక గ్రామాల వారికి రాకపోకలకు ఈ రహదారులే ఆధారం. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో ఈ పనులు చేపట్టాల్సి ఉంది. తారురోడ్డు నిర్మాణంతో పాటు అవసరమైన చోట కల్వర్టులు నిర్మించాలి. త్వరలో పనులు చేపడతామని అధికారులు అంటున్నారు.

అన్నే ప్రేరణ.. అతడితోనే సాధన!

క్రికెట్‌లో రాణిస్తున్న ఏలూరు కుర్రోడు

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: అన్నయ్య బ్యాట్ పట్టి.. బంతులను బౌండరీ దాటిస్తుంటే ఆ బాలుడు మురిసిపోయేవాడు. తానూ అన్నయ్య బాటలోనే నడవాలని బాల్యంలోనే నిర్ణయించుకున్నాడు. అతడినే ప్రేరణగా తీసుకొని.. బ్యాట్ ఝుళిపిస్తున్నాడు. బంతితోనూ వికెట్లు పడగొట్టేస్తున్నాడు. ఫీల్డింగ్‌లోనూ మెరుపులు మెరిపిస్తున్నాడు. మొత్తానికి క్రికెట్ ఆల్‌రౌండర్‌గా తనకంటూ గుర్తింపు తెచ్చుకొని.. భారత జట్టు జెర్సీ ధరించేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. అతడే జయంత్ సాయి ఫణీంద్ర.

చిన్నతనం నుంచే.. ఏలూరుకు చెందిన శివప్రసాదరావు, నీరజ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దబ్బాయి వి.ఉజ్వల్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. అతడిని ప్రేరణగా తీసుకొని రెండో కుమారుడు జయంత్ సాయి ఫణీంద్ర చిన్నతనంలోనే క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నాడు. పదేళ్లుగా శిక్షకుడు జి.సత్యనారాయణ వద్ద మెలకువలు నేర్చుకుంటున్నాడు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.. ఇలా అన్ని విభాగాల్లో ప్రతిభ చాటుతున్నాడు.

160కు పైగా మ్యాచ్‌లాడి.. ఇప్పటికే రాష్ట్ర స్థాయి క్రీడాకారుడి గుర్తింపు సాధించాడు. అమరావతి రాయల్స్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్- 23, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ జట్లకు ప్రాతినిధ్యం వహించి సత్తా చాటడంతో ఏపీఎల్‌కు ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఏలూరు రామచంద్ర కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. ఇప్పటి వరకూ అన్ని స్థాయిల్లో 160కు పైగా మ్యాచ్‌లాడాడు. మరింత శ్రమించి భారత జట్టుకు ఎంపిక కావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు జయంత్ సాయి ఫణీంద్ర తెలిపాడు.

శ్రీవారి క్షేత్రంలో రద్దీ

ద్వారకాతిరుమల (జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. నూతన సంవత్సరం మొదటిరోజు స్వామిని దర్శించుకుంటే ఏడాదంతా మంచి జరుగుతుందనే నమ్మకంతో రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీవారి ఆలయ పరిసరాలతో పాటు దర్శన క్యూలైన్లు, కేశఖండనశాల కిటకిటలాడాయి. క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. సామాన్యులు స్వామిని దర్శించుకునేందుకు మూడు గంటల సమయం పట్టింది.

క్యూలైన్‌లో భక్తులు

ఉపాధి ఆరాటం.. మృత్యువుతో పోరాటం

- తెల్లారుతున్న మత్స్యకారుల బతుకులు
- పెద్దలను కోల్పోతున్న కుటుంబాలు

● కలిదిండిలో రెండు వారాల క్రితం చేపల పట్టుబడికి వెళ్లి వస్తున్న మత్స్యకారుల వ్యాను అదుపు తప్పి బోల్తా పడగా ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలవగా అందులో ఒకే కుటుంబానికి చెందిన తండ్రీకొడుకులు ఉండటంతో తీవ్ర విషాదం నెలకొంది.

● నెలన్నర కిందట కైకలూరు వెలమపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఏలూరులో చేపల ప్యాకింగ్ ముగించుకుని వస్తుండగా మండవల్లి మండలం మణుగునూరు వద్ద లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పెద్దదిక్కులను కోల్పోయిన రెండు కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు న్యూస్‌టుడే: కొల్లేరు పరివాహక ప్రాంతంలో జానెడు పొట్ట నింపుకోవాలనే తపనతో చేపల వేటకు వెళ్తున్న మత్స్యకారులు రోడ్డు ప్రమాదాల్లో అసువులు బాస్తున్నారు. పెద్దదిక్కును కోల్పోయిన ఆ కుటుంబాల్లో భావితరం భవితవ్యం మసకబారుతోంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఉన్న 16 మండలాల్లో 8 లక్షలకు పైగా జనాభా ఆక్వా రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తోంది. 1.20 లక్షల మంది మత్స్యకారులు ఉండగా 30 వేల మందికి పైగా చేపల వేటనే జీవనాధారం చేసుకున్నారు.

మణుగునూరు వద్ద చెల్లాచెదురుగా పడిన క్షతగాత్రులు

నిర్లక్ష్యమే ప్రాణం తీస్తుందా.. మత్స్యకారులంతా తెల్లవారుజామున 3 గంటల నుంచి పట్టుబడులకు వెళ్తారు. నిద్రమత్తు కారణంగా ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరో పక్క లైసెన్సులు లేని యువతకు వాహనాలు అప్పగించడంతో అతివేగంతో ప్రయాణిస్తున్నారు. ఇటీవల ప్రమాదాలకు ఎక్కువగా పొగ మంచే కారణంగా కనిపిస్తోంది.

దీనిపై సహాయ రోడ్డు రవాణా అధికారి జగదీశ్‌ను వివరణ కోరగా తనిఖీలు ముమ్మరం చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

జీఎస్‌టీ 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

ఆదర్శమూర్తికి అశ్రునివాళి
జననం: 26-11-1948
మరణం: 27-12-2025

శ్రీ అప్పిక రాంబాబు గారు
మేనేజింగ్ డైరెక్టర్: శ్రీ వెంకటేశ్వర సిరామిక్ (గ్రూప్ ఇండస్ట్రీస్), భీమవోలు
ఛైర్మన్: మానవతా కేంద్ర నియంత్రణ కమిటీ, మానవతా శాంతి రథాల జిల్లా కమిటీ,
సీఆర్ఆర్ విద్యాసంస్థల మేనేజింగ్ కమిటీ సభ్యులు
మంచితనం, మానవత్వం, మూర్తీభవించిన మహోన్నత వ్యక్తి, నిరంతరం ప్రజా సేవకే పరితపించే సేవాతత్పరులు, ఆప్యాయతానురాగాలు మాకు పంచి ఇచ్చి, మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసిన మా కుటుంబ మార్గదర్శకులు
శ్రీ అప్పిక రాంబాబు గారి మరణం మా కుటుంబానికి తీరని లోటు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ.. భార్య: అప్పిక అనసూయమ్మ
కుమారుడు: అప్పిక కళ్యాణ మునిస్వామి కోడలు: శ్రీలక్ష్మి
కుమార్తెలు: కాపరాజు రత్నమాణిక్య రాధిక అల్లుళ్లు: శైలేష్‌కుమార్
మండ మాధవి - శ్రీనివాస్
మనుమలు: అప్పిక పరిమళ్ రామ్‌ప్రసాద్, మండ చేతన్
మనుమరాండ్రు: కాపరాజు భావన గంగ, కాపరాజు హర్షిణి నాయుడు, మండ నిహిల, అప్పిక హాసిత
పెద్దకార్యం: ది. 08-01-2026 గురువారం భీమవోలు శ్రీనివాసా కళ్యాణ మండపం నందు (MRO ఆఫీస్ ఎదురుగా) జరుపబడును. కావున తెలియపరచడమైనది. సెల్: 96000 76092, 94404 84477

(c) eenadu

సిబ్బంది లేక.. ఇబ్బందులు తీరక!

చింతలపూడి, న్యూస్‌టుడే: జిల్లాలోనే నాటుసారా తయారీ, అమ్మకాల్లో ముందు వరుసలో ఉండే చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో సిబ్బంది కొరత వేధిస్తోంది.

సంవత్సరం	సారా కేసులు	గొలుసు దుకాణాలు కేసులు
2024	482	205
2025	370	108

సిబ్బంది ఎక్కడ? కిందిస్థాయి సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతోపాటు మహిళా కానిస్టేబుల్ ఒక్కరూ లేకపోవటంతో దాడులు చేయాలంటే ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సాయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి. సర్కిల్ పరిధిలో 12 మంది కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా కేవలం 4 గురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా ఇద్దరు ఉన్నారు. సారా కేసుల్లో 70 శాతం పైగా మహిళలే పట్టుబడుతున్నారు. వీరిని అదుపులోకి తీసుకోవాలన్నా, రిమాండ్, బైండోవర్‌కు తరలించాలన్నా మహిళా కానిస్టేబుల్ ఒక్కరూ లేరు. గతంలో ముగ్గురు మహిళా కానిస్టేబుళ్లు ఉండేవారు. వీరందరిని బదిలీ చేయడంతో కేసుల సమయంలో ఇబ్బంది తలెత్తుతోంది. భీమడోలు, ఏలూరు, ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్‌లో సుమారు 10 మంది మహిళా కానిస్టేబుళ్లు పనిచేస్తున్నారు. భీమడోలు, ఏలూరు సర్కిల్లో ఒకటి, రెండు మించి సారా కేసులు నమోదు కావటం లేదు. ఉండాల్సిన పరిస్థితి. సిబ్బంది నియామకం తగ్గటంతో గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి సోదాలు నిర్వహించాలంటే ఎక్సైజ్ సిబ్బందికి తలకుమించిన భారంగా మారుతోంది.

నవోదయం 2.0తో కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాత సర్కిల్ పరిధిలో నాటుసారా తయారీ, అమ్మకం కేసులు తగ్గుముఖం పట్టాయి. సర్కిల్ పరిధిలోని నాగిరెడ్డిగూడెం, తల్లార్లపల్లి, రేచర్ల, నామవరం, ఎర్రంపల్లిలను 'ఏ' గ్రేడ్‌గా, క్రిష్టాపురం, బందంచర్ల, సీతానగరం, కొప్పాయగూడెంలను 'బి' గ్రేడ్‌గా, కె.గోకవరం, ఉప్పల్లపల్లి, తెడ్లం, ఆడమిల్లిలను 'సి' గ్రేడ్‌గా విభజించారు. నవోదయం 2.0తో తర్వాత ఆయా గ్రామాల్లో దాడులు పెరిగి కేసుల సంఖ్య బాగానే తగ్గాయి. సారా తయారీ సమాచారం వచ్చినప్పుడు ఎక్సైజ్ సిబ్బంది ఇళ్లలోకి వెళ్లి సోదాలు నిర్వహించాలి. మహిళా కానిస్టేబుల్ లేకపోవటంతో ఇళ్లలోకి వెళ్లాలంటే వెనకడుగు వేయాల్సి వస్తోంది.

దాడులు చేస్తున్నాం..

సర్కిల్ పరిధిలో కానిస్టేబుళ్ల కొరత ఉన్న మాట వాస్తవమే. అయినా ఈఎస్‌టీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐలతో కలిసి దాడులు నిర్వహిస్తూనే ఉన్నాం. గతంతో పోలిస్తే సారా కేసులు బాగా తగ్గాయి. - అశోక్, ఎక్సైజ్ సీఐ, చింతలపూడి

ద్వారకాతిరుమల ఈవోగా భద్రాజీ బాధ్యతల స్వీకరణ

ద్వారకాతిరుమల(జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా వై.భద్రాజీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈవోగా పనిచేసిన ఎన్వీఎస్ఎన్ మూర్తి గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడ డిప్యూటీ ఈవోగా పనిచేస్తున్న భద్రాజీని పూర్తి అదనపు బాధ్యతలతో ఈవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో భద్రాజీ గురువారం బాధ్యతలు స్వీకరించారు.

గుడ్డే బంగారమాయె.. నెట్టింట అమ్ముడుపోయె

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: జాతి కోళ్ల పెంపకాన్ని కొందరు కుటీర పరిశ్రమలా మలచుకుంటున్నారు. నాటు కోళ్ల కంటే జాతి కోళ్ల పెంపకంలోనే అధిక లాభాలు పొందుతున్నారు. కేవలం పందెం పుంజులే కాకుండా కోడి గుడ్లను, ఒక రోజు లేదా నెలరోజుల కోడిపిల్లలను కూడా సామాజిక మాధ్యమాల్లో విక్రయాలు జరుపుతున్నారు. పుంజు పిల్లల ధర లేదా వాటి జాతి నాణ్యత పోటీలు తీసి ఆన్‌లైన్‌లో పెడుతున్నారు. ఒక్కో గుడ్డు రూ.500 అమ్ముతున్నారు. వీటిలోనే భీమవరం రెచ్చివాటం, పెరూ, పెరూ క్రాస్ కోడి గుడ్డు ఒక్కొక్కటీ రూ.600 విక్రయాలు జరుపుతున్నారు. ఫోన్ చేసి ఆర్డర్ చేస్తే గుడ్లు పాడవకుండా పంపుతున్నారు. భీమవరం, భీమడోలు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల నుంచి అమ్మకాలు జరుగుతున్నాయి. వీటిని ఇతర ప్రాంతాల నుంచి కోళ్ల పెంపకదారులు కొనుగోలు చేసి ఇంక్యుబేటర్, పెట్టలతో పొదిగించి పిల్లలను చేయించుకుంటున్నారు.

వ్యసనాలే ముంచుతున్నాయ్

మండవల్లి, న్యూస్‌టుడే: ఏ దేశానికైతే యువ రక్తం ఎక్కువగా ఉంటుందో ఆ దేశాభివృద్ధి గణనీయంగా పెరుగుతుందని స్వామి వివేకానంద తెలిపారు. మన యువశక్తి నేడు వ్యసనాల బారిన పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటోంది. అనుకోని రీతిలో కన్నవారికి, కట్టుకున్న వారికి తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు. రోజురోజుకు వీటి గణాంకాలు పెరగడంతో ప్రస్తుతం తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. కొత్త సంవత్సరం కొంగొత్తగా జీవించాలంటే యువత మేల్కొనక తప్పదని విశ్లేషకులు వివరిస్తున్నారు.

నిర్లక్ష్యం.. అతి వేగం

రోడ్డు ప్రమాదాల్లో అత్యధికం ద్విచక్ర వాహనాలవేనని ప్రభుత్వ సర్వేలో వెల్లడైంది. ఈ ఏడాది 30శాతం ప్రమాదాలు బైకుల వల్లే జరిగాయి. జిల్లాలో ద్విచక్ర వాహన ప్రమాదాల్లో ఎక్కువగా చనిపోయింది యువతే. 2025లో ఏలూరు జిల్లాలో 84 వ్యక్తిగత ప్రమాదాలు చోటుచేసుకోగా ఎక్కువగా యువతే ప్రాణాలను కోల్పోయారు.

అంతర్జాలంతో అనర్థాలు

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఎక్స్-ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా యువత బిజీబిజీగా గడుపుతున్నారు. కొందరు ఈజీ మనీ కోసం అడ్డదారులు తొక్కడం, బెట్టింగులు లేదా ఆన్‌లైన్ మోసాలకు గురికావడం పరిపాటిగా మారుతున్నాయి. జిల్లాలో 20 లక్షల మేర స్మార్ట్‌ఫోన్‌లు ఉండగా అందులో 14 లక్షల ఫోన్‌లు యువత చేతిలోనే ఉన్నాయి.

మద్యం, గంజాయి మత్తు.. భవిత చిత్తు..

మద్యం తాగడం, గంజాయి మత్తులో తూగడం ప్రస్తుతం యువతకు పరిపాటిగా మారింది. యువత పార్టీలు పేరుతో మద్యానికి దగ్గరవుతున్నారు. పార్టీలు శృతిమించడంతో గంజాయి, డ్రగ్స్ లాంటి వాటికి అలవాటు పడుతున్నారు. వ్యసనాలకు బానిసలై మానసిక వైద్యులను ఆశ్రయించేవారి సంఖ్య పెరుగుతుందంటేనే అర్థమవుతుంది. 2024లో 19 గంజాయి కేసుల్లో 36 మందిని జిల్లాలో అరెస్టు చేశారు.

పెరుగుతున్న ఆత్మహత్యలు

బెట్టింగులతో అప్పుల పాలైనా, ప్రేమలో ఓడిపోయినా, చదువులో ర్యాంక్ రాకపోయిన ఆత్మహత్య శరణ్యంగా భావిస్తున్నారు. ఇళ్లు, వసతి గృహాల్లో బలవన్మరణాలకు పాల్పడే వారి సంఖ్య పెరిగిపోతోంది. ఏటా ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో 20 నుంచి 40 ఏళ్లలోపు వారే ఎక్కువ మంది.

ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించుకోవాలి

యువత ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకునేలా యోగా, ప్రాణాయామాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలి. యువత తను మానసికంగా చేసే మహనీయుల పుస్తకాలను చదివి ఆత్మన్యూనత భావాన్ని, నిరాశ, నిస్పృహలను దూరం చేసుకోవచ్చు. - గొలపల్లి నాగభూషణం, మానసిక వికాస నిపుణుడు, ఏలూరు

చట్టాలపై అవగాహన అవసరం

గంజాయి సేవించినా, రవాణా చేసినా జీవితాంతం ఇబ్బందులు తప్పవు. యువత వేగానికి కళ్లెం వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి మానిటరింగ్ చేస్తున్నాం. - శ్రావణ్‌కుమార్, డీఎస్పీ, ఏలూరు

హెచ్‌ఎస్‌ఆర్‌పీ.. వాహనానికి కవచం

హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ బిగించుకోవాల్సిందే

నూజివీడు, న్యూస్‌టుడే: 'మాది పాత వాహనం. హై సెక్యూరిటీ ప్లేటు మాకెందుకు' అని అనుకుంటున్నారా? పాతది, కొత్తది అనే తేడా లేకుండా ప్రతి వాహనానికి హైసెక్యూరిటీ నంబర్ ప్లేటును కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. 2019 ఏప్రిల్‌కు ముందు రిజిస్ట్రేషన్ చేసిన వాహనాలకూ వీటిని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. నకిలీ నంబర్ ప్లేట్లకు అడ్డుకట్ట వేయడం, వాహన చోరీలను అరికట్టాలనే లక్ష్యంతో. 15 ఏళ్లలోపు రిజిస్ట్రేషన్ అయిన ద్విచక్ర, నాలుగు చక్రాల, ఇతర వాహనాలకు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా నంబరు ప్లేట్లు పొందేందుకు అవకాశం కల్పించినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనరు కె.ఎస్.ఎం.కృష్ణారావు తెలిపారు.

బుకింగ్ ఇలా.. www.siam.in వెబ్‌సైట్ ఓపెన్ చేసి బుక్ హెచ్‌ఎస్‌ఆర్‌పీపై క్లిక్ చేయాలి. అనంతరం పేరు, ఈ-మెయిల్, రాష్ట్రం, వాహనం రిజిస్ట్రేషన్ నంబర్, రాష్ట్రం, వాహనం రిజిస్ట్రేషన్ నంబర్, వరవాణి సంఖ్య జిల్లా వివరాలను నమోదు చేసి సబ్మిట్ చేయాలి. ఆయా కంపెనీలను బట్టి నంబరు ప్లేటు ద్విచక్ర వాహనాలకు రూ.320 నుంచి రూ.500 వరకు.. నాలుగు చక్రాల వాహనాలకు రూ.600 నుంచి రూ.3వేల వరకున్నాయి. కావాల్సింది ఎంపిక చేసుకుని ఓటీపీ ద్వారా ఆన్‌లైన్‌లో నగదు చెల్లించాలి. 15 రోజుల తర్వాత ఎంపిక చేసిన షోరూంకు వెళ్లే వారు ఆ నంబరు ప్లేటును వాహనానికి బిగిస్తారు.

ఇవీ ప్రత్యేకతలు.. లేజర్ కోడ్.. ప్రతి ప్లేట్‌పై యూనిక్ లేజర్ ఐడీ ఉంటుంది. క్రోమియం హోలోగ్రామ్.. నకిలీగా మార్చలేని విధంగా దీన్ని రూపొందించారు. నాన్-రిమూవబుల్ స్నాప్ లాక్.. ఒక సారి అమర్చితే తొలగించడం సాధ్యం కాదు. ఐఎన్‌డీ, బ్లూబ్యాండ్.. దేశవ్యాప్తంగా ఏక రూపత. ట్రాకింగ్‌కు అనుకూలం.. నేర విచారణలో భాగంగా వాహన నంబర్ ప్లేట్‌ను స్కాన్ చేయడం ద్వారా నంబరు ప్లేట్లు పొందేలా అవకాశం కల్పించారు.

ప్రమాద రహిత జిల్లాగా ఏలూరు: కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏలూరును ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు ప్రారంభించి, గోడ పత్రాలు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. దీనిపై ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు. ఉప రవాణా కమిషనరు కృష్ణారావు, ఆర్టీవోలు శేఖర్, భీమారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థినులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: చెన్నైలో ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే సీనియర్ నేషనల్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు నూజివీడు ట్రిపుల్ ఐటీ పీయూసీ మొదటి సంవత్సరం విద్యార్థులు ఎంపికైనట్లు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. చిత్తూరులో జరుగుతున్న ఏపీ సీనియర్ నేషనల్ క్యాంపులో ఈ విద్యార్థినులు శిక్షణ పొందుతున్నట్లు చెప్పారు. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి వాకా రాహుల్(వీఐటీ యూనివర్సిటీ), బేతాళ ప్రభుదీపిక, షేక్ అస్రా(ట్రిపుల్‌ఐటీ- నూజివీడు) పీయూసీ విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. ముగ్గురు క్రీడాకారులు నూజివీడుకు చెందిన వారేనని తెలిపారు. వీరిని ఏవో బి.లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ ఎస్.చిరంజీవి అభినందించారు.

మోతాదుకు మించి ఎరువులు చల్లొద్దు!

- నీటి పొదుపు చర్యలతో రబీలో అధికోత్పత్తి
- 'న్యూస్‌టుడే'తో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లికార్జునరావు

ఉండి, న్యూస్‌టుడే: రబీలో నారుమడి తయారీ నుంచి ప్రధాన చేలో గింజ తయారయ్యే వరకూ అవసరమైన జాగ్రత్తలను పాటిస్తే ఉత్తమ దిగుబడులను సాధించొచ్చు. భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా నేల స్వభావానికి అనువైన విత్తనాలను ఎంచుకోవాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు సాధించొచ్చని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎన్.మల్లికార్జునరావు తెలిపారు. రబీ ప్రారంభమవుతున్న దశలో అవలంబించాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు.

★ అధిక ఎరువుల వినియోగంతో అన్నీ అనర్థాలే. నేలలో సల్ఫైడ్ ఇంజూరీ సమస్యతో వేరు వ్యవస్థ నల్లగా మారిపోతోంది. భాస్వరం ఎక్కువగా వాడినచోట్ల జింకుధాతు లోపం వస్తోంది. భూమి చవుడు బారుతోంది. చీడపీడల సమస్య తలెత్తి నివారణకు అదనపు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి.

? ఎరువుల యాజమాన్య విధానాలను తెలియజేయండి?

» నత్రజని, భాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులను సిఫార్సు మేరకు చల్లుకోవాలి. ఆఖరి దమ్ములో భాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులు చల్లాలి. దమ్ములో, చిరుపొట్ట దశల్లో పొటాష్ చల్లితే దుబ్బు తెగులును తట్టుకునే శక్తితో గింజ నాణ్యత పెరుగుతుంది. సిఫార్సు చేసిన యూరియా మూడు దఫాలుగా చల్లుకుంటే సరిపోతోంది.

? వెదజల్లే పద్ధతి, డ్రమ్ సీడర్‌తో నాట్లేసే విధానం పెరగడంలేదు. కారణాలేమిటి?

» డెల్టాలో సాగునీటి పారుదలను నియంత్రించలేం, కలుపు సమస్య అధికమనే అభిప్రాయాలుండటమే ప్రధాన కారణం. వెదజల్లే పద్ధతి, డ్రమ్ సీడర్‌తో నాటే విధానంలో సాగుకాలాన్ని తగ్గించుకోవచ్చు. తొలుత దమ్ము పూర్తైన భూమిలో ఎత్తు పల్లాలు లేకుండా చేసుకోవాలి. నీరు ఆరగట్టితే కలుపు సమస్య తలెత్తదు. వెదజల్లే పద్ధతిలో వేరు వ్యవస్థ పటిష్ఠపడుతుంది.

? రబీ పంటకు ఏ రకమైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి?.

» వరి నీటి మొక్కెనా.. నిరంతరం పూర్తిస్థాయిలో నీరుంచాల్సిన అవసరం లేదు. పిలకలు తొడగడం, చిరుపొట్ట, ఈనిక, గింజ తయారీ దశల్లో 5 సెంటీమీటర్ల మేర నీరుంటే సరిపోతుంది. మిగిలిన దశల్లో ఆరు తడులందించాలి. మధ్యలో చేను ఆరగట్టడం ద్వారా సుడిదోమ, తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుంది. దిగుబడి పెరుగుతుంది.

సత్యసాయిబాబా శతజయంతి నాణెం!

సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నవంబరు19న పుట్టపర్తిలో సత్యసాయిబాబా ముఖ చిత్రంతో రూ.100 నాణేన్ని విడుదల చేశారు. 35 గ్రాముల బరువుతో 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5శాతం నికెల్, 5 శాతం జింక్ లోహ మిశ్రమాలను తయారీలో వినియోగించారు. ఈ స్మారక నాణేన్ని భారత రిజర్వుబ్యాంకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా కొనుగోలు చేసినట్టు ఏలూరుకు చెందిన నాణేల సేకర్త ఆలీఖాన్ మహమ్మద్ తెలిపారు. - ఈనాడు, ఏలూరు

కొత్త ఏడాదిలో..
ఎన్నో కలలుగన్నారు..
మరెన్నో ఆశించారు....
ఇంకెన్నో కోరుకున్నారు..
నెరవేర్చుకోవాలనుకున్నారు..
ఆర్థికంగా స్థిరపడాలని ఒకరు..
కుటుంబానికి ఆదరవ్వాలని
ఇంకొకరు..
బిడ్డలకు ఉజ్వల భవితవ్యాలని మరొకరు..
తీరుతాయనుకున్నారు..
కానీ,
రహదారులు రక్తధారలయ్యాయి..
అయిదుగురి ప్రాణాలు బలిగొన్నాయి..
ఆయా కుటుంబాల్లో విషాదం నింపాయి..
కలలన్నింటినీ కల్లలు చేశాయి..

ఆగని రక్తధార.. ఆరని కన్నీటి చార!

వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురు మృతి

కారు కింద పడి యువకుడు..

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన జంగారెడ్డిగూడెం మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వీరప్రసాద్ కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన అమరారం చౌదరి (25) జంగారెడ్డిగూడెంలో నివాసముంటూ స్థానికంగా ఉన్న ఓ ఫ్యాన్సీ దుకాణంలో పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై అశ్వారావుపేట వెళ్లిన అమరారం చౌదరి పని ముగించుకుని జంగారెడ్డిగూడెం వస్తున్నాడు. 'దేవరపల్లి - తల్లాడ' జాతీయ రహదారిపై వేగవరం గ్రామ శివారుకు వచ్చేసరికి.. ముందు సైకిల్‌పై వెళ్తున్న బేతాళ వెంకటపతి అనే వ్యక్తి అకస్మాత్తుగా చక్రదేవరపల్లి వెళ్లే రోడ్డు వైపు తిరిగాడు. ఇది గమనించిన అమరారం చౌదరి బ్రేకు వేసినా ద్విచక్ర వాహనం అదుపుతప్పి సైకిల్‌పై వెళ్తున్న వెంకటపతిని ఢీకొట్టి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో తాడువాయి వైపు వెళ్తున్న కేఆర్‌పురం డిప్యూటీ డైరెక్టర్‌కు సంబంధించిన కారు..కిందపడిపోయిన అమరారం చౌదరి పైనుంచి వెళ్లి, నడిచి వెళ్తున్న కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు అనే మరో వ్యక్తిని ఢీకొంది. దీంతో అమరారం చౌదరి ఘటనా స్థలిలోనే మృతిచెందగా.. నడిచి వెళ్తున్న శ్రీనివాసరావు, సైకిలిస్ట్ వెంకటపతికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం సీఐ సుభాష్, ఎస్సై వీరప్రసాద్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

చౌదరి (పాత చిత్రం)

వేగం.. గాలిలో కలిసిన ప్రాణం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం గ్రామానికి చెందిన కాకుళ్ల స్టాలిన్ (18), మాండ్రు సాగర్, కాకుళ్ల జశ్వంత్, మానుకొండ జశ్వంత్‌లు స్నేహితులు. స్టాలిన్ పెయింటింగ్ పని చేసుకుంటుండగా.. సాగర్, కాకుళ్ల జశ్వంత్, మానుకొండ జశ్వంత్‌లు చదువుతున్నారు. వీరంతా కలిసి గురువారం ద్వారకాతిరుమల వెళ్లాలని అనుకున్నారు. ఇందుకు జంగారెడ్డిగూడెంకు చెందిన ఓ వ్యక్తి నుంచి కారు అద్దెకు తీసుకుని గురువారం బయలుదేరారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామ శివారుకు వెళ్లేసరికి వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొంది. ప్రమాదం దాటికి పెద్ద శబ్దం రావడంతో స్థానికులు యువకులను జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఘటనలో కారు నడుపుతున్న మాండ్రు సాగర్‌కు తీవ్రగాయాలు కాగా ముందు కూర్చున్న స్టాలిన్ మృతిచెందాడు. వెనుక సీట్లో కూర్చున్న కాకుళ్ల జశ్వంత్, మానుకొండ జశ్వంత్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.

స్టాలిన్ (పాత చిత్రం)

చెట్టును ఢీకొని ధ్వంసమైన కారు

మితిమీరి.. యువకులు అతివేగంగా కారు నడుపుతూ ప్రమాదానికి గురైనట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మితిమీరిన వేగంతో వాహనం వెళ్తుండగా రోడ్డు కుడివైపున ఉన్న చెట్టును ఢీ కొట్టడంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొని లారీ

భార్య దుర్మరణం.. భర్తకు తీవ్ర గాయాలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం ఆ కుటుంబానికి తీవ్ర విషాదం మిగిల్చింది. దైవ దర్శనానికి వెళ్లొస్తున్న దంపతుల్లో భార్య దుర్మరణంపాలై భర్తకు తీవ్ర గాయాలైన ఘటనతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. తణుకు మండలం తేతలి జాతీయ రహదారిపై గురువారం తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన అందే లోకేశ్వరరావు తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో ఔషధ దుకాణం నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య వెంకటలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, కుమార్తె భీమవరంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో బీఫార్మసీ చదువుతోంది. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం తెల్లవారుజామున లోకేశ్వరరావు దంపతులు ద్విచక్ర వాహనంపై ద్వారకా తిరుమల, మద్ది ఆంజనేయస్వామి ఆలయాలకు వెళ్లి తిరిగొస్తుండగా తణుకు మండలం తేతలి సమీపంలో జాతీయ రహదారిపై లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో వెంకటలక్ష్మి (43) అక్కడికక్కడే మృతి చెందగా భర్తకు తీవ్ర గాయాలు కావడంతో 108 సిబ్బంది తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో లోకేశ్వరరావును మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తణుకు గ్రామీణ ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపారు.

ఎదురొచ్చిన మృత్యువు

కుంచనపల్లి(తాడేపల్లిగూడెం వన్ టౌన్), న్యూస్‌టుడే: ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన తాడేపల్లిగూడెం మండలంలో జాతీయ రహదారి నుంచి కుంచనపల్లికి వెళ్లే రోడ్డులో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. ఎల్.అగ్రహారానికి చెందిన కోమటి నాగబాబు విద్యుత్తు ఉప కేంద్రంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. తన స్నేహితుడిని ఇంటి వద్ద దించి తిరిగి వెళ్తుండగా కుంచనపల్లి గ్రామానికి వస్తున్న తాడేపల్లి మహిమారావు(21) వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో నాగబాబు కాలికి తీవ్ర గాయం కాగా తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మహిమారావు తలకు బలమైన గాయమైంది. స్థానికులు అతడ్ని తొలుత తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి అనంతరం ఏలూరుకు తరలించారు. అక్కడి వైద్యుల సిఫారసు మేరకు మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతడికి తల్లిదండ్రులు, ఓ సోదరి ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తాడేపల్లిగూడెం గ్రామీణ ఎస్సై జేవీఎన్ ప్రసాద్ తెలిపారు.

రైలు ఢీకొని..

దెందులూరు, న్యూస్‌టుడే: పట్టాలు దాటుతున్న యువకుడిని రైలు ఢీకొనడంతో.. అక్కడికక్కడే మృతి చెందారు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. దెందులూరు మండలం సీతంపేటకు చెందిన గొటికల శ్రీను(30) బుధవారం రాత్రి దెందులూరు- భీమడోలు మధ్య రైలు పట్టాలు దాటుతున్నారు. అతడిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గేట్‌మెన్ ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్సై కె.శివనారాయణ గురువారం కేసు నమోదు చేశారు.

పాములేరు ఒడ్డున.. సరదా సరదాగా...

నదిలో యువకుల వాలీబాల్ పోటీ

ఆయిల్‌పామ్ తోటలో వంటవార్పు

కుక్కునూరు, న్యూస్‌టుడే: కుక్కునూరు మండలంలోని పాములేరు నది జనంతో నిండిపోయింది. కొత్త సంవత్సరం సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి సరదాగా గడిపేందుకు రావటంతో, ఆ ప్రాంతం జనసందోహంగా మారింది. సాధారణంగా అది పిక్నిక్ పాయింటు. ప్రతి ఆదివారం వందల సంఖ్యలో అక్కడకు జనం వస్తుంటారు. కొత్త సంవత్సరం కావటంతో ఆ సంఖ్య మరింత పెరిగింది. ఆంధ్రా-తెలంగాణ సరిహద్దు ప్రాంతం కావటంతో రెండు రాష్ట్రాలలోని సమీప ప్రాంతాల ప్రజలు అక్కడకు చేరుకున్నారు. నది ఒడ్డున ఉన్న ఆయిల్‌పామ్ తోటలో మహిళలు వంటవార్పు చేస్తుండగా, పిల్లలు, యువకులు నదిలో ఈదులాడుతూ సరదాగా గడిపారు. యువకులు నీళ్లలో నెట్ ఏర్పాటు చేసుకొని వాలీబాల్ పోటీలు పెట్టుకున్నారు. సెలవు దినాల్లో అక్కడకు సరదాగా వచ్చే కుటుంబాల సంఖ్య పెరుగుతుండటంతో, ఆయిల్‌పామ్ తోట యజమాని కొంత రుసుం వసూలు చేస్తున్నారు. పిక్నిక్ పూర్తయిన మరుసటిరోజు తోటను బాగుచేసేందుకు అయ్యే ఖర్చు మాత్రమే వసూలు చేస్తున్నామని, ఇందులో లాభాపేక్ష లేదని ఆ తోట కాపరులు తెలిపారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
ANDHRA PRADESH EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION, GUNTUR DISTRICT
E-PROCUREMENT SHORT TENDER NOTICE
Nit No. SE/AE2/APEWIDC/59 to 61/2025-26 Dated: 01.01.2026
Downloading commencement on 02.01.2026 and closing date may be viewed in e-procurement.gov.in
Tenders are invited for certain Civil Works in Eluru District with an Estimate cost ranging from Rs. 40.00 Lakhs to Rs. 100.00 Lakhs
Further details may be viewed at http://tender.apeprocurement.gov.in.
Contact APEWIDC Circle Office, Guntur - Mobile No.9703336838
Note: Changes/ amendments if any will only be communicated through above e-procurement platform.
Sd/- Superintending Engineer, APEWIDC, Guntur.

యువకుడిని చెట్టుకు కట్టి కొట్టిన కేసులో ఆరుగురి అరెస్టు

సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్, సీఐ, ఎస్ఐ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ముసునూరు మండలంలోని రమణక్కపేటలో రెండు కుటుంబాల మధ్య ప్రేమ వ్యవహారంలో జరిగిన ఘర్షణ మినహా ఎటువంటి గొడవలు లేవని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి 9.30 గంటలకు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. యువకుడిని చెట్టుకు కట్టి కొట్టిన కేసులో కందుల బాబు, కందుల విజయలక్ష్మి, శివనాగప్రసాద్, సాయిదుర్గ, గూడూరు విజయ, కందుల శివ నాగప్రసాద్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు. రెండు కులాల మధ్య తగాదాలు జరిగే అవకాశం ఉందనే వదంతులు సోషల్ మీడియాలో రావడంతో ఈ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండవల్లి మండలంలోని కానుకొల్లుకు చెందిన అల్లం సాయి చందు హైదరాబాద్‌లోని ఒక చికెన్ దుకాణంలో పని చేస్తున్నట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన కందుల సాయి దుర్గను గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నట్లు చెప్పారు. వీరిరువురి పెళ్లికి సాయి దుర్గ కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో గత నెల 30న అల్లం సాయి చందు, సాయిదుర్గ ఏలూరులోని గంగానమ్మ గుడి వద్ద వివాహం చేసుకున్నారు. 31న సాయిదుర్గను డ్యూటీకి ముసునూరు మండలంలోని రమణక్కపేట తీసుకుని వెళ్లాడన్నారు. ఈ సమయంలో సాయిదుర్గ తల్లిదండ్రులు కందుల బాబు, విజయలక్ష్మి, శివనాగప్రసాద్ తదితరులు అక్కడకు వచ్చి తమ కుమార్తెను తీసుకువెళ్లేందుకు యత్నించినట్లు చెప్పారు. అడ్డుకునే ప్రయత్నంలో అల్లం సాయి చందును స్తంభానికి కట్టేసి అతనిపై కర్ర, వైర్లు, రాయి, చేతులతో దాడి చేసి గాయపరిచినట్లు పేర్కొన్నారు. అడ్డుకున్న చెన్నకేశ్వరిపై కూడా దాడి చేసినట్లు తెలిపారు. అనంతరం సాయిదుర్గను బలవంతంగా కారులో ఎక్కించుకుని వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. గాయపడిన అల్లం సాయి చందు నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారించి, ఈ కేసులో ముద్దాయిలను విజయవాడ సమీపంలోని నున్న వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు. కిడ్నాప్‌నకు ఉపయోగించిన కారును సీజ్ చేశామని తెలిపారు. రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ చిరంజీవి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే చెప్పండి: డీఎంహెచ్‌వో

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఒప్పంద ప్రాతిపదికన ఫార్మసీ అధికారుల పోస్టుల భర్తీకి స్వీకరించిన దరఖాస్తుల పరిశీలనానంతరం ప్రొవిజనల్ మెరిట్ జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 13లోపు రాజమహేంద్రవరంలోని వైఎంసీఏ హాలులో సమర్పించాలని డీఎంహెచ్‌వో పి.జె.అమృతం తెలిపారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, మెరిట్, రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా చేపట్టనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఆమె గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కేజీబీవీల్లో కొలువుల భర్తీకి దరఖాస్తులు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: కుక్కునూరు, వేలేరు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది ఉద్యోగాలను పొరుగు సేవల విధానంలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సమగ్ర శిక్షా ఏపీసీ పంకజ్ కుమార్ తెలిపారు. కుక్కునూరు కేజీబీవీలో కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, వేలేరు కేజీబీవీలో ఏఎన్ఎం కొలువులకు అర్హులైన వారు ఈ నెల 11లోపు ఏలూరు సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -147 రిటైల్ ధర 174 చికెన్ విత్ స్కిన్ - 252, చికెన్ స్కిన్‌లెస్ - 287. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 167, 176, 187 చికెన్ విత్ స్కిన్ - 324 చికెన్ స్కిన్‌లెస్ - 334.

92.7 FM Rajamahendravaram
92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

REAL ESTATE

HOUSE FOR SALE

ఖండవల్లి గ్రామంలో కాముట్ల వీధిలో డబుల్ స్టేర్ బిల్డింగ్ క్రింద నివాసం పైన షాపు అమ్మకము గానీ, అద్దెకు గానీ కలదు. సెల్: 9392122526.

PLOT FOR SALE

భీమవరం భారతి విద్యాభవన్ స్కూల్ దగ్గరలో 200 చ॥గ॥ స్థలం ఫెన్సింగ్‌తో ఉన్నది. అమ్మకమునకు కలదు. సంప్ర॥ సెల్: 9392122526.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.25 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

(c) eenadu

ఏలూరు

• ఏలూరు • దెందులూరు • ఉంగుటూరు

ఆర్టీసీ బలోపేతానికి కృషి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీఎస్ ఆర్టీసీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని విజయవాడ ప్రాంతీయ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో ఆర్టీసీ ఉద్యోగులు, పలు రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు, కార్యకర్తలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. భారీ గజమాలలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అప్పలనాయుడుకు గజమాల వేస్తున్న నాయకులు

వాలీబాల్ విజేత ఏలూరు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా నరసరావుపేట వేదికగా నిర్వహించిన అంతర కళాశాల వాలీబాల్ పోటీల్లో ఏలూరు సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో మొత్తం 20 జట్లు పాల్గొన్నాయి.. సీఆర్ఆర్ క్రీడాకారులు ప్రథమ స్థానం సాధించారు. వారిని కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, ప్రధానాచార్యుడు కె.వెంకటేశ్వరరావు, విద్యాసంస్థల యాజమాన్య కమిటీ సభ్యుడు కె.హరిరామకృష్ణరాజు అభినందించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

జిల్లాను అన్నింటా ముందుకు తీసుకెళ్దాం

ఏలూరు వన్‌టౌన్, విద్యా విభాగం- న్యూస్‌టుడే: జిల్లాను అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకెళ్దామని జడ్పీ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. స్థానిక ఉమ్మడి జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ విడిది కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆమెకు జడ్పీ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పద్మశ్రీ దంపతులు కేక్ కోసి అందరికీ పంచి పెట్టారు. సీఈవో ఎం.శ్రీహరి, డిప్యూటీ సీఈవో కె.భీమేశ్వర్, ఏవోలు తదితరులు పాల్గొన్నారు.✦ స్థానిక జడ్పీలోని విడిది కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రూపొందించిన నూతన సంవత్సర కాలమానిని, దైనందినిని జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజకుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సతీశ్ కుమార్, శ్యామసుందర్ తదితరులున్నారు.

కేక్ కోస్తున్న పద్మశ్రీ దంపతులు

ఏలూరు గ్రామీణ: ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ రూపొందించిన నూతన సంవత్సర కాలెండర్‌ను జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా గురువారం ఆవిష్కరించారు. అనంతరం సంఘ నాయకులు జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, ఏపీఎంఐపీ పీడీ రామ్మోహనరావు, జిల్లా ఉద్యానాధికారి షాజానాయక్ తదితరులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపశమనం

నా పేరు ప్రసాద్. ప్రైవేట్ ఉద్యోగిని. ఏలూరు ఒకటో పట్టణం అగ్రహారంలో నివాసముంటున్నా. ఉద్యోగ రీత్యా ఒక్కోసారి ఎక్కువ ఒత్తిడి గురవుతుంటా. రోజూ వ్యాయామం చేయడం ద్వారా కాస్త ఉపశమనం కలుగుతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సమయం కేటాయిస్తున్నా. ఆరోగ్యంతో పాటు ప్రశాంతంగా జీవిస్తున్నా.

సమయం పెంచాలి

నా పేరు ఎల్.శ్రీనివాస్‌కుమార్. ఏలూరు నగరం ఆర్ఆర్‌పేటలో ఉంటున్నా. ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువ ఉంటోంది. రోజూ కాస్త ఎక్కువ సమయం వ్యాయామం చేయడం ద్వారా అనారోగ్య బారిన పడకుండా ఉండొచ్చు. రోజూ రెండుపూటలా తప్పకుండా బహిరంగ వ్యాయామశాలకు వస్తున్నా. వీటి సమయం మరింత పెంచాలి.

ఒత్తిడి అధిగమించి.. ఆరోగ్యంగా జీవించి!

బహిరంగ వ్యాయామశాలలకు స్పందన

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రస్తుత జీవనం యాంత్రికమైంది. అటు విద్యార్థులు, ఇటు ఉద్యోగుల్లో ఒత్తిడి సాధారణమైంది. దీన్నుంచి బయటపడేందుకు నగర వాసులు వ్యాయామాన్ని మార్గంగా చేసుకున్నారు. రోజూ కొంత సమయం కేటాయిస్తూ.. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఆరోగ్యంగానూ జీవిస్తున్నారు. ఆర్ఆర్ పేట, పోస్టల్ కాలనీ, అశోక్ నగర్, గులాబీతోట, రాజీవ్ ఉద్యానాల్లో నగరపాలక సంస్థ ఆధ్వర్యాన ప్రత్యేకంగా బహిరంగ వ్యాయామశాలలు ఏర్పాటు చేశారు. ఇందుకు భారీగా నిధులు వెచ్చించి వ్యాయామ పరికరాలు సమకూర్చింది.

సిబ్బంది నియామకం

వ్యాయామశాలల నిర్వహణ, పర్యవేక్షణకు నగరపాలక అధికారులు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. ఉద్యానాల్లో పిల్లలు ఆడుకునేందుకు, పెద్దలు వ్యాయామం చేసేందుకు పరికరాలుండటంతో.. వీటిని నగర వాసులు చక్కగా వినియోగించుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆయా ప్రాంతాల నుంచి ఒక్కో వ్యాయామశాలకు సుమారు 70 మందికి పైగా వస్తుంటారు. నగర వ్యాప్తంగా రమారమి 800-1000 మంది సద్వినియోగం చేసుకుంటున్నారు. సెలవు రోజుల్లో వీటి సంఖ్య మరింత ఎక్కువగా ఉంటోంది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు రూరల్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనింద్రకొలను జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారి వెంబడి చెదారాలు పడేస్తున్నారు. కొందరు బహిర్భూమికి వెళ్తుండటంతో.. ఈ మార్గంలో రాకపోకలు సాగించే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- నరేశ్, స్థానికుడు**

✔ సమస్య నా దృష్టికి రాలేదు. పంచాయతీ సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. **- స్వామి, ఈవోపీఆర్డీ**

వెలిగిన వీధి దీపాలు

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: నిడమర్రులోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలిగాయి. 'మేమున్నాం.. మీకు తోడుగా'లో గత నెల 20న ప్రచురితమైన సమస్యకు పంచాయతీ కార్యదర్శి సంజీవరావు స్పందించారు. సిబ్బందితో కొత్త దీపాలు ఏర్పాటు చేయించారు.

సంక్షేమమే పరమావధి: గన్ని

భీమడోలు, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వీరాంజనేయులుకు పూలమొక్క ఇస్తున్న అధికారులు

రాష్ట్రాభివృద్ధే ధ్యేయం: చింతమనేని

దుగ్గిరాల(పెదవేగి), న్యూస్‌టుడే: రాష్ట్ర, నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. స్థానిక దుగ్గిరాల విడిది కార్యాలయంలో గురువారం ఆయన్ను కూటమి, కార్మిక సంఘాల నాయకులు, ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.● స్థానిక దుగ్గిరాలలో యూటీఎఫ్ కాలమానిని, దైనందినిని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆవిష్కరించారు. పాఠశాలల అభివృద్ధి, పిల్లల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.

పెదవేగి: కేక్ కోస్తున్న ప్రభాకర్

ఆకాంక్షలు నెరవేరుస్తాం: పత్సమట్ల

ఉంగుటూరు, న్యూస్‌టుడే: గతేడాది సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులకు పెద్దపీట వేశామని.. కొత్త ఏడాదిలో ప్రజా ఆకాంక్షలు నెరవేరుస్తామని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. స్థానిక విడిది కార్యాలయంలో గురువారం నూతన సంవత్సరాది వేడుకలు నిర్వహించారు. నాలుగు మండలాల కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తరలివచ్చి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

ధర్మరాజుకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న నాయకులు

జనసేనలో చేరిక.. ఉంగుటూరు: జనసేన సిద్ధాంతాలు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయాలు నచ్చి పార్టీలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బాదంపూడి మాజీ సర్పంచి యామల సాయి బాబా, ఆయన కుమారుడు ప్రవీణ్‌కుమార్, వారి అనుచరులు సుమారు 200 మంది గురువారం జనసేనలో చేరారు. స్థానిక విడిది కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజాహిత పాలనకు ప్రణాళిక: బడేటి

పవరుపేట (ఏలూరు అర్బన్), న్యూస్‌టుడే: నూతన ఏడాదిలో ప్రజాహిత పాలనకు ప్రణాళిక అమలు చేయనున్నట్లు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. స్థానిక పవరుపేటలోని విడిది కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆయన్ను పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, నగరపాలక కమిషనరు భానుప్రతాప్, తహసీల్దారు గాయత్రి తదితరులున్నారు.● స్థానిక ఏలూరు రేంజ్ కార్యాలయంలో ఐజీ అశోక్ కుమార్‌ను ఎమ్మెల్యే బడేటి చంటి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

చంటికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మేయర్ నూర్జహాన్

మలి వయసులో.. విజయబావుటా

ఏలూరు కలెక్టరేట్, గ్రామీణ- న్యూస్‌టుడే: విజయవాడ వేదికగా నిర్వహించిన ఏపీ మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో ఏలూరుకు చెందిన సీహెచ్ గంగాధరరావు ప్రతిభ కనబరిచారు. 70 ప్లస్ పురుషుల విభాగంలో విజేతగా నిలిచారు. ఆయన్ను కలెక్టర్ వెట్రి సెల్వి గురువారం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు గెలవాలని ఆమె ఆకాంక్షించారు.✦ స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్విని విద్యుత్తు శాఖ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె చేతులమీదుగా వసతి గృహ విద్యార్థులకు దుప్పట్లు అందజేశారు. ఎస్ఈ సాల్మన్‌రాజు, ఈఈ అంబేడ్కర్, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

నేడు బావాయిపాలెంలో జనవాణి

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: బావాయిపాలెం గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 11 గంటలకు జనవాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని చెప్పారు. అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రజకులపై దాడులు అరికట్టాలి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రజకులపై దాడులు అరికట్టాలని రజక జన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కట్లయ్య కోరారు. స్థానిక రేంజ్ కార్యాలయంలో ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్‌ను గురువారం వారు కలిశారు. ఆయన మాట్లాడుతూ.. రజకులపై చిన్నచూపు చూసేవారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంఘ నాయకులు సుధీర్‌బాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఐజీ, ఎస్పీలతో సంఘ నాయకులు

తెలుగు భాషాభివృద్ధికి తోడ్పాటు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తెలుగు భాషాభివృద్ధికి మండలి వెంకట కృష్ణారావు ఎనలేని తోడ్పాటునందించారని వైఎంహెచ్ఏ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక హాలులో వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల గోడపత్రాలను గురువారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 5న నృత్య, మెలట్టూరు భాగవత మేళా నాట్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలి వెంకట కృష్ణారావు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం చేయనున్నట్లు వివరించారు. ఈ వేడుకకు శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణ రాజు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, పెద్ద సంఖ్యలో నగర ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వైఎంహెచ్ఏ యాజమాన్య, కార్యనిర్వాహక కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగేశ్వరరావు, వి.సత్యనారాయణ, ముద్దు కృష్ణ, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

చెత్త.. దుర్గంధమే అంతా!

పెదవేగి మండలం లక్ష్మీపురం వద్ద పోలవరం కుడి కాలువ గట్టు వెంబడి రహదారి పక్కన చెత్తాచెదారం పడేస్తున్నారు. దీన్ని రోజుల తరబడి తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు ముక్కులు మూసుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, పెదవేగి(పెదపాడు)**

పునాదుల దశ.. మారని దిశ!

గణపవరం మండలం వెలగపల్లిలో విలేజ్ ఆర్గనైజేషన్ భవన నిర్మాణాన్ని ఎనిమిదేళ్ల కిందట ప్రారంభించారు. గుత్తేదారుకు నాటి వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పునాదుల దశలో నిలిపివేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పీఆర్ జేఈ దుర్గాప్రసాద్ తెలిపారు. **- న్యూస్‌టుడే, గణపవరం**

నీటి వృథా.. తప్పదు వ్యథ

ఏలూరు నగరంలోని జూట్ మిల్లు సమీప కృష్ణా కాలువ వెంబడి మినీ బైపాస్ అంచున తాగు నీటి ప్రధాన పైపులైన్ దెబ్బ తింది. ఫలితంగా నీరంతా లీకేజీ అవుతోంది. ముందుకెళ్లక అక్కడే నిలిచిపోవడంతో.. తాగునీరు కలుషితమవుతోంది. పైపులైన్‌కు మరమ్మతులు చేయించాలి. **- న్యూస్‌టుడే, ఏలూరు**

ఇరుకు దారి.. వెళ్లేదెలా మరి

పెదపాడు మండలం వట్లూరులోని పేదల కాలనీలో మౌలిక సదుపాయాలు మృగ్యమయ్యాయి. ఎక్కడా సీసీ రోడ్లు లేకపోవడంతో.. స్థానికులు ఇరుకు మట్టి దారుల్లో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపుతామని పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. **- న్యూస్‌టుడే, వట్లూరు(పెదపాడు)**

మలుపుంది.. సూచిక లేకుంది..

పెదవేగి మండలం వంగూరు సమీపంలో రహదారి మలుపు ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ సూచికలు లేకపోవడంతో.. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రివేళ చోదకులు మలుపును గుర్తించలేకపోతున్నారు. వాహనాలను అదుపు చేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. **- న్యూస్‌టుడే, వంగూరు(పెదవేగి)**

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	ఈషా
అంబిక మినీ	వృషభ
సాయి బాలాజీ	ఛాంపియన్
బాలాజీ	శంబాల
సత్యనారాయణ 1	మార్క్
సత్యనారాయణ 2	45
సత్యనారాయణ 3	పతంగ్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	దండోర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	సైక్ సిద్ధార్థ
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	మదం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	ఛాంపియన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	అఖండ 2
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	శంబాల

ఆక్రమించి.. దారి కుచించి!

గుండుగొలను(భీమడోలు), న్యూస్‌టుడే: మండలంలో 16, 216ఏ జాతీయ రహదారి కలయిక గుండుగొలను కూడలి. గ్రామం మీదుగా వెళుతున్న ర.భ.శా. రహదారికి ఇరుపక్కలా ఆక్రమణలు పెరిగిపోవటంతో మార్గం ఇరుకుగా తయారైంది. గుండుగొలనుతో పాటుగా కొల్లేరు లంక గ్రామాలకు, దెందులూరు మండలంలోని పోతునూరు, కొవ్వలి గ్రామాలకు సైతం ఇదే ప్రధాన రహదారి. నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గంలో తిరుగాడుతుంటాయి. ఏలూరు కాలువపై ఉన్న వంతెన దిగువ ప్రాంతం నుంచి గ్రామం పొడవునా రహదారికి రెండు పక్కలా దుకాణదారులు ఆక్రమిస్తున్నారు.

ఆక్రమణలతో కనిపించకుండా పోయిన ర.భ.శా. సూచిక

తొలగించేదెవరు: గుండుగొలను నుంచి కొల్లేరు ప్రాంత లంక గ్రామాల్లో విస్తరించి ఉన్న వేలాది ఎకరాల్లోని చేపల చెరువుల వద్దకు నిత్యం భారీ వాహనాలు, లారీలు వందల టన్నుల లోడుతో వస్తుంటాయి. ఈ క్రమంలో గ్రామంలోని ప్రధాన రహదారి వెంబడి లారీలను గంటల కొద్దీ నిలిపేస్తున్నారు. సంబంధిత అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా ఏళ్ల తరబడి సమస్య పరిష్కారమవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. రహదారి వెంబడి ఉన్న డ్రైయినేజీలు ఆక్రమణలతో పూడిపోవటంతో మురుగు నిలిచిపోతోంది. వర్షాలు పడినపుడు రహదారిపై నీరు నిలిచి గుంతలు పడుతోంది.

గుండుగొలను ప్రధాన రహదారికి ఇరుపక్కలా

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

ఈ విషయమై ర.భ.శాఖ ఏఈ భాస్కరరావు మాట్లాడుతూ ఆక్రమణల తొలగించే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఉరేసుకొని ఆత్మహత్య

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక దక్షిణపు వీధికి చెందిన కర్రి దుర్గాప్రసాద్(25) తాపీ పని చేస్తారు. అవివాహితుడైన అతడు.. తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిసై రోజూ తాగుతున్నారు. డిసెంబరు 31 రాత్రి కుటుంబ సభ్యులు చర్చికి వెళ్లగా.. ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న అతడిని కుటుంబ సభ్యులు సర్వజన ఆసుపత్రికి తరలించారు. దుర్గాప్రసాద్‌ను పరీక్షించిన వైద్యులు. . మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెదపాడు, న్యూస్‌టుడే: పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా రెండు లారీల్లో తరలిస్తుండగా పెదపాడు పోలీసులు గురువారం పట్టుకున్నారు. దాసరిగూడెం నుంచి రెండు లారీల్లో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు ఎస్సై కట్టా శారదా సతీశ్ సమాచారం అందింది. ఆ లారీలను తనిఖీ చేయగా.. 4 టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ప్రత్తిపాడు, పెదపాడు మండలం దాసరిగూడేనికి చెందిన లారీ డ్రైవర్లు గంగిరెడ్డుల శివస్వామి, మల్లవల్లి శివరంగారావును అదుపులోకి తీసుకున్నారు. రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దారు టి.రామారావుకు అప్పగించారు. లారీలను స్వాధీనం చేసుకొని వారిద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కట్టా శారదా సతీశ్ తెలిపారు.

కోళ్ల వ్యర్థాల లారీ స్వాధీనం

పెదపాడు: చెరువుల్లో చేపల మేతగా వినియోగించేందుకు కోళ్లు, జంతువుల వ్యర్థాలు తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.శారదా సతీశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పెదపాడు మండలం అందేఖాన్‌చెరువు వద్ద గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. విజయవాడ వైపు నుంచి వస్తున్న లారీని పరిశీలించారు. అందులో కోళ్ల వ్యర్థాలు ఉండటంతో.. స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: క్రీస్తు చూపిన మార్గంలో విశ్వాసులు నడవాలని.. ఆయన బోధనలు అనుసరణీయమని ఐసీఎం అగ్ర పీఠాధిపతి బిషప్ జాన్ ఎస్డీ రాజు అన్నారు. స్థానిక ఆల్ సెయింట్స్ ఐసీఎం కథెడ్రల్ చర్చిలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అనంతరం బిషప్ బ్రదర్ ఎం.రమేశ్, బ్రదర్ జి.రమేశ్‌ను డీకన్లుగా అభిషేకించారు. రెవ.కె.ప్రసాదరావు వాక్యపరిచర్య చేశారు.

ఏలూరు: కథెడ్రల్ చర్చిలో అగ్ర పీఠాధిపతి ప్రార్థనలు

భీమడోలు: ఆర్సీఎం చర్చిలో కేక్ కోస్తున్న ఫాదర్లు

భీమడోలు: మండలంలోని అన్ని చర్చిల్లో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. భీమడోలు ఆర్సీఎం చర్చి, ఆరోగ్యమాత దేవాలయంలో ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి.. కేక్‌లు కోశారు. సూరప్పగూడెం క్రీస్తు సంఘం చర్చిలో బ్రదర్ ఇంజేటి విజయ అచ్యుతం ఆధ్వర్యాన విశ్వాసులు సామూహిక ప్రార్థనలు చేసి.. పేదలకు దుప్పట్లు, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

కరుణ ఉండాలని.. కటాక్షం పొందాలని!

ఆలయాల్లో నూతన సంవత్సర శోభ

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా.. సత్రంపాడు లక్ష్మీగణపతి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, అర్చన తదితరాలు నిర్వహించారు. అనంతరం గణనాథుడిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



అభయాంజనేయస్వామికి..

పెదపాడు: అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేసి.. విశేషంగా అలంకరించారు. భక్తులు 108 సార్లు ప్రదక్షిణలు చేసి వాయుపుత్రుడిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

నిడమర్రు: పెదనింద్రకొలను పార్వతీ సమేత భీమేశ్వరస్వామి, మందలపర్రు ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. రాత్రి భీమేశ్వరస్వామి ఆలయావరణలో కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. పెదనింద్రకొలను వేణుగోపాలస్వామి ఆలయంలో మూడ్రోజులపాటు కొనసాగిన ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ముగిశాయి.

కోటి కుంకుమార్చన

ఏలూరు ఆధ్యాత్మికం: స్థానిక దక్షిణపు వీధి గంగానమ్మ జాతర కనులపండువగా కొనసాగుతోంది. గురువారం మేడలో కొలువైన అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. పెద్దఎత్తున మహిళలు తరలివచ్చి.. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కోటి కుంకుమార్చన చేశారు. జాతర కమిటీ అధ్యక్షుడు అద్దేపల్లి శ్రీను, సభ్యులు పర్యవేక్షించారు.

మోటారు సైకిల్ దహనం

భీమడోలు: పెదలింగంపాడుకు చెందిన బిరుదుగడ్డ బాబూరావు తన కుమార్తె కాపురం విషయంలో అల్లుడు కొండ సుబ్బారావుతో కొన్నాళ్లుగా గొడవ పడుతున్నారు. వీరిద్దరి మధ్య గురువారం సాయంత్రం మరోమారు వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన బాబూరావు తన అల్లుడి మోటారు సైకిల్‌పై పెట్రోలు పోసి నిప్పంటించాడు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మదీనాబాషా తెలిపారు.

చేపల చెరువు తవ్వకంపై కేసు

పెదపాడు: గుడిపాడు పంచాయతీ రాళ్లపల్లివారిపాలెంలో పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూమిలో గత నెల 19 రాత్రి గుడిపాడుకు చెందిన ముంగర విష్ణు, మరో ఎనిమిది మంది చేపల చెరువు తవ్వుతున్నారు. గుడిపాడు వీఆర్వో ఎన్.బేబీరాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కట్టా శారదాసతీశ్ తెలిపారు.

9వ వర్ధంతి

మా కుటుంబ మార్గదర్శకులు, మా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన మా తండ్రి గారు శ్రీ పరసా రాఘవయ్య గారు మా నుండి దూరమై 9 సంవత్సరాలు గడిచిననూ మీ మధురస్మృతులు మా మదిలో పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ పరసా రాఘవయ్య గారు
ఏలూరు, మరణం: 02-01-2017

కుమారుడు: వెంకట పట్టాభి రామారావు
కోడలు : సత్య సుశీలా దేవి
కుమార్తె : P.ధనలక్ష్మి
మనుమడు, మనుమరాండ్రు, మునిమనుమడు, మునిమనుమరాలు
అక్క, సోదరులు, మరదళ్ళు మరియు బంధుమిత్రులు

(c) eenadu

పోలవరం

• పోలవరం • చింతలపూడి

ప్రాణాలు కాపాడిన వైద్యులు

చింతలపూడి, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన బుజ్జా సోమయ్యకు గురువారం ఉదయం ఛాతినొప్పి తీవ్రంగా రావటంతో కుటుంబసభ్యులు చింతలపూడి ఆసుపత్రికి తీసుకొచ్చారు. సోమయ్యను పరీక్షించిన వైద్యులు దీన్ని గుండెపోటుగా నిర్ధారించి వెంటనే రూ.40 వేలు విలువ కలిగిన టెనెక్టెప్లేజ్ ఇంజెక్షన్ ఇచ్చి రోగి ప్రాణాలు కాపాడారు. కుటుంబసభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కొనసాగుతున్న దీక్షలు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం కేంద్రంగా జిల్లాను ప్రకటించాలన్న డిమాండ్‌తో జిల్లా సాధన సమితి సభ్యులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరాయి. గురువారం పలువురు దీక్ష శిబిరం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. పోలవరానికి న్యాయం చేయాలని సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు.

విధుల్లోకి తీసుకోవాలంటూ ఆందోళన

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: రామవరం అంగన్‌వాడీ కేంద్రం వద్ద బాలుడు మృతిచెందిన ఘటనలో మంగళవారం టీచర్, ఆయాను విధుల నుంచి తొలగించినట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీరి ఉద్యోగాలు తొలగించడంపై రామవరం గ్రామస్థులు అంగన్‌వాడీ కేంద్రం వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకునేంత వరకు తమ పిల్లలను బడికి పంపమని ఐసీడీఎస్ అధికారులతో అన్నారు. అప్పటివరకు అంగన్‌వాడీ కేంద్రం తెరవొద్దని తాళం వేశారు.

జంగారెడ్డిగూడెంలో సమావేశమైన విశ్వహిందూ పరిషత్, రామదండు, ఇతర హిందూ సంఘాల నాయకులు

'అర్ధరాత్రి పూజలు వద్దు'

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెంలోని పలు దేవాలయాలు డిసెంబర్ 31 అర్ధరాత్రి తెరచి, పూజలు చేయడం ఆగమ శాస్త్రానికి విరుద్ధమని విశ్వహిందూ పరిషత్, రామదండు, ఇతర హిందూ సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు పట్టణంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ...గ్రామదేవతలకు అర్చన కలిగించేలా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయా దేవాలయాల సిబ్బందితోపాటు పండితులకు విజ్ఞప్తి చేశారు. తిప్పాబట్ల రామకృష్ణ, వీహెచ్‌పీ రాము, దూలిపాళ మృత్యుంజయశర్మ, రాంబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పరాయి పంచన... అంగన్‌వాడీ

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: పోలవరం నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరవయ్యాయి. చాలా వరకు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. నిర్వహణ నానాటికీ ఇబ్బందిగా మారుతోంది. కొన్ని అద్దె భవనాల్లో రేకుల షెడ్లలో, ఇరుకు గదులు, పూరి పాకల్లో గాలి, వెలుతురు లేక చిన్నారులు, సిబ్బంది సైతం కష్టాలు పడుతున్నారు.

ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	అద్దె భవనాలు
కొయ్యలగూడెం	168	68
బుట్టాయగూడెం	189	37
కుక్కునూరు	160	75

టేకూరు కేంద్రం వద్ద చెట్టు కింద భోజనం చేస్తున్న విద్యార్థులు

అసౌకర్యాల నడుమ..

దశాబ్ద కాలం కిందట ప్రారంభించిన అంగన్‌వాడీ కేంద్రాలకు సైతం సొంత భవనాలు సమకూరలేదు. ప్రభుత్వాలు మారినా..పాలకులు మారినా... అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు పరిష్కారం కావటం లేదు. పలు చోట్ల అద్దె భవనాల్లో కేంద్రాల నిర్వహణ సాగుతోంది. మరికొన్ని చోట్ల ప్రభుత్వానికి చెందిన ఇతర శాఖల భవనాల్లో నిర్వహిస్తున్నారు. కాలం చెల్లిన భవనాల్లో అరకొర వసతుల నడుమ చిన్నారులకు చదువులతో పాటు పౌష్టికాహారాన్ని అందించాల్సిన దుర్భర స్థితి ఎదుర్కొంటున్నామని సిబ్బంది వాపోతున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, నీటి వసతి లేనందున ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టి సొంత భవనాలు సమకూర్చడంతోపాటు సౌకర్యాలను మెరుగుపరచాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

అరకొర వసతులతో..

అంగన్‌వాడీ కేంద్రాలకు గరిష్ఠంగా గ్రామాల్లో రూ.2 వేలు, పట్టణాల్లో రూ.6 వేలు అద్దె ఇస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే అద్దెకు అన్ని సౌకర్యాలున్న భవనాలు లభించక చాలీచాలని అద్దె గదుల్లోనే కేంద్రాలు నిర్వహించాల్సి వస్తోంది. మన్యం ప్రాంతంలోని పలు గ్రామాల్లో ఎంత అద్దె చెల్లించినా సౌకర్యాలు ఉన్న భవనాలు దొరకట్లేదని కార్యకర్తలు వాపోతున్నారు.

స్థలాలు లేక ఇబ్బందులు

కుక్కునూరు ప్రాజెక్టు పరిధిలోని స్థలాలు పోలవరం ప్రాజెక్టు ముంపులో ఉండటంతో పాటు మరో రెండు ప్రాజెక్టుల పరిధిలో స్థలాలు లేక సొంత భవనాల నిర్మాణాలు సాగడం లేదని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

జిల్లాను అన్నింటా ముందుకు తీసుకెళ్దాం

కేక్ కోస్తున్న పద్మశ్రీ దంపతులు

ఏలూరు టూన్, విద్యా విభాగం-న్యూస్‌టుడే: జిల్లాను అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకెళ్దామని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. స్థానిక ఉమ్మడి జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ విడిది కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆమెకు జడ్పీ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పద్మశ్రీ దంపతులు కేక్ కోసి అందరికీ పంచిపెట్టారు. సీఈవో ఎం.శ్రీహరి, డిప్యూటీ సీఈవో కె.భీమేశ్వర్, ఏవోలు తదితరులు పాల్గొన్నారు. ✦ స్థానిక జడ్పీలోని విడిది కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రూపొందించిన నూతన సంవత్సర కాలమానిని, దైనందినిలను జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ బుధవారం ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సతీశ్ కుమార్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కొమ్మలు

కొయ్యలగూడెం గ్రామీణ, బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం కొవ్వాడ సమీపంలో రహదారిపై చెట్టు కొమ్మలు ఎంతో ప్రమాదకరంగా మారాయి. కొంతకాలం కిందట ఈదురుగాలుల తాకిడికి చెట్టు విరిగిపడి రహదారికి ఆవలివైపున ఉన్న చెట్లలో కొమ్మలు ఇరుక్కున్నాయని స్థానికులు తెలిపారు. కొయ్యలగూడెం, బుట్టాయగూడెం వైపు నుంచి పోలవరం వెళ్లడానికి ఇదే ప్రధాన మార్గం కావడంతో వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుందని, ఎండిన ఆ కొమ్మలు ఎప్పుడు ఎవరిమీద విరిగి పడతాయోనని ఆందోళన చెందుతున్నారు.

మాట్లాడుతున్న రోషన్ కుమార్

పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివి

చింతలపూడి, న్యూస్‌టుడే: ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని, ఆయన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. స్థానిక అగ్నిమాపక కేంద్రం కూడలి సమీపంలో ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే గురువారం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కొరకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. విగ్రహావిష్కరణ సందర్భంగా పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ చీదరాల దుర్గా పార్వతి, పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య సంఘం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన దేవాలయాలు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జంగారెడ్డిగూడెంలోని పాతబస్టాండ్ వద్ద ఉన్న శిర్డీసాయి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోకులతిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పట్టణంలోని గంగానమ్మ, నూకాలమ్మ, విజయదుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలు చర్చిల్లో విశ్వాసులు ప్రార్థనలు చేశారు.

కామవరపుకోట, న్యూస్‌టుడే: తూర్పుయడవల్లి సీతారామ చంద్రస్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. తడికలపూడి గాంగేశ్వరాలయం, కామవరపుకోట వీరభద్రస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం శిర్డీసాయి మందిరంలో భక్తులు

తూర్పుయడవల్లిలో..

ఆకట్టుకున్న రంగవల్లులు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం 2026కు మండల ప్రజలు ఆనంద ఉత్సాహాలతో స్వాగతం పలికారు. గ్రామాల్లో మహిళలు ఇళ్ల ముందు అందమైన రంగ వల్లులు వేశారు.

టి.నరసాపురంలో ..

ప్రజల ఆశయాలకు అనుగుణంగా సేవలు

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: కొత్త సంవత్సరంలో ప్రజల ఆశయాలకు అనుగుణంగా సేవలు అందిస్తూ మరింత అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. బర్రింకలపాడులోని తన క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేసు కోసి పంచారు. ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, తెదేపా నేతలు ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇరువురూ పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. వివిధ శాఖాధికారులు, కూటమి నాయకులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చింతలపూడి, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానిక క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని కూటమి నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు గురువారం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడారు. ఏఎంసీ ఛైర్మన్ చీదరాల దుర్గాపార్వతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాలరాజుకు శుభాకాంక్షలు చెబుతున్న శ్రీనివాసులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బూసరాజుపల్లిలో తెదేపా నియోజకవర్గ కార్యాలయం వద్ద ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు కేక్ కోసం పంచారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి మండలాల నాయకులు పాల్గొన్నారు. బుట్టాయగూడెంలో జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి కేక్ కోశారు.

● కేఆర్‌పురంలో ఐటీడీఏ పీవో రాములు నాయక్ కేక్ కోసి పంచారు. వివిధ శాఖాధికారులు, సిబ్బంది ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ట్రైకార్ ఛైర్మన్ శ్రీనివాసులుకు కేక్ తినిపిస్తున్న రామారావు, తదితరులు

అసంపూర్తి పనులతో.. అవస్థలు

పోలవరం, న్యూస్‌టుడే: నాడు - నేడు 2లో మంజూరైన అదనపు తరగతి గది నిర్మాణంతో పిల్లల అవస్థలు తీరతాయని భావించిన తల్లిదండ్రులకు నిరాశే మిగిలింది. పట్టిసీమ ప్రత్యేక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేకపోవడంతో అసంపూర్తి భవనంలోనే ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నారు. గుమ్మాలు, కిటికీలు బిగించి, టైల్స్ రంగులు వేస్తే భవనం ఉపయోగంలోకి వచ్చేది. పార్కింగ్ టైల్స్ తీసుకొచ్చి మూలనపెట్టారు. ప్రహరీ నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. గత ప్రభుత్వ హయాంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారులు అరకొర పనులతో సరిపెట్టారు. తీసుకొచ్చిన టైల్స్ వరండాలో ఉంచి పైన బరకాలు కప్పారు. అధికారులు వచ్చి చూసి నివేదికలు పైవారికి పంపడం తప్ప ఎప్పటికీ నిర్మాణం పూర్తిచేస్తారో అంతుబట్టడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టిసీమ ప్రత్యేక పాఠశాల వరండాలో బరకాల చాటున టైల్స్

వారు పెంచుతారు.. వీరు తుంచుతారు..!

కొయ్యలగూడెం గ్రామీణ, బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: పచ్చదనం కోసం చెట్లు పెంచాలని ఉద్యమంలా కొందరు మొక్కలు నాటి పెంచుతూ ఉంటే..విద్యుత్తు లైన్ల నిర్మాణం పేరుతో ఏపుగా ఎదిగిన పచ్చని చెట్లను ఇష్టారాజ్యంగా తొలగిస్తూ ఇంకొందరు మోడులు చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం, అటవీశాఖ ఆధ్వర్యంలో ఎవెన్యూ ప్లాంటేషన్ పేరుతో కొన్నేళ్ల కిందట ఉపాధి పథకం కింద ఆర్‌అండ్‌బీ రహదారుల వెంట పెద్దసంఖ్యలో మొక్కలు నాటారు. ఇదే క్రమంలో కేఆర్‌పురం ఐటీడీఏ రహదారిలో నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగాయి. వీటితోపాటు ఏళ్లతరబడి పెరిగిన మహా వృక్షాలు ఉన్నాయి. ఇటీవల ఆర్‌డీఎస్‌ఎస్ పనుల పేరుతో చేపట్టిన విద్యుత్తు లైన్ల నిర్మాణం కోసం ఆ చెట్లను కొట్టేశారు. కొన్నింటిని వేళ్లతో సహా పెకలించి తొలగించారు. వృక్షాలను మోడులుగా మార్చారు. కేఆర్‌పురం, రాజానగరం గ్రామాల మధ్య వందలాది చెట్లు కొట్టేయడంతో పచ్చదనం వెలవెలబోతోంది. ఆ కలపను కొందరు అక్రమార్కులు దారి మళ్లించారన్న విమర్శలు ఉన్నాయి.

కేఆర్ పురం - ఐటీడీఏ మార్గంలో రహదారి వెంట నరికిన చెట్ల మొదళ్లు

చెట్టెక్కిన కాపురం

కుక్కునూరు, న్యూస్‌టుడే: మిర్చికోతలు, జామాయిల్ తోటలు నరకటం వంటి పనుల నిమిత్తం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి పెద్దఎత్తున కూలీలు వలస వస్తుంటారు. వీరికి ఎటువంటి ఆవాసాలు ఉండవు. పని ప్రాంతంలోనే ఏదో ఒక గూడు చేసుకొని రాత్రి నిద్రించి, ఉదయం పనులకు వెళ్లిపోతుంటారు. కుక్కునూరు మండలం పెదరావిగూడెం గ్రామంలో జామాయిల్ తోటలు నరికేందుకు వచ్చిన కూలీలు పనికి వెళ్లేటప్పుడు, తమ సామగ్రి అంతా ఇలా చెట్టు ఎక్కించి, భద్రపరచుకుంటారు. నేలపై ఉంచితే కుక్కలు, ఇతర జంతువులు ఆహారం తినడం, సామగ్రిని పాడుచేయడం చేస్తాయనే భయంతో ఇలా చెట్టెక్కించారు. రాత్రివేళ నిద్రించేందుకు సమీపంలో ఓ పచ్చిరొట్ట పైనవేసి చిన్నపాకలా తయారు చేసుకున్నారు.

సామగ్రి.. కాస్త దూరంలో నివాసం ఉండేలా ఆకులతో పాక ఏర్పాటు చేసిన దృశ్యం

ఇతర అవసరాలకు ఎరువులు అమ్మితే చర్యలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఎరువులు, యూరియా వంటివి కేవలం వ్యవసాయానికి మాత్రమే విక్రయించాలని మండవల్లి ఏడీఏ జి.వెంకటమణి సూచించారు. ముదినేపల్లిలోని ఎరువుల దుకాణాలను ఆమె పరిశీలించారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కొవ్వూరు వారి కోర్టులో డెటార్ ఐ.పి.నెం. 28/2025

బిట్వీన్:

పడగా రాము ... పిటిషనర్

మరియు

సాయిశ్రీ జ్యువెలర్, ప్రొ॥ కె.ఎ.కె.రాజ్‌కుమార్ అండ్ 18 అదర్స్ .... రెస్పాండెంట్స్

పై శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ నోటీసు ద్వారా యావన్మందికి తెలియజేయునది. పై పిటిషనర్ తాను పిటిషన్‌లో పేర్కొన్న యావత్తు రెస్పాండెంట్లపై తనను ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ పై శ్రీ కోర్టు నందు డెటార్ ఐ.పి.నెం. 28/2025 దాఖలు చేసియున్నారు. సదరు వ్యాజ్యమును గూర్చి ఎవరికైనా ఎట్టి అభ్యంతరములు ఉన్నా ది. 8-1-2026 తేదీన ఉదయం 10-30 గం.లకు పైన పేర్కొన్న శ్రీ కోర్టు వారి యెదుట తాను స్వయముగా గాని లేదా వారి యొక్క న్యాయవాది ద్వారా గాని హాజరై వారి యొక్క అభ్యంతరములను తెలియపర్చుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు సదరు వ్యాజ్యము తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

సం/- P.వెంకటరత్నం, అడ్వకేట్, తాడేపల్లిగూడెం, ఫోన్: 80088 34609

కొవ్వూరు 31-12-2025

వరదలకు కొట్టుకుపోయిన కల్వర్టు అనుసంధాన మార్గం

అంతిమ యాత్రకు అగచాట్లు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కన్నాపురం ఎస్సీకాలనీ సమీపంలో శ్మశానవాటిక మార్గంలో తూర్పుకాలువపై నిర్మించిన పైపుకల్వర్టు అప్రోచ్ వరదలకు కొట్టుకుపోయి అంతిమ యాత్రలకు అగచాట్లు పడుతున్నారు. గతేడాది అప్పట్లో పడిన గండిని పూడ్చడానికి మండల పరిషత్తు నిధులు రూ.1.50 లక్షలకు పైబడి ఖర్చు చేశారు. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు కాలువ పోటెత్తడంతో ఆ పనులు కొట్టుకుపోయాయి. కల్వర్టుపై అంతిమయాత్ర చేస్తూ చివరన అంచులు దిగి శవపేటికను మోస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిపై జల వనరుల శాఖ కొయ్యలగూడెం ఏఈ రాహుల్ భాస్కర్ మాట్లాడుతూ కల్వర్టు అప్రోచ్ పనులకు ప్రతిపాదనలు పంపామని, అనుమతులు రావాల్సి ఉందన్నారు.

మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఇబ్బందులు

మద్ది క్షేత్రం భక్త జనసంద్రం

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి గురువారం భక్తజన సంద్రంగా మారింది. నూతన సంవత్సరం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ముఖమండపం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఒక్కరోజే వివిధ సేవల రూపేణా రూ.3,97,450 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఆర్వీ చందన తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. జంగారెడ్డిగూడెం ఎస్సై వీరప్రసాద్ కథనం ప్రకారం.. చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామానికి చెందిన పింగుల అబ్రహం(39).. ఐదు నెలల కిందట తన భార్యాబిడ్డలతో జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి వచ్చి స్థానికంగా ఓ నర్సరీలో పనిచేస్తున్నాడు. అయితే కొద్ది రోజులుగా అబ్రహాంకు ఆరోగ్యం బాగుండటం లేదు. ఈక్రమంలోనే అతడికి కామెర్లు రావడంతో కోలుకోలేకపోతున్నానని.. తరచూ కుటుంబసభ్యుల వద్ద బాధపడేవాడు. మనస్తాపం చెందిన అబ్రహం బుధవారం రాత్రి పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబసభ్యులు అతడిని జంగారెడ్డిగూడెం ప్రాంతీయాసుపత్రికి.. అక్కడి నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందతూ గురువారం ఉదయం అతడు మృతిచెందాడు. దీనిపై మృతుడు భార్య లీలా ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్యాయత్నం

పోలవరం, న్యూస్‌టుడే: ఈ సంవత్సరం దిగుబడులు సగానికి సగం తగ్గి, చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో కలుపు మందు తాగి ఓ యువరైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలవరం మండలం కొత్తపట్టిసీమ గ్రామానికి చెందిన గంటా రాధాకృష్ణ కౌలుకు పది ఎకరాలు తీసుకుని వరి వేశాడు. వాతావరణంలో మార్పుల కారణంగా దిగుబడులు తగ్గిపోవడంతో బతుకుపై విరక్తి చెంది గురువారం ఇంట్లో కలుపు మందు తాగాడు. కుటుంబసభ్యులు వెంటనే పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. అక్కడి వైద్యులు పూనెం రాంబాబుదొర ప్రథమ చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమహేంద్రవరం ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు.

జూద శిబిరాలపై దాడులు

జంగారెడ్డిగూడెం పట్టణం, కామవరపుకోట, ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: చింతలపూడి,పోలవరం నియోజకవర్గాల్లో కోడిపందేలు, ఇతర జూద శిబిరాలపై పోలీసులు గురువారం పెద్దఎత్తున దాడులు చేశారు. జంగారెడ్డిగూడెం పట్టణం సుబ్బంపేటలో జూద స్థావరంపై దాడిచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకొని, వీరివద్ద నుంచి రూ.5,930 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు. ఉప్పలమెట్ట ప్రాంతంలో కోడిపందేలపై దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ.5110, 2 కోళ్లు, 2 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు. ● జీలకర్రగూడెం గ్రామ శివారులో ఓ జూద శిబిరంపై దాడి చేసిన ఏడుగురుని అదుపులోకి తీసుకున్నట్లు తడికలపూడి ఎస్సై చెన్నారావు తెలిపారు. రూ.22,050, అయిదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

● ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెంలో కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడిచేసి 9 మందిని అదుపులోకి తీసుకొని, రూ.9,500, ఓ కోడిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధీర్ తెలిపారు.

కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, టి.నరసాపురం, వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: యర్రంపేట శివారులో కోడి పందేల స్థావరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,800, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కన్నాయగూడెంలో జూద శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. పట్టుబడ్డ వారి నుంచి రూ.9,380, 52 కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

● స్వర్ణవారిగూడెం, దర్భగూడెం, కొయిదా పునరావాస కాలనీ శివారుల్లో కోడిపందేలపై దాడి చేసినట్లు 14 మందిని అరెస్టు చేయడంతోపాటు, రూ.7,490, మూడు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వి.క్రాంతికుమార్ తెలిపారు. ● సింగరాయపాలెంలో కోడి పందేలపై దాడి చేశారు. నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.1,080, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జయబాబు తెలిపారు. ● కన్నాయిగుట్టలో కోడి పందేలపై దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద రెండు కోడి పుంజులు, రూ.వెయ్యి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

పోలవరం, న్యూస్‌టుడే: వెంకటాపురం సమీపంలో 365 బిబి జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనదారుడు ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. వారిని 108 వాహనంలో పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రగడపల్లి గ్రామానికి చెందిన పి. నర్సయ్య జంగారెడ్డిగూడెం నుంచి వచ్చిన అల్లుడు కొడమంచిలి రాజ్‌కుమార్‌ను తీసుకుని పండగకు వస్త్రాలు కొనేందుకు గురువారం ద్విచక్ర వాహనంపై పోలవరం బయలుదేరారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని ఇందుకూరిపేట నుంచి ద్విచక్ర వాహనంపై జాతీయ రహదారిపై వెళ్తున్న వీవీ.అవినాష్ మలుపులో వేగంగా వెళ్లి ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొనడంతో రాజ్‌కుమార్‌కు మూడు చోట్ల ఎముకలు విరిగినట్లు వైద్యులు చెప్పారు. నర్సయ్య స్వల్పగాయాలతో బయట పడ్డాడు. అవినాష్ మాత్రం స్పృహ కోల్పోవడంతో ఇద్దరికి ప్రథమ చికిత్స చేసి రాజమహేంద్రవరం ఆసుపత్రికి 108 వాహనాల్లో తరలించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ వీరేశ్వర స్వామివారి దేవస్థానం, పట్టిసం (V), పోలవరం మండలం, ఏలూరు జిల్లా.

సీల్డు కొటేషన్స్ మరియు టెండర్ కమ్ బహిరంగవేలం ప్రకటన

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, పట్టిసంలో వేంచేసియున్న శ్రీ వీరేశ్వర స్వామివారి దేవస్థానం నందు ది.14-02-2026 నుండి ది.16-02-2026 వరకు జరుగు మహాశివరాత్రి మహోత్సవములు సందర్భముగా ఈ క్రింది షెడ్యూలు నందు తెలిపిన వివిధ పనులకు సీల్డు కొటేషన్స్ టెండర్ - కమ్ - బహిరంగ వేలములు.

వ. నెం.	పనుల వివరము	కాలపరిమితి	ధరావత్తు	టెండర్లు ఇచ్చు తేదీ, సమయము	సీల్డు కొటేషన్స్ టెండర్లు స్వీకరించి మరియు తెరచు తేదీ, సమయము, ప్రదేశము	టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించు తేదీ, సమయము, ప్రదేశము
1	కొబ్బరి చెక్కలు ప్రోగుచేసుకొను హక్కునకు	ది.14-02-2026 నుండి ది.16-02-2026	రూ.20,000/-	--	--	ది.12-01-2026వ తేదీ ఉదయం గం.10.00 లకు టెండర్-కమ్-బహిరంగ వేలము పాటలు నిర్వహించబడును
2	శ్రీ స్వామివారికి భక్తులచే సమర్పించు తలనీలాలు ప్రోగుచేసుకొను హక్కునకు	ది.01-04-2026 నుండి ది.31-03-2027	రూ.1,000/-	--	--	
3	విద్యుత్ అలంకరణ, మైక్‌సెట్లు, జనరేటర్, కూలర్లు, స్టాండ్ ఫాన్స్ వగైరాలు షెడ్యూల్ దాఖలా ఏర్పాటు చేయు నిమిత్తం	ది.14-02-2026 నుండి ది.16-02-2026	రూ.20,000/-	ది.10-01-2026వ తేదీ సాయంత్రం గం॥ 05.00 ని॥ వరకు శ్రీ వీరేశ్వర స్వామివారి దేవస్థానం కార్యాలయము వద్ద టెండర్లు యివ్వబడును	ది.12-01-2026వ తేదీ ఉదయం గం.10.00 వరకు సీల్డు కొటేషన్ టెండర్లు స్వీకరించి అదేరోజు ఉదయం 11.00 లకు హాజరైన టెండరుదార్లు డిపార్టుమెంటు అధికారుల సమక్షములో శ్రీస్వామివారి దేవస్థానము వద్ద తెరువబడును.	
4	ఆలయ తూర్పు భాగమంతా తాటియాకు పందిర్లు, దేవాలయ ప్రాంగణం మరియు బయట భాగములో మెట్లు వద్ద వాటర్ ప్రూఫ్ పందిర్లు & క్యూ లైన్ల వద్ద ఐరన్ మెటీరియల్‌తో పందిర్లు, యం.యస్. పైపులతో & ఐరన్ హోల్స్ స్టేజ్, సైడ్ వాల్స్, గ్రీన్‌మేట్, షామియానా పందిర్లు వగైరాల నిమిత్తం					
5	బూంది లడ్డు ప్రసాదం మరియు పులిహోర ప్రసాదం తయారు చేయు వంటశాల వద్ద లేబరు ఛార్జీల నిమిత్తం					
6	దేవాలయము నందు పనులు చేయు కూలీలు సప్లైయి కాంట్రాక్టు నిమిత్తం					

పైన తెలిపిన పనులు నిమిత్తము సీల్డు కొటేషన్స్ ఫారంనకు రూ.200/-లు శ్రీస్వామివారి దేవస్థానం నందు చెల్లించి టెండర్ ఫారం పొందవచ్చును. సదరు సీల్డు కొటేషన్స్‌కు ధరావత్తు సొమ్ము DD రూపేణా జతచేసి, టెండర్ వివరములు సక్రమముగా వ్రాసి షెడ్యూలు నందు తెల్పిన సమయమునందు ప్రతి ఐటమ్‌నకు విడివిడిగా సీల్డు కొటేషన్ సమర్పించవలెను. సదరు సీల్డు కొటేషన్స్ షెడ్యూల్ నందు చూపబడిన సమయమున డిపార్టుమెంటు అధికారుల సమక్షములో తెరువబడును. మిగిలిన వివరములకు శ్రీ స్వామివారి దేవస్థానము కార్యాలయము పనివేళలలో కార్యాలయము నందు సంప్రదించగలరు.

పట్టిసం, తేది.01-01-2026. సం/- ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శ్రీ వీరేశ్వర స్వామి వారి దేవస్థానం

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

బాబాకు విశేష హారతి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: సింగన్నగూడెం బస్టాప్ వద్ద గల సర్కారుక్షెట్టి శ్రీ సాయిబాబా మందిరంలో విశేష పూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం నుంచి 24 గంటల ఏకనామం, గురువారం ఉదయం విశేష క్షీరాభిషేకం, ప్రత్యేక అలంకారం, అర్చనలు చేశారు. బాబాకు విశేష హారతి ఇచ్చారు. దాతలుగా ఆగిరిపల్లికి చెందిన వీరమనేని ఉమా మహేశ్వరరావు(చంటి), నాగమణి దంపతులు పాల్గొన్నారు. పూజలను ఆలయ అర్చకులు డి.లక్ష్మీనరసింహ మూర్తి నిర్వహించారు. భక్తులు బాబాను దర్శించుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వ్యవసాయేతర అవసరాలకు ఎరువులు అమ్మితే చర్యలు

బోర్డు ఏర్పాటు చేయిస్తున్న ఏడీఏ, ఏవో

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఎరువుల దుకాణాల వద్ద తప్పనిసరిగా స్టాక్ బోర్డులు ఏర్పాటు చేసి ఎరువుల నిల్వల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని మండలంలో ఏడీఏ జి.వెంకటలక్ష్మి సూచించారు. ముదినేపల్లిలోని ఎరువుల దుకాణాలను గురువారం ఆమె ఏవో వేణు మాధవ్‌తో కలిసి పరిశీలించారు. ఎరువులు, యూరియా వంటివి కేవలం వ్యవసాయానికి మాత్రమే విక్రయించాలన్నారు. ఇతర అవసరాలకు ఇండస్ ఆయిల్ తయారీ వద్ద దొరికిన యూరియా ఏ దుకాణదారు విక్రయించారనే దానిపై పరిశీలిస్తున్నామని, నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆమె వివరించారు.

ఘనంగా ధనుర్మాస పూజలు

విశేష అలంకరణలో సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వైష్ణవాలయాల్లో ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదా రంగనాథులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వడాలి జగన్నాథస్వామి, సింగరాయపాలెంలో బాలాజీ మందిర, గురజ వేణుగోపాల స్వామి ఆలయంలో తులసీ పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు గోదాదేవి అమ్మవారి 17వ పాశురాన్ని స్వామివారికి నివేదించారు.

వ్యవసాయానికి కూలీల కొరత

ముమ్మరంగా రబీ సాగు

చాట్రాయి, న్యూస్‌టుడే: రబీ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పనుల్లో కీలకమైన కూలీల కొరత వ్యవసాయానికి సమస్యగా మారింది. జిల్లాలో అత్యధికంగా మొక్కజొన్న సాగు చేసే మండలాల్లో చాట్రాయి ఒకటి. రబీలో మొక్కజొన్న 9 వేలు, వరి 2,500 ఎకరాలు, ఆయిల్ పామ్ 5 వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. రబీ వ్యవసాయానికి నిత్యం కూలీలు అవసరం ఉంది. మండలంలో పది వేల మంది ఉపాధి శ్రామికులు ఉండగా వీరిలో వ్యవసాయ పనులకు వచ్చే వారు అత్యధికం. మొక్కజొన్న, వరి నాట్లు, కలుపుతీత పనులు

ఆటోలో వరి నాట్లకు వెళ్తున్న మహిళలు

సాగుతున్నాయి. ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు సాగవుతున్నాయి. రైతులు ట్రాక్టర్లలో వీరిని తీసుకువెళ్లి పని తర్వాత తిరిగి ఇంటికి చేర్చుతున్నారు. ఒక్కొక్కరికి రోజు రూ.350 నుంచి రూ. 500వరకు ఇస్తున్నారు. అయినా వారి లభ్యత లేక ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయానికి పెట్టుబడులతో పాటు కూలీలను సమకూర్చుకోవడం సమస్యగా ఉందని రైతులు వాపోతున్నారు.

తెలంగాణలోనూ పనులతో సమస్య..

సరిహద్దులోని సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో సాగర్ జలాలు ఉండగా వరి నాట్లు సాగుతున్నాయి. అక్కడకు నాట్లకు వెళ్తే ఎకరాకు చొప్పున గుత్త మాట్లాడుకోవడంవల్ల కూలి రూ. 700 నుంచి రూ. 800 నగదు గిట్టుబాటవుతోంది. ఫలితంగా చాలా మంది మహిళలు అక్కడకు వెళ్తుండటం ఇక్కడ చూపుతుండటంతో ఇక్కడి రైతులకు సమస్యగా మారింది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు :80085 74698	ఆగిరిపల్లి: 9121229090
ముసునూరు :93983 81268	చాట్రాయి: 8008574700
కైకలూరు :73060 88555	మండవల్లి: 8106099008
కలిదిండి :90594 84862	ముదినేపల్లి: 8008574693

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ? ముదినేపల్లి బస్టాండు సమీపంలో పోలీసుస్టేషన్ రహదారిలో చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. మురుగు చేరడంతో దుర్వాసన వెదజల్లుతోంది. - రవీంద్ర

✔ వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. - రమేశ్, కార్యదర్శి

స్పందనకు వందనం

కైకలూరు, న్యూస్‌టుడే: మండలంలోని సీతనపల్లి రామాలయం నుంచి గౌడ బజారుకు వెళ్లే మార్గంలో కొన్ని రోజుల నుంచి డ్రైనేజీ మురుగు నీరు నిల్వ చేరింది. రాకపోకలకు గ్రామస్థులు అవస్థలు పడుతున్నారని స్థానికుడు కమలాకర్ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ ఈవో కుమారి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆమె సైడు బోడెలు ఏర్పాటు చేయించి మురుగునీరు మళ్లించి సమస్య పరిష్కరించారు.

● కైకలూరు 2వ వార్డులో కొన్ని రోజులుగా చెత్త వ్యర్థాలు పేరుకుపోవడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తోంది. దీనిపై స్థానికుడు సీతారామయ్య 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో పవిత్రాకుమారి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె చెత్త తొలగించి, పారిశుద్ధ్య పనులు నిర్వహించారు.

సానారుద్రవరం (కలిదిండి), న్యూస్‌టుడే: సానారుద్రవరంలోని ప్రధాన మార్గంలో వీధి దీపాలు వెలగక పోవడంతో స్థానికులు రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్థానికుడు శ్రీను 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్య సర్పంచి నున్న రాజేశ్వరమ్మ దృష్టికి తీసుకొచ్చారు. సర్పంచి స్పందించి.. సిబ్బంది సహకారంతో వెలగని దీపాలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేయించారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలోని కపుల వెలమ పేటలో రెండో వార్డు హనుమాన్‌నగర్‌లో నూతన సంవత్సరం సంక్రాంతి పండగను పురస్కరించుకుని హనుమాన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను గురువారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో వార్డులోని క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు మాజీ కౌన్సిలర్ కందిపల్లి చెన్నారావు, తెదేపా పట్టణ కార్యదర్శి పల్లి నాగరాజు, వార్డు కౌన్సిలర్ దాసరి అప్పాజి బహుమతులు అందించారు.

వాసవీ క్లబ్ చేయూత

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: వాసవీ క్లబ్ సభ్యులు సత్యసాయి బాబా పాఠశాలకు గురువారం వివిధ కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం నగదు అందించారు. పెయింట్స్ కోసం దార లలిత ఆనంద్ రూ.15 వేలు, మాడా వెంకటేశ్వరరావు రూ.10 వేలు విరాళం ప్రకటించారు. తటవర్తి వెంకటేశ్వరరావు, సుశీల దంపతులు 20 మంది విద్యార్థులకు నూతన వస్త్రాలను బహూకరించారు.

రైతులతో వాలంటీర్ల చర్చ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని బోర్వంచలో గురువారం ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 వాలంటీర్లు తమ సేవా కార్యక్రమాలను కొనసాగించారు. గ్రామ రైతులతో చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పంటల నిర్వహణ, వ్యవసాయంలో డిజిటల్ సాంకేతికత వంటి అంశాలపై చర్చించారు. అనంతరం డిజిటల్ మాధ్యమాలను సురక్షితంగా వినియోగించడంపై అవగాహన కల్పించారు. తప్పుడు వార్తలను గుర్తించడం, వ్యక్తిగత సమాచార రక్షణ, ప్రభుత్వ సేవలకు సంబంధించిన సమాచారాన్ని సరిగా ఎలా పొందాలో అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కోఆర్డినేటర్ పీవీ లక్ష్మణరావు, ఏవో బి.లక్ష్మణరావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బోర్వంచ: ప్రదర్శనలో పాల్గొన్న ఏవో లక్ష్మణరావు

★ మండలంలోని రావిచర్లలో యూనిట్ 3 ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం జరిగింది. మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ గురించి వివరించారు. ఈ శిబిరాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.లక్ష్మణరావు, ట్రిపుల్ ఐటీ డీఎస్‌డబ్ల్యూవో రాజేశ్, చీఫ్ వార్డెన్ సురేశ్‌బాబులు సందర్శించి వాలంటీర్ల సేవలను అభినందించారు. యూనిట్ 3 ప్రోగ్రాం అధికారి సత్యదేవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

అభివృద్ధికే తొలి ప్రాధాన్యం: కామినేని

బసవన్నలతో ఎమ్మెల్యే శ్రీనివాస్

కైకలూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రతి గ్రామ అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇస్తానని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. వరహాపట్నం ఆయన నివాసంలో నూతన సంవత్సర వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల నుంచి భారీగా కూటమి శ్రేణులు, ప్రభుత్వ శాఖల అధికారులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కొల్లేరు ప్రజలకు త్వరల మంచి రోజులు రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు గ్రామంలోని భూసమేత లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అక్కడ బసవన్నలతో సందడి చేశారు.

కైకలూరు, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణను ఆయన కార్యాలయంలో అభిమానులు, కూటమి నేతలు, ప్రభుత్వ అధికారులు కొల్లేరు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ★ వైకాపా జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు రైల్వే స్టేషన్ రోడ్డులోని తన కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా బుడా సాహెబ్ ట్రస్టు అధినేత వైకాపా నాయకుడు గాలిబ్‌బాబు సహకారంతో కలిదిండికి చెందిన వికలాంగుడు సుభానీకి మూడు చక్రాల సైకిల్‌ను అందించారు.

సబ్‌కలెక్టరు కార్యాలయంలో .. నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు సబ్‌కలెక్టరు కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలను రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా నిర్వహించుకున్నారు. సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న కేక్ కోసి ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

★ నూజివీడు ట్రిపుల్ ఐటీలో నూతన సంవత్సర వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. విద్యార్థులు కేరింతలు, నృత్యాలతో ఆహా అనిపించారు. అర్ధరాత్రి 12 గంటలకు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్రకుమార్ కేక్ కోయడంతో ప్రాంగణం మొత్తం హ్యాపీ న్యూ ఇయర్ అనే నినాదంతో హోరెత్తింది. సాయంత్రం నుంచే వివిధ

ట్రిపుల్ ఐటీలో విద్యార్థినుల నృత్యాలు

నూజివీడులో కేక్ కోస్తున్న వినూత్న

సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడంతో యువత ఆనందానికి అవధులు లేవు. ఏవో లక్ష్మణరావు, అకడమిక్ డీన్ చిరంజీవి, వివిధ విభాగాల ప్రతినిధులు ఈ కార్యక్రమం పర్యవేక్షించారు.

నాయకులకు శుభాకాంక్షలు తెలిపిన పార్టీ శ్రేణులు..

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలను వివిధ రాజకీయ పార్టీల నాయకుల కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. నూజివీడులోని మంత్రి కొలుసు పార్థసారథి కార్యాలయంలో కేకు కోశారు. పట్టణ, మండల, ముసునూరు పార్టీ అధ్యక్షులు జగదీశ్, వాసు, రఘు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గాప్రసాద్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ దుర్గాదేవి, కౌన్సిలర్లు, మాజీ సర్పంచి చందు, కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ సత్యంబాబు, మాజీ ఎంపీటీసీ వై. నాగేంద్రప్రసాద్, పలు గ్రామాల నుంచి నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: వాసవి క్లబ్ నూతన అధ్యక్షుడిగా మాడ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా చలువాది రామకృష్ణ, పరిస శ్రీనివాసకుమార్, కార్యదర్శిగా చిట్లూరి కిశోర్ కుమార్, సహ కార్యదర్శి నాళ్ల లక్ష్మీనారాయణ, డోకుపర్తి సురేంద్రకుమార్, కోశాధికారిగా కందుల శశిధర్, పీఆర్వోగా మిర్యాల ప్రదీప్, మెడికల్ క్యాంప్స్ ఇన్‌ఛార్జిగా మానేపల్లి సతీశ్‌కుమార్, వేసవి మజ్జిగ పంపిణీ క్యాంపు ఇన్‌ఛార్జి తటవర్తి కుమార్, విద్యార్థుల సహాయ కమిటీ ఇన్‌ఛార్జిగా నారాయణ సుష్మణ్, టూర్స్ అండ్ ప్రోగ్రామ్స్ కమిటీ ఛైర్మన్ వనమా వెంకటేశ్వరరావు, జోన్ ఛైర్‌పర్సన్ గాదె శివరామకృష్ణ, జిల్లా సీఎంఆర్ ఇన్‌ఛార్జిగా చిన్నం శ్రీనివాసరావును ఎన్నుకున్నారు.

ఎంపీపీ లంక నిర్మలను అభినందిస్తున్న మండల పరిషత్తు సిబ్బంది

పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

చాట్రాయి, న్యూస్‌టుడే: పథకాలను పేదలకు చేరువ చేసేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలనే ఆకాంక్షను ఎంపీపీ లంక నిర్మల వ్యక్తం చేశారు. బూరుగుగూడెంలో సర్పంచి దేశిరెడ్డి హైమావతి ఇంటిలో గురువారం నిర్వహించి వేడుకల్లో ఈవోఆర్డీ విజయలక్ష్మి, ఎంఈవో-2 వీఎస్వీ బ్రహ్మచారి, ఏపీవో లక్ష్మీకుమారి, కార్యదర్శి నాగరాజులతో ఎంపీపీ నిర్మలకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం!

ముసునూరు, న్యూస్‌టుడే: స్తంభాలు వేశామా.. తీగలు లాగామా అన్నంత వరకే విద్యుత్తు అధికారులు, సిబ్బంది పరిమితమవుతున్నారు. ముసునూరు మండలం రమణక్కపేట సచివాలయం వెనుక రహదారి పక్కన ఉన్న నియంత్రిక, స్తంభాల చుట్టూ కొమ్మలు, తీగ జాతి పాదుల అల్లుకున్నాయి. వాటిని తొలగించడంపై దృష్టి సారించడం లేదు. అప్పుడప్పుడు సరఫరాను నిలిపివేసి కొమ్మలను తొలగిస్తున్నా.. పాదులను చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారు. ఆ ప్రాంతంలో నివాసముంటున్న వారు స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మరోవైపు పొదలు వల్ల విద్యుత్తు అంతరాయం ఏర్పడుతోందని చెబుతున్నారు. దీనిపై విద్యుత్తు ఏఈ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రమాదమని తెలిసినా..

ట్రాక్టర్‌పై భద్రతలేని ప్రయాణం

చాట్రాయి, న్యూస్‌టుడే: వారంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీలు.. చాట్రాయి మండలంలో 11 కేవీ విద్యుత్తు లైన్లు నిర్మాణ పనులకు వలస వచ్చారు. పనికి వచ్చే సమయంలో గుత్తేదారు సమకూర్చిన ట్రాక్టర్‌పై సామాన్లు తీసుకుని పని ప్రదేశానికి వచ్చి వెళ్తుంటారు. ప్రమాదకరమైన ప్రయాణం చేస్తున్నామని తెలిసినా తామంతా ఎత్తైన స్తంభాలపై పనులు చేస్తుంటామని.. ఇదేమంత ప్రమాదం కాదనే ధీమాను వారు వ్యక్తం చేయడం విశేషం. ఏదైనా జరిగితే మీ కుటుంబాలకు ఎలా అంటే తాము నిత్యం ప్రమాదంలో పనులు చేస్తున్నామని తెలిపారు.

చుట్టూ పిచ్చి మొక్కలు.. మధ్యలో కళాశాల!

కలిదిండి, న్యూస్‌టుడే: కలిదిండి శివారు పడమటిపాలెంలోని అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ పిచ్చి మొక్కలు పెద్దగా పెరిగిపోయాయి. రహదారి పక్కన కళాశాల ప్రహరీకి ఆనుకుని పొదలుగా ఏర్పడ్డాయి. వీటిలో విష పురుగులు సంచరించే అవకాశం ఉంది. ఇవి కళాశాల గదుల్లోకి చొరబడితే విద్యార్థులకు హాని కలిగిస్తాయి. వీటిని కొంతకాలంగా తొలగించడం లేదు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రాజశ్రీ స్పందిస్తూ.. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతూ ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బంది దృష్టిలో పెట్టామని తెలిపారు. వీలైనంత త్వరగా తొలగించేలా చూస్తామన్నారు.

మురుగు పారదు.. సమస్య తీరదు

ముసునూరు, న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్య వైఖరితో తమ ఆరోగ్యాలను పణంగా పెట్టాల్సి వస్తోందని ముసునూరు మండలం చింతలవల్లి ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీలో డ్రెయినేజీలో ఓ వ్యక్తి మురుగు నీరు ముందుకు పారనివ్వకుండా అడ్డుకట్ట వేశారు. దీంతో రోజుల తరబడి కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిల్వ ఉండి, దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయని వాపోతున్నారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణను వివరణ కోరగా ఈ సమస్య తమ దృష్టికి వచ్చిందని రెండు రోజుల్లో కాలువను శుభ్రం చేయిస్తామని చెప్పారు.

అల్లూరులో దుస్తులు పంపిణీ చేసిన నాగరాజు, ఆనందకుమార్

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛంద సంస్థల అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలుగు యువత ఉపాధ్యక్షుడు దావు నాగరాజు అన్నారు. అల్లూరులోని సజీవ సువార్త ప్రార్థనా మందిరంలో గురువారం వివేక ఫౌండేషన్, ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆనందకుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం నాగరాజు చేతులు మీదగా సుమారు వందమంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. పాస్టర్ లాజరస్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వితరణ

చాట్రాయి, న్యూస్‌టుడే: చనుబండలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండల ఆర్యవైశ్య సంఘాధ్యక్షుడు నడిపల్లి కిశోర్ గురువారం 50 మందికి దుస్తులు, 100 మందికి దుప్పట్లు పంపిణీ చేసి వారికి భోజనాన్ని అందించారు. పెంతెకోస్తు ప్రార్థనా మందిరానికి రూ.లక్ష అందించారు. రెండేళ్లుగా తాను ఇరవై మంది వృద్ధులకు నిత్యం వారి ఇంటికే రెండు పూటలకు సరిపోయేలా భోజనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలైన వృద్ధులు ఆకలితో పస్తులుండరాదనే లక్ష్యంతో తాను సేవ చేస్తున్నట్లు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ ఉద్యోగులకు మద్దతు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: న్యాయమైన సమస్యల పరిష్కార సాధనకు పోరాటం చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సీపీఐ, సీపీఎం నాయకులు వేర్వేరుగా మద్దతు తెలిపారు. గురువారం అసిస్టెంట్ ప్రొఫెసర్లు తొమ్మిదో రోజు నిరాహార దీక్షను కొనసాగించారు. వీరికి ట్రిపుల్ ఐటీలోని వివిధ విభాగాల ఉద్యోగులు మాత్రమే కాకుండా కార్మిక సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని రామారావు, నియోజకవర్గ నాయకుడు చాట్ల పుల్లారావులు అసిస్టెంట్ ప్రొఫెసర్లను కలిసి మాట్లాడారు. సమస్యను పరిష్కరించకుండా అధికారులు జాప్యం చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు అలసత్వాన్ని ప్రదర్శించడం అన్యాయమని అసిస్టెంట్ ప్రొఫెసర్లు

అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మద్దతు ప్రకటించిన నాయకులు రామారావు, పుల్లారావు

పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ క్యాంపస్ అంతా ప్రదర్శన నిర్వహించారు. వి.నాయుడు, కృష్ణ, సతీశ్, సీతాపతి, వేణుగోపాల్, దుర్గాబాబు, వెంకటేశ్వర్లు, చింతయ్యానాయుడు, గణేశ్, జడా సుబ్బారావు, విజయశ్రీ, దీప్తి సాహు, సుధీర్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణరావు, వై.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల ముంగిట రంగవల్లులు



నూజివీడు, ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ... నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ.. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు బుధవారం అర్ధ రాత్రి నుంచి నూతన సంవత్సర సంబరాలు చేసుకున్నారు. మహిళలు ఇళ్ల ముంగిట అందమైన రంగ వల్లులను తీర్చిదిద్దారు. గ్రామాల్లో యువత కేకులు కోసి, మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చర్చిలో ప్రార్థనలు, ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

కాలమానిని ఆవిష్కరణ

ముదినేపల్లి, న్యూస్‌టుడే: నేషనల్ జస్టిస్, హ్యూమన్ రైట్స్ కాలమానిని గురువారం డాక్టర్ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేతులు మీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలతో ప్రతి ఒక్కరికి సామాజిక, వ్యక్తిగత న్యాయం అందేలా, వారి హక్కులు తెలుసుకునేలా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి వీవీవీ సత్యప్రసాద్, భాజపా జిల్లా నాయకులు కోటప్రోలు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: యూటీఎఫ్ 2026 కాలమానిని, డైరీని గురువారం మండల వనరుల కేంద్రంలో ఎంఈవో ఎస్. హేబేలు ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా యూటీఎఫ్ పని చేస్తున్నట్లు ఆ సంఘ నాయకులు తెలిపారు. నాయకులు కె.అజరయ్య, జె.వెంకటేశ్వరరావు, జె.జ్ఞాన సుందరం, పి.కృష్ణ, జి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బూరుగుగూడెంలో జూదంపై దాడి

చాట్రాయి, న్యూస్‌టుడే: బూరుగుగూడెంలో గ్రామ శివారులో జూదంపై గురువారం దాడి చేసినట్లు ఎస్సై డి.రామకృష్ణ తెలిపారు. దాడిలో 17 మందిని అదుపులో తీసుకోని రూ.21,030, 19 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

నూజివీడు మెయిన్ బ్రాంచి (00889), యస్ వాణి టవర్స్, హనుమాన్ జంక్షన్ రోడ్, నూజివీడు, ఏలూరు జిల్లా-521201.

APPENDIX-IV-A

{see provision to rule 8(6)R/w9(1)}

స్థిరాస్తి ఈ-వేలం అమ్మకం బహిరంగ ప్రకటన తేది.20-01-2026

https://www.baanknet.com

రిజర్వు ధర: రూ.40,70,682/- ధరావత్తు: రూ.4,07,069/- బిడ్ పెంపుదల: రూ.10,000/-

ఇ-వేలం తేదీ & సమయం: 20-01-2026 ఉ॥ గం॥ 11.00 ల నుండి సా॥ గం॥ 4.00 ల వరకు

NEFT/RTGS ... https://www.baanknet.com ... sbi.00889@sbi.co.in ... DRS Associates ...

సం/- అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్

ప్రదేశం: నూజివీడు

తేది : 31-12-2025

విద్యార్థుల్లేక వసతిగృహం మూత

మండవల్లి, న్యూస్‌టుడే: నిత్యం పేద విద్యార్థులతో కళకళలాడిన మండవల్లి బీసీ బాలుర వసతిగృహం నేడు వెలవెలబోతోంది. వసతి పొందేందుకు ఒక్కరూ లేకపోవడంతో పూర్తిగా మూతపడింది. గతంలో వందల సంఖ్యలో విద్యార్థులు ఉన్న ఈ వసతి గృహానికి ఇటువంటి దుస్థితి రావడంపై ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. గత విద్యా సంవత్సరం 17 మంది ఉండగా ఈ ఏడాది 11 మందికే పరిమితమైంది.

దురలవాట్లకు బానిసలై

5 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు ఇక్కడ వసతి పొందేవారు. అయితే కొందరు దురలవాట్లకు బానిసలైనట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి ఆజ్యం పోస్తూ ఇటీవల ఓ నలుగురు విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడటంతో పాటు ఇతర విద్యార్థులతో దురుసుగా ప్రవర్తించడంతో వీరిని బహిష్కరించారు. దీంతో విద్యార్థుల సంఖ్య కేవలం ఏడుగురికి పరిమితమైంది. రాత్రి వేళల్లో నిద్రించేందుకు ఇబ్బందులు ఎదుర్కొనడంతో ఇక్కడ పరిస్థితుల నేపథ్యంలో పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెందిన తల్లిదండ్రులు వీరిని ఇంటికి తీసుకెళ్లిపోయారు. గత డిసెంబరు 22 నుంచి వసతి గృహంలో ఒక్కరూ లేక పూర్తిగా మూతపడింది. దీనిపై బీసీ వసతి గృహ వార్డెన్ రాధను సంప్రదించగా.. ప్రస్తుతం విద్యార్థులు లేక పోవడంతో పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాం. జూన్ నుంచి విద్యార్థుల సంఖ్య పెంచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

అలల సవ్వడి.. అందెల రవళి

సంప్రదాయ నృత్య వస్త్రధారణలో ఒక్కొక్కరుగా చిన్నారులు వేదికపైకొచ్చారు. నాట్యాచార్యుల స్వరార్చనకు అనుగుణంగా అందెలు కదుపుతూ నృత్యంతో అలరించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా గురువారం కాకినాడ సముద్ర తీరంలోని శిల్పారామం.. అనంత సందడికి అద్భుత వేదికైంది. అటు సముద్రంలో అలలు సవ్వడి చేస్తుంటే.. ఇటు చిరుపాదాల అందెల రవళి అలరించిన చిత్రమే ఇది.

– న్యూస్‌టుడే, సర్పవరం

వాడపల్లిలో ఆధ్యాత్మిక శోభ

అష్టోత్తర పూజ చేస్తున్న అర్చకస్వామి, పాల్గొన్న భక్తజనం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: నూతన ఆంగ్ల సంవత్సరం ప్రారంభం సందర్భంగా గురువారం కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం అశేష భక్తజనంతో శోభిల్లింది. ఈ సందర్భంగా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. తొలుత గోపూజ, ఐశ్వర్య లక్ష్మీహోమం, తిరుప్పావై సేవ, 17వ పాశుర విన్నపం, తీర్థగోష్ఠి తదితర కార్యక్రమాలను అర్చకులు జరిపించారు. అనంతరం అష్టోత్తర శతనామావళి పూజలు, కల్యాణం నిర్వహించారు.

మొక్క ఎదిగితే చెట్టు.. వంతెనకే చేటు

కాకినాడ నుంచి రాజమహేంద్రవరం, సామర్లకోట నుంచి బిక్కవోలు ప్రాంతాలను కలిపే రహదారులకు కేంద్ర బిందువుగా ఉన్న సామర్లకోట పైవంతెన పరిస్థితి ఇది. ఇరువైపులా గోడల్లో రావి, ఇతర మొక్కలు పెరిగాయి. దీంతో వంతెన పటుత్వం కోల్పోయి బీటలు వారుతోంది. మరోవైపు రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుతున్నాయి. వారధికి ఇరువైపులా పెరిగిన మొక్కలను తొలగించి, వారధిపై రక్షణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. – ఈనాడు, కాకినాడ

పెరుగుతున్న స్క్రబ్ టైఫస్ కేసులు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: జిల్లాలో గత ఏడాదిలో మొత్తం 191 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయని డీఎంహెచ్‌వో తెలిపారు. గతనెలలో మొత్తం 43 పాజిటివ్ కేసులు వచ్చాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు.

బియ్యం వారివి.. భోజనం వీరిది!

ఏటా రూ.20 కోట్లు పక్కదారి

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

రేషన్‌కార్డుదారులు శాశ్వతంగా ఇతర రాష్ట్రాలకు వలసవెళ్లినా, కుటుంబ సభ్యులు మరణించినా, ఇతర దేశాలకు వెళ్లిన వారికి యథావిధిగా ప్రభుత్వం ప్రతి నెలా రేషన్ బియ్యం విడుదల చేస్తోంది. ఈ విధానంతో పెద్ద ఎత్తున సరకు పక్కదారి పడుతోందని, దీని అడ్డుకట్టకు కార్డులోని ప్రతి సభ్యుడు విధిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని కేంద్రం ఆదేశించింది. గత కొన్ని నెలలుగా జిల్లాలో ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటికీ 77 వేల మంది ఈకేవైసీ పెండింగ్‌లో ఉంది. వీరు ఎక్కడున్నారనే వివరాలు తెలియడం లేదు. కానీ కార్డులోని అందరికీ ప్రతీనెలా రేషన్ పంపిణీ మాత్రం జరుగుతోంది.

రేషన్ బియ్యం

ఏడాదికి 4,620 టన్నులు

కాకినాడ జిల్లాలో కార్డుదారులకు ప్రతినెలా 9,300 టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. వీరిలో ఈకేవైసీ చేయకుని 77 వేల మందికి 385 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇదంతా పక్కదారి పట్టినట్లే.. ఇలా ఏడాదికి 4,620 టన్నుల బియ్యం అక్రమార్కుల పాలవుతోంది.

నెలకు రూ.1.64 కోట్లు..

ప్రభుత్వం కిలో బియ్యానికి రూ.46 వెచ్చిస్తోంది. ఈ లెక్కన జిల్లాలో ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న సభ్యులకు ప్రతినెలా రూ.1.64కోట్ల విలువైన బియ్యం సరఫరా చేస్తున్నారు. ఏడాదికి ఈ లెక్క రూ.20 కోట్లకు చేరుతోంది.

రేషన్‌కార్డుల్లోని సభ్యుల ఈకేవైసీకి 2025, నవంబరు 30 వరకు గడువు ఇచ్చారు. అందరూ డీలరు, గ్రామ/వార్డు సచివాలయాల్లో తప్పనిసరిగా ఈకేవైసీ(వేలిముద్ర నమోదు) చేసుకోవాలని సూచించారు. గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయకపోతే కార్డుల్లో వారి పేర్లు తొలగిస్తామని ప్రభుత్వం ఆదేశించింది.

చర్యలు చేపట్టరే..?

ఇప్పటి వరకు పట్టించుకోలేదు. వలి తంగా ప్రతినెలా రూ.కోట్ల విలువైన బియ్యాన్ని అక్రమార్కులు బొక్కేస్తున్నారు. అలాగే వరుసగా ఆరు నెలలు రేషన్ తీసుకోకపోయినా కార్డు రద్దయ్యే మార్గదర్శకాలు జారీ చేసింది. జిల్లాలో ప్రతినెలా 10 శాతం కార్డుదారులు సరుకులు తీసుకోవడం లేదు. వీరిని ప్రభుత్వ గణాంకాలు రుజువు చేస్తున్నాయి. ఇప్పటికైనా నిజమైన లబ్ధిదారులు ఉంటే.. ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకునేలా అధికారులు దృష్టిసారించి, రూ.కోట్ల విలువైన సరకు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

కార్డుల్లోని సభ్యులు	ఈకేవైసీ పూర్తయినవారు	నమోదు అవసరం లేని చిన్నారులు, వృద్ధులు	నమోదు చేసుకోనివారు
18,39,728	17,19,678	42,656	77,394

డ్వాక్రా మహిళల దొడ్డ మనసు

కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న మహిళా సమాఖ్య ప్రతినిధులు, అధికారులు

పతాక నిధి, వసతి గృహాలకు రూ.57.82 లక్షల విరాళం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామీణ ప్రాంత డ్వాక్రా మహిళలు పెద్ద మనసు చాటారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, కలెక్టర్ పిలుపు మేరకు సాయుధ దళాల పతాక దినోత్సవ పురస్కరించుకుని జిల్లాలోని 3,85,480 మంది డ్వాక్రా మహిళలు రూ.10 చొప్పున విరాళాన్ని సేకరించారు. డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావు, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధుల ఆధ్వర్యంలో రూ.38,54,800 చెక్కును గురువారం కలెక్టర్‌కు అందించారు. అలాగే జిల్లాలోని వసతి గృహాల్లో సౌకర్యాలకు ఒక్కొక్కరు రూ.5 చొప్పున విరాళాన్ని సేకరించి, రూ.19,27,400 చెక్కును కలెక్టర్‌కు ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ-సెర్ప్ ఏపీడీ జిలానీ, డీపీఎంలు అశోక్‌భరత్, కేశవరావు, బాబూరావు, రాయ్, వెంకటేశ్వరరావు, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు జల్లి ధనలక్ష్మి, ఎం.నాంచారమ్మ పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలపై రాజముద్ర

నేటి నుంచి గ్రామసభ ద్వారా అందజేత

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్– ఈనాడు, కాకినాడ

కొత్త సంవత్సరంలో రైతులకు రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు అందనున్నాయి. ఈ నెల 2 నుంచి 9 వరకు ఊరూరా గ్రామసభలు నిర్వహించిన వీటి పంపిణీకి జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లాలో భూముల రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో గత వైకాపా ప్రభుత్వంలో జగన్ బొమ్మతో పట్టాదారు పాసపుస్తకాలు ఇచ్చింది. దీనిపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక.. రాజముద్రతో కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. దీని ప్రకారం జిల్లాకు 1,56,507 పట్టాదారు పాసు పుస్తకాలు విడుదల చేసింది. గ్రామసభల ఏర్పాటుకు షెడ్యూల్ విడుదల చేసినట్లు డీఆర్వో జె.వెంకటరావు తెలిపారు.



కొత్త పాసుపుస్తకం

ఇలా చేస్తారు

- పట్టాదారుల వివరాల్ని వెబ్‌ల్యాండ్‌లోని వివరాల ప్రకారం సరిపోల్చి చూస్తారు.
- ఎలాంటి తప్పులు లేని పాసుపుస్తకాలను అందజేస్తారు.
- పాతవి కాలు వెనక్కు తీసుకుంటారు.
- చిన్న చిన్న తప్పులు సరిదిద్దడానికి తహసీల్దార్లకు అధికారాలిచ్చారు.
- యజమానులు చనిపోతే వారి స్థానంలో వారసులకు ఇస్తారు.
- అత్యధికంగా పిఠాపురం మండలంలో 20,883 మందికి, అత్యల్పంగా కోటనందూరులో 496 మందికి పుస్తకాలు వచ్చాయి.

317 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి

జిల్లాలో 414 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 317 గ్రామాల్లో రీ-సర్వే పూర్తయింది. వీటిలో 291 గ్రామాలకు సంబంధించి రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు విడుదల చేశారు. ఇంకా 26 గ్రామాలకు ఇవి రావాల్సి ఉంది.

రాజముద్రతో వచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలు - 1,56,057

కాకినాడ రెవెన్యూ డివిజన్‌కు వచ్చినవి 1,13,237

పెద్దాపురం డివిజన్ 42,820

కొండల్లో రింగ్ రింగా!

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: జిల్లా మొత్తం ఏనాడో సెల్ ఫోన్లతో మమేకం కాగా.. ప్రత్తిపాడు నియోజకవర్గం ఉపప్రణాళిక మన్యంలోని పల్లెలు మాత్రం సమాచార వ్యవస్థకు దూరంగా ఉండేవి. ఇప్పటికీ 20 పల్లెలు ఏ నెట్‌వర్కుకు నోచక మౌనం దాల్చుతూనే ఉన్నాయి. ప్రభుత్వం సెల్‌ఫోన్ నెట్‌వర్కును అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేయడంతో కొండా కోనల్లోని జనం బాహ్య ప్రపంచంతో క్రమేపీ అనుసంధానం అవుతున్నారు. ప్రత్తిపాడు మండలంలోని ఎత్తైన కొండల మధ్య ఉన్న ఉలిగోగులలో గత మూడు నెలలుగా బీఎస్ఎన్ఎల్ పలుకుతోంది. ఈ తండాలో 38 కుటుంబాలకూ సమాచారం ఇవ్వడం సులువైంది. ఎత్తైన గిరులపై ఉన్న బురదకోట పంచాయతీ పరిధిలోని బాపన్నధార, కె.మిర్తివాడ, కొండపల్లి, బురదకోటల్లో మూడు సెల్ టవర్లు ఏర్పాటవుతాయని తహసీల్దార్ సూర్యప్రభ తెలిపారు. శంఖవరం మండలంలో కొండల మధ్య ఉన్న వజ్రకూటంలో కొన్నేళ్ల క్రితమే టవర్ వచ్చినా చరవాణి సంకేతాలు అందేవి కావు. ఇపుడు చక్కగా పలుకుతోంది. రౌతులపూడి మండలం రాఘవపట్నంలో సెల్‌నెట్‌వర్కుకు స్థలం కేటాయించినట్లు అధికారులు తెలిపారు. కాకినాడ జిల్లాకు మంజూరైన 9 టవర్లు ప్రత్తిపాడు నియోజకర్గంలోనే ఏర్పాటు అవుతున్నాయి.

ఉలిగోగుల తండాలో అందుబాటులోకి వచ్చిన సెల్‌టవర్

అన్నవరం.. ప్రగతి మార్గం

భక్తులకు మెరుగైన సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టి

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానం అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. కేంద్ర ప్రభుత్వ పథకం 'ప్రసాద్', దేవస్థానం నిధులతో పలు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో ఇవన్నీ అందుబాటులోకి రానున్నాయి.

సాగుతున్న క్యూకాంప్లెక్స్ నిర్మాణం

రూ.18.98 కోట్లతో 'ప్రసాద్' పనులు

ఏళ్లుగా దస్త్రాలకే పరిమితమైన కేంద్ర ప్రభుత్వ పథకం 'ప్రసాద్' ద్వారా పలు పనులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టాలెక్కాయి. రూ.18.98 కోట్లతో పనులు జరుగుతున్నాయి. రత్నగిరిపై అన్నదాన భవన నిర్మాణం జరుగుతుంది. జీ ప్లస్1లో నాలుగు హాళ్లు నిర్మాణం చేస్తున్నారు. ఒకేసారి 1,400 మంది భక్తులు భోజనాలు చేయవచ్చు. 1,500 మంది భక్తులు వేచి ఉండేలా రెండు హాళ్లలో క్యూ కాంపెక్స్ నిర్మాణం చేస్తున్నారు. రూ.7.07 కోట్ల దేవస్థానం నిధులతో 105 గదులతో సీతారామ సత్రం వసతి సముదాయం నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఎగువ ఘాట్ రోడ్డుకు ఆనుకుని కొండపైకి 350 మెట్లతో మరోమార్గాన్ని నిర్మిస్తున్నారు.

బృహత్తర ప్రణాళికలో మార్పులు

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా దేవస్థానం బృహత్తర ప్రణాళికలో కొన్ని మార్పులు చేస్తున్నారు. సత్యగిరిపై వివాహాలు చేసుకునే వారికి సాధారణ ఛార్జీలతో వసతి సౌకర్యాలు, యోగా ఆసుపత్రి నిర్మాణానికి పరిశీలిస్తున్నారు.

సత్యసాయి స్మారక నాణెం

అమలాపురం పట్టణం: భగవాన్ సత్యసాయి బాబా శత జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం రూ.100 ముఖవిలువతో స్మారక నాణెం విడుదల చేసింది. దీనిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన పుత్సా కృష్ణ కామేశ్వర్ ప్రత్యేక ఆర్డర్‌పై గురువారం తెప్పించారు. దీనిని రూ.6,330కు కొనుగోలు చేసినట్లు కామేశ్వర్ చెప్పారు.

మార్పులు.. మార్కులు

ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షల్లో అమలు

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు రాసే విద్యార్థులు కొత్త విధానంలో రాయాల్సి ఉటుంది. ఈ ఏడాది నుంచి జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) సిలబస్‌ను అమల్లోకి తెచ్చారు. దాంతో ప్రశ్నపత్రాల్లో మార్పు చేశారు. తొలిసారి ఒక్క మార్కు ప్రశ్నలను ప్రవేశపెట్టారు. జవాబులు రాసేందుకు 32 పేజీల బుక్‌లెట్‌ను ఇవ్వనున్నారు.

సబ్జెక్టుల వారీగా ఇలా..

- గణితంలో గతంలో 150 మార్కులకు రెండు పేపర్లు ఉండేవి. ఈ సారి వంద మార్కులకు ఒక పేపరునే అమలు చేయనున్నారు.
- గణితం, భౌతిక, రసాయనశాస్త్రాలు, చరిత్ర, రాజనీతి శాస్త్రం, అర్థశాస్త్రం, కామర్సు సబ్జెక్టులకు 32 పేజీల జవాబు పత్రాల బుక్‌లెట్ అందిస్తారు.
- జీవశాస్త్రంలో.. వృక్షశాస్త్రానికి 24 పేజీలు, జంతు శాస్త్రంలో 24 పేజీలు చొప్పున రెండు బుక్‌లెట్లు ఇస్తారు. ప్రశ్నపత్రంలో మాత్రం ఏ, బీ సెక్షన్లుగా వృక్ష, జంతు శాస్త్రాలకు వేర్వేరుగా ప్రశ్నలు ఇస్తారు. జవాబులను విడిగా రాయాల్సి ఉంటుంది.
- భౌతిక, రసాయన, జీవశాస్త్రాలకు సంబంధించి మొదటి సంవత్సరంలో 85 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఉత్తీర్ణతకు 35 శాతం లెక్కన 29.75 శాతం మార్కులు రావాలి. అయితే వీటిని 29కి తగ్గించారు. ద్వితీయ సంవత్సరంలో మాత్రం 30 వస్తే ఉత్తీర్ణతగా పరిగణిస్తారు.
- మిగతా సబ్జెక్టులకు గతంలో మాదిరిగానే 24 పేజీల బుక్‌లెట్‌ను అందిస్తారు.
- జాగ్రఫీ పరీక్షను గతంలో మాదిరిగానే 75 మార్కులకు నిర్వహించి.. 85 మార్కులకు లెక్కిస్తారు. ద్వితీయ సంవత్సరంలో 30 మార్కులకు ప్రాక్టికల్ పరీక్షను నిర్వహిస్తారు.

రెండో ఏడాది 30 మార్కుల ప్రాక్టికల్ పరీక్షల్లో ఉత్తర్ణత మార్కులను 10.5 నుంచి 11 మార్కులకు పెంచారు.

ఇవీ లెక్కలు..	
జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు	171
పరీక్షలు జరగనున్న కేంద్రాలు	58
ప్రథమ సంవత్సరం విద్యార్థులు	22,009 మంది
ద్వితీయ విద్యార్థులు	20,864

అంతా సన్నద్ధం..

ఈ ఏడాది నుంచి ఇంటర్ ప్రథమ విద్యార్థులకు కొత్త విధానంలో పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అందుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల విద్యార్థులను సంసిద్ధం చేశాం. ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్షలు రాయాలి.

- ఐ.శారద, జిల్లా ఇంటర్ విద్య అధికారిణి. కాకినాడ

ఖాళీలు 34.. దరఖాస్తులు 457

పారామెడికల్ పోస్టులకు పోటాపోటీ

ఈనాడు, కాకినాడ: కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల పరిధిలో పారామెడికల్ పోస్టుల భర్తీకి ఎక్కువ మంది పోటీపడుతున్నారు. మొత్తం 34 పోస్టులకు 457 దరఖాస్తులు వచ్చాయి. జనరల్ డ్యూటీ అటెండెంట్ పోస్టులు 14 ఖాళీలకు 326 మంది పోటీ పడుతున్నారు. రేడియో థెరపీ పోస్టులు మూడు ఉంటే ఒక్క దరఖాస్తే వచ్చింది. సీటీ, ఓటీ టెక్నీషియన్ పోస్టులకు ఎక్కువ మంది పోటీపడుతున్నారు. తుది జాబితాలు ప్రదర్శించి కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. అధికార పార్టీ నేతలు తమ వారి కోసం పైరవీలు చేస్తున్నారు.

శ్రద్ధాంజలి

వైద్యరంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, ఎందరో వైద్య విద్యార్థినీ, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతూ మీరు చేసిన సేవలు అనిర్వచనీయమైనవి. మీ సేవలు ఎప్పటికీ మరువలేనివి. మీరు భౌతికంగా మా నుండి దూరమైననూ మీ తీపి జ్ఞాపకాలు ఎల్లప్పుడూ మా వెంటే ఉంటాయి. దైవ సన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...

అంజలి ఘటిస్తూ....

మీ... భార్య: శ్రీమతి Y. పద్మావతి

డాక్టర్ Y. శేషగిరిరావు గారు
M.D. (Gen. Med.) DCH.
Area Hospital, Tuni
Retd. Professor,
Civil Surgeon Specialist
జననం: 28-01-1956
స్వర్గస్తు: 22-12-2025

కుమారుడు: Dr. Y. వెంకటేష్, MD
కుమార్తె-అల్లుడు: శ్రీమతి S. ప్రియాంక - S. శ్రీనివాస్
అన్నయ్యలు - వదినలు: Y. రంగారావు - Y. శశికళ (Late), Y. జగన్నాథరావు - Y. ఉషారాణి
మనుమరాలు: S. శ్రీనిత
చెల్లెలు - బావగారు: R. సుగుణ - R. కన్నారావు
బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు

పెద్దకర్మ తేదీ: 03-01-2026 శనివారం ద్వారకానగర్, పార్చ్యూన్ శ్రీకన్య హోటల్ నందు జరుగును.

ఒక్కరోజు.. రూ.6.42 కోట్ల మద్యం

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: పాత ఏడాదికి వీడ్కోలు చెబుతూ, కొత్త ఏడాదికి స్వాగతం పలికిన సందర్భంగా జిల్లాలో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. నచ్చిన బ్రాండ్లు అందుబాటులో ఉండటంతో అమ్మకాలు పెరిగాయి. డిపోల నుంచి 31వ తేదీన సుమారు రూ.6.42 కోట్ల విలువైన సరకును దుకాణాలకు తరలించారు. గతంలో ఇదే రోజున రూ.3.99 కోట్ల మద్యం అమ్మకాలు జరగ్గా, ఇప్పుడు రూ.2.43 కోట్లు అధికంగా ఆదాయం వచ్చింది. పలువురు వైన్‌షాప్‌ల వద్ద బారులుదీరారు. జనవరి ఒకటో తేదీన రూ.2,14,86,264 కోట్ల మద్యాన్ని విక్రయించారు. గత ఏడాది ఒకటిన రూ.1.30 కోట్లు అమ్మకాలు జరిగాయి. దాంతో పోలిస్తే ఈ సారి రెట్టింపు విక్రయాలు జరిగాయి.

సర్కిల్ పేరు	ఐఎంఎల్	బీరు	విలువ(రూ.లో)
కాకినాడ నార్త్	2312	761	2,00,83,929
కాకినాడ సౌత్	1361	872	1,34,44,809
పెద్దాపురం	826	356	67,85,938
పిఠాపురం	807	492	68,09,128
ప్రత్తిపాడు	508	452	47,86,668
తాళ్లరేవు	900	347	67,88,070
తుని	678	349	55,61,118

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో జాప్యమేల!

ఎమ్మెల్సీ అనంతబాబుకు కొందరి సహకారం

ఈనాడు, కాకినాడ: కాకినాడకు చెందిన దళిత యువకుడు, డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్యకేసు విచారణలో ఇప్పుడూ అదే నిర్లక్ష్యం కనిపిస్తోంది. 2022 మేలో ఆయన హత్యకు గురయ్యారు. గత ప్రభుత్వంలో నీరుగారిపోయిన ఈ కేసును ప్రస్తుత ప్రభుత్వం కొలిక్కితెచ్చి నిందితులకు శిక్ష పడేలా చేస్తారని ఆశించినా ఆ స్థాయిలో విచారణ సాగడంలేదనే విమర్శలున్నాయి. నిందితుడు వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుకు ఇప్పుడు కూడా కొంతమంది సహకారం అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

సాక్ష్యాల విశ్లేషణ కీలకం..

సుబ్రహ్మణ్యం హత్య కేసు తదుపరి విచారణకు కోర్టు అనుమతించి గడువు విధించినా పోలీసులు మాత్రం సీసీటీవీ పుటేజీ, ఫోరెన్సిక్ ల్యాబ్ ఫలితాలపైనే ఆధారపడ్డారు తప్ప ఇతర సాక్ష్యాల సేకరణ, విశ్లేషణపై పెద్దగా దృష్టిపెట్టలేదు. ఎమ్మెల్సీ అనంతబాబు ఐ ఫోన్‌లో సమాచారం సేకరించేలా ప్రయత్నించలేదు. అప్పట్లో పోలీసులు కొన్ని ఆధారాలను తప్పించారు. అనంతబాబు భార్య లక్ష్మీదుర్గను విచారణకు హాజరుకావాలని రెండు సార్లు, రెండు విధాలుగా నోటీసులు జారీ చేయడం విమర్శలకు తావిస్తోంది.

సమాచార లీకు వీరులెవరు..

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో లక్ష్మీదుర్గ కుల ధ్రువీకరణ కోసం అడ్డతీగల తహసీల్దార్ కార్యాలయానికి సిట్ అధికారి లేఖ రాశారు. సమాచారం పోలీసులకు రాకముందే ఆ లేఖ అనంతబాబుకు చేతికి చేరింది. దీని ఆధారంగానే నిందితుని భార్య ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలుచేశారు. సిట్‌లో కూడా ఒకరిద్దరు వైకాపా నాయకులతో టచ్‌లో ఉన్నారనే ఆరోపణలున్నాయి. ఈ కేసు విచారించేందుకు ప్రభుత్వం నియమించిన న్యాయవాది ముప్పాల సుబ్బారావు వద్ద ప్రస్తావించగా సిట్ విచారణలో కొన్ని లోపాలున్నాయని, వాటిపై పోలీసులను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. లేఖ లీకు అంశం కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ వద్ద ప్రస్తావించగా పోలీసు వర్గాల నుంచి బయటకు వెళ్లలేదని, రెవెన్యూ నుంచి వెళ్లిందేమో పరిశీలిస్తామన్నారు.

ఖో.. అంటే పతకం కొట్టాల్సిందే!

న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపిస్తున్నారు జిల్లాకు చెందిన ఈ క్రీడాకారిణులు. ఖోఖోలో రాణిస్తూ పతకాలు సాధిస్తూ ఔరా అనిపిస్తున్నారు. ఇటీవల గుడివాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు మూడోస్థానంలో నిలవడంలో వీరు కీలక పాత్ర పోషించారు. ఆ ప్రతిభతో జనవరి మూడోవారంలో తెలంగాణలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మరింత పట్టుదలతో సాధన చేసి, అంతర్జాతీయ పోటీల్లో రాణించడమే తమ లక్ష్యమని వారు పేర్కొంటున్నారు.

రైల్వే ఉద్యోగం సాధిస్తా

బీపీటీ మొదటి ఏడాది చదువుతున్నా. నాన్న రామకృష్ణ రైతు, అమ్మ గంగాభవాని గృహిణి. మాది కిర్లంపూడి మండలం, గెద్దనాపల్లి. వ్యాయామోపాధ్యాయుల ప్రోత్సాహంతో 8వ తరగతి నుంచి శిక్షణ పొందుతున్నా. ఇప్పటివరకూ రాష్ట్రస్థాయి పోటీల్లో సుమారు 12 పతకాలు సాధించా. సుమారు 16 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించా. ప్రతిరోజు రెండుగంటల పాటు సాధన చేస్తా. జాతీయ స్థాయిలో సత్తా చాటి రైల్వే ఉద్యోగం సాధించాలనేది నా కోరిక. అందుకు పట్టుదలతో కృషి చేస్తున్నా

- అనూష, కిర్లంపూడి

దేశం తరఫున ఆడడమే లక్ష్యం

ఇంటర్ ద్వితీయ ఏడాది చదువుతున్నా. నాన్న గాలియ్య, అమ్మ భూలక్ష్మి హౌస్‌కీపర్‌గా పనిచేస్తారు. మాది కాకినాడ. గత నాలుగేళ్ల నుంచి ఖోఖోలో కోచ్ వాసు వద్ద శిక్షణ తీసుకుంటున్నా. ప్రతిరోజూ 5 గంటలు సాధన చేస్తా. ఇప్పటివరకూ రాష్ట్రస్థాయి పోటీల్లో సుమారు 10 పతకాలు సాధించా. 8 సార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచాం. తర్వాత జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యా. దేశం తరఫున ఆడి పతకం సాధించడమే నా లక్ష్యం.

- నందిని, కాకినాడ

జన్మదిన శుభాకాంక్షలు

తెలుగుదేశం పార్టీకి చేస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మకమైన కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులుగా నియమించబడి నేడు జన్మదినోత్సవం జరుపుకొంటున్న, శ్రీ సాయి గ్రూప్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త, TDP కాకినాడ జిల్లా ఉపాధ్యక్షులు, మా అందరి శ్రేయోభిలాషి శ్రీ కందుల చిట్టిబాబు గారికి జన్మదిన శుభాకాంక్షలు.

శ్రీ కందుల చిట్టిబాబు గారు

కందుల విజయ్ | KVV చౌదరి | కుడుకూరి రమేష్ | గోలి సాయివెంకటేష్

మేనేజ్‌మెంట్: శ్రీ సాయి గ్రూప్
శ్రీ సాయి రైస్ ఇండస్ట్రీస్, శ్రీ సాయి పౌల్ట్రీఫామ్స్, శ్రీ సాయి ఫీడ్స్

శ్రద్ధాంజలి

మా అందరికీ ప్రేమ, ఆప్యాయత, అనురాగాన్ని పంచిన కీ.శే. పోలిశెట్టి వెంకటరత్నం గారు (నాయన)

కీ.శే. పోలిశెట్టి వెంకటరత్నం (నాయన) గారు
కాకినాడ
జననం: 21-09-1950 మరణం: 22-12-2025

భార్య: వెంకట రమణమ్మ (రమావతి)

పోలిశెట్టి బ్రదర్స్ & సిస్టర్స్

పెద్దకర్మ: ది. 03-01-2026 శనివారం, శాంతినగర్, కాకినాడలోని మా స్వగృహమునందు జరుగును.

(c) eenadu

పరుగులతో మెరిసి.. విజయంతో మురిసి..!

▲ ఉత్కంఠభరితంగా సాగుతున్న ఈఎస్ఎల్ క్రికెట్ పోటీలు

శ్యామల సెంటర్, రాజానగరం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. క్రీడాకారులు ఫోర్లు, సిక్సర్లతో అదరగొడుతున్నారు. ఐడియల్, చైతన్య కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఏకంగా ఓవర్‌కు 15కు పైగా రన్‌రేట్ స్కోరుతో భారీ లక్ష్యాలు చేస్తున్నారు. మరో వైపు గైట్, క్రైట్ ఇంజినీరింగ్ జట్లు జరిగిన మ్యాచ్ ఆఖరి బంతి వరకు ఉత్కంఠ రేకెత్తించింది. క్రీడాకారులు క్రికెట్ ఆస్వాదిస్తూ.. పరుగుల వరద సృష్టించగా విజయంతో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకున్నారు. రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) క్రీడా మైదానంలో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్ పోటీలు గురువారం ఉత్సాహంగా సాగాయి.

బీవీసీ మెరుపులు..

హోరాహోరీపోరులో విజయం సాధించిన బీవీసీ కళాశాల జట్టు

బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల, భట్లపాలెం - ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, సూరంపాలెం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బీవీసీ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచిన బీవీసీ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆదిత్య కళాశాల జట్టు మూడు వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. ఈ జట్టులో లోహిత్ 27 బంతుల్లో 41 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన బీవీసీ కళాశాల జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 103 పరుగులు సాధించింది. బీవీసీ జట్టులో తేజ 21 బంతుల్లో 38 పరుగులు సాధించి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. ఆ జట్టు 9 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.

భారీ ఆధిక్యంతో ఘన విజయం సాధించిన ఐడియల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు

100 పరుగుల తేడాతో ఐడియల్ డిగ్రీ కళాశాల జట్టు విజయం

ఐడియల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కాకినాడ, చైతన్య ఇంజినీరింగ్ కళాశాల, కాకినాడ మధ్య జరిగిన పోటీలో ఐడియల్ ఆర్ట్స్ అండ్ కళాశాల జట్టు 100 పరుగుల భారీ ఆధిక్యంతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన ఐడియల్ కళాశాల జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ జట్టులో శివకుమార్ వీరోచిత బ్యాటింగ్‌తో కేవలం 29 బంతుల్లో 60 పరుగులు చేశాడు. వినయ్ ఆఖరి 6 బంతుల్లో ఫోర్లు, సిక్సర్లు, ఒకఫోర్ కొట్టి 34 పరుగులు సాధించటంతో ఐడియల్ జట్టు ఐదు వికెట్ల నష్టానికి 152 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చైతన్య ఇంజినీరింగ్ జట్టు భారీ లక్ష్యఛేదనలో ఆది నుంచి తడబడుతూ త్వరత్వరగా వికెట్లు కోల్పోయింది. ఐడియల్ కళాశాల జట్టులోని వెంకటేష్ 2 ఓవర్లకు కేవలం 8పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టి చైతన్య జట్టును దెబ్బతీశాడు. చైతన్య కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 52 పరుగులు మాత్రమే చేయగలిగింది. 100 పరుగుల భారీ ఆధిక్యంతో ఐడియల్ కళాశాల జట్టు ఘనవిజయం సాధించింది. ఇప్పటివరకు ఈ టోర్నీలో ఐడియల్ కళాశాల జట్టు చేసిన 152 పరుగులు అత్యధికం కావటం విశేషం..

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే శివకుమార్ (60 పరుగులు)

హ్యాట్రిక్‌తో రాజు మాయ

ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల(కాకినాడ), బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల(వాడపాలెం) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి ఐడియల్ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన బీవీసీ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసింది. ప్రత్యర్థి జట్టులో కె. రాజు వరుసగా మూడు వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్ సాధించటం విశేషం. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఐడియల్ కళాశాల జట్టు ఒక వికెట్ నష్టపోయి 73 పరుగులు సాధించి తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. బ్యాటింగ్‌లోనూ కె. రాజు సత్తాచాటి 37 బంతుల్లో 46 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.

విజయం సాధించిన ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

మూడు వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్ సాధించిన రాజు

ఒక్క పరుగు తేడాతో క్రైట్ విజయం

మైదానం-2లో ఉదయం క్రైట్ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ), గైట్ ఇంజినీరింగ్ కళాశాల (రాజమహేంద్రవరం) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో క్రైట్ ఇంజినీరింగ్ కళాశాల ఒకే ఒక్క పరుగు తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన క్రైట్ కళాశాల జట్టు నిర్ణీత 10ఓవర్లకు 4వికెట్ల నష్టానికి 87 పరుగులు చేశారు. ఈ జట్టులో జేఎల్ దీపక్ 20 బంతుల్లో 28పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గైట్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు తక్కువ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సింగిల్స్, డబుల్స్ తీస్తూ స్కోరుబోర్డును పరుగుపెట్టించారు. అయితే ఒకానొక సమయంలో వరుసగా వికెట్లు కోల్పోవటంతో ఆఖరి ఓవర్‌కు 14 పరుగులు చేయాల్సి ఉండగా ఒక ఫోర్, రెండు వైడ్, బైస్ రూపంలో 12 పరుగులు వచ్చాయి. ఆఖరి బంతికి రెండు పరుగులు చేయాల్సి ఉండగా బ్యాటర్ బంతిని తాకలేకపోయాడు. కీపర్ చేతికి బంతి వెళ్లగా ఒక్క పరుగు కోసం పరుగెత్తే క్రమంలో రనౌట్ అయ్యాడు. దీంతో గైట్ జట్టు ఒక్క పరుగుతో ఓటమిపాలైంది.

విజయం సాధించిన క్రైట్ ఇంజినీరింగ్ జట్టు

విజయం సాధించిన వీఎస్ఎం జట్టు

వీఎస్ఎం విజయబావుటా

వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల (రామచంద్రాపురం), ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వీఎస్ఎం జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన వీఎస్ఎం జట్టు 102 పరుగులు చేసి ఆలౌటైంది. ఈ జట్టులో అర్జున్ 26 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌కేవీటీ జట్టు 7వికెట్లు కోల్పోయి 90 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది.

Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు
IIT-JEE | NEET
Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ
NECC
(Non-Govt. Public Charitable Trust)
"Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner
CMR SHOPPING MALL
The joy of life
Gift Partner
KL UNIVERSITY (DEEMED TO BE)
Regional Sponsor
GGU
GODAVARI GLOBAL UNIVERSITY
RAJAMAHENDRAVARAM, A.P.
Call: 994 999 3483 | www.ggu.edu.in
Digital Partner
ఈనాడు.నెట్
ETV BHARAT
Medical Partner
GSL
FM Partner
ఈ FM Mee FM
TV Partner
ETV ఆంధ్ర ప్రదేశ్
District Sponsor
TIRUMALA విద్యాసంస్థలు
Organised by
ఈనాడు

నేటి మ్యాచ్‌లు 02.01.2026

గ్రౌండ్-1

● **ఉదయం 8 గంటలకు:** ఆదికవి నన్నయ యూనివర్సిటీ(యూజీ) X ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (రాజమహేంద్రవరం). ● **ఉదయం 11 గంటలకు:** పైడా కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ X గైట్ డిగ్రీ కాలేజీ. ● **మధ్యాహ్నం 2 గంటలకు:** గైట్ ఇంజినీరింగ్ కాలేజీ X ఏబీఎన్, పీఆర్ఆర్ కళాశాల.

గ్రౌండ్-2

● **ఉదయం 8 గంటలకు:** మెగా జూనియర్ కాలేజీ (రాజమహేంద్రవరం) X శ్రీరాజరాజేశ్వరి (కాకినాడ). ● **ఉదయం 11 గంటలకు:** శ్రీ సంహిత జూనియర్ కాలేజీ (రావులపాలెం) X శ్రీరాజరాజేశ్వరి కళాశాల (పెద్దాపురం).

రేపటి మ్యాచ్‌లు 03.01.2026

గ్రౌండ్ - 1

● **ఉదయం 8 గంటలకు:** క్రైట్ - 2(కాకినాడ) X బీవీసీ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల(భట్లపాలెం). ● **ఉదయం 11 గంటలకు** : ఐడియల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (కాకినాడ) X క్రైట్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల(కాకినాడ). ● **మధ్యాహ్నం 2 గంటలకు:** చైతన్య ఇంజనీరింగ్ కళాశాల, కాకినాడ X ఎస్‌కేజీఆర్ అండ్ ఎస్ఎస్ కుమారి జూనియర్ కళాశాల (తాళ్ళపూడి)

గ్రౌండ్ - 2

● **ఉదయం 8 గంటలకు :** క్రైట్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (కాకినాడ) X మంగెన గైరయ్య కళాశాల(లక్కవరం). ● **ఉదయం 11 గంటలకు :** గొలుగూరి బాపిరాజు జూనియర్ కళాశాల(అనపర్తి) X దివ్య జూనియర్ కళాశాల (రాజానగరం).

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: సుపరిపాలన.. కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పెరిక కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కంచి భద్రి అన్నారు. స్థానిక జిల్లా తెదేపా కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మూడు గ్యాస్ సిలిండర్లు, అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం, అన్న క్యాంటీన్లు, తదితర పథకాలన్నీ అన్ని వర్గాల ప్రజలకు అందుతున్నాయన్నారు.

మాట్లాడుతున్న పెరిక కార్పొరేషన్ ఛైర్మన్ భద్రి

సమాచార శాఖ డీడీగా రామచంద్రరావు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమాచార, పౌరసంబంధాల శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్, డీఐపీఆర్వోగా ఆర్‌వీఎస్ రామచంద్రరావు గురువారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన నాగార్జున స్థానంలో రాజమహేంద్రవరంలోని రాష్ట్ర సమాచార కేంద్రం సహాయ సంచాలకుడిగా పనిచేస్తున్న ఆయనకు డీడీ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్,జేసీ, డీఆర్వోలను మర్యాదపూర్వకంగా కలిశారు.

భద్రత, సాంకేతికతతో ప్రమాదాల నివారణ

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, అధికారులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈ నెల 31 వరకు నిర్వహించనున్న రహదారి భద్రత మాసోత్సవాల అవగాహన గోడపత్రికను గురువారం కలెక్టర్ షాన్‌మోహన్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భద్రత-సాంకేతికత ద్వారా పరివర్తన, ప్రమాదాల నివారణ ప్రధాన లక్ష్యంగా మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రమాద బాధితులకు తక్షణ సాయం, నగదు రహిత చికిత్సకు ప్రభుత్వం చేయూతనిసుందన్నారు. డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఉప రవాణా కమిషనర్ కె. శ్రీధర్, ఆర్టీవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చప్పిడిచేపల కూర.. గోదారోళ్ల నోరూర..

న్యూస్‌టుడే, పి.గన్నవరం

మన ఊరి వంట

నోరూరించే చేపల కూరలు తయారు చేయడంలో గోదారోళ్లు సిద్ధహస్తులు. సీజన్ల వారీగా దొరికే పులస, దొందు, చీరమీను తదితరాలను కొనుగోలు చేసి బంధుమిత్రులకు పంపుతుంటారు. ప్రధానంగా మహా రుచికరమైన చప్పిడి చేపలను గోదావరి తీరప్రాంతంలో ఉండే మత్స్యకార కుటుంబాలు తయారు చేసి విక్రయిస్తుంటాయి. కొయ్యింగ, కట్టిపరిగి, కడిస, ఇసుకదొందులు వంటి పచ్చిచేపలతో చప్పిడి చేపలు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. వీటిని ఎంతోమంది ఇష్టంగా తింటారు.

చప్పిడిచేపలు తయారు చేస్తున్న మత్స్యకారులు (అంతర చిత్రం) చప్పిడిచేపలు, కోడిగుడ్లు, చిక్కుడు కాయలతో కూర

తయారీ విధానం ఇలా..

కోనసీమలో జొన్నల్లంక, నాగుల్లంక, వాకలగరువు, బోడసకుర్రు తదితర ప్రాంతాల్లో చప్పిడిచేపలు తయారు చేస్తుంటారు. పచ్చిచేపలను పొలుసు తీయకుండా లోపల పేగులు వంటివాటిని తొలగించి ఎండలో ఆరబెడతారు. డొక్కలపీచును పరుపు మాదిరిగా పరిచి మధ్య నిప్పులు వేస్తారు. దానిపై చెరకుపిప్పు పెట్టి పైన ఆరిన పచ్చిచేపలను చక్కగా పేర్చి పొగతో ఆరుస్తారు. వీటిని చప్పిడిచేపలు లేదా ఆర్చినచేపలు అంటారు. మంట రాకుండా పొగతో ఆర్చడంతో ఎనలేని రుచి వస్తుంది.

అందుబాటు ధరలో..

ఆర్చిన చప్పిడిచేపల ధర వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది. కొయ్యింగలైతే ఒకటి రూ. 200-300, కట్టిపరిగ, కడిస, దొందులు వంటివైతే రూ. 100 నుంచి ఆపైన ఉంటుంది.

వీటిని కలిపి వండితే..

చప్పిడి చేపలపైన ఉండే చర్మంలాంటి పొరను తొలగించి వండుతారు. చిక్కుడుకాయ, కోడిగుడ్డు, టమాటా, వంకాయ, చింతకాయ, మునగకాడలు.. ఇలా వివిధ రకాలతో కలిపి ఇగురు తయారు చేసి ఆరగిస్తుంటారు.

ఇతర ప్రాంతాలకు

ఈ చేపలు మార్కెట్ నుంచి తెచ్చుకున్న ఒకటి, రెండు రోజుల్లో వండుకోవాలి. ఫ్రిజ్‌లో పెట్టుకుంటే ఎక్కువ రోజులు ఉంటాయి. సంక్రాంతికి వచ్చే వారికి ఈ చేపలతో కూరలు తయారు చేసి ఇక్కడి వారు ప్రత్యేకంగా వడ్డిస్తారు.

స్వామి వారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అధికారులు

సత్యదేవుని దర్శించుకున్న గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

అన్నవరం: అన్నవరం సత్యన్నారాయణ స్వామి వారిని గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీత అగర్వాల్ గురువారం దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా వచ్చిన ప్రధాన న్యాయమూర్తికి ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనం గావించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ బాబూరావు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు.

కలెక్టరేట్‌లో నూతన సంవత్సర వేడుకలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టర్ షాన్‌మోహన్‌ను జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జేసీ అపూర్వభరత్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డీఆర్వో వెంకటరావు, ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, కాకినాడ మున్సిపల్ కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగులతో కలిసి కలెక్టర్ కేకు కోశారు. అందరి సమష్టి భాగస్వామ్యంతో జిల్లాను అన్ని రంగాల్లో ముందుండేలా చూడాలని, దేశ, రాష్ట్ర ప్రగతిలో కీలక పాత్ర వహించాలని ఆయన ఆకాంక్షించారు.

కలెక్టర్ షాన్‌మోహన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జేసీ అపూర్వభరత్

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

ఇంటిపని వంటపనిలో అనుభవం కలిగిన 35 సం||లోపు ఏ బాదరబందీలేని మహిళలు హైదరాబాద్‌లో ఇంటిలో పనిచేయుటకు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. నమ్మకంతో పనిచేయుటకు ఇష్టం గలవారు సంప్ర||. ✆ 98481 93191, 98493 49999.

BUSINESS OFFER

న్యూఇయర్‌లో ఎలాంటి పెట్టుబడి లేకుండా నచ్చిన టైమ్‌లో బిజినెస్ చేసుకొని అధికఆదాయం పొందండి. అనుభవం, అర్హత లేదు. 9705877799, 8096225555

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-25 పై|| అనపర్తి ఆఫీసు: 08857-226908

SECOND SALE

New Jewellery shop Furniture, cash counter, 2 display counters etc for sale ✆ Cont: 9885076741.

EENADU for Advertisement Contact: 8008597607

JOBS

రాజమండ్రి, కోరుకొండ రోడ్డులో మా ఇంటివద్ద 2 సంవత్సరాల పిల్లల ఆలన పాలన చూసుకొనుటకు ★ కేర్‌టేకర్స్ కావలెను. Cont. Cell: 77999 88168.

వాచ్‌మెన్ ఫ్యామిలీ, వార్డెన్స్ (మగ), వంట మనుషులు (ఆడ) కావలెను. వసతి సదుపాయం. జయశ్రీ గార్డెన్స్, ఎ.వి.ఎ.రోడ్, రాజమండ్రి. 7095223216, 9494158858.

రాజమండ్రిలో ప్రముఖ రెడీమేడ్ గార్మెంట్స్ షాపులో పనిచేయుటకు సేల్స్‌స్టాఫ్, డైలీవేజస్ (పు)-500/-, స్త్రీ-300-400/- కావలెను. Contact: 90523 81026.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	17,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	27,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,000-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	147-00
రిటైల్ లైవ్	174-00
డ్రెస్డ్	252-00
స్కిన్‌లెస్	287-00

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

తితిదే పరిధిలోకి ఏవీనగరం ఆలయం

తొండంగి, తునిపట్టణం, న్యూస్‌టుడే: తొండంగి మండలం ఏవీనగరం గ్రామంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తితిదే పరిధిలోకి తీసుకుంటూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ఈ ఆలయాన్ని 2015లో నిర్మించారు. అప్పటి నుంచి ఈ ఆలయ నిర్వహణను ఆయనే చూసుకుంటున్నారు. ఈ ఆలయాన్ని తితిదే పరిధిలోకి తీసుకోవాలని ఆయన తితిదేను కోరుతూ గతేడాది లేఖ రాశారు. దీనిపై తితిదే బోర్డు పరిశీలించింది. సంబంధిత అధికారుల బృందం ఆలయాన్ని సందర్శించి నివేదికను అందజేశారు. దీనిపై గత నెల 16న తీర్మానం చేసి ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపించారు. దీనికి అనుమతి ఇస్తూ ప్రభుత్వం జీవో నంబరు 1తో గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. ఇకనుంచి ఆలయ నిర్వహణ తితిదే చేపట్టనుంది.

అన్న కోసం వెళ్తూ.. అనంతలోకాలకు..

ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో దుర్మరణం

తొండంగి, న్యూస్‌టుడే: అన్న కోసం వెళ్తూ మృత్యువాత పడిన ఓ వ్యక్తి విషాదగాథ ఇది. శృంగవృక్షం గ్రామానికి చెందిన **ఎం.శివరాం** (28), నూతన సంవత్సర వేడుకలకు వస్తున్న అన్నను తీసుకువచ్చేందుకు బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ద్విచక్ర వాహనంపై అన్నవరం రైల్వేస్టేషన్‌కు బయల్దేరారు. బయలుదేరేముందు విషయాన్ని భార్యకు చెప్పి ఒక గంటలో వచ్చేస్తానన్నాడు. 15 నిమిషాల వ్యవధిలోనే మార్గమధ్యలో ఎ.కొత్తపల్లి సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి రహదారిపై పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్లేవారు చూసి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. వెంటనే అక్కడికి వెళ్లి శివరాంను తుని ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లేసరికే మృతి చెందాడని వైద్యులు ధ్రువపరిచారు. కొత్త ఏడాది మొదటి రోజునే భర్త మృతితో భార్య జ్యోతి, ఇద్దరు కుమార్తెల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగన్‌మోహనరావు తెలిపారు.

రథ శకలాల నిమజ్జనానికి ఏర్పాట్లు

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామికి చెందిన దగ్ధమైన పాత రథ శకలాలను ఈ నెల 3న నిమజ్జనం చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి వార్షిక వాహన సేవకులతో శకలాలను చిన్న చిన్న ముక్కలుగా చేసి సాగర సంగమం వద్దకు తీసుకెళతారు. అక్కడ ఇసుకలో పెద్దగొయ్యి తీసి చుట్టూ రేకులు అమర్చి అందులో శకలాలను వేసి కర్పూరంతో మండిస్తారు. భస్మాన్ని బోట్లపై సంగమం మధ్యలో నిమజ్జనం చేస్తారని ఆలయ ఏసీ నాగవరప్రసాద్ తెలిపారు.

కేకు కట్ చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

జిల్లా పోలీసు కార్యాలయంలో...

మసీదుసెంటర్(కాకినాడ): నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. గురువారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలన్నారు. కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్, ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, ఆర్‌ఐలు, సీఐలు, ఏఆర్ ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ

రైతుబజార్‌లో కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్: గురువారం నాటి ధరలిలా ఉన్నాయి. టమాట- 36, వంకాయలు- 24, 34, 44, బెండకాయలు- 46, పచ్చిమిర్చి- 44, 48, 60, కాకరకాయ- 58, బీర- 60, క్యాలీఫ్లవర్- 25, 30, క్యాబేజీ- 30, క్యారెట్- 32, దొండకాయలు- 46, బంగాళాదుంపలు- 20, 25, ఉల్లి- 28, 32, దోసకాయలు- 30, చిక్కుళ్లు- 20, చేమదుంపలు- 30, బీట్‌రూట్- 24, కీర దోస- 24, బీన్స్‌కాయలు- 70, అల్లం- 68, క్యాప్సికం- 56, బొబ్బర్లు- 30, చిలకడదుంపలు- 38, ఒకటి చొప్పున ఆనపకాయ- 25, 30, పొట్లకాయ- 25, 30, అరటికాయ- 5, 7, మునగకాడ- 10, 14, నిమ్మకాయలు(డజన్) - 24, 30.

తెరపై ఈనాడు

ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్స్- సైక్ సిద్ధార్థ, ఈషా, అవతార్ ఫైర్ అండ్ యాష్, దురంధర్, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్స్- సైక్ సిద్ధార్థ, 45, నీలకంఠ, ఛాంపియన్, లక్ష్మీ- ఈషా, సత్యగౌరి- సహకుటుంబానాం(ఉ, సా), అవతార్ ఫైర్ అండ్ యాష్, తిరుమల- వృషభ, సీఅండ్‌సీ 1- శంబాల, సీఅండ్‌సీ 2- వనవీరా, శ్రీప్రియ - అల్లా(ఉ), ఛాంపియన్, పద్మప్రియ- నువ్వు నాకు నచ్చావ్(మ), అఖండ 2, సూర్య1(వాకలపూడి) - ఈషా, సూర్య 2- శంబాల.

ఫ్యూజుబాక్స్‌కు మూత ఏర్పాటు

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ శ్రీరామ్‌నగర్‌లోని ఓ వీధిలో విద్యుత్తు స్తంభానికి ఏర్పాటు చేసిన ఫ్యూజ్ బాక్స్ మూత లేకుండా ఉంది. దీనిపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి మూత ఏర్పాటుచేశారు.

నాగార్జునను సత్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

సేవలు అభినందనీయం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ ఉప సంచాలకుడిగా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన దాసరి నాగార్జునను గురువారం కలెక్టర్ షాన్‌మోహన్ సత్కరించారు. సమాచార శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన నాగార్జున ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి(ఇన్‌ఛార్జి) రామచంద్రరావు, డివిజనల్ పీఆర్వో పి.వి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సి.హెచ్.బాబూరావు, పీఆర్వో ఎస్. అజయ్, సీహెచ్. నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుడుపూడి చిత్రపటం వద్ద జోహార్లు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

సూర్యనారాయణకు నివాళి

గాంధీనగర్, న్యూస్‌టుడే: సీపీఎం కాకినాడ పట్టణ కమిటీ సభ్యుడిగా, ఇంద్రపాలెం శాఖ కార్యదర్శిగా కుడుపూడి సూర్యనారాయణ సేవలు చిరస్మరణీయమని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. గురువారం కచేరిపేటలోని సుందరయ్యభవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సత్తిరాజు, వర్మ, దువ్వా శేషబాబ్జి, నగర కన్వీనర్ పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం.. ఆదాయ మార్గం

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

ఆ విద్యార్థులు తరగతి గదిలో చదివిన పాఠాలను క్షేత్రస్థాయిలో అమలుచేసి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. వివిధ జాతుల మొక్కలను పెంచుతూ విజ్ఞానం పెంచుకోవడంతో పాటు డబ్బులూ సంపాదిస్తున్నారు. ఇలా వచ్చిన సొమ్ములో కొంత కళాశాలకు అందజేస్తూ మిగిలినది పేద విద్యార్థుల ఫీజులు, పుస్తకాల కోసం వినియోగిస్తున్నారు. కాకినాడ అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బోటనీ విద్యార్థులు వృక్షశాస్త్రం చదివే విద్యార్థినులంతా బృందంగా ఏర్పడి కళాశాల ప్రాంగణంలోని కొంత భూమిలో మొక్కల పెంపకాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి, కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు డా.ఎం.సులక్షణ, కేఎస్‌వీఎస్ఎన్ ఈశ్వరి, ఎన్.పుష్ప పర్యవేక్షణలో 'బ్లోసమ్స్ నర్సరీ' ఏర్పాటు చేశారు.

బొకేల రూపంలో విక్రయం..

టెర్రారియమ్, ఎంగ్లోమిసస్, బోన్సాయ్, యాగ్లోనిమా లిఫ్టిక్స్, ఫిల్లో డెండ్రాన్, ఎడీనియం, జీజీ, మనీ, ఆక్సిజన్ ప్లాంట్స్ వంటి పెంచుతున్నారు.

రాణిస్తున్న వృక్షశాస్త్ర విద్యార్థినులు

కళాశాల వద్ద అమ్మకాలు సాగిస్తున్న విద్యార్థినులు

వాటిని బొకేలుగా తయారు చేసి, కొత్త సంవత్సర వేడుకలు, పండగలు, ఏదైనా శుభకార్యాలు వంటి రోజుల్లో కళాశాల వద్ద స్టాల్స్ ఏర్పాటు చేసి తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. పెంపకానికి సారవంతమైన మట్టిని వినియోగిస్తున్నారు. వాట్సాప్ గ్రూపు వేదికగా కూడా మొక్కల అమ్మకాలు సాగిస్తున్నారు.

స్వయం ఉపాధి దిశగా..

వ్యాపార ధోరణి అలవర్చుకునేలా కళాశాల విద్యార్థినులకు మొక్కల పెంపకంపై తగిన శిక్షణ ఇస్తున్నామని అధ్యాపకురాలు సులక్షణ తెలిపారు. బయట మార్కెటింగ్ పద్ధతులు, నర్సరీల పెంపకంతో కలిగే ప్రయోజనాలు వంటి వాటిపై తెలియజేస్తూ స్వయం ఉపాధి దిశగా విద్యార్థినులను తీర్చిదిద్దుతున్నామన్నారు.

యువ

విజ్ఞానాన్ని పెంచేందుకు..

కేవలం కళాశాల తరగతులకే పరిమితం కాకుండా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా మాలో విజ్ఞానం పెంపొందుతుంది. ఎక్కడో బయట ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కళాశాలలో ఏర్పాటు చేసిన బ్లోసమ్స్ నర్సరీ ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. వివిధ రకాల మొక్కలను పెంచుతున్నాం. - యు.అక్షయ

సేంద్రియ ఎరువుల వినియోగం

అధ్యాపకుల సహకారంతో కళాశాల ప్రాంగణంలోనే 'నాపెడ్ కంపోస్టు పిట్'ను ఏర్పాటు చేశాం. ఎండిన ఆకులు, వ్యర్థాలతో స్వయంగా కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నాం. దీని వినియోగంతో మొక్కలు ఏపుగా పెరగడంతోపాటు చీడపీడలు తక్కువ ఉంటున్నాయి. దీంతో చాలామంది కొనుగోలు చేస్తున్నారు. -ఆర్.అపర్ణ

ప్రత్యేక శిక్షణ

కళాశాలలో బ్లోసమ్స్ నర్సరీ ద్వారా వచ్చే ఇండోర్ ప్లాంట్‌లతో బొకేలను తయారు చేస్తున్నాం. అధ్యాపకులు వీటిపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. కళాశాల ముందు స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నాం. వచ్చిన ఆదాయంలో కళాశాలకు కొంత ఇవ్వడంతో పాటు, మరి కొంత చదువుకు ఉపయోగిస్తున్నాం. -కె.ఉదయ సూర్య

కార్డుదారులకు గోధుమపిండి పంపిణీ చేస్తున్న రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్

ఆహార అలవాట్లకు అనుగుణంగా రేషన్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మారుతున్న ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక శాలిపేట వద్ద కాకినాడ నగరంలోని రేషన్‌కార్డుదారులకు రాయితీపై అందిస్తున్న గోధుమ పిండి పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాల ముఖ్య కేంద్రాల్లో కిలో రూ.20 చొప్పున పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఎస్‌వో ఆర్ఎస్ఎస్ సత్యనారాయణరాజు, పౌర సరఫరాల ఉప తహసీల్దారు శ్రీనివాస్, జనసేన నాయకులు స్వామి, సత్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: నగరంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. యువత, నగరవాసులు ఆనందోత్సాహాల మధ్య కొత్త ఏడాదికి స్వాగతం పలికి ఉత్సాహంగా గడిపారు. నృత్యాలు, కేక్ కట్ చేయడం, ఆటలు, బాణసంచా శబ్దాలతో ఆనందోత్సాహాల మధ్య గడిపారు. ముంగిళ్లను రంగవల్లులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

మసీదు సెంటర్: కాకినాడ బార్ అసోసియేషన్‌లో అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి సుబ్రహ్మణ్యం, చెక్కపల్లి వీరభద్రరావు(చంటి) ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. న్యాయవాదులు జి.గోకుల కృష్ణ, సహాయకార్యదర్శి రవికృష్ణ, సీహెచ్. శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాకినాడ కలెక్టరేట్: నగరంలోని ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద గురువారం నూతన సంవత్సర సందడి నెలకొంది. స్థానిక గొడారిగుంటలోని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నివాసం వద్ద జనసేన నాయకులు, కార్యకర్తలు ఆయనను గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ఆమె నివాసం వద్ద కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్‌కు ఆయన నివాసం వద్ద జనసేన నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ఉద్యోగులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నూతన సంవత్సర వేడుకకు దూరంగా ఉన్నారు.

చిన్నారులతో కలిసి వేడుకల్లో జేసీ అపూర్వభరత్

కమిషనర్ సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న అదనపు కమిషనర్ సుధాకర్, తదితరులు

స్థానిక రామారావుపేట కమిషనర్ బంగ్లాలో గురువారం నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ కేకు కోశారు. అదనపు కమిషనర్ సుధాకర్, ఉప కమిషనర్ శ్రీనివాస్, డీసీపీ కృష్ణారావు, ఎస్‌ఈ వెంకటరావు, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, పలువురు డీఈలు, ఏఈలు, విభాగాల అధికారులు కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కాకినాడ నగరం: నూతన సంవత్సరంలో నగర ప్రజలకు మంచి జరగాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ కాంక్షించారు. గురువారం ఆమె నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నగర ప్రజలు, కూటమి పార్టీల కార్యకర్తలు, నాయకులు వచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ ఆవిష్కరించారు.

యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ తదితరులు

కాకినాడ నగరం: కాకినాడ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వర్గాలు సహకరించాలని నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ కోరారు.

ప్రపంచ తెలుగు మహాసభల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

గాంధీనగర్: ఆంధ్ర సారస్వత పరిషత్ సారథ్యంలో గుంటూరులో ఈ నెల 3,4,5 తేదీల్లో నిర్వహించనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల ఆహ్వానపత్రికను గురువారం కాకినాడ ప్రధాన తపాలా కార్యాలయంలో డివిజనల్ పోస్టల్ సూపరిండెంటెంట్ కె.కృష్ణ ఆవిష్కరించారు. పోస్టల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జీవి.లక్ష్మీనారాయణ, తురగా సూర్యారావు మాట్లాడుతూ తెలుగు భాషా వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసే ఇటువంటి కార్యక్రమాల్లో పోస్టల్ ఉద్యోగులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ సంఘ నాయకులు సిహెచ్. రామారావు, సాయిరాం, సూర్యనారాయణ, కృష్ణమూర్తి, వై.నాగేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

ఘర్షణలో ఒకరికి తీవ్రగాయాలు

సామర్లకోట గ్రామీణం: హుస్సేన్‌పురంలో ఇరు వర్గాల కొట్లాటలో ఒకరికి తీవ్రగాయాలై ఆసుపత్రి పాలయ్యారు. సామర్లకోట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి గ్రామంలోని ఓ వీధిలో రోడ్డుకు అడ్డుగా ఉన్నారనే విషయమై ఇద్దరి నడుమ వాగ్వాదం చోటుచేసుకుంది. వారిద్దరూ మద్యం తాగి ఉండడంతో కొట్లాటకు దారితీసింది. దుర్గాప్రసాద్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా కాకినాడలోని ఆసుపత్రికి తరలించారు. ఘటనలో మరో ఇద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. ఇరువర్గాలపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కలెక్టర్ షాన్‌మోహన్‌కు చెక్కు అందజేస్తున్న ఉద్యోగులు

కలెక్టర్ పిలుపునకు స్పందన

కాకినాడ కలెక్టరేట్: నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లకు విరాళాలు, వస్తువులు అందించాలని కలెక్టర్ ఇచ్చిన పిలుపునకు ఉద్యోగులు, వివిధ సంస్థలు స్పందించాయి. పేద విద్యార్థులకు ఉపయోగపడే నోట్‌పుస్తకాలు, టవళ్లు, ఇతర వస్తువులను అందజేశారు. సుమారు రూ.30 లక్షల మేర విరాళాలిచ్చారు. వీరందరికీ కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

కాకినాడ నగరం: సంక్షేమ వసతి గృహాల్లో వసతుల కల్పనకు నగరపాలక సంస్థ ఉద్యోగులు సేకరించిన రూ.50వేల విరాళాన్ని కలెక్టరుకు అందజేశారు. కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ, అదనపు కమిషనర్ సుధాకర్, ఉప కమిషనర్ శ్రీనివాస్ తదితరులు గురువారం కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కాలువ మధ్యలో స్తంభం

నగరంలోని 49వ డివిజన్ వెంకన్నబాబు ఫంక్షన్ హాలు సమీపంలోని అశోక్‌నగర్‌లో డోర్‌నంబరు 68-9-23 వద్ద విద్యుత్తు స్తంభం డ్రెయిన్‌లో ఉంది. అది నీటిలో ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. 49-బీ వార్డు సచివాలయం పరిధిలోని నంబరు-246 స్తంభాన్ని కాలువ నుంచి తొలగించి, పక్కన ఏర్పాటు చేయాలని స్థానికుడు జి.సూర్యనారాయణ విజ్ఞప్తి చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

పొగతో ఉక్కిరిబిక్కిరి..

కాకినాడ శాంతినగర్, పెద్దిరెడ్డి వారివీధిలో రహదారి పక్కన చెత్తకు నిప్పంటించడంతో దట్టమైన పొగ వ్యాప్తించడంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు చలికాలం నేపథ్యంలో శ్వాసకోస సంబంధిత వ్యాధులతో బాధపడేవారు అధికంగా ఉంటారు. ఈ క్రమంలో పొగ కారణంగా మరింత ప్రమాదం పొంచి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మసీదు సెంటర్

వీధి దీపాలు లేక వెతలు

గాంధీనగర్ పోలీస్ క్లబ్ వెనుక వైపు చీడీలపొర ప్రధాన కాలువ ఆనుకుని 50 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. ఇక్కడ రెండేళ్ల కిందట రహదారి నిర్మించారు. ఇంతవరకు వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు చీకట్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని, అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

పూడికతీతకు ఇక్కట్లు

గాంధీనగర్ చామర్తివారి వీధిలో ఓ ఇంటి వద్ద కాలువపై స్లాబు రాళ్లు వేయడంతో పూడికతీతకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని 41వ డివిజన్ భాజపా నాయకులు గోడి వెంకట్, స్థానికులు అధికారులను కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్

శేషశయన.. హయగ్రీవ..

గాంధీనగర్, న్యూస్‌టుడే: శేషశయనంపై శయనించిన మహావిష్ణువుగా.... జ్ఞానాన్ని ప్రసాదించే హయగ్రీవుడి స్వామి వారు కనిపించారు. ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం మెయిన్ రోడ్డు రామాలయంలో రజత దశావతార అలంకార మహోత్సవాల్లో భాగంగా సాయంత్రం సీతారామస్వామి వారిని శేషశయనంపై ఉన్న మహావిష్ణువు అవతారంలో అలంకరించారు. వేణుగోపాల స్వామి ఆలయంలో సాయంత్రం హయగ్రీవ అవతారంలో పూజలందుకున్నారు. వివిధ ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.

హయగ్రీవ అవతారంలో వేణుగోపాలస్వామి

శేషశయన అలంకరణలో శ్రీరాముడు

ఘనంగా రఘోత్తమ తీర్థ ఆరాధన

గాంధీనగర్: ఉత్తరాది మఠ యతివరేణ్యులు రఘోత్తమ తీర్థుల ఆరాధనా మహోత్సవ కార్యక్రమాలను మధ్వసభ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. చొల్లంగి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని రఘోత్తమ తీర్థ మృతికా బృందావనానికి విశేష పంచామృతాభిషేకాలు, పుష్పాలంకరణలను పురోహితులు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో చేశారు. రామారావుపేటలోని మధ్వసభ ప్రాంగణలో కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కోపల్లె శేషగిరిరావు, రాచూరి శేషగిరిరావు, వి.రాము, పరశురాం, డాక్టర్ ఎస్.వెంకటరమణ, సత్యనారాయణమూర్తి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

హోమం నిర్వహిస్తున్న ఉపాసకులు

వైభవంగా గణపతి హోమం

గాంధీనగర్: కొత్త సంవత్సరంలో అందరూ క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తూ గురువారం సూర్యారావుపేటలోని భోగి గణపతి పీఠంలో గణపతి హోమాన్ని నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీవారి పాదాల వద్ద దీపోత్సవం జరిగింది. పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ ఈనెల 6న సంకష్టహర చతుర్థి, 7న సముద్రతీరంలో సముద్రుడికి విష్ణుహారతి, కుంభహారతి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రమణమూర్తిని సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ రాష్ట్ర ఛైర్మన్ వై.డి.రామారావు, పాలపర్తి సుబ్బారావు తదితరులు

సేవే శాశ్వతంగా ఉంటుంది

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఎవరికైనా సేవే శాశ్వత ఆభరణంగా అలరారుతుందని రెడ్‌క్రాస్ రాష్ట్ర ఛైర్మన్ వై.డి.రామారావు అన్నారు. గురువారం బాలాత్రిపుర సుందరి ఆలయం సమీపంలోని పాలపర్తి సుబ్బారావు కార్యాలయంలో జరిగిన స్నేహ సమ్మేళనానికి వై.డి.రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ తరపున చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు, క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం వంటి వివరాలు తెలియజేశారు. ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన నిధులు అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. మెగా పీటీఎం సందర్భంగా కృత్రిమ మేధ ప్రక్రియ టూల్‌ను రూపొందించిన పి.వి.రమణమూర్తిని సత్కరించారు. పంచాంగకర్త సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి, అలయెన్స్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ ప్రెసిడెంట్ పాలపర్తి సుబ్బారావు, అలయెన్స్ క్లబ్ గవర్నర్ జనార్దనం, లయన్స్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు

పెదపూడి: పెదపూడి మండలంలోని పుట్టకొండ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గోదాదేవికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమ పూజలు జరిపించారు. నూతన సంవత్సరం సందర్భంగా దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేకంగా పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి తగిన సౌకర్యాలు కల్పించారు.

గాడిమొగలో నగర సంకీర్తన

తాళ్లరేవు: గాడిమొగలో హరేకృష్ణ సత్సంగ కేంద్రం, రాధాకృష్ణ మందిరం అధ్యక్షుడు సంగాడి పూసలయ్య ఆధ్వర్యంలో పురవీధుల్లో గురువారం నగర సంకీర్తన నిర్వహించారు. భక్తి పాటలను ఆలపించారు. కేంద్రంలో రాధాకృష్ణుల విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

భీమా కోరాగావ్ విజయోత్సవం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఇంద్రపాలెంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం దళిత, ప్రజా సంఘాలు, బౌద్ధ సంఘాల ఆధ్వర్యంలో కోరెగావ్ విజయోత్సవాన్ని నిర్వహించారు. ఆ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షురాలు డా.భానుమతి, ఆయా సంఘాల ప్రతినిధులు అయితాబత్తుల రామేశ్వరరావు, డా.బాబ్జి, పావన ప్రసాద్, ఎం.రాజశేఖర్, ఎన్.పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం, తూరంగికి చెందిన పి.వెలగయ్య(44) రోడ్డుప్రమాదానికి గురైన ఘటనలో తీవ్రగాయాలు కావడంతో గత నెల 28న జీజీహెచ్‌లో చేర్చారు. చికిత్సపొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. దీనిపై ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

సందడిగా.. సముద్రతీరం

కాకినాడ గ్రామీణం పరిధి సూర్యారావుపేట వద్ద సముద్ర తీరం గురువారం నూతన సంవత్సర వేడుకల శోభను సంతరించుకుంది. శిల్పారామంలో పరిపాలనాధికారి మోహన్‌తేజ ఆధ్వర్యంలో చిన్నారులు నృత్యాలతో అలరించారు. అనపర్తికి చెందిన శ్రీవైష్ణవి నాట్యాలయం గురువు భానుప్రమీల శిష్యబృందం సందడి చేసింది. భారీగా తరలివచ్చిన పర్యాటకులు సముద్ర స్నానాలు ఆచరించారు. తీరంలోనే కేకులు కోసి పంచుకున్నారు. - న్యూస్‌టుడే, సర్పవరం

బిర్యానీ అమ్మకాల జోరు..

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కొత్త ఏడాది సందర్భంగా డిసెంబరు 31న నగరంలో బిర్యానీ అమ్మకాలు జోరుగా సాగాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి అమ్మకాలు పెరిగాయని దుకాణ యజమానులు తెలిపారు. ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి జోరుగా అమ్మకాలు సాగించారు. కొందరు వన్ ప్లస్ వన్, చీరలు, డ్రింక్‌లు, కాంబో ప్యాక్ ఆఫర్లతో ఆకట్టుకున్నారు.

విద్యుద్దీపాలతో అలకరించిన ఓ దుకాణం

300 కొత్త స్టాల్స్

చిన్నా పెద్దా కలిపి నగరంలో 850కుపైగా ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు ఉన్నాయి. ఇవి కాకుండా బుధవారం రాత్రి, గురువారం వివిధ ప్రాంతాల్లో ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద టెంట్లు, విద్యుదీపాలతో అలంకరించి సుమారు 300కుపైగా కొత్త కౌంటర్లు ఏర్పాటు చేశారు. దమ్ బిర్యానీ, ఫ్రై బిట్ బిర్యానీ, స్టార్టర్ వంటి వాటితో కాంబో ప్యాక్‌లు ఏర్పాటు చేసి రూ.600 నుంచి రూ.800 వరకు ధరతో అమ్మకాలు సాగించారు. మరికొందరు రూ.99 ధరతో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. ఓ దుకాణంలో గత ఏడాది డిసెంబరు 31న రూ.2 లక్షల వ్యాపారం చేస్తే ఈసారి రూ.3 లక్షల వరకు జరిగినట్లు యజమాని తెలిపారు. సాధారణ రోజుల్లో రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు అమ్మకాలు జరిగే దుకాణాల్లో ఒక్క రోజులోనే రూ.లక్ష వరకు వ్యాపారం సాగింది.

అమ్మకాలు బాగున్నాయి..

ఈసారి బిర్యానీ అమ్మకాలు బాగా సాగాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి రూ.లక్ష వరకు ఆదాయం పెరిగింది. అయితే నూనె, మసాలా, ఇతర సరకుల ధరలు కూడా పెరగడంతో పెట్టుబడి కూడా భారీగానే ఉంది. -గౌస్, వ్యాపారి

రూ.లక్ష చెక్కును ఈవోకు అందజేస్తున్న దాత వెంకట సుబ్బారావు

చెక్కు అందజేస్తున్న దాత సుబ్రహ్మణ్యం

ఆలయ పునః నిర్మాణానికి దాతల విరాళం

గాంధీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని మెయిన్‌రోడ్డులో పురాతన సీతారామస్వామి ఆలయ పునః నిర్మాణానికి దాతలు విరాళాలు అందిస్తున్నారు. గురువారం యెండూరి వెంకట సుబ్బారావు రూ.లక్ష చెక్కును ఈవో యర్రా వెంకటేశ్వరరావుకు అందజేశారు. బాదం నాగరత్నం జ్ఞాపకార్థం భర్త సుబ్రహ్మణ్యం, కుమారులు, కుమార్తెలు రూ.1,00,116 విరాళాన్ని ఆలయ ఛైర్మన్ పులవర్తి విశ్వనాథానికి అందించారు.

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గోదాదేవికి ప్రత్యేక పూజలు

పెదపూడి, న్యూస్‌టుడే: పెదపూడి మండలంలోని పుట్టకొండ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో గోదాదేవికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమ పూజలు జరిపించారు. నూతన సంవత్సరం సందర్భంగా దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేకంగా పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి తగిన సౌకర్యాలు కల్పించారు.

సంప్రదాయాలు కొనసాగిద్దాం

పిఠాపురం: సంక్రాంతి వేళ సంప్రదాయాలు కొనసాగిద్దామని మాజీ ఎమ్మెల్యే వర్మ అన్నారు. గురువారం పిఠాపురంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో కత్తులు కట్టని పుంజులతో నాయకులతో కలిసి పందేలు ఆడారు. వర్మ మాట్లాడుతూ కత్తులు కట్టకుండా కోడి పందేలు ఆడడం, ఎడ్ల పరుగు పోటీలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో సంక్రాంతి చేసుకోవాలని ఆకాంక్షించారు.

కత్తులు కట్టని పుంజులతో పందెం ఆడుతున్న వర్మ

ఆధ్యాత్మిక శక్తితోనే లక్ష్యాలు సాధ్యం

పిఠాపురం: ఆధాత్మిక, జ్ఞానశక్తితోనే యువత జీవితాశయాలు, లక్ష్యాలు సాధించవచ్చని పీఠాధిపతి డా.ఉమర్ ఆలీషా పేర్కొన్నారు. పిఠాపురంలోని శ్రీవిశ్వవిజ్ఞాన విద్యాఆధ్యాత్మిక పీఠంలో నూతన సంవత్సరం సందర్భంగా గురువారం జ్ఞాన మహాసభ నిర్వహించారు. జీవితంలో ఏర్పడే చిన్నపాటి సమస్యలు, వివాదాలు విడనాడి లక్ష్యంపై గురి పెట్టాలన్నారు. పలు పుస్తకాలు ఆవిష్కరించారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో పలువురికి దుస్తులు పంచారు. ఎన్ఆర్ఐ కిరణప్రభ, కొండా నరసింహారావు, ఉమేష్‌కుమార్, పేరూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంచుతున్న పీఠాధిపతి డా.ఉమర్ ఆలీషా

గాడిమొగలో నగర సంకీర్తన

తాళ్లరేవు: గాడిమొగలో హరేకృష్ణ సత్సంగ కేంద్రం, రాధాకృష్ణ మందిరం అధ్యక్షుడు సంగాడి పూసలయ్య ఆధ్వర్యంలో పురవీధుల్లో గురువారం నగర సంకీర్తన నిర్వహించారు. భక్తి పాటలను ఆలపించారు. కేంద్రంలో రాధాకృష్ణుల విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

రాధాకృష్ణ మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

పంట తెచ్చేదారి.. పాడైనా పట్టదే మరి..!

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

పంట పొలాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను గ్రామాలకు తెచ్చుకునేందుకు ఉపకరించే పుంత రోడ్లు చాలా చోట్ల దయనీయంగా మారాయి. ఏళ్ల తరబడి కనీస మరమ్మతులు చేపట్టక, గ్రావెల్‌తో గుంతలు పూడ్చక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. మరమ్మతులు, నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నా నిధులు మంజూరుకాక పనులు నిర్వహించడం లేదు. గత వైకాపా ప్రభుత్వంలో పుంత రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ద్విచక్ర వాహనదారులు కూడా రాకపోకలు సాగించలేని విధంగా దుర్భరంగా తయారయ్యాయి.

✦ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో అధికంగా కాలువల ఆయకట్టు పొలాలకు ప్రయోజనం కలిగించే 82 పుంత రోడ్లున్నాయి. వీటిలో 47 గుంతలతో దుర్భరంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అధ్వాన దారులను తిరిగి నిర్మించి రైతుల ఇబ్బందులు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమైంది. నియోజకవర్గంలో ఏపీఆర్ఆర్ఎస్‌పీ నిధులు రూ.91.68 కోట్లతో నియోజకవర్గంలోని రోడ్లను నిర్మించేందుకు ప్రతిపాదించారు. వీటిలో బీటీ రోడ్లతోపాటు పుంతరోడ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపారు. గొల్లప్రోలు మండలానికి రూ.32.93 కోట్లు, పిఠాపురం మండలానికి రూ.35.24 కోట్లు, కొత్తపల్లి మండలానికి రూ.24.51 కోట్లతో పనులు చేపట్టేందుకు ఇంజినీరింగ్ అధికారులు సిద్ధమయ్యారు. గొల్లప్రోలు శివారు సీతానగరం పుంత రోడ్డు బురదమయంగా మారి 3 వేల ఎకరాల ఆయకట్టు రైతులు యాతనపడుతున్నారు. అధ్వానంగా మారిన ఈ రోడ్డును ఏళ్ల తరబడి పట్టించుకోకపోవడంతో వాహనాల రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. పొలాల నుంచి ధాన్యం, పశుగ్రాసం, ఇతర ఉత్పత్తులను బయటకు వ్యయప్రయాసలకోర్చి ఎడ్లబండ్లపై తరలించుకోవాల్సివస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొల్లప్రోలు మండలంలో 12, పిఠాపురం మండలంలో 9 పుంతరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. యు.కొత్తపల్లి మండలంలో 6 రోడ్ల నిర్మాణానికి అంచనాలు తయారు చేశారు.


గొల్లప్రోలు శివారు సీతానగరం పరిధిలో దుస్థితి

ప్రతిపాదిత ప్రాంతాల్లో నిర్మాణం చేపడతాం

గొల్లప్రోలు-సీతానగరం పుంతరోడ్డును 4.7 కిలోమీటర్ల పొడవున నిర్మించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో రూ.1.12 కోట్లకు ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు అందజేశాం. ఏపీఆర్ఆర్ఎస్‌పీ నిధులు మంజూరుకాగానే రోడ్ల పనులు ప్రారంభిస్తాం.

- కృష్ణమోహన్, మండల ఇంజినీర్

కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కౌన్సిలర్లు

విధుల్లో చేరిన కమిషనర్

పిఠాపురం: పిఠాపురం మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకారావు గురువారం విధుల్లో చేరారు. మూడు నెలలపాటు సెలవుపై అమెరికా వెళ్లిన ఆయన తిరిగొచ్చి బాధ్యతలు స్వీకరించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఉద్యోగులు, కౌన్సిలర్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇన్‌ఛార్జి కమిషనర్‌గా వ్యవహరించిన డీఈ రాజు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణపై ఉద్యోగులతో కమిషనర్ చర్చించారు.

ఆలయ ఈవో బాధ్యతల స్వీకరణ

పిఠాపురం: పిఠాపురంలోని కుంతీమాధవ స్వామి ఆలయ ఈవోగా బొడ్డేపల్లి ధనలక్ష్మి గురువారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఈవోగా ఉన్న శ్రీరాములు ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ఉ.కొత్తపల్లి మండల గ్రూపు దేవాలయాల ఈవోగా పనిచేస్తున్న ఆమె ఇక్కడ కూడా విధులు నిర్వహిస్తారు. అనంతరం వేణుగోపాలస్వామి ఆలయానికి వెళ్లగా ఈవో జనార్దనాచార్యులు సత్కరించారు.

దస్త్రంపై సంతకం చేస్తున్న ధనలక్ష్మి

ఆశల ఏడాది.. ఆశయాల దారిదీ..

పిఠాపురం, న్యూస్‌టుడే: కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టిన యువత తమ ఆశలు, ఆశయాలు నెరవేరాలని ఆకాంక్షిస్తున్నారు. 2026లో వ్యాపార, ఉద్యోగ, ఇతర రంగాల్లో తమకంటూ ప్రత్యేకత చాటుతామని ప్రతిన చేస్తున్నారు. 'న్యూస్‌టుడే'తో ఇలా అభిప్రాయాలు పంచుకున్నారు.

అంతర్జాతీయ వేదికే లక్ష్యం

పిఠాపురంలో విద్యార్థులు, యువతకు కరాటే, ఆర్చరీ, రగ్బీ ఆటలో శిక్షణ ఇస్తున్నాను. రెండుమూడు నెలలకోసారి రాష్ట్ర అసోసియేషన్ల ఆధ్వర్యంలో స్థానికంగా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నా. చాలామంది ఇప్పటికే జాతీయ స్థాయిలో ఆర్చరీ, రగ్బీల్లో రాణిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయికి వెళ్లేలా పలువురిని తీర్చిదిద్దేందుకు 2026లో లక్ష్యం నిర్దేశించుకున్నా. - వల్లా లక్ష్మణరావు

కొత్త ఆలోచనలతో ముందుకు..

మా ఊరు వెల్దుర్తి. నాకు న్యాయవాద వృత్తి అంటే మక్కువ. డిగ్రీ తర్వాత లా చదివా. గత ఏడాది నుంచి పిఠాపురం కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నా. యువత కొత్త సంవత్సరంలో సరికొత్త లక్ష్యాలు ఏర్పరుచుకోవాలి. ఎంచుకున్న రంగంలో రాణించాలంటే.. నిత్య విద్యార్థిలా కష్టపడాల్సిందే. ఏటా ఒక లక్ష్యం విధించుకుని సాధించాలి. నేనూ అదే ఆలోచనతో ఉన్నా. - యు.దుర్గాదివ్య

నూతన ఉత్సాహం.. ఆకాంక్షల సంవత్సరం

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిఠాపురాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నారని జనసేన జిల్లా అధ్యక్షుడు, టీడీసీ ఛైర్మన్ రామస్వామి పేర్కొన్నారు. గురువారం పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ క్రీడా మైదానంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. ✦ పిఠాపురం: ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మాజీ ఎమ్మెల్యే వర్మ ఆకాంక్షించారు. గురువారం పిఠాపురంలోని పాత మున్సిపల్ బాలికల పాఠశాల ఆవరణలో తెదేపా ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చినవారికి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ✦ గొల్లప్రోలు: గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాసులుకు మేనేజర్ నవీన్‌చంద్ర, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్, ఎంపీడీవో తదితర కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లలో వేడుకలు జరిపారు. చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. ✦ పెద్దాపురం: పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, డీఎస్పీ శ్రీహరిరాజు కేక్ కోశారు. ఆర్డీవో శ్రీరమణి, ఎస్ఈ కంతు, ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు రంగనాగేశ్ కూడా చెప్పారు. శ్రీకాంత్, కుమారస్వామి, జగదీష్‌మోహన్, రవిచంద్రప్రసాద్, కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు. సర్పవరం: గొడారిగుంటలో ఎమ్మెల్యే నానాజీ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. వాకలపూడిలో మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి, నాయకుడు సత్యనారాయణమూర్తికి పార్టీ శ్రేణులు పుష్పగుచ్ఛాలిచ్చారు. గైగోలుపాడులో తెదేపా నేతలు శ్రీనివాసబాబా, వెంకటప్రభాకర్ వేడుకల్లో పాల్గొన్నారు. సర్పవరం భావనారాయణస్వామి, రేపూరు విరాట్ సాయి ఆలయం, బీడిగ దశవతార వేంకటేశ్వరస్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

చినరాజప్పకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్డీవో శ్రీరమణి

పిఠాపురం: తుమ్మల రామస్వామిని సత్కరిస్తున్న జనసేన నేతలు

మురమళ్లలో ఎమ్మెల్యే బుచ్చిబాబుతో తెదేపా శ్రేణులు

ఆయా కార్యాలయాల సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలిపారు. ✦ తాళ్లరేవు: మురమళ్లలో ఎమ్మెల్యే బుచ్చిబాబును తాళ్లరేవు మండల కూటమి శ్రేణులు, ఉద్యోగులు గురువారం ఉదయం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తాళ్లరేవు మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీతకు యూటీఎఫ్, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, సర్పంచులు శుభాకాంక్షలు తెలిపారు.

సామర్లకోట, సామర్లకోట గ్రామీణం: అచ్చంపేటలో ఎమ్మెల్యే చినరాజప్పకు శ్రీనివాసు పాల్గొన్నారు. ✦ కాజులూరు: కాజులూరు మండలంలో దేవాలయాల్లో ప్రత్యేకపూజలు జరిగాయి. క్రిస్టియన్ సోదరులు చర్చిల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాస్టర్లు జె.రాజయ్య, కె.ఆశీర్వాదం, బొమ్ము ఇజ్రాయిల్‌రాజు శాంతి మార్గంలో నడవాలని పిలువునిచ్చారు. ✦ కరప: కరపలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ శ్రీలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావులకు పంచాయతీ

పెద్దాపురంలో డీఎస్పీ శ్రీహరిరాజుకు శుభాకాంక్షలు చెబుతున్న సిబ్బంది

గొల్లప్రోలులో సిబ్బందితో కలిసి కేకు కోస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

వరిలో కలుపు నివారణ కీలకం

కాజులూరు: రబీలో కలుపు నివారణే కీలకమని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ తెలిపారు. బుధవారం మండలంలోని చేదువాడ, కాజులూరు, గొల్లపాలెం, తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. రబీ తొలిదశలో శాతం మంది రైతులు వెద జల్లే విధానంలో సాగుచేస్తున్నారన్నారు.

పరిసరాలు అపరిశుభ్రం

కరప: గ్రామంలోని పందులను విడిచిపెడుతుండటంతో ఇంటి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. గురజనాపల్లిలో పెంపకందారులు పందుల్ని వదిలేస్తుండగా ఇళ్ల వద్ద మొక్కలను నాశనం చేస్తున్నాయని చెబుతున్నారు. ఎంపీడీవో శ్రీనివాస్‌కు చెప్పగా పంచాయతీ సిబ్బందితో కట్టడికి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు

గొల్లప్రోలులోని ఏలేరు బల్లకట్టు సమీపంలో ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు తీగలు చేతికి అందే ఎత్తులోనే వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. కూరగాయల దుకాణం ఎదుట లోడుతో వస్తున్న ఆటోల్లో కూలీలకు తగిలేలా ఉన్నాయి. దీని గురించి అడగ్గా ఎత్తుగా ఏర్పాటు చేయిస్తామని ఏఈ రామచంద్రరావు తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

పునాదిలోనే పనులు.. ప్రజలకు ఇక్కట్లు

గొల్లప్రోలు మండలం కొడవలిలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం పునాది దశలోనే నిలిచిపోయింది. దీంతో ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు వసతుల్లేక ఇబ్బందిపడుతున్నారు. పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు. నిధులకోసం ప్రతిపాదనలు పంపుతామని మండల ఇంజినీర్ కృష్ణమోహన్ తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

మూతపడిన సుజల కేంద్రం

చేబ్రోలులో సుజల కేంద్రం మూతపడి శుద్ధిజలం సరఫరాకాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత తెదేపా ప్రభుత్వంలో చేబ్రోలులో రెండు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. కొన్నాళ్లకే ఒకటి, రెండేళ్లనాడు మరొక కేంద్రం మూతపడ్డాయి. బాగు చేయించాలని కోరుతున్నారు. చర్యలు చేపడతామని డిప్యూటీ ఎంపీడీవో కుమార్ తెలిపారు.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

పంట కాలువలోకి వ్యర్థాలు

పిఠాపురం శివారు భీమ్‌నగర్ నుంచి నరసింగపురం వెళ్లే మార్గంలో ఏలేరు కాలువ చెంతన వ్యర్థాలు పడేస్తున్నారు. తాగిపడేసిన కొబ్బరి బొండాలు దారి పొడవునా కాలువ చెంతన పేరుకుపోతున్నాయి. క్రమంగా అవి జారుతుండడంతో కాలువ మూసుకుపోయే పరిస్థితి ఎదురవుతోంది. ఈవోపీఆర్డీ రామకృష్ణ చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, పిఠాపురం

సీసీ రహదారికి బెర్మ్‌లేవీ..?

తాళ్లరేవు మండలం నీలపల్లి జిమ్మిచెట్టు నుంచి శ్రీరామ్ నగర్ వరకు ఇటీవల సీసీ రహదారి నిర్మించారు. ఇరువైపుల బెర్మ్‌లు పూర్తి కాకపోవడంతో ప్రమాదకరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఎదురెదురుగా రెండు వాహనాలు తప్పుకునే క్రమంలో ఏ మాత్రం పక్కకు వెళ్లినా ప్రమాదమే. సంబంధిత అధికారులు స్పందించి సీసీ రోడ్డు ఇరువైపుల బెర్మ్‌లు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, తాళ్లరేవు

సముద్ర స్నానాలు.. అలరించే నృత్యాలు

సర్పవరం, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం పరిధి సూర్యారావుపేట వద్ద సముద్ర తీరం గురువారం నూతన సంవత్సర వేడుకల శోభను సంతరించుకుంది. శిల్పారామంలో పరిపాలనాధికారి మోహన్‌తేజ ఆధ్వర్యంలో చిన్నారులు నృత్యాలతో అలరించారు. అనపర్తికి చెందిన శ్రీవైష్ణవి నాట్యాలయం గురువు భానుప్రమీల శిష్యబృందం సందడి చేసింది. భారీగా తరలివచ్చిన పర్యాటకులు సముద్ర స్నానాలు ఆచరించారు. తీరంలోనే కేకులు కోసి పంచుకున్నారు. అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండడంతో మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది, గజ ఈతగాళ్లు భద్రతాచర్యలు చేపట్టారు.

సముద్ర తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

సైన్స్ రంగోలి పోటీలు

పెద్దాపురం: నూతన సంవత్సరం సందర్భంగా పెద్దాపురం పట్టణంలో స్థానిక చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయిలో విద్యార్థులకు సైన్స్ రంగోలి పోటీలు నిర్వహించారు. సమాజంలో జరుగుతున్న అనేక పరిణామాలను వివరిస్తూ రంగులతో ముగ్గులు వేశారు. సుమారు 300 మంది విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్, అధ్యక్షురాలు అరుణ, అనూష, అంజలి, జస్విత, సాయి, బంగారం, నేహా, రేణుక, పవన్ తదితరులు పాల్గొన్నారు.

స్వాగత వనం

సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్రంలో నూతన సంవత్సరానికి అధికారుల, సిబ్బంది వినూత్నంగా స్వాగతం పలికారు. నాలుగు కాలాలపాటు 'పచ్చ'గా ఉండాలనే ఆకాంక్షతో వనమహోత్సవం నిర్వహించారు. గురువారం 2026 నూతన సంవత్సరం సందర్భంగా ఈటీసీ ప్రిన్సిపల్ కేఎన్‌వీ ప్రసాదరావుకు అధికారులు, సిబ్బంది మంచి ఫలాలు, పచ్చదనం, నీడనిచ్చే జామ, మామిడి, పనస వంటి మొక్కలందించి శుభాకాంక్షలు తెలిపారు. వాటిని ఆయన ఈటీసీ ఆవరణలో నాటించారు. ఉప ప్రిన్సిపల్ రమణ, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాసరావు, డీడీవో శర్మ, ఎంపీడీవోలు శేషుబాబు, సుశీల, రవికుమార్, ఆంజనేయులు, నిహారిక, రామకృష్ణ, జగన్నాథం, రాజశ్రీ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, సామర్లకోట

'ఇళ్ల పట్టాల పేరిట అవినీతి'

తాళ్లరేవు, న్యూస్‌టుడే: మండలంలో 2022 నుంచి 2024 వరకు ఇళ్ల పట్టాల పేరుతో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని గాడిమొగకు చెందిన సామాజిక కార్యకర్త పి.వి. భద్రం డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అప్పట్లో జరిగిన ఇళ్ల పట్టాల పనులపై ఆయా శాఖల ద్వారా సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించానన్నారు. ఈ పనులపై 2024లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశానన్నారు. దీనిపై అవినీతి నిరోధక శాఖ అధికారులు సంబంధిత భూమి యాజమానులను, అధికారులను, గుత్తేదారులను ఇప్పటికే విచారించారన్నారు. తక్కువ ధరకు లభించే ప్రభుత్వ భూములు పక్కన పెట్టి అధిక ధరకు ప్రైవేట్ భూములను కొనుగోలు చేశారన్నారు. ఆ స్థలాల అభివృద్ధి పేరిట పనులు చేయకుండానే బిల్లులు వసూలు చేశారని ఆయన ఆరోపించారు.

ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

సామర్లకోట గ్రామీణం: హుస్సేన్‌పురంలో ఇరువర్గాల కొట్లాటలో ఒకరికి తీవ్రగాయాలై ఆసుపత్రిపాలయ్యారు. సామర్లకోట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి గ్రామంలోని ఓ వీధిలో రోడ్డుకు అడ్డుగా ఉన్నారనే విషయమై ఇద్దరి నడుమ వాగ్వాదం చోటుచేసుకుంది. వారిద్దరూ మద్యం తాగి ఉండడంతో కొట్లాటకు దారితీసింది. దుర్గాప్రసాద్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా కాకినాడలోని ఆసుపత్రికి తరలించారు. ఘటనలో మరో ఇద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. ఇరువర్గాలపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంతో ఒకరు ఆసుపత్రిపాలు

కొత్తపల్లి: పిఠాపురం మండలం నవఖండ్రవాడకు చెందిన పీతల తాతేలు గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై మూలపేట వెళ్తుండగా కొండెవరం సమీపంలో ఎదురుగా వస్తున్న ఓ కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తాతేలు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కొత్తపల్లి పోలీసులను సంప్రదించగా తమకు సమాచారం అందలేదన్నారు.

మతిస్థిమితం లేని మహిళ రాళ్లు రువ్వడంతో యువకులకు గాయాలు

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోట పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద మతి స్థిమితం లేని మహిళ వాహనదారులపై రాళ్లు రువ్వడంతో పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికేందుకు, 2025కు వీడ్కోలు పలికే వేడుకల్లో భాగంగా బుధవారం అధిక సంఖ్యలో యువకులు పాత తహసీల్దార్ కార్యాలయం మీదుగా మోటారుసైకిళ్లు, కార్లలో వెళుతున్నారు. అదే సమయంలో మతిస్థిమితం లేని ఈ మహిళ వారిపై రాళ్లు రువ్వుతూ మూడు గంటలపాటు బీభత్సం సృష్టించింది. చివరికి కొందరు యువకులు ఆమెను పట్టుకుని, చేతులకు తాడు కట్టి పోలీసులకు అప్పగించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 ఫోన్ చేయండి: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: కూరాడ బీసీకాలనీ మంచినీటి ట్యాంకు వీధిలో రెండు రోజులుగా వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. - సత్తిబాబు

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్‌కు చెప్పగా సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

– న్యూస్‌టుడే, కరప

సమస్య: గొల్లప్రోలు రైల్వేస్టేషన్ రోడ్డులో చెరువుగట్టుపై చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. - స్థానికులు

పరిష్కారం: పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: పిఠాపురం ఇందిరానగర్‌లోని పలు వీధుల్లో ఏలేరు కాలువ నీరుచేరి దారులు బురదమయంగా ఉన్నాయి. - సతీష్

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్ మోటర్లతో నీరు తోడించి, వీధులను శుభ్రం చేయించారు.

– న్యూస్‌టుడే, పిఠాపురం

సమస్య: స్థానిక వక్కలంకవారివీధిలో రహదారిపై చెత్తపోగులున్నాయి. తొలగించడానికి చర్యలు తీసుకోవాలి. - ఏవీరావు

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలుపగా కార్మికులతో తొలగింపజేశారు.

– న్యూస్‌టుడే, పెద్దాపురం

రైతన్నకు 'రాజముద్ర'

నేటి నుంచి పాస్ పుస్తకాల పంపిణీ

కూటమి ప్రభుత్వం ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. గత వైకాపా హయాంలో రీసర్వే, పట్టాదారు పాస్ పుస్తకాలపై నాటి సీఎం జగన్ చిత్రం ముద్రించి ఇచ్చింది. దాంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారిక రాజముద్రతో పాస్ పుస్తకాలు అందించనుండడంపై హర్షం వ్యక్తమవుతోంది. – న్యూస్‌టుడే, పిఠాపురం

✦ పిఠాపురం, కాకినాడ గ్రామీణం, పెద్దాపురం నియోజకవర్గాల్లో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి చర్యలు చేపట్టింది. ప్రతి గ్రామంలోనూ ఈ నెల 2 నుంచి 9వ తేదీవరకు గ్రామ సచివాలయాల వారీగా వీటిని అందించనున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయాలకు ఈ పుస్తకాలు చేరవేశారు. రైతులు పాత భూహక్కు పత్రాలు వెనక్కి ఇచ్చేసి, వేలిముద్రలు వేసి కొత్త పుస్తకాలు తీసుకోవచ్చు. దీనిపై రెవెన్యూశాఖ ఇప్పటికే గ్రామాల వారీగా అవగాహన కల్పించింది. ఇదే సమయంలో రైతుల నుంచి వచ్చే అభ్యర్థనలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. గతంలో కొన్ని గ్రామాల్లో సర్వే జరగలేదు. పూర్తయిన పలు గ్రామాలకు పుస్తకాలు అందలేదు. ప్రస్తుతం ఎవరికైతే ఈ పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చాయో వారికే మొదటి విడతలో అందించనున్నారు. ఇప్పటికే వీటి పంపిణీకి సంబంధించి గ్రామాల వారీగా షెడ్యూల్ విడుదల చేశారు. పెద్దాపురం డివిజన్‌లో పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆర్డీవో శ్రీరమణి తెలిపారు.

వివరాలు ఇవీ..

మండలం	పాస్ పుస్తకాలు
పిఠాపురం	19,894
గొల్లప్రోలు	11,302
కొత్తపల్లి	5,455
పెద్దాపురం	7389
కరప	17,602
కాకినాడ గ్రామీణం	5,700
సామర్లకోట	10,323


కొత్తగా వచ్చిన పట్టాదారు పాస్ పుస్తకం

రైతులందరూ తీసుకోండి

ప్రభుత్వం రాజముద్రతో సిద్ధం చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలను ఆయా రైతులందరూ తీసుకోవాలి. అదే సమయంలో పాతవి తిరిగి ఇచ్చేయాలి. గతంలో సర్వే జరగని గ్రామాల్లోనూ రీసర్వే పూర్తయ్యింది. వారికి మాత్రమే పుస్తకాలు ఇంకా రాలేదు. త్వరలో వారికీ అందిస్తాం. రైతులు పుస్తకాల్లో పేర్లు, విస్తీర్ణం తదితర వివరాలు సరిచూసుకోవాలి. ఏమైనా సమస్యలుంటే తెలపవచ్చు.

- పీవీవీ గోపాలకృష్ణ, తహసీల్దార్, పిఠాపురం

(c) eenadu

రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సభలు

తొండంగి : రీ సర్వే 10 గ్రామాల్లో పూర్తయింది. ప్రభుత్వం రాజ ముద్రతో ముద్రించి రైతులకు అందిస్తున్న పట్టాదారు పాస్‌పుస్తకాలు నాలుగు గ్రామాలకు వచ్చాయి. ఆయా గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కాంతారావు తెలిపారు. రైతులు గ్రామసభలకు హాజరై పాస్‌పుస్తకం తీసుకునేందుకు ఈ-కేవైసీ వేయాలి. 2న పీఈగ్రహారం, 3 న వేమవరం, 6న గోపాలపట్నం, మధ్యాహ్నం ఆనూరుల్లో గ్రామసభలు జరగనున్నాయి.

కుమార వైభవం తెలుసుకోవాలి

శంఖవరం: కుమారస్వామి వైభవం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ప్రవచనకర్త టంగుటూరి ప్రవీణ్‌కుమార్ అన్నారు. కత్తిపూడి శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం ఆయన పవచనాలు చేశారు. కుమారస్వామి పుట్టుక, ఆయన విశిష్టతను వివరించారు.

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

సేవలు అభినందనీయం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ ఉప సంచాలకుడిగా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన దాసరి నాగార్జునను గురువారం కలెక్టర్ షాన్‌మోహన్ సత్కరించారు. సమాచార శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన నాగార్జున ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి(ఇన్‌ఛార్జి) రామచంద్రరావు, డివిజనల్ పీఆర్వో పి.రవి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సి.బాబూరావు, పీఆర్వో ఎస్.అజయ్, సీహెచ్.నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి మేత.. ఊళ్లకు వెత..

భారీ వాహనాలతో రోడ్లు ఛిద్రం

– న్యూస్‌టుడే ప్రత్తిపాడు, ఏలేశ్వరం

టి.రాయవరం దారిలో మట్టి వాహనం..

అనుమతి లేని మట్టి, గ్రావెల్ తవ్వకాలను అప లేని స్థితిలో ఉంది. పెద్దల అభయంతోనే ఏమాత్రం భయపడకుండా ప్రత్తిపాడు, ఏలేశ్వరంలలో యథేచ్ఛగా తవ్వుతున్నారు. దుమ్ము రేపుతూ మట్టి తరలించే వాహనాలు రోడ్లపై కంకరా పుట్టిస్తున్న ఆ వైపు అధికారులు చూడడం లేదు. రోజూ 30 నుంచి 50 లారీలు ఈ రహదారిలోనే హైవే, గ్రామీణ రోడ్లపై జుబ్బర్లుగా తిరుగుతున్నాయి. గ్రామీణ కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. కళాశాల బస్సులు తిరిగే ప్రత్తిపాడు- సామర్లకోట రహదారిలో మట్టి లారీ జోరుకు కళ్లెం పడటం లేదు. కళాశాల బస్సులు, విద్యార్థుల రోజూ ప్రయాణిస్తుంటారు. ఇవన్నీ ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లోనే తవ్వకాలు చెందినవి.

ప్రత్తిపాడు మండలం టి.రాయవరం గ్రామం వెళ్లే దారిలో పోలవరం మట్టిని తరలిస్తున్నారు.

తాజాగా.. గ్రామానికి వెళ్లే దారిలోనే మట్టి వాహనాలు జోరుగా సాగడంతో దుమ్ముకొట్టుకుపోతున్నాయి. టి.రాయవరం గ్రామం దాటి రావడానికి వేరే మార్గం లేదు. ఆటోలు, సొంతవాహనాలే రవాణా సాధనం. మట్టి రవాణా చేసే వాహనాల జోరుతో దట్టమైన దుమ్ము రోడ్డుపై కమ్మేస్తోంది. రాత్రివేళల్లో మరీ ప్రమాదకరంగా ఉంటోంది. లంపకలోవ దారిలో, ప్రత్తిపాడు హైవే కూడలిలోనూ వీటి జోరు తీవ్ర ఇబ్బంది అవుతోంది.

లారీ 20 టన్నులకు పైగా బరువుతో రోడ్లను ధ్వంసం చేస్తున్నాయి.

బేఖాతర్ కూటమి ప్రభుత్వం వచ్చాక దారులు బాగుపడుతున్నాయనే సంతోషం ఎంతో కాలం నిలవడం లేదు. భారీ వాహనాల రాకపోకలతో ఛిద్రమవుతున్నాయి. మట్టి, గ్రావెల్ తవ్వకాలపై గనులశాఖ అధికారులు దృష్టి పెట్టరు. రవాణా అధికారులు అడపాదడపా కేసులు రాస్తున్నా లెక్కచేయని వైనం ఇక్కడ కనిపిస్తోంది.

ప్రమాదాల నియంత్రణకు చర్యలేవీ..?

పోలీసులు, ఎన్‌హెచ్ఏఐల సమన్వయంతోనే సాధ్యం

గండేపల్లి, న్యూస్‌టుడే: గత దాదిలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకుందాం. నూతన సంవత్సరంలో మెరుగైన ప్రయాణాలను అడికట్టేందుకు పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ నిర్వాకులు సమన్వయంతో వ్యవహరించాల్సి ఉంది. గత ఏడాది నియోజకవర్గంలో ప్రమాదకర కూడళ్ల వద్ద జరిగిన రక్షణ చర్యలు లోపించడంతోనే ప్రమాదాలు సంభవించినట్లు వాహనచోదకులు ఆరోపిస్తున్నారు.

మండలం	కేసులు	క్షతగాత్రులు	మృతులు
జగ్గంపేట	24	17	17
గండేపల్లి	45	38	30
కిర్లంపూడి	9	7	9

గండేపల్లి మండలంలోనే అధిక ప్రమాదాలు..

జగ్గంపేట నియోజకవర్గంలోని మూడు మండలాల్లో చూస్తే 2024లో ఏడాదిలో వివిధ ప్రమాదాల్లో 67 మంది మృతి చెందగా, 2025లో 56 మంది మృత్యువాత పడ్డారు. అయితే గత రెండేళ్లుగా సంబంధించి అధికారుల గణాంకాలను పరిశీలిస్తే గండేపల్లి మండలంలోనే ఎక్కువ ప్రమాదాలు, మృతులు ఉన్నారు. అనధికారికంగా ఇంకా ఎక్కువే ఉంటాయన్నది వాస్తవం. ఒక్క గండేపల్లి మండలంలోనే 18 కి.మీ జాతీయ రహదారి, సుమారు 11 కూడళ్లు ఉన్నాయి. అనధికార కూడళ్లు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఏ కూడలి వద్ద రక్షణ చర్యలు లేకపోవడంతోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

మల్లేపల్లి కూడలి వద్ద రోడ్డు దాటుతున్న విద్యార్థులు, వాహనదారులు

బ్లాక్‌స్పాట్‌ల వద్ద రక్షణ చర్యలు

ఏడాదిలో ఎక్కువ ప్రమాదాలు జరిగిన కూడళ్లను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తిస్తాం. ఈ బ్లాక్‌స్పాట్‌ల వద్ద రోడ్డు మార్కింగ్ (జీబ్రా క్రాసింగ్)లు, సోలార్ బ్లింకర్స్, రోడ్డు సైన్ బోర్డ్సు తదితరాలను ఏర్పాటు చేస్తాం.
- శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్, హైవే నిర్వహణ

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 95333 66637

కాలువలను శుభ్రం చేయించాలి.

సమస్య : పేరవరంలో కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పూడికతో నిండిపోవడంతో మురుగుతో ఇబ్బందులు పడుతున్నాం. **- రాజు, పేరవరం,**

సమాధానం : కాలువల్లో పూడిక తీయించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని పంచాయతీకి ఆదేశాలిస్తాం. మురుగు సమస్య తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.
- రవికుమార్ దర్మ, ఎంపీడీవో, ఏలేశ్వరం.

వీధి దీపాలకు మరమ్మతులు

సమస్య: మండలంలోని రాజపూడి శివారు సీతారాంపురంలో వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రిపూట బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉంది. **- స్థానికులు**

పరిష్కారం: గ్రామంలో వీధి దీపాలకు మరమ్మతులు చేపడతాం. వెలగని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తాం.
- ఎం.వి.వి.ఎస్ మూర్తి, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, ఏలేశ్వరం, జగ్గంపేట గ్రామీణం

సముద్ర స్నానాలు.. అలరించిన నృత్యాలు

సర్పవరం, తొండంగి, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం పరిధి సూర్యారావుపేట, అద్దరిపేట, దానవాయిపేట, నర్సీపేటల వద్ద సముద్ర తీరం గురువారం నూతన సంవత్సర వేడుకల శోభను సంతరించుకుంది. శిల్పారామంలో పరిపాలనాధికారి మోహన్‌తేజ ఆధ్వర్యంలో చిన్నారులు నృత్యాలతో అలరించారు. అనపర్తికి చెందిన శ్రీవైష్ణవి నాట్యాలయం గురువు భానుప్రమీల శిష్యబృందం సందడి చేసింది. భారీగా తరలివచ్చిన పర్యాటకులు సముద్ర స్నానాలు ఆచరించారు. తీరంలోనే కేకులు కోసి పంచుకున్నారు. అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండడంతో మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది, గజ ఈతగాళ్లు భద్రతాచర్యలు చేపట్టారు.

తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

విధుల్లో చేరిన ఈవో

పిఠాపురం: పిఠాపురంలోని కుంతీమాధవస్వామి ఆలయ ఈవోగా బొడ్డేపల్లి ధనలక్ష్మి గురువారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఈవోగా ఉన్న శ్రీరాములు ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ఉ.కొత్తపల్లి మండల గ్రూపు దేవాలయాలకు ఈవోగా పని చేస్తూ, ఆమె ఇక్కడ కూడా విధులు నిర్వహిస్తారు. అనంతరం వేణుగోపాలస్వామి ఆలయానికి వెళ్లగా ఈవో జనార్దనాచార్యులు సత్కరించారు.

పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి కృషి

వేణు, సత్యనారాయణలను సన్మానిస్తున్న నాయకులు

తుని పట్టణం, న్యూస్‌టుడే: ఆం.ప్ర. రాష్ట్ర మున్సిపల్ పెన్షనర్స్ అసోసియేషన్ కోశాధికారిగా గాజుల సత్యనారాయణ, సలహా సభ్యుడిగా సుందరినీడి సత్యనారాయణ ఎన్నికైన సందర్భంగా సంఘ నాయకులు గురువారం సన్మానించారు. పట్టణంలోని ఎస్‌ఏ రోడ్డులో ఉన్న మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ రీక్రియేషన్ హోమ్‌లో అసోసియేషన్ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. సమావేశంలో చందక ప్రకాశరావు, కెవివి సత్యనారాయణ రాజు, కె.శివాజీ, ఎంవీ రమణ, డీఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు : ప్రత్తిపాడు మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గ ఎన్నిక ఉపఖజానా కార్యాలయంలో గురువారం జరిగింది. సంఘ అధ్యక్షుడిగా ముక్కు సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా దిడ్డి సీతారామం, బొడ్డేటి అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా ఏఎస్ఆర్ శేషగిరిరావు, కోశాధికారిగా బి.సత్యనారాయణ, సహ అధ్యక్షులుగా వై.రామం, సూర్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులుగా జె.సుబ్బారావు, కంపరపు నాగేశ్వరరావు, ఎం.చిన్నారావు, పి.వెంకటరమణ, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులుగా మద్రిపూడి సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ తదితర 12 మంది ఎంపికయ్యారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్లు ఫిబ్రవరి 28లోపు అందజేయాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగులు నూతన కార్యవర్గం

కనకదుర్గాదేవికి మహా కుంభాభిషేకం

కిర్లంపూడి, న్యూస్‌టుడే: తామరాడ గ్రామంలో గ్రామదేవత కనకదుర్గాదేవి అమ్మకి గ్రామస్థులు గురువారం మహా కుంభాభిషేకం నిర్వహించారు. మహిళలు సప్తనదీ జలాలతో బోనాలను ఊరేగింపుగా తెచ్చి అమ్మవారికి సమర్పించారు. అర్చకస్వాములు దేవరబట్ల రాజా, గరుడమూర్తి, కృష్ణ అమ్మవారికి ఆ జలాలతో అభిషేకం నిర్వహించారు. కర్రి శ్రీనివాస్, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో గ్రామస్థులతోపాటు వివిధ గ్రామాలకు చెందిన మహిళలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బసవేశ్వరునికి 21 ద్రవ్యాలతో అభిషేకాలు

ప్రత్తిపాడు : ఆంగ్ల సంవత్సరాది నాడు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. రాచపల్లిలోని ఆంధ్రా అరుణాచలం గురువారం రద్దీగా మారింది. అరుణాచలేశ్వరునికి రుద్రాభిషేకాలు, పూజలు జరిగాయి. మండపంలోని బసవేశ్వరునిగా కొలిచే నందికి 21 ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ఈ విశేష అర్చనను తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేశారు. ఆలయ వ్యవస్థాపకులు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఒమ్మంగి, ఉత్తరకంచి, ధర్మవరం, ప్రత్తిపాడు విష్ణాలయాల్లోనూ భక్తుల సందడి నెలకొంది.

ఉమా కోటేశ్వరుడు.. ఆపద్బాంధవుడు

ఏలేశ్వరం: ఏలేశ్వరంలోని ఏలేరు నదీ తీరాన వేంచేసియున్న శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆపద్బాంధవునిగా వాసికెక్కారు. సాయిబాబా మెట్టపై కొలువైయున్న కోటిలింగేశ్వరుని మహిమ అనంతమని భక్తుల విశ్వాసం. అర్చకుడు అయిలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయంలో నిత్య కైంకర్యాలు వైభవంగా జరుగుతాయి. ఏటా కార్తిక మాసంలో పెద్ద సంఖ్యలో భక్తజనం తరలివస్తారు. ఆలయ సమీపానే షిర్డీ సాయినాధుడు, దత్తాత్రేయ మందిరాలు ఉండడం ప్రత్యేకత.

ఆహార అలవాట్లకు అనుగుణంగా రేషన్

కాకినాడ కలెక్టరేట్ : మారుతున్న ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక శాలిపేట వద్ద కాకినాడ నగరంలోని రేషన్‌కార్డుదారులకు రాయితీపై అందిస్తున్న గోధుమ పిండి పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాల ముఖ్య కేంద్రాల్లో కిలో రూ.20 చొప్పున పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఎస్‌వో ఆర్ఎస్ఎస్ సత్యనారాయణరాజు, పౌరసరఫరాల ఉప తహసీల్దారు శ్రీనివాస్, జనసేన నాయకులు స్వామి, సత్య పాల్గొన్నారు.

కలెక్టర్ పిలుపునకు స్పందన

కలెక్టర్ షాన్‌మోహన్‌కు చెక్కు అందజేస్తున్న కలెక్టరేట్ ఉద్యోగులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లకు విరాళాలు, వస్తువులు అందించాలని కలెక్టర్ ఇచ్చిన పిలుపునకు ఉద్యోగులు, వివిధ సంస్థలు స్పందించాయి. పేద విద్యార్థులకు ఉపయోగపడే నోట్‌పుస్తకాలు, టవళ్లు, ఇతర వస్తువులను అందజేశారు. సుమారు రూ.30 లక్షల మేర విరాళాలిచ్చారు. వీరందరికీ కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

కాకినాడ నగరం : సంక్షేమ వసతి గృహాల్లో వసతుల కల్పనకు నగరపాలక సంస్థ ఉద్యోగులు సేకరించిన రూ.50వేల విరాళాన్ని కలెక్టరుకు అందజేశారు. కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ, అదనపు కమిషనర్ సుధాకర్, ఉప కమిషనర్ శ్రీనివాస్ తదితరులు గురువారం కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త ఏడాది సందడి

తుని, ప్రత్తిపాడు, కిర్లంపూడి, ఏలేశ్వరం, గండేపల్లి, తొండంగి, రౌతులపూడి, శంఖవరం, కోటనందూరు, తుని గ్రామీణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. గెడ్లబీడు సాయివేదికలో తెదేపా ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే యనమల దివ్య కేకును కోసి యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్ తదితరులకు అందజేశారు. పురపాలక సంఘ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ నార్ల భువనసుందరి, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు నివాసం, కిర్లంపూడిలో ముద్రగడ నివాసంలో అభిమానులు, పార్టీ శ్రేణులు, శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్తిపాడులోని రాష్ట్ర ఖాదీ బోర్డు వైస్‌ఛైర్మన్ కె.కన్నబాబును పార్టీ శ్రేణులు కలిసి శుభాకాంక్షలు తెలిపాయి. రామచంద్రపురంలో జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, జడ్.రాగంపేటలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు కందుల చిట్టిబాబు, కోర్పు లచ్చయ్యదొర, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సింగరంపాలెంలో, జాస్తి వసంత్ మురారిలో, జడ్పీటీసీ పరిమి వెంకటలక్ష్మి, ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ● శంఖవరం జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్‌కు పార్టీ శ్రేణులు కత్తిపూడి వచ్చి శుభాకాంక్షలు తెలిపాయి. నాయకులు పర్వత సురేష్, బద్ది రామారావు, రాష్ట్ర రోడ్డు కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు ఇంట వేడుకలు జరిపారు. ఏలేశ్వరం ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్ చలమయ్యలకు ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

తుని గ్రామీణం: వేడుకల్లో కేకు కోస్తున్న ఎమ్మెల్యే దివ్య

కిర్లంపూడిలో అభిమానులతో ముద్రగడ



జగ్గంపేట: అప్పలరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

సబల...శుభకామన

ప్రత్తిపాడు : తహసీల్దార్ కార్యాలయంలో సబలల సందడి ఆసక్తిగా నిలిచింది. తహసీల్దార్ సూర్యప్రభకు వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఉప తహసీల్దార్ పుణ్యవతితో సహా 15 మంది వీఆర్వోలు, సిబ్బంది మహిళలే. వీరు మొక్కలు, పుష్పగుచ్ఛాలతో ఫొటోలు దిగారు. మొక్కలను ఆవరణలోనే పెంచే బాధ్యతను సిబ్బందికి తహసీల్దార్ అప్పగించారు.

శిథిలావస్థలో పశువుల ఆసుపత్రి

జగ్గంపేట గ్రామీణం మండలం మల్లిసాలలో పశువుల ఆసుపత్రి భవనం శిథిలమై బీటలు వారుతోంది. భవనానికి ఏర్పడిన బీటల్లో మొక్కలు పెరగడంతో పగుళ్లు పెద్దవయ్యాయి. భవనం ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన దుస్థితి. ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనం గోడలు బలహీనంగా మారుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. భారీ వర్షం కురిస్తే లీకులు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు.
– న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

పేదలకు వితరణ

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడు గొల్లపూడి త్రిమూర్తులు పుట్టిన రోజు సందర్భంగా గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కేకులు కోసి సందడి చేయకుండా 50 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సొసైటీ కార్యాలయం సమీపాన అనారోగ్యంతో ఉన్న అచ్చిబాబుకి 25 కిలోల బియ్యం, నిత్యావసరాలను త్రిమూర్తులు అందజేశారు. నాయకులు బుగత శ్రీను, వాగు రాజేష్, జింకల నానాజీ, పెచ్చెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో రెండిళ్లు దగ్ధం

తుని గ్రామీణం: తాళ్లూరు గ్రామంలో గురువారం సాయంత్రం విద్యుదాఘతంతో రెండు తాటాకిళ్లు అగ్నికి దగ్ధమయ్యాయి. షేక్ మహబూబ్ నిషా, షేక్ షిలార్‌బీబీ, షేక్ అమ్మాజీలు నివాసం ఉంటున్న ఇళ్లు దగ్ధం కావడంతో వారు నిరాశ్రయులయ్యారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఇంటిలోని సామగ్రితోపాటు కొద్దిపాటి నగదు బూడిదైందని బాధితులు వాపోయారు. రెవెన్యూ అధికారులు అత్యవసర సాయంగా బియ్యం అందించారు. మాజీ మంత్రి దాడిశెట్టి రాజా స్థానిక నాయకుడు నాగం దొరబాబు ద్వారా రూ.50 వేలు నగదు, నిత్యావసర సరకులను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

శంఖవరం: కత్తిపూడి హైవేపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలివీ.. దుర్గాడ గ్రామానికి చెందిన ప్రగడ వాసు రోడ్డు దాటేందుకు ద్విచక్రవాహనంపై రహదారి పక్కనే వేచి ఉండగా రాజమహేంద్రవరం వైపు వెళుతున్న లారీ అదుపుతప్పి ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన వాసుని 108లో కాకినాడ ఆసుపత్రికి తరలించారు. పోలీసులను సంప్రదించగా ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదన్నారు.

పెదశంకర్లపూడిలో కోడిపందేలపై దాడి

ప్రత్తిపాడు: పెదశంకర్లపూడిలో కోడిపందేలపై గురువారం రాత్రి పోలీసులు దాడి చేశారు. గ్రామానికి చేరువగా గుంపుగా పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై లక్ష్మీకాంతం, సిబ్బంది మెరుపుదాడి చేశారు. 13 మందిని అరెస్టు చేసి మూడు పుంజులను స్వాధీనం చేసుకున్నారు. పందెం బరి వద్ద రూ.10,120లు నగదుతో పాటు ఆరు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. మండల పరిధిలో ఎక్కడ జూదాలు, కోడి పందేలు జరిగినా 94407 96570, 94407 96530 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

ధర్మవరంలో జూద శిబిరంపై..

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని ధర్మవరం గ్రామ శివారున జూద శిబిరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.2550లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మీకాంతం తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

వద్దన్న చోటే చెత్త... రాకపోకలకు అవస్థ

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : ఊరి చెత్త అంతా అక్కడే వేసేస్తున్నారు. మండలంలోని యర్రవరం శివారు కొత్త యర్రవరంలో ర.భ.శాఖ రహదారి అంచు మినీ డంపింగ్ యార్డుగా మారిపోయింది. ఇక్కడ చెత్త వేస్తే రూ. 500 జరిమానా అని హెచ్చరిక బోర్డు పెట్టిన ప్రదేశానికే వ్యర్థాలను కొందరు తరలిస్తున్నారు. వెంటనే తొలగించకపోవడంతో నిల్వ ఉండిపోతోంది. ఇప్పటికే రహదారి అంచులు చెత్తతో నిండిపోయాయి. క్రమేపీ రహదారిపై చేరుతున్నాయని స్థానికులు అంటున్నారు. అధికారులు కేవలం హెచ్చరిక బోర్డులు పెట్టి చేతులు దులుపుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రహదారులకు ఇరువైపులా ఉన్న చెత్తను గ్రామానికి దూరంగా తరలించే ఏర్పాట్లు చేయించాలని పలువురు కోరుతున్నారు.

కొత్త యర్రవరంలో రోడ్డుని ఆక్రమిస్తున్న చెత్త

ప్రపంచ తెలుగు మహాసభల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్ర సారస్వత పరిషత్ సారథ్యంలో గుంటూరులో ఈ నెల 3,4,5 తేదీల్లో నిర్వహించనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల ఆహ్వానపత్రికను గురువారం కాకినాడ ప్రధాన తపాలా కార్యాలయంలో డివిజనల్ పోస్టల్ సూపరిండెంటెంట్ కె.కృష్ణ ఆవిష్కరించారు. పోస్టల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జీవి.లక్ష్మీనారాయణ, తురగా సూర్యారావు మాట్లాడుతూ తెలుగు భాషా వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసే ఇటువంటి కార్యక్రమాల్లో పోస్టల్ ఉద్యోగులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ సంఘ నాయకులు సిహెచ్.రామారావు, సాయిరాం, సూర్యనారాయణ, కృష్ణమూర్తి, వై.నాగేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రబీ సందడి

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు, ఏలేశ్వరం

నియోజకవర్గంలో దాళ్వా పనులు జోరందుకున్నాయి. నాలుగు మండలాల్లోనూ 14 వేల ఎకరాల్లో రెండో పంట సాగవుతుంది. నాట్లు, వెదజల్లు పద్ధతిలో సాగు చేసేందుకు వ్యవసాయ క్షేత్రాలు సిద్ధమవుతున్నాయి. రబీలో ఎంటీయూ 1156, ఆర్ఎన్ఆర్ 048 రకాలకే రైతులు ప్రాధాన్యం ఇచ్చారు. నేల దమ్ము చేసే పనిలో రైతులు బిజీగా ఉన్నారు. ఏలేశ్వరం మండలంలోని గ్రామాలు, ప్రత్తిపాడు మండలంలోని ఏలూరుకు ఏలేరు జలాలు సరఫరా అవుతాయి. ప్రత్తిపాడు మండలంలో బోర్లు ఆధారం. పుష్కర, పోలవరం కాలువల్లో ఉన్న నీటిని తోడుకుని దాళ్వా వేస్తారు. ఈ మండలంలో ఈ ఏడాది 6 వేల ఎకరాల్లో సాగు జరుగుతుంది. పూర్తి వర్షాధార మండలాలైన శంఖవరం, రౌతులపూడిల్లో రెండో పంటగా వరి విస్తీర్ణం తక్కువే. అపరాలను పండిస్తారు. ఎరువులను ఆర్బీకేల ద్వారా ఇప్పటికి 1300 మెట్రిక్ టన్నులు సరఫరా చేశారు. ఎరువుల కొరత లేదని వ్యవసాయాధికారులు రాజేశ్, అమృత తెలిపారు. ఖరీఫ్ పంట గండాలను దాటి సానుకూలంగానే పండటంతో పాటు రెండో పంటకు నీరు అందుబాటులోనే ఉండటంతో రైతులు ఆశాజనకంగా ఉన్నారు. ఏలేరు ఎడమకాలువ వెంబడి ఉన్న గ్రామాల్లో ఊటలు రబీకి భరోసా ఇస్తున్నాయి. చింతలూరులో పెద్ద చెరువు పొర్లుపడటానికి ఊటలే ఆధారం. ఈ నీటి వనరు కింద 1400 ఎకరాలు సాగవుతాయి. రబీ కాలంలో టమాటా, చిక్కుడు రకాలతో సహా అన్ని రకాల కూరగాయలు పండిస్తున్నారు. ఇంజిన్లతో నీటిని తోడుకుని ఈ సాగు జరుగుతుంది.

రాచపల్లి సమీపంలో నాట్లు వేసేందుకు దమ్ము

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
सेंट्रल बैंक ऑफ इंडिया
Central Bank of India
"CENTRAL" TO YOU SINCE 1911

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయం: #47-10-14, సాయిబల్లి ఎలైట్, 3వ అంతస్తు, పోలాక్స్ స్కూల్ ఎదురుగా, డైమండ్ పార్కు దగ్గర, 2వ లైను ద్వారకానగర్, విశాఖపట్నం-530016.

బిడ్లు కొరకు ఆహ్వానం / లీజు ప్రాంగణం కొరకు ఆహ్వానం

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ప్రాంగణం కొరకు 120.77 చ॥మీ॥లు (1300 చ॥అ॥లు) విస్తీర్ణం గల కార్పెట్ ఏరియా, తుని బ్రాంచ్ కొరకు 3 నెలల లోపు అద్దె కొరకు సిద్ధంగా ఉండగలిగిన మరియు బ్రాంచ్ యొక్క కస్టమర్ & స్టాఫ్ కొరకు తగిన పార్కింగ్ స్థలంతో పాటు గ్రౌండ్ ఫ్లోర్‌కు ప్రాధాన్యత ఉండవలెను. దయచేసి బ్రోకర్లు లేదా మధ్యవర్తుల ప్రమేయమునకు అవకాశం లేదు అని గమనించగలరు. ప్రభుత్వం / సెమీ ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. దయచేసి https://www.centralbank.bank.in నుండి ఫార్మాట్‌లు / నిబంధనలు మరియు షరతులను డౌన్‌లోడ్ చేసుకోండి లేదా కార్యాలయ పనిదినములలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తుని బ్రాంచ్ / రీజనల్ ఆఫీస్ విశాఖపట్నం నుండి సేకరించవచ్చును మరియు ఆఫర్లను చివరి తేది.23.01.2026 సాయంత్రం 4.00 గం॥ల లోపు సమర్పించవలెను.

సం/- సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయం, విశాఖపట్నం

జన్మదిన శుభాకాంక్షలు
మాకు అత్యంత ఆప్తులు, శ్రేయోభిలాషులు, గౌరవనీయులు శ్రీ కందుల చిట్టిబాబు గార్కి, మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొంది ప్రజాసేవలో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని కోరుకుంటూ, శుభాకాంక్షలతో..
శ్రీ కందుల చిట్టిబాబు గారు
మేనేజ్‌మెంట్ & స్టాఫ్, శ్రీ సాయి రైస్ ఇండస్ట్రీస్, Z.రాగంపేట
కురుకూరి చౌదరి | కందుల విజయ్
కురుకూరి రమేష్ | గోలి సాయివెంకటేష్
పలివెల తేజ | ముత్తిన శ్రీనివాస్ | బొర సాయికుమార్

(c) eenadu

పట్టాదారులకు పుస్తకం

■ నేటి నుంచి పంపిణీ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రాజముద్రతో ముద్రించిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి రెవెన్యూ శాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. ఈనెల 2 నుంచి 9వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజాప్రతినిధుల చేతులమీదుగా వాటిని రైతులకు పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే కర్నూలు, నంద్యాల జిల్లాలోని మండల తహసీల్దారు కార్యాలయాలకు పాసు పుస్తకాలను సరఫరా చేశారు. శుక్రవారం నుంచి వీటిని పంపిణీ చేయనున్నారు.

❑ గత వైకాపా ప్రభుత్వంలో కర్నూలు జిల్లాలో 255, నంద్యాల జిల్లాలోని 204 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తయింది. ఈ గ్రామాల్లోని 1.54 లక్షల మంది రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వనున్నారు.

❑ వైకాపా హయాంలో 459 గ్రామాల్లో రీసర్వే పూర్తయింది. వీటిలో 25 శాతం గ్రామాలకు కూడా పాసుపుస్తకాలు రాలేదు. ప్రస్తుతం పంపిణీ చేపట్టిన గ్రామాల్లో కూడా కొంతమంది రైతులకు పాసుపుస్తకాలు రాలేదు.

❑ గత వైకాపా ప్రభుత్వంలో భూ రికార్డుల స్వచ్ఛీకరణ చేపట్టారు. అప్పట్లో కొందరు రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా ఖాతా నంబర్లను మార్చేశారు. ఆలో మ్యుటేషన్ పేరుతో ఖాతా నంబర్లలో తప్పులు దొర్లాయి. కూటమి ప్రభుత్వంలో ఈ తప్పులను సరిచేయాలని ఆదేశించినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం అవే తప్పులతోనే కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

దారి అంచు.. జారితే ముంచు

కర్నూలు నగరం అబ్బాస్‌నగర్ వద్ద జాతీయ రహదారి ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డు అంచులు ప్రమాదకరంగా మారాయి. సమీపంలోనే ఉన్న కల్లూరు తహసీల్దారు కార్యాలయానికి వస్తున్న వారు ప్రమాదాల బారిన పడుతున్నారు.

– ఈనాడు, కర్నూలు

జీవన ప్రమాణ పత్రాల సమర్పణకు ప్రత్యేక కౌంటర్లు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్, ఫ్యామిలీ పింఛనుదారులు జీవన ప్రమాణ పత్రాలను సమర్పించాలని జిల్లా ఖజానాధికారి బి.రామచంద్రరావు సూచించారు. పింఛనుదారులు జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీలోగా జీవన ప్రమాణ పత్రాలు సమర్పించాలన్నారు.

❑ ఆరు సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి నెలాఖరులోగా జీవన ప్రమాణ పత్రాలు సమర్పించకపోతే ఏప్రిల్ 1న ఇవ్వాల్సిన మార్చి నెల పింఛను నిలిచిపోతుందన్నారు.

❑ జిల్లాలో 12,290 (కర్నూలు), 2,131 (ఆదోని), 695 (ఆలూరు), 512 (గూడూరు), 712 (పత్తికొండ), 1,100 (ఎమ్మిగనూరు) మంది పెన్షనర్లు ఉన్నారు.

సీమ గుమ్మం.. పరిశ్రమల గమ్యం

■ ఈ ఏడాది ఓర్వకల్లుకు రానున్న భారీ ప్రాజెక్టులు

■ వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు

బ్రాహ్మణపల్లిలో నిర్మిస్తున్న బేవరేజెస్, కన్స్యూమర్ ఉత్పత్తుల తయారీ కేంద్రం

ఈనాడు, కర్నూలు: సీమ గుమ్మంలో పారిశ్రామికాభివృద్ధికి చకచకా అడుగులు పడుతున్నాయి. ఓర్వకల్లులోని 'మెగా ఇండస్ట్రియల్ హబ్‌'లో పరిశ్రమ ఏర్పాటుకు పలు కంపెనీలు ముందుకొస్తున్నాయి. హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారిలో ఉన్న ఓర్వకల్లు నోడ్ అభివృద్ధికి రూ.2,870.39 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం ముందుకొచ్చింది. ఇప్పటికే రూ.వెయ్యి కోట్లు విడుదల చేసింది. తొలి దశలో 2,600 ఎకరాల్లో భారీ పారిశ్రామిక వాడను అభివృద్ధి చేస్తున్నారు. రూ.56,244.25 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం చేసుకోగా.. ఇందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోద ముద్ర పడింది. వీటి ఏర్పాటు వల్ల ప్రత్యక్షంగా 17,826 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. పరోక్షంగా పదివేల మందికి ఉపాధి దక్కే అవకాశం ఉంది.

బ్రాహ్మణపల్లిలో అతిపెద్ద ప్లాంటు

● రిలయన్స్ సంస్థ బ్రాహ్మణపల్లి పరిధిలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బేవరేజెస్ ప్లాంటును ఇక్కడ నిర్మిస్తోంది. 170 ఎకరాల్లో రూ.2,380.02 కోట్ల వ్యయంతో బేవరేజెస్, కన్స్యూమర్ ఉత్పత్తుల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేస్తోంది.

● చాకొలెట్లు, స్నాక్స్, నూడుల్స్, ఆటా, బియ్యం, సుగంధ ద్రవ్యాలు తదితర ఉత్పత్తుల ప్యాకేజింగ్ కూడా ఈ ప్రాంగణంలోనే చేయనుంది. ఈ ఒక్క సంస్థ కారణంగానే సుమారు 5 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది.

గుట్టపాడులో ఉపాధి వెలుగులు

● సిగాచి ఇండస్ట్రీస్ సంస్థ గుట్టపాడులో 25 ఎకరాల్లో రూ.280 కోట్లతో ఓ పరిశ్రమను స్థాపించబోతోంది. దీంతో పాటు ఆర్సీఎస్ ఇండస్ట్రీస్ సంస్థ 11 ఎకరాల్లో రూ.90 కోట్ల వ్యయంతో మరో పరిశ్రమను ఏర్పాటు చేయబోతోంది.

● ఈ రెండు కర్మాగారాల ఏర్పాటుతో 1130 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. వీటితో పాటు సిగాచి సంస్థ మరో రూ.వెయ్యి కోట్లు కర్నూలులో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చింది.

సెమీ కండక్టర్ల రూపకల్పన

● ఓర్వకల్లు సెమీ కండక్టర్ల తయారీ కేంద్రంగా రూపాంతరం చెందడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జపాన్‌కు చెందిన ఇఐఓఫ్ మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, భారత్‌కు చెందిన ప్రైజ్, టీఎస్ గ్రూప్‌లు కలిపి మొత్తం రూ.14 వేల కోట్లతో సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నాయి.

● ఇండిచిప్ సెమీ కండక్టర్ సంస్థ కర్నూలులో రూ.22,976 వేల కోట్లతో పరిశ్రమ స్థాపించేందుకు ముందుకొచ్చింది. ఈ రెండు పరిశ్రమలు ఏర్పాటైతే ఉమ్మడి జిల్లా యువతకు కనీసం 20 వేల ఉద్యోగాలు వస్తాయని నిపుణుల అంచనా వేస్తున్నారు.

ఇక్కడే.. డ్రోన్ నగరం

డ్రోన్ల రంగంలో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో పరిశ్రమలు ఏర్పాటు చేయించే లక్ష్యంతో ప్రభుత్వం కర్నూలులో డ్రోన్ సిటీని ఏర్పాటు చేసింది. గతేడాది నవంబరు 14వ తేదీన దీనికి విశాఖ సీఐఐ సదస్సు నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

లేఅవుట్ ఏర్పాటు చేసిన వెంటనే ఇక్కడ డ్రోన్ల తయారీ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. కర్నూలు ట్రిపుల్ ఐటీ డీఎం భాగస్వామ్యంతో డ్రోన్ రంగంలో గణనీయ అభివృద్ధి సాధించేదుకు వీలుగా ప్రభుత్వం మార్గదర్శిని సిద్ధం చేసింది. డ్రోన్ల రంగంలో పెద్దఎత్తున ఉపాధి లభించేలా త్వరలో శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుంది.

మన వద్దే విద్యుత్తు వాహనాల తయారీ

విద్యుత్తుతో నడిచే వాహనాలకు రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కర్నూలు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రంగా మార్చడానికి వీలుగా 'ఈవీ పార్క్' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

1,200 ఎకరాల్లో ఏర్పాటు కాబోయే ఈ ప్రాజెక్టులో మొత్తం రూ.13 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఈ ఒక్క ఈవీ పార్క్ ద్వారానే ఏకంగా 25 వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది.

నేత్రశోభితం.. నారాయణుడి ఉత్సవం

అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగించారు. వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆళ్వారుల చెంత అర్చకుల వేదపారాయణలు పఠించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ధనుర్మాస పూజల్లో భాగంగా గోదాదేవి సన్నిధిలో పాశురాన్ని స్వామికి విన్నవించారు. ఈ ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, సీఏవో రామానుజన్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. – న్యూస్‌టుడే, అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం)

ప్రమాదాల చిట్టా ఐ-రాడ్‌లో నిక్షిప్తం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల వివరాలు పక్కాగా నమోదు చేయాలని కేంద్రం ఆదేశించింది. ఇందులో భాగంగా తాజాగా 'ఐ-రాడ్' (ఇంటిగ్రేటెడ్ యాక్సిడెంట్ డేటాబేస్) యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఏదైనా ప్రమాద ఘటన జరిగినచోట ప్రమాదస్థలికి పోలీసులు చేరుకున్న వెంటనే ప్రమాదం జరిగిన సమయం, జరిగిన తీరు, కారణాలను వివరిస్తూ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.

● ఏ సమయంలో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.. ఏ వాహనాలు అధికంగా ప్రమాదాలకు గురవుతున్నాయి.. ఏ స్థలం ప్రమాదకరంగా ఉందనే వివరాలు యాప్‌లో నమోదవుతాయి. రహదారి నిర్మాణ లోపాలుంటే వెంటనే వాటిని అప్‌లోడ్ చేస్తారు. దీని ఆధారంగా పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటారు. రహదారులపై ఎన్‌హెచ్ఏఐ సంస్థ గుర్తింపు చిహ్నాలు(సైన్ బోర్డులు), క్రాసింగ్ లైన్స్, బారికేడ్లు ఏర్పాటు చేస్తారు.

అంశం	2024	2025
ప్రమాదాలు	1075	1208
మృతులు	571	566

● ప్రమాదం జరిగినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే క్షతగాత్రుల వివరాలను వైద్య సిబ్బంది 'ఐ-రాడ్' యాప్‌లో నమోదు చేయాలి. దీని ద్వారా ప్రమాదం జరిగిన స్థలం, క్షతగాత్రుడి చిరునామా, పరవాణి సంఖ్యల సమాచారం పోలీసులకు చేరుతుంది. కేసు నమోదు తర్వాత విచారణకు అవసరమైన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో పోలీసులు సులభంగా తీసుకునే అవకాశం ఉంది.

కేక్ కోస్తున్న కలెక్టర్ డా.సిరి, జేసీ నూరుల్ ఖమర్, డీఆర్వో వెంకటనారాయణమ్మ

జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: 2026 నూతన సంవత్సరంలో కర్నూలు జిల్లా అభివృద్ధికి మనమందరం సమష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ డా.ఎ.సిరి అధికారులకు పిలుపునిచ్చారు. నూతన ఆంగ్ల సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకుని నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జేసీ నూరుల్ ఖమర్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది గురువారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బి.క్యాంపులోని జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జేసీ నూరుల్ ఖమర్‌ను రెవెన్యూ, ఇతర శాఖల జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉద్యోగి బిల్లు.. ఖజానాలో చిల్లు

■ చేయి తడపందే కదలని దస్త్రం

ఈనాడు, కర్నూలు: ఖజానా కార్యాలయాల్లో యథేచ్ఛగా అక్రమాలు సాగుతున్నాయి. చేయి తడపందే పనులు కావడం లేదు. ఐటీవలే ఆళ్లగడ్డ ఉప ఖజానా కార్యాలయంలో రూ.కోటికిపైగా నిధులు దుర్వినియోగమైన ఉదంతంలో ఆళ్లగడ్డ ఎస్టీవోతో సహా ముగ్గురిపై సస్పెన్షన్ వేటు పడింది. ఆ తర్వాత డోన్ ఉప ఖజానా కార్యాలయ ఉద్యోగి లక్ష్మీనాయక్ లంచం తీసుకుంటూ అనిశా అధికారులకు చిక్కారు. పలువురు అక్రమాలకు పాల్పడుతున్నా విచారణ జరుగుతున్నా ఖజానా శాఖ ఉద్యోగుల వైఖరి మారడం లేదు. నగర పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఓ ప్రభుత్వ వైద్యుడికి జీతాలు మంజూరు చేసేందుకుగాను ఓ ఖజానా ఉద్యోగి ముడుపులు డిమాండ్ చేశారు. ఆయన నిరాకరించడంతో కొర్రీలతో జాప్యం చేసి బిల్లు ఆపేశారు. ముడుపులు ఇచ్చిన తర్వాత జీతాలు విడుదల చేశారన్న విషయం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

వీరికి ఎందుకు చెల్లించినట్లో..

▶ ఓ ఉద్యోగి పారెన్ సర్వీసును పూర్తి చేసుకున్న ఐదు నెలల తర్వాత పొడిగింపు (ఎక్స్‌టెన్షన్) అనుమతి వచ్చిన తేదీ నుంచి తొలుత జీతాలు చెల్లించి అనుమతి లేని కాలానికి ప్రత్యేకంగా ఉత్తర్వులు తెప్పుకోవాలి. అందుకు విరుద్ధంగా అనుమతి లేని కాలానికి కూడా బిల్లులను చెల్లించేశారు.

▶ ఏడేళ్లకుపైగా పారెన్ సర్వీసు పూర్తి చేసుకున్న ఓ ఉద్యోగి ఏటా పొడిగింపు పొందాల్సిన పొడిగింపు ఉత్తర్వులు పొందలేదని సమాచారం. ఆ తర్వాత బదిలీపై వచ్చినప్పటికీ ఆర్థిక అనుమతులు లేవన్న విమర్శలున్నాయి. అయినప్పటికీ ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా అతనికి జీతాలు మంజూరు చేశారు.

20 ఏళ్ల కిందటి పత్రాలు తేవాలట..

▶ పలు ప్రభుత్వ శాఖల్లో కొందరు గత 20 ఏళ్లుగా ఒప్పంద ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. అప్పట్లో కొన్ని ప్రైవేటు ఏజెన్సీలు వారిని నియమించుకున్నాయి. వారిలో ప్రస్తుతం 'ఆప్కాస్' పరిధిలోకి తీసుకొచ్చారు. తాజాగా కొందరు ఒప్పంద ఉద్యోగులకు 20 ఏళ్ల కిందటి ఏజెన్సీ నియామక పత్రాలు తేవాలంటూ ఖజానా ఉద్యోగులు ఒత్తిడి చేస్తుండడంతో వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

▶ కర్నూలు డీసీహెచ్ఎస్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఒప్పంద ఉద్యోగి జీతాన్ని రెండు నెలలుగా నిలిపేశారు. ఆయన అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

కొర్రీలు పెట్టి.. వేతనాలు నిలిపేసి

▶ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐటీవల ఓ ఉద్యోగిని హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా బదిలీ చేశారు. బదిలీ అయిన ప్రాంతంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆ ఉద్యోగితో సహా మొత్తం తొమ్మిది మంది ఉద్యోగుల వేతన బిల్లులు గత నెల 23న పంపారు. బదిలీ అయిన ఉద్యోగి బిల్లుకు అభ్యంతరం చూపి ఆయనతో పాటు తొమ్మిది మంది బిల్లులను ఆపేశారు. బదిలీలపై నిషేధం ఉన్న సమయంలో బదిలీ అయ్యారంటూ మెలిక పెట్టారు. ఒకరి సమస్య కారణంగా మిగిలినవారి జీతాలు ఎలా ఆపుతారంటూ ట్రెజరీ అధికారులను బాధిత ఉద్యోగులు గట్టిగా ప్రశ్నించడంతో పాటు లిఖితపూర్వకంగా లేఖ రాయడంతో ఆఖరు నిమిషంలో బిల్లు మంజూరు చేశారు.

▶ గతేడాది జరిగిన సాధారణ బదిలీల్లో ఓ సీనియర్ అసిస్టెంటును నంద్యాల నుంచి అనంతపురం బదిలీ చేశారు. తన బదిలీ.. నిబంధనలకు విరుద్ధంగా జరిగిందంటూ సదరు ఉద్యోగి హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు కర్నూలులోని రీజినల్ డిస్పెన్సరీలో సీనియర్ అసిస్టెంటుగా గత నెలలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన బిల్లుకు ఆర్థిక అనుమతి (ఫైనాన్షియల్ కంకరెన్స్) లేదంటూ బిల్లును ఆపేశారు. ఆయన ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు బిల్లు ఆమోదించారు.

పనుల్లో పారదర్శకత.. అక్రమాలకు అడ్డుకట్ట

■ వీబీ-జీ రామ్ జీతో 125 పని దినాలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికాహామీ మిషన్ (గ్రామీణ్). (వీబీ-జీ రామ్ జీ) బిల్లు తీసుకొచ్చి చట్టం చేసింది. దీనిద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఏటా 125 పని దినాలు లభిస్తాయి. వ్యవసాయ పనులపుడు. నూర్పిళ్లు ఎక్కువగా ఉన్న సమయంలో కూలీల కొరత లేకుండా 60 రోజులపాటు ఈ పథకాన్ని ఆపేస్తారు. గ్రామ పంచాయతీల ద్వారానే పనుల ప్రణాళిక, పర్యవేక్షణ జరుగుతుంది. చేసిన పనులే చేసి పైసలు మెరుగులు దిద్ది వదిలేసే పనులు ఇక ఉండవు. మట్టి పనులు తగ్గించి గ్రామీణాభివృద్ధికి అవసరమయ్యే శాశ్వత పనులు చేపట్టనున్నారు.

జిల్లా	జాబ్‌కార్డులున్న కుటుంబాలు	పనికి హాజరయ్యేవారు
కర్నూలు	3.34 లక్షలు	4.80 లక్షలు
నంద్యాల	2.63 లక్షలు	2.25 లక్షలు

ఏటా కర్నూలులో రూ.296.32 కోట్లు, నంద్యాలలో రూ.209.51 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

ఈ-కేవైసీకి 1.43 లక్షల మంది దూరం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 6 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులున్నాయి. కూలీలకు ఉపయోగపడే పథకం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ముఖ ఆధారిత హాజరు అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా జాబ్ కార్డుల స్థానంలో ఈ-కేవైసీ చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికీ సుమారు 1.43 లక్షల మంది ఈ-కేవైసీకి దూరంగా ఉన్నారు. ప్రక్రియ పూర్తి చేసుకున్నవారికి మాత్రమే పని కల్పించాలని, జాబ్ కార్డులకు ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంటుంది.

5 నుంచి గ్రామ సభలు

◆ నూతన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకుగాను ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా 5వ తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నారు. ఒక్కో సభ నిర్వహణకు రూ.2 వేలు కేటాయించారు. సభ నిర్వహణ, బ్యానర్లు, కరపత్రాలు తదితర వాటికి ఈ నిధులు ఖర్చు చేయనున్నారు.

◆ ఈ ఏడాది మార్చి వరకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరుతోనే కొనసాగనుంది. మార్చి నెలాఖరులోగా ప్రతిపాదించిన పనులన్నీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఏప్రిల్ 1 నుంచి నూతన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వస్తుంది.

వీటికి ప్రాధాన్యం

◆ నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీఛార్జి, చెరువులు, కుంటల పునరుజ్జీవం, వాటర్‌షెడ్ అభివృద్ధి, బావుల తవ్వకం, మైక్రో ఇరిగేషన్ చానళ్ల నిర్మాణం.

◆ విద్య, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, పునరుత్పాదక ఇంధనం, సామాజిక సేవలకు ప్రాధాన్యం.

◆ వ్యవసాయం, పశుసంవర్ధక, చేపల పెంపకం, నైపుణ్య శిక్షణలు ఇస్తారు.

◆ తుపాను, వరద తదితర వాటిని ఎదుర్కొనే పనులు చేపడతారు. పునరావాసం, పునరుద్ధరణ, గ్రామీణ రహదారులు అభివృద్ధి చేస్తారు.

రూ.కోట్ల నిధులు పక్కదారి

గతంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పని ప్రదేశంలో కూలీలను గ్రూపుగా నిలబెట్టి ఫొటో తీసి హాజరు వేసే విధానం అమలుచేశారు. అయినప్పటికీ చేతివాటం ప్రదర్శించారు. ఏడేళ్ల కిందట కేవలం హాజరు పట్టీల మాత్రమే ఉండగా.. భారీగా అక్రమాలు జరిగాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చేస్తున్నవారి పేర్లు సైతం నమోదు చేసి వేతనాలు స్వాహా చేశారు. రూ.కోట్లలో ఉపాధి నిధులను పక్కదారి పట్టించారు. సోషల్ ఆడిట్‌లో అక్రమాలు వెలుగు చూసినా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేకపోయారు.

ఆనంద క్షణం.. చెమ్మగిల్లిన నయనం

జీవిత భాగస్వామి దూరమైంది..
ఒంటరి జీవనం భారమైంది!
పిల్లలను ఉగ్గుపాలతో పెంచిన తండ్రి..
'పాలకూట' విముక్తిచ్చి ప్రాణాలు తీశారు

కొడుకు, మనవడు, మనవరాళ్ల మృతికి రోదిస్తున్న చిన్న సుబ్బారాయుడు

ఉయ్యాలవాడ మండలం తుడుములదిన్నెకు చెందిన వేమువాటి సురేంద్ర (35) తన ముగ్గురు పిల్లలు కావ్యశ్రీ (7), ధ్యానేశ్ (4), సూర్య గగన్ (2)లకు పాలల్లో విషద్రావణం కలిపి తాగించారు. అనంతరం తాను ఇంటి పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

సరదాగా పల్లె'టూరు'కెళ్లారు

జలదృశ్యం ఆహ్వానించింది..
కన్నీటి సుడిలో చిక్కుకొని ఊపిరిలొదిలారు!

ఓర్వకల్లు మండలం పాలకొలనులో చెక్‌డ్యాం కుంటలో ఈతకు వెళ్లిన అస్లాం (14), వినయ్ (14)లు నీట మునిగి మృత్యువాతపడి చేరారు.

ఇద్దరు విద్యార్థులను మింగిన కుంట

యువతరం కొత్త సంబరం చేసుకొంది

తిరుగు ప్రయాణం లేని గమ్యానికి చేరింది.
తల్లిదండ్రుల కల చెదిరింది..
కన్నీటి అల కడలిలో ముంచింది!

ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జరిగిన రహదారి ప్రమాదాల్లో ఐదుగురు యువకులు భరత్ (24)(నందికొట్కూరు), షేక్ మౌలాలి (25)(బండి ఆత్మకూరు), సమీర్ (19)(ఆళ్లగడ్డ), నాయక్ ఈరన్న(35) (కుటికి), కట్ట ఈరన్న(35) (పెద్దతుంబళం)లు మృత్యువాత పడ్డారు.

★ ఉమ్మడి జిల్లాలో కొత్త ఏడాది తొలిరోజు జరిగిన వివిధ ఘటనల్లో ఐదుగురు విద్యార్థులు, ఐదుగురు యువకులు మృతి చెందడం.. కన్నపేగుకు విషాదం మిగిల్చింది.
– న్యూస్‌టుడే, ఆదోని నేరవిభాగం

పేదింటి బిడ్డ.. కబడ్డీలో దిట్ట

దేవనకొండ మండలం గుడిమిర్ల గ్రామానికి చెందిన వెంకటేశ్ డోన్‌లోని జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతూ వసతిగృహంలో ఉంటున్నారు. ఆతని తల్లిదండ్రులు వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వెంకటేశ్ ఓవైపు చదువుకుంటూనే.. మరోవైపు తనకిష్టమైన కబడ్డీలో రాణిస్తూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గతేడాది అక్టోబరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డోన్‌లో జరిగిన డివిజన్ స్థాయి పోటీల్లో సత్తా చాటి జిల్లాస్థాయి జట్టులో స్థానం సంపాదించారు. గతేడాది నవంబరులో కర్నూలులో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్రస్థాయి జట్టులోకి ప్రవేశించారు. అదే నెలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. "జాతీయస్థాయిలో రాణించడమే నా లక్ష్యమని.. భవిష్యత్తులో సైన్యంలో చేరి దేశానికి సేవలందిస్తా"నని వెంకటేశ్ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, డోన్ పట్టణం

తిరుమలేశుడికి తిరుప్పావడ సేవ

ధనుర్మాస పూజల్లో భాగంగా కర్నూలు నగరం పాతబస్తీలోని మాలే బాలయ్యసత్రంలో వెంకటేశ్వరస్వామికి గురువారం తిరుప్పావడ సేవ నిర్వహించారు. వివిధ రకాల పిండివంటలతో కూడిన నైవేద్యాలు, పండ్లు, పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.
– న్యూస్‌టుడే, కర్నూలు ఆధ్యాత్మికం

కళారాధన

శ్రీశైల మహా క్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా గురువారం జరిగిన సంప్రదాయ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన శ్రీదేవి నృత్య కళాక్షేత్రం బృందం సభ్యులు పలు ఆధ్యాత్మిక గీతాలకు సంప్రదాయ నృత్యాలు చేశారు. కళాకారులను దేవస్థానం అధికారులు సత్కరించారు. – న్యూస్‌టుడే, శ్రీశైలం, నంది సర్కిల్

పల్లె బిడ్డలు.. దేశ సైనికులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సైన్యంలో చేరాలన్నది వారి కల. ఇలాంటి ఆలోచన ఉన్న 20 మంది ఇక్కడ కల్లూరు.. ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలుర మైదానాన్ని వేదికగా చేసుకున్నారు. తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 8 గంటల వరకు కష్టపడ్డారు. వీరి పట్టుదలను గమనించిన పీఈటీ మల్లికార్జున మరిన్ని మెలకువలు నేర్పించారు. ఉద్యోగ ప్రకటన వచ్చిన వెంటనే మరింత శ్రమించారు. మొత్తం 14 మంది సైనిక ఉద్యోగాలకు ఎంపికయ్యారు. తమ విజయప్రస్థానాన్ని 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

నిత్యం 4 గంటల సాధన

– ఎల్లప్ప, వెంకటాపురం

నేను ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశా. అమ్మానాన్నలు గుంటెమ్మ, శంకరిలు కూలీ పనులు చేస్తున్నారు. ఆర్మీలో ప్రవేశం పొందాలని పదో తరగతిలోనే లక్ష్యం నిర్దేశించుకున్నా. మా గురువు సహకారంతో నిత్యం సాధన చేశా. నాలుగు గంటల పాటు రాళ్లు ఎత్తడం, పరుగులో సాధన చేశా. నియామక ప్రకటన వచ్చిన వెంటనే స్నేహితులందరం కలిసి చదువుకున్నాం. పరీక్షలు రాసి జవానుగా ఎంపికయ్యా. ఏడు నెలల పాటు శిక్షణ తీసుకున్నా. అసోంలో విధుల్లో చేరుతున్నా.

రెండో ప్రయత్నంలో..

– విల్సన్, బెట్టేహళ్లి

సైనిక ఉద్యోగం తెచ్చుకోవాలన్న పట్టుదలతో సాధన చేశా. రోజూ మైదానంలో ఏడు కిలోమీటర్లు రన్నింగ్ చేశా. అమ్మానాన్నలు జయమ్మ, చిన్నతిక్కయ్య కూలీ పనులు చేస్తారు. వారికి ఆసరాగా ఉండాలని నిర్ణయించుకున్నా. ఏదైనా ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో మొదలుపెట్టి సాధన చేశా. రెండోసారి పరీక్ష రాసి ఎంపికయ్యా. ఏడు నెలలపాటు బెంగళూరులో శిక్షణ ఇచ్చారు. తుపాకీ గురి చూడడం తదితరాలు నేర్చుకున్నా. జమ్మూకశ్మీర్ సెక్టార్‌లో ఉద్యోగం వచ్చింది.

క్రమశిక్షణతో రాణిస్తాం

– వెంకటేశ్ (హాలహర్వి), కల్యాణ్ (మంత్రాలయం)

మేమిద్దరం మంచి స్నేహితులం. సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలన్న ఉద్దేశంతో పదో తరగతి నుంచి సాధన చేయడం ప్రారంభించాం. మైదానంలో లాంగ్‌జంప్, రన్నింగ్, ఇతర క్రీడలు ఆడాం. పరీక్షల్లో మంచి ప్రతిభ చూపి ఆర్మీ ఉద్యోగానికి ఎంపికయ్యాం. లడక్ (వెంకటేశ్), పంజాబ్ (కల్యాణ్)లో విధుల్లో చేరేందుకు సిద్ధమయ్యాం. క్రమశిక్షణతో ఉద్యోగంలో రాణిస్తాం. దేశ సేవే మా ప్రధాన లక్ష్యం.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97628
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 13479

(c) eenadu

ఆశాజనకంగా టమాటా ధరలు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మామూలుగా అయితే నవంబరు, డిసెంబరులో సరుకు నాణ్యత తగ్గి ధరలపై తీవ్ర ప్రభావం చూపేది. కాలం దాటిపోయినా టమాటా ధరలు గత కొన్ని రోజులుగా స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 10 కిలోల జత గంపలు రూ.600 నుంచి రూ.800 వరకు, 25 కిలోల జత బాక్సులు రూ.1500-1800 పలుకుతున్నాయి. క్వింటాలు టమాటా సుమారు రూ.4వేల వరకు పలుకుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొంత నాణ్యత తగ్గినా.. ధరలు మాత్రం ఆశాజనకంగా ఉంటున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన టమాటా దిగుబడి పూర్తిగా తగ్గిపోగా కాల్వలు, వ్యవసాయ బోర్ల కింద రబీలో సాగు చేసిన సరకు మాత్రం నామమాత్రంగా మార్కెట్‌కు వస్తోంది. నవంబరు మొదటి వారంలో కొన్ని రోజులుగా గతంలో ఎన్నడూ లేనంతంగా ధరలు ఊరట కలిగించేలా ఉన్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కాశయ్య వనం.. ఆరోగ్యం ఘనం

బనగానపల్లి పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో ప్రజలకు కాశయ్య తోట అంటే తెలియని వారు ఉండరు. జనాలకు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి అంటే తెలియదు కానీ కాశయ్య తోట ఆసుపత్రి అంటేనే గుర్తు పడతారు. కర్ణాటక వాసి అయిన కాశయ్య 120 ఏళ్ల క్రితం చెన్నై నుంచి ఇక్కడికి వచ్చి బనగానపల్లి శివారులో పదెకరాల పొలం కొన్నారు. ఆయుర్వేదంలో సిద్ధహస్తుడైన ఆయన పొలంలోనే వివిధ రకాల వన మూలికల మొక్కలు పెంచి ఔషధాలు తయారు చేసేవారు. అనారోగ్యానికి గురైన రోగులకు చికిత్సతోపాటు మందులను ఉచితంగా ఇచ్చేవారు. ఇలా 20 ఏళ్లకు పైగా చుట్టుపక్కల వారికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఆయన జీవిత చరమాంకంలో పదెకరాల పొలాన్ని ఓ ట్రస్టుకు దానం చేశారు. 1986లో ఆయన మరణానంతరం ఇదే స్థలంలో ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఏర్పాటైంది. కాశయ్య నివాస గృహం, చికిత్స అందించేందుకు గదిని, అలాగే పేదలు పెళ్లిళ్లు చేసుకునేందుకు ఓ షెడ్డును నిర్మించారు. పట్టణ వాసులు ఉదయం, సాయంత్రం వేళల్లో చెట్ల నీడన సేద తీరుతుంటారు. – న్యూస్‌టుడే, బనగానపల్లి

ఆహ్లాదకరంగా తోట

కాశయ్య విగ్రహం (అంతర చిత్రం)

వైభవంగా మద్దిలేటయ్య తెప్పోత్సవం

ఆర్‌ఎస్ రంగాపురం శివారులోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో గురువారం ముక్కోటి ఏకాదశి బ్రహ్మోత్సవాల సందర్భంగా తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈవో, ఆలయ ఉపకమిషనర్ రామాంజనేయులు, తెదేపా మండల కన్వీనర్, మాజీ ఛైర్మన్ ఉన్నం ఎల్లనాగయ్య ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం మద్దులేరు కోనేరులో అంగరంగ వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. చివరి రోజు కావడంతో పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. – న్యూస్‌టుడే, ఆర్‌ఎస్ రంగాపురం(బేతంచెర్ల)

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థికి మొక్క అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ డా.సిరి

కోర్టు ఆవరణలో నూతన సంవత్సర వేడుకలు

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో గురువారం నూతన సంవత్సర వేడుకలు సందడి జరిగాయి. జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి కేకు కోశారు. అక్కడే ఏర్పాటు చేసిన పార్కును ప్రారంభించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయవాదులు కాలానుగుణంగా వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. కొత్త ఏడాదిలో కేసులు త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడు కరణం కిషోర్‌కుమార్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రవిగువేరా, అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్‌చౌదరి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

◆ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి జిల్లా కోర్టులో గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఐజీ విక్రాంత్‌పాటిల్

విక్రాంత్‌పాటిల్ ఇక నుంచి డీఐజీ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ హోదా మారిపోయింది. గురువారం ఈయన డీఐజీగా పదోన్నతి స్వీకరించారు. ప్రభుత్వం ఈయనకు డీఐజీగా పదోన్నతి కల్పిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ప్రభుత్వం కొలువు కేటాయించే వరకు ఈయన ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. నూతన ఆంగ్ల సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకుని నగరంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో విక్రాంత్‌పాటిల్ తన సతీమణి, ఏపీఎస్పీ పటాలం దళాధిపతి దీపికా పాటిల్‌తో కలిసి కేకు కోశారు. అనంతరం డీఐజీ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి, కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, కలెక్టర్ డాక్టర్ ఎ.సిరిలను వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల బాట.. గెలుపు బావుటా

■ జాతీయ స్థాయిలో గుర్తింపు

■ తాడాట, కరాటేలో రాణిస్తున్న చిన్నారులు

పత్తికొండ, తుగ్గలి, న్యూస్‌టుడే: వారు ఆడే ఆటపై పట్టు సాధించారు. ఏ స్థాయిలో పాల్గొన్నా.. పతకాలు అందిపుచ్చుకుంటున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటూ తమ ప్రత్యేకతను చాటుతున్నారు. తుగ్గలి సాధన పాఠశాల విద్యార్థులు బంగి ఐశ్వర్య, గుండ్లకొండ అరవింద్ ఇటీవల మహారాష్ట్రలోని అలీబాగ్‌లో ఇంటర్ నేషనల్ రోప్ స్కిప్పింగ్ ఆర్గనైజేషన్ మరియు రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్ యాదవ్ క్రీడల్లో విద్యార్థులను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నారు. వెల్దుర్తి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న యశ్మిత గోపజ్ఞ కరాటేలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. గ్రామీణ ప్రాంత విద్యార్థుల విజయాలపై కథనం.

అరవింద్ సమేత విజయాలు

ముద్దికెర మండలం మదనంతపురం గ్రామానికి చెందిన గుండ్లకొండ గోపాల్ సుంకమ్మ దంపతుల కుమారుడు అరవింద్ ఏడో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ.. కుమారుడిని చదివిస్తున్నారు. ఇటీవల మహారాష్ట్రలో జరిగిన రోప్ స్కిప్పింగ్ పోటీలు అండర్-14 విభాగంలో మూడు నిమిషాల (త్రీమినిట్ ఫాస్ట్) ఈవెంట్‌లో పాల్గొని ఎనిమిదో స్థానంలో నిలిచాడు. రోజూ రెండు గంటల పాటు సాధన చేస్తున్నాడు. క్రీడలతో మానసిక, శారీరకంగా ఉల్లాసంగా ఉంటామని, విద్యాభ్యాసంలోనూ మెదడు చురుగ్గా ఉంటుందంటున్నాడు అరవింద్. భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకోవడమే తన లక్ష్యమని చెబుతున్నాడు.

నిత్య సాధనే ఐశ్వర్యం

ముద్దికెర మండలం మదనంతపురం గ్రామానికి చెందిన బంగి శివశంకర్, యశోదమ్మ కుమార్తె ఐశ్వర్య తుగ్గలి ఆరో తరగతి చదువుతోంది. మహారాష్ట్రలో జరిగిన రోప్ స్కిప్పింగ్ పోటీల్లో అండర్-12 విభాగంలో 90 సెకెండ్స్ ఈవెంట్‌లో పాల్గొని ఆరో స్థానంలో నిలిచింది. చదువుతో పాటు తల్లిదండ్రులు క్రీడా పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. రోప్ స్కిప్పింగ్‌తో పాటు కర్రసాము నేర్చుకొంటోంది. నిత్యం సాధన చేయడంతో ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది. భవిష్యత్తులో ఇంకా విజయాలు సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

గోపజ్ఞ కరాటేలో తెగువ

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తికి చెందిన హరిప్రసాద్‌రావ్, మమత దంపతుల కుమార్తె యశ్మిత గోపజ్ఞ కృష్ణగిరి జడ్పీ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ప్రాథమిక పాఠశాల స్థాయిలో నుంచే కరాటేపై శిక్షణ పొందింది. చిన్నారిలోని చురుకుదనం గుర్తించిన కరాటే కోచ్ ఫయాజ్ ప్రత్యేక శ్రద్ధ చూపారు. నిత్య సాధనతో కరాటేలో పట్టు సాధించింది. పల్లె నుంచి జాతీయస్థాయి కరాటే పోటీల్లో పాల్గొని తన ప్రత్యేకతను చాటింది. కృష్ణగిరి పాఠశాలలో చదవడంతో ప్రస్తుతం ఆన్‌లైన్ తరగతులతో కరాటే శిక్షణ పొందుతోంది.

వరుస పతకాలతో..

గ్రామీణ పాఠశాలలో చదువుతున్న ఈ బాలిక జాతీయ స్థాయి కరాటే పోటీలకు వరుసగా మూడేళ్లు పాల్గొంది. అక్టోబర్‌లో నిర్వహించిన స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో అండర్-14 బాలికల కరాటే విభాగంలో మండల స్థాయిలో ప్రతిభ చూపడంతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. డిసెంబర్ 22 నుంచి 26 వరకు రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-14లోని 26 కిలోల బాలికల విభాగంలో బంగారు పతకం సాధించింది. దీంతో మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో వెల్దుర్తికి చెందిన విద్యార్థి పాల్గొంది. ఈ జాతీయ స్థాయి పోటీల్లో వరుసగా మూడేళ్లు పాల్గొంది. జాతీయ స్థాయిలో విజేతగా నిలవాలన్నదే తన లక్ష్యమని చెబుతోంది యశ్మిత గోపజ్ఞ.

తెదేపాను మరింత బలోపేతం చేద్దాం

కేకు కోస్తున్న నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షురాలు, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, తెదేపా నేత గౌరు వెంకటరెడ్డి, గౌరు జనార్దన్‌రెడ్డి

కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మకు కేక్ తినిపిస్తున్న పార్టీ ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్

కర్నూలు సచివాలయం, కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : 2026 నూతన సంవత్సరంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేద్దామని కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకొని నగరంలోని తెదేపా జిల్లా కార్యాలయంలో కృష్ణమ్మ కేక్ కోశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి పూల నాగరాజుయాదవ్, డీసీఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగేంద్ర, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు నూరీ మన్సూర్ అలీ, కార్పొరేటర్ జక్రియా అక్సారీ, తెదేపా నాయకులు అబ్బాస్, తదితరులు కృష్ణమ్మకు శుభాకాంక్షలు తెలిపారు. మాధవనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గౌరు చరితారెడ్డి, గౌరు వెంకటరెడ్డి దంపతులు కేకు కోశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విషాద ఛాయలు.. కన్నీటి చారలు

అర్ధంతరంగా ముగిసిన యువత ప్రయాణం

మలుపు తిరిగిన జీవితాలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణానికి చెందిన యువకుడు దోర్నాల ఘాట్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, సాక్షుల కథనం ప్రకారం.. నందికొట్కూరుకు చెందిన ఠాగూర్, భరత్, ఆత్మకూరుకు చెందిన బాషా, కర్నూలుకు చెందిన గణేష్ గురువారం ఉదయం కారులో విజయవాడకు బయల్దేరారు. దోర్నాల సమీపాన ఘాట్ రోడ్డులో మలుపు వద్ద కారు చెట్టుకు ఢీకొంది. డ్రైవింగ్ చేస్తున్న భరత్‌కు తీవ్రగాయాలు కాగా.. మిగతా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వారు ప్రమాదాన్ని గమనించి, యువకులను కారులో ఎక్కించుకుని నందికొట్కూరు ఆసుపత్రికి తీసుకొచ్చారు. బాషా ఆత్మకూరులో దిగిపోయాడు. గణేష్, ఠాగూర్‌లను ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు పంపించారు. చికిత్స పొందుతూ భరత్(24) మరణించినట్లు తెలిపారు. అశోక్ ఆచారి, ఉమాదేవి దంపతులకు భరత్ ఏకైక కుమారుడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భరత్(పాత చిత్రం)

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ.. యువకుడి దుర్మరణం

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ చాంద్‌బాషా కథనం ప్రకారం.. బండిఆత్మకూరు గ్రామానిక చెందిన షేక్ మౌలాలి(25) తన అక్కను అయ్యలూరి మెట్టలోని ఆమె ఇంట్లో దింపడానికి గురువారం ద్విచక్రవాహనంపై తీసుకెళ్లాడు. అక్కడ బావతో కలిసి భోజనం చేసి, తిరుగు ప్రయాణమయ్యాడు. పట్టణ శివారులోని ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో మౌలాలిని ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందినట్లు సీఐ పేర్కొన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మౌలాలి (పాతచిత్రం)

దిక్కులేనివారయ్యారు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: కపటి గ్రామానికి చెందిన రైతు నాయక్ ఈరన్న(35) పొలం పనులు చేసుకొంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. భార్య రాధమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నూతన గ్రామస్థులతో కలిసి నాయక్ ఈరన్న గురువారం మధ్యాహ్నం ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఇంటికి వెళ్లి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత ఈరన్న, గ్రామానికి చెందిన వీరేశ్ కలిసి ద్విచక్రవాహనంపై పని నిమిత్తం ఎమ్మిగనూరు పట్టణానికి వెళ్లి రాత్రి స్వగ్రామానికి బయల్దేరారు. రహదారి ప్రమాదంలో ఈరన్న తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందినట్లు తాలుకా ఎస్సై రామాంజనేయులు తెలిపారు. ప్రమాదం ఎలా జరిగిందో తెలియాల్సి ఉందన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్యా పిల్లలు విషాదంలో మునిగారు.

నాయక్ ఈరన్న (పాత చిత్రం)

ఆళ్లగడ్డ పట్టణ శివారులో..

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పట్టణ శివార్లలోని కడప రోడ్డుపై గురువారం రాత్రి జరిగిన రహదారి ప్రమాదంలో సమీర్ (19) అనే యువకుడు మృతి చెందాడు. ఆళ్లగడ్డ పట్టణం సద్దాం కాలనీకి చెందిన సమీర్ ద్విచక్ర వాహనంపై తన ఇద్దరి స్నేహితులతో కలిసి చాగలమర్రి వైపునకు వెళ్తుండగా కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతడితో పాటు ప్రయాణిస్తున్న మిగిలిన స్నేహితులు దూరంగా ఉన్న కాల్వలో పడిపోయి తర్వాత పారిపోయినట్లు సమాచారం. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో జరిగిందా.. వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారా అన్నది తెలియాల్సి ఉంది.

వలస వెళ్లి.. మృత్యుఒడికి

ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన చెరువు కట్ట ఈరన్న(35) మూడు నెలల కిందట కర్ణాటక రాష్ట్రం చిక్‌మగళూరు జిల్లా కడూర్ తాలూకా శివపూర్ గ్రామానికి వలస వెళ్లారు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత నెల 31న పొలం పనులు చేస్తున్న సమయంలో ట్రాక్టరు ప్రమాదవశాత్తు ఈరన్నను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గుర్తించిన స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ.. శివపూర్ గ్రామానికి వెళ్లారు.

కట్ట ఈరన్న (పాత చిత్రం)

ఏపీ టూరిజం హరిత హోటల్ పేరుతో మోసం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : ఏపీ టూరిజం హోటల్ హరిత పేరుతో వసతి గది బుకింగ్ చేసుకున్న ఒక భక్తుడు మోసపోయిన ఘటన గురువారం వెలుగు చూసింది. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఎం.పవన్‌కుమార్ జనవరి ఒకటో తేదీకి వసతి గది పొందేందుకు ఏపీ టూరిజం పేరుతో ఉన్న వెబ్‌సైట్‌ను ఆశ్రయించారు. రూ.2800 చెల్లింపులు చేశారు. గురువారం శ్రీశైలం వచ్చి స్థానిక ఏపీ టూరిజం హరిత రిసార్ట్‌కు వెళ్లి రసీదు చూపించగా, అది నకిలీదని సిబ్బంది వెల్లడించారు. దీంతో చేసేదేమీ లేక భక్తుడు దేవస్థానం వసతి గది తీసుకొని బస చేశారు. ఏపీ టూరిజం హోటల్ హరిత పేరుతో యథేచ్ఛగా నకిలీ వెబ్‌సైట్ నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు కేవలం ఫిర్యాదు చేసి వదిలేయడంతో మోసాలు కొనసాగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వృద్ధురాలి ఆత్మహత్య

గడివేముల, న్యూస్‌టుడే: మండలంలోని సోమాపురం గ్రామానికి చెందిన మహబూబ్‌బీ(77) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నాగార్జున రెడ్డి తెలిపారు. డిసెంబర్ 21న పురుగుల మందు తాగగా.. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక 31న రాత్రి మరణించినట్లు చెప్పారు. మృతురాలు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడడంతోపాటు కళ్లు కనిపించకపోవడంతో జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుమారుడు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రూ.6 కోట్ల మద్యం తాగేశారు

నంద్యాల జిల్లాలో బుధవారం ఒక్కరోజే రూ.6 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తెగ తాగేశారు. దుకాణాలన్నీ మందుబాబులతో కిటకిటలాడాయి. జిల్లాలోని 115 మద్యం దుకాణాలు, 20 బార్లలో ఈ అమ్మకాలు సాగినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, మద్యం డిపో మేనేజరు నగేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నూతన సంవత్సర సంబరాలు ప్రశాంతంగా జరిగినట్లు వారు చెప్పారు.

– న్యూస్‌టుడే, నంద్యాల నేరవిభాగం

మల్లన్నకు వార్షిక ఆరుద్రోత్సవం 3న

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 3న శ్రీమల్లికార్జునస్వామికి వార్షిక ఆరుద్రోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. 2వ తేదీ రాత్రి 10 గంటలకు స్వామివారికి మహాన్యాస పూర్వక లింగోద్భవకాల ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహిస్తారన్నారు. 3వ తేదీన తెల్లవారుజామున సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజలు జరుగుతాయని చెప్పారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक Union Bank of India

మున్సిపల్ మెయిన్ రోడ్ శాఖ, ఆదోని (00021)

19/1, మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా, ఆదోని, ఆంధ్రప్రదేశ్-518301. మొబైల్: 9321932021.

ఇమెయిల్ ఐడి: ubin0800023@unionbankofindia.bank.in

స్థిరాస్తుల విక్రయం

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 (6) లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు), కో-ఆబ్లిగెంట్ మరియు గ్యారంటర్(ల)కు (వివరాలు పట్టికలో ఇవ్వబడినవి) ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, గత ఆంధ్రాబ్యాంక్, ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవల్సిన బకాయిలను (పట్టికలో తెలియజేయబడినవి) సదరు రుణగ్రహీత, గ్యారంటర్ మరియు కో-ఆబ్లిగెంట్ల నుండి రాబట్టుకోవటానికి, గత ఆంధ్రాబ్యాంక్, ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తనఖా పెట్టబడిన/చార్జిచేయబడిన మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారిచే సంభావిత స్వాధీనత చేపట్టబడిన దిగువ తెలిపిన స్థిరాస్తి 28-01-2026 సమయం: 12:00 గం. నుండి 05:00 గం. వరకు "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలానే" ప్రాతిపదికన విక్రయించబడును.

రిజర్వు ధర మరియు ధరావతు వివరాలు దిగువనివ్వబడిన పట్టికలో కలవు:

ఖాతా, రుణగ్రహీత/లు, గ్యారంటర్/లు వగైరా పేరు

1ఎ. శ్రీ ఆరికట్ల కిషోర్ చౌదరి (రుణగ్రహీత), డి.నెం.3-43, సర్వే నెం.50, వార్డు నెం.3, కుంబలనూరు క్యాంప్-1, కౌతాళం, కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్-518301.

1బి. శ్రీమతి ఆరికట్ల నాగ జ్యోతి (సహ-రుణగ్రహీత), భర్త శ్రీ ఆరికట్ల కిషోర్ చౌదరి, డి.నెం.3-43, సర్వే నెం.50, వార్డు నెం.3, కుంబలనూరు క్యాంప్-1, కౌతాళం, కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్-518301.

2ఎ. శ్రీమతి ఆరికట్ల లక్ష్మి (గ్యారంటర్) భర్త శ్రీ ఎ. రాజ గోపాల కృష్ణ, డి.నెం.3-43, సర్వే నెం.50, వార్డు నెం.3, కుంబలనూరు క్యాంప్-1, కౌతాళం, కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్-518301.

సంభావిత స్వాధీనతలో ఉన్న ఆస్తి

కోసిగి సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, కర్నూలు రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో కర్నూలు జిల్లా, కౌతాళం (మం), నదిచాగి (పోస్ట్), 1వ క్యాంప్, కుంబలనూరు గ్రామం, సర్వే నెం.50లో పోర్షన్లో 61.93 చ.మీటర్లు, ప్లింత్ జి.ఎఫ్ 154.76 చ.మీటర్లు, ప్లాట్ 709.26 చ.మీటర్ల విస్తీర్ణంతో ఆరికట్ల కిషోర్ చౌదరికి చెందిన నివాస ఇల్లు యావత్తు. **సరిహద్దులు: తూర్పు:** రోడ్, **పడమర:** ఎస్. సత్తిరాజు ఆస్తి, **ఉత్తరం:** ఎం. సత్యనారాయణ రాజు ఇల్లు, **దక్షిణం:** సి.హెచ్. సత్యనారాయణకి చెందిన ఆస్తి.

రిజర్వు ధర: రూ. 23,60,000/- (ఇరవై మూడు లక్షల అరవై వేల రూపాయిలు మాత్రమే), **ఇఎండి:** రూ.2,40,000/-, **బిడ్ పెంపుదల:** రూ.25,000/-

IFSC కోడ్: UBIN0800023, ఖాతా నెం.000211980050000

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఉన్న బకాయి మొత్తం: 30.11.2025 నాటికి రూ.9,82,462.97 (తొమ్మిది లక్షల ఎనభై రెండు వేల నాలుగు వందల అరవై రెండు రూపాయల తొంభై ఏడు పైసలు మాత్రమే) మరియు దానిపై తదుపరి వ్యయాలు, ఖర్చులు మరియు వడ్డీ

ఇఎండి దాఖలుకు చివరి తేది: ఇ వేలం పూర్తిఅయ్యేంతవరకు

ఇ-వేలం తేది మరియు సమయం: 28.01.2026న 12:00 గం. నుండి 05:00 గం. వరకు. వేలం యొక్క చివరి 10 నిమిషాల లోపు బిడ్ చేయబడిన ప్రతిసారి వేలం ముగింపు సమయం 10 నిమిషాలపాటు పొడిగించబడును.

వివరమైన విక్రయ నియమనిబంధనల కొరకు ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్స్ వెబ్‌సైట్: https://baanknet.com మరియు www.unionbankofindia.bank.in నందు ఇవ్వబడిన లింకును చూడండి

తేది: 30.12.2025
ప్రదేశం: ఆదోని

అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఉరేసుకొని ఒడిశా యువతి ఆత్మహత్య

సుహాసిని (పాత చిత్రం)

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: కూలి పనుల కోసం వలసొచ్చిన వివాహిత సుహాసిని(23) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం ఆదోని మండలం అరేకల్ గ్రామంలో జరిగింది. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఈశ్వర్, సుహాసిని దంపతులకు మూడేళ్ల కిందట వివాహం జరిగింది. కొన్ని నెలలుగా ఆదోని మండలం అరేకల్ సమీపంలోని ఇటుకల పరిశ్రమలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నూతన సంవత్సరం వేళ సుహాసిని ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు సుహాసిని మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

రహదారి ప్రమాదంలో 52 గొర్రెలు మృతి

◆ మరో 28 జీవాలకు తీవ్ర గాయాలు

చిప్పగిరి, ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చిప్పగిరి మండలం కుందనగుర్తి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 52 గొర్రెలు మృతి చెందగా, మరో 28 తీవ్రంగా గాయపడ్డాయి. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు... అనంతపురం జిల్లా పామిడి మండలం అనుంపల్లికి చెందిన ముసలప్పగారి రామచంద్ర గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు. గ్రామానికి చెందిన గొర్రెల కాపర్లు చిరంజీవి, వడ్డే మురళి, ఎం.నాగార్జునతో కలిసి చిప్పగిరి మండలం నేమకల్లు గ్రామానికి సుమారు 300 గొర్రెలతో మేత కోసం బయల్దేరారు. గురువారం తెల్లవారు జామున తమిళనాడుకు చెందిన లారీ గుంతకల్లు వైపు నుంచి అతివేగంగా వచ్చి రహదిరిపై వెళ్తున్న గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 52 గొర్రెలు మృతిచెందగా. . మరో 28 గాయపడటం వల్ల భారీగా నష్టం వాటిల్లిందని బాధితుడు ఎం.రామచంద్ర తెలిపారు. లారీ ఆగకుండా ఆలూరు వైపు వెళ్లిందన్నారు. బాధితుడు చిప్పగిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు

వదినను చంపిన కేసులో మరిది అరెస్టు

ఆస్పరి, న్యూస్‌టుడే: తొగలగల్లు గ్రామంలో వదినను హత్య చేసిన కేసులో మరిది గొల్ల పెద్దయ్యను అరెస్టు చేసినట్లు ఆస్పరి సీఐ గంగాధర్ తెలిపారు. ఆస్పరిలో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితుడు పెద్దయ్య అన్న అయిన అహోబిలంను గత సెప్టెంబరులో బెంగళూరుకు చెందిన చెన్నబసవ అనే వ్యక్తి హత్యచేశారు. అహోబిలం భార్య గంగావతితో చెన్నబసవతో వివాహేతర సంబంధం పెట్టుకొని తన అన్న చంపించిందని, పెద్దయ్య తన వదిన గంగావతిపై కక్ష పెంచుకున్నారు. జైలుకెళ్లి ఇటీవల బెయిల్‌పై విడుదలైన గంగావతి తిరిగి భర్త స్వగ్రామమైన తొగలగల్లులో నివాసం ఉంటోంది. దీన్ని పెద్దయ్య జీర్ణించుకోలేకపోయారు. ఓ రోజు గంగావతి రేకులషెడ్డులో నిద్రిస్తుండగా రాయితో, రోకలిబండతో కొట్టాడు. హత్యచేసిన తరువాత ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. డిసెంబర్ 31 సాయంత్రం నిందితుడిని, హత్యకు ఉపయోగించిన రోకలిబండతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి, రిమాండ్ తరలించినట్లు తెలిపారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు, పోలీసులు శ్రీను, మల్లికార్జున, అంజి, గిరి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గౌడగల్లులో చిరుతల కలకలం

కోసిగి, న్యూస్‌టుడే: కోసిగి మండలం గౌడగల్లు గ్రామ శివారున ఉన్న కొండపై గురువారం రాత్రి 8 గంటల సమయంలో రెండు చిరుత పులుల సంచారం కలకలం రేపింది. వాటిని గమనించిన గ్రామస్థులు మిద్దెలపై ఎక్కి గట్టిగా కేకలు, ఈలలు వేస్తూ. . భయాందోళనలతో గంటలపాటు మిద్దెలపైనే చిన్న పిల్లలను ఎత్తుకుని ఉండిపోయారు. గ్రామంలో కొన్నేళ్ల నుంచి చిరుతలు సంచరిస్తున్న అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు. రాత్రి పూట పులులు వస్తాయనే అనే భయంతో నిద్రకూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికార్లు స్పందించి చిరుతలను బంధించి వేరే చోటికి తరలించాలని కోరుతున్నారు.

గౌడగల్లు కొండపై రెండు చిరుతలు

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 73821 14647.

CELLPHONES

యశ్విన్ మొబైల్ రిపేర్ ట్రైనింగ్, చిప్‌స్థాయి హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ మొబైల్ రిపేరి వర్క్ నేర్పించబడును. @ డి-మార్ట్ వెనుక, కర్నూలు. ✆ 91103 23814.

REAL ESTATE

మణికంఠ హోమ్స్ వారి లక్ష్మీగ్రీన్ వ్యాలీ పసుపుల గ్రామంలో నూతన వెంచర్ నందు ప్లాట్లు & ఇండ్లు కట్టించి బ్యాంక్ లోన్ సౌకర్యంతో ఇవ్వబడును. శ్రీరామ్: 99853 43829.

FLAT FOR SALE

నంద్యాల చెక్ పోస్ట్ దగ్గరలో మేము కొత్తగా నిర్మించబోయే అపార్ట్ మెంటులో ఫుల్ పేమెంట్ తో 3 flats (1400 Sft, 3 BHK, 1100 Sft, 2BHK) Cost to Cost అమ్మబడును. ఆసక్తి గలవారు సంప్రదించండి. ✆ 72078 97528, 96189 22589.

JOBS

అనుభవం గల కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. వెంకటేశ్వర గ్యాస్ సర్వీసెస్, గిప్సన్ కాలనీ, కర్నూలు. టైం: 11:00 AM - 2:00 PM. ✆ 08518 221316.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆదోని వైద్యం, న్యూస్‌టుడే: ఆదోని డివిజన్లోని వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ఉపవైద్యాధికారిణి డాక్టర్ సత్యవతి తెలిపారు. స్థానిక వైద్య కార్యాలయంలో గురువారం హంసా(ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్) ఆధ్వర్యంలో 2026 నూతన క్యాలండర్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. సత్యవతిని ఉద్యోగులు సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బాబురాజు, కార్యదర్శి శ్రీరాములు, కోశాధికారి వాసుదేవారెడ్డి, ఉద్యోగులు చంద్రశేఖర్, రాణి, విజయ, రవికుమార్ పాల్గొన్నారు.

బడ్జెట్ ఆమోదించకపోవడం సరికాదు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పురపాలక సంఘం 2026-27 ఏడాదికి సంబంధించి బడ్జెట్‌ను వైకాపా సభ్యులు ఆమోదించకపోవడం సరికాదని భాజపా నియోజకవర్గ కో-కన్వీనర్ నాగరాజుగౌడ్ గురువారం అన్నారు. కౌన్సిల్ తమ చేతుల్లో ఉందని, తాము ఎలా చెబితే అలా జరగాలని శాసించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. దీని వల్ల అభివృద్ధి కుంటుపడుతుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలోని ఎం.ఎం.రహదారి, పీఎన్.రహదారులు గుంతలు ఏర్పడ్డాయి. వెడల్పు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలతో పాటు రాకపోకలకు ఇబ్బందిగా మారింది.
- షఫీ, చిరు వ్యాపారి, ఆదోని

✔: త్వరలో గుంతలు పూడ్చే పనులు చేపడతాం. రహదారి విస్తరణకు సైతం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.
- కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

హొళగుంద, న్యూస్‌టుడే: ?: హొళగుంద బీసీ కాలనీలో నీటి నిల్వ ట్యాంకుకు మూడు కుళాయిలు లేక నీరు వృథా అవుతోంది. **- సిద్దప్ప, హొళగుంద**

✔: కుళాయిలు ఏర్పాటు చేసి, సమస్య పరిష్కరిస్తాం.
- రాజశేఖర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి, హొళగుంద

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని డీఎస్పీ హేమలత, పట్టణ సీఐలు రామలింగమయ్య, అబ్దుల్ గౌస్, రాజశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, ఎస్సైలు మహేశ్‌కుమార్, రామాంజనేయులు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌ను కలిసి సన్మానించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్టీయూ డైనందిని ఆవిష్కరణ

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీలు, కాలమాన పట్టికలను ఆదోని డివిజన్ ఉప విద్యాధికారి రాజేంద్రప్రసాద, మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు గురువారం ఆవిష్కరించారు.

డైరీలు, కాలమానపట్టికలు విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

మట్టికుప్పలు.. ఆటలకు తిప్పలు

▶ క్రీడా మైదానంలో గుట్టలుగా నిల్వలు ▶ పట్టించుకోని పుర అధికార యంత్రాంగం

ఆదోని మున్సిపల్ మైదానంలో నిల్వ చేసిన మట్టిదిబ్బలు

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో క్రీడాకారులకు కొదవలేదు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఆదోని పట్టణానికి మంచి గుర్తింపు తెచ్చారు. క్రీడలకు ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ ప్రాంతానికి ప్రభుత్వ మైదానం, ఔట్‌డోర్, ఇండోర్ స్టేడియం లేక సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో క్రీడాకారులకు, యువకులకు, విద్యార్థులకు ఆధారం మున్సిపల్ మైదానం. దీని నిర్వహణలోనూ పురపాలక సంఘం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో క్రీడా మైదానం చెత్తకుండీలా మారింది.

ఇదీ పరిస్థితి

ఆదోని పట్టణం నడిబొడ్డున ఉన్న మున్సిపల్ మైదానానికి ఘనమైన చరిత్ర ఉంది. స్వాతంత్ర్య సమరయోధుల పోరాట సమయంలో జాతిపిత మహాత్మ గాంధీ సైతం ఇదేచోట బహిరంగ సభకు వచ్చి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. నాటి నుంచి నేటి వరకు ఈ మైదానానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇదే ఆవరణలో పురపాలక ఉన్నత పాఠశాల, నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో 3,500 మంది విద్యార్థులకూ ఇదే ఆటల స్థలం. దీనికితోడు ఆదివారం వచ్చిందంటే చాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రికెట్, ఇతర ఆటలు ఆడుతూ సేదతీరుతారు.

నిర్వహణపై నిర్లక్ష్యం

ఆదోని పట్టణ వాసులు ఆటలాడాలంటే ముందుకు గుర్తొచ్చేది మున్సిపల్ మైదానమే. ఇంత ప్రాధాన్యం ఉన్న మైదానం నిర్వహణపై పురపాలక అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఆదోని పట్టణంలో నిర్మిస్తున్న మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు సంబంధించిన మట్టి, చెత్తాచెదారం తెచ్చి ఈ మైదానంలో వేస్తున్నారు. నెల రోజులుగా ఇదే పరిస్థితి. మరోవైపు మట్టిని తెచ్చేందుకు లారీలు, ట్రాక్టర్లు భారీ వాహనాలు తిరుగుతుండటంతో అధ్వానంగా మారుతోంది. క్రీడా మైదానం ఇలా మారడంతో క్రీడాకారులు, పురవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఇక్కడ నిల్వ చేసిన మట్టిని తొలగించి మైదానం శుభ్రం చేయించి, క్రీడాకారులకు అనువుగా మార్చాలని క్రీడాకారులు, పురవాసులు కోరుతున్నారు.

రహదారికి మరమ్మతులు

స్పందనకు వందనం

చిప్పగిరి, న్యూస్‌టుడే: ఆలూరు-గుంతకల్లు రహదారి మరమ్మతుకు అధికారులు చర్యలు చేపట్టారు. గత ఏడాది డిసెంబరు 29వ తేదీన 'గుంతలకల్లు రహదారి' అనే శీర్షకతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చిప్పగిరి పెట్రోలు బంకు వద్ద దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేపట్టారు. కుందన గుర్తి వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో లారీ ఢీకొని 52 గొర్రెలు మృతిచెందాయి. భారీ వాహనాలు రాకుండా చర్యలు చేపట్టాలని ఆలూరు నియోజకవర్గ ప్రజలు వాహన తనిఖీ అధికారులను కోరారు.

భాజపాలో చేరిక

హొళగుంద, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి పట్ల ఆకర్షితులై నెరణికి గ్రామంకు చెందిన కొందరు గురువారం భాజపా మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీలో చేరినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షురాలు సుధా తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ ఏఈఎన్ ప్రసాద్, కాశీ విశ్వనాథ్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే పూర్తయిన గ్రామాల్లో మూసానపల్లె, కాత్రికి, ఏ.గోనేహాలు, తుంబళబీడు, కరడిగుడ్డం, కురవళ్లి గ్రామాల్లో పట్టాదారు పాస్‌పుస్తకాలను శుక్రవారం నుంచి అందించనుందని తహసీల్దారు శోభా సువర్ణమ్మ, ఆర్‌ఐ బసవన్నగౌడ్ తెలిపారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో వాటిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని, వాటిపై ఎలాంటి రాజకీయ లోగోలు, పేర్లు ఉండవని చెప్పారు. రైతులు తప్పక తీసుకోవాలని సూచించారు.

కొత్తవి నిర్మించినా.. నిరుపయోగమే

హొళగుంద మండలం ఇంగళదహాళ్ గ్రామంలోని బీసీ బాలుర వసతిగృహంలో కొన్ని నెలల కిందట కేంద్ర ప్రభుత్వం నిధులు రూ.15 లక్షలు వెచ్చించి 20 మరుగుదొడ్లు నిర్మించారు. వసతిగృహంలో సుమారు 160 మంది విద్యార్థులు ఉన్నారు. వర్షాలు అధికంగా కురవడంతో సెప్టిక్ ట్యాంకు పైపులు మట్టితో పాటు కుంగిపోయాయి. దీంతో వాటిని అలాగే వదిలేశారు. వసతిగృహంలోని ఎనిమిది పాత వాటినే మరుగుదొడ్లు వినియోగించుకుంటున్నారు. ఈ విషయాన్ని ఇన్‌ఛార్జి వార్డెన్ ఎల్లమ్మతో ప్రస్తావించగా ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. – న్యూస్‌టుడే, హొళగుంద

కుంట కలుషితం..చర్యలు శూన్యం

ఏరూరు గ్రామంలో ఉన్న చెన్నప్పకుంట కలుషితమవుతోంది. ఒకప్పుడు గ్రామస్థుల అవసరాలు, పశువుల దాహార్తి తీర్చిన ఈ కుంటలోకి ప్రస్తుతం మురుగు కలవడంతో దుర్వాసన వస్తోంది. ఎంపీపీ పాఠశాల నుంచి చెన్నప్పకుంట వరకు ఉన్న కాలనీవాసులు రోడ్డపైకి మురుగు వదులుతున్నారు. ఆ నీరంతా వెళ్లి కుంటలో కలుస్తోంది. పలుమార్లు వారికి తాఖీదులు ఇచ్చినా.. కేసులు పెట్టినా ఫలితం లేకుండా పోయింది. సర్పంచి తిమ్మాపురం వెంకటలక్ష్మిని సంప్రదించగా.. ఈ సమస్య పరిష్కారానికి కాలనీల్లో మురుగు కాలువల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం. కుంటలో మురుగు తొలగించేలా చర్యలు తీసుకుంటామని వారు వివరించారు.
– న్యూస్‌టుడే, చిప్పగిరి

ఆదిమానవుడి వేషధారణలో నిరసన

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోనిని జిల్లా చేయాలని సామాజిక కార్యకర్త కమాలకర్‌నాయుడు ఆదిమానవుడి వేషధారణలో ఆకులు, కూరగాయలు కట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఆలూరులోని బస్టాండ్ ఆవరణలో నిర్వహిస్తున్న

దీక్షలు గురువారం 21వ రోజు చేరాయి. ఆయనకు ఐకాస నాయకులు భూపేష్, కత్తిరామాంజనేయులు, ఎల్లప్ప, బంగారు రామకృష్ణ, పూల రామాంజనేయులు మద్దతు తెలిపారు.

అతివలు సైతం.. దీక్షకు సిద్ధం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధనకు తిరుమలనగర్‌కు చెందిన మహిళలు నూతన సంవత్సరం వేళ రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆదోని జిల్లా సాధన

సమితి ఐకాస ఆధ్వర్యంలో ఆదోని జిల్లా సాధనకు చేపట్టిన దీక్షలు గురువారం 47వ రోజుకు చేరాయి. ఐకాస నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడు, దస్తగిరినాయుడు, అశోకానందరెడ్డి తదితరులు మాట్లాడారు.

పెద్దహరివాణం మండల కేంద్రం కావాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దహరివాణం మండల కేంద్రాన్ని కొనసాగించాలని గ్రామస్థులు రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలు గురువారం మూడో రోజుకు చేరాయి. దీక్షలో బింగి లక్ష్మన్న, బింగి పరమేష్, బింగి నాగరాజు, గోసవాళు అయ్యన్న కూర్చున్నారు. మండల సాధన కమిటీ సభ్యులు కరియప్ప మాట్లాడారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పెద్దహరివాణం మండల కేంద్రాన్ని కొనసాగించాలని, లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు.

టీబీడ్యాంలో 36 టీఎంసీల నిల్వ

హలహర్వి, న్యూస్‌టుడే: ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు తాగు, సాగు నీరు అందించే వరప్రదాయిని తుంగభద్ర జలాశయంలో 36.76 టీఎంసీలు నీటి నిల్వ ఉంది బోర్డు అధికారులు తెలిపారు. వారు మాట్లాడుతూ.. డ్యాంకు ఎగువ నుంచి ఎలాంటి ఇన్‌ఫ్లో లేదని, జలాశయం నుంచి వివిధ కాలువలకు తాగు, సాగు నీటి అవసరాల కోసం 8,764 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డ్యాం నూతన గేట్ల మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

తిరుప్పావై సేవలు 3న

బంగారుబజారు(ఆదోని పాతపట్టణం), న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని వెంగళాపురం ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 3వ తేదీన తిరుప్పావై సేవలు నిర్వహించనున్నారు. ధనుర్మాసం పురస్కరించుకుని 21 కిలోల పులిహోర వండి, రాసులుగా పోసి, స్వామి వారికి నివేదించనున్నారు. ఏటా నిర్వహించే ఈ పూజలకు ప్రాధాన్యత ఉంటుంది.

రహదారి వేయండి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం పాండవగల్ సాయిబాబా దేవాలయం (మాధవరం ప్రధాన రహదారి) నుంచి కుప్పగల్ రైల్వేస్టేషన్ వరకు అనుసంధాన రోడ్డు వేయాలని సీపీఎం మండల లింగన్న, నాయకులు పాండురంగ, అనీఫ్‌బాషా, నర్సిరెడ్డి, హనుమంతరెడ్డి, భీమాంజనేయులు, పక్కీరయ్య డిమాండు చేశారు. ఆదోనిలో గురువారం పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశులును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ రహదారి వేయడం జరిగితే ఉరుకుంద, కౌతాళం వెళ్లే భక్తులు, వాహనదారులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. నాలుగు కి.మీ. దూరం తగ్గుతుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారి నిర్మాణం చేయాలన్నారు.

బాల్యవివాహాలతో భవిష్యత్తు అంధకారం

హోసూరు(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: బడికి వెళ్లి చదువుకోవాల్సిన వయసులో ఆడపిల్లలకు పెళ్లి చేయటం చట్ట విరుద్ధమని, అంతేకాక వారి భవిష్యత్తు అంధకారంగా మారుతుందని హోసూరు అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-6లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పాఠశాల విద్యార్థినులతో కలిసి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హైమావతి, పద్మావతి, రామచంద్రమ్మ, కళావతి, ఈరమ్మ, శకుంతలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయసులోనే వివాహం చేసి వారి బాల్యాన్ని బుగ్గిపాలు చేయొద్దని ఆస్పరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సంతోష్ కుమార్ సూచించారు. కళాశాలలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంతోషమ్మ, మైసూరారెడ్డి, రామన్న, మద్దిలేటి, మల్లికార్జున, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఏజీపీ బాధ్యతల స్వీకరణ

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా న్యాయవాది బాలబాషా బాధ్యతలు చేపట్టారు. పేదలకు న్యాయం అందించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఏజీపీగా బాధ్యతలు చేపట్టిన ఆయనను పలువురు న్యాయవాదులు అభినందించారు.

క్విజ్ పోటీలతో మెదడుకు పదును

★ ఈనాడు- ఈటీవీ ప్రతిభా పాటవ పోటీలు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొనడం వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుందని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్‌బాబు అన్నారు. ఆదోని పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు చురుగ్గా పాల్గొని తమ మేధను పదును పెట్టారు. ఈ పోటీలో ప్రథమ ఎం.అబ్దుల్ కాలిక్, ద్వితీయ కె. కార్తిక్, తృతీయ స్థానంలో బి.అయేషా ముస్కాన్ గెలుపొందారు. విజేతలకు పాఠశాల నిర్వాహకులు బహుమతులు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాన్‌విక్టర్, లోక్యానాయక్, ప్రహ్లాద తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న ఆదోని మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న పాఠశాల నిర్వాహకులు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొనటం వల్ల వారి మేధస్సు పురోగతికి ఎంతో దోహదపడుతుందని పత్తికొండ ఏపీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ విక్టర్ శామ్యూల్ అన్నారు. ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు మేఘన, పావని, ఆనంద్‌నాయక్‌కు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ కె.నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు రాజశేఖర్, హరినాథ్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ విక్టర్ శామ్యూల్

కర్ణాటకకు తరలుతున్న ధాన్యం

రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించడం లేదు. ఫలితంగా వ్యాపారులు, దళారులు చెప్పిన ధరకే విక్రయించాల్సిన పరిస్థితి రైతులకు నెలకొంది. హాలహర్వి మండల పరిధిలో బాపురం, పచ్చారపల్లి, చింతకుంట, జె.హోస్పల్లి, గూళ్యం, సిద్దాపురం గ్రామాల్లో దిగువ కాల్వ కింద సుమారు 1100 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే ప్రకృతి ప్రకోపం కారణంగా దిగుబడులు పూర్తిగా తగ్గాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వచ్చిన దిగుబడిని వ్యాపారులు ఇష్టానుసారంగా కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,369 నుంచి రూ.2,389 ఉంది. రకాన్ని బట్టి రూ.1900 నుంచి రూ.2100 వరకు పలుకుతోంది. ఇందులో బాజు పేరుతో రైతుల నుంచి అదనంగా రెండు కిలోల నుంచి మూడు కిలోల వరకు ధాన్యం తీసుకుంటున్నారు. కర్ణాటకలో వరి క్వింటాలు రూ.2,200 పలుకుతోంది. స్థానికంగా మిల్లులు లేకపోవడంతో వ్యాపారులు ధాన్యాన్ని కర్ణాటకకు తరలిస్తున్నారు. ధాన్యం ధర తక్కువగా ఉన్నా.. బియ్యం ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం బియ్యం రూ.3,800 నుంచి 3,900 వరకు పలుకుతోంది. – న్యూస్‌టుడే, హాలహర్వి

పైపులకు మరమ్మతు

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర పంచాయతీ కార్యాలయం నుంచి వెళ్లే ప్రధాన రహదారిలోని నీటి పథకం పైపులైను నిత్యం లీకవుతోంది. నీరంతా రహదారిపై పారుతుండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దీనిపై మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన 'లీకేజీలు కానరాకున్నాయి' అనే చిత్ర కథనానికి పంచాయతీ సిబ్బంది స్పందించి, గురువారం మరమ్మతులు చేపట్టారు.

అంబరాన్నంటిన కొత్త ఏడాది సంబరం

ఆదోనిలో గుడిసె కృష్ణమ్మను సన్మానించిన నాయకులు, కార్యకర్తలు

ఆలూరులో తెదేపా ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతిని సన్మానిస్తున్న ఆ పార్టీ నాయకులు

కర్నూలులో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ సిరి, ఆదోని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్, ఆదోని తహసీల్దారు శేషఫణి తదితరులు

నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. రాజకీయ పార్టీల కార్యాలయాలు, ప్రముఖుల ఇళ్లకు అభిమానులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని మండలాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. – న్యూస్‌టుడే, బృందం

పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుతో చేనేత ఐక్య సంఘం ప్రధాన కార్యదర్శి అవరపు శంకర్, తదితరులు →

మున్సిపల్ ఛైర్‌పర్సన్ లోకేశ్వరిని సన్మానిస్తున్న ఆదోని పురపాలక ఉద్యోగులు

తెదేపా ఎమ్మెల్సీ బీటీ.నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పురపాలక ఉన్నతాధికారులు

చిప్పగిరి: హైదరాబాద్‌లో ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

వృథానీరు.. మారని తీరు

★ దృష్టిసారించని అధికారులు
★ చుట్టుముడుతున్న రోగాలు

పట్టణాల్లో పైపులైన్ లీకేజీలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నీరు కలుషితం అవుతుండటంతో రోగాలు చుట్టుముడుతున్నాయి. నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. తరుచూ లీకేజీలు జరుగుతున్నా.. శాశ్వత పనులు చేపట్టడం లేదు. వాల్వ్‌ల వద్ద వృథా నీటితో గుంతలు నిండిపోతున్నాయి. కొన్నిచోట్ల మరమ్మతుల కోసం తవ్విన గుంతలు రోజుల తరబడి పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారాయి.

మురుగు కాల్వ పక్కనే..!

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని చందసా దర్గా ప్రాంతంలోని ప్రధాన రహదారిపై తాగునీటి పైపులైన్ లీకవుతోంది. ప్రధాన పైపులైన్ నుంచి సరఫరా అయ్యే నీరంతా వృథాగా కాల్వలో కలుస్తోంది. అసలే నీటి కొరత, ఆపై నాలుగైదు రోజులకోసారి సరఫరా.. చేస్తున్నారు. ఇలాంటి సమయంలో పొదుపు పాటించిపోయి.. ఇలా వృథా చేయడం ఎంత వరకు సమంజసమని పుర జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చందసా దర్గా ప్రాంతంలో కాల్వలో కలుస్తున్న నీరు

మద్దికెరలో మరమ్మతు చేసినా లీకవుతున్న వాల్వ్‌లు

నాసిరకం పనులతోనే సరి

మద్దికెర, న్యూస్‌టుడే: నీటి పథకాల నిర్వహణలో భాగంగా అధికారులు నిధులు ఖర్చు చేస్తున్నా.. పనిచేసే సిబ్బంది నిర్లక్ష్యం, నాసిరకం పరికరాల వినియోగం కారణంగా అవి చెడిపోతూనే ఉన్నాయి. మద్దికెరలో గత వారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ స్వయంగా పరిశీలించి మరమ్మతు చేయించినా ఫలితం లేకుండా పోయింది. 'ఈనాడు' ఆధ్వర్యంలో వాక్‌విత్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు స్వయంగా పరిశీలించారు. మరమ్మతు చేయించిన రోజు నుంచే అవి లీకవుతుండడంతో నీరు కలుషితం అవుతోంది. ఇప్పటికైనా నాణ్యమైన పరికరాలతో మరమ్మతులు చేయించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
మున్సిపల్ మెయిన్ రోడ్ శాఖ, ఆదోని (00021)
19/1, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా, ఆదోని, ఆంధ్రప్రదేశ్-518301. మొబైల్: 9321932021.
ఇమెయిల్ ఐడి: ubin0800023@unionbankofindia.bank.in

స్థిరాస్తుల అమ్మకం

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ- వేలం అమ్మకు ప్రకటన

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు), కో-ఆబ్లిగెంట్ మరియు గ్యారంటరు(ల)కు (వివరాలు దిగువ పట్టికలో తెలుపబడినవి) ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా గత ఆంధ్రా బ్యాంక్, ఇప్పటి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తనఖా పెట్టిన/ చార్జిచేయబడిన దిగువతెలిపిన స్థిరాస్తి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారిచే సంభావిత స్వాధీనత చేపట్టబడినది మరియు రుణగ్రహీత, గ్యారంటరు మరియు కో-ఆబ్లిగెంట్ నుండి గత ఆంధ్రా బ్యాంక్, ఇప్పటి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రావల్సిన బకాయిని (పట్టికలో పేర్కొనబడినది) రాబట్టుకొనుటకు 28-01-2026న మ.12.00 గం.నుండి సా.5.00 గం.ల మధ్య " ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలానే " ప్రాతిపదికన విక్రయించబడును. రిజర్వు ధర మరియు ధరావతు దిగువ పట్టికలో పేర్కొనబడినవిధంగా ఉన్నవి.

ఖాతా, రుణగ్రహీత/ల, గ్యారంటరు/ల వగైరాల పేరు

1ఎ. శ్రీ ఆర్.మల్లికార్జున రెడ్డి (రుణగ్రహీత) తండ్రి శ్రీ కృష్ణా రెడ్డి, ఇంటి నెం.1-82, కురుకుంద, ముద్దనగెరి, ఆలూరు మండలం, కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్- 518395.
1బి. శ్రీమతి రామిరెడ్డిగారి పార్వతి (సహరుణగ్రహీత) భర్త ఆర్. మల్లికార్జున రెడ్డి, ఇంటి నెం.1-82, కురుకుంద, ముద్దనగెరి, ఆలూరు మండలం, కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్- 518395.
2ఎ. శ్రీ కొగిలతోట శ్రీధర్ రెడ్డి, (గ్యారంటరు) తండ్రి శ్రీ హరిచంద్రారెడ్డి డి.నెం.2-28, కురుకుంద, ముద్దనగెరి, ఆలూరు మండలం, కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్- 518395.

సంభావిత స్వాధీనతలో ఉన్న ఆస్తి

కర్నూలు జిల్లా, ఆలూరు మండలం, ముద్దనగిరి పోస్ట్, కురుకుంద గ్రామ పంచాయత్, సర్వే నెం.343ఎలో వార్డు నెం.1, డి.నెం.1/82గల, 155.55 చ.గ. విస్తీర్ణంగల గ్రామీణ నివాస భూమి మరియు భవనం యావత్తు, **సరిహద్దులు: తూర్పు:** రస్తా, **పడమర:** కృష్ణా రెడ్డికి చెందిన ఇల్లు, **ఉత్తరం:** సీతారామి రెడ్డికి చెందిన ఇల్లు, **దక్షిణం:** జనార్ధన్ రెడ్డికి చెందిన ఇల్లు.

రిజర్వు ధర: రూ.13,40,000/- (పదమూడు లక్షల నలభై వేల రూపాయలు మాత్రమే)
ధరావతు: రూ. 1,40,000/- **బిడ్ పెంపుదల:** రూ. 15,000/-, **ఐఎఫ్ఎస్‌సి కోడ్:** UBIN0800023, ఖాతా నెం.000211980050000
30-11-2025 నాటికి బకాయి: రూ.20,45,028.47 (ఇరవై లక్షల నలభైఐదు వేల ఇరవై ఎనిమిది రూపాయల నలభై ఏడు పైసలు మాత్రమే)తోపాటు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రావల్సిన తదుపరి వ్యయాలు, ఖర్చులు మరియు దీనిపై వడ్డీ.
ఇఎండి దాఖలుకు చివరి తేదీ: ఇ-వేలం పూర్తయ్యేంత వరకు.
ఇ-వేలం తేది మరియు సమయం: 28-1-2026 మ.12.00 గం.నుండి సా.5.00 గం.ల మధ్య. వేలం చివరి 10 నిమిషాల్లోగా బిడ్ చేయబడిన పక్షంలో వేలం ముగింపు సమయం ప్రతీసారి 10 నిమిషాలు పొడిగించబడును.

అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు www.unionbankofindia.bank.in మరియు ఇ-వేలం సర్వీసు ప్రొవైడర్స్ వెబ్‌సైట్: https://baanknet.com నందు ఏర్పాటు చేయబడిన లింకును చూడండి.

తేది: 30.12.2025
ప్రదేశం: ఆదోని
అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు

రాఘవేంద్రస్వామి దర్శనానికి తరలొచ్చిన భక్తులు

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీగురు రాఘవేంద్రస్వామి ఆలయానికి నూతన సంవత్సరం సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలొచ్చారు. స్వామివారి మూల బృందావనానికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు గ్రామదేవత మంచాలమ్మ, రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. శ్రీమఠం మధ్య కారిడార్ భక్తులతో కిక్కిరిసిపోయింది.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని బంగారు బజార్‌లో విద్యుత్తు తీగల మరమ్మతులు కారణంగా శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తు ఏఈ ప్రసన్నాంజనేయ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మెయిన్, బంగారు బజార్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : ?: రాఘవేంద్ర కాలనీలో దారంతా గుంతలు పడి అధ్వాన్నంగా ఉంది. **-రఘు**

✔: కొత్త రహదారికి ప్రతిపాదనలు పెట్టాం **-గంగిరెడ్డి, పురపాలక కమిషనర్**

?: గాంధీనగర్ కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి మరమ్మతులు చేపట్టండి **-కేశవరెడ్డి, కాలనీవాసి.**

✔: రహదారి పనులు త్వరలో చేపడతాం **- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్**

?: మాత్రాల తిమ్మప్ప కాలనీలో అదనంగా బోర్లు వేయండి **- సుశీలమ్మ, కాలనీవాసి.**

✔: కొత్త బోర్లకు ప్రతిపాదనలు పంపాం -నీరజా, డీఈ

?: వెంకటాపురంలో రెండు అదనపు బోర్లు వేయండి **- చిన్నరంగన్న, కాలనీవాసి**

✔: కొత్త బోర్లు త్వరలో వేయిస్తాం. **- నీరజ, డీఈ**

పెద్దకడబూరు, న్యూస్‌టుడే : ?: నాగులాపురంలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. శుభ్రం చేయించాలి. **-గ్రామస్థులు,**

✔: నిధులను అనుసరించి పారిశుద్ధ్య నిర్మూలన చర్యలు చేపడతాం. **-ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు.**

నందవరం, న్యూస్‌టుడే: ?: గంగవరం గ్రామంలో తాగునీరు రెండు రోజులకు ఒక్కసారి సరఫరా అవుతుంది. రోజువారిగా తాగునీరు సరఫరా చేయండి. **-రఘు, గంగవరం**

✔: గ్రామంలో రోజు వారిగా తాగునీరు సరఫరా అయ్యే విధంగా చూస్తాం. **-ఎంపీడీవో పుల్లయ్య, నందవరం**

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కంబదహాల్(సి.బెళగల్), న్యూస్‌టుడే : మండలంలోని కంబదహాల్ గ్రామంలో వెలసిన సాయిబాబా ఆలయంలో గురువారం పురోహితుడి ఆధ్వర్యంలో సాయిబాబా విగ్రహానికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12.00గంటలకు కాగడ హారతి ఇచ్చారు. సాయంత్రం సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల్లో మేళతాళాలతో ఊరేగించగా భక్తులు పూజాద్రవ్యాలు అందించి మొక్కులు తీర్చుకున్నారు. పోలకల్‌లో సద్గురు శింగరయ్య ఆలయం సర్వజ్యోతి పీఠాధిపతి రాజరత్నంశెట్టి ఆధ్వర్యంలో భక్తులు నాగదోషనివారణ, అభిషేక పూజలు నిర్వహించారు. కొత్తకోటలోని రాఘవేంద్రస్వామి మఠంలో, గుండ్రేవుల గ్రామంలోని సుబేంద్రస్వామి ఆలయంలో ఆయా పురోహితుల ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.

నిర్మాణాలు శిథిలం.. నిర్వహణ శూన్యం

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో విలువైన నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పత్తి మార్కెట్ కోసం రూ.కోట్లతో నిర్మించిన నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. పరిసరాలు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది.

రూ.2.50 కోట్లతో నిర్మాణాలు

వ్యవసాయ మార్కెట్ 23 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు రెండు ఎకరాల విస్తీర్ణంలో పత్తి మార్కెట్ టీఎంసీ సౌజన్యంతో 2012 సంవత్సరంలో రూ.2 కోట్లతో నిర్మించారు. తర్వాత రూ.50 లక్షలతో జంబోషెడ్డు, రైతుల సౌకర్యార్థం ప్లాట్‌ఫాం, మరుగుదొడ్లు వంటి నిర్మాణాలు చేపట్టారు. అయితే వాటిని వినియోగించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

శిథిలావస్థకు చేరిన భవనం

అన్నదాతలకు తప్పని ఇక్కట్లు

పరిశీలన

ఉప విభాగంలో లక్ష ఎకరాల్లో పత్తి వేశారు. పత్తిని విక్రయించేందుకు ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లోని పలు గ్రామాలతో పాటు కోడుమూరు, ఆలూరు నియోజకవర్గాల నుంచి పలు దిగుబడులు వస్తాయి. ఏడాదికి పత్తి విక్రయాలు రూ.400 కోట్ల వరకు జరుగుతాయి. మార్కెట్‌కు సెస్సు రూపేణా దాదాపు రూ.3కోట్ల నుంచి రూ.4కోట్ల ఆదాయం వస్తోంది. ఇంత పెద్ద ఎత్తున ఆదాయం వస్తున్నా.. పత్తి రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పత్తి మార్కెట్‌లో నిర్మించిన నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పత్తి విక్రయాలు బయట జిన్నింగ్ మిల్లులు, దుకాణాల్లో మాత్రమే జరుగుతున్నాయి. పత్తి మార్కెట్‌లో ప్రస్తుతం కూరగాయల టోకు వ్యాపారం నిర్వహిస్తున్నారు.

◆ నీరుగారుతున్న ప్రభుత్వ ఆశయం

అమ్మకాలకు అవస్థలే..

మార్కెట్లో ప్రస్తుతం వేరుసెనగ, కందులు, ఆముదాలు, శనగలు వంటి దిగుబడుల విక్రయాలు జరుగుతున్నాయి. వేరుసెనగ దిగుబడులు కుప్పగా పోసి టెండర్‌కు పెడతారు. కూరగాయల టోకు వ్యాపారంతో వేరుసెనగ అమ్మకాలకు అసౌకర్యంగా మారిందని రైతులు పేర్కొంటున్నారు. వ్యవసాయ దిగుబడులు అమ్మకాల మార్కెట్ కూరగాయల టోకు వ్యాపార కేంద్రంగా మారింది. కూరగాయల టోకు వ్యాపారంతో మార్కెట్‌కు ఆదాయం అంతంత మాత్రమే వస్తోంది. వేరుసెనగ, పత్తి విక్రయాల ద్వారానే దాదాపు మార్కెట్‌కు ఏడాదికి రూ.6 కోట్ల నుంచి రూ.7కోట్ల వరకు ఆదాయం వస్తోంది.

కాల్వగట్టు.. మరమ్మతులు చేపట్టు

మండల పరిధిలోని చనుగొండ్ల గ్రామ సమీపంలో ఎల్లెల్సీ కాల్వ గట్టు కోతకు గురై అధ్వానంగా ఉంది. రబీ సీజన్ కావడంతో గాజులదిన్నె జలాశయం నుంచి ఎల్లెల్సీ కాల్వకు నీటి ప్రవాహం ఉంటుంది. గట్టుపైన వాహనాలు తిరగడానికి, రైతులు తమ పంట ఉత్పత్తులను తరలించే సమయంలో ఇబ్బందికరంగా ఉంది. ప్రమాదవశాత్తు కాల్వలో పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి కాల్వ గట్టుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

దారంతా పొగమంచు... జాగ్రత్త వహించు

శీతాకాలంలో చలి ప్రభావం ఎక్కువగానే ఉంది. పొగ మంచు దట్టంగా కురుస్తోంది. రహదారులు, పచ్చని పొలాలపై పొగమంచు గురువారం ఉదయం మంచు దుప్పటిలా కప్పుకొంది. ఉదయం ఎనిమిది గంటల వరకు పొగమంచు తగ్గలేదు. మండలంలోని ప్రధాన రహదారులపై వాహన దీపాల వెలుగులో చోదకులు రాకపోకలు సాగించాల్సివస్తోంది. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. -న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

బోరుమంటున్నా పట్టదే

మండలంలోని కంబళదిన్నె గ్రామంలో మాలపల్లి రహదారి పక్కన ఉన్న మినీట్యాంకు ఎస్ బోరు మరమ్మతులకు గురైంది. దీంతో ఇక్కడ నీటి ఎద్దడి ఏర్పడింది. బోరు చెడిపోయి రెండు నెలలు కావస్తోంది. బోరులో రెండు ఇంచుల నీరు పడ్డాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో సుమారు 5 వేల జనాభా నివసిస్తున్నారు.
–న్యూస్‌టుడే, పెద్దకడబూరు

సంపు పూర్తి చేయాలి.. దాహార్తి తీర్చాలి

మండలంలోని పెద్దనెలటూరు గ్రామంలో తాగునీటి పరిష్కారం కోసం జలజీవన్ మిషన్ పథకం కింద 1.50 లక్ష లీటర్ల నీటి సామర్థ్యం గల సంపు నిర్మాణం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో చేపట్టారు. ఏడాది కావస్తున్నా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నాయి. అసంపూర్తి పనుల వల్ల పాఠశాల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. సంపు పనులు పూర్తయితే గ్రామానికి తాగునీటి సమస్య తీరుతుందని గ్రామస్థులు చెప్పారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.-న్యూస్‌టుడే, గోనెగండ్ల

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు

కోడుమూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలందరికీ అందేలా చూస్తామని కోడుమూరు శాసనసభ సభ్యులు బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. నూతన ఏడాది సందర్భంగా ఎమ్మెల్యేను తన నివాసంలో గురువారం పోలీసు శాఖ, రెవెన్యూశాఖ, పంచాయతీ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, తహసీల్దార్లు, ఏఈలు కలిశారు.

మత్స్యకారుల వలకు చిక్కిన మొసలి పిల్ల

కర్నూలు గ్రామీణం, న్యూస్‌టుడే : తుంగభద్ర నదిలో చేపల వేటకు వేసిన వలలో ఓ మొసలిపిల్ల పడింది. ఇ.తాండ్రపాడు గ్రామానికి చెందిన కొందరు మత్స్యకారులు గురువారం తెల్లవారుజామున తుంగభద్రలోకి చేపల వేటకు వెళ్లారు. చేపలతో పాటు సుమారు 2 అడుగుల పొడవున్న మొసలి పిల్ల కూడా వలలో పడింది. మత్స్యకారులు దానిని జాగ్రత్తగా బయటికి తీశారు. గ్రామస్థులు దానిని ఆసక్తిగా తిలకించి ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కావలి ఎమ్మెల్యే

స్వామిని దర్శించుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రాలయం రాఘవేంద్రస్వామిని గురువారం నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం ఎమ్మెల్యే కావలి కృష్ణారెడ్డి దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఆయనకు మఠం అధికారులు స్వాగతం పలికారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు స్వామివారి శేషవస్త్రం, ఫలమంత్ర అక్షితలు ఇచ్చి ఎమ్మెల్యేని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్, సహాయ పీఆర్వో వ్యాసరాజా ఆచార్, విజయేంద్ర ఆచార్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడి పూజ

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా గురువారం రాత్రి పడి పూజ వైభవంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వాములు భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు మల్లికార్జునస్వామి, అనంతహరి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడి ఎంపిక

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్ల గ్రామానికి చెందిన భాజపా నాయకుడు జి.రవికుమార్‌నాయుడు భాజపా కిసాన్ మోర్చా తరపు నుంచి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికైనట్లు ఆ పార్టీ నాయకులు గురువారం తెలిపారు. రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపడానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

గ్రామ అభివృద్ధే ధ్యేయం

ముగతి(నందవరం), న్యూస్‌టుడే: ముగతి గ్రామ అభివృద్ధే ధ్యేయమని వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సర్పంచి ముగతి విరుపాక్షిరెడ్డి పేర్కొన్నారు. ముగతి గ్రామంలో దర్గా వీధిలో రూ.12 లక్షలతో వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన కుళాయిని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఎంపీపీ లక్ష్మీదేవమ్మ సహకారంతో సీసీ రోడ్డు, తాగునీటి కొళాయి, వీధి దీపాలు ఏర్పాటు చేశామన్నారు. ఉప సర్పంచి గణపతి, నాయకులు మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

నవ వసంతం.. వెల్లివిరిసిన ఆనందం

ఎమ్మిగనూరు: ఎమ్మెల్యే బీవీని సన్మానిస్తున్న కమ్మ సంఘం అధ్యక్షుడు భాస్కర్, చంద్రశేఖర్

దేశవ్యాప్తంగా కొత్త సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. టపాసుల మోతలు, కేకు కటింగ్‌లు, డీజే శబ్దాల మధ్య 2026వ సంవత్సరానికి స్వాగతం పలికారు. పట్టణ, గ్రామ ప్రజలు వీధుల్లోకి వచ్చి వేడుకలు చేసుకున్నారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వారి నియోజకవర్గాల ఎమ్మెల్యేలను మర్యాదపూర్వకంగా కలిశారు.
– న్యూస్‌టుడే బృందం

గూడూరు గ్రామీణం:తెదేపా జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మను కలిసిన తెదేపా నాయకులు

గూడూరు గ్రామీణం: ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని గజమాలతో సత్కరించిన రేమట వెంకటేశ్వర్లు

గూడూరు గ్రామీణం: ఎంపీ బస్తిపాటి నాగరాజుకు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న సుమన్‌బాబు

మంత్రాలయం గ్రామీణం: తిక్కారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మంత్రాలయం గ్రామీణం: రాఘవేంద్రరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

గ్రామస్థుల హర్షం

పలుకుదొడ్డి (సి.బెళగల్), న్యూస్‌టుడే : మండలంలోని సి.బెళగల్ నుంచి పలుకుదొడ్డి సంగాల పంచాయతీరాజ్ వరకు బీటీ రహదారి నిర్మాణం పనులు కూలీలతో, యంత్రాలతో చేపట్టి పూర్తి చేశారు. దాదాపు 6 కి.మీ. బీటీ రహదారి నిర్మాణం పూర్తితో ప్రయాణికులు కాలినడకన, వాహనాల్లో ప్రయాణం సాగిస్తున్నారు. కొన్నేళ్లుగా గుంతలమయంగా ఉన్న రహదారిని బాగు చేయడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో నాబార్డు నిధులతో నూతనంగా బీటీ రహదారి నిర్మాణం పూర్తి చేశారు. కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

చేనేత పురిలో సమస్యల తిష్ఠ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: చేనేత పురిలో సమస్యలు తిష్ఠ వేశాయి. రూ.కోట్ల ఆదాయం వస్తున్నా.. కనీస వసతులు కల్పించలేకపోతున్నారు. శివారు ప్రాంతాలతో పాటు, ప్రధాన వీధుల్లో అభివృద్ధి పనుల విషయంలో మమ అనిపిస్తున్నారు. ప్రతి నెల సర్వసభ్య సమావేశంలో రూ.లక్షల విలువ చేసే పనులకు ఆమోదించి వదిలేస్తున్నారు.

28వ వార్డులో దెబ్బతిన్న దారి

కంకర వేసి వదిలేశారు

పట్టణంలో సీసీ రహదారుల కోసం కొత్తగా ఇందిరానగర్, ఎస్సీకాలనీ, గీతానగర్, లక్ష్మణ్ టాకీస్ ఏరియా ప్రాంతాల్లో పది రోడ్లకు కంకర వేశారు. వీటి కోసం గతంలో రూ. 1.50 కోట్లతో టెండర్లు పిలిచినా.. ఇంకా ఓపెన్ చేయలేదు. మూడేళ్లు గడిచిన ఇక్కడ దారులు కంకరతో ఉన్నాయి. దీనిపై ఎన్నిసార్లు విన్నవించినా గుత్తేదారులు ముందుకు రావడం లేదు. కాలనీవాసులు కంకర దారిలో నడక కొనసాగించలేకపోతున్నారు.

అధ్వాన దారులు

11వ వార్డులో ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. మురుగు కాల్వల నిర్మాణం, రహదారి పనులు సగంలో ఆగిపోవడంతో వాహనదారులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మైనారిటీ కాలనీకి వెళ్లే దారిలో గుంతలు పడి రహదారి అధ్వానంగా ఉంది. కర్నూలు రహదారి వరకు కనీసం రోడ్డు లేకపోవడంతో కాలనీవాసులు చుట్టు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి. ఈ కాలనీలో దాదాపు 500 కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. పెద్దక మేలా ప్రాంతంలో ఉన్న రహదారికి గుంతల పడి రాకపోకలు ఇబ్బంది నెలకొంది. సోమప్ప కూడలి నుంచి శ్రీనివాస కూడలి,శివకూడలి వరకు రహదారి అధ్వాన్నంగా నెలకొంది. దీనిపై అసలు పనులు చేపట్టలేదు.

కాల్వలు కానరాక

☛ మునెప్పనగర్ కాలనీలో మురుగు కాల్వలు లేకపోవడంతో నీరంతా రహదారులపైకి చేరుతోంది. ప్రజలు రోగాల బరిన పడుతున్నారు.

☛ వెంకటాపురంలో భూగర్భ మురుగు కాల్వలు తవ్వి వదిలేయడంతో రోడ్లు అధ్వానంగా ఉన్నాయంటూ కౌన్సిలర్ బజారి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డులో రోడ్లన్ని గుంతలు పడడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారన్నారు. వెంకటాపురం రహదారి, లక్ష్మణ్ టాకీస్ రోడ్డులో విద్యుత్తు దీపాలు సక్రమంగా లేవు. ఈ కాలనీలో దాదాపు పదివేల మంది రాకపోకలు సాగిస్తున్నారు.

☛ వెంకటసాయి గుడి సమీపంలో ఉన్న కాలనీలో మురుగు నీరు బయటకు వెళ్లేందుకు కాల్వలు లేవు. మురుగు నీటి కుంటలతో దోమలు అధికమయ్యాయి. అధికారులు ఈ సమస్యలను అసలు పట్టించుకోలేదని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు.

☛ లక్ష్మణ్‌టాకీస్ వెనుక భాగంలో మూడు రహదారుల కోసం గతంలో రూ.33 లక్షలతో సీసీ రోడ్ల పనులు చేపట్టేందుకు కంకర లేయర్ వేశారు. భూగర్భ మురుగు కాల్వల కోసం నిర్మించిన మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా మారాయి.

పరిష్కరిస్తాం: – గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు

పట్టణంలోని నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరిస్తాం. రహదారులకు పడిన గుంతల చోట కొత్త దారుల నిర్మాణం కోసం రూ.కోటితో టెండర్లు పిలిచాం.

జిల్లా సాధనకు పోరాటం ఉద్ధృతం

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఐకాస నాయకులు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధనకు పోరాటం ఉద్ధృతం చేస్తామని ఆదోని జిల్లా సాధన ఐకాస నాయకులు నూర్‌అహ్మద్ పిలుపునిచ్చారు. కౌతాళం మండల కేంద్రంలో గురువారం ఆదోని జిల్లా ఉద్యమకారులతో చర్చించి కార్యాచరణ రచించాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ..వలసలతో మంత్రాలయం నియోజకవర్గం ఖాళీ అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో కౌతాళం ఐకాసం నాయకులు శేషిరెడ్డి, ఖాజా, గ్రామస్థులు నరేంద్రయాదవ్, సకీల్‌సద్దాం హుసేన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ కాలమానిని ఆవిష్కరణ

కోడుమూరు, న్యూస్‌టుడే : రాష్ట్రోపాధ్యాయ సంఘం మండలశాఖ అధ్యక్షుడు ఎస్ తిమ్మన్న అధ్యక్షతన ఎస్టీయూ రూపొందించిన 2026 నూతన ఏడాది కాలమానిని, నూతన డైరీని విశ్రాంత ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న మాట్లాడుతూ ఉపాధ్యాయుల, విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ ఎల్లవేలలా పోరాటం చేస్తుందన్నారు. ఈసందర్భంగా జిల్లా ఉపాధ్యాయ వాణి కన్వీనరు జీసీ నరసింహుడు, విశ్రాంత ఎంఈవో రాఘవరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు సుంకయ్య, నారాయణ, గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, గణేష్, శంకర్, శివ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు విద్యార్థులు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలోని వికాస్ విద్యావిహార పాఠశాల విద్యార్థులు విరాట్, బాలచైతన్య, కావ్య రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహఆచారి తెలిపారు. ఆయన మాట్లాడుతూ..ఎమ్మిగనూరులోని నలంద జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి జూనియర్ అబాకస్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారన్నారు. ఫిబ్రవరిలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రశంసాపత్రం అందుకొంటున్న విద్యార్థిని

ప్రమాదాల నియంత్రణ.. యంత్రాంగం పర్యవేక్షణ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరులో వాహనాలు వేగానికి కళ్లెం వేయనున్నారు. కూడలిలో నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే జరిమానా విధించనున్నారు. ప్రధాన కూడలిలో కొన్ని ఏళ్ల నుంచి ప్రమాదాలకు నిలయం మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రాఫిక్ సిగ్నల్స్ పద్ధతి ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా ఏర్పాటు చేసిన సిగ్నల్స్ లైట్లు, వివిధ రాష్ట్రాల నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనాలు, ప్రజలు తప్పనున్న ఇబ్బందులపై న్యూస్‌టుడే ప్రత్యేక కథనం

పట్టణంలో వాహనాల రాకపోకలు
బస్సులు: 650 పైగానే
లారీలు: 450
కార్లు, ఇతర వాహనాలు: దాదాపు 5 వేలు
ద్విచక్రవాహనాలు: 8 వేలు
ఆటోలు: 6 వేలు

■ పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని

చేనేతపురిలో పెరిగిన వాహనాలు రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పట్టణంలో అన్నమయ్య కూడలిలో మూడు రోడ్లలో రాకపోకలు సాగుతాయి. ఎమ్మిగనూరు మీదుగా ఎమ్మిగనూరు- కర్నూలు, మంత్రాలయం- కర్నూలు, ఆదోని- కర్నూలుకు వెళ్లే వాహనాల సంఖ్య అధికంగా ఉంటోంది. అన్నమయ్య కూడలిలో వాహనాల్లో ఎటుపడితే అటు వెళ్తుండేవి. ఈ కూడలి మీదుగా ప్రతి రోజూ దాదాపు 550 బస్సుల సర్వీసులు నడుస్తాయి. మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని శని, ఆదోని, సోమ, గురువారాల్లో దాదాపు 60 వేల మంది దర్శించుకుంటారు. దీంతో గతంలో ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల నివారణ కోసం పురపాలక సంఘం దాదాపు రూ.16.70 లక్షలతో సిగ్నల్స్ ఏర్పాటు చేసింది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి.

అన్నమయ్య కూడలిలో ఏర్పాటు చేసిన సిగ్నళ్లు

■ సెన్సార్‌తో గుర్తించి

గతంలో ఎమ్మిగనూరు పట్టణంలో మాచాని సోమప్ప బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దాదాపు పదిమంది ఆటోలో ప్రయాణిస్తుండగా గాయపడ్డారు. ఇందులో ఒక బాలిక మృత్యువాత పడింది. సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి ఓ వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ప్రతి ఏడాది దాదాపు 30 నుంచి 40 ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో పట్టణంలో అన్నమయ్య కూడలిలో సిగ్నల్స్‌ను మూడు వైపుల బిగించారు. రాకపోకలను అన్ని వైపుల ఒకటిన్నర నిమిషం వాహనాలు నిలిచే విధంగా సెన్సార్ రూపంలో తయారుచేశారు. రెడ్‌లైట్ పడినపుడు వాహనం ఆపకపోతే ట్రాఫిక్ నిబంధనలు ప్రకారం జరిమానా విధిస్తారు. కూడలిలో సెన్సార్లు ఏర్పాటు చేయడంతో ఆటోమెటిక్‌గా వాహనం నెంబర్ ఫీడ్ చేసుకొని వాహనదారుడికి సెల్‌కు సమాచారం రూపంలో జరిమానా పడుతోంది. వీటిని అరికట్టేందుకు తోడ్పాటు అందుతోంది.

త్వరలోనే ప్రారంభిస్తాం: – గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను త్వరలో ప్రారంభిస్తాం. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి వాహనాల ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం.

మున్సిపల్ ఛైర్మన్‌పై కౌన్సిలర్ల విమర్శలు

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మున్సిపల్ ఛైర్మన్ పనితీరు అధ్వానంగా ఉందని ఆ పార్టీ కౌన్సిలర్లే మున్సిపల్ సమావేశంలో విమర్శలు చేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. బుధవారం జరిగిన మున్సిపల్ సమావేశంలో వైకాపా కౌన్సిలరు బజారి మాట్లాడుతూ.. ఛైర్మన్ మున్సిపాలీటీలో సమస్యలు పరిష్కంచకపోవడం బాధాకరమన్నారు.

అర్ధరాత్రి యువకుల ఘర్షణ

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రాలయం మండలంలోని బూదూరు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి యువకుల మధ్యన ఘర్షణ చోటుచేసుకుంది. ఈ సంఘటనలో ముగ్గురికి యువకులకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుల తెలిపిన వివరాల మేరకు.. బూదూరు గ్రామానికి చెందిన దళిత యువకులు విజయ్, చిన్న, గాబ్రెల్ అర్ధరాత్రి బస్టాండులో ఉన్న చికెన్ దుకాణానికి వెళ్లారు. అక్కడ చాకలి నరేష్ అనే వ్యక్తితో వాగ్వాదం జరిగి కొట్టుకోవడంతో ముగ్గురు దళిత యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు.

లారీ బీభత్సం..ముగ్గురికి తీవ్రగాయాలు

కోడుమూరు, న్యూస్‌టుడే: అతివేగంతో వచ్చిన లారీ గురువారం కోడుమూరు పట్టణంలో బీభత్సం సృష్టించిన ఘటన చోటుచేకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన లారీ కర్ణాటకకు చెందిన డ్రైవరు కర్నూలు మీదుగా కోడుమూరు వైపు వస్తూ పట్టణంలోని స్థానిక కోట్ల సర్కిల్ సమీపంలో కారును, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న గూడూరు మండలం చనుగొండ్ల మజరా వై కానాపురం గ్రామానికి చెందిన బోయ నడిపి రంగయ్య, బోయ బడేసా, ఉప్పరి శ్రీనివాసులు తీవ్రగాయాల పాలయ్యారు. క్షతగాత్రులను కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ఘటనలో కారును సైతం లారీ ఢీకొట్టడంతో కారు ఓవైపు దెబ్బతింది. ఘటనపై కోడుమూరు ఎస్సై డీవై స్వామి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

(c) eenadu

కర్నూలు

ఆర్యవైశ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఆర్యవైశ్యులకు కూటమి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. ప్రకాశం జిల్లా పొదిలిలో ఆర్యవైశ్యుడు యాదాల అవినాష్‌ను స్థానిక ఎస్సై కొట్టిన నేపథ్యంలో మంత్రి భరత్ బాధితుడిని ఫోన్‌లో పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకొని ధైర్యం చెప్పారు. ఎస్సైపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఎలాంటి కష్టమొచ్చినా తనను సంప్రదించాలని బాధితుడికి భరోసా ఇచ్చారు. ఇలాంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. ఆర్యవైశ్యులకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని, పెనుగొండ పేరును వాసవి పెనుగొండగా మార్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగర పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు శుక్రవారం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు 08518-221847 నంబరుకు ఫోన్‌చేయాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85010 05408, పత్తికొండ : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ?: మాస మసీదు ప్రాంతంలో కుక్కల బెడద ఉంది. బయటికెళ్తే దాడులు చేస్తున్నాయి. – దుర్గాప్రసాద్
?: బంగారుపేట నుంచి ఆర్ఎస్ రోడ్డు కూడలికి వచ్చే దారిలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. – వీరేష్
✓: త్వరలోనే కుక్కలను పట్టిస్తాం. రహదారులను శుభ్రం చేయిస్తాం. – నగరపాలక అధికారులు

ప్రతిభ చూపారు.. పోటీల్లో మెరిశారు

పోటీలో పాల్గొన్న భారత్ పాఠశాల విద్యార్థులు

క్విజ్ పోటీల్లో శ్రీలక్ష్మి పాఠశాల విద్యార్థులు

విజేతలతో ప్రిన్సిపల్ మహమ్మద్ ఇమ్రాన్

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : 'ఈనాడు' ప్రతిభ పాటవ పోటీల్లో భాగంగా పాతనగరం పూల బజారు సమీపంలోని భారత్ ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో క్విజ్ పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు షేక్ మహమ్మద్ బిలాల్, షేక్ సమీర్‌బాషా, బోయ ఈశ్వర్‌ప్రసాద్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ మహమ్మద్ ఇమ్రాన్ బహుమతులు అందజేశారు.

బహుమతులు అందుకున్న విజేతలు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఎన్ఆర్‌పేటలోని శ్రీలక్ష్మి హైస్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. సి.జితేంద్రసింగ్, వి.వరుణ్‌గోపి (పదో తరగతి), ఆర్.అన్నెట నజరీనా (ఎనిమిదో తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల డైరెక్టర్, ఛైర్మన్ పి.దీక్షిత్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేసి అభినందించారు.

నగరం.. అభివృద్ధిలో తిరోగమనం

☛ ఏళ్లుగా సాగుతున్న కీలక నిర్మాణాలు
☛ ఈ ఏడాదైనా పూర్తిచేయాలని ప్రజల విన్నపం

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారమవ్వక ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పాలకవర్గం, అధికారుల మధ్య సమన్వయ లోపంతో పనులు ముందుకు సాగడం లేదు. గతేడాది నగరంలో ఆశించిన మేర అభివృద్ధి కనిపించలేదు. రూ. కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణాలు.. ఇతర పనులు మధ్యలో ఆగిపోయినా పట్టించుకునే వారు కరవయ్యారు. ఈ ఏడాదైనా వాటిని పూర్తిచేసి నగర ప్రగతికి బాటలు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరుగునపడ్డ మురుగు శుద్ధి

కేసీ కాలువ, హంద్రీ, తుంగభద్ర నదుల్లో మురుగునీరు కలుస్తోంది. నదీ జలాలు కలుషితం కాకుండా మురుగునీటిని శుద్ధి చేసేందుకు పాతనగరంలో జమ్మిచెట్టు వద్ద 2 ఎంఎల్‌డీ సామర్థ్యంతో చేపట్టిన శుద్ధి కేంద్రం అసంపూర్తిగా ఉంది. ● సుంకేసుల రోడ్డులోని పాత పంప్ హౌస్ వద్ద రూ.100 కోట్లతో 35 ఎంఎల్‌డీల సామర్థ్యంతో శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇది ఎప్పటికి సాకారమవుతుందో తెలియని పరిస్థితి.

శునకాల బెడద.. పట్టదా

నగరంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. వీటిని జనావాసాలకు దూరంగా తరలించే ఉద్దేశంతో కల్లూరు మండలం బస్తిపాడు గ్రామ పరిధిలో కుక్కల షెల్టర్ ఏర్పాటు చేసేందుకు నగరపాలక సంస్థ చేపట్టిన కార్యాచరణ దాల్చలేదు. దీనిని త్వరగా పూర్తిచేయాల్సిన అవసరం ఉంది.

విస్తరణ కలేనా..

నంద్యాల చెక్‌పోస్టు నుంచి నందికొట్కూరు రోడ్డులో ఎన్‌హెచ్ 340బీ జాతీయ రహదారిని 2.34 కి.మీ మేర వంద అడుగుల వెడల్పుతో విస్తరించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ పనులతో నష్టపోతున్న బాధితులకు టీడీఆర్ బాండ్లు జారీ చేయడంలో ఆలస్యం అవుతుండటంతో రహదారి విస్తరణ ముందుకు సాగడం లేదు.

నీటి కష్టాలకు అడ్డుకట్ట పడేనా..

సుంకేసుల నుంచి కేసీ కాలువ ద్వారా నగరానికి సరఫరా చేస్తున్న తాగునీరు పలుచోట్ల వృథా అవుతోంది. రైతులు పొలాలకు ఉపయోగిస్తున్నారని అధికారులు గుర్తించారు. వృథాను అరికట్టేందుకు సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు రూ.84 కోట్ల వ్యయంతో 20.5 కి.మీ పైపులైన్ పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయితే సుంకేసుల జలాశయం నుంచి నీళ్లు నేరుగా మునగాలపాడు పంప్‌హౌస్‌కు చేరతాయి. 2022 డిసెంబరులో పనులు ప్రారంభించారు. మూడేళ్లు గడిచినా వీటిలో పురోగతి కరవైంది. గతేడాది మార్చి నాటికే పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నా సాధ్యం కాలేదు. వచ్చే వేసవి లోపు ఈ పనులు పూర్తి చేస్తే నగరంలో నీటి కష్టాలు తొలగిపోతాయి.

నాలుగో విడత రీసర్వేకి వేళాయె

☛ నేటి నుంచి 4 మండలాల్లో ప్రక్రియ ప్రారంభం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన మూడో విడత రీసర్వే ముగింపు దశకు వచ్చింది. తాజాగా జిల్లాలో నాలుగో విడత రీసర్వేకు అధికారులు చర్యలు చేపట్టారు. కర్నూలు రెవెన్యూ డివిజన్‌లో పరిధిలో కర్నూలు అర్బన్‌తో కలిపి ఎనిమిది మండలాలు ఉన్నాయి. వీటిలో కర్నూలు రూరల్, ఓర్వకల్లు, వెల్దుర్తి, కోడుమూరు మండలాల్లోని ఏడు గ్రామాల్లోనే ఈనెల 2వ తేదీ నుంచి నాలుగో విడత రీసర్వే జరగనుంది. కల్లూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు అర్బన్ మండలాల్లో రీసర్వే జరగడం లేదు.

7 గ్రామాలు.. 33,901 ఎకరాలు

● ఏడు గ్రామాల్లో 33,901.14 ఎకరాల విస్తీర్ణంలో రీసర్వే నిర్వహించనున్నట్లు అధికారులు ప్రచారం చేస్తున్నారు. రెవెన్యూ, సర్వే, రీసర్వే డీటీల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించనున్నారు. సర్వే కోసం 14 రోవర్లు, 28 మంది విలేజ్ సర్వేయర్లు అవసరం ఉందని అధికారులు తేల్చారు. రోవర్ల సంఖ్య పెంచితే సర్వే వేగవంతం చేయడానికి అవకాశం ఉంటుందని సర్వే సిబ్బంది అంటున్నారు. సర్వే సమయంలో రైతులు తప్పక హాజరై తమ సందేహాలు నివృత్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

గ్రామం	సర్వే చేయాల్సిన పట్టా భూమి (ఎకరాల్లో)	రోవర్లు	విలేజ్ సర్వేయర్లు
కోడుమూరు	6,522.11	03	06
దేవమడ	1,238.80	01	02
గొందిపర్ల	2,175.41	01	02
ఉల్చాల	9,527.51	04	08
బొడ్డువానిపల్లె	1,987.26	01	02
కాల్వ	3,646.72	01	02
వెల్దుర్తి	8,803.33	03	06

మోక్షగుండం ఆశయాల సాధనకు కృషి

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే : మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆశయాల సాధనే లక్ష్యంగా బాధ్యతాయుతంగా పనిచేసి నీటి పారుదల శాఖకు మంచిపేరు తేవాలని కర్నూలు ముఖ్య ఇంజినీరు (సీఈ) షేక్ కబీర్ బాషా పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకుని కర్నూలులోని ఆ శాఖ కార్యాలయంలో గురువారం మోక్షగుండం విగ్రహాన్ని ఆవిష్కరించారు. హంద్రీనీవా ఎస్ఈ పి.పాండురంగయ్య మాట్లాడుతూ.. ఆయకట్టుకు నీటి విడుదల చేయడంతో పాటు, జల వనరుల సంరక్షణ, నీటి వినియోగంపై ప్రజలు, రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఇంజినీర్లపై ఉందన్నారు. అంతకుముందు సీఈ కబీర్‌బాషా, ఎస్ఈలు బాలచంద్రారెడ్డి, ప్రతాప్, శుభకుమార్, డీసీఈ రాజేంద్రప్రసాద్ తదితరులు మోక్షగుండం విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇంజినీర్లు, సీఈ సీసీ వెంకటేష్, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన ఆర్‌డీ ఎస్ డీఈఈ రామకృష్ణను సీఈ అభినందించారు.

మోక్షగుండం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీఈ కబీర్‌బాషా, ఎస్ఈలు

నేటి నుంచి నూతన పాసుపుస్తకాల పంపిణీ

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : కర్నూలు మండల పరిధిలోని దిగువపాడు, బి.తాండ్రపాడు, నూతనపల్లి, గార్గేయపురం, సుంకేసుల గ్రామాల్లో శుక్రవారం నుంచి ఈనెల 9వ తేదీ వరకు రైతులకు నూతన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్ బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామంలో అందుబాటులో ఉంటారని, రైతులు వారిని సంప్రదించి పాసు పుస్తకాలు పొందవచ్చన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి వీసీ వెంకటబసవరావు

లక్ష్య సాధనకు ప్రణాళిక ముఖ్యం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : జీవితంలో ఉన్నత శిఖరాలను చేరాలన్న లక్ష్య సాధనకు ప్రణాళిక ముఖ్యమని క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ వెంకటబసవరావు పేర్కొన్నారు. నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలోని ఆడిటోరియంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా కొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ శ్రీనివాసులు, ఇందిరాశాంతి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేద్దాం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : జిల్లాలో విద్యాభివృద్ధికి అధికారులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని డీఈవో సుధాకర్ పిలుపునిచ్చారు. కర్నూలు కలెక్టరేట్ సముదాయంలోని డీఈవో కార్యాలయంలో 2026 నూతన

కేక్ కోస్తున్న డీఈవో సుధాకర్

సంవత్సరం వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు.

కార్యక్రమంలో ఏడీలు అసదుల్లాఖాన్, నాగభూషణం, సీనియర్ అసిస్టెంట్ జయసింహ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయంలో రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్ఈఎఫ్) 2026 దైనందినిని వీసీ వెంకటబసవరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్సిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఉద్యోగుల సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ విజయ్‌కుమార్‌నాయుడు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏపీఎంఎస్ఐడీసీ ఇన్‌ఛార్జి ఎస్ఈగా ఇందిర

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలులోని ఏపీ ఎంఎస్ఐడీసీ ఇన్‌ఛార్జి ఎస్ఈగా ఇందిరను ప్రభుత్వం డిప్యుటేషన్‌పై నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె విజయవాడలోని జాతీయ రహదారుల విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు.

కాలమానిని ఆవిష్కరణ

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ప్రజారోగ్యశాఖ ఉద్యోగుల సంఘం 3194 (ఐఎన్‌టీయూసీ) నూతన సంవత్సరం 2026 క్యాలెండరును డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ గురువారం ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి సంపత్, కార్యాలయ ఏవో అరుణ, తదితరులు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి సాయిరాం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్, జిల్లా కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌రాజు, అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, సంపత్, సాయిరాం

కర్నూలు గాయత్రీ ఎస్టేట్ : జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల 2026 సంవత్సరం నూతన క్యాలెండర్‌ను స్థానిక తన కార్యాలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి గురువారం ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు దేవేంద్ర గౌడ్, ప్రధాన కార్యదర్శి గోపాల్, కోశాధికారి శివరాముడు, అసోసియేషన్ అధ్యక్షుడు జువైద్ అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుదర్శన్‌శెట్టి, రాముడు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : కల్లూరు పట్టణంలోని నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో పార్కు స్థలం ఆక్రమణకు గురైందని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు అందింది. దీంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం నుంచి నగరపాలక కమిషనర్‌కు ఆదేశాలు వచ్చాయి.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు దిల్లీలో జరిగే జాతీయస్థాయి

క్రీడాకారులను అభినందిస్తున్న రామాంజనేయులు

జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన కార్తీక్‌నాయక్, బోయ చరణ్ ఎంపికయ్యారు. రగ్బీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బొల్లవరం రామాంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు బాషా, తదితరులు గురువారం వీరిని అభినందించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీల్లో రాణించి ఆంధ్రప్రదేశ్‌కు పతకాలు తేవాలని సూచించారు.

కర్నూలు ఆధ్యాత్మికం : సూర్యనారాయణస్వామి ఆలయంలో మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకరణ

కలెక్టర్ డా.సిరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఐసీడీఎస్ అధికారిణులు, సిబ్బంది

నూతన ఏడాది.. కావాలి సంతోషాల వారధి

నూతన ఆంగ్ల సంవత్సరం 2026 ఆరంభ వేడుకలు గురువారం కర్నూలు నగరంలో ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ప్రజలు కేకలు కోసి సంబరాలు చేసుకున్నారు. పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. యువత, పిల్లలు సందడిగా గడిపారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రైస్తవులు చర్చిల్లో ప్రార్థనలు చేశారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులను, అధికారులు తమ శాఖల ఉన్నతాధికారులను కలిసి పుష్పగుచ్ఛాలు, మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

– న్యూస్‌టుడే, కర్నూలు బృందం

కర్నూలు విద్య : ట్రిపుల్ ఐటీ డీఎం విద్యార్థినుల నృత్యాలు

కర్నూలు నగరపాలక సంస్థ : కార్మికులకు మిఠాయిలు అందజేస్తున్న నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ దంపతులు

కల్లూరు గ్రామీణ : సీఎస్ఐ చర్చిలో క్రైస్తవుల ప్రార్థనలు


కల్లూరు గ్రామీణ : మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక

అథ్లెటిక్స్‌లో అదుర్స్

■ పరుగు, హర్డిల్స్‌లో రాణిస్తున్న ఉస్మానియా విద్యార్థులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరంలోని ఉస్మానియా కళాశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు. మంజునాథ్, దీవెన్‌కుమార్‌లు పరుగులో తమకు తిరుగు లేదని నిరూపిస్తున్నారు. శిక్షణలో మెలకువలు తెలుసుకుని.. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పలు పతకాలు సాధించారు. ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు తమిళనాడులో జరగనున్న దక్షిణ మండలం అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ పోటీలకు ఆర్‌యూ తరఫున వీరు ఎంపికయ్యారు.

దీవెన్‌కుమార్.. పోటీపడితే పతకం

శరీన్‌నగర్ సమీపంలోని ఉద్యోగనగర్‌కు చెందిన దీవెన్‌కుమార్ ఉస్మానియా కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ విద్యార్థి పరుగు పోటీల్లో అద్భుత ప్రతిభ చాటుతున్నాడు. ● 2023 సెప్టెంబర్‌లో నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన దక్షిణ మండలం అంతర్ రాష్ట్రాల అథ్లెటిక్స్ పోటీల్లో 4100 రిలేలో రజతం, 400 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు గెలుపొందాడు. ● 2024 సెప్టెంబరులో గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 4400 రిలేలో స్వర్ణ పతకం సాధించాడు. ● 2025 జులైలో హైదరాబాద్‌లోని గోల్కొండలో జరిగిన రీజినల్ అథ్లెటిక్స్ మీట్‌లో 400 మీటర్ల పరుగు, 400 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకాలు అందుకున్నాడు. ● 2025 నవంబరులో కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో 400 మీటర్ల పరుగు, 400 మీటర్ల హర్డిల్స్‌లో సత్తా చాటి స్వర్ణ పతకాలు గెలుపొందాడు. ● 2025 డిసెంబరు 27న నిర్వహించిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల అథ్లెటిక్స్ మీట్‌లో 100, 200 మీటర్ల పరుగులో కాంస్యాలు, 4100 రిలే పరుగులో స్వర్ణ పతకం సాధించాడు.

పరుగులో తిరుగులేని మంజునాథ్

బి.క్యాంపు సమీపంలోని అరోరా నగర్‌కు చెందిన కురువ మంజునాథ్ ఉస్మానియా కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. క్రీడలపై ఆసక్తితో అథ్లెటిక్స్‌లో రాణిస్తున్నాడు. ● 2023 జనవరి 20న శ్రీకాకుళంలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల పరుగులో కాంస్యం, 4400 రిలేలో స్వర్ణం పతకం సాధించాడు. ● 2023 అక్టోబరులో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో మిడ్ రిలేలో కాంస్యం అందుకున్నాడు. ● 2024 నవంబరులో రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్‌లో 100, 200 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు గెలుపొందాడు. ● 2025 సెప్టెంబరులో 28న గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 100 మీటర్ల పరుగులో కాంస్యం అందుకున్నాడు. ● 2025 డిసెంబరు 27న నంద్యాలలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగులో రజతం, 4100 రిలేలో స్వర్ణ పతకాలు సాధించాడు.

మత్స్యకారుల వలకు చిక్కిన మొసలి పిల్ల

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : తుంగభద్ర నదిలో చేపల వేటకు వేసిన వలలో ఓ మొసలి పిల్ల పడింది. ఇ.తాండ్రపాడు గ్రామానికి చెందిన కొందరు మత్స్యకారులు గురువారం తెల్లవారుజామున తుంగభద్రలోకి చేపల వేటకు వెళ్లారు. చేపలతో పాటు సుమారు 2 అడుగుల పొడువున్న మొసలి పిల్ల కూడా వలలో పడింది. మత్స్యకారులు దానిని జాగ్రత్తగా బయటికి తీశారు. గ్రామస్థులు దానిని ఆసక్తిగా తిలకించి ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : నగర శివారులోని జగన్నాథగట్టు టిడ్కో భవన సముదాయం సమీపంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందారని ఉలిందకొండ ఎస్సై ధనుంజయ తెలిపారు. రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. మృతుడి వాహనానికి నంబరు ప్లేటు లేదన్నారు. మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామని, ఎవరైనా గుర్తిస్తే తమను సంప్రదించాలని కోరారు.

మందుబాబులపై కేసులు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం ఆరంభం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేదుకు కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రి నగరంలోని పలు కూడళ్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. 32 మంది వాహనచోదకులు మద్యం తాగినట్లు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఆర్యవైశ్యుల కోరికను మన్నించి పెనుగొండ పేరును వాసవి పెనుగొండగా మార్చిన సందర్భంగా తెదేపా రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, పార్టీ కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షులు సోమిశెట్టి శ్రీకాంత్, ఏపీ ఐడీసీ డైరెక్టర్ మనోజ్‌కుమార్‌లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకొని పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 72 సార్లు రక్తదానం చేసిన ఇంజినీరు బి. వెంకటరాజు, 44 సార్లు రక్తదానం చేసిన సి.హెచ్.సాయిబాబాను సత్కరించినట్లు పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కర్నూలు మాజీ శాసన సభ్యుడు ఎం.ఎ.గఫూర్‌ను సీపీఎం నాయకులు రాజశేఖర్, రాముడు, గురుశేఖర్, సామెల్ తదితరులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కర్నూలు కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ ఎ.సిరిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు తెలిపారు.

In the Court of the Hon'ble Ist Addl District & Sessions Judge: Kurnool
E.P.No: 294/2022 in O.S.No: 99/2017
G.V.Rama Krishna Reddy - D.Hr
-V/s-
V.Rama Gopal Reddy - J.Dr
వేలం ప్రకటన
పై నెంబర్ అమలు అర్జీలో డిక్రీహోల్డరు తనకు రావలసిన అమలు అర్జీ మొత్తం రాబట్టుకొనుటకు జే.డి.ఆర్ తాలూకు షెడ్యూలు ఆస్తిని వేలంనకు వచ్చినది. వేలం వాయిదా 27/01/2026వ తేదీన ఉన్నది. సవాలుదార్లు పైవేలం తేదీన పైకోర్టులో పగలు 10.30 గం॥లకు హాజరై వేలంలో పాల్గొని సవాలు చేయవచ్చును.
Schedule: 27/100 un-divided share vacant site of an extent of Ac. 0-37.5 Cents of land is laid in Sy.No: 641/3G, 641/3F of Kallur Village Limits now in Kurnool Corporation Limits, Kurnool. R.D.
Boundaries: East: Kurnool- Nandyal Road, **West:** Land of Perugu Rami Reddy, **North:** Same Survey No. of Land of B.Mallikarjuna Reddy and others, **South:** Land of R.Lakshmi Narayana Reddy.
Measurements: Eastern Side: 231 Links, **Western Side:** 206 Links, **Northern Side:** 330 Links, **Southern Side:** 344 Links.
Extent: Northern Side 37.5 Cents out of 75 Cents.
Sub Register Market Value: 30,00,000/-
Court Ameena Value: 60,00,000/-
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
Sd/- **K.SREEDHAR,** Advocate, Kurnool. Cell: 94400 92490.

(c) eenadu

ఈనాడు మార్కాపురం

3న ఉగ్ర ప్రమాణ స్వీకారం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా ఒంగోలు పార్లమెంటరీ నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా నియమితులైన కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డితోపాటు కమిటీ సభ్యులు ఈ నెల 3వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఒంగోలు నగరంలోని దక్షిణ బైపాస్‌లోని ఎన్జీవీఎస్ కల్యాణ మండపంలో సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమానికి కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని సమాచారం అందించారు.

కొత్త సంవత్సర వేడుక.. కొంగొత్త కానుక!

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి వచ్చే నాయకులు, అధికారులు, ప్రజలు పూలగుచ్ఛాలు, పూలమండీలు, ఎండుపండ్లు, కేకులు, శాలువాలు తీసుకురావద్దని కలెక్టర్ రాజాబాబు ఇచ్చిన పిలుపునకు స్పందన వచ్చింది. కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలపడానికి వచ్చినవారు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, సంచులు, దుప్పట్లు, పండ్లు ఇచ్చి కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇలా వచ్చిన వాటిని ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. -ఈనాడు, ఒంగోలు

మార్కాపురానికి కొత్త రూపు!

- జిల్లాకేంద్రంలో పూర్తిస్థాయి వసతుల కల్పనకు చర్యలు
- అన్ని శాఖల కార్యాలయాలు తెరిచేందుకు సన్నాహాలు

కొత్త జిల్లా ఒకటిరెండు రోజుల వ్యవధిలోనే ఏర్పాటు కావడంతో వసతులు పెద్ద సమస్యగా మారింది. కేవలం మొక్కుబడిగా జిల్లా ప్రారంభోత్సవాలు చేసేసి వదిలేయకుండా ప్రజలకు పూర్తిస్థాయి సేవలు స్థానికంగా లభ్యమయ్యేవిధంగా ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. తక్షణం కలెక్టరేట్‌కు తగిన వసతులు కల్పించేందుకు దృష్టిసారించింది. అన్ని అనుకూలిస్తే, వచ్చే సోమవారం గ్రీవెన్స్ కూడా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. - ఈనాడు, మార్కాపురం

మార్కాపురం పట్టణం

● ప్రస్తుత సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ సెలవులో ఉండడంతో డీఆర్వో ఓబులేసు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇన్‌ఛార్జి జేసీ హోదాలో ఓబులేసు గురువారం మార్కాపురంలో బాధ్యతలు చేపట్టారు. అన్ని జిల్లా శాఖలు మార్కాపురంలో ప్రారంభించేందుకు ఆయన పర్యవేక్షిస్తున్నారు. రెండో రోజు గృహ నిర్మాణశాఖ, ఉద్యానశాఖ జిల్లా కార్యాలయాలను ప్రారంభించారు. మరికొన్ని జిల్లా కార్యాలయాలు శుక్ర, శనివారాల్లో తెరిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సంవత్సరాంతం కావడంతో అధికారులు బిజీగా ఉండడం, సచివాలయంలోని ఆయా శాఖల డైరెక్టరేట్, కమిషనరేట్ నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో జిల్లా శాఖల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. ● కొన్ని శాఖల్లో సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ద్వారా జిల్లా కార్యాలయం తెరవాలంటే కొత్తగా ఏర్పడిన జిల్లా పరిధి విషయమై [illegible] మార్పులు చేయాల్సి ఉంది. ఏది ఏమైనా జిల్లా ప్రారంభించి వదిలేయకుండా అన్ని కార్యాలయాలు మార్కాపురం జిల్లా కేంద్రంగానే జరగాలని కలెక్టర్ రాజాబాబు అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. కొన్ని డివిజన్ కార్యాలయాలను జిల్లా కార్యాలయాలుగా మార్చే పనిలో ఉన్నారు. తదనుగుణంగా కొత్త జిల్లా పరిధి, సిబ్బంది ఎంత అవసరం.. లెక్కలు వేసే పనిలో జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే కలెక్టరేట్‌కు కేటాయించిన సూపరింటెండెంట్లు, సిబ్బంది విధుల్లో నిమగ్నమయ్యారు.

కలెక్టరేట్‌లో సదుపాయాలకు అంచనాలు

మార్కాపురం జిల్లా కలెక్టరేట్ ఏర్పాటు చేసిన పునరావాస కాలనీలో మూడు భవనాలుండగా, వాటికి కనీసం కిటికీలు, తలుపులు లేవు. ఇప్పటికే పెట్టిన వాటిని దొంగలు ఎత్తుకెళ్లారు. ఇవన్నీ అమర్చడంతో పాటు ఫర్నిచర్ సమకూర్చాల్సి ఉంది. దీనిపై ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఏయే వసతులు కల్పించాలనే దానిపై పరిశీలన చేస్తున్నారు. వెనువెంటనే సౌకర్యాల కల్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. తక్కువ వ్యవధిలోనే కలెక్టరేట్ దిద్ది పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కసరత్తు జరుగుతోందని మార్కాపురం ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కార్యాలయాలు ప్రారంభించే విషయమై వివిధ శాఖల అధికారులు ఇప్పటికే తమతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన వివరించారు.

చెన్నకేశవుడికి ఊంజల్ సేవ



ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మార్కాపురం పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీలక్ష్మిచెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం స్వామి వారి ఊంజల్ సేవ కన్నులపండువగా జరిగింది. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మధ్యరంగంలో కార్యక్రమం మనోహరంగా నిర్వహించారు. పూజల్లో ఆలయ ఈవో జి. శ్రీనివాసరెడ్డి, అర్చకులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

-న్యూస్‌టుడే, మార్కాపురం పట్టణం

86 మందికి ఒకటే మరుగుదొడ్డి!

చిత్రంలో కనిపిస్తున్నది తర్లుపాడు బీసీ వసతిగృహంలో తలుపు లేని స్నానాల గదులు, మరుగుదొడ్డి. గత 30 ఏళ్లుగా ఇరుకైన అద్దె భవనంలో వసతిగృహం కొనసాగుతోంది. ఇక్కడున్న 86 మంది విద్యార్థులకు కేవలం ఒకే ఒక మరుగుదొడ్డి, రెండు స్నానపు గదులే ఉండడం గమనార్హం. వీటికి పైకప్పు కూడా లేకపోవడం ఇక్కడి దుస్థితికి అద్దం పడుతోంది. వసతిగృహానికి శాశ్వత భవనం నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నా స్పందన లేదని, ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు. ఈ విషయమై సంక్షేమాధికారి సురేష్ మాట్లాడుతూ ఇక్కడ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెబుతున్నారు. - న్యూస్‌టుడే, తర్లుపాడు

వెలిగొండతోనే వెలుగులు!

మార్కాపురం ప్రాంత వాసుల చిరకాల స్వప్నమైన మార్కాపురం జిల్లా ఏర్పాటును కూటమి ప్రభుత్వం సాకారం చేసింది. లక్షల మంది ఆకాంక్షలు నెరవేర్చి ప్రజల నీరాజనాలు అందుకుంటోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన మార్కాపురం జిల్లాగా ఆవిర్భవించింది. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లో అత్యధిక భాగం కరవు ప్రాంతమే. సాగు, తాగునీటికి ఇబ్బందులే. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే నీరు ప్రధాన పాత్ర పోషిస్తుంది. పరిశ్రమలు రావాలన్నా.. వ్యవసాయం ఊపందుకోవాలన్నా.. ఉపాధి అవకాశాలు పెరగాలన్నా నీరే ఆధారం. కొత్త జిల్లాకు నీటి ఆవశ్యకత ఎనలేనిది.

-న్యూస్‌టుడే, యర్రగొండపాలెం, పెద్దదోర్నాల, మార్కాపురం

తాగునీటి కోసం రూ.వెయ్యి కోట్లతో నిర్మిస్తున్న పథకం

ఈ ఏడాదే నీళ్లిస్తామని ప్రభుత్వం ప్రకటన

ప్రజల సాగు, తాగు నీటి కష్టాలకు ఇక చెక్

మరో తీపి కబురుకు సిద్ధం...

మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది మరో ప్రతిష్ఠాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. జిల్లాకు వెన్నెముక లాంటి వెలిగొండ ప్రాజెక్టును ఈ ఏడాదే పూర్తి చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. దానికి తగ్గట్టుగానే నిధుల విడుదల చేస్తున్నారు. మంత్రి నిమ్మల నెలకోసారి ప్రాజెక్టును సందర్శించి పురోగతిపై సమీక్షిస్తున్నారు. ఇప్పటికే మొదటి సొరంగం పూర్తికాగా.. రెండో సొరంగం నిర్మాణపనులు వడివడిగా సాగుతున్నాయి. సొరంగాల నుంచి నల్లమల సాగర్‌కు నీరిచ్చే ఫీడర్ కాలువకు సిమెంటు లైనింగ్, రీటెయినింగ్ గోడ నిర్మాణానికి ఇటీవల రూ.457 కోట్లు కేటాయించింది. 21.8 కిలోమీటర్ల పొడవైన కాలువ సిమెంటు పనులు త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

సాగు, తాగునీటికి ఆధారం...

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో సాగు, తాగునీటికి వెలిగొండ ప్రాజెక్టే ఆధారం. జిల్లాలోని 21 మండలాల్లో 19 మండలాలు వెలిగొండతో లబ్ధి పొందుతాయి. మొదటి విడతలోనే 1.2 లక్షల ఎకరాల ఆయకట్టు అందుబాటులోకి రానుండగా, గిద్దలూరు నియోజకవర్గంలో 22 వేల ఎకరాలు, మార్కాపురంలో 31 వేల ఎకరాలు, వై.పాలెంలో 66 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది. రెండో విడతలో 1.89 లక్షల ఎకరాలు కాగా, ఇందులో మార్కాపురంలో 52 వేల ఎకరాలు, గిద్దలూరులో 37 వేలు, కనిగిరి నియోజకవర్గంలో లక్ష ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. జిల్లాలో నల్లమల సాగర్ వద్ద రూ. వెయ్యి కోట్లతో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులు దాహార్తి తీర్చనున్నాయి. వెలుగొండ ద్వారా ఆరు లక్షల మందికి తాగునీరందనుంది. జిల్లా అభివృద్ధిపై నేరుగా ముఖ్యమంత్రి దృష్టిసారించడంతో ప్రజల ఆశలు నెరవేరనున్నాయి.

మందు తాగి బండి నడిపితే చుక్కలే

రహదారి భద్రత నిబంధనలు ఉల్లంఘించి మద్యం తాగి వాహనాలు నడిపితే చుక్కలు కనిపించడం ఖాయం. ఇప్పటిదాకా కేవలం పోలీసుశాఖ మాత్రమే వినియోగిస్తున్న బ్రీత్ ఎనలైజర్లు తాజాగా రవాణాశాఖ చేతికి సైతం వచ్చాయి. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా వీటిని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఎంవీఐ), ఏఎంవీఐలకు సైతం అందజేశారు. రహదారి నిబంధనల ఉల్లంఘనలో పోలీసులు విధించే జరిమానాలు నామమాత్రంగా ఉంటాయి. అదే రవాణాశాఖకు పట్టుబడితే మాత్రం భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే.

- న్యూస్,టుడే, నేరవిభాగం

ఒక్కరోజే రూ.5.69 కోట్ల మద్యం తాగేశారు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో డిసెంబరు 31వ తేదీన రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు జరిగాయి. ఏకంగా రూ.5.69 కోట్ల విలువైన మద్యాన్ని మందుబాబులు తాగేశారు. సాధారణంగా రోజూ రూ.3.50 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. వారాంతాలు, పర్వదినాల సమయాల్లో కాస్త పెరుగుతుంటాయి. దీనికి భిన్నంగా 2025కు వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాది ప్రారంభం రోజున రికార్డు స్థాయిలో విక్రయాలు జరిగాయి. జనవరి 1న అదేస్థాయిలో అమ్మకాలు జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది డిసెంబరులో రూ.110.8 కోట్ల మేరకు మద్యం విక్రయాలు జరగ్గా, 2024, డిసెంబరులో రూ.104.6 కోట్ల మేర విక్రయాలు జరిగాయి. 2024తో పోలిస్తే 2025లో మద్యం విక్రయాల్లో 5.9 శాతం పెరుగుదల కనిపించింది. అనధికార మద్యంపై ఉక్కుపాదం, నాటుసారా నియంత్రణ, మద్యం గొలుసు దుకాణాల కట్టడితో ఈ ఏడాది మద్యం విక్రయాల్లో హెచ్చుదల వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఆయేషా బేగం చెప్పారు. 2024 డిసెంబరుతో పోలిస్తే ఐఎంఎల్ విక్రయాల్లో 7 శాతం, బీర్ల విక్రయాల్లో 33 శాతం వృద్ధి సాధించినట్లు పేర్కొన్నారు.

ఈ-నారీ..జవాబుదారి

ఆర్థిక అక్షరాస్యతపై మహిళల్లో అవగాహనకు శ్రీకారం

ఒంగోలు మండలం మండువవారిపాలెంలో సమావేశమైన స్వయం సహాయక సంఘం

న్యూస్‌టుడే, కలెక్టరేట్

స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆధునిక సాంకేతికతను ఎప్పటికప్పుడు చేరువ చేసేందుకు అడుగులు పడుతున్నాయి. సంఘాల సభ్యుల్లో చురుకైన మహిళలను ఈ-నారీ పేరుతో నియమించే సరికొత్త వ్యవస్థ ఏర్పాటుకు డీఆర్‌డీఏ అధికారులు నిమగ్నమయ్యారు. బ్యాంకు అనుసంధాన రుణాల నుంచి నెలవారీ వాయిదాల చెల్లింపుల వరకు మరింత పారదర్శకత, మహిళలకు జీవనోపాధుల కల్పన, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన నిమిత్తం ఇప్పటికే ‘మన డబ్బులు-మన లెక్కలు’ యాప్‌పై శిక్షణ ఇస్తున్నారు. కేవలం వారికి ఆండ్రాయిడ్ ఫోన్‌పై అవగాహన ఉంటే చాలు. తద్వారా మహిళలకు పలు అంశాలపై చైతన్యం కలిగిస్తారనే ఉద్దేశంతో వినూత్న విధానానికి శ్రీకారం చుట్టారు. ఓ వైపు సరికొత్త అంశాలపై అవగాహన కల్పించడంతోపాటు ఈ-నారీలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు.

అర్హులు ఎవరంటే...

గ్రామాల్లోని సంఘాల సంఖ్య ఆధారంగా ప్రతి 10 స్వయం సహాయక సంఘాలకు ఒక ఈ-నారీమణిని ఎంపిక చేస్తారు. కనీసం 25 సంఘాలు ఉన్నచోట ముగ్గురిని నియమించనున్నారు. అంతకంటే అత్యధికంగా ఉన్న చోట ఎక్కువ చదువుకున్న వారిని జీవనోపాధుల కింద మరో ఇద్దరు సీఆర్పీలను గుర్తిస్తున్నారు. వీరి ఎంపికకు డిగ్రీ నుంచి 10వ తరగతిలోపు విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 40 ఏళ్లలోపు వయసు ఉండాలి. ఎక్కువ చదువు ఉన్నవారికి ప్రాధాన్యమివ్వనున్నారు. ● స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన పుస్తకాల నిర్వహణ తెలిసి ఉండాలి. ఎంపిక ప్రక్రియ పూర్తయిన అనంతరం నారీమణులతోపాటు, సీఆర్పీలకు సబ్జెక్టుల వారీగా త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నారు. అందులో భాగంగా ఎంపికైన నారీమణులకు వారికి సమీపంలో ఉండే వీధులు, కాలనీల ఆధారంగా సంఘాలను మ్యాపింగ్ చేసే పనిలో ఏపీఎం, సీసీలు నిమగ్నమయ్యారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామసంఘాలు: 1,543 | మొత్తం స్వయం సహాయక సంఘాలు : 44,857 | మొత్తం మహిళల సంఖ్య : 4,38,444

అన్న క్యాంటీన్‌కు ఎదురుచూపులు

చిత్రంలో కనిపిస్తోంది పొదిలి పెద్దబస్టాండు కూడలిలో పిల్లర్ల దశలో నిలిచిపోయిన అన్న క్యాంటీన్ భవనం. మార్కాపురం ప్రత్యేక జిల్లా కావడంతో పొదిలిలో అన్న క్యాంటీన్ ఏర్పాటుపై ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత తెదేపా పాలనలో క్యాంటీన్ భవన నిర్మాణ పనులు ప్రారంభించగా, పిల్లర్ల దశలో నిలిచిపోయాయి. అనంతరం వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మూలనపడింది. తాజాగా కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తామని, అవసరమైనచోట కొత్తవాటిని ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో ప్రజల్లో ఆశలు చిగురించాయి. పొదిలికి నిత్యం పెద్దసంఖ్యలో కూలీలు, చిరువ్యాపారులు, వివిధ పనులపై ప్రజలు వస్తుంటారు. తాత్కాలిక భవనంలోనైనా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పొదిలి

సిబ్బంది లేమి.. ఇబ్బందులే అన్నీ!

- జలవనరుల శాఖలో ఖాళీలు
- నీటి నిర్వహణలో అవస్థలు

బాగుచేయించాల్సిన నర్సిరెడ్డిపల్లి కతువ

జిల్లాలోని జలవనరులశాఖలో అధికారులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో రైతులకు మెరుగైన సేవలందడంలేదు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 799 చెరువులుండగా, 544 తటాకాలు ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనాలు వేశారు. వీటికి వెంటనే మరమ్మతులు చేయించాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో జేఈలు, లస్కర్ల కొరత తీవ్రంగా ఉంది. వీటిని వచ్చే తొలకరి నాటికి బాగు చేయించకుంటే వచ్చే ఏడాది ఆయకట్టుకు నీరందించడం కష్టంగా మారుతుంది.

- న్యూస్‌టుడే, కంభం

మరమ్మతులు చేయించాల్సిన తురిమెళ్ల చెరువు

● కంభం సబ్ డివిజన్ పరిధిలో అయిదుగురు జేఈలు పనిచేయాల్సి ఉండగా, ఒక్కరు మాత్రమే ఉన్నారు. ● గిద్దలూరు సబ్‌డివిజన్‌లో నలుగురికి ఒక్కరూ లేరు. ● మార్కాపురంలో 18 మందికి ఏడుగురు మాత్రమే ఉన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 100 మంది జేఈలు పనిచేయాల్సి ఉండగా 40 ఖాళీలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ● జిల్లాలో లస్కర్ల కొరత మరింత వేధిస్తోంది. ఒక్కో డివిజన్‌లో సుమారు 120 మంది విధులు నిర్వహించాల్సి ఉండగా, 25 నుంచి 30 మంది లోపే పనిచేస్తున్నారు. 2004 అనంతరం నియామకాలు నిలిపేయడంతో నిర్వహణపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కనీసం పొరుగుసేవల కింద నియమించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఎస్‌ఈ వరలక్ష్మి మాట్లాడుతూ ఖాళీల విషయంపై ప్రతిపాదనలు పంపించామన్నారు.

యడవల్లిలో కళకళలాడుతున్న కంది పంట

కంది పంటకు మంచి రోజులు

వాతావరణం అనుకూలించడంతో కంది సాగు ఊపందుకుంది. ఒంగోలు, కొండపి, దర్శి, సంతనూతలపాడు, గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో సుమారు 1.09 లక్షల ఎకరాల్లో కంది వేశారు. ఒక్క కనిగిరి నియోజకవర్గం పరిధిలోనే 50 వేల ఎకరాలకు పైగా పంట విస్తరించడం విశేషం. వాతావరణం సైతం అనుకూలించడంతో పూత, పిందెతో పైరు కళకళలాడుతున్నట్లు డీఏవో శ్రీనివాసరావు తెలిపారు. ఎకరాకు ఏడు క్వింటాళ్లకు పైగా దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.- న్యూస్‌టుడే, కనిగిరి

భయం వీడండి... ఇష్టంతో చదవండి

● న్యూరోలింగ్విస్టిక్ ప్రోగ్రాం మాస్టర్ ట్రైనర్ డాక్టర్ నల్లూరి

న్యూస్‌టుడే, విద్య : మరో రెండు నెలల్లో పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దాదాపు 80 వేల మంది విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని బోధకులకు విద్యాశాఖ ఉన్నతాధికారులు లక్ష్యంగా విధించారు. ఇదే సమయంలో పిల్లల ఆరోగ్యం, ఒత్తిడిని అధిగమించడం, విసుగు లేకుండా చదువు కోవడం ఎలాగనే అంశాలపై ఒంగోలుకు చెందిన విశ్రాంత వైద్యాధికారి, న్యూరో లింగ్విస్టిక్ ప్రోగ్రాం మాస్టర్ ట్రైనర్ డాక్టర్ నల్లూరి రాఘవ రావు కొన్ని సూచనలు చేశారు. ఆయన గతంలో పరీక్షల్లో ఉత్తీర్ణత ఎలా అనే పుస్తకంతోపాటు విద్యార్థుల మనస్తత్వంపై కొన్ని పుస్తకాలు రాశారు.

● రాత్రి త్వరగా పడుకుని వేకువజామున 5 గంటలకు లేచి చదవడం మొదలుపెడితే మెదడు ప్రశాంతంగా ఉంటుంది. ● చదివేటప్పుడు పుస్తకంలో లైన్ల వెంట వేలును రన్ చేస్తూ చదవాలి. చదివిన విషయాలు ఒకసారి రాస్తే మెదడులో నిక్షిప్తమవుతాయి.

● ఆరుబయట చెట్లమధ్య కొంతసేపు, గదిలో కూర్చుని కొంతసేపు చదువుకోవాలి. ● ఇంట్లో వంట వాసనలు, ఇతరత్రా మనసు పక్కకు మరలే పరిస్థితి రాకుండా మంచి సువాసనలతో కూడిన అగరబత్తీలను వెలిగించుకోవాలి. ● పరీక్షలు సమీపించేకొద్దీ ఒత్తిడితో ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. త్వరగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. నీరు ఎక్కువ తాగాలి. ● తల్లిదండ్రులు పిల్లల్ని గమనిస్తూ ఉండాలి. ఇతరులతో పోల్చి వారిని కించపరిచేలా మాట్లాడకూడదు. ● రోజూ కాసేపు చిన్నపాటి వ్యాయామం, ధ్యానం చేస్తే ప్రశాంతంగా ఉంటుంది. ● కొత్త సబ్జెక్టులు చదవడం కన్నా చదివిన వాటిని తరవుగా ఉండడం మేలు. ● పరీక్షకు ముందు రాత్రి జాగారం మంచిది కాదు. దాని వల్ల మరుసటి రోజు మెదడు సరిగా పనిచేయక ప్రశ్నలకు జవాబులు గుర్తుకు రావు.

త్రిపురాంతకం సర్కిల్ మార్పు

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా దర్శి పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో ఇప్పటివరకు ఉన్న త్రిపురాంతకం పోలీస్ సర్కిల్‌ను మార్కాపురం పోలీస్ సబ్ డివిజన్‌లోకి మార్చేందుకు పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. తాజాగా మార్కాపురం జిల్లా ఏర్పడడంతో దర్శి నియోజకవర్గంలోని కురిచేడు, దొనకొండ పోలీస్‌స్టేషన్‌లతో కలిసి ఇప్పటి వరకు ఉన్న త్రిపురాంతకం పోలీస్ సర్కిల్ పరిస్థితి ఏమిటని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. క్షేత్ర స్థాయిలోని పరిస్థితుల దృష్ట్యా త్రిపురాంతకం పోలీస్ సర్కిల్‌ను మార్కాపురం పోలీస్ సబ్ డివిజన్‌లోకి మార్చి ఇప్పటి వరకు యర్రగొండపాలెం సర్కిల్‌లో ఉన్న పెద్దారవీడుతో పాటు త్రిపురాంతకం పోలీస్ స్టేషన్‌లను కలిపి త్రిపురాంతకం సర్కిల్‌లో కొనసాగేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి.

పూడ్చేసి.. దోచేసి..!

- చెరువులు, వాగులు, వంకల కబ్జాలు
- కనిగిరిలో ప్రభుత్వ స్థలాల మాయం

కనిగిరి పురపాలక సంఘం పరిధిలోని భూముల ధరలకు రెక్కలొచ్చాయి. స్థిరాస్తి వ్యాపారులుగా అవతారమెత్తిన అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలు, చెరువులు, వాగులు, వంకలు ఆక్రమించేశారు. అధికారుల సహకారంతో నకిలీ పట్టాలు సృష్టించి రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కబ్జా చేసేశారు.

- న్యూస్‌టుడే, కనిగిరి

సగం పూడ్చేసి ఆక్రమించిన కనిగిరి పెద్ద చెరువు

కనిగిరి ప్రాంతంలోని వాగులు, వంకలు, చివరకు చెరువులు సైతం అక్రమార్కులు ఆక్రమించేశారు. అధికారులు ఆక్రమణలు గుర్తించినప్పటికీ ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. అదే అదునుగా కబ్జాదారులు కనిగిరి పెద్ద చెరువు, నాగుల చెరువును ఆక్రమించేశారు. కనిగిరి పెద్ద చెరువు విస్తీర్ణం 380 ఎకరాలు కాగా, ఇప్పటికే 10 ఎకరాల వరకు ఆక్రమణకు గురైంది. ఆక్రమిత స్థలాల్లో వెంచర్లు వేసి విక్రయించేయడం గమనార్హం. ఆక్రమణలపై రైతులు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. రెండు నెలలుగా కనిగిరి కొండ వాగును ఆక్రమించి పూడ్చేసినా అధికారులు కనీసం కన్నెత్తి చూడడంలేదు. ● కనిగిరి పెద్ద చెరువు పైభాగాన తుమ్మగుంట వాగును కొంతమంది అక్రమార్కులు పూర్తిగా పూడ్చేసి ప్లాట్లు వేసి కంచె సైతం ఏర్పాటు చేశారు. స్థానిక అర్బన్ కాలనీ సమీపంలోని విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలో 20 అడుగుల వాగును పూర్తిగా పూడ్చేశారు. అప్పట్లో పూర్వ ఆర్డీవో అజయ్‌కుమార్ ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ భవనాలను పూర్తిగా కూల్చేశారు. తాజాగా అధికారుల సహకారంతో కొందరు నకిలీ పట్టాలు సృష్టించి తిరిగి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు. ● కనిగిరి పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాలో సుమారు రూ.20 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు, వాగులు, వంకలు చెరువుల ఆక్రమణలపై పరిశీలించి వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ ఆక్రమణలు పరిశీలించి స్వాధీనం చేసుకుంటామన్నారు.

పాతూరు జాతీయ రహదారి పక్కన పూడ్చేసి చదును చేసిన వాగు

(c) eenadu

సొంత మైదానంలో చితక్కొట్టేశారు!

సంతనూతలపాడు, న్యూస్‌టుడే

సెమీస్‌లో ట్రిపుల్ ఐటీ కళాశాల జట్టు భారీ విజయం

బ్యాటర్లు బాదేశారు. బౌలర్లు చక్కటి లైన్ అండ్ లెంగ్త్ బంతులు వేస్తూ అవతలి బ్యాట్స్‌మెన్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఇక ఫీల్డర్లు తమ నుంచి బంతిని దాటనివ్వలేదు. ఫలితంగా రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ట్రిపుల్ ఐటీ కళాశాల) జట్టు భారీ విజయం సొంతం చేసుకుంది. సంతనూతలపాడులోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో జరుగుతున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్-2025)లో భాగంగా గురువారం నాటి మ్యాచ్ ఏకపక్షంగా సాగింది. సీనియర్స్ విభాగంలో రెండో సెమీ ఫైనల్‌లో ట్రిపుల్ ఐటీ కళాశాల, క్విస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్లు తలపడ్డాయి. సమష్టి కృషితో ట్రిపుల్ ఐటీ కళాశాల జట్టు 57 పరుగుల తేడాతో విజయకేతనం ఎగురవేసింది.

మైదానంలో పరుగులు తీస్తున్న క్రీడాకారులు

మల్లేష్.. శభాష్!

ట్రిపుల్ ఐటీ కళాశాల జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగింది. 10 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 112 పరుగులు భారీ స్కోర్ చేసింది. మల్లేష్ 28 బంతుల్లో 47 పరుగులు చేశారు. కె.సుభాష్ 18 బంతుల్లో 26, జాయ్ 6 బంతుల్లో 16, వినయ్ 4 బంతుల్లో 10 పరుగులు సాధించారు. తమ సొంత మైదానంలో అవకాశమే హద్దుగా బ్యాటర్లు విజృంభించారు. ప్రత్యర్థి జట్టు బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగిపోయారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన క్విస్ జట్టు 10 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 55 పరుగులు మాత్రమే చేసింది. రవితేజ 19 బంతుల్లో 15, సాయిరెడ్డి 16 బంతుల్లో 15 పరుగులు చేశారు. ట్రిపుల్ ఐటీ జట్టు బౌలింగ్‌లో అరవింద్, హర్షి రెండేసి వికెట్లు తీసుకున్నారు. మల్లేష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా

మల్లేష్

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్ (ట్రిపుల్ ఐటీ కళాశాల) జట్టు విజయానందం

నేడు ఈఎస్ఎల్-2025 ఫైనల్స్

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ పోటీల్లో భాగంగా శుక్రవారం ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు జూనియర్స్ విభాగంలో పేస్ పాలిటెక్నిక్ జూనియర్ కళాశాల-ప్రభుత్వ జూనియర్ కళాశాల(కొండపి) జట్ల మధ్య తుదిపోరు జరగనుంది. మధ్యాహ్నం 1 గంటకు సీనియర్స్ విభాగంలో రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్ (ట్రిపుల్ ఐటీ కళాశాల)-పేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ జట్లు తలపడనున్నాయి.

సీనియర్స్
గాయత్రీ డిగ్రీ కళాశాల, కందుకూరు
Vs ఆదిత్య డిగ్రీ కళాశాల,
నెల్లూరు మ్యాచ్ 11.00 గంటలకు
A.C. Stadium (Ground-1) లో
జరుగుతుంది.

Medical Partner
వెంకటరమణ
Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner
CMR SHOPPING MALL The joy of life
Gift Partner
KL UNIVERSITY (DEEMED TO BE)
Regional Sponsor
City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor
QIS EDUCATIONAL INSTITUTIONS ONGOLE
Digital Partner
ఈనాడు.నెట్ ETV BHARAT
TV Partner
ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

కలెక్టరేట్‌కు నేతల తాకిడి

ఒంగోలు కలెక్టరేట్, మార్కాపురం, న్యూస్‌టుడే: ప్రకాశం, మార్కాపురం జిల్లా వ్యాప్తంగా గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డితోపాటు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల నివాసాల వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు, జిల్లా, మండల అధికారులు, ఉద్యోగుల రాకతో పండగ వాతావరణం నెలకొంది. ప్రజా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపేందుకు అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలతోపాటు, ప్రభుత్వ ఉద్యోగులు బారులుతీరారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఒంగోలు రామనగర్‌లోని కార్యాలయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, స్థానిక గుంటూరురోడ్డులోని తెదేపా కార్యాలయంలో దామచర్ల జనార్దన్, మంగమూరురోడ్డులోని కార్యాలయంలో బీఎన్.విజయకుమార్, నెల్లూరు బస్టాండ్‌లోని కార్యాలయంలో రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, కనిగిరిలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరులో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెంలో నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తదితరులు నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. కలెక్టర్ పి.రాజాబాబు వేడుకలను నిరాడంబరంగా జరుపుకొన్నారు. పూల దండలు, పుష్పగుచ్ఛాల స్థానంలో ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు ఉపయోగపడేలా పెన్నులు, పుస్తకాలు, బ్యాగులు, దోమతెరలు స్వీకరించారు. కలెక్టర్ రాజాబాబును పలువురు ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్ రాజాబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యం

జిల్లా పోలీసు కార్యాలయంలో కేకు కోస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించాలని, జిల్లా పోలీసు ప్రతిష్ఠతను మరింత ఇనుమడింపజేసేలా పనిచేయాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు సూచించారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేకు కోసి పోలీసు అధికారులు, సిబ్బందికి పంచిపెట్టారు. సమస్యలతో వచ్చిన బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరిస్తూ వారికి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, మహిళా పీఎస్ డీఎస్పీ వి.వి.రమణకుమార్, సీఐలు వై.నాగరాజు, ఎం.శ్రీనివాసరావు, టి.విజయకృష్ణ, ఎస్.శ్రీకాంత్‌బాబు, ఎ.జగదీష్, యు.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా గురువారం నుంచి ఎస్పీ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఎస్ఎస్పీ)హోదాలో వ్యవహరించనున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటాం: డీఆర్వో

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి డీఆర్వో ఓబులేసు అన్నారు. గురువారం తర్లుపాడు రోడ్డులోని కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను పలువురు అధికారులు, స్థానిక ప్రజలు కలిశారు. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్టు కోసం తాము భూములను త్యాగం చేశామని పెద్దారవీడు మండలం సుంకేసుల గ్రామస్థులు తెలిపారు. అంతకు ముందు డీఆర్వోను కలెక్టర్ కార్యాలయ అధికారి రవీంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ సుబ్బారావు తదితరులు కలిశారు.

డీఆర్వో ఓబులేసును మర్యాద పూర్వకంగా కలిసిన రెవెన్యూ అధికారులు

కలెక్టర్ కార్యాలయంలో అధికారుల నియామకం

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనా విభాగానికి సంబంధించిన అధికారులను ప్రభుత్వం నియమించింది. ఇన్‌ఛార్జి పరిపాలన అధికారిగా కె.రవీంద్రారెడ్డిని నియమించడంతో గురువారం విధుల్లో చేరారు. ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ సెక్షన్ అధికారిగా ఎం.ఆంజనేయరెడ్డి, సూపరింటెండెంట్ సమన్వయ సెక్షన్ అధికారిగా వి.కిరణ్ విధుల్లో చేరారు. సూపరింటెండెట్ ల్యాండ్ సెక్షన్-1 ఇన్‌ఛార్జి అధికారిగా కె.అర్జున్, సూపరింటెండెంట్ ల్యాండ్ సెక్షన్-2 ఎస్.అనిల్‌కుమార్‌లు విధుల్లో చేరారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి అధికారిగా ఎం.పద్మావతిని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయరుగా డి.పరిశుద్ధరావును నియమించారు.

ఎమ్మెల్యే ఉగ్రకు చెక్కు అందజేస్తున్న నాగరాజు

కనిగిరి ఆసుపత్రికి చేయూత

కనిగిరి, పీసీపల్లి, న్యూస్‌టుడే: కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి పీసీపల్లి మండలం పెదఅలవలపాడుకు చెందిన తెదేపా నాయకుడు పువ్వాడి నాగరాజు... తన తల్లిదండ్రులు పువ్వాడి నాగయ్య, జయమ్మల జ్ఞాపకార్థం రూ.1,11,111 సాయం అందజేశారు. కనిగిరి నగరవనంలో గురువారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి సంబంధిత చెక్కు అందజేశారు. సామాజిక బాధ్యతగా సాయం అందించిన నాగరాజును ఎమ్మెల్యే అభినందించారు.

నిత్యాన్నదానానికి ఎమ్మెల్యే దామచర్ల విరాళం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో శ్రీవెంకటేశ్వర స్వామివారి నిత్యాన్నదానానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తన కుటుంబ సభ్యులతో కలిసి విరాళం కింద రూ.21,63,740 ఇచ్చారు. ఈ మేరకు సదరు చెక్కును తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం రాత్రి జేఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

జేఈవో వెంకయ్య చౌదరికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, కుటుంబ సభ్యులు

అద్దంకి కాలువలో యువకుడి గల్లంతు

మామిళ్లపల్లి (సంతమాగులూరు), న్యూస్‌టుడే: నాగార్జున సాగర్ అద్దంకి బ్రాంచి కాలువలో ఓ యువకుడు గల్లంతైన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మామిళ్లపల్లికి చెందిన సీహెచ్.రాంబాబు (25) రైతు. కొత్త సంవత్సరం సందర్భంగా బుధవారం అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై కొమ్మాలపాడుకు వెళ్లారు. తిరిగి అర్ధరాత్రి సమయంలో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గంమధ్యలో మామిళ్లపల్లి సమీపంలోని ఎన్నెస్పీ అద్దంకి బ్రాంచి కాలువ వంతెన వద్ద ఆగారు. రాంబాబు ముఖం కడుక్కునేందుకు కాలువ వద్దకు వెళ్లి అందులో పడి గల్లంతయ్యారు. ఆయనతో పాటు వెళ్లిన మరో వ్యక్తి సమాచారాన్ని బాధిత కుటుంబ సభ్యులకు తెలిపారు. కాలువలో ఉన్న నీటిమట్టాన్ని తగ్గించి గల్లంతైన యువకుడి కోసం కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.

కారు ఢీకొని వివాహిత దుర్మరణం

అద్దంకి, న్యూస్‌టుడే : మోపెడ్‌ను కారు ఢీకొన్న సంఘటనలో భార్య మృతిచెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తిమ్మాయపాలెం సమీపంలో చోటుచేసుకుంది. 108 సిబ్బంది అందించిన సమాచారం మేరకు..ముండ్లమూరు మండలం పోలవరానికి చెందిన దంపతులు ఏడుకొండలు-రమణ (50) మోపెడ్‌పై స్వగ్రామం నుంచి అద్దంకి వస్తున్నారు. అదే మార్గంలో అద్దంకి నుంచి దర్శి వైపు వస్తున్న కారు మోపెడ్‌ను ఢీకొట్టింది. దీంతో దంపతులకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, మార్గంమధ్యలోనే రమణ మృతిచెందారు. భర్త ఏడుకొండలుకు మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు.

గాయపడిన ఏడుకొండలు

మద్యం మత్తులో కత్తితో దాడి

మద్దిపాడు, న్యూస్‌టుడే: యువతిని ఎందుకు వేధిస్తున్నావని అడిగినందుకు మద్యం మత్తులో ఓ వ్యక్తిపై యువకుడు కత్తితో దాడి చేసిన సంఘటన మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగన్నపాలెం ఎస్సీ కాలనీకి చెందిన యువతి విజయవాడలో చదువుతూ నూతన సంవత్సరం సందర్భంగా స్వగ్రామానికి వచ్చింది. అదే గ్రామానికి చెందిన పాలెటి ప్రదీప్‌కుమార్, మద్దుమాల ఆంజనేయులుతో కలిసి మద్యం తాగుతున్నాడు. ఆ సమయంలో అటుగా వెళుతున్న యువతిని చూసి.. ఎందుకు ఆమెను వేధింపులకు గురిచేస్తున్నావని ఆంజనేయులు అడగడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి వివాదం రేగింది. దీంతో యువకుడు తన వద్ద ఉన్న చాకుతో ఆంజనేయులు వీపుపై పొడిచాడు. అది చూసి అడ్డకునేందుకు వచ్చిన బ్రహ్మయ్య అనే మరో వ్యక్తిపైనా దాడికి ప్రయత్నించాడు. ఈ ఘటనలో ఆంజనేయులు, బ్రహ్మయ్యలకు గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్సు ద్వారా చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. దీనిపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

మంచు జోరు.. జనం బేజారు!

ఉమ్మడి ప్రకాశం జిల్లాను గురువారం మంచు దుప్పటి కప్పేసింది. ప్రధానంగా ఒంగోలు నగరంపై తీవ్ర ప్రభావం చూపింది. నూతన సంవత్సర కానుకగా ఉదయం 9 గంటలదాకా నగరమంతా మంచు కమ్మేసింది. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రంగరాయుడు చెరువు పరిసరాలన్నీ మంచుతో ఆహ్లాదకరంగా కనిపించాయి. -ఈనాడు, ఒంగోలు

ద్విచక్ర వాహనాల ఢీ

ఇద్దరి మృతి.. ఒకరికి తీవ్ర గాయాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా నుంచి పల్నాడు జిల్లాలోని మాచర్లకు పండ్లు, డ్రైఫ్రూట్స్ తెచ్చి అమ్ముకుని తిరిగి వెళుతూ ఇద్దరు దుర్మరణం చెందగా, మరొకరు గాయపడిన ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. మార్కాపురానికి చెందిన షేక్ కరీముల్లా (50) రెండు రోజులకోసారి పండ్లు, డ్రైఫ్రూట్స్ తెచ్చి మాచర్లకు చెందిన సమీప బంధువు నూర్జహాన్‌తోపాటు వ్యాపారం చేస్తుంటాడు. గురువారం వ్యాపారం ముగించుకుని నూర్జహాన్(45)తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. శిరిగిరిపాడు శివారులో మాచర్ల వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహేష్ ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో కరీముల్లా తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన నూర్జహాన్‌ను ఆసుపత్రికి తీసుకెళ్తుండగా చనిపోయారు. మృతుడు కరీముల్లాకు భార్య, కుమారుడు, నూర్జహాన్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

అంబులెన్స్ ఆలస్యమై..: ప్రమాదం విషయాన్ని 108కు సమాచారం ఇచ్చిన 50 నిమిషాలకు ఘటన స్థలానికి వచ్చింది. పది నిమిషాలు ముందు వచ్చినా క్షతగాత్రులు బతికే అవకాశాలు ఉన్నాయని స్థానికులు తెలిపారు.

కారులో ఎత్తుకెళ్లి పొలం రిజిస్ట్రేషన్

బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

మూసాపేట, న్యూస్‌టుడే: తనను ఓ వ్యక్తి కారులో బలవంతంగా తీసుకెళ్లి పొలం రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు, పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలం ముమ్మిడివరం గ్రామానికి చెందిన రాజశేఖర్ (58) కొన్నాళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. కూకట్‌పల్లి పరిధి జయనగర్‌లో ఉంటున్నారు. ఇతను సొంత గ్రామానికి చెందిన వెంగల్‌రెడ్డి (35) వద్ద మూడేళ్ల క్రితం రూ.40 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ప్రస్తుతం వడ్డీతో కలిపి అది రూ.53 లక్షలకు చేరింది. ఎంతకూ బాకీ చెల్లించక పోవడంతో బుధవారం ఉదయం రాజశేఖర్ ఇంటికి వచ్చి అతన్ని బలవంతంగా తన కారులో ఎక్కించుకొని సొంతూరుకు తీసుకెళ్లాడు. అక్కడ రాజశేఖర్‌కు చెందిన 2 ఎకరాల వ్యవసాయ భూమిని బెదిరించి తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అనంతరం సాయంత్రానికి వదిలి వెళ్లాడు.

తప్పిపోయిన బాలుడు తండ్రికి అప్పగింత

దగదర్తి, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనేందుకు తండ్రితో కలసి దగదర్తికి వచ్చిన బాలుడు గురువారం తప్పిపోగా.. గుర్తించిన పోలీసులు తిరిగి అప్పగించారు. ప్రకాశం జిల్లా పామూరు పట్టణానికి చెందిన సుబ్బరాయుడు తన మూడేళ్ల కుమారుడు అనోస్‌తో కలసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనేందుకు దగదర్తిలోని ఓ ప్రార్థనా మందిరానికి వచ్చారు. ఆసమయంలో బాలుడు బయటకు వచ్చి దారి తప్పి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఏడుస్తూ వెళుతున్నాడు. అటుగా వెళుతున్న గ్రామంలోని మిక్సడ్ కాలనీకి చెందిన విజయనిర్మల గుర్తించి తీసుకెళ్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించింది. ఎస్సై తన సిబ్బంది గ్రామంలో విచారించారు. ప్రార్థనా మందిరం వద్ద తండ్రి సుబ్బరాయుడుకు అప్పగించారు.

బాలుడితో ఎస్సై జంపానికుమార్, తండ్రి, అప్పగించిన మహిళ

బడిలోనే భవిత పాఠం

• విద్యాశాఖ కెరియర్ ఎక్స్‌పోలో ఆకట్టుకున్న విద్యార్థులు

ఉన్నత పాఠశాలల్లో చదువుతున్నప్పుడే భవిష్యత్తుపై విద్యార్థులకు అవగాహన ఉండాలనేది ప్రభుత్వ ఆలోచన. దానిలో భాగంగా ఈ ఏడాది సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో కెరియర్ ఎక్స్‌పో కార్యక్రమం చేపట్టింది. మొదటి సారిగా పాఠశాల స్థాయిలో ప్రదర్శన నిర్వహించారు. కెరియర్‌పై మంచి అవగాహన కలిగిన వారిని మండలానికి అయిదుగురిని ఎంపిక చేసి ఒంగోలు నగరంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఎక్స్‌పోకు పంపించారు. ఈ సందర్భంగా కెరియర్‌పై వారికున్న అవగాహనను ఇతర విద్యార్థులతో పంచుకున్నారిలా.

- న్యూస్‌టుడే, ఒంగోలు నగరం, మార్కాపురం

ఇంటి వద్దనే సంపాదన

విద్యార్థి :శ్రీవిద్య, జడ్పీ బాలికోన్నత పాఠశాల, మార్కాపురం

అంశం: చదువు మీద ఆసక్తిలేక మధ్యలో మానేసినవారు ఇంటివద్దనే కుట్టు, అల్లికలు, గృహోపకరణాలు తయారు చేసి ఆదాయం పొందవచ్చు. డాక్టర్లు, ఇంజినీర్లు కావాలంటే ఏమి చదవాలనేది చక్కగా వివరించింది.

క్లౌడ్ కంప్యూటింగ్‌తో ఉజ్వల భవిష్యత్తు

విద్యార్థులు: గోపి, అంకమ్మరావు, దేవరంపాడు జడ్పీ హైస్కూలు

అంశం: డేటా సైన్స్, ఎనలైజర్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్‌కంప్యూటింగ్ రంగాల్లో భవిష్యత్తులో ఉన్న అవకాశాల గురించి వివరించారు.

సీపీఆర్ అందరికీ తెలియాల్సిందే..

విద్యార్థులు: బి.భావన, మోహన్‌తేజ్, 9వ తరగతి, మర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాల

అంశం: సీపీఆర్, బయోవేస్ట్‌పై ప్రాజెక్టు ప్రదర్శించారు. చిన్నవయసులోనే సీపీఆర్ గురించి తెలుసుకుంటే గుండెపోటుతో అపస్మారిక స్థితికి వెళ్లినవారి ప్రాణాలు కాపాడవచ్చు. అదే విధంగా చెత్తనుంచి సంపద ఎలా పొందవచ్చో వివరించారు.

సేద్యంతో ఉపాధి పొందడంపై..

విద్యార్థులు: రిప్తిక, దీప్తి, వర్షిత, 9వ తరగతి, కామేపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల

అంశం: డిగ్రీలు చదివాక ప్రభుత్వ ఉద్యోగం కోసం వేచిఉండాల్సిన పనిలేదు. ప్రభుత్వ పథకాలు ఆసరాగా పాడిపరిశ్రమ, ప్రకృతి సేద్యం, ఉద్యానసాగు, శీతలగిడ్డంగులు, డ్రోన్ టెక్నాలజీ తదితర విభాగాల్లో స్థిరమైన ఆదాయం పొందవచ్చు.

డేటా బేస్డ్ ఉద్యోగాలు

విద్యార్థులు: సులోచన, మౌనిక, 9వ తరగతి, డీఆర్ఆర్ మున్సిపల్ హైస్కూలు

అంశం: డిగ్రీ, ఇంజినీరింగ్‌లో కంప్యూటర్ ఆధారిత ఉద్యోగాలు ఎలా పొందవచ్చనేది వివరించారు.

ఫోన్‌పే పేరిట మోసం.. భారీగా నగదు మాయం

అద్దంకి, న్యూస్‌టుడే : ఫోన్ పే చేసిన కొన్ని క్షణాల్లోనే భారీ నగదు మాయమైంది. ఈ సంఘటన అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు.. ఒంగోలుకు చెందిన యువకుడు నరసరావుపేట వెళ్లేందుకు అద్దంకి వచ్చాడు. బస్టాండ్‌లోని నరసరావుపేట పాయింట్ వద్ద కూర్చొని ఉండగా, ఓ ఆగంతకుడు వచ్చి తన ఫోన్‌పేలో నగదు లేదని, ఓ వంద ఇచ్చి ఫోన్‌పే ఖాతాకు పంపమని కోరాడు. దీంతో నగదు బదిలీ చేశాడు. కొద్ది సేపటి తర్వాత బ్యాంక్ ఖాతాలో భారీ నగదు గల్లంతైనట్లు గుర్తించి అవాక్కయ్యాడు. వెంటనే ఆర్టీసీ అధికారుల ద్వారా పోలీసుల్ని సంప్రదించగా.. బ్యాంక్ ఖాతాను సీజ్ చేయించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ప్రముఖ చెప్పుల వ్యాపారి గుండవరపు నరసింగరావు కుమారుడు శివాజీ (36) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బుధవారం తిరుపతి నుంచి కందుకూరుకు కారులో వస్తుండగా.. శ్రీకాళహస్తి సమీపంలో టైరు పంక్చరైంది. వాహనం దిగి పరిశీలిస్తుండగా.. ద్విచక్ర వాహనదారుడు వేగంగా వచ్చి శివాజీని ఢీకొట్టాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా మారడంతో బంధువులు నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, తెదేపా నాయకులు, పలువురు ప్రముఖులు శివాజీ మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 152, రిటైల్ లైవ్ - 179, చికెన్ విత్ స్కిన్ - 260, చికెన్ స్కిన్‌లెస్- 295

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

REAL ESTATE

PLOT FOR SALE

వినుకొండ దొనకొండ 133 గజాలు (2.75 సెంట్లు) ఇంటి స్థలం కేవలం 99999/- మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 9398621767

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

JOBS

ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ/ డిప్లమో అర్హతతో కనీసం 2 సం||లు అనుభవం ఉండాలి. ఆకర్షణీయమైన జీతం. అమరావతిరూఫింగ్ కంపెనీ. ఒంగోలు. ✆: 8121789333.

SECURITY GUARDS

సెక్యూరిటిగార్డులు (స్త్రీ/ పురుషులు) కావలెను. ఒంగోలు అద్దంకి బస్టాండ్ ఏరియాలో ప్రముఖ షాపింగ్ మాల్‌లో 30 రోజులు పని చేయుటకు. రోజుకి రూ|| 500/-. సంప్ర : 7285963951/ 8099444758.

(c) eenadu

కనిగిరి
•కనిగిరి •గిద్దలూరు

నామఫలకాల్లో జిల్లా పేరు మార్పు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: ప్రత్యేకంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసి తాత్కాలిక కలెక్టరేట్ నుంచి పాలన ప్రారంభించిన నేపథ్యంలో... ప్రభుత్వ కార్యాలయాల్లోని నామఫలకాలు, బోర్డుల్లో జిల్లా పేరును మారుస్తున్నారు. సి.ఎస్.పురంలో తహసీల్దార్ కేవీ ప్రసాద్, ఎంపీడీవో వి.ప్రతాప్‌రెడ్డి... రెవెన్యూ, మండల పరిషత్తు కార్యాలయాల్లో ఈ మేరకు బోర్డుల్లో మార్పులు చేశారు.

శ్రీ, భూ సమేత తిరుమలనాథ స్వామి మూలవిరాట్

భక్తులతో ఆలయాలు కిటకిట

సి.ఎస్.పురం, కంభం – న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా గురువారం... భైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథ దేవస్థానం; కంభంలోని వేంకటేశ్వరస్వామి, కోట సత్యమాంబదేవి తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు చోట్ల ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేపట్టారు. కనిగిరి, కంభం, గిద్దలూరు తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నూతనోత్సాహం

ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, డాక్టర్ కవిత దంపతులకు స్వాగతం పలుకుతున్న తెలుగు మహిళలు

బుధవారం అర్ధరాత్రి కేకు కోస్తున్న గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. బుధవారం రాత్రి నుంచే సంబరాలు మొదలయ్యాయి. అర్ధరాత్రి పన్నెండు గంటల సమయంలో కేకులు కోసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొంటూ యువత, పిల్లలు సందడి చేశారు. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ గృహిణులు తమ ఇళ్ల ముంగిట తీర్చిదిద్దిన రంగవల్లులు ఇలపై హరివిల్లును ఆవిష్కరించాయి. కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో ఆయా శాఖల అధికారులను సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ❖ కనిగిరి మండలం కంభం రోడ్డులోని భైరవ వనంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వేడుకలకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా అక్కడి మైదానంలో నిర్వహించిన కోలాట ప్రదర్శనలు, తాడు లాగుడు, లెమన్-స్పూన్ తదితర ఆటల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జబర్దస్త్ టీం బుల్లెట్ భాస్కర్, నరేష్, ఫైమా తదితరులు స్కిట్లతో అలరించారు. వేడుకలకు వచ్చేవారికి ఇబ్బంది లేకుండా అమరావతి మైదానం నుంచి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సహకారంతో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. వచ్చేవారు పూలదండలు, బొకేలు తేవద్దని, ఆ మొత్తాన్ని సామాజిక వైద్యశాల అభివృద్ధికి ఇవ్వాలని సూచించడంతో... ఆ మేరకు ప్రత్యేకంగా హుండీ ఏర్పాటు చేయడంతో ఎమ్మెల్యే సహా నాయకులు అందులో విరాళాలు వేశారు. ❖ మాచవరం సమీపంలోని నివాసంలో వైకాపా నియోజకవర్గ బాధ్యుడు దద్దాల నారాయణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ❖ గిద్దలూరులో బుధవారం అర్ధరాత్రి పన్నెండు గంటల సమయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అభిమానులతో కలిసి కేకు కోశారు. గురువారం ఉదయం... తెదేపా నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పెద్ద ఎత్తున తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే సూచన మేరకు పూలమాలలు, బొకేలు కాకుండా విద్యార్థులకు ఉపయోగపడేలా పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ❖ ఏఎంసీ ఛైర్మన్ బాలయ్యకు మార్కెట్ కమిటీ సిబ్బంది; పురపాలక ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్యకు మున్సిపల్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి... డివిజన్ పరిధిలోని సిబ్బందితో కలిసి వేడుకలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే బృందం

కంభంలో...

కనిగిరిలో జబర్దస్త్ కళాకారులు బుల్లెట్ భాస్కర్, ఫైమా సందడి

మహిళల కోలాట ప్రదర్శన

హనుమంతునిపాడు నగరవనంలో కోలాహలం

క్విజ్‌లో ప్రతిభ చాటారు

బహుమతులు అందుకున్న విద్యార్థులతో పాఠశాల ప్రతినిధులు

కంభం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా కంభం వాసవీ విద్యానికేతన్‌లో మంగళవారం నిర్వహించిన క్విజ్ పోటీలు సందడిగా సాగాయి. 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని వర్తమాన అంశాలపై ఇచ్చిన ప్రశ్నలకు చక్కగా సమాధానాలిచ్చారు. ఎస్. సిహాదిక, జి.జసిత ప్రియ, పి.ఎస్.ఎ. ... ప్రతిభ చాటి వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ గోళ్ల సుబ్బరత్నం, ప్రిన్సిపల్ కిరణ్‌వర్మ చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

వైభవంగా కల్పతరువు వేడుకలు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: కాశిరెడ్డినగర్‌లోని రామకృష్ణ ధ్యానమందిరంలో గురువారం ఉదయం నిర్వహించిన కల్పతరువు వేడుకలు వైభవంగా సాగాయి. ధ్యానమందిరం అధ్యక్షుడు పి.హనుమంతారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్యాన సాధనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొత్త జిల్లా... కొంగొత్త ఒరవడి

❖ దృష్టి సారిస్తే కనిగిరికి మహర్దశ ❖ గిద్దలూరు వాసులకు తీరిన కష్టాలు

న్యూస్‌టుడే – కనిగిరి

భౌగోళికంగా కనిగిరి ప్రాంతానికి ఒంగోలుతోనే అనుబంధం ఎక్కువ. అప్పట్లో నెల్లూరు జిల్లాలో భాగంగా ఉన్న ఈ ప్రాంతాన్ని ప్రకాశం జిల్లాలో కలిపారు. అప్పటి నుంచి విద్య, వైద్యం, వ్యాపారం, వాణిజ్యపరంగా బంధం మరింత పెరిగింది. తాజాగా మార్కాపురం కేంద్రంగా ఏర్పాటైన కొత్త జిల్లాలో కనిగిరిని కలపడంతో ఈ ప్రాంత ముఖచిత్రం మారనుంది.

ఇవీ సానుకూలతలు...

వెనుకబడిన ప్రాంతాలతో జిల్లా ఏర్పాటైనందున ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్... కనిగిరి ప్రాంత పర్యటన సమయంలో పలు హామీలు ఇచ్చి ఆ మేరకు నిధులు కేటాయించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కూ ఇక్కడి సమస్యలపై అవగాహన ఉంది. ఆ క్రమంలోనే ఫ్లోరైడ్ సమస్య పరిష్కారం దిశగా కొంత చొరవ చూపారు. ప్రస్తుతం కొత్త జిల్లాలో భాగమైనందున వారు మరింతగా దృష్టి సారించే అవకాశం ఉంది. బయోగ్యాస్, ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ఇప్పటికే అడుగులు పడ్డాయి. గ్రీన్ ఫీల్డ్ హైవే, నడికుడి - శ్రీకాళహస్తి రైలు మార్గం పనులు తుదిదశకు చేరాయి. ఇవి అందుబాటులోకి వస్తే రైలు, రోడ్డు రవాణా సౌకర్యాలు పెరిగి పారిశ్రామిక విస్తరణకు అవకాశం కలుగుతుంది. బీసీ గురుకులం మంజూరు కావడం, ట్రిపుల్‌ఐటీ భవనాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందడం విద్యారంగానికి ఊతమిచ్చేదే.



రాష్ట్రంలో అత్యధిక ప్రభుత్వ భూములున్న నియోజకవర్గాల్లో కనిగిరి ఒకటి. నీటి వసతి లేక సద్వినియోగం కావడం లేదు. వెలిగొండ పూర్తయితే ఆ సమస్య తీరి ప్రభుత్వ ప్రాజెక్టులు రావడంతో పాటు సస్యశ్యామలంగా మారతాయి.

చిక్కిపోయిన రెవెన్యూ డివిజన్...

పదమూడు మండలాలతో కళకళలాడిన కనిగిరి రెవెన్యూ డివిజన్... కొత్త జిల్లా ఏర్పాటుతో నియోజకవర్గంలోని ఆరు మండలాలకే పరిమితం కావడం కొంత లోటు. కొనకనమిట్ల, పొదిలి... మార్కాపురం డివిజన్‌లోకి; దర్శి, కురిచేడు, దొనకొండ... అద్దంకిలోకి; మర్రిపూడి, పొన్నలూరు మండలాలు కందుకూరు డివిజన్‌లోకి వెళ్లాయి. పొదిలి, కొనకనమిట్లను ఇక్కడే కొనసాగించాల్సిందన్న అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు కనిగిరి నుంచి మార్కాపురానికి నేరుగా బస్సు సౌకర్యం లేదు. ఆ మేరకు రవాణా సౌకర్యాలు మెరుగుపరచాల్సిన అవసరం ఉంది.

గిద్దలూరుకు బహుళ ప్రయోజనం

మార్కాపురం జిల్లా ఏర్పాటుతో గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు బహుళ ప్రయోజనం చేకూరింది. ఇప్పటి వరకు ఒంగోలుకు వెళ్లేందుకు అయిదు గంటల సమయం పట్టేది. దీంతో ఏదైనా పని పడితే రోజంతా వృథా కావడంతో పాటు... వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేది. పనికాకపోతే మరిన్ని చిక్కులు తలెత్తేవి. కొత్త జిల్లా కేంద్రమైన మార్కాపురం ఇక్కడి నుంచి కిలోమీటర్ల దూరంలోనే ఉండడం... నేరుగా రైలు, బస్సు సౌకర్యం ఉండడంతో ప్రయోజనం చేకూరుతోంది. ప్రభుత్వ సేవలూ మెరుగుపడనున్నాయి. – న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

భూ సమస్యల పరిష్కారానికి కృషి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: భూ సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని తహసీల్దార్ కేవీ ప్రసాద్ తెలిపారు. ప్రస్తుత డీటీగా ఉన్న ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంతో గురువారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

పామూరు ఎస్సైగా అనూక్

పామూరు, న్యూస్‌టుడే: పామూరు ఎస్సైగా కె.అనూక్... గురువారం బాధ్యతలు స్వీకరించారు. పొన్నలూరు నుంచి బదిలీపై వచ్చారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇక్కడ ఎస్సైగా ఉన్న కిషోర్‌బాబు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మార్కాపురం అర్బన్: విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా ఇన్‌ఛార్జి డీఆర్వో ఓబులేసు సూచించారు. స్థానిక తర్లుపాడు రోడ్డులోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో అందుతున్న సౌకర్యాల గురించి బాలికలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అధికారిని కలెక్టర్ రాజాబాబు నియమించినట్లు తెలిపారు. మార్కాపురం జిల్లా అయిన నేపథ్యంలో ఇక నుంచి నిత్యం ఆకస్మిక తనిఖీలు ఉంటాయన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తేవాలన్నారు. అనంతరం విద్యార్థినులకు దుప్పట్లు, పుస్తకాలతో పాటు వివిధ రకాల వస్తువులు అందజేశారు. ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, డీఎవో రవీంద్రారెడ్డి, డిటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కనిగిరి : 8008574114,
గిద్దలూరు పట్టణం : 8008574135

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: **కనిగిరి:** ఎన్జీవోకాలనీ, ఇందిరాకాలనీ, బీసీ కాలనీలో వీధి దీపాలు సరిగా వెలగక రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం.– స్థానికులు

✓: వెంటనే సిబ్బందిని పంపి మరమ్మతులు చేయిస్తాం.– **మాధవరావు, మున్సిపల్ ఏఈ**

?: **కనిగిరి:** జవహర్‌లాల్ వీధి, నీలకంఠంవారి వీధిలో కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. వారం రోజుల వ్యవధిలో నలుగురు కుక్కకాటుకు గురయ్యారు.– **అచ్యుత వెంకటేశ్వర్లు**

✓: ఉన్నతాధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– **నాయబ్ రసూల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

బాధిత కుటుంబానికి పరామర్శ

కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కొమరోలు జడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరంరెడ్డి వీరరాఘవరెడ్డి (85) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. పాతికేళ్లు సర్పంచిగా, అయిదేళ్లు జడ్పీటీసీ సభ్యుడిగా సేవలందించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, కడప జిల్లా బద్వేలు నియోజకవర్గ బాధ్యులు విజయమ్మ, కృష్ణకిశోర్ రెడ్డి, ఎం.సంజీవరెడ్డి, శ్రీనివాస్ చౌదరి, జడ్పీటీసీ సభ్యుడు వెంకట నాయుడు, ఎంపీపీ అమూల్య, శ్రీనివాసరెడ్డి... మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు

❖ నేటి నుంచి గ్రామాల్లో పంపిణీ

న్యూస్‌టుడే – సి.ఎస్.పురం


రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకం


వైకాపా హయాంలో ఇచ్చిన భూహక్కు పత్రం

గత వైకాపా ప్రభుత్వం రూ.కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి జగన్ బొమ్మలు, ఆ పార్టీ రంగులతో ముద్రించిన భూహక్కు పత్రాలను రైతులకు పంపిణీ చేసింది. ఈ విషయమై అప్పట్లోనే నిరసన వ్యక్తమైనా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వాటిని రద్దు చేసి సర్కారు రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంది. కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో శుక్రవారం నుంచి ఈ నెల 9 వరకు గ్రామసభలు నిర్వహించి వీటిని అందజేయనుంది. గత ప్రభుత్వంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో భూయజమానులకు ఇచ్చిన హక్కుపత్రాలను వెనక్కి తీసుకుని కొత్తవి ఇవ్వనున్నారు. అప్పట్లో కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లోని 57 గ్రామాల్లో రీసర్వే నిర్వహించి హక్కు పత్రాలు ఇచ్చారు. ప్రస్తుతం ఆయా గ్రామాల వారీగా సభలు నిర్వహించి కొత్త పుస్తకాలు అందజేయనున్నట్లు ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి తెలిపారు. దాదాపు 18 వేల పాసు పుస్తకాలు పంపిణీ చేయనున్నారు.

❖ **రాచర్ల:** మండలంలో 2న అనుములపల్లి, 6న డి.గురువాయపల్లి, 7న మాధవపురం, 8న పాలకవీడు, 9న సోమిదేవపల్లి గ్రామాల్లో సభలు నిర్వహించి మొత్తం 3,338 పాసుపుస్తకాలు అందజేయనున్నట్లు తహసీల్దారు వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు.

చప్టా దెబ్బతిని చిక్కులు

బేస్తవారపేట బస్టాండ్ సమీపంలో తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే దారిలో... జాతీయ రహదారిని ఆనుకుని ప్రధాన మురుగు కాలువపై ఏర్పాటు చేసిన చప్టా పరిస్థితి ఇది. గతంలో చప్టాకు ఇరువైపులా వేసిన సిమెంట్ లేచిపోవడంతో గుంతలు ఏర్పడ్డాయి. ఆ ప్రాంతం ఎత్తుపల్లాలుగా మారడంతో కొద్ది నెలలుగా ఇటుగా రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. పలువురు ద్విచక్ర వాహనదారులు సైతం ప్రమాదాలకు గురయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, బేస్తవారపేట

నైపుణ్య పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపిక

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీల్లో... ముండ్లపాడులోని గంజి భద్రయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.ప్రవీణ్, ఎస్.వి.మణికంఠ, ఎస్.సాయిరాం ప్రదర్శించిన నమూనా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని కె.లక్ష్మీదేవి, వృత్తివిద్య శిక్షకుడు ఉలాపు బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

44 అంగన్‌వాడీల స్థాయి పెంపు

కనిగిరి, న్యూస్‌టుడే: మినీ అంగన్‌వాడీలను మెయిన్ కేంద్రాలుగా మార్చినందున చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మరింత మెరుగైన సేవలందుతాయని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. కనిగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టులోని కనిగిరి, పామూరు, పీసీపల్లి మండలాలకు చెందిన 44 మినీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చిన ఉత్తర్వులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. సీడీపీవో పి.సరోజని, సూపర్‌వైజర్లు పార్వతి, పద్మజ, ధనలక్ష్మి, సుమతి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఉత్తర్వు పత్రాలు చూపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వంతెన... నిత్యం యాతన

కంభం మండలం రావిపాడు సమీపంలో గుండ్లకమ్మ నదిపై నిర్మించిన వంతెన ఇది. తక్కువ ఎత్తులో ఉండడంతో తరచూ చిక్కులు తలెత్తుతున్నాయి. మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు కంభం చెరువు అలుగు పారడంతో ఇరవై రోజుల పాటు కంభం - రావిపాడు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్థులు బేస్తవారపేట మీదుగా చుట్టూ తిరిగి రావాల్సి వచ్చింది. వంతెన సమీపంలో మలుపు ఉండడం, అక్కడ ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడమూ సమస్యగా మారింది. వంతెనపైనా రక్షణ చర్యలు లేవు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. సమస్యను రహదారులు, భవనాల శాఖ జేఈ పాపారావు దృష్టికి తీసుకువెళ్లగా... ఆ ప్రాంతంలో కొత్త వంతెన నిర్మాణానికి రూ.4 కోట్లతో ప్రతిపాదించినట్లు తెలిపారు.– న్యూస్‌టుడే, కంభం

జిల్లా శాఖల కార్యాలయాలకు శ్రీకారం

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా ఆవిర్భావం కావడంతో పలు శాఖలకు చెందిన జిల్లా కార్యాలయాలు ప్రారంభం అవుతున్నాయి. గృహ నిర్మాణ శాఖ జిల్లా కార్యాలయాన్ని స్థానిక విద్యానగర్‌లోని ఈఈ కార్యాలయం ఆవరణలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి (పీడీ) కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి పీడీ పవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈఈ, డీఈ కార్యాలయంలోని అధికారులు ఆయనకు అభినందలు తెలిపారు. ◗ మార్కాపురంలోని స్థానిక చెరువు కట్టకు సమీపంలో ఉన్న మండల ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంపైన జిల్లా ఆర్‌డ్యబ్ల్యూఎస్ ఇంజినీరు వారి కార్యాలయం ప్రారంభించారు. జిల్లా అధికారిగా పి.సురేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఈలు, ఏఈలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదిలి, యర్రగొండపాలెం డీఈఈలు జె.లక్ష్మణ్, ఎం.శ్రీనివాసులు, జెఈ నాగరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లోడు పెరిగి ఆగిన వ్యవసాయ బోర్లు

❖ తంబళ్లపల్లె పరిధిలో పంటలు వాడుముఖం

తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న తీగలకు ఆధారంగా ఉంచిన కర్రలు

నాణ్యమైన వ్యవసాయ విద్యుత్తు సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నా స్థానిక అధికారుల నిర్లక్ష్యం కారణంగా గిద్దలూరు మండలం తంబళ్లపల్లె పరిధిలోని రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామంలోని 100 కేవీఏ పరివర్తకం పరిధిలో అధికారికంగా 16, అనధికారికంగా మరో ఆరు వ్యవసాయ డీప్‌బోర్లు ఉన్నాయి. ఇటీవల వర్షాలకు భూగర్భ జలాలు పెరగడంతో ఈ పరిధిలోని రైతులు బోర్లను వినియోగంలోకి తెచ్చి దాదాపు 120 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఇక్కడి పరివర్తకం నుంచి తంబళ్లపల్లెతో పాటు నల్లగట్ల పరిధిలోని రైతులకూ విద్యుత్తు సరఫరా జరుగుతోంది. ఒకటిన్నర కిలోమీటర్లకు పైగా తీగలు వెళ్లడం, పలుచోట్ల సామర్థ్యానికి తగ్గవి లేక తెగిపోతుండడంతో చివరి భూముల వారికి లో ఓల్టేజీ సమస్య తలెత్తుతోంది. బోర్లు పనిచేయక పంటలు వాడుముఖం పడుతున్నాయి. ఈ క్రమంలో బోర్ల వినియోగం విషయంలో నిత్యం ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. దీనికితోడు తీగలు తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉండడంతో కర్రలు ఆధారంగా పెట్టారు. పదేళ్ల క్రితం రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్తుకు హెచ్‌వీడీఎస్ పథకం అమలు చేసినప్పటికీ... అధికారుల నిర్లక్ష్యంతో ఇక్కడ అమలు కాక సమస్య నెలకొంది. ఇప్పటికైనా లైను మార్పుతో పాటు సరఫరా మెరుగుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి స్వామి, ఏపీటీఎఫ్ ప్రతినిధులు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి... గురువారం ఆవిష్కరించారు. ఈవో ఎస్.నరసింహబాబు, సిబ్బంది పాల్గొన్నారు. ❖ స్థానిక తెదేపా కార్యాలయంలో ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను నాయకులు ఆవిష్కరించారు. తెదేపా మండల అధ్యక్షుడు బి.రమేష్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యుడు బి.వెంకటేశ్వర్లు, మాలకొండయ్య, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు. ❖ ఏపీటీఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ సంఘ సభ్యులతో కలిసి మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులను కలిసి డైరీ, క్యాలెండర్లను అందజేశారు. యూటీఎఫ్ నాయకులు మండల అధికారులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ❖ **రాచర్ల:** యూటీఎఫ్ కాలమానిని, దైనందినిని ఎంపీడీవో వెంకట్రామిరెడ్డి, ఎంఈవోలు గిరిధరశర్మ, మొయినుద్దీన్‌లు గురువారం ఆవిష్కరించారు. సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

(c) eenadu

మార్కాపురం పట్టణం: ఎమ్మెల్యే నారాయణరెడ్డికి అభినందనలు తెలుపుతున్న మెప్మా సంఘాల మహిళలు

మార్కాపురం ఇన్‌ఛార్జి ఉప కలెక్టర్ శివరామిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

మార్కాపురం
•మార్కాపురం • యర్రగొండపాలెం

మెనూ ప్రకారం భోజనం అందించాలి

న్యూస్‌టుడే, మార్కాపురం అర్బన్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా ఇన్‌ఛార్జి డీఆర్వో ఓబులేసు సూచించారు. స్థానిక తర్లుపాడు రోడ్డులోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో అందుతున్న సౌకర్యాల గురించి బాలికలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అధికారిని కలెక్టర్ రాజాబాబు నియమించినట్లు తెలిపారు. మార్కాపురం జిల్లా అయిన నేపథ్యంలో ఇక నుంచి నిత్యం ఆకస్మిక తనిఖీలు ఉంటాయన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తేవాలన్నారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లు, పుస్తకాలతో పాటు వివిధ రకాల వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, డీఎస్పీ రవీంద్రారెడ్డి, డిజి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరం.. ఘన స్వాగతం

న్యూస్‌టుడే, మార్కాపురం: మార్కాపురం గురువారం నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని అంటాయి. డీఎస్పీ నాగరాజు డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలు, ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక జవహర్‌నగర్‌కాలనీలోని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు నివాసం వద్ద 860 కిలోల భారీ కేక్ కోసి పార్టీ శ్రేణుల మధ్య నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు.

◗ త్రిపురాంతకం గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక ఎంఆర్పీ భవనంలో ఎంఈవోలు కేజే మల్లికార్జున నాయక్, టి.రాజశేఖరరెడ్డి సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

◗ త్రిపురాంతకం గ్రామీణ: మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు త్రిపురాంతకేశ్వరుడికి అభిషేకాలు, బాలాత్రిపురసుందరీదేవి వద్ద కుంకుమార్చనలు చేశారు.

◗ పొదిలి, న్యూస్‌టుడే: శ్రీ నిర్మమహేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, సాయిబాబా దేవాలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

◗ పొదిలిలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి జి.భాస్కర్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.అనిల్, ఏఎంసీ ఛైర్మన్ సయ్యద్ ఇమాంసాహెబ్, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి ఇళ్ల వద్ద ఆయా పార్టీల కార్యకర్తల సందడి కనిపించింది. పొదిలిలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ అభిమానులతో కలిసి భారీ కేక్ కోశారు.

యర్రగొండపాలెం: పట్టణంలోని తెదేపా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు అత్యంత కోలాహలంగా తెదేపా శ్రేణులు నిర్వహించారు.

◗ యర్రగొండపాలెం పట్టణం: తెదేపా సీనియర్ నేత జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మన్నె రవీంద్ర ఇంటికి వెళ్లి అభిమానులు పుష్పగుచ్ఛం, శాలువాలు, పూలదండలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఇంటికి వెళ్లి అభిమానులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు శాలువలతో నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు.

ఎరిక్షన్‌బాబును సన్మానిస్తున్న తెదేపా శ్రేణులు

నూతన సంవత్సర కేక్ కోస్తున్న మార్కాపురం పీఏసీఎస్ ఛైర్మన్ రామాంజులురెడ్డి

తెదేపా రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ ఇంటివద్ద కేక్ కట్‌చేసి తినిపిస్తున్న యువత

తెదేపా జిల్లా నేత మన్నె రవీంద్రను సన్మానిస్తున్న అభిమానులు

వై.పాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

రూ.లక్షల వ్యయం.. నెరవేరని లక్ష్యం

న్యూస్‌టుడే, కొనకనమిట్ల, మార్కాపురం

☛ వృథాగా చెత్త సంపద కేంద్రాలు

పరిశీలన

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచి సంపద సృష్టించేందుకు ఏర్పాటుచేసిన డంపింగ్ యార్డులు (చెత్త సంపద తయారీ కేంద్రాలు) నిరుపయోగంగా మారాయి. దీంతో వీటికోసం ఖర్చు చేసిన లక్షలాది రూపాయలు వృథా అయినట్లయింది.

కంపచెట్లకు నిలయం.. పరిసరాలు అధ్వానం..

మార్కాపురం, పెద్దారవీడు, త్రిపురాంతకం, తర్లుపాడు, పెద్ద దోర్నాల తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన చెత్త సేకరణ కేంద్రాలు పట్టించుకునే వారు లేక పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. ఆరంభంలో ఆర్భాటంగా ప్రచారం చేసినా తరువాత వదిలేశారు. దీంతో కొన్నిచోట్ల కంపచెట్లు పెరిగాయి. అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది. వద్దిమడుగు సంపద తయారీ కేంద్రం. దీనికోసం రూ.లక్షలు వెచ్చించి నాడెప్ కంపోస్టు తొట్టెలు ఏర్పాటు చేశారు. కానీ వీటిని వినియోగించిన పాపాన పోలేదు. కేంద్రంలో కంపకర్ర చెట్లు పెరిగిపోతున్నాయి. షెడ్లు శిథిలావస్థకు చేరాయి. గ్రామంలో సేకరించిన చెత్తను శివారులో కుప్పలుగా పోస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు అధ్వానంగా తయారవుతున్నాయి.

◗ చెత్త సేకరణ కేంద్రం చుట్టూ ఫెన్సింగ్ తీగల ఏర్పాటుకు నాసిరకం పనులు చేపట్టారు. ఇందుకు రూ.లక్ష వెచ్చించారు.

వృథాగా వద్దిమడుగులోని సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం

◗ మార్కాపురం డంపింగ్ యార్డులో రెండేళ్ల క్రితం చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారుచేసే కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. మొదట్లో రూ.5కే సేంద్రియ ఎరువు విక్రయించినా ప్రస్తుతం నిర్వహణపై మరింత దృష్టి సారించాల్సి ఉంది.

◗ గార్లదిన్నెలో కేవలం షెడ్డు కట్టి వదిలేశారు. దీంతో చెత్త ఎక్కడపడితే అక్కడే పేరుకుంటోంది.

ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నైపుణ్య పోటీల్లో జాతీయస్థాయికి ఎంపిక

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీల్లో.. ముండ్లపాడులోని గంజి భద్రయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.ప్రవీణ్, ఎస్.వి.మహేంద్ర, ఎస్.సాయిరాం ప్రదర్శించిన నమూనా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని కె.లక్ష్మీదేవి, వృత్తివిద్య శిక్షకుడు ఉలాపు బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పోలేరమ్మకు నూతన సంవత్సరం శోభ

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయానికి గురువారం నూతన సంవత్సరం శోభ వచ్చింది. అమ్మవారిని వివిధ రకాల పూలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

పెద్దారవీడు, న్యూస్‌టుడే: మండలంలోని చట్లమిట్ల గ్రామంలోని సాయిబాబ ఆలయంలో గురువారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రతి గురువారం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి... గురువారం ఆవిష్కరించారు. ఈవో ఎస్.నరసింహబాబు, సిబ్బంది పాల్గొన్నారు. ❖ స్థానిక తెదేపా కార్యాలయంలో ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను నాయకులు ఆవిష్కరించారు. తెదేపా మండల అధ్యక్షుడు బి.రమేష్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యుడు బి.వెంకటేశ్వర్లు, మాలకొండయ్య, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు. ❖ ఏపీటీఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ సంఘ సభ్యులతో కలిసి మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులను కలిసి డైరీ, క్యాలెండర్లను అందజేశారు. యూటీఎఫ్ నాయకులు మండల అధికారులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ❖ **రాచర్ల:** యూటీఎఫ్ కాలమానిని, దైనందినిని ఎంపీడీవో వెంకట్రామిరెడ్డి, ఎంఈవోలు గిరిధరశర్మ, మొయినుద్దీన్‌లు గురువారం ఆవిష్కరించారు. సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా శాఖల కార్యాలయాలకు శ్రీకారం

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద జిల్లా అధికారి సురేష్‌బాబు, అధికారులు

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా ఆవిర్భావం కావడంతో పలు శాఖలకు చెందిన జిల్లా కార్యాలయాలు ప్రారంభం అవుతున్నాయి. గృహ నిర్మాణ శాఖ జిల్లా కార్యాలయాన్ని స్థానిక విద్యానగర్‌లోని ఈఈ కార్యాలయం ఆవరణలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి (పీడీ) కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి పీడీ పవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈఈ, డీఈ కార్యాలయంలోని అధికారులు ఆయనకు అభినందలు తెలిపారు. ◗ మార్కాపురంలోని స్థానిక చెరువు కట్టకు సమీపంలో ఉన్న మండల ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంపైన జిల్లా ఆర్‌డ్యబ్ల్యూఎస్ ఇంజినీరు వారి కార్యాలయం ప్రారంభించారు. జిల్లా అధికారిగా పి.సురేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఈలు, ఏఈలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదిలి, యర్రగొండపాలెం డీఈఈలు జె.లక్ష్మణ్, ఎం.శ్రీనివాసులు, జెఈ నాగరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ శాఖ కార్యాలయం వద్ద ఇన్‌ఛార్జి పీడీ పవన్‌కుమార్, అధికారులు

44 అంగన్‌వాడీల స్థాయి పెంపు

కనిగిరి, న్యూస్‌టుడే: మినీ అంగన్‌వాడీలను మెయిన్ కేంద్రాలుగా మార్చినందున చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మరింత మెరుగైన సేవలందుతాయని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. కనిగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లోని కనిగిరి, పామూరు, పీసీపల్లి మండలాలకు చెందిన 44 మినీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చిన ఉత్తర్వులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. సీడీపీవో పి.సరోజని, సూపర్‌వైజర్లు పార్వతి, పద్మజ, ధనలక్ష్మి, సుమతి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
యర్రగొండపాలెం : 8008552658

కొనకనమిట్ల, న్యూస్‌టుడే

?: మండలంలోని వెలిగండ్ల శివారు ఎస్సీ కాలనీ మార్గంలో దీపాలు వెలగక స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వెంటనే చర్యలు తీసుకోగలరు. – శివయ్య, వెలిగండ్ల

✓: పంచాయతీ కార్యదర్శి మాట్లాడి సిబ్బందిని పంపిస్తాం. పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. – శ్రీదేవి, ఈవోఆర్డీ

పొదిలి, న్యూస్‌టుడే

?: పొదిలి ఇస్లాంపేటలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. సిమెంటురోడ్లు మంజూరు చేయించాలి. – స్థానిక ప్రజలు

✓: నగర పంచాయతీల్లో నిధుల లభ్యతను బట్టి ఆయా ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి సిమెంటురోడ్ల ప్రతిపాదనలు తయారుచేస్తాం. – కె.ఎల్.నారాయణరెడ్డి, కమిషనరు, పొదిలి

పెద్దారవీడు, న్యూస్‌టుడే

?: ఉన్నత పాఠశాల, ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే రహదారిలో వ్యర్థాలు నిలిచి దుర్వాసన వస్తోంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించాలి. – కిషోర్‌బాబు, స్థానికుడు, పెద్దారవీడు

✓: వ్యర్థాలను తొలగించి, ఆ పరిసరాల్లో వ్యర్థాలను వెయ్యకుండా స్థానికులకు అవగాహన కల్పిస్తాం. – శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో, పెద్దారవీడు

పెద్ద దోర్నాల, న్యూస్‌టుడే

?: అసానాబాద్‌లోని పంట పొలాలకు తీగలేరు వాగు దాటి పోవాల్సి రావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాగుపై చిన్నపాటి వంతెన ఏర్పాటు చేసి సమస్యలు తొలగించాలి. – వెంకటేశ్వర్లు, అసానాబాద్

✓: వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. – పోలురాజు, ఏఈ, నీటిపారుదల శాఖ, దోర్నాల

తర్లుపాడు, న్యూస్‌టుడే

?: మండలంలోని తాడివారిపల్లె ప్రధాన రహదారిలోని కొట్లబజారులోని వీధిదీపాలు వెలగడంలేదు. చీకట్లో బయటకు రావాలంటే మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. –వెంకటేశ్వర్లు, తాడివారిపల్లె.

✓: పంచాయతీ సిబ్బంది ద్వారా వీధి దీపాలకు మరమ్మతులు చేపిస్తాం. –అనూషా, తాడివారిపల్లె, పంచాయతీ అధికారి

నేల వాలిన సూచిక.. సరిచేయాలిక

నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే పెద్దదోర్నాల - శ్రీశైలం ఘాట్ రోడ్డులో కొన్ని సూచిక బోర్డులు నేల చూపులు చూస్తున్నాయి. మరికొన్ని చెట్ల కొమ్మల మధ్యలో ఉండిపోయాయి. అవి చోదకులకు స్పష్టంగా కనిపించక పోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులు సరిచేయాలని చోదకులు కోరుతున్నారు. పెద్దదోర్నాల, న్యూస్‌టుడే

సగంలో వదిలేశారు.. చోద్యం చూస్తున్నారు!

మోట్ల మల్లికార్జునపురంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో తరగతి గదుల నిర్మాణం సగంలోనే నిలిచిపోవడంతో గదుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నుంచి ఇంటర్ వరకు 500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆరేళ్ల క్రితం పాఠశాల రెండో అంతస్తులో గదులు నిర్మాణం చేపట్టారు. నిధులు పూర్తి స్థాయిలో మంజూరు కావడంతో గుత్తేదారుడు శ్లాబు వరకు నిర్మాణ పనులు చేసి వదిలేశారు. సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. **పెద్దదోర్నాల, న్యూస్‌టుడే**

రైతులకు కొత్త పాసు పుస్తకాలు

న్యూస్‌టుడే, పొదిలి

● నేటినుంచి పంపిణీ..

రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు నేటినుంచి గ్రామసభల్లో పంపిణీ కానున్నాయి. ఇందుకోసం అధికారులు అన్నిరకాల చర్యలు తీసుకున్నారు.

ఇప్పటికే గ్రామ సభల తేదీల వెల్లడి

◗ వైకాపా పాలనలో భూముల రీసర్వే తరువాత సీఎం బొమ్మతో ముద్రించిన పాసు పుస్తకాల స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో పాస్‌పుస్తకాలు మంజూరైనట్లు పొదిలి తహసీల్దార్ ఎం.వి.క్రిష్ణారెడ్డి చెప్పారు. మండలంలో 5,099 పాస్‌పుస్తకాలు వచ్చాయన్నారు. శుక్రవారం నిమ్మవరంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామాల వీఆర్వోల ద్వారా గ్రామసభలు జరిగే తేదీలను తెలియజేశామన్నారు.

◗ **తర్లుపాడు, న్యూస్‌టుడే:** తర్లుపాడు మండలంలోని ఇప్పటికే రీసర్వే పూర్తి చేసిన భూములకు సంబంధించి ఆయా గ్రామాల రైతులకు నేటి నుంచి నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ జరుగుతుందని తహసీల్దార్ కె.కె.కిశోర్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి జగన్ బొమ్మతో ఉన్న పుస్తకాలను వెనక్కు తీసుకుని వాటి స్థానంలో ప్రభుత్వ రాజముద్ర ఉండే పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. మండలంలోని జగన్నాథపురం 2న, జంగంరెడ్డిపల్లె 3న, కందలపల్లె 5న, కారుమానుపల్లె 6న, ఫత్తేపురం 7న, సూరేపల్లె 8వ తేదీ వరకు రైతులకు అందించనున్నారు. రైతులు ఆయా రోజుల్లో ఇంటి వద్ద ఉండి నూతన పుస్తకాలను అందుకోవాలని ఆయన కోరారు.


ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన పాసు పుస్తకం

విజ్ఞాన పోటీల్లో సత్తా చాటారు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో 41 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్కే.నజీర్ బాషా ప్రథమ బహుమతి, ఎస్కే.రుఖియా ద్వితీయ బహుమతి, ఎం.సుకన్య తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు కళాశాల అధ్యాపకులు కేవీ నారాయణ, ఆదిశేషిరెడ్డి, సర్తాజ్, శ్రీనివాసరావు, రాజశేఖర్‌రెడ్డి, కోటమ్మ, ప్రతాప్ బహుమతులు అందజేసి అభినందించారు.

◗ యర్రగొండపాలెం: పట్టణంలోని వాగ్దేవీ జూనియర్ బాలికల కళాశాలలో ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో 55 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డి.లక్ష్మీబాయి ప్రథమ బహుమతి, పీ.వీ.సునీత ద్వితీయ బహుమతి, ఎన్.అక్షిత తృతీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు ఏవో బాలునాయక్, జాస్మీన్, వసుమతి బహుమతులు అందజేసి అభినందించారు.

◗ యర్రగొండపాలెం: పట్టణంలోని చైతన్య ఉన్నత పాఠశాలలో ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో 60మంది విద్యార్థులు పాల్గొన్నారు. పి.రామ్‌చరణ్ ప్రథమ బహుమతి, సీ.హెచ్.రంగరాజు ద్వితీయ బహుమతి, ఎ.మల్లికార్జున తృతీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.లక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు బహుమతులు అందజేసి అభినందించారు.

చైతన్య ఉన్నత పాఠశాలలో బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

వై.పాలెం: వాగ్దేవీ కళాశాలలో బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

రోడ్డు పక్క కోతులు.. వాహనదారులు బెంబేలు

న్యూస్‌టుడే, తర్లుపాడు: తర్లుపాడు మండలం తాడివారిపల్లె వద్ద ప్రమాదకరమైన మూలమలుపుతో కూడిన ఘాట్ రోడ్డు ఉంది. ఇక్కడి రక్షణ గోడను మూడేళ్ల క్రితం భారీ వాహనం ఢీకొట్టడంతో పగిలిపోయింది. దీన్ని కంభం ఆర్ అండ్ బీ అధికారులు బాగుచేయకుండా వదిలేశారు. వాహనదారులే రాళ్లను తాత్కాలికంగా గోడగా ఏర్పాటు చేశారు. వీటిపై వానరాలు నిల్చుని వాహనదారులు ఇచ్చే పండ్లు, ఫలాల కోసం వేచి చూస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉంటున్నా కొన్నిసార్లు అవి దాడిచేస్తున్నాయి. దీనివల్ల ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వదిలి ఘాట్ రోడ్డులోని ప్రమాదకరమైన మలుపులో పడిపోయిన రక్షణ గోడను నిర్మించాలని కోరుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ఘాట్‌లో ప్రమాదాలు జరిగి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లేదంటే కోతుల కోసం ఆహారం పేరుతో వాహనాలు ఆగడం, కొన్నిసార్లు ఇతర వాహనాలు ఇబ్బంది పడటం తప్పదన్నారు. అధికారులు రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు.

తాడివారిపల్లె ఘాట్ రోడ్డుపై కూలిన గోడ రాళ్లపై వానరాలు

శివారు... సమస్యలతో బేజారు

న్యూస్‌టుడే, పొదిలి

☛ మౌలిక సదుపాయాలు లేక ప్రజల అవస్థలు

నగర పంచాయతీలోని వార్డులు : 20
జనాభా: 38 వేలు
శివారు కాలనీల్లోని జనాభా : సుమారు 12 వేలు
శివారు ప్రాంతాల్లోని వార్డులు : 7

పొదిలి నగర పంచాయతీలోని శివారు కాలనీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

గోడు వినే వారేరీ..

నగర పంచాయతీగా రూపాంతరం చెందినా మాగోడు విని పరిష్కరించేవారు కరవయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని శివారు కాలనీలైన పిచ్చిరెడ్డితోట, శ్రీపతినగర్, టైలర్స్‌కాలనీ, విరాట్‌నగర్, బీసీకాలనీ, ఇస్లాంపేట, రాజుపాలెం, బుచ్చన్నపాలెం, కొత్తపాలెం ప్రాంతాల్లోని ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. అంతర్గత రహదారులు, మురుగునీటి కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. కొన్నివీధుల్లో కాలువలు, రహదారులు లేక చిన్నపాటి వర్షంపడినా నడవలేని పరిస్థితి నెలకొంది.

◗ పిచ్చిరెడ్డి కాలనీలో కాలనీలో మూడు వీధులు ఉండగా ఒక్కవీధిలోనే సిమెంటురోడ్డు వేశారు. మిగిలిన అంతర్గత రహదారులకు కాలువలు లేక వర్షమొస్తే నీరు ఇళ్లలోకి వస్తున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టైలర్స్ కాలనీలో అధ్వానంగా అంతర్గత రహదారి

◗ బీసీ కాలనీలోను అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. మురుగునీరు కాలువలు లేక ఇళ్ల మధ్యే మురుగు పేరుకు పోతోంది. తాగునీరు వారం, పది రోజుల కొకసారి వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. కొన్ని వీధుల్లో తాగునీటి పైపులైన్లు లేక ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి శివారు ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

జేవీవీ కాలమానిని ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యార్థుల్లో విన్నూత ఆలోచనలే ధ్యేయం

పొదిలి, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సైన్సు పట్ల ఆసక్తిని పెంపొందించటం ప్రజల్లో మూఢనమ్మకాలను పారదోలేందుకే జేవీవీ కృషిచేస్తుందని జేవీవీ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి గురుస్వామి అన్నారు. గురువారం పింఛనర్ల భవనంలో జేవీవీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జేవీవీ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చెకుముకి ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం జేవీవీ కాలమానిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు దేవప్రసాద్, యల్లమందారెడ్డి, బాదుల్లా, మదార్‌వలీ, సుబ్బారావు, మూసాజానీ పాల్గొన్నారు.

(c) eenadu

పట్టాదారులకు పుస్తకం

■ నేటి నుంచి పంపిణీ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రాజముద్రతో ముద్రించిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి రెవెన్యూ శాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. ఈనెల 2 నుంచి 9వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజాప్రతినిధుల చేతులమీదుగా వాటిని రైతులకు పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని మండల తహసీల్దారు కార్యాలయాలకు పాసుపుస్తకాలను సరఫరా చేశారు. శుక్రవారం నుంచి వీటిని పంపిణీ చేయనున్నారు.

❑ గత వైకాపా ప్రభుత్వంలో కర్నూలు జిల్లాలో 255, నంద్యాల జిల్లాలోని 204 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తయింది. ఈ గ్రామాల్లోని 1.54 లక్షల మంది రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వనున్నారు.

❑ వైకాపా హయాంలో 459 గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యింది. వీటిలో 25 శాతం గ్రామాలకు కూడా పాసుపుస్తకాలు రాలేదు. ప్రస్తుతం పంపిణీ చేపట్టిన గ్రామాల్లో కూడా కొంతమంది రైతులకు పాసుపుస్తకాలు రాలేదు.

❑ గత వైకాపా ప్రభుత్వంలో భూ రికార్డుల స్వచ్ఛీకరణ చేపట్టారు. అప్పట్లో కొందరు రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా ఖాతా నంబర్లను మార్చేశారు. ఆటో మ్యుటేషన్ పేరుతో ఖాతా నంబర్లలో తప్పులు దొర్లాయి. కూటమి ప్రభుత్వంలో ఈ తప్పులను సరిచేయాలని ఆదేశించినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం అవే తప్పులతోనే కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

ఆరిన దీపం.. వీధిన కష్టం!

నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం వంతెనపై రాత్రివేళ చీకట్లు అలుముకుంటున్నాయి. వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

అవుకు యువకుడికి సైన్యంలో కీలక పదవి

అవుకు, న్యూస్‌టుడే: సైనిక విభాగంలో కీలకమైన పదవి అవుకు మండలం మూరేమడుగులకు చెందిన యు.జనార్దన్‌రెడ్డిని వరించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ భద్రతాదళంలో సుబేదార్ మేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన 26 ఏళ్ల క్రితం సైన్యంలో క్లర్కుగా చేరారు. నాయక్, హవల్దార్, సుబేదార్‌గా పలు ప్రాంతాల్లో పనిచేశారు. ప్రస్తుతం గుజరాత్‌లో పనిచేస్తున్న ఆయనకు సుబేదార్ మేజర్‌గా కీలక పదోన్నతి దక్కింది.

సీమ గుమ్మం.. పరిశ్రమల గమ్యం

■ ఈ ఏడాది ఓర్వకల్లుకు రానున్న భారీ ప్రాజెక్టులు

■ వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు

బ్రాహ్మణపల్లిలో రిలయన్స్ సంస్థ నిర్మిస్తున్న బేవరేజెస్, కన్జ్యూమర్ ఉత్పత్తుల తయారీ కేంద్రం

ఈనాడు, కర్నూలు : సీమ గుమ్మంలో పారిశ్రామికాభివృద్ధికి చకచకా అడుగులు పడుతున్నాయి. ఓర్వకల్లులోని 'మెగా ఇండస్ట్రియల్ హబ్'లో పరిశ్రమల ఏర్పాటుకు పలు కంపెనీలు ముందుకొస్తున్నాయి. హైదరాబాద్- కర్నూలు జాతీయ రహదారిలో ఉన్న ఓర్వకల్లు నోడ్ అభివృద్ధికి రూ.2,870.39 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం ముందుకొచ్చింది. ఇప్పటికే రూ.వెయ్యి కోట్లు విడుదల చేసింది. తొలి దశలో 2,600 ఎకరాల్లో భారీ పారిశ్రామిక వాడను అభివృద్ధి చేస్తున్నారు. రూ.56,244.25 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం చేసుకోగా.. ఇందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోద ముద్ర పడింది. వీటి ఏర్పాటు వల్ల ప్రత్యక్షంగా 17,826 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. పరోక్షంగా పదివేల మందికి ఉపాధి దక్కే అవకాశం ఉంది.

బ్రాహ్మణపల్లిలో అతిపెద్ద ప్లాంటు

● రియలన్స్ సంస్థ బ్రాహ్మణపల్లి పరిధిలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బేవరేజెస్ ప్లాంటును ఇక్కడ నిర్మిస్తోంది. 170 ఎకరాల్లో రూ.2,380.02 కోట్ల వ్యయంతో బేవరేజెస్, కన్జ్యూమర్ ఉత్పత్తుల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేస్తోంది.

● చాక్‌లెట్లు, స్నాక్స్, నూడుల్స్, ఆటా, బియ్యం, సుగంధ ద్రవ్యాలు తదితర ఉత్పత్తుల ప్యాకేజింగ్ కూడా ఈ ప్రాంగణంలోనే చేయనుంది. ఈ ఒక్క సంస్థ కారణంగానే సుమారు 5 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది.

గుట్టపాడులో ఉపాధి వెలుగులు

● సిగాచి ఇండస్ట్రీస్ సంస్థ గుట్టపాడులో 25 ఎకరాల్లో రూ.280 కోట్లతో ఓ పరిశ్రమను స్థాపించబోతోంది. దీంతో పాటు ఆర్పీఎస్ ఇండస్ట్రీస్ సంస్థ 11 ఎకరాల్లో రూ.90 కోట్ల వ్యయంతో మరో పరిశ్రమను ఏర్పాటు చేయబోతోంది.

● ఈ రెండు కర్మాగారాల ఏర్పాటుతో 1130 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. వీటితో పాటు సిగాచి సంస్థ మరో రూ.వెయ్యి కోట్లు కర్నూలులో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చింది.

సెమీ కండక్టర్ల రూపకల్పన

● ఓర్వకల్లు సెమీ కండక్టర్ల తయారీ కేంద్రంగా రూపాంతరం చెందడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జపాన్‌కు చెందిన ఇటోయే మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, భారత్‌కు చెందిన హైడ్రస్, బీఐఎస్ గ్రూపులు కలిసి మొత్తం రూ.14 వేల కోట్లతో సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నాయి.

● ఇండిచిప్ సెమీ కండక్టర్ సంస్థ కర్నూలులో రూ.22,976 వేల కోట్లతో పరిశ్రమ స్థాపించేందుకు ముందుకొచ్చింది. ఈ రెండు పరిశ్రమలు ఏర్పాటైతే ఉమ్మడి జిల్లా యువతకు కనీసం 20 వేల ఉద్యోగాలు వస్తాయని నిపుణుల అంచనా వేస్తున్నారు.

మనదే.. డ్రోన్ నగరం

➔ డ్రోన్ రంగంలో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో పరిశ్రమలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కర్నూలులో డ్రోన్ సిటీని ఏర్పాటు చేసింది. గతేడాది నవంబరు 14వ తేదీన దీనికి విశాఖ సీఐఐ సదస్సు నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

➔ లేఅవుట్ ఏర్పాటు చేసిన వెంటనే ఇక్కడ డ్రోన్ల తయారీ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. కర్నూలు ట్రిపుల్ ఐటీ డీఎం భాగస్వామ్యంతో డ్రోన్ రంగంలో గణనీయ అభివృద్ధి సాధించేందుకు వీలుగా ప్రభుత్వం మార్గదర్శిని సిద్ధం చేసింది. డ్రోన్ రంగంలో పెద్దఎత్తున ఉపాధి లభించేలా త్వరలో శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుంది.

ఇక్కడే విద్యుత్తు వాహనాల తయారీ

➔ విద్యుత్తుతో నడిచే వాహనాలకు రోజు రోజుకు ఆదరణ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కర్నూలులో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రం మార్గదర్శకానికి వీలుగా 'ఈవీ పార్క్' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

➔ 1,200 ఎకరాల్లో ఏర్పాటు కాబోయే ఈ ప్రాజెక్టులో మొత్తం రూ.13 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఈ ఒక్క ఈవీ పార్క్ ద్వారానే ఏకంగా 25 వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది.

నేత్రశోభితం.. నారాయణుడి ఉత్సవం

అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగించారు. వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆళ్వారుల చెంత అర్చకులు వేదప్రబంధ పారాయణాలు పఠించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ధనుర్మాస పూజల్లో భాగంగా గోదాదేవి సన్నిధిలో పాశురాన్ని స్వామికి విన్నవించారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, సీఐవో రామానుజన్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. – న్యూస్‌టుడే, అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం)

ప్రమాదాల చిట్టా ఐ-రాడ్‌లో నిక్షిప్తం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల వివరాలు పక్కాగా నమోదు చేయాలని కేంద్రం ఆదేశించింది.. ఇందులో భాగంగా తాజాగా 'ఐ-రాడ్' (ఇంటిగ్రేటెడ్ యాక్సిడెంట్ డేటాబేస్) యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఏదైనా ప్రమాద ఘటన జరిగినప్పుడు ప్రమాదస్థలికి పోలీసులు చేరుకున్న వెంటనే ప్రమాదం జరిగిన సమయం, జరిగిన తీరు, కారణాలను వివరిస్తూ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.

● ఏ సమయంలో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.. ఏ వాహనాలు అధికంగా ప్రమాదాలకు గురవుతున్నాయి.. ఏ స్థలం ప్రమాదకరంగా ఉందనే వివరాలు యాప్‌లో నమోదవుతాయి. రహదారి నిర్మాణ లోపాలుంటే వెంటనే వాటినీ అప్‌లోడ్ చేస్తారు. దీని ఆధారంగా పోలీసులు, ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటారు. రహదారులపై ఎన్‌హెచ్ఏఐ సంస్థ గుర్తింపు చిహ్నాలు(సైన్ బోర్డులు), క్రాసింగ్ లైన్స్, బారికేడ్లు ఏర్పాటు చేస్తారు.

అంశం	2024	2025
ప్రమాదాలు	1075	1208
మృతులు	571	566

● ప్రమాదం జరిగినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే క్షతగాత్రుల వివరాలను వైద్య సిబ్బంది 'ఐ-రాడ్' యాప్‌లో నమోదు చేయాలి. దీని ద్వారా ప్రమాదం జరిగిన స్థలం, క్షతగాత్రుడి చిరునామా, చరవాణి సంఖ్యల సమాచారం పోలీసులకు చేరుతుంది. కేసు నమోదు తర్వాత విచారణకు అవసరమైన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో పోలీసులు సులభంగా తీసుకునే అవకాశం ఉంది.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ సునీల్ షొరాణ్

జిల్లా అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. ప్రజా సంక్షేమం, పారదర్శక పరిపాలన, ఉత్తమ సేవలు అందించేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ సునీల్ షొరాణ్, జేసీ కొల్లాబత్తుల కార్తీక్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు గురువారం కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో గతేడాది అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలను కలెక్టర్ గుర్తు చేశారు. కొత్త సంవత్సరంలో అందరూ కలిసికట్టుగా పనిచేస్తే జిల్లాను అన్నిరంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చని వివరించారు.

నాణ్యత తేలింది.. ఊపిరి ఆగుతోంది

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వివిధ జాతీయ రహదారులు వెళుతున్నాయి. ప్రతి వాహనం నుంచి టోల్ వసూలు చేస్తున్నారు. అందుకు తగ్గట్టు వసతులు కల్పించాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో రహదారుల నిర్వహణ అధ్వానంగా మారింది. గుంతలు తేలినా పట్టించుకోవడం లేదు. విశ్రాంత గదుల్లో సౌకర్యాలు కరవయ్యాయి. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అస్తవ్యస్తంగా జాతీయ రహదారుల నిర్వహణ

హైదరాబాద్– బెంగళూరు రహదారిలో అమకతాడు టోల్‌ప్లాజా వద్ద మృత్యు గుంత

రూ.కోట్లు సమకూరుతున్నా..

డోన్ నుంచి కర్నూలు వైపునకు వెళ్లే జాతీయ రహదారిలో 12 కి.మీ. దూరంలో అమకతాడు టోల్‌ప్లాజా ఉంది. డోన్ హైవే మీదుగా రోజుకు 16 వేలకు పైగా వాహనాలు తిరుగుతుంటాయి. టోల్‌ప్లాజా పరిధిలో రోజుకు రూ.5 లక్షలకు పైగా వసూలవుతోంది. నెలకు రూ.1.50 కోట్ల వరకు ఆదాయం సమకూరుతూ ఉంటుంది. అయినప్పటికీ వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించడం లేదు. – న్యూస్‌టుడే, డోన్ నేరవిభాగం

వాహనదారుల ఇక్కట్లు

చాగలమర్రి, పట్టణం మీదుగా 40వ నంబరు జాతీయ రహదారి వెళుతోంది. చాగలమర్రి సమీపంలో టోల్‌ప్లాజా ఉంది. దీనికి సమీపంలో ప్రయాణికులు విశ్రాంతి తీసుకునేందుకు గదులు లేవు. మరుగుదొడ్లకు నిత్యం తాళాలు వేసి ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రోజూ 7 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. టోల్‌ప్లాజా వద్ద నామమాత్రంగా మరుగుదొడ్లు ఉన్నాయి. కొన్ని శౌచాలయాలకు తాళాలు వేశారు. ఫలితంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, చాగలమర్రి

ప్యాచ్‌వర్కులతో సరి..

❑ ఉమ్మడి జిల్లాలో ముఖ్యంగా ఎన్‌హెచ్ 40, ఎన్‌హెచ్ 44 రహదారులు వెళుతున్నాయి. వీటి నిర్వహణ అధ్వానంగా మారింది. ఏటా రూ.కోట్లలో వాహనదారుల నుంచి టోల్ రుసుము వస్తున్నా అందుకు తగ్గట్టు సౌకర్యాలు కల్పించడం లేదు.

❑ కర్నూలు-ప్యాపిలి మధ్య చాలా ప్రాంతాల్లో రహదారి గుంతలు పడి అధ్వానంగా మారింది. ప్యాచ్‌వర్క్ చేస్తున్నారే తప్ప బీటీ లేయర్ వేయడం లేదు.

❑ టోల్‌ప్లాజాకు ఇరువైపులా రహదారి మధ్యలో కొన్ని విద్యుద్దీపాలు వెలగడం లేదు.

❑ హైవేలో కొన్ని గ్రామాల వద్ద ఉపరితల వంతెనలు నిర్మించారు. అక్కడ కూడా రహదారి మధ్యలో దీపాలున్నా రాత్రివేళ వెలగడం లేదు.

❑ డోన్ మండలం దొరపల్లి రైల్వే వంతెనపై కొన్ని నెలలుగా దీపాలు వెలగకున్నా పట్టించుకోవడం లేదు.

❑ అమకతాడు టోల్‌ప్లాజా వద్ద ఒకవైపు ఆరు, మరోవైపు ఆరు కౌంటర్లు ఉంటాయి. పనిచేసేది మాత్రం మూడు కౌంటర్లు మాత్రమే.

❑ కొన్ని కౌంటర్ల వద్ద వాహనాలు వెళ్లకుండా అడ్డుగా ప్లాస్టిక్ డబ్బాలు పెట్టారు. అవి దగ్గరికి వస్తేగానీ కనపడవు. ఫలితంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

❑ స్నానం గదులకు నీటి సరఫరా అంతంత మాత్రంగా ఉంది. కొన్నింటికి తలుపులు సరిగా లేవు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి.

పేదింటి బిడ్డ.. కబడ్డీలో దిట్ట

దేవనకొండ మండలం గుడిమిరాళ్ల గ్రామానికి చెందిన వెంకటేశ్ డోన్‌లోని జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతూ వసతిగృహంలో ఉంటున్నారు. ఇతని తల్లిదండ్రులు వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వెంకటేశ్ ఓవైపు చదువుకుంటూనే.. మరోవైపు తనకిష్టమైన కబడ్డీలో రాణిస్తూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గతేడాది అక్టోబరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డోన్‌లో జరిగిన డివిజన్ స్థాయి పోటీల్లో సత్తా చాటి జిల్లాస్థాయి జట్టులో స్థానం సంపాదించాడు. గతేడాది నవంబరులో కర్నూలులో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్రస్థాయి జట్టులోకి ప్రవేశించారు. అదే నెలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. "జాతీయస్థాయిలో రాణించడమే తన లక్ష్యమని.. భవిష్యత్తులో సైన్యంలో చేరి దేశానికి సేవలందిస్తానని" వెంకటేశ్ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, డోన్ పట్టణం

పనుల్లో పారదర్శకత..

అక్రమాలకు అడ్డుకట్ట

■ వీబీ-జీ రామ్ జీతో 125 పని దినాలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికాహామీ మిషన్ (గ్రామీణ్). (వీబీ-జీ రామ్ జీ) బిల్లు తీసుకొచ్చి చట్టం చేసింది. దీనిద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఏటా 125 పని దినాలు లభిస్తాయి. వ్యవసాయ పనులప్పుడు. నూర్పిళ్లు ఎక్కువగా ఉన్న సమయంలో కూలీల కొరత లేకుండా 60 రోజులపాటు ఈ పథకాన్ని ఆపేస్తారు. గ్రామ పంచాయతీల ద్వారానే పనుల ప్రణాళిక, పర్యవేక్షణ జరుగుతుంది. చేసిన పనులే చేసి పైపై మెరుగులు దిద్ది వదిలేసే పనులు ఇక ఉండవు. మట్టి పనులు తగ్గించి గ్రామీణాభివృద్ధికి అవసరమయ్యే శాశ్వత పనులు చేపట్టనున్నారు.

జిల్లా	జాబ్‌కార్డులున్న కుటుంబాలు	పనికి హాజరయ్యేవారు
కర్నూలు	3.34 లక్షలు	4.80 లక్షలు
నంద్యాల	2.63 లక్షలు	2.25 లక్షలు

రూ.కోట్ల నిధులు పక్కదారి

గతంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పని ప్రదేశంలో కూలీలను గ్రూపుగా నిలబెట్టి ఫొటో తీసి హాజరు వేసే విధానం అమలుచేశారు. అయినప్పటికీ దొంగ మస్టర్లకు అడ్డుకట్ట పడలేదు. ఐదేళ్ల కిందట కేవలం హాజరు పట్టిక మాత్రమే ఉండగా.. భారీగా అక్రమాలు జరిగాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చేస్తున్నవారి పేర్లు సైతం నమోదు చేసి వేతనాలు స్వాహా చేశారు. రూ.కోట్లలో ఉపాధి నిధులను పక్కదారి పట్టించారు. సోషల్ ఆడిట్‌లో అక్రమాలు వెలుగు చూసినా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేకపోయారు.

ఈ-కేవైసీకి 1.43 లక్షల మంది దూరం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 6 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులున్నాయి. కూలీలకు ఉపయోగపడే పథకం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ముఖ ఆధారిత హాజరు అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా జాబ్ కార్డులన్నింటినీ ఈ-కేవైసీ చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికీ సుమారు 1.43 లక్షల మంది ఈ-కేవైసీకి దూరంగా ఉన్నారు. ప్రక్రియ పూర్తి చేసుకున్నవారికి మాత్రమే పని జరిగే ప్రాంతంలో ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంటుంది.

5 నుంచి గ్రామ సభలు

✦ నూతన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకుగాను ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా 5వ తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నారు. ఒక్కో సభ నిర్వహణకు రూ.2 వేలు కేటాయించారు. సభ నిర్వహణ, బ్యానర్లు, కరపత్రాలు తదితర వాటికి ఈ నిధులు ఖర్చు చేయనున్నారు.

✦ ఈ ఏడాది మార్చి వరకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరుతోనే కొనసాగనుంది. మార్చి నెలాఖరులోగా ప్రతిపాదించిన పనులన్నీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఏప్రిల్ 1 నుంచి నూతన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వస్తుంది.

వీటికి ప్రాధాన్యం

✦ నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీచార్జి, చెరువులు, కుంటల పునరుజ్జీవం, వాటర్‌షెడ్ల అభివృద్ధి, బావుల తవ్వకం, మైక్రో ఇరిగేషన్ ఛానళ్ల నిర్మాణం.

✦ విద్య, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, పునరుత్పాదక ఇంధనం, సామాజిక సేవలకు ప్రాధాన్యం.

✦ వ్యవసాయం, పశుసంవర్ధక, చేపల పెంపకం, నైపుణ్య శిక్షణలు ఇస్తారు.

✦ తుపాను, వరద తదితర వాటిని ఎదుర్కొనే పనులు చేపడుతారు. పునరావాసం, పునరుద్ధరణ, గ్రామీణ రహదారులు అభివృద్ధి చేస్తారు.

ఆనంద క్షణం.. చెమ్మగిల్లిన నయనం

కొడుకు, మనవడు, మనవరాళ్ల మృతితో రోదిస్తున్న చిన్న సుబ్బరాయుడు

జీవిత భాగస్వామి దూరమైంది..
ఒంటరి జీవనం భారమైంది.!
పిల్లలను ఉగ్గుపాలతో పెంచిన తండ్రి..
'పాలకూట' విషమిచ్చి ప్రాణాలు తీశారు

ఉయ్యాలవాడ మండలం తుడుములదిన్నెకు చెందిన వేములపాటి సురేంద్ర (35) తన ముగ్గురు పిల్లలు కావ్యశ్రీ (7), ధ్యానేశ్వరి (4), సూర్య గగన్ (2)లకు పాలల్లో విషద్రావణం కలిపి తాగించారు. అనంతరం తాను ఇంటి పైకప్పునకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు.

సరదాగా పల్లె'టూరు'కెళ్లారు
జలదృశ్యం ఆహ్వానించింది..
క'న్నీటి' సుడిలో చిక్కుకొని ఊపిరొదిలారు!

ఓర్వకల్లు మండలం పాలకొలనులో చెక్‌డ్యాం కుంటలో ఈతకు వెళ్లిన అస్లాం (14), వినయ్ (14)లు నీట మునిగి మృత్యుఒడికి చేరారు.

ఇద్దరు విద్యార్థులను మింగిన కుంట

యువతరం కొత్త సంబరం చేసుకొంది
తిరుగు ప్రయాణం లేని గమ్యానికి చేరింది.
తల్లిదండ్రుల కల చెదిరింది..
కన్నీటి అల కడలిలో ముంచింది.!

ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జరిగిన రహదారి ప్రమాదాల్లో ఐదుగురు యువకులు భరత్ (24)(నందికొట్కూరు), షేక్ మౌలాలి (25)(బండిఆత్మకూరు), సమీర్ (19)(ఆళ్లగడ్డ), నాయక్ ఈరన్న(35) (కపటి), కట్ట ఈరన్న(35) (పెద్దతుంబళం)లు మృత్యువాత పడ్డారు.

★ ఉమ్మడి జిల్లాలో కొత్త ఏడాది తొలిరోజు జరిగిన వివిధ ఘటనల్లో ఐదుగురు విద్యార్థులు, ఐదుగురు యువకులు మృతి చెందడం.. కన్నపేగుకు విషాదం మిగిల్చింది.

అయ్యప్పకు అష్టాదశ కలశ పూజ

నంద్యాల పట్టణం గుడిపాటిగడ్డలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామికి అష్టాదశ కలశ పూజా మహోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీక్షా స్వాములు, అయ్యప్పస్వామి సేవాసమితి ఆధ్వర్యంలో రాత్రి పూజలు చేశారు. ఉదయం స్వామికి పంచామృతాభిషేకాలు, అర్చనలు జరిపారు. – న్యూస్‌టుడే, నంద్యాల గాంధీచౌక్

కళారాధన

శ్రీశైల మహాక్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా గురువారం జరిగిన సంప్రదాయ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన శ్రీదేవి నృత్య కళాక్షేత్రం బృందం సభ్యులు పలు ఆధ్యాత్మిక గీతాలకు సంప్రదాయ నృత్యాలు చేశారు. కళాకారులను దేవస్థానం అధికారులు సత్కరించారు. – న్యూస్‌టుడే, శ్రీశైలం, నంది సర్కిల్

పల్లె బిడ్డలు.. దేశ సైనికులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : సైన్యంలో చేరాలన్నది వారి కల.. ఇలాంటి ఆలోచన ఉన్న 20 మంది జట్టు కట్టారు.. ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలుర మైదానాన్ని వేదికగా చేసుకున్నారు. తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 8 గంటల వరకు కష్టపడ్డారు. వీరి పట్టుదలను గమనించిన పీఈటీ మల్లికార్జున మరిన్ని మెలకువలు నేర్పించారు. ఉద్యోగ ప్రకటన వచ్చిన వెంటనే మరింత శ్రమించారు. మొత్తం 14 మంది సైనిక ఉద్యోగాలకు ఎంపికయ్యారు. తమ విజయపథాన్ని 'న్యూస్‌టుడే'తో పంచుకొన్నారు.

నిత్యం 4 గంటల సాధన

– ఎల్లప్ప, వెంకటాపురం

నేను ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశా. అమ్మానాన్నలు గుంటెమ్మ, శంకర్‌లు కూలీ పనులు చేస్తున్నారు. ఆర్మీలో ప్రవేశం పొందాలని పదో తరగతిలోనే లక్ష్యం నిర్దేశించుకొన్నా. మా గురువు సహకారంతో నిత్యం సాధన చేశా. నాలుగు గంటల పాటు రాళ్లు ఎత్తడం, పరుగులో సాధన చేశా. నియామక ప్రకటన వచ్చిన వెంటనే స్నేహితులమంతా కలిసి చదువుకొన్నాం. పరీక్షలు రాసి జవానుగా ఎంపికయ్యా. ఏడు నెలల పాటు శిక్షణ తీసుకున్నా. అసోంలో విధుల్లో చేరుతున్నా.

రెండో ప్రయత్నంలో..



– విల్సన్, చెట్నిహళ్లి

సైనిక ఉద్యోగం తెచ్చుకోవాలన్న పట్టుదలతో సాధన చేశా. రోజూ మైదానంలో ఏడు కిలోమీటర్లు రన్నింగ్ చేశా. అమ్మానాన్నలు జయమ్మ, చిన్న తిక్కయ్య కూలీ పనులు చేస్తారు. వారికి అండగా ఉండాలని నిర్ణయించుకున్నా. ఏదైనా ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో మూడేళ్లపాటు సాధన చేశా. రెండోసారి పరీక్ష రాసి ఎంపికయ్యా. ఏడు నెలల పాటు బెంగళూరులో శిక్షణ ఇచ్చారు. తుపాకీ గురిపెట్టడం తదితరాలు నేర్చుకున్నా. జమ్మూకశ్మీర్ సెక్టార్‌లో ఉద్యోగం వచ్చింది.

క్రమశిక్షణతో రాణిస్తాం

– వెంకటేశు (హాలహర్వి), కల్యాణ్ (మంత్రాలయం)

మేమిద్దం మంచి స్నేహితులం. సైన్యంలోకి వెళ్లాలన్న ఉద్దేశంతో పదో తరగతి నుంచి సాధన చేయడం ప్రారంభించాం. మైదానంలో లాంగ్‌జంప్, రన్నింగ్, ఇతర క్రీడలు ఆడాం. పరీక్షల్లో ఉత్తీర్ణులై ఆర్మీ ఉద్యోగానికి ఎంపికయ్యాం. లడఖ్(వెంకటేశు), పంజాబ్ (కల్యాణ్)లో విధుల్లో చేరేందుకు సిద్ధమయ్యాం. క్రమశిక్షణతో ఉద్యోగంలో రాణిస్తాం. దేశ సేవే మా ప్రధాన లక్ష్యం.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97628
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 13479

(c) eenadu

ఆలోచన మెరిసెన్.. పక్షులను తరిమెన్

జొన్న, సజ్జ తదితర పంటల సమయంలో కంకులకు గింజలు పడిన నాటి నుంచి కోత కోసే వరకు పిట్టలు, చిలుకలు ఇతర పక్షుల నుంచి బెడద తీవ్రంగా ఉంటుంది. ఇలాంటి సమయాల్లో పంట రక్షణ కోసం అన్నదాతలు నిత్యం శబ్దాలు చేస్తూ వాటిని తరుముతుంటారు. కానీ చాగలమర్రిలో కొందరు రైతులు చిన్న ఉపాయంతో సమస్యకు చెక్ పెడుతున్నారు. ఆహార పదార్థాలు, ఇతర పార్సిళ్లు చేసే ప్లాస్టిక్ షైనింగ్ కవర్లను చేనంతా తీగల్లా కట్టారు. గాలికి కవర్లు ఊగి శబ్దాలు రావడంతోపాటు సూర్యకాంతి పడి మెరుస్తుంది. దీంతో పక్షులు పంటపై వాలడం లేదని రైతులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, చాగలమర్రి

కాశయ్య వనం.. ఆరోగ్యం ఘనం

బనగానపల్లి పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో ప్రజలకు కాశయ్య తోట అంటే తెలియని వారు ఉండరు. జనాలకు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి అంటే తెలియదు కానీ కాశయ్య తోట ఆసుపత్రి అంటేనే గుర్తుపడతారు. చెన్నై వాసి అయిన కాశయ్య 120 ఏళ్ల క్రితం చెన్నై నుంచి ఇక్కడికి వచ్చి బనగానపల్లి శివారులో పదెకరాల పొలం కొన్నారు. ఆయుర్వేదంలో సిద్ధహస్తుడైన ఆయన పొలంలోనే వివిధ రకాల వనమూలికల మొక్కలు పెంచి ఔషధాలు తయారు చేసేవాడు. అనారోగ్యానికి గురైన రోగులకు చికిత్సతోపాటు మందులను ఉచితంగా ఇచ్చేవారు. ఇలా 20 ఏళ్లకు పైగా చుట్టుపక్కల వారికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఆయన జీవిత చరమాంకంలో పదెకరాల పొలాన్ని ఓ ట్రస్టుకు దానం చేశారు. 1986లో ఆయన మరణానంతరం ఇదే స్థలంలో ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఏర్పాటైంది. కాశయ్య నివాస గృహం, చికిత్స అందించేందుకు గదిని, అలాగే పేదలు పెళ్లిళ్లు చేసుకునేందుకు ఓ షెడ్డును నిర్మించారు. పట్టణ వాసులు ఉదయం, సాయంత్రం వేళల్లో చెట్ల నీడన సేద తీరుతుంటారు. – న్యూస్‌టుడే, బనగానపల్లి

ఆహ్లాదకరంగా తోట
కాశయ్య విగ్రహం (అంతర చిత్రం)

వైభవంగా మద్దిలేటయ్య తెప్పోత్సవం

ఆర్‌ఎస్ రంగాపురం శివారులోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో గురువారం ముక్కోటి ఏకాదశి బ్రహ్మోత్సవాల సందర్భంగా తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈవో, ఆలయ ఉపకమిషనర్ రామాంజనేయులు, తెదేపా మండల కన్వీనర్, మాజీ ఛైర్మన్ ఉన్నం ఎల్లనాగయ్య ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం మద్దులేరు కోనేరులో అంగరంగ వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. చివరి రోజు కావడంతో పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. – న్యూస్‌టుడే, ఆర్‌ఎస్ రంగాపురం(బేతంచెర్ల)

అంబులెన్సును ప్రారంభిస్తున్న దాత, గ్రామస్థులు

పల్లెలకు అంబులెన్సు సౌకర్యం

అవుకు, న్యూస్‌టుడే: కనీస వైద్య సౌకర్యాలు లేని కొండ మీది గ్రామాల వాసులకు దాత సహకారంతో అంబులెన్సు సౌకర్యం సమకూరింది. కొండమనాయునిపల్లెకు చెందిన తెదేపా నాయకుడు ఆకుల నాగిరెడ్డి రూ.8 లక్షలు సొంత నిధులను వెచ్చించి అంబులెన్సును గురువారం ప్రారంభించారు. కొండమనాయునిపల్లె, జూనూతల, మారెమడుగుల, పెట్నికోట తదితర గ్రామ ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వైద్యశాలలకు వెళ్లేందుకు అంబులెన్సును వినియోగించుకోవచ్చని దాత నాగిరెడ్డి తెలిపారు. వాహనం 24 గంటలు అందుబాటులో ఉంటుందని, అవసరమైన వ్యక్తులు 4710857108 నంబరులో సంప్రదించవచ్చన్నారు. వాహనాన్ని అందుబాటులోనికి తీసుకు రావడంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెదేపా నాయకులు శివారెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బాట.. గెలుపు బావుటా

■ జాతీయ స్థాయిలో గుర్తింపు
■ తాడాట, కరాటేలో రాణిస్తున్న చిన్నారులు

పత్తికొండ, తుగ్గలి, న్యూస్‌టుడే: వారు ఆడే ఆటపై పట్టు సాధించారు. ఏ స్థాయిలో పాల్గొన్నా.. పతకాలు అందిపుచ్చుకుంటున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటూ తమ ప్రత్యేకతను చాటుతున్నారు. తుగ్గలి సాధారణ పాఠశాల విద్యార్థులు బంగి ఐశ్వర్య, గుండకొండ అరవింద్ ఇటీవల మహారాష్ట్రలోని అలీబాగ్‌లో ఇంటర్ నేషనల్ రోప్ స్కిప్పింగ్ ఆర్గనైజేషన్ మరియు రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్ యాదవ్ క్రీడల్లో విద్యార్థులను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నారు. వెల్దుర్తి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న యశ్మిత గోపజ్ఞ కరాటేలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. గ్రామీణ ప్రాంత విద్యార్థుల విజయాలపై కథనం.

అరవింద్ సమత విజయాలు

మద్దికెర మండలం మదనంతపురం గ్రామానికి చెందిన గుండకొండ గోపాల్ సుంకమ్మ దంపతుల కుమారుడు అరవింద్ ఏడో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ.. కుమారుడిని చదివిస్తున్నారు. ఇటీవల మహారాష్ట్రలో జరిగిన రోప్ స్కిప్పింగ్ పోటీల అండర్-14 విభాగంలో మూడు నిమిషాల (త్రిమినిట్ ఫాస్ట్) ఈవెంట్‌లో పాల్గొని ఎనిమిదో స్థానంలో నిలిచాడు. రోజూ రెండు గంటల పాటు సాధన చేస్తున్నాడు. క్రీడలతో మానసిక, శారీరకంగా ఉల్లాసంగా ఉంటామని, విద్యాభ్యాసంలోనూ మెదడు చురుగ్గా ఉంటుందంటున్నాడు అరవింద్. భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకోవడమే తన లక్ష్యమని చెబుతున్నాడు.

నిత్య సాధనే ఐశ్వర్యం

మద్దికెర మండలం మదనంతపురం గ్రామానికి చెందిన బంగి శివశంకర్, యశోదమ్మ కుమార్తె ఐశ్వర్య తుగ్గలి ఆరో తరగతి చదువుతోంది. మహారాష్ట్రలో జరిగిన రోప్ స్కిప్పింగ్ పోటీల్లో అండర్-12 విభాగంలో 90 సెకండ్స్ ఈవెంట్‌లో పాల్గొని ఆరో స్థానంలో నిలిచింది. చదువుతో పాటు తల్లిదండ్రులు క్రీడా పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. రోప్ స్కిప్పింగ్‌తో పాటు కర్రసాము నేర్చుకొంటోంది. నిత్యం సాధన చేయడంతో ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది. భవిష్యత్తులో ఇంకా విజయాలు సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

గోపజ్ఞ కరాటేలో తెగువ

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తికి చెందిన హరిప్రసాద్‌రావ్, మమత దంపతుల కుమార్తె యశ్మిత గోపజ్ఞ కృష్ణగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే కరాటేపై శిక్షణ పొందింది. చిన్నారిలోని ప్రతిభను గుర్తించిన కరాటే కోచ్ వయాజ్ ప్రత్యేక శ్రద్ధ చూపారు. నిత్య సాధనతో కరాటేలో పట్టు సాధించింది. పల్లె నుంచి జాతీయస్థాయి కరాటే పోటీల్లో పాల్గొని తన ప్రత్యేకతను చాటింది. కృష్ణగిరి పాఠశాలలో చదువుతూనే ప్రస్తుతం ఆన్‌లైన్ తరగతులతో కరాటే శిక్షణ పొందుతోంది.

వరుస పతకాలతో..

గ్రామీణ పాఠశాలలో చదువుతున్న ఈ బాలిక జాతీయ స్థాయి కరాటే పోటీలకు వరుసగా మూడేళ్లు పాల్గొంది. అక్టోబర్‌లో నిర్వహించిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-14 బాలికల కరాటే విభాగంలో మండల స్థాయిలో ప్రతిభ చూపడంతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. డిసెంబర్ 22 నుంచి 26 వరకు రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-14లోని 26 కిలోల బాలికల విభాగంలో బంగారు పతకం సాధించింది. దీంతో మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో వెల్దుర్తికి చెందిన విద్యార్థి పాల్గొంది. ఈ జాతీయ స్థాయి పోటీల్లో వరుసగా మూడేళ్లు పాల్గొంది. జాతీయ స్థాయిలో విజేతగా నిలవాలన్నదే తన లక్ష్యమని చెబుతోంది యశ్మిత గోపజ్ఞ.

అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం అవసరం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. కొత్త ఏడాదిలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం మంత్రి ఫరూక్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రితోపాటు తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, నాయకులు ఫయాజ్‌లను కలిసి పూలమాలలు, శాలువాలు, నోట్ పుస్తకాలు, పెన్నులు, బ్యాగులు ఇచ్చి సత్కరించారు.

మంత్రి ఫరూక్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

శ్రీశైలంలో వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: శ్రీశైలంలో శాశ్వత పద్ధతిలో వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ శ్రీశైలం ట్రస్ట్ పాలక మండలి సభ్యులకు హామీ ఇచ్చారు. అమరావతిలోని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యులు ఏవీ రమణ, బోడేపూడి వెంకట సుబ్బారావు, శంకరశెట్టి పిచ్చయ్యలు పట్టాభిరామ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. దేవస్థానం చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

పట్టాభిరామ్‌కు దేవస్థానం చిత్రపటం, ప్రసాదం అందజేస్తున్న శ్రీశైలం బోర్డు సభ్యులు

మల్లన్నసేవలో హైకోర్టు న్యాయమూర్తి

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ మహాద్వారం వద్ద దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మహామంగళహారతి సేవలో పాల్గొని స్వామివార్ల స్పర్శ దర్శనం చేసుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో న్యాయమూర్తికి అర్చకులు వేదాశీర్వచనాలు పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. న్యాయమూర్తి వెంట సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తదితరులు ఉన్నారు.

దర్శనానికి వస్తున్న జస్టిస్ రవినాథ్ తిల్హరి

విషాద ఛాయలు.. కన్నీటి చారలు

అర్ధాంతరంగా ముగిసిన యువత ప్రయాణం

మలుపు తిరిగిన జీవితాలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణానికి చెందిన యువకుడు దోర్నాల ఘాట్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం..నందికొట్కూరుకు చెందిన ఠాగూర్, భరత్, ఆత్మకూరుకు చెందిన బాషా, కర్నూలుకు చెందిన గణేష్ గురువారం కారులో విజయవాడకు బయల్దేరారు. దోర్నాల సమీపాన ఘాట్‌రోడ్డులో మలుపు వద్ద కారు చెట్టుకు ఢీకొంది. డ్రైవింగ్ చేస్తున్న భరత్‌కు తీవ్రగాయాలు కాగా.. మిగతా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్నవారు గమనించి, యువకులను కారులో ఎక్కించుకుని నందికొట్కూరు ఆసుపత్రికి తీసుకొచ్చారు. బాషా ఆత్మకూరులో దిగిపోయాడు. గణేష్, ఠాగూర్‌లను ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు పంపించారు. చికిత్స పొందుతూ భరత్(24) మరణించినట్లు తెలిపారు. అశోక్ ఆచారి, ఉమాదేవి దంపతులకు భరత్ ఏకైక కుమారుడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భరత్(పాత చిత్రం)

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ.. యువకుడి దుర్మరణం

మౌలాలి (పాతచిత్రం)

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ చాంద్‌బాషా కథనం ప్రకారం.. బండిఆత్మకూరు గ్రామానిక చెందిన షేక్ మౌలాలి(25) తన అక్కను అయ్యలూరి మెట్టలోని ఆమె ఇంట్లో దింపడానికి గురువారం ద్విచక్రవాహనంపై తీసుకెళ్లాడు. అక్కడ బావతో కలిసి భోజనం చేసి, తిరుగు ప్రయాణమయ్యాడు. పట్టణ శివారులోని ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో మౌలాలిని ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందినట్లు సీఐ పేర్కొన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దిక్కులేనివారయ్యారు

నాయక్ ఈరన్న (పాత చిత్రం)

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: కపటి గ్రామానికి చెందిన రైతు నాయక్ ఈరన్న(35) పొలం పనులు చేసుకొంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. భార్య రాధమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నూతన గ్రామస్థులతో కలిసి నాయక్ ఈరన్న గురువారం మధ్యాహ్నం ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఇంటికి వెళ్లి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత ఈరన్న, గ్రామానికి చెందిన వీరేశ్ కలిసి ద్విచక్రవాహనంపై పని నిమిత్తం ఎమ్మిగనూరు పట్టణానికి వెళ్లి రాత్రి స్వగ్రామానికి బయల్దేరారు. రహదారి ప్రమాదంలో ఈరన్న తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందినట్లు తాలుకా ఎస్సై రామాంజనేయులు తెలిపారు. ప్రమాదం ఎలా జరిగిందో తెలియాల్సి ఉందన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్యా పిల్లలు విషాదంలో మునిగారు.

ఆళ్లగడ్డ పట్టణ శివారులో..

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పట్టణ శివార్లలోని కడప రోడ్డుపై గురువారం రాత్రి జరిగిన రహదారి ప్రమాదంలో సమీర్ (19) అనే యువకుడు మృతి చెందాడు. ఆళ్లగడ్డ పట్టణం సద్దాం కాలనీకి చెందిన సమీర్ ద్విచక్ర వాహనంపై తన ఇద్దరి స్నేహితులతో కలిసి చాగలమర్రి వైపునకు వెళ్తుండగా కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతడితో పాటు ప్రయాణిస్తున్న మిగిలిన స్నేహితులు దూరంగా ఉన్న కాల్వలో పడిపోయి తర్వాత పారిపోయినట్లు సమాచారం. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో జరిగిందా.. వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారా అన్నది తెలియాల్సి ఉంది.

వలస వెళ్లి.. మృత్యుఒడికి

కట్ట ఈరన్న (పాత చిత్రం)

ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన చెరువు కట్ట ఈరన్న(35) మూడు నెలల కిందట కర్ణాటక రాష్ట్రం చిక్‌మగళూరు జిల్లా కడూర్ తాలూకా శివపూర్ గ్రామానికి వలస వెళ్లారు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత నెల 31న పొలం పనులు చేస్తున్న సమయంలో ట్రాక్టరు ప్రమాదవశాత్తు ఈరన్నను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గుర్తించిన స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ.. శివపూర్ గ్రామానికి వెళ్లారు.

ఏపీటీఎఫ్ దైనందిని, కాలమానిని ఆవిష్కరణ

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ 1938 సంఘానికి సంబంధించిన నూతన సంవత్సర కాలమానిని, దైనందినిని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యుడు సాంబశివుడు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, నగిరి శ్రీనివాసులు ఆవిష్కరించారు. డీఈవో కార్యాలయంలో గురువారం వీటిని పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాల పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఏపీటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని డీఈవో పేర్కొన్నారు. నాయకులు కమలాకర్‌రావు, రవికుమార్, లాజరస్, గోపాల్‌రావు, జయరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలో జిల్లా విద్యాధికారి జనార్దన్‌రెడ్డి తదితరులు

3న మల్లన్నకు వార్షిక ఆరుద్రోత్సవం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 3న శ్రీమల్లికార్జునస్వామికి వార్షిక ఆరుద్రోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ధనుర్మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం రోజున ఉత్సవం జరిపిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం(2వ తేది) రాత్రి 10 గంటలకు శ్రీస్వామివారికి మహాన్యాస పూర్వక లింగోద్భవకాల ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహిస్తారన్నారు. 3వ తేదీన తెల్లవారుజామున సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజలు జరిపిస్తారన్నారు. శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళహారతులతో పూజించి నంది వాహనంపై వైభవంగా గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఏపీ టూరిజం హరిత హోటల్ పేరుతో మోసం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : ఏపీ టూరిజం హోటల్ హరిత పేరుతో వసతి గది బుకింగ్ చేసుకున్న ఒక భక్తుడు మోసపోయిన ఘటన గురువారం వెలుగు చూసింది. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఎం.పవన్‌కుమార్ జనవరి ఒకటో తేదీకి వసతి గది పొందేందుకు ఏపీ టూరిజం పేరుతో ఉన్న వెబ్‌సైట్‌ను ఆశ్రయించారు. రూ.2800 చెల్లింపులు చేశారు. గురువారం శ్రీశైలం వచ్చి స్థానిక ఏపీ టూరిజం హరిత రిసార్ట్‌కు వెళ్లి రసీదు చూపించగా, అది నకిలీదని సిబ్బంది వెల్లడించారు. దీంతో చేసేదేమీ లేక భక్తుడు దేవస్థానం వసతి గది తీసుకొని బస చేశారు. ఏపీ టూరిజం హోటల్ హరిత పేరుతో యథేచ్ఛగా నకిలీ వెబ్‌సైట్ నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు కేవలం ఫిర్యాదు చేసి వదిలేయడంతో మోసాలు కొనసాగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వృద్ధురాలి ఆత్మహత్య

గడివేముల, న్యూస్‌టుడే: మండలంలోని సోమాపురం గ్రామానికి చెందిన మహబూబ్‌బీ(77) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నాగార్జున రెడ్డి తెలిపారు. డిసెంబర్ 21న పురుగుల మందు తాగగా.. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక 31న రాత్రి మరణించినట్లు చెప్పారు. మృతురాలు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడడంతోపాటు కళ్లు కనిపించకపోవడంతో జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుమారుడు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రూ.6 కోట్ల మద్యం తాగేశారు

జిల్లాలో బుధవారం ఒక్కరోజే రూ.6 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తెగ తాగేశారు. దుకాణాలన్నీ మందుబాబులతో కిటకిటలాడాయి. జిల్లాలోని 115 మద్యం దుకాణాలు, 20 బార్లలో ఈ అమ్మకాలు సాగినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, మద్యం డిపో మేనేజరు నగేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నూతన సంవత్సర సంబరాలు ప్రశాంతంగా జరిగినట్లు వారు చెప్పారు.

– న్యూస్‌టుడే, నంద్యాల నేరవిభాగం

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, కర్నూలు, పర్యావరణ్ భవన్, లేబర్ కాలనీ, వి.ఆర్.కాలనీ,
కర్నూలు- 518003, ఫోన్ : 08518-235800, ఈమెయిల్ : roknl-ee1@appcb.gov.in

LiFE Lifestyle for Environment

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

భారత ప్రభుత్వము, పర్యావరణము, వాతావరణ మార్పు మరియు అడవుల మంత్రిత్వ శాఖ, ప్రకటన నెం.ఎస్.ఓ.1533, తేది: 14.09.2006 మరియు తదుపరి సర్క్యులర్స్‌కు అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారు మెస్సర్స్ ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ వారి పేరున – ఆంధ్రప్రదేశ్, నంద్యాల జిల్లా, మిడ్తూరు మండలం, నాగలూటి గ్రామం, సర్వేనెం.177 నందు 18.071 హెక్టార్ల విస్తీర్ణంలో 74,990.6 టిపిఏల ఉత్పత్తి సామర్థ్యం గల క్వార్ట్జైట్ మైనింగ్ చేయుటకు ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన జారీ చేయబడినది. సదరు ప్రతిపాదిత ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరములు క్రింద తెలుపబడినవి.

1. కంపెనీ పేరు, టెలిఫోన్ నెం. మరియు చిరునామా	మెస్సర్స్ ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ (18.071 హెక్టార్ల క్వార్ట్జైట్ మైను), ప్లాటు నెం.1, సర్వేనెం.83/1, ఐకియా ఎదురుగా, అరోబిందో గ్యాలెక్సీ టవర్స్, 16వ అంతస్తు, ఎ-వింగ్, రాయదుర్గం, శేరిలింగంపల్లి, హైదరాబాద్, తెలంగాణ, ఇండియా – 500081, సెల్: 9490091686
2. ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రదేశం & భూమి విస్తీర్ణం	సర్వేనెం.177, నాగలూటి గ్రామం, మిడ్తూరు మండలం, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు విస్తీర్ణం 18.071 హెక్టార్లు
3. సంప్రదించవలసిన అధికారి పేరు, చిరునామా మరియు ఫోన్ నెంబరు	శ్రీ పి.మనోజ్‌కుమార్‌రెడ్డి, మేనేజర్, మెస్సర్స్ ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్, సర్వేనెం.177, నాగలూటి గ్రామం, మిడ్తూరు మండలం, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్ ఫోన్ :9490091686, ఈమెయిల్: srinivasaulu.b@indosolsolar.com
4. ప్రతిపాదిత ప్రాజెక్టుకు కేటాయించిన పెట్టుబడి	రూ.75.0 లక్షలు
5. ప్రతిపాదిత కార్యకలాపాల సామర్థ్యం	74,990.6 టిపిఏల సామర్థ్యం గల క్వార్ట్జైట్ మైనింగ్ కొరకు
6. ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : 04.02.2026 (బుధవారం), సమయం: ఉ.11.00గం॥లకు ప్రదేశం : మైను లీజు ఏరియా దగ్గర, అనగా సర్వేనెం.177, నాగలూటి గ్రామం, మిడ్తూరు మండలం, నంద్యాల జిల్లా

7. ప్రతిపాదిత ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరములు సదరు ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సమ్మరీ (తెలుగు & ఇంగ్లీష్) & డ్రాఫ్ట్ క్లస్టర్ EIA/EMP రిపోర్టు ప్రజల సౌకర్యార్థం ఈ క్రింద కార్యాలయములలో లభ్యపరచడమైనది.
ఎ) జిల్లా రెవిన్యూ అధికారి మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, నంద్యాల జిల్లా
బి) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, ఎపిపిసిబి, జోనల్ కార్యాలయం, కర్నూలు
సి) ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, ఎపిపిసిబి, ప్రాంతీయ కార్యాలయం, కర్నూలు
డి) జనరల్ మేనేజర్ వారి కార్యాలయము, జిల్లా పరిశ్రమల కేంద్రం, నంద్యాల, నంద్యాల జిల్లా
ఇ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, జిల్లా పరిషత్, కర్నూలు
ఎఫ్) ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, గ్రామ పంచాయతీ కార్యాలయం, నాగలూటి & పైపాళెం గ్రామాలు, మిడ్తూరు మండలం, నంద్యాల జిల్లా
జి) తహశీల్దారు వారి కార్యాలయము, మిడ్తూరు మండలం, నంద్యాల జిల్లా
హెచ్) పర్యావరణ, అటవీ & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, ప్రాంతీయ కార్యాలయం, (ఐఆర్ఓ) గ్రీన్‌హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్డు, విజయవాడ – 520010

ఈ ప్రాజెక్టు వలన ప్రభావితం అయ్యే ప్రజల నుండి వ్యాఖ్యలు, అభ్యంతరములు ఏవైనా వున్నట్లయితే వాటిని లిఖిత పూర్వకంగా ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 30 రోజులలోపు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి, కర్నూలు వారికి తెలుపవచ్చును. అట్టివారు పైన పేర్కొనబడిన తేదీన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో కూడా పాల్గొని తమ అభిప్రాయములు స్వయముగా తెలుపవచ్చును.

సం/-
ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము,కర్నూలు

ప్రదేశం : కర్నూలు,
తేది : 01.01.2026

అబ్దుల్ కలాం జువెలర్స్ షోరూం ప్రారంభం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని గాంధీచౌక్‌లో అబ్దుల్ కలాం బంగారు, వెండి ఆభరణాల షోరూం గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ఫయాజ్, ఖలీల్ అహమ్మద్, షోరూం యజమాని అబ్దుల్ కలాం తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్

పౌరులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడమే నిజమైన రోడ్డు భద్రత అని కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో గురువారం జాతీయ రోడ్డు భద్రతా మాసం-2026 ప్రారంభోత్సవ బ్యానర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రహదారులపై జరుగుతున్న ప్రమాదాలు అనేక కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెట్టుతున్నాయన్నారు. అందరి బాధ్యతగా భావించి మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది జాతీయ రోడ్డు భద్రతా మాసం నినాదంగా ఎంపిక చేసిన 'శిక్షతో భద్రత, సాంకేతికతతో పరివర్తన' రోడ్డు భద్రత సాధనకు ఎంతో ప్రధానమైందన్నారు. ఉప రవాణాధికారి శివారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జి.రాజకుమారి

ఆధునిక సాంకేతికతతో రోడ్డు ప్రమాదాలు నివారించాలి

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రోడ్డు ప్రమాదాలను ముందుగానే నివారించాలని ఎస్పీ సునీల్ షొరాణ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసం ప్రారంభం సందర్భంగా గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ అధికారి శివారెడ్డి, అధికారులు కలిసి బ్యానర్‌ను ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఏఐ ఆధారిత కెమెరాలు, స్పీడ్ మానిటరింగ్ వ్యవస్థలు, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి స్మార్ట్ ట్రాఫిక్ సూచికలు ఏర్పాటు చేయడంతో రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రత లక్ష్య సాధనకు పోలీసు, ఆర్‌అండ్‌బీ, వైద్య, ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, పురపాలక శాఖలు, ఏపీఎస్ఆర్టీసీ, ఎన్‌హెచ్ఏఐ తదితర అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి, ఎంఈఐలు శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 73821 14647.

CELLPHONES

యశ్విన్ మొబైల్ రిపేర్ ట్రైనింగ్, చిప్‌స్థాయి హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ మొబైల్ రిపేరి వర్క్ నేర్పించబడును. @ డి-మార్ట్ వెనుక, కర్నూలు. ✆ 91103 23814.

REAL ESTATE

మణికంఠ హోమ్స్ వారి లక్ష్మీగ్రీన్ వ్యాలీ పసుపుల గ్రామంలో నూతన వెంచర్ నందు ప్లాట్లు & ఇండ్లు కట్టించి బ్యాంక్ లోన్ సౌకర్యంతో ఇవ్వబడును. శ్రీరామ్: 99853 43829.

FLAT FOR SALE

నంద్యాల చెక్ పోస్ట్ దగ్గరలో మేము కొత్తగా నిర్మించబోయే అపార్ట్ మెంటులో ఫుల్ పేమెంట్ తో 3 flats (1400 Sft, 3 BHK, 1100 Sft, 2BHK) Cost to Cost అమ్మబడును. ఆసక్తి గలవారు సంప్రదించండి. ✆ 72078 97528, 96189 22589.

JOBS

అనుభవం గల కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. వెంకటేశ్వర గ్యాస్ సర్వీసెస్, గిప్సన్ కాలనీ, కర్నూలు. టైం: 11:00 AM - 2:00 PM. ✆ 08518 221316.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

కాలమానిని ఆవిష్కరణ

ఆవిష్కరణలో కలెక్టర్ రాజకుమారి

నంద్యాల విద్య, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా పీఆర్‌టీయూ కాలమానిని, డైరీలను కలెక్టర్ రాజకుమారి ఆవిష్కరించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణయ్య, రాష్ట్ర నాయకులు జగదీష్, శివనాగిరెడ్డి, హనుమంతు, విశ్వనాథరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రఘు ఆధ్వర్యంలో కాలమానిని ఆవిష్కరించి పంపిణీ చేశారు.

నేడు మహానందీశునికి అన్నాభిషేకం

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి 11 గంటల నుంచి తెల్లవారి 3 గంటల వరకు ఆరుద్రోత్సవ పూజలతోపాటు అన్నాభిషేకం చేస్తున్నామని పండితులు తెలిపారు. దేవస్థానం ఆధ్వర్యాన దాతలు వారణాసి రామ్మోహన్‌రావు, విజయకుమారి దంపతుల సహకారంతో చేపడుతున్నామని వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?: నంద్యాల బస్టాండ్ ఎదురుగా, నేషనల్ సుభాష్‌వీధిలో కాల్వలను శుభ్రం చేయడం లేదు. దుర్వాసన, దోమల బెడద అధికమైంది. - **ప్రసాద్, నౌమాన్, వెంకట్**

సమాధానం: సిబ్బందిని పంపి కాల్వలను శుభ్రం చేస్తాం. ముదురును తొలగిస్తాం. - **శివప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ?: మండల కేంద్రం పాణ్యంలో బీసీ కాలనీలో చెత్తను రహదారిపైనే పడవేస్తున్నారు. - **శివకుమార్**

సమాధానం: చెత్తను రోజూ సేకరించేలా చర్యలు తీసుకుంటాం. - **వరలక్ష్మి, ఇన్‌ఛార్జి, ఎంపీడీవో**

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: సిద్దపల్లె రస్తాలో బండలదీపి శివారులో రహదారి గుంతలమయంగా ఉంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - **నజీర్**

సమాధానం: సిమెంటు రహదారి నిర్మాణం పరిశీలిస్తాం. - **రమేష్‌బాబు, కమిషనర్**

?: సంతమార్కెట్‌లో వ్యర్థాలు, చెత్తాచెదారం పేరుకుపోవటంతో దుర్వాసన వెదజల్లుతోంది. - **కుమార్**

సమాధానం: వ్యర్థాలు తొలగిస్తాం. - **జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

మిడుతూరు, న్యూస్‌టుడే: ?: మండలంలోని చౌట్కూరు మజరా గ్రామమైన గుడిపాడు గ్రామంలో ఉపరితల నీటి రవాణా ట్యాంకు వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. శుభ్రం చేయాలి. - **శ్రీనివాసులు**

సమాధానం: పరిసరాలు శుభ్రత చర్యలు తీసుకుంటాం. - **వినయ్, తాత్కాలిక కార్యదర్శి, చౌట్కూరు**

పోటీల్లో పాల్గొన్న నారాయణ పాఠశాల విద్యార్థులు

బహుమతులు అందుకున్న విద్యార్థులు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: విద్యార్థుల ప్రగతికి పోటీ పరీక్షలు తోడ్పడతాయని ప్రిన్సిపల్ రవీంద్ర అన్నారు. నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీలోని నారాయణ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో లోహిత్‌రామ్, రిత్విక్, లిఖిత్‌శ్రీ వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్‌తోపాటు డీన్ వివేకానందరెడ్డి బహుమతులు అందజేశారు.

క్విజ్‌లో ప్రతిభ చూపి.. బహుమతులు సాధించి

పరీక్ష రాస్తున్న శ్రీనంది కళాశాల విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందిస్తున్న సిబ్బంది

నందికొట్కూరు, న్యూస్‌టుడే : పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులు బహుమతులు సాధించారని శ్రీనంది జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు శ్రీకాంత్ పేర్కొన్నారు. నందికొట్కూరు పట్టణంలోని శ్రీనంది జూనియర్ కళాశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఎస్.మనస్విని, ఎస్.సాహితీ, పి.రేణుక వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి కళాశాల ప్రధానాచార్యులు బద్దుల శ్రీకాంత్, అధ్యాపకుడు శంకరరావు బహుమతులు అందజేశారు.

అరకొరగా నీటిశుద్ధి

★ తాగునీటికి ప్రజల ఇబ్బందులు

పరిశీలన

నంద్యాలలో ఎస్‌ఎస్ ట్యాంకు

నంద్యాల రైతునగరం, పురపాలకం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని కొన్ని వార్డుల్లో మూడు రోజులకు ఒకసారి నీటిని వదులుతున్నారు. ప్రజలను కలుషిత నీటి భయం వెంటాడుతోంది. మహానంది రోడ్డులోని హెడ్ వాటర్ వర్క్స్ వద్దనున్న ఎస్‌ఎస్ వాటర్ ట్యాంకు నీటిని, వెలుగోడు జలాశయం నుంచి పైపులైన్ ద్వారా వచ్చే నీటిని శుద్ధి చేసి పట్టణానికి సరఫరా చేస్తున్నారు. శుద్ధి ప్రక్రియ సరిగా జరగకపోవడం, తరచూ పైపులైన్లు పగలడం, లీకేజీలు, పైపులైన్లు మురుగు కాల్వల్లోంచి వెళ్తుండడంతో నీరు రంగుమారి, దుర్వాసన వస్తోందని ప్రజలు చెబుతున్నారు.

◆ నంద్యాల పట్టణానికి అమృత్ పథకం ద్వారా నీటిని వదులుతున్నారు. శుద్ధి తర్వాత కుళాయిలకు వదులుతారు. 2.4 లక్షల మందికి నీటిని సరఫరా చేస్తున్నారు.

◆ ఎస్‌ఎస్ వాటర్ ట్యాంకుకు 2,307 మిలియన్ లీటర్ల సామర్థ్యం ఉంది. ప్రస్తుతం 2,300 మిలియన్ లీటర్ల నీరు ఉంది.

◆ పట్టణంలోని 42 వార్డులకు నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని వార్డులో మూడు రోజులకు ఒకసారి నీటిని వదులుతున్నారు.

◆ వాటర్ వర్క్ కింద 170 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

◆ నీటిని శుద్ధి చేయడానికి 3 వాటర్ బెడ్లు ఉన్నాయి. ఇవి పనిచేస్తున్నాయని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో కొన్ని ప్రాంతాల్లో మురికిగా వస్తోందని ప్రజలు చెబుతున్నారు. వాటర్ బెడ్లు మార్చి 6 నెలలు దాటిందని అధికారులు చెబుతున్నారు.

◆ ఇసుక మార్చాల్సి వస్తే ప్రజలకు నీటి సమస్య వస్తుందని కొన్నేళ్లుగా మార్చలేదు.

◆ నీటి శుద్ధి కోసం ఏటా సుమారు రూ.9 కోట్లు ఖర్చు పెడుతున్నారు.

మరమ్మతులకు రూ.21 లక్షలతో ప్రణాళికలు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పాణ్యం మండలంలో మద్దూరు, అనుపూరు, అహల్యాపురం, ఎస్ కొత్తూరు గ్రామాలకు నీరందించడానికి అహల్యాపురం వద్ద సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మద్దూరు, అనుపూరు, అహల్యాపురం గ్రామాలకు నీరు వెళ్తుండగా ఎస్ కొత్తూరుకు పైపులైన్లు దెబ్బతినడంతో వెళ్లడం లేదు. కొత్తూరులో బోరు నీటిని అందజేస్తున్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు మరమ్మతులు చేయడానికి రూ.21 లక్షలకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఇంజినీరు మధుశేఖర్ పేర్కొంటున్నారు. అనుపూరు, ఎస్ కొత్తూరు గ్రామాలకు నూతన పైపులైన్, ఫిల్టర్‌బెడ్లు, వాల్వ్, మోటార్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఎస్సార్బీసీ కాల్వ నుంచి నీటిని తీసుకుని నిల్వ చేసి శుద్ధి అనంతరం సరఫరా చేస్తున్నారు.

◆ సీపీడబ్ల్యూఎస్ పథకంలో 480 లక్షల లీటర్ల నీటి నిల్వ ఉంటుంది. ఏటా 18 లక్షలు ఖర్చు అవుతున్నాయి. నాలుగు గ్రామాలకు నీరు ఇవ్వాల్సి ఉండగా.. మూడు గ్రామాలకు ఇస్తున్నారు. ఆరుగురు సిబ్బంది పని చేస్తున్నారు. ఏడేళ్ల క్రితం ఫిల్టర్‌బెడ్లు, ఇసుక మార్చారు.

రహదారికి మరమ్మతులు

స్పందనకు వందనం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలోని మార్క్ ఫెడ్ కార్యాలయం ఎదుట ఆర్డీవో కార్యాలయానికి వెళ్లేదారి దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఈ సమస్యపై డిసెంబరు 17వ తేదీ 'ఈనాడు'లో 'తవ్వేస్తారు.. వదిలేస్తారు' శీర్షికతో చిత్రవార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేశారు.

అలంకారప్రాయంగా చెత్తబుట్టలు

ఇంట్లో పోగయ్యే చెత్తను బయట పారబోయకుండా నిల్వ చేసి చెత్త సేకరణకు వచ్చే సిబ్బందికి అందజేసేందుకు ప్రభుత్వం చెత్తబుట్టలు పంపిణీ చేస్తోంది. బండిఆత్మకూరు మండలం ఎ.కోడూరు గ్రామ సచివాలయంలో దాదాపు వెయ్యి చెత్తబుట్టలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని ప్రజలకు పంపిణీ చేయకుండా అధికారుల నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రజలకు అందేలా చూడాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

నీటి సరఫరా లేని ఆర్వో ప్లాంట్

నందికొట్కూరు పట్టణం సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ వద్ద నీరు రావడం లేదు. ఆసుపత్రికి వచ్చే రోగులు, బంధువుల కోసం ఎంపీ నిధులు రూ.5లక్షలతో ఏర్పాటు చేసి గతేడాది డిసెంబర్ 27న జాతికి అంకితం చేశారు. ప్రస్తుతం ప్లాంటు వద్ద నీరు రాకపోవడంతో బయటి నుంచి కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నట్లు రోగుల బంధువులు తెలిపారు. నిర్వాహకులు స్పందించి మినరల్ వాటరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నందికొట్కూరు

పార్కులో పొంచి ఉన్న ప్రమాదం

నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీలోని పార్కు ఎదుట ఇనుప కడ్డీల కంచె కింద పడకుండా ఇలా రాళ్లు అడ్డు పెట్టారు. ఉదయం, సాయంత్రం అధిక సంఖ్యలో పిల్లలు పార్కుకు వస్తుంటారు. పార్కు ఎదుట పాఠశాలలకు వెళ్లడానికి నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. పొరపాటున కడ్డీల కంచె కింద పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు కంచెను దిమ్మెల్లో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వేంకటేశ్వరస్వామికి అలంకరణ

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: ధనుర్మాసం ద్వాదశి, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని తెలుగుపేటలో ఉన్న లక్ష్మీనృసింహ నరసింహస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. బొమ్మలసత్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో స్వామి వారికి ఉదయం అభిషేకాలు, అర్చనలు చేసి విశేషంగా అలంకరించారు. సంజీవనగర్ రామాలయంలో భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా నూతన ముత్యాల కవచాలతో అలంకరించారు. సాయంత్రం ఆలయంలో హోమాలు నిర్వహించారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. క్షీరాభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు.

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన శనగల బసవన్న నందీశ్వరునికి గురువారం త్రయోదశి పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. నందీశ్వరమూర్తికి అర్చకులు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, పలు జలాలతో విశేష అభిషేకాలు జరిపారు. పుష్పార్చనలు చేసి మంగళహారతులు సమర్పించారు. పలువురు భక్తులు పరోక్షంగా నందీశ్వరునికి తమ గోత్రనామాలతో పూజలు జరిపించుకున్నారు.

మంగళహారతి ఇస్తున్న అర్చకుడు

నూతనోత్సాహం

ఆత్మకూరు: ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డితో కలిసి కేకు కోస్తున్న డీఎస్పీ రామాంజినాయక్, సీఐలు

నంద్యాల నేరవిభాగం: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సునీల్ షొరాణ్‌కు పుష్ప గుచ్ఛం అందిస్తున్న ఏఎస్పీ మంద జావళి

నంద్యాల, నందికొట్కూరు, పాణ్యం, శ్రీశైలం నియోజకవర్గాల్లో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యాలయాలు, రాజకీయ నాయకుల నివాసాల వద్ద అభిమానులు పెద్దఎత్తున సంబరాలు చేశారు. నాయకులను కలిసి కేకులు కోసి, పుస్తకాలు, పూలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. - న్యూస్‌టుడే బృందం

పాణ్యం గ్రామీణం: ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని సన్మానిస్తున్న పాణ్యం తెదేపా నాయకులు

నందికొట్కూరు గ్రామీణం: అల్లూరులో పోలీసులతో కలిసి కేకు కోస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో కాంస్య పతకం

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణానికి చెందిన పబ్బతి వేణు, అపర్ణ దంపతుల కుమార్తె చిన్మయి శ్రేయ గతేడాది డిసెంబరు 28వ తేదీ నుంచి మహారాష్ట్రలో జరిగిన జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో కాంస్య పతకం అందుకున్నట్లు శిక్షకుడు లక్ష్మణ్ తెలిపారు. స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లో గురువారం చిన్మయి శ్రేయను అభినందించారు. పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి అండర్-17 పోటీల్లో చిన్మయి శ్రేయ కాంస్య పతకం పొందిన రాష్ట్రంలోనే ప్రథమ క్రీడాకారిణి కావడం ఆనందంగా ఉందన్నారు. గతంలో ఏషియన్ క్రీడల్లో పాల్గొని ప్రశంసాపత్రం అందుకున్నట్లు తెలిపారు.

చిన్మయి శ్రేయను అభినందిస్తున్న ప్రముఖులు

క్రీస్తు బోధనలు అనుసరణీయం

నంద్యాలలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: క్రీస్తు బోధనలు అనుసరణీయమని బిషప్ సంతోష్ ప్రసన్నరావు, ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ గురు శ్రీ కేడీ జోసఫ్ పేర్కొన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం నంద్యాల పట్టణంలోని పలు చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హోలి క్రాస్ కెథడ్రల్ చర్చిలో బిషప్ సంతోష్‌ప్రసన్నరావు భక్తులకు సందేశాన్నిచ్చారు. ఆరోగ్యమాత చర్చిలో డైరెక్టర్ జోసఫ్, కడప మిత్రాసనగురువు పీటర్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.

పాణ్యం గ్రామీణం: పాణ్యంలోని షాలేము చర్చిలో క్రైస్తవులు పాల్గొని కేక్ కట్ చేసి ప్రార్థనలు చేశారు.

ఆత్మకూరు పట్టణం: ఆత్మకూరు పట్టణంలోని ఇందిరానగర్ సీఎస్ఐ పరిశుద్ధ తోమా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహిళలు, చిన్న పిల్లలకు నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

పులుల గణన 3 నుంచి

పర్యావరణ విద్యాకేంద్రాన్ని పరిశీలిస్తున్న విజయకుమార్

మహానంది, న్యూస్‌టుడే: పులులతోపాటు ఇతర వన్యప్రాణులు, పక్షుల ఫేజ్-3 గణన కార్యక్రమాలను ఈనెల 3వ తేదీ నుంచి అటవీశాఖ చేపడుతోందని ఫీల్డ్ డైరెక్టర్ బీ విజయకుమార్ స్పష్టం చేశారు. మహానందిలోని పర్యావరణ విద్యాకేంద్రాన్ని గురువారం పునః ప్రారంభించి ఉచిత ప్రవేశాలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రంపచోడవరం, చింతపల్లి, నర్సీపట్నం, నెల్లూరు వంటి ప్రదేశాల్లో కెమెరాలు ఏర్పాటు చేసి ట్రాప్ చేస్తూ ఈ గణన మే చివరి నాటికి పూర్తవుతుందన్నారు. వేసవి సమీపిస్తున్నందున అడవిలోని నాలుగు డివిజన్లలో 2500 కి.మీ.ల దూరం వరకు ఈనెల 15-20 ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. నంద్యాల అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్‌మీనా, అటవీ రేంజ్ ఆఫీసర్లు జడ్‌ఎన్ జాహ, ఉదయ్‌దీప్, డీఆర్వో హైమావతి ఉన్నారు.

● మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను అటవీశాఖ ఫీల్డ్ డైరెక్టర్ బీ విజయకుమార్ దర్శించి పూజించుకున్నారు. వేదపండితులు రవిశంకర అవధాని తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

సాహితీ అభివృద్ధికి కృషి చేయాలి

నంద్యాల విద్య, న్యూస్‌టుడే: భాష, సాహితీ అభివృద్ధికి కృషి చేయాలని నంద్యాల కవి కొప్పుల ప్రసాద్ పేర్కొన్నారు. ఆయన రచించిన 'నేనొక విశ్వవ్యాపకుడను' అనే కవితా సంపుటిని మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించినట్లు తెలిపారు. చిక్కడపల్లి త్యాగరాజగాన సభలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ వీడీ రాజగోపాల్, నరసింహప్ప, ప్రముఖ కవితా సమీక్షకులు కృష్ణారెడ్డి హాజరై ఆవిష్కరించారు. ఆయన్ను నంద్యాలకు చెందిన విశ్రాంత శాస్త్రవేత్త రవీంద్రనాథ్, వైద్యులు రవికృష్ణ, సహదేవుడు, ఉదయశంకర్, అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, నరేంద్ర, మురళీధర్‌రెడ్డి, వాసుదేవారెడ్డి అభినందించారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

సన్మాన గ్రహీతలతో జడ్జి తంగమణి

సీనియర్ న్యాయవాదులకు సత్కారం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా కోర్టులో 70ఏళ్లు పైబడిన సీనియర్ న్యాయవాదులను జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి తంగమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీనియర్ న్యాయవాదులను సన్మానించాలనే ఆలోచన ప్రశంసనీయమని కొనియాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుస్సేన్‌బాషా, కార్యదర్శి ఎంఆర్. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఆధార్ సేవలు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: సున్నిపెంటలోని పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు పోస్టుమాస్టర్ ప్రభాకర్ గురువారం తెలిపారు. కొన్ని నెలలుగా ఆధార్ మిషన్ సాంకేతిక లోపంతో పనిచేయక పోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులు సాంకేతిక లోపాన్ని సరిచేసినట్లు పేర్కొన్నారు. దీంతో తెలంగాణ ప్రాంతంలోని బ్రహ్మగిరి, శ్రీశైలం మండలంలోని సున్నిపెంట, లింగాలగట్టు ప్రజలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్జీఎం డైరెక్టర్ అశోక్‌కు పురస్కారం

పాణ్యం గ్రామీణం: ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ అశోక్‌కుమార్ ఎడ్యుకేషన్ చేంజ్ మేకర్ అవార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జయచంద్రప్రసాద్ తెలిపారు. కళాశాలలో గురువారం ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 30న ఐసీటీ(ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ) అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో అవార్డు అందజేశారన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అశోక్‌కుమార్‌ను కళాశాల సిబ్బంది అభినందించారు.

అవార్డు అందుకుంటున్న అశోక్‌కుమార్

తప్పుడు కేసులు ఎత్తివేయాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నిరపరాధులపై మోపిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఎమ్మార్పీఎస్, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు సాంబశివుడు, వీరయ్య అన్నారు. బొమ్మలసత్రం కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు భీమా కోరెగాన్ యుద్ధవీరులకు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఏజాస్ హుస్సేన్, కరిముల్లా, మజీద్ ఖాన్, శ్రీనివాసులు, ఓబయ్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోవింద నామస్మరణ చేయాలి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: గోవింద నామస్మరణ చేస్తే దైవ అనుగ్రహం లభిస్తోందని తితిదే బ్రహ్మోత్సవ వ్యాఖ్యాత ప్రవచనకర్త డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. నంద్యాల పట్టణం సంజీవనగర్ రామాలయంలో గురువారం భగవత్ సేవా సమాజ్, తితిదే ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి సహకారంతో, తిరుప్పావై ప్రవచనాలను భక్తులకు వివరించారు. ఆయన ఉపన్యసిస్తూ విష్ణువు దశావతారంలోని కూర్మ అవతారం గొప్పతనాన్ని వివరించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని బోధనలు విన్నారు.

అభాగ్యులం.. ఆదుకోండి

◆ పింఛను కోసం దివ్యాంగుల ఎదురుచూపులు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: అందరిలానే వారూ మంచి జీవితం గడిపారు. కుటుంబానికి అండగా నిలిచారు. కానీ, అనుకోని ప్రమాదంలో కాళ్లు కోల్పోయి ఒకరు.. పక్షవాతంతో మరొకరు జీవనోపాధి కోల్పోయారు. దీంతో వారి కుటుంబ పరిస్థితి దుర్భరంగా మారింది. కనీసం పింఛను మంజూరు చేస్తే ఆర్థికంగా కొంత అండగా ఉంటుందని వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. పింఛను మంజూరు చేయడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పింఛన్లు మంజూరు చేసి తమను ఆదుకోవాలని ఆత్మకూరుకు చెందిన షేక్ ముర్తుజా, నూర్‌అహ్మద్ వేడుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంతో నడవలేకుండా: షేక్ ముర్తుజా

ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామానికి చెందిన షేక్ ముర్తుజా కొన్నేళ్ల క్రితం ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో వెన్నెముక దెబ్బ తినటంతో రెండు కాళ్లు పని చేయటం లేదు. స్ట్రెచర్ ఆధారంతో నడుస్తున్నాడు. పండ్లు విక్రయిస్తూ కుటుంబానికి ఆధారంగా ఉన్న షేక్ ముర్తుజా మంచానికి పరిమితం కావటంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. సదరం క్యాంపులో దరఖాస్తు చేసుకుంటే 85శాతం వికలత్వం ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరణ పత్రం అందజేశారు. పింఛను కోసం కలెక్టరు, మండల పరిషత్తు, సచివాలయం చుట్టూ ప్రదక్షణలు చేసినా మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వెన్నెముక నొప్పి అధికంగా ఉందని, మాత్రలు, మందులు వేసుకోకపోతే భరించలేని నొప్పిగా ఉందని కన్నీరుమున్నీరవుతున్నారు.

పక్షవాతంతో జీవితం దుర్భరం : నూర్‌మహమ్మద్

ఆత్మకూరు రహ్మత్‌నగర్‌కు చెందిన నూర్‌అహ్మద్ లారీ డ్రైవరుగా పనిచేస్తూ ఏడుగురు పిల్లలకు వివాహాలు చేశాడు. అయిదేళ్ల క్రితం నూర్‌అహ్మద్‌కు పక్షవాతం రావటంతో కాళ్లు, చేతులు పనిచేయడం లేదు. దీంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో కుదేలైంది. నూర్‌అహ్మద్ సంపాదన ఆగిపోవటం, మందులు, కుటుంబ ఖర్చులు పెరగటంతో పూట గడవటం కష్టమైంది. నూర్‌అహ్మద్ భార్య ఇళ్లలో పనులు చేస్తూ భర్త ఆలనాపాలనా చూస్తుండేది. ఆమెకూ మోకాళ్ల నొప్పులు అధికం కావటంతో పనిచేయడం సాధ్యం కావటం లేదు. పక్షవాతం బాధితులకు ప్రభుత్వం అందించే పింఛను కోసం పురపాలక, కలెక్టరు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. తనను ఆదుకోవాలని నూర్‌అహ్మద్ ప్రాధేయపడుతున్నాడు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

వెలుగోడు, న్యూస్‌టుడే: వెలుగోడు మండలంలోని రేగడగూడూరు-అలగనూరు గ్రామాల మధ్య అర్షపోగు అశోకరత్నం(21) అనే యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందినట్లు మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు జూపాడుబంగ్లా మండలం 80-బన్నూరు గ్రామానికి చెందిన అశోకరత్నం నందికొట్కూరు ఐటీఐ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. నూతన సంవత్సరం సందర్భంగా తన అమ్మమ్మ ఊరైన గడివేముల మండలం పెసరవాయి గ్రామానికి వచ్చారు. బుధవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఇంటినుంచి బయటికి వెళ్లి, గురువారం తెల్లవారుజామున రేగడగూడూరు-అలగనూరు గ్రామాల మధ్య రోడ్డు పక్కన మృతిచెంది పడిఉన్నట్లు చెప్పారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పశుగ్రాసం దగ్ధం

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని కడమలకాల్వ గ్రామానికి చెందిన మేకల వెంకటసుబ్బయ్య పశుగ్రాసం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. గడివామినుంచి గురువారం పొగలు వ్యాపించడంతో స్థానికులు ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు అధికంగా వ్యాపించడంతో పూర్తిగా దగ్ధమైంది. పశుగ్రాసం విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని స్థానికులు చెప్పారు.

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

పోటీ పరీక్షలతో సామర్థ్యాల పెంపు

విజేతలకు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం హరికృష్ణ

క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పోటీ పరీక్షలతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగు పడతాయని ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ పేర్కొన్నారు. బేతంచెర్ల పట్టణంలోని ధరణి టౌన్‌షిప్‌లోని జిల్లా పరిషత్ మెయిన్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. పోటీల్లో పదో తరగతి విద్యార్థులు బి.మనీషా (పదోతరగతి), ఎస్.ఆనందరాణి (పదోతరగతి), ఎస్.మహమ్మద్ రసూల్ వరుస స్థానాల్లో నిలిచారు. విజేతలకు హెచ్‌ఎం ప్రశంసాపత్రాలు, బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు సావిత్రి, ఉమామహేశ్వరి, నూర్జహాన్, కృష్ణమోహన్, గోపినాథరావు, జనార్దన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విజేతలను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్యాపిలి, న్యూస్‌టుడే: క్విజ్ పోటీలతో విద్యార్థుల్లో విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని కళాశాల ప్రధానాచార్యులు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. పోటీల్లో బి.శ్రీనివాసులు (సీనియర్ హెచ్‌ఈసీ), జి.రమ్య (సీనియర్ ఎంపీసీ), జె.సుకన్య (జూనియర్ సీఈసీ) వరుస స్థానాల్లో నిలిచారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నవీనపాటి, మద్దిలేటి, ముస్తాక్, మురళీమోహన్‌గౌడ్, వెంకటేష్, మంజునాథ్, సురేష్, వన్నూర్, వెంకటరమణ, శంకరయ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ నిర్వహించే 'ఆల్ ఇండియా ట్రేడ్ టెస్టు' (ఏఐటీటీ) జులై 2026 క్రాఫ్ట్స్‌మెన్ ట్రైనింగ్ స్కీమ్ కింద పరీక్షకు హాజరయ్యేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉపాధి శిక్షణ డైరెక్టర్ తెలిపినట్లు ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్ ఎస్.ప్రసాదరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కనీస వయస్సు 21 ఏళ్లు ఉండాలన్నారు. వివిధ ప్రైవేట్ పరిశ్రమల్లో సంబంధిత ట్రేడ్‌లో కనీసం మూడేళ్ల పని అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను డోన్ ప్రభుత్వ ఐటీఐలో జనవరి 29వ తేదీ లోపు సమర్పించాలన్నారు. ఇతర వివరాల కోసం ఐటీఐ కళాశాలల కన్వీనర్‌ను గానీ, డోన్ ఐటీఐలో ప్రిన్సిపల్ ప్రసాదరెడ్డిని గానీ సంప్రదించాలని తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్యాపిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలు తీసుకుని హాజరు కావాలని కోరారు. మండల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించాలన్నారు.

కొత్త ఏడాదిలోనైనా కలిసొచ్చేనా?

◆ రెండో పంటపైనే వరి రైతుల ఆశలు ◆ కష్టాలు మిగిల్చిన ఖరీఫ్

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి పంటను సాగు చేసిన రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. వరుసగా కురిసిన అధిక వర్షాలతో పైరుపై ప్రభావం చూపి దిగుబడులు తగ్గాయి. దిగుబడులను అమ్మగా వచ్చిన సొమ్ము పెట్టిన పెట్టుబడులకే సరిపోగా చేసిన కష్టానికి ఏమాత్రం మిగల్లేదు. కనీసం రెండో పంటైనా పండి తమ కష్టాలను తీర్చుతుందేమోనని ఆశగా సాగు పనులకు సిద్ధమవుతున్నారు.

ట్రాక్టర్‌తో వరి మడులను సిద్ధం చేసుకుంటున్న రైతు

పెట్టుబడులు పెరిగి.. దిగుబడులు తగ్గి

★ కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్‌లో మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 9,513 హెక్టార్లు ఉండగా 11,410 హెక్టార్లలో వరి సాగైంది. ఖరీఫ్‌లో వరుసగా అధిక వర్షాలు కురవడంతో తెగుళ్లు పెరిగి పెట్టుబడి ఖర్చులు పెరిగి దిగుబడులు తగ్గాయి.

★ ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40వేలు వరకు పెట్టుబడులు పెట్టగా దిగుబడులు 30నుంచి 35బస్తాలకు మాత్రమే పరిమితమయ్యాయి. నవంబరులో మొంథా తుపాను ప్రభావంతో వరి పైర్లు నీట మునిగి, నేలవాలి గింజలోకి నీరు చేరి దెబ్బతినడంతో దిగుబడులు తగ్గాయి.

కోవెలకుంట్ల సబ్‌డివిజన్‌లో ఖరీఫ్‌లో వరి సాగు వివరాలు (హెక్టార్లలో)

మండలం	సాధారణ సాగు	సాగైంది
కోవెలకుంట్ల	1,423	1,955
దొర్నిపాడు	1,055	1,417
ఉయ్యాలవాడ	1,074	1,003
సంజామల	1,142	1,531
అవుకు	4,385	4,919
కొలిమిగుండ్ల	434	585

ధర లేక దక్కని ఫలితం

★ 20 రోజుల కిందట బస్తా (77 కిలోలు) నంద్యాల సోనా రూ.1500, కర్నూలు సోనా రూ.1400లకే అమ్ముకున్నారు. దీంతో రైతుకు ఏమాత్రం మిగల్లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు పెరిగాయి. నంద్యాల సోనా రూ.2 వేలు, కర్నూలు సోనా రూ.1800లకు పెరగడంతో వ్యాపారులకు లాభాలు కలిగిస్తున్నాయి.

★ ఖరీఫ్‌లో ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిని దిగుబడులు తగ్గి, ధరలు లేక వరి రైతులు అవస్థలు పడ్డారు. మొదటి పంటలో ఏమి మిగలకపోయినా కనీసం రెండో పంటైనా తమ కష్టాలు తీరుస్తుందని ఆశతో జిల్లా వ్యాప్తంగా వరి రైతులు రెండో పంట సాగుకు సిద్ధమవుతున్నారు.

ఏమీ మిగల్లేదు - శ్రీనివాసులు, రైతు

ఖరీఫ్‌లో ఎకరాకు 10 బస్తాలు కౌలు కింద ఇచ్చేలా 25ఎకరాల్లో వరి సాగు చేశా. అధిక వర్షాలు, తెగుళ్ల కారణంగా ఎకరాకు 35బస్తాల దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ.40వేల వరకు పెట్టా. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయకపోవడంతో మార్కెట్ ధరకే బస్తా రూ.1400చొప్పున అమ్మి నష్టపోయా.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

అవుకు, న్యూస్‌టుడే: ?: అవుకులో ఈబీసీ కాలనీలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. - గోపాల్, అవుకు.

✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - పక్కీరయ్య, ఏఈ అవుకు.

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో చెత్తాచెదారం తొలగించడం లేదు. - ప్రణీత్, ప్రయాణికుడు.

✔: పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. - ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని గౌరీపేటలో సీసీ రోడ్డు దెబ్బతింది. - శేషిరెడ్డి, గౌరిపేట.

✔: త్వరలో మరమ్మతులు చేయిస్తాం. -హరిప్రసాద్, కమిషనర్.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: మండలంలోని యర్రగుంట్ల బీసీ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి. - కృష్ణయ్య, స్థానికుడు.

✔: తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. - శివమల్లేశ్వరప్ప, ఎంపీడీవో, శిరివెళ్ల.

నల్లగట్ల(ఆళ్లగడ్డ గ్రామీణం),న్యూస్‌టుడే: ?: నల్లగట్ల గ్రామంలో అర్జునాపురం రస్తాలో తగ్గు వీధిలో రోడ్డుపై మురుగు నిల్వ ఉంది. - శ్రీరాములు, నల్లగట్ల.

✔: పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. - నూర్జహాన్, ఎంపీడీవో.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: శ్రీనివాసనగర్‌లో బైపాస్ వరకు కొంత మేర సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టకుండా వదిలేశారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి. - రామచంద్రుడు, శ్రీనివాసనగర్.

✔: ప్రతిపాదనలు రూపొందించి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తాం. - సురేష్, మున్సిపల్ ఏఈ.

?: పాతబస్టాండులో గాంధీ విగ్రహం సమీపంలో రహదారి పక్కనే మురుగుకాల్వలో వ్యర్థాలు పోగయ్యాయి. - రామకృష్ణ, కొత్తపేట.

✔: పరిశీలించి వ్యర్థాలను తొలగిస్తాం. - సునీల్, శానిటరీ ఇన్‌ఛార్జి అధికారి.

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండు ప్రవేశ మార్గంలో చెత్తాచెదారాన్ని తొలగించడం లేదు. - ప్రణీత్, ప్రయాణికుడు.

✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో.

మట్టి చేరి.. అవస్థలు మిగిల్చి

డోన్ నియోజకవర్గం గుండా సాగే జాతీయ రహదారిపై మట్టి చేరింది. వాహనదారులు ఏ మాత్రం మట్టిలో జారి కింద పడినా జాతీయ రహదారి కావటంతో వేగంగా వచ్చే వాహనాల కింద పడి నలగాల్సిందే. రహదారికి సగం వరకు ఇలా మట్టి వచ్చినా ఎవరూ పట్టించుకోవటంలేదని ప్రయాణికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైవే అధికారులు స్పందించి మట్టిని తొలగించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, డోన్

చెట్లు నరికి.. పచ్చదనం హరించి

మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రభుత్వం ప్రచారం చేపడుతోంది. కాని క్షేత్రస్థాయిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. రోడ్లకు ఇరువైపులా చెట్లను ఇష్టానుసారంగా నరికేసి తొలగించేస్తున్నారు. ఆళ్లగడ్డ మండలంలోని పాలసాగరం నుంచి కోటకందుకూరు గ్రామానికి వెళ్లే రహదారిలో అటవీశాఖ ఆధ్వర్యంలో గతంలో మొక్కలు నాటారు. ఒక వరుస మొత్తం చెట్లను సగ భాగం వరకు తొలగించడంతో పచ్చదనం పూర్తిగా హరించిపోయింది. - న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

చురుగ్గా రహదారి నిర్మాణ పనులు

సంజామల మండలంలోని నొస్సం, అక్కంపల్లె గ్రామాల మధ్య జాతీయ రహదారి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నంద్యాల నుంచి కోవెలకుంట్ల మీదుగా వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు వరకు నాలుగు వరుసల రహదారి పనులు జరుగుతున్నాయి. త్వరలో నిర్మాణం పనులు పూర్తికానుండటంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది పూర్తైతే నిన్నటి వరకు రెండు వరుసల రహదారి కష్టాలు తీరి ప్రయాణం సాఫీగా సాగుతుంది. - న్యూస్‌టుడే, సంజామల

వ్యర్థాల గుట్టలు.. ప్రజల కష్టాలు

బేతంచెర్ల మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలోని శ్మశాన వాటిక నుంచి గూటుపల్లె వెళ్లే ప్రధాన రహదారి పక్కన వ్యర్థాలు, చెత్తాచెదారం గుట్టలుగా వేశారు. దీంతో ఈ ప్రాంతమంతా తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోంది. గూటుపల్లె, నాగమళ్లకుంట, రహిమాన్‌పురం, తవిశికొండ, హుస్సేనాపురం గ్రామాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కళ్లల్లో దుమ్మూ దూళి పడుతోందని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, ఆర్‌ఎస్ రంగాపురం(బేతంచెర్ల)

పేరుసోముల వాగు పరిశుభ్రం

సంజామల, న్యూస్‌టుడే: మండలంలోని పేరుసోముల వాగు పిచ్చిమొక్కలతో పాటు పూడికతో నిండిపోయింది. దీంతో వాగు పరివాహక ప్రాంతంలోని పంటలు వరద నీటి ఉద్ధృతికి కొట్టుకుపోతుండటంపై 'ఈనాడు'లో ఈ నెల 24న 'పంటలకు ముప్పు.. కలిగేదెప్పుడు కనువిప్పు' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. దీంతో పంచాయతీ అధికారులు స్పందించి కార్మికులతో వాగులో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేశారు. దీంతో కొంతమేరకు వాగునీరు ప్రవహించేందుకు వీలు ఏర్పడింది.

కౌలుకార్డుకు దరఖాస్తు చేసుకోండి

గోవిందపల్లె (శిరివెళ్ల), న్యూస్‌టుడే: కౌలు రైతులు గ్రామాల్లో కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని గోవిందపల్లె గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ.. భూములు లేని రైతులకు ప్రభుత్వం అందించే కౌలు కార్డులు తీసుకుంటే వ్యవసాయ సంబంధిత రాయితీలు వర్తిస్తాయని తెలిపారు. రబీ సాగులో వ్యవసాయ సిబ్బంది సూచనలు తప్పకుండా పాటించాలని కోరారు. వ్యవసాయ పథకాలు అందని వారు సమీప రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

ఆధార్‌లో మార్పులకు అవకాశం

శిరివెళ్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల వివరాలు, చిరునామాలు, పుట్టినతేదీ వివరాలను ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీఅహోబిల అన్నదాన సత్రం కాలమానిని గురువారం ఆవిష్కరించారు. నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు


కాలమానిని ఆవిష్కరణలో సంఘం నాయకులు

సమక్షంలో కాలమానిని ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని, వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గురుస్వామి, కళాకారుల సంఘం అధ్యక్షుడు బాలనరసింహ, పురపాలక కౌన్సిలర్ నరసింహులు, ఉపాధ్యక్షుడు చిన్నగోవిందు, మధు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్టీయూ నాయకులు ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డిని కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే కోట్లను ఎస్టీయూ నాయకులు కలిసి శుభాకాంక్షలను తెలియజేసి, మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు రామ్మోహన్, విశ్వనాథ్‌ల అధ్యక్షతన ఎస్టీయూ డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఇ.షణ్ముర్తి మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపునివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇక్బాల్‌బాషా, జి.వి.రమణ, దేవేంద్రప్ప, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం అభివృద్ధి

గూటుపల్లి(బేతంచెర్ల), న్యూస్‌టుడే: మండంలోని గూటుపల్లె గ్రామంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రం అభివృద్ధికి నోచుకోక పిల్లలు, గర్భిణులు ఇబ్బందులకు గురయ్యేవారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గ్రామ సర్పంచి శ్రీరాములు, మండలాధ్యక్షులు బుగ్గన నాగభూషణంరెడ్డి ద్వారా అభివృద్ధి పనులకు రూ.1.50 లక్షలు మంజూరు చేయించారు. దీంతో కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మాణం, విద్యుత్తు, కుళాయి, ట్యాంకు, ఫ్లోరింగ్, పెయింటింగ్ తదితర పనులను చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

నవ వసంతం.. వెల్లివిరిసిన ఆనందం

చిన్నాపెద్దా తేడాలేదు.. వీధుల్లో ఆనందోత్సాహాలతో చిందులు వేశారు. కాలనీల్లోని వీధులు, నివాస సముదాయాల్లో కేకులు కోసి ఆనందం పంచుకున్నారు. పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వీధుల్లో బృందాలుగా తిరుగుతూ ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. గురువారం నూతన సంవత్సరం వేడుక ఆనందంగా జరుపుకొన్నారు. పలు పార్టీల రాజకీయ నాయకుల గృహాలు, కార్యాలయాలు వారి అభిమానులతో కిటకిటలాడాయి. - న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ గ్రామీణం, కోవెలకుంట్ల, కోవెలకుంట్ల గ్రామీణం, బనగానపల్లి, బనగానపల్లి గ్రామీణం, సంజామల, అవుకు, చాగలమర్రి, డోన్, డోన్ పట్టణం.

డోన్ పట్టణం: ఎమ్మెల్యే కోట్లకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

డోన్ పట్టణం: ధర్మవరం సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న యువకులు

ఆళ్లగడ్డ: ఎమ్మెల్యే అఖిలప్రియకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఐసీడీఎస్ సిబ్బంది

అక్కాచెల్లెళ్లు.. క్రికెట్‌లో దిట్టలు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డకు చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు క్రికెట్‌లో అదరగొడుతున్నారు. విజయవాడలో డిసెంబరు 23న జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 క్రికెట్ జట్టులో ఉమ్మడి జిల్లా తరఫున అక్కాచెల్లెళ్లు రిశ్వహర్షిణి, మధువర్షిణి ఆడారు. అంతగాక జిల్లా జట్టు సెమీస్‌లో స్థానం సంపాదించింది. జట్టు విజయాల్లో వీరు కీలక పాత్ర పోషించారు. అక్క వికెట్‌కీపర్‌గా, బ్యాటర్‌గా.. చెల్లి ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నారు. వీరు త్వరలోనే రాష్ట్ర జట్టు తలుపు తట్టేందుకు సిద్ధమవుతున్నారు. జాతీయ జట్టులో స్థానం సాధించడమే లక్ష్యంగా వీరిద్దరూ శిక్షకుడు సుబ్బరాయుడు శిక్షణలో ముందుకు సాగుతున్నారు.

కీపింగ్‌లో రాణిస్తున్న రిశ్వహర్షిణి

రిశ్వహర్షిణి చిన్నతనం నుంచే వికెట్‌కీపర్‌గా జట్టులో కీలక భూమిక పోషిస్తున్నారు. 2024లో సెప్టెంబరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో రాణించి జిల్లా జట్టులో చోట సాధించారు. గతేడాది డిసెంబరులో మంగళగిరిలో జరిగిన స్టేట్‌మీట్‌లో కర్నూలు జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. కీపర్‌గా ఆడిన మూడు మ్యాచుల్లో ఆరు క్యాచ్‌లు అందుకున్నారు. జట్టుకు ఉపయుక్తమైన పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. జూన్‌లో బీసీసీఐ ఆధ్వర్యంలో నెల్లూరులో జరిగిన జోన్-4(కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు) క్రికెట్ పోటీల్లో అండర్-17 విభాగంలో కర్నూలు జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఈమె చూపిన ప్రతిభతో జిల్లా జట్టుకు రెండో స్థానం దక్కింది. నవంబరులో ఎస్జీఎఫ్ క్రికెట్ పోటీల్లోనూ రాణించి ఉమ్మడి కర్నూలు జట్టుకు ఎంపికయ్యారు.

ఆల్‌రౌండర్‌గా మధువర్షిణి ప్రతిభ

మధువర్షిణి కూడా అక్క ప్రోత్సాహంతో క్రికెట్‌లో రాణిస్తున్నారు. 2024లో జరిగిన ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో రాణించి జిల్లాస్థాయి జట్టులో స్థానం దక్కించుకున్నారు. అక్టోబరు 29న జిల్లాస్థాయి పోటీల్లో రాణించి మరోసారి జిల్లా జట్టులో స్థానం పదిలం చేసుకుని, సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటున్నారు. ఇటీవల పిడుగురాళ్లలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో నంద్యాల జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు.

రిశ్వహర్షిణి, మధువర్షిణి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ గ్రామీణం, కోవెలకుంట్ల, బనగానపల్లి, బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం పల్లెలు, పట్టణాల్లో పండగ వాతావరణం నెలకొంది. భక్తులు ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కొత్త సంవత్సరంలో అంతా శుభాలు కలగాలని కోరారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం గురువారం నిర్వహించారు. అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి గ్రామోత్సవం చేశారు. వీఆర్ లక్ష్మిరెడ్డి, శివశంకర్, వెంకటమల్లారెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

డోన్, న్యూస్‌టుడే: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి పట్టణానికి చెందిన అశోక్‌కుమార్, వెంకటలక్ష్మి, వారి కుమార్తె లావణ్య రూ.లక్ష నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నగదును ఆలయ కమిటీ సభ్యులు ప్రజావైద్యశాల మల్లికార్జున, ప్రకాష్‌స్వామి, నార్ల ప్రకాష్‌స్వామిలకు అందజేశారు. అనంతరం దాతలకు సన్మానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దాతలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ఐక్యతతో సమస్యలపై పోరాటం చేద్దాం

ప్యాపిలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు, సమస్యల పరిష్కారానికి ఐక్యతతో కలిసి పోరాడి సాధించుకోవాల్సిన అవసరం ఉందని ఎరుకల హక్కుల పోరాట సేవా సమితి అధ్యక్షుడు గోపాల్ పేర్కొన్నారు. పట్టణంలోని బస్టాండులో ఏర్పాటు చేసిన ఏకలవ్య

నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

విగ్రహం వద్ద గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోపాల్, ఉపాధ్యక్షుడిగా సుంకన్న, ప్రధాన కార్యదర్శిగా శేషాద్రి, సంయుక్త కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా గురుమూర్తి, ఈసీ సభ్యులుగా సుధాకర్, వెంకటేష్‌లను తదితరులను ఎన్నుకున్నారు.

మత్తులో యువకుల ఘర్షణ

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: మద్యం మత్తులో కొంత మంది యువకులు గురువారం ఘర్షణ పడ్డారు. కోవెలకుంట్లలోని పెద్దగ్రౌండ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. సుమారు 20 మంది యువకులు వర్గాలుగా విడిపోయి కొట్టుకున్నారు. వీరిలో కొంతమంది గంజాయి సేవించినట్లు సమాచారం. దీంతో మైదానంలో ఆడుకునేందుకు వచ్చిన పిల్లలు, వాకింగ్‌కు వచ్చినవారు భయాందోళనకు గురయ్యారు. విషయం పోలీసులకు తెలిసి ఘటనా స్థలానికి చేరుకోవడంతో ఘర్షణ పడినవారిలో కొంతమంది యువకులు పారిపోగా మిగిలినవారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

నేడు పాసుపుస్తకాల పంపిణీ

శిరివెళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని 2,500 మంది రైతులకు నూతనంగా పాసుపుస్తకాలు మంజూరైనట్లు తహసీల్దార్ విజయశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలో ఆరు గ్రామాల్లో జరిగిన రీసర్వేకు సంబంధించి రాష్ట్రప్రభుత్వ ఆదేశానుసారం నూతన పాసుపుస్తకాలు మంజూరయ్యాయన్నారు. వీటిని ఆయా గ్రామాల్లో శుక్రవారం నుంచి పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మంజూరైన కొత్త పుస్తకాలను ఇప్పటికే ఆయా గ్రామాల వీఆర్‌వోలకు అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఎంవీఐ, ఆర్‌అండ్‌బీ, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు మోటారు వాహనాల తనిఖీ అధికారి క్రాంతికుమార్ తెలిపారు. జనవరి నెలాఖరు వరకు మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో నీటి సమస్య నెలకొంది. గత వారం రోజుల నుంచి నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి పైపు మరమ్మతులకు గురి కావడంతో సమస్య ఏర్పడిందని ప్రజలు చెబుతున్నారు. అధికారులు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాచేపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: బాచేపల్లె గ్రామంలో ప్రధాన రహదారిపై వృథా నీరు నిత్యం పారుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు జారి కింద పడుతుండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుపై వ్యర్థం నీరు పారకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: అర్హత ఉండి అన్నదాత సుఖీభవ జాబితాలో పేరులేని రైతులు ధ్రువీకరణ పత్రాలతో ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో మరోమారు దరఖాస్తు చేసుకోవాలని ఏవో సుధాకర్ తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: సర్కిల్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు సీఐ దస్తగిరిబాబు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని ఎమ్మార్సీ భవన ఆవరణలో ఎంఈవోలు అనురాధ, నయామతుల్లా ఆధ్వర్యంలో గురువారం ఎస్టీయూ డైరీ, కాలమానిని ఆవిష్కరించారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివశంకర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుచంద్రుడు, మస్తాన్‌బాషా పాల్గొన్నారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని సెయింట్ జోసఫ్ పాఠశాల ఆవరణలో ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో మహిళలు, పురుషులకు ఆటల పోటీలు గురువారం నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను ఆదివారం అందించనున్నారు. చర్చి ఫాదర్ చిన్నప్ప, సంఘం పెద్దలు అర్లప్ప, ఓబులేసు, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

అవుకు, న్యూస్‌టుడే: దివంగత మాజీ ఎమ్మెల్యే చల్లా రామకృష్ణారెడ్డి వర్ధంతిని గురువారం అవుకులోని చల్లా వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో విఘ్నేశ్వర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు చల్లా రాజశేఖరరెడ్డి, తెదేపా నాయకుడు చల్లా విజయభాస్కరరెడ్డి, వైకాపా నాయకులు చల్లా అమర్‌నాథ్‌రెడ్డి, చల్లా రఘునాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: సుదీర్ఘ చరిత్ర కలిగిన సంఘం ఎస్టీయూ అని, ఉపాధ్యాయ సంక్షేమం కోసం, విద్యారంగ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకట్‌నాయక్ పేర్కొన్నారు. ప్యాపిలి మండలశాఖ ఆధ్వర్యంలో మండల విద్యాధికారులు మహేశ్వరరెడ్డి, వెంకటేష్‌నాయక్ చేతుల మీదుగా ఎస్టీయూ డైరీలు, కాలమానిలను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. జి.మద్దిలేటి, బి.వై.మద్దిలేటి, విజయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కోటపాడు (శిరివెళ్ల), న్యూస్‌టుడే: గ్రామంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తున్నట్లు సర్పంచి దూదేకుల ఉశేన్‌బీ పేర్కొన్నారు. కోటపాడు గ్రామంలోని పలు కాలనీల్లో మురుగు తొలగింపు ప్రక్రియను గురువారం సర్పంచి పరిశీలించారు.

సీతారాంపురం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఎవ్వరైనా సరే అంకిత భావంతో పనిచేస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో ఫజుల్ రహిమాన్ పేర్కొన్నారు. గురువారం సీతారాంపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వజీదున్నీసాబీ గురువారం పదవీ విరమణ పొందారు. ఎంఈవోలు సోమశేఖర్, అబ్రహం అధ్యక్షతన ఘనంగా సన్మానించారు.

(c) eenadu

పోటాపోటీ.. ధాన్యానికి గిరాకీ

రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం

ఇటు ప్రభుత్వం.. అటు వ్యాపారులు
48 గంటల్లోపే నగదు జమ

సత్తెనపల్లి, ఎన్జీవో కాలనీ (నరసరావుపేట వ్యవసాయం), సంతగుడిపాడు (రొంపిచర్ల), న్యూస్‌టుడే: ఇటు ప్రభుత్వం.. అటు వ్యాపారులు పోటాపోటీగా ధాన్యం కొంటున్నారు. రైతులకు 48 గంటల్లోనే నగదు జమ చేస్తున్నారు. తేమ శాతం 17 వరకు వచ్చేలా ఆరబెట్టి కొందరు రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సరకు అమ్ముతున్నారు. వాహన ఖర్చులు, గోతాలు, తేమ శాతం పేరుతో కొర్రీలు ఉంటాయని భావించి మరికొందరు పొలాల్లోనే వ్యాపారులకు విక్రయిస్తున్నారు. గతంలో సరకు కొనుగోలు చేసిన తర్వాత వ్యాపారుల నుంచి రైతులకు డబ్బులు సకాలంలో అందేవికావు. ఇప్పుడు వారు కూడా సత్వరం అందజేస్తున్నారు. దీంతో రైతులకు ఊరట లభిస్తోంది.

ఫామ్‌గేట్ పద్ధతిలో..

పచ్చి సరకును పొలాల్లో అమ్ముకుంటూ రైతులు నష్టపోతున్న తరుణంలో వారివద్దకు నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల అధికారులు, సిబ్బంది వెళ్లి ఫామ్‌గేట్ పద్ధతిలో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. తేమశాతం 17 నుంచి 22లోపు ప్రభుత్వానికి అమ్ముకోవచ్చని, హమాలీ ఖర్చులు క్వింటాకు రూ. 22 చెల్లిస్తామని, బయట సరకు అమ్మి నష్టపోవద్దని చెబుతున్నారు.

జిల్లాలో లెక్కలివీ..

ఖరీఫ్‌లో వరి సాగు:	66,316 హెక్టార్లు
దిగుబడి అంచనా:	4,36,169 మెట్రిక్ టన్నులు
కొనుగోలు కేంద్రాలు:	100
ఇప్పటివరకు కొనుగోళ్లు:	8190.20 మె.ట
కొనుగోలు చేసిన ధాన్యం విలువ:	రూ.19.17 కోట్లు
ఏగ్రేడు రకానికి మద్దతు ధర:	రూ. 1,792
సాధారణ రకానికి(బస్తా):	రూ.1,777

వాట్సాప్‌లో వివరాల సేకరణ

రైతులు ధాన్యాన్ని సులభంగా అమ్మేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇంటి నుంచే తమ వద్ద ఉన్న పంట వివరాలను తెలియజేసేలా వాట్సాప్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. 7337359375 నంబరుకు హాయ్ అని సందేశం ఇస్తే పౌర సరఫరాల సంస్థ అధికారులు స్పందిస్తారు. రైతు వద్ద ఎన్ని బస్తాలు ఉన్నాయి.. పంట రకం.. ఎప్పటికి సిద్ధం అవుతాయి.. మొదలైన సమాచారం పంపిస్తే సరిపోతుంది. దీన్ని అనుసరించి సాంకేతిక సిబ్బంది రైతు వద్దకు వెళ్లి ధాన్యాన్ని పరిశీలించి కొనుగోలు చేపట్టనున్నారని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు నారదముని తెలిపారు.

ఐసీడీఎస్‌లో కొత్త దందా

అంగన్‌వాడీల నుంచి నిర్బంధంగా మామూళ్ల వసూళ్లు

వినుకొండ, న్యూస్‌టుడే: దసరా మామూళ్ల గురించి మనం ఎక్కువగా వింటుంటాం. కానీ నూతన సంవత్సరం పేరిట ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీల నుంచి వసూళ్లకు తెరతీశారు. జిల్లాలో ఓ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ లీడర్లు కార్యకర్తలతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి సెంటర్ నుంచి రూ.500 వంతున సుమారు రూ.50 వేలకు పైగా వసూలు చేశారు. చిరుద్యోగులని చూడకుండా తరచూ నగదు వసూలు చేయడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్య అవగాహన కార్యక్రమాల నిర్వహించేందుకు (సీబీ ఈవెంట్లకు) ప్రభుత్వం మంజూరు చేసిన బిల్లుల్లో ఇటీవల 10 శాతం వసూలు చేశారు. ప్రధానమంత్రి మాతృవందన యోజనకు లబ్ధిదారుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదుకు రూ. 300 తీసుకుంటున్నట్లు ఫిర్యాదులున్నాయి. ప్రాజెక్టు అధికారులు తమ చేతికి మట్టి అంటకుండా అంగన్‌వాడీ లీడర్ల ద్వారా పని చక్కబెడుతున్నారనే ఆరోపణలున్నాయి. వసూళ్లపై స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి దృష్టికి తేగా ఇలా వసూలు తగదని.. విచారించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

గుండెకు ఊపిరి

బాధితులకు గోల్డెన్ అవర్‌లో చికిత్స
స్టెమి వైద్య సేవలతో నిలుస్తున్న ప్రాణాలు

సత్తెనపల్లికి చెందిన జీవీవీ రాఘవ ఛాతిలో నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు ఈసీజీ తీసి స్టెమి యాప్ ద్వారా గుంటూరు ప్రభుత్వాసుపత్రిలోని హబ్‌కు పంపించారు. వారు వెంటనే టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్ ఇవ్వాలని సూచించారు. రూ. 45 వేలు విలువచేసే ఇంజెక్షన్ ఇవ్వడంతో ఆయనకు ప్రాణాపాయం తప్పింది. అలాగే నరసరావుపేట ప్రభుత్వాసుపత్రిలోనూ లక్ష్మి అనే మహిళ గుండెపోటు బారినపడి స్టెమితో గోల్డెన్ అవర్‌లో చికిత్స పొంది ప్రాణాలు నిలుపుకొన్నారు.

న్యూస్‌టుడే, సత్తెనపల్లి, మాచర్ల

దీర్ఘకాలిక వ్యాధులు, జీవనశైలి పరమైన సమస్యలు, శారీరక వ్యాయామం లేకపోవడం, తీవ్ర ఒత్తిడి, అధిక ధ్వనితో కూడిన డీజేలాంటి శబ్దాలు, కల్తీ, నకిలీలతో కూడిన ఆహార పదార్థాలతో గుండెపోటు సమస్య తలెత్తుతోంది. వయసుతో సంబంధం లేకుండా బాధితులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఆధునిక మనిషి వేగాన్ని గుండె అందుకోలేకపోతోంది. అలుపెరగని హృదయానికి వచ్చే పోటుపై అప్రమత్తంగా ఉంటే ప్రాణాలు నిలిపే అవకాశం ఉంటుంది. ప్రభుత్వాసుపత్రుల్లో స్టెమి వైద్య సేవలతో గుండెలకు ఊపిరిపోసి పునర్జన్మ అందిస్తున్నారు.

బాధితురాలికి సేవలు అందిస్తున్న వైద్యురాలు

ఈ లక్షణాలుంటే అప్రమత్తం కావాల్సిందే.. గుండె దడ, ఛాతిపై బరువు, మంటగా ఉండటం, శ్వాసలో ఇబ్బంది, వాంతులు, దవడ నొప్పి, చెమటలు పట్టడం, తలతిరిగి కింద పడిపోవడం, ఛాతినొప్పి, ఎడమచేతి వరకు నొప్పి రావడం వంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలు, సామాజిక ఆసుపత్రుల్లోని స్టెమి విభాగానికి తీసుకెళ్లాలని ఉమ్మడి గుంటూరు జిల్లా డీసీహెచ్ఎస్ రంగారావు ప్రజలకు సూచించారు.

టెనెక్టెప్లేస్(స్టెమి) ఇంజెక్షన్ల వినియోగం ఇలా..

ఆసుపత్రి	సరఫరా	వినియోగం
నరసరావుపేట	52	51
మాచర్ల	24	23
సత్తెనపల్లి	59	56
చిలకలూరిపేట	16	14
అమరావతి	23	22
విజయపురిసౌత్	7	4
పెదకూరపాడు	12	10
గురజాల	14	12
ఈపూరు	2	0
వినుకొండ	22	20

కిరణం ప్రసరించదు.. సంగీతం వినిపించదు

నిరుపయోగంగా రూ.4 కోట్లతో నిర్మించిన లేజర్ షో

ధరణికోట, అమరావతి, న్యూస్‌టుడే: పర్యాటకులకు కనువిందు, ఆహ్లాదం పంచేందుకు అమరేశ్వర ఘాట్‌లో ఏర్పాటుచేసిన లేజర్ షో మూణ్నాళ్ల ముచ్చటే అయ్యింది. 2018లో సుమారు రూ. 4 కోట్లతో ఏర్పాటుచేసిన ఫౌంటెన్ ద్వారా పైకి లేచిన నీటిపై తెరలాగా ఏర్పడి ఛాయాచిత్రాలు ప్రదర్శితమవుతాయి. ఆ షోలో అమరావతి విశేషాలు, బుద్ధుని జీవిత చరిత్ర, అమరేశ్వరాలయ ప్రాముఖ్యత తెలిపేలా రూపొందించారు. ఆహ్లాదకర వాతావరణంలో శ్రావ్యంగా ఉండే సంగీతంతో ఈ లేజర్ షో పర్యాటకులను రెండు నెలలపాటు అలరించింది. తర్వాత కృష్ణానది వరదలతో కొంత మేర సామగ్రి కొట్టుకుపోయింది. పకడ్బందీగా నిర్మాణం చేపట్టాల్సిన గుత్తేదారు మొక్కుబడిగా చేసి చేతులు దులుపుకొన్నారన్న విమర్శలొచ్చాయి. వరద వచ్చినప్పుడల్లా షోకు అంతరాయం ఏర్పడటంతో పూర్తిగా నిలిపేశారు. ఆ సామగ్రిని థీమ్ పార్కులో ఏర్పాటు చేశారు. అక్కడ నిర్మాణం చేపట్టి నాలుగేళ్లు పూర్తయినా ఒక్క షో కూడా వేయలేదు. రూ. కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన లేజర్ షో ఉపయోగం లేకుండా పోయిందని, ప్రజాధనం అంటే పాలకులకు లెక్కలేకపోవడం వల్లనే ఈ దుస్థితి వచ్చిందని పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

వృథాగా లేజర్ షో పరికరాలు

స్త్రీశక్తి.. సూపర్‌హిట్

నాలుగున్నర నెలలు.. 1.65 కోట్ల మంది ప్రయాణం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్త్రీశక్తి'ని జిల్లా అతివలు సద్వినియోగం చేసుకుంటున్నారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు నాలుగున్నర నెలల్లో 1.65 కోట్ల మంది ప్రయాణం సాగించారు. పండగలు, శుభకార్యాలు, వైద్య అవసరాలు, కార్యాలయాల్లో పనులకు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. మహిళా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సర్వీసులు పెంచుతున్నట్లు డీపీటీవో అజితకుమారి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. జిల్లాలోని నరసరావుపేట, మాచర్ల, చిలకలూరిపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ డిపోల పరిధిలోని బస్సుల్లో మహిళా ప్రయాణికులు నిండుగా ఉంటున్నారు. ఆగస్టు 15 నుంచి డిసెంబరు నెలాఖరు వరకు మొత్తం 275.51 లక్షల మంది ప్రయాణాలు సాగించగా.. వారిలో మహిళలు 165.94 లక్షల మంది ఉన్నారు.

ప్రయాణికులు (లక్షల్లో)

నెల	మొత్తం	మహిళలు
ఆగస్టు	31.29	17.27
సెప్టెంబరు	59.16	35.59
అక్టోబరు	59.40	35.68
నవంబరు	63.14	38.90
డిసెంబరు	62.52	38.50

❖ జిల్లాలో అత్యధికంగా సత్తెనపల్లి డిపో పరిధిలో 29.24 లక్షల మంది, చిలకలూరిపేట డిపోలో 29.05 లక్షల మంది మహిళలు స్త్రీశక్తిని సద్వినియోగం చేసుకున్నారు.

రైతేరాజు

నాగులవరం రైతులు.. చెరకులో సిరులు

శనగలో యాజమాన్య పద్ధతులు

6లో

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ రాయితీ

నవనీత రూపం.. వేంకన్న వైభవం

సత్తెనపల్లి: నూతన సంవత్సరం పురస్కరించుకుని సత్తెనపల్లి రైల్వే స్టేషన్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారు గురువారం నవనీత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వడ్డవల్లిలోని ఆలయంలో వేంకన్న నిజరూప దర్శనంలో పూజలందుకున్నారు.

కొంగొత్తగా.. సమగ్రంగా

నేటి నుంచి భూమి హక్కు పత్రాల పంపిణీ

నరసరావుపేట వ్యవసాయం, రొంపిచర్ల, న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వం భూముల రీసర్వే చేపట్టింది. అప్పట్లో ఆ పార్టీ నాయకులు వందేళ్ల నాటి భూ సమస్యలు పరిష్కరిస్తున్నామని ఊదరగొట్టారు. ప్రత్యేక యంత్రాలు, సిబ్బందిని నియమించి హడావుడిగా రీ సర్వే చేశారు. తర్వాత కొన్నాళ్లకు పొలం పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేశారు. వాటిలో ముఖ్యంగా పొలం కొలతల్లో హెచ్చుతగ్గులు, విస్తీర్ణంలో మార్పులు, కొనుగోలుదారులు, వారసుల పేర్లలో తప్పులు, సర్వే నంబర్లు, ఆధార్ ఫొటోలు, సెల్‌ఫోన్ సంఖ్య వంటి తప్పులు దొర్లాయి. దీంతో బ్యాంకుల్లో రుణం తీసుకోవాలన్నా, పొలం కొనుగోలు, విక్రయాలకు రైతులు ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు పుస్తకంపై అప్పటి సీఎం జగన్ చిత్రం, నవరత్నాల లోగో ముద్రించడంతో సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమైంది. మరో పక్క తప్పులు సరిచేయాలని కోరుతూ రైతులు కాళ్లరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. దీంతో చేసేదేమీ లేక మిన్నకుండిపోయారు.



ప్రభుత్వం అందించే భూమి హక్కు పత్రాన్ని చూపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

తాజాగా రాజముద్రతో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రత్యేకంగా గ్రామ సభలు నిర్వహించి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. అర్జీల ఆధారంగా రెవెన్యూ అధికారుల సాయంతో ప్రభుత్వం సమస్యలు పరిష్కరించింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గతంలో మాదిరి పొలం పట్టాదారు పాసు పుస్తకాలపై భారత చిహ్నం (రాజముద్ర) ఉండేలా వాటిని తయారు చేసి సంబంధిత రైతులకు అందించనుంది.

గ్రామసభలు నిర్వహించి..

నేటి నుంచి ఈ నెల 9వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదగా భూమి హక్కు పత్రాల పంపిణీ చేపట్టనున్నారు. రీసర్వే చేయని గ్రామాల్లో ప్రస్తుతం సర్వే సాగుతోంది. త్వరలో ఆయా గ్రామాల్లో కూడా కొత్తగా సమగ్రంగా పొలం పట్టాదారు పుస్తకాలు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. నరసరావుపేట డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల పరిధిలో రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి 78,377 పుస్తకాలు అందిస్తామని ఆర్డీవో మధులత తెలిపారు.

మీ ఇంటికి మీ డాక్టర్

గిరిజనులకు రెడ్‌క్రాస్ ఉచిత వైద్యసేవలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: వైద్య సేవలు అందుబాటులో లేని గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేకంగా మాతా శిశు సంరక్షణకు ఉచిత సేవలు అందుబాటులోకి రానున్నాయి. జాతీయ రెడ్‌క్రాస్ సొసైటీ, గ్రామీణ విద్యుదీకరణ సంస్థ ఫౌండేషన్ (ఆర్ఈసీఎఫ్) సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా 'మీ ఇంటికి మీ డాక్టర్' పేరుతో ఏడు జిల్లాల్లో సంచార వైద్యశాల నిర్వహించేందుకు ముందుకు వచ్చాయి. అందులో భాగంగా జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో మొబైల్ యూనిట్ ద్వారా మహిళలు, గర్భిణులు, చిన్నారులకు వైద్య సేవలందించనున్నారు. జిల్లాలో ఈ వైద్య సేవలందించేందుకు ఏడాదికి రూ. 40 లక్షలు వ్యయం చేయనున్నారు. దీని కోసం వైద్యుడు, ఫార్మాసిస్ట్, నర్సు, వాహనానికి డ్రైవర్లను నియమించేందుకు ఇప్పటికే రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్, కలెక్టర్ కృతికాశుక్లా నోటిఫికేషన్ జారీ చేశారు. మూడేళ్ల పాటు ప్రాజెక్టు అమలు చేసేందుకు ఆర్ఈసీఎఫ్ నిధులు సమకూరుస్తుంది. కలెక్టర్‌తో పాటు డీఎంహెచ్‌వో, ప్రాజెక్టు మెడికల్ అధికారి, రెడ్‌క్రాస్ అధ్యక్ష, కార్యదర్శులు సభ్యులుగా ఉన్న కమిటీ పర్యవేక్షిస్తుంది.

జిల్లాలో అమలు ఇలా.. జిల్లా జనాభాలో 7 శాతం గిరిజనులు ఉన్నారు. మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, అచ్చంపేట, బొల్లాపల్లి మండలాల్లోని 51 తండాల్లో చెంచులు నివసిస్తున్నారు. వారిలో వైద్య సేవల వినియోగంపై అవగాహన లోపం ఉంది. ఈ నేపథ్యంలో రెడ్‌క్రాస్ సంస్థ చొరవ తీసుకుని మాతా శిశు సంరక్షణకు ప్రత్యేకంగా ప్రాజెక్టు చేపట్టింది. ఫిబ్రవరి 1 నుంచి వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. వారానికి అయిదు రోజుల పాటు సంచార వాహనం గిరిజన ప్రాంతాల్లో మహిళలకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తుంది. అవసరమైతే వైద్యశాఖ సిబ్బంది సహకారంతో వైద్యశాలలకు తరలిస్తారు. వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారు. సేవాసంస్థల సహకారంతో మాతాశిశు సంరక్షణకు చర్యలకు ప్రభుత్వం సహకరిస్తున్నట్లు జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు ఎమ్మార్ శేషగిరిరావు తెలిపారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సమష్టిగా కదులుదాం

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపి సమగ్రాభివృద్ధి సాధించేందుకు సమష్టిగా సాగుదామని కలెక్టర్ కృతికాశుక్లా పిలుపునిచ్చారు. పెదచెరువులోని క్యాంపు కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఉద్యోగులు తెచ్చిన కేకును కలెక్టర్ కోశారు. దాదాపు రెండు గంటలకు పైగా సందర్శకుల తాకిడి కొనసాగింది. ఎస్పీ బి.కృష్ణారావు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక రంగాల్లో మరింత అభివృద్ధి సంవత్సరం కావాలని ఆకాంక్షించారు. డీఆర్వో మురళి, ఆర్డీవోలు మధులత, రమణకాంత్‌రెడ్డి, మురళీకృష్ణ, అన్ని శాఖల అధికారులు వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్ కృతికాశుక్లాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్పీ కృష్ణారావు

త్రికోటేశ్వరుడికి పూజలు.. కోటప్పకొండపై త్రికోటేశ్వరస్వామిని కలెక్టర్ కృతికా శుక్లా గురువారం దర్శించుకుని పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.

నాణేల మాస్టారు

నరసరావుపేటకు చెందిన **తిరుమలశెట్టి రఘురామ్** ఆరుపదుల వయసులో అలుపెరగకుండా దేశంలోని వివిధ నగరాలు తిరుగుతూ పురాతన నాణేలు, ఖరీదైన కరెన్సీ నోట్లను సేకరిస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 360కి పైగా దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు, అరుదైన నాణేలు సేకరించి భద్రపరిచారు. ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడి చరిత్ర, సంస్కృతి తెలుసుకుంటున్నారు. ఆయన కొంతకాలం ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేసి, సొంతంగా స్కూలు కూడా నిర్వహించారు. చిన్నప్పట్నుంచే నాణేలను సేకరించడం హాబీగా పెట్టుకున్నారు. బంధువులు, స్నేహితుల వద్ద విదేశీ నాణేలు ఉన్నాయని తెలిస్తే.. అడిగి తీసుకుని భద్రపరిచేవారు. ఒకటి నుంచి 50 పైసల నాణేలు, 2, 5, రూపాయల నోట్లున్నాయి. సీసం, బంగారం, వెండి, రాగి, ఇనుము, కంచు తదితర లోహాలతో తయారు చేసిన నాణేలు కూడా భద్రపరిచారు. ఒకటో శతాబ్దం నుంచి వివిధ రాజ్యాల్లోని పాలకులు వినియోగంలోకి తెచ్చినవి ఉన్నాయి. నేటితరానికి మన చరిత్రను తెలియజేయాలనే లక్ష్యంతో నాణేలను ప్రదర్శిస్తున్నట్లు ఆయన చెబుతున్నారు.

- ఈనాడు డిజిటల్, నరసరావుపేట

ప్రపంచ తెలుగు మహాసభలకు అంతా సిద్ధం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గుంటూరు ఏటుకూరు బైపాస్ రోడ్డులోని శ్రీసత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ ప్రాంగణంలో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో జరగనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు అంతా సిద్ధమైంది. దాదాపు ఆరు వేల మంది కూర్చుని కార్యక్రమాలను చూసేందుకు వీలుగా ప్రధాన వేదికను రూపొందించారు. దీంతో పాటు మరో నాలుగు వేదికలు సిద్ధమయ్యాయి. సభలకు వచ్చే వారి కోసం భోజన వసతి, వివిధ అంగళ్లు, ప్రదర్శనశాలల నిర్మాణాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. సాహిత్య, సాంస్కృతిక, కళాంశాల ఆస్వాదనకు ప్రేక్షకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు, నిర్వహణలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఇది తెలుగు చేవ అని తెలియజెప్పేలా కార్యక్రమాలను రూపకల్పన చేశామని పేర్కొన్నారు.

ప్రధాన వేదికను పరిశీలిస్తున్న గజల్ శ్రీనివాస్, ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, పీఆర్ రాజు తదితరులు

సాగర్ నీటిమట్టం 562 అడుగులు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం సాయంత్రం 7 గంటలకు 562.90 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 15,748 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 6774 క్యూసెక్కులు, సాగర్ కుడి కాలువకు 9500, ఎడమ కాలువకు 8022, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 1812, లోలెవల్ కెనాల్‌కు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం 26,637 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

దర్జాగా మున్సిపల్ స్థలాల కబ్జా

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం నరసరావుపేటలో మున్సిపల్ స్థలాలు ఆక్రమిస్తున్నా పట్టించుకునే వారే లేరు. ఏకంగా నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేస్తున్నారు. పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే 60 అడుగుల రోడ్డులో స్థలాన్ని ఆక్రమించి ఓ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. ఆరు నెలల క్రితం ఇక్కడ నిర్మాణం చేస్తుంటే అధికారులు అడ్డుకున్నారు. ఆ సమయంలో పట్టణ ప్రణాళికా విభాగంలో పనిచేసే సిబ్బంది ఆక్రమణదారుని వద్ద కొంత నగదు వసూలు చేశారు. ఉన్నతాధికారులు విషయం తెలుసుకుని ఆ నగదు తిరిగి ఇప్పించేయడం అప్పట్లో చర్చనీయాంశమైంది. తాజాగా అదే ప్రాంతంలో దుకాణాలు నిర్మిస్తున్నా అధికారులు మిన్నకుండటంతో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఓ మున్సిపల్ అధికారి బంధువు నిర్మాణాలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై టీపీవో సాంబయ్యను అడగగా అక్రమ కట్టడాన్ని తొలగించి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే స్టేషన్ రోడ్డులో ఓ దుకాణం ముందు మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి విద్యుత్తు శాఖాధికారుల సాయంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం, దానిని తొలగించేందుకు వెళ్లిన వారిపై సదరు దుకాణదారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో నేటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

అక్రమంగా నిర్మిస్తున్న దుకాణాలు

3,686 మంది ఉద్యోగులు.. 7,13,941 కుటుంబాలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రామాణికమైన ఏకీకృత కుటుంబ సర్వే (యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే) జిల్లాలో వేగం అందుకుంది. జిల్లాలోని 538 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ,3,686 మంది ఉద్యోగులు పాల్గొంటున్నారు. 7,13,941 కుటుంబాల వివరాలు సేకరించాల్సి ఉండగా ఇప్పటివరకు 6,955 కుటుంబాల సర్వే పూర్తి చేశారు.

ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో మరణించిన, శాశ్వత వలస వెళ్లిన వారి పేర్లను తొలగిస్తున్నారు. యూఎఫ్ఎస్ సర్వే యాప్‌లో వ్యక్తిగత, కుటుంబ స్థాయి వివరాలు నమోదు చేస్తున్నారు. వ్యక్తిగత ఆధార్ వివరాలు, జనన తేదీ, చరవాణి నంబరు, ఆధార్ నంబర్లు, కులం, మతం, విద్యార్హత, కుటుంబ ఉపాధి, ఆదాయం, ఇంటి పరిస్థితి, తాగునీరు, మరుగుదొడ్డి, అంతర్జాలం, ఎల్పీజీ కనెక్షన్, వాహనాలు, ఆస్తులు ఇతర వివరాలు నమోదు చేస్తున్నారు. సాంకేతిక సమస్యలతో మొదట్లో సర్వే కాస్తంత నెమ్మదించింది. త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

అమృతమూర్తికి అశ్రుతాంజలి

జననం : 01-07-1937

మరణం : 24-12-2025

కీ॥శే॥ శ్రీమతి డా॥ వీరగంధం సువర్ణ పద్మావతి గారు

పద్మావతి సూపర్ స్పెషాలిటి హాస్పిటల్, కొత్తపేట, గుంటూరు.

నీ జ్ఞాపకాల మధుర స్మృతులే మాకు నిత్య స్మరణీయం.. బాధాతప్త హృదయాలతో...

భర్త : డా॥ వీరగంధం వెంకట సుబ్బారావు

కుమారుడు - కోడలు : డా॥ VSV. రమేష్ - డా॥ PV. సుమన్

మనుమరాండ్రు, మనుమడు : V.శృతి, V.ప్రీతి, V.కృష్ణ

కుమార్తె - అల్లుడు : డా॥ YS.లక్ష్మి - డా॥ Y.శ్రీనివాస్

మనుమడు : డా॥ Y.విజయ్-డా॥ Y.విద్య

మనుమరాలు : డా॥ స్వాతి - మాధ్యూ

ముని మనుమలు, ముని మనుమరాలు : Y.రిషికృష్ణ, Y.మీరాపార్వతి, జోసఫ్ రవి, క్రిష్టఫర్ నిఖిల్

సంస్మరణ సభ : ది.03-01-2026 శనివారం మధ్యాహ్నం 12 గంటలకు 'V' కన్వెన్షన్, గుజ్జనగుండ్ల, పలకలూరు రోడ్, గుంటూరు నందు జరుగును. కావున తెలియపరచడమైనది. సెల్ : 9963192709

(c) eenadu

రేషన్ కార్డుదారులకు కొత్తకానుక

నేటి నుంచి జిల్లా కేంద్రంలో కిలో రూ.20కే గోధుమ పిండి

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే

ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. నూతన సంవత్సరంలో కార్డుదారులకు అదనంగా సరకులు పంపిణీ చేయనుంది. బియ్యం, చక్కెరతో పాటు రాగులు, జొన్నలు, గోధుమపిండిని ఇవ్వనున్నారు. జనవరి 2 నుంచి వీటిని అందజేయడానికి ఇప్పటికే జిల్లాకు కేటాయింపులు చేశారు. సరకులను ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి చౌకదుకాణాలకు చేరవేశారు.

కార్డుదారులకు అందించనున్న గోధుమపిండి

బియ్యం తగ్గించి జొన్నలు: జిల్లాలో బియ్యం 8803 మెట్రిక్ టన్నులు, చక్కెర 308 మెట్రిక్ టన్నులు, జొన్నలు 1899 మెట్రిక్ టన్నులు వచ్చాయి. వాటితో పాటు గోధుమపిండి 42.50 మెట్రిక్ టన్నులు వచ్చింది. ఒక కుటుంబం 25 కిలోల చొప్పున బియ్యం తీసుకుంటే అందులో 3 కిలోలు బియ్యం తగ్గించి జొన్నలు తీసుకోవచ్చు.

జిల్లాలో చౌకధరల	
దుకాణాలు:	1,289
కార్డుదారులు:	6,39,282

జిల్లా కేంద్రాల్లో మాత్రమే..: బహిరంగ మార్కెట్‌లో గోధుమపిండి కిలో రూ.63 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చౌకదుకాణాల్లో కిలో రూ.20కే గోధుమపిండిని ప్యాకెట్ రూపంలో అందించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా తొలుత జిల్లా కేంద్రాల్లో కార్డుదారులకు గోధుమ పిండి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానిలో భాగంగా జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో మాత్రమే గోధుమ పిండి అందుబాటులో ఉంటుంది. జనవరి 2న జిల్లా కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమక్షంలో గోధుమపిండి పంపిణీ ప్రారంభిస్తామని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ నారదముని పేర్కొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణ

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చునని ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలు సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం జిల్లా రవాణా శాఖాధికారి సంజీవరావుతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు నిర్లక్ష్యంగా నడపటం వల్లే ప్రమాదాల్లో ఏటా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలన్నారు. రోడ్డెక్కిన ప్రతి ఒక్కరూ క్షేమంగా ఇళ్లకు చేరాలనే ఆకాంక్షతోనే నిబంధనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకరి నిర్లక్ష్యంతో మరొకరు ప్రాణం కోల్పోరాదన్నారు. పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు బాధ్యత వహించక తప్పదన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ శివనాగేశ్వరరావు ఉన్నారు.

కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఎస్పీ కృష్ణారావు తదితరులు

వైభవం.. అమ్మవారి వార్షికోత్సవం

క్రోసూరు (అచ్చంపేట): క్రోసూరు మండలం విప్పర్ల గ్రామంలోని శ్రీనిదానంపాటిశ్రీలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. అయోధ్య రామ మందిరం ట్రస్టు బోర్డు సభ్యులు వాసుదేవానంద మహారాజ్ స్వామి పాల్గొని సందేశం అందజేశారు. వివిధ గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకొని పొంగళ్ల నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. కోలాటం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. భాజపా నాయకులు రామచంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో అయోధ్య రామమందిర్ ట్రస్టు బోర్డు సభ్యుడు

భక్తి భావనల వెలుగులు

గుంటూరు సాంస్కృతికం: ప్రపంచ తెలుగు మహాసభల్లో భక్తిభావనలకు పెద్దపీట వేస్తున్నారు. తెలుగు నాట భక్తి అనగానే గుర్తొచ్చే శ్రీవెంకటేశ్వర స్వామికి పూజలు, కల్యాణాలు, కీర్తనలతో ప్రారంభమై.. శివ, సుబ్రహ్మణ్యేశ్వర పూజలు, కల్యాణాలతో కళకళలాడేలా అచ్చంగా ఓ వేదిక నిర్మితమైంది. ప్రముఖ సీఏ గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్ బృందం వేదిక నిర్వహణకయ్యే వ్యయాన్ని భరిస్తున్నారు. వేదిక సమన్వయకర్త అన్నాప్రగడ రవిశ్రీనివాస్ కార్యక్రమాల వివరాలు వెల్లడించారు.

మదురై నుంచి స్వామి విగ్రహం: తొలి రోజున లక్ష్మీగణపతి హోమంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం పద్మావతీ శ్రీనివాసుల కల్యాణోత్సవం జరుగుతుంది. ఇక్కడే మదురై నుంచి తీసుకొస్తున్న వెంకటేశ్వర స్వామి పంచలోహ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. తిరుమలలో శ్రీవారికి నిత్యం ఎలా అలంకరించి కల్యాణం నిర్వహిస్తారో. అదేవిధంగా ఇక్కడి విగ్రహానికి నిర్వహిస్తారు. శివపార్వతులకు, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుల కల్యాణాలు జరుగుతాయి. హనుమాన్ చాలీసా, విష్ణు సహస్రనామ పారాయణలు, అన్నమయ్య సంకీర్తన గానాలు.. ఇలా ఎన్నో వైవిధ్య భరిత కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టి పడేలా ప్రాంగణాన్ని రూపొందిస్తున్నారు.

వాటర్‌షెడ్ పథకం కింద చెరువులు ఎంపిక

ఒక్కొక్కటి రూ.50 లక్షలతో అభివృద్ధి

వినుకొండ, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లాలో వాటర్‌షెడ్ పథకం కింద ఐదు చెరువులు అభివృద్ధి చేయనున్నారు. ఒక్కోదానికి ఉపాధిహామీ పథకం నిధులు రూ.50లక్షలు ఖర్చు చేయనున్నారు. కట్టలను బలోపేతం చేయడం, పూడిక తీత, సీల పునరుద్ధరణ, నడకదారి తదితర పనులు చేయనున్నారు. వాగుల వెంట వర్షపు నీరు వృథా కాకుండా గ్రామ పంచాయతీలు, వర్షాధార ప్రాంతాల్లో నీటి వనరుల పెంపు లక్ష్యంగా పనులు చేపడతారు. సమీపంలో ఉన్న గ్రామీణ ప్రాంతంలోని 5 నుంచి 20హెక్టార్లు ఉన్న చెరువులను ఎంపిక చేస్తారు. కట్ట లోపల నీటి కోతను అరికట్టేందుకు రాళ్లను వరుసలుగా పేరుస్తారు. అలుగులు, తూములకు మరమ్మతులు చేస్తారు. నడకదారి నిర్మించి కట్టలపైన పచ్చదనం కోసం మొక్కలు నాటి సోలార్ లైట్లు, కూర్చునేందుకు సిమెంట్ బల్లలు, పెద్దలకు ఓపెన్ జిమ్, చిన్న పిల్లల పార్కు, నక్షత్ర వనం ఏర్పాటు చేస్తారు. ఇప్పటి వరకు గుర్తించిన వాటిల్లో ఐదింటిని ఎంపిక చేస్తామని డ్వామా పల్నాడు జిల్లా సంచాలకులు (పీడీ) సిద్దలింగమూర్తి తెలిపారు.

బొల్లాపల్లి చప్పిడివాగు చెరువు

ప్రతిపాదిత చెరువులు ఇవే..

నియోజకవర్గం	గ్రామం	చెరువు పేరు	విస్తీర్ణం (హె.లో)
నరసరావుపేట	కొండకావూరు	కోటప్పకొండ చెరువు	5.5
చిలకలూరిపేట	నాదెండ్ల	గోవర్ధనస్వామి చెరువు	8
పెదకూరపాడు	అత్తలూరు	అత్తలూరు చెరువు	15
మాచర్ల	వెల్దుర్తి	ఊరచెరువు	10
	తాళ్లపల్లి	మదిరాజుచెరువు	25
గురజాల	అంభాపురం	అంభాపురం చెరువు	45
	పులిపాడు	చిన్నచెరువు	20
వినుకొండ	బొల్లాపల్లి	చప్పిడిచెరువు	80
	అయ్యన్నపాలెం	పెద్దమ్మచెరువు	16

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

INDUSTRY

GENERATORS

జనరేటర్స్ కావలెను. 82.5KV కెపాసిటిగల Kirloskar, Cummins, Ashok Leyand కంపెనీ మాత్రమే కావలెను. వెంటనే సంప్రదించగలరు. మొబైల్ నెంబర్: 92487 11160, 92487 33306.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

గుంటూరు సిటీ లిమిట్స్ నుండి కేవలం 5Kms దూరంలో, రాజధాని అమరావతి రహదారికి దగ్గరలో లామ్ అగ్రికల్చర్ యూనివర్సిటీ దగ్గర 25 ఎకరాలలో గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ లోటస్ ఇన్‌ఫ్రా వారి Luxurio. 105 ప్రీమియం 4BHK విల్లాలు. 4 వైవిధ్య భరితమైన పార్కులు, క్లబ్‌హౌస్, గ్రాండ్ ఎంట్రన్స్ ఆర్చ్ 40 అ।। CC రోడ్స్ కాంపౌండ్ వాల్ సోలార్ ఫెన్సింగ్‌తో, CC TV, CRDA & Rera అప్రూవ్డ్ వెంచర్. బ్యాంక్‌లోన్ కలదు. 9866833383, 8142223456.

PLOT FOR SALE

VINUKONDA

వినుకొండ దొనకొండ 133 గజాలు (2.75 సెంట్లు) ఇంటి స్థలం కేవలం 99999/- మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 93986 21767.

GENERAL

గుంటూరు, సిటీ పరిధిలో 1250, 1360,3000 చ।।గజాల తూర్పు ఫేస్ ప్లాట్స్ సేల్, గోరంట్ల, ఆదిత్రి యెల్లోరా ప్రక్కన రేట్ గజం 14000: 87908 94569.

JOBS

WANTED exp MBA - Marketing graduates to work in a well reputed real estate company. Age below 35yrs. 2wheeler is must & willing to travel extensively with in Guntur limits. Attractive salary&Inc. mail: h4hanumanth@gmail.com. ✆ 95531 55743.

Exp Principals, IIT, NEET, Civils Faculty & 6th - 10th all subjects Teachers (B.Ed/ M.Ed) Required. Interview: 4-1-26, 10Am-4Pm. Jonathan E.M. School, Pedaravuru, (Tenali). ✆ 91778 62662, 96038 65658.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/- 5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/- ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

గుంటూరు బార్‌లో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్, వెయిటర్స్, సప్లయర్లు కావలెను. రూం + భోజన వసతి కలదు. ✆ 81431 98968, 70753 38338.

ప్రముఖ ఐస్ క్రీమ్ కంపెనీ నందు పనిచేయుటకు ట్యాలీ వచ్చిన లేడీ ఆపరేటర్ కావలెను. జీతం: 15కె నల్లపాడు గుంటూరు. ✆ 70323 51666.

R అగ్రహారం & శ్రీనగర్ కాలనీ నందు రిటైల్ షాప్‌లో పని చేయుటకు పార్ట్ టైం సేల్స్ పర్సన్స్ కావలెను. టైం: 4:00Pm-10:30 Pm. ✆ 77990 65046.

MARKETING/ SALES

జీతం 25వేలు. రియల్ ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. M/F రిటైర్డ్ Govt. ఎంప్లాయిస్, LIC ఏజెంట్స్. ✆ 9493585365.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

ఇద్దరి మృతి, ఒకరికి తీవ్రగాయాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా నుంచి పల్నాడు జిల్లాలోని మాచర్లకు పండ్లు, డ్రైఫ్రూట్స్ తెచ్చి అమ్ముకుని తిరిగి వెళుతూ ఇద్దరు దుర్మరణం చెందగా, మరొకరు గాయపడిన ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. మార్కాపురానికి చెందిన షేక్ కరీముల్లా (50) రెండు రోజులకోసారి పండ్లు, డ్రైఫ్రూట్స్ తెచ్చి మాచర్లకు చెందిన సమీప బంధువు నూర్జహాన్‌తోపాటు వ్యాపారం చేస్తుంటాడు. గురువారం వ్యాపారం ముగించుకుని నూర్జహాన్(45)తో కలిసి ద్విచక్రవాహనంపై వెళుతున్నాడు. శిరిగిరిపాడు శివారులో మాచర్ల వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహేష్ ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో కరీముల్లా తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన నూర్జహాన్‌ను ఆసుపత్రికి తీసుకెళ్తుండగా చనిపోయారు. మహేష్‌ను మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి, తర్వాత మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు. మృతుడు కరీముల్లాకు భార్య, కూమారుడు, నూర్జహాన్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

అంబులెన్స్ ఆలస్యమై..: ప్రమాదం విషయాన్ని 108కు సమాచారం ఇచ్చిన 50 నిమిషాలకు ఘటన స్థలానికి వచ్చింది. పది నిమిషాలు ముందు వచ్చినా క్షతగాత్రులు బతికే అవకాశాలు ఉన్నాయని స్థానికులు తెలిపారు. మధ్యాహ్నం 2.55 నిమిషాలకు సమాచారం ఇస్తే 3.45కు వచ్చిందని వాపోయారు.

రైలు నుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు

వలిగొండ: రైల్లో నుంచి కింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని ఏదుల్లాగూడెం గ్రామ పరిధిలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలో పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన మేడి చంద్రశేఖర్ రైల్లో ప్రయాణిస్తూ ఏదుల్లాగూడెం గ్రామ పరిధిలో ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందగానే రైల్వే పోలీసులు, 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని భువనగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు సిబ్బంది తెలిపారు.

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

నాగులవరం రైతులు.. చెరకులో సిరులు

వినుకొండ గ్రామీణ, న్యూస్‌టుడే: చెరకు పంట కర్షకులకి కాసులు కురిపిస్తోందని నిరూపిస్తున్నారు వినుకొండ మండలం నాగులవరం రైతులు. గ్రామానికి చెందిన చిలకల సుబ్బారెడ్డి 22 ఏళ్లుగా సాగుచేస్తు దిగుబడులు సాధిస్తున్నారు. గ్రామంలో మరో 20 మంది వరకు సుమారు 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఒకటిన్నర ఎకరాలో సాగు చేసినట్లు సుబ్బారెడ్డి తెలిపారు. మొదటి సంవత్సరం కొంత పెట్టుబడి ఎక్కువగా ఉంటుందని, మూడేళ్ల పాటు తక్కువ పెట్టుబడితో పంట వస్తుందన్నారు. పంట వేసేందుకు, దుక్కి దున్నేందుకు, బోదెలు చేయడం, విత్తనం నాటేందుకు, ఎరువులు, నీటి తడులు, కలుపు నివారణ చర్యలు, ఆకు విరవడం, చెరకు కొట్టడం, రవాణా ఇతర ఖర్చులు.. అన్నీ కలిపి కూలీలు, ఎరువుల ధరల ఆధారంగా ఎకరాకు సుమారు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి అవుతుందన్నారు. అన్ని అనుకూలిస్తే ఎకరాకు రూ.3 లక్షల వరకు పంట వస్తుందని, ఖర్చులు పోను రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల మధ్య మిగులుతుందని చెప్పారు. వరికి ప్రత్యామ్నాయంగా లాభదాయకమన్నారు. కూలీల కొరతను అధిగమించవచ్చని, యాంత్రీకరణ ఉపయోగించవచ్చన్నారు. సొంత పొలంతో పాటు మరి కొంత కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నానని సుబ్బారెడ్డి తెలిపారు. చెరకు కోతకు రాగానే వ్యాపారులకు అమ్మితే ఒకేసారి డబ్బులు వస్తాయి.. కానీ లాభం తగ్గుతుంది. 10 చెరకులు చొప్పున కట్టలుగా కట్టి జనవరి నుంచి గ్రామాల్లో జరిగే తిరునాళ్లు, జాతర్లలో అమ్మితే ఎక్కువ ధరకు అమ్ముకోవడంతో అధికంగా మిగులుతాయి. కర్ర సైజు పెరిగి లావు ఊరితే పెట్టుబడులు పోను ఎకరాకు రూ.2 లక్షల వరకు మిగులుతాయని వివరించారు.

చెరకు తోట వద్ద సుబ్బారెడ్డి

రైతేరాజు

ఆరేళ్లుగా.. శనగ, ఎర్రజొన్న సాగుతో లాభాలు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం మండలం గొనసపూడి గ్రామానికి చెందిన మానం సుబ్బారావు వయసు 65 ఏళ్లు. 45 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. ప్రకృతి పరంగా, ఇతర కారణాల వల్ల పంట దిగుబడులు ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారు. మండలంలో పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం 15 ఎకరాల శనగ, 12 ఎకరాల్లో ఎర్రజొన్న సాగు చేస్తున్నారు. తనకున్న పొలంతో పాటు మరో 12 ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. శనగ, ఎర్రజొన్న నెల రోజుల పైర్లుగా ఉన్నాయి. ఎకరం భూమికి రూ.17 వేలకు కౌలుకు తీసుకున్నారు. ఎర్రజొన్న మూడు నెలల 15 రోజుల పంట కాలం కాగా శనగ 80 రోజుల పంట కాలం. ఎకరం శనగ పొలానికి కౌలు ఇతర ఖర్చులు కలిపి రూ.35 వేలు కాగా దిగుబడి ఎనిమిది క్వింటాళ్లు వచ్చి రూ.55 వేల ఆదాయం వస్తుందని సుబ్బారావు తెలిపారు. అన్ని ఖర్చులు పోగా ఎకరానికి రూ.20 వేలు వస్తుందన్నారు. ఎకరం ఎర్రజొన్నకు కౌలు తదితర ఖర్చులు కలిపి రూ.30వేలు వ్యయం కాగా రూ.55 వేల నుంచి రూ.60 వేలు వస్తుందని తెలిపారు. అన్ని ఖర్చులు పోగా రూ.30 వేలు మిగులుతుందని చెప్పారు. గతంలో వరి, సోయాబీన్, కంది, మినుము, పెసర పంటలు సాగు చేసినట్లు వివరించారు. ప్రస్తుత కాల పరిస్థితులు దృష్ట్యా లాభసాటిగా ఉందని శనగ, ఎర్రజొన్నను ఆరేడు సంవత్సరాల నుంచి సాగు చేస్తూ లాభాలు పొందుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ వారు 2018లో సుబ్బారావును ఆదర్శ రైతుగా ఎంపిక చేసి, సత్కరించారు.

శనగ పైరు వద్ద రైతు సుబ్బారావు

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ రాయితీ

మార్టూరు, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోంది. జాతీయ నూనె గింజలు, పామాయిల్ (ఎన్ఎంఈవో) పథకం కింద రైతులకు పామాయిల్ మొక్కలు ఉచితంగా అందించడంతో పాటు ఒక హెక్టారుకు రూ.5,250, అంతర పంటల కింద రూ.5,250 చొప్పున నాలుగేళ్లకు రూ.42వేల రాయితీ అందిస్తోంది. ఈ పథకం కింద పేర్లు నమోదు చేసుకున్నవారికి సాగుపై ఎప్పటికప్పుడు అధికారులు సూచనలు చేస్తున్నారు. దీంతో మార్టూరు మండలం జంగమహేశ్వరపురం, జొన్నతాళి, ఇసుకదర్శి ద్రోణాదుల, నాగరాజుపల్లి గ్రామాల్లో 60 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. రైతులను వాణిజ్యపరంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం మార్టూరులో ఆయిల్‌పామ్ సాగుకు శ్రీకారం చుట్టిందని ఉద్యాన శాఖాధికారి బి. హనుమంత్‌నాయక్ తెలిపారు.

నల్ల తామర పురుగును నియంత్రిద్దాం

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: లాభదాయకమైన పంటల్లో మిరప ఒకటి ఈ తోటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభాలు ఖాయమని చెబుతున్నారు పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు. మిరప సాగులో నల్లతామర పురుగు ఆశిస్తే దిగుబడి భారీగా తగ్గించే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఎకరానికి 40 చొప్పున జిగురు అట్టలు ఏర్పాటు చేయాలి. వేప కషాయం 5 శాతం ఎకరాకు లీటరు చొప్పున పిచికారీ చేయాలి. వారం రోజుల తరువాత స్పైనోసాడ్ 0.3మి.లీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి చల్లాలి. అక్కడక్కడ బంతి మొక్కలు తోట చుట్టూ మొక్కజొన్న రెండు వరుసల్లో పెంచితే సత్ఫలితం ఉంటుందని చెప్పారు.

శనగలో యాజమాన్య పద్ధతులు

పర్చూరు, కారంచేడు, న్యూస్‌టుడే: శనగలో ప్రస్తుతం ఎండుతెగులు, వేరుకుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉంది. రైతులు ఎక్కువగా జేజీ 11, కేఏకే2 రకాలు సాగుచేస్తున్నారు. ప్రస్తుతం పంట ఎదుగుదల దశ నుంచి పూత దశకు చేరుకోవడంతో పంటపై రైతులు జాగ్రత్తలు పాటించాలి. ఎండుతెగులు, వేరుకుళ్ల తెగులు, తుప్పు తెగులు నివారణకు రైతులు తప్పనిసరిగా వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని పర్చూరు ఏడీఏ జీబీపీ ప్రవీణ తెలిపారు.

ఎండు తెగులు ఆశించకుండా చర్యలు

నేలలో ట్రైకోడెర్మావిరిడి అభివృద్ధి చేసే విధానం ద్వారా తెగులును నివారించవచ్చు. బాగా మాగిన పశువుల ఎరువు 90 కిలోలు, ట్రైకోడెర్మావిరిడి 2కిలోలు, వేపపిండి 10కిలోలు చొప్పున కలుపుకొని మిశ్రమాన్ని ఆరు అంగుళాల మందం ఉండేలా ఒక బెడ్‌లా వేసుకుని, ప్రతి రోజూ నీరు చల్లాలి. 15రోజుల తర్వాత ట్రైకోడెర్మావిరిడి అభివృద్ధిచెంది ఎరువుగా మారుతుంది. ఎక్కడైతే ఎండుతెగులు, వేరుకుళ్ల తెగులు ఆశించి మొక్కలు చనిపోతాయో అక్కడ విత్తబోయే ముందుగా పొలంలో ఈ ఎరువును చల్లుకోవడం ద్వారా మట్టి ద్వారా సంక్రమించే తెగులు శిలీంద్రాన్ని అరికట్టవచ్చు. దుక్కులు లోతుగా దున్నుకోవడంతో పాటు పంటమార్పిడి, విత్తనశుద్ధికి రైతులు అధికప్రాధాన్యం ఇవ్వాలి. నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3గ్రాములు లేదా కార్బండిజమ్ ఒక గ్రాము లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లల్లో పోయాలి.

తుప్పు తెగులు నివారణ ఇలా..

శనగ పైరు పక్వాని దశలో తుప్పుతెగులు ఆశించే అవకాశం ఉంది. ఆకులపై గుండ్రని చిన్న గోధుమ రంగు పొక్కులు ఏర్పడితే వెంటనే గుర్తించాలి. లేని పక్షంలో మొక్కలు పక్వానికి రాకముందే ఎండిపోతాయి. చల్లని వాతావరణం ఈ తెగులు వ్యాప్తికి దోహదపడుతుంది. నివారణకు హెక్సాకొనజోల్ 2ఎం.ఎల్ లేక ప్రొపికొనజోల్ 1ఎం.ఎల్ లేక ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ టెబుకొనజోల్ 0.8గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.

అనధికారికంగా విగ్రహం ఏర్పాటు!

ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం ★ అనుమతులు లేవంటున్న మున్సిపల్ అధికారులు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రం నరసరావుపేటలో పలు రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలను ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం యథేచ్ఛగా ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తున్నా అడిగే వారు లేకపోవటం గమనార్హం. నరసరావుపేటలో కొన్ని రాజకీయ పార్టీల నాయకులు అధినాయకుల వద్ద తమ ప్రాభవం చూపించుకునేందుకు ఇష్టానుసారం విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో వైకాపా అనుసరించిన విధానాన్నే కొందరు అనుసరించడం చర్చనీయాంశమైంది. పల్నాడు రోడ్డులో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ విగ్రహం వ్యవహారం కోర్టులో ఇప్పటికీ నడుస్తుంది. తాజాగా నిత్యం రద్దీగా ఉండే 60 అడుగుల రోడ్డు వద్ద ఓ రాజకీయ పార్టీ నేతలు తమ నాయకుడి విగ్రహం ఏర్పాటుకు రాత్రికి రాత్రి గుంత తవ్వారు. ఆ గుంతకు అడ్డుగా ఉన్న డివైడర్‌ను కొంతమేర పగులగొట్టారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రజలు నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన ప్రజాధనంతో నిర్మించిన డివైడర్‌ను పగులగొట్టడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై మున్సిపల్ డీఈ రఫీని అడగ్గా విగ్రహ ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పారు.

60 అడుగుల రోడ్డు వద్ద పగులగొట్టిన డివైడర్

అందుబాటులోకి అధునాతన వైద్యసేవలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో ప్రజలకు అధునాతన వైద్యసేవలు అందుబాటులోకి వస్తున్నాయని ఎమ్మెల్యే అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట ఎన్జీవో కాలనీలో నూతనంగా నిర్మించిన యశ్వూర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని గురువారం ప్రారంభించారు. వైద్యశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు తక్కువ ఖర్చుతో అందించాలని సూచించారు. వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ నిఖిల్ యండమూరి, డాక్టర్ అనూహ్య చదలవాడ మాట్లాడుతూ వైద్యశాలలో జీర్ణకోశ, మెదడు, నరాలు, గుండె, ఇంటర్నల్ మెడిసిన్, ఊపిరితిత్తులు, చర్మ సంబంధిత సమస్యలకు అధునాతన వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వైద్యశాలకు 60 పడకల సామర్థ్యం ఉందన్నారు. డాక్టర్ చదలవాడ కృష్ణమోహన్, డాక్టర్ పూర్ణిమా శ్రీదేవి, పలువురు ప్రముఖ వైద్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

వేర్వేరు ప్రమాదాల్లో ఒకరి దుర్మరణం

యడ్లపాడు, న్యూస్‌టుడే: మండలంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతిచెందగా, ఏడుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నాదెండ్ల మండలం గణపవరంనకు చెందిన కిరణ్, అంకమ్మ, మరో నలుగురు యువకులు గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు కారులో ప్రయాణిస్తున్నారు. తిమ్మాపురం వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి సర్వీసు రోడ్డు పక్కన మురుగు కాలువలోకి పల్టీలు కొట్టింది. ప్రమాదంలో కారులోని అందరూ గాయపడ్డారు. ఎస్సై శివరామకృష్ణ ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కిరణ్ (23) మృతి చెందాడు. మెరుగైన చికిత్స కోసం ముగ్గురిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

✦ కొత్త బైపాస్ రోడ్డులో రాజస్థాన్‌కు చెందిన కార్మికులు రాహుల్, వర్ష ద్విచక్ర వాహనంపై గుంటూరు వైపు వెళుతున్నారు. తిమ్మాపురంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద అడ్డు వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో ఓ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. 108లో చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు గురువారం మృతి చెందాడు. నాదెండ్ల ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు.. గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన వేల్పుల ఆనంద్‌బాల (22) గ్రామంలోని ఓ గ్యాస్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేసేవాడు. గత నెల డిసెంబరు 26న ద్విచక్రవాహనంపై వస్తూ డివైడర్ ఢీకొని కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన అతన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం జీజీహెచ్‌కి పంపారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

ఒక్క క్లిక్.. వందల పుస్తకాల పెట్టె

గుంటూరు సాంస్కృతికం: వందల సంవత్సరాల కిందట అచ్చయిన పుస్తకాలు, వేల రూపాయల ధర ఉన్నవి, అరుదైనవి కావాలంటే.. ఈ రోజుల్లో పుస్తకప్రియులు కాస్తంత ఇబ్బంది పడుతున్న మాట నిజమే. ఈ కష్టాన్ని పోగొట్టడానికి మూడో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా గుంటూరు సాహితీ సమాఖ్య ఓ వినూత్న, విశిష్ట కార్యక్రమాన్ని చేపట్టింది. నిఘంటు రచయితగా పేరున్న పెద్ది సాంబశివరావు సహకారంతో అందుబాటులో ఉన్న అధునాతన సాంకేతిక సహకారంతో తెలుగు భాష, సంస్కృతుల ప్రచారానికి ఉపకరించేవి, పాఠకుల ఆదరణ పొందిన వందల పుస్తకాలు సేకరించారు. వీటన్నింటినీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఒక 'క్యూఆర్ కోడ్'కు అనుసంధానించారు. ఆ కోడ్‌ను స్కాన్ చేస్తే సంబంధిత వెబ్‌సైట్ తెరుచుకుంటుంది. అందులో పీడీఎఫ్ పద్ధతిలో వివిధ పుస్తకాలు ఉంటాయి. వాటిలో ఏది కావాలో ఎంచుకుని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

జాతీయ వాలీబాల్ పోటీల రిఫరీగా రాజేష్

వినుకొండ, న్యూస్‌టుడే: వినుకొండకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు కాకుమాను రాజేష్ జాతీయ వాలీబాల్ పోటీలకు రిఫరీ (టెక్నికల్ అఫీషియల్)గా నియమితులయ్యారు. ఈ నెల 5 నుంచి 9 వరకు కడప జిల్లా దేవగుడిలో అండర్-14 బాలికల జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లా నుంచి రాజేష్ ఒక్కరికే ఈ అవకాశం లభించింది. ప్రస్తుతం ఆయన యడ్లపాడు మండలం ఉన్నవ జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో / కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, రిటైల్ ధర - 179, చికెన్ విత్‌స్కిన్ - 260, చికెన్ స్కిన్‌లెస్ - 295.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -147 రిటైల్ ధర 174 చికెన్ విత్ స్కిన్ - 252, చికెన్ స్కిన్‌లెస్ - 287.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 162, 171, 183 చికెన్ విత్ స్కిన్ - 314 చికెన్ స్కిన్‌లెస్ - 324.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు సహకరించాలని కలెక్టర్ కృతికాశుక్లా కోరారు. తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో యూటీఎఫ్ కాలమానినిని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు తగ్గకుండా చూడాలని సూచించారు. జిల్లా నేతలు శ్రీనివాసరెడ్డి, మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

వినుకొండలో నేడు ప్రజాదర్బార్

వినుకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తన కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

క్విజ్‌లో మెరిసి.. ప్రశంస పొంది..

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలకు స్పందన

నరసరావుపేట: విజేతలతో సన్‌షైన్ పాఠశాల డైరెక్టర్లు, ప్రిన్సిపల్

చిలకలూరిపేట: విద్యార్థులతో జడ్‌సీవో ప్రమీలరాణి, ప్రిన్సిపల్ వాసు, హెచ్ఎం యామిని

నరసరావుపేట అర్బన్, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: పాఠశాలల్లో 'ఈనాడు' నిర్వహిస్తున్న ప్రతిభాపాటవ పోటీలకు విద్యార్థుల నుంచి చక్కని స్పందన లభిస్తోంది.

చిలకలూరిపేట: ప్రతిభ చాటిన విద్యార్థులతో డైరెక్టర్ రాజేష్, ప్రిన్సిపల్ బాషా

ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారు. దీనిలో భాగంగా జిల్లా కేంద్రం నరసరావుపేటలో ప్రకాశ్‌నగర్‌లోని సన్‌షైన్ ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీ నిర్వహించారు. దీనిలో రాణించిన జి.సత్యరేవంత్ (7వ తరగతి) ఎం.విష్ణుసాయి, షేక్ ఆసియా (8వ తరగతి) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్లు ఎం.లక్ష్మి, ఎస్.లక్ష్మి, రాధిక ప్రిన్సిపల్ కామేశ్వరి బహుమతులు అందజేసి అభినందించారు. ★ చిలకలూరి పేట భాష్యం హైస్కూల్లో సాత్విక, మహబూబ్ సుభాని, యషిత్ (7వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి బహుమతులు అందుకున్నారు. విజేతలైన విద్యార్థులకు పాఠశాల జడ్‌సీవో ఎ.ప్రమీలా రాణి, ప్రిన్సిపల్ జి.వాసు, హెచ్ఎం ఎస్.యామిని, వైస్ ప్రిన్సిపల్ టి.మేరి ప్రశంసా పత్రాలు అందించి వెన్నుతట్టారు. ★ చిలకలూరిపేట హీలియోస్ సాదినేని చౌదరయ్య స్కూలులో నిర్వహించిన క్విజ్ పోటీలో విద్యార్థులు ఎ.షణ్ముఖ ఆనందబాబు (9వ తరగతి), టి.సాయినవీన్, ఎం.డి.మల్లిక (10వ తరగతి) చక్కగా రాణించి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల డైరెక్టర్ జి.రాజేష్, ప్రిన్సిపల్ ఎస్కే బాషా వారికి బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156

యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలో రూత్‌డైక్‌మెన్ కాలనీలోని చర్చి పక్కన ప్రధాన సీసీ రహదారి పగుళ్లిచ్చింది. ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. **– వెంకటేశ్వర్లు**

✔ రహదారికి మరమ్మతులు చేయించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **– మణికుమార్, పురపాలక సంఘ ఏఈ**

- న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

మూడు నెలలుగా అడుగు పడలేదు!

ఆగిపోయిన ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి పనులు

గాంధీపేట(చిలకలూరిపేట పట్టణం), న్యూస్‌టుడే : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక చిలకలూరిపేటలో పేదలకు వైద్యసేవలు అందించే ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేసినా పనులు మాత్రం జరగడం లేదు. పట్టణంలోని 100 పడకల ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు, పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రూ.9.5 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ ఏడాది జులైలో పనులు కూడా ప్రారంభించారు. ఆసుపత్రి చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు మొదలుపెట్టి కొంతమేర చేసి వదిలేశారు. మూడు నెలల నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ఆసుపత్రి చుట్టూ సగం మాత్రమే పూర్తయిన పనులు దర్శనమిస్తున్నాయి.

చేయాల్సినవివే.. ఆసుపత్రికి మంజూరైన నిధులతో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రి చుట్టూ ప్రహరీతో పాటు వాహనాలు నిలుపుకొనేందుకు స్టాండ్, వంట గది, గేటు, రోగుల సహాయకులు భోజనం చేసేందుకు షెడ్లు, ఆసుపత్రి ప్రాంగణంలో అంతర్గత రహదారులు, ఎక్స్‌రే రూం, పాత భవనానికి మరమ్మతులు, అధునాతన క్యాజువాలిటీ భవనం పనులు చేయాల్సి ఉంది. ఆసుపత్రికి అవసరమైన జనరేటర్, చెవి, ముక్కు, కంటి, ఎముకలకు సంబంధించిన వైద్య పరికరాలు కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే వీటిలో ప్రహరీ కొంతభాగం పనులు చేసి నిలిపివేశారు. జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రయోగశాలలో పరీక్షలు చేసే సమయంలో విద్యుత్తు సరఫరా ఆగిపోతే ఆ పరీక్షలు మళ్లీ చేయాల్సి వస్తోంది. ఆసుపత్రి ప్రాంగణంలో ఎక్కడపడితే అక్కడ ఇసుక కుప్పలు, ఇనుప చువ్వలు, నిర్మాణ పనులకు సంబంధించిన సామగ్రి ఉన్నాయి. దీంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు, సహాయకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

సగంలో నిలిచిన ప్రహరీ పనులు

త్వరితగతిన పూర్తికి చర్యలు

ఇటీవల ఆసుపత్రి కమిటీ సమావేశంలో పనులు ఆగిపోయిన విషయం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఆసుపత్రి అభివృద్ధి పనులు త్వరలో మొదలు పెట్టి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు.

కొండపైన ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

రాధాకృష్ణకు రసీదు అందిస్తున్న ఛైర్మన్ అచ్యుత కోటేశ్వరరావు

వినుకొండ, న్యూస్‌టుడే: కొండపైన గంగా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి వినుకొండ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచి చలవాది హనుమాయమ్మ కుమారుడు రాధాకృష్ణ, అరుణ దంపతులు రూ.5లక్షలు విరాళం ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఆలయ పాలకమండలి అధ్యక్షుడు అచ్యుత కోటేశ్వరరావు ఇతర సభ్యులు ఆయనను తన నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. గుడిలో నూతన నందీశ్వరుని విగ్రహానికి ఈ నగదు ఖర్చు చేయాలని కోరారరన్నారు. దాతల విరాళాలతో ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.

సందడిగా ప్రభుత్వ కార్యాలయాలు

వినుకొండ వైద్యశాలలో నూతన వత్సర సంబరం

వినుకొండ రూరల్, శావల్యాపురం, రొంపిచర్ల, నూజండ్ల, న్యూస్‌టుడే: ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా ఉద్యోగులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వైద్యశాలలు, పోలీసు స్టేషన్లలో ఉన్నతాధికారులకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపి కేకులు కోశారు. డీఎంఅండ్‌హెచ్‌వో రవి, డీఆర్వో మురళి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో పద్మావతిని ఆయా శాఖల సిబ్బంది కలిసి శాలువాలతో సత్కరించారు. ఉత్సాహంగా విధులు నిర్వహించాలని వారు సూచించారు. చిన్నారులు తమ స్నేహితులకు గ్రీటింగ్ కార్డులు పంచారు. యువత పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రొంపిచర్ల, నూజండ్ల, గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ), మల్లమ్మ సెంటర్(నరసరావుపేట): కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ బుధవారం అర్ధరాత్రి యువత పలు కార్యక్రమాలు చేపట్టారు. ఆలయాల్లో దేవతా మూర్తులను అలంకరించారు. ప్రజలు ఆలయాలకు పెద్ద ఎత్తున తరలి వెళ్లి పూజలు చేశారు. చర్చిల్లో కేకులు కోసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహిళలు నూతన ఏడాదికి స్వాగతం పలుకుతూ ముగ్గులు వేశారు.

కిటకిటలాడిన నేతల లోగిళ్లు

ఎంపీ, ఎమ్మెల్యేల కార్యాలయాలు, నేతల నివాసాలకు పోటెత్తిన అభిమానులు

నరసరావుపేట: దివ్యాంగుల నుంచి పుష్పగుచ్ఛం అందుకుంటున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

స్వర్ణ నరసరావుపేట డాక్యుమెంట్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, ఆర్డీవో మధులత

కేకు కోస్తున్న తెదేపా ప్రధాన కార్యదర్శి శివరాం

చిలకలూరిపేట: పార్టీ కార్యకర్తలు, నాయకుల నడుమ ఎమ్మెల్యే ప్రత్తిపాటి

వినుకొండ: తెదేపా నాయకులతో కలిసి వేడుకల్లో ప్రభుత్వ చీఫ్‌విప్ ఆంజనేయులు

జనసేన కార్యాలయంలో నవోత్సాహం

నరసరావుపేట అర్బన్, నరసరావుపేట వ్యవసాయం, చిలకలూరిపేట పట్టణం, చిలకలూరిపేట గ్రామీణ, వినుకొండ, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా ప్రజాప్రతినిధులు, పలు రాజకీయ పార్టీ నేతల నివాసాలు, కార్యాలయాలు అభిమానులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అభిమానులు, కార్యకర్తలు, అధికారులు, నేతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్జీవో కాలనీలోని తన క్యాంపు కార్యాలయం వద్ద దివ్యాంగులను పలకరించి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు శుభాకాంక్షలు అందుకున్నారు. గుంటూరు రోడ్డులో ఎమ్మెల్యే అరవిందబాబు కార్యాలయంలో వేడుకలు సాగాయి. ఈ సందర్భంగా స్వర్ణ నియోజకవర్గం 2047 డాక్యుమెంట్‌ను ఆర్డీవో మధులతతో కలిసి ఆవిష్కరించారు. రాజాగారికోటలోని కోడెల క్యాంపు కార్యాలయంలో కోడెల ఆశయాలను సాధిస్తామంటూ నినదించారు. ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ప్రకాశ్‌నగర్‌లో మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి నివాసంలో వేడుకలు నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సయ్యద్ జిలాని పార్టీ నేతలతో కలిసి కేక్ కోశారు. వినుకొండలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు జీడీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జ్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి శివాలయంలో పూజలు చేశారు. చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల తెదేపా అధ్యక్షులు జవ్వాజి మదన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్‌యార్డులో వేడుకల్లో యార్డు ఛైర్మన్ షేక్ కరీముల్లా పాల్గొన్నారు. చిలకలూరిపేటలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ఇంటి వద్ద వేడుకలు ఘనంగా జరిగాయి. పురపాలకసంఘ కార్యాలయంలో ఛైర్మన్ ఎస్కే రఫానిని పట్టణ ప్రముఖులు, పార్టీ నాయకులు, కమిషనర్ శ్రీహరిబాబు, అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వైకాపా ఆధ్వర్యంలోనూ వేడుకలు నిర్వహించారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

రొంపిచర్ల, నూజండ్ల, న్యూస్‌టుడే: భూముల రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో మొదటి విడతగా శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహించి రైతులకు భూమి హక్కు పత్రాల పంపిణీ చేయనున్నట్లు రొంపిచర్ల తహసీల్దార్ బండి నిర్మల గురువారం తెలిపారు. 2న కర్లకుంట, 3న బుచ్చిపాపన్నపాలెం, అన్నవరం, 5న తురిమెళ్ల, 6న మాచవరం, నల్లగార్లపాడు, 7న సంతగుడిపాడు, 8న ఆలవాల, ముత్తనపల్లి, 9న ఆరేపల్లి, అన్నవరప్పాడు గ్రామాల్లో పంపిణీ ఉంటుందన్నారు. తొలి రోజు ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు. ఆయా గ్రామాలకు సంబంధించి 13104 పుస్తకాలు వచ్చాయన్నారు. విప్పర్ల రెవెన్యూ గ్రామ పరిధిలో శుక్రవారం నుంచి రీసర్వే నిర్వహిస్తున్నామని, రైతులంతా సహకరించాలని ఆమె కోరారు. నూజండ్ల మండలంలో 2న ముర్తింజాపురం, తంగిరాల, 3న చింతలచెరువు, పెద్దవరం, 5న తెల్లబాడు, 6న అన్నవరం, 7న ములకలూరులో పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని తహసీల్దార్ రమేష్‌కుమార్ తెలిపారు. 5802 మంది రైతులకు పుస్తకాల పంపిణీ జరుగుతుందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవీ ఇవీ

ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యారంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలను విజయవంతంగా అమలు చేసేందుకు ఉపాధ్యాయులు సహకరించాలని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎస్టీయూ(డీ) ఉపాధ్యాయ సంఘానికి సంబంధించిన కాలమానినిని ఆయన ఆవిష్కరించారు. సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి జంగం కోటేశ్వరరావు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు సాంబశివరావు తదితరులు ఉన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యమే లక్ష్యం

యడ్లపాడు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలపాలిట వరం అని, వైద్యం కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే నిధులు మంజూరు చేస్తున్నారని తెదేపా తిమ్మాపురం గ్రామ అధ్యక్షుడు బొల్లినేని వీరశేఖర్ అన్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సహకారంతో మంజూరైన రూ.9.51 లక్షల సహాయ నిధి చెక్కును తెదేపా నేతలు గురువారం లబ్ధిదారు ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా వీరశేఖర్ మాట్లాడుతూ..పార్టీలకు అతీతంగా వైద్య సహాయం కోరిన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి మంజూరు చేస్తున్నారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఆపదలో ఉన్న వారికి సహాయనిధి ద్వారా తోడ్పాటు అందించటం సంతృప్తిని కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పాపసాని రాజేశ్వరి, గ్రామ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పావులూరి పిచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు దుస్తుల అందజేత

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: నరసరావుపేట ఎంఎల్ఎస్ పాయింట్లలో పనిచేస్తున్న హమాలీలకు నూతన సంవత్సరం పురస్కరించుకొని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు నారదముని దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అందించే నిత్యావసర సరకులను భద్రంగా రేషన్ డీలర్ల వద్దకు చేర్చే హమాలీలను సత్కరించుకోవటం మన బాధ్యత అన్నారు. అనంతరం వారికి భోజనం వడ్డించారు. ఎల్.రాంబాబు సమకూర్చిన దుస్తులను వారికి అందించి యోగ క్షేమాలు తెలుసుకున్నారు.

పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహక బహుమతులు

వయ్యకల్లు(శావల్యాపురం), న్యూస్‌టుడే : నూతన సంవత్సరం పురస్కరించుకుని మండలంలో వయ్యకల్లు వెండార్ కేంద్రంలోని పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహక బహుమతులు అందచేసినట్లు సంఘం అధ్యక్షుడు చెవల యోగయ్య తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.లక్ష వ్యయం దాటిన 12 మంది పాల ఉత్పత్తిదారులకు గురువారం ఉదయం సంఘ ఆవరణలో బహుమతులు అందచేసినట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు నడింపల్లి లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : నాదెండ్ల మండలం గణపవరం మెయిన్‌బజారులోని చర్చిలో గురువారం వృద్ధులు, పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కొప్పుల ఓబయ్య అందించిన ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చర్చి పాస్టర్ శామ్యూల్ తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు కిలారు హనుమయ్య, దార కొండయ్య, షేక్ బాబావలి తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రికల ఆవిష్కరణ

యడ్లపాడు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు తహసీల్దార్ విజయశ్రీ అన్నారు. ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం గోడ పత్రికలను ఏపీ జేఏసీ-అమరావతి పల్నాడు జిల్లా ఛైర్‌పర్సన్ (మహిళా విభాగం) అనూరాధతో కలిసి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కేపే చారి, ఆర్ఐ సుబ్బారావు, గణాంక అధికారి చెన్నయ్య, వీఆర్వోలు, వీఆర్ఏలు, రేషన్ డీలర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మినీ వ్యాన్

ప్రమాద దృశ్యం

రొంపిచర్ల, న్యూస్‌టుడే: అద్దంకి- నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిపై రొంపిచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు చెక్‌పోస్టు సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మినీ వ్యాన్ ఢీ కొట్టిన సంఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. చెక్‌పోస్టు వద్ద సెస్ చెల్లించటానికి ధాన్యం లోడు లారీ ఆపారు. ఇదే మార్గంలో అద్దంకి వైపు వెళుతున్న మినీ వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మినీ వ్యాన్ ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు.

ఎదురెదురుగా బస్సు, ద్విచక్రవాహనం..

మార్టూరు, న్యూస్‌టుడే: చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై ఇసుకదర్శి సమీపంలో గురువారం ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరు నుంచి ఒంగోలు వైపు ప్రయాణికులతో వెళుతున్న బస్సు ఇసుకదర్శిలో ప్రయాణికులను దింపి, ఎక్కించుకునేందుకు హైవే సర్వీసు రోడ్డులోకి మళ్లుతుండగా వినుకొండ సమీపంలోని పిట్టంబండ గ్రామానికి చెందిన జయపాల్ (42) బైక్‌పై వెళుతూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో అతడి తలకు బలమైన గాయమైందని స్థానికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు వైద్య సేవల నిమిత్తం తమ వాహనంలో క్షతగాత్రుడిని మార్టూరు తరలించారు. జొన్నతాళిలోని బంధువుల ఇంటికి జయపాల్ వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. మెరుగైన వైద్యం కోసం మార్టూరు వైద్యులు గుంటూరుకు సూచించడంతో అక్కడికి తరలించారు.

పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేట వరవకట్టకు చెందిన షేక్ సుభానికి లింగంగుంట్లకు చెందిన రాము, చరణ్, విఘ్నేశ్వర్, విష్ణుతో పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత నెల 28న సుభానిపై ఆ నలుగురు దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు.

ఆరుతడి పంటలకు కల్పతరువు

కనమర్లపూడి(శావల్యాపురం), న్యూస్‌టుడే : మండలంలో కనమర్లపూడి తారకరామా ఎత్తిపోతల పథకం నాలుగు గ్రామాల రైతులకు కల్పతరువుగా మారింది. గతంలో తెదేపా ప్రభుత్వ హయంలో రూ.కోటి వ్యయంతో పథకానికి మరమ్మతులు చేపట్టారు. ఈ పథకం కింద ఆరుతడి పంటలకు సాగు నీరందుతోంది. రైతులు వాణిజ్య పంటలైన పొగాకు, కంది, మిరప పంటలను విరివిగా ఖరీఫ్, రబీలో సాగుచేశారు. ఎత్తిపోతల పథకం కింద మొత్తం 3481 ఎకరాలు సాగులో ఉంది. దీని పరిధిలో కనమర్లపూడి, విఠంరాజుపల్లి, పిచికలపాలెం, బోడిశంభునివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. అంతేకాకుండా ఆయకట్టు పరిధిలోని రైతులే స్వయంగా విరాళాలు సేకరించి పథకాన్ని నిర్వహిస్తున్నారు. దీనికి ప్రభుత్వం 16 గంటల త్రీఫేస్ విద్యుత్తు సరఫరా చేయడంతో రైతులకు సమృద్ధిగా సాగునీరు అందుతుందని ఎత్తిపోతల పథకం పరిధిలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కనమర్లపూడి తారకరామ ఎత్తిపోతల పథకం

దస్తావేజులు పోయినవి

పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం పుచ్చనూతల గ్రామానికి చెందిన రుద్రరాజు రామచంద్ర రాజు గారి కుమారుడు ప్రసాద రాజు అను నేను 29-12-2025 తేదీన నూజెండ్ల నుంచి xerox నిమిత్తం xerox షాపునకు వెళ్లుచుండగా 1943/2012, 1944/2012, 1945/2012, 1946/2012 అను నెంబర్లు గల డాక్యుమెంట్లు మార్గమధ్యలో పోయినవి, దొరికిన వారు తెలియచేయగలరు.

6301157639

దస్తావేజులు పోయినవి

పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం పుచ్చనూతల గ్రామానికి చెందిన రుద్రరాజు ప్రసాదరాజు భార్య అయిన రుద్రరాజు లక్ష్మి అను నేను 29-12-2025 తేదీన నూజెండ్ల నుంచి xerox నిమిత్తం xerox షాపునకు వెళ్లుచుండగా 1947/2012, 1948/2012, 1949/2012 అను నెంబర్ గల డాక్యుమెంట్లు మార్గమధ్యలో పోయినవి దొరికిన వారు తెలియచేయగలరు.

6301157639

తారు లేచి.. అవస్థలు మిగిల్చి..

నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు

న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

చిలకలూరిపేట బ్యాంక్ కాలనీ నుంచి టిడ్కో గృహాలు, చెరువు, కమ్మవారిపాలెం, కట్టుబడివారి పాలెం మీదుగా యూటీ వరకు 12 కి.మీ. రహదారి అధ్వానంగా మారింది. తారు లేచి రాళ్లు పైకి కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల గుంతలమయంగా మారింది. వచ్చే ఫిబ్రవరిలో మహాశివరాత్రి పర్వదినానికి ఈ రోడ్లు సిద్ధంగా ఉంటేనే భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉంటాయని ఈ మార్గంలో ప్రయాణించే గ్రామాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డంతా గుంతలతో నిండటంతో రాత్రిళ్లు ప్రయాణం ప్రమాదకరంగా మారిందన్నారు. కమ్మవారిపాలెం, కట్టుబడివారి పాలెం వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సమస్య తీవ్రతపై గతంలో 'ఈనాడు'లో కథనాలు రావడంతో ఈ రహదారితో పాటు లింగంగుంట్ల - వేలూరు రహదారికి కలిపి ప్రభుత్వం రూ.2.57 కోట్లు నిధులు మంజూరు చేసింది. టెండర్లు కూడా పిలిచారు. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు పనులు చేపట్టకుండా జాప్యం చేస్తుండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనికి సంబంధించి ఆర్అండ్‌బీ ఏఈ సురేష్ మాట్లాడుతూ త్వరలోనే పనులు మొదలుపెట్టేలా గుత్తేదారుకు సూచనలు చేస్తామన్నారు.

ఎనిమిదేళ్లుగా.. ఎదుగూబొదుగూ లేక..

కాకతీయనగర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేట రూరల్ పరిధిలోని పెద్దతురకపాలెం గ్రామంలో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, హాస్టల్ నిర్మాణ పనులు ఎనిమిదేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం వీటి నిర్మాణానికి రూ.18 కోట్లు కేటాయించింది. అదే సంవత్సరంలో పనులు ప్రారంభించారు. 2019లో అధికారంలో వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ మైనార్టీ పాఠశాల నిర్మాణ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అయిదేళ్ల వైకాపా పాలనలో 5శాతం పనులు కూడా చేయలేదు. ఈ పాఠశాల నిర్మాణం పూర్తయితే మైనార్టీ విద్యార్థులకు సులువుగా చదువుకునే అవకాశం ఉంటుంది. పనుల్లో జాప్యంపై ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏఈఈ జాన్‌సైదాను వివరణ కోరగా గత వైకాపా ప్రభుత్వంలో బిల్లులు రాక గుత్తేదారులు చాలా ఇబ్బంది పడ్డారని అందువల్ల పనులు ఆలస్యం అయ్యాయన్నారు. ఒప్పందం కూడా రెండుసార్లు రీషెడ్యూల్ చేశామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు వేగవంతం అయ్యాయని మార్చి నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

తుది దశకు సింథటిక్ ట్రాక్ నిర్మాణం

చిరుమామిళ్ల(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామంలో నడికట్టు రామిరెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో సింథటిక్ ట్రాక్ నిర్మాణ పనులు పూర్తికావస్తున్నాయి. దాత నడికట్టు రామిరెడ్డి సింథటిక్ ట్రాక్ నిర్మాణ పనులకు మూడు నెలల క్రితం తన సొంత నిధులు రూ.50లక్షలు అందజేశారు. దీంతో పనులు చకచకా జరుగుతున్నాయి. త్వరలోనే పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు పాఠశాల హెచ్ఎం కిషోర్ తెలిపారు.

ఘనంగా పూర్ణాహుతి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో దీక్షాపరులకు రెండు నెలలకు పైగా నిర్వహించిన అన్నప్రసాద వితరణ (సద్ది) గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. పూర్ణాహుతి కార్యక్రమంలో గురుస్వాములు పూసల హరిబాబు, దివి పవనాచార్యులు, కరణం రంగారావు, ఆలయ ఛైర్మన్ గుంటు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తాం

మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త రాధాకృష్ణ

యడ్లపాడు, న్యూస్‌టుడే: మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే వరకు ప్రజల పక్షాన పోరాడతామని చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం.రాధాకృష్ణ అన్నారు. స్థానిక ఎర్రచెరువులోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటైన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని తెదేపా, జనసేన, వైకాపాలు భాజపాకు తలొగ్గి పనిచేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 2వఅదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు, సత్తెనపల్లి

ఇ.పి.నెం.38/2025 ఇన్ ఓ.యస్. నెం. 250/2014

బిట్వీన్: స్వర్ణ లీలావతి ...డి.హెచ్.ఆర్

మరియు

గుంటుపల్లి వెంకటేశ్వర్లు (లేటు) మరియు ఇతరులు ...జె.డి.ఆర్

చిరునామా: జె.డి.ఆర్ నెం.2: గుంటుపల్లి చంద్రశేఖర్, తండ్రి వెంకటేశ్వర్లు, హిందూ, వయస్సు 32 సం నివాసం. లింగారావుపాలెం గ్రామం, పొలస దగ్గర, యడ్లపాడు మండలం, గుంటూరు జిల్లా,

పై నెంబరు గల ఇ.పి.డి.హెచ్.ఆర్ దాఖలు చేసియున్నారు. పై ఇ.పిలో మీరు జెడి ఆర్ నెం.2 అయివున్నారు. మీకు ఎన్ని పర్యాయాలు నోటీసులు పంపినను మీరు ముట్టనందున శ్రీ కోర్టువారి ఉత్తర్వు ప్రకారం ఈ నోటీసు ద్వారా మీకు తెలియజేయడమైనది. పైనెంబరు ఇ.పి.పిటీషన్ వాయిదా దీ.22-01-2026న అయివున్నది. కావున పై తెలిపిన తేదీన మీరు పై కోర్టుకు వాయిదా రోజున ఉదయం 10-30 గంటలకు మీరు స్వయముగా లేక ప్లీడరుగారి ద్వారా పై కోర్టువారి యెదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించెదరు.

కోర్టువారి ఆర్డర్‌తో... వాయిదా తేదీ: 22-01-2026.

సం/- ఉడుముల విద్యాసాగర్ రెడ్డి

డిహెచ్ఆర్ తరపు న్యాయవాది సత్తెనపల్లి. Cell: 9177738739

(c) eenadu

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

పల్నాడు ప్రజల్లో నూతనోత్తేజం నిండాలి

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మధుబాబు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే : నూతన సంవత్సరంలో పల్నాడు ప్రజలు ఉత్సాహంతో ఉండాలని పూడా కమిటీ ఛైర్మన్ మధుబాబు ఆకాంక్షించారు. గురువారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డిలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ విజనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధితో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

75త్యాళ్లూరు పీహెచ్‌సీలో పండ్లు, మిఠాయిలు అందిస్తున్న వైద్య సిబ్బంది

పెదకూరపాడు, న్యూస్‌టుడే: యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సరికొత్త ఆలోచనలతో మెరుగైన జీవితాన్ని గడిపేందుకు కొత్త ఏడాది నూతన తీర్మానాలు, ప్రతిన బూనాలని జిల్లా తెదేపా కార్యదర్శి అర్తిమళ్ల రమేష్ కోరారు. నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ గురువారం పెదకూరపాడు తెలుగు బాప్టిస్టు చర్చిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని కేకు కోశారు. ★ 75త్యాళ్లూరు పీహెచ్‌సీ వైద్యులు వెలుగొండారెడ్డి, ఆదిత్య, గోవర్ధిని, సూపర్‌వైజర్ దిలీప్, పండ్లు, మిఠాయిలు, నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? గ్రామంలోని ప్రధాన వీధిలో లైట్లు వెలగడంలేదు. - **ఈశ్వరరెడ్డి, మండాది.** ✔ త్వరలో లైట్లు ఏర్పాటు చేస్తాం. - **ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి.**

? గ్రామంలో మహిళలు, చిన్నారులు, వృద్ధులపై వీధికుక్కలు దాడిచేసి గాయపరుస్తున్నాయి. - **సాంబిరెడ్డి, వెల్దుర్తి.** ✔ కుక్కల సమస్య పరిష్కరిస్తాం. - **రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి.** - వెల్దుర్తి, న్యూస్‌టుడే

నేడు పాసుపుస్తకాల పంపిణీ

రెంటపాళ్ల(సత్తెనపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే : ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో శుక్రవారం జరుగుతుందని తహసీల్దారు కె.ఎస్. చక్రవర్తి తెలిపారు. గ్రామానికి చెందిన 530 పాసుపుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కలెక్టరు కృతికా శుక్లా, ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

పర్యాటకాభివృద్ధికి అడుగులు

సత్తెనపల్లి, రామకృష్ణాపురం, న్యూస్‌టుడే

యాభై ఎకరాల చెరువు.. చుట్టూ సుమారు 2 కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్.. నలువైపులా పచ్చదనం.. చెరువు మధ్యలో 36 అడుగుల ఎత్తయిన ఎన్టీఆర్ విగ్రహం.. పక్కనే స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య స్మారక పార్కు. ప్రజా రాజధాని అమరావతి ప్రాంతంలోనే ఆకర్షణీయ, ఆహ్లాదకర ప్రాంతమిది. 2019లో మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రత్యేక శ్రద్ధతో పాత సమ్మర్ స్టోరేజీ చెరువు, ఓవర్‌హెడ్ ట్యాంకులకు చెందిన భూమి 58 ఎకరాలను తారకరామసాగర్, వావిలాల పార్కులుగా నిర్మించి, పర్యాటకంగా అభివృద్ధి చేశారు. సీఆర్‌డీఏ నిధులు రూ. 12 కోట్లతో చేపట్టిన పనులు సత్తెనపల్లికి ప్రత్యేక వన్నె తెచ్చాయి.

ఏపీటీడీసీకి బాధ్యతలు: 2019 సార్వత్రిక ఎన్నికలతో పాలన మారి వైకాపా అధికారంలోకి రావడంతో తారకరామసాగర్ అభివృద్ధి, నిర్వహణను గాలికి వదిలేశారు. మున్సిపాల్టీకి దీని నిర్వహణ భారంగా మారడంతో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ)కు అప్పగించాలని తాజాగా కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. పర్యాటక అభివృద్ధి సంస్థ తారకరామసాగర్ నిర్వహణకు ముందుకొస్తే పండుగే అవుతుంది.

వావిలాల పార్కు

మున్సిపాలిటీకి భారం

2019 నుంచి పురపాలక సంఘం నిర్వహిస్తుంది. నిర్వహణ, కాపలాదారుల జీతభత్యాలు, జంగిల్ క్లియరెన్స్, సీసీ ఛార్జీలు తదితరాలు కలిపి ఏటా రూ.70 లక్షల ఖర్చు తారకరామసాగర్, వావిలాల పార్కుపై ఉంటుందని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వంలో శాప్‌కు చెరువులో జల క్రీడలు నిర్వహించేలా అనుమతులిస్తూ తీర్మానం చేశారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ముందుకొస్తే అన్నీ మరింత మెరుగ్గా ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి.

❖ తారకరామసాగర్, వావిలాల పార్కులో ఇప్పటికే ఆహ్లాదకర, పర్యాటకుల్ని ఆకర్షించేవి ఎన్నో అందుబాటులో ఉన్నాయి. బోటింగ్ సౌకర్యం కోసం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, ఫుడ్‌కోర్టు, యోగా సెంటర్, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు చుట్టూ వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట పరికరాలు, ఓపెన్ జిమ్, పార్కు చుట్టూ గ్రీన్‌బెల్టు, పాత ఎస్‌ఎస్ ట్యాంకు మధ్యలో 36 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం, వ్యూ డెక్, గజెబో, ఓపెన్ ఎయిర్ థియేటర్‌లు ఉన్నాయి.

అమరేశ్వరాలయ దర్శనానికి రండి

గవర్నర్‌ను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, న్యూస్‌టుడే: ఒక వైపు కృష్ణమ్మ పరవళ్లు, మరోవైపు ప్రాచీన చరిత్ర బోధి దర్మాలకు నెలవై దక్షిణకాశీగా పిలిచే పంచరామ ప్రథమక్షేత్రం అమరావతిలోని అమరేశ్వరుడి దర్శనానికి రావాలని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆహ్వానించారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను ఎమ్మెల్యే ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలియజేసి దుశ్శాలువాతో సత్కరించారు. అమరేశ్వరుడి చరిత్ర, ఆలయంలోని 23 ఉపాలయాల గురించి గవర్నర్‌కు వివరించారు. గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

నియోజకవర్గం అభివృద్ధికి పునరంకితం

ఎమ్మెల్యే కన్నాకు శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీతులసి, కమిషనర్ ఆనంద్‌కుమార్, ఉద్యోగులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో సుస్థిర అభివృద్ధికి బాటలు వేసేలా నియోజకవర్గ అభివృద్ధికి అందరం పునరంకితం అవుదామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లోని ప్రజావేదికలో గురువారం నూతన సంవత్సర వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా కేకుకోసి మాట్లాడారు. 2026లో నియోజకవర్గ రూపురేఖలుమార్చే అభివృద్ధి పనుల్ని కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. అధికారులు, ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి జవాబుదారీతనంతో సేవలందించాలన్నారు. ప్రభుత్వంచేసే మంచిని కూటమి పార్టీల శ్రేణులు ప్రజలకు వివరించాలని కోరారు. ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రామస్వామి, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రభుత్వశాఖల అధికారులు, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రాధాన్యం

కాలమానిని ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

రెంటచింతల, పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికే అధిక ప్రాధాన్యం ఇచ్చేలా పనిచేయాలని యూటీఎఫ్ మండలాధ్యక్షుడు నాసరయ్య కోరారు. సంఘం కార్యాలయంలో నేతలతో కలిసి దైనందిని, కాలమానిని ఆవిష్కరించారు. ఉద్యోగుల బకాయి తక్షణమే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, కిషోర్, సునీల్, సుధీర్, జోస్పిన, సుదర్శన్, సుబ్బారావు, ప్రతాప్, ప్రియాంక, శిరీష, మల్లికార్జున్ పాల్గొన్నారు.

★ పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా యూటీఎఫ్ క్యాలెండర్‌ను సభ్యులు గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జి.విజయసారథి, షేక్ ఖాశింపీరా, షేక్ జమాల్, డి.శ్రీనివాసరావు, ఎస్.మరియదాసు, కేవీఎస్‌ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సామాజిక తనిఖీలు

రాజుపాలెం, అచ్చంపేట, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులను పరిశీలించేందుకు సామాజిక తనిఖీ బృంద సభ్యులు గ్రామాల్లో పర్యటించనున్నారు. రెండ్రోజులుగా రాజుపాలెంలోని నరేగా కార్యాలయంలో రికార్డులను స్వాధీనం చేసుకొని క్షేత్ర సహాయకుల నుంచి వివరాలు సేకరించారు. గురువారం బీరవల్లిపాయ, కొత్తబోధనం, చౌటపాపాయపాలెం గ్రామాల్లో తనిఖీ ప్రారంభించారు.

★ అచ్చంపేటలో 73 నంబరు దుకాణాన్ని గురువారం నూతన భవనంలోకి మార్పు చేశారు. మండల తెదేపా నాయకులు వి.కోటయ్య ప్రారంభించారు. గాంధీ, వెంకయ్య, కిరణ్, సుహాని తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన నూతన సంబరం

కేకు కోస్తున్న తెదేపా నేతలు

రెంటచింతల, పిడుగురాళ్ల, గురజాల, న్యూస్‌టుడే: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. కానుకమాత, లూథరన్ చర్చిలలోనూ అర్ధరాత్రి, గురువారం ఉదయం నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఫాదర్లు మర్రెడ్డి, సతీష్, ప్రసన్నకుమార్, విజయ భాస్కరరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేకు కోసి అందరికి పంచారు. 12 గంటల సమయంలో బాణసంచా కాల్చారు. గురువారం స్థానిక వెంకటేశ్వర, వాసవీ మాత, వేణుగోపాల, శివాలయం, సత్రశాల మల్లయ్య, పాలువాయిజంక్షన్ ఆలయాలు భక్తులతో నిండాయి. ప్రత్యేక పూజలు చేశారు.

★ పిడుగురాళ్ల పట్టణంలోని తెదేపా కార్యాలయం దగ్గర మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ తురకా వీరస్వామి, తెదేపా నేతలు కనిగిరి శ్రీనివాసరావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పిల్లి చెన్నారావులు కేక్ కోసి పంచిపెట్టారు.

★ గురజాలలో ఆర్డీవో మురళీకృష్ణను తహసీల్దార్‌లు, సిబ్బంది, డీఎస్పీ జగదీష్‌ను సీఐలు, ఎస్సైలు కలిసి అభినందనలు తెలిపారు. ఆర్డీవో నరసరావుపేటకు వెళ్లి కలెక్టరు కృతికా శుక్లాను కలిసి అభినందనలు తెలిపారు. తెలుగునాడు ట్రేడ్ యూనియన్ సభ్యులు ఏడీఈ ఆనందరావు, నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ పులుకూరి కాంతారావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్మన్ షేక్ బడేజానికి కౌన్సిలర్లు, పలువురు అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

నూతన సంవత్సరం సందర్భంగా కేకు కోస్తున్న నాగోతు శౌరయ్య తదితరులు

నకరికల్లు, న్యూస్‌టుడే: సత్తెనపల్లి నియోజకవర్గంలో నకరికల్లు మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తానని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు శౌరయ్య పేర్కొన్నారు. గురువారం నకరికల్లు మండలంలో నిర్వహించిన కొత్త సంవత్సరం వేడుకల్లో పలువురు పార్టీ నాయకులు, అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

అచ్చంపేట, క్రోసూరు: అచ్చంపేట, క్రోసూరు మండలాల్లో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా జరుపుకున్నారు.

దుర్గి, న్యూస్‌టుడే : మండలంలో 2026 సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీనిదానంపాటి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దుర్గి ఆర్సీఎమ్ చర్చిలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు తెదేపా నాయకులు శ్రీరాం కాశీబాబు నేతృత్వంలో అన్నదానం చేశారు. అదేవిధంగా విశ్రాంత ఐజీ, తెదేపా సీనియర్ నాయకులు చిరుమామిళ్ల వెంకటనరసయ్య కేకు కోసి వృద్ధులకు దుప్పట్లు అందజేశారు.

ప్రజలు ఆర్థిక ప్రగతి సాధించాలి

వేడుకల్లో ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి, నాయకులు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే : నూతనోత్తేజంతో ప్రజలు కొత్త సంవత్సరంలో ఆర్థిక ప్రగతి వైపు పయనించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మాచర్ల పట్టణంలోని వీవీఎన్ గార్డెన్స్‌లో వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ర్యాలీగా వీవీఎన్ గార్డెన్స్‌కు చేరుకున్నారు. దారి మధ్యలో కార్యకర్తలు ఎమ్మెల్యేకు గజమాలలు వేసి స్వాగతం పలికారు. ఈ క్రమంలో భారీ కేకు కోసి కూటమి నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాది మాచర్ల నియోజకవర్గంపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపి అభివృద్ధికి నిధులు కేటాయించారన్నారు. పల్నాడు అభివృద్ధి చెందితేనే ఈ ప్రాంతంలో ఫ్యాక్షన్ కనుమరుగవుతుందన్నారు. ఎమ్మెల్యేకు కూటమి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు సహకరించాలని కలెక్టర్ కృతికాశుక్లా కోరారు. తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో యూటీఎఫ్ కాలమానినిని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు తగ్గకుండా చూడాలని సూచించారు. జిల్లా నేతలు శ్రీనివాసరెడ్డి, మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

దూసుకెళ్లొచ్చు

రాజుపాలెం, న్యూస్‌టుడే: రెండడుగుల లోతు గుంతలతో అధ్వానస్థితికి చేరిన గ్రామీణ లింకు రోడ్లు ఏడాది కాలంలో నూతన రూపును సంతరించుకున్నాయి. అంచులవారిపాలెం-అనుపాలెం, కోటనెమలిపురి-కొండమోడు, బీరవల్లిపాయ-చౌటపాపాయపాలెం మధ్య మట్టి రహదారులను జడ్పీ, డీఎంఎఫ్ నిధులు రూ.54 లక్షలతో బాగు చేశారు. ఆయా గ్రామాల వాసుల రాకపోకల కష్టాలు తొలగిపోయాయి.

దారి ప్రమాదకరం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఆ దారిలో ప్రయాణించాలంటే జనం భయపడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇచ్చే పరిస్థితి లేక ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని శిరిగిరిపాడు నుంచి పిచ్చయ్య బావితండాకు వెళ్లే దారికి ఇరువైపులా పిచ్చిచెట్లు, ముళ్ల కంప అల్లుకుపోయాయి. మూలమలుపులో అడ్డుగా పెరిగాయి. అధికారులు స్పందించి ముళ్ల కంప తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలోచన ఆచరణై.. స్ఫూర్తిగా నిలిచి

రూ.10 లక్షలు పోగుచేసి నందనవనం ఏర్పాటు

ఆలయ ప్రాంగణంలో పెరిగిన చెట్లు

రెంటచింతల, న్యూస్‌టుడే : నిత్యం కాలుష్యంతో ఇబ్బంది పడుతున్న కొత్తపాలువాయి గ్రామస్థులు మొక్కలు పెంచాలని నిర్ణయించారు. ఆలోచన వచ్చిన వెంటనే బెంగళూరులో వ్యాపారంలో చేస్తున్న గ్రంధి రవీందర్‌రెడ్డి రూ. 3లక్షలు విరాళం ప్రకటించారు. మాచర్ల వ్యాపారి నారాయణ లక్ష రూపాయలు నిర్వాహకుడు పాశం శంకరరెడ్డికి అందజేశారు. గ్రామస్థులు రూ. 10 వేలు, రూ. 5వేలు చొప్పున మొత్తం రూ. 10 లక్షలు పోగు చేశారు. ఎకరం స్థలంలో ఉన్న ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణాన్ని తుమ్మకోట నుంచి ఎర్రమట్టి తీసుకొచ్చి చదును చేశారు. రూ. 1.7లక్షల వ్యయంతో కంచె ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరి జిల్లా కడియం నుంచి వివిధ రకాల మొక్కలు, చిన్నసైజు చెట్లు 500 తెచ్చి నాటారు. బోరింగు, పైపులతో నీటి సౌకర్యం కల్పించారు. నిత్యం పూజలు జరిగేలా నెలకు రూ. 5వేల చొప్పున ఆలయానికి అందజేస్తున్నారు. గ్రామస్థులు ఖాళీ సమయంలో ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలనే ఆశయంతో మొక్కలు పెంచుతున్నామని, త్వరలో ఆలయ ప్రాంగణంలో బల్లలు, ఆటలు ఆడుకునేందుకు కోర్టులు, చిన్నారులు, పెద్దలు, యువత, మహిళలకు కావాల్సిన పరికరాలు కొనుగోలు చేయనున్నట్లు శంకరరెడ్డి తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి

క్రోసూరు (అచ్చంపేట) న్యూస్‌టుడే: క్రోసూరు నాలుగు రోడ్లు కూడలిలో గురువారం రాత్రి జరిగిన ఘర్షణలో ఖయ్యుం అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అనంతవరానికి చెందిన యువకుడు దేవరాజ్ ఇతని పై కత్తితో దాడి చేసి గాయపర్చాడు. మెడపై తీవ్ర గాయమైన బాధితుడిని సత్తెనపల్లి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దేవరాజ్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. బైకును ఢీకొన్న దగ్గర ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది.

వైభవంగా వృక్షాంజనేయస్వామి వార్షికోత్సవం

నకరికల్లు,న్యూస్‌టుడే: నకరికల్లు ఎన్నెస్పీ కాలనీలో వృక్షాంజనేయ స్వామి వార్షిక వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఏటా నూతన సంవత్సరం సందర్భంగా ఉత్సవాలు జరపటం ఆనవాయితీగా ఉంది. 34 ఏళ్లుగా ఉత్సవాలు జరుగుతున్నాయి. వార్షిక వేడుకలు సందర్భంగా అర్చకులు టి.పాండు స్వామివారికి పంచామృత అభిషేకాలు, నాగదళపూజార్చన, ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వామనావతారంలో ఊరేగింపు

అచ్చంపేట, న్యూస్‌టుడే: స్థానిక సీతారామస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే ధనుర్మాస పూజల్లో భాగంగా గురువారం వామనావతారంలో స్వామి వారు దర్శన మిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామిని ఊరేగించారు. గ్రామంలోని భక్తులు పాల్గొన్నారు.

ధనుర్మాస ప్రత్యేక పూజలు

వెన్నపూస అలంకరణలో స్వామివారు

రామకృష్ణాపురం(సత్తెనపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే : ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. రామకృష్ణాపురంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. వెన్నపూస, బాదం, జీడిపప్పు, చెర్రీ తదితరాలతో స్వామిని అలంకరించి భక్తులు పూజలు చేశారు. కొమెరపూడి, కంటెపూడి, పెదమక్కెనల్లోని శివాలయాల్లో పూజలు జరిగాయి.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

అయ్యప్పస్వామి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలోని గంగమ్మ గుడి, శ్రీకన్యకాపరమేశ్వరి, అయ్యప్పస్వామి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాలు చేపట్టారు. అయ్యప్పస్వామి దేవాలయానికి వేలాది మంది భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని వైద్యులు ధూళిపాళ్ల భరత్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు అంచూరి శ్రీనివాసరెడ్డి, ధర్మకర్త గుండా శ్రీనివాసరావులు పాల్గొన్నారు. పట్టణ శివారులోని అయ్యప్పస్వామి దేవస్థానం ఏర్పాటు చేసి 28 ఏళ్లైన సందర్భంగా 28 కిలోల లడ్డును స్వామివారి దగ్గర ఉంచి వేలం పాట నిర్వహించారు. పట్టణానికి చెందిన సరాబు శంకరాచారీ రూ. 25,116లకు వేలంపాటలో దక్కించుకున్నారు.

అలంకరణలో సాయినాథుడు

ముప్పాళ్ల, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో శ్రీప్రసన్న షిరిడీ సాయిబాబా దేవాలయంలో సాయినాథుడికి గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

సాగరమాత ఆలయంలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

విజయపురి సౌత్, దుర్గి, న్యూస్‌టుడే: మాచర్ల మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిలు, మందిరాలతోపాటు విజయపురిసౌత్ పరిధిలోని పుణ్యక్షేత్రమైన సాగరమాత ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు ప్రార్థనలు నిర్వహించారు.

★ దుర్గి, ముటుకూరు, అడిగొప్పల, కంచరగుంట, ఆత్మకూరుగ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దుర్గిలో ఆర్సీఎమ్ చర్చి ఫాదర్ ఆంథోని ఆధ్వర్యంలో మేరీమాత విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో గోపాలు, సుబ్బారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక ప్రదేశంలో చెత్త

అమరావతి, న్యూస్‌టుడే: శాతవాహనులు పాలించిన ధాన్యకటకం ధరణికోటలో చారిత్రక ప్రదేశాలలో వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. కేంద్ర పురావస్తుశాఖ ధరణికోటలో కొన్ని చారిత్రక ప్రదేశాలు గుర్తించి అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని నిషేధాజ్ఞలు విధించింది. వాటిని ప్రస్తుతం కోట కట్లగా పిలుస్తున్నారు. ఆయా ప్రదేశాలలో పంచాయతీ అధికారులు గ్రామంలో సేకరించిన వ్యర్థాలు, చెత్త వేస్తున్నారు. చారిత్రక ఆధారాలు లభించే ప్రాంతాల్లో పంచాయతీ చెత్త వేయడంపై చరిత్రకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిండా పట్టలు.. కళ్లకు గంతలు..!

అధిక లోడుతో ఇసుక తరలింపు ★ ధ్వంసమవుతున్న రహదారులు

పెదకూరపాడు, సత్తెనపల్లి, న్యూస్‌టుడే

ఇసుక దందా అక్రమార్కులకు వరంగా మారుతోంది. నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారంగా దందా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు, అధికారుల సూచనలు పాటించకుండా పరిమితికి మించి అధిక లోడుతో రవాణా చేస్తున్నారు. పరిమితికి మించిన సామర్థ్యంతో వాహనాలు తిప్పుతున్నా, రవాణా శాఖ ఆదేశాలు విస్మరించినా, నిబంధనలకు నీళ్లు వదిలినా అధికారుల కళ్లకు గంతలు మాత్రం వీడటంలేదు. అధిక బరువుతో వెళ్తున్న వాహనాలతో రవాణా సదుపాయం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన రహదారులు ధ్వంసం అవుతున్నాయి. ఇసుక రీచుల నుంచి పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి, పెదకూరపాడుతోపాటు పలు ఇతర ప్రాంతాలు, తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్నారు. అనుమతి పొందిన రీచుల నుంచి వాహనాలకు జారీ చేసే వే-బిల్లుల్లో ఎంత లోడు వేయాలో స్పష్టంగా ఉన్నా ఎవరూ పాటించడం లేదు. ఫలితంగా రోడ్లు ఛిద్రమై వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు.

పరిమితికి మించి తరలింపు: లారీలు, టిప్పర్లలో టైర్ల సంఖ్యను బట్టి సామర్థ్యాన్ని నిర్ణయిస్తారు. ఆమేరకు లోడు చేసుకుని వెళ్లాల్సి ఉన్నా పరిమితికి మించిన లోడుతో లారీలు, టిప్పర్లు ఇసుక, మట్టి, గ్రానైట్ రాళ్లు తరలిస్తున్నారు. 14 చక్రాల లారీకి 30 టన్నులు లోడు చేసేందుకు మాత్రమే అనుమతి ఉన్నా, 40 నుంచి 50 టన్నుల వరకు తరలిస్తున్నారు. 12 చక్రాల లారీకి 25 టన్నుల వరకే అనుమతి ఉన్నా 40 టన్నుల వరకు లోడు చేస్తున్నారు. అదనపు లోడుకు బిల్లులు లేకుండా వాహనాల్లో ఇసుక తరలిస్తుండటంతో సత్తెనపల్లి-అమరావతి, కాలచక్ర రహదారి ఛిద్రమవుతుంది. అక్రమార్కులు మాత్రం అదనపు లోడు తరలిస్తూ అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోని తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధిక లోడుతో వెళ్లే వాహనాల కారణంగా రోడ్లు కూడా ధ్వంసమై ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పెద్ద మొత్తంలో మట్టి, ఇసుక తరలిస్తున్న వాహనాలతో రోడ్లతోపాటు, లైన్వే, జాతీయ రహదారుల వంతెలన వద్ద ఏర్పాటు చేసిన పరిమితి గడ్డర్లు కూడా దెబ్బతింటున్నాయి.

పరిమితి గడ్డర్ తాకుతూ వెళుతున్న ఇసుక లోడు టిప్పర్

మండలాభివృద్ధికి సమష్టిగా కృషి

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పెదకూరపాడు మండల ప్రగతికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషిచేద్దామని మండల తెదేపా అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. గురువారం నూతన సంవత్సరం సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు బ్రహ్మయ్యను మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న పనుల పురోగతిపై చర్చించారు.

రచ్చమల్లపాడులో వరిగడ్డి దగ్ధం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని రచ్చమల్లపాడు గ్రామంలో గురువారం రైతు కాకునూరి శ్రీనివాసరావుకు చెందిన 200 కట్టల వరిగడ్డి అగ్నికి ఆహుతైంది. ఫైరింజన్ వచ్చి మంటలు ఆపేలోపు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రైతు శ్రీనివాసరావు మాట్లాడుతూ పశుగ్రాసానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడం వల్ల ప్రమాదం జరిగిందని, తనకు న్యాయం చేయాలని వాపోయాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

కుక్కల భయం.. కట్టడితోనే అభయం

పట్టణంలోని వివిధ ప్రాంతాల ప్రజల్ని వీధికుక్కల భయం వెంటాడుతోంది. గుంపులుగా కుక్కలు వీధుల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. తరచూ జరుగుతున్న కుక్కల దాడులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో విచ్చలవిడిగా తిరుగున్న కుక్కలు రాత్రి సమయాల్లో వాహనాల వెంట పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకుని కుక్కలకు యాంటీర్యాబీస్ టీకాలువేసి వాటి నుంచి ముప్పు లేకుండా చూడాలని కౌన్సిల్ సమావేశంలో ఇటీవల ప్రజాప్రతినిధులు అధికారుల్ని కోరారు. జంతు సంరక్షణ చట్టం నిబంధనలకు లోబడి వాటితో ముప్పు లేకుండా చూడాలని పుర ప్రజలు కోరుకుంటున్నారు. - **సత్తెనపల్లి, న్యూస్‌టుడే**

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము

డి.ఆర్.ఏ. 96/2025

మెస్సర్స్: శ్రీరఘుపరస్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్., రాయదుర్గం బ్రాంచ్ **...డిస్‌పూటెంట్**

వర్సెస్

వట్టిప్రోలు ప్రవీణ్ కుమార్ మరియు ఇతరులు **...అపోనెంట్స్**

అపోనెంట్ 1 మరియు 3కి నోటీసు

1. **వట్టిప్రోలు ప్రవీణ్ కుమార్,** తండ్రి : సుబ్బారావు, ఉద్యోగి : గ్రేడ్- VII జూనియర్ అసిసెంట్, క్రోసూరు సబ్. రిజిస్ట్రార్ ఆఫీసు, క్రోసూరు, నివాసం : డోర్ నెం : 5-42, ఆత్మకూరు రూరల్, గుంటూరు జిల్లా. ప్రస్తుతం : డోర్ నెం : 4-22, 5813, ముత్యారెడ్డి నగర్ లైన్, 2వ క్రాసు రోడ్డు, మదర్ థెరిస్సా రోడ్డు, గుంటూరు.

3. **వడ్డూరి అనుకుమారి,** భర్త : గాంధీబాబు, వయస్సు : 40 సం॥లు, ఉద్యోగి: గ్రేడ్-1 అటెండర్, క్రోసూరు సబ్-రిజిష్టర్ ఆఫీసు, క్రోసూరు, గుంటూరు జిల్లా. నివాసం : డోర్ నెం : 24-4. సెవెన్‌లైన్ వీధి, ఆర్.అగ్రహారం, గుంటూరు.

డిస్‌పూటెంట్, డిస్‌పూట్ బాకీమొత్తం రూ. 9,88,771/- లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌పూట్‌లో 1 మరియు 3కి అపోనెంట్ అయిన మీరు 21-01-2026 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్ నెం. 6-3-134, 1వ అంతస్తు రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌పూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept, D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

కలెక్టరేట్‌లో కొత్త ఏడాది వేడుక

చిన్నారితో కేకు కోయిస్తున్న కలెక్టర్

పార్వతీపురం, న్యూస్‌టుడే: కొత్త సంవత్సరంలో జిల్లాను మరింత మెరుగైన స్థానంలో నిలిపేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కలెక్టర్ ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, సిబ్బంది సమక్షంలో కేకు కోసి, వేడుకలను ప్రారంభించారు. జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి, సబ్‌కలెక్టర్లు వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో హేమలత, డ్వామా పీడీ రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, గనుల శాఖ అధికారి శ్రీనివాసరావు, డీఈవో బ్రహ్మాజీ, పంచాయతీరాజ్, అబ్కారీ, రవాణా, వ్యవసాయ, ఉద్యాన తదితర శాఖల అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కొమరాడ: కొమరాడ మండలంలోని అర్తాం గదబవలసలో గిరిజనుల మధ్య కలెక్టర్ నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. చిన్నారితో కలిసి కేకు కోసి, సందడి చేశారు. పిల్లలకు పెన్నులు, పెన్సిల్, పుస్తకాలను అందించారు. వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు.

★ కలెక్టర్ అర్తాం మార్గంలో వెళ్తున్న ఇసుక లోడును గుర్తించి, ఎక్కడి నుంచి తరలిస్తున్నారో తెలుసుకోవాలని తహసీల్దారును ఆదేశించారు.

☛ ఇంధన పరిరక్షణ మిషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో లఘుచిత్ర విభాగంలో దత్తిరాజేరు మండలం రామచంద్రపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పి.హేమావతి, పి.హారిక ప్రథమ స్థానం సాధించారు.

☛ స్మార్ట్ డస్ట్ బిన్ తయారీతో జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు పార్వతీపురం జిల్లా నర్సిపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు లక్షింద్రనాయుడు, గుణవర్ధన్.

బాలలూ.. భవితను తీర్చిదిద్దుకుందాం

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

ఇవీ గత ఏడాది మన జిల్లా బాలలు సాధించిన విజయాలు. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో అవకాశాలు, సౌకర్యాలు కల్పిస్తున్నాయి. నచ్చిన రంగంలో రాణించేందుకు పలు వేదికలు ఏటా ఆహ్వానం పలుకుతున్నాయి. ప్రతిభ చూపితే పీఎంతో మాట్లాడవచ్చు.. ఇస్రోను చూడొచ్చు.. జపాన్ వెళ్లొచ్చు.. ఉన్నత విద్యకు బాటలు వేసుకోవచ్చు. మరి ఆ ప్రయత్నం ఇప్పట్నుంచే మొదలుపెడదామా పిల్లలు?.

సైన్స్ ఫెయిర్.. పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ, సౌత్ ఇండియా స్థాయిల్లో జరుగుతోంది. ఈ ఏడాది రాష్ట్రస్థాయి పోటీల ద్వారా బృంద విభాగంలో చీపురుపల్లి జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల బృందం ప్రదర్శించిన 'క్రాప్ డాక్టర్' ప్రాజెక్టు జాతీయ స్థాయితో పాటు సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైంది.

యువికా.. యువికా(యువ విజ్ఞాన శాస్త్రం) కార్యక్రమాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) నిర్వహిస్తోంది. ఎనిమిదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు అర్హులు. ఎంపిక చేసిన వారికి స్పేస్ టెక్నాలజీ, సైన్స్ అప్లికేషన్స్‌పై ప్రాథమిక జ్ఞానాన్ని అందించనున్నారు. ఎంపికైనవారికి ఏటా మేలో రెండు వారాల పాటు శ్రీహరికోట, హైదరాబాద్, తిరువనంతపురం తదితర ప్రాంతాల్లో శిక్షణ ఉంటుంది.

ఎన్ఎంఎంఎస్.. జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్ఎంఎంఎస్)కు ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అర్హులు. ఎంపికైతే ఇంటర్మీడియట్ వరకు ఏడాదికి రూ.12 వేలు ఉపకార వేతనంగా ఇస్తారు. ఏటా సగటున జిల్లాలో 150 మంది ఎంపికవుతున్నారు.

కౌశల్.. భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు(కౌశల్) ఏటా నిర్వహిస్తారు. క్విజ్ (ప్రహేళిక), పోస్టర్ ప్రెజెంటేషన్ రెండు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. 8, 9, 10 తరగతుల నుంచి ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు ఒక బృందంగా క్విజ్‌లో పాల్గొనాలి. పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీల్లో 8, 9 తరగతులకు చెందిన ఇద్దరు విద్యార్థులు పాల్గొంటారు. జిల్లా స్థాయి విజేతలకు ప్రథమ రూ.4,500, ద్వితీయ రూ.మూడు వేలు బహుమతిగా అందజేస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ రూ.15 వేలు, ద్వితీయం రూ.12 వేలు, తృతీయం రూ.9వేలు చెల్లిస్తారు.

ఇన్‌స్పైర్ మనక్.. బాలల్లో సృజన గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మరో పథకం. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు. ఎంపికైతే రూ.10 వేలు ఇస్తారు. జాతీయ స్థాయి విజేతలను జపాన్ పర్యటనకు తీసుకెళతారు. అలా జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం లభించింది. 2025-26 విద్యాసంవత్సరంలో 2,040 ప్రాజెక్టులు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి.

ప్రధానితో ముఖాముఖి.. ప్రధాని మోదీతో ముఖాముఖి అయ్యే 'పరీక్షా పే చర్చ' కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలో ఎక్కువ సంఖ్యలోనే రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. భయాన్ని పోగొట్టి, ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయడం ఈ కార్యక్రమం ఉద్దేశం. ఏటా ఫిబ్రవరిలో జరుగుతుంది. గత విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 1.50 లక్షల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 2018-19లో నవోదయ కిల్తంపాలెం విద్యార్థులు, 2019-20లో విజయనగరం చాణక్య పాఠశాల విద్యార్థి మనోజ్‌కుమార్ ఈ అవకాశం అందుకున్నాడు.

నూతన ఏడాది 2026 నవ్యదారి

షైనింగ్ స్టార్ .. పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పురస్కారాలు ప్రదానం చేస్తోంది. మార్కులే ప్రామాణికం. రూ.20 వేల నగదు బహుమతి అందజేస్తారు. ఈ ఏడాది పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన 158 మంది విద్యార్థులకు పురస్కారాలు లభించాయి.

> పిల్లల్లో అనంతమైన శక్తి ఉంటుంది. దానిని నమ్మడం వల్ల వారు అడ్డంకులను అధిగమించి అసాధ్యం అనిపించే వాటిని సాధించడానికి సహాయపడుతుంది.
> - స్వామి వివేకానంద

> నువ్వేం చేసినా బాగా చెయ్. ఇష్టపడి చేయడానికి భయపడొద్దు. మాస్టర్ కావడానికి ముందే విద్యార్థిగా మారు. నీలో కలలు కనాలనే కోరిక ఉంటే అది కూడా నెరవేరుతుంది.
> - వాల్ట్ డిస్నీ

వేణుగోపాలుడికి వెన్నసేవ

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సీతానగరం వేణుగోపాలుడు, లక్ష్మీనరసింహుడికి గురువారం నవనీత సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు ఆధ్వర్యంలో మూల విరాట్‌లను వెన్నతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, సీతానగరం

నీకు కుక్కరు.. నాకు స్టవ్

- పంచేసుకున్న వైకాపా నాయకులు
- రైతు భరోసా కేంద్రాల్లో కానరాని వైనం

ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

అన్నదాతలకు సేవలు అందిస్తామని చెప్పి గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను(ఆర్ఎస్‌కేగా పేరు మార్చారు) ప్రారంభించింది. సిద్ధమైన భవనాలకు రూ.కోట్ల విలువైన కియోస్క్‌లు, ఇతర పరికరాలను సమకూర్చింది. వాటిల్లో కుక్కర్లు, స్టవ్‌లు, గ్యాస్ సిలిండర్లు సైతం ఉండడం గమనార్హం. వాటి ఉపయోగం లేకపోవడంతో వైకాపా నాయకులు అప్పట్లోనే మాయం చేశారు. ప్రస్తుతం చాలాచోట్ల అవి కానరావడం లేదు. కొన్నిచోట్ల ఉన్నా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

రూ.లక్షల సామగ్రి: ఒక్కో కేంద్రానికి రూ.4 లక్షల విలువైన కుక్కర్, స్టవ్, గ్యాస్ సిలిండర్, గ్లాస్ డిస్‌ప్లే బోర్డులు, కియోస్క్, టీవీ, ఓపెన్ ర్యాక్‌లు-2, బుక్ ర్యాక్‌లు-2, పుస్తకాలు, కుర్చీలు-15, టేబుళ్లు-2, పెద్ద బల్ల-1, కంప్యూటర్, ప్రింటర్, తేమకొలిచే మీటర్, స్టేషనరీ, రికార్డులు అందించారు. వీటిల్లో ప్రస్తుతం కుక్కర్లు, స్టవ్‌లు, సిలిండర్‌లు కనిపించడం లేదు. అప్పట్లో కొందరు అధికారులు, నాయకులు పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది.

ఇదీ పరిస్థితి..: రెండు జిల్లాల్లో 791 కేంద్రాలున్నాయి. వీటికి రూ.7.11 కోట్ల విలువైన కియోస్క్ యంత్రాలు సమకూరాయి. ఆది నుంచి సాంకేతిక లోపాలతో మొరాయిస్తున్నాయి. ఒక్క కేంద్రంలోనూ కనీసం నెల పాటు ఇవి పనిచేసిన దాఖలాలు లేవు. మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకొచ్చే ఆలోచనా చేయలేదు. కొన్నింటినైతే కనీసం తెరవలేదు. దీంతో ప్రజాధనం వృథా అయింది.

ఇది సాలూరు మండలం మామిడిపల్లిలోని రైతు సేవా కేంద్రంలో ఓ మూలన ఉన్న సిలిండర్. సీల్ కూడా తీయలేదు. కుక్కర్ మరో గదిలో ప్యాకింగ్‌లో ఉంది. స్టవ్ ఇక్కడ లేదు. సిబ్బందిని అడిగితే గతంలో పనిచేసిన వారు ఎవరికో ఇచ్చారని, సాలూరులోని ఓ ప్రైవేటు పురుగుల మందు దుకాణంలో ఉన్నట్లు తెలుస్తోంది.

అలంకారానికేనా?

ఆర్ఎస్‌కేల ద్వారా విత్తనాలు, ఎరువుల సరఫరా, భూసార పరీక్షలు, సలహాలు, పంటల కొనుగోలు, పెట్టుబడి సాయం తదితర సేవలు అందాలి. ఈమేరకు వాటికి సంబంధించిన వీడియోలు, ప్రత్యేక కార్యక్రమాలు, పథకాల అమలు తీరు, ఉపయోగాలను టీవీల్లో ప్రసారం చేయాలి. అప్పుడప్పుడూ గన్నవరం నుంచి శాస్త్రవేత్తలు మాట్లాడితే.. రైతులకు తెలియజేయాలి. ఈ ప్రక్రియ సైతం ఆగిపోయింది. దీంతో టీవీలన్నీ గోడలకు అలంకారంగా ఉన్నాయి. ప్రింటర్లు సైతం ఎక్కడా కనిపించడం లేదు. స్టేషనరీదీ అదే పరిస్థితి. సేవలు అందించాల్సిన వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని అన్నదాతలు చెబుతున్నారు. నిర్దిష్టమైన జాబ్ ఛార్ట్ లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. యంత్రాలు, పరికరాల వినియోగంపై సమాచారం తీసుకుంటామని రెండు జిల్లాల వ్యవసాయాధికారులు వీటీ రామారావు, అన్నపూర్ణ 'ఈనాడు'కు తెలిపారు.

జన్‌మన్ జోష్

న్యూస్‌టుడే, పార్వతీపురం

గిరిజన ఆవాసాలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి వీలుగా కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ అమలు చేస్తున్న పీఎం జన్‌మన్ పథకం కింద రెండో విడతలో రహదారులు, వంతెనలు మంజూరయ్యాయి. ఈ మేరకు పంచాయతీరాజ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా నిధులు కేటాయించాయి. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

17 రోడ్లు.. 2 వంతెనలకు రూ.84 కోట్లు

జిల్లాలో గిరిజన గ్రామాలున్న మండలాల్లో 17 రహదారుల నిర్మాణానికి రూ.30.01 కోట్లు మంజూరు చేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి రూ.17.03 కోట్లు, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.12.90 కోట్లు కేటాయించారు. దీంతోపాటు రహదారుల అయిదేళ్ల నిర్వహణ వ్యయం కింద రూ.1.99 కోట్లు ఖర్చు చేయనున్నారు.

★ సాలూరు మండలం వట్టిగెడ్డపై దుగ్ధసాగరం వద్ద వంతెన నిర్మాణానికి రూ.13.10 కోట్లు, సీతంపేట మండలంలో బీఎం రోడ్డు నుంచి ఎగువసంకిలి వరకు వంతెనకు రూ.40.90 కోట్లు మంజూరు చేశారు.

★ పీఎం జన్‌మన్ మొదటి విడత కింద మంజూరైన పనుల్లో నాలుగు రహదారులకు అటవీ శాఖ అనుమతులు రావాల్సి ఉంది. ఆ పనులు ముందుకు కదలడం లేదు.

నియోజకవర్గం	రహదారులు	పొడవు కిలోమీటర్లలో	నిధులు రూ.కోట్లలో
పాలకొండ	8	19.81	18.81
కురుపాం	7	30.10	6.88
సాలూరు	2	4.10	4.87

టెండర్లు ఆహ్వానిస్తాం: ఇటీవల పీఎం జన్‌మన్ కింద పదిహేడు రహదారులు మంజూరయ్యాయి. వీటిని ప్రారంభించేందుకు వీలుగా సాంకేతిక అనుమతులు తీసుకుని టెండర్లు ఖరారు చేసిన తర్వాత ప్రారంభిస్తాం. మొదటి విడత పనుల్లో నాలుగు రహదారులకు అటవీశాఖ అనుమతులకు వినతులు సమర్పించాం. - వీఎస్ నగేష్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి

ట్రైకార్‌కు జవసత్వాలు.. గిరి రైతుకు తోడ్పాటు

90 శాతం రాయితీతో వ్యవసాయ, ఉద్యాన పరికరాలు

సీతంపేట, న్యూస్‌టుడే: గిరిజన సహకార ఆర్థిక సంస్థ(ట్రైకార్)కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వైకాపా గత అయిదేళ్లలో ట్రైకార్‌ను పక్కన పెట్టేసింది. ఒక్క యూనిట్ కూడా గిరిజనులకు ఇవ్వలేదు. ప్రస్తుత ప్రభుత్వం స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ టు ట్రైబల్ సబ్ స్కీమ్(ఎస్‌సీఏ టు టీఎస్ఎస్) కింద ఐటీడీఏలకు నిధులు మంజూరు చేసింది. వీటిద్వారా సేద్యానికి తోడ్పాటునందించేలా అవసరమైన యంత్ర పరికరాలు అందించనున్నారు.

పదిశాతం చెల్లిస్తే చాలు..

ఎంపిక చేసిన లబ్ధిదారులకు 90 శాతం రాయితీతో పరికరాలు ఇవ్వనున్నారు. మిగతా పది శాతం రైతులే భరించాలి. తక్కువ విలువైనవి వ్యక్తిగతంగా, భారీ వ్యయం అయ్యేవి సంఘాలకు మంజూరు చేస్తారు. సీతంపేట ఐటీడీఏకు రూ.2.99 కోట్లు మంజూరయ్యాయి. దీని ద్వారా ఆయిల్ ఇంజిన్లు 80, మినీ ట్రాక్టర్లు 25, నూర్పు యంత్రాలు 12, పవర్ టిల్లర్లు 28, పవర్ వీడర్లు 53 ఇవ్వనున్నారు. పార్వతీపురానికి రూ.3.30 కోట్లు వచ్చాయి. పెద్ద ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజిన్లు, టార్పాలిన్లు, గడ్డికోత యంత్రాలు, చేతి రంపాలు, కేష్ నెట్, డ్రగ్ నెట్, గిల్ నెట్, మోపెడ్, ఐస్ బాక్స్ తదితరాలు ఇవ్వనున్నారు.

గతంలో ఇలా...

తెదేపా ప్రభుత్వ హయాంలో ట్రైకార్ ద్వారా గిరిజనులకు స్వయం ఉపాధి యూనిట్లు, వ్యవసాయ, ఉద్యాన యంత్ర పరికరాలు అందజేశారు. రెండు ఐటీడీఏల పరిధిలో 3,731 యూనిట్లు మంజూరు కాగా 3,184 యూనిట్లు గ్రౌండింగ్ అయ్యాయి.

దరఖాస్తు చేసుకోవాలి: ఆసక్తి ఉన్న గిరిజన రైతులు ఐటీడీఏ వద్ద దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే పీజీఆర్ఎస్‌లలో దరఖాస్తులు వచ్చాయి. దీనికి ఎకరా భూమి ఉండాలి. పంటలు పండిస్తుండాలి. గతంలో లబ్ధి పొంది ఉండరాదు. దరఖాస్తులు వచ్చిన తర్వాత పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తాం. - ఎస్.వి.గణేష్, ప్రాజెక్టు ఉద్యాన అధికారి

గిరిజన ప్రాంతంలో అత్యాధునిక వైద్యం

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న ఐసీడీఎస్ పీడీ, తదితరులు

సాలూరు, న్యూస్‌టుడే: గిరిజనులకు కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తెస్తున్నామని గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పారు. గురువారం స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడారు. సాలూరు, భద్రగిరి, కురుపాం, సీతంపేటలో నిర్మించిన ఆసుపత్రి భవనాలను పది రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. నూతన సంవత్సర కానుకగా జిల్లాలోని 4 ఆసుపత్రులను ప్రారంభిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనుల్లో జాప్యం ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పెండింగ్ బిల్లులు చెల్లించడమే కాకుండా, నిర్మాణ సమస్యలను పరిష్కరించామన్నారు.

పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యం

పుర కమిషనర్ పావని

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తానని పుర కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన డి.పావని అన్నారు. గురువారం ఉదయం కార్యాలయానికి చేరుకున్న ఆమెకు ప్రస్తుత కమిషనర్ కె.కిషోర్‌కుమార్ బాధ్యతలు అప్పగించారు. డీఈ శ్రీనివాసరాజు, ఆర్వోడీ రూబిన్, టీపీఎస్ సీహెచ్ నారాయణరావు, పారిశుద్ధ్య అధికారి కె.పకీరురాజు, ఏఈలు, ఆర్ఐలు, ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఒక్కరోజులో రూ.2.10 కోట్ల మద్యం తాగేశారు!

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలో మద్యం దుకాణాలు, హోటళ్లు కళకళలాడాయి. 15 మండలాల పరిధిలో 56 మద్యం దుకాణాలు, ఆరు బార్లు నడుస్తున్నాయి. బుధవారం(31వ తేదీ) ఒక్క రోజు ఉదయం 10 నుంచి అర్ధరాత్రి వరకు రూ.2.10 కోట్ల విక్రయాలు జరిగినట్లు అబ్కారీ జిల్లా అధికారి శ్రీనాథుడు తెలిపారు. గతేడాదితో పోల్చితే కొంత మేర విక్రయాలు తగ్గాయి. గతేడాది ఒక్క రోజు రూ.2.16 కోట్ల విక్రయాలు జరిగాయి. ఈ సారి రూ.6 లక్షల మేర తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు పాలకొండ, సాలూరు, వీరఘట్టం, మండల కేంద్రాలు, ప్రధాన కూడళ్ల వద్ద 300 వరకు హోటళ్లు, దుకాణాలు ఉన్నాయి. పెద్ద హోటళ్లు రాయితీ ప్రకటించాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రద్దీగా కనిపించాయి.



చతుర్థ వర్ధంతి

నీతిమంతుని జ్ఞాపకము చేసుకొనుట ఆశీర్వాదకరమగును సామెతలు – 10 : 7

ఎంతో మంది పిల్లలకు విద్యా బుద్ధుల్ని నేర్పి, వారి బంగారు భవిష్యత్ కోసం అహర్నిశలు పాటుపడి, మా అందరి మనస్సులలో చెరగని సుస్థిర స్థానం ఏర్పరుచుకొన్న మీరు మా నుండి భౌతికంగా దూరమై నాలుగు సంవత్సరాల కాలం గడిచినను.. మీ మధురస్మృతులు, జ్ఞాపకాలు మా మదిలో పదిలంగా ఉన్నాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... మీ జ్ఞాపకాలతోనే ముందుకు సాగుతూ..

కీ॥శే కురమాన దాసు గారు
M.A, M.Ed
రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్
పెదభోగిలి, సీతానగరం (మండలం)
జననం: 01-07-1961 మరణం: 02-01-2022

మీ భార్య: శ్రీమతి కురమాన భాగ్యవతి
కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

(c) eenadu

కొండకు చేరిన కరిరాజులు

మొన్నటివరకు జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల్లో తిరిగిన కరి రాజులు గురువారానికి అర్ధాంతం అటవీ ప్రాంతానికి చేరుకున్నాయి. మార్గ మధ్యలోని దుగ్గి సమీపంలో కూరగాయల పంటలను ధ్వంసం చేశాయి. రైలు పట్టాలు దాటి కొండల్లోకి వెళ్లాయి. అక్కడ సరిపడా ఆహారం లభించకపోతే గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. – న్యూస్‌టుడే, కొమరాడ

వెలుగుల వేడుక.. నూతన కానుక

తాటిపూడి సమీపంలోని కాటేజీ వద్ద ఉపాధ్యాయుల థింసా నృత్యం

పాలకొండ ఆర్సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు



విజయనగరంలోని గంటస్తంభం వద్ద యువత సందడి

విజయనగరం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబితతో కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి తదితరులు

నూతన ఏడాది రాకతో ఉమ్మడి జిల్లాలో సందడి వాతావరణం నెలకొంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు వేడుకల్లో పాల్గొన్నారు. విజయనగరం, రాజాం, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు తదితర ప్రాంతాల్లో యువతీ, యువకులు ఆటపాటలతో అలరించారు. సందర్శన కేంద్రాలు, ఉద్యానాలు కిక్కిరిశాయి.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం, అర్బన్, తాటిపూడి(గంట్యాడ), పాలకొండ

పశుగ్రాసం.. అధనం

– న్యూస్‌టుడే, రాజాం

సన్న, చిన్నకారు రైతులకు వర్తింపు

సంఘాలకు నర్సరీల అవకాశం

పశుగ్రాసం కొరత ముందుముందు తీవ్రం కానుందని ప్రభుత్వం భావిస్తోంది. రైతులు ఆధునిక యంత్రాలతో వరి కోతలు చేపడుతున్నారు. అక్కడే నూర్పులు చేసి పొలాల్లో వదిలేయడం, దుబ్బులను భూమి నుంచి ఎత్తుకు కోస్తుండడంతో పరిమాణం తగ్గిపోయి ఈ పరిస్థితి ఏర్పడుతోందని అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో పాల దిగుబడి, పశువుల ఆరోగ్యానికి భద్రతనిచ్చేలా చర్యలు చేపడుతోంది. పశుగ్రాస క్షేత్రాలతో పాటు నర్సరీలను పెంచేలా అన్నదాతలు, సంఘాలకు ఉపాధి హామీ పథకం నుంచి ఆర్థిక ప్రోత్సాహం అందించనున్నట్లు ప్రకటించింది.

మంజూరు ఇలా

రాజాం ప్రాంతంలో పశుగ్రాసం సాగు

★ వ్యక్తిగతంగా పశుగ్రాసం పండిస్తే 25 సెంట్ల నుంచి ఒక ఎకరాలో పెంచేందుకు అవకాశం ఉంటుంది. రెండేళ్లలో 184 రోజుల పని దినాలకు రూ.56,488 చెల్లిస్తారు.

★ 2 పశువులకు 25 సెంట్లు, 3- 5 అయితే 50 సెంట్లు, 5 పైబడి ఉంటే ఎకరా ఉండాలి ★ సంఘాలు: 25 సెంట్ల నుంచి అయిదెకరాల వరకు ఉంటే రెండేళ్లలో రూ.1,05,016 ఇస్తారు. 292 రోజుల వేతనాల కింద రూ.89,664, మెటీరియల్‌కు రూ.15,352 జమ చేస్తారు. కలెక్టర్ అనుమతిస్తే అయిదెకరాల పైబడి విస్తీర్ణంలో సాగు చేసుకోవచ్చు.

ఇవీ ప్రయోజనాలు

- గ్రాసం కొరత తీర్చడం
- అధిక పాల దిగుబడి
- వేసవితో పాటు ఏడాది పొడవునా గడ్డిని అందుబాటులో ఉంచడం
- పశువుల్లో రోగనిరోధక శక్తి పెంచడం, రైతులకు ఉపాధి కల్పించడం

వీరు అర్హులు

- సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ, ఎస్‌హెచ్‌జీ, రైతు సంఘాలు
- అర్హులైన లబ్ధిదారులకు ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రాసం పెంచడానికి ఉపాధి హామీ పథకం కింద 100 రోజుల పనిదినాలు కల్పిస్తారు. మెటీరియల్ కాంపొనెంట్ వ్యయానికి సంబంధించిన మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. ఇందుకు సంబంధించిన పర్యవేక్షణ బాధ్యతను ఉపాధి హామీ పథకం, పశుసంవర్ధకశాఖ సిబ్బందికి అప్పగిస్తారని పశుసంవర్ధకశాఖ **జేడీ మురళీకృష్ణ** తెలిపారు. అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ పత్రాలు అవసరం

- ఉపాధి జాబ్‌కార్డు
- భూమికి సంబంధించి 1బీ
- ఆధార్‌కార్డు
- రేషన్‌కార్డు
- బ్యాంకు ఖాతా పాసుపుస్తకం
- ఈ నకళ్లతో అర్జీ పెట్టుకోవాలి. గ్రామసభ ద్వారా లబ్ధి దారులను ఎంపిక చేస్తారు

లక్ష్యం.. సాగు విస్తీర్ణం: 9 వేల ఎకరాలు నర్సరీలు:350(1,750 ఎకరాలు)

నేటినుంచి గోధుమ పిండి పంపిణీ

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల ద్వారా శుక్రవారం నుంచి గోధుమ పిండిని అందజేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు జిల్లాలో విజయనగరం అర్బన్‌లో పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 55 మెట్రిక్ టన్నుల బస్తాలు ఇప్పటికే చేరాయి. వీటిని నగరంలోని 97 చౌక దుకాణాలకు తరలించారు. ఒక్కో కార్డుదారునికి కిలో రూ.20 చొప్పున ఇవ్వనున్నారు. గడిచిన రెండు నెలల నుంచి రాగుల పంపిణీ సాగుతోంది. బియ్యానికి బదులు గరిష్ఠంగా మూడు కిలోల వరకు తీసుకునే వెసులుబాటు కల్పించినా గ్రామీణంలో పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అర్బన్‌లో డిమాండ్‌ను బట్టి అధికారులు ఇండెంట్ పెడుతున్నారు. జనవరి నెలకు 75 టన్నులే సరఫరా చేసినట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ ప్రబంధకురాలు బి.శాంతి తెలిపారు.

రుణం కట్టండి.. రసీదు తీసుకోండి!!

స్త్రీ నిధిలో అవకతవకలకు అడ్డుకట్ట

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

స్వయం సహాయక సంఘాల్లో మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు 48 గంటల్లోనే రుణాలు అందిస్తోంది స్త్రీనిధి కో-ఆపరేటివ్ సంస్థ. యూనిట్ల ఏర్పాటుకు సైతం అండగా నిలుస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడం, సిబ్బంది చేతివాటం కారణంగా నిధులు పక్కదారి పడుతున్నాయి. సభ్యులు చెల్లింపులు చేస్తున్నా కొందరు బ్యాంకుల్లో డిపాజిట్ చేయడం లేదు. ఈ పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు క్యాప్స్ పేరిట రీపేమెంట్ యాప్‌ను తీసుకొచ్చారు. నగదు కట్టిన వెంటనే రసీదు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

★ వంగర మండలం బాగెమ్మ పేట, పటువర్ధనం గ్రామాల్లో స్త్రీనిధి రుణాలను 90 రోజులుగా చెల్లించలేదు. ఆ రెండు ప్రాంతాల్లో సీఏఫ్‌లుగా పనిచేసిన ఇద్దరు మహిళలు ఇటీవల కారణం లేకుండా మానేశారు. అప్పటికే రూ.3 లక్షలు పక్కదారి పట్టినట్లు తేలింది. సభ్యులు చెల్లించినప్పటికీ సిబ్బంది ఆన్‌లైన్‌లో పొందుపర్చకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీనిపై విచారణ సాగుతోంది.

చెల్లింపులకు సంబంధించిన డిజిటల్ రసీదు

వారిదే బాధ్యత..

స్త్రీనిధి రుణాల మంజూరులో వీవో ఏలది కీలక పాత్ర. సంఘాల స్థితిగతుల ఆధారంగా అధికారుల సాయంతో బ్యాంకులకు వెళ్లి రుణాల మంజూరుకు కృషి చేయాలి. ఈక్రమంలో కొందరు కాసులకు కక్కుర్తి పడుతున్నారు. మరి కొందరు కమీషన్ వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సీఏఫ్‌లు సక్రమంగా విధులు నిర్వహించకపోయినా పట్టించుకోవడం లేదని సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. ఇప్పటికే జరిగిన ఘటనల నేపథ్యంలో ఇక నుంచి అక్రమాలు జరిగితే వారినే బాధ్యులను చేయనున్నారు.

సమగ్ర వివరాలతో..

కొత్తగా తీసుకొచ్చిన ఈ విధానంతో సత్ఫలితాలు వస్తాయని భావిస్తున్నారు. ప్రతి నెలా పొదుపు సభ్యులంతా వీవోఏ ద్వారా చెల్లింపులు పూర్తి చేయాలి. ఈమేరకు జిల్లాలోని 1045 మంది సిబ్బంది చరవాణుల్లో యాప్‌ను నిక్షిప్తం చేశారు. వారిని ఆశ్రయిస్తే డబ్బులు కట్టాక, విధిగా రసీదు ఇస్తారు. అందులో లావాదేవీ, సంఘం, సభ్యురాలి పేరు, సమయం తదితర వివరాలన్నీ ఉంటాయి. ఇప్పటివరకు కట్టింది, ఇంకా చెల్లించాల్సినదెంతో తెలుసుకోవచ్చు. అవసరమైతే వాట్సాప్ సాయంతో చరవాణికి పంపించుకునే వెసులుబాటు సైతం ఉంటుంది. ★ ప్రస్తుతం చాలాచోట్ల ఇంకా మాన్యువల్‌గానే ప్రక్రియ సాగుతోంది. దీనిని రద్దు చేసినట్లు అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.

పొదుపు సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం..

రుణాల మంజూరు, వసూళ్లకు సంబంధించి ప్రతి క్లస్టర్‌కూ ఒక ఏపీఎం ఉన్నారు. జనరల్ ఏపీఎంలు సైతం కొనసాగుతున్నారు. వీరి ఆధ్వర్యంలో వీవోఏలు పనిచేయాలి. సభ్యుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవు. యాప్ సాయంతో చెల్లింపులు చేసి, విధిగా రసీదు ఇవ్వాలి. ఇప్పటికే 283 పీటీఎం యంత్రాలిచ్చాం. ఈ ఆర్థిక ఏడాదిలో ఇప్పటివరకు 23,298 మందికి రూ.213.93 కోట్లు అందించాం. వచ్చే మూడు నెలల్లో 6800 మందికి రూ.68.95 కోట్లు ఇవ్వనున్నాం. - **చిట్టిబాబు, స్త్రీనిధి ఏజీఎం**

నిర్లక్ష్యమై మొలుస్తోంది!

నెల్లిమర్ల నగర పంచాయతీలో సుమారు 900 మొక్కలను నాటాలని ప్రభుత్వం గతంలో లక్ష్యం పెట్టుకుంది. దీనిలో భాగంగా వాటిని పంపిణీ చేయగా 500 వరకు వేశారు. మిగతా వాటిని వినియోగించకుండా ఇలా కార్యాలయం ఆవరణలోనే పడేశారు. నీరు సక్రమంగా వేయకపోవడంతో ఎండకు ఎండిపోతున్నాయి. వీటిని కూడా నాటి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఏఈ శివకుమార్ వద్ద ప్రస్తావించగా త్వరలో మిగిలిన మొక్కలను నాటి, నిర్వహణ చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల

మామిడి తోటల్లో ఆశల పూత

– న్యూస్‌టుడే, విజయనగరం వ్యవసాయ విభాగం

నిలబెట్టుకుంటేనే దిగుబడి

జిల్లాలో వరి తరువాత ప్రధానంగా మామిడి పంటపైనే రైతులు ఆధారపడతారు. అన్ని మండలాల్లో కలుపుకొని 33 వేల హెక్టార్లలో తోటలు విస్తరించాయి. ఇందులో 30 వేల హెక్టార్ల మేర ఫలసాయం వస్తోంది. ఏటా 3 లక్షల టన్నుల వరకు దిగుబడి రావాల్సి ఉండగా.. చివరికొచ్చేసరికి 60 శాతమే చేతికందుతోంది. యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం, వాతావరణం మార్పు, పూత రక్షణకు చర్యలు కొరవడడం తదితర కారణాలతో ఈ పరిస్థితి కనిపిస్తోంది.

పూతతో ఉన్న చెట్టు

పెద్దఎత్తున ఎగుమతులు..

జామి, ఎస్.కోట, రామభద్రపురం తదితర మండలాల్లో తోటలెక్కువ. రకాన్ని బట్టి టన్ను రూ.35 వేల నుంచి రూ.55 వేల వరకు అమ్ముతున్నారు. రాష్ట్రంలో మామిడిని ఎక్కువగా ఎగుమతి చేసే జిల్లాల్లో మన ప్రాంతమూ ఉంది. అయితే స్థానికంగా తాండ్ర, బెల్లం తయారీ పెరగడంతో కొన్నేళ్లుగా ఎగుమతి శాతం తగ్గింది. ప్రస్తుతం దిల్లీ, ముంబయి, కోల్‌కతా, బరంపురం, బెంగళూరుకు పంట తరలుతోంది.

ఆశాజనకంగానే..

నవంబరులో పడిన వర్షాలతో చెట్లకు నీటి తడులు పుష్కలంగా అందాయి. ప్రస్తుతం అన్నిచోట్లా పూత కనిపిస్తోంది. అయితే ఉష్ణోగ్రతల్లో మార్పు, మంచు కారణంగా అక్కడక్కడా రాలిపోతోంది. ఈ పరిస్థితి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె.చిట్టిబాబు సూచించారు.

నివారణ చర్యలివిగో..

★ తేనె మంచు పురుగు నివారణకు లీటరు నీటిలో 1.5 మి.లీ. మోనోక్రొటోఫాస్ లేదా 2 మి.లీ డైమిథోయేట్ కలిపి పూత మొదలయ్యే సమయం, పిందెలు తయారయ్యే ముందు చెట్టంతా పిచికారీ చేయాలి.

★ మొగ్గ దశలో కనిపిస్తే లీటరు నీటిలో 1.2 మి.లీ బ్యూప్రోఫెజిన్- 25 ఎస్.సి లేదా 0.3 గ్రాముల థయోమిథాక్సిమ్ కలిపి చల్లాలి.

★ మసికి కారణమైన శిలీంధ్రాల నివారణకు లీటరు నీటిలో 2 మి.లీ హెక్సాకొనజోల్ లేదా మి.లీ ప్రొపికొనజోల్ కలిపి చల్లాలి.

నడవండి.. అనారోగ్యాన్ని తరమండి

ట్రాక్‌పై నడుస్తున్న జేఎన్‌టీయూజీవీ అధికారులు, ఆచార్యులు, సిబ్బంది

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని 'ప్రకృతితో కలిసి నడుద్దాం- ప్రగతి సాధిద్దాం' అనే నినాదంతో గురువారం విజయనగరంలోని జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయంలో నడకదారిని ప్రారంభించారు. ఉపకులపతి వి.వి.సుబ్బారావు, రిజిస్ట్రార్ జి.జయసుమ, ఆచార్యులు, సిబ్బంది, విద్యార్థులు కలిసి నడక సాగించారు. ప్రతిఒక్కరూ రోజూ ఎంతో కొంత సమయం నడవాలని, అప్పుడే అనారోగ్య సమస్యలు దూరమవుతాయని సుబ్బారావు సూచించారు. జీవితంలో ఏం సాధించాలన్నా ఆరోగ్యం ముఖ్యమని, జీవనశైలిలో మార్పులతోనే అది సాధ్యమన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రధానాచార్యుడు ఆర్.రాజేశ్వరరావు, డైరెక్టర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు. అనంతరం కాలమానిని ఆవిష్కరించారు. – న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

ప్రశాంతంగా కొత్త సంవత్సర వేడుకలు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ముందస్తు చర్యలతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ముఖ్య కూడళ్లలో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. అర్ధరాత్రి ఒంటి గంట తరువాత రహదారులపై ఎవరూ తిరగకుండా పెట్రోలింగ్ ముమ్మరం చేశామని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 28 మందిపై, ఎంవీ చట్టాన్ని అతిక్రమించిన 87 మందిపై కేసులు పెట్టామన్నారు. విజయనగరం రెండో పట్టణ, గజపతినగరం స్టేషన్ల పరిధిలో డ్రోన్ల సాయంతో 9 మంది జూదరులను అదుపులోకి తీసుకుని, రూ.1895 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏఎస్పీ పి.సౌమ్యలత, డీఎస్పీలు ఆర్.గోవిందరావు, భవ్యారెడ్డి, ఎస్.రాఘవులు పర్యవేక్షించారన్నారు.

విమానాశ్రయమే అభివృద్ధికి సంకేతం

మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, చిత్రంలో నాయకులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: భోగాపురంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి సంకేతమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. నూతన సంవత్సర కానుకగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని బహుమతిగా ఇవ్వనున్నాయన్నారు. విజయనగరంలోని అశోక్‌బంగ్లాలో గురువారం విలేకరులతో మాట్లాడారు. విజయనగరం, విశాఖపట్నం జంట నగరాలుగా మారతాయని, శ్రీకాకుళం జిల్లాకు అనుసంధానమవుతాయని చెప్పారు. భవిష్యత్తులో ఈ ప్రాంతానికి పెద్దఎత్తున పరిశ్రమలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాదుల వరప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

శనివారం.. ఉల్లాసం

గాజుసీసాల మధ్య వ్యాయామం చేస్తున్న బాలలు

పాఠశాలల్లో పటిష్ఠంగా నో బ్యాగ్ డే అమలు

వీరఘట్టం, న్యూస్‌టుడే: సర్కారు బడుల్లోని విద్యార్థులు వారంలో ఒకరోజు (శనివారం) ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. బడి సంచి మోత బరువు లేకుండా ఈ కార్యక్రమం అమలు చేస్తోంది. ఆ రోజంతా ఆటపాటలతో కూడిన అభ్యసన జరిగేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా నో బ్యాగ్ డేను అమలు చేస్తున్నారు. పుస్తకాలను ఇంట్లో విడిచిపెట్టి శనివారం బడికి వెళ్లొచ్చు. దీని ద్వారా బాలల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలు వెలికితీసి మానసిక ఉల్లాసం కలిగిస్తున్నారు.

జిల్లాలో వివరాలు..

- మొత్తం పాఠశాలలు: 1495
- విద్యార్థులు: 94002
- ఉపాధ్యాయులు: 4872

కార్యక్రమాలు ఇలా:

★ **1, 2 తరగతులు:** పాడుకుందాం, మాట్లాడుకుందాం, నటిద్దాం, సృజన ★ 3, 4, 5 తరగతులు: తోటకు పోదాం, సృజన, పరిశుభ్రం చేద్దాం, చదువుకుందాం, విందాం ★ 6-10 తరగతుల ఉన్నత పాఠశాలల్లోని బాలలకు సృజనాత్మకత, ఆటపాటలు, విద్యా, వైజ్ఞానిక నమూనాల రూపకల్పన.

★ **కలెక్టర్ మరో ప్రకటన:** ఇప్పటికే జిల్లాలో ఏరోబిక్ నృత్యాల కార్యక్రమం అమలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి శనివారం ఫ్రెండ్లీ డే పాటించాలని సీతానగరం మండలం జోగింపేట అంబేడ్కర్ గురుకులాన్ని సందర్శించిన సందర్భంగా కలెక్టర్ ప్రభాకరరెడ్డి ప్రకటన చేశారు. కలెక్టర్ ప్రత్యేకంగా పాఠశాలల్లో నిర్వహిస్తున్న ముస్తాబు కార్యక్రమాన్ని భామినిలో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య ఆత్మీయ సంబంధాలు ఏర్పడి పాఠశాలల్లో నమోదు శాతం.

హాజరు శాతం పెరుగుతుంది..

★ అనుకూల వాతావరణం: పాఠశాలల్లో ప్రతి శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా అనేక వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నాణ్యమైన విద్యాప్రమాణాలతో కూడిన ఫలితాలు వస్తాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదవాలనే ఆలోచన అందరిలో కలుగుతుంది.

– కోటేశ్వరరావు, ఏఎంవో, ఆర్.తేజేశ్వరరావు, ఏపీసీ, సమగ్ర శిక్షా

భగవంతుడా బతికేదెలా

బ్యాంకు ఉద్యోగి దుర్మరణంతో మిన్నంటిన రోదనలు

కొత్త ఏడాదికి స్వాగతం పలకాలని.. కుటుంబంతో సరదాగా గడపాలని విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. దార్లో కేకు కొన్నాడు. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుతాడనగా అనుకోని విషాదం. లారీ రూపంలో మృత్యువు ప్రాణాలు తీసుకుపోయింది. అండగా ఉంటాడనుకుంటే అందకుండా పోయాడని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

నాగేశ్వరరావు (పాతచిత్రం)

రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస మేజరు పంచాయతీ శివారు పాతసుంకరపాలేనికి చెందిన గనిశెట్టి నాగేశ్వరరావు(32) ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేసేవారు. బుధవారం రాత్రి అర్ధానపాలెం సమీపంలో ఓ శీతల పానీయ గిడ్డంగిలో లోడు దించుకుని వెనక్కి తిప్పుతున్న లారీ వెనుకభాగం తగిలి మృతి చెందారు. ఆయనకు తల్లిదండ్రులు, భార్య, 14 నెలల కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులకు విషయం తెలిసి ఆందోళనకు దిగారు. సీఐ షణ్ముఖరావు వారిని శాంతింపజేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇక మాకు దిక్కెవరు?..

'వివాహమైన మూడేళ్లకే నన్ను వదిలేసి వెళ్లిపోయావు.. ఎలా బతికేది..' అంటూ భార్య సాయి కన్నీమున్నీరయ్యారు. అందొచ్చిన కుమారుడి మృతితో తల్లిదండ్రులు అమ్మాలు, శంకరరావు బోరున విలపించారు. ఊరిలో ఎవరి ఇంట ఏ చిన్న కార్యక్రమం జరిగినా బంధువులుగా భావించి అన్ని పనుల్లో సాయం చేస్తుంటాడని, ఆయన మరణం తీరని లోటని గ్రామస్థులు కన్నీరు పెట్టుకున్నారు.

నింద భరించలేక వివాహిత ఆత్మహత్య

రమణమ్మ (పాతచిత్రం)

రామభద్రపురం, న్యూస్‌టుడే: ఓ వృద్ధుడి ఆరోపణలతో మనస్తాపం చెందిన వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రామభద్రపురం మండలం కొట్టక్కిలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రసాదరావు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తెంటు రమణమ్మ(32) భూతవైద్యం చేస్తోందని, చేతబడికి పాల్పడుతోందని అదే వీధికి చెందిన ఓ వృద్ధుడు కొన్నాళ్లుగా ఆరోపిస్తున్నాడు. దీనిపై పలుపురు ఆమెను అడగడంతో తీవ్ర మనస్తాపం చెంది బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న బాధితురాలిని కుటుంబ సభ్యులు, స్థానికుల సాయంతో సాలూరులోని ప్రాంతీయాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనలతో విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. ఆమెకు భర్త బాలరాజు, ఇద్దరు కుమార్తెలున్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య నగదు ఖర్చు చేసిందని ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: భార్య డబ్బులు ఖర్చు చేసిందన్న కోపంతో పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన ఘటన పార్వతీపురం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. డోకిశీల గ్రామానికి చెందిన బి.కోటేశ్వరరావు కొన్నిరోజుల క్రితం భార్య చేతికి కొంత డబ్బిచ్చి భద్రపర్చమన్నాడు. గురువారం తిరిగి కావాలని అడగ్గా.. లేవు.. పిల్లల కోసం ఖర్చు చేశానని చెప్పడంతో మనస్తాపానికి గురయ్యాడు. వంగ మొక్కలకు కొట్టే ద్రావణాన్ని తాగాడు. కుటుంబీకులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

నూతన సంవత్సరం వేళ తీవ్ర విషాదం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృత్యువాత

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: అప్పటివరకు స్నేహితులతో సరదాగా గడిపి.. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపాడు. భార్య, పిల్లలకు శుభాకాంక్షలు తెలియజేయాలని ఆత్రుతగా ఇంటికి బయలు దేరాడు. అదే తనకు చివరి ప్రయాణమని ఊహించలేకపోయాడు. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. నూతన సంవత్సరం వేళ ఆ ఇంట్లో అంధకారం నిండుకున్న ఘటన పార్వతీపురం మండలంలో గురువారం వేకువజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాళ్లబురిడి గ్రామానికి చెందిన కె.తవిటిరాజు(48) మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య లక్ష్మి టీ దుకాణం నడుపుతూ భర్తకు చేదోడువాదోడుగా ఉంటోంది. కొత్త సంవత్సర వేడుకలను స్నేహితులతో జరుపుకోవాలని పక్క గ్రామం ఐఆర్ పేట వెళ్లాడు. అర్ధరాత్రి వరకు స్నేహితులతో సందడి చేశాడు. తర్వాత ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. మలుపు వద్ద వాహనం అదుపుతప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తవిటిరాజు కుమార్తె పదో తరగతి, కుమారుడు అయిదో తరగతి చదువుతున్నారు. ఇంటికి ఆధారమైన వ్యక్తి మృతితో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బాగా చదువుకొని ప్రయోజకులైతే ఇంటి కష్టాలు గట్టెక్కుతాయని, చదువుతోనే మంచి జీవితం సొంతం అవుతుందని ఎప్పుడూ చెప్పే నాన్న ఇక రాడన్న నిజాన్ని ఆ పిల్లలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎస్సై సంతోషికుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

రకం	బ్యాగ్‌లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	270	280

EENADU eClassifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా?

రావివలసలో పంట పొలాలు, జాతర మెట్టకు వెళ్లే మార్గం బురదమయంగా మారుతోంది. ఏటా నాగావళి పిల్ల కాలువలో సాగునీరు వదిలినప్పుడల్లా రోడ్డు తడవడంతో గోతులు ఏర్పడుతున్నాయి. దీంతో రైతులు పంటను ఎడ్లబళ్లు, ట్రాక్టర్లపై తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మరమ్మతులు చేయాలని కోరినా స్పందన లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని ఏఈ గౌరీశంకరరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. – న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

మురుగు కదలదంతే..!

పట్టణంలో మురుగునీటి కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. చాలా వీధుల్లో పక్కా కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో అపారిశుద్ధ్యం నెలకొంటోంది. 23వ వార్డు దేవీ నగర్‌లో కాలువ నిర్మాణం జరగకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇళ్ల ముందు మురుగు కదలక దోమల బెడద, దుర్వాసన ఎక్కువ అవుతోంది. కాలువలు సైతం శుభ్రం చేయడం లేదు. పూడిక శుభ్రం చేస్తామని పారిశుద్ధ్య అధికారి కె.పకీరురాజు తెలిపారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం పురపాలక

రోజూ.. కి.మీ నడుస్తున్నాం సార్..

కరాసువలస పంచాయతీ కోదుకరకవలస విద్యార్థులు వీరు. గ్రామంలో గిరిజన సంక్షేమశాఖ ప్రాథమిక పాఠశాలలో కేవలం 1, 2 తరగతులు మాత్రమే బోధిస్తున్నారు. దీంతో మూడో తరగతి కోసం కి.మీ దూరంలోని దత్తివలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రోడ్డు దాటుకుని.. 8 మంది చిన్నారులు నడిచి వెళ్తున్నారు. డ్రాపౌట్లు పెరిగితే 5 వరకూ అక్కడే తరగతులు నిర్వహిస్తామని ఏటీడబ్ల్యూవో కృష్ణవేణి చెప్పారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

అసంపూర్తిగా వదిలేశారు

వెంకటాపురం గ్రామ శివారున రైతు సేవా, వెల్‌నెస్ కేంద్రం భవనాల నిర్మాణానికి 2020లో శంకుస్థాపన చేశారు. గోడల వరకు నిర్మాణం పూర్తి చేసిన గుత్తేదారు.. బిల్లుల విడుదలలో జాప్యంతో అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం సచివాలయ భవనం వృథాగా ఉంది. సిబ్బంది అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. వెంకటాపురం, చెల్లం నాయుడువలస గ్రామాల ప్రజలకు అద్దె భవనమే దిక్కు అయ్యింది. భవనం ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని ఏఈ చంద్రమౌళి తెలిపారు. – న్యూస్‌టుడే, సీతానగరం

నమ్మండి.. ఇది పార్కు

పట్టణంలో శ్రీనివాస కాలనీలోని పార్కు నామమాత్రంగానే ఉంది. 12 ఏళ్ల కిందట దీన్ని రూ.5 లక్షలతో పిల్లలు ఆడుకునే పరికరాలు, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేశారు. అవన్నీ దొంగలపాలయ్యాయి. పశువులశాలగా మారింది. పరిసర ప్రాంత ప్రజలు చెత్త వేసి డంపింగ్‌యార్డులా మార్చేశారు. ఎక్సైజ్ శాఖ అధికారులు సారా కేసుల్లో పట్టుకున్న వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారింది. పార్కు అభివృద్ధికి ప్రతిపాదనలు చేస్తామని పుర డీఈ ప్రసాద్ చెప్పారు. – న్యూస్‌టుడే, సాలూరు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

?: అంటిపేట ఎస్సీ వీధిలో సగం వరకు మాత్రమే సీసీ రోడ్డు నిర్మించారు. మిగిలిన భాగం రాళ్లు తేలి ఇబ్బందులు పడుతున్నాం. **- రామారావు, స్థానికుడు** ❖ పనులు చేపడతాం. **- శశిభూషణరావు, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, సీతానగరం

?: సన్యాసిరాజుపేటలో విద్యుత్తు స్తంభాలకు తీగజాతి మొక్కలు అల్లుకున్నాయి. **- తిరుపతి, సన్యాసిరాజుపేట** ❖ పరిశీలించి, తొలగిస్తాం. **- శ్రీనివాసరావు, ఏఈ** – న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

?: పాలకొండ నీలమ్మ కాలనీలో పలుచోట్ల వీధి కుళాయిలు పనిచేయడం లేదు **- ప్రసన్న, గృహిణి** ❖ పరిశీలించి తాగునీరు సరఫరా అయ్యేలా చూస్తాం **- రత్నరాజ్, కమిషనర్** – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

తాగునీటి సరఫరా

స్పందనకు వందనం

పార్వతీపురం గ్రామీణం: వెంకంపేట పంచాయతీ వైకేఎం నగర్ కాలనీలో పైపులైన్ బాగుచేసి తాగునీరు అందించారు. ఐదు రోజులుగా నీరు రాక ప్రజల ఇబ్బందులపై 'ఈనాడు' 'మేమున్నాం.. మీకుతోడుగా'లో గురువారం వచ్చిన వార్తకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బసవరాజు, సర్పంచి కృష్ణారావు స్పందించి పనులు చేయించారు.

పనులు ప్రారంభం: సాలూరు: పట్టణంలోని వెంగళరాయ కాలనీలో గిరిజన బహుళ సాధక మార్కెట్ పనులు అధికారులు ప్రారంభించారు. రూ.కోటితో 15 దుకాణాలు, గోదాము నిర్మించనున్నారు. గిరిజనులు సంతల్లో విక్రయించి దళారులతో మోసపోతున్నారు. మార్కెట్ ప్రారంభిస్తే గిట్టుబాటు ధరతో పాటు పట్టణ వాసులకు గిరిజన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి.

బాలికల విద్య.. మరింత భద్రం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: కస్తూర్బా గాంధీ విద్యాలయాలు(కేజీబీవీలు) నిఘా నీడలో కొనసాగనున్నాయి. బాలికలకు మరింత రక్షణ కల్పించడంతోపాటు అక్రమాలకు కళ్లెం వేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దశల వారీగా సీసీ కెమెరాలను మంజూరు చేసింది. ఇకపై సాంకేతికతతో మరింత పక్కాగా అధికారులు పర్యవేక్షణ చేయనున్నారు.

మన్యం జిల్లాలో అన్ని రకాల కేజీబీవీలు 21 ఉన్నాయి. ఆరు నుంచి ఇంటర్ వరకు 3,780 మంది చదువుతున్నారు. ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాలతో బాలికలు మధ్యలో చదువుకు దూరం కాకూడదన్న ఆలోచనతో కేజీబీవీలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. మధ్యలో చదువుకు దూరం అయిన డ్రాపౌట్లకు ప్రవేశం కల్పించి ఆరు నుంచి ఇంటర్ వరకు విద్య, వసతి, ఇతర మౌలిక సౌకర్యాలు కల్పిస్తోంది. రాష్ట్రంలో అక్కడక్కడ చోటు చేసుకుంటున్న కొన్ని ఘటనల నేపథ్యంలో బాలికలకు మరింత రక్షణ కల్పించాలన్న ఆలోచనతోపాటు

ఒక్కోచోట తొమ్మిది సీసీ కెమెరాలు

పాఠశాలలో అక్రమాలకు తావు ఉండకూడదన్న నిశ్చయంతో వాటిని నిఘా నీడలోకి తీసుకొచ్చే చర్యలు ప్రభుత్వం చేపట్టింది. ఒక్కో కేజీబీవీకి 9 సీసీ కెమెరాలు సమకూర్చింది. జిల్లావ్యాప్తంగా 189 కెమెరాలు వచ్చాయి. వాటిని అమర్చే పనులు సిబ్బంది చేపడుతున్నారు.

అక్రమాలకు కళ్లెం

జిల్లాలోని పలు కేజీబీవీల్లో వంటవాళ్లు సరకులు తీసుకెళ్లడం, మిగులు బియ్యం అక్రమంగా విక్రయించిన ఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. అటువంటి వాటికి అవకాశం లేకుండా సీసీ కెమెరాలతో కళ్లెం వేయనున్నారు. అంతేకాకుండా విద్యార్థులను కలిసేందుకు ఎవరు వస్తున్నారు.. ఎవరు వెళ్తున్నారు తదితర వాటిపైనా నిఘా పెరగనుంది.

ఉన్నతాధికారులు వీక్షించేలా..

సీసీ కెమెరాల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. బాలికలకు సాంకేతిక రక్షణ సమకూరనుంది. టీచింగ్, నాన్ టీచింగ్, విద్యార్థులను కలిసేందుకు వచ్చే వారిపైన పర్యవేక్షణ ఉంటుంది. నేరుగా ఉన్నతాధికారులు వీక్షించే ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. **– తేజేశ్వరరావు, ఏపీసీ, సమగ్ర శిక్ష**

ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలు దూరం



రహదారి భద్రత మాసోత్సవాల గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టరు, జిల్లా రవాణాధికారి

పార్వతీపురం, కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: రహదారి భద్రతా ప్రమాణాలను పాటిస్తే రహదారి ప్రమాదాలకు దూరం కావచ్చని కలెక్టరు ప్రభాకరరెడ్డి అన్నారు. గురువారం కలెక్టరు ఛాంబరులో రహదారి భద్రత మాసోత్సవాల గోడపత్రికలను జిల్లా రవాణాధికారి దుర్గాప్రసాద్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ప్రమాద నివారణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. చిన్నచిన్న తప్పుల కారణంగానే 90 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వాహనదారులు తమ ప్రాణాలతోపాటు తమపై ఆధారపడి ఉన్న కుటుంబం, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలన్నారు. రవాణా శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమిస్తున్నా.. అధికారులకు పట్టదా..?

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణానికి గతంలో రూ.2 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.. పనులు చేశారు. ఆపై ఆ గదుల్ని వినియోగించలేదు. నిజానికి ఇది ఒకప్పటి వెంగళరాయసాగర్ కాలనీ స్థలం. తర్వాత క్రమంగా ఆక్రమణకు గురైంది. భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటికి మరమ్మతులు చేయించి కొంతమంది బయటి వ్యక్తులు ఆక్రమించి నివసిస్తున్నారు. వీరిలో కొంత మందికి సొంత ఇల్లు ఉన్నా.. పలు అవసరాల నిమిత్తం వీటిని వాడుతున్నారు. ఇంకొందరికి జగనన్న లేఅవుట్ కాలనీలో ఇళ్ల స్థలాన్ని మంజూరు చేయగా.. వాటిని అద్దెకిచ్చి, విక్రయించి ఇక్కడే నివాసముంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులకు పట్టడం లేదని పలువురు అంటున్నారు. తాజాగా ఈ స్థలంలో కొంత ప్రాంతాన్ని ఐటీడీఏ ఆశ్రమ పాఠశాల నిర్మించేందుకు అందివ్వగా, ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. కానీ నివాసాలను మాత్రం ఇంకా ఖాళీ చేయించలేదు. దీనిపై ఐటీడీఏ ఏఈ సత్యనారాయణను వివరణ కోరగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఆక్రమార్కులు వినియోగించుకుంటున్న గదులు

తెరపై ఈనాడు

★ శ్రీ సినిమా(ఎస్‌వీబీ): **శంబాల, ఈషా**

★ టీబీఆర్: **సైక్ సిద్ధార్థ రెడ్డి, అఖండ-2, అనకొండ, వృషభ**

కూరగాయల ధరలు

పార్వతీపురం రైతు బజారు: గురువారం సాయంత్రానికి కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి (కిలో.. రూపాయిల్లో..)టమాటా: 48, వంకాయలు: 34, బెండ: 48, బీర: 48, దొండ: 42, చిక్కుడు: 38, పచ్చిమిర్చి: 58, కాకర: 35, క్యారెట్: 56, బీట్‌రూట్: 48, ఉల్లి: 23, బంగాళాదుంపలు: 20, అల్లం: 77, వెల్లుల్లి: 76, క్యాప్సికమ్: 83, అరటి కాయ: 5, ఆనపకాయ: 15 – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

41 లక్షల చేప పిల్లల పంపిణీకి ఏర్పాట్లు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మన్యం జిల్లాలో మత్స్య పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా 41 లక్షల చేపపిల్లలను మత్స్యకారులకు పంపిణీ చేయనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో డివిజన్ అభివృద్ధి అధికారులు, సచివాలయ మత్స్య సహాయకులతో మాట్లాడారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 14 లక్షలు, పార్వతీపురం పరిధిలో 27 లక్షల చేప పిల్లల పంపిణీకి ప్రతిపాదించామన్నారు. వీటిని మత్స్యకారులు చెరువులు, నీటి వనరుల్లో పెంచుకుని ఆదాయ వనరులుగా మార్చుకోవచ్చని చెప్పారు. సంక్రాంతి పండగ తర్వాత పంపిణీ చేస్తామని తెలిపారు. మత్స్యశాఖ కార్యాలయంలో ఒక అభివృద్ధి అధికారి, సీనియర్ సహాయకుని పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని పూరించేలా ప్రతిపాదనలు పెట్టామని పేర్కొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖ అధికారి

వేడుకల్లో ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీలు వెంకటేశ్వరరావు, మనీషారెడ్డి, అధికారులు

ఎమ్మెల్యే జయకృష్ణకు అభినందనలు తెలుపుతున్న అభిమానులు

గుమ్మలక్ష్మీపురంలో కేకు కోస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

పార్వతీపురం పట్టణం, సీతంపేట, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఎస్పీ మాధవరెడ్డి, సిబ్బంది కేకు కోశారు. అదనపు ఎస్పీలు వెంకటేశ్వరరావు, మనీషారెడ్డి, డీఎస్పీ రాంబాబు, ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి, ఎస్‌బీఐ సీఐ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ❖ **గుమ్మలక్ష్మీపురం:** ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మిఠాయిలు పంచారు. ❖ **పార్వతీపురం గ్రామీణం:** నియోజకవర్గంలో ప్రజలందరూ ఆర్థికాభివృద్ధి సాధించి, సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. తన గృహం వద్ద జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో అభిమానులు తెచ్చిన కేకు కోసి మాట్లాడారు. ❖ పార్వతీపురం ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్‌కలెక్టర్లు వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌కు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ❖ డీఎంహెచ్‌వో భాస్కరరావు, డీసీహెచ్‌ఎస్ నాగభూషణరావుకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ❖ **జియ్యమ్మవలస:** చినమేరంగిలో మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి, జిల్లా వైకాపా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు కేకు కోశారు. ❖ **పాలకొండ:** అంపిలి గ్రామంలో తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గండి రామినాయుడుకు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ❖ **వీరఘట్టం:** ఎం.రాజపురంలో ఎమ్మెల్యే జయకృష్ణ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేకు కోశారు.

కోటదుర్గమ్మ.. శరణు శరణు

పాలకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని కోటదుర్గమ్మకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్‌శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు.

సీతారాముల వైభోగం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సరాది పురస్కరించుకుని పాలకొండ పట్టణంలోని సీతారామాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు.

నగర సంకీర్తన

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: ఏకాదశి పర్వదినం సందర్భంగా త్రినాథస్వామి ఆలయంలో భక్తులు రోజంతా శ్రీహరి నామస్మరణతో పూజలు చేశారు. ముగింపు సందర్భంగా నగర సంకీర్తన జరిగింది. ఆలయ అర్చకులు పద్మనాభ పాత్రో, ఒడిశాకు చెందిన వేద పండితుల ఆధ్వర్యంలో 24 గంటలపాటు సాగిన సంకీర్తనతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

పాలకొండ, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పాలకొండ ఆర్సీఎం చర్చిలో బుధవారం అర్ధరాత్రి ఫాదర్ సుందరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పెద్ద ఎత్తున క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు. క్రీస్తు సందేశం వినిపించారు.

పాల్గొన్న క్రైస్తవ భక్తులు

పక్కా కాలువ నిర్మించరూ..

పాలకొండ పట్టణ ప్రధాన రహదారిని ఆనుకుని వడమ గ్రామ రహదారిలో కొత్త కాలనీలు ఏర్పడ్డాయి. పక్కా కాలువలు లేక మురుగు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దోమలు, రోగాలు వ్యాపిస్తాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పాలకవర్గ సమావేశంలో చర్చించి చర్యలు చేపడతామని నగర పంచాయతీ ఏఈ దేవీ వరప్రసాద్ తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

ఐజీని కలిసిన ఎస్పీ

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: విశాఖ రేంజ్ ఐజీగా బాధ్యతలు స్వీకరించిన గోపీనాథ్‌ని ఎస్పీ మాధవరెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల వరకు ఆయన రేంజ్ డీఐజీగా విధులు నిర్వర్తించేవారు. ఐజీగా పదోన్నతి పొందారు.

క్రీడా మైదానానికి రూ.2.98 కోట్లు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గుమ్మలక్ష్మీపురం హెచ్‌గ్రౌండు క్రీడా మైదానం అభివృద్ధికి రూ.2.98 కోట్లు మంజూరైనట్లు డీఎస్‌డీవో శ్రీధర్ తెలిపారు. గురువారం మైదానం, అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణం పనులను పరిశీలించారు. 400 మీటర్ల ట్రాకు, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ మైదానాలు, అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియం పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. జిల్లా క్రీడా సమన్వయకర్త వాసుదేవరావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచి మృతి

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ మండలం ఎం.సింగుపురం మాజీ సర్పంచి దన్నాన రాజారత్నం నాయుడు(78) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

రబీకి నాగావళి నీరు విడుదల

గరుగుబిల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గరుగుబిల్లి మండలం నాగావళి కుడి పిల్ల కాలువలో రబీ సాగుకు నీరు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ కిశోర్ గురువారం తెలిపారు. ఆయకట్టు రైతుల కోరిక మేరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుమారు ఎనిమిది వేల ఎకరాలకు నీరందిస్తున్నట్లు చెప్పారు.

రోగులకు రగ్గుల పంపిణీ

పాలకొండ, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఎన్టీఆర్ వైద్య జిల్లా మేనేజరు, జాతీయ మానవ హక్కుల వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దూబ రాంబాబు కుటుంబసభ్యులు గురువారం పాలకొండ ఆసుపత్రిలో 350 మందికి రగ్గులు, పండ్లు పంపిణీ చేశారు.

చదును చేసి.. ఆహ్లాదంగా మార్చి..

గరుగుబిల్లి మండల కేంద్రంలో పిల్లలు ఖాళీ సమయంలో ఆడుకోవడానికి వీలుగా చిన్న మైదానం, పార్కును ఏర్పాటు చేశారు. అందులో సర్పంచి కలిశెట్టి ఇందుమతి రూ.2.50 లక్షలు విలువైన ఆరు రకాల క్రీడా పరికరాలు కూడా ఏర్పాటు చేశారు. రహదారి పక్కన ఖాళీగా ఉన్న స్థలంలో చెత్త తొలగించి, వినోదం కోసం పార్కు ఏర్పాటు చేశారు. చుట్టూ కంచె వేసి మొక్కలు నాటారు. ఈ సంక్రాంతికి పూర్తిస్థాయిలో పిల్లలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, గరుగుబిల్లి

పాలకొండ వెంకటరాయుడు కోనేరు గట్టుపై పట్టణానికి చెందిన మహిళలు గురువారం నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

సాలూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతి ఇంటికీ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సుపరిపాలన సాగుతోందని గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం మంత్రి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 18 నెలలుగా ప్రజారంజక పాలన సాగుతోందన్నారు. రానున్న మూడున్నరేళ్లలో ఎంతో అభివృద్ధి సాధిస్తామన్నారు. ప్రజల స్వర్ణాంధ్ర కళను సాకారం చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రభాకరరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌వో హేమలత, కూటమి నేతలు మంత్రికి పుష్పగుచ్ఛాలు, నోటు పుస్తకాలు, పెన్నులు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు చిట్టి, పరమేశు, వెంకటరావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, పార్టీ నేతలు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

వారపు సంత.. తప్పదు చింత

భామిని, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో సరసమైన ధరలకు కూరగాయాలు, ఇతర సరకులు లభించేది వారపుసంతల్లోనే. కానీ వాటిల్లో మౌలిక వసతులు లేక రైతులు, వ్యాపారులతో పాటు ప్రజలూ ఇబ్బందులు పాలవుతున్నారు. షెడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు, సరైన రోడ్లు లేవు. వేలం పాట, ఇతరాల నుంచి పంచాయతీలకు ఆదాయం వస్తున్నా సౌకర్యాలు కల్పించడం లేదు. దీంతో నేలపైనే విక్రయాలు చేసుకోవాల్సిన పరిస్థితి.

శిథిలావస్థలో భామిని సంత షెడ్లు

మండలాల్లో ఇదీ పరిస్థితి..

❖ పాలకొండ మండలంలో గతంలో ప్రతి సోమవారం జరిగే నవగాం సంతకు రూ.5 లక్షలతో గదులు నిర్మించారు. నిర్వహణ లేక అవి పాడైపోయాయి. నేడు ఆకతాయిల అడ్డాగా మారాయి. ఇప్పుడు ప్రతి బుధవారం సంత జరుగుతున్నా షెడ్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ❖ భామిని వారపు సంత గురువారం, బత్తిలిలో రోజూ జరుగుతాయి. ఈ ప్రాంతాల్లో నిర్మించిన షెడ్లు శిథిలావస్థలో, ముళ్లపొదల మధ్యలో దర్శనమిస్తున్నాయి. దీంతో రోడ్లపైనే అమ్మకాలు చేస్తున్నారు. వేలం పాటలో నిధులొస్తున్నా అభివృద్ధి కానరావడం లేదు. ❖ సీతంపేట మండలం కుసిమి, సీతంపేట, మర్రిపాడు, పూతికవలస, దోనుబాయి వారపుసంతల్లోనూ ఇదే పరిస్థితి. వేలంపాటలో వచ్చిన నగదు పంచాయతీ ఖాతాలో జమ చేస్తారు. కానీ మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు.

చినుకు పడితే అంతే..

షెడ్లులేకపోవడంతో వర్షం వస్తే రోడ్డంతా బురదగా మారుతోంది. విక్రయాలు జరపలేని పరిస్థితి. కొందరు చిరువ్యాపారులు తప్పని పరిస్థితుల్లో బురదలోనే అమ్మకాలు జరుపుతున్నారు. గతంలో ఉపాధి హామీ ద్వారా మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపినా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

దృష్టి సారిస్తాం..

వారపుసంతల అభివృద్ధి గ్రామ పంచాయతీలదే. సంతల్లో వేసిన వేలం పాట నిధులతో సదుపాయాలు సమకూర్చాలి. ప్రత్యేక దృష్టిసారించి తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు సరఫరా కల్పనకు కృషి చేస్తాం. **– రాంప్రసాద్ నాయుడు, డీఎల్‌పీవో, పాలకొండ.**

బాధ్యతల స్వీకరణ

హేమలత

షణ్ముఖరావు

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం ఎస్సైగా ఎం.హేమలత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రాజేష్ పార్వతీపురం గ్రామీణ ఠాణాకు బదిలీ కాగా, హేమలత శిక్షణ పూర్తి చేసుకుని తొలిసారి బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ❖ **వీరఘట్టం:** వీరఘట్టం ఎస్సైగా ఎస్.షణ్ముఖరావు బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. గతంలో పనిచేసిన ఎస్సై జి.కళాధర్ పార్వతీపురానికి బదిలీ అయ్యారు.

స్వచ్ఛ పార్వతీపురంగా తీర్చిదిద్దుదాం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పార్వతీపురాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. గురువారం రూ.12 లక్షలతో కొనుగోలు చేసిన డంపర్ బిన్లను ప్రారంభించారు. స్వచ్ఛత, ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని చెప్పారు. పురపాలక సంఘంలో చెత్త సేకరణను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కమిషనరు డి.పావని, అధికారులు పాల్గొన్నారు.

డంపర్ బిన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పురాతన కట్టడం.. ఆధ్యాత్మిక నిలయం

బలిజిపేట మండలం గళావల్లి గ్రామంలోని పురాతన ఉమా సహిత కామలింగేశ్వరాలయానికి ప్రత్యేకత ఉంది. 11వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పాలించిన గంగ, చోళ, కళింగ రాజుల కాలంలో దీన్ని నిర్మించినట్లు ఇక్కడి కట్టడాలను పరిశీలిస్తే తెలుస్తోంది. ఈ ఆలయంలో రెండున్నర అడుగుల శివలింగం ఏర్పాటు చేశారు. 50 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ ఆలయం ఒరిశాలోని పరశురామేశ్వర ఆలయాన్ని పోలి ఉండడం విశేషం. ఇటుకలు, సున్నం వాడకుండా రాతితో గుడిని నిర్మించారు. కార్తికమాసంలోని అన్ని రోజులు రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. మన్యంతోపాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. – న్యూస్‌టుడే, బలిజిపేట

పురాతన కామలింగేశ్వరాలయం

(c) eenadu

వాడపల్లిలో ఆధ్యాత్మిక శోభ

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: నూతన ఆంగ్ల సంవత్సరం ప్రారంభం సందర్భంగా గురువారం కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం అశేష భక్తజనంతో శోభిల్లింది. ఈ సందర్భంగా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. తొలుత గోపూజ, ఐశ్వర్య లక్ష్మీ హోమం, నిత్యార్చన సేవ, 17వ పాశుర విన్నపం, తీర్థగోష్ఠి తదితర కార్యక్రమాలను అర్చకులు రమణీయంగా జరిపించారు. అనంతరం అష్టోత్తర శతనామావళి పూజలు, కల్యాణం నిర్వహించారు. ఈవో(డీసీ) నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అష్టోత్తర పూజ చేస్తున్న అర్చకస్వామి, పాల్గొన్న భక్తజనం

ఇన్‌ఛార్జి డీఆర్‌డీఏ పీడీగా దేగలయ్య

రంపచోడవరం, న్యూస్‌టుడే: నూతన జిల్లా కేంద్రమైన రంపచోడవరంలోని వెలుగు ఏపీడీ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. వెలుగు ఏపీడీగా ఉన్న డేగలయ్యకు అదనపు బాధ్యతలను అప్పగించడంతో ఇన్‌ఛార్జి డీఆర్‌డీఏ పీడీగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

రంపచోడవరంలో డీఆర్‌డీఏ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జి పీడీ డేగలయ్య

శరవేగంగా జిల్లా కార్యాలయాలు

వారంలో కొలిక్కి వచ్చే అవకాశం

ఈనాడు, పోలవరం, న్యూస్‌టుడే, రంపచోడవరం

కొత్తగా ఏర్పాటైన పోలవరం జిల్లా కేంద్రమైన రంపచోడవరంలో అన్ని ప్రభుత్వ శాఖల ప్రధాన కార్యాలయాలు అందుబాటులోకి తెచ్చేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. వారంలోగా ప్రతి శాఖ కార్యాలయాన్ని స్థానికంగా ఏర్పాటు చేయటంతోపాటు జిల్లా స్థాయి బాధ్యతలు డివిజన్ స్థాయి అధికారులకు తాత్కాలికంగా అప్పగించి పాలనాపరమైన ఇబ్బందులు లేకుండా చూడనున్నారు. పూర్తిస్థాయిలో అధికారుల నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకు స్థానిక సబ్ కలెక్టర్/ ఐటీడీఏ పీవోకు పర్యవేక్షణ బాధ్యత అప్పగించనున్నారు.

జిల్లా కలెక్టర్, జేసీ, పలుశాఖల కార్యాలయాలు ఏర్పాటు చేయనున్న పీఎంఆర్‌సీ ప్రాంగణం

త్వరలోనే కలెక్టరేట్, ఎస్పీ ఆఫీసులు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు సిరిగిందలపాడు యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ)లో కలెక్టరేట్, సంయుక్త కలెక్టర్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ ఆవరణలోని సమావేశ మందిరంలో ఎస్పీ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. మరమ్మతులు, నిర్మాణాల తర్వాత పీఎంఆర్‌సీ సముదాయంలో కలెక్టరేట్, ఇతర కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. వైటీసీలో ఎస్పీ, ఓఎస్డీ కార్యాలయాలు ఏర్పాటు చేసేలా ప్రణాళిక చేశారు. పనులన్నీ పది రోజుల్లో పూర్తిచేసి కార్యాలయాలు అందుబాటులోకి తేవాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

ఫిర్యాదుల వేదికకు కలెక్టర్

కొత్త జిల్లాలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదిక (పీజీఆర్‌ఎస్)కు ఇన్‌ఛార్జి కలెక్టర్ దినేశ్‌కుమార్ హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. కొన్ని శాఖల్లో సీనియర్ అధికారులకు ఇన్‌ఛార్జి బాధ్యతలు చేపట్టాలని సూచిస్తూ గత రాత్రి నిర్వహించిన జూమ్ సమావేశంలో స్పష్టత ఇచ్చారు. అన్ని శాఖల్లో ఆయా విభాగాల నుంచి సీనియర్ అధికారుల జాబితాను సేకరిస్తున్న కలెక్టర్.. వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారానికి ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉంది.

మౌలిక సదుపాయాలకు రూ.5 కోట్లు

వసతుల కల్పనకు రూ.5 కోట్లు విడుదల చేయడంతో యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన చర్యలపై ఇంజినీరింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సిరిగిందలపాడు వైటీసీ, పీఎంఆర్‌సీలో శిథిల భవనాలను తొలగించి చేపట్టాల్సిన కొత్త నిర్మాణాలు, మరమ్మతుల గురించి ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్, సబ్‌కలెక్టర్ శుభం నోక్వాల్‌తో కలిసి కలెక్టర్ పలు సూచనలు చేశారు.

త్వరలో ఏర్పాటు..: కొత్తగా ఏర్పడిన పోలవరం జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖల ఏర్పాటు, అధికారుల నియామకాన్ని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. తాత్కాలికంగా వారంలోగా ఇన్‌ఛార్జి అధికారులు, భవనాలు అందుబాటులోకి తెస్తాం. దశలవారీగా పూర్తిస్థాయి నియామకాలు, శాశ్వత భవనాలు సమకూర్చుతాం. **- దినేష్‌కుమార్, కలెక్టర్, పోలవరం**

పోలవరం ➡ రంపచోడవరం కేంద్రంగా అందుబాటులో ఉన్నతాధికారులు

కాంక్షలు తీరే తరుణం

ఈనాడు, పోలవరం

'దగ్గర'.. ఈ ఒక్క అనుకూలత ఎన్నో సదుపాయాల్ని సమకూర్చి పెడుతుంది. 'దూరం'.. అనే భారమొక్కటే ఎన్నో వెతల్ని మిగిల్చి పెడుతుంది. అశాస్త్రీయత అధ్వాన్నపు రూపాన్ని చూడాలంటే నిన్నటి వరకూ ఉన్న 'పాడేరు' జిల్లా పరిధిని ఒక్కసారి పరికిస్తే చాలు. మూడేళ్లపాటు రంపచోడవరం, విలీన మండలాల గిరిజనుల కంఠశోషను, బాధల్ని ఆలకిస్తే చాలు.. వైకాపా ప్రభుత్వ హయాంలో తలాతోక లేకుండా ఏర్పాటుచేసిన జిల్లాకేంద్రానికి వెళ్లాలంటే తలప్రాణం తోకకు వచ్చేది. కాలాకాలు కొట్టుకుంటూ, ఊపిరి బిగపట్టుకుంటూ వందల కిలోమీటర్లు ప్రయాణించి వెళ్లేటప్పటికి బాధలు ఆలకించే నాధుడు లేకుంటే! ఇక చెప్పేదేమీ లేదు. నిర్వాసిత గిరిజనులకైతే ఏడుపే తక్కువ. ఏళ్ల వెతలు ఎట్టకేలకు గిరి'జనం' బాధలు తొలగాయి. 'పోలవరం' జిల్లా ఏర్పాటుతో అనువైన జిల్లా, జిల్లాకేంద్రం అందుబాటులోకి వచ్చాయి. అధికారులు స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేస్తే మన్యంలో అభివృద్ధి పరుగులు పెట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం..

మెరుగైన వైద్యం అందుబాటులో లేకపోవడంతో ఆరోగ్య సమస్య తలెత్తితే రంపచోడవరం ప్రాంతం నుంచి సుమారు 55 కి.మీ. దూరంలో ఉన్న రాజమహేంద్రవరానికి, చింతూరు ప్రాంతవాసులను భద్రాచలం రిఫర్ చేస్తున్నారు. ప్రస్తుతం రంపచోడవరంలో ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి. దీన్ని సూపర్ స్పెషాలిటీగా, చింతూరులోని 50 పడకల ఆసుపత్రిని 100 పడకలుగా వృద్ధి చేసేందుకు సమగ్ర నివేదికలు పంపించారు. కార్యరూపం దాలిస్తే మెరుగైన వైద్య సేవలు దరిచేరుతాయి. ఆ ప్రాంతంలో ఆయా విభాగాల్లో అర్హత, నైపుణ్యం ఉన్నవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలూ లభిస్తాయి.

పర్యాటక వనరులు



పర్యాటకంగా మారేడుమిల్లికి విశేష గుర్తింపు ఉన్న నేపథ్యం, రంపచోడవరం నుంచి చింతూరు వరకు ఘాట్ రోడ్డు, అనేక చోట్ల దట్టమైన అడవులు విస్తరించడంతో వ్యూ పాయింట్లున్నాయి. వీటికి అనుబంధంగా మరిన్ని వనరులు, వసతులు అందుబాటులోకి తేవచ్చు. కూటమి ప్రభుత్వం పర్యాటకానికి ప్రోత్సాహం ఇస్తున్న నేపథ్యంలో పీపీపీ విధానంలో మరిన్ని ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

పారిశ్రామిక క్లస్టర్‌తో ఉపాధి

రంపచోడవరం నియోజకవర్గానికి ఇప్పటికే పారిశ్రామిక క్లస్టర్ మంజూరు కావటంతో కుటీర పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఏర్పడింది. దీంతోపాటు రబ్బరు సాగును ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రత్యేక సాయం అందించాలని నిర్ణయించిన నేపథ్యంలో స్థానికంగా శిక్షణ ఇచ్చి నాణ్యమైన ఉత్పత్తులు తయారీకి ప్రోత్సాహం లభిస్తుంది.

✦ విస్తారంగా వెదురు ఉన్న నేపథ్యంలో, వీటి నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసేందుకు ప్రణాళికలున్నాయి. ఇప్పటికే ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీలను (ఎఫ్‌పీసీ) ఏర్పాటు చేసి శిక్షణ పూర్తి చేశారు. వీటి ద్వారా వెదురు విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేస్తే, ఇంధన ఉత్పత్తి సంస్థలు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికీ దీనికి సంబంధించి అటవీ శాఖ అధికారులు గణన చేస్తున్నారు. జిల్లా యంత్రాంగం దీనిపైనా దృష్టి సారించాలి.

కొత్త జిల్లా మాది.. గిరిజనాభివృద్ధికి నాంది

రంపచోడవరం, న్యూస్‌టుడే

నూతనంగా ఏర్పాటైన పోలవరం జిల్లాతో గిరిజన ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని పలు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. దూరాభా తొలగించి, పాలనా వ్యవస్థను దగ్గర చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. గతంలో వివిధ పనులపై ఉన్నతాధికారులను కలవాలంటే అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరు వెళ్లేందుకు ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు పడేవారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం చంద్రబాబునాయుడు పోలవరం పేరుతో ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

'జిల్లా ఏర్పాటుతో ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు జిల్లా స్థాయి అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉంటారు.'

-బోండ్ల వరప్రసాద్, ఆదివాసీ హక్కుల వేదిక అధ్యక్షుడు

'రంపచోడవరంలో ఏరియా ఆసుపత్రి జిల్లా ఆసుపత్రిగా మారుతుంది. ప్రత్యేక వైద్యుల ద్వారా రోగులకు మెరుగైన వైద్యం అందే అవకాశముంది.'

-వెదుళ్ల లచ్చిరెడ్డి, ఆదివాసీ చైతన్యవేదిక అధ్యక్షుడు

'ఏజెన్సీలో పాఠశాలలకు పక్కా భవనాలతో పాటు ఉపాధ్యాయులు వస్తారు. భవిష్యత్తులో ఉన్నత చదువులకు పట్టణాలకు వెళ్లే అవసరం ఉండదు.'

- లండా వేణుగోపాల్, ఎస్టీయూ రాష్ట్ర ప్రతినిధి.

పర్యాటకుల హుషారు... నిబంధనలు బేఖాతరు

మారేడుమిల్లి పర్యాటక ప్రాంతానికి పెద్దఎత్తున పర్యాటకులు వస్తున్నారు. మితిమీరిన ఉత్సాహంతో నిబంధనలను బేఖాతరు చేస్తూ, చేజేతులా ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. మన్యంలోని వాగులు, కొండలు, లోయలపై సరైన అవగాహన లేకపోవడంతో తరచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పలువురు మృత్యువాత పడిన ఘటనలున్నాయి. నాలుగు నెలల క్రితం ఏలూరులోని ఆశ్రమ్ వైద్య కళాశాలకు చెందిన వైద్య విద్యార్థులు జలతరంగిణి జలపాతం వద్దకు విహారయాత్రకు వచ్చారు. భారీ వర్షం కురవడం, ఒక్కసారిగా వాగు ఉప్పొంగడంతో అయిదుగురు విద్యార్థులు గల్లంతయ్యారు. అందులో ఇద్దరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. ఈ నేపథ్యంలో జలపాతం లోపలకు వెళ్లకుండా కలెక్టర్ ఆదేశాలతో బారికేడ్లు ఏర్పాటు చేసి, ఆంక్షలు విధించారు. కొంతమంది ఏమాత్రం పట్టించుకోవట్లేదు.

- న్యూస్‌టుడే, మారేడుమిల్లి

అటు 3 రాష్ట్రాలు.. ఇటు 4 జిల్లాలు



జిల్లా పేరు:	పోలవరం
జిల్లా కేంద్రం:	రంపచోడవరం
రెవెన్యూ డివిజన్లు:	చింతూరు, రంపచోడవరం
మండలాలు:	12 (కొత్త ఏర్పడిన గుర్తేడుతో కలిపి)
పంచాయితీలు:	186
గ్రామాలు:	827
అసెంబ్లీ నియోజకవర్గం:	రంపచోడవరం
జనాభా:	3,49,799
పురుషులు:	1,70,645
మహిళలు:	1,32,638
ఓటర్లు:	2,55,313

రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల కోసం ప్రత్యేకంగా రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు చేసిన పోలవరం జిల్లాకు ఓ ప్రత్యేకత ఉందండోయ్. కొత్తగా ఏర్పాటైన ఈ జిల్లాకు మూడు రాష్ట్రాలు, నాలుగు జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి. వేరే ఏ జిల్లాకు ఇలాంటి ప్రత్యేకత లేదు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దున కుంట, ఒడిశా సరిహద్దున మోటు, తెలంగాణలోని భద్రాచలం గ్రామాలు ఓవైపు సరిహద్దుగా ఉన్నాయి. మరోవైపు కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలు కలిసి ఉన్నాయి. **- న్యూస్‌టుడే, చింతూరు**

మన్యాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి

రంపచోడవరం, న్యూస్‌టుడే: నూతనంగా ఏర్పడిన జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. గురువారం నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. గత పాలకులు ఈ నియోజకవర్గాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లాలో విలీనం చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకొని సీఎం చంద్రబాబు ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేశారన్నారు. పలు శాఖలకు చెందిన ఉద్యోగులతో పాటు ఉపాధ్యాయ సంఘాల నేతలు, తెదేపా నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వేడుకల్లో భాగంగా కేకు కోస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

సుబ్రహ్మణ్యం హత్య కేసులో జాప్యమేల!

● సాక్ష్యాల సేకరణ, సమాచార భద్రతలో సిట్ చొరవేది

ఈనాడు, కాకినాడ: కాకినాడకు చెందిన దళిత యువకుడు, డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్యకేసు విచారణలో ఇప్పుడూ అదే నిర్లక్ష్యం కనిపిస్తోంది. 2022 మేలో ఆయన హత్యకు గురయ్యారు. గత ప్రభుత్వ హయాంలో నీరుగారిపోయిన ఈ కేసును కొలిక్కితెచ్చి నిందితులకు శిక్ష పడేలా చేస్తారని బాధిత కుటుంబం ఆశించినా ఆ స్థాయిలో విచారణ సాగడం లేదనే విమర్శలున్నాయి. హత్యకేసులో నిందితుడు వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుకు ఈ ప్రభుత్వంలోనూ కొంతమంది సహకారం అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

లీకు వీరులెవరు..

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో లక్ష్మీదుర్గ కుల ధ్రువీకరణ కోసం అడ్డతీగల తహసీల్దార్ కార్యాలయానికి, సిట్ అధికారి లేఖ రాశారు. తహసీల్దార్ ఆ బాధ్యతను వీఆర్వోకు అప్పగించారు. సమాచారం పోలీసులకు రాకముందే ఆ లేఖ అనంతబాబు చేతికి చేరింది. దీని ఆధారంగానే నిందితుని భార్య ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అరెస్టు చేయాలంటే ముందే కుల ధ్రువీకరణ పత్రం అవసరం లేదు. లేఖ సమాచారం లీకు చేసిందెవరో ఇప్పుడు తేలాల్సి ఉంది. సిట్‌లో కూడా ఒకరిద్దరు అధికారులు వైకాపా నాయకులతో టచ్‌లో ఉన్నారనే ఆరోపణలున్నాయి. కేసు విచారించేందుకు ప్రభుత్వం నియమించిన ప్రముఖ న్యాయవాది ముప్పాల సుబ్బారావు వద్ద ప్రస్తావించగా సిట్ విచారణలో కొన్ని లోపాలున్నాయని చెప్పారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ పోలీసు వర్గాల నుంచి బయటకు వెళ్లలేదని పరిశీలిస్తామన్నారు.

విశ్లేషణ కీలకం..

సుబ్రహ్మణ్యం హత్య కేసు తదుపరి విచారణకు కోర్టు అనుమతించి గడువు విధించినా పోలీసులు మాత్రం నిదానం పాటిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీ, ఫోరెన్సిక్ ల్యాబ్ ఫలితాలపైనే ఆధారపడ్డారు తప్ప ఇతర సాక్ష్యాల సేకరణ, విశ్లేషణపై పెద్దగా దృష్టిపెట్టలేదు. హత్య సమయంలో ఎమ్మెల్సీ అనంతబాబు ఐ ఫోన్‌లో సమాచారం సేకరించేలా ప్రయత్నించలేదు. ఘటనకు ముందు, తర్వాత వైకాపా ముఖ్య నాయకులతో ఆయన మాట్లాడినట్లు ఆరోపణలున్నాయి. అప్పట్లో కేసు విచారణ చేసిన పోలీసులు కొన్ని ఆధారాలను తప్పించారు. వారికి నోటీసులిచ్చి విచారించలేదు.

అటకలపై పోతలు..
అన్నదాతల ఆశలు

న్యూస్‌టుడే, అంబాజీపేట

కోనసీమ మార్కెట్‌లో కొబ్బరి కాయల ధరలు తగ్గుముఖం పట్టాయి. గత అక్టోబర్, సెప్టెంబర్ మాసాల్లో వెయ్యి పచ్చికాయలు రూ.23 వేల నుంచి రూ.26 వేల వరకు ధర పలికింది. అనంతరం నవంబర్, డిసెంబర్ నెలల్లో ధరలు బాగా పడిపోయాయి. ఇప్పుడు రూ.15 నుంచి రూ.16 వేలు వరకు ఉంది. తమిళనాడులో ఉత్పత్తులు పెరగడం, ఇక్కడ మూఢం కొనసాగుతుండటం, ఇతర ప్రాంతాల నుంచి దిగుబడులు రావడంతో డిమాండ్ తగ్గింది. ఈ నేపథ్యంలో స్థానిక రైతులు పచ్చికాయలను అటకలపై వేసి నిల్వ చేసుకుంటున్నారు.

కురిడీలుగా మార్చి..

పచ్చి కొబ్బరికాయలను అటకపై వేసి నిల్వ చేసుకుంటే ఆరు నెలల్లో నీరు ఇంకిపోయి కురిడీలుగా మారతాయి. దీంతో వీటికి మంచి డిమాండ్ ఏర్పడుతుంది. నిల్వ చేసుకోవడంతో ప్రస్తుత ధర ఉందని, లేకపోతే మరింత పతనమయ్యేదని చెబుతున్నారు. శివరాత్రి నుంచి ధరలు పెరుగుతాయని ఆశిస్తున్నారు.

13 నుంచి కోనసీమ సంక్రాంతి ఉత్సవ్

సత్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ

పాముర్రు, న్యూస్‌టుడే: 'సంతోషాలకు స్వర్గసీమ.. ఆనందాలకు చిరునామా మన కోనసీమ' అనే నినాదంతో కోనసీమ సంక్రాంతి ఉత్సవ్-2026కు సంబంధించిన లోగోను మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. వాసంశెట్టి సత్యం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఉత్సవాలు కోటిపల్లి-ముక్తేశ్వరం రేవు వద్ద ఈ నెల 13, 14, 15 తేదీల్లో ఏర్పాటుచేశామన్నారు. దానికి సంబంధించిన లోగోను ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, రేవు నిర్వాహకుడు పప్పుల మసేను వెంకన్న (శ్రీనుబాబు)లతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు.

లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

పండగకు పెట్టింది పేరు కోనసీమ.. తెలుగువారికి పెద్ద పండుగ సంక్రాంతి. ఈ పండుగకు పెట్టింది పేరు కోనసీమ. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా, అన్ని వర్గాల ప్రజలూ ఆదరించేలా పలు సాంస్కృతిక, జానపద, పురాణ కార్యక్రమాలు, అలనాటి పాత మధురాలు ఉత్సవాల్లో ఉంటాయన్నారు. వీటితో పాటు జబర్దస్త్ టీం షోలు కూడా ఉంటాయన్నారు. కూటమి నాయకులు పి.శ్రీనుబాబు, కర్రి చిట్టిబాబు, సలాది నాయుడు, చందమామ వాసు, పెమ్మాడి బేబీ సత్తిబాబు, అవసరాల వెంకటరమణ, ఎస్.విశ్వనాథ బాలాజీ, కంచుమర్తి బాబూరావు, చిర్రా రాజకుమార్ పాల్గొన్నారు.

హాయ్‌తో రయ్‌రయ్..!

పండగ ప్రయాణానికి వాట్సాప్‌లో ఆర్టీసీ టికెట్ల బుకింగ్

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: సంక్రాంతికి ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుంది. పలు ప్రాంతాల వాళ్లు సొంతూళ్లు, బంధువుల ఇళ్లకు వెళ్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని టికెట్ బుకింగ్ కోసం బస్టాండ్, నెట్ సెంటర్‌కు వెళ్లి సమయం వృథా చేసుకోవాల్సిన అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మన మిత్ర-వాట్సాప్ గవర్నెన్స్' ద్వారా సులువుగా టికెట్ పొందచ్చు.

☛ వాట్సాప్ ద్వారా ఆర్టీసీ బస్సు టికెట్లు బుక్ చేసుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన 9552300009 నంబరును సేవ్ చేసుకోవాలి.

☛ దానికి వాట్సాప్‌లో హాయ్ అని సంక్షిప్త సందేశం పంపి, ఆర్టీసీ సేవలను క్లిక్ చేయాలి.

☛ బస్ టికెట్ బుకింగ్‌పై క్లిక్ చేసి నిర్ధారించాలి.

☛ టికెట్ బుకింగ్ ఎంపిక చేసుకుని ప్రయాణ వివరాలు, బయలుదేరే ప్రదేశం, చేరాల్సిన గమ్యం, తేదీ, వివరాలు నమోదు చేయాలి. బస్సును ఎంపిక చేసుకుని, వివరాలు పేర్కొనాలి.

☛ ఆన్‌లైన్‌లో నగదు చెల్లిస్తే నిర్ధారణ సందేశం మీ వాట్సాప్‌కే వస్తుంది.

☛ బస్టాండ్లలో అతికించిన క్యూఆర్‌కోడ్‌ను మీ ఫోన్‌లో స్కాన్ చేయడం ద్వారా టికెట్ బుకింగ్ చేసుకోవచ్చు.

పారామెడికల్ పోస్టులకు పోటాపోటీ

ఈనాడు, కాకినాడ: కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల పరిధిలో పారామెడికల్ పోస్టుల భర్తీకి పోటీ ఎక్కువగా ఉంది. 34 పోస్టుల భర్తీకి గతనెలలో ప్రకటన జారీచేశారు. 457 దరఖాస్తులు వచ్చాయి. జనరల్ డ్యూటీ అటెండెంట్ పోస్టులు 14 ఖాళీలకు 326 మంది పోటీ పడుతున్నారు. మిగతా పోస్టులకు మూడు నుంచి 33 మంది వరకు దరఖాస్తులు చేశారు. రేడియో థెరపీ పోస్టులు మూడు ఖాళీలుంటే ఒక్క దరఖాస్తే వచ్చింది.

మన్యం గజగజ..

కొన్ని రోజులుగా చలితో మన్యం గజగజ వణుకుతుంది. రాజవొమ్మంగిలో గురువారం ఉదయం 516-ఈ జాతీయ రహదారిపై దట్టమైన పొగమంచు కురిసింది. 9 గంటలు దాటినా మంచు తెరలు వీడలేదు. రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడ్డారు. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకు వెళ్లే 516-ఈ జాతీయ రహదారిపై పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పొగమంచు అధికంగా ఉండటంతో పర్యటక ప్రదేశాలకు వెళ్లే వాహనచోదకులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. **- న్యూస్‌టుడే, రాజవొమ్మంగి**

ఉదయం 9 గంటలకు రాజవొమ్మంగి జాతీయ రహదారిపై మంచు

గిరి పల్లెల అభివృద్ధికి దారులు

న్యూస్‌టుడే, కూనవరం

ఇప్పటికే మనుగడ సాగిస్తున్న అల్లూరి సీతారామరాజు, కొత్తగా ఊపిరి పోసుకున్న పోలవరం.. రెండు జిల్లాలూ గిరి పుత్రుల నిలయాలే. అడవితో మమేకమైన ఇక్కడి వారి జీవితాలకు ఉపాధినిచ్చేవి వనాలే. కాలక్రమేణా వ్యవసాయ విస్తరణ పెరగటం, అటవీ భూముల విస్తరణ తగ్గిపోవటంతో ఉపాధి పథకమే కీలక వనరుగా మారింది. ఇందులో కొన్ని నిబంధనల కారణంగా గిరి పుత్రులకు పూర్తిస్థాయి పనిదినాలు దొరికేవి కావు. వారుండే ప్రాంతాల్లో వసతుల కల్పనకూ ప్రతిబంధకంగా మారేవి. ఈ నేపథ్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేరుతోపాటు పలు నిబంధనల మార్పులకు కేంద్రం శ్రీకారం చుట్టిన విషయం విదితమే. వీబీజీ రామ్‌జీ (వికసిత్ భారత్- రోజ్‌గార్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) చట్టంగా మారనున్న ఉపాధి పథకంలో పలు సవరణలు చేస్తున్నారు. వీటిపై అవగాహనకు ఈ నెల 5న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. నూతన మార్పులను ఒడిసిపట్టుకోగలిగితే మన్యంలో అభివృద్ధికి 'దారులు' పడతాయనడంలో సందేహం లేదు.

కూనవరం మండలంలో రేపాక-పెద్దర్కూర్ మధ్య రహదారి

సద్వినియోగం చేసుకోగలిగితే..

ఏజెన్సీలో అతి ప్రధాన సమస్య రహదారులు. ప్రధాన రహదారులు అంతోఇంతో అభివృద్ధి చెందుతున్నా అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉంటున్నాయి. వర్షాకాలమొస్తే వ్యాధులు విజృంభించటానికి కావల్సిన లోటుపాట్లన్నీ వీటిల్లో ఉంటున్నాయి. మెటీరియల్ ఖర్చులో ఇప్పటివరకు ఉన్న నిబంధనతో సీసీ రోడ్ల నిర్మాణం సాధ్యమయ్యేది కాదు. తాజా నిబంధనతో వెసులుబాటు కలిగింది. పాలకులు ప్రణాళికబద్ధంగా ముందుకెళ్తే మారుమూల గ్రామాల్లోనూ రోడ్ల విస్తరణకు అవకాశం ఉంటుంది. ఇంకో పక్క వ్యవసాయ సీజన్‌లో చేతినిండా పనులున్నా తునికాకు సేకరణ తగ్గిపోవటంతో మిగిలిన రోజుల్లో అందరికీ పనులు దొరికేవి కావు. పని దినాల పెంపూ గిరిజనులకు కలిసొస్తుంది.

ఉపాధి పనుల్లో మారిన నిబంధనలతో ప్రయోజనం

మార్పులు ఇలా..

1. కొత్తగా వస్తున్న వీబీజీ రామ్‌జీలో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ప్రత్యేక రంగులో జాబ్ కార్డులు ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు అందరికీ ఒకే జాబ్ కార్డులుండటంతో ఎవరు సకలాంగులు, ఎవరు దివ్యాంగులు అన్న విషయం గుర్తించడం కష్టంగా మారేది.

2. దివ్యాంగులపై పనిభారాన్ని తగ్గిస్తూ వేతనాలు మాత్రం అందరితో సమానంగా వచ్చేలా మార్పులు చేశారు.

3. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ప్రతి జాబ్‌కార్డుకు అదనంగా 25 పనిదినాలు కలవడంతో మొత్తం 125 పనిదినాలు అందుబాటులోకి వస్తున్నాయి.

4. వ్యవసాయదారులకు పనివేళల్లో ఇబ్బందులు లేకుండా రెండు నెలల పాటు పనులు నిలిపివేసే అవకాశాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పిస్తారు.

5. పరిపాలనా ఖర్చును ఆరు నుంచి తొమ్మిది శాతానికి పెంచారు.

6. ఇప్పటి వరకు 60:40గా ఉన్న మెటీరియల్ ఖర్చును పనులకు అనుకూలంగా పెంచుకునే అవకాశం ఇచ్చారు. ప్రధానమంత్రి గతిశక్తి పథకానికి అనుసంధానం చేసి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

7. పనులు చేసిన పక్షం రోజుల్లో చెల్లింపులు పూర్తికాకుంటే వేతనదారులకు అదనంగా పరిహారాలను చెల్లించేలా రూపకల్పన చేశారు.

రెండు జిల్లాల్లో ఇలా...

(అల్లూరి సీతారామరాజు, పోలవరం)

మొత్తం మండలాలు:	**22**
జాబ్‌కార్డులు:	**2,57,986**
పనులకు వెళ్తున్న వారు:	**2,35,578**
సరాసరి వేతనం:	**రూ.294** (2024-25 గతేడాదితో పోల్చితే ఎక్కువ)
ఇప్పటి వరకు కార్డుదారుల సరాసరి పనిదినాలు:	53 రోజులు
వంద పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు:	**24** వేలు
వేతన రూపంలో చెల్లింపులు:	**రూ.309** కోట్లు

(c) eenadu

పరుగులతో మెరిసి.. విజయంతో మురిసి..!

▲ ఉత్కంఠభరితంగా సాగుతున్న ఈఎస్ఎల్ క్రికెట్ పోటీలు

శ్యామలా సెంటర్, రాజానగరం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. క్రీడాకారులు ఫోర్లు, సిక్సర్లతో అదరగొడుతున్నారు. ఐడియల్, చైతన్య కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఏకంగా ఓవర్‌కు 15కు పైగా రన్‌రేట్ స్కోరుతో భారీ లక్ష్యాలు చేస్తున్నారు. మరో వైపు గైట్, కైట్ ఇంజినీరింగ్ జట్ల జరిగిన మ్యాచ్ ఆఖరి బంతి వరకు ఉత్కంఠ రేకెత్తించాయి. క్రీడాకారులు క్రికెట్ ఆస్వాదిస్తూ.. పరుగుల వరద సృష్టించగా విజయంతో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకున్నారు. రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) క్రీడా మైదానంలో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్ టోర్నీ గురువారం ఉత్సాహంగా సాగాయి.

బీవీసీ మెరుపులు..

హోరాహోరీపోరులో విజయం సాధించిన బీవీసీ కళాశాల జట్టు

బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల, భట్లపాలెం - ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, సూరంపాలెం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బీవీసీ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచిన బీవీసీ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆదిత్య కళాశాల జట్టు మూడు వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. ఈ జట్టులో లోహిత్ 27 బంతుల్లో 41 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన బీవీసీ కళాశాల జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 103 పరుగులు సాధించింది. బీవీసీ జట్టులో తేజ 21 బంతుల్లో 38 పరుగులు సాధించి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. ఆ జట్టు 9 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.

భారీ ఆధిక్యంతో ఘన విజయం సాధించిన ఐడియల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు

100 పరుగుల తేడాతో ఐడియల్ డిగ్రీ కళాశాల జట్టు విజయం

ఐడియల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కాకినాడ, చైతన్య ఇంజినీరింగ్ కళాశాల, కాకినాడ మధ్య జరిగిన పోటీలో ఐడియల్ ఆర్ట్స్ అండ్ కళాశాల జట్టు 100 పరుగుల భారీ ఆధిక్యంతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన ఐడియల్ కళాశాల జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ జట్టులో శివకుమార్ వీరోచిత బ్యాటింగ్‌తో కేవలం 29 బంతుల్లో 60 పరుగులు చేశాడు. వినయ్ ఆఖరి 6 బంతుల్లో 5భారీ సిక్సులు, ఒకఫోర్ కొట్టి 34 పరుగులు సాధించటంతో ఐడియల్ జట్టు ఐదు వికెట్ల నష్టానికి 152 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చైతన్య ఇంజినీరింగ్ జట్టు భారీ లక్ష్యఛేదనలో ఆది నుంచి తడబడుతూ త్వరత్వరగా వికెట్లు కోల్పోయింది. ఐడియల్ కళాశాల జట్టులోని వెంకటేష్ 2 ఓవర్లకు కేవలం 8పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టి చైతన్య జట్టును దెబ్బతీశాడు. చైతన్య కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 52 పరుగులు మాత్రమే చేయగలిగింది. 100 పరుగుల భారీ ఆధిక్యంతో ఐడియల్ కళాశాల జట్టు ఘనవిజయం సాధించింది. ఇప్పటివరకు ఈ టోర్నీలో ఐడియల్ కళాశాల జట్టు చేసిన 152 పరుగులు అత్యధికం కావటం విశేషం..

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే శివకుమార్ (60 పరుగులు)

హ్యాట్రిక్‌తో రాజు మాయ

ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల(కాకినాడ), బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల(వాడలరేవు) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి ఐడియల్ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన బీవీసీ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసింది. ప్రత్యర్థి జట్టులో కె. రాజు వరుసగా మూడు వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్ సాధించటం విశేషం. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఐడియల్ కళాశాల జట్టు ఒక వికెట్ నష్టపోయి 73 పరుగులు సాధించి తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. బ్యాటింగ్‌లోనూ కె.రాజు సత్తాచాటి 37 బంతుల్లో 46 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.

విజయం సాధించిన ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

మూడు వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్ సాధించిన రాజు

ఒక్క పరుగు తేడాతో కైట్ విజయం

మైదానం-2లో ఉదయం కైట్ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ), గైట్ ఇంజినీరింగ్ కళాశాల (రాజమహేంద్రవరం) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కైట్ ఇంజినీరింగ్ కళాశాల ఒకే ఒక్క పరుగు తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కైట్ కళాశాల జట్టు నిర్ణీత 10ఓవర్లకు 4వికెట్ల నష్టానికి 87 పరుగులు చేశారు. ఈ జట్టులో జేఎల్ దీపక్ 20 బంతుల్లో 28పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గైట్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు తక్కువ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సింగిల్స్, డబుల్స్ తీస్తూ స్కోరుబోర్డును పరుగుపెట్టించారు. అయితే ఒకానొక సమయంలో వరుసగా వికెట్లు కోల్పోవటంతో ఆఖరి ఓవర్‌కు 14 పరుగులు చేయాల్సి ఉండగా ఒక ఫోర్, రెండు వైడ్, బైస్ రూపంలో 12 పరుగులు వచ్చాయి. ఆఖరి బంతికి రెండు పరుగులు చేయాల్సి ఉండగా బ్యాటర్ బంతిని తాకలేకపోయాడు. కీపర్ చేతికి బంతి వెళ్లగా ఒక్క పరుగు కోసం పరుగెత్తే క్రమంలో రనౌట్ అయ్యాడు. దీంతో గైట్ జట్టు ఒక్క పరుగుతో ఓటమిపాలైంది.

విజయం సాధించిన కైట్ ఇంజినీరింగ్ జట్టు

విజయం సాధించిన వీఎస్ఎం జట్టు

వీఎస్ఎం విజయబావుటా

వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల (రామచంద్రపురం), ఎస్‌వీజేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వీఎస్ఎం జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన వీఎస్ఎం జట్టు 102 పరుగులు చేసి ఆలౌటైంది. ఈ జట్టులో అర్జున్ 26 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌వీజేట్ జట్టు 7వికెట్లు కోల్పోయి 90 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది.

Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు
IIT-JEE | NEET
Protein Partner
NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ
(Non-Govt. Public Charitable Trust)
"Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner
CMR SHOPPING MALL
The joy of life
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Regional Sponsor
GGU GODAVARI GLOBAL UNIVERSITY
RAJAMAHENDRAVARAM, A.P.
Call: 994 999 3483 | www.ggu.edu.in
Digital Partner
ఈనాడు.net ETV BHARAT
FM Partner
TV Partner
Medical Partner
GSL
District Sponsor
TIRUMALA విద్యాసంస్థలు
Organised by ఈనాడు

నేటి మ్యాచ్‌లు 02.01.2026

గ్రౌండ్-I

● ఉదయం 8 గంటలకు: ఆదికవి నన్నయ యూనివర్సిటీ(యూఏజీ) x ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (రాజమహేంద్రవరం). ● ఉదయం 11 గంటలకు: పైడా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ x గైట్ డిగ్రీ కాలేజీ. ● మధ్యాహ్నం 2 గంటలకు: గైట్ ఇంజినీరింగ్ కాలేజ్ x ఏబీఎన్ పీఆర్ఆర్ కళాశాల.

గ్రౌండ్-2

● ఉదయం 8 గంటలకు: మెగా జూనియర్ కాలేజ్ (రాజమహేంద్రవరం) x శ్రీరాజరాజేశ్వరి (కాకినాడ). ● ఉదయం 11 గంటలకు: శ్రీ సంహిత జూనియర్ కాలేజ్ (రావులపాలెం) x శ్రీరాజరాజేశ్వరి కళాశాల (పెద్దాపురం).

రేపటి మ్యాచ్‌లు 03.01.2026

గ్రౌండ్ - I

● ఉదయం 8 గంటలకు: కైట్ - 2(కాకినాడ) x బీవీసీ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల(భట్లపాలెం). ● ఉదయం 11 గంటలకు: ఐడియల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (కాకినాడ) x కైట్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల(కాకినాడ). ● మధ్యాహ్నం 2 గంటలకు: చైతన్య ఇంజినీరింగ్ కళాశాల, కాకినాడ x ఎస్‌కేబీఆర్ అండ్ ఎస్ఏఎస్ కుమార్ జూనియర్ కళాశాల (తాళ్ళపూడి)

గ్రౌండ్ - 2

● ఉదయం 8 గంటలకు : కైట్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (కాకినాడ) x మంగెన గైరయ్య కళాశాల(అల్లవరం). ● ఉదయం 11 గంటలకు : గొల్లలమూడి జూనియర్ కళాశాల(అనపర్తి) x దివ్య జూనియర్ కళాశాల (రాజానగరం).

గ్రామసభల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు

కలెక్టరేట్: కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి జిల్లాలో గ్రామసభల నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది. శుక్రవారం నుంచి ఈ నెల 9 వరకు ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామసభల ద్వారా కొత్త పాసుపుస్తకాలు రైతులకు జారీ చేయనున్నట్లు డీఆర్వో సీతా రామమూర్తి తెలిపారు. శుక్రవారం అనపర్తి మండలం మహేంద్రవాడ, బిక్కవోలు మండలం రంగాపురం, ఇల్లపల్లి, తుమ్మలపల్లి, రళ్లకండ్రిగ, కోరుకొండ మండలం గాడాల, రాజమహేంద్రవరం గ్రామీణ మండలం రాజవోలు, రంగంపేట మండలం సుభద్రమ్మపేట, కడియం మండలం దామిరెడ్డి పల్లి, ఉండ్రాజవరం మండలం వెలగదుర్రు, తాళ్లపూడి మండలం తాళ్లపూడి, పెరవలి మండలం నడుపల్లి, నిడదవోలు మండలం సురపురం, ఉనకరమిల్లి, నల్లజర్ల మండలం మరెళ్లమూడి, కొవ్వూరు మండలం పెనకనమెట్ట, గోపాలపురం మండలం దొండపూడి, చాగల్లుమండలం నెలటూరులలో సభలు జరుగుతాయని డీఆర్వో తెలిపారు.

రథ శకలాల నిమజ్జనానికి ఏర్పాట్లు

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామికి చెందిన దగ్ధమైన పాత రథ శకలాలను ఈ నెల 3న నిమజ్జనం చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి వార్షిక వాహన సేవ కలతో శకలాలను చిన్నచిన్న ముక్కలుగా చేసి సాగర సంగమం వద్దకు తీసుకెళ్తారు. అక్కడ ఇసుకలో పెద్దగొయ్యి తీసి చుట్టూ రేకులు అమర్చి అందులో శకలాలను వేసి కర్పూరంతో మండిస్తారు. భస్మాన్ని బోట్లపై సంగమం మధ్యలో నిమజ్జనం చేస్తారని ఆలయ ఏసీ నాగవరప్రసాద్ తెలిపారు.

పరమశివుడి సన్నిధిలో రాజకీయాలు వద్దు: సుభాష్

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: పరమశివుడి సన్నిధిలో రాజకీయాలు వద్దని మంత్రి వాసంశెట్టి సుభాష్ హితవు పలికారు. రెండు రోజుల క్రితం ద్రాక్షారామ భీమేశ్వరుడి సన్నిధిలో కపాలేశ్వరస్వామి లింగాన్ని ధ్వంసం చేసిన తరువాత గురువారం ఆయన ఆలయాన్ని సందర్శించి కపాలేశ్వర లింగానికి అభిషేకం చేశారు. తూతూమంత్రంగా లింగాన్ని ప్రతిష్ఠించారని వైకాపా నాయకులు ఆరోపిస్తున్నారని వారికి ఆగమ శాస్త్రం గురించి ఏమి తెలుసని ప్రశ్నించారు. ఘటన జరిగిన రోజే నిందితుడిని గుర్తించి అరెస్టు చేశామని వైకాపా హయాంలో అంతర్వేది రథం తగలబెడితే ఎన్నాళ్లకో ఒక ఉన్మాదిని నిందితుడిగా చూపించారని గుర్తు చేశారు. ఆలయ ఈవో, సహాయ కమిషనరు ఏవీ దుర్గాభవాని, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

కపాలేశ్వరస్వామి లింగానికి అభిషేకం చేస్తున్న మంత్రి సుభాష్

అందరి సహకారంతో ప్రమాదాల నివారణ

పాడేరు, న్యూస్‌టుడే: ఈనెల ఒకటి నుంచి 31 వరకు జరిగే జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయాలని, వాహనదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించి ప్రమాదాలను నివారించేందుకు సహకరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మసోత్సవాల ప్రచారపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. నెల రోజులపాటు పలు రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. పాత వాహనాలు కొనుగోలు చేసినవారు తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులకు వాహనాలు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. జిల్లా రవాణాశాఖ అధికారి కె.వి.ప్రకాశ్‌రావు, సహాయ మోటార్ వాహన ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సాయిరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పత్రాలు ఆవిష్కరించిన కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో జిల్లా రవాణాశాఖ అధికారి కె.వి.ప్రకాశ్‌రావు తదితరులు

చప్పిడిచేపల కూర.. గోదారోళ్ల నోరూర..

న్యూస్‌టుడే, పి.గన్నవరం

మన ఊరి వంట

నోరూరించే చేపల కూరలు తయారు చేయడంలో గోదారోళ్లు సిద్ధహస్తులు. సీజన్ల వారీగా దొరికే పులస, దొందు, చీరమీను తదితరాలను కొనుగోలు చేసి బంధుమిత్రులకు పంపుతుంటారు. ప్రధానంగా మహా రుచికరమైన చప్పిడి చేపలను గోదావరి తీర ప్రాంతంలో ఉండే మత్స్యకార కుటుంబాలు తయారు చేసి విక్రయిస్తుంటాయి. కొయ్యింగ, కట్టెపరిగి, కడిస, ఇసుకదొందులు వంటి పచ్చిచేపలతో చప్పిడి చేపలు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. వీటిని ఎంతోమంది ఇష్టంగా తింటారు.

చప్పిడిచేపలు తయారు చేస్తున్న మత్స్యకారులు (అంతర చిత్రం) చప్పిడిచేపలు, కోడిగుడ్లు, చిక్కుడు కాయలతో కూర

తయారీ విధానం

కోనసీమలో జొన్నల్లంక, నాగుల్లంక, వాకలగరువు, బోడసకుర్రు తదితర ప్రాంతాల్లో చప్పిడిచేపలు తయారు చేస్తుంటారు. పచ్చిచేపలను పొలుసు తీయకుండా లోపల పేగులు వంటివాటిని తొలగించి ఎండలో ఆరబెడతారు. డొక్కలపీచును పరుపు మాదిరిగా పరిచి మధ్య నిప్పులు వేస్తారు. దానిపై చెరకుపిప్పు పెట్టి పైన ఆరిన పచ్చిచేపలను చక్కగా పేర్చి పొగతో ఆరుస్తారు. వీటిని చప్పిడిచేపలు లేదా ఆర్చినచేపలు అంటారు. మంట రాకుండా పొగతో ఆర్చడంతో ఎనలేని రుచి వస్తుంది.

అందుబాటు ధరలో..

ఆర్చిన చప్పిడిచేపల ధర వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది. కొయ్యింగలైతే ఒకటి రూ. 200-300, కట్టెపరిగ, కడిస, దొందులు వంటివైతే రూ. 100 నుంచి ఆపైన ఉంటుంది.

ఈ కాంబినేషన్‌లో..

చప్పిడి చేపలపైన ఉండే చర్మంలాంటి పొరను తొలగించి వండుతారు. చిక్కుడుకాయ, కోడిగుడ్డు, టమాటా, వంకాయ, చింతకాయ, మునగకాడలు.. ఇలా వివిధ కాంబినేషన్లతో ఇగురు తయారు చేసి ఆరగిస్తుంటారు.

ఇతర ప్రాంతాలకు

ఈ చేపలు మార్కెట్ నుంచి తెచ్చుకున్న ఒకటి, రెండు రోజుల్లో వండుకోవాలి. ఫ్రిజ్‌లో పెట్టుకుంటే ఎక్కువ రోజులు ఉంటాయి. సంక్రాంతికి వచ్చే వారికి ఈ చేపలతో కూరలు తయారు చేసి ఇక్కడివారు ప్రత్యేకంగా వడ్డిస్తారు.

వెన్నతో కన్నయ్య

ధనుర్మాస మహావ్రతంలో భాగంగా కొవ్వూరు పాత ఊరు వరద గోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, తిరుప్పావై పాశుర పఠనం గావించారు. అనంతరం నవనీతం (వెన్న)తో స్వామివారిని అలంకరించారు. క్షేత్రంలోని సుందరేశ్వర స్వామి, గోష్పదేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతామూర్తులకు విశేషాలంకరణలు చేశారు.

– న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

మృత్యుశకటం

దంపతులను ఢీకొన్న లారీ

భార్య మృతి.. భర్తకు తీవ్ర గాయాలు

తణుకు గ్రామీణం: నూతన సంవత్సరం ఆ కుటుంబానికి తీవ్ర విషాదం మిగిల్చింది. దైవ దర్శనానికి వెళ్లొస్తున్న దంపతుల్లో భార్య దుర్మరణంపాలై భర్తకు తీవ్ర గాయాలైన ఘటనతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. తణుకు మండలం తేతలి జాతీయ రహదారిపై గురువారం తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన అందే లోకేశ్వరరావు ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో ఔషధ దుకాణం నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య వెంకటలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, కుమార్తె భీమవరంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో బీఫార్మసీ చదువుతోంది. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం తెల్లవారుజామున లోకేశ్వరరావు దంపతులు ద్విచక్ర వాహనంపై ద్వారకా తిరుమల, మద్ది ఆంజనేయస్వామి ఆలయాలకు వెళ్లి తిరిగొస్తుండగా తణుకు మండలం తేతలి సమీపంలో జాతీయ రహదారిపై లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో వెంకటలక్ష్మి (43) అక్కడికక్కడే మృతి చెందగా భర్తకు తీవ్ర గాయాలు కావడంతో 108 సిబ్బంది తణుకు జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో లోకేశ్వరరావును మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తణుకు గ్రామీణ ఎస్సై తెలిపారు.

మంత్రి దుర్గేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్డీవో రాణి సుస్మిత, రెవెన్యూ సిబ్బంది

రాష్ట్రాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం: దుర్గేష్

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలులోని జనసేన కార్యాలయంలో మంత్రి కందుల దుర్గేష్‌కు వివిధ శాఖల జిల్లా అధికారులతో పాటు, కూటమి నాయకులు భారీగా తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో రాష్ట్రాభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. గడిచిన ఏడాది కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి రూ.400 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవకుమార్, పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, పట్టణ తెదేపా అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు తదితరులు మంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

చిత్తశుద్ధితో విధులకు పునరంకితం

పాడేరు, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలతో గురువారం ప్రభుత్వ కార్యాలయాల్లో సందడి నెలకొంది. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ దినేష్‌కుమార్, ఇన్‌ఛార్జి జేసీ శ్రీపూజను పలువురు అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో విధులకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే దిశగా పనిచేయాలని కోరారు. కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటుతో రంపచోడవరం ప్రాంతంలో పరిపాలనా సౌలభ్యం పెరుగుతుందన్నారు. చింతూరు డివిజన్‌లో పోలవరం ముంపు బాధితులకు పునరావాసం, పరిహారం వెంటనే అందించే అవకాశం ఉంటుందన్నారు. కొత్త కలెక్టరేట్ కోసం రూ. ఐదు కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. రంపచోడరంలో ఐటీడీఏ, పీఎంఆర్‌సీ భవనాలు వినియోగించుకుంటామని చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎస్పీ అమిత్ బర్దార్, ఇన్‌ఛార్జి జేసీ తిరుమణి శ్రీపూజ, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఇన్‌ఛార్జి డీఆర్ఓ అంబేడ్కర్, ఇన్‌ఛార్జి ఆర్డీఓ లోకేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ మురళీ, పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్‌బాబు, ఐటీడీఏ ఏపీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ● ఎస్పీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ అమిత్ బర్దార్ కేక్ కట్‌చేశారు. పోలీస్ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎస్పీ అమిత్‌బర్దార్.. చిత్రంలో జిల్లా పోలీస్ అధికారులు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్ళలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	17,000
పాతకాయ: గండేరా	27,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,000-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	147-00
రిటైల్ లైవ్	174-00
డ్రెస్డ్	252-00
స్కిన్‌లెస్	287-00

మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలోని వెదిరేశ్వరం రోడ్డులో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ఏర్పాటు విషయంలో తలెత్తిన వివాదంలో మాజీ ఎమ్మెల్యే, వైకాపా జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వెదిరేశ్వరం రోడ్డు మధ్యలో ఓ సామాజికవర్గం వారు విగ్రహ ఏర్పాటుకు నిర్మించిన దిమ్మ కారణంగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, మరి కొంతమంది అక్కడికి వచ్చి దిమ్మపై ఉంచిన శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటాన్ని దూరంగా విసిరేస్తున్న సమయంలో పోలీసులు అడ్డుకున్నారు. దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కలిగించిన నేపథ్యంలో చిర్ల జగ్గిరెడ్డి, గొల్లపల్లి డేవిడ్, ఏనుగపల్లి నాగార్జున, ఇసుకపట్ల సునీల్, కొల్లాటి డాక్టర్‌బాబు, ముసునూరి వెంకటేశ్వరరావు, గొల్లపల్లి రాజశేఖర్, పడాల నాగమహేశ్వరరెడ్డి, నెల్లి రాజులపై కేసు నమోదు చేసినట్లు రావులపాలెం ఎస్సై చంటి గురువారం తెలిపారు.

రాబర్ట్‌పాల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వ్యవసాయాధికారులు, సిబ్బంది

ఇన్‌ఛార్జి డీఏవోగా రాబర్ట్‌పాల్ బాధ్యతలు

కలెక్టరేట్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఇన్‌ఛార్జి జిల్లా వ్యవసాయ అధికారి (ఇన్‌ఛార్జి డీఏవో)గా గురువారం కె.రాబర్ట్‌పాల్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ డీఏవోగా బాధ్యతలు నిర్వహించిన ఎస్.మాధవరావు ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఉమ్మడి జిల్లా ఆత్మ ప్రాజెక్టు మేనేజర్‌గా వ్యవహరిస్తున్న రాబర్ట్‌పాల్‌ను ఇన్‌ఛార్జి డీఏవోగా నియమించారు. కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను రాజమహేంద్రవరం ఏడీఏ సూర్యరమేష్, ఏఈవో సంఘ అధ్యక్షుడు వేణుమాధవ్, రాజమహేంద్రవరం గ్రామీణం, కడియం, రాజానగరం మండలాల వ్యవసాయ అధికారులు భీమరాజు, కల్యాణ్, శ్రీనివాస్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా

రంపచోడవరం 9490877172 | అడ్డతీగల 9491575045 | దేవీపట్నం 7673936638 | గంగవరం 9493541083

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి నుంచి లబ్బర్తి వెళ్లే రహదారి రాళ్లు తేలి అధ్వానంగా ఉంది. మరమ్మతులు చేపట్టాలి. - నాని, రాజవొమ్మంగి, ✓: సంబంధిత శాఖల అధికారులతో చర్చిస్తాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. - యూదనీశ్వరరావు, ఎంపీడీవో, రాజవొమ్మంగి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి నుంచి కుట్రవాడ మీదుగా రంపచోడవరం వెళ్లే ప్రధాన రహదారి వెంబడి తుప్పలు భారీగా పెరిగాయి. ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకోవడానికి కూడా ఆస్కారం ఉండట్లేదు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. - సార్ల మంగిరెడ్డి, కుట్రవాడ, ✓: మారేడుమిల్లి-భోదులూరు రహదారి వెంబడి తుప్పలు తొలగించడానికి చర్యలు చేపడతాం. - ప్రదీప్, ఏఈ, ఆ.భ.శాఖ

గిరిజనుల అభ్యున్నతి, సంక్షేమ పాలనకు కృషి

రంపచోడవరం, న్యూస్‌టుడే: మన్యంలో గిరిజనుల అభ్యున్నతి, సంక్షేమ పాలనను అందించేందుకు కృషి జరుగుతోందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొజ్జిరెడ్డి మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగా నూతనంగా పోలవరం పేరుతో ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేశారన్నారు.

ఐటీడీఏ కార్యాలయంలో: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్‌కు ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు, ఆదివాసీ సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కోసి వేడుకలను నిర్వహించారు. ★ గిరిజన సంక్షేమశాఖ(విద్య) కార్యాలయంలో డీడీ రుక్మాంగదయ్యను పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే డీఎస్పీ సాయిప్రశాంత్‌కు పోలీసు అధికారులు, ప్రజాసంఘాల నేతలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు: రంపచోడవరం మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్‌లను నియోజకవర్గంలో 12మండలాలకు చెందిన తెదేపా నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజాప్రతినిధులు, పలువురు ఉద్యోగులు, ఆదివాసీ సంఘాల నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్టీయూ నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డి

ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

టీఎన్‌టీయూఎస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గిరిజన సంక్షేమశాఖ డీడీ రుక్మాంగదయ్య

విశ్వవిద్యాలయ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

కొత్త ఆలోచనలతో అభివృద్ధి

రాజానగరం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో కొత్త ఆలోచనలతో నన్నయ విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి చేద్దామని వీసీ ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా వీసీ ప్రసన్నశ్రీ 2026 విశ్వవిద్యాలయ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ 2025లో మూడు నూతన భవనాలు ప్రారంభించామని, జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, నాక్ పీర్ టీమ్ విజిట్, ఫుడ్ ఫెస్ట్, భాషా సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేశామన్నారు. రిజిస్ట్రార్ కేవీ స్వామి విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్యం అందించండి

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ వైద్యులను ఆదేశించారు. గురువారం సాయంత్రం స్థానిక ఏరియా ఆసుపత్రిని పీవో ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. వివిధ వ్యాధులతో వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో పీవో మాట్లాడి పండ్లు పంచారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారణ చేసి మందులందజేయాలన్నారు. ఆసుపత్రిలో ఎంతమంది గర్భిణులు, బాలింతలున్నారని వైద్యులను ఆరాతీశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టరు సూర్యప్రకాష్, వైద్యులు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిని సందర్శించి రోగులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్

పునరావాస కాలనీల్లో శిథిల సమస్యలు

దేవీపట్నం, న్యూస్‌టుడే: పోలవరం పునరావాస కాలనీల్లో ప్రభుత్వం రూ.లక్షల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. దేవీపట్నం మండలం పెదభీంపల్లి-2 ఆర్‌అండ్‌ఆర్ పునరావాస కాలనీలో మూడేళ్ల క్రితం దాదాపు రూ.25 లక్షలతో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల నిర్మించారు. ఇది నేటికీ ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఉనికి కోల్పోతోంది. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించారు. అన్ని వసతులు సమకూర్చారు. కాలనీలోని సుమారు 15మంది విద్యార్థులున్నారు. పాఠశాల ప్రారంభించకపోవడంతో ప్రత్యామ్నాయం లేక వీరంతా సమీప ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి చదువుకుంటున్నారు. స్కూల్ భవనం తోపాటు కాలనీలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్, హెల్త్ సెంటర్ భవనం, ఎరువుల దుకాణాల గదులు నిరుపయోగంగా మారాయని నిర్వాసితులు తెలిపారు. అధికారులు వీటిని వినియోగంలోకి తెచ్చి యువతకు ఉపాధి కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. పాఠశాల సమస్యపై మండల విద్యాశాఖ అధికారి-2 శిరసం బాబు దొరను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా కాలనీలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని త్వరలోనే పాఠశాలను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

పునరావాస కాలనీలో పాఠశాల దుస్థితి

నేటి నుంచి సంగీత, నృత్య పాఠశాల స్వర్ణోత్సవం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 2, 3, 4 తేదీల్లో స్వర్ణోత్సవం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ పసుమర్తి శ్రీనివాసశర్మ తెలిపారు. రాజమహేంద్రవరం ఆనంకళాకేంద్రంలో జరిగే వేడుకలో భాగంగా శుక్రవారం ఉదయం 7.30 గంటలకు నగర సంకీర్తన, 8.30గంటలకు నాదస్వరం, వేదస్వస్తి ఉంటుంది. ప్రార్థనా గీతాలు, స్వాగత నృత్యంతో 10 గంటలకు సభ ప్రారంభం, పురస్కార ప్రదానం, మధ్యాహ్నం 3 గంటలకు వీణాకచేరీ, పూర్వవిద్యార్థుల గాత్రకచేరీ, సాయంత్రం కూచిపూడి నృత్య రూపకం ఉంటాయి. 3న ఉదయం 9 గంటల నుంచి గాత్రకచేరీ, నృత్య ప్రదర్శన, 11 గంటలకు కవితా సదస్సు, మధ్యాహ్నం 3 గంటల నుంచి గాత్రకచేరీ, వీణా కచేరీ, కూచిపూడి నృత్య రూపకం ఉంటాయి. 4న ఉదయం 9 గంటల నుంచి పంచరత్న సేవ, నృత్య ప్రదర్శన, వీణా కచేరీ, అధ్యాపకుల వాద్య కచేరీ, భక్తి సంగీతం, రాత్రి 7 గంటల నుంచి స్మారక పురస్కారాల ప్రదానంతో వేడుక ముగుస్తుందని పేర్కొన్నారు.

రాజముద్రతో పాసుపుస్తకాలు

రంపచోడవరం, పాడేరు, న్యూస్‌టుడే: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీకి ముహూర్తం కుదిరింది. రైతుల కష్టాలను తీర్చేలా రాజముద్రతో కూడిన నూతన పాసు పుస్తకాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి అల్లూరి జిల్లాలోని 169 గ్రామాల్లో 7847 మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. పాడేరు డివిజన్‌లో 5,645, రంపచోడవరం డివిజన్‌లో 2,202 మంది రైతులకు పాసు పుస్తకాలు వచ్చాయి. వీటి మంజూరు పూర్తయినా పంపిణీ కార్యక్రమం 8 నెలలుగా వాయిదా పడుతూ వస్తోంది. ఈ జాప్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ముద్రణ పూర్తయిన పుస్తకాలు సత్వరం రైతులకు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గ్రామసభల్లో పంపిణీ

గ్రామసభల ద్వారా జనవరి 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రైతులకు పుస్తకాల పంపిణీకి కార్యాచరణ రూపొందించారు. గతంలో వారికి పంపిణీ చేసిన భూహక్కు పత్రాలు వెనక్కి తీసుకుని కొత్తవి ఇవ్వనున్నారు. రైతుకు అందినట్లుగా నిర్ధారించేందుకు బయోమెట్రిక్ నమోదు చేయనున్నారు. వెబ్ ల్యాండ్‌లో వివరాల ప్రకారం సరిపోల్చి, ఎలాంటి తప్పులు లేని పాసు పుస్తకాన్ని అందజేయనున్నారు.

వివాహ దరఖాస్తుల ఆవిష్కరణ

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: దానవర్థ చారిటబుల్ ట్రస్ట్, విశాఖ తరంగిణి అనుసంధానంతో నిరుపేద గిరిజనుల వివాహానికి దరఖాస్తులను గురువారం తహసీల్దార్ సత్యనారాయణ చేతులమీదుగా ట్రస్టు సభ్యులు సూరిబాబు ఆవిష్కరించారు. సూరిబాబు మాట్లాడుతూ 216 జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించేందుకు సంకల్పించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 9492238605, 9490290520 నంబర్లలో సంప్రదించవలెనని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీను, రామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో నూతనోత్సాహం

కొత్త సంవత్సరాన కొత్త జిల్లా ఏర్పాటుతో మన్యంలో నూతనోత్సాహం నెలకొంది. పలుచోట్ల 'పోలవరం జిల్లా' పేరుతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు సందడి చేస్తున్నాయి. రంపచోడవరం నియోజకవర్గాన్ని ప్రత్యేక పోలవరం జిల్లాగా ప్రకటించడంతో బుధవారం నుంచే పలుచోట్ల ఫ్లెక్సీలు వెలిశాయి. మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి వెళ్లే ఫజుల్లాబాద్ వద్ద రహదారికి ఇరువైపులా స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. - దేవీపట్నం, న్యూస్‌టుడే

ఫజుల్లాబాద్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తూర.. బాగయ్యే దారేది!

మండలంలోని చింతకర్రపాలెం గ్రామంలో చిన్న వాగుపై నుంచి రాకపోకలు సాగించేందుకు వీలుగా ఏర్పాటుచేసిన తూర శిథిల స్థితికి చేరుకుంది. దాని మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలు కొన్నిసార్లు ప్రమాదాల బారినపడుతున్నాయి. దశాబ్దకాలంగా విన్నవిస్తున్నా మట్టి రోడ్డును సీసీగా మార్చటం లేదు. దెబ్బతిన్న తూర స్థానంలో చప్టా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. వర్షాకాలమొస్తే తీవ్ర ఇబ్బంది పడుతున్నామని స్థానికుడు రామారావు తెలిపారు. ఎంపీడీవో బాపన్నదొర దృష్టికి తీసుకెళ్లగా ప్రతిపాదనలు పంపామని, అనుమతులు రాగానే నిర్మాణం చేపడతామని తెలిపారు. - న్యూస్‌టుడే, వై.రామవరం

దుర్వాసనతో ఇబ్బందులు

మారేడుమిల్లిలో ప్రభుత్వ కార్యాలయాల మధ్యలోని ఓ శిథిల భవనంలో ఆవు మృతి చెందింది. చనిపోయి ఆరు రోజులు అవుతున్నా తొలగించకపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. ఆయా కార్యాలయాల సిబ్బందితో పాటు, పరిసర ప్రాంతంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు గ్రామ పంచాయతీ అధికారులకు తెలిపినా చర్యలు చేపట్టకపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. మండల పరిషత్తు కార్యాలయం, ఎమ్మార్వో, జీసీసీ కార్యాలయం, గోదాములు, ఐసీడీఎస్ కార్యాలయాలతో పాటు, సత్యసాయి సేవా కేంద్రంలో ఉండే సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మారేడుమిల్లి

విరిగిపోయి.. వంగిపోయి..

అసలే మారేడుమిల్లి నుంచి చింతూరు అంతర్రాష్ట్ర రహదారి.. పైగా ప్రమాదకరమైన ఘాట్‌రోడ్డు.. దట్టమైన అటవీ ప్రాంతం గుండా ప్రమాదకర మలుపులతో కూడిన రహదారి. మారేడుమిల్లి నుంచి వాలమూరు వరకు దట్టమైన అటవీ ప్రాంతంతో పాటు, ప్రమాదకర మలుపులు ఉంటాయి. అక్కడ నుంచి అతికష్టతరమైన ఘాట్‌రోడ్డు ప్రారంభం అవుతుంది. సుమారు 30 కి.మీ. మేర విస్తరించి ఉంటుంది. మలుపుల్లో హెచ్చరికల బోర్డులు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పట్లేదు. కొన్నిచోట్ల తుప్పలు పెరిగిపోయి, మూసేయడంతో కనిపించట్లేదు. మరి కొన్ని ప్రదేశాల్లో వాహనాలు ఢీకొని విరిగిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మారేడుమిల్లి

తుప్పపట్టి.. ప్రమాదకరంగా..

మారేడుమిల్లిలోని వినాయకుని ఆలయం వద్ద ఇనుప విద్యుత్తు స్తంభం తుప్పు పట్టి శిథిలమై పెద్ద రంధ్రం ఏర్పడింది. విద్యుత్తు తీగల ఆధారంతో నిలబడి ఉంది. నిత్యం వినాయకుడు, సాయిబాబా ఆలయాలకు భక్తులు వస్తుండడంతో పాటు, రంపచోడవరం వెళ్లే ప్రధాన రహదారి కావడంతో జనసంచారం ఎక్కువగా ఉంటుంది. పర్యటకుల కోసం నిర్మించిన ప్రైవేటు కాటేజీలు, రిసార్టులు ఉండడంతో పర్యటకులు అధికంగా ఉంటారు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ శాఖలు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మారేడుమిల్లి

ప్రత్యేక పూజలు

రాజవొమ్మంగి, వై.రామవరం: స్థానిక షిరిడీ సాయి ఆలయంలో బాబాకు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని భక్తులు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలో నూకాలమ్మతల్లి, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, రామలింగేశ్వర స్వామి, జడ్డంగి స్వయంభూ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

అలంకరణలో సాయిబాబా

కూనవరం ఎంపీడీవోగా ఆశీర్వాదం

కూనవరం, న్యూస్‌టుడే: కూనవరం ఎంపీడీవోగా ఎస్.ఆశీర్వాదం గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఏలూరు జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా చేస్తున్న జగన్నాథరావు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. పాలకవర్గం, అధికారులు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కొత్త జిల్లా ఏర్పడిన రోజున విధుల్లో చేరడం ఆనందంగా ఉందన్నారు.

పింఛన్ల పంపిణీలో అగ్రస్థానంలో మారేడుమిల్లి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో మారేడుమిల్లి మండలం అగ్రస్థానంలో కొనసాగుతుంది. తాజాగా డిసెంబర్ 31న చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలోనూ మొదటి రోజే 96.35శాతం పింఛన్లు లబ్ధిదారులకు అందజేసి ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది. మారేడుమిల్లి మండలంలో 1,905 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 1835 మందికి మొదటి రోజు మధ్యాహ్నమే సచివాలయ సిబ్బంది అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చింతూరు, న్యూస్‌టుడే: అనారోగ్యంతో మృతి చెందిన కుమ్మూరుకు చెందిన కుడియం రత్తమ్మ కుటుంబానికి జమాల్‌ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ జమాల్‌ఖాన్ గురువారం రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

కళకళలాడుతున్న కడియం నర్సరీలు

కడియం, న్యూస్‌టుడే: నూతన సంవత్సర ప్రత్యేక కూర్పులు ఏర్పాటుతో కడియం నర్సరీలు సందర్శకుల తాకిడితో రద్దీగా మారాయి. జాతీయ రహదారి సమీపంలో నర్సరీ వద్ద ఏర్పాటు చేసిన భారీ విరుల కూర్పు ఆకట్టుకుంటోంది.

కడియపులంక పుల్లా నాగేశ్వరరావు నర్సరీ వద్ద ఏర్పాటు చేసిన విరుల కూర్పు

మాకిది పోల'వరం'

వై.రామవరం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన పోలవరం జిల్లా ఏర్పాటైన సందర్భంగా వై.రామవరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వేణుగోపాల్ గురువారం కేక్ కోసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి తెదేపా నాయకుడు జి.శ్రీకాంత్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా సౌలభ్యం, అభివృద్ధి దృష్ట్యా రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా చేశారన్నారు. తెదేపా మండల మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి, మండల అధ్యక్షురాలు రామలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: రేఖపల్లి వైద్యులు నీలుఫర్ వైద్యశాలలో కేకును కోశారు. విలీన మండలాల ప్రజలకు ఇది శుభ పరిణామమన్నారు. ఆయుర్వేద వైద్యురాలు స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం జిల్లా ఏర్పాటు సందర్భంగా తన కార్యాలయంలో కేక్ కోస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సంబరాలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మారేడుమిల్లిలో ఉత్సాహంగా సంబరాలు చేసుకున్నారు. స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల ఆవరణల్లో క్యాంప్ ఫైర్ వేసుకుని నృత్యాలు చేశారు. ▼ రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో క్యాంప్ ఫైర్ నిర్వహించారు.

గంగవరం: గంగవరం వైజంక్షన్‌లో చిన్నారులు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేకు కోశారు. పోలీస్ సిబ్బంది రాత్రి వరకు ప్రత్యేక గస్తీలు కాశారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తులు నిర్వహించారు. ప్రతి ఏడాదికంటే ఈ ఏడాది రోడ్లపై ద్విచక్రవాహనాలు కనిపించకపోవడం విశేషం. ఉదయం నుంచి యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు శుభాకాంక్షలు తెలుపుతు స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు.

మారేడుమిల్లి గురుకుల పాఠశాలలో క్యాంప్‌ఫైర్

కొత్త జిల్లాతో మన్యం అభివృద్ధి

కొత్తగా గుర్తేడు మండలం ఏర్పాటుతో ఫ్లెక్సీతో స్థానికుల సంబరాలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గిరిజన గ్రామాలు అభివృద్ధికి చెందే ఆస్కారం ఏర్పడుతుందని మారేడుమిల్లి ఎంపీపీ సార్ల లలితకుమారి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కొత్త బోర్డులను ఆవిష్కరించారు. కొత్త జిల్లా ఏర్పాటుతో గిరిజన గ్రామాల రహదారులు, విద్య, వైద్యం, సమాచార వ్యవస్థలు మెరుగు పడతాయన్నారు. ప్రత్యేకంగా నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, సర్పంచి కొండా జాకబ్, ఉపసర్పంచి వీర బాబు, ఎంపీడీవో రవికిశోర్, డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖర్, పరిపాలనా అధికారిణి రత్నకుమారి, ఏపీవో మణికుమారి, కూటమి నాయకులు శేషుకుమార్, మళ్ల దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల సంబరాలు..: వై.రామవరం మండలం ఎగువ ప్రాంతాన్ని గుర్తేడు మండలంగా ఏర్పాటు చేయడంతో పాటు, రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటుపై గిరిజనులు సంబరాలు చేసుకున్నారు. గురువారం గుర్తేడులో సర్పంచి గొర్లె దుష్యంతుడు ఆధ్వర్యంలో గిరిజనులంతా సమావేశమై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు, జీజీహెచ్ మేనేజర్ కోసూరి కేదారేశ్వరరావు పేర్కొన్నారు. ఇటీవల ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీఎన్జీవో ద్వారా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జీజీహెచ్ ఏడీ శ్యామ్‌సుందర్, సీనియర్ అసిస్టెంట్లు యోహాన్, అజీజ్, ఒప్పంద, పొరుగుసేవల సంక్షేమ సంఘం కార్యదర్శి సరాకుల సుధాకర్, నర్సింగ్ సంఘం నాయకులు, జూనియర్ అసిస్టెంట్లు, మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం

కూనవరం, న్యూస్‌టుడే: కూనవరానికి చెందిన వేములపల్లి రామారావు ఇంట్లో విద్యుదాఘాతం సంభవించి ఇల్లు కాలిబూడిదైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు అగ్నిమాపక శకటానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. కష్టార్జితం మొత్తం కాలిబూడిదవడంతో బాధితుడు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న జేకే ట్రస్టు ఛైర్మన్ జమాల్‌ఖాన్ సంఘటనా స్థలానికి చేరుకుని తక్షణ సాయంగా రూ.5 వేలు, 50 కిలోల బియ్యం అందించారు. తెదేపా మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కర్‌రావు, పొడియం అప్పారావు, చెలికాని ఉమామహేశ్వరరావు, నాగరాజు, ట్రస్టు సభ్యులు షాజహాన్, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న జమాల్‌ఖాన్, తెదేపా నాయకులు

4న సీఐటీయూ జాతీయ మహాసభలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి నూతన ఉత్తేజంతో పోరాటాలకు సిద్ధం కావాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి రామరాజు కోరారు. రాజవొమ్మంగిలో సంఘం అధ్యక్షుడు వీరబాబు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో రామరాజు మాట్లాడారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ద్వారా వచ్చే క్లెయిమ్‌లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, బోర్డును పునరుద్ధరించాలని, కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈనెల 4న విశాఖపట్నంలో జరగనున్న సీఐటీయూ జాతీయ మహా సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం నాయకులు అచ్చారావు, బుజ్జి, అప్పారావు, అప్పన్నబాబు పాల్గొన్నారు.

జాతీయ చదరంగంలో చిన్నారి ప్రతిభ

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: అస్సాంలో గతనెల 27నుంచి 31 వరకు జరిగిన 14వ జాతీయ స్కూలుగేమ్స్ ఓపెన్ కేటగిరిలో నగరానికి చెందిన అనన్య టాప్-9లో నిలిచినట్లు ఎంకె చెస్ అకాడమీ కోచ్ జి.హేమచంద్రమౌళి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 9 రౌండ్లు నిర్వహించగా 6.5పాయింట్లతో టాప్-10లో చోటు దక్కించుకోవటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అనన్యను జిల్లా చదరంగం సంఘ కార్యదర్శి జీవీ కుమార్, ఉపాధ్యక్షులు వై.కల్యాణ్‌కుమార్, కోచ్ హేమచంద్ర, కార్తీక్‌గోపాల్ అభినందించారు.

పతకం అందుకుంటున్న అనన్య

దండిగా వ్యయం.. దక్కని ఫలితం

అరకులోయ, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో రూ. 2 కోట్ల ప్రజాధనం వృథా అయ్యే పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. అరకులోయలోని హరిత హిల్‌రిసార్ట్స్ ప్రాంగణంలో 2019లో రూ. 2 కోట్లతో డ్రైవ్ ఇన్ రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. పర్యాటకులు వారి వాహనాల్లోనే కూర్చొని ఎదురుగా తెరపై కనిపించే దృశ్యాలను చూస్తూ.. సంగీత ధ్వనులను ఆస్వాదిస్తూ వారికి నచ్చిన ఆహారాన్ని తినేందుకు వీలుగా దీన్ని ఏర్పాటు చేశారు. లోపల కూడా కూర్చొని ఆహారాన్ని తినేందుకు భవనాలు నిర్మించారు. అప్పటి పర్యాటకశాఖ మంత్రిగా ఉన్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు దీనిని ప్రారంభించారు.

ప్రారంభోత్సవం జరిగి సుమారు ఆరేళ్లు పూర్తవుతున్నా నేటికీ ఈ రెస్టారెంట్‌లో కార్యకలాపాలు ప్రారంభం కాలేదు. రూ. కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన నిర్మాణం నిరుపయోగంగా మారింది. హరిత హిల్ రిసార్ట్స్‌లో రెస్టారెంట్ మరమ్మతులకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్న అధికారులు.. ఈ రెస్టారెంట్‌ని పూర్తిస్థాయిలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. పర్యాటకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా.. కేవలం నిధుల ఖర్చు పైనే ఆనాటి అధికారులు దృష్టి సారించడంతో ఈ పరిస్థితి నెలకొంది.

శిథిలావస్థకు చేరుతూ..: కోట్లు ఖర్చు చేసి నిర్మించిన డ్రైవ్ ఇన్ రెస్టారెంట్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతోంది. ఇప్పటికే అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయి. భవనాల నిర్వహణ లేకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. కేవలం పర్యాటకశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే డ్రైవ్ ఇన్ రెస్టారెంట్‌కు ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు విమర్శిస్తున్నారు. ఈ పర్యాటక సీజన్‌లో అయినా దీన్ని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అరకులోయలో నిరుపయోగంగా డ్రైవ్ ఇన్ రెస్టారెంట్

శిథిలమవుతున్న అంతర్గత రహదారులు

(c) eenadu

కొత్త సంవత్సర వేడుక.. కొంగొత్త కానుక

కలెక్టర్‌కు పుస్తకాలు, పెన్నులు అందజేస్తూ..

కానుకలుగా వచ్చిన పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి వచ్చే నాయకులు, అధికారులు, ప్రజలు పూలగుత్తులు, పూలకుండీలు, ఎండుఫలాలు, కేకులు, శాలువాలు తీసుకురావొద్దని కలెక్టర్ రాజాబాబు ఇచ్చిన పిలుపునకు స్పందన వచ్చింది. కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలపడానికి వచ్చినవారు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, సంచులు, దుప్పట్లు, పంకాలు ఇచ్చి కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇలా వచ్చిన వాటిని ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. –ఈనాడు, ఒంగోలు

లక్ష్య సిద్ధి ప్రాప్తిరస్తు

నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆలయాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. కొత్త సంవత్సరంలో తాము లక్ష్యాలు సాధించాలని, అంతా మంచి జరగాలని వేడుకున్నారు. చిన్నా, పెద్దా అంతా కలిసి ఉదయం నుంచే సమీపంలోని దేవాలయాలకు తరలి రావడంతో రద్దీ నెలకొంది. ఒంగోలు నగరంలోని లాయర్‌పేట ప్రాంతంలోని సాయిబాబా ఆలయానికి తరలివచ్చిన భక్తులను చిత్రాల్లో చూడొచ్చు. - ఈనాడు, ఒంగోలు

3న ఉగ్ర ప్రమాణ స్వీకారం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా ఒంగోలు పార్లమెంటరీ నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా నియమితులైన కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డితోపాటు కమిటీ సభ్యులు ఈ నెల 3వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఒంగోలు నగరంలోని దక్షిణ బైపాస్‌లోని ఎస్‌జీవీఎస్ కల్యాణ మండపంలో సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమానికి కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని సమాచారం అందించారు.

మందు తాగి బండి నడిపితే చుక్కలే

రహదారి భద్రత నిబంధనలు ఉల్లంఘించి మద్యం తాగి వాహనాలు నడిపితే చుక్కలు కనిపించడం ఖాయం. ఇప్పటిదాకా కేవలం పోలీసు శాఖ మాత్రమే వినియోగిస్తున్న బ్రీత్ ఎనలైజర్లు తాజాగా రవాణాశాఖ చేతికి సైతం వచ్చాయి. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా వీటిని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఎంవీఐ), ఏఎంవీఐలకు సైతం అందజేశారు. రహదారి నిబంధనల ఉల్లంఘనలో పోలీసులు విధించే జరిమానాలు నామమాత్రంగా ఉంటాయి. అదే రవాణా శాఖకు పట్టుబడితే మాత్రం భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే. - న్యూస్‌టుడే, నేరవిభాగం

దారుణాలు చేసినవారి మాటేమిటి?

రూ.కోట్లు మేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు

మెప్మా అక్రమాల్లో అధికారులపై చర్యలతో సరి

ఈనాడు, ఒంగోలు

అధికారాన్ని అడ్డం పెట్టుకొని కొంతమంది పెద్దలు బోగస్ సంఘాలు సృష్టించి మెప్మాలో రూ.కోట్ల రుణాలు కొట్టేశారు. అమాయకులైన వారిని సభ్యులుగా చేర్చడం, వారికి ఇప్పుడు బ్యాంకుల నుంచి నోటీసులు రావడంతో అక్రమాల డొంక కదిలింది. విచారణ చేపట్టి మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీహరి, మరో 9 మందిపై చర్యలు తీసుకున్నారు. అయితే రుణాలు కొల్లగొట్టిన తెరవెనుక పెద్దలు మాత్రం బయటపడలేదు. వీరిపై కేసులు నమోదు చేస్తారా.. లేదా.. సొమ్ములు రికవరీ ఎలా చేస్తారన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

☛ గత వైకాపా హయాంలో కార్పొరేటర్లుగా ఉన్న కొందరు బోగస్ రుణాలు తీసుకొన్నారు. ఒక కార్పొరేటరు ఐదు బోగస్ సంఘాలను ఏర్పాటు చేసి రూ.కోటి మేర వెనకేసుకున్నారు. ఒంగోలు నగరపాలక సంస్థ పాలక వర్గంలో కీలక స్థానంలో ఉన్నవారు సైతం రుణాలు స్వాహా చేశారు. ఈ నేపథ్యంలో జేసీ రోణంకి గోపాలకృష్ణ అధ్యక్షతన చేపట్టిన విచారణ కమిటీ 2020 అనంతరం రుణాలు తీసుకున్న సంఘాల్లో బ్యాంకులకు భారీగా బకాయిపడ్డ సంఘాలపైనే విచారణ చేపట్టారు. దాదాపుగా రూ.10 కోట్ల మేర బ్యాంకుల్లో బకాయిలు పేరుకుపోయిన సంఘాలను మాత్రమే విచారించారు.

ఒంగోలు నగరంలో పొదుపు సంఘాల మహిళలను విచారిస్తున్న జేసీ రోణంకి గోపాలకృష్ణ

☛ వ్యక్తిగత రుణాలు ఇప్పిస్తామని చెప్పడంతో తాము ఆధార్ కార్డులు ఇచ్చినట్లు కేశవరావుపేట, విజయనగర్ కాలనీలకు అధికారులు విచారణ నిమిత్తం వెళ్లినప్పుడు మహిళలు తెలిపారు. ఒక్కో సంఘం నుంచి ఇద్దరు, ముగ్గురిని ఎంపిక చేసి కొత్తగా మరో సంఘం సృష్టించి బోగస్ రుణాలు తీసుకున్నారు. మెప్మా సిబ్బంది, నాయకులు కలిసి బ్యాంకుల నుంచి రూ.కోట్లు కొల్లగొట్టారు. వాస్తవానికి పూర్తిస్థాయిలో విచారణ చేపడితే బోగస్ రుణాలు రూ.30 కోట్లపైనే ఉంటాయని చెబుతున్నారు. విజిలెన్స్ బృందం విచారణ చేస్తేనే ఇవన్నీ బయటపడతాయి. కొంతమంది నాయకులు పార్టీలు మారడంతో అధికారాన్ని అడ్డం పెట్టుకుని బయటపడే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు.

బ్యాంకర్లపై చర్యలేవీ?

సాధారణంగా ఏదైనా సంఘానికి రుణం ఇచ్చినప్పుడు ఆయా సభ్యుల ఖాతాల్లో నగదు జమ చేస్తారు. ఇక్కడ నగదు రూపంలో ఇచ్చేశారు. అక్రమాల్లో బ్యాంకర్ల పాత్ర స్పష్టంగా కనిపిస్తోంది. ఓ బ్యాంకులో ఓ శాఖకు చెందిన అధికారి బోగస్ రుణాలు ఇవ్వడంలో పేరొందారు. నేరుగా.. అన్నట్లు చేసేశారు. ఇంతవరకు బ్యాంకర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

సస్పెన్షన్ల పరంపర

ప్రస్తుతం సస్పెండ్ చేసిన మెప్మా అధికారుల్లో ఇద్దరు ఏడాదిన్నర కిందట విధుల నుంచి తప్పించారు. దొడ్డిదారిన మళ్లీ పోస్టింగ్ దక్కించుకున్నారు. నాటి అక్రమాలు వెంటాడడంతో తాజాగా తిరిగి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇద్దరు ఆర్పీలు ఇప్పటికే విధుల నుంచి దూరంగా ఉండగా, మళ్లీ సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం. అక్రమాలకు బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేశారు గానీ తీసుకున్న రుణం సొమ్ము ఎవరి నుంచి రికవరీ చేయాలనే దానిపై స్పష్టత లేదు. తనను సస్పెండ్ చేస్తున్నారని కారణం చెప్పాలని, ఎంత మేర రుణాలు తాను అక్రమాలకు పాల్పడ్డానో చెప్పాలని తెలుగింటి ఆర్పీ ఒకరు అధికారులను ప్రశ్నించడం గమనార్హం. అక్రమాల లెక్కలు తీస్తే వెనుక ఉన్న పెద్దలు కూడా బయటకొస్తారు.

యువోత్సాహం

తాళ్లూరులో యువతుల సందడి

నూతన సంవత్సరం సందర్భంగా జిల్లావ్యాప్తంగా బుధవారం అర్ధరాత్రి యువత నృత్యాలతో సందడి చేశారు. ఒకరికొకరు హ్యాపీ న్యూ ఇయర్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కొత్తపట్నం కె.పల్లెపాలెం సముద్రతీరానికి పర్యాటకులు పోటెత్తారు. సముద్రంలో దిగి స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. -న్యూస్‌టుడే, తాళ్లూరు

6లో సొంత మైదానంలో చితక్కొట్టేశారు!

ఒక్కరోజే రూ.5.69 కోట్ల మద్యం తాగేశారు

గతేడాది కంటే పెరిగిన విక్రయాలు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో డిసెంబరు 31వ తేదీన రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు జరిగాయి. ఏకంగా రూ.5.69 కోట్ల విలువైన మద్యాన్ని మందుబాబులు తాగేశారు. సాధారణంగా రోజూ రూ.3.50 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. వారాంతాలు, పర్వదినాల సమయాల్లో కాస్త పెరుగుతుంటాయి. దీనికి భిన్నంగా 2025కు వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాది ప్రారంభం రోజున రికార్డు స్థాయిలో విక్రయాలు జరిగాయి. జనవరి 1న అదేస్థాయిలో అమ్మకాలు జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది డిసెంబరులో రూ.110.8 కోట్ల మేరకు మద్యం విక్రయాలు జరగ్గా, 2024, డిసెంబరులో రూ.104.6 కోట్ల మేర విక్రయాలు జరిగాయి. 2024తో పోలిస్తే 2025లో మద్యం విక్రయాల్లో 5.9 శాతం పెరుగుదల కనిపించింది. అనధికార మద్యంపై ఉక్కుపాదం, నాటుసారా నియంత్రణ, మద్యం గొలుసు దుకాణాల కట్టడితో ఈ ఏడాది మద్యం విక్రయాల్లో హెచ్చుదల వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఆయేషా బేగం చెప్పారు. 2024 డిసెంబరుతో పోలిస్తే ఐఎంఎల్ విక్రయాల్లో 7 శాతం, బీర్ల విక్రయాల్లో 33 శాతం వృద్ధి సాధించినట్లు పేర్కొన్నారు.

రాచబాటలో పనుల పరుగు

● గ్రీన్‌ఫీల్డ్‌లో వంతెనల నిర్మాణం

బెంగళూరు-కడప-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటిని మొత్తం 14 ప్యాకేజీలుగా విభజించారు. జిల్లాలోని తాళ్లూరు మండలం సోమవరప్పాడు నుంచి బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలం ముప్పవరం వరకు చివరి ప్యాకేజీగా నిర్ణయించగా మేఘా కంపెనీ ప్రతినిధులు నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా గుండ్లకమ్మ నదిపై కొటికలపూడి-వేలమూరిపాడు మధ్య సుమారు 300 మీటర్ల వంతెన నిర్మాణం జరుగుతోంది. ఈ వారధి పనులు 20 శాతం పూర్తయ్యాయి. రైతుల నుంచి వస్తున్న అభ్యంతరాలు పరిష్కరిస్తూ . .దేవాదాయ శాఖ భూముల పరిహారం కొలిక్కితెస్తూ పనులు చేపడుతున్నారు. మొత్తం 624 కి.మీ. రహదారిలో ఇప్పటికే బెంగళూరు నుంచి కోడికొండ వరకు, ముప్పవరం నుంచి విజయవాడ వరకు జాతీయ రహదారి ఉంది. మధ్యలో 343 కి.మీ మేరకు నూతన రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీనికిగాను అంచనా వ్యయం రూ.19,320 కోట్లుగా నిర్ణయించారు. ఇది కొంతమేర పెరిగే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం గుండ్లకమ్మపై వంతెన పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారిపై అద్దంకి సమీపంలో వాహనాల మళ్లింపు (డైవర్షన్) వంతెన నిర్మాణం చురుగ్గా సాగుతోంది. నిర్దేశించిన గడువు లోగా నిర్మాణం పూర్తిచేయనున్నట్లు గుత్తేదారు సంస్థ మేనేజరు సురేష్‌కుమార్ వెల్లడించారు. - న్యూస్‌టుడే, అద్దంకి

వేలమూరిపాడు సమీపంలో పూర్తయిన వంతెన దిమ్మెలు

కంది పంటకు మంచి రోజులు

వాతావరణం అనుకూలించడంతో కంది సాగు ఊపందుకుంది. ఒంగోలు, కొండపి, దర్శి, సంతనూతలపాడు, గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో సుమారు 1.09 లక్షల ఎకరాల్లో కంది వేశారు. ఒక్క కనిగిరి నియోజకవర్గం పరిధిలోనే 50 వేల ఎకరాలకు పైగా పంట విస్తరించడం విశేషం. వాతావరణం సైతం అనుకూలించడంతో పూత, పిందెతో పైరు కళకళలాడుతున్నట్లు డీఏవో శ్రీనివాసరావు తెలిపారు. ఎకరాకు ఏడు క్వింటాళ్లకు పైగా దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.- న్యూస్‌టుడే, కనిగిరి

యడవల్లిలో కళకళలాడుతున్న కంది పంట

సిబ్బంది లేక ఇబ్బంది

• జలవనరుల శాఖలో ఖాళీలు
• నీటి నిర్వహణలో అవస్థలు

బాగుచేయించాల్సిన నర్సిరెడ్డిపల్లి కతువ

జిల్లాలోని జలవనరులశాఖలో అధికారులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో రైతులకు మెరుగైన సేవలందడంలేదు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 799 చెరువులుండగా, 544 తటాకాలు ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనాలు వేశారు. వీటికి వెంటనే మరమ్మతులు చేయించాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో జేఈలు, లస్కర్ల కొరత తీవ్రంగా ఉంది. వీటిని వచ్చే తొలకరి నాటికి బాగు చేయించకుంటే వచ్చే ఏడాది ఆయకట్టుకు నీరందించడం కష్టంగా మారుతుంది. - న్యూస్‌టుడే, కంభం

• దర్శి డివిజన్‌లో ఎన్‌ఎస్‌పీ కాలువ వెళ్తుంది. ఆ ప్రాంతంలో 16 మంది జేఈలు పనిచేయాల్సి ఉండగా, ఆరుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇతర ప్రాంతంలో పనిచేసే వారిలో కొందరు ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. • కందుకూరు ప్రాంతంలోని రాళ్లపాడు ప్రాజెక్టులోనూ పది మంది విధులు నిర్వహించాల్సి ఉండగా, ఒక్కరూ లేక పోవడం గమనార్హం. • చీమకుర్తి ప్రాంతంలోనూ నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. • కంభం సబ్ డివిజన్ పరిధిలో అయిదుగురు జేఈలు పనిచేయాల్సి ఉండగా, ఒక్కరు మాత్రమే ఉన్నారు. • గిద్దలూరు సబ్‌డివిజన్‌లో నలుగురికి ఒక్కరూ లేరు. • మార్కాపురంలో 18 మందికి ఏడుగురు మాత్రమే ఉన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 100 మంది జేఈలు పనిచేయాల్సి ఉండగా 40 ఖాళీలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. • జిల్లాలో లస్కర్ల కొరత మరింత వేధిస్తోంది. ఒక్కో డివిజన్‌లో సుమారు 120 మంది విధులు నిర్వహించాల్సి ఉండగా, 25 నుంచి 30 మందిలోపే పనిచేస్తున్నారు. 2004 అనంతరం నియామకాలు నిలిపేయడంతో నిర్వహణపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయమై ఎస్ఈ వరలక్ష్మి మాట్లాడుతూ ఖాళీల విషయంపై ప్రతిపాదనలు పంపించామన్నారు.

భయం వీడండి... ఇష్టంతో చదవండి

న్యూరోలింగ్విస్టిక్ ప్రోగ్రాం మాస్టర్ ట్రైనర్ డాక్టర్ నల్లూరి

న్యూస్‌టుడే, ఒంగోలు విద్య

మరో రెండు నెలల్లో పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దాదాపు 80 వేల మంది విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని బోధకులకు విద్యాశాఖ ఉన్నతాధికారులు లక్ష్యంగా విధించారు. ఇదే సమయంలో పిల్లల ఆరోగ్యం, ఒత్తిడిని అధిగమించడం, విసుగు లేకుండా చదువు కోవడం ఎలాగనే అంశాలపై ఒంగోలుకు చెందిన విశ్రాంత వైద్యాధికారి, న్యూరోలింగ్విస్టిక్ ప్రోగ్రాం మాస్టర్ ట్రైనర్ డాక్టర్ నల్లూరి రాఘవ రావు కొన్ని సూచనలు చేశారు. ఆయన గతంలో పరీక్షల్లో ఉత్తీర్ణత ఎలా అనే పుస్తకంతోపాటు విద్యార్థుల మనస్తత్వంపై కొన్ని పుస్తకాలు రాశారు.

• రాత్రి త్వరగా పడుకుని వేకువజామున 5 గంటలకు లేచి చదవడం మొదలుపెడితే మెదడు ప్రశాంతంగా ఉంటుంది. • చదివేటప్పుడు పుస్తకంలో లైన్ల వెంట వేలును రన్ చేస్తూ చదవాలి. చదివిన విషయాలు ఒకసారి రాస్తే మెదడులో నిక్షిప్తమవుతాయి. • ఆరుబయట చెట్లమధ్య కొంతసేపు, గదిలో కూర్చుని కొంతసేపు చదువుకోవాలి. • ఇంట్లో వంట వాసనలు, ఇతరత్రా మనసు పక్కకు మరలే పరిస్థితి రాకుండా మంచి సువాసనలతో కూడిన అగరబత్తీలను వెలిగించుకోవాలి. • పరీక్షలు సమీపించేకొద్దీ ఒత్తిడితో ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. త్వరగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. నీరు ఎక్కువ తాగాలి. • తల్లిదండ్రులు పిల్లల్ని గమనిస్తూ ఉండాలి. ఇతరులతో పోల్చి వారిని కించపరిచేలా మాట్లాడకూడదు.

• రోజూ కాసేపు చిన్నపాటి వ్యాయామం, ధ్యానం చేస్తే ప్రశాంతంగా ఉంటుంది. • కొత్త సబ్జెక్టులు చదవడం కన్నా చదివిన వాటిని తరచుగా ఉండడం మేలు. • పరీక్షకు ముందు రాత్రి జాగారం మంచిది కాదు. దాని వల్ల మరుసటి రోజు మెదడు సరిగా పనిచేయక ప్రశ్నలకు జవాబులు గుర్తుకు రావు.

1,480 ఎకరాలు.. 64 గేట్లు

కందుకూరు మండలం మాచవరం చెరువు 1,480 ఎకరాల్లో విస్తరించి ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 280 ఎంసీఎఫ్‌టీలు. దీని పరిధిలో 3,368 ఎకరాల ఆయకట్టు ఉంది. తటాకం సామర్థ్యానికి మించి నీరు చేరితే దిగువకు విడుదల చేసేందుకు 64 గేట్లు ఏర్పాటు చేశారు. వీటిపై కందుకూరు నుంచి మాచవరానికి రాకపోకలు నిలిచిపోకుండా ఉండేలా నడక మార్గం కూడా ఏర్పాటు చేశారు. ఈ సౌకర్యాన్ని నేటికీ రైతులు ఉపయోగించుకుంటున్నారు. -న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

కట్టడి చేశారు!

ఫలించిన పోలీసు యంత్రాంగం ప్రణాళిక ✦ ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు

ఒంగోలు నగరంలో బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు

న్యూస్‌టుడే, ఒంగోలు నేర విభాగం

జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. పోలీసులు తీసుకున్న కట్టుదిట్టమైన చర్యలతో ఎక్కడా ఎటువంటి ఆవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఆనందోత్సాహాల మధ్య ప్రజలు వేడుకలు నిర్వహించుకున్నారు. పోలీసులు ఆద్యంతం వ్యూహాత్మకంగా వ్యవహరించి యువత ఎక్కడా వెర్రితలలు వేయకుండా నిలువరించారు. ప్రధానంగా జిల్లాకేంద్రం ఒంగోలు నగరంతో పాటు కీలకమైన పట్టణాలు, మండల కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లాలో శాంతిభద్రతలను ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. అత్యంత కీలకమైన ఒంగోలు నగరమంతా పోలీసులు మోహరించారు. కర్నూలు రోడ్డులోని వంతెనను పూర్తిగా మూసివేశారు. నగరంలోని మంగమూరు రోడ్డు, కొప్పోలు రోడ్డు, పేర్నమిట్ట రోడ్డు తదితర కీలక ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. నగరమంతా పికెట్లు ఏర్పాటు చేశారు. తీర ప్రాంతాల్లో సముద్ర స్నానాలపై తాత్కాలిక నిషేధం విధించటంతోపాటు డ్రంక్ అండ్ డ్రైవ్ అడ్డుకట్టకు ప్రత్యేక బృందాల ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాలతో నిఘాతో యువత రోడ్లపై ఎక్కడా హల్‌చల్ చేయకుండా తమ ప్రాంతాల్లో ప్రశాంతంగా వేడుకలు నిర్వహించుకున్నారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వన్‌టౌన్, టూటౌన్, తాలూకా, ట్రాఫిక్ సీఐలు వై.నాగరాజు, ఎం.శ్రీనివాసరావు, టి.విజయ్‌కృష్ణ, ఎస్.జగదీష్ తమ సిబ్బందితో బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు.

మంచు తెరల్లో అడ్డదారులు



జాతీయ రహదారి-16పై గురువారం తెల్లవారుజామున మంచు కమ్మేసింది. త్రోవగుంట నుంచి ఒంగోలు నగరం వైపు వస్తున్న వాహనదారులు మంచులోనే అడ్డదారిలో జాతీయ రహదారిలో వస్తున్న వాహనాలకు ఎదురుగా ప్రమాదకరంగా వెళ్తూ కనిపించారు. అండర్‌పాస్ నుంచి వెళ్లే వీలున్నా వీళ్లు మంచులోనే ఎదురుగా వెళుతుండడం ప్రమాదానికి ఎదురెళ్లడమే. -ఈనాడు, ఒంగోలు

పారదర్శకతకు పెద్దపీట

ఆర్థిక అక్షరాస్యతపై మహిళల్లో అవగాహనకు శ్రీకారం

ఒంగోలు మండలం మండువవారిపాలెంలో సమావేశమైన స్వయం సహాయక సంఘం మహిళలు

న్యూస్‌టుడే, కలెక్టరేట్

స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆధునిక సాంకేతికతను ఎప్పటికప్పుడు చేరువ చేసేందుకు అడుగులు పడుతున్నాయి. సంఘాల సభ్యుల్లో చురుకైన మహిళలను ఈ-నారీ పేరుతో నియమించే సరికొత్త వ్యవస్థ ఏర్పాటుకు డీఆర్‌డీఏ అధికారులు నిమగ్నమయ్యారు. బ్యాంకు అనుసంధాన రుణాల నుంచి నెలవారీ వాయిదాల చెల్లింపుల వరకు మరింత పారదర్శకత, మహిళలకు జీవనోపాధుల కల్పన, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన నిమిత్తం ఇప్పటికే 'మన డబ్బులు-మన లెక్కలు' యాప్‌పై శిక్షణ ఇస్తున్నారు. కేవలం వారికి ఆండ్రాయిడ్ ఫోన్‌పై అవగాహన ఉంటే చాలు. తద్వారా మహిళలకు పలు అంశాలపై చైతన్యం కలిగిస్తారనే ఉద్దేశంతో వినూత్న విధానానికి శ్రీకారం చుట్టారు. ఓ వైపు సరికొత్త అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు ఈ-నారీలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు.

అర్హులు ఎవరంటే...

గ్రామాల్లోని సంఘాల సంఖ్య ఆధారంగా ప్రతి 10 స్వయం సహాయక సంఘాలకు ఒక ఈ-నారీమణిని ఎంపిక చేస్తారు. కనీసం 25 సంఘాలు ఉన్నచోట ముగ్గురిని నియమించనున్నారు. అంతకంటే అత్యధికంగా ఉన్న చోట ఎక్కువ చదువుకున్న వారిని జీవనోపాధుల కింద మరో ఇద్దరు సీఆర్పీలను గుర్తిస్తున్నారు. వీరి ఎంపికకు డిగ్రీ నుంచి 10వ తరగతిలోపు విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 40 ఏళ్లలోపు వయసు ఉండాలి. ఎక్కువ చదువు ఉన్నవారికి ప్రాధాన్యమివ్వనున్నారు. • స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన పుస్తకాల నిర్వహణ తెలిసి ఉండాలి. ఎంపిక ప్రక్రియ పూర్తయిన అనంతరం నారీమణులతోపాటు, సీఆర్పీలకు సబ్జెక్టుల వారీగా త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నారు. అందులో భాగంగా ఎంపికైన నారీమణులకు వారికి సమీపంలో ఉండే వీధులు, కాలనీల ఆధారంగా సంఘాలను మ్యాపింగ్ చేసే పనిలో ఏపీఎం, సీసీలు నిమగ్నమయ్యారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామసంఘాలు: 1,543 | మొత్తం స్వయం సహాయక సంఘాలు : 44,857 | మొత్తం మహిళల సంఖ్య : 4,38,444

వెలిగొండతోనే వెలుగులు!

ఈ ఏడాదే నీళ్లిస్తామని ప్రభుత్వం ప్రకటన

ప్రజల సాగు, తాగు నీటి కష్టాలకు ఇక చెక్

మార్కాపురం ప్రాంత వాసుల చిరకాల స్వప్నమైన మార్కాపురం జిల్లా ఏర్పాటును కూటమి ప్రభుత్వం సాకారం చేసింది. లక్షల మంది ఆకాంక్షలను నెరవేర్చి ప్రజల నీరాజనాలు అందుకుంటోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన మార్కాపురం జిల్లాగా ఆవిర్భవించింది. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లో అత్యధిక భాగం కరవు ప్రాంతమే. సాగు, తాగునీటికి ఇబ్బందులే. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే నీరు ప్రధాన పాత్ర పోషిస్తుంది. పరిశ్రమలు రావాలన్నా.. వ్యవసాయం ఊపందుకోవాలన్నా.. ఉపాధి అవకాశాలు పెరగాలన్నా నీరే ఆధారం. కొత్త జిల్లాకు నీటి ఆవశ్యకత ఎనలేనిది.
-న్యూస్‌టుడే, యర్రగొండపాలెం, పెద్దదోర్నాల, మార్కాపురం

తాగునీటి కోసం రూ.వెయ్యి కోట్లతో నిర్మిస్తున్న పథకం

మరో తీపి కబురుకు సిద్ధం...

మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది మరో ప్రతిష్ఠాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. జిల్లాకు వెన్నెముక లాంటి వెలిగొండ ప్రాజెక్టును ఈ ఏడాదే పూర్తిచేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. దానికి తగ్గట్టుగానే నిధుల విడుదల చేస్తున్నారు. మంత్రి నిమ్మల నెలకోసారి ప్రాజెక్టును సందర్శించి పురోగతిపై సమీక్షిస్తున్నారు. ఇప్పటికే మొదటి సొరంగం పూర్తికాగా.. రెండో సొరంగం నిర్మాణపనులు వడివడిగా సాగుతున్నాయి. సొరంగాల నుంచి నల్లమల సాగర్‌కు నీరిచ్చే ఫీడర్ కాలువకు సిమెంటు లైనింగ్, రీటెయినింగ్ గోడ నిర్మాణానికి ఇటీవల రూ.457 కోట్లు కేటాయించింది. 21.8 కిలోమీటర్ల పొడవైన కాలువ సిమెంటు పనులు త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

(c) eenadu

సొంత మైదానంలో చితక్కొట్టేశారు!

EENADU SPORTS LEAGUE 2025

సంతనూతలపాడు, న్యూస్‌టుడే

▸ సెమీస్‌లో ట్రిపుల్‌ఐటీ కళాశాల జట్టు భారీ విజయం

బ్యాటర్లు బాదేశారు. బౌలర్లు చక్కటి లైన్ అండ్ లెంగ్త్ బంతులు వేస్తూ అవతలి బ్యాట్స్‌మెన్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఇక ఫీల్డర్లు తమ నుంచి బంతిని దాటనివ్వలేదు. ఫలితంగా రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ట్రిపుల్ ఐటీ కళాశాల) జట్టు భారీ విజయం సొంతం చేసుకుంది. సంతనూతలపాడులోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో జరుగుతున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్-2025)లో భాగంగా గురువారం నాటి మ్యాచ్ ఏకపక్షంగా సాగింది. సీనియర్స్ విభాగంలో రెండో సెమీ ఫైనల్‌లో ట్రిపుల్ ఐటీ కళాశాల, క్విస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్లు తలపడ్డాయి. సమష్టి కృషితో ట్రిపుల్ ఐటీ కళాశాల జట్టు 57 పరుగుల తేడాతో విజయకేతనం ఎగురవేసింది.

మైదానంలో పరుగులు తీస్తున్న క్రీడాకారులు

రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్ (ట్రిపుల్ ఐటీ కళాశాల) జట్టు విజయానందం

▸ మల్లేష్.. శభాష్!

ట్రిపుల్ ఐటీ కళాశాల జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగింది. 10 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 112 పరుగుల భారీ స్కోర్ చేసింది. మల్లేష్ 28 బంతుల్లో 47 పరుగులు చేయగా.. కె.సుభాష్ 18 బంతుల్లో 26, జాయ్ 6 బంతుల్లో 16, వినయ్ 4 బంతుల్లో 10 పరుగులు సాధించారు. తమ సొంత మైదానంలో అవకాశమే హద్దుగా బ్యాటర్లు విజృంభించారు. ప్రత్యర్థి జట్టు బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగిపోయారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన క్విస్ జట్టు 10 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 55 పరుగులు మాత్రమే చేసింది. రవితేజ 19 బంతుల్లో 15, సాయిరెడ్డి 16 బంతుల్లో 15 పరుగులు చేశారు. ట్రిపుల్ ఐటీ జట్టు బౌలింగ్‌లో అరవింద్, హాషీ రెండేసి వికెట్లు తీసుకున్నారు. మల్లేష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

Medical Partner
వెంకటరమణ నర్సింగ్ హోమ్ (ప్రై) లిమిటెడ్ SINCE 1989 CARING YOUR LIFE

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా

మల్లేష్

నేడు ఈఎస్ఎల్-2025 ఫైనల్స్

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ పోటీల్లో భాగంగా శుక్రవారం ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు జూనియర్స్ విభాగంలో పేస్ పాలిటెక్నిక్ జూనియర్ కళాశాల-ప్రభుత్వ జూనియర్ కళాశాల(కొండపి) జట్ల మధ్య తుదిపోరు జరగనుంది. మధ్యాహ్నం 1 గంటకు సీనియర్స్ విభాగంలో రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్ (ట్రిపుల్ ఐటీ కళాశాల)-పేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ జట్లు తలపడనున్నాయి.

సీనియర్స్
గాయత్రి డిగ్రీ కాలేజీ, కందుకూరు Vs ఆదిత్య డిగ్రీ కాలేజీ, నెల్లూరు మ్యాచ్ 11.00 గం॥లకు A.C. Stadium (Ground-1) లో జరుగుతుంది.

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ NECC (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Gift Partner: KL UNIVERSITY (DEEMED TO BE)
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: QIS EDUCATIONAL INSTITUTIONS ONGOLE
Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

కలెక్టరేట్‌కు నేతల తాకిడి

ఒంగోలు కలెక్టరేట్, మార్కాపురం, న్యూస్‌టుడే: ప్రకాశం, మార్కాపురం జిల్లా వ్యాప్తంగా గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డితోపాటు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల నివాసాల వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు, జిల్లా, మండల అధికారులు, ఉద్యోగుల రాకతో పండగ వాతావరణం నెలకొంది. ప్రజా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపేందుకు అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలతోపాటు, ప్రభుత్వ ఉద్యోగులు బారులుతీరారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఒంగోలు రామనగర్‌లోని కార్యాలయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, స్థానిక గుంటూరురోడ్డులోని తెదేపా కార్యాలయంలో దామచర్ల జనార్దన్, మంగమూరురోడ్డులోని కార్యాలయంలో బీఎన్ విజయకుమార్, నెల్లూరు బస్టాండ్‌లోని కార్యాలయంలో రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, కనిగిరిలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరులో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెంలో నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తదితరులు నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. కలెక్టర్ పి.రాజాబాబు వేడుకలను వినూత్నంగా జరుపుకొన్నారు. పూల దండలు, పుష్పగుచ్ఛాల స్థానంలో ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు ఉపయోగపడేలా పెన్నులు, పుస్తకాలు, బ్యాగులు, దోమతెరలు స్వీకరించారు. కలెక్టర్ రాజాబాబును పలువురు ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్ రాజాబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యం

జిల్లా పోలీసు కార్యాలయంలో కేకు కోస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించాలని, జిల్లా పోలీసు ప్రతిష్ఠతను మరింత ఇనుమడింపజేసేలా పనిచేయాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు సూచించారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేకు కోసి పోలీసు అధికారులు, సిబ్బందికి పంచిపెట్టారు. సమస్యలతో వచ్చిన బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరిస్తూ వారికి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, మహిళా పీఎస్ డీఎస్పీ వి.వి.రమణకుమార్, సీఐలు వై.నాగరాజు, ఎం.శ్రీనివాసరావు, టి.విజయకృష్ణ, ఎస్.శ్రీకాంత్‌బాబు, ఎస్.జగదీష్, యు.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా గురువారం నుంచి ఎస్పీ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఎస్ఎస్‌పీ)హోదాలో వ్యవహరించనున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటాం: డీఆర్వో

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి డీఆర్వో ఓబులేసు అన్నారు. గురువారం తర్లుపాడు రోడ్డులోని కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను పలువురు అధికారులు, స్థానిక ప్రజలు కలిశారు. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్టు కోసం తాము భూములను త్యాగం చేశామని పెద్దారవీడు మండలం సుంకేసుల గ్రామస్థులు తెలిపారు. అంతకు ముందు డీఆర్వోను కలెక్టర్ కార్యాలయ అధికారి రవీంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ సుబ్బారావు తదితరులు కలిశారు.

డీఆర్వో ఓబులేసును మర్యాద పూర్వకంగా కలిసిన రెవెన్యూ అధికారులు

కలెక్టర్ కార్యాలయంలో అధికారుల నియామకం

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనా విభాగానికి సంబంధించిన అధికారులను ప్రభుత్వం నియమించింది. ఇన్‌ఛార్జి పరిపాలన అధికారిగా కె.రవీంద్రారెడ్డిని నియమించడంతో గురువారం విధుల్లో చేరారు. ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ సెక్షన్ అధికారిగా ఎం.ఆంజనేయరెడ్డి, సూపరింటెండెంట్ సమన్వయ సెక్షన్ అధికారిగా వి.కిరణ్ విధుల్లో చేరారు. సూపరింటెండెట్ ల్యాండ్ సెక్షన్-1 ఇన్‌ఛార్జి అధికారిగా కె.అర్జున్, సూపరింటెండెంట్ ల్యాండ్ సెక్షన్-2 ఎస్.అనిల్‌కుమార్‌లు విధుల్లో చేరారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి అధికారిగా ఎం.పద్మావతిని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయరుగా డి.పరిశుద్ధరావును నియమించారు.

ఎమ్మెల్యే ఉగ్రకు చెక్కు అందజేస్తున్న నాగరాజు

కనిగిరి ఆసుపత్రికి చేయూత

కనిగిరి, పీసీపల్లి, న్యూస్‌టుడే: కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి పీసీపల్లి మండలం పెదఅలవలపాడుకు చెందిన తెదేపా నాయకుడు పువ్వాడి నాగరాజు... తన తల్లిదండ్రులు పువ్వాడి నాగయ్య, జయమ్మల జ్ఞాపకార్థం రూ.1,11,111 సాయం అందజేశారు. కనిగిరి నగరవనంలో గురువారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి సంబంధిత చెక్కు అందజేశారు. సామాజిక బాధ్యతగా సాయం అందించిన నాగరాజును ఎమ్మెల్యే అభినందించారు.

నిత్యాన్నదానానికి ఎమ్మెల్యే దామచర్ల విరాళం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో శ్రీవెంకటేశ్వర స్వామివారి నిత్యాన్నదానానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తన కుటుంబ సభ్యులతో కలిసి విరాళం కింద రూ.21,63,740 ఇచ్చారు. ఈ మేరకు సదరు చెక్కును తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం రాత్రి జేఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

జేఈవో వెంకయ్య చౌదరికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, కుటుంబ సభ్యులు

అద్దంకి కాలువలో యువకుడి గల్లంతు

మామిళ్లపల్లి (సంతమాగులూరు), న్యూస్‌టుడే: నాగార్జున సాగర్ అద్దంకి బ్రాంచి కాలువలో ఓ యువకుడు గల్లంతైన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మామిళ్లపల్లికి చెందిన సీహెచ్.రాంబాబు (25) రైతు. కొత్త సంవత్సరం సందర్భంగా బుధవారం అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై కొమ్మాలపాడుకు వెళ్లారు. తిరిగి అర్ధరాత్రి సమయంలో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గంమధ్యలో మామిళ్లపల్లి సమీపంలోని ఎన్నెస్పీ అద్దంకి బ్రాంచి కాలువ వంతెన వద్ద ఆగారు. రాంబాబు ముఖం కడుక్కునేందుకు కాలువ వద్దకు వెళ్లి అందులో పడి గల్లంతయ్యారు. ఆయనతో పాటు వెళ్లిన మరో వ్యక్తి సమాచారాన్ని బాధిత కుటుంబ సభ్యులకు తెలిపారు. కాలువలో ఉన్న నీటిమట్టాన్ని తగ్గించి గల్లంతైన యువకుడి కోసం కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.

కారు ఢీకొని వివాహిత దుర్మరణం

అద్దంకి, న్యూస్‌టుడే : మోపెడ్‌ను కారు ఢీకొన్న సంఘటనలో భార్య మృతిచెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తిమ్మాయపాలెం సమీపంలో చోటుచేసుకుంది. 108 సిబ్బంది అందించిన సమాచారం మేరకు..ముండ్లమూరు మండలం పోలవరానికి చెందిన దంపతులు ఏడుకొండలు-రమణ (50) మోపెడ్‌పై స్వగ్రామం నుంచి అద్దంకి వస్తున్నారు. అదే మార్గంలో అద్దంకి నుంచి దర్శి వైపు వస్తున్న కారు మోపెడ్‌ను ఢీకొట్టింది. దీంతో దంపతులకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, మార్గంమధ్యలోనే రమణ మృతిచెందారు. భర్త ఏడుకొండలుకు మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు.

గాయపడిన ఏడుకొండలు

మద్యం మత్తులో కత్తితో దాడి

మద్దిపాడు, న్యూస్‌టుడే: యువతిని ఎందుకు వేధిస్తున్నావని అడిగినందుకు మద్యం మత్తులో ఓ వ్యక్తిపై యువకుడు కత్తితో దాడి చేసిన సంఘటన మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగన్నపాలెం ఎస్సీ కాలనీకి చెందిన యువతి విజయవాడలో చదువుతూ నూతన సంవత్సరం సందర్భంగా స్వగ్రామానికి వచ్చింది. అదే గ్రామానికి చెందిన పాలెటి ప్రదీప్‌కుమార్, మద్దు మాల ఆంజనేయులుతో కలిసి మద్యం తాగుతున్నాడు. ఆ సమయంలో అటుగా వెళుతున్న యువతిని చూసి.. ఎందుకు ఆమెను వేధింపులకు గురిచేస్తున్నావని ఆంజనేయులు అడగడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి వివాదం రేగింది. దీంతో యువకుడు తన వద్ద ఉన్న చాకుతో ఆంజనేయులు వీపుపై పొడిచాడు. అది చూసి అడ్డుకునేందుకు వచ్చిన బ్రహ్మయ్య అనే మరో వ్యక్తిపైనా దాడికి ప్రయత్నించాడు. ఈ ఘటనలో ఆంజనేయులు, బ్రహ్మయ్యలకు గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్సు ద్వారా చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. దీనిపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

మంచు జోరు.. జనం బేజారు!

ఉమ్మడి ప్రకాశం జిల్లాను గురువారం మంచు దుప్పటి కప్పేసింది. ప్రధానంగా ఒంగోలు నగరంపై తీవ్ర ప్రభావం చూపింది. నూతన సంవత్సర కానుకగా ఉదయం 9 గంటలదాకా నగరమంతా మంచు కమ్మేసింది. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రంగరాయుడు చెరువు పరిసరాలన్నీ మంచుతో ఆహ్లాదకరంగా కనిపించాయి. -ఈనాడు, ఒంగోలు

ద్విచక్ర వాహనాల ఢీ

▸ ఇద్దరి మృతి.. ఒకరికి తీవ్ర గాయాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా నుంచి పల్నాడు జిల్లాలోని మాచర్లకు పండ్లు, డ్రైఫ్రూట్స్ తెచ్చి అమ్ముకుని తిరిగి వెళుతూ ఇద్దరు దుర్మరణం చెందగా, మరొకరు గాయపడిన ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. మార్కాపురానికి చెందిన షేక్ కరీముల్లా (50) రెండు రోజులకోసారి పండ్లు, డ్రైఫ్రూట్స్ తెచ్చి మాచర్లకు చెందిన సమీప బంధువు నూర్జహాన్‌తోపాటు వ్యాపారం చేస్తుంటాడు. గురువారం వ్యాపారం ముగించుకుని నూర్జహాన్(45)తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. శిరిగిరిపాడు శివారులో మాచర్ల వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహేష్ ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో కరీముల్లా తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన నూర్జహాన్‌ను ఆసుపత్రికి తీసుకెళ్తుండగా చనిపోయారు. మృతుడు కరీముల్లాకు భార్య, కుమారుడు, నూర్జహాన్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

అంబులెన్స్ ఆలస్యమై..: ప్రమాదం విషయాన్ని 108కు సమాచారం ఇచ్చిన 50 నిమిషాలకు ఘటన స్థలానికి వచ్చింది. పది నిమిషాలు ముందు వచ్చినా క్షతగాత్రులు బతికే అవకాశాలు ఉన్నాయని స్థానికులు తెలిపారు.

కారులో ఎత్తుకెళ్లి పొలం రిజిస్ట్రేషన్

▸ బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

మూసాపేట, న్యూస్‌టుడే: తనను ఓ వ్యక్తి కారులో బలవంతంగా తీసుకెళ్లి పొలం రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు, పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలం ముమ్మిడివరం గ్రామానికి చెందిన రాజశేఖర్ (58) కొన్నాళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. కూకట్‌పల్లి పరిధి జయనగర్‌లో ఉంటున్నారు. ఇతను సొంత గ్రామానికి చెందిన వెంగల్‌రెడ్డి (35) వద్ద మూడేళ్ల క్రితం రూ.40 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ప్రస్తుతం వడ్డీతో కలిపి అది రూ.53 లక్షలకు చేరింది. ఎంతకూ బాకీ చెల్లించక పోవడంతో బుధవారం ఉదయం రాజశేఖర్ ఇంటికి వచ్చి అతన్ని బలవంతంగా తన కారులో ఎక్కించుకొని సొంతూరుకు తీసుకెళ్లాడు. అక్కడ రాజశేఖర్‌కు చెందిన 2 ఎకరాల వ్యవసాయ భూమిని బెదిరించి తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అనంతరం సాయంత్రానికి వదిలి వెళ్లాడు.

తప్పిపోయిన బాలుడు తండ్రికి అప్పగింత

దగదర్తి, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనేందుకు తండ్రితో కలిసి దగదర్తికి వచ్చిన బాలుడు గురువారం తప్పిపోగా.. గుర్తించిన పోలీసులు తిరిగి అప్పగించారు. ప్రకాశం జిల్లా పామూరు పట్టణానికి చెందిన సుబ్బరాయుడు తన మూడేళ్ల కుమారుడు అనోస్‌తో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనేందుకు దగదర్తిలోని ఓ ప్రార్థనా మందిరానికి వచ్చారు. ఆసమయంలో బాలుడు బయటకు వచ్చి దారి తప్పి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఏడుస్తూ వెళుతున్నాడు. అటుగా వెళుతున్న గ్రామంలోని మిక్స్‌డ్ కాలనీకి చెందిన విజయనిర్మల గుర్తించి తీసుకెళ్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించింది. ఎస్సై తన సిబ్బంది గ్రామంలో విచారించారు. ప్రార్థనా మందిరం వద్ద తండ్రి సుబ్బరాయుడుకు అప్పగించారు.

బాలుడితో ఎస్సై జంపానికుమార్, తండ్రి, అప్పగించిన మహిళ

ఫోన్‌పే పేరిట మోసం.. భారీగా నగదు మాయం

అద్దంకి, న్యూస్‌టుడే : ఫోన్ పే చేసిన కొన్ని క్షణాల్లోనే భారీ నగదు మాయమైంది. ఈ సంఘటన అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు.. ఒంగోలుకు చెందిన యువకుడు నరసరావుపేట వెళ్లేందుకు అద్దంకి వచ్చాడు. బస్టాండ్‌లోని నరసరావుపేట పాయింట్ వద్ద కూర్చొని ఉండగా, ఓ ఆగంతకుడు వచ్చి తన ఫోన్‌పేలో నగదు లేదని, ఓ వంద ఇచ్చి ఫోన్‌పే ఖాతాకు పంపమని కోరాడు. దీంతో నగదు బదిలీ చేశాడు. కొద్ది సేపటి తర్వాత బ్యాంక్ ఖాతాలో భారీ నగదు గల్లంతైనట్లు గుర్తించి అవాక్కయ్యాడు. వెంటనే ఆర్టీసీ అధికారుల ద్వారా పోలీసుల్ని సంప్రదించగా.. బ్యాంక్ ఖాతాను సీజ్ చేయించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ప్రముఖ చెప్పుల వ్యాపారి గుండవరపు నరసింగరావు కుమారుడు శివాజీ (36) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బుధవారం తిరుపతి నుంచి కందుకూరుకు కారులో వస్తుండగా.. శ్రీకాళహస్తి సమీపంలో టైరు పంక్చరైంది. వాహనం దిగి పరిశీలిస్తుండగా.. ద్విచక్ర వాహనదారుడు వేగంగా వచ్చి శివాజీని ఢీకొట్టాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా మారడంతో బంధువులు నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, తెదేపా నాయకులు, పలువురు ప్రముఖులు శివాజీ మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 152, రిటైల్ లైవ్ - 179, చికెన్ విత్ స్కిన్ - 260, చికెన్ స్కిన్‌లెస్- 295

బడిలోనే భవిత పాఠం

• విద్యాశాఖ కెరియర్ ఎక్స్‌పోలో ఆకట్టుకున్న విద్యార్థులు

ఉన్నత పాఠశాలల్లో చదువుతున్నప్పుడే భవిష్యత్తుపై విద్యార్థులకు అవగాహన ఉండాలనేది ప్రభుత్వ ఆలోచన. దానిలో భాగంగా ఈ ఏడాది సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో కెరియర్ ఎక్స్‌పో కార్యక్రమం చేపట్టింది. మొదటి సారిగా పాఠశాల స్థాయిలో ప్రదర్శన నిర్వహించారు. కెరియర్‌పై మంచి అవగాహన కలిగిన వారిని మండలానికి అయిదుగురిని ఎంపిక చేసి ఒంగోలు నగరంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఎక్స్‌పోకు పంపించారు. ఈ సందర్భంగా కెరియర్‌పై వారికున్న అవగాహనను ఇతర విద్యార్థులతో పంచుకున్నారిలా.

- న్యూస్‌టుడే, ఒంగోలు నగరం, మార్కాపురం

ఇంటి వద్దనే సంపాదన

విద్యార్థి : శ్రీవిద్య, జడ్పీ బాలికోన్నత పాఠశాల, మార్కాపురం

అంశం: చదువు మీద ఆసక్తిలేక మధ్యలో మానేసినవారు ఇంటివద్దనే కుట్టు, అల్లికలు, గృహోపకరణాలు తయారు చేసి ఆదాయం పొందవచ్చు. డాక్టర్లు, ఇంజినీర్లు కావాలంటే ఏమి చదవాలనేది చక్కగా వివరించింది.

క్లౌడ్ కంప్యూటింగ్‌తో ఉజ్వల భవిష్యత్తు

విద్యార్థులు: గోపి, అంకమ్మరావు, దేవరంపాడు జడ్పీ హైస్కూలు

అంశం: డేటా సైన్స్, ఎనలైజర్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్‌కంప్యూటింగ్ రంగాల్లో భవిష్యత్తులో ఉన్న అవకాశాల గురించి వివరించారు.

సీపీఆర్ అందరికీ తెలియాల్సిందే..

విద్యార్థులు: బి.భావన, మోహన్‌తేజ్, 9వ తరగతి, మర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాల

అంశం: సీపీఆర్, బయోవేస్ట్‌పై ప్రాజెక్టు ప్రదర్శించారు. చిన్నవయసులోనే సీపీఆర్ గురించి తెలుసుకుంటే గుండెపోటుతో అపస్మారిక స్థితికి వెళ్లినవారి ప్రాణాలు కాపాడవచ్చు. అదే విధంగా చెత్తనుంచి సంపద ఎలా పొందవచ్చో వివరించారు.

సేద్యంతో ఉపాధి పొందడంపై..

విద్యార్థులు: రిష్తిక, దీప్తి, వర్షిత, 9వ తరగతి, కామేపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల

అంశం: డిగ్రీలు చదివాక ప్రభుత్వ ఉద్యోగం కోసం వేచిఉండాల్సిన పనిలేదు. ప్రభుత్వ పథకాలు ఆసరాగా పాడిపరిశ్రమ, ప్రకృతి సేద్యం, ఉద్యానసాగు, శీతలగిడ్డంగులు, డ్రోన్ టెక్నాలజీ తదితర విభాగాల్లో స్థిరమైన ఆదాయం పొందవచ్చు.

డేటా బేస్డ్ ఉద్యోగాలు

విద్యార్థులు: సులోచన, మౌనిక, 9వ తరగతి, డీఆర్ఆర్ మున్సిపల్ హైస్కూలు

అంశం: డిగ్రీ, ఇంజినీరింగ్‌లో కంప్యూటర్ ఆధారిత ఉద్యోగాలు ఎలా పొందవచ్చునేది వివరించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

REAL ESTATE
PLOT FOR SALE
వినుకొండ దొనకొండ 133 గజాలు (2.75 సెంట్లు) ఇంటి స్థలం కేవలం 99999/- మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 9398621767

JOBS
ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ/ డిప్లమో అర్హతతో కనీసం 2 సం॥లు అనుభవం ఉండాలి. ఆకర్షణీయమైన జీతం. అమరావతిరూఫింగ్ కంపెనీ. ఒంగోలు. ✆: 8121789333.

SECURITY GUARDS
సెక్యూరిటీగార్డులు (స్త్రీ/ పురుషులు) కావలెను. ఒంగోలు అద్దంకి బస్టాండ్ ఏరియాలో ప్రముఖ షాపింగ్ మాల్‌లో 30 రోజులు పని చేయుటకు. రోజుకి రూ॥ 500/-. సంప్ర : 7285963951/ 8099444758.

(c) eenadu

కందుకూరు

•కందుకూరు •కొండపి

నూతన సంవత్సర వేడుక.. ఆనంద గీతిక

మంత్రి స్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెదేపా నాయకులు

టంగుటూరు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా తూర్పు నాయుడుపాలెంలోని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి క్యాంపు కార్యాలయంలో గురువారం సందడి నెలకొంది. ఈ సందర్భంగా భారీ కేకులు కోశారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. పలువురు నాయకులు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గొర్రెపాటి రామయ్యచౌదరి, రామా గోపి, వీరభోగ వసంతరావు, కొండ్రగుంట శ్రీనివాసరావు, కర్ణ కోటిరెడ్డి, బత్తుల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

● కందుకూరు పట్టణం: స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారీ కేకును ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోశారు. 2026 ప్రారంభంలో కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపడం శుభపరిణామమన్నారు. ఈ ఏడాది నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందనుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రభుత్వ వైద్యశాలకు రూ.2 లక్షల విరాళం అందజేశారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ డి.హిమవంశీ, డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటల దాటాక యువతీయువకులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు.. ఆయన స్వగ్రామం బడేవారిపాలెంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. పలువురు నాయకులు, అధికారులు ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు.

● కొండపి గ్రామీణం: ముప్పవరంలో తెదేపా సీనియర్ నాయకుడు బత్తుల నారాయణస్వామి ఆధ్వర్యంలో కేక్ కోసి, బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

● మర్రిపూడి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కందుకూరులో కేకు కోస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ముప్పవరంలో..

ఎస్సైగా బాధ్యతల స్వీకరణ

పొన్నలూరు, న్యూస్‌టుడే: పొన్నలూరు పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా నియమితులైన **పాలూరు సత్యనారాయణ** గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గుంటూరు జిల్లా నల్లపాడు స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన కట్టా అనూక్‌ను పామూరు స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

కూలి కంటే.. పాడి మిన్న..!

శీతలీకరణ కేంద్రాలకు తరలిస్తున్న పాలు

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పాడి పంటలు సక్రమంగా ఉంటే ఆ గ్రామాలు సిరిసంపదలతో కళకళలాడుతుంటాయి. మండలంలోని మాచవరం గ్రామంలో 1900 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో సుమారు 400 పాడిపైనే ఆధారపడి జీవిస్తుంటాయి. ఈ విషయంలో మహిళలు ముఖ్య భూమిక పోషిస్తూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. గ్రామంలో ఆవులు 150, గేదెలు 2200 వరకు ఉన్నాయి. వీటి ద్వారా నిత్యం 1800 లీటర్ల వరకు పాలు ఉత్పత్తి అవుతాయి. వీటిని కొందరు స్థానికంగా ఉన్న అయిదు కేంద్రాల్లో పోస్తుంటే.. మరికొందరు విడిగా విక్రయిస్తుంటారు. పాల కేంద్రాల్లో వెన్న శాతం 10 వస్తే లీటరుకు రూ.83 చెల్లిస్తున్నారు. సరాసరిన రోజుకు రూ.1.50 లక్షల వరకు వ్యాపారం సాగుతోంది. కొందరు ప్రత్యేకంగా చిన్నక్యాన్లు ఏర్పాటు చేసుకుని నేరుగా శీతలీకరణకు కేంద్రాలకు ఆటోల్లో పంపుతున్నారు. వీరికి ప్రతి పదిరోజులకోసారి వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. గ్రామంలో నెలకు పాడిపరిశ్రమ ద్వారా రూ.50 లక్షల వరకు నగదు మహిళల చేతికి అందుతుంది. కుటుంబ అవసరాలకు ఇవి ఎంతో చేదోడుగా ఉంటున్నాయని వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోజు వారి వ్యవసాయ పనులకు వెళ్తే రూ.350 కూలి వస్తుందని, పాడి పశువుల ద్వారా అంతకంటే ఎక్కువగా సంపాదిస్తున్నామని ధీమాగా చెబుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కందుకూరు: 70939 81624
కొండపి: 96424 56296

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: జాతీయ రహదారిపై మాల్యాద్రికాలనీ వద్ద కుక్కల బెడద అధికంగా ఉంది. ద్విచక్ర వాహనదారుల వెంట పడుతుండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. –రమేష్, కందుకూరు
✓: కుక్కల బెడద తొలగించేందుకు చర్యలు చేపడతాం. –రత్నజ్యోతి, ఎంపీడీవో కందుకూరు

?: అయ్యవారిపల్లె ఎస్సీ కాలనీలో రక్షిత పథకానికి చెందిన పైపులైన్ లీకు కారణంగా నీరు వృథా అవుతోంది. –కోటయ్య, స్థానికుడు
✓: మరమ్మతులు చేయిస్తాం. –రవి, పంచాయతీ కార్యదర్శి

?: స్థానిక పంచాయతీ కార్యాలయం వీధిలో రాత్రి సమయంలో దీపాలు వెలగడం లేదు. –నవీన్ చౌదరి, స్థానికుడు
✓: పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. –నరేశ్, పంచాయతీ కార్యదర్శి

?: మర్రిపూడి పడమర బజారులోని మహలక్ష్మీ అరుగు సమీపంలో రహదారి అంచులో చెత్త పేరుకుపోయింది. –వెంకటేశ్వర్లు, మర్రిపూడి
✓: వెంటనే పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. –బీవీ నాయుడు, పంచాయతీ కార్యదర్శి

?: పట్టణంలోని పోతురాజుమిట్ట నుంచి డంపింగ్ యార్డుకు వెళ్లే దారిలో పెద్ద కాలువపై చప్టా మరమ్మతులకు గురై ప్రమాదకరంగా ఉంది. –ఎస్.మనోజ్, యర్రగుంటపాలెం
✓: మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. –గణపతి, మున్సిపల్ డీఈ

న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం, వలేటివారిపాలెం, గుడ్లూరు, మర్రిపూడి, కందుకూరు పట్టణం

కలెక్టర్‌ను కలిసిన కందుకూరు శాసనసభ్యుడు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఒంగోలులో జిల్లా కలెక్టర్ రాజాబాబును పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు ఉప కలెక్టర్ హిమ వంశీ తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

విద్యార్థుల చదువుకు చేయూత

మద్దిపాడు, న్యూస్‌టుడే: గ్రామస్థులు సహకరిస్తే పడియాపూడిలో శుద్ధజల కేంద్రం ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నమనేని ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రత్నాకర్‌రావు తెలిపారు. ఇంజినీరింగ్ చదువుతున్న గ్రామానికి చెందిన ఆరుగురు పేద విద్యార్థులకు గురువారం రూ.80 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు కోటేశ్వరరావు, మానికొండ సుబ్బారావు పాల్గొన్నారు.

నమ్మండి.. ఇది సర్పంచి ఉండే కాలనీ..!

కాలువల దుస్థితి ఇలా..

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎటు చూసిన సమస్యలే. పట్టించుకునేవారు లేక నిరంతరం ఇబ్బందులే. ఇది ఎక్కడో కాదండి మండల కేంద్రం కొండపి ఎస్సీ కాలనీలోని దుస్థితి. గ్రామ సర్పంచి ఎన్నికలు నిర్వహించి అయిదు నెలలు దాటినా ఇక్కడి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. గ్రామ మొదటి పౌరుడు ఉండే చోటే ఈ విధంగా ఉంటే.. ఇక గ్రామం మొత్తం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని బహిరంగంగా విమర్శలున్నాయి. ఎస్సీ కాలనీలో స్తంభం శిథిలావస్థకు చేరి ఏడాది దాటింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు అనేకసార్లు తెలియజేసినా స్పందించడం లేదంటున్నారు. కాలువల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో మురుగు పారక దుర్వాసనతో పాటు దోమలు పెరిగిపోయి.. పగలు, రాత్రి తేడా లేకుండా కుడుతుండటంతో డెంగీ, మలేరియా వంటి విష జ్వరాల బారిన పడతామేమోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు అధ్యాపకులు కృషి చేయాలని ఆర్ఐవో కె.ఆంజనేయులు సూచించారు. రాష్ట్ర ఒప్పంద అధ్యాపకుల జేఏసీ ఛైర్మన్ కుమ్మరకుంట సురేష్, ఇతర సభ్యులు ఆర్ఐవోని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఐవో మాట్లాడుతూ ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రానున్న పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రాక్టికల్, థియరీ పరీక్షల నిర్వహణలో కాంట్రాక్టు అధ్యాపకులకు సముచిత స్థానం కల్పించాలని జేఏసీ ప్రతినిధులు ఆర్ఐవోని కోరగా.. సానుకూలంగా స్పందించారు. మార్గదర్శకాల ప్రకారం న్యాయం చేస్తానన్నారు. బీవీ కాశీరత్నం, వెంకట్రావు తదితరులు కలసిన వారిలో ఉన్నారు.

వసతి గృహ విద్యార్థినులకు ఇబ్బందులు రానీయొద్దు

మెడికల్ కిట్లు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ హిమవంశీ

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ వసతి గృహ విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు రానీయొద్దని సబ్‌కలెక్టర్ డి.హిమవంశీ సూచించారు. పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా వసతి గృహాన్ని గురువారం సాయంత్రం సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పడక గదులు, భోజన వంటశాల, మెడికల్, కిట్లు తదితరాలను పరిశీలించి, వసతి గృహ సంరక్షకులకు సూచనలు చేశారు. లైట్లు, ఫ్యాన్లు మరమ్మతులకు గురైతే వెంటనే సరిచేయించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి నూతన సంవత్సర కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గుడ్లూరు: పుష్పాలంకరణలో వేణుగోపాలుడు

గుడ్లూరు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా గురువారం పలు ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారు జాము నుంచే తరలివెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కొత్త ఏడాదిలో తమ జీవితం ఆనందమయంగా ఉండాలని ప్రార్థించారు. గుడ్లూరు వేణుగోపాలస్వామి, రావూరు బండ్లమాంబ వేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

కందుకూరు గ్రామీణం: మోపాడు సాయి సౌందర్యలహరి ఆలయాన్ని పూలతో అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. మాచవరం వీరాంజనేయస్వామిని గజమాల, తమలపాకులతో అలంకరించారు. ఆకు పూజలు చేశారు.

ప్రత్యేక అలంకరణలో మాచవరం వీరాంజనేయస్వామి

ప్రభుత్వ రాజముద్రతో పాసు పుస్తకాలు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో నూతన పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ రాజేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియ ఈ నెల 9 వరకు కొనసాగుతుందన్నారు. 2న మూలగుంటపాడు, 3న కలికవాయ, 5న కనుమళ్ల గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన పాసు పుస్తకాలను రద్దు చేసి, కొత్తగా ప్రభుత్వ రాజముద్రతో అందిస్తామని వెల్లడించారు. రైతులు ఈకేవైసీ నమోదు చేయించుకొని ఉండాలన్నారు.

జలాశయం దారి.. దారుణంగా మారి!

రాళ్లపాడు జలాశయం తారు రోడ్డు గోతులతో అధ్వానంగా తయారైంది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రాజెక్టు నుంచి కొత్తపేట వరకు చాలా చోట్ల రోడ్డు దెబ్బతింది. అధికారులు స్పందించి.. మరమ్మతులకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, లింగసముద్రం

వ్యర్థాలతో రాకపోకలకు అసౌకర్యం

మండల కేంద్రం ఉలవపాడు సొసైటీ వీధిలో రెండ్రోజులుగా వ్యర్థాలు తొలగించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపైకి చేరడంతో రాకపోకలు సాగించేందుకు పాదచారులు అసౌకర్యానికి గురౌతున్నారు. - న్యూస్‌టుడే, ఉలవపాడు

ఉన్నాయంతే.. చుక్కనీరు రాదంతే..!

మండలంలోని కాకుటూరు పంచాయతీ చెర్లోపాలెంలో 2022లో రూ.8 లక్షలతో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నీరు సరఫరా లేకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. చేసేది లేక ప్రైవేటు కేంద్రాల్లో కొనుగోలు చేసి గొంతు తడుపుకోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కుళాయిలకు నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వలేటివారిపాలెం

చుట్టూ అపరిశుభ్రతే..!

ఎం.నిడమానూరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ట్యాంకులు ఏర్పాటు చేశారు. వాటిలో కొన్ని మాత్రమే వినియోగిస్తుండగా.. మరికొన్ని మూలకు చేరాయి. వాటి సమీపంలో మురుగు కాలువలు నిర్మించలేదు. దీంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. చేసేది లేక స్థానిక ప్రజలు అక్కడే నీటిని పట్టుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మురుగు కాలువలు నిర్మించి, రోగాలు బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, టంగుటూరు

తీరం.. నూతనోత్సాహం!

నూతన సంవత్సరం సందర్భంగా గురువారం కొత్తపట్నం కె.పల్లెపాలెం సముద్రతీరానికి పర్యాటకులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి కుటుంబంతో కలిసి వచ్చారు. ఉదయం నుంచే తీరంలో సందడి వాతవరణ నెలకొంది. చిన్న, పెద్ద, యువత చేరుకొని హ్యాపీ న్యూ ఇయర్ అంటూ పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. సముద్రంలో దిగి స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. -న్యూస్‌టుడే, కొత్తపట్నం

జోరుగా జామాయిల్ సాగు

టంగుటూరు, న్యూస్‌టుడే: మూడేళ్ల కిందట జామాయిల్ కర్ర టన్ను రూ.1500లకు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. గతేడాది పొగాకుకు గిట్టుబాటు ధర లేకపోవడం, తక్కువ పెట్టుబడి, పంట మార్పిడి, కౌలు మొత్తాలు పడిపోవడం వంటి కారణాలతో జామాయిల్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ధరలు కూడా ఆశాజనకంగా ఉండటంతో మరింత మంది అటువైపు మొగ్గుచూపుతున్నారు.

కలిసొచ్చిన కాలం..

మూడేళ్ల కిందట పొగాకు సాగు గిట్టుబాటు కావడంతో భూమి కౌలు ధరలు విపరీతంగా పెంచారు. 2024-25 ఏడాదిలో ఆశించిన స్థాయిలో లేకపోవడంతో కౌలు మొత్తాలు సైతం తగ్గించారు. ఈ నేపథ్యంలో పొగాకు సాగు ఇష్టం లేని రైతులు జామాయిల్ వేస్తున్నారు. ప్రస్తుతం ఆ పంట టన్ను రూ.6 వేల వరకు పలుకుతోంది. ప్రస్తుతం ఎక్కడా లేకపోవడంతో డిమాండ్ ఏర్పడింది. దీంతో సాగులో ఉన్న దాని కోసం రైతుల చుట్టూ వ్యాపారులు తిరుగుతున్నారు. అలాగే పేపర్ పరిశ్రమలకు సైతం ఎగుమతులు ఊపందుకున్నాయి.

టంగుటూరు సమీపంలో సాగులో ఉన్న పంట

గంగమ్మా.. కరుణించమ్మా..!

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల కేంద్రం మద్దిపాడులోని గంగమ్మతల్లి ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచింది. పురాతన కాలం నుంచి భక్తుల పూజలందుకుంటుంది. చుట్టుపక్కల వెల్లంపల్లి, రాచవారిపాలెం గ్రామాలతోపాటు, జిల్లాలోని కరవది, సింగరాయకొండ, దొనకొండ, పాలేటిగంగ తదితర ప్రాంతాల భక్తులు ఇక్కడికి వస్తుంటారు. సంతానం లేని మహిళలు అమ్మవారిని పూజిస్తే సంతానం పొందుతారని భక్తుల నమ్మకం. మద్దిపాడులో అమ్మవారి పేరుతో ఆడపిల్లలకు గంగా భవాని, మగపిల్లల పేర్లు గంగయ్య, గంగాధర్‌ల పేరుతో సుమారు వంద మందికి పైగా ఉండడం విశేషం. ఇటీవల ఆలయంలో మధురై శిల్ప కళాకారులతో నిర్వాహకులు, భక్తులు కలిసి రూ.85 లక్షలు వెచ్చించి ఇత్తడి, వెండి పూతతో అలంకరణ చేయించారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

యోగాతో ఆరోగ్యం.. ఆనందం

ఒంగోలు అంజయ్యరోడ్డు: యోగా సాధనతో ఉత్సాహంగా ఉంటారని గురువు గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఒంగోలు నగరంలోని గాంధీపార్కు పతంజలి పవర్ యోగా సభ్యులంతా కలిసి యోగా గురువు అధ్యక్షతన వేడుకలు జరుపుకొన్నారు. ముందుగా సూర్య నమస్కారాలు, యోగాసనాలు సాధన చేశారు. అనంతరం కేకు కోసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గాంధీపార్కులో 14 సంవత్సరాలుగా నిత్యం యోగా సాధన చేస్తున్నామని చెప్పారు. దీనివల్ల ఆరోగ్య సమస్యలను, మానసిక ఒత్తిడిలను అధిగమిస్తున్నామని వివరించారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

ఏపీజీఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా సంఘం (ఏపీజీఈఏ) ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సీహెచ్.కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు మాల కొండారెడ్డి, వరకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే.. వాగులోకే..!

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు మండలం ఎం.నిడమానూరు పరిధిలో ముసి వాగుపై 30 ఏళ్ల కిందట వంతెన నిర్మించారు. ఏటా కురుస్తున్న వర్షాలకు వాగు పొంగి నీరంతా వారధిపై ప్రవహిస్తుంది. మరోవైపు దాని సిమెంట్ దిమ్మెలు వాహనాలు తగలడంతో దెబ్బతిన్నాయి. మరికొన్ని ప్రవాహానికి కొట్టుకుపోయాయి. ఈ మార్గంలో కొండపి, టంగుటూరు మండలాల ప్రజలు ఒంగోలు, సంతనూతలపాడు మండలాల పరిధిలోని గ్రామాలకు ప్రయాణిస్తుంటారు. వంతెనపై ప్రయాణించే సమయంలో ఏ మాత్రం వాహనం అదుపుతప్పినా వాగులో పడిపోయే అవకాశం ఉంది. ప్రమాదం జరగక ముందే అధికారులు మేల్కొని ఉపశమన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అసలే గోతులు.. ఆపై రాళ్లు..!

మర్రిపూడి, న్యూస్‌టుడే: మర్రిపూడి నుంచి వల్లాయిపాలెం వెళ్లే రహదారి పలు చోట్ల రాళ్లు తేలి గోతలమయంగా మారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. దుగ్గిరెడ్డిపాలెం, వల్లాయిపాలెం, శివరాయునిపేట, కాకర్ల, చిలంకూరు తదితర గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రం మర్రిపూడికి అటుగా రాకపోకలకు సాగిస్తుంటారు. అయిదు కిలోమీటర్ల దారిలో దుగ్గిరెడ్డిపాలెం సమీపంలోని మలుపులో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రాత్రి వేళ గోతులు సరిగా కనిపించక ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోయి గాయపడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ రహదారి మరమ్మతుల నిమిత్తం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేయిస్తామని తెలిపారు.

క్రీడా పోటీ.. వీరికిలేరు సాటి!

న్యూస్‌టుడే, ఒంగోలు కర్నూలు రోడ్డు: క్రీడా పోటీల్లో పురుషులకు తామేమీ తక్కువ కాదని నిరూపిస్తున్నారు ఈ యువతులు. చదువుతోపాటు తమకు ఆసక్తి ఉన్న వాలీబాల్, ఖోఖో, షటిల్, టేబుల్ టెన్నిస్, పరుగుపందెం, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, చదరంగం తదితర క్రీడల్లో నిత్యం సాధన చేస్తూ ఆటపై పట్టు సాధిస్తున్నారు. పోటీలు ఎక్కడ జరిగినా.. భాగస్వాములై సత్తా చాటుతున్నారు. ఇటీవల కొత్తపట్నం మండలం ఈతముక్కల ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన రీజనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న వీరు తాము సాధించిన విజయాలు, ఇతర వివరాలను పంచుకున్నారిలా.

ఆటల్లో రాణిస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థినులు

ఇటీవల ఈతముక్కల కళాశాలలో పరుగు పందెంలో విద్యార్థినులు

నాన్న స్ఫూర్తితో..

నా పేరు **వరలక్ష్మి.** ఒంగోలు డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నా. మా నాన్న పీటీ అయినందువల్ల నాకు చిన్నప్పటి నుంచే ఆటలపై ఆసక్తి పెరిగింది. పరుగుపందెంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడి అనేక పతకాలు సాధించా. జాతీయ స్థాయిలో రాణించడమే నా ధ్యేయం.

వాలీబాల్ పోటీల్లో సత్తా..

నా పేరు **మానస.** ఈతముక్కల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నా. ఏడో తరగతి నుంచే ఆటలు ఆడుతున్నాను. వాలీబాల్ అంటే ఎంతో ఆసక్తి. ఇప్పటికే జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొని మా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించా. మళ్లీ ఇప్పుడు పోటీల్లో తలపడ్డా. రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించడమే నా లక్ష్యం.

జాతీయ స్థాయిలో తలపడ్డా..

నా పేరు **కీర్తన.** నేను ఒంగోలు రైస్ కళాశాలలో చదువుతున్నా. ఆరో తరగతి నుంచే ఫెన్సింగ్ ఆట అంటే చాలా ఇష్టం. నాటి నుంచి ప్రత్యేకంగా రోజూ సాధన చేస్తూ పోటీల్లో పాల్గొంటున్నా. జాతీయ స్థాయిలో 16వ స్థానం వరకు వెళ్లాను. చదరంగం పోటీల్లోనూ రాణిస్తున్నా. 2024 పోటీల్లో రెండో స్థానంలో నిలిచాను. అంతర్జాతీయ స్థాయిలో ఆడాలనేదే నా లక్ష్యం.

పరుగులో దూసుకెళ్తూ..

నా పేరు ప్రశాంతి. ఈతముక్కల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నా. నాకు పరుగుపందెం అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. అందుకోసం రోజూ సాధన చేసి అనేక పోటీల్లో పాల్గొన్నా. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ తలపడ్డా. సెమీ ఫైనల్స్‌లో మూడో స్థానంలో నిలిచాం. జాతీయ స్థాయిలో పతకం సాధించడమే లక్ష్యం.

పేదలకు బియ్యం పంపిణీ

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అయిదు పేద కుటుంబాలకు జనసైనికులు గురువారం బియ్యం బస్తాలను అందజేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా ఒక్కొక్కరికి 25 కిలోల ప్యాకెట్లు రెండు చొప్పున మొత్తం పది బస్తాలు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో జనసైనికులు సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌ను ఒంగోలులోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆరెం వెంకటేశ్వర్లు, సుద్దపల్లి పవన్, నూనె శ్రీను, సత్యం, దమ్ము సురేష్, తిరుమలశెట్టి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

అద్దంకి
•అద్దంకి • దర్శి

సేవామార్గం అనుసరణీయం

ఎన్టీఆర్‌నగర్(అద్దంకి), న్యూస్‌టుడే : సేవామార్గం అనుసరణీయమని ఉత్తర ధ్రువ తెదేపా నేత కోనేటి అనిల్‌కుమార్ అన్నారు. ఎన్టీఆర్‌నగర్‌లోని హోసన్నా అపోస్తలిక్ ప్రార్థనామందిరం వద్ద 30 మందికి చీరలు పంపిణీ చేశారు. అనంతరం 150మంది స్థానికులకు అన్నదానం జరిపించారు. నాగరాజు, వి.నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్ ప్రార్థనామందిరం వద్ద మహిళలకు దుస్తులు అందిస్తున్న దాత కోనేటి అనిల్

బల్లికురవ, న్యూస్‌టుడే: క్రీస్తు బోధనలు అనుసరణీయమని క్రిస్టర్ ఇంబార్ట్, మండల సీనియర్ నాయకులు మల్లినీడి గోవిందరావు అన్నారు. గుంటుపల్లి ఎస్సీ కాలనీలోని క్రైస్తవ ప్రార్థన మందిరంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన మాట్లాడారు. అనంతరం క్రైస్తవ మత బోధకులు గోవిందరావును సన్మానించి పూలమొక్కను అందజేశారు. ఎస్సీ కాలనీలో అన్న సంతర్పణ నిర్వహించారు. కోయి పేరయ్య, ఎంపీటీసీ శ్రావణి పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుకు మొక్కను అందజేస్తున్న పాస్టర్

ఉత్సాహంగా పొట్టేళ్ల బలప్రదర్శన

జె.పంగులూరు, న్యూస్‌టుడే: రేణింగవరం గ్రామంలో గొట్టిపాటి యువసేన ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పొట్టేళ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 41 బృందాలు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి కామమాను బాలకృష్ణ కైవసం చేసుకోగా, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు వరుసగా మేదరమెట్ల రవి, కొణిదెన మణి, రేణింగవరం గంగమ్మ తల్లి పొట్టేళ్లు కైవసం చేసుకున్నాయి. విజేతలకు బోరెడ్డి ఓబుల్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. వీక్షించేందుకు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

విజేతకు బహుమతి అందిస్తున్న బోరెడ్డి ఓబుల్‌రెడ్డి

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

జె.పంగులూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు మండలంలోని తూర్పు తక్కెళ్లపాడు గ్రామంలో కమ్యూనిటీ భవనం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం ముప్పవరం క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని మంత్రి కార్యాలయ ప్రతినిధి తెలిపారు. స్థానికులు తమ సమస్యలను మంత్రికి నివేదించవచ్చని ఆయన చెప్పారు.

ఇంటికి వెళ్లి ఆహ్వానిస్తున్న ప్రతినిధులు

4న హిందూ సమ్మేళనం

అద్దంకి, న్యూస్‌టుడే : అద్దంకి పట్టణంలో ఈనెల 4న జరిగే హిందూ సమ్మేళనంలో పాల్గొనాల్సిందిగా పట్టణ ప్రజలకు ఆహ్వాన కమిటీ బాధ్యులు గురువారం ప్రచారం చేశారు. రామ్‌నగర్ నుంచి ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికి వేర్వేరు బృందాలు వెళ్లి ఆహ్వాన పత్రికలు అందిస్తున్నాయి. ఆదివారం సాయంత్రం జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చండి వేదాశ్రమం వ్యవస్థాపకులు చండీశ్వర శర్మాజీ హాజరవుతారని, ఆధ్యాత్మిక ప్రవక్తగా వేమూరి రమాసుందరి వ్యవహరిస్తారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ సమ్మేళనం నిర్వహిస్తారన్నారు.

జనసేనలో చేరిన వారికి సత్కారం

దర్శి, న్యూస్‌టుడే: దర్శి జనసేన కార్యాలయంలో ఇటీవల పార్టీలో చేరిన ఆర్యవైశ్య ప్రముఖులను గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతరావు, పాపారావు, రామారావు, ప్రసాద్, వెంకటశేషయ్య, ఇతరులు పాల్గొన్నారు.

3న సర్వసభ్య సమావేశం

జె.పంగులూరు, న్యూస్‌టుడే: ఈ నెల 3న ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు. ఈ సమావేశానికి మండలస్థాయి వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అజెండాకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆమె కోరారు.

ఋణమే.. నవ్య కిరణమై..

☛ నారీలోకం ఉపాధి పయనం

ప్రస్తుతం పురుషులకు దీటుగా నారీలోకం రాణిస్తోంది. ప్రభుత్వ పథకాలు, రాయితీలు సద్వినియోగం చేసుకుని ఉపాధి బాటలో కాంతులీనుతోంది. రూ.కోట్లాది రుణాలు తీసుకుని సకాలంలో చెల్లిస్తూ పలువురిలో స్ఫూర్తి నింపుతోంది.
-న్యూస్‌టుడే, తాళ్లూరు

రూ.20 లక్షల మంజూరుపత్రం అందుకుంటున్న మహిళలు

దర్శి నియోజకవర్గ పరిధిలోని అయిదు మండలాల్లో 5,916 స్వయం సహాయక సంఘాలుండగా, వీటిలో 59,080 మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. వారు పాడి పరిశ్రమ, కిరాణా, ఫ్యాన్సీ, దుస్తులు, చిరు వ్యాపారాలతో జీవనోపాధి పొందుతున్నారు. సంఘం ప్రారంభించిన కొత్తలో రూ.యాభై వేలే బ్యాంకర్లు అందజేయగా, ప్రస్తుతం రూ.లక్షన్నర వంతున ఇస్తున్నారు. గతంలో ఒక్కో సంఘానికి గరిష్ఠంగా రూ.అయిదు నుంచి పది లక్షల వరకూ అందివ్వగా.. ప్రస్తుతం రూ.20 లక్షల వరకూ రుణ పరపతి కల్పిస్తుండటంతో వారంతా కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తున్నారు.

భారీగా చేయూత అందుకుని..

దర్శి నియోజకవర్గం పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ బ్యాంకుల ద్వారా ఇప్పటికీ రూ.170 కోట్ల మేర రుణాలు పంపిణీ చేశారు. మార్చి లోగా మరో రూ.125 కోట్ల మేర అందజేసేందుకు వెలుగు, బ్యాంకు అధికారులు యత్నాలు చేస్తున్నారు. ఒక్కో సంఘానికి రూ.పది లక్షలను వడ్డీ లేని రుణంగా ప్రభుత్వం ఇప్పిస్తుండగా మిగతా రుణాన్ని బ్యాంకర్లు తక్కువ వడ్డీకే అందిస్తున్నారు. స్త్రీనిధి పథకం ద్వారా మహిళలకు 9.5 శాతం వడ్డీపై రూ.19 కోట్ల మేరకు రుణాలివ్వాలన్నది లక్ష్యం. తాళ్లూరు మండలంలో రూ.13 కోట్లకుగాను ఇప్పటికీ రూ.ఆరు కోట్లు, కురిచేడు మండలంలో రూ.ఆరు కోట్లకుగాను రూ.మూడుకోట్లు అందించారు. దర్శి, ముండ్లమూరు, దొనకొండ మండలాల్లో కొంత మందగమనంలో ఉంది.

అత్యవసరంగా పొందే వీలు

మహిళలు అత్యవసర రుణ సదుపాయానికి సామాజిక పెట్టుబడి నిధి (సీఐఎఫ్) పథకం ఉపయోగపడుతోంది. పన్నెండు శాతం వడ్డీపై ఒక్కో సంఘానికి రూ.లక్ష వంతున మంజూరు చేస్తున్నారు. ప్రస్తుత ఏడాది రూ. 1.81 కోట్లు లక్ష్యంగా గుర్తించి ఇప్పటికీ రూ. 1.54 కోట్లు రుణాలు అందించారు. కేవలం తాళ్లూరు మినహా మిగతా నాలుగు మండలాల్లో లక్ష్యం మేరకు పంపిణీ పూర్తి చేశారు.

పనిచేస్తోందన్నది.. శుద్ధ అబద్ధం

దొనకొండలోని రైల్వే స్టేషన్‌లో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంటు ఆరేళ్లుగా పడకేసింది. రైల్వే అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు నీరు విడుదల చేస్తున్నారని, ఆ తర్వాత షరా మామూలేనని వారంటున్నారు. కుళాయిల్లో ఫ్లోరైడ్ నీరు వస్తోందని, రూ.లక్షలు వచ్చించి ఏర్పాటుచేసిన ప్లాంట్‌తో ప్రయోజనమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. - దొనకొండ, న్యూస్‌టుడే

రోడ్డుపైనే నీరు.. ఎలా వెళ్లాలి సారూ

ముండ్లమూరు మండలంలోని ఉమామహేశ్వరపురం - ఈదర గ్రామాల మధ్య కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. పొలాల్లోంచి వచ్చే నీరంతా అక్కడి రోడ్డుపై నిలిచిపోతోంది. దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహనాలు అదుపుతప్పి చోదకులు గాయాల పాలవుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు ఎత్తు పెంచాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని, అనుమతులు రాగానే పనులు చేపడతామన్నారు. - ముండ్లమూరు, న్యూస్‌టుడే

పొగమంచు వేళ.. లైట్లు వెలిగితేనే..

పొగమంచు కారణంగా వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు అద్దంకి పట్టణం గుండా ప్రయాణిస్తుంటాయి. పది రోజులుగా ఉదయం ఎనిమిది గంటల వరకు దట్టంగా పొగమంచు పడుతోంది. దీంతో చోదకులు హెడ్‌లైట్లు వేసుకుని తక్కువ వేగంతో వెళుతున్నారు. లైట్లు వెలగని వాహనాలను రోడ్డుపక్కనే నిలిపేస్తున్నారు. అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలు చోటుచేసుకుంటాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. - అద్దంకి, న్యూస్‌టుడే

అసలే కూడలి.. ఆపై గుంత

రోడ్డుపై భారీ గుంతతో వాహనాలు అదుపుతప్పుతున్నాయి. వేమవరం నాలుగురోడ్ల కూడలి నుంచి నిత్యం వేల సంఖ్యలో వాహనాలు పరుగులు తీస్తుంటాయి. అలాంటిచోట గుంత పడినా అధికారులు పూడ్చించడం లేదని స్థానికులంటున్నారు. స్థానిక వేమవరం బీసీ కాలనీ వద్ద ఇలాగే రోడ్డ మధ్యలో గుంత ఉంది. అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. - బల్లికురవ, న్యూస్‌టుడే

వినియోగదారులకు మరింత చేరువ

అద్దంకి, న్యూస్‌టుడే : విద్యుత్తు వినియోగదారులకు సేవలందించి మరింత చేరువయ్యామని అద్దంకి ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. తనను కలిసేందుకు వచ్చిన అద్దంకి పట్టణ విద్యుత్తు ఏఈ, సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఐవీఆర్ఎస్ విధానం ద్వారా డిసెంబరు నెలలో 50 మంది వినియోగదారుల్ని విచారించగా వారి నుంచి సంతృప్తికర సమాధానం లభించిందన్నారు. బిల్లుల వసూలులో అద్దంకి డివిజన్ మూడోస్థానంలో నిలిచినట్లు చెప్పారు. డిసెంబరు నెలలో మొత్తం డిమాండ్ రూ.8.48 కోట్లు ఉండగా రూ.9.37కోట్లు వసూలు చేసినట్లు చెప్పారు. తద్వారా 110.56శాతం వసూలు సాధించామన్నారు. మొండిబకాయిలను వసూలు చేయడంలో అధికారులు, సిబ్బంది చేసిన కృషి కారణంగానే అధికశాతం వసూలు చేయగలిగినట్లు చెప్పారు. మొంథా తుపాను సమయంలో కొన్ని గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకపోవటం విశేషమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వాటిని అందిపుచ్చుకుని వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పట్టణ ఏఈ ఎన్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఈఈ నల్లూరి మస్తాన్‌రావు

ఇచ్చిన మాటను నెరవేర్చిన చంద్రబాబు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: జాగర్లమూడివారిపాలెంలో తెలుగు యువత ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి గొట్టిపాటి రవికుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. తమ ప్రాంతాన్ని ప్రకాశంలో కలిపి ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ నెరవేర్చారన్నారు. కేకు కోసి పంచిపెట్టారు. కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రబాబు, గొట్టిపాటి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న జాగర్లమూడివారి పాలెం యువత

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

అద్దంకి: 94409 15704,
దర్శి: 9848 671678
మేదరమెట్ల: 79933 00506

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ఏల్చూరు (సంతమాగులూరు), న్యూస్‌టుడే:

?: స్థానిక అసిస్ట్ సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రాంతంలో రెండుచోట్ల వీధి దీపాలు వెలగటం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలి. - స్థానికులు, ఏల్చూరు

✓: తక్షణం పరిశీలిస్తాం. వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తాం. -పూర్ణచంద్, పంచాయతీ కార్యదర్శి, ఏల్చూరు

కురిచేడు, న్యూస్‌టుడే:

?: గంగదొనకొండలోని ఎస్సీ కాలనీ, బలిజపాలెంలో పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. - నాగేశ్వరరావు, స్థానికుడు

✓: వెలగని వీధి దీపాలను గుర్తించి నాలుగు రోజుల్లో కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. - కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి

అద్దంకి : ధ్వజస్తంభం వద్ద భక్తులు

అద్దంకి: క్యూలైన్‌లో నిలిచి..

నూతన వత్సరం.. పోటెత్తిన భక్తజనం

దర్శిలో ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే : నూతన సంవత్సరం వేళ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శింగరకొండ క్షేత్రం వద్ద గురువారం విశేష పూజలు చేశారు. ప్రసన్నాంజనేయ, లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల వద్ద భారీఎత్తున బారులు తీరారు. ఉదయం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అలంకరణ గావించి భక్తులకు దర్శనం కల్పించారు. పట్టణంలోని మాధవస్వామి, కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, ధన్వంతరి దత్తపాదుకాక్షేత్రం, వేయిస్తంభాల గుడి, కమలేశ్వరాలయం తదితరచోట్ల భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ముండ్లమూరు: పెదఉల్లగల్లులోని లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు నరసింహమూర్తి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. మారెళ్లలోని హరిహరదత్తక్షేత్రంలో చెన్నమల్లేశ్వరస్వామి, ముండ్లమూరులోని మల్లికార్జున స్వామి, వేంపాడులోని ప్రసన్నాంజనేయస్వాములకు అభిషేకాలు చేశారు. తాళ్లూరు : గుంటిగంగలో తిరునాళ్ల వాతావరణం నెలకొంది. గంగాభవానీ అమ్మవారికి పూజారులు ప్రకాశరావు, కామేశ్వరశర్మ, బాలరాజులు విశేష పూజలు చేశారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తపాలెంలో శిర్డీ సాయిబాబా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. దర్శి: పట్టణంలోని పోలేరమ్మ గుడిలో అమ్మవారిని అలంకరించారు. జిల్లాస్థాయి త్రోబాల్ పోటీలో విజయం సాధించి, త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనే ఉపాధ్యాయినుల జట్టు సభ్యులు తెదేపా నియోజకవర్గ బాధ్యులు గొట్టిపాటి లక్ష్మిని, ఇతర అధికారులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైకాపా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ పాల్గొని కేకు కోసి వేడుకల్లో పాల్గొన్నారు.

ముండ్లమూరు : పెదఉల్లగల్లులో పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

కూటమి పాలనలో చురుగ్గా అభివృద్ధి

దర్శి, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలు గురువారం దర్శిలో ఘనంగా నిర్వహించారు. తెదేపా కార్యాలయం వద్ద భారీ కేకు కోశారు. తెదేపా నియోజకవర్గ బాధ్యులు గొట్టిపాటి లక్ష్మి, డా.లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే పాపారావు సమక్షంలో వేడుకలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వ పాలనలో నియోజకవర్గంలో చురుగ్గా అభివృద్ధి పనులు చేశామని ఆమె చెప్పారు. దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. కాలనీల్లో మౌలిక వసతులు దరిచేరుస్తున్నామని ఆమె చెప్పారు. మున్సిపల్ ఛైర్మన్ పిచ్చయ్య, ఏఎంసీ ఛైర్మన్ నాగవేణి సుబ్బారావు, సొసైటీ బ్యాంకు ఛైర్మన్ చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లూరు: నూతన సంవత్సర ఆరంభ వేడుకలు తాళ్లూరు, తూర్పుగంగవరంలో ఉత్సాహంగా జరిగాయి. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రమణరావు, డీటీ జి.ఫణీంద్ర మిఠాయిలు పంచి పెట్టారు. తహసీల్దారు బీవీ.రమణారావు ఒంగోలు వెళ్లి చిన్నారులకు ఉపయోగపడేలా రాత పుస్తకాలను జిల్లా కలెక్టరు పి.రాజాబాబుకు అందించారు.

దర్శి : కేకు కోస్తున్న నియోజకవర్గ బాధ్యురాలు గొట్టిపాటి లక్ష్మి, ఇతర నాయకులు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

అద్దంకి, న్యూస్‌టుడే : నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారిపై భవానీకూడలి వద్ద జరిగిన ప్రమాదంలో ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన యువకుడు షేక్ నాగూర్ వలీకి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది అందించిన సమాచారం మేరకు ఎన్టీఆర్‌నగర్‌లో నివాసముంటున్న నాగూర్‌వలీ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నారు. పట్టణంలో ఆయన వెళుతుండగా లారీ ఢీకొని గాయపడ్డాడు.

పెనగమూరులో...

కురిచేడు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై వెళుతూ ఆగివున్న లారీని ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన పెనగమూరు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. అలవలపాడు గ్రామానికి చెందిన చిన్నకత్తి శ్రీను తన భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై కురిచేడు వచ్చి పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామం వెళుతున్నారు. మార్గంమధ్యలోని పెనగమూరు సమీపంలో ఆగి ఉన్న లారీ ఢీకొనడంతో శ్రీనుకు గాయాలయ్యాయి.

తీవ్రంగా గాయపడిన నాగూర్‌వలీ

త్వరలో గ్రంథాలయ నిర్మాణం

అద్దంకి, న్యూస్‌టుడే : శాఖా గ్రంథాలయం, రంగస్థల కళాకారులకు ఉపకరించే టౌన్‌హాల్ త్వరలో అద్దంకి వాసులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కొన్నేళ్లుగా స్థానికుల సౌకర్యార్థం గ్రంథాలయ భవనం నిర్మించే నిమిత్తం ఎన్నెస్పీ ఆవరణలో పది సెంట్ల భూమిని మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషితో మంజూరైంది. అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు ఆధ్వర్యంలో గ్రంథాలయ సాధన సమితి పేరుతో ఉద్యమాలు నిర్వహించారు. కాగా దీని నిర్మాణానికి జిల్లా గ్రంథాలయ సంస్థ రూ.10 లక్షలు కేటాయించగా, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ఎంపీ నిధులు రూ.20 లక్షలు మంజూరయ్యాయి. అయినప్పటికీ నిధులు సరిపోనట్లయితే పురపాలక నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పురపాలక కమిషనర్ డి.రవీంద్ర తెలిపారు.

◗ భవానీకూడలిలోని రీడింగ్ రూం స్థలంలో 'అద్దంకి టౌన్‌హాల్' నిర్మాణం చేపట్టనున్నట్లు కమిషనర్ చెప్పారు. సుమారు 19 సెంట్ల విస్తీర్ణంలో టౌన్‌హాల్ నిర్మాణానికి అదానీ కంపెనీ ప్రతినిధులు రూ.3.30 కోట్లు కేటాయించారని వెల్లడించారు. ఈ నిధులు జిల్లా కలెక్టర్ ద్వారా వెచ్చించనున్నట్లు చెప్పారు.

అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

అద్దంకి, న్యూస్‌టుడే : పర్యావరణ సమతౌల్యానికి ప్రతి వ్యక్తి మొక్కలు నాటాలని 'ఆ నలుగురు' ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు రాచుమల్లు శివాంజనేయులు అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల తూర్పువైపు గురువారం పలువురు మహిళలతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు లేనికారణంగా పర్యావరణానికి ఎంత నష్టం కలుగుతుందో ప్రజలు తెలుసుకోవాలన్నారు. ప్రతి వ్యక్తి బాధ్యతగా వాటిని కాపాడాలన్నారు.

మొక్కలతో మహిళలు

ఉత్తమ ఫలితాలకు కృషి

ఒంగోలు నగరం: ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు అధ్యాపకులు కృషి చేయాలని ఆర్ఐవో కె.ఆంజనేయులు సూచించారు. రాష్ట్ర ఒప్పంద అధ్యాపకుల జేఏసీ ఛైర్మన్ కుమ్మరకుంట సురేష్, ఇతర సభ్యులు ఆర్ఐవోని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఐవో మాట్లాడుతూ ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రానున్న పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రాక్టికల్, థియరీ పరీక్షల నిర్వహణలో కాంట్రాక్టు అధ్యాపకులకు సముచిత స్థానం కల్పించాలని జేఏసీ ప్రతినిధులు ఆర్ఐవోని కోరగా.. సానుకూలంగా స్పందించారు. మార్గదర్శకాల ప్రకారం న్యాయం చేస్తానన్నారు. బీవీ కాశీరత్నం, వెంకట్రావు కలసిన వారిలో ఉన్నారు.

వేగంగా వెళితే ముప్పు తప్పదు

రామభద్రాపురం వద్ద ప్రమాదకర మలుపు

తాళ్లూరు, న్యూస్‌టుడే : మండలంలోని తూర్పుగంగవరం-రాజంపల్లి ప్రధాన రహదారిలో రామభద్రాపురం సమీపంలోని మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. వేగంగా వస్తున్న వాహనాలు అదుపుతప్పి చోదకులు గాయాల పాలవుతున్నారు. ఇటీవల కట్టెల లోడుతో వెళుతున్న ట్రాక్టరు రహదారి పక్కకు బోల్తా పడింది. అదృష్టవశాత్తూ ప్రాణాపాయం వాటిల్లలేదు. నిత్యం వేకువజామునుంచి అర్ధరాత్రివరకూ అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. అధికారులు స్పందించి తగుచర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పేరు మరియు పుట్టిన తేది మార్పు

నేను, కొప్పుల రంగారావు తండ్రి వెంకటేశ్వర్లు, చిరునామా ఇంటి నెంబర్ 6-980, గొడుగు వెంకట సత్యనారాయణ ఇంటి దగ్గర, టెలిఫోన్ ఆఫీస్ దగ్గర, దర్శి నగర పంచాయతీ ప్రకాశంజిల్లా, ఆంధ్రప్రదేశ్. నా కుమార్తె అయిన కొప్పుల డాన్సీ అనువారి పుట్టినతేదీ 01-01-2010గా మరియు పేరు కొప్పుల ఝాన్సీగా ఆధార్ నందు తప్పుగా నమోదైనది. తన ఆధార్ నెంబర్ 983097449395. నా కూతురు పేరు కొప్పుల డాన్సీగా మరియు పుట్టినతేదీ 09-08-2010గా మార్పు చేయుటకు ఏలాంటి ఆక్షేపణలు లేవని తెలుపుకొనడమైనది.

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

గంగమ్మా.. కరుణించమ్మా!

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల కేంద్రం మద్దిపాడులోని గంగమ్మతల్లి ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచింది. పురాతన కాలం నుంచి భక్తుల పూజలందుకుంటుంది. చుట్టుపక్కల వెల్లంపల్లి, రావిపాటిపాలెం గ్రామాలతోపాటు, జిల్లాలోని కరవది, సింగరాయకొండ, దొనకొండ, పొదిలిగంగ తదితర ప్రాంతాల భక్తులు ఇక్కడికి వస్తుంటారు. సంతానం లేని మహిళలు అమ్మవారిని పూజిస్తే సంతానం పొందుతారని భక్తుల నమ్మకం. ఇటీవల ఆలయంలో మదురై శిల్ప కళాకారులతో నిర్మాణాలు, భక్తులు కలిసి రూ.85 లక్షలు వెచ్చించి ఇత్తడి, వెండి పూతతో అలంకరణ చేయించారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

విశేష అలంకరణలో అమ్మవారు

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు అధ్యాపకులు కృషి చేయాలని ఆర్ఐవో కె.ఆంజనేయులు సూచించారు. రాష్ట్ర ఒప్పంద అధ్యాపకుల జేఏసీ ఛైర్మన్ కుమ్మరకుంట సురేష్, ఇతర సభ్యులు ఆర్ఐవోని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఐవో మాట్లాడుతూ ప్రకాశం, మార్కాపురం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రానున్న పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రాక్టికల్, థియరీ పరీక్షల నిర్వహణలో కాంట్రాక్టు అధ్యాపకులకు సముచిత స్థానం కల్పించాలని జేఏసీ ప్రతినిధులు ఆర్ఐవోని కోరగా.. సానుకూలంగా స్పందించారు. మార్గదర్శకాల ప్రకారం న్యాయం చేస్తామన్నారు. బీవీ కోటేశ్వరం, వెంకట్రావు తదితరులు కలసిన వారిలో ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు: 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

? కొత్తపట్నం రైల్వే వంతెన దిగువన గల చర్చి ఎదుట తాగునీటి పైప్‌లైన్ లీకై నీరు వృథాగా పోతోంది. - బ్రహ్మయ్య, స్థానికుడు
✓ రెండు రోజుల్లో లీక్ అరికట్టేలా పనులు చేపడతాం. - ఏఈయు, మున్సిపల్ ఇంజినీర్

? పీవీఆర్ స్కూలు పక్కన గల ఏకలవ్య నగర్ రోడ్డు గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - స్థానికులు
✓ ప్యాచ్ వర్క్ పనులకు టెండర్లు పిలిచాం. త్వరలోనే పనులు చేయిస్తాం. - ఏఈయు, మున్సిపల్ ఇంజినీర్

? నాగులుప్పలపాడు మండలం తక్కెళ్లపాడులో విద్యుత్తు స్తంభాలను మా స్థలంలో వేశారు. మార్చి వేయాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. - మురళి, గ్రామస్థుడు
✓ విద్యుత్తు స్తంభాలను వైరాపై ప్రభుత్వంతో జగనన్న కాలనీల కోసం ఏర్పాటు చేశారు. మార్పు చేయడానికి సంబంధించిన డీడీ చెల్లిస్తే లైను మార్చివేస్తాం. - వెంకట్రావు, ఏఎల్ఎం

? చీమకుర్తి ప్రభుత్వ బాలుర ఎస్సెస్సీ కాలనీ బీసీ బాలుర వసతి గృహం ఎదురుగా ఉన్న వీధి దీపం వెలగడం లేదు. రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వెంటనే మరమ్మతులు చేయించాలి. -ఖయ్యూం బాష, పట్టణవాసి
✓ వెంటనే మరమ్మతులు చేయిస్తాం. -వై.రామకృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్

? మద్దిపాడులోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీపై పరిసర ప్రాంత ప్రజలు చెత్త పారబోస్తున్నారు. -ఎం.హనుమంతు, విద్యార్థి
✓ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి చెత్తను తొలగిస్తాం. చుట్టుపక్కల నివాసాల వారు మళ్లీ వేయకుండా చర్యలు తీసుకుంటాం. - నూరుల్లా, పంచాయతీ కార్యదర్శి

-న్యూస్‌టుడే, ఒంగోలు నగరం, నాగులుప్పలపాడు, చీమకుర్తి, మద్దిపాడు

క్రీడా పోటీ.. వీరికి లేరు సాటి!

ఆటల్లో రాణిస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థినులు

న్యూస్‌టుడే, ఒంగోలు కర్నూలు రోడ్డు

క్రీడా పోటీల్లో పురుషులకు తామేమీ తక్కువ కాదని నిరూపిస్తున్నారు ఈ యువతులు. చదువుతోపాటు తమకు ఆసక్తి ఉన్న వాలీబాల్, ఖోఖో, షటిల్, టేబుల్ టెన్నిస్, పరుగుపందెం, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, చదరంగం తదితర క్రీడల్లో నిత్యం సాధన చేస్తూ ఆటపై పట్టు సాధిస్తున్నారు. పోటీలు ఎక్కడ జరిగినా.. భాగస్వామ్యులై సత్తా చాటుతున్నారు. ఇటీవల కొత్తపట్నం మండలం ఈతముక్కల ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన రీజనల్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న వీరు తాము సాధించిన విజయాలు, ఇతర వివరాలను పంచుకున్నారు.

ఇటీవల ఈతముక్కల కళాశాలలో పరుగుపందెంలో తలపడుతున్న విద్యార్థినులు

నాన్న స్ఫూర్తితో..

నా పేరు వరలక్ష్మి. ఒంగోలు టీవీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నా. మా నాన్న పీఈటీ అయినందువల్ల నాకు చిన్నప్పటి నుంచే ఆటలపై ఆసక్తి పెరిగింది. పరుగుపందెంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడి అనేక పతకాలు సాధించా. జాతీయ స్థాయిలో రాణించడమే నా ధ్యేయం.

వాలీబాల్ పోటీల్లో సత్తా..

నా పేరు మానస. ఈతముక్కల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నా. ఏడో తరగతి నుంచే ఆటలు ఆడుతున్నాను. వాలీబాల్ అంటే ఎంతో ఆసక్తి. ఇప్పటికే జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొని మా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించా. మళ్లీ ఇప్పుడు పోటీల్లో తలపడ్డా. రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించడమే నా లక్ష్యం.

జాతీయ స్థాయిలో తలపడ్డా..

నా పేరు కీర్తన. నేను ఒంగోలు రైస్ కళాశాలలో చదువుతున్నా. ఆరో తరగతి నుంచే ఫెన్సింగ్ ఆట అంటే చాలా ఇష్టం. నాటి నుంచి ప్రత్యేకంగా రోజూ సాధన చేస్తూ పోటీల్లో పాల్గొంటున్నా. జాతీయ స్థాయిలో 16వ స్థానం వరకు వెళ్లాను. చదరంగం పోటీల్లోనూ రాణిస్తున్నా. 2024 పోటీల్లో రెండో స్థానంలో నిలిచాను. అంతర్జాతీయ స్థాయిలో ఆడాలనేదే నా లక్ష్యం.

పరుగులో దూసుకెళ్తూ..

నా పేరు ప్రణతి. ఈతముక్కల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నా. నాకు పరుగుపందెం అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. అందుకోసం రోజూ సాధన చేసి అనేక పోటీల్లో పాల్గొన్నా. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ తలపడ్డా. సెమీ ఫైనల్స్‌లో మూడో స్థానంలో నిలిచాం. జాతీయ స్థాయిలో పతకం సాధించడమే లక్ష్యం.

పేద విద్యార్థులకు చెక్కులు అందజేసిన అన్నమనేని ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

విద్యార్థుల చదువుకు చేయూత

మద్దిపాడు, న్యూస్‌టుడే: గ్రామస్థులు సహకరిస్తే ఘడియాపూడిలో శుద్ధజల కేంద్రం ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నమనేని ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రత్నాకర్ రావు తెలిపారు. ఇంజినీరింగ్ చదువుతున్న గ్రామానికి చెందిన ఆరుగురు పేద విద్యార్థులకు గురువారం రూ.80 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు కోటేశ్వరరావు, మానికొండ సుబ్బారావు పాల్గొన్నారు.

ఒంగోలులోని క్యాంపు కార్యాలయంలో ఉద్యోగుల సమక్షంలో కేకు కోస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఎంపీ మాగుంటకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, ఒడా ఛైర్మన్ రియాజ్

వేడుకల్లో పాల్గొన్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఇతర ఉద్యోగులు

చీమకుర్తి హరిహర క్షేత్రంలో కేకు కోస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు

CHANGE OF SURNAME

I, YADAVALLI SUBHASHINI W/o YADAVALLI SAMBASIVA RAO, 45-124-204, Throvagunta, Ongole, Prakasam District-523202. My Surname is YADAVALLI SUBHASHINI (Old) Changed my SURNAME is ILLURI SUBHASHINI(New) Asper my documents & Certificates hera after my Name is Konwn as ILLURI SUBHASHINI

కొత్త సంవత్సరం.. ఆనంద వీక్షణం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు నగరంలోని రాజకీయ పార్టీలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల కార్యాలయాల్లో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఒంగోలు రామనగర్‌లోని కార్యాలయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, గుంటూరురోడ్డులోని తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. తెదేపా నాయకులు, కార్యకర్తలతోపాటు, అధికారులు, ఉద్యోగుల రాకతో ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంది. తొలుత తెదేపా శ్రేణుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేకులు కోశారు. గజమాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల రాకతో నూతన సంవత్సర సందడి నెలకొంది.

● ఒంగోలు నగరం: నగరంలోని బీకే అపార్ట్‌మెంట్‌లో నూతన సంవత్సర వేడుకలు వైభవంగా జరిగాయి. బుధవారం అర్ధరాత్రి కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, అపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే దామచర్ల పాల్గొన్నారు. కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ● చీమకుర్తి: గెలాక్సీపురి చీమకుర్తిలో నూతన సంవత్సర వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. అభిమానులు, పార్టీ శ్రేణులతో ప్రముఖుల గృహాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. స్థానిక హరిహర క్షేత్రంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు, బూచేపల్లి ఉద్యానవనంలో జడ్పీ ఛైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మార్కెట్ కమిటీ కార్యాలయంలో మద్దిపాడు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ మన్నం రాజేశ్వరిప్రసాద్, తమ గృహంలో మాజీ ఛైర్మన్ మారం వెంకారెడ్డి, సహకార సంఘంలో ఛైర్మన్ పూనాటి వెంకట్రావు తదితరులు కేకులు కోశారు.

● సంతనూతలపాడు: ఒంగోలులోని కార్యాలయంలో ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌కు సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మండల తెదేపా కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, సిండికేటు రైతు సహకార సొసైటీలో ఛైర్మన్ కూకట్ల విజయమ్మ నూతన సంవత్సర కేకులను కత్తిరించారు. ● మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కేకు కోసి అందరికి పంచి, పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. అనంతరం నాగేశ్వరావు, ఏపీ పొగాకు పెంపకందారుల సమాఖ్య ఛైర్మన్ మండవ జయంత్‌బాబుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌ను ఒంగోలులోని ఆయన స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి స్వాములు, వెల్లంపల్లి ఎంపీటీసీ సభ్యురాలు భవాని, పోతినేని శ్రీనివాస్, వడ్డెంపూడి శ్రీనివాస్, ముళ్లూరి మురళి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీఎన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు

వేలం ప్రకటన

మహారాజశ్రీ ఒంగోలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో

E.PNo: 76/2023 O.SNo: 182/2017

Between:

ఆళ్ళ నాగేశ్వరరావు ....D.H.R

And

వేజెండ్ల వెంకటేశ్వర్లు ....J.D.R

ఈ క్రింద తెలుపబడిన షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని పైకోర్టువారు తేది 19-01-2026న పై కోర్టులో వేలం వేయుదురు. కావున కావలసినవారు వేలం పాటలో పాల్గొనవచ్చును. వేలం తేది. 19-01-2026 ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 5.00 గం॥ల లోపల పై తెలుపబడిన కోర్టులో జరుగను.

వేలం షెడ్యూలు ఆస్థి వివరం

Prakasam District - Ongole Sub Registration - Ongole Municipal Corporation - Ongole Town - Kurnool Road- survey No. 175, Ward No: 37, Block No.1, House No 37 -1-169/47, 3-2, 3-3/1, Flat No: Shop/1A, Apartment Sasthra Complex, an extent of 4 Sq. yards. Built : 70 Sq feet bounded by **East:** 7 feets Bata. **South :** Manchiganti Venkata Subba Rao Property. **West:** Thirupathi Krishna Rao Property. **North :** Steps way to upstairs.

D.H.R Value of Rs:- 4,00,000/-,
Amin Value of Rs:- 4,00,000/-,
Market Value of Rs 2,80,000/-

వేలం వాయిదా తేది: 19-01-2026
Further Hearing: 27-01-2026

ఇట్లు/- **గుడిపూడి సురేంద్ర, యం. ప్రమోద్, జె. అనిల్‌కుమార్,** D.H.R తరపున అడ్వకేట్స్, ఒంగోలు

ఒంగోలు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

EP.No. 48/2023 in OSNo. 83/2016

చిల్లర వెంకట సుబ్బారావు ....DHR

మరియు

నల్లూరి అన్నపూర్ణ ....JDR

వేలం ప్రకటన

పై నంబరు EPని డిక్రీహోల్డరు దావా బాకీ రాబట్టుకొను నిమిత్తము దాఖలు చేయగా పైకోర్టు వారు క్రింద తెలిపిన JDR తాలూకు షెడ్యూలు ఆస్తిని తేది 19-01-2026న ఉదయం గం॥ 10.30నిల నుండి వేలం జరుపబడునని ఇందుమూలముగా యావన్మందికి తెలియపరచడమైనది.
షెడ్యూలు: ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, ఒంగోలు సబ్ రిజిస్ట్రేషన్ ఒంగోలు మండలము, కరవది గ్రామ పంచాయతీ, కరవది గ్రామ సర్వే నంబరు 651 మొత్తం విస్తీర్ణము 2418 చదరపు అడుగులు లేక 33 గదులు 42 చదరపు అడుగులు లేక 268.6/9చదరపు గజములు లేక 244.549 చదరపు మీటర్లు స్తలములో RCC ఇల్లు కట్టుబడి విస్తీర్ణము 686 చదరపు అడుగులు డోరు నంబరు4-107 అసెస్‌మెంట్ నంబరు483, SC నంబరు428 RCC కట్టుబడి మరియు ఖాళీ స్థలమునకు హద్దులు. **తూర్పు:** కొండ్రగుంట వెంకటసుబ్బయ్య ఇల్లు కొంతవరకు బజారు కొంతవరకు ఈదిశ 37.2 అడుగులు. **దక్షిణము:** మాదాల క్రిష్ణయ్య గారి ఆస్థి ఈదిశ 63.5 అడుగులు. **పడమర:** ఒగూరి చినశేషయ్య గారి ఆస్తి కొంతవరకు, బజారు కొంత వరకు ఈ దిశ 37 అడుగులు. **ఉత్తరము:** కొండ్రగుంట శేషయ్య ఆస్థి ఈ దిశ 67 అడుగులు.
పై హద్దులలోని విస్తీర్ణము 2418 చదరపు అడుగులు లేక 33 గదుల 42 చదరపు అడుగులలో RCC బిల్డింగు 687 చదరపు అడుగులు, డోర్స్, డోరు ఫ్రేమ్స్, సిమెంటు ఫిటింగ్స్ మరియు ఇతర ఈజ్‌మెంటు హక్కులతో సహా.

వేలం తేది: 19-01-2026, ఫరదర్ హియరింగు: 27.01.2026
D.H.Rవిలువ రూ. 8,00,000/-, అమీనా విలువ రూ. 30,00,000/-
మార్కెట్ విలువ రూ. 11,77,831/-, వారెంట్‌ఎమౌంట్ రూ. 6,83,697/-

ఇట్లు/- **యం. గంగాధరరావు,** బి.ఏ., బి.యల్., **కె. శివప్రసాదరావు.,** బి.యస్సీ., బి.యల్., డిక్రీహోల్డరు తరపు అడ్వకేట్స్

రాయి పెట్టి.. బాధ్యత మరిచి!

ఈ చిత్రం ఒంగోలు నగరంలోని ఒడ్డుపాలెం నుంచి దారావారి తోటకు వెళ్లే మార్గంలోనిది. ఇక్కడ మ్యాన్‌హోల్‌కు మూత లేకపోవడంతో పెద్ద రాయిని దానిపై పెట్టి వదిలేశారు. రోడ్డు మధ్యలో ఇలా రాయి ఉండడంతో వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదకరంగా మారింది. పగలు కాస్త కనిపిస్తున్నా.. రాత్రి సమయంలో కనిపించక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాయిని తొలగించి మూతను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు

పట్టు జారితే.. కూలిపోవడమే!

మద్దిపాడు మండలం మల్లవరం సమీపంలో ట్రాక్టర్‌పై ప్రమాదకరంగా కూర్చుని కూలీలు వెళ్తున్న చిత్రమిది. ట్రక్కులో పచ్చాకు నింపి, చుట్టూ డోర్లు తీసి వాటిపై పురుషులతోపాటు, మహిళలు సైతం ఇలా కూర్చుని ప్రయాణం సాగిస్తున్నారు. వీరు కూలి పనులకు వెళ్తేనే కుటుంబాలు సాగుతాయి. అలాంటిది అజాగ్రత్తగానే వెళ్తున్నారు. రైతులు, కూలీలకు పోలీసు అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. -న్యూస్‌టుడే, మద్దిపాడు

వేడుకగా పుష్పార్చన

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా చీమకుర్తి హరిహర క్షేత్రం వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రీవారికి సామూహిక పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. పలు రకాలపుష్పాలతో స్వామి వారికి అర్చనలు చేశారు. యడ్లపల్లి రామబ్రహ్మం దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అగ్రహారం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి వ్రతాలు వేడుకగా జరిగాయి. శిద్దా వెంకటేశ్వరరావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, చీమకుర్తి

తీరం.. నూతనోత్సాహం!

నూతన సంవత్సరం సందర్భంగా గురువారం కొత్తపట్నం కె.పల్లెపాలెం సముద్రతీరానికి పర్యాటకులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి కుటుంబంతో కలిసి వచ్చారు. ఉదయం నుంచే తీరంలో సందడి వాతవరణ నెలకొంది. చిన్న, పెద్ద, యువత చేరుకొని హ్యాపీ న్యూ ఇయర్ అంటూ పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. సముద్రంలో దిగి స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. -న్యూస్‌టుడే, కొత్తపట్నం

సూర్యప్రకాశరావును సత్కరిస్తున్న యోగా మిత్రమండలి సభ్యులు

వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఛైర్మన్‌కు సత్కారం

ఒంగోలు నగరం: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఛైర్మన్‌గా ఎన్నికైన శిద్దా సూర్యప్రకాశరావును యోగా మిత్రమండలి సభ్యులు ఘనంగా సత్కరించారు. గురువారం లాయర్‌పేట యోగా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి సూర్యప్రకాశరావును సత్కరించారు. ఆయన మాట్లాడుతూ వాసవీ క్లబ్ ద్వారా పేద విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇప్పించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. యోగా గురువు ఉడుతా ఆంజనేయులు, మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు. ❖ సంతనూతలపాడు: మండల వాసవీ క్లబ్ సభ్యులు శిద్దా సూర్యప్రకాశరావును సన్మానించారు. క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వీఎన్ ప్రసాదరావు, మహిళా అధ్యక్షురాలు వేమూరి నాగమణి, అధ్యక్షులు వేమూరి శేషారావు, కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

నిత్యం యోగాతో ఆరోగ్య భాగ్యం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: యోగాతో ఆరోగ్యం కలిగి ఉత్సాహంగా ఉంటారని గురువు గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఒంగోలు నగరంలోని గాంధీపార్కు పతంజలి పవర్ యోగా సభ్యులంతా కలిసి యోగా గురువు అధ్యక్షతన వేడుకలు జరుపుకొన్నారు. ముందుగా సూర్య నమస్కారాలు, యోగాసనాలు సాధన చేశారు. అనంతరం కేకు కోసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గాంధీపార్కులో 14 సంవత్సరాలుగా నిత్యం యోగా సాధన చేస్తున్నామని చెప్పారు. దీనివల్ల ఆరోగ్య సమస్యలను, మానసిక ఒత్తిడిలను అధిగమిస్తున్నామని వివరించారు. నగర ప్రజలంతా కూడా యోగాను తమ దినచర్యలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మురళీ, సత్యం, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రాము, శ్రీదేవి, లక్ష్మీ, సవర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా సంఘం (ఏపీజీఈఏ) ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సీహెచ్.కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు మాల కొండారెడ్డి, వరకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అయిదు పేద కుటుంబాలకు జనసైనికులు గురువారం బియ్యం బస్తాలను అందజేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా ఒక్కొక్కరికి 25 కిలోల ప్యాకెట్లు రెండు చొప్పున మొత్తం పది బస్తాలు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో జనసైనికులు సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌ను ఒంగోలులోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆరెం వెంకటేశ్వర్లు, సుద్దపల్లి పవన్, నూనె శ్రీను, సత్యం, దమ్ము సురేష్, తిరుమలశెట్టి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కొలచనకోట ఎస్సీ కాలనీలో మహిళకు బియ్యం బస్తాలు అందజేస్తున్న జనసైనికులు

నిర్లక్ష్యం వేళ్లూనుకుంది..!

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గదిలోని గోడలపై వేర్లు

న్యూస్‌టుడే, చీమకుర్తి

చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరై ఏడాది కావస్తున్నా ఆ దిశగా పనులు మాత్రం చేపట్టడం లేదు. దీంతో ఇక్కడ విధుల నిర్వహణకు అధికారులు, సిబ్బందికి అవస్థలు అప్పడం లేదు. గడిచిన సార్వత్రిక ఎన్నికల సమయంలో సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జిల్లా సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ వ్యవహరించారు. ఆ సమయంలో చీమకుర్తి తహసీల్దారు కార్యాలయ దుస్థితిని స్వయంగా పరిశీలించారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత జిల్లా కలెక్టర్ ద్వారా తహసీల్దారు కార్యాలయ నూతన భవన నిర్మాణం కోసం డీఎంఎఫ్ నిధులు రూ.3 కోట్లు మంజూరు చేయించారు.

తాత్కాలిక వసతి సమకూరకపోవడంతో..

తహసీల్దార్ కార్యాలయం నిర్వహించేందుకు తాత్కాలికంగా భవనం సమకూరక పోవడంతో నిధులు మంజూరైనా కొత్త భవనం పనులు ప్రారంభం కాలేదు. గతంలో పురపాలక సంఘం కార్యాలయం నిర్వహించిన భవనాన్ని తాత్కాలికంగా తమకు కేటాయించాలని మున్సిపల్ అధికారులకు తహసీల్దార్ లేఖ రాశారు. వారి వైపు నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించ లేదు. దీంతో ప్రజా ప్రతినిధుల ద్వారా కూడా చెప్పించారు. సంబంధిత భవనంలో వార్డు సచివాలయాలు నిర్వహిస్తున్నందున తమకు ఇబ్బంది అవుతుందనేది పురపాలక సంఘం అధికారుల వాదన. స్థానిక ఎన్నెస్పీ కాలనీలో నూతనంగా నిర్మాణం చేసిన ఈఈ కార్యాలయంలోకి తహసీల్దారు కార్యాలయాన్ని మార్చే విషయమై చర్చలు జరిగాయి. ఈ విషయంలో జేసీ చొరవ చూపి జలవనరుల శాఖ అధికారులతో కూడా చర్చించినట్లు తెలిసింది.

శిథిల భవనంలో ఇక్కట్లు..

ప్రస్తుత తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిల స్థితికి చేరింది. కిటికీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. స్లాబు పెచ్చులూడి రాలిపడుతున్నాయి. దీంతో అక్కడ పనిచేయలేక ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇక వర్షం కురిస్తే కంప్యూటర్, డిప్యూటీ తహసీల్దార్ గదులు పూర్తిగా తడిసి ముద్దవుతున్నాయి. ఆ సమయంలో ఉద్యోగులు బయటే ఉండాల్సి వస్తోంది. డాబా, గోడలపై పెరిగిన కొన్ని చెట్ల వేర్లు గదుల్లోకి చొచ్చుకొని వచ్చేశాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు చేపట్టి కార్యాలయ నిర్వహణకు తాత్కాలిక వసతి కల్పిస్తే తప్ప, నూతన భవన నిర్మాణం సాకారం కాదు.

చెదలు పట్టి దెబ్బతిన్న తలుపు



(c) eenadu

ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం జనవరి 2, 2026 5

శుభ దీవెనలు

నూతన ఆంగ్లనామ సంవత్సర ఆగమన వేళ.. కోటి ఆశలు.. కొంగొత్త ఉషస్సులను కాంక్షిస్తూ ప్రజలు తమ ఇష్ట దైవాలను దర్శించుకున్నారు. దీంతో ఆలయాలు కిక్కిరిసి కనిపించాయి. ప్రత్యేక అలంకరణలో అభయమిస్తున్న నెల్లూరులోని రాజరాజేశ్వరీ అమ్మవారు... జొన్నవాడలో భక్తుల రద్దీ... – ఈనాడు, నెల్లూరు

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

వీఎస్‌యూలో పోటీ పరీక్షల కేంద్రం

వెంకటాచలం, న్యూస్‌టుడే: వీఎస్‌యూలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన 'సెంటర్ ఫర్ కాంపిటేటివ్ ఎగ్జామినేషన్స్'ను గురువారం వీసీ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఈ కేంద్రం ద్వారా శిక్షణ, మార్గదర్శకం లభిస్తుందన్నారు. మాక్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సునీత, ప్రిన్సిపల్ విజయ, కేంద్రం సంచాలకులు విజేత, ఆచార్యులు అందె ప్రసాద్, ఉస్సేనయ్య తదితరులు పాల్గొన్నారు.

సింహపురికి మణిహారం.. క్రిస్ సిటీ!

10,834.50 ఎకరాల్లో నిర్మాణం

ఈనాడు, నెల్లూరు: గూడూరు, కోట, న్యూస్‌టుడే: గూడూరు నియోజకవర్గంలోని మూడు మండలాలను జిల్లాలో కలుపుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో.. కోట, చిల్లకూరు మండలాల పరిధిలో నిర్మిస్తున్న కృష్ణపట్నం పారిశ్రామిక నగరం(క్రిస్ సిటీ) సింహపురికి మణిహారంగా మారింది. రూ. 37,500 కోట్ల పెట్టుబడితో 4,67,500 మందికి ఉపాధి కల్పించే ఈ ప్రాజెక్టును వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయగా.. కూటమి ప్రభుత్వం వేగంగా పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తోంది. భూసేకరణ అడ్డంకులను తొలగించడంతో పాటు.. సేకరించిన దానిలో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. 2026, ఫిబ్రవరి నాటికి మొదటి విడత పనులు పూర్తి చేయాలన్నది లక్ష్యం కాగా- చెన్నై, కృష్ణపట్నం నౌకాశ్రయాలు, రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం, చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి, చెన్నై- కోల్‌కతా రైల్వే లైన్ ఉండటం ఈ ప్రాజెక్టుకు కలిసొచ్చే అంశం. దీంతో పరిశ్రమల స్థాపనకు మార్గం సుగమం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

కోట, చిల్లకూరు మండలాల్లో అభివృద్ధి పనులు

మూడు విడతల్లో భూసేకరణ

క్రిస్ సిటీ ఏర్పాటుకు 2017లో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్టు(నిక్‌డిక్ట్), రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నాయి. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్(సీబీఐసీ)లో భాగమైన ఈ ప్రాజెక్టును మూడు దశల్లో 10,834 ఎకరాలు సేకరించనున్నారు. తొలి విడతలో కోట, చిల్లకూరు మండలాల్లో 2,500.49 ఎకరాలు సేకరించాల్సి ఉండగా.. ఇందులో 985.604 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిలో దాదాపు 600 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం.. అయిదేళ్లు భూసేకరణను పక్కన పడేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక.. అన్నదాతలతో చర్చలు జరిపారు. తొలుత ఎకరాకు రూ. 5.99 లక్షలు చెల్లించాలని నిర్ణయించగా.. రైతుల కోరిక మేరకు ఆ మొత్తాన్ని రూ. 8 లక్షలకు పెంచారు. సుమారు 400 ఎకరాలకు పరిహారం అందించారు. రెండో దశలో 4,132.8 ఎకరాలు, మూడో దశలో 4,473 ఎకరాలు సేకరించనున్నారు. ఇందులో పారిశ్రామిక అవసరాలకు 4658.83 ఎకరాలు, పర్యావరణం, జీవావరణ సంరక్షణకు 1,202.62, నివాసాలకు 1,310.97 ఎకరాల చొప్పున కేటాయించనున్నారు.

రూ. 2,139.43 కోట్లతో మౌలిక వసతులు

ఈ ప్రాజెక్టులో రూ. 2,139.43 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. ఇప్పటి వరకు నిక్‌డిక్ట్ రూ. 531.36 కోట్లు విడుదల చేయగా.. ప్రధాన, అంతర్గత రోడ్లు, వంతెనలు, నీటి సరఫరా, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, విద్యుత్తు ఉపకేంద్రాలు, ఇతర వసతులు కల్పించే పనులు చేస్తున్నారు. రెండు ప్రధాన వంతెనల్లో ఒకదాని నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. 2027 ఫిబ్రవరి నాటికి తొలి విడత పూర్తి చేసి.. ఎలక్ట్రానిక్స్, ఆటో మొబైల్స్, ఆహారశుద్ధి, ఇంజినీరింగ్, నిర్మాణ సామగ్రి, టెక్స్‌టైల్స్, ఫార్మా తదితర పరిశ్రమలను ఆకర్షించనున్నారు. ఈ ప్రాంతంలో రూ. 37,500 కోట్ల పెట్టుబడులు వస్తాయని, 4.67 లక్షల మందికి ఉపాధి లభించనుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

స్త్రీశక్తి.. ప్రయాణ ఆసక్తి

నెల్లూరు(ఆర్టీసీ), న్యూస్‌టుడే: స్త్రీ శక్తి పథకం మహిళా వరంగా నిలుస్తుండగా.. మరోవైపు ఆర్టీసీకి ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) పది శాతం పెరిగింది. మహిళా ప్రయాణికులు 21.5 శాతం పెరిగారు.

2.03లక్షల మంది.. పథకం అమలుకు ముందు నెల్లూరు రీజియన్‌లో నిత్యం 1.5లక్షల మంది ప్రయాణిస్తుండగా.. ప్రారంభం తర్వాత 2.03 లక్షల మందికి చేరింది. ఓఆర్ కూడా 72 నుంచి 82 శాతానికి పెరిగింది. డిసెంబర్ 26వ తేదీ వరకు 1.69 లక్షల మంది మహిళలు ఆర్టీసీలో ప్రయాణించారు. నెల్లూరు-1 డిపో పరిధిలో 28.20లక్షల మంది, నెల్లూరు-2 డిపో పరిధిలో 30.60లక్షల మంది రాకపోకలు సాగించారు. వన్ డిపో పరిధిలో 67 నుంచి 71 శాతానికి, రెండో డిపో పరిధిలో 68 నుంచి 73 శాతానికి ఓఆర్ పెరిగింది.

పెరిగిన రద్దీ.. రీజియన్‌లో 460, నెల్లూరు-1, 2 డిపోల పరిధిలో 167 బస్సులు కేటాయించారు. ప్రధానంగా నెల్లూరు- కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, పామూరు, రాపూరు రూట్లతోపాటు పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంత మార్గాల్లో రద్దీ ఎక్కువగా ఉంది. దీంతో ఉన్న బస్సులు చాలని పరిస్థితి నెలకొంది. అనేక బస్సులు వంద శాతం ఓఆర్‌తో నడుస్తున్నాయి. రద్దీకి తగినట్లు బస్సులు లేకపోవడం కాస్త ఇబ్బందిగా మారింది. ప్రస్తుత అవసరాలకు తగినట్లు కొత్తగా 60 బస్సులైనా అందుబాటులోకి వస్తే సమస్య కొంతవరకు తీరుతుందని అధికారులు అంటున్నారు.

అబ్బురం.. అనితెర సాధన

న్యూస్‌టుడే, దుత్తలూరు

భవిత కేంద్రాల్లో డిజిటల్ విద్యా బోధన సత్ఫలితాలు ఇస్తోంది. ఉపాధ్యాయులు, విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు. కొన్ని ప్రత్యేక యాప్‌ల ద్వారా శిక్షణ ఇస్తుండటం.. వాటిపై ప్రత్యేక నిఘా ఉండటం.. ఉపాధ్యాయుల బోధనా తీరును ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చూస్తుండటంతో.. విద్యార్థి ప్రతిభను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించే అవకాశం ఏర్పడింది.

ఉదయగిరి భవిత కేంద్రంలో ట్యాబ్‌లో డిజిటల్ విద్య నేర్చుకుంటున్న విద్యార్థులు

సానుకూల ఫలితాలు

జిల్లాలో మొత్తం 38 మండలాలు ఉండగా.. అన్నిచోట్ల భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటిలో విద్యను అభ్యసిస్తున్న వారిలో.. వినికిడి సమస్య, చూపు సరిగా లేని 188 మంది చిన్నారులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. 98 మంది ఉపాధ్యాయులకు సైతం ఇచ్చారు. చిన్నారులు తమ సమస్యలను అధిగమించేలా ట్యాబ్‌ల్లో 32 యాప్‌లు రూపొందించారు. చదువుతో పాటు సులువుగా పనులు చేసుకునేలా ఇవి ఎంతో ఉపకరిస్తున్నాయి. డిజిటల్ విద్య ద్వారా వంద శాతం ఫలితాలు రావాలని ప్రభుత్వం కూడా కోరుకుంటోంది.

గూగుల్ ఫ్యామిలీ లింక్ యాప్ ప్రత్యేకత

ట్యాబ్‌ల్లో గూగుల్ ఫ్యామిలీ లింక్ యాప్ ఉంటుంది. దీని ద్వారా భవిత కేంద్రాల్లో.. బయట జరుగుతున్న బోధనపై నిరంతర పరిశీలన ఉంటుంది. తాజాగా యాప్, ట్యాబ్‌ల వాడకంలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులపైనా అవగాహన కల్పించాం. – ప్రసాద్‌రావు, సహిత విద్య జిల్లా సమన్వయకర్త

ఆ ఏడు.. అవస్థలు తోడు!

మొదలు కాని పీహెచ్‌సీ పనులు

అనంతసాగరం మండలంలో నిర్మాణంలో ఉన్న పీహెచ్‌సీ

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

గత ప్రభుత్వ పాలన ముగిసే సమయంలో సర్వేపల్లి, ఆత్మకూరు, కావలి, కందుకూరు, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలోని మండలాలకు ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరయ్యాయి. వీటికి 15వ ఆర్థిక సంఘం నుంచి సుమారు రూ. 17.75 కోట్లు మంజూరయ్యాయి. ముత్తుకూరు, అనంతసాగరం, బోగోలు, గుడ్లూరు, మర్రిపాడు, వలేటివారిపాలెం, బాలాయపల్లి మండలాల్లో వీటిని నిర్మించాలని నిర్ణయించారు. అనంతసాగరం మండలంలోనే పనులు ప్రారంభమవగా.. రెండేళ్లు గడిచినా.. ఆరు మండలాల్లో పనులు మొదలు కాలేదు.

> పల్లె ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం రెండేళ్లుగా ఒక్క అడుగు ముందుకు పడలేదు. నిధులు ఉన్నా.. అనుమతులు తీసుకురావడంలో నిర్లక్ష్యం వాటి పాలిట శాపమైంది. ఏడు కేంద్రాలు మంజూరైతే.. ఒక్క చోటే పనులు ప్రారంభమవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

అనుమతులే సమస్య

గత ప్రభుత్వ పాలన చివర్లో అనుమతులు రావడం.. తర్వాత ప్రభుత్వం మారడంతో.. ఇందుకు సంబంధించిన దస్త్రం మరుగున పడింది. దాన్ని తిరిగి బయటకు తీసి.. అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ఈ దిశగా అటు ప్రజాప్రతినిధులు గానీ, ఇటు ఆర్అండ్‌బీ అధికారులు గానీ ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వ నిధుల విషయంలో రాష్ట్ర అధికారుల నుంచి తమకు ఎలాంటి తదుపరి ఆదేశాలు రాలేదని రహదారులు భవనాలశాఖ అధికారులు ఇటీవల జడ్పీ సమావేశంలో వెల్లడించారు. దీనిపై ఆర్అండ్‌బీ అధికారులు మాట్లాడుతూ.. రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

జీవన్ ప్రమాణ్ పత్రం సమర్పిద్దామా!

నెల్లూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: పింఛను పునరుద్ధరణకు విశ్రాంత ఉద్యోగులు ఏటా జీవన ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంది. నిర్దేశిత సమయంలోగా ఇవ్వకపోతే పింఛను నిలిచిపోతుంది. ఇందుకోసం గతంలో మాదిరిగా ఖజానాశాఖ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా.. యాప్, పోర్టల్, ఆన్‌లైన్ సేవా కేంద్రాల ద్వారా సులువుగా ఎక్కడి నుంచైనా సమర్పించే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. కాగా.. జిల్లాలో 20 వేల మంది విశ్రాంత ఉద్యోగులు పింఛను పొందుతున్నారు.

యాప్ ద్వారా ఇలా..

ప్లేస్టోర్ నుంచి జీవన్ ప్రమాణ్ యాప్ డౌన్‌లోడ్ చేసి.. ఆధార్, చరవాణి, ఈ-మెయిల్ ఐడీ సబ్మిట్ చేయాలి. తద్వారా ఫోన్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేయగానే రౌండ్ సర్కిల్ వస్తుంది. ముఖ ఆధారిత నిర్ధారణతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తర్వాత ఆధార్, చరవాణి, ఈ-మెయిల్ అడుగుతుంది. వాటిని నమోదు చేస్తే పింఛనుదారుడి వివరాలు ప్రత్యక్షమవుతాయి. గతంలో జీవనపత్రం పొందని వారు.. వారి వివరాలను కొత్తగా చేర్చాలి. పేరు, పీపీవో నంబరు, బ్యాంకు, ప్రభుత్వశాఖ, పింఛను మంజూరు సంస్థ తదితర వివరాలు సరి చూసుకుని సబ్మిట్ చేయాలి. అనంతరం వృత్తంలో ముఖం స్పష్టంగా కనిపించేలా ఫొటో తీసుకుంటే. . పత్రం సమర్పించే ప్రక్రియ పూర్తవుతుంది. సంక్షిప్త సందేశం కూడా వస్తుంది.

పోస్టాఫీసు, మీసేవ కేంద్రాల్లోనూ..

జీవన్ ప్రమాణ్ పోర్టల్, పోస్టాఫీసు, మీసేవ కేంద్రాల్లోనూ పత్రాన్ని సమర్పించవచ్చు. ఆధార్, మొబైల్, పీపీవో, బ్యాంకు ఖాతా నంబర్లు తీసుకువెళ్లాలి. ఫిబ్రవరి 28వ తేదీలోగా పత్రాన్ని సమర్పించాలని జిల్లా ఖజానా శాఖ అధికారి బి.శ్రీనివాసులు తెలిపారు. బయోమెట్రిక్(వేలిముద్రలు) సరిగా లేని వారు.. ఆరోగ్యం సరిగా లేనివారు, మంచానికే పరిమితమైన వారు సంబంధిత ఉప ఖజానా కార్యాలయంలో తెలియజేస్తే.. సిబ్బంది పింఛనర్ వద్దకే వచ్చి ధ్రువీకరిస్తారని వివరించారు.

మన మిత్ర.. మనసు పెట్టాలబ్బా!

ఈనాడు, నెల్లూరు: వాట్సాప్ గవర్నెన్స్(మన మిత్ర)పై జిల్లా ప్రజలకు అవగాహన అంతంత మాత్రంగానే ఉందా? అవుననే సమాధానమే వస్తోంది. కార్యాలయాల చుట్టూ తిరగకుండా చరవాణిలోనే పలు సమస్యలు చక్కబెట్టుకునే అవకాశం ఉన్నా.. ఆసక్తి చూపడం లేదని తెలిసింది. అధికారులు సైతం అదే తీరులో ఉండటంతో లక్ష్యం నీరుగారుతోంది. జిల్లాలో మొత్తం 5633 మంది అధికారులకు ఈ బాధ్యతలు అప్పగించగా.. ఇటీవల కలెక్టర్ల సదస్సు జరిగే సమయానికి 3854 మంది మాత్రమే ఇందుకు సంబంధించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇంకా 1779 మంది పాల్గొనాల్సి ఉంది. దీంతో 161 రకాల సేవలతో గత ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించినా.. మూడొంతుల మంది ఇంకా సేవలను సద్వినియోగం చేసుకోలేదు.

ఐవీఆర్ఎస్ సర్వేలో(జిల్లాలో)..

	అవును	కాదు
వాట్సప్ గవర్నెన్స్(మన మిత్ర) గురించి తెలుసా	28.8	71.2
మీరు మనమిత్ర ఎప్పుడైనా వాడారా?	21.7	78.3

161 రకాల సేవలు

బస్సు టిక్కెట్ కొనుగోలు మొదలు.. దైవ దర్శనం, విద్యుత్తు బిల్లు చెల్లింపు, రెవెన్యూ ధ్రువీకరణ పత్రాలు, పోలీసులకు ఫిర్యాదు(ధ్రువపత్రాల మిస్సింగ్‌పై), పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేసిన ఫిర్యాదు స్థితి, పుర సేవలు, ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు నవీకరణ వంటి సేవలు అందుబాటులో ఉంచారు. ఇందుకు సంబంధించిన వాట్సాప్ నంబరు 95523 00009 ఫోన్‌లో సేవ్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఆపై దానికి హాయ్ అని సందేశం పెడితే చాలు.. సేవల వివరాలు ప్రత్యక్షమవుతాయి. తద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. కానీ, జిల్లాలో ఆశించిన మేరకు వినియోగం లేదు. కలెక్టర్ల సదస్సులో మాట్లాడిన ముఖ్యమంత్రి.. ప్రత్యేక దృష్టిసారించాలని సూచించడం గమనార్హం.

పులి సంచారం.. వణుకుతున్న జనం

ఉదయగిరి, న్యూస్‌టుడే: కొండకింద పల్లెవాసులను పులి వణికిస్తోంది. పది రోజులకు పైగా ఎక్కడో ఒక చోట.. ఎవరో ఒకవరికి తారపడుతుండటంతో.. ఇళ్ల నుంచి బయటకు రావడానికీ జంకుతున్నారు. కృష్ణారెడ్డిపల్లి సమీప అటవీ ప్రాంతానికి కానూరు వెంకటసుబ్బారెడ్డి గడ్డి తెచ్చేందుకు గురువారం ఉదయం వెళ్లారు. ఆ క్రమంలో జామాయిల్ చెట్లలో పులి పడుకుని ఉండటాన్ని గమనించి.. గ్రామంలోకి పరుగులు తీశారు. పులిభయంతో పగలు అడవిలోకి వెళ్లలేక పశువుల పోషణ భారం కాగా.. రాత్రిళ్లు జాగారం చేయాల్సి వస్తుందంటున్నారు. ఎప్పుడు ఎటువైపు నుంచి ఎవరిపై దాడి చేస్తుందోనని హడలిపోతున్నామని.. అటవీశాఖ అధికారులు నిర్దుష్ట చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొనసాగిన ఉత్తర ద్వార దర్శనం

నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో గురువారం మూడో రోజు కూడా ఉత్తర ద్వార దర్శనం కొనసాగింది. నూతన సంవత్సరం సందర్భంగా మూలవిరాట్ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా.. వేద పండితులు వేద పఠనం చేశారు. ఈవో శ్రీనివాసులురెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

ఉత్తరక్రియలు

నా సతీమణి
స్నేహశీలి, మృదుస్వభావి, చెరగని చిరునవ్వుతో
అందరి ఆదరాభిమానాలు చూరగొన్న మంచి మనిషి..
శ్రీమతి గండికోట వెంకట శేషమ్మ గారు
JACT, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ - నెల్లూరు
జననం : 15-07-1975 మరణం : 23-12-2025
తేది : 23-12-2025 మంగళవారం స్వర్గస్తులైనారు.
వారి పెద్దకర్మ తేది: 03-01-2026 శనివారం
భరత్‌లీలా ప్రైడ్ అపార్ట్‌మెంట్, యస్.పి. బంగ్లా దగ్గర, సుజాతమ్మ కాలని,
నెల్లూరు నందు గల మా స్వగృహము నందు జరుగును.
వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
ఇట్లు : డి. మహదేవ,
GM - Vowel Group of Educational Institutions, Cell: 85559 89225

మీ కోసమే.. నిద్రమత్తు వదిలిస్తారంతే!

న్యూస్‌టుడే, నెల్లూరు(నేర విభాగం)

'స్టాప్.. వాష్ అండ్ గో'.. ప్రమాదాల నివారణకు జాతీయ రహదారులపై చేపడుతున్న ఈ కార్యక్రమంపై పోలీసు శాఖ మరింత దృష్టి సారించింది. ఎప్పటి నుంచో ఇది అమలవుతున్నా.. రోడ్డు ప్రమాదాలు అదుపులోకి రాని పరిస్థితుల్లో తాజా నిర్ణయం తీసుకుంది. అందుకు అనుగుణంగా జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న స్టేషన్ల పరిధిలోని పోలీసులు అప్రమత్తమయ్యారు.

డ్రైవర్ల ముఖాలు కడిగేస్తున్న పోలీసులు

తెల్లవారుజాము వరకు...

జిల్లాలో ప్రధానంగా 5 జాతీయ, 14 రాష్ట్ర రహదారులు ఉండగా.. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు నెల్లూరు నుంచి హైదరాబాద్, విజయవాడ, వైజాగ్, గుంటూరు, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిల్లో ప్రయాణించేవారు అధికమే. వీటికి తోడు పార్సిల్ లారీలు, గూడ్స్ వాహనాలు దూసుకువెళుతుంటాయి. దాంతో అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు సీఐలు, ఎస్సైలు.. వాహనాలను ఆపి.. చోదకుల పరిస్థితిని పరిశీలిస్తున్నారు. వారితో ముఖం కడిగించి.. నిద్రమత్తు వీడేలా చూస్తున్నారు. అదే సమయంలో వాహనాలు, డ్రైవింగ్ లైసెన్సులు తనిఖీ చేయడంతో పాటు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు.

> "జిల్లాలో గత ఏడాది 460 ఘోర రోడ్డు ప్రమాదాలు జరగ్గా.. సాధారణమైనవి 422 చోటు చేసుకున్నాయి. వీటిల్లో 514 మంది మృతి చెందగా.. 894 మంది క్షతగాత్రులయ్యారు. ఇక అతివేగంపై 4,262, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై 4,741 కేసులు నమోదయ్యాయి."

వెలుగుల తోట

పొలంలో ఈ విద్యుత్తు వెలుగులు ఏమిటీ అని అనుకుంటున్నారా..? దాని వెనుక పంట దిగుబడి రహస్యం ఉందంటున్నారు.. కలువాయికి చెందిన రైతు పి.పిచ్చిరెడ్డి. సాధారణంగా సూర్యకాంతిని సంగ్రహించి మొక్కలు వాటి కాలాలకు అనుగుణంగా పూతకొచ్చి కాయలు కాసి పండ్లనిస్తాయి. ఆయా సీజన్‌ల్లో ఒకేసారి పండ్లు విపణిలోకి తీసుకొస్తే గిరాకీ తగ్గుతుంది. దీంతో రైతులకు గిట్టుబాటు కాదు. నాన్ సీజన్లో పండిస్తే మంచి ధర వస్తుంది కదా అని భావించిన పిచ్చిరెడ్డి కృత్రిమ వెలుగుల సాయంతో పంట పండించవచ్చని శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకున్నారు. అనుకున్నదే తడవుగా అనంతసాగరం మండలం గోవిందపల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలోని డ్రాగన్ ఫ్రూట్ తోట రెండోసారి కాపు వచ్చేలా.. ఇలా విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేశారు. – న్యూస్‌టుడే, చేజర్ల

చేప చేప... ఎప్పుడంట!

ఆత్మకూరు, న్యూస్‌టుడే: సోమశిల జలాశయంలో చేప పిల్లల విడుదల ఎప్పటికప్పుడు కలగానే మిగులుతోంది. ఇప్పటికే జలనిధిలో ఆశించిన స్థాయిలో మత్స్య సంపద లేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ కార్యక్రమాన్ని అసలే పట్టించుకోలేదు. ఇప్పుడు ఆ దిశగా చర్యలు చేపట్టాలని చూసినా.. సోమశిల జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో సమస్యలు.. నిధుల లేమి ప్రతిబంధకంగా మారాయి. దాంతో టెండరు పిలిచి.. ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లాలని నిర్ణయించినా.. అడుగులే పడటం లేదు.

4 జిల్లాల నుంచి..జలాశయం.. నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల మత్స్యకారులకు జీవన భృతి కల్పిస్తోంది. దాంతో ఆ మూడు జిల్లాల ఆధ్వర్యంలో చేప పిల్లలు వదలాలని నిర్ణయించారు. మొదటగా గత నెలలో కడప జిల్లావారు బ్యాక్ వాటర్‌లో 11.4 లక్షలు వదిలారు. ఇక రెండు జిల్లాల వంతు మిగిలి ఉంది. జిల్లా పరంగా 40 శాతం వదలాల్సి ఉండగా.. అదే ఎప్పుడు అన్న ప్రశ్న ఎదురవుతోంది. అలివి వలలతో వేట నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరుతున్నారు. దీనిపై మత్స్యశాఖ జేడీ శాంతి మాట్లాడుతూ.. టెండర్లు ఖరారు చేశారు. త్వరలోనే వదిలే ఏర్పాట్లు చేస్తామన్నారు.

దైన్యం తొలగేలా... ధాన్యం సేకరణ

ముందస్తుగా పౌరసరఫరాలశాఖ సన్నద్ధం

> రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలతో పోల్చితే.. జిల్లాలో పంట కాలానికి సంబంధం లేకుండా వరి సాగు, ధాన్యం సేకరణ ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని శాశ్వత లక్ష్యాన్ని నిర్ణయించాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా.. ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. అందులో భాగంగానే.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ధాన్యం సేకరించేందుకు పౌరసరఫరాలశాఖ చర్యలు చేపట్టింది. ఈ నెల ఆరో తేదీ మిల్లర్లు, రైతులతో సమావేశం నిర్వహించనున్నారు.

ధాన్యం విక్రయాలు

సంగం, న్యూస్‌టుడే: జిల్లాలో కర్షకులకు మేలు జరిగేలా పౌరసరఫరాలశాఖ ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. 1.4 లక్షల టన్నుల మేర ధాన్యం సేకరణకు సిద్ధమైంది. జులై నుంచి అక్టోబరు వరకు ఎడగారు ఉంటుంది. ఆ సమయంలో పండిన 1.5 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులు రాగా.. పౌరసరఫరాలశాఖ ఆలస్యంగా ప్రక్రియ ప్రారంభించడంతో 10,214 టన్నులే సేకరించారు. అందుకుగాను రూ. 24 కోట్లు రైతులకు చెల్లించారు. ప్రస్తుతం 1.4 లక్షల టన్నుల సేకరణకు సిద్ధంగా ఉన్నట్లు ఉన్నతాధికారులకు నివేదించగా.. ఆమోదం లభించింది. వ్యవసాయశాఖ 'ఈ పంట ఆధారంగా' ఇచ్చే వివరాల మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

ఏప్రిల్ నుంచి మరో 1.5 లక్షల టన్నులు

జిల్లాలో వరుస తుపాన్ల కారణంగా ఈసారి పంట సాగు ఆలస్యమైంది. దాంతో మార్చి నెలాఖరుకు తక్కువగా, ఏప్రిల్ నుంచి ఎక్కువ మొత్తంలో పంట చేతికి రానుంది. ఆ క్రమంలో 1.5 లక్షల టన్నుల మేర సేకరించాలని ప్రతిపాదించారు. ఈ ఏడాది మొత్తం మీద 2.9 లక్షల టన్నుల వరకు సేకరించే అవకాశం ఉంటుందని పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు అర్జునరావు తెలిపారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

(c) eenadu

నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో కేకు కోస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ నాయకులు

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా నెల్లూరు నారాయణ వైద్య కళాశాలలో కేకు కోసే కార్యక్రమంలో మంత్రి నారాయణ

నగరంలోని జనహిత వాత్సల్య అనాథాశ్రమంలో విద్యార్థులకు కేకు తినిపిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

జిల్లాలో గురువారం నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. అధికారులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఎక్కడికక్కడ తమ శ్రేణుల ఆనందోత్సాహాల మధ్య కేకులు కోసి పంచిపెట్టారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మరికొందరు అభివృద్ధి కార్యక్రమాలకు స్వీకారం చుట్టారు. - న్యూస్‌టుడే బృందం

నేటి ఈఎస్ఎల్ క్రికెట్ మ్యాచ్‌ల వివరాలు (2-1-2026)

సీనియర్స్ A.C. Stadium (Ground-1)

కృష్ణచైతన్య డిగ్రీ కాలేజీ, నెల్లూరు x
ఆదిశంకర ఇంజినీరింగ్ కాలేజీ, నార్పరాజుపాళెం. 8.30 A.M.

గాయత్రి డిగ్రీ కాలేజీ, కందుకూరు x
ఆదిత్య డిగ్రీ కాలేజీ, నెల్లూరు 11.00 A.M.

ఉదయం 8.30 మ్యాచ్ విన్నర్ x
డి.బి.ఎస్. ఇంజినీరింగ్ కాలేజీ, కావలి 2.00 P.M.

గ్రౌండ్-2: తిరుపతి ఎస్వీయూ స్టేడియం

ఎన్.బి.కె.ఆర్. ఇంజినీరింగ్ కాలేజ్, విద్యానగర్ x
ఎస్వీయూ కళాశాల, తిరుపతి 8.00 A.M.

జూనియర్స్ A.C. Stadium (Ground-2)

ప్రభుత్వ జూ॥ కళాశాల, బిట్రగుంట x
ఎ.పి. మోడల్ స్కూల్ & కాలేజీ, ఎ.ఎస్.పేట 8.30 A.M.

బి.ఎస్.ఆర్. జూ॥ కాలేజీ, ఆత్మకూరు x
ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వెంకటేశ్వరపురం 11.00 A.M.

ఉదయం 8.30 మ్యాచ్ విన్నర్ x
డి.బి.ఎస్. పాలిటెక్నిక్ కాలేజీ, కావలి 2.00 P.M.

ఆ దారిలో.. ముక్కు మూసుకోవాల్సిందే

మండల కేంద్రంలోని మసీదు వీధిలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో పరిసరాల్లో ఉన్న స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ సిబ్బంది పట్టించుకోక పోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు వ్యర్థజలం రోడ్డుపై ప్రవహిస్తోంది. ముక్కు మూసుకుని నడవాల్సి వస్తోందని రాకపోకలు చేసే వారు చెబుతున్నారు. చెత్త కుప్పల కారణంగా దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్త వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కోవూరు

ఆర్ఎం మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందిస్తున్న ఉద్యోగులు

ఖాతాదారులకు మెరుగైన సేవలు

నెల్లూరు(నవాబుపేట), న్యూస్‌టుడే: రైతులు, స్వయం సహాయక సంఘాలు, వ్యాపారులు, సమాజంలోని అన్ని వర్గాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ కృషి చేస్తున్నట్లు ఆ బ్యాంక్ నెల్లూరు ఆర్ఎం టి.మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని వెంకట్రామాపురం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధి, ఎంఎస్ఎంఈ రుణాల పురోగతిలో ఏపీజీబీ ముఖ్యపాత్ర పోషించిందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్లు, ఉద్యోగ, సిబ్బంది పాల్గొన్నారు.

నివేదికల్లోనే నిధి..

అభివృద్ధికి దూరంగా కండలేరు జలాశయం ఆనకట్ట

నెల్లూరు, తిరుపతి జిల్లాలకు సాగునీరు, చెన్నై నగరానికి తాగునీరు అందిస్తున్న కండలేరు జలాశయం నిరాదరణకు గురవుతోంది. కనీసం చిన్న చిన్న మరమ్మతు పనులు కూడా చేపట్టకపోవడంతో ఆనకట్టపై చెట్లు పెరిగిపోయాయి. కట్టనుంచి నీరు కూడా లీకవుతోంది. కొన్నిచోట్ల కోతకు గురైంది. కనీస మరమ్మతు పనులు చేయడానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపినా. మంజూరు కాలేదు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (పద్మావతిసెంటర్), రాపూరు

ఈనాడు పరిశీలన

కోతకు గురైన జలాశయం ఆనకట్ట

కండలేరు జలాశయం.. ఆసియా ఖండంలోనే అతి పొడవైన మట్టికట్ట. 10.76 కిలోమీటర్ల దూరం ఉంది. పూర్తి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు. ప్రస్తుతం 60 టీఎంసీల నీరు నిల్వఉంది. జలాశయం పరిధిలో రెండు జిల్లాలకు కలిపి మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. దీని పరిధిలో 250 చెరువులు కూడా ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న జలాశయంపై నిర్లక్ష్యం జరుగుతోంది. ఆనకట్ట రోజురోజుకు బలహీన పడుతుండడంతో సమీప సైదాపురం, పొదలకూరు, వెంకటాచలం, మనుబోలు, గూడూరు, చిల్లకూరు, చిట్టమూరు, కోట, వాకాడు మండలాల ప్రజలు, రైతులు భయపడుతున్నారు. గత ఐదారు సంవత్సరాల నుంచి కట్టపై జలవనరుల శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడి విపరీతంగా చెట్లు పెరిగాయి. పలుచోట్ల కట్ట కోతకు గురైంది. దీనికితోడు కట్ట నుంచి ఊటనీరు లీకవుతున్నా జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు.

అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు

పది సంవత్సరాలుగా అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వారు ఆనకట్టను పట్టించుకోవడంలేదు. కండలేరు మట్టికట్ట ప్రమాదానికి గురైతే వందలాది గ్రామాలకు నష్టం వాటిల్లుతుంది. లక్షలాది ఎకరాల్లో పంట పొలాలు ముంపునకు గురవుతాయి. – శేషుబాబు, రాపూరు

కట్టను పటిష్ఠం చేస్తాం

కండలేరు జలాశయం ఆనకట్టపై జంగిల్ క్లియరెన్స్, దెబ్బతిన్న చోట పనులు చేయడానికి రూ.20 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదిక పంపాం. కట్టను పూర్తిస్థాయిలో పటిష్ఠంగా చేసి వాహనాలు తిరిగేలా చేయడానికి రూ.362 కోట్లు కావాలి. ఈ విషయాన్ని నివేదికలో పొందుపరిచాం.

–గజేంద్రరెడ్డి, ఈఈ, కండలేరు జలాశయం

జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

చిల్లకూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గురుకుల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ అండర్-14 విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ అనిల్‌కుమార్ గురువారం తెలిపారు. గతేడాది నవంబర్ 28వ తేదీ నుంచి మూడురోజుల పాటు కలికిరిలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఎనిమిది, తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు శ్రీనాథ్, బాలాజీ, అఖిల్ నెల్లూరు జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి మూడోస్థానంలో నిలిపారని చెప్పారు. ఈనెల 6 నుంచి నాలుగు రోజుల పాటు రాజస్థాన్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

గెలిచిన కప్‌ను చూపుతున్న విద్యార్థులు

బాలిక.. భయం లేదిక

ఆత్మరక్షణ విద్యలో శిక్షణ

'ధైర్యం కోల్పోవద్దు.. సమాజంలో ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కొనే శక్తి మీలోనే ఉంది.. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి.. ఇవీ సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షకులు బాలికలకు చెబుతున్న మాటలు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థినులకు ధైర్యాన్ని నూరిపోస్తున్నారు. ఆత్మరక్షణ విద్య నేర్చుకోవడంతో పాటు చదువులో ఎలా ముందుకెళ్లాలనే అంశంపై ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. ఎస్ఎస్ఏ ఆధ్వర్యాన జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని గత నవంబరులో ప్రారంభించారు.

– న్యూస్‌టుడే, కలిగిరి

కలిగిరి జడ్పీహెచ్ఎస్‌లో శిక్షణ పొందుతున్న బాలికలు

నేను రక్షించుకోగలను

టి.మాధురి, కేజీబీవీ, కలిగిరి.. పాఠశాలలో నేర్చుకున్న ఆత్మరక్షణ విద్యతో నన్ను నేను రక్షించుకోగలను. గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసిన సమయంలో ఏ విధంగా స్పందించాలో వివిధ పంచ్‌ల ద్వారా నేర్చుకున్నాను. బంగారం, నగదు అపహరణ సమయంలో సమయస్ఫూర్తిగా వ్యవహరించడం తెలుసుకున్నా.

స్వీయరక్షణే ధ్యేయంగా..

జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఆదర్శ, కేజీబీవీలు, గురుకులాల్లో 314 పాఠశాలల్లో చదివే బాలికలకు సాయంత్రం వేళ ప్రత్యేక శిక్షణ తరగతులు రెండు నెలలుగా జరుగుతున్నాయి. వీటిలో 46,430 బాలికలు తర్ఫీదు పొందుతున్నారు. తొలుత వ్యాయామంతో పాటు ఆపద సమయంలో ఎదురయ్యే పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి.. వారి నుంచి ఎలా రక్షించుకోవాలి? సమయస్ఫూర్తితో.. భయపడకుండా ధైర్యంగా ప్రతిస్పందించడం తదితరాలపై శిక్షణ ఇస్తున్నారు. దిశ, నిర్భయ వంటి చట్టాలున్నా బాలికలపై అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆత్మరక్షణ విద్య వారికి ఎంతో ఉపయోగంగా మారనుంది. తైక్వాండో, కరాటే, కుంగ్‌ఫూలో మెలకువలు నేర్పిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేకంగా నియమించిన కోచ్‌లు శిక్షణ ఇస్తున్నారు.

శారీరక, మానసికోల్లాసం

టి.చిత్ర, కేజీబీవీ, కలిగిరి.. ఆకతాయిల ఆగడాలు, అనుకోని ఆపద సమయాల్లో రక్షించుకోవడంపై శిక్షణ పొందాను. దీంతో శారీరక, మానసికోల్లాసం అలవడుతుంది. ఉచితంగా నేర్చుకోవడం ఆనందంగా ఉంది.

అందరికీ శిక్షణ

వెంకటసుబ్బయ్య, ఏపీసీ, జిల్లా ఎస్ఎస్ఏ

స్వీయరక్షణతో పాటు యోగాసనాలపై అవగాహన కల్పిస్తున్నాం. నవంబరు నుంచి కార్యక్రమం ప్రారంభమైంది. రోజుకు 90 నిమిషాల వంతున 20 రోజులు శిక్షకులు వారికి కేటాయించిన పాఠశాలలకు వెళ్లి ఆత్మరక్షణ విద్య నేర్పిస్తున్నారు. సంక్రాంతి సెలవుల్లోగా జిల్లాలోని అన్ని విద్యాలయాల్లో శిక్షణ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం.

జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో అధికారులు

మద్యం తాగి వాహనం నడిపితే ఆరునెలల జైలు

నెల్లూరు(రవాణా), ఆత్మకూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు గురువారం నుంచి జనవరి 31 వరకు జరుగుతాయని జిల్లా డిప్యూటీ రవాణా కమిషనర్ బి.చందర్ తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నారాయణ, కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా రోడ్డు సేఫ్టీ బ్యానర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదని తెలిపారు. తాగి నడుపుతూ పట్టుబడితే ఆరునెలల జైలుశిక్ష పడుతుందని వివరించారు. ప్రతి వాహనదారుడు జాగ్రత్తగా నడపాలన్నారు. కార్యక్రమంలో నెల్లూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి మదని, నెల్లూరు మోటార్ వాహన తనిఖీ అధికారులు బాలమురళీ కృష్ణ, రఫీ, ఆత్మకూరు మోటారు వాహన తనిఖీ అధికారి రాములు తదితరులు పాల్గొన్నారు.

కోడూరు తీరంలో కోలాహలం

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరు బీచ్ గురువారం సందర్శకుల రద్దీతో కోలాహలంగా మారింది. నూతన సంవత్సరం ప్రారంభ రోజు కావడంతో జిల్లాలోని నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. యువకులు ఎక్కువగా రావడంతో తీరంలో సందడి వాతావరణం నెలకొంది. సముద్రం లోపలికి వెళ్లకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కల్వర్టు లేని వైనం.. తప్పని ప్రమాదం

బుచ్చిరెడ్డిపాళెంలోని చెన్నూరురోడ్డు మార్గంలో మున్సిపాలిటీ దుకాణాల వద్ద రోడ్డు దుస్థితి ఇది. ఇటీవల రోడ్డు విస్తరణ చేశారే కానీ మురుగు కాలువలపై కల్వర్టు ఏర్పాటు చేయలేదు. దీంతో కేబుల్ వైర్లు, ఇతర పైపులు కనిపిస్తున్నాయి. రాకపోకలు చేసే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, నాయకులు స్పందించి డ్రెయిన్, రోడ్డుకు అనుసంధానంగా కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ.12,793
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ.1,02,344
వెండి గ్రాము :	రూ.240.70

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	164
లేయర్	100
బ్రాయిలర్స్	286
బ్రాయిలర్స్కిన్‌లెస్	314
లేయర్ మాంసం	170

EENADU Classifieds JOBS

Escorts కావలి షోరూంలో పనిచేయుటకు కావలి, ఉదయగిరి నియోజకవర్గంలోని మండలాల వారీగా సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం, ఇన్‌సెంటివ్ - 30,000/-. స్థానికులకు ప్రాధాన్యత. ✆ 91212 84988, 90142 60271

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే

వివరాలకు..

నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 600
Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

ఆయుష్ పోసేనా..!

శిథిలావస్థలో ఆయుర్వేద ఆసుపత్రులు

గ్రామాల్లో సీజనల్ వ్యాధులతో ప్రజలు సతమతమవుతున్నారు.. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళితే చికిత్స వ్యయమూ అధికమై పేద, మధ్య తరగతి వర్గాలకు వైద్యసేవలు పెనుభారమవుతున్నాయి. ఈ తరుణంలో తక్కువ వ్యయంతో వ్యాధులను నయం చేసే ఆయుర్వేదం ఆశాజనకంగా కనిపిస్తోంది. మారుతున్న కాలంతో పాటు ప్రాచీన ఆయుర్వేద వైద్యానికి ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. అందుకనుగుణంగా ఆయుర్వేదం, యునాని, హోమియో వైద్య కేంద్రాల్లో సరిపడ వైద్యులు లేకపోవడంతో రోగులు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కేంద్రాలకు వెళుతున్నారు.

మడమనూరులో వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యురాలు

న్యూస్‌టుడే, మనుబోలు

జిల్లాలో ఆయుష్ పరిధిలో పలు ఆయుర్వేద, యునాని, హోమియో ఆరోగ్య కేంద్రాలు మొత్తం 43 వరకు ఉన్నాయి. చాలాచోట్ల సొంత భవనాలు లేక శిథిలావస్థ గదుల్లో నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే మందులు భద్రపరిచేందుకూ ఇక్కడ సరైన వసతి లేదు. నెల్లూరు, కోవూరు, మాదరాజగూడూరు, తోటపల్లిగూడూరు, డమ్మాయపాలెం, మడమనూరు, తూర్పుకంభంపాడు, విరువూరు, చిరమన, తెల్లపాడు, సిద్ధనకొండూరు, జలదంకి, చిన్నక్రాక, తెల్లపాడు, కొండాపురం, పెదపుత్తేడు, గండవరం, వరిని దండిగుంట, ముదివర్తి, ముదివర్తిపాలెం, రామన్నపాలెం, అల్లూరు తదితర ప్రాంతాల్లో ఆయుర్వేద వైద్యశాలలు ఉన్నాయి. ఎక్కువ మంది వయసు పైబడిన వృద్ధులు సద్వినియోగం చేసుకుంటున్నారు. కోవూరు, అల్లూరుతో పాటు పలు చోట్ల వైద్యుల కొరత ఉంది. బుచ్చిరెడ్డిపాలెం, ఇనమడుగు, లక్ష్మీపురం, చాగణం, కలువాయి, బోగోలు, అనంతసాగరం, పలుకూరు, కందుకూరు, నెల్లూరు ప్రాంతాల్లో హోమియో వైద్యశాలలు ఉన్నాయి.

ఆయుష్ పరిధిలో కేంద్రాల వివరాలు	
ఆయుర్వేదం	26
హోమియో	10
యునాని	7

● మడమనూరు, విరువూరు, పెదపుత్తేడు, మాదరాజగూడూరు, చిన్నక్రాక, కోవూరు తదితర కేంద్రాలు శిథిలావస్థలో ఉన్నాయి.

● **వైద్యురాలు జగదీశ్వరి** మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో అధ్వానంగా ఉన్న కేంద్రాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. మడమనూరులో భవన నిర్మాణానికి సుమారు రూ.30 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో టెండర్లు పిలవనున్నట్లు చెప్పారు. మందుల కొరత లేదని, మూడు విడతలు మందులను సరఫరా చేస్తున్నామన్నారు. కషాయాలు, మందు బిళ్లలు, పౌడర్లు అందుబాటులో ఉన్నాయని రోగులకు మందులు ఇస్తున్నామని పేర్కొన్నారు.

ఏపీసీఎన్ఎఫ్ జిల్లా పీడీగా కన్నయ్య

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సామాజిక ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌గా కె.కన్నయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి డీపీఎం రవికుమార్ నుంచి బాధ్యతలు అందుకున్నారు. ఈయన ప్రస్తుతం జిల్లా భూసార పరీక్ష కేంద్రం ఏడీఏగా పనిచేస్తున్నారు. ఎస్‌టీఎల్‌కు ఇన్‌ఛార్జిగా, ఏపీసీఎన్ఎఫ్ డీపీఎంగా పూర్తిస్థాయిలో బాధ్యతలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగు అయ్యేలా కృషి చేస్తామన్నారు. ఆయన్ని ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


ఇన్‌ఛార్జి డీపీఎం రవిచంద్ర ప్రసాద్ నుంచి బాధ్యతలు అందుకుంటున్న కన్నయ్య

200 యూనిట్ల ఉచిత విద్యుత్తుకు దరఖాస్తు చేయండిలా?

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, ముత్తుకూరు : బార్బర్ దుకాణాలు నిర్వహించే నాయీ బ్రాహ్మణులు ఇకపై నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు వినియోగిస్తే ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం జీవో ఇచ్చింది. నవంబరు నెల నుంచే అమల్లోకి వచ్చింది. దీనికి ఎలా దరఖాస్తు చేయాలి..? ఎవరిని సంప్రదించాలో తెలియక చాలా మంది దళారులను ఆశ్రయించి డబ్బులు పోగొట్టుకుంటున్నారు.

అనుసరించాల్సిన విధానాలు ఇలా..

లబ్ధిదారులు తొలుత విద్యుత్తు శాఖ ఏఈకి దరఖాస్తు చేసుకుంటున్నట్టు రిక్వెస్టు లెటరు తయారు చేసుకోవాలి. ● దానికి లేబర్ లైసెన్సు, దుకాణం ఎదుట లబ్ధిదారులు నిల్చొన్న ఫొటో, విద్యుత్తు బిల్లు నకలు, తహసీల్దారు కార్యాలయం నుంచి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధారు కార్డు, అద్దె ఖరారు నామా జత చేయాలి. ● అద్దె ఖరారునామా లేని వారు అఫిడవిట్ జత పరచాలి. ● సరైన వివరాలతో దరఖాస్తు పూర్తి చేసిన తమ ప్రాంత ఏఈకి అందించాలి. ● అడ్మినిస్ట్రేటివ్ అధికారులకు వెళుతుంది . ● వారి ఆమోదం అనంతరం పథకం వర్తిస్తుంది.

గ్రంథాలయ బకాయిలు జమయ్యేనా?

పొదలకూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గ్రంథాలయాలు కనీస వసతులేక కునారిల్లుతున్నాయి. యువత పోటీ పరీక్షలకు తగిన పుస్తకాలు లేక, అంతర్జాల సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో వస్తున్న పాఠకుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. గూడూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలో ఉన్న గ్రంథాలయాలకు రావాల్సిన పన్ను బకాయిలు జమకావడం లేదు. పొదలకూరు గ్రంథాలయానికే సుమారు రూ.10 లక్షలకు పైగా ఇవ్వాల్సి ఉన్నా పంచాయతీ నుంచి చెల్లించడం లేదు. 35 ఏళ్లుగా నిర్వహిస్తున్న శాఖా గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. వందల సంఖ్యలో పాఠకులున్నా వారు కూర్చొని చదువుకునేందుకు కనీస సదుపాయాలు లేక చిన్న గదిలోనే కొనసాగించాల్సి వస్తోంది. నూతన పుస్తకాలు అందజేసి రెండేళ్లు గడుస్తోంది. సుమారు 6000 పుస్తకాలు గ్రంథాలయంలో ఉన్న వాటిని భద్రపరచుకునే సదుపాయం లేదు.

● లైబ్రేరియన్ కల్పనాదేవి చేజర్ల గ్రంథాలయం ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. వారంలో మూడు రోజులు పొదలకూరు మిగతా రోజులు చేజర్లలో విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు, దాతలు ముందుకొచ్చి శిథిలావస్థకు చేరిన గ్రంథాలయాన్ని కనీసం మరమ్మతులు చేయడం లేదా వేరొక భవనంలోకి మార్చాలని పాఠకులు కోరుతున్నారు.

● ఎంపీడీవో నరసింహారావు మాట్లాడుతూ... గ్రంథాలయానికి పంచాయతీల నుంచి చెల్లించాల్సిన పన్ను బకాయిలు చెల్లించే అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని, పాఠకులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

కార్పొరేషన్ ఎస్ఈగా రహంతుజానీ

నెల్లూరు (నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ విభాగం సూపరింటెండెంట్ ఇంజినీరుగా ఎస్‌కే రహంతుజానీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈఈగా పని చేస్తున్న ఆయనకు ఎస్ఈగా ఉద్యోగోన్నతి కల్పించి బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న రామమోహనరావును విజయవాడ ఏడీసీఎల్ ఎస్ఈగా బదిలీ చేశారు.

నాడు గుంతలమయం.. నేడు రోడ్డు నిర్మాణం

వెంకటాచలం మండలం కనుపూరు నుంచి చవటపాళేనికి వెళ్లే రోడ్డు కొన్నేళ్లుగా అధ్వానంగా ఉంది. ఈ మార్గంలో భారీ గుంతలు ఉండడంతో ఇటు వైపు వెళ్లాలంటే భయాందోళనకు గురయ్యారు. కొన్నేళ్లుగా అధ్వానంగా ఉన్న రోడ్డు కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న రోడ్డు ఆద్యంతం గుంతలు పడి దారుణంగా మారింది. కూటమి ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి మోక్షం లభించింది. రూ.కోటి మంజూరు చేయడంతో టెండర్లు పూర్తయి పనులుజరుగుతున్నాయి. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌టుడే, వెంకటాచలం

ప్లాస్టిక్ గుట్టలు.. వ్యాధులకు ఆవాసాలు

నెల్లూరు- ముత్తుకూరు ప్రధాన రోడ్డులోని బ్రహ్మదేవి వద్ద రోడ్డుపై ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. సమీపంలో మద్యం దుకాణం ఉండడంతో మందు బాబులు మద్యం తాగి ప్లాస్టిక్ గ్లాసులు, తినుబండారాల వ్యర్థాలను అక్కడే పడేస్తున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే మార్గంలో ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుపై వ్యర్థాలు వేయకుండా చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, ముత్తుకూరు

విద్యుత్తు తీగలు.. ప్రమాద ఘంటికలు

చెర్లోపాలెం పంచాయతీ పరిధిలో కట్ట కింద సుమారు అయిదు ఎకరాల విస్తీర్ణంలో దరువు ఉంది. దాని మీదుగా 11 కేవీ విద్యుత్తు లైను వెళ్తుండగా.. తీగలు దరువులో నీటిని తాకేంతా కిందికి వేలాడుతున్నాయి. నిత్యం పశువులు ఇక్కడ నీరు తాగుతుంటాయి. పలువురు చేపలు పడుతుంటారు. ఏ మాత్రం విద్యుదాఘాతం చోటుచేసుకున్నా ప్రమాదం తప్పదు. డిస్కం అధికారులు స్పందించి తీగలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కోవూరు

దశాబ్దాల క్రితం నిర్మాణం.. కూలడానికి సిద్ధం

ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడులోని డైట్ కళాశాలలో దశాబ్దాల క్రితం నిర్మించిన పాత భవనాలు శిథిలమయ్యాయి. అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో ప్రాంగణం మొత్తం ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. విషపురుగుల సంచారంతో కళాశాలకు వచ్చే విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పరిసరాలను శుభ్రం చేయాలని విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, ఇందుకూరుపేట

కావలి

•కావలి •ఉదయగిరి •ఆత్మకూరు

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

9 నుంచి క్రికెట్ పోటీలు

సీతారామపురం, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా ఈనెల 9 నుంచి బసినేనిపల్లిలో సీఎస్ఆర్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏదో తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీలపై గోడపత్రికలను బెంగళూరులో వైకాపా ఉదయగిరి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు చొప్పున విజేతలకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, వైకాపా మండల కన్వీనర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

హిందూ సమ్మేళనంపై ప్రచారం

ప్రచారం చేస్తున్న నాయకులు

ఉదయగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో ఈనెల 4న కళ్యాణ మండపంలో జరగనున్న హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని భాజపా, ఆర్ఎస్ఎస్ నాయకులు కోరారు. పంచాయతీ బస్టాండ్, మెయిన్ బజార్, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో గురువారం కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లలిత భరద్వాజ దత్త పీఠాధిపతులు రామయాణం మహేష్, ప్రధాన వక్తగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో భాజపా, ఆర్ఎస్ఎస్ నాయకులు గడ్డం ప్రసాద్, నారాయణరెడ్డి, మన్నేటి శ్రీనివాసులురెడ్డి, ముక్కా శ్రీనివాసులు, వల్లభ తదితరులు పాల్గొన్నారు.

జమ్ము.. ప్రవాహానికి అడ్డు

అల్లూరు స్లాంపు వాగులో జమ్ము తొలగించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం వర్షాలు లేకపోవటంతో వాగులో నీటి స్థాయి తగ్గింది. ఇప్పుడే చర్యలు తీసుకుంటే సమస్యలు ఉండవని రైతులు కోరుతున్నారు. లేకుంటే పంటలకు నీరు అందదని వాపోతున్నారు. **- అల్లూరు, న్యూస్‌టుడే**

నేటి నుంచి చెన్నైకి సూపర్‌లగ్జరీ బస్సు

ఉదయగిరి, న్యూస్‌టుడే: పట్టణం నుంచి చెన్నైకి సూపర్ లగ్జరీ బస్సును శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ప్రతిరోజు రాత్రి 9.30 గంటలకు బయలుదేరి నందిపాడు, ఆత్మకూరు, బుచ్చి, నెల్లూరు, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట మీదుగా మరుసటి రోజు తెల్లవారుజామున నాలుగు గంటలకు చెన్నైకు చేరుతుందన్నారు. అదేరోజు ఉదయం 10.30 గంటలకు అక్కడ బయలుదేరి సాయంత్రం 5.30కి ఉదయగిరికి చేరుతుందన్నారు.

భూగర్భ వంతెనలు.. ఇంకెంత కాలం?

కావలి, న్యూస్‌టుడే

పట్టణంలో రైల్వే పట్టాలను దాటేందుకు ఏర్పాటు చేస్తున్న భూగర్భ వంతెనల నిర్మాణం అడుగు ముందుకు నాలుగడుగులు వెనక్కు అన్న చందంగా మారింది. దీంతో ప్రజలకు కష్టాలు తీరడం లేదు. పట్టాలు దాటేందుకు ఇప్పటివరకు ఉదయగిరి వంతెన మాత్రమే ఉంది. మరో రెండు చోట్ల బుడమగుంట, వినాయక కాలనీ, జగనన్న లేఅవుట్ వద్ద రైల్వే క్రాసింగ్ గేట్లున్నాయి. వైకుంఠపురం వద్ద అనపగుంత తూము నుంచి ద్విచక్రవాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలు కురిస్తే ఇక్కడ అంతరాయమే.

నిర్మాణంలో భూగర్భ వంతెన

ఊట నీటితో అంతరాయం

వినాయకనగర్ కాలనీ వద్ద క్రాసింగ్‌కు ఫర్లాంగు దూరంలో ప్రస్తుతం భూగర్భ వంతెన నిర్మిస్తున్నారు. దీనికి సమీపంలో మందాటి చెరువు ఉండడంతో నీరు ఊరుతోంది. ఇటీవల వర్షాలకు భారీగా చేరడంతో రోజుల తరబడి పనులకు ప్రతిబంధకంగా మారింది. క్రాసింగ్ గేట్‌కు అలా దూరంగా నిర్మించడం ఎందుకు నిర్మిస్తున్నారో ఎవరికీ అంతుపట్టడం లేదు. జగనన్న లేఅవుట్ వద్ద వంతెన ఊసే లేదు. ట్రంకురోడ్డులోని ఐలవ్ కావలి పాయింట్ నుంచి కచ్చేరిమిట్ట మీదుగా తూర్పున ఉన్న వెంగళరావునగర్‌కు వెళ్లేందుకు పైవంతెన నిర్మిస్తామని పాలకులు ప్రకటించారు. కొత్తగా రెండు భూగర్భ వంతెనలతోపాటు మరో పైవంతెన నిర్మాణం ఉంటుందని వచ్చిన ప్రకటనలు ఆచరణలో కార్యరూపం దాల్చడం లేదు.

ఎమ్మెల్యే యోచన ఇలా..

ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ఇక్కడ పైవంతెన అవసరం లేదని పలుమార్లు ప్రకటనలు చేశారు. భూగర్భ వంతెనతో అవసరాలు తీరుతాయని స్పష్టంచేశారు. 2026 జనవరి నెలకల్లా పూర్తి చేస్తామన్నారు. ఆదిశగా ఇప్పటివరకు అడుగులు పడ లేదు.

ఏళ్లుగా అసంపూర్తి..

కళుగోళమ్మ ఆలయం వెనుకవైపున వైకుంఠపురం ప్రాంతానికి చేరుకునేందుకు గతంలో రైల్వే క్రాసింగ్ గేట్ ఉండేది. రైళ్ల రాకపోకలతో పదే పదే గేటు వేస్తుండడం ఇబ్బందిగా మారింది. ఈక్రమంలో అక్కడ పైవంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎన్నేళ్లు అయినా నిర్మాణం పూర్తయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. వైకుంఠపురం, ఉత్తర జనతాపేట, చేవూరివారితోట, తదితర ప్రాంతాల వారికి ఇక్కట్లు ఎదురవుతున్నాయి. వారంతా కిలోమీటరు దూరంలో ఉన్న ఉదయగిరి వంతెన మీదుగా ప్రధాన పట్టణానికి చేరుకోవడం పెద్ద సమస్యగా మారింది.

అనుమతులు రాలేదు

గుండాల భరత్‌కుమార్‌రెడ్డి, సహాయ ఇంజినీర్, ర.భ శాఖ, కావలి

వైకుంఠపురం వంతెన మిగిలిన భాగం నిర్మాణానికి అనుమతులు రాలేదు. ప్రస్తుతం సందిగ్ధంలో ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పనులు చేస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి : 80080 51666, 91548 46698
ఉదయగిరి: 80085 73944 ఆత్మకూరు: 8008573949

సమస్య: పట్టణంలోని ఉదయగిరి వంతెనపై ఇరువైపులా కొన్ని చోట్ల గుంతలు ఏర్పడుతున్నాయి. పూర్తిగా సమస్య పరిష్కరించాలి.
- డబ్బుగొట్టు వెంకటరమణయ్య, కావలి

సమాధానం: సమస్యను వెంటనే పరిష్కరిస్తాం.
- నాగిరెడ్డి, డీఈఈ, ఎన్‌హెచ్ఏఐ, - కావలి

? లీకేజీ కారణంగా మా గ్రామంలో తాగునీటి ట్యాంకులో నుంచి నీరు వృథాగా పోతోంది. - రాము, జంగాలకండ్రిక
✓ పరిశీలించి వెంటనే చర్యలు చేపడతాం - జె.సునీల్‌కుమార్, సర్పంచి, జంగాలకండ్రిక
? ఏఎస్ పేట మండలం రాజవోలు ఎస్సీ కాలనీలో పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. - అంకయ్య, కాలనీవాసి
✓ వెలగని చోట వీధి దీపాలు వేయిస్తాం. - నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి
? మర్రిపాడు మండలంలోని నందవరంలో పారిశుద్ధ్య పనులు చేపట్టక పోవడంతో రోడ్ల వెంట చెత్త పేరుకుపోయింది. - బాషా, స్థానికుడు
✓ పారిశుద్ధ్య పనులు చేపడతాం. - రమేష్, పంచాయతీ కార్యదర్శి
? గ్రామంలో బస్‌షెల్టర్ నిరుపయోగంగా ఉంది. వినియోగంలోకి తెస్తే ప్రయాణికులకు బాగుంటుంది. - రామయ్య, అల్లూరు
✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఉమామహేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ - అల్లూరు, న్యూస్‌టుడే
? మర్రిపాడు మండలంలోని చినమాచనూరులో నిర్మించిన చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా మారింది. - కిరణ్, స్థానికుడు
✓ వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడతాం. - నాగేశ్వర ప్రసాద్, ఎంపీడీవో
? సంగం మండలం మక్తాపురం గ్రామ కూడలిలో బస్‌షెల్టర్ వద్ద అపరిశుభ్రంగా ఉంది. తగిన చర్యలు తీసుకోవాలి. - రాజేష్
✓ వెంటనే పారిశుద్ధ్య సిబ్బందితో బాగు చేయిస్తాం. - అరుణ, పంచాయతీ కార్యదర్శి
? అనంతసాగరం మండలం కొత్తపల్లి వడ్డిపాలెం గ్రామంలో మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే మురుగు నీరు రోడ్డుపై నిలుస్తోంది. - రాఘవయ్య, గ్రామస్థుడు
✓ మురుగు కాలువల నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. - రమణారావు, పంచాయతీ కార్యదర్శి
? [illegible] - [illegible], వైకుంఠపురం
✓ పైప్‌లైన్ల వ్యవస్థ అందుబాటులోకి రానందున ట్యాంకర్లతో ఇస్తున్నాం. - సాయి కుమార్, కమిషనర్ - కావలి, న్యూస్‌టుడే

నూతన సంవత్సరం.. మిన్నంటిన సంబరం

కావలి: ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

దుత్తలూరు: అలంకరణలో వెంగమాంబ దంపతుల విగ్రహాలు

కలిగిరి: సీఐకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాలుగు మండలాల ఎస్సైలు

న్యూస్‌టుడే బృందం, కావలి, ఉదయగిరి: నూతన సంవత్సర వేడుకలు గురువారం అంబరాన్ని తాకాయి. కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో వాడవాడలా కోలాహలంగా జరిగాయి. కేకులు కోసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. కావలిలో ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డికి అధికారులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పూజలు చేసేందుకు వెళ్లిన వారితో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. దుత్తలూరు మండలంలోని నర్రవాడ వెంగమాంబ ఆలయానికి పోటెత్తారు. దగదర్తిలోని ఆలయాల్లో పూజలు జరిగాయి. **ఆత్మకూరు, సంగం, ఏఎస్‌పేట, మర్రిపాడు, చేజర్ల :** ఆత్మకూరు నియోజకవర్గంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆత్మకూరు వెంకటేశ్వర స్వామి, అలఘనాథ స్వామి ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనంలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. చేజర్ల మండలంలోని తెదేపా నాయకులు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, బీద రవిచంద్రని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు తాళ్లూరు గిరినాయుడు, వేలూరు కేశవచౌదరి తదితరులు ఉన్నారు. సంగం బస్టాండు కూడలిలో యువత నూతన ఏడాదికి స్వాగతం పలుకుతూ కేకును కోసి మతాబులు కాల్చారు. నూతన సంవత్సరం సందర్భంగా ఏఎస్ పేట దర్గాకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.

ఉదయగిరి: గంగమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సంగం: కేకు కోస్తున్న తెదేపా నాయకులు

పరదాల నీడలో చెక్‌పోస్టు

పట్టణంలోని ఉదయగిరి హైవే రోడ్డులో ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులో కనీస వసతులు లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ కనీసం నీడ కూడా లేదు. దస్త్రాలు భద్రపరుచుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ఏటా సుమారు మూడు కోట్ల రూపాయలు వరకు ఆదాయం ఉదయగిరి మార్కెట్ కమిటీకి వస్తోంది. ఇందులో సింహ భాగం ఈ చెక్‌పోస్టు నుంచే వసూలవుతోంది. అయినా ఇక్కడ సౌకర్యాలు కల్పించలేదు. రోడ్డు పక్కన రేకుల వేసుకొని విధులు నిర్వహిస్తున్నారు. చుట్టూ పరదాలు కట్టి కాలం వెళ్లదీస్తున్నారు. రోడ్డు విస్తరణలో భవనాన్ని కూల్చి వేశారు. దస్త్రాలు భద్రపరిచేందుకు తాత్కాలికంగా ఒక బంకు తయారు చేయిస్తున్నట్లు ఇక్కడ పనిచేస్తున్న వెంకటేశ్వర్లు తెలిపారు. **- వింజమూరు, న్యూస్‌టుడే**

పరదాల మాటున మార్కెట్ కమిటీ చెక్ పోస్ట్

ఉపాధ్యాయులకు బ్యాగులు అందజేత

సీతారామపురం : నూతన సంవత్సరం సందర్భంగా తెదేపా నాయకులు కుర్రా రత్తయ్య యాదవ్ గ్రామంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయులకు బ్యాగులు పంపిణీ చేశారు. యూటీఎఫ్ యూనియన్ ఉపాధ్యాయులందరికీ వాటిని అందజేశారు. ఏపీటీఎఫ్ యూనియన్ వారికి కూడా ఇచ్చారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంఈవో కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి గురువారం దర్శించుకున్నారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు స్వామివారి శేషవస్త్రం, ఫల మంత్రాక్షితలతో ఎమ్మెల్యేని ఆశీర్వదించారు.

కేంద్రం ఇలా... సంపద ఎలా?

మండలంలోని పాపంపల్లిలో చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా మారింది. దీని చుట్టూ చెట్లు పెరగడంతో విషసర్పాలు సంచరిస్తున్నాయి. కేంద్రాన్ని వినియోగంలోకి తెస్తే గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపడుతుందని ప్రజలు సూచిస్తున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున మాట్లాడుతూ వినియోగంలోకి తీసుకొచ్చేలా చూస్తామని తెలిపారు. **- దుత్తలూరు, న్యూస్‌టుడే**

బొమ్మలేసినా మారరే !

ఇది పట్టణంలోని రైల్వేస్టేషన్ ముందు దివ్యాంగుల వాహనాల పార్కింగ్‌కు నిర్దేశించిన ప్రదేశం. ర్యాంప్ చెంతనే ఇలా రిజర్వ్ చేశారు. తొలుత బోర్డు పెట్టినా సకలాంగుల వాహనాలు పార్క్ చేస్తుండడంతో నేలపై దివ్యాంగ వాహనాల బొమ్మలు కూడా వేశారు. అయినా మార్పు లేకుండా అక్కడే పెడుతున్నారు. **- కావలి, న్యూస్‌టుడే**

గుంత.. ప్రమాదమంట!

ఈ చిత్రం ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. బోగోలు మండలంలోని జువ్వలదిన్నెకు వెళ్లే మార్గంలో జడగోగుల సమీపంలో రహదారి అధ్వానంగా తయారైంది. మార్జిన్‌లో పెద్ద గుంత ప్రమాదకరంగా మారింది. ఈమార్గంలో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీన్ని పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఏఈ భరత్‌కుమార్‌రెడ్డి వివరించారు.
- బిట్రగుంట, న్యూస్‌టుడే

నీటి వృథా అరికట్టరూ!

పడమటి కంభం పాడు చెరువు కట్టపై నాగారప్పమ్మ ఆలయం వద్ద కుళాయి దెబ్బతినడంతో తాగునీరు వృథాగా పోతోంది. గుర్తు తెలియని వ్యక్తులు కుళాయిని ధ్వంసం చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అప్పటి నుంచి నీరు వృథాగా పోతోందని పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కుళాయికి డమ్మీ ఏర్పాటు చేయిస్తామని సర్పంచి లావణ్య తెలిపారు. **- న్యూస్‌టుడే, అనంతసాగరం**

రక్షణ దిమ్మెలు శిథిలం.. ప్రయాణికులకు భయం

కలిగిరి- సంగం రోడ్డుపై గ్రామ సమీపంలో చప్టాకు ఒకవైపు రక్షణ దిమ్మెలు కూలిపోయాయి. ఆరు నెలల క్రితం లారీ ఢీకొట్టడంతో ఇవి దెబ్బతిన్నాయి. కొన్ని ధ్వంసం కాగా, మరికొన్ని పగిలాయి. ఇవి లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ విషయమై ర.భ ఏఈ అహ్మద్‌బాషాను వివరణ కోరగా పరిశీలించి చర్యలు చేపడతామని వివరించారు.
- న్యూస్‌టుడే, కలిగిరి

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఉదయగిరి, న్యూస్‌టుడే: మండలంలోని వడ్లమూడిపల్లికి చెందిన రాయవరపు వెంకటమ్మ (85) నెల్లూరులో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. గత నెల 23న ఇంట్లో నీరు కాస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకొని గాయాలయ్యాయి. నెల్లూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్నాటి ఇంద్రసేనా రెడ్డి తెలిపారు.

గడ్డి మందు తాగిన యువకుడు..

ఆత్మకూరు, న్యూస్‌టుడే: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్సై జిలానీ తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరు పట్టణానికి చెందిన భరత్(22)గత నెల 29న గడ్డి మందుతాగారు. కుటుంబ సభ్యులు గమనించి చెన్నై తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని బలవన్మరణానికి కారణాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు

బోల్తా పడిన కారు

వింజమూరు, న్యూస్‌టుడే : కావలి- ఉదయగిరి రోడ్డులో కారు ఢీకొని యువకుడికి గాయాలైన వైనమిది. మండలంలోని జువ్విగుంటపాలెంలో జరిగిన ఘటనలో గ్రామానికి చెందిన కుమ్మిత శ్రీధర్‌కు గాయాలయ్యాయి. వరికుంటపాడు డిస్కం సిబ్బంది ఆత్మకూరు నుంచి దుత్తలూరు వైపు వెళుతుండగా మోటార్‌సైకిల్‌పై రోడ్డు దాటుతున్న శ్రీధర్‌ను ఢీకొంది. కారు రోడ్డుకు దూరంగా వెళ్లి పడిపోయింది. అందులో ఉన్న వారికి గాయాలు కాలేదు. శ్రీధర్‌ను తొలుత కావలికి తరలించి ప్రాథమిక వైద్యం అనంతరం చెన్నైకు తరలించారు.

డీసీపల్లి సమీపంలో..

మర్రిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని డీసీపల్లి సమీపంలో వెన్నవాడ వెళ్లే మార్గంలో గురువారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. స్థానికుల వివరాల మేరకు రామనాయుడుపల్లికి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెన్నవాడ నుంచి వస్తున్నారు. డీసీపల్లి నుంచి మరో వ్యక్తి వెన్నవాడ వైపు వెళుతుండగా మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

కలిగిరి, న్యూస్‌టుడే: మండలంలోని తూర్పుగుడ్లదొన అటవీ ప్రాంతంలో జరుగుతున్న కోడిపందేల స్థావరంపై ఎస్సై ఉమాశంకర్ గురువారం సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. పది మందిని అదుపులోకి తీసుకుని, రూ.4,500 నగదు, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

తప్పిపోయిన బాలుడు తండ్రికి అప్పగింత

దగదదర్తి, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనేందుకు తండ్రితో కలసి దగదర్తికి వచ్చిన బాలుడు గురువారం తప్పిపోగా.. గుర్తించిన పోలీసులు తిరిగి అప్పగించారు. ప్రకాశం జిల్లా పామూరు పట్టణానికి చెందిన సుబ్బరాయుడు తన మూడేళ్ల కుమారుడు అనోస్‌తో కలసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనేందుకు దగదర్తిలోని ఓ ప్రార్థనా మందిరానికి వచ్చారు. ఆసమయంలో బాలుడు బయటకు వచ్చి దారి తప్పి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఏడుస్తూ వెళుతున్నాడు. అటుగా వెళుతున్న గ్రామంలోని మిక్స్‌డ్ కాలనీకి చెందిన విజయనిర్మల గుర్తించి తీసుకెళ్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించింది. ఎస్సై తమ సిబ్బంది గ్రామంలో విచారించారు. ప్రార్థనా మందిరం వద్ద తండ్రి సుబ్బరాయుడుకు అప్పగించారు.

దుమ్ముకొట్టుకుపోతున్నారు!

కొండాపురం, న్యూస్‌టుడే

ఆదిమూర్తిపురం గ్రామం నుంచి రాము తన మిత్రుడితో కలిసి మోటారుబైకుపై ఇస్కదామెర్ల వెళ్లి తిరిగి ఇంటికి వచ్చారు. శరీరమంతా దుమ్ము కొట్టుకుపోవడంతో ఏమిట్రా మీ అవతారం అంటూ వారి అమ్మ ప్రశ్నించింది. ఏముందమ్మా ఆ రోడ్డుపై దుమ్ము ఎగసిపడుతోంది. దీంతో ఇలా అయ్యామని తెలిపారు. ఇదీ ఈమార్గంలో నిత్యం వెళ్లే వారి పరిస్థితి. అసంపూర్తిగా నిర్మించిన 12 కి.మీ మార్గంలో ప్రయాణం దారుణంగా తయారైంది. పైగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఏళ్లుగా దీనికి మోక్షం కలగడం లేదు.

ఆదిమూర్తిపురం నుంచి ఇస్కదామెర్ల వెళ్లే మార్గంలో ప్రయాణికులు నిత్యం దుమ్ములో ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. ర.భ శాఖ అధికారులు రూ.3.50 కోట్లతో 12 కిలోమీటర్ల మేర కొన్నాళ్ల క్రితం మరమ్మతులు చేశారు. గుంతలు పడిన చోట చేసేందుకు పగలగొట్టారు. కొంతమేరకు పనులు చేశారు. ఆతరువాత బిల్లులు రాలేదని గుత్తేదారు పనులు చేయడం మానుకున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు దుమ్ములో నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు పీజీఆర్ఎస్‌లో విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దీనిపై దృష్టి సారించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇస్కదామెర్ల వద్ద ఎగసి పడుతున్న దుమ్ము

తారు పనులు మిగిలాయి

ఫయాజ్, ఏఈ ర.భ

రోడ్డు మీద తారు వేసే పని మిగిలి ఉంది. బిల్లులు రావడం లేదని గుత్తేదారు చెబుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

అధిక ధరలకు ఎరువుల విక్రయాలు

అనంతసాగరం, న్యూస్‌టుడే: రబీ సీజన్లో రైతులు వ్యవసాయ పనుల్లో హడావుడిగా ఉంటే మరోవైపు ఎరువుల వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి విక్రయిస్తున్నారు. నిషేధిత పురుగు మందులు, నాసిరకం మందులను రైతులకు అంటగడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరి కొంతమంది ఎరువులు, పురుగుల మందులు రైతులకు అప్పుగా ఇవ్వడంతోపాటు వ్యవసాయ పనులకు పెట్టుబడిగా నగదును ఇస్తున్నారు. పంట చేతికొచ్చినప్పుడు రైతుల నుంచి తక్కువ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేసి వ్యాపారులు దోపిడీకీ పాల్పడుతున్నారని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం యూరియా బస్తా ధరను రూ.267 నిర్ధారించగా బయట అనధికార దుకాణాల్లో రూ.300 నుంచి రూ.350 వరకు అమ్ముతున్నారు. ఇతర ఎరువులు, పురుగు మందులను సైతం ఎంఆర్పీ ధరలకు కంటే రూ.50 అదనంగా విక్రయిస్తున్నారని స్థానిక రైతులు వాపోతున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారిణి శైలజాకుమారి మాట్లాడుతూ ఎరువుల దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తున్నామన్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు మా దృష్టికి తీసుకువస్తే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం.. వ్యాధుల భయం

న్యూస్‌టుడే, దుత్తలూరు

పాలకుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. కాలువల్లో పూడిక చేరడం.. కొన్నిప్రాంతాల్లో అసలు లేకపోవడంతో మురుగునీరంతా వీధుల్లో ప్రవహిస్తోంది. ఫలితంగా దోమలు ఉద్ధృతమై వ్యాధులు ప్రబలుతున్నాయి.

ఉదయగిరి నియోజకవర్గంలో ఎనిమిది మండలాలుండగా 143 గ్రామ పంచాయతీలతోపాటు 127 మజరా గ్రామాలున్నాయి. గతంలో నిర్మించిన కాలువలు కూడా నిర్మించే వారు. దీంతో వర్షపు నీటితో పాటు ఇళ్లలోని వృథా నీరు కాలువల్లోకి వెళ్లేది. దీంతో ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావు. వీటిలో పూడిక సరిగా తీయకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయి మురుగునీరు ముందుకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఫలితంగా పారిశుద్ధ్యం అధ్వానంగా మారి మురుగు కాలువల్లో దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. మండల కేంద్రాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

లక్ష్మీపురంలో చెత్తాచెదారంతో నిండిన కాలువ

కాలువలు లేకుండా నిర్మాణం

తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పల్లె పండగ పేరిట గ్రామాల్లో పెద్ద ఎత్తున సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టింది. వీటికి అనుసంధానంగా కాలువలు నిర్మాణం చేపట్టకపోవడంతో ఇళ్లలోని మురుగునీటితో పాటు వర్షాలు పడినప్పుడు వచ్చే నీరు రహదారులపైకి చేరుతోంది. దుర్గంధం వెదజల్లుతోంది. ప్రస్తుతం గ్రామాల్లో పల్లె పండగ పేరిట నిర్మించిన రోడ్లకు కాలువలు నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం

గ్రామాల్లో చెత్తాచెదారంతో నిండిన కాలువల్లో ప్రవాహం సాగేలా చర్యలు తీసుకోవాలని పాలకులు, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. పల్లె పండగ పేరిట నిర్మించిన రహదారుల పక్కన కాలువల నిర్మాణం విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపడతాం.
– వెంకటరమణ, కావలి డీఎల్పీవో

జలాశయానికి 5,269 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయంలో గురువారానికి ఎగువ ప్రాంతాల నుంచి 5,269 క్యూసెక్కులు వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.988కి 73.926 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 328.166 అడుగుల మేర నీటి మట్టం నమోదైంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50, క్రస్ట్‌గేట్ల లీకేజీల ద్వారా 50, పవర్ టన్నల్ ద్వారా 2,600 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన కండలేరు వరద కాలువకు 2,000, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 274 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
బ్యాంక్ ఆఫ్ బరోడా
కావలి బ్రాంచి, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా ఈ క్రింది పేర్కొనబడిన ఖాతాదారు మా బ్యాంకు **కావలి బ్రాంచి** నందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణములు చెల్లించాల్సిందిగా బ్యాంకు వారు పలుమార్లు కోరినను, నోటీసులు పంపినను, వారు తమ బాకీలు చెల్లించలేదు. కావున ఈ పత్రికా ప్రకటన ద్వారా దిగువ ఖాతాదారులకి తెలియజేయునది ఏమనగా **తేది.15.01.2026** లోగా బకాయి సొమ్ము, వడ్డీ & ఇతర ఖర్చులను కలిపి మొత్తంను బ్యాంక్‌కు చెల్లించి మీరు తాకట్టుగా ఉంచిన బంగారపు వస్తువులను విడిపించుకొనవచ్చును లేని యెడల సదరు బంగారు నగలను మా బ్యాంకు శాఖ ఆవరణలో **తేది.22.01.2026, మ.3.00 గం.లకు** బహిరంగ వేలము వేసి మీ పేరున ఉన్న బకాయిలు జమకట్టుకొనబడును. ఖాతాదారునికి ఎవరికైననూ బ్యాంకు వారి నోటీసులు అందని యెడల లేదా నోటీసులు తిరస్కరించిన వారికి పత్రికాముఖంగా చివరగా తెలియజేయడమైనది. వేలము వేసినా బకాయి సొమ్ముకు సరిపోనియెడల వారిపై చట్టరీత్యా తగుచర్యలు తీసుకొని మిగిలిన బకాయిలు వసూలు చేయబడును మరియు వేలము తదితర ఖర్చులు వారి ఖాతాకు వ్రాయబడును. ఈ దిగువ ఖాతాదారు మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు

క్ర.సం	అకౌంట్ నెంబరు	ఋణగ్రహీత పేరు	లోను మొండి బకాయి తేది
1.	37130600015582	శ్రీమతి పొట్లూరి శారద	20-08-2023

వేలం నియమ నిబంధనలు: (1) వేలంలో పాల్గొనువారు ది. **22.01.2026** తేదీన మధ్యాహ్నం **1.00 గం.** లోపు ఆధార్ కార్డు, పాన్ కార్డు మరియు ఒక ఫోటో ఇచ్చి **రూ.25,000/-** ధరావత్తు సొమ్మును 'బ్యాంక్ ఆఫ్ బరోడా, పైన తెలిపిన బ్రాంచి పేరున క్యాష్ డిపాజిట్ చేయవలెను. (2) ఏ కారణం చూపకుండానే వేలం షరతులు మార్చుటకు, వేలం వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు బ్యాంకు వారికి సర్వ హక్కులు కలిగియున్నవి. (3) మరిన్ని వివరములకు బ్రాంచిను సంప్రదించండి.

తేది: 01.01.2026, ప్రదేశం: కావలి — బ్రాంచి మేనేజర్, బ్యాంక్ ఆఫ్ బరోడా

(c) eenadu

గూడూరు
•గూడూరు •కోవూరు •సర్వేపల్లి

గూడూరు జిల్లా చేయాలని డిమాండ్
గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం గూడూరును అడ్డగోలుగా విభజించి తీవ్ర అన్యాయం చేసిందని, గూడూరును జిల్లాగా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గూడూరులోని గ్రామకార్యాలయం వద్ద గురువారం మాట్లాడారు. 1890లో బ్రిటీష్ ప్రభుత్వం ఉన్నప్పుడు చిత్తూరు జిల్లా కేంద్రంలో ఉన్న గూడూరు రెవెన్యూ డివిజన్ 19 మండలాలతో ఉండేదని, ఇప్పుడు కేవలం 3 మండలాలతో డివిజన్ చేయడం దారుణమన్నారు. జగన్ ప్రభుత్వం గూడూరుని తిరుపతిలో కలిపి అన్యాయం చేస్తే, కూటమి ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని చెప్పారు. డివిజన్ కేంద్రం ఉనికి కోల్పోయిందని వాకాడు, చిట్టమూరు మండలాలను కలిపి గూడూరుని జిల్లా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పూల చంద్రశేఖర్, రామకృష్ణయ్య, వేమయ్య, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సైదాపురంలో ప్రత్యేక ప్రజావిజ్ఞప్తుల దినం
సైదాపురం, న్యూస్‌టుడే: సైదాపురం మండలంలో ప్రజల సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు గాను శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో ప్రత్యేక ప్రజావిజ్ఞప్తుల దినం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మోహన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హాల్లోని ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు తమ వ్యక్తిగత, గ్రామాభివృద్ధి సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చి పరిష్కారం పొందాలని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!
(10 AM to 1 PM) గూడూరు: 85002 02046
కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980

? సమస్య : పొదలకూరు రూరల్ పరిధిలోని నరసింహకొండ ప్రధాన వీధిలో విద్యుత్తు దీపాలు మరమ్మతులకు గురై పది రోజులుగా వెలగడం లేదు. – చంద్ర, స్థానికుడు
✓ సమాధానం : పరిశీలించి బాగు చేయిస్తాం. – సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి
? తోటపల్లిగూడూరు మండలం ఇస్కపాలెంలో రోడ్డు పక్కనే వ్యర్థాలు పడేస్తున్నారు. దీంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వ్యర్థాలు తొలగింపునకు చర్యలు తీసుకోవాలి – రామకృష్ణ, స్థానికుడు
✓ ప్రజలు ఇబ్బంది లేకుండా చేస్తాం. – లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో
? తోటపల్లిగూడూరు మండలం మల్లికార్జునపురం వద్ద పొదలకూరు కాలువలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. వర్షాలు కురిసిన సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – పరమేశ్, స్థానికుడు
✓ కాలువలో పిచ్చి మొక్కల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. – అలీ, ఇరిగేషన్ ఏఈ
? పొదలకూరులోని శ్రీనివాసనగర్‌లోకి వెళ్లే ముందు ఉన్న సాగునీటి కాలువ అపరిశుభ్రంగా తయారై దుర్గంధం వెదజల్లుతోంది. ఆలయానికి వెళ్లే భక్తులకు అసౌకర్యానికి గురవుతున్నారు. –వేణుగోపాల్, స్థానికుడు.
✓ గుత్తేదారుకు బిల్లులు చెల్లించక పనులు నిలిపేశారు. మాట్లాడి పనులు పూర్తిచేయిస్తాం. – అనిల్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ
? కోట పరిధిలోని రవినగర్ సమీపంలోని కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి నీటి పారుదలకు అడ్డంకిగా ఉంది. –కస్తూరయ్య
✓ సమస్య పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. – మునిరత్నం, ఇరిగేషన్ ఏఈ
? రాపూరు మండల పరిధిలోని సిద్ధవరం బీసీ కాలనీలో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దుర్వాసన వస్తోంది. – స్థానికులు
✓ సమస్య పరిశీలించి పరిష్కరిస్తాం – భవాని, ఎంపీడీవో, రాపూరు
? తోటపల్లిగూడూరు మండలం కృష్ణారెడ్డి పాలెంలో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కాలువలు శుభ్రం చేయించాలి. –రమేశ్
✓ పరిశీలించి కాలువలుపూడిక తీసేలా చర్యలు తీసుకుంటాం. – లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో
? తోటపల్లిగూడూరు మండల పరిధిలోని నడింపాలెం రోడ్డు గతుకులమయంగా మారింది. – రామలింగయ్య, స్థానికుడు.
✓ బాగుచేస్తాం. – రమేశ్, పీఆర్ ఏఈ
? పొదలకూరు రూరల్ పరిధిలోని టీపీ నగర్‌లో విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా వాలాన్నాయి. – వెంకటేశ్, స్థానికుడు
✓ సరి చేయిస్తాం. – శ్రీనివాసులు, ఏఈ
? రాపూరులోని వినాయకగుడి వద్ద చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. – స్థానికులు
✓ తొలగిస్తాం. – భవాని, ఎంపీడీవో
? బుచ్చి పురపాలక పరిధి నాలుగో వార్డులో వీధిదీపం వెలగడం లేదు. – రాజేష్
✓ ఏర్పాటు చేయిస్తాం. –బాలకృష్ణ,కమిషనర్

కార్యకర్తలకు అండగా ఉంటాం

కేకు కోస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, తెదేపా నాయకులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌ని ఘనంగా సత్కరించి, సన్మానించారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సీఎం చంద్రబాబు పాలనలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని, రాష్ట్రం అభివృద్ధి చెందాలని చెప్పారు. తనపై అభిమానం చూపించే నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే పిలుపు మేరకు పలువురు నాయకులు విద్యా సామగ్రిని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, గుండాల లీలావతి, పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వర్లురాజు పలువురు నియోజకవర్గ నేతలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేరు ఘనం.. రోగుల దైన్యం..!
గూడూరు ప్రాంతీయ వైద్యశాలలో పూర్తి కాని భవనం

అసంపూర్తిగా ఆసుపత్రి భవన నిర్మాణం

న్యూస్‌టుడే, గూడూరు పట్టణం

డివిజన్ కేంద్రమైన గూడూరు పరిధిలోని పేద ప్రజలకు ప్రాంతీయ వైద్యశాల ఎంతో కీలకం. ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడ వసతులు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయి. నూతన భవన నిర్మాణం నాలుగేళ్లుగా సాగుతోంది. గుత్తేదారు నిర్లక్ష్యంతో పేద రోగులకు అవస్థలు తప్పడం లేదు. రోజుకు వందల సంఖ్యలో ఓపీ నమోదవుతున్నా ఆ స్థాయిలో సౌకర్యాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది గర్భిణులు ఇక్కడ ప్రసవానికి వస్తుంటారు. నాబార్డు నిధులతో వంద పడకల నూతన ఆసుపత్రి భవన నిర్మాణం చేపట్టారు. రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పి.. నాలుగేళ్లు గడిచినా ఇంత వరకు పూర్తి కాలేదని రోగులు వాపోతున్నారు.

తులు లేకపోవడంతో ప్రథమ చికిత్స అందించి అనంతరం నెల్లూరుకు రిఫర్ చేస్తున్నారు. దీంతో ఎంతో మంది రోగులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం ఉన్న పాత భవనంలో రోగులు ఉండేందుకు వీలుగా పడకలు కూడా సక్రమంగా లేకపోవడంతో వైద్యం చేసుకొని ఇంటికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ప్రమాదాలు.. అత్యవసర సమయాల్లో ఇబ్బందులు
ప్రాంతీయ వైద్యశాలకు గూడూరు, చిల్లకూరు, కోట మండలాలతో పాటు సమీపంలోని సైదాపురం, రాపూరు, మనుబోలు మండలాల నుంచి, తిరుపతి జిల్లాలోని వాకాడు, చిట్టమూరు, ఓజిలి, బాలాయపల్లి మండలాల ప్రజలు నిత్యం వస్తుంటారు. కోల్‌కతా-చెన్నై రహదారిలోని జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులు ఎక్కువ మందిని ఈ ఆసుపత్రికే తరలిస్తారు. సరైన వస

ప్రాంతీయ వైద్యశాల	గూడూరు
నిధుల మంజూరు	నాబార్డు
కేటాయించిన నిధులు	రూ.21 కోట్లు
పనులు ప్రారంభించింది	2021
పూర్తి చేయాల్సిన సమయం	రెండేళ్లు
ఇప్పటి వరకు జరిగిన సమయం	నాలుగేళ్లు
రోజు ఆసుపత్రికి వచ్చే రోగులు	500 నుంచి 700

త్వరలో పూర్తిచేసేలా చర్యలు
డాక్టర్ వీణ, ఆసుపత్రి సూపరింటెండెంట్, గూడూరు

ఆసుపత్రి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారులకు తెలియజేశాం. అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ గుత్తేదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే నిర్మాణం పూర్తి చేసి, రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం

దివ్యాంగులకు సేవా కార్యక్రమాలు భేష్

మనవడితో దుప్పట్లు పంపిణీ చేయిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, న్యూస్‌టుడే: నూతన ఏడాది దివ్యాంగులకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. కొత్త ఏడాది సందర్భంగా వెంకటాచలంలోని సెయింట్ జ్యూడ్స్ మానసిక దివ్యాంగుల కేంద్రాన్ని గురువారం సందర్శించిన సోమిరెడ్డి.. తన మనుమడు రణదేవ్‌తో కలిసి దివ్యాంగులకు దుప్పట్లు, కేక్‌లు పంపిణీ చేశారు. ఈకేంద్రం 40 ఏళ్లుగా నిర్వహించడం గొప్పవిషయమన్నారు. శుక్రవారం మరికొన్ని వస్తువులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. నిర్వాహకులను సన్మానించారు. కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఎంవీఐలను కలిసిన సీఐటీయూ నాయకులు
గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా రవాణశాఖాధికారులను సీఐటీయూ ఆటో సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గూడూరు పట్టణంలోని రవాణాశాఖ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐటీయూ ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి రమణయ్య, నాయకులు శేఖరయ్య, సయ్యద్ మీరాషా, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చాముండేశ్వరీ ఆలయానికి సామగ్రి వితరణ
ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: గంగపట్నంలోని చాముండేశ్వరీ అమ్మవారి దేవస్థానానికి కర్పూరం సుధాకర్ రెడ్డి-లక్ష్మి కుమారి దంపతులు రూ.లక్ష విలువ చేసే రెండు టేబుళ్లను గురువారం అందజేశారు. ఆలయ ఛైర్మన్ కృష్ణారెడ్డి వారికి కృతజ్ఞతలు తెలియజేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు
తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: రైతుల భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు సుధీర్ తెలిపారు. మండలంలోని ఈదూరు-2, కోడూరు-1 గ్రామాల్లో రీ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దారు రైతుల సమస్యలు తెలుసుకున్నారు. గత సర్వేలో తప్పులుంటే సరిచేస్తామన్నారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నూతన సంవత్సరం.. ఆనంద పరవశం

పెంచలకోనలో బారులు తీరిన భక్తులు

గూడూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి బృందం, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలు గూడూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలో ఘనంగా జరిగాయి. చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులో వెలిసిన ముత్యాలమ్మ ఆలయంలో, రాపూరు మండలం పెంచలకోనలో విశేష పూజలు జరిగాయి. జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. పొదలకూరులోని శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి, రామనగర్ లోని అయ్యప్పనగర్‌లో వెలసిఉన్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. తోటపల్లిగూడూరు మండలంలోని పలు క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నచెరుకూరు రక్షణసైన్య ప్రార్థనా మందిరంలో కేకు కోశారు. కోడూరు తీరంలోని వేళాంగణి మందిరంలో ప్రార్థనలు చేశారు. విడవలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీసీటీఏ కాలమానిని కళాశాల ప్రిన్సిపల్ సుజాత ఆవిష్కరించారు.

చిల్లకూరు: బంగారు చీరలో ముత్యాలమ్మ

పొదలకూరులో...

తెదేపా బలోపేతానికి కృషి
విడవలూరు, ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: తెదేపా బలోపేతమే లక్ష్యంగా, ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలకు తెదేపా సీనియర్ నాయకులు బెజవాడ వంశీకృష్ణా రెడ్డి సూచించారు. గురువారం ఊటుకూరులో తెదేపా నాయకుడు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. సర్పంచి చౌటూరు వెంకటశేషమ్మ, ఎంపీపీ ఏకుల శేషమ్మ, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు. ఇందుకూరుపేట మండలంలో పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

జమ్మిపాలెం రోడ్డు గుంతలమయం

పడుగుపాడు ప్రధాన రహదారి నుంచి జమ్మిపాళేనికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి అధ్వానంగా ఉంది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. దుమ్ముధూళితో సతమతమవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు పరిశీలించి రోడ్లు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు, విడవలూరు

ఆదమరిస్తే కాలువలోకే..

విద్యానగర్ నుంచి రంగన్నగుంట వరకు డబుల్ రోడ్డుగా విస్తరించారు. ఈ క్రమంలోనే ఈ మార్గంలో వాహనాలు రాకపోకలతో రద్దీగా ఉంటుంది. విద్యానగర్ నుంచి వీరారెడ్డిపత్రం వరకు డివైడర్లు ఏర్పాటు చేశారు. మలుపులు వద్ద రేడియం సూచిక బోర్డులు పలు చోట్ల ఏర్పాటు చేసినవి కనిపించడం లేదు. ర.భ ఇన్‌ఛార్జి ఏఈ మల్లికార్జునరావు మాట్లాడుతూ తరచుగా రేడియం బోర్డులు ఏర్పాటు చేస్తునే ఉన్నామని, పరిశీలించి ఏర్పాటు చేస్తామన్నారు.– న్యూస్‌టుడే, కోట

చిన్న చెరుకూరులో తాగునీరు వృథా

తోటపల్లిగూడూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో పంచాయతీ కొళాయిలకు ట్యాప్‌లు లేక నీరు వృథాగా పోతోంది. చిన్నచెరుకూరు ఎస్సీ కాలనీలో కుళాయి ట్యాప్ లేకపోవడంతో కొన్ని నెలలుగా ఇదే సమస్య నెలకొంది. స్థానిక అధికారుల పర్యవేక్షణ లోపంతో కనపడుతోంది రూ.వంద రూపాయలు ఖర్చు చేస్తే తీరే సమస్యను గుర్తించేవారు లేరు. తాగునీరు వృథా కాకుండా అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

చిట్టేడు పీహెచ్‌సీకి ప్రహరీ ఏదీ..!

కోట మండలం చిట్టేడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ రక్షణకు ప్రహరీ లేదు. దీంతో మూగజీవాలకు సైతం ఆవాసంగా మారింది. రోగులు, పని చేసే సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవతున్నారు. నలభై గ్రామాలకుపైగా వైద్య సేవలందిస్తున్నారు. ఆరేళ్ల క్రితం నిధులు మంజూరై నిర్మాణానికి పునాదులు తీసి వదిలేశారు. వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నిధులు మంజూరైతే పనులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, కోట

అపహరిస్తున్నా పట్టదా..

పొదలకూరు చిట్టేపల్లి తిప్ప సమీపంలో ప్రజలకు శుద్ధి నీరందించాలని 2019లో మదర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్వహణ సరిగా లేక మదర్ ప్లాంట్‌తో పాటు గ్రామాల్లో ఏర్పాటు చేసినవి శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిలో ఉన్న విలువైన సామగ్రి కొందరు అపహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, పొదలకూరు

ద్విచక్ర వాహనం బోల్తా.. ఇద్దరికి తీవ్రగాయాలు
మనుబోలు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటన స్థానిక ఉన్నత పాఠశాల సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకొంది. స్థానికుల వివరాల మేరకు.. మనుబోలుకు చెందిన కృష్ణయ్య, వాసు పని నిమిత్తం ద్విచక్రవాహనంపై కోదండరామపురానికి వస్తుండగా రోడ్డుపైకి ఒక్కసారిగా గేదె అడ్డురావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహనంలో గూడూరుకు తరలించారు.

జూద స్థావరాలపై దాడులు
విడవలూరు, కోవూరు, న్యూస్‌టుడే: విడవలూరు మండలం రామచంద్రాపురంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో గురువారం ఎస్సై నరేష్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. రెండు కోళ్లు, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కోవూరు మండలంలోని విగ్నేశ్వరపురం సమీపంలో కొంతమంది వ్యక్తులు కోడి పందేలు నిర్వహించారు.

మనుబోలు, న్యూస్‌టుడే: మండలంలోని వడ్లపూడి అటవీప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందెం స్థావరంపై గురువారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,050 నగదు, కోడిపుంజు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాకేశ్ తెలిపారు.

ఇల్లు దగ్ధం.. రూ.5 లక్షల ఆస్తి నష్టం
విడవలూరు, న్యూస్‌టుడే: మండలంలోని రామతీర్థం పంచాయతీ పరిధిలోని రామలింగాపురంలో ఓ ఇంట్లో గురువారం గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు దగ్ధమైంది. స్థానికులు, బాధితుల వివరాల మేరకు.. పామంజి సుజాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుదాఘాతం చోటుచేసుకుంది. మంటలు చెలరేగి ఆ గ్యాస్‌సిలిండర్ పేలింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు మంటలను అదుపుచేశారు. అప్పటికే ఇంట్లోని నగదు, బంగారు ఆభరణాలు, విలువైన సామగ్రి కాలిబూడిదయ్యాయని, సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు వాపోయారు. తన భర్త దివ్యాంగుడని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సామూహిక పొంగళ్లు
కోట, న్యూస్‌టుడే: కోట మండలంలోని వాడవాడలా గురువారం నూతన సంవత్సర సంబరాలు ఘనంగా జరిగియి. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామదేవతల ఆలయాల్లో భక్తులు సామూహికంగా పొంగళ్లు పెట్టి పూజలు చేశారు. కోటమ్మ దేవత ఆలయంలో జరిగిన పూజలో వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది పలువురికి ప్రసాదాలు పంచారు. మండల పరిధిలోని పలు ఆలయాల్లో అన్నదానాలు నిర్వహించారు.

విశేష అలంకరణలో కోటమ్మదేవత

వేడుకగా త్రయోదశి పూజలు
నెల్లూరు(సాంస్కృతికం) : దర్గామిట్ట రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో గురువారం త్రయోదశి పూజలు ఘనంగా నిర్వహించారు. సుందరేశ్వర స్వామికి పూజలు, అనంతరం నందీశ్వరస్వామికి అభిషేకాలు జరిపారు.

ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం

రాపూరు ఆర్టీసీ బస్టాండ్ ముఖ ద్వారం వద్ద రోడ్డు దెబ్బతింది. గత నెలలో కురిసిన వర్షానికి ఇలా మారింది. కొన్ని రోజులుగా బోర్డు ఏర్పాటు చేసి వదిలేశారు. కనీసం మరమ్మతులు చేయడం లేదు. అక్కడ బస్సులు మలుపు తిరగాలంటే అవస్థలు తప్పడం లేదు. ఎదురెదురు వాహనాలు వస్తే ప్రమాదం జరిగే అవకాశముంది. ఇప్పటికైనా ఆర్టీసీ, ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రాపూరు

కనీస వసతుల్లేక అధ్వానం
రాపూరు, వెంకటాచలం, న్యూస్‌టుడే: రాపూరు.. 2009 ఎన్నికల ముందు వరకు నియోజకవర్గ కేంద్రంగా ఉంది. తరువాత పునర్విభజనలో మారింది. అయితే యాభై వేలకుపైగా జనాభా ఉన్నా కనీస వసతుల్లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కోటి రూపాయలకు వరకు పన్నుల రూపంలో జమవుతున్నా అందుకు తగిన సౌకర్యాలు లేవు. ఆర్థిక సంఘం నిధులు వస్తున్నా దేనికి వెచ్చిస్తున్నారో తెలియడం లేదు. గతంతో పోలిస్తే రాపూరు ప్రాంతం గణనీయంగా విస్తరిస్తోంది. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. రాపూరు పాత బస్టాండు నుంచి (పెంచలకోన మార్గంలో) ఊరు పొలిమేర వరకు అన్నీ నీటి మడుగులే ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా రెండు చోట్ల చెరువులను తలపిస్తున్నాయి. చుక్క నీరు బయటకెళ్లే మార్గం లేదు. మురుగునీటి మడుగుల నిండా దోమలు విజృంభిస్తూ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. తీవ్ర దుర్వాసన వస్తోందని మొఘల్ వీధి, మద్దెలమడుగు తదితర ప్రాంతాల వారు పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. అయినా ర.భ శాఖ అధికారులు పూర్తిగా అలసత్వం వహిస్తున్నారు. రోడ్డు మధ్యలో మురుగునీరు కొన్ని నెలలపాటు నిల్వ ఉంటోంది. అధికారులు చూస్తూ వెళుతున్నారే తప్ప సమస్యలు పరిష్కరిస్తున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో ప్రజల సమస్యలను చర్చించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరం పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు రాపూరు మండల సర్వసభ్య సమావేశం
రాపూరు, న్యూస్‌టుడే: రాపూరు మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో భవాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులంతా హాజరవ్వాలని కోరారు. అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో రావాలిన పేర్కొన్నారు.

వ్యక్తిగత ఆరోపణలు చేస్తే సహించం
మనుబోలు, న్యూస్‌టుడే: వ్యక్తిగత ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్‌కుమార్ అన్నారు. అక్కంపేటలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఉండే గ్రామంలో రెచ్చగొట్టే మాటలు తగవని సూచించారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు
పొదలకూరు, న్యూస్‌టుడే: ప్రతి ఉద్యోగి తమ వృత్తిపై అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని జిల్లా సాంఘిక సంక్షేమ ఉపసంచాలకులు శోభారాణి అన్నారు. పొదలకూరు బాలుర వసతిగృహం సంక్షేమాధికారి ప్రసాదరావు పదవీ విరమణ సందర్భంగా ఆమె హాజరై సన్మానించారు.

మృత్యు గుంతలు

గూడూరు-సైదాపురం ప్రధాన రహదారిలోని ఆర్అండ్‌బి రోడ్డు ధ్వంసమై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో రాకపోకల సమయంలో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఇటీవల జరిగిన ప్రమాదాలతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి గుంతలను తాత్కాలికంగా మట్టితోనైనా పూడ్చాలని విన్నవిస్తున్నారు.– న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, సైదాపురం

ఉపాధి రోజుల పెంపు.. శ్రామికుల్లో హర్షం
న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, వెంకటాచలం

పల్లెల్లో శ్రమజీవులకు కూటమి తీపి కబురు చెప్పింది... ఉపాధి హామీ పనుల్లో ప్రస్తుతం అమల్లో ఉన్న వంద రోజుల పని దినాలను 120 రోజులకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అరకొర పనులతో వేతనాలు సకాలంలో అందక అవస్థలు పడ్డారు. ప్రస్తుతం కనీస వేతన చెల్లింపును సవరించడంతో కార్మికులకు లబ్ధి చేకూరనుంది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పేరును వికసిత్ భారత్ జీ రామ్‌జీగా మార్చారు.

విరవదోలులో పనులు చేస్తున్న కూలీలు

కలకు పాల్పడ్డారని విమర్శలున్నాయి. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అధికారంలోకి వచ్చిన వెంటనే క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా జాబ్ కార్డుదారులందరికీ ఈకేవైసీని పూర్తి చేశారు. పని చేస్తున్న వేల మంది కూలీలకు పని దినాలు పెంపుతో ప్రయోజనం చేకూరనుంది. సర్వేపల్లి నియోజకవర్గంలో భూగర్భ జలాల పెంపుదల, ఉద్యాన పంటలు, తోటల పెంపకం, మినీ గోకులాలు, రోడ్లు, డ్రైనేజీలు, కాలువల్లో పూడిక తీయడం వంటి పనుల ద్వారా కార్మికులు లబ్ధి పొందుతున్నారు.

వేతనాలు అందక.. పనులు సాగక..
గత పాలనలో గూడూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల్లో ఉపాధి హామీ కూలీలకు వేతనాలు అందక పలువురు పనులకు దూరమయ్యారు. ఎక్కువగా దొంగ మస్టర్లు సృష్టించి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు...

సర్వేపల్లి నియోజకవర్గంలో వివరాలు		
మండలం	మొత్తం కూలీలు	పనిలో ఉన్నవారు
పొదలకూరు	21834	20675
మనుబోలు	11098	10889
వెంకటాచలం	14398	13454
ముత్తుకూరు	9949	8765
టీపీగూడూరు	12051	11323

● ఏపీడీ గాయత్రీ దేవి మాట్లాడుతూ.. పథకం పని దినాలను వంద నుంచి 120 వరకు పెంచడం ద్వారా శ్రామికుల ఆదాయం పెరుగుతుందన్నారు. ఎక్కువ మంది కార్మికులు కూలీలుగా ఈ పథకంలో చేరి ఉపాధి పొందేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

ఏపీటీఎఫ్ కాలమానిని ఆవిష్కరణ
పొదలకూరు : ఎంఈవో కార్యాలయంలో ఏపీటీఎఫ్ కాలమానిని ఎంఈవో రేణుక అవిష్కరించారు. విద్యార్థులు సృజనాత్మక నైపుణ్యాలు సాధించే విధంగా కృషిచేయాలని ఉపాధ్యాయులను ఉద్దేశించారు.

CHANGE OF NAME
I, CHALLA SREENIJA (Old Name) has Changed My Name to CHALLA SRINIJA (New Name), W/o Challa Sreenadh Reddy, D.No.27-1-1. Flat No: 201, B-Block, Pavani Elite, Ramji Nagar, Nellore, SPSR, Nellore District, Andhra Pradesh.

CHANGE OF NAME
I, RAVALLA ANITHA (Old Name) has Changed My Name to RAVILLA ANITHA (New Name), W/o Ravilla Ramesh, Resident of D.No.26-2-1971, 6th Street, RR Nagar, Vedayapalem, Nellore - 524004, SPSR, Nellore District, Andhra Pradesh.

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

ఆలయాల్లో త్రయోదశి పూజలు

రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో నందీశ్వరుడికి అభిషేకం

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: నగరంలోని దర్గామిట్ట రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో గురువారం త్రయోదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరేశ్వర స్వామికి పూజలు, అనంతరం నందీశ్వరస్వామికి అభిషేకాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ● మూలాపేటలో కొలువు తీరిన శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో త్రయోదశి పూజలు నిర్వహించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజల అనంతరం శివపార్వతులకు నందిసేవ జరిగింది.

ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎస్టీయూ డైరీని డీఈవో బాలాజీరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘ ప్రధాన కార్యదర్శి నరసింహం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సుదర్శనం, గౌరవాధ్యక్షులు రాజామనోహర్, రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: మూలాపేట రామయ్యబడి, మద్రసా ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ద్విచక్రవాహన చోదకుల వెంట పడుతున్నాయి. – శంకరయ్య, స్థానికుడు

సమాధానం: కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, నగరపాలకసంస్థ వెటర్నరీ అధికారి

? ఉమ్మారెడ్డిగుంటలో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. – నీలిమ, స్థానికురాలు

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ కనకాద్రి, నగరపాలకసంస్థ ఆరోగ్యాధికారి

? నగరంలోని బాలాజీనగర్ ఆంధ్రాబ్యాంకు పక్కన స్వామిదాసు స్కూల్ దగ్గర మూడు రోజులుగా చెత్త తరలించే వాహనం రావడం లేదు. చెత్త పేరుకుపోయింది. – రామకృష్ణ

✓ వాహనాలు పంపి చెత్త తొలగిస్తాం. – డాక్టర్ కనకాద్రి, ఆరోగ్యాధికారి.

–న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, నవాబుపేట)

పుష్పాలంకరణలో పెద్ద బజారు రామ మందిరం

బాలాజీనగర్ బాబా మందిరంలో భక్తులు

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు

భక్తులకు దర్శనం ఇచ్చిన కల్యాణ రాముడు..

చిన్నపిల్లల పార్కు శ్రీసాయిసదన్‌లో అలంకరణలో బాబా

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: నగరంలో నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. బుధవారం అర్ధరాత్రి నుంచే యువకులు కేకులు కోసి సంబరాలు చేసుకున్నారు. ఉదయాన్నే ఉద్యోగులు, సిబ్బంది ఉన్నతాధికారులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నగర ప్రజలు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి పూజలు చేశారు. శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో విశేష పూల అలంకరణ ఆకట్టుకుంది. బాలాజీనగర్‌లో అద్దాల బాబా మందిరం, చిన్నపిల్లల పార్కు వద్ద గల సాయి సదన్‌లో, గాంధీనగర్, నిప్పో ఫ్యాక్టరీ తదితర బాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వెంకయ్యస్వామి గురు నిలయంలో మాకాని గోపి ఆధ్వర్యంలో హోమగుండ పూజలు జరిగాయి. కొళ్లపూడి రహదారికి సమీపంలో ఉన్న శ్రీ కాళికామాత కాళేశ్వరస్వామి ఆలయంలో అచల మహర్షి ఆధ్వర్యంలో విశేష పూజలు చేపట్టారు. మాగుంట లేఅవుట్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది.

స్వచ్ఛతకు.. 200 ఈ-ఆటోలు

తగ్గనున్న అద్దె ట్రాక్టర్ల భారం

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

చెత్త సేకరణకు ఉపయోగిస్తున్న అద్దె ట్రాక్టర్

నెల్లూరు నగరంలో ఇంటింటా చెత్త సేకరణకు ఆర్థిక భారం పడకుండా అత్యాధునిక పద్ధతులతో ముందుకెళ్లేందుకు అడుగులు పడుతున్నాయి. అద్దె ట్రాక్టర్లకు మంగళం పాడనున్నారు. గత ప్రభుత్వం ముందు నుంచి ఉచితంగా అందిస్తున్న సేవకు చెత్త పన్ను విధించింది. పన్ను వసూలు చేసి ప్రైవేటు ఏజెన్సీతో ఆటోలు పెట్టించి ఇంటింటా చెత్త సేకరణ చేయించింది. చెత్త పన్ను వసూలు వివాదాస్పదంగా మారడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేసింది. చెత్త సేకరణను వాహనాలతో కాకుండా కార్మికులతో తోపుడు బండ్లపై చేయించాలని పురపాలకశాఖ ఆదేశించింది. ఇది ఆచరణలో కష్టసాధ్యంగా మారింది.

నెలకు రూ.1.38కోట్ల ఖర్చు

నగరపాలకసంస్థ పరిధిలో 54 డివిజన్లు ఉండగా.. 1.56 లక్షల గృహాలు, దాదాపు 10 లక్షల జనాభా ఉన్నారు. రోజూ 320 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. క్లాప్ ఆటోలను తీసేయడంతో చెత్త సేకరణకు 123 అద్దె ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఒక్కో దానికి రోజుకు రూ.3,750 చెల్లిస్తున్నారు. రోజుకు రూ.4,61,250, నెలకు రూ.1,38,37,500 అదనపు భారం పడుతోంది. దీనిని గుర్తించిన నగర ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కమిషనర్ వైవో నందన్ చెత్త సేకరణకు 200 విద్యుత్తు ఆటోలను కొనుగోలు చేయాలనే ఆలోచన చేశారు. ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని టెండర్లు పిలిచారు. ఈ నెలలోనే కార్పొరేషన్‌కు రానుండటంతో ఛార్జింగ్ చేయడానికి పాయింట్లు సిద్ధం చేస్తున్నారు.

హైడ్రాలిక్ వ్యవస్థతో..

పాత ఆటోల మాదిరిగా కాకుండా ప్రస్తుతం సరఫరా చేయనున్న ఆటోల్లో తడి, పొడి చెత్త వేసేందుకు వేర్వేరుగా కంపార్ట్‌మెంట్లు ఉండటం, చెత్తను డంప్ యార్డుల్లో వేయడానికి హైడ్రాలిక్ వ్యవస్థ వంటి అధునాతన సదుపాయాలు ఉపయోగకరంగా ఉంటాయి. నగరంలో కుచించుకుపోయిన వీధుల్లో అద్దె ట్రాక్టర్లకు చెత్త సేకరణకు వెళ్లడం లేదు. ఈ-ఆటోలు అందుబాటులోకి వస్తే సన్న సందుల్లో సైతం ఇంటింటి చెత్తను సేకరించేందుకు ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

మహిళలకు చీరల పంపిణీ

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నెల్లూరు నగరం సుబేదారుపేటలో గురువారం కేతా కోటమ్మ సేవా సమితిని ప్రారంభమైంది. ఈ సందర్భంగా సమితి నిర్వాహకులు పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే : ప్లాస్టిక్ రహిత సమాజానికి అందరూ కృషిచేయాలని జాషువా గ్రంథాలయ సభ్యులు ఎస్కే ఖాసిం పేర్కొన్నారు. గురువారం గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్లాస్టిక్ రహిత సమాజానికి పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. గుర్రం జాషువా గ్రంథాలయాన్ని డిజిటల్ గ్రంథాలయంగా చేసేవరకు పోరాడుతామని తెలిపారు. అన్న క్యాంటీన్‌కు ప్రతినెలా రూ. 5వేలు విరాళం అందిస్తున్నానని.. జీవితాంతం అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

సేవలు అందించేందుకు గదులు కేటాయించాలి

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఇంజినీరింగ్ విభాగ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను జడ్పీ ఛైర్మన్ ఆనం అరుణమ్మ ఆవిష్కరించారు. పంచాయతీరాజ్ ఉద్యోగులకు సేవలందించేందుకు కార్యాలయంలో ఓ గది కేటాయించాలని ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్ జడ్పీ ఛైర్మన్‌ను కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రియాజ్ అహ్మద్, కోశాధికారి జి. శ్రీధర్, కార్యవర్గ సభ్యులు కొండయ్య, పరమేష్, భీమ్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో విష సర్పాలు

ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దాంతో పాములు తిరుగుతున్నాయి. నగరంలోని రామలింగాపురం వద్ద ఉన్న నీటిపారుదల శాఖ సెంట్రల్ డివిజన్ ఈఈ కార్యాలయ ఆవరణలోకి ఒక్కసారిగా పాము రావడంతో ఉద్యోగులు భయాందోళనకు గురయ్యారు. దాన్ని చంపేందుకు ఉద్యోగి ప్రయత్నించగా తప్పించుకొని పక్కనే ఉన్న ముళ్ల పొదల్లోకి వెళ్లిపోయింది. – న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతి సెంటర్)

వాషింగ్ మెషిన్ వితరణ

నెల్లూరు(కలెక్టరేట్): ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న పేద విద్యార్థుల దుస్తులు ఉతుక్కోడానికి భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్, పోలుదాసు రాజేష్ ఆధ్వర్యంలో వాషింగ్ మెషిన్‌ను అందించారు. గురువారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు అందజేశారు. అదేవిధంగా ఆర్ఎస్ఎస్‌ను స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఆర్ఎస్ఎస్ చేయబోయే పంచ పరివర్తన్ కార్యక్రమాల గురించి తెలియజేసే 'సమాజ సంఘటన.. సేవలో వందేళ్ల' అనే పుస్తకాన్ని అందించారు. కార్యక్రమంలో భాజపా, ఆర్ఎస్ఎస్ నాయకులు చల్లగుండ్ల సాయిప్రసాద్, జయకుమార్, కిషోర్‌కుమార్, శ్రీధర్, చంద్ర, సురేష్, హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం

నగరంలోని పరమేశ్వరి అవెన్యూలో గత కొన్ని నెలలుగా విరిగిపోయిన విద్యుత్తు స్తంభాన్ని ఇక్కడ ఉన్న ఖాళీ స్థలంలో ఆ శాఖ సిబ్బంది వదిలేశారు. దీనివల్ల ఆటలాడుకుంటున్న చిన్నారులకు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. దీన్ని తొలగించాలని కోరుతున్నారు.– న్యూస్‌టుడే, నెల్లూరు(విద్యుత్తు)

పొగతో పరిసరాలు కలుషితం

నగరంలోని 12వ డివిజన్ సౌత్ రాజుపాళెం, నవాబుపేట మధ్యలో ఉన్న చిన్న పరిశ్రమల నుంచి భారీగా పొగ రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీని వల్ల ప్రతిరోజూ ఆయా ప్రాంతాలు కాలుష్యంతో నిండిపోతున్నాయని స్థానికులు తెలిపారు. కలుషిత వాతావరణం నెలకొనకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు (ఏసీ నగర్)

ఇళ్ల మధ్య మడుగులా మురుగు

నెల్లూరు నగర శివారు ప్రాంతమైన వైఎస్ఆర్ నగర్‌లో మురుగు మడుగులా మారింది. ఇళ్ల మధ్య ఉన్న గుంతలో వర్షపు, మురుగు నీరు చేరి దుర్వాసన వస్తోంది. గత కొన్ని రోజులుగా ఇలాగే ఉండటంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

గోతులతో తప్పని తిప్పలు

నగరంలోని మూలాపేట నుంచి వహాబ్‌పేటకు వెళ్లే రహదారిపై ఉన్న గోతులు రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. గతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయిన తర్వాత ఈ మార్గంలో సిమెంట్ రోడ్డు వేశారు. అలంకార్ సెంటర్ ఏటీఎం వద్ద, సీఏఎం పాఠశాల సమీపంలో రెండుచోట్ల కొంత భాగం గుంతగా వదిలేశారు. సగం రోడ్డు వరకు ఈ గుంతలు ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు (మార్కెట్ సెంటర్)

ట్రాఫిక్‌కు అంతరాయం

నగరంలోని జీఎన్‌టీ రోడ్డులో గురువారం ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది. ఆత్మకూరు బస్టాండు, అయ్యప్పగుడి ఫ్లైఓవర్ బ్రిడ్జిల మరమ్మతుల కారణంగా వాహనాలను నిలిపివేయడంతో జీఎన్‌టీ రోడ్డుపై వాహనాలు వెళుతున్నాయి. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. అధికారులు స్పందించి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(ఏసీ నగర్)

వసతిగృహ విద్యార్థులకు దుప్పట్లు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ ఆధ్వర్యంలో కార్యాలయంలోని ఛాంబరులో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరపాలకసంస్థ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది కమిషన్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పూలబొకేలు, శాలువాలు, పూలదండలకు బదులుగా విద్యార్థులకు అవసరమైన దుప్పట్లు, టవళ్లు అందించాలని ముందస్తుగా కమిషనర్ నందన్ ఇచ్చిన సూచనల మేరకు వసతి గృహాల విద్యార్థుల కోసం అధికారులు వాటిని అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డిప్యూటీ డైరెక్టర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు దుప్పట్లు అందిస్తున్న ఉద్యోగులు

వనంతోపులో పేరుకున్న సమస్యలు

న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతిసెంటర్)

నెల్లూరు నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నా.. చిన్నచిన్న సమస్యలు అపరిష్కృతంగా ఉండిపోతున్నాయి. ముఖ్యంగా కలుషిత జలం, కాలువల సమస్యలే ఎక్కువగా ఉంటున్నాయి. పలు ప్రాంతాల్లో తాగునీరు సక్రమంగా రాక, కాలువల్లో పూడిక తీయక ప్రజలు అవస్థలు పడుతున్నారు. వనంతోపు సెంటర్ మొదటి వీధిలో నగర పాలకసంస్థ సరఫరా చేస్తున్న తాగునీరు ఎర్రటి మట్టితో పచ్చగా కలుషితమై వస్తున్నాయని స్థానికులు తెలిపారు. నీరు దుర్వాసనగా ఉంటున్నాయన్నారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా నీటిలో కలపడం లేదన్నారు. వనంతోపు సెంటర్ మొదటి వీధి నుంచి ఇస్కాన్ సిటీ రోడ్డు వరకు ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. నీరు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఇస్తున్నారని, ఉదయం సమయంలో ఇవ్వకపోవడంతో కుటుంబ అవసరాలకు సరిపోవడం లేదని స్థానికులు వాపోయారు. సొంత మోటార్లు ఉన్న వారికి ఎటువంటి ఇబ్బంది లేదని, లేని వారు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నీరు సరిపోక వాటర్ క్యాను పది రూపాయలు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. కలుషిత జలం తాగడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

కాలువల్లో పూడిక తీయక..

కాలువల్లో సక్రమంగా పూడిక తీయకపోవంతో నీరు నిలిచి దుర్వాసన వస్తోందని, దోమలతో అల్లాడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో చెత్తను వారం రోజులకోసారి తీస్తున్నారని తెలిపారు. కాలువల్లో దోమల మందు సంవత్సరం కాలంగా పిచికారీ చేసిన పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

వనంతోపు మొదటి వీధిలో కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

బాల ఏసుకు సప్రమహోత్సవం

నగర వీధుల్లో ఊరేగుతున్న బాల ఏసు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: నూతన సంవత్సరం పురస్కరించుకొని నగరంలోని కామాటి ఎస్సీ కాలనీ, కపాడిపాళెంలో గురువారం బాల ఏసు సప్ర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ భక్తులు బాల ఏసుకు పూలమాలలు వేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నగర వీధుల్లో ఊరేగిన బాల ఏసుకు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేపట్టారు. కపాడిపాళెంలో చేపట్టిన బాల ఏసు నగరోత్సవాన్ని విచారణ గురువు వైడీ హృదయరాజ్ ప్రార్థనలతో ప్రారంభించారు.

ప్రత్యేక ప్రార్థనలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నూతన సంవత్సరం సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. నగరంలోని బోసుబొమ్మ వద్ద గల ది లోన్ స్టార్ తెలుగు బాప్టిస్టు చర్చి, డౌనీ హాల్, బట్వాడిపాలెం తెలుగు బాప్టిస్టు చర్చి తదితర చోట్ల కార్యక్రమాలు చేపట్టారు. ది లోన్ స్టార్ తెలుగు బాప్టిస్టు చర్చిలో జరిగిన మూడో సర్వీస్‌లో పాస్టర్ శ్రీధర్‌శర్మ సందేశాన్ని ఇచ్చారు.

రేపటి తరం కోసమే మా పోరాటం

నెల్లూరు(గ్రామీణం, న్యూస్‌టుడే: రేపటి తరం భవిష్యత్తు కోసమే.. నేటి తమ పోరాటమని సీపీఐ సీనియర్ నాయకుడు పముజుల దశరథరామయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి అరిగెల సాయిలు అన్నారు. సీపీఐ శత జయంతి సందర్భంగా గురువారం మొగళ్లపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. జనవరి 18వ తేదీన ఖమ్మంలో జరిగే ఉత్సవాలు, బహిరంగ సభకు నెల్లూరు రూరల్ నుంచి అత్యధిక సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని కోరారు. పార్టీ నెల్లూరు రూరల్ మండల సహాయ కార్యదర్శి ఆదినారాయణ, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పముజుల హరి, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి

రాష్ట్రం మరింత ముందడుగు వేయాలి

ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న నాయకులు

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరం జేమ్స్‌గార్డెన్‌లోని ఇన్‌ఛార్జి మేయర్ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్‌ను తెలుగు దేశం పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేశ్ నాయకత్వంలో ఈ ఏడాది రాష్ట్రం మరింత ముందడుగు వేయాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. నెల్లూరు పినాకిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ భాస్కర్, సెక్రటరీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ, తెదేపా జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, తాళ్లపాక రమేష్‌రెడ్డిలను కలిసి పూల మాలలు, శాలువాలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

విలువలతో కూడిన విద్యాబోధన గొప్ప విషయం

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: అనాథ చిన్నారుల మధ్య నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. గురువారం నగరంలోని జనహిత వాత్సల్య అనాథాశ్రమాన్ని సందర్శించి పిల్లలతో కలిసి కేక్ కట్‌చేసి స్వయంగా తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలతో గడపడం తనకెంతో ఇష్టం అన్నారు. ఎటువంటి ప్రభుత్వ తోడ్పాటును ఆశించకుండా కేవలం దాతల సహకారంతో మూడు దశాబ్దాలకు పైగా ఆశ్రమాన్ని నిర్వహించడమే కాకుండా విలువలతో కూడిన విద్యాబోధన అందించడం గొప్ప విషయమన్నారు. చిన్నారులకు నిఘంటువులు, నోటు పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. జనహిత వాత్సల్య అనాథాశ్రమ ఆర్గనైజింగ్ సెక్రటరీ జీవీ సాంబశివరావు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు

నెల్లూరు (విద్యుత్తు), న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సందర్భంగా మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లాను గురువారం విద్యుత్తుశాఖ ఎస్ఈ కె.రాఘవేంద్రం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణకు మరింత కృషి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ప్రజారోగ్య పరిరక్షణకు శ్రమిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది అభినందనీయులని డీఎంహెచ్‌వో వి.సుజాత అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగ సిబ్బంది గురువారం ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ప్రజలందరం కలిసి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా సాగాలని ఆకాంక్షించారు. ఏవో నిషాంత్‌రెడ్డి, డెమో కనకరత్నం, ఎస్‌వో సహన తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య

ఏపీటీఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ జేడీ మువ్వా రామలింగం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం సంఘం డైరీని విద్యాశాఖ జేడీ మువ్వా రామలింగం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు, రాష్ట్ర బాధ్యులు రియాజ్, జుల్ఫికర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

పార్వీ సినిమాస్ (ఎం.1) షెడ్యూల్: స్క్రీన్ 1..శంబాలా, అవతార్ ఫైర్ అండ్ ఆష్ 3డి (తెలుగు), స్క్రీన్ 2..ఛాంపియన్, శంబాలా (తెలుగు), స్క్రీన్ 3 ..అఖండ 2, నువ్వు నాకు నచ్చావ్ (తెలుగు), **పార్వీ సినిమాస్ (స్పైన్):** స్క్రీన్..1. అవతార్ ఫైర్ అండ్ ఆష్ 3డి, శంబాలా (తెలుగు), స్క్రీన్ 2. ఛాంపియన్, అఖండ2 (తెలుగు), స్క్రీన్ 3 సైకో సిద్ధార్థ, 45, (తెలుగు), ఇక్కిస్ (హిందీ), స్క్రీన్.5.. ధురంధర్ (హిందీ), ఈషా, సైకో సిద్ధార్థ, (తెలుగు), **రైన్ సినిమా షెడ్యూల్:** స్క్రీన్..1 అవతార్ ఫైర్ అండ్ ఆష్ 3డి, శంబాలా, వనవీర (తెలుగు), స్క్రీన్ 2. ఛాంపియన్, అఖండ2 (తెలుగు), స్క్రీన్ 3. 45, శంబాలా, మార్క్ (తెలుగు), స్క్రీన్ 4 సైకో సిద్ధార్థ, నీలకంటా, ధురంధర్ (హిందీ)

మలేసియా ట్రిప్ విజేత సురేష్

డ్రా తీస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సంధ్య

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: నెల్లూరులో 30 ఏళ్ల క్రితం నెలకొల్పిన చందన, సీఎంఆర్ షోరూంలు ప్రజల ఆదరణ పొందాయని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. గురువారం చందన, సీఎంఆర్ ఫెస్టీవండర్ సందర్భంగా నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సతీమణి కె.సంధ్యతో కలిసి న్యూఇయర్ మలేసియా ట్రిప్ డ్రాను తీశారు. విజేతగా బుచ్చిరెడ్డిపాలెంనకు చెందిన పి.సురేష్ నిలిచారు. వీక్లీ డ్రాలో నెల్లూరు కొత్తకాలువ సెంటరుకు చెందిన కె.మోహన్ రెడ్డికి హీరో స్కూటీ దక్కింది. అలాగే డైలీ డ్రా విజేతలను ప్రకటించారు. కార్యక్రమంలో చందన అధినేత ఎం.శ్రీనివాసరావు, మోపూరు పెంచలయ్య, శైలేష్, మేనేజర్లు కిశోర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

సెలవొస్తే.. అపరిశుభ్రతే

న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

కోటమిట్టలో పేరుకుపోయిన చెత్త

ఓ వైపు నూతన సంవత్సరం వేడుకలతో నగరం ఆహ్లాదకరంగా మారగా.. మరో వైపు అపరిశుభ్ర పరిస్థితుల మధ్య నగరవాసులు అల్లాడుతున్నారు. పారిశుద్ధ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించాల్సిన నగరపాలకసంస్థ ఆరోగ్య విభాగం పండుగలు, సెలవు రోజుల్లో చెత్త సేకరణను అటకెక్కిస్తోంది. దీంతో రోజువారీ వచ్చిన చెత్తను ప్రజలు తెచ్చి రోడ్లపై గుట్టలుగా పోస్తున్నారు. 14 ఏళ్ల కిందట నగరపాలకసంస్థగా మారిన నెల్లూరులో ఇప్పటికీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

చెత్త ఎంతంటే..

నగరపాలకసంస్థ పరిధిలో సుమారు 10 లక్షల జనాభా ఉన్నారు. రోజూ కనీసం 320 టన్నుల చెత్త వస్తుందని అధికారుల అంచనా వేస్తున్నారు. దీన్ని సేకరించి నగరానికి దూరంగా తరలించాల్సిన బాధ్యత పారిశుద్ధ్య విభాగంపై ఉంది. కార్మికులు, వాహనాలు.. రూ.కోట్లలో ఖర్చు మాత్రమే చూపుతున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎంత మాత్రం ఉపయోగంగా ఉండటం లేదు. నెల్లూరు నగరపాలకసంస్థనే చూస్తే.. పారిశుద్ధ్య కార్మికులకు, పర్యవేక్షణ సిబ్బందికి కలిపి జీతాల రూపేణ ప్రతి నెలా రూ.2 కోట్లను చెల్లించాల్సి వస్తోంది. ఇవి కాకుండా కేవలం పారిశుద్ధ్యం కోసం ఏడాదికి రూ.20 కోట్లు మొత్తాన్ని వెచ్చిస్తున్నట్లు నగరపాలక సంస్థ లెక్కలు చూపుతోంది. ఇంత ఖర్చు చేస్తున్నా.. ప్రతిరోజూ చెత్త తొలగించడం లేదు. దీని వల్ల వీధుల మెంట పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. అధికారులు స్పందించి నిత్యం చెత్త తొలగించేలా చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

● నగరంలో ఎప్పటికప్పుడు చెత్త తొలగిస్తున్నట్లు ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి తెలిపారు. ఎక్కడా నిల్వలు లేకుండా ప్రతిరోజూ తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

In the Court of the IIIrd Additional District Judge :: Rajampet
AS No. 16/2025
Sakapuram Theertha Prakash, S/o Narasimhulu, Gundalapalli Village, Rly. Kodur Town & Mandal, Annamayya Dist. **- Appellant/Plaintiff**
Vs
R3) Varadhi Sai Niharika, W/o Sonu
R4) Sakapuram Narahari Krishna Prasad, S/o Late Narasimha Prasad, Both r/at D.No.16-12-428/11, Revenue ward No.16-111, Gayathri Nagar, Near Gomathi School, Harinathapuram area of Nellore Town - 524004. **- Respondents**
పై Appellant మీ మీద మరియు ఇంకొందరి మీద పై కోర్టు నందు అప్పీలు దాఖలు చేసి ఉన్నారు. ఇందు విషయమై మీకేలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు నందు తేదీ : **23.01.2026**న ఉదయం 10.30 గంటలకు హాజరై ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ తెలుపుకొనగలరు. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.
// BY ORDER OF THE COURT //
R.C.SURESH BABU
ADVOCATE, RLY. KODUR.

(c) eenadu

సేవా దృక్పథం చాటారు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలో నూతన సంవత్సర వేడుకలను సేవాభావంతో ప్రారంభించాలన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పిలుపుకు అనూహ్యమైన స్పందన లభించింది. గురువారం కలెక్టర్, జేసీ మౌర్యభరద్వాజ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధులు వచ్చారు. వారంతా పుష్పగుచ్ఛాలు, మిఠాయిలు, పండ్లకు బదులు పుస్తకాలు, బెడ్‌షీట్లు, కార్పెట్లను అందించారు. వీటిని 26 కళాశాలల వసతి గృహాల్లోని 1,868 మంది విద్యార్థులకు కలెక్టర్ అందించారు. సహృదయంతో స్పందించిన ప్రతి ఒక్కరికీ కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. సేవా దృక్పథంతో ముందుకు సాగితే జిల్లాను అన్ని రంగాల్లో ఉన్నతమైన స్థానంలో నిలబెట్టగలమని, ఈ స్ఫూర్తి భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహ అధికారులు, విద్యార్థినులకు దుప్పట్లు, నోటుపుస్తకాలు అందిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రమాద రహిత జిల్లా లక్ష్యం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రమాద రహిత శ్రీసత్యసాయి జిల్లానే లక్ష్యం కావాలని, ఆ దిశగా అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో జిల్లా రవాణాశాఖ అధికారులతో కలిసి కరపత్రాలు, అవగాహన పత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ మాసోత్సవాలను పటిష్ఠంగా నిర్వహించాలన్నారు. ప్రజలకు, వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖాధికారి కరుణసాగర్‌రెడ్డి, కదిరి ప్రాంతీయ అధికారి శ్రీనివాసులు, తనిఖీల అధికారి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



స్తంభాల తీరు.. సరిదిద్దేదెవరు?

తాడిపత్రి నుంచి యల్లనూరు మార్గంలో చిప్పిలి వెంగన్నపల్లె వద్ద విద్యుత్తు స్తంభాలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ఎప్పుడు కూలిపోతాయా అని రైతులు భయాందోళన చెందుతున్నారు. శనగ పంట తొలగించే సమయంలో ప్రాణాలకే ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి స్తంభాలను సరిదిద్దాలని కోరుతున్నారు.

-ఈనాడు, అనంతపురం

కరవు నేలలో సుగంధ ద్రవ్యాల గుబాళింపు

మడకశిర, అమరాపురం, న్యూస్‌టుడే: కరవు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో రైతులు సుగంధ ద్రవ్యాల సాగు వైపు అడుగులు వేస్తున్నారు. కర్ణాటకలో వర్షపాతం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పండించే నల్ల మిరియాలు, జాజికాయ, చెక్క వంటివి ప్రయోగాత్మకంగా సాగు చేసి విజయం సాధించారు. రాష్ట్రంలోనే మారుమూలన ఉన్న ఈ ప్రాంతంలో అత్యధికంగా వక్క పంట సాగవుతోంది. దానిలో అంతర పంటల సాగుకు దక్కిన అవకాశాన్ని ఇక్కడి రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. సాధారణంగా వక్క పంటలో తీగ జాతి మొక్క తమలపాకు సాగు చేసేవారు. సదరు పంటకు తెగుళ్ల బెడద ఎక్కువ కావడంతో తీవ్రంగా నష్టపోయారు. దీంతో సుగంధ ద్రవ్యాలపై ఆసక్తి పెంచుకుని అడుగులు వేస్తున్నారు. ప్రధానంగా అమరాపురం మండల రైతులు కొత్త పంటలను ఈ ప్రాంతానికి పరిచయం చేస్తూ మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

నెలాఖరులో కోతకు సిద్ధంగా..

ప్రస్తుతం అంతర పంటలుగా నల్లమిరియాలు 50 ఎకరాలు, జాజికాయ 5 ఎకరాలు, చెక్క 2 ఎకరాల్లో సాగవుతోంది. జనవరి చివర్లో నల్లమిరియాల పంట కోత ప్రారంభమౌతుంది. ఎకరాకు క్వింటాలు వరకు దిగుబడి వస్తోంది. మార్కెట్‌లో కిలో మిరియాల ధర రూ.600 నుంచి రూ.800 వరకు పలుకుతోంది. ఈలెక్కన రూ.10 వేల వరకు పెట్టుబడి పోయినా రూ.60 వేల నుంచి రూ.70 వేల దాకా ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. వీటితో పాటు చెక్క, జాజికాయ పంట ప్రారంభమైతే మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. పంట ఉత్పత్తులను కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నా పంటలు బాగా పండుతుండటంతో ఇతర రైతులు కొత్త పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు.

ఏపుగా పెరిగిన నల్లమిరియాల చెట్టు తీగలు

ప్రయోగాత్మక సాగు విజయవంతం

అదనపు ఆదాయం..

- మూర్కణప్ప, గౌడనకుంట, అమరాపురం మండలం



కొన్నేళ్ల నుంచి 5 ఎకరాల్లో వక్క సాగు చేస్తున్నా. తమలపాకు సాగు చేసి నష్టపోవడంతో పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రం హాసన్ జిల్లాలో రైతులు పండిస్తున్న సుగంధ ద్రవ్యాల సాగు చేయాలని నిర్ణయించుకున్నా. అక్కడికే వెళ్లి ప్రత్యక్షంగా సాగు విధానం తెలుసుకుని వక్కలో అంతర పంటగా మిరియాలు వేశాను. నీడలో పెరిగే జాతి మొక్క కావడంతో వక్క చెట్లు అనుకూలంగా ఉంటాయి. మొక్కలకు మాత్రమే డబ్బులు పెట్టాం. పెద్దగా ఖర్చులు ఉండవు. రెండేళ్ల నుంచి ఎకరాకు క్వింటాలు వరకు నల్లమిరియాలు దిగుబడి వస్తోంది.

పాదపూజ చేస్తున్న రఘువీరారెడ్డి మిత్రబృందం

గురువుకు పాదపూజ

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: నీలకంఠాపురం గ్రామంలో నూతన ఏడాదిని పురస్కరించుకొని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి మిత్ర బృందంతో కలిసి అప్పట్లో చదువుచెప్పిన గురువు హనుమంతరాయప్ప దంపతులకు పాదపూజ చేశారు. ఉన్నత పాఠశాలల్లో చదివే రోజుల్లో గురువుతో దెబ్బలు తిన్న క్షణాలను గుర్తు చేసుకుని, మరో సారి బెత్తంతో దెబ్బవేయించుకుని..మధుర క్షణాలను ఆస్వాదించారు.

సాయి సన్నిధిలో నూతన సంవత్సర సందడి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో నూతన సంవత్సర వేడుకలు వైభవంగా నిర్వహించారు. గురువారం సాయికుల్వంత్ మందిరంలో సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ పూర్వ విద్యార్థులు వేద పఠనంతో వేడుకలను ప్రారంభించారు. సాయి పూర్వ విద్యార్థులు వేదాలు పఠిస్తూ, భక్తి గీతాలను ఆలపిస్తూ జాతీయ పతకాలతో ఊరేగింపుగా మందిరానికి చేరుకున్నారు. సత్యసాయి మహాసమాధిని వివిధ రంగుల పుష్పాలతో అలంకరించి, వేదంతో వేడుకలను ప్రారంభించారు. 'ప్రేమబంధం' పేరుతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సత్యసాయితో ఉన్న అనుబంధాన్ని నృత్యనాటిక ద్వారా కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. బ్రాస్‌బ్యాండు వాయిస్తూ బాబాను కీర్తించారు. వందలాది మంది భక్తులు సాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

సాయి పూర్వవిద్యార్థుల మార్చ్‌ఫాస్ట్

845 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు

తొలి స్నాతకోత్సవానికి సెంట్రల్ యూనివర్సిటీ

సమాయత్తం అనంత నగరానికి సమీపాన జంతులూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవానికి సిద్ధమవుతోంది. త్వరలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా 845 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయి.

నేపథ్యం ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం హామీల్లో భాగంగా 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వ చొరవతో అనంత జేఎన్‌టీయూ తాత్కాలిక భవనాల్లో 200 మంది విద్యార్థులతో వర్సిటీ ప్రారంభమైంది. జంతులూరు వద్ద 291 ఎకరాల విస్తీర్ణంలో కేంద్రం తొలివిడత రూ.350 కోట్లతో రెండు అకడమిక్ భవనాలు, పరిపాలనా భవనం, మూడు వసతిగృహాలతోపాటు ఇతర మౌలిక వసతులు కల్పించారు.

వర్సిటీలోని అకడమిక్ బ్లాక్

కోర్సులు ఇలా 2024, ఆగస్టు నుంచి నూతనంగా నిర్మించిన భవనాల్లో 1200 మంది విద్యార్థులతో వర్సిటీ ప్రారంభించారు. ప్రస్తుతం 17 పీజీ కోర్సులు, 9 యూజీ, 5 పీహెచ్‌డీ, 16 డిప్లొమా కోర్సుల్లో 1,457 మంది విద్యార్థులు చదువుతున్నారు. గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌లు, తరగతి గదుల్లో ఆధునిక పరిజ్ఞానంతో డిజిటల్ తరగతులు నిర్వహణలో ఆదర్శంగా నిలుస్తోంది.

నిరంతర నిఘా విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. 24 గంటలు 25 మంది సెక్యూరిటీ గార్డులతో పహారా, 500 సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంది. 491 ఎకరాల్లో ప్రహరీ నిర్మాణం, తాగునీరు, రోడ్డు నిర్మాణం చేసి వర్సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈనెల 26 తర్వాత రాష్ట్రపతి పర్యటన ఖరారయ్యే అవకాశం ఉందని ఉపకులపతి కోరి చెబుతున్నారు. ఇప్పటికే ఆయన గత నెలలో రాష్ట్రపతిని కలిసి స్నాతకోత్సవానికి ఆహ్వానించారు.

- న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం

ఆకారం శివుడిది.. ఆలయం వెంకన్నది!



ఒకదాని అంచున ఒకటి పెద్ద పెద్ద బండ రాళ్లు.. వాటిపై స్వర్ణ కాంతితో చిన్నపాటి గోపురం.. బండరాతి కింద ఒక మనిషి దూరేంత గవి.. అందులో విగ్రహం. చూడగానే అక్కడున్న శివలింగం అని అనుకున్న వారంతా మరింత దగ్గరికెళ్లి పరిశీలించి వేంకటేశ్వరుడి రూపాన్ని చూసి ఆశ్చర్యచకితులవుతారు. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఉరవకొండ-గుంతకల్లు ప్రధాన రహదారి అంచున పెద్ద రాతిబండ కింద ఉన్న రూపాన్ని గవి వెంకటేశ్వరునిగా పూజిస్తారు. కొన్నేళ్ల క్రితం ఓ భక్తుడు స్వామి మూలవిగ్రహానికి నాగాభరణాన్ని బహూకరించాడు. అర్చకులు వెంకన్న విగ్రహానికి నాగభరణాన్ని అలంకరించి, పూజలు మొదలుపెట్టారు. కొత్తగా విగ్రహాన్ని చూసే పర్యాటకులు, భక్తులు నాగపడగ ఆభరణాన్ని చూసి తొలుత శివలింగం అనుకుంటారు. వెంకన్న ఆలయాల్లో ఉగాది, వైకుంఠ ఏకాదశి సందర్భాల్లో ఉత్సవాలు ఉంటాయి. కానీ ఇక్కడ మహాశివరాత్రి పెద్ద జాతరను నిర్వహిస్తారు. - ఈనాడు, అనంతపురం-న్యూస్‌టుడే, ఉరవకొండ

విద్యుత్తు ఛార్జింగ్ స్టేషన్లు వచ్చేస్తున్నాయ్!

- ఎస్పీడీసీఎల్ స్థలాల్లో ఏర్పాటుకు సన్నాహాలు

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్తుతో నడిచే వాహనాలను కొనుగోలు చేసేందుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో తగినన్ని ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులోలేని పరిస్థితి. వాయు కాలుష్య నియంత్రణతోపాటు తక్కువ ధరకు విద్యుత్తు యూనిట్లను అందించి.. వాహనాల వాడకాన్ని పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. ఇందులో భాగంగా పీఎం డ్రైవ్ పథకం కింద అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో ఎస్పీడీసీఎల్ సంస్థకు సంబంధించిన స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఒక స్టేషన్‌కు వ్యయం చేసే నిధుల్లో 70 శాతం మేరకు కేంద్రం రాయితీ ఇస్తుంది. వాహనాల సామర్థ్యాన్ని బట్టి ఛార్జింగ్ సమయం ఉంటుంది. స్టేషన్ ఆవరణలోనే తినుబండారాల స్టాల్స్‌తో పాటు, పిల్లల ఆటస్థలం తదితరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. వాటి ద్వారా సంస్థకు ఆదాయం వచ్చే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి.

అనంత జిల్లాలో ఎక్కడెక్కడ?

జాతీయ రహదారుల పక్కన విద్యుత్తు ఉపకేంద్రాలు ఉన్న హంపాపురం, ఇటుకలపల్లి, రాయలచెరువు, మిడుతూరు, కూడేరు... అనంత నగరంలోని బళ్లారిరోడ్డు, కళ్యాణదుర్గం, గుత్తి, ఉరవకొండ, తాడిపత్రి విద్యుత్తు కార్యాలయాల ఎదురుగా ఉన్న సంస్థ ఖాళీ స్థలాల్లో స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. ఇందుకు గాను రూ.7 కోట్లు వ్యయం చేయనున్నారు.

శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో..

పెనుకొండ, కదిరి, బత్తలపల్లి విద్యుత్తు కార్యాలయం, ధర్మవరం మార్కెట్ యార్డు, డి.చెర్లోపల్లి, ఎన్‌ఎస్‌గేట్, కనముక్కల, కొత్తచెరువు, గోరంట్ల, బుక్కపట్నం, గూణిపల్లి, రామగిరి, ఓబుళదేవరచెరువు, గాజులవారిపల్లి, ఎన్‌పీ కుంట, ముదిగుబ్బ, కొడికొండ, కోడూరు, కళ్లుమర్రి, మడకశిర, రాళ్లఅనంతపురం, లేపాక్షి, రొద్దం, తురకలపట్నం, పరిగి ఉపకేంద్రాల వద్ద స్టేషన్లను అందుబాటులోకి తేనున్నారు. వాటి ఏర్పాటుకు రూ.17.14 కోట్లు వెచ్చించనున్నారు.

మార్చిలోపు అందుబాటులోకి..

- శేషాద్రి శేఖర్, సంపత్‌కుమార్, ఎస్‌ఈలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు

ఇరు జిల్లాల్లో అనువైన ప్రాంతాలను గుర్తించి ఉన్నతాధికారులకు పంపాం. మార్చి ఆఖరులోపు గుర్తించిన ప్రాంతాల్లో విద్యుత్తు ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు వచ్చాయి.

16 మందికి ఉప తహసీల్దార్లుగా పదోన్నతి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలో ఎంతో కాలంగా నిరీక్షిస్తున్న పదోన్నతుల ప్రక్రియ మొదలైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన 16 మంది సీనియర్ సహాయకులు/ఆర్‌ఐలకు ఉప తహశీల్దార్లుగా (డీటీ) తాత్కాలిక పదోన్నతి కల్పించారు. వీరిలో చాలా మంది రీసర్వే డీటీలే (తాత్కాలికం) ఉన్నారు. గురువారం కలెక్టర్ ఆనంద్ పదోన్నతి ఉత్తర్వులను జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో కొందరు కలెక్టర్, సహాయ కలెక్టర్ సచిన్, డీఆర్‌ఓ మాలోల, ఏఓ అలెగ్జాండర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పదోన్నతి పొందిన వారిలో.. శ్రీసత్యసాయి కలెక్టరేట్ సీనియర్ సహాయకుడు (ఎస్‌ఏ) కె.మహబూబ్‌బాషా, అనంత కలెక్టరేట్ భూ సంస్కరణలో పని చేస్తున్న యు.రమాదేవి, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ భూ సేకరణలో ఉన్న కె.సుశీల, ధర్మవరం ఎంఆర్‌ఐ జి.రమాదేవిలతోపాటు..రీసర్వే డీటీలుగా పని చేస్తున్న వారిలో కుందుర్పి ఎస్.గణేశ్‌బాబు, కళ్యాణదుర్గం పీసీ కుళ్లాయప్ప, శ్రీసత్యసాయి జిల్లా కె.ఆర్.చంద్రశేఖర్, శెట్టూరు బి.షెక్షావలి, వజ్రకరూరు జె.కేశవరెడ్డి, పామిడి జి.బేబి సురేఖ, బొమ్మనహాళ్ పి.లక్ష్మీకాంత్ నాయక్, గుత్తి ఎంఎల్‌ఎస్ పాయింట్ యు.ఆదినారాయణ, గుమ్మఘట్ట ఎస్.రఘు, ఆత్మకూరు కె.నాగమణి, అనంత అర్బన్ జి.చాంద్‌బాషా, ఆత్మకూరు ఎంఎల్‌ఎస్ పాయింట్ ఎ.ఎస్.ముక్తియార్ అహమ్మద్ ఉన్నారు. త్వరలోనే వీరికి డీటీలుగా స్థానాల కేటాయింపు జరగనుంది.

పుష్పయాగంలో మహిళా భక్తులు

నేత్రపర్వం.. సత్యనారాయణుడి పుష్పయాగం

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే : పట్టణంలోని చిన్నమార్కెట్ సర్కిల్‌లో ఉన్న సత్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, అశేష భక్తజనం నడుమ ఘనంగా మహా పుష్పయాగాన్ని నిర్వహించారు. అంతకుముందు స్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను కొలువుదీర్చి.. 150 కిలోల వివిధ రకాల పుష్పాలను స్వామికి సమర్పించారు. సప్తమాతృకులకు ఒడిబియ్యం సమర్పించారు. మహిళలు సప్తహారతులు సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీఎం ఆదినారాయణగుప్త, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రూ.3.5కోట్ల బంగారు నగలు స్వాధీనం

- పురం బ్యాంకు దోపిడీ కేసులో పురోగతి
- రెండో నిందితుడి అరెస్ట్: ఎస్పీ

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం గ్రామీణ మండలం తూముకుంట పారిశ్రామికవాడలో ఎస్‌బీఐలో జరిగిన భారీ దోపిడీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. 2025, జులై 27న జరిగిన దోపిడీ రాష్ట్రంలో సంచలనం కలిగించింది. కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు నగలతోపాటు రెండో నిందితుడిని పట్టుకున్నారు. ఎట్టకేలకు సుమారు 50 శాతం బంగారం రికవరీ చేయగలిగారు. గురువారం జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. కేసులో రెండో నిందితుడు రాజస్థాన్‌లోని కరౌలి జిల్లా సలంపూర్‌కు చెందిన మహ్మద్ ఇష్రార్‌ఖాన్‌ను పీటీ వారెంట్‌పై కస్టడీలోకి తీసుకొని... రూ.3.5 కోట్లు విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనకు మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ప్రధాన నిందితుడు హరియాణాలోని సాన్వర్ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ పన్వార్‌ను గత ఆగస్టులో అరెస్ట్ చేసి... 2 కిలోల బంగారు ఆభరణాలు, కారు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్, పోలీసు అధికారులు, చిత్రంలో స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

నెలల కొద్దీ రెక్కీ...

నిందితులు చెడువ్యసనాలకు అలవాటుపడ్డారు. దోపిడీ చేయడానికి ముందు నెలల కొద్ది అక్కడే ఉంటూ పలు దఫాలు రెక్కీ నిర్వహిస్తారు. తర్వాత పక్కా ప్రణాళికతో తమ పని కానిచ్చేస్తారని ఎస్పీ వివరించారు. 2018లో అనంతపురంలోని జేఎన్‌టీయూ ఎస్‌బీఐ దోపిడీలో అనిల్‌కుమార్ పన్వార్ నిందితుడని, అతనిపై పలు రాష్ట్రాల్లో 14 కేసులు ఉన్నాయన్నారు. తమిళనాడులోని కోయంబత్తూరులో ఐదేళ్లు జైలుశిక్ష అనుభవించి విడుదలైన తర్వాత మహమ్మద్ ఇష్రార్‌ఖాన్‌తో ఇతను కలిసి హిందూపురంలో బ్యాంకు దోపిడీకి పాల్పడ్డారని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా నగలు, నిందితులను పట్టకోవడంలో కీలకంగా వ్యవహరించిన డీఎస్పీ మహేశ్, సీఐలు ఆంజినేయులు, మహ్మద్‌కరీం, జనార్దన్, ఎస్‌ఐలు మునీర్‌అహ్మద్, మునిప్రతాప్, జీఎం కరీం, శ్రీధర్, ముక్బూల్‌ను ఎస్పీ అభినందించారు.

పారని అమృత్ ధార

- నిధులివ్వని గత వైకాపా ప్రభుత్వం
- ఆగిన పనులు.. తీరని ప్రజల దాహార్తి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణాల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రవేశపెట్టిన అమృత్ పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన మున్సిపాలిటీల్లో అమృత్ పథకాన్ని అమలు చేశారు. ప్రజలకు సురక్షితమైన శుద్ధ జలాన్ని అందించాలన్న లక్ష్యంతో ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. శ్రీసత్యసాయి జిల్లాలో ధర్మవరం, హిందూపురం మున్సిపాలిటీల్లో అమృత్ పథకాన్ని అమలు చేశారు. అందులో భాగంగానే ధర్మవరం పట్టణంలో 2016లో రూ.17.65 కోట్లతో ఎల్1, సిద్దయ్యగుట్ట, మారుతినగర్ ప్రాంతాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఎల్‌కేసీపురం, అయప్పస్వామి గుడి సమీపంలో శుద్ధజల కేంద్రాలు(ఎస్టీపీ), 35 కి.మీ మేర పైపులైన్ నిర్మాణాలకు అప్పటి తెదేపా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గుత్తేదారులు 2019 ఎన్నికల నాటికి దాదాపు 75 శాతం పనులు పూర్తి చేశారు. ఆ తరువాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అర్ధాంతరంగా ఆగిపోయాయి.

★ కేంద్రం అమృత్ పథకానికి కేటాయించిన నిధులు విడుదల చేసినా రాష్ట్ర వాటాను వైకాపా ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో చేసిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కావడంతో మిగిలిన పనులు చేసేందుకు గుత్తేదారులు విముఖత చూపారు. ట్యాంకు నిర్మాణాలు, పైపులైన్, శుద్ధ జల కేంద్రాల పనులను గుత్తేదారులు ఆపేశారు. ట్యాంకుల నిర్మాణాలు దిష్టిబొమ్మలా ఉండిపోయాయి. పలు సామగ్రి తుప్పుపట్టిపోయింది.

ధర్మవరంలోని ఎల్1 కాలనీలో నిలిచిన ట్యాంకు నిర్మాణం

★ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకంపై దృష్టిసారించింది. అమృత్ 2.0 పేరిట మొదటి, రెండో దశలో 11.5 కోట్లు మంజూరు చేసింది. గత ఏడాది నవంబరులో తిరిగి పనులు ప్రారంభించిన నేటికీ అసంపూర్తిగా ఉన్నాయి. తాగునీరు సక్రమంగా అందని కాలనీల్లో శుద్ధజలాన్ని కొనుగోలు చేయాల్సిన దుస్థితి. పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు తీవ్ర నిరాశ చెందుతున్నారు. పాలకులు, అధికారులు చొరవ చూపి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

సకాలంలో పూర్తి చేస్తాం

మొదటి దశ బిల్లులు జమ కాకపోవడంతో గుత్తేదారులు ఆలస్యం చేస్తున్నారు. వాటి పనుల వివరాలను ఉన్నతాధికారులకు పంపించాం. సకాలంలో పనులు పూర్తి చేసి ప్రజలకు శుద్ధజలం అందేలా చర్యలు చేపడతాం.

- వీరేశ్, మున్సిపాలిటీ డీఈ

రహదారిపై ధాన్యం.. ప్రమాదాలకు ఆస్కారం

ముదిగుబ్బలోని 42వ జాతీయ రహదారితోపాటూ బుక్కపట్నం, కదిరి, బత్తలపల్లికి వెళ్లే మార్గాల్లో నిత్యం రహదారులపై వరి ధాన్యం ఆరబోస్తున్నారు. పట్టలు ఏర్పాటు చేసి, అడ్డంగా రాళ్లు పెట్టడంతో వాహనదారులు గమనించక ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనచోదకులు వేగంగా వస్తూ జారిపడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవచూపి ప్రమాదాలు జరగకుండా నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ముదిగుబ్బ

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

పూర్తి వివరములకు: 8008709784

(c) eenadu

'మైనారిటీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

రాణినగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: ముస్లిం, మైనారిటీల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆల్‌మేవా సంఘం ముద్రించిన 2026 క్యాలెండర్‌ను ఎంపీతో పాటు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వేర్వేరుగా విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానంగా మైనారిటీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటోందన్నారు. ఉర్దూ భాషను అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నప్పటికి నూర్‌బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.100 కోట్లు కేటాయించారని, ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం కూడా ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మైనారిటీల అభివృద్ధి కోసం రూ.5433 కోట్ల కేటాయించి, కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకున్నారన్నారు. హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలకు ఆర్థిక సాయం అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు. ఆల్‌మేవా అధ్యక్షుడు షేక్షావలి, కార్యదర్శి ఫరూక్ అహమ్మద్, నాయకులు పఠాన్, జిలాన్, అన్సర్, జాకీర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు అశోక్‌కుమార్

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని మహాత్మా జ్యోతి బాపులే గురుకుల పాఠశాల విద్యార్థి అశోక్‌కుమార్ స్కూల్ గేమ్స్ అండర్-19 విభాగంలో జాతీయస్థాయి ఆర్టిస్టిక్ యోగా పోటీలకు ఎంపికయ్యాడు. కిందటి నెల 23, 24, 25 తేదీల్లో బాపట్ల జిల్లా చందలూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్టిస్టిక్ యోగా పోటీల్లో అశోక్‌కుమార్ ఉత్తమ ప్రతిభ చూపి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. జనవరి 25, 26 తేదీల్లో వెస్ట్‌బెంగాల్‌లో నిర్వహించే జాతీయస్థాయి ఆర్టిస్టిక్ యోగా పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపల్ రూప్సింగ్‌నాయక్, వ్యాయామ ఉపాధ్యాయుడు శర్మ తెలిపారు.

మూడు రోజుల్లో రూ.13.52 కోట్ల మద్యం అమ్మకాలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మూడు రోజుల్లో అనంతపురం జిల్లాలో రూ.13.52 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. 30వ తేదీ 6,900 పెట్టెల ఐఎంఎల్, 3381 పెట్టెల బీరు అమ్ముడుపోగా రూ.5.87 కోట్లు ఆదాయం సమకూరింది. అలాగే 31న 8,661 పెట్టెల ఐఎంఎల్, 3442 పెట్టెల బీర్ల వ్యాపారం కాగా రూ.6.06కోట్లు ఆదాయం వచ్చింది. అలాగే 1న రూ.1.59 కోట్ల వ్యాపారం జరిగింది.

అపుస్మా కాలమానిని ఆవిష్కరణ

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిబంధనలు ప్రైవేటు పాఠశాలలు పాటించాలని డీఈవో ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. జిల్లా ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల సంఘం (అపుస్మా) ఆధ్వర్యంలో రూపొందించిన 2026 సంవత్సరపు క్యాలెండర్‌ను డీఈవో గురువారం విడుదల చేశారు. ఉప విద్యాశాఖాధికారి మల్లారెడ్డి, అపుస్మా పుల్లారెడ్డి, సుబ్బారెడ్డి, రవిశంకర్‌ప్రసాద్, నాగరాజు, సూర్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులు అస్తవ్యస్తం!

పునర్విభజన సరే.. పోస్టులేవీ?

రెడ్డిపల్లి శిక్షణ కేంద్రంలోని పాత భవనంలో శింగనమల వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్వహణ

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మార్కెట్ యార్డులు అస్తవ్యస్తంగా మారాయి. సిబ్బంది కొరత, పర్యవేక్షణ లోపంతో సతమతమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 17 వ్యవసాయ మార్కెట్ యార్డులున్నాయి. తొమ్మిది చోట్ల కార్యదర్శులులే లేకపోవడం గమనార్హం. ఒక్కొక్కరికి రెండేసి యార్డుల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. 2021లో అప్పటి వైకాపా ప్రభుత్వం యార్డులను పునర్విభజించింది. వాటికి ఏటా ప్రతిపాదనలు పంపుతున్నారే కాని ఒక్క పోస్టు మంజూరు కాలేదు. దీంతో ఉన్న సిబ్బందినే సర్దుబాటు చేయడంతో పనిభారం పెరిగింది.

● మార్కెట్ యార్డులన్నీ ప్రభుత్వానికి ఆదాయ వనరులే. కింది స్థాయి సిబ్బందికి పాలనా పగ్గాలు ఇవ్వడంతో ఆదాయానికి గండి కొడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో కొన్నేళ్లుగా పలు యార్డులకు ఇన్‌ఛార్జి కార్యదర్శులుగా సూపర్‌వైజర్లు కొనసాగుతున్నారు.

● అనంతపురం, గుత్తి, కళ్యాణదుర్గం, రాప్తాడు, శింగనమల, తాడిపత్రి, గోరంట్ల, మడకశిర, పుట్టపర్తి, తనకల్లు యార్డులకు కార్యదర్శులులే లేరు. అనంతపురం యార్డుకు ఎంపికగ్రేడ్ కార్యదర్శి గోవింద ఆదోని యార్డుకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. దీంతో అనంతపురం, శింగనమల యార్డులకు అనంతపురం మార్కెటింగ్‌శాఖ ఏడీ రామచంద్రకుమార్ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు.

● శ్రీసత్యసాయి జిల్లాకు ఏడీఎం పోస్టు ఖాళీగా ఉంది. హిందూపురం కార్యదర్శి నరసింహమూర్తికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

● గతేడాది నవంబరు వరకు ఉమ్మడి జిల్లాలో రూ.19.49 కోట్ల రుసుం లక్ష్యం విధించగా రూ.7.27 కోట్ల మాత్రమే వసూలైంది.

స్థలాల సమస్య

కొత్తగా వ్యవసాయ మార్కెట్ యార్డులకు భవనాలు లేవు. రాప్తాడులో 50 ఎకరాలు కేటాయించగా సదరు భూమిని రెవెన్యూ అధికారులు ఏపీఐఐసీకి ఇచ్చేశారు. శింగనమల మార్కెట్ యార్డు ప్రాంతీయ పశువైద్య శిక్షణ కేంద్రంలో కొనసాగుతుండగా, పుట్టపర్తి యార్డు పరిధిలో కొత్తచెరువు సబ్‌యార్డు ఉందని, నల్లమాడలో భవనాలు నిర్మించారు. అనుకూలం లేదని ఇంతవరకు కొత్త భవనంలోకి చేరలేదు.

ప్రతిపాదనలు పంపుతున్నాం

ఉమ్మడి జిల్లాలో సిబ్బంది కొరత వాస్తవమే. పాతయార్డుల నుంచి సర్దుబాటు చేశాం. ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి నివేదికను ప్రభుత్వానికి పంపుతున్నాం.

రామచంద్రకుమార్, నరసింహమూర్తి, ఏడీఎంలు (అనంతపురం, శ్రీసత్యసాయి)

వేధిస్తున్న సిబ్బంది కొరత

అనంతపురం, హిందూపురం యార్డుల్లో సంతలు నిర్వహిస్తారు. వివిధ కేడర్లలో మొత్తం మంజూరు పోస్టులు 181 కాగా అందులో 53 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన 128 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో 24 చెక్‌పోస్టులు ఉన్నాయి. ఆయా మార్కెట్ యార్డులోని పనిచేసే సిబ్బంది అక్కడ విధులు నిర్వహిస్తున్నారు.

● గోరంట్ల, కొత్తచెరువు మండలాల్లో పశువుల సంతలు, కదిరి యార్డులో గొర్రెల సంతను ప్రతి వారం నిర్వహిస్తారు. సిబ్బంది కొరత కారణంగా వాటి నిర్వహణ కష్టంగా మారింది.

● మార్కెట్ యార్డుల పునర్విభజనలో భాగంగా రాప్తాడు, పుట్టపర్తిలో కొత్తగా మార్కెట్ యార్డులు... గోరంట్ల, శింగనమల సబ్‌యార్డులను మార్కెట్ యార్డులుగా మార్చారు. ఒక్కోదానికి కార్యదర్శితో పాటు నలుగురు సిబ్బంది ఉండాలి. నాలుచోట్ల ఒక్క పోస్టు మంజూరు చేయలేదు.

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా నేడు (శుక్రవారం) వేకువజామునే పూజలు మొదలవుతాయి. ఉదయం ఏడున్నర గంటలకు అమృతవల్లి అమ్మవారికి అభిషేక పూజలు చేస్తారు. ఖాద్రీశునికి ఉదయం 5 నుంచి 7 గంటల వరకు, 8 గంటల నుంచి 10 గంటల వరకు రెండు పర్యాయాలు అభిషేకాలు. తర్వాత పది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

అధికారినంటూ ఖాతాలో రూ.60 వేలు స్వాహా

ఇద్దరు మహిళలను మోసం చేసిన సైబర్ నేరగాడు

యాడికి, న్యూస్‌టుడే: వెలుగు కార్యాలయం నుంచి మాట్లాడుతున్నానంటూ ఇద్దరు మహిళల ఖాతాలో నుంచి నగదు తస్కరించాడు ఓ సైబర్ నేరగాడు. యాడికిలోని ప్రధాన రహదారిలో ఉంటున్న ఓ మహిళకు వెలుగు కార్యాలయ అధికారిని అంటూ.. ఫోన్ చేశాడు. మీ లావాదేవీలు సరిగ్గా లేవని... బ్యాంకు ఖాతా నంబరు సరి చూడాలని చెప్పుకొచ్చాడు. ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పమన్నాడు. దీన్ని నమ్మిన బాధిత మహిళ ఓటీపీ చెప్పింది. ఈక్రమంలో ఆమె ఖాతాలోని రూ.29 వేలు స్వాహా చేశాడు. తిరిగి డబ్బు జమ చేస్తానంటూ... మరో ఖాతా నంబరు చెప్పాలని కోరాడు. దీంతో బాధిత మహిళ పొదుపు సంఘంలోని మరో సభ్యురాలి వద్దకు వెళ్లింది. ఆమెను కూడా సైబర్ నేరగాడు మాయమాటలతో నమ్మించాడు. ఇద్దరు మహిళలు మరో ఖాతా నంబరు ఇవ్వగా అందులో రూ.28వేలు జమ చేశాడు. మళ్లీ వారికి ఫోన్ చేసి ఓటీపీ చెప్పమన్నాడు. వచ్చిన ఓటీపీని తెలపడంతో ఒకేసారి రూ.60 వేలు ఖాళీ చేశాడు. మోసపోయామని గుర్తించిన బాధితులు సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేశారు.

వినీత.. వినూత్న బోధన

బోధిస్తున్న వినీత

న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం: కళ్యాణదుర్గం మండలంలోని మానిరేవు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయిని వినీత వినూత్నంగా బోధన చేస్తున్నారు. ఆమె మొదటగా కంబదూరు మండలం కురాకులపల్లి ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరారు. స్థానికంగా పిల్లల సంఖ్య తక్కువగా ఉండటంతో చదువు పట్ల ఆకర్షితులయ్యేలా చేయాలని ఆటపాటలు, నోకాస్టు -లోకాస్టు పరికరాలు, ఇతర వస్తువులతో బోధన ప్రారంభించారు. దీంతో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే వారు సైతం ప్రభుత్వ పాఠశాలలో చేరడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఆత్మకూరు పడమటి యాలేరు, బెళుగుప్ప మండలం పి.గొల్లలదొడ్డి ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ ఇదే స్థాయిలో బోధన చేశారు. ఆరు నెలలుగా కళ్యాణదుర్గం మండలం మానిరేవులో ఆమె పనిచేస్తున్నారు.

● ఆంగ్లంపై భయం పోగొట్టి సంభాషించుకునేలా చేయడం, అందంగా అక్షరాలు రాయడంపై ఆసక్తి పెంచేలా కృషి చేస్తున్నారు. విద్యార్థులు ఆయా సబ్జెక్టుల అంశాల్లో పాల్గొని నేర్చుకొనేలా చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులు సైతం సులువుగా చదివేలా చేస్తున్నారు. ఇలాంటి బోధనలకు సంబంధించి వీడియోలు చేసి యూట్యూబ్‌లోనూ ఉంచారు.

పిల్లలకు ఆసక్తి పెరిగింది

ప్రతి విద్యార్థికి ఆసక్తి పెంచుకునేలా కృషి చేస్తున్నా. వినూత్న బోధనల కారణంగా పాఠశాలకు క్రమం తప్పకుండా వస్తున్నారు. ఆంగ్లమంటే భయాన్ని వీడి చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు దక్కింది. - **వినీత**

అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం: మంత్రి పయ్యావుల

కూడేరులో శ్రేణులతో కలిసి కేకును కోస్తున్న కేశవ్

ఉరవకొండ, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలో పనిచేద్దామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఉరవకొండ తెదేపా కార్యాలయంలోనూ, లత్తవరం, కౌకుంట్లలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో తనయులు విక్రమసింహ, విజయసింహతో కలిసి పాల్గొన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి కేకు కోశారు. పార్టీ నాయకులు, అధికారులు ఆయనకు పుస్తక సామగ్రి, మొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, ఏపీఐడీసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రేగటి నాగరాజు, తెదేపా మండల కన్వీనరు విజయభాస్కర్ పాల్గొన్నారు.

బాల్య వివాహరహిత జిల్లాగా మారుద్దాం

అనంతపురాన్ని బాల్య వివాహ రహిత జిల్లాగా మారుద్దామని, తల్లిదండ్రులు సహకరించాలని మంత్రి పయ్యావుల సూచించారు. 'బాల్య వివాహ ముక్త్ భారత్'లో భాగంగా శిశుసంక్షేమ శాఖ చేపట్టిన వంద రోజుల కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. సీడీపీవో శ్రీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, అరుణ, రబియా, పుష్ప, విజయ, పద్మ, ధనశేఖర్ పాల్గొన్నారు.

కమీషన్ ఇవ్వాలని బొగ్గుల వ్యాపారులతో గొడవ

బత్తలపల్లి, న్యూస్‌టుడే: కమీషన్ల కోసం బొగ్గుల వ్యాపారులతో గొడవకు దిగిన వారిని బత్తలపల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. మండలంలోని వేల్పుమడుగు గ్రామ సమీపంలో మహారాష్ట్రకు చెందిన కొందరు వ్యక్తులు రైతులతో మాట్లాడుకొని కంపచెట్లు కాల్చి బొగ్గుల వ్యాపారం చేసుకుంటున్నారు. బుధవారం రాత్రి బొగ్గులను లారీలోకి లోడ్ చేశారు. విషయం తెలుసుకున్న తెదేపా నాయకుడు జగ్గు తన అనుచరులతో కలిసి సదరు వ్యాపారుల వద్దకు వెళ్లి.. అక్రమంగా బొగ్గులు కాలుస్తున్నారు, మీకు పర్మిట్ ఉందా అని గొడవకు దిగారు. లారీ టైర్ల గాలి తీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని జగ్గు, నాగార్జునరెడ్డి, సాంబతోపాటు మరి కొందరిని అదుపులోకి తీసుకున్నారు. రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

REAL ESTATE

FLAT FOR SALE

నూతన సంవత్సర స్పెషల్ ఆఫర్ 3 BHK, 2 BHK ఫ్లాట్స్ ఆధునిక సౌకర్యాలతో అనంతపురం నడిబొడ్డున గల మీనాక్షి అపార్ట్‌మెంట్ నందు కొన్ని ఫ్లాట్స్ మాత్రమే కలవు. సెల్: 7416560179, 9515651111.

JOBS

Required Civil Site Supervisors/Engg/Diploma with or without Experience. Location Karnataka. Contact: 9347083151

ATP ప్లైవుడ్ షాపు నందు అకౌంటెంట్‌గా Tally Input, Output మరియు GST Returns వేయడంలో అనుభవం గల జెంట్స్ మాత్రమే కావలెను. ✆ 8096006606

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

జేఎన్‌టీయూ ర్యాంకింగ్‌కు కృషి

క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఆచార్యులు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: ర్యాంకింగ్, గ్రేడింగ్ రావడానికి ఉద్యోగులంతా కృషి చేయాలని జేఎన్‌టీయూ వీసీ ఆచార్య సుదర్శనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ రూపొందించిన నూతన సంవత్సరపు క్యాలెండర్లు, టేబుల్ ప్రణాళికలను గురువారం ఆవిష్కరించారు. వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్యతో కలిసి వాటిని ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ 2025 సంవత్సరంలో పలువురు ఆచార్యులకు పదోన్నతులు కల్పించామన్నారు. 2026 సంవత్సరంలో నాక్ మంచి గ్రేడ్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ సాధించడానికి అందరూ కృషి చేయాలన్నారు. వర్సిటీ అభివృద్ధికి బోధన, బోధనేతర ఉద్యోగులు సహకారం అందించాలన్నారు. ఓఎస్‌డీ దేవన్న, డీఏపీ డైరెక్టర్ ఎస్.వి.సత్యనారాయణ, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

కేకు తిని పది మందికి అస్వస్థత

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మణపల్లి రహదారిలోని నైపుణ్య శిక్షణ కేంద్రంలో గురువారం నూతన సంవత్సరం పురస్కరించుకుని కేకు కోశారు. ఆ కేకును తిని పది మంది అస్వస్థతకు గురయ్యారు. కేకును కొత్తచెరువులోని ఓ బేకరి నుంచి తీసుకొచ్చినట్లు తెలిసింది. కేకు తిన్న వెంటనే మొదట ముగ్గురికి, తర్వాత మరో ఏడుగురికి వాంతులు అయ్యాయి. వారిని వెంటనే సత్యసాయి జనరల్ ఆసుపత్రికి తరలించారు. వీరితో పాటు కేకు తిన్న 40 మందిని ఆసుపత్రికి తరలించి, వైద్యసేవలందించారు. అస్వస్థతకు గురైన పది మంది ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆర్డీవో సువర్ణ, డీఎస్పీ విజయ్‌కుమార్ ఆసుపత్రికి వెళ్లి పరిశీలించారు. చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితులపై ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ప్రదర్శిస్తున్న ఎస్పీ జగదీశ్, సంఘం ప్రతినిధులు

అనంత నేరవార్తలు: అనంతపురం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా, సిటీ, శింగనమల తాలూకా క్యాలెండర్‌ను ఎస్పీ జగదీశ్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ, కార్యదర్శి రామునాయక్‌లు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగులందరూ నూతన ఉత్సాహంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వం ప్రజల మధ్య వారధిగా ఉంటూ జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఉద్యోగుల సంఘం కార్యకలాపాలు విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. సంఘం అధ్యక్షుడు గోపీకృష్ణ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని వివరించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. సంఘం ప్రతినిధులు హనుమంతు, రఫీ, వేణుగోపాల్, నాగరాజు, మౌలాసాహెబ్, సుధాకర్, ఈశ్వరయ్య, తిమ్మరాజు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ మేనేజరు బాధ్యతల స్వీకరణ

సత్యనారాయణరెడ్డి

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ నూతన మేనేజరుగా సత్యనారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సొసైటీలో 1992లో జూనియర్ సహాయకుడిగా ఉద్యోగంలో చేరిన ఆయన సీనియర్ సహాయకుడిగా, గణాంక అధికారిగా, సహాయ మేనేజరుగా పనిచేశారు. ఇప్పటివరకు మేనేజరుగా పనిచేసిన విజయ భాస్కర్ ఉద్యోగ విరమణ చేశారు. తాడిపత్రి మండలం చుక్కలూరు గ్రామానికి ఆయన అనేక హోదాల్లో పనిచేసి మేనేజరుగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీసీఎంఎస్ అధ్యక్షుడు నెట్టెం వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎరువులు, పురుగు మందులు సరసమైన ధరలకు అందించి సొసైటీని లాభాల దిశగా నడిపిస్తానని వెల్లడించారు. పాలకవర్గం సహకారంతో సొసైటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత సహాయ మేనేజరు సుధాకర్ రెడ్డి, ఇతర సిబ్బంది ఆయనను సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

పక్కా ప్రణాళికతో పనిచేద్దాం: జేడీఏ

జేడీఏ రవిని సత్కరిస్తున్న కార్యాలయ పరిపాలనాధికారి మునీర్ అహమ్మద్, ఇతర ఉద్యోగులు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లా రైతాంగానికి సకాలంలో సేవలు అందాలంటే.. మనమంతా కలిసికట్టుగా ప్రణాళికబద్ధంగా పనిచేయాలని నూతన జేడీఏ రవి సూచించారు. గురువారం జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని రైతు సేవా కేంద్రాల సిబ్బంది, మండల, డివిజన్, జిల్లాలోని వివిధ విభాగాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులంతా తరలివచ్చారు. ముందుగా జేడీఏ రవి, అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రాముడు, వెంకట్‌కుమార్ ఉద్యోగులు, సిబ్బంది కేక్ కోశారు. అనంతరం జేడీఏకు శాలువాలు, పూలు, పండ్లతో ఘనంగా సత్కరించారు. అనంతరం అందరికీ జేడీఏ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2026లో వ్యవసాయశాఖలోని అందరం ఒక జట్టులాగా పనిచేయాలన్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ ఆనంద సూచనలతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పక్కా ప్రణాళికలతో ముందుకెళ్లాలన్నారు. డీడీఏ ఓబుళపతి, వ్యవసాయాధికారుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసుప్రకాశ్, అధ్యక్షుడు వెంకట్రాముడు, ప్రధాన కార్యదర్శి వెంకట్‌కుమార్, ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు, పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

వంశీకృష్ణ

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లు, తాడిపత్రి, బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన ముగ్గురు మృతిచెందారు. నూతన సంవత్సరవేళ యువత మృత్యువాత పడడం ఆ కుటుంబాల్లో విషాదం నింపింది. విడపనకల్లులో సుబ్బలక్ష్మీ కాలనీకి చెందిన రామాంజనేయులు, రాజేశ్వరి దంపతుల కుమారుడు వంశీకృష్ణ(28) గురువారం గుత్తి మండలంలోని తురకపల్లి గ్రామానికి వెళ్లాడు. తిరిగి ద్విచక్రవాహనంపై వస్తుండగా గుంతకల్లు సమీపంలో పంప్‌హౌస్ వద్ద వాహనం అదుపు తప్పి కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఏడు నెలల కిందటే వివాహం జరిగిందని, భార్య జాహ్నవి గర్భిణి అని బంధువులు వివరించారు. కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధుమిత్రులు కన్నీటి పర్యంతమయ్యారు.

జీవన

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా స్నేహితురాలితో కలిసి బెంగళూరులో గుడికి వెళ్తున్న సమయంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి కదిరికి చెందిన జీవన (20) మృతిచెందింది. బంధువుల వివరాల మేరకు.. భాస్కరాచారి, కుమారి దంపతుల రెండో కుమార్తె జీవన బీబీఏ పూర్తిచేసి బెంగళూరులో ఎంబీఏ కోసం శిక్షణ పొందుతుంది. గురువారం జరిగిన ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. వాహనం నడుపుతున్న ఆమె స్నేహితురాలు చికిత్స పొందుతుంది. జీవన మృతి విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు బెంగళూరుకు తరలివెళ్లారు.

తాడిపత్రి, న్యూస్‌టుడే: మండలంలోని చుక్కలూరు గ్రామానికి చెందిన రత్నకుమార్ (20) పని నిమిత్తం వరదాయపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న రాయికి ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని స్థానికులు 108 అంబులెన్స్‌లో స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఆతర్వాత బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గాయపడిన కార్యకర్తలను పరామర్శించిన ఎంపీ

వైద్య సిబ్బందితో వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్యంలో హింసకు స్థానంలేదని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం యల్లనూరులో వైకాపా నాయకుల దాడిలో గాయపడిన తెదేపా కార్యకర్తలను అనంతపురం ప్రభుత్వ వైద్యశాలలో పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పినా వైకాపా నాయకుల్లో మార్పు రావడం లేదన్నారు. దాడులు, దౌర్జన్యాలతో భయభ్రాంతులకు గురిచేసేందుకు యత్నిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి దాడులను ఉపేక్షించదు, తప్పక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

అప్పుల బాధతో వెల్డర్ బలవన్మరణం

షుకూర్ ఖాన్

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం మాళాపురంలో వెల్డింగ్ షాప్ నిర్వాహకుడు షుకూర్ ఖాన్(29) అప్పుల బాధతో బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన అతడి భార్య, కుటుంబ సభ్యులు వెంటనే బళ్లారిలోని ఓపీడీ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సుకూర్ ఖాన్ స్వగ్రామం పాల్తూరు కాగా.. మాళాపురానికి వలసొచ్చి వెల్డింగ్ షాప్ నిర్వహిస్తున్నాడు. కుటుంబ అవసరాల కోసం అయిన రూ.5 లక్షల అప్పులు తీరే మార్గం లేకపోవడంతో మనోవేదనతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఖాజాహుసేన్ పేర్కొన్నారు.

మిద్దెపై నుంచి పడి యువకుడి మృత్యువాత

తరుణ్‌కుమార్‌రెడ్డి

పుట్టపర్తి పట్టణం: నూతన సంవత్సర వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. మిద్దెపై సంబరాలు జరుపుకొంటున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన పుట్టపర్తి మండల పరిధిలోని చెర్లోపల్లిలో చోటుచేసుకుంది. బుధవారం రాత్రి తరుణ్‌కుమార్ (18) మిత్రులతో కలిసి ఇంటిపైన సంబరాలు జరుపుకొన్నాడు. కేకు కోసిన తర్వాత సెల్‌ఫోన్ చూసుకుంటూ పొరపాటున జారిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. తల్లిదండ్రులు అతన్ని పుట్టపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి రాజారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో యువకుల ఘర్షణ

ఒకరి పరిస్థితి విషమం, మరికొందరికి గాయాలు

చెర్లోపల్లిలో గ్రామస్థులను విచారిస్తున్న సీఐ శ్రీధర్, ఎస్ఐ ప్రదీప్‌రాజ్

రామగిరి, న్యూస్‌టుడే: డిసెంబరు 31 అర్ధరాత్రి మద్యం మత్తులో ఉన్న చెర్లోపల్లి, వెంకటాపురం గ్రామాలకు చెందిన యువకుల మధ్య ఘర్షణ తలెత్తి పలువురు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. రామగిరి సీఐ శ్రీధర్, ఎస్ఐ ప్రదీప్‌రాజ్, చెర్లోపల్లి గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. డిసెంబరు 31న అర్ధరాత్రి రామగిరి, ఎన్ఎస్ గేటు రహదారి పక్కన చెర్లోపల్లి వద్ద ఆ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు చరణ్, నరేంద్ర, బాలు చలిమంట కాచుకుంటున్నారు. అటుగా వెంకటాపురం వైపు వెళుతున్న ఆ గ్రామ వాస్తవ్యులు నాని, మంజునాథ మరో యువకుడు ఆగి చలి మంట వద్దకు వచ్చారు. ఇరు గ్రామాల యువకులు మద్యం మత్తులో ఉండటంతో మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది. ఒకరినొకరు తోసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. వెంకటాపురానికి చెందిన నాని కొంతమంది యువకులతో వచ్చి చెర్లోపల్లి యువకుల ఇళ్ల వద్దకు వెళ్లి ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో ఒకరిపై నొకరు దాడి చేసుకున్నారు. ఘర్షణలో నానికి తీవ్రగాయాలు కావడంతో అనంతపురం ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఇరు గ్రామాలకు చెందిన మంజునాథ, చరణ్, నరేంద్రలకు గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

(c) eenadu

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు

అమరవీరులను స్మరించుకుందాం

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే : దేశానికి సేవలందించిన అమరవీరులను స్మరించుకోవడం మన అందరి బాధ్యత అని బహుజన్‌సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీరాములు పేర్కొన్నారు. ఆ పార్టీ హిందూపురం నియోజకవర్గ అధ్యక్షుడు మౌలాలీ అధ్యక్షతన స్థానిక అంబేడ్కర్ కూడలిలో గురువారం నిర్వహించిన భీమా కోరేగావ్ విజయదివస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భీమా కోరేగావ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు నరసింహులు, కిష్టప్ప,శ్రీనివాసులు తదితరులు ఇందులో పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, కొల్హాపురమహాలక్ష్మీ, వెంకటరమణస్వామి, వేణుగోపాలస్వామి తదితర దేవాలయాల్లో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో వెలసిన దేవతా మూర్తులకు వేకువజామునే ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు.

పుష్పాలంకరణలో దక్షిణామూర్తి

వెండి, స్వర్ణ ఆభరణాలంకరణలో సత్యనారాయణ

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: బేవనహళ్లి పంచాయతీలోని ఊడుగుపల్లిలో తాగునీటి సరఫరా అయ్యే మోటారు చెడిపోవడంతో ప్రజలు ఇబ్బందులెదుర్కొంటున్నారు. **-గోవిందప్ప**

సమాధానం: ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈతో మాట్లాడి రెండురోజుల్లో మరమ్మతులు చేయిస్తాం. **-దామోదరమ్మ, ఎంపీడీవో**

సమస్య : పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో నిత్యం వందలాది మంది ప్రజలు ఉదయం నడకకు వెళ్తుంటారు. మైదానంలోని చివరి భాగాల్లో చెత్తాచెదారం, కవర్లు, వ్యర్థపదార్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది **-వెంకటేశ్‌బాబు**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తా. **-శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హిందూపురం**

-న్యూస్‌టుడే, హిందూపురం సాంస్కృతికం

సమస్య: కొంకల్లు ఎస్సీకాలనీలో చెత్తాచెదారం పేరుకుపోయింది. **-హనుమంతరాయప్ప**

సమాధానం: హరితరాయబారుల ద్వారా తొలగిస్తాం. **-కవితమ్మ, సర్పంచ్, కొంకల్లు**

సమస్య: వడ్డిపల్లి తాగునీటి బోరులో నీరు రావడం లేదు. **-దుర్గప్ప**

సమాధానం: పైప్లైన్ పనులు పూర్తి చేసి నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. **-అమరేశ్, పంచాయతీ కార్యదర్శి, ముతుకూరు**

-న్యూస్‌టుడే, గుడిబండ

సమస్య: కొడిగెనహళ్లి జగనన్న కాలనీలో అంతర్గత రహదారులు ఏర్పాటు చేయాలి. **-లక్ష్మమ్మ, కొడిగెనహళ్లి**

సమాధానం: పల్లెపండగ రెండో విడత నిధులతో కాలనీలో అంతర్గత రహదారులు, మౌలిక వసతులు కల్పిస్తాం. **-అరుణ పంచాయతీ కార్యదర్శి, కొడిగెనహళ్లి**

సమస్య: పరిగిలోని ఇందిరమ్మ బీసీ కాలనీలో ఉన్న ముళ్లకంపలు ఆక్రమించాయి. పాముల బెడద ఎక్కువగా ఉంది. **-జయమ్మ, రాధమ్మ**

సమాధానం: ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల మధ్యన ఖాళీ ప్రదేశాల్లో ఉన్న ముళ్లకంపచెట్లను తొలగించేందుకు తగు చర్యలు తీసుకుంటాం. **- అరుణ పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి**

-న్యూస్‌టుడే, కొడిగెనహళ్లి

జయమంగళి నదిపై వంతెనకు మోక్షమెన్నడో?

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే : మండలంలోని శ్రీరంగరాజుపల్లి గ్రామ సమీపంలో జయమంగళి నదిపై నిర్మించిన కాజ్‌వే వరద నీటి ప్రవాహం కారణంగా దెబ్బతింది. కాజ్‌వేను పునర్నిర్మించేందుకు తగు చర్యలు తీసుకోవాలని శ్రీరంగరాజుపల్లి, పాపిరెడ్డిపల్లి గ్రామస్థులు అధికారులకు విన్నవిస్తున్నారు. 40 ఏళ్ల క్రితం జయమంగళి నదికి అడ్డంగా కాజ్‌వేను నిర్మించారు. గతంలో జయమంగళి నదికి వరదలు వచ్చి నదిపై నిర్మించిన కాజ్‌వే కొంతవరకు దెబ్బతింది. దీంతో బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో గ్రామస్థులే చందాలు వేసుకుని కొట్టుకుపోయిన కాజ్‌వే ప్రాంతంలో మట్టి వేసి చదును చేసి రాకపోకలు సాగిస్తున్నారు.

విద్యార్థులకు సౌకర్యం కల్పిస్తే మేలు

● ఇదే మార్గంలో హిందూపురం నుంచి శ్రీరంగరాజుపల్లికి ఆర్టీసీ యాజమాన్యం గత సంవత్సరంగా ప్రత్యేకంగా బస్సు నడుపుతోంది. హిందూపురంలోని వివిధ కళాశాలలు, పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తుంటారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నదిపై కాజ్‌వే లేదా, వంతెన నిర్మాణం చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాజ్‌వేపై మట్టి వేసి చదును చేయడంతో రాకపోకలు సాగిస్తున్న జనం

సైనికులకు ఆసరాగా.. మన వంతు సాయం

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: సైనికులు, వైమానిక, నౌకా దళాలు సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని రక్షిస్తున్నారు. ప్రమాదవశాత్తు గాయపడినా, అమరులైనా, వితంతువులకు, వారి పిల్లలకు ఆర్థిక, సామాజిక ఇబ్బందులు తలెత్తకుండా ఆసరాగా నిలవడానికి ఏర్పాటు చేసిందే సైనిక సంక్షేమ నిధి. ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఏటా డిసెంబరు 7న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని విరాళాల కార్యక్రమం చేపడతారు. డిసెంబరులో ప్రారంభమైన ఈ కార్యక్రమం జనవరి 7వ తేదీ వరకు కొనసాగుతుంది.

క్రికెటర్ దీపికకు ప్రశంసలు

దీపికను అభినందిస్తున్న రఘువీరారెడ్డి

మడకశిర గ్రామీణం: గతంలో మంత్రిగా నేను చేయని పనిని ఓ అమ్మాయి సాధించిందని మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి భారత అంధుల క్రికెట్ కెప్టెన్ దీపికనుద్దేశించి అన్నారు. గురువారం నీలకంఠాపురం గ్రామంలో దీపికతో పాటు ఆమె తల్లిదండ్రులను రఘువీరారెడ్డి దంపతులు, గ్రామ ప్రజలు ఘనంగా సత్కరించారు. రఘువీరారెడ్డి మాట్లాడుతూ నేను ఎమ్మెల్యే, మంత్రిగా కొనసాగినా మడకశిర నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతం తంబాళ్లహట్టికి రోడ్డు వేయించలేకపోయానని, నేను చేయని ఆ పనిని దీపిక ప్రభుత్వాన్ని కోరి గ్రామానికి రూ.6.5 కోట్లలతో రోడ్డు మంజూరు చేయించుకుందని కొనియాడారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో దీపికతో కలిసి రఘువీరారెడ్డి క్రికెట్ ఆడారు. క్రికెట్‌లో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ప్రతిభతో విజ్ఞాన వికాసం

దీప్తి ఉన్నత పాఠశాలలో విజేతలతో ప్రిన్సిపల్

హిందూపురం : దీప్తి ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో 'వర్తమాన అంశాలు, జనరల్ నాలెడ్జ్'పై క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 8వ తరగతి చదువుతున్న వి.నాగశ్రీ ప్రథమ, కె.పవన్‌కుమార్ ద్వితీయ, కె.భార్గవసాయి తృతీయ స్థానంలో నిలిచారు. ప్రిన్సిపల్ అబ్రహంకుట్టి యాంకుల్, వైస్ ప్రిన్సిపల్ లూసీఅబ్రహం, ఎండీ డాక్టర్ దీపు అబ్రహం, ప్రధానోపాధ్యాయులు షాజీఇమాన్యుయల్ బహుమతులు అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు అన్నదానం

సోమందేపల్లి, న్యూస్‌టుడే : స్థానిక గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్ మిత్రలు, వారి కుటుంబ సభ్యులకు నూతన సంవత్సరం-2026 సందర్భంగా గురువారం 'హెల్పింగ్ హ్యాండ్స్' సంస్థ అధ్యక్షుడు పరందామ అన్నదానం చేశారు. పంచాయతీ కార్యాలయంలో వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన అందరికీ భోజనం వడ్డించారు. ప్రజాశ్రేయస్సు దృష్ట్యా పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికుల సేవలను వెలకట్టలేమని సంస్థ అధ్యక్షుడు పరందామ అన్నారు. అనంతరం కార్మికులకు నూతన ఏడాది శుభాకాంక్షలు తెలియజేశారు. సభ్యులు నవీన్, సంతోష్, మోహన్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

భోజనం వడ్డిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు పరందామ, అతని మిత్రులు

సత్యసాయి భక్తుల పాదయాత్ర

రొద్దం: సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తిలో వెలసిన సత్యసాయి బాబా దర్శనార్థం భక్తులు ప్రారంభించిన పాదయాత్రను గురువారం తహసీల్దారు ఉదయ శంకర్ ప్రారంభించారు. మండల సత్యసాయి కమిటీ సభ్యులు ఓబులేసు, రవిశేఖర్ ఆధ్వర్యంలో బాబా చిత్రపటాన్ని చేతపట్టుకుని యాత్రగా సాగారు. పలువురు సత్యసాయి భక్తులతో కలిసి భజనలు చేస్తూ గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

పాదయాత్రను ప్రారంభిస్తున్న తహసీల్దారు ఉదయశంకర్‌రాజు

పేదలకు వరం సీఎం సహాయనిధి

చెక్కులు అందజేస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

పెనుకొండ, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం అప్పులు పాలైన పేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో 13 మంది లబ్ధిదారులకు రూ.6.5లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం పార్టీ శ్రేణులతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. ఈసందర్భంగా కేకులు కోసి మిఠాయిలు పంచిపెట్టారు.

నేటి నుంచి కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

పెనుకొండ, న్యూస్‌టుడే : రీసర్వే పూర్తయిన గ్రామాల్లో శుక్రవారం నుంచి గతంలో మంజూరైన పట్టాదారు పాసుపుస్తకాల స్థానంలో నూతన పుస్తకాలు పంపిణీ చేస్తామని తహసీల్దార్ స్వాతి పేర్కొన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ మొదటి రోజున వాసుదేవపురం గ్రామానికి సంబంధించి నూతన పుస్తకాలు వెంకటరెడ్డిపల్లి గ్రామ సచివాలయంలో పంపిణీ చేస్తామన్నారు. ఈనెల 3వ తేదీన రాంపురం, 6న కొండంపల్లి, 7న బొజ్జిరెడ్డిపల్లి, 8నశెట్టిపల్లి గ్రామాల్లో పంపిణీ చేస్తాయనున్నట్లు తహసీల్దార్ వివరించారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి

సోమందేపల్లి, న్యూస్‌టుడే : విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతి ఉపాధ్యాయుడు చిత్తశుద్ధితో కృషి చేస్తూ మండలాన్ని ప్రథమ స్థానంలో ఉంచాలని ఎంఈఓ ఆంజనేయులు నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని ఉపాధ్యాయ సంఘం (ఏపీటీఎఫ్) నాయకులు, సభ్యులు కలిసి ఎంఈవో, జూలుకుంట హెచ్‌ఎం శ్రీధర్‌లను ఘనంగా సత్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారితో కలిసి ఉపాధ్యాయ సంఘం కాలమానిని, దైనందినిలను ఆవిష్కరించారు. సంఘం మండల గౌరవాధ్యక్షుడు దస్తగిరి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివన్న,గణేశ్‌కుమార్, నాయకులు నాగరాజు, చంద్రశేఖర్, విజయ్‌కుమార్‌నాయక్, ఇర్ఫాన్, రంగేశ్‌కుమార్, మధు, ప్రసాద్ నాయక్, రమేశ్, నరసింహమూర్తి, ఆనంద్, కాళయ్య, రాజారమేశ్, హనుమంతరాయుడు, ఉపేంద్ర, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్లలో.. డీవైఈవో, ఎంఈవో ఆధ్వర్యంలో కాలమానిని, దైనందిని విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

గోరంట్ల, న్యూస్‌టుడే : ఏపీటీఎఫ్-1938 మండల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మార్సీలో నూతన సంవత్సర కాలమానిని, దైనందిని పెనుకొండ డీవైఈవో జాన్‌రెడ్డెప్ప, ఎంఈవో గోపాల్ గురువారం ఆవిష్కరించారు. ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, జిల్లా అధ్యక్షుడు పక్కీరప్ప, పూర్వప్రధాన కార్యదర్శి నాగరాజు, మండల గౌరవాధ్యక్షుడు శ్రీరాంనాయక్, మండల అధ్యక్షుడు తిరుపాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, చిలమత్తూరు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథరెడ్డి, బాబాజన్, సభ్యులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: ఏపీటీఎఫ్ కాలమానిని, దైనందినిలను ప్రదర్శిస్తున్న ఎంఈవో ఆంజనేయులు నాయక్, సంఘం నాయకులు, సభ్యులు

మహిళలకు చీరల పంపిణీ

పెనుకొండ, న్యూస్‌టుడే : స్థానిక త్రిపురా రిసార్ట్స్‌లో గురువారం భాజపా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కె.గోపీనాథ్ ఆధ్వర్యంలో నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న 70 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి కేకుకోసి మిఠాయిలు పంచిపెట్టారు. ఐదు మండలాల నుంచి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరభద్రుడికి పుష్పాలంకరణ

లేపాక్షి, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వాములకు అభిషేకాలు, అర్చనలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

4న హిందూ సమ్మేళనం

గోరంట్ల, న్యూస్‌టుడే: హిందూ సమాజంపై గౌరవం, అంకితభావం వికసింప చేసే ఆలోచనతో ఆర్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో గోరంట్లలోని మాధవరాయ ఆలయంలో ఈనెల 4న ఉదయం 10 గంటలకు హిందూసమ్మేళనం ఏర్పాటు చేసినట్లు మండల నిర్వహణ సమితి సభ్యులు పేర్కొన్నారు. ప్రతిహిందువు పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో చెన్నేకొత్తపల్లి సమీపంలో ఉన్న కోనకణ్వాశ్రమ పీఠాధిపతి దత్తానందగిరిస్వామి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు జీఎంసురేష్, ధర్మవరానికి చెందిన ఆర్‌ఎస్ఎస్ విభాగ్ ప్రచార ప్రముఖ్ వివేకానంద పాల్గొంటారని వివరించారు.

చెరువులు నింపాలి: మంత్రి

పెనుకొండ, న్యూస్‌టుడే : నియోజకవర్గంలో చెరువులను నింపేవిధంగా తక్షణ చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ ఎస్ఈ స్వరూప్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆదేశించారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మంత్రి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువులకు ఫీడర్ ఛానల్ ఏర్పాటు, గుడిపల్లి జలాశయం నిర్మాణం గురించి చర్చించారు. రాబోయే వేసవిలో తాగు, సాగునీటి కొరతలేకుండా ఉండేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

నీటి వృథా కట్టడి చేయరూ!

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని మిట్టమీదపల్లి గ్రామం సమీపంలో వృథా అవుతున్న హంద్రీ-నీవా నీటిని నియంత్రించాలని సీపీఐ హిందూపురం కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయనతో పాటు నాయకులు బాబు, లింగప్ప, వెంకటరాముడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చలపతి తదితరులు నీరు వృథా అవుతున్న ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ కిరికెర చెరువు నుంచి సూగూరు చెరువుకు నీరు వెళ్లేందుకు కాలువ లేకపోవడంతోనే నీరు సజావుగా పోవడానికి మార్గం లేదన్నారు.

క్షయ రహిత జిల్లాగా మారుద్దాం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాను క్షయ వ్యాధి (టీబీ) రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పెనుకొండ డివిజన్ టీబీ యూనిట్ పరిధిలోని పది మంది రోగులను 'నిక్షయ్ మిత్ర' పథకం కింద దత్తత తీసుకుని పోషకాహార కిట్లను కలెక్టర్ అందజేశారు. జిల్లా వైద్యాధికారిణి ఫైరోజాబేగం, ఎన్టీఆర్ సేవా కోఆర్డినేటర్ శ్రీదేవి టీబీ రోగులను దత్తత తీసుకుని పోషకాహారానికి సాయం అందించారు. జిల్లాలో 1,662 మంది క్షయ వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీరికి వివిధ సంస్థలు సామాజిక బాధ్యతగా (సీఆర్ఎస్) నిధుల ద్వారా పోషకాహర సాయం అందిస్తున్నట్లు తెలిపారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి 'నిక్షయ్‌మిత్ర'లుగా మారి పోషకాహారానికి సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

నీరు నింపితేనే ఉపయోగం

మండలంలోని హేమావతి నుంచి నిద్రఘట్ట వెళ్లే రోడ్డులో ఆరు నెలల కిందట పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా పశువులకు తాగునీటి తొట్టె నిర్మించారు. అందులో నీరు నింపకపోవడంతో వృథాగా ఉంది. ఈఏడాది అరకొర వర్షం కురవడంతో రాబోయే వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంది. నీరు నింపితే పశువులకు ఉపయోగంగా ఉంటుంది. ఈవిషయమై ఎంపీడీవో రామారావును వివరణ కోరగా పంచాయతీ అధికారులతో మాట్లాడి తొట్టెకు నీరు నింపేలా చర్యలు తీసుకుంటామన్నారు.

-న్యూస్‌టుడే, రొళ్ల

లేపాక్షిలో పర్యాటకుల సందడి

లేపాక్షి, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో లేపాక్షిలో సందడి నెలకొంది. ఉదయం నుంచే భక్తులతో ఆలయం కిటకిటలాడింది. మన రాష్ట్రం నుంచే కాక కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆలయంలోని పురాతన కట్టడాలు, చారిత్రక నిర్మాణాల గురించి తెలుసుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఏడు శిరస్సుల నాగేంద్రుని చెంత పర్యాటకులు

వేదికపై చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

అలరించిన చిన్నారుల నృత్యం

హిందూపురం, న్యూస్‌టుడే : పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్ పాఠశాలలో నూతన సంవత్సరం సందర్భంగా గురువారం నిర్వహించిన కిండర్‌గార్టెన్ డే వేడుకలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్యాలు మనస్సుకు హత్తుకొని అలరించాయి. ఎంతో ఆహ్లాదవాతావరణంలో సాగిన వేడుకలో పాఠశాల అధ్యక్షుడు పీఎస్ శ్రీనివాసులు, కరస్పాండెంట్ డీఎస్ నందకుమార్, పాఠశాల ఏడీలు స్మిత, నందిత, హెచ్‌ఎం గాయిత్రి, ఏవో భాస్కర్, సూపరింటెండెంట్ విజయింద్ర, ఏహెచ్‌ఎంలు శశికళ, సతీశ్‌కుమార్, షేక్‌అబ్దుల్‌రజాక్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా శ్రీనివాస్ బాధ్యతలు

శ్రీనివాస్‌కు అభినందనలు తెలుపుతున్న అధికారుల బృందం

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షి ఇన్‌ఛార్జి (ఎఫ్ఏసీ)ఎంపీడీవోగా శ్రీనివాస్ గురువారం పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఎంపీడీవోగా ఉన్న నరసింహమూర్తి బుధవారం పదవీ విరమణ పొందడంతో జీఎస్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చారు. అందరి సహకారంతో మండలానికి ప్రత్యేక గుర్తింపు తెస్తానని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఏవో కుల్లాయప్ప, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, కార్యాలయ సిబ్బంది ఆయన పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సంబరంగా నూతన ఏడాదికి స్వాగతం

హిందూపురంలో ఏడీజే కంపల్లె శైలజకు శుభాకాంక్షలు తెలుపుతున్న న్యాయవాదులు

హిందూపురం : ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేక్ కోసి నూతన సంవత్సర వేడుకల జరుపుకొంటున్న తెదేపా నాయకులు

గోరంట్ల :నిమ్మల కిష్టప్ప కుటుంబసభ్యులను గజమాలతో సన్మానిస్తున్న తెదేపా శ్రేణులు

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో నూతన ఏడాది సంబరాలు మిన్నంటాయి. అర్ధరాత్రి నుంచే యువత నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సందడి చేసింది. పిల్లలతో మొదలుకొని పెద్దల వరకు ప్రతి ఒక్కరూ కేకులు కోసి శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ప్రజాప్రతినిధుల నివాస గృహాలు కార్యకర్తలు, అభిమానులతో సందడిగా కనిపించాయి. ప్రభుత్వ ఉన్నతాధికారులకు కింది స్థాయి ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన ఏడాది శుభాకాంక్షలు తెలిపారు.కార్యాలయాలన్నీ కిటకిటలాడాయి.

-న్యూస్‌టుడే బృందం

పెనుకొండలో మంత్రి సవితకు శుభాకాంక్షలు తెలుపుతున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు ఎం.ఎస్.రాజు, తదితరులు

లేపాక్షిలో పర్యాటక కార్పొరేషన్ డైరెక్టర్ జయ్యప్పకు కేకు తినిపించి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

లేపాక్షి :తెదేపా మండల కన్వీనర్ అభిలాష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కూటమి నాయకులు

అగళి-పావగడ బస్సును పునరుద్ధరించండి

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: అగళి, పావగడ బస్సును పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో అగళి నుంచి పావగడకు 4 సింగిల్స్ తిరిగే సమయంలో అగళి, రొళ్ల, మడకశిర మండలాల దాదాపు 30 గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేది. ఉదయాన్నే పావగడకు వెళ్లే పూలవ్యాపారులు, ఆసుపత్రులకు వెళ్లే రోగులకు, ప్రసిద్ధిగాంచిన శనీశ్వర ఆలయానికి వెళ్లే భక్తులు నేరుగా పావగడకు చేరుకునేవారు. ప్రస్తుతం పావగడకు వెళ్లాలంటే నాలుగు బస్సులు మారాల్సి వస్తోంది. దూరంతో పాటు వ్యయప్రయాసాలు పడాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని సత్వరమే అగళి-పావగడ బస్సును పునరుద్ధరించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్టీసీ డీఎం రంగభాష్యం మాట్లాడుతూ అగళి, పావగడ బస్సును నడిపేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

విషగుళికలు మింగి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల: గోరంట్లకు చెందిన ఓ వివాహితుడు కుటుంబ సమస్యల కారణంగా గురువారం అధిక మోతాదులో విషగుళికలు మింగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హిందూపురం పంపించారు.

వైకాపా నాయకుడి మృతిపై కేసు నమోదు

గోరంట్ల, న్యూస్‌టుడే : మండలంలోని బూదిలి రహదారిలో బుధవారం రాత్రి ద్విచక్రవాహన ప్రమాదంలో వైకాపా నాయకుడు చౌడరెడ్డి మృతి చెందిన సంఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతిపై అనుమానాలు ఉన్నట్లు సోదరుడు ఫిర్యాదులో పేర్కొన్నాడని చెప్పారు.

పోలీసుశాఖ గౌరవం మరింత పెంచాలి: ఎస్పీ

పుట్టపర్తి, పట్టణం: కొత్త సంవత్సరంలో బాధ్యతాయుతంగా పని చేసి పోలీస్ శాఖ గౌరవాన్ని మరింత పెంచాలని పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది, పోలీస్ అధికారులతో కలసి ఎస్పీ కేకు కోశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్బీ సీఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ వలి, సీఐ నరేంద్రరెడ్డి, పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి రథోత్సవం

అగళి, న్యూస్‌టుడే : అగళి మండల కేంద్రంలో అయప్పస్వామి భక్తులు గురువారం రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేసి ఉత్సవమూర్తిని రథంలో ప్రతిష్ఠించారు. అయ్యప్ప మాల ధరించిన భక్తులు పురవీధుల గుండా స్వామివారి రథాన్ని లాగుతూ భక్తిని చాటుకున్నారు. వాయిద్యాల నడుమ భక్తులు నృత్యాలు చేసి పులకించిపోయారు.

రొద్దం, న్యూస్‌టుడే : మండలంలోని సానిపల్లి అయ్యప్పస్వామి దీక్షలు చేపట్టిన పలువురు మాలధారులు నెల రోజుల నుంచి ప్రత్యేక పూజలు, భజనలు చేపట్టారు. ఇందులో భాగంగా మణికంఠడిని వెండి పూల రథంలో ఉంచి పుర వీధుల్లో ఘనంగా ఊరేగించారు.

(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

రత్నాకర్‌ను సత్కరిస్తున్న అభిమానులు

సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తాం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని, పుట్టపర్తి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. గురువారం నూతన సంవత్సరం పురస్కరించుకుని అధికారులు, పాలకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజలు ఆయనకు పుష్పగుచ్ఛాలు, పుస్తకాలు ఇచ్చి గజమాలలతో సత్కరించారు. చిన్నారులకు పుస్తకాలు, ప్రజలకు పూలమొక్కలను అందజేశారు.

వర్తమాన అంశాలపై అవగాహన అవసరం

కదిరి (గ్రామీణం), న్యూస్‌టుడే: వర్తమాన అంశాలపై కనీస అవగాహన కలిగి ఉండటం ప్రతి విద్యార్థికి అవసరం అని, ఇందుకు దిన పత్రిక చదవడం అలవాటు చేసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం కదిరి మండలం కాళసముద్రం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో గత రెండు నెలల్లో 'ఈనాడు' పత్రికలో ప్రచురితమైన అంశాలపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. 9వ తరగతి విమల్, 8వ తరగతి నవదీప్, 9వ తరగతి యశ్వంత్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది జనార్దన్‌రెడ్డి, ఫిరోజ్‌ఖాన్, బాలకృష్ణ, నాగరాజు, రవినాయక్ పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యుత్తు తీగలకు మరమ్మతులు

చందమూరు (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: చెన్నేకొత్తపల్లి మండలం చందమూరు గ్రామంలో పోతలయ్యస్వామి గుడికి వెళ్లే దారిలో ఉన్న విద్యుత్తు స్తంభాలకు ఏర్పాటు చేసిన తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. దీనిపై మేమున్నాం..మీకు తోడులే.. భాగంగా సమస్యను బుధవారం ప్రచురించడం జరిగింది. స్పందించిన మండల విద్యుత్ అధికారులు కిందకు వేలాడుతున్న తీగలను గురువారం పైకి లాగించి సమస్యను పరిష్కరించారు.

దివ్యాంగులకు వినికిడి యంత్రాలు

తలుపుల, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా దివ్యాంగులైన 60 మందికి వినికిడి యంత్రాలను గురువారం పంపిణీ చేసినట్లు తలుపులకు చెందిన గ్రామీణాభివృద్ధి స్నేహితుల సంస్థ అధ్యక్షుడు మన్సూర్ ఒక ప్రకటనలో తెలిపారు.

నానో యూరియాతో సాగు సులభం

రైతులకు తప్పనున్న కష్టాలు

గాండ్లపెంట, కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయంలో పురుగుల మందులు, ఎరువుల వాడకానికి కిసాన్‌డ్రోన్ ఉపయోగించడం వల్ల రైతులకు కష్టాలు తప్పనున్నాయి. శ్రమతోపాటు ఖర్చు తగ్గనుంది. యూరియా బదులు నానో యూరియా అందుబాటులోకి రావడంతో రైతులకు భారం తగ్గనుంది.

● డ్రోన్ ద్వారా మందుల పిచికారీకి 10 లీటర్ల నీరు ఎకరా పొలానికి సరిపోతుంది. 8 నుంచి 10 నిమిషాల సమయం మాత్రమే పడుతుంది. డ్రోన్‌తో రోజుకు 40 ఎకరాల వరకు మందులు పిచికారీ చేయవచ్చు. దీని వల్ల రైతులకు, పైలెట్(ఆపరేటర్)కు ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావు. ఎకరా మందు పిచికారీకి రూ.400-500 మాత్రమే ఖర్చు వస్తుంది.

ఉపయోగాలెన్నో.. : నానో యూరియా ఎకరాకు అరలీటరు సరిపోతుంది. ఇది ఒక బస్తా యూరియాకు సమానం. నానో యూరియాతో 90 శాతం నత్రజని అందుబాటులోకి వస్తుంది. యూరియా ఒక బస్తా 40 శాతం నత్రజనిని మాత్రమే అందిస్తుంది. నానో యూరియాను మొక్క దశ 20 రోజుల నుంచి 25 రోజులు ఉన్నప్పుడు ఆకులపై పిచికారీ చేయాలి. డ్రిప్ పరికరాల ద్వారా దుక్కిలో వేయకూడదు. యూరియా ధరతో పోలిస్తే నానోయూరియా ధర కూడా తక్కువ. తీసుకెళ్లడానికి సులువుగా ఉంటుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కిసాన్‌డ్రోన్‌తో మందుల పిచికారీ ఎంతో సులభం. యూరియా కన్నా నానో యూరియా మంచి ఫలితాలను ఇస్తుంది. రైతులకు ఖర్చు తగ్గడంతోపాటు సమయం కలిసి వస్తుంది. కష్టపడాల్సిన పని లేదు. పది నిమిషాల్లో ఎకరా పంటకు మందులు పిచికారీ చేయవచ్చు. ఖర్చు కూడ తక్కువే. **- షాదాబ్, గాండ్లపెంట మండల వ్యవసాయాధికారి**

డ్రోన్‌తో మందుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

పుట్టపర్తి, న్యూస్‌టుడే: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. గురువారం నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు, తెదేపా శ్రేణులు వారికి పుష్పగుచ్ఛాలు, పుస్తకాలు, పెన్నులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక, పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో పాటు, పారిశ్రామికవాడగా తీర్చిదిద్ది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. తర్వాత ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే, మాజీ మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు

క్షయ రహిత జిల్లాగా మారుద్దాం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాను క్షయ వ్యాధి (టీబీ) రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పెనుకొండ డివిజన్ టీబీ యూనిట్ పరిధిలోని పది మంది రోగులను 'నిక్షయ్ మిత్ర' పథకం కింద దత్తత తీసుకుని పోషకాహార కిట్లను కలెక్టర్ అందజేశారు. జిల్లా వైద్యాధికారి ఫైరోజాబేగం, ఎన్జీఓ 'సేవ కోఆర్డినేటర్' శ్రీదేవి టీబీ రోగులను దత్తత తీసుకుని పోషకాహారాన్ని సాయం అందించారు. జిల్లాలో 1,662 మంది క్షయ వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీరికి వివిధ సంస్థలు సామాజిక బాధ్యతగా (సీఆర్‌ఎస్) నిధుల ద్వారా పోషకాహార సాయం అందిస్తున్నట్లు తెలిపారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి 'నిక్షయ్‌మిత్ర'లుగా మారి పోషకాహారానికి సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

మహిళలకు బియ్యం బస్తా అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వేణుగోపాల్ రాయల్, కృష్ణమోహన్

కదిరి, న్యూస్‌టుడే: కదిరిలోని రోడ్లు భవనాల అతిథి భవనంలో గురువారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ జన్మదిన వేడుకలు సందడిగా జరిగాయి. వేడుకలకు హాజరైన జనంతో అతిథి భవనం ఆవరణ కిటకిటలాడింది. పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య ఎమ్మెల్యే కేక్ కోశారు. ఓ అభిమాని ఎమ్మెల్యే చిత్రాన్ని వడ్లగింజలతో రూపుదిద్ది కానుకగా ప్రదర్శించారు. కందికుంట కార్యకర్తలకు అండగా ఉండటం, అభివృద్ధి, సంక్షేమం, పేదల పట్ల సేవాతత్పరతలపై పాడుతా తీయగా ఫేం సుధాకర్ పాడిన గీతాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే అభిమాని మాధవ గురుకులంలోని అనాథ పిల్లలకు రాతపుస్తకాలు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. పీవీఆర్ ఫంక్షన్ హాలులో మొటుకపల్లి పంచాయతీలోని వంద పేద కుటుంబాలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. ఐఎంఏ చంద్ర, డాక్టర్ గణేష్ పాల్గొన్నారు. నల్లచెరువు సహకార సంఘం మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్ రాయల్, స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ గాలివేటి కృష్ణమోహన్ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌అండ్‌బీ ఆవరణలో జనాలకు భోజనాలు ఏర్పాటు చేశారు. తలుపుల, నల్లచెరువు, నంబులపూలకుంటలోనూ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

తిమ్మమ్మమర్రిమాను వద్ద భక్తుల సందడి

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం పురస్కరించుకుని పర్యాటక కేంద్రమైన తిమ్మమ్మమర్రిమాను వద్ద గురువారం భక్తులు, పర్యాటకుల సందడి నెలకొంది. భక్తులు తిమ్మమాంబకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పేదలకు ఆర్థిక చేయూత

కదిరి, న్యూస్‌టుడే: 'పేదల సేవలో' భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాగ్దానం చేసిన ఆర్థిక సాయాన్ని గురువారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అందజేశారు. తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జీవన పరిస్థితులు మెరుగు పరచుకునేలా ఆర్థిక సాయాన్ని అందిస్తామని రెండు కుటుంబాలకు హామీ ఇచ్చారు. ఐదులో మేడ రెడ్డెప్పకు రూ.3 లక్షలు, మేడ మల్లయ్యకు రూ.2 లక్షలు అందివ్వాలని సీఎం ఆదేశించారు. దీంతో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆ సాయాన్ని ఆర్డీవో ద్వారా పంపారు. కదిరి ఆర్‌అండ్‌బీ అతిథి భవనంలో లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబునాయుడు నాయకత్వం, పాలనలో నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. ప్రతినెలా ఇద్దరు పేదల కుటుంబ జీవనం మెరుగు పడేలా సాయం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో వీవీఎస్‌శర్మ, తహసీల్దార్ రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

సైనికులకు ఆసరాగా.. మన వంతు సాయం

విరాళాలు సేకరిస్తున్న ఉపాధ్యాయులు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: సైనికులు, వైమానిక, నౌకా దళాల సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని రక్షిస్తున్నారు. ప్రమాదవశాత్తు గాయపడినా, అమరులైనా, వికలాంగులైనా, వారి పిల్లలకు ఆర్థిక, సామాజిక ఇబ్బందులు తలెత్తకుండా ఆసరాగా నిలవడానికి ఏర్పాటు చేసిందే సైనిక సంక్షేమ నిధి. ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఏటా డిసెంబరు 7న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని విరాళాల కార్యక్రమం చేపడతారు. డిసెంబరులో ప్రారంభమైన ఈ కార్యక్రమం జనవరి 7వ తేదీ వరకు కొనసాగుతుంది. గతంలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ల ద్వారా విరాళాలు సేకరించేవారు. ఈసారి విద్యాశాఖ విరాళాలు సేకరిస్తోంది. ప్రతి మండలంలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులకు ఒక హుండీని అందించారు. సేకరించిన నిధి అంతా సైనిక్ వెల్ఫేర్ ఫండ్‌కి పంపుతారు. త్రివిధ దళాల సైనికులకు సాయం చేసేందుకు ఇది మంచి అవకాశం. విరాళాల రూపంలో సేకరించిన నిధిని మాజీ సైనికుల పునరావాసం, సంక్షేమం, అమర సైనిక కుటుంబాల సంక్షేమానికి ఉపయోగిస్తారని ఎంఈఓ రమణప్ప తెలిపారు.

శిక్షణను రైతులు సద్వినియోగం చేసుకోండి

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండిలో నేడు (శుక్రవారం) వ్యవసాయ శాస్త్రవేత్తలు, జిల్లా వనరుల కేంద్రం నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. పంటల సాగు, సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు తదితర వాటిపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉద్యానశాఖ అధికారులు హాజరవుతారని, ఉదయం 10 గంటలకు కమ్యూనిటీ భవనం వద్ద ప్రారంభమవుతుందని రైతులు హాజరై సూచనలు, సలహాలు పొందవచ్చన్నారు.

లేపాక్షిలో పర్యాటకుల సందడి

ఏడు శిరస్సుల నాగేంద్రుని చెంత పర్యాటకులు

లేపాక్షి, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో లేపాక్షిలో సందడి నెలకొంది. ఉదయం నుంచే భక్తులతో ఆలయం కిటకిటలాడింది. మన రాష్ట్రం నుంచే కాక కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆలయంలోని పురాతన కట్టడాలు, చారిత్రక నిర్మాణాల గురించి తెలుసుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సందడిగా నూతన సంవత్సర వేడుకలు

ధర్మవరం: హరీష్‌బాబుకు పుస్తకాలు అందజేస్తున్న కార్యకర్తలు

ధర్మవరం: చిలకం మధుసూదన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యకర్తలు

ధర్మవరం: కేక్ కోస్తున్న ఆర్డీవో మహేష్

పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో ప్రజలు నూతన సంవత్సర వేడుకలను గురువారం ఘనంగా జరుపుకొన్నారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ అభిమాన నేతలకు పుష్పగుచ్ఛాలు, రాతపుస్తకాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కేకులు కోశారు. అధికారులు, సిబ్బంది తమ శాఖల ఉన్నతాధికారులకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. **- న్యూస్‌టుడే, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి**

కదిరి శాంతినికేతన్ పాఠశాలలో..

బుక్కపట్నం: ఏపీసీ దేవరాజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్‌ఎస్‌ఏ సిబ్బంది

తాడిమర్రిలో..

కదిరి: యూటీఎఫ్ ఉపాధ్యాయుల సంబరాలు

వృద్ధులు, అనాథలకు దుప్పట్ల పంపిణీ

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం రైల్వేస్టేషన్ ఆవరణలో వృద్ధులకు, అనాథలకు గురువారం రాత్రి సాంస్కృతిక మండలి అధ్యక్షుడు సత్రసాల ప్రసన్నకుమార్, పట్టుచీరల వ్యాపారి బండి రాము, విజయకుమారి దుప్పట్లు పంపిణీ చేశారు. భోజన ప్యాకెట్లు అందజేశారు.

ధర్మవరం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో రోగులకు పాలు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. సుబ్రహ్మణ్యం, రాగిణి దంపతులు, సత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

4న ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం, న్యూస్‌టుడే: యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4న ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని సంస్థ అధ్యక్షులు నాగేంద్ర, జయరాం తెలిపారు. ప్రచార కరపత్రాలను కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. బెంగళూరు నేత్రజ్యోతి కంటి ఆసుపత్రి వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తారని నాగేంద్ర పేర్కొన్నారు. యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు కోటేశ్వరరావు, డాక్టర్ సుబ్బారావు, చాంద్ బాషా, పోలా ప్రభాకర్, వై.కె.శ్రీనివాసులు, కేతా లోకేష్, ప్రసాద్, మల్లికార్జున, రమేష్‌బాబు పాల్గొన్నారు.

పోలీసుశాఖ గౌరవం మరింత పెంచాలి: ఎస్పీ

పుట్టపర్తి, పట్టణం, న్యూస్‌టుడే: కొత్త సంవత్సరంలో బాధ్యతాయుతంగా పని చేసి పోలీస్ శాఖ గౌరవాన్ని మరింత పెంచాలని పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది, పోలీస్ అధికారులతో కలసి ఎస్పీ కేకు కోశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్బీ సీఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ వలి, సీఐలు నరేంద్రరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్

పట్టాదారు పాసుపుస్తకాలు సిద్ధం

కనగానపల్లి, న్యూస్‌టుడే: రీసర్వే పూర్తి చేసిన గ్రామాల రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడానికి సిద్ధం చేసినట్లు తహసీల్దార్ ప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. నేటి నుంచి ఈనెల 9 వరకు రీ సర్వేలో భాగంగా భూమికి సంబంధించిన వివరాలు పూర్తి చేసిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రాజముద్ర కలిగిన పట్టదారు పాసుపుస్తకాన్ని సంబంధిత రైతులకు అందజేస్తామన్నారు. నర్శంపల్లి, ఎలకుంట్ల, ముత్తవకుంట్ల గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశారన్నారు.

సత్యసాయి భక్తుల పాదయాత్ర

పాదయాత్రను ప్రారంభిస్తున్న తహసీల్దారు ఉదయశంకర్‌రాజు

రొద్దం: సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తిలో వెలసిన సత్యసాయి బాబా దర్శనార్థం భక్తులు ప్రారంభించిన పాదయాత్రను గురువారం తహసీల్దారు ఉదయ శంకర్ ప్రారంభించారు. మండల సత్యసాయి కమిటీ సభ్యులు ఓబుళేసు, రవిశేఖర్‌ల ఆధ్వర్యంలో బాబా చిత్రపటాన్ని చేతపట్టుకొని యాత్రగా సాగారు. పలువురు సత్యసాయి భక్తులతో కలిసి భజనలు చేస్తూ గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

ప్రహరీ లేక బాలికలకు రక్షణ కరవు

కొత్తచెరువు: కొత్తచెరువు జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానానికి ప్రహరీ లేకపోవడంతో తరచూ పాములు, విషపురుగులు సంచరించడం విద్యార్థినులను భయాందోళనకు గురిచేస్తోంది. వందలాదిగా ఉన్న బాలికలకు క్రీడా మైదానం ఇదే. అయితే పక్కనే ఉన్న శ్మశానం వైపు ప్రహరీ కూలిపోయింది. శ్మశానంలో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు విషపురుగులకు ఆశ్రయంగా ఉంది. దీంతో తరచూ పాములు పట్టపగలే క్రీడామైదానంలో యదేచ్ఛగా సంచరించడం బాలికలు, ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. గతంలో పలుమార్లు పెద్ద పాములు కనిపించడంతో పాములు పట్టే వ్యక్తిని పిలిపించి వాటిని బంధించి సుదూరంగా వదిలేసినట్లు పేర్కొంటున్నారు. దీనిపై పాఠశాల కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో తల్లిదండ్రుల సమావేశానికి పాఠశాలకు వచ్చిన విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. ప్రహరీ నిర్మించడానికి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టేలా తగు సూచనలు జారీ చేశారన్నారు. ఏడాది గడిచినా ఇప్పటి వరకూ ప్రహరీ నిర్మాణం చేపట్టలేదని వాపోయారు. వెంటనే ప్రహరీ నిర్మించి బాలికలకు రక్షణ కల్పించాలని కోరారు.

ప్రహరీ కూలిపోయిన ప్రాంతం (వృత్తంలో)

క్రైం కార్నర్

తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ కూడలి వద్ద సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్ఐ ఉమాదేవి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. 12 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు తేలింది. వారిపై కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేశారు. టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో సీఐ రెడ్డెప్ప వాహన తనిఖీలు నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో కేసులు నమోదు చేసి ద్విచక్రవాహనాలు సీజ్ చేశారు. వీధుల్లో అధిక వేగంతో వెళుతున్న మరో 10 మంది యువకులను అదుపులోకి తీసుకొని వాహనాలను సీజ్ చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గంటలమారెమ్మ గుడి వద్ద గురువారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడినట్లు పుట్టపర్తి రూరల్ ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు. రామగిరికి చెందిన నాగరాజుకు తీవ్ర గాయాలు కాగా లోకేష్, రాజు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఉల్లిపాయల వ్యాపారం నిమిత్తం నిడిమామిడికి రాగా తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

తనకల్లు: మండల పరిధిలోని ఉస్తినిపల్లి క్రాస్ వద్ద గురువారం ద్విచక్రవాహనం అదుపుతప్పి దిగువతొట్లిపల్లికి చెందిన వెంకటరమణ గాయపడ్డాడు. బాధితుడిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

తనకల్లు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. వెతికినా ఆచూకి లభించకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆకతాయిల దుశ్చర్య

తాడిమర్రి: నూతన సంవత్సర వేడుకల్లో కొందరు యువకులు అత్యుత్సాహం ప్రదర్శించి చిరువ్యాపారులకు తీవ్ర నష్టం కలిగించారు. మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా పలువురు తోపుడు బండ్లపై పండ్లు, పూలు అమ్ముకొని కుటుంబాలను పోషించుకుంటున్నారు. గురువారం తెల్లవారుజామున కొందరు యువకులు తోపుడు బండ్లను ధ్వంసం చేశారు. పండ్లను భద్రపరుచుకునే ట్రేలను ఎత్తుకెళ్లారు. ఇళ్ల ముందు ఉంచిన ద్విచక్రవాహనాల పెట్రోల్ పైపులను కత్తిరించారు. తోపుడు బండ్ల వ్యాపారులు పూసల రామయ్య, అలివేలమ్మ, రామలక్ష్మిలకు చెందిన దుకాణాల్లో సుమారు రూ.18 వేలు విలువ చేసే వస్తువులను దొంగించినట్లు వారు వాపోయారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం మండలం తుంపర్తి కాలనీ వద్ద గురువారం పుట్టపర్తి నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ప్రదీప్, సంపత్, గంగాధర్ గాయపడ్డారు. కారు చెట్టును ఢీకొన్న వెంటనే బెలూన్లు తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఇదే మార్గంలో వెళుతున్న ధర్మవరం పట్టణానికి చెందిన తెదేపా నాయకుడు సంధారాఘవ క్షతగాత్రులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి పంపించారు. కారును ధర్మవరం గ్రామీణ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ చేనేత కార్మికుడి మృతి

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం గాంధీనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరు విక్టరీ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న చేనేత కార్మికుడు ఈశ్వరయ్య (54) గురువారం మృతి చెందాడు. డిసెంబర్ 24న కాలినడకన వెళుతున్న అతన్ని ద్విచక్రవాహనదారుడు ఢీకొన్నాడు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నామని వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ... 10 మందిపై కేసు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని రామ్‌నగర్‌లో గురువారం ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో 10 మందిపై కేసు నమోదు చేశామని టూటౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపారు. చీటీ డబ్బుల విషయంలో నెలకొన్న వివాదం ఘర్షణకు దారి తీసిందన్నారు. ఒక వర్గానికి చెందిన హరీశ్, జ్యోతి, ఆదెమ్మ, యశోదమ్మ, శ్రీదేవి, చంద్రకళపై, మరో వర్గానికి చెందిన లక్ష్మి, మంజునాథ్, ధనమ్మ, రమణమ్మపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

తలుపుల, న్యూస్‌టుడే: నూతనకాలువ పంచాయతీ ఎగువ నిగ్గిడి గ్రామ సమీపంలో కోడిపందెం నిర్వహిస్తున్న 9మందితో పాటు 5 పందెం కోడిపుంజులను పట్టుకొన్నట్లు ఎస్సై చెన్నయ్య తెలిపారు. వారి నుంచి రూ.2,290 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరి కొంతమంది పారిపోయారన్నారు.

వైకాపా నాయకుడి మృతిపై కేసు నమోదు

గోరంట్ల, న్యూస్‌టుడే : మండలంలోని బూదిలి రహదారిలో బుధవారం రాత్రి ద్విచక్రవాహన ప్రమాదంలో వైకాపా నాయకుడు చౌడరెడ్డి మృతి చెందిన సంఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతిపై అనుమానాలు ఉన్నట్లు సోదరుడు ఫిర్యాదులో పేర్కొన్నాడని చెప్పారు.

పునాదిలోనే శిథిలావస్థకు!

చెన్నేకొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గత వైకాపా హయాంలో చేపట్టిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర నిర్మాణం పునాది దశలోనే శిథిలావస్థకు చేరుకుంటోంది. ఆరోగ్య కేంద్ర నిర్మాణం కోసం ఆరేళ్ల క్రితం పునాది వేసి పిల్లర్ల నిర్మాణం కోసం ఇనుప చువ్వలు ఏర్పాటు చేశారు. ఆపై గుత్తేదారు నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆపేశారు. ఐదేళ్ల నుంచి పిల్లర్ల ఇనుప చువ్వలు తుప్పుపడుతున్నాయి. మరో కొన్ని నెలలు ఇలానే వదిలివేస్తే ఇనుప చువ్వలు తుప్పుపట్టి పనికి రాకుండా పోయే ప్రమాదం ఉంది. ఇలా జరిగితే పునాది నిర్మాణం సైతం ఎందుకు పనికి రాకుండా పోతుందని, నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ రాజ్ మండల ఇన్‌ఛార్జి ఏఈ అబ్దుల్ ఖాదర్ దృష్టికి తీసుకుపోగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, వారి ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటానన్నారు. **- న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి**

అమరవీరులను స్మరించుకుందాం

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే : దేశానికి సేవలందించిన అమరవీరులను స్మరించుకోవడం మన అందరి బాధ్యత అని బహుజన్‌సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీరాములు పేర్కొన్నారు. ఆ పార్టీ హిందూపురం నియోజకవర్గ అధ్యక్షుడు మౌలాలీ అధ్యక్షతన స్థానిక అంబేడ్కర్ కూడలిలో గురువారం నిర్వహించిన భీమా కోరేగావ్ విజయదివస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భీమా కోరేగావ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు నరసింహులు, కిష్టప్ప,శ్రీనివాసులు తదితరులు ఇందులో పాల్గొన్నారు.

(c) eenadu

– న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

క్వాంటమ్ కంప్యూటింగ్.. రాష్ట్రంలో ఈ మధ్య ఎక్కువ వినిపిస్తున్న పేరు ఇది. రాజధాని అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నెలకొల్పేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగా అధునాతన సాంకేతికతకు సంబంధించి నిపుణులను సిద్ధం చేసేందుకు కసరత్తు మొదలుపెట్టింది. క్వాంటమ్ టెక్నాలజీ కోర్సులో యువతకు శిక్షణ ఇచ్చేందుకు రిజిస్ట్రేషన్లు చేపట్టగా.. జిల్లా నుంచి 1,200 మందికి పైగా విద్యార్థులు వివరాలు నమోదు చేసుకున్నారు.

క్వాంటమ్.. నేర్చుకుంటాం..!

శిక్షణ పొందుతున్న ట్రిపుల్ ఐటీ విద్యార్థి

అమరావతి క్వాంటమ్ మిషన్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మందికి క్వాంటమ్ టెక్నాలజీపై శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమెరికాకు చెందిన 'క్వైజర్', హైదరాబాద్‌లోని 'క్యూబిటెక్ స్మార్ట్ సొల్యూషన్స్' సంస్థలతో ఇందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా 54 వేల మంది ముందుకొచ్చి.. ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. జిల్లాలోని రెండు ప్రభుత్వ, మూడు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

రెండో విడతలో మరింత లోతుగా..

★ శిక్షణ పూర్తి చేసినవారికి కేకేవీ క్యూబిటెక్ సంస్థ తరఫున ధ్రువపత్రాలు అందజేస్తారు. వాషింగ్టన్‌లోని గూగుల్ క్వాంటమ్ ఏఐ, అయాన్ క్యూ కేంద్రాలను వర్చువల్ విధానంలోనే చూపిస్తారు.

★ తొలి విడతలో శిక్షణ పూర్తి చేసుకున్న వారి ప్రతిభ ఆధారంగా 3 వేలమందిని రెండో విడతకు ఎంపిక చేసి.. సబ్జెక్టుపై మరింత లోతైన శిక్షణ ఇస్తారు. అది 8 వారాలు జరుగుతుంది.

రూ.500..: ప్రతి విద్యార్థి ఆన్‌లైన్‌లో శిక్షణకు రూ.2 వేలు చెల్లించాల్సి ఉండగా.. ప్రభుత్వం రూ.500 మాత్రమే చెల్లించి శిక్షణ పొందే అవకాశం కల్పించింది.

4 వారాలు..: ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పిస్తూ నాలుగు వారాలు శిక్షణ ఇస్తున్నారు.

నేర్పించే అంశాలు: క్వాంటమ్ కంప్యూటింగ్, డీప్ టెక్, ఏఐ, అల్గారిథంలు

★ ఆ తర్వాత వృత్యంతర శిక్షణకు పంపిస్తారు. ఈ ఆన్‌లైన్ శిక్షణ ప్రతి రోజు తరగతులు పూర్తయ్యాక రెండు గంటలపాటు ఉంటుంది. విద్యార్థులు ల్యాప్‌టాప్, మొబైల్ ద్వారా ఎక్కడి నుంచైనా హాజరుకావచ్చు.

★ క్వాంటమ్ రంగంలో వచ్చే ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేందుకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ప్రధానాచార్యుడు ఆడారి సత్యశ్రీనివాసరావు తెలిపారు.

నూతనోత్సాహం

నిమ్మాడలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఇతర అధికారులు

కొత్త ఏడాదిలోకి అడుగు పెట్టిన వేళ అందరిలో ఉత్సాహం ఉరకలెత్తింది. జిల్లావ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. బుధవారం అర్ధరాత్రి యువత కేరింతలు కొడుతూ ఘనస్వాగతం పలికారు. కేకులు కోసి సందడి చేశారు. గురువారం రాజకీయ నాయకుల కార్యాలయాలు కిటకిటలాడాయి. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో జిల్లా అధికారులు, తెదేపా నేతలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

కవిటి బీచ్‌లో సందర్శకుల సందడి

నేటి నుంచి రహదారి భద్రత మాసోత్సవాలు

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా మాసోత్సవాలు నిర్వహించడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ హెచ్.అమరసింహుడు తెలిపారు. శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 3 నుంచి 6 వరకు బస్సుల నిర్వహణ, భద్రత తనిఖీలు, 7, 8 తేదీల్లో కుటుంబ కౌన్సెలింగ్, 20, 21 తేదీల్లో సేఫ్టీ డ్రైవింగ్ భృతిపై అవగాహన కల్పించనున్నారు. 22, 27, 28 తేదీల్లో రహదారి భద్రతపై శిక్షణ కార్యక్రమాలు, 22, 23 తేదీల్లో వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. 24న డ్రైవర్స్ డే, 25, 26 తేదీల్లో రక్తదాన శిబిరాలు, 29, 30 తేదీల్లో రహదారి భద్రత ఆడిట్ నిర్వహించనున్నట్లు వివరించారు. మాసోత్సవాల్లో భాగంగా నెలాఖరున ప్రతిభ కనబరిచిన సిబ్బందిని సత్కరించనున్నట్లు తెలిపారు.

రెండేళ్లు.. 3 వేల కిలోలు!

జిల్లా మీదుగా గంజాయి అక్రమ రవాణా

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా రోజురోజుకూ పెరుగుతోంది. పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా తగ్గేదేలే అన్నట్లుగా దందా సాగుతోంది. అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు, 'సంకల్పం' పేరిట అవగాహన కార్యక్రమాలతో నివారణ చర్యలు తీసుకుంటున్నా మార్పు కనిపించడం లేదు. ఇందుకు గత రెండేళ్లలో జిల్లాలో నమోదైన కేసులే ఉదాహరణ..

★ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండేళ్ల వ్యవధిలోనే 3,108 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 451 మందిని అరెస్టు చేశారు.

గతేడాది నవంబరు 12న ఒడిశా నుంచి జిల్లా మీదుగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను మెళియాపుట్టి వద్ద అరెస్టు చేశారు. వీరి నుంచి 563.92 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

199 మంది అరెస్టు..

ఎక్కువ డబ్బు వస్తుందని ఆశతో కొంత మంది యువత ఈ ఊబిలోకి దిగుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి మరీ గంజాయి తరలిస్తున్నారు. సరిహద్దు ఒడిశాలో కిలో రూ.2 వేల నుంచి రూ.4 వేలకు కొనుగోలు చేస్తున్నారు. దీన్ని ఇతర ప్రాంతాల్లో కిలో రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారు. గతేడాది ఇలా చేస్తున్న 199 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని అరెస్టు చేశారు. హైదరాబాద్, ముంబయి, బెంగళూరుతో పాటు గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు రోడ్డు, రైలు మార్గాల ద్వారా అక్రమంగా రవాణా చేస్తున్నారు. 32 వాహనాలను సీజ్ చేశారు.

దొరికితే తీవ్రమైన శిక్షలు ..

గతేడాది నాలుగు కేసుల్లో ఏడుగురికి పదేళ్లు, మరో ఇద్దరికి నాలుగేళ్ల జైలు శిక్ష విధించారు. జిల్లాలో విక్రయాలు, వినియోగిస్తున్న 43 మంది జిల్లా వాసులను అరెస్టు చేశారు. మరో 16 మంది రిపీట్ అఫెండర్లను గుర్తించారు. వీరిలో 9 మందిపై చట్టపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించారు. రాష్ట్రానికి సంబంధించి ఏడాదిలో 89 మందిని అరెస్టు చేశారు.

జిల్లాలో వివరాలిలా...

సంవత్సరం	కేసులు	పట్టుబడిన గంజాయి (కిలోల్లో)	అరెస్టయినవారు	సీజ్ చేసిన వాహనాలు
2024	52	1,333.91	163	17
2025	137	1774.20	288	32

ఎవరినీ ఉపేక్షించం..

జిల్లాలో గంజాయి అక్రమ రవాణాలో ఎవరినీ ఉపేక్షించేది లేదు. చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయి. సంకల్పం పేరుతో ఏడాది కాలంలో 4,850 అవగాహన సదస్సులు ఏర్పాటు చేశాం. వీటిని విస్తృతంగా నిర్వహిస్తున్నాం. ఎవరైనా గంజాయి విక్రయం, రవాణా, తాగడం చేస్తే పోలీసులకు తెలపండి. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– కె.వి.మహేశ్వరరెడ్డి, ఎస్పీ

పాస్‌పుస్తకాల పంపిణీకి సర్వం సిద్ధం

రెవెన్యూ గ్రామాలు: 652
రైతులు: 2,54,218

కలెక్టరేట్(శ్రీకాకుళం), కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం నుంచి అన్ని మండలాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నారు. కోటబొమ్మాళి మండలం అక్కయ్యవలస గ్రామంలో తొలి రోజు జరిగే ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఆయా నియోజకవర్గాల్లో శాసనసభ్యులు హాజరై పాస్‌పుస్తకాలు రైతులకు అందజేయనున్నారు.

అభ్యంతరాలుంటే తక్షణ పరిష్కారం..

జిల్లావ్యాప్తంగా రైతులకు పాత భూహక్కు పత్రాల స్థానంలో కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వనున్నారు. కొత్తవాటిలో ఎలాంటి రాజకీయ ముద్రలు లేకుండా, కేవలం అధికారిక చిహ్నంతోనే ముద్రించినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వెబ్‌ల్యాండ్ డేటాతో ధ్రువీకరించిన తర్వాతే అర్హులైన పట్టాదారులకు పత్రాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఏమైనా అభ్యంతరాలుంటే వాటిని నమోదు చేసి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులు తమ గ్రామాలకు కేటాయించిన షెడ్యూల్ ప్రకారం నిర్ణీత సభలకు హాజరై పాస్‌పుస్తకాలను తీసుకోవాలని కోరారు.

మునగ.. ఘనంగా..!

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

ఉద్దానం ప్రాంతంలో జీడిమామిడి, కొబ్బరి తోటల్లో అంతర పంటగా మునగ సాగు పెరిగింది. ఇది రైతులు ఆర్థిక ఇబ్బందుల్ని అధిగమించేందుకు ఎంతో దోహదపడుతోంది. ఈసారి కురిసిన అధిక వర్షాలకు దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో పాటు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండటంతో హర్షం వ్యక్తమవుతోంది. కాయలను ఒకప్పుడు కట్టలు లెక్క అమ్మేవారు.. ఇప్పుడు కిలోల చొప్పున విక్రయిస్తుండటంతో లాభాలు పొందుతున్నారు.

★ వజ్రపుకొత్తూరు, పలాస మందస, సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల పరిధిలో సుమారు 15 వేల ఎకరాల్లో మునగ తోటలు విస్తరించాయి. దీనిపై ఆధారపడి సుమారు 30 వేల మంది రైతులు జీవిస్తున్నారు.

చినవంకలో అమ్మకానికి సిద్ధం చేసిన మునగ కాయలు

★ వంటకాలతో పాటు ఔషధాల తయారీలోనూ వీటి వినియోగం పెరగడంతో అధిక ధర లభిస్తోంది.

★ బహిరంగ మార్కెట్‌లో కిలో ధర రూ.130పైగా పలుకుతుండగా.. వ్యాపారులు చెట్టు వద్దనే రూ.120 వరకు కొనుగోలు చేస్తున్నారు.

★ తెలంగాణ, ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో వీటికి మంచి గిరాకీ ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

★ ప్రభుత్వం సాగు విస్తీర్ణం పెంచేలా ప్రత్యేక దృష్టి సారిస్తే మరింత ఆశాజనకంగా ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గ్లాసులు గలగల కాసులు గలగల

36 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

– న్యూస్‌టుడే, పాతశ్రీకాకుళం, నేరవార్తావిభాగం

కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టిన తరుణంలో మందుబాబులు రెచ్చిపోయారు. గడిచిన సంవత్సరంలో చివరి రోజు సందర్భంగా బుధవారం జిల్లాలో ఒక్కరోజే రూ.7.50 కోట్ల విలువైన మద్యాన్ని తాగేశారు. పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ.. కొత్త సంవత్సరానికి స్వాగతం చెబుతూ అర్ధరాత్రి వేళ మద్యం ప్రియులంతా పెద్ద ఎత్తున పార్టీలు చేసుకున్నారు. రిసార్టులు, హోటళ్లు, దాబాలు, ఇళ్లలో తాగుతూ గడిపారు. ప్రభుత్వం కూడా మద్యం దుకాణాలను రాత్రి 12 గంటలకు తెరుచుకునేందుకు ప్రత్యేక అనుమతి ఇవ్వడంతో రాత్రి ఒంటి గంట వరకు సంబరాల్లో మునిగితేలారు.

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 15 మందిపై, తాగి వాహనాలు నడిపిన 36 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. శ్రీకాకుళం, కాశీబుగ్గ, టెక్కలి, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో బుధవారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో రోడ్డు ప్రమాదాలు కట్టడి చేయగలిగామని ఎస్పీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు.

ఒక్కరోజులో రూ.7.50 కోట్లు తాగేశారు

రెండు రోజులు.. రూ.12.52 కోట్లు..

జిల్లాలోని మద్యం దుకాణాల యజమానులు ఈ నెల 30న రూ.7.04 కోట్లు, 31న రూ.5.47 కోట్ల మద్యాన్ని ఎక్సైజ్ డిపో నుంచి తీసుకెళ్లారు. మొత్తంగా రెండు రోజులు కలిపి రూ.12.52 కోట్ల సరకు పంపారు. అందులో రూ.7.50 కోట్ల మేర అమ్మకాలు జరిగాయని అధికారులు, వ్యాపారులు అంచనా వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా గతేడాది కంటే ఈసారి సుమారు రెండు కోట్లకు పైగానే మద్యం డిపో నుంచి దుకాణాలకు వెళ్లింది. మండలాలు, గ్రామీణ ప్రాంతాలలో మంచి వ్యాపారం జరిగినప్పటికీ శ్రీకాకుళం నగరంలో పోలీసు ఆంక్షలకు మద్యం ప్రియులు భయపడి కొంత దూరంగా ఉన్నారని వ్యాపార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

ఆబ్కారీ సర్కిళ్లు: 14 మద్యం దుకాణాలు: 176 బార్‌అండ్ రెస్టారెంట్లు: 9

కమ్మేసిన పొగమంచు

పొగమంచు సిక్కోలును కమ్మేస్తోంది. దానికి తోడు చలి గజగజలాడిస్తుంది. వారం రోజుల నుంచి రాత్రి వేళ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. దట్టంగా మంచు పడుతుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గురువారం ఉదయం 8 గంటలకు కోటబొమ్మాళి మండలంలో జాతీయరహదారిపై పరిస్థితిని చిత్రంలో చూడొచ్చు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

4న శ్రీకూర్మంలో హిందూ సమ్మేళనం

గార(శ్రీకూర్మం), న్యూస్‌టుడే: గార మండల శ్రీకూర్మంలో ఈ నెల 4న హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వహణ సమితి అధ్యక్షుడు బూరగాపు రవికాంత్ గురువారం తెలిపారు. హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైక్యపరిచే దిశగా కార్యక్రమం జరుగుతుందని స్పష్టం చేశారు. శ్రీకూర్మంలో దేవస్థానం పాలకమండలి సభ్యురాలు జి. సంయుక్త చేతుల మీదుగా బుధవారం కరపత్రాన్ని విడుదల చేశారు. అనుపోజు రమణమూర్తి, కె.వి.అప్పలరాజు, బి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బరువు ఎత్తితే.. బంగారమే..!

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో యువకుడి సత్తా

– న్యూస్‌టుడే, పాతబస్టాండ్, గార

కొన్నేళ్ల కిందట ఆరోగ్యం కోసం ఆ యువకుడు మొదలుపెట్టిన వ్యాయామ సాధన.. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో కీర్తిని తెచ్చిపెడుతోంది. గార మండలం కొర్ని గ్రామానికి చెందిన చమళ్ల రాజశేఖరరావు పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటుతున్నాడు. బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేసిన ఈయన పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన యువకుడు జిమ్‌లో చేరిన తర్వాత ఈ క్రీడపై మక్కువ పెంచుకున్నాడు. వెయిట్ లిఫ్టింగ్, ఇది ఒకేలా ఉన్నప్పటికీ కొంచెం తేడా ఉంటుంది. ఇందులో స్క్వాట్, బెంచ్‌ప్రెస్, డెడ్ లిఫ్ట్ అని మూడు అంచెల్లో గరిష్ఠ బరువు ఎత్తాలి. రెండేళ్ల సాధనలోనే రాటుదేలి.. ఎక్కడ పోటీలకు వెళ్లినా బంగారు పతకంతోనే తిరిగొస్తున్నాడు.

సాధించిన విజయాలిలా..

2024లో డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, అమలాపురం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు బంగారు పతకాలు అందుకున్నాడు. ★ గతేడాది గుడివాడ, అమరావతి ప్రాంతాల్లో నిర్వహించిన మరో రెండు స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నాడు. ★ అక్టోబరులో బెంగళూరు, ఆగస్టులో టాటానగర్ జంషెడ్‌పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ అదే ఉత్సాహం కొనసాగించాడు. ★ నవంబరులో భూటాన్‌లో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శనతో పసిడి పతకం సొంతం చేసుకున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి.. ప్రభుత్వ కొలువు అందుకోవడమే తన లక్ష్యమని చెబుతున్నాడీ క్రీడాకారుడు.

అపోహ వీడు.. ఆపద చూడు..!

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం

జుట్టు రాలిపోతుంది.. గాలి ఆడట్లేదు.. క్రాఫ్ చెదిరిపోతుంది.. తలనొప్పి పెడుతుంది.. ఇవి ద్విచక్ర వాహనదారులు చెబుతున్న సమాధానాలు. వాహన తనిఖీల సమయంలో శిరస్త్రాణం ఎందుకు ధరించలేదని పోలీసులు ప్రశ్నిస్తుంటే కొందరు ఇలా బదులిస్తుండటంతో అధికారులే అవాక్కవుతున్నారు. ప్రమాద సమయాల్లో శిరస్త్రాణం లేక ప్రాణాలు పోతున్నా చాలా మంది పట్టించుకోకుండా కుంటి సాకులు చెబుతున్నారు. అవన్నీ అపోహలేనని.. హెల్మెట్ ధరిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని వైద్యులు సూచిస్తున్నారు.

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు అడపాదడపా కేసులు నమోదు చేస్తున్నా వాహనదారుల్లో మార్పు రావట్లేదు. గత సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు నాలుగు నెలలు శిరస్త్రాణం ధరించనివారిపై 5,939 కేసులు నమోదు చేశారు. రూ.33.09 లక్షల జరిమానా విధించారు

ధరిస్తే ప్రయోజనమిది..

రోడ్డు ప్రమాద సమయాల్లో తలకు బలమైన గాయాలు తగలకుండా శిరస్త్రాణం కాపాడుతుంది. కొన్ని ప్రమాదాల్లో బయట గాయం లేకున్నా తలకు దెబ్బ తగిలితే లోపలి భాగంలో గాయాలు ఉంటాయి. పుర్రె గోడలు, మెదడులోని రక్తనాళాలు దెబ్బతిని తీవ్ర రక్తస్రావం, బ్రెయిన్ డెడ్ పరిస్థితులకు దారి తీయొచ్చు. హెల్మెట్ పెట్టుకుంటే తలకు గాయాల తీవ్రత తగ్గుతుంది.

ఇవి గుర్తుంచుకోండి..

★ ప్రభుత్వ ప్రమాణాలు పాటిస్తూ ఐఎస్ఐ మార్క్ ఉన్నవి వాడటం ఉత్తమం.

★ కూల్ ఫైబర్ ఉన్న హెల్మెట్లు, గాలి లోపలికి వెళ్లే వాటిని ఎంచుకుంటే తలకు చెమట పట్టదు.

★ తల సైజుకు సరిపడా హెల్మెట్ కొనుక్కోవాలి.

★ జుట్టు ఆరోగ్యానికి ప్రోటీన్లు, సూక్ష్మపోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలి



★ హెల్మెట్ ధరించినా బెల్ట్ సక్రమంగా పెట్టుకోకపోతే ప్రమాద సమయాల్లో అది ఎగిరి.. తలకు రక్షణ కొరవడే ప్రమాదం ఉంది.

★ చుండ్రు, చర్మ వ్యాధులు ఉంటే వైద్యులను సంప్రదించి చికిత్స చేసుకోవాలి.

ఎలాంటి సమస్య ఉండదు..

హెల్మెట్ ధరిస్తే జుట్టు రాలిపోతుందనేది కేవలం అపోహ మాత్రమే. అలాంటివి నమ్మితే ప్రమాదాన్ని కోరి తెచ్చుకున్నట్లే. ప్రమాదం జరిగి.. తలకు గాయాలైతే అంతర్భాగంలో రక్తనాళాలు చిట్లి రక్తస్రావమయ్యే అవకాశం ఉంటుంది. అలాంటప్పుడు శిరస్త్రాణం మాత్రమే రక్షణగా నిలుస్తుంది. అది ధరించడం వల్ల ఎలాంటి సమస్య ఉండదు. – డాక్టరు చింతాడ వరుణ్, చర్మవ్యాధి నిపుణులు

అసంపూర్తిగా వదిలేశారు..!

కవిటి మండలం కొత్త కొజ్జిరియా జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడేళ్ల కిందట ఆర్ఎంఎస్ఏ ద్వారా పాఠశాలకు అదనపు తరగతి భవనం మంజూరైంది. ఆ మేరకు అప్పట్లో గుత్తేదారు నిర్మాణ పనులు చేపట్టారు. పునాదులు వేసిన తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో భవన నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ప్రస్తుతం ఇలా పనికిరాని మొక్కలు, పొదలు పెరిగిపోతున్నాయి. మరోవైపు వరండాలో తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. ఈ విషయమై ప్రధానోపాధ్యాయుడు పి.చలపతిని వివరణ కోరగా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని, నిధులు రాగానే పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



ఇంతకుముందు గతంలో మినీ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త, సహాయకురాలిగా ఒకరే ఉండేవారు. వారికి నెలకు రూ.7 వేలు వేతనం అందేది. కేంద్రం, దస్త్రాల నిర్వహణ, సేవలందించడంలో ఇబ్బంది పడేవారు.

ఇక నుంచి.. మినీలను మెయిన్‌గా మార్చడంతో రూ.11,500 వేతనం అందుతుంది. అదనంగా ఓ సహాయకురాలిని నియమించుకోవచ్చు. ఆమెకు రూ.7 వేలు వేతనం అందిస్తారు. దీంతో అటు లబ్ధిదారులు.. ఇటు ఉద్యోగులకు మేలు జరగనుంది.

ఆ 369.. ఇక ప్రధాన కేంద్రాలే..!

– న్యూస్‌టుడే, కొత్తూరు, హిరమండలం

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై కూటమి సర్కారు దృష్టి సారించింది. గ్రామాల్లోని పలు మినీ కేంద్రాలను ప్రధాన సెంటర్లుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 445 కేంద్రాలకు సంబంధించి ప్రతిపాదనలు వెళ్లగా.. 369 సెంటర్లను అప్‌గ్రేడ్ చేసింది. ఇప్పటికే ఆయా ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో కార్యకర్తలకు ఎమ్మెల్యేలు పత్రాలు అందజేస్తున్నారు.

కొత్తూరు: ఇరపాడుగూడలోని ప్రధాన కేంద్రంగా మారనున్న మినీ అంగన్‌వాడీ సెంటర్

మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల సంఖ్య, లబ్ధిదారులు, ఇతర వివరాల ఆధారంగా ప్రధాన కేంద్రాలుగా మార్పు చేశారు. ఇక నుంచి అవి రెగ్యులర్ కేంద్రాలుగా పని చేయనున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన మినీ కార్యకర్తల వివరాలను సైతం ఐసీడీఎస్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. ధ్రువపత్రాల తుది పరిశీలన అనంతరం అర్హుల జాబితాను సిద్ధం చేసి.. ఉన్నతాధికారులు ఆయా జిల్లాలకు పంపించారు.

బాధ్యతగా పని చేయాలి..

క్షేత్రస్థాయిలో నెలకొన్న ఇబ్బందుల్ని పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మినీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసింది. ఆయా చోట్ల ఉన్న కార్యకర్తలు మరింత బాధ్యతగా పని చేసి.. మంచి పేరు తీసుకురావాలి.

– ఐ.విమల, ఐసీడీఎస్ పీడీ, శ్రీకాకుళం

జిల్లాలో వివరాలిలా..

★ ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 16 ★ మండలాలు: 30 ★ మినీ కేంద్రాలు: 599 ★ ప్రతిపాదనలు పంపినవి: 445 ★ స్థాయి పెంచినవి: 369

(c) eenadu

కొత్త కలెక్టర్ కార్యాలయ ఆవరణలో చెట్టుకు నీరు పోస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నూతన సంవత్సర సందడి

జిల్లావ్యాప్తంగా గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులను కార్యకర్తలు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధికారులను మర్యాదపూర్వకంగా కలవడానికి వచ్చిన ఉద్యోగులతో కార్యాలయాల్లో సందడి నెలకొంది. కొత్త కలెక్టర్ భవన సముదాయం వద్ద కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మొక్కలను నాటారు. జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘ కాలమానిని, దైనందినిలను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేకు కోసి న్యాయమూర్తులకు, న్యాయసేవల సిబ్బందికి, న్యాయవాదులకు అందజేశారు. 1,3, 4 అదనపు జిల్లా న్యాయమూర్తులు పి.భాస్కరరావు, సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, ఎస్.ఎం.ఫణికుమార్, సీనియర్ సివిల్ జడ్జిలు ఎం.శ్రీధర్, ఆర్.శాంతిశ్రీ, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.హరిబాబు, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేజేఎం బేగం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు, ఉపాధ్యక్షుడు ఇప్పిలి సీతరాజు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం), పాతబస్టాండ్

ఏపీసీపీఎస్ఈఏ కాలమానిని ఆవిష్కరిస్తున్న ఖజానా శాఖ డీడీ రవికుమార్, సంఘ నాయకులు

అటు వెళ్తే కేసులు.. ఇటు ఇక్కట్లు

ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులు జాతీయ రహదారిపై ప్రయాణిస్తే చర్యలు చేపడుతుండటంతో విధిగా సర్వీసు రోడ్లపై నుంచి వెళ్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. రెండు రోజులుగా కొత్తపేట-టెక్కలి మార్గంలో సర్వీసురోడ్డులో వాహనాల రద్దీ కొనసాగుతోంది. ఓ మందుల దుకాణం ముందు వివిధ ప్రాంతాలకు చెందిన వైద్యుల వాహనాలు నిలిపేస్తుండటంతో ఇబ్బందులు నెలకొంటున్నాయి. ఈ వ్యవహారంపై కచ్చితమైన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాస్, ఎస్సై సత్యనారాయణ స్పష్టం చేశారు.

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

హిందీ పరీక్షల్లో ప్రతిభావంతుల జాబితా విడుదల

జాబితా విడుదల చేస్తున్న విశ్రాంత డీఈవో బలివాద మల్లేశ్వరరావు, హిందీ మంచ్ ప్రతినిధులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: హిందీ సేవా సదన్ ఆధ్వర్యంలో గత నెల 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన పాఠశాల స్థాయి హిందీ ప్రతిభ పరీక్షల్లో జిల్లా స్థాయికి ఎంపికైన వారి వివరాలను విశ్రాంత డీఈవో బలివాద మల్లేశ్వరరావు గురువారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హిందీ భాషపై అభిరుచి పెంచేందుకు ప్రతిభా పరీక్ష నిర్వహించడం అభినందనీయమన్నారు. హిందీ మంచ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోనే శ్రీధర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో 2,300 మంది పైగా విద్యార్థులు పాఠశాల స్థాయి ప్రతిభా పోటీలకు హాజరయ్యారు. వారిలో 150 మంది ప్రతిభావంతులుగా నిలిచారన్నారు. ఈ నెల 25న జిల్లా స్థాయి పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. హిందీ పండితులు ఆర్.రామారావు, బి.మంజుల, కె.సత్యం, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు హై సెక్యూరిటీ కావాలా..?

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

వాహనాల భద్రత కోసం కేంద్ర రవాణాశాఖ హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లు అందిస్తోంది. వాహనాల చోరీలు, నకిలీ నంబరు ప్లేట్లతో వాహనాలు నడుపుతున్న వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ విధానాన్ని తీసుకొచ్చి అమలు తప్పనిసరి చేసింది. ఇది కేవలం వాహనాల భద్రతే కాదు.. నేరాలను నియంత్రించేందుకు ఉపయోగ పడుతోంది. 2019 ఏప్రిల్ ఒకటో తేదీకి ముందు రిజిస్ట్రేషన్ చేసిన వాహనాలకు కూడా హై సెక్యూరిటీ నంబర్లు తప్పనిసరి అని కేంద్రం నిర్దేశించింది. దీంతో రవాణాశాఖాధికారులు ప్రత్యేక కార్యక్రమాలతో వాహన యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. 15 ఏళ్ల లోపు రిజిస్ట్రేషన్ చేసిన ద్విచక్ర, నాలుగు చక్రాలు, ఇతరత్రా వాహనాలకు వెబ్‌సైట్ ద్వారా ఈ తరహా నంబరు ప్లేట్లు పొందేలా అవకాశం కల్పించారు.

★ 15 రోజుల తర్వాత ఎంపిక చేసిన షోరూంకు వెళితే, హై సెక్యూరిటీ నంబరు ప్లేట్‌ను వాహనానికి అమరుస్తారు. నిర్ణీత సమయంలో కొత్త ప్లేట్లను అమర్చకపోతే వాహన తనిఖీల్లో రూ.500 నుంచి రూ.5 వేల వరకూ జరిమానా చెల్లించాల్సి ఉంటుందని ఎంవీఐ గోవిందరాజులు స్పష్టం చేశారు.

నమోదు ఇలా...

★ వెబ్‌సైట్‌లో బుక్ హెచ్ఎస్ఆర్‌పీ అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అనంతరం పేరు, ఈ-మెయిల్ ఐడీ, రాష్ట్రం పేరు, వాహన రిజిస్ట్రేషన్ నంబరు, చరవాణి నంబరు, జిల్లా వివరాలను నమోదు చేసి, సబ్‌మిట్ చేయాలి. అలాగే వాహనం నంబరు, చాసిస్ సంఖ్య చేయాలి. ★ వాహన కంపెనీలను అనుసరించి నంబరు ప్లేట్ల కోసం ద్విచక్రవాహనాలకు రూ.320 నుంచి రూ.500 వరకూ వసూలు చేస్తారు. నాలుగు చక్రాల వాహనాలకు రూ.600 నుంచి రూ.3వేల వరకు రుసుము ఉంటుంది. వీటిలో కావల్సినవి ఎంపిక చేసుకుని, ఓటీపీ ద్వారా ఆన్‌లైన్‌లోనే డబ్బులు చెల్లించాలి.

ప్రత్యేకతలివే..

★ **లేజర్ ఐడీ:** ప్రతి ప్లేట్‌పై యూనిక్ లేజర్ ఐడీ ఉంటుంది. ★ **క్రోమియం హోలోగ్రామ్:** నకిలీగా మార్చలేని విధంగా దీనిని రూపొందించారు. ★ **ఐఎన్‌డీ, బ్లూబ్యాండ్:** దేశవ్యాప్తంగా ఏకరూపత.

★ **ట్రాకింగ్‌కు అనుకూలం:** నేర విచారణలో వాహన నంబరు ప్లేట్‌ను స్కాన్ చేయడం ద్వారా పోలీసులకు పూర్తి సమాచారం లభిస్తుంది. ★ **నాన్-రిమూవబుల్ స్నాప్‌లాక్:** ఒకసారి అమర్చితే ఇక తొలగించడం సాధ్యం కాదని రవాణాశాఖాధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో వాహనాలు : 5,00,797 ద్విచక్ర : 4,28,472 కార్లు : 28,545

వన్యప్రాణుల భయం.. సాగుకు దూరం!

న్యూస్‌టుడే, సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం గ్రామీణం

తూర్పు కనుమలకు సమీపంలోని అటవీ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో వన్యప్రాణుల బెడదతో సాగు విస్తీర్ణం క్రమేపీ తగ్గుతోంది. వాటి వసతి, ఆహారానికి ఇబ్బందులు ఏర్పడుతుండటంతో జనావాసాలు, వ్యవసాయ భూముల వైపు వస్తున్నాయి. కొండలపై చెట్లు నరికివేయడమే సమస్యకు ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు.

★ కంచిలి, సోంపేట మండలాల పరిధి అటవీ ప్రాంతంలో 5 వేల ఎకరాల మేర రబీ సాగుకు రైతులు దూరమయ్యారు. తూర్పు కనుములకు దగ్గరగా ఉండటంతో కోతులు, అడవి పందులు, ఇతర వన్యప్రాణులు స్వైరవిహారం చేస్తున్నాయి. పంటను కాపాడలేక విసిగిపోయి పొలాలను ఖాళీగా ఉంచుతున్నారు. ఎంకీపురం, సువాగ, సుంకిలి, బుసాభద్ర, రేజావేపుట్టుగ, భైరిపురం, అర్జునాపురం తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది.

★ మందస, పలాస మండలాల పరిధిలో 7 వేల ఎకరాలకు పైగా వ్యవసాయం చేయలేని దుస్థితి. అడవి పందులు, కోతుల బెడదతో 20 పంచాయతీల పరిధిలో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఖరీఫ్‌లో వరి పంటను వన్యప్రాణులు ధ్వంసం చేశాయి. తాళ్ల గురంటి, భోగాపురం, చీకటి, పెద్దకస్ర, పొత్తంగి, సిరిపురం, కృష్ణాపురం, సాబకోట, మూలిపాడు తదితర ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించాయి.

ఇదీ పరిస్థితి

★ వరి, చెరకు, అరటి, మొక్కజొన్న పొలాలు, జీడి, మామిడి తోటల పైన అడవి పందులు, జింకలు, ఎలుగుబంట్లు వన్యప్రాణులు వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ★ అటవీ ప్రాంతంలో నీటి వనరులు తగ్గడంతో కూరగాయలు, ఇతర పంటల్ని నాశనం చేస్తున్నాయి.

ఇచ్ఛాపురం మండలం బిర్లంగిలో అడవి పందులు స్వైరవిహారంతో దెబ్బతిన్న వరి పైరు

శాస్త్రవేత్తల సూచనలు

★ వన్యప్రాణుల నుంచి పంటల్ని కాపాడుకోవడానికి అటవీ, సరిహద్దు ప్రాంతాల్లో బఫర్ జోన్లు ఏర్పాటు చేయాలి. ★ రైతులకు రాయితీపై సౌర ఫెన్సింగ్ ఏర్పాటుకు అవకాశమివ్వాలి.

★ అడవుల నుంచి అటవీ ప్రాంత సరిహద్దుల వరకు బయోఫెన్సింగ్‌కు చర్యలు తీసుకోవాలి.

★ వన్యప్రాణుల ఆహారానికి అవసరమైన పండ్ల తోటల పెంపకం, నీటి వనరులు ఏర్పాటు చేయాలి.

★ అటవీ సరిహద్దు ప్రాంతాల్లో వెదురు, అగావే, కానుగ, జట్రోఫా తదితర ముళ్ల జాతి మొక్కల్ని పెంచాలి.

★ సిట్రోనెల్ల జాతి మొక్కల్ని పెంచితే వన్యప్రాణులు మైదానాల వైపు రావు.

రక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తే మేలు

పండ్ల తోటలు పెంచుతాం..

ఉపాధి హామీ పథకంలో భాగంగా అటవీ సరిహద్దు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాం. గతంలో రూ.40 లక్షలు మంజూరయ్యాయి. సకాలంలో బిల్లులు అందక నీరు పోయడం, కంచె ఏర్పాట్లు తదితర పనుల విషయమై వేతనదారులు శ్రద్ధ చూపక మొక్కలు పూర్తి స్థాయిలో పెరగలేదు. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో వన్యప్రాణులకు అవసరమైన పండ్ల తోటల పెంపకానికి చర్యలు తీసుకుంటాం.

– మురళీకృష్ణం నాయుడు, అటవీ రేంజ్ అధికారి, కాశీబుగ్గ

ప్రత్యామ్నాయ పంటల సాగుతో సత్ఫలితాలు

ప్రత్యామ్నాయ పంటల సాగుతో వన్యప్రాణులతో కలిగే ఇబ్బందులను అధిగమించొచ్చు. రబీలో అడవి పందుల బెడదతో కొంతమేర సమస్యలున్నాయి. పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం, నియోజకవర్గాల్లోని అటవీ సరిహద్దు ప్రాంతాల్లో అడవి పందుల్ని ఆకర్షించని పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

-త్రినాథస్వామి, జేడీ, వ్యవసాయ శాఖ

పరదాలు మూలకు.. పంటలు ఎలా భద్రం?

మొంథా తుపాను సమయంలో వరి పంటను కాపాడుకోవడానికి ప్రభుత్వం టార్పాలిన్లు సమకూర్చింది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఒక్కోటి రూ.590 చొప్పున విక్రయించాలని అధికారులు నిర్ణయించారు. జి.సిగడాం మండలంలో 20 గ్రామాలకు సంబంధించి అందజేసిన 7,536 పరదాలు తహసీల్దారు కార్యాలయంలో భద్రపరిచారు. వాటిలో సుమారు 200 విక్రయించారు. మిగిలినవన్నీ మూలకు చేరాయి. వాటిని అన్నదాతలకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు సరితను 'న్యూస్‌టుడే' సంప్రదించగా అధికారులతో సమీక్షించి రైతులకు అందజేస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, జి.సిగడాం

నా భర్త ఆచూకీ తెలపండి..!

మాట్లాడుతున్న అప్పన్న భార్య చంద్రకళ

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: తన భర్త కింజరాపు అప్పన్న కనిపించడం లేదని గురువారం రాత్రి కోటబొమ్మాళి మండలం నిమ్మాడ గ్రామానికి చెందిన చంద్రకళ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వద్ద మొర పెట్టుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో రాజకీయ వేధింపుల కారణంగా ఏడాదిన్నర నుంచి నిమ్మాడ విడిచిపెట్టి రౌర్కెలాలో సోదరుని ఇంటి వద్ద ఉంటున్నారు. గత నెల 27న మెళియాపుట్టి మండలం కొసమాల వచ్చిన తన భర్తను 29న మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులు పోలీసుల పేరిట వచ్చి వెంట తీసుకెళ్లారు. ఆ సమయంలో విశాఖ వెళ్లిన తాను తిరిగి వస్తుండగా భర్తకు ఫోన్ చేస్తే స్విచాఫ్ అని వచ్చిందని తెలిపారు. అప్పటి నుంచి ఆచూకీ లభ్యం కాలేదని పేర్కొన్నారు. గత నెల 29న రాత్రి మెళియాపుట్టి పోలీసుల వద్దకు వెళ్లినా కేసు నమోదు చేయకుండా తాత్సారం చేశారని ఆక్షేపించారు. 31న ఉదయం పోలీసుస్టేషన్‌కు వెళ్లగా కానిస్టేబుల్ చందు తీసుకెళ్లినట్లు గ్రామస్థులు చెబుతున్నారని తెలిపారు. మెళియాపుట్టిలో ఆ పేరుతో కానిస్టేబుల్ ఎవరూ లేరని.. ఎస్పీని కలవాలని సిబ్బంది సూచించారని వివరించారు. ఈమేరకు ఎస్పీని కలిసి వినతిప్రతం అందజేశానని స్పష్టం చేశారు.

యువకుడి దుర్మరణం

హరిపురం (మందస), న్యూస్‌టుడే: మందస మండలం కొర్రాయిగేటు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వాహనం ఢీకొని చెన్నైకు చెందిన మింటుకుమార్ సాహు (25) మృతి చెందినట్లు మందస ఎస్సై కె.కృష్ణప్రసాద్ తెలిపారు. చెన్నై నుంచి సాహు, అతని స్నేహితుడు సోనో కుమార్ మండల్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై ఝార్ఖండ్ వెళ్తుండగా మార్గమధ్యలో ప్రమాదానికి చోటుచేసుకుంది. ఇందులో సాహు మరణించగా.. గాయాలపాలైన మండల్ హరిపురం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

గంజాయి కేసులో ఆరుగురి అరెస్టు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: గంజాయి అక్రమ రవాణా కేసులో శ్రీకాకుళం నగరానికి చెందిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు గ్రామీణ పోలీసు స్టేషన్ సీఐ పైడపునాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కార్యాలయం సమీపంలోని అపార్ట్‌మెంట్ల వెనుక భాగంలో గంజాయి అక్రమ రవాణా జరుగుతోందని వచ్చిన సమాచారం మేరకు ఎస్సై ఎం.హరికృష్ణ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన భానుగురి చంద్రశేఖర్, కిల్లంశెట్టి నిఖిల్, పొన్నాడ కిశోర్, కుందు గోపాల్, కొన్న రాందేవ్, దండి వేణులను అదుపులోకి తీసుకుని వివరాలు ఆరా తీశారు. ఒడిశా నుంచి గంజాయి తెచ్చి చిన్న పొట్లాలు తయారు చేసి విక్రయిస్తున్నట్లు తేలింది. వారిని అరెస్టు చేసి 2.4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో కారాగారానికి తరలించారు.

రాళ్లు తేలి.. దుమ్ము రేగి

హిరమండలంలోని గులమూరు, నివగాం రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లతో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఇటీవల శంకుస్థాపన చేశారు. రోడ్డును తవ్వి వెట్‌మిక్స్, మెటల్ రోడ్డుపై వేసి ఒక విడత రోలింగ్ చేశారు. పనులు నెమ్మదిగా సాగుతుండటం, సరిపడేంత నీరుతడి లేకపోవడంతో రాళ్లు తేలి ధూళితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నాణ్యతపై ప్రభావం చూపుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏఈ గోపాలరావు మాట్లాడుతూ పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, హిరమండలం

కొమ్మ కొమ్మకు శాఖోయి..

చిత్రంలో కనిపిస్తున్న బొప్పాయి చెట్టు.. వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరులోని ఓ ఇంటి పెరటిలో పెరుగుతోంది. బొప్పాయి చెట్టు సాధారణంగా ఒకే కాండంతో పెరుగుతుంది. ఈ చెట్టు మొదలు నుంచి చివరి వరకు పలు కొమ్మలతో దర్శనమిస్తోంది. అంతే కాదు.. కొమ్మలకు కూడా శాఖలు వస్తూ భారీ ఎత్తున ఎదుగుతోంది. కొమ్మ కొమ్మకే కాకుండా వాటి నుంచి పుట్టిన చిన్న శాఖలకు సైతం నిండుగా కాయలు కాస్తుండటం విశేషం. ఆ చెట్టును చూసిన వారంతా ఔరా! అంటూ విచిత్రంగా చూస్తున్నారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

రోడ్డే విశ్రాంతి భవనం

మండల కేంద్రమైన ఎల్ఎన్‌పేటలో విశ్రాంతి భవనం లేక ప్రయాణికులు రహదారిపైనే పడిగాపులు కాస్తున్నారు. గతంలో ఉన్న భవనాన్ని రహదారి విస్తరణలో కూల్చేయడంతో పదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు.

మండల కేంద్రానికి సుమారు 30 గ్రామాల ప్రజలు బస్సుల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా సంబంధిత శాఖతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

EENADU e Classifieds

BUSINESS SERVICES | REAL ESTATE

BUSINESS OFFER

ప్రీమియం ఒగోబాముప్పు సాకి (బెన్నిన్) ముడి జీడిపప్పు (RCN) అత్యుత్తమ నాణ్యత, సరసమైన ధర, నేరుగా సరఫరా. బిజినెస్ వీసా, వసతి సౌకర్యాలు మేము ఏర్పాటు చేస్తాం. సంప్ర॥ 7893732377.

PLOT FOR SALE

విజయనగరంనుండి వైజాగ్ వెళ్ళు NH-26కు ప్రక్కన రాయపూర్ హైవేకు దగ్గర్లో ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళు 80Ft రోడ్‌కు ఆనుకొని VMRDA & RERA అనుమతులు కల్గిన లేఅవుట్‌లో 24గం॥ సెక్యూరిటీతో అన్నిసౌకర్యాలు కలిగిన ఇండ్లస్థలములు డైరెక్ట్ కంపెనీదరకు అమ్మబడును. ఈ ఆఫర్ సేల్స్ సంక్రాంతి వరకు మాత్రమే. 8919807419.

FINANCIAL SERVICES

Easy Loans.. Easy Cash.. మీకు అవసరమైన అన్ని రకముల లోన్స్ ఇప్పించబడును. సంతోషిమాత లోన్స్ కన్సల్టింగ్ సర్వీసెస్. చిన్నబజార్ రోడ్డు, శ్రీకాకుళం ✆ 9063568887.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

10, 11 తేదీల్లో పౌర హక్కుల సంఘం మహాసభలు

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న నాయకులు

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుపతిలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న పౌర హక్కుల సంఘం 20వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు పలాస మండలం బొడ్డపాడులో ప్రజాసంఘాల నాయకులతో కలిసి గురువారం గోడప్రతులు, కరపత్రాలు ఆవిష్కరించారు. పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తిరి దానేష్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వంకల మాధవరావు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు, పీవోడబ్ల్యూ నాయకులు పోతనపల్లి కుసుమ పాల్గొన్నారు.

డీఐజీతో ఎస్పీ భేటీ

ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా ఉద్యోగోన్నతి పొందిన విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టిని ఆయన కార్యాలయంలో గురువారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ రేంజ్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, గంజాయి అక్రమ రవాణా అరికట్టడానికి ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నట్లు తెలిపారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తా విభాగం

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

విశ్వేశ్వరరావు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారుడు పి.విశ్వేశ్వరరావు ఎంపికయ్యాడు. నొయిడాలో ఈ నెల 4 నుంచి నిర్వహించనున్న 9వ ఎలైట్ మెన్ బాక్సింగ్ పోటీలకు హాజరు కానున్నాడు. ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా అతన్ని కోచ్ ఉమామహేశ్వరరావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి మహేశ్‌బాబు, బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బీఏ లక్ష్మణ్‌దేవ్, సీనియర్ బాక్సర్ రాజీవ్ అభినందించారు.

వాలీబాల్‌లో..

సత్యం

రణస్థలం, న్యూస్‌టుడే: రణస్థలం మండలంలోని చిన కొవ్వాడకు చెందిన మైలపల్లి సత్యం జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్న రాష్ట్ర జట్టులో ఎంపికయ్యాడు. త్వరలో కశ్మీర్‌లు వెళ్లనున్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న సత్యం శాయ్ అకాడమీ బెంగళూరులో రెండేళ్లుగా ప్రభుత్వం తరపున శిక్షణ పొందుతున్నాడు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	165	285	305

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

మందసలో నేడు గిరిజన దర్బారు

మందస: సీతంపేట ఐటీడీఏ పీవో స్వప్నిల్ జగన్నాథ్ నేతృత్వంలో మందసలో శుక్రవారం గిరిజన దర్బారు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వై.వెంకటరమణ తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో గిరిజనులు వారి సమస్యలను పేర్కొంటూ వినతులు సమర్పించాలని కోరారు.

విద్యార్థుల భవితతో ప్రయోగం

27 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరికరాలు, ద్రావణాలు

కళాశాలల్లో అవసరమైన వసతులు కరవు

న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం), పొందూరు, సరుబుజ్జిలి

విద్యార్థుల భవిష్యత్తును మలుపు తిప్పేది ఇంటర్ విద్య. అధిక మార్కులు సాధించాలంటే ప్రయోగ పరీక్షలు ఎంతో కీలకం. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి జూనియర్ కళాశాలల్లో ప్రయోగ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకేషనల్ విభాగానికి ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు, ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు వచ్చే నెల 1 నుంచి 10 వరకు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. పరీక్షలు జరిగే కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

వెంటాడుతున్న సమస్యలు

❖ జిల్లాలోని 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలు ఉండగా.. చాలా వరకు ప్రయోగశాలల్లో సరైన వసతులు లేవు.

❖ 25 కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినులు సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పంపుతుండటంతో ఇబ్బంది పడుతున్నారు.

❖ చాలాచోట్ల కొన్ని రోజుల ముందు ప్రయోగశాలల్లో బూజులు దులిపి పరీక్షలకు సిద్ధం చేస్తుంటారనే విమర్శలు ఉన్నాయి.

❖ కోర్ సబ్జెక్టుల్లో మంచి మార్కులొచ్చినా ప్రాక్టికల్స్‌లో తగ్గుతున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

❖ ఎంపీసీలో 60, బైపీసీలో 120 మార్కులు సాధించే అవకాశం ఉండటంతో తగిన జాగ్రత్తలు తీసుకుంటే మేలని అధ్యాపకులు అభిప్రాయపడుతున్నారు.

❖ ఇంటర్ బోర్డు అధికారులు స్పందించి ప్రయోగశాలల్లో అవసరమైన వసతులు ఉండేలా పర్యవేక్షించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం ..

ఇంటర్ ప్రయోగ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణ చేస్తున్నాం. ఇప్పటికే ప్రిన్సిపాళ్లకు సూచనలు చేశాం. ప్రయోగ పరీక్షల కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించాం. – రేగ సురేష్‌కుమార్, జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి, శ్రీకాకుళం

జిల్లాలో ప్రయోగ పరీక్షల కేంద్రాలు	హాజరవుతున్న విద్యార్థులు	ఎంపీసీ	బైపీసీ	ఒకేషనల్ విభాగంలో కేంద్రాలు	ప్రథమ సంవత్సరం విద్యార్థులు	ద్వితీయ సంవత్సరం
119	15,432	10,626	4,806	25	1,439	1,114

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

బెందాళం అశోక్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జనసేన బాధ్యుడు దాసరి రాజు

పలాసలో గజమాలతో ఎమ్మెల్యే గౌతు శిరీషను సత్కరిస్తున్న తెదేపా నాయకుడు నరేంద్రబాబు

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు 2025 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. 2026కు స్వాగతం పలికారు. ప్రతి ఇంటి ముందు రంగవల్లులు వెల్లివిరిశాయి. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఎమ్మెల్యే గౌతు శిరీష, మాజీ మంత్రులు గౌతు శివాజీ, సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జడ్పీ అధ్యక్షురాలు విజయ, జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త దాసరి రాజులకు ఆయా పార్టీల కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, ఉన్నతాధికారులకు క్షేత్రస్థాయి సిబ్బంది పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. – న్యూస్‌టుడే, బృందం

మాజీ మంత్రి అప్పలరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు.

బల్లిపుట్టుగలో జడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ, సాయిరాజ్‌లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైకాపా నాయకులు

హ్యాపీ న్యూ ఇయర్ ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

బ్రహ్మపుర జట్టు విజయం

మకరాంపురంలో శ్రీవృక్ష, ఫిజిక్స్‌వాలా విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీ-20 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం బ్రహ్మపుర (లీడ్స్ అకాడమీ), కంచిలి జట్ల మధ్య మ్యాచ్ జరగగా.. కంచిలి జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్రహ్మపుర జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేయగా.. కంచిలి జట్టు 7 వికెట్ల నష్టానికి 154 పరుగులే చేయగలిగింది. 17 పరుగుల తేడాతో విజయం సాధించిన బ్రహ్మపుర జట్టుకు చెందిన తపస్‌కు ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

పనులు ముమ్మరం

స్పందనకు వందనం

వజ్రపుకొత్తూరు మండలం లింగాలపాడులో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం శిథిలమవ్వడంతో దానిని కూల్చేశారు. కొత్త భవన నిర్మాణంలో జాప్యం జరుగుతూ వచ్చింది. దీనిపై ఈనాడులో పలుమార్లు ప్రచురితమైన కథనాలకు ఎట్టకేలకు అధికారులు స్పందించారు. సమగ్ర శిక్షా నిధులు రూ.24 లక్షలతో పనులు ముమ్మరం చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి విద్యార్థులకు భవనాన్ని అందిస్తామని ఎస్ఎస్ఏ ఏఈ ఎం.బెనర్జి అన్నారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

నిధుల మంజూరు.. వైద్య సేవలు షురూ..

అసంపూర్తిగా నిలిచిన ఆరోగ్య కేంద్రాలకు మోక్షం

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్య సేవలు అందించేందుకు అనువుగా ఉండే ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా వైకాపా హయాంలో నిర్మాణాలు చేపట్టి వివిధ కారణాలతో నిలిచిపోయిన కేంద్రాలను విడతలవారీగా పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేసింది.

మకరాంపురంలో సగంలో నిలిచిన ఆరోగ్యకేంద్రం

ఇదీ పరిస్థితి...

గత వైకాపా ప్రభుత్వం ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కంచిలి, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో 67 ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా వెల్‌నెస్ కేంద్రాల పేరిట గ్రామ సచివాలయాల పరిధిలో వీటి నిర్మాణాలు చేపట్టారు. గత ప్రభుత్వ అనాలోచిత విధానాలతో వీటి నిర్మాణాలు పూర్తికాలేదు. తాజాగా ఈ అంశంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించి కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడంతో కేంద్రం ఇటీవల నిధులు విడుదల చేసింది. ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు దూరంగా ఉన్న గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలను మొదటి విడతలో పూర్తిచేయడానికి ప్రాధాన్యమిచ్చింది.

నియోజకవర్గ వివరాలు

మండలం	ఆరోగ్య కేంద్రాలు	నిధులు మంజూరైనవి	విడుదలైన నిధులు (రూ.కోట్లలో)
ఇచ్ఛాపురం	14	10	1.97
సోంపేట	17	10	1.00
కంచిలి	18	05	0.75
కవిటి	18	04	0.75

మార్చిలోగా పూర్తిచేస్తాం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మంజూరైన ఆరోగ్య కేంద్రాలను త్వరితగతిన పూర్తిచేసి మార్చి నెలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– ప్రవీణ్, రమేష్, హిమసాగర్ ఏఈఈ, పంచాయతీరాజ్ శాఖ, కంచిలి, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 8008574279 9063144707

? ఇచ్ఛాపురం పట్టణం కస్పావీధికి వెళ్లే రోడ్డు ఇబ్బందికరంగా ఉంది. పూర్తిస్థాయిలో రహదారితోపాటు కాలువ నిర్మించాలి. **– బి.రామానందం, ఇచ్ఛాపురం** ★ సమస్యను పరిష్కరిస్తాం. **– ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం** – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

? జాడుపూడి కాలనీ నుంచి గొల్లపుట్టుగ వెళ్లే రోడ్డు నిర్మాణం సగంలో నిలిచిపోయింది. **– బి.జగన్, గొల్లపుట్టుగ** ★ ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే రహదారి నిర్మాణం చేపడతాం. **– ప్రవీణ్, పీఆర్ ఏఈ, కంచిలి** – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

? పలాస మండలం కొత్తవూరులోని కొత్తవీధిలో కాలువలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. **– స్థానికులు** ★ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. **– సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, తర్లాకోట** – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

? పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి వివేకానంద మార్గ్‌కు వెళ్లే రహదారిలో దీపాలు వెలగడం లేదు. **– కె.వెంకట సూర్యగుప్తా, కాశీబుగ్గ** ★ సిబ్బందిని పంపించి మరమ్మతులు చేసి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **-కిరణ్, ఏఈ, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం** – న్యూస్‌టుడే, పలాస

? రెయ్యిపాడు పంచాయతీలో జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేసి నీరందించకుండా వదిలేశారు. **– సరస్వతి, రెయ్యిపాడు** ★ సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం. **– మోహిని, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

ఇదేం దుస్థితి..

పలాస మండలం వీరభద్రాపురంలోని పెద్ద వీధిలో పూర్తి స్థాయి కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. వీధిలో కొంతమేర కాలువ ఉన్నా అది నిరుపయోగంగా ఉందని, పూర్తిస్థాయిలో నిర్మిస్తే ఉపయోగం ఉంటుందని పేర్కొంటున్నారు. ఇదే విషయాన్ని పంచాయతీ కార్యదర్శి రేవతీపతి వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

రోడ్డుపై మురుగు కనరా..

నడుమూరు జిల్లా పరిషత్తు ఉన్నతపాఠశాల రహదారిపై మురుగు ప్రవహిస్తుండడంతో విద్యార్థులతోపాటు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన బోరుబావి వద్ద వాడుకనీరు వెళ్లేందుకు మార్గం ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపసర్పంచి బల్లి మాధవరావును వివరణ కోరగా పరిశీలించి కార్యదర్శితో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

నీరు నింపండి.. గొంతు తడపండి

జాడుపూడి శివాలయం వద్ద పశువుల దాహార్తిని తీర్చేందుకు రూ.42 వేల వ్యయంతో నిర్మించిన పశువుల నీటి తొట్టె నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా దీన్ని వినియోగంలోకి తీసుకొచ్చి పశువులతోపాటు వివిధ జాతులకు చెందిన పక్షుల గొంతును తడిపేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి ఈశ్వర్ వద్ద ప్రస్తావించగా సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

రాకపోకలకు అవస్థ

ఇచ్ఛాపురం పట్టణం షరాబువీధి ఎత్తుగా మారడం, దీనికి అనుసంధానంగా ఉన్న పాత జాతీయ రహదారి పల్లపు ప్రాంతంగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రోడ్డును మూడు దశలుగా వేయడం, వేర్వేరు రూపాల్లో ఉండటం, కాలువ కూడా లేకపోవడంతో రోడ్డుపైనే మురుగు ప్రవహిస్తోంది. సమస్యను పుర కమిషనర్ రమేష్ వద్ద ప్రస్తావించగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ముళ్ల పొదలు తొలగించరూ..

ఎం.తోటూరు నుంచి మండపల్లి వెళ్లే రహదారిలో ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పొదలతోపాటు [illegible] డితే అక్కడ గుంతలు ఏర్పడటంతో ప్రమాదాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీపురం, బుడ్డెపుపేట తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మధును వివరణ కోరగా సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

చేపల చెరువుల లీజు పునరుద్ధరణ

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పట్టణంలోని ఐదు చేపల చెరువుల లీజు పునరుద్ధరణతో స్వదేశీ మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా వీరికి ఇబ్బంది పెట్టిన కొందరు పాలకుల తీరుతో వీరు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థాన తీర్పు మేరకు కౌన్సిల్ ఆమోదం తెలపడంతో ప్రభుత్వ విప్ డా.బెందాళం అశోక్‌ను గురువారం సత్కరించారు. ఇచ్ఛాపురంలోని స్వదేశీ మత్స్యకార సహకార సంఘం (ఇన్‌ల్యాండ్ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ) కొన్నేళ్లుగా పురపాలక సంఘం నుంచి లీజుకు తీసుకుని నిర్వహించుకుంటున్నారు. సొసైటీ సభ్యులు వీటిలో చేపపిల్లలు పెంచి, విక్రయిస్తూ ఆదాయం పొందేవారు. వీరిలో అత్యధికులు తెదేపా అభిమానులు కావడంతో లీజు పునరుద్ధరణ జరిపేందుకు ఇబ్బంది పెట్టారని కౌన్సిలర్ నారాయణ బెహరా, ఇతర సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి, అనుకూలంగా తీర్పు పొందడంతో న్యాయం దక్కిందని, అందుకు అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గుంతలు పూడ్చారు..

ఇచ్ఛాపురంలో ఎర్రన్నాయుడు కూడలి నుంచి బజారు కూడలి వరకు రోడ్డు ధ్వంసమైంది. గుంతలమయం కావడంతో వాహనదారుల ఇబ్బందులపై 'ఈనాడు'లో పలు కథనాలు వెలువడ్డాయి. తాజాగా హోంమంత్రి రాక నేపథ్యంలో గురువారం గుంతలు పూడ్చారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించండి

ప్రథమ చికిత్స సామగ్రి అందిస్తున్న డిపో మేనేజర్ ఎస్.ఎస్.నాయుడు

పలాస, న్యూస్‌టుడే: ప్రమాదాలు జరగకుండా వాహనాలను జాగ్రత్తగా నడపాలని పలాస ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.ఎస్.నాయుడు అన్నారు. పలాస డిపో ఆవరణలో మిస్టర్ డెంటిస్ట్ ఇంటర్నేషనల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం రాత్రి 120 ప్రథమ చికిత్స పెట్టెలను వైద్యాధికారి మెట్ట లక్ష్మీనారాయణ అందించగా డిపో మేనేజర్ డ్రైవర్లు, కండక్టర్లకు అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ కరుణశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిట్ ఇండియా సాధనే లక్ష్యం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఫిట్ ఇండియా సాధనే లక్ష్యంగా జేసీఐ సభ్యులు కృషి చేస్తున్నారని జేసీఐ ఇచ్ఛాపురం అధ్యక్షుడు బోయిన శ్రావణ్ అన్నారు. ఇచ్ఛాపురం రాజావారి మైదానంలో విశ్రాంత సైనికాధికారి దక్కత సుమన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వ్యాయామసాధన కేంద్రంలో గురువారం కసరత్తు చేశారు. కొత్త సంవత్సరంలో ఓ లక్ష్యంతో ముందుకు సాగేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆర్గనైజేషన్ సభ్యులు కాళ్ల జైదేవ్, వెచ్చా రాము, రాజ్‌కమల్, షణ్ముఖరావు, స్వరూప్ కుమార్, నరేష్, అనిత్‌చౌదరి తెలిపారు. 30 రోజులపాటు దీన్ని నిర్వహిస్తామన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి మండలం తొత్తిడిపుట్టుగ గ్రామానికి చెందిన పొడియ జమున కుటుంబానికి మాతృమూర్తి యువజన సంఘం ఆర్థిక సాయం అందజేశారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం బాధిత కుటుంబానికి నగదుతోపాటు కుసుంపురం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ బత్తిని గోపాలరావు సమకూర్చిన నిత్యావసర సరకులు అందించారు. సంఘ సభ్యులు మోహన్, చలపతి, ప్రదీప్, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

జయప్రదం చేయాలని పిలుపు

పలాస, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగులంతా రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని పలాస ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.ఎస్.నాయుడు పిలుపునిచ్చారు. పలాస డిపో ఆవరణలో శుక్రవారం ప్రారంభమయ్యే అవగాహన సదస్సులో పాల్గొనాలని కోరారు.

పాఠశాల గదులు మరమ్మతులు చేయాలి

పరిశీలిస్తున్న అధికారులు

గొల్లగండి ప్రాథమికోన్నత పాఠశాల తరగతి గదుల మరమ్మతులు చేపట్టాలని మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు జి.చిన్నరాజారావు, తెదేపా నాయకుడు ఆర్.బాబూరావు కోరారు. తరగతి గదుల్లో వేసిన పలకలు పాడవ్వడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు విప్ ఆదేశాల మేరకు సమగ్రశిక్షా అధికారులు గురువారం పరిశీలించారు. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించామని ఇంజినీరింగ్ సహాయకుడు బెనర్జీ నాయకులకు తెలిపారు. – న్యూస్‌టుడే, సోంపేట

బాబాకు ప్రత్యేక పూజలు

మకరాంపురం సాయిబాబా ఆలయంలో ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ధర్మకర్త రమణస్వామి ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భజన సంకీర్తనలతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్ల ఆవిష్కరణ

ఆపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) ఒడియా టీచర్స్ అసోసియేషన్(అపోటా) 2026 క్యాలెండర్, దైనందిని గురువారం ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో, ఎమ్మెల్సీ నర్తు రామారావు స్వగృహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజంలో అక్షర జ్యోతులు నింపేది ఉపాధ్యాయులేనన్నారు. ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కీలు సోమేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు వెంకటరమణ, ఎ.నాగేశ్వరరావు, అనిల్, సత్యానందం, ఇచ్ఛాపురం, కవిటి మండలాల అధ్యక్షుడు బండారం శంకరం, భగవాన్, కార్యదర్శి శరత్, సభ్యులు ప్రసాద్, రాఘవేంద్ర, అపోటా ఉత్తరాంధ్ర ఒడియా డీఐ దుర్గా ప్రసాద్ చౌదరి, రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథ పాడి, కార్యదర్శి బృందావన్ దొళాయి, ఒడియా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన

చిన్న నీలావతిలో గురువారం పోలీసులు మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. నారీశక్తి, సైబర్ నేరాలు, సంకల్పం, మహిళలపై నేరాలు, బాల్య వివాహాలు మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. అందరూ శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఎస్సై నరసింహమూర్తి పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

జనజీవనంలో భాగం కాలమానిని

శాంతినికేతన్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఒడియా ఉపాధ్యాయుల సంఘం (అపోటా) నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఒడియా మైనారిటీల సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ పాఢి, జిల్లా ఒడియా డీఐ దుర్గాప్రసాద్ చౌదరి పాల్గొని అపోటా రూపొందించిన జేబు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర సంఘ కార్యదర్శి బృందావన్ దొలాయి, మాజీ అధ్యక్షుడు రఘునాథగౌడో తదితరులు పాల్గొన్నారు. శాంతినికేతన్ పాఠశాలలో సంస్థ క్యాలెండర్‌ను డి.కృష్ణమూర్తిరెడ్డి, ఇందిరారెడ్డి, కేసీ పూరి, ఉపాధ్యాయులు ఆవిష్కరించి, విద్యార్థులకు పంపిణీ చేశారు.

ఏపీటీఎఫ్ సేవలు చిరస్మరణీయం

మండల విద్యావనరుల కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ కాలమానిని ఆవిష్కరిస్తున్న ఎంఈవో ధనంజయ

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఏపీటీఎఫ్ సేవలు చిరస్మరణీయమని మండల విద్యాశాఖాధికారి ధనంజయ మజ్జి అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఏపీటీఎఫ్(1938) సంఘం 2026 సంవత్సర కాలమానిని విద్యాశాఖ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజబాబు, మండలాధ్యక్షుడు బల్ల ధర్మారావు, గౌరవాధ్యక్షుడు రంగారావు, మొర్రి గోపి, విశ్రాంత ఉపాధ్యాయులు ఎం.డిల్లీశ్వరరావు, ఉపాధ్యాయులు రామచంద్రరావు, జయరాం, రఘునాథ్ పాణిగ్రాహి, జగన్నాథ దొళాయి, సాయిరాజ్, చంద్రశేఖర్, నల్ల సుజాత పాల్గొన్నారు.

గణిత అవధానంతో విశేష సేవలు

ఒకే పేజీలో రెండు విధాలుగా అందరికీ అర్థమయ్యే రీతిలో ప్రముఖ గణిత అవధాని మద్దు తిరుపతిరావు తయారు చేసిన 2026 క్యాలెండర్‌ను ప్రముఖ వైద్యుడు రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. గురువారం సోంపేటలో జరిగిన కార్యక్రమంలో తిరుపతిరావు ప్రతిభను కొనియాడారు. గణిత అవధానంతో గ్రామీణ విద్యార్థులకు ఆయన విశేష సేవలందిస్తున్నారని అభినందించారు. – న్యూస్‌టుడే, సోంపేట

ఇరుకు.. ఆపై రోడ్డు ధ్వంసం

ఇచ్ఛాపురం పట్టణం గొల్లవీధి నుంచి ఫకీరుపేటకు వెళ్లే మార్గం ఇరుకుగా ఉండగా, అక్కడ కల్వర్టుపై కొంత భాగం దెబ్బతింది. ఆపై రోడ్డు కూడా శిథిలం కావడంతో విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు. చాలా కాలంగా అభివృద్ధి జరగకపోవడంతో సమస్యలు వేధిస్తున్నాయని స్థానికులు తెలిపారు. రోడ్డును పూర్తిచేయాలని కోరుతున్నారు. పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలు చేస్తామని పుర కమిషనర్ రమేష్ తెలిపారు.

–న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

వ్యక్తికి గాయాలు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస మండలం రామకృష్ణాపురానికి చెందిన సాయి గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో గాయాలపాలయ్యారు. ద్విచక్ర వాహనంపై కాశీబుగ్గ నుంచి రామకృష్ణాపురం వైపు వెళ్తుండగా జాతీయ రహదారిపై బోల్తా పడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు.

జిల్లా గీత కార్మిక సొసైటీ అధ్యక్షుడి మృతి

నరసన్నపేట: జిల్లా కల్లుగీత కార్మిక సొసైటీ అధ్యక్షుడు గన్నయ్య (75) గురువారం మృతి చెందారు. నాలుగు దశాబ్దాలుగా సొసైటీకి శాశ్వత అధ్యక్షుడిగా ఉన్నారు.

నేటి నుంచి పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, పలాస బృందం

కలెక్టరు ఆదేశాల మేరకు జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయనున్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో పాత భూహక్కు పత్రాలు (బీహెచ్‌పీస్)స్థానంలో పట్టాదారు పాసు పుస్తకాలు (పీపీఎస్)ను అందిస్తారు. 4వ తేదీ(ఆదివారం) మినహా మిగిలిన రోజుల్లో పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని రెవెన్యూ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి వీటిని అందజేస్తారు. ఈకేవైసీ పూర్తయిన పాత పాసుపుస్తకం అందిస్తే, అది తీసుకుని కొత్తది ఇస్తామని, తహసీల్దార్లు తెలిపారు. తేదీల వారీగా పంపిణీ చేసే రెవెన్యూ గ్రామాల వివరాలను కింద పట్టికలో చూడొచ్చు.

మండలం	2వ తేది	3	5	6	7	8	9
ఇచ్ఛాపురం	ముచ్చింద్ర, కేదారిపురం	అరకబద్ర, శాసనం, టి.బరంపురం	బొడ్డబడ, బొడ్డకాళి	తేలుకుంచి, హరిపురం	ఈదుపురం, పూర్ణాటకం	మండపల్లి, మునిబద్ర, మశాకపురం	లొద్దపుట్టి, ధర్మపురం
సోంపేట	బుషాభద్ర, జింకిభద్ర, జె.పొత్తంగి	తురకశాసనాం, అనంతపురం	రాణిగాం, రాజాం, ఉప్పలాం	పొత్రఖండ, జగతికేశుపురం	కొర్లాం, పద్మనాభపురం, విక్రాంపురం, సుంకిడి	బారువ, గొల్లగండి	పలాసపురం, లక్కవరం, సోంపేట-2
కవిటి	భైరిపురం, ప్రగడపుట్టుగ	రఘునాథపురం	వింధ్యగిరి, చండీపుట్టుగ	కొజ్జిరియా	కుసుంపురం, వరక	మాణిక్యపురం, బల్లిపుట్టుగ	
కంచిలి	అంపురం, పద్మతుల పెద్దకొజ్జిరియా, చిన్న కొజ్జరియా	ఆరవ సరియాపల్లి, గుండాం, కర్తలి, అమరావతి, వీరనారాయణపురం	బోగాబెని, మహల్పడ, పురుషోత్తపురం, ఎస్ఆర్‌సీ పురం, వీరరామచంద్రపురం	భిన్నళ, భిన్నళ కొత్తూరు, బెల్లుపడ, జనార్దనపురం,	తిమ్మాలాంజి, డెప్పిపడ, దాలేశ్వరం రాగుపురం, మఠంసరియాపల్లి, పుడాపద్ర	అమ్మవారిపుట్టుగ, కొక్కిలిపుట్టుగ, తలతంపర	కత్తివరం, జాడిపూడి
పలాస	గురుదాసుపురం, మామిడిమెట్టు రంగోయి, కంట్రగాడ, కొటియా, అల్లుఖోల	సున్నాడ, శాసనాం, జగన్నాథపురం, సవర రామకృష్ణాపురం పెదంచల, మరదరాజపురం	సవర గోవిందపురం, పొత్రియా, రఘునాథపురం, సొగిడియా, కేసుపురం, పెద్దనారాయణపురం	మహాదేవీపురం కైజోల, పూర్ణభద్ర అమలకుడియా	వీరరామచంద్రాపురం, గోదావరిపురం లక్ష్మీపురం, గరుడఖండి పాత జగదేవిపురం	ఈదురాపల్లి, గంగువాడ, కేదారపురం, సరియాపల్లి, గోపాలపురం,	గోపీవల్లభాపురం, తోటవూరు, మోదుగులపుట్టి పండా శాసనాం,
మందస	రాధాకృష్ణపురం, పుచ్ఛపాడు, బాలాజీపురం, గోవిందపురం	కొత్తపల్లి, బాలిగాం, వీరభద్ర, ముకుందాపురం	రంగనాథపురం, లింబుగాం, బహాడపల్లి, లక్ష్మీపురం	సరియాపల్లి, అల్లిమెరక, దున్నూరు,	మందస, ఉమాగిరి డిమిరియా, జిల్లుండ	కుంటికోట, పాతకమలాపురం, అచ్చుతాపురం, మధ్య	కొండలోగాం, ఛత్రపురం, టుబ్బూరు
వజ్రపుకొత్తూరు	తర్లాగడూరు, మెట్టూరు బైపల్లి	పల్లిసారథి, తడివాడ కిడిసింగి	నువ్వలరేవు(లక్ష్మీదేవి పేట) పెద్దబడాం	తెరపల్లి యూఎన్‌పల్లి	యు.కూర్మానాథపురం బట్టుపాడు, తోటపల్లి	గునాలపాడు, లింగలపాడు యు.రాయపాడు	డబ్బాలపాడు, సూర్యమణిపురం, చీపురుపల్లి

(c) eenadu

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

ఏ క్షణాన కూలుతుందో

నందిగాం మండలం నుంచి పెంటూరు, నరేంద్రపురం, నారాయణపురం, పాతినవానిపేట, కణితివూరు గ్రామాల మీదుగా వజ్రపుకొత్తూరు మండలం పూండి వరకు వెళ్లే రహదారిలో కణితివూరు సమీపంలో వంశధార ప్రధాన ఎడమ కాలువపై 1986లో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఏ క్షణాన కూలుతుందోనని ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. నూతన వంతెన నిర్మించాలని కోరారు. నిధులు మంజూరైతే నిర్మిస్తామని వంశధార శాఖ ఈఈ శేఖరరావు పేర్కొన్నారు - న్యూస్‌టుడే, నందిగాం

తీర్మానించారు... బడిని బాగుచేశారు

తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే పాఠశాలను అభివృద్ధి చేయాలన్న సంకల్పం జలుమూరు మండలం టెక్కలిపాడు పంచాయతీ గొల్లపేటకి చెందిన విద్యార్థుల తల్లిదండ్రుల్లో కలిగింది. ఇటీవల జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో వారు ఒక తీర్మానం చేసుకున్నారు. తోచినంత ఆర్థిక సహాయాన్ని అందించి పాఠశాలకు రంగులు దిద్దడంతో పాటు, చిన్నచిన్న మరమ్మతులు కూడా చేయించినట్లు ప్రధానోపాధ్యాయురాలు జి.మాధవి తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సహకరించినందుకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. –న్యూస్‌టుడే, జలుమూరు

సందడిగా నూతన సంవత్సర వేడుకలు

పోలాకి: మండల పరిషత్ ఉద్యోగులతో ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి

పాతపట్నం: తెదేపా కార్యాలయంలో కేకు కోస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా గురువారం నూతన సంవత్సర వేడుకలు సందడిగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ, తెదేపా, వైకాపా, భాజపా, జనసేన, పార్టీ కార్యాలయాల్లో నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు కేకులు కోశారు. నియోజకవర్గాల నలుమూలల నుంచి అభిమానులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. పాఠశాల, కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే బృందం

వైకాపా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైకాపా నాయకులు

నిమ్మాడలో కేంద్ర, రాష్ట్రమంత్రులకు శుభాకాంక్షలు తెలియజేయడానికి బారులుతీరిన అభిమానులు

కొత్తూరు: మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణతో తెదేపా నాయకులు, అభిమానులు

శిక్షణ ముగిసింది..

ఉపాధిపై ఆశ పెరిగింది

బుడితి కార్మికుల్లో నూతనోత్తేజం

– న్యూస్‌టుడే, సారవకోట

బుడితి గ్రామానికి చెందిన కంచు, ఇత్తడి కార్మికుల్లో నూతనుత్తేజం ప్రారంభమైంది. వీరిలో నైపుణ్యాన్ని పెంచి, మరిన్ని రకాల నగిషీ, డిజైన్ వస్తువులు తయారు చేయించాలనే ఆలోచనతో లేపాక్షి అధికారులు 4 నెలల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన అద్దాల రామకృష్ణ, సూర్యకళ దంపతులతోపాటు, కింతాడ బుజ్జిని మాస్టర్‌ను శిక్షకులుగా నియమించి 30 మంది కార్మికులకు శిక్షణనిచ్చారు. ఛత్తీస్‌గఢ్ చెందిన డిజైనర్ రాజేంద్ర పోయమ్ చేత కూడా మెలకువలు నేర్పించారు.

శిక్షణ పొందుతున్న కంచు, ఇత్తడి కార్మికులు

కార్మికులు తయారు చేసిన కొన్ని డిజైన్ వస్తువులు

★ బిందెలు, చెంబులు, పేట్లు, దీపపు కుందులు తయారికే పరిమితమైన వీరు ఇక నుంచి గృహాలంకార వస్తువులైన గోడగడియారాలు, ఫ్లవర్‌వేజ్‌లు, బియ్యపు బుట్టలు వంటి డిజైన్ వస్తువులు కూడా తయారు చేయగలరనే విశ్వాసాన్ని పెంపొందించారు. దీంతో బుడితి కంచు, ఇత్తడి పరిశ్రమకు పూర్వవైభవం వస్తుందన్న ఆశాభావాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

యంత్రాలిస్తే మరింత ఊతం..

లేపాక్షిలో డిమాండ్ ఉన్న వస్తువుల తయారీపై కార్మికులకు శిక్షణ ఇచ్చాం. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన రాజేంద్ర పోయమ్ నుంచి చాలా వస్తువుల తయారీలో మెలకువలు నేర్పించాం. మా శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతర్జాలం ద్వారా డిజైన్లు తెలుసుకోవడానికి కంప్యూటర్లు, ప్రింటర్ల వంటి యంత్రాలు మాకు అందజేస్తే మరింత మేలు జరుగుతుంది. తద్వారా కార్మికుల ఆదాయం పెరిగి, బుడితికి పూర్వ వైభవం వస్తుంది.

– అద్దాల రామకృష్ణ, మాస్టర్ శిక్షకుడు, బుడితి

శిక్షణతో అవలీలగా...

ఏన్నో ఏళ్లుగా ఇత్తడి, కంచుతో వస్తువులు తయారు చేస్తున్నాం. శిక్షణ తీసుకున్న తరవాత డిజైన్ వస్తువుల తయారీతో పాటు కటింగ్, మౌల్డింగ్, డ్రాయింగ్‌పై పట్టుసాధించడం, ఆలయాలు, ఫ్లవర్‌వేజ్‌లు, మకరతోరణాలు, బియ్యం బుట్టలు వంటివి అవలీలగా తయారు చేయగలననే నమ్మకం మాలో పెరిగింది. – వెలిచర్ల సాయికిరణ్, రమణమూర్తి, శిక్షణ పొందిన కార్మికులు, బుడితి

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు.వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ప్రశ్న: నందిగాం మండలం బోరుభద్ర పంచాయతీ కామధేనువు గ్రామంలో 18 వీధి దీపాలకు గాను 11 దీపాలు నిత్యం వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్తు వృథా అవుతోందని, దీపాలు మరమ్మతులకు గురవుతున్నాయి. **కూర్మారావు, స్థానికుడు**

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **డి.లావణ్య, పంచాయతీ కార్యదర్శి, బోరుభద్ర** – న్యూస్‌టుడే, నందిగాం

విశ్రాంత ఉద్యోగికి సత్కారం

పోలాకి, న్యూస్‌టుడే: పీహెచ్‌సీలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన కె.నాగులను గురువారం ఆసుపత్రి వైద్యాధికారి శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెండో వైద్యాధికారిణి సుమప్రియ, హోమియో వైద్యాధికారి రజనీకాంత్, విస్తరణాధికారి రవికుమార్ ఆయన సేవలను కొనియాడారు.

వసతిగృహం నిరుపయోగం..

మండల కేంద్రమైన కొత్తూరులోని శ్రీకాకుళం రోడ్డులో ఉన్న ఎస్సీ బాలుర వసతిగృహం నిరుపయోగంగా మారింది. ఏబీ రహదారికి ఆనుకుని ఉన్న విలువైన స్థలంలో దీన్ని నిర్మించారు. ఇక్కడ కాలువలు లేకపోవడంతో మురుగు నీరు గదుల్లోకి వచ్చేస్తోందని మూడు నెలల కిందట వసతిగృహాన్ని మూసివేశారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బీసీ బాలుర వసతిగృహంలోకి ఇక్కడి బాలురను తరలించేశారు. ఈ విషయాన్ని వార్డెన్ ఉమామహేశ్వరరావు వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారులకు నివేదించామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

తాగునీరు పట్టుకునేదెలా..?

గులుమూరు గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయం సమీపంలో ప్రధాన వీధిలో బోరు బావి వద్ద అపరిశుభ్రత తాండవిస్తోంది. సీసీ కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లో వాడుక నీరు బయటకు వచ్చి నిలుస్తోందని స్థానికులు వాపోతున్నారు. తాగునీటిని పట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. డిప్యూటీ ఎంపీడీవో గోవిందరావు మాట్లాడుతూ పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, హిరమండలం

శుభ్రం చేసి ఏడాది..

పోలాకి మండల పరిధిలోని చీడివలస గ్రామంలో ఉన్న 60 వేల లీటర్ల నీటిని నిల్వ చేసే ట్యాంకు శుభ్రం చేసి ఏడాది దాటినా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామంలో ప్రజలు జ్వరాలు బారి పడి ఆసుపత్రులకు పరుగులు తీసినా ప్రజల బాధలు పట్టడం లేదు. ఈదువలస కూడలిలో ఉన్న వనితమండలం నీటి పథకం నుంచి ఈ గ్రామానికి నీరు సరఫరా కావాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శుభ్రమైన తాగునీరు వచ్చేలా చూడాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి నారాయణరావు మాట్లాడుతూ సచివాలయం వద్ద ఉన్న సంపును క్లీనింగ్ చేయించాం. ఓహెచ్‌ను కూడా చేయిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, పోలాకి

వాలింది..ప్రమాదకరంగా మారింది..

జాతీయరహదారిపై కోటబొమ్మాళి- చిన్నబమ్మిడి మార్గంలో పెద్దబమ్మిడి ఎదురుగా భారీ విద్యుత్తు స్తంభం వాలుతూ ప్రమాదకరంగా కనిపిస్తోంది. విద్యుత్తు తీగలు సైతం స్తంభంతో పాటు రహదారివైపు వాలుతున్నట్లు ఉండటంతో తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. 11 కేవీలైన్‌లో ఉన్న సమస్యను గుర్తించామని యంత్రాలతో సరిచేస్తామని ఏఈ కోటేశ్వరరావు స్పష్టంచేశారు.

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

దుర్వాసనతో చిన్నారుల అవస్థ

కోటబొమ్మాళి మండలం సుభద్రాపురంలో ప్రాథమిక పాఠశాల ప్రహరీ పక్కన, అంగన్‌వాడీ కేంద్రం- 1కు సమీపంలో కాలువ వద్ద మురుగు వెళ్లే దారి మూసుకుపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో చిన్నారులు అవస్థలు ఎదుర్కొంటున్నారని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేపడతామని పంచాయతీ కార్యదర్శి పి.ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. –న్యూస్‌టుడే, నందిగాం

భళా... చిన్నారుల నాట్యకళ

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

ఇటీవల కాలంలో అన్ని ప్రాంతాల్లో చిన్నారులు, మహిళలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చక్కటి కోలాటాలు, శాస్త్రీయ నృత్యప్రదర్శనలతో విశేషంగా ఆకట్టుకుంటున్నారు. రోజురోజుకూ వీటిని నేర్చుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇందులో భాగంగానే ప్రాథమిక, ఉన్నత విద్య దశలోనే కూచిపూడి శాస్త్రీయ నృత్యం అభ్యసించేందుకు చిన్నారులు ఆశక్తి చూపుతున్నారు. మూడేళ్లలో జాతీయస్థాయి ప్రదర్శనల్లో పాల్గొని విశేష గుర్తింపును సొంతం చేసుకున్నారు.

నేర్చుకోవాలనే తపన

కొత్తపేటకు చెందిన మాసాబత్తుల ఉష కూచిపూడి నృత్య కళాకారిణిగా విశేష ప్రతిభను చాటి అనేక అవార్డులను సాధించారు. గత కొన్నాళ్లుగా అనేకమంది చిన్నారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కొత్తపేట శివకేశవ ఆలయంలో రోజూ సాయంత్రం శిక్షణనిస్తూ ఎలాగైనా ఇవి నేర్చుకోవాలనే తపన కలిగించేలా ఆమె చేసిన కృషి ఫలించింది. దీంతో పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రదర్శనలు చేశారు. చిన్నతనంలోనే వీరు చేస్తున్న అభినయాలకు తల్లిదండ్రులతో పాటు ప్రేక్షకులను ఆశ్చర్యచకితులయ్యారు. ఇది వీరికి రెట్టింపు ఉత్సాహానిచ్చింది.

విజయవాడలో తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన చిన్నారులు

తల్లిదండ్రుల ప్రోత్సాహం..

ఇంతటి ఘనత సాధించిన చిన్నారులకు వారి తల్లిదండ్రుల నుంచి లభించిన ప్రోత్సాహమే కారణం. కొత్తపేట, మాసాహెబ్‌పేట గ్రామాలకు చెందిన 5వ తరగతి బాలికలు పెద్దిని జోషిక, సిరిగిరి సాయిసంజనలు ఉన్నారు. బాలికల తండ్రులు ఢిల్లేశ్వరరావు, మన్మథరావులు మెకానిక్ ఆపరేటర్లగా వృత్తి నిర్వర్తిస్తున్నారు. వీరితో పాటు రేష్మ, రమ్య, యశస్విని, సాయివైష్ణవి, రోషిని, పూజిత, జోషిత, ప్రవస్థి బాలికలు ప్రదర్శనలిచ్చేవారిలో ఉన్నారు.

జాతీయస్థాయి అవకాశం..

నృత్యప్రదర్శనతో తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

విజయవాడలో అభినయ ఆరాధన- 2025 జాతీయస్థాయి నృత్య ప్రదర్శనలకు వీరికి అవకాశం లభించింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ల సౌజన్యంతో గతనెల 14న జరిగిన శాస్త్రీయనృత్య ప్రదర్శనల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చారు. ఈనేపథ్యంలో ఈ బృందం తెలుగు బుక్ ఆఫ్ రికార్డులకెక్కడంతో పాటు నాట్యమంజరి అవార్డు, జ్ఞాపిక, మెడల్, ధ్రువపత్రాలను సాధించారు. మరోవైపు గురువు ఉషకు అభినయ నాట్యాచార్య బిరుదుతో సత్కరించారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఉద్యమిస్తాం

పీఆర్టీయూ కాలమానిని ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు, సంఘ నాయకులు

కొత్తూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సెలర్ వి.ప్రసాదరావు, జిల్లా నాయకుడు పప్పల నారాయణరావు, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రుషిదాస్, చంద్రకాంత్ అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో పీఆర్టీయూ కాలమానిని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎంఈవోలు కె.గోవిందరావు, ఎన్.శ్రీనివాసరావు, పీఆర్టీయూ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరణ

పోలాకి, న్యూస్‌టుడే: నరసాపురం గ్రామం సమీపంలో విశ్వశాంతి పాఠశాలలో కాలమానిని కరస్పాండెంట్ మెట్ట జనార్దన్‌రావు ఆవిష్కరించారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి తల్లిదండ్రులు హాజరయ్యారు.

సేవా దృక్పథం అలవరుచుకోండి

మాట్లాడుతున్న జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ వనజ

నరసన్నపేట, న్యూస్‌టుడే: విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలని జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ వనజ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1,2 ఆధ్వర్యంలో గొట్టిపల్లి, యాతపేటలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్‌తో అటు గ్రామీణ ప్రాంతాల పర్యటనలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవా దృక్పథం అలవడుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శాంతిహేమ్, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు ఢిల్లేశ్వరరావు, నాగరాజు, రవికుమార్ పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

నందిగాం మండలం కర్లపూడి - నౌగాం గ్రామాల మధ్యలోని బీటీ రహదారి పక్కన నౌగాం సమీపంలో ఉన్న ఓ విద్యుత్తు స్తంభానికి ముళ్లతీగలు అల్లుకున్నాయి. దీంతో ఫీజులు కాలిపోయి 2 గ్రామాలకు విద్యుత్తు సరఫరా లేకుండా పోతోందని, తక్షణం ముళ్ల తీగలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్తు శాఖ జేఈ నేతాజీ పేర్కొన్నారు.
– న్యూస్‌టుడే, నందిగాం

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస మండలం రామకృష్ణాపురానికి చెందిన సాయి గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో గాయాలు పాలయ్యారు. ద్విచక్ర వాహనంపై కాశీబుగ్గ నుంచి రామకృష్ణాపురం వైపు వెళ్తుండగా జాతీయ రహదారిపై బోల్తా పడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు.

చర్మ వ్యాధి కుక్కలతో బెంబేలు

నరసన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో వ్యాధుల బారిన పడిన కుక్కలు రూపుమారి భయానకంగా సంచరిస్తున్నాయి. శరీరం ఆకృతి మొత్తంగా మారి తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. దీనిపై ఉర్లాం సహాయ పశువైద్యుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ చలికాలంలో కుక్కలు చర్మ వ్యాధుల బారిన పడి రూపుమారుతున్నాయని, పంచాయతీలు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.
– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణ

అలరించిన పౌరాణిక కళాకారుల పోటీలు

రణస్థలం, న్యూస్‌టుడే : రణస్థలం మండలంలోని కోష్టలో మణికంఠ కళాకారుల పరిషత్, పిసిని లక్ష్మణరావులు గురువారం పౌరాణిక కళాకారుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పోటీలు కొనసాగాయి. 30 మంది కళాకారులు పాల్గొని ప్రతిభ చూపారు.

విజయవంతానికి పిలుపు

పలాస: ఆర్టీసీ ఉద్యోగులంతా రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పలాస ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.ఎస్.నాయుడు పిలుపునిచ్చారు. డిపో ఆవరణలో శుక్రవారం ప్రారంభమయ్యే అవగాహన సదస్సులో పాల్గొనాలని కోరారు.

జిల్లా గీత కార్మిక సొసైటీ అధ్యక్షుడి మృతి

టెంక గన్నయ్య (పాతచిత్రం)

నరసన్నపేట, న్యూస్‌టుడే: జిల్లా కల్లుగీత కార్మిక సొసైటీ అధ్యక్షులు టెంక గన్నయ్య (75) గురువారం మృతి చెందారు. గత నాలుగు దశాబ్దాలుగా జిల్లా కల్లుగీత సొసైటీకి శాశ్వత అధ్యక్షుడిగా ఉన్న ఆయన ఇటీవల అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య జనార్దనమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. గన్నయ్య మృతి పట్ల వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, శ్రీశయన సంఘ నియోజకవర్గ బాధ్యుడు టీవీ చంద్రమోహన్‌దేవ్ సంతాపం తెలిపారు.

రబీ సాగుపై అన్నదాతల ఆసక్తి

నీటివనరులు సమృద్ధిగా ఉండటంతో జోరుగా వ్యవసాయ పనులు

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

నియోజకవర్గంలో రైతులు రబీ వరి సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించేందుకు మెరుగైన సదుపాయాలు కల్పించడంతో పాటు ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లోగా పైకం చెల్లిస్తుండటంతో రైతులు రబీ సాగుపై ఆశలు పెంచుకుంటున్నారు. ఖరీఫ్ కంటే రబీలో చీడపీడల తాకిడి తక్కువగా ఉండటంతో నియోజకవర్గ పరిధిలో సుమారు 2500 హెక్టార్ల వరకు వరిపంట సాగు చేపడుతున్నారు. పంటమార్పిడి చేయాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నా సాగునీరు సమృద్ధిగా ఉండటంతో రైతులు మొగ్గుచూపుతున్నారు.

★ నరసన్నపేట మండలంలో ఉర్లాం, బడ్డవానిపేట, చింతువానిపేట, బాలసీమ, నడగాం, కొల్లవానిపేట, గొనపపేట, లుకులాం తదితర గ్రామాల్లో బోర్ల కింద సాగు చేసేందుకు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. దీంతో పాటు కొన్ని గ్రామాల్లోఊడ్పులు కూడా చేస్తున్నారు.

తోటాడ వద్ద ఊడ్పులు చేసేందుకు నారు తీస్తున్న కూలీలు

★ జలుమూరు మండలంలో పెద్దదూగాం, జలుమూరు, పాగోడు, బొడ్డపాడు, కరవంజ, బసివాడ, గుగ్గిలి తదితర గ్రామాలతో పాటు సారవకోట మండలంలో సారవకోట, జగ్గయ్యపేట, కొత్తూరు, చీడిపూడి, అవలంగి, లక్ష్మీపురం, గొర్రిబంద, గోపాలపురం తదితర గ్రామాల్లో చెరువులు, కాలువలు ఆధారంగా రబీ వరి సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

నరసన్నపేట నియోజకవర్గ వివరాలు

మండలం	వరి (హెక్టార్లలో)
నరసన్నపేట	708
పోలాకి	430
జలుమూరు	650
సారవకోట	767

అవగాహన కల్పిస్తున్నాం..

బోర్లు, చెరువులు, కాలువల ద్వారా సాగునీరు అందుబాటులో ఉండటంతో రైతులు రబీ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పంట మార్పిడి సేద్యం చేస్తే భూసారం పెరిగి అధిక దిగుబడులు వచ్చి రైతులకు మేలు చేకూరుతుంది. ఇందుకు అనుగుణంగానే ఆరుతడి, వాణిజ్య పంటల సాగుపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నాం. –ఎల్.వి.మధు, వ్యవసాయశాఖ సహాయసంచాలకులు



శ్రీకాకుళం నగరంలో సంక్షేమ, విద్య ఉద్యోగుల సంఘం కాలమానిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు

ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న తెదేపా కార్యకర్తలు, అభిమానులు

శ్రీకాకుళం

●శ్రీకాకుళం ●ఆమదాలవలస ●ఎచ్చెర్ల

మేలుకొలుపుతో ఆధ్యాత్మిక శోభ

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: ధనుర్మాసం సందర్భంగా గ్రామాల్లో తెల్లవారుజామున నిర్వహిస్తున్న మేలుకొలుపుతో ఆధ్యాత్మిక శోభ అలుముకుంది. మండలంలో సరుబుజ్జిలి, నందికొండ కాలనీ, షలంత్రి, వీరమల్లిపేట, గోనెపాడు, రావివలస, రొట్టవలస తదితర గ్రామాల్లో భక్త బృందం గీతాలపన చేస్తూ వేకువజామున నాలుగు గంటల నుంచి భజనలు చేపట్టారు.

నందికొండ గ్రామంలో నిర్వహిస్తున్న మేలుకొలుపు

సందడిగా నూతన సంవత్సర వేడుకలు

నూతన సంవత్సర వేడుకలు ఎచ్చెర్ల, ఆమదాలవలస నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా జరిగాయి. మహిళల ఇంటి ముందు రంగవల్లులు వేసి కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. దైవ దర్శనానికి బారులు తీరడంతో ఆలయాలు కళకళలాడాయి. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు ఎన్. ఈశ్వరరావు, గొండు శంకర్, కూన రవికుమార్‌లకు పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. –న్యూస్‌టుడే, బృందం

ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుతో కార్యకర్తలు, నాయకులు

ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు శుభాకాంక్షల వెల్లువ

పల్లెలకు మోక్షం.. అభివృద్ధి వైపు పయనం..!

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: దశాబ్దాల నుంచి రహదారులు లేని పల్లెలకు కూటమి మోక్షం కలిగించింది. కాలువలు లేక ఇబ్బందులు పడుతున్న గ్రామాలకు ఆ సమస్య తీర్చింది. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే బీటీ రోడ్లు, సీసీ కాలువలు నిర్మించడంతో ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఆమదాలవలస నియోజకవర్గంలోని పొందూరు, బూర్జ, సరుబుజ్జిలి, ఆమదాలవలస మండలాల్లో ఎంజీఎన్ ఆర్ఈజీఎస్ నిధులతో రూ. కోట్లు ఖర్చు చేశారు.

★ వైకాపా హయాంలో గుంతలు దారులు దర్శనమిచ్చేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలుత రహదారులు నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకుంది. 396.95 కోట్లు ఇప్పటి వరకు వెచ్చించింది.

★ కాలువలకు రూ 51.49 కోట్లు, ఆర్అండ్‌బీ రహదారుల నిర్మాణానికి రూ. 30 కోట్లు, సాగునీటి పనులు రూ. 3.82 కోట్లు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ రోడ్ల కు రూ. 159 కోట్లు, ఆమదాలవలస పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అదనపు భవనాల కట్టేందుకు రూ. 5 కోట్లు, మున్సిపాలిటీలోని 23 వార్డులకు తాగునీటి సరఫరాకు, గిరిజన సంక్షేమానికి, ఆదివాసీల రహదారుల నిర్మాణం రూ. 4 కోట్లు, వంశధార పనులు వటి పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి.

★ ప్రస్తుతం అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. పనులు పురోగతి సాధించేందుకు తగు చర్యలు తీసుకుంటాం.' అని పంచాయతీరాజ్ డీఈఈ జె. చంద్రశేఖర్ తెలిపారు.

★ ఆమదాలవలస నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 110 గ్రామాలతోపాటు మున్సిపాలిటీలో 23 వార్డుల్లో ఏళ్ల తరబడి తిష్ట వేసిన వార్డుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం' అని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు.

ఇసకలపేటలో మార్గంలోని నిర్మించిన బీటీ రోడ్డు

నియోజకవర్గంలో పనులకు వెచ్చించిన నిధులు (రూ. కోట్లలో)

మండలం	పనులు	నిధులు
ఆమదాలవలస	205	83.12
పొందూరు	483	70.21
సరుబుజ్జిలి	273	74.19
బూర్జ	523	66.38

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

? : ఆమదాలవలస పట్టణానికి చేరుకునే రహదారులపై ప్రమాదకర మలుపులు ఉన్నాయి. వాటి వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. **రవి, స్థానికుడు.** ☛ : హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. -బాలరాజు, ఎస్సై ఆమదాలవలస.

? : మున్సిపాలిటీ పరిధిలోని చెరువుల్లో ఇష్టానుసారంగా మట్టి, కంకర ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. **రాజు, స్థానికుడు.** ☛ : అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు చేపడతాం.

-రాంబాబు, తహసీల్దార్, ఆమదాలవలస.

–న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం,

? : శ్రీకాకుళంరోడ్డు రైల్వేస్టేషన్ మూడు, నాలుగు ప్లాట్‌ఫాంలపై మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. **లక్ష్మీ, ప్రయాణికురాలు** ☛ : రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి, త్వరలోనే ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. -ఉమామహేశ్వరావు, రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్, శ్రీకాకుళంరోడ్డు

? : సప్తపురాల్లో తాగునీరు సమస్య అధికంగా ఉంది. భరత్, స్థానికుడు. ☛ : తగు చర్యలు తీసుకుంటాం. **జాన్సన్, మున్సిపల్ ఏఈ, ఆమదాలవలస.**

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

సరుబుజ్జిలి, జి.సిగడాం, న్యూస్‌టుడే: సరుబుజ్జిలి ఉప కేంద్రం పరిధిలో శుక్రవారం మరమ్మతులు, కొత్త బ్రేకర్ అమర్చే పనులకు జరగనున్నాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్తుశాఖ ఈఈ యోగేశ్వరరావు తెలిపారు. సరుబుజ్జిలి, షలంత్రి, కొత్తకోట, రొట్టవలస, రావివలస, వెంకటాపురం, పాలవలస, పురుషోత్తపురం, అలమాజీపేట, కాగితాపల్లి తదితర గ్రామాలకు విద్యుత్తు సరఫరా జరగదని, వినియోగదారులు సహకరించాలని కోరారు. ★ జి.సిగడాం, బాతువ, నిద్దాం, గొబ్బూరు, ఎందువపేట, గెడ్డ కంచరాం, చంద్రయ్యపేట, మదుపాం, దేవరవలస, వెలగాడ, చెట్టుపొదిలాం, సేతుభీమవరం, అద్వానంపేట, ఎస్పీఆర్‌పురం, జాడ, నడిమివలస తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

నేటి నుంచి పాసుపుస్తకాలు అందజేత

రణస్థలం, న్యూస్‌టుడే : రణస్థలంల మండలంలో రీసర్వే పూర్తయిన 24 గ్రామాల్లో శుక్రవారం నుంచి 9 వరకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు ఎస్. కిరణ్‌కుమార్ తెలిపారు. రైతులు తమ పాత పాసు పుస్తకాలు తప్పనిసరిగా అందజేసి కొత్తవి పొందాలని కోరారు.

అలరించిన పౌరాణిక కళాకారుల పోటీలు

రణస్థలం, న్యూస్‌టుడే : రణస్థలం మండలంలోని కోస్టలో మణికంఠ కళాకారుల పరిషత్, పిసిని లక్ష్మణరావులు గురువారం పౌరాణిక కళాకారుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పోటీలు కొనసాగాయి. 30 మంది కళాకారులు పాల్గొని ప్రతిభ చూపారు. హరిశ్చంద్ర పాత్రధారి బొబ్బిలికి చెందిన వండాన మహేష్‌కు మొదటి బహుమతి లభించింది. నక్షత్రపాత్రధారి ఎం. వాసుదేవరావును కళాకారులంతా సత్కరించారు.

ఆమె నేత్రాలు సజీవం

శ్యామలాంబ (పాత చిత్రం)

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగర పరిధి ఏడు రోడ్ల కూడలి ప్రాంతానికి చెందిన పట్నాల శ్యామలాంబ (86) కన్నుమూయగా ఆమె కుటుంబ సభ్యులు రామకృష్ణ, సాయిరవికుమార్) నేత్రదానానికి ముందుకొచ్చారని రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ పి. జగన్మోహనరావు తెలిపారు. మగటపల్లి నేత్ర సేకరణ సాంకేతిక సిబ్బంది పూతి సుజాత, పి. సుమతి గురువారం కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర బ్యాంక్‌కు తరలించారని చెప్పారు. అంధత్వ రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుకు రావాలని ఆకాంక్షించారు.

ఊపిరి ఆడట్లేదు

ఆమదాలవలస శ్రీకాకుళం రహదారిలో పలు ప్రాంతాల్లో కల్వర్టులు నిర్మాణం చేపట్టి రహదారులను మరిచారు. దీంతో వాహనాలు వెళ్తున్న సమయంలో దుమ్ము రేగడంతో వెనక వచ్చే వారి కళ్లలో పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. రహదారి నిర్మాణం చేపడతామని ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

–న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

శుభ్రత అంటే ఇదేనా?

పొందూరు మండలం లోలుగు గ్రామ పంచాయితీ పరిధిలో గల పోస్టాఫీసు ఎదురుగా ప్రవహిస్తున్న కాలువలో ప్లాస్టిక్ సీసాలు, వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నిల్వ ఉంటోంది. దీంతో దుర్వాసన, దోమల బెడద అధికమవుతోందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాలువను శుభ్రం చేయాలని కోరుతున్నారు. సమస్యను ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా కార్యదర్శితో మాట్లాడి కాలువను శుభ్రం చేసే చర్యలు చేపడతామని తెలిపారు.

– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

అసంపూర్తి.. అవస్థలు

సరుబుజ్జిలి మండలంలోని కేజేపేట గ్రామంలో ఇటీవల నిర్మించిన శ్మశాన వాటిక నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. దీంతో గ్రామంలో ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలు చేసేందుకు మౌలిక సదుపాయాలు లేకపోవడంతో బుడ్డివలస గ్రామానికి వెళ్లే రహదారి పక్కనే కార్యక్రమాలు పూర్తిచేస్తున్నారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ జేఈ కూర్మనాథరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. **సరుబుజ్జిలి, న్యూస్‌టుడే:**

జారి పడుతున్నారు

ఆమదాలవలస మండలం కనుగులవలస రైల్వే అంతర్గత మార్గంలో నీరు నిలిచిపోవడంతో నాచు ఏర్పడి వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వాహనాలు అదుపు తప్పి జారి పడుతున్న ఘటనలు ఉన్నాయి. నీరు, నాచు తొలగించాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీకాకుళం రైల్వే ఏడీఈఎన్ బీవీఎస్ మూర్తి తెలిపారు. –న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

21వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
విజయహర్ష తల్లీపిల్లల హాస్పిటల్
సరస్వతి థియేటర్ దరి, ఒన్ వే ట్రాఫిక్ రోడ్, శ్రీకాకుళం Ph: 220221
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రీయింబర్స్‌మెంట్ కలదు

మా డాక్టర్ గార్లయిన డా॥ N.విజయ్‌కుమార్ (చిన్నపిల్లల వైద్యనిపుణులు), డా॥ D.హర్షవల్లి (స్త్రీ ప్రసూతి సంతాన సాఫల్య వైద్య నిపుణులు) శ్రీకాకుళంలో హాస్పిటల్‌ను ప్రారంభించి నేటికి 20 సం॥లు పూర్తి చేసుకొని 21వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా మా హార్దిక శుభాకాంక్షలు తెలియజేస్తూ...
డా॥ N.విజయ్‌కుమార్ MD (పీడియాట్రిక్స్) చిన్నపిల్లలు మరియు పురిటి పిల్లల వైద్య నిపుణులు
డా॥ D.హర్షవల్లి MD (గైనిక్) స్త్రీ ప్రసూతి గర్భకోశ వ్యాధుల మరియు సంతాన సాఫల్య వైద్యనిపుణులు

బస్వా నాని
రిలయన్స్ పెట్రోల్ బంకు, టెక్కలి

పేదలకు దుప్పట్ల పంపిణీ

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు శ్రీసత్యసాయి సేవాసమితి వారి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లను పంపిణీ జరిగింది. కార్యక్రమంలో కన్వీనర్ దున్నా రాధాకృష్ణతో పాటు సత్యసాయి సేవాదళ్ సభ్యులు పాల్గొని ఇళ్లకు వెళ్లి అందజేశారు.

ఘనంగా బొల్లినేని జన్మదిన వేడుకలు

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లా చరిత్రలో అత్యాధునిక వైద్య సేవలు అందించిన ఘనత డా. బొల్లినేని భాస్కరరావుకే దక్కుతుందని కిమ్స్ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. గూడేన సోమేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో గురువారం బొల్లినేని భాస్కరరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా 25 ఆసుపత్రుల్లో 25 వేల మంది సిబ్బంది సేవలు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కిమ్స్ వైద్యులు బి. గౌతమి, పద్మజ, నమ్రత, పి. రమణ, రామలింగేశ్వరరావు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులతో కలిసి కేకు కోస్తున్న డా.గూడేన సోమేశ్వరరావు

భవిత కేంద్రాలతో భరోసా

ఆమదాలవలస గ్రామీణం, సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మానసిక, శారీరక వైకల్యంతో బాధపడుతున్న బాలలకు భవిత కేంద్రాలు భరోసానిస్తున్నాయి. ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో ఆటపాటలు, ప్రత్యేక పరికరాలు ద్వారా వారిలో నైపుణ్యం పెరిగేందుకు కృషి చేస్తున్నారు.

◆ వారంలో ఒక రోజు ఫిజియోథెరపీ చేయడంతో పాటు తల్లిదండ్రులకు సూచనలు ఇచ్చి ఇంటి వద్ద చేసేందుకు కొన్ని థెరపీలు చెబుతున్నారు.

◆ భవిత కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం అందించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దివ్యాంగ ఉపకరణాలు, ఆటలు, మేధస్సు పెంచే బోధన జరుగుతోంది. క్రమం తప్పకుండా ఇలాంటి కార్యక్రమాలు చేస్తుండటంతో బాలల్లో మార్పు వస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు.

◆ నియోజక వర్గంలో ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాల్లో 654 మంది దివ్యాంగులకు వైద్య సేవలు అందుతున్నాయి. గతంలో ఇలాంటి పిల్లలను తల్లిదండ్రులు ఇళ్లలోనే ఉంచేవారు. ఇప్పుడు భవిత కేంద్రాల్లో వదిలి వెళ్తున్నారు.

◆ విద్యా సంవత్సరం ప్రారంభంలో దివ్యాంగుల సర్వే నిర్వహించి, గుర్తించేందుకు కాన్పూర్‌కు చెందిన ఏఎల్ఐఎంసీవో సంస్థతోపాటు సమగ్రశిక్షా విభాగం సమష్టిగా సేవలు అందిస్తోంది.

ఆమదాలవలస భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారికి ఫిజియో థెరపీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఆమదాలవలస నియోజక వర్గం ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలు

మండలం	దివ్యాంగ చిన్నారులు
ఆమదాలవలస	270
సరుబుజ్జిలి	142
పొందూరు	127
బూర్జ	115

సద్వినియోగం చేసుకోండి : 'దివ్యాంగ చిన్నారులు భవితా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. విద్యాశాఖ నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుంది' అని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బుడుమూరు గోవిందరావు తెలిపారు.

శిరస్త్రాణాల పంపిణీ

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరానికి చెందిన సామాజికవేత్త సూర శ్రీనివాసరావు గురువారం 100 మంది పాత్రికేయులకు శిరస్త్రాణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు షకలక శంకర్, భాజపా మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

● **కిన్నెర:** సైకో సిద్ధార్థ ● **కీర్తన:** మార్క్, మదం ● **కీర్తిక:** వన వీర, దండోరా ● **మారుతి:** శంబాల ● **సూర్య:** 45 ● **సన్‌మ్యాక్స్:** ఈషా ● **ఎస్‌వీసీ(రామలక్ష్మణ):** అఖండ 2 ● **సరస్వతి:** ఛాంపియన్ – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

శుద్ధజలం కలేనా..?

బడుల్లో మూలకు చేరిన యంత్రాలు

–న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శుద్ధజలం అందించేందుకు వైకాపా హయాంలో రూ. లక్షలు వెచ్చించి బడుల్లో ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేశారు. కొన్ని రోజులు పని చేసినా.. తరువాత నిర్వహణ కరవై, మరమ్మతులకు గురై మూలకు చేరాయి. దీంతో విద్యార్థులు సమీపంలోని బోరు నీరు లేదంటే ఇంటి నుంచి నీళ్ల సీసా తీసుకొస్తున్నారు. అవి ఉదయం నుంచి సాయంత్రం వరకు చాలకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

★ శుద్ధజల యంత్రాలను మూడు లేదా ఆరు నెలలకు ఒకసారి పనితీరు పరిశీలించాలి. ఫిల్టర్లు, ద్రావణాలు, వాల్స్, పైపులు, ట్యాంకులు అవసరమైతే మార్చాలి. కొంతకాలం గుత్తేదారులు నిర్వహణ చూసినా.. అనంతరం నిర్లక్ష్యం వహించారు. సంప్రదించినా.. సంబంధిత గుత్తేదారులు స్పందించట్లేదని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు.

★ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 100 మంది విద్యార్థులు ఉన్నచోట రూ. 24 వేలు నుంచి రూ. 70 వేలు ఖర్చు చేసి శుద్ధ జల యంత్రాలు ఏర్పాటు చేశారు. 300 వందల మంది ఉంటే రూ. 1.84 లక్షలు, 300 వందల నుంచి 500 వందల వరకు ఉంటే రూ. 4.80 లక్షలు, 500 వందలు పైబడి రూ. 5.20 లక్షలతో పెట్టారు.

★ ప్రస్తుతం సుమారు 80 శాతానికిపైగా శుద్ధజల యంత్రాలు మూలకు చేరాయి. దృష్టి సారించి వాటిని వినియోగంలోకి తీసుకు రావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

★ 'నీటిశుద్ధ యంత్రాలు నిర్వహణ పూర్తి బాధ్యత గుత్తేదారులపై ఉంది. వారు స్పందించడం లేదు. ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.' అని మండల విద్యాశాఖాధికారి కేవ రాములు తెలిపారు.

గేదెలవానిపేట పాఠశాలలో పనిచేయని నీటిశుద్ధి యంత్రం

మండలం పేరు	మంజూరైనవి	పనిచేస్తున్నవి
ఆమదాలవలస	39	18
సరుబుజ్జిలి	09	03
పొందూరు	08	05
బూర్జ	20	12

21వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
విజయహర్ష తల్లీపిల్లల హాస్పిటల్
సరస్వతి థియేటర్ దరి, ఒన్ వే ట్రాఫిక్ రోడ్, శ్రీకాకుళం Ph: 220221
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రీయింబర్స్‌మెంట్ కలదు

డా॥ ఎన్. విజయ్‌కుమార్ MD (పీడియాట్రిక్స్) చిన్నపిల్లలు మరియు పురిటిపిల్లల వైద్యనిపుణులు
Dr. D. హర్షవల్లి MD (గైనిక్) స్త్రీ ప్రసూతి గర్భకోశ వ్యాధుల మరియు సంతాన సాఫల్య వైద్యనిపుణులు
మా బావగారైన డా॥ ఎన్. విజయ్‌కుమార్ (చిన్నపిల్లల వైద్య నిపుణులు) మా అక్కగారైన డా॥ డి.హర్షవల్లి (స్త్రీ, ప్రసూతి సంతాన సాఫల్య వైద్యనిపుణులు) శ్రీకాకుళంలో హాస్పిటల్ ప్రారంభించి నేటికి 20 సం॥లు పూర్తి చేసుకొని 21వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంలో మా హార్దిక శుభాకాంక్షలు తెలియజేస్తూ...
మీ తమ్ముళ్లు

డి. మోహనరావు M.Tech., Asst Engineer, Water Resourses, Dhavaleswaram
దుంగ సుదర్శనరావు B.Tech., Director SKS FIRMS, Srikakulam

దుంగ భాస్కరరావు, MBA రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి Managing Director SKS FIRMS, Srikakulam
Dr.D.P. కళ్యాణ చక్రవర్తి M.D, DM, Cardialogy కార్డియాలజిస్ట్, గుండె సంబంధిత వ్యాధి వైద్యనిపుణులు

21వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
విజయహర్ష తల్లీపిల్లల హాస్పిటల్
సరస్వతి థియేటర్ దరి,
ఒన్ వే ట్రాఫిక్ రోడ్, శ్రీకాకుళం Ph: 220221

డా॥ ఎన్. విజయ్‌కుమార్ MD (పీడియాట్రిక్స్) చిన్నపిల్లలు మరియు పురిటిపిల్లల వైద్యనిపుణులు
Dr. D. హర్షవల్లి MD (గైనిక్) స్త్రీ ప్రసూతి గర్భకోశ వ్యాధుల మరియు సంతాన సాఫల్య వైద్యనిపుణులు
మా ఆసుపత్రిలో లభించు వివిధ వైద్య సేవలు:
1. పిల్లల వైద్యము : ❖ వ్యాక్సినేషన్ ❖ చిన్నపిల్లలలో వచ్చు ఆయాసమునకు నెబ్యులైజేషన్ ❖ ఫోటో థెరపి ❖ రక్త మార్పిడి ❖ పిల్లల శస్త్రచికిత్స
2. స్త్రీ మరియు ప్రసూతి వైద్యము ❖ నెలసరి సమస్యలకు చికిత్స ❖ సంతాన సాఫల్యత ❖ సంక్లిష్ట గర్భిణి తనిఖీ మరియు చికిత్స ❖ ఫ్యామిలి ప్లానింగ్ శస్త్ర చికిత్స ❖ క్యాన్సర్ స్క్రీనింగ్ ❖ క్రయోథెరపీ ❖ గర్భసంచి వ్యాధులకు (ఫైబ్రాయిడ్స్, అడినోమయోసిస్) లాపరోస్కోపి ద్వారా శస్త్ర చికిత్స ❖ అండాశయ సమస్యలకు (PCOD, Ovarian Cysts) శస్త్రచికిత్స
3. గుండె వ్యాధులకు చికిత్స: ❖ అధిక రక్తపోటు ❖ ఆయాసం ❖ మధుమేహం ❖ గుండె నెమ్మదిగా కొట్టుకొనుట ❖ గుండె వేగంగా కొట్టుకొనుట ❖ ఆందోళన ❖ గుండె వైఫల్యం ❖ గుండె పోటు ❖ రక్త నాళములలో సమస్య
4. శస్త్రచికిత్స మరియు లాపరోస్కోపి శస్త్ర చికిత్స: ❖ అపెండిసెక్టొమి ❖ హెర్నియ ❖ హైడ్రోసిల్ ❖ గాల్ బ్లాడర్ స్టోన్ మొదలగునవి
5. జనరల్ మెడిసిన్: ❖ జ్వరం, దగ్గు, బి.పి. మరియు డయాబెటిక్ కేర్ మొదలగునవి
6. ఎముకలు మరియు కీళ్ల చికిత్స: ❖ కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స ❖ విరిగిన ఎముకలు మరియు కీళ్ల చికిత్స ❖ నడుము నొప్పి ❖ కీళ్ళ నొప్పులు ❖ ఎముకల అరుగుదల మొదలగు వాటికి చికిత్స.
మా ఆసుపత్రిలో లభించు సేవలు:
❖ ఔట్ పేషెంట్ సేవలు ❖ ఇన్ పేషెంట్ సేవలు ❖ ఆపరేషన్ థియేటర్ ❖ లాపరోస్కోపిక్ శస్త్రచికిత్స ❖ లేబర్ రూం ❖ లేబొరేటరీ సేవలు ❖ X- Ray విభాగము ❖ స్కానింగ్ సదుపాయము ❖ వివిధ అత్యవసర చికిత్స సేవలు ❖ ఇంటెన్సివ్ కేర్ విభాగము (ICU) ❖ వెంటిలేటర్ సదుపాయము ❖ బరువు తక్కువ మరియు నెలలు నిండని పిల్లలకు ప్రత్యేక చికిత్స విభాగం (NICU) ❖ పిల్లల ప్రత్యేక చికిత్స విభాగము (PICU) ❖ 24 గంటలు కరెంట్ సదుపాయము ❖ 24 గంటలు మందుల షాప్
మా హాస్పిటల్ నందు:★ FHPL ★ Medi Assist ★ MD INDIA ★ Vipul ★ Religare Star Health Insurance మరియు TPA మరియు అన్నిరకముల హెల్త్‌కార్డులకు మా హాస్పిటల్ నందు నగదు రహిత వైద్యసేవలు అందించబడును.
మా డాక్టర్ గార్లయిన డా॥ N. విజయ్‌కుమార్ (చిన్నపిల్లల వైద్యనిపుణులు) డా॥ D.హర్షవల్లి (స్త్రీ ప్రసూతి సంతానసాఫల్య వైద్యనిపుణులు) శ్రీకాకుళంలో హాస్పిటల్ ప్రారంభించి నేటికి 20సం॥ పూర్తి చేసుకుని 21వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా మా హార్దిక శుభాకాంక్షలు తెలియజేస్తూ...
శ్రీకాకుళంలో అత్యాధునిక సౌకర్యాలు గల తల్లీపిల్లల హాస్పిటల్
విజయహర్ష
తల్లీపిల్లల హాస్పిటల్ సిబ్బంది, శ్రీకాకుళం

(c) eenadu

నూతన ఆంగ్ల సంవత్సరాది వేడుకలను నగరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో కళాకారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. జబర్దస్త్ హాస్యనటుడు రాజమౌళి ప్రదర్శన సందర్శకులకు నవ్వులు పూయించింది. బాలకృష్ణ, కృష్ణ వేషధారణలోని కళాకారుల ప్రదర్శనలు అలరించాయి. నగరవాసులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో శిల్పారామం సందడిగా మారింది. కార్యక్రమాలు ప్రజలను కనువిందు చేశాయి. ఏవోలు సుధాకర్, ఖాదర్‌వల్లీ తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, తిరుపతి (నగరం)

మూతి వంకర.. పక్షవాతం అనుకోరా!

■ **జిల్లాలో బెల్స్ పాల్సీ ముప్పు**

సునీతకు 28 ఏళ్లు.. ఉదయం చన్నీటి స్నానం చేయడం, ధనుర్మాసం సందర్భంగా తెల్లవారుజామునే ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల ఉన్నట్టుండి ఆమె మూతి వంకర పోవడం గుర్తించిన భర్త అద్దంలో చూపించగా పక్షవాతం వచ్చిందేమోనని హడలిపోయింది. వెంటనే వైద్యుడిని సంప్రదించగా అది పక్షవాతం కాదని బెల్స్‌పాల్సీగా నిర్ధారించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే ఇలాంటి వారి సంఖ్య జిల్లాలో వందల నుంచి వేలకు చేరుతోంది. ఇంతకీ ఏమిటీ బెల్స్ పాల్సీ?

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : ప్రస్తుతం మంచు ఎక్కువగా కురుస్తోంది. దీనికి తోడు విపరీతమైన చలి ఉంటోంది. నునువెచ్చని సూర్యకిరణాలు తాకుతున్న సమయంలో ఉదయపు నడక (వాకింగ్) చేస్తే ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. చలికాలంలో యువత వాకింగ్ చేసినా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అయితే వృద్ధులు, నడి వయస్కులు బెల్స్ పాల్సీ బారిన పడే అవకాశం ఎక్కువ. మూతి వంకరతో వచ్చే వారు బెల్స్‌పాల్సీగా వైద్యులు గుర్తిస్తున్నారు.

లక్షణాలు ఇవీ ..

చలిగాలులు ఎక్కువగా చెవుల్లో నుంచి లోపలకు వెళ్లడం వల్ల నాడిపై ప్రభావం పడి ముఖం ఒక పక్కకు లాగేసినట్లు ఏర్పడుతుంది. దీంతో మూతి వంకర తిరిగినట్లు ఉంటుంది. దీన్నే బెల్స్ పాల్సీ అంటారు.

● చన్నీటి స్నానం చేసినా, చలిలో తిరిగినా 30 ఏళ్లు పైబడిన వారికి ఈ ముప్పు ఎక్కువగా ఉంటుంది.

అందరూ వీఐపీలే..!



దర్శనం పూర్తయి తిరిగి వచ్చే మార్గంలో ఎదురెళ్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తజన సంద్రంగా మారింది. గురువారం ఇసుకేస్తే రాలనంతగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి ఆలయం మూతవేసే సమయానికి దాదాపు 35 వేలమందికి పైగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వచ్చిన వాళ్లలో సిఫార్సు దర్శనాలే ఎక్కువ. మరోవైపు అంతరాలయ దర్శన టికెట్లు 719 మాత్రమే విక్రయించారు. దళారులు తమదైన రీతిలో భక్తుల బృందాలను దర్శనాలకు యథేచ్ఛగా తీసుకెళ్లారు. ప్రధానంగా రూ.500, వీఐపీ దర్శనాల కారణంగా సామాన్య భక్తులు అవస్థలు పడ్డారు. వీఐపీ బ్రేక్ సమయాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో ఉచిత సిఫార్సులు కట్టడి చేయాల్సి ఉంది.

ఏడు పదుల కాలానికి.. ఏడుకొండలవాడి చెంతకు

■ రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రయాణం

ఐదు మండలాలు
99 పంచాయతీలు
జనాభా : **4.90** లక్షలు
ఓటర్లు: **2,05,419** మంది

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: స్వాతంత్ర్యం వచ్చాక 1947 నుంచి 1962 వరకు రైల్వేకోడూరు నియోజకవర్గం రాజంపేటలో కలసి ఉండేది. 1962లో ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడగా అప్పటి నుంచి కడప జిల్లా కేంద్రంగా కొనసాగుతున్న ఈ నియోజకవర్గాన్ని 2022లో గత ప్రభుత్వం అన్నమయ్య జిల్లాలోకి మార్చింది. రాయచోటి కేంద్రంగా మూడేళ్లపాటు అందులో ఉండి.. తాజాగా తిరుపతి జిల్లాలో కలిసింది. కడపతో ప్రారంభమైన నియోజకవర్గ ప్రయాణం అన్నమయ్య మీదుగా సాగి చివరకు ఏడుకొండలవాడి చెంతకు చేరిందని ఇక్కడి ప్రజలు, అధికారులు, విద్యార్థులు, రైతులు, మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే సుమారు ఏడు దశాబ్దాలుగా కడపతో ముడివేసుకున్న అనుబంధం దూరమైనందుకు ఒకింత విచారం వ్యక్తం చేస్తున్నారు.

అరటి ఎగుమతులు

ఉద్యాన సిరులు

ప్రధాన ఉద్యాన పంటలైన అరటి, మామిడి, బొప్పాయికి ప్రసిద్ధి. సారవంతమైన నేలలు ఉండటంతో పంట నాణ్యత ఉంటుంది. చీనీ, నిమ్మ అంటు మొక్కలకు రైల్వేకోడూరు మండలం పేరుగాంచింది.

ముగ్గురాయికి ప్రత్యేకం

ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేట అపారమైన ముగ్గురాయి గనులతో నిండి ఉంది. ఇక్కడ 1976 నుంచి మైనింగ్ మొదలైంది. గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తారు. పౌడిని క్రూడ్ ఆయిల్ శుద్ధి ప్రక్రియలో వినియోగిస్తారు. ఏపీఎండీసీకి ప్రధాన ఆదాయ వనరు.

రెండు లక్షల ఎకరాల్లో ఎర్రచందనం

శేషాచలం అడవుల్లోని ఎర్రచందనం వనాలు సహజసిద్ధంగా ఈ ప్రాంతానికి పేరు తెచ్చిపెట్టాయి. నియోజకవర్గ పరిధిలో ఈ అడవులు సుమారు రెండు లక్షల ఎకరాల్లో విస్తరించాయి.

రాజకీయం రసవత్తరం

1962 - 2024 వరకు మొత్తం 15 పర్యాయాలు (2012లో ఉప ఎన్నికలు) ఎన్నికలు జరిగాయి. ఎస్సీ రిజర్వుడు కాగా పార్టీలను నడిపించే రాజకీయ నాయకుల మధ్య రసవత్తర రాజకీయం నడుస్తుంది. 1962 నుంచి 1983 వరకు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందగా - 1983లో తెదేపా ఆవిర్భావం నుంచి 2004 వరకు ఈ నియోజకవర్గం ఆ పార్టీకి కంచుకోటగా నిలిచింది. 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్, 2012 ఉప ఎన్నికల నుంచి 2024 వరకు వైకాపా గెలుపొందింది. గత ఎన్నికల్లో కూటమి తరపున జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ గెలుపొందారు. ప్రధానంగా తెదేపా - వైకాపా మధ్యనే పోరు సాగింది. గత ఎన్నికల్లో కూటమి ప్రభావం పనిచేసింది.

15న శెట్టిపల్లి భూముల లబ్ధిదారులకు ప్లాట్లు

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: శెట్టిపల్లి భూముల లబ్ధిదారులకు ఈనెల 15న లాటరీ విధానం ద్వారా ప్లాట్లు కేటాయించనున్నట్లు కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి జేసీ మౌర్యతో కలిసి శెట్టిపల్లి గ్రామ కమిటీలు, వ్యవసాయదారులతో సమీక్షించారు. ఈనెల 15న లాటరీ విధానం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఉచితంగా పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. రిజిస్ట్రేషన్ పత్రాలు హద్దులతో సహా ముద్రించి ఒకరోజున సామూహికంగా పట్టాలు అందజేస్తామన్నారు. మోడల్ టౌన్ షిప్‌నకు సంబంధించి తుడా ద్వారా 65 ఎకరాలు భూమిని కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆర్డీవో రామ్మోహన్, తుడా చీఫ్ ప్లానింగ్ అధికారి దేవికుమారి పాల్గొన్నారు.

రేవు దోచేయ్.. చెన్నై తరలించేయ్

పుత్తూరు, న్యూస్‌టుడే: ఇసుక ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.. రూ.4 వేలు చెల్లిస్తేగానీ ఇసుక దొరకని పరిస్థితి.. పుత్తూరు, నగరి అవసరాలకు నాగలాపురం, గాజులమండ్యం రీచ్‌ల నుంచే సరఫరా అవుతుంది. ఇది వ్యయప్రయాసలతో కూడిన పనికావడంతో అక్రమ వ్యాపారం చేసేవారి పంట పండుతోంది.

పాపానాయుడుపేట నుంచి పుత్తూరుకు వెళ్తున్న ట్రాక్టర్

నిత్యం భారీగా తరలింపు

ఏర్పేడు మండలం పాపానాయుడుపేట నుంచి ఇసుక రాజమార్గాన తరలివస్తోంది. ఒకే పర్మిట్‌తో రోజుకు నాలుగైదు ట్రిప్పులు తరలిస్తున్నారు. ఇలా రోజూ వంద ట్రిప్పుల మేర పుత్తూరుకే డంప్ అవుతోంది. అనంతరం రాత్రివేళ చెన్నైకు టిప్పర్లలో తరలిస్తున్నారు. అక్రమాలు తిరుపతి-చెన్నై హైవేపై నిరాటంకంగా సాగుతున్నా పట్టించుకునే దిక్కులేదు.

పర్మిట్లు విధిగా ఉండాల్సిందే..

ఏర్పేడు నుంచి పుత్తూరుకు వస్తున్న ఇసుక ట్రాక్టర్లకు విధిగా పర్మిట్లు ఉండాలి. అలా ఉంటేనే ఆయా వాహనాలు పట్టణంలోకి అనుమతించాలి. ఈ మేరకు చర్యలు తీసుకుంటాం. స్థానిక పోలీసులు నిఘా పెంచి అక్రమంగా వస్తున్న ట్రాక్టర్లు సీజ్ చేసేలా చర్యలు తీసుకుంటాం. ఈ అక్రమాల్లో ఎవరున్నా ఉపేక్షించబోం.

- వెంకటేశ్వర్లు, తహసీల్దారు, పుత్తూరు

పాసుపుస్తకాల పంపిణీకి గ్రామసభలు

నేటి నుంచి రైతులకు అందజేత

తిరుపతి (కలెక్టరేట్), నాయుడుపేట, న్యూస్‌టుడే: భూయాజమాన్య హక్కులకు సంబంధించిన కొత్త పట్టదారు పాసుపుస్తకాల పంపిణీకి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శుక్రవారం నుంచి ఈనెల 9వ తేదీవరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహించి రైతులకు పంపిణీ చేయనున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రత్యేక దృష్టి సారించింది. రీసర్వే గ్రామాల్లో పక్కాగా వివరాలున్న 27,942 మంది రైతులకు మొదటి విడతలో పాసుపుస్తకాలు అందజేయనున్నారు. నోషనల్ ఖాతాలు, చనిపోయి వారసత్వంగా వచ్చిన భూములు, రికార్డుల్లో తేడాలు ఉన్న మరో 24,637 మంది నుంచి అభ్యంతరాలు స్వీకరించి రెండో విడతగా ఇవ్వనున్నారు. రాజకీయ పార్టీల రంగులు, నాయకులు ఫొటోలు లేకుండా ప్రతి పాసుపుస్తకానికి క్యూఆర్‌డ్, రాజముద్రతో పంపిణీ చేయనున్నారు. స్కాన్ చేసి ఆధార్ నమోదు చేస్తే భూమి పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో లభ్యమవుతాయి. నాయుడుపేటలో అత్యధికంగా 4,824, బాలాయపల్లి 2,335, ఓజిలి 2,675 మంది రైతులకు చొప్పున పంపిణీకి సిద్ధం చేశారు.

సభలు జరిగే గ్రామాలు : **217**
పంపిణీ చేయనున్న పుస్తకాలు: **27,942**
తప్పొప్పులు సరిచేయాల్సినవి : **24,637**

మత్తు వదిలించారు

■ **444 లైసెన్సుల తాత్కాలిక రద్దుకు సిఫార్సు**

తిరుపతి (నేరవిభాగం) : జిల్లాలో డిసెంబర్ 31వ తేదీ రాత్రి మద్యం తాగి వాహనాలు నడిపిన 444 మందిపై కేసులు నమోదు చేశారు. వాహనాలు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. వారి డ్రైవింగ్ లైసెన్సుల తాత్కాలిక రద్దుకు రవాణా శాఖకు సిఫార్సులు పంపారు. నూతన సంవత్సర వేడుకల్లో పోలీసు శాఖ కఠిన చర్యలు చేపట్టింది. ఎస్పీ సుబ్బరాయుడు తిరుపతిలోని అన్ని కూడళ్లలో తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో 64 బ్రీత్ అన్‌లైజర్ పరికరాల ద్వారా తనిఖీలు చేశారు. అర్ధరాత్రి వేళ రోడ్లపై కేకులు కోయడం, బాణసంచా పేల్చడం, గొడవలు, బైక్ విన్యాసాలు, రేసింగ్ వంటివి లేకుండా కట్టడి చేశారు.

104FM Tirupati | ఈ FM 104 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

SREE VIDYANIKETHAN INTERNATIONAL SCHOOL
WHERE EXCELLENCE IS A HABIT.

SREE VIDYANIKETHAN International School
A CBSE Affiliated School For Classes I to XII

AP'S NO.1* CO-ED BOARDING SCHOOL

- 40-acre Lush Green Campus
- Tirupati's Only Atal Tinkering Lab
- Smart Classrooms
- CCTV Surveillance & Wi-Fi Across Campus
- Enriched Library with Digital Resources
- State-of-the-art Physics, Chemistry, Biology, Mathematics & IT Labs
- STEAM Learning
- Equal Focus on Sports & Co-curricular Activities

Integrated Study Programs

- Integrated Classes for IIT/JEE and NEET
- Chrysalis Curriculum (Grades 1-5)
- Coaching for Olympiads: IEO, IMO, NCO, NSO, IGKO & ISSO
- NTSE Preparation

*India School Rankings by Education World

ADMISSIONS OPEN Call/WhatsApp: +91-7337333725

Sree Sainath Nagar, Tirupati, Andhra Pradesh - 517 102
www.svis.school/tirupati

(c) eenadu

ఈఎస్ఎల్ హోరు.. యువత హుషారు

ఆసక్తికరంగా 'ఈనాడు' క్రికెట్ మ్యాచ్‌లు

EENADU SPORTS LEAGUE 2025

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్' (ఈఎస్ఎల్)-2025 క్రికెట్ పోరులో యువ బ్యాటర్లు, బౌలర్లు సత్తాచాటుతున్నారు. అదరగొట్టే బ్యాటింగ్‌తో బంతిని బౌండరీలు దాటిస్తూ.. చాకచక్యమైన బౌలింగ్‌తో వికెట్లు పడగొడుతూ అద్భుత ప్రతిభ ప్రదర్శిస్తున్నారు. తిరుపతిలోని ఎస్వీ హై స్కూల్ క్రికెట్ మైదానం, ఎస్వీయూ స్టేడియం వేదికగా సీనియర్స్, జూనియర్స్ విభాగంలో జరుగుతున్న మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగుతున్నాయి. బుధవారం జరిగిన 'ఈనాడు' క్రికెట్ మ్యాచ్‌ల వివరాలు ఇలా ఉన్నాయి.

లష్ మల్టీ స్పెషాలిటీ లేజర్ హాస్పిటల్స్ మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా, తిరుపతి

గ్రౌండ్-1 ఎస్వీ హై స్కూల్ మైదానం

పది వికెట్ల తేడాతో సీకాం గెలుపు

విజయం సాధించిన సీకాం జూనియర్ కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జయంత్

తొలి మ్యాచ్‌లో బీఎస్ఆర్ జూనియర్ కళాశాల తిరుపతి, సీకాం జూనియర్ కళాశాల తిరుపతి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సీకాం బౌలింగ్‌ను ఎంచుకోగా, బ్యాటింగ్ చేసిన బీఎస్ఆర్ 7.2 ఓవర్లలో ఆలౌటై 31 పరుగులు చేసింది. 32 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన సీకాం కేవలం 3.3 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. జట్టులో జయంత్ (15 బంతుల్లో 4×3) 20 పరుగులు, 2 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

అదే జోరులో ఎమరాల్డ్స్

గెలుపొందిన ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా హవీష్ రెడ్డి

ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల తిరుపతి, అక్షర జూనియర్ కళాశాల నాగలాపురం జట్ల మధ్య రెండో మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన అక్షర బ్యాటింగ్‌లో నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 66 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన ఎమరాల్డ్స్ 8.5 ఓవర్లలో 67 పరుగులు చేసి 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జట్టులో హవీష్ రెడ్డి (29 బంతుల్లో 4×1) 26 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

వరదయ్యపాళెం కళాశాల లక్ష్య ఛేదన

వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల విజయకేతనం

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ప్రణీత్

మూడో మ్యాచ్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల నాగలాపురం, ప్రభుత్వ జూనియర్ కళాశాల వరదయ్యపాళెం జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన నాగలాపురం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 70 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన వరదయ్యపాళెం జట్టు 8.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 71 పరుగులతో గెలుపును సొంతం చేసుకుంది. జట్టులో ప్రణీత్ (16 బంతుల్లో 4×1) 12 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి ఉత్తమ ఆల్‌రౌండర్‌గా ఎంపికయ్యాడు.

గ్రౌండ్-2 ఎస్వీయూ స్టేడియం

హోరాహోరీ పోరులో ఎస్వీ విజయం

విజయం సాధించిన ఎస్వీ పాలిటెక్నిక్ జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా సాయితేజ

ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తిరుపతి, గీతం జూనియర్ కళాశాల భవానీనగర్ జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్ హోరాహోరీగా సాగింది. టాస్ గెలిచిన ఎస్వీ పాలిటెక్నిక్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన గీతం నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 101 పరుగులు చేసింది. 102 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన ఎస్వీ పాలిటెక్నిక్ 8.2 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జట్టులో సాయితేజ (29 బంతుల్లో 10×4) 54 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

ఆర్కే విద్యాలయ సత్తా

సత్తాచాటిన ఆర్కే విద్యాలయ జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నితీష్

రెండవ మ్యాచ్‌లో వేము పాలిటెక్నిక్ కళాశాల పి.కొత్తకోట, ఆర్కే విద్యాలయ జూనియర్ కళాశాల చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఆర్కే విద్యాలయ బౌలింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్ చేసిన వేము పాలిటెక్నిక్ నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 71 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆర్కే విద్యాలయ 8.3 ఓవర్లలో కేవలం వికెట్ నష్టానికి 72 పరుగులు చేసి సత్తాచాటింది. జట్టులో నితీష్ (11 బంతుల్లో 3×4) 19 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

కృష్ణతేజ విజయకేతనం

గెలుపొందిన కృష్ణతేజ ఫార్మసీ జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎన్.దినేష్

మూడో మ్యాచ్‌లో కృష్ణతేజ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ తిరుపతి, వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పి.కొత్తకోట జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన వేము బ్యాటింగ్‌తో నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 73 పరుగులు చేసింది. 74 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌తో బరిలో దిగిన కృష్ణతేజ 7.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించి విజయకేతనం ఎగురవేసింది. జట్టులో ఎన్.దినేష్ (21 బంతుల్లో 4×6) 34 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ NECC (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక
Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY www.mits.ac.in MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్ FM Partner: ETV BHARAT, Mee FM TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

నేడు 02.01.2026

గ్రౌండ్-1: ఎస్వీ హై స్కూల్ మైదానం (సీనియర్స్, జూనియర్స్)

- **ఉదయం 8:00:** సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎస్ఐఈటీకే), పుత్తూరు × పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చిత్తూరు (సీనియర్స్)
- **ఉదయం 10:30:** శ్రీవివేకానంద జూనియర్ కళాశాల, పలమనేరు × సీకాం జూనియర్ కళాశాల, తిరుపతి (జూనియర్స్)
- **మధ్యాహ్నం 2:00:** శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి × ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ కళాశాల, తిరుపతి (సీనియర్స్)

గ్రౌండ్-2: ఎస్వీయూ స్టేడియం (సీనియర్స్, జూనియర్స్)

- **ఉదయం 8:00:** ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కాలేజ్, విద్యానగర్ × ఎస్వీయూ కళాశాలలు, తిరుపతి (సీనియర్స్)
- **ఉదయం 10:30:** గీతం జూనియర్ కళాశాల, రామాపురం × ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల, తిరుపతి (జూనియర్స్)
- **మధ్యాహ్నం 2:00:** ప్రభుత్వ జూనియర్ కళాశాల, వరదయ్యపాళెం × ఆర్కే విద్యాలయ జూనియర్ కళాశాల, చిత్తూరు (జూనియర్స్)

రేపు 03.01.2026

గ్రౌండ్-1: ఎస్వీ హై స్కూల్ మైదానం (సీనియర్స్, జూనియర్స్)

- **ఉదయం 8:00:** ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తిరుపతి × ఎస్వీ జూనియర్ కళాశాల, తిరుపతి (జూనియర్స్)
- **ఉదయం 10:30:** అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, తిరుపతి × బీఎస్ఆర్ డిగ్రీ కళాశాల, తిరుపతి (సీనియర్స్)
- **మధ్యాహ్నం 2:00:** శ్రీవిద్యానికేతన్ ఇంజినీరింగ్ కాలేజ్, రంగంపేట × సీకాం డిగ్రీ కళాశాల, తిరుపతి (సీనియర్స్)

గ్రౌండ్-2: ఎస్వీయూ స్టేడియం (సీనియర్స్, జూనియర్స్)

- **ఉదయం 8:00:** గ్రౌండ్-2లో నేటి మ్యాచ్-2 విజేత × గ్రౌండ్-1లో నేటి మ్యాచ్-2 విజేత (జూనియర్స్)
- **ఉదయం 10:30:** సిద్ధార్థ ఎడ్యుకేషనల్ అకాడమీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, సి.గొల్లపల్లి × గ్రౌండ్-2లో నేటి మ్యాచ్-1 విజేత
- **మధ్యాహ్నం 2:00:** ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి × చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి

తెప్పలపై శ్రీకామాక్షి అమ్మవారి కటాక్షం

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తిరుపతిలోని శ్రీకపిలేశ్వరస్వామి తెప్పోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన గురువారం రాత్రి శ్రీ కామాక్షి అమ్మవారు కపిలతీర్థం పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన తెప్పపై ఆసీనులైన శ్రీకామాక్షి, లక్ష్మీ, సరస్వతి అమ్మవారు కపిలతీర్థం పుష్కరిణిలో 9 చుట్లు తిరిగారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు అందించారు. తితిదే అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు భక్తి సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

EENADU Classifieds

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

గూడూరుకు 5 కి.మీ. పరిధిలో 1 3/4 ఎకరము పొలము అమ్మబడును. వివరములకు సెల్: ✆ 96522 14810.

JOBS

ప్రభుత్వ ఆఫీసులలో అవుట్ సోర్సింగ్ కింద పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్స్, ITI మెకానిక్స్ కావలెను. ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగాలకు. 9849848817.

తిరుపతి ఏరియాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ అర్జెంటుగా కావలెను. మంచి జీతం. 85004 05004, 89854 22255.

THE EENADU WAY CLASSIFIEDS B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

శివయ్యకు వేడినీళ్ల అభిషేకం రేపు



ముక్కంటి ఆలయంలోని వాయులింగేశ్వరుని సన్నిధి

శ్రీకాళహస్తి: ఆరుద్రను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో విశేష వేడుకలు జరపనున్నారు. ఎక్కడా లేని విధంగా ఇక్కడి ఆలయంలో శనివారం శ్రీజ్ఞానప్రసూనాంబిక, శ్రీకాళహస్తీశ్వరుని ధ్రువమూర్తులకు వేడినీళ్లతో అభిషేకాలు జరపనున్నారు. ఉదయం 6 గంటలకు శ్రీశివకామ సుందరి సమేత నటరాజస్వామికి అభిషేకాలు జరిపి ఊరేగింపు చేస్తారు. పదిగంటలకు వేడినీళ్ల అభిషేకం సందర్భంగా దర్శనాలు నిలిపేస్తారు. ఉత్సవమూర్తులను ఉంచి దర్శనాలకు అనుమతించనున్నారు. ఇక రాత్రి ఆలయంలోని మహానంది ప్రతిమ వద్ద అరికట్ల ఉత్సవం నిర్వహించాక ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించనున్నారు.

తితిదేకు రూ.78 లక్షల ఔషధాల వితరణ

తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడికి పత్రాలు అందిస్తున్న దాత ప్రతినిధి, తితిదే బోర్డు సభ్యుడు సదాశివరావు ▸ విరాళం డీడీ అందిస్తున్న దాత పొన్నయ నాగేశ్వరన్ కుటుంబం

తిరుమల, న్యూస్‌టుడే: తితిదేకు హైదరాబాద్‌కు చెందిన త్రిశూల్ ఎంటర్‌ప్రైజర్స్ సంస్థ అధినేతలు చక్రధర్, శివరంజనిలు రూ.78 లక్షల విలువైన ఔషధాలను విరాళంగా అందించారు. దాతల తరపున తితిదే బోర్డు సభ్యుడు సదాశివరావు గురువారం స్థానిక తితిదే ఛైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్ బీఆర్ నాయుడికి ఔషధాలు అందజేశారు. కార్యక్రమంలో స్విమ్స్ సంచాలకుడు ఆర్.వి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షలు

తితిదే ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు చెన్నైకు చెందిన పొన్నయ నాగేశ్వరన్ రూ.50 లక్షలు విరాళంగా అందించారు. ఛైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్ బీఆర్ నాయుడికి కుటుంబసభ్యులతో కలిసి విరాళం డీడీని అందజేశారు.

వెంటాడి.. భయపెట్టి.. దోపిడీ

సినీ ఫక్కీలో రూ.2.18 లక్షల నగదు స్వాహా

మాస్కులు ధరించి ఆరా తీస్తున్న వ్యక్తులు, పల్సర్ బైక్ వద్ద మరో ఇద్దరు

నూలివీడు (గాలివీడు), న్యూస్‌టుడే: బంగారు నగలు బ్యాంకులో తాకట్టు పెట్టి నగదు తీసుకెళ్తున్న కుటుంబాన్ని వెంటాడిన దుండగులు అదను చూసి బెదిరించి దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటన నూలివీడులో బుధవారం రాత్రి 7 గంటల చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు గాలివీడు మండలం నూలివీడుకు చెందిన ఈశ్వరమ్మ, ఆమె భర్త ఇరగయ్య, మనవడితో కలిసి బుధవారం సాయంత్రం స్టేట్ బ్యాంకుకు వెళ్లింది. సొంత అవసరాల కోసం బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రూ.2.18 లక్షలు తీసుకున్నారు. ఆపై ఆటోలో నూలివీడు బస్టాండుకు చేరుకున్నారు. గాలివీడు నుంచి వీరిని బైకులో ఇద్దరు వెంటాడుతున్న విషయాన్ని గుర్తించలేదు. ఈ నేపథ్యంలో ఇరగయ్య పక్కకు వెళ్లగా.. స్థానిక పాఠశాలలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఈశ్వరమ్మ పాఠశాలలో వస్తువులు సరిచేయడానికి బడిలోకి వెళ్లింది. ఈ క్రమంలో వెంబడించిన ఇద్దరు ఇద్దరు దుండగులు మాస్కులతో గదిలోకి వెళ్లారు. అధికారులమని నమ్మించి ఆమె వద్ద ఉన్న నగదు సంచిని లాక్కున్నారు. గది తలుపులు వేసి అక్కడి నుంచి బైక్‌లో లక్కిరెడ్డిపల్లె మార్గం వైపు వెళ్లారు. ఈశ్వరమ్మ అరుపులు విన్న స్థానికులు గది తలుపులు తెరవగా దోపిడీ జరినట్లు బాధితురాలు వాపోయారు. దుండగుల కోసం గాలించినా ప్రయోజనం లేకపోయింది. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. నూలివీడు బస్టాండులో ఓ దుకాణం వద్ద ఉన్న సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై ఇరగయ్య, ఈశ్వరమ్మలను అనుసరించినట్లు కనిపించిందని పోలీసులు తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ డిప్యూటీ సీఎం

ఆలయం ఎదుట తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుటుంబ సభ్యులు తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని వైకుంఠ త్రయోదశినాడు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జమ్మూకశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. వీరితోపాటు ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, పులివర్తి నాని, తమిళనాడు మంత్రి గాంధీ, దివంగత నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, తితిదే బోర్డు సభ్యుడు ఆనంద్‌సాయి, వాసుకి దంపతులు, సినీనటి నవ్యాస్వామి ద్వార దర్శనం చేసుకున్నారు.

ముక్కంటి సేవలో ఎల్‌జీ .. శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: జమ్మూ, కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హా వాయులింగేశ్వరుని దర్శనార్థం వచ్చారు. ఈయనకు ఆలయ ఈవో బాపిరెడ్డి దక్షిణ గోపురం వద్ద గురువారం ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో రాహు, కేతు పూజలతో పాటు అభిషేక సేవల్లో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనం పూర్తయ్యాక వేదాశీర్వాదం, జ్ఞాపికతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ప్రొటోకాల్ ఏఈవో మోహన్ పాల్గొన్నారు.

కాళ్లు దువ్వుతున్న పందెం కోళ్లు

రైల్వేకోడూరు నియోజకవర్గంలో కోడి పందేలకు సై అంటున్నారు. ఓబులవారిపల్లె మండల పరిధిలోని గ్రామాల్లో ఏటా సంక్రాంతికి పందేలు పెద్దఎత్తున నిర్వహిస్తారు. పలుప్రాంతాల నుంచి పందెం కోళ్లను రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వెచ్చించి తెప్పిస్తున్నారు. మరోవైపు పెద్దఎత్తున నగదు సిద్ధం చేసుకుంటున్నారు. గతంలో గొడవలు జరిగిన నేపథ్యంలో పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె**

నీళ్లు లేక మరుగుదొడ్లకు తాళాలు

నూతన సంవత్సరం సందర్భంగా అత్యధికంగా భక్తులు వస్తారని తెలుసు. అయినా ప్రణాళిక లోపం కారణంగా యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీస అవసరాల దృష్ట్యా శివయ్య గోపురం ఆవరణలో టాయ్‌లెట్స్ ఏర్పాటు చేశారు. నీళ్లు నిల్వ చేయని కారణంగా గురువారం మధ్యాహ్నం వాటికి తాళాలు వేశారు. దర్శనార్థం వచ్చిన భక్తుల ఇక్కడకు రావడం, తాళాలు వేసి ఉండటంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. దాదాపు ఐదారు గంటల వరకు ఇదే పరిస్థితి. భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

నోటికి ప్లాస్టర్ అతికించి ఆభరణాల చోరీ

బాధితులతో మాట్లాడుతున్న ఎస్సై మహేష్

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బొంతవారిపల్లె సమీపంలో నివసిస్తున్న సోనుగారి విజయమ్మ ఇంట్లోకి బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బంగారు ఆభరణాలు చోరీ చేశారని ఎస్సై మహేష్ నాయుడు గురువారం తెలిపారు. ఇంట్లో విజయమ్మ, వారి పిన్ని ఇందిరమ్మ నిద్రిస్తున్న సమయంలో దొంగలు చొరబడి వారి నోటికి ప్లాస్టర్ అతికించి, బెదిరించి, సుమారు 8 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారని తెలిపారు. రెండు చైన్లు, తెల్లపూసల దండ, నాలుగు ఉంగరాలు, నాలుగు జతల కమ్మలు ఉండగా.. వీటి విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు చోరీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, విచారిస్తున్నామన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే లైసెన్సు రద్దు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపితే మూడు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని జిల్లా రవాణా శాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ పేర్కొన్నారు. 37వ జాతీయ భద్రతా మాసోత్సవాల ప్రారంభం సందర్భంగా తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు ద్వారా బ్యానర్లు విడుదల చేయించారు. అనంతరం డీటీవో కార్యాలయంలో 25 మంది హోంగార్డులు, డ్రైవర్లకు హెల్మెట్లు అందజేశారు. తిరుపతి జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా మార్చడానికి కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎంవీఐలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి ఆశలపై మంచుతెరలు

ఆలస్యమవుతున్న పూత, దిగుబడిపై తీవ్ర ప్రభావం

అక్కడక్కడ కనిపిస్తున్న మామిడి పూత

పుత్తూరు, బంగారుపాళ్యం, న్యూస్‌టుడే : మామిడి రైతులను మంచు ముంచేస్తోంది.. ఏడాది కష్టం నేలపాలయ్యే పరిస్థితి ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.. ఏటా ఏదోఒక కారణంతో నష్టాలపాలవుతున్నారు.. గతేడాది ఆశించిన దిగుబడి వచ్చినా తోతాపురి రైతుకు నష్టం తప్పలేదు.. గతేడాది నవంబరులో మొంథా, డిసెంబరులో దిత్వా తుపానుతో వర్షాలు కురిశాయి.. మామిడిలో డిసెంబరు 15 నాటికే మొగ్గ దశ ఉండాలి.. అధిక వర్షాల వల్ల పూత ఆలస్యమవుతోంది.. దీనికితోడు ఈ ఏడాది మంచు అధికంగా పడటం, ఉష్ణోగ్రతల్లో భారీ తేడాలతో వచ్చిన పూత మగ్గిపోయి బంక పడుతోంది.. ఫలితంగా దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి సాగు విస్తీర్ణంలో ప్రథమ స్థానంలో ఉంది. జిల్లాలో 1.05 లక్షల హెక్టార్లలో మామిడి సాగవుతోంది. ఈ విస్తీర్ణం ఏటికేడు పెరుగుతోంది. ఇక్కడ గుజ్జు కంపెనీలు సైతం ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏటా రైతులు దుక్కులు, నీటి తడులు అందించడం, సస్య రక్షణ చర్యలకు రూ. లక్షలు ఖర్చు చేస్తున్నా ఏదోఒక విపత్తుతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారు. గతేడాది నవంబరు, డిసెంబరులో అధిక వర్షాల వల్ల పూత ఆలస్యమై దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

పట్టించుకోని యాజమాన్యాలు..

గుజ్జు పరిశ్రమల యజమానులు టన్నుకు రూ.3,500 నుంచి రూ.6 వేల వరకు తమకు తోచినట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. చాలామందికి నేటికీ డబ్బు అందలేదు. అధికారులు మొక్కుబడి సమావేశాలు నిర్వహించడంతో రైతులు పరిశ్రమల చుట్టూ తిరుగుతున్నారు. ఈ ఏడాదైనా ఆశించిన మేర దిగుబడి వస్తుందని ఊహించిన వారు ప్రస్తుతం మంచుతో దిగాలు చెందుతున్నారు. పూత నల్లగా మారి బంక కారే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి..

ఉష్ణోగ్రత అనుకూలిస్తే ఆశించిన దిగుబడులు వస్తాయి. లేదంటే దిగుబడి తగ్గొచ్చు. పూత ఆలస్యమవుతోంది. తేనెమంచు పురుగు నివారణకు ఇమిడాక్లోపిడ్ లీటరు నీటికి 0.33 మి.లీ, కార్బొడైజిన్ ఒక గ్రాము.. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కాదర్ లాంటి రకాల్లో డైజర్ కోనోజిల్.. లీటరు నీటికి 0.5 మి.లీటర్లు కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. గూడు పురుగు నివారణకు అసిఫేట్ ఒక లీటరు నీటికి 125 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. తద్వారా కొంతమేర వాటి నుంచి కాపాడుకోవచ్చు.

-వెంకట సౌజన్య, ఉద్యానశాఖ అధికారిణి, పుత్తూరు

(c) eenadu

తిరుపతి
•తిరుపతి • చంద్రగిరి

జూను సందర్శించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.ఎస్.చందూర్కర్ గురువారం తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతుప్రదర్శనశాలను కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. జూ క్యూరేటర్ సెల్వం, అధికారులు వారికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జూను సందర్శించడం సంతోషంగా ఉందని, నిర్వహణ బాగుందని, వన్యప్రాణుల సంరక్షణ మెరుగ్గా ఉందని న్యాయమూర్తి తెలిపారు.

సీతాకోక చిలుకల పార్కును సందర్శించి వస్తున్న జస్టిస్ ఏ.ఎస్.చందూర్కర్

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుచానూరు: శ్రీపద్మావతీ అమ్మవారిని గురువారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జ్యోతిర్మయి, జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబ సభ్యులతో వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద న్యాయమూర్తులకు సూపరింటెండెంట్లు సురేష్‌బాబు, రమేష్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

ఆదాయం రూ.7 లక్షలు

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలను గురువారం పెద్ద సంఖ్యలో సందర్శించారు. జూను సందర్శించిన వారిలో 6500 మంది పెద్దలు, 1100 మంది పిల్లలు ఉన్నారని జూ అధికారులు తెలిపారు. వీరి ద్వారా జూకు సుమారు రూ.7 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు.

వెంగమాంబ విశ్రాంతి భవనం వద్ద వేచి ఉన్న భక్తులు

సర్వదర్శనం క్యూలైన్ల వద్ద భక్తుల పడిగాపులు

సిబ్బందితో స్వల్ప వాగ్వాదం

ఈనాడు డిజిటల్, తిరుపతి: వైకుంఠ ద్వార దర్శనం కోసం వేచి ఉన్న భక్తులతో తిరుమల వీధులు కిక్కిరిసిపోయాయి. గురువారం రాత్రి మాతృశ్రీవెంగమాంబ విశ్రాంతి భవనం పక్కన సర్వదర్శనం క్యూలైన్ల వద్ద భక్తులకు, భద్రతా సిబ్బందికి మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. తమకు మరుసటి రోజు రైలు ప్రయాణాలు ఉన్నాయని, దర్శనం ఆలస్యమైతే రైలు తప్పుతుందన్న ఆందోళనతో కొంతమంది భక్తులు తమను క్యూలైన్లలోకి ముందే అనుమతించాలని సిబ్బందిని కోరారు. అయితే అప్పటికే క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయని, భక్తుల భద్రత దృష్ట్యా ప్రస్తుతం లైన్లోకి పంపడం సాధ్యం కాదని సిబ్బంది నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభమవుతుందని, అప్పటి వరకు వేచి ఉండాలని లేదా విశ్రాంతి భవనాలకు వెళ్లాలని సూచించారు. సిబ్బంది చెప్పిన మాటలకు సంతృప్తి చెందని కొంతమంది భక్తులు ఆవేదనతో కాసేపు రోడ్డుపైనే వేచి చూశారు. దీంతో అక్కడ కాస్త రద్దీ పెరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని భక్తులతో మాట్లాడారు. రద్దీ తీవ్రత, భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న నిర్ణయాలను వివరించడంతో భక్తులు శాంతించారు. అనంతరం పోలీసులు పరిస్థితిని సర్దుబాటు చేయడంతో గందరగోళం తొలగింది.

చెర్లోపల్లి కూడలి.. ట్రాఫిక్ కడలి

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: నగరంలోని ట్రాఫిక్ సమస్య గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించింది. తిరుపతిలో అడుగడుగునా ఉన్న ట్రాఫిక్ సమస్య ఇటీవల కాలంలో శివారు ప్రాంతాల కూడళ్లలోనూ ఎక్కువగా కనిపిస్తోంది. తిరుపతి స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి సొంత వాహనాలు, బస్సుల్లో వచ్చే భక్తులు ఆకస్మిక ట్రాఫిక్ స్తంభనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు.

గురువారం స్తంభించిన ట్రాఫిక్

రోజురోజుకీ మరింత జటిలం

తిరుపతితో సంబంధం లేకుండా నేరుగా తిరుమలకు వెళ్లేందుకు అవకాశం ఉన్న ఏకైక మార్గం చెర్లోపల్లి కూడలి నుంచి బైపాస్ రోడ్డు మీదుగా అలిపిరి చేరుకునే మార్గం. ఇటీవల ఈ కూడలిలో బెంగళూరు, మదనపల్లి, చిత్తూరు ప్రాంతాలతో పాటు చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అలిపిరి చేరుకునేందుకు సులువైన మార్గం ఇది. ఇటీవల శ్రీనివాస మంగాపురం నుంచి చెర్లోపల్లి, నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిలోని వకుళమాత ఆలయ కూడలి నుంచి వచ్చే మరో రోడ్డు, చంద్రగిరి-తిరుపతి, అలిపిరి-చెర్లోపల్లి రోడ్డు ఇక్కడే కలుస్తాయి. దీంతో నిత్యం వేలాది వాహనాలు చెర్లోపల్లి కూడలి మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి.

❖ ఇటీవల ప్రభుత్వం అన్ని రోడ్లను ఆధునికీకరించడంతో వాహనాల రద్దీ ఎక్కువైంది. కూడలి సమీపంలో జూపార్క్ ఉండడం, మరోవైపు ఆన్‌లైన్ పరీక్షా కేంద్రంలో నిత్యం పరీక్షలు జరుగుతుండటం కూడా ట్రాఫిక్ సమస్యకు ఒక కారణం.

శివారు ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

నగర ట్రాఫిక్ సమస్య శివారు ప్రాంతాల నుంచే ప్రారంభం అవుతుంది. ఎక్కువగా తిరుపతి- తిరుచానూరు మార్గంలోని మార్కెట్ యార్డు వద్ద, జాతీయ రహదారి నుంచి నగరంలోకి ప్రవేశించే, బయటికి వెళ్లే తాజ్‌హోటల్ కూడలి, రాయల్ చెరువు రోడ్డు కూడలి, రామానుజపల్లి కూడలిలో ఇదే సమస్య కనిపిస్తుంటుంది. వాస్తవానికి ఈ ప్రాంతాల్లో గతంలో పోలీసుల పర్యవేక్షణ ఉండేది కాదు. ఇటీవల కాలంలో ఎక్కువగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండడం పోలీసులు సైతం దృష్టి సారించారు. అయినా సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో భక్తులు, స్థానికులకు ట్రాఫిక్ సమస్యలు శివారు ప్రాంతంలోనే రుచి చూసి నగరంలోకి ప్రవేశించాల్సి వస్తోంది.

ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం, అస్తవ్యస్తంగా ఈ కూడలి ఉండడం, దుకాణాలు రోడ్డుపైకి చేరడం వంటివి సమస్యకు మూల కారణాలు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: సమస్య: బైరాగిపట్టెడలోని రామానాయుడు నగరపాలిక పాఠశాల ఎదురుగా అపరిశుభ్రత ఎక్కువగా ఉంది. – **భరత్, బైరాగిపట్టెడ**

సమస్య: ప్రకాశం పార్కు నుంచి పక్కన ఖాదీ కాలనీ వెళ్లే మార్గంలో పార్కు ప్రహరీని ఆనుకొని ఉన్న స్థలాన్ని చిరు వ్యాపారులు ఆక్రమించారు. వారి వ్యాపారం పూర్తయ్యాక వ్యర్థాలను అక్కడే వదిలేసి వెళ్తున్నారు. – **గణేష్**

సమాధానం: వ్యాపారులను హెచ్చరించి శుభ్రత పెంపొందిస్తాం. – **డా.యువ అన్వేష్, వైద్యాధికారి**

బాధ్యతలు వదిలేసిన వారే అనాథలు

తిరుపతి(నేరవిభాగం): పుట్టుకతో ఎవరూ అనాథలు కారని.. బాధ్యతలు వదిలేసిన వారే నిజమైన అనాథలని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి జీవకోనలోని రైజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలోని అనాథ శరణాలయాన్ని సందర్శించారు. విద్యార్థులతో కలిసి కేకు కోశారు. విద్యార్థులకు టవల్స్, నోట్‌బుక్స్, సబ్బులు, స్టేషనరీ సామగ్రి అందజేశారు. సీఐ రామ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు విద్యాసామగ్రి అందజేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

ఎర్రచందనం పరిరక్షణలో విజయాలు సాధించాలి

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: ఏపీ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కొత్త ఏడాదిలో ఎర్రచందనం పరిరక్షణలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఏఎస్పీ జె.కులశేఖర్, డీఎస్పీ వి.శ్రీనివాసరెడ్డి, ఎండీ షరీఫ్, ఏసీఎఫ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేకు కోస్తున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, చిత్రంలో సిబ్బంది

భక్తిశ్రద్ధలతో 'నూతన' వేడుకలు

న్యూస్‌టుడే బృందం: నూతన సంవత్సరాది సందర్భంగా గురువారం తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లోని ప్రధాన దేవాలయాలు అశేష భక్తజనంతో కిటకిటలాడాయి. ● శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి నిజనేత్ర స్వరూపంతో భక్తులకు దర్శనమిచ్చారు. ● తలకోనకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చి సిద్ధేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చంద్రగిరి వైకాపా ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తదితరులు స్వామిని దర్శించుకున్నారు. ● తుమ్మలగుంటలోని కల్యాణ వెంకటేశ్వర స్వామిని ఎంపీ గురుమూర్తి దర్శించుకున్నారు. చిగురువాడ వద్ద ఉన్న స్వర్ణముఖి పార్వతీ పరమేశ్వరుల ఆలయంలో నూతన సంవత్సరానికి మహాభిషేకం వేడుకలు నిర్వహించారు.

చంద్రగిరి: అలంకరణలో శ్రీమల్లేశ్వరస్వామి

స్వర్ణముఖి పార్వతీ పరమేశ్వరస్వామి

తలకోనలో మాజీ మంత్రి రామచంద్రారెడ్డికి ప్రసాదాలు అందిస్తున్న ఆలయ నిర్వాహకులు

మంత్రి నారాయణకు సూపర్ సిక్స్ షీల్డ్ అందజేస్తున్న ఆర్సీ మునికృష్ణ, రుద్రకోటి సదాశివం

మంత్రి నారాయణను కలిసిన ఉప మేయర్

తిరుపతి(నగరం): రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణను నెల్లూరులోని ఆయన నివాసంలో గురువారం తిరుపతి ఉప మేయర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం ఆయనకు సూపర్ సిక్స్ ప్రభుత్వ పథకాల షీల్డ్ అందజేశారు.

స్వామీ.. నిన్ను దర్శించాలని!

తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి మొదటి మూడు రోజులు ఈ-డిప్ టోకెన్లున్న భక్తులను మాత్రమే అనుమతించారు. జనవరి 2 నుంచి టోకెన్లు లేని భక్తులను కూడా అనుమతిస్తున్న నేపథ్యంలో గురువారం ఉదయం నుంచే భక్తులు తిరుమలకు పెద్దఎత్తున తరలి వస్తున్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో గరుడ కూడలి నుంచి నంది కూడలి వైపు ట్రాఫిక్ స్తంభించడంతో శ్రీవారి భక్తులు ఇబ్బందులు పడ్డారు. తిరుమలకు వెళ్లే బస్సులు తగినన్ని లేకపోవడంతో బాలాజీ లింకు బస్టాండ్‌లో వచ్చిన ప్రతి బస్సు వద్దకూ భక్తులు పరుగులు తీశారు. సీటు కోసం పోటీ పడ్డారు. ఇదే పరిస్థితి ఆర్టీసీ సెంట్రల్ బస్టాండ్‌లో కనిపించింది. **-ఈనాడు, తిరుపతి**

సీఎస్సై చర్చిలో ప్రార్థనలు

పాకాల, న్యూస్‌టుడే: స్థానిక సీఎస్సై, ఆర్సీఎం చర్చిల్లో గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

ఎన్టీఆర్ వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిగా శ్రీకాంత్

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నూతన పరీక్షల నియంత్రణాధికారిగా తిరుపతి స్విమ్స్ అనాటమీ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఐదేళ్లుగా పరీక్షల నియంత్రణాధికారి పనిచేసిన డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు డిసెంబరు 31వ తేదీతో గడువు ముగిసిన విషయం విదితమే. ఆయన సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫిజియాలజీ ప్రొఫెసర్‌గా చేరారు.

కలెక్టర్ వెంకటేశ్వర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న జనార్దన్‌రెడ్డి, రమణప్రసాద్

కలెక్టర్‌ను కలిసిన పర్యాటకశాఖ అధికారులు

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని గురువారం కలెక్టర్ డా.వెంకటేశ్వర్‌ను పర్యాటక ఆర్‌జేడీ రమణప్రసాద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి ఎం.జనార్దన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు సంబంధించిన చిత్రాలతో కూడిన జ్ఞాపికను జనార్దన్‌రెడ్డి ఆయనకు అందజేశారు.

పుట్టినరోజు వేడుక

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: స్థానిక ఖాదీకాలనీలో అఖిల భారతీయ యాదవ సంఘం కార్యదర్శి శంకర్‌యాదవ్ జన్మదిన వేడుకలను గురువారం ఆయన సన్నిహితులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఆయన్ని తెదేపా నాయకులు అన్నా రామచంద్రయాదవ్, నరసింహయాదవ్, ఆర్సీ మునికృష్ణ, బాలయాదవ్, అశోక్ సామ్రాట్‌యాదవ్, చిరంజీవి యాదవ్, ప్రకాష్‌యాదవ్, జీవయాదవ్, హరియాదవ్, మునికృష్ణ, శ్రీధర్‌వర్మ, చిట్టిబాబుయాదవ్, భాస్కర్, సుబ్రహ్మణ్యం ఘనంగా సత్కరించారు.

శంకర్‌యాదవ్‌ను సత్కరిస్తున్న నరసింహయాదవ్, శ్రీధర్‌వర్మ, నాయకులు

తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌ను సత్కరిస్తున్న పుష్పావతియాదవ్, నాయకులు

తితిదే ఈవోను కలిసిన నాయకులు

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని గురువారం తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, కలెక్టర్ డా.వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడును నగరానికి చెందిన తెదేపా నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. అధికారులను కలిసిన వారిలో పుష్పావతియాదవ్, సురా సుధాకర్‌రెడ్డి, డా.కోడూరు బాలసుబ్రహ్మణ్యం, బుల్లెట్ రమణ, బీసీ కృష్ణయాదవ్ ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అండగా నిలుస్తాం

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగులకు అండగా నిలుస్తామని ఎంప్లాయీస్ యూనియన్ మంగళం డిపో గౌరవ అధ్యక్షుడు, జనసేన నాయకుడు, వాకర్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక మంగళం, ఏపీపీటీడీ(ఆర్టీసీ) డిపోలో గురువారం ఉద్యోగులకు ట్రావెలింగ్ బ్యాగులు, డైరీలు, మిఠాయిలు, క్యాలెండర్లను అస్టర్ నారాయణాద్రి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచితంగా పంపిణీ చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఈ.రమేష్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మురగమ్మ, జోనల్ కమిటీ సభ్యుడు ఎ.మనోజ్, జిల్లా అధ్యక్షుడు జి.ఆర్.చంద్ర, కార్యదర్శి వి.మస్తాన్, డిపో అధ్యక్ష, కార్యదర్శులు బి.శేషాద్రి, వెంకటేశ్వరబాబు, బి.రామారావు పాల్గొన్నారు.

ఉద్యోగినికి బ్యాగు అందజేస్తున్న ఆర్కాట్ కృష్ణప్రసాద్

ఎస్వీయూలో శ్రీవారిని దర్శించుకున్న భక్తులు

తిరుపతి(ఎస్వీయూ), న్యూస్‌టుడే: నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని గురువారం శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో వెలసిన శ్రీజ్ఞానప్రద శ్రీవేంకటేశ్వర స్వామి వారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ఏర్పాట్లను ఇంజినీరింగ్ శాఖ, విశ్రాంత ఆచార్యులు కె.ఎం.భాను, అర్చకులు కౌశిక్, నరసింహన్, సిరిగిరి రమేష్ బాబు, ఆడిటోరియం శ్రీనివాస రావు, ప్రభాకర్, చంద్రశేఖర్‌రాజు తదితరులు పర్యవేక్షించారు. భక్తులు స్వచ్ఛందంగా ఆలయం ప్రాంగణంలో ధ్వజ స్తంభం నిర్మాణానికి విరాళాలు అందజేశారు.

కేకు కోస్తున్న ఎమ్మెల్యే ఆరణి, కూటమి నేతలు

వికసిత్ ఏపీగా నిలిపేందుకు కృషి

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గురువారం తన కార్యాలయంలో కూటమి నేతలతో కలిసి కేకు కోశారు. వికసిత్ ఏపీగా నిలిపేందుకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషి ఫలిస్తుందని ఆయన ఆకాంక్షించారు. ● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జనసేన పార్టీని బలోపేతం చేసి, పార్టీ పటిష్ఠతకు ఈ ఏడాది అడుగులేయనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శ్రేణులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.

రేపు ఎమ్మెల్యే ఆరణి జనవాణి

ప్రజా సమస్యల పరిష్కార వేదికైన జనవాణి కార్యక్రమం శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగనుంది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యం

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: నగర పరిశుభ్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవని తిరుపతి డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు రాపూరు ప్రసాద్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం స్థానిక 13వ వార్డు ఎస్టీవీనగర్‌కు చెందిన పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ దుస్తులు, మిఠాయిలు పంపిణీ చేశారు.

రూ.25 లక్షలు చెల్లించారు.. సగంలోనే వదిలేశారు

✦ పాకాల నడిబొడ్డులో వృథాగా భవన నిర్మాణం

పాకాల, న్యూస్‌టుడే: మండల కేంద్రం పాకాలలోని దినసరి కూరగాయల మార్కెట్ ఎదురుగా దామలచెరువు-పాకాల రహదారి పక్కనున్న స్థలంలో గ్రామ పంచాయతీ నిధులతో సుమారు నాలుగేళ్ల కిందట రెండంతస్తుల భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. మొదటి అంతస్తు పూర్తి కాగానే రూ.16 లక్షలు, రెండో అంతస్తు నిర్మాణంలో ఉండగానే రూ.9 లక్షలు చెల్లించేశారు. టౌన్ మధ్యలో ఉండటంతో ఈ భవన నిర్మాణ పనులు పూర్తయితే షాపింగ్ కాంప్లెక్సు ఏర్పాటు చేయడం ద్వారా గ్రామ పంచాయతీకి అద్దె వస్తుందని ప్రచారం జరిగింది. ఏమైందో తెలియదుగానీ భవన నిర్మాణాన్ని సగంలోనే వదిలేశారు. ఇప్పుడు ఆ నిర్మాణం వృథాగా మారింది. రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇంతకీ ఈ స్థలం ఎవరిది?

తాజాగా మరో వివాదం మొదలైంది. అసలు ఈ భవనం నిర్మించిన స్థలం గ్రామ పంచాయతీకి చెందినది కాదన్న వాదన బలంగా వినిపిస్తోంది. రెవెన్యూ స్థలంలో అనుమతి తీసుకోకముందే నిర్మాణ పనులు చేపట్టడమేగాక అప్పటి అధికారులు నిధులు చెల్లించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు రెవెన్యూ శాఖ తన స్థలాన్ని స్వాధీనం చేసుకుంటే ఖర్చు పెట్టిన నిధుల సంగతేంటని వారు ప్రశ్నిస్తున్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన నిధులను గుత్తేదార్లకు అప్పనంగా చెల్లించిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులుగానీ, అనుమతికి అభ్యర్థనలు గానీ తన వద్దకు రాలేదని తహసీల్దారు సాయిసంతోష్ తెలిపారు. వెంటనే సిబ్బందిని పంపి సంబంధిత స్థలాన్ని పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు.

రక్తదాతలకు స్విమ్స్ సన్మానం

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: అత్యధిక సంఖ్యలో పునరావృత సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ రక్తదాతలను స్విమ్స్ సంచాలకుడు డాక్టర్ ఆర్వీ కుమార్ ఘనంగా సన్మానించారు. స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ విభాగంలో ఎక్కువసార్లు రక్తదానం చేసిన టి.ధనంజయ, పీఆర్ కృష్ణవర్ధన్ బాబు, పీకే రాజేష్‌బాబు, పూజారి రవి, ప్రదీప్‌లను గురువారం సత్కరించారు. క్రమం తప్పకుండా ప్లేట్‌లెట్స్ దానం చేస్తూ ప్రాణాలు కాపాడటంతో దాతలు చూపిన నిబద్ధతను సంచాలకుడు అభినందించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి డాక్టర్ శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలను సన్మానించిన స్విమ్స్ సంచాలకుడు ఆర్వీ కుమార్

సావిత్రిబాయి ప్యాకెట్ పుస్తకాల ఆవిష్కరణ

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: తిరుపతి బీసీ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కూడలిలో సావిత్రి బాయి పులే విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా ఆమె జీవితం గురించి బీసీ సంఘర్షణ సమితి మూడు వేలు ప్యాకెట్ సైజ్ పుస్తకాలు ప్రచురించింది. వీటిని గురువారం కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. పుస్తక రూపకర్తలు డా.సాకం నాగరాజ, డి.మస్తానమ్మ, బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సాకం ప్రభాకర్, కమిటీ సభ్యుడు బి.వి.కేశవులు పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంక్ కాలమానిని ఆవిష్కరణ

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్ నూతన సంవత్సరం-2026 కాలమానిని ఆవిష్కరించారు. స్థానిక శ్రీగోవిందరాజస్వామి కోనేరు వద్ద ప్రధాన కార్యాలయంలో గురువారం బ్యాంక్ పాలకవర్గ సభ్యులు, ఉద్యోగుల చేతుల మీదుగా నూతన కాలమానిని ఆవిష్కరించారు. బ్యాంకు ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ వాసు యాదవ్, డైరెక్టర్లు, ఎండీ శివకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరిస్తున్న టౌన్‌బ్యాంక్ పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు

అంతర్జాతీయ స్థాయి జర్నల్స్‌గా గుర్తింపు సాధించాలి

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో పరిశోధనలు, పబ్లికేషన్లు పెంచేందుకు గతేడాది గ్యానవి, గమనం పేరుతో ప్రారంభించిన జర్నల్స్ జాతీయ స్థాయి జర్నల్స్‌గా గుర్తింపు సాధించాలని వర్సిటీ ఉపకులపతి ఆచార్య వి.ఉమ పేర్కొన్నారు. గురువారం ఉపకులపతి బంగ్లాలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. గతేడాది వర్సిటీలో జరిగిన అభివృద్ధి, ప్రాజెక్టుల నివేదికను విడుదల చేశారు. రిజిస్ట్రార్ రజిని, డీన్లు, డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

(c) eenadu

శ్రీకాళహస్తి

• శ్రీకాళహస్తి • సత్యవేడు • రైల్వేకోడూరు

కలెక్టర్ వెంకటేశ్వర్‌కు మొక్కను అందజేస్తున్న శాంతిదుర్గ

కలెక్టర్‌కు శుభాకాంక్షలు

శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని రాష్ట్ర ఉద్యోగుల సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు, శ్రీకాళహస్తి సీడీపీవో శాంతిదుర్గ గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సహచర ఉద్యోగినులతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని మొక్కను జ్ఞాపికగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

తహసీల్దారుగా తనూజ

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండల ఇన్‌ఛార్జి తహసీల్దారుగా తనూజ గురువారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్‌లో డీటీగా పనిచేస్తున్న ఆమెను కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక్కడ తహసీల్దారుగా నియమించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో భూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని అన్నారు.

శంకర్ రెడ్డికి సత్కారం

కేవీబీపురం: నియోజకవర్గ తెదేపా సమన్వయకర్త కూరపాటి శంకర్ రెడ్డిని కేవీబీపురం తెలుగు తమ్ముళ్లు గురువారం నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆయన నివాసంలో కలిసిన శాలువా కప్పి గజమాలతో ఘనంగా సత్కరించారు. మునస్వామి యాదవ్, సర్పంచులు దొరబాబునాయుడు, వెంకటేష్ యాదవ్, ప్రకాష్ నాయుడు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో దామోదరనాయుడు

నిబంధనలు తప్పనిసరి

శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: రోడ్డుప్రమాదాలను నియంత్రించేందుకు వాహన చోదకులు విధిగా నిబంధనలు పాటించాలని శ్రీకాళహస్తి మోటారు వాహనాల తనిఖీ అధికారి దామోదరనాయుడు తెలిపారు. వాహన చోదకులకు అవగాహన కల్పిస్తూ గురువారం రహదారి భద్రత మాసోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో శ్రీకాళహస్తి పరిధిలో 2025లో ప్రమాదాలు పెరిగాయని పేర్కొన్నారు. ప్రమాద రహిత ప్రాంతంగా మార్చేందుకు కలిసికట్టుగా కృషిచేద్దామని పిలుపు నిచ్చారు.

మొక్క అందజేస్తున్న సేవ్ ఆక్సిజన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

మొక్కల పెంపకం అందరి బాధ్యత

ఏర్పేడు, న్యూస్‌టుడే: మొక్కలు పెంపకం అందరి బాధ్యతని శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయ పాలకమండలి ఛైర్మన్ గిరినాయుడు తెలిపారు. సేవ్ ఆక్సిజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం గుడిమల్లంలో ఉచితంగా మొక్కలు పంపిణీ చేసి మాట్లాడారు. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించుకోవడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. కేశవులు, గిరీష్, ఉమాశంకర్, అన్నాదొరై, శంకర్‌నాయుడు పాల్గొన్నారు.

చిరు ప్రయత్నం.. పోషకాలు ఘనం

కార్డుదారులకు రాగులు, జొన్నల పంపిణీ

చౌకదుకాణాల్లో నిత్యావసర సరకుల పంపిణీ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ప్రజల్లో ఆరోగ్యసిద్ధి కోసం ప్రభుత్వం చౌక దుకాణాల్లో బియ్యం పంపిణీకి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు పంపిణీకి శ్రీకారం చుట్టింది. మూడు నెలలుగా వీటి పంపిణీ కొనసాగుతోంది. వీటిని తీసుకునేందుకు కార్డుదారులు ఎంతో ఉత్సాహాన్ని చూపడం విశేషం.

ఆరోగ్యసిద్ధే లక్ష్యంగా

ఎక్కువ పాలిష్ చేసిన బియ్యాన్ని ఉడికించి అన్నం రూపంలో తీసుకోవడంలో గ్లుకోజ్, పిండిపదార్థాలు మోతాదుకు మించి శరీరంలోకి చేరుతున్నాయి. ఫలితంగా చిన్న, మధ్య వయసులోనే మధుమేహ వ్యాధిగ్రస్తులుగా మారుతున్నారు. దీన్ని నియంత్రించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం అమల్లోకి తీసుకువచ్చింది. అందుకు ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో అందుబాటులోని రాగులు, జొన్నలతో తయారయ్యే ఆహార పదార్థాలు వాడేందుకు ప్రజలు ఎంతో ఆసక్తిని కనబరుస్తున్నారు. దీన్ని ప్రజలకు అందుబాటులోనికి తీసుకువచ్చేలా ఈ నిర్ణయం తీసుకున్నారు.

లబ్ధి పొందే కార్డుదారుల వివరాలు ఇలా..

నియోజకవర్గం	కార్డులు	లబ్ధిదారులు
శ్రీకాళహస్తి	87,904	2,52,902
సత్యవేడు	70,955	2,04,206
రైల్వేకోడూరు	76,794	2,68,047
మొత్తం	2,35,653	7,25,155

పేదల శ్రేయస్సే ధ్యేయం

మార్కెట్ పరంగా డిమాండ్ ఎక్కువగా ఉన్న చిరుధాన్యాలు బియ్యానికి ప్రత్యామ్నాయంగా పేదలకు అందుబాటులోనికి తీసుకురావాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఇంట్లో ఒక్కరికి ఐదు కిలోల బియ్యాన్ని ఉచితంగా అందజేస్తోంది. మూడు నెలలుగా చౌక దుకాణాల ద్వారా బియ్యం నిల్వలు తగ్గించి అవసరమైన వాళ్లకు ఒకరికి కిలో వంతున కిలో రాగులు, జొన్నలు పంపిణీకి జిల్లా పౌరసరఫరాల విభాగం చేపట్టడం విశేషం.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308
ఓబులవారిపల్లె: 99664 67525

సత్యవేడు : సమస్య: మండల పరిధి జడేరి గ్రామంలోని పలు వీధుల్లో కాలువల్లో మురుగు నిలిచి రాత్రిపూట దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. **- సుబ్రహ్మణ్యం, స్థానికుడు**

సమాధానం: వెంటనే పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేపడతాం. **- బాబు యాదవ్, సర్పంచి**

నాగలాపురం, న్యూస్‌టుడే: సమస్య: నాగలాపురంలోని బ్రాహ్మణ వీధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. రహదారి పక్కనే చెత్తాచెదారాలు పేరుకున్నాయి. మురుగు కాలువలు నిర్మించినా శుభ్రం చేయడం లేదు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. **- కమ్రుద్దీన్, నాగలాపురం**

సమాధానం: వెంటనే పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. **- రాధిక, ఈవో, నాగలాపురం**

రేణిగుంట, న్యూస్‌టుడే:

సమస్య: పంచాయతీలోని వీఎం వీధిలో దీపం వెలగడం లేదు. చీకటిగా మారి రాత్రుల్లో రాకపోకలకు ఇబ్బంది ఉంది. **- రమేష్, స్థానికుడు**

సమాధానం: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- నాగేశం, సర్పంచి, రేణిగుంట**

పుల్లంపేట, న్యూస్‌టుడే: సమస్య: శ్రీ రాములపేట కాలనీలో చెత్త పేరుకుపోయింది. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. **- రామకృష్ణ, డ్రైవర్**

సమాధానం: చెత్త వేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. చర్యలు తీసుకుంటాం. **- బాలాజీ, పీఎస్, దళవాయపల్లె**

కోతల్లేని విద్యుత్తు సరఫరా

ఈనాడు కథనానికి స్పందన

పిచ్చాటూరు: మండలంలోని గొల్లకండ్రిగ, రామగిరి, అడవికండ్రిగ, రెప్పాలపట్టు, టీకే పురం గ్రామాల్లో ఇకపై కోతలు లేకుండా విద్యుత్తు సరఫరా అందిస్తామని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ సుబ్రహ్మణ్యంరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లోని కోతలపై గతేడాది డిసెంబర్ 30వ తేదీన "నిరంతర విద్యుత్తు. . అదెక్కడా..?" శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ప్రభుత్వం చేపట్టిన ఆర్‌డీఎస్ఎస్ పథకంలో మండలంలో కొత్తగా 1000కిపైగా స్తంభాలను మార్చే ప్రక్రియతో ఇబ్బందులు తలెత్తాయన్నారు.

నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: నూతన ఆంగ్ల సంవత్సరాది ప్రారంభం ప్రశాంతంగా ముగిసింది. పోలీసుల పకడ్బందీ చర్యలతో పౌరులు ఇళ్ల వద్దనే వేడుకలు ప్రశాంతగా జరుపుకున్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచే తనిఖీలు నిర్వహించారు. గతంలో రోడ్లపైనే కేకు కటింగ్‌లు, వాహన రేసింగ్, కేకలు, అరుపులు జరిగేవి. ఉన్నతాధికారుల ఆదేశాలతో డీఎస్పీ నరసింహమూర్తి, సీఐలు ప్రకాష్‌కుమార్, నాగార్జునరెడ్డి, తిమ్మయ్యలు పకడ్బందీ చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి దాటాక బ్రీత్ అనలైజర్‌తో పరీక్షలు జరిపారు.

ముక్కంటి దర్శనార్థం వచ్చిన సినీనటుడు ప్రభాస్ పెద్దమ్మ శ్యామలాదేవి

గుంతకల్ ఎమ్మెల్యే జయరాంకు వేదాశీర్వాదం చేస్తున్న పండితులు

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సినీనటుడు ప్రభాస్ పెద్దమ్మ శ్యామలాదేవి (కృష్ణంరాజు సతీమణి) వారి కుటుంబీకులతో కలిసి వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఆమెకు గురువారం ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్వామి, అమ్మవార్లనుద దర్శించుకున్న అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎమ్మెల్యే పూజలు..

గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబ సభ్యులతో కలసి ముక్కంటీశుని దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన వీరికి గురువారం ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వాదం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జమ్మూకశ్మీర్ ఎల్‌జీకి వీడ్కోలు

రేణిగుంట, న్యూస్‌టుడే: జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు రేణిగుంట విమానాశ్రయంలో ఘన వీడ్కోలు లభించింది. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చిన ఆయన గురువారం మధ్యాహ్నం ఇక్కడ్నించి వెళ్లారు. అదే విధంగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక విమానంలో ఇక్కడ్నించి హైదరాబాదుకు వెళ్లారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో వీరికి డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు వీడ్కోలు పలికారు.

నియంత్రిక.. ప్రమాద ఘంటిక

మండల కేంద్రంలోని హోమియో ఆసుపత్రి ప్రహరీ గోడకు ఆనుకుని హైవోల్టేజి విద్యుత్తు నియంత్రిక ఉంది. రక్షణ లేక ప్రమాదకరంగా మారింది. చిన్నపిల్లలు, వృద్ధులు, వైద్యశాలకు వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. అటుగా రాకపోకలు సాగించే మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బీయన్ కండ్రిగ**

నాడు అధ్వానం.. నేడు ప్రగతిపథం

నాడు గుంతలతో..

ప్రయాణికులకు ఆరేళ్ల నరకం చూపిన వరదయ్యపాళెం-సత్యవేడు రహదారి కూటమి ప్రభుత్వం రాగానే అద్భుతంగా మారింది. వైకాపా ప్రభుత్వ హయాంలో అడుగు లోతు గుంతలతో అడుగడుగునా అవస్థలు తప్పలేదు. చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి ప్రత్యక్ష నరకాన్ని చూపారు. ఈ మార్గంలో సత్యవేడు, శ్రీసిటీ పరిశ్రమలు, హీరో, అపోలో వంటి పరిశ్రమలకు రాకపోకలు సాగించే కార్మికులు, వాహనచోదకుల కష్టాలు వర్ణనాతీతం. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో రహదారి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి పనులు చేయించారు. ప్రస్తుతం ప్రజలు, వాహనదారుల ప్రయాణం సాఫీగా సాగుతుంది. **- న్యూస్‌టుడే, వరదయ్యపాళెం**

నేడు సుందరంగా..

నీరు వృథా.. దుర్గంధం నిండా

మండలంలోని వీఆర్ కండ్రిగ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నీటి తొట్టె పైపులైన్ మరమ్మతు కారణంగా తాగునీరు వృథా అవుతుంది. ట్యాంకు నుంచి నీటి తొట్టెకు వెళ్లే పైపు లైను దెబ్బతినడంతో నీరంతా ఆవరణలో చేరి దుర్గంధంగా మారింది. పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్యం లోపించి విషపురుగులకు ఆవాసంగా మారింది. ఆకతాయిలు మద్యం సీసాలు పడేస్తుండటంతో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సత్యవేడు**

మురుగు మరుగయ్యేనా..?

నాగలాపురం వీకేఎం వీధిలోని పాతసామన్ల దుకాణం వద్ద మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. ప్లాస్టిక్ సీసాలు, పాత సామాన్లు కాలువల్లోనే దుకాణదారుడు పడేస్తుండటంతో ఈ సమస్య ఏర్పడింది. దీంతో వ్యర్థ జలాలు కాలువపైకి పొర్లి రహదారిపై ప్రవహిస్తున్నాయి. స్థానికులు దుర్గంధాన్ని భరిస్తూ నడక సాగించాల్సి వచ్చింది. అధికారులు స్పందించి కాలువల నిర్వహణ పట్ల శ్రద్ధ తీసుకోవాలి. **- న్యూస్‌టుడే, నాగలాపురం**

దక్షిణామూర్తికి ప్రత్యేకాభిషేకాలు

శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయంలో కొలువుదీరిన శ్రీమేధా దక్షిణామూర్తికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో స్వామి వారి సన్నిధి వద్ద గురువారం సంకల్పపూజలను ఆలయ ప్రధాన అర్చకులు కరుణాగురుకుల్ నేతృత్వంలో జరిగింది. గోక్షీరం పూజా ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ధూప, దీప, నివేదనలు పూర్తయ్యాక బంగారు ఉడుపులతో ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముక్కంటి ఆలయంలో ప్రదోషాన్ని పురస్కరించుకుని ఉమాదేవి సమేత చంద్రశేఖరస్వామికి విశేష పూజలు జరిపారు.

వేడుకగా ప్రదోష పూజలు .. నాగలాపురం : మండల కేంద్రంలోని నాగలింగేశ్వరాలయం, సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయం, కొట్టకాడులోని తిరునీలకంఠేశ్వరాలయాల్లో ప్రదోష పూజలు బుధవారం వేడుకగా నిర్వహించారు. పల్లికొండేశ్వరాలయంలో ఉత్సవమూర్తులను కామధేను వాహనంపై ఆసీనులు చేసి ప్రాకారోత్సవం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ పద్మనాభరాజు పర్యవేక్షించారు. ప్రదోష పూజల్లో రాజ్యసభ ఎంపీ, మాజీ మంత్రి సీవీ షణ్ముగం పాల్గొని స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు.

నందీశ్వరునికి కుంభహారతినిస్తున్న ప్రధానార్చకులు కార్తికేశన్

ఘనంగా నూతన సంవత్సర సంబరాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు స్వగృహంలో గురువారం పార్టీ శ్రేణుల సమక్షంలో కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు, ముక్కంటి ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, ఉమ్మడి జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి కార్యాలయాల్లో సంబరాలు జరిగాయి. వైకాపా కార్యాలయంలో బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. **ఓబులవారిపల్లె:** ముక్కావారిపల్లెలోని కార్యాలయంలో తెదేపా నియోజకవర్గ బాధ్యుడు ముక్కా రూపానందరెడ్డి, కూటమి నాయకులు కేక్ కోశారు. ఏపీఎండీసీ కార్యాలయంలో సీపీవో గోపినాథ్‌కు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయాల్లో.. రద్దీ

న్యూస్‌టుడే, బృందం: నూతన సంవత్సరం రోజున మూడు నియోజకవర్గాల్లోని ప్రధాన ఆలయాలు రద్దీగా కనిపించారు. దైవ దర్శనానికి భక్తులు బారులు తీరారు. సిఫార్సుల దర్శనాల కారణంగా సామాన్యులు క్యూలైన్లల్లో అధిక సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పార్టీ శ్రేణులతో సంబరాలు చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు, రూపానందరెడ్డి, కూటమి నాయకులు

ఆర్టీసీ బస్టాండు కూడలి వద్ద జనసేన పార్టీ తరఫున అన్నదానం చేస్తున్న నేతలు

సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయంలో భక్తులు

గుడిమల్లం శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయంలో..

ఓబులవారిపల్లె: ముక్కావారిపల్లెలో కేకు కోస్తున్న నియోజకవర్గ బాధ్యులు

యథేచ్ఛగా కలప రవాణా

నారాయణవనం, న్యూస్‌టుడే: మండలంలోని కొండ గుట్టల్లోని చెట్లను నరికి యథేచ్ఛగా కలపను అక్రమ రవాణా చేస్తున్నారు. ప్రభుత్వం హరితహారం పేరిట మొక్కలు నాటుతుంటే.. మరోవైపు అక్రమార్కులు చెట్లు నరికి సొమ్ము చేసుకుంటున్నారు. అటవీని సంరక్షించాల్సిన అటవీ శాఖ, వాల్టా చట్టం అమలు చేయాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. చెట్లు నరకాలంటే అటవీ, రెవెన్యూ శాఖల సంబంధిత పంచాయితీ నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదు. నారాయణవనం, కేవీబీ పురం అటవీప్రాంతంలో నరికి ఇటుక బట్టీలకు, పరిశ్రమలకు కలపను అక్రమంగా తరలిస్తున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

గాయపడి చికిత్స పొందుతూ రైతు మృతి .. పుల్లంపేట, న్యూస్‌టుడే: ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని అనంతసముద్రం పంచాయతీ ఎ.పుత్తనవారిపల్లె గ్రామానికి చెందిన రైతు పుత్తన వెంకటరెడ్డి(50) పొలంలోని విద్యుత్తు నియంత్రికకు బుధవారం మరమ్మతులు చేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురయ్యారు. గాయపడిన ఇతన్ని తొలుత రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించారు. ఇతనికి భార్య కొడుకు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భక్తురాలిపై వానరం దాడి.. శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కనకాచలంపై కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన మహిళపై వానరం దాడి చేసింది. పండ్ల సంచి కోసం గురువారం వానరం ఆమెపైకి దూకింది. దీంతో ఆమె భయాందోళనకు గురికావడంతో భక్తురాలిని కొరికి గాయ పరిచింది. రక్తగాయాలతో ఆమె ఇక్కడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు.

సిద్ధమవుతున్న పందెం కోళ్లు

✦ నిర్వహణకు జోరుగా ఏర్పాట్లు
✦ అడ్డుకునేందుకు పోలీసుల గస్తీ

గాదెలలో ముందుగానే నిర్వహిస్తున్న కోడిపందేలు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలో ఏటా సంక్రాంతికి పెద్ద ఎత్తున కోడిపందాలు నిర్వహిస్తారు. ఓబులవారిపల్లె మండలంలోనూ ఇవి పెద్దఎత్తున ఉంటాయి. గాదెల, వైకోట అటవీ ప్రాంతంలోనూ, పొలాల్లోనూ, జీవీపురం, శేష్మగారిపల్లె, పెద్దఓరంపాడు చెరువు ప్రాంతం, బొమ్మవరం, చిన్నంపల్లె, గోవిందంపల్లె చెరువు ప్రాంతాలు ప్రధాన స్థావరాలు. గతంలో బొమ్మవరం, గోవిందంపల్లెల్లో స్థావరాలపై పోలీసులు సాధారణ దుస్తులతో దాడి చేయగా స్థానికులు పోలీసులపై ఎదురుదాడికి పాల్పడ్డారు. ఎస్సైపై దాడి చేయగా రాజకీయ నాయకులు జోక్యంతో గొడవ సద్దుమణిగింది. ఈ దఫా ఇప్పటికే కోళ్లు సిద్ధమవుతున్నాయి. పోలీసులు కళ్లుగప్పి బరులు ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది.

మొదలైన సందడి

గ్రామాల్లో కోళ్ల సందడి జోరుగా ఉంది. గుట్టు చప్పుడు కాకుండా తోటల్లో, చెరువుగట్లపై పందేలు నిర్వహిస్తున్నారు. పోలీసులు స్థావరాలపై దాడులు చేస్తే తప్పించుకొనేందుకు వీలుగా తమ అనుచరులతో గస్తీ పెట్టారు. కొత్తవాళ్లు గ్రామాలకు వస్తే వారి వివరాలు ఆరా తీస్తున్నారు. పోలీసులు, పత్రికా విలేకరులు అవునో కాదో తెలుసుకొని పందెం నిర్వాహకులకు ముందుగానే సమాచారం ఇచ్చేందుకు ఏర్పాట్లు సైతం పూర్తి చేశారు.

తర్ఫీదు పొందుతున్న పుంజులు

ఇప్పటికే పుంజులను సిద్ధం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి కోడిపందేలు ఆడటానికి నమ్మకంగా వచ్చే వారికి ముందుగానే స్థావరాల సమాచారం అందిస్తారు. జిల్లాలో పలుప్రాంతాల నుంచి కోళ్లను రూ.5 వేల నుంచి రూ.10 వేలు పెట్టి తెప్పిస్తున్నారు. రోజు వీటికి ఉదయపు నడక, ఈత సాధన ఉంటుంది.

బ్యాంకుల నుంచి నగదు డ్రా

కొందరు జోరుగా బ్యాంకులకు చేరుకొని ఖాతాల్లో నగదును దఫాలుగా అనుమానం రాకుండా విత్‌డ్రా చేసుకుంటున్నారు. దీంతో బ్యాంకుల నుంచి రూ.లక్షల కొద్దీ నగదు రహస్య కేంద్రాలకు చేరుతుంది. అధిక వడ్డీలకు నగదు తెచ్చిమరీ పోటీల్లో పాల్గొనడానికి సైతం వెనుకాడరు.

నిర్వహిస్తే ఉపేక్షించం

కోడిపందేలు నిర్వహిస్తే దాడి చేసి కేసులు నమోదు చేస్తాం. సంక్రాంతి ముసుగులో జూదం, పందేలు నిర్వహించకూడదు. గ్రామాల్లో పోలీసు గస్తీ, స్థావరాలు గుర్తించి నిఘా పెట్టాం. అన్ని ప్రాంతాల నుంచి పక్కా సమాచారం సేకరిస్తున్నాం. **- మహేష్, ఎస్సై, ఓబులవారిపల్లె**

కళాకారుల ప్రదర్శన అదరహో

పుల్లంపేట : సాయిబాబా వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం వివిధ జిల్లాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆలయంలో బాబా పాలరాతి విగ్రహానికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని అందంగా అలకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన కళాకారులు స్వామి గ్రామోత్సవంలో ప్రదర్శన నిర్వహించారు.

తిరుపతిలో విలీనంపై సంబరాలు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపడంతో గ్రామాల్లో ప్రజలు సంబరాలు చేసుకున్నారు. మండల పరిధిలోని బొమ్మవరంలో గురువారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. తెదేపా నాయకులు ఉమ్మలరాజు సుబ్బరాజు ఆధ్వర్యంలో పెద్దఎత్తున సంబరాలు నిర్వహించారు.

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ప్రజలు

శ్రీ కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి - శ్రీమతి శోభారెడ్డి(USA) గార్లు
శంకర నేత్రాలయ కంటి వైద్యశాల - చెన్నై
శ్రీ ఆరువేల బాలసుబ్రమణ్యం ట్రస్టు - నిండ్ర
సంయుక్తంగా నిర్వహించు
SANKARA NETHRALAYA OM TRUST
ఉచిత కంటి శుక్ల శస్త్ర చికిత్స శిబిరం
స్థలం: శ్రీ వీ కాంప్లెక్స్ (శ్రీ వీ సినిమాస్ వెనుక) నిండ్ర, చిత్తూరు జిల్లా
శిబిరం నిర్వహించే తేది:
జనవరి 3వ తేది నుంచి 11వ తేది వరకు
కంటి ఆపరేషన్ వాహనము
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
98463 24139 / 96766 05144 / 70130 85790
TYROMER INDIA PRIVATE LIMITED
NINDRA

(c) eenadu

సూళ్లూరుపేట

• సూళ్లూరుపేట • వెంకటగిరి

ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి

వెంకటగిరి, న్యూస్‌టుడే: నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు బుధవారం రాత్రి నుంచే జరిగాయి. పలు ప్రాంతాల్లో కేకులు కోసి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ యువత కేరింతలు వేశారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాల ముందు బారులు తీరారు. తూర్పు వీధిలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. స్వామివారికి చేసిన ప్రత్యేకాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. గుడిని విద్యుత్తు దీపాలతో ముస్తాబు చేశారు

కల్యాణ వేంకటేశ్వర స్వామి

కేంద్ర పథకాలతో రాష్ట్రాభివృద్ధి

పెళ్లకూరు న్యూస్‌టుడే: కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రం అభివృద్ధి సాధిస్తోందని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం పెళ్లకూరు మండలం పెన్నేపల్లి గ్రామంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పలువురు భాజపా చేరారు. భాజపా నాయకులు పాల్గొన్నారు.

పెన్నేపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, నాయకులు

మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న తెదేపా నాయకులు

నేతల ఇంట నూతన సంవత్సర వేడుకలు

నాయుడుపేట, న్యూస్‌టుడే: కొత్తఏడాదికి స్వాగతం పలుకుతూ ప్రజలు కేకులు కోసి సంబరాలు చేశారు. తెదేపా నాయకులు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంను ఆయన నివాసంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెళ్లకూరు, ఓజిలి మండలాల పార్టీ అధ్యక్షులు సంచికృష్ణయ్య, విజయకుమార్ నాయుడు పాల్గొన్నారు. మాజీ సర్పంచి గూడూరు ప్రభావతమ్మ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, పట్టణ తెదేపా అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డిలు నివాసాల్లో నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు.

మళ్లీ నాయుడుపేట రెవెన్యూ డివిజన్?

● అన్ని ప్రాంతాలకు అనుకూలంగా

నాయుడుపేట, న్యూస్‌టుడే: పలు ప్రాంతాలకు ప్రధాన కూడలిగా ఉన్న నాయుడుపేటలో మళ్లీ రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు.. ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. పారిశ్రామిక అభివృద్ధి, భూసేకరణను దృష్టిలో ఉంచుకుని 2013లో ప్రభుత్వం ఇక్కడ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసింది. నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాలకు ఇది అనుకూలంగా ఉండేది. 2022లో జిల్లాల పునర్విభజనలో డివిజన్ కార్యాలయాన్ని సూళ్లూరుపేటకు తరలించారు. ఇది రెండు మండలాలకు దగ్గరగా.. మిగతా వాటికి దూరంగా ఉంది. కూటమి ప్రభుత్వం.. వైకాపా పాలనలో అసంబద్ధంగా జరిగిన విభజనను సరిచేస్తోంది. ప్రజా ప్రతినిధుల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లి ఉంటే సూళ్లూరుపేటలో అద్దె భవనంలో ఉన్న రెవెన్యూ డివిజన్ కార్యాలయం తిరిగి నాయుడుపేటలో సొంత భవనంలో ఏర్పాటు జరిగేదని ప్రజలు భావిస్తున్నారు.

నాయుడుపేటలో రెవెన్యూ డివిజన్ భవనం

ప్రజా ప్రతినిధులు స్పందించాలి

ప్రస్తుతం గూడూరు డివిజన్‌లో ఉన్న వాకాడు, చిట్టమూరు మండలాలను సూళ్లూరుపేట డివిజన్‌లోను వెంకటగిరి నియోజకవర్గంలోని మూడు మండలాలను శ్రీకాళహస్తి డివిజన్‌లో ఏర్పాటు చేశారు. వీటికి నాయుడుపేట అనుకూలంగా ఉంటుంది. సూళ్లూరుపేటలో ఉన్న డివిజన్ ఇక్కడకు తరలించాలని ఉద్యోగ సంఘాలు, నాయకులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. గూడూరును నెల్లూరులో విలీనం చేసినందున అక్కడ ఉన్న పీఆర్, జలవనరులు, ర.భ శాఖ ఇతర డివిజన్ కార్యాలయాల్లో మార్పులు చేసే అవకాశాలు ఉన్నాయి. వీటిని నాయుడుపేట కేంద్రంగా ఏర్పాటు చేస్తే సూళ్లూరుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలకు అనుకూలంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణ పరిధిలోని సెప్టిక్ ట్యాంకులు సేకరించిన మురుగును జాతీయ రహదారి పక్కన ఉన్న పొలాల్లో రైతులు లేని సమయంలో వదులుతున్నారు. –స్థానిక రైతు

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. –పురపాలిక కమిషనర్

తొలగిన పూడిక

తడ, న్యూస్‌టుడే: సున్నపు బట్టి వీధి సమీపంలోని తూము వద్ద పేరుకున్న పూడికను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. ఐటీఐ కళాశాల సమీపంలో సర్వీసు రోడ్డుపై మురుగుతో స్థానికులు ఇబ్బంది పడుతున్న వైనంపై 'ఈనాడు'లో 'పూడిక తొలగితేనే మురుగు కదిలేది' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దాంతో సర్పంచి కె.ఆర్ముగం స్పందించారు.

నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయ ఆవరణంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. సమస్యలు తెలిపితే అధికారుల సమక్షంలో అక్కడికక్కడే పరిష్కారం చేయనున్నారు.

కేకు కోస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

కొత్తఏడాది కిటకిట

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా శ్రీ చెంగాలమ్మ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసన్నలక్ష్మి స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది. ●

తడ, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలను మండల ప్రజలు గురువారం వేడుకగా జరుపుకొన్నారు. కేకులు కోసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. తడకండ్రిగ చెల్లాతమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయిబాబా మందిరం, శివాలయాలలోనూ భక్తులు పూజలు చేశారు. ● **వాకాడు, న్యూస్‌టుడే:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గురువారం ప్రజలు ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామదేవత శ్రీ నాగవరప్పమ్మ అమ్మవారికి పూజలు చేశారు. లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మండలంలోని తూపిలిపాలెం సముద్రం వద్ద బీచ్‌లో పర్యాటకుల సందడి నెలకొంది. తెదేపా మండల అధ్యక్షుడు దువ్వూరు మధురెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, వైకాపా వెంకటగిరి ఇన్‌ఛార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నివాసాల్లో కోలాహలం నెలకొంది. **చిట్టమూరు:** మండలంలోని మల్లాం గ్రామంలో శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రజలు పూజలు చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్‌నాయుడు నివాసంలో సంబరాలు జరిగాయి. ● **నాయుడుపేట, న్యూస్‌టుడే:** తిమ్మాజకండ్రిగ సమీపంలో ఉన్న ఆలయ వేంకటేశ్వరస్వామి, తుమ్మూరు శ్రీకరిమాణిక్యస్వామి, వాకాడులో జిక్కస్వామి, జంబుకేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో వెళ్లారు.

ప్రత్యేక అలంకరణలో నాగవరప్పమ్మ అమ్మవారు

తడకండ్రిగలో భక్తులకు దర్శనమిచ్చిన చెల్లాతమ్మ

ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులను సత్కరిస్తున్న నాయకులు

ఎమ్మెల్యేను సత్కరించిన తెదేపా నాయకులు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట పురపాలక సంఘం తెదేపా నాయకులు గురువారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతుల్ని సన్మానించారు. కొత్త ఏడాదిలో మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు చర్చించారు. శ్రీపోలేరమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ ఎన్.సుబ్బారావు, ఆనుపల్లి కమిటీ సభ్యులు జీవీఆర్‌నాయుడు, తెదేపా నాయకులు గంగాప్రసాద్, రాజశేఖర్, కృష్ణారెడ్డి, మస్తాన్, ధనంజయ, ఎన్‌సీఆర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఓజిలి, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ మండల నాయకులు ఎమ్మెల్యేను సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి పాడి వెంకటసుబ్బయ్య, నాయకుడు ప్రసాద్‌రావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీవో భవానీశంకర్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల బ్యానర్‌ను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆవిష్కరించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రజలలో అవగాహన కల్పించడమే లక్ష్యం అన్నారు. వీటిని జనవరి 1 నుంచి 31 వరకు ఒక నెల పాటు నిర్వహిస్తారని.. ట్రాఫిక్ నిబంధనలు పాటించడంపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

కూటమి పాలనలో అభివృద్ధి వేగం

వెంకటగిరి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి వేగవంతమైందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం తెదేపా కార్యాలయంలో నియోజకవర్గ నేతల సమక్షంలో నూతన సంవత్సర సంబరాలలో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడి నేతృత్వంలో పేద ప్రజల ఆకలి నింపడానికి అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తే గత ప్రభుత్వం మూసివేసిందన్నారు. అనంతరం పోలేరమ్మ ఆలయంలో పూజలు చేశారు. గొల్లగుంట కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏఎంసీ ఛైర్మన్ విశ్వనాథం, పుర మాజీ అధ్యక్షురాలు శారద, ఉపాధ్యక్షుడు బీరం రాజేశ్వరరావు, మాజీ పట్టణాధ్యక్షుడు ఆనంద్, పోలేరమ్మ దేవస్థానం మాజీ ఛైర్మన్ మురళీ, లాలాపేట సొసైటీ ఛైర్మన్ వెంకటముని పాల్గొన్నారు.

మహిళలు ఆదర్శ రైతులుగా

వెంకటగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయం రంగంలో మహిళల్ని ఆదర్శంగా తయారు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచించారు. గురువారం ఆయనను ఏడీఏ అనసూయ, వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి ఏవోలు సుజాత, శిరీష, విజయలక్ష్మీ, ప్రవీణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సబ్ డివిజన్ అధికారి, ఈ పరిధిలో నలుగురు ఏవోలూ మహిళలే కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

రాజుల నివాసంలో సంబరాలు.. వెంకటగిరి, న్యూస్‌టుడే: వెంకటగిరి సంస్థానంలో గురువారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. రాజ కుటుంబీకులు సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞ కుమార యాచేంద్ర కేకు కోశారు. గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారిని అనుచరులతో కలిసి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఢిల్లీ బాబు, నారాయణ, రాధమ్మ, వహిదా నేతలు వెంకటేశ్వర్లు, రమేష్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఆపితే ప్రమాదాలు జరగవా..!

బస్సు ఎక్కాలంటే బస్టాండుకు వెళతారు. కానీ తడలో ఇందుకు భిన్నంగా ఉంది. శ్రీసిటీలో పనిచేసే తడ ప్రజలు అధికభాగం ప్రైవేటు బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. వారిని తరలించే క్రమంలో జాతీయ రహదారిపైనే బస్సులను నిలుపుతున్నారు. వెనుక వచ్చే వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. ఇరువైపులా సర్వీసు రోడ్లు ఉన్నప్పటికీ వాటిని వినియోగించడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. **-న్యూస్‌టుడే, తడ**

ఆదమరిస్తే అంతే సంగతులు

వాకాడు-చిట్టమూరు ప్రధాన మార్గంలో పులికాలువపై వంతెన ఉంది. దీనికి ఇరువైపులా ఎలాంటి రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. వాహనం ప్రమాదవశాత్తు అదుపుతప్పితే కాలువలోకి వెళ్లిపోయేలా ఉందని అంటున్నారు. పలుమార్లు అధికారులకు సమస్య విన్నవించినా పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, వాకాడు**

బస్సులు రావు.. నిరీక్షణ తప్పదు

నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు నుంచి కోట, విద్యానగర్ వెళ్లే బస్సులు సాయంత్రం 4.30 గంటల నుంచి 6.30 గంటల వరకు రాలేదు. రోజూ తిరిగే సర్వీసులు రాక కొత్త ఏడాది మొదటి రోజునే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ అధికారులు రోజూ బస్సులు సక్రమంగా తిరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు విన్నవిస్తున్నారు. **-న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం**

స్తంభం నిలబెట్టారు.. పూడ్చడం విస్మరించారు

సూళ్లూరుపేట గ్రామీణం, నూస్‌టుడే: సూళ్లూరుపేట మండలం చిన్న ఉలసాపడవ గ్రామంలో ర.భ. రహదారి పక్కన ఆర్‌డీఎస్ విద్యుత్తు స్తంభాలు వేశారు.. కానీ వాటి గుంతలు మాత్రం పూడ్చలేదు. అవి ఎప్పుడు పడిపోతాయో అని వాహనచోదకులు, స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం చూపకుండా మరమ్మతులు చేయాలని స్థానికులు వాపోతున్నారు.

సమస్య తెలుపు.. పరిష్కారం చూపు

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: ప్రమాదల నివారణ కోసం రైల్వే అధికారులు సబ్‌వేల నిర్మాణం చేపట్టారు. ఇవి లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుంది. ఈ వంతెనల్లో నీరు లేకుండా ఉండేందుకు విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని దొరవారిసత్రం వంతెనకు ఇరువైపులా అధికారులు, గుత్తేదారుల ఫోన్ నెంబర్లు ఉన్న బోర్డులు ఏర్పాటు చేశారు. ఫోన్ చేసిన వెంటనే సమస్య పరిష్కరిస్తుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన పుచ్చ సాగు

● గతేడాది ధరల పతనమే కారణం

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట నియోజకవర్గంలో పుచ్చ సాగు ఈ ఏడాది గణనీయంగా తగ్గింది. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, నాయుడుపేట మండలాల్లోని పలు గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో పుచ్చపంట సాగు చేసేవారు. గతేడాది ధరలు పతనం కావడంతో కొందరు రైతులు కోయకుండా పొలాల్లోనే వదిలేశారు. అధిక విస్తీర్ణంలో సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ క్రమంలో పుచ్చ పంట సాగుకు స్వస్తి పలికారు. ఈ ఏడాది ఇప్పటి వరకు వందెకరాల లోపే సాగు చేసినట్లు రైతులు తెలిపారు. ఎక్కువ మంది వరి, వేరుశెనగ పంటలపైనే ఆసక్తి చూపారు.

నేటి నుంచి రైతులకు పాసుపుస్తకాల పంపిణీ

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: దొరవారిసత్రం మండలంలో భూముల రీసర్వే జరిగిన 12 రెవెన్యూ గ్రామాల్లోని 2,300 మంది రైతులకు శుక్రవారం నుంచి ప్రభుత్వ రాజముద్ర ఉన్న కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు శైలకుమారి తెలిపారు. శుక్రవారం లింగంపాడు, మావిళ్లపాడు గ్రామాల్లో పంపిణీ చేస్తామన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: తుమ్మూరు సమీపంలో స్వర్ణముఖి నది వంతెనపై బుధవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని కలిపేడు వాసి కస్తూరయ్య నాయుడుపేటకు వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఆయనకు గాయాలయ్యాయి. రెండో వాహనంపై వెళ్తూ గాయపడిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు రోడ్డు ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు.

మారనున్న రూపురేఖలు

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని పాత తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో ఉద్యాన వనం అభివృద్ధి చేసేందుకు పురపాలిక అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇక్కడ రెండు కోట్ల నూతన పుర కార్యాలయ భవనం నిర్మించనున్నారు. ముందు భాగంలో ఆర్థిక సంఘ నిధులతో పార్కు అభివృద్ధి చేసే విధంగా ఇటీవల పాలకవర్గ సమావేశంలో చర్చించారు. పట్టణంలో ఇప్పటి వరకు గాంధీ మందిరం వద్ద ఉన్న పార్కు తప్పితే ఎక్కడ కూడా ఉద్యాన వన కేంద్రాలు లేవు.

ఉద్యానం అభివృద్ధి చేయనున్న ప్రాంతం

రూ.58.77 లక్షలతో విభాగినులు సెంట్రల్ లైటింగ్

పట్టణంలో గోమతి సెంటర్ నుంచి పిచ్చిరెడ్డితోపు వరకు ఇటీవల ఏపీఐఐసీ నిర్మించిన రహదారి మధ్యలో ఉన్న విభాగినుల నిర్మాణానికి రూ.24.77 లక్షలు, మధ్యలో రూ.34 లక్షలతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. పురపాలిక సంఘం అధికారులు ఇందుకు సంబధించిన అంచనాలు సిద్ధం చేశారు. ఈ పనులు కార్యరూపం దాల్చితే కొత్త హంగులు సంతరించుకునే అవకాశం ఉంది.

కాలువలిలా.. నీరు పారేదెలా

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట, ఓజిలి మండలాల్లోని గ్రామాల్లో కొనసాగే 5ఆర్ తెలుగుగంగ కాల్వలో పిచ్చిమొక్కలు తొలగించక సాగునీరు ముందుకు సాగడం కష్టంగా మారింది. మాచవరం నుంచి ద్వారకాపురం చెరువు వరకూ ఈ కాలువ కొనసాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో పూడిక తీత, పిచ్చి చెట్లు తొలగించక నీరు పారడం కష్టంగా మారింది. అధికారులు స్పందించి చెట్లు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మెహర్ ఆశ్రమంలో రెవెన్యూ ఉద్యోగులు

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: మండలంలోని కుప్పారెడ్డిపాలెం వద్ద ఉన్న మెహర్ వృద్ధుల, దివ్యాంగుల అనాథాశ్రమంలో గురువారం కొత్త ఏడాది వేడుకలు నిర్వహించారు. సర్వేయర్ బాలకృష్ణ, వీఆర్వోలు జ్ఞానేంద్ర, మధు, యుగంధర్‌లు ఆశ్రమ నిర్వాహకులతో కలిసి కొత్త ఏడాది వేడుకలు జరుపుకొన్నారు. ఆశ్రమంలో ఉన్న వారికి అల్పాహారం అందించారు.

వృద్ధులతో సర్వేయర్, వీఆర్వోలు

నిబంధనలతో మందు బాబులకు అడ్డుకట్ట

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలో నూతన ఆంగ్ల సంవత్సరం సంబరాలను యువత ఉత్సాహంగా చేసుకున్నారు. ఉదయం నుంచి పలు ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వెళ్లి దర్శించుకున్నారు. పట్టణ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఏడుకొండలు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. దీంతో రాత్రిపూట మందు బాబుల ఆగడాలకు అడ్డుకట్ట పడింది.

కోడిపందెం స్థావరాలపై దాడులు

డక్కిలి, న్యూస్‌టుడే: నరసనాయుడుపల్లి పరిసరాల్లో గురువారం కోడిపందెం స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. రెండు కోడిపుంజులు, రూ.4600 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, ఓ ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్సై ఏడుకొండలు తెలిపారు.

మురుగు తొలగించరు.. జ్వరాలు వదలవు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: వాతావరణంలో వచ్చిన మార్పులు, చలి అధికమవడం వంటి కారణాలతో జ్వరాల ఉద్ధృతి పెరిగింది. దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇలాంటి సమయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాల పారిశుద్ధ్యం, కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా రక్షణ పొందవచ్చు. అయితే కొద్ది రోజులుగా చాలా ప్రాంతాల్లో కాలువల్లో మురుగు ముందుకు కదలక దుర్వాసన వెదజల్లుతున్నాయి. పుర వీధుల్లో చెత్త గుట్టలుగా ఉండిపోయింది.

షార్‌కు వెళ్లే రహదారి పక్కన కాలువల్లో పేరుకుపోయిన మురుగు

దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారుల బాధ్యతారాహిత్యం ఇందుకు ప్రధాన కారణమని స్థానికులు అంటున్నారు.

అధికారి ఏమన్నారంటే

సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్యంపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేస్తాం. – కమిషనర్, సూళ్లూరుపేట

పట్టణంలోని కోళ్లమిట్ట సమీపంలో షార్‌కు వెళ్లే రహదారి పక్కన ఉన్న కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో పరిసర ప్రాంత వాసులు ఇక్కట్లు పడుతున్నారు. ఈ రహదారిలో తిరిగే వాహన చోదకులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ● హోలీ క్రాస్ సర్కిల్ నుంచి శ్రీ చెంగాళమ్మ ఆలయానికి వెళ్లే జీఎన్‌టీ రహదారి పక్కన డ్రైనేజీ కాలవ సరిగ్గా లేకపోవడంతో పాదచారులు, వాహన చోదకులు వాపోతున్నారు. ● సూళ్లూరుపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద, ప్రహరీ పక్కన కొద్ది రోజులుగా మురుగు ముందుకు కదలక దుర్వాసన వస్తోంది. దీని గురించి పలు సార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై శ్రద్ధ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎక్కడెక్కడ

పంటకు రక్షణగా సోలార్ కంచె

నాయుడుపేట పట్టణం, దొరవారి సత్రం, న్యూస్‌టుడే: చిట్టమూరు మండలం చిల్లమూరు గ్రామంలోని రైతులు అధిక సంఖ్యలో ఆవులను పెంచుతున్నారు. ఇక్కడి రైతులు రోడ్డుకు ఇరువైపులా మిరప, పుచ్చ, వరి, వేరుసెనగ పంటల్ని సాగు చేస్తున్నారు. ఆవులు వస్తూ పోయే సమయాల్లో పంటల్ని మేయడంతో నష్టం జరుగుతుందని రహదారి పొడవునా సోలార్ కంచె అమర్చారు. దీంతో ఆవులు సోలార్ తీగలకు తగలకుండా ఒకదాని వెనుక ఒకటి పోతున్నాయి.

మహిళలకు రంగవల్లుల పోటీలు

వాకాడు, న్యూస్‌టుడే: స్థానిక ఎన్‌జేఆర్ గిరిజన కాలనీలో సంక్రాంతి ముందస్తు రంగవల్లి పోటీలను స్వర్ణసాగరం సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేశారు. ఈ పోటీల్లో విజేతలుగా నీరజ, హేమలత, ఝాన్సీ, రమణమ్మ, రమ నిలిచారు. వీరికి తెదేపా నేత కోటేశ్వరరావు, సంస్థ అధ్యక్షుడు విజయకుమార్, న్యాయనిర్ణేత స్వప్న బహుమతులు అందజేశారు.

రంగవల్లుల పోటీల్లో మహిళలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెళ్లకూరు, న్యూస్‌టుడే: కుప్పగుంటకండ్రిగ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రకాశం జిల్లా కందుకూరు పట్టణానికి చెందిన వెంకట శివాజీ (35) గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తిరుపతి నుంచి కారులో కందుకూరుకు వెళ్తుతుండగా మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో తలకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. చెన్నైలోని ఓ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu

ఈనాడు
విశాఖపట్నం
శుక్రవారం 2 జనవరి 2026 సిటీ 5

కనిపించాయి... మురిపించాయి!!

ఆర్కే బీచ్‌లో గురువారం సాగర జలాలు వెనక్కి వెళ్లిన తరుణంలో... అప్పటి వరకూ నీటిలో ఉన్న రాళ్లు బయటపడ్డాయి. కొత్త సంవత్సరం వేడుకల నిమిత్తం బీచ్‌కు వచ్చిన సందర్శకులు ఈ రాళ్ల వద్ద ఫొటోలు దిగి సందడి చేశారు. – ఈనాడు, విశాఖపట్నం

మరుగుదొడ్ల పేరిట దోపిడీ

'స్థాయీ'లో ఆమోదానికి ప్రతిపాదనలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: యోగాంధ్ర సందర్భంగా వీఐపీలకు తాత్కాలికంగా అద్దె ప్రాతిపదికన మరుగుదొడ్లు సమకూర్చిన గుత్తేదారుకు బిల్లులు చెల్లించేలా 'స్థాయీ' సంఘం సమావేశంలో చర్చించేందుకు నిర్ణయించారు. ఒక్కో మరుగుదొడ్డికి రూ.6,600 అద్దె నిర్ణయించడం గమనార్హం. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు 87 అంశాలతో 'స్థాయీ' సమావేశం జరగనుంది. ★ గత సమావేశంలో వాయిదాపడిన మరుగుదొడ్ల బిల్లుల చెల్లింపు అంశాన్ని ఈ అజెండాలో చేర్చారు. అత్యవసరం పేరుతో కొటేషన్ పద్ధతిపై అద్దెకు మరుగుదొడ్లు తీసుకొచ్చి, అధిక చెల్లింపులకు యత్నిస్తున్న అధికారులపై విచారణ జరపాలని పలువురు కోరుతున్నారు. ★ నగర శివారులో బీటీ రహదారుల అభివృద్ధికి, పాతనగరంలో హెరిటేజ్ వాక్ పేరిట ప్రస్తుతం ఉన్న రహదారి పక్కనే ఏర్పాట్లు చేయడానికి ప్రతిపాదించారు.

'పురమిత్ర'కు ప్రజా స్పందన!

వారానికి 450 నుంచి 500 ఫిర్యాదులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పట్టణ ప్రజల సమస్యల్ని పరిష్కరించడంతో పాటు, ప్రభుత్వ సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు వీలుగా ప్రవేశపెట్టిన 'పురమిత్ర' యాప్‌కు విశేష స్పందన వస్తోంది. ఆగస్టులో యాప్‌ను ప్రవేశపెట్టగా, ఇప్పటి వరకు విశాఖ నగరంలో 1.84 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. రాష్ట్రంలో ఇతర పట్టణాల కంటే జీవీఎంసీ పరిధిలోనే అత్యధికంగా యాప్‌ను వినియోగిస్తుండటం గమనార్హం.

★ యాప్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై తరచూ మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తుండటంతో... జీవీఎంసీ సిబ్బంది, అధికారులు త్వరితగతిన పరిష్కార చర్యలు చేపడుతున్నారు.

★ పరిష్కారమైన సమస్యకు సంబంధించి కచ్చితమైన సమాచారం, ఛాయాచిత్రాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేస్తేనే.. ఆ సమస్య పరిష్కారమైనట్లు గుర్తిస్తారు.

★ చెత్త కుప్పలు తరలించకపోవడం, వీధి కుక్కలు, దోమలు, పందుల సంచారం, వీధి దీపాలు, ఆక్రమణలు తదితరాలపై ఎక్కువగా సమస్యలు వస్తున్నాయి.

★ ప్రస్తుతం వారానికి 450 నుంచి 500 వరకు ఫిర్యాదులు వస్తుండటంతో వాటిని సంబంధిత అధికారులకు పంపించి, పరిష్కార సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నామని పీజీఆర్ఎస్, పురమిత్ర పర్యవేక్షకుడు శంకరరావు తెలిపారు.

★ యాప్ వినియోగంపై మహిళా సంఘాలకు, నగర ప్రజలకు గతంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో.. ఎక్కువమంది క్షేత్రస్థాయి సమస్యలను అప్‌లోడ్ చేస్తూ, పరిష్కారం పొందుతున్నారు.

★ పురమిత్రలో అందుతున్న ప్రభుత్వ సేవలపైనా ప్రజలు దృష్టి సారిస్తే, తరచూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం ఉండదు.

రామావతారంలో అప్పన్న

రాపత్తు ఉత్సవాల్లో భాగంగా గురువారం అప్పన్న స్వామి రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. –న్యూస్‌టుడే, సింహాచలం

వాగైనా కప్పేస్తాం.. ఏదైనా చేసేస్తాం!!

అడ్డదారి కోసం ఇష్టారాజ్యం

అయినా కన్నెత్తి చూడని యంత్రాంగం

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, ఆనందపురం: కొనుగోలు చేసిన భూములకు దగ్గర మార్గాన్ని ఎంచుకునే క్రమంలో జలవనరుని కప్పేశారు. రాత్రికి రాత్రే రోడ్డు నిర్మించేశారు. జాతీయ రహదారి నుంచి ఆ భూములకు వేగంగా చేరుకునేందుకే ఈ దారుణమంతా. ఆనందపురం మండలం గిడిజాలలో ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. విశాఖ నగర సమీప భూములకు ఇటీవల బాగా విలువ పెరుగుతుండటంతో ఎక్కడికక్కడ ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

రాత్రికి రాత్రే: విజయనగరం జిల్లా కొత్తవలస ప్రాంత కొండలు, ఆనందపురంలోని బృహదాచల కొండల నుంచి ప్రవహించే వాగును గిడిజాల రెవెన్యూ పరిధిలో కొందరు దర్జాగా పూడ్చేశారు. వీరి భూములకు నీళ్ల కుండీల నుంచి దిబ్బడపాలెం గ్రామం మీదుగా వెళ్తే రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అలా కాకుండా నీళ్లకుండీలను ఆనుకొని ఓ ప్రైవేట్ లేఅవుట్ మీదుగా గెడ్డను దాటుకొని వెళ్తే జాతీయ రహదారికి 300 మీటర్ల దూరంలోనే ఉంటుంది. అందుకే ఎటువంటి అనుమతులు లేకుండా ఏకంగా నీటి ప్రవాహ వాగుపై 25 అడుగుల మేర రోడ్డు నిర్మించేశారు. రాత్రికి రాత్రి లారీలతో గ్రావెల్ తెచ్చి, గొట్టాలు ఏర్పాటు చేసి కప్పేశారు. గతంలో ఆ ప్రాంతం చెట్లు, పొదలతో ఉండేది. ఇప్పుడు వాటన్నింటినీ తొలగించారు. దీంతో ఆ ప్రాంతమంతా ఖాళీగా కనిపిస్తోంది.

వాగు ప్రవాహానికి అడ్డంగా నిర్మించిన మార్గం

ఎంతో కీలకమైన వనరు: ఈ వాగు ఆనందపురం మండలంలోని గుడిలోవ ఛానల్‌కు ఆధారం. సుమారు 50 చెరువులు నిండాలంటే ఇది ప్రవహించాలి. మరో వైపు గంభీరం జలాశయానికి ప్రధాన వరద గెడ్డ కూడా ఇదే. సుమారు 25 కిలోమీటర్ల మేర వివిధ గ్రామాల మీదుగా ప్రవహిస్తుంది. అంతటి ప్రాధాన్యమున్న వాగును భూముల విలువ పెంచుకునేందుకు మూసేయడంపై విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి జలవనరులపై రోడ్డు నిర్మించాలంటే రెవెన్యూ, జలవనరులశాఖల నుంచి అనుమతి తీసుకోవాలి. ఇక్కడ అవేమీ లేకుండానే ఇష్టానుసారంగా చేపట్టారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

'స్మార్ట్' సేవలా.. అడగొద్దు!!

మధురవాడ, న్యూస్‌టుడే: నగర వ్యాప్తంగా 'స్మార్ట్‌సిటీ' ప్రాజెక్టులో భాగంగా జీవీఎంసీ ఏర్పాటు చేసిన 'స్మార్ట్‌పోల్స్' రెండేళ్లుగా వినియోగానికి దూరమయ్యాయి. 2018లో రూ.15 కోట్ల కేంద్రం నిధులతో పలు ప్రధాన కూడళ్లలో 50 స్తంభాలను అమర్చారు. గంటకు 225 కి.మీ వేగంతో వీచే గాలులను సైతం తట్టుకునే శక్తి వీటికి ఉంది. ఈ స్తంభాల ద్వారా ఉష్ణోగ్రత, గాలిలో నాణ్యత, కాలుష్యం, తేమ, వేగం, శబ్దం రికార్డు అవుతాయి. ఇందులోనే 300 మీటర్ల పరిధిలో ఉచిత ఇంటర్నెట్ (వైఫై), ఎల్ఈడీ విద్యుత్తు దీపాలు, సీసీ కెమెరాలు, రోడ్డు భద్రత, జాగ్రత్తలు, అత్యవసర సమయాల్లో హెచ్చరికలు జారీ చేసేందుకు ప్రచార సాధనం (మైక్) తదితర సౌకర్యాలను పొందుపరిచారు. ప్రస్తుతం నిర్వహణ లేక 'స్మార్ట్‌పోల్స్' సేవలు నిలిచిపోయాయి. జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి ఆయా సేవలను అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

క్రికెట్ పోరు.. తుది దశకు చేరే...!
వివరాలు 6లో

'గాలి'స్తుంది.. చుట్టేస్తుంది!!

నగరంలో పెరుగుతున్న కాలుష్య స్థాయిలు

ఈనాడు–విశాఖపట్నం: విశాఖలో గాలి నాణ్యతలో ఊహించనిరీతిలో మార్పులొచ్చాయి. ఉదయం, రాత్రి వేళల్లో నాణ్యత క్షీణించి ఒక్కోసారి కాలుష్య స్థాయిల్లో దిల్లీని దాటేస్తోంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (గాలి నాణ్యతా సూచీ) విశాఖలో గంటగంటకూ మారుతోంది.

★ గతేడాది డిసెంబరు 31 ఉదయం 4:30-5:30 గంటల మధ్య 732గా, 7:30-8:30 మధ్య 392గా నమోదైంది. 2025 డిసెంబరు 19న 350గా ఏక్యూఐ నమోదైంది. సాధారణంగా 200 దాటితే ప్రమాదం ఎక్కువ. ఈ ఏడాది జనవరి ఒకటిన సాయంత్రం గాలి నాణ్యత 216-240 వరకు నమోదైంది. ధూళి కణాలూ భయపెడుతున్నాయి.

★ గతేడాది డిసెంబరు 31 ఉదయం 6:30 సమయంలో గాలిలో పీఎం 2.5 188 మైక్రోగ్రామ్/క్యూబిక్ మీటరుగా, పీఎం10 507గా నమోదైంది. ఈ ఏడాది జనవరి 1న పీఎం2.5... 131గా, పీఎం10 217గా నమోదైంది. సాధారణంగా పీఎం2.5...60; పీఎం10...100 దాటితే ప్రమాదకరం.

తెలుగుతల్లి పైవంతెన ప్రాంతంలో కమ్ముకున్న పొగమంచు

వాతావరణం ఇలా ఉంటే..

- ఆస్తమా బాధితులపై తీవ్రప్రభావం
- కంటి మంట, గొంతు నొప్పి వంటి లక్షణాలు వేధిస్తాయి.
- పిల్లలు, వృద్ధుల్లో శ్వాస, ఊపిరి తిత్తుల సమస్యలు వస్తాయి.

★ 'విశాఖలో వాతావరణ కాలుష్యం ఇలా ఉందంటే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనం. ప్రజల ఆరోగ్యానికి అపారమైన హాని కలుగుతుంది. గాలిలో వ్యాపిస్తున్న కాలుష్యాన్ని శాస్త్రీయ పద్ధతుల ఆధారంగా అరికట్టడానికి ప్రభుత్వాలు సమగ్ర ప్రణాళికలను అమలు చేయాలి' అని ఏపీపీసీబీ అధ్యక్షులు పి.కృష్ణయ్యకు విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ గురువారం లేఖ రాశారు.

కారణాలు ఇవే..

భౌగోళికంగా చూస్తే విశాఖకు మూడు వైపులా కొండలు, ఒక వైపు సముద్రం ఉన్నాయి. శీతాకాలం గాలిలో వేగం తక్కువ. దీంతో కాలుష్యం దూరంగా వెళ్లలేని పరిస్థితి. పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడే పొగ గాల్లోనే ఉండి నగరాన్ని కమ్మేస్తోంది. ఉదయం, రాత్రి వేళల్లో... పైకి వెళ్లాల్సిన కాలుష్య కణాలు కిందనే నిలిచిపోతున్నాయి. పోర్టు నుంచి బొగ్గు రవాణా సమయంలో కోల్ డస్ట్ భారీగా గాలిలో కలుస్తుంది. స్టీలు ప్లాంటు, హెచ్‌పీసీఎల్ వంటి ఆయిల్ రిఫైనరీలు, ఇతర భారీ పరిశ్రమల నుంచి ఉద్గారాలు విడుదలవుతున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇవి వ్యాపిస్తున్నాయి. విశాఖ పోర్టులో కోల్ హ్యాండ్లింగ్ (బొగ్గు నిర్వహణ)పై దృష్టిపెట్టాలి. కన్వేయర్ బెల్టులకు డస్ట్ సప్రెషన్ సిస్టమ్స్, నిల్వలకు కవర్‌షెడ్లు, బహిరంగ నిల్వలపై నీటి తుంపర్లు, పరిశ్రమల చుట్టూ గ్రీన్‌బెల్ట్‌ల నిర్వహణపై దృష్టిపెట్టాలి. ఈ అంశాలపై పీసీబీ ఈఈ పైడి వెంకట ముకుందరావు 'ఈనాడు'తో మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించిన ఐదు కంపెనీలకు నోటీసులివ్వడంతోపాటు రూ.10 కోట్లు జరిమానాగా విధించినట్లు తెలిపారు.

వెట'రన్'.. మెరిసెన్..

అథ్లెటిక్స్‌లో పతకాలు సాధిస్తున్న సుధాకర్

గాజువాక, న్యూస్‌టుడే : పాతికేళ్లు నిండేసరికే ఒళ్లు, కీళ్లు పట్టేస్తున్నాయంటూ ఆపసోపాలు పడే నేటి యువతలో చాలా మంది... 77 ఏళ్లు మీదపడ్డా వివిధ పోటీల్లో పతకాలను ఎగరేసుకొస్తున్న పాత గాజువాకకు చెందిన గోగినేని సుధాకర్‌ను ఆదర్శంగా తీసుకోవాల్సిందే. ఇటీవల గుంటూరు జిల్లా పెదనందిపాడులో నిర్వహించిన 45వ ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఒకేసారి 5 పతకాలను కైవసం చేసుకున్నారు.

★ వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖ (వావ్) ఆధ్వర్యంలో జరిగిన అన్ని పోటీల్లోనూ మూడు బంగారు పతకాలతోపాటు, ఒక రజత, ఒక కాంస్య పతకం పొందారు. వయో వృద్ధులతో వాకింగ్, రన్నింగ్, షాట్‌పుట్, జాగింగ్, అథ్లెటిక్స్‌లో పోటీపడి తనదైన ముద్ర వేసుకున్నారు. ఈ సందర్భంగా 'వావ్' చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ కమల్‌బైడ్, మాస్టర్ ఈకే జనకులం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సత్యదేవ్, వావ్ ట్రస్టీలు సుధాకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయ పోటీలకు అర్హత: గుంటూరు జిల్లాలో జరిగిన పోటీల్లో వరుసగా 5 పతకాలు సాధించిన సుధాకర్ త్వరలో జబల్‌పుర్‌లో నిర్వహించనున్న జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సంపాదించారు. ఈయన బీహెచ్‌పీవీలో సాధారణ ఉద్యోగిగా పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. జాతీయ కబడ్డీ పోటీల్లో పలు పతకాలను నమోదు చేసుకున్నారు. ఆరుసార్లు రాష్ట్రస్థాయి పోటీలకు కెప్టెన్‌గా వ్యవహరించారు. రోజూ తెల్లవారుజామున భెల్ మైదానంలో 2 గంటలపాటు సాధన చేస్తుంటానని, ఏమాత్రం అలసట, అనారోగ్యం తన దరి చేరదని పేర్కొన్నారు.

వావ్ ఆధ్వర్యంలో జరిగిన అథ్లెటిక్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన గోగినేని సుధాకర్

ఉచితం వెనుక ఉన్నత లక్ష్యం!

'వైజాగ్ వాలంటీర్స్' బృందం నూతన సంవత్సర ప్రారంభం రోజున ఓ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. దాదాపు 500 మొక్కలను ఉచితంగా అందించారు. బృందంలో 30 మంది సభ్యులు బీచ్ రోడ్‌లో వాహనచోదకులకు, ఇతర ప్రయాణికులకు వీటిని పంపిణీ చేశారు. నగరంలో కాలుష్య కట్టడికి తమవంతుగా ఈ ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. – ఈనాడు, విశాఖపట్నం

నీటి పరీక్షల వాహనంలో కమిషనర్ కేతన్‌గార్గ్, తదితరులు

ఇక.. ఎక్కడికక్కడే నీటి పరీక్షలు!

కార్పొరేషన్, న్యూస్‌టుడే : జీవీఎంసీ సరఫరా చేస్తున్న నీటిని పరీక్షించేందుకు రూ.40 లక్షలతో కొనుగోలు చేసిన మొబైల్ వాటర్ ల్యాబ్ వాహనాన్ని గురువారం కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు శుద్ధమైన నీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా, నూతన వాహనం ద్వారా సిబ్బంది అన్ని ప్రాంతాల్లో సంచరిస్తూ నీటి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రధాన ఇంజినీర్ పీవీవీ. సత్యనారాయణరాజు, ఎస్ఈ పల్లంరాజు, విస్కో సలహాదారు శివప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

చామంతుల సోయగం

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం గ్రామంలో తాలాడ వీధిలోని సర్పంచి ఇంటిపై ఎటు చూసినా చామంతుల సోయగమే. వివిధ రంగుల్లో విరబూసి కనువిందు చేస్తున్నాయి. పూల మొక్కల పెంపకంపై మక్కువతో సుమారు 120 కుండీల్లో ఎనిమిది రకాల చామంతులను పెంచుతున్నట్లు సర్పంచి తాలాడ పాప చెబుతున్నారు. ఇటుగా వచ్చే ప్రతి ఒక్కరు ఈ పుష్పాలను ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ప్రథమ వర్ధంతి
నీతిమంతుని జ్ఞాపకము చేసికొనుట ఆశీర్వాదమగును. సామెతలు: 10:7
జననం 27-05-1976
మరణం 02-01-2025

కీ॥శే॥ వేమగిరి రాజుబాబు గారు
B.Ed.,M.C.A, M.Sc,
Ward Education Secretary,
GVMC - Visakhapatnam
మీరు మా నుండి భౌతికంగా దూరమైనా మీ జ్ఞాపకాలు మా వెన్నంటే ఉన్నాయి... మిమ్ములను ఎప్పటికీ మరువలేము..మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనసారా దేవున్ని ప్రార్థిస్తూ... అశ్రునయనాలతో...
అమ్మ : వి. సుగుణ అత్తగారు : పి. జ్యోయ్
భార్య: డా॥ వి. సూర్యసునీత, M.Sc., M.Phil, Ph.D, (Govt. Lecturer)
కుమారుడు: వి. ఆకర్ష్ చక్రవర్తి, B.Tech (Mech)
కుమార్తె : అమృతహంస మరియు కుటుంబ సభ్యులు

హృదయపూర్వక అభినందనలు
నిండు చంద్రునికో నూలు పోగు,
మీ కీర్తి కిరీటంలో మరో కలికితురాయిలా
ప్రతిష్ఠాత్మక గ్రేటర్ విశాఖపట్నం
మున్సిపల్ కార్పొరేషన్
స్టాండింగ్ కౌన్సిల్‌గా
నియమితులైన సందర్భంగా
అడ్వకేట్
శ్రీ నాలి శేషుకుమార్ గార్కి
మా హృదయపూర్వక
శుభాకాంక్షలు తెలియజేస్తూ...
మీరు మరెన్నో ఉన్నత
శిఖరాలు అధిరోహించాలని
కోరుకుంటూ...
శ్రీ నాలి శేషుకుమార్ గారు, అడ్వకేట్
GVMC స్టాండింగ్ కౌన్సిల్.
సెల్: 9347379739
Moksha Dhaam Eternal Pvt. Ltd.
Smt. KONATALA SUDHA RANI
Managing Director

సమగ్ర గణన.. అభివృద్ధికి రూపకల్పన

గ్రామీణభీమిలి, తగరపువలస, న్యూస్‌టుడే: జిల్లాలో ఏకీకృత కుటుంబ గణన (యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే) ప్రారంభమైంది. ఇందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుటుంబాల వివరాలను సేకరిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. ఆయా వివరాలను ఇందులో పొందుపరుస్తున్నారు.

సేకరిస్తున్న వివరాలివే..: ముందుగా కుటుంబ సభ్యుల ఆధార్ ఈకేవైసీ వెరిఫికేషన్ చేస్తారు. ★ యజమాని, సభ్యుల వ్యక్తిగత వివరాలు (పేరు, పుట్టినతేదీ, లింగం) ★ విద్యా, నైపుణ్యాలు, ఉపాధి, ఆదాయ వివరాలు తీసుకుంటారు. ★ ఇళ్లు, ఆస్తులు, వాహనాల వివరాలు సేకరిస్తారు. అలాగే విద్యార్హత, వివాహం, జనన, మరణ, తదితర ధ్రువపత్రాలను ప్రజల నుంచి తీసుకుని సర్వే సిబ్బంది యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.

విశాఖ జిల్లాలో ఇదీ పరిస్థితి...

మండలం/జోన్	సర్వేచేయాల్సిన గృహాలు	పూర్తయినవి
జీవీఎంసీ	6,37,939	1846
ఆనందపురం	21,202	123
పద్మనాభం	21,213	75
భీమిలి	17,735	63
పెందుర్తి	12,130	59

ఇదీ ఉద్దేశం..

గతంలో చేపట్టిన సర్వే గందరగోళంగా తప్పులతో ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వివాహమైన వారు కూడా ఉమ్మడి కుటుంబాల్లోనే మ్యాపింగ్ అయి ఉండటంతో ప్రభుత్వ పథకాలకు దూరం అవుతున్నారు. కుటుంబ వివరాలతో పాటు వారికి సంబంధించిన విద్యా, ఉద్యోగ, ఉపాధి, తదితర అన్ని వివరాలు ఒకేచోట ఏకీకృతం చేస్తారు. దీంతో ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాలు, ఉద్యోగావకాశాల కల్పనకు అవకాశం ఉంటుంది. ★ ప్రజలంతా సహకరించి సచివాలయ సిబ్బంది అడిగిన సమాచారాన్ని చెప్పాలని భీమిలి డీఎల్‌డీవో ఎం.నిర్మలాదేవి పేర్కొన్నారు.

ఉక్కు ఇన్‌ఛార్జి సీఎండీగా మనీష్ రాజ్ గుప్తా బాధ్యతల స్వీకరణ

ఉక్కునగరం, న్యూస్‌టుడే: సెయిల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మనీష్ రాజ్ గుప్తా విశాఖ ఉక్కు ఇన్‌ఛార్జి సీఎండీగా గురువారం దిల్లీలో బాధ్యతలు స్వీకరించారు. మెకానికల్ ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్ డిప్లొమా చేసిన ఆయన 1991లో దుర్గాపుర్ స్టీల్‌ప్లాంటులో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరారు. అనంతరం సెయిల్ యూనిట్లలోని పలు విభాగాల్లో పనిచేశారు. 2019లో బొకారో స్టీల్ ప్లాంటులో సీజీయంగా బాధ్యతలు చేపట్టారు. ఆయన పనిచేసిన చోట సాంకేతిక అభివృద్ధి, ప్రక్రియల సరళీకరణ జరిగాయి. ప్రాజెక్టుల ఆధునీకరణ విజయవంతంగా అమలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
పదవీ విరమణ శుభాకాంక్షలు
ఈనాడు క్లాసిఫైడ్స్
జన్మదిన శుభాకాంక్షలు
జయంతి, వర్ధంతి
లీగల్ ప్రకటనలు
అంత్యక్రియలు,
వేడుక ఏదైనా..
ఈనాడు ను
చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

సంక్రాంతికి..

1500 అదనపు సర్వీసులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : సంక్రాంతి రద్దీ దృష్ట్యా 1500 అదనపు సర్వీసులు నడపడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఆర్టీసీ ఆర్ఎం బి.అప్పలనాయుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ... నగరంలోని వివిధ డిపోలకు చెందిన మేనేజర్లతో సమీక్ష నిర్వహించామని, రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలని ఆదేశించామన్నారు. స్త్రీ శక్తి పథకం అమలులో ఉండటంతో, మహిళలతో పాటు, ఇతర ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. భోగీ ముందు రోజు నుంచి ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి వస్తాయని, కనుమ తర్వాత ఐదు రోజుల పాటు ఆయా సర్వీసులు ఉంటాయన్నారు. హైదరాబాద్, విజయవాడ, రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, శ్రీకాకుళం, విజయనగరం, పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి, పార్వతీపురం, పాలకొండ, సాలూరు, బొబ్బిలి ప్రాంతాలతో పాటు, గ్రామీణ ప్రాంతాలకు బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.

పారిశ్రామిక శోభ!

కొత్త పరిశ్రమలు.. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు

ఈనాడు, విశాఖపట్నం: ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న విశాఖ.. ఉత్తరాంధ్రతోపాటు పొరుగు రాష్ట్రాల ప్రజలకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పరిశ్రమలు తరలివస్తున్నాయి. గతేడాది వివిధ పరిశ్రమలు ప్రారంభం కాగా.. వేలాది మందికి కొత్తగా ఉద్యోగావకాశాలు లభించాయి. గత నవంబరులో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన భాగస్వామ్య సదస్సు పారిశ్రామిక, వాణిజ్య పరంగా విశాఖకు కలిసొచ్చింది. నగర పరిసరాల్లో వివిధ రంగాల్లో పరిశ్రమల ఏర్పాటుకు 105 ఒప్పందాలు జరిగాయి. అవన్నీ పట్టాలెక్కి.. త్వరలో కార్యకలాపాలు ప్రారంభించేలా జిల్లా అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ఉపాధి కల్పనకు చర్యలు: జిల్లాలో యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అన్ని నియోజకవర్గాల్లో దశలవారీగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కులు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ)లను అభివృద్ధి చేయనున్నారు. భూములు అందుబాటులో ఉన్న చోట పారిశ్రామిక పార్కుగా, తక్కువ భూమి ఉంటే ఎఫ్ఎఫ్‌సీగా నిర్మిస్తున్నారు. పెదగంట్యాడలో నిర్మించిన ఎఫ్ఎఫ్‌సీని ఇప్పటికే ప్రారంభించారు. 29 దుకాణాలు అందుబాటులో ఉన్నట్లు ఏపీఐఐసీ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. విశాఖ పశ్చిమం, పెందుర్తి నియోజకవర్గాల్లో ఎఫ్ఎఫ్‌సీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.

పారిశ్రామిక సదస్సులో ఒప్పందాలు..

పర్యాటకం	42	ఫుడ్ ప్రాసెసింగ్	02
ఐటీ రంగం	41	వైద్యారోగ్య	01
ఐ అండ్ సీ	18	టెక్స్‌టైల్	01



శ్రద్ధాంజలి
వైద్యరంగంలో విశిష్ట సేవలు అందిస్తూ,
ఎందరో వైద్య విద్యార్థినీ, విద్యార్థులను
ఉన్నతులుగా తీర్చిదిద్దుతూ మీరు చేసిన
సేవలు అనిర్వచనీయమైనవి.
మీ సేవలు ఎప్పటికీ మరువలేనివి.
మీరు భౌతికంగా మా నుండి దూరమైననూ
మీ తీపి జ్ఞాపకాలు ఎల్లప్పుడూ మా వెంటే
ఉంటాయి. దైవ సన్నిధికి చేరిన మీ పవిత్ర
ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని
ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...
అంజలి ఘటిస్తూ...
డాక్టర్ Y. శేషగిరిరావు గారు
M.D. (Gen. Med.) DCH.
Area Hospital, Tuni
Retd. Professor,
Civil Surgeon Specialist
జననం: 28-01-1956
స్వర్గప్రాప్తి: 22-12-2025
మీ... భార్య: శ్రీమతి Y. పద్మావతి
కుమారుడు: Dr. Y. వెంకటేష్, MD
కుమార్తె-అల్లుడు:
శ్రీమతి S. ప్రియాంక - S. శ్రీనివాస్
అన్నయ్యలు - వదినలు:
Y. రంగారావు - Y. శశికళ (Late)
Y. జగన్నాథరావు - Y. ఉషారాణి
చెల్లెలు - బావగారు:
R. సుగుణ - R. కన్నారావు
మనుమరాలు: S. శ్రీహిత
బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు
పెద్దకర్మ
తేది: 03-01-2026 శనివారం ద్వారకానగర్, ఫార్చ్యూన్ శ్రీకన్య హోటల్ నందు జరుగును.

(c) eenadu

క్రికెట్ పోరు.. తుది దశకు చేరె...!

ఉత్కంఠగా 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025'

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : ఆంధ్ర మెడికల్ కళాశాల మైదానంలో 'ఈనాడు- ఈతరం క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్' ప్రజెంట్స్ 'ఈనాడు- స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025' టోర్నీ చివరి దశకు చేరుతుంది. గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో విజయం సాధించిన గీతం డీమ్డ్ యూనివర్సిటీ (సీనియర్స్), కైట్స్ జూనియర్ కళాశాల (జూనియర్స్) జట్లు ఫైనల్ బెర్తులు ఖరారు చేసుకున్నాయి. కైట్స్ జూనియర్ కళాశాల జట్టు క్రీడాకారుడు ఆర్.రోహన్ 'ధనిక్ భారత్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే'గా ఎంపికయ్యాడు.

★ శుక్రవారం సీనియర్స్ విభాగంలో జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో బుల్లయ్య డిగ్రీ కళాశాల- శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల, అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ - ఆంధ్ర మెడికల్ కళాశాల జట్లు, జూనియర్స్ విభాగంలో జరిగే సెమీ ఫైనల్స్‌లో విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (పాలిటెక్నిక్)- సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాల జట్లు పోటీ పడనున్నాయి.

✔ **గీతం డీమ్డ్ యూనివర్సిటీ 'వర్సెస్' గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాల (సీనియర్స్) :** తొలుత గీతం డీమ్డ్ యూనివర్సిటీ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసింది. జట్టులో వి.ప్రద్యుష్‌సాయి 36, పి.శ్యామ్ 20, సాయివర్ధన్ 14 పరుగులు చేశారు. గాయత్రి జట్టు బౌలర్లు అనంత్ 2 వికెట్లు, సాల్మన్, నరేంద్ర చెరో వికెట్ తీశారు. తర్వాత గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 63 పరుగులు చేసింది. జట్టులో చిన్నా 43, సాల్మన్ 11 పరుగులు చేశారు. గీతం జట్టు బౌలర్లు దేవాశిష్, మోహన్, సాయివర్ధన్ తలో వికెట్ తీశారు.

విజయం సాధించిన గీతం డీమ్డ్ యూనివర్సిటీ జట్టు (సీనియర్స్)

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

ఆర్.రోహన్ (23 పరుగులు, ఓ వికెట్)

గెలుపొందిన కైట్స్ జూనియర్ కళాశాల జట్టు (జూనియర్స్)

✔ **కైట్స్ జూనియర్ కళాశాల 'వర్సెస్' గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల (జూనియర్స్) :** తొలుత కైట్స్ జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 74 పరుగులు చేసింది. **జట్టులో రోహన్ 23,** ధార్మిక్ 15, మౌర్య 14 పరుగులు చేశారు. గవర్నమెంట్ కెమికల్ పాలిటెక్నిక్ జట్టు బౌలర్లు దినేష్, లక్ష్మణ్ చెరో రెండు వికెట్లు తీయగా, రాము ఓ వికెట్ తీశాడు. తర్వాత గవర్నమెంట్ కెమికల్ పాలిటెక్నిక్ జట్టు 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 71 పరుగులు చేసింది. జట్టులో దినేష్ 20, చరణ్ 18 పరుగులు చేశారు. కైట్స్ జట్టు బౌలర్లు తేజేశ్వర్, భరత్ చెరో రెండు వికెట్లు, రోహన్ ఓ వికెట్ తీశారు.

✔ **ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల 'వర్సెస్' సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాల (జూనియర్స్) :** మొదట సాంకేతిక జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 67 పరుగులు చేసింది. జట్టులో కె.లవకుమార్ 15 పరుగులు చేశాడు. ఏపీటీడబ్ల్యూఆర్ జట్టు బౌలర్లు బి.చరణ్, ఎస్.యశ్వంత్, ఎల్.మహేంద్ర తలో 3 వికెట్లు తీశారు. అనంతరం ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 58 పరుగులు చేసింది. జట్టులో బి.మూర్తి 9 పరుగులు చేయగా, చరణ్, యశ్వంత్ చెరో 8 పరుగులు చేశారు. సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాల జట్టు బౌలర్లు జి.అనిల్ 3 వికెట్లు తీయగా, భరత్, శ్రీనివాస్ చెరో వికెట్ తీశారు.

విజయానందంలో సాంకేతిక పాలిటెక్నిక్ జట్టు (జూనియర్స్)

Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner
CMR SHOPPING MALL The joy of life
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Regional Sponsor
GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
TV Partner
ఈటీవీ ఆంధ్రప్రదేశ్
Digital Partner
ఈనాడు.నెట్ ఈటీవీ BHARAT
Dolphin Diagnostic Services
District Sponsor
TIRUMALA విద్యాసంస్థలు
Organised by ఈనాడు ఈతరం క్లబ్

నేటి మ్యాచ్‌లు (02-01-2026)

★ **ఉదయం 8 గంటలకు :** డాక్టర్ లంకపల్లి బుల్లయ్య డిగ్రీ కళాశాల × శ్రీ కశ్యప్ డిగ్రీ కళాశాల(సీనియర్స్) ★ **10 గంటలకు :** విశాఖ పాలిటెక్నిక్ కళాశాల × సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాల (జూనియర్స్) ★ **మధ్యాహ్నం 12 గంటలకు :** అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ × ఆంధ్ర మెడికల్ కళాశాల (సీనియర్స్).

రేపటి మ్యాచ్ (03-01-2026)

★ సీనియర్స్ విభాగంలో శుక్రవారం జరిగే రెండు మ్యాచ్‌ల్లో విజేతలైన జట్లు శనివారం సెమీ ఫైనల్‌లో తలపడతాయి.

నేటి నుంచి ఐటీడీసీ ఛాప్టర్2

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఈనెల 2, 3 తేదీల్లో అంతర్జాతీయ సంప్రదాయ నృత్య కాంగ్రెస్ (ఐ.టి.డి.సి) ఛాప్టర్2-2026 నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ బి.ఆర్.విక్రమ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దీన్ని ప్రారంభిస్తారన్నారు. ఇందులో భాగంగా బీచ్‌రోడ్డు ఎంజీఎం పార్కులో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మందితో సామూహిక కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన ఉంటుందన్నారు.

'సంజీవని'కి రూ.8.22 లక్షల విరాళాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : సంజీవని జిల్లా సహాయ నిధికి గురువారం రూ.8.22 లక్షల విరాళాలు వచ్చినట్లు కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. నాలుగేళ్ల నుంచి నూతన సంవత్సరం సందర్భంగా విరాళాలు అందించాలంటూ కలెక్టర్ పిలుపుతో వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, సంఘాల సభ్యులు, క్రెడాయిలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలు అందిస్తున్నారు.

చూడచక్కగా అలంకరణ

ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయంలో స్వామిని నూతన సంవత్సరం సందర్భంగా గురువారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. గణపతికి చూడచక్కగా పుష్పాలంకరణ చేశారు. - ఈనాడు, విశాఖపట్నం

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రణాళిక

అనకాపల్లి, న్యూస్‌టుడే: వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. స్థానిక సుబ్రహ్మణ్యం ఘాట్ వద్ద గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర సుజలస్రవంతికి బడ్జెట్‌లో రూ. 1,000 కోట్లు కేటాయించారని, భూ సేకరణ జరుగుతోందన్నారు. వంశధార, నాగావళి, జంఝావతి వంటి ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ.రెండు వేల కోట్లు కేటాయించారన్నారు. పోలవరం ఎడమ కాలువ నిర్మాణం పూర్తయితే ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.

ANDHRA UNIVERSITY VISAKHAPATNAM
No.UE/e-PTN (14)/AU/VSP/2025-26.
Date:21-12-2025
TENDER NOTICE
Normal e-tenders are invited through e-procurement for Civil and Electrical works at Andhra University, Visakhapatnam. Last Date for Normal e-tenders : 17-01-2026.
For details visit:
https:// tender.apeprocurement.gov.in.
Sd/- Registrar

జిల్లా పురోగతిపై ప్రత్యేక దృష్టి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కొత్త ఏడాదిలో విశాఖ జిల్లా అన్ని రంగాల్లో పురోగతి సాధించేలా అధికారులు, సిబ్బంది సమష్టిగా పని చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సూచించారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు పారదర్శకంగా, బాధ్యతాయుతమైన పాలన అందించాలన్నారు. కలెక్టర్‌ను జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, జేసీ మయూర్ అశోక్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్‌భరత్, ఇతర అధికారులు, న్యాయవాదులు కలిసి అభినందనలు తెలిపారు.

కలెక్టర్‌తో వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్‌భరత్, ఇతర అధికారులు

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ , జేసీ మయూర్‌అశోక్

కోళ్లకు చలిగండం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: చలి బాగా పెరగడంతో బాయిలర్, లేయర్ కోళ్లు పెద్ద సంఖ్యలో చనిపోతున్నాయి. రెండురోజుల్లో 30 వేలకు పైగా పిల్లకోళ్లు, 20 వేలకు పైగా పెద్ద కోళ్లు చనిపోయాయి. కోళ్ల మరణాలను నిలువరించడానికి రైతులు షెడ్ల చుట్టూ పరదాలు కడుతున్నారు. తాగడానికి వేడి నీళ్లు, బొగ్గు కుంపట్లు పెట్టి వెచ్చదనాన్ని కలిగిస్తున్నారు. ఇన్ని చేసినా మరణాలు తగ్గకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పిల్ల దశలో ఉన్న కోళ్లకు కుంపట్లు పెట్టడానికి భారీ ఖర్చు అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా వీస్తున్న చలిగాలులు కోళ్లకు ఇబ్బందిగా మారాయి. ఈ గండం నుంచి కోళ్లను కాపాడుకోవడానికి రైతులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. వేడిని ఇచ్చే అత్యధిక ఓల్టేజి గల విద్యుత్ బల్బులను వాడుతున్నారు. గుడ్డుకు, మాంసానికి ధర బాగున్న సమయంలో వాతావరణం ప్రతికూలంగా మారడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

వేల సంఖ్యలో చనిపోతున్నాయి

చలి పెరగడంతో ఒక్క మా ఫారంలోనే పిల్లకోళ్లు 3 వేలు, పెద్దకోళ్లు రెండు వేలు చనిపోయాయి. పిల్లకోళ్లకు కుంపట్లు పెట్టి తాగడానికి వేడినీళ్లు ఉంచుతున్నాం. పెద్ద కోళ్లకు ఉదయాన్నే బోరు నుంచి వచ్చే వేడి నీరు మారుస్తున్నాం. అయినా మరణాలు ఆగడం లేదు. **- పాపారెడ్డి, ఎలమంచిలి**

ఉమ్మడి విశాఖ జిల్లాలో	
గుడ్లు పెట్టే కోళ్ల సంఖ్య	: 21 లక్షలు
బాయిలర్ కోళ్ల సంఖ్య	: 50 లక్షలు
పెరుగుతున్న పిల్ల కోళ్లు	: 20 లక్షలు

MARGADARSI CHIT FUND PVT LTD.
Chit Groups are available at our NAD KOTHA ROAD Branch.

Chit Group	Duration In Months	Monthly Installment	Chit Value
LT VV	50	2,00,000	1,00,00,000
LT V	50	1,00,000	50,00,000
LT CC	50	60,000	30,00,000
LT C	50	30,000	15,00,000
LT X	50	20,000	10,00,000
LT T	50	10,000	5,00,000
LT S	50	6,000	3,00,000
LT P	50	4,000	2,00,000

Please Contact Branch Manager Mr. S.SRINIVASA RAO for further details.
Mobile No. 80083-13115, Landline: 0891-2572015, 2572735.

సమష్టి కృషితో విశాఖ అభివృద్ధి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఉద్యోగులంతా సమష్టిగా పని చేసి విశాఖ అభివృద్ధికి కృషి చేయాలని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ పిలుపునిచ్చారు. సిరిపురం వీఎంఆర్డీఏ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఉద్యోగులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. విశాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఓ విజన్ ఉందని, ఆయన ఆలోచనలకు తగ్గట్టుగా అందరం నడుచుకోవాలన్నారు. వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్‌భరత్ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో 10 ముఖ్యమైన అంశాలతో ముందుకెళ్లాలన్నారు. మాస్టర్‌ప్లాన్ రహదారులను నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలన్నారు. భూమి, నిధులు సమీకరించి ముఖ్యమైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయించాలన్నారు. వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యూజియంల ఆధునికీకరణ, భోగాపురం నుంచి రాంబిల్లి వరకు సెమీ రింగ్ రోడ్డును ఏర్పాటు చేయడం, నియోజకవర్గాల్లో ప్రధానంగా 5 సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, ముఖ్య ప్రణాళిక అధికారిణి శిల్పా, ముఖ్య గణాంక అధికారి హరిప్రసాద్, ఎస్టేట్ అధికారి దయానిధి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్, చిత్రంలో కమిషనర్ తేజ్‌భరత్

సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యం

కార్పొరేషన్ న్యూస్‌టుడే : ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఆర్ఎం బి.అప్పలనాయుడు తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా గురువారం ఆయన ఆర్టీసీ అధికారులతో సమావేశమయ్యారు. బస్సుల్ని డ్రైవర్లు అతివేగంగా నడపకుండా, ప్రయాణికులను సకాలంలో గమ్యస్థానాలకు చేర్చేలా పర్యవేక్షణ ఉంచాలన్నారు. బస్సుల సామర్థ్యంపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈనెల 31 వరకు రహదారి భద్రత కార్యక్రమాలు నిర్వహించి, సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు.

ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న ఆర్ఎం అప్పలనాయుడు

ఐజీగా గోపీనాథ్‌జెట్టి బాధ్యతల స్వీకరణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: విశాఖ రేంజ్ డీఐజీగా విధులు నిర్వహిస్తున్న గోపీనాథ్ జెట్టి పదోన్నతి పొందడంతో గురువారం ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఐజీ)గా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు విశాఖ రేంజ్ కార్యాలయంలో సంతకాలు చేశారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రణకు పెద్దపీట వేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను రేంజ్‌పరిధిలోని వివిధ జిల్లాల ఎస్పీలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్, శ్రీకాకుళం ఎస్పీ మహేశ్వరరెడ్డి, పార్వతీపురం ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి, విజయనగరం ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఉన్నతాధికారులు ఉన్నారు. అనంతరం అధికారులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు.

గోపీనాథ్‌జెట్టి

'ఉపాధి హామీ చట్టం మార్పు జాతీయ నేరం'

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కేంద్రంలోని భాజపా కూటమి ప్రభుత్వం దేశంలోని ఉపాధి హామీ చట్టాన్ని మార్పు చేసి వీజీ-జీరాంజీ పథకం తెచ్చి పేదల జీవితాలతో ఆడుకుంటోందని సిటూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఆరోపించారు. లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల హక్కులపై దాడి చేస్తోందని పేర్కొన్నారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం మధ్యాహ్నం సీఐటీయూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. విశాఖలో జరుగుతున్న అఖిల భారత మహాసభల్లో భవిష్యత్ కార్మిక, కర్షక పోరాటాలపై వివిధ రాష్ట్రాల ప్రతినిధులు చర్చిస్తున్నారన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం మార్చడంతో ఉపాధికి గ్యారంటీ లేకుండా పోయిందన్నారు. మహాసభల రెండో రోజున ఉపాధి హామీ చట్టం నిర్వీర్యంపై ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మెకు సిద్ధమయ్యేలా చేసిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. గత ఐదేళ్లుగా కార్మికులు చేస్తున్న పోరాటాల వల్లే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాలేదన్నారు. యూనియన్లు లేకుండా చేయడమే కేంద్రం లక్ష్యమని వీటిపై కార్మికులు పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. ★ సినీ దర్శకుడు సత్యారెడ్డి సిటూ జాతీయ మహాసభలో పాల్గొని మాట్లాడారు. సామాజిక న్యాయం సాధనకై ఉద్యమించాలని, సామాజిక న్యాయం అంశాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలను అడ్డుకొని తీరాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న తపన్‌సేన్, చిత్రంలో సీహెచ్ నర్సింగరావు

EENADU Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

BUSINESS OFFER

న్యూఇయర్‌లో ఎలాంటి పెట్టుబడి లేకుండా నచ్చిన టైమ్‌లో బిజినెస్ చేసుకొని అధిక ఆదాయం పొందండి. అనుభవం, అర్హతలేదు. 9705877799, 8096225555

REAL ESTATE

FLAT FOR SALE

MADHURAWADA

Madhuawada Chandram palem E/F 1180 Sft. Furnished 2BHK 10Yrs. Old Flat Near NH-16 For Sale. Cont: 8125920193.

MVP COLONY

3B/R 2025 Sft. Delux Flats, Each Floor one Flat at MVP Sector-VI, Ready to Occupy. Contact: A.S.Rao. ✆ 8885556575.

SEETHAMMADHARA

Rs.6999/Sft 3bhk Smart Flat 2450 sft Google Automation, Touch Swiches, Glass Lift, Generator, 2 parking. Ph: 7893126804

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగ మం గోవిందపురంరోడ్డు, హైవేకి ½km తార్రోడ్డుపేసింగ్ 9ఎకరాలు కొబ్బరితోట & 4 ఎకరాలు కొబ్బరితోట అమ్మకం. 9440255187.

PLOT FOR SALE

KURMANNAPALEM

PLOT FOR SALE
HIG -III
KURMANNAPALEM
Phase-6 VMRDA
Layout 60x40 S/W
261.12 Yards
Rate: 62,000/ yard
✆ 9848198291 9866651382

GENERAL

విజయనగరంనుండి వైజాగ్ వెళ్ళు NH-26కు ప్రక్కన రాయపూర్ హైవేకు దగ్గర్లో ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళు 80Ft రోడ్‌కు ఆనుకొని VMRDA & RERA అనుమతులు కల్గిన లేఅవుట్‌లో 24గం॥ సెక్యూరిటీతో అన్నిసౌకర్యాలు కలిగిన ఇండ్ల స్థలములు డైరెక్ట్ కంపెనీధరకు అమ్మబడును. ఈ ఆఫర్ సేల్స్ సంక్రాంతి వరకు మాత్రమే. 8919807419.

TO LET

KURMANNAPALEM

TO-LET
A) 4 - BHK, Green City Heights @ VPL Green City, VADLAPUDI
B) 3 - BHK, Fully Furnished with A/C, Green City Heights @ VPL Green City, VADLAPUDI
✆ 98487 71300

JOBS

RECRUITMENT
Are you RETIRED but not "TIRED"
A Leading MNC Looking for New Operations In Vizag
Age Limit: 55 yrs to 70 yrs (Male/Female).
A Great Opportunity for Retired Government / (State & Central) / Private Employees.
Offering An exciting Opportunity to attend "FREE" ONE DAY WORKSHOP for exploring the New Trending Opportunities in VIZAG exclusive for Retired Government (State & Central) / Private Employees.
NOTE: This Workshop Timings is from 9am to 3pm. (Breakfast, Lunch & Evening Snacks will be provided during training).
Call between 10AM to 7PM HR Ph: 83096 55089.
Kalyani, Aishwarya Towers, R&B Jn., Nr. NAD Kotha Road, Vizag.

అమెజాన్ సంస్థలో డెలివరీ చేయుటకు డెలివరీ అసోసియేట్స్ కావలెను. జీ॥ 25,000/- నుండి 30,000/- వరకు ఇవ్వబడును. 8885216128, 8919110170

Hydలో 24 గం. బెడ్ పేషంట్ & సపోర్టింగ్‌కి చేయుటకు అనుభవంగల ఆయాలు, కేర్‌టేకర్ స్త్రీ/పు, జీ:18-20వేలు+రూం+బో. బ్రా.& వైశ్య, బ్రాహ్మణులు వంటకి. 8331078939

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఒత్తిడిని జయించేలా.. ఆందోళన అధిగమించేలా..

పెందుర్తి, న్యూస్‌టుడే

సర్కారు బడుల్లోని పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక అమలవుతోంది. నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు అత్యధిక మార్కులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఈ ప్రణాళిక అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు, పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాలబాలికలు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉన్నందున నివారణకు ప్రత్యేక కృత్యాలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

నిత్య కృత్యాలు ఇలా..

★ ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం తొలి పీరియడ్ ప్రారంభానికి ముందు పది నిమిషాలు యోగా, ధ్యానం నిర్వహించాలి. ★ ప్రతిరోజు సాయంత్రం చివరి పీరియడ్‌లో పిల్లలు ఆరు బయట ఆడుకునేలా అవకాశం కల్పించాలి. పోటీలేని క్రీడలు ఆడేలా ప్రోత్సహించడం ★ ఉదయం అసెంబ్లీలో విద్యార్థుల్లో ప్రేరణ కలిగించేలా స్ఫూర్తిదాయక ప్రసంగాలు వినిపించడం ★ ఒత్తిడి నివారణ మార్గాలు సూచించేలా గోడపత్రికల ప్రదర్శన ★ ఓటమి భయం, ఆత్మన్యూనత ఇబ్బందులున్న వారిని గుర్తించి కౌన్సెలింగ్ చేయడం ★ సందేహాల నివృత్తికి 'షేరింగ్ టైం' 'ఆస్క్ మి' సెషన్లు నిర్వహించాలి.★ వెనుకబడిన విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు పనికిరాదు. ★ విద్యార్థులు తమ సమస్యలు తెలియజేసేందుకు 'హెల్ప్ బాక్స్' ఏర్పాటు చేసి వాటిని బహిర్గతం చేయకుండా గోప్యంగా ఉంచి పరిష్కరించాలి. ★ విద్యార్థుల బలాబలాలను ముందుగానే గుర్తించి వెనుకబడిన వారిని ప్రోత్సహించేలా నిపుణులతో కౌన్సెలింగ్, ప్రకృతిలో నడక, గార్డెనింగ్ వంటివి చేయించి లక్ష్య సాధనకు ప్రోత్సహించాలి. ★ పిల్లలు 'స్క్రీన్ టైం' తగ్గించుకునేలా అవగాహన కల్పించాలి. సాంకేతికతను ఎలా ఉపయోగించుకోవాలో తెలియజేయాలి. ★ 'మై ఎగ్జామ్ విత్ మై ఓన్ క్వశ్చన్ పేపర్' పేరిట విద్యార్థులు వారే ప్రశ్నపత్రం ఎంపిక చేసుకుని పరీక్ష రాసేలా ప్రోత్సహించాలి. ★ పదో తరగతి పరీక్షలకు ఇంకా రెండు నెలల సమయం ఉన్నందున పైఅంశాలు పాటిస్తూ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా కృత్యాలు అమలు చేసేందుకు శ్రీకారం చుట్టారు.

వి.జుత్తాడ పాఠశాలలో ధ్యానంలో విద్యార్థులు

రామావతారంలో సింహాచలేశుడి దర్శనం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం సింహాచలేశుడు శ్రీరామచంద్రమూర్తి అవతారంలో భక్తులను అనుగ్రహించారు. అప్పన్న ఆలయంలో అధ్యయనోత్సవాల సందర్భంగా సింహగిరి మాడవీధుల్లో స్వామివారి తిరువీధి వేడుక వైభవోపేతంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేతుడైన గోవిందరాజ స్వామిని ధనుర్బాణాలతో రామావతారంలో అలంకరించారు. స్వామి, అమ్మవార్లు, ఆళ్వారాచార్యులను వేర్వేరు పల్లకిలో అధిష్ఠింపజేశారు. నాదస్వర మంగళవాయిద్యాలు, వేద పారాయణల నడుమ ఊరేగించారు. తిరువీధులలో విహరించి దేవ దేవుడిని దర్శించుకున్న భక్తజనం గోవింద నామస్మరణ చేశారు.

సింహగిరి మాడవీధుల్లో దేవతామూర్తుల తిరువీధి వేడుక

ఉక్కులో స్వల్ప ప్రమాదం

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కు కర్మాగారంలోని ఎస్ఎంఎస్ విభాగంలో గురువారం సాంకేతిక సమస్యతో స్వల్పప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్ఎంఎస్ మిక్సర్ పిట్టులో హాటు మెటల్ పోసే క్రమంలో టర్బో లాడిల్ కార్ (టీఎల్‌సీ) బ్రేక్ పనిచేయక హాట్ మెటల్ అలా పడుతూనే ఉండిపోయింది. సుమారు 100 టన్నుల హాట్ మెటల్ మిక్సర్ పిట్టులో నిండిపోయింది. మిక్సర్ పిట్టుకు ప్రత్యామ్నాయం ఉండటంతో ఉత్పత్తికి ఎటువంటి అంతరాయం, ప్రమాదం జరగలేదని అక్కడి ఉద్యోగులు తెలిపారు. పిట్టులో హాట్ మెటల్ చల్లారిన తరువాత కోసి తొలగించాల్సి ఉంటుందని తెలిపారు.

రూ.12 కోట్ల మద్యం తాగేశారు!

డిసెంబరు 31న జిల్లాలో భారీగా విక్రయాలు

మాధవధార, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో జిల్లాలో మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. డిసెంబర్ 31 ఒక్క రోజే రూ.12 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాది రూ.11 కోట్లు విక్రయాలు జరగ్గా ఈ ఏడాది అదనంగా మరో రూ.కోటి విలువైన మద్యాన్ని విక్రయించారు. ఈ ఏడాది అనూహ్యంగా డిజిటల్ పేమెంట్స్ 51 శాతం జరిగాయి. అర్ధరాత్రి 1 గంట వరకు మద్యం అమ్మకానికి అనుమతి ఇవ్వడంతో విక్రయాలు భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. నూతన సంవత్సరం సందర్భంగా మూడు రోజులు ముందుగానే మద్యం వ్యాపారులు నిల్వలు సిద్ధం చేసుకున్నారు. ★ నగరంలో మొత్తం 161 మద్యం షాపులు, 75 బార్లు, 16 స్టార్ హోటల్స్, 6 క్లబ్‌లు, 5 టూరిజం బార్ అండ్ రెస్టారెంట్లలో మొత్తం రూ.12 కోట్లు మేర విక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి కాత్యాయినీ కూచిపూడి నృత్య అకాడమీ విద్యార్థులు ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. దేవస్థానం వీరి ప్రతిభను గుర్తించి ప్రశంసా పత్రాలను అందజేసింది.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	133	130
లైవ్	160	150
డ్రెస్డ్	232	270
స్కిన్‌లెస్	264	280

(c) eenadu

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1: శంబాల (మార్నింగ్, ఫస్ట్ షో), ఈషా (మ్యాట్నీ, సెకండ్ షో)
స్క్రీన్-2: 45

నేడు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం రావాడ, పరవాడ, కన్నూరు, పెద ముషిడివాడ పంచాయతీల్లో శుక్రవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పర్యటించనున్నారని స్థానిక కూటమి నాయకులు పేర్కొన్నారు. అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామాల్లో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకుంటారని, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని అన్నారు. కూటమి నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు హాజరు కావాలని కోరారు.

పెందుర్తి

జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలు అంటేనే ఉత్సాహంగా జరుపుకొంటున్నా ఉక్కు ఉద్యోగుల్లో ఆ ఆనందం కనిపించడం లేదని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ పేర్కొన్నారు. తక్షణమే ఉద్యోగులకు పూర్తి జీతంతో పాటు పాత బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉత్పత్తితో ముడిపెట్టి జీతాలు చెల్లించడం అప్రజాస్వామికం అన్నారు. తక్షణమే ఆ ఉత్తర్వులు రద్దు చేయాలని ఇంటక్ నాయకులు ఎం.రాజశేఖర్, పి.వి.రమణమూర్తి యాజమాన్యాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: సమస్య కృష్ణరాయపురం సమీప విద్యానగర్‌లో ప్రధాన కాలువలు శుభ్రపరచ నోచుకోవడం లేదు. -అప్పారావు ✓: పరిష్కారం: వెంటనే శుభ్రత చర్యలు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. -అప్పలనాయుడు, ఏఎంహెచ్‌వో

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: అసకపల్లి ఎస్సీ కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. -కె.ఆర్.ప్రసాద్, ఎస్సీకాలనీ, అసకపల్లి ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -కె. నర్సింగరావు, అసకపల్లి సర్పంచి

?: సబ్బవరం కోమటి వీధిలో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద పెరుగుతోంది. -పి.వెంకటేశ్, సబ్బవరం. ✓: వెంటనే పరిశీలించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. -డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ సబ్‌స్టేషన్ కూడలిలోని హైమాస్టు దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. -నాగేశ్వరరావు, పరవాడ ✓: క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరిస్తాం. -మల్లికార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో, పరవాడ.

ప్రతిభ చాటి.. పతకాలు సాధించి..

వివిధ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు



పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పి.బోనంగి సంస్కృతి గ్లోబల్‌స్కూల్ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, క్విజ్ తదితర పోటీల్లో సత్తా చాటుతున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఇటీవల జరిగిన సౌత్‌జోన్, జిల్లా, రాష్ట్ర స్థాయి క్విజ్, క్రీడా పోటీల్లో ప్రతిభ చాటి త్వరలో హైదరాబాద్, దిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు విజేతల మనోగతం వారి మాటల్లోనే..

మేము పదో తరగతి చదువుతున్నాం. చదువుతో పాటు మిగతా రంగాల్లో రాణించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో క్రీడా పోటీల్లో పాల్గొంటున్నాం. నవంబరులో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన సీబీఎస్‌ఈ సౌత్‌జోన్ స్థాయి రీడింగ్ [illegible] క్విజ్ పోటీల్లో 30 పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పోటీ పడ్డాం. ప్రథమస్థానం సాధించి జ్ఞాపికతో పాటు పతకం సొంతం చేసుకుని ఈనెల 17న హైదరాబాద్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాం. జాతీయ స్థాయిలోనూ సత్తా చాటుతామనే నమ్మకముంది. -అభినవ్ ధనవత్, ప్రతి వెంకట శ్రేయన్

మాది జాలువానిపాలెం. నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. తండ్రి ఆడడం చూసి ఆసక్తి పెంచుకున్నా. రెండేళ్లుగా క్రమం తప్పకుండా కోచ్ వద్ద తర్ఫీదు పొందుతున్నా. [illegible] మూడో తరగతి చదువుతున్నా. తండ్రి సన్యాసిరావు రైతు. తల్లి ధనలక్ష్మి గృహిణి. రోజూ ఆడడం వల్ల ఆరోగ్యంగా ఉంటున్నా. ఇటీవల విశాఖలో జరిగిన అండర్-10 విభాగంలో సింగపూర్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో విశాఖ జట్టు తరఫున ఆడి నాలుగు వికెట్లు తీశా. ప్రస్తుతం విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్ క్యాంప్‌లో శిక్షణ పొందుతున్నా. మున్ముందు అంతర్జాతీ స్థాయి క్రికెటర్ అవుతా. -ఎస్. రోష్మిత్

చదువుతో పాటు సాఫ్ట్‌బాల్ క్రీడకు ప్రాధాన్యమిచ్చి మూడేళ్లుగా సాధన చేస్తున్నా. కోచ్ వద్ద తర్ఫీదు పొందుతూ ఆటలో రాటు దేలుతున్నా. తండ్రి మణిమధు, తల్లి తనూజకుమారి రైల్వే ఉద్యోగులు. క్రీడల వల్ల ఏకాగ్రత పెరిగి చదువులోనూ రాణిస్తున్నా. ఆరో తరగతి చదువుతున్నా. ఇటీవల మాకవరపాలెంలో జిల్లా స్థాయి పోటీల్లో, కడపలో రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి బెస్టుప్లేయర్ అవార్డు సొంతం చేసుకున్నా. త్వరలో దిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యా. గతంలోనూ జిల్లా స్థాయిలో పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. -ప్రతీక్‌కుమార్

ప్రజల దగ్గరకు పాలన కూటమి ప్రభుత్వ లక్ష్యం

పెందుర్తి జోన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేపగుంట, న్యూస్‌టుడే: ప్రజలకు దగ్గరగా పరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన జోనల్ వ్యవస్థలో భాగంగా వేపగుంటలో పెందుర్తి జోన్ కార్యాలయాన్ని మేయర్, ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా జోనల్ కార్యాలయాలు ఉంటే ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందుతాయన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆ మార్పు చేసిందన్నారు. జోనల్ కమిషనర్ హెచ్.శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు, ఏసీపీ రామలింగారెడ్డి, ఈఈ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ★ ఈ సందర్భంగా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాల తీరుపై మేయర్ పీలా శ్రీనివాసరావు అసహనం వ్యక్తం చేశారు. జోన్ పరిధిలో ఉన్న కార్పొరేటర్ల పేర్లు లేకపోవడం తగదని, వారి పేర్లు కూడా శిలాఫలకంపై ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శిలాఫలకాలు ప్రజలందరికీ కనిపించే చోట ఏర్పాటు చేయాలని సూచించారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

సబ్బవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం సబ్బవరం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల మధ్య నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. ముందుగా ఆమె కేక్ కోసి విద్యార్థులకు తినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇదే రోజున పుట్టిన రోజు జరుపుకొంటున్న విద్యార్థులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులంతా బాగా చదువుకుని తల్లిదండ్రులకు, విద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన శుద్ధ జల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా ప్రజలకు ఆమె నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీవో జి.గ్రేస్, డీడీవో బి.రామానంద్, సబ్బవరం తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పి.పద్మజ, ప్రిన్సిపల్ సీహెచ్ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో కేక్ కోస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ఉరేసుకుని యువకుడి మృతి

శ్రీనివాసనగర్ (వేపగుంట), న్యూస్‌టుడే: ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. శ్రీనివాసనగర్‌కు చెందిన కరోతి షణ్ముఖరావు (32) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో పిన్ని, చిన్నాన్నల వద్దే ఉంటూ గోపాలపట్నంలోని ఓ వెల్డింగ్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఇటీవల స్నేహితులు జానీ, గోపాల్‌తో కలసి బయటకు వెళ్లాడు. అక్కడ వారి మధ్య తలెత్తిన వివాదంలో జానీని షణ్ముఖరావు బలంగా కొట్టడంతో ఆసుపత్రిలో చేరాడు. కోలుకున్న తర్వాత అతడు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ విషయం తెలుసుకున్న షణ్ముఖరావు కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ బుధవారం రాత్రి ఇంటికొచ్చాడు. మళ్లీ కొద్ది సేపటికే బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో నూతన సంవత్సర వేడుకల్లో స్నేహితులతో ఉండి ఉంటాడని కుటుంబీకులు భావించారు. కాగా.. గురువారం మామిడితోటలో చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించడంతో స్థానికులు గోపాలపట్నం పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ మరణంపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరుతున్నారు.

సేవలకు గుర్తింపు

సత్కారం పొందిన ఉద్యోగులతో నాయకులు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం అంతకాపల్లి సచివాలయం నుంచి బదిలీపై వెళ్లిన అధికారులు సీహెచ్ రవి, మూర్తి, మహాలక్ష్మి, ఎన్.శ్రావణి, సీహెచ్ దేవకిలను గురువారం సర్పంచి నారాయణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు చొక్కాకుల గోవింద, తదితరులు సత్కరించి జ్ఞాపికలు అందించారు. జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రామకాసు తదితరులు అతిథులుగా విచ్చేసి వారి సేవలను కొనియాడారు. స్థానిక నాయకులు ముత్యాలునాయుడు, దేముడు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ ప్రేమికుడి ఔదార్యం

ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్న దుర్గాప్రసాద్

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం గొర్లెవానిపాలెం బీసీకాలనీకి చెందిన రేగల దుర్గాప్రసాద్ పర్యావరణంపై ఉన్న మక్కువను మరోమారు చాటుకున్నారు. ఈయన అచ్యుతాపురం మండలం నునపర్తి సచివాలయ పరిధిలో అసిస్టెంట్ లైన్‌మెన్. నూతన సంవత్సరం సందర్భంగా తన సొంత నిధులు రూ.50 వేలు వెచ్చించి కడియం నుంచి వివిధ రకాలకు చెందిన 1200 మొక్కలు తెప్పించి గురువారం విశాఖ ఆర్కే బీచ్ వద్ద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. రోజురోజుకు కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం ఈ ప్రక్రియ చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. గడచిన రెండేళ్లుగా ఆయన తన కుమారుడు విరాజ్ మొదటి, ద్వితీయ పుట్టిన రోజు వేడుకలు చేయకుండా ఆ సొమ్ముతో కడియం నుంచి వెయ్యికి పైగా మొక్కలు తెప్పించి పరిసర గ్రామాల్లో పంపిణీ చేశారు. దుర్గాప్రసాద్ తన వివాహానికి శుభలేఖలకు బదులు అప్పట్లో బంధువులకు, స్నేహితులకు, అధికారులకు మొక్కలు అందజేసి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో 'వైజాగ్ వాలంటీర్స్' పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయాల ప్రారంభం

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, అగనంపూడి, గాజువాక, న్యూస్‌టుడే : అగనంపూడిలో కొత్తగా ఏర్పాటుచేసిన జోనల్ కార్యాలయాన్ని, పునర్ వ్యవస్థీకరించిన గాజువాక జోనల్ కార్యాలయాలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరానికి దీటుగా గాజువాక ప్రాంతాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రజల సౌలభ్యం కోసం జోనల్ కార్యాలయాలను ఏర్పాటు చేశామన్నారు. జోనల్ కార్యాలయాల ప్రారంభోత్సవంలో డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, అగనంపూడి జెడ్సీ మనీషా త్రిపాఠి, జెడ్సీ శేషాద్రి, ఎస్ఈ గోవిందరావు, ఇ.ఇ. రాయల్‌బాబు, కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, ఇల్లపు వరలక్ష్మి, మొల్లి ముత్యాలనాయుడు, ఎ.జె.స్టాలిన్, భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కర్రి దశేంద్ర, గొల్లవిల్లి కనకభవాని, గవర సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవలు ప్రశంసనీయం

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : సమాజంలో పేదలు, వెనుకబడిన వర్గాలకు నిరంతరం సేవలు అందిస్తున్న సత్యసాయి సేవా సంస్థల నిస్వార్థ సేవా సిద్ధాంతం ప్రశంసనీయమని మెడ్‌టెక్ జోన్ మేనేజింగ్ డైరెక్టర్, వ్యవస్థాపక సీఈవో డాక్టర్ జితేంద్ర శర్మ అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మెడ్‌టెక్ జోన్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఎంటీజెడ్ వాలంటీర్లు, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు ఆర్.ఎ.నాయుడు, సోమేశ్వరి, ఎస్.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న మెడ్‌టెక్ వ్యవస్థాపక సీఈవో డాక్టర్ జితేంద్ర శర్మ

ఘనంగా ధనుర్మాసోత్సవాలు

వేంకటాద్రిపై పూజలందుకున్న మలయప్ప స్వామి

నవనీత అలంకరణలో శ్రీనివాసుడు

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై కొలువుదీరిన శ్రీనివాసుడు గురువారం నవనీత అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చక బృందం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా వేకువజామున తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. 27 కిలోల వెన్నతో స్వామిని అలంకరించి ధూపదీప సేవలు జరిపి తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా స్వామివారి ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామిని శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు సామూహిక పాశుర పారాయణం చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, అమెరికాలోని అట్లాంటాలో హనుమాన్ మందిర ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ చీమలపాటి మూర్తి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అర్చకులు ప్రముఖులను వేదమంత్రాలతో ఆశీర్వదించి శేషవస్త్రాలతో సత్కరించారు.

తిరుప్పావై సేవాకాలంలో పాల్గొన్న భక్తజనం

కృష్ణావతారంలో..

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: సుజాతనగర్ హరిహర క్షేత్రంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామి గురువారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఫార్మాసిటీ పునరావాస కాలనీలో..

విరాళం అందజేస్తున్న దాత గంగరాజు దంపతులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.బోనంగి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొండపై కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం నూతన సంవత్సరం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరికృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు, గోత్రనామాలతో అర్చనలు చేశారు. ఈ సందర్భంగా తిరుప్పావై 17వ పాశురాన్ని విన్నపం చేశారు. భక్తులు పెద్దఎత్తున స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పెదముషిడివాడకు చెందిన డి.గంగరాజు దంపతులు ఆలయ అభివృద్ధి కోసం రూ.10,116 మొత్తాన్ని విరాళంగా సమకూర్చారు. ఆలయ కమిటీ ఛైర్మన్ బుగిడి రామగోవిందరావు, పాల్గొన్నారు.

వేపగుంట, న్యూస్‌టుడే : నాయుడుతోట రవినగర్ శేషాద్రి శిఖరంపై గల కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ముత్యమాంబకాలనీలో బైబిల్‌మిషన్ సమృద్ధిగృహం చర్చిలో పాస్టర్ సుందరరావు ఆధ్వర్యంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అర్చకులు వేకువజామున తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నపం చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత గోవింద రాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు.

గణనాథుడుకి జేజేలు

ప్రత్యేక అలంకరణలో వినాయకుడు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరి ఘాట్ రోడ్డు టోల్‌గేటు దరి సింహాచలం దేవస్థానం ఉప దేవాలయం వినాయకుడి ఆలయంలో గురువారం నూతన సంవత్సరం పురస్కరించుకుని విశేష పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో గణనాథుడిని శ్రీగంధం, పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు.

నేటి నుంచి గ్రామసభలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలోని భూయజమానులకు రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసేందుకు ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ అరుణ్ కుమార్ తెలిపారు. ఈనెల 2న ఈ.బోనంగి, గొర్లెవానిపాలెం, 3న వెన్నెలపాలెం, 5న కలపాక, పి.బోనంగి, 6న భరణికం, తానాం, 7న పెదముషిడివాడ, కన్నూరు, 8న ఈ.మర్రిపాలెంలో గ్రామసభలు ఉంటాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఈ సభలు జరుగుతాయని పేర్కొన్నారు. పరవాడ గ్రామానికి చెందిన కొత్తపట్టాదారు పాసుపుస్తకాలు ఇంకా రాలేదని, వచ్చిన వెంటనే గ్రామసభ నిర్వహించి పుస్తకాలు అందిస్తామన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలానికి చెందిన షెడ్యూల్‌ను తహసీల్దార్ బి.చిన్ని కృష్ణ విడుదల చేశారు. ఈనెల 2న విప్పాక అగ్రహారం, ఆరిపాక; 3న ఎరుకునాయుడుపాలెం, గాలిభీమవరంలలో, 5న లగిశెట్టిపాలెం, రాయపుర అగ్రహారం, టెక్కలిపాలెం, 6న బంగారమ్మపాలెం, సిరసపల్లి, 7న అయ్యన్నపాలెం, ఎల్లుప్పి, బోదువలస 8న సీహెచ్ అగ్రహారం, 8న మొగలిపురం, ఇరువాడ, 9న పైడివాడ అగ్రహారంలలో ఈ కార్యక్రమం జరుగుతుందని రైతులంతా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు పుస్తకాలు అందిస్తున్న పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్, ఎస్‌ఐలు, సిబ్బంది

మేయర్ పీలా శ్రీనివాసరావుకు మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందిస్తున్న జీవీఎంసీ అధికారులు

పెందుర్తి, న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పెందుర్తి మండలంలో గురువారం ఘనంగా వేడుకలు జరిగాయి. సుజాతనగర్ సమీప రత్నగిరినగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత అభిమానుల నడుమ రమేశ్‌బాబు కేక్ కోసి వేడుకల్లో పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు ఆయనకు పుస్తకాలు, రాత సామగ్రి, శాలువాలు, రగ్గులు అందజేశారు. వాటిని అవసరమైన వారికి పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన ఏడాదిలో కూటమి ప్రభుత్వం మరపురాని పాలన అందించిందని కొనియాడారు. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ★ పెందుర్తిలో జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు నివాసంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు అధికారులు, కార్పొరేటర్లు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ★ పెందుర్తి మండల పరిషత్ కార్యాలయం వద్ద పరిపాలనాధికారి కొల్లి వెంకటరావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది జెడ్పీ సీఈవో నారాయణమూర్తిని కలిసి శాలువాతో సత్కరించారు.

★ పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐలు, సిబ్బంది స్థానిక శక్తి సదన్, లయోలా వృద్ధాశ్రమాల్లో వృద్ధులు, పునరావాసం పొందుతున్న మహిళల మధ్య ఈ వేడుకలు నిర్వహించారు. ఎస్‌ఐలు షేక్ జిలానీ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీకి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలో ఈ వేడుకలు సందడిగా జరిగాయి. పలుచోట్ల బాణసంచా కాల్చారు. వెన్నెలపాలెంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కేక్ కట్ చేశారు. నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పరవాడలో ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మిని ఎంపీడీవో రమేశ్‌నాయుడు, ఇతర అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ★ పరవాడ మండలం వెన్నెలపాలెం గ్రామంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని గురువారం రాత్రి అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

బండారుకు శుభాకాంక్షలు చెబుతున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

సబ్బవరం, న్యూస్‌టుడే: పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ మొగలిపురంలోని తన నివాసంలో తెదేపా కూటమి నేతలు, కార్యకర్తల మధ్య ఈ వేడుకలు నిర్వహించారు. శాప్ డైరెక్టర్ రాజు, స్థానిక నాయకులు బర్నికాన సాయినాథరావు, గండి ముత్యాలునాయుడు తదితరులు పాల్గొన్నారు. ★ సబ్బవరం మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లోనూ ఈ వేడుకలు జరిగాయి. ఎంపీపీ బోకం సూర్యకుమారికి మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు బొకేలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్టీపీసీ దీపాంజలినగర్‌లో..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్ క్రీడామైదానంలో బుధవారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈడీ సమీర్‌శర్మ సంస్థ అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కుటుంబసభ్యులు ఆటపాటలతో సందడి చేశారు. సినీనేపథ్య గాయకుడు శ్రీకృష్ణ హుషారైన పాటలు పాడి ఉర్రూతలూగించారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి. బాణసంచా వెలుగులు కనువిందు చేశాయి. దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు నీతూశర్మ, ఎన్టీపీసీ జీఎంలు, సంస్థ అధికారులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ, తదితరులు

సినీ నేపథ్య గాయకుడు శ్రీకృష్ణ గీతాలాపన

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట జోనల్ కార్యాలయంలో జెడ్సీ శంకరరావుకు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేశారు. పెందుర్తి జోన్ కార్యాలయం ప్రారంభోత్సవానికి వచ్చిన మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబులకు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావుల కార్యాలయాలకు పలుకాలనీ సంఘాల ప్రతినిధులు, అభిమానులు వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎమ్మెల్యే పంచకర్లకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్

'సిటూ పోరాటాలతోనే ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ'

మాట్లాడుతున్న జె.అయోధ్యరామ్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: సీఐటీయూ పోరాటాలతోనే ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ సాధ్యమవుతుందని విశాఖ ఉక్కు కర్మాగారం ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అఖిల భారత స్టీల్ కార్మికుల సమాఖ్య ఉపాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. ఏయూ ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న సిటూ 18వ అఖిల భారత మహాసభల్లో ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ అంశంపై ఆయన మాట్లాడారు. నూతన ఆర్థిక విధానాల ప్రారంభం నుంచే ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ప్రయత్నం ప్రారంభమైందన్నారు. దీనికి వ్యతిరేకంగా సీఐటీయూ చేస్తున్న పోరాటాల వల్ల ప్రభుత్వాలు ముందుకు వెళ్లలేకపోతున్నాయన్నారు. విశాఖ ఉక్కుకు ముడిసరకు, వర్కింగ్ క్యాపిటల్ కేటాయించకపోవడం వల్లే ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మూడో వంతుకు తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వం రూ.5 వేల కోట్ల పెట్టుబడి పెడితే రూ.58 వేల కోట్ల మేరకు పన్నుల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమకూర్చడంతో పాటు లక్షల మందికి ఉపాధి కల్పించడం సాధ్యమైందన్నారు. ఇటువంటి పరిశ్రమలను ప్రైవేటీకరణ చేసేందుకు చేస్తున్న అన్ని ప్రయత్నాలను సీఐటీయూ అడుగడుగునా అడ్డుకుంటుందన్నారు.

ఘనంగా భీమా కొరేగావ్ విజయోత్సవం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కుల వివక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి చిరస్మరణీయ ప్రతీకగా నిలిచిన భీమా కోరేగావ్ విజయోత్సవాన్ని(శౌర్యదిన్) గురువారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. మూవ్‌మెంట్ 21 ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా క్యాలెండర్ ఆవిష్కరించారు. డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య జి.సుధాకర్, ఆచార్య పి.ప్రేమానందం, డాక్టర్ కృష్ణ, డాక్టర్ బి.మోహన్‌బాబు, డాక్టర్ తెనాలి సాంబశివరావు, డాక్టర్ చప్పిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతల స్వీకరణ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ఏవీఎన్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా ఉన్న పి.కృష్ణకుమారిని ప్రిన్సిపల్‌గా నియమిస్తూ కరస్పాండెంట్ ఏవీ అదీప్‌భానోజీరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. అధ్యాపకులను సమన్వయం చేసుకుంటూ, విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తామని ప్రకటించారు. అనంతరం ఆమెను అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

(c) eenadu

భీమిలి

సినిమాలు
చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే
గణేశ్- సైక్ సిద్ధార్థ
రాములమ్మ- శంబాలా
తాతా- 45
సప్తగిరి- ఛాంపియన్

పార్టీ బలోపేతమే లక్ష్యం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : విశాఖలో తెదేపాను మరింత బలోపేతం చేసేలా కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఐక్యంగా కృషి చేయాలని విశాఖ లోక్‌సభ నియోజకవర్గం తెదేపా అధ్యక్షునిగా నియమితులైన చోడె వెంకటపట్టాబిరామ్ అన్నారు. గురువారం పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు ఆయన్ను నగర పార్టీ కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పట్టాభిరామ్ సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: స్వతంత్రనగర్(మధురవాడ)లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. – స్థానికులు ✓: క్షేత్రస్థాయిలో దృష్టి సారించి తగు చర్యలు తీసుకుంటాం. – అయ్యప్పనాయుడు, జెడీ

?: రాడిసన్ బ్లూ(బీచ్‌రోడ్డు) ఎదురుగా ఉన్న దారిలో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. – లేఅవుట్ వాసులు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – సాయిరాం, విద్యుత్ అధికారి

?: ఈనాడు లేఅవుట్(సాగర్‌నగర్)లో విజయ అపార్ట్‌మెంట్ పరిసరాల్లో విద్యుద్దీపాలు మరమ్మతులకు గురయ్యాయి. – అపార్ట్‌మెంట్ వాసులు ✓: విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – సాయిరాం, విద్యుత్ అధికారి

?: వి కన్వెన్షన్(పీఎంపాలెం) వెనుక ఓ ఆశ్రమం పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. – స్థానికులు ✓: పిచ్చిమొక్కలను తొలగిస్తాం. – సాయికుమార్, శానిటరీ అధికారి

?: ఎండాడ ట్యాంక్‌బండ్‌లో వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. – రాజు ✓: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. – రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి

అనుక్షణం భయం భయం
రక్షణ లేని సంక్షేమ వసతి గృహాలు

ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణా సంస్థ వద్ద ఇలా..

కొమ్మాది, న్యూస్‌టుడే

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో రక్షణ చర్యలు కొరవడటంతో విద్యార్థులు నిత్యం భయభ్రాంతులకు గురవుతూ విద్యను అభ్యసిస్తున్నారు. ఏ క్షణం ఎటు వైపు నుంచి ప్రమాదం పొంచి ఉంటుందోనని ఆందోళన చెందుతూనే రాత్రివేళ వసతి గృహాల్లో నిద్రిస్తున్నారు.

★ మారికవలస కూడలి నుంచి ఐటీ హిల్స్‌కు వెళ్లే రహదారిలో కొండవాలు ప్రాంతంలో సుమారు 6 ఎకరాల్లో ఏపీ గిరిజన సంక్షేమ పాఠశాలతో పాటు వసతి గృహం ఉంది. ఇక్కడ 437 మంది బాలురు 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలతో పాటు వసతి గృహం సైతం అదే ప్రాంగణంలో ఉండటం, ఆ వసతి గృహం కొండకు ఆనుకుని ఉండటంతో విషకీటకాలు, విషసర్పాలు సైతం లోపలకు ప్రవేశిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇటీవల వారానికి ఒకసారైనా విషసర్పాలు రావడం వాటిని విద్యార్థులు హతమార్చడం పరిపాటిగా మారింది.

ఇదే ప్రాంగణంలో మరో ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణ సంస్థ సైతం ఉంది. ఇక్కడ వందమంది విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారు. ఈ రెండు వసతి గృహాల చుట్టూ 820 మీటర్లు పొడవునా 4 అడుగుల ఎత్తులో ప్రహరీ గతంలో నిర్మించారు. పన్నెండేళ్ల కిందట చిరుతపులి ఆ ప్రాంతంలోకి వచ్చి ప్రహరీపై నిలబడటంతో ఆ సమయంలో విద్యార్థులతో పాటు చుట్టూ పక్కల ప్రాంతీయులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆ ప్రహరీ కాస్త శిథిలావస్థకు చేరుకుంది. చెట్లు, తుప్పలు భారీగా పెరిగిపోయి దర్శనమిస్తున్నాయి. నిత్యం భయభ్రాంతులతోనే విద్యను అభ్యసిస్తున్నామని విద్యార్థులంతా వాపోతున్నారు. ఈ విషయంపై స్థానిక ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు గత వైకాపా పాలకులు వివరించినా స్పందన లేదని, కనీసం అటు వైపు కన్నెత్తి చూడలేదని, ఇప్పటికైనా కూటమి పాలకులు స్పందించి ఎటువంటి విషసర్పాలు రాకుండా చుట్టూ రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.

3న నియోజకవర్గ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపకల్పన

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కొమ్మాది, న్యూస్‌టుడే: భీమిలి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఈ నెల 3న మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నట్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గాల వారీగా జోనల్ కార్యాలయాల ఏర్పాటు ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జోన్-2 కార్యాలయాన్ని మధురవాడ జోనల్ కార్యాలయంగా నామకరణం చేశారు. గురువారం ఎమ్మెల్యే దీన్ని ప్రారంభించారు. ఈ జోన్ పరిధిలో 5, 6, 7, 8, 98 వార్డులు ఉన్నాయన్నారు. ఈ నెల 3న కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి రెండుజోన్ల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నియోజకవర్గ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నూతన సంవత్సరం సందర్భంగా కేకు కోశారు. కార్యక్రమంలో జనసేన భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సందీప్, జెడ్పీ అయ్యప్పనాయుడు, ఏఎంహెచ్‌వో ఎల్.రాజారవికుమార్, కార్పొరేటర్లు మొల్లి హేమలత,

భీమిలి జోనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా

అప్పారావు, నాయకులు మొల్లి లక్ష్మణరావు, మన్నాల సోంబాబు, నాగోతి వెంకటసత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి ప్రాంతం త్వరలోనే సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గంటా పేర్కొన్నారు. జీవీఎంసీలోని జోనల్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా జోన్-1 కార్యాలయాన్ని భీమునిపట్నం జోనల్ కార్యాలయంగా ఆయన ప్రారంభించారు. పాలనాపరమైన సౌలభ్యం కోసం నియోజకవర్గాన్ని భీమిలి, మధురవాడ జోన్లుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. త్వరలో అందుబాటులోకి రానున్న భోగాపురం విమానాశ్రయం వల్ల ఈ ప్రాంతానికి ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. అనేక పరిశ్రమలు రానున్నాయన్నారు. ఫలితంగా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పంచకర్ల సందీప్, జోనల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, మూడో వార్డు కార్పొరేటర్ జి.అప్పలకొండ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి విరాళాలు

డిప్యూటీ ఈవో రాధకు విరాళం చెక్కు అందిస్తున్న దాత రాజేంద్రప్రసాద్ రెడ్డి

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి నిత్య అన్నప్రసాద పథకానికి తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా లింగోజిగూడెం గ్రామానికి చెందిన భక్తుడు బి.రాజేంద్రప్రసాద్ రెడ్డి గురువారం రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్కు రూపంలో దేవస్థానం డిప్యూటీ ఈవో సింగం రాధకు అందజేశారు. ★ నిత్య అన్నప్రసాద పథకానికి అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం తూటిపాల గ్రామానికి చెందిన బోడసకుర్తి నాగ వెంకట లక్ష్మీకుమార్ దంపతులు గురువారం రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో దేవస్థానం డిప్యూటీ ఈవోకు అందజేశారు. అధికారులు దాత కుటుంబానికి స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

దాతకు విరాళం ధ్రువపత్రం అందిస్తున్న డిప్యూటీ ఈవో రాధ

నృత్య రూపకాలు అదరహో

నృత్యాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామం (జాతర) కళావేదికపై గురువారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నగరానికి చెందిన జోష్ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు నిధి, సుహాని, కాస్మిత, మహన్య, దక్షిత, భవిష్య, మోక్ష, హాసిని వారి హావభావాలతో నర్తించిన శాస్త్రీయ, జానపద నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. ఈ నృత్యాలకు మురళీగోవింద్ దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలనాధికారి రమేష్‌రెడ్డి చిన్నారులను అభినందించారు. వసంత్ ప్రదర్శించిన ఇంద్రజాల ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది.

శ్రీకృష్ణ లీలల నృత్య రూపకం

వైభవంగా శ్రీ నరసింహ యజ్ఞం

ఆనందపురం, న్యూస్‌టుడే: గంభీరం ఐఐఎం రోడ్డులో కొలువుదీరిన శ్రీరాధా మదనమోహన్ స్వామి ఆలయ ఆవరణలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీనరసింహ యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ జిల్లా ప్రెసిడెంట్ డా.నిష్కించన భక్తదాస యజ్ఞం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణలీలల నృత్య రూపకాన్ని ప్రదర్శించారు.

డివైడర్‌ను ఢీకొని ఆటో బోల్తా

ప్రమాద ఘటనలో దెబ్బతిన్న ఆటో

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఎండాడ కూడలి నుంచి రుషికొండ వెళ్లే రహదారిలో విభాజకం ఢీకొని ఆటో బోల్తా కొట్టింది. పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎస్సై విజయ కుమార్ తెలిపిన వివరాలిలా.. మధురవాడ ప్రాంతానికి చెందిన 9 మంది కుటుంబ సభ్యులు గురువారం సాయంత్రం ఆటోలో రుషికొండ బీచ్‌కు వెళ్తున్నారు. గీతం వర్సిటీ వెనుక గేటు దాటిన తర్వాత అదుపు తప్పి మధ్య విభాజకం ఢీకొట్టి రహదారిపై బోల్తా పడింది. ఆటోలో ఉన్న 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో అక్కడ వాహనాల రద్దీ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

ఎన్నికైన జాతర వాకర్స్ అసోసియేషన్ బృందం

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామంలో గురువారం జాతర వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.వి.రామారావు, కార్యదర్శిగా బి.సంజయ్, కోశాధికారిగా జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఎం.రామారావు, సహాయ కార్యదర్శులుగా ఎస్.రాఘవాచార్యులు, డి.మహేష్, మహిళా ప్రతినిధి పద్మజలను నియమించారు. గత కమిటీ సభ్యుల సహకారంతో మరింతగా అసోసియేషన్‌ను బలోపేతం చేస్తామని వీరంతా పేర్కొన్నారు.

ఆకట్టుకున్న గిరిజన నృత్య ప్రదర్శనలు

డీడీ మహేశ్వరరావు తదితరులతో గిరిజన యువత

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ వర్సిటీలో జరుగుతున్న గిరిజన యువ సమ్మేళనంలో రెండోరోజు గురువారం కొనసాగింది. స్థానిక కేఆర్‌సీ ఆడిటోరియంలో విశాఖ సంబంధిత డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు పర్యవేక్షణలో గిరిజన యువత చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. డిజిటల్ యుగంలోనూ ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో తమ సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా గిరిజన సంప్రదాయ వేషధారణలో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

● **ఉచిత వైద్య శిబిరానికి స్పందన**

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాదిలో గురువారం విజ్ఞాన్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సంస్థ వ్యవస్థాపకులు తంగేళ్ల విజయమోహన్ ఆధ్వర్యంలో వైద్యనిపుణులు పలువురికి పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. సంస్థ సేవకులు పవి, ఉద్యోగ్య తదితరులు పాల్గొన్నారు.

● **రేపు మెగా వైద్య శిబిరం**

పద్మనాభం, న్యూస్‌టుడే: స్థానిక స్ప్రింగ్‌ఫీల్డ్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ఈ నెల 3న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పాఠశాల డైరెక్టర్ అలీవర్ రాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. తన తల్లి ఆచార్య సత్యబాల రత్నరాజు వర్ధంతి పురస్కరించుకొని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

చిరునవ్వులు బంధించి.. చిత్రాలు అందించి

కొమ్మాది, న్యూస్‌టుడే: ఎన్నో ఒడుదొడుకుల మధ్య చిరునవ్వుకు దూరమవుతున్న ప్రజల్లో ఆనందోత్సాహం నింపి వారికి జీవితాంతం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకాలను అందించేందుకు విద్యార్థుల బృందం కృషి చేస్తోంది. కొమ్మాది గాయత్రీ విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో 'రోటరాక్ట్ క్లబ్' పేరిట విద్యార్థులు 'ప్రాజెక్ట్ చిత్ర స్మృతి-2.0' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గతేడాది డిసెంబర్ 13న విద్యార్థుల బృందం కొమ్మాదికి సమీపంలోని ఓ కాలనీకి వెళ్లి కొన్ని కుటుంబాలతో ముచ్చటించారు. వారి అవసరాలు, జీవన స్థితిగతులు, కుటుంబ నేపథ్యం తదితరాలపై సర్వే చేశారు. కొద్ది రోజుల తర్వాత మళ్లీ అదే కాలనీకి వెళ్లి వారితో మాటలు కలిపి చిరునవ్వులు చిందిస్తున్న క్షణాలతో పాటు పలు భావోద్వేగాలను తమ కెమెరాల్లో బంధించారు. వాటిలో కొన్ని చిత్రాలను ఫొటో ఫ్రేమ్‌లుగా తీర్చిదిద్ది నూతన సంవత్సరం సందర్భంగా గురువారం వారికి అందజేశారు. వాటిని చూసి వారంతా హర్షాతిరేకం వ్యక్తం చేశారు. విద్యార్థుల బృందంలో వాసంశెట్టి తనయ్ మణికాంత (అధ్యక్షుడు), సింగుపురం జాహ్నవి (కార్యదర్శి), కమ్యూనిటీ సర్వీసెస్ డైరెక్టర్ జి.ఎల్.దిరగ్నప్రభాస్, ఫొటోగ్రఫీ డైరెక్టర్ పసుమర్తి అఖిల్ తదితరులు ఉన్నారు. వీరిని కళాశాల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

ఫొటో ఫ్రేమ్‌లు కట్టించి మహిళలకు అందజేస్తున్న జీవీపీ రోటరాక్ట్ క్లబ్ విద్యార్థి బృందం

యూజీడీ అస్తవ్యస్తం.. కానరాని మోక్షం

పీఎంపాలెం, న్యూస్‌టుడే

జీవీఎంసీ జోన్-2 6వ వార్డు హౌసింగ్‌బోర్డు (పీఎంపాలెం) కాలనీలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ (యూజీడీ) అస్తవ్యస్తంగా మారింది. ఇళ్ల నుంచి వచ్చే మురుగు ప్రవహించే మ్యాన్‌హోల్స్ ఎక్కడికక్కడ పొంగి వ్యర్థపు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఆయా నివాసిత పరిసరాల్లో అపరిశుభ్రత తాండవించడంతో పాటు దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేయడంలో జీవీఎంసీ చూపిస్తున్న శ్రద్ధ ప్రజారోగ్యంతో ముడిపడిన మురుగు సమస్యపై చూపించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

★ ఏపీ హౌసింగ్‌బోర్డు సంస్థ 1993 సంవత్సరంలో ఎల్‌ఐజీ, ఎల్‌ఐజీ-1, ఎంఐజీ, ఎంఐజీ-1, హెచ్‌ఐజీ(టైప్-1,2) విభాగాలుగా కాలనీలో మొత్తంగా 1,511 వ్యక్తిగత గృహాలు నిర్మించింది. అప్పటి నివాసాల సంఖ్య జనాభా ప్రాతిపదికన భూగర్భ పైపులైన్లు వేసి మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు చేశారు. కాలక్రమేణా ఈ కాలనీలో వ్యక్తిగత ఇళ్ల స్థానంలో ప్రస్తుతం వందల సంఖ్యలో అపార్టుమెంట్లు నిర్మించారు. దీంతో సుమారు పది వేల లోపు ఉన్న జనాభా ప్రస్తుతం లక్షకు పైగా పెరిగింది. దీంతో వినియోగం పెరిగి భూగర్భ పైపులైన్ల సామర్థ్యం సరిపోవడం లేదు. ఎక్కడికక్కడ మ్యాన్‌హోల్స్ పొంగి వ్యర్థాలు రోడ్లపైకి వస్తున్నాయి. కొందరు నివాస ప్రాంగణాల్లో సెప్టిక్ ట్యాంక్‌లు నిర్మించుకోవాల్సిన పరిస్థితి ఎదురౌతోంది. ఈ సమస్యపై కాలనీవాసులు పలుమార్లు జీవీఎంసీ అధికారులకు సమస్యను వివరిస్తూ వినతులు అందజేసినా ఇంత వరకు ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కొత్తగా భూగర్భ మురుగునీటి వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నివాసిత ప్రజలు కోరుతున్నారు.

హౌసింగ్‌బోర్డు కాలనీలో మ్యాన్‌హోల్స్ పొంగి రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

★ **నేటికీ దశాబ్దాల నాటి పైపులైన్:** కాలనీలో దశాబ్దాల కిందట భూగర్భ మురుగునీటి వ్యవస్థ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ఇళ్ల ముందు ఉన్న మ్యాన్‌హోల్స్ పొంగిపోవడం అతి పెద్ద సమస్యగా మారుతోంది. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేయడం, తాత్కాలికంగా పూడిక తొలగించడంతో కొన్ని రోజులు సమస్య పరిష్కారమవుతోంది. దీనిపై జీవీఎంసీ కమిషనర్ స్పందించి భూగర్భ మురుగునీటి వ్యవస్థ సామర్థ్యం పెంచి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నాం. – కూనపురాజు రంగరాజు, కాలనీవాసి

క్యాలెండర్ల ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన భీమిలి ఇన్‌ఛార్జి సందీప్, నాయకులు

ఎండాడ, న్యూస్‌టుడే: జనసేన భీమిలి కార్యాలయం (ఎండాడ)లోని 8వ వార్డు అధ్యక్షుడు శాఖరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం కేక్ కోసి పంచి పెట్టారు.

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలోని ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆంగ్ల సంవత్సరం క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్ర మూర్తి, కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, ప్రధాన అర్చకుడు పి.శేషాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. దేవాలయ ట్రస్టు ప్రతినిధులు కె.వి.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, వి.తాతాజీ పాల్గొన్నారు.

కొమ్మాది: ఐక్యతతో కలిసి భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై పోరాడాలని శ్రీదుర్గా భవాని భవన నిర్మాణ శ్రామిక సంక్షేమ సంఘం అధ్యక్షులు వై.ఎస్.మూర్తి కోరారు. జీవీఎంసీ 5వ వార్డు సాయిరాంకాలనీలో సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్మికుల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నాయకులు గురుగుబెల్లి యోగేశ్వరరావు, కురుమోజు గోవిందరావు, సాసుబిల్లి వైకుంఠరావు, ఎస్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నవనీత అలంకరణలో మాధవుడు

కుంతీమాధవ స్వామి

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభంలోని శ్రీఅనంత పద్మనాభ స్వామి వారి ఆలయం కొండ దిగువన ఉన్న కుంతీమాధవ స్వామి ఆలయంలో స్వామివారు గురువారం నవనీత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం వెన్నతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

గణనాథుడుకి ప్రత్యేక పూజలు

సింహగిరి ఘాట్‌రోడ్డులో ప్రత్యేక అలంకరణలో వినాయకుడు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరి ఘాట్‌రోడ్డు టోల్‌గేటు దరి సింహాచలం దేవస్థానం ఉప దేవాలయం వినాయకుడి ఆలయంలో గురువారం నూతన సంవత్సరం పురస్కరించుకుని విశేష పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో గణనాథుడిని శ్రీగంధం, ఎండు ఫలాలు, పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు.

మిల్లు కార్మికులకు న్యాయం చేయాలి

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: చిట్టివలస జ్యూటు మిల్లు కార్మికులకు ప్రభుత్వం న్యాయం చేయాలని మిల్లు గుర్తింపు సంఘం అధ్యక్షుడు, ఇంటక్ జాతీయ కార్యదర్శి కాకర్లపూడి వరహాలరాజు అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గురువారం కార్మికులు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. చిట్టివలస కార్మికులకు కొత్త ఏడాదిలోనైనా పూర్తి బకాయిలు, పరిహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఇంటక్ నాయకులు చిల్ల వెంకటరమణ, జీరు వెంకటరెడ్డి, సూరిబాబు, సూరిగురువులు, తదితరులు పాల్గొన్నారు.

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అర్చకులు వేకువజామున తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నపం చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు.

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

'సిటూ పోరాటాలతోనే ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ'

మాట్లాడుతున్న జె.అయోధ్యరామ్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: సీఐటీయూ పోరాటాలతోనే ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ సాధ్యమవుతుందని విశాఖ ఉక్కు కర్మాగారం ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అఖిల భారత స్టీల్ కార్మికుల సమాఖ్య ఉపాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. ఏయూ ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న సిటూ 18వ అఖిల భారత మహాసభల్లో ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ అంశంపై ఆయన మాట్లాడారు. నూతన ఆర్థిక విధానాల ప్రారంభం నుంచే ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ప్రయత్నం ప్రారంభమైందన్నారు. దీనికి వ్యతిరేకంగా సీఐటీయూ చేస్తున్న పోరాటాల వల్ల ప్రభుత్వాలు ముందుకు వెళ్లలేకపోతున్నాయన్నారు. విశాఖ ఉక్కుకు ముడిసరకు, వర్కింగ్ క్యాపిటల్ కేటాయించకపోవడం వల్లే ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మూడో వంతుకు తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వం రూ.5 వేల కోట్ల పెట్టుబడి పెడితే రూ.58 వేల కోట్ల మేరకు పన్నుల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమకూర్చడంతో పాటు లక్షల మందికి ఉపాధి కల్పించడం సాధ్యమైందన్నారు. ఇటువంటి పరిశ్రమలను ప్రైవేటీకరణ చేసేందుకు చేస్తున్న అన్ని ప్రయత్నాలను సీఐటీయూ అడుగడుగునా అడ్డుకుంటుందన్నారు.

పనివేళల్లో సచివాలయానికి తాళం
సిబ్బందిపై తెదేపా నాయకుల ఫిర్యాదు

విశాఖపట్నం (తగరపువలస), న్యూస్‌టుడే: విశాఖలోని భీమిలి మండలం అమనాం గ్రామ సచివాలయం గురువారం తెరవకపోవడంపై స్థానిక తెదేపా నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పనివేళల్లో కార్యాలయానికి తాళాలు వేసి వైకాపా సర్పంచి ఇంట్లో వైకాపా ప్రజాప్రతినిధులతో కలిసి సంబరాలు చేసుకోవడం పట్ల తీవ్రంగా మండిపడ్డారు. దీనిపై సిబ్బందిని ఫోన్‌ద్వారా ప్రశ్నించగా పబ్లిక్ హాలీడే అంటూ చెప్పుకొచ్చారని ఆరోపించారు. దీనిపై భీమిలి మండల పరిషత్తు అభివృద్ధి అధికారి నర్సింహారావుకి ఫిర్యాదు చేశారు. సచివాలయానికి సెలవు లేదని ఆయన స్పష్టం చేయడంతో సిబ్బందిపై చర్యలకు వారు డిమాండ్ చేశారు. దీనిపై ఆన్‌లైన్‌లో పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదు చేసినట్లు తెదేపా లీగల్ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు మరగడ రఘురామిరెడ్డి, తెదేపా పంచాయతీ మాజీ అధ్యక్షుడు చుక్కా ఆదిబాబురెడ్డి తెలిపారు. సచివాలయ సిబ్బందికి ప్రజా సమస్యల కంటే వైకాపా నేతలతో కేకులు కోసుకోవడమే ముఖ్యమైందా అంటూ ధ్వజమెత్తారు.

CHANGE OF NAME
I, NANDIVADA PADMAVATHI, W/o Jaggumahanthi Sumanth Kumar Previously called Jaggumahanthi Padmavathi, resident of D.No. 14-147/1/1/2, HB Colony, PM Palem, Visakhapatnam - 530041, now changed my name from JAGGUMAHANTHI PADMAVATHI to NANDIVADA PADMAVATHI. Henceforth I will be called as NANDIVADA PADMAVATHI for all purposes.

తుప్పు పడుతూ... తుప్పల్లో మూలుగుతూ

పీఎంపాలెం, న్యూస్‌టుడే

పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసుస్టేషన్ వద్ద పలు ప్రమాద ఘటనల్లో సీజ్ ద్విచక్రవాహనాలు, ఆటోలకు రక్షణ కరవైంది. రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో ఇష్టానుసారంగా పడేయడంతో పిచ్చిమొక్కల మధ్య దుమ్ము పట్టి తుక్కుగా మారుతున్నాయి. కనీస భద్రత లేకపోవడంతో వాహనాల విడిభాగాలు చోరీకి గురవుతున్నాయని యజమానులు వాపోతున్నారు. తమ వాహనాలను తామే గుర్తు పట్టలేని విధంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పీఎంపాలెం ట్రాఫిక్ స్టేషన్ వద్ద వాహనాలు ఇలా..

పేదలకు మూడు సెంట్లు ఇవ్వాలి

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు అన్నారు. తగరపువలసలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలాలు మంజూరుచేయాలని, నూతన పింఛన్లు, తదితర పథకాలను అమలు చేయాలన్నారు. ఏఐటీయూసీ లేబరు యూనియన్ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను పూర్తిగా ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోర అప్పలరాజు, ఆదినారాయణ, మాపూరి వీర్రాజు, లక్ష్మణరావు, సన్యాసిరావు, గోవిందరావు, అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు సూచించారు. గురువారం నూతన సంవత్సరం సందర్భంగా విద్యాశాఖ ఆర్జేడీ బి.విజయభాస్కర్, డీఈఓ ప్రేమకుమార్, ఏపీసీ జె.చంద్రశేఖరరావు, డిప్యూటీ డీఈఓ ఎ.సోమేశ్వరరావు, ఈఈ నరసింగరావు తదితరులు ఎమ్మెల్సీని కలిసి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు అభినందనలు తెలుపుతున్న విద్యాశాఖ అధికారులు

విశాఖ తూర్పు

ఏయూలో నూతన సంవత్సర వేడుకలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్లను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది ఒకరిని ఒకరు కలిసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. దీంతో వర్సిటీ అంతా సందడి నెలకొంది.

3న మానవ హక్కుల పరిరక్షణపై సదస్సు

సీతంపేట, న్యూస్‌టుడే: మానవ హక్కుల కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ నెల 3న విశాఖ పౌర గ్రంథాలయంలో 'వికసిత్ భారత్ - మానవ హక్కుల పరిరక్షణ'పై సదస్సు, క్యాలెండర్ ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య వై.సత్యనారాయణ, నగర ఏడీసీపీ(ట్రాఫిక్) కె.ప్రవీణ్‌కుమార్, విశ్రాంత అదనపు ఎస్పీ దివాకర్, కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహనరావు తదితరులు హాజరవుతారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 12వ వార్డు పరిధి పెదగదిలి, చినగదిలి కొండవాలు సేవా మార్గంలో చెత్త కుండీల వద్ద భవన వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. –ప్రభాకరరావు, చినగదిలి ✓: సిబ్బందితో భవన నిర్మాణ వ్యర్థాలు తరలించేలా చర్యలు చేపడతాం. – గణేష్, పారిశుద్ధ్య విభాగం అధికారి.

న్యూస్‌టుడే, విశాలాక్షినగర్: ?: ఎంవీపీకాలనీ సమీప ధర్మశక్తినగర్‌లో రహదారి నిర్మాణం కోసం తవ్విన వ్యర్థాలను మార్గమధ్యలోనే వదిలేశారు. రాత్రి సమయంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. –రామకృష్ణ, ఎంవీపీకాలనీ. ✓: పరిశీలించి, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటాం. –కోళ్ల అప్పలనాయుడు, ఏఈ.

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: పాతడెయిరీఫాం కూడలి నుంచి రవీంద్రనగర్‌కు వెళ్లే మార్గంలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. రాత్రి సమయంలో రాకపోకలు సాగించే వారు అవస్థలు పడుతున్నారు. –రవిశంకర్, సుందరనగర్ ✓: సిబ్బందితో పరిశీలన చేయించి, దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. – జీవీఎంసీ విద్యుత్తు అధికారి.

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: 15వ వార్డు ఎంఎంటీసీ కాలనీ కాలువల్లో పూడికలు తొలగించడం లేదు. –సురేష్‌కుమార్, ఎంఎంటీసీకాలనీ ✓: తక్షణమే సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం. –కిశోర్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందన

నిర్మాణ సామగ్రి తొలగించారు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఎంవీపీకాలనీ ఆరో సెక్టార్ శాంతినికేతన్ పాఠశాల వద్ద రహదారికి అడ్డంగా ఉన్న భవన నిర్మాణ సామగ్రితో రాకపోకలు సాగించే వారు అవస్థలు పడుతున్నారని ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ ఏఈ అప్పలనాయుడు స్పందించారు. వెంటనే భవన నిర్మాణ సామగ్రి తొలగింపునకు చర్యలు చేపట్టారు.

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 22వ వార్డు మంగాపురం కాలనీ కాలువల్లో పూడికలు తొలగించడం లేదని గురువారం 'ఈనాడు'లో వెలువడిన వార్తాంశానికి వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ స్పందించి పూడికలు తీయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

'స్వర్ణభారతి' తళతళ..!

రూ.11కోట్లతో ఆధునికీకరణ
త్వరలో అందుబాటులోకి ఇండోర్‌స్టేడియం

ఆధునికీకరించిన తర్వాత ఇలా..

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: రేసపువానిపాలెం ప్రాంతంలోని స్వర్ణభారతి ఇండోర్‌స్టేడియం ఆధునికీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా సుమారు రూ.11కోట్లతో ఆయా పనులు చేపట్టారు. ప్రధానంగా లోపలి భాగాన్ని ఆధునికంగా తీర్చిదిద్దారు. సీటింగ్, ఫ్లడ్‌లైట్లు, ఏసీలు, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేశారు. బయట ప్రాంతాన్ని అద్దాలతో ముస్తాబు చేయడంతో స్టేడియం కళకళలాడుతోంది. జనవరిలో పనులు పూర్తి కానున్నాయని ఈఈ గంగాధర్ తెలిపారు. దశాబ్దాల కిందట దీన్ని నిర్మించడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీంతో వైకాపా హయాంలో స్టేడియం ఆధునికీకరణ పనులకు అప్పటి నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి శంకుస్థాపన చేశారు. నిధులు విడుదల చేయకపోవడంతో కొన్నాళ్లపాటు పనులు నత్తనడకన సాగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిధులు విడుదల చేయడంతో పనులు చకచకా సాగుతున్నాయి. ఇటీవల జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ స్టేడియాన్ని సందర్శించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ స్టేడియం అందుబాటులోకి వస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి షటిల్, టేబుల్ టెన్నిస్, బాక్సింగ్ క్రీడలు ఈ ప్రాంగణంలో నిర్వహించవచ్చు. ఆధునిక సౌకర్యాలు ఉండటంతో నగర క్రీడాకారుల సాధనకు ఇది ఎంతో ఉపయుక్తంగా మారుతుందని క్రీడా నిపుణులు భావిస్తున్నారు. పనులు తక్షణమే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

స్టేడియం లోపల సీటింగ్

ఇలా తవ్వేసి... వదిలేస్తే ఎలా..?

జీవీఎంసీ 11వ వార్డు పరిధి పార్వతీనగర్‌లోని ఓ వీధిలో మంచి నీటి పైపులైన్ ఏర్పాటుకు నాలుగు నెలల కిందట అడ్డదిడ్డంగా తవ్వేశారు. ఆ తర్వాత పలు కారణాలతో పైపులు ఏర్పాటు చేయకుండా, రోడ్డుకు మరమ్మతులు చేయకుండా వదిలేశారు. దీంతో స్థానికంగా ఉంటున్న వారు నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. సమస్యను పరిష్కరించాలని నివాసితులు డిమాండ్ చేస్తున్నారు. – ఆరిలోవ, న్యూస్‌టుడే

దర్పణం

'సిటూ పోరాటాలతోనే ప్రభుత్వ రంగ సంస్థల మనుగడ'

మాట్లాడుతున్న జె.అయోధ్యరామ్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: సీఐటీయూ పోరాటాలతోనే ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ సాధ్యమవుతుందని విశాఖ ఉక్కు కర్మాగారం ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అఖిల భారత స్టీల్ కార్మికుల సమాఖ్య ఉపాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. ఏయూ ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న సిటూ 18వ అఖిల భారత మహాసభల్లో ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ అంశంపై ఆయన మాట్లాడారు. నూతన ఆర్థిక విధానాల ప్రారంభం నుంచే ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ప్రయత్నం ప్రారంభమైందన్నారు. దీనికి వ్యతిరేకంగా సీఐటీయూ చేస్తున్న పోరాటాల వల్ల ప్రభుత్వాలు ముందుకు వెళ్లలేకపోతున్నాయన్నారు. విశాఖ ఉక్కుకు ముడిసరకు, వర్కింగ్ క్యాపిటల్ కేటాయించకపోవడం వల్లే ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మూడో వంతుకు తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వం రూ.5 వేల కోట్ల పెట్టుబడి పెడితే రూ.58 వేల కోట్ల మేరకు పన్నుల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమకూర్చడంతో పాటు లక్షల మందికి ఉపాధి కల్పించడం సాధ్యమైందన్నారు. ఇటువంటి పరిశ్రమలను ప్రైవేటీకరణ చేసేందుకు చేస్తున్న అన్ని ప్రయత్నాలను సీఐటీయూ అడుగడుగునా అడ్డుకుంటుందన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ కోసం రోజూ రెండు గంటల పాటు కృషి చేయాలని గ్రీన్‌క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం సూచించారు. పర్యావరణ పరిరక్షణపై ఎంవీపీ కాలనీ ఎ.ఎస్.రాజా మహిళా జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇందులో భాగంగా వరి కంకులు, వివిధ రకాల మొక్కలకు సంబంధించిన నారు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 13వ తేదీన బీచ్ రోడ్డులో లక్ష ఆవు పేడ పిడకలతో భోగిమంట వేస్తామన్నారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ ఎం.కాసు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న 'గ్రీన్‌క్లైమేట్' బృందం

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి, కమిషనర్ కేతన్‌గార్గ్ తదితరులు

'తూర్పు' జోనల్ కార్యాలయం ప్రారంభం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విశాఖ నగరాభివృద్ధి దిశగా జీవీఎంసీ పాలనా సౌలభ్యానికి జోనల్ పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ చేపట్టినట్లు జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. తూర్పుజోన్ కార్యాలయాన్ని గురువారం ఆశీలుమెట్ట ప్రాంతంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి 1 నుంచి పది జోనల్ కార్యాలయాల్లో సేవలు మొదలయ్యాయన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ ప్రజలకు చేరువలో పాలకులు, అధికారులు ఉంటే అభివృద్ధి, సంక్షేమం సులువుగా అమలు చేసేందుకు వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు జోన్ కమిషనర్ కె.శివప్రసాద్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పేరుకుపోయిన వ్యర్థాలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రామ్‌నగర్ జీవన్ జ్యోతి అపార్టుమెంటు చుట్టుపక్కల వ్యర్థాలు పేరుకుపోయాయి. కొంతకాలంగా పారిశుద్ధ్య సిబ్బంది వీటిని తొలగించకపోవడంతో ఈ సమస్య నెలకొంది. అధికారులకు ఎంత చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.

నిరాశ్రయులకు శాలువాల పంపిణీ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరులోని రెడ్‌క్రాస్ సంస్థలో నిర్వహిస్తున్న జీవీఎంసీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు గురువారం సాయంత్రం నగర పోలీసు కమిషనర్ శంఖబ్రతబాగ్చీ శాలువాలు పంపిణీ చేశారు. చలి కాలం కావడంతో నిరాశ్రయుల అవసరాన్ని గుర్తించి వీటిని అందజేసినట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్ బాలసతీష్ మాట్లాడుతూ త్వరలో షెల్టర్‌ను విస్తరిస్తామన్నారు. ఈఎస్‌ఆర్ నిధులతో నాలుగు అంతస్తుల నిర్మాణం చేపట్టి మరింత మంది నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తామన్నారు. షెల్టర్ ప్రతినిధి మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమంలో సీపీ శంఖబ్రతబాగ్చీ, నిర్వాహకులు

ఇందిరానగర్ ఆనందమార్గ్ ఆశ్రమంలో..

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : జీవీఎంసీ పదో వార్డు పరిధి ఇందిరానగర్ ఆనందమార్గ్ ఆశ్రమంలో నూతన సంవత్సరం సందర్భంగా గురువారం పేదలకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్ ప్రాంతాల నుంచి వచ్చిన 250 మందికి ఆశ్రమ నిర్వాహకులు స్వామి సౌమ్యనంద అవదూత ఆధ్వర్యంలో రగ్గులు, దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా హోమియో మందులు అందించి, మధ్యాహ్నం భోజనం పెట్టారు. కమిటీ ప్రతినిధులు ఆంజనేయపాత్రో, నారాయణ పండా పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వేంకటేశ్వరస్వామికి అలంకరణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఈస్టు పాయింట్, లాసెన్స్‌బే కాలనీల్లో శిర్డీ సాయిబాబా, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో నూతన సంవత్సరం పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 21 రకాల స్వీట్లను శిర్డీ సాయిబాబాకు నైవేద్యంగా సమర్పించారు.

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సందర్భంగా పదో వార్డు ఇందిరానగర్ సమీప లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో భక్తులు గురువారం పూజలు చేశారు. ఇతర ఆలయాల్లోనూ భక్తుల రద్దీ కనిపించింది.

శిర్డీసాయిబాబా గుడిలో..

లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో..

నూతన కార్యవర్గం ఏర్పాటు

కొమ్మాది, న్యూస్‌టుడే : మధురవాడ శిల్పారామంలో గురువారం జాతర వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పి.వి.రామారావు, కార్యదర్శిగా బి.సంజయ్, కోశాధికారిగా జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షునిగా ఎం.రామారావు, సహాయ కార్యదర్శులుగా ఎస్.రాఘవాచార్యులు, డి.మహేష్, మహిళా ప్రతినిధిగా పద్మజ నియమితులయ్యారు.

డివైడర్‌ను ఢీకొని ఆటో బోల్తా

పీఎంపాలెం, న్యూస్‌టుడే : ఎండాడ కూడలి నుంచి రుషికొండ వెళ్లే రహదారిలో డివైడర్‌ను ఢీకొని ఆటో బోల్తా కొట్టింది. పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఆర్ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాలివి. మధురవాడ ప్రాంతానికి చెందిన 9 మంది కుటుంబ సభ్యులు గురువారం సాయంత్రం ఆటోలో రుషికొండ బీచ్‌కు వెళ్తున్నారు. గీతం వర్సిటీ వెనుక గేటు దాటిన తర్వాత ఆటో అదుపు తప్పింది. ఆటోలో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

అన్నప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం, న్యూస్‌టుడే : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా లింగోజీగూడెం గ్రామానికి చెందిన భక్తుడు బి.రాజేంద్రప్రసాద్ రెడ్డి గురువారం రూ.లక్ష విరాళంగా సమర్పించారు. అలాగే అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం తూటిపాల గ్రామానికి చెందిన బి.నాగ వెంకట లక్ష్మీకుమార్ దంపతులు రూ.1,00,116 విరాళంగా అందించారు. వారిని దేవస్థానం డిప్యూటీ ఈవో సింగం రాధ అభినందించారు.

సచివాలయం సిబ్బంది తీరుపై ఫిర్యాదు

విశాఖపట్నం(తగరపువలస), న్యూస్‌టుడే : భీమిలి మండలం అమనాం గ్రామ సచివాలయాన్ని గురువారం తెరవకపోవడంపై స్థానిక తెదేపా నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పనివేళల్లో కార్యాలయానికి తాళాలు వేసి వైకాపా సర్పంచి ఇంట్లో వైకాపా ప్రజాప్రతినిధులతో కలిసి సంబరాలు చేసుకోవడంపై వారు మండిపడ్డారు. దీనిపై సిబ్బందిని ఫోన్ ద్వారా ప్రశ్నించగా పబ్లిక్ హాలీడే అంటూ చెప్పుకొచ్చారని నాయకులు ఆరోపించారు. ఈ ఘటనపై భీమిలి మండల పరిషత్తు అభివృద్ధి అధికారి నర్సింహారావుకి ఫిర్యాదు చేశారు. సచివాలయానికి సెలవు లేదని ఆయన స్పష్టం చేయడంతో, సిబ్బందిపై చర్యలకు తెదేపా నాయకులు డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే : భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ వర్సిటీలో జరుగుతున్న గిరిజన యువ సమ్మేళనం రెండో రోజు గురువారం కొనసాగింది. స్థానిక కేఆర్‌సీ ఆడిటోరియంలో గిరిజన యువత నృత్య ప్రదర్శనలు అలరించాయి.

జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే : నూతన సంవత్సర వేడుకలు అంతటా ఉత్సాహంగా జరుపుకొంటున్నా ఉక్కు ఉద్యోగుల్లో ఆ ఆనందం కనిపించడం లేదని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ పేర్కొన్నారు. తక్షణమే ఉద్యోగులకు పూర్తి జీతంతో పాటు పాత బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రిన్సిపల్‌గా బాధ్యతల స్వీకరణ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ఏవీఎన్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా ఉన్న పి.కృష్ణకుమారిని ప్రిన్సిపల్‌గా నియమిస్తూ కరస్పాండెంట్ ఏవీ అదీప్‌భానోజీరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. అధ్యాపకులను సమన్వయం చేసుకుంటూ, విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తామని ప్రకటించారు. అనంతరం ఆమెను పలువురు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఎంవీపీ కాలనీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేపట్టారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.కిశోర్‌కుమార్, డాక్టర్ పప్పురని కుంజ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరంలో పాల్గొన్న వాకర్స్

సత్యసాయి సేవలు ప్రశంసనీయం

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే : సమాజంలో పేదలు, వెనుకబడిన వర్గాలకు నిరంతరం సేవలు అందిస్తున్న సత్యసాయి సేవా సంస్థల నిస్వార్థ సేవా సిద్ధాంతం ప్రశంసనీయమని మెడ్‌టెక్ జోన్ మేనేజింగ్ డైరెక్టర్, వ్యవస్థాపక సీఈవో డాక్టర్ జితేంద్ర శర్మ అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మెడ్‌టెక్ జోన్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఎంటీజెడ్ వాలంటీర్లు, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు ఆర్.ఎ.నాయుడు, సోమేశ్వరి, ఎస్.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరణ

ఏపీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో..

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఏపీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్ ఆవిష్కరించారు. గురువారం సాయంత్రం పిఠాపురం కాలనీలోని మాధవ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అరుణ్‌కుమార్, సుదర్శన్, గోపీనాథ్, శ్రీనివాస్, రామలక్ష్మి, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేయన్ ఫెడరేషన్ సంస్థ ఆధ్వర్యంలో సిద్ధం చేసిన నూతన సంవత్సర డైరీని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ శంకరరావు ఆవిష్కరించారు. హనుమంతువాక సమీప పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.గోవిందరాజు, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఫెడరేషన్ అధ్యక్షుడు డి. కోదండరావు, ప్రధాన కార్యదర్శి బి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ గురువారం ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ చేతులమీదుగా సెనేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఏయూ రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య ఆర్.పద్మశ్రీ, ఆచార్య జి.గిరిజాశంకర్, ఆచార్య జాలాది రవి తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: శివాజీపాలెంలో ఉన్న దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ క్యాంప్ కార్యాలయంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంవీపీ కాలనీ ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్‌రుద్ర విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడు సి.హెచ్.వి.పట్టాభిరామ్‌కు తెదేపా నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన కేక్ కోసి అభిమానులకు పంచిపెట్టారు. మద్దిలపాలెంలోని వైకాపా కార్యాలయంలోనూ ఈ వేడుకలు జరిగాయి.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 16వ వార్డు భానునగర్ సీయేను మందిరంలోనూ ఈ వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. పాస్టర్ వంకా శివశంకర్ లాజరస్, కళా ఆసుపత్రి ఎండీ డాక్టర్ పి.రమణమూర్తి, ప్రభుత్వ న్యాయవాది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

★ పిఠాపురం కాలనీలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తన నివాసంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేయన్ ఫెడరేషన్ సంస్థ ఆధ్వర్యంలో..

ఏయూ సెనేట్ సమావేశ మందిరంలో..

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కూటమి నాయకులు

తెదేపా శ్రేణులతో పట్టాభిరామ్

ఘనంగా భీమా కోరేగావ్ విజయోత్సవం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కుల వివక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి చిరస్మరణీయ ప్రతీకగా నిలిచిన భీమా కోరేగావ్ విజయోత్సవాన్ని(శౌర్యదిన్) గురువారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. మూవ్‌మెంట్ 21 ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా క్యాలెండర్ ఆవిష్కరించారు. డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య జి.సుధాకర్, ఆచార్య పి.ప్రేమానందం, డాక్టర్ కృష్ణ, డాక్టర్ బి.మోహన్‌బాబు, డాక్టర్ తెనాలి సాంబశివరావు, డాక్టర్ చిప్పాడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్‌ను ప్రదర్శిస్తున్న సంఘం సభ్యులు

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు సూచించారు. గురువారం నూతన సంవత్సరం సందర్భంగా విద్యాశాఖ ఆర్జేడీ బి.విజయభాస్కర్, డీఈఓ ప్రేమకుమార్, ఏపీసీ జె.చంద్రశేఖరరావు, డిప్యూటీ డీఈఓ ఎ.సోమేశ్వరరావు, ఈఈ నరసింగరావు తదితరులు ఎమ్మెల్సీని కలిసి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు అభినందనలు తెలుపుతున్న విద్యాశాఖ అధికారులు

మెరుగైన సేవలకు పెద్దపీట

కార్పొరేషన్ న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థ అధికారులు సమష్టిగా పని చేసి, నగరాన్ని మరింత అభివృద్ధి చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ సూచించారు. గురువారం ఉదయం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే జీవీఎంసీ లక్ష్యమని ఆయన ప్రకటించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో అదనపు కమిషనర్లు ఎస్ఎస్.వర్మ, డీవీ.రమణమూర్తి, పీఎం.సత్యవేణి, ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ఎ.ప్రభాకర్, ప్రధాన ఇంజినీర్ పీవీవీ.సత్యనారాయణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కమిషనర్ కేతన్‌గార్గ్‌తో జీవీఎంసీ అధికారులు

ఉరేసుకుని యువకుడి మృతి

శ్రీనివాసనగర్ (వేపగుంట), న్యూస్‌టుడే: ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. శ్రీనివాసనగర్‌కు చెందిన కరోతి షణ్ముఖరావు (32) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో పిన్ని, చిన్నాన్నల వద్దే ఉంటూ గోపాలపట్నంలోని ఓ వెల్డింగ్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఇటీవల స్నేహితులు జానీ, గోపాల్‌తో కలసి బయటకు వెళ్లాడు. అక్కడ వారి మధ్య తలెత్తిన వివాదంలో జానీని షణ్ముఖరావు బలంగా కొట్టడంతో ఆసుపత్రిలో చేరాడు. కోలుకున్న తర్వాత అతడు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ విషయం తెలుసుకున్న షణ్ముఖరావు కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ బుధవారం రాత్రి ఇంటికొచ్చాడు. మళ్లీ కొద్ది సేపటికే బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో నూతన సంవత్సర వేడుకల్లో స్నేహితులతో ఉండి ఉంటాడని కుటుంబీకులు భావించారు. కాగా..గురువారం మామిడితోటలో చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించడంతో స్థానికులు గోపాలపట్నం పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ మరణంపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరుతున్నారు.

భర్త చితికి తలకొరివి పెట్టిన భార్య

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డు ఎల్లపువానిపాలెం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు పొలమరశెట్టి సత్తిబాబు(58) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. సత్తిబాబుకు భార్య భవాని, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె దీపికకు నిశ్చితార్థం కూడా జరిగింది. ఫిబ్రవరిలో పెళ్లి కూడా చేసేందుకు నిర్ణయించారు. ఇద్దరు ఆడపిల్లలే కావడంతో భార్య.. అన్నీ తానై భర్త అంతిమయాత్రలో పాల్గొని భర్త చితికి తానే నిప్పంటించటం విశేషం.

(c) eenadu

ఘనంగా భీమా కొరేగావ్ విజయోత్సవం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కుల వివక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి చిరస్మరణీయ ప్రతీకగా నిలిచిన భీమా కొరేగావ్ విజయోత్సవాన్ని(శౌర్యదిన్) గురువారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. మూవ్‌మెంట్ 21 ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా క్యాలెండర్ ఆవిష్కరించారు. డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య జి.సుధాకర్, ఆచార్య పి.ప్రేమానందం, డాక్టర్ కృష్ణ, డాక్టర్ బి.మోహన్‌బాబు, డాక్టర్ తెనాలి సాంబశివరావు, డాక్టర్ చప్పిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు అభినందనలు తెలుపుతున్న విద్యాశాఖ అధికారులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు సూచించారు. గురువారం నూతన సంవత్సరం సందర్భంగా విద్యాశాఖ ఆర్జేడీ బి.విజయభాస్కర్, డీఈఓ ప్రేమకుమార్, ఏపీసీ జె.చంద్రశేఖరరావు, డిప్యూటీ డీఈఓ ఎ.సోమేశ్వరరావు, ఈఈ నరసింగరావు తదితరులు ఎమ్మెల్సీని కలిసి అభినందనలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: సీతమ్మధార రైతుబజార్ దరి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. బజారుకు వచ్చేవారు తమ వాహనాలను రహదారిపై పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. – నరేశ్ ✓: ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం. – రామారావు, ద్వారకా ట్రాఫిక్ ఎస్సై

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ గెడ్డ వ్యర్థాలతో నిండి, మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. – ఏ.రామారావు ✓: సిబ్బందిని పంపించి గెడ్డను శుభ్రం చేయిస్తాం. – వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పాతవి తొలగించరు.. కొత్తవి ఏర్పాటు చేయరు..

కంచరపాలెం, న్యూస్‌టుడే

కంచరపాలెం ఫైవంతెనపై ప్రయాణించే వారంతా బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఎప్పుడు ఏ స్తంభం కూలి ఎవరిమీద పడుతుందో తెలియని దుస్థితి. ఎప్పుడో ఏళ్లక్రితం ఇనుప స్తంభాలు ఏర్పాటు చేశారు. అనంతరం వాటి నిర్వహణను గాలికొదిలేయడంతో ప్రస్తుతం అవి తుప్పు పట్టి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇప్పటికే దాదాపు ఆరేడు స్తంభాలు తుప్పు పట్టి పడిపోగా, మరి కొన్ని వాహనాలు ఢీకొట్టడంతో నేలకొరిగాయి. అలా పడిపోయిన వాటిని గుట్టుచప్పుడు కాకుండా సంబంధిత సిబ్బంది డివైడర్‌పై పడేస్తున్నారు. నెలలు తరబడి అవి అక్కడే మూలుగుతున్నాయి. దీంతో పలువురు ఆ ప్రాంతాలను మూత్ర విసర్జనకు వినియోగించడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పడిపోయిన వాటి స్థానంలో కొత్త స్తంభాలు వేయకపోవడంతో రాత్రిళ్లు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో బ్రిడ్జిపై చీకట్లు అలముకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తోందోనని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు వాటిని తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

తొలగించిన స్తంభాలను డివైడర్‌పై ఉంచేశారిలా..

సంపత్ వినాయకునికి పూజలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సందర్భంగా ఆశీలుమెట్ట సంపత్ వినాయగర్ ఆలయానికి భక్తులు పోటెత్తారు. గురువారం ఉదయం నుంచి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

మెరుగైన సేవలకు పెద్దపీట

కార్పొరేషన్ న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థ అధికారులు సమష్టిగా పని చేసి, నగరాన్ని మరింత అభివృద్ధి చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ సూచించారు. గురువారం ఉదయం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే జీవీఎంసీ లక్ష్యమని ఆయన ప్రకటించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో అదనపు కమిషనర్లు ఎస్ఎస్.వర్మ, డీవీ.రమణమూర్తి, పీఎం.సత్యవేణి, ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ఎ.ప్రభాకర్, ప్రధాన ఇంజినీర్ పీవీవీ.సత్యనారాయణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కమిషనర్ కేతన్‌గార్గ్‌తో జీవీఎంసీ అధికారులు

'దక్షిణం' జోనల్ కార్యాలయం ప్రారంభం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : పాతనగరం సూర్యాబాగ్‌లోని జోన్-4 కార్యాలయాన్ని దక్షిణం నియోజకవర్గానికి కేటాయించడంతో, గురువారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దక్షిణం పరిధిలోని అన్ని వార్డులకు సంబంధించిన అధికార యంత్రాంగం ఇకపై ఇక్కడి కార్యాలయం నుంచే సేవలు అందిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కూటమి నాయకులు ఎమ్మెల్యేను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు కోసూరి శ్రీనివాసరావు, శివప్రసాద్, వై.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు

'సిటూ పోరాటాలతోనే ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ'

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: సీఐటీయూ పోరాటాలతోనే ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ సాధ్యమవుతుందని విశాఖ ఉక్కు కర్మాగారం ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అఖిల భారత స్టీల్ కార్మికుల సమాఖ్య ఉపాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. ఏయూ ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న సిటూ 18వ అఖిల భారత మహాసభల్లో ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ అంశంపై ఆయన మాట్లాడారు. నూతన ఆర్థిక విధానాల ప్రారంభం నుంచే ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ప్రయత్నం ప్రారంభమైందన్నారు. దీనికి వ్యతిరేకంగా సీఐటీయూ చేస్తున్న పోరాటాల వల్ల ప్రభుత్వాలు ముందుకు వెళ్లలేకపోతున్నాయన్నారు. విశాఖ ఉక్కుకు ముడిసరకు, వర్కింగ్ క్యాపిటల్ కేటాయించకపోవడం వల్లే ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మూడో వంతుకు తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వం రూ.5 వేల కోట్ల పెట్టుబడి పెడితే రూ.58 వేల కోట్ల మేరకు పన్నుల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమకూర్చడంతో పాటు లక్షల మందికి ఉపాధి కల్పించడం సాధ్యమైందన్నారు. ఇటువంటి పరిశ్రమలను ప్రైవేటీకరణ చేసేందుకు చేస్తున్న అన్ని ప్రయత్నాలను సీఐటీయూ అడుగడుగునా అడ్డుకుంటుందన్నారు.

మాట్లాడుతున్న జె.అయోధ్యరామ్

పట్టాభిరామ్‌కు అభినందనలు తెలుపుతున్న తెదేపా నాయకులు

పార్టీ బలోపేతమే లక్ష్యం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : విశాఖలో తెదేపాను మరింత బలోపేతం చేసేలా కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఐక్యంగా కృషి చేయాలని విశాఖ లోక్‌సభ నియోజకవర్గం తెదేపా అధ్యక్షునిగా నియమితులైన చోడె వెంకటపట్టాభిరామ్ అన్నారు. గురువారం పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు ఆయన్ను నగర పార్టీ కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పట్టాభిరామ్ సూచించారు.

ఒకే కార్యాలయం నుంచి సేవలు

మాధవధార, న్యూస్‌టుడే: ఉత్తరం నియోజకవర్గం పరిధిలోని జీవీఎంసీ వార్డుల్లోని ప్రజలందరికీ ఒకే కార్యాలయం నుంచి సేవలు అందించనున్నట్లు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన నార్త్ జోనల్ కార్యాలయాన్ని కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి గురువారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ప్రజలు తమ సమస్యలను విన్నవించడానికి గతంలా పలు చోట్ల తిరగాల్సిన అవసరం లేదన్నారు. అన్ని విభాగాల అధికారులు ఇక్కడ నుంచే సేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, జెడ్సీ బి.రాము, కూటమి నాయకులు, కార్యకర్తలు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, కమిషనర్ కేతన్‌గార్గ్ తదితరులు

మలుపుల్లో గోతులు.. ప్రమాదాలకు పిలుపు

గురుద్వారా, న్యూస్‌టుడే: పైపులైన్ మరమ్మతుల పనులతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఎక్కడికక్కడ రహదారులను ఇష్టానుసారం తవ్వేయడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. జీవీఎంసీ 24వ వార్డు పీఅండ్‌టీ కాలనీ ప్రాంతంలోని రహదారి నెంబర్-4, 5 మలుపులో రెండు రోజుల కిందట గోతులు తవ్వేసి వదిలేశారు. పైగా అక్కడ ఎటువంటి ప్రమాదకర సూచికలు పెట్టలేదు. మలుపు తిప్పే సమయంలో ఆదమరిస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. వీటితో ప్రయాణాలకు ఇబ్బంది తప్పడం లేదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. వీలైనంత త్వరగా గోతులు పూడ్చాలని కోరుతున్నారు.

తవ్వేసి.. వదిలేశారు..!

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 38వ వార్డు కురుపాం మార్కెట్‌లో పప్పుల వీధి సమీప గంగాబత్తుల రోడ్డులో కొత్తగా పైపులైన్ల నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టారు. సుమారు రెండు నెలల కిందటే రోడ్డును అడ్డదిడ్డంగా తవ్వేసి, ఆ తర్వాత పలు కారణాలతో పనులు మొదలు పెట్టలేదు. దీంతో నిత్యం రాకపోకలు సాగించే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై అధికారులకు వినతులు అందిస్తున్నా... పట్టించుకోవడం లేదని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అధ్వానం.. పడితే ప్రమాదం..!

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 37వ వార్డు పరిధి విశాఖ చేపలరేవుకు వెళ్లే మార్గం గోతులతో అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ రాళ్లు తేలడంతో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనచోదకులు జారి పడుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రహదారి మరమ్మతులకు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

3న మానవ హక్కుల పరిరక్షణపై సదస్సు

సీతంపేట, న్యూస్‌టుడే: మానవ హక్కుల కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ నెల 3న విశాఖ పౌర గ్రంథాలయంలో 'వికసిత్ భారత్ - మానవ హక్కుల పరిరక్షణ'పై సదస్సు, క్యాలెండర్ ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య వై.సత్యనారాయణ, నగర ఏడీసీపీ(ట్రాఫిక్) కె.ప్రవీణ్‌కుమార్, విశ్రాంత అదనపు ఎస్పీ దివాకర్, కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహనరావు తదితరులు హాజరవుతారన్నారు.

చెక్కి గోధుమపిండిలో పోషకాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రేషన్ డిపోల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న చెక్కి గోధుమపిండిలో అధిక పోషకాలు ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచించారు. గురువారం మహారాణిపేట ప్రాంతంలోని డిపోలో గోధుమపిండి విక్రయాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతి కార్డుకు కిలో పిండిని రూ.20కి అందిస్తున్నామని డీసీఎస్‌ఓ భాస్కర్‌రావు తెలిపారు. అన్ని డిపోల్లో గోధుమపిండి అందుబాటులో ఉందని డీసీఎస్ఓ వివరించారు.

మహారాణిపేటలో సరకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు

ప్రిన్సిపల్‌గా బాధ్యతల స్వీకరణ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ఏవీఎన్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా ఉన్న పి.కృష్ణకుమారిని ప్రిన్సిపల్‌గా నియమిస్తూ కరస్పాండెంట్ ఏవీ అదీప్‌భానోజీరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. అధ్యాపకులను సమన్వయం చేసుకుంటూ, విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తానని ప్రకటించారు. అనంతరం ఆమెను పలువురు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

ప్రిన్సిపల్ కృష్ణకుమారిని అభినందిస్తున్న అధ్యాపకులు

వనితా వాకర్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

మురళీనగర్, న్యూస్‌టుడే: మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఆర్.సుదీత, ఉపాధ్యక్షులుగా కె.వినీలా, పి.లక్ష్మీకుమారి, కార్యదర్శిగా జి.శిరీషలత, సంయుక్త కార్యదర్శిగా శీల రమణి, కోశాధికారిగా కె.భానుమతి, జాలీవాకర్‌గా సురేంద్ర కౌర్‌తో పాటు మరో 11 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు తెలియజేశారు.

వనితా వాకర్స్ క్లబ్ కమిటీ సభ్యులు

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అర్చకులు వేకువజామున తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నపం చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు.

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

భాజపా కార్యాలయంలో సందడే సందడి..

గురుద్వారా, న్యూస్‌టుడే: నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా నార్త్ భాజపా కార్యాలయంలో గురువారం పండుగ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు శుభాకాంక్షలు తెలిపేందుకు కూటమి నాయకులు, పోలీసులు, జీవీఎంసీ, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వారందరికీ ఎమ్మెల్యే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు మొక్క అందజేస్తున్న ఏసీపీ లక్ష్మణమూర్తి

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: నేషనల్ పోర్టు ట్రస్ట్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు పోర్టు డిప్యూటీ ఛైర్‌పర్సన్ కె.రోష్ని అపరాంజిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ బేరర్స్ గురుప్రసాద్, రమణ, నాగప్రసాద్, శశి, శాంతి మల్లిక, మరిడయ్య, అప్పలనాయుడు, మురళీకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ★ జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని శ్రీ గణేష్ సేవా సంఘం సభ్యులు మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, పోర్టు ట్రస్ట్ డిప్యూటీ ఛైర్‌పర్సన్ రోష్ని అపరాంజిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సంఘం అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి, సంఘం సభ్యులు గొర్లె కృష్ణ, ఎం.ఎస్.ప్రకాశరావు, టి.వెంకటరావు, సిహెచ్.లక్ష్మణరావు, సిహెచ్.నర్శింగరావు, వి.రాజు తదితరులు పాల్గొన్నారు. ★ జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం సమీపంలోని కాళ్లవారితోటకు చెందిన శ్రీ గౌరీ సేవా సంఘం సభ్యులు ఎమ్మెల్యే పి.గణబాబును మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. సంఘం అధ్యక్షుడు కాళ్ల సూర్యప్రకాష్, పిళ్లా నూకరాజు, కాండ్రేగుల రాము, ఐ.ఎల్.ఎన్.ప్రసాద్, పీలా నీలితిలక్, బొడ్డేటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు డిప్యూటీ ఛైర్‌పర్సన్ కె.రోష్నితో యూనియన్ నాయకులు

ఏపీఆర్ఎస్ఏ జిల్లా కమిటీ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, జేసీ మయూర్‌అశోక్, తదితరులు

కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న సమాచార శాఖ డీడీ సైదారావు, తదితరులు

ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు, తదితరులు

కలెక్టరేట్‌లో కొత్త ఏడాది వేడుకలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సందర్భంగా గురువారం పలువురు అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఇతరులు కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు, మిఠాయిలు తీసుకురాకుండా, సామాజిక బాధ్యతతో సంజీవని నిధికి విరాళాలు అందజేశారు. మరికొందరు పుస్తకాలు, పెన్నులు అందజేయగా, వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు.

★ ఏపీఆర్ఎస్ఏ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను కలెక్టర్, జేసీ మయూర్‌అశోక్ ఆవిష్కరించారు. కమిటీ నాయకులు త్రినాథరావు, శ్యామ్‌బాబు, రాజేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

★ ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ, నోబెల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు, వీఎస్ కృష్ణా కళాశాల, ఏయూ అధ్యాపకులు, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు, పలువురు తెదేపా నాయకులు గురువారం ఎమ్మెల్సీ చిరంజీవిరావును కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్లు, డైరీలను ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. ★ విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు స్వామి వివేకానంద సేవా సంస్థ ప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ★ భాజపా రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్.మాధవ్‌ను విశాఖ దక్షిణం భాజపా నాయకులు ఆర్.రవికుమార్, నాగమణి, సోమేశ్వరరావు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సభ్యులు

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను కలిసిన పార్టీ నాయకులు

ఆలయాలకు 'నూతన' శోభ

శ్రీలక్ష్మి గణపతి ఆలయంలో స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకుడు

జీవీఎంసీ 50వ వార్డు శిర్డీ సాయి ధ్యాన మందిరంలో..

మాధవధార, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా మాధవధారలోని మాధవస్వామి, వేణుగోపాలస్వామి, అప్పయ్యనగర్‌లో వెలసిన శ్రీ భూసమేత విజయ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం దర్శనాలు కోసం భక్తులు బారులు తీరారు. పంచామృతాభిషేకం, కుంభాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు.

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: పోర్టు ఆసుపత్రి ఎదురుగా ఉన్న శ్రీలక్ష్మి గణపతి ఆలయంలో బాలానంద శివాచారియర్ సారథ్యంలో శ్రీలక్ష్మి గణపతి స్వామికి అఖండ పరిపూర్ణ అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. తదుపరి స్వామివారికి లడ్డూలతో అర్చన చేసి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్షన్ దరి సాయిబాబా మందిరంలో నూతన సంవత్సరం సందర్భంగా గురువారం బాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు జరిపారు. పాలాభిషేకం చేసి నక్షత్ర హారతి, నైవేద్యం సమర్పించారు. భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

మాధవధార, న్యూస్‌టుడే: జీవీఎంసీ 50వ వార్డులో వెలసిన శిర్డీ సాయి ధ్యాన మందిరంలో సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

నార్త్‌ఎక్స్‌టెన్షన్ దరి సాయిబాబా మందిరంలో..

ప్రత్యేక అలంకరణలో మాధవస్వామి

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని శాంతినగర్, తాటిచెట్లపాలెం, సంజీవయ్యకాలనీ ప్రాంతాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శాంతినగర్‌లోని సెయింట్ జోషఫ్ చర్చిలో పాస్టర్ పాల్ విక్టర్ బైబిల్‌లోని ముఖ్య అంశాలను భక్తులకు వివరించారు. సాలగ్రామపురంలోని బెతస్థ, సంజీవయ్య కాలనీలోని బాప్టిస్ట్ చర్చిలను విద్యుత్తు దీపాలతో సుందరంగా అలంకరించారు. పిల్లలకు, యువతకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: దొండపర్తి సమీప కుమ్మరివీధిలోని ఈస్టర్ ప్రేయర్ మినిస్ట్రీస్ చర్చిలో సిస్టర్ కె.లతాసుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బోధకుడు జి.కె. నాయుడు పాల్గొని క్రీస్తు బోధనలను వివరించారు. పలువురు క్రైస్తవులు భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి అందరికీ పంచిపెట్టారు.

శాంతినగర్ సెయింట్ జోషఫ్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

ఈస్టర్ ప్రేయర్ మినిస్ట్రీస్ చర్చిలో..

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
सेन्ट्रल बैंक ऑफ इंडिया
Central Bank of India
1911 से आपके लिए "सेंट्रल" "CENTRAL" TO YOU SINCE 1911

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయం: #47-10-14, సారిపల్లి ఎలైట్, 3వ అంతస్తు, పాలాక్స్ స్కూల్ ఎదురుగా, డైమండ్ పార్కు దగ్గర, 2వ లైను ద్వారకానగర్, విశాఖపట్నం-530016.

బిడ్లు కొరకు ఆహ్వానం / లీజు ప్రాంగణం కొరకు ఆహ్వానం

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ప్రాంగణం కొరకు 139.35 చ॥మీ॥లు (1500 చ॥అ॥లు) విస్తీర్ణం గల కార్పెట్ ఏరియా, సూర్యాభాగ్ బ్రాంచ్ (జగదాంబ జంక్షన్ దగ్గర) కొరకు 3 నెలల లోపు అద్దె కొరకు సిద్ధంగా ఉండగలిగిన మరియు బ్రాంచ్ యొక్క కస్టమర్ & స్టాఫ్ కొరకు తగిన పార్కింగ్ స్థలంతో పాటు గ్రౌండ్ ఫ్లోర్‌కు ప్రాధాన్యత ఉండవలెను. దయచేసి బ్రోకర్లు లేదా మధ్యవర్తుల ప్రమేయమునకు అవకాశం లేదు అని గమనించగలరు. ప్రభుత్వం / సెమీ ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. దయచేసి https://www.centralbank.bank.in నుండి ఫార్మాట్‌లు / నిబంధనలు మరియు షరతులను డౌన్‌లోడ్ చేసుకోండి లేదా కార్యాలయ పనిదినములలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సూర్యాభాగ్ బ్రాంచ్ / రీజనల్ ఆఫీస్ విశాఖపట్నం నుండి సేకరించవచ్చును మరియు ఆఫర్లను చివరి తేది.23.01.2026 సాయంత్రం 4.00 గం॥ల లోపు సమర్పించవలెను.

సం/- సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయం, విశాఖపట్నం

ఘనంగా భీమా కోరేగావ్ విజయోత్సవం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కుల వివక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి చిరస్మరణీయ ప్రతీకగా నిలిచిన భీమా కోరేగావ్ విజయోత్సవాన్ని(శౌర్యదిన్) గురువారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. మూవ్‌మెంట్ 21 ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా క్యాలెండర్ ఆవిష్కరించారు. డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య జి.సుధాకర్, ఆచార్య పి.ప్రేమానందం, డాక్టర్ కృష్ణ, డాక్టర్ బి.మోహన్‌బాబు, డాక్టర్ తెనాలి సాంబశివరావు, డాక్టర్ చప్పిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

ఆదమరిస్తే అంతే సంగతులు

దర్పణం

సింధియా, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం కోరమండల్ బస్ స్టాప్ సమీపాన ఉన్న కూడలి సమీపాన డివైడర్‌పై విద్యుత్తు బాక్సు పడిపోయి అందులోని తీగలు వేలాడుతున్నాయి. రాత్రి సమయంలో ఎవరైనా డివైడర్ దాటే సమయంలో చూసుకోకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీన్ని వెంటనే సరిచేయాల్సిన అవసరం ఉంది.

డివైడర్‌పై పడిపోయిన విద్యుత్తు బాక్సు

పనుల్లో కదలిక.. కొత్త ఏడాది కానుక..

ఇండోర్ స్టేడియం బయట పూర్తయిన పనులు

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మరో రూ.40 లక్షలు మంజూరు

న్యూస్‌టుడే, సింధియా : పదకొండేళ్ల ఇండోర్ స్టేడియం పనులకు ఎట్టకేలకు కొత్త ఏడాదిలో పూర్తికానుంది. జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలో పురాతన కల్యాణ మండపాన్ని ఇండోర్ స్టేడియంగా నిర్మించడానికి 2013 ఆఖరులో అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే ఆశించిన స్థాయిలో పనులు జరగలేదు. 2019లో వచ్చిన వైకాపా ప్రభుత్వం గుత్తేదారులను భాగాలుగా విభజించడంతో పనులు ఇంకా మందగించాయి.

ఎమ్మెల్యే చొరవతో తిరిగి..: పనుల ఆలస్యానికి కారణమైన గుత్తేదారులు ముగ్గురికి అధికారులు నోటీసులను జారీచేశారు. అయితే అప్పటికే గుత్తేదార్లకు చాలా వరకు బిల్లులు మంజూరు కాక పనులు వదిలేసినట్టు సమాచారం. 2024లో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం ఏర్పడటం, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు స్వతహాగా క్రీడాకారుడు కావడంతో స్టేడియం పనుల్లో కదలిక వచ్చింది. పనులు కూడా నాణ్యతగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నిర్మించిన ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించి వాటి నివేదికలను, డిజైన్లను తెప్పించి నిశిత పరిశీలన జరిపారు.

టెండర్ల ఖరారు: ఇప్పటికే పలు దఫాలుగా మారిన కాంట్రాక్టర్లతో ఏకంగా రూ.కోటిన్నర పైగా ఖర్చయింది. ఇప్పుడు స్టేడియం లోపల ఫ్లోరింగ్, ఫర్నిచర్ కోసం మరో రూ.40లక్షల వరకు నిధులు మంజూరయ్యాయి. ఇటీవలే ఈ పనులకు టెండర్లను కూడా ఖరారు చేశారు. నిర్మాణ వ్యవధి పెరిగే కొద్దీ నిర్మాణ వ్యయం కూడా పెరుగుతూనే ఉంది. ఇప్పటికే తీవ్ర జాప్యం జరగడం వల్ల పనులను వేగవంతంగా జరిపేందుకు ఈ మొత్తాన్ని కూడా రెండుగా విభజించి ఇద్దరికి టెండర్లను ఖరారు చేసినట్టు జీవీఎంసీ ప్రజాపనుల విభాగం వర్గాలు వెల్లడించాయి. త్వరలో స్టేడియం అందుబాటులోకి వస్తుందని భావిద్దాం..

త్వరలో పనులు పూర్తిచేస్తాం: గత ప్రభుత్వం స్టేడియం నిర్మాణం పనులను పూర్తిగా విస్మరించింది. కూటమి అధికారంలోకి వచ్చాక నిర్మాణ పనులను పరిశీలించాం. నామమాత్రంగా సదుపాయాలు ఉంటే యువత క్రీడాసక్తి కోల్పోతారని భావించాం. అవసరం మేరకు పూర్తి ఆధునికీకత కలిగిన మెటీరియల్‌ను వినియోగించాలని నిర్ణయించాం. టెండర్లు ప్రక్రియను వేగవంతంగా జరిపాం. ఈ పనులను కూడా త్వరితగతిన పూర్తిచేసి త్వరలోనే పారిశ్రామిక ప్రాంత యువతకు అందుబాటులోకి తెస్తాం.

– పెతకంశెట్టి గణబాబు, పశ్చిమ ఎమ్మెల్యే

జోనల్ కార్యాలయాల ప్రారంభం

అగనంపూడి జోనల్ కార్యాలయాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

గాజువాక, అగనంపూడి, గాజువాక, న్యూస్‌టుడే : అగనంపూడిలో కొత్తగా ఏర్పాటు చేసిన జోనల్ కార్యాలయాన్ని, పునర్వ్యవస్థీకరించిన గాజువాక జోనల్ కార్యాలయాలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరానికి దీటుగా గాజువాక ప్రాంతాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రజల సౌలభ్యం కోసం జోనల్ కార్యాలయాలను ఏర్పాటు చేశామన్నారు. జోనల్ కార్యాలయాల ప్రారంభోత్సవంలో డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, అగనంపూడి జెడ్సీ మనీషా త్రిపాఠి, జెడ్సీ శేషాద్రి, ఎస్ఈ గోవిందరావు, ఇ.ఇ. రాయల్ బాబు, కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, ఇల్లపు వరలక్ష్మి, మెట్ల ముత్యాలనాయుడు, ఎ.జె.స్టాలిన్, భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కర్రి దుర్గేంద్ర, గొల్లవిల్లి కనకబాబు, గవర సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక జోనల్ కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా, కమిషనర్ కేతన్‌గార్గ్, తదితరులు

జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే : నూతన సంవత్సర వేడుకలు అంతటా ఉత్సాహంగా జరుపుకొంటున్నా ఉక్కు ఉద్యోగుల్లో ఆ ఆనందం కనిపించడం లేదని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ పేర్కొన్నారు. తక్షణమే ఉద్యోగులకు పూర్తి జీతంతో పాటు పాత బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉత్పత్తితో ముడిపెట్టి జీతాలు చెల్లించడం అప్రజాస్వామికం అన్నారు. తక్షణమే ఆ ఉత్తర్వులు రద్దుచేయాలని ఇంటక్ నాయకులు ఎం.రాజశేఖర్, పి.వి.రమణమూర్తి యాజమాన్యాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అర్చకులు వేకువజామున తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నపం చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట వరకు
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే : సమస్య : హైస్కూల్‌రోడ్‌లో మారుతీనగర్, ఆటోనగర్‌లలో కాలువలు సరిగ్గా శుభ్రం చేయడం లేదు. ఎగువ నుంచి మురుగు నీరు ముందుకు వెళ్లడం లేదు. –సన్యాసిరావు, పవనత, 67వ వార్డు, సమాధానం : ఇప్పటికే పారిశుద్ధ్య సిబ్బందికి తగిన ఆదేశాలిచ్చాం. – కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్ ?: దువ్వాడ నుంచి జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ దారిలో అక్కడక్కడ మాత్రమే దీపాలు వెలుగుతున్నాయి. –శ్రీనివాస్, దువ్వాడ, ✔: మరమ్మతులకు గుర్తించి దీపాలు పునరుద్ధరిస్తాం. –శివ, వీధి దీపాల నిర్వాహకుడు. గోపాలపట్నం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 82వ వార్డు ఎల్లపువానిపాలెంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. – శంకరరావు, ఎల్లపువానిపాలెం, ✔: ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం. –రామకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ?: జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో వీధిదీపాలు వెలగడం లేదు. – రాజేశ్వరి, విమాన్‌నగర్, ✔: దీపాల మరమ్మతులు చేపడతాం. –గోవిందరావు, వీధిదీపాల నిర్వాహకులు

ఉరేసుకుని యువకుడి మృతి

శ్రీనివాసనగర్ (వేపగుంట), న్యూస్‌టుడే: ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. శ్రీనివాసనగర్‌కు చెందిన కరోతి షణ్ముఖరావు (32) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో పిన్ని, చిన్నాన్నల వద్దే ఉంటూ గోపాలపట్నంలోని ఓ వెల్డింగ్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఇటీవల స్నేహితులు జానీ, గోపాల్‌తో కలసి బయటకు వెళ్లాడు. అక్కడ వారి మధ్య తలెత్తిన వివాదంలో జానీని షణ్ముఖరావు బలంగా కొట్టడంతో ఆసుపత్రిలో చేరాడు. కోలుకున్న తర్వాత అతడు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ విషయం తెలుసుకున్న షణ్ముఖరావు కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ బుధవారం రాత్రి ఇంటికొచ్చాడు. మళ్లీ కొద్ది సేపటికే బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో నూతన సంవత్సర వేడుకల్లో స్నేహితులతో ఉండి ఉంటాడని కుటుంబీకులు భావించారు. కాగా..గురువారం మామిడితోటలో చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించడంతో స్థానికులు గోపాలపట్నం పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ మరణంపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరుతున్నారు.

చందన అలంకరణలో వైభవ వేంకటేశ్వరస్వామి

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా గ్రీన్‌సిటీలో వేంచేసిన వైభవ వేంకటేశ్వర స్వామి చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంత భక్తుల సామూహిక దర్శనంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. వైజాగ్ ప్రొఫెషనల్స్ అధినేత బండి సురేష్‌కుమార్ దంపతులు, డైరెక్టర్ వీవీ కృష్ణారావులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బీహెచ్‌పీవీ కూడలిలోని ప్రసన్నగిరిపై, నాతయ్యపాలెం, తుంగ్లాం, మింది, అక్కిరెడ్డిపాలెంలోని పలు ఆలయాలకు భక్తులు వెళ్లి పూజల్లో పాల్గొన్నారు.

వాంబేకాలనీలో..

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా గాజువాక పుడావాలని, వాంబేకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. శ్రీవారిని పుష్పాలు, చందన రూపంలో అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. పురోహితులు సామూహిక అర్చనల్లో పాలుపంచుకున్నారు.

శీలానగర్ అయ్యప్పస్వామి ఆలయంలో..

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: కొత్త ఏడాదిని పురస్కరించుకొని గురువారం పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శీలానగర్ అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి వారిని సుందరంగా పూలతో, దీపాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్బీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో,

శ్రీ సాగరగిరి కొండకు..

మల్కాపురం, న్యూస్‌టుడే : కొత్త ఏడాదిని పురస్కరించుకొని.. దుర్గాబీచ్ శ్రీ సాగరగిరి కనకదుర్గాదేవి అమ్మవారిని దర్శించుకునేందుకు గురువారం భక్తులు పోటెత్తారు. దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో రాత్రయితే దడే..?

ఘాట్‌రోడ్డులో విరిగిన విద్యుత్తు స్తంభం

ఓ ప్రమాదకర మలుపు వద్ద స్తంభాలు తప్ప దీపాలు లేని వైనం

పరిశీలన

యారాడ (మల్కాపురం) న్యూస్‌టుడే : యారాడ బీచ్ పర్యాటకంగా ఎంతగానో అభివృద్ధి దశగా దూసుకెళ్తుంది. కానీ ఈ యారాడ బీచ్ వెళ్లే ఘాట్‌రోడ్డులో ప్రయాణించాలంటే వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి గల ప్రధాన కారణం. ఎక్కడ వీధి విద్యుత్తు దీపాలు సరిగా ఉండవు. మల్కాపురం పోలీసుస్టేషన్ నుంచి యారాడకు వెళ్లే మార్గంలో దాదాపుగా డాల్ఫిన్ హిల్స్ వరకూ ఎక్కడ వీధి విద్యుత్తు దీపాలను అమర్చలేదు. యారాడ వెళ్లే ఘాట్‌రోడ్డులో అర కిలోమీటరు మేర విద్యుత్తు దీపాలున్నా అలంకారప్రాయంగానే ఉన్నాయి. వాహనాలు ఘాట్‌రోడ్డులో దిగుతున్నప్పుడు అదుపుతప్పి పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాలను ఢీ కొడుతుండటంతో అన్నీ ఓ వైపుగా ఒరిగిపోయాయి. ప్రస్తుతం వెలగడం లేదు. ఒరిగిన విద్యుత్తు స్తంభాలన్నింటిని సరిచేయాల్సిన అవసరం ఉంది.

సత్యసాయి సేవలు ప్రశంసనీయం

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే : సమాజంలో పేదలు, వెనుకబడిన వర్గాలకు నిరంతరం సేవలు అందిస్తున్న సత్యసాయి సేవా సంస్థల నిస్వార్థ సేవా సిద్ధాంతం ప్రశంసనీయమని మెడ్‌టెక్ జోన్ మేనేజింగ్ డైరెక్టర్, వ్యవస్థాపక సీఈఓ డాక్టర్ జితేంద్ర శర్మ అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మెడ్‌టెక్ జోన్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంఎంటీజెడ్ వాలంటీర్లు, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు ఆర్.ఎ.నాయుడు, సోమేశ్వరం, ఎస్.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న మెడ్‌టెక్ వ్యవస్థాపక సీఈవో డాక్టర్ జితేంద్ర శర్మ

భర్త చితికి తలకొరివి పెట్టిన భార్య

గోపాలపట్నం(కొత్తపాలెం): జీవీఎంసీ 89వ వార్డు ఎల్లపువానిపాలెం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు పోలమరశెట్టి సత్తిబాబు(58) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. సత్తిబాబుకు భార్య భవాని, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె వివాహం జరిగింది. పిల్లలతో వెళ్లి కాలం వెళ్లదీయాలని నిర్ణయించారు. ఇద్దరు ఆడపిల్లలే కావడంతో భార్య అన్నీ తానై భర్త అంతిమయాత్రలో పాల్గొని భర్త చితికి తానే నిప్పంటించడం విశేషం.

క్యాలెండర్ ఆవిష్కరణ

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి హార్టికల్చర్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సొసైటీ అధ్యక్షుడు పెల్లి శ్రీనివాసరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెదమడక కాలనీలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది కూడా కార్మికులు ఉక్కులో పచ్చదనం అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేసి సొసైటీకి మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. సొసైటీ ప్రతినిధులు ఎం.కన్నారావు, బి.సత్యనారాయణ, వి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ధ్యాన వేడుక

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : నెల్లిముక్కు అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రంలో గురువారం సామూహిక ధ్యాన వేడుక నిర్వహించారు. తొలుత కేంద్రం నిర్వాహకులు ఎం.శివగణేశ్వరరావు, వనితలు కేక్ కోసి సభ్యులకు మిఠాయిలు పంచి పెట్టారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్లు, ధ్యాన సభ్యులు పాల్గొన్నారు.

ధ్యాన కేంద్రంలో కేక్ కోస్తున్న సభ్యులు

కట్టడాలు కూల్చేసి.. కష్టాలు మిగిల్చి..!

గాజువాక, న్యూస్‌టుడే: పెదగంట్యాడ కూడలి నుంచి దుర్గవానిపాలెం, నెల్లిముక్కు మీదుగా బాలచెరువు వరకూ దారికి ఇరువైపులా జేసీబీ, ఇతర యంత్రాల సాయంతో ఇటీవల కూల్చివేతలు చేపట్టారు. కాలువలపై దుకాణదారులు వేసుకున్న సిమెంటు పలకలు, షెడ్లు, మెట్ల మార్గాలు, ప్రహరీలను కూల్చివేసి వ్యర్థాలను గాలికి వదిలేసి చేతులు కడిగేసుకున్నారు. దీంతో మురుగు నీరు పారే అవకాశం లేకుండా చేశారంటూ నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూల్చివేతల సమయంలోనే టిప్పర్లను రంగంలోకి దింపి డెబ్రిస్, ఇతర వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదు. జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం,

పెదగంట్యాడలో కాలువలపై తొలగించిన కట్టడాలు

ఫోకస్

ప్రజా ఆరోగ్య విభాగం అధికారుల మధ్య సమన్వయంలేక చిక్కు సమస్యలు తలెత్తాయి. తొందరపాటు చర్యలతో మురుగు సమస్య తీవ్రమైంది. ఇకనైనా కాలువల్లో విరిగిపడ్డ భవన వ్యర్థాలను వెలికితీసి కష్టాలను తీర్చాలని వీరంతా కోరుతున్నారు.

రేషన్ డిపోల్లో గోధుమ పిండి అందజేత

మల్కాపురం: కొత్త ఏడాదిలో కూటమి ప్రభుత్వం ఆదేశాలతో.. రేషన్ డిపోల్లో కేజీ గోధుమ పిండిని కేవలం రూ. 20లకే అందజేస్తున్నారు. జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం కొండదేవతమ్మ ఆలయం వద్ద రేషన్‌డిపోలో గోధుమపిండిని తెదేపా వార్డు అధ్యక్షులు మజ్జి మాలినాయుడు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర ఎస్సీసెల్ అధికార ప్రతినిధి నీలాపు జోగి, వార్డు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రి సిబ్బందికి దుస్తుల పంపిణీ

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీ దుస్తులు పంపిణీ చేశారు. గురువారం నూతన సంవత్సరం సందర్భంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.గోపీకృష్ణ, జనసేన నాయకులు దుల్ల రామునాయుడు, అట్టా అప్పారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డొక్కా రమేష్, కె.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

'నూతన' లక్ష్యాలతో ముందుకు సాగుదాం

ఎమ్మెల్యేలు పల్లా, గణబాబు

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే: కొత్త ఏడాది నూతన లక్ష్యాలతో ముందుకు సాగుదామని గాజువాక, పశ్చిమ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.గణబాబులు పేర్కొన్నారు. నూతన సంవత్సరం మొదటి రోజు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు వారికి శుభాకాంక్షలు తెలపటానికి తరలివచ్చారు.

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడిలోని దివ్యజ్యోతి భవనంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజాపిత బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు. బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు రామకోటి, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3)న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌ను ఆ పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్, ఉక్కు ఉద్యోగి వెన్నా శ్రీరామమూర్తి గురువారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 86వ వార్డు భాజపా నాయకులు డి.సుబ్బారావు, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్‌లకు పలువురు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

గోపాలపట్నం, ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే: పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు నివాసంలో కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నాయకులు బెహరా భాస్కరరావుకు పార్టీ నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, బొమ్మిడి రమణ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు.

ఎమ్మెల్యే పల్లాను సత్కరిస్తున్న కూటమి నాయకులు

ఎమ్మెల్యే గణబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నాయకులు

ములగాడ కాలనీ చర్చిలో గీతాలను ఆలపిస్తున్న బాలలు

సింధియా, న్యూస్‌టుడే: పశ్చిమ నియోజకవర్గం వైకాపా క్యాంపు కార్యాలయంలో గురువారం కొత్త ఏడాది వేడుకలను కార్యకర్తలు నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ సమక్షంలో 14 వార్డుల నుంచి ఆ పార్టీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు కేక్‌ను కోసి సంబరాలు చేసుకున్నారు.

★ ఏడు వార్డుల కూటమి సమన్వయకర్త విశ్వనాథుల దినకర్ నేతృత్వంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గణబాబు సమక్షంలో కేక్‌ను కోసి పేద విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలను పంపిణీ చేశారు.

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జీవీఎంసీ 69, 68వ వార్డు కార్పొరేటర్లు కాకి గోవిందరెడ్డి, గుడివాడ అనూషలకు పలువురు నాయకులు, అధికారులు, ప్రజలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పల్లాను ఏపీ టెక్నికల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ఇక ఎంచక్కా.. ఆడుకోవచ్చు

ప్రభుత్వ బడులకు క్రీడా పరికరాల సరఫరా

గోపాలపట్నం, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందుకు అవసరమైన వసతులను సమకూరుస్తోంది. ఈ మేరకు క్రీడాపరికరాలు సిద్ధం చేసి.. మండలాల వారీగా అధికారులు పంపిణీ చేశారు. ఉన్నత పాఠశాలకు రూ.30వేల విలువైన కిట్లు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.14వేలు, ప్రాథమిక పాఠశాలకు రూ.7.5వేల విలువ చేసే సామగ్రి అందించారు. విద్యార్థుల ఆసక్తి మేరకు మొత్తం 31 రకాల ఉపకరణాలు పంపించారు. స్కూల్ కాంప్లెక్సుల నుంచి కిట్లను పాఠశాలకు చేరి సీఆర్పీలకు అప్పగించారు.

ఇందులో ఏం ఉంటాయంటే...: హైజంప్ పోల్స్, డిస్క్, జావెలిన్, షార్ట్‌పుట్, బ్యాడ్మింటెన్, కాక్, నెట్స్, షటిల్ రాకెట్లు, క్యారమ్ బోర్డుసెట్, చెస్ బోర్డు, క్రికెట్, బ్యాట్‌లు, స్టంప్స్, సాఫ్ట్ టెన్నిస్‌బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్ పంప్, కబడ్డీ యాంకిల్ క్యాప్స్, నీ ప్యాడ్స్, వెయింగ్ మిషన్లు, స్కిప్పింగ్ రోప్స్, టెన్నికాయిట్ రింగ్స్, త్రోబాల్, యోగ మ్యాట్లు, టేప్, ఉడెన్ స్టంప్స్ సామగ్రి ఉంటాయి.

★ గోపాలపట్నం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు-5, జీవీఎంసీ ఉన్నత పాఠశాలలు-4, రెసిడెన్షియల్ స్కూల్ ఉంది. మండల ప్రాథమిక పాఠశాలలు-26, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా.. సుమారు 9వేల మంది విద్యార్థులు సర్కారు బడుల్లో చదువుతున్నారు. అన్ని పాఠశాలలకు క్రీడా సామగ్రి అందడంతో సాయంత్రం వేళల్లో కొత్త సామగ్రి పరికరాలతో విద్యార్థులు ఆటలు ఆడుతూ సందడి చేస్తున్నారు.

పాఠశాలకు చేరిన క్రీడా పరికరాలతో విద్యార్థినులు

'సిటూ పోరాటాలతోనే ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ'

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: సీఐటీయూ పోరాటాలతోనే ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ సాధ్యమవుతుందని విశాఖ ఉక్కు కర్మాగారం ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అఖిల భారత స్టీల్ కార్మికుల సమాఖ్య ఉపాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. ఏయూ ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న సిటూ 18వ అఖిల భారత మహాసభల్లో ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ అంశంపై ఆయన మాట్లాడారు. నూతన ఆర్థిక విధానాల ప్రారంభం నుంచే ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ప్రయత్నం ప్రారంభమైందన్నారు. దీనికి వ్యతిరేకంగా సీఐటీయూ చేస్తున్న పోరాటాల వల్ల ప్రభుత్వాలు ముందుకు వెళ్లలేకపోతున్నాయన్నారు.

మాట్లాడుతున్న అయోధ్యరామ్

★ విశాఖ ఉక్కుకు ముడిసరకు, వర్కింగ్ క్యాపిటల్ కేటాయించకపోవడం వల్లే ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మూడో వంతుకు తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వం రూ.5 వేల కోట్ల పెట్టుబడి పెడితే రూ.58 వేల కోట్ల మేరకు పన్నుల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమకూర్చడంతో పాటు లక్షల మందికి ఉపాధి కల్పించడం సాధ్యమైందన్నారు. ఇటువంటి పరిశ్రమలను ప్రైవేటీకరణ చేసేందుకు చేస్తున్న అన్ని ప్రయత్నాలను సీఐటీయూ అడుగడుగునా అడ్డుకుంటుందన్నారు.

రైతుబజారులో పూల శోభ

నర్సరీలో పెంచుతున్న మొక్కలు


మొక్కలను సిద్ధం చేస్తున్న సిబ్బంది

గోపాలపట్నం, న్యూస్‌టుడే: గోపాలపట్నం రైతుబజారుకు వచ్చేవారికి పూలు, పూలమొక్కలు స్వాగతం పలుకుతున్నాయి. రైతుబజార్‌లోని నర్సరీలో క్రోటాన్స్, గులాబీ, హ్యాంగింగ్ మొక్కలు, ఫస్ట్‌లవ్ మొక్కలు, ఇన్‌డోర్, అవుట్ డోర్ మొక్కలు, ఆక్సిజన్ పెంచే మొక్కలు, వాస్తు, ధనలాభ మొక్కలు ఇలా.. అనేక రకాల పూలమొక్కలు చూపర్లను ఆకట్టుకుంటున్నాయి. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపటానికి ఎక్కువ మంది ఈ పూల మొక్కలు అందించడానికి ఆసక్తి చూపించారు.

పెద్దసంఖ్యలో క్రోటాన్ మొక్కలు

నర్సరీలో చామంతులు

(c) eenadu

నవనీతధరుడా.. నారాయణ

ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా విజయనగరంలోని వివేకానందకాలనీలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్నకు నవనీత సేవ వేడుకగా జరిగింది. వేకువజాము నుంచే కల్యాణ మూర్తులను దర్శించేందుకు భక్తులు తరలివచ్చారు.

– న్యూస్‌టుడే, విజయనగరం ఉడాకాలనీ

నేటి నుంచి 'స్టెప్ కోన్'

రాజాం, న్యూస్‌టుడే: జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి స్టూడెంట్ టెక్నికల్ పేపర్-ప్రాజెక్ట్ కాంటెస్ట్, ఎగ్జిబిషన్‌ను శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌కు ప్రాధాన్యతనిస్తూ బిట్స్ టు క్యూబిట్స్ థీమ్‌తో 'స్టెప్ కోన్-2026' నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 'క్వాంటమ్ మెకానిక్స్', క్వాంటమ్ గేట్స్, క్వాంటమ్ సర్క్యూట్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ అనే 4 క్యూలు వస్తాయని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థులు వినూత్న ఆలోచనలు, సృజనాత్మక చర్చలు జరిపేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని చెప్పారు. వివిధ కళాశాలల విద్యార్థులు భాగస్వామ్యం అవుతారన్నారు.

బాలలూ.. భవితను తీర్చిదిద్దుకుందాం

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

☛ ఇంధన పరిరక్షణ మిషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో లఘుచిత్ర విభాగంలో దత్తిరాజేరు మండలం రామచంద్రపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పి.హేమావతి, పి.హరిణి ప్రథమ స్థానం సాధించారు.

☛ స్మార్ట్ డస్ట్ బిన్ తయారీతో జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు పార్వతీపురం జిల్లా నర్సిపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గుణవర్ధన్, రిషీంద్రనాయుడు.

ఇవీ గత ఏడాది మన జిల్లా బాలలు సాధించిన విజయాలు. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో అవకాశాలు, సౌకర్యాలు కల్పిస్తున్నాయి. నచ్చిన రంగంలో రాణించేందుకు పలు వేదికలు ఏటా ఆహ్వానం పలుకుతున్నాయి. ప్రతిభ చూపితే పీఎంతో మాట్లాడవచ్చు.. ఇస్రోను చూడొచ్చు.. జపాన్ వెళ్లొచ్చు.. ఉన్నత విద్యకు బాటలు వేసుకోవచ్చు. మరి ఆ ప్రయత్నం ఇప్పట్నుంచే మొదలుపెడదామా పిల్లలు?.

సైన్స్ ఫెయిర్.. పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ, సౌత్ ఇండియా స్థాయిల్లో జరుగుతోంది. ఈ ఏడాది రాష్ట్రస్థాయి పోటీల ద్వారా బృంద విభాగంలో చీపురుపల్లి జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల బృందం ప్రదర్శించిన 'క్రాప్ డాక్టర్' ప్రాజెక్టు జాతీయ స్థాయితో పాటు సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైంది.

యువికా.. యువికా(యువ విజ్ఞాన శాస్త్రం) కార్యక్రమాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) నిర్వహిస్తోంది. ఎనిమిదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు అర్హులు. ఎంపిక చేసిన వారికి స్పేస్ టెక్నాలజీ, సైన్స్ అప్లికేషన్స్‌పై ప్రాథమిక జ్ఞానాన్ని అందించనున్నారు. ఎంపికైనవారికి ఏటా మేలో రెండు వారాల పాటు శ్రీహరికోట, హైదరాబాద్, తిరువనంతపురం తదితర ప్రాంతాల్లో శిక్షణ ఉంటుంది.

ఎన్ఎంఎంఎస్.. జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్ఎంఎంఎస్)కు ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అర్హులు. ఎంపికైతే ఇంటర్మీడియట్ వరకు ఏడాదికి రూ.12 వేలు ఉపకార వేతనంగా ఇస్తారు. ఏటా సగటున జిల్లాలో 150 మంది ఎంపికవుతున్నారు.

కౌశల్.. భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు(కౌశల్) ఏటా నిర్వహిస్తారు. క్విజ్ (ప్రహేళిక), పోస్టర్ ప్రెజెంటేషన్ రెండు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. 8, 9, 10 తరగతుల నుంచి ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు ఒక బృందంగా క్విజ్‌లో పాల్గొనాలి. పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీల్లో 8, 9 తరగతులకు చెందిన ఇద్దరు విద్యార్థులు పాల్గొంటారు. జిల్లా స్థాయి విజేతలకు ప్రథమ రూ.4,500, ద్వితీయ రూ.మూడు వేలు బహుమతిగా అందజేస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ రూ.15 వేలు, ద్వితీయం రూ.12 వేలు, తృతీయం రూ.9వేలు చెల్లిస్తారు.

ఇన్‌స్పైర్ మనక్.. బాలల్లో సృజన గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మరో పథకం. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు. ఎంపికైతే రూ.10 వేలు ఇస్తారు. జాతీయ స్థాయి విజేతలను జపాన్ పర్యటనకు తీసుకెళతారు. అలా జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం లభించింది. 2025-26 విద్యాసంవత్సరంలో 2,040 ప్రాజెక్టులు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి.

నూతన ఏడాది 2026 నవ్యదారి

ఐఐఐటీల్లో ప్రవేశాలు.. పదోతరగతి మార్కుల ఆధారంగా ఐఐఐటీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు విద్యాలయాల్లో ప్రవేశాలు పొందొచ్చు. ఇందులో సీటు వస్తే ఇంటర్మీడియట్ నుంచి ఇంజినీరింగ్ వరకు చదువుకోవచ్చు. 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాల్లో ఉమ్మడి జిల్లా నుంచి 381 మందికి సీట్లు లభించాయి.

ప్రధానితో ముఖాముఖి.. ప్రధాని మోదీతో ముఖాముఖి అయ్యే 'పరీక్షా పే చర్చ' కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలో ఎక్కువ సంఖ్యలోనే రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. భయాన్ని పోగొట్టి, ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయడం ఈ కార్యక్రమం ఉద్దేశం. ఏటా ఫిబ్రవరిలో జరుగుతుంది. గత విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 1.50 లక్షల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 2018-19లో నవోదయ కిల్లంపాలెం విద్యార్థులు, 2019-20లో విజయనగరానికి చెందిన పాఠశాల విద్యార్థి మనోజ్‌కుమార్ ఈ అవకాశం అందుకున్నారు.

షైనింగ్ స్టార్ .. పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పురస్కారాలు ప్రదానం చేస్తోంది. మార్కులే ప్రామాణికం. రూ.20 వేల నగదు బహుమతి అందజేస్తారు. ఈ ఏడాది పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన 158 మంది విద్యార్థులకు పురస్కారాలు లభించాయి.

పిల్లల్లో అనంతమైన శక్తి ఉంటుంది. దానిని నమ్మడం వల్ల వారు అడ్డంకులను అధిగమించి అసాధ్యం అనిపించే వాటిని సాధించడానికి సహాయపడుతుంది. - స్వామి వివేకానంద

నువ్వేం చేసినా బాగా చెయ్. ఇష్టపడి చేయడానికి భయపడొద్దు. మాస్టర్ కావడానికి ముందే విద్యార్థిగా మారు. నీలో కలలు కనాలనే కోరిక ఉంటే అది కూడా నెరవేరుతుంది. - వాల్ట్ డిస్నీ

భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి సంకేతం

మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: భోగాపురంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి సంకేతమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. నూతన సంవత్సర కానుకగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని బహుమతిగా ఇవ్వనున్నాయన్నారు. విజయనగరంలోని అశోక్‌బంగ్లాలో గురువారం విలేకరులతో మాట్లాడారు. విజయనగరం, విశాఖపట్నం జంట నగరాలుగా మారుతాయని, శ్రీకాకుళం జిల్లాకు అనుసంధానమవుతాయని చెప్పారు. భవిష్యత్తులో ఈ ప్రాంతానికి పెద్దఎత్తున పరిశ్రమలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాదుల వరప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి గోధుమ పిండి పంపిణీ

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ దుకాణాల ద్వారా శుక్రవారం నుంచి గోధుమ పిండిని అందజేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు జిల్లాలో విజయనగరం అర్బన్‌లో పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 55 మెట్రిక్ టన్నుల బస్తాలు ఇప్పటికే చేరాయి. వీటిని నగరంలోని 97 చౌక దుకాణాలకు తరలించారు. ఒక్కో కార్డుదారునికి కిలో రూ.20 చొప్పున ఇవ్వనున్నారు.

రాగులపై అనాసక్తి

గడిచిన రెండు నెలల నుంచి రాగుల పంపిణీ సాగుతోంది. బియ్యానికి బదులు గరిష్ఠంగా మూడు కిలోల వరకు తీసుకునే వెసులుబాటు కల్పించినా గ్రామీణంలో పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అర్బన్‌లో డిమాండ్‌ను బట్టి అధికారులు ఇండెంట్ పెడుతున్నారు.

నీకు కుక్కరు.. నాకు స్టవ్

ఈనాడు, విజయనగరం

అన్నదాతలకు సేవలు అందిస్తామని చెప్పిన గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను(ఆర్ఎస్‌కేగా పేరు మార్చారు) ప్రారంభించింది. సిద్ధమైన భవనాలకు రూ.కోట్ల విలువైన కియోస్క్‌లు, ఇతర పరికరాలను సమకూర్చింది. వాటిల్లో కుక్కర్లు, స్టవ్‌లు, గ్యాస్ సిలిండర్లు సైతం ఉండడం గమనార్హం. వాటి ఉపయోగం లేకపోవడంతో వైకాపా నాయకులు అప్పట్లోనే మాయం చేశారు. ప్రస్తుతం చాలాచోట్ల అవి కానరావడం లేదు. కొన్నిచోట్ల ఉన్నా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

బాడంగి మండలం తెంటువలసలో అలంకారప్రాయంగా టీవీ.. కానరాని కుక్కర్, స్టవ్, సిలిండర్

● పంచేసుకున్న వైకాపా నాయకులు
● రైతు భరోసా కేంద్రాల్లో కానరాని వైనం

రూ.లక్షల సామగ్రి

ఒక్కో కేంద్రానికి రూ.4 లక్షల విలువైన కుక్కర్, స్టవ్, గ్యాస్ సిలిండర్, గ్లాస్ డిస్‌ప్లే బోర్డులు, కియోస్క్, టీవీ, ఓపెన్ ర్యాక్‌లు-2, బుక్ ర్యాక్‌లు-2, పుస్తకాలు, కుర్చీలు-15, టేబుళ్లు-2, పెద్ద బల్ల-1, కంప్యూటర్, ప్రింటర్, తేమకొలిచే మీటర్, స్టేషనరీ, రికార్డులు అందించారు. వీటిల్లో ప్రస్తుతం కుక్కర్లు, స్టవ్‌లు, సిలిండర్‌లు కనిపించడం లేదు. అప్పట్లో కొందరు అధికారులు, నాయకులు పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది.

నిరుపయోగంగా..

రెండు జిల్లాల్లో 791 కేంద్రాలున్నాయి. వీటికి రూ.7.11 కోట్ల విలువైన కియోస్క్ యంత్రాలు సమకూరాయి. ఆది నుంచి సాంకేతిక లోపాలతో మొరాయిస్తున్నాయి. ఒక్క కేంద్రంలోనూ కనీసం నెల పాటు ఇవి పనిచేసిన దాఖలాలు లేవు. మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకొచ్చే ఆలోచనా చేయలేదు. కొన్నింటినైతే కనీసం తెరవలేదు. దీంతో ప్రజాధనం వృథా అయింది.

అలంకారానికేనా?

ఆర్ఎస్‌కేల ద్వారా విత్తనాలు, ఎరువుల సరఫరా, భూసార పరీక్షలు, సలహాలు, పంటల కొనుగోలు, పెట్టుబడి సాయం తదితర సేవలు అందాలి. ఈమేరకు వాటికి సంబంధించిన వీడియోలు, ప్రత్యేక కార్యక్రమాలు, పథకాల అమలు తీరు, ఉపయోగాలను టీవీల్లో ప్రసారం చేయాలి. అప్పుడప్పుడూ గన్నవరం నుంచి శాస్త్రవేత్తలు మాట్లాడితే.. రైతులకు తెలియజేయాలి. ఈ ప్రక్రియ సైతం ఆగిపోయింది. దీంతో టీవీలన్నీ గోడలకు అలంకారంగా ఉన్నాయి. ప్రింటర్లు సైతం ఎక్కడా కనిపించడం లేదు. స్టేషనరీదీ అదే పరిస్థితి. సేవలు అందించాల్సిన వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని అన్నదాతలు చెబుతున్నారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. యంత్రాలు, పరికరాల వినియోగంపై సమాచారం తీసుకుంటామని రెండు జిల్లాల వ్యవసాయాధికారులు వీటీ రామారావు, అన్నపూర్ణ 'ఈనాడు'కు తెలిపారు.

భద్రతకు బాటలు

న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

జిల్లాలో జరుగుతున్న ప్రమాదాలకు 90 శాతం మేర నిబంధనలు పాటించకపోవడం, స్వయం తప్పిదాలే కారణమవుతున్నాయి. ఈ పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులతో పాటు రవాణా శాఖ సిద్ధమవుతోంది. 'సడక్ సురక్ష అభియాన్' నినాదంతో ఈ ఏడాది రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తోంది. ఈనెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు సాగనున్నాయి. 'విద్యతో భద్రత- సాంకేతికతతో మార్పు' అనే అంశంపై చైతన్యం చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు.

కార్యాచరణ ఇలా..

జిల్లాలో గురువారం నుంచి ప్రక్రియ ప్రారంభమైంది. తొలి రోజు జిల్లా స్థాయిలో బ్రోచర్లు, కరపత్రాలు, ప్రచార సామగ్రిని ఆవిష్కరించారు. ఇప్పటికే గుర్తించిన వాలంటీర్లకు శుక్రవారం శిక్షణ ఇవ్వనున్నారు. 3న వాహన తనిఖీలు చేపడతారు. 4న చోదకులకు ఆరోగ్య పరీక్షలు, 5న వాక్‌థాన్, ఆరో తేదీ నుంచి విద్యాసంస్థల్లోని డ్రైవర్లు, సూపర్‌వైజర్లు, ప్రిన్సిపాళ్లు, యాజమాన్య ప్రతినిధులకు అవగాహన, ర్యాలీలు, శిరస్త్రాణం ధరించడం, సీట్‌బెల్ట్ పెట్టుకోవడం తదితర అంశాలపై సూచనలు చేయనున్నారు. అతివేగం, నియమాల ఉల్లంఘన, డ్రంక్ అండ్ డ్రైవ్, చరవాణి చోదకంతో జరిగే ముప్పును తెలియజేస్తారు.

● గుడ్ సమరిటన్, క్విజ్, వ్యాస రచన పోటీలు, కార్యశాలలు జరగనున్నాయి. 31న ముగింపు కార్యక్రమం ఉంటుంది.

భాగస్వాములు కావాలి..

ఈసారి ప్రభుత్వం ఆదేశాలతో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రవాణా శాఖ ఉప కమిషనర్ మణికుమార్ తెలిపారు. ఈక్రతువులో జిల్లా ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అవగాహన ఉంటేనే వాహనాలతో రోడ్లపైకి రావాలని సూచించారు.

పచ్చగా.. పర్యావరణహితంగా..

కార్యాలయ ఆవరణలో పచ్చదనం పరవళ్లు

గ్రౌండ్ ఫ్లోర్‌లో హంగులు

ప్రాంగణంలో ఎక్కడ చూసినా పచ్చదనం పరవళ్లు. విభాగాలకు వెళ్లే దారుల్లో మొక్కల పలకరింత.. ఇదంతా ఏ కార్పొరేట్ కార్యాలయ ఆవరణో అనుకుంటే పొరపాటే. విజయనగరం నగరపాలక సంస్థ పర్యావరణహిత బాట ఇది. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులోని పట్టణ ప్రణాళికా విభాగం, సెక్రటేరియల్, సర్వే విభాగం, ప్రవేశ మార్గం రూపురేఖలను అధికారులు ఇలా మార్చేశారు. రూ.40 లక్షలకు పైగా నిధులతో ఆధునికీకరణ పనులు చేపడుతున్నామని కమిషనర్ నల్లనయ్య చెప్పారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

స్వచ్ఛ గ్రామాలు.. ఆరోగ్య దివిటీలు

కొత్తవలస, న్యూస్‌టుడే: పల్లెలను పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వుల మేరకు జిల్లా వ్యాప్తంగా ఘన వ్యర్థాల నిర్వహణ అమలు చేయనున్నట్లు డీపీవో మల్లికార్జునరావు పేర్కొన్నారు. 2026 జనవరి 5న నిర్వహించే గ్రామసభల్లో చెత్త కుప్పలు లేని గ్రామాలు ప్రకటించనున్నామన్నారు. చెత్త రహిత పంచాయతీల అంశంపై చర్చించాలన్నారు.

ఇవీ మార్గదర్శకాలు..

● జనవరి 4 వరకు వ్యర్థాలు, చెత్త కుప్పలు తొలగించాలి. తడి, పొడి చెత్త వేరు చేసి బయోరిమిడియేషన్, బయోమైనింగ్ అనుసరించాలి. ● సంపద సృష్టి కేంద్రాల్లో నాడెప్ గుంతల్ని తడి చెత్త, పశువుల ఎరువు, వ్యవసాయ వ్యర్థాలతో నింపాలి. ● పొడి చెత్తను డ్రై వేస్ట్ గుంతల్లో నిల్వ చేయాలి. ● వర్మీ కంపోస్టు తయారు చేయని పంచాయతీల్లో వెంటనే ప్రారంభించాలి. ● గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు రేడియం జాకెట్లు సరఫరా ● రహదారి పక్కనున్న పశువుల గెత్తం తొలగించాలి. ● వర్మీ కంపోస్టును 50:50 నిష్పత్తిలో పంచాయతీ, రైతు పంచుకునేలా చేయాలి. ● సంపద సృష్టి కేంద్రాల్లో నీరు, మరుగుదొడ్డి, విద్యుత్తు సదుపాయాలు కల్పించాలి. ● చెత్త వేసే స్థలాలను హరిత ప్రాంతాలుగా మార్చాలి.

శిక్షణకు నేడు ఎంపిక పరీక్ష

రాజాం, న్యూస్‌టుడే: రాజాంలోని నైరడ్ సంస్థ.. అయిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివిన వారికి వివిధ ట్రేడ్లో శిక్షణ ఇస్తోంది. 2003 సంవత్సరంలో అప్పటి ఆంధ్రాబ్యాంకు (ప్రస్తుతం యూనియన్ బ్యాంకు)- జీఎంఆర్‌వీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో దీనికి పునాది పడింది. కొత్త బ్యాచ్‌ల ఎంపికకు శుక్రవారం మౌఖిక పరీక్ష నిర్వహించనున్నారు. రిఫ్రిజిరేటర్- ఏసీల మరమ్మతులపై 75 రోజులు, ఫొటోగ్రఫీ, వీడియో మిక్సింగ్‌పై 30 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. 18-40 సంవత్సరాల వయసుండి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఆసక్తిగల వారు నేరుగా ఒరిజనల్ మార్కుల పత్రం, ఆధార్, రేషన్, ఇతర విద్యార్హత పత్రాలతో హాజరు కావాలని నిర్వాహకులు తెలిపారు. శిక్షణకు 99899 53145 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు కేకు తినిపిస్తున్న ఐసీడీఎస్ పీడీ విమలారాణి

వేడుక.. ఆనంద వీచిక

జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. విజయనగరంలోని అయ్యన్నపేట కూడలి వద్ద కల్యాణ మండపంలో గురువారం జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కేకు కోశారు. ప్రజలు, అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డికి పలువురు అధికారులు, సిబ్బంది, నాయకులు పుస్తకాలు, పెన్నులు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు ఆయన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత, మంత్రిని కలిసి, మొక్కలను అందించారు.

– న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

(c) eenadu

కొండకు చేరిన కరిరాజులు

మొన్నటివరకు జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల్లో తిరిగాడిన కరి రాజులు గురువారానికి అర్తాం అటవీ ప్రాంతానికి చేరుకున్నాయి. మార్గ మధ్యలోని దుగ్గి సమీపంలో కూరగాయల పంటలను ధ్వంసం చేశాయి. రైలు పట్టాలు దాటి కొండల్లోకి వెళ్లాయి. అక్కడ సరిపడా ఆహారం లభించకపోతే గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. – న్యూస్‌టుడే, కొమరాడ

వెలుగుల వేడుక.. నూతన కానుక

తాటిపూడి సమీపంలోని కాటేజీ వద్ద ఉపాధ్యాయుల థింసా నృత్యం

పాలకొండ ఆర్సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

విజయనగరంలోని గంటస్తంభం వద్ద యువత సందడి

విజయనగరం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబితతో కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి తదితరులు

నూతన ఏడాది రాకతో ఉమ్మడి జిల్లాలో సందడి వాతావరణం నెలకొంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు వేడుకల్లో పాల్గొన్నారు. విజయనగరం, రాజాం, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు తదితర ప్రాంతాల్లో యువతీ, యువకులు ఆటపాటలతో అలరించారు. సందర్శన కేంద్రాలు, ఉద్యానాలు కిక్కిరిశాయి.
– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం, అర్బన్, తాటిపూడి(గంట్యాడ), పాలకొండ

నడవండి.. అనారోగ్యాన్ని తరమండి

ట్రాక్‌పై నడుస్తున్న జేఎన్‌టీయూజీవీ అధికారులు, ఆచార్యులు, సిబ్బంది

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని 'ప్రకృతితో కలిసి నడుద్దాం- ప్రగతి సాధిద్దాం' అనే నినాదంతో గురువారం విజయనగరంలోని జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయంలో నడకదారిని ప్రారంభించారు. ఉపకులపతి వి.వి.సుబ్బారావు, రిజిస్ట్రార్ జి.జయసుమ, ఆచార్యులు, సిబ్బంది, విద్యార్థులు కలిసి నడక సాగించారు. ప్రతిఒక్కరూ రోజూ ఎంతో కొంత సమయం నడవాలని, అప్పుడే అనారోగ్య సమస్యలు దూరమవుతాయని సుబ్బారావు సూచించారు. జీవితంలో ఏం సాధించాలన్నా ఆరోగ్యం ముఖ్యమని, జీవనశైలిలో మార్పులతోనే అది సాధ్యమన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రధానాచార్యుడు ఆర్.రాజేశ్వరరావు, డైరెక్టర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు. అనంతరం కాలమానిని ఆవిష్కరించారు. – న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

124 మందిపై కేసుల నమోదు: ఎస్పీ

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ముందస్తు చర్యలతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ముఖ్య కూడళ్లలో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. అర్ధరాత్రి ఒంటి గంట తరువాత రహదారులపై ఎవరూ తిరగకుండా పెట్రోలింగ్ ముమ్మరం చేశామని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 28 మందిపై, ఎంవీ చట్టాన్ని అతిక్రమించిన 87 మందిపై కేసులు పెట్టామన్నారు. విజయనగరం రెండో పట్టణ, గజపతినగరం స్టేషన్ల పరిధిలో డ్రోన్ల సాయంతో 9 మంది జూదరులను అదుపులోకి తీసుకుని, రూ.1895 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏఎస్పీ పి.సౌమ్యలత, డీఎస్పీలు ఆర్.గోవిందరావు, భవ్యారెడ్డి, ఎస్.రాఘవులు పర్యవేక్షించారన్నారు.

PUBLIC NOTICE

The public is hereby informed that our clients intend to acquire schedule mentioned property from **Smt. Mukkavilli Indhumathi** and other family members, residents of Mumbai, Bengalore, Hyderabad, Vijayawada and Visakhapatnam, who represented to our clients that the schedule property was originally purchased by their predecessor in interest, late Sri Mukkavilli Sanyasayya. It is further represented to our clients by the said people that the schedule property is unencumbered and salable. Any person having right, title or interest or claim in the said property or any objection to the proposed transaction may lodge his objections in writing together with supporting proofs, before the undersigned, within **07 days** of publication of this notice. In the absence of any such objection, our clients intend to proceed with proposed transaction and any objections thereafter will not bind our clients.

SCHEDULE

All the site of an extent of 825.11 Sq. yds or 7426 Sq. Ft. together with old house therein bearing D.No.20-3-11, surrounded by a compound wall situated in Survey No.480/2, Kaspa East-Ward, Lanka Street, Vizianagaram District within the limits Vizianagaram Municipality and within the limits of SRO, Vizianagaram District and bounded as follows: **East:** T.S.No.491-Itla Sanysi's House and Arle Jagannadham's House, **South:** T.S.No.492 Houses of Battula Appayyamma and Mallipamula Audeyyamma and T.S. No. 494 - Lanka Street, **West:** T.S. No. 480/1, Vacant site of Sri Pusapati Sitarama Raju Garu and others, **North:** T.S.No.480/1, Vacant site of Sri Pushapati Sitarama Raju Garu and others and T.S.No.481 Municipal School Vacant Site.

VRUDDHULA SATISH & Smt. V. RAJYA LAKSHMI, Advocates
4-57-2/1, LIG-55, Lawson's Bay Colony
Visakhapatnam-530 017. **Cell: 98485 18385**

జిల్లా పంచాయితీ అధికారి వారి కార్యాలయము విజయనగరం

టెండర్ ప్రకటన

రేఖా నెం. 01/2025/ఎ12, తేది: 01.01.2026.

విజయనగరం జిల్లాలో 27 మండలాలలో మండలం ఒక యూనిట్‌గా "స్వచ్ఛ రథం" నిర్వహణ కోసం 3 దశలలో, అర్హులైన వ్యక్తులు/సంస్థలు/స్క్రాప్ డీలర్లు/ఆపరేటర్ల నుండి దరఖాస్తులు ఆహ్వానించడమైనది. ప్రతి మండలము ఒక యూనిట్ కనుక అభ్యర్థులు విడివిడిగా దరఖాస్తులు చేసుకోవాలి. వర్తించే గరిష్ట వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (మోడల్-I రూ: 25,000/నెల, మోడల్-II కి రూ: 21,000/నెల).

దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ (టెండర్ ప్రకటన జారీ చేసిన తేదీ నుండి 7 రోజుల్లోపు)

అర్హతలు:

★ స్క్రాప్ డీలింగ్, ఘన వ్యర్థాల సేకరణ లేదా పునర్వినియోగపరచదగిన పదార్థాల నిర్వహణలో కనీసం మూడు (3) సంవత్సరాల ధృవీకరించదగిన అనుభవం కలిగి ఉండాలి.
★ స్క్రాప్ లేదా పునర్వినియోగపరచదగిన పదార్థాల డీలింగ్ కోసం చెల్లుబాటు అయ్యే ట్రేడ్ లైసెన్స్/రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి.

దరఖాస్తుదారుడు దరఖాస్తునకు ఈ క్రింది పేర్కొనిన వాటిని జతపరచాలి

★ ఆదార్, పాన్ కార్డు కాపీ
★ నివాసం లేదా సంస్థ రిజిస్ట్రేషన్ రుజువు.
★ అనుభవ ధృవీకరణ పత్రం మరియు సహాయక పత్రాలు.
★ స్క్రాప్ డీలింగ్/MRF ఆపరేషన్ కోసం ట్రేడ్ లైసెన్స్.
★ GST రిజిస్ట్రేషన్ (వర్తిస్తే).
★ గత మూడు సంవత్సరాల టర్నోవర్ స్టేట్మెంట్ మరియు IT రిటర్న్సులు.
★ స్వచ్ఛ రథం కోసం ప్రతిపాదించబడిన వాహనం వివరాలు (RC కాపీ, డ్రైవింగ్ లైసెన్స్, కాలుష్య ధృవీకరణ పత్రం, బీమా ధృవీకరణ పత్రం, ఫిట్‌నెస్ సర్టిఫికేట్).
★ బ్యాంక్ పాస్ బుక్.
★ ఉమ్మడి ఆపరేషన్ వివరాలు, వర్తిస్తే (స్క్రాప్ డీలర్ అమరిక + వాహన యజమాని + ఆపరేటర్).
★ అధికారుల నుండి నెలకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పొందడానికి బిడ్డర్ కోట్ చేసిన మొత్తం సీలింగ్ (I- పరిమితి మోడల్ రూ: 25,000, మోడల్-IIకి రూ: 21,000, (మించకూడదు)
★ పాస్‌పోర్ట్ సైజు ఫోటోగ్రాఫ్ మరియు సంప్రదింపు వివరాలు.
★ దరఖాస్తు దారుడు రూ. 10,000/- డిమాండ్ డ్రాఫ్ట్‌ను MPDO చిరునామాతో దరఖాస్తుతో పాటు సమర్పించాలి. ఇది తిరిగి చెల్లించబడదు.
★ టెండర్ ఆమోదించుటకు గాని రద్దుపరచుటకు గాని మరియు వాయిదా వేయుటకు గాని జిల్లా పంచాయతీ అధికారి మరియు కన్వీనర్ వారికి పూర్తి అధికారము కలదు.

ఇతర వివరములకు పరిపాలనాధికారి (6300002016) జిల్లా పంచాయతీ అధికారి వారి కార్యాలయము వారిని సంప్రదించవలెను.

సం/- XXX
జిల్లా పంచాయతీ అధికారి మరియు కన్వీనర్
విజయనగరం

రుణం కట్టండి.. రసీదు తీసుకోండి!!

స్త్రీనిధిలో అవకతవకలకు అడ్డుకట్ట

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

స్వయం సహాయక సంఘాల్లో మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు 48 గంటల్లోనే రుణాలు అందిస్తోంది స్త్రీనిధి కో-ఆపరేటివ్ సంస్థ. యూనిట్ల ఏర్పాటుకు సైతం అండగా నిలుస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడం, సిబ్బంది చేతివాటం కారణంగా నిధులు పక్కదారి పడుతున్నాయి. సభ్యులు చెల్లింపులు చేస్తున్నా కొందరు బ్యాంకుల్లో డిపాజిట్ చేయడం లేదు. ఈ పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు క్యాష్ పేమెంట్ రిసీవింగ్ యాప్‌ను తీసుకొచ్చారు. నగదు కట్టిన వెంటనే రసీదు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

★ వంగర మండలం బాగెమ్మపేట, పటువర్ధనం గ్రామాల్లో స్త్రీనిధి రుణాలను 90 రోజులుగా చెల్లించలేదు. ఆ రెండు ప్రాంతాల్లో సీఏఫ్‌లుగా పనిచేసిన ఇద్దరు మహిళలు ఇటీవల కారణం లేకుండా మానేశారు. అప్పటికే రూ.3 లక్షలు పక్కదారి పట్టినట్లు తేలింది. సభ్యులు చెల్లించినప్పటికీ సిబ్బంది ఆన్‌లైన్‌లో పొందుపర్చకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీనిపై విచారణ సాగుతోంది.



చెల్లింపులకు సంబంధించిన డిజిటల్ రసీదు

వారిదే బాధ్యత..

స్త్రీనిధి రుణాల మంజూరులో వీవోఏలది కీలక పాత్ర. సంఘాల స్థితిగతుల ఆధారంగా అధికారుల సాయంతో బ్యాంకులకు వెళ్లి రుణాల మంజూరుకు కృషి చేయాలి. ఈక్రమంలో కొందరు కాసులకు కక్కుర్తి పడుతున్నారు. మరి కొందరు కమీషన్ వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సీఏఫ్‌లు సక్రమంగా వివరాలు నిర్వహించకపోయినా పట్టించుకోవడం లేదని సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. ఇప్పటికే జరిగిన ఘటనల నేపథ్యంలో ఇక నుంచి అక్రమాలు జరిగితే వారిని బాధ్యులను చేయనున్నారు.

సమగ్ర వివరాలతో..

కొత్తగా తీసుకొచ్చిన ఈ విధానంతో సత్ఫలితాలు వస్తాయని భావిస్తున్నారు. ప్రతి నెలా పొదుపు సభ్యులంతా వీవోఏ ద్వారా చెల్లింపులు చేయాలి. ఈమేరకు జిల్లాలోని 1045 మంది సిబ్బంది చరవాణుల్లో యాప్‌ను నిక్షిప్తం చేశారు. వారిని ఆశ్రయిస్తే డబ్బులు కట్టాక, విధిగా రసీదు ఇస్తారు. అందులో లావాదేవీ, సంఘం, సభ్యురాలి పేరు, సమయం తదితర వివరాలన్నీ ఉంటాయి. ఇప్పటివరకు కట్టింది, ఇంకా చెల్లించాల్సినదెంతో తెలుసుకోవచ్చు. అవసరమైతే వాట్సాప్ సాయంతో చరవాణికి పంపించుకునే వెసులుబాటు సైతం ఉంటుంది. ★ ప్రస్తుతం చాలాచోట్ల ఇంకా మాన్యువల్‌గానే ప్రక్రియ సాగుతోంది. దీనిని రద్దు చేసినట్లు అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.

పొదుపు సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం..

రుణాల మంజూరు, వసూళ్లకు సంబంధించి ప్రతి క్లస్టర్‌కు ఒక ఏపీఎం ఉన్నారు. జనరల్ ఏపీఎంలు సైతం కొనసాగుతున్నారు. వీరి ఆధ్వర్యంలో వీవోఏలు పనిచేయాలి. సభ్యుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవు. యాప్ సాయంతో చెల్లింపులు చేసి, విధిగా రసీదు ఇవ్వాలి. ఇప్పటికే 283 పేటీఎం యంత్రాలిచ్చాం. ఈ ఆర్థిక ఏడాదిలో ఇప్పటివరకు 23,298 మందికి రూ.213.93 కోట్లు అందించాం. వచ్చే మూడు నెలల్లో 6800 మందికి రూ.68.95 కోట్లు ఇవ్వనున్నాం. **- చిట్టిబాబు, స్త్రీనిధి ఏజీఎం**

నిర్లక్ష్యమై మొలుస్తోంది!

నెల్లిమర్ల నగర పంచాయతీలో సుమారు 900 మొక్కలను నాటాలని ప్రభుత్వం గతంలో లక్ష్యం పెట్టుకుంది. దీనిలో భాగంగా వాటిని పంపిణీ చేయగా 500 వరకు వేశారు. మిగతా వాటిని వినియోగించకుండా ఇలా కార్యాలయం ఆవరణలోనే పడేశారు. నీరు సక్రమంగా వేయకపోవడంతో ఎండకు ఎండిపోతున్నాయి. వీటిని కూడా నాటి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఏఈ శివకుమార్ వద్ద ప్రస్తావించగా త్వరలో మిగిలిన మొక్కలను నాటి, నిర్వహణ చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల

మామిడి తోటల్లో ఆశల పూత

నిలబెట్టుకుంటేనే దిగుబడి

– న్యూస్‌టుడే, విజయనగరం వ్యవసాయ విభాగం

జిల్లాలో వరి తరువాత ప్రధానంగా మామిడి పంటపైనే రైతులు ఆధారపడతారు. అన్ని మండలాల్లో కలుపుకొని 33 వేల హెక్టార్లలో తోటలు విస్తరించాయి. ఇందులో 30 వేల హెక్టార్ల మేర ఫలసాయం వస్తోంది. ఏటా 3 లక్షల టన్నుల వరకు దిగుబడి రావాల్సి ఉండగా.. చివరికొచ్చేసరికి 60 శాతమే చేతికందుతోంది. యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం, వాతావరణం మార్పు, పూత రక్షణకు చర్యలు కొరవడడం తదితర కారణాలతో ఈ పరిస్థితి కనిపిస్తోంది.

పూతతో ఉన్న చెట్టు

పెద్దఎత్తున ఎగుమతులు..

జామి, ఎస్.కోట, రామభద్రపురం తదితర మండలాల్లో తోటలెక్కువ. రకాన్ని బట్టి టన్ను రూ.35 వేల నుంచి రూ.55 వేల వరకు అమ్ముతున్నారు. రాష్ట్రంలో మామిడిని ఎక్కువగా ఎగుమతి చేసే జిల్లాల్లో మన ప్రాంతమూ ఉంది. అయితే స్థానికంగా తాండ్ర, బెల్లం తయారీ పెరగడంతో కొన్నేళ్లుగా ఎగుమతి శాతం తగ్గింది. ప్రస్తుతం దిల్లీ, ముంబయి, కోల్‌కతా, బరంపురం, బెంగళూరుకు పంట తరలుతోంది.

ఆశాజనకంగానే..

నవంబరులో పడిన వర్షాలతో చెట్లకు నీటి తడులు పుష్కలంగా అందాయి. ప్రస్తుతం అన్నిచోట్లా పూత కనిపిస్తోంది. అయితే ఉష్ణోగ్రతల్లో మార్పు, మంచు కారణంగా అక్కడక్కడా రాలిపోతోంది. ఈ పరిస్థితి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె.చిట్టిబాబు సూచించారు.

నివారణ చర్యలివిగో..

★ తేనె మంచు పురుగు నివారణకు లీటరు నీటిలో 1.5 మి.లీ. మోనోక్రొటోఫాస్ లేదా 2 మి.లీ డైమిథోయేట్ కలిపి పూత మొదలయ్యే సమయం, పిందెలు తయారయ్యే ముందు చెట్టంతా పిచికారీ చేయాలి.
★ మొగ్గ దశలో కనిపిస్తే లీటరు నీటిలో 1.2 మి.లీ బ్యూప్రోఫెజిన్- 25 ఎస్.సి లేదా 0.3 గ్రాముల థయోమిథాక్సిమ్ కలిపి చల్లాలి.
★ మసికి కారణమైన శిలీంద్రాల నివారణకు లీటరు నీటిలో 2 మి.లీ హెక్సాకొనజోల్ లేదా మి.లీ ప్రొపికొనజోల్ కలిపి చల్లాలి.

పశుగ్రాసం.. అధనం

సన్న, చిన్నకారు రైతులకు వర్తింపు

సంఘాలకు నర్సరీల అవకాశం

– న్యూస్‌టుడే, రాజాం

పశుగ్రాసం కొరత ముందుందు తీవ్రం కానుందని ప్రభుత్వం భావిస్తోంది. రైతులు ఆధునిక యంత్రాలతో వరి కోతలు చేపడుతున్నారు. అక్కడే నూర్పులు చేసి పొలాల్లో వదిలేయడం, దుబ్బులను భూమి నుంచి ఎత్తుకు కోస్తుండడంతో పరిమాణం తగ్గిపోయి ఈ పరిస్థితి ఏర్పడుతోందని అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో పాల దిగుబడి, పశువుల ఆరోగ్యానికి భద్రతనిచ్చేలా చర్యలు చేపడుతోంది. పశుగ్రాస క్షేత్రాలతో పాటు నర్సరీలను పెంచేలా అన్నదాతలు, సంఘాలకు ఉపాధి హామీ పథకం నుంచి ఆర్థిక ప్రోత్సాహం అందించనున్నట్లు ప్రకటించింది.

మంజూరు ఇలా

రాజాం ప్రాంతంలో పశుగ్రాసం సాగు

★ వ్యక్తిగతంగా పశుగ్రాసం పండిస్తే 25 సెంట్ల నుంచి ఒక ఎకరాలో పెంచేందుకు అవకాశం ఉంటుంది. రెండేళ్లలో 184 రోజుల పని దినాలకు రూ.56,488 చెల్లిస్తారు.
★ 2 పశువులకు 25 సెంట్లు, 3- 5 అయితే 50 సెంట్లు, 5 పైబడి ఉంటే ఎకరా ఉండాలి ★ సంఘాలు: 25 సెంట్ల నుంచి అయిదెకరాల వరకు ఉంటే రెండేళ్లలో రూ.1,05,016 ఇస్తారు. 292 రోజుల వేతనాల కింద రూ.89,664, మెటీరియల్‌కు రూ.15,352 జమ చేస్తారు. కలెక్టర్ అనుమతిస్తే అయిదెకరాల పైబడి విస్తీర్ణంలో సాగు చేసుకోవచ్చు.

ఇవీ ప్రయోజనాలు

- గ్రాసం కొరత తీర్చడం
- అధిక పాల దిగుబడి
- వేసవితో పాటు ఏడాది పొడవునా గడ్డిని అందుబాటులో ఉంచడం
- పశువుల్లో రోగనిరోధక శక్తి పెంచడం, రైతులకు ఉపాధి కల్పించడం

వీరు అర్హులు

- సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ, ఎస్‌హెచ్‌జీ, రైతు సంఘాలు
- అర్హులైన లబ్ధిదారులకు ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రాసం పెంచడానికి ఉపాధి హామీ పథకం కింద 100 రోజుల పనిదినాలు కల్పిస్తారు.

మెటీరియల్ కాంపొనెంట్ వ్యయానికి సంబంధించిన మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. ఇందుకు సంబంధించిన పర్యవేక్షణ బాధ్యతను ఉపాధి హామీ పథకం, పశుసం వర్ధకశాఖ సిబ్బందికి అప్పగిస్తారని పశుసంవర్ధకశాఖ **జేడీ మురళీకృష్ణ** తెలిపారు. అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ పత్రాలు అవసరం

- ఉపాధి జాబ్‌కార్డు
- భూమికి సంబంధించి 1బీ
- ఆధార్‌కార్డు
- రేషన్‌కార్డు
- బ్యాంకు ఖాతా పాసుపుస్తకం
- ఈ నకళ్లతో అర్జీ పెట్టుకోవాలి. గ్రామసభ ద్వారా లబ్ధి దారులను ఎంపిక చేస్తారు

లక్ష్యం.. సాగు విస్తీర్ణం: 9 వేల ఎకరాలు నర్సరీలు:350(1,750 ఎకరాలు)

గిరిజన ప్రాంతంలో అత్యాధునిక వైద్యం

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, న్యూస్‌టుడే: గిరిజనులకు కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి తెస్తున్నామని గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పారు. గురువారం స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడారు. సాలూరు, భద్రగిరి, కురుపాం, సీతంపేటలో నిర్మించిన ఆసుపత్రి భవనాలను పది రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. నూతన సంవత్సర కానుకగా జిల్లాలోని 4 ఆసుపత్రులను ప్రారంభిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనుల్లో జాప్యం ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పెండింగ్ బిల్లులు చెల్లించడమే కాకుండా, నిర్మాణ సమస్యలను పరిష్కరించామన్నారు.

భగవంతుడా బతికేదెలా

బ్యాంకు ఉద్యోగి దుర్మరణంతో మిన్నంటిన రోదనలు

కొత్త ఏడాదికి స్వాగతం పలకాలని.. కుటుంబంతో సరదాగా గడపాలని విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. దార్లో కేకు కొన్నాడు. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుతాడనగా అనుకోని విషాదం. లారీ రూపంలో మృత్యువు ప్రాణాలు తీసుకుపోయింది. అండగా ఉంటాడనుకుంటే అందకుండా పోయాడని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నాగేశ్వరరావు (పాతచిత్రం)

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస మేజరు పంచాయతీ శివారు పాతసుంకరపాలేనికి చెందిన గనిశెట్టి నాగేశ్వరరావు(32) ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేసేవారు. బుధవారం రాత్రి అర్ధానపాలెం సమీపంలో ఓ శీతల పానీయ గిడ్డంగిలో లోడు దించుకుని వెనక్కి తిప్పుతున్న లారీ వెనుకభాగం తగిలి మృతి చెందారు. ఆయనకు తల్లిదండ్రులు, భార్య, 14 నెలల కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులకు విషయం తెలిసి ఆందోళనకు దిగారు. సీఐ షణ్ముఖరావు వారిని శాంతింపజేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇక మాకు దిక్కెవరు?..

'వివాహమైన మూడేళ్లకే నన్ను వదిలేసి వెళ్లిపోయావు.. ఎలా బతికేది..' అంటూ భార్య సాయి కన్నీమున్నీరయ్యారు. అందొచ్చిన కుమారుడి మృతితో తల్లిదండ్రులు అమ్మాలు, శంకరరావు బోరున విలపించారు. ఊరిలో ఎవరి ఇంట ఏ చిన్న కార్యక్రమం జరిగినా బంధువులుగా భావించి అన్ని పనుల్లో సాయం చేస్తుంటాడని, ఆయన మరణం తీరని లోటని గ్రామస్థులు కన్నీరు పెట్టుకున్నారు.

నింద భరించలేక వివాహిత ఆత్మహత్య

రమణమ్మ (పాతచిత్రం)

రామభద్రపురం, న్యూస్‌టుడే: ఓ వృద్ధుడి ఆరోపణలతో మనస్తాపం చెందిన వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రామభద్రపురం మండలం కొట్టక్కిలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రసాదరావు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తెంటు రమణమ్మ(32) భూతవైద్యం చేస్తోందని, చేతబడికి పాల్పడుతోందని అదే వీధికి చెందిన ఓ వృద్ధుడు కొన్నాళ్లుగా ఆరోపిస్తున్నాడు. దీనిపై పలువురు ఆమెను అడగడంతో తీవ్ర మనస్తాపం చెంది బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న బాధితురాలిని కుటుంబ సభ్యులు, స్థానికుల సాయంతో సాలూరులోని ప్రాంతీయాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనలతో విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. ఆమెకు భర్త బాలరాజు, ఇద్దరు కుమార్తెలున్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నూతన సంవత్సరం వేళ తీవ్ర విషాదం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృత్యువాత

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: అప్పటివరకు స్నేహితులతో సరదాగా గడిపి.. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపాడు. భార్య, పిల్లలకు శుభాకాంక్షలు తెలియజేయాలని ఆత్రుతగా ఇంటికి బయలు దేరాడు. అదే తనకు చివరి ప్రయాణమని ఊహించలేకపోయాడు. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. నూతన సంవత్సరం వేళ ఆ ఇంట్లో అంధకారం నిండుకున్న ఘటన పార్వతీపురం మండలంలో గురువారం వేకువజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాళ్లబురిడి గ్రామానికి చెందిన కె.తవిటిరాజు(48) మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య లక్ష్మి టీ దుకాణం నడుపుతూ భర్తకు చేదోడువాదోడుగా ఉంటోంది. కొత్త సంవత్సర వేడుకలను స్నేహితులతో జరుపుకోవాలని పక్క గ్రామం ఐఆర్ పేట వెళ్లాడు. అర్ధరాత్రి వరకు స్నేహితులతో సందడి చేశాడు. తర్వాత ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. మలుపు వద్ద వాహనం అదుపుతప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తవిటిరాజు కుమార్తె పదో తరగతి, కుమారుడు అయిదో తరగతి చదువుతున్నారు. ఇంటికి ఆధారమైన వ్యక్తి మృతితో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బాగా చదువుకొని ప్రయోజకులైతే ఇంటి కష్టాలు గట్టెక్కుతాయని, చదువుతోనే మంచి జీవితం సొంతం అవుతుందని ఎప్పుడూ చెప్పే నాన్న ఇక రాడన్న నిజాన్ని ఆ పిల్లలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎస్సై సంతోషికుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య నగదు ఖర్చు చేసిందని ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: భార్య డబ్బులు ఖర్చు చేసిందన్న కోపంతో పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన ఘటన పార్వతీపురం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. డోకిశీల గ్రామానికి చెందిన బి.కోటేశ్వరరావు కొన్నిరోజుల క్రితం భార్య చేతికి కొంత డబ్బిచ్చి భద్రపర్చమన్నాడు. గురువారం తిరిగి కావాలని అడగ్గా.. లేవు.. పిల్లల కోసం ఖర్చు చేశానని చెప్పడంతో మనస్తాపానికి గురయ్యాడు. వంగ మొక్కలకు కొట్టే ద్రావణాన్ని తాగాడు. కుటుంబీకులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

చికెన్ ధరలు

రకం	బ్యాగ్‌లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	270	280

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

EENADU Classifieds
BUSINESS SERVICES
BUSINESS OFFER
ప్రీమియం ఒగోబాముషు సాక్షి (బెన్నిన్) ముడి జీడిపప్పు (RCN) అత్యుత్తమ నాణ్యత, సరసమైన ధర, నేరుగా సరఫరా. బిజినెస్ వీసా, వసతి సౌకర్యాలు మేము ఏర్పాటు చేస్తాం. సంప్ర॥ 7893732377.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

(c) eenadu

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో గురువారం కూరగాయల ధరలు (కి.లో రూ.లలో).. ★ టమాటా: 62.00 ★ వంకాయలు: 32.00 ★ దొండ: 38.00 ★ బీర: 54.00 ★ బెండ: 60.00 ★ కాకర: 50.00 ★ చిక్కుడు: 40.00 ★ ఆనపకాయ (ఒకటి): 30.00 ★ అరటి (జత): 20.00 ★ మునగ: 100.00 ★ ఉల్లి: 35.00 ★ బంగాళ దుంపలు: 25.00 ★ అల్లం: 80.00 ★ వెల్లుల్లి: 120.00 ★ పచ్చి మిర్చి: 63.00 ★ క్యాబేజీ: 30.00/38.00 – న్యూస్‌టుడే– రాజాం

తెరపై ఈనాడు

✦ లక్ష్మీ థియేటర్: సైక సిద్ధార్థ ✦ వాసవి: ఈషా ✦ టీబీఆర్ స్క్రీన్-1: అఖండ-2 ✦ టీబీఆర్ స్క్రీన్-2: వృషభ – న్యూస్‌టుడే, బొబ్బిలి

✦ ఎస్‌వీసీ సీతారామా: ఈషా ✦ ఎస్‌వీసీ సీతారామా మినీ: మధం ✦ ఎస్‌వీసీ అప్సర: అఖండ–2 – న్యూస్‌టుడే, రాజాం

బొబ్బిలి

●బొబ్బిలి ●రాజాం ●గజపతినగరం ●చీపురుపల్లి

రహదారికి మరమ్మతులు

స్పందనకు వందనం

గుర్ల, న్యూస్‌టుడే: కొండగండ్రేడులో రోడ్డుకు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. గ్రామంలో ప్రధాన రహదారిపైకి వాడుకనీరు రావడంతో గుంతలమయంగా మారింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడేవారు. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో కథనం ప్రచురించారు. పంచాయతీ అధికారులు స్పందించి గుంతలను మట్టితో పూడ్చారు. రహదారికి ఇరువైపులా కాలువలు కూడా నిర్మించాలని ర.భ అధికారులను కోరామని సర్పంచి గోవింద తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి- 80085 74348

? పెదమానాపురం సంతతోట సమీపంలో గల వంతెన చివరి భాగంలోని 26వ నంబరు జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. ప్రమాదాలకు గురవుతున్నాం. -స్థానికులు ★ మరమ్మతులు చేస్తాం. -సురేష్, ఏఈ – న్యూస్‌టుడే, దత్తిరాజేరు

? దత్తి గ్రామం నుంచి రాజుల రామచంద్రపురం వరకు గల రహదారిలో పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ఇబ్బందులు పడుతున్నాం. -స్థానికులు ★ సమస్యను పరిష్కరిస్తాం. -కిశోర్‌కుమార్, ఎంపీడీవో –న్యూస్‌టుడే, దత్తిరాజేరు

? పెణసాం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. దుర్వాసన వస్తోంది. -స్థానికులు ★ చెత్తను తొలగిస్తాం. - విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? రామభద్రపురం మండలంలోని మర్రివలస జాతీయ రహదారి

మలుపు ప్రమాదకరంగా ఉంది. సూచికలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. -స్థానికులు ★ రోడ్డు మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా సూచికలు ఏర్పాటు చేస్తాం. - ప్రసాదరావు, ఎస్సై – న్యూస్‌టుడే, రామభద్రపురం

? రాజాం పట్టణంలోని కాకర్ల వీధి కూడలి వద్ద గల శివాలయం ఎదురుగా కాలువలో చెత్త వేస్తుండడంతో దుర్గంధంతో ఇబ్బందులు

పడుతున్నాం. ★ కాకర్ల వీధిలోని కాలువలో చెత్త తొలగించేలా చర్యలు చేపడతాం. - ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

? మండలంలోని ఎం.సీతారాంపురంలో కాలువల్లో మురుగు పేరుకుపోవడంతో దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. - స్థానికులు ★ కార్యదర్శితో మాట్లాడి కాలువల్లో మురుగు తొలగించే చర్యలు చేపడతాం. - రామారావు, పంచాయతీ విస్తరణాధికారి, – న్యూస్‌టుడే, వంగర

? మండలంలోని పాలవలసలో నీటి కుళాయిల వద్ద మూతలు లేకపోవడంతో నీరు వృథాగా పోతుంది. -స్థానికులు ★ మూతలు ఏర్పాటుచేస్తాం. –వెంకటరమణ, ఈవోపీఆర్డీ – న్యూస్‌టుడే, రామభద్రపురం

సందడిగా కొత్తవత్సర వేడుకలు

రాజాంలో ఎమ్మెల్యే మురళీమోహన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు

బొబ్బిలి, గ్రామీణం, రామభద్రపురం, తెర్లాం, బాడంగి, రాజాం, గ్రామీణం, సంతకవిటి: నూతన సంవత్సర వేడుకలు అంతటా ఘనంగా నిర్వహించుకున్నారు. పలు పార్టీల కార్యాలయాల్లో ఎమ్మెల్యేలకు శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ అధ్యక్షుడు సుజయ్‌కృష్ణరంగారావు, ఎమ్మెల్యే బేబినాయనలకు కోటలో పలువురు అభిమానులు, కార్యకర్తలు శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా రేలారే రేలారే వంటి సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటుచేశారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి అప్పలనాయుడుకు నాయకులు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి అప్పలస్వామికి శ్రేణులు పుష్పగుచ్ఛాలిచ్చారు. రోటరీ జిల్లా అధ్యక్షుడు జేసీ రాజు, బొబ్బిలి అధ్యక్షుడు వారణాశి హరి దివ్యాంగులతో వేడుకలు జరిపారు. రామభద్రపురం, తెర్లాంలో అధికారులు, నాయకులు వేడుకలు జరిపారు. ★ రాజాం, ఎచ్చెర్ల నియోజకవర్గాల నాయకులు, శ్రేణులు శ్యాంపురంలోని క్యాంపు కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు శుభాకాంక్షలు చెప్పారు. ★ గరివిడి: నూతన సంవత్సరంలో ప్రజల ఆశలు నెరవేరేలా పనిచేస్తామని, చీపురుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. గరివిడిలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. గద్దె బాబూరావు, కె.త్రిమూర్తులరాజు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా కార్యదర్శి రామ్ మల్లిక్‌నాయుడు పాల్గొన్నారు.

బొబ్బిలి కోటలో సాంస్కృతిక ప్రదర్శన

బొబ్బిలిలో మాజీ మంత్రి, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ అధ్యక్షుడు సుజయ్, ఎమ్మెల్యే బేబినాయనలకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

రాజాంలో ఎమ్మెల్యే కళా వెంకటరావుకు మొక్క ఇస్తున్న దృశ్యం

ఏళ్లుగా ఆరుబయటే ఆహారం!

మండలంలో 2015లో మంజూరు చేసిన పాఠశాలల్లోని వంటశాలల నిర్మాణాలు కొన్ని పూర్తికాలేదు. అప్పటి నుంచి నేటి వరకూ పునాదులు, గోడలు, పైకప్పు స్థాయిలోనే ఉన్నాయి. నిర్మాణాలు పూర్తి చేసేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. పలు చోట్ల విద్యార్థులు ఆరుబయటే భోజనాలు చేస్తూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనిపై పంచాయతీ రాజ్ శాఖ ఏఈ అప్పలనాయుడు వద్ద ప్రస్తావించగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. -న్యూస్‌టుడే, గజపతినగరం

అసంపూర్తి భవనం.. అవస్థలతో పయనం

మండలంలోని దత్తి, దత్తి వెంకటాపురం గ్రామాల్లో గత ఏడేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు అసంపూర్తి నిర్మాణాలతో నిలిచిపోయాయి. దీంతో పిల్లలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. దత్తి వెంకటాపురం, దత్తి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వీటిలోనూ పూర్తి సౌకర్యాలు లేక కార్యకర్తలు, పిల్లలు అవస్థలు పడాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై సంబంధిత అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు ఇందిరా భవానీ వద్ద ప్రస్తావించగా సమస్య గురించి ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. –న్యూస్‌టుడే, దత్తిరాజేరు

బీపీఎస్‌కు స్పందన అంతంతే!

న్యూస్‌టుడే, బొబ్బిలి

అక్రమ భవంతుల యాజమాన్యాలు.. నిబంధనల మేరకు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశానికి స్పందన అంతంతమాత్రంగానే ఉంది. నిబంధనలు పాటించని భవన నిర్మాణాలు, ప్లాన్లు లేకుండా ఉన్న కట్టడాలు సక్రమం చేసేందుకు ఇటీవల ప్రభుత్వం భవంతుల క్రమబద్ధీకరణ పథకం (బీపీఎస్) అమలు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికి రెండు నెలలు కావస్తున్నా.. దరఖాస్తులు తక్కువగానే వచ్చాయి.

బొబ్బిలిలో బహుళ అంతస్తుల భవనంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

500 నిర్మాణాలకు 22 దరఖాస్తులు

అవగాహన కార్యక్రమాలు

సచివాలయాల వారీ అనధికార కట్టడాలు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. అధికారులు పలు డివిజన్లు, బహుళ అంతస్తుల భవనాల్లో యజమానులతో సమావేశమై అవగాహన కల్పిస్తున్నారు. బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ ఉపయోగాలు వివరిస్తున్నారు. దరఖాస్తులు ఇవ్వకపోవడానికి కారణాలపై ఆరా తీస్తున్నారు. యాజమాన్యాలు మారడంతో తామెందుకు భరించాలంటూ కొందరు, ఇప్పటికే వాటిపై బ్యాంకు రుణాలు పొందిన వారు మరికొందరు వెనుకంజ వేస్తున్నారు.

ఎక్కడెక్కడంటే..

★ ఆసుపత్రి రహదారికి ఇరువైపులా చాలా మంది నిబంధనలకు విరుద్ధంగా పాత ఇళ్లను ఆధునికీకరించారు. పెద్ద భవనాలు వచ్చాయి. వారంతా బీపీఎస్ చేయించుకోవాల్సి ఉంది.

★ మార్కెట్‌లోని ఇరుకు రోడ్లలో ప్లాన్లు లేకుండా మూడేసి అంతస్తుల భవనాలు నిర్మించారు. ★ బొబ్బిలి- బలిజిపేట రోడ్డులో పలు దుకాణాలు వెలిశాయి. వాటినీ క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంది.

★ ఐటీఐ సమీపంలో పట్టణంలోని కొన్ని చోట్ల చేపట్టిన కల్యాణమండపాల నిర్మాణాలదీ ఇదే పరిస్థితి.

★ పట్టణ శివారులోని నివాస సముదాయాలు పరిశీలిస్తే ఇలాంటి పరిస్థితి కనిపిస్తుంది.

☛ బొబ్బిలి పురపాలికలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలు 500 వరకు ఉంటాయని ప్రాథమికంగా గుర్తించారు. ఆ మేరకు 200 మందికి నోటీసులిచ్చారు. వారంతా బీపీఎస్ చేసుకునేందుకు గుర్తింపు పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్ల(ఎల్‌టీపీ) ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ ధర మేరకు నగదు చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చు. ఇంతవరకు పుర కార్యాలయానికి ఆన్‌లైన్‌లో 22 దరఖాస్తులే వచ్చాయి. బీపీఎస్ నుంచి రూ.4 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా వేసినా సాధ్యం కాలేదు.

అవగాహన కల్పిస్తున్నాం..: బీపీఎస్‌పై భవన యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించిన వారికి నోటీసులు ఇస్తున్నాం. క్రమబద్ధీకరించుకోకుంటే కట్టడాలను తొలగిస్తాం. – ఫిలిప్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి, బొబ్బిలి

తుప్పలు తొలగి.. సమస్య తీరి

స్పందనకు వందనం

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని నీలావతి గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం వద్ద పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా ఉండేది. దీన్ని వినియోగించకపోవడంతో గ్రామంలో సేకరించిన చెత్త ఆరుబయట వేసేవారు. దీంతో అధ్వానంగా మారింది. నిర్వహణ సరిగా లేని పరిస్థితిపై 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించి బాగు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు.

మంచు ముంచేస్తోంది!



రెండు రోజులుగా కురుస్తున్న దట్టమైన మంచుతో బొబ్బిలి ప్రాంతంలో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు కనిపించడం లేదు. ఉదయం 8 గంటల వరకు సూర్యుడి వెలుగు రాని పరిస్థితి. దీంతో పెసర, మినప పంటలు తడిసి పాడవుతున్నాయని రైతులు వాపోతున్నారు. పూతరాలిపోయి పంట కాపు రాదంటున్నారు. మామిడి, జీడికి నష్టం వాటిల్లుతుందని రైతులు అంటున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించడం లేదని వాహన చోదకులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

వెలగని దీపాలతో అవస్థలు

రాజాం పట్టణంలో చీకట్లు కమ్ముకుంటున్నాయి. రూ.20 కోట్లతో రహదారుల విస్తరణ పనులు పూర్తయినా.. విభాగినిల్లో ఏర్పాటు చేయాల్సిన విద్యుత్తు స్తంభాల అమరిక పూర్తి కాలేదు. దీంతో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసేందుకు ఆటంకాలు తప్పడం లేదు. నిత్యం రద్దీగా ఉండే పాలకొండ, చీపురుపల్లి రోడ్లలో రోజూ కారుచీకట్లు అలముకుంటున్నాయి. వేలాది వాహనాలు, జనం రాత్రి వేళల్లో రాకపోకలకు అవస్థలు ఏర్పడుతున్నాయి. ప్రమాదాలకు కారణమవుతోంది. ఆర్అండ్‌బీ జేఈ నాగభూషణరావు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. స్తంభాలు, వీధిదీపాల పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. –న్యూస్‌టుడే, రాజాం

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా



రాజాం పట్టణ పరిధిలోని బుచ్చింపేట-కొండంపేట రోడ్డు గుంతలు, రాళ్లు తేలి అధ్వానంగా మారింది. పాదచారులు, వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలోనే ప్రభుత్వ కార్యాలయాలకు అమరాం, గడ్డిముడిదాం, దోసరి, రామినాయుడువలన గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ కల్వర్టు లేకపోవడంతో వర్షం నీరు, మురుగుతో కలిసి రోడ్డుపై చేరుతోంది. రోడ్డు నిర్మాణం విషయంపై కమిషనర్ రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

శుద్ధజలం అందేదెప్పుడో!

సంతకవిటి మండలం జీఎన్‌పురానికి శుద్ధజలం అందని ద్రాక్షగానే మిగిలింది. గ్రామానికి తాగునీరు అందించేందుకు 30 ఏళ్ల కిందట రక్షిత నీటిట్యాంకు, పైపులైన్ వేశారు. కొన్నేళ్లకు పైపులైన్ పాడవడంతో సరఫరా నిలిచింది. పంచాయతీ నిధులతో మూడేళ్ల కిందట బోరు తవ్వారు. పైపులైన్ వేసేందుకు పంచాయతీకి తలకు మించిన భారం కావడంతో విస్మరించింది. దీంతో గ్రామస్థులు నేల, బోరు బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. గ్రామానికి జల్‌జీవన్ పథకంలో రూ.44 లక్షలు మంజూరయ్యాయి. పనులకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన వెంటనే పైపులైన్ వేసి తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, సంతకవిటి

తరుగు వస్తోంది.. సమస్య వేధిస్తోంది

గజపతినగరం, న్యూస్‌టుడే: రేషన్ దుకాణాలకు బియ్యం తరుగులు వస్తున్నాయని మండలానికి చెందిన డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్‌సీఐ గిడ్డంగుల నుంచి లోడుతో వచ్చే లారీలు బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ గోదాముల్లో దించకుండా నేరుగా డీలర్ల దుకాణాలకు పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్లే కార్డుదారులకు బియ్యం తగ్గించి అందిస్తున్నామన్నారు. మండల నిల్వల కేంద్రం వద్ద తూకం వేసి డీలర్లకు అందించాలనే నిబంధన పూర్తిగా విస్మరిస్తున్నారన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. విషయాన్ని గోదాము నిర్వాహకుడు ఈశ్వరరావు వద్ద ప్రస్తావించగా పక్కనే ఉన్న ఎఫ్‌సీఐ గోదాము వద్ద లారీ కాటాపై తూకం వేస్తున్నందున అదే బియ్యాన్ని డీలర్లకు పంపిస్తున్నామని తెలిపారు.

ఎఫ్‌సీఐ గోదాము నుంచి వచ్చిన లారీ నుంచి డీలర్లకు వెళ్లే లారీలో బస్తాలు వేస్తున్న హమాలీలు

అంగడి.. ఆదాయానికి గండి

రాజాం పట్టణంలోని పాతబస్టాండ్‌లో నిర్మించిన పురపాలిక దుకాణాలు మూతపడడంతో ఏటా రూ.లక్షల్లో ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది. చెంతనే కొత్తగా కాంప్లెక్స్ నిర్మించి బస్టాండ్‌ను అక్కడికి తరలించడంతో ఈ ప్రాంతం జనం లేక వెలవెలబోతోంది. వ్యాపారాల్లేక ఒక్కొక్కరుగా ఖాళీ చేస్తున్నారు. 26 వరకు దుకాణాలు ఉండగా, ఆరేడుకు మించి అద్దెలు రావడం లేదు. గతంలో ఏటా రూ.18 లక్షల వరకు ఆదాయం సమకూరేది. ప్రభుత్వ నిధులూ లేకపోవడంతో పురపాలిక నిధుల్లేక ఇబ్బంది పడుతోంది. సమస్యను కమిషనర్ రామచంద్రరావు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. వినియోగంలోకి తెచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. –న్యూస్‌టుడే, రాజాం

మురుగు నిలిచి.. సమస్య తెచ్చి

రాజాం పట్టణం సారధి రోడ్డులో ఉన్న బధిరుల పాఠశాల వద్ద కాలువ మురుగు నిలిచి చెత్తా చెదారంతో నిండి ఉంది. ఇటువైపుగా రాకపోకలు సాగించే వారు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. దోమల బెడద ఎక్కువై అనారోగ్యాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు తొలగించాలని కోరుతున్నారు. సమస్యను కమిషనర్ రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

ఇంటింటికీ కుళాయి నీరు

బాడంగి, న్యూస్‌టుడే: జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఆకుల కట్ట గ్రామంలో ఇంటింటికీ కుళాయి నీరు అందించే పథకం గురువారం సర్పంచి సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమం ద్వారా గ్రామంలో తాగు నీటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

జనసేన పార్టీలో చేరిక

చీపురుపల్లి, గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి నియోజకవర్గం గుర్ల మండలం జమ్ముపేట గ్రామానికి చెందిన వార్డు సభ్యుడితో పాటు పలు కుటుంబాలు వైకాపాను వీడి జనసేన పార్టీలో కలిశారు. వీరికి గురువారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ బాధ్యుడు వి.శ్రీనివాసరావు కండువా వేసి ఆహ్వానించారు. పార్టీ సీనియర్ నాయకుడు రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తెదేపాలోకి పలు కుటుంబాలు

వంగర: మండలంలోని కొప్పరవలసకు చెందిన 20 కుటుంబాలు వైకాపా నుంచి తెదేపాలోకి చేరాయి. తెదేపా విజయనగరం జిల్లా పార్లమెంటు ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వాసుదేవరావునాయుడు సమక్షంలో చేరిన వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

పేదలకు రగ్గుల పంపిణీ

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలోని బస్టాండు, రైల్వేస్టేషన్ పరిసరాల్లో రాత్రి వేళల్లో చలిలో ఇబ్బంది పడుతూ నిద్రిస్తున్న అభాగ్యులకు రూ.9వేలు విలువైన 30 రగ్గులను మానవీయత స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు బీవీ గోవిందరాజులు బుధవారం పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు రామ్మూర్తినాయుడు, బొత్స గౌతం నాయుడు, ఆర్.రంగా తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్‌ఎం మృతికి సంతాపం

బొబ్బిలి: సంస్థానం ఉన్నత పాఠశాల పూర్వపు ప్రధానోపాధ్యాయుడు కొల్లి శివున్నాయుడు(87) బుధవారం రాత్రి మృతి చెందారు. కారాడకు చెందిన ఆయన పట్టణంలోని ఆళ్వారువీధిలో నివాసం ఉంటున్నారు. భార్య అన్నపూర్ణమ్మ, కుమారుడు శ్రీనివాస జగదీష్, కుమార్తెలు మంజుల, శిరీషలు ఉన్నారు. గణితం మాస్టారుగా ఆయన పేరుపొందారు. పాఠశాల అభివృద్ధికి సహకారం అందించారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

నేటి నుంచి పాస్ పుస్తకాల పంపిణీ

మెంటాడ, న్యూస్‌టుడే: మండలంలోని రీసర్వే పూర్తయిన 16 గ్రామాల్లో ఈ నెల 9వ తేదీ వరకూ ప్రభుత్వ రాజముద్రతో పాస్ పుస్తకాల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు అరుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 2న బడేవలస, 3న చల్లపేట, కొంపంగి, 5న ఇద్దనవలస, జక్కువ, మీసాలపేట, 6న రాబంద, గుర్రమ్మవలస, ఇప్పలవలస, 7న బుచ్చిరాజుపేట, అమరాయవలస, వాణిజ, 8న ఉద్దంగి, కైలాం, 9న చింతలవలస, వంకసోమిద గ్రామాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

గణిత పరీక్షలో ప్రతిభ

బొబ్బిలి గ్రామీణం: డిసెంబరు 22న జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా విజయనగరం గణిత ఫోరం నిర్వహించిన గణిత ప్రతిభ పరీక్షలో మండలంలోని పెంట ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని మరడ కుసుమ ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు బుధవారం విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో డీఈవో మాణిక్యంనాయుడు అభినందించి జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని ఆమెకు అందించారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని లక్కిడాం గ్రామంలో శ్రీ కనకమహాలక్ష్మి తీర్థమహోత్సవం సందర్భంగా గ్రామ యువత నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను మాజీ జడ్పీటీసీ కొరుపోలు రమేష్‌కుమార్ గురువారం ప్రారంభించారు. 15వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయన్నారు. నాయకులు ఎల్.కృష్ణ, అప్పలనాయుడు, యూత్‌కమిటీ పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభించిన రమేష్‌కుమార్

విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: సావిత్రిబాయిపులే జయంతి సందర్భంగా చీపురుపల్లిలోని జడ్పీ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు సావిత్రిబాయి పులే ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి శివాజీ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు గురువారం జరిగాయి. విజేతలకు ఈనెల 3న బహుమతులు అందిస్తామన్నారు. ఎంఈవో ఎం.బూసినాయుడు, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణారావు, హెచ్‌ఎంలు డి.ఉమామహేశ్వరి, రెహానాబేగం పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బొబ్బిలి, న్యూస్‌టుడే: కర్రపని, రాడ్ బెండింగ్ పనివార్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం గురువారం ఎన్నికైంది. గొల్లవీధి కూడలిలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా అలజంగి వీరాచారి, ఉపాధ్యక్షుడిగా గౌరీశంకరరావు, ప్రధాన కార్యదర్శిగా సతీష్, కోశాధికారిగా శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా ఎం.చెన్నకేశవరావుల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు నిర్వాహకులు తెలిపారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

తెర్లాం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నది యూటీఎఫ్ అని ఆ సంఘం అధ్యక్షుడు జి.మునిస్వామి అన్నారు. గురువారం మండలపరిషత్తు కార్యాలయం ఆవరణలో యూటీఎఫ్ క్యాలెండర్లను ఎంపీడీవో రేగి రాంబాబు, ఎంఈవో త్రినాథరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు పలువురు మాట్లాడారు. సంఘం బలోపేతానికి అందరూ కృషి చేయాలని సంఘ సభ్యులు కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి జి.శంకరరావు, నాయకులు సురేష్, ఉమామహేశ్వరరావు, రమణ పాల్గొన్నారు.

గ్రామాల్లో మేలుకొలుపు

బొబ్బిలి గ్రామీణం, రామభద్రపురం, న్యూస్‌టుడే: ధనుర్మాసం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు మేలుకొలుపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చింతాడ, శివడవలస, కమ్మవలస గ్రామాల్లోని వీధుల్లో భజన గీతాలు ఆలపిస్తున్నారు. రామభద్రపురంలో చిన్నమ్మ తల్లి గ్రామదేవత గుడి, సాయిబాబా, అయ్యప్ప, వెంకటేశ్వరస్వామి, శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

చింతాడలో మేలుకొలుపులో పాల్గొన్న భక్తులు

(c) eenadu

విజయనగరం

•విజయనగరం •నెల్లిమర్ల • ఎస్.కోట

పోటీలకు పయనం

పశ్చిమగోదావరి జిల్లాలో శుక్రవారం నుంచి ఈనెల 4 వరకు రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఇందులో పాల్గొనే జిల్లా జట్టు గురువారం పయనమైంది. వారిని జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు రంగారావుదొర అభినందించారు. విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. – న్యూస్‌టుడే, విజయనగరం బాబామెట్ట

రామాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కంటోన్మెంట్: అయోధ్య రామమందిరం నమూనాలో విజయనగరంలో నిర్మిస్తున్న బాలాజీ రామమందిర నిర్మాణానికి వాసవీ ఛారిటీ మిత్రుల గ్రూప్, వాసవీ క్లబ్ సభ్యులు గురువారం రూ.1,11,111 అందజేశారు. ఆలయ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బారావు, ఛారిటీ గ్రూపు అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్, క్లబ్ జిల్లా గవర్నర్ తమ్మిన కల్యాణ్‌రాజు, డిమ్మ రాజు, సముద్రాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మీకు తోడుగా

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	8008574326
భోగాపురం	70959 54646

(10 AM TO 1 PM)

? జీఎస్‌టీయూ కూడలి నుంచి కొండకరకం వెళ్లే రోడ్డులో వీధి దీపాలు వేయాలి. - **స్థానికులు** ★ పరిశీలించి, ఏర్పాటు చేస్తాం. - **శ్రీనివాసరావు, ఈఈ,పీఆర్‌ఐ** – న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

?: కామాక్షినగర్ పైడిమాంబ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. - **అప్పారావు, స్థానికుడు** ★ సిబ్బందిని పంపించి, బాగు చేయిస్తాం. - **ప్రసంగి, ఏఈ, నగర పాలక సంస్థ** – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

వెండితెర ఈనాడు

★ ఎస్విఎన్: **నువ్వు నాకు నచ్చావ్** ★ శ్రీకృష్ణ: **ఈషా** ★ ఆదిత్య: **దండోరా, వనవీర** ★ లీలామహల్: **మార్క్** ★ రంజని స్క్రీన్-1: **మార్క్, సైక్ సిద్ధార్థ** ★ కోరమాండల్ స్క్రీన్-2: **ఈషా, అఖండ 2, సైక్ సిద్ధార్థ, శంబాల** ★ హిమగిరి: **శంబాల** ★ సప్తగిరి: **సైక్ సిద్ధార్థ, అఖండ 2** – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

సమస్యలు పరిష్కరించి రైతుకు అండగా ఉంటాం

మండలంలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు దృష్టిసారిస్తామని మండల వ్యవసాయాధికారిణి పి.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. నెల్లిమర్ల వ్యవసాయ కార్యాలయంలో 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్‌లో పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, నెల్లిమర్ల

మండల వ్యవసాయ అధికారిణి శ్రీలక్ష్మి

ప్రశ్న: జరజాపుపేటలో యూరియా అందుబాటులో లేదు. దూరంగా ఉన్న సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. మొక్కజొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలి. - **వై.సురేష్‌కుమార్, జరజాపుపేట, సీహెచ్.రామకృష్ణ**

సమాధానం: జరజాపుపేట రైతులకు మొయిద సచివాలయం నుంచి యూరియా సరఫరా చేస్తున్నాం. మొక్కజొన్న కొనుగోలుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. 120 టన్నుల యూరియా విడిపించడంకు దరఖాస్తు చేశాం.

? రబీ సీజన్‌లో మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు, ఆకులపై బూడిద తెగుళ్లు, వరికి కాండం తొలిచే పురుగు ఆశిస్తున్నాయి. నివారణ ఎలా. - **రాంబాబు, రామారావు (సీతారామునిపేట), జి.పాపారావు (బూరడపేట), సూర్యనారాయణ (గొర్లెపేట)**

★ మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఎకరాకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి మువ్వులో పిచికారీ చేయాలి. ఆకులపై బూడిద తెగుళ్లకు కార్బెండజిమ్ 250 గ్రాములు, మెంకోజెబ్ 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి వాడాలి. వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు 200లీ. నీటిలో కలిపి వేయాలి.

? చాలామందికి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలకు సంబంధించిన నగదు జమ కాలేదు. - **కె.అప్పలరాము, మల్యాడ**

★ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. 2019 ఫిబ్రవరి ముందు నమోదైన వారికి మాత్రమే పీఎం కిసాన్ వస్తుంది. అన్నదాత సుఖీభవ పథకానికి ఈకేవైసీ, ఆధార్ లింక తప్పనిసరి. గ్రీవెన్స్ మాడ్యూల్ ఇచ్చిన వెంటనే ఆర్ఎస్‌కేలో నమోదు చేసుకోవాలి.

? రాయితీపై వ్యవసాయ, యాంత్రీకరణ పరికరాలు అందుబాటులో ఉన్నాయా. - **లక్ష్మణనాయుడు, సతివాడ** ★ రాయితీపై పరికరాలు అందించేందుకు సర్వే చేస్తున్నాం. అవసరమైనవారు రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేసుకోవాలి.

? మొక్కజొన్న చేను ఎదుగుదల, దిగుబడికి ఏయే జాగ్రత్తలు పాటించాలి. - **సూరిబాబు, సతివాడ**

★ యాజమాన్య పద్ధతిలో ఎరువులు వాడాలి. ఎకరాకు యూరియా 200 కిలోలు, డీఏపీ 50 కిలోలు, పొటాష్ 50 కిలోలు వేసుకోవాలి.

? యూరియా లేనప్పుడు ఏం చేయాలి. - **ఎం.నాయుడు, జరజాపుపేట**

★ నానో యూరియా వాడాలి. ఎకరా మొక్కజొన్నకు 150 నుంచి 200 లీటర్ల నీటిలో, వరికి అర లీటరు 200 లీటర్ల నీటిలో కలిపి వాడాలి.

? ఈ పంట నమోదుకు గడువు పూర్తి ఎప్పుడు. - **ధర్మారావు, మల్యాడ**

★ ఫిబ్రవరి 25లోపు నమోదు చేసుకోవాలి. లేకుంటే ఎరువులు, పరిహారం, బీమా నగదు వర్తించవు.

వెంకన్నకు పుష్పాలంకరణ

విజయనగరంలోని తిరిదే కల్యాణ మండపంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి గురువారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు ఆలయ ప్రధాన అర్చకుడు పి.వి. నర్సింహాచార్యులు వేద మంత్రాల నడుమ అభిషేకాలు, అర్చనలు జరిపారు. – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

నీలమేఘశ్యామా.. గోవిందా

ధనుర్మాసం, ఆంగ్ల సంవత్సరాది కావడంతో గురువారం భీమసింగి సహకార చక్కెర కర్మాగార పరిధిలోని కుమారం కల్యాణ వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. – న్యూస్‌టుడే, జామి

సాయినాథునికి పూజలు

నూతన సంవత్సరం సందర్భంగా విజయనగరం రామనారాయణంలో కొలువుదీరిన సీతారాములు, వైకుంఠనారాయణుడు, విష్ణుస్వరూపుడికి భక్తులు పూజలు నిర్వహించారు. గోపాలకృష్ణ స్వామికి పాలాభిషేకం జరిపించి. ధర్మపురి రోడ్డులో సాయిబాబా మందిరంలో గురూజీ సాయిసుందరం హారతి ఆధ్వర్యంలో సాయినాథుడు, దత్తాత్రేయస్వామి, శ్రీపాదవల్లభునికి పూజలు జరిగాయి. – న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

గట్టు దెబ్బతింది.. సరిచేయరూ!

ఎల్.కోటలోని సర్వే నంబరు 361/2లో ఉన్న దేవుని బంద గట్టు వర్షాలకు కొట్టుకు పోయింది. దీంతో సాగు నీరు నిరంతరం పంట పొలాల్లోకి వచ్చేస్తోంది. కోతల సమయంలోనూ పొలాల్లో నీరు ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పైన ఉన్న నారాయణ బంద నిండి నీరు ఇటు వచ్చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోయారు. పలుమార్లు శ్రమదానంతో బాగు చేసుకున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి గట్టు పూడ్చి మదుము ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై జలవనరుల శాఖ డీఈఈ శ్రీచరణ్‌ను వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, లక్కవరపుకోట

ప్రహరీ లేక.. రక్షణ కానరాక

ఎల్.కోట మండలంలోని ఖాసాపేట ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పశువులు, పందులు, కుక్కలు లోపలికి ప్రవేశించి ఆవరణం అధ్వానంగా మారుతున్నాయి. దీనికితోడు పరిసరాలు మొక్కలు పెరిగిపోయి, వెనక పొలాలు ఉండడంతో విష కీటకాలు, పాములు వస్తున్నాయని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆవరణలోకి పాము రావడంతో భయాందోళనకు గురయ్యాం. బడి ముందు భాగంలో కొంత నిర్మించి వదిలేశారు. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం వరహాలు శెట్టి కోరారు. – న్యూస్‌టుడే, లక్కవరపుకోట

తుప్పుపట్టి బోరుమంటోంది..!

ఎల్.కోట మండలం గంగుబూడి గ్రామంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో బోరు పాడైంది. గతంలో విద్యార్థులకు తాగునీరు అందించేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. కొంతకాలంగా వినియోగించక ఇలా తయారైంది. పూర్తిగా తుప్పు పట్టింది. విద్యార్థులు ఆడుకుంటున్నప్పుడు అటు వెళ్తే అది కూలి ఎవరి మీదైనా పడుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎవరూ పట్టించుకోవడం లేదు. వెంటనే తొలగించాలని కోరుతున్నారు. ప్రధానోపాధ్యాయురాలు శారదాదేవిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తొలగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, లక్కవరపుకోట

చెత్త తరలదు.. సమస్య వీడదు

లక్కవరపుకోట మండలంలోని గంగుబూడి గ్రామంలో సీసీ రోడ్డుకు ఇరువైపులా చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. గ్రామంలో సేకరిస్తున్న చెత్త, ఇతర వ్యర్థాలను వేయడంతో ఈ దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. దోమల బెడద ఎక్కువై, దుర్వాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలగించాలని కోరుతున్నారు. సమస్యను డిప్యూటీ ఎంపీడీవో కుమార్ వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, లక్కవరపుకోట

రహదారి ఇలా.. ప్రయాణమెలా..?

సోంపురం -జాకేరు ప్రధాన రహదారికి ఇరువైపులా పనికిరాని మొక్కలు దట్టంగా పెరిగిపోయాయి. దీంతో వాహనదారులు, గ్రామస్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జాకేరు, కరకవలస, చామలాపల్లి, వెంకయ్యపాలెం, పోతుబందిపాలెం, మారిక, దబ్బిరాజుపేట, వల్లంపూడి వరకు నిత్యం బస్సులు, ఆటోలు తిరుగుతుంటాయి. ప్రజలు జాకేరు నుంచి వేపాడ మండల కేంద్రానికి వెళ్లడానికి కూడా ఇదే ప్రధాన రహదారి. ఈ నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుకు ఇరువైపులా తుప్పలు తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, వేపాడ

అందరికీ శుభాలు కలగాలి

కమిషనర్ నల్లనయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏసీపీ రమణమూర్తి, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బంది

నూతన సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని ఎస్పీ దామోదర్ ఆకాంక్షించారు. గురువారం నగరంలోని పోలీసు కార్యాలయంలో కేకు కోశారు. ఏఎస్పీ పి.సౌమ్యలత తదితరులు పాల్గొన్నారు. ★ అయోధ్య మైదానంలో ఎంఆర్.యునైటెడ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, అశోక్ బంగ్లాలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జడ్పీ కార్యాలయంలో ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, నగరపాలికలో కమిషనర్ నల్లనయ్య, వైకాపా కార్యాలయంలో మేయర్ విజయలక్ష్మికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఎల్.కోటలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆమె భర్త తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్‌కు, డ్వామా పీడీ శారదా దేవికి శుభాకాంక్షలు చెప్పారు. డెంకాడ చింతలవలస అయిదో బెటాలియన్‌లో కమాండెంట్ వై.రవిశంకర్‌రెడ్డి, అదనపు కమాండెంట్ సి.రాజారెడ్డి, సహాయ కమాండెంట్లు జీవీ ప్రభాకరరావు, ఎస్.బాపూజీ, జి.లక్ష్మీనారాయణ, డీవీ రమణమూర్తి, యూనిట్ అధికారులు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. భోగాపురంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజుకు, జిల్లా పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకులు రవిశేఖర్ దంపతులు, మండలాధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌కు, వేపాడలో జడ్పీటీసీ సభ్యుడు అప్పలనాయుడు, ఎంపీపీ సత్యవంతుడు, ఈశ్వరరావు, కొత్తవలసలో జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయ చందర్‌కు, ఏజీపీ ఎం.వి.ఎస్.గిరిబాబు, పోలీసు, ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులు, ములగపాకవానిపాలెంలో రాష్ట్ర దాసరి కార్పొరేషన్ ఛైర్మన్ పి.వి.రత్నాజీకి, వియ్యంపేటలో ఎంపీపీ ఎన్.గోపమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు ఎన్.శ్రీదేవి నాయుడుబాబును, రామలింగపురంలో పీఏసీఎస్ ఛైర్మన్ కోళ్ల వెంకటరమణకు, బొడ్డవరలో ఎమ్మెల్సీ ఐ.రఘురాజుకు, ఎస్.కోటలో డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణకు అధికారులు, ఉద్యోగులు, పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. – న్యూస్‌టుడే, బృందం

ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో అవనాపు విజయ్ తదితరులు

ఎమ్మెల్యే లలితకుమారి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ దామోదర్ తదితరులు

బంగార్రాజుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రవిశేఖర్, ఆనంద్‌కుమార్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న గ్రామీణ సీఐ లక్ష్మణరావు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని విజయనగరం గ్రామీణ సీఐ బి.లక్ష్మణరావు హెచ్చరించారు. గురువారం గొల్లలపేటలో సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త సంవత్సరం, సంక్రాంతి నేపథ్యంలో ఎక్కడైనా జూదం ఆడితే అరెస్టు చేస్తామన్నారు. గొడవలకు దిగొద్దని, సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

నీరు పారదు.. రైతు బతుకు మారదు

జామి, న్యూస్‌టుడే

జిల్లాలో ప్రధాన జలవనరు జి.బి.అప్పారావు తాటిపూడి జలాశయ పరిధిలో సాగునీటి కాలువల డివిజనల్ డ్యామ్‌లు నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. దీంతో చివరి ఆయకట్టుకు నీరు సక్రమంగా అందని పరిస్థితి. దీని నుంచి 15,366 ఎకరాలకు అందుతుండగా, జామి మండలంలో 5,423 ఎకరాలు, గంట్యాడ మండలం 7 వేలు, ఎస్.కోటలో 2943 ఎకరాలకు ఉపయోగం. రానున్నది వేసవి కావడంతో భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

తుప్పలతో అధ్వానంగా జామి పల్లపు కాలువ

అధ్వానంగా తాటిపూడి కాలువలు

పాడైన షట్టర్లు..

షట్టర్లు పాడై గోడలు బీటలు వారాయి. కాలువలు తుప్పలు, డొంకలు, పనికిరాని మొక్కలతో నిండిపోయాయి. గత అయిదేళ్లుగా ఇవి మరమ్మతులకు నోచుకోక రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. జామి పల్లపు కాలువ 9 కి.మీ. డివిజనల్ డ్యామ్ పనికిరాని మొక్కలతో ఉంది. షట్టర్లు సైతం లేవు. ఆర్.వి.కె. ఛానల్ పురాతనమైనది కావడంతో గోడలు పాడయ్యాయి. 2019లో జైకా నిధులతో సిమెంట్ లైనింగ్ వేసినా, అప్పన్నపాలెం వరకు మాత్రమే నిర్మించారు. మిగతా ప్రాంతానికి నీరు పారడం లేదు. అధికారులు స్పందించి కాలువ బాగుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు

జామి మండలంలోని తాటిపూడి జలాశయ కాలువల దుస్థితి ఉన్నతాధికారులకు విన్నవించాం. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులొస్తే బాగు చేస్తాం.

– సంతోష్‌కుమార్, ఏఈ

జామి మండలంలో ఇదీ పరిస్థితి..

కాలువ	పొడవు(కి.మీ)	సాగునీరందే గ్రామాలు
వి.టి.ఛానల్	5.23	విజినిగిరి, తాండ్రంగి
టి.వి. లింక్ అండ్ ఛానల్	7	తాండ్రంగి, విజినిగిరి
పల్లపు కాలువ	9	జామి, అప్పన్నపాలెం, సోమయాజులపాలెం
అర్.వి.కె.ఛానల్	6	జన్నివలస, వెన్నె, వి.ఆర్.పాలెం

చిన్నారులకు దుస్తులు అందజేత

వేపాడ, న్యూస్‌టుడే: వల్లంపూడి భవిత కేంద్రంలోని దివ్యాంగులకు విశాఖపట్నం పరిధిలోని మురళీనగర్‌కు చెందిన పి.అలేఖ్య రూ. 30 వేలు విలువైన దుస్తులను గురువారం పంపిణీ చేశారు. తన భర్త పి.దుర్గాప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించామన్నారు. సీఆర్‌పీ రాంప్రసాద్, ఉపాధ్యాయులు ఎన్.సత్యవతి, సీహెచ్.జయంతి పాల్గొన్నారు.

నేటి నుంచి పాసుపుస్తకాల పంపిణీ.. కొత్తవలస: మండలంలో రీ సర్వే పూర్తయిన 18 రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం నుంచి పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేపడుతున్నట్లు తహసీల్దారు బి.సునీత తెలిపారు. 2న కొత్తవలస-3, బలిఘట్టం సచివాలయాల్లో, 3న చినరావుపల్లి, కాటకాపల్లి, 5న సంతపాలెం, 6న గనిశెట్టిపాలెం, ముసిరాం, 7న వీరభద్రపురం, దేవాడ, 8న దత్తి రామాలయం, నిమ్మలపాలెం, 9న కాటకాపల్లి, రామలింపురంల్లో పంపిణీ చేస్తామన్నారు.

న్యాయం చేయాలి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: భోగాపురం మండలం ముంజేరు గ్రామ దళితులు సీఐ, డిప్యూటీ ఎంపీడీవో, ఎంపీడీవో, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని 27 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని దళిత ఉద్యమ నేత ఆతవ ఉదయ్‌భాస్కర్ అన్నారు. శృంగవరపుకోటలో గురువారం అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం సభ్యులతో కలిసి మాట్లాడారు. దాడి చేసిన వారిని శిక్షించాలని కోరారు. నాయకులు పి.సూరిదేముడు, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: మండలంలో కుమిలి గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం నిర్వహిస్తున్న కోడిపందేలపై పోలీసులు దాడి చేశారు. నిర్వాహకులు ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశామని, వారి నుంచి 12 ద్విచక్రవాహనాలు, అయిదు చరవాణులు, రూ.13,470 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

అధ్యక్షుడిగా నియామకం

కంటోన్మెంట్: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బుసరి గౌరీశంకర్ నియమితులయ్యారు. గురువారం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం సాయంత్రం 3 గంటలకు మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరగనుంది. ఈమేరకు 22 అంశాలతో కూడిన అజెండాను రూపొందించినట్లు కార్యదర్శి కె.అప్పలరాజు తెలిపారు.

పేదలకు రగ్గుల పంపిణీ

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలో ధర్మవరం గ్రామంలో అప్సర్ రూమ్ చర్చి పాస్టర్ ఎం.విజయకుమార్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా గురువారం రూ.20వేల విలువైన 100 రగ్గులను పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు ప్రేమ్‌కుమార్, రవికుమార్, ఎర్రిబాబు తదితరులు పాల్గొన్నారు.

దైనందిని ఆవిష్కరణ

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన సంవత్సర కాలమానిని, దైనందినిని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు టి.గోవింద, కార్యదర్శి సూర్యనారాయణ, జిల్లా రెవెన్యూ అధికారి మురళీ, కలెక్టరేట్ పరిపాలనాధికారి దేవ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

డెంకాడలో..

నెల్లిమర్ల(డెంకాడ), న్యూస్‌టుడే: డెంకాడ ఏఈవో కార్యాలయంలో యూటీఎఫ్ ఉపాధ్యాయుల సంఘం కాలమానిని డిప్యూటీ డీఈవో కెవీ.రమణ, ఎంఈవో-2 రాచర్ల చిన్నికృష్ణ గురువారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు మరింత కృషి చేస్తామన్నారు. యూటీఎఫ్ మండల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డీఈవో రమణ, ఎంఈవో-2 చిన్నికృష్ణ తదితరులు

అభివృద్ధి పరుగు.. సౌకర్యాలు మెరుగు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే

నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. ప్రస్తుత ప్రభుత్వంలో నిధులు మంజూరు కావడం, సకాలంలో బిల్లులు చెల్లిస్తుండడంతో రోడ్లు, కాలువలు, ఉద్యానవనాలు, కొత్త పైపులైన్లు, వీధి దీపాలు, ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు తదితరాలు చేపడుతున్నారు.

రూ.34.79 కోట్లతో..

నగరపాలక సంస్థ పరిధిలో రూ.34.80 కోట్లతో 288 వరకు అభివృద్ధి పనులకు ప్రతిపాదించారు. రూ.8.82 కోట్లతో 90 పూర్తి చేశారు. 83 ప్రగతిలో ఉండగా, 77 ప్రారంభించాల్సి ఉంది. రూ.5.49 కోట్ల విలువైన 38 పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా..

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు రూ.1.54 కోట్లతో 10 చోట్ల సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదన చేశారు. రాక్‌గార్డెన్, గాంధీ పార్కులో పూర్తయ్యాయి. విజ్జీ మైదానంలో నాలుగు, జగన్నాథపురం, ప్రకాశం పార్కు, నెహ్రూ పార్కు, ఐడీఎస్‌ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో పనులు జరుగుతున్నాయి. ★ రూ.55 లక్షలతో కొత్త లైట్లు, ఎంఎస్ పోల్స్, మినీ హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేయనున్నారు. రూ.1.50 కోట్లతో 14 చోట్ల ట్రాఫిక్ సిగ్నళ్లు ఎస్‌బీటీ నెట్ వర్క్స్ ద్వారా ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే రూ.15 లక్షలు సంస్థకు చెల్లించారు. ★ వారిష్ అపార్టుమెంట్, కామాక్షినగర్ పైడిమాంబ కాలనీ, జమ్ము, వసంతవిహార్‌లో సాధారణ నిధులు రూ.50 లక్షలతో పైపులైన్లు, పవర్ బోర్లు వేశారు. నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని కమిషనర్ పి.నల్లనయ్య చెప్పారు.

బాలాజీ కూడలి వద్ద నిర్మిస్తున్న అంబేడ్కర్ సామాజిక భవనం

(c) eenadu

ఈనాడు
పశ్చిమగోదావరి

శుక్రవారం జనవరి 2, 2026

కలెక్టర్ నాగరాణికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

ఉప సభాపతి రఘురామకృష్ణరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

శుభాలు కలగాలని ఆకాంక్ష

భీమవరం కలెక్టరేట్, వన్‌టౌన్, కాళ్ల, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో జిల్లా ప్రజల్లో సంతోషాలు వెల్లివిరియాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకాంక్షించారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ● పెదఅమిరంలో ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజుకు అధికారులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి కొత్తేడాది శుభాకాంక్షలు తెలిపారు. మిఠాయిలు, పుష్పగుచ్ఛాలు కంటే పుస్తకాలే అధికంగా అందించారు.

లెక్క తేల్చారు.. అంతే!
కొలిక్కిరాని యానిమేటర్ల స్వాహా వ్యవహారం

ఆకివీడు, న్యూస్‌టుడే: జిల్లాలో సంచలనంగా మారిన ఆకివీడు డ్వాక్రా మహిళలను బురిడీ కొట్టించిన ఇద్దరు యానిమేటర్ల వ్యవహారం ఇంకా ఒక కొలిక్కి రాలేదు. రూ.కోట్లు స్వాహా చేశారని లెక్క తేల్చారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదని మహిళలు అంటున్నారు.

ఆకివీడులో డ్వాక్రా సంఘాల మహిళల బ్యాంకు ఖాతాల్లో నుంచి వారికి తెలియకుండానే ఇద్దరు యానిమేటర్లు రూ.కోట్లలో స్వాహా చేసిన ఘటన గత ఏడాది డిసెంబరు 8న వెలుగు చూసింది. బ్యాంకు అధికారులు 18వ తేదీ సాయంత్రానికి 32 సంఘాల సభ్యులకు సంబంధించి రూ.కోట్ల మేర నిధులు పక్కదారి పట్టినట్లు లెక్క తేల్చారు. ఇందులో ఒక యానిమేటర్ పరిధిలో 19 సంఘాల మహిళలకు చెందిన రూ.1.39 కోట్లు, మరో యానిమేటర్ తన పరిధిలోని 13 సంఘాలకు సంబంధించి రూ.96 లక్షలు స్వాహా చేసినట్లు నిర్ధారించారు. అవకతవకలు లెక్క తేల్చామని బ్యాంకు, మెప్మా అధికారులు సంయుక్తంగా ఎస్సై నాగరాజుకు వివరించారు. అయితే మోసపోయిన డ్వాక్రా మహిళల నుంచి వివరాలు నమోదు చేసిన అనంతరం ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు. ఇప్పటికీ నమోదు ప్రక్రియ పూర్తి కాలేదు. కేసు నమోదు కాలేదు.

కొత్త సంవత్సరంలోనైనా ఈ వ్యవహారం కొలిక్కి తీసుకొచ్చి న్యాయం చేయాలని మహిళలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయాన్ని ఆకివీడు మెప్మా అధికారి జయకృష్ణను వివరణ కోరగా వేగవంతంగా నివేదిక సిద్ధం చేసి ఎస్సైకు అందిస్తామని చెప్పారు.

అక్షరమే ఆభరణం
మహిళల ఉన్నతికి మహాయజ్ఞం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మహిళలు చదువుకుంటే కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుంది. అక్షర కుసుమాలు పూస్తాయి. అందుకే కూటమి ప్రభుత్వం 'అక్షరాంధ్ర' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. జిల్లాలో ఈ మహత్తర యజ్ఞాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి పర్యవేక్షిస్తున్నారు.

పాఠాలు చదువుకుంటున్న మహిళలు

అక్షరాలు రాయడం, చదవడం, అంకెలపై పట్టు, డిజిటల్ నగదు లావాదేవీలపై అవగాహన ఉంటే మహిళలు మోసాలకు గురికారని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం 'ఉల్లాస్'. దీన్ని గ్రామీణ ప్రాంతాల నుంచి అన్ని చోట్లా విజయవంతం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం 'అక్షరాంధ్ర' కొనసాగిస్తోంది. అంతర్జాతీయ అక్షరాస్యత రోజైన సెప్టెంబరు 8న ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

డ్వామా, డ్వాక్రా, మెప్మా తదితర విభాగాల్లో అక్షరాలు నేర్చుకోవాల్సిన మహిళలను గుర్తించారు. వారిలో కొందరికి తొలివిడతగా పాఠాలు బోధిస్తున్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం అమలు తీరును ఎన్‌సీఈఆర్టీ బృందం ఇటీవల పరిశీలించింది. కోర్సులు పూర్తి చేశాక ఫిబ్రవరిలో పరీక్షలు నిర్వహిస్తారు. ఉత్తీర్ణులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు.

రోజూ ఓ గంట.. బోధన, పుస్తక పఠనానికి ఆయా సంఘాల్లో చదువుకున్న వారినే వాలంటీర్లుగా ఎంపిక చేశారు. వీరు అక్షరాలు రాయడం, పదాలు పలకడం వంటివి నేర్పుతారు. రోజూ ఓ గంట పాటు ఆయా ప్రాంతాల్లో అనువైన చోట చెబుతారు. మొత్తం మీద 100 గంటల కార్యక్రమం ఇది. అన్ని ప్రాంతాలకు పుస్తకాలు పంపించామని వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి కె.వి.వి సత్యనారాయణ తెలిపారు.

పశ్చిమ గోదావరి జిల్లాలో ఎంపికైన వారు

డీఆర్‌డీఏ	40,892
డ్వామా	22,000
మెప్మా	6,500
బోధించే వాలంటీర్లు	6932

ఉగాది నాటికి 11,846 ఇళ్ల నిర్మాణాలు పూర్తి

భీమవరం కలెక్టరేట్, వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆప్షన్ 3 ఇళ్ల నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ఆప్షన్ 3 ఇళ్ల నిర్మాణాలపై గుత్తేదారులు, పీఎంఏవై 1.0 గృహాల ప్రగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల్లో అలసత్వం వహించిన అజాయ్ వెంచర్స్ గుత్తేదారునిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆప్షన్ 3లో జిల్లా వ్యాప్తంగా 6,271 నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా 1,191 మాత్రమే అయ్యాయని, మిగిలినవి వేగంగా పూర్తి చేయాలన్నారు. పీఎంఏవై 1.0లో జిల్లా వ్యాప్తంగా 56,210 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకూ 36,052 నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించినట్లు చెప్పారు. ఉగాది నాటికి 11,846 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, గుత్తేదారులు, డీఈలు పాల్గొన్నారు.

అమ్మా.. ఆశీర్వదించమ్మా!

మావుళ్లమ్మ దర్శనానికి క్యూలో బారులు తీరిన భక్తులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మను వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులొచ్చి దర్శించుకున్నారు. ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ అమ్మవారికి ప్రత్యేకాలంకరణ, కుంకుమ పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు అమ్మవారిని దర్శించుకున్నారు.

మత్స్యనారాయణ నమో నమః

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామివారి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని గురువారం మత్స్యనారాయునిగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రూ.20కే కిలో గోధుమ పిండి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా రేషన్ దుకాణాల ద్వారా రూ.20కే కిలో గోధుమ పిండి పంపిణీని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, కలెక్టర్ చదలవాడ నాగరాణి, జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. భీమవరంలోని కేంద్ర మంత్రి క్యాంపు కార్యాలయ ఆవరణలో గురువారం లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని 49 రేషన్ దుకాణాల పరిధిలో 33,363 కార్డుదారులకు ఈ నెల బియ్యంతో పాటు నాణ్యమైన గోధుమ పిండిని ఇస్తామని కలెక్టర్ తెలిపారు.

ప్యాకెట్ అందజేస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

వైద్యానికి చికిత్స అవసరం
ఆసుపత్రుల్లో సేవలు పెరగాలి
ఐవీఆర్ఎస్ సర్వేలో అభిప్రాయం

ఈనాడు-ఏలూరు: ప్రభుత్వ ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్యసేవలు ఎలా అందుతున్నాయి? వైద్యులు, మందులు, పారిశుద్ధ్యం, సేవలు అందించడానికి సిబ్బంది ఎవరైనా డబ్బులు ఆశిస్తున్నారా అని కూటమి ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే చేయించింది. ప్రజలకు ఫోన్ చేసి వారి అభిప్రాయాలు తెలుసుకుంది. ఈ సర్వే 2024 డిసెంబరు నుంచి 2025 డిసెంబరు 19 వరకు నిర్వహించారు.

రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో మూడు నుంచి ఐదారు నియోజకవర్గాల్లో సర్వే చేశారు. అక్కడ ఆరోగ్య కేంద్రాల్లో నెల వారీ సర్వేతో పాటు ఆరు మాసాలు, ఏడాదిలో అందుతున్న సేవలపై సంతృప్తిగా ఉన్నారా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని నాలుగు ప్రశ్నలు సంధించి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. ఈ సర్వే వివరాలను గత నెలలో జరిగిన కలెక్టర్ల సమీక్షలో ప్రభుత్వం వెల్లడించింది. ఆసుపత్రుల్లో సేవలపై ఇంకా సంతృప్తి స్థాయి పెరగాలని.. అందుకు వైద్యశాలలను బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి దిశా, నిర్దేశం చేశారు.

రెండు జిల్లాల్లో ఫలితాలు (%) ఇలా..

నియోజకవర్గం	పాజిటివ్	నెగిటివ్
ఏలూరు	68.68	31.32
చింతలపూడి	65.85	34.15
నూజివీడు	63.73	36.27
పోలవరం	64.35	35.65
ఉంగుటూరు	64.94	35.06
తణుకు	65.93	34.07
ఉండి	65.39	34.61
తాడేపల్లిగూడెం	64.34	35.66

బాగుంటే మంచి ర్యాంకు వచ్చేది.. సర్వేలో అన్ని విభాగాల్లో ప్రగతి బాగుంది. వైద్యసేవల్లో మాత్రం ర్యాంకు బాగా పడిపోయింది. దీనిలో పురోగతి బాగుంటే జిల్లాలకు మంచి ర్యాంకు వచ్చేది. దీన్ని అధిగమించాలని కలెక్టర్ల సదస్సు ముగిసిన వెంటనే జరిగిన పీజీఆర్ఎస్ సమావేశంలో ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిస్థాయిలో ప్రత్యామ్నాయ వినియోగానికి మళ్లించడమే ధ్యేయంగా ప్రభుత్వం స్వచ్ఛ రథ వ్యవస్థను ప్రవేశపెట్టింది. దీన్ని ఈ నెల 17 నుంచి అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ విధానం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేశారు. అది విజయవంతమైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

వ్యర్థాలిస్తే.. ఉల్లి, నిత్యావసరాలు

జిల్లాలోని 409 పంచాయతీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించేందుకు ఒక్కో మండలానికి ఒక స్వచ్ఛ రథాన్ని ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని ఇరవై మండలాల్లోనూ వీటిని అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు సేకరించి తరలించేందుకు జీఎస్టీ, ట్రేడింగ్ లైసెన్సు ఉన్న అభ్యర్థులకు స్వచ్ఛరథం కేటాయించనున్నారు. ప్రాథమికంగా ఈ నెల 17న మూడు మండలాల్లో వీటిని ప్రారంభించనున్నారు. ఫిబ్రవరి ఆఖరుకు మిగిలిన మండలాల్లోనూ ఈ విధానం అమలు చేయనున్నారు.

నిర్వహణ ఇలా.. ఎంపికైన అభ్యర్థి వాహనాన్ని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. నిర్వాహకుడు ఆ వాహనంతో నెలలో ఇరవై రోజులు ఆయా మండలంలోని అన్ని పంచాయతీల్లో తిరుగుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించాల్సి ఉంది. ప్రజల నుంచి సేకరించిన చెత్తకు బదులు ఉల్లిపాయలు, ఇతర నిత్యావసర సామగ్రి అందించాల్సి ఉంది. దీనికి ప్రభుత్వం నెలకు రూ.25 వేలు చెల్లించనుంది. వారు సేకరించిన వ్యర్థాలను వారే విక్రయించుకునే వెసులుబాటు కల్పించారు.

ప్లాస్టిక్ ముప్పు నివారణకు.. ప్రజలు విరివిగా ప్లాస్టిక్ సామగ్రి వినియోగిస్తున్నారు. అవి ఎక్కడబడితే అక్కడ పారవేయడంతో వేల సంవత్సరాలు శిథిలమవ్వకుండా ఉంటున్నాయి. వాటికి నిప్పు పెట్టడంతో వాతావరణంలోకి విషవాయువులు వెలువడుతున్నాయి. వీటి నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంట్లో భాగంగా స్వచ్ఛరథాలను వినియోగంలోకి తీసుకురానున్నాం. ఈ ప్రక్రియ విజయవంతానికి ప్రజలు సహకరించాలి. **- ఎన్.రామ్‌నాథ్‌రెడ్డి, పంచాయతీ అధికారి, భీమవరం**

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాడేపల్లిగూడెంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కనీస వసతులు లేక, గుంతల రహదారులతో పట్టణవాసులు అవస్థలు పడ్డారు. ప్రస్తుతం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ స్థానిక ప్రజాప్రతినిధులు, పురపాలక సంఘం ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ రూ.20 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వాటిలో కొన్ని పథకాలు తుది దశకు చేరుకోగా మరికొన్ని పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ నిధులతోపాటు పీ4లో భాగంగా ప్రజా భాగస్వామ్యంతో చేపట్టిన ఈ నిర్మాణాలు అందుబాటులోకి వస్తే పట్టణవాసులకు మరిన్ని ఆధునిక వసతులు అందుబాటులోకి రానున్నాయి.

గూడెం సిగలో ప్రగతి కిరీటం
త్వరలో అందుబాటులోకి ఆధునిక వసతులు

పట్టణంలో విద్యార్థులు, యువత ఆడుకోవడానికి సరైన క్రీడామైదానం లేకపోవడంతో పీ4 కార్యక్రమంలో భాగంగా ప్రజలను భాగస్వాములను చేస్తూ పట్టణంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో అత్యాధునిక వసతులతో బాక్స్ క్రికెట్ నిర్మిస్తున్నారు. అదే ప్రాంగణంలో ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ తదితర కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. దీని చుట్టూ నడకదారితోపాటు ఫౌంటెయిన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

రూ.2 కోట్లతో బాక్స్ క్రికెట్.. క్రీడా మైదానం

సరికొత్తగా ఈత కొలను

పట్టణంలో ప్రభుత్వ, ప్రజా భాగస్వామ్యంతో నిర్మిస్తున్న మరో ప్రతిష్ఠాత్మకమైన నిర్మాణం ఈత కొలను. ఉన్నతస్థాయి ప్రమాణాలతో నిర్మిస్తున్న దీనికి ఇప్పటికే రూ.75 లక్షలు ఖర్చు చేశారు. ప్రజల సహకారంతో మరో రూ.25 లక్షలు సమకూర్చుకోవాల్సి ఉందని.. త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు.

మణిహారంగా ఇండోర్ స్టేడియం

పట్టణానికి మరో మణిహారంగా ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నారు. సుమారు రూ.85 లక్షలతో చేపట్టిన ఈ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. ఇక్కడే అత్యాధునిక వసతులతో బ్యాడ్మింటన్, షటిల్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తున్నారు.

తెగ తాగేశారు
గణనీయంగా పెరిగిన ఆదాయం

ఈనాడు - ఏలూరు, భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో నూతన సంవత్సర వేడుకల వేళ మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో జరిగాయి. గడిచిన రెండు రోజుల్లో ఏలూరు జిల్లాలో రూ.15 కోట్లు, పశ్చిమలో రూ.22 కోట్లు వచ్చింది.

వారం రోజుల్లో అమ్మాల్సిన సరకు కేవలం సోమవారం నుంచి బుధవారం వరకు రికార్డు స్థాయిలో విక్రయించారు. సంవత్సర ముగింపు సేల్ అంటూ అధికారులు పక్షం రోజుల నుంచే వ్యాపారులను అప్రమత్తం చేసి ఇండెంట్ మేరకు సరకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఇవన్నీ అమ్మకాలు పెరగటానికి దోహదమయ్యాయి. ఒకానొక సమయంలో జిల్లాకు అవసరమైన సరకు సర్దుబాటు చేయడానికి పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి తీసుకొచ్చారు.

పశ్చిమలో 193 దుకాణాలు ఉన్నాయి. ఇక్కడ 2024లో జిల్లావ్యాప్తంగా రూ.1150 కోట్ల వ్యాపారం జరగ్గా.. 2025లో రూ.1250 కోట్లకు చేరింది. గతేడాదితో పోలిస్తే రూ.100 కోట్లు పెరిగింది. ఒక్క 2024 డిసెంబరులో రూ.124.21 కోట్లు అమ్మగా 2025లో అది రూ.129.09 కోట్లు వచ్చింది.

అడవిలో పుట్టాం.. ఆకివీడులో ఎండిపోయాం

ఆకివీడులో పచ్చదనం.. పర్యావరణ పరిరక్షణ కోసం అధికారులు ఎంత శ్రద్ధ తీసుకుంటున్నారో ఈ చిత్రమే స్పష్టం చేస్తుంది. గతేడాది వర్షాకాలంలో అటవీ శాఖ అధికారులు జామ, నేరేడు, మామిడి, గానుగ తదితర పండ్లు, పువ్వులు, నీడ, కలపనిచ్చే సుమారు 15 రకాల మొక్కలను వేల సంఖ్యలో ఆకివీడుకు సమకూర్చింది. వాటిని నగర పంచాయతీ కార్యాలయం వెనుక దించారు. ఈ మొక్కలు ప్రభుత్వ స్థలాల్లో, రహదారుల వెంబడి నాటించాలి. ఆసక్తి ఉన్న ప్రజలకు అందజేయాలి. నగర పంచాయతీ అధికారులు పూర్తిస్థాయిలో నాటకుండా.. పంపిణీ చేయకపోవడంతో అనేక మొక్కలు ఇలా ఎండిపోయాయి. **– న్యూస్‌టుడే, ఆకివీడు**

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

బతుకుతున్నాం.. మీరే పంచ ప్రాణాలుగా..

మీరే సర్వమై..
మీరే సకలమై..
బతుకుతున్నాం..
ఎన్నో ఆశలతో..
ఎన్నో కలలతో
జీవిస్తున్నాం..
ఒక్క మాటలో చెప్పాలంటే..
పంచప్రాణాలు మీరే..
కొత్తేడాదిలో..
కొంగొత్త జీవితంలోకి
అడుగెట్టిన
ఆనందోత్సాహాల వేళ..
ఆ దేవుడు..
ఎందుకిలా
చేశాడు..
మాకెందుకు
మిమ్మల్ని
దూరం చేశాడు..

ఆగని రక్తధార.. ఆరని కన్నీటి చార!

వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురి మృతి 6లో

కుటుంబ సభ్యుల రోదన

6లో

అన్న క్యాంటీన్ల పండగ
గ్రామీణులకు సంక్రాంతి కానుక..

ఆచంట, ఉండి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాలోని అన్న క్యాంటీన్లు పునరుద్ధరించడమే కాక మరో రెండు మంజూరు చేసింది. ఆచంట, ఉండి నియోజకవర్గాలకు కేటాయించిన వీటి నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయి. ఇప్పటికే శ్లాబులు పూర్తయ్యాయి. జిల్లాలో ఇప్పటికే 9 అన్నక్యాంటీన్లు అందుబాటులో ఉన్నాయి. కొత్తవి అందుబాటులోకి వస్తే ఆచంట, ఉండిలో నిరుపేద వర్గాల ఆకలి తీరనుంది.

ఉండి: నిర్మాణంలో భవనం

సంక్రాంతి కానుకగా ప్రభుత్వం ఒకేసారి 70 క్యాంటీన్లు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోంది. ఇప్పుడున్న వాటికి అదనంగా గ్రామీణ నియోజకవర్గ, మండల కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో ఒక్కోటి రూ.60 లక్షల వ్యయంతో ఆచంట, ఉండిలో నిర్మిస్తున్నారు. వీటి ద్వారా కేవలం పూటకు రూ.5కే ఆహారం సరఫరా చేస్తారు. ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం లభించనుంది.

☛ కొత్త నిర్మాణాలు జనవరి 10లోపు పూర్తి చేసి సంక్రాంతి సమయంలో 13-15 మధ్య ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆచంటలో క్యాంటీన్ కచేరీ కూడలిలో అందరికీ అందుబాటులో ఉండేలా నిర్మిస్తున్నారు. వీటి గురించి ప్రజారోగ్య డీఈ విజయ్‌ను సంప్రదించగా వీలైనంత తొందరగా నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

ఆదర్శమూర్తికి అశ్రునివాళి

జననం: 26-11-1948

మరణం: 27-12-2025

శ్రీ అప్పక రాంబాబు గారు

మేనేజింగ్ డైరెక్టర్: శ్రీ వెంకటేశ్వర సిరామిక్ గ్రూప్ ఇండస్ట్రీస్, భీమడోలు
ఛైర్మన్: మానవత కేంద్ర నియంత్రణ కమిటీ, మానవత శాంతి రథాల జిల్లా కమిటీ,
సీఆర్ఆర్ విద్యాసంస్థల మేనేజింగ్ కమిటీ సభ్యులు

మంచితనం, మానవత్వం, మూర్తీభవించిన మహోన్నత వ్యక్తి, నిరంతరం ప్రజా సేవకే పరితపించే సేవాతత్పరులు, ఆప్యాయతానురాగాలు మాకు పంచి ఇచ్చి, మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసిన మా కుటుంబ మార్గదర్శకులు

శ్రీ అప్పక రాంబాబు గారి మరణం మా కుటుంబానికి తీరని లోటు.

వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... భార్య: అప్పక అనసూయమణి

కుమారుడు: అప్పక కళ్యాణ మునిస్వామి — కోడలు: శ్రీలక్ష్మి

కుమార్తెలు: కాపరాజు రత్నమాణిక్య రాధిక, మండ మాధవి — అల్లుళ్ళు: శైలేష్‌కుమార్, శ్రీనివాస్

మనుమలు: అప్పక పరిమళ్ రామప్రసాద్, మండ చేతన్

మనుమరాండ్రు: కాపరాజు భావన గంగ, కాపరాజు హర్షిణి నాయుడు, మండ నిహారి, అప్పక హాసిత

పెద్దకార్యం: ది. 08-01-2026 గురువారం భీమడోలు శ్రీనివాసా కళ్యాణ మండపం నందు (MRO ఆఫీస్ ఎదురుగా) జరుపబడును. కావున తెలియపరచడమైనది. సెల్: 96000 76092, 94404 84477

(c) eenadu

సిబ్బంది లేక.. ఇబ్బందులు తీరక!

సంవత్సరం	సారా కేసులు	గొలుసు దుకాణాలు కేసులు
2024	482	205
2025	370	108

చింతలపూడి, న్యూస్‌టుడే: జిల్లాలోనే నాటుసారా తయారీ, అమ్మకాల్లో ముందు వరుసలో ఉండే చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో సిబ్బంది కొరత వేధిస్తోంది. కిందిస్థాయి సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతోపాటు మహిళా కానిస్టేబుల్స్ ఒక్కరూ లేకపోవటంతో దాడులు చేయాలంటే ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సాయం

సిబ్బంది ఎక్కడ?

సర్కిల్ పరిధిలో 12 మంది కానిస్టేబుల్స్ ఉండాల్సి ఉండగా కేవలం 4 గురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా ఇద్దరు ఉన్నారు. సారా కేసుల్లో 70 శాతం పైగా మహిళలే పట్టుబడుతున్నారు. వీరిని అదుపులోకి తీసుకోవాలన్నా, రిమాండ్, బైండోవర్‌కు తరలించాలన్నా మహిళా కానిస్టేబుల్ ఒక్కరూ లేరు. గతంలో ముగ్గురు మహిళా కానిస్టేబుల్స్ ఉండేవారు. వీరందరినీ బదిలీ చేయడంతో కేసుల సమయంలో ఇబ్బంది తలెత్తుతోంది. భీమడోలు, ఏలూరు, ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్‌లో సుమారు 10 మంది మహిళా కానిస్టేబుళ్లు పనిచేస్తున్నారు. భీమడోలు, ఏలూరు సర్కిల్స్‌లో ఒకటి, రెండు మించి సారా కేసులు నమోదు కావటం లేదు.

ఉండాల్సిన పరిస్థితి. సిబ్బంది నియామకం తగ్గటంతో గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి సోదాలు నిర్వహించాలంటే ఎక్సైజ్ సిబ్బందికి తలకుమించిన భారంగా మారుతోంది.

నవోదయం 2.వో కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాత సర్కిల్ పరిధిలో నాటుసారా తయారీ, అమ్మకం కేసులు తగ్గుముఖం పట్టాయి. సర్కిల్ పరిధిలోని నాగిరెడ్డిగూడెం, తల్లార్లపల్లి, రేచర్ల, నామవరం, ఎడవల్లిలను 'ఏ' గ్రేడ్‌గా, క్రిష్టాపురం, బంధంచర్ల, సిద్ధియన్‌పేట, కొవ్వూరుగూడెంలను 'బి' గ్రేడ్‌గా, కె.గోకవరం, ఈస్ట్ ఎడవల్లి, తెల్లం, ఆడమిల్లిలను 'సి' గ్రేడ్‌గా విభజించారు. నవోదయం 2.వో తర్వాత ఆయా గ్రామాల్లో దాడులు పెరిగి కేసుల సంఖ్య బాగానే తగ్గాయి. సారా తయారీ సమాచారం వచ్చినప్పుడు ఎక్సైజ్ సిబ్బంది ఇళ్లలోకి వెళ్లి సోదాలు నిర్వహించాలి. మహిళా కానిస్టేబుల్స్ లేకపోవటంతో ఇళ్లలోకి వెళ్లాలంటే వెనకడుగు వేయాల్సి వస్తోంది.

దాడులు చేస్తున్నాం..

సర్కిల్ పరిధిలో కానిస్టేబుల్స్ కొరత ఉన్న మాట వాస్తవమే. అయినా ఈఎస్‌టీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీలతో కలిసి దాడులు నిర్వహిస్తూనే ఉన్నాం. గతంతో పోలిస్తే సారా కేసులు బాగా తగ్గాయి.
- అశోక్, ఎక్సైజ్ సీఐ, చింతలపూడి

వ్యసనాలే ముంచుతున్నాయ్

మండవల్లి, న్యూస్‌టుడే: ఏ దేశానికైతే యువ రక్తం ఎక్కువగా ఉంటుందో ఆ దేశాభివృద్ధి గణనీయంగా పెరుగుతుందని స్వామి వివేకానంద తెలిపారు. మన యువశక్తి నేడు వ్యసనాల బారిన పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటోంది. అనుకోని రీతిలో కన్నవారికి, కట్టుకున్న వారికి తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు. రోజురోజుకు వీటి గణాంకాలు పెరగడంతో ప్రస్తుతం తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. కొత్త సంవత్సరం కొంగొత్తగా జీవించాలంటే యువత మేల్కొనక తప్పదని విశ్లేషకులు వివరిస్తున్నారు.

నిర్లక్ష్యం.. అతి వేగం

రోడ్డు ప్రమాదాల్లో అత్యధికం ద్విచక్ర వాహనాలవేనని ప్రభుత్వ సర్వేలో వెల్లడైంది. ఈ ఏడాది 30శాతం ప్రమాదాలు బైకుల వల్లే జరిగాయి. జిల్లాలో ద్విచక్ర వాహన ప్రమాదాల్లో ఎక్కువగా చనిపోయింది యువతే. 2025లో ఏలూరు జిల్లాలో 84 వ్యక్తిగత ప్రమాదాలు చోటుచేసుకోగా ఎక్కువగా యువతే ప్రాణాలను కోల్పోయారు.

అంతర్జాలంతో అనర్థాలు

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఎక్స్-ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా యువత బిజీబిజీగా గడుపుతున్నారు. కొందరు ఈజీ మనీ కోసం అడ్డదారులు తొక్కడం, బెట్టింగులు లేదా ఆన్‌లైన్ మోసాలకు గురికావడం పరిపాటిగా మారుతున్నాయి. జిల్లాలో 20 లక్షల మేర స్మార్టుఫోన్‌లు ఉండగా అందులో 14 లక్షల ఫోన్లు యువత చేతిలోనే ఉన్నాయి.

మద్యం, గంజాయి మత్తు.. భవిత చిత్తు..

మద్యం తాగడం, గంజాయి మత్తులో తూగడం ప్రస్తుతం యువతకు పరిపాటిగా మారింది. యువత పార్టీలు పేరుతో మద్యానికి దగ్గరవుతున్నారు. పార్టీలు శృతిమించడంతో గంజాయి, డ్రగ్స్ లాంటి వాటికి అలవాటు పడుతున్నారు. వ్యసనాలకు బానిసలై మానసిక వైద్యులను ఆశ్రయించేవారి సంఖ్య పెరుగుతుందంటేనే అర్థమవుతుంది. 2024లో 19 గంజాయి కేసుల్లో 36 మందిని జిల్లాలో అరెస్టు చేశారు.

పెరుగుతున్న ఆత్మహత్యలు

బెట్టింగులతో అప్పుల పాలైనా, ప్రేమలో ఓడిపోయినా, చదువులో ర్యాంక్ రాకపోయిన ఆత్మహత్య శరణ్యంగా భావిస్తున్నారు. ఇళ్లు, వసతి గృహాల్లో బలవన్మరణాలకు పాల్పడే వారి సంఖ్య పెరిగిపోతోంది. ఏటా ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో 20 నుంచి 40 ఏళ్లలోపు వారే ఎక్కువ మంది.

ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించుకోవాలి

యువత ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించుకోవడానికి యోగా, ప్రాణాయామాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలి. యువత తను జాగృతం చేసే మహనీయుల పుస్తకాలను చదివి ఆత్మన్యూనత భావాన్ని, నిరాశ, నిస్పృహలను దూరం చేసుకోవచ్చు.
- గొరిపర్తి నాగభూషణం, మానసిక వికాస నిపుణుడు, ఏలూరు

చట్టాలపై అవగాహన అవసరం

గంజాయి సేవించినా, రవాణా చేసిన జీవితాంతం ఇబ్బందులు తప్పవు. యువత వేగానికి కళ్లెం వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి మానిటరింగ్ చేస్తున్నాం.
- శ్రావణ్‌కుమార్, డీఎస్పీ, ఏలూరు

ద్వారకాతిరుమల ఈవోగా భద్రాజీ బాధ్యతల స్వీకరణ

ద్వారకాతిరుమల(జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా వై.భద్రాజీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈవోగా పనిచేసిన ఎన్వీఎస్ఎస్ మూర్తి గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడ డిప్యూటీ ఈవోగా పనిచేస్తోన్న భద్రాజీని పూర్తి అదనపు బాధ్యతలతో ఈవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో భద్రాజీ గురువారం బాధ్యతలు స్వీకరించారు.

గుడ్డే బంగారమాయె.. నెట్టింట అమ్ముడుపోయె

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: జాతి కోళ్ల పెంపకాన్ని కొందరు కుటీర పరిశ్రమలా మలచుకుంటున్నారు. నాటు కోళ్ల కంటే జాతి కోళ్ల పెంపకంలోనే అధిక లాభాలు పొందుతున్నారు. కేవలం పందెం పుంజులే కాకుండా కోడి గుడ్లను, ఒక రోజు లేదా నెలరోజుల కోడిపిల్లలను కూడా సామాజిక మాధ్యమాల్లో విక్రయాలు జరుపుతున్నారు. పుంజు పెట్టల రంగు లేదా వాటి జాతి నాణ్యత పోటీలు ఆన్‌లైన్‌లో పెడుతున్నారు. ఒక్కో గుడ్డు రూ.500 అమ్ముతున్నారు. వీటిలోనే భీమవరం రెచ్చివాటం, పెరూ, పెరూ క్రాస్ కోడి గుడ్డు ఒక్కొక్కటీ రూ.600 విక్రయాలు జరుపుతున్నారు. ఫోన్ చేసి ఆర్డర్ చేస్తే గుడ్లు పాడవకుండా పంపుతున్నారు. భీమవరం, భీమడోలు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల నుంచి అమ్మకాలు జరుగుతున్నాయి. వీటిని ఇతర ప్రాంతాల నుంచి కోళ్ల పెంపకదారులు కొనుగోలు చేసి ఇంక్యుబేటర్, పెట్టలతో పొదిగించి పిల్లలను చేయించుకుంటున్నారు.

హెచ్ఎస్ఆర్‌పీ.. వాహనానికి కవచం

హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ బిగించుకోవాల్సిందే

నూజివీడు, న్యూస్‌టుడే: 'మాది పాత వాహనం. హై సెక్యూరిటీ ప్లేటు మాకెందుకు' అని అనుకుంటున్నారా? పాతది, కొత్తది అనే తేడా లేకుండా ప్రతి వాహనానికి హైసెక్యూరిటీ నంబర్ ప్లేటును కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. 2019 ఏప్రిల్‌కు ముందు రిజిస్ట్రేషన్ చేసిన వాహనాలకూ వీటిని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. నకిలీ నంబర్ ప్లేట్లకు అడ్డుకట్ట వేయడం, వాహన చోరీలను అరికట్టాలనే లక్ష్యంతో. 15 ఏళ్లలోపు రిజిస్ట్రేషన్ అయిన ద్విచక్ర, నాలుగు చక్రాల, ఇతర వాహనాలకు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా నంబరు ప్లేట్లు పొందేందుకు అవకాశం కల్పించినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనరు కె.ఎస్.ఎం.కృష్ణారావు తెలిపారు.

బుకింగ్ ఇలా.. www.siam.in వెబ్‌సైట్ ఓపెన్ చేసి బుక్ హెచ్ఎస్ఆర్‌పీపై క్లిక్ చేయాలి. అనంతరం పేరు, ఈ-మెయిల్, రాష్ట్రం, వాహనం రిజిస్ట్రేషన్ నంబర్, రాష్ట్రం, వాహనం రిజిస్ట్రేషన్ నంబర్, చరవాణి సంఖ్య, జిల్లా వివరాలను నమోదు చేసి సబ్మిట్ చేయాలి. ఆయా కంపెనీలను బట్టి నంబరు ప్లేటు ద్విచక్ర వాహనాలకు రూ.320 నుంచి రూ.500 వరకు.. నాలుగు చక్రాల వాహనాలకు రూ.600 నుంచి రూ.3వేల వరకున్నాయి. కావాల్సింది ఎంపిక చేసుకుని ఓటీపీ ద్వారా ఆన్‌లైన్‌లో నగదు చెల్లించాలి. 15 రోజుల తర్వాత ఎంపిక చేసిన షోరూంకు వెళ్తే వారు ఆ నంబరు ప్లేటును వాహనానికి బిగిస్తారు.

ఇవీ ప్రత్యేకతలు.. లేజర్ కోడ్.. ప్రతి ప్లేటుపై యూనిక్ లేజర్ ఐడీ ఉంటుంది. క్రోమియం హోలోగ్రామ్.. నకిలీగా మార్చలేని విధంగా దీన్ని రూపొందించారు. నాన్- రిమూవబుల్ స్నాప్ లాక్.. ఒక సారి అమర్చితే తొలగించడం సాధ్యం కాదు. ఐఎన్‌డీ, బ్లూవ్యాండ్.. దేశవ్యాప్తంగా ఏక రూపత. ట్రాకింగ్‌కు అనుకూలం.. నేర విచారణలో భాగంగా వాహన నంబర్ ప్లేట్‌ను స్కాన్ చేయడం ద్వారా నంబరు ప్లేట్లు పొందేలా అవకాశం కల్పించారు.

మద్ది క్షేత్రం భక్త జనసంద్రం

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి గురువారం భక్తజన సంద్రంగా మారింది. నూతన సంవత్సరం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ముఖమండపం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఒక్కరోజే వివిధ సేవల రూపేణా రూ.3,97,450 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఆర్వీ చందన తెలిపారు.

జాతీయ బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థినులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: చెన్నైలో ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే సీనియర్ నేషనల్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు నూజివీడు ట్రిపుల్ ఐటీ పీయూసీ మొదటి సంవత్సరం విద్యార్థులు ఎంపికైనట్లు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. చిత్తూరులో జరుగుతున్న ఏపీ సీనియర్ నేషనల్ క్యాంపులో ఈ విద్యార్థులు శిక్షణ పొందుతున్నట్లు చెప్పారు. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి వాకా రాహుల్(బీబీఏ యూనివర్సిటీ), బేతాళ ప్రభుదీపిక, షేక్ అస్రా(ట్రిపుల్ఐటీ- నూజివీడు) పీయూసీ విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. ముగ్గురు క్రీడాకారులు నూజివీడుకు చెందిన వారేనని తెలిపారు. వీరిని ఏవో బి.లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ ఎస్.చిరంజీవి అభినందించారు.

సత్యసాయిబాబా శతజయంతి నాణెం!

సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నవంబరు19న పుట్టపర్తిలో సత్యసాయిబాబా ముఖ చిత్రంతో రూ.100 నాణేన్ని విడుదల చేశారు. 35 గ్రాముల బరువుతో 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5శాతం నికెల్, 5 శాతం జింక్ లోహ మిశ్రమాలను తయారీలో వినియోగించారు. ఈ స్మారక నాణేన్ని భారత రిజర్వుబ్యాంకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా కొనుగోలు చేసినట్టు ఏలూరుకు చెందిన నాణేల సేకర్త ఆలీఖాన్ మహమ్మద్ తెలిపారు.
- ఈనాడు, ఏలూరు

మోతాదుకు మించి ఎరువులు చల్లొద్దు!

- నీటి పొదుపు చర్యలతో రబీలో అధికోత్పత్తి
- 'న్యూస్‌టుడే'తో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లికార్జునరావు

ఉండి, న్యూస్‌టుడే: రబీలో నారుమడి తయారీ నుంచి ప్రధాన పొలంలో గింజ తయారయ్యే వరకూ అవసరమైన జాగ్రత్తలు పాటిస్తే ఉత్తమ దిగుబడులు సాధించొచ్చు. భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా నేల స్వభావానికి అనువైన విత్తనాలను ఎంచుకోవాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు సాధించొచ్చని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎన్.మల్లికార్జునరావు తెలిపారు. రబీ ప్రారంభమవుతున్న దశలో అవలంబించాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు.

★ అధిక ఎరువుల వినియోగంతో అన్నీ అనర్థాలే. నేలలో సల్ఫైడ్ ఐరన్ సమస్యతో వేరు వ్యవస్థ నల్లగా మారిపోతోంది. భాస్వరం ఎక్కువగా వాడినచోట్ల జింకులోపం ఏర్పడుతోంది. భూమి చవుడు బారుతోంది. వీటివల్ల సమస్య తలెత్తి నివారణకు అదనపు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి.

? ఎరువుల యాజమాన్య విధానాలను తెలియజేయండి?

» నత్రజని, భాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులను సిఫార్సు మేరకు చల్లుకోవాలి. ఆఖరి దమ్ములో భాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులు చల్లాలి. దమ్ములో, చిరుపొట్ట దశల్లో పొటాష్ చల్లితే దుబ్బు తెగులును తట్టుకునే శక్తితో గింజ నాణ్యత పెరుగుతుంది. సిఫార్సు చేసిన యూరియా మూడు దఫాలుగా చల్లుకుంటే సరిపోతోంది.

? వెదజల్లే పద్ధతి, డ్రమ్ సీడర్‌తో నాట్లేసే విధానం పెరగడంలేదు. కారణాలేమిటి?

» డెల్టాలో సాగునీటి పారుదలను నియంత్రించలేం, కలుపు సమస్య అధికమనే అభిప్రాయాలుండటమే ప్రధాన కారణం. వెదజల్లే పద్ధతి, డ్రమ్ సీడర్‌తో నాటే విధానంలో సాగుకాలాన్ని తగ్గించుకోవచ్చు. తొలుత దమ్ము పూర్తైన భూమిలో ఎత్తు పల్లాలు లేకుండా చేసుకోవాలి. నీరు ఆరగట్టితే కలుపు సమస్య తలెత్తదు. వెదజల్లే పద్ధతిలో వేరు వ్యవస్థ పటిష్ఠపడుతుంది.

? రబీ పంటకు ఏ రకమైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి?

» నీటి మొక్కైనా.. నిరంతరం పూర్తిస్థాయిలో నీరుంచాల్సిన అవసరం లేదు. పిలకలు తొడగడం, చిరుపొట్ట, ఈనిక, గింజ తయారీ దశల్లో 5 సెంటీమీటర్ల మేర నీరుంటే సరిపోతుంది. మిగిలిన దశల్లో ఆరుతడులందించాలి. మధ్యలో చేను ఆరగట్టడం ద్వారా సుడిదోమ, తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుంది. దిగుబడి పెరుగుతుంది.

ఆగని రక్తధార.. ఆరని కన్నీటి చార!

వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురు మృతి

కొత్త ఏడాదిలో..
ఎన్నో కలలుగన్నారు..
మరెన్నో ఆశించారు....
ఇంకెన్నో కోరుకున్నారు..
నెరవేర్చుకోవాలనుకున్నారు..
ఆర్థికంగా స్థిరపడాలని ఒకరు..
కుటుంబానికి ఆదరవ్వాలని
ఇంకొకరు..
బిడ్డలకు ఉజ్వల భవితవ్వాలని మరొకరు..
తీరుతాయనుకున్నారు..
కానీ,
రహదారులు రక్తధారలయ్యాయి..
అయిదుగురి ప్రాణాలు బలిగొన్నాయి..
ఆయా కుటుంబాల్లో విషాదం నింపాయి..
కలలన్నింటినీ కల్లలు చేశాయి..

కారు కింద పడి యువకుడు..

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన జంగారెడ్డిగూడెం మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వీరప్రసాద్ కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన అమరారం చౌదరి (25) జంగారెడ్డిగూడెంలో నివాసముంటూ స్థానికంగా ఉన్న ఓ ఫ్యాన్సీ దుకాణంలో పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై అశ్వారావుపేట వెళ్లిన అమరారం చౌదరి పని ముగించుకుని జంగారెడ్డిగూడెం వస్తున్నాడు. 'దేవరపల్లి - తల్లాడ' జాతీయ రహదారిపై వేగవరం గ్రామ శివారుకు వచ్చేసరికి.. ముందు సైకిల్‌పై వెళ్తున్న బేతాళ వెంకటపతి అనే వ్యక్తి అకస్మాత్తుగా చక్రదేవరపల్లి వెళ్లే రోడ్డు వైపు తిరిగాడు. ఇది గమనించిన అమరారం చౌదరి బ్రేకు వేసినా ద్విచక్ర వాహనం అదుపుతప్పి సైకిల్‌పై వెళ్తున్న వెంకటపతిని ఢీకొట్టి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో తాడువాయి వైపు వెళ్తున్న కేఆర్‌పురం డిప్యూటీ డైరెక్టర్‌కు సంబంధించిన కారు..కిందపడిపోయిన అమరారం చౌదరి పైనుంచి వెళ్లి, నడిచి వెళ్తున్న కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు అనే మరో వ్యక్తిని ఢీకొంది. దీంతో అమరారం చౌదరి ఘటనా స్థలిలోనే మృతిచెందగా.. నడిచి వెళ్తున్న శ్రీనివాసరావు, సైకిలిస్ట్ వెంకటపతికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం సీఐ సుభాశ్, ఎస్సై వీరప్రసాద్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

చౌదరి (పాత చిత్రం)

వేగం.. గాలిలో కలిసిన ప్రాణం

స్టాలిన్ (పాత చిత్రం)

చెట్టును ఢీకొని ధ్వంసమైన కారు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం గ్రామానికి చెందిన కాకుళ్ల స్టాలిన్ (18), మాండ్రు సాగర్, కాకుళ్ల జశ్వంత్, మానుకొండ జశ్వంత్‌లు స్నేహితులు. స్టాలిన్ పెయింటింగ్ పని చేసుకుంటుండగా.. సాగర్, కాకుళ్ల జశ్వంత్, మానుకొండ జశ్వంత్‌లు చదువుతున్నారు. వీరంతా కలిసి గురువారం ద్వారకాతిరుమల వెళ్లాలని అనుకున్నారు. ఇందుకు జంగారెడ్డిగూడెంకు చెందిన ఓ వ్యక్తి నుంచి కారు అద్దెకు తీసుకుని గురువారం బయలుదేరారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామ శివారుకు వెళ్లేసరికి వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొంది. ప్రమాదం దాటికి పెద్ద శబ్దం రావడంతో స్థానికులు యువకులను జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఘటనలో కారు నడుపుతున్న మాండ్రు సాగర్‌కు తీవ్రగాయాలు కాగా ముందు కూర్చున్న స్టాలిన్ మృతిచెందాడు. వెనుక సీట్లో కూర్చున్న కాకుళ్ల జశ్వంత్, మానుకొండ జశ్వంత్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.

మితిమీరి.. యువకులు అతివేగంగా కారు నడుపుతూ ప్రమాదానికి గురైనట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మితిమీరిన వేగంతో వాహనం వెళ్తుండగా రోడ్డు కుడివైపున ఉన్న చెట్టును ఢీ కొట్టడంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొని లారీ

భార్య దుర్మరణం.. భర్తకు తీవ్ర గాయాలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం ఆ కుటుంబానికి తీవ్ర విషాదం మిగిల్చింది. దైవ దర్శనానికి వెళ్లొస్తున్న దంపతుల్లో భార్య దుర్మరణంపాలై భర్తకు తీవ్ర గాయాలైన ఘటనతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. తణుకు మండలం తేతలి జాతీయ రహదారిపై గురువారం తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన అందే లోకేశ్వరరావు తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో ఔషధ దుకాణం నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య వెంకటలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, కుమార్తె భీమవరంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో బీఫార్మసీ చదువుతోంది. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం తెల్లవారుజామున లోకేశ్వరరావు దంపతులు ద్విచక్ర వాహనంపై ద్వారకా తిరుమల, మద్ది ఆంజనేయస్వామి ఆలయాలకు వెళ్లి తిరిగొస్తుండగా తణుకు మండలం తేతలి సమీపంలో జాతీయ రహదారిపై లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో వెంకటలక్ష్మి (43) అక్కడికక్కడే మృతి చెందగా భర్తకు తీవ్ర గాయాలు కావడంతో 108 సిబ్బంది తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో లోకేశ్వరరావును మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తణుకు గ్రామీణ ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపారు.

రైలు ఢీకొని..

దెందులూరు, న్యూస్‌టుడే: పట్టాలు దాటుతున్న యువకుడిని రైలు ఢీకొనడంతో.. అక్కడికక్కడే మృతి చెందారు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. దెందులూరు మండలం సీతంపేటకు చెందిన గొటికల శ్రీను(30) బుధవారం రాత్రి దెందులూరు- భీమడోలు మధ్య రైలు పట్టాలు దాటుతున్నారు. అతడిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గేట్‌మెన్ ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్సై కె.శివనారాయణ గురువారం కేసు నమోదు చేశారు.

ఎదురొచ్చిన మృత్యువు

కుంచనపల్లి(తాడేపల్లిగూడెం వన్ టౌన్), న్యూస్‌టుడే: ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన తాడేపల్లిగూడెం మండలంలో జాతీయ రహదారి నుంచి కుంచనపల్లికి వెళ్లే రోడ్డులో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. ఎల్.అగ్రహారానికి చెందిన కోమటి నాగబాబు విద్యుత్తు ఉప కేంద్రంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. తన స్నేహితుడిని ఇంటి వద్ద దించి తిరిగి వెళ్తుండగా కుంచనపల్లి గ్రామానికి వస్తున్న తాడేపల్లి మహిమారావు(21) వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో నాగబాబు కాలికి తీవ్ర గాయం కాగా తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మహిమారావు తలకు బలమైన గాయమైంది. స్థానికులు అతడ్ని తొలుత తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి అనంతరం ఏలూరుకు తరలించారు. అక్కడి వైద్యుల సిఫారసు మేరకు మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతడికి తల్లిదండ్రులు, ఓ సోదరి ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తాడేపల్లిగూడెం గ్రామీణ ఎస్సై జేవీఎన్ ప్రసాద్ తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్యాయత్నం

పోలవరం, న్యూస్‌టుడే: ఈ సంవత్సరం దిగుబడులు సగానికి సగం తగ్గి, చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో కలుపు మందు తాగి ఓ యువరైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలవరం మండలం కొత్తపట్టిసీమ గ్రామానికి చెందిన గంటా రాధాకృష్ణ కౌలుకు పది ఎకరాలు తీసుకుని వరి వేశాడు. వాతావరణంలో మార్పుల కారణంగా దిగుబడులు తగ్గిపోవడంతో బతుకుపై విరక్తి చెంది గురువారం ఇంట్లో కలుపు మందు తాగాడు. కుటుంబసభ్యులు వెంటనే పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. అక్కడి వైద్యులు పూనెం రాంబాబుదొర ప్రథమ చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమహేంద్రవరం ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు.

పాములేరు ఒడ్డున.. సరదా సరదాగా...

నదిలో యువకుల వాలీబాల్ పోటీ

కుక్కునూరు, న్యూస్‌టుడే: కుక్కునూరు మండలంలోని పాములేరు నది జనంతో నిండిపోయింది. కొత్త సంవత్సరం సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి సరదాగా గడిపేందుకు రావటంతో, ఆ ప్రాంతం జనసందోహంగా మారింది. సాధారణంగా అది పిక్నిక్ పాయింటు. ప్రతి ఆదివారం వందల సంఖ్యలో అక్కడకు జనం వస్తుంటారు. కొత్త సంవత్సరం కావటంతో ఆ సంఖ్య మరింత పెరిగింది. ఆంధ్రా-తెలంగాణ సరిహద్దు ప్రాంతం కావటంతో రెండు రాష్ట్రాలలోని సమీప ప్రాంతాల ప్రజలు అక్కడకు చేరుకున్నారు. నది ఒడ్డున ఉన్న ఆయిల్‌పామ్ తోటలో మహిళలు వంటవార్పు చేస్తుండగా, పిల్లలు, యువకులు నదిలో ఈదులాడుతూ సరదాగా గడిపారు. యువకులు నీళ్లలో నెట్ ఏర్పాటు చేసుకొని వాలీబాల్ పోటీలు పెట్టుకున్నారు. సెలవు దినాల్లో అక్కడకు సరదాగా వచ్చే కుటుంబాల సంఖ్య పెరుగుతుండటంతో, ఆయిల్‌పామ్ తోట యజమాని కొంత రుసుం వసూలు చేస్తున్నారు. పిక్నిక్ పూర్తయిన మరుసటిరోజు తోటను బాగుచేసేందుకు అయ్యే ఖర్చు మాత్రమే వసూలు చేస్తున్నామని, ఇందులో లాభాపేక్ష లేదని ఆ తోట కాపరులు తెలిపారు.

యువకుడిని చెట్టుకు కట్టి కొట్టిన కేసులో ఆరుగురి అరెస్టు

సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్, సీఐ, ఎస్ఐ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ముసునూరు మండలంలోని రమణక్కపేటలో రెండు కుటుంబాల మధ్య ప్రేమ వ్యవహారంలో జరిగిన ఘర్షణ మినహా ఎటువంటి గొడవలు లేవని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి 9.30 గంటలకు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. యువకుడిని చెట్టుకు కట్టి కొట్టిన కేసులో కందుల బాబు, కందుల విజయలక్ష్మి, శివనాగప్రసాద్, సాయిదుర్గ, గూడూరు విజయ, కందుల శివ నాగప్రసాద్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు. రెండు కులాల మధ్య తగాదాలు జరిగే అవకాశం ఉందనే వదంతులు సోషల్ మీడియాలో రావడంతో ఈ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండవల్లి మండలంలోని కానుకొల్లుకు చెందిన అల్లం సాయి చందు హైదరాబాద్‌లోని ఒక చికెన్ దుకాణంలో పని చేస్తున్నట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన కందుల సాయి దుర్గను గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నట్లు చెప్పారు. వీరిరువురి పెళ్లికి సాయి దుర్గ కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో గత నెల 30న అల్లం సాయి చందు, సాయిదుర్గ ఏలూరులోని గంగానమ్మ గుడి వద్ద వివాహం చేసుకున్నారు. 31న సాయిదుర్గను డ్యూటీకి ముసునూరు మండలంలోని రమణక్కపేట తీసుకుని వెళ్లాడన్నారు. ఈ సమయంలో సాయిదుర్గ తల్లిదండ్రులు కందుల బాబు, విజయలక్ష్మి, శివనాగప్రసాద్ తదితరులు అక్కడకు వచ్చి తమ కుమార్తెను తీసుకువెళ్లేందుకు యత్నించినట్లు చెప్పారు. అడ్డుకునే ప్రయత్నంలో అల్లం సాయి చందును స్తంభానికి కట్టేసి అతనిపై కర్ర, వైర్లు, రాయి, చేతులతో దాడి చేసి గాయపరిచినట్లు పేర్కొన్నారు. అడ్డుకున్న చెన్నకేశ్వరిపై కూడా దాడి చేసినట్లు తెలిపారు. అనంతరం సాయిదుర్గను బలవంతంగా కారులో ఎక్కించుకుని వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. గాయపడిన అల్లం సాయి చందు నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారించి, ఈ కేసులో ముద్దాయిలను విజయవాడ సమీపంలోని నున్న వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు. కిడ్నాప్‌నకు ఉపయోగించిన కారును సీజ్ చేశామని తెలిపారు. రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ చిరంజీవి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -147 రిటైల్ ధర 174 చికెన్ విత్ స్కిన్ - 252, చికెన్ స్కిన్‌లెస్ - 287. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 167, 176, 187 చికెన్ విత్ స్కిన్ - 324 చికెన్ స్కిన్‌లెస్ - 334.

అభ్యంతరాలుంటే చెప్పండి: డీఎంహెచ్‌వో

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఒప్పంద ప్రాతిపదికన ఫార్మసీ అధికారుల పోస్టుల భర్తీకి స్వీకరించిన దరఖాస్తుల పరిశీలనానంతరం ప్రొవిజనల్ మెరిట్ జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 13లోపు రాజమహేంద్రవరంలోని వైఎంసీఏ హాలులో సమర్పించాలని డీఎంహెచ్‌వో పి.జె.అమృతం తెలిపారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, మెరిట్, రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా చేపట్టనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఆమె గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కేజీబీవీల్లో కొలువుల భర్తీకి దరఖాస్తులు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: కుక్కునూరు, వేలేరు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది ఉద్యోగాలను పొరుగు సేవల విధానంలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సమగ్ర శిక్షా ఏపీసీ పంకజ్ కుమార్ తెలిపారు. కుక్కునూరు కేజీబీవీలో కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, వేలేరు కేజీబీవీలో ఏఎన్ఎం కొలువులకు అర్హులైన వారు ఈ నెల 11లోపు ఏలూరు సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

92.7 FM Rajamahendravaram
92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

REAL ESTATE

HOUSE FOR SALE

ఖండవల్లి గ్రామంలో కామట్ల వీధిలో డబుల్ స్టేర్ బిల్డింగ్ క్రింద నివాసం పైన షాపు అమ్మకము గానీ, అద్దెకు గానీ కలదు. సెల్: 9392122526.

PLOT FOR SALE

భీమవరం భారతి విద్యాభవన్ స్కూల్ దగ్గరలో 200 చ॥గ॥ స్థలం ఫెన్సింగ్‌తో ఉన్నది. అమ్మకమునకు కలదు. సంప్ర॥ సెల్: 9392122526.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.25 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
CLASSIFIEDS

భీమవరం
• భీమవరం • ఉండి

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	భీమవరం గునుపూడి: 80085 74474
భీమవరం మండలం: 80085 74533	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

ఉండి, న్యూస్‌టుడే: ? ఉండి నుంచి పెదపుల్లేరు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాం. - **రామలక్ష్మి, పెదపుల్లేరు**
✔ నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు చేపడతాం. - **కె.శ్రీహరిరాజు, ఏఈ, ఆర్అండ్‌బీ**

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ? భీమవరం ఫుట్‌పాత్ వంతెనపై ఉన్న వీధి దీపాలు రాత్రి సమయంలో వారం రోజులుగా వెలగడం లేదు. ఆ సమయంలో అవస్థలు పడుతున్నాం. - **ఎన్.చిన్నారి, ప్రైవేటు ఉద్యోగి**
? గునుపూడి సోమగుండం చెరువు చుట్టూ ఉన్న రహదారిలో పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. - **కె.రాము, స్థానికుడు**
✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- **సాంబశివ, విద్యుత్తు పురపాలక ఏఈ.**

ఆకివీడు, న్యూస్‌టుడే: ? ఆకివీడు మెయిన్ రోడ్డు వెంబడి ఉన్న డ్రెయినేజీలో అనేక చోట్ల ఆటంకాలు తొలగించడం లేదు. మురుగు పారుదల సక్రమంగా సాగడం లేదు. - **సత్యనారాయణ, ఆకివీడు**
✔ పరిశీలించి పనులు చేయిస్తాం.
– **సాకేత్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

ఉండి, న్యూస్‌టుడే:? భవానీపేటలో కొన్ని వీధిదీపాలు వెలగడంలేదు.
- **కె.సుబ్బారావు, భవానీపేట, ఉండి**
✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- **అనిల్‌కుమార్, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి, ఉండి.**

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ? పారిశ్రామికవాడ, చినరంగనిపాలెంలో డ్రెయిన్లను శుభ్రం చేయడం లేదు. దుర్వాసన, దోమలతో నరకం చూస్తున్నాం. - **బి.సూరిబాబు, సీహెచ్ సత్యనారాయణ, స్థానికులు**
✔ దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. డ్రెయిన్లలో చెత్త అడ్డుపడకుండా పనులు చేయిస్తాం. - **సూర్యనారాయణరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

స్పందనకు వందనం

భీమవరం (గ్రామీణ), న్యూస్‌టుడే: ✦ తాడేరు-జేతపూడి ప్రధాన మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదంటూ గత నెల 25న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి పార్వతి స్పందించారు. దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. ✦ రాయలం బైపాస్‌రోడ్డు వెంబడి చెత్తతో ఇబ్బందిగా ఉందంటూ డిసెంబరు 24న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి వీర్రాజు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తీసి తరలించారు. ✦ రాయలం పంచాయతీ మంచి నీటి చెరువు గట్టున చెత్త పేరుకుందని, పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందంటూ గత నెల 29న చెత్తతో అవస్థ శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి వీర్రాజు స్పందించి చెత్తను తొలగింపజేశారు.

ఎస్ఈగా ఉద్యోగోన్నతి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం మున్సిపల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పి.త్రినాథరావుకు సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు ఆయనను విశాఖపట్నం నగరపాలకసంస్థకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో భీమవరం ఎంఈని నియమించాల్సి ఉందని కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తా : జుత్తిగ

మహదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆ సంస్థ నూతన ఛైర్మన్ జుత్తిగ నాగరాజు తెలిపారు. మహదేవపట్నంలోని తన నివాసంలో గురువారం నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పాటుపడతానని వివరించారు. జనసేనను బలోపేతం చేస్తానని వివరించారు. జుత్తిగ నాగరాజుని కలిసి అభినందించిన వారిలో ఉండి, ఆకివీడు ఏఎంసీ వైస్ ఛైర్మన్లు యడవల్లి వెంకటేశ్వరరావు, గవర లక్ష్మి, మండల తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు కరిమెరక నాగరాజు, కళ్లేపల్లిసతీష్‌రాజు, వివిధ గ్రామాల కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఆదాయాన్ని పెంచుతూ ప్రగతిబాట పట్టిస్తాం

'న్యూస్‌టుడే'తో కమిషనర్ కృష్ణమోహన్

ఆకివీడు, న్యూస్‌టుడే: నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రజలకు వసతులు కల్పించేలా, ఆదాయాన్ని పెంచే దిశగా ప్రణాళికను సిద్ధం చేసినట్లు కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు. చేపట్టనున్న ప్రగతి పనుల వివరాలు ఆయన మాటల్లోనే..

✪ వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు అదనపు విద్యుత్తు మోటార్లను సిద్ధం చేసి, మంచినీటి చెరువులో నీటి నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోనున్నాం.

✪ తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు తదితర మరమ్మతులు మరింత వేగంగా పూర్తిచేయిస్తాం.

✪ పారిశుద్ధ్యం మెరుగుదలకు స్వచ్ఛభారత్ మిషన్ నుంచి 3 కొత్త వాహనాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ వాహనాల్లో ఒక్కో వాహనం రోజుకు వెయ్యి ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించేలా ఏర్పాట్లు చేస్తాం.

✪ అమృత-2 పథకం ద్వారా ఆకివీడులో పూర్తిస్థాయిలో నూతన పైప్‌లైన్లు ఏర్పాటు, సామర్థ్యం గల ఫిల్టర్‌బెడ్లు తదితర ప్రగతి పనులు వచ్చే ఏడాది ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

✪ వర్షాకాలంలో ముంపు, మురుగు సమస్య తలెత్తకుండా వచ్చే ఏప్రిల్, మే నెలల్లో పట్టణం పరిధిలోని మేజర్, మైనర్, మిడియం డ్రెయినేజీలలో పూర్తిస్థాయిలో మట్టి పూడికతీత పనులు పూర్తిచేయించేలా, ఆటంకాలను పూర్తిస్థాయిలో తొలగించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం.

✪ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు కలిపి సుమారు రూ.4 కోట్లతో ఆకివీడులోని 20 వార్డుల పరిధిలోని పలు సీసీ రోడ్లు, సీసీ డ్రెయినేజీలు, కల్వర్టులు తదితర అభివృద్ధి పనులు చేపట్టాం. ఇప్పటికే కొన్ని సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించాం.

✪ ఇప్పటికే 112 వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయించాం. మిగిలిన వాటికి వచ్చే ఏడాది శస్త్రచికిత్సలు చేయిస్తాం.

పల్లెకు పండగ

● ఇది వీరవాసరంలో పిల్లకాలువ రహదారి. సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టుకు చెందిన రైతులు నిత్యం ఈ రహదారి వెంబడి రాకపోకలు సాగిస్తుంటారు. 800 మీటర్ల పొడవైన ఈ రహదారి ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. పల్లె పండగ 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఈ రహదారిని రూ.48 లక్షలతో సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయనుంది.

వీరవాసరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ రహదారుల రూపురేఖలు మారుతున్నాయి. పల్లె పండగ మొదటి విడతలో భీమవరం నియోజకవర్గంలో సుమారు రూ.2.50 కోట్లతో మొత్తం 34 రహదారులను అభివృద్ధి చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండగ 2.0 కార్యక్రమంలో భాగంగా భీమవరం నియోజకవర్గానికి రూ.5.08 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో వీరవాసరం, భీమవరం గ్రామీణ మండలాల్లో మొత్తం 42 అభివృద్ధి పనులు పూర్తి చేయనున్నట్లు పంచాయతీరాజ్ డీఈ స్వామినాయుడు తెలిపారు.

ఎట్టకేలకు రహదారి పనులు ప్రారంభం

ఉండి - గణపవరం రోడ్డులో సాగుతున్న పనులు

ఉండి, న్యూస్‌టుడే: ఉండి-చేబ్రోలు రాష్ట్రీయ రహదారిలో ఎట్టకేలకు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. కోలమూరు-ఆరేడు మధ్య ఈ మార్గం పూర్తిగా ఛిద్రమైపోవడంతో గత రెండేళ్ల నుంచి వాహనచోదకులు, ప్రయాణికులు పడుతున్న వేదన వర్ణనాతీతం. వివిధ ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందగా.. పది మంది క్షతగాత్రులయ్యారు. ఈసమస్యను శీర్షికలు తెలియజేస్తూ గతేడాది అక్టోబరు 6న 'సంతల్లో పడితే గాయాలే', అదే నెల నవంబరు 6న 'రోడ్డంతా గోతులు.. ఎన్నాళ్లీ అవస్థలు', నవంబరు 29న "నన్ను అనొద్దు.. నాకేం పాపం తెలియదు", శీర్షికలతో ఈనాడులో కథనాలను ప్రచురితమయ్యాయి. ఇటీవల కొన్నిచోట్ల రహదారి మరమ్మతు పనులు పూర్తిచేశారు. రూ.5 కోట్ల విలువైన పనులకు తాజాగా టెండర్లు నిర్వహించడంతో వెనువెంటనే పనులు చేపట్టారు. సుమారు 5.42 కిలోమీటర్ల పరిధిలో రహదారి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మిగిలిన చోట్ల మరమ్మతులు జరుగుతాయని ఆర్అండ్‌బీ ఏఈ కె.శ్రీహరిరాజు తెలిపారు.

ప్రముఖుల ఇంట కొత్త ఏడాది కళ

కేకు కోస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా భీమవరం పట్టణంలో గురువారం సందడి కనిపించింది. కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తదితర నాయకులను అధికారులు, అభిమానులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తదితరులు కేంద్ర మంత్రి వర్మను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

భీమవరం అర్బన్, వన్‌టౌన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం 2025లో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలకు మరచిపోలేని సంతోషాలను అందించిందని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త తోట సీతారామలక్ష్మి అన్నారు. గురువారం భీమవరం తెదేపా కార్యాలయంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో సీతారామలక్ష్మి పాల్గొని కేకును కోశారు. అనంతరం 'తొలి అడుగు' కార్యక్రమంలో ఉత్సాహంగా పని చేసిన క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లకు రాష్ట్ర పార్టీ పంపిన జ్ఞాపికలను అందజేశారు.



కాళ్ల, న్యూస్‌టుడే: ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు కార్యాలయంలో ప్రజలకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. వైకాపా ఉండి ఇన్‌ఛార్జి వీవీఎల్ నర్సింహరాజు నాయకులతో కలిసి కేకు కోశారు.

రామరాజుకు శుభాకాంక్షలు చెబుతున్న తెదేపా నాయకులు

త్రినేత్రాయ.. నమఃశివాయ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామి ఆలయంలో నూతన సంవత్సరం తొలిరోజు సందర్భంగా గురువారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, సహస్రనామ పూజలు చేశారు. సాయంత్రం పార్వతీ, అన్నపూర్ణమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు.

పంచాయతీ అధికారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

పెదఅమిరం(కాళ్ల), న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను కలెక్టర్ నాగరాణి గురువారం ఆవిష్కరించారు. పెదఅమిరంలోని కలెక్టర్ బంగ్లాలో నిర్వహించిన వేడుకల్లో డీపీవో రామనాథ్ రెడ్డితో కలిసి క్యాలెండర్‌తోపాటు డైరీలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పాలా శ్రీనివాస్, కోశాధికారి సుందర వెంకటేష్‌తోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి నిధులు

ఈనాడు స్పందన

తోలేరు (వీరవాసరం), న్యూస్‌టుడే: తోలేరు వంతెనకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. పోలమూరు డ్రెయిన్‌పై ఉన్న ఈ వంతెన దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. భారీ వాహనాలపై ఆక్వా ఉత్పత్తులను దీనిపై నుంచి బయటకు తీసుకు రావాలంటే కష్టంగా మారింది. దీనిపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు అధికారులు, నాయకులు స్పందించారు. ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని చొరవతో మంత్రి రామానాయుడు ఇక్కడ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ప్రభుత్వం రూ.3.13 కోట్లు మంజూరు చేసిందని మురుగునీటిపారుదల శాఖ ఏఈ వేంద్ర వెంకటరమణ తెలిపారు. రబీ సాగు ముగిసిన తరువాత పనులు చేపడతామన్నారు. రక్షణ గోడ కూడా నిర్మించనున్నట్లు తెలిపారు.

గణిత క్యాలెండర్ ఆవిష్కరణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరమ్ తయారు చేసిన గణిత క్యాలెండరను డీఈవో ఇ.నారాయణ తన కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. విద్యార్థుల్లో గణితంపై అభిరుచి పెంపొందించేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచనలు ఇవ్వాలన్నారు.

ఇక మరింత విస్తృతంగా లయన్స్ సేవలు

రాయకుదురు(వీరవాసరం), న్యూస్‌టుడే: వీరవాసరం లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేస్తామని అధ్యక్షుడు పోలిశెట్టి సత్యనారాయణ అన్నారు. గురువారం నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రాయకుదురులో 90 నిరుపేద కుటుంబాలకు బియ్యం, దుప్పట్లు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు దేవిరెడ్డి పుల్లారావు, పోలిశెట్టి వెంకట రామకృష్ణ (అబ్బు), ప్రసన్న, శ్రీనివాస్, పంజా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాయం పొందిన వారితో లయన్స్ ప్రతినిధులు

కళ్లతో చూడలేం.. నోటితో తాగలేం

నాచుతో దయనీయంగా ఫిల్టర్ హౌస్

తోలేరు (వీరవాసరం), న్యూస్‌టుడే: తోలేరు ర్యాపిండ్ శాండ్ వాటర్ ఫిల్టర్ పథకం నిర్వహణ తీరు దయనీయంగా ఉంది. ప్రజలకు రక్షిత నీరు సరఫరా చేయాలనే లక్ష్యంతో రూ.లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసి తాగునీటి పథకానికి స్థానిక పంచాయతీ అధికారులు విధిగా నిర్వహణ పనులు చేయకపోవడంతో పథకంలో నీటి శుద్ధి జరిగే ప్రాంతాలు నాచు, మురుగుతో కలుషితంగా మారాయి. చెరువు నీటిని పథకం ద్వారా శుద్ధి చేసి సరఫరా చేస్తున్నా దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి ఫణికుమార్ మాట్లాడుతూ ఫిల్టర్ హౌస్‌లోని ఏరియేటర్ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తానన్నారు.

ప్రమాదకరంగా స్తంభం

రాయకుదురు(వీరవాసరం), న్యూస్‌టుడే: చింతలకోటిగరువు జిల్లా పరిషత్ రహదారి వెంబడి విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఉంది. రహదారిపైకి ఒరిగి పోవడంతో అది కూలిపోయి ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ అప్పారావు మాట్లాడుతూ స్తంభాన్ని పరిశీలించి మరమ్మతులు చేయిస్తానన్నారు.

అంచు..ఆదమరిస్తే ముంచు

కోలనపల్లి(కాళ్ల), న్యూస్‌టుడే: కాళ్ల మండలం కోలనపల్లి మలుపు ప్రమాదకరంగా మారింది. ఆకివీడు నుంచి కుప్పనపూడి మీదుగా కాళ్ల వెళ్లే ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. కొత్తవారెవరైనా ఇటువైపు వస్తే ప్రమాదానికి గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రహదారి అంచు రెండు అడుగుల లోతులో ఉండటంతో తరచూ ఇబ్బందులు పడుతున్నామని వాహన చోదకులు చెబుతున్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో న్యాయమూర్తులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలోని పలుచోట్ల జరిగిన కార్యక్రమాల్లో న్యాయమూర్తులు పాల్గొని నూతన సంవత్సర వేడుక నిర్వహించారు. ✦ భీమవరం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవా సంస్థ ఛైర్మన్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ భీమవరం ప్రత్యేక ఉపకారాగారాన్ని సందర్శించారు. ముద్దాయిలతో కేకు కోయించి పండ్లు పంచారు. న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమత లేకపోతే సంస్థ తరపున ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ✦ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) జి.సురేష్ బాబు పార్కు పక్కన ఉన్న నిరాశ్రయుల ఆశ్రమంలో వృద్ధులతో కేకు కోయించారు. ✦ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి తాడేరులోని వృద్ధాశ్రమంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు ✦ ఒకటో అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పి.హనీష పట్టణంలోని బీసీ కళాశాల విద్యార్థినులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రత్యేక ఉపకారాగారాన్ని పరిశీలిస్తున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి లక్ష్మీనారాయణ

పార్కు పక్కన ఉన్న నిరాశ్రయుల ఆశ్రమంలో వృద్ధులతో కేకు కోయిస్తున్న న్యాయమూర్తి సురేష్‌బాబు

వృద్ధురాలితో మాట్లాడుతున్న న్యాయమూర్తి సుధారాణి

బీసీ వసతిగృహ విద్యార్థినులతో న్యాయమూర్తి హనీష

లక్ష్యానికి.. కళలు తోడుగా

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: చిన్నతనం నుంచే వివిధ కళలపై ఆసక్తి పెంచుకుంటున్న వారి ప్రతిభకు తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడైంది. దీంతో తమ లక్ష్యాలను సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు ఈ బాలలు. కూచిపూడి, భరత నాట్యం, జానపదం, చిత్రలేఖనం, కరాటే ఇతర పోటీల్లో రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రదర్శనలిస్తూ తమ సత్తా చాటుతున్నారు.

☆ భీమవరానికి చెందిన బత్తుల జాహ్నవిరాజ్ ఏడో తరగతి చదువుతోంది. కూచిపూడి నృత్యంలో సుమారు 110కి ప్రదర్శనలు ఇచ్చి 30 పురస్కారాలు, 10 జ్ఞాపికలు, 60 ప్రశంసా పత్రాలు సాధించింది. నిత్యం కొంత సమయం నృత్యం, కరాటే శిక్షణకు కేటాయిస్తూ మరిన్ని మెలకువలు నేర్చుకుంటోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కరాటేలో బ్లూ బెల్ట్ సాధించింది. చిత్రలేఖనంలో రాష్ట్ర స్థాయి పోటీలో ప్రథమ బహుమతి అందుకున్న తాను భవిష్యత్తులో నృత్యంలో డిప్లొమో పూర్తి చేయడంతోపాటు ఐపీఎస్ అధికారి కావాలన్నదే లక్ష్యమని తెలిపింది.

☆ చదువుతో పాటు కూచిపూడి నృత్యంలోనూ ప్రతిభను చాటుతున్న పడవల లిఖిత అక్షయసాయిశ్రీ భారతీయ విద్యా భవన్స్‌లో ఒకటో తరగతి చదువుతోంది. కూచిపూడి నృత్యం, జానపదం, కరాటే, ఈత, చిత్రలేఖనంలో పలు అవార్డులు సాధించింది. ఐదేళ్ల వయసు నుంచే 50కిపైగా ప్రదర్శనలిచ్చి ప్రశంసలు అందుకుంది. నృత్య శిక్షకురాలు ఎస్‌టీపీ లక్ష్మీస్వరూప దగ్గర మెలకువలు నేర్చుకుంటూ ప్రదర్శనలిస్తుంది. నృత్య కళాకారిణిగా గుర్తింపు పొంది, ఐఏఎస్‌కు ఎంపికై సేవలందించాలన్నదే తన లక్ష్యమని చెబుతుంది.

చిన్నారులే కదా అని నిర్లక్ష్యమా..

పూర్తికాని మరుగుదొడ్డి నిర్మాణం

పెదకాపవరం(ఆకివీడు), న్యూస్‌టుడే: ఆకివీడు మండలం పెదకాపవరంలోని 31వ నెంబర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద మరుగుదొడ్డి వసతి లేక చిన్నారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏడాది క్రితం ఈ కేంద్రం ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నుంచి రూ.36 వేలు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా మరో రూ.24 వేలు మొత్తం రూ.60 వేలు మంజూరయ్యాయి. అయితే ఇప్పటికీ నూరుశాతం నిర్మాణ పనులు పూర్తికాలేదు. మరుగుదొడ్ల వినియోగంలోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయాన్ని సీడీపీవో వాణీవిజయరత్నం దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా వెంటనే పనులు పూర్తిచేయిస్తామని చెప్పారు.

బీరు సీసాతో యువకుడిపై దాడి

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. వీరవాసరంలో ఎం.రాజేష్ అనే యువకుడిపై అదే ప్రాంతానికి చెందిన మరో యువకుడు బీరు సీసాతో దాడి చేశాడు. ఈ దాడిలో రాజేష్ పొట్ట భాగంలో గాయమైంది. రాత్రి 2 గంటల సమయంలో 108 సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని వివరాలు సేకరిస్తున్నామని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. బలుసుగొయ్యపాలెం, నందమూరుగరువు గ్రామాల్లో ఇరువర్గాల మధ్య స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి.

మావుళ్లమ్మ సేవలో ఎమ్మెల్యే బొలిశెట్టి

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గురువారం రాత్రి మావుళ్లమ్మను దర్శించుకున్నారు. ఆయనతో ఉప ప్రధానార్చకుడు, వేదపండితుడు ప్రత్యేక పూజలు చేయించి అమ్మవారి ఆశీర్వాదం అందించారు. ఆలయాధికారి నగేష్ శేషవస్త్రం, ప్రసాదం అందించారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, జనసేన ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

హమ్మయ్య... రూపురేఖలు మారాయి

కింది అంతస్తులో పూర్తయిన పనులు

శృంగవృక్షం(పాలకోడేరు), న్యూస్‌టుడే: శృంగవృక్షం పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న గ్రామ మహిళా సమాఖ్య భవనం రూపురేఖలు మారుతున్నాయి. వైకాపా ప్రభుత్వం హయాంలో సుమారు రూ.40 లక్షల వ్యయంతో రెండంతస్తుల భవనం నిర్మాణ చేపట్టారు. శ్లాబులు వేసిన అనంతరం నిధులు విడుదల కాకపోవడంతో గుత్తేదారు పనులను మధ్యలోనే నిలిపివేయడంతో రెండేళ్ల నుంచి అసంపూర్తిగానే ఉంది. ఎట్టకేలకు ఉపసభాపతి రఘురామకృష్ణ రాజు చొరవతో పనుల్లో మళ్లీ కదలిక వచ్చింది. మండల పరిషత్ నిధులతో పాటు స్థానిక డ్వాక్రా సంఘాల సహకారంతో కింది అంతస్తులో మిగిలిపోయిన పనులను పూర్తిచేశారు. దీంతో సమావేశాలు, శిక్షణ తరగతుల నిర్వహణకు ఇబ్బందులు తప్పాయని స్థానిక డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే మిగతా పనులు కూడా పూర్తిచేస్తామని స్థానిక సొసైటీ ఛైర్మన్ కలిదిండి బుజ్జి తెలిపారు.

చేయి చేయి కలిపి .. కాలువను అభివృద్ధి పరిచి!

ఆరేడు(ఉండి), న్యూస్‌టుడే: తమ చెరువులతో పాటు గ్రామంలో ఇళ్ల చుట్టూ మురుగునీరు నిలిచిపోకుండా శాశ్వత మార్గాన్ని చూపించారు ఆరేడు రైతులు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల నుంచి ఎస్సీ కాలనీ మీదుగా గణపవరం రహదారిలోని చెక్‌పోస్టు వరకూ కొన్ని దశాబ్దాల నుంచి డ్రెయిన్(మురుగు కాలువ) ఆక్రమణలు, వ్యర్థాలతో పూడిపోయింది. గత అక్టోబరులో కురిసిన అధిక వర్షాలకు మురుగు ఎగదన్నడంతో అనేక ఇబ్బందులు తలెత్తాయి. ప్రధాన వీధుల్లో మురుగు పారుదల వ్యవస్థకు తీవ్ర అవరోధాలు తలెత్తడంతో కాలనీ ప్రజలు తాము పడుతున్న ఇబ్బందులను స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు, రైతులతో చర్చించిన ఆయన మురుగునీటి పారుదలకు అవరోధాలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ దశలో సాగుదారులంతా ఒకే మాట.. ఒకే బాటగా కదిలారు. తలో కొంత చందాలేసుకొని డ్రెయిన్ ప్రక్షాళన పనులకు శ్రీకారం చుట్టారు. అలా తీసిన మట్టిని కొంతవరకూ బయటకు తరలించారు. ఇరువైపులా గట్లను పటిష్ఠ పరిచారు. డ్రెయిన్‌లో మురుగునీరు సాఫీగా ముందుకెళ్లేలా కృషి చేసిన రైతులకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

చెరువు బాగుపడింది

ప్రక్షాళన అనంతరం చెరువు

గొల్లలకోడేరు(పాలకోడేరు), న్యూస్‌టుడే: గొల్లలకోడేరులో పురాతన బ్రాహ్మణ చెరువు ఎట్టకేలకు బాగు పడింది. ఒకప్పుడు స్థానికుల తాగునీరు అవసరాలను తీర్చిన ఈ చెరువు నిర్వహణలోపంతో మురుగు గుంటగా మారిపోయింది. పంచాయతీ కూడా పట్టించుకోకపోవడంతో చెరువు అంతా పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగిపోయి చిట్టడవిని తలపించింది. ఈ దుస్థితిపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురించడంతో ఉపసభాపతి రఘురామకృష్ణరాజు స్పందించి ప్రక్షాళనకు ఆదేశించారు. స్థానిక ఖాదర్ రొయ్యల ఫ్యాక్టరీ ముందుకు రావడంతో స్థానిక కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఇటీవలే చెరువు ప్రక్షాళన పనులు పూర్తిచేశారు. దీంతో చెరువుకు పూర్వవైభవం సంతరించుకుందని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీరు అవసరాలకు చెరువును వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

పంజావేమవరం (వీరవాసరం), న్యూస్‌టుడే: పంజావేమవరం గ్రామ దేవతలు పద్దాలవెంకమ్మ, సత్తెమ్మ అమ్మవార్ల జాతర సందర్భంగా గురువారం ఆలయ ప్రాంగణం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వాకల వీరవేణి, వసంతలక్ష్మి, సత్యరుక్మిణిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఎంపీటీసీ సభ్యురాలు పంజా మంగతాయారు, నాగలక్ష్మి, వరలక్ష్మిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి బహుమతులు అందజేశారు.

CHANGE OF NAME
I, JAKKAMSETTY SATYA NAGARAJU S/o. Someswara Rao , Resident D.No. 2-38, Tamara Cheruvu Gattu, Near Ramalayam, Pennada Agraharam Village, Palakoderu Mandal, W.G.Dist, AP, 534243. I have Changed my Name from **JAKKAMSETTY SATHYANAGA RAJU** (OLD NAME) to **JAKKAMSETTY SATYA NAGARAJU** (NEW NAME). Hence forth I am being called as **JAKKAMSETTY SATYA NAGARAJU** NEW NAME) for all purposes.

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

పెనుమదంలో మహారుద్రయాగం

పోడూరు, న్యూస్‌టుడే: పెనుమదంలో కొలువైన ఉమాఅగస్త్రేశ్వరస్వామి ఆలయంలో గురువారం మహారుద్రయాగం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ నిట్లల ఫణిభాస్కర శర్మ పర్యవేక్షణలో 30 మంది దంపతులచే వేద మంత్రోచ్చారణలతో రుద్రయాగం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 3వ తేదీన శివ ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని యాగం తలపెట్టారు. దీనిలో భాగంగా ఉమా అగస్త్రేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. విఘ్నేశ్వరుని పూజ, మంటపారాధన, మహన్యాసము, మహారుద్రాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం, దత్తహోమం, మేధాదక్షిణామూర్తి హోమం నిర్వహించారు. ఉదయం 7గంటలకు పూజలు ప్రారంభించి రాత్రి 7గంటలకు నిర్వహించారు.

స్వామివార్ల కల్యాణానికి ఏర్పాట్లు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు క్షీరరామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో పార్వతీ సమేత స్వామివారు, లక్ష్మీ సమేత జనార్దన స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలపై పాలకవర్గం సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మీసాల రామచంద్రరావు మాట్లాడుతూ మార్చి 23 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు ఇప్పటి నుంచి చేపట్టాలన్నారు. కల్యాణంలో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలన్నారు.

కనకదుర్గమ్మా.. కరుణించమ్మా..

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు నూతన సంవత్సరం సందర్భంగా పాలకొల్లు మండలంలో పలు ఆలయాలు పూలతో అలంకరించారు. భక్తులు పూజలు చేయించుకుని దర్శించుకున్నారు. ఉల్లంపర్రు కనకదుర్గమ్మను వివిధ రకాల పుష్పాలతో నేత్రపర్వంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా నరసాపురం పట్టణంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివాలయాల్లో, సాయిబాబా ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. సాయిబాబా ఆలయాల్లో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

పంచాయతీ అధికారుల కాలమానిని ఆవిష్కరణ

పెదఅమిరం(కాళ్ల), న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ నాగరాణి గురువారం ఆవిష్కరించారు. పెదఅమిరంలోని కలెక్టర్ బంగ్లాలో నిర్వహించిన వేడుకల్లో డీపీవో రామనాథ్ రెడ్డితో కలసి క్యాలెండర్‌తోపాటు డైరీలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పాలా శ్రీనివాస్, కోశాధికారి సుంకర వెంకటేష్‌తోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

చదువు చెప్పిన పాఠశాలకు చేయూత

పెనుగొండ గ్రామీణ, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం డివిజన్ పరిధిలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో దాతల సహకారంతో కొన్ని వసతులు సమకూరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనేక సరస్వతీ నిలయాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొంతమంది దాతలు, పూర్వ విద్యార్థులు ఐక్యంగా ఆదుకు ముందుకొచ్చి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడానికి కృషిచేశారు. తరమా పూర్వ విద్యార్థులు సమావేశమై పాఠశాలలోని సమస్యలు తెలుసుకుని చేయూతను కలిపి వాటిని పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తున్నారు.

ఇలపర్రు హైస్కూలుకు విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో సర్పంచి దండు పద్మావతి రూ.1,85,000 విలువైన ఆర్వో ప్లాంట్‌ను గత నెల నవంబరులో పాఠశాలకు బహూకరించారు.

దేవ జిల్లా పరిషత్ పాఠశాలలో 1991-92 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సైకిల్ షెడ్డు నిర్మించి ఇచ్చారు.

సిద్ధాంతం హైస్కూల్‌లో 1997-98 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్వచ్ఛమైన మంచినీరు అందించాలని ఉద్దేశంతో రూ.1,70 లక్షలతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు.

నరసాపురం మండలం యర్రంశెట్టి పాలెం జడ్పీ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు పాలపర్తి శ్రీనివాస్ రూ.1,80,000 నిధులతో కళావేదిక నిర్మించి ఇచ్చారు. ఇదే పాఠశాలలో వైర్ బ్యాక్ స్వచ్ఛంద సంస్థ రూ.70 వేల నిధులతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	:80085 74504	ఆచంట	:90631 44737
పాలకొల్లు	:80085 74510	పెనుగొండ	:80085 74469
పోడూరు	:90631 44741	పెనుమంట్ర	:91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? పట్టణంలోని మిసమ్మ ఆసుపత్రి పక్క రోడ్డులో డ్రెయిను పూడిక సక్రమంగా తొలగించడం లేదు. **- ఎస్. రామచంద్రరావు, నరసాపురం.**
✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ? స్థానిక త్సవటపల్లి వారి వీధిలో కొన్ని రోజులుగా డ్రెయిన్లు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉంటోంది. **- రవి**
✔ శుభ్రం చేయిస్తాం. **- లక్ష్మణ్, ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య కార్మికుడు.**

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ? పూలపల్లి మసీద్ వీధిలో డ్రెయినేజీలో పూడిక తొలగించడం లేదు. దీంతో దుర్వాసన, దోమలబెడద భరించకలేకపోతున్నాం. **ప్రదీప్, స్థానికుడు.**
✔ పూడిక తీయిస్తాం. **- శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి**

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? గ్రామంలోని ఆదర్శనగర్ ప్రాంతంలో పలు విద్యుత్తు దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- ఏడుకొండలు**
? విద్యుత్తు దీపాల మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. **- మహేశ్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, మొగల్తూరు.**

నరసాపురం, న్యూస్‌టుడే: ? పట్టణంలోని పంజా సెంటరు ప్రాంతంలో చెత్త సక్రమంగా తరలించడం లేదు. **- శివశంకర్**
✔ చెత్త తరలించేందుకు చర్యలు చేపడతాం.
- జీవీఎస్ఎస్ పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

గణిత క్యాలెండర్ ఆవిష్కరణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరమ్ తయారు చేసిన గణిత క్యాలెండర్‌ను డీఈవో ఇ.నారాయణ తన కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. విద్యార్థుల్లో గణితంపై అభిరుచి పెంపొందించేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచనలు ఇవ్వాలన్నారు.

పుస్తకాలు అందిస్తున్న ప్రభుత్వ విప్ నాయకర్

కొమ్ముచిక్కాలలో..

కొత్త ఏడాదికి శుభస్వాగతం

యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం జరిగాయి. ఎంపీడీవో జీ.డీ.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులే దేశ భవిష్యత్తు, వారికి అన్ని విధాలా నా సహకారం ఉంటుందని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. నరసాపురం పట్టణం స్టేషన్ పేటలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. అనంతరం చిన్నారులతో కలిసి భోజనం చేశారు.

★ నరసాపురం పట్టణం, మొగల్తూరు మండలంలోని గ్రామాల్లో గురువారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ఆయన ఇంటి వద్ద ప్రజలకు కేకు కోసి పంపిణీ చేశారు.

పోడూరు, న్యూస్‌టుడే: కొమ్ముచిక్కాలలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ గృహంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.

పట్టాదారు పాస్‌పుస్తకాలు వచ్చేశాయి

పెనుగొండ, పాలకొల్లు, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: భూ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో రీసర్వే నిర్వహించింది. వివాదాల పరిష్కారం అనంతరం నిర్దేశించిన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించేందుకు రంగం సిద్ధం చేసింది. శుక్రవారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించాలని కార్యాచరణ రూపొందించింది.

మండలాల వారీగా	
ఆచంట	397
పెనుగొండ	7,094
పోడూరు	684
పెనుమంట్ర	199
పాలకొల్లు	2,072
నరసాపురం	427

నరసాపురం డివిజన్‌లో సుమారు 32 వేల పాస్‌పుస్తకాలు పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఇవి కనిపించలేదా?

రోడ్లు వేసి స్తంభాలు తొలగించని వైనం

నరసాపురం గ్రామీణ, మొగల్తూరు, న్యూస్‌టుడే: నరసాపురం మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు విస్తరించి అభివృద్ధి చేశారు. అయితే రోడ్లకు ఆనుకొని ఉన్న విద్యుత్తు స్తంభాలను అలాగే వదిలేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. స్తంభాలను తొలగించేందుకు సంబంధిత ర.భ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

నరసాపురంలో...

☛ చిట్టవరం గ్రామంలో ప్రధాన రహదారి చెంత పెదపాలెం, పెదపేట ప్రాంతంలో సీసీ రహదారి చెంత విద్యుత్తు స్తంభాలను తొలగించలేదు. ☛ సారవ గ్రామ పరిధిలో విద్యుత్తు స్తంభాలను తొలగించకుండానే రహదారి నిర్మాణం చేయడంతో అవి ప్రమాదకరంగా మారాయి.

☛ ఎల్బీచర్ల ప్రధాన కూడలిలో ప్రధాన రహదారిపై తొలగించకుండా వదిలేసిన విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి.

☛ నరసాపురం వయా మత్స్యపురి భీమవరం ప్రధాన రహదారిలో చినమామిడిపల్లి-సరిపల్లి గ్రామాల మధ్య విద్యుత్తు స్తంభాలు తొలగించకుండా అలాగే వదిలేశారు.

మొగల్తూరు మండలంలో.. ముత్యాలపల్లి నుంచి పేరుపాలెంలోని కనకదుర్గ బీచ్ వరకూ ఉన్న ఆర్ అండ్ బీ రహదారిని రెండు వరుసలుగా నిర్మించారు. ఈ రహదారికి చెంత ఉన్న విద్యుత్తు స్తంభాలు మార్పు చేయలేదు. దీంతో వాహన చోదకులు తరచూ విద్యుత్తు స్తంభాలకు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు.

చర్యలు చేపడతాం.. రహదారులను ఆనుకుని ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించేందుకు విద్యుత్తుశాఖకు సొమ్ములు చెల్లించాం. ఈ నెలాఖరులోగా ఎల్బీచర్ల, సారవ, లక్ష్మణేశ్వరం, నరసాపురం వయా మత్స్యపురి ప్రధాన రహదారితో పాటు పలు గ్రామాల్లోని విద్యుత్తు స్తంభాలను ఈ నెలఖారు నాటికి తొలగించేందుకు చర్యలు చేపడతాం. **- జీవీఎస్ కిరణ్ కుమార్, రహదారులు భవనాలశాఖ, డీఈ, నరసాపురం.**

రాళ్లు లేచిన రహదారితో అవస్థలు

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు నుంచి కాపవరం వెళ్లి రహదారి అధ్వానంగా ఉంది. రెండు కిలో మీటర్లు రహదారి గుంతలమయంగా, రాళ్లు లేచిన మార్గంలో ప్రయాణించాలంటే పలు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారుల ఎదురుగా వాహనం వస్తే గోతుల కారణంగా తప్పించి క్రమంలో రాత్రి సమయంలో వీధి దీపాలు వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ మూర్తి వివరణ కోరగా నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

కాలువను కమ్మేసిన తూడు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: మల్లవరం నుంచి కొప్పర్రు మీదుగా మొగల్తూరు వెళ్లే మురుగు కాలువలో మల్లవరం కాలిబాట వంతెన వద్ద డెక్క కమ్మేసింది. దీంతో పొలాల్లోని మురుగునీరు ముందుకు సాగని పరిస్థితి నెలకొందని అన్నదాతలు వాపోతున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వితరణ

పోడూరు, న్యూస్‌టుడే: మినిమించిలిపాడులో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న ముగ్గురు కార్మికులకు సర్పంచి రామన వీర్రాజు గురువారం నూతన వస్త్రాలు అందజేశారు.

యలమంచిలి, న్యూస్‌టుడే: సీఎం నారా చంద్రబాబు నాయుడు పేదలకు సాయం చేయాలనే ఆలోచన ఎంతో గొప్పదని జెడ్పీ మాజీ ఛైర్మన్ కొక్కిరిగడ్డ జయరాజు అన్నారు. మండలంలోని ఊటాడలో సీఎం చంద్రబాబు పిలుపు మేరకు నూతన సంవత్సరం సందర్భంగా వృద్ధులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు.

దురలవాట్లతో భవిష్యత్తు అంధకారం

నరసాపురం, న్యూస్‌టుడే: దురలవాట్లతో భవిష్యత్తు అంధకారం అవుతుందని, సత్ప్రవర్తన అలవరుచు కోవాలని శక్తిటీమ్, పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి సూచించారు. డీఎస్పీ జి.శ్రీవేదఅరవింద ఆధ్వర్యంలో గురువారం శక్తిబృందం పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో వీధుల్లో తిరుగుతూ విద్యార్థినులు, మహిళలను వేధిస్తున్న పలువురు యువకులను స్టేషన్‌కు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రవర్తనలో మార్పు లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తా : జుత్తిగ

ఉండి, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని ఆ సంస్థ నూతన ఛైర్మన్ జుత్తిగ నాగరాజు తెలిపారు. మహదేవపట్నంలోని తన నివాసంలో గురువారం నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పాటుపడతానని వివరించారు.

నేటి నుంచి గ్రామసభలు

పెనుగొండ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ గ్రామసభలను ఆయా సచివాలయాల్లో శుక్రవారం నుంచి ఈనెల 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జి.అనితాకుమారి గురువారం తెలిపారు. పెనుగొండ మండలంలో గ్రామాల్లో ఈ నెల 2వ తేదీన పెనుగొండ, కొఠాలపర్రు, 3వ తేదీన మునమర్రు, తామరాడ, 5వ తేదీన వడలి, 6వ తేదీన వెంకట్రామపురం, ఇలపర్రు గ్రామాల్లో జరుగుతాయన్నారు. 2వ తేదీ ఉదయం 10 గంటలకు పెనుగొండ సచివాలయంలో నిర్వహించనున్న గ్రామ సభకు ముఖ్య అతిథిగా ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పాల్గొని రైతులకు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తారన్నారు

ఆచంట, న్యూస్‌టుడే: భూముల యజమానులకు ఆచంట మండలంలో శుక్రవారం నుంచి ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు ఇన్‌ఛార్జి తహసీల్దార్ సోమేశ్వరరావు తెలిపారు. మండలంలోని కందరవల్లి గ్రామంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శుక్రవారం పంపిణీ ప్రారంభిస్తారన్నారు.

ఏ కాలమైనా సకాలంలో అందదు

యూరియా కోసం రైతుల ఎదురుచూపులు

ఆచంట, న్యూస్‌టుడే: పంటకాలం ఏదైనా సరే కర్షకులకు ఎరువుల కష్టాలు తప్పడం లేదు. మృత్యుంజయ విశాల సహకార సంఘం ఎరువుల దుకాణానికి 25 టన్నులు యూరియా లోడు రాగా ఒక్క రోజులో ఖాళీ అయిపోయింది. ఇది డెల్టాలో యూరియాకు ఉన్న డిమాండుకు ఉదాహరణ. సహకార సంఘాల వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం బస్తా రూ.266కు విక్రయిస్తున్నారు. దీంతో రైతులు యూరియా బస్తాలకు ఎగబడుతున్నారు.

సహకార సంఘం వద్ద బారులు తీరిన రైతులు

ఎందుకింత డిమాండ్.. డివిజన్‌లోని ఆచంట, నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల్లో రబీ నారుమళ్లు పూర్తయ్యాయి. ఇప్పుడిప్పుడే నాట్లు పడుతున్నాయి. డెల్టాలో వరి పంటకు ఎకరానికి 3 బస్తాల యూరియా వ్యవసాయాధికారులు సిఫార్సు చేసినా 4 బస్తాలు వరకూ వినియోగిస్తారు. ఉదాహరణకు ఆచంట మండలానికి రబీలో 1830 టన్నులు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకూ 400 టన్నులు విక్రయించారు. మరో 160 టన్నులు సిద్ధంగా ఉన్నాయి.

ధరల్లో వ్యత్యాసం.. రైతులు ఎరువుల డీలర్ల వద్ద యూరియాకు అధిక ధర చెల్లించవలసి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా గ్రామాల్లో రైతులు, మరీ ముఖ్యంగా కౌలు రైతులు ఎరువులు, పురుగుమందులు అరువు తీసుకుంటారు. అధిక ధర, వడ్డీలు కలిపి భారం అవుతోంది.

భవిష్యత్తులో మార్పులు.. భవిష్యత్తులో పంట నమోదు ప్రకారమే రైతులకు ఎరువులు కేటాయించేలా ప్రభుత్వం సంస్కరణలు తీసుకురాబోతోంది. అందుకు జిల్లాలో తాడేపల్లిగూడెం ప్రాంతంలో ప్రాజెక్టు కూడా ప్రారంభించింది. యూరియా విక్రయాలు గురించి వ్యవసాయ సహాయ సంచాలకులు మురళీకృష్ణను సంప్రదించగా వదంతులు నమ్మవద్దని, అవసరమైన యూరియా సరఫరా చేస్తామన్నారు. యూరియా డీలర్లు ఎవరైనా నిర్ణయించిన ధరకంటే ఎక్కువ అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని యువకుడికి గాయాలు

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై పాలకొల్లు నుంచి పూలపల్లి వెళ్తున్న యువకుడు మద్యం మత్తులో అతివేగంతో వచ్చి అయ్యప్ప స్వామి ఆలయ సమీపం వద్ద ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో వాహనంపై యువకుడికి తీవ్రగాయాలవ్వడంతో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో ఎటువంటి కేసు నమోదు కాలేదన్నారు.

రహదారి ప్రమాదంలో ఒకరికి..

పెనుమంట్ర, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన పెనుమంట్రలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పొలమూరు గ్రామానికి చెందిన వి.శివప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. అత్తిలి నుంచి బ్రహ్మణ చెరువుకు ద్విచక్రవాహనంపై వస్తున్న ప్రసాద్‌ను వెంకటేశ్ అనే యువకుడు అత్యంత వేగంగా బైక్‌తో ఢీకొట్టడంతో ప్రసాద్ తల, కాలు, చేతికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు వివరాలు సేకరించారు.

కోడిపందేల స్థావరంపై దాడి

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: నరసాపురం గ్రామీణ మండలం తూర్పుతాళ్లలో గురువారం తెల్లవారుజామున ఫ్లడ్‌లైట్ల వెలుగులో నిర్వహిస్తున్న కోడిపందాల స్థావరంపై దాడి చేశామని ఎస్సై జి.వాసు తెలిపారు. ఈ దాడిలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1050లు, కోడి, కోడి కత్తి స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో వీరంగం

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో బుధవారం అర్ధరాత్రి మద్యం మత్తులో వ్యక్తి వీరంగం సృష్టించాడు. దీనికి సంబంధించి ఆసుపత్రి వైద్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒంటిపై గాయాలతో స్పృహలో లేని మొగల్తూరుకు చెందిన సాయికృష్ణను అతని బంధువులు సోదరులు ఆసుపత్రికి తీసుకువచ్చారు. అర్ధరాత్రికి స్పృహలోకి వచ్చిన ఆ వ్యక్తి ఆసుపత్రి సిబ్బందిపై దాడికి ప్రయత్నించడంతోపాటు తాను ఉరి వేసుకుని, కత్తితో పొడుచుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో ఆసుపత్రి సిబ్బంది భయభ్రాంతులకు గురై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేశారు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు.

చీకటి దారిలో ఇక్కట్లు

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై దొంగరావిపాలెం సమీపంలో రోడ్ కటింగ్ వద్ద దీపాలు వెలగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో సాయంత్రం వేళల్లో ప్రయాణికులు హైదరాబాద్, విజయవాడకు వెళ్తుంటారు. దీపాలు వెలగకపోవడం వల్ల బస్సులు కోసం వేచి చూసే ప్రయాణికులకు వేగంగా వచ్చే వాహనాలతో ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి లైట్లు బాగు చేయించాలని కోరుతున్నారు.

మార్పు మంచికే.!

ఉపాధి హామీ పథకంలో పనిదినాల పెంపు

పెనుగొండ, న్యూస్‌టుడే: నియోజకవర్గాల్లోని పలు మండలాలకు చెందిన పల్లెల్లో శ్రామికులు ఖరీఫ్, రబీ సీజన్ ముగిసిన తరువాత పనుల్లేక వలసలు వెళ్లేవారు. 2005లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇటువంటి వారికి పనులు కల్పించి ఆర్థికంగా తోడ్పాటు అందించింది. ఈ పథకం పేరును వీబీ-జీ రామ్‌జీ(వికసిత్ భారత్ రోజ్ గార్, ఆజీవికా హామీ మిషన్(గ్రామీణ్)గా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో బిల్లును ఆమోదించింది. ఇప్పటి వరకూ వేతన దారులకు ఏడాదిలో 100 రోజులు పని కల్పించారు. కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.307 లభించేది. ప్రస్తుతం జాబ్‌కార్డులకు 125 పనిదినాలు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీని వల్ల అదనపు ఆదాయం సమకూరనుంది. ఉపాధి హామీ పథకంలో కాలువలు, చెరువుల శుభ్రత, గ్రామాల్లో తుప్పల తొలగింపు, మొక్కలు నాటే పనులు, భవనాలు, రహదారులు, డ్రెయినేజీల నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నారు.

మండలం	జాబ్ కార్డులు	వేతన శ్రామికులు
ఆచంట	7,836	13,355
పెనుగొండ	6,956	10,315
పెనుమంట్ర	7,465	11,797
పోడూరు	7,688	11,969
పాలకొల్లు	7,795	12,477
నరసాపురం	10,578	17,277

త్వరలో అమల్లోకి.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్పుతో పాటు, కూలీలకు పనిదినాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో త్వరలోనే ఇది అమల్లోకి రానుంది. వ్యవసాయ పనుల్లేనప్పుడు గ్రామాల్లో పేద ప్రజల జీవనానికి ఈ పనులే ఆధారం. పని దినాల పెంపు వీరికి ఉపయోగకరంగా ఉంటుంది.
- కేసీహెచ్ అప్పారావు, డ్వామా పీడీ, భీమవరం

వీధులన్నీ చెత్తమయం

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలో చెత్తసమస్య జటిలంగా మారింది. పారిశుద్ధ్య నిర్వహణ గాడితప్పింది. డంపింగ్ యార్డు సమస్య కొలిక్కి రాలేదు. ఇళ్లు, వ్యాపార దుకాణాలు, సంస్థలు, రహదారులపై నుంచి సేకరించిన చెత్త వేసేందుకు జాగా కోసం అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో పట్టణంలో ఏ వీధిలో చూసినా మేటవేసిన చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి.

సేకరించిన భూమిలో.. డంపింగ్‌యార్డుకు గతంలో మూడు పర్యాయాలు మూడు ప్రాంతాల్లో స్థలం సేకరించారు. 2014లో 12వ ఆర్థికసంఘం నిదులు రూ.26.25లక్షలతో వేములదీవిలో 5ఎకరాల భూమి సేకరించారు. ఆ భూమి నల్లీక్రీక్ గర్భంలో ఉంది. దీంతోపాటు అక్కడ చెత్త వేయడాన్ని స్థానికులు అడ్డుకున్నారు. సుమారు రెండేళ్ల కిందట రుస్తుంబాద పంచాయతీ మండావారితోట సమీపంలో గ్రామస్థుల అభిప్రాయానికి వ్యతిరేకంగా సుమారు రూ.3.45 కోట్లతో 4.20 ఎకరాల భూమి సేకరించారు. ఆవాసాలకు సమీపంలో ఉన్న ఆ భూమిలో చెత్త వేయొద్దని ఆ ప్రాంతవాసులు అడ్డుకున్నారు. తుంగపాటివారి చెరువులో చెత్త వేయడాన్ని వారు అడ్డుకున్నారు.

పట్టణంలో
జనాభా: 65 వేలు,
రోజూ సేకరించే చెత్త 35 టన్నులు, పారిశుద్ధ్య కార్మికులు: 123 మంది

ఏరియా ఆసుపత్రి వద్ద మేట వేసిన వ్యర్థాలు

రహదారుల పక్కనే .. గత కొన్ని రోజులుగా గుంటూరుకు రోజుకు ఒక వాహనంలో మాత్రమే చెత్త తరలిస్తున్నారు. చెత్త తరలించకపోవడంతో పట్టణంలో ఏ ప్రాంతంలో చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. వాటినుంచి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు పెరుగుతున్నాయి. వాటిల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలు గాలికి రహదారులపైకి, ఇళ్లల్లోకి చేరుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

హరిత ట్రైబ్యునల్ తీర్పు అమలుతో.. సీఆర్‌జడ్ పరిధిలోని గోదావరి తీరంలో చెత్త వేయొద్దని, ఇప్పటికే వేసిన చెత్తను గతేడాది డిసెంబరు 3లోపు తొలగించాలని హరిత ట్రైబ్యునల్ మద్రాసు సదరన్ బెంచ్ తీర్పిచ్చింది. దీంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

పరిష్కారం చూపుతా.. నరసాపురం కమిషనర్‌గా రెండ్రోజుల కిందట బాధ్యతలు స్వీకరించిన ఆర్.వెంకటరామిరెడ్డి తీసుకోబోయే చర్యలపైనే సమస్య పరిష్కారం కానుందని పట్టణవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అందరి సహకారంతో పట్టణంలో చెత్త సమస్యకు పరిష్కారం చూపుతానని కమిషనర్ తెలిపారు.

బీరు సీసాతో యువకుడిపై దాడి

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. వీరవాసరంలో ఎం.రాజేష్ అనే యువకుడిపై అదే ప్రాంతానికి చెందిన మరో యువకుడు బీరు సీసాతో దాడి చేశాడు. ఈ దాడిలో రాజేష్ పొట్ట భాగంలో గాయమైంది. రాత్రి 2 గంటల సమయంలో 108 సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని వివరాలు సేకరిస్తున్నామని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. బలుసుగొయ్యపాలెం, నందమూరుగరువు గ్రామాల్లో ఇరువర్గాల మధ్య స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి.

(c) eenadu

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

గుంతల దారులకు మోక్షం

నూతనంగా నిర్మించిన ఉరదాళ్లపాలెం రహదారి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి మండలం ఉరదాళ్లపాలెంలోని రహదారిలో పెద్ద గోతులతో నరకయాతన అనుభవించిన ప్రజలు, వాహనచోదకులకు కూటమి ప్రభుత్వం రాకతో రహదారి ఇబ్బందులు తొలిగాయి. గత ఐదేళ్లలో కనీస మరమ్మతులకు కూడా నోచుకోని ఉరదాళ్లపాలెం గోతుల దారి కాంక్రీటుతో కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కృషితో రూ.1.65 కోట్లతో సీసీ రహదారి నిర్మించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అప్పలనాయుడుకు గజమాల వేస్తున్న నాయకులు

ఆర్టీసీ బలోపేతానికి కృషి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీఎస్ ఆర్టీసీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని విజయవాడ ప్రాంతీయ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో ఆర్టీసీ ఉద్యోగులు, పలు రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు, కార్యకర్తలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. భారీ గజమాలలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	: 99488 53114
తణుకు	: 85558 50851
తణుకు గ్రామీణం	: 63005 79402
అత్తిలి	: 91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? తాడేపల్లిగూడెం గాంధీబొమ్మ కూడలిలో పురపాలక కుళాయి మరమ్మతుల కోసం తవ్విన గుంత పూడ్చకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది - విక్రమ్

✔ మరమ్మతులు కొనసాగుతున్నాయి. త్వరితగతిన గుంత పూడ్చేలా చర్యలు చేపడతాం - వెంకటేశ్వరరావు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్

? తాడేపల్లిగూడెం యాగర్లపల్లి శివారులో మురుగు కాల్వలు పేరుకుపోయి దోమలు వృద్ధి చెందుతూ రోగాల బారిన పడుతున్నాం. - రవీంద్ర

✔ మురుగు సాఫీగా సాగేలా దోమల నివారణ చర్యలు చేపడతాం - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? తాడేపల్లిగూడెం వెంకట్రామా సినిమాహాల్ రోడ్డులో చెత్త పేరుకుపోయి రహదారిపైకి వస్తోంది - జయేంద్ర

✔ చెత్త తొలగింపజేస్తాం - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

? బ్రహ్మానందరెడ్డి మార్కెట్ నుంచి నవ్వారుపేటకు వెళ్లే రహదారిలో కల్వర్టు పగిలి రాకపోకలకు ఇబ్బందిగా మారింది- భాస్కర్

✔ మరమ్మతులు చేయిస్తాం - ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్

ఇందిరమ్మ ఇళ్లు.. సమస్యల లోగిళ్లు

● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
● సమస్యలతో లబ్ధిదారులు సతమతం

నివాసాల వద్ద చెరువును తలపిస్తున్న మురుగు బోదె

న్యూస్‌టుడే, ఎల్.అగ్రహారం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్): పేదల కోసం నిర్మించిన ఇందిరమ్మ గృహాలను అటు అధికారులు, ఇటు నాయకులు విస్మరిస్తుండడంతో నిత్యం సమస్యలతో సహవాసం తప్పడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని ఎల్.అగ్రహారం పరిధిలో 2007లో రూ.3.42 కోట్లతో 360 ఇందిరమ్మ గృహాలు నిర్మించారు. 2012లో వాటిని లబ్ధిదారులకు అందించారు. అధికారులు మౌలిక వసతులు సమకూర్చకపోవడంతో అవస్థలు తప్పడం లేదని వారు వాపోతున్నారు. నిర్వహణ లోపంతో గృహాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. మరోవైపు మురుగు కదలక, సెప్టిక్ ట్యాంకుల లీకేజీ, పాముల సంచారం తదితర సమస్యలతో స్థానికులు సతమతమవుతున్నారు. రాజకీయ నాయకులు స్థానికుల్ని ఓటు బ్యాంకుగానే చూస్తున్నారు తప్ప సౌకర్యాలు సమకూర్చడం లేదని వాపోతున్నారు. రోజు మార్చి రోజు వస్తున్న పురపాలక ట్యాంకు నీటిపైనే ఆధారపడి జీవిస్తున్నామని.. విద్యుత్తు మీటర్లు పాడై వర్షం వస్తే వాటిలో నీరు చేరి శబ్దాలొస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. సెప్టిక్‌ట్యాంకు పలకలు పగిలి దుర్వాసన వెదజల్లుతోంది. పిచ్చిమొక్కలు మొలిచి పాములు, విషపురుగుల సంచారం ఎక్కువైంది. చెత్త సేకరణ సరిగా లేక ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుంటున్నాయి. సమస్యలు పరిష్కరించే దిశగా నాయకులు, అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పురపాలక కమిషనర్ ఎం.ఏసుబాబు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా మౌలిక వసతులు కల్పించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మురుగుతో అవస్థలు

నివాసాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి మురుగు సమస్య వీడటం లేదు. దీంతో దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. - నజీర్

కనీస సౌకర్యాలు కరవు

పట్టణ పరిధిలో ఉన్నా కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. మహిళలు బయటకు రావాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. చిట్టడవుల్లా పెరిగిన పిచ్చి మొక్కల్ని తామే సొంత ఖర్చుతో తొలగించుకుంటున్నాం. శివారు నివాసాల వారికి రహదారి లేక పురపాలక ట్యాంకు నీరు రావడం లేదు. - ఉండ్రాజవరపు సునీత

ముఖాముఖి కార్యక్రమంలో నాయకులు

అంతరాలు పెరిగిపోతున్నాయి

తణుకు, న్యూస్‌టుడే: రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలకు విరుద్ధంగా 10 శాతం బడా కార్పొరేట్లు దగ్గర పోగుపడిన సంపద వల్ల సమాజంలో అంతరాలు పెరిగి పోతున్నాయని దారి దీపం సంపాదకుడు డీవీవీఎస్.వర్మ అన్నారు. ప్రజా రిపబ్లిక్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక సురాజ్య భవనంలో అక్కమాంబ అండర్ సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్ కార్మికులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకుడు కోనాల భీమారావు మాట్లాడుతూ దేశంలో పెచ్చుమీరుతున్న విద్వేష రాజకీయాల పట్ల కార్మికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్మిక సంఘాల నాయకులు దుర్గాప్రసాద్, పెద్దిరాజు, ముసలయ్య, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

తణుకు, న్యూస్‌టుడే: తణుకు, ఇరగవరం మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీకి శుక్రవారం నుంచి ఈ నెల 9 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తణుకు, ఇరగవరం తహసీల్దార్లు అశోక్ వర్మ, సుందరరాజు తెలిపారు. ఈ మేరకు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తణుకు మండలంలో ఈ నెల 2న కోనాలలోని రైతు సేవా కేంద్రం, 3న మధ్యాహ్నం గ్రామ సచివాలయంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇరగవరం మండలంలో 2న కన్నయ్య కుముదవల్లి, రాపాక, ఇండ్రకలో ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు, కావల ఇల్లిందలపర్రులో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు గ్రామ సచివాలయాల్లో, 5న ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు సూరంపూడిలో, మధ్యాహ్నం కావలిపురంలో, 6న ఉదయం గోటేరు, మధ్యాహ్నం అయితంపూడి, 7న ఉదయం కాకిలేరు, మధ్యాహ్నం రాపాక, 8న ఉదయం ఓగిడి, మధ్యాహ్నం అయినపర్రు, 9న ఉదయం ఏలేటిపాడులోని గ్రామ సచివాలయాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకోవాలనుకునే వారు పాత పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకొని వ్యక్తిగతంగా రావాలని, బయోమెట్రిక్ ప్రక్రియ అనంతరం నూతన పాస్‌పుస్తకం అందజేస్తారని తెలిపారు.

నేడు బావాయిపాలెంలో జనవాణి

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: బావాయిపాలెం గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 11 గంటలకు జనవాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని చెప్పారు. అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భవిత కేంద్రం భవనానికి నిధులు

ఇరగవరం, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాల పిల్లల కోసం భవిత కేంద్రం నూతన భవన నిర్మాణానికి సమగ్ర శిక్షా నిధులు రూ.29 లక్షలు మంజూరయ్యాయని మండల విద్యాశాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు గురువారం చెప్పారు. తూర్పు విప్పర్రు ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు గదులతో కూడిన భవనం నిర్మిస్తారన్నారు. మండలంలో 174 మంది దివ్యాంగులున్నారని ఆయన వివరించారు.

ఏపీటీఎఫ్ దైనందిని, కాలమానిని ఆవిష్కరణ

తణుకు, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ - 2026 దైనందిని, కాలమానినిలను గురువారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించినట్లు జిల్లా కార్యదర్శి వి.రామమోహన్ తెలిపారు. అనంతరం తణుకు, ఇరగవరం మండలాల్లోని మండల విద్యాశాఖ కార్యాలయాల్లో నరసాపురం డీవైఈవో డి.మురళీ సత్యనారాయణ, తణుకు, ఇరగవరం ఎంఈవోలు బి.ఆంజనేయులు, జి.ప్రసాద్‌రావు, శ్రీనివాసరావు దైనందిని, కాలమానినిలను ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ నాయకులు ఏ.వీరభద్రరావు, ఎన్.జయరాజు, ఎస్.జాన్సన్, కె.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పరివర్తకం

తాడేపల్లిగూడెం పట్టణంలోని గొల్లగూడెం సెంటరు నుంచి కడకట్ల వెళ్లే రహదారిలో విద్యుత్తు పరివర్తకం ప్రమాదకరంగా మారింది. నిత్యం రాకపోకలు సాగించే రహదారిలో పరివర్తకానికి రక్షణ గోడ నిర్మించకపోవడంతో ఆయా మార్గాన రాకపోకలు సాగించే వారు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదాలు సంభవించక ముందే విద్యుత్తు అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కడకట్ల(తాడేపల్లిగూడెం వన్‌టౌన్)

దుమ్ము రేగుతోంది

తాడేపల్లిగూడెం మండలంలోని జగన్నాథపురం నుంచి మాధవరం వెళ్లే రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. నవాబుపాలెం నుంచి గతంలో రహదారి నిర్మాణం చేపట్టగా జగన్నాథపురం వరకు పూర్తి చేశారు. ఈ క్రమంలో మాధవరం వరకు ఎర్త్‌వర్క్ పనులు చేసి వదిలేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలంటే వాహనాల తాకిడికి దుమ్ము లేచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కళ్లలోకి దుమ్ము పడుతోందని పలువురు వాహన చోదకులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ డీఈ మణికుమార్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా త్వరలో పనులు పూర్తి చేసి వాహన చోదకుల సమస్య పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, మాధవరం, జగన్నాథపురం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్)

ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు, నాయకులు, కార్యకర్తలు

ఎమ్మెల్యే రాధాకృష్ణను సత్కరిస్తున్న నాయకులు

కేక్ కోస్తున్న భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ, నాయకులు

ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌తో నాయకులు

నూతన సంవత్సర వేడుక.. ఆనంద డోలిక..

నూతన సంవత్సర వేడుకల్ని తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌కు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొంత మంది సామాజిక బాధ్యతగా పుస్తకాలు, మొక్కలు అందజేశారు. కేకులు కోసి మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. - న్యూస్‌టుడే బృందం

తణుకు : దైవదర్శన ప్రార్థన మందిరంలో..

మావుళ్లమ్మను దర్శించిన ఎమ్మెల్యే బొలిశెట్టి

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గురువారం రాత్రి మావుళ్లమ్మను దర్శించుకున్నారు. ఆయనతో ఉప ప్రధానార్చకుడు, వేదపండితుడు ప్రత్యేక పూజలు చేయించి అమ్మవారి ఆశీర్వాదం అందించారు. ఆలయాధికారి నగేష్ శేషవస్త్రం, ప్రసాదం అందించారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, జనసేన ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాలకు అంకురార్పణ

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యెగ్గిన నాగబాబు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం కొబ్బరితోటలోని శ్రీదేవి మహంకాళి అమ్మవారి ఉత్సవాలు పురస్కరించుకొని గురువారం ఉదయం రాట మహోత్సవం నిర్వహించారు. నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ యెగ్గిన నాగబాబు ప్రారంభించారు. యూనియన్ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మార్నీడి బాబ్జీని సన్మానిస్తున్న రాజా త్రినాథ్

పుంతలో ముసలమ్మ ఉత్సవాలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణం సీతారాంపేట కొబ్బరితోటలోని పుంతలోముసలమ్మ అమ్మవారి 43వ వార్షికోత్సవం గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. తెల్లావారుజామున మేలుకొలుపు, మంగళస్నానం, సుప్రభాతసేవ తదితర విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీనరసింహస్వామి సత్సంగ సభ్యులు వినాయక గానామృతం చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్నీడి బాబ్జి, డాక్టర్ సత్యప్రసాద్, అమ్మవారి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజా త్రినాథ్, సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభ

నిడమర్రు: పెదనింద్రకొలను పార్వతీ సమేత భీమేశ్వరస్వామి, మందలపర్రు ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. రాత్రి భీమేశ్వరస్వామి ఆలయావరణలో కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. పెదనింద్రకొలను వేణుగోపాలస్వామి ఆలయంలో మూడ్రోజులపాటు కొనసాగిన ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ముగిశాయి.

అభివృద్ధిలోనూ శివారునే..

న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం వన్‌టౌన్: తాడేపల్లిగూడెం మున్సిపాల్టీలో శివారు ప్రాంతాలు, కాలనీల్లో అంతర్గత రహదారులు, మురుగు కాల్వలు లేక జనం ఇబ్బంది పడుతున్నారు. ఆయా కాలనీల్లో చినుకు పడితే అడుగు వేయలేని దుస్థితి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పురపాలక నిధులు సద్వినియోగం చేసుకోలేకపోవడంతో అభివృద్ధి తిరోగమనం పట్టింది. పురపాలికకు పాలకవర్గం లేకపోవడంతో అభివృద్ధి పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. ఏడేళ్లుగా పురపాలక సంఘానికి ఎన్నికలు నిర్వహించక పాలకవర్గం ఏర్పడలేదు. దీంతో అభివృద్ధి కుంటుపడింది. ఫలితంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణంలో 35 వార్డులు ఉండగా సుమారు 1.28 లక్షల జనాభా నివసిస్తున్నారు. అంతర్గత రహదారుల్లో పైపులైన్ల మరమ్మతుల కోసం తరచూ తవ్వేస్తున్నారు. ఈ క్రమంలో రహదారులు పాడవుతున్నాయి. దీర్ఘకాలం పాటు వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో మరింత అధ్వానంగా మారుతున్నాయి.

ప్రత్యేక నిధులతో ఎస్సీ కాలనీలో సౌకర్యాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పురపాలికల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆ దిశగా నాయకులు, అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో తాడేపల్లిగూడెం పట్టణంలో రహదారుల అభివృద్ధికి ఎస్సీ ఉప ప్రణాళిక నిధులు రూ.2.5 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా 1, 24 వార్డులు, రిక్షాపుంత రోడ్డు తదితర కాలనీల్లో రహదారులు, మురుగు కాల్వలు అభివృద్ధి చేయనున్నారు.

కడకట్ల ఎస్సీకాలనీలో అధ్వానంగా రహదారి

త్వరితగతిన పనులు చేపడతాం

ఎస్సీ కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. సంబంధిత పనులు టెండరు ప్రక్రియలో ఉన్నాయి. టెండరు పూర్తయిన వెంటనే పనులు చేపడతాం. - ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్

ఆకాంక్షలు నెరవేరుస్తాం: పత్సమట్ల

ధర్మరాజుకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న నాయకులు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: గతేడాది సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులకు పెద్దపీట వేశామని.. కొత్త ఏడాదిలో ప్రజా ఆకాంక్షలు నెరవేరుస్తామని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. స్థానిక విడిది కార్యాలయంలో గురువారం నూతన సంవత్సరాది వేడుకలు నిర్వహించారు. నాలుగు మండలాల కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తరలివచ్చి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

జనసేనలో చేరిక.. ఉంగుటూరు: జనసేన సిద్ధాంతాలు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆశయాలు నచ్చి పార్టీలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బాదంపూడి మాజీ సర్పంచి యామల సాయిబాబా, ఆయన కుమారుడు ప్రవీణ్‌కుమార్, వారి అనుచరులు సుమారు 200 మంది గురువారం జనసేనలో చేరారు. స్థానిక విడిది కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

జనరేటర్‌కు తుప్పు.. ఎవరిది తప్పు

నిడమర్రు తహసీల్దార్ కార్యాలయం అవసరాల కోసం గతంలో జనరేటర్ కొనుగోలు చేశారు. దాన్ని వినియోగించకపోవడంతో తుప్పు పట్టింది. దీంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అయ్యింది. ఇప్పటికైనా జనరేటర్‌ను వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం టూటౌన్

పునాదుల దశ.. మారని దిశ!

గణపవరం మండలం వెలగపల్లిలో విలేజ్ ఆర్గనైజేషన్ భవన నిర్మాణాన్ని ఎనిమిదేళ్ల కిందట ప్రారంభించారు. గుత్తేదారుకు నాటి వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పునాదుల దశలో నిలిపివేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పీఆర్ జేఈ దుర్గాప్రసాద్ తెలిపారు. - న్యూస్‌టుడే, గణపవరం

సంక్షేమమే పరమావధి: గన్ని

భీమడోలు, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వీరాంజనేయులుకు పూలమొక్క ఇస్తున్న అధికారులు

పెదఅమిరం కలెక్టర్ బంగ్లాలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

పంచాయతీ అధికారుల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

పెదఅమిరం(కాళ్ల), న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ నాగరాణి గురువారం ఆవిష్కరించారు. పెదఅమిరంలోని కలెక్టర్ బంగ్లాలో నిర్వహించిన వేడుకల్లో డీపీవో రామనాథ్ రెడ్డితో కలసి క్యాలెండర్‌తోపాటు డైరీలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షులు పాలా శ్రీనివాస్, కోశాధికారి సుంకర వెంకటేష్‌తోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వామివార్ల కల్యాణానికి ఏర్పాట్లు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు క్షీరరామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో పార్వతీ సమేత స్వామివారు, లక్ష్మి సమేత జనార్దన స్వామివార్ల కల్యాణ మహోత్సవాలపై పాలకవర్గం సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మీసాల రామచంద్రరావు మాట్లాడుతూ మార్చి 23 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు ఇప్పటి నుంచి చేపట్టాలన్నారు. కల్యాణంలో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలన్నారు.

రజకులపై దాడులు అరికట్టాలి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రజకులపై దాడులు అరికట్టాలని రజక జన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కట్లయ్య కోరారు. స్థానిక రేంజ్ కార్యాలయంలో ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్‌ను గురువారం వారు కలిశారు. ఆయన మాట్లాడుతూ.. రజకులపై చిన్నచూపు చూసేవారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తెలుగు భాషాభివృద్ధికి తోడ్పాటు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తెలుగు భాషాభివృద్ధికి మండలి వెంకట కృష్ణారావు ఎనలేని తోడ్పాటునందించారని వైఎంహెచ్ఏ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక హాలులో వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల గోడపత్రాలను గురువారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 5న నృత్య, మెలట్టూరు భాగవత మేళా నాట్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలి వెంకట కృష్ణారావు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం చేయనున్నట్లు వివరించారు. ఈ వేడుకకు శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, పెద్ద సంఖ్యలో నగర ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వైఎంహెచ్ఏ యాజమాన్య, కార్యనిర్వాహక కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగేశ్వరరావు, వి.సత్యనారాయణ, ముద్దుకృష్ణ, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో చురుగ్గా సీసీ రోడ్డు పనులు

ఇరగవరం, న్యూస్‌టుడే: పెరవలి - పెనుగొండ ఆర్అండ్‌బీ మార్గంలోని ఇరగవరం మండలం పరిధిలోని తూర్పు విప్పర్రు, నారాయణపురం, రాపాక ప్రాంతాల్లో గుంతల రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చొరవతో ఆయా గ్రామాల పరిధిలో బీటీ రహదారిని సీసీ దారిగా అభివృద్ధి చేశారు. 10 మీటర్ల వెడల్పు, 1010 మీటర్ల పొడవున రూ.3 కోట్లతో దీన్ని శరవేగంగా నిర్మించారు. ఇటీవలే పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం వాటరింగ్ చేస్తున్నారు. మరో 10 రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఆ శాఖ ఏఈ తోట ప్రసాద్ చెప్పారు.

ఆటోనగర్ కాదు బైపాస్‌రోడ్డే

రోడ్డు పక్కనే నిలిపి ఉంచిన భారీ క్రేన్లు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలో దుకాణాలు, వ్యాపార సముదాయాల వద్ద వాహనాలు నిలిపితే వెంటనే పోలీసులొచ్చి వాటిని తీయించేస్తారు.. కొంచెం వాదనకు దిగితే అపరాధ రుసుం విధిస్తారు. అలాంటిది భారీ వాహనాలు రోజులు, నెలల తరబడి రోడ్డు పక్కన నిలిపి ఉంచినా అడిగే నాథుడేలేడు. అలాంటివాటిపై పోలీసులు కన్నెత్తి చూడడం లేదు.

★ స్థానిక కొత్త ఫ్లైఓవర్ బైపాస్ రోడ్డులో రహదారి పక్కన నాలుగు భారీ క్రేన్లు నిలిపి ఉంచుతున్నారు.

★ ఎస్వీఆర్ కూడలి నుంచి రెండో ఫ్లైఓవర్ వంతెన వరకు వివిధ వాహనాలు, జనరేటర్లు, షామియానా సామగ్రి ఇష్టారీతిన రోడ్డుపైనే ఉంచేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్ మొత్తం ఆక్రమించేశారు. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. ★ వాహనాలు రోజుల తరబడి అక్కడే నిలిపి ఉంచడంతో చుట్టుపక్కల వారు వాటి పక్కనే చెత్త పారబోస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు చోటుచేసుకోక ముందే రోడ్ల పక్కన నిలిపి ఉంచుతున్న వాహనాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయాల అభ్యున్నతికి కృషి: జుత్తిగ

మహదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని ఆ సంస్థ నూతన ఛైర్మన్ జుత్తిగ నాగరాజు తెలిపారు. మహదేవపట్నంలోని తన నివాసంలో గురువారం నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పాటుపడతానని వివరించారు. జనసేనను బలోపేతం చేస్తానని వివరించారు. జుత్తిగ నాగరాజుని కలిసి అభినందించిన వారిలో ఉండి, ఆకివీడు ఏఎంసీ వైస్ ఛైర్మన్లు యడవల్లి వెంకటేశ్వరరావు, గవర లక్ష్మి, మండల తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు కరిమెరక నాగరాజు, కళ్లేపల్లిసతీష్‌రాజు, వివిధ గ్రామాల కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

(c) eenadu

జిల్లాకు నూతన బలం
పునర్ విభజనతో మారిన సంఖ్యలు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: జిల్లాల పునర్ విభజనతో కడప జిల్లాకు కొత్త బలం చేకూరింది. పోలీస్ సబ్ డివిజన్లు, ఆర్టీసీ డిపోల సంఖ్య పెరిగింది.

◆ పునర్ విభజనకు ముందు జిల్లాలో కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల పోలీసు సబ్ డివిజన్లు ఉండేవి. తాజాగా రాజంపేట చేరికతో ఆ సంఖ్య ఆరుకు చేరింది.

◆ గతంలో 11 సర్కిళ్లుండగా.. ఇప్పుడు 12 అయ్యాయి. ఇంతకు ముందు 18 అప్‌గ్రేడ్ ఠాణాలుండగా 19కి పెరిగాయి. ఇతర ఠాణాలు 47 ఉంటే.. ప్రస్తుతం ఆ సంఖ్య 52కు చేరింది.

◆ కొత్తగా మన్నూరు, రాజంపేట సర్కిల్ కార్యాలయం, రాజంపేట టౌన్ ఠాణాతో పాటు నందలూరు, వీరబల్లి, సుండుపల్లె ఠాణాలు జిల్లాలో చేరిన వాటిలో ఉన్నాయి.

● జిల్లాలో ప్రస్తుతానికి కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు ఆర్టీసీ డిపోలున్నాయి. ఇప్పుడు రాజంపేట చేరడంతో ఆ సంఖ్య ఏడుకు పెరిగింది.

● మొన్నటి వరకు 616 బస్సులుండగా.. రాజంపేట డిపోకు చెందిన 80 బస్సులతో కలిపి మొత్తం 696 అయ్యాయి.

● పునర్ విభజన పర్వానికి ముందు కడప కార్పొరేషన్, 5 పురపాలక సంఘాలుండగా.. రాజంపేటను కలపడంతో పురపాల సంఖ్య ఆరుకు చేరింది.

▼ జిల్లాలో ప్రస్తుతం తొమ్మిది ఎక్సైజ్ ఠాణాలుండగా.. పునర్ విభజనతో రాజంపేట కలిసింది. దీంతో వాటి సంఖ్యకూడా పదికి చేరింది.

▼ ఇప్పటి వరకు కడప, పులివెందుల, బద్వేలు, జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్లుండగా.. రాజంపేట చేరికతో వాటి సంఖ్య ఐదుకు పెరిగింది.

▼ మండలాలు కూడా గతంలో 36 ఉండగా తాజాగా అవి 40 వరకు పెరిగి రాష్ట్రంలో అత్యధిక మండలాలున్న జిల్లాగా ఆవిర్భవించింది.

▼ అసెంబ్లీ నియోజకవర్గాలు కూడా ఏడు నుంచి రాజంపేట చేరికతో ఎనిమిది అయ్యాయి.

తాగేసిన మద్యం రూ.7.28 కోట్లు

కడప చిన్న చౌకు, న్యూస్‌టుడే: 2025కు వీడ్కోలు పలుకుతూ.. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ జిల్లా వ్యాప్తంగా మందుబాబులు సందడి చేశారు. గడిచిన రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా రూ. 7.28 కోట్ల విలువైన మద్యాన్ని తాగేశారు. డిసెంబరు 31న ఒక్కరోజే రూ. 7.23 కోట్ల విలువైన 9,658 లిక్కర్ పెట్టెలు, 3,991 బీరు పెట్టెలు విక్రయమయ్యాయి. జనవరి 1న రూ. 55 లక్షల విలువైన 745 లిక్కర్ పెట్టెలు, 514 బీరు పెట్టెలు అమ్ముడయ్యాయి.

నృత్యోత్సాహం

నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా పులివెందులలోని శిల్పారామంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. పులివెందులకు చెందిన పలువురు సినీ గీతాలకు నృత్యం చేసి ఆదరహో అనిపించారు. చిన్నారులు పలు భక్తి గీతాలకు శాస్త్రీయ నృత్యం చేసి తమ ఉత్సాహాన్ని చాటారు. - న్యూస్‌టుడే, పులివెందుల

కొంగొత్త జోష్

దేవుని కడపలో శ్రీదేవి, భూదేవి సమేత దేవదేవుడు..

స్వామిని దర్శించుకొనేందుకు బారులు తీరిన భక్తులు

ఒంటిమిట్ట, జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: కొంగొత్త ఆంగ్ల సంవత్సరం ప్రారంభం వేళ నూతనోత్సాహం వెల్లివిరిసింది. సంబరాలు అంబరాన్నంటాయి. పాత సంవత్సరం చేదు, తీపి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ కోటి ఆశలతో కొత్త ఏడాదికి ఉరకలేసే ఉత్సాహంతో స్వాగతం పలికారు. ప్రజల్లో భక్తిభావం ఉప్పొంగింది. జిల్లాలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు తితిదే అనుబంధ, విలీన క్షేత్రాలు సందర్శకులతో కిటకిటలాడాయి. ఒంటిమిట్ట కోదండ రామాలయానికి అత్యధికంగా 23,792 మంది తరలివచ్చారు. దేవునికడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని 15,840 మంది, నందలూరు సౌమ్యనాథస్వామి సన్నిధిని(7,365), రాజంపేట మండలం బోయనపల్లిలో వేంకటేశ్వరస్వామి గుడిని(2,350), జమ్మలమడుగు నారాపుర వేంకటేశ్వరస్వామి దివ్యాలయాన్ని(2,050), అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలోని సిద్ధేశ్వర, చెన్నకేశవ స్వామి ఆలయాలను(2,000) మంది దర్శించారు.

● క్రైస్తవ సోదరులు చర్చిల్లో బుధవారం అర్ధ రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కోసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

● **గండికోట.. పర్యాటకులతో కిటకిట:** చారిత్రాత్మక కట్టడమైన గండికోట గురువారం పర్యాటకులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. కోట అందాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ... సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు.



సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవ సోదరులు

ఒంటిమిట్ట: క్యూలైనులో భక్తుల రద్దీ

మారనుంది పారిశ్రామిక ముఖచిత్రం
ఎంఎస్ఎంఈ పార్కులకు మహర్దశ

ప్రొద్దుటూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గాలవారీగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) అభివృద్ధికి ఏపీఐఐసీ అధికారులు వేగవంతంగా కార్యాచరణ ప్రణాళిక చేపడుతున్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించనున్నారు. తద్వారా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

◆ ప్రొద్దుటూరు కేంద్రంగా రూ. 14 కోట్లతో 60 ఎకరాల చౌడూరు తోపు భూములు, మైదుకూరు మండలంలోని నంద్యాలంపేటలో 41 ఎకరాల్లో రూ. 3 కోట్ల అభివృద్ధి పనులకు గత నవంబరు 11న ఆయా ఎమ్మెల్యేలు శిలాఫలకాలను ఆవిష్కరించారు. తొలి విడలో రూ. 7 కోట్ల వ్యయంతో 2026 జనవరి 5న ప్రొద్దుటూరు ఎంఎస్ఎంఈ పార్కులో తారు రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులకు టెండరు ముగిసింది. నంద్యాలంపేటలో రూ. 3 కోట్ల టెండరు ప్రక్రియ పూర్తవగానే అక్కడ పనులు చేపట్టనున్నారు.

ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు కేటాయించిన చౌడూరు తోపు భూములు

● జమ్మలమడుగు నియోజకవర్గంలోని 20 ఎకరాల్లో సీ. సుండేసుల, కమలాపురం నియోజకవర్గంలోని కొప్పర్తిలో 20 ఎకరాల ఎంఎస్ఎంఈ పార్కులో రూ. 3 కోట్లు చొప్పున బీటీ రహదారులు, కాలువలను ఏర్పాటు చేస్తున్నారు.

● పులివెందుల నియోజకవర్గంలోని గుల్లమడుగులో ఏపీఐఐసీ పరిధిలోని 25.26 ఎకరాల్లో రూ. 3 కోట్లతో పనుల టెండరు ప్రక్రియ ముగిసిపోయి ఉంది. ● కడప నియోజకవర్గంలో భూముల లభ్యత లేకపోవడంతో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకాలేదు.

● బద్వేలు నియోజకవర్గంలోని గోపవరంలో రూ. 15 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తికావడంతో ఎంఎస్ఎంఈ పార్కులో ఆన్‌లైన్ ద్వారా ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టారు.

● ఈ విషయమై జిల్లా ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ.. చౌడూరులో ఈ నెల 5న అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. నంద్యాలంపేట, గుల్లమడుగులో రూ. 3 కోట్లతో పనులకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు.

ఊ అంటే పోయేది మీ సొమ్ములు కాదుగా!

◆ మూలుగుతున్న ఆర్థిక సంఘం నిధులు
◆ ఆమోదం లేక ఆగిన రూ. 32 కోట్ల పనులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆర్థిక సంఘం నిధులపై స్థానిక పాలకవర్గం దృష్టిసారించలేదు. సాధారణ నిధులే ఖర్చుపెట్టేశాయి. 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఏడు విడతల్లో రూ. 4,731.88 లక్షల నిధులు ప్రొద్దుటూరుకు మంజూరయ్యాయి. వీటిలో 98 పనులు ఆమోదం పొందగా 40 మాత్రమే పూర్తయ్యాయి. ఐదు వివిధ దశల్లో ఉన్నాయి. పదింటిని కౌన్సిల్ రద్దు చేసింది. 43 అసలు ప్రారంభమే కాలేదు. ఇంకా రూ. 32 కోట్లు వినియోగించలేదు. ఈ నిధుల వినియోగానికి మూడు మాసాలే గడువుంది. పురపాలక సంఘాల పదవీ కాల పరిమితి కూడా మరికొన్ని నెలల్లో ముగియనుంది. పాలకవర్గం, అధికార యంత్రాంగం నుంచి పనులకు పరిపాలనా పరమైన ఆమోదం తెలపకపోతే ఈ నిధులు మురిగిపోయే ప్రమాదముంది.

మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆర్ట్స్ కాలేజీ మైదానంలో తాగునీటి గొట్టం నుంచి వృథాగా పోతున్న తాగునీరు

◆ జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, మైదుకూరు, కమలాపురం, బద్వేలు, పులివెందుల పురపాలక, నగర పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి. ఆర్థిక సంఘం నిధులు కొన్నింటిని ప్రభుత్వ ఖాతాకు జమ చేశారు. మైదుకూరులో రూ. 7 కోట్లు, కమలాపురంలో రూ. 3.96 కోట్ల ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై దృష్టిసారించాల్సి ఉంది.

◆ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై పురపాలక పట్టణాభివృద్ధి శాఖనే దృష్టి సారిస్తుందని.. ఆయా కమిషనర్లదే బాధ్యత ఉంటుందని పురపాలక అనంతపురం రీజినల్ డైరెక్టర్ ఇంజినీర్ అధికారి రామ్మోహన్‌రెడ్డి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

వీడని ఏలిననాటి శని!

'అధికారంలోకి వచ్చాక ప్రతి పేదకూ ఇల్లు కట్టిస్తా''నని ప్రజా సంకల్ప యాత్రలో వైకాపా అధినేతగా ఆశ పెట్టారు. గెలిచి గద్దెనెక్కాక దారీతెన్నూ లేని ప్రాంతాల్లో లేఅవుట్లు వేయించారు జగన్. పేరు గొప్ప కాలనీలు, అధ్వాన పనులతో పేదల సొంతింటి కలలను కుప్పకూల్చారనేందుకు.. ఏలిన నాటి శని ఇంకా వీడలేదు అనేందుకు ఈ చిత్రమే నిదర్శనం. బద్వేలు పురపాలకలో గత వైకాపా ప్రభుత్వం నివాస యోగ్యం కాని చెరువులు, కొండ గుట్టలపై లబ్ధిదారులకు స్థలాలు కేటాయించి ఇళ్లను నిర్మించింది. అంతటితో తమ పని అయిపోయిందని పాలకులు, అధికారులు చేతులు దులుపేసుకున్నారు. రూ. కోట్లతో కట్టి కమీషన్లు పొందారు. అయితే రహదారులు, విద్యుత్తు, తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతులూ కల్పించలేదు. సరికదా నివాస యోగ్యంగా లేకుండా చెరువుకు అత్యంత సమీపంలో నిర్మించారు. దీంతో లబ్ధిదారులు అక్కడ నివాసం ఉండేందుకు వెనకాడుతున్నారు. బద్వేలు పురపాలకలో దాదాపు ఐదు వేల వరకు ఇళ్లు నిరుపయోగంగానే ఉంటున్నాయి. - **ఈనాడు కడప, న్యూస్‌టుడే బద్వేలు**

నేతల నీడలో జూదం

◆ ఒకటికి రెండు రెట్లంటూ ఆశలు
◆ చేతులు మారుతున్న రూ. కోట్లు

☛ జమ్మలమడుగులో నాలుగు నెలల కిందట పోలీసులు నిర్వహించిన దాడుల్లో 22 మంది జూదరులతో పాటు రూ. 11 లక్షల నగదు దొరికింది.

☛ కడప చిన్నచౌకు ఠాణా పరిధిలో తొమ్మిది మంది జూదరులను అరెస్టు చేసి రూ. 72 వేల నగదు జప్తు చేశారు. వీరిలో కొందరు ప్రముఖులూ ఉండటంతో పోలీసులు పేర్లు వెల్లడించలేదు.

కడప, న్యూస్‌టుడే: జిల్లాలో జూదం జడలు విప్పుకొంటోంది. అధికార, ప్రతిపక్షాలకు చెందిన కొందరు చోటా నేతల కనుసన్నల్లో జూదశాలలు నడుస్తున్నాయి. ఇరవై నాలుగు గంటలపాటూ నిర్వహిస్తుండటంతో కడపతో పాటు పరిసర జిల్లాలకు చెందిన పలువురు జూదరులు తరలివస్తున్నారు. ఈ క్రమంలో రోజుకు రూ. కోట్లలోనే చేతులు మారుతున్నాయి. ఒక్క కడపలోనే ఆ మొత్తం రూ. 50 నుంచి రూ. 70 లక్షల వరకు ఉంటోంది.

● **పునాదులేసిన వైకాపా:** గత వైకాపా ప్రభుత్వంలో రాజకీయ అండదండలతో ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగింది. లాభాలకు అలవాటు పడ్డ కొందరు చోటా నేతలు అధికారం మారినా తీరు మార్చుకోవడం లేదు. వీరికి ఇతర పార్టీలకు చెందిన నాయకులు కొందరు తోడయ్యారు. రిమ్స్ సమీపంలోని జగనన్న కాలనీలో ఉన్న ఖాళీ నివాసాలు, చలమారెడ్డిపల్లె కొండల ప్రాంతాలు, ఒకటో పట్టణ ఠాణా పరిధిలోని రాజారెడ్డివీధి, కో-ఆపరేటివ్ కాలనీ, ఎర్రముక్కపల్లె, తాలూకా ఠాణా పరిధిలో రామారాజుపల్లె సమీప ప్రాంతాలు, తారకరామ నగర్, రెండో పట్టణ ఠాణా పరిధిలో కట్టపై నకాష్ ప్రాంతంలో గౌస్ నగర్, దేవుని కడప చెరువు, చిన్నచౌకు పరిధిలోని ఎన్జీవో కాలనీ, అశోక్‌నగర్, చిన్నచౌకు, శంకరాపురం తదితర ప్రాంతాల్లో కొన్ని ప్రదేశాలను నిర్వాహకులు అడ్డాలుగా మార్చారు. జూదరుల కోసం కొందరు అక్కడే వడ్డీలకు డబ్బులూ ఇస్తున్నారు. కడప నగరంలో ఓ వ్యక్తి ఇలాంటి అక్రమ వ్యవహారంతోనే ఆర్థికంగా ఇప్పుడు బలపడ్డాడు. పోలీసులు కఠిన చర్యలు చేపట్టి అడ్డుకట్ట వేయాలని.. ఈ దిశగా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

రైతుల చేతికి 67,890 పాసు పుస్తకాలు

నేటి నుంచి గ్రామ సభల నిర్వహణ

ఈనాడు, కడప: కొత్త పట్టాదారు పాసు పుస్తకాల జారీని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుంచి ప్రారంభిస్తోంది. గత ప్రభుత్వంలోని తప్పులను సరిదిద్ది, రాజముద్రతో వీటిని ఉచితంగా అందించనుంది. గతంలో మాజీ సీఎం జగన్ బొమ్మలుండగా.. ఇప్పుడు రాజముద్రతో ఇవ్వనుంది. రీ సర్వేలో తప్పులను సరిదిద్దిన తర్వాత వీటిని జారీ చేస్తోంది.

● **221 గ్రామాల్లో సభలు:** గత వైకాపా ప్రభుత్వంలో రీ సర్వే చేసిన గ్రామాల్లో పంపిణీకి రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల రెవెన్యూ అధికారి, డిప్యూటీ సర్వేయర్, వీఆర్వో, విలేజ్ సర్వేయర్‌ల బృందం గ్రామసభ నిర్వహిస్తుంది. 221 గ్రామసభల ద్వారా ప్రజాప్రతినిధులతో రైతులకు పాసు పుస్తకాలు అందిస్తారు. ఇందుకుగాను బద్వేలు, జమ్మలమడుగు, కడప, రాజంపేట, పులివెందుల రెవెన్యూ డివిజన్ కార్యాలయాల నుంచి మండల తహసీల్దార్ కార్యాలయాలకు పాసు పుస్తకాలను ఇప్పటికే సరఫరా చేశారు. 40 మండలాల పరిధిలో 67,890 పుస్తకాలు పంపిణీ చేయనున్నారు.

● **ఇవీ ప్రత్యేకతలు:** ● ట్యాంపరింగ్ చేయడానికి వీల్లేకుండా హై సెక్యూరిటీతో రూపొందించారు.
● ప్రతి పాసు పుస్తకంపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. స్కాన్ చేసి ఆధార్ నంబర్ ఎంటర్ చేస్తే భూముల వివరాలు మొబైల్‌లో చూసుకోవచ్చు.
● గ్రామ సభలకు రాలేని రైతులకు కొరియర్ ద్వారా చేర్చాలని ప్రభుత్వం ఆదేశించింది.

10లో భయపెడుతున్న ఆ రెండు!

◆ విద్యార్థులకు కష్టంగా గణితం, సైన్స్
◆ ఏటా వాటిలోనే అనుత్తీర్ణులు ఎక్కువ

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: పదో తరగతి ఎంతో కీలకం. ఉన్నత తరగతులకు ఉత్తీర్ణ సాధించాల్సిందే. అందుకే పరీక్షలంటే విద్యార్థుల్లో కాస్త ఆందోళన ఉంటుంది. ప్రధానంగా గణితం, సైన్స్ సబ్జెక్టులు వారిని భయపెడుతున్నాయి. బాగా చదివే వారు సులువుగా ఉత్తీర్ణులవుతుండగా.. వెనుకబడిన వారు మాత్రం తడబడుతున్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు సాధించిన ఫలితాలే ఇందుకు నిదర్శనం.

చదువుతున్న పదో తరగతి విద్యార్థులు

● **సమయం పెంచితే మేలు:** గణితం, సైన్స్ సబ్జెక్టులకు ప్రభుత్వ పాఠశాలల్లో వారానికి ఎనిమిది పిరియడ్లే కేటాయిస్తున్నారు. పాఠ్యాంశాల బోధనకే ఆ సమయం సరిపోతోంది. ఆ తర్వాత సాధన చేయించేందుకు అవకాశం ఉండటం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పిరియడ్లు పెంచాలని కోరుతున్నా పట్టించుకోలుదన్న వాదన వినిపిస్తోంది. అదే ప్రైవేట్ పాఠశాలల్లో ఆ సబ్జెక్టులకు రోజుకు రెండు పిరియడ్లు కేటాయిస్తుండటంతో పాటు విద్యార్థులతో చేయిస్తున్నారు.



రోజూ సాధన చేయిస్తున్నాం

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి రోజూ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఆ మరుసటి రోజే జవాబు పత్రాలను పరిశీలించి వారు చేసిన తప్పులను గుర్తించి పునరావృతం కాకుండా సాధన చేయిస్తున్నాం. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా అన్నీ సబ్జెక్టుల్లో సులువుగా ఉత్తీర్ణులయ్యేలా మెలకువలు నేర్పుతున్నాం. గత విద్యా సంవత్సరం కంటే ఈ ఏడాది ఉత్తీర్ణ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నాం.

- షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖాధికారి

తలకెక్కినవన్నీ అసలు కావు

◆ నాణ్యమైన శిరస్త్రాణాలే ప్రాణానికి రక్ష

ముకోసం

కమలాపురం, న్యూస్‌టుడే: శిరస్త్రాణం ధరించడం ద్విచక్ర వాహన చోదకులకు ప్రాణరక్షతో సమానం. నిబంధనల కఠిన అమలుతోపాటు అవగాహన పెరుగుతుండడంతో చోదకులు వీటిని ధరించేందుకు మొగ్గు చూపుతున్నారు. అదే సమయంలో తాము తలకెత్తుకున్నదీ నాణ్యమైందో లేదో గుర్తించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ఏదేని ప్రమాదం చోటుచేసుకుంటే సదరు శిరస్త్రాణం రక్షించలేకపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఐఎస్ఐ మార్క్ హెల్మెట్ ధరించడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

బీఐఎస్ హెల్మెట్‌లు మేలు

భారతీయ ప్రమాణాల సంస్థ(బీఐఎస్) రూపొందించిన ఐఎస్-4151:2015 శిరస్త్రాణాన్ని ధరించడం మేలు. ఇది 1,500 గ్రాముల బరువు మించకూడదు. అధిక బరువున్నవి మెడపై ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. రోజూవారీ వినియోగానికి ఫుల్ ఫేస్, లోయర్ ఫేస్ కవర్ ఉన్నవైతే మంచిది. సరైన పరిమాణం, బిగువైన చిన్ స్ట్రాప్ ఉండేలా చూసుకోవాలి. ప్రమాదానికి గురైన వాటిని, లోపల పగుళ్లున్న వాటిని వాడకూడదు.

● ఫైబర్ గ్లాస్, పాలీ కార్బొనేట్, కంపోజిట్ పదార్థాలతో చేసిన హెల్మెట్ బయట పొర మొదట దెబ్బను స్వీకరించి, పదునైన వస్తువులను తలలోకి చొచ్చుకెళ్లకుండా అడ్డుకుంటుంది.

● బయట పొర తర్వాత ఉంటే ఈపీఎస్ ప్రమాద సమయంలో మెదడుపై పడే దెబ్బ తీవ్రతను తగ్గిస్తుంది. ● ఈపీఎస్‌పై ఉండే మృదువైన పొరే కంఫర్ట్ ప్యాడింగ్. హెల్మెట్ తలపై కదలకుండా ఉండేలా ఇది చూస్తుంది. ● గాలి, దుమ్ము, వర్షం, పురుగుల నుంచి కళ్లను విజర్ రక్షిస్తుంది. ● చిన్‌స్ట్రాప్ బిగువుగా లేకుంటే ఎంత ఖరీదైన హెల్మెట్ అయినా పనికిరాదు.

● తక్కువ ధరకు వస్తుందనే ఆశతో నాసిరకం కొన్నా ఫలితం ఉండదు. బిల్లు ఇచ్చే అధీకృత డీలర్ల వద్ద కొనుగోలు మేలు.

కేంద్ర మంత్రికి కొండాపురం వాసి సలహాలు

కొండాపురం, న్యూస్‌టుడే: కొండాపురం గ్రామానికి చెందిన గైబువల్లికి అరుదైన గౌరవం దక్కింది. హిందీ సేవాసదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, హిందీ ప్రచారసభ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఆయన్ను.. ఎర్త్ సైన్సెస్ కేంద్ర మంత్రిత్వ శాఖ హిందీ సలహాదారుడిగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు దిల్లీలో ఎర్త్ సైన్సెస్ కేంద్ర మంత్రిత్వ శాఖ మంత్రి జితేంద్రసింగ్ చేతుల మీదుగా బాధ్యతలు చేపట్టారు. హిందీ భాషాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని., సమస్యలు, విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని గైబువల్లి తెలిపారు.

కేంద్ర మంత్రి జితేంద్రసింగ్‌కు జ్ఞాపిక అందిస్తున్న గైబువల్లి

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 99899 97626

(c) eenadu

సాగునీటిపై కాలుష్య భూతం

వేలాది ఎకరాలకు సాగునీరు అందించే కేసీ కాలువపై పర్యవేక్షణ కరవైంది. సాగునీటి సంఘాలున్నా పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు. రెండో పంట కోసం మార్చి వరకు సాగునీరు అందించేందుకు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో చివరి ఆయకట్టు వరకు సక్రమంగా నీరందేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. మైదుకూరు, ఖాజీపేట మండలాల్లో 15,575 ఎకరాలకు, పుల్లూరు, రావులపల్లె, దుంపలగట్టు, చెముళ్లపల్లె, కొండపేట చెరువులకు నీరందించే కొండపేట కాలువలో పలుచోట్ల పిచ్చిమొక్కలు అల్లుకుపోయాయి. ఈ విషయమై కేసీ కాలువ ఏఈ సుబ్బరాయుడు మాట్లాడుతూ కాలువలో వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, మైదుకూరు

కొత్త ఏడాదిలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

కడప నేరవార్తలు : కొత్త సంవత్సరంలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంతో పని చేయాలని జిల్లా పోలీసు అధికారి నచికేత్ విశ్వనాథ్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేకు కోసి పోలీసు సిబ్బందికి తినిపించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్‌హెగ్డే, ఎస్‌బీ డీఎస్పీ సుధాకర్, కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు డీఎస్పీలు వెంకటేశ్వర్లు, భావన, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వరరావు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

కేకు కోస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, చిత్రంలో పోలీసు అధికారులు

2026 డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టరు శ్రీధర్ చెరుకూరి

రెవెన్యూ సమస్యలు పరిష్కరించి మన్ననలు పొందండి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : నూతన సంవత్సరంలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని రెవెన్యూ శాఖ అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం కలెక్టర్ శ్రీధర్, ఇన్‌ఛార్జి జేసీ విశ్వేశ్వరనాయుడు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జీవన్ చంద్రశేఖర్‌లు ఆ సంఘం డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు వారు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో విజయ్ కుమార్, ఆ సంఘం ప్రతినిధులు వెంకటస్వామి, ప్రతాప్‌రెడ్డి, కలెక్టరేట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. నూతన సంవత్సరాది రోజున క్యాంపు కార్యాలయంలో వేదపండితులు కలెక్టరు దంపతులను ఆశీర్వదించారు.

నేడు ఈనాడు క్రికెట్ పోటీలు

కేఎస్ఆర్ఎం గ్రౌండ్ (సీనియర్ మెన్స్): ◆ ఉదయం 8.00 గంటలకు : ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల (ప్రొద్దుటూరు) - అన్నమాచార్య (కడప) ◆ ఉదయం 10.00 గంటలకు : శ్రీ శ్రీనివాస డిగ్రీ కళాశాల (మదనపల్లె) - కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల (కడప) ◆ మధ్యాహ్నం 1 గంటకు : గవర్నమెంట్ మెడికల్ కళాశాల (రిమ్స్), కడప - ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల (మదనపల్లె)

కేఓఆర్ఎం గ్రౌండ్ (సీనియర్ మెన్స్) :

◆ ఉదయం 8.00 గంటలకు : శ్రీసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (రాయచోటి)-శ్రీ వైష్ణవి డిగ్రీ కళాశాల (రాజంపేట) ◆ ఉదయం 10.00 గంటలకు : ఎస్ఆర్ఎన్‌బీ డిగ్రీ కళాశాల (బద్వేలు) - పి.రామిరెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (కడప)

మహిమాన్విత క్షేత్రం.. మురిసె భక్తజనం

భక్తులకు దర్శనమిచ్చిన సీతారామలక్ష్మణమూర్తులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: పవిత్ర ధనుర్మాసంలో భాగంగా 14వ రోజైన గురువారం మహిమాన్విత ఒంటిమిట్ట కోదండ రామాలయంలో అధ్యయనోత్సవాల పూజలు ఆద్యంతం భక్తిశ్రద్ధలతో సాగాయి. రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమున్నత పీఠంపై కొలువుదీరిన సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రుత్వికులు రుగ్వేదం, యజుర్వేదం, సామ వేదం, అధర్వణ వేదాలను పారాయణం చేశారు. దాశరథి తేజోవంతంగా ప్రకాశించి దర్శనభాగ్యం కల్పించడంతో భక్తులు కనులారా వీక్షించి మురిసిపోయారు. దివ్య మంగళ స్వరూపునికి ప్రణమిల్లి మంగళహారతులు సమర్పించారు.

ఒంటిమిట్టలో పూజలు చేస్తున్న భక్తులు

వాటర్‌గ్రిడ్ పనులు పూర్తి చేయండి : కలెక్టర్

సచివాలయం, న్యూస్‌టుడే : చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి పులివెందుల నియోజకవర్గ గ్రామాలకు తాగునీరందించే వాటర్ గ్రిడ్ పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి నీటిపారుదల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయంలో పులివెందుల వాటర్ గ్రిడ్ పనుల పురోగతిపై రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సంబంధిత ఇంజినీరింగ్ కాంట్రాక్ట్ ప్రాజెక్టు మేనేజరులతో కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాలకు ఎలాంటి నీటి కొరత లేకుండా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి పులివెందుల వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా తాగునీటి సదుపాయం, గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి కొరత లేకుండా ప్రణాళికలు రూపొందించి ప్రాజెక్టు పనులు దాదాపు పూర్తి చేసి నిర్వహణలోకి తీసుకొచ్చామన్నారు. ఈ వారంలోపే పులివెందుల నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో సమృద్ధిగా తాగునీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.480 కోట్ల వ్యయంతో చేపట్టిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా పులివెందుల నియోజకవర్గంలో 109 గ్రామ పంచాయతీల్లోని 299 గ్రామాలలో 5.36 లక్షల జనాభాతో పాటు 7 రకాల ప్రభుత్వ విద్యా సంస్థలకు అవసరమైన 135 ఎల్‌పీసీడీల మంచి నీటిని నిరంతరాయంగా నీరందించే ఉద్దేశంతో పులివెందుల వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఈఈ శ్రీనివాసులు, డీఈఈలు కిరణ్‌కుమార్‌రెడ్డి, అంజలీదేవి, ఎంఈఐఎల్ ప్రాజెక్టు మేనేజరు రవికుమార్, ఏఈఈలు పాల్గొన్నారు.

మత్తు వదిలితేనే.. భవిష్యత్తు

● గంజాయి, మద్యానికి బానిసవుతున్న యువత

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకునేలా అడుగులు వేయాల్సిన యువత గంజాయి, మద్యానికి బానిసవుతున్నారు. మత్తులో వర్గాలుగా ఏర్పడి గొడవలకు దిగుతున్నారు. క్రికెట్ బెట్టింగ్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. హత్యలు, హత్యాయత్నాలు, ఘర్షణలు, అక్రమ మద్యం దిగుమతి, చోరీ కేసులు, నేరాల్లో యువకుల పాత్రం అధికంగా ఉంటోంది.

★ మొదట స్నేహితులతో కలిసి గంజాయి మత్తుకు అలవాటు పడుతున్న యువకులు వ్యసనంగా మార్చుకుంటున్నారు. పొరుగు ప్రాంతాల నుంచి జిల్లాలోని ప్రొద్దుటూరు, కడప, ఎర్రగుంట్ల, కమలాపురంతో పాటు ఇతర ముఖ్య పట్టణాలకు సైతం పెద్ద ఎత్తున గంజాయి దిగుమతి అవుతోంది. దాన్ని చిన్న పొట్లాలుగా తయారు చేసి యువతకు విక్రయిస్తూ వినియోగిస్తున్నారు. ★ గంజాయి మత్తులో ప్రొద్దుటూరు మండలం పరిధిలోని పెన్నానగర్‌కు చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్నిరోజుల వ్యవధిలోనే ఈశ్వర్‌రెడ్డి నగర్‌కు చెందిన మరో యువకుడు చెట్టుకు ఉరేసుకుని ప్రాణాలొదిలాడు.

నేరాల్లో నిందితులుగా యువకులు

★ ప్రొద్దుటూరుకు చెందిన ఓ యువకుడు క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. బెట్టింగ్ యాప్‌ల ద్వారా కొన్ని రోజుల వ్యవధిలోనే ఏకంగా రూ.లక్షలు పందేలు ఆడాడు. పోలీసులు పట్టుకోవడంతో ఆ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ★ తల్లిని బీటెక్ చదువుకున్న కుమారుడు దారుణంగా హత్య చేయడం ప్రొద్దుటూరులో ఇటీవల కలకలం రేపింది. ఘటనతో యువకుడు జైలుపాలయ్యాడు. ★ పలు చోరీల కేసుల్లో బాలలతో కొందరు యవకులు సైతం నిందితులుగా ఉన్నారు. దొంగతనం కేసులో ప్రొద్దుటూరులో ఇటీవల ఓ యవకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ★ గోవాతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం దిగుమతి, విక్రయాల వ్యవహారంలోనూ ప్రొద్దుటూరుకు చెందిన యువకులపై అనేక కేసులున్నాయి. ఆ వ్యవహారంలో ఓ యువకుడిపై గతంలో పీడీయాక్టు సైతం నమోదైంది. ★ ప్రొద్దుటూరులోని పెన్నానగర్‌లో ఇద్దరు యువ స్నేహితులు గొడవ పడ్డారు. అందులో ఓ యువకుడు తన స్నేహితుడిపై కత్తితో దాడి చేశాడు. తోపులాట జరగడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వారిపై గతంలోనూ కేసులున్నాయి. ★ గతేడాది జిల్లాలో ఎక్సైజ్ శాఖ పరిధిలో 19 గంజాయి కేసులు నమోదయ్యాయి. 67 మందిని అరెస్టు చేశారు. 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 20 వాహనాలను సీజ్ చేశారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రొద్దుటూరు పోలీసులు

సీపీ బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి సహకరిస్తాం

వైవీయూ, న్యూస్‌టుడే : ఎంతో ప్రతిష్ఠాత్మకమైన సీపీ బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి అదనపు భవనాల నిర్మాణానికి నిధుల మంజూరులో తమ వంతు బాధ్యతగా సహకారం అందిస్తామని సమాచార శాఖ కమిషనర్ రవికుమార్ తెలిపినట్లు జానమద్ది సాహితీ పీఠం నిర్వాహకులు జానమద్ది విజయభాస్కర్ తెలిపారు. నూతన సమాచార కమిషనర్‌గా నియమితులైన సందర్భంగా విజయవాడలోని కార్యాలయంలో ఆయన్ను జానమద్ది విజయభాస్కర్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 1995లో సీపీ బ్రౌన్ గ్రంథాలయాన్ని కడపలో ప్రారంభించారని, పుస్తకాలు నిల్వ ఉంచడానికి గదుల సౌకర్యం లేకపోవడంతో అదనపు భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, అందుకు అవసరమైన అదనపు నిధుల మంజూరుకు ముఖ్యమంత్రిని ఒప్పించాలని కోరినట్లు తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారన్నారు.

సమాచార శాఖ కమిషనర్ రవికుమార్‌ను కలిసి సత్కరిస్తున్న జానమద్ది సాహితీ పీఠం నిర్వాహకులు జానమద్ది విజయభాస్కర్

సైబర్ మోసం.. రూ.1,07,199 దోచేసిన దుండగులు

ఖాజీపేట, న్యూస్‌టుడే: సైబర్ మోసంలో రూ.1,07,199 దుండగులు దోచేసిన ఘటన ఖాజీపేట మండలంలో బుధవారం చోటుచేసుకుంది. రావులపల్లె పోస్టుమ్యాన్‌గా పనిచేస్తున్న సుదర్శన్ రెడ్డి, హరిప్రసాద్ స్నేహితులు. హరిప్రసాద్ ఇంటి రుణం చెల్లించేందుకు తన బ్యాంక్ ఖాతాలో నగదు బదిలీ పరిమితి ముగియడంతో సుదర్శన్ రెడ్డికి ఫోన్ చేశారు. తన ఇంటి రుణం చెల్లించాలని సాయంత్రం డబ్బులు ఇస్తానని చెప్పారు. దీంతో సుదర్శన్‌రెడ్డి తన స్నేహితులు శ్రీనివాసులు, కిరణ్ కుమార్ రెడ్డిల నుంచి రూ.లక్ష తన ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. అనంతరం హరిప్రసాద్ పంపిన లింక్ ద్వారా సుదర్శన్‌రెడ్డి రుణం చెల్లించేందుకు ప్రయత్నించగా పేమెంట్ ఫెయిలైంది. దీంతో డబ్బులు నేరుగా చెల్లించేందుకు కడపకు వెళ్తున్న సమయంలో ఖాతాలో నుంచి రూ.లక్షతో పాటు తన ఖాతాలో ఉన్న రూ.7,199 మాయమైనట్లు గుర్తించారు. వెంటనే ఖాజీపేట బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్‌ను సంప్రదించగా ఇది సైబర్ నేరానికి సంబంధించిన మోసమన్నారు. మేనేజర్ సూచన మేరకు బాధితుడు కడప సైబర్ క్రైమ్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

ఆభరణాల మంజూరుకు ప్రణాళికలు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని బోయనపల్లి 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద ఉన్న శ్రీవారి ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు భారీగా ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. దాదాపు రెండు వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందేలా ఏర్పాట్లు చేశారు. నిత్యం స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకోసం ఉచిత అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. తితిదే అధికారుల నుంచి ఆదేశాలు రాగానే అమలు చేసేలా ఏర్పాట్లు చేశారు. అంతే కాకుండా స్వామి వారికి అవసరమైన బంగారు ఆభరణాలు మంజూరు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయడంతో వారం పది రోజుల్లో ఆభరణాలు వస్తాయని అధికారులు, అర్చకులు తెలిపారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

కమలాపురం, న్యూస్‌టుడే : పట్టణంలోని సీఎస్ఐ, పట్టణ టీసీసీ, తెలుగు చర్చి కౌన్సిల్ తదితర చర్చిల్లో ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. గురువారం నూతన సంవత్సరం సందర్భంగా సాయంత్రం మహిళలు, యువతులకు లెమెన్ స్పూన్, పరుగు పందెం, త్రో బాల్, సూదిలో దారం పోటీలు నిర్వహించారు. పురుషులు, యువకులకు టగ్‌ఆఫ్‌వార్, పరుగపందెం తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

గోనె సంచి పోటీల్లో పురుషులు

తాడు లాగుడు పోటీల్లో మహిళలు

నిందితులను పట్టుకుంటాం

పులివెందుల, న్యూస్‌టుడే : మాజీ మంత్రి వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ2గా ఉన్న సునీల్‌యాదవ్ భార్యను బెదిరించిన కేసులో నిందితులను తప్పకుండా పట్టుకుంటామని పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. గురువారం ఆయనతోపాటు పులివెందుల గ్రామీణ సీఐ ఎన్వీ రమణ, పులివెందుల పట్టణ ఇన్‌ఛార్జి సీఐ నరసింహులు, ఎస్ఐలతో కలిసి ఆయన ఘటన జరిగిన ప్రదేశానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను వారు పరిశీలించారు. అనంతరం సునీల్‌యాదవ్ భార్య ధనలక్ష్మి, సోదరుడు కిరణ్‌యాదవ్‌ను డీఎస్పీ విచారించారు. తిరిగి సాయంత్రం కూడా డీఎస్పీ కార్యాలయానికి పిలిపించుకుని ఎలా జరిగింది.. ముందుగా సునీల్‌యాదవ్ ఇంటి నుంచి ఎవరైనా అనుసరించారా..? లేక మార్గమధ్యంలో అనుసరించారా..? అని పలు కోణాల్లో విచారిస్తున్నారు. నిందితుడు వాడిన పల్సర్ బైకు రంగు తెల్లగా ఉంది. ఈ మేరకు అనుమానాస్పదంగా అదేరంగు గల 12 వాహనాలను స్వాధీనం చేసుకుని, వాటి సంబంధీకులను విచారణ చేస్తున్నామని డీఎస్పీ మురళీ నాయక్ తెలిపారు. త్వరలో ఈ కేసును ఛేదిస్తామన్నారు.

సునీల్‌యాదవ్ కుటుంబ సభ్యులను విచారిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

గురువుల ఆందోళన బాట

వేంపల్లె, న్యూస్‌టుడే : గురువులు ఆందోళనబాట పట్టారు. తమ డిమాండ్ల సాధన కోసం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంటు ప్రొఫెసర్లు, అతిథి అధ్యాపకులు నూతన సంవత్సరాది రోజు గురువారం నిరసనకు దిగారు. ట్రిపుల్ ఐటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమకు వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ డైరెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ట్రిపుల్ ఐటీ కాంట్రాక్ట్ బోధనా సిబ్బంది వేతనాలు పెంచి హోదా మార్చాలంటూ అక్కడి అకడమిక్ బ్లాక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. 2018లో తాము అతిథి అధ్యాపకులుగా విధుల్లో చేరామని, ఇప్పటి వరకు ఒకపైసా జీతం పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీతాలు పెంచాలని వారు కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నజీర్‌హుస్సేన్, గౌతమ్, గిరిజ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో అకడమిక్ బ్లాక్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ బోధనా సిబ్బంది

ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: గుంటూరులో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగే ప్రపంచ తెలుగు మహాసభలకు ప్రొద్దుటూరుకు చెందిన కవి, రచయిత జింక సుబ్రహ్మణ్యానికి ఆహ్వానం వచ్చింది. జాషువా కరుణశ్రీ కవి సమ్మేళన వేదికపై తనకు పాల్గొనే అవకాశం కల్పించినట్లు ఆయన వెల్లడించారు.

జింక సుబ్రహ్మణం

రామయ్య అన్నప్రసాదానికి రూ. 1,00,111 వితరణ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో తితిదే నిర్వహిస్తున్న అన్నప్రసాద కేంద్రానికి కర్నూలు నగరం పాత బస్టాండు ప్రాంతం ఎస్.నాగప్పవీధికి చెందిన న్యాయవాదులు ఎ.రాజేంద్రప్రసాద్, హిందుమతి దంపతులు రూ.1,00,111 వితరణ చేశారు. రామయ్య క్షేత్రాన్ని గురువారం కుటుంబ సమేతంగా వారు దర్శించారు. జగదభిరాముడిపై అపారమైన భక్తిభావంతో కానుకగా బహూకరించినట్లు దాతలు తెలిపారు. అనంతరం న్యాయవాదులను ఆలయ మర్యాదలతో అర్చకులు సత్కరించి వేదాశీర్వచనం చేశారు. తితిదే తరఫున దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎ.పవన్‌కుమార్, వీణా రాఘవాచార్యులు పాల్గొన్నారు.

తితిదే ఉద్యోగి కన్నయ్యకు నగదు అందజేస్తున్న న్యాయవాదులు రాజేంద్రప్రసాద్, హిందుమతి దంపతులు

కలెక్టర్‌ను కలిసిన ఎన్జీవో నాయకులు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం పురస్కరించుకుని గురువారం జిల్లా కలెక్టర్ శ్రీధర్‌ను ఎన్జీవో సంఘ నాయకులు కలిశారు. నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్జీవో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, కార్యదర్శి నిత్యపూజయ్య, గౌరవ అధ్యక్షుడు తిమ్మారెడ్డి, కోశాధికారి టి.శ్రీనివాసులు, నగర అధ్యక్షుడు చిన్నయ్య, కార్యదర్శి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: దాడి ఘటనపై ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశామని గురువారం పోలీసలు తెలిపారు. మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్న షేక్ జబీవుల్లాకు అదే ప్రాంతానికి చెందిన హకీంకు కొంత కాలంగా పాత గొడవలున్నాయి. ఈ క్రమంలో జబీవుల్లాపై హకీంతో పాటు ఆయన సోదరులు ఇలియాస్, రియాజ్ భౌతికంగా దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రక్షక భటులు చెప్పారు.

సుండుపల్లి ఎంఈవో-2 సస్పెండ్

సుండుపల్లి, న్యూస్‌టుడే: ఎంఈవో-2 రవీంద్రనాయక్‌ను సస్పెండ్ చేస్తూ కడప జిల్లా విద్యాధికారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం రాయవరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని కొందరు విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. ఈ ఘటన జరిగిన రోజు ఎంఈవో సెలవులో ఉన్న బాధ్యుడిని చేసి సస్పెండ్ చేయడంపై సర్వత్రా ఆశ్చర్యం కలిగించింది.

ఎల్‌ఎల్‌బీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

వైవీయూ, న్యూస్‌టుడే : యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలోని లా కళాశాలల ఎల్‌ఎల్‌బీ పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ తన ఛాంబర్‌లో గురువారం విడుదల చేశారు. మూడేళ్ల కోర్సుకు సంబంధించి 2, 4, 6 సెమిస్టర్లు, ఐదేళ్ల కోర్సుకు సంబంధించి 2, 4, 6, 8 సెమిస్టర్‌ల ఫలితాలను వెల్లడించారు. అక్టోబర్ మాసంలో జరిగిన ఈ పరీక్షల మూల్యాంకనం ప్రక్రియలో చురుగ్గా వ్యవహరించిన సీఈ కార్యాలయ పరీక్షల సిబ్బందిని అభినందించారు. విద్యార్థులు ఫలితాల కోసం https:///www.yvuexams.inesults.aspx వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కృష్ణారావు పాల్గొన్నారు.



ఎల్‌ఎల్‌బీ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేస్తున్న వైవీయూ ఉప కులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్

అయిదు రోజులు.. వాలీబాల్ పండగ

● 5 నుంచి జాతీయ స్థాయి బాలికల ఛాంపియన్ షిప్ టోర్నీ
● చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : ఎంతో ప్రతిష్ఠాత్మకమైన అండర్-14 జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లా వేదిక కానుంది. 23 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి మొత్తం 353 మంది వాలీబాల్ క్రీడాకారిణిలు జిల్లాకు విచ్చేయనున్నారు. వీరితో పాటు 67 మంది కోచ్‌లు, మేనేజర్లు హాజరుకానున్నారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జమ్మలమడుగులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ మెగా క్రీడా పండగ జరగనుంది. క్రీడాకారిణిలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 16 కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ మెగా జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను విజయవంతం చేసేందుకు 130 మంది వ్యాయామ ఉపాధ్యాయులు తమ సేవలను అందించనున్నారు. ఈ టోర్నమెంట్ ఆర్గనైజర్ బాధ్యతలను పెండ్లిమర్రి మండలం గంగనపల్లె వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డికి అప్పగించారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతిలతో పాటు శివశంకర్‌రెడ్డి పర్యవేక్షణలో వాలీబాల్ నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. పోటీలు జరిగే క్రీడా ప్రాంగణాన్ని సిద్ధం చేశారు.

3న కమిటీలతో సమావేశం

ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి అండర్-14 బాలికల వాలీబాల్ ఛాంపియన్‌షిప్ విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, నిర్వాహకులు, కమిటీ సభ్యులు ఈ నెల 3న జమ్మలమడుగు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి డీఈవో షంషుద్దీన్‌తో పాటు రాష్ట్ర ఎస్‌జీఎఫ్ కార్యదర్శి భానుమూర్తి రాజు, ఇతర జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు హాజరు కానున్నారు. టోర్నమెంట్ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలు.. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారిణిలు, కోచ్‌లు, మేనేజర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఏఏ చర్యలు తీసుకోవాలో తదితర అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. ఇప్పటికే రవాణా, ఆహ్వాన, ఫుడ్, గ్రౌండ్ ప్రిపరేషన్, స్టేజీ, అకామిడేషన్, కంట్రోల్ రూం కమిటీలతో పాటు మరిన్ని కమిటీలను ఏర్పాటు చేశారు. క్రీడాకారిణిలు పెద్దఎత్తున వస్తుండటంతో వారికి కావాల్సిన వసతి ఏర్పాట్లను పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు.

అధికారులకు ఆహ్వానం

టోర్నమెంట్ ఆర్గనైజర్ శివశంకర్‌రెడ్డితో పాటు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చంద్రావతి, ఆహ్వాన కమిటీ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, రాయుడు, నాగరాజారెడ్డి, అగ్గిరప్ప, మహేశ్వరరెడ్డిలు గురువారం జిల్లా కలెక్టర్ శ్రీధర్, జిల్లా ఎస్పీ విశ్వనాథ్, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, జడ్పీ ఛైర్మన్ రామగోవిందరెడ్డిని కడపలో కలిశారు. వారికి జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ఆహ్వాన పత్రాలను అందించారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న టోర్నమెంట్ ఆర్గనైజర్, కమిటీ సభ్యులు

EENADU Classifieds

PERSONAL CLASSIFIEDS

BIRTHDAY GREETINGS

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

TO LET

COMMERCIAL

సిద్దవటం కోర్టు సమీపమున మెయిన్ రోడ్డులో ఉషా గార్డెన్, ఫంక్షన్ హాలు, రూములు బాడుగకు గానీ లీజుకు ఇవ్వబడును. Cell : 9949741939.

JOBS

Kadapa, Proddatur Ather Showroom need Sales Executives, Service Technicians, Service Advisors Cont: 7093909123 (Sales), 9381331440 (Service)

కడపలో డా|| పరమేశ్వర రావు ENT (చెవి, ముక్కు, గొంతు) హాస్పిటల్ నందు పని చేయుటకు ఇద్దరు నర్సులు, కాంపౌండర్స్ & ఇంట్లో పని చేయుటకు ఇద్దరు ఆడవారు కావలెను. కడప వారికి ప్రాధాన్యత. ✆ 9492410402

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ|| 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏటి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాజంపేట
•రాజంపేట • బద్వేలు

ప్రాణవాయువుకు ప్రాణం పోద్దాం

మొక్కకు నీరు పోస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

బద్వేలు, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి మొక్కలను నాటాలని ఆర్డీవో చంద్రమోహన్ సూచించారు. స్థానిక ఎస్సీ-1 సాంఘిక సంక్షేమ వసతి గృహంలో గురువారం విద్యార్థులతో కలిసి 2026 నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాణవాయువుకు ప్రాణం పోద్దామన్నారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను విరివిగా నాటి విద్యార్థులు సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. మొక్కలతోనే మెరుగైన పర్యావరణ మంచి ఫలితాలను సాధించొచ్చన్నారు. వసతి గృహం ఆవరణలో మొక్కలను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో పుర కమిషనర్ నరసింహా రెడ్డి, ఎపీసీడబ్ల్యూ షేక్ హైపా, వార్డెన్లు సుభాష్ చంద్ర, మధుసూదనరెడ్డి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

భవిష్యత్తు కూటమి ప్రభుత్వానిదే

సిద్దవటం, న్యూస్‌టుడే: మరో ముప్పై ఏళ్ల వరకు కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండాలని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ నియోజక వర్గం సమన్వయకర్త అతికారి కృష్ణ ఆకాంక్షించారు. సిద్దవటంలో గురువారం జనసేన, తెదేపా నాయకులు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. అతికారి కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను కూటమి నాయకులు గజమాల వేసి సత్కరించారు. తెదేపా, జనసేన పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గజమాలతో సత్కరిస్తున్న కూటమి నాయకులు

కొత్త సంవత్సరం.. ఆలయాల్లో భక్తజనం

రాజంపేటలో భక్తులకు దర్శనమిస్తున్న వాయుపుత్ర హనుమాన్

రాజంపేట, బద్వేలు నియోజకవర్గాల్లోని ఆయా ఆలయాల్లో నూతన సంవత్సరం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని ఆలయాలను ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక పూజలు నిర్వహించారు. కొత్త ఏడాదిలో అంతా మంచే జరగాలని భక్తులు మొక్కుకున్నారు. ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. **- న్యూస్‌టుడే, బృందం**

లక్ష్మీపాలెం గ్రామంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సుండుపల్లిలో పూజలందుకుంటున్న నాగాలమ్మ

పోరుమామిళ్లలో ప్రత్యేక అలంకరణలో లక్ష్మీకాంత స్వామి

బద్వేలులోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

శత శాతం లక్ష్యంగా నిత్యం అధ్యయనం

వీరబల్లి, న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి పరీక్షలే కీలకం కావడంతో ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కసరత్తు చేస్తున్నారు. ప్రతి ఏటా వంద శాతం ఫలితాలు సాధిస్తున్నారు. అంతేగాక మండలంలోనే కాకుండా జిల్లా, రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నిలుస్తున్నారు. ఏటా వంద శాతం ఉత్తీర్ణతతో పాటు, ట్రిపుల్‌ఐటీ, ఎన్ఎంఎంఎస్ ఉపకారవేతనాలు సాధిస్తున్నారు ఈ మండలంలోని పెద్దివీడు ఉన్నత పాఠశాల విద్యార్థులు. ఈ ఏడాది కూడా వంద శాతం సాధించడంతో పాటు అత్యధిక మార్కులు సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు ఈ విద్యార్థులు. ఆ వివరాలు వారి మాటల్లోనే.

బృంద చర్చల్లో పాల్గొన్న విద్యార్థులు

బృంద చర్చలతో సందేహాల నివృత్తి

బృంద చర్చలతో సందేహాలు నివృత్తి అవుతున్నాయి. ప్రత్యేకంగా మెరిట్ విద్యార్థులతో పాఠ్యాంశాలలో వస్తున్న సందేహాలను చెప్పిస్తున్నారు. నిత్యం ప్రత్యేకంగా ఈ చర్చలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు చెప్పలేని ఉపాధ్యాయులతో కూడా చెప్పిస్తున్నారు. అర్థం కాని వాటిని పదే పదే నివృత్తి చేసుకోవడంతో పరీక్ష సమయంలో పూర్తి సమాధానం రాసి అత్యధిక మార్కులు సాధిస్తామనే ధీమా వస్తోంది. **- టి.నాగరాజు**

అత్యధిక మార్కులు సాధిస్తా

గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా అత్యధిక మార్కులు సాధిస్తా. గతేడాది ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో రాష్ట్రంలో ఉత్తమ ర్యాంకు వచ్చింది. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపి పాఠ్యాంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వివిధ మోడల్ పేపర్లను ప్రిపేర్ చేయిస్తున్నారు. దీంతో అత్యధిక మార్కులు సాధిస్తాననే నమ్మకం ఉంది. **- జి.మౌలిక ప్రియ**

ప్రత్యేక తరగతులు

పదో తరగతిలో ఎస్ఏ వన్ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఏ, బీ గ్రేడ్ వచ్చిన పిల్లలను షైనింగ్ స్టార్లుగాను సీ, డీ గ్రేడ్లు వచ్చిన వారిని రైజింగ్ స్టార్లుగా గుర్తించి తగిన మెటీరియల్ అందిస్తాం. నిత్యం యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఒక సబ్జెక్టుపై 20 మార్కుల పరీక్షను నిర్వహిస్తాం. బడికి రాని పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించి పాఠశాలకు వచ్చేలా చేస్తున్నాం. సబ్జెక్టులో వెనుకబడ్డ వారిని దృష్టిలో ఉంచుకొని మెరిట్ ఉన్న విద్యార్థులతో బృంద చర్చలు పెట్టించి వారి సందేహాలను నివృత్తి చేస్తున్నాం. **- ఎస్.శివయ్య, ప్రధానోపాధ్యాయుడు**

రెండు మండలాలను రాయచోటి రెవెన్యూ డివిజన్‌లో కలపాలి

వీరబల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం తీసుకున్న జిల్లా పునర్విభజనలో భాగంగా రాయచోటి జిల్లాను మార్చి అన్యాయం చేయగా, దగ్గర్లో ఉన్న వీరబల్లి, సుండుపల్లి మండలాలను కడపలోకి కలిపి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని మండల బీసీ సంఘం నాయకులు పి.జయరామయ్య అన్నారు. జిల్లా పోయినా రెవెన్యూ డివిజన్‌లోనైనా అందుబాటులో ఉన్న రాయచోటిలో కలపక పోవడం దారుణమన్నారు. ఈ మండలాలకు రాయచోటి 20 కిలోమీటర్ల లోపే ఉన్నాయన్నారు. తిరిగి రాయచోటి మీదుగానే ప్రస్తుతం కడపకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ విషయం రాజకీయ నాయకులకు తెలిసినా రాయచోటి రెవెన్యూ డివిజన్‌లో కలపాలని అడుగక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై పునరాలోచన చేసి రాయచోటి రెవెన్యూ డివిజన్లో కలిపేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సుండుపల్లి: జిల్లా పునర్విభజనలో భాగంగా రెవెన్యూ డివిజన్ల పరిధిని మార్చడంలో నాటి వైకాపా, నేటి తెదేపా పాలనలోనూ సుండుపల్లి, వీరబల్లి మండలాల ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలాల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన రాజకీయ పార్టీల నేతలు తీరుపై సాధారణ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కోడూరును రాయచోటి జిల్లాలో కలిపి రెవెన్యూ డివిజన్‌ను మాత్రం రాజంపేటలో పాలకులు ఉంచారు. ఈ మండలాలకు దగ్గరలో ఉన్న రాయచోటి రెవెన్యూ డివిజన్ కాదని రవాణా సౌకర్యం లేని రాజంపేటలో కలపడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అలాగే 20 కి.మీ. రాయచోటి గ్రామీణ సర్కిల్, డీఎస్పీ పరిధిలోని సుండుపల్లి, వీరబల్లి మండలాలను రాజంపేట గ్రామీణ పోలీసు, డీఎస్పీ పరిధిలోకి చేర్చడం కూడా ప్రజలకు, పరిపాలనకు ఇబ్బందికరమే అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు మండలాలకు చెందిన కూటమి నాయకులు ప్రజల ఆకాంక్షలను, కష్టాలను పాలకుల దృష్టికి తీసుకెళ్లి ప్రజా ప్రయోజనం కాపాడేందుకు ఇకనైనా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని చర్చిలు, పలు ప్రార్థనా మందిరాల్లో గురువారం నూతన సంవత్సర వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలసపాడులోని పురాతన 'పరిశుద్ధ పేతురు-పౌలు' సీఎస్ఐ (ఎస్‌పీజీ) చర్చి, కలసపాడు, చెన్నారెడ్డిపల్లెల్లోని ఆర్సీఎం చర్చిలకు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు సామూహిక ప్రార్థనలు చేశారు. డీసీఎస్సైయ్యే ఆనంద్‌కుమార్, విచారణ గురువు కత్తుల మనోహర్ భక్తులకు నూతన సంవత్సర సందేశమిచ్చారు.

ఆర్సీఎం చర్చిలో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

నిరసనలపై ఉక్కుపాదం మోపడం సరికాదు

కలసపాడు, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో బైజూస్ పేరుతో వేల కోట్లను ఒక ప్రైవేటు సంస్థకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేసిన విశాఖకు చెందిన ఏఐఎస్ఎఫ్, విద్యార్థి సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి, పూర్వపు ఏఐఎస్ఎఫ్ నాయకుడు పి.రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్పటి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తే ప్రస్తుత ప్రభుత్వం ఆ కేసుల ఆధారంగా రౌడీషీట్ పెట్టడం సరికాదన్నారు. వారి భవిష్యత్తు నడిరోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు చేసే నిరసనలపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపడం సరికాదన్నారు.

నేటి నుంచి పాసు పుస్తకాల పంపిణీ

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: రీ సర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం నుంచి పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తామని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల తొమ్మిది వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. 2న రౌతుపల్లి, మిద్దెపాడు, 3న టి.శేషంపల్లి, 6న చెన్నకృష్ణాపురం, 7న లింగంపల్లి, వీరబల్లి, 8న సిద్దన్నకిచ్చాయపల్లి, 9న మార్కాపురం గ్రామాల్లో ఈ సదస్సులు నిర్వహించి పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన తెదేపా నాయకులు

కలసపాడు, న్యూస్‌టుడే: పోరుమామిళ్లలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మను గురువారం కలసపాడు తెదేపా టౌన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పట్టా బీరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బి.రోషిరెడ్డి తదితరులు కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేలు గ్రామీణ: పట్టణంలోని తెదేపా కార్యాలయంలో ఏపీఐఐసీ డైరెక్టర్ వద్దిబోయిన ప్రసాద్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రసాద్‌రెడ్డి తెదేపాలో క్రియాశీలకంగా పనిచేస్తూ, పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు జి.వెంగల్‌రెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

అట్లూరు: అట్లూరులో తెదేపా నాయకుడు బోవిళ్ల జయకృష్ణారెడ్డిని ఉత్తమ కార్యకర్తగా ఎంపిక చేయడంపై మాజీ ఎమ్మెల్యే విజయమ్మ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రశంసా పత్రాన్ని జయకృష్ణారెడ్డికి ఆమె అందజేసారు. పార్టీ నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో పాటు గుర్తింపు కార్డుల జారీలో ప్రథమంగా నిలవడంతో బోవిళ్ల జయకృష్ణారెడ్డికి ఉత్తమ కార్యకర్తగా ఎంపికైనట్లు పార్టీ నాయకులు తెలిపారు.

విశ్వబ్రాహ్మణ సంఘాభివృద్ధికి కృషి

రాజంపేట, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని విశ్వబ్రాహ్మణ తాలూకా సంఘం అధ్యక్షుడు డాక్టర్ సి.సుధాకర్‌ని ఆయన కార్యాలయంలో ఆ సంఘ నాయకులు గురువారం కలిసి సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ తాలూకా అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్‌ను సత్కరిస్తున్న నాయకులు

పింఛనుదారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వండి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : నూతన సంవత్సరంలో వైద్య ఆరోగ్య శాఖలోని ఉద్యోగులు, పింఛనుదారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని కోరుతూ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంబారపు అహరోన్ కోరారు. గురువారం నూతన సంవత్సరం తొలి రోజును పురస్కరించుకుని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉద్యోగుల సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్ ఆవిష్కరించారు. అహరోన్ మాట్లాడుతూ కొత్త ఏడాదిలో ఉద్యోగులు, పింఛనుదారులు సంతోషంగా ఉండేలా చూడాలని కోరారు.

రహదారి ఇలా.. ప్రయాణం ఎలా?

సుండుపల్లి- రాజంపేట మార్గంలో సానిపాయి ఘాట్ వద్ద ప్రధాన రహదారి పక్కనే వర్షాలకు రహదారి కోతకు గురై రాళ్లు తేలాయి. అకస్మాత్తుగా ఎదురుగా వాహనం వస్తే పక్కకు దిగాలంటే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని చోదకులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సుండుపల్లి

తాగునీరు వృథా.. ప్రజల వ్యథ

సిద్దవటం మండలం మాధవరం-1 పరిధి పార్వతీపురంలోని రోడ్డు నం-4 శివారులో పైపులైను లీకేజీ కావడంతో తాగునీరు వృథాగా పోతోంది. నాలుగు నెలల నుంచి నీరు వృథాగా పోతూ రహదారిపైకి చేరుతోంది. దీంతో రహదారంతా బురదగా మారి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో అటుగా వెళ్లలేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. మరమ్మతులు చేయాలని పలుమార్లు కోరినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

- న్యూస్‌టుడే, సిద్దవటం

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

బద్వేలు నాలుగు రోడ్ల కూడలిలో పురపాలక అధికారులు అధునాతన ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.పది లక్షలు వెచ్చించారు. పాతవి సక్రమంగా పనిచేయక పోవడంతో వాటి స్థానంలో వీటిని ఏర్పాటు చేశారు. ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వెళ్తే చలానా వారి చరవాణికి వస్తుందని అధికారులు చెబుతున్నారు. త్వరలో వీటిని ప్రారంభించనున్నట్లు కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. **- న్యూస్‌టుడే, బద్వేలు**

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

రాజంపేట, బద్వేలు నియోజక వర్గాల్లోని అధికారులు, అన్ని పార్టీల నాయకులు గురువారం నూతన సంవత్సర వేడుకలను ఆయా కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. కేకును కోసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి సబ్‌కలెక్టర్ హెచ్ఎస్ భావన కేక్ కోసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఒంటిమిట్ట తెదేపా కార్యాలయంలో చమర్తి జగన్ మోహన్‌రాజు వేడుకలకు హాజరై కేకును కోసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. పోరుమామిళ్ల సహకార సంఘం కార్యాలయంలో నూతన సంవత్సరం సందరర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆధ్వర్యంలో కేక్‌ను కోసి కార్యకర్తలకు పంచారు. **- న్యూస్‌టుడే, బృందం**

ఒంటిమిట్ట తెదేపా కార్యాలయంలో కేకు కోస్తున్న తెదేపా నియోజక వర్గ ఇన్‌ఛార్జి జగన్‌మోహన్‌రాజు

బద్వేలులో ఎమ్మెల్యే సుధకు శుభాకాంక్షలు తెలుపుతున్న పురపాలక ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కేక్ కోస్తున్న సబ్‌కలెక్టర్ హెచ్ఎస్ భావన

రాజంపేటలో పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కోస్తున్న తెదేపా లీగల్‌సెల్ పార్లమెంటు అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై పరిశీలన

సుండుపల్లి, న్యూస్‌టుడే: రాయవరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని పలువురు విద్యార్థులు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న వైద్యాధికారి రుబీనా, వైద్య బృందం గురువారం విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. విద్యార్థుల పరిస్థితిని అడిగి తెలుసుకుని ఆరోగ్యంగా ఉన్నారని నిర్ధారించుకున్నారు. పరిశీలన కార్యక్రమంలో సీహెచ్‌వో వీరనారాయణ, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడే సందడి
అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల, న్యూస్‌టుడే : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గురువారం పులివెందులలోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. పులివెందులకు చెందిన డ్యాన్స్ మాస్టర్ శ్రావణ్, ఎస్.కె. ఫిలిం స్టూడియో, భవాని కృష్ణ క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు పలు సినీ, భక్తి గీతాలకు చేసిన నృత్యం అదరహో అనిపించాయి. గణనాయకాయ, బ్రహ్మమొక్కటే, ఓం నమఃశివాయ, మూషిక వాహన తదితర భక్తి గీతాలకు చిన్నారులు చేసిన నృత్యం అబ్బురపరిచాయి. అలాగే బుట్టబొమ్మ, వంగతోట కాడ, వరాహరూపం, ఓ బావా రబ్బరు గాజులు తదితర సినీ పాటలకు చేసిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. శిల్పారామం పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి అన్ని ఏర్పాట్లను చేసి పర్యవేక్షించారు.

పులివెందుల : సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు హాజరైన ప్రజలు

మారుతీనగర్, న్యూస్‌టుడే : నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా శిల్పారామం కళావేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో ఆలరించాయి. విద్యార్థులు, కళాకారులచే నిర్వహించిన పలు సాంస్కృతిక, జానపద, పల్లెటూరు, సినీ గీతాల కార్యక్రమాలు ఆహ్లాదం కోసం వచ్చిన ప్రజలను ఎంతో ఉత్సాహపరిచాయి. నూతన సంవత్సర ప్రత్యేక కార్యక్రమంలో చిన్నారులు, పెద్దలు, మహిళలు సందడి చేశారు.

మారుతీనగర్ : శిల్పారామం కళా వేదికపై నృత్యం చేస్తున్న యువకులు

పేరుకు పురపాలకం.. మార్కెట్ లేక దైన్యం

బద్వేలు కూరగాయల మార్కెట్

బద్వేలు, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు మారిన బద్వేలు పురపాలకలోని కూరగాయల మార్కెట్ రూపు రేఖలు మాత్రం మారడం లేదు. కనీస సౌకర్యాలు కొరవడటంతో వ్యాపారులు, పురప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ అరవై కూరగాయల అంగళ్లు వరకు న్నాయి. వీటి ద్వారా ఏటా ముప్పై లక్షలు దాకా పురపాలకకు ఆదాయం వస్తోంది. వీటికి సంబంధించి ప్రత్యేక కూరగాయల మార్కెట్ లేదు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన స్థలంలోనే తాత్కాలికంగా రేకుల షెడ్లను వేసి నడుపుతున్నారు. నిత్యం బద్వేలు, మైదుకూరు ప్రాంతాలలో పండిస్తున్న కూరగాయలను రైతులు ఇక్కడకు తెచ్చి వ్యాపారులకు విక్రయిస్తుంటారు. రోజుకు మూడు నుంచి నాలుగు లక్షల వరకు వ్యాపారం జరుగుతుంది. అయితే అక్కడ కనీస సౌకర్యాలైన తాగునీరు, మరుగు దొడ్లు లాంటివి లేవు. అత్యవసర సమయాల్లో దూరంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కూరగాయల మార్కెట్‌కు నిత్యం వందల మంది ప్రజలు వస్తూ ఉంటారు. ఈ ప్రాంగణం అంతా ఇరుకుగా ఉండటంతో రాకపోకలను సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల పార్కింగ్‌కు కూడా కష్టంగా మారుతోంది. పురపాలకలో 35 వార్డులు ఉన్నాయి. లక్షా పదివేల దాక జనాభా ఉన్నారు.

చర్యలు తీసుకుంటాం

ఇక్కడ సౌకర్యాలు లేని విషయాన్ని పురపాలక కమిషనర్ నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లాము. దీనిపై స్పందించిన ఆయన కూరగాయల మార్కెట్ పెట్టిన స్థలం న్యాయస్థానం పరిధిలో ఉందని, అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఆంక్షలు ఉండటంతో సమకూర్చలేదన్నారు. ప్రత్యేక కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కనీస సౌకర్యాలు లేవు



బద్వేలు కూరగాయల మార్కెట్‌లో కనీస సౌకర్యాలు లేవు. రోడ్లు కూడా మేమే వేసుకున్నాం. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేవు. అత్యవసర సమయాల్లో వెళ్లాలంటే కష్టంగా ఉంటోంది. వర్షం వస్తే షెడ్లు కూడా ఉరుస్తున్నాయి. ఒక్కొక్క దుకాణానికి రోజుకు వంద రూపాయలు చెల్లిస్తున్నాం. ఇప్పటికైనా పురపాలక అధికారులు చొరవ తీసుకుని సౌకర్యాలతో కూడిన ప్రత్యేక కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి.

- యూనస్ కూరగాయల వ్యాపారి బద్వేలు

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

కడప విద్య, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం, సంక్రాంతి కానుకగా 12వ పీఆర్సీ కమిషన్ నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి డిమాండు చేశారు. గురువారం స్థానిక ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (పీఎస్టీయూ) కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలైనా ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. పీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లకు మూడు డీఏలతో పాటు జనవరి నుంచి మరో డీఏ కలిపి మొత్తం నాలుగు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఇలియాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే : రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ అన్నారు. గురువారం నగరంలోని ఆ శాఖ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాలమానిని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలు, కార్యక్రమాలు రైతులకు అందేలా కృషి చేస్తామన్నారు. రైతు సంఘాలు ప్రజల సమస్యలు తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు నాగయ్య, బాలచంద్రయ్య, రామ్మోహన్‌రెడ్డి, పెద్దపుల్లయ్య, జిల్లా సమితి సభ్యులు రామాంజనేయరెడ్డి, సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

ప్రొద్దుటూరు

•ప్రొద్దుటూరు •జమ్మలమడుగు •మైదుకూరు

ఆర్టీపీపీలో కాలమానిని ఆవిష్కరణ

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఈ వాసుదేవరావు, యూనియన్ నాయకులు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ తాప విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం సీఈ వాసుదేవరావు చేతుల మీదుగా ఏపీ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (ఈ-1595) కాలమానిని గురువారం ఆవిష్కరించారు. ఈ మేరకు సీఈ వాసుదేవరావును ఆయన కార్యాలయంలో యూనియన్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్టీపీపీ అభివృద్ధికి సహకరించాలని సీఈ యూనియన్ నాయకులకు సూచించారు.

పొట్టిశ్రీరాములు కూడలిలో అంధకారం



మైదుకూరు పట్టణం పొట్టిశ్రీరాములు కూడలిలో విద్యుత్తు దీపాలు గత రెండు నెలలుగా వెలగడం లేదు. విద్యుత్తు తీగ తెగిపోవడంతో సమస్య ఉత్పన్నమైంది. ఫిర్యాదు చేసినా పురపాలక సిబ్బంది స్పందించ లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన కూడలిలో విద్యుత్తు దీపాలు వెలగకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పురపాలక కమిషనర్ వై.రంగస్వామి మాట్లాడుతూ విద్యుత్తు దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, మైదుకూరు

నేటి నుంచి గ్రామసభలు

జమ్మలమడుగు గ్రామీణ, కొండాపురం, మైదుకూరు, చాపాడు, న్యూస్‌టుడే: గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు జమ్మలమడుగు తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. 2న కొత్తగుండపల్లె, 5న సంజీవపల్లె, 6న ధర్మాపురం గ్రామాల్లో సభలు నిర్వహించి రైతుల నుంచి పాత పట్టాదారు పాసు పుస్తకాలను సేకరించి, కొత్తవి అందిస్తున్నారు.

- రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుకు పాసు పుస్తకాలు అందిస్తున్నట్లు కొండాపురం తహసీల్దార్ గుర్రప్ప తెలిపారు. ఈ నెల 2న బొమ్మేపల్లె, పురం, 3న మురారిచింతల, 5న రేగడిపల్లె, 6న బ్రాహ్మణపల్లె, 7న లింగాలనేనిపల్లె, 8న ఏటూరు గ్రామాలకు చెందిన రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.
- మైదుకూరు మండల పరిధిలోని సోమాయాజులపల్లెలో 2న, ఆదిరెడ్డిపల్లెలో 3న గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాజసింహ నరేంద్ర తెలిపారు. అలాగే మండలంలోని తిప్పిరెడ్డిపల్లె, మిట్టమానుపల్లె గ్రామాల్లో శుక్రవారం నుంచి రీసర్వే ప్రారంభం కానున్నట్లు తహసీల్దార్ తెలిపారు.
- రైతులకు నూతనంగా అందించే పట్టాదారు పాసుపుస్తకాలను శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం చాపాడు సచివాలయంలో పంపిణీ చేపడుతున్నట్లు చాపాడు తహసీల్దార్ రమాకుమారి తెలిపారు.

పురపాలక ప్లాట్లలో అభివృద్ధి పనులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో బొల్లవరం శివారు ప్రాంతాల్లో ఐఐసీఎంటీ పథకం కింద సాధారణ నిధులు రూ.14.80 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ముళ్లకంపలు, గడ్డి తొలగించి, ప్లాట్ల నంబరు రాళ్ల ఏర్పాటుకు నిధులు వినియోగిస్తున్నట్లు పురపాలక ఇంజినీరు శ్రీనివాసులు చెప్పారు. 80 ఎకరాల స్థలంలో 17 ఏళ్ల కిందట కొన్ని ప్లాట్లను పురపాలక సంఘం విక్రయించింది. మిగతా ప్లాట్లకు వేలం వేయడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి ఆదేశించడంతో అభివృద్ధి పనులు చేపట్టారు.

ప్లాట్లను విభజిస్తున్న పురపాలక సిబ్బంది

చివరి ఆయకట్టుకు నీరందేనా?

మైలవరం ఉత్తర కాలువ దుస్థితి

రామిరెడ్డిపల్లె వెళ్లే దారిలో దెబ్బతిన్న ఉత్తర కాలువ

జమ్ముతో నిండిన మైలవరం ఉత్తర, దక్షిణ కాలువలు

75 వేల ఎకరాలకు సాగునీరు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: మైలవరం జలాశయం కడప, నంద్యాల జిల్లాల రైతులకు జీవనాధారం. అంతటి ముఖ్యమైన జలాశయానికి సంబంధించిన ఉత్తర, దక్షిణ కాలువలు దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో జమ్ము, పూడికతో నిండిపోయాయి. కాలువలకు నీరు వదిలితే చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందని పరిస్థితి. ప్రధాన కాలువలతో పాటు ఉప కాలువలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మైలవరం ఉత్తర, దక్షిణ కాలువల ఆధారంగా సుమారు 75 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. మైలవరం ఉత్తర కాలువ 34.34 కి.మీ. పొడవు ఉంది. 47,195 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ప్రధాన కాలువకు అనుసంధానంగా నొస్సం, టంగుటూరు, పెద్ద పసుపుల, దేవగుడి, వెలవలి, గోపవరం ఉప కాలువలున్నాయి. కాలువల నిర్వహణ శిథిలం కావడంతో పూర్తిస్థాయిలో నీరందడం లేదు. సుమారు 20 ఏళ్ల కిందట ఈ కాలువలకు సిమెంటు పూత వేయించారు. తర్వాత వాటి గురించి పట్టించుకోకపోవడంతో పలుచోట్ల కాలువ రూపురేఖలు కోల్పోయాయి. మైలవరం, జమ్మలమడుగు, పెద్దముడియం మండలాల్లో కాలువలు, ఉప కాలువలు ఉనికి కోల్పోయేలా ఉన్నాయి. జమ్మలమడుగు నుంచి రామిరెడ్డిపల్లె వెళ్లే దారిలో ఉత్తర ప్రధాన కాలువ నిండా జమ్ము పెరిగి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. పూడిక సైతం నిండిపోయింది. పట్టణంలోని మురుగు అందులోకే చేరుతుండడంతో కాలువ అధ్వానంగా మారింది. 2025 జులై ఒకటో తేదీన జమ్మలమడుగు మండలం గూడెంచెరువు గ్రామానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చినపుడు మైలవరం ఉత్తర, దక్షిణ కాలువల ఆధునికీకరణ, ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.10 కోట్లు నిధులు కావాలని అధికారులు విన్నవించారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతే పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

ప్రొద్దుటూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవతామూర్తులు, పూజలు చేస్తున్న భక్తులు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణం పాతమార్కెట్‌వీధిలోని అలివేలుమంగ సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

కొండాపురం: మండలంలోని పలు ఆలయాలకు భక్తులు బారులు తీరారు. గురువారం తెల్లవారు జామునుంచే పెద్ద సంఖ్యలో భక్తులు బెదురూరు వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వెంకటాపురంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయం

ప్రొద్దుటూరు: దివ్యాంగుల సంక్షేమమే పూర్తి ధ్యేయంగా సంస్థ కృషి చేస్తోందని దివ్యాంగుల సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ దొడియం అష్ఫల్ అన్నారు. స్థానిక కూరగాయల మార్కెట్లో సంస్థ ఆధ్వర్యంలో గురువారం దాతలు సమకూర్చిన దుప్పట్లను దివ్యాంగులకు అందించారు. తెదేపా నాయకుడు, మాజీ కౌన్సిలర్ అలీల్, భాజపా నాయకుడు వై.చలపతిరావు అందజేశారు.

వెల్లాల ఆలయానికి విరాళం

రాజుపాళెం, న్యూస్‌టుడే: వెల్లాల చెన్నకేశవ, సంజీవరాయుని స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.50 వేలు విరాళం ఇచ్చినట్లు ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత జడ్జి చింతాలాలిరెడ్డి, భార్య సరోజమ్మ జ్ఞాపకార్థం కుమారుడు విజయకుమార్‌రెడ్డి, భార్య సవిత సాయమందించారు.

జమ్మలమడుగు సీఎస్‌ఐ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ సోలోమెన్

రామేశ్వరంలోని సీఎస్‌ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

ప్రపంచ శాంతి కోసం ప్రార్థించండి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరంలోని సీఎస్‌ఐ చర్చిలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా చర్చి రెవరెండ్ డాక్టర్ జాకోబ్ ఫ్రాంక్ భక్తులకు సందేశమిచ్చారు.

జమ్మలమడుగు: ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ ప్రార్థించాలని సీఎస్‌ఐ పాస్టర్ రెవరెండ్ సోలోమెన్, టీసీసీ పాస్టర్ జోసెఫ్, సీఎస్‌ఐ క్రైస్ట్ టౌన్ చర్చి దీన జనార్దన్ బాబు వాక్య సందేశాన్ని వినిపించారు. నూతన సంవత్సరాన్ని స్వాగతం పలుకుతూ అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రసంగించారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని స్థానిక సీఎస్‌ఐ క్రైస్ట్ టౌన్ చర్చిలో విద్యార్థులు నిర్వహించిన వివిధ రకాల పోటీలు ఆద్యంతం ఆసక్తిగా సాగాయి.

ఎర్రగుంట్లలో కేకు కోస్తున్న బీసీ నాయకులు

దువ్వూరు మండల తెదేపా కన్వీనర్ బొర్రెడ్డి వెంకటరమణారెడ్డికి గజమాల వేస్తున్న తెదేపా శ్రేణులు

మిన్నంటిన నూతన సంవత్సర సంబరాలు

జమ్మలమడుగు, జమ్మలమడుగు గ్రామీణ, ఎర్రగుంట్ల, రాజుపాళెం, దువ్వూరు: నూతన సంవత్సర వేడుకలు గురువారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు నియోజకవర్గాల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సరానికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత టపాసులు పేల్చారు. కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. రాజుపాళెం మండలం గోపల్లె తెదేపా నాయకులు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దువ్వూరు మండల తెదేపా కన్వీనర్‌కు బొర్రెడ్డి వెంకటరమణారెడ్డిని గుడిపాడులో ఆయన నివాసంలో గజమాలతో సత్కరించారు. ఎర్రగుంట్ల బీసీ సంఘం ఆధ్వర్యంలో కేకు కోశారు. జమ్మలమడుగు తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి తన కార్యాలయంలో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సిబ్బందికి నిమ్మకాయ ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏర్పాటు సరే.. నిర్వహణ లేకపోతే ఎలా?

నీటి ప్రవాహ స్థాయిని నమోదు చేసేందుకు చాపాడు మండలం కుందూనదిపై ఒద్దున రాష్ట్ర డ్యాం భద్రతా సంస్థ ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ వాటర్ లెవెల్ రికార్డర్‌ను పిచ్చిమొక్కలు చుట్టేశాయి. యంత్రం ఏర్పాటు చేయడం కాదు నిర్వహణ ముఖ్యమని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు ఆ దిశగా దృష్టి సారించాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, మైదుకూరు

విద్యుత్తు తీగలతో ముప్పు

రాజుపాళెం మండలంలోని వాసుదేవపురం సచివాలయం ఎదురుగా ఉన్న చెట్ల మధ్యలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షం, గాలి వచ్చిన సమయంలో తీగలు చెట్టు కొమ్మలకు తగిలి విద్యుత్తు సరఫరా అయ్యే అవకాశం ఉంది. ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, రాజుపాళెం

వాహనాలిలా.. రాకపోకలెలా..!

జమ్మలమడుగులోని ప్రధాన రహదారులు, కూడలి ప్రాంతాల్లో రహదారి నిబంధనలు పాటించడం లేదు. దారి అడ్డుగా వాహనాలు నిలుపుదల చేస్తుండటంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రద్దీగా ఉండే పాతబస్టాండ్ సర్కిల్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రహదారి పక్కనే వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో బస్సు ఎక్కేందుకు ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు.

- న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

ఈ ప్రయాణం ప్రమాదమే

చివరిలో కాళ్లు వేలాడదీసి కూర్చొని, నిలబడి ఉన్న ప్రయాణికులతో లగేజీ మినీలారీ దూసుకెళ్తోంది. ఈ దృశ్యం ప్రొద్దుటూరు నుంచి జమ్మలమడుగు వెళ్లే 67వ జాతీయ రహదారి చౌడూరు వద్ద కనిపించగా 'న్యూస్‌టుడే' కెమెరా క్లిక్‌మనిపించింది. సర్కారు ఆర్టీసీ బస్సు ప్రయాణం ఉచితం కల్పించినా కొందరూ ప్రమాదకరంగా ప్రయాణం చేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాల్సింది.

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

పేదలకు అండగా ఉంటాం

స్టీల్ బేసిన్ అందజేస్తున్న భాజపా నాయకుడు కటికరెడ్డి మాధుసూదన్‌రెడ్డి, రమాదేవి

ముద్దనూరు, న్యూస్‌టుడే : ముద్దనూరు పంచాయితీలోని గ్రామ ప్రజలందరికీ గురువారం మండల భాజపా నాయకుడు కటికరెడ్డి మాధుసూదన్‌రెడ్డి, యువనాయకుడు గుణవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 3,200 కుటుంబాలకు స్టీల్ బేసిన్లు అందించారు. ఈ సందర్భంగా మాధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏటా నూతన సంవత్సరం సందర్భంగా ముద్దనూరు, చెన్నరెడ్డిపల్లె, డియాన్‌పల్లె గ్రామ ప్రజలకు ఈ కార్యక్రమం చేస్తున్నట్లు వివరించారు. అలాగే ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం కింద వచ్చిన రూ.2 లక్షల చెక్కును బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో భాజపా నాయకుడు మాధుసూదన్‌రెడ్డి సతీమణి రమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మికాంతమ్మ, భాజపా నాయకులు పాల్గొన్నారు.

చాపాడు ఎంపీపీకి పరామర్శ

చాపాడు, న్యూస్‌టుడే: చాపాడు ఎంపీపీ లక్షుమయ్య తీవ్ర జ్వరంతో బెంగళూరులో చికిత్స పొందుతుండగా మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దంపతులు పరామర్శించారు. గురువారం బెంగళూరులోని ఎంపీపీ స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే, సతీమణి ప్రభావతమ్మ, వారి కుమారుడు అశోక్‌కుమార్‌రెడ్డి వెళ్లి ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు పట్టణం బద్వేలురోడ్డులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. పట్టణానికి చెందిన నవీన్, మండలంలోని పోతిరెడ్డిపల్లెకు చెందిన విశ్వం ద్విచక్రవాహనంపై వెళ్తూ డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు వెల్లడించారు.

ప్రొద్దుటూరు-మైదుకూరు మార్గంలోని 67వ జాతీయ రహదారి పక్కన మూలవారి పల్లె పరిధిలో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న ఇంటి ప్రహరీ, రేకుల వరండా కింద ఆర్టీపీపీ గొట్టానికి లీకేజీ ఏర్పడింది. దీంతో పెద్ద ఎత్తున కృష్ణా జలాలు వృథా అవుతున్నాయి. పైపునకు మరమ్మతు పనులకు గుంత తవ్వాలంటే ముందువైపు ఉన్న కట్టడాలను ఎవరూ తొలగించాలో ఖరారు కాకపోవడంతో సమస్య తీవ్రమవుతోంది. ఈ విషయమై

ఆర్టీపీపీ గొట్టానికి లీకేజీ

ఆర్టీపీపీ ఇంజినీరింగ్ విభాగం ఏఈ శైలేంద్ర కుమార్ మాట్లాడుతూ లీకేజీ అరికట్టేందుకు అడ్డుగా ఉన్న అక్రమ కట్టడాలను త్వరలో తొలగించి గొట్టానికి మరమ్మతు పనులు చేస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

తొగటవీర క్షత్రియుల అభివృద్ధికి కృషి

మాట్లాడుతున్న అధ్యక్షుడు సూర్యనారాయణ, చిత్రంలో కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక వసంతపేటలోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపం అధ్యక్షుడిగా బండారు సూర్యనారాయణ, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం తొగట కల్యాణ మండపంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడిగా బండారు రఘురామయ్య, పాలకవర్గ సభ్యులుగా మోతుకూరు వెంకట రమణ, చిన్నకోట్ల నాగభూషణం, పల్లా వెంకట సుబ్బయ్య, గంజికుంట ఆంజినేయులు, చౌడం ప్రసాదు, ఉమ్మడిశెట్టి చౌడయ్య, డాక్టరు కుండా నాగరాజుతో పాటు మరో 40 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. త్వరలో మినీ కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేస్తామని అధ్యక్షుడు సూర్యనారాయణ తెలిపారు. కమిటీలోని సభ్యులకు జీవిత బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. తొగటవీర క్షత్రియుల విద్య, సంక్షేమ, ఆర్థిక ప్రయోజనాలకు కృషి చేస్తామన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

కడప విద్య, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం, సంక్రాంతి కానుకగా 12వ పీఆర్సీ కమిషన్ నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి డిమాండు చేశారు. గురువారం స్థానిక ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (పీఎస్టీయూ) కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలైనా ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. పీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లకు మూడు డీఏలతో పాటు జనవరి నుంచి మరో డీఏ కలిపి మొత్తం నాలుగు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఇలియాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

పింఛనుదారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వండి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : నూతన సంవత్సరంలో వైద్య ఆరోగ్య శాఖలోని ఉద్యోగులు, పింఛనుదారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని కోరుతూ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంబారపు అహరోన్ కోరారు. గురువారం నూతన సంవత్సరం తొలి రోజును పురస్కరించుకుని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉద్యోగుల సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అహరోన్ మాట్లాడుతూ కొత్త ఏడాదిలో ఉద్యోగులు, పింఛనుదారులు సంతోషంగా ఉండేలా చూడాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కేకు కోసి సంబరాలు చేసుకుంటున్న శ్యాంసుందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలోనైనా ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా నాయకులతో కలిసి కేకు కోశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్సీ, పెండింగ్ డీఏలు, ఆర్థిక బకాయిలు చెల్లించాలన్నారు. టీచర్ల సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయులు గౌస్ మొహిద్దీన్, నాగరాజు, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, గురివిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు విద్య : 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు పాత పెన్షన్ అందుకోబోతున్నారని అందుకు ఈ సంవత్సరం ప్రత్యేకమైనదని ఒంటేరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు ఒంటేరును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి చర్యలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే : రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ అన్నారు. గురువారం నగరంలోని ఆ శాఖ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాలమానిని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలు, కార్యక్రమాలు రైతులకు అందేలా కృషి చేస్తామన్నారు. రైతు సంఘాలు ప్రజల సమస్యలు తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు నాగయ్య, బాలచంద్రయ్య పాల్గొన్నారు.

ఉపాధి పథకం.. పేదలకు వరం

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: మైదుకూరు నియోజకవర్గం బ్రహ్మంగారిమఠం మండలం పరిధిలోని శ్రామికులు ఖరీఫ్, రబీ సీజన్లు ముగిసిన తర్వాత పనుల్లేక ఇతర ప్రాంతాలకు పనులకు వెళ్తేవారు. 2005లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం ద్వారా వారికి పనులు కల్పించి ఆర్థికంగా తోడ్పాటు అందించింది. ఈ పథకం పేరును వీబీ- జీ రామ్ జీ మారుస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ఆమోదించింది. ఇది చట్టంగా మారింది. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు శ్రామికులకు ఏడాది 100 రోజులు పని కల్పించారు. కొలతల ప్రకారం పని చేస్తే రోజుకు రూ.307 లభిస్తుంది. ప్రస్తుతం

జాబ్ కార్డుకు 125 పని దినాలను కల్పిస్తూ కేంద్రం చర్యలు చేపట్టింది. దీంతో కూలీలకు అదనపు ఆదాయం సమకూరనుంది. ◆ ఉపాధి హామీ పథకం పేరు మార్పుతో పాటు, కూలీలకు పని దినాలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త చట్టం అమలుకానుంది. వ్యవసాయ పనులు లేని సమయంలో గ్రామాల్లో పేద ప్రజల జీవనానికి ఈ పనులే ఆధారం.

మండలం	జాబ్‌కార్డులు	మొత్తం శ్రామికులు	పనులకు వచ్చేవారు
బ్రహ్మంగారిమఠం	7,862	14,689	7,825
మైదుకూరు	7,211	14,018	8,710
దువ్వూరు	8,642	17,194	11,200
ఖాజీపేట	8,965	17,371	11,958
చాపాడు	7,041	13,329	8,540

సద్వినియోగం చేసుకోండి

ఉపాధి హామీ పథకంలో చెరువుల్లో శుభ్రత, మొక్కలు నాటే పనులు, పండ్లతోటల పెంపకం, నీటి కుంటలు, పంట కాలువలు, సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణం, పలు పనులను చేపట్టవచ్చు. ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- హరికృష్ణ, ఏపీవో, బ్రహ్మంగారిమఠం

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వరెజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468



శ్రద్ధాంజలి
సాకం సుబ్బారెడ్డి (S.P)
శ్రీ సిద్దేశ్వర స్వామి దేవస్థానమునకు రెండు పర్యాయములు ఆలయ ఛైర్మెన్‌గా ఎంతో అభివృద్ధి చేసినారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..
కీ॥శే॥ సాకం సుబ్బారెడ్డి (S.P)
కలమల్ల, యర్రగుంట్ల మండలం
ఇట్లు :
శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయ కమిటీ (Trust)

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

నేటి నుంచి గ్రామ సభలు

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: మండలంలో నేటి (శుక్రవారం) నుంచి 9వ తేది వరకు గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో రీ సర్వే పూర్తైన రెవెన్యూ గ్రామాలకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ ఈ సభల్లో ఉంటుందన్నారు. రైతులు నేరుగా గ్రామ సభలకు వచ్చి పాత పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చి కొత్తవి తీసుకోవాలని సూచించారు. గ్రామ సచివాలయాల వారీగా 2న (శుక్రవారం) మొయిళ్ల కాల్వ (మొయిళ్లకాల్వ, ఎస్.రామాపురం రెవెన్యూ గ్రామాలకు), 3న రంపతాడు (రంపతాడు, ఎగువపల్లె), 5న పెండ్లిమర్రి (చిన్నదాసరపల్లె, పగడాలపల్లె), 6న చీమలపెంట, నందిమండలం(ఏవీ కాల్వ), 7న గొందిపల్లె, 8న మాచునూరు (ఎం.కొత్తపేట, బిందురావుపల్లె), 9న సంగటిపల్లె (ఎ.రామచంద్రాపురం, చెన్నంరాజుపల్లె, కోనాయపల్లె) వారీగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలకు రైతులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

భక్తి మార్గంలోనే మానసిక ప్రశాంతత

దేవునిపాటల సీడీని ఆవిష్కరిస్తున్న ఎస్ఐ తాహిర్ హుస్సేన్

అరవింద్‌నగర్, న్యూస్‌టుడే : భక్తి మార్గంలోనే మానసిక ప్రశాంతత ఉంటుందని కడప తాలూకా ఎస్ఐ తాహిర్‌హుస్సేన్ అన్నారు. కడప కృపాకాలనీలోని న్యూవేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షుడు పాస్టర్ పి.మహేశ్, శాంతమ్మల ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఎస్ఐ దేవుని పాటల సీడీని ఆవిష్కరించి ప్రసంగించారు. సమాజంలో ఆధ్యాత్మిక అనేది మనుషులను సన్మార్గంలో నడిపిస్తుందన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు థామస్, శ్రీరాములు, దూపం రాజు, రవితేజ, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన మార్గం.. అవస్థల ప్రయాణం

కడప పాత రిమ్స్‌లో పలు ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. నిత్యం ఉద్యోగులు, కార్యాలయాలకు వచ్చి వెళ్లే సందర్శకులతో రిమ్స్ వెళ్లే రోడ్డు రద్దీగా ఉంటోంది. అయితే ముఖ ద్వారం వద్ద సీసీ రోడ్డు సగ భాగం గుంతలుపడి దెబ్బతింది. మిగిలిన సగం రోడ్డు బాగుండటంతో వాహన చోదకులు ఒకే వైపున రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల వల్ల వాహనాలు విడి భాగాలు దెబ్బతింటున్నాయని, తరచూ రిపేర్లకు రూ.వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు అధ్వానంగా మారుతున్నా సంబంధిత అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. రాత్రి వేళల్లో దెబ్బతిన్న రోడ్డు కనిపించకపోవడంతో కిందపడి గాయపడుతున్నామని చోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కడప చిన్నచౌకు**

శ్రీరంగనాథునికి తెప్పోత్సవం

పుష్కరిణిలోకి శ్రీరంగనాథస్వామిని తీసుకెళ్తున్న పండితులు, భక్తులు

పులివెందుల, న్యూస్‌టుడే: పట్టణంలో మొట్ట మొదటి సారిగా అతి పురాతన చరిత్ర కలిగిన శ్రీరంగనాథస్వామి వారి ఆలయంలో తెప్పోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తుల గోవిందనామస్మరణల మధ్య తెప్పోత్సవ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ సుధీకర్‌రెడ్డి, అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ శాశ్వత దాతలు మేడం వంశీయులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అల్పాహారం ఏర్పాటుచేశారు.

✶ పట్టణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో తెప్పోత్సవ కార్యక్రమానికి పులివెందుల జడ్పీటీసీ సభ్యురాలు, బీటెక్ రవి సతీమణి మారెడ్డి లతారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ కమిటీ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ సుధీకర్‌రెడ్డి, అంకాళమ్మ దేవస్థాన ఛైర్మన్ బ్యాటరీ ప్రసాద్, ట్రస్ట్ సీఈవో రంగనాయకులు, ఆలయ శాశ్వత దాతలు మేడం దినేష్‌కుమార్ గుప్తా, శ్రీరంగనాథ్, క్రిష్ణ, శివ పాల్గొన్నారు.

బోటు షికారు.. ఎవరూ పట్టించుకోరు!

కడప దేవునికడప చెరువులో కొంత కాలం కిందట నగర వాసులు బోట్ షికారు చేసేందుకు పర్యాటక శాఖ మూడు బోట్‌లను ఏర్పాటు చేసింది. వాటిలో విహరించిన వారు ఎంతో అనుభూతి పొందారు. సాయంత్రం వేళ చెరువు వద్దకు చేరి ఆహ్లాద వాతావరణంలో బోట్ షికారు చేసేందుకు నగర వాసులు ఎంతో ఆసక్తి చూపేవారు. అయితే వాటి నిర్వహణ గురించి పర్యాటక శాఖాధికారులు గాలికొదిలేశారు. పెద్ద బోట్ నిరుపయోగంగా మారింది. మరో రెండు పెడల్ బోట్‌లు నీటిలో కొట్టుకుని ఒడ్డుకు చేరాయి. అవి పూర్తిగా దెబ్బతిన్నాయి. వాటికి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చేవి. కానీ వాటిని అలానే వదిలేయడంతో ఎందుకూ పనికి రాకుండాపోయాయి. దీంతో బోట్ షికారు చేసే సదుపాయం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. పర్యాటక శాఖ అధికారులు స్పందించి బోట్లను మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని నగర వాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కడప చిన్నచౌకు**

ప్రిన్సిపల్ బాధ్యతల స్వీకరణ

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ - స్వయం ప్రతిపత్తి) నూతన ప్రిన్సిపల్‌గా (ఎఫ్ఏసీ) డాక్టర్ మల్లెల రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం యర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. బాధ్యతలు చేపట్టిన ఆయన్ను పలువురు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఏవో రమణారావు, అకడమిక్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, వైస్ ప్రిన్సిపల్ రమేష్, పరీక్షల నియంత్రణ అధికారి రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ అధికారి కెప్టెన్ నీలయ్య, న్యాక్ కోఆర్డినేటర్ సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారులో కూరగాయల ధరలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే : రైతు బజారులో కూరగాయల ధరలు కిలో (రూపాయల్లో) ఇలా.. బంగాళదుంప - 40, క్యాబేజీ - 30, క్యారెట్ - 50, 65, బీన్స్ - 60, బీట్‌రూట్ - 40, కీర - 40, దోస - 40, చౌడకాయలు - 55, ముల్లంగి - 35, అల్లం - 80, కాలీఫ్లవర్ - 50, క్యాప్సికం - 70, టమాట - 35, మిరపకాయలు - 40, వంకాయలు - 25, బెండకాయలు - 40, బీర - 40, నాటుకాకర - 50, హైబ్రిడ్ కాకర - 40, మటిక్కాయ - 40, చిక్కుడు - 30, అలసందకాయలు - 40, అనపకాయలు - 45, ఉల్లిపాయలు-25.

ఆలయాల్లో పోటెత్తిన భక్తులు.. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

దేవుని కడప శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు

మారుతీనగర్, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సందర్భంగా నగరంలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని పూజలు చేసి స్వామి వారి దర్శనం చేసుకున్నారు. దేవుని కడప శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో తితిదే ఆధ్వర్యంలో గురువారం ఉదయం రాత్రి ఉత్సవాలు నిర్వహించారు. లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను అలంకరించి ప్రాకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని పలు చర్చిల్లో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆనందంగా కేకు కోసి సంబరాలు చేసుకున్నారు.

వల్లూరు, కమలాపురం : కమలాపురం నియోజకవర్గంలోని వివిధ ఆలయాల్లో పూజలు చేశారు. చర్చిల్లో ప్రార్థనలు చేశారు.

వల్లూరు : పుష్పగిరిలో దర్శనమిస్తున్న చెన్నకేశవస్వామి

మరియాపురం చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

కమలాపురంలో..

ఆరోగ్యమాత చర్చిలో కేకు కోస్తున్న బిషప్ పాల్ ప్రకాష్

కమనీయం.. కల్యాణోత్సవం

వేంపల్లె, న్యూస్‌టుడే : వేంపల్లె పట్టణంలోని పాపఘ్ని నది తీరాన ఎద్దులకొండపై నూతన సంవత్సరం సందర్భంగా గురువారం వృషభాచలేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు హరిప్రవీణ్ నేతృత్వంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి అమ్మ వారికి జీలకర్ర, బెల్లం పెట్టి మంత్రోచ్ఛారణ చెబుతూ స్వామి కల్యాణోత్సవం, ఎదురుకోళ్ల కార్యక్రమాన్ని అట్టహాసంగా జరిపించారు. పట్టణానికి చెందిన ప్రభుత్వులు శ్రీనివాసులు, రమేష్‌బాబు కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం పట్టణానికి చెందిన శ్రీను, వేణు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కడప కేఎస్ఆర్ఎం కళాశాల ప్రొఫెసర్ కందుల చంద్రఓబుల్‌రెడ్డి(నాని) స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

అంజన్నా.. అనుగ్రహించన్నా!

చక్రాయపేట, న్యూస్‌టుడే: గండిక్షేత్రం భక్తజన సంద్రమైంది. గురువారం నూతన సంవత్సరం పురస్కరించుకుని వేలాది మంది భక్తులు అంజన్న దర్శనానికి తరలి వచ్చారు. క్యూ లైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. భజేవా భజే వాయుపుత్రం అంటూ భక్తులు వేడుకున్నారు. రంగురంగుల పూలతో అలంకరించడంతో ఆలయం కొత్త శోభను సంతరించుకుంది.

ప్రత్యేకాలంకరణలో వీరాంజనేయస్వామి

అధికారులను కలిసిన బ్రహ్మ కుమారీలు

క్యాలెండరు ఆవిష్కరిస్తున్న ఎస్పీ

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సందర్భంగా కడపకు చెందిన బ్రహ్మకుమారీలు గురువారం జిల్లా అధికారులను కలిసి 2026 ఏడాదికి సంబంధించిన క్యాలెండర్, డైరీని అందజేశారు. కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విశ్వనాథ్, కడప ఎమ్మెల్యే మాధవి, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డిని కూడా కలిసి క్యాలెండర్, డైరీని అందజేశారు. నగర మేయర్ పాకా సురేష్, వైద్యులు విద్యాసాగర్‌రెడ్డి తదితరులను కలిశారు. కొత్త ఏడాదిలో జిల్లా అధికారులకు, ప్రజలకు భగవంతుని ఆశీస్సులు పుష్కలంగా ఉండాలని భగవంతున్ని ప్రార్థించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీ గీతా దీదీ, ప్రదీప్, అక్కయ్య పాల్గొన్నారు.

బాధ్య సూపరింటెండెంట్‌కు సన్మానం

కమలాపురం, న్యూస్‌టుడే: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గత ఆరు నెలలుగా బాధ్య సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన శిల్పారెడ్డిని గురువారం వైద్యులు, సిబ్బంది సన్మానించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఆమె ఎంతో కృషి చేశారని, ఆమె సేవలను కొనియాడారు. ఆమె స్థానంలో సీనియర్ మెడికల్ అధికారిగా ఉన్న తాజుద్దీన్‌ను అధికారులు సూపరింటెండెంట్‌గా నియమించడంతో ఆయన నూతన బాధ్యతలు స్వీకరించారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

కడప విద్య, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం, సంక్రాంతి కానుకగా 12వ పీఆర్సీ కమిషన్ నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి డిమాండు చేశారు. గురువారం స్థానిక ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (పీఎస్టీయూ) కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలైనా ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదారుల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లకు మూడు డీఏలతో పాటు జనవరి నుంచి మరో డీఏ కలిపి మొత్తం నాలుగు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఇలియాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

వేంపల్లె, న్యూస్‌టుడే : వేంపల్లెలోని గండి రోడ్డులో ఉన్న మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు అనాథ వృద్ధాశ్రమంలో నూతన సంవత్సరం సందర్భంగా తెదేపా నాయకులు గౌస్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, నాయకులు సుబహాన్, జిలాని, పీర్ బాషా, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : వైకాపా సీనియర్ నాయకులు పెంచల్‌రెడ్డి గురువారం మండలంలోని బృంద వృద్ధాశ్రమంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. వృద్ధులకు అల్పాహారం అందజేయడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలసుబ్బయ్య, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడే సందడి
అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కడప : నృత్యం చేస్తున్న బాలికలు

పులివెందుల, న్యూస్‌టుడే : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గురువారం పులివెందులలోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. పులివెందులకు చెందిన డ్యాన్స్ మాస్టర్ శ్రావణ్, ఎస్.కె. ఫిలిం స్టూడియో, భవాని కృష్ణ క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు పలు సినీ, భక్తి గీతాలకు చేసిన నృత్యం అదరహో అనిపించాయి. గణనాయకాయ, బ్రహ్మ మొక్కటే, ఓం నమఃశివాయ, మూషికవాహన తదితర భక్తి గీతాలకు చిన్నారులు చేసిన నృత్యం అబ్బురపరిచాయి. అలాగే బుట్టబొమ్మ, వంగతోట కాడ, వరాహరూపం, ఓ బావా రబ్బరు గాజులు తదితర సినీ పాటలకు చేసిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. శిల్పారామం పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి అన్ని ఏర్పాట్లను చేసి పర్యవేక్షించారు.

పులివెందుల : సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు హాజరైన ప్రజలు

మారుతీనగర్ : నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా శిల్పారామం కళావేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో అలరించాయి. విద్యార్థులు, కళాకారులచే నిర్వహించిన పలు సాంస్కృతిక, జానపద, పల్లెటూరు, సినీ గీతాల కార్యక్రమాలు ఆహ్లాదం కోసం వచ్చిన ప్రజలను ఎంతో ఉత్సాహపరిచాయి. నూతన సంవత్సర ప్రత్యేక కార్యక్రమంలో చిన్నారులు, పెద్దలు, మహిళలు సందడి చేశారు.

అరవిందనగర్ : కడప ఎమ్మెల్యే మాధవికి శుభాకాంక్షలు తెలుపుతున్న తెదేపా నాయకులు

పులివెందుల : ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఈవో శంషుద్దీన్

పులివెందుల : జడ్పీటీసీ సభ్యురాలు లతారెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కొత్త ఆశలు.. కొంగొత్త గమ్యాలు
ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

కొత్త ఏడాది 2026కు కోటి ఆశలతో జిల్లా ప్రజలు స్వాగతం పలికారు. గడిచిన 2025కు వీడ్కోలు పలికి.. కొత్త ప్రణాళికలతో విజయాల వైపు దూసుకెళ్లాలనే ఉత్సాహంతో నవ వసంతంలోకి అడుగు పెట్టారు. కేకులు కోసి నోరు తీపి చేసుకుని ఏడాదంతా ఆనందం.. సుఖ శాంతులతో ఉండాలని కోరుకున్నారు. గురువారం ఉదయం కడప, పులివెందుల, కమలాపురం నియోజకవర్గాల్లో ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. సంబరాలు మిన్నంటాయి.. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో కేకులు కోసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కేకులు కోశారు. 2026 క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. ప్రజలు రోజంతా సందడిగా గడిపారు. **- న్యూస్‌టుడే బృందం**

అరవిందనగర్ : క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో ఉమామహేశ్వర్‌కుమార్ తదితరులు

కడప వ్యవసాయం : కాలమానిని ఆవిష్కరిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్, రైతు సంఘం నాయకులు

విద్యార్థి సంఘాల నాయకులపై రౌడీషీట్ తగదు

కమలాపురం, న్యూస్‌టుడే: విద్యా రంగ సమస్యలపై పోరాడుతున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులపై ప్రభుత్వం రౌడీ షీట్ ఓపెన్ చేయడాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కోగటం షేక్ సాదిక్ ఖండించారు. గురువారం ఇందుకు వారు కమలాపురంలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, యువతకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని విశాఖలో పోరాటం చేస్తున్న ఐదుగురి విద్యార్థి సంఘాల నాయకులపై రౌడీషీట్ పెట్టడం దారుణమన్నారు. వెంటనే ఈ చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి రబ్బాని, పాండు, రాంప్రసాద్, రసూల్, తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

కృష్ణమ్మా.. దరిచేరేదెప్పుడమ్మా!
చెరువుల్లో అడుగంటిన జలాలు

వెలిదండ్ల కోన చెరువులో కానరాని నీరు

లింగాల, న్యూస్‌టుడే : లింగాల కుడి కాలువ పరిధిలో ఏఈలు, డీఈలు, లష్కర్ల కొరతతో చెరువులు, కుంటలను సకాలంలో కృష్ణా జలాలతో నింపలేని పరిస్థితి తలెత్తింది. లింగాల, పులివెందుల, వేముల, వేంపల్లె మండలాల పరిధిలో 17 ఎత్తిపోతల పథకాల కింద 17 చెరువులు, 5 కుంటలు ఉన్నాయి. ప్రస్తుతం వెలిదండ్ల కోనచెరువు, యర్రకుంట, కోమనూతల, మురారిచింతల, ఎగువపల్లె, దిగువపల్లె, తాతిరెడ్డిపల్లె, బోనాల, రామనూతనపల్లె, భూమయ్యగారిపల్లె, వేముల, నాయనపల్లె, బక్కన్నగారిపల్లె, చెరువులు, కుంటల్లో నీరు అడుగంటింది. వాటిల్లో నీరు లేకపోవడంతో భూగర్భ జల మట్టం కూడా తగ్గింది. ఫలితంగా బోర్లలో నీరు అడుగంటిందని వేసవిలో సాగునీటి ఇబ్బందుల తలెత్తే పరిస్థితులున్నాయి. అధికారులు మేలుకొని ముందస్తుగా ఆయా వీటిని కృష్ణా జలాలతో నింపాలని రైతులు కోరుతున్నారు.

అధికారుల కొరత.. రైతులకు అవస్థ

పర్యవేక్షణ చేసే అధికారుల కొరత ఉండటంతో పీబీఆర్‌లో పుష్కలంగా నీరున్నా చెరువులను నింపలేని పరిస్థితి ఏర్పడింది. కుడికాలువ కింద 15 మంది ఏఈలు పనిచేయాల్సి ఉండగా పదోన్నతుల మీద వెళ్లడంతో ముగ్గురితో కాలం నెట్టుకొస్తున్నారు. నలుగురు డీఈలు పని చేయాల్సి ఉండగా ఒకరు మాత్రమే పనిచేస్తున్నారు. ఒక డీఈ అనంతపురంలో నివాసం ఉంటూ ఏడాది కాలంగా చుట్టపు చూపుగా విధులకు హాజరవుతున్నారు. మరో డీఈ బదిలీపై వెళ్లగా.. మరో డీఈని కడప నీటిపారుదల శాఖలో అకౌంట్స్ విభాగానికి అడిషనల్ ఇన్‌ఛార్జిగా బదిలీచేశారు. కుడి కాలువ 15 కి.మీ. పరిధిలో 80 ఎకరాల్లో ఊట నీరు తమ పొలాల్లోకి మళ్లుతోందని రైతులు కొత్తపల్లె హెడ్ రెగ్యులేటరీ వద్ద కుడికాలువ ప్రవాహ నీటిని పీబీసీ కాలువకు మళ్లిస్తున్నారు. దీంతో కాలువలో 100 క్యూసెక్కుల మేర మాత్రమే నీరు ప్రవహిస్తోంది. దీంతో అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. సమస్యను కుడి కాలువ ఈఈ మధుసూదనరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా త్వరలో అన్ని చెరువులను పూర్తిస్థాయిలో కృష్ణా జలాలతో నింపుతామన్నారు.

కడప నగరాభివృద్ధికి కృషి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : కొత్త ఏడాదిలో కడప నగర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కడప ఎమ్మెల్యే మాధవి, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. నూతన సంవత్సరం తొలి రోజును పురస్కరించుకుని గురువారం తమ కార్యాలయంలో ఎమ్మెల్యే దంపతులు కేక్ కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త ఏడాదిలో కడప నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, కార్యకర్తలంతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మన్సూర్‌అలీఖాన్, బోనం శిలాస్ హాజీ షాషావలీ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే : రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ అన్నారు. గురువారం నగరంలోని ఆ శాఖ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాలమానిని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు నాగయ్య, బాలచంద్రయ్య, రామ్మోహన్‌రెడ్డి, పెద్దపుల్లయ్య, జిల్లా సమితి సభ్యులు రామాంజనేయరెడ్డి, సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE ADDL.
SENIOR CIVIL JUDGE, KADAPA
I.P. No. 82 of 2025

Rokkam Peddanna son of Rokkam Obulesu aged 46 years, Hindu. RMP by profession & Real Estate Business residing at D.No. 1/857, Yerramukkapalli, Kadapa City, Kadapa District
- Petitioner/Debtor

Vs

1. Nagireddi Obul Reddy, Son of Nagi Reddy, residing at D.No. 1/9, Putlampalli, Kadapa City, Kadapa District
2. N.Naga Muni Son of Subbanna, residing at D.No. 1/1282-B, Bugga Road, Yerramukkapalli, Kadapa City, Kadapa District
3. Kanakadandi Prem Kumar, Father's name not known, residing at D.No.8/34-1, Chowdeswari Colony, Chinthakommadinne village and post, Kadapa District. Mobile No.98661 28522.
4. K.Ramana Yadav, Son of K. Krishnaiah Yadav, residing at D.No. 1/920-4, Yerramukkapalli, Kadapa City
5. B.Lakshmaiah, Son of Pedda Lakshmanna, residing at House No. 15, Road No. 5, Singapur Township, RIMS Road, Putlampalli, Kadapa City
6. V.Nagaraju, Son of Gurrappa, residing at D.No. 1/1262, Bugga Road, Yerramukkapalli, Kadapa City, Kadapa District.
7 B.Shyamson, Son of Santenna, residing at D.No. 1/1664, kandipalem, Yerramukkapalli post, Kadapa City
8. D.Sreenivasulu, Son of D. Ramudu, residing at D.No. 89/5, Angadiveedhi, near Urudu School, Kadapa City
9. V. Prasad, father's name not known, residing at D.No. 38-1-167-14, S.R. Nagar, Chinna Chowk, Kadapa City,
10. Umamaheswara Reddy C/o Nagamu, residing at D.No. 1282-B, Bugga Road, Yerramukkapalli, Kadapa City,
11. G.Venugopal, father's name not known, residing at D.No. 1/932, Yerramukkapalli, Kadapa City.
12. K. Murali Mohan, father's name not known, residing at D.No. 1/868-1, Yerramukkapalli, Kadapa City, Kadapa District.

GENERAL PUBLIC NOTICE

The above named Petitioner/Debtor filed the above I.P. to declare him as an Insolvent and to discharge him from A schedule liabilities. If any person having objections, appear on **19-01-2026** before the above named Hon'ble Court at about 10.30 A.M. either in person or through their authorized counsel, failing which the matter will be decided as Exparty

/ BY Order of the Court/
Sri B.OBULESU, B.A., B.L.
Advocate, KADAPA, Mobile No. 83907 69833.

(c) eenadu